
మహాభారతం
విచారణ
సంపూర్ణ మహాభారతం


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **తెలుగు భక్తి** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **తెలుగు భక్తి** వారి వెబ్ సైట్: http://www.telugubhakti.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com.

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.


గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో **తెలుగు భక్తి** వెబ్ సైట్ వారు అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు,కనుక వారిని సంప్రదించగలరు.

**SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)**

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

## తెలుగు భక్తి వారి వెబ్ సైట్:

## http://www.telugubhakti.com/


Telugu Bhakti Slokas

www.telugubhakti.com/telugupages/main.htm

# Telugu Bhakti Pages

www.telugubhakti.com

**Best viewed with screen settings 1280X1024 pixels**

| Scriptures, Slokas and Stotras | | General | Downloads |
|---|---|---|---|
| Adi Sankaracharya | Rama Geeta | Appeal and Objectives | Audio Downloads |
| Aditya | Saraswathi | Bala Basha | Bhakti Screen Savers |
| Adwaitam | Sandharbha | Bhakti Celebrities | Printer Friendly Page |
| Ayyappa | Satya Sai | Bhakti Classicals | |
| Bhagavad Geetha | Shirdi Sai | Bhakti Links | **Pravachanaalu** |
| Bammera Pothana | Siva | Book Reviews | |
| Bhagavatam | Slokas with meaning | Jeji Mamayya Patalu | Bhaja Govindam |
| Brahma Sutras | Subrahmanya | Chatuvulu | Bhasmo Dhulita Vigrahaya |
| Durga | Suktas | Dasa Mudrani | Karma Siddhantam |
| Dattatreya | Sundara Kanda | Divine Guidance of Satya Sai | Class Prayers |
| Ganesh | Venkatesa | Kavitha Kadambam | Kenopanishad |
| Gayatri | Vishnu | Keerthanalu | Sri Narasimha Charitram |
| Guru | Vratas | Koonalamma Padalu | Soundarya Lahari |
| Hanuman | Upanishads | Prasnalu - Javaabulu | Ramana Saranagathi |
| Hindu Marriage System | Rigveda | Naturopathy | Vivekachoodamani |
| Krishna | Samhitaanuvadam | Rishi Vani | |
| Lakshmi | (Yoga Paranga) | Sai Krishna's Art | **Specials** |
| Mahabharat | Vyasa Bhagavatam | Satakalu | |
| Mantrapushpam | | Swamiji | Annamayya Pada Visleshana |
| Narada Bhakti Sootralu | | Tatvalu | Monthly |
| Nava Grahas | | Telugu Special | Satsang |
| Patanjali Yoga Sootralu | | Useful Links | Chinna Kathalu |
| Raghavendra | | Value Education | Class Prayers |
| Rama | | Web Hunt | Human Relations |
| Ramayanam | | Hindu Cultural | Nadiche Devudu |
| | | Questions & Answers | Stories of Alwars |
| | | Yoga | Stories of Bhaktas |
| | | Yoga Mudralu Bandhalu | Stories of Indian Sages |
| | | Yogasanas (Detailed) | Stories of Nayanars |
| | | | Sankara Vangmayamu |
| | | | Special Articles |
| | | | Hinduism and Mantras |
| | | | Personality Development |

Join Bhakti Group

Statistics of page views

[About us][Mission][People][Links][Books][Guest Book][Contact]

# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఓజసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014


MAHABHARAT

# Veda Vyasa Maha Bharatham

in

Telugu by



Sri. M.V.Subrahmanyam,B.A.,B.G.L.,
Former Registrar AP High Court,
2-31 Chaitanyapuri Colony,
Hyderabad 500060
South India
Phone No.24048104
Mobile: 9866140619

# శ్రీమదాంధ్ర మహా భారతము

(తేట తెలుగు వచనం లో)

సంస్కృత మూలం
భగవాన్ వేదవ్యాసమహర్షి.

తెలుగు మూలం
శ్రీ నన్నయభట్టారకుడు, శ్రీ ఎఱ్ఱాప్రగడ, శ్రీ తిక్కనసోమయాజి.
(కవిత్రయం).

తేట తెలుగువచనం లో మీ కందిస్తున్నది
కవిత్రయం పాదరేణువు

మొదలి వెంకట సుబ్రహ్మణ్యం.
(రిటైర్డు హైకోర్టు రిజిస్ట్రార్)
2-31, సత్యనారాయణపురం,
చైతన్యపురి కాలనీ, హైదరాబాద్ 500060
ఫోన్: 24048104.
(సెల్: 9391134792).

శ్రీరామ శ్రీరామ శ్రీరామ

శుక్లామ్బరధరం విష్ణుం శశి వర్ణం చతుర్భుజం।
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే॥

వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మషం।
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్॥
వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే।
నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమోనమః॥
అవికారాయ  శుద్ధాయనిత్యాయ పరమాత్మనే।
సదైక రూప రూపాయ విష్ణవే సర్వ జిష్ణవే॥
యస్య స్మరణ మాత్రేణ జన్మ సంసార బంధనాత్।
విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే॥

మంగళ శ్లోకం

శ్రీ వాణీ గిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే।
లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం।
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజిత వస్సురై।
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవ శ్రీకన్ధరా శ్శ్రేయసే.॥

★★★

# శ్రీమదాంధ్ర మహా భారతము

# ఆది పర్వము

## ప్రథమాశ్వాసము.

విమలాదిత్యుని కుమారుడు రాజరాజనరేంద్రుడు రాజమహేంద్ర వరమును రాజధానిగా చేసుకొని వేంగీ రాజ్యమును పరిపాలిస్తున్నాడు. రాజరాజనరేంద్రుని ఆస్థానంలో ఆపస్తంభ సూత్రుడు, ముద్గల గోత్రంలో పుట్టినవాడు, సుజనుడు అయిన నన్నయభట్టారకుడు ఆస్థాన కవీంద్రుడుగా ఉండేవాడు.

ఒకరోజు రాజరాజనరేంద్రుడు నన్నయభట్టును చూచి ఈ విధంగా అన్నాడు. "మహానుభావా! మీరు చెప్పిటువంటి పురాణములు ఎన్నో విన్నాను. అర్ధశాస్త్రముల గురించి తెలుసుకున్నాను. ఉదాత్త రసంతో కూడిన కావ్యములు నాటకములు ఎన్నో చూచాను. నా మనసంతా భక్తితో నిండిపోయింది. కాని ఎన్ని విన్నా మహాభారతము విన్నదానితో సాటి రాలేదు. నా మనసు మహాభారత కావ్యము మీదనే లగ్నమయింది. నాకు ఎప్పుడూ మహాభారతము వినవలెనని కుతూహలముగా ఉంటుంది. ఎందుకంటే మా పూర్వులైన పాండవుల చరిత్ర తెలుసుకోడం నాకు ఎంతో ప్రీతి పాత్రమైనది. కాని మహాభారతము సంస్కృతములో ఉంది. దానిని దయచేసి తెలుగులో రాయండి." అని అర్థించాడు రాజరాజనరేంద్రుడు.

"మహారాజా! మహాభారతమును తెలుగులో రాయడమంటే ఆకాశంలో చుక్కలు లెక్కబెట్టడం లాంటిది. నా వల్ల అవుతుందా అని సందేహంగా ఉంది.

అయినా తమరు ఆజ్ఞాపించారు కాబట్టి ప్రయత్నిస్తాను." అని పలికాడు నన్నయభట్టు.

త్రిమూర్తులను, గణపతిని, కుమారస్వామిని, లక్ష్మి,సరస్వతి,పార్వతులను, సమస్త దేవతలను మనసులో తల్చుకున్నాడు. వారికి నమస్కారం చేసాడు. ఆది కవి వాల్మీకికి, పరాశరుని కుమారుడైన వేదవ్యాసునికి మనసులోనే నమస్కారం చేసాడు. తన కంటే ముందు ఉన్న అందరు కవులకు నమస్కరించాడు. తన సహపాఠి అయిన నారాయణభట్టు సాయం తీసుకున్నాడు. ఆ ప్రకారంగా నన్నయభట్టు మహాభారతమును తెలుగులో రచించడానికి ఉద్యుక్తుడైనాడు. ఈ మహాభారత కథాక్రమము ఎలాంటిది అంటే...........

నైమిశారణ్యంలో శౌనకుడు అనే కులపతి ఉన్నాడు. ఆయన లోక హితం కోసరము 12 సంవత్సరములు నడిచేసత్రయాగము చేయడానికి సంకల్పించాడు. ఆ సమయంలో రోమహర్షణుని కుమారుడు అయిన ఉగ్రశ్రవసుడు అనే సూతుడు-(పురాణ కథలు చెప్పేవాడు) వచ్చాడు. అక్కడ ఉన్న మహామునులకు నమస్కరించాడు. శౌనకాది మహామునులందరూ ఆ సూతుని వలన పురాణ కథలు వినవలెనని ఉత్సాహంగా ఉన్నారు. ఆ మునులను చూచి ఆ సూతి ఇలా అన్నాడు.

"అయ్యా! నేను వ్యాసుని శిష్యుడైన రోమహర్షణుని కుమారుడను, ఉగ్రశ్రవసుడు అనే పేరుగల సూతుడను. నేను అనేక పురాణ గాథలు చెప్పగలను. నా వలన మీరు ఏ పురాణ గాథ వినవలెనని కుతూహల పడుతున్నారో తెలపండి." అని అడిగాడు.

ఆ మాటలకు మునులు ఇలా అన్నారు. "ఏది వింటే మాకు అన్ని విషయాలు తెలుస్తాయో, ఏ కథ హృద్యంగా ఉంటుందో, ఏ కథ వింటే పాపాలు తొలగిపోతాయో ఆ కథమాకు వినిపించండి." అని అడిగారు. అప్పుడు సూతుడు మహాభారత కథను చెప్పడం ప్రారంభించాడు.

పూర్వము వేదములన్ని ఒకటిగా ఉండేవి. వాటిని వ్యాసుడు ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము అని విభజించాడు. తరువాత తన శిష్యులైన పైలుడు, వైశంపాయనుడు సుమంతుడు, జైనుడు అనే వారలను నియమించి చతుర్వేదములకు సూత్రాలు రాయించాడు. దాని వలన వ్యాసుడు వేదవ్యాసుడు అని ప్రసిద్ధి చెందాడు.

తరువాత వేదవ్యాసుడు బ్రహ్మచేత ఆజ్ఞాపించబడి, అష్టాదశ (18)పురాణములను, నీతి శాస్త్రము, ధర్మ శాస్త్రము, అర్థశాస్త్రము, తత్త్వశాస్త్రములను, వేదములు, వేదాంతములు (అనగా ఉపనిషత్తులు) వాటి మీద వ్యాఖ్యానములను, ధర్మార్థకామమోక్షములు, అరిషడ్వర్గములు వాటికి సంబంధించిన విషయములో కూడిన కథలను, నాలుగు యుగములలో ఉన్న రాజుల వంశముల చరిత్రలను, నాలుగు వర్ణములు, నాలుగు ఆశ్రమ ధర్మములు వాటి క్రమములను, ఎల్ల దేవతలతో పూజింపబడే శ్రీకృష్ణుని మాహాత్మ్యమును, పాండవులు మొదలగు భారతవీరుల మహాగుణములను, క్రోడీకరించి, తన యొక్క విమలమైన జ్ఞానము, వాక్కులు ప్రకాశిస్తూ ఉండగా, సంస్కృతంలో మహా భారతము అనే మహా గ్రంథమును రచించాడు.

ఆ మహా భారతమును ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రము అనియు, అధ్యాత్మవిదులు వేదాంత గ్రంథమని, నీతి విచక్షణులు నీతి శాస్త్రమని, కవీంద్రులు మహాకావ్యమని, లాక్షణికులు సర్వలక్షణ గ్రంథమని, ఐతిహాసికులు

ఇతిహాసమని, పౌరాణికులు అన్ని పురాణముల సముదాయమనీ, ప్రశంశించారు.

వ్యాసభారతంలో మొత్తం 100 పర్వములు ఉన్నవి. అవి
1. పౌష్యము 2.పౌలోమము, 3. ఆస్తీకము, 4. ఆదివంశావతారము,
5.సంభవపర్వము, 6.జతుగృహదాహము, 7.హైడింబము, 8.బకవధ,
9.చైత్రరథము, 10.ద్రౌపదీస్వయంవరము, 11.వైవాహికము,
12.విదురాగమనము, 13.రాజ్యార్థలాభము, 14. అర్జున తీర్థయాత్ర,
15.సుభద్రాకల్యాణము, 16.హరణ హారిక, 17.ఖాండవదహనము,
18.మయదర్శనము, 19.సభాపర్వము, 20. మంత్రపర్వము,
21.జరాసంధవధ, 22.దిగ్విజయము, 23.రాజసూయము,
24.బర్ఘ్యాభిహరణము, 25.శిశుపాలవధ, 26.ద్యూతము, 27.అనుద్యూతము,
28. ఆరణ్యము, 29.కిమ్మీరవధ, 30.కైరాతం, 31. ఇంద్రలోకాభిగమనము,
32.ధర్మజతీర్థయాత్ర, 33.జటాసుర వధ, 34.యక్షయుద్ధం, 35.అజగరము,
36.మార్కండేయోపాఖ్యానము, 37.సత్యాద్రౌపదీసంవాదము,
38.ఘోషయాత్ర, 39.ప్రాయోపవేశము, 40.వ్రీహిద్రోణకాఖ్యానము,
41.ద్రౌపదీహరణము, 42.కుండలాహరణము, 43. ఆరణేయము,
44.వైరాటము, 45.కీచకవధ, 46.గోగ్రహణము, 47.అభిమన్యువివాహం,
48. ఉద్యోగము, 49.సంజయయానము, 50.ధృతరాష్ట్రప్రజాగరణము,
51.సానత్సుజాతము, 52. యానసంధి, 53.భగవద్యానము, 54.సేనానిర్యాత్ర,
55. ఉలూకదూతాభిగమనము, 56.సమరథ,అతిరథ సంఖ్యానము,
57.కర్ణభీష్మ వివాదము, 58.అంబోపాఖ్యానము, 59.జంబూఖండవినిర్మాణము,
60.భూమి పర్వము, 61.భీష్మాభిషేకము, 62.భగవద్గీత, 63.భీష్మవధ,
64.ద్రోణాభిషేకము,65.సంశప్తక వధ, 66.అభిమన్యు వధ,
67.ప్రతిజ్ఞాపర్వము, 68.జయద్రధ వధ, 69.ఘటోత్కచవధ, 70.ద్రోణ వధ,

71.నారాయణాస్త్రప్రయోగము, 72.కర్ణపర్వము, 73.శల్యపర్వము, 74.హ్రదప్రవేశము, 75.గదాయుద్ధము, 76.సారస్వతము, 77.సౌప్తికపర్వము, 78.వైషీకము, 79.జలప్రదానము, 80.స్త్రీపర్వము, 81.శ్రాద్ధ పర్వము, 82.రాజ్యాభిషేకము, 83.చార్వాక నిగ్రహము, 84.గృహప్రవిభాగము, 85.శాంతిపర్వము, 86.రాజధర్మానుకీర్తనము, 87. ఆపద్ధర్మము, 88. మోక్షధర్మము, 89.అనుశాసనికము,90. భీష్మస్వర్గారోహణము, 91.అశ్వమేధికము, 92అనుగీత, 93.ఆశ్రమవాసము, 94. పుత్రసందర్శనము,95. నారదాగమనము, 96.మౌసలము, 97.మహాప్రస్థానికము, 98.స్వర్గారోహణము, 99.హరివంశము, 100.భవిష్యత్పర్వము.

| పర్వముల పేర్లు | ఉప పర్వములు | శ్లోకములు | ఆశ్వాసములు | పద్యగద్యములు. |
|---|---|---|---|---|
| 1. ఆది పర్వము | 18 | 9,984 | 8 | 2,084 |
| 2.సభాపర్వము | 9 | 4,311 | 2 | 618 |
| 3.అరణ్యపర్వము | 16 | 13,664 | 7 | 2,894 |
| 4.విరాటపర్వము | 4 | 3,500 | 5 | 1,624 |
| 5. ఉద్యోగపర్వము | 11 | 6,998 | 4 | 1,562 |
| 6.భీష్మపర్వము | 5 | 5,884 | 3 | 1,171 |
| 7.ద్రోణపర్వము | 8 | 10,919 | 5 | 1,860 |
| 8.కర్ణపర్వము | 1 | 4,900 | 3 | 1,124 |
| 9.శల్యపర్వము | 4 | 3,220 | 2 | 827 |
| 10.సౌప్తికపర్వము | 3 | 2,874 | 2 | 376 |
| 11.స్త్రీపర్వము | 5 | 1,775 | 2 | 376 |
| 12.శాంతిపర్వము | 4 | 14,525 | 6 | 3,093 |
| 13.అనుశాసనిక | 2 | 12,000 | 5 | 2,148 |
| 14.అశ్వమేధ | 2 | 4,420 | 4 | 976 |

| | | | | |
|---|---|---|---|---|
| 15. ఆశ్రమవాస పర్వము | 3 | 1,106 | 2 | 362 |
| 16.మౌసల పర్వము | 1 | 300 | 1 | 226 |
| 17.మహాప్రసానిక పర్వము | 1 | 120 | 1 | 79 |
| 18,స్వర్గారోహణ పర్వము | 1 | 200 | 1 | 97 |
| 19.హరి వంశపర్వము,భవిష్యపర్వము. | - - | == | = | -- |
| మొత్తం. | 100 | 1,00,500 | 63 | 21,507 |

మహాభారతమును వ్యాసుడు మూడు సంవత్సరములు రచించాడు. ఈ మహా భారతమును స్వర్గలోకంలో చెప్పడానికి నారద మహా మునిని, పితృ లోకంలో చెప్పడానికి దేవలుడిని, గరుడ గంధర్వయక్షరాక్షస లోకములలో చెప్పడానికి తన కుమారుడైనశుక మహర్షిని, సర్పలోకములో చెప్పడానికి సుమంతుడిని, మానవలోకంలో చెప్పడానికి వైశంపాయనుడిని నియమించాడు వ్యాసుడు.

పూర్వం దేవాసురయుద్ధం జరిగింది. అదే మాదిరి ఇప్పుడు మహాభారత యుద్ధం జరిగింది. ఆ యుద్ధములో భీష్ముడు 10 దినములు, ద్రోణుడు ఐదు రోజులు, కర్ణుడు రెండు రోజులు, శల్యుడు అర్ధరోజు, సేనా నాయకత్వము వహించారు. మిగిలిన సగము దినము భీముడు, సుయోధనుడు గదాయుద్ధము చేసారు.

ఈ మహా యుద్ధములో పాండవ పక్షమున ఏడు అక్షౌహిణులు, కౌరవ పక్షమున పదకొండు అక్షౌహిణుల సైన్యము పాల్గొన్నారు. శమంత పంచకము అనే ప్రదేశములో 18 రోజుల పాటు ఒకరిని ఒకరు చంపుకొని 18 అక్షౌహిణుల

సైన్యము మరణించారు.” అని సూతి చెప్పగా శౌనకాది మహామునులు ఇలా అడిగారు.

“అనఘా! 18 అక్షౌహిణులు అన్నారు, శమంతక పంచకము అన్నారు. వాటి అర్ధం వివరించండి. అసలు ఈ యుద్ధం ఎందుకు జరిగింది. కౌరవ పాండవులకు వైరము ఎందుకు ఏర్పడింది. ఈ భీష్ముడు ఎవరు. వివరంగా తెలపండి.” అని అడిగారు. సూతుడు శౌనకాది మహా మునులకు ఇలా చెప్పసాగాడు.

త్రేతాయుగము ద్వాపర యుగము సంధి కాలంలో మదించిన ద్వేషంతో పరశు రాముడు ఇరవై ఒక్క సార్లు క్షత్రియ వంశమును నిర్మూలించాడు. పరశురాముడు చంపిన క్షత్రియుల రక్తం ఏడు పాయలుగా పారింది. ఆ పాయలలో పారుతున్న రక్తంతో పరశురాముడు తన తండ్రికి తర్పణము విడిచాడు. దానితో పరశురామునికి క్షత్రియ కులము మీద ఉన్న కోపము చల్లారింది. పరశురాముడు క్షత్రియులను చంపి రక్తము పారించిన ప్రదేశమునకు శమంత పంచకము అని పేరు వచ్చింది.

ఇంక సైన్య విశేషములు చెబుతాను వినండి.

ఒక రథము, ఒక ఏనుగు, మూడు హయములు, ఐదుగురు సైనికులు కలిసి పత్తి అని పిలుస్తారు. అటువంటి పత్తులు మూడైతే సేనాముఖము అంటారు. అటువంటి సేనాముఖములు మూడైతే గుల్మము అంటారు. అలాంటి గుల్మములు మూడు కలిస్తే గణం అవుతుంది. అటువంటి గణములు మూడైతే వాహిని అవుతుంది. మూడు వాహినులు కలిస్తే పృతనము అవుతుంది. మూడు పృతనములు ఒక చమువు. మూడు చమువులు ఒక అనీకిని. అటువంటి

అనీకినులు పది అయితే అక్షౌహిణి అవుతుంది. అనగా 21,870 రథములు, 21,870 ఏనుగులు, 65.610 హయములు (గుఱ్ఱములు), 1,09,350 భటులు కలిస్తే ఒక అక్షౌహిణి అవుతుంది. అటువంటి అక్షౌహిణులు పదునెనిమిది. పదునెనిమిది అక్షౌహిణీల సైన్యముతో కురు వీరులు యుద్ధం చేసారు కాబట్టి ఆ ప్రదేశమునకు కురుక్షేత్రము అని కూడా పేరు వచ్చింది. ఇదీ మహాభారత యుద్ధ సైన్యవిశేషము.

ఇంక భారత కథను మొదలు పెడతాను వినండి. పంచపాండవులలో అర్జునుడు ప్రముఖుడు. అతడే శ్రీకృష్ణునికి బావ. అర్జునుని కుమారుడు అభిమన్యుడు. అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తు మహారాజు. ఆ పరీక్షిత్తు మహారాజు కుమారుడు జనమేజయుడు. ఆ జనమేజయుడు ఒకసారి ఒక మహా యజ్ఞము చేస్తున్నాడు. సరమ అనే దేవతల కుక్క కుమారుడు సారమేయుడు. ఆ సారమేయుడు ఆ యజ్ఞము చేసే చోటికి వచ్చి ఆడుకుంటున్నాడు. జనమేజయుని తమ్ముళ్లు అది చూచారు. వారు ఆ కుక్క పిల్లను కొట్టి తరిమేసారు.

సారమేయుడు అనే కుక్క పిల్ల ఏడుస్తూ పోయి తన తల్లి సరమకు జరిగిన విషయం చెప్పింది. సరమ కోపంతో జనమేజయుని వద్దకు వచ్చింది. "ఓ జనమేజయ మహారాజా! నీ తమ్ములు ఏ మాత్రం వివేకము, కరుణ లేకుండా నా కొడుకు సారమేయుని కొట్టారు. ఓ రాజా! యుక్తా యుక్త వివేచన విచక్షణ లేకుండా మంచి వారికి, సాధువులకు అపకారం చేసే వారికి అకారణంగా ఆపదలు వచ్చి మీద పడతాయి." అని పలికి ఆ సరమ అనే కుక్క వెళ్లి పోయింది.

తరువాత కొన్నాళ్లకు జనమేజయుడు తాను చేయుచున్న యాగము

పూర్తి చేసాడు. తన రాజధాని హస్తినా పురమునకు పోయి సుఖంగా ఉన్నాడు. ఇంతలో జనమేజయునికి సరమ మాటలు గుర్తుకు వచ్చాయి. చేసిన తప్పుకు శాంతి చేయిద్దాము అనుకున్నాడు. తగిన ఋత్విక్కు కోసరం అన్వేషిస్తున్నాడు.

ఆ క్రమంలో శ్రుత శ్రవసుడు అనే మునిని కలుసుకున్నాడు. అతనికి నమస్కరించి ఇలా అన్నాడు. "తమరి కుమారుడు సోమశ్రవసుని నాకు పురోహితునిగా పంపండి." అని అర్థించాడు. దానికి తండ్రి సమ్మతించాడు. జనమేజయుడు సోమశ్రవసుని పురోహితునిగా స్వీకరించాడు. సోమశ్రవసుని ఆధ్వర్యంలో అనేక పుణ్యకార్యములు చేసాడు.

పైలుడి శిష్యుని పేరు ఉదంకుడు. ఉదంకుడు గురువులను భక్తితో సేవించి అణిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, మహిమ, ఈశత్వం, వశిత్వం, కామావసాయిత, అనే ఎనిమిది సిద్ధులు పొందాడు. ఒక రోజు గురువు గారి భార్య ఉదంకుని పౌష్యుడు అనే మహారాజు భార్య వద్దనున్న కుండలములు తీసుకురమ్మని పంపింది. ఉదంకుడు ఆ పని మీద పౌష్య మహారాజు వద్దకు వెళుతుండగా దారిలో ఒక దివ్య పురుషుని చూచాడు. అతని కోరిక మేరకు గోమయము ( ఆవు పేడ) భక్షించాడు. ఆ దివ్య పురుషుని అనుగ్రహం పొందాడు.

తరువాత పౌష్యమహారాజు వద్దకు వెళ్లాడు. "మహారాజా! నేను నా గురుపత్ని ఆజ్ఞ మేరకు నీ వద్దకు వచ్చాను. నీ భార్య వద్దనున్న కుండలములు ఇప్పిస్తే అవి తీసుకొని పోయి మా గురుపత్నికి ఇస్తాను. త్వరగా ఇప్పించండి." అని అడిగాడు. "మహాత్మా! ఆ కుండలములు నా భార్య వద్ద ఉన్నవి. ఆమెను అడిగి తీసుకోండి." అని అన్నాడు.

ఉదంకుడు పౌష్యమహారాణి వద్దకు వెళ్లాడు. కాని ఆమె ఉదంకునికి కనిపించలేదు. మరలా రాజు వద్దకు వచ్చి "రాజా! మహారాణి నాకు కనిపించలేదు. మీరే ఆ కుండలములు తెప్పించి ఇవ్వండి." అని అడిగాడు. "మహాత్మా! నా భార్య మహా పతివ్రత. చాలా పవిత్రురాలు. ఆమె అపవిత్రులకు కనపడదు." అని అన్నాడు. అప్పుడు ఉదంకునికి గుర్తుకు వచ్చింది. తాను గోమయ భక్షణము చేసి ఆచమనము చేయలేదు అని. ఆ అపవిత్రత వలన రాణి తనకు కనపడలేదు అని అనుకున్నాడు.

వెంటనే తూర్పు తిరిగి కాళ్లు చేతులు శుభ్రంగా కడుక్కొని, ఆచమనం చేసాడు. వెంటనే పౌష్యాదేవి వద్దకు వెళ్లాడు. ఆమె ఉదంకునికి కనపడింది. ఆమెను కుండలములు అడిగాడు ఉదంకుడు. ఆమె కుండలములు ఉదంకు నికి ఇచ్చింది. ఇలా చెప్పింది. "కుమారా! తక్షకుడు ఈ కుండలములు అపహరించవలెనని చాలా కాలం నుండి వేచి ఉన్నాడు. తక్షకుడు మాయల మారి. కాబట్టి నీవు ఈ కుండలములు తక్షకుని కంటపడకుండా భద్రంగా తీసుకొని పో." అని చెప్పింది. అలాగే అని కుండలములు తీసుకొని ఉదంకుడు పౌష్యుని వద్దకు వెళ్లాడు.

పౌష్యుడు ఉదంకుని భోజనము చేసి వెళ్ల మన్నాడు. సరే అన్నాడు ఉదంకుడు. ఉదంకుడు భోజనము చేస్తూ ఉంటే ఆ భోజనములో ఒక వెంట్రుక వచ్చింది. ఉదంకుడు పౌష్యుని చూచి "నీవు నాకు అపవిత్రమైన భోజనము పెట్టావు కాబట్టి గుడ్డివాడివై పో!" అని శాపం పెట్టాడు.

"నేను చేసిన చిన్న తప్పుకు ఇంత పెద్ద శాపం ఇచ్చావు కాబట్టి నీకు సంతానము కలగకుండు గాక!" అని ప్రతిశాపం ఇచ్చాడు పౌష్యుడు.

తన తప్పు తెలుసుకున్నాడు పౌష్యుడు. "అయ్యా! నాకు సంతానం కావాలి. దయచేసి తమ శాపం ఉపసంహరించుకోండి." అని పౌష్యుని ప్రాధేయపడ్డాడు ఉదంకుడు.

"ఉదంకా! మీ బ్రాహ్మణులకు మనసు నవనీతము కాని మాట కర్కశము. కాని మా క్షత్రియులకు మనసు కర్కశము కాని మాట సౌమ్యము. బ్రాహ్మణుడు తన శాపం ఉపసంహరింప గలరు కాని క్షత్రియులకు అది సాధ్యము కాదు. కాబట్టి నీవు నాకు ఇచ్చిన శాపము ఉపసంహరింపుము." అని అన్నాడు.

అలాగే అన్నాడు ఉదంకుడు. "నా శాపము(అంధత్వము) కొద్దికాలము మాత్రమే ఉంటుంది. తరువాత శాపవిమోచనమవుతుంది." అని చెప్పి ఉదంకుడు కుండలములతో సహా గురు పత్ని వద్దకు వెళుతున్నాడు. దారిలో ఒక జలాశయము కనపడింది. ఉదంకుడు తన కుండలములను ఒక పవిత్రమైన ప్రదేశములో పెట్టి తాను జలాశయములో దిగి అనుష్ఠానము చేసుకుంటున్నాడు. ఇంతలో తక్షకుడు ఒంటి మీద బట్టలు లేకుండా నగ్నంగా అక్కడకు వచ్చి ఆ కుండలములు తీసుకొని పారిపోయాడు. ఉదంకుడు ఇది చూచి తక్షకుని వెంబడించాడు. తక్షకుడు ఒక రంధ్రం గుండా నాగలోకానికి పారిపోయాడు.

ఉదంకుడు కూడా నాగలోకానికి వెళ్లాడు. అక్కడ ఉన్న నాగ రాజులను పేరు పేరునా స్తుతించాడు. "తన వేయి పడగల మీద భూభారమును మోస్తూ శ్రీ మన్నారాయణుడికి శయ్యగా వెలుగొందే అనంతా! నీకు నమస్కారము. సమస్త నాగ లోకమును రాక్షసుల బాధ నుండి రక్షిస్తూ, మహాశివుని మెడలో అలంకారంగా వెలుగొందుచున్న ఓ వాసుకీ! నన్ను అనుగ్రహించు. దేవతల

చేతా మనుష్యుల చేతా పూజింప బడే సమస్త నాగరాజులకు నమస్కారము. తన కుమారుడైన అశ్వసేనుడితో కూడి భూలోకము అంతా సంచరించుచున్న తక్షకా! నన్ను అనుగ్రహించు." అని నాగుల నందరనూ పొగిడాడు ఉదంకుడు.

అప్పుడు అతనికి తెలుపు నలుపు దారాలతో వస్త్రములు నేయుచున్న ఇద్దరు స్త్రీలు, పన్నెండు ఆకులు గల చక్రమును తిప్పుతున్న ఈ ఇద్దరు స్త్రీల యొక్క ఆరుగురు కుమారులు, ఒక పెద్ద గుర్రమును ఎక్కిన ఒక దివ్యపురుషుని చూచాడు. ఆ దివ్యపురుషుడు ఉదంకుని చూచి "ఉదంకా! నీకు ఏమి వరం కావాలో కోరుకో!" అని అడిగాడు. వెంటనే ఉదంకుడు "ఈ నాగకులము మొత్తం నాకు వశవర్తులయి ఉండాలి." అని అడిగాడు. "అలాగయితే నువ్వు వచ్చి ఈ గుర్రం చెవిలో గట్టిగా ఊదు." అని అన్నాడు ఆ దివ్యపురుషుడు. వెంటనే ఉదంకుడు పోయి ఆ గుర్రం చెవిలో గట్టిగా ఊదాడు. అప్పుడు ఆ గుర్రము శరీరంనుండి భయంకరమైన అగ్ని జ్వాలలు పుట్టి నాగలోకమును చుట్టుముట్టాయి.

నాగులంతా ప్రళయం వచ్చిందని భయపడ్డారు. నాగరాజు తల్లడిల్లి పోయాడు. వెంటనే తక్షకుడు గడగడా వణుకుతూ వచ్చి తాను అపహరించిన కుండలమును ఉదంకుడికి ఇచ్చాడు. అక్కడి నుండి బయటకు ఎలా వెళ్లాలా అని మథన పడుతున్న ఉదంకునితో ఆ దివ్యపురుషుడు ఇలా అన్నాడు. "ఉదంకా! నీవు ఈ గుర్రము ఎక్కి నీకు కోరిన చోటికి వెళ్లు" అన్నాడు. వెంటనే ఉదంకుడు ఆ గుర్రము ఎక్కి గురువుగారి ఆశ్రమమునకు వెళ్లాడు. గురుపత్నికి కుండలములు ఇచ్చాడు.

"ఉదంకా! పక్కనే ఉన్న పౌష్యమహారాజు దగ్గరనుండి కుండలములు తేవడానికి ఇంత ఆలస్యమా!" అని గురువుగారు ఉదంకుని అడిగారు.

ఉదంకుడు జరిగిన విషయాలు అన్ని గురువుగారికి చెప్పాడు.

"ఉదంకా! నీవు ధన్యుడవు. ఆ ఎద్దు నెక్కి వచ్చిన వాడు ఇంద్రుడు. ఆ ఎద్దు ఐరావతము. నీవు తిన్న గోమయము అమృతము. నీవు నాగ లోకములో చూచిన స్త్రీలు ధాత, విధాత. ఆ తెలుపు,నలుపు దారాల వస్త్రము రాత్రి పగలు, 12 ఆకులు గల చక్రము 12 మాసములు గల సంవత్సరకాలము. ఆరుగురు కుమారులు ఆరు ఋతువులు. ఆగుర్రము నెక్కి వచ్చిన దివ్య పురుషుడు ఇంద్రుని మిత్రుడు పర్జన్యుడు. మొదట్లోనే నీవు ఇంద్రుడిని చూచి అమృతపానము చెయ్యడం వల్ల నీవు కోరుకున్న పని నెరవేరింది. నీవు గురు పత్ని కోరిక నెరవేర్చడం వల్ల గురు దక్షిణ చెల్లించుకున్నావు. నీ విద్యాభ్యాసం పూర్తి అయింది. నీకు కోరిన చోటికి వెళ్ల వచ్చును." అని పలికాడు గురువు.

ఉదంకుడు గురువుకునమస్కరించి వెళ్లిపోయాడు. కాని ఉదంకుని మనసులో మాత్రము తక్షకుడు తనకు చేసిన అపకారము మరువలేక పోయాడు. తక్షకుని మీద పగ తీర్చుకోవాలని అనుకున్నాడు. వెంటనే జనమేజయ మహారాజు వద్దకు వెళ్లాడు.

"జనమేజయ మహారాజా! నీకు శుభము కలుగు గాక. నా పేరు ఉదంకుడు. నేను నా గురువు గారి కార్యము మీద పోయేటప్పుడు, కుటిల బుద్ధితో ఏ మాత్రం వివేకం లేకుండా తక్షకుడు నాకు అపకారము చేసాడు. నన్ను మోసం చేసి గురుపత్ని కుండలములు అపహరించాడు. జనమేజయ మహారాజా! నాకే కాదు ఆ తక్షకుడు నీకూ మహాపకారము చేసాడు. మహావీరుడు అర్జునుని మనుమడు, అభిమన్యుని కుమారుడు అయిన నీ తండ్రి పరీక్షిత్తును దారుణంగా కాటువేసి చంపాడు. తన ఘోర మైన విషాగ్ని కీలలకు నీ తండ్రిని బలిచేసాడు. ఒక విప్రుని కోరిక మేరకు నీ తండ్రిని

చంపాడు. తక్షకుడు మహా బలవంతుడు కదా. ఆ బ్రాహ్మణునికి ఇది తప్పు. పరీక్షిత్తు మహారాజును చంపడం భావ్యం కాదు అని నచ్చచెప్పవచ్చుకదా! కాని చెప్పలేదు. ఆ బ్రాహ్మణుడు చంపమనగానే వచ్చి, కాటు వేసి, నీ తండ్రిని దారుణంగా చంపాడు.

జనమేజయమహారాజా! నీ తండ్రిని చంపిన వాడి మీద ప్రతీకారం తీర్చుకో! వెంటనే సర్పయాగం చెయ్యి. ఆ తక్షకుడిని ఆ యాగాగ్నిలో భస్మం చెయ్యి. ఒక్క తక్షకునే కాదు. సమస్త నాగజాతినే భస్యం చెయ్యి. నీ తండ్రిని చంపిన తక్షకుని మీద పగ చల్లార్చుకో! మహారాజా! ఒక్కడు తప్పు చేస్తే ఆ కులమంతా తప్పు చేసినట్టే. ఇదేమీ కొత్త కాదు. కాబట్టి వెంటనే సర్పయాగము చేసి తక్షకుని తో సహా సమస్త నాగ లోకమును యాగాగ్నిలో భస్మం చెయ్యి!" అని ఉదంకుడు జనమేజయుని రెచ్చగొట్టాడు.

ఈ కథ విన్న శౌనకాది మహామునులు సూతునితో ఇలా అన్నారు. "మహాత్మా! ఈ నాగకులమంతా యాగాగ్నిలో పడి భస్మం కావడానికి వేరు కారణం ఏమన్నా ఉందా!" అని అడిగారు.

" మహామునులారా మంచి ప్రశ్న వేసారు. పూర్వము సర్పకులమునకు తల్లి అయిన కద్రువ తన కుమారులకు ఇచ్చిన శాపం వలన, సర్పకులము అంతా జనమేజయుడు చేయబోయే సర్పయాగంలో పడి నశిస్తూ ఉంటే, పూర్వము భృగువంశము లో పుట్టిన రురుడు లోకములో ఉన్న పాములను అన్నిటినీ నాశనం చేస్తుంటే దానిని సమప్రపాదుడు ఆపి నట్టు, సర్పయాగంలో నాశనం అవుతున్న సర్పకులము ఆస్తీకుని వలన రక్షింపబడుతుంది. ఆ వృత్తాంతమును సవిస్తరముగా చెబుతాను వినండి.

పూర్వము భృగువు అనే మహర్షి ఉండేవాడు. అతని భార్య పేరు పులోమ. ఆమె గర్భం దాల్చింది. ఒకరోజు భృగువు గర్భిణితో ఉన్న తన భార్మ పులోమను అగ్నిహోత్రము చూస్తూ ఉండమని చెప్పి తాను స్నానానికి సమీపంలో ఉన్న నదికి వెళ్లాడు. ఆ సమయంలో పులోముడు అనే రాక్షసుడు అక్కడకు వచ్చాడు. పులోమను చూచాడు. ఆ రాక్షసుడికి పులోమ మీద మోహం కలిగింది. ఈమె ఎవ్వరు అని అగ్నిహోత్రుడిని అడిగాడు.

ఇప్పుడు అగ్ని సంకటం లో పడ్డాడు. ఎందుకంటే ఆ పులోమను మొదట పులోముడు అనే ఆ రాక్షసుడు వివాహం చేసుకోవాలని అనుకున్నాడు. కాని ఆమె తండ్రి ఒప్పుకోలేదు. భృగువుకు ఇచ్చి చేసాడు. ఆమె పులోమ అని తెలిస్తే రాక్షసుడు ఆమెను ఏం చేస్తాడో అని భయం. అదీ కాక, నిజం చెబితే ముని శాపం ఇస్తాడు. అబద్ధం చెబితే పాపం చుట్టుకుంటుంది. ఎలాగా అని ఆలోచించాడు. ముని శాపాన్ని ఎలాగైనా పోగొట్టుకోవచ్చు. కాని అనృతదోషమును పోగొట్టు కొనడం సాధ్యం కాదు. అని అనుకొన్నాడు.

పులోముని చూచి అగ్ని ఇలా అన్నాడు. "ఈమె భృగుమహర్షి భార్య పులోమ"అని చెప్పాడు.

పులోముడు ఆమెను గుర్తు పట్టాడు. తాను మొదట వివాహం చేసుకోదలచిన లలన ఆమే అని తెలుసుకున్నాడు. వెంటనే వరాహ రూపం దాల్చాడు. పులోమను బుజం మీద వేసుకొని పారిపోయాడు. అలా పారిపోతూ ఉండగా, ఆ అదురుకు ఆమెకు ప్రసవం అయింది. బిడ్డ కింద పడ్డాడు. అలా గర్భం నుండి జారిన వాడు కాబట్టి వాడికి చ్యవనుడు అని పేరు వచ్చింది. తల్లి గర్భంనుండి జారి పడిన చ్యవనుడు కళ్లు తెరవ గానే ఆ తీక్ష్ణ తకు తట్టుకోలేక పులోముడు అనే ఆ రాక్షసుడు భస్మం అయ్యాడు.

అప్పుడు పులోమ బిడ్డను ఎత్తుకొని భృగు మహర్షి ఆశ్రమానికి వచ్చింది. పులోముడు పులోమను ఎత్తుకొని పోతుంటే ఆమె కళ్లనుండి జాలువారిన కన్నీరు ఆ ఆశ్రమ సమీపంలో ఒక నదిగా ప్రహించింది. ఆ నదికి వధూసర అని బ్రహ్మ నామకరణం చేసాడు.

ఈ లోపల భృగువు స్నానం ముగించుకొని ఆశ్రమానికి వచ్చాడు. రాగానే అప్పుడే ఉదయించినట్టున్న తన కుమారుని, భార్యను చూచాడు. జరిగింది తెలుసుకున్నాడు. "అసలు నీవు పులోమ అనీ, నా భార్య అనీ ఆ రాక్షసునికి ఎలా తెలిసింది. ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

" నాధా! ఈ అగ్ని దేవుడు నా పేరు పులోమ అనీ, నేను తమరి భార్య అనీ చెప్పాడు. వెంటనే వాడు వరాహ రూపంతో నన్ను ఎత్తుకొని బుజం మీదపెట్టుకొని పరుగెత్తాడు. అప్పుడు ఈ బిడ్డ నా గర్భంలోంచి జారి కింద పడ్డాడు. అత్యంత తేజస్సు గల ఈ బిడ్డను చూడగానే ఆ రాక్షసుడు భస్మము అయ్యాడు." అని చెప్పింది పులోమ.

భృగువుకు కోపం వచ్చింది. "నా భార్య గురించి చెప్పిన నీవు అతి క్రూరుడవు. వాడు నా భార్యకు అపకారం చేస్తాడని తెలిసికూడా వాడికి నా భార్యగురించి చెప్పావు. అందుకని నీవు సర్వభక్షకుడివి అగుదువు గాక" అని అగ్నిదేవుని శపించాడు.

అప్పుడు అగ్ని భృగువుతో ఇలా అన్నాడు. "మహాఋషీ! తనకు తెలిసిన విషయాన్ని దాచి పెట్టి అబద్ధం చెప్పేవాడు నరకానికి పోతాడని నీకు తెలుసుకదా! నేను కూడా అసత్య దోషమునకు భయపడి ఈమె భృగువు భార్య అని ఉన్న విషయం చెప్పాను. నేను అఖిల జగములకు కర్మ సాక్షిని. అటువంటి

నేను అబద్ధం ఎలా చెప్పగలను. కాని నా తప్పు ఏమీ లేకపోయినా నీవు నాకు శాపం ఇచ్చావు. నేను కూడా నీకు శాపం ఇవ్వడానికి శక్తిలేని వాడను కాను కదా! కాని, కొట్టినా, తిట్టినా, పరుషమైన మాటలు పలికినా, ఉత్తమ బ్రాహ్మణులు పూజ్యులే కదా! అలాంటి బ్రాహ్మణులకు అపకారము చేస్తే నాకు ఇహము,పరమూ రెండూ లేకుండా పోతాయి. ఈ విషయం తెలిసిన వాడను కాబట్టి నేను ఎల్లప్పుడూ బ్రాహ్మణు లను పూజిస్తాను. బ్రాహ్మణుల మీద కోపించడానికి భయపడతాను. ఓ భృగు! నీవు కూడా ఉత్తమ మైన బ్రాహ్మణుడవు. ఏమిచేసినా నీకే చెల్లింది. సమస్తలోకములను హితం చేసే నాకు శాపం ఇచ్చి లోకాలకు అపకారం చేసావు. ఎలాగంటే, ప్రతి రోజూ వేదములో చెప్పబడిన నిత్యనైమిత్తికబలి విధానములలో బ్రాహ్మణుల చేత నాలో వేల్చబడిన హోమద్రవ్యములను, హవిస్సులను, పిండములను నేను తీసుకొని పోయి దేవతలకు, పితరులకు అందిస్తుంటాను. అందుకే నాకు హవ్యవాహనుడని పేరు వచ్చింది. కానీ నీవు ఇచ్చిన శాపం ప్రకారము నేను సర్వభక్షకుడినైతే నేను అపవిత్రుడిని అవుతాను. ఇంక నాకు హవిస్సులను తీసుకొని పోయి దేవతలకు,పితరులకు ఇచ్చే అర్హత లేదు. నేను ఆ పని చెయ్యకపోతే లోకము స్తంభించి పోతుంది." అని అన్నాడు అగ్ని.

వెంటనే అగ్ని దేవుడు తన జ్వాలలను ఉపసంహరించుకున్నాడు. త్రేతాగ్నులు (ఆహవనీయం, దక్షిణాగ్ని, గార్హపత్యం) జ్వలించడం మాను కున్నాయి. దేవక్రతువులు, యజ్ఞయాగములు నిలిచిపోయాయి. అగ్నిహోత్రము లేకపోవడంతో ఉదయం, సాయంత్రం చేసే ఔపోసనాది కార్యములు ఆగి పోయాయి. దేవతార్చనలలో దీపాలు వెలగడం లేదు. పితృకార్యములలో పితరులకు చేసే పిండప్రదానము నిలిచిపోయింది. జనమంతా హాహాకారాలుచేస్తున్నారు. అందరూ కలిసి మునుల దగ్గరకు వెళ్లారు. వారు అందరూ కలిసి దేవతల దగ్గరకు వెళ్లారు. అందరూ కూడపల్కుకొని

బ్రహ్మదేవుని వద్దకు పోయారు.  విషయమంతా తెలుసుకున్న బ్రహ్మ అగ్ని దేవుని  పిలిపించాడు.

"ఓ అగ్నీ!  వ్యక్తమవుతున్న (కనిపించుచున్న)  ఈ సమస్త భూతకోటికి నీవు యజమానివి. ఈ చరాచర సృష్టికి నీవు హేతుభూతుడవు. సమస్త దేవతలకు ముఖం లాంటి వాడివి. లోకపావకుడవు. అలాంటి నీవు ఇలా చెయ్యడం భావ్యమా!  భృగుమహర్షి వాక్కు అమోఘము.  ఆ ముని వాక్కు ప్రకారము నీవు సర్వభక్షకుడివి అయినా నీకు అశౌచము ఎలా కలుగుతుంది. నీవు శుచులలో శుచుడివి. నీ వలన సర్వమూ పవిత్రము అవుతుంది. పూజింప తగిన వారిలో నీవు అగ్రపూజ్యుడివి.  కాబట్టి నీ విధులు యథావిధిగా నిర్వర్తించు. బ్రాహ్మణుల సాయంతో హవిస్సులను దేవతలకు అందించు." అని అన్నాడు బ్రహ్మ దేవుడు.

అగ్నిదేవుడు బ్రహ్మదేవుని మాటలను ఆమోదించాడు. అగ్ని కార్యములు యథావిధిగా జరుగుతున్నాయి. తరువాత, భృగు కుమారుడైన చ్యవనుడు సుకన్య అనే కన్యను వివాహమాడాడు. వారికి ప్రమతి అనే కుమారుడు కలిగాడు.  క్షీరసాగర మథన సమయంలో అమృత కలశంతో పాటు ఘృతాచి అనే అప్సరస కూడా పుట్టింది. ఆ ఘృతాచిని ప్రమతి పెళ్లిచేసుకున్నాడు.   ఆ ఇరువురికి రురుడు అనే కుమారుడు జన్మించాడు.

ఇది ఇలా  ఉండగా, విశ్వావసుడు అనే గంధర్వరాజుకు, మేనక అనే అప్సరసకు ప్రమద్వర అనే కుమార్తె పుట్టింది. ఆ ప్రమద్వర స్థూలకేశుడు అనే ముని ఆశ్రమంలో పెరుగుతూ ఉంది.  ఆ ప్రమద్వరను ఈ రురుడు ప్రేమించాడు. పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడు.

ఇంతలో ఒకరోజు ఆ ప్రమద్వరను ఒక పాము కాటు వేసింది. పాము కాటుతో ప్రమద్వర మరణించింది. ఆ ముని ఆశ్రమంలో ఉన్న వారందరూ ఆమె మరణానికి దుఃఖించారు. ఈ వార్త విన్న రురుడు గుండె బద్దలు అయ్యేట్టు ఏడ్చాడు. అక్కడ ఉండలేక ఒంటరిగా అడవులలోకి వెళ్లిపోయాడు. ఒక చోట కూర్చుని చేతులు పైకెత్తి "ఓ దేవతలారా! ఓ బ్రాహ్మణులారా! నేను దేవ యజ్ఞములు, వేదాధ్యయనము, వ్రతములు, పుణ్యకార్యములు చేసిన వాడిని అయితే, నేను నా గురువులను భక్తితో సేవించేవాడిని అయితే, నేను ఘోరమైన తపస్సు చేసేవాడిని అయితే, నా మనస్సునిండా నిల్చిన నా ప్రేయసి ప్రమద్వరకు మీ అందరి దయవలన విషము దిగిపోవుగాక!" అని ప్రార్థించాడు. "ఈ లోకంలో ఎంతో మంది మంత్ర తంత్రములు నేర్చినవారు. విషతత్త్వ శాస్త్రములు చదివిన వారు ఉన్నారు కదా! ఒక్కరు కూడా ప్రమద్వర ను ఈ విషము నుండి కాపాడలేరా! అలా చేస్తే నేను ఇప్పటి వరకూ చేసిన తపోఫలము, అధ్యయన ఫలము వారికి ధారపోస్తాను." అని ఆ క్రోశించాడు.

అతని మొరను విని ఒక దేవదూత ఆకాశమునుండి ఇలా పలికాడు. "ఓ విప్రోత్తమా! ప్రమద్వరను కాలవశమున పాము కాటు వేసింది. దానిని ఆపడం ఎవరి తరమూ కాదు. కాని దీనికి ఒక ఉపాయము మాత్రం ఉంది. ఎవరైనా తమ ఆయుర్దాయములో సగం ఆమెకు ఇస్తే ఆమె విషం నుండి విముక్తి పొందుతుంది. ఇదివరకటి కంటే ఎక్కువ తేజస్సుతో జీవిస్తుంది. ఇది యమధర్మరాజు అనుమతితో నేను చెబుతున్నాను." అని అన్నాడు. రురుడు సంతోషంతో తన ఆయువులో సగభాగం ప్రమద్వరకు ఇచ్చాడు. ప్రమద్వర విషము నుండి విముక్తి పొందింది. రురుడు, ప్రమద్వర పెళ్లిచేసుకొని సుఖంగా ఉన్నారు.

కాని రురుడికి మాత్రం తన ప్రేయసికి అపకారం చేసిన పాముల మీద

కోపం పోలేదు. ఒక కర్రతీసుకున్నాడు. కనిపించిన పామును కనిపించినట్టు చంపుతున్నాడు. చెట్ల వెంట పుట్టల వెంట తిరుగుతూ, పాములను వెతికి వెతికి మరీ చంపుతున్నాడు. అలా చంపుతుండగా ఒక రోజు డుండుభము అనే పామును చూచాడు. చిక్కిందిరా అని దానిని చంపడానికి కర్రపైకి ఎత్తాడు. ఆ డుండుభము అనే పాము భయపడి అతనితో ఇలా అంది.

" ఏంటిది? పాములను ఎందుకు చంపుతున్నావు? దీనికి కారణమేమి? నీవు మంచి తేజస్సుగల బ్రాహ్మణుడి లాగా కనపడుతున్నావు. ~~ఈ~~ పాములను చంపడం ఏమిటి?" అని అడిగింది.

" నా పేరు రురుడు. నేను ప్రమద్వర అనే కన్యను ప్రేమించాను. ఒక పాము నేను ప్రాణంతో సమానంగా ప్రేమించిన నా ప్రేయసిని కాటు వేసింది.అందుకే పాములను చంపుతున్నాను. నిన్నుకూడా ఇప్పుడే చంపుతాను" అని కొట్టడానికి కర్రను పైకి ఎత్తాడు.

వెంటనే ఆ పాము మానవ ఆకృతి దాల్చి రురుడి ఎదురుగా నిలబడింది. రురుడు ఆశ్చర్యపోయాడు. "ఇదేమిటి! నీవు పామువు కదా! మునీశ్వర అవతారం ఎత్తావేమిటి? నీవు ఎవరు?" అని అడిగాడు.

"అయ్యా! నేను సహస్రపాదుడు అనే మునీశ్వరుడను. నా స్నేహితుని పేరు ఖగముడు. ఒక రోజు ఖగముడు అగ్నికార్యము చేస్తున్నాడు. నేను పరిహాసానికి ఒక గడ్డితో చేసిన పామును అతని మీదికి విసిరాను. దానికి అతనికి కోపం వచ్చింది. నన్ను విషంలేని పాముగా మారిపొమ్మని శపించాడు. ఏదో పరిహాసానికి చేసిన పనికి అంతఘోరమైన శాపం పెడతావా! నన్ను క్షమించలేవా అని అడిగాను. మిత్రమా! నా మాట తప్పకుండా జరుగుతుంది. కానీ నీవు పాముగ

పడి ఉండగా నిన్ను చంపడానికి రురుడు అనే భృగు వంశ సంజాతుడు వస్తాడు. అతనిని చూడగానే నీకు మామూలు రూపం వస్తుంది అని అన్నాడు. ఆ కారణం చేత నిన్ను చూడగానే నేను నా మామూలు రూపం పొందాను.

అది సరే! నీవు బ్రాహ్మణ వంశంలో పుట్టావు కదా! సర్వగుణ సంపన్నుడివి కదా! ఇది ఏమి పని? ఇలాంటి క్రూరమైన పనులు క్షత్రియులకు తప్ప బ్రాహ్మణులకు ఉచితము కాదు కదా! ఎందుకంటే బ్రాహ్మణుడు అహింసాపరులు కదా! వారు హింస చేయరు. ఎదుటి వారు హింస చేస్తుంటే నివారించే కరుణామూర్తులు. జనమేజయుడు సర్పయాగము చేసి లోకములో ఉన్న పాములను అన్నింటినీ యాగాగ్నిలో భస్మం చేస్తుంటే నీ తండ్రిగారి శిష్యుడైన ఆస్తీకుడు కదా వారించాడు. నాగలోకమును రక్షించాడు. మరి నీవు ఇలా పాములను చంపడం భావ్యమా! ఈ సంహార కార్యక్రమం పమానలేవా!"అని అన్నాడు.

ఆ మాటలు విన్న రురుడు తన తప్పు తెలుసుకున్నాడు. పాములను చంపడం మానుకున్నాడు.

ఈ కథ విన్న శౌనకాది మహామునులు సూతునితో ఇలా అన్నారు. "ఎవరైనా తన బిడ్డలకు అపకారం చేస్తే తల్లి కాపాడుతుంది కదా. అటువంటిది కద్రువ తన కుమారులకు శాపం ఎలా ఇచ్చింది?" అని అడిగారు. దానికి సూతి ఇలా చెప్పసాగాడు.

మహాభారతము

ఆదిపర్వము ప్రథమాశ్వాసము సంపూర్ణము.

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎర్రాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)

Modali Venkata Subrahmanyam,
B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.
Ph:040-24048104

# మహాభారతం

## ఆదిపర్వము

### ద్వితీయాశ్వాసము

ఆ కథకుడు (ఉగ్రశ్రవసుడు) శౌనకాది మహా మునులను చూచి ఇలా చెప్పసాగాడు.

కృతయుగంలో కశ్యపప్రజాపతి ఉండేవాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. వినత, కద్రువ. పుత్ర సంతానము కోరి వారు కశ్యపుని ప్రార్థించారు. కశ్యపుడు వారిని చూచి

"మీకు ఎలాంటి సంతానం కావాలి" అని అడిగాడు.

కద్రువ తనకు "ప్రకాశవంతులైన, పొడవైన దేహముగల వెయ్యి మందికుమారులు కావాలి" అని అడిగింది.

వినత కొంచెం ఆలోచించి తనకు "కద్రువకుమారుల కంటే బలవంతులైన ఇద్దరు సుపుత్రులు కావాలి" అని కోరింది.

కశ్యపుడు పుత్రకామేష్టి యాగం చేసాడు. వినత కద్రువలు గర్భం ధరించారు. కద్రువకు వెయ్యి అండములు (eggs), వినతకు రెండు అండములు కలిగాయి. వారు ఇద్దరు ఆ అండములను జాగ్రత్తగా కాపాడుతున్నారు..

కొంత కాలానికి కద్రువకు కలిగిన అండములు పగిలి, అందులోనుండి, వాసుకి, శేషుడు, తక్షకుడు మొదలైన సర్పములు (పాములు) బయటకు వచ్చాయి. కాని వినత కు కలిగిన అండములు ఎంతకూ పగలలేదు. వినతకు ఉక్రోషం వచ్చింది. ఎలాగైనా తను కూడా సంతానం పొందాలని, రెండు అండములలో ఒక అండమును బలవంతముగా చిదిమింది.

అందులో నుండి, అపరార్ధ కాయ విహీనుడు (నడుము కింద దేహము లేని వాడు అంటే నడుము నుండి పైన మాత్రమే దేహముకలవాడు,) బయటకు వచ్చాడు. అతని పేరు అరుణుడు.

అరుణుడు తల్లి వినతను చూచి "అమ్మా, ఎందుకమ్మా తొందరపడి అండాన్ని చిదిపావు. నేను సగం దేహంతో పుట్టాను. సవతి మత్సరంతో అండాన్ని చిదిమావు కాబట్టి నువ్వు నీ సవతికి దాసిగా ఉండుము." అని

శపించి, "అమ్మా, రెండవ అండాన్ని జాగ్రత్తగా రక్షించు. అందులో నుండి పుట్టబోయేవాడు మహాబల సంపన్నుడు. వాడు నీ దాసీత్వాన్ని పోగొడతాడు " అని చెప్పాడు.. తరువాత, సూర్య భగవానుడి రధానికి సారధిగా వెళ్లాడు.

జరిగిన దానికి బాధపడ్డ వినత, రెండవఅండాన్ని జాగ్రత్తగా కాపాడ సాగింది.

ఇది ఇలా ఉండగా, దేవతలు, అసురులు అమృతం కోసం సముద్రాన్ని మధించడానికి నిశ్చయించారు. సముద్రాన్ని ఎలా మధించాలి, దానికి కవ్వం ఏది, తాడు ఏది అని చర్చించ సాగారు. బ్రహ్మ, విష్ణువులతో చర్చించారు.. బాగా ఎత్తుగా, పొడవుగా ఉన్న మంధర పర్వతాన్ని కవ్వముగాను, వాసుకిని తాడు గాను నిశ్చయించారు.

సర్ప రాజు అయిన ఆదిశేషువు మంధర పర్వతాన్ని పెకలించాడు. దేవతలు, అసురులు, ఆ పర్వతాన్ని తెచ్చి సముద్రంలో నిల బెట్టారు. కాని అది లోపలకు కుంగి పోతూ ఉంది. ఆదికూర్మమును మంధర పర్వతం కింద ఉంచారు. అప్పుడు మంధర పర్వతం నిటారుగా నిల బడింది. సర్ప రాజు వాసుకిని తాడుగా చేసారు. తల వైపు అసురులు, తోక వైపు దేవతలు పట్టుకొని సముద్రాన్ని చిలకడం ఆరంభించారు.

మొట్ట మొదట సముద్రంలోనుండి హాలా హాలం పుట్టింది. దానిని మహాశివుడు తీసుకొని తన కంఠంలో నిలుపుకున్నాడు.

తరువాత, లక్ష్మీదేవి, కౌస్తుభ మణి పుట్టాయి. వాటిని విష్ణువు స్వీకరించి తన వక్షస్థలంలో నిలుపుకున్నాడు. తరువాత ఉచ్చైశ్రవము అనే తెల్లటి గుర్రము, ఐరావతము అనే తెల్లటి ఏనుగు, పుట్టాయి. వాటిని మహేంద్రుడు స్వీకరించాడు. తరువాత అమృత కలశము పుట్టింది. ఆ అమృత కలశాన్ని రాక్షసులు స్వీకరించారు. కాని విష్ణు మూర్తి, మోహినీ రూపంతో రాక్షసులను వంచించి, ఆ అమృత కలశాన్ని దేవతలకు ఇచ్చాడు. అమృతం తాగడానికి దేవతలు అందరూ కూర్చున్నారు.

రాహువు అనే రాక్షసుడు దేవతల రూపం ధరించి వారితో పాటు అమృతం తాగడానికి కూర్చున్నాడు. రాహువుకు అమృతం ఇచ్చే సమయంలో ఈ విషయాన్ని సూర్యుడు, చంద్రుడు గుర్తించారు. వెంటనే విష్ణువుకు ఈవిషయం చెప్పారు. విష్ణువు తన చక్రాయుధంతో రాహువు తల తెగ నరికాడు.

కాని అప్పటికే అమృతము రాహువు కంఠం దాకా వెళ్లింది కాబట్టి, తల మాత్రం అమృతత్వాన్ని సంతరించుకుంది. మొండెం మాత్రం తల నుండి వేరయి పడిపోయింది. అప్పటి నుండి రాహువుకు, సూర్య చంద్రులకు బద్ధ వైరం ఏర్పడింది.

కష్ట పడి సముద్రాన్ని చిలికి అమృతాన్ని సంపాదించినా, విష్ణువు చేసిన మాయ వల్ల, రాక్షసులకు అమృతం దక్కలేదు. వాళ్లకు చాలా కోపం వచ్చింది. వాళ్లు బలి చక్రవర్తితో ఆలోచన చేసారు. ఇంక దేవతలతో పొత్తు కుదరదు అనుకున్నారు. దేవతలతో యుద్ధం ప్రకటించారు.

దేవ దానవ యుద్ధం జరిగింది. దేవతల పక్షాన నరుడు, నారాయణుడు యుద్ధం చేసారు. వాళ్ల ధాటికి రాక్షసులు తట్టుకోలేక పోయారు. ఓడి పోయారు. సముద్రంలోకి పారి పోయారు. దేవతలు విజయం సాధించారు. మంధర పర్వతాన్ని ఇది వరకు ఉన్న చోట పెట్టారు. స్వర్గానికి వెళ్లి సుఖంగా ఉన్నారు. అమృత కలశాన్ని దేవేంద్రునికి ఇచ్చారు. దేవేంద్రుడు అమృత కలశాన్ని జాగ్రత్తగా కాపాడుతున్నాడు.

ఇది ఇలా ఉండగా, ఒక రోజు, దేవేంద్రుడి దగ్గర

ఉన్న ఉచ్చైశ్రవము అనే తెల్లని గుర్రము, సముద్రం ఒడ్డున విహరిస్తూ ఉంది. కశ్యపప్రజాపతి భార్యలు అయిన, వినత, కద్రువ కూడా సముద్రపు ఒడ్డుకు విహారానికి వెళ్లారు.

అప్పుడు కద్రువ దూరం నుండి ఆ తెల్ల గుర్రాన్ని చూచింది. వినతను చూచి "వినతా, చూచావా. ఆ గుర్రం ఎంత తెల్లగా ఉందో. కాని ఆ గుర్రం తోక మాత్రం అంత నల్లగా ఉందేమే?" అన్నది పరిహాసంగా.

వినత కూడా చూచింది. ఆ గుర్రం తోక తెల్లగా పాల నురగలాగా ఉంది.

"అదేమిటి అక్కా ఆ గుర్రం తోక తెల్లగా ఉంది. నల్లగా ఉంది అంటావేమిటి?" అంది.

దానికి కద్రువకు పట్టుదల పెరిగింది. "కాదు, ఆ గుర్రం తోక నల్లగా ఉంది" అంది. వినత ఒప్పుకోలేదు.

"ఐతే ఒక పందెం, ఆ గుర్రం తోక నల్లగా ఉంటే నువ్వు నాకు దాస్యం చెయ్యాలి. ఆ గుర్రం తోక

నువ్వు చెప్పినట్లు తెల్లగా ఉంటే, నేను నీకు దాస్యం చేస్తాను" అంది కద్రువ.

వినత దానికి ఒప్పుకుంది. "పద అక్కా వెళ్లి చూద్దాము" అంది వినత.

"వద్దులే. ఇప్పుడు పొద్దుపోయింది. ఆ గుర్రం ఎక్కడకు పోతుంది. రేపు చూద్దాము" అంది.

సరే అని ఇద్దరు ఇళ్లకు వెళ్లారు. ఆ రోజు రాత్రి కద్రువ తన కొడుకులైన పాములందరిని పిలిచింది. తనకు, వినతకు జరిగిన పందెం విషయం చెప్పింది.

"కుమారులారా, మీ తల్లి దాసి కాకుండా మీరే కాపాడాలి. రేపు ఉదయం ఆ గుర్రం తోక నల్లగా కనపడాలి" అంది కద్రువ.

ఆమె కొడుకులు దానికి ఒప్పుకోలేదు. "అమ్మా, తల్లి చెప్పినదని అధర్మానికి పాల్పడ వచ్చునా. తప్పు కాదా. ఇంత నీతి లేనిపని ఎలా చెయ్యమంటావు అమ్మా" అన్నారు.

దానికి కద్రువ కోపించింది. "మీరు తల్లి మాట

పినలేదు. కాబట్టి, పరీక్షిత్ మహారాజు కుమారుడైన జనమేజయుడు చేయబోయే సర్పయాగంలో పడి పాములన్నియు చనిపోవు గాక" అని శాపం ఇచ్చింది.

ఇదంతా చూచి కర్కోటకుడు అనే పాము భయపడ్డాడు. "అమ్మా అమ్మా, నేను నీ కోరిక నెరవేరుస్తాను అమ్మా" అన్నాడు. కద్రువ అతని మాటలకు సంతోషించింది.

వెంటనే కర్కోటకుడు వెళ్లి, సముద్రం ఒడ్డున ఉన్న ఆ గుర్రపు తోకకు చుట్టుకున్నాడు. అప్పుడు ఆ తోక నల్లగా కనపడ సాగింది.

మరు నాడు ఉదయమే, వినత కద్రువ, సముద్ర తీరానికి వెళ్లారు. దూరం నుండి గుర్రాన్ని చూచారు. తోక నల్లగా కనపడింది. వినత ఓడిపోయినట్లు ఒప్పుకుంది. అప్పటి నుండి వినత కద్రువకు దాసి అయింది.

కొంత కాలం గడిచింది. వినత జాగ్రత్తగా కాపాడుతున్న అండము పగిలింది. అందులో నుండి అత్యంత బల సంపన్నుడు, అమిత వేగము కల వాడు అయిన గరుడుడు పుట్టాడు. బయటకు రాగానే

అత్యంత వేగంతో ఆకాశంలోకి ఎగిరాడు. వెంటనే కిందికి వచ్చి తల్లి వినతకు నమస్కరించాడు. తరువాత కద్రువకు కూడా నమస్కరించాడు. అత్యంత బల సంపన్నుడైన గరుడుని చూచి కద్రువకు అసూయ కలిగింది.

"గరుడా, నీ తల్లి వినత నాకు దాసి. కనుక నువ్వు దాసీ పుత్రుడవు. నువ్వు నా కుమారులకు దాస్యం చెయ్యాలి. ప్రతిరోజూ పాములన్నింటిని నీ వీపు మీద ఎక్కించుకొని విహారానికి తీసుకెళ్ళు" అని ఆజ్ఞాపించింది.

"సరే" అన్నాడు గరుడుడు.

ఒక రోజు, గరుడుడు పాములను తన వీపు మీద ఎక్కించుకొని సూర్య మండలం దాకా ఎగిరాడు. అక్కడ ఉన్న వేడిమికి పాములు తట్టుకోలేక మాడిపోయి మూర్ఛ పోయాయి. ఇది చూచి కద్రువ దుఃఖించింది. ఇంద్రుడిని ప్రార్థించి వర్షం కురిపించింది. ఆ వాన జల్లులో తడిసి, పాములన్నీ సేద తీరాయి. జరిగిన దానికి కద్రువ గరుడుని దూషించింది.

అది సహించలేక పోయాడు గరుడుడు. తల్లి

అయిన వినతను చూసి "అమ్మా అమ్మా, ఏమిటమ్మా, నువ్వు ఎందుకమ్మా కద్రువకు దాస్యం చేస్తున్నావు. కారణమేమిటమ్మా?" అని అడిగాడు.

వినత తనకు, కద్రువ కు జరిగినదంతా చెప్పింది. పందెం విషం చెప్పింది.

"గరుడా నీ వల్ల నా దాస్యం తొలగిపోతుంది అని నీ అన్నయ్య అరుణుడు చెప్పాడు. అందువల్ల ఇప్పటికా ఈ దాస్యాన్ని అనుభవిస్తున్నాను" అని చెప్పింది.

వెంటనే గరుడుడు కద్రువ వద్దకు, పాముల వద్దకు వెళ్లి "మీకు ఏమి చేస్తే నా తల్లి దాస్య విముక్తి అవుతుంది" అని అడిగాడు.

అప్పుడు పాములన్ని గరుడుని చూసి "దేవ లోకం లో ఉన్న అమృత కలశం తెచ్చి మాకు ఇస్తే, నువ్వు, నీ తల్లి దాస్య విముక్తులవుతారు" అని చెప్పారు.

దానికి గరుడుడు అంగీకరించాడు. తల్లి వినత వద్దకు వెళ్లాడు. "అమ్మా అమ్మా దేవ లోకం నుండి అమృతం తెచ్చి, నీకు దాస్య విముక్తి కలిగిస్తాను

అమ్మా. నన్ను అశీర్వదించమ్మా" అన్నాడు.

వినత సంతోషంగా కొడుకును దీవించి పంపింది. గరుడుడు ఆకాశంలోకి ఎగిరాడు. దేవలోకానికి పోతూ దారిలో తండ్రి అయిన కశ్యపుని కలిసాడు.

కశ్యపుని చూచి గరుడుడు "తండ్రీ, నేను నా తల్లి దాస్యము నివృత్తి చేయుటకు అమృతము తెచ్చుటకు దేవలోకము వెళ్లుచున్నాను. నాకు ఆకలిగా ఉన్నది. నాకు తగిన ఆహారము కావలెను" అని అడిగాడు.

కశ్యపుడు "కుమారా, విభావసుడు, సుప్రతీకుడు అని ఇరువురు అన్నదమ్ములు ఉన్నారు. తమ పిత్రార్జితమైన ఆస్తిలో భాగము ఇవ్వమని సుప్రతీకుడు తన అన్న గారైన విభావసుడిని అడిగాడు. దానికి అన్న విభావసుడు కోపించి తమ్ముడిని "నువ్వు ఏనుగువు కమ్ము" అని శపించాడు. దానికి తమ్ముడు సుప్రతీకుడు కూడా కోపించి "నువ్వు తాబేలువు కమ్ము" అని ప్రతి శాపం ఇచ్చాడు. అప్పుడు వారు ఇరువురు, మూడు యోజనముల పొడవు, పదియోజనముల వెడల్పు కల తాబేలు కానూ, ఆరు యోజనముల పొడవు, పన్నెండు యోజనముల వెడల్పుకల ఏనుగు గాను మారి పోయారు. కాని వారు ఇంకా ఆస్తి కోసం తగవులాడుకుంటూనే

ఉన్నారు. నీవు ఆ ఏనుగును, తాబేలును భక్షించి నీ ఆకలి తీర్చుకొనుము" అని చెప్పాడు కశ్యపుడు.

గరుడుడు సంతోషించి, ఆ ఏనుగు తాబేలు ఉండే చోటికి వెళ్ళి, వాటిని తన రెండు కాళ్ల తో పట్టుకొని ఆకాశంలోకి ఎగిరి పోయాడు. మధ్య లో రోహణము అనే మహా వృక్షాన్ని చూచాడు.

అప్పుడు రోహణుడు గరుడుని చూచి "గరుడా, నువ్వు నా కొమ్మ మీద కూర్చుని ఆ ఏనుగును, తాబేలును తినుము" అని కోరాడు.

గరుడుడు అలాగే అని, ఒక పెద్ద కొమ్మ మీద వాలాడు. కాని ఆ ఏనుగు, తాబేలు, గరుడుని బరువుకు తాళ లేక, ఆ కొమ్మ విరిగి పోయింది. గరుడుడు కంగారుపడ్డాడు. ఆ కొమ్మ భూమి మీద పడితే, ఆ కొమ్మకు తలకిందులుగా వేలాడుతూ తపస్సు చేసుకొనుచున్న వాలఖిల్యులు అనే మునులు కింద పడి పోతారేమోనని భయపడి, ఆకొమ్మను నోట కరుచుకొని మరల ఆకాశంలోకి ఎగిరాడు.

మరల తండ్రి అయిన కశ్యపుని వద్దకు వెళ్లాడు. గరుడుడు పడుతున్న అవస్త చూచి కశ్యపుడు, ఆ

మహా మునులతో "మహాత్ములారా, గరుడుడు ఒక కార్యము నిమిత్తము దేవలోకానికి వెళుతున్నాడు. దయచేసి మీరు ఈకొమ్మను పిడిచిపెట్టి, వేరేచోటికి వెళ్లి తపస్సు చేసుకోండి" అని ప్రార్థించాడు.

దానికి ఆ మునులు సమ్మతించి, ఆ కొమ్మను పిడిచిపెట్టి హిమాలయాలకు వెళ్లారు. తరువాత గరుడుడు ఆ కొమ్మను ఎవరూ లేని చోట జార పిడిచాడు. హిమాచలం మీద ఉన్న ఒక కొండ శిఖరం మీద కూర్చుని ఆ ఏనుగును, తాబేలును తిన్నాడు. వెంటనే దేవలోకానికి వెళ్లాడు.

గరుడుడు దేవ లోకం సమీపించగనే, దేవేంద్ర సభలో దుశ్శకునాలు గోచరించాయి. దేవ గురువు, బృహస్పతి, దేవేంద్రుడిని చూచి,

"దేవేంద్రా, కశ్యపుని కుమారుడు గరుడుడు, తన తల్లి వినత దాస్య విముక్తి కొరకు, అమృతాన్ని అపహరించడానికి వస్తున్నాడు" అని చెప్పాడు. అప్పుడు దేవేంద్రుడు తన భటులతో "అమృతాన్ని జాగ్రత్తగా కాపాడండి" అని ఆజ్ఞాపించాడు. గరుడునికి అమృత రక్షకులకు ఘోర యుద్ధం జరిగింది. గరుడుడు దేవతలను తన ముక్కుతోనూ, కాలి గోళ్ల తోనూ, రెక్కలతోనూ,

గాయపరిచాడు. గరుడుని ధాటికి తట్టుకోలేక, అమృత రక్షకులైన దేవతలు పారి పోయారు. గరుడుడు అమృతం ఉన్న చోటికి చేరుకున్నాడు. అమృత కలశాన్ని తీసుకొని ఆకాశంలోకి ఎగిరాడు.

అప్పుడు విష్ణువు గరుడుని వద్దకు వచ్చాడు. "గరుడా నీ శౌర్యానికి సాహసానికి మెచ్చాను.నీకు ఏమివరం కావాలో కోరుకో!" అని అడిగాడు.

దానికి గరుడుడు " దేవా, నేను అమృతం సేవించకుండానే, నాకు ముసలి తనం, చావు లేకుండా, ఎల్లప్పుడూ నిన్ను సేవించే వరం ప్రసాదించు" అని అడిగాడు. విష్ణువు దానికి సంతోషించి, "గరుడా నీవు కోరిన వరం ఇస్తున్నాను. ఇంక నుండి నువ్వు నాకు వాహనంగానూ, నా పతాకం గానూ ఉండు" అని అన్నాడు.

(ఇప్పటికీ, వైష్ణవ ఆలయాల్లో, గరుడ ధ్వజారోహణము, , గరుడ వాహనము, గరుడ సేవ జరుగుతున్నాయి. )

గరుడుడు విష్ణువుకు నమస్కరించి, మరల పైకి ఎగిరాడు. ఇంతలో దేవేంద్రుడు, తన వజ్రాయుధాన్ని గరుడుని మీదికి విసిరాడు. వజ్రాయుధం గరుడుని మీదికి వస్తూ ఉంది. వజ్రాయుధాన్ని చూచి

గరుడుడు

"ఓ వజ్రాయుధమా, నీవు ఒక మహా ముని (దధీచి) నుండి పుట్టి నావు కబట్టి నిన్ను అవమానించను. నువ్వు దేవేంద్రుని ఆయుధం కాబట్టి, నిన్ను గౌరవించు చున్నాను. కాని నువ్వు నన్ను ఏమీ చెయ్యలేవు. అందు కని, నా రెక్కలో ఉన్న ఒక ఈకను త్రుంచుము" అని చెప్పాడు.

ఇది అంతా చూచి దేవేంద్రుడు గరుడిని శక్తికి ఆశ్చర్యపోయాడు. గరుడునితో స్నేహం చెయ్యాలను కున్నాడు.

"ఓ గరుడా, నేను నీకు స్నేతుడిని. నువ్వు ఈ అమృతాన్ని క్రూరులైన పాములకు ఇస్తున్నావు. అప్పుడు వారిని దేవతలు కూడా జయింపలేరు. కాబట్టి అమృత కలశాన్ని తిరిగి నాకు ఇమ్ము. నువ్వు కోరినది ఇస్తాను" అన్నాడు.

దానికి గరుడుడు "మహేంద్రా, ఈ అమృత కలశాన్ని నేను పాములకు ఇస్తే నా తల్లి వినత దాస్య పి ముక్తి అవుతుంది. నేనూ నా తల్లి దాస్యపి ముక్తులమై వెళ్లిపోతాము. తరువాత నువ్వు ఈ అమృత కలశాన్ని

పాముల నుండి సంగ్రహించు" అని చెప్పాడు.

"గరుడా నువ్వు నాకు అమృతాన్ని ఇస్తున్నావు. నీకు ఏమి కావాలో కోరుకో" అన్నాడు.

దానికి గరుడుడు, "నాకు నా తల్లికి అపకారం చేసిన పాములు నాకు ఆహారం అయ్యేట్లు అనుగ్రహించు" అన్నాడు. దానికి మహేంద్రుడు అలాగే అని వరము ఇచ్చాడు.

తరువాత గరుడుడు పాముల వద్దకు అమృత కలశాన్ని తీసుకొని వెళ్ళాడు. దేవేంద్రుడు అతనిని అనుసరించాడు. గరుడుడు అమృతకలశాన్ని ధర్భల మీదపెట్టాడు. పాములను చూచి

"మీరు కోరినట్లు అమృతాన్ని తెచ్చి మీకు ఇచ్చాను. నేను నా తల్లి దాస్యవిముక్తుల మయ్యాము. మేము వెళుతున్నాము. మీరు స్నానం చేసి శుచి అయి వచ్చి ఈ అమృతాన్ని సేవించండి" అని చెప్పి, తన తల్లి వినతను వీపు మీద ఎక్కించుకొని ఎగిరిపోయాడు.

అమృతం దొరికిందన్న ఆనందంతో పాములన్నీ స్నానం చేసి రావడానికి వెళ్ళాయి. అక్కడే దాక్కుని

ఉన్న దేవేంద్రుడు వచ్చి అమృత కలశాన్ని సంగ్రహించి, స్వర్గానికి తీసుకు వెళ్లాడు. అమృతకలశాన్ని యధా స్థానంలో ఉంచాడు.

ఇక్కడ పాములు స్నానం చేసి వచ్చి చూస్తే అమృత కలశం కనపడలేదు. చాలా దుఃఖించారు. కనీసం అమృతం పెట్టిన ధర్భలను నాకితే నన్నా ఫలితం ఉంటుందని, ఆ ధర్భలను తమ నాలుకల తో నాకారు. ధర్భలు వాటి నాలుకలను రెండుగా చీల్చాయి.

అప్పటి నుండి పాములు ద్విజిహ్వలు అయ్యాయి అంటే పాములకు రెండు నాలుకలు ఏర్పడ్డాయి. అమృత కలశం ధర్భల మీద ఉంచబడింది కాబట్టి అప్పటి నుంది ధర్భలు పవిత్రం అయ్యాయి.

ఈ విధంగా పాములకు అమృతం దక్కలేదు. ఇది అంతా చూచి ఆది శేషువు తన తల్లి, తమ్ములు చేసిన పనులకు చాలా బాధ పడ్డాడు. అసహ్యించుకుని వెళ్లి పోయాడు. బ్రహ్మను గూర్చి తపస్సు చేసాడు.

బ్రహ్మ ప్రత్యక్షం అయి "ఓ ఆది శేషూ, నీ సత్య సంధతకు, ధర్మ నిష్టకు సంతోషించాను. ఈ

భూభారాన్ని మొయ్యడానికి నువ్వే సమర్ధుడివి. వేరే ఎవ్వరూ ఈపని చెయ్యలేరు. కాబట్టి, ఇప్పటినుండి ఈ భూభారాన్ని నువ్వు మోస్తూ ఉండు" అని చెప్పాడు. అప్పటినుండి ఈ భూ భారాన్ని ఆది శేషువు తన పడగల మీద మోస్తున్నాడు.

ఆది శేషువు అలా వెళ్లగానే, కద్రువ కొడుకుల్లో ముఖ్యుడైన వాసుకి కి సర్ప యాగం భయం పట్టు కుంది. తన తమ్ములను,బంధువులను అందరిని సమావేశపరిచాడు.

"తమ్ములారా, బంధువులారా, ఆది శేషువు బ్రహ్మ గారి ఆజ్ఞ చేత భూ భారం మోస్తున్నాడు. కాబట్టి అతని కే మీ అపకారం జరగదు. నేను సాగర మధ నంలో తాడు లాగా ఉపయోగ పడ్డాను కాబట్టి, దేవత లందరూ బ్రహ్మ తో చెప్పి నాకు చావులేకుండా చేసారు. కాని మీ సంగతే అర్ధం కాకుండా ఉంది. మీరంతా, మన తల్లి కద్రువ శాపం వల్ల జనమే జయుడు చెయ్యబోయే సర్పయాగంలో పడి నాశనం కాక తప్పదు. దానిని నివారించే ఉపాయం ఆలోచించండి" అని అడిగాడు.

అది విని కొన్ని పాములు "మనం బ్రాహ్మణుల

వేషాలలో వెళ్లి, జన మేజయుడికి, అతని మంత్రులను కలిసి సర్ప యాగం వల్ల అనర్థాలు జరుగుతాయి అని నచ్చచెప్పి, సర్ప యాగం మానిపిద్దాము" అని అన్నారు.

ఇంకా కొందరు "మన మంతా వెళ్లి, యాగశాల దగ్గర దాడి చేసి, యాగం చేసేవారిని భయపెట్టి, యాగాన్ని పాడు చేద్దాము" అని అన్నారు.

ఇదంతా వింటున్న ఏలా పుత్రుడు అనే పాము ఇలా అన్నాడు "అన్నయ్యా, మన అమ్మ కద్రువ శాపం ఇచ్చేటప్పుడు, నేను అమ్మ ఒడిలో పడుకొని ఉన్నాను. అప్పుడు, బ్రహ్మ దేవుడు, దేవతలు మాట్లాడుకోనే మాటలు నేను విన్నాను. అవే మీకూ చెపుతాను వినండి. అమ్మ కద్రువ శాపం ఇవ్వగానే, దేవతలందరూ బ్రహ్మతో "బ్రహ్మ దేవా, ఏ మాత్రం దయలేకుండా, కద్రువ తన కొడుకులకు దారుణమైన శాపం ఇచ్చింది. దీనికి విమోచన లేదా" అని అడిగారు. దానికి బ్రహ్మ "దేవతలారా, పాములు లోకానికి హాని చేస్తాయి కాబట్టి ఈ శాపం మంచిదే. కాని వీరిలో కొందరు మంచి వారు ఉన్నారు. జరత్కారుడికి, అదే పేరు కల వాసుకి చెల్లెలు అయిన జరత్కారువుకు పుట్టిన ఆస్తీకుడు అనే ముని, జనమేజయుడిని ఒప్పించి సర్ప యాగాన్ని మానిపిస్తాడు. సర్పములను రక్షిస్తాడు." అని

అన్నాడు. కాబట్టి భయపడ వలసిన పనిలేదు" అని ఏలా పుత్రుడు అన్నాడు.

వాసుకి, మిగిలిన పాములు ఏలా పుత్రుడు చెప్పిన ఆ మాటలకు సంతోషించాయి. జరత్కారువు ఎప్పుడు వచ్చి తన చెల్లి జరత్కారువు ను వివాహ మాడతాడా, ఎప్పుడు ఆస్తీకుడు పుడతాడా అని వాసుకి ఎదురు చూస్తున్నాడు.

జరత్కారువు ఒక మహా ముని. అతనుపెళ్లి చేసుకోకుండా బ్రహ్మ చర్యాన్నిపాటిస్తున్నాడు. ఒక రోజు ఆ జరత్కారువు ఒక నీటి మడుగు దగ్గరకు వెళ్లాడు. అక్కడ కొన్ని రెల్లు గడ్డి దుబ్బులు(grass plants) కనిపించాయి.

అందులో ఒక రెల్లు గడ్డి మొదలును ఎలుకలు కొరికి వేసాయి. కేవలం ఒక వేరు ఆధారంగా ఉన్నాయి. ఆ రెల్లు దుబ్బులను పట్టుకొని కొంత మంది రుషులు వేలాడుతున్నారు. వారిని చూచి జరత్కారువు ఆశ్చర్య పోయాడు.

"మహాత్ములారా, ఇదే మీ తపస్సు. ఇలా తల కిందులుగా వేలాడుతున్నారు" అని అడిగాడు.

దానికి ఆ రుషులు "అయ్యా, మా వంశంలో జరత్కారువు అనే పాపకర్ముడు ఉన్నాడు. వాడు పెళ్లి చేసుకొని, సంతానం కని, వంశాన్ని వృద్ధి చెయ్యడం లేదు. వాడి తాత ముత్తాలమైన మాకు ఉత్తమ గతులు కల్పించడంలేదు. వాడు మీకు కలిస్తే వెంటనే వివాహం చేసుకొని, మాకు ఉత్తమ గతులు కల్పించమని చెప్పండి" అని చెప్పారు.

అది విని జరత్కారువు సిగ్గు పడి "మహాత్మా, ఆ క్రూరకర్ముడు జరత్కారువు నేనే. ఇప్పటి దాకా నాకు పెళ్లి చేసుకోవాలని ఆసక్తిలేదు. మీ అవస్థ చూచి పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాను. మీకు తప్పకుండా ఉత్తమ గతులు కల్పిస్తాను. కాని నాకు నాపేరు కల కన్యనే వివాహం చేసుకోవాలి అనే కోరికగా ఉంది. ఆకన్య కోసం వెతుకుతాను" అని చెప్పి వెళ్లి పోయాడు.

కాని ఎక్కడ వెతికినా తన పేరు కల కన్య అతనికి కనపడలేదు. కాని ఇదంతా వాసుకి కి తెలిసింది. తన చెల్లెలు పేరు జరత్కారువు కనుక, ఆమెను ఇచ్చి వివాహం చెయ్యడానికి, ఆమెను తీసుకొని జరత్కారువు దగ్గరకు వెళ్లాడు.

"మహాత్మా. ఈమె నా చెల్లెలు జరత్కారువు. నీ పేరు గల కన్య. ఈమెను మీరు వివాహమాడండి" అని అడిగాడు.

దానికి జరత్కారువు సమ్మతించాడు. వాసుకి ఇద్దరికి వివాహం జరిపించాడు. మొదటి రాత్రి నాడు జరత్కారువు భర్త వద్దకు వెళ్లింది.

అప్పుడు జరత్కారువు తన భార్యను చూచి "నాకు నువ్వు ఎప్పుడూ ప్రియంగానే మసలుకోవాలి. నువ్వు నాకు ఎప్పుడైనా అప్రియం చేస్తే, నేను వెంటనే నిన్ను విడిచిపెట్టి తపస్సుకువెళ్లి పోతాను" అని చెప్పాడు. జరత్కారువు దానికి సమ్మతించింది. ప్రతిరోజూ ఒక్క పొరపాటు కూడా లేకుండా భర్తకు సేవచేస్తూ ఉంది. కొంతకాలానికి గర్భం ధరించింది.

ఒకరోజు జరత్కారువు తన భార్య తొడ మీద తలపెట్టుకొని నిద్రపోతూ ఉన్నాడు. సాయంత్రం అయింది. సంధ్యావందనం చేసే సమయం దాటిపోతూ ఉంది. అందుకని జరత్కారువు తన భర్తను నిద్ర లేపింది.

భర్తకు కోపంవచ్చింది. "ఎందుకునిద్ర లేపావు?" అని భార్యను ప్రశ్నించాడు.

"తమరు సంధ్యా వందనం చెయ్యాలి కదా అందుకని నిద్ర లేపాను" అని బదులు చెప్పింది.

"నువ్వు నన్ను నిద్ర నుండి లేపి నన్ను అవమానించావు. మనము అనుకున్న ప్రకారం, నేను నిన్ను వదిలి పెట్టి పోతున్నాను. నువ్వు నీ అన్న వాసుకి దగ్గరకు వెళ్లు. నీకు పుట్టబోయే పుత్రుడు కీర్తిమంతుడవుతాడు" అని చెప్పి తపస్సు చేసుకోడానికి అడవులకు వెళ్లిపోయాడు.

అతని భార్య జరత్కారువు అన్న వాసుకి ఇంటికి వెళ్లింది. నెలలునిండిన తరువాత ఆమెకు ఒక కొడుకుపుట్టాడు. అతనిపేరు ఆస్తీకుడు. ఆస్తీకుడు పెరిగిపెద్ద వాడయి, చ్యవనుడి కుమారుడైన ప్రమతి వద్ద సమస్త విద్యలు అభ్యసించాడు.

ఇది ఇలా ఉండగా, ఉదంకుడు, హస్తినా పురాన్ని పరిపాలిస్తున్న జనమేజయుని వద్దకు వెళ్లి, తక్షకుడు జనమేజయుని తండ్రి పరీక్షిత్తును దారుణంగాచంపాడు అని చెప్పాడు.

అది విన్న జనమేజయుడు మంత్రులను రావించి "ఇతను చెప్పింది నిజమేనా. తక్షకుడు నా తండ్రిని ఎందుకు చంపాడు. ఎలా చంపాడు వివరించండి" అని

అడిగాడు. దానికి మంత్రులు ఇలా చెప్ప సాగారు.

అర్జునునికు మారుడు అభిమన్యుడు. అభిమన్యుడి భార్య ఉత్తర. ఉత్తరకు అభిమన్యునకు జన్మించిన వాడు పరీక్షిత్తు. అంటే తమరి తండ్రి గారు.

పరీక్షిత్తు మహారాజుకు వేట అంటే మక్కువ ఎక్కువ. ఒక రోజు పరీక్షిత్తు వేటకు వెళ్లాడు. ఒక మృగాన్ని చూచాడు. దానిని తరుముతూ చాలా దూరం వెళ్లాడు. ఒక ఆశ్రమం లోకి ప్రవేశించాడు. అది శమీక మహర్షి ఆశ్రమము. ఆ సమయంలో శమీకుడు మౌన వ్రతంలో కళ్లు మూసుకొని తపస్సు చేసుకుంటు న్నాడు.

పరీక్షిత్తు శమీకుడిని చూచి "మహాత్మా, నేను వేటాడుతున్న మృగం ఈ వైపు వచ్చినదా" అని అడిగాడు. మౌన వ్రతంలో ఉన్న శమీకుడు జవాబు చెప్ప లేదు. దానికి పరీక్షిత్తుకు కోపం వచ్చింది. అక్కడే పడి ఉన్న ఒక చచ్చిన పామును తన బాణంతో తీసి శమీకుడి మెడలో వేసాడు. తరువాత హస్తినాపురానికి వెళ్లి పోయాడు.

ఇదంతా శమీకుడి శిష్యుడు కృశుడు అనే వాడు చూచాడు. శమీకుడి పుత్రుడు శృంగి ఆ సమయంలో

ఆశ్రమంలో లేడు. కృశుడు వెళ్లి శృంగికి జరిగినదంతా చెప్పాడు. శృంగికి చాలా కోపం వచ్చింది.

"ఎక్కడో అరణ్యంలో తపస్సు చేసుకొనుచున్న నా తండ్రిని అవమానించిన పరీక్షిత్తు ఈ రోజు నుండి ఏడు రోజుల లోగా తక్షకుడు అనే సర్ప రాజు చేత మరణించు గాక" అని శాపం ఇచ్చాడు.

తరువాత ఆశ్రమానికి వెళ్లాడు. తండ్రి మెడలో ఉన్న చచ్చిన పామును తీసి వేసాడు. తరువాత శమీకుడు కన్నులు తెరిచాడు. శృంగి జరిగిందంతా తండ్రికి చెప్పాడు. దానికి శమీకుడు చాలా బాధ పడ్డాడు.

"కుమారా, కోపము అన్ని అనర్థాలకు మూలము. అందుకే బ్రాహ్మణులకు కోపం తగదు అంటారు. మనం నిర్భయంగా, క్షేమంగా తపస్సు చేసుకుంటూ కాలం గడుపుతున్నాము అంటే ఆ రాజులు మనకు రక్షణ కల్పించడం వల్లనే కదా. పైగా పరీక్షిత్తు సామాన్య మైన రాజు కాడు. ధర్మ రక్షకుడు. ఆకలికి, దప్పికకు ఆగలేక పిసుగులో ఆ పని చేసాడు. దానికి నువ్వు ఇంత ఘోరమైన శాపం ఇవ్వాలా. వెంటనే ఆ శాపాన్ని ఉపసంహరించు" అన్నాడు.

దానికి శృంగి ఒప్పుకోలేదు. తన శాపానికి తిరుగులేదన్నాడు. వెంటనే శమీకుడు తన శిష్యుడు గౌరముఖుడు అనే వాడిని పిల్చి

"నీవు పరీక్షిత్తుకు వద్దకు వెళ్లి, జరిగిన విషయం అంతా చెప్పి, ఈ ఆపద తొలగే ఉపాయం చూసుకో మని చెప్పు" అని చెప్పి పంపాడు.

గౌరముఖుడు పరీక్షిత్తు వద్దకు వెళ్లి, జరిగిందంతా చెప్పాడు. ఇదంతా విని పరీక్షిత్తు చాలా బాధ పడ్డాడు. శృంగి శాపానికి భయపడ్డాడు. దానిని నివారించే ఉపాయం ఆలోచించమని మంత్రులను అడిగాడు. వారి సలహా మీద ఎత్తైన ఒంటి స్తంభం మేడ కట్టించుకున్నాడు. అందులో మత్రులతో సహా నివసిస్తున్నాడు. మంత్ర తంత్రాలు తెలిసిన వాళ్లను, విషాన్ని హరించే వైద్యులను తన దగ్గర ఉంచుకున్నాడు.

ఇది ఇలా ఉండగా, పాములన్నీ లోకానికి హాని చేస్తున్నాయి అని తెలిసి, బ్రహ్మదేవుడు, పాముల విషం చేత మరణించిన వారిని తిరిగి జీవింప చేసే విద్యను, కశ్యపుడు అనే మునికి ఉపదేశించాడు.

పాము కాటుతో మరణించబోయే పరీక్షిత్తును రక్షించడానికి ఆ కశ్యపుడు బయలు దేరాడు. తక్షకుడు

కూడా శృంగి ఇచ్చిన శాపాన్ని అమలు చేసేందుకు బయలు దేరాడు. దారిలో తక్షకుడు కశ్యపుడిని కలుసుకున్నాడు.

"ముని పుంగవా, తమరు ఎవరు? ఎక్కడకు వెళుతున్నారు?" అని అడిగాడు తక్షకుడు.

"నా పేరు కశ్యపుడు. తక్షకుడు అనే సర్పము బారి నుండి పరీక్షిత్తును రక్షించి తగు బహుమానం పొందడానికి వెళుతున్నాను" అన్నాడు కశ్యపుడు.

దానికి తక్షకుడు నవ్వి "నేనే ఆ తక్షకుడిని. పిడుగు పడ్డ వాడైనా బతక వచ్చు కాని, నేను కాటు వేసిన వాడు బతకడం కష్టం. నీ మంత్రాలు, తంత్రాలు పనిచెయ్యవు. కాబట్టి తిరిగి వెళ్లిపో" అన్నాడు.

కశ్యపుడు ఒప్పుకోలేదు.

"అట్లా ఐతే, నేను ఈ మహావృక్షాన్ని నా విషంతో భస్మం చేస్తాను. నీకు చేతనైతే మరల బతికించు" అన్నాడు. తక్షకుడి కాటుకు అంత పెద్ద వృక్షం కాస్తా బూడిద అయిపోయింది.

కశ్యపుడు ఆ బూడిద నంతా కుప్పగా చేసి, తన

మంత్ర శక్తి చేత, ఆ మహావృక్షాన్ని పూర్వము ఉన్న మాదిరి జీపింప చేసాడు. తక్షకుడు ఇది చూచి ఆశ్చర్య పోయాడు.

"మహాత్మా, శృంగి ఇచ్చిన శాపం తిరుగులేనిది. పరీక్షిత్తు బతకడు. కాబట్టి, ఆ మహా రాజు ఇచ్చే కానుకల కన్న ఎక్కువ కానుకలు నేను ఇస్తాను. తీసుకొని వెనక్కు వెళ్లండి" అని చెప్పాడు తక్షకుడు.

కశ్యపుడు జరగబోయేదానిని దివ్య దృష్టితో తెలుసుకొని, తక్షకుడు ఇచ్చిన కానుకలు తీసుకొని వెనక్కు వెళ్లాడు.

ఇదంతా ఎలా తెలిసిందంటే, ఆ చెట్టు బూడిద కాక ముందు, ఆ చెట్టు మీద ఒకడు కట్టెలు కొడుతూ ఉన్నాడు. చెట్టుతో కూడా వాడు కూడా భస్మం అయ్యాడు. కశ్యపుని మంత్ర శక్తి తో చెట్టు తిరిగి బతికి నప్పుడు వాడూ బతికాడు. వాడు హస్తినా పురానికి వచ్చి జరిగిందంతా అందరకూ చెప్పాడు.

అలా కశ్యపుడు వెళ్లి పోయిన తరువాత, తక్షకుడు కొందరు సర్ప కుమారులను పిలిచాడు వారందరికి బ్రాహ్మణ కుమారుల వేషం వేసాడు. అందరకు పూలు,పండ్లు ఇచ్చాడు. అందులో ఒక

ఫలంలో తాను, ఒక నల్లని క్రిమిలాగ దాక్కున్నాడు. ఆ పళ్ళను తీసుకు వెళ్లి జనమేజయునికి ఇమ్మని సర్ప కుమారులకు చెప్పాడు.

తక్షకుడు చెప్పినట్టు, ఆ సర్పకుమా రులు, పూలు, పండ్లు తీసుకొని పరీక్షిత్తు మహారాజు వద్దకు వెళ్లారు. ఆ బ్రాహ్మణ కుమారులను చూచి, పరీక్షిత్తు వారందరిని సాదరంగా ఆహ్వానించాడు. వారు ఇచ్చిన పళ్లను పూలను స్వీకరించాడు. కొన్నిఫలాలనూ క్కడ ఉన్న మంత్రులకు ఇచ్చాడు.

తాను ఒక పండు తీసుకొని దానిని ఒలిచాడు. అందులో నల్లనిక్రిమిలాగా దాక్కున్న తక్షకుడు బయటకు వచ్చాడు. ఆ నల్లని క్రిమి చూస్తూ ఉండగానే పిషాగ్నులు చిమ్ముతూ పెద్దదిగా అయింది. తక్షకుడు పరీక్షిత్తును కాటు వేసాడు. ఇది చూచి అక్కడ ఉన్న మంత్రులు, సేవకులు పారిపోయారు. ఆ పిష జ్వాలలకు పరీక్షిత్తు ఉన్న భవనం భస్మం అయింది. తరువాత బ్రాహ్మణులు నీ తండ్రికి కర్మకాండలు జరిపించారు.

కాని ఓ జనమేజయ మహారాజా! ఇది యుక్తము కాదు అని కూడా తలచకుండా, ఆ తక్షకుడు ఒక బ్రాహ్మణుడి ప్రేరణతో, నీ తండ్రి మరణానికి కారకుడు అయ్యాడు. కాబట్టి నువ్వు కూడా బ్రాహ్మణులను రాపించి,

సర్ప యాగము చేసి, తక్షకుడితో సహా పాములను అన్నింటిని అంతం చెయ్యి " అని మంత్రులు జనమే జయునకు వివరించారు.

ఇదంతా విని జనమేజయుడు మండి పడ్డాడు. తన తండ్రిని దారుణంగా చంపిన తక్షకుడి మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. ఋత్విక్కులను పిలిచి సర్ప యాగం చేయడానికి ఏర్పాట్లు చేసాడు. సర్ప యాగం చెయ్యాడానికి ఒక యాగ శాలను నిర్మించాడు. తన భార్య వపుష్టమతో యాగం చెయ్యడానికి సిద్ధం అయ్యాడు.

ఇంతలో ఒక వాస్తు విద్యా నిపుణుడు జనమే జయునితో ఇలా పలికాడు.

"ఓ జనమేజయ మహారాజా, సర్పయాగం చెయ్యాలి అనే నీ సంకల్పం మంచిదే కాని ఈ యజ్ఞం పూర్తి కాదు. మధ్యలో ఆగి పోతుంది" అని చెప్పాడు.

కాని ఆ మాటలు జనమేజయ మహారాజు వినలేదు. వ్యాసుడు, వైశంపాయనుడు మొదలైన మహా మునుల సమక్షంలో యాగం చెయ్య తలపెట్టాడు. సర్ప యాగం మొదలు అయింది. ఋత్విక్కులు మంత్రాలు పలుకుతూ పాములన్నిటిని పిలుస్తున్నారు. అప్పుడు పాములన్నీ

వచ్చి హోమ గుండంలో పడి భస్మం అవుతున్నాయి.
ఇదంతా చూచి తక్షుడు భయంతో తల్లడిల్లి పోయాడు.

ఇంద్రుడి వద్దకు వెళ్లి "దేవేంద్రా నన్ను కాపాడు" అని అడిగాడు. ఇంద్రుడికి బ్రహ్మ గారు కొన్ని పాములకు అభయం ఇచ్చిన విషయం తెలుసు. అందుకే "తక్షకా నీకేం భయం లేదు" అని చెప్పాడు.

అన్నిపాములు వస్తున్నాయి కాని తక్షకుడు రావడం లేదు. తక్షకుడు ఇంద్రుని ఆశ్రయం పొందినట్లు తెలిసింది. అందుకే రుత్విక్కులు, " ఇంద్రుడితో సహా తక్షకుడు వచ్చుగాక" అని మంత్రాలు చదవసాగారు.

ఇది విని ఇంద్రుడు భయపడ్డాడు. "తక్షకా, నీ దారిన నువ్వు వెళ్లు. నేను నిన్ను రక్షించలేను" అని తక్షకుడిని స్వర్గం నుండి పంపేసాడు.

సర్ప యాగంలో పడటానికి, తక్షకుడు ఆకాశంలో తిరుగుతున్నాడు. ఇది ఇలా ఉండగా, పెద్ద పెద్ద పాములన్నీ సర్ప యాగ హోమ గుండం లో పడి మరణించడం చూచి వాసుకి భయపడ్డాడు. తన చెల్లెలు జరత్కారువు ను పిలిచి

"అమ్మా, చూచావా, పాములన్నీ జనమేజయుడు

చేస్తున్న సర్పయాగంలో పడి చని పోతున్నాయి. దీనికి పరిష్కారం నువ్వే చెయ్యాలి. అందుకే నిన్ను నీ పేరు కల జరత్కారువు కి ఇచ్చి వివాహం చేసాను. బ్రహ్మ గారి వాక్కు ప్రకారం, మీ ఇరువురికి పుట్టిన కుమారుడు ఆస్తీకుడు ఈ సర్ప యాగాన్ని నివారిస్తాడు .అందు వల్ల నువ్వు నీ కొడుకు ఆస్తీకుడిని పంపి ఆ యాగాన్ని నిలుపు చెయ్యి" అని కోరాడు.

ఇది విన్న జరత్కారువు ఆస్తీకుడిని పిలిచి "కుమారా, నీ మేన మామ వాసుకి కోరిక విన్నావు కదా. నీవు వెంటనే వెళ్లి సర్పయాగన్ని ఆపు చేయుము" అని చెప్పింది. దానికి ఆస్తీకుడు సరే అన్నాడు. వాసుకిని భయ పడవద్దని చెప్పి, వెంటనే జనమేజయుని వద్దకు వెళ్లాడు.

ఆస్తీకుడిని చూచి జనమేజయుడు అతనిని సాదరంగా ఆహ్వానించాడు. అతిథి మర్యాదలు చేసాడు.

"జనమేజయ మహారాజా. నీ పూర్వీకులైన, మాంధాత, రఘువు, దశరధుడు, రాముడు,ధర్మ రాజు మొదలైన మహా రాజులలో ఉన్న ఉత్తమ గుణాలన్నీ నీలో ఉన్నాయి. నీవు యజ్ఞ యాగాలుచేసి, పునీతుడవైనావు. ఇప్పుడు నువ్వు చేస్తున్న సర్ప యాగం నిర్వహిస్తున్న వారు , సమస్త శాస్త్రాలు ఎరింగిన వారు. వ్యాసుడు,

వైశంపాయనుడు మొదలైన మహామునులు నీ యాగానికి వచ్చారు అంటే, ఆ యాగం ఎంతో గొప్పది. నీకు అన్నిశుభములు కలుగు గాక." అని జనమేజయ మహారాజును పొగిడాడు.

దానికి జనమేజయుడు సంతోషించి, "మహాత్మా, మీకేమి కావాలో కోరుకొనుడు తప్పక ఇచ్చెదను" అని అన్నాడు.

అప్పుడు ఆస్తీకుడు "జనమేజయ మహారాజా, నీవు వెంటనే ఈ సర్ప యాగాన్ని ఆపుచేయుము. నాకు బంధువులైన పాములను కాపాడుము." అని కోరాడు.

జనమేజయుడు ఆలోచనలోపడ్డాడు. కాని అక్కడ ఉన్న రుత్విక్కులు, బ్రాహ్మణులు "మహారాజా, ఆస్తీకుడు గొప్ప తపస్వి, తగినవాడు. కాబట్టి అతను కోరినట్టు ఈ సర్ప యాగాన్ని ఆపించండి" అని చెప్పారు.

అటు ఆస్తీకుని కోరిక, ఇటు సకల బ్రాహ్మణుల ప్రార్థనలను మన్నించి, జనమేజయుడు సర్ప యాగాన్ని ఆపించాడు.

సర్ప యాగంలో పడటానికి సిద్ధంగా ఉన్న తక్షకుడినిచూచి ఆస్తీకుడు "ఓ తక్షకా, నిలువుము,

నిలువుము. సర్పయాగం ఆగి పోయింది. మరలి పొమ్ము" అని అరిచాడు.

"బతుకు జీవుడా" అంటూ తక్షకుడు నాగ లోకం వెళ్లిపోయాడు.

ఆస్తీకుడు సర్పయాగాన్ని ఆపించినందుకు, మిగిలిన పాములను కాపాడినందుకు, యాగ శాల లోని వారంతా సంతోషించారు. ఆస్తీకుడిని ప్రశంసించారు.

**మహాభారతము,**
ఆది పర్వము,
ద్వితీయాశ్వాసము
(సమాప్తము)

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎర్రాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)
Modali Venkata Subrahmanyam, B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.
Ph:040-24048104

# మహా భారతం

## ఆది పర్వము

### తృతీయాశ్వాసము

తరువాత ఆ కథకుడు (ఉగ్రశ్రవసుడు) శౌనకాది మహామునులను చూచి ఇలా చెప్పసాగాడు.

సర్పయాగము అలా అర్ధాంతరంగా ముగిసి పోయింది. జనమే జయుడు యాగానికి విచ్చేసిన ఋత్విక్కులకు, బ్రాహ్మణులకు దక్షిణలు, సంభావనలు ఇచ్చి సత్కరించాడు. ఆ యాగానికి వచ్చిన వ్యాస మహామునిని, వైశంపాయనాది ఆయన శిష్యులను, భక్తితో పూజించాడు.

ఒక రోజు, జనమేజయుడు, వ్యాస భగవానుడిని చూచి, " మహాత్మా, మీ లాంటి పూజ్యులు, భీష్ముడు లాంటి కురువృద్ధులు దగ్గర ఉండి కురు సామ్రాజ్యాన్ని పంచి ఇచ్చారు కదా. హాయిగా

రాజ్యసుఖాలని అనుభవించక, పాండవులు, కౌరవులు ఎందుకు యుద్ధం చేసుకున్నారు. అసలు అన్నదమ్ముల మధ్య కలహం ఎందుకు పుట్టింది. నా తాత ముత్తాల గురించి వినవలెనని కోరికగా ఉన్నది. దయచేసి వివరించండి" అని చేతులు జోడించి ప్రార్థించాడు.

అప్పుడు వ్యాస భగవానుడు తన పక్కనే ఉన్న వైశంపాయనుడిని చూచి "వైశంపాయనా, భారత కథను జనమేజయునకు చెప్పుము" అని ఆదేశించాడు.

తరువాత జనమేజయుడు, వైశంపాయనుని పూజించి, మహా భారత కథను వినడానికి బంధుమిత్ర పురోహిత సహితంగా కూర్చున్నాడు. అప్పుడు వైశంపాయనుడు, వ్యాస భగవానునికి నమస్కరించి, ఆయన ఆశీర్వాదం పొంది, మహా భారత కథను ఇలా చెపుతున్నాడు.

"జనమేజయా, ఈ మహాభారత కథ భగవాన్ వ్యాసుని చేత రచింపబడినది.

(ఇక్కడ మహాభారత కథను క్లుప్తంగా చెప్ప బడింది. కాని చెప్పిందే చెప్పడం అవుతుం దని, దానిని ఇక్కడ చెప్పడంలేదు).

అందుకని ముందు మనము వ్యాసుడు ఎలా జన్మించాడు అని తెలుసుకుందాము.

ఆ రోజుల్లో చేది దేశాన్ని వసువు అనే రాజు పరిపాలిస్తుండేవాడు. ఒక రోజు ఆ రాజు అడవికి వేటకు వెళ్లాడు. అక్కడ ప్రశాంతంగా తపస్సు చేసుకుంటున్న మహామునులను చూచాడు. వెంటనే వసువు కూడా, అక్కడే కూర్చుని తపస్సుచెయ్యడం మొదలు పెట్టాడు.

ఇది చూచి ఇంద్రుడు ఆయన దగ్గరకు వచ్చాడు. "మహా రాజా, రాజ్య పాలన చెయ్య వలసినవాడవు ఈ తపస్సు ఏమిటి. నాతో స్నేహం చెయ్యి. నీకు దైవత్వం ప్రసాదిస్తున్నాను. నువ్వు రాజ్య పాలన చేసుకుంటూ, నా దగ్గరకు వస్తూ ఉండు" అని వరం ఇచ్చాడు.

ఇంద్రుడు వసువుకు ఏ ఆయుధమునకు లొంగని, వాడని పుష్పములు కల, ఇంద్ర మాలను, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేయు సామర్ధ్యము గల ఒక"వేణుయష్టి" ని ప్రసాదించాడు. అప్పటినుండి వసువు ఆవిమానాన్ని ఎక్కి దేవలోకానికి వస్తూ పోతూ ఉన్నాడు. అందుకే అతనికి "ఉపరిచర వసువు" అని పేరు వచ్చింది. వసువు ప్రతి సంవత్సరం తన రాజ్యంలో ఇంద్రుని ఉత్సవాలు జరిపించాడు.

అతను నివసిస్తున్న నగరానికి పక్కనే శుక్తిమతి అనే నది ప్రవహిస్తూ ఉన్నది. ఆ నది పక్కనే కోలహాలము అనే పర్వతము ఉన్నది. అతి సోయగంగా వంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న ఆ నదిని చూచి కోలహాలుడు మోజు పడ్డాడు. ఆ నదికి అడ్డంగా పడ్డాడు. ఒక రోజు అటుగా వస్తున్న వసువు ఇది చూచి, తన బలంతో ఆ పర్వతాన్నిపైకిలేపాడు. అప్పటి దాకా, శుక్తిమతి నదికి, కోలాహల పర్వతానికి సంపర్కం జరగడం వల్ల, వారికి గిరిక అనే కుమార్తె, వసు పదుడు అనే కుమారుడు జన్మించారు. ఆ ఇరువురిని శుక్తిమతి నది

వసువుకు కానుకగా ఇచ్చింది. వసువు సంతోషించి, గిరికను వివాహం చేసుకున్నాడు. వసుపదుడిని తన రాజ్యానికి సేనాపతిగా నియమించాడు.

ఒక రోజు వసువు వేటకు వెళ్ళాడు. అడవిలో ఉండగా, వసువుకు అందాల రాశి అయిన తన భార్య గిరిక గుర్తుకు వచ్చింది. ఆమెను తల్చుకుంటూ ఉంటే అతనికి వీర్యము (సెమెన్)పతనం అయింది. వెంటనే, వసువు ఆ వీర్యాన్ని ఒక ఆకు దొప్పలో సేకరించాడు. ఆ దొప్పను ఒక డేగ (eagle) మెడకు కట్టి, తన భార్య గిరికకు ఇవ్వమన్నాడు.

ఆ డేగ ఆ దొప్పను తీసుకొని ఆకాశంలో ఎగురుతూ ఉంటే, మరొక డేగ చూసింది. అదేదో తినే పదార్థం అని, దానిని తీసుకోడానికి ప్రయత్నించింది. రెండు డేగలకు పోట్లాట జరిగింది. ఈ గొడవలో ఆ వీర్యం ఉన్న దొప్ప యమునా నది లో పడిపోయింది. అద్రిక అనే అప్సరస బ్రహ్మదేవుడి శాపం వల్ల చేపగా మారి, యమునా నదిలో ఈత కొడుతూ ఉంది. ఆకు దొప్ప లోనుండి జారిన

వసువు వీర్యము, సరా సరి ఈ అప్సరస నోట్లో పడింది. అద్రిక గర్భం దాల్చింది.

ఒక రోజు జాలరలు వేసిన వలలో ఈ అద్రిక పడింది. జాలర్లు చేప రూపంలో ఉన్న అద్రికను కోసారు. అందులో నుండి, ఒక ఆడ బిడ్డ ఒక మగబిడ్డను చూచారు. వెంటనే అద్రిక అప్సరస గా మారి దేవలోకం వెళ్లిపోయింది.

ఆ బిడ్డలను జాలర్లు తమ రాజైన దాశరాజుకు ఇచ్చారు. ఆ పిల్లలు పెరిగి పెద్ద వాళ్ల అయ్యారు. మగ బిడ్డ మత్స్య దేశానికి రాజయ్యాడు. ఆడపిల్ల మత్స్య గంధి అనే పేరుతో దాశరాజు ఇంటిలో పెరుగుతూ ఉంది. తండ్రి లేనపుడు యమునా నదిలో పడవ నడుపుతూ ఉంది.

ఒక రోజు వశిష్ట మహా మునికి మనుమడు, శక్తి మహాముని కొడుకు అయిన పరాశర మహా ముని యమునా నదిని దాటడానికి వచ్చాడు. పడవలో ఉన్న మత్స్యగంధిని చూచాడు. ఆమెను మోహించాడు. తనతో సంపర్కం జరపవలసిందిగా కోరాడు. ఆమె

భయపడింది. కాదు అంటే శాపంపెడతాడేమో అని వణికి పోయింది.

"మహాత్మా, నేను కన్యను. జాలరి పుత్రికను. ఒళ్లంతా చేపల వాసన. మీరు తట్టుకోలేరు. నేను నా కన్యాత్వమును పోగొట్టుకొనిన, మరల నా తండ్రి మొహము ఎలా చూడగలను." అని చెప్పింది.

అప్పుడు పరాశరుడు "బాలా, నీవు జాలరి పుత్రికవు కావు. వసురాజు వీర్యమునకు జన్మించిన దానవు. నీ కన్యాత్వము చెడకుండా నీతో సంగమించెదను." అని తన మహిమతో ఆమె ఒళ్లంతాఒక యోజన దూరం సుగంధాలుపెదజల్లేట్టు చేసాడు. అప్పటినుండి ఆమె యోజన గంధి అయింది".

"మహాత్మా ఇది పట్టపగలు. మనం సంపర్కం జరిపితే అందరూ చూస్తారు" అని మరో సాకు చెప్పి తప్పించుకోబోయింది. దానికి పరాశరుడు, ఆకాశంలో మేఘాలను ఆవరింపచేసి, లోకమంతా చీకటి చేసాడు. ఇంక ఆమె చేసేది లేక పరాశరుడితో సంపర్కానికి ఒప్పుకుంది.

తత్ఫలితంగా ఆ సత్యవతికి వ్యాసుడు జన్మించాడు.

పుట్టిన వెంటనే వ్యాసుడు తల్లికి నమస్కరించి "అమ్మా నేను తపస్సు చేసుకోడానికి వెళుతున్నాను. నీకు అవసరం వచ్చినప్పుడు నన్ను తల్చుకో. నేను నీ వద్దకు వస్తాను" అని చెప్పి వెళ్లిపోయాడు. ఆ వ్యాసుడే, వేదాలను విభజించాడు. మహాభారత కథను రచించాడు.

తరువాత, దేవ దానవ అంశలతో, భీష్ముడు మొదలైన కురు రాజులు పుట్టారు అని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పగా, జనమేజయుడు "మహాత్మా, దేవతల అంశలతో పుట్టిన వాళ్లు ఇలా రాజ్యం కోసం యుద్ధం చేసుకోడం ఏమిటి" అని అడిగాడు.

దానికి వైశంపాయనుడు ఇలా చెప్ప సాగాడు. జనమేజయా, పరశురాముడు ఇరవై ఒక్క సార్లు క్షత్రియుల మీద యుద్ధం చేసి, లోకంలో ఉన్న క్షత్రియులందరినీ చంపేసాడు. అప్పుడు వారిభార్యలందరూ, సంతానము కావాలెను అనే

కోరికతో, అప్పటి ధర్మం ప్రకారం, ఉత్తమమైన బ్రాహ్మణుల అనుగ్రహంతో , పుత్ర సంతానాన్ని పొందారు.

మరల రాజ వంశాలు వృద్ధి చెందాయి. రాజులు ధర్మం తప్పకుండా పరిపాలించారు. సకాలంలో వానలు కురిశాయి. పంటలు వృద్ధి చెందాయి. ప్రజ ఆయుర్దాయం పెరిగింది. మరణాలు తక్కువ అయ్యాయి. భూ భారం ఎక్కువ అయింది.

భూదేవి బ్రహ్మ విష్ణు మహేశ్వరుల వద్దకు వెళ్ళి భూభారాన్ని తగ్గించమని వేడుకుంది. అప్పుడు దేవతల అంశలతో పాండవులు, ఇతర రాజులు జన్మించారు. రాక్షసుల అంశలతో శిశుపాలుడు, దుర్యోధనుడు మొదలైన వారు జన్మించారు. వీరి వలన మహాభారత యుద్ధం జరిగింది. 15 అక్షౌహిణీల మంది చనిపోయారు. భూభారం తగ్గిపోయింది అని వివరించాడు వైశంపాయనుడు.

అప్పుడు జనమేజయుడు, మహాత్మా, దేవ

దానవులు ఈ భూమి మీద ఎలా జన్మించారో వివరంగా తెలపండి అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా చెప్ప సాగాడు.

జనమేజయా, ఈ సృష్టికి మూలం బ్రహ్మదేవుడు. ఆయనకు ఆరుగురు మానసపుత్రులు. వారు మరీచి, అంగీరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు.

(1) మరీచి కొడుకు కశ్యప ప్రజాపతి. బ్రహ్మదేవుడి కుడి చేతి బొటన వేలి నుండి దక్షుడు అనే పురుషుడు, ఎడమచేతి బొటనవేలి నుండి ధరణి అనే స్త్రీ జన్మించారు. వారు ఇరువురికి వెయ్యి మంది మహర్షులు జన్మించారు.

దక్షునికి యాభై మంది కుమార్తెలు జన్మించారు. అందులో పదమూడు మందిని కశ్యపునకు ఇచ్చాడు. వారిలో దితి అనే ఆమెకు హిరణ్యకశిపుడు జన్మించాడు. హిరణ్యకశిపుని కుమారుడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదునికి ముగ్గురు కొడుకులు. అందులో విరోచనుడికి బలి

జన్మించాడు. బలి కొడుకు బాణాసురుడు. దను అనే స్త్రీకి 40 మంది దానవులు కలిగారు. అలా దానవ సంతతి పుట్టింది. (ఇక్కడ మనకు అవసరమైనంత వరకే రాస్తున్నాను. మిగిలినవి వదిలేస్తున్నాను).

సింహిక అనే దానవ వనితకు రాహువు జన్మించాడు. వినతకు అనూరుడు, గరుడుడు జన్మించారు. అనూరుడికి సంపాతి, జటాయువు పుట్టారు. కద్రువకు శేషుడు, వాసుకి మొదలైన పాములు పుట్టాయి.

(2) బ్రహ్మ మానస పుత్రులలో రెండవ వాడైన అంగిరుసునకు, ఉతధ్యుడు, బృహస్పతి, సంవర్తుడు అనే కొడుకులు పుట్టారు. బృహస్పతి దేవతలకు గురువు ఐనాడు.

(3) అత్రి అనే మానసపుత్రునికి అనేక మంది మహా మునులు జన్మించారు.

(4) పులస్త్యుడు అనే బ్రహ్మ మానసపుత్రునకు,

రాక్షసులు జన్మించారు.

(5) పులహుడు అనే మానస పుత్రునకు, కిన్నరలు, కింపురుషులు జన్మించారు.

(6) క్రతువు అనే మానసపుత్రునకు పక్షి జాతి పుట్టింది.

దేవుడు అనే మనువు కొడుకు ప్రజాపతి. ప్రజాపతికి అష్ట వసువులు జన్మించారు. అందులో ప్రభావసుడు అనే వసువుకు విశ్వకర్మ జన్మించాడు.

బ్రహ్మ హృదయం నుండి భృగు మహర్షి జన్మించాడు. భృగుడి కొడుకు కవి. ఆ కవికొడుకు శుక్రుడు. ఆ శుక్రుడు రాక్షసులకు గురువు.

భృగువు కు మారుడు చ్యవనుడు. చ్యవనుడి కొడుకు ఔర్వుడు. ఔర్వుడి కొడుకు జమదగ్ని. జమదగ్ని కొడుకు పరశురాముడు.

ఇంక భూలోకంలో పైన చెప్పిన దేవ దానవ

అంశలతో రాజులు జన్మించారు.

మహా విష్ణు అంశతో శ్రీకృష్ణుడు,

ఆది శేషుడి అంశతో బలరాముడు,

లక్ష్మీ దేవి అంశతో రుక్మిణి,

అప్సరసల అంశలతో పదహారు వేల మంది గోపికలు జన్మించారు.

ప్రభాసుడనే వసువు అంశతో భీష్ముడు,

బృహస్పతి అంశతో ద్రోణుడు జన్మించారు.

కామము, క్రోధము కలిసి అశ్వత్థామగా ద్రోణుడికి పుట్టాడు.

మరుత్తుల అంశలతో విరాటుడు, సాత్యకి, ద్రుపదుడు జన్మించారు.

సిద్ధి,బుద్ధి, అంశలతో కుంతి, మాద్రి పుట్టారు.

యమధర్మ రాజు, మాండవ్య మహా ముని శాపం కారణంగా విదురుడిగా జన్మించాడు.

ఏకాదశ రుద్రుల అంశలతో కృపాచార్యుడు, సూర్యుని అంశతో కర్ణుడు జన్మించారు.

హంసుడు అనే గంధర్వుడు ధృతరాష్ట్రుడు గా జన్మించాడు.

మతి అనే దేవత గాంధారి గాపుట్టింది.

కలి అంశతో దుర్యోధను డు పుట్టాడు.

హిరణ్య కశిపుడు శిశుపాలుడుగా పుట్టాడు.

సంహ్లాదుడు శల్యుడిగా పుట్టాడు.

విప్రచిత్తి అనే దానవుడు జరాసంధుడుగా పుట్టాడు.

అశ్వపతి కృతవర్మ గా పుట్టాడు.

కాలనేమి కంసుడుగా జన్మించాడు.

గుహ్యకుడు శిఖండి గా పుట్టాడు.

మరుద్గణాంశతో పాండు రాజు పుట్టాడు.

యముడి అంశతో ధర్మరాజు, వాయుదేవుడి అంశతో భీముడు, ఇంద్రుడి అంశతో అర్జునుడు, అశ్వినుల అంశతో నకుల సహదేవులు పుట్టారు.

శ్రీ అంశతో ద్రౌపది జన్మించింది.

అగ్ని అంశతో ధృష్టద్యుమ్నుడు జన్మించాడు.

ఇంక భారత చక్రవర్తుల చరిత్ర సవిస్తరం గా చెపుతాను వినండి. అని జనమేజయుడికి వైశంపాయనుడు చెపుతున్నాడు.

దక్షుడికు మార్తె అదితి. ఆమె భర్త కశ్యపుడు

వారికి కుమారుడు వివస్వంతుడు. వివస్వంతుడికి కుమారుడు వైవస్వత మనువు. వైవస్వత మనువుకు, ఈ మానవ లోకంలోని నాలుగు వర్ణాలు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు జన్మించారు.

చంద్రుడి కొడుకు బుధుడు. బుధుడికి కుమారుడు పురూరవ చక్రవర్తి. కాని ఆ చక్రవర్తి ధనాశా పరుడు. బ్రాహ్మణుల ధనాన్ని అపహరించాడు. ఇది బ్రహ్మ దేవునికి తెలిసింది. విషయం ఏమిటో తెలుసుకొని రమ్మని సనత్కుమారుడు మొదలైన మహా మునులను పురూరవుని వద్దకు పంపించాడు బ్రహ్మ.

పురూరవుడు వారిని గౌరవించక పోగా, పరిహసించాడు. దానికి ఆ మహామునులు కోపించి, అతనిని వెర్రి వాడు కమ్మని శపించారు.

పురూరవుని భార్య ఊర్వశి అనే అప్సర. వారికి ఆరుగురు కొడుకులు. అందులో ఆయుషుడు అనే పుత్రునకు ఐదుగురు కుమారులు జన్మించారు. వారిలో నహుషుడు చక్రవర్తి అయినాడు. నహుషుని

భార్య పేరు ప్రియంవద. నహుషుని కొడుకు పేరు యయాతి. యయాతికి శుక్రుడి కుమార్తె అయిన దేవయాని వలన ఇద్దరు కుమారులు, వృషపర్వుడు అనే రాక్షరాజు పుత్రిక శర్మిష్ఠ వలన ముగ్గురు కుమారులు కలిగారు. శుక్రుడి శాపం వలన యయాతికి ముసలితనం ఆవరించింది.

యయాతి కొడుకులను పిల్చి, "కుమారులారా, మీలో ఒక్కరు నా ముసలితనాన్ని తీసుకొని, మీ యవ్వనాన్ని నాకు ఇస్తారా" అని అడిగాడు. పూరుడు అనే కుమారుడు తన యవ్వనాన్ని తండ్రియయాతికి ఇచ్చి, అతని ముసలితనాన్ని తను గ్రహించాడు.

ఇక్కడ జనమేజయ మహారాజుకు ఒక సందేహం వచ్చింది. "వైశంపాయన మహర్షీ, క్షత్రియుడు, చక్రవర్తి అయిన యయాతి మహారాజు, బ్రాహ్మణుడు, రాక్షసులకు గురువు ఐన శుక్రుని కుమార్తెను ఎలా పెళ్లి చేసుకున్నాడు. శుక్రుడు యయాతికి ఎందుకు శాపం ఇచ్చాడు " అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"జనమేజయ మహారాజా, వృషపర్వుడు అనే రాక్షస రాజు ఉన్నాడు. ఆయనకు గురువు శుక్రాచార్యుడు. శుక్రాచార్యుని కుమార్తె దేవయాని. వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ.

దేవతలకు గురువు బృహస్పతి. బృహస్పతి కుమారుడు కచుడు. శుక్రాచార్యుని కి మృతసంజీవని విద్య తెలుసు. ఆ విద్యతో దేవాసుర యుద్ధంలో, చనిపోయిన రాక్షసులందరినితిరిగి బతికిస్తున్నాడు శుక్రాచార్యుడు. దానితో రాక్షసుల బలం పెరిగి పోతూ ఉంది.

దేవతలందరూ కచుని వద్దకు వెళ్లారు.

"ఓ కచుడా, మృతసంజీవని వలన, మనం ఎంత మందిని చంపినా, రాక్షసుల బలం తగ్గకుండా ఉంది. అందువలన నువ్వు శుక్రాచార్యుని వద్దకు వెళ్లి ఆ మృతసంజీవని విద్యను తెలుసుకొని రావాలి. దానికి ఒకే మార్గం ఉంది. శుక్రాచార్యునకు తన కుమార్తె దేవయాని అంటే ఎంతో ప్రేమ. ఆమె కోసం ఏమైనా చేస్తాడు. నువ్వును ముందు ఆమె

అభిమానాన్ని పొంది, దాని ద్వారా ఆ మృతసంజీవని విద్యను శుక్రునివల్ల గ్రహించాలి" అని చెప్పారు.

దానికి కచుడు సరే అన్నాడు. దేవతల కోరిక మేరకు శుక్రుని వద్దకు వెళ్లాడు. శుక్రాచార్యుడిని చూచి నమస్కరించాడు.

"మహాత్మా, నేను దేవగురువు బృహస్పతి పుత్రుడను. నా పేరు కచుడు అంటారు. నేను తమ వద్ద విద్య అభ్యసింప వచ్చాను" అన్నాడు. దానికి శుక్రుడు సంతోషించాడు. తన శిష్యుడుగా చేర్చుకున్నాడు. ఇది మిగిలిన రాక్షసులకు నచ్చలేదు. వారు ఎలాగైనా కచునికి అపకారం తలపెట్టాలని నిశ్చయించారు. కచుడు మాత్రం గురువు గారు చెప్పిన పనులన్ని చేస్తున్నాడు. ముఖ్యంగా దేవయాని చెప్పిన పనులను శ్రద్ధగా చేస్తూ ఆమె ప్రేమను పొందుతున్నాడు.

ఒక రోజు, కచుడు మిగిలిన రాక్షస శిష్యులు అడవికి వెళ్లారు. ఇదే అదనుగా భావించి, ఆ రాక్షసులు కచుడిని చంపి, ఆ శవాన్ని ఒక చెట్టుకు

కట్టేసారు. తరువాత ఆశ్రమానికి వెళ్లారు. ఎంత రాత్రి అయినా కచుడు రాలేదు. దేవయానికి కంగారు ఎక్కువ అయింది.

తండ్రి వద్దకు వెళ్లి "తండ్రీ, రాత్రి చాలా పొద్దు పోయింది. అందరూ వచ్చారు కాని కచుడు రాలేదు. అతనికి ఏమన్నా ఆపద కలిగిందేమో అని నాకు భయంగా ఉంది." అని చెప్పింది.

శుక్రుడు తన దివ్య దృష్టితో చూచాడు. కచుడు చని పోయాడని తెలిసింది. వెంటనే శుక్రుడు, దేవయాని కచుడు చచ్చిపడి ఉన్న చోటికి వెళ్లారు. శుక్రుడు తన మృతసంజీవని విద్యతో కచుడిని బ్రతికించాడు. దేవయాని సంతోషించింది. కచునితో ఆశ్రమానికి వచ్చారు.

కొన్ని రోజుల తరువాత, ఒక రోజు కచుడు, మిగిలిన రాక్షసులు పూలు తెచ్చేందుకు అడవికి వెళ్లారు. అక్కడ రాక్షసులందరూ కలిసి కచుడిని చంపేసారు. అతని శవాన్ని కాల్చి బూడిద చేసారు. ఆ బూడిదను మద్యంలో కలిపారు. ఆ మద్యాన్ని

గురువు గారు శుక్రుడికి ఇచ్చారు. ఇది తెలియక, శుక్రుడు ఆ మద్యాన్ని సేవించాడు.

రాత్రి పొద్దు పోయింది. కచుడు రాలేదు. మరల రాక్షసులు చంపేసారేమో అని దేవయానికి అనుమానం కలిగింది. తండ్రి వద్దకు వెళ్లి ఏడుస్తూ ఉంది. అప్పటికే శ్రుక్రుడు మద్యం మత్తులో ఉన్నాడు.

"పోనీలేమ్మా, బతికి ఉంటే వస్తాడు. చస్తే ఉత్తమ లోకాలకు పోతాడు. ఎందుకు ఏడుస్తావు" అన్నాడు.

దానికి దేవయాని "తండ్రీ, అంగీరసుని మనుమడు, బృహస్పతి పుత్రుడు అయిన కచుడు రాక్షసులచేత చస్తే ఏడవకుండా ఎలా ఉండమంటావు. కచుడు ఇంటికి వస్తేగాని నేను ఆహారం, నీళ్ల ముట్టను" అని ఏడుస్తూ కూర్చుంది.

కూతురి ఏడుపు చూచి శుక్రుడు చలించిపోయాడు. తన దివ్యదృష్టితో చూచాడు. కచుడు ఎక్కడా కనపడలేదు. చూడగా, చూడగా, బూడిద రూపంలో, మద్యంతో కలిసి తన కడుపులో

ఉన్న కచుడిని చూచాడు.

అప్పుడు తెలిసింది రాక్షసులు కచుడిని చంపి, బూడిద చేసి, మద్యంలో కలిపి తనతో త్రాగించారని. చాలా బాధ పడ్డాడు.

"అహో! మద్యంఎన్ని అనర్థాలు కలిగిస్తుంది. అందువల్ల నేటి నుండీ బ్రాహ్మణులు గాని, ఇతరులు గాని మద్యపానం చేస్తే, వారికి పాపం చుట్టుకుంటుంది. నరకానికి పోతారు" అని శాపం పెట్టాడు.

(ఈ రోజుల్లో కూడా మద్య పానం వల్ల ఎన్నో కుటుంబాలు సర్వ నాశనం అవుతున్నాయి.ఎన్నో నేరాలు మద్యపానం మత్తులోనే జరుగుతున్నాయి. ఆనాటి శుక్రాచార్యుల వారికి ఉన్న జ్ఞానం ఈనాటి ప్రభుత్వాలకు లేదు. మద్యపానం నిషేధించరు. ఇది చదివిన వారిలో ఎవరికన్న మద్యపానం అలవాటు ఉంటే , వారందరూ, మద్యపానాన్ని మాని, వారికి, వారి కుటుంబాలకు మేలు చేసుకుంటారని నా కోరిక).

వెంటనే, తన మృతసంజీవని విద్యతో తన పొట్టలో ఉన్న కచుడిని బతికించాడు. అప్పుడు పొట్టలోనుండి కచుడు "మహాత్మా, మీదయవలన నేను బతికాను. కాని నేను ఎలా బయటకు రావాలి" అని అడిగాడు.

శుక్రుడు ఆలోచనలో పడ్డాడు. కచుడు తన పొట్ట చీల్చుకొని బయటకు వస్తే తను చచ్చిపోతాడు. మరల తను బతకాలంటే కచునికి మృత సంజీవని విద్య రావాలి. అందుకని తన పొట్టలో ఉన్న కచునికి మృత సంజీవని విద్య ఉపదేశించాడు. వెంటనే కచుడు గురువుగారైన శుక్రుని పొట్ట చీల్చుకొని బయటకు వచ్చాడు. శుక్రుడు చనిపోయాడు. కచుడు మృత సంజీవని విద్య చేత శుక్రుని బతికించాడు. ఆ విధంగా కచుడు శుక్రుని వలన మృత సంజీవని విద్యను సంపాదించాడు.

కొంత కాలం గడిచింది. వచ్చిన పని అయిపోయింది కాబట్టి ఇంక తను వెళ్లిపోతానన్నాడు కచుడు. శుక్రుడు సరే అన్నాడు కాని దేవయాని

మాత్రం ఒప్పుకోలేదు. కచుడు పెళ్లిపోతాడు అనే మాట విని ఏడ్చింది.

కచుని చూచి "నీకు పెళ్లి కాలేదు. నాకూ పెళ్లి కాలేదు. నేను నిన్ను ప్రేమించాను. నా తండ్రి వలన నువ్వు మృత సంజీవని విద్య స్వీకరించావు. ఆయన కుమార్తెనైన నన్ను కూడా స్వీకరించు" అని అడిగింది.

దానికి కచుడు "అమ్మా దేవయాని. నీ తండ్రి నాకు గురువు. అనగా నాకు పితృ సమానుడు. ఆయన పుత్రికవు నువ్వు నాకు సోదరీ సమానురాలవు. ఇది ధర్మం. అందువల నన్ను పెళ్లి చేసుకోమనడం నీకు తగదు." అని అన్నాడు.

దానికి దేవయాని కోపించి "అట్లైన నా తండ్రి వలన నువ్వు పొందిన మృతసంజీవని విద్య నీకు పని చేయదు" అని శాపం ఇచ్చింది.

కచుడు దేవయానిని చూచి "సోదరీ, మృత సంజీవని నాకు పని చెయ్యకపోయినా, నేను

మరొకరికి ఉపదేశిస్తే, వాళ్లకు పని చేస్తుంది కదా. కాని నేను నీకు శాపం ఇస్తున్నాను. నువ్వు ధర్మం తప్పి, నన్ను పెళ్లాడమని కోరావు కాబట్టి నీకు బ్రాహ్మణుడితో వివాహం కాదు" అని ప్రతి శాపం ఇచ్చాడు. తరువాత కచుడు దేవలోకం వెళ్లి పోయాడు.

(ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి. ఈ రోజుల్లో, school or college students వాళ్లకు విద్య చెప్పే గురువులైన lecturers ను ప్రేమించడం ఒక ఫాషన్ అయిపోయింది. వీటి మీద సినిమాలు కూడా వస్తున్నాయి. అంటె ఒక అమ్మాయి తనకు చదువు చెప్పే గురువును ప్రేమిస్తుందంటే తన తండ్రినే కామిస్తున్నదని అర్థం ఇది తప్పు అనీ, చెయ్యకూడదనీ, అధర్మమని ఈ నాటి యువకులకు, యువతులకు తెలియదు.చెప్పే వాళ్లూ లేరు. వినే వాళ్లు అంతకన్నా లేరు. కొన్ని వేల ఏళ్ల క్రితం ఈధర్మం ఉందని కచుని కథ వలన మనకు తెలుస్తూ ఉంది. ఈ విషయం ఈ నాటి విద్యార్థులకు, వారి గురువులకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని నా అభిప్రాయము).

ఒక రోజు రాక్షసరాజు వృషపర్వుని కూతురు శర్మిష్ఠ, గురువు గారి కూతురు దేవయాని తోనూ, తన వెయ్యి మంది పరిచారికలతోనూ విహారానికి అడవికి వెళ్లింది. అక్కడ ఒక కొలనులో అందరూ బట్టలు విప్పి గట్టున పెట్టి జలకాలాడుతున్నారు. ఇంతలో గట్టిగా సుడి గాలి వీచింది. ఆ గాలికి గట్టు మీద పెట్టిన బట్టలన్నీ కలిసిపోయాయి.

తరువాత శర్మిష్ఠ, దేవయాని, మిగిలిన పరిచారికలు కొలనులో నుండి బయటకు వచ్చారు. బట్టలన్నీ కలిసిపోవడంతో, దేవయానిబట్టలు శర్మిష్ఠ వేసుకుంది. కాని శర్మిష్ఠ బట్టలు మాత్రం దేవయాని వేసుకోలేదు.

"నేను నీ తండ్రికి గురువుగారైన శుక్రుని కూతురిని. బ్రాహ్మణ కులంలో పుట్టిన కన్యను. నీవు విడిచిన మలిన వస్త్రాలను వేసుకుంటానా" అని అడిగింది.

దానికి శర్మిష్టకు కోపం వచ్చింది.

"నీ తండ్రి నా తండ్రిని సేవిస్తూ ఆశీర్వదిస్తూ బతికే ఒక బ్రాహ్మణుడు. ఆ బ్రాహ్మణుడి కూతురివి నువ్వు గొప్పదానివా? నీవు విడిచిన వస్త్రం నేను కట్టుకోగా లేనిది నువ్వు నేను విడిచిన వస్త్రం కట్టుకోవా?" అని నిందించి, దేవయానిని ఒక పాడుబడ్డ నూతిలో తోసింది. తరువాత తన పరిచారికలతో వెళ్లిపోయింది.

యయాతి మహారాజు అదే అడవికి వేటకు వచ్చాడు. నీటి కోసం ఆ బావి దగ్గరకు వచ్చాడు. బావిలో ఏడుస్తూ ఉన్న దేవయానిని చూచాడు. తన చేతిని అందించి పైకి లాగాడు. దేవయాని పైకి వచ్చింది.

"వనితా, నీవు ఎవరవు? ఈ నూతిలో ఎందుకు పడ్డావు?"అని అడిగాడు.

దానికి దేవయాని "మహారాజా, నా పేరు దేవయాని. రాక్షస గురువైన శుక్రాచార్యుల వారి పు

త్రికను. ప్రమాద వశాత్తు ఈ బావిలో పడ్డాను. నీ దయ వలన నీ చెయ్యి పట్టుకొని పైకి వచ్చాను" అని బదులు చెప్పింది. తరువాత యయాతి తన నగరానికి వెళ్ళిపోయాడు.

ఇంతలో దేవయాని పరిచారిక ఘూర్ణిక అను పేరు కలది దేవయానిని వెదకుచూ అక్కడకు వచ్చింది.

దేవయాని పరిచారికను చూచి "నేను వృషపర్వుడి నగరానికి రాను. నువ్వు వెళ్ళి నా తండ్రితో నాకు శర్మిష్ఠ చేసిన అవమానము తెలుపుము" అని చెప్పి పంపింది.

ఈ విషయం తెలిసి శుక్రుడు వెంటనే దేవయాని ఉన్న చోటుకు వచ్చాడు.

"అమ్మా దేవయాని, నీకు కోపం తగదమ్మా. ఎన్నో యజ్ఞాలు,యాగాలుచేసిన వారికంటె, కోపము లేని వాడే గొప్పవాడమ్మా. ఇతరులు మన మీద కోపించినా, అవమానించినా, దానిని మనసులో

పెట్టుకోకుండా స్నేహంగా ఉండటమే పరమ ధర్మం అమ్మా. కాబట్టి కోపం బుద్ధిమంతులకు తగదు. శర్మిష్ట నీ కంటే వయసులో చిన్నది. దానితో నీకేమిటి. ఇంటికి పోదాము రా అమ్మా" అన్నాడు శుక్రుడు.

(ఇక్కడ శుక్రుడు మంచి వారికి కోపం తగదు అని చెప్పాడు. కోపములేని వాడే గొప్ప వాడు అని నొక్కి చెప్పాడు. మహారుషి శమీకుడు కూడా, తన కొడుకు శృంగితో కోపము సర్వ అనర్ధాలకు మూలము అంటాడు. అలాగే భగవద్గీతలో కూడా "క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః స్మృతి భ్రంశాద్బుద్ధి నాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి." అనగా కోపం వలన ఆవేశం పుడుతుంది, ఆవేశం, వస్తే తన్ను తాను మరిచిపోతాడు. మంచి చెడు వివేకం నశిస్తుంది. ఈ స్తితిలో అనరాని మాటలు అంటాడు చెయ్యరాని పనులు చేస్తాడు. దానిఫలితంగా మనుష్యుడు చెడిపోతాడు.

కాబట్టి, కోపము సర్వ అనర్ధాలకు మూలము అని, శాంతమే సౌఖ్యదాయకమనీ ఆ నాడే శమీక

మహర్షి, శుక్రుడు, శ్రీ కృష్ణుడు చెప్పారు. మన కాలంలో కూడా, "శాంత ము లేక సౌఖ్య ము లేదు" అని త్యాగరాజు తన కృతుల్లో వినిపించాడు. కాబట్టి మనం కోపం తగ్గించుకొని, వీలుంటే పూర్తిగా మానివేసి, శాంతంగా బతకాలని కోరుకుందాము. ఇదే విషయం మన పిల్లలకు కూడా చెపుదాము).

శుక్రుడు ఎంత చెప్పినా దానికి దేవయాని ఒప్పుకోలేదు."నాకు అవమానం జరిగిన చోట నేను ఉండను. వేరే ఎక్కడికన్నా వెళతాను" అని తండ్రి అయిన శుక్రుడితో చెప్పింది.

"అమ్మ నువ్వులేకుండా నేను కూడా ఈ నగరంలో ఉండలేను నేను కూడా నీ వెంటనే ఉంటాను" అన్నాడు శుక్రుడు.

ఇంతలో ఈ విషయాలన్ని తెలుసుకున్న వృషపర్వుడు వెంటనే శుక్రాచార్యులు, దేవయాని, దగ్గరకు వచ్చాడు.

"గురుదేవా నీ దయచేతనే కదా మా రాక్షస

జాతి అంతా బతుకుతున్నది. లేకపోతే మేము అందరం మరణించవలసిన వారమే కదా. అందుకని ఈ రాజ్యము, ఈ సంపదలు మీవి. మీకు ఏమి కావాలో అడగండి." అని ప్రాధేయపడ్డాడు.

శుక్రుడు దేవయాని మొహం చూచాడు. దేవయాని వృషపర్వునితో "నీ కూతురు శర్మిష్ఠ, ఆమె వెయ్యి మంది పరిచారికలు ఈ రోజు నుండి నాకు పరిచారికలుగా ఉండాలి" అని చెప్పింది. వృషపర్వుడు దానికి ఒప్పుకున్నాడు. వెంటనే తన కూతురు శర్మిష్ఠను, ఆమె వెయ్యి మంది పరిచారికలను దేవయానికి పరిచారకులుగా నియమించాడు. అప్పటి నుండి చక్రవర్తి కుమార్తె శర్మిష్ఠ, శుక్రుని కూతురైన దేవయానిని సేవిస్తూ ఉంది.

ఒక రోజు దేవయాని, శర్మిష్ఠతోనూ, మిగిలిన పరిచారికలతో, అదే వనానికి విహారానికి వెళ్లింది. మరల యయాతి మహారాజు అదే వనానికి వేటకు వచ్చాడు. వీరందరిని చూచాడు. దేవయానిని చూచి "బాలా, ఇది వరకు నేను నిన్ను చూచినాను.

వీరందరూ ఎవరు?" అని అడిగాడు.

దానికి దేవయాని, "మహారాజా, నేనెవరో మీకు తెలియును. ఈమె పేరు శర్మిష్ట, వృషపర్వ చక్రవర్తి కుమార్తె, నా దాసి. ఎప్పుడూ నన్ను సేవిస్తూ ఉంటుంది. మిగిలిన వారందరూ నా పరిచారికలు. రాజా, నేను నూతిలో పడ్డప్పుడు నువ్వు నీ చేతిని నాకు అందించి, నన్ను బయటకు లాగావు. అప్పుడే మనకు పాణిగ్రహణమైనది. అందుకని నీవు నన్ను వివాహమాడుము. ఈ శర్మిష్టతో సహా వెయ్యి మంది పరిచారికలతో నిన్ను సేవిస్తూ ఉంటాము" అని చెప్పింది.

దానికి యయాతి, "బాలా, ఇది ధర్మము కాదు. బ్రాహ్మణులు క్షత్రియ కన్యను వివాహమాడవచ్చు కాని, క్షత్రియుడు బ్రాహణ కన్యను వివాహమాడ రాదు. ఇది ధర్మ విరుద్ధము. రాజునైన నేనే అధర్మము చేసిన మిగిలిన వారు కూడా ధర్మము తప్పురా. అందుకని ఈ వివాహము జరగదు" అని అన్నాడు.

"యయాతి మహారాజా, నా తండ్రి శుక్రాచార్యుడు,

లోకానికి ధర్మాధర్మ నిర్ణయం చేసేవాడు.ఆయన చెపితే ఒప్పుకుంటారా" అని దేవయాని అడిగింది.

దానికి యయాతి "ఆ మహానుభావుడు వచ్చి ఇది ధర్మ విరుద్ధము కాదు అని చెప్పిన నేను నిన్ను తప్పక వివాహమాడెదను" అని అన్నాడు.

వెంటనే దేవయాని,తన పరిచారికలను పంపి తన తండ్రిని రప్పించింది.

శుక్రుని చూచి యయాతి భక్తితో నమస్కరించాడు. "తండ్రీ ఈ మహారాజుకు నాకు ఇది వరకే పాణిగ్రహణం జరిగింది. ఇప్పుడు నేను వేరే వారిని వివాహ మాడటం తగునా చెప్పండి. యయాతి మహారాజే నా భర్త. మా వివాహము ధర్మ విరుద్ధము కాకుండా తమరు అనుగ్రహించాలి" అని అడిగిందిదేవయాని.

కన్న కూతురి మీదప్రేమ శుక్రుని ఆ వివాహానికి అంగీకరింపచేసింది. "యయాతితో జరిగే ఈ వివాహము అధర్మము కాదు" అని చెప్పాడు శుక్రుడు.

యయాతి సంతోషంగా దేవయానిని వివాహ మాడటానికి ఒప్పుకున్నాడు. ఇరువురికి వివాహం జరిగింది. యయాతి తన నగరానికి వెళ్లడానికి సన్నద్ధం అయ్యాడు.

శుక్రుడు శర్మిష్టను చూపించి "ఈమె వృషపర్వుని కూతురు శర్మిష్ట. అందరి పరిచారికల మాదిరి కాకుండా ఈమెకు ఆహారము, పానీయము అలంకారాలు మాత్రం ఇవ్వు. పడక సుఖం మాత్రం ఇవ్వ వద్దు" అని చెప్పాడు. యయాతి సరే అన్నాడు.

యయాతి తన భార్య అయిన దేవయానిని తీసుకొని, శర్మిష్ట, మిగిలిన పరిచారికలతో సహా తన నగరానికి వెళ్లాడు. దేవయానిని అంతఃపురంలో ఉంచాడు. శర్మిష్టను, మిగిలిన పరిచారికలను వేరే గృహంలో ఉంచాడు. దేవయానితో సకల భోగాలు అనుభవిస్తున్నాడు. దేవయానికి యయాతికి యదువు, తుర్వసుడు అనే కొడుకులు పుట్టారు. భర్తతోను, కొడుకులతోను, దేవయాని సుఖంగా కాలం గడుపుతూ ఉంది.

ఇది ఇలా ఉండగా, ఒక రోజు శర్మిష్ట ఒంటరిగా కూర్చుని తన గురించి ఆలోచిస్తూ ఉంది.

"ఒక రాక్షస రాజుపుత్రికగా పుట్టిన తాను, అనేక భోగములు అనుభవించవలసిన తాను, ఇలా దాసిగా కాలం వెళ్లబుచ్చవలెనా? తన యౌవ్వనం ఇలా వృధాకావలసిందేనా? తనకు పతి సుఖం అనుభవించే భాగ్యం లేదా? తన జీవితం అడవి కాచిన వెన్నెల అగునా ఏమి?

దేవయాని చేసుకున్న అదృష్టం ఏమి. హాయిగా భర్తతో సుఖం అనుభవిస్తూ ఉంది. కొడుకులను కూడా కన్నది. ఒక స్త్రీ జీవితంలో, తగిన భర్తను, కొడుకులను పొందుటయే పరమార్ధము. ఈ దేవయానికి భర్త, కొడుకులు లభించారు. కాని నా విషయమే అర్ధం కావడంలేదు. యయాతి మహారాజును చూచినప్పటి నుండి నా మనసు అతనియందే లగ్నం అయింది. యయాతి మహారాజు నన్ను కూడా ప్రేమతో చూస్తున్నాడు. దేవయాని ఎలా యయాతిని తన భర్తగా చేసుకున్నదో నేను కూడా

అలాగే యయాతిని భర్తగా చేసు కుంటాను. సంతానాన్నిపొందుతాను."

ఈ విధంగా ఆలోచించి శర్మిష్ఠ సమయం కోసం ఎదురు చూస్తూ ఉంది.

ఒక రోజు యయాతి మహారాజు శర్మిష్ట ఉన్న వనానికి విహారానికి వచ్చాడు. అప్పుడు దేవయాని వెంట లేదు. శర్మిష్ట యయాతిని చూచి సిగ్గు పడింది. ఇదే సమయము అనుకొని సిగ్గు విడిచి

"మహారాజా, తమరు మా యజమాని దేవయానికి భర్త. లోకాచార ధర్మం ప్రకారం ఆమె పరిచారిక నైన నాకు కూడా నువ్వు భర్తవే. భార్య, సేవకు రాలు, పుత్రులు ఈ లోకంలో వీడని బంధాలు. అందుకని, దేవయానిని మీరు పెళ్లాడినప్పుడే ఆమె దాసినైన నేను కూడా మీ భార్యనైనాను. నాకు మీ పొందును అనుగ్రహించండి" అని ప్రార్థించింది.

!దానికి యయాతి "బాలా, నీవు చెప్పినది యుక్తమే. నా భార్య దాసివైన నీవు కూడా నా భార్యా

సమానురాలివే. కాని శుక్రుడు నీకు పడక సుఖమివ్వవద్దని ఆజ్ఞాపించాడు కదా. ఆయన మాటలు నేను ఎలా తప్పాలి". అన్నాడు.

దానికి శర్మిష్ట నవ్వి "మహారాజా, ప్రాణాలకు హాని కలిగిన పుడు, తన వద్దనున్న ధనం ఎవరన్నా ఎత్తుకు పోతున్నపుడు, చావబోతున్న ఒక బ్రాహ్మణుడిని రక్షించవలసినపుడు, ఆడ వాళ్ల పొందు అనుభవించేటప్పుడు, వివాహ సమయములలోనూ, అబద్ధం చెప్పినా తప్పు కాదు అని మహా రుషులు చెప్పియున్నారు కదా. కాబట్టి, నన్ను పొందుటలో మీరు శుక్రాచార్యుల వారి మాట తప్పినా తప్పులేదు" అంది సిగ్గుతో తలవంచుకొని.

ఆమె మాటలకు,యయాతి అంగీకరించాడు. ఆమెతో పడక సుఖమనుభవించాడు. వారు ఇరువురి సమాగమానికి ఫలంగా శర్మిష్ట గర్భం ధరించింది. ఒక కొడుకును కన్నది. ఇది దేవయానికి తెలిసింది.

దేవయాని శర్మిష్ట వద్దకు వచ్చి "శర్మిష్టా,

నీవు శీలవంతురాలవు. పెళ్లి కాకుండా భర్త లేకుండా నీకు కొడుకు ఎలా పుట్టాడు" అని అడిగింది.

దానికి శర్మిష్ట మరో అబద్ధం చెప్పింది. "దేవయానీ, నాకు ఒక మునీశ్వరుడు అనుగ్రహించి, పుత్రుడినిప్రసాదించాడు" అని చెప్పింది. దేవయాని ఆమె మాటలు నమ్మి, తన నివాసానికి వెళ్లింది.

తరువాత, శర్మిష్ట కు యయాతి మహా రాజు వలన, ద్రుహ్యుడు, అనువు, పూరుడు అను ముగ్గురు కొడుకులు కలిగారు. ఒక రోజు ఆ ముగ్గురూ తోటలో ఆడుకుంటున్నారు. అక్కడకు దేవయాని తన భర్త యయాతితో కూడా అక్కడకు వచ్చింది.

ఆ ముగ్గురుకుమారులను చూచి " మీరు ఎవ్వరు. మీ తలితండ్రులు ఎవరు?" అని అడిగింది. ఆ ముగ్గురు బాలురు యయాతి మహారాజును శర్మిష్టను చూపి "వీరే మా తల్లితండ్రులు" అని చెప్పారు. అప్పుడు దేవయానికి సమస్తం తెలిసిపోయింది. ఆమెకు దుఃఖం పొల్లుకు వచ్చింది. తన భర్త యయాతి తనను

మోసగించాడని తెలుసుకుంది. వెంటనే తన తండ్రి శుక్రాచార్యుని వద్దకు వెళ్ళింది. జరిగిన దంతా చెప్పింది. ఆమె వెంట యయాతి కూడా వెళ్ళాడు. శుక్రాచార్యునికి నమస్కరించాడు.

శుక్రుడికి కోపం వచ్చింది. "యయాతి మహారాజా, నువ్వు యవ్వన మదంతో నాకూతురికి ద్రోహం చేసావు. నా మాట తప్పావు. కాబట్టి నిన్ను ముసలి తనము బాధించుగాక" అని శాపం పెట్టాడు.

దానికి యయాతి శుక్రునితో " మహాత్మా, నేను నీ కుమార్తెకు భర్తను. అలాగే నీ కుమార్తె దాసికి కూడా భర్తనే. ఋతుమతి అయిన భార్య భర్తను సంతానం కావాలి అని అడిగితే నేను నిరాకరించడం అధర్మం కాదా. అందుకని నేను శర్మిష్టకు సంతానాన్ని ప్రసాదించాను. దీనికి తమరు కోపింపవచ్చునా? మహాత్మా,నాకు విషయ వాంఛల మీద ఆసక్తి తగ్గలేదు. ఇంకా తమరి కుమార్తె, నా భార్య ఐన దేవయానితో ఇంద్రియ సుఖములను అనుభవించవలెనని కోరికగా ఉన్నది. ఈ ముసలి తనమును నేను భరించలేను.

నాకు పి ముక్తి ప్రసాదించండి" అని వేడుకున్నాడు.

దానికి శుక్రుడు "యయాతీ, నీ కొడుకులలో ఒకడికి నీ ముసలితనాన్ని ఇచ్చి, వాడి యవ్వనాన్ని నువ్వు తీసుకో. ఇంద్రియ సుఖాలు అన్ని అనుభవించిన తరువాత, నీ యవ్వనాన్ని నీ కుమారునికి ఇచ్చి మరల నీ ముసలితనాన్ని నువ్వు తీసుకో. ఎవరైతె నీ ముసలితనాన్ని తీసుకొని నీకు యవ్వనాన్ని ఇస్తాడో, ఆ కొడుకే నీ రాజ్యానికి వారసుడు అవుతాడు. నీ వంశాన్ని కొనసాగిస్తాడు" అని అన్నాడు.

యయాతి తన కుమారులు ఐదుగురను పిలిచాడు. "కుమారులారా, శుక్రాచార్యుని ఆదేశము ప్రకారము, మీలో ఎవరైనా నా ముసలి తనాన్ని తీసుకొని, మీ యవ్వనాన్ని నాకు ఇవ్వగలరా" అని అడిగాడు.

అప్పుడు యయాతి కుమారులైన యదువు, ద్రుహ్యు, తుర్వసుడు, అనువు, యయాతిని చూచి "తండ్రీ, ముసలి తనము అనేది వయోభారం వలన

వస్తుంది. రోగం విధివశాత్తు వస్తుంది. కాబట్టి అవి రెండూ మానవులు అనుభవించక తప్పదు. కోరి కోరి ఎవరూ రోగాన్ని, ముసలి తనాన్ని మరొకరినుండి తీసుకోరు. అదియును కాక, ముసలి వాడు మన్మధుడైనా, యౌవనవతులు అసహ్యించుకుంటారు. దగ్గరకు రానివ్వరు. కాబట్టి శరీర సుఖాలు అనుభవించ వీలులేదు. కాబట్టి మీ ముసలితనాన్ని తీసుకొనడం మాకు ఇష్టం లేదు" అని చెప్పారు.

దానికి యయాతికి కోపం వచ్చింది. ఆ నలుగురిని ఈ విధంగా శపించాడు. "యదు వంశానికి చెందిన వారు రాజ్యం చెయ్యడానికి అనర్హులు. తుర్వసు వంశానికి చెందిన వారు ధర్మా ధర్మములు తెలియని వారైన కిరాతులకు రాజులు ఔతారు, ద్రుహ్యులు జలమయమైన ప్రదేశములకు రాజులు ఔతారు. అను వంశమునకు చెందిన వారు, యవ్వనములో ఉండగానే మరణిస్తారు" శాపం పెట్టాడు.

ఇది అంతా చూచి, ఐదవ కుమారుడు

పూరుడు అనే వాడు ధైర్యంగా ముందుకు వచ్చాడు."తండ్రీ నా యవ్వనాన్ని మీకు ఇస్తాను. మీ ముసలితనాన్ని నేను అనుభవిస్తాను" అన్నాడు.

దానికి యయాతి సంతోషించాడు. పూరుడు తన యవ్వనాన్ని తన తండ్రి యయాతికి ఇచ్చాడు. ఆయన ముసలితనాన్నితను స్వీకరించాడు. యయాతి మరల నవయవ్వనుడైనాడు. తన భార్య ఐన దేవయానితో సకల సుఖాలు అనుభవించాడు. వేయి సంవత్సరాలు యవ్వనవంతుడిగా ఇంద్రియ సుఖాలు యధేచ్ఛగ అనుభవించాడు. తృప్తి చెంది, మరల తన యవ్వనాన్నితన కుమారుడైన పూరునికి ఇచ్చాడు. తన ముసలితనాన్ని తిరిగి స్వీకరించాడు. శుక్రాచార్యుని ఆదేశం ప్రకారం పూరుడిని తన సామ్రాజ్యనికి చక్రవర్తిని చేసాడు.

కాని పుర జనులకు ఇది నచ్చలేదు. పెద్ద వాడైన యదువు ఉండగా, ఆఖరివాడు పైగా దాసీ పుత్రుడు ఐన పూరుడికి రాజ్యాధికారము ఎలా వస్తుందని యయాతిని అడిగారు.

"పురజనులారా, యదువు నా పెద్ద కుమారుడే. కాని తండ్రి మాట వినలేదు. గర్వంగా ప్రవర్తించాడు. తండ్రి మాట వినని వాడు, తండ్రి ఆస్తికి వారసుడు ఎలా అవుతాడు. పూరుడు చిన్న వాడైనా నా పట్ల గౌరవ మర్యాదలు కలవాడు. నా మాట నెరవేర్చాడు. అందుకే నా సామ్రాజ్యానికి అతనే వారసుడు"అని యయాతి నిర్ణయించాడు.

(ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి. ఈ రోజుల్లో వృద్ధాశ్రమాలు పెరిగి పోతున్నాయి. నిర్లక్ష్యం చెయ్యబడ్డ తల్లి తండ్రులు ఎక్కువ అవుతున్నారు. తల్లి తండ్రుల డబ్బుతో పెరిగి పెద్దవారయి, ఎంతో ఖర్చుతో పై చదువులు చదువుకున్న వారు, తండ్రి ఆస్తినంతా చేజిక్కించుకున్న వారు, తల్లి తండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. అలాంటి వారికి కొన్ని వేల ఏండ్ల క్రితం యయాతి చెప్పిన మాటలు వర్తిస్తాయి. తల్లి తండ్రులను నిర్లక్ష్యం చేసిన కొడుకులు వాళ్ల ఆస్తికి ఎలా వారసులవుతారు? అని సూటిగా ప్రశ్నించాడు యయాతి. అదే ప్రశ్న ఈ తరం వారు ఎవరికి వారు వేసుకుంటే బాగుంటుందని నా ఆశ. కనీసం కొందరి

వృద్ధులైన తల్లి తండ్రుల కళ్లలో అయినా ఆశాజ్యోతులు వెలుగుతాయి".

తరువాత యయాతి తపోవనానికి వెళ్లాడు. వెయ్యి సంవత్సరాలు తపస్సు చేశాడు. దేవ లోకం నుండి వచ్చిన విమానంలో బ్రహ్మ లోకానికి వెళ్లాడు. అక్కడ కొన్ని కల్పములు గడిపి, ఇంద్ర లోకానికి వెళ్లాడు. ఇంద్రుడు యయాతిని సాదరంగా ఆహ్వానించాడు. మర్యాదలు చేసాడు.

ఇంద్రుడు యయాతితో "యయాతి మహారాజా, నీవు నీ కుమారుడి యొక్క యవ్వనాన్ని గ్రహించి, అతనికి రాజ్య భారాన్ని అప్పగించేటప్పుడు, నీవు అతనికి ఏమేమి నీతులు బోధించావు" అని అడిగాడు.

దానికి యయాతి "మహేంద్రా, ఎప్పుడూ మంచి వాళ్లతో స్నేహం చెయ్యాలి. వారితోనే మాట్లాడాలి. ఒకరికి ఇవ్వాలే గాని, మరొకరి నుండి ఏమీ తీసుకో కూడదు. అందరిని తృప్తిగా ఉండేట్లు చూడాలి. ఎప్పుడూ ఎదుటి వారికి సంతోషం కలిగించే విధంగా నిజమే మాట్లాడాలి. ఎదుటి వారి మీద

దయకలిగి ఉండాలి. గర్వం, కోపం,లోభం మొదలైనవి దగ్గరకురానివ్వ కూడదు. అని చెప్పాను" అని అన్నాడు.

దానికి ఇంద్రుడు సంతోషించాడు. కాని యయాతిని పరీక్షించదలచి, "యయాతి మహారాజా, నువ్వు ఏమి తపస్సు చేసావో స్వర్గ లోక భోగాలు అనుభవిస్తున్నావు. నీ తపస్సు చాలా గొప్పది" అని అన్నాడు.

అప్పుడు యయాతిలో కొంచెం గర్వం తలెత్తింది. ఇంద్రుడు లాంటి వాడు తనను పొగుడుతున్నాడు కదా అని గర్వంగా తలచాడు.

"అవును మహేంద్రా, ఈ లోకంలో మానవులు కాని, దేవతలు కాని, మహామునులు కాని చేసిన ఏ తపస్సు ఐనా నేను చేసిన తపస్సుకు సమానం కావు" అని గర్వంగా పలికాడు.

అప్పుడు ఇంద్రుడు అతనిని చూచి, "యయాతీ, నీలో గర్వమింకా నశించలేదు. ఈ మాటతో నీ

పుణ్యం హరించి పోయింది. నువ్వు స్వర్గ లోకం లో ఉండటానికి అర్హుడవు కావు. మానవ లోకానికి వెళ్ళు" అని చెప్పాడు.

దానికి యయాతి "మహేంద్రా, నేను మానవ లోకానికి వెళ్ళ లేను. నక్షత్ర లోకానికి వెళ్తాను " అని అన్నాడు. దానికి ఇంద్రుడు సమ్మతించాడు. యయాతి నక్షత్ర లోకానికి వెళ్ళాడు.

అక్కడ యయాతి కూతురు కొడుకులు (మనుమలు), అష్టకుడు మొదలైన వారు ఉన్నారు. వారు యయాతిని కలుసుకున్నారు.

"మీరు ఎవరు ఇక్కడకు ఎందుకు వచ్చారు" అని అడిగారు.

దానికి యయాతి "నేను నహుషుడి కుమారుడను, యయాతి మహారాజును.నేను చేసిన పుణ్య ఫలం వలన, బ్రహ్మలోకము, దేవ లోకము, దర్శించి ఇప్పుడు ఇక్కడకు వచ్చాను" అని అన్నాడు.

అప్పుడు అష్టకుడు మొదలైన వారు అతనిని తమ తల్లికి తండ్రిగా గుర్తించారు. అతని నుండి జీవుల పిండోత్పత్తి మిగిలిన విషయాలు తెలుసుకోవాలనుకున్నారు. వారికి యయాతి ఇలా చెప్పసాగాడు.

"అన్ని జీవుల యందు దయ కలిగి ఉండటం, ఎప్పుడూ నిజం పలకడం, వీటిని మించి ధర్మం మరొకటి లేదు. ఇతరులను బాధించడం అధర్మం.

(ఇక్కడ మనం ఒకటిచెప్పుకోవాలి. ఈ రోజుల్లో మానవత్వం నశించి పోయింది. జంతువులకన్న హీనంగా ప్రవర్తిస్తున్నారు. పులి సాటి పులిని చంపదు. సింహము తోటి సింహాన్ని చంపదు. పిల్లి కూడా సాటి పిల్లిని చంపదు. కాని మానవుడు. సాటి మనిషిని నిర్దాక్షిణ్యంగా చంపుతున్నాడు. మారణ హోమం చేస్తున్నాడు. తీవ్రవాదం పెచ్చురిల్లుతోంది. బాంబు దాడులు జరుగుతున్నాయి. తుపాకులు గర్జిస్తున్నాయి. ఇవన్ని దేనికి? సాటి మనిషిని చంపడానికి. న్యాయస్తానాల్లో దేవుడి మీద ప్రమాణం చేసి మరీ పచ్చి అబధాలు చెపుతున్నారు. మరి ఈ

నాటి మానవులకు నాడు యయాతి చెప్పిన సూక్తులు వర్తించవా? వర్తిస్తే ఎందుకు పాటించరు?" ఆలోచించండి)

ఇంకా యయాతి ఇలా చెప్పసాగాడు:

"స్త్రీ గర్భంలో ఋతు కాలమందు రజస్సు ఉద్భవిస్తుంది. అది పురుషుడి రేతస్సుతో చేరి పిండంగా మారుతుంది. ఆ పిండము శబ్దము, స్పర్శ, మొదలైన 5 తన్మాత్రలు ఒక రూపం పొందుతుంది. తొమ్మిది నెలలు గర్భంలో ఉండి, ఈ లోకంలోకి ప్రవేశిస్తుంది. పుట్టిన తరువాత, కంటితో చూస్తూ, చెవులతో వింటూ, నోటితో మాట్లాడుతూ, ముక్కుతో వాసనపీలుస్తూ నోటితో ఆహారాన్ని స్వీకరిస్తూ, మంచి పనులు చెడ్డ పనులూచేస్తుంటారు. చేసిన పుణ్యం ఎక్కువైతే మరు జన్మలో మంచి గర్భములలో జన్మిస్తారు. ఆఖరుకు మోక్షం పొందుతారు. పాపము చేసిన వాళ్లు పశువులుగాను, పక్షులుగాను జన్మించి తమ పాపాలు అనుభవిస్తారు. నిత్యం గురువుల సేవ చేస్తూ, యజ్ఞ యాగాలు చేస్తూ, ఇతరులనుండి ఏమీ

తీసుకోకుండా, తమకు ఉన్న దాన్ని దానంచేస్తూ, ఉండేవాళ్లు మంచి వాళ్లు. గర్వంతోనూ, ఆడంబరం తోనూ చేసే పనులు, యజ్ఞాలు యాగాలు మంచివి కావు." అని చెప్పాడు యయాతి.

తరువాత, అష్టకుడు మొదలైన వారు యయాతితో, "యయాతి మహారాజా, మేము ఇక్కడే ఉండవలెనా, మాకు పుణ్య లోకాలు లేవా" అని అడిగారు.

దానికి యయాతి "మీకు తప్పకుండా పుణ్య లోకాలు ఉన్నాయి" అన్నాడు. యయాతి మనుమలు పుణ్యం చేసుకున్నారు కాబట్టి పుణ్య లోకాలకు వెళ్లారు. వారి తో కూడ ఉన్న యయాతికి, వారి సాంగత్యము వలన పుణ్య లోకాలు లభించాయి. అందరూ కలిసి పుణ్య లోకాలకువెళ్లారు.

## మహాభారతము
## ఆది పర్వము తృతీయాశ్వాసము
## సమాప్తము.

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎఱ్ఱాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)

Modali Venkata Subrahmanyam, B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.

Ph:040-24048104

# మహా భారతం

## ఆది పర్వము.

## (చతుర్థా శ్వాసము)

ఆ కథకుడైన ఉగ్రశ్రవసుడు శౌనకాది మహా మునులను చూచి ఇలా చెప్ప సాగాడు.

యయాతి తన కొడుకు అయిన పూరుడికి పట్టాభిషేకం చేసిన తరువాత, పూరుడు జనరంజకంగా రాజ్య పాలన సాగిస్తున్నాడు.

పూరుడి కొడుకు జనమేజయుడు. జనమేజయుని కొడుకు ప్రాచిన్వంతుడు. ప్రాచిన్వంతుని కుమారుడు సంయాతి. సంయాతి కొడుకు అహంయాతి. అహంయాతి కొడుకు సార్వభౌముడు. సార్వభౌముని కొడుకు జయత్సేనుడు. జయత్సేనుడి కొడుకు అవాచీనుడు. అవాచీనుడి కొడుకు అరిహుడు. అరిహుని కొడుకు మహాభౌముడు. మహాభౌముని కొడుకు యుతానీకుడు. యుతనీకుని కొడుకు అక్రోధనుడు. అక్రోధనుని కొడుకు దేవాతిథి. దేవాతిథి కొడుకు రుచీకుడు.

రుచీకుని కొడుకు రుక్షుడు. రుక్షుని కొడుకు మతినారుడు.

ఆ మతినారుడు సరస్వతీనదీ తీరమున పన్నెండు సంవత్సరములు సత్రయాగము చేశాడు. సరస్వతీ నది అతనిని తన భర్తగా చేసుకున్నది. వారికి త్రసుడు అనే పీరుడు పుట్టాడు. త్రసుని కొడుకు ఇలినుడు. ఇలినుడి కొడుకు దుష్యంతుడు.

దుష్యంతుడు చిన్నప్పటినుండి అడవులలో తిరుగుతూ సింహాలను, పులులను వెంటాడి పట్టుకుంటూ ఆడుకుంటూ ఉండేవాడు. దుష్యంతుని రాజ్య పాలనలో ప్రజలు ధర్మ మార్గం అవలంబిస్తూ ప్రశాంతం గా జీవిస్తున్నారు.

ఒక రోజు దుష్యంతుడు వేటకు వెళ్లాడు. అలా వేటాడుతూ దుష్యంతుడు ఒక తపోవనానికి చేరుకున్నాడు. అది కణ్వాశ్రమము. కణ్వ మహాఋషి తపస్సు చేసుకొనే ఆశ్రమము. ఆ ఆశ్రమములో బద్ధ శత్రువులైన సింహాలు ఏనుగులు, ఎలుకలు పిల్లులు, చెట్టపట్టాలు వేసుకొని సహజీవనం చేస్తుంటాయి.

దుష్యంతుడు తన మంత్రులతో "నేను ఒంటరిగా వెళ్లి కణ్వ మహామునిని దర్శించి వస్తాను. మీరు ఇక్కడే ఉండండి" అని చెప్పి ఒంటరిగా పాదచారి అయి కణ్వాశ్రమానికి వెళ్లాడు.

కణ్వాశ్రమ సమీపంలో ఒక అందమైన కన్య శకుంతల అనే పేరు కల దానిని దుష్యంతుడు చూచాడు. శకుంతల కూడా అతిలోక సుందరుడైన దుష్యంతుని చూచింది. అతనిని సాదరంగా ఆహ్వానించింది. ఉచిత రీతిన సత్కరించింది.

దుష్యంతుడు ఆ కన్యను చూచి "నా పేరు దుష్యంతుడు. ఈ దేశాన్ని ఏలే చక్రవర్తిని. వేటని మిత్తము ఈ అడవికి వచ్చాను. కణ్వ మహాఋషిని దర్శించుకుందామని ఇక్కడకు వచ్చాను" అన్నాడు.

"వారు ఇప్పుడే పండ్లు తెచ్చుటకు వెళ్లారు. ఇప్పుడే వస్తారు" అని చెప్పింది శకుంతల.

"బాలా నీ తలితండ్రులెవరు? ఇక్కడ ఎందుకు ఉన్నావు?" అని అడిగాడు దుష్యంతుడు.

"ప్రభూ, నేను కణ్వ మహాఋషి కుమార్తెను" అని బదులు చెప్పింది.

దుష్యంతునికి అనుమానం వచ్చింది. "ఈమే ముని కన్యక ఐతే నా మనసు ఈమె మీదికి ఎందుకు లగ్నం అయింది. కణ్వ ముని ఆజన్మబ్రహ్మచారి. మరి ఆయనకు కూతురు ఎలా వచ్చింది." అని మనసులో అనుకొని శకుంతల పుట్టుక గురించి తెలుసుకోవాలనుకున్నాడు దుష్యంతుడు.

"శకుంతలా, సన్యాసాశ్రమాన్ని పాటిస్తున్న కణ్వ మహామునికి నీవు కూతురు ఎలా అయినావు" అని అడిగాడు.

"మహారాజా, నాకునూ తెలియదు. ఒక రోజు ఒక మునీశ్వరుడు నా తండ్రి గారైన కణ్వ మహా మునిని నాపుట్టు పూర్వోత్తరాల గురించి అడిగాడు. నా తండ్రి ఆ మునీశ్వరునికి చెప్పినది నేను విన్నాను. అది మీకు చెపుతాను వినండి.

ఒకసారి రాజర్షి అయిన విశ్వామిత్రుడు తపస్సు

చేస్తున్నాడు. ఆ తపస్సుకు ఇంద్రుడు భయపడ్డాడు. విశ్వామిత్రుని తపస్సు భగ్నం చెయ్యాలి అని అనుకున్నాడు. వెంటనే మేనక అనే ఒక అప్సరస ను పిలిచాడు.

"మేనకా, నీవు ఎలాగైనా విశ్వామిత్రుని వద్దకు వెళ్లి ఆయన తపస్సు భగ్నం చెయ్యాలి" అని చెప్పాడు.

మేనక భయపడింది. "దేవేంద్రా, విశ్వామిత్రుని వద్దకు పోవడానికే నువ్వు మొదలుకొని అందరూ దేవతలు భయపడుతుంటారు. మరి నన్ను ఆయన వద్దకు పోయి ఆయన తపస్సుభగ్నం చెయ్యి అని అడగడం తగునా చెప్పండి. కాని నా శక్తి కొలదిప్రయత్నించి ఆయన మనసును మారుస్తాను" అని చెప్పి మేనక విశ్వామిత్రుని వద్దకు వెళ్లింది. ఘోరమైన తపస్సు చేస్తున్న విశ్వామిత్రుని చూచింది. ఆయనకు నమస్కారం చేసింది. తన చెలికత్తెలతో, ఆయన దృష్టిలో పడేవిధంగా పూలు కోస్తూ అటూ ఇటూ తిరుగుతూ ఉంది.

విశ్వామిత్రుడు మేనకను చూచాడు. ఆయన మనస్సు చలించింది. మేనక మీద మనసు పడ్డాడు.

తపస్సు కట్టిపెట్టాడు. మేనకతో కామ సుఖాలు అనుభవించ సాగాడు. వారిద్దరికి ఒక ఆడ శిశువు జన్మించింది. వచ్చిన పని అయి పోయినది కాబట్టి మేనక దేవలోకానికి వెళ్లి పోయింది. విశ్వామిత్రుడు తిరిగి తపస్సు చెయ్యడానికి తపోవనానికి వెళ్లాడు.

ఆ పసి బిడ్డ మాత్రం ఏడుస్తూ ఆ ఇసుక తిన్నెల మీద ఉండి పోయింది. అక్కడ ఉన్న పక్షులు తమ రెక్కలను అడ్డంగా పెట్టి నీడ కల్పిస్తూ ఆ బిడ్డను కాపాడాయి. అప్పుడు నా తండ్రి కణ్వ మహాఋషి తన శిష్యులతో అక్కడకు వెళ్లారట. నదీ తీరంలో ఒక ఇసుక తిన్నె మీద, పక్షులచేత రక్షింపబడుతున్న ఆ ఆడ బిడ్డను చూచారట. ఆ బిడ్డను తీసుకొని ఆశ్రమానికి వచ్చారట. ఆ ఆడ శిశువును నేనే. శకుంతములతో రక్షింబడిన ది కాబట్టి నాకు శకుంతల అని నామకరణం చేసారు. అప్పటి నుండి నన్ను తన కన్న కూతురి లాగా పెంచుతున్నారు. నేను వారిని నా తండ్రి లాగా ఆదరి స్తున్నాను" అని చెప్పింది శకుంతల.

శకుంతల తాను విశ్వామిత్రుని కూతురు అని చెప్పగానే దుష్యంతునకు ఆమె మీద మనసు కలిగింది.

విశ్వామిత్రుడు క్షత్రియుడు. కాబట్టి శకుంతల క్షత్రియ కన్య.

దుష్యంతుడు శకుంతలను చూచి "ఓ కోమలీ, నీవు అతిలోక సౌందర్యవతివి. నీవు ఈ నార చీరలు కట్టుకొని ఆశ్రమ వాసం చెయ్య తగవు. నీవు అందమైన రాజ సౌధములలో, రాజ్య సంపదలను అనుభవింప వలసిన దానవు. నాకు నీ మీద ప్రేమ కలిగింది. నిన్ను ఎనిమిది రకాలైన వివాహ విధులలో ఒకటైన గాంధర్వ విధిప్రకారం వివాహం చేసుకుంటాను." అని అన్నాడు దుష్యంతుడు.

{వివాహ విధులు ఎనిమిది రకాలు, అవి (1)బ్రాహ్మము (2)దైవము (3) ఆర్షము (4)గాంధర్వము (5)ఆసురము (6)రాక్షసము (7)ప్రాజపత్యము (8)పైశాచము}

"మహారాజా, నా తండ్రి కణ్వుల వారి ఆశ్రమములో లేరు. వారు వచ్చి కన్యా దానము చేసిన నన్ను మీరు స్వీకరింపవచ్చును" అని చెప్పింది.

"కోమలీ, గాంధర్వమునకు పెద్దల అను మతి తోనూ, మంత్ర తంత్రములతో పని లేదు. అత్యంత రహస్యంగా జరిగేదే గాంధర్వము." అని ఆమెకు చెప్పి ఒప్పించాడు.

"దుష్యంత మహారాజా, నేను నిన్ను వివాహ మాడిన, మన ఇరువురకు పుట్టబోయే పుత్రుని నీ సువిశాల సామ్రాజ్యానికి మహా రాజును చెయ్య డానికి తమరు అంగీకరించిన, నేను ఈ వివాహమునకు ఒప్పుకొనెదను" అని శకుంతల చెప్పింది.

దానికి దుష్యంతుడు సంతోషంగా ఒప్పుకున్నాడు. శకుంతలా దుష్యంతులకు గాంధర్వ విధిన వివాహం జరిగింది. దుష్యంతుడు ఆమెతో కామ సుఖాలను అనుభవించాడు.

"శకుంతలా, నేను వెళ్లి నిన్ను సగౌరవంగా రాజ ధానికి తీసుకురావడానికి నా మంత్రులను పంపిస్తాను" అని శకుంతలను ఒప్పించి దుష్యంతుడు వెళ్లి పోయాడు.

ఈ విషయమంతా తెలిస్తే తన తండ్రి కణ్వుడు కోపగిస్తాడేమో అని శకుంతల భయపడుతూ ఉంది.

కణ్వ మహా ముని ఆశ్రమానికి వచ్చాడు. శకుంతలలో కనపడుతున్న నును సిగ్గు, హావ భావాలు చిత్రంగా కనపడ్డాయి. తన దివ్య దృష్టితో చూచి జరిగిందంతా తెలుసుకున్నాడు.

శకుంతలను చూచి "అమ్మా, గాంధర్వ వివాహము శాస్త్ర సమ్మతమే. నీకుతగిన భర్తనే ఎన్నుకున్నావు. గర్భాదానం కూడాజరిగింది. నీకు పుట్టబోయే పుత్రుడు ఈ సువిశాల భరత సామ్రాజ్యానికి చక్రవర్తి అవుతాడు." అని దీవించి "అమ్మా శకుంతలా, నీవు కోరిన వరం ఇస్తాను కోరుకో అమ్మా" అన్నాడు.

శకుంతల తండ్రికి నమస్కరించి "తండ్రీ, నా మనసు ఎప్పుడూ ధర్మం తప్పకుండా ఉండాలి. నాకు పుట్టబోయే కొడుకు దీర్ఘా ఆయువు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలిగి ఉండాలి. మహాబలవంతుడై ఉండాలి. మంచి యశోవంతుడు కావాలి" అని అడిగింది

ఆమె కోరినట్టుగా ఆమెకు వరాన్ని ప్రసాదించాడు కణ్వుడు. ఆమెకు చక్రవర్తి లక్షణాలతో భరతుడు జన్మించాడు.

భరతుడు మహాబలవంతుడు. చిన్నప్పుడే, అడవిలో ఉండే పులులను సింహాలను, ఏనుగులను పట్టి తెచ్చి చెట్లకు కట్టేసేవాడు. ఏనుగుల పైన స్వారీ చేసేవాడు. అతని చేష్టలను చూచి ఆశ్రమంలో ఉన్న మునులు అతనికి "సర్వదమనుడు" అనిపేరుపెట్టారు.

ఒక రోజు కణ్వ మహాముని శకుంతలను చూచి "అమ్మా శకుంతలా, ఆడ పిల్ల పుట్టిన ఇంట్లో ఎక్కువ రోజులు ఉండటం క్షేమం కాదు. ఉచితంకాదు. పెండ్లి అయిన ఆడపిల్ల భర్త దగ్గర ఉండటమే ధర్మం. కాబట్టి నీవు నీ భర్త అయిన దుష్యంతునివద్దకు వెళ్ళు" అని చెప్పి తన శిష్యులను తోడు ఇచ్చి శకుంతలను దుష్యంత మహారాజు వద్దకు పంపాడు. శకుంతల తన కుమారునితో, శిష్యులతో దుష్యంతుని వద్దకు వెళ్లింది.

కాని దుష్యంతుడు ఆమెను గుర్తించ లేదు. ఆశ్రమంలో తన పట్ల చూపిన వలపు, ఆదరణ, ఆసక్తి

అతనిలో కనిపించలేదు. శకుంతలకు అనుమానం కలిగింది.

"దుష్యంతుడు నిజంగా తనను గుర్తించలేదా. లేక తెలిసి తెలియనట్టు ఉన్నాడా. లేదా రాజ్య కార్యాల లోపడి తనను మరిచి పోయాడా. లేక తనను పెండ్లి చేసుకున్న నాడు చెప్పిన మాటలు మరిచి తనను వదిలి వేసాడా. ఎవరన్నా దేనినన్న మరిచి పోతే తిరిగి జ్ఞాపకం చెయ్యవచ్చును. అసలు తెలియనపుడు, తెలియ చెప్ప వచ్చును. కాని ఇలాగా తెలిసి కూడా తెలియనట్టు నటించే వారికి చెప్పడం బ్రహ్మ తరం కాదు. అయినా ఇంత దూరం వచ్చి, తిరిగి ఆశ్రమానికి తిరిగి వెళ్లి పోవడం మంచిది కాదు. ఆ రోజు జరిగినది అంతా చెప్పి, ఈ కుమారుని చూపిస్తాను" అని మనసులో నిశ్చయించుకుంది శకుంతల.

"ఓ రాజా, ఆ రోజు నువ్వు వేటకు అడవికి వచ్చావు. నా తండ్రి కణ్వ మహామునిని దర్శించు కోడానికి మా ఆశ్రమానికి వచ్చావు. నన్ను చూచావు. మోహించావు. నన్ను గాంధర్వ విధిని వివాహమాడావు. నాకు పుట్టబోయే కుమారుని రాజును చేస్తాను అన్నావు.

ఇడు గోనీకు మారుడు" అని తన కుమారుడు భరతుని చూపించింది.

ఇది అంతా చూచాడు దుష్యంతుడు. అతనికి అంతా తెలుసు. కాని ఏమీ తెలియని వాని వలె "నీవు ఎవ్వరవో నాకు తెలియదు.నేను నిన్ను ఎప్పుడూచూడలేదు. నీవు ఎక్కడ నుండి వచ్చావో అక్కడకు పో" అని అన్నాడు.

శకుంతలకు దుఖం పొర్లుకు వచ్చింది.

"మహా రాజా, అన్నీయు తెలిసీ, ఏమీ తెలియని వాని వలే ఎందుకు మాట్లాడతావు. ఆ రోజు జరిగిన మన వివాహానికి సాక్షులు ఎవ్వరూ లేరని ఇలా అబద్ధాలు ఆడ వచ్చునా! ఇది మీకు తగునా! కాని మనలను, సూర్య చంద్రులు, పంచభూతాలు, మన హృదయం, యముడు, రాత్రి పగలు ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాయి.

కట్టుకున్న భార్యను తిరస్కరించే వాడికి ఇహ లోక సుఖం గాని,పరలోక సుఖం గాని దక్కవు. పుత్ర సంతానాన్ని పొందాలంటే భార్య కావాలి. ధర్మము, అర్థము, కామము, మోక్షము అనే పురుషార్థాలను

సాధించడానికి, వంశాన్నినిలపడానికీ, ఉత్తమ గతులు పొందడానికి, హృదయానికి ఆనందం కలిగించడానికి భర్తకు భార్య అవసరం. భార్యా బిడ్డలను ఆదరంతో చూచేవాడికి ఎలాంటి కష్టాలు రావు.

అదియును కాక భార్య భర్తలో అర్ధ భాగము. అందుకని భర్తకంటె భార్య ముందు చనిపోయిన, స్వర్గంలో భర్తకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. కాని భర్త ముందు చనిపోతే, భార్య కూడా అతనితో సహగమనం చేస్తుంది. అలాంటి భార్యను అవమానించడం ధర్మం కాదు.

పురుషుడు తన భార్య శరీరంలో ప్రవేశించి, తిరిగి ఆమెకు పుత్రుడుగా జన్మిస్తాడు. కాబట్టి కొడుకులో భర్తను చూచుకుంటుంది స్త్రీ. తండ్రి కూడా, తన రూపానికి ప్రతి రూపమైన కొడుకును చూచి ఆనందిస్తాడు.

పైగా పున్నామ నరకం నుండి ఉద్ధరించే వాడు పుత్రుడు. ఒక దీపం నుండి మరొక దీపం వెలిగినట్లు, నీ శరీరం నుండి ఈ పుత్రుడు పుట్టాడు.

కాబట్టినీ పుత్రుని కౌగలించుకొని, ఆనందించు.

నీ కొడుకు నీ వంశ కర్త అవుతాడని సరస్వతి చెప్పింది. మన వివాహం జరిగిన రోజు తమరు నాకు ఇచ్చిన మాట ను మరవడం తగునా. మనకు పుట్టిన ఈ కుమారుని నిరాకరించడం తగునా.

ఈ లోకంలో సత్యం పలకడంకన్నా మంచి పని మరొకటిలేదు. వెయ్యి అశ్వమేధ యాగాలు చేసిన ఫలం, ఒక సత్య వాక్యంతో సమానము. ఎన్ని తీర్థాలు సేవించినా, వేదాలు అన్ని చదివినా, అవి సత్యం చెప్పడంతో సాటి రావు. నేను అప్సరస అయిన మేనకకు, రాజర్షి అయిన విశ్వామిత్రునికి పుట్టిన దానను.ధర్మం తప్పి నేను అసత్యం పలుకను. కాబట్టి, తమరు నాకు కణ్వాశ్రమములో చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకొని, నన్ను, మన కుమారుని స్వీకరింపుడు." అని పలికింది శకుంతల.

కాని దుష్యంతుడు అంగీకరింపలేదు.

"నేను మహారాజును. నువ్వు సామాన్య ఋషి

కన్యవు. నేను నిన్ను ఎప్పుడూ చూడలేదు. ఆడు వారు అబద్ధాలు ఆడుదురు అనే మాట సార్ధకం చేస్తున్నావు. ఎత్తుగా,బలంగా కనపడుతున్న ఇతడిని నా కొడుకు అని చెపుతున్నావా. ఇలాంటి అబద్ధాలను నేను అంగీకరించను. నీవునీ ఆశ్రమానికి తిరిగి పొమ్ము" అని తిరస్కరించాడు దుష్యంతుడు.

"మహారాజా, నాకు ఈ తిరస్కారాలు కొత్త కాదు. పుట్టిన నాడే తల్లి తండ్రులచేత విడువబడ్డాను. ఇప్పుడు భర్త చేత విడువబడ్డాను. నేను నోచిన నోములు అంతే అని సరిపెట్టుకుంటాను. ఇంత కన్నా ఏమీ కాదు కదా. ఇంక నాకు ఆ భగవంతుడే దిక్కు" అంటూ కొడుకును తీసుకొని వెనక్కు తిరిగి వెళ్ళబోయింది.

అప్పుడు ఆకాశం నుండి ఒక వాక్కు వినిపించింది.

"ఓ దుష్యంత మహారాజా!. శకుంతల నిజమే చెప్పింది. ఈ శకుంతల నీ భార్య. ఈ భరతుడు నీకు శకుంతలకు పుట్టిన వాడు. వీరిని స్వీకరించుము."

ఇది విని దుష్యంతుడు లేచి సభ లో ఉన్న వారితో ఇలా అన్నాడు.

"సభా సదులారా. ఆ రోజు నేను ఈ శకుంతలను గాంధర్వ విధిని వివాహం మాడిన నాడు, నాకు ఈమెకు తప్ప వేరే ఎవరికి తెలియదు. లోక నిందకు వెరిచి ఇప్పటిదాకా ఈమె నాకు తెలియదు అని అన్నాను. కాని ఇప్పుడు ఆకాశవాణి అందరకూ నిజం తెలియచేసింది. నేను నా భార్యా పుత్రులను స్వీకరిస్తున్నాను" అని పలికి, శకుంతలను, భరతుని సాదరంగా స్వీకరించాడు. భరతుని యువ రాజుగా చేసాడు.

కొంత కాలం రాజ్య సుఖాలు అనుభవించి, కుమారుడైన భరతునికి రాజ్యం అప్పగించింది, భార్యతో తపోవనానికి వెళ్లాడు. భరతుడు ఈ సువిశాల సామ్రాజ్యాన్ని, జనరంజకంగా పాలించాడు. భరత వంశానికి వంశ కర్త అయ్యాడు.

అటువంటి భరతునికి భుమన్యుడు జన్మించాడు. భుమన్యుడి కొడుకు సుహోత్రుడు. సుహోత్రుడి కొడుకు హస్తి. అతని పేరు మీదనే హస్తినా పురం వెలసింది. అదే

కౌరవుల రాజధాని అయింది. (నేటికీ మనకు రాజ ధాని హస్తినాపురం (Delhi)).

హస్తి కొడుకు వికుంఠనుడు. వికుంఠనుడి కొడుకు అజమీఢుడు. అజమీఢుడికి 124 మంది కుమారులు. అందులో సంవరణుడు అనే వాడు సూర్యుడికుమార్తె అయిన తపతిని వివాహం చేసుకున్నాడు. వారికి మరొక వంశ కర్త అయిన కురు జన్మించాడు. అతనిపేరు మీదనే కురు వంశం మొదలైంది. భారత యుద్ధం జరిగిన ప్రదేశం కూడా అతనిపేరు మీదనే కురుక్షేత్రం అని పిలువబడింది.

కురునకు విదూరథుడు పుట్టాడు. విదూరథుని కొడుకు అనశ్వుడు. అనశ్వుని కొడుకు పరీక్షిత్. పరీక్షిత్ కొడుకు భీమసేనుడు. భీమసేనుడి కొడుకు ప్రదీపుడు. ప్రదీపుని కొడుకు ప్రతీపుడు. ప్రతీపుని కుమారుడు శంతనుడు. శంతనుడికి గంగాదేవికి దేవవ్రతుడైన భీష్ముడు పుట్టాడు. శంతనునికి యోజన గంధి అయిన సత్యవతికి చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు అనే ఇద్దరు కొడుకులు పుట్టారు.

అప్పుడు జనమేజయుడు వైశంపాయనుని చూచి, "వైశంపాయన మహర్షీ, శంతన మహారాజుకూ, గంగా దేవికీ ఎలా కలిసింది. వారికి భీష్ముడు ఎలాపుట్టాడు. వివరించండి" అని అడిగాడు.

వైశంపాయనుడు ఇలాచెప్ప సాగాడు.

పూర్వము ఇక్ష్వాకు వంశంలో మహాభిషుడు అనే వాడు వెయ్యి అశ్వమేధ యాగాలు, నూరు రాజసూయ యాగాలు చేసి, బ్రహ్మలోకానికి వెళ్లి అక్కడ దేవతల తోనూ, మహాఋషులతోనూ, బ్రహ్మదేవుని సేవిస్తూ ఉన్నాడు.

ఒక రోజు గంగాదేవి బ్రహ్మ సభకు వచ్చింది. అప్పుడు గాలి బలంగా వీచింది. గంగా దేవి కట్టుకున్న చీర కొంచెం పైకిలేచి గంగా దేవి తొడలు కనపడ్డాయి. దేవతలందరూ తలలుపక్కకు తిప్పుకున్నారు. కాని మహాభిషుడు ఆసక్తిగా చూస్తున్నాడు.

బ్రహ్మదేవుడు ఇది చూచాడు. కోపం వచ్చింది. " మహాభిషా, నువ్వు భూలోకమున మానవ వనితకు

జన్మించుము" అని శాపం పెట్టాడు.

తన తప్పు తెలుసుకున్నాడు మహాభిషుడు. "బ్రహ్మదేవా, భూలోకంలో ప్రతీపుడు అనే పుణ్యాత్ముడు ఉన్నాడు. కాబట్టి అతనికి కొడుకుగా జన్మిస్తాను" అని కోరుకున్నాడు. బ్రహ్మదేవుడు సరే అన్నాడు.

ఇది ఇలా ఉండగా, గాలికి చీర తొలగినపుడు , తన తొడలను చూచిన మహాభిషుని చూచి గంగాదేవి మోహించింది. అతనినే తలుచుకుంటూ భూలోకానికి వస్తుంటే, ఎనిమిది మంది వసువులు ఆమెకు ఎదురుపడ్డారు. దీనంగా ఉన్నా వారిని చూచి కారణం ఏమిటి అని ప్రశ్నించింది గంగాదేవి.

అప్పుడు ఎనిమిది మంది వసువులూ గంగను చూచి "అమ్మా గంగాదేవీ. మాకు వసిష్ఠ మహాముని భూలోకంలో పుట్టమని శాపం ఇచ్చాడు. అందుకని, ఒక పుణ్యవతి గర్భంలో జన్మించవలెనని పోతున్నాము. నువ్వు ఎదురుపడ్డావు. మేము నీకు పుత్రులుగా జన్మిస్తాము. మహాభిషుడు మానవ లోకంలో ప్రతీపునకు శంతనుడై జన్మిస్తాడు. నీకూ అతనికి సంగమము

అవుతుంది. నీకూ, శంతనునికి మేము జన్మిస్తాము" అని అడిగారు.

గంగా దేవి కూడా సంతోషించింది. నా కోరికా అదే. కాబట్టి మీరు నిశ్చింతగ ఉండండి అని చెప్పింది.

"అమ్మా మాది ఒక కోరిక. మేము పుట్టిన వెంటనే గంగలో పడవేస్తూ మాకు భూలోకం నుండి ముక్తిని ప్రసాదించు. మాకు వశిష్ట మహర్షి కూడా అలాగే అనుమతి ఇచ్చాడు " అని చెప్పారు.

గంగా దేవి ఆలోచనలోపడింది. "మీరు చెప్పింది బాగానే ఉంది. కాని నాకు దీర్ఘాయుష్మంతుడైన ఒక్క కొడుకు కావాలి. అది ఎలాగా? అని అడిగింది.

"అమ్మా గంగాదేవి, మాలో ఎనిమిద వ వాడు ప్రభాసుడు. అతడు మా అందరి అంశలతో, దీర్ఘాయువుగా నీ కన్న కొడుకై మానవ లోకంలో ఉంటాడు" అని చెప్పారు.
గంగా దేవి, అష్ట వసువులు అలా ఒప్పందం చేసుకొని వెళ్లిపోయారు.

మానవ లోకంలో ప్రతీపుడు అనే మహా రాజు రాజ్య భోగాలను అనుభవించి, గంగా నదీతీరంలో తపస్సు చేసుకుంటున్నాడు. ఒక రోజు గంగా దేవి ప్రతీపునకు ప్రత్యక్ష్యం అయింది. ఒక దివ్య కాంత రూపంలో అతని కుడి తొడ మీద కూర్చుంది.

ప్రతీపుడు ఆమెను చూచి ఆశ్చర్య పోయాడు. "నీవు ఎవ్వరు? నా తొడ మీద ఎందుకు కూర్చున్నావు?" అని అడిగాడు.

"ప్రతీప మహారాజా, నేను జహ్ను మహర్షి పుత్రికను. జాహ్నవిని. నీకు భార్యను అవుదామని వచ్చాను. నన్ను స్వీకరించు" అని అడిగింది.

"ఓ జాహ్నవీ, నాకు ఇప్పటికే పెళ్లి అయింది. నేను నా భార్యను తప్ప మరొక స్త్రీని మనసులో తలపను. అయినా, నీ వంటి స్త్రీ ఇలా అడగడం న్యాయమా. పైగా, ఆడు వారు భర్త ఎడమ తొడ మీద కూర్చుంటారు. పుత్రులు తండ్రి కుడి తొడ పై కూర్చుంటారు. నువ్వు నా కుడి తొడపై కూర్చున్నావు. కాబట్టి నా కొడుకును వరించి పెళ్లి చేసుకొనుము?" అని చెప్పాడు ప్రతీపుడు.

గంగాదేవి అక్కడ నుండి వెళ్లి పోయింది.

ప్రతీపునకు, అతని భార్య అయిన సునందకు, మహాభిషుడు, బ్రహ్మ వాక్కు ప్రకారం, శంతనుడు అనే పేరుతో జన్మించాడు. ప్రతీపుడు శంతనుడికి రాజ్యాన్ని అప్పగించాడు.

"కుమారా, ఒక రోజు, గంగానదీ తీరాన ఒక కన్యను చూచాను. "నువ్వు నా కొడుకుకు భార్యవు కమ్ము" అని అడిగాను. ఆమె దానికి అంగీకరించింది. నీవు ఆమెను వివాహము చేసుకొనుము. ఆమెను గురించి వివరాలు ఏమీ అడగకుండా ఆమె కోర్కె తీర్చు" అని చెప్పాడు. శంతనుడు సరే అన్నాడు.

తరువాత ప్రతీపుడు తపోవనానికి వెళ్లి పోయాడు. శంతనుడు రాజ్యం చేస్తున్నాడు. ఒక రోజు శంతనుడు వేటకు వెళ్లాడు. గంగా నదీ తీరంలో, ఒక అందమైన కన్య (గంగ)ను చూచాడు. ఆమె అందానికి ముగ్ధుడై ఆమెనే చూస్తున్నాడు. ఆమె కూడా శంతనుని అందానికి పరవశించి అతనినే చూస్తూ ఉంది.

శంతనుడు ఆమెను చూచి "నువ్వు ఎవ్వరు? ఒంటరిగా ఇక్కడ ఎందుకు ఉన్నావు?" అని అడిగాడు.

దానికి ఆమె "ఓ రాజా, నీకు నన్ను భార్యగా స్వీకరించాలి అనే కోరిక ఉంటే, నన్ను ఏమీ అడక్కు. నేను ఏమి చేసినా అడ్డు చెప్పకు. నా మనసు నొప్పించకు. అలాగైతే నేను నీకు భార్యనై నీ కోరికలు తీరుస్తాను" అని చెప్పింది.

తండ్రి చెప్పిన మాట గుర్తుకు వచ్చింది శంతనునికి. పైగా ఆమె మీద మనసు పడ్డాడు శంతనుడు. అందుకని ఆమె చెప్పిన వాటికి ఒప్పుకున్నాడు. గంగను వివాహం చేసుకున్నాడు.

గంగకు శంతనుడికి, వసువులు ఒకరి వెంట ఒకరు కుమారులుగా జన్మించారు. గంగ వారందరిని పుట్టిన వెంటనే గంగా నదిలో పడవేసింది. శంతనుడికి మనసులో బాధగా ఉన్నా అనుకున్న మాట ప్రకారం ఏమీ అనే వాడు కాదు. అలా ఏడుగురు వసువులూ పుట్టారు. చని పోయారు.

అష్ట మ వసువు ఐన ప్రభాసుడు జన్మించాడు. ఈ సారి శంతనుడు ఊరుకోలేదు. "ఇప్పటి దాకా పుట్టిన వారందరిని గంగలో వేసావు. నాకు ఈ కొడుకు ను వదలడం ఇష్టం లేదు. నేను ఇవ్వను" అన్నాడు.

"శంతన మహారాజా, నీవు నాకు ఇచ్చిన మాట తప్పావు. నేను వెళ్లిపోతున్నాను. నేను ఎవరో తెలుసా. నేను గంగను.. అష్ట వసువులు వశిష్ట మహాముని శాపంతో మానవ లోకంలోపుట్టారు. వారు కోరిన కోరిక ప్రకారం నా గర్భంలోజన్మించారు. పుట్టగానే వారికి విముక్తి కలిగించాను. ఈ ఎనిమిదవ కొడుకు చిర కాలం జీవిస్తాడు. కీర్తి మంతుడవుతాడు" అని చెప్పింది గంగ.

"ఓ గంగా, వసువులు దేవతలు. దోషము లేనివారు కదా. వశిష్ట మహా రుషి వారికి ఎందుకు శాపం ఇచ్చాడు. అందులో ఎనిమిదవ వాడు మాత్రం మానవ లోకంలో ఎక్కువ కాలం ఎందుకు జీవించాడు. వివరంగా చెప్పు " అని అడిగాడు. అప్పుడు గంగా ఇలాచెప్పింది.

"శంతన మహారాజా, వరుణుడి కుమారుడైన వశిష్టుడు అనే మహా ముని మేరు పర్వతపు గుహలో తపస్సు చేస్తున్నాడు. వశిష్టుని ఆశ్రమంలో నందిని అనే కామధేనువు ఉంది. అది వశిష్టునికి కావలసిన వస్తువులు అన్నింటినీ ఇస్తూ వశిష్టునికి సేవచేస్తూ ఉంది.

ఒక రోజు అష్ట వసువులు వశిష్టుని ఆశ్రమానికి వచ్చారు. కామధేనువును చూచారు. దాని మహిమకు ఆశ్చర్యపోయారు. అందులో ఎనిమిదవ వసువు భార్య తన భర్తతో ఇలా అంది.

"నందిని అనే ఈ కామధేనువు పాలు తాగి రోగం, ముసలితనము లేకుండా బతుకుతారు అంటారు కదా. మరి దీని యజమాని ఎంతటి గొప్ప వాడు అయి ఉండాలి. కాబట్టి ఈ ధేనువును నా ప్రాణ స్నేహితురాలు జితవతికి కానుకగా ఇవ్వాలాని కోరికగా ఉంది." అని అడిగింది.

మిగిలిన వసువులు కూడా ఆమెకు వంత పాడారు. ఎనిమిదవ వసువు, ప్రభాసుడు, నందిని అనే ఆ హోమ ధేనువును పట్టుకొని తీసుకొని వెళ్లాడు. వశిష్ట మహా

ముని తన యోగ దృష్టి తో ఇదంతా చూచాడు. ఆయనకు కోపం వచ్చింది. " మీరందరూ మానవులై పుట్టండి" అని శాపం ఇచ్చాడు వసువులందరూ వసిష్టుని కాళ్ల మీద పడ్డారు. భూలోకంలో ఎక్కువ కాలం ఉండకుండా అనుగ్రహించమని వేడుకున్నారు.

"అలాగే జరుగుతుంది. కాని అసలు నేరం చేసిన వాడు ఈ ఎని మిదవ వసువు అయిన ప్రభాసుడు. వాడు మాత్రం చిర కాలం మానవ లోకంలో ఉంటాడు. సంతాన హీనుడిగా బతుకుతాడు." అని అన్నాడు వసిష్టుడు. తరువాత జరిగిందంతా మీకు తెలిసిందే" అని చెప్పింది గంగాదేవి.

అష్టమ వసువు అయిన ప్రభాసునికి, దేవవ్రతుడు అని నామకరణం చేసింది. "శంతన మహారాజా, దేవ వ్రతుడుపెద్ద వాడు అయ్యేవరకు నా దగ్గరేపెరుగుతాడు" అని చెప్పి, అతనిని తీసుకొని వెళ్లి పోయింది.

ఇదంతా విని శంతనుడు ఆశ్చర్య పోయాడు. జరిగిందానికి విచారిస్తూ హస్తినాపురానికి వచ్చాడు.

కొంత కాలం తరువాత, ఒక రోజు శంతనుడు వేట నిమిత్తము గంగానదీ తీరానికి వెళ్లాడు. ఒక చోట గంగా నది ప్రవాహం ఆగి పోయినట్టు అయింది. శంతనుడు ఇది చూచి ఆశ్చర్య పోయాడు. దీనికి కారణం ఏమిటా అని ఆలోచిస్తూ గంగా నది వెంట నడుస్తున్నాడు. అక్కడ ఒక చోట ఒక బాలుడు గంగా నదికి అడ్డంగా తన బాణాలతో అడ్డు కట్ట కట్టాడు. అతనే గంగా శంతనుల కుమారుడు దేవవ్రతుడు. కాని శంతనుడు ఆ కుమారుని గుర్తించలేదు.

ఇంతలో గంగా దేవి అక్కడకు వచ్చింది. "ప్రభూ ఈ బాలుడు మీ కుమారుడు. వసిష్టుని వద్ద వేదాలు నేర్చుకున్నాడు. శుక్రుడు, బృహస్పతి వద్ద ధర్మ శాస్త్రాలు నేర్చుకున్నాడు. పరశురాముని తో సమానంగా ధనుర్విద్యను నేర్చుకున్నాడు. ఇంక నీకుమారుని స్వీకరించుము" అని కుమారుని శంతనునికి అప్పచెప్పి గంగ వెళ్లి పోయింది. వీరుడు, ధీరుడు, గుణవంతుడు, సకలవిద్యాపారంగతుడు అయిన కొడుకును చూచి శంతనుడు ఉప్పొంగి పోయాడు. కొడుకుతో సహా హస్తినాపురానికి వచ్చాడు. దేవవ్రతునికి యౌవ్వరాజ్య పట్టాభిషేకం చేసాడు.

ఒక రోజు శంతనుడు యమునా నదీ తీరంలో విహరిస్తున్నాడు. దూరం నుండి మంచి పరిమళం వేస్తూ ఉంది. ఆ పరిమళం వస్తున్న వైపుకు వెళ్లగా, అక్కడ ఒక అందమైన కన్యను చూచాడు శంతనుడు. ఆమె యోజన గంధి (సత్యవతి). ఆమె ఒంటి మీదినుండి వచ్చే పరిమళాన్ని, ఆమె సౌందర్యాన్ని చూచి పరవశించి పోయాడు శంతనుడు..

"ఓ సుందరీ, నీవు ఎవరు? ఒంటరిగా ఇక్కడ ఎందుకు పడవ నడుపుతున్నావు?" అని అడిగాడు.

"ఓ రాజా, నేను దాశ రాజు కూతురిని. తండ్రి గారి ఆజ్ఞ మేరకు పడవ నడుపుతున్నాను" అని బదులు చెప్పింది సత్యవతి.

శంతనునికి ఆమెను వివాహం చేసుకొన వలెనని కోరిక కలిగింది. వెంటనే శంతనుడు దాశరాజు దగ్గరకు వెళ్లి, తన కోరిక వెల్లడించాడు.

"మహారాజా, ఆడ పిల్ల పుట్టిన వెంటనే ఒక

వరుని చేతిలోపెట్టడం సంప్రదాయం.. నా కుమార్తెను నీ వంటి వరునికి ఇవ్వడానికి అభ్యంతరం ఏముంది. కాని, నాది ఒక కోరిక ఉన్నది" అని అన్నాడు దాశ రాజు.

" అదేమిటో చెప్పు" అని అడిగాడు శంతనుడు .

"నా కుమార్తెకు పుట్ట బోయే సంతానానికి రాజ్యాధికారం దక్కాలి" అని కోరాడు దాశరాజు.

దానికి శంతనుడు ఒప్పుకోలేదు. గాంగేయుడికి తప్ప వేరే వారికి రాజ్యం ఇవ్వడం ఇష్టం లేదు.

"వేరే ఏదైనా కోరుకో" అన్నాడు శంతనుడు.

"నాకు మరే మీ ఇష్టంలేదు" అన్నాడు దాశరాజు.

విచారంతో శంతనుడు హస్తినాపురానికి తిరిగి వచ్చాడు. అప్పటినుండి శంతనుడు రాచ కార్యాలు సరిగా చూడ్డంలేదు ఎప్పుడూ ఏదో విచారంగా ఉంటు న్నాడు. గాంగేయుడు ఇది చూచాడు.

"తండ్రీ. మీ మనోవేదనకు కారణమేమి?" అని అడిగాడు.

"గాంగేయా, ఒకే పుత్రుడు కలవాడు, అసలు సంతానం లేని వాడు సమానమే అని ధర్మ శాస్త్రాలు చెపుతున్నాయి. నీకు తోడుగా మరి కొంత మంది కొడుకులను కనాలని నాకు కోరికగా ఉంది. పైగా, నువ్వు అస్త్ర శస్త్ర విద్యలో ఆరితేరిన వాడవు.శత్రువుల పట్ల క్రూరుడవు. అత్యంత సాహసికుడవు. కాబట్టి, నీకు ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంది. నువ్వు ఎన్నాళ్ల బతుకు తావోతెలియదు. కాబట్టి, ఇంకా కొంత మంది పుత్రులు ఉంటే బాగుంటుంది" అని అన్నాడు. శంతనుడు.

తండ్రికి మరల వివాహం చేసుకొన వలెనని కోరికగా ఉంది అని గాంగేయునకు అర్ధం అయింది. మంత్రులతో ఆలోచించి అసలు విషయం తెలుసుకున్నాడు. దాశరాజు దగ్గరకు వెళ్లాడు.

"దాశ రాజా, నీ కుమార్తె యోజన గంధిని నా తండ్రి శంతనునికి ఇచ్చి వివాహము చేయుము" అని

అడిగాడు.

"చాలా సంతోషం. నీవు నీ తండ్రి కొరకు కన్యను అడగడానికి వచ్చిన ధర్మాత్ముడివి. ఈ కన్య సామాన్యురాలు కాదు. ఉపరిచర వసువు వీర్యానికి జన్మించినది. ఆ ఉపరిచర వసువు ఈ కన్యను శంతన మహారాజుకే ఇమ్మని చెప్పాడు. అందుకే ఇది వరకు దేవలుడు అడిగినా ఇవ్వలేదు. కాని నాది ఒక కోరిక. నా కూతురికి పుట్టే పుత్రులు సవతి కుమారులు అవుతారు. కాబట్టి ఆ దోషం లేకుండా చెయ్యి" అని చెప్పాడు దాశరాజు.

గాంగేయునికి దాశరాజు అంతర్యం అర్థం అయింది. వెంటనే అక్కడ ఉన్న వారినందరిని పిలిచి "ఇక్కడ చేరిన రాజులు అమాత్యులు, ప్రజలు అందరూ వినండి. నా తండ్రికి కాబోయే భార్య అయిన ఈ యోజన గంధికి పుట్టబోయే పుత్రులే ఈ రాజ్యానికి వారసులు అవుతారు. అతనే మన అందరికి ప్రభువు" అని చెప్పాడు.

కాని దాశరాజుకు ఒక సందేహం కలిగింది.

"గాంగేయా, నీవు రాజ్యాధికారాన్ని వదులుకున్నావు. కాని నీకు పుట్టబోయే పుత్రులు ఊరుకోరు కదా. వారు నీ మాటను అంగీకరిస్తారా?" అని అడిగాడు.

"దాశరాజా నాకు పుత్రులుకలిగితేనే కదా ఆ సమస్య వచ్చేది. అందుకే, నేను, ఈ రోజు నుండి బ్రహ్మచర్య వ్రతాన్ని స్వీకరించాను. ఆజన్మాంతం బ్రహ్మచారిగనే ఉంటాను. నీ కూతురిని నా తండ్రికి ఇచ్చి వివాహం చెయ్యడానికి అభ్యంతరంలేదుగా" అని అన్నాడు గాంగేయుడు.

గాంగేయుడు చేసిన ఈ భీషణమైన ప్రతిజ్ఞ "భీష్మ ప్రతిజ్ఞ" గా చరిత్రలోనిలిచిపోయింది. దేవతలు పూల వాన కురిపించారు. ఆ రోజునుండి గాంగేయుడు "భీష్ముడు" గా ప్రసిద్ధి చెందాడు.

దాశరాజు వెంటనే తన కూతురు యోజన గంధి (సత్యవతి) ని శంతనునికి ఇచ్చి వివాహం జరిపించాడు. తన కుమారుడైన గాంగేయుడు, తన కోర్కె తీర్చడం కోసం చేసిన త్యాగాన్ని శంతనుడు ఎంతగానో

ప్రశంసించాడు.

"కుమారా, నీకు ఒక వరం ప్రసాదిస్తున్నాను. నీకు స్వచ్ఛంద మరణం ప్రసాదిస్తున్నాను. నువ్వు నీ ఇష్టం వచ్చినపుడు మరణించ వచ్చు" అని వరం ఇచ్చాడు.

శంతనుడికి సత్యవతి ద్వారా ఇద్దరు కొడుకులు పుట్టారు. వారు చిత్రాంగదుడు విచిత్ర వీర్యుడు. వారు చిన్న వయసులో ఉండగానే శంతనుడు చనిపోయాడు. భీష్ముడు వారిని పెంచి పెద్ద చేసాడు. చిత్రాంగదుడిని చక్రవర్తిని చేసాడు.

చిత్రాంగదుడు అహంకారి. ఒక సారి చిత్రాంగదుడు ఒక గంధర్వ రాజుతో యుద్ధానికి తలపడ్డాడు. ఆ యుద్ధంలో చిత్రాంగదుడు చనిపోయాడు. తరువాత విచిత్ర వీర్యుని చక్రవర్తిని చేసాడు భీష్ముడు.

కాశీరాజు తన కుమార్తెలకు స్వయంవరం ప్రకటించాడు. భీష్ముడు తాను ఒక్కడె ఒంటరిగా కాశీ రాజ్యానికి వెళ్లాడు. కాశీరాజు కూతుళ్లను

బలవంతంగా తన రథం మీద ఎక్కించుకొన్నాడు.

"కాశీరాజా, స్వయంవరానికి వచ్చిన రాజులారా, నేను ఈ కన్యలను నా తమ్ముడు విచిత్రవీర్యునికి ఇచ్చి వివాహం చెయ్యడానికి తీసుకు వెళుతున్నాను. మీకు చేతనైతె నన్ను అడ్డగించండి. ఎనిమిది రకాల వివాహ విధులలో, క్షత్రియులకు గాంధర్వము, రాక్షసము తగినవి. పైగా మీ అందరిని జయించి, తీసుకుపోవడం పరమ ధర్మము" అని గర్వంగా పలికాడు.

అక్కడ ఉన్న రాజులు అందరూ భీష్ముని ఎదిరించారు. కాని భీష్ముడు అందరిని జయించాడు. కాని సాల్వుడు అనే రాజు మాత్రం, పట్టు విడవకుండా భీష్ముని వెంబడించాడు. భీష్మునికి సాల్వునికి ఘోర యుద్ధం జరిగింది. అందులో సాల్వుడు ఓడిపోయాడు. వెనక్కు తిరిగాడు. భీష్ముడు హస్తినాపురానికి వెళ్లాడు.

కాశీరాజు పుత్రికలు అంబ, అంబిక, అంబాలిక అను కన్యలను

విచిత్ర వీర్యునకు ఇచ్చి వివాహం చెయ్యడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. అందులో పెద్ద కూతురు అంబ,భీష్ముని తో ఇలా చెప్పింది:

"సాల్వుడికి నన్ను ఇచ్చి వివాహం చెయ్యడానికి నా తండ్రి నిశ్చయించాడు. నాకు కూడా సాల్వుడు అంటే ఇష్టమే. కాని మీరు నన్ను బలవంతంగా తీసుకు వచ్చారు. ధర్మం మీరే నిర్ణయించండి" అని పలికింది.

వెంటనే భీష్ముడు అంబను కొందరు బ్రాహ్మణులను తోడు ఇచ్చి, సాల్వుని వద్దకు పంపాడు. అంబిక, అంబాలికలను విచిత్ర వీర్యునికి ఇచ్చి వివాహం చేసాడు.

విచిత్రవీర్యుడు అందమైన తన భార్యలతో కామ భోగాలతో తేలియాడుతున్నాడు. రాచ కార్యాలు మర్చిపోయాడు. పిచ్చలపిడిగా కామభోగాలు అనుభవించి అనుభవించి కడకు చనిపోయాడు. ఇప్పుడు రాజ్యం రాజు లేని రాజ్యం అయింది.

ఒక రోజు సత్యవతి భీష్ముని చూచి

"కుమారా, ప్రస్తుతం ఈ భరత సామ్రాజ్యానికి వారసులులేరు. నువ్వు ఒక్కడివే రాజ్యానికి అర్హుడివి. కాబట్టి నువ్వే ఈ రాజ్యానికి చక్రవర్తివి. వహుగా పెళ్లి చేసుకొని, సంతానాన్ని కని ఈవంశాన్ని ఉద్ధరించు" అని చెప్పింది.

"అమ్మా నేను ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటానని ప్రతిజ్ఞ చేసాను. రాజ్యాధికారం ముట్టనని శపథం చేసాను. ఇప్పుడు మీరు ఇలాపలకడం తగునా. నేను మాత్రం నా బ్రహ్మచర్యవ్రతాన్ని విడువను. శంతనుని వంశము వృద్ధి చెందేట్టు నాకు తెలిసిన క్షత్రియ ధర్మాన్ని చెపుతాను వినండి. దీనిని బ్రాహ్మణులతోనూ, ధర్మ విదులతోనూ ఆలోచించి నిర్ణయం చెయ్యండి.

పూర్వము, పరశురాముడు క్షత్రియ లోకాన్ని సమూలంగా నాశనం చేసినపుడు, వారిభార్యలు, ఉత్తమమైన బ్రాహ్మణుల వలన సంతానాన్నికని, క్షత్రియ వంశాలను నిలిపారు.

అదియును కాక, ఉతథ్యుడు, బృహస్పతి

అన్నదమ్ములు. ఉతథ్యుని భార్య మమత. ఆమె గర్భవతి. ఒక రోజు బృహస్పతి సోదరుడైన ఉతథ్యుని ఇంటికి వచ్చాడు. మమతను చూచాడు. దేవర న్యాయాన్ని అనుసరించి మమత తో పొందు కోరాడు. అప్పటికె మమత గర్భంలో ఉన్న బాలుడు దీనిని వ్యతికేరించాడు. ఇదిధర్మ వ్యతిరేకమని పెద్దగా అరిచాడు. బృహస్పతికి కోపం వచ్చింది. ఆ బాలుడని పుట్టు గుడ్డిగా శపించాడు.

ఆ బాలుడే దీర్ఘతముడు. దీర్ఘతముడు గుడ్డి వాడైనా వేద వేదాంగాలు అభ్యసించాడు. ప్రద్వేషిణి అనే కన్యను వివాహ మాడాడు. అతనికి చాలా మంది పుత్రులు కలిగారు. కాని ప్రద్వేషిణికి మాత్రం భర్త మీద ప్రేమ లేదు. అదే విషయం ధీర్గతముడు అడిగాడు.

"భరించే వాడు భర్త. భరింపదగినది భార్య. కాని ఇన్నాళ్ల నేను నిన్ను భరిస్తున్నాను. ఇంకా ఎంత కాలం భరించాలి. నా చేత కాదు.నువ్వు వేరే చోటికి వెళ్లు" అని పలికింది ప్రద్వేషిణి.

దీర్ఘత మునికి కోపం వచ్చింది. దీర్ఘత ముడు ఆడ వాళ్లకు ఒక శాపమిచ్చాడు. "భర్త లేని భార్యలు, ఎంతటి వారైనా, అలంకారాలు లేకుండా, తాళి లేకుండా, దయనీయమైన బతుకు బతుకుదురు కాక" అని శాపం ఇచ్చాడు.

ప్రద్వేషిణి కి కూడా కోపం వచ్చింది. తన కొడుకులను పిలిచి "ఈ ముదుసలిని ఎక్కడికైనా తీసుకుపోయి పడిచిపెట్టండి" అని కోరింది.

తల్లి మాట మీద కొడుకులు, ధీర్ఘత ముని తాళ్లతో కట్టి ఒక నదిలో పడవేసారు. దీర్ఘత ముడు వేదాలు వల్లె వేస్తూ నదిలో కొట్టుకుపోతున్నాడు. బలి అనే రాజు ధీర్ఘత ముని చూచాడు. అతని పాండిత్యానికి సంతోషించాడు. కట్లు విప్పి తనతో తన ఇంటికి తీసుకొనిపెళ్లాడు.

"మహాత్మా, తమరు ఎవరో నాకు తెలియదు. కాని మీరు ఉత్తమమైనబ్రాహ్మణులు. నాకు సంతానం లేదు. దయచేసి నాకు సంతానం ప్రసాదించండి" అని కోరాడు. తన భార్య అయిన సుధేష్ణ ను దీర్ఘత ముని వద్దకు

వెళ్ల మన్నాడు.

సుధేష్ణకు దీర్ఘత ముని చూస్తే రోత కలిగింది. అందుకని తన మాదిరే ఉన్న తన దాసీ ని అలంక రించి దీర్ఘత ముని వద్దకు పంపింది. దీర్ఘత ముని వలన ఆ దాసీ దానికి పదకొండు మంది కొడుకులు పుట్టారు.

బలి వారిని చూచి "మహాత్మా, వీరు నా కొడుకులేనా?" అని అడిగాడు.

"కాదు మహారాజా. వీరు నీ వంశంలో పుట్టిన వారు కాదు. దాసీ పుత్రులు" అని చెప్పాడు.

బలి మరల తన భార్య సుధేష్ణను దీర్ఘత ముని వద్దకు పంపాడు. చేసేది లేక వెళ్లింది. వారికి అంగరాజు అనే కొడుకు పుట్టాడు.

కాబట్టి, విధిలేని పరిస్తితుల్లో ఉత్తమ బ్రాహ్మణుల వలన సంతానం పొందటం అనాదిగా వస్తున్న ఆచారం. ఇది ధర్మ విరుద్ధ ము కాదు. అందుకని మన ము ఇప్పుడు

ఒక ఉత్తమమైన బ్రాహ్మణుని తీసుకు రావాలి. అతను ఈ కురు వంశాన్ని ఉద్ధరిస్తాడు" అని పలికాడు భీష్ముడు.

ఇది అంతా విన్న సత్యవతి కి ఒక ఆలోచన వచ్చింది. తను కన్యగా ఉండగా పరాశరుని వలన పుట్టిన వ్యాసుడు గుర్తుకు వచ్చాడు. వెంటనే ఈ విషయం భీష్మునికి చెప్పింది.

"కుమారా, వ్యాసుడు సమస్త ధర్మాలు తెలిసిన వాడు. గొప్ప తపస్వి. ఆయన వలన నీ తమ్ముడి భార్యలకు సంతానం కలుగుతుంది" అని చెప్పింది. వెంటనే మనసారా తన కుమారుడైన వ్యాసుని ప్రార్థించింది. వ్యాసుడు తల్లి ముందు ప్రత్యక్ష్యం అయ్యాడు. చాలా రోజుల తర్వాత వచ్చిన కొడుకును చూచి ఆనందించింది సత్యవతి. వ్యాసుడు తల్లికి నమస్కరించాడు. భీష్ముడు వ్యాసుని సత్కరించాడు.

సత్యవతి కుమారుని చూచి "కుమారా, ఈ రాజ్యానికంతా వారసుడైన ఈ భీష్ముడు తన భీషణ ప్రతిజ్ఞతో, వివాహానికి, రాజ్యాధికారానికి దూరం అయ్యాడు. నాకు వేరే కుమారులు లేకపోవడం వల్ల ఈ

వంశం ఇంతటితో ఆగిపోయే ప్రమాదం ఉంది. ధర్మ సమ్మతమైన దేవర న్యాయమున, నీ తమ్ముని భార్యలయందు సంతానము పొందుము." అని చెప్పింది సత్యవతి.

"అమ్మా నీవు ఆజ్ఞాపించినట్లే చేస్తాను" అని అన్నాడు వ్యాసుడు.

"దేవర న్యాయ మనగా, ఎవ్వరైనా ఒక మహారాజుకు సంతానము లేనపుడు గాని, సంతాన హీనుడిగా మరణించినపుడు గాని, ఆ మహారాజు భార్య, ఒక వేద విదుడు, పుణ్య చరితుడు, సద్గుణ సంపన్నుడు అయిన బ్రాహ్మణుని తో సంగమించి సంతానమును పొందుట).

సత్యవతి తన పెద్ద కోడలు అంబికను ఆ రోజు రాత్రి వ్యాసుని వద్దకు పంపింది. వ్యాసుడు వచ్చాడు. సన్నగా,నల్లగా పొడుగ్గా, జడలతో వికృతంగా ఉన్న వ్యాసుని చూచిభయంతో కళ్ళు మూసుకుంది అంబిక. వ్యాసుడు ఆమెకు పుత్ర దానం చేసాడు. అంబికకు మహా బల పరాక్రమవంతుడైన కొడుకు పుట్టాడు కాని సంగమ కాలంలో ఆమె కళ్ళు మూసుకున్నందున గుడ్డివాడుగా పుట్టాడు. అతనే ధృతరాష్ట్రుడు.

సత్యవతి తన రెండవ కోడలు అంబాలికను వ్యాసుని వద్దకు పంపింది. వ్యాసుడు రాగానే, అంబాలిక భయంతో వణికిపోయింది. తెల్లగా పాలిపోయింది. అందుకని ఆమెకు, మహా పరాక్రమవంతుడు, గుణవంతుడు, వంశకర్త అయిన కొడుకు పుట్టాడు. కాని సంగమ కాలంలో ఆమె పాలిపోయినట్టు అయినందున, ఆ కొడుకు పాండు వర్ణం అంటే తెల్లని వర్ణం తో పుట్టాడు. అతనే పాండు రాజు.

కాని అంబాలికకు గుడ్డి వాడైన కొడుకు పుట్టినందుకు దుఃఖించింది సత్యవతి . మరొక కుమారు డి నిప్రసాదించమని వ్యాసుడిని కోరింది. దానికి వ్యాసుడు సమ్మతించాడు. మరొక రూప వంతుడైన పుత్రుని ప్రసాదిస్తాను అన్నాడు.

వెంటనే సత్యవతి పెద్ద కోడలు అంబాలికను మరల వ్యాసుని వద్దకు వెళ్లమని కోరింది. కాని అంబాలికకు వ్యాసుని వద్దకు వెళ్లి సంగమించడం ఇష్టం లేదు. కాని అత్తగారి మాట కాదనలేక, తనదాసీ దానికి తన మాదిరి అలంకరణ చేసి వ్యాసుని వద్దకు పంపింది.

ఆమె దాసీ కాబట్టి ఆమె వ్యాసుని చూచి భయపడలేదు, అసహ్యించుకోలేదు. హాయిగా వ్యాసునితో కామక్రీడలలో తేలియాడింది. కాబట్టి ఆమెకు, మాండవ్య మహాముని శాపం కారణంగా యమధర్మ రాజు, ఆ దాసీ గర్భంలో ధర్మ పీడుడు, సర్వ లక్షణ సంపన్నుడైన విదురుడుగా జన్మించాడు.

ఇప్పుడు జనమేజయునకు ఒక సందేహం వచ్చింది.

"వైశంపాయన మునీంద్రా, యమధర్మ రాజుకు మాండవ్య మహర్షి శాపం ఎందుకు ఇచ్చాడు" అని అడిగాడు.

దానికి వైశంపాయనుడు ఇలా చెప్ప సాగాడు. మాండవ్యుడు అనే మహాఋషి ఉండేవాడు. ఆయన ఊరి వెలుపల ఒక ఆశ్రమం కట్టుకొని, ప్రశాంతంగా తపస్సు చేసుకుంటున్నాడు. ఒక రోజు కొందరు దొంగలు రాజుగారి ధనాన్ని దొంగిలించి, సైనికులు వెంటపడగా పరుగెత్తుకుంటూ అటుగా వచ్చారు. అక్కడ ఉన్న

ఆశ్రమం చూచి అందులో దాక్కున్నారు. సైనికులు వచ్చి మాండవ్యుని చూచి "అయ్యా, ఇటుగా ఎవరన్నా దొంగలు వచ్చారా" అని అడిగారు. మౌన వ్రతంలో ఉన్న మాండవ్యుడు జవాబు చెప్పలేదు.

సైనికులు ఆశ్రమంలో ప్రవేశించి, అక్కడ దాక్కున్న దొంగలను పట్టుకున్నారు. మాండవ్య మహాముని కి కూడా దొంగలతో సంబంధం ఉందని అనుమానించి దొంగలతో సహా మాండవ్య మహాముని ని పట్టి బంధించి రాజు గారి ముందు నిలబెట్టారు.

రాజు గారు ఆ దొంగలకు మరణ శిక్ష విధించారు. సహాయం చేసినట్లు అనుమానిస్తున్న మాండవ్యుని కి ఇనప శూలం మీద కూర్చోబెట్టమని శిక్ష విధించాడు. కాని మాండవ్యుడు ఆ శిక్షకు భయపడక, తపస్సు చేసుకుంటున్నాడు.

ఒక రోజు రాత్రి కొంత మంది మహారుషులు పక్షుల రూపంలో వచ్చి మాండవ్యుని చూచి "ఓ మహర్షీ, మహానుభావుడైన నీకు ఈ శిక్ష వేసిన వారు ఎవ్వరు?" అని అడిగారు.

దానికి మాండవ్యుడు నవ్వి "నా పూర్వ జన్మ పాప ఫలాన్ని అనుభవిస్తున్నాను. దీనికి ఒకరిని నిందించ పనిలేదు" అన్నాడు.

ఈ విషయం అక్కడ కాపలా ఉన్న భటులు విని రాజుకు చెప్పారు. రాజు గారు వెంటనే అక్కడకు వచ్చి, మాండవ్యుని కిందికి దించమని ఆజ్ఞాపించాడు. కాని ఆ శూలం అతని శరీరం నుండి వెలుపలికి రాలేదు. అక్కడికి దానిని నరికించాడు. శూలంలో కొంత భాగం శరీరంలో మిగిలిపోయినందున మాండవ్య మహా మునికి "అణి మాండవ్యుడు" అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు.
తరువాత ఆ మాండవ్యుడు యమ పురికి వెళ్లాడు.

"యమధర్మ రాజా, మహారాజు నాకు అంతటి శిక్ష వెయ్యడానికి నేనేమి తప్పు చేసాను?" అని అడిగాడు.

" మహా మునీ నువ్వు నీ చిన్నతనంలో తూనీగలను పట్టుకొని చిన్న చిన్న మేకులకు గుచ్చి ఆనందించావు. అందుకని ఆ ఫలం ఇప్పుడు అనుభవించావు"

అని అన్నాడు యముడు. దానికి మాండవ్యునికి కోపం వచ్చింది.

"యమ ధర్మ రాజా, పిల్లలు 14 ఏళ్ళ వచ్చేవరకు బాలురు అని పిలవబడతారు. ఆ వయసులో ఏదీ తెలిసి చెయ్యరు. కాబట్టి ఈ రోజు మొదలు 14 ఏళ్ల లోపు పిల్లలు ఏమీ చేసినా అది తప్పు కాదు. పెద్దగా పాపం కాదు. కాని 14 ఏళ్ల లోపు పిల్లలకు ఎవరన్న అపకారం చేస్తే అది పెద్ద తప్పు అవుతుంది" అని నిర్ణయం చేసాడు. (ఈ చట్టం ఈ నాటికీ "Juvenile Act" గా అమలులో ఉంది).

"కాని యమధర్మ రాజా, నేను బాల్యంలో చేసిన చిన్న పాటి తప్పుకు నాకు ఇంత పెద్ద శిక్ష విధించావు. కాబట్టి నువ్వు శూద్ర యోని యందు జన్మించు" అని శాపం పెట్టాడు. అందుకని యమధర్మ రాజు వ్యాసుడి వలన, దాసీ దాని గర్భం లో నుండి విదురుడు గా జన్మించాడు." అని వైశంపాయనుడు జనమేజయునకు వివరించాడు.

(మహాభారత ము—అదిపర్వ ము—చతుర్థాశ్వాస ము (fourth chapter) సమాప్త ము.)

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎర్రాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)

Modali Venkata Subrahmanyam, B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.

Ph:040-24048104

# మహాభారతం

## ఆది పర్వము

## పంచమాశ్వాసము.

ఉగ్ర శ్రవసుడు అనే ఆ కథకుడు శౌనకాది మహా మునులను చూచి ఇలా చెప్పసాగాడు.

ధృతరాష్ట్రుడు, పాండు రాజు, విదురుడు భీష్ముని సంరక్షణలో పెరుగుతున్నారు. భీష్ముడు వారందరికి ఉపనయన సంస్కారం చేయించాడు. ముగ్గురు కుమారులు అన్ని విద్యలలో ఆరితేరారు. తరువాత భీష్ముడు ధృతరాష్ట్రునికి యౌవ్వ రాజ్య పట్టాభిషేకం చేసాడు. విదురుని బుద్ధి బలంతోనూ తన పరాక్రమంతోనూ, కౌరవ రాజ్యాన్ని సుభిక్షంగ పాలిస్తున్నాడు.

ధృతరాష్ట్రునికి వివాహం చేయాలని సంకల్పించాడు భీష్ముడు. గాంధార దేశాధీశుని కుమార్తె గాంధారి ని తగిన కన్యగా నిశ్చయిం

చాడు. విదురునితో చర్చించాడు.

"విదురా, గాంధారి తనకు నూర్గురు పుత్రులు ఒక పుత్రిక కలిగేట్టు వరంపొందింది. అందువల్ల కురు వంశం అభివృద్ధి చెందుతుంది. కాబట్టి గాంధారిని మన ధృతరాష్ట్రునకు ఇచ్చి పెళ్లి చేద్దాము" అని అన్నాడు విదురుడు. "సరే" అన్నాడు. వెంటనే పురోహితులను గాంధార రాజువద్దకు పంపాడు.

గాంధార రాజు సుబలుడు ఈ వివాహానికి సంతోషంగా అంగీకరించాడు. గాంధారిని ధృతరాష్ట్రునకు ఇచ్చి వివాహం చేస్తానని వాగ్దానం చేసాడు. కాని బంధువులు ఒప్పుకోలేదు. పుట్టు గుడ్డికి పిల్లను ఇవ్వటం ఏమిటన్నారు.

ధృతరాష్ట్రుని వివాహం చేసుకోడానికి గాంధారి అంగీకరించింది. తండ్రి మాట ఇచ్చాడు కాబట్టి ధృతరాష్ట్రుడే తన భర్త అని నిశ్చయించుకుంది. భర్తకు కళ్ళు లేవు కాబట్టి తను కూడా కళ్లకు గంతలు కట్టుకుంది.

గాంధార రాజు సుబలుడు తన కుమారుడు శకునిని, కుమార్తె గాంధారిని సకల లాంచనాలతో హస్తినాపురానికి పంపాడు. భీష్ముడు దగ్గర ఉండి ధృతరాష్ట్రునకు గాంధారికి వివాహం జరిపించాడు. ధృతరాష్ట్రుడు గాంధారి చెల్లెళ్ళ పదిమందిని అదే ముహూర్తానికి వివాహ మాడాడు. భీష్ముడు మరొక నూరు మంది కన్యలను తీసుకుని వచ్చి ధృతరాష్ట్రునికి ఇచ్చి వివాహం జరిపించాడు. నూట పదకొండు మంది భార్యలతో ధృతరాష్ట్రుడు సకల భోగాలు అనుభవిస్తున్నాడు.

ధృతరాష్ట్రుని తమ్ముడు పాండురాజు కూడ సకల విద్యలలో ఆరితేరాడు. వేదాలు,శాస్త్రాలు, ఆయుధ విధ్యలునేర్చుకున్నాడు. పాండు రాజుకు వివాహం చెయ్య సంకల్పించాడు భీష్ముడు.

ఇది ఇలా ఉండగా—శూరుడు అనే యాదవ రాజు ఉండేవాడు. ఆయన పెద్ద కూతురు పేరు పృధ. శూరుడు తన కూతురు పృధను తన మేనత్త కుమారుడైన కుంతి భోజునకు సంతానం లేని కారణంగా, పెంచుకోడానికి ఇచ్చాడు. పృధ

కుంతి భోజుని ఇంటిలో పెరుగుతూ ఉంది.

ఒక రోజు మహాముని దూర్వాసుడు కుంతిభోజుని భవనానికి వచ్చాడు. పృథ చేసిన సత్కారాలకు సంతుష్టుడు అయ్యాడు. ఆమెను చూచి

"కుమారీ, నీకు ఒక మంత్రం ఉపదేశిస్తాను. ఈ మంత్రంతోనువ్వు ఏ దేవతను ఆరాధిస్తావో, ఆ దేవతలు నీకు నీవు కోరిన కొడుకులను ప్రసాదిస్తారు" అని చెప్పాడు.

ఒక రోజు పృథ ఒంటరిగా గంగా నది ఒడ్డుకు వెళ్లింది. స్నానం చేసింది. సూర్యుడికి అర్ఘ్యం విడిచింది. అప్పుడు ఒక ఆలోచన వచ్చింది. బాల్య చాపల్యంతో దూర్వాసుడు ఇచ్చిన మంత్రాన్నిపరీక్షించాలని అనుకుంది. వెంటనే మంత్రాన్ని జపించి, "దేవా నాకు నీ వంటి కొడుకును ఇమ్ము" అని సూర్య దేవుడిని ప్రార్థించింది.

వెంటనే సూర్యుడు ప్రత్యక్షం అయ్యాడు. సూర్య భగవానుని చూచి పృధ వణికి పోయింది. సూ ర్యుడు ఆమెనుచూచి

"బాలా భయపడకుము. నువ్వు కోరిన వరం ఇవ్వడానికి వచ్చాను" అని చెప్పాడు.

"దేవా, నేను కన్యను. భాల్య చాపల్యంతో అడిగాను. నన్ను క్షమించు" అని వేడుకొంది.

"బాలా, నా దర్శనం వృధా పోదు. నీకు కొడుకు పుడతాడు" అని అన్నాడు.

"దేవా, నాకు ఇంకా పెళ్లి కాలేదు. ఇప్పుడు నాకు గర్భం వస్తే నా తల్లి తండ్రుల మొహం ఎలా చూడను" అని అడిగింది.

"నీ కన్యాత్వం చెడకుండా నీకు పుత్రుని ప్రసాదిస్తాను" అని చెప్పాడు.

వెంటనే ఆమెకు సహజ కవచ కుండలాలతో

కర్ణుడు పుట్టాడు. సూర్యుడు వెళ్లి పోయాడు. చేతిలోబిడ్డతో పృధ నిలబడి పోయింది. ఏమి చెయ్యాలో తోచలేదు.

"ఆ ముని ఏల రావలె. వచ్చినా మంత్రము ఏల ఉపదేశించవలె.ఉపదేశించినా నేను ఏల వరము కోరవలె. నేను బుద్ధి లేక కోరినా సూర్యుడు ఏల పుత్రుని ప్రసాదించవలె. అంతా విధి లీల. ఇప్పుడు ఈ లోకాపవాదము ఏల తప్పుతుంది. ఈ బాలుని ఇంటికి తీసుకొని వెళ్లితే నన్ను అందరూ తిడతారు. అలా అని ఈ బిడ్డను వదల బుద్ధి కావడం లేదు. ఏమి చెయ్యలో తోచడం లేదు" అని చింతిస్తూ ఉంది.

ఇంతలో అమూల్యమైన బంగారము, రత్నములు, మణులు గల ఒక పెట్టె నదిలో తేలుతూ వచ్చింది. కుంతికి ఒక ఆలోచన వచ్చింది. వెంటనే ఆ బిడ్డను ఆ పెట్టెలో పెట్టి నదిలో విడిచి పెట్టింది. ఆ పెట్టె అలా నదిలో తేలుతూ పోతూ ఉంటే, ఒక సూతుడు దానిని చూచాడు. పెట్టెను ఒడ్డుకు తీసుకొని వచ్చి

తెరిచాడు. పెట్టెలో బంగారము, రత్నములు, మణులతో సహా బిడ్డ కనిపించాడు. వెంటనే ఆ బిడ్డను తీసుకొని వెళ్లి తన భార్య రాధకు ఇచ్చాడు. రాధ ఎంతో సంతోషించింది. బంగారము, మణులతో దొరకడం వల్ల ఆ బిడ్డకు "వసుషేణుడు" అని పేరు పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు.

కుంతిభోజుడు పృధకు స్వయంవరం ప్రకటించాడు. అందులో పృధ పాండు రాజును వరించింది. వారి ఇద్దరికి వివాహం అయింది. తరువాత, భీష్ముని అనుమతితో పాండు రాజు, మద్రరాజు కూతురైన మాద్రిని కూడా వివాహం చేసుకున్నాడు.

వివాహం అయిన తరువాత, పాండు రాజు దిగ్విజయ యాత్రకు వెళ్లాడు. నాలుగు దిక్కులలో ఉన్న రాజులందరినీ జయించాడు. రాజ్యాన్ని విస్తరించాడు. రాజులందరూ కురు సామ్రాజ్యానికి సామంతులయ్యారు. పాండు రాజు నూరు అశ్వమేధ యాగాలు చేసాడు.

ఒక రోజు పాండు రాజు వేట నిమిత్తము అడవికి వెళ్లాడు.అతని భార్యలైన కుంతి, మాద్రి, కూడా అతని వెంట వెళ్లారు. ఒక రోజు ఎంత వెదికినా ఒక్క జంతువు కూడా కనపడలేదు. పాండు రాజు విసుగుతో వెదుకుతున్నాడు.

అప్పుడు ఆ అడవిలో ఒక చోట ఒక మగ జింక, ఒక ఆడ జింక ప్రణయ కలాపాలలో మునిగి తేలుతున్నాయి. గురి చూచి ఆ రెండు జింకలను కొట్టాడు. అందులో ఆడు జింక వెంటనే చనిపోయింది. మగ జింక కొన ఊపిరితో ఉంది. పాండు రాజు ఆ జింక దగ్గరగా వెళ్లాడు. పాండు రాజును చూచి ఆ మగ జింక

"రాజా, వేటాడుట రాజ ధర్మము. అందువలన మమ్మలను చంపుటలో మీకు దోషములేదు. కాని పరుగెత్తలేనివి, ప్రణయ కలాపములలో ఉన్నవి, వ్యాధితో బాధపడు తున్నవి అయిన మృగాలను కిరాతులు కూడా కొట్టరు. నువ్వు ఈ ధర్మం తెలిసి కూడా

మమ్మలను కొట్టావు. ఎందుకు అలా చేసావు?" అని అడిగింది.

దానికి పాండు రాజు "ఓ మృగమా, నేను నిన్ను మోసం చేసి కాని, నమ్మించి కాని చంపలేదు. వేటాడి చంపాను. అదినా ధర్మము. ఇందులో నా దోషము లేదు. " అని అన్నాడు.

దానికి ఆ జింక "ఓ రాజా, ప్రణయ కలాపములలో తేలియాడుతున్న మమ్మలను కొట్టావు కాబట్టి నువ్వు నీ భార్యలతో సంగమిస్తే నువ్వు మరణాన్ని పొందుతావు" అని శాపం ఇచ్చి తన ప్రాణాలు విడిచింది.

ఆ శాపంతో పాండు రాజు ఎంతో దుఃఖించాడు. సంసార సుఖము లేనపుడు తపస్సు చెయ్యడమే శరణ్యం అనుకున్నాడు.

తన భార్యలను చూచి "మీరు హస్తినాపురానికి తిరిగి వెళ్లండి. నా శాప విషయం భీష్మునికి సత్యవతీ దేవికి చెప్పండి. మీరు

అక్కడనే ఉండండి" అని అన్నాడు.

దానికి వారు దుఃఖించి "మేము మిమ్ములను పిడిచిపెట్టి వెళ్లము. మీ వెంటనే ఉంటాము" అని అన్నారు.

పాండు రాజు తన వెంట వచ్చిన వారికి తన వద్ద ఉన్న అన్ని వస్తువులను దానం చేసాడు. వేట నిమిత్తం వచ్చిన వారినందరిని తిరిగి రాజధానికి పంపించాడు. ముని వృత్తి అవలంబించి, భార్యలతో వానప్రస్థానికి బయలుదేరాడు. ఉత్తర దిక్కుగా ప్రయాణం చేసి, శతశృంగ పర్వతము మీద తపస్సు చేసుకుంటున్నాడు. కుంతి, మాద్రి అతనిని సేవిస్తూ అతని వెంటనే ఉన్నారు.

ఒక అమావాశ్య రోజు, మహా ఋషులందరూ బ్రహ్మ లోకానికి పోతున్నారు. పాండు రాజు కూడా తన భార్యలతో బ్రహ్మ లోకానికి వెళ్లడానికి ప్రయాణం అయ్యాడు.

పాండు రాజును చూచి ఆ మహా ఋషులు "రాజా ఇవి దేవ మార్గాలు. మీ లాంటి వారు రాలేరు" అని అన్నారు.

పాండు రాజుకు విషయం అర్ధం అయింది. "మహాత్మా, మాకు సంతానము లేదు. మేము అనపత్యులము. అందువలన మాకు దేవ మార్గములో ప్రవేశించుటకు అర్హత లేదు కదా" అని అన్నాడు. ఆ ఋషులు దివ్య దృష్టి తో చూచి "రాజా, మీకు సంతాన యోగమున్నది సంతానము కోసము ప్రయత్నించుము" అని చెప్పారు.

తరువాత పాండు రాజు తన మనసులో ఇలా అనుకున్నాడు:

"పురుషుడికి నాలుగు ఋణాలు ఉంటాయి. దేవ ఋణము. ఋషి ఋణము. పితృ ఋణము మరియు మనుష్య ఋణము. పురుషుడు ఈ నాలుగు ఋణాలు తీర్చాలి. లేకపోతే వాడికి పుణ్య లోకాలు లేవు. యజ్ఞముల వలన దేవతల

ఋణమును, వేదాధ్యయనము వలన ఋషుల ఋణమును, శ్రాద్ధకర్మలు నిర్వర్తించడం ద్వారా, పుత్రులను కని వారి ద్వారా పితరులకు ఉత్తమ గతులు కల్గించి, పితృ ఋణమును, దయా గుణము వలన మానుష ఋణమును తీర్చు కుంటాడు. నేను పితృ ఋణము తప్ప మిగిలిన అన్ని ఋణాలు తీర్చుకున్నాను. సంతాన యోగం లేనిది పితృ ఋణము తీరదు. కాని ఈ మృగ శాపము వలన ఆ యోగము లేదు. ఏమి చెయ్యాలి" అని ఆలోచిస్తూ ఆశ్రమానికి చేరుకున్నాడు.

కుంతీ దేవిని పిలిచాడు. జరిగినది అంతా ఆమెకు చెప్పాడు.

"కుంతీ, సంతానం లేకుండా జీవించి ఒకటే మరణించి ఒకటే. కావున ధర్మ మార్గంద్వారా మనకు సంతానం కలిగేట్లు చెయ్యవా. కుంతీ నీకు ఇంకొక విషయం చెపుతాను విను ము. పుత్రులు ఆరు రకాలు. 1.ఔరసుడు,2.దత్తకుడు, 3.కృత్రిముడు, 4.గూఢోత్పన్నుడు 5.అపవిద్ధుడు. 6.క్షేత్రజుడు. వీరికి రాజ్యములో కాని ఆస్తిలో

కాని భాగం ఉంటుంది.

ఇంకొక రకమైన పుత్రులు ఆరుగురు ఉన్నారు. వారు 1.కానీనుడు, 2.సహోఢుడు, 3.క్రీతుడు. 4.పౌనర్భవుడు, 5.స్వయందత్తుడు, 6.జ్ఞాతుడు. వీరు కూడా పుత్ర సమానులే కాని, వీరికి రాజ్యాధికారము కాని, ఆస్తిలో భాగము కాని లేదు.

మొదట నేను చెప్పిన వారిలో ఔరసుడు, క్షేత్రజుడు. ముఖ్యులు. ఔరసుడు పుట్టే యొగ్యత మనకు లేదు కాబట్టి, క్షేత్రజుడు మిగిలిన వారి కంటే మేలు. దేవర న్యాయము చేత పుట్టిన పుత్రుడు ఉత్తముడు. పూర్వం కేకయ రాజు కు పుత్రులు లేరు. అప్పుడు ఆయన తన భార్యను నియోగించగా, ఆమె పుంసవన హోమం చేయించి, ఉత్తమ మైన ఋత్విజుల ద్వారా ముగ్గరు కుమారులను పొందింది. కాబట్టి ఔరసులు పుట్టడానికి అవకాశం లేనపుడు, క్షేత్రజులే మేలు" అన్నాడు పాండు రాజు.

దానికి కుంతి "మహారాజా, మేము నీ ధర్మ పత్నులము. మనసులో కూడా పర పురుషులను తలపము. అలాంటప్పుడు వారితో కలిసి సంతాన్ని ఎలా పొందగలము? కాని నీ వలననే మాకు సంతానం కలుగుతుంది.

ఎలా అంటే —పూర్వం పూరు వంశంలో వ్యుషితాశ్వుడు అనే రాజు, నూరు అశ్వమేధ యాగాలు చేసాడు. లోకం లో ఉన్న రాజులందరిని జయించాడు. కాని ఆయనకు కామం ఎక్కువ. మితి మీరి కామ సుఖాలు అనుభవించి, క్షయ రోగంతో మరణించాడు. ఆయన భార్య భర్త పక్కన కూర్చుని ఏడుస్తూ ఉంది. అప్పుడు వ్యుషితాశ్వుని శరీరం నుండి ఒక మాట వినిపించింది.

"నీవు బహిష్టు అయిన ఎనిమిదో రోజు గాని, 14వ రోజు కాని, పడక మీద పడుకొని నన్ను స్మరించుము. నేను నీతో సంగమిస్తాను. నీకు పుత్రులు కలుగుతారు" అని వినిపించింది.

ఆ ప్రకారం చేసి ఆమె ఏడుగురు కొడుకులకు జన్మనిచ్చింది. కాబట్టి, పాండు రాజా, నువ్వు కూడా ఆ ప్రకారం సంతానం పొందవచ్చు కదా" అని అడిగింది కుంతీ దేవి.

అది సాధ్యం కాదు అని తెలుసుకున్నాడు పాండు రాజు.

"కుంతీ, ఇది వరకు స్త్రీలు, భర్తల అదుపు ఆజ్ఞలలో ఉండే వాళ్ళు కాదు. వారు స్వతంత్ర ప్రవృత్తి కలిగి ఉండేవాళ్ళు. భర్త అనుమతితో గాని, భర్త అనుమతి లేకుండ కాని, తమ ఇష్టం వచ్చిన వారితో, కామ సుఖాలుఅనుభవించేవారు. సంతానం పొందుతుండేవారు.

ఒక రోజు మహా తపస్వి అయిన ఉద్దాలకుని భార్య బహిష్టు అయింది. అప్పుడు ఒక వృద్ధ బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు. ఆమెను చూచి, మోహించి, తనకు సంతానం కావాలని, ఆమెను కామించాడు. ఇది చూచి ఉద్దాలకుని కొడుకు శ్వేతకేతు కోపించాడు. అది ధర్మవిరుద్ధం అని

ఖండించాడు.

"ఈ రోజు నుండి, స్త్రీలు ఎప్పుడూ పరపురుషుని కోరకూడదు. వివాహమైన స్త్రీలకు పరపురుషునితో సంగమం నిషిద్ధం. దానివలన సర్వ పాపాలు కలుగుతాయి." అని కట్టడి చేసాడు.

{నాడు శ్వేతకేతుడు చేసిన కట్టడి, Indian Penal Code లో Adultery గా ఈ నాటికీ అమలులో ఉంది}.

అప్పటి నుండి వివాహితలైన భార్యలు, తమ భర్తలతో తప్ప వేరే వారితో సంగమించడంలేదు. కాని భర్త ఆజ్ఞ ప్రకారం సంగమించ వచ్చును. భర్త ఆజ్ఞను అతిక్రమించడం దోషం. అంతే కాదు. కల్మాషపాదుడు తన భార్య దమయంతిని దేవర న్యాయం ప్రకారం పుత్రుని పొందమని నియోగించాడు. భర్త ఆజ్ఞ అతిక్రమిస్తే పాపం వస్తుందని, దమయంతి వసిష్టుని వలన, అశ్మకుడు అనే పుత్రుని పొందింది. అలాగే నువ్వు కూడా దేవర న్యాయంతో పుత్రులను పొందుము. నీకు చేతులెత్తి

నమస్కరిస్తాను" అని దీనంగా అన్నాడు పాండు రాజు.

కుంతీ దేవి భర్త పడుతున్న ఆవేదనకు చలించి పోయింది. ఆమెకు చిన్నప్పుడు దూర్వాస మహా ముని ఉపదేశించిన మంత్రం గుర్తుకు వచ్చింది. తనకు కర్ణుడు పుట్టడం తప్ప మిగిలిన విషయం అంతా పాండు రాజుకు చెప్పింది.

"పాండురాజా, ఆ మంత్రం సహాయంతో మనకు సంతానం కలుగుతుంది. నేను ఏ దేవతను ఆరాధించాలో చెప్పండి?" అని అడిగింది కుంతి.

"కుంతీ, ధర్మదేవుడిని మించిన దేవత లేదు. అతనిని స్మరింపుము" అన్నాడు.

అలా భర్త చేత నియోగింపబడిన కుంతి, శుచి అయి, ధర్ముడిని, మనసారా ధ్యానించింది. ధర్ముడు ఆమెకు ప్రత్యక్షం అయ్యాడు. అతని దయ వలన కుంతీ దేవి గర్భం ధరించింది. ఒక సంవత్సరం కాలం పూర్తి కాగానే ఒక కుమారుడు

జన్మించాడు. ఆకాశ వాణి ఆ బిడ్డకు యుధిష్ఠిర అని నామకరణం చేసింది. అతనిని చూచి అక్కడ నున్న మహాఋషులు అతను కురు వంశానికి రాజు అవుతాడని, ధర్మం తప్పకుండా రాజ్యం చేస్తాడని పలికారు.

ఇది ఇలా ఉండగా, హస్తినా పురంలో ధృత రాష్ట్రుడి వలన గాంధారి గర్భవతి అయింది. అదీ కూడా, కుంతీ దేవి కన్న ముందే గర్భవతి అయింది. కాని ఎంతకూ ఆమెకు ప్రసవం కాలేదు. ఇంతలో కుంతీ దేవికి యుధిష్ఠిరుడు పుట్టాడని వార్త తెలిసింది. అది విని భరించ లేక, గాంధారి తన కడుపు మీద కొట్టుకుంది. ఆమెకు గర్భ స్రావం అయింది.

అది విని కృష్ణద్వైపాయనుడు హస్తినకు వచ్చాడు. వెంటనే ఆ మాంసఖండములను, 101 గా విభజించి, వాటిని నేతి కుండలలో పెట్టి కాపాడమని, ఆమెకు 100 మంది పుత్రులు, ఒక పుత్రిక కలుగుతారు అని చెప్పాడు. గాంధారి తను చేసిన పనికి చింతించి, కృష్ణ

ద్వైపాయనుడు చెప్పినట్టు చేసింది.

అక్కడ శతశృంగ పర్వతము మీద ఉన్న పాండు రాజుకు మరొక కొడుకు కావాలని పించింది. కుంతిని చూచి, "కుంతీ, ఈ సారి నువ్వు వాయుదేవుడిని స్మరించి, అంతటి బలసంపన్నుడైన కొడుకును పొందుము" అని చెప్పాడు.

కుంతీ దేవి భర్త మాట ప్రకారము వాయు దేవుడిని ప్రార్థించింది. ఆయన దయ వలన గర్భం ధరించింది. ఒక సంవత్సరం తిరగ్గానే ఆమెకు వాయు దేవుని అంశతో అమిత బలసంపన్నుడైన పుత్రుడు జన్మించాడు. ఆకాశ వాణి ఆ బిడ్డకు భీమసేనుడు అని నామకరణం చేసింది.

ఇక్కడ భీముడు పుట్టిన రోజే, హస్తినా పురములో, కలి అంశతో, దుర్యోధనుడు జన్మించాడు. తరువాత రోజుకు ఒక్కరు చొప్పున, నూర్గురు కుమారులు జన్మించారు. వారిపేర్లు:

1.దుర్యోధనుడు, 2.దుశ్శాసనుడు,
3.దుస్సహుడు, 4.దుశ్శలుడు,
5.జలసంధుడు, 6.సముడు,
7. సహుడు, 8.విందుడు,
9.అనువిందుడు, 10.దుర్ధర్షుడు,
11.సుబాహుడు 12.దుష్ప్రదర్షణుడు,
13.దుర్మర్షణుడు 14.దుర్ముఖుడు,
15.దుష్కర్ణుడు, 16.కర్ణుడు,
17. వివింశతుడు, 18.వికర్ణుడు,
19. శలుడు, 20. సత్వుడు,
21. సులోచనుడు, 22. చిత్రుడు,
23. ఉపచిత్రుడు, 24. చిత్రాక్షుడు,
25.చారుచిత్రుడు, 26. శరాసనుడు,
27. దుర్మదుడు, 28.దుర్విగాహుడు,
29. వివిత్సుడు, 30. వికటాననుడు,
31.నోర్ణనాభుడు, 32. సునాభుడు,
33. నందుడు, 34. ఉపనందుడు,
35. చిత్రబాణుడు, 36. చిత్రవర్మ,
37.సువర్మ, 38. దుర్విమోచనుడు,
39. అయోబాహుడు, 40. మహాబాహుడు,
41. చిత్రాంగుడు, 42. చిత్రకుండలుడు,

43. భీమవేగుడు, 44. భీమబలుడు,
45. బలాకుడు, 46. బలవర్ధుడు,
47. నోగ్రాయుధుడు, 48. సుషేణుడు,
49. కుండధారుడు, 50. మహోదరుడు,
51. చిత్రాయుధుడు, 52. నిషంగుడు,
53. పాశుడు, 54. బృందారకుడు,
55. ధృడవర్మ, 56. ధృఢక్షత్రుడు,
57. సోమకీర్తి, 58. అనూదరుడు,
59. ధృడసంధుడు, 60. జరాసంధుడు,
61. సదుడు, 62. సువాగుడు,
63. ఉగ్రశ్రవుడు, 64. ఉగ్రసేనుడు,
65. సేనానీ, 66. దుష్పరాజుడు,
67. అపరాజితుడు, 68. కుండశాయి,
69. విశాలాక్షుడు, 70. దురాధరుడు,
71. దుర్జయుడు, 72. ధృఢహస్తుడు,
73 సుహస్తుడు, 74. వాతవేగుడు,
75. సువర్చుడు, 76. ఆదిత్యకేతుడు,
77. బహ్వాసి, 78. నాగదత్తుడు,
79. అగ్రయాయుడు, 80. కవచుడు,
81. క్రథనుడు, 82. కుండినుడు,
83. ధనుర్ధరోగ్రుడు, 84. భీమరథుడు,
85. వీరబాహుడు, 86. వలోలుడు

87. రుద్రకర్ముడు, 88.ధృఢరధాశ్రయుడు,
89. అధృష్యుడు, 90.కుండభేధి,
91.పిరాపి, 92. ప్రమధుడు,
93. ప్రమాధి, 94.దీర్ఘరోముడు,
95.దీర్ఘబాహువు, 96.ఊడోరుడు,
97.కనకధ్వజుడు, 98.ఉపాభయుడు,
99.కుండాశి,100.పిరజసుడు.

తరువాత. 101 వ పిండము పగులగా, అందులో నుండి దుస్సల అనే కూతురు పుట్టింది. ధృతరాష్ట్రుడికి వైశ్య కులమునకు చెందిన మరొక భార్య వలన యుయుత్సుడు అనే కొడుకు పుట్టాడు.

దుర్యోధనుడు పుట్టినపుడు అనేక దుశ్శకునాలు గోచరించాయి. ఆ దుశ్శకునాలను చూచి భీష్మాదులు కలత చెందారు. భీష్ముడు, పిదురుడు, బ్రాహ్మణులు వచ్చి ఇలా అన్నారు.

"ధృతరాష్ట్ర మహారాజా, దుర్యోధనుడు పుట్టినపుడు అనేక దుశ్శకునాలు గోచరించాయి.

కులక్షయకారకుడైన దుర్యోధనుని వదలివేసి, కులమును రక్షించరాదా.నీకు వంద మంది పిల్లలు ఉన్నారు కదా." అని పలికారు. కాని పుత్రుడి మీద మమకారంతో, ధృతరాష్ట్రుడు వాళ్ల మాటలు వినలేదు.

శతశృంగ పర్వతము మీద ఒక రోజు కుంతీ దేవి,వాయుదేవుని అంశతో పుట్టిన భీముని ఎత్తుకొని దేవాలయానికి వెలుతూ ఉంది. ఇంతలో ఒక పులి కుంతీ దేవి మీదికి దుమికింది. పాండు రాజు తనబాణములతో పులిని చంపాడు. కాని, పెద్ద పులి భయంతో కుంతీ దేవి వణికి పోయింది. ఆమె చేతిలో ఉన్న భీముడు కింద పడ్డాడు. కేవలం పదిరోజుల వయసు ఉన్న ఆ బాలుని శరీరం పడ్డ చోట రాళ్లు పొడి పొడి అయ్యాయి. ఇది చూచి పాండు రాజు ఆశ్చర్యపోయాడు.

ఇంతలో గాంధారికి నూరు మంది కొడుకులు కలిగారని వార్త తెలిసింది. తనకూ ఇంకా కొడుకులు కావాలని కోరుకున్నాడు పాండురాజు దేవేంద్రుని గూర్చి తపస్సు చేసాడు. దేవేంద్రుడు

ప్రత్యక్షం అయి, "పాండు రాజా, నీకు ముల్లోకాలను జయించే కొడుకు పుడతాడు" అని వరమిచ్చాడు.

పాండు రాజు కుంతీ దేవిని చూచి, "కుంతీ, నాకు ఇంకా ధర్మ మార్గంలో కొడుకులను పొందాలని ఉంది. దేవతలలో పెద్ద దేవేంద్రుడు. నీ మంత్ర మహిమ వలన దేవేంద్రుని ధ్యానించి అతని వలన ఒక పుత్రుని పొందుము" అని కోరాడు. కుంతీ దేవి భర్త ఆజ్ఞ మేరకు అలాగే చేసింది.

కుంతీ దేవికి ఇంద్రుని అంశతో పౌరుష వంతుడు, తేజోవంతుడు అయిన కుమారుడు ఉత్తర ఫల్గునీ నక్షత్రములో జన్మించాడు. అప్పుడు ఆకాశ వాణి "ఇతను కార్త వీర్యార్జునుని కన్నా వీరుడు అవడం వలన, అర్జునుడు అనే పేరుతో పిలువబడతాడు."అని పలికింది. పాండు రాజు, కుంతీ దేవి, త్రిమూర్తులతో సమానమైన ముగ్గురు కొడుకులతో ఆనందంగా కాలం గడుపుతున్నారు.

అక్కడ గాంధారికి 101 మంది సంతానం కలిగారు. ఇక్కడ కుంతీ దేవికి ముగ్గురు సంతానం కలిగారు కాని పాండు రాజు రెండవ భార్య అయిన మాద్రికి సంతానం లేరు. దానికి ఆమె ప్రతిరోజూ చింతిస్తూ ఉంది. ఒక రోజు తనకు కూ డా సంతానం కావాలి అని భర్త పాండు రాజు ను అడిగింది. పాండు రాజు కుంతీ దేవిని పిలిచాడు. మాద్రికి కూడా సంతానాన్ని కలుగచెయ్యమని అర్థించాడు.

కుంతీ దేవి భర్త మాట ప్రకారము, దుర్వాసుడు ఉపదేశించిన మంత్ర ప్రభావముతో, సకల లోక కళ్యాణ కారకులైన అశ్వినీ దేవతలను ప్రార్థించింది. వారు ప్రత్యక్షం అయ్యారు. మాద్రికి సంతానం కలిగించమని ప్రార్థించింది. మాద్రికి అశ్వినీ దేవతల అంశతో, ఇరువురు పుత్రులు జన్మించారు. వారు పుట్టగానే ఆకాశవాణి నకులుడు, సహదేవుడు అని వారికినామకరణం చేసింది.

కుంతీ దేవికి సంతానం కలిగారన్న

విషయం కుంతీ దేవి అన్నయ్య వసుదేవుడికి తెలిసింది. ఆయన తన చెల్లెలి పిల్లలకు ఎన్నో కానుకలను తన పురోహితుడైన కశ్యపునిచేత పంపించాడు.

ఇంతలో వసంత కాలం వచ్చింది. ఒక రోజు పాండు రాజు, తన రెండవ భార్య మాద్రి మనోహర రూపం చూచాడు. తన్మయుడైనాడు. ముని శాపాన్ని మరిచాడు. బలవంతంగా ఆమెతో సంభోగ సుఖాన్ని అనుభవించాడు. ప్రాణాలు కోల్పోయాడు.

ఇదంతా చూచి మాద్రి భయంతో వణికి పోయింది. భర్త శవాన్ని చూచి పెద్దగా ఏడవ సాగింది. కుంతీ దేవి అక్కడకు వచ్చి భర్త శవాన్ని చూచింది. జరిగింది అర్థం అయింది. వెంటనే సహగమనానికి సిద్ధ పడింది. కాని మాద్రి అందుకు ఒప్పుకోలేదు.

"అక్కా, నా వలననే మన భర్త మరణించాడు. ముని శాపం తెలిసికూడా అజాగ్రత్తగా

ప్రవర్తించాను. ఇంత జాగ్రత్త లేని దాన్ని నేను మన కొడుకులను కాపాడలేను. నువ్వే వీరిని కాపాడాలి. అందువల్ల నేనే సహగమనం చేస్తాను" అని చెప్పింది. వెంటనే పాండు రాజు చితి మీదికి ఎక్కి సహగమనం చేసింది.

కుంతీ దేవి కి అక్కడ ఉన్న ఋషులే దిక్కు అయ్యారు. వారందరూ, కుంతీ దేవిని, ఐదుగురు కుమారులను తీసుకొని హస్తినాపురానికి ప్రయాణం అయ్యారు.

పాండు రాజు కుమారులను చూడ్డానికి హస్తినా పుర ప్రజలందరూ కదిలి వచ్చారు. కుంతీ దేవి మునులతోనూ, కుమారులతోనూ రాజ భవనాన్ని సమీపించగానే, దుర్యోధనుడు, తన 99 మంది తమ్ముళ్లతోనూ, పురోహితులతోనూ ఎదురు వచ్చి, వారందరిని లోపలకు తీసుకొనివెళ్లాడు.

భీష్ముడు, విదురుడు, సత్యవతి, ధృతరాష్ట్రుడు, అంబిక, అంబాలిక, వారికెదురు వచ్చి, మునులందరికి నమస్కరించారు. కుంతీ దేవిని

ఓదార్చారు. పాండు కుమారులను ప్రేమతో
ఎత్తుకున్నారు.

ఆ వచ్చిన వారిలో ఒక ముని భీష్మునితో ఇలా
అన్నాడు "పాండు రాజు శతశృంగ పర్వతము
మీద, ఈ ఐదుగురు కుమారులను పొందాడు.
విధివశాత్తు భార్యతో కూడా స్వర్గస్థుడైనాడు.
అందువలన మేము వచ్చి వీరిని మీకు అప్ప
గించాము" అని చెప్పి ఆ మునులందరూ
వెళ్లిపోయారు.

తరువాత భీష్ముడు పాండు కుమారులతో
పాండు రాజుకు ఉత్తర కర్మలు నిర్వర్తింప
చేసాడు.

ఆ సందర్భంగా అక్కడకు వచ్చిన కృష్ణ
ద్వైపాయనుడు, ఒక రోజు తన తల్లి సత్యవతితో
రహస్యంగా ఇలా అన్నాడు. "అమ్మా, ధృతరాష్ట్రుని
కుమారులు దుర్మార్గులు. వాళ్ల ఆగడాలు మీరు
చూడలేరు. మీరు తపోవనానికి వెళ్లండి" అని
చెప్పాడు. వెంటనే, సత్యవతి, తన కోడళ్ల

అంబిక, అంబాలికలను వెంట తీసుకొని భీష్ముని అనుమతితో తపోవనానికి వెళ్లింది. కాల క్రమేణా ఆ ముగ్గురూ స్వర్గస్థులయ్యారు.

ధృతరాష్ట్రుడు, తన కుమారులు, పాండు రాజు కుమారులు అనే బేధ భావము లేకుండా, అందరినీ సమానంగా పెంచుతున్నాడు. కాని ఆటలలో ఎప్పుడూ మిగిలిన వారు, భీముని కన్నా తక్కువ అవుతున్నారు. భీముడు వారందరిని ఎక్కువగా బాధిస్తుండేవాడు. భీముడు పెట్టే బాధలు పడలేక, దుర్యోధనుడు, తన మేన మామ శకుని, తమ్ముడు దుశ్శాసనుడు మొదలగు వారితో ఆలోచించాడు.

"మనం ఈ బాధలు భరించలేము. భీముడిని చంపాలి. ధర్మ రాజును చెరలో పెట్టాలి. ఈ రాజ్యాన్ని అంతా మనమే పాలించాలి" అన్నాడు. దానికి శకుని వంత పాడాడు.

ఒక రోజు అందరూ జలక్రీడలు ఆడి మైమరిచి నిద్రపోతున్నారు. ఆ సమయంలో

దుర్యోధనుడు భీముని తీగలతో కట్టించి, గంగలో తోయించాడు. కాని భీముడు నిద్ర మేల్కొని, ఒళ్ళు విరుచుకోగానే ఆ తీగలు అన్నీ తెగిపోయాయి.

మరి ఒక రోజు, దుర్యోధనుని ఆజ్ఞతో, అతని సారధి భీముని నల్ల తాచు పాములతో కరిపించాడు. కాని భీముడి వజ్ర శరీరాన్ని ఆ పాము కోరలు ఛేదించలేక పోయాయి. భీముడు నిద్ర లేచి, ఆ పాములను చంపేసాడు.

మరొక రోజు, దుర్యోధనుడు, కాలకూట విషాన్ని అన్నంలో కలిపి భీముడికి పెట్టించాడు. కాని, భీముడు ఆ విషాన్ని కూడా జీర్ణం చేసుకున్నాడు. ఈ విధంగా భీముని చంపవలెనని దుర్యోధనుడు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఇంకా ఏ విధంగా పాండవులకు కీడు చెయ్యాలా అని దుర్యోధనుడు ఆలోచిస్తున్నాడు.

భీష్ముడు కురుకుమారులందరికి, కృపాచార్యుని వద్ద, ద్రోణాచార్యుని వద్ద, విలు

విద్య నేర్పించ సాగాడు.

అప్పుడు జనమేజయుడు వైశంపాయనునితో ఇలా అన్నాడు. "మహర్షీ, మాకు కృపాచార్యుడు, ద్రోణచార్యుని జన్మ వృత్తాంతాలను చెప్పండి" అని అడిగారు.

వైశంపాయనుడు, జనమేజయునితో కృపాచార్యుని జన్మ వృత్తాంతాన్ని ఇలా చెప్ప సాగాడు.

గౌతముడు అనే మహా మునికి శరద్వంతుడు అనే కుమారుడు ఉన్నాడు. అతనికి వేదాలు చదవటం ఇష్టం లేదు. ధనుర్విద్యలో ప్రావీణ్యం సంపాదించాడు. ఇంకా సాధించాలని, ఘోరమైన తపస్సు చేస్తున్నాడు.

ఆ తపస్సును భంగం చెయ్యాలని దేవేంద్రుడు జలపద అనే యౌవనవతిని పంపించాడు. శరద్వంతుడు ఆమెను చూచి పరవశుడయ్యాడు. . అతని చేతిలోనుండి

ధనుర్బాణాలు, జింక చర్మము కింద పడ్డాయి. కామోద్రేకంలో అతనికి వీర్య పతనం అయింది. శరద్వంతుడు మరల తపస్సుకు వెళ్లాడు. అతని వీర్యము ఒక రెల్లు పొదలలో రెండు భాగాలుగా పడింది. ఆ వీర్యం లో నుండి ఒక కొడుకు, ఒక కూతురు జన్మించారు.

ఒకరోజు శంతన మహారాజు వేటకు వచ్చి ఆ బిడ్డలను పక్కనే పడి ఉన్న ధనుర్బాణాలను, జింక చర్మాన్ని చూచాడు. వారు బ్రాహ్మణ కుమారులై ఉంటారని తలచి తీసుకొని వెళ్లి పెంచుకున్నాడు. వారికి కృపుడు, కృపి అని పేర్లు పెట్టాడు.

కొంత కాలము తర్వాత, శరద్వంతుడు శంతనుని వద్దకు వచ్చాడు. వారు తన సంతాన మని శంతనునికి తెలిపాడు. కృపునికి ఉపనయనం చేసాడు. తనే స్వయంగా ధనుర్విద్యను కృపుడికి నేర్పించాడు.

అలాంటి కృపాచార్యుని భీష్ముడు పిలిపించి,

పాండు పుత్రులకు, దుర్యోధనాదులకు విలువిద్య నేర్పించడానికి నియమించాడు.

తరువాత వైశంపాయనుడు జనమేజయునితో ద్రోణాచార్యుని జన్మ వృత్తాంతాన్ని ఇలా చెప్ప సాగాడు.

భరద్వాజ మహా ముని గంగా తీరంలో తపస్సు చేసుకుంటున్నాడు. ఒక రోజు ఘృతాచి అనే అప్సరస గంగా నదిలో జలకాలాడుతూ ఉంది. గాలికి ఆమె చీర తొలగిపోయింది. ఆమెను చూచి భరద్వాజుడికి కామం కలిగింది. ఆ క్షణంలో భరద్వాజునికి వీర్య స్ఖలనం అయింది. భరద్వాజుడు తన వీర్యాన్ని సేకరించి, ఒక (ద్రోణి లో) కలశంలో పెట్టాడు. ఆ వీర్యం నుండి శుక్రుని అంశతో ద్రోణుడు జన్మించాడు.

భర ద్వాజుని స్నేహితుడైన పృషతుడు అనే రాజు పాంచాల దేశాన్ని పాలిస్తున్నాడు. అతను కూడా అడవులకు వెళ్లి భయంకరమైన తపస్సు చేసాడు. ఒక రోజు మేనక అనే అప్సరసను

చూచాడు. కామంతో అతనికి వీర్యం పతనం అయింది. కాని దానిని అతడు తన పాదంతో కప్పి వేసాడు. ఆ వీర్యంలోనుండి మరుత్తుని అంశతో ద్రుపదుడు అనే బాలుడు జన్మించాడు. పృషతుడు ఆ బాలుని భరద్వాజుని ఆశ్రమంలో ఉంచి పాంచాల దేశం వెళ్లి పోయాడు.

భరద్వాజుని ఆశ్రమంలో ద్రోణుడు, ద్రుపదుడు కలిసి విద్యాభ్యాసం చేస్తున్నారు. విలు విద్యను నేర్చుకుంటున్నారు. తరువాత ద్రుపదుడు పాంచాలరాజ్యానికి రాజు అయ్యాడు. ద్రోణుడు అగ్నివేశ్యుడు అనే మహా ముని వద్ద ధనుర్విద్యను నేర్చుకున్నాడు. కృపుని చెల్లెలు అయిన కృపిని ద్రోణుడికి ఇచ్చి వివాహం చేసాడు భరద్వాజుడు. ఆ ఇరువురికి ఒక కుమారుడు కలిగాడు. అతనే అశ్వత్థామ.

ఇది ఇలా ఉండగా, పరశురాముడు బ్రాహ్మణులకు దాన ధర్మాలు చేస్తున్నాడని తెలిసి ద్రోణుడు పరశురాముని వద్దకువెళ్లాడు. ధనం దానం చెయ్యమని

అడిగాడు.

"ద్రోణా, నేను నా వద్ద ఉన్న ధనమంతయూ బ్రాహ్మణులకు దానం చేసాను. నా వద్ద ఇంక శస్త్రాస్త్రాలు మిగిలి ఉన్నాయి. నీకు కావలిస్తే అవి తీసుకో" అన్నాడు.

ద్రోణుడు సంతోషంగా సమ్మతించాడు. పరశురాముని వద్ద అనేక శస్త్రాస్త్రాలు ప్రయోగ ఉపసంహారాలతో నేర్చుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చాడు. ఒక రోజు చిన్న నాటి స్నేహితుడైన పాంచాల దేశాధిపతి ద్రుపదుని వద్దకు వెళ్లాడు. స్నేహపూర్వకంగా మాట్లాడాడు. కాని ద్రుపదునికి ఇది నచ్చలేదు.

"పేద బ్రాహ్మణులకు, మహారాజులకు స్నేహం ఎలాకుదురుతుంది. నోరు మూసుకొని పో. అదియును కాక, మిత్రులైనా, శత్రులైనా సమానమైన వారి మధ్యనే జరగాలి. మా వంటి మహారాజులకు నీ వంటి పేద బ్రాహ్మణులతో ఏమీ ప్రయోజనం లేదు. కాబట్టి మన మధ్య స్నేహానికి అవకాశం లేదు" అని గర్వంగా మాట్లాడాడు.

ద్రోణుడు ఆ అవమానాన్ని భరించలేక పోయాడు. ఏమి చెయ్యడానికి తోచక, ఇంక అక్కడ ఉండలేక, భార్యాబిడ్డలతో హస్తినా పురానికి ప్రయాణం అయ్యాడు.

ఆ సమయంలో దుర్యోధనాదులు, పాండు కుమారులు బంతి ఆట ఆడుకుంటూ ఉండగా, ఆ బంతి అక్కడే ఉన్న లోతైన బావిలో పడింది. దానిని బయటకు తీసుకొనే మార్గం లేక అందరూ చూస్తూ ఉన్నారు.

అప్పుడు ద్రోణుడు భార్యా పుత్ర సమేతంగా అక్కడకు వచ్చాడు. నిస్సహాయంగా ఉన్న రాజ కుమారులను చూచాడు. వెంటనే ద్రోణుడు బాణాలను ఒక దానికి ఒకటి కొట్టి, ఒక తాడుగా చేసి, బావి లో నుండి ఆబంతిని బయటకు తీసాడు.

రాజ కుమారులు ఈ విషయాన్ని భీష్మునికి చెప్పారు. వెంటనే భీష్ముడు ద్రోణుడి దగ్గరకు

వెళ్లాడు. " తమరు ఎక్కడ నుండి వచ్చారు. ఎక్కడ ఉంటున్నారు?" అని అడిగాడు.

"మహాశయా, నా పేరు ద్రోణుడు. నేను అగ్నివేశ్యుడి దగ్గర విలువిద్య నేర్చుకున్నాను. పాంచాల రాజు నా స్నేహితుడు. కాని అతను నా స్నేహాన్ని అవహేళన చేసాడు. ఈ కుమారుడు నా కొడుకు అశ్వత్థామ. చేతిలో ధనము లేక పోవడం వల్ల, సంసారాన్ని పోషించలేక, ఎన్నో బాధలు పడ్డాను.

కనీసం బాల్యంలో నా కుమారునికి పాలు కూడా కొనడానికి ధనం లేక, నా చిన్న నాటి స్నేహితుడు ద్రుపదుని వద్దకు వెళ్లి నా కుమారుని పాల కోసం నాలుగు పాడి ఆవులు ఇవ్వమని అడిగాను. కాని ద్రుపదుడు నా పేదరికాన్ని ఎత్తి చూపుతూ, తనతో నాకు స్నేహం తగదన్నాడు. ఆ విధంగా అతనితో అవమానం పొందాను" అని తన వృత్తాంతాన్ని వివరించాడు ద్రోణుడు.

భీష్ముడు ద్రోణుడికి కోరినంత ధనం ఇచ్చాడు. ధృతరాష్ట్రుని కుమారులకు, పాండురాజు కుమారులకు విలువిద్య నేర్పమని అర్థించాడు. ద్రోణుడు దానికి ఒప్పుకున్నాడు. వారినందరినీ ద్రోణుడు ఒక కోరిక కోరాడు.

"మీరంతా నా దగ్గర విలువిద్య నేర్చుకున్న తరువాత, నా కోరికను మీలో ఎవరు తీరుస్తారు?" అని అడిగాడు.

కౌరవులు ఒకరి మొహం ఒకరు చూచుకున్నారు. వెంటనే అర్జునుడు ముందుకు వచ్చి "గురువర్యా, నేను మీరు ఏది కోరితే అది తీరుస్తాను" అని పలికాడు.

ద్రోణుడు ఎంతో సంతోషించాడు. అర్జునుని కౌగలించుకున్నాడు. తరువాత అందరికి విలువిద్య నేర్పించడం ప్రారంభించాడు. దేశ దేశాల నుండి రాకుమారులు వచ్చి ద్రోణుడి దగ్గర విలువిద్య నేర్చుకుంటున్నారు. కుంతీ దేవికి బాల్యంలో సూర్యుని వరం వలన కలిగిన

పుత్రుడు, సూతుని ఇంట పెరుగుతున్న కర్ణుడు కూడా ద్రోణుడి దగ్గర విలు విద్య నేర్చు కుంటు న్నాడు. కాని కర్ణుడు ఎప్పుడూ రాకు మా రుడైన దుర్యోధనుని పక్షం వహించే వాడు. అర్జునుడు మాత్రం వినయంతో గురు పూజ చేస్తూ, ద్రోణుడి అనుగ్రహానికి పాత్రుడయ్యాడు.

ద్రోణుడి కుమారుడు అశ్వత్థామకు విద్యా మత్సరం ఎక్కువ. అర్జునుడు చీకట్లో బాణాలు వెయ్యడం అనే విద్య నేర్చుకోడం అశ్వత్థామకు ఇష్టం లేదు. అందుకే వంట వాడిని పిలిచి, ఎప్పుడూ అర్జునుడికి చీకటిలో భోజనం పెట్టవద్దని చెప్పాడు.

ఒకరోజు రాత్రి,అర్జునుడు భోజనం చేస్తు న్నాడు. పెద్ద గాలి వీచింది. దీపం ఆరి పోయింది. అలవాటు ప్రకారం అర్జునుడు అన్నం తింటు న్నాడు. అర్జునుడికి ఒక ఆలోచన వచ్చింది. చీకట్లో అన్నం తిన్నట్టు, చీకట్లో విలు విద్య కూడా నేర్చుకోవచ్చు అని తెలుసుకున్నాడు. అప్పటి నుండి చీకట్లో బాణాలు వెయ్యడం

ఆరంభించాడు.

ఒక రోజు చీకట్లో అర్జునుడి అల్లె తాటి ధ్వని విన్నాడు ద్రోణుడు. అస్త్రవిద్యలో అర్జును నికికల పట్టుదలకు సంతోషించాడు. ద్రోణుడు తాను పరశురాముని వద్దనేర్చుకున్న అస్త్ర విద్య లన్నీ నేర్పించి తనంతవాడిగా తయారు చేసాడు.

ద్రోణుడి కీర్తిని విని హిరణ్యధన్వుడు అనే పేరు కల రాజు కొడుకు ఏకలవ్యుడను వాడు, ద్రోణుడి వద్దకు వచ్చి విలువిద్య నేర్పమని అడి గాడు. కాని ద్రోణుడు హీన జాతి వాడైన ఏకల వ్యుడికి విలు విద్య నేర్పడానికి అంగీకరించ లేదు.

అప్పుడు ఏకలవ్యుడు అడవిలోకి వెళ్ళి పోయాడు. మట్టితో తన గురువు గారైన ద్రోణుడి విగ్రహాన్ని తయారు చేసాడు. దానిని భక్తితో పూజించాడు. ఆ విగ్రహం ఎదురుగా విలువిద్య సాధన చేసాడు.

ఒక రోజు పాండవులు, కౌరవులు వేట

సి మిత్తం సమీపములో ఉన్న అడవికి వెళ్లారు. పాండవుల కు చెందిన ఒక కుక్క తప్పించుకొని అడవిలోకి పారి పోయింది. అది ఏకలవ్యుడు సాధన చేస్తున్న ప్రదేశానికి వెళ్లి మొరగ సాగింది. ఏకలవ్యుడు ఏడు బాణాలను సంధించి, ఆ కుక్కనోటిలో కొట్టాడు. ఆ కుక్క వెనక్కు తిరిగి కురుకుమారుల దగ్గరకు వచ్చింది. దానిని చూచి కురుకుమారులు ఆశ్చర్య పోయారు. ఆబాణాలు ఎవరు వేసారు అని వెదుకుతూ వెళ్లారు. వారికి జింక చర్మాన్ని కట్టుకున్న, ఏకలవ్యుడు కనిపించాడు.

వారు అతనిని చూచి "నీవు ఎవరు. విలువిద్యలో నీకు గురువు ఎవరు?" అని అడిగారు.

దానికి ఏకలవ్యుడు "నా పేరు ఏకలవ్యుడు. ఎరుకల రాజు కొడుకును. నా గురువు ఇదిగో ఈయన ద్రోణాచార్యులు" అని విగ్రహం చూపించాడు. కురుకుమారులు తిరిగి వచ్చి ద్రోణుడికి విషయం అంతా చెప్పారు.

కాని అర్జునుడు భరించలేక పోయాడు. ద్రోణుడిని ఒంటరిగా కలుసుకొని "గురువు గారూ, నేనే తమ ప్రియ శిష్యుడు అన్నారు. అన్ని విద్యలు నేర్పించాను అని అన్నారు. కాని ఆ ఎరుకల వాడు తమకు ప్రియ శిష్యుడట కదా. అతనికి నాకన్నా విలువిద్యలో నైపుణ్యం ఎక్కువట కదా?" అని అడిగాడు.

ద్రోణుడికి ఇదేమీ అర్థం కాలేదు. అర్జునుడి వెంట ఏకలవ్యుడు ఉండే ప్రదేశానికి వెళ్లాడు. ఏకలవ్యుడు ద్రోణుడికి ఎదురు వచ్చి నమస్కరించి "అయ్యా నేను తమరి శిష్యుడిని. విలువిద్య నేర్చుకున్నాను" అని చెప్పాడు.

వెంటనే ద్రోణుడు "మరి నాకు గురుదక్షిణ ఇవ్వవా"అని అడిగాడు.

"గురువు గారూ, ఇది నా దేహం, ఇది నా ధనం వీరు నా సేవకులు. మీకు ఏమి కావాలో కోరుకోండి ఇస్తాను" అని అన్నాడు.

"నీ కుడి చేతి బొటన వేలు కోసి నాకు ఇవ్వు. అదే నాకు గురు దక్షిణ" అని అడిగాడు.

ఏకలవ్యుడు ఆలోచించకుండా కత్తి తీసుకొని తన కుడి చేతి బొటన వేలు కోసి ఇచ్చాడు. ఇంక ఏకలవ్యుడు విల్లు పట్టలేడు.బాణం సంధించలేడు. తను నేర్చుకున్న విలు విద్య నంతా కోల్పోయాడు. అర్జునుడికి మనసుకు శాంతి లభించింది.

భీముని బలాన్ని, అర్జునుడి విలువిద్యను చూచి దుర్యోధనాదులు సహించలేకపోయారు. ఒక రోజు, ద్రోణుడు తన శిష్యులకు విలు విద్య పరీక్ష పెట్టాడు. ఒక బొమ్మ పక్షిని తయారు చేసి, ఒక చెట్టు పై భాగాన ఉన్న కొమ్మకు కట్టాడు. తన శిష్యులందరికి దానిని చూపించాడు. "మీరు అందరూ మీ ధనుస్సులు ఎక్కు పెట్టి,నేను చెప్పినపుడు ఆ పక్షిని కొట్టండి" అని చెప్పాడు.

ధర్మ రాజును పిలిచాడు. పిల్ల ఎక్కు పెట్టమన్నాడు.

"ధర్మజా, చెట్టు కొసన ఉన్న పక్షి తలను చూచావా?" అని అడిగాడు.

"చూచాను గురువర్యా" బదులు చెప్పాడు ధర్మ రాజు.

"ఆ చెట్టును, నన్ను, నీ తమ్ముళ్లను చూచావా?" అని అడిగాడు.

"చూచాను గురువర్యా" అన్నాడు ధర్మ రాజు.

"నీ దృష్టి చెదిరింది. నువ్వు దీనిని కొట్ట లేవు" అన్నాడు.

ఆ మాదిరి మిగిలిన వారి నందరిని అడిగాడు. వారందరూ తమకు చెట్టు కొసన ఉన్న

పక్షి తలతో పాటు, మిగిలినవి అన్నీ కనపడుతున్నాయి అని చెప్పారు.

ఆఖరున అర్జునిడిని విల్లు ఎక్కుపెట్టమన్నాడు ద్రోణుడు. మిగిలిన వాళ్లను అడిగినట్లుగానే అర్జునుని కూడా అడిగాడు.

అర్జునుడు మాత్రం "గురుదేవా, నాకు పక్షితల తప్ప వేరే ఏదీ కనిపించుట లేదు" అని బదులు చెప్పాడు.

"కొట్టు" అన్నాడు ద్రోణుడు.

అర్జునుడుబాణం విడిచాడు. పక్షి తల తెగిపడింది. అర్జునిడి ఏకాగ్రతకు, లక్ష్య భేధనకు ద్రోణుడు సంతోషించాడు.

ఒక రోజు రాకుమారులూందరూ కలిసి గంగా నదికి స్నానం చెయ్యడానికి వెళ్లారు. గురువుగారైన ద్రోణుడు నదిలో మునిగి స్నానం చేస్తున్నాడు. నదిలో ఉన్న ఒక మొసలి ద్రోణుడి తొడ పట్టుకొని నీటిలోకి లాగసాగింది.

వెంటనే ద్రోణుడు "రాకుమారులారా, నన్ను ఈ మొసలి బారి నుండి కాపాడండి" అని పెద్దగా అరిచాడు. రాకుమారులంతా దిక్కుతోచక అటు ఇటు పరుగెడుతున్నారు. అర్జునుడు మాత్రం నీటిలో కనిపించకుండా ఉన్న ఆ మొసలిని తన బాణాలతో కొట్టి గురువు గారైన ద్రోణుడిని కాపాడాడు. అతని విలువిద్యా నైపుణ్యానికి ద్రోణుడు సంతోషించాడు. ఎప్పటికైనా ద్రుపదుని మీద ఉన్న తన పగను తీర్చేవాడు అర్జునుడే అని నమ్మకం కుదిరింది. అందుకని అర్జునుడికి అనేక దివ్యమైన అస్త్రాలను ఇచ్చాడు.

{మహాభారతం—ఆది పర్వము—
పంచమాశ్వాసము—సమాప్తము}.

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎర్రాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)
Modali Venkata Subrahmanyam, B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.
Ph:040-24048104

**మహాభారతం**

## ఆదిపర్వము

### షష్ఠాశ్వాసము

మహాభారత కథను చెబుతున్న ఆ ఉగ్రశ్రవసుడు (సూతుడు) శౌనకాది మహామునులను చూచి ఇలా చెప్ప సాగాడు.

ఆ ప్రకారము పాండవులు, కౌరవులు ద్రోణుడి వద్ద అస్త్ర శస్త్ర విద్యలు నేర్చు కుంటున్నారు. ఒక రోజు ద్రోణుడు, రాకుమారుల అస్త్ర విద్యా ప్రదర్శనను, వ్యాసుడు, భీష్ముడు, విదురుడు, కృపుడు, శల్యుడు, శకుని, సోమదత్తుడు మొదలైన పెద్దల ముందు ఏర్పాటు చెయ్యవలసిందిగా ధృతరాష్ట్రుడిని కోరాడు. దానికి ధృతరాష్ట్రుడు సమ్మతించాడు. విదురుని తగు ఏర్పాట్లు చెయ్యమని కోరాడు. విదురుడు ఒకప్రదర్శనా శాలను నిర్మింపచేసాడు. అస్త్ర విద్యా ప్రదర్శనకు ధృతరాష్ట్రుడు, గాంధారి వచ్చారు. తగు ఆసనాలలో ఆశీనులయ్యారు.

ఇంకా వ్యాస మహర్షి, కృపాచార్యుడు, శల్యుడు, శకుని, భీష్ముడు, విదురుడు, సోమదత్తుడు మొదలైన ప్రముఖులు తమ తమ ఆసనాలలో ఆశీనులయ్యారు.

ద్రోణాచార్యుడు తెల్లని వస్త్రాలు ధరించి అక్కడకు వచ్చాడు. ఆయన వెనుక పాండు కుమారులు, ధృతరాష్ట్ర కుమారులు వయసును బట్టి వరుస క్రమంలో నిల్చున్నారు. ముందు కొంచెంసేపు రాకుమారుల అస్త్ర శస్త్ర ప్రదర్శన అయిన తరువాత, భీముడు, దుర్యోధనుడు గదలు తీసుకొని తమ గదాయుద్ధ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వారు ఇరువురు కొదమ సింగాల వలే పోరాడుతున్నారు.

ఈ ప్రదర్శనా విశేషాలన్నీ విదురుడు గాంధారీ ధృతరాష్ట్రులకు వివరంగా చెపుతున్నాడు. భీమ దుర్యోధన గదా యుద్ధాన్ని చూస్తున్న పౌరులు తమలో తాము ఆవేశ కావేషాలు పెంచుకుంటున్నారు.పరిస్థితి చెయ్యి దాటుతోంది అని అనుకున్న ద్రోణాచార్యుడు తన కుమారుడు

అశ్వత్థామను పంపి ఆ ప్రదర్శనను ఆపించాడు. తరువాత అర్జునుని విలు విద్యాప్రదర్శన ఉంటుంది అని ప్రకటించాడు.

అర్జునుడు విల్లు, అమ్ములు ధరించి రంగం లోకి ప్రవేశించాడు. అర్జునుని చూడగానే జనం లో కల కలం రేగింది. అడుగో పాండు రాజు పుత్రుడు మేటి విలుకాడు అర్జునుడు అని ప్రజలు జయ జయ ధ్వానాలు చేసారు.

అర్జునుని చూచి కుంతీ దేవి, తన కుమారుడు ప్రయోజకుడైనందుకు, ఎంతో ఆనందించింది.ఆ కలకలం, జనుల హర్ష ధ్వానాలు విని "అదే మిటి" అని అడిగాడు ధృతరాష్ట్రుడు. దానికి విదురుడు "అర్జునుని విలు విద్యా కౌశల్యాన్ని చూచి ప్రజలు జయ జయధ్వానాలు చేస్తున్నారు" అని చెప్పాడు. దానికి ధృతరాష్ట్రుడు కూడా ఎంతో సంతోషించాడు.

అర్జునుడు గురువు గారి అనుమతితో ఆగ్నేయాస్త్రము, వారుణాస్త్రము, వాయవ్యాస్త్రము,

మేఘాస్త్రము, మొదలైన అస్త్రాలు ప్రదర్శించాడు. ప్రజలందరూ అర్జునుడి అస్త్ర విద్యను చూచి ఆశ్చర్యపొయ్యారు.

ఇంతలో కర్ణుడు ప్రవేశించాడు. సహజ కవచ కుండలాలతో ప్రకాశిస్తున్న కర్ణుడిని చూచి జనం విస్మయంతో చూస్తున్నారు. కర్ణుడు సభా మధ్యలో నిలబడి, గురువులకు నమస్కరించి, అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా, ఈ విద్యలు ప్రదర్శించడానికిపెద్ద నేర్పు అవసరం లేదు. ఈజనం మెచ్చేటట్టి ఈ విద్యలన్నీ నేను కూడా ప్రదర్శించగలను" అని అన్నాడు.

దుర్యోధనుడు కర్ణునిచూచి సంతోషించాడు. అర్జునునికి కోపం వచ్చింది. ద్రోణుని అనుమతితో కర్ణుడు, అర్జునుడు చూపిన అస్త్ర విద్య లన్నీ తనూ చేసి చూపాడు. దుర్యోధనుడు ఆనందంతో కర్ణుని వద్దకు వెళ్లి తనతో చెలిమి చెయ్యమని కోరాడు. అప్పుడు కర్ణుడు అర్జునునితో ద్వంద్వ యుద్ధానికి అనుమతి కోరాడు.

పిలవకుండానే సభకు వచ్చినందుకు అర్జునుడు కర్ణుని ఆక్షేపించాడు.

దానికి కర్ణుడు, "ఈ అస్త్ర విద్యా ప్రదర్శన వీరులు అందరికి చెందినది. దీనికి ఎవరూ పిలవనవసరంలేదు" అని అన్నాడు. దుర్యోధనుడు వెంటనే కర్ణునికి అర్జునునితో ద్వంద్వ యుద్ధానికి అనుమతి ఇచ్చాడు.

అర్జునుడు, కర్ణుడు ద్వంద్వ యుద్ధం చెయ్యడానికి సమకట్టారు. ఇద్దరూ ఘోరంగా యుద్ధం చేస్తున్నారు. ఒక సమయంలో కర్ణుడి వేసిన పర్జన్యాస్త్రానికి అర్జునుడు కనిపించకుండాపోయాడు. అది చూచి కుంతీ దేవి మూర్ఛపోయింది. మరల అర్జునుడు వాయవ్యాస్త్రంతో ఆ మేఘాలను పారదోలాడు.

వ్యవహారం శృతి మించుతుందని తెలుసుకొని కృపాచార్యుడు ఇద్దరి మధ్య నిలిచాడు.

"కర్ణా, ఇతను పాండు రాజు పుత్రుడు,

కుంతీ కుమారుడు. జన్మతహా క్షత్రియుడు. నీవు అర్జునునితో యుద్ధం చెయ్యాలంటే నీ వంశము, తలితండ్రుల గురించి చెప్పాలి" అని అన్నాడు. దానికి కర్ణుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.

అప్పుడు దుర్యోధనుడు కృపాచార్యుని చూచి, "గురువర్యా, కులము, శౌర్యము, అధిక సేన కలవారలు రాజు గా పిలవబడతారు. మీ అభ్యంతరం అంతా కర్ణుడు రాజు కాడు అనేగా. ఇప్పుడే కర్ణుడిని నా అంగరాజ్యానికి రాజును చేస్తాను." అంటూ భీష్ముడు, ధృతరాష్ట్రుని అనుమతితో అక్కడికక్కడే కర్ణుడిని అంగ రాజ్యానికి రాజును చేసాడు.

కర్ణుడు ఆనందంతో పొంగిపోయాడు. దుర్యోధనా, నన్ను గౌరవించి, రాజును చేసి నా పరువు నిలిపావు. నేను నీకు ఏమి చెయ్యగలను" అని అడిగాడు.

"కర్ణా నేను నీ స్నేహాన్ని అభిలషిస్తున్నాను. నాతో స్నేహం చెయ్యి" అని అన్నాడు. కర్ణుడు తన

జీవితాంతం దుర్యోధనుడికి మిత్రుడిగా ఉండటానికి అంగీకరించాడు.

ఇది అంతా చూచి కర్ణుడి తండ్రి అక్కడకు వచ్చాడు. కర్ణుడు తండ్రికి నమస్కరించాడు. ఇది చూచాడు భీముడు. కర్ణుడు సూతపుత్రుడు అని అర్ధం అయింది.

"కర్ణా, సూత పుత్రుడవైన నీవు, రథం నడుపుకోక, నీకు అర్జునితో యుద్ధము ఏలనయ్యా? అని ఆక్షేపించాడు.

వెంటనే దుర్యోధనుడు "వాయు పుత్రా, భీమా, ఇంతటి తేజశ్శాలి సూత కులంలో పుడతాడా. వీరుల పుట్టుక, దేవతల పుట్టుక, యేరుల పుట్టుక ఎవరికి తెలియవు?

దేవేంద్రుని వజ్రాయుధము దధీచి వెన్నెముక నుండి పుట్టలేదా?

పరమ శివుని కుమారుడు, కుమార

స్వామి రెల్లు పొదలో జన్మించలేదా?

మా గురువైన మీరు ఎలా జన్మించారో తెలియదా?

ద్రోణాచార్యులు కుండలో పుట్టలేదా?

ఉత్తమ క్షత్రియులందరూ బ్రాహ్మణుల వలన జన్మించలేదా?

అంత దాకా ఎందుకు, మీ ఐదుగురు అన్న దమ్ముల పుట్టుకలు ఎట్టివి?

కాబట్టి ఇక్కడ జన్మలతో పనిలేదు. కర్ణుడు అంగ దేశానికి రాజు. సహజ కవచ కుండల ములు కలవాడు." అంటూ ఉండగానే సూర్యాస్త మయం అయింది. ఆ రోజుకు ప్రదర్శన ముగిసింది.

దుర్యోధనుడు కర్ణుడిని వెంటపెట్టుకొని రాజ సౌధానికివెళ్లాడు. అప్పటి దాకా ఇది అంతా చూస్తున్న కుంతీ దేవి కర్ణుడిని తన

పెద్దకుమారుడిగా గుర్తుపట్టింది. కాని అర్జునుని మీద ప్రేమతో అది బయట పడ నీయ లేదు.

రాకుమారులందరికి విలు విద్య పూర్తి అయింది. గురు దక్షిణ ఇచ్చే సమయం వచ్చింది.

"తమరికి ఏమి ఇవ్వాలో చెప్పండి" అని రాకుమారులు ద్రోణుడిని అడిగారు.

పాత పగ గుర్తుకు వచ్చింది ద్రోణుడికి. "నాకు గర్వాంధుడైన ద్రుపదుడిని పట్టి తెచ్చి ఇవ్వండి" అని అడిగాడు.

వెంటనే దుర్యోధనాదులు రథాలెక్కి పాంచాల దేశం వైపు వెళ్లారు. పాండవులు కూడా ద్రోణాచార్యుడిని రథమ్మీద ఎక్కించుకొని పాంచాల దేశం వెళ్లారు. దుర్యోధనాదులు ద్రుపదుడితో యుద్ధం చెయ్యడం మొదలు పెట్టారు.

ద్రుపదుడు సామాన్యుడు కాడు. కౌరవుల నందరినీ ఓడించాడు. అది చూచి అర్జునుడు, ధర్మరాజును, ద్రోణుడిని అక్కడే ఉండమని, ద్రుపదుని మీదికి యుద్ధానికి వెళ్లాడు.

భీమార్జునులు ద్రుపదుడి సేనను చీల్చి చెండాడారు. అర్జునుడు ద్రుపదునితో ద్వంద యుద్ధం చేసాడు. ద్రుపదుడిని ఓడించాడు. ద్రుపదుడిని తన రథ చక్రానికి కట్టి తీసుకొని వచ్చి ద్రోణుడి ముందు పడవేసాడు.

ద్రోణాచార్యుడు ద్రుపదుని చూచి హేళనగా నవ్వి

"ఏమేమీ ద్రుపద మహారాజులు ఇలా దీనంగా పడి ఉన్నారేమి? మహారాజు అనే మదం తొలగి పోయిందా? ఇక ముందైనా మమ్మల్ని గుర్తు పెట్టుకుంటారా" అని అడిగాడు. వెంటనే ద్రుపదుడిని విడిచిపెట్టమన్నాడు.

ద్రుపదుడు ఆ పరాభవాన్ని తట్టుకోలేక

పోయాడు. తగిన ప్రతీకారం చెయ్యాలని నిశ్చయిం చుకున్నాడు.

తరువాత, ధృతరాష్ట్రుడు. ధర్మరాజును కురు సామ్రాజ్యానికి యువ రాజుగా పట్టాభిషిక్తుని చేసాడు. తన నలుగురు తమ్ములు నాలుగు దిక్కులు జయించగా, ధర్మరాజు, యువ రాజైనా కూడా, చక్రవర్తివలె ప్రకాశించాడు.

గదా యుద్ధంలో భీముడు, విలువిద్యలో అర్జునుడు అజేయంగా ఉన్నారు. నకుల సహ దేవులు శత్రు రాజులకు భయంకరంగా నిలి చారు.

అర్జునుడి పరాక్రమానికి సంతోషించి ద్రోణాచార్యుడు, బ్రహ్మ శిరము అనే అస్త్రాన్ని ఇచ్చాడు.

"అర్జునా, ఈ దివ్యాస్త్రము అమోఘమైనది. దీనిని నాకునాగురువైన అగ్నివేశుడు ఇచ్చాడు. దీనిని అల్ప మానవుల మీద ప్రయోగింపరాదు.

ఇదిలోకాలనే మాడ్చివేస్తుంది. కాని నాకు మరొక గురుదక్షిణ ఇమ్ము. నేను యుద్ధం చెయ్యడం అంటూ జరిగితే, నువ్వు నాకు ఎదురుగా యుద్ధం చెయ్య కూడదు". అర్జునుడు దానికి అంగీకరించాడు.

(ఈ బ్రహ్మ శిరము అనే అస్త్రము ఈ నాటి ఆటం బాంబ్, హైడ్రొజన్ బాంబు లాంటిది అని చెప్ప వచ్చును. అది ఇద్దరి వద్దనే ఉంది. ఒకరు అశ్వత్థామ. మరొకరు అర్జునుడు. భారతయుద్ధం అంతా అయిన తరువాత, అశ్వ త్థామ, అర్జునుడు ఒకరి మీద ఒకరు ఈ బ్రహ్మ శిరము అనే అస్త్రాన్ని వేసుకుంటారు. అప్పుడు వ్యాసుడు దాని మహిమ గురించి చెపుతాడు. ఈ అస్త్రము వేసిన ప్రదేశ ములో పన్నెండేళ్లు గడ్డికూడా మొలవదు అని అంటాడు. దీనిని బట్టి చూస్తే,ఇది నేటి అణు బాంబు అని చెప్పక తప్పదు).

ధర్మ రాజు యువ రాజు. భీమార్జున నకుల సహదేవులు అతనికి అండగా ఉన్నారు. వారి వైభవాన్ని చూచి దుర్యోధనుడు ఓర్వలేక పోయాడు.

ఒక రోజు తండ్రి అయిన ధృతరాష్ట్రుది వద్దకు వెళ్లాడు.

"తండ్రీ, పాండవులు మహా వీరులు. పైగా నువ్వు ధర్మ రాజును యువరాజుగా పట్టాభి షిక్తుని చేసావు. దేశంలోని ప్రజలు, మంత్రులు, సామంతులు అందరూ అతని మీదనే అనురాగం చూపుతున్నారు. అతనంటే గౌరవం చూపుతు న్నారు. నిన్ను కాని, తాత భీష్ముడిని కాని ఎవరూ లెక్క చెయ్యడం లేదు. ప్రజలంతా ఏమనుకుంటున్నారో తెలుసా. నువ్వు రాజ్యం చెయ్యడానికి పనికి రావని, భీష్ముడు తగిన వాడైనా రాజ్యాధికారం స్వీకరించనని ప్రతిజ్ఞ చేసాడు కాబట్టి, ఆయన కూడా పనికి రాడని, అందువల్ల ధర్మరాజే గౌరవించ తగిన వాడనీ అనుకుంటున్నారు. దీనికి విదురుడు కూడా అంగీకరిస్తున్నాడు. మా మాటకు విలువ లేదు. ప్రజలు మంత్రులు, సామంతులు వారిని పొగుడు తుంటే నేను వినలేను, తట్టుకోలేను. కాబట్టి మీరు ఎలాగైనా పాండవులను ఎక్కడికన్నా పంపించివేయండి." అని అన్నాడు.

ధృతరాష్ట్రుడు ఆలోచించి, "నాయనా దుర్యోధనా! నాకు అన్నీ తెలుసు. కాని నేను అంధుడను. రాజ్య కార్యాలను స్వయంగా చూచుకొన లేను.కాబట్టి నా తమ్ముడు పాండు రాజు నన్ను రాజుగా చేసి నన్ను భక్తితో సేవించాడు. నా చేత ఎన్నో యజ్ఞాలు యాగాలు చేయించాడు. ఎందరో రాజులను జయించి ధనరాసులను తెచ్చి ఇచ్చాడు. అందుకే నీ కన్న పెద్ద వాడైన పాండు రాజు కుమారుడైన ధర్మ రాజుకు యువ రాజ పట్టాభిషేకం చేసాను. ఇప్పుడు నీ మాట మీద వారిని ఎలా తొలగించగలను చెప్పు" అన్నాడు.

"తండ్రీ రాజ్యాధికారము వారసత్వముగా సంక్రమించింది. ఇది వరకు పాండు రాజు నీ బదులు రాజ్యం చేసాడు. ఇప్పుడు పాండు రాజు కుమారుడు రాజైనాడు. తరువాత ధర్మ రాజు కుమారుడు రాజు అవుతాడు. ఈ ప్రకారము పాండు వంశము వాళ్లు రాజులవుతారు. మా గతి ఏమిటి? మేము, మా కొడుకులు, మా మనుమలు వారికి సేవ చెయ్యాలా. బానిసల మాదిరి జీవించాలా చెప్పండి తండ్రీ. పైగా ఈ రాజ్యము

నీది. నీవు అంధుడవు కావటం వల్ల నీ తమ్ముడు నీ కు మారుగా రాజ్యాధి కారం వహించాడు. క్రమంగా రాజ్యం మాకుచెందాలి. కాని పాండు రాజు మంచి తనం వల్ల, అతని కు మారుడు ధర్మ రాజు రాజు కావాలని ప్రజలు కోరు కుంటు న్నారు. అందువల్ల వారిని ఇక్కడినుండి వారణా వత ము పంపుదా ము. కొంత కాల ము వారు కనపడక పోతే మంత్రులు, సామంతులు, ప్రజలు నన్నే రాజుగా అభి మాని స్తారు. గౌరవి స్తారు. నేను రాజుగా స్థిర పడిన తరువాత, పాండవులు మరల ఇక్కడకు వస్తారు. ఏమంటారు?" అన్నాడు దుర్యోధనుడు.

కు మారుడు చెప్పిన మాటలన్నీ సావధా నంగా విన్నాడు ధృతరాష్ట్రుడు.

"సుయోధనా, నేను కూడా ఇదే అభి ప్రాయం తో ఉన్నాను. కాని ఇంత దారుణమైన పనికి విదు రుడు, భీష్ముడు, ద్రోణుడు అంగీకరి స్తారా. ఇది సాధ్యం కాదు" అని అన్నాడు.

"తండ్రీ! మీరు చక్రవర్తి. మీ మాటను భీష్ముడు, ద్రోణుడు, విదురుడు ఒప్పుకుంటారు. తాత భీష్ముడు మా ఇరువురి మీద సమభావం కలవాడు. ఆయనతో ఇబ్బంది లేదు. అశ్వత్థామ నా స్నేహితుడు. నా వెంటనే ఉంటాడు. కొడుకు మీద ప్రేమతో ద్రోణుడు, బావ గారి మీదప్రేమతో కృపుడు నన్ను విడిచి వెళ్లరు. విదురుడు పాండవ పక్షపాతి. కాని అతను ఒక్కడూ ఏమీ చెయ్యలేడు. కాబట్టి నేను చెప్పిన దానిలో దోషము లేదు. అసాధ్యం అంతకంటే లేదు. మీరు అంగీకరించండి" అని బలవంతం చేసాడు దుర్యోధనుడు.

చేసేది లేక ధృతరాష్ట్రుడు సరే అన్నాడు. ఇంక దుర్యోధనుడు తన కపటోపాయాన్ని ఆచరణలో పెట్టాడు. కొంత మంది మంత్రులను పిలిపించి వారణావతం గురించి ధర్మరాజుతో, మిగిలిన పాండవులతో గొప్పగా చెప్పమని పంపాడు. వారందరూ పాండవులకు ఆ నగరం మీద కుతూహలం కలిగేట్టు వర్ణించారు. సహజంగా పాండవులకు వారణావతం చూడాలని కోరిక కలిగింది.

ఒక రోజు ధృతరాష్ట్రుడు పాండవులను పిలిచి, "నాయనా ధర్మజా! మీ తండ్రి పాండు రాజు చాలా కీర్తి గడించాడు. కాల వశాత్తు ఇప్పుడు ఆయన లేడు. మీరు కూడా తండ్రికి తగ్గ తనయులు. నా మాట కాదనరు. ఇంత కాలం రాజ్య భారాన్ని వహించి అలసిపోయారు. గంగా నదీ తీరాన ఉన్న వారణావతము సర్వ సుఖాస్పదము అని అందరూ చెపుతుంటారు. మీరు, కుంతీ దేవితో సహా అక్కడకు పోయి కొంత కాలం హాయిగా గడిపి రండి."

పెద తండ్రి అంతటి ప్రేమతో చెపుతుంటే ధర్మ రాజు కాదనలేక పోయాడు. సరే అని ఒప్పుకున్నాడు. గాంధారీ ధృతరాష్ట్రులకు మొక్కి వారి అనుమతి తీసుకున్నాడు. భీష్మ, ద్రోణ, కృపాచార్యులకు నమస్కరించి వారి ఆశీర్వాదము తీసుకున్నారు. తల్లి కుంతీ దేవితో వారణావతానికి ప్రయాణం అయ్యాడు.

ఇది అంతా చూచి దుర్యోధనుడి ఆనందానికి అవధులు లేవు. వెంటనే పురోచనుడు అనే వాడిని

పిలి పించి,

"పురోచనా, నువ్వు గృహములు నిర్మించడంలో నేర్పరి అని విన్నాను. పాండవులు వారణావతానికి వెలుతున్నారు. వారు అక్కడ ఉండేటందుకు నువ్వు తగిన గృహాలను నిర్మించాలి. కాని ఆ ఇళ్ళు మామూలుగా కాదు. లక్క, మట్టి, నెయ్యి కలిసిన మిశ్రమంతో నిర్మించాలి. పాండవులు ఆ గృహాలలోనివసిస్తారు. వారు ఏమరుపాటుగా ఉన్నపుడు నువ్వు ఆ ఇండ్లకు నిప్పు పెట్టాలి. పాండవులు చని పోయినారు అని వార్త తీసుకొని రావాలి. ఈ పని సమర్ధవంతంగా చేస్తే నాకు రాజ్యాధికారం వస్తుంది.నువ్వు కూడా జీవితాంతం భోగాలు అనుభవిస్తావు" అని ప్రలోభ పెట్టాడు. పురోచనుడు సరే అని వెంటనే వారణావతానికి వెళ్లాడు.

ఇక్కడ నన్నయ గారు పాండవుల వయసుల గురించి ప్రస్తావించాడు. ధర్మ రాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు శత శృంగ పర్వతము నుండి హస్తినాపురానికి వచ్చి

నప్పటికి వారికి వరుసగా 16, 15, 14, 13, 13 సంవత్సరాలు అనీ, వారు హస్తినా పురానికి వచ్చిన తరువాత 13 ఏళ్లు ఉన్నారని, వారు వారణావతానికి వెళ్లేటప్పటికి వారికి 29, 28, 27, 26, 26 వయసులు అని చెప్పారు.

పాండవులు, కుంతీ దేవితో సహా వారణావతానికిబయలు దేరుతుంటే హస్తినా పురం లోని పౌరులందరూ

"అయ్యో ఇదేమిటి, పాండవుల అడ్డం తొలగించుకోడానికి వారిని వారణావతానికి పంపుతున్నారు. కాని భీష్ముడు మొదలైన వాళ్లు దీనికి అడ్డు చెప్పలేదు. ధర్మ రాజులేని రాజ్యంలో మనం ఎందుకు" అని పౌరులందరూ పాండవుల వెంట బయలుదేరారు.

వారందరిని చూచి ధర్మ రాజు, "అయ్యలార, నేను నాపెదనాన్న కోరిక మీద తల్లితో, అన్న దమ్ములతో వారణావతానికి వెళుతున్నాను. మరల తిరిగి వస్తాము. మీరందరూ వెనక్కు

మరలండి" అని కోరాడు.

కాని విదురుడు మాత్రము ధర్మజుని వెంట కొంత దూరం వెళ్లాడు. నర్మగర్భంగా కొన్ని మాటలు చెప్పాడు. తరువాత కుంతీ దేవి వద్ద సెలవు తీసుకొని వెనక్కు మరలాడు. విదురుడు చెప్పిన మాటలు ఎవరీ అర్థం కాలేదు.

కుంతీ దేవి ధర్మజుని చూచి, "ధర్మజా, నీకు విదురుడు చెప్పిన మాటలు మాకు అర్థం కాలేదు. ఏమి చెప్పాడు" అని అడిగింది.

దానికి ధర్మజుడు నవ్వుతూ "అమ్మా, విషాగ్నుల వలన అప్రమత్తంగా ఉండండి అని చెప్పాడు. పైగా తాను దుర్యోధనుని వద్ద ఉండి అతను మనకు ఏమన్నా అపకారం తలపెడితే, ఆ విషయం మనకు తెలియచేస్తాను" అని అన్నాడు. విదురునికి తమ మీద ఉన్న ప్రేమకు సంతోషిస్తూ వారు వారణావతానికి వెళ్లారు.

వారణావతంలో ఉన్న ప్రజలు పాండవులకు,

కుంతికి ఘన స్వాగతం పలికారు. వారిని తమ నగరానికి సాదరంగా ఆహ్వానించారు. పురోచనుడు పాండవుల కోసం తాను నిర్మించిన గృహములు చూపించాడు. పాండవులు ఎంతో సంతోషించారు. శిల్పాచార్యుడైన పురోచనుని పూజించారు. పుణ్యాహ వచన కార్యక్రమాలు నిర్వర్తించి నూతన గృహప్రవేశం చేసారు. ధర్మరాజు ఆ ఇల్లు అంతయు అణువు అణువూ పరీక్షించాడు. ఏదో కృత్రిమత్వం గోచరించింది ధర్మజునికి. భీముని పిలిచాడు.

"భీమా, ఈ ఇంటి గోడలు చూడు పింత వాసనవేస్తున్నాయి కదూ!" అన్నాడు.

"అవును అన్నయ్యా, లక్క, తైలము, నెయ్యి కలిసిన వాసన వస్తున్నాయి అన్నయ్యా పైగా మన ఇల్లు ఆయుధాగారం దగ్గరగా ఉంది. ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది". అన్నాడు.

అప్పుడు విదురుని మాటలు గుర్తుకువచ్చాయి ధర్మజునికి. పిషాగ్నులు అంటేఇవన్న మాట అనుకున్నాడు.

"అన్నయ్యా మనం ఒక పని చేద్దాము. మనం ఇప్పటి దాకా ఉన్న పాత ఇంట్లోనే ఉందాము. ఈ ఇంటిని, ఇందులో ఉన్న పురోచనుడిని దహించి వేద్దాము" అన్నాడు భీముడు ఆవేశంగా.

భీమా తొందర పడకు. మనకు ఈ ఇంటి విషయం తెలిసి పోయింది అందుకని జాగ్రత్తగా ఉందాము. ఒక వేళ మనకు ఈ విషయం తెలిసినట్లు పురోచనునికి కాని, దుర్యోధనునికి గాని తెలిస్తే వేరే ఉపాయం పన్నుతారు. అది తెలుసుకోడం మనకు కష్టం కావచ్చు. అందుకని, మనం ఏమీ తెలియనట్లె ఉందాము" అన్నాడు ధర్మజుడు. అప్పటి నుండీ భీముడు చాలా జాగ్రత్తగా ఉంటున్నాడు.

పురోచనుడు, పాండవులకు సేవ చెయ్యడానికి ఒక బోయ వనితను నియమించాడు. దానికి ఐదుగురు కొడుకులు. అందరూ పాండవులు నివశిస్తున్న గృహంలోనే ఉన్నారు. పాండవుల కదలికలు రహస్యంగా ఎప్పటికప్పుడు పురోచనుడికి చేర వేస్తున్నారు.

హస్తినా పురంలో ఉన్న విదురుడికి సుయోధనుని కుతంత్రం తెలిసిపోయింది. వెంటనే ఒక ఖనకుడిని పాండవుల వద్దకు పంపించాడు. వాడు పాండవుల వద్దకు వచ్చి తనను గుర్తు పట్టడానికి విదురుడు చెప్పిన మాటలు చెప్పాడు. తనను తాను ఎరుక పరుచుకున్నాడు. ధర్మ రాజును చూచి "ధర్మనందనా, రాబోవు కృష్ణ చతుర్దసి నాడు పురోచనుడు ఈ లక్క ఇల్లు తగలపెట్టగలడు. అందుకని మీ భవనము నుండి ఒక సొరంగ మార్గము తవ్వమని నన్ను విదురుడు పంపాడు. మీ అనుజ్ఞ అయిన తవ్వగలను" అన్నాడు. ధర్మ రాజు విదురుని దూర దృష్టికి అచ్చెరువొంది, ఖనకుడికి అనుమతి ఇచ్చాడు. ఖనకుడు పాండవులు నివసించు లక్క ఇంటి నుండి వెలుపలికి ఒక బిల మార్గమును ఏర్పాటు చేసాడు. దానిని భీముడు పరీక్షించి తృప్తి చెందాడు.

ఆ కృష్ణ చతుర్దశి నాడు కుంతీ దేవి వారణావతములోనున్న బ్రాహ్మణులకు, ముత్తైదువలకు వారికి ఇష్టమైన భోజనము పెట్టి, దక్షిణలు

ఇచ్చింది. రాత్రి అయింది. వారికి సాయంగా ఉన్న బోయ వనిత తన కుమారులతో కూడా కల్లు సేవించింది. అదరూ మత్తుగా నిద్ర పోతున్నారు.

అంతా సద్దు మణిగిన తరువాత, భీముడు ముందుగా పురోచనుడు నిద్రించుచున్న ఇంటి కి నిప్పు పెట్టాడు. ముందుగా తల్లిని, తమ్ములను సొరంగ మార్గమున బయటకు పంపాడు తరువాత తాము నివశించు చున్న ఇంటికి నిప్పు పెట్టాడు. తరువాత ఆయుధాగారానికి కూడా నిప్పుపెట్టాడు. ఖనకుడికి తాము క్షేమంగా ఉన్నట్టు చెప్పి, సొరంగ మార్గము ద్వారాపెళ్లి తల్లిని అన్నను, తమ్ములను కలుసుకున్నాడు. తరువాత అందరూ వడి వడి గా నడవ సా గారు కాని భీముని వే గా న్ని అందుకోలేక పోయారు. భీముడు తల్లిని తన వీపు మీద ఎక్కించు కున్నాడు. ధర్మరాజును అర్జునుడిని చెరి ఒక భుజం మీద కూర్చోపెట్టుకున్నాడు. నకుల సహదేవులను చెరి ఒక చేత్తో ఎత్తుకున్నాడు. వడి వడిగా నడవసాగాడు.

మరు నాడు తెల్ల వారింది. లక్క ఇల్లు తగలబడటం వారణావత ప్రజలు చూచారు. అందరూ వచ్చి ఆ బూడిద కుప్పలను తొలగించారు. అందులో బోయ వనిత, ఆమె ఐదుగురు కొడుకుల శవాలు కనిపించాయి. ఆ ఆరుగురు, కుంతీ దేవి, పంచ పాండవులు అనుకున్నారు. ఘోరున విలపించారు. ధృతరాష్ట్రుని కుయుక్తిని తిట్టి పోశారు.

ఖనకుడు కూడా జనంలో చేరి పోయాడు. బూడిద కుప్పలను తొలగిస్తునట్లు నటిస్తూ, ఆ బూడిదను తాను తవ్విన సొరంగంలో పోసి అది కనపడకుండా చేసాడు. వెంటనే హస్తినా పురానికి వెళ్లి విదురుడికి పాండవులు క్షేమంగా తప్పించుకున్నారు అని చెప్పాడు. వారణావతంలో ప్రజలు కూడ పాండవులు లక్క ఇంట్లో కాలి పోయిన విషయాన్ని ధృతరాష్ట్రునికి తెలియచేసారు.

భీష్ముడు, ద్రోణుడు, కృపుడు ఎంతో దుఃఖించారు. వారితో పాటు విదురుడు కూడా దుఃఖిస్తున్నట్లు నటించాడు. దుర్యోధనుడు

పాండవుల మరణానికి ఎంతో సంతోషించాడు కాని ఆ మంటలలో పడి పురోచనుడు చనిపోవడం బాధ అనిపించింది.

అక్కడ పాండవులు వారణావతానికి దక్షిణంగా నడవ సాగారు. అందరూ అలిసి పోగా, భీముడు ఒక పెద్ద వృక్షం నీడలో అందరిని విశ్రాంతి తీసుకోమన్నాడు. తాను వెళ్లి నీరు తీసుకొని వచ్చాడు. అందరూ అలి పోవటం చేత, ఆ చెట్టు కింద విశ్రమించారు. చీకటి పడింది. భీముడు వారికి కాపలాగా కూర్చున్నాడు. జరిగిందంతా ఒక సారి తల్చుకుంటున్నాడు.

పాండవులు విశ్రమించిన ప్రదేశానికి దగ్గరగా హిడింబుడు అనే రాక్షసుడు ఉన్నాడు. నర వాసన వాడి ముక్కు పుటాలకు సోకింది. చెల్లెలు హిడింబను పిలిచాడు.

"హిడింబా, మన ఆవాసానికి నరులు వచ్చారు. నోరు చపి చెడి ఉన్నది. ఆ నరులను చంపి, నాకు వండి పెట్టు" అని చెప్పాడు.

హిడింబ పాండవుల దగ్గరకు వెళ్లింది. పడుకొని ఉన్న పాండవులను, కాపలాగా ఉన్న భీముని చెట్టు చాటున నిలబడి చూచింది. భీముని మీద మనసు పడింది. వెంటనే, మానవ కాంత రూపం ధరించింది. అన్న చెప్పిన మాటలు మరిచిపోయింది.

(ఇక్కడ నన్నయ గారు ఒక పద్య పాదం రాసారు:

"పతిస్నేహము కామినులకు బలవంతము వెఱ నెయ్యములు వేయు తత్సదృశములే?"

అనగా భామలకు భర్త మీది ప్రేమ బలమైనది. మిగిలిన ప్రేమలు దానితో సమానం కావు. అది ఈనాడు అక్షర సత్యం అవుతూ ఉంది కదా. ఈ రోజుల్లో "ప్రేమ" అనే పదం ప్రతి నవలకు, సినిమాకు ముడి సరుకు అయిపోయింది. ప్రేమించిన వాడికోసం చిన్నప్పటినుండి కనిపెంచిన తల్లి తండ్రులప్రేమను తృణీకరించడం ఒక ఫాషన్ అయిపోయింది. ఇంట్లో కూడా చెప్పకుండా ప్రేమికుడితో వెళ్లడం, కష్టాల్లో ఇరుక్కోడం మనం చూస్తూనే ఉన్నాము. ఈనాటి యువత పోకడలను ఆ

నాడే నన్నయ గారు ఎంతో చక్కగా వర్ణించారు కదూ).

తన దగ్గరకు వస్తున్న హిడింబను చూచాడు భీముడు.

"నువ్వు ఎవరు? ఇక్కడకు ఎందుకు వచ్చావు?" అని అడిగాడు.

"మహాభాగా, నా పేరు హిడింబ. నేను హిడింబుడు అనే రాక్షసుని చెల్లెలిని. నిన్ను మోహించాను. నువ్వు నాకు భర్తవు అయితే నా అన్న నీకు హాని చెయ్యడు. కాబట్టి నన్ను వివాహమాడు. మా అన్న సంగతి నీకు తెలియదు. అతను ఎవరినీ లెక్కపెట్టడు. అతనికి భయపడని వాళ్లులేరు. నువ్వు ఒక లెక్కా. ఇది నా అన్నయ్య హిడింబాసురిడి వనము. అతను చూసిన మిమ్ములను బతుకనీయడు. నా తో రమ్ము. నిన్ను కోరిన చోటికి తీసుకొని పోతాను. మనం సుఖాలు అనుభవిస్తాము" అని బలవంతం చేసింది హిడింబ.

దానికి భీముడు "వీరు నా తల్లి, తమ్ములు. ఒక స్త్రీ కోసం వీళ్లను ఎలా వదలమంటావు?" అన్నాడు.

"ఐతే వీరలను నిద్ర లేపు. అందరం వెళ్లి పోదాము" అంది హిడింబ.

"అదేమిటి అలా అంటావు. ఎవరో రాక్షసుడు వస్తున్నాడని సుఖంగా నిద్రిస్తున్న తల్లిని, సోదరులను నిద్ర చెడగొట్టమంటావా? అన్నాడు భీముడు.

వెళ్లిన చెల్లెలు ఎంతకూ రాకపోతే, హిడింబాసురుడే అక్కడకు వచ్చాడు. అతనిని చూచి హిడింబ భీముని చాటుకు వెళ్లి దాక్కుంది.

"రాక్షసా, నువ్వు వధింబడుటకు ఉచితుడవు. నిన్ను వధించి, ఈ అడవిలో రాక్షస భయం లేకుండ చేస్తాను" అని హిడింబాసురుడి మీదికి ఉరికాడు భీముడు. ఇద్దరికి ఘోర యుద్ధం జరిగింది. వారు చేస్తున్న గర్జనలకు, కుంతీ,

మిగిలిన పాండవులు నిద్ర లేచారు. హిడింబను చూచారు.

"అమ్మా! నువ్వు ఎవరు?" అని అడిగింది కుంతి.

"అమ్మా! నేను ఇదుగో ఈ రాక్షసుడు హిడింబాసుని చెల్లెలును. నా పేరు హిడింబ. నీ కుమారుని భర్తగా వరించాను. నా అన్నయ్య, మీ కుమారుడు భీకరంగా యుద్ధం చేస్తున్నారు" అని చెప్పింది. ఇంతలో అర్జునుడు యుద్ధం జరిగే చోటికి వెళ్లాడు

"భీమా, తూర్పు అరుణంగా మారుతోంది. ఇది దుష్ట రాక్షసులకు అనుకూల వేళ. వెంటనే ఈ రాక్షసుడిని చంపు" అని అరిచాడు.

ఆ మాటలు విని భీముడు విజృంభించి హిడింబుని ఎత్తుకొని గిర గిరా తిప్పి నేల మీద పడేసాడు. హిడింబుడు నడుము విరిగి నేల మీద పడ్డాడు. ప్రాణాలు విడిచాడు.

హిడింబ కు ఆశ్చర్యం వేసింది. భీముడు హిడింబను చూచి "నువ్వు రాక్షస కాంతవు. మేము నిన్ను నమ్మము నువ్వు మా వెంట రావద్దు" అని అన్నాడు.

అప్పుడు హిడింబ కుంతీ దేవిని చూచి "అమ్మా. సర్వ ప్రాణులకు కామ సంబంధమైన కోరికలు సామాన్యంగా ఉంటాయి. కాని స్త్రీలలో అవి కొంచెం ఎక్కువగా ఉంటాయి. నేను భీముని మీద మనసు పడ్డాను. అతని కొరకు అందరిని వదులు కున్నాను. నా కోరిక తీరక పోతే నేను ప్రాణాలు విడుస్తాను. మీరు నన్ను స్వీకరిస్తే మీకు ఎంతో సహాయంగా ఉంటాను. నాకు జరిగింది, జరుగుతున్నది, జరగ పోయేది తెలుసు.

మీకు జరగ పోయే దానిని చెపుతాను వినండి. ఇక్కడికి కొంచెం దూరంలో శాలిహోత్రుడు అనే మహాముని ఆశ్రమము ఉంది. అక్కడ ఉన్న కొలను లో నీరు త్రాగితే ఆకలి దప్పులు ఉండవు. మీరు అక్కడ ఉండండి. మీకు కృష్ణద్వైపాయనుడు వచ్చి మీకు హితోపదేశం చేస్తాడు" అని చెప్పింది.

ఇది విని కుంతీ దేవి ఎంతో సంతోషించింది. భీముని చూచి "భీమా, నా మాట, నీ అన్న గారైన ధర్మజుని మాటగా వినుము. హిడింబ ఉత్తమ కాంత. ఈమెను పెళ్లి చేసుకో. నీకు మంచి జరుగుతుంది" అని చెప్పింది.

భీముడు తల్లి మాట ప్రకారము హిడింబను పెళ్లి చేసుకున్నాడు. తరువాత అందరూ శాలిహోత్రుని ఆశ్రమానికి వెళ్లారు.

ఒకరోజు వేద వ్యాసుడు వారి వద్దకు వచ్చాడు. "అమ్మా కుంతీ, ధర్మనందనా, కష్టాలు కలకాలం ఉండవు. మీకు మంచి రోజులు వస్తాయి. రాజ్యం లభిస్తుంది. ఇక్కడ కొన్ని రోజులు ఉండి తరువాత ఇక్కడకు దగ్గరలో ఉన్న ఏకచక్ర పురానికి వెళ్లండి. బ్రాహ్మణ రూపాలలో అక్కడ నివశించండి. తరువాత నేను వచ్చి చెయ్యవలసింది చెపుతాను." అని చెప్పాడు.

వేద వ్యాసుని మాట ప్రకారము పాండవులు శాలిహోత్రుని ఆశ్రమములో కొంతకాలం

నివశించారు.

ఇంతలో హిడింబ గర్భం ధరించింది. ఆమెకు ఘటోత్కచుడు జన్మించాడు. అతను అపరిమితమైన బలం కలవాడు. కామ రూపుడు. ఘటోత్కచుడు తండ్రులకు, కుంతీ దేవికి, నమస్కరించాడు. "అమ్మా నేను ఇక్కడే నా తల్లి తో పాటు ఉంటాను. మీరు తలచిన వెంటనే మీ దగ్గరకు వస్తాను" అని చెప్పాడు. తల్లిని తీసుకొనివెళ్లి పోయాడు.

శాలిహోత్రుని వద్ద, పాండవులుధర్మశాస్త్రాలు నీతి శాస్త్రాలు అభ్యసించారు. తరువాత వారు ఏకచక్రపురానికి బ్రాహ్మణవేషంలో బయలు దేరారు. పాండవులు, కుంతీ దేవి, జింక చర్మాలు ధరించి, నార చీరలతో, వేదపఠనం చేస్తూ ఏక చక్రపుర ము అనే అగ్రహారానికి వచ్చారు.

ఒక బ్రాహ్మణుడి ఇంటిలో తమ నివాసం ఏర్పరచుకున్నారు. ప్రతి రోజూ మౌనంగా

అందరి ఇళ్లకూ వెళ్లి బిక్ష స్వీకరించి, తీసుకొని వచ్చి, తల్లికి ఇచ్చేవారు. కుంతీ దేవి ఆ బిక్షను రెండు భాగాలు చేసి, అందులో ఒక భాగం భీమునికిపెట్టి, మిగిలినది, తను, మిగిలిన నలుగురు కొడుకులు తింటూ ఉండేవాళ్లు. సత్ప్రవర్తనులు, సహృదయులు అయిన వారిని చూచి ఆ అగ్రహారంలో వాళ్ళ అందరూ చాలా ఆనందపడేవాళ్లు.

ఒకరోజు, భీముడు, కుంతి ఇంట్లో ఉన్నారు. మిగిలిన వారు బిక్షాటనకు వెళ్లారు. ఆ సమయంలో ఆ ఇంటిలో నుండి రోదన ధ్వనులు వినపడ్డాయి. అవి విని కుంతీ దేవి భీముని పిలిచి

"నాయనా భీమసేనా! ఈ ఇంటి వారికి ఏదో కష్టం కలిగినట్టున్నది. వీరు మనకు ఉపకారం చేసారు. వాళ్ల ఉపకారాన్ని గుర్తించడం మనకు పుణ్యం. కాని దానికి ప్రత్యుపకారం చెయ్యడం ఎక్కువ పుణ్యం. కాని వారు మనకు చేసిన దానికన్న ఎక్కువ ప్రత్యుపకారం

చెయ్యడం ఉత్తమ మైన పుణ్యం. కాబట్టి మనకు ఉపకారం చేసిన వాళ్లకు తగిన ప్రత్యుపకారం చెయ్యడానికి ఆలోచించు" అని చెప్పింది.

(పై చెప్పినది లోక ధర్మము. కాని ఈ నాటి కలియుగ ధర్మం ఏమిటంటె, ఉపకారం చేసిన వాడికి ప్రత్యుపకారం చెయ్యక పోగా, వాడిని సర్వ నాశనం చెయ్యడం. కుంతీ దేవి చెప్పిన ఉపకార ధర్మాన్ని పాటిస్తే ఇన్ని నేరాలు ఘోరాలు, ఉండవు కదా.)

"అమ్మా! నీ ఆజ్ఞ అవశ్యం నెరవేరుస్తాను అమ్మా. తప్పకుండా వారికి ప్రత్యుపకారం చేస్తాను. నీవు వెళ్లి వారి శోక కారణం కనుక్కొని రా అమ్మా" అన్నాడు భీముడు.

సరే అని కుంతి వారి వద్దకు వెళ్లింది. రోదిస్తున్న ఆ ఇంటి యజమానిని వారి దుఖానికి కారణం అడిగింది.

"అమ్మా జనన మరణాలు, సంయోగ

వియోగాలు ప్రకృతి సిద్ధమైనవి. కాని వేదోక్తంగా వివాహ మాడిన భార్యను రాక్షసునికి ఎలా ఆహారంగా పంపగలను. పెళ్లి చేసి అత్త వారి ఇంటికి పంపవలసిన కూతురిని రాక్షసునికి ఆహారంగా ఎలా పంపగలను. నాకు, నా పితరులకు పిండోదకాలు ఇవ్వ వలసిన కుమారుడిని రాక్షసునికి ఆహారంగా ఎలా పంపగలను. అందుకని నేనే ఆ రాక్షసునికి ఆహారంగా వెళతాను" అని అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

దానికి ఆయన భార్య సమ్మతించలేదు. "నాథా, మిమ్మల్ని వివాహమాడినందుకు మీకు సంతాన ప్రాప్తికలిగించాను. నా బాధ్యత తీరిపోయింది. భర్త కంటే ముందు మరణించి, పుణ్యలోకాలకు వెళతాను. పైగా భర్త లేని స్త్రీలకు అవమానాలు ఎక్కువ. ప్రతివాడూ కోరతాడు. పైగా భార్య మరణిస్తే భర్త మరొకరిని వివాహం చేసుకోవచ్చు. కాని భర్త మరణిస్తే, భార్య వేరే వివాహం చేసుకోలేదు కదా. అది లోక నింద కదా. కాబట్టి నేనె ఆ రాక్షసునికి

ఆహారంగా వెళతాను. మీరు వేరే వివాహం చేసుకొని, పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పించి, ప్రయోజకులను చెయ్యండి" అని చెప్పింది ఆ ఇల్లాలు.

అప్పుడు కూతురు ముందుకు వచ్చి, "అమ్మా నాకు వివాహం చేసి మీకు మనుమలు కలిగే కంటే, మీరు జీవించి వుంటే మీకు ఇంకా ఎక్కువ మంది సంతానం కలుగుతారు. అందు కని నేను రాక్షసునికి ఆహారంగా వెళతాను" అని చెప్పింది.

ఇంతలో చిన్న వాడైన కుమారుడు, ధైర్యం గా, ఒక చిన్న కర్ర తీసుకొని, "తండ్రీ నేను వెళ్ళి ఆ రాక్షసుడిని చంపుతాను" అని వచ్చీ రాని మాటలతో ఓదార్చాడు.

ఇదే మీ కుంతికి అర్ధం కాలేదు. "అమ్మా రాక్షసుడు ఎవరు? మీరు వాడికి ఆహారం కావడం ఏమిటి? వివరంగా చెప్పండి" అని అడిగింది.

దానికి ఆ బ్రాహ్మణుడు ఈవిధంగా చెప్పాడు. "అమ్మా ఇక్కడికి ఆమడ దూరాన, యమునా నదీ తీరాన, బకుడు అనే రాక్షసుడు ఉన్నాడు. వాడు ప్రతిరోజూ వచ్చి గ్రామాల మీద పడి అందరిని భక్షిస్తుండేవాడు. అందుకని, గ్రామస్తులు, బ్రాహ్మణులు అందరూ కలిసి వాడితో ఒక ఒప్పందం చేసుకున్నారు. ప్రతిరోజూ ఇంటికి ఒక మనిషి, రెండు దున్న పోతులు, బండెడు ఆహారం వాడికి పంపాలి. ఈ దేశాన్ని ఏలే రాజు కూడా వాడిని ఎదిరించే శక్తి లేనందున, ఆయన దీనిని గురించి ఆలోచించలేదు.

(ఈ రోజుల్లో కూడా, వీధి గూండాలు, రౌడీలు, షాప్ కు ఇంత అని రౌడీ మామూళ్లు వసూలుచేస్తున్నారు. పోలీసులు కూడా, బార్లకు, వైన్ షాపులకు, నెల సరి మామూళ్ల వసూలు చేస్తున్నారు. రాజకీయనాయకులు కూడా తమ తమ ప్రాంతాల్లో చేశే అభివృద్ధి పనులకు, కట్టె ప్రాజెక్టులకు, కోట్ల కొలది డబ్బు రాయల్టీ పేరుతో మామూళ్ళ కింద వసూళ్ల

చేస్తున్నారు.వీరందరూ తెల్ల బట్టలు వేసుకున్న బకాసురులు కారా! ఆరోజుల్లో ఒకడే బకాసురుడు. ఈ రోజుల్లో వీధి వీధికీ, ఊరి ఊరికీ, జిల్ల జిల్లాకూ బకాసురులు ఉన్నారు. ఆ నాటి రాజు మాదిరి, ఈ నాటి ప్రభుత్వాలు కూడా వారిని అదుపుచెయ్యలేక చేతులు ఎత్తేసాయి కదా! ఈ బకాసురులను అంతం చెయ్యడానికి దేశాన్ని రక్షించడానికి ఊరి ఊరికీ జిల్లా జిల్లకూ ఒక్కొక్క భీమసేనుడు పుట్టాలి. అప్పుడే మనకు విముక్తి. ఇదీ నేటిభారతం)

అప్పుడు కుంతీ దేవి ఆ బ్రాహ్మణుడితో, "అయ్యా, మీరు దుఃఖించవలదు. ఈ ఆపద తొలిగే ఉపాయం నాకు తెలుసు. మీకు ఒక్కడే కొడుకు. నాకు ఐదుగురు కొడుకులు. వారిలో ఒకరిని నేను ఆహారంగా పంపుతాను" అని చెప్పింది.

దానికి ఆ బ్రాహ్మణుడు "అమ్మా, వద్దమ్మా, మీరు మాకు అతిధులు. మిమ్మల్ని ఆ కోరిక కోరడం మహాపాపం. పైగా బ్రాహ్మణ హత్య ఘోర

పాపము" అని అన్నాడు.

దానికి కుంతీ దేవి నవ్వి. "అయ్యో! మీరు ఏమీ ఆలోచించకండి. నాకుమారుడు అమిత బలవంతుడు. ఇది వరకు కొంత మంది రాక్షసులను చంపాడు. ఆ బకుడిని చంపి వస్తాడు" అని చెప్పింది.

వెంటనే భీముని పిలిచి జరిగిందంతా సవిస్తరంగా చెప్పింది. భీముడు సంతోషంగా ఒప్పుకున్నాడు. ఇంతలో ధర్మజుడు, మిగిలిన తమ్ములు వచ్చారు. జరిగిందంతా తెలుసుకున్నాడు ధర్మజుడు. సంతోషంగా ఉన్న భీముని చూచాడు.

తల్లిని పిలిచి "అమ్మా భీముడు ఎవ్వరితోనో యుద్ధానికి పోతున్నట్టున్నాడు. తనంతట తానే వెళుతున్నాడా లేక మీరు వెళ్ళమన్నారా?" అని అడిగాడు.

జరిగిందంతా ధర్మజునికి చెప్పింది

కుంతి. "అమ్మా! అమ్మా! ఇదే మిటమ్మా! పరాయి వాళ్ల కోసం కన్నకొడుకును బలి ఇస్తావా అమ్మా. అమ్మా నీకు మతి భ్రమించినట్లుంది. భీమసేనుడు పిడిచిపెట్ట దగినవాడా చెప్పమ్మా?" అన్నాడు.

"నాయనా ధర్మజా, భీముని బలము తెలియక నేను ఈపని చెయ్యడం లేదు. ఈ భీమసేనుని శక్తి నీకు తెలియదు. వీడు పుట్టిన పదవ రోజున వీడు నా చెయ్యి జారి ఒక కొండరాయిమీద పడ్డాడు.ఆ పెద్ద బండ రాయి పొడి పొడి అయింది. వీడు వజ్రకాయుడు. ఆ రాక్షసుడిని చంపి ఈ అగ్రహారానికి శాశ్వతంగా రాక్షస బాధ తీర్చగలడు.

క్షత్రియ ధర్మాన్ని ఇది వరకు వేద వ్యాసుడు చెప్పగా విన్నాను. అది నీకు చెపుతాను విను. ఉత్తమ క్షత్రియుడు, ఇతరుల దుఖాలను తొలగించడానికి పుట్టిన వాడు. మృత్యుభయంతో ఉన్న బ్రాహ్మణులను రక్షిస్తే పుణ్యలోకాలు పొందుతాడు. సాటి క్షత్రియుడిని రక్షిస్తే కీర్తిని పొందుతాడు. వైశ్యులను శూద్రులను రక్షిస్తే, ప్రజల అనురాగాన్ని పొందుతాడు. ఇది క్షత్రియ ధర్మం. మనకు ఆశ్రయం ఇచ్చిన ఈ బ్రాహ్మణ కుటుంబానికి

ప్రత్యుపకారం చేసే అవకాశం లభించింది" అని చెప్పింది.

వెంటనే ఆ ఊరి వారందరూ రక రకాలైన పిండి వంటలు, ఆహార పదార్థాలు తయారు చేసారు. ముందుగా భీముడికి తృప్తిగా కడుపునిండా భోజనం పెట్టారు. ఒక బండి నిండా ఆహార పదార్థాలు నింపారు. భీముడు ఆ బండి తోలుకుంటూ బకాసురుడు ఉండే చోటుకు వెళ్లాడు. యమునా నదీ తీరాన బండి నిలిపాడు. బకాసురుడిని పిలిచాడు. వాడు ఎంతకూ రాలేదు. వాడు వచ్చేదాకా ఊరికే ఉండటం ఎందుకని, ఆ బండిలో ఆహార పదార్థాలన్నింటిని ఒక్కొక్కటిగా తినేసాడు.

బకాసురుడికి ఏమీ తోచడంలేదు. ప్రతి రోజూ భయం భయంగా తన వద్దకు వచ్చే నరుడు ఈ రోజు ఎక్కడో ఉండి పిలుస్తున్నాడు ఏమిటి అనుకున్నాడు. ఎంతకూ నరుడు రాక పోతే ఆకలి బాధకు తట్టుకోలేక బండిని వెతుక్కుంటూ వెళ్లాడు. బండి మీద కూర్చుని

ఆహారాన్ని తింటున్న భీముడిని చూచాడు.

తన కోసం తెచ్చిన ఆహారాన్ని నరుడు తినడం చూచి సహించలేకపోయాడు. భీముడిని పిడికిలితో ఒక్క పోటు పొడిచాడు. భీముడికి చీకకుట్టినట్లైనా లేదు. బకుడు పక్కనే ఉన్న ఒక చెట్టును పెరికి భీముని మీదవేసాడు. భీముడికి కోపం వచ్చింది. బకాసురుడి మీద కలియబడ్డాడు. ఇద్దరికి ఘోర యుద్ధం జరిగింది. భీముడు బకాసురుడితో మల్ల యుద్ధం చేసి, చంపేసాడు.

బకాసురుడు పెట్టిన కేకలకు అతని బంధువులు అందరూ అక్కడకు వచ్చారు. "చూడండి. ఈ బకాసురుడు చచ్చాడు. మీరు కూడా ఏక చక్రపుర వాసులకు ఏమన్నా ఆపద తలపెడితే పీడిలాగే చస్తారు" అని చెప్పాడు.

చేసేది లేక భీమునికి భయపడి వారందరూ దానికి ఒప్పుకున్నారు. భీముడు బకాసురుని కళేబరాన్ని ఈడ్చుకొని వచ్చి

ఏకచక్రపురం పొలిమేరలలో పడవేసాడు. అది చూచి ఏకచక్రపుర వాసులందరూ సంతోషించారు. భీముని పరాక్రమాన్ని ఎంతగానో కొనియాడారు.

ఇంటికి వెళ్లి తల్లి కుంతికి, అన్నయ్య ధర్మజునకు, తమ్ములకు జరిగిందంతా చెప్పాడు. ఆ ఊరి వారందరూ "వీడు సామాన్య బ్రాహ్మణుడు కాదు. మంత్ర సిద్ధి కలవాడు" అంటూ భీముని చూడానికి అతను ఉన్న ఇంటికి వచ్చారు.

(మహాభారతము—ఆది పర్వము—షష్ఠాశ్వాసము)

(sixth chapter completed)

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎఱ్ఱాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)

Modali Venkata Subrahmanyam,
B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.
Ph:040-24048104

# మహాభారతం

## ఆది పర్వము

### సప్తమాశ్వాసము

మహా భారత కథను వినిపిస్తున్న ఉగ్రశ్రవసుడు (సూతుడు) శౌనకాది మహా మునులను చూచి ఇలా చెప్ప సాగాడు.

భీముడు బకాసురుని చంపిన తరువాత, పాండవులు కుంతీ దేవి ఏక చక్రపురం లో కొంత కాలం నివశించారు.

ఒక రోజు ఒక బ్రాహ్మణుడు వారి ఇంటికి వచ్చాడు. ధర్మ రాజు ఆ బ్రాహ్మణుడికి అతిధి సత్కారాలు గావించాడు.

"బ్రాహ్మణోత్తమా, తమరు ఏ ఏ దేశాలు తిరిగారు? అక్కడ విశేషాలు ఏమిటి? అని

అడిగాడు. దానికి ఆ బ్రాహ్మణుడు ఇలా చెప్ప సాగాడు.

"నేను ఎన్నో దేశాలు చూచాను కాని ద్రుపద రాజు పాలించే పాంచాల దేశాన్ని మించిన దేశం లేదు. ద్రుపద మహా రాజుకు అగ్ని గుండం నుండి ఉద్భవించిన కుమార్తె ఉన్నది. ఆమె పేరు ద్రౌపది. ఆమెకు వివాహం చేయ సంకల్పించాడు ద్రుపదుడు."

అది విని ధర్మ రాజు ఆశ్చర్య పడి "బ్రాహ్మణోత్తమా! ఆమె ఎందుకు మానవులకు జన్మించలేదు? ఆమెను ద్రుపదుడు ఏ విధంగా పొందాడు? సవిస్తరంగా చెప్పండి" అని అడిగాడు.

ఆ బ్రాహ్మణుడు ఈ విధంగా చెప్ప సాగాడు. "ద్రోణుడు, ద్రుపదుడు మంచి స్నేహితులు. వారిరువురు ఒకే గురువు గారి దగ్గర వేదాలు చదువుకున్నారు. అగ్నివేశుని వద్ద ధనుర్విద్యను నేర్చుకున్నారు. తరువాత వారికి విరోధం వచ్చింది. ద్రోణుడు హస్తినా పురానికి వెళ్లాడు. అక్కడ కురుకుమారులకు అస్త్ర విద్య నేర్పించాడు. గురుదక్షిణ గా ద్రుపదుని బంధించి తెమ్మని

కోరాడు. ఆ విధంగానే అర్జునుడు ద్రుపదుని బంధించి తెచ్చి గురువుగారి కాళ్ల ముందు పడవేశాడు. ద్రోణుడు ద్రుపదుని వేళన చేసి విడిచి పెట్టాడు.

ఆ అవమానాన్ని భరించలేక పోయాడు ద్రుపదుడు. ఎలాగైనా ద్రోణుని చంపే కొడుకును, అర్జునుని వివాహ మాడే కూతురిని పొందాలని నిశ్చయించుకున్నాడు.

యాజుడు అనే బ్రాహ్మణోత్తముని, యాజ్ఞీకుడిగా చేసుకొని యజ్ఞం మొదలుపెట్టాడు. ద్రుపదుని, ఆయన భార్య కోకిలా దేవిని కూర్చోపెట్టి యాజుడు వారి చేత యజ్ఞం చేయించాడు.

అప్పుడుయజ్ఞ కుండం లోనుండి భయంకరమైన శరీరం కల వాడు, పెద్ద ధనుస్సు కల వాడు ఐన ఒక మహా పురుషుడు ఉద్భవించాడు. తరువాత ఒక అద్భుత సౌందర్య రాసి అగ్ని కుండం లో నుండి బయటకు వచ్చింది.

అప్పుడు ఆకాశ వాణి, వారికి ధృష్టద్యుమ్నుడు, కృష్ణ(నల్లని శరీరము కలది) అని నామ కరణం చేసింది.

ఇప్పుడు ఆ కన్యకు వివాహ వయసు వచ్చింది. ద్రుపదుడు ఆమెకు వివాహం చేయ నిశ్చయించాడు. కాని ద్రుపదుడు తన కుమార్తెను అర్జునుడికి ఇచ్చి వివాహం చేయ సంకల్పించాడు. అర్జునుడు, తన సోదరులతో సహా లక్క ఇంటిలో మృతిచెందాడని తెలిసి చాలా దుఃఖించాడు.

కాని ద్రుపదుని పురోహితుడు మాత్రం "పాండవులకు అన్నియు శుభ శకునములు గోచరించు చున్నవి.వారుతప్పక బతికే ఉన్నారు" అని చెప్పాడు.

దానికి ఒక ఉపాయం ఆలోచించాడు ద్రుపదుడు. ఒక బలిష్ఠమైన ధనుస్సును తయారుచేయించాడు. ఒక మత్స్య యంత్రాన్ని నిర్మించాడు. ఆ బలిష్ఠమైన ధనుస్సును ఎక్కుబెట్టి ఆ మత్స్యయంత్రమును కొట్టినవారికి

తన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తానని స్వయం వరం ప్రకటించాడు. అందుకని రాజు లంతా వెళుతున్నారు." అని ఆ బ్రాహ్మణుడు ధర్మరాజుకు చెప్పాడు.

ఇది అంతా విని కుంతీ దేవి ధర్మ రాజును చూచి, "ధర్మజా, మనం చాలా కాలంగా ఈ బ్రాహ్మణుని ఇంటిలో ఉన్నాము. ఇతరుల ఇండ్లలో ఎక్కువ కాలం ఉండటం ఉచితం కాదు. అందువలన మనం కూడా పాంచాల దేశం పోదాము." అని చెప్పింది.

దానికి ధర్మజుడు సరే అన్నాడు. అందరూ పాంచాల దేశం ప్రయాణం అయ్యారు. వారు పాంచాల దేశం వెలుతూ మార్గ మధ్యంలో వ్యాస మహా ముని ఆశ్రమం దర్శించారు.

వ్యాస మహాముని వారిని ఆశీర్వదించి "మీరు పాంచాలపురానికి వెళ్లండి మీకు మేలు జరుగుతుంది" అని చెప్పాడు. వ్యాస మహాముని ఆశీర్వాదం తీసుకొని వారు పాంచాల పురానికి

ప్రయాణం అయ్యారు.

ఆ ప్రకారం పాండవులు రాత్రిళ్ల పగళ్ల ప్రయాణం చేస్తున్నారు. ఒక రోజు అర్ధ రాత్రి వారు గంగా తీరానికి చేరుకున్నారు. అది సోమశ్రవ తీర్థము. అందులో స్నానం చేయాలని అనుకున్నారు.

ఆ సమయానికి అక్కడకు అంగార పర్ణుడు అనే గంధర్వుడు తన భార్యలతో కూడి విహారానికి గంగా తీరానికి వచ్చాడు. పాండవులను చూచాడు. అంగార పర్ణుడికి కోపం వచ్చింది.

"మానవా, ఇది అర్ధరాత్రి సమయము. యక్షులు, రాక్షసులు, గంధర్వులు తిరిగే సమయము. ఈ వేళలలో మానవులు తిరగరాదు. నేను అంగార పర్ణుడు అనే గంధర్వుడిని. ఈ అడవి, గంగాతీరం నా అధీనంలో ఉన్నాయి. మీరు ఇక్కడ నుండి వెళ్లి పోండి. లేక పోతే నా బాణాలకు బలి అవుతారు" అని గర్వంగా పలికాడు.

దానికి అర్జునుడు "నువ్వు చెప్పిన మాటలు బలహీనులైన మానవులకు వర్తిస్తాయి కాని మా వంటి మహా వీరులకు కాదు. ఇంకొక్క మాట ఈ భూమి మీద ఉన్న నదులు అన్నియు అందరు జనులకు ఉపయోగ కరమైనవి. పైగా ఈ పవిత్ర గంగా నది జనులందరికి చెందిన పుణ్య నది. ఇది ఏ ఒక్కరి సొంతమూ కాదు" అని పలికాడు.

తనకు ఒక మానవుడు ఎదురు చెప్పినందుకు అంగార పర్ణుడు కోపించాడు. అర్జునుని మీద పదునైన బాణాలు వేసాడు. అర్జునుడు ఆ బాణాలను, తన చేతిలోని కొరివితో అడ్డుకున్నాడు.

అంగార పర్ణుని చూచి "ఓయి గంధర్వా, ఇది ఆగ్నేయాస్త్రము. దీనిని పూర్వము అగ్నిదేవుడు బృహస్పతికి ఇచ్చాడు. అతడు భరద్వాజునికి ఇచ్చాడు. భరద్వాజుడు దానిని పరశురామునికి, పరశురాముడు ద్రోణుడికి, ఇచ్చారు. నా గురువైన ద్రోణుడు నాకు ప్రసాదించాడు."అంటూ ఆగ్నేయాస్త్రాన్ని అంగారపర్ణుని మీద ప్రయో

గించాడు. వెంటనే అతని రథం కాలి పోయింది. అంగార పర్ణుడు నేల మీద పడ్డాడు. అతనిని అర్జునుడు ధర్మరాజు వద్దకు తీసుకొని వచ్చాడు.

"అర్జునా, ఓడిపోయిన వాడిని,శౌర్యం కోల్పోయిన వాడిని శిక్షించరాదు. విడిచి పెట్టుము" అన్నాడు.

అప్పుడు అంగార పర్ణుడు అర్జునుని చూచి, "అర్జునా, నీ పరాక్రమానికి మెచ్చాను. నీతో స్నేహం చెయ్యాలని ఉంది. నేను నీకు నాకు లభించిన చాక్షుసీ విద్యను ఇస్తాను. నీకు మహా వేగం కల గుర్రాలను ఇస్తాను. నాకు నీ వద్ద ఉన్న అగ్నేయాస్త్రాన్ని ఇవ్వు" అని అడిగాడు.

దానికి అర్జునుడు "గంధర్వా, మనం ఎంత స్నేహితులమైనా, నీ వద్ద నుండి విద్యలను, ధనాన్ని స్వీకరించలేను. నీకు ఆగ్నేయాస్త్రాన్ని ఇస్తాను. నీ వద్ద నుండి గుర్రాలను స్వీకరిస్తాను" అని అన్నాడు.

దానికి గంధర్వుడు సమ్మతించాడు. అర్జునుడు గంధర్వుని చూచి "గంధర్వా, మేము ధర్మబుద్ధి కలవాళ్లము. మమ్మలను చూచి నువ్వు ఎందుకు అలా గర్వంగా మాట్లాడావు?" అని అడిగాడు. .

"అర్జునా, మీరు ఎవరో నాకు తెలియును. కాని ఆడ వాళ్ల తో విహరించేవాళ్లు ఎంత వివేకము కల వాడు అయినా అహంకారం కలిగి ఉంటాడు. అందువలననే నేను వివేకం కోల్పోయి మీతో అలా మాట్లాడాను. కాని ఆ సమయంలో మనకు ఒక బ్రాహ్మణుడు పురోహితుడుగా ఉంటే, ధర్మాధర్మ విచక్షణ చేస్తాడు. మనలను తప్పు చెయ్యకుండా నివారిస్తాడు. ఓ తాపత్యా, మరి మీరు కూడా పురోహితుడు లేకుండా ఇలా సంచరించడం భావ్యం కాదు కదా. అందువలన ఒక ఉత్తమ బ్రాహ్మణుడిని పురోహితుడినా చేసుకోండి." అని అన్నాడు.

అప్పుడు అర్జునుడికి ఒక సందేహం కలిగింది. "గంధర్వా, మేము కుంతీ

పుత్రులము. నువ్వు తాపత్యా అన్నావు. మేము తాపత్యులము ఎలా అయ్యాము?" అని అడిగాడు.

దానికి ఆ గంధర్వుడు ఇలా చెప్ప సాగాడు: "సూర్యునికి కూతురు, సావిత్రికి చెల్లెలు అయిన తపతి అనే కన్య మహా సౌందర్యవతి. గుణవతి. అజామీఢుని కొడుకు పేరు సంవరణుడు. ధర్మ పరుడు. అతను సూర్యుని గూర్చి తపస్సు చేస్తున్నాడు. ఇది తెలిసిన సూర్యుడు, సంవరణుడే తన కూతురు తపతికి తగిన భర్త అను కున్నాడు.

ఒక రోజు సంవరణుడు అడవికి వేటకు వెళ్లాడు. తిరిగి తిరిగి అలసిపోయి తిరుగు తుండగా, ఆ అరణ్యములో విహరిస్తున్న తపతిని చూచాడు. తపతి సౌందర్యానికి సమ్మోహితు డయ్యాడు. ఆమెను చూచి "ఓ అబలా, నీవు ఎవరు? ఈ అరణ్యములో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు?" అని అడిగాడు. కాని తపతి బదులు చెప్పకుండా వెళ్లి పోయింది.

సంవరణుడు ఆమె మీద మోహం తో పిచ్చి వాడి లాగా ఆమె కోసం వెదుకుతున్నాడు. తపతి కూడా సంవరణుడిని చూచి మోహించింది. అతని దగ్గరకు వచ్చి "ఓ రాజా, నువ్వు చూచి ఎందుకు మోహం చెందావు? అని అడిగింది. దానికి సంవరణుడు "ఓ సౌందర్యవతీ, నేను ఎవరికీ భయపడలేదు. కాని నీ సౌందర్యం చూచి నువ్వు నాకు దక్కవేమో అని భయపడుతున్నాను. మన్మధ బాధ భరించలేకుండా ఉన్నాను నిన్ను గాంధర్వ వివాహం చేసుకుంటాను" అని అడిగాడు.

తపతి అతనిని చూచి నవ్వి "నేను సూర్యుని కుమార్తెను. సావిత్రి కి చెల్లిని. నా పేరు తపతి.నాకు స్వతంత్రము లేదు. నీకు నాపై ప్రేమ ఉంటే, నా తండ్రిని అడుగు. మన పెండ్లి జరుగుతుంది" అని చెప్పి వెళ్లి పోయింది. అప్పటి నుండి సంవరణుడు అక్కడే ఉండి సూర్యుని పట్టుదలతో ఆరాధిస్తున్నాడు.

ఒక రోజు వసిష్టుడు సంవరణుడి దగ్గరకు వచ్చాడు. అతని బాధను తెలుసుకున్నాడు.

వెంటనే సూర్యుని వద్దకు వెళ్లాడు. వసిష్ఠుని చూచి సూర్యుడు అర్ఘ్య పాద్యాలు ఇచ్చి సత్కరించాడు. వచ్చిన కారణం అడిగాడు.

"పూరు వంశజుడు, ధర్మ పరుడు, సద్గుణ సంపన్నుడు అయిన సంవరణుడు నీ కుమార్తె తపతిని చూచి మోహించాడు. నువ్వు నీ కుమార్తెను అతనికి ఇచ్చి వివాహం చెయ్యాలి" అని చెప్పాడు. సూర్యుడు కూడా తన కోరిక తీరబోతున్నందుకు సంతోషించాడు. తపతిని వసిష్ఠునితో సంవరణుడి వద్దకు పంపించాడు. వసిష్ఠుడు ఇద్దరికి వివాహం జరిపించాడు. సంవరణుడికి, తపతికి కురు మహారాజు జన్మించాడు. మీరు కురు వంశజులు కాబట్టి, మీరు తాపత్యులు అయ్యారు" అని వివరించాడు అంగార పర్ణుడు.

అప్పుడు అర్జునుడు అంగార పర్ణుని చూచి "గంధర్వా, మా పూర్వులకు గురువులు పురోహితులు అయిన వసిష్ఠుని గురించి వినాలని ఉంది." అని అడిగాడు.

అంగార పర్ణుడు అర్జునునితో ఇలా చెప్పసాగాడు.

పూర్వం కన్యాకుబ్జ నగరాన్ని విశ్వామిత్రుడు అనే మహా రాజు పరిపాలిస్తుండేవాడు. ఒక రోజు తన సేనలతో సహా అరణ్యానికి వేటకు వెళ్లాడు. వేటాడి అలసిపోయి సమీపములో ఉన్న వసిష్ట మహాముని ఆశ్రమానికి వెళ్లాడు. వసిష్టుడు విశ్వామిత్ర మహారాజునకు అతిథి సత్కారాలు గావించాడు.

వసిష్టుని వద్ద నందిని అని ఒక కామ ధేనువు ఉంది. విశ్వామిత్రునికి అతని అపార సేనా వాహినికి భోజన సత్కారాలు చెయ్యమని నందినికి చెప్పాడు. నందిని వారందరికి ఇష్టమైన వంటకాలతో భోజనం పెట్టింది. ఇది చూచి విశ్వామిత్రుడు ఆశ్చర్యపోయాడు.

లక్ష పాడి ఆవులు ఇస్తాను ఆ కామ ధేనువును ఇమ్మని వసిష్టుని అడిగాడు విశ్వామిత్రుడు. వసిష్టుడు దానికి నిరాకరించాడు.

బలవంతంగా ఆ ధేనువును తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు విశ్వామిత్రుడు. నందిని వసిష్ఠుని వైపు చూసింది. వసిష్ఠుడు మౌనంగా చూస్తున్నాడు.

నందిని విజృంభించింది. తన శరీరం నుండి అనేక మంది సైన్యాలను పుట్టించింది. వారందరూ విశ్వామిత్రుని సైన్యాలను చించి చెండాడారు.

విశ్వామిత్రునికి జ్ఞానోదయం అయింది. క్షాత్రబలం కన్నా తపో బలం గొప్పది అని తెలుసుకున్నాడు. రాజ్యాన్ని విడిచి పెట్టి తపస్సుకు వెళ్లిపోయాడు. దివ్య శక్తులను పొందాడు. కాని వసిష్టుని మీద మత్సరం మాన లేదు.

వసిష్టుడు కల్మాష పాదుడు అనే మహా రాజుకు యాజకుడు (యజ్ఞములు చేయించే పురోహితుడు) గా ఉంటున్నాడు. కల్మాష పాదునకు యాజకుడు కావాలని విశ్వామిత్రుడు కూడా

ప్రయత్నిస్తున్నాడు.

ఒక రోజు కల్మాష పాదుడు వేటకు వెళ్లాడు. అలసిపోయి సమీపములో ఉన్న వసిష్టుని ఆశ్రమానికి వెళుతున్నాడు. దారిలో వశిష్టుని నూర్గురు కుమారులలో పెద్ద వాడైన శక్తి ఎదురుగా వస్తున్నాడు. కల్మాష పాదుడు గర్వంతో శక్తిని తప్పుకొని తనకు దారి ఇవ్వమన్నాడు.

"రాజా, ఎంతటి గొప్ప వారైనా, బ్రాహ్మణులు ఎదురుగా వచ్చినపుడు తప్పుకొని దారి ఇస్తారు. ఇది ధర్మం" అని అన్నాడు. ఆ మాటలకు కోపించి, కల్మాష పాదుడు తన చేతికర్రతో శక్తిని కొట్టాడు.

శక్తికి కోపం వచ్చింది. "నన్ను రాక్షస బుద్ధితో అవమానించావు. నువ్వు రాక్షసుడివై నర మాంసం తింటూ జీవించు" అని శాపం ఇచ్చాడు.

అప్పుడు కళ్లు తెరిచాడు కల్మాష పాదుడు.

అతనిని వసిష్టుని పెద్ద కుమారుడిగా గుర్తిం చాడు. శాప విమోచన కొరకు ప్రార్ధించాడు.

ఇదంతా దూరం నుండి చూస్తున్న విశ్వా మిత్రుడు, కల్మాష పాదుని మనస్సులోకి కింక రుడు అనే రాక్షసుని ప్రవేశ పెట్టాడు. అప్పటి నుండి కల్మాష పాదుడు రాచ కార్యాలు మాని వేసాడు.

ఒక రోజు ఒక బ్రాహ్మణుడు కల్మాష పాదుని వద్దకు వచ్చాడు. తనకు మాంసాహారం భోజనం కావాలని అడిగాడు. "సరే" అని వెళ్లాడు కాని మరిచిపోయాడు. రాత్రి పొద్దు పోయిన తరువాత ఆ విషయం గుర్తుకు వచ్చింది. వెంటనే వంట వాడిని పిలిచి "నేను ఒక బ్రాహ్మణుడికి మాంసాహారం భోజనం పెడతాను అని చెప్పాను. అతనికి భోజ నం పెట్టు" అని చెప్పాడు.

దానికి వంట వాడు "మహా రాజా, ఈ రాత్రప్పుడు మాంసం ఎక్కడ దొరుకుతుంది?" అని అన్నాడు. అప్పటికే కింకరుడు కల్మాష

పాదుని మనసులో ఆవేశించి ఉండటం వల్ల "నీ ఇష్టం. నర మాంసమైనా వండించి పెట్టు" అని అన్నాడు.

సరే అని వంట వాడు ఆ బ్రాహ్మణుడికి నర మాంసం రుచిగా వండి పెట్టాడు. ఆ బ్రాహ్మణుడు దానిని తిన్నాడు. కాని తాను తిన్నది నర మాంసం అని గ్రహించాడు. ఆ బ్రాహ్మణునకు కోపం వచ్చింది "నర మాంసంతో నాకు భోజనం పెట్టావు కాబట్టి నువ్వు నర మాంసం తినే రాక్షసుడివై పో" అని శాపం పెట్టాడు. వెంటనే కల్మాష పాదుడు రాక్షసుడిగా మారి పోయాడు.

కల్మాష పాదుడు వెంటనే శక్తి వద్దకు వెళ్ళి "దీనికంతా నువ్వే కారణం. ముందు నిన్నే తింటాను" అని శక్తిని చంపి తిన్నాడు. అంతటితో ఆగ కుండా వసిష్ఠుని పుత్రులందరిని చంపి తిన్నాడు.

తన నూరుగురు పుత్రులూ రాక్షసునికి ఆహారం కావడం చూచి వసిష్టుడు తట్టుకోలేక

పోయాడు. పుత్ర శోకం తో కుమిలి పోయాడు. ఆత్మ హత్య చేసుకోవాలని ఎంతో ప్రయత్నించాడు. కాని సఫలం కాలేదు.

ఇదంతా శక్తి భార్య, వసిష్ఠుని కోడలు, అదృశ్యంతి, చూస్తూ ఉంది. అప్పుడు ఆమె గర్భవతి. ఆమె కడుపులో ఉన్న బిడ్డ వేదాలు సుస్వరంతో వల్లె వేస్తున్నాడు. అది విని వసిష్ఠుడు ఆశ్చర్యపోయాడు. తన మనుమడిని చూడాలని అనుకున్నాడు. ఆత్మ హత్యా యత్నం విరమించాడు.

ఒక రోజు రాక్షస రూపంలో ఉన్న కల్మాష పాదుడు అదృశ్యంతి మీద పడి చంప పోయాడు. వసిష్ఠుడు మంత్ర జలం చల్లాడు. కల్మాష పాదుడు శాప విముక్తుడు అయ్యాడు.

కల్మాష పాదుడు వసిష్ఠునకు నమస్కరించి "మహా మునీ నీ దయవల్ల నాకు శాప విమోచనం అయింది" అన్నాడు.

"బ్రాహ్మణులను అవమానిస్తే వచ్చే అనర్థాలు

చూసావు కదా. ఇంకనైనా బ్రాహ్మణులను పూజించు" అని హితభోధ చేసాడు.వసిష్టుని ఆశీర్వాదము తీసుకొని కల్మాష పాదుడు అయోధ్యా నగరానికి వెళ్లి రాజ్యం చేస్తున్నాడు.

కాని రాక్షస రూపంలో ఉన్నపుడు కల్మాష పాదుడు, ఒక నాడు, ఒక బ్రాహ్మణ దంపతులు కామక్రీడలలో ఉండగా, ఆ బ్రాహ్మణుడిని చంపి తిన్నాడు. దానికి కోపించి ఆ బ్రాహ్మణ వనిత "స్త్రీ తో సంభోగం చేసినపుడు నువ్వు కూడా నా భర్త మాదిరి చస్తావు" అని శపించింది. అందువలన కల్మాష పాదుడు భార్య తో కలిసి సంతానం పొందలేక పోయాడు.

సంతాన కావాలనే కోరిక అధికం కావడం తో, వశిష్ఠుని తనకు సంతానం ప్రసాదించమని కోరాడు. వసిష్ఠుడు అలాగే అన్నాడు. కల్మాష పాదుడు ఋతు స్నానం చేసిన తన భార్య మదయంతిని వసిష్ఠుని వద్దకు పంపాడు. అతని అనుగ్రహంతో మదయంతి గర్భం దాల్చింది. పన్నెండేళ్లు గడిచాయి. కాని ఎంతకూ ప్రసవం

కాలేదు. అందుకని ఒక పదునైన రాతి ముక్కతో తన గర్భం చీల్చుకుంది. ఆమెకు అశ్మకుడు అనే రాజర్షి జన్మించాడు

(దీని వలన ఆ రోజుల్లోనే సిజేరియన్ ఆపరేషన్లు జరిగాయి అని అనుకోవచ్చునా. ఏమో!).

అదే సమయానికి వశిష్టుని పెద్ద కుమారుడైన శక్తి భార్య అదృశ్యంతికి కూడా ఒక పుత్రుడు కలిగాడు. అతనే పరాశరుడు. పరాశరుడు పెరిగి పెద్దవాడు అయ్యాడు. తన తండ్రి శక్తిని ఒక రాక్షసుడు చంపాడని తన తల్లి వలన తెలుసుకున్నాడు. తన తపో మహిమతో లోకాలన్నీ భస్మం చేస్తానని శపథం చేసాడు. అది విని వశిష్టుడు అతనిని వారించాడు.

"పరాశరా, అది ధర్మము కాదు. పూర్వం కృత వీర్యుడు అనే మహా రాజు భృగువంశ బ్రాహ్మణులను యాజ్ఞికులుగా చేసుకొని ఎన్నో యజ్ఞాలను యాగాలను చేసారు. కృత వీర్యుడు వారికి మిక్కుటమైన ధన్నాన్ని ఇచ్చాడు. దానిని

వారు దాచుకున్నారు. తరువాత కాలంలో కొంత మంది క్షత్రియులు "భృగు వంశ బ్రాహ్మణులు కృతవీర్యుని ధన్నాన్ని అపహరించి దాచుకున్నారు" అని అపప్రధ పుట్టించారు.

అది విని కొంత మంది బ్రాహ్మణులు తమ వద్ద ఉన్న ధనాన్ని ఆ క్షత్రియులకు ఇచ్చారు. మరి కొంత మంది బ్రాహ్మణులు ఆ ధనాన్ని భూమిలో పాతిపెట్టారు. క్షత్రియులు ఇది చూచి, ఆ బ్రాహ్మణులను చంపి ఆ ధనం తీసుకుని వెళ్లారు. భృగు వంశ బ్రాహ్మణులనందరినీ, గర్భం లో ఉన్న బిడ్డలతో సహా చంపారు. ఆడు వారందరూ వీరికి భయపడి హిమాలయాలకు వెళ్లిపోయారు.

అందులో ఒక బ్రాహ్మణుని భార్య తన తొడలో గర్భం ధరించింది. ఆమె తొడలోనుండి ఔర్వుడు అనే అత్యంత తేజోవంతుడైన కుమారుడు జన్మించాడు. అతని తేజస్సుకు, కృతవీర్యుని వంశములోని క్షత్రియులందరు దృష్టి కోల్పోయి గుడ్డి వాళ్లయ్యారు.

తరువాత ఔర్వుడు తన తండ్రి, మిగిలిన

బంధువులు ఒక్క సారి చనిపోయారని తెలుసు
కొని, లోకాలన్నింటిని నాశనం చెయ్యాలని
సంకల్పించి, ఘోర తపస్సు చెయ్య సంకల్పించాడు.
అతని పితృ దేవతలు ఔర్వుని చూచి

"మేము అసమర్ధులమై క్షత్రియులచేత చంప
బడ లేదు. మేము ధనమునకు ఆశ పడి ధనమును
దాచ లేదు. మేము ఎంతో తపస్సు చేసాము. మా
తపో మహిమ వలన మాకు మరణం రావడం
లేదు. ఆత్మ హత్య చేసుకుందామంటే అది
పాపము అని తెలుసు. ఈ మనుష్య లోకంలో
ఎక్కువ కాలము ఉండలేము . అందువలన మేము
కావాలనే క్షత్రియులతో వైరం తెచ్చుకొని వారి
చేతిలో చంపబడ్డాము. కాబట్టి ఆ కారణం చేత
నువ్వు లోకాలను నాశనం చెయ్యడం ధర్మం
కాదు" అని పలికారు.

వారి మాటలు విని, ఔర్వుడు తన
సంకల్పం విరమించుకున్నాడు. కాబట్టి పరాశరా!
కోపం తో నువ్వు చెయ్యబోయే తపస్సు మంచిది
కాదు. కనుక శాంతం వహించు" అని చెప్పాడు

వశిష్టుడు. తాత గారి మాటను మన్నించి, ఆ సంకల్పం విరమించుకున్నాడు పరాశరుడు.

కాని తన తండ్రి శక్తిని, పిన తండ్రులను చంపిన రాక్షసుడి మీద కోపం పోలేదు.రాక్షస వినాశనానికి సత్రయాగం చెయ్యడానికి సంకల్పించాడు. దానికి వసిష్ఠుడు కూడా అడ్డు చెప్పలేదు. ఆ సత్ర యాగంలో దుర్మార్గులైన రాక్షసులందరూ పడి మల మలా మాడిపోతున్నారు.

అలా రాక్షస జాతి అంతరిస్తుంటే చూచి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు వసిష్ఠుని దగ్గరకు వచ్చారు. శక్తి చేసే రాక్షస వినాశానాన్ని ఆపమని కోరారు. వారి కోరిక మేరకు శక్తి తన సత్ర యాగాన్ని, రాక్ష వినాశనాన్ని ఆపుచేసాడు." అని అంగార పర్ణుడు అనే గంధర్వుడు అర్జునుడితో చెప్పాడు.

తరువాత అర్జునుడు ఆ గంధర్వుని చూచి, "మిత్రమా, ఇక్కడ మాకు ఎవ్వరూ తెలియదు. నువ్వే మాకు దారి చూపించాలి. మంచి

పురోహితుడు ఎవరో చెప్పాలి" అని అడిగాడు.

"అర్జునా, ఇక్కడికి సమీపంలో ఉత్కంచం అనే పుణ్య తీర్థం ఉంది. అక్కడ ధౌమ్యుడు అనే బ్రాహ్మణుడు తపస్సు చేసుకుంటున్నాడు. మీరు అతనిని పురోహితునిగా చేసుకోండి" అని చెప్పాడు.

తరువాత పాండవులుఅక్కడి నుండి బయలు దేరి ధౌమ్యుని వద్దకు వెళ్లారు. అతనిని తమ పురోహితునిగా ఉండమని కోరారు. ధౌమ్యుడు దానిని సమ్మతించాడు. పాండవులు, ద్రౌపది ధౌమ్యుని ఆశీర్వాదం తీసుకొని, పాంచాల దేశానికిప్రయాణం అయ్యారు. దారిలో వారు కొంత మంది బ్రాహ్మణులను కలిసారు. వారి వలన ద్రౌపది స్వయంవర విశేషాలు తెలుసుకున్నారు. తాము కూడా ద్రుపద నగరానికి ప్రయాణం అయ్యారు. ఆ బ్రాహ్మణులతో కలిసి ప్రయాణించి ద్రుపద నగరం చేరుకున్నారు. ఒక కుమ్మరి వాని ఇంటిలో విడిది చేసారు.

ద్రుపద నగరంలో పాంచల రాజు ద్రుపదుడు, తన కుమార్తె కృష్ణను అర్జునునికి ఇచ్చి వివాహం చెయ్యాలని సంకల్పించాడు. కాని పాండవులు లక్క ఇంటిలో మృతి చెందారు అని తెలిసి శోకించాడు. కాని పాండవులు ఎక్కడో బతికి ఉన్నారు అని పురోహితులు చెప్పడం వల్ల, అర్జునుని స్వయంవరానికి రప్పించడానికి, ఒక మత్స్య యంత్రాన్ని ఏర్పాటు చేసాడు.

ఒక బలమైన ధనుస్సును తయారు చేయించాడు. ఆ ధనుస్సును ఎక్కుపెట్టి ఆకాశంలో తిరుగుతున్న మత్స్య యంత్రాన్ని కొట్టిన వాడికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు. ఒక్క అర్జునుడు తప్ప వేరే వాళ్లు ఆ మత్స్యయంత్రాన్ని కొట్టలేరని ఆయన నమ్మకం.

ఎందరో రాజులు ఆ స్వయంవరానికి వచ్చారు. వారిలో ఒకరిని వరించడానికి తెల్లటి పుష్ప మాల ధరించి కృష్ణ సిద్ధంగా ఉంది. ధృష్టద్యుమ్నుడు, స్వయంవరానికి వచ్చిన రాజులందరికి, మత్స్య యంత్రాన్ని గురించి

వివరించాడు. ద్రౌపదికి, స్వయంవరానికి వచ్చిన రాజుల గూర్చి చెప్పాడు.

దుర్యోధనుడు, దుశ్శాసనుడు మొదలైన నూర్గురు కౌరవులు, వారి పక్కనే ఉన్న కర్ణ, అశ్వత్థామ, సోమదత్త, భూరిశ్రవ, శ్రుతసేనుడు మొదలైన వారు, శల్యుడు, విరాటుడు, జరాసంధుడు, గాంధార రాజులు, సారణుడు, సాత్యకి, సాంబుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, కృతవర్మ, అనిరుద్దుడు, యుయుధానుడు, మొదలైన వారు, సుమిత్రుడు, సుకుమారుడు, సుశర్మ, సుదక్షిణుడు, సుషేణుడు, సేనా బిందుడు, చంద్రసేనుడు, సముద్రసేనుడు, ఔశీనరుడు, చేకితానుడు, శిశుపాలుడు, జనమేజయుడు, జయద్రధుడు, బృహద్రధుడు, సత్యవ్రతుడు, చిత్రాంగదుడు, శుభాంగదుడు, భగీరధుడు, భగదత్తుడు, పౌండ్రక వాసు దేవుడు, వత్స రాజు మొదలైన రాజులు, ఇంకా యదు, వృష్ణి, భోజ, అంధక వంశ రాజులను, ఇంకా సంభావనల కోసం వచ్చిన బ్రాహ్మణ సమూహాలను చూపించాడు...

(ఈ రాజుల పేర్లు, వీరి దేశాలు ముందు ముందు భారతం లో అక్కడక్కడ కనిపిస్తాయి. అందుకని ఈ స్వయంవర సంధర్భంలో ఈ రాజుల పేర్లను, వంశాల పేర్లను, మనకు పరిచయం చేసాడు వ్యాసుడు).

శ్రీ కృష్ణుడు, తన అన్న బలరామ సహితుడై స్వయంవరానికి వచ్చాడు. వచ్చిన వారినందరిని తేర పార చూచాడు. బ్రాహ్మణ సమూహంలో, నివురు కప్పిన నిప్పుకణికల్లా ఉన్న పాండవులను గుర్తించాడు.

(మహాభారతంలో శ్రీ కృష్ణుని ప్రస్తావన మొట్ట మొదటి సారిగా ద్రౌపదీస్వయంవర ఘట్టం లో జరిగింది. గీతా భోధకుడు, రాజకీయ చతురుడు అయిన శ్రీ కృష్ణుని, శుభప్రదమైన స్వయంవర ఘట్టంలో, పరిచయం చెయ్యడం ఎంతో ఔచిత్యంగా ఉంది. అక్కడే మారువేషాలలో ఉన్న పాండవులను గుర్తుపట్టడం కూడా జరిగింది. శ్రీ కృష్ణ పాండవ సమాగమానికి అంకురార్పణ ఇక్కడే జరిగింది).

కను సైగతో, యదు రాజులంద రిని స్వయం వరంలో పాల్గొనవద్దని ఆదేశించాడు శ్రీ కృష్ణుడు. స్వయంవరం మొదలైంది.ఒక్కొక్కరే వచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాని ఎవ్వరూ ఆ బలమైన ధనుస్సును ఎక్కుపెట్టలేక పోయారు. కర్ణుడు, శల్యుడు లాంటి వీరులు ధనుస్సును ఎక్కుపెట్టినా మత్స్య యంత్రాన్ని భేదించ లేక పోయారు. వెనుదిరిగారు.

అది చూచి, అర్జునుడు అన్నగారి వైపు చూచాడు. ధర్మ రాజు, వెళ్లమని సైగ చేసాడు. అర్జునుడు సభాస్థలి వైపు వెళ్లాడు. అది చూచి అక్కడ చేరిన బ్రాహ్మణులు ఆశ్చర్యపోయారు.

"మహా మహా వీరులే ఎక్కుపెట్టలేక పోయారు, వీడెందుకు వెళుతున్నాడో. వచ్చిన వాడు సంభావన పుచ్చుకొని పోక, ఇతనికెందుకండీ ఈ చేతగాని పనులు, బ్రాహ్మణులను నవ్వుల పాలు చెయ్యడానికి కాకపోతే" అని తమలో తాము అనుకున్నారు.

కొందరు బ్రాహ్మణులను మాత్రం "బ్రాహ్మణుల పరువు నిలబెట్టాలి. నీకు శుభం జరుగుతుంది" అని ఆశీర్వదించారు.

అర్జునుడు ధనుస్సు దగ్గరకు వెళ్లాడు. ధనుస్సుకు మూడు సార్లు ప్రదక్షిణం చేసి నమస్కారం చేసాడు. అలవాటైన వారు ఎత్తినట్టు ధనుస్సును ఎత్తి సంధించాడు. ఐదు బాణాలతో మత్స్య యంత్రాన్ని పడగొట్టాడు. వచ్చిన రాజులందరూ ఆశ్చర్యపోయారు. వారికి నోట మాట రాలేదు. బ్రాహ్మణులందరూ తమ ఉత్తరీయాలను, చెంబులను గాలిలో ఊపుతూ సంతోషంతో కేరింతలు కొడుతున్నారు.

వెంటనే ధర్మరాజు, భీముని అర్జునునికి సహాయంగా ఉంచి, నకుల సహదేవులతో తన విడిదికి వెళ్లి పోయాడు. ద్రుపద రాజ పుత్రి, ద్రౌపది, మంద గమనంతో వచ్చి, అర్జునుని మెడలో వర మాల వేసి, అర్జునుని తన భర్త గా స్వీకరించింది.

ఇది చూచి స్వయంవరానికి వచ్చిన రాజులందరికి కోపం భగ్గుమంది. వీరందరికి దుర్యోధనుడు నాయకత్వం వహించాడు. ద్రుపదుని చూచి "స్వయంవరంలో తన విద్యా పటిమతో, మత్స్యయంత్రాన్ని భేదించి, ద్రౌపదిని గెల్చుకున్నాడు. ఇందులో ఈ బ్రాహ్మణుడి తప్పు లేదు. కాని ఇంత మంది రాజులను, స్వయంవరానికి ఎందుకు పిలవాలి? ఎందుకు మర్యాదలు చెయ్యాలి? ఎందుకు అవమానించాలి? దీనికంతటికి కారకుడు ఈ ద్రుపదుడు. ఇతని బలాన్ని అణచాలి" అని అన్నాడు దుర్యోధనుడు.

ద్రుపదుడు అర్జునుని పక్కన నిలబడ్డాడు. కాని అక్కడ చేరిన బ్రాహ్మణులు "రండి రా రండి మనం తేల్చుకుందాము" అంటూ తమ ఉత్తరీయాలను ఎగుర వేస్తూ ఆ రాజుల మీదికి ఎగబడ్డారు.

అర్జునుడు వారిని చూచి నవ్వాడు. వారించాడు. భీముడికి సైగ చేసాడు. భీమార్జునులు విజృంభించారు. శత్రు రాజులను చీల్చిచెండా

డారు. భీముడు అక్కడే ఉన్న వృక్షాలను, స్తంభాలను పెకలించి వారి మీద వేసాడు.

ఇదంతా చూచి శ్రీ కృష్ణుడు ఆశ్చర్య పోయాడు. తన అన్న బల రాముని చూచి "అన్నయ్యా, చూచావా పాండవులు ఎలా విజృంభిస్తున్నారో. విల్లు చేపట్టి యుద్ధం చేస్తున్న వాడు అర్జునుడు. ఆపక్కనే ఒక చెట్టునుపెకలిస్తున్న వాడు భీముడు. ఇందాక సభ నుండి వెళ్లి పోయిన వాడు ధర్మ రాజు, నకుల సహదేవులు" అని పరిచయం చేసాడు.

బల రాముడు ఆశ్చర్య పోయాడు.ఎప్పుడో లక్క ఇంటిలో చని పోయారు అనుకున్న పాండవులు ఇక్కడ ఈ విధంగా ప్రత్యక్షం కావడం ఎంతో ఆనందం కలిగించింది బలరామునికి.

కర్ణుడు అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు. ఈ బ్రాహ్మణుడికి ఇంత విలువిద్యా నైపుణ్యం ఎలా వచ్చిందో తెలియక సతమత మౌతున్నాడు కర్ణుడు.

"ఓ బ్రాహ్మణుడా, నాతో ఎదిరించి నిలవ డానికి ఒక్క పరశురామునికి, దేవేంద్రునికి, అర్జునుడికి తప్ప వేరే వారికి సాధ్యం కదు. నువ్వు ఎవరు?" అని అడిగాడు.

అర్జునుడు నవ్వుతూ "నేను వీరిలో ఎవ్వ రినీ కాను కాని ముందు యుద్ధం చెయ్యి" అన్నాడు. భీముడు శల్యునితో మల్ల యుద్ధం చేసి ఓడిం చాడు. ఈ బ్రాహ్మణులతో యుద్ధం ఏమిటని రాజులం దరూ వెనక్కు తిరిగి వెళ్ళిపోయారు.

కాని దుర్యోధనుడు మాత్రం "ఈ బ్రాహ్మణులు ఎవరు? ఎక్కడ ఉంటారు? ఎక్కడనుండి వచ్చా రు?" అని విచారించడం మొదలు పెట్టాడు. ఇది చూచాడు శ్రీ కృష్ణుడు. "సుయోధనా, ఇతరులు చెయ్యలేని కార్యాన్ని ఆ బ్రాహ్మణుడు చేసాడు. ద్రౌపదిని భార్యగా పొందాడు. అంతే కదా. ఇంక అతని గురించి మనకు ఎందుకు. వెళ్దాం పదండి" అంటూ వారించాడు. దుర్యోధనుడు మిగిలిన రాజులు సరే అని వెళ్ళి పోయారు.

భీమార్జునులు ద్రౌపదిని తమతో తమ విడిదికి తీసుకొని వెళ్లారు. అప్పటికె కుంతీ దేవి చాలా ఆందోళనగా ఉంది. స్వయంవరోత్సవాన్ని చూడటానికి వెళ్లిన వాళ్లు ఇంకా ఎందుకు రాలేదు. ఒకవేళ కౌరవులు వారిని గుర్తించి చంపేశారా లేక వేరే కారణం ఏదైనా వుందా అని ఆలోచిస్తూ ఉంటే ధర్మరాజు నకుల సహదేవులు ముందు వచ్చారు. తరువాత కొంచెం సేపటికి భీమార్జునులు వచ్చారు.

రాగానే అర్జునుడు "అమ్మా, మేము ఒక బిక్ష తీసుకొని వచ్చాము" అని అన్నారు. దానికి కుంతీ దేవి సంతోషించి "మీరు ఐదుగురూ ఉపయోగించండి" అని బదులు చెప్పింది. కాని కొడుకు తెచ్చిన బిక్ష ఒక కన్య అని తెలిసి అధర్మం పలికినందుకుభయపడింది. "అయ్యో ఏమి తెచ్చారో తెలియక అలా పలికాను. ఇది అధర్మం. ధర్మజా, ఇది లోక విరుద్ధము. ఇప్పుడు ఏమి చేద్దాము" అని అడిగింది.

అప్పుడు ధర్మరాజు అర్జునుని చూచి

"అర్జునా ఈమెను నువ్వు తీసుకొని వచ్చావు కాబట్టి అగ్నిసాక్షిగా నువ్వే వివాహ మాడుము" అన్నాడు. దానికి అర్జునుడు "పెద్ద వారు మీరు ఉండగా నేను వివాహం చేసుకోడం ఉచితం కాదు. ఈమెను మీరే వివాహం చేసుకోండి" అని చెప్పాడు.

(ఇక్కడ నన్నయ ఒక పద్యం పాదం రాసాడు "ఆ లలితాంగి యందు హృదయంబులు దృష్టులు నిల్పి పాండు భూపాల తనూజ పంచకము పంచ శరాహతి బొందె నొక్కతన్" అంటే మనసులో పాండవులు ఐదుగురు ద్రౌపది మీద మనసు పడ్డారు. మోహము చెంది ఉన్నారు" అని అర్థం. కాని పైకి మాత్రం నువ్వు పెళ్లి చేసుకో అంటే నువ్వుపెళ్లి చేసుకో అని అనుకుంటు న్నారు. ఎంత గొప్ప వారైనా స్త్రీ విషయం వచ్చేటప్పటికి, ఒకే విధంగా ఆలోచిస్తారు కదా)

ఇది ధర్మరాజు గ్రహించాడు. మనలో మనకు తగవులు ఎందుకని, మనం ఐదు గురము ద్రౌపదిని వివాహం చేసుకుందాముఅని అన్నాడు.

ఇంతలో శ్రీ కృష్ణుడు బలరామ సహితుడై అక్కడకు వచ్చాడు. అప్పటి దాకా పాండవులు శ్రీ కృష్ణుని చూడలేదు. అందుకని శ్రీ కృష్ణుడు తనని తాను పరిచయం చేసుకున్నాడు. ధర్మజునికి కుంతీ దేవికి నమస్కరించాడు.

ధర్మ రాజు కృష్ణుని చూచి "బ్రాహ్మణ వేషములలో ఉన్న మమ్ము మీరు ఎలా గుర్తు పట్టగలిగారు?" అని అడిగాడు.

"ధర్మజా, సూర్యుని మేఘములు కప్పిన, సూర్యుని తేజస్సును దాచ గలవా. అలాగే మీరు బ్రాహ్మణ వేషములలో ఉన్నా మీ తేజస్సును దాచలేరు కదా.అందువలన గుర్తు పట్టాను. అదియును కాక, అంతటి మత్స్య యంత్రాన్ని కొట్టడం, రాజుల నందరిని ఎదిరించడం మీకు కాక మరొకరికి సాధ్యమా. మీరు లక్క ఇంటి నుండి తప్పించుకున్నారు. మీకు అంతా శుభమే జరుగుతుంది " అని చెప్పి కృష్ణుడు, బల రాముడు వెళ్లి పోయారు.

(మహాభారతంలో ఇది శ్రీ కృష్ణ పాండవుల ప్రథమ సమాగమము. ఈ సమాగమము, శ్రీ కృష్ణుడు అర్జునునికి గీతా బోధ చేసేవరకు ఎదిగింది.

ప్రథమ సమాగమానికి వేదిక ఒక కుమ్మరి వాని ఇల్లు. సమయం, పాండవుల వివాహ సమయం.

గీతా బోధకు వేదిక యుద్ధ రంగము. సమయము ఇంకొంచెం సేపట్లో యుద్ధం మొదలు కాబోతోంది.

ఇక్కడ సంసారము అనే విచిత్రమైన యుద్ధ రంగములో ప్రవేశించబోయే సమయం. అక్కడ అన్నదమ్ముల మధ్య, బంధు మిత్రుల మధ్య యుద్ధ ములో ప్రవేశించబోయే సమయం.

కుమ్మరి వాని ఇల్లు కూడా కాకతాళీయంగా ఒక మహత్తరమైన సత్యం చెపుతుంది. కుమ్మరి మట్టితో ఎన్నో రక రకాలైన పాత్రలు తయారు చేస్తాడు. కాని మూలం మట్టి. పాంచ భౌతిక మైన ఈ శరీరాలు కూడా వివిధ ఆకృతులు ధరించి ఈ

లోకంలో సంచరించినా, అన్నింటికి మూలం పంచ భూతాలు, ఈ ప్రకృతి. ప్రతి జీవిలో ఒక జీవాత్మ ఉన్నా, అన్ని జీవులకు మూలం ఆ పరమాత్మ. ఈ సత్యాన్నే గీత లో చెప్పాడు శ్రీ కృష్ణుడు.

ఈ నర నారాయణుల ప్రధమ సమాగమము లోకోత్తరమైనది. వారికి మన ప్రణామాలు).

ఇది ఇలా ఉండగా అక్కడ ద్రుపదుడు "ఎవరో బ్రాహ్మణుడు మత్స్య యంత్రాన్ని కొట్టాడు. ద్రౌపదిని తీసుకొని వెళ్లాడు. వారు ఎవరో తెలియదు. వారి చరిత్ర ఏమిటో తెలుసుకొని రా" అని తన కుమారుడు ధృష్టద్యుమ్నుని పంపించాడు.

ధృష్టద్యుమ్నుడు భీమార్జునుల వెంట వెళ్లి జరిగిందంతా చూచాడు. తండ్రి వద్దకు వచ్చి "తండ్రీ, ఆ ఇరువురు వెళ్లి ద్రౌపదిని తీసుకొని వెళ్లి ఒక పెద్ద ఆమెకు చూపించారు. అందరూ ఆమెకు నమస్కరించారు. అందులో పెద్ద వాడు

చెప్పిన ప్రకారం, మిగిలిన నల్గురు బయటకు వెళ్లి బిక్ష తీసుకొని వచ్చారు.అందులో కొంతభాగం బలి దానాలకు, అతిధులకు తీసి పెట్టారు. మిగిలిన దానిలో, సగ భాగం బలిష్ఠుడైన రెండవానికి పెట్టారు. మిగిలిన సగ భాగం, మిగిలిన వారు తిన్నారు. చెల్లి ద్రౌపది వారికి పిసుక్కో కుండా సేవలుచేసింది. వారందరికి ధర్భలతో పడకలు తయారుచేసింది. వారందరూ పడుకొని, ఏనుగులు, గుర్రాలు, యుద్ధాలు వాటి గురించి మాట్లాడుకుంటున్నారు. వీరిని చూస్తే బ్రాహ్మణులవలె లేరు. శ్రేష్టమైన రాజవంశములోపుట్టిన వారి మాదిరి ఉన్నారు" అని చెప్పాడు ధృష్టద్యుమ్నుడు.

అయినా ద్రుపదునికి నమ్మకం కుదర లేదు. తన పురోహితుని పంపి, వారి పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకొని రమ్మన్నాడు. పురోహితుడు వెంటనే ధర్మ రాజు వద్దకు వెళ్లాడు. ఆ బ్రాహ్మణునికి పాండవులు అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి సత్కరించారు.

అప్పుడు ఆ పురోహితుడు "బ్రాహ్మణోత్తమా, ద్రుపదుడు ఆడ పిల్ల తండ్రి కదా. అందువలన, మీ కులం, గోత్రం, పేర్లు మిగిలిన వివరాలు తెలుసుకొని రమ్మని ద్రుపదుడు నన్ను పంపించాడు. దయచేసి ఆ వివరాలు చెప్పండి" అన్నాడు.

దానికి ధర్మరాజు నవ్వుతూ "విప్రోత్తమా, మీ మహారాజు మత్స్య యంత్రాన్ని కొట్టిన వారికి తన కుమార్తెను ఇస్తాను అన్నాడు. అలాగే మా వాడు మత్స్య యంత్రాన్ని పడగొట్టాడు. మీ మహారాజు కుమార్తెను తీసుకొని వచ్చాడు. ఇప్పుడు మా కుల గోత్రాలు తెలుసుకోవడం ఎందుకు? తెలుసుకొని ఏమి చేస్తాడు? అయినా అంత బలమైన విల్లును ఎక్కుపెట్టడం ఎవరికి సాధ్యం అవుతుంది? మత్స్య యంత్రం వీరులు కాక మరొకరు కొట్టగలరా? మీ మహారాజు కోరిక తీరినది కదా. ఇంకా విచారించడం ఎందుకు?"అని నర్మ గర్భంగా అన్నాడు ధర్మరాజు. చేసేది లేక, ఆ పురోహితుడు అదే విషయాన్ని ద్రుపదునికి చెప్పాడు.

ద్రుపదునికి సందేహం కొంత వరకు తీరింది కాని, ఇంకా కొరత గానే ఉంది. అందు కని వారిని తీసుకు రమ్మని, నాలుగు జాతుల వారికి అనువైన రథాలను ఇచ్చి ధృష్టద్యుమ్నుని పాండవుల వద్దకు పంపాడు. పాండవులు అది చూచి, క్షత్రియులకు ఉచితమైన బంగారు రథాల ను ఎక్కి ద్రుపదుని వద్దకు వచ్చారు.

పాండవులకు ఎదురు వెళ్లి వారికి అతిథి సత్కారాలు గావించాడు. ఎన్నో వస్తువులను కానుకగా పంపాడు ద్రుపదుడు. కాని పాండ వులు క్షత్రియులకు ఉచితమైన కత్తులు, విల్లులు, బాణములు మాత్రం తీసుకున్నారు. ఇది చూచి ద్రుపదుడు ఎంతో సంతోషించాడు. వారు క్షత్రియు లు అని నిర్ధారణ చేసుకున్నాడు. కాని వారి నోటితో చెపితేనే బాగుంటుందని అనుకున్నాడు.

ధర్మరాజు పక్కనే కూర్చుని "అయ్యా, మీరు క్షత్రియులా, బ్రాహ్మణులా, లేక దేవతలా, గంధర్వులా మాకు సందేహముగా నున్నది. మీ నిజ స్థితి తెలుసుకోకుండా నా కుమార్తెను

ఇచ్చి వివాహం చెయ్యలేను కదా. అందువలన తెలుసుకోగోరుతున్నాను" అని నిర్మొహమాటంగా చెప్పాడు. ఇంక దాచి ప్రయోజనం లేదనుకున్నాడు ధర్మరాజు.

"ద్రుపద మహారాజా, మేము క్షత్రియులము. పాండురాజు పుత్రులము. నా పేరు ధర్మజుడు. వీరు భీమార్జున నకుల సహదేవులు. మత్స్య యంత్రాన్ని ఛేధించినది నా తమ్ముడు అర్జునుడు. ఈమె మా తల్లి కుంతీ దేవి." అని చెప్పాడు.

ఆ మాటలు విని ద్రుపదుడు అత్యధిక సంతోషాన్ని పొందాడు. తన చిరకాల కోరిక నెరవేరిందని పొంగి పోయాడు. ద్రుపదుడు ధర్మజుని పక్కన కూర్చుని "విచిత్ర వీర్యుని మనుమడు, పాండురాజు పుత్రుడు, అర్జునుడు నాకు అల్లుడు కావడం ఎంతో సంతోషంగా ఉంది. స్వయం వరంలో అతనిని వరించిన కన్యను, అర్జునుడికి ఇచ్చి వివాహం చేస్తాను" అని అన్నాడు ద్రుపదుడు.

దానికి ధర్మజుడు "అది ఎలా కుదురు

తుంది. అర్జునుని కన్నా, ఇద్దరం పెద్ద వాళ్లము ఉన్నాము. మా వివాహాలు జరగంది అర్జునునికి వివాహం ఎలా చేస్తాము" అని అన్నాడు.

అప్పుడు ద్రుపదుడు "అలా ఐతే పెద్ద వాడివి నువ్వు నా కుమార్తెను వివాహం చేసుకో. ధర్మబద్ధంగా ఉంటుంది" అని అన్నాడు.

"అలా కాదు. అర్జునుడు తెచ్చిన బిక్ష ఐదు గురు పొందలని మా తల్లి కోరిక. అందువల ఈ కన్యను మేము ఐదుగురము వివాహం చేసుకుంటాము" అన్నాడు ధర్మ రాజు.

ద్రుపదుడు ఆశ్చర్య పోయాడు. "అదే మిటి. ఒక పురుషుడు చాల మంది కన్యలను వివాహ మాడటం విన్నాను. కాని ఒక కన్య ఎక్కువ మంది పురుషులను వివాహం మాడటం ఎక్కడా వినలేదు. ఇది లోక విరుద్ధం. కాబట్టి ఆలోచించి రేపు నిర్ణయం తీసుకుందాము" అని అన్నాడు ద్రుపదుడు.

(ఇక్కడ ఒక మాట. వర మాల వేసినప్పటి నుండి ద్రౌపది నోటి నుండి ఒక్క మాట కూడా రాలేదు. ఎవరు కూడా ఆమెను నీ అభిప్రాయం ఏమిటి అని అడగ లేదు. మగ వాళ్లు మాత్రం తమ ఇష్టం వచ్చినట్టు ఆమె వివాహం గురించి మాట్లాడు తున్నారు. ఇదంతా చూస్తుంటే సమాజంలో స్త్రీ పరిస్థితి నాడు నేను ఒకటే అనిపిస్తూ ఉంది. వివాహ విషయంలో ఆమె మాటకు, అభిప్రాయాలకు విలువ లేదు. )

మరు నాడు వేద వ్యాస మహా ముని అక్కడ కు వచ్చాడు. ద్రుపదుడు వ్యాసునికి అర్ఘ్య పాద్యా దులు ఇచ్చి సత్కరించాడు.ద్రుపదుడు వ్యాసునితో

" మహాత్మా, నా కుమార్తె ద్రౌపదిని అర్జును డు మత్స్య యంత్రాన్ని ఛేదించి, స్వయంవరంలో పొందాడు. కాని ధర్మ రాజు తాము ఐదుగురు అన్నదమ్ములము ద్రౌపదిని వివాహం చేసుకుం టాము అంటున్నాడు. ఇది లోక విరుద్ధము కాదా? తమరే ధర్మ నిర్ణయం చెయ్యండి" అని అడిగాడు.

ధర్మ రాజు కూడా చేతులు జోడించి "మహాత్మా, మాట వరసకైనా నేను అసత్యం, అధర్మం పలకను. నా నోటినుండి అలా ఎందుకు వచ్చిందో తెలియదు. మాకు మా తల్లి దైవం. కాబట్టి తల్లి మాటను మేము జవదాట లేము. అదియును కాక, జటిల అనే ఋషి కన్య ఏడుగురు ఋషులను వివాహం చేసుకుంది. దాక్షాయణి అనే కన్య ప్రచేతసులు అనబడే పది మందిని వివాహం చేసుకుంది. కాబట్టి ద్రుపద మహారాజా, ఆలోచించక, నీ కుమార్తె ద్రౌపదిని మా ఐదుగురు అన్నదమ్ములకు ఇచ్చి వివాహం చెయ్యి" అని అన్నాడు.

ఇరువురి వాదనలు విన్నాడు వ్యాసుడు. కాసేపు ఆలోచించాడు. "ద్రుపద మహా రాజా, ఈ ధర్మ రాజు చెప్పినట్టు, నీ కుమార్తె ద్రౌపదిని ఈ ఐదుగురికి ఇచ్చి వివాహం చెయ్యి. ఇది ధర్మ నిర్ణయం. నేను ఈ నిర్ణయానికి ఎలా వచ్చానో కారణాలు కావాలంటే లోపలకు రా చెపుతాను" అని ద్రుపదుడిని లోపలకు తీసుకొని వెళ్లాడు. ఏకాంతంలోద్రుపదునికి వ్యాసుడు ఇలాచెప్ప సాగాడు.

"పూర్వ కాలంలో ఇంద్రసేన అనే ఆమె మౌద్గల్య మహాముని భార్య. ఆమె మహా పతివ్రత. మౌద్గల్యుడు కుష్టు రోగంతో బాధ పడుతు న్నాడు. చర్మం అంతా వడలి పోయింది. అవయ వాలు కుళ్లి పోయాయి. కాని ఇంద్ర సేన అసహ్యిం చుకోకుండా భర్తకు సేవలు చేస్తూ ఉంది. ఒక రోజు భర్తకు భోజనం పెట్టింది. మిగిలిన అన్నం తను తింటూ ఉంది. అందులో భర్త వేలు ఒకటి ఊడి పడి ఉంది. ఇంద్ర సేన ఆ వేలును తీసి పక్కన పెట్టి, మిగిలిన అన్నం తింటూ ఉంది. దీనిని చూచి మౌద్గల్యుడు ఆశ్చర్య పోయాడు.

"ఇంద్ర సేనా. నీ పతి భక్తి అమోఘం. నీకు ఏ వరం కావాలో కోరుకో ఇస్తాను" అన్నాడు.

దానికి ఇంద్ర సేన "నాధా, నాకు కామ వాంఛలు మెండుగా ఉన్నాయి. అవి మీ వల్ల ఈ రూపంలో తీర లేదు. కాబట్టి మీరు, అందమైన, మనోహరమైన రూపం ధరించి, ఐదుగురిగా మారి, ఐదు విధాలుగా నా కామ వాంఛలు తీర్చండి" అని అడిగింది.

దానికి ఆ మహా ముని సంతోషించాడు. తన తపో మహిమతో, మనోహరమైన రూపం ధరించాడు. ఐదుగురిగా విడిపోయాడు. ఐదు విధాలుగా భార్యతో కామ సుఖాలు అనుభవించాడు. తరువాత బ్రహ్మలోకానికి వెళ్లాడు.

కాని ఇంద్రసేనకు కామ వాంఛలు ఇంకా తీరలేదు. మరు జన్మలో కాశీ రాజు పుత్రికగా జన్మించింది. చాల కాలం కన్యగానే మిగిలి పోయింది. శివుని గూర్చి తపస్సు చేసింది. శివుడు ప్రత్యక్షం అయ్యాడు. ఏమి కావాలో కోరుకొమ్మన్నాడు.

శివుడిని చూచిన తత్తర పాటులో, తన మనసులో ఉన్న బలమైన కోరికతో, "నాకు భర్త కావాలి, నాకు భర్త కావాలి" అంటూ ఐదు మార్లు అడిగింది. నీకు మరు జన్మలో ఐదుగురు భర్తలు ఔతారు అని వరం ఇచ్చాడు శివుడు.

ఆమె తన పొరపాటు గ్రహించింది. "దేవా,

ఎక్కడన్నా ఒక కన్యకు ఐదుగురు భర్తలు ఉంటారా. ఇది ధర్మ విరుద్ధం కాదా. కాబట్టి నాకు ఈ వరం అక్కర లేదు" అని చెప్పింది.

దానికి శివుడు "సాధ్వీ, నువ్వు ధర్మ తప్పకుండా ఐదుగురు భర్తలతో ఉంటావు" అని అన్నాడు

"అలా ఐతే, నాకు ఆ ఐదుగురు భర్తలతో ప్రత్యేక సంగమం కావాలి. ఒక్కొక్క సారి ఒక్కరినే కలవాలి. అప్పుడు నేను కన్యగానే ఉండాలి. నా కామేచ్ఛ తీరాలి. పతి సేవా భాగ్యం, నిరంతర సౌభాగ్యం కలగాలి" అని అడిగింది. శివుడు ఆమె కోరిన విధంగా వారాలు ఇచ్చాడు. "నువ్వు వెళ్లి గంగా తీరంలో ఉన్న ఇంద్రుడిని నా వద్దకు తీసుకొని రా" అని చెప్పాడు. కాశీ రాజు కుమార్తె అలాగే అని గంగా తీరానికి వెళ్లింది.

ఆ సమయంలో యమ ధర్మ రాజు సత్ర యాగం నిర్వహిస్తున్నాడు. యాగ దీక్షలో ఉంటాడు కాబట్టి ప్రాణి హింస చెయ్యకూడదు. అందువలన

మానవులు మరణం లేకుండా ఏళ్ల తరబడి జీవించ సాగారు. భూభారం ఎక్కువ అయి పోయింది.

ఇంద్రుడు మొదలైన దేవతలు బ్రహ్మ దేవుని వద్దకు వెళ్లి "బ్రహ్మదేవా, మానవులు మరణం లేకుండా జీవిస్తే, మాకు వారికి తేడా ఏముంటుంది చెప్పండి. దీనికి మీరే ఒక మార్గం చూపాలి" అని ప్రాధేయపడ్డారు.

దానికి బ్రహ్మదేవుడు "యముని సత్ర యాగం అయ్యేదాక మీరు నిశ్చింతగా ఉండండి. యాగం పూర్తి కాగానే అతను మానవులను అంతమొందిస్తాడు. యముని తేజస్సు, మీ తేజస్సు కలిగిన వీరులు ఆయనకు సహాయంగా ఉంటారు" అని చెప్పాడు.

ఇంద్రుడు ఇతర దేవతలు ఇంద్ర లోకం వెళుతూ మార్గ మధ్యంలో గంగానది ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ కాశీ రాజు కూతురు ఏడుస్తూ ఉంది. ఇంద్రుడు ఆమెను చూచి

"ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగాడు. "దేవేంద్రా, నా ఏడుపు గురించి తెలుసు కోవా లంటే, మీరు నా వెంట రావాలి" అని అతనిని మహా శివుని వద్దకు తీసుకొని వెళ్లింది.

ఆ సమయంలో మహా శివుడు నవ యువకుని రూపంలో మరి ఒక యువతితో పాచికలు ఆడు తున్నాడు. అది చూచి దేవేంద్రుడికి కోపం వచ్చింది "ముల్లోకాలకు అధిపతిని నా ఎదురుగా జూదం ఆడుతున్నావా?" అని గర్వంగా అడిగాడు.

దానికి శివుడు కోపించి "నువ్వు గర్వం తో మాట్లడావు. నీకు చేతనైతే ఆ కొండ గుహను రెండుగా చీల్చు" అన్నాడు. ఇంద్రుడు తన బాహు బలంతో ఆ గుహను రెండు గా చీల్చాడు. అందు లో తన మాదిరే ఉన్న నలుగురు ప్రకాశ వంతు లైన బలవంతులైన వీరులను చూచాడు.తన మాదిరే ఉన్న వారిని చూచి ఆశ్చర్య పోయాడు ఇంద్రుడు.

మహేశ్వరుడు తన నిజ రూపంతో సాక్షాత్కరించాడు " మీ ఐదుగురు ఇంద్రులు మానవ లోకంలో జన్మించండి." అని అన్నాడు కాశీ రాజు పుత్రికను చూచి "నువ్వు ఆ ఐదుగురిని వివాహం చేసుకొని నీ కోరికలు తీర్చుకో" అని వెళ్ళిపోయాడు.

ద్రుపద మహారాజా, ఆ ఐదుగురు ఇంద్రులే, యమ, ఇంద్ర, వాయు, అశ్వినుల అంశలతో, ధర్మజ, భీమ, అర్జున, నకుల, సహదేవులుగా జన్మించారు. కాశీ రాజు పుత్రిక ఐన ఇంద్రసేన, యాజ్ఞసేనిగా ఉద్భవించి, నీ ఇంట పెరిగింది. కావాలంటే వారి పూర్వ రూపాలు చూడు" అని తన తపోమహిమతో వారి పూర్వ రూపాలు చూపించాడు.

ఇంద్రుని ఐదు రూపాలలో ప్రకాశిస్తున్న ఆ వీరులను చూచాడు ద్రుపదుడు. ఇంద్రసేనను కూడా చూచాడు. అలా ఆశ్చర్యంతో చూస్తున్న ద్రుపదుని చూచి వ్యాసుడు ఇంకా ఇలా అన్నాడు "ద్రుపదా, పూర్వం నితంతుడు అనే రాజ ఋషి

కుమారులు కూడా ఔశీనర పుత్రికను స్వయం వరంలో పొంది వివాహం చేసుకున్నారు. కాబట్టి నీ కూతురుకు పంచ పాండవులతో వివాహం జరిపించు. శుభం కలుగుతుంది" అని చెప్పాడు.

ద్రుపద మహారాజుకు సందేహ నివృత్తి అయింది. వ్యాస మహాముని మాటను శిరసావ హించాడు. పాండవులు ఐదుగురికి తన కుమార్తె ద్రౌపదిని ఇచ్చి వివాహం చేయడానికి నిశ్చయిం చాడు. పాండవుల పక్షాన వారి పురోహితుడు ధౌమ్యుడు పౌరోహిత్యం వహించాడు.

ద్రౌపదిని సర్వాలంకార భూషితురాలిని చేసి వివాహం మండపానికి తీసుకొని వచ్చారు. ధౌమ్యుడు వివాహ విధిని నిర్వర్తించాడు. మొదట, ద్రౌపదిని ధర్మరాజుకు ఇచ్చి వివాహం జరిపిం చాడు. వివాహం కాగానే ద్రౌపది ఈశ్వరుని ప్రార్థించింది. ఆ మహేశ్వరుని వరం వలన మరల ఆమెకు కన్యాత్వం సిద్ధించింది. తరువాత ఆమెను భీమసేనునికి ఇచ్చి వివాహం జరిపిం చారు. మరల ఆమె ఈశ్వరుని ప్రార్థించి తన

కన్యాత్వన్ని పొందింది. ఇలా, ఒకరి తరువాత ఒకరుగా, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపదిని వివాహ మాడారు. పంచ పాండవులు ద్రౌపది తమ తల్లి కుంతీ దేవి ఆశీర్వాదం తీసుకునారు. సభాసదుల ఆశీర్వాదం పొందారు.

(మహాభారతము - ఆది పర్వము - సప్తమాశ్వాసము సమాప్తము).

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎర్రాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)

Modali Venkata Subrahmanyam, B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.
subrahmanyam_mv1947@yaoo.co.in
Ph:040-24048104

# మహాభారతం

## ఆది పర్వము

### అష్టమాశ్వాసము

మహాభారత కథను చెబుతున్న ఉగ్రశ్రవసు డు (సూతుడు) శౌనకాది మహా మునులను చూచి ఇలా చెప్పసాగాడు.

ద్రౌపదీ స్వయంవరం తరువాత ద్రుపదుడు పాండవులకు ఎంతో విలువైన ఆభరణాలను, ఏనుగులను, గుర్రాలను ఇంకా ఎన్నో విలువైన కానుకలను ఇచ్చాడు. ద్రౌపది కూడా పతివ్రతా ధర్మంతో ఐదుగురు భర్తలకూ సేవ చేస్తూ ఉంది. కుంతీ దేవి కూడా కోడలును సకలైశ్వర్య వంతురాలిగా, సంతానవతిగా దీవించింది.

ద్వారకా నగరంలో ఉన్న శ్రీకృష్ణుడు పాండవుల వివాహ సమయంబున అనేక కానుకలు పంపాడు. ఆ విధంగా పాండవులు ద్రుపద పురంలో

ఒక సంవత్సరం పాటు సమస్త రాజభోగాలు అనుభవించారు. స్వయంవరంలో మత్స యంత్రాన్ని కొట్టినది అర్జునుడని, వారు పాండవులని, దుర్యోధనుడు వేగుల వలన తెలుసు కున్నాడు. పాండ వులు లక్క ఇంటిలో తగలబడకుండా బతికి బయట పడ్డందుకు దుర్యోధనుడు ఎంతో చింతించాడు.

విదురుడికి పాండవుల విషయం తెలిసి ఎంతో ఆనందించాడు. ధృతరాష్టుడికి ఈ విషయం చెప్పాడు. ద్రుపదుని కుమార్తె అయిన ద్రౌపదిని వివాహం చేసుకోడం వల్ల పాండవులు ఎంతో మిత్రలాభం పొందారు అని అనుకున్నాడు ధృత రాష్టుడు.

ఒక రోజు కర్ణ దుర్యోధనులు, విదురుడు దగ్గర లేని సమయంలో, ధృతరాష్టుని దగ్గరకు వెళ్లి ఇలా అన్నారు

" తండ్రీ! పాండవులు బతికే ఉన్నారు. విదురుడు ఎల్లప్పుడూ పాండవుల మేలు కోరే వాడు అని

తెలిసికూడా మీరు అతని మాటకు విలువ ఇస్తున్నారు. అది మా దురదృష్టము" అని నిర్వేదంగా అన్నాడు దుర్యోదనుడు.

" నాయనా దుర్యోధనా! నేను పైకి పాండవులు అంటే ఎంతోఇష్టం ఉన్నట్టు ఉంటాను కాని ఆ విషయం విదురునికి తెలియనీయను. ఒక విషయం మాత్రం మీ రు మరువవద్దు. పాండవులకు దైవబలం ఉన్నది. వారిని మనం ఏమీచెయ్యలేము" అని అన్నాడు ధృతరాష్టుడు.

"తండ్రీ! పాండవులు ఇప్పుడు ద్రుపద రాజ పురంలో ఉన్నారు. వారికి పాంచాల రాజు అండగా ఉన్నాడు. శ్రీకృష్ణుడు, బలరాముడు మొదలైన యాదవ రాజులు, వృష్ణి, భోజ, అంధక రాజులు తోడుగా ఉన్నారు. అప్పుడు వారిని ఎవ్వరూ జయించలేరు. కాబట్టి వారిని పాంచాల రాజు నుండి వేరు చెయ్యాలి. ఇది ఒక మార్గము.

ఇంక రెండవది. కుంతీ పుత్రులకు, మాద్రీ పుత్రులకు మధ్య విభేధాలు పుట్టించి వారిని వేరు

చెయ్యాలి. మూడవది. అత్యంత అందగత్తెలైన స్త్రీలను పాండవులమీద ప్రయోగించి, వారికి, ద్రౌపదికి మధ్య విభేధం కలిగించాలి. ఇంక నాలుగవది. మరల మంత్ర తంత్రములతో కుటిలోపాయములతో భీముని చంపి పాండవులను నిర్వీర్యులను చెయ్యడం. వీటిలో ఏది ఉత్తమ మార్గం ఆలోచించండి" అని తన మనసులో విషయం బయట పెట్టాడు దుర్యోధనుడు.

కర్ణుడు దీనికి ఒప్పుకోలేదు. "సుయోధనా! అసలు, ద్రుపదుడు సజ్జనులు సత్త్వవర్తనులు అయిన పాండవులను ఎందుకు వదలి వేస్తాడు. అది అసంభవము. పాండవులు అందరూ ఒకే మాట మీద ఉన్నారు. వారిలో విభేధాలు ఎందుకు వస్తాయి. పైగా, ద్రౌపది వారిని కోరి వివాహం చేసుకుంది. కాబట్టి ఆమెకు వారిమీద ఎందుకు ద్వేషం పుడుతుంది. కాబట్టి ఇవన్నీ ఏవీ పని చెయ్యవు.

పైగా ఇప్పటిదాకా మీరు భీముని చంపాలని ఎన్నో ప్రయత్నాలు చేసారు. ఏమయింది? భీముని ఏమీ చెయ్యలేకపోయారు. కాబట్టి అదికూడా

ప్రయోజనం లేదు. ఇంక ఒక్కటే మార్గము. దండోపాయము. మనము మన సేనలతో ధ్రుపద మహారాజు మీదికి యుద్ధానికి వెళ్లి, ధ్రుపదుని ఓడించి, పాండవులను తీసుకొని వద్దాము." అని అన్నాడు.

ఇది అంతా విని, ధృతరాష్ట్రుడు "పెద్దలతో ఆలోచించి రేపు నిర్ణయం తీసుకుందాము" అని అన్నాడు.

మరునాడు, ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మొదలైన వారిని సమావేశపరిచి, విషయం అంతా వివరించాడు. అప్పుడు, కురు వృద్ధుడు, భీష్ముడు, దుర్యోధనుని చూచి ఇలా అన్నాడు.

" సుయోధనా! నాకు మీ మీద కాని, పాండవుల మీద కాని బేధభావము లేదు. అందరూ నాకు సమానమే. కాని, పాండవులతో యుద్ధం చెయ్యడానికి నేను అంగీకరించను. మీవలెనే, పాండురాజ కుమారులు కూడా ఈ రాజ్యానికి

వారసులు. అందుచేత, పాండవులకు చెందవలసిన అర్ధ రాజ్యాన్ని వారికి పంచి ఇవ్వు. అది ధర్మము. ధర్మాన్ని ఆచరించి కీర్తిమంతుడవు గా!" అని అన్నాడు భీష్ముడు.

ద్రోణుడు కూడా " నాయనా సుయోధనా! తాత గారి మాట పాటించుము. నీవు ఈ కర్ణుని మాటలు విని, యుద్ధము మాట తలప వద్దు. ద్రుపదునికి తగిన కానుకలు ఇచ్చి, పాండవులను ఇక్కడకు తీసుకొని రావడానికి నీ తమ్ములను పంపు" అని హితబోధ చేసాడు.

ఈ మాటలకు కర్ణునికి కోపం వచ్చింది. "సుయోధనా! వీరంతా నీకు కీడు చెయ్యడానికి తలపెడుతున్నారు. నీసంపదను అపహరించడానికి ప్రయత్నిస్తున్నారు. వీరి మాట నమ్మకు" అని అన్నాడు కర్ణుడు.

" ఏమీ! మేము కీడు తలపెట్టు వారమా! నీ పేనా హితము చెప్పు వాడివి. నీవలననే కౌరవ కులానికి శాంతి లేకుండా పోయింది" అని అన్నాడు.

వారిద్దరిని వారించి ధృతరాష్ట్రునితో విదురుడు ఇలా అన్నాడు. " మహారాజా! భీష్మ, ద్రోణులు వయసులో పెద్ద వారు. వారు చెప్పినది చెయ్యడం ధర్మం. అదీ కాక, పాండవులు స్వతహాగా అజేయులు. ఇప్పుడు, వారికి మహా బలవంతుడైన ద్రుపద మహారాజు అండగా ఉన్నాడు. శ్రీకృష్ణుడు, బలరాముడు, సాత్యకి వారికి మిత్రులు. కాబట్టి వారిని జయించడం సులభం కాదు. లక్క ఇంటిలో వారిని తగలపెట్టినా వారు బతికారు. పురోచనుని వలన కలిగిన అపకీర్తి పోగొట్టుకో. వెంటనే వారిని పిలి పించి అర్ధ రాజ్యం ఇమ్ము. అది అందరికీ శ్రేయస్కరము" అని అన్నాడు విదురుడు.

చేసేది లేక ధృతరాష్ట్రుడు దానికి అంగీక రించాడు. పాండవులను తీసుకు రావడానికి విదు రుని ద్రుపదపురానికి పంపాడు. అప్పటికే శ్రీకృష్ణుడు పాండవుల వద్ద ఉన్నాడు. విదురుడు ద్రుపద మహారాజుకు తగిన కానుకలు సమర్పిం చాడు. ద్రుపదుని ఎదుట, శ్రీకృష్ణుని ఎదుట పాండవులతో ఇలా అన్నాడు.

"ద్రుపద మహారాజా! మా పాండవులకు మీతో బంధుత్వము కలిసినందుకు భీష్మునికి, ద్రోణునికి, కృపాచార్యునికి నాకూ చాలా ఆనం దంగా నున్నది. కుంతీదేవి, పాండవులు తమ వద్ద లేనందుకు ధృతరాష్ట్రుడు మిగుల చింతించు చున్నాడు. పాండవులను, తమ కోడలు సౌభాగ్య వతి ద్రౌపదిని చూడవలెనని ఎంతో ఆతురతతో ఉన్నారు. నీవు అనుమతిస్తే పాండవులు హస్తినకు రాగలరు. అందు వలన మీరు పాండవులను పంప మని కోరు తున్నాను." అని అన్నాడు విదురుడు.

"మహాశయా! ధృతరాష్ట్రుడు పంపగా వచ్చా వు నీవు. భీష్ముడు, ద్రోణుడు, శ్రీ కృష్ణుడు, పాండ వుల శ్రేయస్సును ఎల్లప్పుడూ కోరుతుంటారు. మీరు ఏమి చేసినా అది పాండవులకు క్షేమకరం అవుతుంది." అని అన్నాడు ద్రుపదుడు.

"విదురుడు ఎల్లప్పుడూ పాండవుల క్షేమం కోరుతుంటాడు. మనం అతిగా ఆలోచించవద్దు. పాండవులు కోరుకున్నది సిద్ధిస్తుంది." అని అన్నాడు శ్రీ కృష్ణుడు.

అందరు చెప్పినది శ్రద్ధగా విన్న ధర్మరాజు చేతులు జోడించి "భీష్ముడు, ద్రోణుడు, విదురుడు మాకు పెద్దలు. మా క్షేమం కోరుతుంటారు. శ్రీ కృష్ణుడు మా శ్రేయోభిలాషి. వారి మాట నాకు శిరోధార్యము." అని అన్నాడు.

ద్రుపదుని అనుమతితో తల్లి కుంతీ, భార్య ద్రౌపది, తమ్ములతో సహా హస్తినాపురం పోవడానికి నిశ్చయిం చుకున్నాడు. విదురుడు, పాండవులను, ద్రౌపదిని, కుంతిని తన వెంట తీసుకొని వస్తున్నాడు. శ్రీకృష్ణుడు, ధృష్టద్యుమ్నుడు, అంతులేని సైన్యంతో వారి వెంట వచ్చారు. అందరూ హస్తినాపురం చేరుకున్నారు. వికర్ణుడు, చిత్రసేనుడు, ద్రోణుడు, కృపాచార్యుడు పాండవులకు ఎదురు పోయి వారికి స్వాగతం పలికారు.

పాండవులను చూచి హస్తినాపుర ప్రజలు "ఈ పాండవులకు దైవబలం మానవ బలం ఎక్కువ గా నున్నది. అందువలననే, అన్ని ఆపదలు

తొలగి పోయాయి. ఇంక ధర్మరాజు హస్తినాపురం లోఉండి మనలను పరిపాలించుగాక" అని అనుకున్నారు.

పాండవులు ద్రౌపదితో, తల్లి కుంతి తో అంతః పురం ప్రవేశించారు. ముందు తాత భీష్మునికి, గురువు ద్రోణునికి, పెద తండ్రి ధృతరాష్ట్రునికి, గాంధారికి నమస్కరించారు. దుర్యోధనాదులతో కలిసి ఆనందంగా కాలం గడుపుతున్నారు. అలా ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒక రోజు ధృతరాష్ట్రుడు, భీష్మ, ద్రోణ, విదుర, దుర్యోధనాదుల సమక్షంలో, శ్రీకృష్ణుని ఎదుట, పాండవులతో ఇలా అన్నాడు.

"ధర్మరాజా! పాండవులారా! ఇందరి పెద్దల ఎదుట, శ్రీకృష్ణుని సాక్షిగా, మీకు అర్ధరాజ్యం ఇస్తున్నాను. నా తమ్ముడు, పాండురాజు ఐశ్వర్యమంతా స్వీకరించండి" అని అన్నాడు. ధర్మరాజును, అర్ధరాజ్యానికి అభిషిక్తుడిని చేసాడు.

"ధర్మజా! నీవు ఖాండవ ప్రస్థాన్ని రాజధానిగా చేసుకొని నీ అర్ధరాజ్యాన్ని జనరంజకంగా పరిపాలించు"అని అన్నాడు. దానికి భీష్మాదులు కూడా అంగీకరించారు. అందరి అనుమతితో, ధర్మరాజు తమ్ములతో, భార్యతో, తల్లితో, ఖాండవ ప్రస్థానికి పయనమయ్యాడు.

శ్రీకృష్ణుడు ఇంద్రుడిని పిలిపించాడు. పాండవులకు రాజధాని నగరం నిర్మించి ఇవ్వమని అడిగాడు. ఇంద్రుడు, దేవశిల్పి మయునికి ఆపని అప్పచెప్పాడు. దేవశిల్పి మయుడు, ఇంద్ర ప్రస్థము అనే విలాసవంతమైన ఒక మహా నగరాన్ని నిర్మించాడు.

వ్యాసుడు, శ్రీకృష్ణుని అనుమతితో ధర్మరాజు, సోదరులు, ద్రౌపదీ సమేతంగా నగర ప్రవేశం చేసాడు.తనకు లభించిన అర్ధ రాజ్యాన్ని జనరంజకంగా పాలిస్తున్నాడు. ధర్మరాజు పట్టాభిషేకం అనంతరం శ్రీకృష్ణుడు ద్వారకానగరానికి వెళ్లిపోయాడు.

ఒకరోజు నారద మహాఋషి ధర్మరాజు వద్దకు

వచ్చాడు. ధర్మరాజు ఆ మహా మునిని సాదరంగా ఆహ్వానించి అతిథి మర్యాదలు చేసాడు.

"మహాత్మా! మా పూర్వ పుణ్యసుకృతము వలన తమరి దర్శనభాగ్యము లభించింది. మేము పునీతులమయ్యాము" అని అన్నాడు.

నారదుడు పాండవులను ఏకాంతముగా పిలిచి "మీరు అన్ని ధర్మాలు తెలిసిన వారు. మీకు తెలియని ధర్మము లేదు. కాని మీకు ఐదుగురికి ద్రౌపది ఒకతే భార్య. ఈ పద్ధతి లోక విరుద్ధము. శాస్త్రవిరుద్ధము. ఈమె మూలంగా మీలో మీకు విరోధం రాకూడదు. ఇదివరకు, ఒక స్త్రీ వలన సుందోప సుందులు అను రాక్షసులు కొట్టుకొని మృతిచెందారు. మీకు ఆ కథ చెపుతాను వినండి.

నికుంభుడు అను వానికి సుందుడు, ఉపసుందుడు అనే ఇద్దరు కుమారులు ఉండే వారు. వారు ఇద్దరూ బ్రహ్మను గూర్చి ఘోర మైన తపస్సు చేసారు. వారికి బ్రహ్మ దేవుడు ప్రత్యక్షం అయ్యాడు. మీకు ఏమి వరం కావాలో కోరుకోండి అన్నాడు. దానికి

వా రు, తమకు కోరిన రూపం ధరించే శక్తి, కోరిన చోటికి వెళ్లే శక్తి, వేరే వాళ్ల చేతిలో చావు లేకుండా వరాన్ని, అసలు ఎవరి వలనా ఎప్పటికి చావు లేకుండా ఉండే వరం కా వా లి అని అడిగారు. దానికి బ్రహ్మదేవుడు, వారికి చావు లేకుండా ఉండే వరం తప్ప మిగిలిన అన్ని వరాలు అనుగ్రహించాడు.

ఆ వరబలంతో వారు చెలరేగి పోయారు. భూలోకంలో ఉన్న బ్రాహ్మణులను, రాజులను, బాధించ సాగారు. వారి బాధ భరించలేక, మునులంతా బ్రహ్మదేవుని వద్దకు వెళ్లి వారి బాధ నుండి విముక్తి కలిగించమని వేడుకున్నారు.

దానికి బ్రహ్మదేవుడు ఆలోచించాడు. " వాళ్లు వేరే వాళ్ల చేతిలో చావు లేకుండా వరం అడిగారు కాని, ఒకళ్ల చేతిలో ఒకళ్లు చావ కుండా వరం అడగ లేదుగా" అని ఆలోచించి, విశ్వకర్మను పిలిచి ఒక అందమైన స్త్రీని సృష్టించమన్నాడు. అలాగే అని విశ్వ కర్మ ఒక లోకోత్తర సౌందర్యవతిని సృష్టించాడు.

ఆ సుందరి పేరు తిలోత్తమ. ఆ తిలోత్తమ బ్రహ్మ ముందర నిలబడి తనను సృష్టించిన పని ఏమి? అని అడిగింది. బ్రహ్మదేవుడు ఆమెకు సుందోప సుందుల గురించి చెప్పి వారిలో వారికి కలహము పెట్టి, ఒకరిని ఒకరు కొట్టుకొని మరణించేట్టు చెయ్యి అని చెప్పాడు.

తిలోత్తమ అలాగే అని భక్తితో బ్రహ్మదేవునికి ప్రదక్షిణం చేసింది. తిలోత్తమ అందానికి ముగ్ధుడైన బ్రహ్మ, తిలోత్తమ తనకు ప్రదక్షిణం చేస్తుంటే, తన తలను నలుదెసలా తిప్పుతూ తిలోత్తమ అందాల్ని వీక్షించాడు .అప్పటి నుండీ బ్రహ్మ చతుర్ముఖుడయ్యాడు.

తిలోత్తమ అందానికి దేవేంద్రుడుకూడా ముగ్ధుడయ్యాడు. ఆ అందం చూడడానికి రెండు కళ్లు చాలక, ఒళ్లంతా వెయ్యికళ్లు పెట్టుకొని చూచాడు. అప్పటినుండి, దేవేంద్రుడు సహస్రాక్షుడు అయ్యాడు.

ఆ ప్రకారం అందరినీ మోహితులను చేసిన

తిలోత్తమ, సుందో పసుందుల వద్దకు వెళ్లింది. తిలోత్తమను చూచి సుందోపసుందులు కామ మోహితులు అయ్యారు. ఇద్దరూ తిలోత్తమను కామించారు. తిలోత్తమ "నాది అంటే నాది" అని చెరి ఒక చెయ్యి పట్టుకొని లాగుతున్నారు. "నువ్వువవరిని ప్రేమిస్తున్నావు? చెప్పు?" అని బలవంతం చేసారు.

దానికి తిలోత్తమ "నేను మీలో ఎవరిని ప్రేమించాలో నిర్ణయించుకో వాలంటే, మీలో మీరు యుద్ధం చెయ్యండి. మీలో ఎవరు గెలుస్తారో నేను వారిని ప్రేమిస్తాను" అని చెప్పింది.

వారిలో విచక్షణా జ్ఞానం నశించింది. ఇద్దరూ ఆ స్త్రీ కోసం ఒకరితో ఒకరు యుద్ధం చేసుకున్నారు. ఇద్దరూ బలవంతులే కాబట్టి ఒకరి చేతిలో ఒకరు చచ్చారు. కాబట్టి ఎంతటి మిత్రులైనా, ఎంతటి ధైర్య వంతులైనా, స్త్రీల కారణంగా విరోధం పొందుతారు" అని చెప్పాడు నారదుడు.

నారదుని మాటలలోని అంతరార్థం గ్రహించారు పాండవులు. వారిలో వారు ఒక నియమం చేసుకున్నారు. ద్రౌపది ఒక్కొరి ఇంటిలో ఒక్కొక్క సంవత్సరము ఉండేటట్లు ఏర్పాటు చేసుకున్నారు. ద్రౌపది ఎవరి ఇంటిలో ఉంటే ఆ ఇంటి వైపు మిగిలిన వారు కన్నెత్తి కూడా చూడకూడదు. పొరపాటున అలా జరిగితే, పన్నెండు నెలలు తీర్థ యాత్రలు చెయ్యాలి. ఆ మాదిరి ఒప్పందం చేసుకొని నార దుని ఎదుట ప్రతిజ్ఞ చేసారు. ఆ ఒప్పందం ప్రకారం నడుచు కుంటున్నారు.

ఒక రోజు, ఒక బ్రాహ్మణుడి గోవును కొందరు దొంగలు ఎత్తుకొని పోయారు. ఆ బ్రాహ్మణుడు ఏడుస్తూ వచ్చి ఆ విషయం అర్జునుని తో చెప్పి ఏడ్చాడు. ఆ దొంగలను దండించి తన గోవును తిరిగి తెచ్చి ఇమ్మని అడిగాడు.

తన ధనుస్సు ఆయుధాగారంలో ఉన్నది. కాని ఆ సమయంలో ధర్మరాజు ద్రౌపదితో ఆయుధాగారంలో ఉన్నాడు. నియమం ప్రకారం పోకూడదు .కాని తప్పదు. బ్రాహ్మణుడి బాధ తీర్చడం ముఖ్యమని

భావించి, అర్జునుడు ఆయుధా గారానికి వెళ్ళాడు. తన ధనుస్సును తీసుకొని ఆ దొంగలను చంపి బ్రాహ్మణుడి గోవునుతెచ్చి ఇచ్చాడు. నియమభంగం జరి గింది కాబట్టి పన్నెండు నెలలువ్రతం చెయ్యడానికి నిశ్చయించు కున్నాడు.

ధర్మరాజు దానికి ఒప్పు కోలేదు. "నీవు ఒక బ్రాహ్మణుని కార్యం నిమిత్తం వచ్చావు. ఆ బ్రాహ్మణునికి మేలు చేసావు. కాబట్టి నియమ భంగం కాలేదు" అని అన్నాడు.

కాని అర్జునుడు "అన్నయ్యా! ఏదో ఒక సాకు చెప్పి ధర్మం తప్పడం భావ్యమా! అందుకని నాకు అనుమతి ఇవ్వండి" అని అడిగాడు. చేసేది లేక ధర్మరాజు సమ్మతించాడు. అర్జునుడు తీర్థయాత్రలకు బయలు దేరాడు.

బ్రాహ్మణులతోనూ, పౌరాణికులతోనూ కలిసి, అర్జునుడు తీర్థయాత్రలకు బయలు దేరాడు. ముందు గంగానదీ తీరానికి చేరుకున్నాడు.

ఒక రోజు, ఉలూచి అనే నాగ కన్యక అర్జునుని చూచి మోహించింది. తన కోర్కె తీర్చమని బలవంతం చేసింది.

అర్జునుడు ఉలూచిని చూచి "నీవు ఎవ్వరవు? నా మీద ఎందుకు మోహం పెంచుకున్నావు" అని అడిగాడు.

"నేను ఉలూచి అను నాగ కన్యను.నిన్ను మోహించాను. నా కోర్కె తీర్చు" అని అడిగింది.

"నా అన్న గారి ఆదేశానుసారము నేను తీర్థ యాత్రలు చేస్తున్నాను. బ్రహ్మచర్య వ్రతములో ఉన్నాను. నీ కోరిక ఎలా తీర్చగలను?" అని అన్నాడు అర్జునుడు.

"మీ గురించి నాకు అంతా తెలియును. కాని నా కోర్కె తీర్చకుంటే నేను ప్రాణ త్యాగం చేసుకుంటాను. మీరు ఎన్ని దానాలు, ధర్మాలు చేసినా ఆ పాపం పోదు. కాబట్టి నా కోరిక తీర్చండి. దీని వల్ల మీకు వ్రత భంగం కాదు" అని అడిగింది.

చేసేది లేక అర్జునుడు ఉలూచితో నాగ లోకం వెళ్లాడు. ఆ రాత్రి ఉలూచితో గడిపాడు. ఫలితంగా ఉలూచి గర్భవతి అయింది. ఇరావంతుడు అనే కుమారుడు జన్మించాడు.

తదుపరి, అర్జునుడు, గయ, గంగా సాగర సంగమం, మొదలైన క్షేత్రాలను దర్శిస్తూ, మణిపూరము అనే నగరానికి వెళ్లాడు. ఆ దేశపు రాజు పేరు చిత్రాంగదుడు. ఆయన ఆతిథ్యాన్ని స్వీకరించాడు. ఆయన కూతురు చిత్రాంగదను ప్రేమించాడు.

"అర్జునా! నా కుమార్తెను నీకు ఇచ్చి పెళ్లి చెయ్యడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కాని ఈశ్వరుడి అనుగ్రహం వలన మా వంశంలో ఒక్కొక్కరికి ఒక్క మగ సంతానం మాత్రం కలుగుతుంది. కాని నాకు మాత్రం ఈ కన్య పుట్టింది. అందు వల్ల నా రాజ్యానికి వారసుడు లేడు. అందుకని, ఆ కన్యకు పుట్టబోయే మగసంతతి నా వంశ కరుడు కావాలి. దీనికి నీవు ఒప్పుకుంటే నా కుమార్తెను నీకు ఇచ్చి

పెళ్లి చేస్తాను" అని అన్నాడు.

దానికి అర్జునుడు అంగీకరించాడు. చిత్రాంగదను పెళ్లి చేసుకున్నాడు. చిత్రాంగదకు బభ్రు వాహనుడు అనే కుమారుడు కలిగాడు.

అర్జునుడు అక్కడినుండి ద్వారకా నగరానికి బయలు దేరాడు.

"అక్కడ శ్రీకృష్ణుని చూడవచ్చును. శ్రీ కృష్ణుని చెల్లెలు సుభద్ర లోకోత్తర సౌందర్యవతి అని ప్రతీతి. సుభద్రను చూడవచ్చును. శ్రీకృష్ణుని దయ ఉంటే సుభద్రను పెళ్లి చేసు కోవచ్చును" అని మనసులో అనుకొన్నాడు అర్జునుడు.

యాదవులకు సన్యాసులు అంటే ఎంతో భక్తి గౌరవము. అందువల్ల తాను కూడా ఒక కపటసన్యాసిగా మారి పోయాడు. సన్యాసి వేషంలో ద్వారకా నగరం పరిసరాలు చేరుకున్నాడు. శ్రీకృష్ణుని భక్తితో మనసులో ధ్యానించాడు. అర్జునుని ఆగమనాన్ని తెలుసు కొని శ్రీకృష్ణుడు అర్జునుని వద్దకు

వచ్చాడు. క్షేమ సమాచారాలు అడిగాడు. అర్జునునికి తన చెల్లెలు సుభద్రమీద అనురాగం ఉన్నదని గ్రహించాడు. అర్జునుని తనతోపాటు ద్వారకా నగరానికి తీసుకుని వెళ్ళాడు. రైవతకాద్రి గుహలో అర్జునుని ఉంచాడు.

తాను మాత్రం ద్వారకకు వెళ్ళి రైవతక మహోత్సవాన్ని జరపాలని పురజనులను ఆదేశించాడు. అందరూ రైవతకాద్రికి బయలు దేరారు. శ్రీకృష్ణుడు కూడా తన భార్యలతో ఆ మహోత్సవాన్ని తిలకించ డానికి రైవతకాద్రికి బయలుదేరాడు. అతని వెంట సారణుడు, సాత్యకి, అక్రూరుడు, ఉగ్రసేనుడు, ఉద్ధవుడు మొదలగు వారు వెళ్ళారు. అన్నయ్య వెంట సుభద్ర కూడా రైవతకాద్రికి బయలుదేరింది.

సుభద్ర కూడా తన మనసులో అర్జునుని భర్త గా తలచింది. కాని సుభద్ర అప్పటి దాకా అర్జునుని చూడలేదు. ఎలా ఉంటాడో అని కలలు కంటూ ఉంది.

అందరూ రైవతకాద్రికి ప్రదక్షిణం చేసి పూజలు చేసారు. ఆ సమయంలో అర్జునుడు సుభద్రను చూచాడు. అతని మనస్సు చలించింది.

అది చూచి శ్రీకృష్ణుడు "స్వామీ! తమరు సన్యాసులు. అందమైన అమ్మాయిలను అలా చూడరాదు" అని అన్నాడు. అర్జునుడు సిగ్గుపడ్డాడు.

"అర్జునా! నీకు నా చెల్లెలుసుభద్ర మీద మనసు ఉందని నాకు తెలియును. నీ కోర్కెను దేవకీ వసుదేవులకు చెప్పి సఫలము చేస్తాను."అని పలికాడు.

బలరాముడు కూడా అక్కడకు వచ్చాడు. అర్జునుని నిజమైన మునీశ్వరుడు అనుకొని ఆయనకు నమస్కరించాడు.

"స్వామీ, తమరు ఇక్కడే ఉండి తమరి చాతుర్మాస్య వ్రతాన్ని నిర్విఘ్నంగా కొనసాగించండి" అని అర్థించాడు. దానికి అర్జునుడు సంతోషంగా ఒప్పుకున్నాడు.

బలరాముడు సుభద్రను అర్జునునికి సేవలు చెయ్యడానికి నియోగించాడు. అర్జునుడు ద్వారకలో క్షేమంగా ఉన్నాడని శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థానికి వార్త పంపాడు.

అర్జునుని హావభావాలు, అందచందాలు చూచి నిజంగా అర్జునుడే అని అనుమానం కలిగింది సుభద్రకు. తన అనుమానం నివృత్తి చేసుకోవాలని అనుకుంది.

ఒక రోజు అర్జునుని చూచి "స్వామీ! తమరు ఎన్నో పుణ్య క్షేత్రాలు దర్శించారు కదా! మా బావ అర్జునుడు తమరికి కనిపించాడా"అని అమాయకంగా అడిగింది సుభద్ర.

అర్జునుడు ఇంక విషయం దాచి ప్రయోజనం లేదనుకున్నాడు. "నేనే అర్జునుడను" అని యతి రూపం తీసి యదార్థ రూపంలో కనిపించాడు. సుభద్ర ఆనందానికి అవధులు లేవు. తన చిరకాల కోరిక నెరవేరినందుకు సిగ్గుతో పులకించిపోయింది.

అర్జునుడు సుభద్రను గాంధర్వవిధిని వివాహం చేసుకుందా మన్నాడు. కాని సుభద్ర ఒప్పుకోలేదు.

"నన్ను మీకు ఇవ్వడానికి మా వా ళ్లు సిద్ధంగా ఉన్నారు. వా రే మన వివా హం జరిపిస్తారు" అని అంత:పురానికి వెళ్లింది.

శ్రీకృష్ణునికి ఈ విషయం తెలిసింది. దేవకీ వసుదేవులకు, ఇతర యాదవులకు ఈ విషయం చెప్పి వారిని సుభద్రార్జునుల వివాహానికి ఒప్పి ంచాడు. శివ పూజలు చెయ్యాలని బలరాముడిని, ఇతర యాదవులను అంతర ద్వీపానికి పంపా డు. తాను కూడా వారితో వెళ్లి నట్లు వెళ్లి మరల ద్వారకకు తిరిగి వచ్చాడు.

శ్రీకృష్ణుడు దేవేంద్రుడిని పిలిపించాడు. అందరి సమక్షంలో సుభద్రార్జునుల వివాహం వైభవంగా జరిగింది. ఇంద్రుడు తన కుమారుని పెళ్లికి ఎన్నో కానుకలు ఇచ్చాడు.

"అర్జునా! నీవు సుభద్రను తీసుకొని బంగారు రధం ఎక్కి ఇంద్రప్రస్థము వెళ్లుము". అని చెప్పి తాను కూడా ఏమీ ఎరుగనట్టు మరల అంతర ద్వీపానికి వెళ్లాడు.

అర్జునుడు బంగారురధం మీద సుభద్రను తీసుకొని వెళుతుంటే ద్వారపాలకులు చూచారు. వారికి సుభద్ర అర్జునుల వివాహ విషయం తెలియదు. కాబట్టి ఎవరో వీరుడు సుభద్రను తీసుకొని పోతున్నాడు అనుకొని అర్జునుని అడ్డగించారు. అర్జునుడు సుభద్రకు రధము పగ్గాలు ఇచ్చాడు. తాను యాదవ వీరులతో యుద్ధంచేశాడు. వారిని ఓడించాడు. యాదవ వీరులు ఈ విషయాన్ని వెంటనే బలరాముడికి తెలిపారు.

బలరాముడు యాదవులనందరిని సమావేశ పరిచాడు. యాదవ వీరులంతా కోపంతో ఊగిపోయారు. "వెంటనే పోయి, అర్జునుని మీద యుద్ధం చేసి, సుభద్రను తీసుకొని వద్దాము" అని అనుకొన్నారు.

వారిని శాంతపరిచి, బలరాముడు శ్రీకృష్ణునితో "కృష్ణా! నీకు తెలియకుండా అర్జునుడు సుభద్రను తీసుకొని వెళ్లాడా?" అని అడిగాడు.

"అన్నయ్యా! అర్జునుడు తన మేన మరదలిని వివాహమాడి తీసుకొని వెళ్లాడు. అది తప్పా! ద్రోణాచార్యుని శిష్యుడు అర్జునుని జయించడం అంత సులభమా! అతని పరాక్రమము తమరు స్వయంవర సమయమున చూడలేదా! " అని అన్నాడు. బలరాముడు ఏమీ చెయ్యలేక పోయాడు.

అక్కడ అర్జునుడు సుభద్రతో ఇంద్రప్రస్థము చేరాడు.

"సుభద్రా! మనం ఇలా వెళితే ద్రౌపది మనలను చూచి పరుషంగా మాట్లాడుతుంది. అందుకని, ముందు నువ్వు వెళ్లి ద్రౌపదిని, నీ అత్త గారు కుంతిని పరిచయం చేసుకొని వారి అభిమానాన్ని సంపాదించు" అని చెప్పి సుభద్రను కొంతమంది గోప బాలికతో అంతఃపురానికి పంపాడు.

సుభద్ర అంత:పురానికి వెళ్లి ముందు కుంతికి తరువాత ద్రౌపదికి నమస్కరించింది. వారి దీవనలు పొందింది. తరు వాత అర్జునుడు నగర ప్రవేశం చేసాడు. అన్నలకు, కుంతికి నమస్కరించి వారి దీవనలు తీసుకున్నాడు.

తరువాత, వసుదేవుడు, బలరామ కృష్ణులు అర్జునునికి అంతు లేని కానుకలు తీసుకొని వచ్చారు. ధర్మరాజు యదుప్రముఖులకు నమస్కరించి వారి దీవనలు తీసుకున్నాడు. అందరూ ఆనందంగా ఒకరిని ఒకరు అభినందించుకున్నారు.

సుభద్ర గర్భం ధరించి. లోకోత్తర పరాక్రమ వంతుడైన అభిమన్యునికి జన్మనిచ్చింది. అభి మన్యుడు ధౌమ్యుని వద్ద వేదవేదాంగాలు అభ్యసించాడు. తండ్రి అర్జునుని వద్ద అస్త్ర, శస్త్ర విద్యలు అభ్యసించాడు.

పాండవులకు ద్రౌపది వలన ప్రతివింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు, అను ఐదుగురు ఉపపాండవులు జన్మించారు.

తరుత ఒకరోజు అర్జునుడు కృష్ణుని చూచి "బావా! ఇక్కడ ఎండలు ఎక్కువగా ఉన్నాయి. మనం మంచి వన ప్రాంతాలకు వెళ్లి అక్కడ సరాదాగా గడుపుదామా!" అని అన్నాడు. కృష్ణుడు "సరే" అన్నాడు. అందరూ ఖాండవ వన సమీపములో ఉన్న అడవికి వెళ్లారు.

వారు అక్కడ విహరిస్తుండగా, ఒక రోజు అగ్నిదేవుడు బ్రాహ్మణ వేషంలో వారి వద్దకు వచ్చాడు. కృష్ణా ర్జునులు ఆ బ్రాహ్మణుడికి అర్ఘ్య పాద్యాదులు ఇచ్చి సత్కరించారు.

"అయ్యా నాకు బాగా ఆకలిగా ఉన్నది. తమరు భోజనం పెట్టగలరా!" అని అడిగాడు అగ్నిదేవుడు.

"మీకు ఏది ఇష్ట మో చెప్పండి పెడతాము" అని అన్నారు కృష్ణార్జునులు.

అప్పుడు అగ్నిదేవుడు తన నిజ స్వరూపమును చూపి "నేను అగ్నిదేవుడను. నేను ఆ ఖాండవ వనాన్ని

దహించాలి. కాని ఇంద్రుడు అడ్డుపడుతున్నాడు. ఇంద్రుడి మిత్రుడైన తక్షకుడు ఆ వనంలో ఉన్నాడు. అతనిని రక్షించడానికి ఇంద్రుడు నాకు అడ్డుపడుతున్నాడు. తమరు, ఇంద్రుడు కలిగించే ఆటంకాలు తొలగిస్తే నేను ఖాండవ వనాన్ని నిరాటంకంగా భుజిస్తాను." అని అన్నాడు.

అప్పుడు అర్జునుడు అగ్నిదేవునితో "అయ్యా! నీకు ఈ ఖాండవ వనం దహించాలని ఎందుకు కోరిక కలిగింది?" అని అడిగాడు. దానికి అగ్నిదేవుడు ఇలా చెప్పాడు.

"శ్వేతకి అనే రాజర్షి సత్ర యాగాన్ని చెయ్య డానికి సంకల్పించాడు. అది 100 సంవత్సరాలు జరిగే యజ్ఞం. ఏ ఋత్విక్కు దానికి ఒప్పుకోలేదు. అప్పుడు శ్వేతకి ఈశ్వరుని గూర్చి ఘోర తపస్సు చేశాడు. ఈశ్వరుడు ప్రత్యక్షం అయ్యాడు.

"దేవా! నేను 100 సంవత్సరాలపాటు జరిగే సత్రయాగం చెయ్య సంకల్పించాను. నువ్వు నాకు ఋత్విక్కుగా ఉండాలి" అని అడిగాడు.

దానికి ఈశ్వరుడు "శ్వేతకీ! యజ్ఞాలు చేయించేపని బ్రాహ్మణులది. అందుకని నీకు దుర్వాసుని యాజ్ఞికునిగా నియమిస్తున్నాను. నీవు 100 సంవత్సరాలు ఎడతెగని నేతి ధారతో యజ్ఞము చేసి అగ్ని దేవుని తృప్తిపరచుము" అని అంతర్ధానం అయ్యాడు.

ఆ ప్రకారం శ్వేతకి సత్రయాగం చేసాడు. అప్పుడు తాగిన నేతితో నాకు జీర్ణ శక్తి తగ్గింది. మహా వ్యాధిగా మారింది. ఖాండవ వనంలో ఉన్న ఓషధులు సేవిస్తేగాని ఈ వ్యాధితగ్గదు అని బ్రహ్మదేవుడు చెప్పారు. అందుకని ఖాండవ వనాన్ని దహించాలని కోరికగా ఉంది" అని అన్నాడు అగ్నిదేవుడు.

అప్పుడు అర్జునుడు అగ్నిదేవునితో "అగ్నిదేవా ! మావద్ద అస్త్రములు, శస్త్రములు ఉన్నవి. కాని వాటిని ప్రయోగించడానికి తగిన ధనుస్సు, రథము ప్రస్తుతము మా వద్ద లేవు. అందుకని ఆలోచించుచున్నాము" అని అన్నాడు.

అప్పుడు అగ్నిదేవుడు వరుణుని ధ్యానించాడు.

వరుణుడు ప్రత్యక్షం అయ్యాడు. "వరుణా! నీకు బ్రహ్మ దేవుడు ఇచ్చిన ధనుస్సు, అమ్ములపొది, రధాన్ని అర్జునునికి ఇమ్ము. అలాగే, చక్రాన్ని, గదను శ్రీకృష్ణునుకి ఇమ్ము" అని చెప్పాడు.

అప్పుడు, వరుణుడు గాండీవము అనే ధనుస్సును, అక్షయ తూణీరములను, కపిధ్వజముతో కూడిన రధమును అర్జునునికి ఇచ్చాడు. అలాగే, సుదర్శనము అనే చక్రాయుధాన్ని, కౌమోదకి అనే గదను శ్రీకృష్ణునుకి ఇచ్చాడు.

" కృష్ణార్జునులారా, ఈ గాండీవము, అక్షయ తూణీరము, చక్రము, గద లను ప్రయోగించి, నాకు రక్షణ కల్పించండి." అని అడిగాడు అగ్నిదేవుడు.

"అగ్నిదేవా! ఇంక నీకేమీ భయము లేదు. నువ్వు ఖాండవ వనమును దహింపుము" అన్నాడు అర్జునుడు.

రెట్టించిన ఉత్సాహంతో అగ్నిదేవుడు ఖాండవ వనాన్ని దహిస్తున్నాడు. ఖాండవ వనానికి ఇరుపైపు

లా కృష్ణార్జునులు నిలబడ్డారు. ఖాండవ వన రక్షకులు అడ్డగించగా అర్జునుడు వారిని చంపాడు. ఖాండవ వనంలో ఉన్న జంతువులు, పక్షులు, పాములు, అన్ని ప్రాణులు అగ్నిజ్వాలలో పడి మరణించసాగాయి..

ఇది చూచి దేవతలంతా దేవేంద్రుని వద్దకు వెళ్లారు. ఖాండవ వన దహనాన్ని గురించి చెప్పారు. దేవేంద్రుడు అదిరి పడ్డాడు. వెంటనే తన మిత్రుడు తక్షకుని కాపాడాలని నిశ్చయించుకున్నాడు. ఉరుములతో, మెరుపులతో కుంభవృష్టి కుర వాలని మేఘాలను ఆజ్ఞాపించాడు.

ఇంద్రుడు కురిపించే కుంభవృష్టి ఖాండవ వనం మీద పడకుండా అర్జునుడు తన బాణాలతో ఒక కప్పు నిర్మించాడు.

అగ్నిదేవుని జ్వాలలనుండి రక్షించుకోడానికి తక్షకుని కుమారుడైన అశ్వసేనుడు అనే సర్పము తన తల్లితోక పట్టుకొని ఆకాశంలో పరుగెత్తుతున్నాడు. ఇది చూచి అర్జునుడు అశ్వసేనుని తన బాణాలతో కొట్టాడు.

ఇది చూచి మహేంద్రుడు అర్జునుని మీద మోహినీ మాయను ప్రయోగించి అశ్వసేనుని అతని తల్లిని కాపాడాడు. తక్షకునికి ఏమయినదోనని భయపడ్డాడు. అర్జునునితో యుద్ధం చేసాడు. ఇద్దరికి ఘోర యుద్ధం జరిగింది. దేవేంద్రుడు తన కుమారుని బలపరాక్రమాలకు సంతోషించాడు. కాని తక్షకుని కాపాడడానికి వారితో ఘోరయుద్ధం చేస్తున్నాడు. ఇంతలో ఆకాశవాణి ఇలా పలికింది.

"దేవేంద్రా! వీరు భూమి మీద అవతరించిన నరనారాయణులు. వీరిని జయించడం నీకు సాధ్యంకాదు. తక్షకుడు ఇక్కడ లేడు. ఎప్పుడో తప్పించుకొని కురుక్షేత్రం వెళ్లాడు." అని పలికింది. ఇది విని దేవేంద్రుడు తన సేనలతో తిరిగి దేవలోకానికి వెళ్లిపోయాడు.

ఇంతలో నముచి అనే రాక్షసుని తమ్ముడు, మయుడు అను వాడు ఆ మంటలలో చిక్కుకొని బయటకు రాలేక అర్జునుని శరణు జొచ్చాడు. అలా మయుడు, అశ్వసేనుడు, మందపాలుని కుమారులు నలుగురు శార్ఙ్గకులు తప్పించుకున్నారు.

ఈ కథ వింటున్న జనమేజయుడు వైశంపాయనునితో ఇలా అన్నాడు "మహాత్మా! మందపాలుడు ఎవరు? అతనికుమారులు ఎలా తప్పించుకున్నారు?" అని అడిగాడు. వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

పూర్వం మందపాలుడు అనే మహాముని బ్రహ్మచర్యం పాటించి ఎంతో నిష్ఠగా తపస్సుచేశాడు. కాని సంతానం లేనందువల్ల పుణ్యలోకాలు పొందలేక పోయాడు. త్వరగా సంతానం పొందడానికి ఒక ప క్షిగా పుట్టాడు. ఆడపక్షి అయిన జరితతో సంభో గించాడు. నలుగురు కొడుకులను కన్నాడు. వారంతా ఖాండవ వనంలో ఉన్నారు.

అగ్నిదేవుడు ఖాండవ వనాన్ని దహించపోయే ముందు తన కుమారులను రక్షించమని ప్రార్థించాడు మందపాలుడు. అగ్నిదేవుడు సరే అన్నాడు. మందపాలుడు తన కొడుకుల దగ్గర ఉన్నాడు.

ఇంతలో మంటలు దగ్గరకు వస్తున్నాయి. మందపాలుడు కొడుకులను భూమిలో ఉన్న కలుగులో దాక్కోమన్నాడు.

"తండ్రీ! కలుగులో దా క్కుంటే ఎలుకలు మమ్మల్ను తినేస్తాయి. ఇక్కడ ఉంటే పవిత్రుడైన అగ్నికి ఆహుతి అవుతాము. ఇదే మంచిది కదా" అని అన్నాయి. "సరే" అని మందపాలుడు, జరిత పైకి ఎగిరి పోయారు.

నలుగురు శార్ఙ్కులు వేదపఠనం చేస్తూ మాకు అభయం ఇమ్మని ప్రార్థించారు. అగ్ని దేవుడు ఇది విన్నాడు. వీరు మందపాలుని కుమారులుఅని గుర్తు పట్టాడు. మందపాలునికి ఇచ్చి మాట ప్రకారం ఆ చెట్టును వదలి పక్కనుండి వెళ్లి పోయాడు.

అలా మందపాలుని కుమారులు బతికారు. మందపాలుడు కూడా తన కుమారులు బతికి ఉన్నారని తెలుసుకొని సంతోషంగా పుణ్యలోకాలకు వెళ్లాడు.

అగ్నిదేవుడు నిర్విఘ్నంగా ఖాండవవన దహనం పూర్తిచేశాడు. తన రోగం పోగొట్టు కున్నాడు. తనకు సహాయం చేసిన కృష్ణార్జునులను దీవించాడు.

మహేంద్రుడు కూడా తన కుమారుని శౌర్యపరాక్రమాలకు సంతోషించి అర్జునునికి ఆగ్నేయాస్త్రము, వారుణాస్త్రము, వాయవ్యాస్త్రము ఇచ్చాడు.

కృష్ణార్జునులు కూడా, ఖాండవ వనంలో పరిచయం అయిన మయుని వెంటపెట్టుకొని ఇంద్రప్రస్థానికి వెళ్లారు. జరిగినది అంతా చెప్పి మయుని ధర్మరాజుకు పరిచయం చేసాడు. అంతా సుఖంగా ఉన్నారు.

మహాభారతము
ఆది పర్వము అష్టమాశ్వాసము సమాప్తము.
ఆది పర్వము సంపూర్ణము.
ఓం ఓం ఓం శాంతిః శాంతిః శాంతిః
హరి ఓం తత్సత్.

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహార్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎఱ్ఱాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)

Modali Venkata Subrahmanyam, B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.
subrahmanyam_mv1947@yaoo.co.in
Ph:040-2404 8104

శ్రీరామ ఓం ఓం

శుక్లాంబరధరం పిష్ణుం శశి వర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ పిఘ్నోప శాంతయే
శ్రీ వాణీ గిరిజా శ్చిరాయ దధతో వక్షో ముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహ న్త్యపిహతాం
స్త్రీ పుం సయోగో ద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రి పురుషా స్సమ్పూజితా వస్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవ శ్రీకన్ధరా శ్శ్రేయసే.
ఓం గణానాంత్వా గణపతిగ్ ం హవామహే
కపిం కపీనా ముపమశ్శ్రవస్తమం
జ్యే ష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆనః శృణ్వన్నూతిభిః సీదసాదనం
ఓం శ్రీ మహాగణాధిపతయేనమః.
ప్రణోదేవీ సరస్వతీ వాజేభిర్ వాజినీవతీ
ధీనామ పిత్ర్యవతు
ఆనోదివో బృహతః పర్వతాదా సరస్వతీ
యజతాగంతు యజ్ఞం
హవందేవీ జుజుషాణాఘృతాచీ శగ్మాం
నో వాచముశతీ శృణోతు.
వ్యాసం వసిష్ట నప్తారం శక్తేః పౌత్రమకల్మషం
పరశరాత్మజం వందే శుకతాతం తపోసిధిం.

వ్యాసాయ పిష్ణు రూపాయ వ్యాసరూపాయ పిష్ణవే

నమోవై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః.

# మహాభారతం

# సభాపర్వము

## ప్రధమాశ్వాసము.

నైమిశారణ్యంలో మహా భారత కధను శౌనకాది మహామునులకు చెపుతున్న ఉగ్రశ్రవసుడు అనే పౌరాణికుడు (సూతి) ఇలా చెప్ప సాగాడు.

అర్జునుని చూచి దానవ శిల్పి అయిన మయుడు ఇలా అన్నాడు. " అర్జునా! నీ దయవలన నేను అగ్ని లో ఆహుతి కాకుండా బతికి బయట పడ్డాను. మీకు ఇష్ట మై నది ఏదైనా చేద్దామని ఉంది. నేను దానవ శిల్పిని. చిత్ర విచిత్రమై న నిర్మాణాలు చెయ్య గలను.

మీకు ఏమి ఇష్టమో చెప్పండి. నిర్మించి ఇస్తాను" అని అన్నాడు.

అర్జునుడు కృష్ణుని వంక చూచాడు. శ్రీకృష్ణుడు మయుని వంక చూచి "ధర్మరాజు కురువంశ మహారాజు. ఆయన విభవానికి దీటుగా ఒక భవనాన్ని నిర్మించి ఇవ్వండి" అని అన్నాడు.

"తమరు చెప్పినది సత్యము. ఈ భూమి మీద ధర్మరాజును మించిన మహారాజు లేడు. అందుకని జనులంతా మెచ్చే విధంగా ఒక చిత్రవిచిత్రమైన భవనాన్ని నిర్మించి ఇస్తాను. ఇదివరకు వృషపర్వుడు అనే రాక్షసరాజుకు ఒక సభ నిర్మించడానికి అన్ని ఉపకరణములను సమకూర్చుకున్నాను. కాని కారణాంతరాల వలన ఆ సభను నిర్మించలేక పోయాను. నేను సేకరించిన ఉపకరణములన్నియు బిందు సరము అనే సరస్సులో భద్రపరచాను. అవి ఉపయోగించి మీకు ఒక చిత్రవిచిత్రమైన సభను నిర్మించి

ఇస్తాను. అదీ కాకుండా నా వద్ద భౌమాదిత్యుడు అనే రాజర్షి దాచి ఉంచిన గద, శంఖము ఉన్నాయి. అందులో గదను భీమసేనునికి ఇస్తాను. దేవదత్తము అనే శంఖాన్ని అర్జునునికి ఇస్తాను." అని అన్నాడు. ధర్మరాజు దగ్గర సెలవు తీసుకొని మయుడు బిందుసరము అనే సరోవరానికి వెళ్లాడు. శ్రీకృష్ణుడు కూడా ద్వారకావతికి వెళ్లాడు.

మయుడు బిందుసరము అనే సరోవరములో ఉన్న దూలములనూ, కంభములనూ, మిగిలిన ఉపకరణములను ఉపయోగించి, ఒక చిత్ర విచిత్రమైన సభను నిర్మించాడు. నీటికి బదులు ఇంద్రనీల మణులను, పద్మరాగ మణులతో ఎర్రని పద్మాలను, రజితముతో తెల్లటి తామరలను, రాజ హంసలను, వజ్రాలతో చేపలను, ముత్యములతో తెల్లటి నురుగులను, మరకతములతో నీటి లోపల నాచును, నిర్మించాడు. అవి చూచి ప్రజలు అవి నిజమయిన నీళ్లు అని, చేపలని, హంసలని భ్రమపడేటట్లుగా నిర్మించాడు. అదియును కాక, ఆ సభలో, నీటి యంత్రములను,

చెట్లను, నీటి కొలనులను, పక్షుల గూళ్లను, వివిధ రత్న కాంతు లతో శోభిల్లు మయసభను పదునాలుగు నెలలు శ్రమించి నిర్మించాడు. దానిని ఎనిమిదివేల మంది బలిష్ఠులైన రాక్షసభటులతో ఆకాశ మార్గాన ఇంద్రప్రస్థ నగరానికి మోయించుకొని తీసుకొని వచ్చాడు. దానిని ధర్మరాజుకు బహూక రించాడు.

ధర్మరాజు ఒక శుభముహూర్తాన, తమ్ములతో, భార్యతో, పురోహితుడైన ధౌమ్యుడు ఆశీర్వచ నములతో మయసభా ప్రవే శం చేశాడు. సామంత రాజులందరూ ధర్మరాజును దర్శించుకొని కానుకలు సమర్పించుకున్నారు.

ఒకనాడు నారద మహర్షి ధర్మరాజు వద్దకు వచ్చాడు. ధర్మరాజు నారదమహర్షిని అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి తగు విధంగా సత్కరించాడు. నారద మహర్షి ధర్మరాజును కొన్ని రాజనీతి సంబంధమైన విషయాలు అడిగాడు.

(ఇక్కడ మనం ఒక విషయం గమనించాలి. మన పురాణ కధలలో, సినిమాలలో, నారదుడిని కలహభోజనుడుగా, జగడాలమారిగా, విదూషకునిగా చిత్రీకరిస్తారు. కాని నారదుడు ఎంతటి రాజనీతిజ్ఞుడో ఆయన ధర్మరాజు ను అడిగిన ప్రశ్నలబట్టి అర్థం అవుతుంది. ఈనాటి పాలకులు అనుసరించవలశిన ఎన్నోవిషయాలు ఆనాడు నారదుడు ధర్మరాజుతో ప్రస్తావించాడు. అవి చదవండి).

ధర్మరాజా! నీవు ధర్మ పద్ధతిని ఆచరిస్తున్నావు కదా!

రాజ్యకార్యాలను ధర్మబుద్ధితో, నీ స్వబుద్ధితో, అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలోచిస్తున్నావు కదా!

రాజోద్యోగములలో స్థిరబుద్ధి కల వారిని, యోగ్యులను నియమించినావు కదా!

సమర్థులైన బ్రాహ్మణులను, శాస్త్రనియమాలను బాగా తెలిసిన వారిని, మంత్రులుగా

నియమించి నావు కదా!

నీవిజయానికి కారణం రహస్యాలోచనం. దానిని ఎవరికి తెలియనియ్యకుండా రక్షించుచు కుంటున్నావు కదా!

నీచేత యజ్ఞములు చేయించు యాజ్ఞికుడు తన కర్తవ్యమును సక్రమంగానెరవేరుస్తు న్నాడు కదా!

ఎల్లప్పుడూ నీ మేలు కోరే వారిని నీకు విశ్వాసపాత్రులను నీ సైన్యాధ్యక్షులు గా నియమించినావు కదా!

ఎక్కువ పలుకుబడి కల, సమర్థుడైన మంత్రి, ఇతరులతో చేతులు కలిపి, నీకు వ్యతిరేక పక్షము ఏర్పరిచి, నీకు ద్రోహం చేయడం లేదు కదా! ఎందు కంటే ధనము, అధికారము ఎలాంటి రికైనా దురాశను, గర్వాన్ని, కలిగిస్తుంది.

( ఈ వెన్నుపోటు వ్యవహారం ఈనాడు ప్రతి చోటా జరుగుతూ ఉంది).

నీ రాజ్యములో ఉన్న శాస్త్రజ్ఞులు తమ స్వీయ ప్రతిభ చేత రాబోవు అంతరిక్ష సంబంధమయిన, భూమికి సంబంధించిన ఉత్పాతాలను ముందు గానే కనిపెట్టి విరుగుడుగా తగిన శాంతి క్రియలు జరిపిస్తున్నారా!

ఆయుర్వేదములో నిష్ణాతులైన వైద్యులు లోకానికి మేలు చేయాలని తలంపు తో, ప్రజలకు ప్రేమతో సేవ చేస్తున్నారా!

(చీటికి మాటికి విధులు బహిష్కరిస్తూ ప్రజలను ఇబ్బంది పెట్టడం నేటి వైద్యులు చేస్తున్న ప్రజాసేవ)

ఆర్థిక సంబంధమయిన రాచ కార్యములలో, ధర్మపరీక్షలతో పరిశుద్ధులైన వారిని, నీతి నియమాలు గల వారిని, పాప రహితులను, మంచి

నైపుణ్యం కలరిని నియమించావు కదా!

వ్యక్తుల యోగ్యతలను బట్టి, ఉత్తమ, మధ్య, అధమ, ఉద్యోగాలలో నియమించావు కదా!

నీ ఉద్యోగులకు జీత భత్యాలను సకాలంలో అందజేస్తు న్నావు కదా!ఎందు కంటే, ఉద్యోగు లకు సకాలంలో అందకపోతే, వారి ముఖాలలో విషాదం గోచరిస్తుంది. అది ప్రభువుకు కీడు కలిగిస్తుంది.

వంశ పారంపర్యంగా పని చేస్తున్న సేవకు లకు సత్కారములు చేస్తున్నావుకదా. వారు నీ కోసం ప్రాణాలు అర్పిస్తారు.

ధర్మజా! నీకోసం యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వారి కుటుంబాలకు తిండి, బట్ట, నీడ కల్పిస్తున్నావు కదా! వాళ్లకు సంతోషం కలిగిస్తున్నావు కదా!

నీ రాజ్యంలో లోభబుద్ధి కల వాళ్లు, దొంగలు, నీ శత్రువులతో స్నేహంగా ఉండే వాళ్లు, పిరికి వాళ్లు, దుర్మార్గులను, రాజ కార్యాలను నిర్వహించ డానికి పంపడంలేదు కదా!

నీ రాజ్యంలో దొంగల భయం లేకుండా ఉంది కదా! నీ రాజోద్యోగులు ధనానికి ఆశ పడి దొంగల వద్ద డబ్బు తీసుకొని వాళ్లకు రక్షణ కల్పించడం లేదు కదా!

(ప్రస్తుతం మన పోలీసులు చేస్తున్న పని అదేగా!)

నీరాజ్యంలో చెరువులు అన్నియు నిండి అనావృష్టి లేదు కదా!

(ప్రస్తుతం, చెరువులు అన్ని ఆక్రమించి, భవనాలు కట్టి, వరదలు వస్తే నిలువు లోతు నీళ్లలో మునిగి తేలుతున్నాము. అది నేటి ప్రగతి).

ధర్మరాజా! నీవు పేదరైతులకు ఉదారంగా

విత్తనాలు, ధాన్యము ఇస్తున్నావు కదా!

పౌరులకు నూటికి ఒక వంతు వడ్డీకి ఋణములు ఇచ్చి ఆదుకుంటున్నావు కదా!

(నన్నయగారు వా డిన పదం ఏమంటే "మానుగ శ తైకవృద్ధి న" శత ఏక వృద్ధి అంటే నూటికి ఒక వంతు అని అర్థము).

ధర్మరాజా! నీ రాజ్యములో కుంటి, గుడ్డి, మూగ, వికలాంగులను, అనాధ లను,దిక్కులేని లిని, దయతో పోషిస్తున్నావు కదా!

యుద్ధంలో శరణు జొచ్చిన శత్రువును, కాపాడుతున్నావుకదా!

(నేడు అమలులోఉన్న International Amnesty గురించి నాడు నారదుడు చెప్పాడు. కాని నేడు ఎవరూ పాటించడం లేదు. యుద్ధ ఖైదీలన్ను యుద్ధ శిబిరాలలో చిత్రహింసలు

పెడుతున్నారు).

ధర్మజా! నీకు మేలు చేసిన వారిని ఉచిత రీతిని సత్కరి స్తున్నావు కదా! చేసిన మేలు గుర్తించిన రాజు చక్కగా పాలించ గలడు.

(చేసిన మేలు వెంటనే మర్చిపోవడం. మేలు చేసిన వారికి కీడు చెయ్యడం నేటిరాజనీతి).

ధర్మరాజా! నీకు వస్తున్న ఆదాయంలో నాలుగవ భాగాన్ని కాని, మూడవ భాగాన్నికాని, లేక అర్ధ భాగాన్ని మాత్రం ఖర్చుచేయాలి. అంతకు మించి ఖర్చు చేయరాదు.

(లోటు బడ్జటు, ప్రపంచ బాంకు అప్పులు, రాజ్యాన్ని తాకట్టుపెట్టడం నేటి రాజనీతి).

ధర్మరాజా! ఆయుధ శాలలు, ధనాగారాలు, కోశాగారాలు వీటిలో సమర్థులైన వారిని,

నమ్మకస్తులను, నీతి మంతులను నియమిం
చావు కదా!
(ఇటీవల రక్షణ శాఖలో బయటపడ్డ తెహెల్కా
కుంభకోణం, బంగారు లక్ష్మణ్ గారి కథ,
రక్షణశాఖాధికారుల కక్కుర్తి, నట్వర్ సింగు,
ఆయన పుత్ర రత్నం చేసిన ఘనకార్యాలు - ఇదీ
నేటి భారతంలో ఉన్న రాజనీతి.).

ధర్మరాజా! వృద్ధులైన గురువులను, శిల్పుల
ను, గొప్ప వర్తకులను, పేదరికం లేకుండా
పోషిస్తు న్నావు కదా!

మంత్రులు, సేనాధిపతులు, అధిక సంఖ్యలో
ఉండగా, ప్రతి దినం కొలువు తీరుతున్నావు
కదా!

(అసెంబ్లి,పార్లంటు సమావేశాలలో, హాజరైన
సభ్యులు పదుల సంఖ్య లో ఉంటారు. అందులో
సగం మంది నిద్రావస్థలో ఉంటారు కదా!)

ధర్మరాజా! బయట ఉన్న వారివలన కానీ, లోపల ఉన్న వారి వలన కానీ నీకు ముప్పులేకుండా నిన్ను నీవు రక్షించుకుంటూ, శత్రురాజుల కదలికలను గూఢచారులవలన కనిపెడుతున్నావు కదా!

మంచి విద్వత్తు కల ముఖ్యులతో కలిసి, ధర్మమును పాటిస్తూ, రాగద్వేషములు లేకుండా సమ బుద్ధితో లోక వ్యవహారాలు విచారిస్తున్నావు కదా!

ధర్మరాజా! ప్రపంచమంతము సమాచార సేకరణ వల్లనే నడచుచున్నది. నీవు వార్తలను చక్కగా సేకరించి తదనుగుణముగా రాజ్యపాలన చేస్తున్నావు కదా!

ధర్మరాజా! నీ పరిరక్షణలో ఉన్న ప్రాంతములు, రాజ్యములు, కోటలు అన్నింటిలో ధాన్యము, ఆయుధములు, సైన్యము, సమృద్ధిగా ఉన్నాయి

కదా!

ఉప్పు,పులుపు,కారము కలిగిన ఆహార పదార్థాలు, వివిధ పానీయాలు, వంటసామగ్రి, వంటచెరకు, అన్ని సమృద్ధిగా ఉన్నాయి కదా!

నీ కోటలన్నియు శత్రుదుర్భేధ్యాలయి ఉన్నాయి కదా!

నీవు నీ అంత:శత్రువులను (కామ, లోభ, క్రో ధ, మో హ, మద, మాత్సర్యములు) జయించి పరిపాలన చేస్తున్నావు కదా! మితిమీరిన మదం తో గుడ్డి వాళ్లైన శత్రువులను జయిస్తున్నావుకదా!

ధర్మజా!నీవు శత్రురాజుల మీదికి దండెత్తక ముందు సామ దాన భేధ ఉపాయాలను ఉప యోగిస్తున్నావు గదా!

(హఠాత్తుగా దొంగ దెబ్బ తియ్యడం నేటి రణనీతి).

ఇక్కడ నారద మహర్షి పదునాలుగు రాస దోషాలు అంటే రాజులు చెయ్యకూడని పనులు, వివరంగా చెప్పాడు.

1.నాస్తికుడుగా ఉండటం.
2.అబద్ధాలు ఆడటం.
3.ప్రమాదాలను ఆలస్యంగా గుర్తించడం.
(ఎందుకంటే ఈ లోపల జరగవలసిన అనర్థాలు జరిగి పోతాయి కాబట్టి),

4.తెలివితక్కువ వాళ్లను చుట్టూ కూర్చోపెట్టుకొని సమాలోచనలు చెయ్యడం.
(అప్పదీయులంతా వా ళ్లేగా మరి).

5.ఎక్కువగా కోపగించుకోడం.
(తాము చేసే అపభ్రంశమయిన పనులకు వత్తాసు పలకలేదని అంతులేని కోపంతో అధికారులను బండ బూతులు తిట్టడం ఈనాటి రాజకీయ

నాయు కుల నిత్యకృత్యం).

6.చేయవలసిన పనులను నాన్చడం. ఆలస్యంగా చెయ్యడం.

7.త దుపరి జరిగిన దానికి చింతించడం. (చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం నేడు పరిపాటి).

8.తెలివిగల జ్ఞానులను గుర్తించకపోవడం.

(రాజ్యాంగంలో పదేళ్లకు నిర్దేశించిన రిజర్వేషన్లను మరో యాభయి ఏండ్లు పొడిగించి, ఇంకా పొడిగిస్తూ, పట్టుమని పది మార్కులు వచ్చినా పాస్ చేస్తూ, ప్రతిభను కాలరాస్తూ పరిపాలించే మన పాలకులను చూస్తే నారదుడు ఏమనుకుంటాడో పాపం!)

9.ప్రయోజనకరము లైన విషయాలలో అప్రయోజనకరములైన ఆలోచనలు చెయ్యడం.

10.ముందుగా నిర్ణయించుకొన్న పనులు చెయ్యకపోవడం.
(సంవత్సరంలో పూర్తి కావలసిన పని ఐదేళ్లు దేకడం. ధరలు పెరగడం. కాంట్రాక్టర్లు దోపిడీ చెయ్యడం. ప్రజాధనం దుర్వినియోగం అవడం ఇదీ నేటి భారతం).

11.ప్రభుత్వరహస్యాలను కాపాడకపోవడం. బయటకు పొక్కడం. (దేశరక్షణ రహస్యాలను బజానీలకు అమ్ముకుంటున్నారు).

12.శుభకార్యాలు చెయ్యకపోవడం (ప్రజాహిత కార్యాలు చెయ్యకపోవడం)

13.ఇంద్రియ సుఖములలో మునిగి తే లడం.

(రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, ద్విశతావధానులు, సెక్స్‌స్కాండల్సు లో ఇరుక్కోవడం ఈ రోజుల్లో పరిపాటి కదా!)

14.సోమరితనం, నిర్లిప్తత, నిష్క్రియా పరత్వం.

(ప్ర స్తుతం మన రాజకీయ నాయకులకు పట్టి పీడిస్తు న్న ప్రథమ జాడ్యం).

(ఇప్పటిదాకా మీరు నారదుడు ధర్మరాజును అడిగిన విషయాలు చది వారు. భారతకధలో, రాజకీయ చతురుడు శ్రీకృష్ణుడు ఉన్నాడు. నీతి కోవిదుడు విదురుడు ఉన్నాడు. కాని రాజనీతికి సంబంధించిన ఇన్ని విషయాల గురించి చెప్పే అవకాశం నారదుడికి కల్పించాడు వ్యా సుడు. దీనిని బట్టి నారదమహర్షి మనం, మన సినిపండితులు, నాటక రచయితలు, పురాణకర్తలు అనుకున్నట్లు జగడాలమారి కాదు, విదూషకుడు కాదు. ఎప్పుడూ ఒక వీణ మెడలో వేసుకొని తిరిగే దిమ్మరికాదు అని గ్రహించాలి. నారదుడు పైన చెప్పిన రాజకీయ సూత్రాలలో కనీసం కొన్ని పాటించినా మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ అవుతుంది. మన దేశం స్వర్ణభారతి అవుతుంది).

నారద మహర్షి! నా యధా శక్తి, అన్యాయ మార్గమును వదిలిపెట్టి, న్యాయ మార్గములో పరిపాలన సాగిస్తున్నాను. తమరు మయసభను చూచినారా! ఎలా ఉన్నది! అని అడిగాడు ధర్మరాజు.

ధర్మజా! నేను దేవేంద్ర, యమ, వరుణ, కుబేర, బ్రహ్మదేవుల యొక్క దివ్యసభలు ఇంకా ఎన్నో సభలు చూచినాను. కాని అన్ని సభల కన్నను, ఈ మయ సభ అపూర్వముగా నున్నది.

ఒకసారి నేను బ్రహ్మసభను వీక్షించాను. దాని రూపం అధ్భుతం. బ్రహ్మసభలో, మనువు, అత్రి, మరీచి, సూర్య చంద్ర గ్రహాలు, దేవగణాలు, వసువులు, రుద్రులు, సిద్ధులు, సాధ్యులు, మహా ఋషులు, అశ్వినీదేవతలు, విశ్వదేవతలు, విశ్వకర్మ, పితృదేవతలు, ధర్మార్ధకామక్షములు, శబ్ద, స్పర్శ, రూప, గంధాలు, తపస్సు,శమం, ద మం, ధృతి, స్మృతి, మేధ, బుద్ధి, క్షమ, కీర్తి, సంకల్పం, వికల్పం, ప్రణవం, క్షణం, లవం, తృటి, కాష్ఠ, ముమూర్తం, పగలు, రాత్రి, పక్షం, మాసం, మొదలయిన

విభాగాలతో కూడిన కాలచక్రం, చతుర్వేదాలు, వేదాంగాలు, పురాణేతి హాసాలు, సమస్తవిద్యలు, సాకారంగా బ్రహ్మను సేవిస్తుండగా, ఆయన సరస్వతీ స మేతుడై, వివిధ జీవరాసుల్ని సృజిస్తూ, బ్రహ్మదేవుడు పద్మాసనం మీద కొలువు దీరి ఉంటాడు.

ఇక్కడ ధర్మరాజుకు ఒక సందేహం కలిగింది. నారదుడు వివిధ సభలను వర్ణిస్తూ కృతవీర్యుడు, జన మేజయుడు, జనకాది మహారాజులు, పాండు రాజు యమసభలో ఉన్నట్టు చెప్పాడు. (రాజ్యాంతే నరకం ధృవం). కాని మహారాజు హరిశ్చంద్రుడు మాత్రం ఇంద్రసభలో ఉన్నట్టు చెప్పాడు.

"నారద మహర్షి! పరమ ధర్మాత్ముడైన నా తండ్రి పాండు రాజు యమ సభలో ఉండగా, హరిశ్చంద్రుడు మాత్రం ఇంద్రసభలో ఎలా ఉన్నాడు. చెప్పండి! " అని అడిగాడు.

" ధర్మజా! త్రిశంకు మహారాజు కుమారుడైన

హరిశ్చంద్రుడు అందరు రాజులను జయించాడు. రాజసూయ మహా యాగాన్ని చేశాడు. అందు వలన హరిశ్చంద్రుడు ఇంద్రసభలో ఉన్నాడు. నేను యమసభను సందర్శించినపుడు నీ తండ్రి పాండు రాజు నాతో ఇలా అన్నాడు "రాజసూయ యాగం చేసిన రాజులు ఇంద్రసభలో ఉంటారు. కాబట్టి నా కుమారుడు ధర్మరాజును రాజసూయ యాగం చెయ్యమని ఆజ్ఞాపించండి" అని అడిగాడు. కాబట్టి ధర్మరాజా! నీ తండ్రి కోరిక ప్రకారం రాజ సూయ యాగం నిర్వహించు. నీ తండ్రి ఇంద్ర సభలో ఉండేటట్లు చెయ్యి" అని చెప్పాడు. అలా చెప్పి నారదుడు నిష్క్రమించాడు.

ధర్మరాజు తన పురోహితుడు ధౌమ్యుడు, ఇతర మంత్రులతో రాజ సూయ యాగం గురించి చర్చించాడు.

దానికి ధౌమ్యుడు "ధర్మజా! నీ తండ్రి కోరిక తీర్చడం నీ కర్తవ్యం. దాని వల్ల సమస్తరాజులు నీకు లొంగి ఉంటారు. నీవు సంపదలు సమ కూర్చు

కోవడానికి ఇది తగిన సమయం." అని అన్నాడు.

ధర్మరాజు తన తమ్ములతో కూడా చర్చించి రాజసూయ యాగం చెయ్యడానికి నిర్ణయం తీసుకున్నాడు. ఈ యాగ నిర్వహణకు శ్రీకృష్ణుడే తగిన సమర్థుడు అని శ్రీకృష్ణుని తీసుకొని వచ్చుటకు ద్వారకకు తన ఆప్తులను పంపాడు.

ధర్మరాజు సందేశాన్ని అందుకొని శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థానికి వచ్చాడు. ధర్మరాజు శ్రీకృష్ణుని తగు రీతిని సత్కరించాడు.

"శ్రీకృష్ణా! నారద మహాముని నా తండ్రి కోర్కె ప్రకారము, నన్ను రాజసూయం చెయ్యమని ఆదేశించాడు. అందరితో ఆలోచించి నేను దానికి అంగీకరించాను. నీ అనుమతి కోసం ఎదురు చూస్తున్నాను" అని అన్నాడు.

శ్రీకృష్ణుడు ఎంతో సంతోషించాడు. "ధర్మజా! నీ నిర్ణయం ప్రశంసనీయం. పూర్వం జమదగ్ని

కుమారుడైన పరశు రాముడు క్షత్రియ వంశా లన్నింటిని నిర్మూలించాడు. అప్పుడు రెండే వంశాలు మిగిలాయి అవి ఇల, ఇక్ష్వాకు వంశాలు. అవి రెండే సహజ వంశాలు. తక్కిన వంశాలన్నీ కల్పితాలే. ఆ రెండు వంశాలు నూటొక్క వంశాలు గా వృద్ధి చెందాయి. యయాతి, భోజ వంశాల వల్ల మరో పదునాలుగు వంశాలు ఏర్పడ్డాయి. ఈ రాజ వంశాల నన్నింటిని జరాసంధుడు జయించాడు. ఛేధి భూపాలుడు శిశుపాలుడు జరాసంధునికి సైన్యాధిపతి. హంసఢింభకులు అనే ఇరువురు మహా బలవంతులు జరాసంధునికి ఆప్తులు. వారి పేర్లు కౌశిక చిత్రసేనులు. జరా సంధునికి కుడి ఎడమ భుజాలు. ఛేది రాజులలో పురుషోత్తముడు, అంగ, వంగ, పుండ్ర, కిరాత రాజులలో పౌండ్రక వాసుదేవుడు, జరాసంధుడిని సేవిస్తున్నారు. తూర్పు, దక్షిణ దేశాల రాజులు, పురుజితుడు, కరూశుడు, కలభ, నకుల, సంకర్షణ, సూపహిత, మనోదత్త, చక్ర, సాల్వేయ, యవనులు అతనినే కొలుస్తున్నారు. ఉత్తర దిక్కున ఉన్న పదునెనిమిది రాజవంశాలు, జరాసంధుని

భయంతో కొలుస్తున్నారు. నేను వధించిన కంసుని భార్య, జరాసంధుని కుమార్తె. అందుకని జరాసంధుడు నా పైన పగబూని ఉన్నాడు. ధర్మరాజా! ఆ హంస డింభకులు, జరాసంధుడు మూడు లోకాలను జయించగలరు. ఒకసారి జరాసంధుడు హంసడింభకులతో కలిసి మధుర మీద దండెత్తాడు. ఒక ఉపాయముతో హంస డింభకులను చంపాము. ఇప్పుడు జరా సంధుడు నిస్సహాయుడు. మే ముకూడా, జరా సంధునితో విరోధము వలన రైవతకాద్రిలో కోట కట్టుకొని ఉన్నాము. మనము ముందు ఆ జరా సంధుని వధించాలి. అప్పుడు నీ రాజ్యం స్థిర పడు తుంది. రాజసూయం కూడా సాధ్య పడు తుంది. జరా సంధుడు ఎంతటి బలవంతుడయినా, అతను చెడు ప్రవర్తన కలిగినందున అతనికి పతనం తప్పదు." అని అన్నాడు కృష్ణుడు.

అప్పుడు భీముడు ధర్మరాజుతో "అన్నయ్యా! ప్రయత్నముతో అన్ని విజయులు సమకూడుతాయి. శ్రీకృష్ణుని దయ, అర్జునుని సాయం, నీ అను

గ్రహం తో జరాసంధుని సంహరిస్తాను" అని అన్నాడు భీముడు.

" అన్నయ్యా! రాజులనందరిని జయిస్తాము. రాజసూయం నిర్వహిస్తాము. లేకపోతే మా పరాక్రమాలు, గాండీవం, మయసభ ఎందుకు?" అని అన్నాడు అర్జునుడు.

భీమార్జునుల మాటలు విని శ్రీకృష్ణుడు సంతోషించాడు. అప్పుడు ధర్మరాజు "కృష్ణా! అసలు ఆ జరాసంధుడు అంతటి బలవంతుడు, అంతటి దుర్మార్గుడు ఎలా అయ్యాడు?" అని అడిగాడు.

శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు."మగధ రాజైన బృహద్రధుడు కాశీరాజు పుత్రికలను పెళ్లిచేసుకున్నాడు. కాని అతనికి సంతానము కలగలేదు. అతడు భార్య లిద్దరితో కలిసి అరణ్యమునకు పోయి మహా తపస్సంపన్నుడైన చండకౌశిక మహర్షిని చూచాడు. ఆ మహర్షిని భక్తితో సేవించాడు.

అతని సేవలకు సంతోషించి " నీకు ఏమి కావాలో కోరుకో!" అన్నాడు చండకౌశికుడు. తనకు పుత్ర సంతానం ప్రాప్తి కలిగించమన్నాడు బృహద్రథుడు. అప్పుడు ఒక మామిడి పండు చెట్టు మీది నుంచి ఆ మహర్షి తొడమీద పడింది. ఆ మహర్షి ఆ పండును మంత్రించి బృహద్రథునికి ఇచ్చాడు. నీకు పుత్రసంతానం కలుగుతుంది అని చెప్పాడు.

మహా సంతోషంతో బృహద్రథుడు రాజధాని నగరానికి వచ్చాడు. ఆ పండును ఇద్దరు భార్యలకు చెరి సగం కోసి ఇచ్చాడు. ఇద్దరు గర్భం ధరించారు. ఇద్దరు ప్రసవించారు. ఒక్కొక్కరికి ఒక కన్ను, ఒక చెవి, ఒక చెంప, ఒక చన్ను, సగం బొడ్డు, ఒక చెయ్యి, ఒక పక్కభాగం, ఒక తొడ, ఒక కాలు అంటే సగం శిశువు జన్మించాడు. ఆ ముక్కలను చూచి బృహద్రథుని భార్యలు భయపడ్డారు. బృహద్రథునికి చూపించడానికి సిగ్గుపడ్డారు. ఆ ముక్కలను బయట పారేసి రమ్మని పరిచారికలకు ఇచ్చారు.

పరిచారికలు ఆ మానవ ముక్కలను నాలుగు మార్గముల కూడలి లో పారేసి వచ్చారు. అర్ధరాత్రి జర అనే రాక్షసి ఆ మాంసపు ఖండాలను తినడానికి వచ్చింది. ఆ రెండు ముక్కలని కలిపి పట్టుకుంది. ఆశ్చర్యంగా ఆ రెండు ముక్కలు అతుక్కున్నాయి. ఒక బాలుడుగా రూపొందాయి. ఆ బాలుడు ఏడుస్తున్నాడు.

ఆ ఏడుపు విని అంత:పురంలో స్త్రీలు పరుగెత్తుకొని వచ్చారు. రాక్షసి పారిపోయింది. ఇంతలో బృహద్రధుడు కూడా అక్కడకు వచ్చాడు. బాలుడిని చూచాడు. ఎంతో సంతోషించాడు. ఇదంతా దూరంనుండి చూస్తున్న ఆ రాక్షసి బృహద్రధుని వద్దకు వచ్చి "మహారాజా! నేను జర అనే రాక్షసిని. నీ భార్యలకు పుట్టిన ఆ మానవ ముక్కలను దాదులు తెచ్చి ఆ నాలుగు మార్గ ముల కూడలిలో పడేశారు. నేను ఆ ముక్కలను ఒకటిగా చేర్చి పట్టుకున్నాను. అవి ఈ మానవ రూపం ధరించాయి. ఈ బాలుడు వజ్రశరీరం కల వాడు. ఇతనిని నువ్వుస్వీకరించు" అని చెప్పింది.

"జరా! నాకు చండకౌశిక మహర్షి కృప వలన ఈ బాలుడు కలిగాడు. నీవలన ఆ బాలుడు మనిషి రూపం ధరించాడు. ప్రేమతో నువ్వునాకు ఇచ్చావు. నువ్వు నా కులమును ఉద్ధరించడానికి వచ్చిన పుణ్యదేవతవు" అని అన్నాడు.

ప్రేమగా కొడుకును ఎత్తుకున్నాడు. జర చేత కలుపబడిన బాలుడు కాబట్టి ఆ బాలునికి "జరాసంధుడు" అని పేరు పెట్టాడు. జరా సంధుడు మహా బలశాలి, పరాక్రమ వంతుడు అయ్యాడు.

ఒకరోజు చండ కౌశికుడు బృహద్రధుని వద్దకు వచ్చాడు. బృహద్రధుడు ఆ మహర్షిని పూజించి తన కొడుకును చూపించాడు.

" బృహద్రధా! వీడు మహా పరాక్రమ వంతు డవుతాడు. ఎలాంటి ఆయుధములు, అస్త్రములు

ఇతనిని చంపలేవు. ఇతడు రాజులందరిని జయి
స్తాడు. ఆ రాజుల సంపదలన్ని పొందుతాడు. ఆ
పరమ శివుని ప్రత్యక్షం చేసుకొంటాడు" అని
చెప్పాడు.

బృహద్రధుడు జరాసందునికి రాజ్యం అప్పగిం
చాడు. తాను తపోవనానికి పయన మయ్యాడు.
జరాసంధుడు ఏ ఆయుధముల చేత చావులేని
హంస ఢింభకుల సహాయముతో రాజులను
అందరిని జయించాడు. ఇప్పుడుహంస
ఢింభకులు చచ్చారు అందువలన, ఓ ధర్మరాజా!
ఒక్క భీముడే జరాసంధుని చంపగల సమర్ధుడు.
అందుకని భీమార్జునులను నాతో పంపు." అని
అన్నాడు శ్రీ కృష్ణుడు.

" ఓ కృష్ణా! నీవు అండ ఉండగా మాకు
పొంద లేనిది ఏమున్నది. ఇంక జరాసంధుడు
మర ణించినట్లే. నేను రాజసూయం నిర్విఘ్న
ముగా నెర వేర్చినట్టే!" అని భీమార్జునులను
విజయోస్తు అని దీవించి కృష్ణునితో పంపాడు.

శ్రీకృష్ణుడు భీమార్జునులతో కలసి కపట బ్రాహ్మణ రూపాలలో స్నాతక వ్రతం స్వీకరించారు. జరాసంధుని నగరము అయిన గిరివ్రజపురం సమీపించారు. ఆపురం చుట్టూ ఉన్న ఐదు పర్వ తాలు ప్రాకారాల మాదిరి  ఆ పురాన్ని రక్షిస్తున్నాయి.

పక్కనే చైత్యక మనే కొండ ఉన్నది. దాని మీద మూడు పెద్ద ఢక్కలు ఉన్నవి. వాటిని శ్రీకృష్ణుడు భీమార్జునులకు  చూపించాడు. "భీమా!ఎవరన్నా కొత్త మనుషులు నగరంలోకి ప్రవేశిస్తే ఆ ఢక్కలు మోగుతాయి." అని చెప్పాడు.  భీమార్జునులకు విషయం అర్థం అయింది. ఆ ఢక్కలను పగుల గొట్టారు. నగర ద్వారం గుండా కాకుండా, చైత్యక పర్వతం ద్వారా నగరంలోకి ప్ర శించారు.

శ్రీకృష్ణుడు భీమార్జునులు సిగలలో పూలు అలంకరించుకున్నారు. స్నాతకుల మాదిరి జరాసంధుని గోశాలలోనికి ప్రవేశించారు.

జరాసంధునికి బ్రాహ్మణులు అంటే ఎంతో భక్తి గౌరవము. జరాసంధుని మందిరములోనికి బ్రాహ్మణులకు ఎల్లప్పుడూ ప్రవేశము కలదు.

బ్రాహ్మణ వేషములలో ఉన్న శ్రీకృష్ణుడు భీమార్జునులను చూచి జరాసంధుడు అర్ఘ్యపాద్యాలు ఇచ్చాడు. వారు దానిని నిరాకరించారు. అప్పుడు జరాసంధునికి అనుమానం వచ్చింది.

" మీరు నిజంగా స్నాతకులేనా? మీరు గంధం పుష్పాలు ఎందుకు ధరించారు. మీరు బ్రాహ్మణుల మాదిరి కనిపిస్తున్నా మీ ఆకారాలు క్షత్రియుల మాదిరి ఉన్నాయి. మీరు ఎవరు? ఎందుకు వచ్చారు?" అని అడిగాడు.

(స్నాతకుడు అనగా ధనం కాని మరేదన్నా గాని యాచించే వాడు స్నాతకుడు)

"మేము క్షత్రియ స్నాత కులము. ముఖ ద్వారం గుండా మిత్రుని ఇంటిలోనికి, దొంగ

దారిగుండా శత్రువుని ఇంటిలోనికి ప్రవేశించడం క్షత్రి య ధర్మం." అని అన్నారు శ్రీకృష్ణుడు, భీమార్జునులు.

"నేను ఎవరికి అపకారం చెయ్య లేదు. మీకు నాకు శత్రుత్వము లేదు. నేను బ్రాహ్మణులకు, దేవతలకు, మునులకు భక్తుడను. ఉత్తమ క్షత్రియ ధర్మాన్ని ఆచరిస్తున్నాను. అలాంటి నాకు మీరు ఎందుకు శత్రువులు అయ్యారు." అని అడిగాడు జరాసంధుడు.

"ఓ జరాసంధా! ధర్మరాజు చక్రవర్తి ఆజ్ఞ ప్రకారము శత్రు సంహారానికి వచ్చాము. అదియును కాక నీవు అత్యుత్తమ క్షత్రియ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నావు అని చెప్పావు. సాటి క్షత్రియులను చెరబట్టి శివునికి బలి ఇస్తూ శివ పూజలు ఉత్తమ క్షత్రియులు చేస్తారా? తగిన కారణం లేకుండా సాధు జనులను హింసించే నీలాంటి క్షత్రియులు అందరికి శత్రువులు కదా? నిర్దోషులైన నీ కులం వారిని చంపడం పాపం కదా! సాటి క్షత్రియులను

బలి ఇచ్చి చేసే శివ పూజలు ఫలితాన్ని ఇస్తా యా? నీలాంటి పాపులను దండించకుండా వదలి పెడితే, మాకు పాపం కదా! అందుకనే పాపాత్ముడైన నిన్ను దండించడానికి వచ్చాము. నేను కృష్ణుడను. ఇతను భీముడు. అతను అర్జునుడు. ఇప్పటికన్నా బుద్ధి తెచ్చుకొని నీ చెరలో ఉన్న రాజులను వదలిపెట్టు లేని ఎడల వీరు నీ గర్వమడచి నీ చెరలో ఉన్న రాజులను విడిచి పెడతాము" అని అన్నాడు శ్రీకృష్ణుడు.

జరాసంధునికి కోపం వచ్చింది.

"పరాక్రమ ముతో పరాయి రాజులను జయించడం తప్పా! అది క్షత్రియ ధర్మం కాదా! పరమ శివునికి బలి ఇవ్వడానికి తెచ్చి న రాజుల ను నేను ఎందుకు వదలిపెడతాను. అయినా కృష్ణా! నా సంగతి నీకు తెలియదా! మీకు సైన్యం ఉంటే మీ సైన్యంతో మా సైన్యం యుద్ధం చేస్తుం ది. లేకపోతే మీ ముగ్గురి తో కాని, మీలో ఇద్దరి తో గాని, లేక మీలో ఒక్కడి తో గాని నేను

ఒక్కడినే యుద్ధం చేస్తాను. మీకు ఏది ఇష్టమో అది చెప్పండి" అని అన్నాడు జరా సంధుడు.

"ముగ్గురం నీతో యుద్ధం చెయ్యడం ధర్మం కాదు. అందుకని మా ముగ్గురిలో నీకు సరి జోడు అయిన బలవంతుని కోరుకో అతను మల్ల యుద్ధంలో నిన్ను జయిస్తాడు." అని అన్నాడు.

" నాకు సరిజోడు భీముడే!" అన్నాడు జరాసంధుడు.

జయాపజయాలు దైవాధీనాలు కాబట్టి జరాసంధుడు ముందుగా తన కుమారుడిని తన రాజ్యానికి పట్టాభిషిక్తుని చేసాడు. పురోహితుల చేత మంగళాశాసనాలు పొంది భీమునితో మల్ల యుద్ధానికి నిలిచాడు.

భీముడు, జరా సంధుడు ఘోరంగా మల్ల యుద్ధం చేసారు. ఒకరిని ఒకరు లాగుతూ తోస్తూ, ఒకరిని ఒకరు జయించాలనే కాంక్షతో

యుద్ధం చేస్తున్నారు.ఆ విధంగా కార్తీక శుద్ధ పాడ్యమినాడు ప్రారంభించిన భీమ జరాసంధుల ద్వందయుద్ధం త్రయోదశి వరకు సాగింది. అప్పటికి జరాసంధుడు అలసిపోయాడు.

అది గమనించి శ్రీకృష్ణుడు "భీమా! జరా సంధుడు అలసి పోయాడు. ఇదే సమయం. అతడిని సంహరించు" అన్నాడు.

భీమసేనుడు తన తండ్రి వాయుదేవుని మనసులో తలచి జరాసంధుడిని పైకి ఎత్తి గిర గిరా తిప్పి నూరు సార్లు విసరి శాడు. అతడి ఎము కలు విరిచాడు. ఘోరంగా సంహరించాడు. జరా సంధుడి మృతదేహాన్ని తీసుకొని వచ్చి అతని గృహ ద్వారము వద్ద పడ వేశాడు.

శ్రీకృష్ణుడు మగధ ప్రజలందరికి అభయం ఇచ్చాడు. జరాసంధుని చెరలో ఉన్న రాజులం దరిని విడిపించాడు. జరాసంధుని కుమారుడైన సహదేవునికి ధైర్యం చెప్పాడు. అతడిని మగధకు

రాజును చేశాడు.

ఈ విధంగా మగధను జయిం చి శ్రీకృష్ణ భీమార్జునులు ఇంద్రప్రస్థానికి చేరు కున్నారు. ధర్మ రాజుకు జరిగినదంతాచెప్పారు. చెర విడిపించిన రాజులను చూపించారు. ఆ రాజులందరూ ధర్మ రాజుకు నమస్కరించి తమ తమ దేశాలకు పయనమయ్యారు. శ్రీకృష్ణుడు కూడా ద్వారకకు వెళ్లాడు.

ధర్మరాజు తన తమ్ములు నలువురిని నాలుగు దిక్కులకు జైత్రయాత్రకుపంపాడు. అర్జునుడు ఉత్తర దిక్కుకు వెళ్లాడు.

ఉత్తర దిక్కున ఉన్న పుళింద రాజును, ప్రతి వింధ్యుడిని, అఖిల ద్వీప మండలాధీశులను, ఓడించి సామంత రాజులుగా చేసుకున్నాడు. ప్రాగ్జ్యోతిష పుర మహారాజు భగదత్తుడి మీద దండె త్తాడు. అతనితో ఎనిమిది రోజులు యుద్ధం చేసా డు. భగదత్తుడు తన బలం కోల్పోయాడు.

"అర్జునా! మనం ఇరువురము ఇంద్రుని పుత్రులము. మనం యుద్ధం చెయ్యడం ఉచితమా. నీకు ఏమి కావాలో చెప్పు" అని అడిగాడు.

" భగదత్తా! ధర్మరాజు రాజసూయయాగం చేస్తు న్నాడు. నీవు కప్పం చెల్లించు. యాగానికి రా" అని అన్నాడు. భగదత్తుడి దానికి ఒప్పు కున్నాడు.

తరువాత, అర్జునుడు అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరి, రాజులందరిని జయించి కప్పం గ్రహించాడు. ఉలూక దేశాధిపతి బ్రహంతుని, ఉత్తర ఉలూక దేశాధిపతుల్ని, దేవప్రస్థ రాజు సేనా బిందుడిని, విష్వగశ్వుడిని, పర్వత రాజులను, బర్బర, శబర, తురుష్క రాజులను, మాళవ, పౌండ్ర, కాశ్మీరాది దేశాధి పతులను ఓడించాడు. సింహ పురాధీశుడు చిత్రాయుధుని, ఆటవిక రాజులను, దస్యులను, కాంభోజ కటక రాజును జయిం చాడు. మేరుపర్వతాన్ని దర్శించాడు. ఉత్తర కురు దేశాల

మీద దండెత్తాడు. ఓడించాడు. వారి వద్దనుండి అమూల్యములైన రత్నాభరణాలు, కప్పములు గ్రహించాడు. ఆ ప్రకారం అర్జునుడు ఉత్తర భారత దేశం అంతా జయించాడు.

భీమసేనుడు తూర్పు దిక్కుకు జైత్ర యాత్ర కు వెళ్లాడు. పాంచాల దేశము, విదేహ దేశము, దశార్ణ దేశము జయించి ఛేది దేశంలో అడుగు పెట్టాడు. ఛేది దేశాధిపతి శిశుపాలుడు భీమసే నుడికి లొంగిపోయి కప్పంకట్టాడు. ఆ ప్రకారం తూర్పు దేశాలన్నింటిని భీమసేనుడు జయిం చాడు. నూరు కోట్ల సంఖ్యలో రత్నములు, వజ్రములు, బంగారము,ధనము కప్పముగా తీసుకొని వచ్చాడు.

సహదేవుడు దక్షిణ దిక్కుగా విజయ యాత్ర సాగించాడు. సుమిత్రుడు, శూరసేనుడు, దంత వక్త్రుడు, యవనులను జయించాడు. కప్ప ము లను గ్రహించాడు. నర్మదానదీ సమీప మున అవంతీ రాజులను ఓడించాడు.

మాహిష్మతీ పురం చేరాడు. ఆ దేశపు రాజు నీలుని తో యుద్ధం చేశాడు. సహదేవుని సైన్యము మీద నీలుడు అగ్ని దేవుని  పురికొల్పాడు.

అసలు విషయం ఏమంటే, పూర్వము, నీలుని వంశము లో పూర్వీకుడు అయిన నిష ధుడు అనే రాజు రాజ్యం చేస్తుండగా, మాహి ష్మతీ పురంలో  అగ్నిదేవుడు బ్రాహ్మణ రూపంలో  వేదా ధ్యయనం చేస్తున్నాడు. ఆ సమయంలో  అగ్ని దేవుడు పొరపాటున పరపురుషుని భార్యతో రమించాడు. రాజభటులు అగ్నిదేవుని పట్టుకొని నిషధుని ముందు నిలబెట్టారు. అగ్నిదేవునికి కోపం వచ్చింది. తన నిజరూపం చూపించాడు. అగ్నికీలలతో బుసలు కొట్టాడు. నిషదుడు భయ పడ్డాడు.  నా అజ్ఞానాన్ని మన్నించమని చేతు లెత్తి నమస్క రిం చాడు. అగ్నిదేవుడు శాంతించి వరం కోరుకో మన్నాడు. ఎప్పుడన్నా ఈ మాహిష్మతీ పురాన్ని శత్రువులు చుట్టుముడితే  వారు నీచేత

దగ్ధం అయ్యేట్టు వరం ఇవ్వమన్నాడు. అలాగే అన్నాడు అగ్నిదేవుడు. అందుకు బదులుగా తనకు ఇష్టం అయింది ఒకటి అడిగాడు అగ్నిదేవుడు. అది ఏమంటే

" మాహిష్మతీ పురం లో ఉన్న స్త్రీలు శృంగార వనితలు, వారికి కామ కోరికలు ఎక్కువ. అందు వలన మాహిష్మతీ పురం లో ఉన్న వనితల వ్యభి చారాన్ని నువ్వు సహించాలి" అని అన్నాడు. సరే అన్నాడు రాజు. అప్పటినుండి మాహిష్మతీ నగరం లో వ్యభిచారం తప్పుకాదు .

అగ్నిదేవుని వర ప్రభావం వలన సహదేవుని సైన్యాలను అగ్ని జ్వాల లు చుట్టు ముట్టాయి. సహ దేవుడు భయపడలేదు. శుచియై అగ్నిదేవుని స్తుతిం చాడు. అగ్ని దేవుడు అభయం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న నిషధుడు కూడా సహదేవునితో స్నేహం చేశాడు. ఎన్నో విలువయిన కానుకలు కప్పం చెల్లించాడు.

సహదేవుడు అక్కడనుంచి రుక్మి, భీష్మక, శూర్పారక, దండక రాజులను జయించి వా రి

చేత కప్పం కట్టించు కున్నాడు. దక్షిణ సాగర ప్రాంత రాజులను జయించి కప్పం కట్టించు కున్నాడు. తాళవనము, పాండ్య, కేరళ, కాళింగ, ద్రవిడ, యవన, కరహాటక రాజులను జయించాడు.

ఆఖరున లంకాధి పతి అయిన విభీషణునకు దూతల ద్వారా ధర్మరాజు రాజసూయం గురించి, తాను దక్షిణదేశాన్ని జయంచడం గురించి వివరించి కప్పం కట్టమని అడిగాడు. విభీషణుడు కూడా సహదేవుని అభ్యర్థన మన్నించి కప్పం చెల్లించాడు. ఆ ప్రకారం సహదేవుని దక్షిణ దిక్కు దిగ్విజయ యాత్ర పూర్తి అయింది.

నకులుడు పశ్చిమ దిక్కుగా  దిగ్విజయానికి బయలుదేరాడు. మహితక దేశాన్ని, మరు, మాళవ, బర్బర, కర్బర, శైరీషక, దాశార్ణ దేశాలు జయించాడు. ద్వారకకు చేరుకొని శ్రీకృష్ణునికి తన రాక తెలిపాడు. తన  మేనమామ, మద్ర దేశాదిపతి అయిన శల్యుని వద్దకు వచ్చి అతని వద్దనుండి

మర్యాద పూర్వకంగా కప్పం కట్టించు కున్నాడు. పశ్చిమ దిక్కున ఉన్న దేశాలు అన్నింటిని జయించి కప్పం కట్టించుకొని ఇంద్రప్రస్థానికి తిరిగి వచ్చాడు.

ఆ ప్రకారంగా భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు నాలుగు దిక్కులు జయించి అసంఖ్యాకంగా ధన, వస్తు,కనక, వాహనములను తీసుకొని వచ్చారు. శ్రీ కృష్ణుడు కూడా ద్వారక నుండి అశేష ధన కనక, వస్తు వాహనములతో వచ్చాడు. అవన్ని ధర్మరాజుకు ఇచ్చి గౌరవించాడు.. ధర్మరాజు అవి చూచి సంతోషించి రాజ సూయాన్ని ప్రారంభించడానికి ఉపక్రమించాడు.

ధర్మరాజు శ్రీకృష్ణునితో "ధర్మతత్వనిధానా! కృష్ణా! నీ దయ వలన నాకు సార్వభౌమత్వం కలిగింది. అశేష సంపదలు కప్పంరూపంలో లభించాయి. నన్ను రాజసూయ యాగము చెయ్యడానికి నియోగించు" అని అడిగాడు.

దానికి శ్రీకృష్ణుడు "ధర్మజా! నువ్వు అవశ్యం

రాజసూయ యాగం ప్రారంభించు. అందుకు, నీఇష్టం వచ్చిన పనికి నన్ను, నీకిష్టమయిన వ్యక్తులను నియోగించు" అని అన్నాడు.

శ్రీకృష్ణుని అనుమతి పొంది ధర్మరాజు రాజసూయం ఆరంభించాడు.యాగానికి కావలసిన ఏర్పాట్లు చెయ్యడానికి సహదేవుని నియమించాడు. శిల్పులను పిలిపించి యజ్ఞశాల ను నిర్మించారు. నానా దేశాధీశులకు ఆహ్వానాలు పంపారు. ఆహార సామాగ్రి సమృద్ధిగా సమ కూర్చారు.

ధర్మరాజు ఆహ్వానాన్ని మన్నించి, భీష్ముడు, ధృతరాష్ట్రుడు,విదురుడు, ద్రోణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, సోమదత్తుడు, కర్ణుడు, భూరిశ్రవుడు, శల్యుడు, శకుని, సైంధవుడు, దుర్యోధనుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు తదితరులు రాజసూయానికి విచ్చేశారు. వచ్చిన అందరిని ధర్మరాజు ఉచితరీతిని సత్కరించి, తగిన

వసతి ఏర్పాట్లు చేశాడు. అందరికి దాన ధర్మాలు చెయ్యడానికి అధిపతిగా కృపాచార్యుని, కార్యాచరణానికి భీష్ముని, ద్రోణుని, సకల వస్తు వ్యయానికి విదురుని,, నానాదేశ రాజులు తెచ్చిన కానుకలు స్వీకరించడానికి దుర్యోధనుని, నియోగించాడు. ఒక శుభముహూర్తాన ధర్మరాజు యజ్ఞదీక్ష వహించి, యజ్ఞశాలలో ప్ర వేశించాడు. పైలుడు, ధౌమ్యుడు ఋగ్వేద ఋత్విక్కులుగాను, యాజ్ఞవల్క్యుడు యజుర్వేద ఋత్విక్కుగానూ, సుసాముడు సామ వే ద ఋత్విక్కుగానూ, వేద వ్యాసుడు ప్రధాన ఋత్త్విక్కుగానూ, నారదాది మహర్షులు, సదస్యులు గానూ, భీష్ముడు సహాయకుడుగానూ, రాజసూయం ప్రారంభం అయింది.

(మహాభారతము సభాపర్వము ప్రధమాశ్వాసము సమాప్తము).

# మహాభారతం

(తేట తెలుగు భాషలో)

సంస్కృత మూలం.
భగవాన్ వ్యాస మహర్షి.

తెలుగు మూలం:

శ్రీ నన్నయభట్టారకుడు

శ్రీ తిక్కన సోమయాజి

శ్రీ ఎఱ్ఱాప్రగడ.

(కవిత్రయం).

తెలుగు అనుసరణ

(కవిత్రయం పాద రేణువు)

Modali Venkata Subrahmanyam, B.A., B.G.L.
2-31, chaitanyapuri,
Hyderabad-500060
South India.
subrahmanyam_mv1947@yaoo.co.in
subrahmanyammv1947@gmail.com
Ph:040-2404 8104

# మహాభారతం

# సభాపర్వము

## ద్వితీయాశ్వాసము.

నైమిశారణ్యంలో మహా భారత కధను శౌనకాది మహామునులకు చెపుతున్న  ఉగ్రశ్రవసుడు అనే కధకుడు (సూతి) ఇలా చెప్పసాగాడు.

రాజసూయయాగం ప్రారంభం అయింది. ఆ యాగాన్ని చూచి తాత గారైన భీష్ముడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

" ధర్మజా! స్నాతకుడు, ఋత్విజుడు, సద్గురుడు, అందరికి ఇష్టుడు, భూతలేశుడు, జ్ఞానసంపన్నుడు అయిన  వారు పూజనీయులు. అలాంటి మహానుభావుని ఒక్కరిని పూజించు." అని అన్నాడు.

" అలాంటి మహానుభావుడు ఎవరో తమరే చెప్పండి" అని అడిగాడు ధర్మరాజు.

" ఇంకెవరు? సాక్షాత్తు మహా విష్ణు స్వరూపుడు అయిన శ్రీకృష్ణుడే అగ్రపూజకుతగిన  వాడు" అని అన్నాడు భీష్ముడు.

మనసులో మాట చెప్పినందుకు ధర్మరాజు సంతోషించాడు. సహదేవుడు తెచ్చిన అర్ఘ్యమును శ్రీకృష్ణునికి ప్రీతితో సమర్పించాడు.

దానిని చూచి సహించలేక పోయాడు శిశుపాలుడు. ధర్మరాజును చూచి ఇలా అన్నాడు.

"ఓ ధర్మ రాజా! ఈ సభలో ఎంతో మంది మహారాజులు ఉన్నారు. విశిష్ఠంగా పూజింపతగ్గ వారు, బ్రా హ్మణులు ఎంతోమంది ఉన్నారు. కాని ఆ గాంగేయుని దుర్బోధ వలన నీవు చెడు నడవడి కల ఈ కృష్ణుని పూజిస్తున్నావు. ఇది నీ అవివే కము కాదా? ఆ దాశార్హుడు పూజార్హుడా? ఈ భీష్మునికి ఆలోచన లేదు. అందుకే నీకు ఈ దుర్బోధ చేశాడు. మీరు కృష్ణునికి అంతగా కావలసిన వారు ఐతే మీఇంటికి పిలిచి మర్యాదలు చెయ్యండి. అంతేగాని, పదిమంది ఎదుట ఈ మహాసభలో మర్యాద చెయ్యకండి. ఎందుకంటే ఆ మర్యాదకు ఇతడు అర్హుడు కాదు.

ధర్మరాజా! ఈ కృష్ణుని నీవు వృద్ధుడు అని పూజిస్తున్నావా? ఈ సభలో ఆయన కన్నా వృద్ధుడు నీ తండ్రి వసుదేవుడు ఉన్నాడు కదా! ఋత్విజుడు అని పూజిస్తున్నావా? దానికి వేదవ్యాసుడు ఉన్నాడు కదా! ఆచార్యుడు అని పూజిస్తున్నావా ? దానికి ద్రోణాచార్యులు, కృపాచార్యులు ఉన్నారు కదా! పోనీ భూనాధుడు అని పూజిస్తున్నా వా ? యాదవ రాజులు ఎంతోమంది ఉన్నారు కదా! ఏ అర్హత ఉందని కృష్ణునికి అగ్ర తాంబూలము ఇచ్చావు? ఈ భీష్ముడు చెప్పాడని పది మందిలో పరువు పోగొట్టుకున్నావు కదా! ధర్మరాజు పూజ్యుడని, గుణవంతుడివని ఈరాజసూయానికి ఎందరో రాజులు వస్తే వారిని

ఇలా అవమానిస్తావా? నీవు అజ్ఞానంతో ఇచ్చినా సిగ్గులేకుండా కృష్ణుడు ఆ అర్ఘ్యం ఎలా తీసుకున్నాడు? ఇక్కడ కృష్ణుని పూజించడం నపుంస కుడికి పెళ్లి చెయ్యడం లాంటిది. చెవిటి వాడికి వీనుల విందైన సంగీతం వినిపించడం లాంటిది. గుడ్డి వాడికి అందమయిన అమ్మాయిని చూపించడం లాంటిది. ధర్మజా! ఈ సభలో నిన్ను చూచి అందరూ నవ్వుతున్నారు తెలుసా? " అంటూ శిశుపాలుడు సభ విడిచి పెట్టాడు.

ధర్మరాజు శిశుపాలుని వెంట ళ్లాడు. "శిశుపాలా! నీలాంటి ప్రభువులకు పరుషంగా మాట్లాడటం తగునా? సాక్షాత్తు ఆ మహావిష్ణు అవతారము అని, పూజార్హుడని తెలుసుకొని భీష్ముడు శ్రీ కృష్ణునికి అర్ఘ్యం ఇమ్మన్నాడు. అది దోషం ఎలా అవుతుంది? శ్రీకృష్ణుని భీష్ముడు అర్థ చేసుకున్నట్టు నీవు ఎలా అర్ధం చేసుకోగలవు?పెద్దలను గురించి తెలుసుకోడం అల్పులకు సాధ్యమా? లోకోత్తరుడని అందరూ కీర్తిస్తుం టే నువ్వు ఇలా కాదనడం భావ్యమా?" అని శిశుపాలుడికి నచ్చ చెప్ప బోయాడు ధర్మరాజు.

అప్పుడు భీష్ముడు ధర్మరాజును చూచి " ధర్మజా! శిశు పాలుడు బాలుడు. చెడు ప్రవర్తన కల వాడు. వా డిని ఒప్పించే ప్రయ త్నం ఎందుకు చేస్తావు? కొద్దిపాటి రాజ్యం లభించగానే మదం తలకె క్కిన వా డు. అకారణం గా పెద్దలను నిందించే వాడు. వీడికి ధర్మా ధర్మములు ఎలా తెలుస్తాయి?" అని ధర్మరాజుతో అని శిశుపాలుని చూచి

"శిశుపాలా! బుద్ధిలేకుండా శ్రీ కృష్ణునికి అర్ఘ్యం స్వీకరించే

యోగ్యత లేదంటూ ? ఇక్కడ ఉన్న రాజులందరూ నాడు జరాసంధుని చెర నుండి ఆ మహానుభావుడు శ్రీ కృష్ణుడు విడిపించిన వాళ్ళే కదా! జ్ఞాన వృద్ధుడైతే, బాలుడైనా పూజనీయుడే! అమిత పరాక్రమవంతుడైన క్షత్రియుడు పూజనీయుడే! శ్రీకృష్ణుడు మహా జ్ఞాని. మురుడు అనే రాక్షసుని సంహరించి మురారి అనే కీర్తి గడించాడు. అందుకే శ్రీకృష్ణుడే లోకారాధ్యుడు. వృద్ధులు లక్షమంది ఉన్ననూ అందులో జ్ఞాన వృద్ధుడినేపూజిస్తాము. ఇతరులను పూజిస్తే వారు మాత్ర ము తృప్తిపొందుతారు. శ్రీకృష్ణుని పూజిస్తే లోకమంతా తృప్తి చెందుతుంది. తెలుసా?" అన్నాడు భీష్ముడు.

ఇంతలో సహదేవుడు లేచి "మేము శ్రీకృష్ణుడికి అర్ఘ్యం ఇచ్చాము మా ఇష్టం. ఎవరైనా దుర్జనులు దీనికి కాదంటే వా రిని నా పాదం కింద పెట్టి అణగ ద్రొక్కెదను!" అంటూ భీకరంగా తన పాదం ఎత్తాడు.

భీకరుడైన సహదేవుని చూచి సభ అంతా భయభ్రాంతమయింది. అప్పుడు శిశుపాలుని సేనాధిపతి అయిన సునీధుడు తన సైన్యాన్ని, తమ పక్షాన ఉన్న రాజులందరిని ఒకటిగా చేర్చి యుద్ధానికి సిద్ధం అయ్యాడు. ఈ పరిణామానికి ధర్మరాజు కలత చెందాడు.

భీష్ముని చూచి "పితామహా! ఆహూతులైన రాజులందరూ కలత చెంది ఉన్నారు. తమరే శాంతిపరచాలి" అని అన్నాడు.

అప్పుడు భీష్ముడు "ధర్మజా! కలతపడకుము. సకల రాక్షస సంహారుడు సాక్షాత్తు శ్రీకృష్ణుడు ఈ యాగాన్ని రక్షిస్తున్నాడు. ఎవరూ ఈ యాగాన్ని విఘ్నము చెయ్యలేరు."

ఆ మాటలకు శిశుపాలుడు కోపించాడు.

"ఈ ముదుసలి భీష్ముడు ఆ యాదవుడిని పరమ ఈశ్వరుడు అని పొగిడాడు. ఈ పాండవులు ధర్మాత్ములట. ఇక్కడ ఉన్న రాజులం దరూ అధీరులా! పూతన అనే స్త్రీని చంపుట, ప్రాణరహితమయిన బండిని తన్నుట, పుచ్చిన చెట్లను పడదోయుట, ఒక చిన్న పుట్టలాంటి కొండను ఎత్తుట ఇవన్ని పరాక్రమాలా! అవి మీరు పొగడాలా! స్త్రీ వధ చేసిన వాడికి మర్యాదలా! మీ నాలుకలు సహస్ర చీలికలు చెయ్యాలి.

ఇంక తమరి సంగతి! మరొకరు ప్రేమించిన కన్యను అపహరించి తెచ్చి తమ్ముడికి కట్టబెట్టచూచావు. కాని ధర్మం తెలిసిన నీ తమ్ముడు అంబను విడిచిపెట్టాడు. సంతాన హీనుడవు. నువ్వు ధర్మపన్నాలు చెబుతావా! ఈ కృష్ణుని వీరత్వం నాకు తెలియదా! మహావీరుడైన జరాసంధునికి భయపడి పది మార్లు పారిపోయాడు. భీమార్జునులను సహాయం తీసుకొని కపట బ్రాహ్మణ వేషాలలో వచ్చి చంపారు. ఇది వీరత్వమా!" అని అన్నాడు.

శ్రీ కృష్ణుని ఆ విధంగా తూలనాడటం చూచి భీముడు కోపంతో ఊగిపోయాడు. శిశుపాలుడిని చంపడానికి కోపంతో ముందుకు ఉరి కాడు. భీష్ముడు భీముని ఆపాడు.

"భీమసేనా! ఈ శిశుపాలుని నువ్వుచంపరాదు.. ఈ దుర్మార్గుడు దమఘోషుడు సాత్వతి కి పుట్టాడు. పుట్టుకతోనే నాలుగు భుజాలతో, నొసటిమీద కన్నుతో, గార్ధభ స్వరంతో పుట్టాడు. ఆ తల్లితండ్రులు ఆ కుమారుడిని చూచి కలత చెందారు. అప్పుడు అశరీర వాణి ఈ

బాలుడిని ఎవరు ఎత్తుకొన్నపుడు ఇతను మామూలు రూపం పొందుతాడో అతనే ఇతనిని చంపగలడు అని పలికింది. అప్పటినుండి ఆ బాలుడిని అందరికి ఇవ్వసాగారు.

ఒక రోజు బలరామ కృష్ణులు ఆ బాలుడిని చూడటానికి వచ్చారు. ప్రధమంగా శ్రీకృష్ణుడుఎత్తుకున్నాడు. శ్రీకృష్ణుడు ఎత్తుకోగానే ఆ బాలుడు అతనికి అధికంగా ఉన్న చేతులు కన్ను అణగిపోయాయి. శ్రీకృష్ణుని చేతిలో అతని మరణం తథ్యమని తలచిన అతని తల్లి శ్రీకృష్ణుని చూచి " శ్రీకృష్ణా! నీ మరిది అయిన ఇతని తప్పులు ఒక్క శతం క్షమించు." అని కోరింది. అలాగే అన్నాడు శ్రీకృష్ణుడు. ఇతని నూరు తప్పులు పూర్తి కాగానే ఇతడు శ్రీకృష్ణుని చేతిలో హతుడౌతాడు" అని చెప్పాడు భీష్ముడు.

అప్పటికీ శివుపాలుడికి బుద్ధిరాలేదు. " శ్రీకృష్ణా! ఈ ముదుసలి భీష్ముడు, ఈ పాండవులు అనర్హుడైన నిన్ను సన్మానించారు. అది నేను సహించలేను. నాతో యుద్ధానికి సిద్ధంకండి" అని అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు అందరిని చూచి " మేము ప్రాగ్జ్యోతిష పురం మీద దండెత్తి న సమయంలో ఈ శిశుపాలుడు ద్వారకా నగరాన్ని తగలపెట్టాడు. భోజరాజులు రైవతకాద్రి మీద భార్యలతో గడుపుతుంటే వా రిని దారుణంగా చంపాడు. నా తండ్రి వసుదేవుడు అశ్వ మేధయాగం చేస్తుంటే, ఆ అశ్వాన్ని అపహరించాడు. బభ్రుని భార్యను తన భార్యగా చేసుకున్నాడు. నా అత్త సాత్వతి కోరిక ప్రకారము నూరు తప్పులు సహించాను. ఇతడు నాకు పరమ శత్రువయ్యాడు" అని అన్నాడు.

అప్పుడు శిశుపాలుడు శ్రీ కృష్ణుని చూచి " దుర్మార్గుడా! నేను పెళ్లి చేసుకోదలచిన కన్యను అపహరించి ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నావా ! " అని దూషించాడు.

ఇంక శ్రీకృష్ణుడు సహించలేక పోయాడు. తన చక్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ చక్రాయుధం శిశుపాలుని శిరస్సు నరికింది. శిశుపాలుని శరీరం నేలమీద పడింది. శ్రీకృష్ణుడు ధర్మరాజుతో శిశుపాలునికి అంత్యక్రియలు జరిపించమన్నాడు. శిశుపాలుని కుమారుని ఛేధిదేశానికి రాజుగా చేశాడు. శిశుపాలుని వధతో రాజసూయం పరిసమాప్తి అయింది.

ధర్మరాజు రాజసూయానికి విచ్చేసిన దేవతలను, గురువులను, బ్రాహ్మణులను, తృప్తిపరిచాడు. ధర్మరాజు ఆజ్ఞప్రకారము భీమసేనుడు భీష్మ, ధృతరాష్ట్రులను, అర్జునుడు ద్రుపదుని, నకులుడు శల్య, సుబలు లను, సహదేవుడు ద్రోణ,కృప,అశ్వత్థామలను, ధృష్టద్యుమ్నుడు విరాట, భగదత్తులను, అభిమన్యుడు ఉపపాండవులు మిగిలిన దేశాధీశులను సాగనంపారు.

శ్రీకృష్ణుడు కూడా ధర్మరాజు వద్ద సెలవు తీసుకొని ద్వారకకు పయనమయ్యాడు. పాండవులు అందరూ శ్రీకృష్ణుని సాదరంగా సాగనంపారు.

మయసభావిశేషాలను చూడడానికి దుర్యోధనుడు, శకుని, ఇంద్ర ప్రస్థములో ఉన్నారు. ఒకరోజు సుయోధనుడు ఒంటరిగా మయసభ చూడడానికి వచ్చాడు. దాని అపూర్వ సౌందర్యానికి ఆశ్చర్యపోయాడు.

కాని అక్కడక్కడ భంగపడ్డాడు. తెరిచి ఉన్న ద్వారాన్నిమూసినదిగానూ, మూసిఉన్న ద్వారం తెరచినదిగానూ భ్రమపడ్డాడు. లలాటము కొట్టుకున్నాడు. మరియొకచోట నీరు లేని చోట నీరు ఉన్నది అనుకొని, నీరు ఉన్నచోట లేదు అనుకొని దిగి బట్టలు తడుపుకున్నాడు. అతని అవస్థ చూచి పాండవులు ద్రౌపది నవ్వుకున్నారు. ఇది చూచి ధర్మరాజు సుయోధనునికి మంచి వస్త్రాలు, ఆభరణాలుఇచ్చి పంపించాడు.

కాని దుర్యోధనుడు తనకు జరిగిన అవమానానికి సిగ్గుపడ్డాడు. హస్తినకు బయలుదేరాడు. పాండవుల విబ షానికి అతనికి అసూయ కలిగింది. మయసభా విభవము అతని మనస్సుకు అగ్నిజ్వాల అయింది. సహించలేకపోయాడు. రోజురోజుకూ కృశించి పోసాగాడు.

ఇదిచూచి శకుని ఇలా అన్నాడు. "సుయోధనా! నీకు ఏమయింది. ఎందుకు ఇలా ఉన్నావు.ఎవరితో మాట్లాడటం లేదు. రాచకార్యాలు చూడటంలేదు. నీ దు:ఖానికి కారణం చెప్పు?" అని అడిగాడు.

"మామా! మయసభ చూచినావు కదా! అలాంటిసభ ఎక్కడైనా కలదా! అంతటి అపూర్వ మయిన మయసభను కలిగిన ధర్మరాజు ఎంతటి అదృష్టవంతుడో కదా! ఈ భూమి మీద ఉన్న రాజులందరూ ధర్మరాజుకు లొంగి అతనికి అమూల్యమయిన కప్పములు సమర్పించు కున్నారు. ధర్మరాజు చక్రవర్తి అయ్యాడు. యాదవుడయిన శ్రీకృష్ణుడు శిశుపాలుని తన చక్రంతో వధిస్తే రాజులందరూ శ్రీ కృష్ణుని పొగిడారు కాని ఇది ఏమి అని అడగలేదు. మామా! పాండవుల ఐశ్వర్యము నాకు సహించరానిదిగా ఉన్నది. అభిమాన ధనుడైన మహారాజు తన

దాయాదుల విభవమును, తన  తగ్గుదలను సహించగలడా?" అని దు:ఖించసాగాడు.

దానికి శకుని "సుయోధనా! దీనికి ఇంత చింతించెదవు ఏల? నువ్వు ధృతరాష్ట్రుని అనుమతి పొందుము. పాండవుల లక్ష్మిని నీకు సమకూర్చెద!" అని అన్నాడు.

ఇద్దరూ ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లారు. తన కుమారుని శరీరం కృశించడం గూర్చి విని ఎంతో చింతించాడు ధృతరాష్ట్రుడు.

"నాయనా సుయోధనా! కౌరవ సంపద అంతా నీకు ఇచ్చాను కదా! నీకు ఇష్టంకాని  వా రు ఎవరూ లేరు కదా! దేవేంద్రునితో సమానమయిన భోగభాగ్యాలు నీకు ఉన్నాయికదా! అందరు రాజులూ నిన్ను భక్తితో కొలుస్తున్నారుకదా! నీవు కృశించడం విరక్తి చెందడం ఎందుకు?" అని అడిగాడు.

"తండ్రీ! పాండవుల ఐశ్వర్యము ఇంద్రుని ఐశ్వర్యముకన్నా ఎక్కువ కదా! పాండవుల కీర్తి నలుదిక్కులా విస్తరించింది. సమస్త భారత దేశము పాండవులకు అధీనమయి ఉండగా, ఒక రాకుమారుడి నై ఉండి, నేను దీనుడిలా ఎలా ఉండగలను? రాజసూయ యాగ సమ యములో రాజులందరూ అశేష రత్నాభరణములు తెచ్చి ఇచ్చారు కదా! ధర్మరాజు ఐశ్వర్యాన్ని పోల్చడానికి మూడు కాలాలలో ఉన్న రాజులు సాటిరారుకదా! హరిశ్చంద్రుడు చేసిన రాజసూయ యాగము కూడా ధర్మరాజు చేసిన రాజసూయయాగము ముందు కళావిహీనమయినది కదా!  రాజసూయంలో అభిషిక్తుడైన ధర్మరాజుకు సాత్యకి ముత్యాల

ఛత్రము పట్టాడు. భీమార్జునులు చామరములు వీచారు. పట్టాభి
, షిక్తులైన రాజు లందరిని తీసుకొని పోయి శ్రీకృష్ణుడు ధర్మరాజుకు
మొక్కించాడు. అది చూచి మా ముఖములు  వెల వెల పోతుంటే,
శ్రీకృష్ణుడు, సాత్యకి, ద్రౌపది అదేపనిగా ఆనందంతో నవ్వుకున్నారు. నేను
పాండవుల విభవమును చూచి సహించలేను" అని అన్నాడు.

అప్పుడు శకుని ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. " ధర్మరాజు
జూదప్రియుడు. అందులో ఉన్న కపటము తెలియని వా డు. నేను
అక్షవిద్యలో నేర్పరిని. నేను ధర్మజుని అక్రమముగా ఓడించి అతని
విభవమునంతయూ సుయోధనుని హస్తగతము చేస్తాను. అని
అన్నాడు.

సుయోధనుడు సంతోషించి " తండ్రీ! మీరు దీనికి అంగీకరిం
చండి!" అని ప్రాధేయపడ్డాడు.

" విదురుడు చాలా దూరదృష్టి కల వాడు. నీతికోవిదుడు. మీ
ఇరువురి క్షేమం కోరే వాడు. అతనితో చర్చించి నిర్ణయం తీసుకుం
దాము" అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

"తండ్రీ తమరికి తెలియనిదేమున్నది. విదురుడు పాండవ
పక్షపాతి. అతడు ఈ ప్రయత్నానికి అంగీకరించడు. కాబట్టి తమరు ఈ
ప్రయత్నానికి అంగీకరించండి. లేనియడల నేను అగ్నికి ఆహుతి
అవుతాను. మీరు మీ విదురుడు సుఖంగా ఉండండి" అని అన్నాడు
దుర్యోధనుడు అమితమయిన దు:ఖంతో.

జూదము తగదని ధృతరాష్ట్రుని మనసులో ఉన్నప్పటికినీ కుమా రు నికి సంతోషం కలిగించడానికి ఒక సభను నిర్మించడానికి ఏర్పాట్లు చెయ్యమన్నాడు. ఒకనాడు విదురునితో సుయోధనుని అభిప్రాయం చెప్పాడు.

దానికి విదురుడు " దీనికి నేను అంగీకరించను. పాండవులకు, కౌరవులకు విరోధం కలిగించడానికి నువ్వు ఎలా ప్రయత్నిస్తున్నావు. జూదం ఎంతటి శాంతస్వభావులకయినా విరోధం కలిగిస్తుంది. పాండవులు కౌరవులు కలిసి ఉండేట్లుచెయ్యి" అని అన్నాడు విదురుడు.

" విదురా! నీవు అనవసరంగా అనుమాన పడుతున్నావు. మీరు, భీష్ముడు ఉండగా అన్నదమ్ముల మధ్య విరోధం ఎందుకు ఏర్పడుతుంది. కాబట్టి నీవు ఈ జూదానికి అంగీకరించు. నీవు ఇంద్రప్రస్థానికి పోయి ధర్మరాజును తోడ్కొనిరా!" అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

విదురుడు ఈ విషయాన్ని భీష్మునికి చెప్పాడు. ఇక్కడ ధృత రాష్ట్రుడు కూడా దుర్యోధనుని చూచి " కుమారా! ఈ జూదం ఎందుకు! దీని వలన మీలో విరోధము పుడుతుంది. మీ మధ్య విరో ధము ఈ భూమిమీద జనులకు కీడుచేస్తుంది. విదురుడు కూడా జూదం సమ్మతం కాదు అని అన్నాడు. ఈరాజ్యాన్ని మీరు ఇరువురూ పాలించుకోండి. ధర్మరాజు సంపద కంటే నీకు ఐదు రెట్లు సంపద ఉన్నది. నీవు కూడా ఒక యాగం చెయ్యి. నీకు కూడా రాజులందరూ లెక్కలేనన్నికానుకలు ఇస్తారు." అని చెప్పాడు.

కాని దుర్యోధనుడు వినలేదు. " ఓ మహారాజా ధృతరాష్ట్రా! ధర్మరాజు జూదం ఆడుతుండగా చూడటం ఒక మహాయజ్ఞము. నేను సకలైశ్వర్యములు పొందడానికి అదే ఉపాయం. మీకు ఒక విషయం చెబుతాను. వినండి. మీరు అందరూ హస్తినాపురానికి వచ్చిన తదుపరి నేను మయసభను చూడటానికి అక్కడే ఉన్నాను. మయసభలో నేను అమితమయిన పరాభవానికి గురి అయ్యాను. నా పరాభవాన్ని చూచి చెలికత్తెలతో ఉన్న పాంచాలి నవ్వింది. ఆ సభలో నేను పడ్డ భంగపాటు నా మనస్సులో బాణంలా గుచ్చుకుని బాధ పెట్టుచున్నది. మనము మన శత్రువులైన పాండవుల వృద్ధిని ఉపేక్షించిన అది మనలను నాశనం చేస్తుంది. కావున పాండవుల ఐశ్వర్యాన్ని ఎలాగైనా అపహరించాలి. అప్పుడు గాని నా హృదయానికి ఉపశమనము కాదు." అని అన్నాడు దుర్యోధనుడు.

వెంటనే శకుని అందుకొని "సుయోధనా! ఎలాంటి సైన్యం లేకుండా, యుద్ధము చెయ్యకుండా, రక్తపుబొట్టు కిందపడకుండా, కేవలం పాచికలు దొర్లించి, సునాయాసంగా పాండవుల సంపదలు హరించి నీకు ఇచ్చెదను. నీవు దు:ఖించకు. ధర్మరాజును జూదానికి పిలిపించు. జూదం తో కాకుండా వేరేవిధంగా పాండవుల సంపద అపహరించడం ఎవ్వరితరమూ కాదు" అని అన్నాడు శకుని.

ఎవరు ఎన్నిచెప్పినా ధృతరాష్ట్రుడు జూదానికి ఇష్టపడలేదు. "మీరు ఎన్ని చెప్పినా నేను వినను. విదురుడు మంచి చెడ్డలు తెలిసిన వాడు. నీతికోవిదుడు. జూదం ఆడటం అనర్ధహేతువుఅని చెప్పాడు. అతని మాట ప్రకారం నేను నడచుకుంటాను. కాబట్టి జూదం మాట వదలి ఎప్పటి మాదిరి ఉండు" అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

"తండ్రీ! విదురుడు ఎల్లప్పుడూ పాండవుల పక్షపాతి. పక్షపాత బుద్ధితో ఉన్న విదురుడు మనకు  ఆప్తుడు ఎలా అవుతాడు? జూదం పురాణ కాలంలోకూడా ఉన్నది. స్నేహంతో ఆడుకునే జూదంలో దోషం లేదు. కాబట్టి జూదం ఆడటానికి శకునికి అనుమతి ఇవ్వండి. ధర్మనందనుని పిలిపించండి" అని అన్నాడు దుర్యోధనుడు.

ధృతరాష్ట్రుడు ఎంతో ఆలోచించాడు. తప్పని పరిస్థితులలో ఒప్పుకున్నాడు. విదురుడిని పిలిపించాడు. "విదురా! మనము కూడా ఒక సభ నిర్మించాము కదా! దానిని చూడటానికి ధర్మరాజును అతని తమ్ములను ఆహ్వానించు.  నీతో తీసుకొని రా. పొద్దుపోవడానికి అక్కడ ఉన్న  వేదిక మీద  దుర్యోధనునితో ధర్మరాజు జూదం ఆడతాడు" అని అన్నాడు.

విదురుడు మరలా " జూదం అనర్ధము వద్దు"  అని ఎన్నోసార్లు చెప్పాడు.  కాని ప్రయోజనం లేకపోయింది. ఇంక తప్పదనుకొని ఇంద్రప్రస్థానికి బయలుదేరాడు. ధర్మరాజు విదురుని సాదరంగా ఆహ్వానించాడు. విదురుడు తన రాకకు కారణం చెప్పాడు.

ధర్మరాజు విదురునితో " విదురా! మా పెదనాన్న మమ్ములను తీసుకుని రమ్మని నిన్ను పంపాడు. నీవు వచ్చినావు. సభను చూడటానికి  వస్తాము కాని సభను చూచు సందర్భములో జూదము తగునా! జూదము వలన మాలో మాకు విభేధాలు రా వా ! కాని ధృతరాష్ట్రుని ఆజ్ఞ మాకు శిరోధార్యము. అందుకని మీతో వస్తాము" అని అన్నాడు ధర్మరాజు.

తమ్ముళ్లతోనూ, ద్రౌపది తోనూ, ఇతర అనుచరులతో ధర్మరాజు హస్తినాపురానికి విదురునితో కలిసి వెళ్లాడు.

అక్కడ హస్తినాపురంలో, దుర్యోధనుడు, దుశ్శాసనాది కుమారులతోనూ, భీష్ముడు, ద్రోణుడు, శల్యుడు, శకుని, సైంధవుడు, అశ్వత్థామ, సోమదత్తుడు మొదలైన వారితో కలిసి ఉన్న ధృతరాష్ట్రునికి, భానుమతి మొదలయిన కోడళ్లతో కూడి యున్న గాంధారికి ధర్మరాజు నమస్కరించాడు. ద్రౌపది అందచందాలు చూచి గాంధారి కోడళ్లందరూ ఆశ్చర్యపోయారు. అసూయచెందారు కూడా.

దుర్యోధనుడు తో కలిసి ధర్మరాజు, అతని తమ్ముళ్లు హస్తినలో నిర్మించిన కొత్త సభా భవనమును తిలకించారు. ఆ సభాభవనములో అందరూ సుఖాశీనులయ్యారు.

ఆ సమయములో దుర్యోధనుడు ధర్మరాజును చూచి " ధర్మజా! కొంచెంసేపు కాలక్షేపానికి జూదం ఆడుకుందాము. నీకు పాచికలు ఆడటంలో, జూదంలో ఆసక్తి కలదని విన్నాను. " అన్నాడు దుర్యోధనుడు.

దానికి ధర్మజుడు " సుయోధనా! జూదము, అందులోనూ మోసపూరితజూదము క్షత్రియ ధర్మము కాదు. రాజులు జూదము ఆడుట పాపపు పని. అందునా కుటిలమయిన వరితో జూదం తగదు. దాని వలన ఎంతటి వరైనా ధనం, ధర్మం, కోల్పోతారు. కాని ధర్మ ద్యూతములో గెలవడం పుణ్యము, కపటద్యూతములో గెలవడం మహా పాపం అని పెద్దలు చెప్పారు. " అని అన్నాడు ధర్మరాజు.

అప్పుడు శకుని ధర్మజుని చూచి "ధర్మజా! ద్యూతక్రీడలో నేర్పరులు, లోకజ్ఞానం కల వా రు, మధావులు, ఎంతో పేరుగాంచిన సుక్షత్రియులు, రాజనీతి తెలిసిన తమలాంటి వా రు జూదమును నిందించుట తగునా. అయినా బలహీనులయిన వా రు, బలవంతులను ఓడించాలంటే మాయలు చేయుట పరిపాటికదా తమరికి తెలియనిది ఏమున్నది. అయినా తమరు ఈ ద్యూతక్రీడకు భయపడినతో మాని వేద్దాము" అని అన్నాడు శకుని.

"శకునీ! బలవంతంగా ద్యూతానికి పిలువబడ్డాము. ఆడక తప్పుతుందా! ఎక్కువగా మాట్లాడటం ఎందుకు? కానివ్వండి." అన్నాడు ధర్మరాజు.

జూదమాడటం తప్పు అని తెలిసికూడా తప్పని సరి పరిస్థితులలో అంగీకరించాడు ధర్మరాజు. అక్కడున్న శకునిని, వివింశతిని, చిత్రసేనుని, వికర్ణుని చూచి "వీరిలో నాతో ఎవరు ద్యూతమాడెదరు" అని అన్నాడు ధర్మరాజు.

అంతలో దుర్యోధనుడు "ధర్మజా! నా పక్షాన శకుని జూదం ఆడుతాడు. అతడు ఒడ్డిన ధనరాసులు అన్ని నీవి" అన్నాడు.

"ఒకరి కోసం మరొకరు ఆడటం ఏమిటి ఇది అక్రమము" అని అనుకొన్నాడు ధర్మజుడు.

చేసేది లేక తన చేతి రత్నఖచిత కంకణాలు ప్రధమంగా పణంగా పెట్టాడు. జూదం స్నేహపూరితంగా సాగుతూఉంది. భీష్ముడు,

ధృతరాష్ట్రుడు, విదురుడు, కృపాచార్యుడు, ద్రోణుడు, అశ్వత్థామ వికల మయిన మనస్సులతో చూస్తున్నారు.

శకుని, తాను చేయించుకున్న ప్రత్యేకమయిన పాచికలతో జూదం ఆడుతున్నాడు. గెలుస్తున్నాడు.

ధర్మరాజులో మత్సరం పెరిగింది. ఒకదాని వెంట ఒకటి పందెం ఒడ్డుతూ ఓడిపోతున్నాడు. బంగారు భాండాగారాలు, వజ్ర, రత్న భాండా గారాలు, బంగారు నిధులు, అశ్వములు, ఏనుగులు, సేవకులు, దాస దాసీజనములు, జాతి గుర్రాలు, గోవులు, సేనావహిని, అన్నింటిని ఒకటి వెంట ఒకటిగా ఒడ్డి ఓడిపోయాడు.

ఇది చూచి విదురుడు ధృత రాష్ట్రునితో " దుర్యోధనుడు పాపాత్ముడు. వీడివలన కురు వంశం పాపంతో నిండబోతోంది. పాండవులు పరాయి వాళ్లుకారు కదా! దుర్యోధనుని నివారించు. ధర్మాన్ని రక్షించు. ఈ భూమిమీద ప్రజలను కాపాడు. పెద్దయుద్ధం నివా రించు. దుర్యోధనుని బహిష్కరించు. ధర్మాన్ని కాపాడు. నీ కుమారుడు ధనం మీద అత్యాశతో బలవంతులతో యుద్ధానికి కాలు దువ్వు తున్నాడు. ఇంక ఉపేక్షింపకు. ఈ దుర్మార్గపు జూదాన్ని ఆపు" అని అన్నాడు.

పుత్రులమీది మమకారంతో ధృతరాష్ట్రుడు మౌనంగా ఉన్నాడు. అప్పుడు విదురుడు దుర్యోధనుని చూచి " సుయోధనా! నీవు ఈ ప్రకారంగా శకుని సహకారంతో పాండవుల సంపదను కొల్లగొడుతుంటే ప్రజలు నిన్ను ఛీ కొట్టరా? ఇలా మోసం చెయ్యటం మంచిదా?"అని

అన్నాడు.

అప్పుడు సుయోధనుడు విదురుని చూచి కోపంతో "విదురా! నువ్వు ఎప్పుడూ పాండవుల పక్షాన్నే మాట్లాడతావు. నువ్వు మాఇంట్లో ఉంటే విషసర్పం ఉన్నట్లే. శత్రువుల సంపదను సులభమయిన ఉపాయా లతో అపహరించటం రాజధర్మం. కాబట్టి మాకు బుద్దులు చెప్పవద్దు." అని విసుక్కున్నాడు.

"సుయోధనా? నీకు చెడ్డ మాటలే ఇంపుగా ఉంటాయి. కాని మేలు చేసే మాటలను బలవంతాగా నయినా చెప్పాలి అందుకని చెప్పాను. మరల చెపుతున్నాను. పాండవులతో వైరము మంచిది కాదు" అని అన్నాడు.

ఇంతలో శకుని ధర్మరాజును చూచి "ధర్మజా! నీవు నీ సంపద నంతా పందెములో ఒడ్డి ఓడావు. తరువత పందెం ఏమిటి?" అని అడి గాడు.

అప్పటికే ధర్మరాజు ద్యూత వ్యసనానికి బానిస అయ్యాడు. తన సమస్త రాజ్యాన్ని ఒడ్డి ఓడిపోయాడు. తరువాత, బ్రాహ్మణులకు, దేవా లయాలకు ఇచ్చిన భూములు తప్ప మిగిలిన సమస్త ఆస్తులను ఒడ్డి ఓడిపోయాడు. తన తమ్ములు నలుగురిని పందెంగా ఒడ్డి ఓడి పోయాడు. ఆఖరున తనను తాను ఒడ్డుకున్నాడు. ఓడిపోయాడు.

అప్పుడు శకుని చూచి "ధర్మజా! అదేమిటి ధర్మజా! నిన్ను నువ్వు ఏల పందెంలో ఒడ్డుకున్నావు? నీవద్ద ఒడ్డడానికి మరొక ధనం

ఉందిగా మరచి పోయావా ? నీ భార్య ద్రౌపది నీధనం కాదా?" అని శకుని ఎత్తి పొడిచాడు.

అప్పుడు మరల పాచికలు అందుకున్నాడు ధర్మరాజు.. తన భార్య ఐన ద్రౌపదిని జూదంలో పణంగా పెట్టాడు. మరల ఓడిపోయాడు. అప్పుడు ఆట చాలించాడు.

ఇది అంతా చూస్తున్న భీష్మ ద్రోణులకు నోట మాట రాలేదు. విదురు దు:ఖిస్తున్నాడు. దుశ్శాసనుడు, కర్ణుడు, సైంధవుడు ఆనం దంతో ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు.

అప్పుడు ధృతరాష్ట్రునికి తెలివి వచ్చింది. " విదురా ఏమయింది? ఎవరెవరు ఏయే పందాలు ఒడ్డారు?" అని అడిగాడు.

అప్పుడు దుర్యోధనుడు విదురుడిని చూచి " నా ఇల్లు తుడువ డానికి దాసి ద్రౌపదిని పిలుచుకొని రా!" అని ఆజ్ఞాపించాడు.

" ఛీ! నీవంటి మూర్ఖుడు లేడు. అయినా ఇలాంటి పనికి నన్ను పంపుతారా. ద్రౌపది ఎవరు? సమస్త భూమండలానికి పట్టమహిషి. ఆ సాధ్విని అవమానిస్తారా?" అని అన్నాడు.

అప్పుడు సుయోధనుడు ప్రాతిగామి అను సూతనందనుని పిలిచి " నీవు పోయి ద్రౌపదిని సభకు తోడ్కొనిరా!" అని ఆజ్ఞాపించాడు.

పాతిగామి ద్రౌపది వద్దకు పోయి " అమ్మా! ధర్మరాజు జూదంలో

సమస్త సామ్రాజ్యాన్ని, తమ్ములను, తనను, నిన్ను ఒడ్డి ఓడి పోయాడు. దుర్యోధనుడు నిన్ను సభకు తీసుకొని రమ్మని నన్ను పంపాడు. పదమ్మా పోదాము" అని అన్నాడు.

దానికి ద్రౌపది " అయ్యా! ఏ యుగంలో అయినా ఇలాంటి చెడ్డజూదగాడు, తన భార్యను ఒడ్డి ఓడిపోయిన వా డు ఉన్నాడా? ధర్మరాజు ఇలా చేశాడా? అయినా తను కూడా ఓడి పోయినాడు అంటున్నావు. ముందు తాను ఓడి నన్ను ఓడాడా? లేక ముందు నన్ను ఓడి తాను ఓడాడా? అనే విషయం నీకు తెలుసా? నీకు తెలియకపోతే ఆ జూదగాడిని అడిగి తెలుసుకొని వచ్చి నన్ను తీసుకొని పో!" అని అన్నది.

ప్రాతిగామి తిరిగి వచ్చి అదే విషయాన్ని అందరికి చెప్పాడు. దానికి సుయోధనుడు "ఇది సమాధానం చెప్ప వీలుకాని విషయం. ఇక్కడి కే వచ్చి అడగమను. నీవు పోయి ద్రౌపదిని తీసుకొని రా!" అని పంపాడు.

" అమ్మా నీవు అడిగిన విషయాన్ని తెలుసుకోడానికి నిన్ను అక్కడి కే రమ్మన్నారు. రా అమ్మా!" అని అన్నాడు.

చేసేది లేక ద్రౌపది, ఏక వస్త్రంతో సభకు వచ్చింది. ధృతరాష్ట్రుని పక్కన నిలబడింది. ద్రౌపది దుస్థితి చూచి పాండవులు తలలు వంచు కున్నారు.

అప్పుడు సుయోధనుడు దుశ్శాసనుని చూచి "నీవు పోయి ద్రౌపదిని ఇక్కడకు తీసుకొని రా!" అని అన్నాడు.

అప్పుడు ద్రౌపది ఒక్క పరుగున గాంధారి పక్కకు పోయి నిల బడింది.

అది చూచి దుశ్శాశనుడు, "నువ్వు ఎక్కడికి పోతావు నిన్ను శకుని జూదంలో గెలిచాడు. నువ్వు సుయోధనుని సొత్తు అయినావు. నీ భర్తలు నిన్ను, తమను, రాజ్యాన్ని జూదంలో ఓడిపోయారు" అని అంటూ దగ్గరకు వచ్చాడు.

"అయ్యా నేను రజస్వలను. ఏకవస్త్రను. నన్ను ముట్టవద్దు. సభలోకి రాలేను" అని అన్నది.

దానికి దుశ్శాసనుడు నవ్వి "నీవు ఏక వస్త్రవయినా, విగత వస్త్ర వయినా రాక తప్పదు నేను నిన్ను తీసుకొని పోతాను" అంటూ దుశ్శాశనుడు ద్రౌపది కురులు పట్టుకొని ఈడ్చుకుంటూ బలవంతంగా సభలోకి తీసుకొని వచ్చాడు.

అప్పుడు ద్రౌపది సభలో ఉన్న కురు వంశ పెద్దలను చూచి "అయ్యా! ఈ దుశ్శాసనుడు నన్ను ఈ సభకు ఈడ్చుకొని వచ్చాడు. మీరందరూ చూస్తూ ఉండగా అవమానించాడు. అధర్మం పెరిగి పోయింది" అని అంటూ భయంతో మనసులో శ్రీకృష్ణుని ధ్యానించింది.

ఇది అంతా చూచి భీముడు ధర్మరాజును చూచి ఇలా అన్నాడు. "ఓ ధర్మరాజా! ఈరాజ్యము, నీ తమ్ములము నీ వశంలో ఉన్నాము కాబట్టి మమ్ములను జూదంలో ఒడ్డావు ఓడావు. అది ఉచితము. కాని ద్రుపదరాజ పుత్రిని జూదంలో పణంగా పెట్ట తగునా?

దాని వలననే కదా ద్రౌపది అవమానాల పాలయినది. జరుగుతున్నది అధర్మ ద్యూతము అని తెలిసి నువ్వు జూదం ఆడావు. నీ చెయ్యి కాల్చాలి కదా!" అని కోపంతో అన్నాడు.

అప్పుడు అర్జునుడు భీముని చూచి, "అన్నయ్యా! స్నేహంగా ఆడు కొనే జూదానికి, ధర్మయుద్ధానికి పిలిస్తే పోకుండా ఉండకూడదు అనే ధర్మాన్ని పాటించి వచ్చాడు ధర్మరాజు. . కాని దైవం విపరీత్యమయింది. ఏమి చేస్తాము." అని అన్నాడు.

అప్పుడు వికర్ణుడు(సుయోధనుని తమ్ముడు) సభాసదులను చూచి ఇలా అన్నాడు. "ఈ సభలో ఉన్న కురు వృద్ధులు, గురువులు, పెద్దలు అందరూ మౌనంగా ఉన్నారు. కనీసం మిగిలిన ధర్మజ్ఞులు అయినా ఆలోచించండి. ఇక్కడ జరుగుతున్నది ధర్మమా?" అని అడిగాడు.

ఎవరూబదులు చెప్పలేదు. అప్పుడు వికర్ణుడు మరల ఇలా అన్నాడు " నేను ఇక్కడ ధర్మనిర్ణయం చేస్తాను. జూదము, వేట, మద్యపానము, అతిగా తినడం ఈ నాలుగూ దుర్వ్యసనాలు. వీటిలో చిక్కిన మానవుడు ధర్మం తప్పి ప్రవర్తిస్తాడు. అలాంటి మానవులు చేసే పనులు లెక్కలోకి రావు. ఒక జూదరి చేత పిలువబడిన, వ్యసన పరుడయిన, మరో జూదరి ధర్మరాజు, జూదంలో ఓడి పోయిన ధర్మరాజు, పాండవుల కందరికి ఉమ్మడి ధనమయిన ద్రౌపదిని పణంగా పెట్టాడు. ఓడాడు. కాబట్టి ఇది అధర్మము. పైగా ఏక వస్త్రను సభకు తీసుకు రావడం అన్యాయం." అని అన్నాడు వికర్ణుడు.

దానికి కర్ణుడు వికర్ణుని చూచి ఇలా అన్నాడు. "చిన్న వాడివి. ఎవ్వరూ తెలుసుకోడానికి ఇష్టపడని ధర్మం నీవు ఎందుకు చెప్పవలసి వచ్చింది. పెద్దలు ఉన్న చోట చిన్న వారికి అధిక ప్రసంగం తగునా? ధర్మరాజు ద్రౌపదిని జూదంలో పణంగా పెట్టి ఓడిపోయాడు. ద్రౌపది ధర్మరాజు ధనము. కాబట్టి ద్రౌపది ధర్మవిజిత. లేకపోతే పాండవులు ఎందుకు అంగీకరిస్తారు. ద్రౌపది పెక్కుమంది భర్తలు కలది. కనుక ద్రౌపది బంధకి. అలాంటి వారిని బట్టలు లేకుండా తీసుకువచ్చినా అధర్మం కాదు" అని అన్నాడుకర్ణుడు .

ఈ మాటలు సుయోధనుడు విన్నాడు. "ఆహా! బాగుంది. దుశ్శాసనా! పాండవులవి, ద్రౌపదివి వస్త్రాలు లాగి తీసుకో!" అని అన్నాడు.

ఆ మాటలు విని దుశ్శాసనుడు "ఇది ధర్మము అధర్మము" అని ఆలోచించక ద్రౌపది కట్టుకున్న చీర పట్టుకు లాగాడు. కాని విచిత్రంగా ద్రౌపది కట్టుకున్న చీర నడుము భాగాన్ని వదలడంలేదు. అలాంటి చీరలే లాగుతుంటే వస్తున్నాయి. విప్పినచీరలు గుట్టలా పడ్డాయి. కాని ద్రౌపది నడుము మీద చీర అలాగే ఉంది. ఇది చూచి దుశ్శాసనుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.

ఇదంతా చూచి భీముడు కోపించి సభలో ఇలా అన్నాడు. "కురు వృద్ధులు, బంధువులు, అనేకమంది చూచు చుండగా, ఈ ప్రకారం ద్రౌపదిని అవమానం చేసిన దుశ్శాసనుని, సుయోధనుడు చూస్తూ ఉండగా, యుద్ధంలో ఘోరంగా చంపి, అతని వక్షస్థలం చీల్చి, రక్తం తాగుతాను. ఇలా చేయక పోతే నేను నా పితృ పితామహులకు

పుట్టలేదు" అని భీముడు భీకరమయిన ప్రతిజ్ఞ చేసాడు.

సభలోని అందరూ "కుమారుడి మీద ప్రేమతో ధృతరాష్ట్రుడు ద్రౌపది అడిగిన దానిని ఉపేక్షించాడు" అని అనుకన్నారు.

అప్పుడు విదురుడు లేచి అందరిని శాంతపరిచి "అందరూ ద్రౌపది అడిగిన దానిని గురించి ఆలోచించండి. ఈ వికర్ణుడు చిన్న అయినా బృమస్పతిలా ధర్మం మాట్లాడాడు. ధర్మం తెలిసి కూడా, ఏదయినా లాభాన్ని ఆశించి కాని, లోభంతో కాని, పక్షపాతంతో గాని మరొక విధంగా పలికితే అది అసత్య దోషం అవుతుంది. పూర్వం ప్రహ్లాదుని కొడుకు విరోచనుడు, సుధన్వుడు అనే బ్రాహ్మణుడు ఒక కన్య విషయంలో నేను ఎక్కువ అంటే నేను ఎక్కువ అని తగవులాడుకున్నారు. న్యాయం కోసం ప్రహ్లాదుడి దగ్గరకు పోయారు. కొడుకు విషయంలో తీర్పు చెప్పడానికి జంకి కశ్యపుని సలహా అడిగాడు ప్రహ్లాదుడు. దానికి కశ్యపుడు ప్రహ్లాదునితో ఇలా అన్నాడు. "న్యాయ మూర్తి సాక్ష్యాలను, ధర్మాన్ని అనుసరించి తీర్పు చెప్పాలి. ఎవరైనా న్యాయం కోసం సభకు వస్తే, న్యాయమూర్తి ధర్మం చెప్పాలి అలా చెయ్యకపోతే ఆ న్యాయమూర్తికి, సభాసదులకు పాపం వస్తుంది. కాబట్టి కామ క్రోధాదులకు అతీతంగా న్యాయం చెప్పు" అని అన్నాడు. ప్రహ్లాదుడు సంతోషించి, తన కొడుకు అని కూడా ఆలోచించకుండా, సుధన్వుడే గుణవంతుడు అని తీర్పుచెప్పాడు. కాబట్టి మనం ఈ నాడు ద్రౌపదికి న్యాయం చెయ్యకపోతే అందరికి పాపం వస్తుంది" అని అన్నాడు విదురుడు.

కాని దుర్యోధనునికి భయపడి ఎవ్వరూ నోరు విప్పలేదు. ద్రౌపది

సభా సదులను చూచి "నేను పాండవుల ఇల్లాలిని. లోకారాధ్యుడయిన శ్రీకృష్ణుని సోదరిని. ఇప్పుడు ఇలా అవమానింప బడ్డాను. నేను అడిగిన దానికి ఎందుకు బదులు చెప్పరు? నేను దాసినా? అదాసినా? చెప్పండి" అని దు:ఖంతో అడిగింది.

అప్పుడు భీష్ముడు "అమ్మా నీవు అడిగిన ప్రశ్నకు ధర్మరాజు ఒక్కడే సమాధానం చెప్పగలడు" అని అన్నాడు.

అప్పుడు కర్ణుడు ద్రౌపదిని చూచి "తరుణీ! ఐదుగురు భర్తల కంటే ఒక్క భర్త మంచిది కదా! జూదంలో భార్యను ఒడ్డి ఓడి పోని వ్యక్తిని భర్తగా ఎంచుకో!" అని ఎగతాళి చేశాడు. అప్పుడు సుయోధనుడు, ద్రౌపదిని చూచి "రా! వచ్చి నా తొడమీద కూర్చో" అని సైగ చేశాడు.

అది చూచాడు భీముడు. "రాజ్యసంపద వలన కలిగిన మదంతో, నువ్వు ద్రౌపదిని తొడమీద కూర్చోమని సైగ చేసిన ఈ దురాత్ముని, నా గదతో తొడలు విరుగ గొడతాను!" అని ముందుకు ఉరికాడు.

అప్పుడు భీష్ముడు, విదురుడు, ద్రోణుడు ఇది తగిన సమయం కాదని భీముని శాంతింప చేశారు.

అప్పటికి చలించింది గాంధారి. విదురుని తీసుకొని ధృతరాష్ట్రుని వద్దకు వచ్చింది. ద్రౌపదికి జరిగిన అవమానాన్ని వివరించింది. ధృతరాష్ట్రుడు కుమారుని పిలిచాడు. "సుయోధనా, పాండవ పట్టమహిషిని ఇలా అవమానించడం తగునా? నీకారణంగా

పాండవులు ఎంతో దు:ఖితులయ్యారు. అని ద్రౌపదిని పిలిచాడు. "అమ్మా ద్రౌపదీ! నా కోడళ్లందరిలో నీవు గౌరవింప తగిన దానివి. నీకు ఏమి కా వా లో కోరుకో ఇస్తాను" అని అన్నాడు.

అప్పుడు ద్రౌపది, "ముందు నా భర్తను దాస్యంనుండి విముక్తుని చెయ్యండి." అని అడిగింది. ధృతరాష్ట్రుడు అలాగే అన్నాడు. ఇంకో వరం కోరుకోమన్నాడు.

"ధర్మరాజు నలుగురు తమ్ములను దాస్యవిముక్తులను చెయ్యండి. వారి వారి ఆయుధాలు, గృహాలు ఇప్పించండి." అని అడిగింది.

" సరే ఇచ్చాను. ఇంకో వరం కోరుకో!" అని అడిగాడు.

అప్పుడు ద్రౌపది " వై శ్యసతి ఒక వరము, క్షత్రియ సతి రెండువరాలు, శూద్రసతి మూడువరాలు, కోరుకోవచ్చును. కాబట్టి నేను ఇంక వరాలు కోరరాదు" అని బదులు చెప్పింది.

తనకోడలి ధర్మనిరతికి ఎంతో సంతోషించాడు ధృతరాష్ట్రుడు. ధర్మరాజును, భీమాది సోదరులను పిలిపించాడు. ధర్మరాజు జూదంలో పోగొట్టుకున్న రాజ్యాన్ని, సమస్తసంపదలను తిరిగి ఇచ్చాడు. " నేను బుద్ధిలేక జూదాన్ని ఉపేక్షించాను. నేను అల్పబుద్ధిని. పైగా వృద్ధుడను. మీ తల్లి గాంధారిని చూచి దుర్యోధనాదులు మీ పట్ల చేసిన చెడ్డపనులు మనసులో పెట్టుకోవద్దు. మీరు ఇంద్రప్రస్తానికి పోయి హాయిగా రాజ్యం చేసుకొండి" అని దీవించాడు.

అప్పుడు భీముడు " సతి కారణంగా పాండవులకు రాజ్యం సంప్రాప్తించింది అనడం కంటే మరొక కష్టం ఏముంటుంది. వీరందరిని యుద్ధంలో ఓడించి మా రాజ్యం తీసుకుంటాను" అని అన్నాడు.

ధర్మరాజు భీముని వారించాడు. అందరూ ఇంద్రప్రస్థానికి వెళ్లారు. దుర్యోధనుడు, కర్ణుడు, శకునితో ఆలోచించాడు. ధృతరాష్ట్రుని దగ్గరకు వచ్చాడు.

"తండ్రీ! శత్రువులను చంపడం వివేకము అని దేవగురువు చెప్పాడు. పాండవులు మనకు శత్రువులు. ఎంత చేసినా పాండవులకు మనం మంచి వాళ్లము కాము. మనం వాళ్లను విడిచి పెట్టి తప్పు చేశాము. గాండీవం అర్జునుడు, గదను భీముడు, నకుల సహదేవులు కత్తులు పట్టితే గెలవడం కష్టం. కాబట్టి పాండవులను మరల జూదానికి పిలిపించి, జూదం ఆడించి, నిర్వాసితుల చెయ్యడం తక్షణ కర్తవ్యం." అని అన్నాడు.

దానికి ధృతరాష్ట్రుడు ఒప్పుకున్నాడు. మరల జూదం ఆడటానికి ధర్మరాజును పిలుచు కొని రమ్మని ప్రాతిగామిని పంపాడు. తండ్రి ఆజ్ఞ దాటరాదని మరల ధర్మరాజు జూదానికి వచ్చాడు. అందరూ కూర్చున్నారు.

అప్పుడు శకుని ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధర్మజా! ధృతరాష్ట్ర మహారాజు మీరు పోగొట్టుకున్న రాజ్యాన్ని సమస్త సంపదలు ఇచ్చాడు. ఇంక అవి జూదంలో పెట్టడం తగదు. ఇప్పుడు ఒక వినూత్నమయిన

పందెం. ఓడిన వారు, వల్కలములు ధరించి, కందమూలములు, ఫలములు తింటూ, పన్నెండేళ్లు వన వాసము చెయ్యాలి. తరు వాత, పదమూడవ ఏడు జనపదంలోనే అజ్ఞాతంగా బతకాలి. ఆ అజ్ఞాతంలో బయటపడితే మరల 12 ఏళ్లు అరణ్య వాసం ఒ క ఏడు అజ్ఞాతవసం చెయ్యాలి. ఇదీ పందెం. మీకు ఇష్టం అయితే జూదం ఆడుదాము." అని అన్నాడు.

"సరే!" అన్నాడు ధర్మరాజు. జూదం ఆడాడు ఓడిపోయాడు. పాండవులు అరణ్యానికి పోవడానికి సిద్ధంఅయ్యారు.

పాండవులు భీష్మ, ద్రోణ, కృపా చార్యుల వద్ద సెలవు తీసుకున్నారు. తల్లి కుంతీ దేవి వద్దకు వచ్చారు.

"పుత్రులారా! ఇలాంటి దుస్థితి చూడాల్సి వస్తుందని మీ తండ్రి, మాద్రి ముందే స్వర్గానికి పోయారు. నేను దురదృష్టవంతురాలిని. శ్రీకృష్ణా! నా కుమారులను కాపాడు!" అని ప్రార్థించింది.

కొడుకులను కోడలిని దీవించి పంపింది. అందరూ అడవులకు పయనం అయ్యారు.

కోపం నిండిన తన చూపుల వలన జనం దహించబడతారని, ధర్మరాజు ముఖానికి వస్త్రము అడ్డపెట్టుకున్నాడు. ఎట్టకేలకు యుద్ధంలో తన బాహు బలాన్ని ప్రదర్శించే అవకాశం వచ్చిందని, భీముడు రొమ్మువిరుచుకుంటూ నడుస్తున్నాడు. ఇంతకంటే ఎక్కువగా శరసంధానం చేసి శత్రువులను హతమారుస్తాను అని అర్జునుడు

ఇసుకను చేతితో నేలమీద చల్లుతూ నడుస్తున్నాడు అర్జునుడు. తమ అంద చందాలు చూసి జనులు దుఃఖపడతారని, నకుల సహదేవులు మలిన దేహాలతో నడుస్తున్నారు. తడిసిన బట్టలతో, విడిన కురులతో, దుఃఖిస్తూ , భర్తలను పోగొట్టుకొని కౌరవుల భార్యలు కూడా తన మాదిరి రాజ్యం వదలి పోతారని, ద్రౌపది పాండవుల తో నడిచింది. పాండవులతో పాటు పురోహితుడు ధౌమ్యుడు, వేలాది బ్రాహ్మణులు పాండవులను అనుసరించారు. ఆ ప్రకారంగా, పాండవులు అరణ్యాలకు పయనమయ్యారు.

మహాభారతము,

సభాపర్వము ద్వితీయాశ్వాసము

సమాప్తము.

మహా భారత కధను చదువుతున్న పాఠకులకు నాదొక విన్నపము.
తెలిసో తెలియకో చేసే విన్నపము.
అవధరించండి.

సభాపర్వము లోనే సభ అనే పదం ఉంది. సభ అంటే ఒకటి మయసభ. రెండవది పాండవులు జూదం ఆడటానికి ధృతరాష్ట్రుడు నిర్మింపచేసిన సభ. ఈ రెండింటికి ప్రాధాన్యత ఉంది. ఈ రెండు లేకపోతే మహా భారత కధ ముందుకు నడవదు. ధర్మరాజు నిర్వహించిన రాజసూయంతోనే పరిసమాప్తి అయి ఉండేది.

సుయోధనుడు అందరితో పాటు హస్తినకు పోకుండా మయసభ చూద్దామని ఉండిపోయాడు. అవమానాలపాలయ్యాడు. పైగా రాజసూయంలో ధర్మరాజుకు వచ్చిన కానుకలు చూచి అసూయ చెందాడు. ఆ సంపదనంతా హరించాలని, తనకు అవమానం చేసినందుకు పాండవులకు తగినశాస్తి చెయ్యాలని కోరిక పుట్టింది. అగ్నికి ఆజ్యంపోశాడు శకుని. ఫలితంగా జూదం. ద్రౌపదికినిండు సభలో అవమానము. పాండవులకు అరణ్యవాసము.

ఇంక జూదము అది జరిగిన విధము.

ధర్మరాజు జూదానికి ఎందుకు ఒప్పుకున్నాడు..

ప్రధమంగా ధర్మరాజుకు జూదం ఆడటం ఇష్టంలేదు. జూదం క్షత్రియ ధర్మంకాదు. రాజులు జూదం ఆడటం పాపపు పని అని అన్నాడు. అనంతరం, ధర్మంగా ఆడే జూదంలో గెలవడం ధర్మ యుద్ధంలో

జయించడం లాంటిది. అని అసితుడయిన దేవలుడు చెప్పాడు అని కూడా అన్నాడు. జూదాన్ని సమర్థించాడు ధర్మరాజు.
జూదమాడ టానికి భయపడితే మానుకో అని శకుని రెచ్చగొట్టాడు.
బలవంతంగా ద్యూతానికి పిలిస్తే వెనుకకు తిరిగి వెళ్లడమా కానివ్వండి అని ద్యూతానికి పూనుకున్నాడు.

అంటే ప్రథమంలో జూదం పాపం అన్న ధర్మజుడు పంతానికి ఒప్పు కున్నాడా? ఉండొచ్చు!

ఇంక జూదం జరిగిన తీరు.

ఆడేది సుయోధనుడు. కాని అతనికి మారు శకుని పందెం వేసు 
న్నాడు. అది సరికాదు విషమం అని అనుకుంటూనే ప్రథమ పందెం ఒడ్డాడు. కనీసం అప్పుడయినా ఇది అన్యాయం అని అనలేదు. అంటే ధర్మరాజు వ్యసనానికి లోబడ్డాడా?

ప్రథమ పందెం శకుని జయించాడు.
ధర్మరాజులో పట్టుదల పెరిగింది.

చూడు ఇంక నిన్ను నేను ఓడిస్తాను అని జూదం ఆడాడు ధర్మరాజు.

అంటే మామూలుగా మనం ఒక ఆట ఓడితే చూడు నా తఢాఖా రా నీ అంతు చూస్తాను అని అంటాం కదా! ధర్మరాజు కూడా అలాగా అన్నాడా! . మరి ధర్మరాజులోని ధర్మస్వరూపుడు ఏమయ్యాడు?

జూదంలో ధర్మరాజు ఒకటి పోతే ఒకటి ఒడ్డుతూనే ఉన్నాడు. ఓడుతున్నాడు. కాని ఆట మానలేదు. ఎందుకు?

మామూలు పేకాటలో కూడా, కాస్త చెయ్యి తగ్గుముఖంలో ఉంటే ఆట మానేస్తారు కదా. అలాగే స్టాక్ మార్కెట్టులో కూడా, ఒక షేరు కొని, దానికి స్టాప్ లాస్ పెట్టుకొని నష్టాన్ని పరిమితం చేసుకుంటారు కదా!. ఈ పాటి మామూలు పరిజ్ఞానంకూడా ఆనాటి ధర్మరాజుకు లేదా?

దీనిని బట్టి చూస్తే మనకుఏమి అనిపిస్తుంది. అప్పటికి ధర్మరాజు అర్భకుడు. ధర్మసూక్ష్మాలు అంతగా తెలియదు. ఒక మామూలు మనిషి. కాని చుట్టు ఉన్న జనం ధర్మరాజును సాక్షాత్తు ధర్మస్వరూపుడు అనగానే నిజమనుకున్నాడు. కాని జితేంద్రియత్వము, సుఖదు:ఖాలను సమానంగా చూచే సంయమనము ధర్మరాజుకు అలవడలేదు. ఒక పందెం ఓడగానే మామూలు జూదరిలానే ప్రవర్తించాడు. అందుకే ద్రౌపది ధర్మరాజును జూదరి ( యక్కితవు నడిగి వచ్చి) అని సంబోధించింది. కితవుడు అంటే జూదరి అని అర్థం.

ఇంక రాజ్యము, సంపదలు. ఈ సంపదలన్ని పాండవులకు ప్రథమంలో లేవు కదా! రాజసూయంతో వచ్చాయి. జూదంలో పోయాయి. ఎలా వచ్చాయో అలా పోయాయి. మూన్నాళ్ల ముచ్చట గా మిగిలిపోయాయి. ఆకస్మికంగా వచ్చిన సంపద అహం కారాన్ని అభిమానాన్ని కలిగిస్తుంది. నారదుడు వచ్చి పాలకులు అనుసరించ వలసిన ధర్మాలు బోధించినా, ధర్మరాజుకు జ్ఞానోదయం కలగలేదు. నారదుడు చెప్పిన మాటలను పెద్దగా పట్టించుకోకుండా, మయ సభను చూచారా అని మాట మార్చాడు.

జీవితంలో అనుభవానికి మించిన పాఠం మరొకటి లేదు. అందుకే ధర్మరాజు జూదం ఆడుతూ అన్ని పోగొట్టుకుంటుంటే ఎవ్వరూ ఒక్క మాట కూడా అనలేదు. ధర్మరాజును జూదం మాను అని చెప్ప లేదు. ఎందుకని? సమాధానం లేదు. ఎంతసేపటికి విదురుడు ధృతరాష్ట్రునికి, సుయోధనునికి చెప్పాడు కాని ధర్మరాజు వద్దకుపోయి జూదం అధర్మం-- మాను-- అని చెప్పలేదు. ఇంత జరుగుతున్నా భీష్ముడు నోరు విప్పలేదు. అంతా అయిన తదుపరి ఒక్క మాట అన్నాడు.

----నీ ప్రశ్నంబునకు నుత్తరంబ యుధిష్ఠిరుండు సెప్పవలయు గాని నాడు ధర్మ సూక్ష్మత యెవ్వరికి నెఱుంగ గహనంబు. దీని ఫలంబు యిక్కులపాంశను లనుభవింతురు-----

ఇవి భీష్ముడు అన్నమాటలు. అంటే చేజేతులా జూదం ఆడి పోగొట్టు కుంటే మనం ఏం చేస్తాము అనా. లేక ఒక పక్క జూదం ఆడి పెళ్లాంతో సహా అందరిని పోగొట్టుకొని ఉంటే ఇంకా ధర్మసూక్ష్మము అతనికే తెలియును అని అవహేళన చెయ్యడమా లేక ఆ పరిస్థితులలోకూడా పొగడ్డమా!

ఇంక శకుని నిర్వహించిన పాత్ర.

శకుని సుయోధనునికి మేనమామ. గాంధారికి సోదరుడు. గాంధార దేశానికి మహారాజు. మహాభారతంలో శకుని పాత్ర ప్రథ మంగా ఆది పర్వము, పంచమాశ్వాసము, 12 వ వచనంలో

కనబడుతుంది.

----నంత నక్కన్యం దోడ్కొని దాని సహోదరుండయిన శకుని మహా విభూతితో హస్తినాపురంబునకు వచ్చిన------

అంటే తన సోదరి గాంధారిని తీసుకొని శకుని హస్తినకు వచ్చాడు. ధృతరాష్ట్రునితో పెళ్లి జరిపించాడు. తర్వాత చాలా కాలానికి సుయో ధనుడు పుట్టాడు.

కాని మనకు శకుని గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. శకునిని, అతని సోదరులను, తండ్రిని సుయోధనుడు నేలమాళిగలో బంధించినట్లు, పిడెకెడు అన్నం పెట్టినట్లు, అవి శకుని మాత్రం తిని బతికినట్లు, మిగిలిన సోదరులు తండ్రి మృతి చెందినట్లు, అప్పటినుండి శకుని సుయోధనుని మీద పగపట్టినట్లు, తండ్రి ఎముకలతో పాచికలు తయారు చేయించి శకుని మాయా జూదం ఆడినట్లు ఉంది. కాని ఆ కథకు భారతంలో ఏ ఆధారము లేదు. పైన చెప్పినట్లు శకుని హస్తినకు వచ్చిన తర్వాత చాలా కాలానికి సుయోధనుడు పుట్టాడు. సుయో ధనుడు పెరిగి పెద్దయి యువరాజు అయి, శకునిని అతని తండ్రిని అలా హింస పెట్టాడుఅంటే నమ్మతగ్గదిగా లేదు. అది కాలానుగుణంగా ఎవరో ఔత్సాహికులు రాసిన ప్రక్షిప్త కథ అని నా అనుమానం.
మరి శకుని తన రాజ్యాన్ని వదిలిపెట్టి హస్తినలో ఉన్నాడు ఎందుకు?

ఉన్నవా డు ఉండకుండా సుయోధనుడు చేసే ప్రతి చెడ్డ పనికి వంత పాడుతుంటాడు. ఇంకా ప్రోత్సహిస్తుంటాడు. కారణం. ఇంతవరకు జరిగిన కథను బట్టి మనం ఇలా ఊహించవచ్చు.

శకుని ఒక గొప్ప దేశభక్తుడు. ఆనాటి రాజకీయ పరిస్తితులు ఎలా ఉన్నాయి అంటే, యావత్తు భారత దేశాన్ని కురు వంశము పాలిస్తోంది. అనువంశికంగా, రాజ్యం కుటుంబంలో జ్యేష్టునికి చెందుతుంది. ఆ ప్రకారంగానే గుడ్డి వా డు అయినా ధృతరాష్ట్రుడు రాజయ్యాడు. అతని ప్రతినిధిగా అతని తమ్ముడు పాండురాజు రాజ్యాన్ని విస్తరించాడు. తర్వాత కారణాంతరాలవల్ల పాండురాజు వనాలకు పోయాడు. అక్కడే అతనికి 5గురు పిల్లలు(పాండవులు) పుట్టారు. పాండురాజు మరణా నంతరం పాండవులు తల్లి తో సహా హస్తినకు వచ్చారు. వా రసత్వ పోరు ఆరంభం అయింది. చిట్టచివరకు భాగం పంచాడు పెదనాన్న. ఎందుకూ పనికిరాని ఖాండవప్రస్థాన్ని ఇచ్చి ఏలుకోమన్నాడు. సరే అన్నారు పాండవులు. కృష్ణుని సాయంతో ఖాండవ ప్రస్థాన్ని ఇంద్రప్రస్థంగా మార్చుకున్నారు. రాజసూయం చేసారు. అటు కాశ్మీరం నుండి, ఇటు కన్యాకుమారి వరకు అటు గుజరాత్ నుండి ఇటు అస్సాం వరకు జయించారు. ఒకే తాటిమీదికి తెచ్చారు. ఇది చూచి కన్నుకుట్టింది సుయోధనునికి. రాజ్యం అపహరించాలని అనుకున్నాడు. శకుని తో సంప్రతించాడు. అప్పుడు శకుని ఇలా ఆలోచించి ఉంటాడు.

అటు ధర్మరాజు స్థాపించిన రాజ్యం, ఇటు సుయోధనుని రాజ్యం కలిపితే, యావత్తు భరతఖండం కురువంశం అధీనంలో ఉంది. దీనికి సమర్థుడైన చక్రవర్తి ఎవరు? ఉండేది ఇద్దరు.

ఒకడు దుర్యోధనుడు. అతను దుష్టుడు, దుర్మార్గుడు. నిరంకుశుడు. ప్రజాకంటకుడు. విషయలోలుడు. దురభిమాని. చక్రవర్తి కాదగ్గ లక్షణాలు ఏకోశానా లేవు.

రెండు ధర్మరాజు. మంచి వా డు, యోగ్యుడు మహాసాత్త్వికుడు. రాజసం లేదు. అందుకే అజాతశత్రువు అయ్యాడు. ఏదో కొంత ధర్మశాస్త్రం చదువు కున్నాడు. కాని పరిపూర్ణత్వంలేదు. వంది మాగధులు చుట్టుచేరి అహా ధర్మాత్ముడు ఓహో ధర్మస్వరూపుడు అనగానే ఉబ్బిపోయి అంతా తనకు తెలుసు అనుకుంటున్నాడు.

ఏమి చేసినా బాగు పడని సుయోధనుని కన్నా, కొంచెం అనుభవంతో మంచి చక్రవర్తి కాదగ్గ లక్షణాలు ధర్మరాజుకే ఎక్కువ ఉన్నాయి. అందుకే ధర్మరాజును యావద్భారత దేశానికి చవర్తిని చెయ్య నిశ్చయించాడు. కాని, అంతకు ముందు రాజ్యం అంతా ఒకరి అధీనంలో ఉండాలి. అది ఎలాగా?

సుయోధనుడు బలవంతుడు. కర్ణుని అండదండలు ఉన్నాయి. నూర్గురు అన్నదమ్ములు. పైగా తండ్రి ఉన్నాడు. ఇంకా పైన భీష్ముడు. కాబట్టి, అతనిని పదవీ చ్యుతుడిని చెయ్యడం సామాన్యమయిన పనికాదు. కాబట్టి ధర్మరాజును జయించి అతని రాజ్యం లాక్కోడం మంచిది అని నిర్ధారణకు వచ్చాడు. నెగటివ్ ఓటు సుయోధనుడికి, సింపతీ ఓటు ధర్మరాజుకు వచ్చేట్టు పాచికలు కదిపాడు.

దీనికి నాంది గా మయసభలో సుయోధనునికి జరిగిన అవమానం వరంగా పరిణమించింది. దానిని తనకు అనువుగా మలుచుకున్నాడు శకుని. సుయోధనునిలో అభిమానాన్ని, అహం భావన్ని రెచ్చగొట్టాడు. పాండవుల సంపదనంతా ఒక్క నెత్తురు బొట్టు కిందపడకుండా కొల్లగొడతాను అని నమ్మబలికాడు. క్షాత్రంతో జయిం చాలి అన్న కర్ణుని నోరు నొక్కేసాడు. ధర్మరాజుకు ఉన్న ద్యూతవ్యసనం

పసికట్టాడు. జూదానికి విదురునితోనే ఆహ్వానం పంపేట్టు పరిస్తితులు కల్పించాడు. జూదానికి వచ్చిన ధర్మరాజు కొంచెం జంకు తుంటే భయపడితే వద్దులే అని ధర్మరాజులోని అహాన్ని రెచ్చగొట్టాడు. జూదానికి పురికొల్పాడు.

ఇంక జూదంలో గెలుపు ఓటములు తధ్యం కదా. తమ్ములతో సహా అన్ని ఓడిపోయాడు ధర్మరాజు. కడకు తనను తాను ఒడ్డుకున్నాడు. ఓడి పోయాడు. అప్పటిదాకా మాట్లాడలేదు శకుని. తనను తాను ఒడ్డి ఓడిపోయాక, అప్పుడు అన్నాడు

నిట్లేల నిన్నొడ్డి తథిప! నీకు నొండు ధనము గలదు మఱచితెట్లు? కమలాక్షి పాంచాల కన్య నీకు ధనము గాదె?

ఏమయ్యా మరచిపోయావు. నీకు ఇంకో ధనం ఉంది కదా! అన్నాడు.

అంటే స్త్రీ ధనమా? ధనము అయితే అది మా ఐదుగురికి చెందిన ధనము? నాదికాదు అని ధర్మరాజు అనవచ్చుకదా! కాని అనలేదు. ద్యూతవ్యసనం అతని విజ్ఞతను మంటకలిపింది. మరు క్షణంలో తమ ఐదుగురి భార్య ద్రౌపదిని జూదంలో పణంగా పెట్టాడు ధర్మరాజు. ఓడిపోయాడు.

కాని కథ అడ్డతిరిగింది. గాంధారి జోక్యంతో పోగొట్టుకున్నదంతా తిరిగి పొందారు పాండవులు. మరల కథ మొదటికి చేరుకుంది.

ఈసారి న్యాయశాస్త్రాన్ని ఆశ్రయించాడు శకుని. ప్రస్తుతం అమలులో ఉన్న Indian Limitation Act ప్రకారం, ఎవరి ఆస్తి అన్నా 12 ఏండ్లు, దాని స్వంతదారుకుతెలిసి, పరాయి వ్యక్తుల అధీనంలో ఉంటే, అది ఆ పరాయి వ్యక్తులకు చెందుతుంది. దీనినే "adverse possession" అంటారు. ఇది త్రేతాయుగంలో 14 ఏళ్లు ఉంటే ద్వాపరంలో 12 ఏళ్లు అయినట్టుంది. కలియుగంలో కూడా అదే 12 ఏళ్లు అమలులో ఉంది.

రెండవసారి మరల జూదానికి ఆహ్వానం పంపేట్టు చేశాడు. ఈసారి పాండవులు అడ్డు చెప్పలేదు. దానికి కారణం ఉంది. కాంతా దయా లబ్ధ రాజ్యం అనుభవించడం ఎవరికీ ఇష్టం లేదు. ముఖ్యంగా వీరులైన భీమార్జునులకు. పైగా ఇంతకంటే ఏంజరుగుతుందిలే! అని అనుకొని ఉంటారు. అందుకే పిలవగానే వచ్చారు.

ఈసారి వినూత్నం పందెం పెట్టాడు శకుని. ఓడిన వ్యక్తి, రాజ్యాన్ని విడిచి సమస్త భోగాలను విడిచి 12 ఏళ్లు అరణ్యవాసం చెయ్యాలి. తర్వాత ఒక ఏడు జనపదాల్లో ఉంటూ అజ్ఞాతంలో గడపాలి. అంటే పదమూడేళ్లు ఉన్నారో చచ్చారో అని తెలియకుండా గడపాలన్నమాట. గెలిచిన వాడికి వ్యక్తికి రాజ్యం లభిస్తుంది. ఇది శకుని రాజకీయ వ్యూహం.

ఇది జూదం పేరిట శకుని సుయోధనునికి లిఖించిన మరణ శాసనం అనక తప్పదు. ఎలా అంటే----

జూదంలో ధర్మరాజు ఓడిపోతాడు. అరణ్యాలకు పోతా డు. ఒక

వేళ  పాండవులు అరణ్య అజ్ఞాత  వా సములు నెరవేర్చి తిరిగి వచ్చినా ఆనాటి ధర్మం ప్రకారం రాజ్యమీద హక్కును కోల్పోయారు.  రాజ్యం వీరభోజ్యం అన్న నానుడి ప్రకారం యుద్ధం శరణ్యం. అప్పటికే అటు సుయోధనుని నిరంకుశత్వం, అతడు పాండవులకు చేసిన మోసం, ఇటు పాండవుల మంచితనం, పాండవులు పడ్డ అష్ట కష్టాలు సామంతరాజులకు విదితమవుతాయి.ఇదీ శకుని తంత్రం.

ఇందు జూదం అనంతర పరిణామం  ఏమంటే

అమాయకులయిన పాండవులను సర్వం అపహరించి అడవులకు పంపాడు అన్న అపకీర్తిని సుయోధనునికి కట్టబెట్టాడు. సుయోధనుని రెచ్చగొట్టి ఘోషయాత్ర జరిపించాడు. పాండవులను అడవులలో కూడా ప్రశాంతంగా బతకనివ్వడంలేదు అన్న అపఖ్యాతిని సుయోధనుని ఖాతాలో జమచేయించాడు. అటు పాండవులకు సింపతీ ఓటు, సుయోధనునికి నెగటివ్ ఓటు ఖాయం చేశాడు.

ధర్మరాజుతనలో  ఉన్న లోపం గ్రహించాడు. అరణ్యం లో ఉన్న మహా మునుల సాంగత్యంలో ఎన్నో ధర్మసూక్ష్మాలు గ్రహించాడు. సంయమనాన్ని జితేంద్రియత్వాన్ని అలవర్చుకున్నాడు.

అర్జునుని తండ్రి ఇంద్రుడుకూడా తనవంతు పాత్ర పోషించాడు. అర్జునుని తనతో ఇంద్రలోకానికి తీసుకెళ్లి అర్ధసింహాసనం మీద కూర్చోబెట్టి అర్జునుని పక్షం నేను ఉన్నాను జాగ్రత్త  అని సామంత రాజులకు సంకేతం పంపాడు.

అటు శ్రీకృష్ణుడు కూడా యాదవ రాజులను కూడ గట్టి పాండవులకు అనుకూలంగా మలిచాడు. రాయబార నాటకం నడిపించాడు.  కనీసం ఐదు ఊళ్లుకూడా ఇవ్వడానికి ఒప్పుకోని దుర్మార్గుడిగా సుయోధనుని నిరూపించాడు. యుద్ధం ఖాయం చేశాడు.

శకుని, ఇంక తన పని అయిపోయిందని, ఆఖరున యుద్ధంలో నాయకత్వం వహించి నిర్యాణం పొందాడు.

నాటినుండి నేటిదాకా స్వతంత్ర భారత దేశం ఏకఖండంగా ఉండాలి అని కోరుకొనే మహాను భావులకు ఆద్యుడు శకుని అని నా భావన.

# శ్రీమదాంధ్ర మహా భారతము

## అరణ్య పర్వము

### ప్రధమాశ్వాసము

ఆ కధకుడైన సూతుడు శౌనకాది మహా మునులను చూచి ఇలా చెప్ప సాగాడు.

ఆ ప్రకారంగా పాండవులు తమ తమ  ఆయుధములను ధరించి ద్రౌపది వెంటరాగా ఉత్తర దిక్కుగా ప్రయాణం  సాగించారు. వారి వెంట వారి ముఖ్య సేవకులు పధ్నాలుగు వేల రధాలతో తరలి వెళ్లారు. వారి వెంట సుభద్ర, అభిమన్యుడు ప్రతి వింధ్యుడు మొదలగు ఉపపాండవులు వెళ్లారు.

ఆ  దృశ్యాన్ని చూచి "ఎక్కడో ఉన్న పాండవులను జూదానికి పిలిపించి, సర్వస్వము హరించి అడవులకుపంపడం ధర్మమా!" అంటూ పురజనులు కంటతడి పెట్టారు.

"భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, విదురుడు క్రూరు లైన దుర్యోధ నాదులను ఎందుకు ఆపలేదు? ఇంక ధర్మము ఎక్కడ ఉంది.

కాబట్టి ఈ రాజ్యంలో మేము బతకలేము. మీతోనే వస్తాము" అని పౌరులు పాండవుల వెంట బయలుదేరారు.

వారిని చూచి ధర్మరాజు "అయ్యలారా మీరు మా పట్ల చూపించిన ఆదరాభిమానాలకు కృతజ్ఞులము. కాని ఆ వనవాసక్లేశము మీరు భరించ లేరు. కాబట్టి మీరు మా వెంట రావడం మాకు ఇష్టం లేదు. కాబట్టి మరలి పొండి" అని పౌరులను వెనకకు పంపివేశాడు.

తరువాత వారు అందరూ గంగా తీరం చేరుకున్నారు. కాని వారి వెంట నిత్యాగ్నిహోత్రులైన బ్రాహ్మణులు, వారి శిష్యులు వచ్చి చేరారు.

వారిని చూచి ధర్మరాజు "బ్రాహ్మణోత్తములారా! మీరు పూజ్యులు. మేము ఈ అరణ్యములలో కందమూలములు తింటూ బతకాలి. మీరు మా వెంట కష్టములు పడటం ఎందుకు మరలి పొండి" అని పలికాడు.

దానికి ఆ బ్రాహ్మణోత్తములు "అయ్యా మీరు తప్ప మాకు వేరు దిక్కు లేదు. అందువలన మేము మీ వెంటనే ఉంటాము. మా ఆహారము గురించి మీరు విచారించనవసరం లేదు. ఈ అడవిలో దొరికే కంద మూలములు తిని మేము బతుకుతాము మా ఆహారం మేము తెచ్చు

కుంటాము కాని మీరు లేని హస్తినాపురంలో మేము ఉండలేము"  అని బదులు చెప్పారు.

ఆ మాటలు విని ధర్మరాజుకు దుఃఖం వచ్చింది. "మంచి మంచి వంటకాలతో తృప్తిగా భుజించే ఈ బ్రాహ్మణోత్తములు ఈ కంద మూలా లు తిని ఎలా బతకగలరు" అని వాపోయాడు.

అది చూచి శౌనకుడు అనే ఋషి "ధర్మజా! దీనికి ఇంత చింతించ తగునా! అసలు ఎందుకు దుఃఖపడుతున్నావు. వివేకులు దేనికీ దుఃఖిం చరు. వికలురు కారు. ఆ బంధాలు తాత్కాలికాలు. కాబట్టి వీటికి కలత చెంద నవసరం లేదు. తామరాకు మీద నీటిబొట్టులా ఉండాలి. ఈ బంధాలవలన అభిమానం, అభిమానం వలన కోరిక, కోరిక వలన కోపం, దాని వలన ఆశ పుడతాయి. ఆశ సమస్త దోషాలకు మూలము. కాబట్టి ఆశ వదలిపెట్టు. ధనం మీద ఆసక్తి కలవాడు పతనమవుతాడు. ధనవంతుని చుట్టు బంధువులు చేరి అతనిని పీడిస్తారు. ధనాన్ని హరిస్తారు. ధనం వలన గర్వం, అహంకారం, భయం, కలుగుతాయి. కాబట్టి ధనార్జన కొరకు పాకు లాడ వద్దు" అని హితవు చెప్పాడు.

దానికి ధర్మజుడు "అయ్యా !, ధనము నాకోసం కాదు. ఇదిగో ఈ బ్రాహ్మణులు కందమూలములు తిని బతుకుతున్నారు వారి కోసం ధనం కావాలి కదా! పైగా అతిధి పూజ గృహస్థుకు అవశ్య కర్తవ్యం. ఈ బ్రాహ్మణులు నా అతిధులు. వారికి అతిధి మర్యాదలు చెయ్యడం నా విధి. ఆర్తునకు శయ్య, భయంతో ఉన్నవాడికి శరణు, దాహంతో ఉన్న వాడికి నీరు, ఆకలితో ఉన్నవాడికి భోజనం, అలసిన వాడికి ఆసనం కూర్చడం గృ హస్థు ధర్మం. తనకోసం మాత్రం వండుకోడం తినడం పాపం. నిష్కార ణంగా జంతు హింస చెయ్యడం పాపం. కాబట్టి ఆ అతిధి సత్కారాలు చెయ్యడం నా ధర్మం" అన్నాడు ధర్మరాజు.

"ధర్మరాజా! ఇంద్రియాలు సుఖాల్నికోరతాయి. ఎంతటి జ్ఞానులకైనా ఇంద్రియాలు వశం కావు. ఇంద్రియసుఖాలకు లోబడి దేహధారులు సంసార చక్రంలో తిరుగుతుంటారు. కాని, మహాత్ములు 1. ప్రేమ, అసూయలను వదలడం, 2.చక్కని చిత్తవృత్తిని అలవర్చుకోడం, 3. ఇంద్రియాలను వశం చేసుకోడం, 4. తనకు నచ్చిన దీక్షను స్వీకరించడం, 5.గురువులను సేవించడం, 6.నియమంగా ఆహారం తినడం, 7.విద్యను అభ్యశించడం, 8.ఫలితం మీద ఆశలేకుండా పనులు చెయ్యడం. ఈ ఎనిమిది నియమాలను ఆచరించిన వారు సంసార బంధాలను అధిగమిస్తారు. కాబట్టి ధర్మరాజా! నువ్వుకూడా గురుసేవ,

పెద్దలు చెప్పిన మాటలు వినడం, విన్నదాన్ని అర్థం చేసుకోడం, అర్థం చేసుకున్నదాన్ని మనసులో నిలుపుకోడం, అవసరమైన దాన్ని ఆచరించడం, అనవసరమైన దాన్ని వదలివెయ్యడం - వీటిని ఆచరించు. వసువులు, రుద్రులు, ఆదిత్యులు, తపస్సు చేసి ఐశ్వర్యాన్ని సంపాదించారు. నువ్వుకూడా తపస్సుచేసి నీ కోర్కెలు తీర్చుకో!" అని అన్నాడు శౌనక మహర్షి.

ధర్మరాజు తన పురోహితుడు ధౌమ్యుని చూచి, "అయ్యా మేము ఉండేది అడవులలో. ఆ బ్రాహ్మణుడు మాతో రావద్దని చెప్పినా వచ్చారు. వీరికి మేము ఎలా ఆహారం సమకూర్చాలి?" అని అడిగాడు.

అప్పుడు ధౌమ్యుడు ధర్మరాజును చూచి "ధర్మజా! ఈలోకంలో జీవ కోటికి ఆహారాన్ని, నీటిని ప్రసాదించేది సూర్యుడు. కాబట్టి నీవు సూర్యుని ప్రార్థించు. నీకోరిక తీరుతుంది." అని చెప్పి, ధర్మరాజుకు ఆదిత్యనామాలు 108 అర్థంతో సహా ఉపదేశించాడు. .

దర్మరాజు, నిష్ఠతో సూర్యుని పూజించాడు. సూర్యుడు ప్రత్యక్షం అయ్యాడు. ధర్మరాజుకు ఒక రాగి పాత్రను ఇచ్చి "ధర్మజా! మీరు ఈ పన్నెడేళ్లు ఏళ్లు అరణ్యావాసములో మీరు అడవిలో సేకరించిన కంద

మూల ములు, ఫలములు మీ వంట ఇంటిలో ద్రౌపదిచే  ఈ  పాత్రలో వండించిన అవి నాలుగు విధములైన  వంటకములు గా  ఏర్పడతాయి. అవి ఎప్పటికీ అయిపోకుండా అక్షయంగా ఉంటాయి" అని వరము ఇచ్చి వెళ్లిపోయాడు.

అప్పటినుండీ ఆ పాత్రలో అడవిలో దొరికే పదా ర్థాలు వేస్తే అవి రుచికరమైన వంటకాలుగా మారి, అందరిని సంతృప్తిప రుస్తు న్నాయి. ఆ ప్రకారం ధర్మరాజు తనతో వచ్చిన వేలమంది బ్రాహ్మణులకు సంత ర్పణలు చేస్తున్నాడు. మిగిలిన దాన్ని పాండవులు, ద్రౌపది భుజిస్తున్నారు. క్రమంగా పాండవులు కామ్యకవనం చేరుకున్నారు.

ఇక్కడ హస్తినాపురంలో ధృతరాష్ట్రుడు విదురుని చూచి "విదురా! పాండవులు ఏం చేస్తుంటారు?" అని అడిగాడు.

దానికి విదురుడు "పాండవులు దైవాంశసంభూతులు. జూదం వలన అన్నదమ్ములకు వైరం కలుగుతుందని నీకు ముందేచెప్పాను. నీవు వినలేదు. ఇప్పటికైనా నా మాట విని పాండవులను వెనక్కు పిలిపించి వాళ్ల రాజ్యం వాళ్లకు ఇచ్చి ధర్మాన్ని నిలబెట్టు. ఆ కర్ణుడు, శకుని చెప్పు చెడ్డమాటలు విని చెడ్డపనులు చేసే నీ కొడుకు సుయోధనుని విడిచి

పెట్టు. ద్రౌపదికి, భీమునికి నిండు సభలో దుశ్శాసనునితో క్షమాపణలు చెప్పించు." అని అన్నాడు.

ఆ మాటలు విని ధృతరాష్ట్రునికి కోపం వచ్చింది. "సుయోధనుడు నా కన్నకొడుకు. వాడిని ఎలా వదలను. నీకు నా కొడుకులు అంటే పడదు. నా కొడుకులు ఉన్నతులైతే నీవు సహించలేవు. నీ సాయం నాకు అక్కరలేదు. నువ్వు పాండవుల దగ్గరకు కాని లేక నీ ఇష్టం వచ్చిన చోటుకు గాని వెళ్లు." అని అన్నాడు.

వెంటనే విదురుడు కామ్యక వనంలో ఉన్న పాండవుల దగ్గరకు వెళ్లాడు. విదురునికి పాండవులు స్వాగతం పలికారు. ధర్మరాజు తన పెదనాన్న గారి గురించి అడిగాడు. జరిగింది చెప్పాడు విదురుడు.

ఇంతలో ధృతరాష్ట్రుడికి విదురుడు పాండవుల దగ్గర ఉన్నట్టు తెలిసింది. విదురుని విడిచి ఉండ లేక పోయాడు. వెంటనే సంజయుని పిలిపించి వెంటనే వెళ్లి విదురుని తీసుకొని రమ్మన్నాడు. సంజయుడు కామ్యకవనానికి వెళ్లి విదురునికి నచ్చ చెప్పి హస్తినకు తీసుకొని వచ్చాడు. "విదురా!నీవు నీతిమంతుడవు. నాకు బుద్ధిలేదు. అందుకే నిన్ను వెళ్లగొట్టాను. నన్ను క్షమించు" అని అన్నాడు.

"ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీవు, నీ కొడుకులు ధర్మం తప్పి నడుస్తున్న పుడు మీకు హితవు చెప్పడం నా కర్తవ్యం. మరల చెపు తున్నాను. మహా పరాక్రమవంతులైన పాండవులతో వైరం మంచిది కాదు!" అని అన్నాడు.

విదురుడు మరల తన తండ్రి ధృతరాష్ట్రుని వద్దకు రావడం దుర్యోధనుని కి ఇష్టంలేదు. కర్ణ, శకుని, దుశ్శాశనులతో చర్చించాడు.

"పాండవుల దగ్గరకు వెళ్లిన విదురుడు మరల వచ్చాడు. మనకు మంత్రి అయ్యాడు. ఒకవేళ విదురుడు, నా తండ్రి కలిసి పాండవులను తిరగి రమ్మంటే ఏమి చేద్దాము?" అని అన్నాడు సుయోధనుడు.

దానికి శకుని అంగీకరించలేదు. "సత్యసంధులైన పాండవులు ఎట్టి పరిస్థితులలోనూ తిరిగి రారు. ఆ భయం నీకు అవసరంలేదు" అన్నాడు శకుని.

కాని కర్ణుడు మాత్రం "ఇదే అదును చూచి వారి మీద దండెత్తి వారిని హతమారిస్తే శత్రు శేషం లేకుండా పోతుంది" అన్నాడు.

కర్ణుడి మాట ప్రకారం సుయోధనుడు సేనలను సమీకరించాడు. పాండవుల మీదికి యుద్ధానికి సన్నద్ధం అయ్యాడు. ఇది వ్యాసునికి తెలిసింది. వెంటనే వ్యాసుడు  ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లి "నీకుమారుడు అడవులలో ఉన్న పాండవుల మీదికి యుద్ధానికి వెళుతున్నాడు. పాండవులు అరణ్య అజ్ఞాత వాసాలు ఐన తరువాత ఎటూ యుద్ధానికి వస్తారు కదా! ఇప్పుడే తొందర ఎందుకు? అతనిని వారించు" అని అన్నాడు.

"నన్ను ఏం చెయ్య మంటారు మహాత్మా? జూదం వలన చెడు జరిగి పోయింది. పుత్రవాత్సల్యం వలన నేను నా కుమారుని విడువలేను!" అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

దానికి వ్యాసుడు ఇలా అన్నాడు "ధృతరాష్ట్రా!  పుత్రప్రేమ ఉండవలసిందే. కాని అడవులలో ఉన్న పాండవులమీద కూడా కొంచెం దయచూపించు. నాకు అందరూ సమానులే. అందుకని చెప్పాను. మంచివారి స్నేహం వలన చెడ్డ వారు మంచి వారు అవుతారు. అలాగే ధర్మరాజు తో స్నేహం వలన నీ కొడుకు సుయోధనుడు మంచివాడు కావచ్చు" అని పలికాడు వ్యాసుడు.

“అయ్యా? వాడు నా మాట వినడు. మీరే వాడికి నచ్చ చెప్పండి.” అని అన్నాడు. దానికి వ్యాసుడు “మైత్రేయ మహర్షి వచ్చి నీ కొడుక్కు నచ్చ చెపుతాడు” అని వ్యాసుడు వెళ్లిపోయాడు.

కొన్ని రోజులకు మైత్రేయ మహర్షి ముందు కామ్యకవనములో ఉన్న ధర్మరాజాదులను చూచి తరువాత హస్తినాపురమునకు వచ్చాడు. ధృత రాష్ట్రుడు ఆ మహర్షికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి సత్కరించాడు.

అప్పుడు ఆ మహర్షి ధృతరాష్ట్రుని చూచి “నేను కామ్యక వనములో ఉన్న పాండవులను చూచి వస్తున్నాను. వారు అడవులలో కందమూలములు తింటూ జీవితము గడుపుతున్నారు.అని అన్నాడు.

“పాండవులుక్షేమముగా ఉన్నారా?” అని, ధృతరాష్ట్రుడు అడిగాడు. “ఓ రాజా! పాండవులు ధర్మబుద్ధి కలవారు. వారికి మహా ఋషుల దీవనలు ఉన్నాయి. అందువలన వారు క్షేమముగా ఉన్నారు” అని చెప్పాడు.

పక్కనే ఉన్న దుర్యోధనుని చూచి "కుమారా! నీకు బుద్ధి ఉంటే పాండవులతో వైరము వదలుము. అప్పుడు నీకు, కురువంశమునకు, మేలు కలుగుతుంది. ఎందుకంటే పాండవులు వజ్ర శరీరులు.భీముడు జరాసంధుని, బకుని, హి డింబుని  చంపిన బలవంతుడు. అతనిని జయించగల యోధులు లేరు. పైగా, శ్రీకృష్ణుడు, దృష్టద్యుమ్నుడు పాండవులకు సంబంధీకులు. వారి సహాయం వారికి ఎల్లప్పుడూ ఉంటుంది. కాబట్టి నీవు పాండవులతో స్నేహంగా ఉండు"  అని పలికాడు.

ఆ మాటలు విని దుర్యోధనుడు తన తొడలు చరుస్తూ నవ్వి ఆ మహర్షిని పరిహసించాడు. దానికి మైత్రేయ మహర్షికి కోపం వచ్చింది. "సుయోధనా!  యుద్ధములో భీముని గదా ఘాతమునకు నీ తొడలు విరుగగలవు." అని శాపం పెట్టాడు. ,

దృతరాష్ట్రుడు భయపడ్డాడు.  ఆ మహర్షిని శాపం ఉపసంహ రించ మని వేడుకున్నాడు.  "మహారాజా! నీ కొడుకు పశ్చాత్తాపం చెంది మంచి బుద్ధి కలిగి ఉంటే  ఈ శాపం అతనికి వర్తించదు" అని అన్నాడు మైత్రే యుడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు "మహాత్మా! కిమ్మీరుడు అనే రాక్షసుడు భీముని చేతిలో ఎలా చనిపోయాడు వివరించండి" అని అడిగాడు.

"నా మాటను నీ కొడుకే వినలేదు. ఇంక నేనెందుకు చెప్పాలి. ఆ విషయం విదురుని అడి గా తెలుసుకో!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

విదురుడు కిమ్మీరుని వృత్తాంతం ఇలా చెప్పసాగాడు.

"పాండవులు ఒక రోజు రాత్రి అడవిలో విశ్రమించారు. అప్పుడు వికృతాకారుడైనా రాక్షసుడు ఒకడు పాండవుల దారికి అడ్డుగా నిలిచాడు. ఆ రాక్షసుని చూచి ద్రౌపది భయంతో కళ్ళు మూసుకుంది. ఇంతలో ధౌమ్యుడు తన మంత్ర శక్తితో ఆ రాక్షసుని మాయను భగ్నం చేసాడు.

అప్పుడు ధర్మరాజు ఆ రాక్షసుని చూచి "నీవు ఎవరు? ఈఅడవిలో ఎందుకు ఉన్నావు?" అని అడిగాడు.

దానికి ఆ రాక్షసుడు "నేను బకుడు అనే రాక్షసుని తమ్ముడిని నా పేరు కిమ్మీరుడు. మనుష్యులను చంపి తింటూ ఉంటాను. నాకు భయ పడి ఎవరూ ఈ కామ్యకవనానికి రారు. మీరు ఎవరు? ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని అడిగాడు.

"నాపేరు ధర్మరాజు. వీరు నా సోదరులు భీమార్జున నకుల సహదేవులు. మేము వనవాసం చేస్తూ ఇక్కడకు వచ్చాము" అని అన్నాడు.

"ఏమీ నా అన్న బకుని చంపిన భీముడు వీడేనా! ఇంక వీడిని చంపి నా ఆకలి తీర్చుకుంటాను. వీడి కోసమే వెదుకుతున్నాను" అని పెద్దగా నవ్వాడు.

అప్పుడు అర్జునుడు గాండీవం ఎక్కుపెట్టాడు. కాని భీముడు కిమ్మీరుని ఎదుర్కొన్నాడు. ఇద్దరూ ఘోరంగా యుద్ధంచేసారు. చెట్ల తోనూ రాళ్లతోనూ కొట్టుకున్నారు. కడకు భీముడు కిమ్మీరుని అతని అన్న బకుని చంపినట్లు అతని దేహాన్ని విరగదీసి చంపాడు. కామ్యకవనంలో రాక్షస భయంలేకుండా చేసాడు భీముడు." అని విదురుడు ధృతరాష్ట్రుని తో చెప్పాడు.

అది విని ధృతరాష్ట్రుడు కలత చెందాడు. పాండవులు కామ్యక వనంలో కొంతకాలం ఉన్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు, పాంచాల, వృష్ణి , భోజ, అంధక, యాదవ రాజులతో కలసి పాండవులను చూడడానికి

వచ్చాడు.  వారు పాండ వులను ఇన్ని కష్టాలు పెట్టిన కౌరవులను నిందించారు.

అర్జునుడు శ్రీకృష్ణుని చూచి "కృష్ణా! నీవు పురాణపురుషుడవు. నీవు గంధమాధన పర్వతము మీద పదివేల సంవత్సరాలు, పుష్కరంలో 11 వేల సంవత్సరాలు, ప్రభాస తీర్థంలో వెయ్యి సంవత్సరాలు, బదరీ వనంలో చాలా వేలసంవత్సరాలు తపస్సుచేశావు.  సరస్వతీ తీరంలో 12 సంవత్సరాలు వ్రతం చేశావు. దితి కుమారులను, దనువు కుమారులను సంహరించి  ఇంద్రుడికి ఇంద్ర పదవిని సుస్థిరం చేశావు. నీవు అదితి కుమారుడవు. ఇంద్రుడికి తమ్ముడివి. మొదట వామనుడుగా తరువాత త్రివిక్రముడుగా లోకాలన్నింటిని ఆక్రమించావు. లోక కంటకులైన శిశుపాల,  కంసులను వధించావు. నీవు అవతార మూర్తివి.  అనృతము, మదము, మత్సరము, క్రోధము నీ దగ్గరకు రావు కదా! "అని కృష్ణుడికి నమస్కరించాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునునితో "అర్జునా?  నీవు నరుడవు. నేను నారాయణుడను. మనము ఇద్దరము  ఈ మనుజలోకంలో అవతరించాము. మనము ఒకరికి ఒకరం మిత్రులము" అని అన్నాడు.

అప్పుడు ద్రౌపది కృష్ణుని చూచి "దేవా! నీవు యజ్ఞ పురుషుడివి. సర్వవ్యాపివి. సజ్జనులకు నీవేదిక్కు.నీకు తెలియనిది లేదు. నా కు జరిగిన పరా భవము చెపుతాను. నేను చక్రవర్తి పాండు రాజు కోడలిని. పాండవుల భార్యను. మహా వీరుడైన ధృష్టద్యుమ్నుని సోదరిని. అట్టి నన్ను ఆ దుశ్శా స నుడు తల వెంట్రుకలు పట్టి ఈడ్చాడు. నా వలువలు విప్పాడు. దారుణంగా నిండు సభలో అవమానించాడు. అప్పుడు ఈ భీమార్జు నులు నా మొర ఆలకించ లేదు. ఇంక వీరి పరాక్రమాలెందుకు? అందరూ ఉంది ఎవరూ లేని దాని నయ్యాను. అప్పుడు ఆ కర్ణుడు నన్ను చూచి నవ్వాడు. వాడి నవ్వే నా మనసులో కాలుతూ ఉంది. ఆ కౌరవులు భీమునికి విషం పెట్టారు, పాముల తో కరిపించారు. లక్క ఇంట్లో పెట్టి కాల్చడానికి ప్రయత్నం చేసారు. ఇప్పుడు జూదమాడి మా రాజ్యం లాక్కున్నారు. పాండవులు తమ శౌర్యాలు పోయి పడి ఉన్నారు. కాని నేను నాకుజరిగిన అవమానాన్ని మరువలేకున్నాను." అంది ద్రౌపది.

అప్పుడు కృష్ణుడు ఆమెను చూచి "అమ్మా ఈ అర్జునుని శరా ఘాతాలకు కౌరవులు చచ్చుట తథ్యము. ఊరడిల్లుము"అని అన్నాడు. "ద్రౌపదీ! శ్రీకృష్ణుడు చెప్పినట్టు భీముడు దుర్యోధన దుశ్శాశ నులను, నేను కర్ణుని చంపుతాము. విచారించకుము" అని అర్జునుడు అన్నాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజును చూచి "ధర్మజా! జరిగిన వృత్తాంతమును యుయుధానుడు చెప్పగా విని దుఃఖించాను. వెంటనే వచ్చాను. అసలు నేను ఆ సమయంలో మీ దగ్గర లేను. అందుకే ఇంత అనర్థము సంభవించింది. నేను అక్కడ ఉంటే భీష్మాదులను ఒప్పించి జూదం ఆపుచేయించి ఉండే వాడిని. మీకు ఇంతటి కీడు జరిగి ఉండేది కాదు. నేను ఆసమయంలో సాల్వుడితో యుద్ధం చేస్తున్నాను అందువలన మీకు దగ్గరగా లేను." అని అన్నాడు.అప్పుడు ధర్మరాజు "కృష్ణా! ఆ వృత్తాంతము వివరించుము" అని అడిగాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు ఇలా చెప్పసాగాడు. "మీకు తెలుసు కదా రాజసూయ యాగ సమయాన శిశుపాలుడు నా చేతిలో చచ్చాడు గదా. శిశుపాలుని తమ్ముడే సాల్వుడు. అన్నను చంపిన దానికి పగ తీర్చుకోడానికి ద్వారక మీదికి యుద్ధానికి వచ్చాడు. అప్పుడు నేను మీ వద్ద ఉన్నాను. ద్వారకాపురిని ముట్టడించాడు. ద్వారకాపురి వెలుపల ఉన్న వనాలను అన్నింటిని నాశనం చేసాడు. ఆ సమయంలో ద్వారకలో ఉన్న సాంబుడు, ప్రద్యుమ్నుడు సాల్వుడితో ఘోరంగా యుద్ధం చేసారు. ప్రద్యుమ్నుడు సాల్వుని మీద బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. సాల్వుడు మూర్ఛపోయాడు. ప్రద్యుమ్నుడు సాళ్వుని చంపబోగా నారదుడు అడ్డుపడ్డాడు. "కుమారా ఇతనిని నువ్వు చంపరాదు. ఇతనిని

నారాయణుడే చంపగలడు" అని చెప్పాడు. అప్పుడు ప్రద్యుమ్నుడు ఊరకున్నాడు. సాల్వుడు యుద్ధంనుండి వెనుకకు తిరిగి వెళ్లిపోయాడు.

నేను ద్వారక చేరుకొని సాల్వుడు ధ్వంసం చేసిన వనాలు అన్ని చూచాను. నాకు కోపం వచ్చింది. బలరాముడిని పుర రక్షణకు ఉంచి నేను సాళ్వుని మీదికి యుద్ధానికి వెళ్లాను. సాళ్వునికి నాకుఘోర యుద్ధం జరిగింది. సాళ్వుడు నాతో గెలవలేక, మాయా యుద్ధం మొదలుపెట్టాడు. నేను వాడి మాయలు వమ్ము చేశాను. ఇంతలో ద్వారకనుండి వార్త వచ్చింది. వసుదేవుడు సాళ్వుని చేతికి చిక్కాడని నేనువెళ్లి రక్షించాలని వార్త. "ద్వారకలో బలరాముడు ఉండగా వసు దేవుడు సాల్వుని చేతికి ఎలా చిక్కాడు?" అని అనుకున్నాను. ఇంతలో సౌంభకమును సాళ్వుని రథంనుండి వసుదేవుడు దిగుతుండగా చూచాను. నా ధనుస్సు కిందపడిపోయింది. నాకు తెలివి తప్పింది. కొంతసేపటికి నాకు తెలివి వచ్చింది. అప్పుడు సౌంభకంలో వసుదేవుడు లేడు అది రాక్షసమాయ అని తెలిసింది. మరల నాకు, సాళ్వునికి ఘోర యుద్ధం జరిగింది. నేను సాళ్వుని మీద నా చక్రాయుధాన్ని ప్రయో గించాను. సాళ్వుని సంహరించాను" అని చెప్పాడు శ్రీకృష్ణుడు.

తరువాత శ్రీకృష్ణుడు తన చెల్లెలు సుభద్రను, అభిమన్యుని తీసుకొని ద్వారకకు వెళ్లాడు. ధృష్టద్యుమ్నుడు ద్రౌపది కుమారులను వెంటబెట్టుకొని ద్రుపద పురానికి వెళ్లాడు. తరువాత పాండవులు తమ ముఖ్య సేవకులైన ఇంద్రసేనుడు మున్నగు వారితో, తమ వెంట ఉన్న బ్రాహ్మణులతోనూ, ద్వైత వనానికి వెళ్లారు.

అప్పుడు ధర్మరాజు తమ్ములను చూచి ఈ అడవిలో క్రూరమృ గాలు ఉన్నాయి. రాక్షసులు ఉన్నారు. మనం చాలా జాగ్రత్తగా ఉండాలి" అని అన్నాడు. వారు అక్క డ కుటీరాలు నిర్మించుకొని సంతోషంగా కాలం గడుపుతున్నారు.

ఒకరోజు మార్కండేయ మహర్షి వారి కుటీరానికి వచ్చాడు. ధర్మరాజు ఆ మహర్షిని తగురీతిని సత్కరించాడు. "ధర్మజా! నాడు తండ్రి ఆజ్ఞమేరకు అడవులకు వెళ్లిన రాముడిని, సీతను, లక్ష్మణుడిని చూచాను. నేడు ఈ ధర్మరాజును చూస్తున్నాను. పూర్వపు రాజు లైన సగరుడు, భరతుడు, నలుడు, యయాతి, పైన్యుడు, నాభాగుడు మొదలగువారు సత్యధర్మాన్నిపాటించి ఉత్తమ లోకాలుపొందారు. మీకు శుభం కలుగుతుంది." అని ఆశీర్వదించి వెళ్లాడు.

ఒకరోజు ద్రౌపది ధర్మరాజును చూచి ఇలా అన్నది. "తన కొడుకైన దుర్యోధ నుని మాట విని మిమ్మల్ని రాజ్యం నుండి వెడలగొట్టాడు ఆ ముసలి ధృతరాష్ట్రుడు. కాని అతనికి మీమీద కోపం పోయిందా? పోదు. ఎందుకంటే అతని హృదయం పాషాణం. తన కొడుకు మిమ్మల్ని నిష్టు రంగా అంటు న్నప్పుడు అతడు వారించలేదు. రాజభోగాలు అనుభవిం చవలసిన మీరు అడవులలో అష్టకష్టాలు పడుతున్నారు. ఇది నేను భరిం చ లేను. ఆ ధృత రాష్ట్రుని వలననే ఆ బ్రహ్మ దేవుడు కూడామీకు శత్రువైనాడా ఏమి?

నీ ఆజ్ఞాను బద్ధులై నీ తమ్ములు తమ పరాక్రమము విడిచి ఉన్నారు. నాడు సమస్త రాజులు మీపాదములకు నమస్కరించినపుడు, వారి కిరీట కాంతులతో ఎర్రబడ్డ మీ పాదాలు నేడు రాళ్లమీద నడిచి ఎర్రబడ్డాయి. ఎంతో మంది బ్రాహ్మణులకు భోజనము పెట్టిన మీరు నేడు కందమూలములు తింటున్నారు. ఇట్టి దుర్దశలో శత్రువుల మీద కోపం విడిచిపెట్టడం మంచిది కాదు కదా! అత్యంత బలసంపన్నుడైన భీముడు, కందమూలములు తిని చిక్కిపోయాడు. ధనుర్విద్యాపారంగతుడు అర్జు నుడు అడవి జంతువుల మధ్య తిరుగుతున్నాడు. వారిని చూచి కూడా ఇంకా ఓర్పువహిస్తున్నారా!

క్షమను, తేజస్సును సమయానుకూలంగా ప్రయోగింపని రాజు ప్రజల అనురాగాన్ని పొందజాలడు అనే కథ మనకు ఇతిహాసములలో వినపడు తున్నది. పూర్వము బలి చక్రవర్తి  క్షమ గొప్పదా? తేజస్సు గొప్పదా? అనే విషయాన్ని గురించిచెప్పమని తన తాతగారైన ప్రహ్లాదుని అడిగాడు.

దానికి ప్రహ్లాదుడు    "అన్ని  కాలాలలోనూ క్షమాగుణం పనికి రాదు. అని చెప్పి ఎప్పుడూ తనప్రతాపం చూపకూడదు. రెండూ సమపాళ్లలో ఉండాలి.  ఎప్పుడూ క్షమి స్తుంటే సేవకులు యజమానిని గౌరవించరు. ఎక్కువ కర్కశంగా ఉంటూ ఉంటే ప్రజా కంటకుడౌతాడు. సమయానుకూలంగా  క్షమా గుణాన్ని, ప్రతాపాన్ని ప్రదర్శించాలి." అని ప్రహ్లాదుడు  బలి  చక్రవర్తికి  చెప్పినట్టు  మనకు  ఇతిహాసాలలో కనబడుతున్నది.  ఒక తప్పు చేస్తే క్షమించవచ్చును. కాని అదేపనిగా తప్పులు చేస్తున్న  కౌరవులను క్షమించడం భావ్యమా? కాబట్టి ఇది మీరు పరాక్రమం, తేజస్సు చూపించవలసిన సమయం." అని చెప్పింది ద్రౌపది.

దానికి ధర్మరాజు  "ద్రౌపదీ! కోపం మహా పాపం. కోపం గలవాడు కర్తవ్యాన్ని విస్మరిస్తాడు. చంపకూడని వాడిని కూడా చంపుతాడు. కోపం వదిలినవాడు తేజోవంతుడు అవుతాడు.  క్షమ గలవాడికి ఎల్లప్పుడూ

విజయం సిద్ధిస్తుంది. దుర్యోధనుడికి క్షమా గుణం లేదు. అతను పతనం కాక తప్పదు." అన్నాడు ధర్మరాజు.

దానికి ద్రౌపది తిరిగి "ఓ అజాతశత్రూ! నీవు క్షమాగుణం తో ధర్మంగా వర్తిల్లుతున్నావు. కాని అదే క్షమా గుణంతో నీ శత్రువుల పట్ల కూడాసమ బుద్ధి తగునా! వంచకుల పట్ల వంచనతోనే ప్రవర్తించాలి. ఓ బ్రహ్మదేవుడా! నీవు వంచకులకు అభ్యుదయాన్ని, ధర్మాత్ములకు అన్ని లేకుండా చేసి నీ కర్తవ్యాన్ని విస్మరిస్తున్నావా? వంచకులు నీకు బంధువులా? ధర్మాత్ములు నీకు శత్రువులా?" అని నిర్వేదంతో పలికింది.

దానికి ధర్మరాజు "ద్రౌపదీ! నీవు నాస్తికురాలివలె దైవదూషణ చేస్తున్నావు. తప్పు. ధర్మాత్ములైన వ్యాస, మార్కండేయ,నారదాది మహామునులు ధర్మాత్ముడనైన నన్ను గౌరవిస్తున్నారు. ఇతరులు నా పట్ల అన్యాయంగా ప్రవర్తించినా నేను ఎందుకు ధర్మం తప్పాలి? పుణ్యకార్యాలకు ఫలితం లేక పోతే మహాఋషులు వాటిని ఎందుకు ఆచరిస్తారు. నీపుట్టుక, దృష్టద్యుమ్నుని పుట్టుక మీ పురాకృత పుణ్య ఫలం వలననే కదా!" అని అన్నాడు.
దానికి ద్రౌపది "కర్మఫలము లేదు. కర్మఫలప్రాప్తికి విధి కారణం కాదు అని అనేంత తెలివి తక్కువ దానిని కాదు నేను. కాని, కర్మ చెయ్యడం

మానవ ధర్మం కదా! కర్మ ఫల ప్రాప్తికి మానుష కర్మ, తదుపరి దైవము కారణములు. పురుషుడు ముందు తన మనసులో చేయవలసిన కర్మను నిర్ణయించుకోవాలి కదా! తదుపరి పురుష ప్రయత్నం చెయ్యాలి. అప్పుడు దైవం కూడా సాయం చేస్తాడు. నువ్వు గింజలలో నూనె ఉంది. కర్రలలో నిప్పు ఉంది. కాని పురుష ప్రయత్నము లేనిది నువ్వు గింజలనుండి నూనెరాదు. కర్రల నుండి నిప్పుపుట్టదు. కాబట్టి పురుషప్రయత్నం చెయ్యకుండా కేవలం దైవాన్ని,ధర్మాన్ని నమ్ముకుంటే ఫలితం ఉంటుందంటారా? కాబట్టి మీ తమ్ముళ్ల పరాక్రమమును ఉపయోగించి, లక్ష్యమును నిర్ణయించి, ఫలసిద్ధి పొందమని నా అభ్యర్ధన." అన్నది ద్రౌపది.

దానికి భీమసేనుడు కూడా వంతపాడాడు "అన్నయ్యా! ఆరాజ్యం మన తండ్రి తాతలది. దానిని నువ్వు అన్యుల పాలు చేసి ధర్మ వాక్యాలు పలుకుతున్నావు. ఇది నీకు న్యాయమా? చెడ్డవారిని ధర్మబుద్ధితో జయించగలమా? అది సాధ్యమా? కాబట్టి పరాక్రమంతో శత్రువులను జయించు. అంతేకాని ధర్మం ధర్మం అంటూ పలవరించడం తగదు. పరాక్రమంతో శత్రువులను జయించడానికి బలం లేని వాడు కృంగి పోవాలి గాని నీవు కాదు. ఆనాడే నీ అనుమతితో శత్రువులను చంపి ఉంటే మనకు ఈనాడు ఆ వనవాసము ప్రాప్తించేది కాదు కదా! మీరు

చేసుకొన్న ఒప్పందాన్ని మీరు అతిక్రమించడం లేదు. కాని కౌరవులుదానిని మన పిరికితనంగా భావిస్తున్నారు. నువ్వు అనుసరిస్తున్న ధర్మం నీకు, మాకు, మన బంధువులకు, బాధ కలిగిస్తూ ఉంది. యుద్ధం చేసి శత్రువులను జయించడం, ప్రజలకు భయం కలిగించకుండా పరిపాలించడం, దానధర్మాలు చెయ్యడం, బ్రాహ్మణులను పూజించడం క్షత్రియధర్మాలు. కాని నీమాదిరి కేవలం ధర్మాచరణం తోనే శత్రువులను జయించలేము. మోసాన్ని మోసంతోనే జయించాలి. కాబట్టి మన శత్రువులతో చేసుకొన్న ఒప్పందాన్ని పక్కన బెట్టి, వాళ్లను జయిద్దాం. నీకు అందరు రాజులు సాయం చేస్తారు. కౌరవ రాజ్యంలో ప్రజలందరూ నీ పాలన కావాలని కోరుకుంటున్నారు. ఇంక ఆలస్యం చేయవద్దు. శత్రువులమీదికి దండుత్తుదాము. శత్రువులను జయిద్దాము. ఈరాజ్యాన్ని ఏలుకో? ప్రజలను ధర్మబుద్ధితో పాలించు." అని అన్నాడు భీముడు.

అంతా విన్న ధర్మరాజు భీమునితో ఇలా అన్నాడు. "నీవు చెప్పిన విషయము లన్నియు ధర్మ సమ్మతమే. కాని నేను పెద్దలు అందరూ ఉన్న సభలో 12 ఏళ్ల అరణ్యవాసము, ఒక ఏడు అజ్ఞాతవాసము చేస్తామని మాట ఇచ్చాను. చంచలమైన సుఖాలకు లోబడి నేను సత్యాన్ని ధర్మాన్ని విడవను. మనకు మేలు జరిగే వరకు వేచి ఉందాము" అని అన్నాడు.

"అన్నయ్యా! మృత్యువు ఎప్పుడూ మన వెంట పొంచి ఉంటుంది. ఈ జీవితాలు అశాశ్వతాలు. అలాంటి ఈ జీవితం సుస్థిరము అనుకొని వేచి ఉండటం తగునా? ఈ శరీరానికి మరణం తప్పదు కదా. మరణించే ముందు పగ తీర్చుకోవాలి కదా! లేని ఎడల వాని జన్మ నిరర్ధకము కదా!

మన శత్రువులకు ప్రతీకారము చెయ్యాలని నా హృదయము తపించుచున్నది. నా తమ్ముల యొక్క , ద్రౌపది యొక్క దుఃఖము తీర్చకుండా, ధర్మము, దయ అనుకుంటూ కాలం గడప వచ్చునా! అన్నయ్యా! నీ అనుసరించు ధర్మము బ్రాహ్మణులకు ఉచితము కాని క్షత్రియులకు కాదు. క్షాత్ర ధర్మము ప్రకారము శత్రువులను జయిద్దాము. అదియును కాక, మనము ఈఅడవిలో 12 ఏళ్లు గడప వచ్చును. కాని జనపదాలలో ఒక ఏడు కాదు కదా ఒక దినము కూడా గడపలేము. ఎందుకంటే మనల గురించి అందరికి తెలియును. మనలను ఎరుగని వారు లేరు. కాబట్టి మనము బయట పడుట తథ్యము. మరల వనవాసము. ఇది ఎన్నటికి పూర్తి అవుతుంది.

ప్రస్తుతం అమలులో ఉన్న గణిత సూత్రముల ప్రకారము ఒక సంవత్సరమును ఒక మాసము గా పరిగణించే ఆచారము ఉన్నది. కాబట్టి మన వనవాసము ఇప్పటికి 13 నెలలు ఐనది. దీనిని 13 ఏళ్లుగా

సరిపెట్టవచ్చును. ఇందులో ధర్మ విరోధము లేదు కదా!" అని అన్నాడు భీముడు.

భీమసేనా! నీకు పాండిత్యము ఉన్నది. పరాక్రమము, దర్పము ఉన్నవి. కాబట్టి నేను చెప్పేది శాంతంగా ఆలోచించు. ఏదో చిన్న పని అయతే దూకుడుగా మొదలు పెట్టినా తప్పులేదు. కాని కౌర వులతో యుద్ధము బృహత్కార్యము. దానిని ఎంతో ఆలోచించి చెయ్యాలి. అప్పుడే మనకు దైవము కూడా అనుకూలిస్తాడు.
ధృతరాష్ట్రుని కుమారులు మహా వీరులు. పైగా దుర్మార్గులు. వారికి కర్ణుడు, భూరిశ్రవుడు, శల్యుడు, మొదలైన మహా వీరుల అండ ఉన్నది. పైగా రాజసూయ యాగ సమయమున మన చేతిలో ఓడిపోయిన రాజులందరూ ఇప్పుడు దుర్యోధనుని పక్షాన చేరారు. కర్ణుడు సహజ కవచకుండలములు కలవాడు. మహా వీరుడు. అదియును కాక భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు మన పట్ల వైరభావము లేకున్నా వారు దుర్యోధనుని పక్షాన యుద్ధంలో పాల్గొంటారు. ముందు వారిని జయించి గాని దుర్యోధనుని జయించలేము. కాబట్టి ప్రస్తుతము యుద్ధమునకు సరైన సమయము కాదు" అని చెబుతుండగా వ్యాసుడు అక్కడకు వచ్చాడు.

ధర్మరాజు వ్యాసుని సాదరంగా ఆహ్వానించాడు. అర్చించాడు. "ధర్మజా! నీ మనసులో ఉన్న చింతను గుర్తించి ఇక్కడకు వచ్చాను. నేను నీకు ప్రతిస్మృతి అనే విద్యను ఉపదేశిస్తాను. దానిని నువ్వు అర్జునునకు ఉపదేశించు. దీని ప్రభావంతో అర్జునుడు అధికంగా తపస్సుచేసి దేవతలను మెప్పిస్తాడు. దివ్యాస్త్రాలను సంపాదిస్తాడు. మీరు ఈ అడవిని విడిచి వేరే వనానికి వెళ్లండి"అని చెప్పాడు. వ్యాసమహాముని ఆజ్ఞప్రకారము పాండవులు కామ్యక వనానికి వెళ్లారు.

ఒకనాడు ధర్మరాజు అర్జునుని తో ఇలా అన్నాడు.

"భీష్ముడు, ద్రోణుడు దివ్యాస్త్ర సంపన్నులు. వారిని యుద్ధంలో గెలవాలంటే మనకూ దివ్యాస్త్రసంపద కావాలి. దానికి మార్గం వ్యాసుడు ఉపదేశించాడు. నీవు ఇంద్రుని గురించి తపస్సుచేసి దివ్యాస్త్రాలుసంపాదించు. ఎందుకంటే,
వృత్రాసురునికి భయపడి దేవతలందరూ తమతమ అస్త్రశస్త్రాలను ఇంద్రుడికి ఇచ్చారు. అవి నీకు లభిస్తాయి. తరువాత పరమశివుని ఆరాధించి పాశుపతము అనే అస్త్రాన్ని సంపాదించు. ఇది వ్యాసుని ఆదేశము" అని చెప్పాడు ధర్మరాజు. వ్యాసుడు తనకు ఉపదేశించిన ప్రతిస్మృతి విద్యను అర్జునునికి ఉపదేశించాడు.

అన్నగారి అనుమతి తీసుకొని తపస్సుకు బయలుదేరాడు అర్జునుడు. గంధ మాధన పర్వతము చేరుకున్నాడు. అక్కడ ఒక ముసలి బ్రాహ్మణుడు కనిపించాడు. ఆ బ్రాహ్మణుడు అర్జునుని చూచి "వీరుడా నీవు ఎవరు? ఇక్కడకు ఎందుకు వచ్చావు? ఇక్కడ శాంత స్వభావులైన బ్రాహ్మణులు ఉండే ప్రదేశము. ఆయుధములు ధరించి నువ్వు ఎందుకు వచ్చావు? నీ ఆయుధములు విడిచిపెట్టు!" అని అన్నాడు.

ఆ మాటలకు అర్జునుడు చలించలేదు. ఆతని ధైర్యానికి మెచ్చి బ్రాహ్మణరూపంలో ఉన్న ఇంద్రుడు ప్రత్యక్షం అయ్యాడు. "అర్జునా! నీ ధైర్యానికి సంతోషించాను. నీకేమి కావాలో కోరుకో!" అని అన్నాడు. " నాకు దివ్యాస్త్రాలు కావాలి" అన్నాడు అర్జునుడు. "అవి ఎటూ లభిస్తాయి. అమరత్వం కావాలా?" అని అడిగాడు ఇంద్రుడు.

"నాకుముందు దివ్యాస్త్రసంపద కావాలి. అవి ప్రసాదించండి" అని అన్నాడు అర్జునుడు."అలా అయితే ముందు నీవు పరమేశ్వరుని గూర్చి తపస్సు చెయ్యి" అని అన్నాడు ఇంద్రుడు.

వెంటనే అర్జునుడు హిమాలయా లకు వెళ్లాడు. అక్కడ శివుని గూర్చి ఘోర తపస్సు మొదలు పెట్టాడు. పరమశివుడు అర్జునుని

పరీక్షించదలచాడు. ఒక కిరాతుడి వేషంలో అర్జునుడు తపస్సు చేసే ప్రదేశానికి వచ్చాడు. అక్కడ మూకాసురుడు అనే రాక్షసుడు పంది రూపం ధరించి అర్జునుని చంపడానికి వచ్చాడు. ఆ పంది తన దగ్గరకు వస్తే చంపడానికి అర్జునుడు విల్లుసంధించి సిద్ధంగా ఉన్నాడు. ఆ పంది రాగానే బాణం తో కొట్టాడు. అదే సమయానికి కిరాతుని వేషంలో ఉన్న శివుడు కూడా పందిని కొట్టాడు. ఆ రెండు బాణాలు ఒకే సారి పందికి తగిలాయి. ఆ పంది పడిపోయింది. మాయమయింది.

శివుడు కిరాతుని వేషంలో అర్జునుని ముందు నిలబడ్డాడు. "నేను కొట్టిన జంతువును నువ్వు ఎందుకు కొట్టావు? వేటలో పాటించే ధర్మం తెలియదా నీకు?" అని అడిగాడు అర్జునుడు.

దానికి శివుడు " ముందు నేను కొట్టాను. అది పడిపోయింది. చనిపోయింది. కాని నువ్వే కొట్టినట్టు చెప్పుకోడానికి సిగ్గులేదూ! ఒట్టి మాటలు ఎందుకు చేవ ఉంటే నాతో యుద్ధం చెయ్యి" అన్నాడు శివుడు.

అర్జునుడు శివుని మీద బాణ వర్షం కురిపించాడు. కాని శివుడు చలించలేదు. అర్జునునికి ఆశ్చర్యం వేసింది. " ఇతను సామాన్యుడు కాదు. దేవేంద్రుడైనా కావాలి లేక పరమశివుడైనా కావాలి. లేకపోతే నా

బాణాల ధాటికి చలించకుండా ఉంటాడా. కాని ఈ ఎరుక నా పై ప్రయోగించిన బాణాలు నన్ను బాధిస్తున్నాయి. ఇవి దివ్యాస్త్రాల మాదిరి ఉన్నాయి." అని అనుకున్నాడు అర్జునుడు మనసులో.

మరల బాణాలు వెయ్యడానికి గాండీవం తీసుకున్నాడు. అతని చేతిలోనుండి గాండీవం అదృశ్యం అయిపోయింది. ఇంక ఇద్దరూ ద్వంద్వయుద్ధానికి దిగారు. శివుని దెబ్బలకు తాళలేక అర్జునుడు మూర్ఛపోయాడు. అప్పుడు పరమ శివుడు తన నిజరూపంతో అర్జునుని ముందు సాక్షాత్కరించాడు.

అర్జునుడు శివుని చూచి భక్తితో చేతులు జోడించి ప్రార్థించాడు. "పరమశివా! నిన్ను సామాన్యుడిగా తలపోసి నీతో యుద్ధం చేసాను. నా తప్పు మన్నించు!" అన్నాడు. దానికి శివుడు "అర్జునా! నిన్ను క్షమించాను. నీవు సామాన్యుడివి కావు. పూర్వజన్మలో నరుడు అనే దేవఋషివి. ఇదిగో నీ గాండీవం. ఇంకా ఏదైనా వరం కోరుకో!" అన్నాడు శివుడు.

"ఓ త్ర్యంబకా! నాకు పాశుపతము అనే అస్త్రాన్ని ప్రసాదించు. ఈ లోకంలో బ్రహ్మశిరము, పాశుపతము మహా అస్త్రాలు. శత్రు సంహారానికి అవి అత్యవసరం. కాబట్టి వాటిని నాకు ప్రసాదించు" అన్నాడు.

(వీటిని మనము ఆటం బాంబు, హైడ్రోజన్ బాంబు లాంటివి  అనుకో వచ్చు. ఎందుకంటే బ్రహ్మశిరము అనే అస్త్రము గురించి వ్యాసుడు సౌప్తిక పర్వంలో వివరిస్తాడు. అది ప్రయోగించిన తరువాత 12 ఏళ్లు అక్కడ గడ్డికూడా మొలవదు అంటాడు. ప్రస్తుత అణుబాంబుల పరిస్తితి అంతేకదా! )

ఈశ్వరుడు సంతసించి అర్జునునికి పాశుపతాన్ని  మంత్ర, ధ్యాన, జప, హోమ పూర్వకంగా, పాశుపతాస్త్రము, సంధానము, మోక్షణము, సంహారము, సహితంగా అర్జునునికి ఉపదేశించాడు. "అర్జునా!  ఈ పాశుపతాన్ని అల్పులపై ప్రయోగిస్తే జగత్తును నాశనం చేస్తుంది. ఈ దివ్యాస్త్ర ప్రభావం వల్ల నువ్వు అఖిల లోకములు జయిస్తావు" అని చెప్పి శివుడు అంతర్హితుడయ్యాడు.
(సంధానము అంటే రెడీ ఫార్ లాంచింగ్, మోక్షణము అంటే లాంచింగ్, సంహారము అంటే దానిని తిరిగి భూమి మీదికి తీసుకు రావడం. ఇవి ఈనాడు మిసిలీస్ లాంచింగ్‌లో అనుస రిస్తున్న విధానాలు అని మనకు తెలుసు).

పరమశివుని చూడగలిగినందుకు అర్జునుడు చాలాసంతోషించాడు. పరమ శివుని శరీర స్పర్శతో అర్జునుని శరీరం కాంతితో మెరిసిపోతోంది. ఈ విషయం తెలుసుకొని ఇంద్రుడు, కుబేరుడు, యముడు, వరుణుడు, అశ్వినీ దేవతలతో కూడా కలిసి అర్జునుని వద్దకు వచ్చాడు. "అర్జునా! నీ పరాక్రమానికి మెచ్చి నీకు వరాలు ఇవ్వడానికి వచ్చాము" అన్నాడు. యముడు తన దండాన్ని అర్జునునికి ఇచ్చాడు. వరుణుడు అర్జునునికి వరుణ పాశాలను అనుగ్ర హిం చాడు. కుబేరుడు అర్జునునికి కౌబేరాస్త్రాన్ని దానం చేసాడు. అర్జునుడు వారిని చూచి. వారు ఇచ్చిన అస్త్రాలను చూచి పరమానందాన్ని పొందాడు.దేవేంద్రుడు అర్జునుని ఇంద్రలోకానికి ఆహ్వానించాడు. ఇంద్రుడు పంపిన రథం మీద ఎక్కి అర్జునుడు ఇంద్రలోకం వెళ్లాడు.

ఇంద్రలోకంలో సూర్య చంద్రులు లేకున్నా స్వయంప్రకాశంతో వెలిగి పోతున్న అమరావతి నగరాన్ని చూచాడు అర్జునుడు. పురద్వారం వద్ద ఐరావతము అనే తెల్లని ఏనుగు అర్జునునికి స్వాగతం పలికింది. అర్జునుడు దేవేంద్రుని వద్దకు వెళ్లి నమస్కారం చేసాడు. అర్జునునికి ఆనందం కలిగిం చడం కోసం దేవేంద్రుడు ఊర్వశిని నియమించాడు. ఆమె తన తళుకు బెళుకులతో అర్జునుని ముందు నాట్యం చేసింది.

అర్జునుడు ఆమెను చూచి "అమ్మా! నా మీద పుత్రప్రేమతో నన్ను ఆశీర్వదించడానికి వచ్చావా అమ్మా!" అంటూ మాతృభావంతో నమస్క రిం చాడు.

"అయ్యో అదేమిటి అర్జునా! నేను నీ పొందు కోరి వచ్చాను. అలా పల కడం న్యాయమా? ఇంతకూ నేను నీకు ఏవిధంగా తల్లిని అయ్యాను. కాని ఇది దేవలోకం. మేము దేవ వేశ్యలం. మాకు వావి వరుసలు లేవు" అంది ఊర్వశి.

" అమ్మా ఇది నీకు ధర్మం కాదు. విచ్చలవిడి శృంగారం పాపం దోషం కాదా! మా వంశ కర్త పురూరవుని భార్యవు నీవు. నా తండ్రి ఐన ఇంద్రునికి పరిచర్యలు చేస్తుంటావు. కాబట్టి నాకు మాతృ సమాను రా లవు" అన్నాడు అర్జునుడు.

ఆ మాటలకు ఊర్వశికి కోపం వచ్చింది. "నేను నిన్ను కామించి వచ్చాను. నా కోరిక నువ్వు తీర్చలేదు. నువ్వు భూలోకంలో నపుంసకు డివిగా, ఆడవాళ్ల మధ్యలో సంచరించుదువు గాక!"అని శాపం ఇచ్చి వెళ్లిపోయింది.

ఇది తెలిసి ఇంద్రుడు  అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! నీవంటి ధైర్యవంతుని నేను ఏ కాలమందు చూడలేదు. నీవు ధర్మ బుద్ధివి. జితేంద్రియుడవు. బాధ పడకు. ఊర్వశి శాపం అనుభవించక తప్పదు. కాని అది నీకు అజ్ఞాత వాస సమయంలో చక్కగా ఉపకరిస్తుంది. ఎవ్వరికీ తెలియకుండా పేడి రూపంలో ఉండవచ్చు. అజ్ఞాత వాసం పూర్తి కాగానే నీ శాపం తొలగిపోతుంది" అని అన్నాడు.

తరువాత ఇంద్రుడు అర్జునునికి ఎన్నో దివ్యాస్త్రాలను  ఇచ్చాడు. అర్జును డు ఇంద్రలోకంలో ఉన్న సమయంలో భూలోకంలో ఐదు సంవత్సరాలు గడిచాయి.

ఒకనాడు రోమశుడు అనే మహా ముని దేవేంద్రుని వద్దకు వచ్చి ఇంద్రుని అర్ధ సింహాసనము మీద కూర్చున్న అర్జునుని చూచాడు. "ఎవరితడు?" అని ఇంద్రుని అడిగాడు.

దానికి దేవేంద్రుడు "మహర్షీ! ఇతను పూర్వము నరుడు అనే మహర్షి. నా అంశతో భూలోకంలో కుంతీ గర్భాన జన్మించాడు. పరమే శ్వరుడు ఇతనిని అను గ్రహించి పాశుపతాన్ని అనుగ్రహించాడు. నేను కూడా నా వద్ద ఉన్న దివ్యా స్త్రాలను ఇచ్చాను. ఇతడు నివాత కవచులు

అను రాక్షసులను సంహరించ గలడు.  కాని తమరు భూలోకమునకు పోయి అర్జునుడు నా వద్ద ఉన్నాడు అని ధర్మజునకు చెప్పండి. ధర్మజుని తీర్ధ యాత్రలు చెయ్యమని నా మాటగా చెప్పండి. దాని వలన ధర్మజుడు పాప రహితుడు కాగలడు" అని రోమశునితో చెప్పాడు.

భూలోకంలో ధృతరాష్ట్రునకు అర్జునుడు శివుని వలన పాశుపతము, ఇంద్రుని వలన దివ్యాస్త్రములు పొందిన విషయం వ్యాసుని వలన తెలిసింది. కలత చెందాడు.

సంజయుని పిలిచి "సంజయా! అర్జునుడు శ్రీకృష్ణుని సహాయంతో ఖాండవ వనాన్ని దహించాడు. నాలుగు దిక్కులు జయించి ధర్మజునితో రాజసూయం చేయించాడు. పరమశివుని మెప్పించి పాశుపతాన్ని పొందాడు. అలాంటి అర్జునుడు ఉండగా పాండవులను జయించడం ఎలాగా? పైగా వారు ధర్మవర్తనులు. వారికి  ఎప్పుడూ విజయం వరిస్తుంది గదా!". అని  అన్నాడు.

" మీరు,  మీ కుమారుడు నిండు సభలో ద్రౌపదిని పాండవులను అవమానించు సమయమున, సుయోధనుని వారించకుండా ఇప్పుడు చింతించి ప్రయోజనమేమి? పాండవులు ఇప్పుడు కామ్యక వనంలో

ఉన్నారు. శ్రీకృష్ణుడు అనేక మంది రాజులను వెంటతీసుకొని కామ్యక వనానికి వెళ్లి పాండవులను పరామర్శించాడు. సుయోధనుని జయించి ధర్మరాజును హస్తినకు రాజ్యాభి షిక్తుని చేస్తానని ప్రతిజ్ఞకూడా చేసాడట. కాని మిగిలిన రాజులు శ్రీకృష్ణుని వారించి అర్జునునికి సారథ్యం వహించ మని కోరారట. అరణ్య అజ్ఞాత వాసములు పూర్తి అయిన పిదప, శ్రీకృ ష్ణుని సాయంతో నీ కొడుకులతో యుద్ధం చేస్తారు. మరి యుద్ధంలో అర్జు నుని దివ్యాస్త్రాలు, భీముని గదాఘాతాల కు నీ కొడుకులు తట్టుకో గలరా" అని అన్నాడు సంజయుడు.

"నేనేం చేసేది సంజయా! నేను ముసలివాడినని నా కొడుకు నా మాట వినడు. వాడు ఒక దుర్బుద్ధి. వాడికి నా మాటలు, భీష్మ, ద్రోణుల మాటలు నచ్చవు. ఆ కర్ణుడు,శకుని మాటలు నచ్చుతాయి. నేనేమీ సేయుదును!" అని పరితపించాడు.

ఇక్కడ ధర్మజుడు అర్జునుడు ఇంకా రాలేదని ఎదురు చూస్తు న్నాడు. అప్పుడు భీముడు ధర్మజుని చూచి "అన్నయ్యా! నువ్వే కదా అర్జునుని తపస్సుకు పంపినది. మన బతుకులన్ని అర్జునుని మీద ఆధార పడి ఉన్నాయి. మీరు వెంటనే శ్రీకృష్ణుని పంపి అర్జునుని తీసుకొని రమ్మని చెప్పండి. నేను, అర్జునుడు, శ్రీకృష్ణుని సాయంతో దుర్యోధనాదులను

జయించి నిన్ను కౌరవ సామ్రాజ్యానికి పట్టాభిషిక్తుని చేస్తాము. నేను అర్జునుడు రణరంగంలో నిలబడితే మమ్ములను ఎదిరించేవాడు లేడు కదా!" అన్నాడు భీముడు.

దానికి ధర్మజుడు "భీమసేనా! ఆ విషయం నాకుతెలియును. కాని యుద్ధానికి ఇది తగిన సమయం కాదు. 13 సంవత్సరాలు పూర్తి అయిన పిదప నీవు, అర్జునుడు,  శత్రువులను జయించండి. విజయులు కండి. ఎందుకంటే నేను నిండు సభలో కౌరవులతో చేసిన ఒప్పందానికి విరుద్ధంగా ప్రవర్తించను" అని అన్నాడు ధర్మజుడు.

శ్రీమత్ ఆంధ్ర మహాభారతము--అరణ్యపర్వము--

ప్రథమాశ్వాసము సంపూర్ణము.

# శ్రీమత్ ఆంధ్ర మహా భారతము

## అరణ్య పర్వము

## ద్వితీయాశ్వాసము.

ఆ ప్రకారముగా ఆ కథకుడు అయిన సూతుడు, శౌనకాది మహా మునులకు మహా భారత కథను చెప్పసాగాడు.

ఒకరోజు బృహదశ్వుడు అనే మహా ముని అడవులో ఉన్న పాండవుల వద్దకు వచ్చాడు. ధర్మరాజు ఆ మహా మునికి అతిధి సత్కారాలు గావించి కౌరవుల వలన తాము పడుతున్న బాధలు అన్ని చెప్పుకున్నాడు.

“మహాత్మా! రాజ్యాన్ని, నివాసాన్ని పోగొట్టుకొని అరణ్యాలలో మా వలె బాధలు పడ్డ వారు ఇతర రాజులు ఎవరన్నా ఉన్నారా? ఉంటే దయచేసి తెలుపండి” అని అడిగాడు.

దానికి ఆ మహాముని ధర్మజా! నీవు కష్టములు పడుతూ అడవులలో ఉన్నా నీ వెంట నీ అన్నదమ్ములు, విప్రులు, నీ భార్య ఉన్నారు. నీకు రథాలు, పరివారము ఉన్నాయి. కాని పూర్వ కాలంలో నలుడు అనే మహారాజు నీ వలెనే జూదమాడి, పుష్కరునకు తన రాజ్యాన్ని అర్పించి, భార్య సమేతుడై ఒంటరిగా అరణ్యాలకు వెళ్లాడు." అని చెప్పాడు.

దానికి ధర్మజుడు "మహాత్మా! దయచేసి నాకు నలుని కథ వివరించండి" అని అడిగాడు. దానికి ఆ మహాఋషి ఇలా చెప్పసాగాడు.

"నిషధదేశాన్ని వీరసేనుడి కుమారుడైన నలుడు పరిపాలి స్తున్నాడు. అతను తన పరాక్రమం చేత ఎన్నో దేశాలు జయించాడు. ప్రజా రంజకంగా పరిపాలిస్తున్నాడు. కాని అతనికి జూదము అంటే ఎక్కువ ప్రీతి.

ఆ కాలంలోనే విదర్భ దేశాన్ని భీముడు అనే రాజు పరిపాలి స్తున్నాడు. అతనికి సంతానము లేదు. వారికి ధమనుడు అనే మహాముని వరము వలన దమయంతి అనే కూతురు, దముడు, దాంతుడు, దమనుడు అనే ముగ్గురు కొడుకులు పుట్టారు.

దమయంతి సౌందర్యవతి. అందగత్తె. గుణవతి. దమయంతి నలుని గుణ గణాల  గురించి విన్నది. అలాగే నలుడు కూడా దమయంతి సద్గుణముల గురించి, ఆమె సౌందర్యము గురించి విన్నాడు. ఇరువురిలో ప్రేమ అంకురిం చింది.

ఒకరోజు నలుడు ఉద్యాన వనములో విహరిస్తూ ఉండగా ఒక హంసల గుంపు వచ్చి అక్కడ వాలింది. నలుడు ఆ హంసలను చూచి ముచ్చట పడ్డాడు.  ఆగుంపులోనుండి ఒక హంసను పట్టుకున్నాడు. మిగిలిన హంసలు తమ తోటి హంసను విడిచి పోలేక ఆకాశంలో తిరుగుతున్నాయి.   నలుని చేతికి చిక్కిని హంస మానవ భాషలో ఇలా చెప్పింది.

"ఓ మహారాజా! నీవు నీ మనసులో దమయంతి అనే రాజ కుమారిని ప్రేమిస్తున్నావు.  నీవు నన్ను విడిచి పెడితే, నేను ఆమె వద్దకు వెళ్లి నీ గురించి నీ గుణగణాల గురించి, నీ అందచందాల గురించి చెబుతాను. నీమీద అనురాగము కలిగేటట్టు చేస్తాను" అని పలికింది.

ఆ హంస పలుకులు విని నలుడు ఆనందించాడు.  ఆ హంసను విడిచి పెట్టాడు. అన్న మాట ప్రకారం ఆ హంస విదర్భ దేశానికి

ఎగిరిపోయింది. దమయంతి అంతఃపురాని కి చేరి దమయంతి ముందు తిరగాడసాగింది. దమయంతి తన చెలులతో అక్కడ విహరిస్తూ ఉంది. హంసలను చూచి ముచ్చట పడింది. చెలి కత్తెలతో చేరి ఆ హంసలను పట్టుకొంది. విధి వశాత్తు నలుని చేత పంపబడిన హంసను దమయంతి పట్టుకొంది.

ఆ హంస దమయంతిని చూచి “నేను నీ హృదయేశ్వరుడయిన నలుని వద్దనుండి వచ్చాను. నలుడు అందగాడు. సద్గుణవంతుడు.నీకు తగినవాడు. నీకు ఉన్న అందము, సంపద, సద్గుణములు నీవు నలునికి భార్య అయితేనే గాని రాణించవు.” అని పలికింది.

దానికి దమయంతి ఎంతో సంతోషించింది. “ ఓ హంసా! నీవు నలుని గురించి నాకు ఎలా చెప్పావో అలాగే నా గురించి కూడా నలునికి చెప్పవా?” అని అడిగింది.

అలాగే అని ఆ హంస నిషధ దేశానికి వెళ్లి దమయంతి గురించి నలునికి చెప్పింది. నల దమయంతులు ఇద్దరూ ఒకరిమీద ఒకరు మదన తాపంతో బాధపడుతున్నారు. ఆ విషయం భీమరాజుకు చెలికత్తెల ద్వారా తెలిసింది. అప్పుడు దమయంతి తండ్రి అయిన భీమరాజు తన

కుమార్తెకు స్వయం వరాన్ని ప్రకటించాడు.  అందరు రాజులకూ ఆహ్వానాలు పంపాడు.

అందరు రాజులు దమయంతీ స్వయంవరానికి వచ్చారు. నలుడు కూడా అందరితో పాటు స్వయంవరానికి పోతున్నాడు.  ఈవిషయం స్వర్గలోకాధిపతి ఇంద్రునికి తెలిసింది. ఇంద్రుడు కూడా దిక్పాలకులతో కలిసి దమయంతీ స్వయంవరానికి బయలుదేరాడు.

మార్గంలో వారికి నలుడు కనిపించాడు. ఇంద్రుడు నలుని చూచి "నిషధ రాజా! నీవు మాకు దూతగా ఒక పని చెయ్యాలి" అని అడిగారు

"సరే. అలాగే చేస్తాను కాని మీరు ఎవరు? నేను మీకు ఏమి చెయ్యాలి" అని అడిగాడు  నలుడు.

అప్పుడు ఇంద్రుడు నలుని చూచి "నేను ఇంద్రుడను. వీరు దిక్పాలకులు. మేము దమయంతీ స్వయంవరానికి వెళుతున్నాము. నీవు ముందుగా పోయి దమయంతితో మా గురించి చెప్పివ ఆ కోమలి మమ్ములను వరించేటట్టు చెయ్యాలి" అని అన్నారు.

దానికి నలుడు "అయ్యా! ఇది మీకు ధర్మమా? నేను కూడా అదే స్వయంవరానికి వెళుతున్నాను కదా!" అని అన్నాడు.

దానికి ఇంద్రుడు "నీవు మాకు మాట ఇచ్చావు.మాట తప్ప కూడదు. ఇది దేవతా కార్యము. నీవు చేయగలవు. దమయంతీ అంతఃపురము ఎలా ప్రవేశించాలా అని నీవు శంకించవలదు. మా మహిమ చేత నిన్ను ఎవ్వరూ అడ్డు పెట్టరు" అని అన్నాడు.

చేసేదిలేక, నలుడు దమయంతీ అంతఃపురంలోకి ప్రవేశించాడు. దమయంతిని మొట్ట మొదటిసారిగా చూచాడు. తాను హంస వలన విన్న దానికంటే ఎక్కువ సౌందర్యవతి అని అనుకున్నాడు. నలుని చూచి దమ యంతి, ఆమె చెలులు ఆశ్చర్యపోయారు.

దమయంతి నలుని చూచి "మహాత్మా మీరు ఎవరు? ఎక్కడి నుండి వచ్చారు? ఈ అంతఃపురములోకి ఎవ్వరికి కనపడకుండా ఎలా ప్రవేశిం చారు?" అని అడిగింది.

దానికి నలుడు "దమయంతీ! నా పేరు నలుడు. నేను దేవదూతగా వచ్చాను. ఇంద్రుడు, దిక్పాలకులు నన్ను తమ దూతగా నీ వద్దకు

పంపారు.  వారిలో  ఒకరిని నీవు వరించాలి అని చెప్పమన్నారు" అని అన్నాడు.

అప్పటికే  దమయంతి నలుని గురించి విన్నది. ఇప్పుడు అతని అందచందాలు కనులారా చూస్తూ ఉన్నది.  కాని అతని మాటలు  ఆమెకు కష్టం కలిగించాయి. "అయ్యా! నేను మానవ కాంతను. వారు దేవతలు. వారికి నమస్కరించవలసిన దానిని వారిని ఎలా వరించను. ఇది ధర్మమా? నాడు హంస చెప్పినది మొదలు నిన్ను, నీ గుణగణాలను మనసులో ధ్యానిస్తున్నాను. నా  తండ్రి గారు తమరిని ఇక్కడకు రప్పించడానికే  ఈ స్వయంవరాన్ని ప్రకటించారు.  కాబట్టి మీరే నా భర్త. నన్ను భార్యగా స్వీకరించండి. లేని  ఎడల నేను బలవంతంగా నా ప్రాణాలు తీసు కుంటాను కాని  ఇతరులను వరించను" అని ప్రార్ధించింది దమయంతి.

"అదేమిటిదమయంతీ? దేవతలు మరణము లేని వారు. ఐశ్వర్యము కలవారు. వారిని వదిలి జరామరణములకు ఆలవాలమైన ఈ శరీరధారినైన నన్ను వరించడం కోరుకొనవచ్చునా?" అని అన్నాడు నలుడు.

ఆ మాటలు విని దమయంతి దుఃఖించింది. “నేను ఒక ఉపాయము చెపుతాను. అందరి ముందర నేను ఆ దేవతలను ప్రార్థించి,నిన్ను వారి సమక్షంలోనే వివాహమాడతాను. అప్పుడు నీకు దేవతల పని చెయ్యలేదు అన్న దోషము ఉండదు” అని పలికింది.

అవే మాటలు నలుడు ఇంద్రునికి చెప్పాడు. అది విని దిక్పాలకులు “మమ్ములను దమయంతి ఎలా వరించదో చూస్తాము” అని పలికి అందరూ నలుని రూపంలో స్వయంవరానికి వచ్చారు.

స్వయంవర మంటపంలో ఒకేసారి ఐదుగురు నలులు కనిపించారు. అందరూ ఆశ్చర్యపోయారు. దమయంతి వరమాల పట్టుకొని వచ్చింది. ఐదుగురు నలులను చూచింది. మనసులో దేవతలను ధ్యానించింది. “ఓదేవత లారా! నాకు నలుని గుర్తుపట్టడంలో సహకరించండి. మీ నిజస్వరూపాలతో కనిపించండి” అని ప్రార్థించింది.

వారు దమయంతిని కరుణించారు. తమ నిజస్వరూపాలను పొందారు. దమయంతి నలుని గుర్తుపట్టింది. నలుని మెడలో పూలమాల వేసి అందరి సమక్షంలో నలుని తన భర్తగా వరించింది. నల దమయం

తులకు అత్యంత వైభవోపేతంగా వివాహం జరిగింది. ఇంద్రాది దేవతలు ఎన్నో వరాలు అను గ్రహించారు.

వారు స్వర్గానికి వెళుతుండగా దారిలో వారికి కలి పురుషుడు కనిపిం చాడు. ఇంద్రుడు కలిని చూచి “ఎక్కడి పోతున్నావు?” అని అడిగాడు.

“భూలోకంలో దమయంతి స్వయంవరము జరుగుతూ ఉంది కదా! దానికి పోతున్నాను” అని చెప్పాడు.

ఆ మాటలకు వారు నవ్వారు. “దమయంతీ స్వయంవరం జరిగి పోయింది. ఆమె నలమహా రాజును వరించి వివాహ మాడింది” అని చెప్పారు.

కలికి కోపం వచ్చింది. నలుడిని రాజ్య భ్రష్టుని చేసి, నలదమయం తులకు వియోగం కల్పించడానికి నిశ్చయించాడు. కాని నలుడు ధర్మాత్ముడు. అతనిలో ప్రవేశించడానికి చాలా కాలం దాకా కలికి అవకాశం చిక్కలేదు.

ఒక రోజు నలుడు మూత్ర విసర్జన అనంతరం పాదప్రక్షాళన చెయ్య కుండా సంధ్యాంవందనం చేశాడు.  ఆ అశౌచాన్ని ఆధారంగా కలి నలునిలో ప్రవేశించాడు.

తరువాత నలుని దాయాది అయిన పుష్కరుని వద్దకు వెళ్లి, నలునికి ద్యూత వ్యసనం ఉందని, అతనితో జూదమాడి, అతని రాజ్యాన్ని గెల్చుకోవచ్చు నని నమ్మబలికాడు. బ్రాహ్మణ వేషంలో పుష్కరునితో సహా నలుని వద్దకు వెళ్లి జూదానికి  ఆహ్వానించాడు.

జూదానికి పిలిస్తే పోకపోవడం ధర్మం కాదని నలుడు జూదం ఆడటానికి ఒప్పుకున్నాడు.జూదం మొదలు అయింది. నలుడు తన రాజ్యాన్ని సంపదలను వరుసగా పోగొట్టుకుంటున్నాడు. కాని ఆట మానలేదు. తన సమస్తం ఓడి పోయే దాకా ఆడుతూనే ఉన్నాడు. కలిప్రభావం.

ఇది చూచి దమయంతి దుఃఖించింది. “ఓడే కొద్ది, పోయినది గెలవాలని మత్సరం పెరుగుతుంది. నేను ఏమీ చెయ్యలేను” అని సరిపెట్టుకుంది. అన్ని ఆటలలో పుష్కరుడు గెలుస్తున్నాడు. నలుడు ఓడుతున్నాడు. ఓటమి తథ్యం అని అనుకున్నది దమయంతి. సారధిని

పిలిచి తన కుమారుడు ఇంద్రసేనుడిని, కుమార్తె ఇంద్రసేనను, విదర్భలో ఉన్న తన తండ్రి వద్దకు పంపింది.

నలుడు తన రాజ్యాన్ని, సంపదలను కోల్పోయాడు. నగరాన్ని విడిచి వెళ్లాడు. నగరం వెలుపల మూడు రోజులు ఉన్నా, జూదంలో రాజ్యాన్ని కోల్పోయిన నలుని చూడ్డానికి ఎవరూ రాలేదు. ఆకలికి తట్టుకోలేక పోయాడు నలుడు. ఆకాశంలో ఒక పక్షుల గుంపు కనిపించింది. నలుడు తన పైన ఉన్న వస్త్రాన్ని తీసి వాటిమీదికి విసిరాడు. ఆ పక్షులు ఆ వస్త్రంతో సహా ఎగిరి పోయాయి. పక్షి కోసం గుడ్డ విసిరితే గుడ్డ కూడా పోయిందని పరితపించాడు. తన భార్య దమయంతి చీర కొంగును పైవస్త్రంగా వాడుకున్నాడు.

ఆ దుస్థితి చూచి నలుడు దమయంతితో "దమయంతీ! ఇక్కడ నాలుగు మార్గాలు ఉన్నాయి. ఇది నీ పుట్టిల్లు విదర్భకు పోయే దారి. ఇది దక్షిణ దేశాలకు పోయే దారి. ఇది కోసల దేశానికి పోయే దారి. ఇది ఉజ్జయినికి పోయే దారి. వీటిలో మనకు అనుకూలమయిన మార్గమేదో చెప్పు. ఎందుకంటే నీవు నాతోపాటు అడవులలో కష్టాలు పడలేవు. నీవు నీ తండ్రి దగ్గరకు పోయి సుఖంగా ఉండు" అని చెప్పాడు.

“అవును నాథా! మనం విదర్భకు పోయి సుఖంగా ఉందాము” అని చెప్పింది.

“కాని దమయంతీ! నలమహారాజుగా విదర్భలో తిరిగిన వాడిని ఇప్పుడు  రాజ్యభ్రష్టునిగా ఎలా రాగలను చెప్పు.  అన్ని రోగాలలో కన్నా పెద్ద రోగం దుఃఖం. దానికి పరమ ఔషధం భార్య చెంత ఉండటం. అందుకని నీ పక్కన ఉంటే నాకు ఎన్ని కష్టాలయినా సుఖాలుగానే ఉంటాయి” అన్నాడు నలుడు.

“నిజమే మహారాజా! అందుకనే నేను ఎల్లప్పుడూ మీ వెంటనే ఉండ టానికి అనుగ్రహించండి” అని వేడుకుంది.

“సరే” అన్నాడు నలుడు.

ఒకరోజు అడవిలో నలుని తొడమీద తల పెట్టుకొని దమయంతి నిద్రపోతూ ఉంది. ఆమెను చూచి నలుడు “ ఈ సుకుమారి నాతో అడవులలో అష్టకష్టాలు పడుతూ ఉంది.  నా వెంట ఉండ బట్టికదా  ఈ మెకు ఇన్ని కష్టాలు. నేను లేక పోతే ఈమె తన పుట్టింటికి వెళ్లి సుఖంగా ఉంటుంది” అని అనుకున్నాడు.

కాని భార్యను విడిచి వెళ్లడానికి అతనికి కాళ్లు ఆడలేదు. ఎంతోసేపు మనసు  ఊగిసలాడింది. కడకు ఆమెను వదలి వెళ్లడానికే నిశ్చయించు కున్నాడు. తాను ధరించిన ఆమె చీరను చించి, తన భాగాన్ని  తీసుకొని ఆమెను విడిచి వెళ్లిపోయాడు.

నిద్రలేచిన దమయంతి భర్తను కానక దుఃఖించింది.  తన భర్తను తల్చుకుంటూ  అడవిలో తిరుగుతున్న దమయంతిని ఒక కొండచిలువ పట్టుకొంది.  భయంతో దమయంతి కేకలు వేసింది.  ఆ కేకలు విని ఒక కిరాతుడు వచ్చి తన కత్తితో ఆ కొండచిలువను చంపి దమయంతిని రక్షించాడు.  “నీవు ఎవరు? ఒంటరిగా  ఆఅడవిలో ఎందుకు తిరు గుతున్నావు?” అని అడిగాడు. కల్లాకపటం తెలియని దమయంతి జరిగినది అంతా చెప్పింది. దమయంతి దిక్కులేనిది అని తెలుసు కున్నాడు కిరాతుడు. దమయంతి అందాన్ని చూచి మోహించాడు. ఆమెను తాక బోగా, దమయంతి అతనిని భస్మ అయిపోవుగాక అని శపించింది. ఆమె శాప ప్రభావం వల్ల ఆ కిరాతుడు కాలి బూడిద అయ్యాడు.

తరువాత తన మనసులో భర్త నలుని ధ్యానించుకుంటూ దమ యంతి అడవిలో దారీ తెన్నూ తోచక ప్రయాణిస్తూ ఉంది. ఆమెకు ఒక ముని పల్లె కనపడింది. అక్క డ వశిష్టుడు, వామదేవుడు, వాలఖిల్యులు, భృగువు, నారదుడు మొదలగు మహాఋషులతో సమానమైన ఋషిపుంగవులను చూచింది.

వారు ఆమెను చూచి "అమ్మా ! నీవు ఎవరు? ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు?" అని అడిగారు.

"మహానుభావులారా! నేను నలచక్రవర్తి భార్యను. నాపేరు దమయంతి. విధి వశంతో నాకు భర్తృ వియోగం కలిగింది. నా భర్త ఎటు వెళ్లాడో మీరు చెప్పగలరా. నేను నా భర్త లేనిదే జీవించలేను" అని చెప్పింది.

"అమ్మా! నీకు త్వరలోనే భర్త సమాగమం జరుగుతుంది. చింత పడ కుము." అని చెప్పి ఆ ఆ ఋషులందరూ వెళ్లిపోయారు.

తరువాత దమయంతి పిచ్చిదానిలా భర్తను వెదుకుతూ ఆ అడవిలో తిరుగుతూ ఉంది. ఇంతలో ఒక బాటసారుల గుంపు కనిపించింది.

అందులో ఉన్న జనులు కొందరు ఆమెను పిచ్చిది అని అపహాస్యం చేసారు. కొందరు ఆమెకు మొక్కారు. వారిలో ఉన్న ఒక వ్యాపారి ఆమె గురించి వివరాలు సేకరించాడు.

"అమ్మా ఈ అడవిలో మేము నలునిని చూడలేదు. కాని మేము ఛేధి నగరానికి వెళుతున్నాము" అని చెప్పాడు.

"అయితే నేను కూడా మీవెంట వస్తాను" అని చెప్పింది దమయంతి.

ఆ వ్యాపారి అలాగే అని దమయంతిని తమ వెంట తీసుకు వెళ్లాడు. ఒకరోజు రాత్రి ఆ గుంపు లోని వారందరూ నిద్రిస్తూ ఉండగా, అడవి లోని ఏనుగుల గుంపు ఒకటి వచ్చి వారిని తొక్కివేసింది. చాలా మంది మరణించారు. అది చూచి దమయంతి దుఃఖించింది. "అయ్యో! దురదృష్టవంతురాలిని నన్ను ఆ ఏనుగులు చంపవచ్చుకదా!" అని ఏడిచింది.

చావగామిగిలిన వారిలో ఉన్న బ్రాహ్మణులు ఆమెను ఓదార్చారు. తమ వెంట తీసుకొని వెళ్లారు. అలా వారితో ప్రయాణించి దమయంతి

ఛేది దేశ రాజధాని అయిన  సుబాహు పురానికి చేరింది.  ఒళ్లంతా దుమ్ము కొట్టుకు పోయిన దమయంతి అలా పురవీధులలో వెళుతుంటే రాజమాత చూచింది. తన దాసిని పంపి దమయంతిని అంతఃపురానికి పిలిపించింది.

రాజమాత దమయంతితో "అమ్మా! నీవు ఎవరు? చూడబోతే రాచకళ ఉట్టిపడుతున్నది. ఎవరమ్మా నీవు?" అని అడిగింది.

దానికి దమయంతి "అమ్మా  నా భర్త జూదంలో  రాజ్యం పోగొట్టు కున్నాడు. నన్ను అడవిలో విడిచి వెళ్లిపోయాడు. ఆయనను వెతుకుతూ తిరుగుతున్నాను  అని మాత్రం చెప్పింది.

"అమ్మా! ఇంక నుంచి నువ్వు నా దగ్గర సైరంధ్రిగా ఉండు నీకు ఏ లోటూ రాకుండా నేను చూస్తాను. నీ భర్త ఎక్కడ ఉన్నాడో వెతికిస్తాను" అని చెప్పింది.

దానికి దమయంతి "అమ్మా! అలాగే ఉంటాను. కాని నే సైరంధ్రిగా ఎవరి ఎంగిలి తినను. పరులకు కాళ్లు పట్టను. పర పురుషులతో మాట్లాడను.  కేవలం నా భర్తను వెతకడానికి వెళ్లే బ్రాహ్మణు లతో

మాత్రమే మాట్లాడతాను. అలా గైతేనే నేను  నీవద్ద ఉంటాను.” అని చెప్పింది.

దానికి రాజమాత అంగీకరించింది.  దమయంతిని తన కూతురు సునంద వద్దకు పంపింది. అప్పటినుండి దమయంతి అక్కడే ఉండిపోయింది.

అక్కడ దమయంతిని వదలి వెళ్లిన నలుడు అడవిలో ప్రయాణిస్తున్నాడు. ఒకరోజు ఆ అడవిలో దావానలం వ్యాపించింది. అడవినంతా దహించి వేస్తోంది.  ఆ మంటల మధ్యనుండి “రక్షించండి రక్షించండి”అనే ఆర్తనాదం వినపడింది.   ఆ ఆర్త నాదాన్ని విన్న నలుడు ఆ వైపుకు వెళ్లాడు. ఆ అగ్ని కీలల మధ్య  ఉన్న ఒక నాగ కుమారుడిని చూచాడు. వెంటనే ఆ పామును రక్షించాడు. కాని ఆ పాము అతనిని కాటు వేసింది.   ఆపాము విషానికి నలుడి రూపం మారి వికృత రూపుడయ్యాడు.

అప్పుడు ఆ పాము తన నిజస్వరూపంలో ప్రత్యక్షం అయ్యాడు. నల మహా రాజా! నా పేరు కర్కోటకుడు. నేను నిన్ను కాటు వేసానని బాధపడకు.నీకు మంచి జరగడానికే అలా కాటు వేసాను. ఇప్పుడు

నిన్ను ఎవరూ గుర్తించరు. ఈ అడవిలో ఏ విషసర్పం కరిచినా నీకు బాధ కలుగదు. నీకు అన్నింటా విజయం కలుగుతుంది. నాభార్య నీకు దక్కుతుంది. నీ రాజ్యం మరలా నీకు సంక్రమిస్తుంది. నీకు ఎప్పుడు నీ నిజరూపం కావాలన్నా నన్ను తల్చుకో. అప్పుడు నీ వద్దకు ఒక వస్త్రము వస్తుంది. దానిని నీవు కప్పుకుంటే నీకు నీ పూర్వ ఆకృతి వస్తుంది. నలచక్రవర్తీ! నీకు మరొక విషయం చెపుతాను. ఇక్కడికి దగ్గరలో ఇక్ష్వాకు వంశ కరుడైన ఋతుపర్ణుని రాజ్యం ఉంది. నీవు అక్కడికి వెళ్లు. బాహుకుడు అనే పేరుతో అతని కొలువులో రథ సారధిగా చేరు. నీవు అతనికి అశ్వహృదయము అనే విద్యను ఇచ్చి అతని వద్దనుండి అక్షహృదయము (గణిత శాస్త్ర రహస్యాలు) అనే విద్యను గ్రహించు." అని చెప్పి కర్కోటకుడు వెళ్లిపోయాడు.

ఆప్రకారం నలుడు ఋతుపర్ణుని వద్దకు వెళ్లాడు. రథసారధిగా చేరాడు. పైగా వంట శాలలో చేరి రుచికరమైన పదార్థాలు వండి పెట్టడం సాగించాడు. నలుడికి జీవలుడు అనే వంటవాడు సహాయకుడు గా ఉన్నాడు. ఎక్కడ ఉన్నా నలుడు అనుక్షణం తన భార్య అయిన దమయంతిని తల్చుకుంటూ దుఃఖిస్తున్నాడు.

ఒకరోజు ఒంటరిగా దమయంతిని తల్చుకుంటూ ఉండగా అది జీవలుడువిన్నాడు. " ఈ వికృతరూపుడికి, గూనివాడికి ప్రియురాలా! వింతగా ఉంది. వీడే ఇంత కురూపి అయితే వీడి భార్య ఎంత కురూపి గా ఉంటుందో!" అనుకుంటూ నలుడి వద్దకు వెళ్లి విషయం అడిగాడు.

దానికి నలుడు "అయ్యో నాకు ఒక ప్రేయసి కూడానా! ఇదివరకు నాకు తెలిసిన సైనికుడు ఒకడు తన భార్యను పోగొట్టుకొని ఎంత వెదికినా కానక దుఃఖిస్తుంటే అది చూచి నేనూ వాడిని అనుకరిస్తున్నాను" అని అన్నాడు.

విదర్భ దేశంలో ఉన్నా భీమునికి నలుని గురించి వివరాలు తెలిసాయి. తన కూతురు అల్లుడు ఎక్కడ ఉన్నారో తెలియక పరితపిస్తున్నాడు.  వారిని వెతకడానికి నలుదిక్కులకు బ్రాహ్మణులను పంపించాడు.  ఎన్నో బహుమానాలు ప్రకటించాడు. అందులో ఒక బ్రాహ్మణుడు  ఛేదిపురానికి వచ్చాడు.  అక్కడ రాచనగరులో సైరంధ్రి వృత్తిలో ఉన్న  దమయంతిని చూచాడు. ఆమె నుదుటి మీద ఉన్న పుట్టుమచ్చ వలన ఆమెను దమయంతిగా పోల్చుకున్నాడు.

ఆమె వద్దకు వెళ్లి "అమ్మా! నేను నీ తండ్రి భీముని వద్దనుండి వస్తున్నాను. నీ తల్లితండ్రులు క్షేమంగా ఉన్నారు. అనుక్షణం నిన్నే తల్చుకుం టున్నారు. అమ్మా నేను నీ సోదరునికి మిత్రుడను. నాపేరు సుదేవుడు అనే బ్రాహ్మణుడను." అని చెప్పాడు.

అది విని దమయంతికి దుఃఖం పొర్లుకు వచ్చింది. దమయంతి దుఃఖిం చడం చూచి రాజమాత ఆమె వద్దకు వచ్చింది. ఆ బ్రాహ్మణుని చూచి "బ్రాహ్మణోత్తమా! ఈమె ఎవరి భార్య ? ఎవరి కూతురు? ఈ విధంగా ఉండటానికి కారణం ఏమి?" అని అడిగింది.

దానికి ఆ బ్రాహ్మణుడు "అమ్మా! ఈమె విదర్భ రాజకుమార్తె. నల చక్రవర్తి భార్య. పేరు దమయంతి. ఈమె భర్త విధి వశాత్తు తన రాజ్య ము పోగొట్టుకున్నాడు. అడవుల పాలయ్యాడు. ఈమె తండ్రి వీరిని వెదకడానికి మమ్ములను పంపాడు ఆ ప్రకారం నేను ఇక్కడకు వచ్చాను ఈమె నుదుటి మీద ఉన్న పుట్టుమచ్చ ఆధారంగా ఈమెను గుర్తుప ట్టాను." అని చెప్పాడు.

ఇది విన్న రాజమాత దమయంతిని కౌగలించుకొన్నది. "దమయంతీ! నీవు నా పుత్రికా సమానురాలవు. నేను, నీ తల్లి, దశార్ణ

రాజు పుత్రికలము. నీ తల్లి విదర్భ దేశాధీశుని వివాహమాడింది. నేను వీరబాహుని వివాహం చేసుకున్నాను" అని చెప్పింది. అంతా సంతోషంగా గడిపారు. తరువాత దమయంతి తనపుట్టినింటికి ప్రయాణం అయి వెళ్లింది.

రాజసౌధంలో ఉన్నా భర్త వియోగంతో బాధ పడుతూ ఉంది దమయంతి. ఒకనాడు దమయంతి తన తండ్రితో " నా భర్త కోసం తక్షణం వెదికించండి. ఆయన లేకపోతేనేను బతకడం వృధా" అని చెప్పింది.

భీముడు వెంటనే నలుని వెదకడానికి బ్రాహ్మణులను పంపాడు. వారితో దమయంతి ఇలా చెప్పింది. "అయ్యలారా! నా భ ర్త ఒకప్పుడు చక్రవర్తి . అయినా ప్రస్తుతం అసమర్థుడు. మారు వేషంలో ఉంటాడు. మీరు వెళ్లి అక్కడ రాజసభలలో ఈ విధంగా ప్రకటించండి. "నీవు నిత్యసంధుడవు. కాని నీ సతిని వంచించినావు. ఆమె సగం వస్త్రం ధరించి వెళ్లిపోయావు. అలా చెయ్యడం నీకు ధర్మమా! నీ భార్య మీద కరుణ చూపు!" అని చెప్పండి. ఈమాటలకు ఎవరన్నా రోషం వచ్చి సమాధానం చెబితే అతనిని నా వద్దకు తీసుకురండి" అని చెప్పింది.

ఆ బ్రాహ్మణులు  ఆమె చెప్పిన ప్రకారం చేస్తామని చెప్పి  నలు దిక్కులకు నలుని వెదకడానికి బయలుదేరారు.  అందరూతిరిగి వచ్చి నలుడు కనపడ లేదని చెప్పారు.

వారిలో పర్ణాదుడు అనే విప్రుడు మాత్రం దమయంతితో “అమ్మా! నేను ఋతుపర్ణుని రాజ్యాని కి వెళ్లాను. నీవు చెప్పునట్టే చెప్పాను. అక్కడ ఉన్న ఒక కురూపి, వంటవాడు, అశ్వశాలలో పని చేసేవాడు, బాహుకుడు, అనే వాడు నా మాటలు విని నన్ను రహస్యంగా కలుసుకున్నాడు.   ఈ విధంగా అన్నాడు.  “అయ్యా! భర్త కష్టాలలో ఉన్నా సహించి ఆదరించే భార్య, ఇహ లోకంలోనూ, పరలోకంలోనూ భర్త నుండి సుఖం పొందు తుంది” అని చెప్పాడు.” అని దమయంతితో అన్నాడు.

దమయంతి ఆలోచించింది. అతడు నలుడు కాకపోతే సమాధానం చెప్పవలసిన అవసరం ఏముంది. కాబట్టి అతనిని గురించి పూర్తిగా తెలుసు కోవలసిన అవసరం ఉంది అని నిశ్చయించు కుంది. వెంటనే తల్లి అనుమతితో, సుదేవుడు అనే పండితుడిని పిలిపించింది.

“ఓ సుదేవా! నీవు ఋతు పర్ణుని రాజ్యానికి విదేశాల నుండి వచ్చిన బ్రాహ్మణుని వలె వెళ్లు. ఋతుపర్ణుని దర్శించు.  విదర్భ రాజు భీముడు

తన అల్లుడు నలుమూలలా నలుని కోసం వెతికించాడు కాని కనపడలేదు. అందు కని తన కుమార్తె దమయంతికి ద్వితీయ స్వయంవరం ప్రకటించాడు. భూమం డలంలోని రాజులందరూ వస్తున్నారు అని చెప్పు. మరునాడే స్వయంవరం అని వెంటనే బయలు దేరమని చెప్పు" అని చెప్పింది.

సుదేవుడు ఆమె చెప్పినట్లే ఋతుపర్ణుని వద్దకు వెళ్లాడు. దమయంతి చెప్పినమాటలు యధాతథంగా చెప్పాడు. "మరునాడే స్వయంవరము. సమయం లేదు వెంటనే బయలు దేరండి" అని అన్నాడు.

స్వయంవరానికి వెళ్లాలి. కాని ఒక్క రోజులో విదర్భ చేరడం ఎలాగా? అని ఆలోచించాడు ఋతుపర్ణుడు. అశ్వశిక్షకుడు అయిన బాహుకుడిని పిలిచాడు. "బాహుకా! దమయంతి కి ద్వితీయ స్వయంవరం ప్రకటిం చారు. నాకు చూడాలని ఉంది. ఒక్కరోజులో మనం విదర్భకు స్వయం వరానికి వెళ్లాలి. మరి నీ అశ్వశిక్షణ ప్రదర్శించూ" అని చెప్పాడు.

సరే అన్నాడు బాహుకుడు. బాహుకుడు కలత చెందాడు. "నేను అడవిలో నిర్దాక్షిణ్యంగా వదలి రాబట్టే కదా నా భార్య దమయంతి ద్వితీయ

స్వయంవరం ప్రకటించింది. ఆమెకు నామీద కోపం ఉంది.  అవివేకులైన పురుషులు, తాము భార్యలను ఏమి చేసినా, వారు తమను ప్రేమిస్తుంటారు, అనే భ్రమలో ఉంటారు. కాని  అది నిజం కాదు." అని దుఃఖించాడు.   "అయినా దమయంతి పతివ్రత. ఇద్దరు పిల్లలు ఉన్నారు. మరి  ఈ విధంగా రెండవ పెళ్లి చేసుకుంటుందా! ఏమో! అయినా నేను కూడా విదర్భ వెళ్లి  ఈ వింత చూస్తాను" అనుకున్నాడు.

వెంటనే రథానికి గుర్రాలను కట్టాడు. ఋతుపర్ణుడిని తీసుకొని ప్రయాణ మయ్యాడు. ఆ రథం పోయే వేగం చూస్తుంటే ఋతుపర్ణుడికి అది సూర్యుని రథమా, అతడు అనూరుడో అని ఆశ్చర్యపోయాడు. పక్కనే ఉన్న వార్ష్ణేయుడికి అనుమానం కలిగింది. భూలోకంలో నలునికి మాత్రమే రథం నడపడంలో ఇంత పరిజ్ఞానం ఉంది. ఇతను నలుడు కాదు గదా అనుకున్నాడు. కాని  ఈకురూపి నలుడు ఎలా అవుతాడు అని తర్కించుకున్నాడు.

ఇంతలో ఋతుపర్ణుని ఉత్తరీయం జారి కింద పడింది. "బాహుకా! రథం ఆపు. వార్ష్ణేయుడు  దిగి వెళ్లి ఉత్తరీయం తెస్తాడు." అన్నాడు.

దానికి  బాహుకుడు “రాజా! మనం ఇప్పుడు ఆమడ దూరం వచ్చేసాము. అంతదూరం నడుచుకుంటూ వెళ్ళి  ఎలా తేగలడు?” అన్నాడు.

అతని రథ వేగానికి ఋతుపర్ణుడు ఆశ్చర్యపోయాడు. తన పరిజ్ఞానాన్ని కూడా బాహుకునికి చూపదలిచాడు.  అంతలో ఒక పెద్ద వృక్షాన్ని రథం దాటింది.

“బాహుకా! ఆ వృక్షంలో ఎన్ని కొమ్మలు, ఆకులు, కాయలు ఉన్నాయో నేను చెప్పగలను.” అని అన్నాడు.

“చెప్పండి మహారాజా!” అన్నాడు బాహుకుడు.

ఋతుపర్ణుడు చెప్పాడు. బాహుకుడు నేను లెక్కించి చూస్తేగాని నమ్మను అని రథం ఆపి ఆ చెట్టును పడగొట్టి లెక్కించాడు. ఋతుపర్ణుడు చెప్పిన లెక్క సరిగా సరిపోయాయి. బాహుకుడు ఆశ్చర్యపోయాడు. తనకు ఆ విద్య ఉపదేశించమని అడిగాడు.

"బాహుకా! ఇది అక్షవిద్య అనే సంఖ్యాశాస్త్రము." అని ఋతుపర్ణుడు బాహుకునికి అక్షవిద్యను ఉపదేశించాడు.

అప్పుడు బాహుకుడు "రాజా! దీనికి ప్రతిగా నాకు తెలిసిన అశ్వహృదయము అనే విద్యను నీకు ఉపదేశిస్తాను" అని అన్నాడు.

"ఇప్పుడు కాదు. తరువాత నేను అడిగి తీసుకుంటాను" అని చెప్పాడు ఋతుపర్ణుడు.

అక్షహృదయ విద్య మహిమ వలన అప్పటిదాకా నలుని ఆవహించిన కలి వెలుపలికి వచ్చాడు. తనను క్షమించమని నలుని వేడుకున్నాడు. నలుడికి కోపం వచ్చింది. కలిని శపించడానికి పూనుకున్నాడు.

అప్పుడు కలి "నలమహారాజా! నిన్ను ఆవహించడం వలన, ఇప్పటిదాకా నేను కర్కోటకుడి విషంచేత అనుక్షణం తగలబడ్డాను. ఇంకా నాకు శాపం ఎందుకు. నన్ను అనుగ్రహించు" అన్నాడు.

తరువాత నలుడు రథాన్ని ఎక్కి ఋతుపర్ణునితోసహా విదర్భకు వెళ్లాడు. నలుని రథం విపరీతమైన ఘోషతో విదర్భ ప్రవేశించింది. ఆరథ

ఘోష విని దమయంతి అది నలుని రథము అని గుర్తుపట్టింది. ఎంతో ఆనందించింది. కాని రథం మీద ఋతుపర్ణుని చూచి నిరాశ చెందింది. భీమరాజు ఎంతో ఆదరంతో ఋతుపర్ణుని ఆహ్వానించాడు. విడిది చూపించాడు. ఋతుపర్ణునికి విదర్భలో స్వయంవరం జరుగుతున్నా సందడి ఏమీ కనిపించలేదు. బాహు కుడు రథాన్ని అశ్వశాలలో నిలిపి గుఱ్రాలను విడిచి సేదతీరుతున్నాడు.

దమయంతి దాసిని పిలిచి "వచ్చినది ఋతుపర్ణ మహారాజు. అతని సారథి వార్ష్ణేయుడు. ఆ ఇద్దరూ నాకు తెలుసు. మరి ఆ కురూపి ఎవరు. అతనిని చూచి నా మనస్సు ఆనందం పొందుతూ ఉంది. నీవు వెళ్లి ఆ మూడవ వ్యక్తి గురించి తెలుసుకొనిరా!" అని పంపింది.

దాసి నలుని వద్దకు వచ్చి "అయ్యా! మా రాజకుమారి దమయంతి తమ యోగక్షేమాలు తెలుసుకొని రమ్మన్నారు" అని అడిగింది.

"మీ రాకుమార్తె స్వయంవరం ప్రకటించింది కదా. దానికి ఒక్క రోజులో నేను మా మహారాజును తీసుకొని వచ్చాను. నూరు ఆమడల దూరం మనో వేగంతో ఒక్కరోజులో ప్రయాణం చేశాము. ఆ రథ సారథి నేనే." అన్నాడు.

“ మరి మీతో వచ్చిన మూడవ వ్యక్తి ఎవరు?” అంది దాసి.

ఆయన  వార్ష్ణేయుడు. ఇదివరకు నలుని సారథి.” అన్నాడు.

“అయ్యా!  మరి అతనికి నలుని జాడ తెలిసి ఉంటుంది కదా.” అని అడిగింది.

“ఎలా తెలుస్తుంది? నలుడు తన రాజ్యాన్ని పోగొట్టుకోకముందు వార్ష్ణేయుడు  నలుని పుత్రులను తీసుకొని వచ్చి విదర్భలో విడిచాడు. ఇంతలో నలునికి రాజ్యం పోయింది. అందుకని అతను ఋతుపర్ణుని వద్ద చేరాడు.  నలుని గురించి అతనికి తెలిసే అవకాశం లేదు. నలుని గురించి నలునికి తెలియాలి, లేక ఆయన భార్యకు తెలియాలి.” అన్నాడు బాహుకుడు.

దానికి ఆ దాసి ఇలా చెప్పింది. “అయ్యా!  నలుడు తనను ప్రాణప్రదంగా చూచుకొనే భార్యను నిర్దాక్షిణ్యంగా అడవిలో విడిచి వెళ్లాడు కదా. కాని దమయంతి ఆనాడు నలుడు విడిచిన సగం చీరనే ధరించి భర్తను తల్చుకుంటూ ఉంది. మరి  ఆనలుడు తన భార్యను ఎలా మరిచిపోయాడు?” అంది దాసి.

దానికి నలుని కంట్లో నీళ్లుతిరిగాయి. దాసికి కనిపించకుండా మొహం తిప్పుకున్నాడు నలుడు. వెంటనే దాసి వెళ్లి దమయంతికి జరిగినది అంతా చెప్పింది. దానికి దమయంతి "అతను నలుడే సందేహం లేదు కాని ఆ వికృతరూపము ఏమిటి? పైగా అతను వంటవాడు అని చెప్పారు కదా. అతను ఎలా వంట చేస్తాడో పరీక్షించు" అని చెప్పి పంపింది.

అలాగే అని దాసి వెళ్లింది. బాహుకుని నిశితంగా పరిశీలించి వచ్చి దమ యంతితో ఇలాఅంది "అమ్మా! అతను సామాన్యుడు కాదు. అతడు ఏపని అయినా అనాయాసంగా చేస్తున్నాడు. అతడు గడ్డినీ తీసుకొని అలా విదిలిస్తే మంటలు వచ్చాయి. వంట పూర్తి అయ్యేవరకూ అలా మండుతూనే ఉన్నాయి. వంటలు కూడా అనాయాసంగా రుచిగా చేస్తున్నాడు" అని చెప్పింది.

అప్పుడు దమయంతి నలుని చేత వండబడిన పదార్థాలుతెప్పించి రుచి చూసింది. సందేహం లేదు ఇవి నలుని వంటలే అని అనుకుంది.కాని ఇంకా అనుమానం పోలేదు. తన కొడుకును, కూతురును దాసిని ఇచ్చి నలుని వద్దకు పంపింది. నలుడు వారిని చూచాడు. చలించిపోయాడు.

కొడుకును ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు. కూతురిని కౌగలించు కున్నాడు.

దాసిని చూచి "అమ్మా ఏమీ అనుకోకు. వీరు నా బిడ్డల మాదిరి ఉన్నారు అందుకని అలా చేసాను. దాసీ నువ్వు ఇక్కడకు నా వద్దకు రావద్దు. ఎవరన్నా చూస్తే ఏమన్నా అనుకుంటారు. అయినా మేమే వేరే దేశం నుండి వచ్చిన అతిధులం. మాతో మీకేం పని?" అని అన్నాడు.

ఇది తెలిసి దమయంతి చాలా సంతోషించింది. తల్లి వద్దకు వెళ్లి "అమ్మా! ఋతు పర్ణుని సారథిగా వచ్చిన కురూపి బాహుకుడు నిశ్చయంగా నల మహారాజు. అమ్మా అతనే ఇక్కడకు వస్తాడా? లేక నేను అక్కడకు వెళ్లాలా? నిర్ణయించు" అని చెప్పింది.

అప్పుడు ఆమె భీమ రాజు అనుమతితో బాహుకుని దమయంతి వద్దకు రప్పించింది. బాహకుడు దమయంతిని చూచాడు. అప్పుడు దమయంతి నలుని చూచి "అయ్యా! నిస్సహాయంగా ఉన్న నన్ను నా భర్త నలమహారాజు నిర్దాక్షిణ్యంగా అడవిలో ఒంటరిగా విడిచి వెళ్లాడు. అలా ఎవరన్నా చేస్తారా? నేను సంతానవతిని కదా? అలా విడిచి పెట్టడం ధర్మమా? అలా చెయ్యడానికి నేను ఏమి అపచారం చేసాను? నిన్ను

ఎప్పటికి విడువను అని ఎన్నో సార్లు చెప్పాడు కదా. మరి ఇలా ఎందుకు చేసాడు?" అని దుఃఖించింది.

అప్పుడు నలుడు దమయంతిని చూచి "సాధ్వీ! ఆసమయంలో నన్ను కలి ఆవహించి ఉన్నాడు. అందు వలన అలా ప్రవర్తించాను. జూదంలో నా సర్వస్వం కోల్పోయాను. ఇప్పుడు కలి నన్ను విడిచి వెళ్లి పోయాడు. అసలు నేను ఇక్కడకు వచ్చింది నీ గురించి తెలుసుకోడానికే. నాకు నీమీద అను రాగం ఉన్నది అని నీకు తెలుసు కదా. మరి మరొక భర్త కోసం స్వయంవరం చాటించడం కులస్త్రీలకు ధర్మమా? రాజులం దరినీ ఆహ్వానించ బట్టేకదా ఋతుపర్ణుడు వచ్చాడు. ఇది న్యాయమా?" అని అన్నాడు నలుడు.

" నాథా! నేను మిమ్మల్ని వెదకుటకు నలుదెసలకు విప్రులను పంపాను. అందులో అయోధ్యకు వెళ్లిన విప్రుడు మిమ్ములను గుర్తించి నాడు. తమరిని ఇక్కడకు రప్పించుటకు వేరు మార్గము లేక ఆ స్వయం వరమను మిషతో తమరిని ఇక్కడకు రప్పించినాను. కాని అసలు స్వయంవర ప్రకటన లేదు. తమరు తప్ప మానవ మాత్రు లెవరూ నూరు యోజనముల దూరము ఒకరోజులో ఎలా రాగలరు. నాలో ఎలాంటి

పాపము తలంపు లేదు అని తమరి పాదములు అంటి ప్రమాణము చేయుచున్నాను." అని పలికింది దమయంతి.

అప్పుడు ఆకాశము నుండి వాయుదేవుడు ఇలా పలికాడు. "ఓ నలచక్రవర్తీ! ఈదమయంతి అమల చరిత. పతివ్రత. ఈమె సౌశీల్యము ను నేను, సూర్యుడు, చంద్రుడు ఈమెను కాపాడాము. ఈమెను పరిగ్రహించుము" అని పలికాడు.

వెంటనే బాహుకుడయిన నలుడు కర్కోటకుని స్మరించాడు. అతడు ఇచ్చిన వస్త్రాన్ని ధరించగానే నలునికి తన పూర్వరూపము వచ్చింది. ఇంద్ర తేజస్సు తో మనోహరమైన రూపంతో నలుడు దమయంతిముందు నిలిచాడు. దమయంతిని పరిగ్రహించాడు. ఇరువురూ సంతోషంగా ఉన్నారు.

నలుడు విదర్భలో ఒక నెల రోజులు ఉండి తన రాజధానికి వెళ్లి పుష్కరుని కలిసాడు.

పుష్కరునితో "పుష్కరా! నీకు జూదమాడటం ఇష్టం కదా. నేను నా భార్య దమయంతిని పణంగా పెట్టి జూదమాడుతాను. నీవు నీ రాజ్య

సర్వస్వాన్ని పణంగా పెట్టి జూదం ఆడగలవా. అలా కాని ఎడల, "వీరులదే రాజ్యం. రాజ్య వీర భోజ్యం". అనే సూక్తిని బట్టి నాతో యుద్ధం చెయ్యి. యుద్ధంలో గెలిచిన వాడిదే రాజ్యం. నీకు ఏది ఇష్టమో అది చెయ్యి." అని అన్నాడు నలుడు.

పుష్కరుడు జూదప్రియుడు. పైగా ఒకసారి నలుని ఓడించాడు అందు వలన నలునితో "మనం జూదమాడదాము. నేను ఓడితే నా రాజ్యం నీది. నీవు ఓడితే దమయంతి నాది ఇది పందెం." అన్నాడు.

నలుడు సరే అన్నాడు. పుష్కరునితో జూదమాడి గెలిచాడు. రాజ్యాన్ని దక్కించుకున్నాడు. అప్పుడు నలుడు పుష్కరుని చూచి "పుష్కరా! ఇదివరకు నీతో జూదమాడినపుడు నేను కలి ప్రభావంతో ఓడి పోయాను కాని, నీ బలం వలన కాదు. అందు వలన నీవు బలవంతుడవని తలపవలదు. నీవు నా పినతండ్రి కుమారుడవు. నీకు నేను కీడు తలపెట్టను. వెళ్లు" అన్నాడు.

తరువాత, నలుడు, దమయంతితో కూడి, రాజ్యాన్ని ప్రజా రంజకంగా పాలించాడు.

కాబట్టి ఓ ధర్మజా! నీవు జూదమాడి ఓడిపోయానని బాధపడకు. నీవును దైవ సహాయంతో, మానవ యత్నంతో విరోధులను జయించి నీ రాజ్యాన్ని పొందుతావు. అని అన్నాడు బృహదశ్వుడు అనే మహర్షి.

తన వద్ద ఉన్న అక్ష హృదయం అనే విద్యను ధర్మరాజుకు ఉపదేశించాడు. తరువాత బృహదశ్వుడు వెళ్లిపోయాడు.

తరువాత ధర్మరాజు అర్జునుని రాక కోసం నిరీక్షిస్తున్నాడు. అంతలో ఒక రోజు నారద మహర్షి వారి వద్దకు వచ్చాడు. ధర్మజుడు నారదునికి అతిధి సత్కారాలు గావించాడు.

ఆయనను చూచి ధర్మజుడు "ఓ మహర్షి! నాకు ఒక ధర్మ సందేహం కలదు. తీర్చెదరా?" అని అడిగాడు.

నారదుడు నవ్వి "అలాగే అడుగు ధర్మజా!" అన్నాడు.

"ఈ ధరణి లో ఉన్న తీర్థములను సేవించిన ధన్యులకు ఎలాంటి ఫలములు కలుగుతాయి?" అని అడిగాడు.

ఇదివరకు భీముడు గంగా తీరంలో వేదాలు చదువుకుంటూ మంచి పనులు చేస్తూ ఉండేవాడు. అప్పుడు అతని వద్దకు పులస్త్యుడు అనే ఋషి వచ్చాడు. భీష్ముడు ఆ మహర్షికి అర్ఘ్యపాద్యాదులు అర్పించి తన పేరు భీష్ముడు అని పరిచయం చేసుకున్నాడు. అప్పుడు భీష్ముడు నీవు నన్ను అడిగిన ప్రశ్ననే ఆ మహర్షిని అడిగాడు. ఆయన చెప్పిన విషయాలనే నేను నీకు చెపుతాను. విను.

మన ఇంద్రియాలను, మనం చేసే కర్మలను, మన బుద్ధిని, అదుపులో పెట్టుకునే వారు, ధృఢమైన మనసు కలవారు, అహంకారము లేని వారు, ఇతరుల నుండి ఏమీ ఆశించని వారు, మితభోజనం చేసేవారు, ఎల్లప్పుడూ సత్యమునే పలికెడి వారు, శాంత స్వభావులు, తీర్ధ యాత్రలు చేసిన ఎడల ఎన్నోయజ్ఞాలు చేసిన ఫలం పొందుతారు. కాని మలినమైన మనసు కలవారు, పాపాత్ములు, ఎన్ని తీర్ధ యాత్రలు చేసినా, ప్రయోజనం లేదు.

దాన ధర్మాలు చేయని వారు, తాము చేసిన అపరాధముల వలన దరిద్రులు అవుతారు. అలాంటి దరిద్రులు యజ్ఞములు చేయలేరు కాబట్టి వారు పుణ్య తీర్థములు సందర్శించిన వారికి పుణ్యము వచ్చును.

తీర్థ యాత్రల వలన కలిగే పుణ్యం విశేషము. సాధారణంగా బ్రహ్మదేవుడు పుణ్య తీర్థాలలో విహరిస్తుంటాడు. అందులో పుష్కర తీర్థము ప్రశిద్ధమైనది. దానిలో స్నానమాచరించి, పితృదేవతలకు తర్పణ ములు విడిచిన, 10 అశ్వమేధ యాగాలు చేసిన ఫలం పొందు తారు. ఆపుష్కర క్షేత్రంలో 10 సంవత్సరాలు నివసించిన బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది.

జంబూ మార్గంలోని తండులిక ఆశ్రమంలో ఉన్న అగస్త్యవటము అనే తీర్థం లో స్నానం చేస్తే, అశ్వమేధము చేసిన పుణ్యము వస్తుంది.

కణ్వాశ్రమాన్ని, ధర్మారణ్యమును, యయాతి పతనము అనే పుణ్య క్షేత్రములు చూచిన వారికి అని పాపాలు పోతాయి.

ఇంకా మహా కాళము, కోటి తీర్థము, భద్రవటము లో శివుని పూజించినా, నర్మదా నదిలో స్నానం చేసినా, దక్షిణ సింధువులో, జర్మణ్వతీ తీర్థంలో, స్నానం చేసినా, ఎంతో పుణ్యం వస్తుంది.

వశిష్ఠాశ్రమంలో ఒకదినం నివసించినా, పింగం అనే పుణ్యతీర్థాన్ని సేవించినా, ప్రభాస తీర్థంలో స్నానమాడినా, వరదాన తీర్థంలో

స్నానమాడినా, సరస్వతీ నదీ సంగమంలో స్నానం చేసినా, పుణ్యఫలాలు పొందుతారు.

ద్వారావతీ పురంలోని పిండారక తీర్థంలో శివుని పూజించినా, సాగర సింధు సంగమంలో స్నానమాచరించినా, శంకు కర్ణేశ్వరంలో శివుని పూజించినా,  వసుధార, వసు సరము లలో తీర్థమాడినా, సింధూత్తమంలో స్నా నం చేసినా, బ్రహ్మతుంగ తీర్థం సేవించినా, శక్రకుమారీ యాత్ర చేసినా, శ్రీకుండంలో బ్రహ్మదేవుని సందర్శించినా, బడబ తీర్థంలో అగ్నిదేవుని సేవించినా, ఎన్నో గోదాన, భూదానములు చేసిన పుణ్యఫలములు కలుగుతాయి.

దేవిక అనే పుణ్యక్షేత్రములో శివుడు నివసిస్తాడు. దానిని, కామ క్షేత్రాన్ని, రుద్రతీర్థాన్ని, బ్రహ్మవాలుకాన్ని, దీర్ఘసత్రాన్ని సేవించిన వారికి ఇష్టకామ్య సిద్ధి కలుగుతుంది.

వినశనము అనే ప్రాంతంలో  అదృశ్యమయిన సరస్వతీ నది, నాగోద్భేద, శివోద్భేద, చమసోద్భే దంబుల లో ఎక్కడైనా కనిపించిన అందులో స్నానం చేస్తే, నాగలోక ప్రాప్తి కలుగుతుంది.

శశియానం తీర్థంలో స్నానం చేస్తే, సహస్ర గోవు లను దానం చేసిన పుణ్యం కలుగుతుంది.

రుద్రకోటిలో శివుని అర్చించిన కైలాస ప్రాప్తి కలుగుతుంది.

దర్మజా! కురుక్షేత్రం, నైమిశతీర్థం, పుష్కరత్రయం అనేవి మూడు పవిత్ర పుణ్యక్షేత్రాలు. కురుక్షేత్రం, సరస్వతీ నదికి దక్షిణాన, దృషద్వతీ నదికి ఉత్తరాన ఉన్నది. ఆ కురుక్షేత్రంలో శమంతక పంచకముల నడుమ, రామహ్రదం అనే సరస్సు మధ్య పితామహుడు బ్రహ్మదేవుని ఉత్తరవేది అనబడే కురుక్షేత్రం దర్శించినవారికి, సర్వపాపక్షయం కలుగుతుంది.

విష్ణుస్థానము లో విష్ణువును పూజించినా, పారిప్లవ తీర్థంలో, పృథివీ తీర్థంలో, శాలూకినీ తీర్థంలో, సర్పతీర్థంలో, వరాహ తీర్థంలో,. అశ్వినీ తీర్థంలో, జయంతిలో ఉండే సోమ తీర్థంలో, కృతశౌచ తీర్థంలో, స్నానమాడినా, ఎంతో పుణ్యం వస్తుంది.

అగ్ని వటక్షేత్రంలో, ముంజవట క్షేత్రంలో శివారాధన చేసినా, యక్షిణీ తీర్థంలో స్నానం చేసినా, కోరిన కోరికలు తీరుతాయి.

దర్మజా! జమదగ్ని కుమారుడైన పరశురాముడు, తన గొడ్డలితో రాజులందరిని నరికినపుడు వారి రక్తం ఐదు పాయలుగా పారింది. దానినే శమంతక పంచకము అంటారు. అందులో పరశురాముడు పితృ తర్పణాలు విడిచాడు. అప్పుడు, పితృదేవతలు అతనికి సాక్షాత్కరించి వరాలు కోరు కోమన్నారు. అప్పుడు పరశురాముడు నాకు రాజులను సంహరించి నందు వలన సంక్రమించిన పాపం నశించాలి. నాకు పుణ్యలోకాలు కలగాలి. ఈ శమంతక పంచకము లోక ప్రశిద్ధముకావాలి అని కోరాడు. అప్పటినుండి ఈ శమంతక పంచకము పుణ్యతీర్థములుగా శోభిల్లుతున్నాయి. వాటిలో స్నానం చేస్తే అశ్వమేధయాగ ఫలం కలుగుతుంది.

ఇంకా కాయశోధనం, లోకోద్ధారం, శ్రీ తీర్థం, కపిలతీర్ధం, సూర్యతీర్ధం, గోభవనం, శంఖినీ తీర్థం, యక్షేంద్రతీర్థం, సరస్వతీనదీ, మాతృతీర్థం, బ్రహ్మావర్తం, శరవణం, శ్వావిల్లోమాపహం, మానుషతీర్థం, ఆపగ నదీ తీర్థం, బ్రహ్మోదుంబరం, సప్తర్షికుండం, కేదారం, కపిలకేదారం, సరకం, ఇలాస్పదం, కిందానం, కింజప్యం, అనే తీర్థాలలో స్నానం చేస్తే అనంతమైన పుణ్యాలు కలుగుతాయి.

నారదుల వారు నిర్మించిన అంబాజన్మం అనే తీర్థంలో చనిపోతే, పుణ్యలోకాలకు పోతారు.

పుండరీకం అనే తీర్థంలో ఉన్న వైతరిణీనదిలో స్నానం చేసినా, ఫలకీ వనం, మిశ్రకం, వ్యాసవనం, మనోజవం, మధువటి, కౌశికీనది, దృషద్వతీ నదీ సంగమం, లో స్నానం చేస్తే సమస్త పాపాలు పోతాయి.

కిందత్త తీర్థం, లో తిలాదానం చేస్తే పితృఋణం తీరు తుంది.అహస్సు సుదినం అనే తీర్థాలలో స్నానం చేస్తే సూర్యలోక ప్రాప్తి కలుగుతుంది. మృగధూమం అనే క్షేత్రంలో గంగా స్నానం చేసి శివుడిని ఆరాధిస్తే అశ్వమేధ ఫలం కలుగుతుంది. వామన తీర్థంలో స్నానం చేస్తే విష్ణు లోకానికి వెళుతారు. పావనం తీర్థంలో స్నానం చేస్తే వంశం పవిత్రం అవుతుంది.

శ్రీకుంజం అనే తీర్థాన్ని దర్శిస్తే అగ్నిష్టోమయాగం చేసిన పుణ్యం పొందుతారు. బ్రహ్మ తీర్థంలో స్నానం చేస్తే బ్రహ్మలోకం సిద్ధిస్తుంది.

ధర్మజా! సప్త సారసత్వాలు అనే తీర్థాలలో స్నానం చేస్తే సారస్వతంలో సమగ్రప్రాప్తి ఏర్పడుతుంది. ఔశనసం, కపాల మోచనం, విశ్వామిత్రం, కార్తికేయం అనే తీర్థాలలో స్నానం చేస్తే పాపాలనుండి

విముక్తులవుతారు.  పృథూదక తీర్థంలో చనిపోతే పాపాలనుండి విముక్తి కలుగుతుంది.

గంగానదీ, సరస్వతీ నదుల సంగమంలో స్నానం చేస్తే బ్రహ్మహత్యా పాతకం పోతుంది. శతం,సహస్రం అనే తీర్థాలలో జపతపాలు  చేస్తే, అంతులేని పుణ్యం లభిస్తుంది. రుద్రపత్ని అనే తీర్థంలో స్నానం చేస్తే సర్వదుఃఖ విముక్తి కలుగుతుంది. స్వస్తిపురం అనే తీర్థం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తే వేయి ఆవులను దానం చేసిన ఫలం దక్కుతుంది.

ఏకరాత్రం అనే తీర్థంలో ఉపవాసం చేస్తే సత్యలోకం సిద్ధిస్తుంది. ఆదిత్యాశ్రమంలో సూర్యుడి ఆరాధిస్తే సూర్యలోక ప్రాప్తి కలుగుతుంది. దధీచి తీర్థంలో మూడు రాత్రులు నివసిస్తే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. సూర్యగ్రహణ కాలంలో సన్నిహిత తీర్థంలో స్నానం చేస్తే నూరు అశ్వమేధాలు చేసిన ఫలం పొందుతారు.  ధర్మతీర్థంలో స్నానం చేస్తే ధర్మస్వభావం కలవారు అవుతారు. జ్ఞాన పావనం, సౌగంధికం అనే తీర్థలలో స్నానం చేస్తే సర్వపాపాలు పోతాయి.

సరస్వతీ ప్రాదంనుండి వెలువడే జలప్రవాహంలో స్నానం చేస్తే అశ్వమేధ యాగ ఫలం వస్తుంది.

శాకంబరీ తీర్థంలో ఒకరోజు శాకాహార తపస్సు చేస్తే పుణ్యం వస్తుంది. సువర్ణం అనేతీర్థంలో స్నానం చేస్తే కైలాసం సిద్ధిస్తుంది.

ధూమావతీ, రథావర్తం అనే తీర్థాలలో స్నానం చేస్తే దుఃఖంనుండి విముక్తి పొందుతారు.

ఇంకా కొన్ని పుణ్య తీర్థాలు వాటిలో స్నానం చేస్తే కలిగే ఫలాలు.

| | |
|---|---|
| గంగాద్వారం స్నానం. | నూరు కోట్ల సేవనం. |
| సప్తగందా సంగమం, త్రిగంగా సంగమం | పుణ్యలోకాలప్రాప్తి. |
| శక్రావర్తం, కనస్వలం,గంగా,సరస్వతీ సంగమం, స్నానం. | |
| భద్రకర్ణేశ్వరంలో రుద్రపూజ,అరుంధతీ వటం, | సర్వసిద్ధులు ప్రాప్తిస్తాయి. |
| సింధునది,యమున పుట్టిన చోట స్నానం. | |
| వేదిక, ఋషికుల్య,కృత్తిక,మఘ,విద్య, వేతసిక తీర్థసేవనం.-------------------- | పాపాలు పోతాయి. |

| | |
|---|---|
| బ్రహ్మతీర్థ స్నానం. | సత్యలోకం. |
| నైమిశ దర్శనం. | పాపాలుపోతాయి. |
| గందోద్భేదం, ఇందీవర తీర్థం, హరితీర్థం, | వాజపేయ యాగఫలం. |
| దిశాపతీ తీర్థాలు. | |
| బాహుద తీర్థం. | సత్రయాగఫలం. |
| సరయూనదీ,గోప్రదానం గోమతీస్నానం. | అశ్వమేధయాగఫలం. |
| కోటితీర్థం స్నానం,కాశిలో శివపూజ, | రాజసూయయాగఫలం. |
| కపిలహ్రదస్నానం, | |
| గంగాగోమతీస్నానం, | వాజపేయయాగపుణ్యం. |
| గయలో నివాసం. | పితరులు చరితార్థులవుతారు |
| యక్షిణీతీర్థంసేవనం. | బ్రహ్మహత్యాపాతకవిముక్తి |
| మణీనాగతీర్థం. | సర్పవిషవిముక్తి. |
| అహల్యాహ్రదస్నానం, ఉదపానం, | అశ్వమేధ పుణ్యం. |
| జనకకూపస్నానం, | వైకుంఠప్రాప్తి |
| కంపన,మహానది,స్నానం. | పౌండరీకయాగఫలం. |

| | |
|---|---|
| దేవపుష్కరిణి,మహేశ్వరధార,మహేశ్వరపదం. | అశ్వమేధ ఫలం. |
| సాలగ్రామతీర్థం, | వైకుంఠప్రాప్తి. |
| భరతాశ్రమంలో శివుని పూజ | మిత్రావరుణప్రాప్తి |
| కన్యాసవేద్యతీర్థ స్నానం, | అక్షయపుణ్యం. |
| దేవకూటతీర్థ స్నానం. | సత్యలోకం. |
| కౌశికహ్రదతీర్థ స్నానం,కుమారవీరాశ్రమం నివాసం. | అశ్వమేధఫలం. |
| అగ్నిధార,కుమారధార,తీర్థ స్నానం. | బ్రహ్మహత్యావిముక్తి. |
| గౌరీశిఖరకుండం,నందినికూపం,తీర్థ స్నానం. | అశ్వమేధ ఫలం. |
| కాళిక,కౌశిక,తీర్థ స్నానం. | పాపవిముక్తి |
| ఊర్వశీ,గోకర్ణం,తీర్థ స్నానం. | జాతిస్మరణం. |
| నంద, ఔలకం,కరతోయం,గంగాసాగర సంగమం,అనేతీర్థ స్నానం. | నూరు అశ్వమేధ యాగ ఫలం |
| శోణానది,నర్మదానది,పుట్టినచోటు,బదరీ తీర్థ స్నానం. | ఆయుర్ వృద్ధి. |
| మహేంద్ర,రామతీర్థ,మతంగ కేదార,వంశ, గుల్మ తీర్థ స్నానం. | అశ్వమేధయాగఫలం. |

| | |
|---|---|
| శ్రీశైలం,దేవహ్రదం,తీర్థ స్నానం. | శివపూజ,అశ్వమేధయాగఫలం |
| కావేరీ,తుంగభద్ర,సముద్ర,కన్యాకుమారీ, తీర్థ స్నానం. | అశ్వమేధయాగఫలం. |
| పయోష్ణియు,దంగకారణ్యం,శరభంగాశ్రమం, శుక్రాశ్రమం,శూర్పారకం,దక్షారామం, సప్తగోదావరి తీర్థ స్నానం. | పుణ్యలోక ప్రాప్తి. |
| సుందర,తుంగకారణ్య దర్శనం. | పాపవిముక్తి. |
| కాలంజరిపర్వతంలో దేవహ్రదం తీర్థ స్నానం. | కోరికలు తీర్తాయి. |
| మేధిక తీర్థ స్నానం. | మేధావులు అవుతారు |
| చిత్రకూటంలో మందాకిని,శృంగిమేరపురం తీర్థ స్నానం. | పాపాలు పోతాయి. |
| ప్రయాగ నివాసం, తీర్థ స్నానం. | రాజసూయ,అశ్వమేధ యాగఫలం. |

అందరూపుణ్యతీర్థాలలో,స్నానం చెయ్యలేరు. నోములు నోచని వారు, చెడ్డవారు, శుచిత్వంలేనివారు, ఉపవాసాలుచెయ్యలేనివారు, తీర్థయాత్రలు చెయ్య లేరు.

కాబట్టి, నీవు సకల తీర్థాలను సేవించడానికి, తీర్థయాత్రలకు వెళ్లిరమ్ము . రోమశుడు అనే మహర్షి నీ వద్దకు వస్తాడు. అతని ఆదేశం ప్రకారం, నీ పురోహితుడు ధౌమ్యుని ఆదేశం ప్రకారం తీర్థయాత్రాసేవనం గావించుము అని నారద మహర్షి దర్మజునకు చెప్పి వెళ్లిపోయాడు.

తరువాత, ధర్మజుడు ధౌమ్యునితో "అర్జునుడు దివ్యాస్త్రాలు సాధించ డానికి వెళ్లాడు. ఇంకా రాలేదు.అర్జునుడు లేని కామ్యకవనం శోభించడం లేదు. మేము అందరం అర్జునుని రాక కోసం నిరీక్షిస్తున్నాము." అని అన్నాడు.

"ధర్మజా! నీకు మేలు జరుగుతుంది. అర్జునుడు విజయుడై తిరిగి వస్తాడు. నారదుల వారు చెప్పినట్టు మనము తీర్థయాత్రలుచేద్దాము" అని అన్నాడు.

ఇంతలో రోమశ మహర్షి వారి వద్దకు వచ్చాడు. ధర్మజుని చూచి రోమశమహర్షి ఇలా చెప్పాడు.

“ధర్మజా! నేను ఇంద్ర లోకం వెళ్లాను. అక్కడ నేను దేవేంద్రుడి పూజలు అందుకుంటున్న అర్జునుని చూచాను. శివుడు, దేవతలు అందరూ అర్జును నికి దివ్యాస్త్రాలు ఇచ్చారు. అర్జునుని విషయం నీకు చెప్పమని నన్ను దేవేం ద్రుడు ఆదేశించాడు. నిన్ను తీ ర్ధ యాత్రలు చెయ్యమని ఆదేశించాడు. ఆ విషయం నీకు చెప్పడానికి ఇక్కడకు వచ్చాను” అని అన్నాడు రోమశుడు.

దానికి ధర్మజుడు “మహర్షీ! అర్జునుడి కుశల వార్త విన్నందుకు, తీర్ధయాత్రలు చెయ్యమని దేవేంద్రుని ఆదేశించినందుకు చాలాసంతోషంగా ఉంది. నేను నారద మహోర్షి ఆదేశం ప్రకారం ఇప్పుడు మహేంద్రుని కోరిక ప్రకారం తీర్ధయాత్రలు చేస్తాను.” అని అన్నాడు.

వెంటనే ధర్మజుడు తీర్ధయాత్రలకు బయలుదేరాడు. ధర్మరాజు వెంట ఉన్న విప్రులు కూడా వెంట వస్తాము అన్నారు. ధర్మజుడు సమ్మతించాడు. ఆ సమయంలో వ్యాసుడు వారి వద్దకు వచ్చాడు.

“ధర్మజా! శరీర నియమాలు పాటిస్తూ, మనో బుద్ధి శౌచాలు పాటిస్తూ, మంచిమార్గంలో తీర్థాలు సేవించండి. నీ పూర్వులైన మహాభిషుడు, నాభాగుడు, భరతుడు, భగీరధుడు, ముచుకుందుడు, మాంధాత, సగరుడు, సార్వభౌముడు, అష్టకుడు, రోమపాదుడు అనే చక్రవర్తులు తీర్థయాత్రలు చేసి సుఖాలుపొందారు. వారి వలెనే నువ్వు తీర్థయాత్రలు చేసి సుఖించు” అని ధర్మజుని ఆశీర్వదించాడు.

ధర్మజుడు రోమశుని చూచి “మహర్షీ! లోకంలో అధ్మపరులకు, దుర్జనులకు అభివృద్ధి కలుగుతుంది. కాని ధర్మం ఆచరించేవారికి కష్టాలు కలుగుతున్నాయి. ఎందువలన?” అని అడిగాడు.

దానికి రోమశుడు ఇలా చెప్పాడు. “ధర్మజా! అధర్మపరులకు అభ్యుదయము ఎల్లకాలము ఉండదు. త్వరలో నశిస్తుంది. రాక్షసులు అధర్మప్రవర్తనులై నాశనమయినారుకదా! కాని దేవతలు ధర్మాచరణము వలన వృద్ధిపొందుతున్నారుకదా! ధృతరాష్ట్రుని కొడుకులు వారి అధర్మప్రవర్తన వలన అచిర కాలంలో నశిస్తారు. ఎందుకంటే అధర్మ ప్రవర్తన వలన గర్వం కలుగుతుంది. గర్వం వలన అహంకారం పుడుతుంది. అహంకారము క్రోధానికి మూలము. దానివలన సిగ్గు ఉండదు. అలాంటి వారికి ప్రవర్తన చెడుతుంది. లక్ష్మి వారిని విడిచి

వెళ్లిపోతుంది. సంపదలు నశిస్తాయి.  కాని మీరు ధర్మపరులు. మీకు జయం కలుగుతుంది.  కాబట్టి తీర్థయాత్రలు చెయ్యి." అని అన్నాడు రోమశుడు. ఆ ప్రకారం ధర్మరాజు తీర్థయాత్రలకు బయలు దేరాడు. అన్ని తీర్థాలు సేవిస్తూ గయ చేరుకున్నారు. అక్కడినుండి అగస్త్యాశ్రమానికి చేరుకున్నారు.

అక్కడ రోమశుడు అగస్త్యుడు గురించి చెప్పాడు. "ధర్మజా! పూర్వము వాతాపి, ఇల్వలుడు అనే మహా బలవంతులైన రాక్షసులు ఉండేవారు. అన్న గారైన ఇల్వలుడు ఒక బ్రాహ్మణుని పూజించి "అయ్యా! నాకు  అన్ని కోరికలు తీరే మంత్రము ఉపదేశించండి" అని అడిగాడు. రాక్షసులకు అలాంటి మంత్రం ఉప దేశించ డానికి ఆ బ్రాహ్మణుడు ఒప్పు కోలేదు. తరువాత   ఇల్వలుడు తన తమ్ముడు వాతాపిని మేకగా మార్చి, ఆ మేకను చంపి ఆ మాంసాన్ని విప్రునికి  వండి వడ్డించాడు. ఆ విప్రుడు ఆ భోజనము తిన్న తరువాత, " వాతాపీ! బయటకు రా" అన్నాడు. అంతే! మేక మాంసరూపంలో బ్రాహ్మణుడి పొట్టలో ఉన్న వాతాపి బ్రాహ్మణుని  పొట్ట చీల్చుకొని బయటకు వచ్చాడు.  ఆ బ్రాహ్మణుడు మరణించాడు.   ఆ ప్రకారం ఆ అన్నదమ్ములు అతిథులుగా వచ్చిన బ్రాహ్మణులను చంపుతున్నారు.

ఒక రోజు బ్రహ్మచర్యవ్రతం పాటిస్తున్న అగస్త్యుడు ఒక లేత చిగురు టాకును ఆధారం చేసుకొని వేలాడుతున్న తన పితరులను చూచాడు. "అయ్యా! మీరు ఎందుకు ఇలా వేలాడుతున్నారు?" అని అడిగాడు. "నాయనా మేము నీ పితృదేవతలము. నీవు వివాహం చేసుకొనకుండా సంతాన హీనుడవు అయ్యావు. అందుకు మాకు ఉత్తమగతులు లేక ఇలా అయ్యాము. కాబట్టి నీవు పెళ్లి చేసుకొని సంతానాన్ని పొందు. మాకు ఉత్తమ గతులు ప్రసాదించు" అని అన్నారు. అగస్త్యుడు అలాగే అన్నాడు.

ఆసమయంలో విదర్భరాజు సంతానం కోసం పరితపిస్తున్నాడు. తన తపోమహిమతో అగస్త్యుడు అతనికి ఒక కూతురిని అనుగ్రహించాడు. ఆమె పేరు లోపా ముద్ర. ఆమె పెరిగి యౌవనవతి అయింది. తగిన వరుని కోసం వెతుకుతున్నాడు విదర్భరాజు.

అప్పుడు అగస్త్యుడు విదర్భరాజు వద్దకు పోయి లోపాముద్రను తనకు ఇచ్చి వివాహం చెయ్యమని అడిగాడు. "అయ్యో! ఆ నిరుపేద బ్రాహ్మడా నా కూతురికి భర్త. ఆమెకూడా నార బట్టలు కట్టు కోవల సిందేనా అని పరిత పించాడు. అప్పుడు లోపాముద్ర తండ్రి వద్దకు వచ్చి "తండ్రీ! నన్ను అగస్త్యునికి ఇచ్చి వివాహం చెయ్యండి." అని అడిగింది.

చేసేది లేక విదర్భరాజు లోపాముద్రను అగస్త్యునికి ఇచ్చి వివాహం చేసాడు. లోపాముద్ర భర్తవెంట నారచీరలు ధరించి వెళ్ళింది.

ఒకరోజు అగస్త్యుడు లోపాముద్రను చూచి మోహితుడై ఆమెతో సంభోగించదలిచాడు. అప్పుడు లోపాముద్ర భర్తకు నమస్కరించి "నాధా! సంతానార్ధము భర్త భార్యతో కలవడం సహజము. కాని తమరు నన్ను సకలాలంకార భూషితను చేసి నాకు గర్భాదానము చెయ్యమని నా ప్రార్థన" అని అడిగింది.

అప్పుడు అగస్త్యుడు "నావద్ద ధనము, ఆభరణములు లేవు. వాటి కొరకు నా తపశ్శక్తిని వృధా చెయ్యడం నాకు ఇష్టంలేదు." అని చెప్పి ధనం కోసం అగస్త్యుడు శ్రతర్వుడు అనే రాజు వద్దకు వెళ్లాడు.

శ్రతర్వుడు తన వద్ద ధనం లేదన్నాడు. అప్పుడు, శ్రతర్వుడు, అగస్త్యుడు కలిసి, బ్రదశ్వుడు అనే రాజు దగ్గరకు వెళ్లి ధనం అడిగారు. ఆ రాజుకూడా తనకు ఆదాయ వ్యయాలు సమానము, మిగులు ధనం లేదు అన్నాడు.

తర్వాత, ఆ ముగ్గురూ త్రసదస్యుడి వద్దకు వెళ్లి ధనం అడిగారు. ఆయనకూడా తనకు మిగులు ధనం లేదన్నాడు. కాని ఇలా అన్నాడు.

"మునీంద్రా! ఇల్వలుడు అనే వాడు ఉన్నాడు. అతను గొప్ప ధనవం తుడు. అతను మీ కోరిక తీరుస్తాడు" అని అన్నాడు. వెంటనే అందరూ ఇల్వలుడి వద్దకు వెళ్లారు.అగస్త్యుడు ఇల్వలుని ధనం అడిగాడు. ఇల్వలుడు మామూలుగా, వాతాసిని మేకగామార్చి, వండి వడ్డించాడు. ముందు అగస్త్యుని తినమన్నాడు. ఈ విషయం మిగిలిన రాజఋషులు గ్రహించారు. "మునీంద్రా! ఈ ఇల్వలుడు తన తమ్ముని వాతాపిని మేకగా మార్చి వండి వడ్డించాడు. తరువాత వాతాపి మీ పొట్టను చీల్చుకొని వస్తాడు. అందు వలన మనం ఇక్కడ భోజనం చెయ్యరాదు" అని చెప్పారు. అగస్త్యుడు చిరునవ్వునవ్వి ఆ భోజనం మొత్తం తినేసాడు. ఇల్వలుడు తన తమ్ముని "వాతాపీ! బయటకు రా!" అని పిలిచాడు. అగస్త్యుడు పొట్ట తడుముకుంటూ బ్రేవ్‌మని త్రేన్చాడు. అంతే! వాతాపి అగస్త్యుని కడుపులో జీర్ణం అయిపోయాడు.

(అందుకే మన ఇళ్లలో తల్లులు, పసిబిడ్డలకు ఉగ్గుపాలు పట్టినా, పాలు పట్టినా, ఇంకా ఏదైనా ఆహారం పెట్టిన తరువాత ఆ బిడ్డ పొట్ట మీద నిము రుతూ "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం", అంటారు. అంటే తిన్నది అంతా జీర్ణం కావాలి అని అర్ధం).

తన తమ్ముడు వాతాపి జీర్ణం కావడం చూచి ఇల్వలుడు భయపడ్డాడు. "అయ్యా మీరు కోరిన ధనం ఇస్తాను" అని అన్నాడు. ఆ ధనంతో అగస్త్యుడు లోపాముద్ర కోరిక తీర్చాడు.

అప్పుడు అగస్త్యుడు లోపాముద్రను అడిగాడు. "నీకు పది మందితో సమానమైన నూర్గురు కొడుకులు కావాలా? లేక నూరు మందితో సమానమైన పదిమంది కావాలా? లేక వేయి మంది కొడుకులు కావాలా? లేక వేయి మందితో పమానమైన ఒక్క కొడుకు కావాలా?" అని అడిగాడు.

దానికి లోపాముద్ర "నాకు వేయిమందితో సమానమైన బలవంతుడు, బుద్ధిమంతుడు అయిన ఒక్క కొడుకును ప్రసాదించండి." అని అడిగింది.

తరువాత లోపాముద్ర గర్భం దాల్చింది. దృఢస్యుడు అనే తేజస్వి, గుణవంతుడు అయిన కొడుకును కన్నది.

ఆవిధంగా అగస్త్యుడు తన పితృదేవతలకు పుణ్యలోక ప్రాప్తి కలిగించాడు.

# మహా భారతము

## అరణ్య పర్వము

## ద్వితీయాశ్వాసము

## సంపూర్ణము.

ఓం తత్సత్

# మహాభారతం

## అరణ్య పర్వము

### తృతీయాశ్వాసము.

పాండవులలో మధ్యముడు అర్జునుడు. అర్జునుని కుమారుడు అభిమన్యుడు. అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తు మహారాజు. ఆ పరీక్షిత్తు మహారాజు కుమారుడే జనమేజయుడు. జనమేజయుడు సర్పయాగం చేసాడు. ఆ సమయంలో  వేదవ్యాసుని శిష్యుడైన వైశంపాయనుడు, మహా భారత కథను జనమేజయ మహారాజుకు వినిపించాడు. అప్పుడు, రోమ హర్షుణి కుమారుడైన ఉగ్రశ్రవసుడు (సూతి) ఆ మహా భారత కథను విన్నాడు.  తను విన్న మహా భారత కథను, శౌనక మహర్షి సత్రయాగం చేసిన సందర్భంలో, శౌనకాదిమహా మునులకు వినిపించాడు.

ఆ ప్రకారంగా, మహా భారత కథను,  నైమిశారణ్యంలో,  శౌనక మహర్షి ఆశ్రమంలో, రోమహర్షుణి కుమారుడైన ఉగ్రశ్రవసుడు (సూతి) అనే పౌరాణి కుడు, శౌనకాది మహా మునులకు ఇలా చెప్పసాగాడు.

ధర్మరాజు కోరిక మేరకు రోమశ మహార్షి అగస్త్య మహాముని కథను సవిస్తరంగా చెప్పాడు.

కృతయుగంలో వృత్రాసురుడు అనే రాక్షసుడు ఉండే వాడు. వాడు తన అనుచరులు అయిన కాలకేయులు అనే రాక్షసులతో కలిసి, దేవతలను పీడిస్తుండేవాడు. దేవతలు అందరూ బ్రహ్మదేవుని వ ద్దకు వెళ్లి వృత్రాసురుని చంపడానికి మార్గం చెప్పమన్నారు.

అప్పుడు బ్రహ్మ దేవుడు వారిని చూచి "మీరు సరస్వతీ నదీ తీరంలో తపస్సు చేసుకుంటున్న దధీచి అనే మహార్షి దగ్గరకు వెళ్లండి. ఆయన తన ఎముకలు మీకు దానం చేస్తాడు. ఆ ఎముకలతో చేసిన ఆయుధాలతో మీరు వృత్రాసురుని సంహరించండి" అని చెప్పాడు.

దేవతలు దధీచి దగ్గరకు వెళ్లి ఆయన ఎముకలు ఇవ్వమని అడిగారు. ఆ మహా ముని తన ప్రాణాలు విడిచి, తన ఎముకలను దానం చేసాడు.

అందులో ఉన్న ఒక ఎముకతో త్వష్ట అనే ప్రజాపతి, వజ్రాయుధాన్ని తయారు చేసాడు. ఆ వజ్రాయుధంతో ఇంద్రుడు వృత్రాసురుడిని సంహరించాడు.

వృత్రాసురుని అనుచరులైన కాలకేయులు  ఇంద్రుడికి భయపడి పగలంతా సముద్రంలో దాక్కుని, రాత్రి వేళల్లో బయటకు వచ్చి జనులను ఋషులను బాధిస్తుండే వాళ్లు.

అప్పుడు   ఇంద్రుని తో సహా దేవతలు విష్ణు మూర్తి దగ్గరకు వెళ్లి మొర పెట్టుకున్నారు.

అప్పుడు విష్ణువు వారితో ఇలా అన్నాడు.  " కాలకేయులు మహా బలవంతులు. పైగా సముద్రం లో ఉన్నారు. కాబట్టి వారిని సంహరించడం వీలు కాదు. సముద్రం లోని నీరు ఇంకి పోతే సంహరించవచ్చు.   కాబట్టి మీరు అగస్త్యుని వద్దకు వెళ్లండి. తరుణోపాయం అడగండి"  అని చెప్పాడు.

దేవతలు అగస్త్యుని వద్దకు వెళ్లి తమ కష్టాలను చెప్పి "మహాను భావా! పూర్వం వింధ్య  పర్వతము పెరిగి జగత్తుకు విపత్తుగా పరిణమించినపుడు తమరే కదా ఆ కీడును తొలగించినది. అదే ప్రకారం  ఇప్పుడు కూడా మాకు ~~ఈ~~ కష్టాన్ని తొలగించండి." అని ప్రార్థించారు.

ఇది విని ధర్మరాజు, "అయ్యా! వింధ్య పర్వతము ఏమిటి? పెరగటం ఏమిటి? వివరించండి." అని అడిగాడు.

అప్పుడు రోమశుడు ధర్మరాజుతో ఇలా చెప్పసాగాడు.

ప్రతి రోజూ సూర్యుడు మేరు పర్వతానికి ప్రదక్షిణం చెయ్యడం ఆనవాయితీ.  అది చూచి వింధ్య పర్వతానికి ఆగ్రహం కలిగింది.

"సూర్య దేవా! కొండలకు నేను రాజును. నాకు ప్రదక్షిణం చెయ్యకుండా నువ్వు ఆ మేరు పర్వతానికి ఎందుకు ప్రదక్షిణం చేస్తున్నావు." అని గర్వంతో పలికాడు.

దానికి సూర్యుడు "ఇది నేను బ్రహ్మ దేవుని ఆజ్ఞాను సారం చేస్తున్నాను." అని పలికాడు.

ఆ మాటలకు వింధ్య పర్వతానికి కోపం వచ్చింది. అలాగే పై పై కి ఎదిగా పోయాడు. సూర్యుడు చంద్రుడు తిరిగే మార్గాలు నిరోధించాడు.
అప్పుడు సూర్యుడు, చంద్రుడు తమ తమ  విధులు నిర్వర్తించలేక పోయారు. లోకమంతా చీకటి  అయింది. లోకాలు అల్ల కల్లోలం అయ్యాయి. దేవతలంతా అగస్త్యుని వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు.

అప్పుడు అగస్త్యుడు తన భార్య లోపాముద్రతో కలిసి వింధ్య పర్వతము వద్దకు వచ్చాడు.

“ఓ వి oధ్య పర్వతమా! నేను నా భార్య దక్షిణ దిక్కుగా వెళుతున్నాము. మాకు దారి ఇవ్వు” అని అడిగాడు.

దానికి వింధ్య పర్వతము, అలాగే అని భూమికి సమానంగా దిగాడు. అగస్త్యుడు వింధ్య పర్వతము దాటి వెళుతూ “వింధ్యా! నేను తిరిగి వచ్చువరకు ఇలాగే ఉండుము” అని అన్నాడు.

అప్పటి నుండి వి oధ్య పర్వతము ఎదగడం ఆగిపోయింది. అగస్త్యముని ఆగమనం కోసం నిరీక్షిస్తూ వింధ్య పర్వతము అలాగే ఉన్నాడు. అని రోమశుడు తెలియచేసాడు.

తరువాత అసలుకథ చెప్పసాగాడు. అప్పుడు అగస్త్యుడు దేవతలను చూచి “ మీకు వచ్చిన అపాయం ఏమిటి? దానికి నేనేమి చెయ్యాలి?” అని అడిగాడు.

అప్పుడు దేవతలు అగస్త్యునితో సముద్ర జలాన్నిపానం చేయమని కోరారు. అగస్త్యుడు సముద్రం వద్దకు వెళ్లి సముద్ర జలాన్ని అంతా తాగేశాడు.

అప్పుడు సముద్రంలో ఉన్న జలచరాలు, వాటి తో పాటు కాలకేయుడు మొదలైన రాక్షసులు బయటపడ్డారు. దేవతలు వారితో యుద్ధం చేసి వారిని చంపారు. చావగా మిగిలిన వారు పాతాళానికి పారిపోయారు.

అప్పుడు దేవతలు అగస్త్యుని చూచి "దేవా! మీ దయవలన రాక్షస బాధ తప్పింది. మరల సముద్రాన్ని జలంతో నింపండి" అని ప్రార్థించారు.

దానికి అగస్త్యుడు "దేవతలారా! అది నాకు సాధ్యం కాదు. సముద్రం నీరు అంతా నీ పొట్టలో ఇంకిపోయింది" అని చెప్పాడు.

దేవతలందరూ మరలా బ్రహ్మ దేవుని వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మ దేవుడు వారితో "అది ఇప్పుడు సాధ్యం కాదు. చాలా కాలం తరువాత భగీరథుడు అనే మహా ఋషి ఈ సముద్రాన్ని జలంతో నింపగలడు" అని చెప్పాడు. అని రోమశుడు ధర్మరాజుతో చెప్పాడు.

అప్పుడు ధర్మరాజు "మహర్షీ! భగీరథుడు ఎలా సముద్రాలను జలంతో నింపాడు?" అని అడుగగా, రోమశుడు ఇలా చెప్పసాగాడు.

"ధర్మజా! పూర్వం ఇక్ష్వాకు వంశంలో సగరుడు అనే రాజు ఉండేవాడు. అతనికి ఇద్దరు భార్యలు. వారు వైదర్భి. శైబ్య. అతనికి సంతానం లేదు. అందు కని సగరుడు కైలాసం వెళ్లి శివుడిని ప్రసన్నం చేసుకున్నాడు. తనకు సంతానం ప్రసాదించమని అర్థించాడు. శివుడు అలాగే అని వరము ఇచ్చాడు.

తరువాత సగరుని ఇద్దరు భార్యలు గర్భం ధరించారు. వైదర్భి గర్భాన  ఒక అలాబూ ఫలము (ఆనప కాయ) పుట్టింది.  శైబ్య గర్భాన అసమంజసుడు అనే కొడుకు పుట్టాడు.

అప్పుడు ఆకాశవాణి ఇలా పలికింది. “రాజా ఆ కాయలో ఉన్న విత్తనములను ఒక నేతికుండలో పెట్టి కాపాడుము. అందులో నుండి నీకు అరవై వేల మంది పుత్రులు జన్మిస్తారు” అని పలికింది.

అలాగే సగరునికి అరవై వేల మంది కుమారులు జన్మించారు. ఆ అరవై వేల మంది పెరిగి పెద్ద వారై లోక కంటకులుగా తయారయ్యారు.  దేవతలను, ఋషులను బాధిస్తున్నారు.

అప్పుడు దేవతలు బ్రహ్మ దేవుని వద్దకు వెళ్లి మొర పెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మ దేవుడు దేవతలను చూచి “వారి గర్వం  ఎక్కువ కాలం ఉండదు. త్వరలో వారు చనిపోతారు” అని చెప్పాడు.

ఇంతలో సగరుడు అశ్వమేధ యాగం చెయ్యడానికి సంకల్పించాడు. యాగాశ్వమును రక్షించే బాధ్యతను కొడుకులకు అప్పగించాడు.   ఆ యాగా శ్వము లోకమంతా తిరిగి నీళ్లులేని సాగరంలో దూకి అదృశ్యం అయింది.

సగరుడి కొడుకులు యాగాశ్వంకోసం సముద్రాన్ని తవ్వారు. వారికి ఈశాన్య దిక్కుగా ఉన్న కపిల మహాముని ఆశ్రమం సమీపంలో యాగాశ్వం కనిపించింది. కపిలుడే తమ అశ్వాన్ని దొంగిలించాడని సగరుని కుమారులు ఆయనను అవమానించారు. ఆ మహా ముని కోపాగ్ని కి భస్మం అయ్యారు.

ఆ సంగతి నారదుని వలన సగరునికి తెలిసింది. సగరుడు దుఃఖించాడు. ఆ సమయానికి శైబ్య కుమారుడు అయిన అసమంజసునికి ఒక కుమారుడు కలిగాడు. అతని పేరు అంశుమంతుడు.

సగరుడు తన మనుమడు అంశుమంతుని చూచి "నాయనా! నా కొడుకులు చనిపోయినందుకు నేను బాధపడను. కాని అశ్వమేధ యాగం సగంలో ఆగిపోయింది. దానిని నీవు పూర్తి చెయ్యి" అని కోరాడు.

అలాగే అని అంశుమంతుడు సాగర తీరానికి వెళ్లాడు. అక్కడ కపిల మహాముని ఆశ్రమం చూచాడు. కపిల మహర్షికి నమస్కరించి తను వచ్చిన పని చెప్పాడు. కపిల మహర్షి యాగాశ్వాన్ని అప్పగించాడు.

"అంశుమంతా! నీ చేత తేబడిన ఈయాగాశ్వంతో నీ తాత సగరుడు అశ్వమేధం పూర్తి చేస్తాడు. నీ మనుమడు భగీరథుడు గంగను భూమి మీదకు తెచ్చి సాగరాన్ని నింపుతాడు." అని పలికాడు. అంశుమంతుడు యాగాశ్వాన్ని తాత గారికి ఇచ్చాడు. సగరుడు అశ్వమేధం పూర్చి చేసాడు. సముద్రాన్ని తన

కుమారునిగా స్వీకరించాడు. అప్పటినుండి సముద్రానికి సాగరం అని  పేరు వచ్చింది.

అంశుమంతుని కుమారుడు దిలీపుడు. దిలీపుని కుమారుడు భగీ రథుడు. భగీరథుడు జనరంజకంగా రాజ్యం చేసాడు.

భగీరథుడు సగరుని వృత్తాంతం తెలుసుకున్నాడు.  సాగరాన్ని జలాలతో నింపాలని అనుకున్నాడు. హిమాలయాలకు వెళ్లాడు. గంగా దేవిని  గూర్చి ఘోర తపస్సు చేసాడు. గంగాదేవి ప్రత్యక్షం అయింది.

“అమ్మా నీవు  ఆ దేవ మార్గాన్ని వదలి భూమికి దిగిరావాలి. సాగరాన్ని జలాలతో నింపాలి. సగర పుత్రులకు మోక్షం కలిగించాలి” అని కోరాడు.

“అలాగే వస్తాను. కాని నేను భూమికి దిగేటప్పుడు నా ఉధృతిని భరించేవాడు ఆ పరమశివుడు ఒక్కడే. కాబట్టి ముందు నీవు శివుని ప్రసన్నం చేసుకో” అంది గంగ.

తరువాత భగీరథుడు కైలాసానికి వెళ్లి శివుని ప్రార్ధించాడు.

శివుడు భగీరథునితో “నీవు గంగను తీపుకొనిరా. నేను భరిస్తాను” అని అన్నాడు.

మరల భగీరథుడు గంగను ప్రార్ధించాడు. గంగ భగీరథుని వెంట భూమికి దిగి వచ్చింది. శివుడు  ఉధృతంగా దుముకుతున్న గంగను తన జటాజూటంలో ధరించాడు.

తరువాత, గంగ శివుని జటాజూటంనుండి భూమి మీదికి దిగి వచ్చింది. సాగరాన్ని తన జలాలతో నింపింది. అప్పటినుండి గంగానదికి భాగీరథి అనే పేరుకూడా వచ్చింది." అని రోమశుడు గంగావతరణం వృత్తాంతాన్ని ధర్మరాజుకు వివరించాడు.

తరువాత ధర్మరాజు గంగ, నంద, అపరనంద, నదులలో స్నానం చేశాడు. తరువాత వారు హేమకూట పర్వతం చేరుకున్నారు. అక్కడ రాళ్లనుండి అగ్ని పుడుతూ ఉంది. ఆ అగ్నికి మేఘాలు  ఆకర్షితమవుతున్నాయి.

తరువాత వారు విశ్వామిత్రుని  ఆశ్రమం చేరుకున్నారు. అక్కడికి దగ్గరలో ఉన్న ఋష్య  శృంగుని సరోవరం చూచారు.

దానిని గురించి రోమశుడు ధర్మరాజు తో ఇలా చెప్పసాగాడు.

"ధర్మజా! కశ్యపుని కుమారుడు విభాండకుడు. అతను ఒక రోజు చెరువులో స్నానం చేస్తున్నాడు.  ఆసమయంలో అతనికి దేవకాంత ఊర్వశి కనిపించింది.

అతనికి మదన వికారం కలిగింది. అతని రేతస్సు ఆ సరస్సులో పడి పోయింది. అతని రేతస్సు కలిసిన నీటిని ఒక దుప్పి తాగింది. గర్భం ధరించింది. ఆ దుప్పికి ఋష్య శృంగుడు జన్మించాడు. అతనికి తన తండ్రి, అడవి తప్ప వేరే ప్రపంచం తెలియదు. అలా పెరుగు తున్నాడు.

ఆ సమయంలో అంగదేశాన్ని రోమపాదుడు పరిపాలిస్తున్నాడు. అతను తన పురోహితునికి చేసిన అపరాధం వలన, ఆ దేశంలో ఉన్న బ్రాహ్మణులు దేశం విడిచి పోయారు. అందుకని ఆ దేశంలో వర్షం కురవడం లేదు. అనావృష్ఠి సంభవించింది. తన తప్పు తెలుసుకున్న మహారాజు బ్రాహ్మణులను తిరిగి తన రాజ్యానికి పిలిపించాడు. వానలు కురవడానికి ఉపాయం చెప్పమన్నాడు.

వారు "రాజా! శాంత స్వభావుడైన ఋష్యశృంగుడు పాదం పెట్టిన చోట వర్షం కురుస్తుంది. కాబట్టి అతన్ని ఎలాగైనా మన దేశానికి రప్పించండి." అని చెప్పారు.

అప్పుడు అంగరాజు కొంతమంది వేశ్యలను పిలిచి ఎలాగైనా ఋష్యశృం గుని అంగ దేశానికి తీసుకురమ్మని చెప్పి పంపించాడు.

ఒకరోజు విభాండకుడు తన కుమారుడు ఋష్యశృంగుని ఆశ్రమంలో ఉంచి తను పళ్లు, సమిధల కొరకు అడవిలోకి వెళ్లాడు.

ఆ సమయంలో అంగ రాజు పంపిన  ఒక వేశ్య   ఆశ్రమానికి వచ్చింది. ఋష్యశృంగుడు ఆమెను తన మాదిరే ఋషికుమారుడు అనుకున్నాడు. ఆమెకు అతిథి సత్కారాలు  చేసాడు.

ఆ వేశ్య కన్య అతనిని తన ఇంటికి ఆహ్వానించింది. తనతో స్నేహం చెయ్యమని అడిగింది. అలా గైతేనే  అతను ఇచ్చిన అతిథి సత్కారాలను గ్రహిస్తాను అని చెప్పింది.

కల్లాకపటం తెలియని ఋష్యశృంగుడు అలాగే అన్నాడు.  ఆ వేశ్య తన ఆటపాటలతో అతనిని అలరించింది. తరువాత  ఆమె వెళ్లిపోయింది. ఋష్య  శృ ంగుడు ఆమెను మరువలేకపోయాడు. ఆమె ధ్యాసలో పడి అన్నం నీళ్లు మరిచిపోయాడు.

విభాండకుడు కొడుకు ను చూచి కారణం అడిగాడు. ఋష్యశృంగుడు జరిగింది చెప్పాడు. విభాండకుడు అసలు విషయం గ్రహించాడు.

“నాయనా! ఋషుల తపస్సు చెడగొట్టడానికి రాక్షసులు ఇలా మాయ వేషాలలో తిరుగుతుంటారు. జాగ్రత్తగా ఉండు” అని చెప్పాడు.

మరునాడు కూడా, తండ్రి ఆశ్రమంలో లేనపుడు మరల ఆ వేశ్య ఋష్య శృంగుని వద్దకు వచ్చింది. ఆమె మోహంలో పడి ఋష్యశృంగుడు తండ్రికి చెప్పకుండా ఆమె వెంట అంగరాజ్యానికి వెళ్లాడు.

ఋష్యశృంగుని రాకతో అంగ దేశంలో వానలు కురిసాయి. అంగరాజు రోమపాదుడు సంతోషించాడు. తనకుమార్తె శాంతను ఇచ్చి ఋష్యశృంగునికి వివాహం జరిపించాడు.

అక్కడ విభాండకుడు ఆశ్రమంలో ఋష్యశృంగుని జాడ తెలియక, అతనిని వెదుకుతూ అంగ దేశానికి వచ్చాడు. అక్కడ తన కొడుకును, కోడలిని చూచి సంతోషించాడు. వారిని తీసుకొని ఆశ్రమానికి వచ్చాడు.

ఋష్యశృంగుడు తన భార్య శాంతతో మునులను సేవించుకుంటూ సుఖంగా ఉన్నాడు" అని ఋష్యశృంగుని వృత్తాంతము రోమశుడు ధర్మరాజుకు వివరించాడు.

అక్కడినుండి ధర్మరాజు, కళింగ దేశంలో ఉన్న వైతరిణీనదిని సందర్శించాడు. అక్కడినుండి మహేంద్రపర్వతానికి వెళ్లాడు. అక్కడ ఉన్న ఋషులను చూచి ధర్మరాజు "మహానుభావులారా! ఇక్కడ పరశురాముడు ఉంటాడు అంటారు కదా. మీరు ఎప్పుడన్నా చూచారా?" అని అడిగాడు.

దానికి పరశురాముని శిష్యుడైన అకృత వర్ణుడు అనే ఋషి  ఈవిధంగా చెప్పాడు.  "ఓ ధర్మరాజా! రేపు చతుర్ధశి. ఆ రోజు మనము పరశురాముని చూడవచ్చును" అని చెప్పాడు.

దానికి ధర్మరాజు "ఓ మహర్షి! నాకు పరశురాముని చరిత్ర వినవలెనని ఉన్నది. వివరించండి." అని అడిగాడు.

దానికి అకృతవర్ణుడు ఇలా చెప్పసాగాడు.

పూర్వ కాలంలో కన్యాకుబ్జనగరాన్ని గాధి అనే రాజు పరిపాలించేవాడు. అతని కూతురు సత్యవతి. ఆమెను వివాహ మాడాలని భృగు మహర్షి కొడుకు ఋచీకుడు, గాధి రాజు వద్దకు వచ్చి కూతురిని ఇమ్మని అడిగాడు. దానికి గాధి రాజు  "మహాత్మా!  ఒకచెవి  నల్లగా మిగిలిన దేహం తెల్లగా ఉండే వేయి గుర్రాలను  కానుకగా ఇచ్చి నా  కూతురిని వివాహం చేసుకో"అని అన్నాడు.

అలాగే అని ఋచీకుడు వరుణుడిని ప్రార్ధించాడు. అప్పుడు గంగానది లోనుండి అలాంటి వేయి గుర్రాలు పుట్టాయి. అందుకని గంగా నదికి అశ్వ తీర్ధము అని పేరు వచ్చింది. ఆ గుర్రాలనుకానుకగా ఇచ్చి గాధి కూతురుని ఋచీకుడు వివాహమాడాడు.

ఒకరోజు భృగు మహర్షి వారి ఆశ్రమానికి వచ్చాడు. కొడుకును కోడలిని చూచి సంతోషించాడు. కోడలిని ఒక వరం కోరుకోమన్నాడు.

ఆమె మామ గారిని చూచి "నాకు ఒక కుమారుడు, నా తల్లికి ఒక కుమారుడు వరంగా ప్రసాదించండి." అని అడిగింది.

అలాగే అన్నాడు భృగువు. "మీరు ఇరువురూ స్నానం చేసి, నీవు మేడి చెట్టును, నీ తల్లి అశ్వత్థ వృక్షాన్ని కౌగలించుకోండి. మీ కోరిక తీరుతుంది." అని చెప్పాడు.

అలాగే అని సత్యవతి, ఆమె తల్లి స్నానం చేసి ఆ తొందరలో పొరపాటున, సత్యవతి అశ్వత్థ వృక్షాన్ని, ఆమె తల్లి మేడి చెట్టును కౌగలించు కున్నారు.

ఆ విషయం తెలిసిన భృగువు కోడలితో ఇలా అన్నాడు.

"అమ్మా! నీకు బ్రహ్మకుల పూజ్యుడు అయిన కుమారుడు పుడతాడు. కాని దారుణమైన క్షాత్రధర్మాన్ని అవలంబిస్తాడు. నీ తల్లికి, ఒక క్షత్రియ కుమారుడు జన్మిస్తాడు. కాని అతడు మహా తపశ్శాలి, బ్రహ్మజ్ఞాని అవుతాడు." అని చెప్పాడు.

అప్పుడు సత్యవతి మామగారిని చూచి దారుణమైన క్షాత్రము తన కొడుకుకు కాక, తన మనుమడికి వచ్చేట్టు అనుగ్రహించమని కోరింది. అలాగే అని భృగువు వరం ఇచ్చి వెళ్లిపోయాడు.

సత్యవతి కొంతకాలానికి గర్భం ధరించి, జమదగ్ని అనే కుమారుని కన్నది. ఆ జమదగ్ని ప్రసేనజితుడు అనే రాజు కుమార్తె రేణుక అనే కన్యను వివాహ మాడాడు. వారికి, రుమణ్వంతుడు, సుషేణుడు, వసుడు, విశ్వావసుడు, రాముడు అనే ఐదుగురు కుమారులు కలిగారు.

ఒకరోజు జమదగ్ని భార్య రేణుక నీటికోసం ఒక సరస్సుకు వెళ్లింది. ఆసమయంలో చిత్రరథుడు అనే రాజు తన రాణులతో ఆ సరస్సులో జలకాలాడుతున్నాడు. ఆ రాజును చూచి రేణుక మనసు చలించింది. కామ ప్రకోపం పొందింది. మానసికంగా వ్యభిచరించింది.

ఈ విషయం తెలిసిన జమదగ్ని కోపించాడు. తన భార్యను చంపమని వరుసగా తన నలుగురు కొడుకులను ఆదేశించాడు. కాని వారు తల్లిని చంపడం మహాపాతకము అని ఒప్పుకోలేదు. దానికి కోపించి వారిని అడవిలో మృ గప్రాయులుగా తిరగమని శపించాడు.

ఐదవ వాడైన రాముని చూచి జమదగ్ని, తన భార్య రేణుకను చంపమన్నాడు. రాముడు మారు చెప్పకుండా తన చేతిలో ఉన్న గొడ్డలితో తన తల్లి రేణుక తల నరికాడు.

జమదగ్ని రాముడు చేసిన పనికి సంతోషించాడు. "నా మాట నెరవేర్చావు. నీకు ఏం వరం కావాలో కోరుకో!" అన్నాడు.

దానికి రాముడు “తండ్రీ!ముందు నా తల్లిని బతికించండి తరువాత, నా అన్నల శాపవిముక్తుల గావించండి. నాకు అమితమైన బలం ప్రసాదించండి. యుద్ధంలో నాకు ఎవరూ  ఎదురు నిలువకూడదు. నాకు దీర్ఘాయుష్షు ప్రసాదించండి.”  అని కోరాడు.

జమదగ్ని సంతోషించి రామునికి అతను కోరిన వరాలు అన్నింటిని అనుగ్రహించాడు.

ఆ తరువాత కొంత కాలానికి కార్తవీర్యార్జునుడు అనే రాజు  సహస్ర బాహువుగా ప్రసిద్ధి కెక్కాడు. అతడు ఒక నాడు వేటాడుతూ అలసిపోయి, జమదగ్ని ఆశ్రమానికి వచ్చాడు. జమదగ్ని అతనికి అన్ని సపర్యలు చేసాడు.

కాని కార్తవీర్యుడు రాజ్య మదంతో, గర్వంతో జమదగ్నిని, ఇతర ఋషులను అవమానించాడు. జమదగ్ని ఆశ్రమంలో ఉన్న హోమధేనువును, దాని దూడను కూడా తీసుకొని పోయాడు.

ఆసమయంలో రాముడు ఆశ్రమంలో లేడు. రాముడు ఆశ్రమానికి రాగానే జరిగినది అంతా  జమదగ్ని రామునికి చెప్పాడు. రామునికి కోపం వచ్చింది. కా ర్తవీర్యార్జునుని వెంటాడి అతని సైన్యాన్ని  ఓడించి, అతనిని వధించాడు.

కార్తవీర్యుని కొడుకులు రాముని మీద పగబట్టారు. కాని అతనిని ఏమీ చెయ్యలేక, రాముడు ఆశ్రమంలో లేని సమయమున, ఆశ్రమానికి వచ్చి, జమదగ్నిని చంపారు. ఆశ్రమాన్ని నాశనం చేసారు. ఆశ్రమంలో ఉన్న ఋషులను నిందించారు.

రాముడు ఆశ్రమానికి రాగానే భర్త శవంమీద పడి రోదిస్తున్న తల్లిని చూచాడు. జరిగింది తెలుసుకున్నాడు. "నీచులయిన కార్తవీర్యుని కొడుకులు అనఘుడు, వీతరాగుడు, కరుణాత్ముడు ప్రశాంత చిత్తుడు అయిన నా తండ్రిని బుద్ధిపూర్వకంగా చంపారు. కాబట్టి నేను దుర్జనులయిన క్షత్రియులను అందరిని చంపుతాను." అని ప్రతిజ్ఞ చేసాడు.

ఆ ప్రకారం భూలోకంలో ఉన్న క్షత్రియులనందరిని సంహరించి, ఆ భూమిని అంతా కశ్యపునకు దానం ఇచ్చాడు. తరువాత, విరాగియై మహేంద్రగిరి మీద తపస్సు చేసుకుంటున్నాడు" అని పరశురాముని అనుచరుడైన అకృతవ్రణుడు ధర్మరాజుతో చెప్పాడు.

తరువాత ధర్మరాజు చతుర్దశి నాడు పరశురాముని దర్శించి అక్కడ నుండి, దక్షిణదిశగా ప్రయాణం అయ్యాడు.

త్ర్యంబకంలో పుట్టిన గోదావరి నదిని సందర్శించాడు. అక్కడ నుండి ప్రభాస తీర్థానికి వెళ్లాడు.

పాండవుల రాకను తెలుసుకున్న శ్రీకృష్ణుడు, బలరాముడు వారిని చూడటానికి ప్రభాస తీర్థానికి వచ్చారు.

ధర్మరాజు తాము పడుతున్న కష్టాలు, అర్జునుడు ఇంద్రలోకంలో ఉండటం అన్ని వివరించాడు.

పాండవులను చూచి బలరాముడు "ఆ ధృతరాష్ట్రుడు బుద్ధిలేని వాడై ఇంతటి పాపానికి ఒడిగట్టాడు. మిమ్మల్ని అడవులకుపంపాడు. కాబట్టి మనం అందరం ధర్మరాజు పక్షాన నిల్చి అతని రాజ్యాన్ని అతనికి వచ్చేట్టు చెయ్యాలి." అని తనతో వచ్చిన వృష్టి రాజులతో పలికాడు.

ఆ మాటలు విని సాత్యకి బలరామునితో ఇలా అన్నాడు. "అనుపమ శౌర్యవంతులు, అమిత బలం కలవారు అయిన మీరు, శ్రీకృష్ణుడు, సాంబుడు, సారణుడు, లాంటి మహావీరులు ఉండగా, పాండవులు ఇలా అడవులలో తిరగడం భావ్యమా! భయంకరమైన మన యాదవ సేనల ధాటికి కౌరవ సేనలు తట్టుకోగలవా! మనము, కేకయులు, సృంజయులు, పాంచాలురు, వృష్ణి, భోజ, అంధక మహావీరుల తో కలిసి, శ్రీకృష్ణుడి అనుమతితో కౌరవుల మీదికి దండెత్తి వారిని సంహరించి, ధర్మరాజును రాజ్యాభిషిక్తుని చేస్తాము. అంతవరకు అభిమన్యుని అఖిలరాజ్య రక్షకునిగా నిలుపుదాము. ఏమంటారు?" అని ఆవేశంగా అన్నాడు.

దానికి ధర్మరాజు "అయ్యా! మేము ఒక నియమం ప్రకారం ఆరణ్య వాసం చేస్తున్నాము. కాబట్టి మీరు శాంతించండి." అని యాదవ వీరులను శాంతింప చేసాడు. తరువాత బలరాముడు, శ్రీకృష్ణుడు మిగిలిన రాజులతో కలిసి ద్వారకకు వెళ్లారు.

ధర్మరాజు అక్కడి నుండి బయలుదేరి పయోష్ణి నదిలో స్నానం చేసాడు. అక్కడినుండి వారు నర్మదా నదీ తీరానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న వైడూర్య పర్వతాన్ని చూచి, ఆ స్థల మహాత్యాన్ని రోమశుడు ధర్మరాజుతో ఇలా చెప్పసాగాడు.

"ధర్మజా! భృగు మహర్షి కుమారుడైన చ్యవనుడు ఈ ప్రదేశంలో చాలాకాలం తపస్సుచేసాడు.అప్పుడు ఆ ముని శరీరం పుట్టలతో తీగలతో కప్పబడిపోయింది.

ఒక రోజు శర్యాతి మహారాజు తన రాణి వాసంతో ఆ ప్రాంతానికి వన విహారానికి వచ్చాడు. ఆ మహారాజు కుమార్తె సుకన్య ఆడుతూ పాడుతూ చ్యవనుడు తపస్సు చేసుకుంటున్న ప్రాంతానికి వచ్చింది. ఆపుట్టలలో ఉన్న చ్యవనుని కళ్లు మిణుకు మిణుకు మంటూ మెరుస్తున్నాయి.

అది చూచి ఆ మె ఆశ్చర్యపోయి ఆ పుట్టను తవ్వించింది. దానికి కోపించి చ్యవనుడు వారికి వారి సైన్యానికి, తన తపశ్శక్తితో మూత్రము, పురీషము

నిరోధింపచేసాడు.   ఈ సంగతి తెలుసుకొని శర్యాతి మహారాజు వచ్చి  తన కుమార్తె తెలియక  చేసిన తప్పు మన్నించమని, చ్యవనుని క్షమాపణ కోరాడు.

అలాగే అన్నాడు చ్యవనుడు కాని రాజకుమార్తె అయిన సుకన్యను తాను వివాహ మాడిన గాని క్షమించను అని చెప్పాడు.

అలాగే అని శర్యాతి మహారాజు తన కుమార్తె సుకన్యను చ్యవనుని కి ఇచ్చి వివాహం చేసాడు. సుకన్య చ్యవనుని ఆశ్రమంలో అతనికి సేవలు చేస్తూ ఉంది.

ఒక రోజు అశ్వినీ దేవతలు ఆ ఆశ్రమానికి వచ్చారు. సుకన్యను చూచారు.

“ అమ్మా నీవు  ఎవరు?” అని అడిగారు.

దానికి సుకన్య “అయ్యా! నేను శర్యాతి మహారాజు కుమార్తెను. చ్యవనుని భార్యను.” అని చెప్పింది.

దానికి వారు ఆశ్చర్యపోయారు.  “నీవంటి అతిలోక సుందరికి చ్యవనుని లాంటి వృద్ధుడా భర్త. వీలు లేదు. ఇంక నైనా నీ అందానికి తగ్గ వరుని కోరుకో. మేము వాడిని తీసుకొని వస్తాము” అని చెప్పారు.

దానికి సుకన్య కోపించి " నాకు నా భర్తమీద ప్రేమ ఉంది. మీరు ఇలా పలకడం భావ్యం కాదు." అని చెప్పింది.

తరువాత, జరిగినది అంతా భర్తకు చెప్పింది. చ్యవనుడు ఆమె పతిభక్తికి సంతోషించాడు.

"సుకన్యా! నీవు కూడా వారు చెప్పినట్టు చెయ్యి వచ్చుకదా!" అని అన్నాడు.

"మీ అనుమతి అయితే చేస్తాను." అంది సుకన్య.

అశ్వినులను చూచి "నాకు నవయవ్వనవంతు డైన వరుని ప్రసాదించండి." అని అడిగింది.

అప్పుడు అశ్వినీ దేవతలు ఈ కొలనులో ప్రవేశించారు. వారితో పాటు చ్యవనుడు కూడా ఈ కొలనులో ప్రవేశించాడు. కొలనులో నుండి ముగ్గురు అందమైన నవయౌవనులు బయటకు వచ్చారు.

వారు సుకన్యను చూచి "మా ముగ్గురిలో నీకు నచ్చిన వాడిని కోరుకో!" అని అన్నారు.

సుకన్య ఆ ముగ్గురిలో తన భర్త ఐన చ్యవనుని వరించింది. అప్పుడు చ్యవనుడు అశ్వినులను చూచి "అయ్యా మీవలన నేను యవ్వన వంతుడ నైనాను. దానికి ప్రతిఫలంగా నేను శర్యాతి మహారాజు చేసే యజ్ఞంలో దేవేంద్రుడు చూస్తూ ఉండగా మీ చేత సోమరసం తాగిస్తాను." అని అన్నాడు. అశ్వినుడు సంతోషించి వెళ్లిపోయారు.

తన అల్లుడు నవయవ్వనవంతుడు అయ్యాడని తెలిసి శర్యాతి మహారాజు చూడ్డానికి వచ్చాడు.

అప్పుడు చ్యవనుడు ఆ మహారాజును చూచి "రాజా! నీ చేత ఒక మహా యజ్ఞాన్ని చేయిస్తాను." అని అన్నాడు.

శర్యాతి "సరే!" అన్నాడు.

ఆ మహా యజ్ఞంలో చ్యవనుడు అనుకున్నమాట ప్రకారం అశ్వినులకు సోమరసం ఇచ్చాడు. దానికి ఇంద్రుడు అభ్యంతరం చెప్పాడు.

"వారు కేవలం దేవతలకు వైద్యం చేసేవారు. వారు దేవతలు కారు. కాబట్టి మాతో సమానంగా సోమరసానికి అర్హులు కారు" అన్నాడు.

కాని చ్యవనుడు ఇంద్రుడి మాటలు పాటించక అశ్వినులకు సోమరసం ఇచ్చాడు.

దానికి ఇంద్రుడు కోపించాడు. చ్యవనుని మీదికి తన వజ్రాయుధం ఎత్తాడు. చ్యవనుడు తన తపశ్శక్తితో ఆ వజ్రాయుధాన్ని నిలువరించాడు. వెంటనే హోమం చేసి అందులో నుండి ఒక భయంకరా కారుడిని పుట్టించాడు. ఆ రాక్షసుడు దేవేంద్రుని మీదికి వస్తున్నాడు.

అది చూచి దేవేంద్రుడు భీతి చెందాడు. "మహర్షీ! నీ తపశ్శక్తి తెలియక అపరాధం చేసాను. నన్ను క్షమించు. నేటినుండి అశ్వినులు కూడా సోమ రసానికి అర్హులు." అని ప్రకటించాడు.

ఆ మాటలకు చ్యవనుడు ప్రసన్నుడు అయ్యాడు. దేవేంద్రుడు దేవలోకం వెళ్లాడు.

చ్యవనుడు సృష్ఠించిన ఆ రాక్షసుడు పోవడానికి వేరు దారిలేక, కాముకు లైన స్త్రీలలోనూ, మద్యములోనూ, అక్షముల (పాచికలు)యందును, మృగముల యందును, ఆశ్రయించాడు. అశ్వినులు సోమపానము చేసి దేవలోకమునకు వెళ్లారు." అని రోమ మహర్షి ఆ స్థల మహాత్మ్యమును వివరించాడు.

తరువాత, ధర్మరాజు సైంధవారణ్యములోనికి ప్రవేశించాడు. అక్కడ ప్రవహించుచున్న యమునా నదిని చూచి రోమశుడు ఇలా చెప్పసాగాడు.

ధర్మజా! ఇది యమున యను నది. గంగానది తో సమానమైనది. దీని తీరముననే మాంధాత అనే మహారాజు  ఎన్నో యాగాలు చేసాడు. ఆయన చరిత్ర చెపుతాను విను.” అని మాంధాత చరిత్ర చెప్పసాగాడు.

“పూర్వము ఇక్ష్వాకు వంశములో ధార్మికుడు, అమిత బలవంతుడు, ధర్మశీలుడు, కీర్తి వంతుడు అయిన యవనాశ్వుడు అనే రాజు ఉండేవాడు. అతనికి సంతానము లేదు. అతను భృగు మహర్షి   ఆశ్రమానికి వెళ్లి సంతానం కోసం అర్థించాడు. అతని కోరిక మన్నించి భృగు మహర్షి పుత్ర కామేష్టి యాగం చేసాడు.  మంత్రజలము నిండిన పాత్రను జాగ్రత్తగా కాపాడమని ఋత్విక్కులను నియోగించాడు.

కాని ఒక అర్ధ రాత్రి సమయమున వారు నిద్రించు చుండగా, దాహము వేసిన యవనాశ్వుడు ఆ మంత్ర జలాన్ని సేవించాడు. అది భృగు  మహర్షికి తెలిసింది.

రాజా! విధి అనుల్లంఘనీయము. నీ భార్యకు ఇవ్వవలసిన జలాన్ని నీవు సేవించావు. కాబట్టి నువ్వు గర్భం ధరిస్తావు. నీకు ఒక కొడుకు పుడతాడు” అని చెప్పాడు.

యవనాశ్వుడు రాజధానికి తిరిగివచ్చాడు. తరువాత యవనాశ్వుడు గర్భం ధరించాడు. అతని ఎడమభాగాన్ని చీల్చుకొని ఒక కొడుకు పుట్టాడు. అతనే మాంధాత.

ఆ శిశువును చూడటానికి ఇంద్రుడు వచ్చాడు. బాలకుని చూచాడు. తన చూపుడు వేలిని ఆ బాలుని నోట్లో పెట్టి

"ఇది అమృతమయము. దీనిని త్రాగుము" అని అన్నాడు.

అందువలన అతనికి మాంధాతృడు అని నామకరణం చేసారు. ఆ మాంధాత చాలా ఏళ్లు రాజ్య పాలన చేసాడు. తన పరాక్రమంతో ఎన్నో రాజ్యాలు జయించాడు. యజ్ఞయాగాలు చేసాడు. ఇంద్రునితో యుద్ధం చేసి తన రాజ్యంలో సకాలంలో వానలు కురిసేటట్టు చేసాడు. ఆ మాంధాత యజ్ఞంచేసిన చోటు ఇదే" అని రోమశుడు ధర్మరాజు తో చెప్పాడు.

"ధర్మరాజా! సోమకుడు అనే రాజర్షి యాగం చేసిన స్థలం. ఇది అంబరీషుడు యాగం చేసిన పుణ్యభూమి. ఇది నహుషుడు యజ్ఞం చేసిన చోటు. ఇది దక్షుడు యజ్ఞం చేసిన స్థలం. ఇదే సరస్వతీ నది. ఇది నిషధ దేశంలో మాయమయింది. ఇదిగో చమసోద్భేదం అనే చోట బయట పడింది. ధర్మజా! ఇది విష్ణుప్రద తీర్థం. ఇది కాశ్మీరమండలం. ఆ క్షేత్రానికి మానసద్వారం అని పేరు.

దీనిని పూ ర్వం పరశురాముడు నిర్మించాడు.  ధర్మజా! ఇది భృగుతుంగ పర్వతం. ఇక్కడ పూర్వము శిబి  చక్రవర్తి యజ్ఞంచేసాడు.

ఒక రోజు ఆ శిబి చక్రవర్తిని పరీక్షించడానికి ఇంద్రుడు డేగ రూపంలో, పావురం రూపంలో ఉన్న అగ్నిదేవుడిని, తరుముకుంటూ  వచ్చాడు. పావురము వచ్చి శిబిచక్రవర్తి శరుణు జొచ్చింది.  శిబిచక్రవర్తి పావురానికి అభయం ఇచ్చాడు. ఇంతలో డేగ వచ్చి "అయ్యా ఇది నాకు ఆహారము. దీనిని నాకు ఇవ్వండి. ~~ఈ~~ ఆహారం లేకపోతే నేను బతకలేను"  అని అడిగాడు.

"ఓ డేగా!  ~~ఈ~~ పావురము ప్రాణభయంతో నా శరణు జొచ్చింది. నేను దీనిని  ఎలా విడిచి పెట్టను. అది ధర్మం కాదు. కాబట్టి నీవు వేరు   ఆహారం వెతుక్కో" అని అన్నాడు.

"రాజా! ఇది నాకు దేవుడిచ్చిన ఆహారం. ఇది నీకు కావాలంటే దీని ఎత్తు మాంసం నాకు ఇచ్చి దీనిని నువ్వు ఉంచుకో." అనిచెప్పింది డేగ.

"సరే" అన్నాడు శిబి చక్రవర్తి.  వెంటనే కత్తితీసుకొని తన దేహాన్ని కోసి మాంసం తీసి త్రాసులో వేసాడు. కాని ఎంత మాంసం వేసినా పావురము ఎత్తు తూగడం లేదు.  శిబి  చక్రవర్తి ఆశ్చర్యపోయాడు. ఇలా కాదని తనే త్రాసులో కూర్చున్నాడు. ఆత్మార్పణం చేసుకున్నాడు.

అతని త్యాగ బుద్ధికి ఇంద్రుడు, అగ్నిదేవుడు సంతోషించారు. తమ నిజ రూపాలు ధరించారు.

"రాజా! నీ త్యాగ బుద్ధికి సంతోషించాము. నీ కీర్తి అజరామరమై చిరస్థాయిగా వర్ధిల్లుతుంది." అని దీవించారు." అని రోమశుడు శిబిచక్రవర్తి చరిత్రను ధర్మరాజుకు వివరించాడు.

తరువాత రోమశుడు ధర్మరాజుకు అష్టావక్రుని చరిత్ర చెప్పసాగాడు.

" పూర్వము ఏకపాదుడు అనే ముని ఉండేవాడు. అతని భార్య పేరు సుజాత. అతను ఘోరంగా తపస్సు చేసేవాడు. తన శిష్యులను ఎప్పుడూ చదివిస్తూ ఉండేవాడు.

కొంత కాలానికి సుజాత గర్భం ధరించింది. ఒక రోజు సుజాత గర్భంలో ఉన్న శిశువు ఏకపాదునితో ఇలా అన్నాడు.

"మీరు ఇలా మీ శిష్యులతో నిరంతరం అహోరాత్రులు పాఠాలు చదివిస్తుంటే వారికి విద్య ఎలా అబ్బుతుంది. వారికి నిద్ర లేక పోవడం చేత విశ్రాంతి లేకపోవడం వల్ల జడులవుతారు. ఇది మంచిదా!" అని అడిగాడు.

దానికి ఏకపాదుడు కోపించి "నీవు నేను చేయిస్తున్న వేదాధ్యయనాన్ని వక్రంగా చెప్పావు కాబట్టి నీవు అష్టావక్రుడివిగాపుట్టు" అని శపించాడు.

సుజాత పురిటిసమయానికి తిండి గింజలు సంపాదించడానికి ఏకపాదుడు జనకమహారాజు వద్దకు వెళ్లాడు. కాని అక్కడ ఉన్న వంది తో వాదించి పరాజయం పాలయ్యాడు.

ఇక్కడ సుజాత అష్టావక్రుని  ప్రసవించింది. అష్టావక్రుడు పెరిగి పెద్దవాడయ్యాడు. తండ్రిని వెతుక్కుంటూ తన మేనమామ కొడుకు శ్వేతకేతునితో కలిసి జనక మహారాజు చేస్తున్న  యజ్ఞానికి వెళ్లాడు.

కాని  ద్వారపాలకులు వారిని చూచి "మీరు బాలురు. ఇది విద్వాంసులు, పెద్దలు, ఋత్విజులు ప్రవేశించ తగ్గ చోటు. మీకు ప్రవేశము లేదు" అని వారిని లోనికి పోనివ్వలేదు.

దానికి అష్టావక్రుడు "అయ్యా! వయస్సుతో జ్ఞానం రాదు కదా. కాబట్టి జ్ఞానం కలవాడు బాలుడైనా అర్హుడే. మేము  ఈ మహారాజు కొలువులో ఉన్న విద్వాంసులను జయించడానికి వచ్చాము." అని  అన్నాడు.

ఈ సంగతి తెలిసి మహారాజు వారిని లోనికి పిలిపించాడు. అష్టావక్రుడు రాజాస్థానంలో ఉన్న విద్వాంసులను, వందిని, ఓడించి చెరలో ఉన్న తండ్రిని, మిగిలిన బ్రాహ్మణులను విడిపించాడు.

తరువాత జనక మహారాజు అష్టావక్రుని ఘనంగా సన్మానించాడు. తండ్రితో కలసి అష్టావక్రుడు తన స్వగ్రామానికి వెళ్లాడు" అని అష్టావక్రుని చరిత్ర రోమశుడు ధర్మరాజుతో చెప్పాడు.

తరువాత వారు సమంగ నదీ తీరానికి చేరుకున్నారు. రోమశుడు ధర్మజునకు రైభ్యాశ్రమము, భరద్వాజ ఆశ్రమము చూపించి, యవక్రీతుని చరిత్ర వివరించాడు.

"ధర్మరాజా! రైభ్యుడు, భరద్వాజుడు అనే ఇద్దరు మహా రుషులు ఉండేవారు. వారు మంచి మిత్రులు. వారు ఇద్దరు ఇదే అడవిలో తపస్సు చేసుకుంటున్నారు.

రైభ్యునికి ఇద్దరు కుమారులు. వారు అర్ధావసుడు, పరావసుడు. ఇద్దరు మంచి విద్యావంతులు.

భరద్వాజుని కుమారుని పేరు యవక్రీతుడు. అతనికి అర్ధావసు, పరావసు అంటే అసూయ.

గురుముఖతా చదవకుండానే తపోబలం చేత సమస్తవిద్యలు రావాలి అనే సంకల్పంతో ఇంద్రుని గూర్చి తపస్సు చేసాడు యవక్రీతుడు.

ఇంద్రుడు అతని దగ్గరకు వచ్చాడు. "ఎందుకు ఇంత ఘోర తపస్సు చేస్తున్నావు?" అని అడిగాడు.

"నాకు చదవకుండానే సర్వ వేదములు, సమస్త శాస్త్రములు అవగతం కావాలి." అని అన్నాడు.

"అది అసంభవము. గురుముఖతా తప్ప విద్య ఎవరికీ మరో విధంగా రాదు. అంతేకాక, తపస్సువలన వచ్చే విద్యలు మత్సరాన్ని కలిగిస్తాయి. ఇది మంచి పద్ధతి కాదు." అని అన్నాడు ఇంద్రుడు.

కాని యవక్రీతుడు ఒప్పుకోలేదు. ఇంద్రుడు వెళ్లిపోయాడు. యవ క్రీతుడు తపస్సు కొనసాగించాడు.

మరల ఇంద్రుడు ఒక వృద్ధ బ్రా హ్మణ వేషంలో వచ్చాడు. అక్కడ గంగ వేగంగా ప్రవహిస్తూ ఉంది. ఆ ప్రవాహానికి సేతు బంధం చెయ్యడానికి పిడికిళ్లతో ఇసుకను తెచ్చి ఆ ప్రవాహంలో పోస్తున్నాడు ఆ వృద్ధబ్రాహ్మణుడు.

ఇది చూచి యవక్రీతుడు నవ్వాడు. "ఓయి వృద్ధుడా! ఇది ఏమి పని? ఎన్నాళ్లు చేస్తే సేతువు పూర్తి అవుతుంది. ఇది సాధ్యమేనా?" అని అడిగాడు.

దానికి వృద్ధుని వేషంలో ఉన్న ఇంద్రుడు "అయ్యా! నేను నీ మాదిరే అఘటన మైన(సాధ్యపడని) పనిలో ఉన్నాను." అని అన్నాడు.

తర్వాత ఇంద్రుడు తన నిజరూపం చూపి, "యవక్రీతా! నేను చేసిన పని ఎంత నిరర్ధకమో నీవు చేసే తపస్సు కూడా అంతే నిరర్ధకము కాబట్టి ఆ ప్రయత్నం మానుము." అని అన్నాడు.

దానికి యవక్రీతుడు ఒప్పుకోలేదు. తనకు విద్యలు ప్రసాదించమని పట్టుబట్టాడు. చేసేది లేక ఇంద్రుడు యవక్రీతునికి సమస్త విద్యలు ప్రసాదించాడు.

తన కోరిక తీరిందన్న గర్వంతో తండ్రివద్దకు తిరిగి వచ్చాడు యవ క్రీతుడు. తరువాత తన పాండిత్యంతో ఎంతోమందిని ఓడించాడు యవక్రీతుడు.

ఒక రోజు తన తండ్రి మిత్రుడు రైభ్యుని చూడటానికి అతని ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడ రైభ్యుని పెద్ద కుమారుడు అయిన పరావసుని భార్య, కృష్ణ అనే సుందరిని చూచాడు. మోహించాడు. ఆమెను తన కోర్కె తీర్చమని అడిగాడు.

అతను మహా ముని శాపం ఇస్తాడని భయపడి ఆమె అప్పటికి ఏదో చెప్పి తప్పించుకుంది. వెంటనే మామా గారైన రైభ్యుని వద్దకు పోయి జరిగినది అంతా చెప్పి కన్నీరుపెట్టింది.

రైభ్యునికి కోపం వచ్చింది. తన శిఖ లోనుండి ఒక జటను లాగి దానిని అగ్నిలో వేల్చాడు. ఆ అగ్ని లో నుండి తన కోడలి రూపంతో ఉన్న ఒక అందమైన యువతి వచ్చింది.

తరువాత మరల తన శిఖలోనుండి మరొక జటను లాగి అగ్ని హోత్రంలో వేల్చాడు. అప్పుడు ఒక భయంకరమైన రాక్షసుడు పుట్టాడు.

రైభ్యుడు వారిని చూచి "మీరు పోయి ఆ యవక్రీతుని వధించండి" అని ఆజ్ఞాపించాడు.

ఆ అందమైన యువతి ముందు గా పోయి యవక్రీతుని తన అందం తో మైమరపించి అతని కమండలం సంగ్రహించింది.

కమండలం పోగానే యవక్రీతుడు అపవిత్రుడు అయ్యాడు. అప్పుడు ఆ రాక్షసుడు అతనిని చంపడానికి వెంటబడ్డాడు. యవక్రీతుడు ప్రాణభయంతో పరుగులు పెట్టాడు. కాని ఆ రాక్షసుడు అతడిని వెంటాడి చంపాడు.

తరువాత ఆ రాక్షసుడు, ఆ యువతి రైభ్యుని వద్దకు వచ్చి నిలిచారు. రైభ్యుడు ఆ యువతిని ఆ రాక్షసునికి ఇచ్చి వివాహం చేసాడు.

తరువాత, భరద్వాజుడు ఆశ్రమానికి వచ్చి తన కుమారుడు యవ క్రీతుడు చనిపోయిన విషయం తెలుసుకున్నాడు. పుత్రశోకం భరించలేక తను కూడా అగ్నిలో దూకి చనిపోయాడు.

తరువాత కొన్నాళ్లకు, బృహద్యుమ్నుడు అనే రాజు సత్రయాగం చేస్తున్నాడు. ఆ యాగానికి రైభ్యుని కుమారులైన పరావసు, అర్ధావసులను ఋత్తిక్కులుగా నియమించాడు. యజ్ఞం జరుగుతూ ఉంది.

ఒకరోజు రాత్రి పరావసు తన ఆశ్రమానికి వస్తున్నాడు. దూరంగా అలికిడి అయింది. అతని తండ్రి రైభ్యుడు వస్తున్నాడు. కాని చీకట్లో అది ఏదో క్రూర మృ గము అని తలిచాడు పరావసు. తనను తాను రక్షించు కోడానికి దానిని చంపాడు. కాని దగ్గరకు వచ్చిచూచి తాను చంపినది తన తండ్రి రైభ్యుని అని తెలిసి కుమిలిపోయాడు. వెంటనే తండ్రికి దహన సంస్కారాలు చేసి, తన అన్న వద్దకు వెళ్లాడు. జరిగినది అంతా చెప్పాడు.

"అన్నయ్యా! నీవు ఒక్కడివి ఆ యాగాన్ని నిర్వహింప లేవు. కాని నేను చెయ్యగలను. కాబట్టి నేను ఆ యాగాన్ని పూర్తి చేస్తాను. నీవు పోయి నాకు కలిగిన బ్రహ్మహత్యా పాతకానికి ప్రాయశ్చిత్తం చేయుము" అని చెప్పాడు.

“అలాగే” అని అర్ధావసు తమ్ముని బదులు అన్ని ప్రాయశ్చిత్తములు చేసి యాగ శాలకు తిరిగి వచ్చాడు.

అతనిని చూచి పరావసు, బృహద్యుమ్నుని తో ఇలా అన్నాడు.

“మహారాజా! ఇతడు యాగ శాలలో ప్రవేశించడానికి అర్హుడుకాడు. పవిత్రమైన శుభకార్యములు విడిచి, బ్రహ్మహత్యా పాతకము పరిహరించు వ్రతుములు చేస్తున్నాడు ఇతడు.” అని చెప్పాడు.

అప్పుడు రాజు అనుచరులు అతనిని యాగ శాలలో ప్రవేశించకుండా అడ్డుకున్నారు.

అర్ధావసుడు రాజును చూచి “రాజా! బ్రహ్మహత్యా పాతకము చేసినది నేనుకాదు. ~~ఈ~~ పరావసు. అతనికి బదులు నేను ప్రాయశ్చిత్తకార్యములు నిర్వర్తించాను. అతనిని బ్రహ్మహత్యాపాతకము నుండి విముక్తుడిని చేసాను.” అని జరిగింది చెప్పాడు.

ఆ మాటలకు దేవతలు కూడా సంతోషించారు. “అర్ధావసూ! నీ తమ్ముడు చేసిన పాపానికి నీవు ప్రాయశ్చిత్తం చేసుకున్నావు. నీ సత్యవ్రతము గొప్పది. నీకు ఏమి వరాలు కావాలో కోరుకో!” అని అన్నారు.

"అయ్యా! నా తండ్రిని, భరద్వాజుని, అతని కుమారుడు యవక్రీతుని బ్రతికించండి. నా సోదరుని దోషం కూడా పరిహరించండి." అని కోరాడు. దేవతలు అందరిని బతికించారు.

అప్పుడు యవక్రీతుడు దేవతలను చూచి "దేవతలారా! నేను ఎన్నోవిద్యలు నేర్చాను. వ్రతాలు చేసాను. కాని రైభ్యుని తో చంపబడ్డాను. కారణం ఏమిటి?" అని అడిగాడు.

దానికి దేవతలు "యవక్రీతా! గురు ముఖతా నేర్చుకున్న విద్యలు ఫలితాన్ని ఇస్తాయి గాని, కేవలం తపస్సు వలన పొందిన విద్యలు ఫలించవు. నీవు గురు ముఖతా విద్యలు నేర్చుకోలేదు. అందుకని నీ విద్యలు నిర్వీర్యములు అయినవి. కాని రైభ్యుడు గురు ముఖతా అన్ని విద్యలు నేర్చుకున్నాడు. అందుకని అతను శక్తిమంతుడు అయ్యాడు." అని పలికి వారు స్వర్గానికి వెళ్లిపోయారు." అని యవక్రీతుని వృత్తాంతము రోమశుడు ధర్మరాజుకు చెప్పాడు.

తరువాత ధర్మరాజు, తమ్ములతో, ద్రౌపదితో కలిసి ఎన్నో ప్రయాసలకోర్చి గంధమాధన పర్వతము చేరుకున్నారు. కాని ఆ మార్గము రాళ్లతో ముళ్లతో దుర్గమంగా ఉంది.

అప్పుడు భీముడు తన కుమారుడైన ఘటోత్కచుడిని స్మరించాడు. ఘటోత్కచుడు తండ్రి ముందు వచ్చి నిలబడ్డాడు. ధర్మరాజు కోరిక మేరకు ఘటోత్కచుడు అందరిని తన వీపు మీద ఎక్కించుకొని బదరికావనానికి చేర్చాడు. రోమశుడు మాత్రం తన మంత్రసిద్ధితో ఆకాశ మార్గాన బదరికా వనం చేరుకున్నాడు.

అందరూ నరనారాయణులు తపస్సుచేసిన ఆశ్రమం చేరుకున్నారు.

ఒకరోజు ద్రౌపదీ, భీముడు, గంధమాధన పర్వత చరియలలో విహరిస్తున్నారు. అప్పుడు సహస్రపత్రములుకల ఒక పద్మము వారి వద్దకు గాలిలో ఎగురుతూ వచ్చింది. దానిని చూచి ద్రౌపది ఎంతో ముచ్చట పడింది. అలాంటి పుష్పాలు ఇంకా ఉంటే తెచ్చి పెట్టమని భీముని కోరింది.

అలాంటి సౌగంధిక పుష్పముల కొరకు భీముడు బయలుదేరాడు. అలా వెళుతూ వెళుతూ భీముడు సింహనాదం చేసాడు. తన శంఖాన్ని పూరించాడు.

ఈ శబ్దాలను అక్కడే ఒక గుహలో ఉన్న హనుమంతుడు విన్నాడు. ఆ వచ్చినది తన సోదరుడు భీముడు అని తలిచాడు. గుహలోనుండిబయటకు వచ్చాడు. పక్కనే ఉన్న చెట్లను పెకలించి దారికి అడ్డం వేసాడు. దారికి అడ్డం పడుకున్నాడు. తన తోకను విలాసంగా ఆడిస్తున్నాడు.

భీముడు అక్కడికి వచ్చాడు. హనుమంతుని చూచాడు. గట్టిగా సింహనాదం చేసాడు. ఆ శబ్దానికి హనుమంతుడు కళ్లు తెరిచాడు.

“ఎవరయ్యా నువ్వు? పెద్దవాడిని ముసలివాడిని అలసిపోయి పడుకొని ఉంటే అలా ఎందుకు అరిచావు? కావాలంటే ఈ అడవిలో ఉన్నా ఫలాలు తిని వెళ్లు కాని అలా అరవకు” అని అన్నాడు హనుమంతుడు.

దానికి భీముడు “నేను పాండు రాజు పుత్రుడను, ధర్మజుని తమ్ముడిని. భీమసేనుడు నా నామధేయము. నేను ఒక పనిమీద వెళుతున్నాను. నాకు దారి వదులు.” అని అన్నాడు.

“అయ్యా! నేను ముసలి వాడిని కదలలేను. కాస్త నా తోకను తీసి అవతల పెట్టి వెళ్లు.” అని అన్నాడు హనుమంతుడు.

“ఓస్ అదెంత పని” అంటూ భీముడు హనుమంతుని తోకను అవతలకు నెట్టబోయాడు. కాని అది కదల లేదు. రెండు చేతులతో ఎత్తాడు. కాని కదలలేదు. ఆశ్చర్యపోయాడు భీముడు.

“అయ్యా! మీరు ఎవరో నాకుతెలియదు కాని మీరుమహాత్ములు. నన్ను మన్నించండి.” అని అడిగాడు.

అప్పుడు హనుమంతుడు భీముని చూచి నవ్వుతూ “భీమా! నా పేరు హనుమంతుడు. నేను నీ అన్నయ్యను. నేనూ వాయుదేవుని వరం వలన జన్మించిన వాడిని. నేను పూర్వకాలంలో రామ బంటును. రావణుడు రాముని భార్యను అపహరించగా, నేను సముద్రాన్ని దాటి లంకకు పోయి, సీతమ్మ జాడను రామునికి తెలిపాను. అప్పుడు రాముడు రావణుని సంహరించి సీతను పరిగ్రహించాడు. అప్పుడు రాముడు నా సేవలకు మెచ్చి నాకు “చిరంజీవిగా భూమి మీద వర్ధిల్లు” అని వరము ఇచ్చాడు. అందుకని నేను ఆ గంధమాధన పర్వతము మీద నివశిస్తున్నాను” అని చెప్పాడుహనుమంతుడు.

భీముడు హనుమంతుని చూచి ఎంతో ఆనందం పొందాడు. “ఆంజనేయా! నీవు అలనాడు సముద్రాన్ని లంఘించిన రూపాన్ని చూడాలని కోరికగా ఉన్నది. ఒక్క సారి చూపించవా!” అని అడిగాడు.

“భీమా! అది ఎలా వీలు అవుతుంది. ఆ కాలం వేరు. ~~ఈ~~కాలం వేరు. అన్ని కాలములు ఒక విధంగా ఉండవు కదా!

కృతయుగము, త్రేతాయుగము, ద్వాపర యుగము, కలియుగము వేరు వేరు గా ఉంటాయి . ఆ కాలములయందు జీవరాసులు వివిధ ప్రకారము లుగా నడుస్తుంటాయి.” అని అన్నాడు.

దానికి భీముడు “అన్నా! నాకు ఆయా యుగముల యందు ఆచార వ్యవహారముల గురించి చెప్పవా!” అని అడిగాడు.

దానికి హనుమంతుడు ఇలా చెప్పసాగాడు.

“భీమా! కృతయుగము లో అన్నిపనులు కృతములే గాని, చెయ్య వల సినవి ఏమీ లేవు. అందుకనే ధర్మము నాలుగు పాదములతో నడిచింది. అప్పుడు శ్రీమన్నారాయణుడు శుక్ల వర్ణంతో ప్రజలను కాపాడాడు. అప్పుడు సనాతన ధర్మం వర్ధిల్లింది. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులు, వేదములు, తమకు విధించిన విధులు నిర్వర్తించారు. వారు కోరకుండానే వారికి తగిన ఫలితాలు కలిగాయి. అందువలన వారు పుణ్యలోకములు పొందారు. ఆ యుగంలో వారికి అసూయ, ద్వేషము, గర్వము, కోపము, మదము, మత్సరము, భయము, సంతాపము, వ్యాధులు, ప్రజలు నశించడం, ఇంద్రియములు క్షయం కావడం లాంటివి లేవు.

తరువాత త్రేతాయుగం వచ్చింది. అప్పుడు ధర్మం మూడు పాదాలతో నడిచింది. ఆ రోజుల్లో జనులు ఎప్పుడూ నిజం చెప్పేవాళ్లు. యజ్ఞాలు, యాగాలు, తపస్సు, దానాలు చేసేవాళ్లు. అప్పుడు విష్ణువు రక్త వర్ణంతో ప్రజలను రక్షించాడు.

తరువాత ద్వాపర యుగం వచ్చింది. అప్పుడు ధర్మం రెండుపాదాలతో నడిచింది. వేదములు నాలుగు భాగాలుగా ప్రవర్తిల్లాయి. వేదములు, శాస్త్రములలో విధించిన ప్రకారము ధర్మము, కామములు ఈ భూమిలో అనుసరింప బడ్డాయి. కాని ద్వాపర యుగంలో ప్రజలు మాట మీద నిలబడరు. సత్యము, శమము

హీనమవుతుంది. జనులు కోరికలు తీరడం కోసమే యజ్ఞాలు యాగాలు చేస్తారు. ఈ యుగంలో విష్ణువు కృష్ణ వర్ణుడై ప్రజలను కాపాడతాడు.

తరువాత వచ్చునది కలియుగము. ఈ యుగంలో ధర్మం ఒక పాదంతో నడుస్తుంది. విష్ణువు పసుపు పచ్చని రంగుతో ఈ లోకాన్ని పాలిస్తాడు. కలియుగంలో జనులు తమోగుణంతో ప్రవర్తిల్లుతారు. వారికి కామ, క్రోధము మొదలగు వాటికి వశులై అధర్మ వర్తనులవుతారు. కలియుగంలో తపము, దానము, మొదలగు పుణ్య కర్మములు చాలా స్వల్పంగా ఆచరిస్తారు. కాని వాటికి సంక్రమించే ఫలాలు మాత్రం ఎక్కువగానే ఉంటాయి." అని హనుమంతుడు నాలుగు యుగాల స్వభావాన్ని భీమునికి చెప్పాడు.

"ఓ హనుమంతా! అలనాడు నీవు సాగరాన్ని దాటిన నీ తనువును చూచి గాని నేను కదలను" అని పలికాడు భీముడు.

అప్పుడు ఆంజనేయుడు తన నిజరూపాన్ని భీమునికి ప్రదర్శించాడు. రెండవ మేరు పర్వతమో అని అనిపించే ఆంజనేయుని విరాట్ స్వరూపాన్ని చూచి భయకంపితుడై వెంటనే ఉపసంహరించమని కోరాడు భీముడు. హనుమంతుడు తన మామూలు ఆకారాన్ని ధరించాడు.

భీముని చూచి "భీమా! నీవు కావాలి అనుకుంటున్న సౌగంధిక పుష్పములు ఉన్న కొలను యక్షులు, రాక్షసులు, రక్షిస్తుంటారు. అక్కడ నీ శౌర్యము

సాహసము పనికిరాదు. ఆ పుష్పాలు దేవతలు అనుభవిస్తుంటారు. దేవతలు భక్తి సాధ్యులు కాని సాహసక్రియాసాధ్యులు కారు. కాబట్టి ధర్మము ఎరింగి ప్రవర్తించు.

సదాచారము నుండి ధర్మం పుడుతుంది. ధర్మము వలన వేదము ప్రతిష్టింప బడుతుంది. వేదముల వలన యజ్ఞములు చేస్తారు. ఆ యజ్ఞముల వలన దేవతలు తృప్తులవుతారు. సర్వ కార్యములు ఆలోచన తోనే సాధ్యం అవుతాయి. కాబట్టి విద్వాంసులతో ఆలోచించి నిర్ణయాలు తీసుకో. పిల్లల తోనూ, అధిక గర్వం కలవారితోనూ నీచులతోనూ ఆలోచనలు చెయ్యవద్దు. నిన్ను చూచిన నాకు చాలా సంతోషంగా ఉంది. నీకు ఏం కావాలో చెప్పు. భీమా! నీకు నీ వారికి కీడు చేసిన ఆ ధృతరాష్ట్రుని, కౌరవులను నేను ఒక్కడినే సంహరించి హస్తినాపురం నేలమట్టం చేస్తాను. చెయ్య మంటావా?" అని అన్నాడు హనుమంతుడు.

దానికి భీముడు "అమిత బలవంతుడవైన నీకు ఆ పని ఒక పెద్దపని కాదు. కాని మేమే ఆ పని చెయ్యగలము." అని వినయంగా అన్నాడు.

దానికి హనుమంతుడు "భీమా! అయితే యుద్ధంలో నన్ను తలుచుకో. నేను అర్జునుని రథంమీద ఉన్న ధ్వజము మీద అధిరోహించి, మీ బల పరాక్రమములు కనులారా చూస్తాను" అని అన్నాడు.

తరువాత హనుమంతుడు భీమునికి సౌగంధిక సరోవరానికి మార్గము చూపి వెళ్లిపోయాడు.హనుమంతుడు చూపిన మార్గంలో ప్రయాణించి భీముడు కుబేరుని వనములో  సౌగంధిక పుష్పములు ఉన్న  తోటను చూచాడు.

భీముని చూచి వన రక్షకులైన రాక్షసులు అతనిని అడ్డగించారు.

"అయ్యా! ఇది కుబేరుని తోట. ఇందులోనికి ఎవ్వరూ పోకూడదు. కుబేరుడు ఈవనంలో  విహరిస్తున్నాడు. ఇక్కడ ఉండటం ప్రమాదం." అని హెచ్చరించారు.

అంతట భీముడు వారిని చూచి "నేను పాండురాజు పుత్రుడను. నా పేరు భీమసేనుడు. నా భార్య ద్రౌపది ఆ పుష్పములు కావాలని కోరింది. వీటిని తీసుకొని పోవడానికి వచ్చాను. వీటిని తీసుకు వెళతాను" అని చెప్పాడు.

" అయ్యా నీవు ధర్మరాజు సోదరునివి. ధర్మ ప్రకారము నడుచుకో. నీవు కుబేరునికి ఈ విషయం తెలిపి ఆయన అనుమతితో ఈ పుష్పములు తీసుకొని పొమ్ము" అని పలికారు.

" ఆ కొలను మొదట కుబేరుడు సంపాదించాడా? ఇవి ప్రకృతి సిద్ధమైనవి. ఎవరికీ చెందినవి కావు. నేను క్షత్రియుడను. ఎవ్వరినీ యాచించను. నా భుజబలంతో తీసుకొని వెళ్తాను. నేను మిమ్ము మీ కుబేరుని ప్రార్థించి ఆ

పుష్పములు తీసుకొని వెళ్లాలా? అసంభవం!" అంటూ భీముడు ఆ కొలనులో ప్రవేశించి పుష్పములు కోసికొని పోతున్నాడు.

అప్పుడు వన రక్షకులు భీమునితో యుద్ధానికి దిగారు. భీముడు సునాయాసంగా ఆ రాక్షసులను జయించాడు. వారు పోయి ఈ విషయం కుబేరునికి చెప్పారు. భీముని పరాక్రమము విని కుబేరుడు ఏమీ చెయ్యకుండా పోనీలే అని ఉపేక్షించాడు.

భీముడు సౌగంధిక పుష్పములు తీసుకొని వచ్చుచుండగా, ఇంతలో భీముని వెదకు కొనుచూ నకుల సహదేవులు, ద్రౌపదీ సమేతుడై ధర్మరాజు ఆ కొలను వద్దకు వచ్చాడు. భీముడు సౌగంధిక పుష్పాలను ద్రౌపదికి ఇచ్చాడు.

ఇంతలో కొంతమంది యక్షులు వారి వద్దకు వచ్చి "అయ్యా! ఇక్కడ యక్షులు రాక్షసులు తిరుగుతుంటారు. ఇక్కడ మీరు ఉండటం మంచిదికాదు." అని చెప్పారు.

"సరే" అని వారు అక్కడికి కొంచెం దూరంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు.

ఒక నాడు జటాసురుడు అనే రాక్షసుడు బ్రాహ్మణ వేషంలో వారి దగ్గరకు వచ్చాడు. "నేను వేదాలు చదువుకున్నాను. పరశురాముని శిష్యుడను" అని చెప్పి వారి నివాసంలో వారితో పాటు తింటూ, ఉంటున్నాడు.

ఒక రోజు భీముడు వేటకు వెళ్లాడు. ఆ సమయంలో ఆ రాక్షసుడు తన నిజ రూపం ధరించి ధర్మరాజును. ద్రౌపదిని, నకుల సహదేవులను తీసుకొని  ఆకాశ మార్గంలో పరుగెత్తాడు.

ఇది చూచి అక్కడ ఉన్న బ్రాహ్మణులు భయపడ్డారు.  అప్పుడు నకులుడు ఆ రాక్షసుని చూచి "అయ్యా! ఇప్పటి దాకా మా నివాసంలో ఉండి మాతో తిన్నావు. మాకు అపకారం చెయ్యడం భావ్యమా?" అని అడిగాడు.

దానికి ఆ రాక్షసుడు బదులు చెప్పలేదు. "అయితే నాతో యుద్ధం చెయ్యి "అని అన్నాడు నకులుడు.

ఇంతలో  ఈ విషయం విప్రుల వలన తెలుసుకున్న భీముడు వాయు వేగంతో అక్కడికి చేరుకున్నాడు.  ఆ రాక్షసుని చూచి "మర్యాదగా ధర్మరాజును ద్రౌపదిని మిగిలిన వారిని  విడిచి పెట్టు లేకపోతే నువ్వుకూడా బకుడు, హిడింబుడు చచ్చినట్టు చస్తావు" అని హెచ్చరించాడు.

దానికి జటాసురుడు "ఓయి భీమా! నిన్ను యుద్ధంలో చంపి బకునికి, హిడింబునకు, కిమ్మీరునకు రక్త తర్పణం విడుస్తాను." అని భీముని తో యుద్ధానికి దిగాడు.

ఇద్దరికి ఘోరంగా యుద్ధం జరిగింది. కొంత సేపటికి జటాసురుడు అలసిపోయాడు. ఇదే అదనుగా భీముడు విజృంభించి జటాసురుని సంహరించాడు.  అప్పుడు రోమశుడు, ధౌమ్యుడు, ధర్మజుడు నకుల సహదేవులు భీముని శౌర్యాన్ని ప్రశంసించారు.

మహా భారతము అరణ్య పర్వము

తృతీయాశ్వాసము సంపూర్ణము.

ఓంతత్సత్.

# శ్రీమదాంధ్రమహాభారతము

## అరణ్య పర్వము

### చతుర్థాశ్వాసము

### (నన్నయ భట్టారకుని రచన సంపూర్ణము).

ఉగ్రశ్రవసుడు అనే సూతి శౌనకాది మహా మునులకు మహా భారత కథను ఇలా చెప్పసాగాడు.

పాండవులు నరనారాయణులు వసించిన స్థానములో కొన్ని దినములు గడిపారు.

ఒక రోజు ధర్మజుడు తన తమ్ములతో ఇలా అన్నాడు.

"అర్జునుడు మనలను విడిచి వెళ్లి ఐదేళ్లు అయింది. అతను వచ్చే సమయం అయింది. దివ్యాస్త్రాలు సంపాదించి వస్తున్నాడు." అని చెప్పాడు.

అతని కోసం ఉత్తర దిక్కుగా ప్రయాణం సాగించాడు. వారందరూ మాల్య వంతము అనే పర్వతమును చేరుకున్నారు.

ఒక రోజు ద్రౌపది, భీమసేనులు ఆ పర్వత సానువులలో విహరిస్తున్నాను. అప్పుడు ఒక పంచ వర్ణములు కల ఒక పుష్పము గాలి వాటుగా వచ్చి అక్కడ పడింది. దానిని చూచి ద్రౌపది ముచ్చట పడి అలాంటి పువ్వులు తెచ్చిపెట్టమని భీముని కోరింది. భీముడు ఆ పువ్వు వచ్చిన దిక్కుగా వెళ్లాడు.

అక్కడ కుబేరుని నివాసాన్ని చూచాడు. అక్కడ కాపలా ఉన్న యక్ష, రాక్షస భటులు భీముని అడ్డగించారు. వారితో యుద్ధం చేసాడు భీముడు. ఆ యుద్ధంలో కుబేరుని సేనాధిపతి మరియు ప్రియమిత్రుడు ఐన మణిమంతుడు మరణించాడు. ఆ విషయాన్ని యక్షులు, రాక్షసుడు వెళ్లి కుబేరునికి తెలిపారు.

ఇంతలో ద్రౌపది వలన భీముడు పుష్పములు తీసుకు రావడానికి వెళ్లాడని తెలుసుకున్నాడు ధర్మరాజు. వెంటనే రోమశ మహర్షి, నకుల సహదేవులు వెంటరాగా ధర్మరాజు భీముడు వెళ్లిన దిక్కుగా వెళ్లాడు.

కుబేరుని మందిర సమీపంలో చనిపోయిన యక్ష, రాక్షసభటులను, మణిమంతుని, భీకరంగా కనపడుతున్న భీముని చూచాడు.

కుబేరుడు జరిగినది అంతా భటుల వలన విన్నాడు. వెంటనే భీముని వద్దకు వచ్చాడు. ధర్మరాజుకు నమస్కరించాడు.

"ధర్మజా! నా మిత్రుడు మణిమంతుని నీ సోదరుడు భీముడు చంపాడని మీరు చింతించవలదు. అతడు శాప వశాత్తు మరణించాడు. మీరు బాధపడవలదు. మీరు ఈ ప్రాంతంలో హాయిగా ఉండవచ్చు. మీకు నా సేవకులు సకల సౌకర్యాలు అమరుస్తారు. మీరు పదిహేను దినముల పాటు ఆర్ష్టి షేణాశ్రమంలో ఉండండి. అంతేగాక మీ తమ్ముడు అర్జునుడు ఇంద్రసభలో ఉన్నాడు. నేను చూచాను. మీ వద్దకు రావడానికి సిద్ధంగా ఉన్నాడు." అని చెప్పాడు.

ఈ విషయాలు విని ధర్మరాజు ఎంతో సంతోషించాడు. కుబేరుడి మాట ప్రకారం పాండవులు ఆర్ష్టి షేణాశ్రమంలో ఉంటున్నారు. ఒక రోజు వారికి ధౌమ్యుడు మందర పర్వతము, మేరు పర్వతం చూపించాడు.

"ధర్మజా! అది మేరు పర్వతము. దానికి  ఎనిమిది వైపులా దిక్పాలకులు నివశిస్తుంటారు.  ఆ మేరు పర్వతం చుట్టూ సూర్యుడు చంద్రుడు, నక్షత్రగణము, సప్తర్షి మండలము,  ప్రదక్షిణం చేస్తారు. త్రిమూర్తులు ఆ కొండమీద కొలువు తీరి ఉంటారు." అని మేరు పర్వత విశేషాలను ధౌమ్యుడు ధర్మరాజుకు వివరించాడు.

ఇంతలో, మాతలి తోలుతున్న  రథము మీద  అర్జునుడు దేవలోకమునుండి అక్కడకు వచ్చాడు.  రాగానే అర్జునుడు, రోమశునికి, ధౌమ్యునికి, అన్నగారు ధర్మరాజుకు, భీమసేనుడికి నమస్కరించాడు. ఇంతలో ఇంద్రుడు కూడా అక్కడకు వచ్చాడు.

"ధర్మజా! నీ తమ్ముడు అర్జునుడు చాలా గొప్పవాడు. ఎన్నో దివ్యాస్త్రాలు సంపాదించాడు. నివాత కవచులను వధించాడు. దేవతలకు ఎంతో మేలు చేసాడు." అని చెప్పి అర్జునుని ధర్మజుని చెంత చేర్చి దేవలోకము వెళ్లాడు.

తరువాత ధర్మరాజు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! నువ్వు పరమ శివుని, ఇంద్రుడు, వరుణుడు, అగ్ని,  మొదలగు దేవతలను

మెప్పించి ఎన్నో దివ్యాస్త్రాలను సాధించావు అని ఇంద్రుడు చెప్పాడు. ఆ వివరాలను మాకు వీనుల విందుగా చెప్పు" అని అడిగాడు.

దానికి అర్జునుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"అన్నయ్యా! నేను నీ ఆదేశము మేరకు హిమవత్పర్వతము నకు వెళ్లాను. నాకు ఇంద్రుడు విప్రరూపములో కనిపించి శివుని గూర్చి తపస్సుచెయ్యమని ఆదేశించాడు. నేను చేసిన తపస్సుకు మెచ్చి శివుడు కిరాతుడి రూపంలో దర్శనము ఇచ్చాడు. నాతో యుద్ధం చేసాడు. నా శౌర్యానికి మెచ్చి నాకు పాశుపతాన్ని అనుగ్రహించాడు.

తరువాత ఇంద్రాది దేవతల వలన అనేక దివ్యాస్త్రాలు పొందాను. సశరీరంగా దేవలోకానికి వెళ్లాను. అమరేంద్రుని వద్దనుండి దివ్యాస్త్రాలు పొందాను. దానికి ప్రతిగా దేవేంద్రుడు నన్ను నివాత కవచులు అనే రాక్షసులను సంహరించి దేవతలకు మేలు చేకూర్చమన్నాడు. నాకు దేవదత్తము అనే శంఖాన్ని బహూకరించాడు.

నేను మాతలి తోలు రధము నెక్కి నివాత కవచుల వద్దకు వెళ్లాను. వారు సముద్రంలో ఉన్న నగరంలో ఉన్నారు. నేను శంఖాన్ని

పూరించాను. అది విని రాక్షసులు నా మీదికి యుద్ధానికి వచ్చారు. వారికి నాకు ఘోర యుద్ధం జరిగింది. ఇంతలో దేవతల సారధి స్పృహతప్పి పడిపోయాడు. ఇది చూచి రాక్షసులు మామీద బాణ ప్రయోగం చేసారు. నేను స్వయంగా రధాన్ని నడుపుకుంటూ వారితో యుద్ధంచేసాను.

వారు తిమిర బాణాన్ని వేసారు. లోకమంతా చీకటి అయింది. మాతలి భయంతో పెద్దగా అరిచాడు. ఎవరికీ ఏమి కనిపించడం లేదు. అప్పుడు నేను దేవేంద్రుడు ఇచ్చిన సూర్య అస్త్రాన్ని ప్రయోగించాను. చీకటి తొలగి వెలుగు వచ్చింది. నేను నా గాండీవం నుండి అస్త్రాలను ప్రయోగించాను. ఆ బాణముల ధాటికి తట్టుకోలేక, రాక్షసులందరూ మరణించారు. ఆప్రకారంగా రాక్షసులను జయించి నేను దేవలోకమునకు తిరిగి వచ్చాను.

దారిలో నేను హిరణ్యపురాన్ని చూచాను. అందులో పౌలోమ కాలకేయులు అనే రాక్షసులు నివసిస్తున్నారు. వారు దేవతలచేత చంపబడరు అని నాకు మాతలి చెప్పాడు.

నేను ఆ పురానికి వెళ్లాను. నన్ను దేవేంద్రుడు అనుకొని రాక్షసులు నన్ను చుట్టుముట్టారు. మాకు ఘోర యుద్ధం జరిగింది. వారు మాయా

యుద్ధం చెయ్యసాగారు. వారు వారి పట్టణంతో సహా ఆకాశానికి ఎగిరి అక్కడ నుండి యుద్ధం చేసారు. నేను శివుని తలచి పాశుపతాన్ని ప్రయోగించాను. దానితో ఆ రాక్షసు లందరూ మరణించారు. అంతట నేను దేవ లోకానికి వచ్చి ఇంద్రుడికి జరిగినది అంతా చెప్పాను.

"అర్జునా! నీకోసం నీ అన్నలు తమ్ములు ఎదురు చూస్తున్నారు. నీ విజయ వార్తలు వినవలెనని ఉవ్విళ్లూరుతున్నారు" అని చెప్పి మాతలిని ఇచ్చి నన్ను ఇక్కడకు పంపించాడు" అని చెప్పాడు అర్జునుడు.

అర్జునుని విజయ గాధలు విని ధర్మజుడు ఎంతో సంతోషించాడు.

"అర్జునా! నీకు దేవతలు ఇచ్చిన అస్త్రములు మాకు చూపుము" అని ధర్మజుడు అడుగగా అర్జునుడు అన్నగారికి వాటిని ప్రయోగించి చూపడానికి సిద్ధం అయ్యాడు. ఇంతలో నారదుడు అక్కడకు వచ్చాడు.

"అర్జునా! ఆగు. ఇవి దివ్యాస్త్రాలు. వాటిని లక్ష్యం లేకుండా ప్రయోగించరాదు. అలా చేస్తే అవి మూడు లోకాలను దహిస్తాయి జాగ్రత్త" అని చెప్పాడు. నారదుని ఆదేశం మేరకు అర్జునుడు ఆ ప్రయత్నాన్ని మానివేసాడు.

తరువాత ధర్మరాజు తమ్ములతో సహా అక్కడ 10 నెలలు ఉన్నాడు. తరువాత దేవఋషి రోమశుడు దేవలోకానికి వెళ్లాడు.

తరువాత పాండవులు బదరీ వనము, సుబాహు పురము నకు వచ్చి, అక్కడనుండి ఘటోత్కచుని తన పరివారంతో సహా పంపివేసాడు.

తరువాత వారు హిమవత్పర్వతము నందు అనేక ప్రదేశములను చూచుచూ ఒక సంవత్సరము గడిపారు.

ఒక రోజు భీముడు వేటనిమిత్తము హిమాలయ శిఖరము మీదికి వెళ్లాడు. అక్కడ ఒక కొండచిలువ భీముని తన ఆహారము అనుకొని పట్టుకుంది. తన శరీరంతో చుట్టేసింది. బలవంతుడైన భీముని బలం ఆ కొండ చిలువ బలంముందు ఎందుకూ పనికి రాలేదు.

భీముడు ఆశ్చర్యంతో "నా వంటి బలవంతుని ఈవిధంగా బంధించే శక్తి నీకు ఎలా వచ్చింది? నీవు ఎవరివల్లనన్నా వరం పొందావా?" అని అడిగాడు.

అప్పుడు ఆ కొండ చిలువ ఈవిధంగా పలికింది.

“భీమసేనా! నేను నహుషుడు అనే మహా రాజును. ఒకప్పుడు దేవేంద్రపదవిని అధిష్ఠించాను. కాని ఒక మునివరుని శాపము వలన సర్ప రూపముదాల్చాను.” అని దుఃఖించాడు.

ఇంతలో భీమసేనుని గురించి ఆందోళన చెందిన ధర్మరాజు భీముని వెదకుకొనుచూ అక్కడకు వచ్చాడు. కొండచిలువ తో బందీ అయిన భీముని చూచాడు. “ఆహా కాలమహిమ. అపరిమితమైన బలము కల భీముడు ఒక పాము చేతిలో బందీకావడమా!” అని తలచాడు.

ఆ కొండచిలువను చూచి “అయ్యా నీవు ఎవరవు? రాక్షసుడివా! దేవతవా! చెప్పుము. నేను పాండురాజు పుత్రుడను. నా పేరు ధర్మజుడు. నీవు నా తమ్ముని కేవలం ఆహారం కొరకు పట్టుకుంటే అతనిని విడిచి పెట్టుము. నేను నీకు కోరినంత మృగ మాంసమును ఆహారంగా సమకూర్చెదను” అని అన్నాడు.

“ధర్మరాజా! నేను మీ వంశంలో పుట్టిన వాడను నా పేరు నహుషుడు. నేను ఇంద్రునితో సమానుడను. ఐశ్వర్య గర్వంతో వివేకము లేక, బ్రాహ్మణులతో రథము లాగించు కుంటూ వారిని అవమానం

చేసాను. దానికి అగస్త్యుడు కోపించి నన్ను అత్యంత ఉగ్రమైన సర్పము గా పడి ఉండుము అని శాపము ఇచ్చాడు. ఆ శాప ప్రభావంతో ఇక్కడ సర్మరూపంలో పడి ఉన్నాను. నేను వేదములు చదివిననూ, నూరు యాగములు చేసిననూ, ఇంద్రపదవి పొందిననూ, నా దుర్మదము చేత, బ్రాహ్మణులను అవమానించి ఈ దురవస్థ కొని తెచ్చుకున్నాను. నేను నా శాప విమోచనము కొరకు, నాకు పూర్వ జన్మ స్మృతి ఉండేట్టు అనుగ్రహించమని అగస్త్యుని ప్రార్ధించాను. దానికి అగస్త్యుడు నన్ను కరుణించి నా ప్రశ్నలకు ఎవరు సమాధానం చెపుతారో వారి వలన నాకు శాపవిముక్తి కలుగుతుంది అని చెప్పాడు. ఆ మహాను భావుని కోసరం నిరీక్షిస్తూ ఇలా పడి ఉన్నాను. నీకు శక్తి ఉంటే నా ప్రశ్నలకు సమాధానం చెప్పి నీ తమ్ముని విడిపించుకో అని అన్నాడు. అయ్యా! నీవు అడిగే ప్రశ్నలకు బ్రాహ్మణులు మాత్రం సమాధానాలు చెప్పగలరు కాని నాకు సాధ్యమా. అయిననూ ప్రయత్నించెదను. అడుగుము అని అన్నాడు. అప్పుడు కొండచిలువ రూపంలో ఉన్న నహుషుడు ఈ క్రింది ప్రశ్నలు అడిగాడు.

1. ఏ గుణములు కలవాడు బ్రాహ్మణుడు? అతను తెలుసుకోదగ్గ విషయమేది?

జ: సత్యము, క్షమ, దయ, శౌచము, దయ, తపము, దానము, శీలము మొదలగు గుణములు కలవాడు బ్రాహ్మణుడు. సుఖము, దుఃఖముల ఎడల సమ బుద్ధి కలగడం అతని తెలుసుకోదగిన ఉత్తమ విద్య.

2.పై చెప్పిన గుణాలు శూద్రుని లో కనిపిస్తే అతను బ్రాహ్మణుడు అని పిలువ బడతాడా? అలా అయితే కుల విభాగములు ఎందుకు? అధికులు, హీనులు అనే వివేకము అపార్ధము కాదా?

జ: మహాత్మా! ఏ కారణము చేతనైనా ప్రమాద వశాత్తు వర్ణసంకరము ఏర్పడినప్పుడు ఎవరు ఏ వర్ణమునకు చెందినవారు అని తెలియుటకు స్వాయంభువ మనువు ఒక పరీక్ష పెట్టినాడు.

సత్యము మొదలగు గుణములు కలిగిననూ శూద్రుడు ఉత్తమమయిన శూద్రుడు కాగలడు కాని బ్రాహ్మణుడు కాగలడా? అదే ప్రకారము సత్యము మొదలగు గుణములు బ్రాహ్మణుని యందు లేని నాడు వాడు బ్రాహ్మణుడు కాగలడా? కాబట్టి ఒక వ్యక్తి వర్ణము నిర్ణయించుటకు అతని గుణశీల ములు, ముఖ్యము. గుణ శీలములు కలవాడు ఇంకా గుణవంతుడు, శీలవంతుడు కాగలడు. గుణశీలములు

లేనివాడు ఎన్నటికి వాటిని పొందలేడు. కాబట్టి ధనాన్ని రక్షించుకోడం కంటే గుణశీలములు కాపాడుకోడం చాలా మంచిది.

3. పరులకు అపకారము చేసి కూడా, అసత్యములు ఆడి కూడా, అహింసా వ్రతమును కఠినముగా ఆచరించువాడు మహాత్ములు పొందు పుణ్యలోకములు పొందుతాడు. అహింస అంత విశేష ప్రాధాన్యతను ఎలా పొందింది?

జ: దానము చెయ్యడం , ఇతరులకు ఉపకారము చేయడం, సత్యమును పలకడం, అహింసను పాటించడం అనేవి నాలుగు ఉత్తమధర్మములు. కాని వాటిలో అహింస విశేషమయినది. ఎందుకనగా, దేవతలు, మనుష్యులు, జంతువులు అనునవి మనిషికి కల్గు జన్మలు. దానము మొదలగు కర్మములు ఆచరిస్తూ అహింసా వ్రతాన్ని పాటించు వాడు దైవత్వము పొందుతాడు. సదా హింస చేయువాడు జంతువుగా జన్మిస్తాడు. అందుకని అహింస పరమ ధర్మంగా పరిగణింప బడింది.

ఈ సమాధానాలు వినిన నహుషుడు భీముని విడిచి పెట్టాడు. తన అజగర రూపమును విడిచి దివ్యమైన మానుషరూపాన్ని పొందాడు.

తరువాత ధర్మజుడు భీముని తీసుకొని తన కుటీరానికి చేరుకున్నాడు.

అప్పటిదాకా వేసవి కాలం గడిచింది. వర్షాలు మొదలు అయ్యాయి. తరువాత శరదృతువు ప్రవేశించింది. ఆ శరత్కాలము ఎలా ఉందంటే--

శా: శారదరాత్రు లుజ్వలలసత్తర తారక హారపంక్తులం
జారుతరంబు లయ్యె వికసన్నవ కైరవ గంధబంధురో
దారసమీర సౌరభము తాల్చి సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండు రుచిపూరము లంబర పూరితంబులై.

శరత్కాలం లోని రాత్రులందు, ఆకాశం ఎక్కువగా ప్రకాశిస్తున్న నక్షత్రములతో శోభాయమానంగా ఉంది. చంద్రుని కాంతి వెదజల్లబడిన పుప్పొడి లాగా మిక్కిలి సుందరంగా ఆకాశమంతా నిండి ఉంది.

శ్రీమదాంధ్రమహా భారతములో, నన్నభట్టారకుడు వ్రాసిన ఆఖరుపద్యము ఇది.

ఇందులో ఒక విశేషము ఉన్నది. ఆఖరున ఉన్న సంధి చూడండి.

"పాండు రుచి పూరములంబర పూరితంబులై."

దీనిని మామూలుగా ఐతే "అంబర పూరితంబులై"అని చదువుకుంటాము. అంటే పుప్పొడి చల్లినట్టుగా చంద్రుని వెన్నెల ఆకాశము అంతా నిండి ఉంది అని అర్ధము.

కాని ~~ఈ~~విధంగా విడదీస్తే -- ఆఖరి మాట "పర పూరితంబులై" అని కనిపిస్తుంది.

"ఇంతవరకు రాసాను ఇంక రాయడం కుదరదు. మిగిలినది పరులు పూర్తి చెయ్యవలసిందే" అని అర్ధం వచ్చేట్టు ఆ పదం అక్కడ నన్నయ ఘంటం నుండి యాధృచ్ఛికంగా పడి ఉంటుంది అని పండితులంటారు. నిజమేనేమో అని పిస్తుంది కదూ!

రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రవరమును రాజధానిగా చేసుకొని ఆంధ్ర దేశాన్ని క్రీ.శ.1022 నుండి పరిపాలించాడు. నన్నయ

భట్టారకుడు ఆయన ఆస్థానంలో కులబ్రాహ్మణుడు అనే మంత్రిగా ఉండేవాడు. నన్నయ భట్టారకుడు ఆపస్తంభ ససూత్రుడు. మౌద్గల ముని గోత్రికుడు.

రాజరాజ నరేంద్రుని కోరిక మేరకు నన్నయ భట్టారకుడు మహా భారతాన్ని తెలుగులో రచించాడు. ప్రతి ఆశ్వాసాంతంలో ఆయనను స్తుతించాడు. మహా భారతాన్ని నన్నయభట్టు క్రీ.శ.1054-61 మధ్య కాలంలో రచిం చాడు. ఈరచన దాదాపు నాలుగేళ్లు సాగింది. అరణ్య పర్వంలో పై పద్యం దాకా రచించాడు. తరువాత పరమపదించాడు.

ఆ తరువాత 200 వందల ఏండ్లకు, అంటే దాదాపు 13 వ శతాబ్దములో నెల్లూరు వాసి అయిన తిక్కన సోమయాజి విరాట పర్వము నుండి మిగిలిన 15 పర్వాలు పూర్తి చేసాడు. అరణ్య పర్వము అసంపూర్ణంగానే మిగిలిపోయింది.

తరువాత 200 ఏండ్లకు అప్పటి నెల్లూరు మండలంలో నే ఉన్న గుడ్లూరు వాస్తవ్యుడు ఎఱ్ఱాప్రగడ 14వ శతాబ్ది పూర్వార్ధంలో అరణ్య పర్వాన్ని పూరించాడు. అంటే ఈమహా భారత రచన దాదాపు 300 ఏండ్లు పాటు సాగింది అని తెలుస్తూ ఉంది.

ఎఱ్ఱాప్రగడ క్రీ.శ.1280 నుండి 1364 వరకు జీవించి ఉన్నాడని, హరి వంశము, నృశింహపురాణము, రామాయణం, అరణ్యపర్వశేషము మొదలగు గ్రంధాలు రచించాడని మనకు తెలుస్తోంది.

ఆయన పాకనాటిలో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానము వలన క్షేత్రగౌరవాన్ని పొందిన గుడ్లూరు లో పుట్టిన ఆపస్తంబ సూత్రుడు, శ్రీవత్సగోత్రీకుడు, శివారాధనా తత్పరుడు, పోతమాంబా సూరనార్యులనే పుణ్యదంపతుల పుత్రుడు. ఇవి ఎఱ్ఱన జీవిత విశేషాలు.

నన్నయ వదిలి పెట్టిన అరణ్య పర్వశేషాన్ని ఎఱ్ఱన పూరించినా నన్నయ భట్టారకుని మీద ఉన్న గౌరవము చేత, ఆయనపేరు మీద, ఆయన రచనగానే రచించడం అపూర్వము. ఇది ఎఱ్ఱనకు పూర్వ కవులమీద ఉన్న గురు భావం సూచిస్తుంది. అంతటి వినయశీలి ఎఱ్ఱన.

(నన్నయ, ఎఱ్ఱన గురించి పైన చెప్పిన విషయములు తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రచురించిన శ్రీమదాంధ్రమహాభారతము ఆది పర్వము, అరణ్యపర్వము పీఠికలనుండి గ్రహింపబడినవి. వారికి నా కృతజ్ఞతలు).

ఎఱ్ఱన రచించిన మొదటి పద్యాన్ని చూడండి.

చ: స్ఫురదరుణాంశు రాగరుచి బొంపిరివోయి నిరస్తనీరదా
వరణములై దళత్కమల వైభవజృంభణ ముల్లసిల్ల ను
ద్ధురతరహంసారసమధువ్రతనిస్వనముల్ సెలంగగా
గరము వెలింగె వాసరముఖంములు శారదవేళ జూడగన్.

నేను నాలుగవ ఫారం (ప్రస్తుతం 9 క్లాస్) చదువుతున్నప్పుడు, మాకు తెలుగు పాఠ్యాంశంగా వర్షర్తు శరదృతు వర్ణనము అని పై రెండు పద్యాలతోపాటు ఇంకా కొన్ని పద్యాలు పాఠ్యాంశంగా ఉండేవి. అప్పటి మా తెలుగు మాష్టారు నన్నయ కవిత, ఎఱ్ఱన కవిత వాటిలో ఉన్న విశేషాలు ఎంతో రమ్యంగా చెప్పారు. నా పూర్వ జన్మ సుకృతము వలన, నేను మహాభారతాన్ని తేటతెలుగులో రాయడం, ఆ సందర్భంలో నేను చిన్నప్పుడు నేర్చుకున్న పద్యాల గురించి రాయడం నా అదృష్టం గా భావిస్తు న్నాను. ఇంక ఎఱ్ఱన రచించిన అరణ్య పర్వశేషాన్ని అవధరించండి.

మహా భారతము - అరణ్య పర్వము -

చతుర్థాశ్వాసములో నన్నయభట్టు కవిత్వం సంపూర్ణం.

# మహాభారతం

# ఆరణ్య పర్వము.

# చతుర్ధాశ్వాసము

## ( ఎఱ్ఱాప్రగ్గడ ప్రణీతము )

పాండవులలో మధ్యముడు అర్జునుడు. అర్జునుని కుమారుడు అభిమన్యుడు. అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తు మహారాజు. ఆ పరీక్షిత్తు మహారాజు కుమారుడే జనమేజయుడు.

జనమేజయుడు సర్పయాగం చేసాడు. ఆ సమయంలో వేదవ్యాసుని శిష్యుడైన వైశంపాయనుడు, మహా భారత కధను జనమేజయ మహారాజుకు వినిపించాడు. ఆ సమయంలో, రోమ హర్షుణి కుమారుడైన ఉగ్రశ్రవసుడు (సూతి) ఆ మహా భారత కధను శ్రవణం

చేసాడు. తను విన్న మహా భారత కథను, శౌనక మహర్షి సత్రయాగం చేసిన సందర్భంలో, శౌనకాదిమహా మునులకు చెప్పాడు.

ఆ ప్రకారంగా, మహా భారత కథను, నైమిశారణ్యంలో, శౌనక మహర్షి ఆశ్రమంలో, రోమహర్షణి కుమారుడైన ఉగ్రశ్రవసుడు (సూతి) అనే పౌరాణి కుడు, శౌనకాది మహా మునులకు ఇలా చెప్పసాగాడు.

శరత్కాలంలో దక్షిణ దిశగా అగస్త్య నక్షత్రం కనిపించింది. ఆ శరదృతువులో పాండవులు సరస్వతీ నదిలో స్నానాలు చేస్తూ కొన్నాళ్లు గడిపారు.

తరువాత వారు కామ్యక వనం చేరుకున్నారు. పాండవులు కామ్యకవనంలో ఉండగా శ్రీకృష్ణుడు సత్యభామతో సహా వారిని చూడటానికి వచ్చాడు. ఆ సమయంలోనే చిరంజీవి అయిన మార్కండేయ మహర్షి కూడా వారిని చూడటానికి వస్తున్నట్టు వర్తమానం వచ్చింది. ధర్మరాజు శ్రీకృష్ణుని సాదరంతో ఆహ్వానించి అర్ఘ్యపాద్యాదులతో సత్కరించాడు.

శ్రీ కృష్ణుడు ధర్మజుని చూచి " ధర్మరాజా! కౌరవులు నిన్ను, నీ సోదరులను, భార్యను ఎన్నో బాధలకు గురిచేసారు. కాని ధర్మం నీ పక్షాన ఉన్నది మీకు విజయం తథ్యం. అంధక, వృష్ణి, భోజ, కుకుర మొదలగు భూపతులు అందరూ నీకు అండగా ఉన్నారు. ఈ సామ్రాజ్యలక్ష్మికి నీవే నాధుడవు. చింతింపకుము." అని అనునయ వాక్యాలు పలికాడు.

దానికి ధర్మరాజు "దేవా! చాలా మటుకు అరణ్యవాసం పూర్తి అయింది. ఇంకా కొద్దికాలం మాత్రం మిగిలి ఉంది. అటుపిమ్మట అజ్ఞాతవాసం కూడా పూర్తి చేసి ధర్మం తప్పకుండా మా రాజ్యాన్ని మేము జయిస్తాము. దీని కంతకు నీ దయ ఉంటే చాలు. భారం అంతా నీ మీదనే మోపుతున్నాను." అన్నాడు ధర్మరాజు.

శ్రీకృష్ణుడు అక్కడే ఉన్న ద్రౌపదిని చూచి "అమ్మా ద్రౌపదీ! నీ కుమారులు యాదవ రాజకుమారులతో కలిసి సంతోషంగా ఉన్నారు. అస్త్రశస్త్ర విద్యలను అభ్యసిస్తున్నారు. నా చెల్లెలు సుభద్ర తన కుమారుడి కంటే నీ కుమారుల మీద ఎక్కువ శ్రద్ధ చూపిస్తూ ఉంది. వారిని గురించి నీవు చింత పడవద్దు." అని ఓదార్చాడు.

ఇంతలో మార్కండేయ మహర్షి అక్కడకు వచ్చాడు. శ్రీకృష్ణుడు, పాండవులు ఆ మహర్షికి ఎదురు వెళ్లి సాదరంతో ఆహ్వానించారు. అర్ఘ్యపాద్యాదులతో సత్కరించారు.

దర్మరాజు మార్కండేయ మహర్షిని చూచి "ఓ మహర్షి! మేము ఎన్నడూ ధర్మం తప్పి చరించలేదు. కాని మేము ఈవిధంగా బాధలు అనుభవిస్తున్నాము. కాని ధార్తరాష్ట్రులు అధర్మ వర్తనులు. ఎల్లప్పుడూ పాపకార్యాలు చేస్తూకూడా సకల సౌఖ్యాలు అనుభవిస్తున్నారు. ఈవిపరీత పరిస్థితికి కారణం ఏమిటి? మనుష్యులు తాము చేసిన కర్మలకు ఫలాన్ని ఇక్కడేఅనుభవిస్తారా? లేక మరణించిన తర్వాత పరలోకంలో అనుభవిస్తారా? లేక ఈ లోకంలోనూ, పరలోకంలోనూ కూడా అనుభవిస్తారా? ఈ విశ్వకర్త అయిన ఈశ్వరుని చూడని వాడు కర్మఫలము అనుభవింపడా? ఈ దేహంతోనే చేసిన కర్మలు కూడా వెడలి పోతాయా? ఈవిషయాలు అన్ని నాకు తెలియ చెప్పమని కోరుతున్నాను" అని ధర్మరాజు మార్కండేయ మహర్షిని కోరాడు.

అప్పుడా మార్కండేయ మహర్షి ఈవిధంగా సమాధానం చెప్పాడు. ,

“ధర్మజా! తొల్లి విధాత ప్రధమ కల్పంలో అత్యంత నిర్మలమైన, పుణ్యప్రదమైన శరీరాలను సృష్టించాడు. ఆ ప్రకారం పుట్టిన మనుజులు మహా సత్వ సంపన్నులు, సత్యమును పలికేవారు, సత్యమునే వ్రతముగా చేసుకున్నారు. జ్ఞాన సముపార్జన చేసారు. స్వేచ్ఛగా జీవించారు. దేవతల మార్గాలలో పయనించారు. అధిక శ్రమ లేకుండానే ఎక్కువ ఫలితాలను పొందారు.

ధర్మం తప్పకుండా చరించేవారు. వారికి మత్సరం లాంటి దుర్గుణాలు లేవు. అధికంగా సంతానవంతులై ఎన్నో వేల సంవత్సరాలు జీవించారు.

కాని కాలం గడిచే కొద్ది మానవులలో కామము, క్రోధము, మోహము, లోభము, మదము, మాత్సర్యము అనే దుర్గుణాలు ప్రవేశించాయి. మాయలో పడిపోయారు. అందుకని దేవతలు వారిని వదిలి వేసారు.

మానవులలో బలం క్షీణించింది. ఆయుష్షు తగ్గిపోయింది. సిరిసంపదలు తొలగి పోయాయి. దరిద్రులు అయ్యారు. చేసిన కార్యములకు సత్ఫలితాలు రావడం తగ్గిపోయింది. అన్నిరకాల రోగాలు

చుట్టుముట్టాయి. మానవులకు దేవుని మీద నమ్మకం సన్నగిల్లి నాస్తికులు అయ్యారు. ఒకరంటే ఒకరికి పడటం లేదు. పాపాలు చేస్తున్నారు. నరాకానికి పోతున్నారు. మరల జంతువులుగా జన్మలెత్తుతున్నారు. ఈ సంసార చక్రంలో తిరుగుచూ జననమరణములతో సతతమవుతున్నారు.

ఈవిధంగా మానవులు పుణ్యములు పాపములు చేస్తూ ఉన్నందువలన, మరణించునపుడు ఆ పుణ్యపాపములు వారిని విడువకుండా వెంటనే వెళుతున్నాయి. వారు తమ సహజ గుణమైన సుఖాన్ని మరిచిపోయి, దుఃఖమును దైన్యమును అయిన జీవితము ను గడుపుతున్నారు. ఆ పుణ్యపాపములు అనుభవించుటకు మరల మరల దేహధారులవుతున్నారు.

ధర్మజా! మనుష్యులకు వారు చేసిన పుణ్య పాపములు అనుభవింపక తప్పదు. ఈ శరీరం మరణించినా వారు చేసిన కర్మఫలములు నశించవు. కొంతమంది వారు చేసిన పుణ్య కార్యములకు ఈ జన్మలోనే సుఖాలు అనుభవిస్తారు. కొందరు పరలోకంలో సుఖం అనుభవిస్తారు. కొంతమంది ఈ లోకంలోనే పరలోకంలోనూ సుఖం అనుభవిస్తారు.

కొంతమందికి ఈ లోకంలో కాని పరలోకంలో కాని సుఖం దక్కదు. అది వారు చేసుకున్న కర్మలను బట్టి ఉంటుంది. కొంతమంది ఎక్కువ ధనం సంపాదిస్తారు. కాని పుణ్య కార్యాలు చెయ్యరు. ఎల్లపుడూ ఇంద్రియ వాంఛలతోనూ కోరికలు తీర్చుకోడంలోనూ కాలం గడుపుతారు. పుణ్యం చెయ్యరు. లోభము, మోహము లతో సతమత మవు తుంటారు. (సంపాదించింది చాలదు. ఇంకా సంపాదించాలి అనేది లోభము. అది కావాలి ఇది కావాలి అని నిరంతరం తృప్తిలేకుండా జీవించడం మోహం).వారికి ఇంద్రియ సుఖాలే ఎల్లప్పుడూ కళ్లకు కనపడుతుంటాయి. వాటికోసమే జీవిస్తుంటారు.

ధర్మరాజా! నిరంతరం పుణ్యకార్యాలు చెయ్యడం, వేదాధ్యయనం చెయ్యడం, తీర్ధయాత్రలు చెయ్యడం మొదలైన పుణ్యకార్యాలు చేయడం వల్ల ఇహలోకంలో కొన్ని కష్టాలు పడ్డా, పరలోకంలో సుఖం లభిస్తుంది. ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరిస్తూ, ధర్మం తప్పకుండా చరిస్తూ, ధర్మంగా ధనం సంపాదిస్తూ, ధర్మం ప్రకారం పెళ్లి చేసుకొని, సంతానం పొంది, పుణ్యకార్యాలు చేసిన వారు ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖాలు అనుభవిస్తారు. ఎల్లప్పుడూ అబద్ధాలు చెపుతూ, ఇంద్రియలోలురై, శుచి, శుభ్రత లేకుండా నాస్తికులై తప్పుడు పనులు చేస్తూ, జీవితం

గడిపేవాళ్లు, ఈ లోకంలో నూ పరలోకంలోనూ ఎప్పుడూ దుఃఖం అనుభవిస్తారు.

ధర్మజా! మీరు దేవతల అంశలతో జన్మించారు. మీరు ధర్మం తప్పకుండా మీ పరాక్రమాన్ని ప్రదర్శించి, శత్రువులను జయిస్తారు. భూభారాన్ని తగ్గిస్తారు. ఎన్నో యజ్ఞయాగాలు చేసి దేవత్వాన్ని పొందుతారు.” అని మార్కండేయ మహర్షి ధర్మరాజుతో చెప్పాడు.

అది విని ధర్మ నందనుడు తనకు బ్రాహ్మణ ప్రభావము వినవలెనని ఉన్నది అని చెప్పగా, మార్కండేయ మహాముని ఇలా చెప్పసాగాడు.

“ఓ ధర్మ నందనా! పూర్వము హైహవ వంశోద్భవుడైన ధుంధుమారుడు అనే రాజు వేటనిమిత్తము అడవిలో తిరుగుతూ ఒక చోట జింక చర్మమును ఉత్తరీయముగా ధరించిన ఒక బ్రాహ్మణుని చూచి అది మృగమనుకొని దానిని బాణంతో కొట్టాడు. దగ్గరకు పోయి తాను చంపినది ఒక బ్రాహ్మణుడిని అని తెలిసి చాలా దుఃఖించాడు.

తర్వాత వంశపెద్దలను వెంటబెట్టుకొని తార్క్ష్యుడు అనే పేరుగల మహా ముని వద్దకు వెళ్లాడు. జరిగింది చెప్పి పాప పరిహారానికి మార్గం

చెప్పమని అడిగారు. ఆ మహాముని చిరునవ్వుతో తన కుమారుని పిలిచాడు. "ఇతడేనా మీ రాజకుమారుడు చంపిన బ్రాహ్మణకుమారుడు!" అని అడిగాడు.

హైహవులు ఆశ్చర్యపోయారు. "మహాత్మా! ఈ ముని కుమారుడు మా రాజకుమారుని చేతిలో చనిపోయాడు. మరల బతికాడు. దీనికి కారణం వివరించండి!" అని అడిగారు.

" మేము కొన్ని నియమాలు పాటిస్తాము. దేనిని ఆలస్యం చేయము. ఆహారము నియమంగా తీసుకుంటాము. నిత్యకర్మలు పాటిస్తాము. అతిథులను సత్కరిస్తాము. ఎప్పుడూ సత్యమునే పలుకుతాము. బ్రహ్మచర్యాన్ని పాటిస్తాము. శాంతిగా ఉంటాము. దాని వలన మాకు రోగములు, మృత్యువు లాంటి భయము లేదు. కాబట్టి మీరు నిశ్చింతగా వెళ్లండి." అని అన్నాడు. వారు ఆ మహామునికి నమస్కరించి వెళ్లిపోయారు.

కాబట్టి బ్రాహ్మణ ప్రభావము అంతటిది. ఇప్పుడు నీకు బ్రాహ్మణ క్షత్రియ స్వరూపము లు తెలుపు ఒక గాధ వివరించెదను" అని మార్కండేయ మహా ముని ఈ విధంగా చెప్పసాగాడు.

"పూర్వము అత్రి అనే మహాఋషి ఉండేవాడు. అతడు తపస్సు చేసుకొనుటకు అరణ్యమునకు పోతూ తన భార్యతో "నేను తపస్సుచేసుకోడానికి వెళుతున్నాను. నువ్వు నీ పుత్రుల వద్ద ఉంటావా లేక నాతో వస్తావా?" అని అడిగాడు. దానికి ఆమె ఇలా చెప్పింది. "నాథా! పుత్రుల పోషణము, కుటుంబ పోషణకు తగిన ఏర్పాట్లు చేయకుండా తమరు ఈవిధంగా అరణ్యమునకు వెళ్లడం భావ్యంకాదు. కాబట్టి మీరు వైన్యమహారాజును అడిగి తగిన ధనమును తీసుకొని రండి." అని చెప్పింది.

ఆమె మాట ప్రకారము అత్రి వైన్యమహారాజు దగ్గరకు వెళ్లాడు. ఆ సమయంలో ఆ మహారాజు అశ్వమేధయాగము చేసి బ్రాహ్మణులకు దానధర్మాలు చేస్తున్నాడు.

అత్రి ఆయన వద్దకు వెళ్లి "రాజా! నీవు బ్రహ్మదేవునితో సమానుడవు. ఇంద్రునితో సమానుడవు. నీవు సమస్త జనులకు ఈశ్వరుడవు. నీకు అన్నిధర్మములు తెలియును. నిన్ను పోలిన రాజులు ఈ భూమిమీద లేరు. నిన్ను అందరు ఋషులు పొగుడుతారు." అని పలికాడు.

అక్కడే ఉన్న గౌతమ మహర్షి ఇది అంతా విన్నాడు. ఆయనకు కోపం వచ్చింది. "కేవలం ధనం కోసం, జంకు లేకుండా, మానవమాత్రుడైన రాజును ఇంద్రు డు, బ్రహ్మదేవుడు అని పొగడటం తగునా!" అని అన్నాడు.

దానికి అత్రి "ఇది యుక్తము, ఇది అయుక్తము అని తెలియకుండా మాట్లాడవలదు. నిర్మలుడై, నీతి వంతుడై, పరాక్రమ వంతుడై సమస్త లోకాలను పరిపాలించే రాజే ధర్మముల కంతటికి మూలము. అతని గొప్పతనాన్ని ప్రశంసించడం నాకు తగదా!"అని బదులు చెప్పాడు.

దానికి గౌతముడు "నీకు వయసు వచ్చి కేశములు తెల్లబడినంత మాత్రమున నీకు జ్ఞానం వస్తుందా. సభలలో జ్ఞానవృద్ధుల మాటలకు మాత్రమే విలువ కలదు" అని బదులు చెప్పాడు.

ఈ మాదిరి అత్రి, గౌతముడు వాదులాడుకుంటున్నారు. ఇది అంతా కశ్యపుడు అనే మహా ముని విన్నాడు. "అయ్యా! ఈవివాదము మన వలన తేలదు. సనత్కుమారుడు అనే మహా మునిని అడుగుదము." అని అన్నాడు.

తరువాత అందరూ సనత్కుమారుని వద్దకు పోయి అత్రి గౌతముల వివాదమును వివరించారు. అప్పుడు సనత్కుమారుడు ఈవిధంగా చెప్పాడు.

"అత్రి నిజమే చెప్పాడు. అతని వాక్యములు ధర్మయుక్తములు. ఈ భూమి సమస్తమును తన భుజస్కంధముల మీద మోసే సుక్షత్రియుడు అందరిని కాపాడే ప్రభువు. కావున శత్రువులను సంహరించి ప్రజలను కాపాడే రాజే ఈశ్వరుడు, బ్రహ్మ. రాజు జనులకందరికి పూజ్యుడు. అతని శాసనము ప్రకారము మంచి వారు, మునులు తమతమ విధులు సక్రమంగా నెరవేరుస్తారు. ఎవరూ అతని ఆజ్ఞ మీరరు. రాజే విరాట్టు, సామ్రాట్టు, అతనే అదృష్టాన్ని జయించిన వాడు. సత్య సంధుడు. ప్రజలను సక్రమంగా పాలించేవాడు. ధర్మబుద్ధి కలవాడు. ఈ గుణములతో కూడిన నామములతో రాజును వేదాలలో వర్ణించారు.

పూర్వము అధర్మమునకు భయపడి బ్రాహ్మణులు తమ తమ తేజస్సును రాజులయందు నిక్షేపించారు. నాటినుండి బ్రాహ్మంబువలన, క్షాత్రము ప్రవర్తిస్తూ ఉంది. కాబట్టి బ్రాహ్మము, క్షాత్రము ఒకదాన్ని ఒకటి

ఆశ్రయించుకొని ఉన్నాయి. అవి విడి విడి గా మనలేవు. సూర్యుడు చీకటిని పటా పంచలు చేయునటుల క్షత్రియుడు బ్రాహ్మణ సేవనము వలన తేజోమంతుడయి అధర్మాన్ని అణిచి, ధర్మాన్ని నిలుపుతాడు. ఆ కారణం చేత క్షత్రియుడు అధికుడు అని చెప్పవచ్చును." అని సనత్కుమారుడు చెప్పాడు.

అప్పుడు వైన్యమహారాజు అత్రికి కావలసినంత ధనము ఇచ్చాడు." అని మార్కండేయుడు చెప్పాడు.

" ఓ ధర్మరాజా! ఇప్పుడు నీకు సరస్వతీ గీత అనే కథను చెపుతాను వినుము" అని మార్కండేయుడు చెప్పసాగాడు.

"పూర్వము తార్ క్ష్యుడు అనే మహాముని సరస్వతీ దేవిని ఆరాధించాడు. ఆ దేవి అతనికి ప్రత్యక్షం అయింది.

"అమ్మా! నీవు నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పు. మానవుడు ఆచరించవలసిన ధర్మము ఏది? మానవుడు ఏ విధంగా పరమ పుణ్యాత్ముడై పుణ్యలోకాలకు పోతాడు?" అని అడిగాడు.

దానికి సరస్వతీ దేవి ఈవిధంగా చెప్పింది.

“ నాలుగు వేదములు చదివిన బ్రాహ్మణుడు, ఎన్నో యజ్ఞయాగములు చేసి, పుణ్యములుసంపాదించి స్వర్గానికి వెళతాడు.

మంచి పాలు ఇచ్చే ఆవులను దానం చేసిన బ్రాహ్మణుడు కూడా స్వర్గానికి వెళతాడు. ఆవు శరీరం మీద ఎన్ని రోమములు ఉండునో అని సంవత్సరములు అతను స్వర్గలోకంలో ఉంటాడు.

మంచి కోడె ఎద్దును దానం చేసిన వాడు పది ఆవులు దానం చేసిన పుణ్యం సంపాదిస్తాడు.

వస్త్రదానం చేసిన వాడు చంద్రలోకానికి పోతాడు. బంగారము దానము ఇచ్చినవాడు స్వర్గలోకం చేరతాడు.

ఏడు సంవత్సరాలు అగ్ని దేవుని నేతితో ప్రీతిగా హోమం చేసిన వాడు తన పదునాలుగు తరముల పితృదేవులను తీసుకొని స్వర్గానికి వెళతాడు.

ఎల్లప్పుడూ శుచిగా ఉంటూ, నిరంతరం అగ్ని హోత్రం చేసేవాడు, గోలోకము చేరుతాడు. ఎందుకంటే అగ్నిహోత్రము నా స్వరూపము. సకల యజ్ఞములకు కావలసిన సంభారములు నాకు సంబంధించినవి. నేను అగ్నిహోత్రుని ముఖం లోనుండి పుట్టాను. నేను విద్వాంసులందరి సందేహాలు తీర్చగలను.

ఎల్లప్పుడూ వేదములు చదువుతూ, దాన ధర్మములు చేయు తపోధనులు శోకము అనేది తెలియకుండా ఎక్కడ నివసిస్తారో అక్కడే నేను నివసిస్తాను. యజ్ఞ యాగాదులు చేసిన పుణ్యాత్ములు మరణానంతరము నా లోకానికి చేరగలరు." అని సరస్వతి పలికింది." అని మార్కండేయ మహా ముని ధర్మరాజుకు చెప్పాడు.

" మహాత్మా! వైవస్వతమనువు ఏ విధంగా ప్రభావ సంపన్నుడయ్యాడు. వివరించండి." అని ధర్మజుడు అడిగాడు.

"ధర్మజా! చాక్షుష మన్వంతరములో వైవస్వతుడు బదరికాశ్రమములో పదివేల సంవత్స రములు తపస్సుచేసాడు.

ఒకరోజు వైవస్వతుడు ఒక జలాశయములో స్నానము చేసి ఒడ్డున ఉండగా, ఒక చేప ఒడ్డు దగ్గరగా వచ్చి "అయ్యా! ఈ జలాశయములో నా కన్నా బలవంతము లైన జలచరములు ఉన్నవి. నన్ను వేరేచోటికి తీసుకొని పో. నీకు నేను ఉపకారం చేస్తాను." అని అడిగింది.

అప్పుడు వైవస్వతుడు ఆ చేపను తీసుకొని పోయి ఒక బావిలో విడిచి పెట్టాడు. ఆ చేప పెద్దది అయింది .

"అయ్యా నాకు ఈబావి చాలడం లేదు. వేరే చోటికి తీసుకొని పో!" అని అడిగింది. అలాగే అని వైవస్వతుడు ఆ చేపను మరొక పెద్ద బావిలో విడిచి పెట్టాడు. కొన్నాళ్లకు ఆ బావి కూడా చాలలేదు. ఆ చేప కోరిక మేరకు వైవస్వతుడు ఆ చేపను ఒక మడుగులో విడిచి పెట్టాడు. ఆ మడుగు సరిపోలేదు. అందుకని వైవస్వతుడు ఆ చేపను సముద్రంలో విడిచి పెట్టాడు.

అప్పుడు ఆ చేప వైవస్వతుని చూచి "అయ్యా! ప్రళయం రాబోవుచున్నది. అన్ని సముద్రములు కలిసిపోతాయి. దీనినే మన్వంతర సంధి అంటారు. నీవు ఒక ఓడను నిర్మించు. అందులో అన్నిరకములైన ధాన్యములు, ఓషధులు నింపుము. నీవు సప్తఋషులతో కలిసి ఆ

ఓడను ఎక్కి  నన్ను తలుచుకో. నేను నీకు మేలు చేస్తాను." అని చెప్పింది.

వైవస్వతుడు అలాగే ఒక ఓడను నిర్మించి దానిని ధాన్యములతో, విత్తనాలతో నింపాడు. సప్త ఋషులతో సముద్రాన్ని చేరాడు.  ఆ చేపను మనసులో తలంచాడు. ఇంతలో  ఆ చేప వచ్చింది. ఆ చేపకు తల మీద పెద్ద కొమ్ము ఉంది.  ఆ  ఓడ తాటిని తన కొమ్ముకు తగిలించుకొని ఆ ఓడను సముద్రం మధ్యకు తీసుకొని వెళ్లింది. ఇంతలో సముద్రాలన్ని ఏకం అయ్యాయి.  భూమి అంతా జలమయం అయింది.  ఆ చేప అనేక వేల సంవత్సరములు  ఆ ఓడను లాగుతూ ఉంది. ప్రళయం అంతరించింది.

ఆ చేప వైవస్వతుని, సప్తఋషులను చూచి "మహాత్ములారా!  ఈ ప్రళయ కాలంలో మిమ్ములను నేను కాపాడాను. నేనే  ఈ సృష్టికి కర్తను. పాలించు వాడను. మత్స్యరూపంలో మిమ్ము కాపాడాను.  ఈ వైవస్తతుడు మరల సృష్టి కొనసాగించగలడు." అని చెప్పాడు.

తరువాత వైవస్వతుడు గొప్ప తపస్సుచేసి, సకల చరాచర జీవ కోటిని సృష్టించాడు."  అని మార్కండేయుడు ధర్మరాజుతో వైవస్వతుని గూర్చి చెప్పాడు.

(ప్రస్తుతం నడుస్తున్నది వైవస్వత మన్వంతరము).

అప్పుడు ధర్మరాజు మార్కండేయుని చూచి "ఓమహర్షి! నీవు చిరంజీవివి. ఎన్నో ప్రళయాలను చూచావు. ఈ చరాచర జీవరాసుల సృష్టి స్థితి లయాలను ఎన్నోసార్లు చూచావు. లోకాలు ప్రళయ కాలంలో ఏరీతిగా ఉంటాయి. వివరించండి." అని అడిగాడు.

దానికి మార్కండేయుడు "ధర్మజా! నీవు అడిగిన ఈ ప్రశ్నకు, సాక్షాత్తు విష్ణు మూర్తి అవతారము అని చెప్పబడుతున్న శ్రీకృష్ణుని అనుమతితో సమాధానము చెపుతున్నాను. సావధానముగా వినుము" అని ఈ విధంగా చెప్పసాగాడు.

"కృతయుగము, త్రేతాయుగము, ద్వాపరయుగము, కలియుగము అని యుగములు నాలుగు. ఇవి 12,000 దివ్య సంవత్సరములు. ఈనాలుగు యుగములు కలసి ఒక మహా యుగము అని పిలువబడతాయి. ఇలాంటి మహాయుగములు 1000 కలిస్తే బ్రహ్మదేవునికి ఒక పగలు అవుతుంది. అలాంటి బ్రహ్మ దివసము ఆఖరున, 100 సంవత్సరములు తీవ్రమైన అనా వృష్టి ఏర్పడుతుంది.

సూర్యుడు తీవ్రంగా తీక్షణంగా ఉంటాడు. దానితోడు విపరీతమైన గాలులు వీస్తాయి. అంతలోనే మేఘాలు కమ్ముకుంటాయి ఉరుములు మెరుపులతో విపరీతంగా వర్షము కురుస్తుంది. నదులు, సముద్రాలు నిండుతాయి. అనావృష్టిఅంతరించి అతివృష్టి ఏర్పడుతుంది. భూభాగమంతా జలమయమవుతుంది. గాడాంధకారము భూమండలం అంతా ఆక్రమిస్తుంది.

ఇంతలో బ్రహ్మదేవుని ఆజ్ఞ ప్రకారము విపరీతమైన గాలి వీచి ఆ మేఘాలను చెదర గొడుతుంది. అప్పుడు బ్రహ్మదేవుడు ఆ ఘోరమైన నీటి మధ్య పద్మము మీద నిద్రిస్తాడు. ఈ విధంగా కల్పాంతమవుతుంది. ఈ రకమైన కల్పములు ఎన్నోగడిచాయి. ఇక ముందు ఎన్నో రానున్నాయి.

( కల్పాంతము అనగా కల్పము చివర వచ్చు ప్రళయము. కల్పము అనగా బ్రహ్మదేవుని కి ఒక రోజు. మన కాలమానంలో నాలుగు యుగాలు 1000 మార్లు గడిస్తే బ్రహ్మకు ఒక పగలు. అప్పుడు ప్రపంచం చైతన్యవంతంగా ఉంటుంది. బ్రహ్మకు సాయంత్రం జల ప్రళయం వస్తుంది. గాడాంధకారం అలుముకుంటుంది. అది బ్రహ్మకు రాత్రి. అప్పుడు జగత్తు చైతన్యరహితంగా ఉంటుంది.)

ధర్మజా! ఈ కల్పాంతములలో నేను దిక్కుతోచక తిరిగాను. ఒక సారి జలప్రళయంలో, నాకు ఒక పెద్ద మర్రి చెట్టు కనపడింది. ఆ మర్రి చెట్టు ఆకు మీద, నీల మేఘశ్యాముడైన మహా విష్ణువు చిన్ని బాలుని వలె, పడుకొని వున్నాడు. ఈ మహా ప్రళయంలో ఈ చిన్ని బాలుడు ఎలా ఉన్నాడా అని నాకు ఆశ్చర్యం కలిగింది. నేను ఆ బాలకుని దగ్గరగా వెళ్లాను.

అప్పుడు ఆ బాలుడు నన్నుచూచి నవ్వుతూ "మహానుభావా! నీకు విశ్రాంతి లేక అలసి పోయి ఉన్నట్టున్నావు. కొంచెంసేపు నా దేహంలోకి ప్రవేశించి కొంచెంసేపు విశ్రాంతి తీసుకో!" అన్నాడు. అలా అంటూ తన నోరు తెరిచాడు. నేను ఆ నోటిలోకి బలవంతంగా నెట్టబడ్డాను.

ఆబాలకుని కడుపులో---- గంగానది మొదలైన మహా నదులు, మేరు పర్వతము మొదలైన మహా పర్వతాలు, సముద్రాలు, నగరాలు, జనపదాలు, ప్రజలు, పశుపక్ష్యాదులు, సువిశాల భూభాగాలు, సూర్యచంద్రులు, నక్షత్ర సముదా యములు, అనంతాకాశము, ఇంద్రాది దేవతలు, యక్ష, రాక్షస, కిన్నెర, కింపురుషులు,విద్యాధరులు

సమస్తదేవతా సమూహములు, సమస్త జగములు ఆ చిన్ని బాలుని కడుపులో చూచాను.

అక్కడ 100 సంవత్సరాలు తిరిగాను. నాకు భయం వేసింది. ఆ బాలుని ప్రార్థించాను. ఆ బాలకుడు వదిలిన గాలికి నేను బయటకు విసిరివేయబడ్డాను. మరల అదే మర్రి ఆకు మీద పవళించిన బాలకుని చూచాను.

"మహాత్మా! నా ఉదరములో విశ్రాంతి తీసుకున్నావా?" అని అడిగాడు. నేను ఆ బాలకుని పాదములకు నమస్కరించి "దేవా! నీ ప్రభావమువలన సమస్త జగములు నీ ఉదరములో చూచాను. నీ మాయ అర్థం చేసుకోలేను. నీవా చిన్ని బాలుడివి. నీ ఉదరములో సమస్తజగములు ఉన్నాయి. ఆ జల ప్రళయం ఏమిటి? ఈమర్రిచెట్టు ఏమిటి? ఆ మర్రి ఆకు మీద నీకు పవళించటం ఏమిటి? దేవా! నీవు నా భ్రాంతిని తొలగింపుము." అని ప్రార్థించాను. అప్పుడు ఆ బాలకుడు ఐన మహా విష్ణువు నాకు ఈ విధంగా తెలియ చెప్పాడు.

"మహాత్మా! జలమును నారములు అంటారు. ఆ జలము నాకు స్థావరము. అందుకే నన్ను నారాయణుడు అంటారు. ఈ లోకములను

నేనే సృష్టిస్తాను. నేనే పోషిస్తాను. నేనే నా లో లయం చేసుకుంటాను. బ్రహ్మ, ఇంద్రుడు, ఈశ్వరుడు, ధనాధిపది కుబేరుడు, తదితర దేవతలందరూ నా అంశలే.

నాకు భూమి పాదము. అగ్ని ముఖము. సూర్యుడు, చంద్రుడు నేత్రములు. ఆకాశము నాకు శిరస్సు. ఈ అద్భుతమైన ఆకారంలో నేను భాసిల్లుతాను. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు,యజ్ఞయాగాదులతో నన్ను ఆరాధిస్తారు. ప్రళయ కాలంలో ఈ భూమిని వరాహావతారములో ఉద్ధరించింది నేనే. ఆ భూమండలాన్ని ఆది శేషుని రూపంలో ధరిస్తున్న వాడను నేనే. అగ్ని రూపంలో నేను సముద్రజలాలను తాగుతాను. మరల వర్షరూపంలో విడిచి పెడతాను.

సృష్టి ఆరంభంలో నేను నా ముఖము నుండి,భుజములనుండి, తొడలనుండి, పాదముల నుండి నాలుగు వర్ణములను సృష్టిస్తాను. నాలుగు వేదాలు నా ముఖం నుండి ఆవిర్భవిస్తాయి. ప్రళయకాలంలో వీటినన్నిటిని నాలో లయం చేసుకుంటాను. అహంకారమును విడిచి, క్రోధములేక, అసూయకు లోబడక, కోరికలను జయించిన వారు, ఆత్మజ్ఞానము పొందినవారు, ఎల్లప్పుడూ సత్యమునే పలికెడి వారు అయిన మహా ఋషులు నన్ను ఎల్లప్పుడూ ఆరాధిస్తుంటారు. ఈ

జగత్తులో ఉండే నక్షత్రములు, గ్రహములు, గాలి, వర్షము, అన్ని నేనే. సప్త సముద్రలను నా పడకగా అమర్చుకొని నేను పడుకొని ఉంటాను.

ఓ మహాఋషీ! సత్యము పలకడం, తపము, జ్ఞానము, అహింస మొదలగు సాత్విక గుణములు నా స్వరూపములు. అలాగే కోరికలు, కోపము, అసూయ, ద్వేషము, తామసము, అజ్ఞానము, అన్నియు నేనే. ఇన్ని మాటలెందుకు. ఈ జగత్తులో కనపడేది అంతయూ నేనే. కనపడనిది నేనే.

ఎప్పుడైతే ధర్మానికి హాని కలుగుతుందో, అధర్మము మీరి పోతుందో,
క్రూరాత్ములు రాక్షస ప్రవృత్తి గలవారు విజృంభిస్తారో, దైవ సంపత్తి కలవారు, సజ్జనులు ఎప్పుడైతే హీనత పొందుతారో, ఆ సయమంలో నేను మంచి వారి ఇండ్లలో జన్మించి, ధర్మమును నిల్పుతాను.

అంతే కాకుండా నేను కృత,త్రేతా,ద్వాపర,కలియుగములలో వరుసగా శ్వేత,రక్త,నీల,పసుపుపచ్చని రూపములలో చరిస్తూ, ధర్మస్థాపన చేస్తాను. ఈ కాల చక్రాన్ని నేను నిర్విరామముగా నడుపుతాను.

లయకాలమందు నేను కాలయముడినై ఆ సృష్టినంతా సంహరిస్తాను. నా స్వరూపాన్ని నీకు వివరించినాను.

ముల్లోకములను సృష్టించు ఆ బ్రహ్మదేవుడు కూడా నా లో సగభాగమే. నా పేరు నారాయణుడు. నేను శంఖ,చక్ర,గదా ధరుడనై బాలకుని రూపమున, ఈ భూమి అంతయూ జలమయినపుడు, వేయి మహా యుగములపాటు, యోగనిద్రలో నుందును. ఈ కల్పాంతము చూచి నీవు భయపడెదవని, నిన్ను నా పొట్టలో ఉంచాను. ఇంక నీ ఇష్టము వచ్చినచోటికి నీవు వెళ్లవచ్చును. ఇంక బ్రహ్మదేవుడు మేల్కొని మరల ఈ లోకములను సృష్టిస్తాడు." అని చెప్పి ఆ బాలకుడు మాయమైనాడు.

ఇది నేను ప్రత్యక్షముగా చూచినాను. ఆ బాలుడే నీకు శ్రీ కృష్ణుని రూపమున సఖుడై నీ వద్ద ఉన్నాడు. ఆనాడు చూచిన బాల కృష్ణుడు ఈనాడు మరల నా మీద దయతో నాకు ప్రత్యక్ష మైన ట్లున్నది. ఈ మహానుభావుని కరుణవలననే గదా నేను కల్పాంతమున కూడా, ఎలాంటి భయము లేకుండా ఉన్నాను. ఈ మహానుభావునిదర్శన భాగ్యము చేతనే నాకు గతస్మృతులు జ్ఞప్తికి వచ్చి నీకు చెప్పగలిగితిని." అని మార్కండేయుడు కల్పాంతము గురించి ధర్మజునకు వివరించాడు.

అప్పుడు ధర్మనందనుడు మార్కండేయుని చూచి "మహాత్మా! కలియుగములో ధర్మహాని కలుగుతుంది అంటారు కదా, దానిని గురించి వివరించండి." అని అడిగాడు.

అప్పుడు మార్కండేయుడు ధర్మరాజుకు కలియుగ ధర్మాలు ఈ విధంగా వివరించాడు.

"దర్మనందనా! కృతయుగములో ధర్మము నాలుగు అంశములతో చరిస్తుంది. త్రేతాయుగమున మూడు అంశలతో చరిస్తుంది. ద్వాపరమున రెండు అంశములతో చరిస్తుంది. కలియుగంలో ఒక్క పాలు వర్ధిల్లుతుంది.

ధర్మం క్షీణిస్తుంది. అధర్మం రాజ్యమేలుతుంది. నరులు సత్యం చెప్పరు. సత్యహాని జరుగుతుంది. మనుజుల ఆయువు తగ్గిపోతుంది. దాని వలన చదువుతు క్షీణిస్తాయి. విద్యలు లేకపోవడం వలన మోహము కలుగుతుంది. మోహము వలన లోభము, లోభము వలన కామము, కామము వలన క్రోధము, క్రోధము వలన వైరము ఒకదాని వలన ఒకటి కలుగుతాయి. వైరము వలన వర్ణముల మధ్య విబేధాలు కలుగుతాయి. వర్ణ సంకరము కలుగుతుంది. హింసప్రబలుతుంది.

బ్రాహ్మణుడు తమ ధర్మాలైన జపము, తపము, నియమము, స్వాధ్యాయము విడుస్తారు. శూద్రులు తపస్సు చేస్తారు. జనపదములన్నియు, క్రూరమృగములతో నిండి పోతాయి. అరాచకము ప్రబలుతుంది. రాజులు దుష్టులవుతారు. రాజ్యాధికారము నశిస్తుంది. క్షత్రియులు తమ ధర్మములైన క్షాత్రము, తేజము, శౌర్యము విడిచిపెట్టి సేవకావృత్తి అవలంబిస్తారు.

పంటలు సరిగా పండవు. చెట్లకు కూడా కాయలు, పండ్లు సరిగాకాయవు. రాజులు ప్రజలను బాధిస్తారు. బ్రాహ్మణుడు తమ ధర్మాన్ని విడిచి పెట్టి, వ్యాపారము, వ్యవసాయము చేస్తారు. నాస్తికులు ప్రబలుతారు. దేహసంరక్షణమే ముఖ్యంగా భావిస్తారు. పాపం, పుణ్యం అనే మాటలకు విలువ ఉండదు. అవి అబద్ధాలవుతాయి. వానలు సరిగా సకాలంలో కురియవు. విత్తనములు తాలుగా ఉంటాయి. కొనుగోలు అమ్మకాలలో మోసాలు ఎక్కువ అవుతాయి. తాకట్టుగా పెట్టిన ఆభరణములు అపహరిస్తారు.

సాధుచరితులు, సజ్జనులు రోగములతో బాధపడతారు. అకాలమరణం పొందుతారు. అధర్మవర్తనులు దీర్ఘాయువులై, భోగభాగ్యాలతో వృద్ధిపొందుతారు. పనికిరాని పంటలు ఎక్కువగా

పండుతాయి. మనుజులలో వివాహేతర సంబంధాలు ఎక్కువ అవుతాయి. పితృకార్యాలలో అర్పించిన పిండములు, ఒకరి పిండములు మరొకరు తింటారు. దైవ కార్యాలు పితృకార్యాలు, దేశ, కాలాను గుణంగా జరగవు.

బ్రాహ్మణులు హేతువాదు లవుతారు. వేదాములను నిందిస్తూ, పూజలు, వ్రతములను విడనాడి, దుర్మార్గులవుతారు. స్త్రీలను, దుర్బలులను, దీనులను, బంధువులను మోసగించి వారి ఆస్తులను అపహరించువారిని, తల్లితండ్రులను, కన్నబిడ్డలను చంపువారిని, విచ్చలవిడిగా సంచరించేవారిని ప్రజలు పూజిస్తారు. బ్రాహ్మణులు, వారి వద్దచేరి. వారి ధనంకోసం ఆశపడతారు.

భూమిని పరిపాలించవలసిన ప్రభువులు, ప్రజలను రక్షించవలసిన ప్రభువులు, గర్వంతో, మదంతో ఆ ప్రజలనే దోచుకుంటారు. స్త్రీలను, ధనమును, భూములను హరించెదరు. రాజులు వారిలో వారు కలహించుకుంటూ యుద్ధాలు చేసుకుంటారు. ప్రజా క్షయం అవుతుంది.

కొడుకులు తండ్రులను అవమానిస్తారు. భర్తలను భార్యలు అవమానిస్తారు. భార్యాభర్తలకు ఒకరు అంటే ఒకరికి పడదు. ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు విహరిస్తారు. దేవ కార్యములు, పితృకార్యములు

నడవవు. వేదాధ్యయనము అంతరిస్తుంది. ఈ భూమి మొత్తము దుర్జనులతో నిండిపోతుంది. పదహారు ఏండ్లకే నిండు నూరేళ్లు నిండుతాయి. 7,8 ఏండ్లకే స్త్రీలు సంతానవతులు అవుతారు.

దానం చేసేవాళ్లు ఉండరు. ప్రజలు ఒకరిని ఒకరు దోచుకుంటారు. అన్ని తెలిసిన జ్ఞానులు సైతం పాపపు పనులు చేస్తుంటారు. అన్నాన్ని ధనం కొరకు అమ్ముకుంటారు. బ్రాహ్మణులు వేదములు అమ్ముకుంటారు. స్త్రీలు తమ మానాన్ని ధనానికి అమ్ముకుంటారు. శూద్రులు అత్యంత బలవంతులై ఇతరులను సంహరిస్తారు. బ్రాహ్మణులు దిక్కుతోచక నాలుగు దిక్కులకు పారి పోతారు. దొంగలు దోపిడీదారులు ప్రజల ధనాన్ని దోచుకుంటారు. ప్రాణాలుకూడా తీస్తారు. వారికి భయపడి ప్రజలు అడవులలో తలదాచుకుంటారు. శూద్రులు వేదాంత విషయములను వివరించి చెపుతుంటే బ్రాహ్మణులు వింటుంటారు. బ్రాహ్మణులు ధైర్యంలేక శూద్రులకు సేవకులౌతారు. చెయ్యకూడని పనులు చేస్తారు.

కలియుగంలో దేవాలయాలు, బ్రాహ్మణ గృహాలు, పవిత్రమైన ఆశ్రమాలు పాడుపడతాయి. అడవులను ధ్వంసం చేస్తారు. మద్యపానం, వ్యభిచారము వృద్ధిచెందుతుంది. శిష్యుడు గురువును

లక్ష్యపెట్టడు. గురువుగారు తన శిష్యుడిని మోసం చేస్తాడు. బంధువులు ఒకరిని ఒకరు గౌరవించరు. కరవు కాటకాలు ఏర్పడాయి. ప్రజలలో భయం ఏర్పడుతుంది. కలియుగంలో క్రమక్రమంగా పట్టణాడు, పల్లెలు నాశనం అవుతాయి. ధర్మం నశిస్తుంది. అధర్మం వర్ధిల్లుతుంది. ఆప్రకారము కలియుగం ఆఖరు దశకు చేరుకుంటుంది.

అప్పుడు శంబళ గ్రామమున కల్కి అవతరిస్తాడు. అతని పేరు విష్ణుయశుడు. అతనికి సంస్మరణ మాత్రం చేతనే సకల వేదాలు, శాస్త్రాలు అవగతమవుతాయి. అతను సార్వభౌముడవుతాడు. అతడు అధర్మవర్తనులను సంహరించి ధర్మాన్ని నిలుపుతాడు. తర్వాత అశ్వమేధయాగము చేస్తాడు. అతను నిలిపిన ధర్మం అనుసరించి బ్రాహ్మణులు తిరిగి తమతమ ధర్మాలను నిర్వర్తిస్తారు.

కృతయుగము ప్రారంభం అవుతుంది. మరల ధర్మం నాలుగు పాదాలతో విలసిల్లుతుంది. దేవాలయాలు ఆశ్రమాలు పూర్వ వైభవం పొందుతాయి. వానలు సకాలంలో కురుస్తాయి. పంటలు సమృద్ధిగా పండుతాయి. మనుజులకు ఆయువు పెరుగుతుంది. ఆరోగ్యంగా ఉంటారి. మరల కాల చక్రం మొదలవుతుంది.

కాబట్టి ధర్మనందనా! నీవు బ్రాహ్మణులను అవమానించకు. వారికి ఇష్టం వచ్చినవి చేయుము. నీకు శుభం కలుగుతుంది. సమస్త భూతములమీద దయకలిగి ఉండుము. ప్రజలను కన్నబిడ్డలవలె పాలించు. పాపాత్ములను శిక్షించు. అజ్ఞానం ప్రబలకుండా చూడు. అహంకారం వదలి పెట్టు. ఎల్లప్పుడూ సత్యం చెప్పడం అలవాటు చేసుకో. నీవు భరత వంశ సంజాతుడవు. నీకు అన్ని తెలుసు. ప్రాజ్ఞుడవు. నీకు వేరు చెప్పనవసరంలేదు" అని మార్కండేయుడు ధర్మజునికి చెప్పాడు.

అప్పుడు ధర్మనందనుడు మార్కండేయుని చూచి "మహాత్మా! మీరు ఆనతిచ్చిన ప్రకారము నేను లోభము, మాత్సర్యము లేకుండా ప్రవర్తిస్తాను.
ధర్మం ఆచరిస్తాను. తమరు నాకు బ్రాహ్మణ ప్రభావము గురించి చెప్పండి" అని ప్రార్ధించాడు. మార్కండేయుడు ధర్మజునికి ఈవిధంగా చెప్పసాగాడు.

" పూర్వకాలంలో పరీక్షిత్తుఅనే రాజు అయోధ్య ను పరిపాలిస్తుండేవాడు. అతను ఒకరోజు వేటకు వెళ్లాడు. అడవిలో ఆ రాజు ఒక అందగత్తెను చూచాడు. ఆమెను మోహించాడు.

"ఓ సుందరీ! నీవు ఎవ్వరు? ఈ అడవిలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు?" అని అడిగాడు.

దానికి ఆ యువతి "ఓ రాజా! నేను అవివాహితను. తగిన వరుని కొరకు వెదుకుతున్నాను" అని చెప్పింది.

ఆరాజు తనను పెళ్లిచేసుకోమని అడిగాడు. ఆమె అంగీకరించింది. కాని తనను ఎప్పుడూ జలవిహారానికి తీసుకు వెళ్లవద్దని కోరింది. ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఆమెను రాజధానికి తీసుకొని వచ్చాడు పరీక్షిత్తు. ఇద్దరూ సుఖంగా ఉన్నారు.

ఒకరోజు వారు ఉద్యానవనంలో విహరిస్తున్నారు. పరీక్షిత్తు అక్కడే ఉన్న కొలనులో దిగాడు. స్నానం చేస్తున్నాడు. భార్యనుకూడా రమ్మన్నాడు. అతని మాటప్రకారం ఆమెకూడా కొలనులో దిగింది అదృశ్యం అయిపోయింది.

వెంటనే ఆ రాజు కొలనులో ఉన్న నీటిని అంతా బయటకు తీసి వెదకమన్నాడు. భటులు అదే ప్రకారం చేసారు. కొలను అడుగున

అసంఖ్యాకంగా కప్పలు ఉన్నాయి. ఆ కప్పలే తన భార్యను మాయం చేసి ఉంటాయని తలచాడు. వెంటనే లోకంలో ఉన్న కప్పలనన్నింటినీ నాశనం చెయ్యమని ఆజ్ఞాపించాడు. ఆ ప్రకారంగా కప్పల నన్నింటిని వెదకి వెదకి నాశనం చేస్తున్నారు.

అది చూచి ఆ కప్పల నాయకుడు ఒక మహర్షి రూపంలో ఆ రాజు దగ్గరకు వచ్చాడు. కప్పలను చంపవద్దని అర్థించాడు. "అవి నా ప్రేయసిని మింగేసాయి. అందుకే చంపుతున్నాను" అన్నాడు ఆ రాజు.

" మహారాజా! నేను కప్పలదొరను. ఆమె ఎవరో కాదు. నా కూతురు. నీవలె చాలా మందిని మోసగించింది." అని చెప్పాడు.

"ఐతే ఆమెను తెచ్చి నాకు అప్పగించు." అని అన్నాడు రాజు.

ఆ కప్పలదొర తన కూతురును అక్కడకు పిలిపించాడు. "నీవు చాలా మంది రాజులను ఇలాగే మోసం చేసావు. కాబట్టి నీకు పుట్టే బిడ్డలు పెద్దవారు మోసగాళ్లుఅవుతారు" అని శపించాడు.

తరువాత పరీక్షిత్తుకు ఆమె వలన శలుడు, నలుడు, వలుడు అనే ముగ్గురు కుమారులు జన్మించారు. తరువాత ఆ రాజు శలునికి రాజ్యం అప్పగించి తపోవనానికి వెళ్లాడు.

ఒకరోజు శలుడు వేటకు వెళ్లాడు. ఒక మృగం అతని బాణం దెబ్బతిని తప్పించుకొని పారిపోయింది. దానిని వెంటాడమన్నాడు రాజు. అప్పుడు రథ సారధి "రాజా! ఆ మృగం చాలా వేగంతో పరుగెత్తింది. మనం ఎంత వేగంతో రథం నడిపినా దానిని చేరలేము. మన గుర్రాలు వామ్య జాతికి చెందినవి ఐతేనే మనం ఆ మృగాన్ని పట్టుకోగలం. ఆ వామ్య జాతి గుర్రాలు వామదేవుడు అనే మహర్షి దగ్గర ఉన్నాయి" అని అన్నాడు.

వెంటనే ఆ రాజు వామదేవుని వద్దకు వెళ్లాడు. "మునీంద్రా! నేను ఒక మృగాన్ని కొట్టాను అది తప్పించుకొని పారిపోయింది. ఆ మృగాన్ని పట్టుకోడానికి నీ అశ్వములు ఇమ్ము "అని అడిగాడు.

"రాజా! ఆ గుర్రాలను నీవు తీసుకొని పొమ్ము. కాని నీ పని కాగానే నాకు తెచ్చి ఇమ్ము "అని చెప్పాడు.

అలాగే అని ఆ రాజు అశ్వములను తీసుకొని వెళ్లాడు. ఆ మృగాన్ని వేటాడి చంపి తిరిగి తన రాజధానికి వెళ్లాడు. ఇంత వేగం గల గుర్రాలు రాజుల వద్ద ఉండాలి కాని ఆ ముని వద్ద ఎందుకు అని ఆ గుర్రాలు తన వద్దనే ఉంచుకున్నాడు.

ఎన్నాళ్లకు రాజు తన గుర్రాలను తిరిగి ఇవ్వక పోవడంతో వామదేవుడు తన శిష్యుడు ఆత్రేయుడిని రాజు వద్దకుపంపాడు. గుర్రాలను తీసుకొని రమ్మన్నాడు.

ఆత్రేయుడు రాజు వద్దకు వెళ్లి "రాజా! మీరు మా గురువు గారు వామదేవుల వారి వద్ద అశ్వములు తీసుకున్నారు. వాటిని తిరిగి ఇవ్వలేదు. వాటిని స్నేహపూర్వకంగా తమరు నాకు ఇస్తే నేను తీసుకొని వెళ్తాను." అని అడిగాడు.

దానికి రాజు కోపించాడు. "ఏమీ! ఆయన పంపడం. నీవు రావడం బాగుంది. వెళ్లు." అని అన్నాడు.

ఆత్రేయుడు తిరిగి వెళ్లి వామదేవునికి విషయం చెప్పాడు. వామదేవుడు కోపంతో రాజు వద్దకు వచ్చాడు.

“ రాజా! ఇది నీకు తగదు. నా గుర్రాలు నాకు ఇమ్ము. నీ పని అయి పోయింది కదా! లోభంతో ఇతరుల సొమ్ము తీసుకొనవచ్చునా! అప్పుగా తీసుకున్నవి ఎల్లకాలం ఉంచుకోడం తగునా! అది ఇతరుల సొత్తు అపహరించడం కాదా! అట్టి పాపం చేసినవారు నరకానికి పోతారు.” అని పలికాడు.

దానికి శలుడు ఇలా అన్నాడు. “అయ్యా విప్రులకు అశ్వములు ఎందుకు? కావాలంటే రెండు ఎద్దులను ఇస్తాను తీసుకో. అవి నచ్చక పోతే కంచర గాడిదను ఇస్తాను. అంతేగాని గుర్రాలను ఇవ్వను. ఊరికే ఆశలు పెట్టుకోకు” అని చెప్పాడు.

“రాజా! ఇవి ఏమి మాటలు! విప్రుల ధనము తీసుకొనడం ధర్మమా! దానికి బదులు వేరే ఇస్తాను అనడం ధర్మమా! ఇది పాపం కాదా!” అని అన్నాడు వామదేవుడు.

శలుడికి కోపం వచ్చింది. భటులను పిలిచి “ఆ బ్రాహ్మణుని బంధించి శూలాలతో పొడిచి చంపండి.” అని ఆజ్ఞాపించాడు. వామదేవునికి కోపం వచ్చింది. అతని ముఖం భీకరమయింది. అప్పుడు

ఎందరో రాక్షసులు పుట్టుకొచ్చారు. వారి రాజును, రాజభటులను చంపారు. వామదేవుడు వెళ్లిపోయాడు.

శలుడు చనిపోవడంతో అతని తమ్ముడు నలుడు రాజయ్యాడు. కొన్నాళ్లకు వామదేవుడు మరల నలుని వద్దకు వచ్చాడు. "రాజా! నీవు ధర్మపరుడవు. నా గుర్రాలను నాకు తిరిగి ఇమ్ము" అని అడిగాడు.

నలునికి కూడా కోపం వచ్చింది. భటులను పిలిచి ఈ బ్రాహ్మణుడిని చంపడానికి విషం పూసిన బాణం తీసుకొని రమ్మన్నాడు. అప్పుడు వామదేవుడు నలుని చూచి నవ్వి "రాజా! నీవు ప్రయోగించే బాణం అంతఃపురంలో ఉన్న నీ కుమారుని చంపుతుంది. జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

అంతలోనే అంతఃపురంలో హాహాకారాలు వినపడ్డాయి. చనిపోయిన రాజకుమారుని మోసుకొని వచ్చారు. అది చూచి నలుడు కోపంతో, అహంకారంతో ఒళ్లుమరిచిపోయాడు. అహంకారంతో మాట్లాడుతున్న ఈ బ్రాహ్మణుని నేనే సంహరిస్తాను అని విల్లు ఎక్కుపెట్టాడు. కాని అతని రెండు చేతులు, బాణం, విల్లు స్థంభించిపోయాయి.

ఆ రాజుకు గర్వం,మదం దిగిపోయింది. ప్రజలను చూచి "నా గర్వం అణిగిపోయింది. నా శక్తి బ్రాహ్మణ శక్తిముందు పనికిరాదని తెలుసుకున్నాను. వామ దేవుని శరణు వేడుతాను" అని ఆ మునికి నమస్కరించాడు.

వామదేవుడు ప్రసన్నమయ్యాడు. రాజకుమారుని బతికించాడు. స్థంభించిన నలుని చేతులు యధాస్థితికి వచ్చాయి. నలుడు గుర్రాలను తిరిగి వామదేవునికి సమర్పించాడు.

ధర్మరాజా! బ్రాహ్మణ ప్రభావం అటువంటిది" అని వివరించాడు మార్కండేయుడు.

అప్పుడు ధర్మరాజు మార్కండేయ మహర్షినిచూచి "అయ్యా! మీరు చిరంజీవులు కదా మీకన్న వయసులో వృద్ధులైన వారు ఉన్నారా!" అని అడిగాడు.

"ధర్మజా! పూర్వం ఇంద్రద్యుమ్నుడు అనే రాజు ఉండేవాడు. అతను చేసిన పుణ్యం వలన చాలా కాలంపాడు స్వర్గసుఖాలు

అనుభవించాడు. పుణ్యం క్షీణించడం వలన అతనిని మరల భూలోకానికి పొమ్మన్నారు దేవతలు. ఇంద్రద్యుమ్నుడు నా వద్దకు వచ్చి ఇలా అన్నాడు.

"మహర్షీ నేను ఇంద్రద్యుమ్నుడను. నేను నీకు తెలుసునా?" అని అడిగాడు.

అయ్యా ! నీవు ఎవరో నాకు తెలియదు. హిమాలయ పర్వతాలలో నివశించే ప్రావార కర్ణుడు అనే గుడ్లగూబ వయసులో నా కన్న పెద్దది. దానిని అడుగుము" అని చెప్పాను.

ఇంద్రద్యుమ్నుడు నన్నుకూడా తనతో రమ్మన్నాడు. నేనే వృ ధ్యాప్యంతో రాలేను అన్నాను. అతను ఒక గుర్రం రూపం ధరించి నన్ను మోసుకొని వెళ్లాడు. ఆ గుడ్ల గూబను కూడా అదే విధంగా అడిగాడు.

ఆ గుడ్లగూబ కూడా "అయ్యా! నేను కూడా నిన్ను ఎఱుంగను. కాని ఇంద్రద్యుమ్నము అనే కొలనులో నాడీ జంఘుడు అనే కొంగ ఉన్నది దానికి తెలిసి ఉంటుంది." అని చెప్పింది.

అప్పుడు ఇంద్రద్యుమ్నుడు నన్ను, గుడ్లగూబను మోసుకొని నాడి జంఘుని వద్దకు వెళ్లాడు. అతనిని కూడా "తనను తెలుసా?" అని అడిగాడు.

"నేను కూడా నిన్ను ఎఱుగజాలను. నా కంటే చిరకాల జీవి అయిన అ కూపారుడు అనే తాబేలు ఉన్నది. దానికి తెలుసేమో అడగండి." అని చెప్పింది.

అప్పుడు ఇంద్రద్యుమ్మడు నన్ను, గుడ్లగూబను,కొంగను, మోసుకొని తాబేలు వద్దకు వెళ్లాడు. తాబేలును కూడా తనను తెలుసునా అని అడిగాడు.

దానికి తాబేలు "అయ్యో నేను ఎఱుగక పోవడం ఏమిటి! ఆయన మహాత్ముడు. గుణాత్ముడు. ఆయన నన్ను ఎన్నో ఆపదలనుండి కాపాడాడు ఆయన ఎన్నో యజ్ఞాలు చేసాడు. బ్రాహ్మణులకు ఆవులను దానాలు చేసాడు. ఆయన దానాలు చేసిన ఆవుల గిట్టల రాపిడితోనే ఆ మడుగు ఏర్పడింది." అని చెప్పింది.

తాబేలు చెప్పిన మాటలు విని దేవతలు విమానం తీసుకొని వచ్చారు. "అయ్యా! మీరు పుణ్యాత్ములు. మీకు శాశ్వతంగా స్వర్గలోక ప్రాప్తి లభించింది. మీరు స్వర్గానికి రావాలి" అని చెప్పారు.

అప్పుడు ఇంద్రద్యుమ్నుడు "అయ్యా! నా మాట ప్రకారము ఈ కొంగ, గుడ్లగూబ నావెంట వచ్చారు. నేను వారిని వారి వారి స్థలాలలో దింపి వస్తాను కొంచెం ఉండండి." అని చెప్పి వారిని వారి వారి స్థలాలలో దింపి వచ్చాడు. తదుపరి విమానం ఎక్కి దేవతలతో కూడి స్వర్గానికి వెళ్లాడు." అని మార్కండేయుడు ధర్మరాజుకు వివరించాడు.

"మహాత్మా!మీకన్నా వయసులో వృద్ధులగురించి వివరించారు. ఇక్ష్వాకు వంశంలో జన్మించిన కువలయాశ్వునికి ధుంధుమారుడు అనే పేరు ఎలా వచ్చిందో వివరించండి." అని అడిగాడు. దానికి మార్కండేయుడు ఇలా చెప్పసాగాడు.

"ఉదంకుడు అనే మహర్షి విష్ణువును గూర్చి తపస్సుచేసాడు. అతని తపస్సుకు మెచ్చి విష్ణుడు సాక్షాత్కరించాడు. "ఏం వరం కావాలో కోరుకో!" అని అడిగాడు.

"దేవా! నీవు సాక్షాత్కరించడమే గొప్పవరం. నాకు ఎల్లప్పుడు సత్యం, ధర్మం, శమము మొదలైన వాటిమీద లగ్నం అయేట్టు, నీ మనసు ఎల్లప్పుడు నీ మీద లగ్నం అయేట్టు వరం ప్రసాదించు" అని కోరాడు.

"ఉదంకా! నీకు పరమ జ్ఞానయోగం సిద్ధిస్తుంది. మూడు లోకాలకు హితమైన కార్యకు ఒకటి నీవలన సిద్ధిస్తుంది. ధుంధుండు అనే రాక్షసుడు లోకాలకు హాని కలిగిస్తున్నాడు. అతడిని సంహరించడానికి నీవు బృహదశ్వ కుమారుడైన కువలయాశ్వుని ఆయత్తం చేయాలి. ఆ రాజు నా చే ప్రసాదింపబడిన యోగ బలముచేత, నీ యొక్క ప్రయత్నంచేత, ఆ రాక్షసుని సంహరించడానికి సమర్ధుడు. ఈ ప్రకారంగా లోకాలన్ని సంతోషిస్తాయి" అని చెప్పి విష్ణుదేవుడు మాయమయ్యాడు. ఉదంకుడు తన తపస్సును కొనసాగించాడు.

దర్మజా! కువలయాశ్వుడు ఇక్ష్వాకు వంశంలో జన్మించాడు. ఇక్ష్వాకువు గొప్పరాజు. అతని వంశవృక్షం ఈవిధంగా ఉంది. ఇక్ష్వాకుని కొడుకు అనేనుడు. అతని కొడుకు పృథుడు. అతడి కొడుకు విష్వగుడు. విష్వగుని కొడుకు ఆర్ద్రుడు. ఆర్ద్రుని కొడుకు యవనాశ్వుడు. అతని కొడుకు శ్రావస్తుడు. అతని కొడుకు బృహదశ్వుడు. ఆ బృహదశ్వుని కొడుకే ఈ కువలయాశ్వుడు. కువలయాశ్వునికి 21,000

మందికొడుకు లు పుట్టారు. అందరూ మహా బలవంతులు అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరినవారు.

బృహదశ్వుడు కువలయాశ్వునకు రాజ్యము అప్పగించి తపోవనాలకు పోవడానికి నిశ్చయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకొని ఉదంకుడు బృహదశ్వుని వద్దకు వచ్చాడు. "రాజా! నీవు అడవులకు పోయి తపస్సుచేస్తే పుణ్యం వస్తుందా? ఇక్కడే ఉండి రాజ్యపాలన చేస్తూ ప్రజలను రక్షించు. అప్పుడు సాధువులైనా మాలాంటి వారికి రక్షణ ఉంటుంది. ఇదికూడా నీ కర్తవ్యమే కదా! పూర్వ కాలంలో మధు కైటభులు అనే రాక్షసులు ఉండేవారు. వారి కుమారుడు ధుంధుండు అనేవాడు ఉన్నాడు. వాడు బ్రహ్మదేవుని మెప్పించి వరాలు పొందాడు. ప్రస్తుతం వాడు మా ఆశ్రమానికి దగ్గరలో ఒక సొరంగంలో నిద్రిస్తున్నాడు. వాడి నిశ్వాసముల వల్ల వచ్చే గాలికి ధూమము, ఇసుక చెలరేగుతూ ఉంది. అందు వల్ల మా ఆశ్రమాలకు చాలా ఇబ్బందిగా ఉంది. కాబట్టి నీవు ఆ దుర్మార్గుడిని సంహరించి మా ఆశ్రమాలకు రక్షణ కల్పించాలి. అదియును కాక ఆ ధుంధుండుని సంహరించడానికి తనశక్తిని అందిస్తానని మహా విష్ణువు కూడా చెప్పాడు. అందుకని మీరు ఆ రాక్షసుని సంహరించి తరువాత తపోవనాలకు వెళ్లవచ్చు." అని కోరాడు.

“ మహాత్మా! ఆ రాక్షసుని సంహరించడానికి నా కుమారుని పంపుతాను. నాకు తపోవనాలకు వెళ్లడానికి అనుజ్ఞ ఇవ్వండి” అని కోరాడు. ఉదంకుడు అంగీకరించాడు.

అప్పుడు ధర్మరాజు “మహాత్మా! ఆ మధుకైటభులు ఎవరు? వారి వృత్తాంతము తెలియపరచండి.” అని మార్కండేయుని కోరాడు.

“ ధర్మజా! ముల్లోకములు ఒక మహా సముద్రంగా ఉండగా విష్ణుమూర్తి ఆదిశేషుని మీద శయనించి యోగనిద్రలో ఉన్నాడు. తరువాత కొంత కాలానికి మధు కైటభులు అనే రాక్షసులు విజృంభించి దేవతలను బాధిస్తూ, కడకు విష్ణువు నాభిలో నుండి పుట్టిన కమలంలో ఉన్న బ్రహ్మదేవుని కూడా బాధించసాగారు. బ్రహ్మదేవుడు పెద్దపెట్టున ఆక్రందన చేసాడు.

అప్పుడే విష్ణుడు యోగనిద్రనుండి మేల్కొన్నాడు. మధుకైటభులు చేస్తున్న ఆగడాల గురించి విన్నాడు. వారి వద్దకు వెళ్లాడు “మధుకైటభులారా! మీ బ లానికి శౌర్యానికి సంతోషించాను. మీకు ఏం వరం కావాలో కోరుకోండి.” అని అడిగాడు.

దానికి వారు నవ్వి "మేమే నీకు వరాలు ఇస్తాం కోరుకో!" అని గర్వంతో అన్నారు.

వెంటనే విష్ణువు "మీరు ఆడిన మాట తప్పకండి. నేను వరం కోరుకుంటున్నాను. లోకాలకు ప్రీతి కలిగించేటట్టు మీరు ఇద్దరూ ఇప్పుడే నా చే మృత్యువును పొందండి" అని కోరుకున్నాడు.

" ఓ విష్ణు దేవా! మేమే ఆడిన మాట తప్పము. మేమే మా ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము . అయితే మమ్ములను జలము లేని చోట చంపాలి. ఇదీ నియమం." అని అన్నారు.

ఆ సమయంలో మూడులోకాలు జలమయమై ఉన్నాయి. అప్పుడు విష్ణువు తన తొడల మీద వారిని పడుకోబెట్టి చక్రాయుధంతో వారిని సంహరించాడు. అదీ మధుకైటభుల కథ.

ఉదంకుని కోరిన ప్రకారము బృహ దశ్వుడు తన కుమారుడు కువలయాశ్వుని మధుకైటభుల కుమారుడైన ధుంధుంని మీదికి దండ యాత్రకు పంపాడు. విష్ణుదేవుడు తన శక్తిని కువలయాశ్వునిలో ప్రవేశపెట్టాడు. కువలయాశ్వుడు సముద్రతీరంలో విడిది చేసాడు. ఇసుక తిన్నెలు తవ్వించాడు. అక్కడ నిద్రిస్తున్న రాక్షసుని చూచాడు. భటులు

అతనిని అతి కష్టంతో నిద్రలేపారు. వాడు వదలిన గాలి అగ్ని జ్వాలలై కువలయాశ్వుని కుమారులు ముగ్గురు తప్ప అందరూ మరణించారు. కువలయాశ్వుడు ఆ రాక్షసునితో యుద్ధంచేసాడు. కువలయాశ్వుడు బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. బ్రహ్మాస్త్రం ఆ రాక్షసునిశరీరాన్ని ముక్కలు చేసింది. ఈ ప్రకారంగా ఆ రాక్షసుని చంపిన కువలయాశ్వుడు అప్పటినుండి ధుంధుమారుడు అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు. అప్పుడు దేవతలు, ఉదంకుడు, మహాఋషులు కువలయాశ్వుని వరం కోరు కోమన్నారు.

"మహాత్మా! నాకు ఎల్లప్పుడూ విష్ణుభక్తి కలిగా ఉండేట్టు, బ్రాహ్మణభక్తి కలిగి ఉండేట్టు, నిరంతరం దానధర్మాలు చేసే శక్తి కలిగి ఉండేట్టు వరం ప్రసాదించండి" అని కోరాడు. వారు అతను కోరిన వరాలు సంతోషంతో అనుగ్రహించి తమ తమ స్థానాలకు వెళ్లారు. కువలయాశ్వుడు తన రాజ్యానికి వెళ్లి ప్రజారంజకంగా పరిపాలించాడు." అని మార్కండేయుడు ధర్మరాజుకు చెప్పాడు.

మహాభారతము--అరణ్యపర్వము--

ఎఱ్ఱాప్రగడ ప్రణీత చతుర్థాశ్వాసము

సంపూర్ణము.

# మహాభారతము

## అరణ్య పర్వము.

### పంచ మా శ్వాసము

### ( ఎఱ్ఱాప్రగ్గడ ప్రణీతము)

పాండవులలో మధ్యముడు అర్జునుడు. అర్జునుని కుమారుడు అభిమన్యుడు. అభిమన్యుని కుమారుడు పరీక్షిత్తు మహారాజు. ఆ పరీక్షిత్తు మహారాజు కుమారుడే జనమేజయుడు.

జనమేజయుడు సర్పయాగం చేసాడు. ఆ సమయంలో వేదవ్యాసుని శిష్యుడైన వైశంపాయనుడు, మహా భారత కధను జనమేజయ మహారాజుకు వినిపించాడు. ఆ సమయంలో, రోమ హర్షణి కుమారుడైన ఉగ్రశ్రవసుడు (సూతి) ఆ మహా భారత కధను శ్రవణం చేసాడు. తను విన్న మహా భారత కధను, శౌనక మహర్షి సత్రయాగం చేసిన సందర్భంలో, శౌనకాదిమహా మునులకు చెప్పాడు.

ఆ ప్రకారంగా, మహా భారత కధను, నైమిశారణ్యంలో, శౌనక మహర్షి ఆశ్రమంలో, రోమహర్షణి కుమారుడైన ఉగ్రశ్రవసుడు (సూతి) అనే పౌరాణి కుడు, శౌనకాది మహా మునులకు ఇలా చెప్పసాగాడు.

ధర్మరాజు మార్కండేయ మహర్షిని చూచి "మహర్షీ! నాకు గొప్ప గొప్ప పతివ్రతల కధలను వినవలెనని కోరికగా ఉన్నది. కాబట్టి నాకు ఆ కధలు వినిపించమని కోరుకుంటున్నాను. అదియును కాక, తమ సంతానము నిమిత్తము తల్లి తండ్రులలో ఎవరు ఎక్కువ కష్టపడతారు? తల్లితండ్రుల యెడ పుత్రుని బాధ్యత ఎలాంటిది? తక్కువ జాతిలో పుట్టినవాడు పరమ ధార్మికులు పొందు లోకములను ఎలా పొందగలడు? నాకు వివరించండి అని అడిగాడు.

దానికి మార్కండేయ మహర్షి ఈవిధంగా సమాధానం చెప్పసాగాడు.

"ఓ ధర్మజా! తన బిడ్డను నవమాసాలు తల్లి కడుపులో పెట్టుకొని కాపాడుతుంది. తన ప్రాణానికి అపాయం అని తెలిసి కూడా కొడుకును కంటుంది. ఇంక పుత్రుని కొరకు తండ్రి తపములు, యజ్ఞములు,

దానములు, వ్రతములు చేస్తాడు. కాబట్టి పుత్రుని కొరకు తల్లి తండ్రులు ఇరువురు సమంగా కష్టపడతారు.

కొడుకు పుట్టిన తరువాత తల్లి తండ్రులు తమ కొడుకు ధర్మ వర్తనుడు కావాలని, తమకు భక్తుడుగా ఉండాలని ఆశిస్తారు. తల్లి తండ్రుల ఆశలను సార్ధకం కావించేవాడే నిజమైన కొడుకు. ఏతల్లితండ్రులు తమ కుమారుడి నడవడిక వలన సంతోషాన్ని పొందుతారో, ఆ తనయుడే కీర్తిని, ధనాన్ని ఆర్జిస్తాడు. ఉత్తమ లోకాలను పొందుతాడు.

మరియు తన భర్తకు సేవలు చేయుటయందు నిత్యము ఆసక్తి కలిగి ఉంటుందో ఆ స్త్రీ కి ఎన్నో యజ్ఞములు చేసిన ఫలము లభిస్తుంది. నీకు ఒక్క కథ చెపుతాను వినుము.

పూర్వము కౌశికుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు ధర్మపరుడు. ఎన్నో తపస్సులు చేసాడు. ఒకరోజు అతను ఊరి బయట ఉన్న చెట్టుకింద కూర్చుని వేదాలు వల్లె వేసుకుంటున్నాడు. ఆ స మయంలో ఒక కొంగ అతని మీద రెట్ట వేసింది. ఆ బ్రాహ్మణుడికి కోపం

వచ్చింది.  ఆ కొంగ వైపు తీక్షణంగా చూచాడు. ఆ చూపులకు ఆ కొంగ చచ్చిపోయి నేలమీద పడింది.

అది చూచి కౌశికుడు చాలా బాధ పడ్డాడు. "అయ్యో! నేను ఎంతటి నిర్దయుడను. నాకు హృదయము లేదు. నావలన ఈ కొంగ చచ్చిపోయింది. నా పాపానికి నిష్కృతి లేదు." అని విలపించాడు.

ఇంతలో మధ్యాహ్నము అయింది. సమీప గ్రామానికి బిక్షకు వెళ్లాడు. ఒక ఇంటి ముందు నిలబడి బిక్షాందేహి అని బిక్షను అర్థించాడు. ఆ ఇంటి ఇల్లాలు అతనికి బిక్ష వెయ్యడానికి ఒక పాత్రను శుద్ధి చేస్తూ ఉంది.

ఇంతలో ఆమె భర్త ఆకలితో ఇంటికి వచ్చాడు. ఆమె అతనికి అభ్యంగన స్నానం చేయించింది.  భర్తకు అన్నం వడ్డించింది. భర్త తృప్తిగా భోజనం చేసేంత వరకూ ఆయన పక్కనే కూర్చుంది. తరువాత ఆయనకు మెత్తటి పక్క వేసి  ఆయనను పడుకోబెట్టి ఆయనకు కాళ్లు పిసుకుతూ ఉంది.

ఇంతలో ఆమెకు తన ఇంటికి బిక్షకు వచ్చిన బ్రాహ్మణుడి విషయం గుర్తుకు వచ్చింది. ఒక పాత్రలో అన్నంపెట్టుకొని బిక్ష వెయ్యడానికి వచ్చింది. ఆమెను చూచి కౌశికుడు కోపించాడు.

"ఏమీ! నీవు గర్వంతో బిక్షకు వచ్చిన నన్ను అవమానించావు. నేను వచ్చిన వెంటనే వెళ్లి పొమ్మంటే వెళ్లిపోయెదను కదా. ఇంత సేపు ఎందుకు ఆలస్యం చేసావు? ఎందుకు అవమానించావు?" అని కోపంగా అడిగాడు.

"అయ్యా! మీకు బిక్ష తెచ్చునప్పుడు నా భర్త వచ్చాడు. ఆయనకు పరిచర్యలు చేసి వచ్చునప్పటికి ఆలస్యం అయింది. ఇది నా తప్పుగా తలవకండి. కొంచెం ఓర్పు వహించండి." అని వేడుకొంది.

"ఏమీ! నీకు బ్రాహ్మణుల కన్నా నీ భ ర్త అంత ఎక్కువా? లోకవంద్యులమైన మమ్ములను అవమానిస్తావా? సాక్షాత్తు దేవేంద్రుడు కూడా బ్రాహ్మణులను పూజిస్తాడు. కాని నువ్వు గర్వంతో బ్రాహ్మణులను అవమానించావు బ్రాహ్మణులను అవమానిస్తే వారి కోపం ఈ లోకాలనే దహించి వేస్తుంది." అని కోపంతో పలికాడు. కౌశికుడు.

"అయ్యా! దేవతలతో సమానమైన బ్రాహ్మణుల మహిమ నాకు తెలియదా చెప్పండి. ఒక బ్రాహ్మణుడు సముద్ర జలాలను తాగకూడనివి అని శపించలేదా! మరొక బ్రాహ్మణుడు దండకారణ్యం తగుల బెట్టలేదా! మరొక బ్రాహ్మణుడు వాతాపిని జీర్ణం చేసుకోలేదా. కాబట్టి బ్రాహ్మణోత్తముల మహిమలు విని ఉన్నాను. అలాంటి బ్రాహ్మణులను అవమానించి కోరి కోరి కష్టాలు ఎందుకు కొని తెచ్చు కుంటాను. కాని నాపాలిటికి నా భర్త నాకు పరమ దైవము. నేను నా భర్తను త్రికరణ శుద్ధిగా ఆరాధిస్తున్నాను. ఎంత ఆలోచించినా ఇంతకంటే గొప్ప ధర్మం నాకు కనిపించలేదు.

బ్రాహ్మణోత్తమా! నీకు కోపం ఎక్కువ అని నాకు తెలుసు. నీ కోపానికి ఒక కొంగ చచ్చిపోయింది కదా! ఈ విషయం నా పాతివ్రత్య మహిమతో తెలుసు కున్నాను. కాబట్టి తమరు నామీద కోపించడం మంచిదికాదు. ఎందుకంటే ప్రతి మానవుని హృదయంలో ఇద్దరు ఘోరమైనశత్రువులు నివశిస్తుంటారు. వారే క్రోధము, మోహము. వారిని అణచి వేయక పోతే బ్రాహ్మణులకు గొప్పదనం రాదు కదా. ఎవడైతే ఎప్పుడూ సత్యం పలుకుతుంటాడో, ఎవడైతే అహింసా వ్రతము ఆచరిస్తాడో, ఎవడైతే గురుజనులకు మంచి చేస్తాడో, ఎవడైతే ఇంద్రియములను జయిస్తాడో, ఎవడైతే అందరిని తన వారిగా చూస్తాడో,

ఎవడైతే ధర్మాన్ని ఆచరిస్తూ కామానికి వశుడు కాకుండా కర్మలను ఆచరిస్తాడో, అట్టి పుణ్యాత్ముడే నిజమైన బ్రాహ్మణుడని సర్వజనులు కీర్తిస్తారు. అట్టి బ్రాహ్మణునకు, మంచి ప్రవర్తన, ఇంద్రియ నిగ్రహము, వేదాధ్యయనము మంచి సంపదలుగా, ధనముగా వర్ధిల్లుతాయి. ఇవే వేదములలో చెప్పబడిన కర్తవ్యములు.

ధర్మము అనునది చాలావిధాలుగా ఉంటుంది. చాలా సూక్ష్మముగా ఉంటుంది. నీవు కేవలం స్వాధ్యాయపరుడవు కాని ధర్మసూక్ష్మములు నీకు తెలియవు. కావున వెంటనే మిథిలా నగరానికి వెళ్లు. అక్కడ ఇంద్రియములను జయించినవాడు, ఎప్పుడూ సత్యము పలుకువాడు, మాతా, పితరులను పూజించువాడు, అయిన ధర్మవ్యాధుడు అనే కిరాతుడు ఉన్నాడు. అతని వలన ధర్మసూక్ష్మములను తెలుసుకొనుము. నీ సందేహములన్నియు తీరుతాయి. నేను ఆడుదానిని. నాకు అంత పరిజ్ఞానము లేదు కదా. కాబట్టి ఆడువారు ఎట్టి అపరాధము చేసినను క్షమించవలయును కదా" అని పలికింది..

"అమ్మా! నీ వలన నాకు జ్ఞానోదయము అయినది. నా మనసు ప్రశాంతి పొందినది. నే వెళ్లి వచ్చెదను. నీకు అంతా మేలు జరుగుతుంది" అని మిథిలా నగరానికి బయలుదేరాడు. కౌశికుడు ఆ

పతివ్రత యొక్క జ్ఞానానికి ఆశ్చర్య పోయాడు. ఆమెను దూషించి తాను ఎంతో తప్పు చేసాను అని పశ్చాత్తాప పడ్డాడు.

కొంతకాలానికి మిథిలా నగరానికి చేరుకున్నాడు. అక్కడ ఉన్న పౌరులను అడిగి ధర్మవ్యాధుడు ఉండే చోటు తెలుసుకున్నాడు. ధర్మవ్యాధుని వద్దకు వెళ్లాడు.

ధర్మవ్యాధుడు మాంసము విక్రయిస్తున్నాడు. అంగడిలో జనం కిక్కిరిసి ఉన్నారు. ఆ దృశ్యాన్నిచూచి, అసహ్యించుకున్నాడు. ఒక పక్కకు ఒదిగి నిలబడ్డాడు.

ఆ బ్రాహ్మణుని చూచిన ధర్మవ్యాధుడు వెంటనే అతని వద్దకు వచ్చాడు. ఆయనకు భక్తితో మొక్కాడు. "మహానుభావా! ఆ మహా పతివ్రత తమరిని నా వద్దకు పంపినదా. అందుకని తమరు నా వద్దకు వచ్చినారా! నాకు చాలా సంతోషంగా ఉంది. రండి మా ఇంటికి పోయెదము" అని ధర్మవ్యాధుడు ఆ బ్రాహ్మణుని తన ఇంటికి తీసుకొని వెళ్లాడు.

ఆ పతివ్రత తనను పంపిన సంగతి ఇతనికి ఎలా తెలిసింది. ఆ బ్రాహ్మణుడు మరల ఆశ్చర్యపోయాడు. ఇద్దరూ ధర్మవ్యాధుని ఇంటికి వెళ్లారు. ధర్మవ్యాధుడు ఆ బ్రాహ్మణునికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి సత్కరించాడు.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు ధర్మవ్యాధుని చూచి, "అయ్యా! మీరు అన్ని ధర్మములు తెలిసిన వారు. ఇలా జీవహింస చేసి జీవించడం న్యాయమా ధర్మమా!" అని అడిగాడు.

"అయ్యా! బ్రాహ్మణులకు, తపస్సు, స్వాధ్యాయము, సత్యము, శౌచము, బ్రహ్మచర్యము, పరమ ధర్మములు. అలాగే, క్షత్రియులకు దండనీతి, వైశ్యులకు వ్యవసాయము, పశుపాలన, వ్యాపారము, పరమ ధర్మములు. శూద్రులకు సేవచెయ్యడం పరమ ధర్మము. అలాగే మాకు మృగ మాంసము విక్రయించి జీవించడం ధర్మము. పైగా ఇది మాకు వంశాను గతంగా వచ్చుచున్నది. ఇది మిధిలా రాజ్యము. ఈ దేశమునకు రాజైన జనకుడు రాజధర్మమును తప్పనివాడు. ఇక్కడ అందరూ ఎవరి ధర్మం వారు నిర్వర్తించాలి. స్వధర్మమును ఆచరించని వాడిని కడకు కన్నకొడుకైనా శిక్షిస్తాడు. కాబట్టి నేను నా ధర్మమును వదలి పెట్టను. కాని ఓ బ్రాహ్మణోత్తమా! నేను ఈవిధంగా మాంస విక్రయము

చేయుచున్ననూ, నేను ఎన్నడూ జీవహింస చేయను. ఇతరులు చంపి తెచ్చిన మాంసమును నేను కొని దానిని మరల అమ్ముతాను. దాని వలన వచ్చిన ధనముతో తప్తిగా జీవిస్తున్నాను.

నేను ఎప్పుడూ అణకువతో ఉంటాను. గురువులను, వృద్ధులను, అతిధులను, బ్రాహ్మణులను, దేవతలను పూజిస్తాను. సత్యమును, శౌచమును, ఆచరిస్తాను. బంధువులను ఆదరిస్తాను. నా శక్తికొలది దానధర్మాలు చేస్తాను. నాకు ఎవరు అన్నా అసూయ లేదు. దేని మీద కోరికలను పెంచుకోను. ఇతరులలో దోషములను ఎంచను. ఉపవాస నియమములు ఆచరిస్తూ, పరిమిత ఆహారము తీసుకుంటాను. ఏకపత్ని వ్రతుడను. ఆమెతో కేవలం ఋతుకాలములోనే సంభోగిస్తాను.

నేను ఎవరి పొగడ్తలకు పొంగిపోను. ఎవరు తిట్టినా కుంగిపోను. దానివలన, నేను హీన కులములో జన్మించినను, నిర్మలంగా ఉంటున్నాను. ఏదో మాట్లాడాలి కాబట్టి ఇవన్నీ చెప్పాను కాని నా గురించి నేను పొగుడు కోవడం కాదు. తమరు నా వద్దకు ధర్మము తెలుసుకొనుటకు వచ్చారు. ఆ విశేషాలు వివరిస్తాను అని ఆ ధర్మవ్యాధుడు చెప్పసాగాడు.

తన కుల ధర్మము విడువకుండా జీవించడం అన్నింటి లోకి పరమ ధర్మము అని పెద్దలు చెపుతారు. హృదయంలో దయ కలిగి ఉండటం గొప్ప లక్షణం. బయట ప్రపంచంలో ఎంతో మంది ఎన్నో భావాలు కలిగి ఉంటారు. అందరి భావాలను మన్నించడం, సహనంతో మెలగాలి. విషయ వాంఛలను, చెడ్డ కోరికలను, విడిచి పెట్టాలి. త్యాగ గుణము అన్నింటి కన్నా గొప్ప గుణము. దానిని ప్రతి వాడూ అలవర్చుకోవాలి. ఎప్పుడూ నిజాన్నే పలకాలి. ఎల్లప్పుడూ మంచివారిని గౌరవించాలి పూజించాలి.

కోరికలు అనేవి మనిషికి సహజం. కాని ఆ కోరికలు తీర్చుకొనేటప్పుడు ధర్మం తప్పకుండా వ్యవహరించాలి. మనకు మంచి జరిగినా, చెడ్డ జరిగినా వాటిని సమదృష్టి తో చూడ్డం నేర్చుకోవాలి. మనకు అపకారము చేసిన వారికి ఉపకారం చెయ్యడం అందరూ మెచ్చుకొనే లక్షణము. ఇతరులకు అపకారము చేసేవాడు తన పాపాలలో తనే కాలిపోతాడు. వేరే వాళ్లు ఎవరూ వాడికి కీడు చెయ్యడం అనవసరం.

దేవుడు లేడు, వేదములు ప్రమాణములు కావు అని వాదించే నాస్తికులు ధార్మికులు చేసే పనులను ఖండిస్తారు. అలాంటి వారి మాటలు నమ్మి ధర్మము విడిచి పెట్టడం మంచిది కాదు. ఎవరైనా పాపం

చేసినపుడు “అయ్యో! పాపం చేసానే, తప్పుచేసానే !”అని పశ్చాత్తాప పడేవాడికి సగం పాపం పోతుంది. ఇంక అలాంటి పాపం చెయ్యను అని నిశ్చయించుకునేవాడికి మిగిలిన పాపంపోతుంది.

అసలు మానవుడు చేసే పాపాలన్నీ లోభము, క్రోధము వల్ల పుడతాయి. అట్టి లోభాన్ని క్రోధాన్ని జయించిన వాడు పరమ ధార్మికుడు. కొన్ని చెడ్డపనులు పైకి చాలా మంచి పనులమాదిరి కనిపిస్తాయి. నీటితో నిండిన బావుల మీద, ఊబి మీద, దట్టంగా గడ్డి పెరిగి అక్కడ బావి, ఊబి ఉన్నది అని కూడా తెలియదు కదా. కాబట్టి అలాంటి చెడ్డ పనుల చెంతకు కూడా పోకూడదు. ఎప్పుడే శిష్టాచారములనే పాటించాలి.” అని ధర్మవ్యాధుడు కౌశికునకు చెప్పాడు.

“శిష్టాచారములు అంటే ఏమిటి” అని కౌశికుడు అడగగా ధర్మవ్యాధుడు ఇలా చెప్పసాగాడు.

“దానము, సత్యము, తపము, యజ్ఞము, మంచితనము, కోపం లేకుండా ఉండటం, ఇంద్రియ నిగ్రహము, ఎల్లప్పుడూ సంతోషంగా ఉండటం, వేదాలను చదవడం, దాంభికత్వము లేకుండా ఉండటం, ఎప్పుడూ దైన్యంగా ఉండక పోవడం, నిరాశతో కుంగక పోవడం,

అసూయ ను, అహంకారాన్ని వదిలిపెట్టడం, మంచి ప్రవర్తన కలిగి ఉండటం, తీర్థయాత్రలు చెయ్యడం, పరిశుభ్రతను పాటించడం, అన్ని భూతముల యందును దయగలిగి ఉండటం, తక్కువగా మాట్లాడటం, అవీ మంచి మాటలు మాట్లాడటం, తనను ఆశ్రయించిన వారిని కాపాడ్డం, ఇవన్ని ధర్మములు, శిష్టాచారములు అని పెద్దలు చెపుతారు.

ఓ మహాత్మా! అసూయను విడిచి పెట్టి, మంచి ప్రవర్తనతో జీవించడం లో ఉన్న హాయి, సంతోషం ఇతర మార్గాలలో జీవించే వారికి లభించదు. కాబట్టి, పైన చెప్పిన శిష్టాచారములను పాటిస్తూ, గురువులను సేవిస్తూ, వేదాధ్యయనం చేస్తూ, మంచి మనసుతో, కామము, క్రోధము అనే మొసళ్లు ఉన్న కోరికలు అనే సముద్రమును, చెదరని ధైర్యము అనే నావమీద దాటవలయును. అట్టివారే ధన్యులు.

మహాత్మా! అహింస అన్ని ధర్మములలోకి ఉత్తమ ధర్మము. అట్టి ధర్మమును సత్యము తో చేర్చి ఆచరింపవలయును. శిష్టాచారాములలో సత్యము గొప్పది. వేద సమ్మతములు, శాస్త్రసమ్మతములు, శిష్టాచారములు అని ధర్మములు మూడు విధములుగా వర్ధిల్లు తుంటాయి. వేదాధ్యయనము చేసిన వాడు, శిష్టాచార మార్గములో

ప్రయాణం చేసి, మంచి బుద్ధి అనే మేడను ఎక్కి, మోహము అనే ఊబిలో పడి కొట్టుకుంటున్న ఈ లోకాన్ని చూచి నవ్వుకుంటాడు.

మహాత్మా! నేను చేస్తున్నది హింస కాదా అని నన్ను మొదట ప్రశ్నించారు. నేను దానికి తగిన సమాధానం చెప్పాను. కాని ఇది హింస, ఇది అహింస అని చెప్పడం ఎవరి తరమూ కాదు. ఒక ప్రాణి పుట్టడానికి, చావడానికి ఆ ప్రాణి అంతకు ముందు చేసిన కర్మములే కారణం. చంపేవాడు కేవలం నిమిత్తమాత్రుడు. పండ్లు, వేర్లు, ఓషధులు, కాయగూరలు, ఆకు కూరలు, జంతువులు, ప్రాణులకు ఆహారంగా భగవంతుడు ఏర్పరిచాడు. ఇది వేద ప్రమాణము. దానిని మనం కాదనగలమా!

పూర్వము శిబి చక్రవర్తి తన మాంసాన్ని కోసి డేగ పావురాయి రూపంలో ఉన్న ఇంద్రుడికి, అగ్నికి ఇచ్చాడు కదా! మరి అతనికి పుణ్యం లభించింది కదా!

రంతి దేవుడు అనే రాజు పూర్వము ప్రతి దినము వేలకొద్దీ గోవులను వధించి సంతర్పణములు చేసాడు కదా! అతనికి పుణ్యలోకములు లభించాయి కదా!

మరి వేదాలు చదివిన వారు యజ్ఞ యాగములందు పశువులను వధిస్తారు కదా! కాబట్టి మాంసాహారాన్ని జీవి హింస గా పరిగణించలేము. పితృ కార్యములలో దైవకార్యములలో మాంసాహారాన్ని పెడతారు కదా. మిగిలిన మాంసాహారాన్ని భుజించడం ధర్మం అని ఋషులు చెబుతారు కదా!

రైతులు భూమిని నాగలితో దున్నుతున్నప్పుడు, ఎన్నో జీవాలు చచ్చి పోతాయి కదా. మరి అది హింస కాదా! ఇంత ఎందుకు మానవులు నేలమీద నడుచు నప్పుడు వారి కాళ్ల కిందపడి ఎన్నో జీవాలు చచ్చి పోతుంటాయి. మరి అది జీవ హింస అవుతుందా! కాబట్టి, ఇది ఎవరికి వారు ఆలోచించి నిర్ణయించు కోవలసిన విషయము.

నీరు, భూమి, ఆకాశము సర్వము ప్రాణులతో నిండి ఉంది. కాబట్టి మనం చేసే ప్రతి కర్మలోనూ హింస తప్పనిసరిగా ఉంటుంది. హింస చెయ్యకుండా జీవనం గడపడం కష్టం. కొంతమంది మాత్రం తాము ఎప్పుడూ హింస చెయ్యమని భ్రమలో ఉంటారు. ముని వత్తిని స్వీకరించి అరణ్యములలో తపస్సు చేసుకుంటూ తాము అహింసా వ్రతాన్ని ఆచరిస్తున్నాము అని చెప్పుకుంటున్న మునులు కూడా ప్రతి రోజూ

ఆకులు, కాయలు,ఫలాలు, కంద మూలములు భుజిస్తూ జీవహింస చేస్తున్నారు కదా. ఎందు కంటే ఆకులలో, కాయలలో, మొక్కలలో అన్నింటిలో జీవం ఉన్నదని మనకు తెలుసు కదా! కాబట్టి ఈలోకంలో జీవ హింస చెయ్యని వాడు ఒక్కడు కూడా లేడు. కాని, తెలిసీ తెలిసీ, కావాలెనని జీవ హింస చెయ్యక పోవడమే అహింస అని చెప్పుకోవాలి.

ధర్మము చాలా రకాలుగా ఉంటుంది. చాలా సూక్ష్మమైనది. తెలుసుకోడం చాలా కష్టం. కాబట్టి వేదములను, పెద్దలు చెప్పిన మాటలను, వారు ఆచరించే ఆచారముల వలనను మనము ధర్మము తెలుసుకొనవలెను.

సత్య వ్రతము చాలాగొప్పది. కాని ఏ ప్రాణికైనా అపకారము జరుగు తున్నప్పుడు దానిని నివారించడానికి ఆడే అబద్ధము. నిజం పలకడం కన్నా గొప్పది. ఏ ప్రాణి కైనా అపకారము కలిగించే సత్యము, అబద్ధము చెప్పడం తో సమానం. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్పుడు వారిని కాపాడడానికి ఆడే అసత్యము, వివాహ సమయము లందును పలికే అసత్యము, సత్యము తో సమానము. ఇలాంటివే ధర్మసూక్ష్మములు.

తన కులమునకు ఉచితమైన మార్గము, మంచిది అయినా, మంచిది కాకపోయినా, కుల వత్తి మానరాదు. ఎందుకంటే కులవత్తి దైవము ఏర్పరిచనది.

మనము పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితము అనుభవింపక తప్పదు. దానిని తప్పిచుకొనడం ఎవరి తరమూ కాదు. ఈ విషయం తెలియని మూఢులు, తమకు కష్టములు వచ్చినపుడు దైవాన్ని దూషిస్తారు.

అలాగే మనుజులు తాము చేసే కర్మములకు తామే కర్తలనియు అని తామే చేస్తున్నాము అనియు అనుకుంటూ ఉంటారు. ఇది అజ్ఞానము. అన్ని పనులకు తానే కర్త అయితే, తాను చేసిన అన్ని కార్యములు ఫలించవలెను కదా. అలా జరగటం లేదు. ఎందు కనగా! చాలామంది నీతి మంతులు, ధర్మనిరతులు, అన్ని కార్యములను దక్షతగా నిర్వహించగలవారు చేసే ఎన్నో కార్యములు కూడా ఒక్కొక్క సారి ఫలించవు. కాని దుష్టులు, క్రూరులు, దుర్మార్గులు చేసే పనులు అన్ని ఫలిస్తుంటాయి.

కొంతమందికి ఏ పనీ చెయ్యకుండానే ధనము, విజయములు వచ్చి పడుతుంటాయి. కాని కొంతమంది ఎంత కష్టపడినా  ఫలితం కనిపించదు. అలాగే, కటిక దరిద్రులకు, పేదవారికి, సంతానం వద్దన్నా కలుగుతుంది. కాని మహా ధనవంతులకు కూడా, ఎన్ని వ్రతాలు చేసినా, పూజలు చేసినా, దానధర్మాలు చేసినా సంతానం కలగదు.  ఇదంతా ఎందకు ఇలా జరుగుతుంది అంటే పూర్వజన్మ కర్మఫలము వలన జరుగుతుంది అని చెప్పక తప్పదు.

అలాగే మనుజులు పూర్వ జన్మ కర్మలకు  అధీనులు కాకుండా, తమ ఇష్టం వచ్చినట్టు తాము చెయ్య వచ్చు అనుకుంటే, అట్టి వారు ఎలాంటి రోగాలు, మరణము లేకుంటా శాశ్వతము గా బతక వచ్చుకదా. కాబట్టి మనం పూర్వము చేసిన  కర్మలబట్టి  ఈ శరీరం ఏర్పడుతుంది. శరీరము చెయ్యవలసిన పనులు కూడా మనము చేసిన కర్మవశమున నిర్ణయింప బడతాయి.  ఈ దేహం విడిచి మరణించిన తరువాత జీవుడు మరల తన కర్మ నిర్దేశించిన దేహానికి వెళతాడు.

ఇప్పుడు జీవుడు  ఎలాంటి వాడో నీకు చెపుతాను.  జీవుడు అనఘుడు, సనాతనుడు.  ఎప్పటికీ ఉంటాడు. జీవుడికి పాపం అంటదు. మనం చేసుకున్న కర్మలబట్టి జీవుడు శరీరాన్ని పొందు తుంటాడు.

కొంతకాలం ఆ శరీరంలో ఉంటాడు. శరీరం మరణిస్తుంది కాని, శాశ్వతుడు ఐన జీవుడు మరణించడు. ఈ శరీరాన్ని విడిచిన జీవుడు తన చేసిన కర్మలను బట్టి వేరే శరీరాన్ని ధరిస్తాడు. ఆ శరీరంలో సుఖ దుఃఖములు అనుభవిస్తాడు. ఆ ప్రకారము జీవుడు ఎన్నో దేహ బంధములలో చిక్కుకుంటాడు.

మహానుభావా! ఇప్పుడు నీకు పుణ్యము, పాపముల వలన కలిగే దేహ బంధములు ఎట్టివి అనే విషయం చెపుతాను. స్థిరమైన పుణ్యము చేసిన వానికి దైవత్వము ప్రాప్తిస్తుంది. కొంత పుణ్యము, కొంత పాపము చేసిన వానికి మనుష్య జన్మ లభిస్తుంది. కేవలం పాపాలు మాత్రమే చేస్తే వాడు జంతవులుగా, క్రిమి కీటకాదులుగా జన్మిస్తాడు. అలా పుట్టుచూ చచ్చుచూ కోరికలు అనే సముద్రంలో కొట్టుకు పోతుంటాడు. ఎన్నటికిని ఒడ్డుకు చేరుకోడు. ఇది తెలిసిన వాడు పాపముల జోలికి పోక, కేవలం పుణ్య కార్యాలు చేస్తూ, మదము, అహంకారము, మాత్సర్యమును వదలిపెట్టి, ధర్మమార్గాన జీవిస్తాడు.

ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరించడం వలన మనసు నిర్మలమవుతుంది. ఈ కోరికలు సుఖాలు ఎందుకు పనికి రావని

తెలుసుకుంటాడు. తపస్సు, ఇంద్రియ నిగ్రహం, సత్యము నే పలకడం, ఆచరిస్తూ, దైవత్వాన్ని పొందుతాడు. ”

ఇది అంతా విన్న కౌశికునకు ఒక సందేహం కలిగింది.

“అయ్యా! ఇంద్రియములు అనగా ఏవి? వాటిని అదుపు చెయ్యకుంటే ఎలాంటి పాపం కలుగుతుంది. వాటిని అదుపు చేస్తే ఎలాంటి పుణ్యం కలుగు తుంది? వివరించండి!” అని అడిగాడు.

అప్పుడు ఆ ధర్మవ్యాధుడు ఇలా చెప్పసాగాడు.

“మహాత్మా! మనము బయట ప్రపంచములో తిరుగుతూ విషయములను గ్రహిస్తాము. దానికి మూలము మనస్సు. ఆ మనస్సు ఎప్పుడూ కోరికలతో, కోపముతో నిండి ఉంటుంది. ఆ కోరికలు, కోపమే మన చేత ఈ ఇంద్రియములతో ఎన్నోపనులు చేయిస్తాయి. కోరికలకు, కోపమునకు లోబడిన మానవుడు అంతులేని విషయ వాంఛలతో సతమతమవుతుంటాడు. కోరికల వలన లోభము ఏర్పడు తుంది.

లోభి అయినవాడికి కరుణ అనేది ఉండదు. అట్టివాడు తన కోరికలు తీర్చుకోడానికి ఎక్కువగా పాపములు చేస్తుంటాడు. ఎవరైనా మంచి మాటలు చెప్పినా వినడు. దుర్మార్గుల స్నేహము చేస్తాడు. మనస్సుతో ఆలోచించేదానికి, మాట్లాడే మాటకు, చేసే పనులకు సంబంధం ఉండదు. అలాంటి వాడు ఎప్పుడూ దుఃఖంలోనే మునిగి తేలుతుంటాడు. కాబట్టి మనుజులు విషయ వాంఛలకు లోబడక, కోరికలతో కొట్టుమిట్టాడక, జ్ఞానమార్గమున పోవడం ఉత్తమం."

"అయ్యా! నువ్వు నన్ను ఇంద్రియముల గురించి, వాటిని ఎలా జయించాలి అని అడిగావు. కాని బ్రహ్మవిద్య గురించి మాలాంటి వారు చెప్ప కూడదు. కాని తమరు బ్రాహ్మణోత్తములు. మీరు కోరినది చెప్పడం నా కర్తవ్యం. కాబట్టి మహాత్మా! పరమ బ్రహ్మ విదులైన బ్రాహ్మణులకు నమస్కరించి, బ్రహ్మవిద్య గురించి తెలిపెదను. సావధాన చిత్తుడవై ఆలకింపుము" అని బ్రహ్మ విద్య గురించి ఇలా చెప్పసాగాడు.

"ఆకాశము, గాలి, అగ్ని, నీరు, భూమి ఇవి పంచ భూతములు. ఈపంచ భూతములకు వరుసగా శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము, అనే గుణాలు కలిగి ఉన్నాయి.

( ఆకాశము= ఉరుముతుంది. శబ్దం చేస్తుంది.

గాలి=స్పర్శతో తెలుసుకుంటాము.

అగ్ని= అగ్నికి రూపం ఉంటుంది.

నీరు=రసాత్మకము. ద్రవరూపంలో ఉంటుంది.

భూమి=వాసన. మట్టి వాసన మనకు తెలిసిందే.

వాన కురవగానే భూమినుండి ఒక విధమైన వాసన సహజంగా వెలువడుతుంది).

ఆకాశమునుండి వరుసగా అన్ని భూతములు ఒకదానినుండి ఒకటి (అనులోమ క్రమంలో) పుడతాయి. మరల ఆ వరుసలోనే ఒకదానిలో ఒకటి (ప్రతిలోమ క్రమంలో) లయమవుతాయి.

ఆకాశము నుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి నీరు, నీటినుండి భూమి పుడతాయి. మరల భూమి నీటిలోను, నీరు అగ్నిలోను, అగ్ని వాయువు లోను, వాయువు ఆకాశము లోనూ లయమవుతాయి.

మొట్టమొదట కేవలం అనంతాకాశము, ఎల్లలులేని ఆకాశము. అంతా చీకటి. శూన్యము. ఆ ఆకాశము లోనుండి ప్రచండ వాయువు.

ఉద్భృతమైన గాలి. ఆ గాలిలో ఉన్న ధాతువుల సంయోగంతో నీరు పుడుతుంది. ఆ నీరు ఘనీభవించి మంచుఖండాలు, ధూళి మేఘాలు ఏర్పడతాయి. అవి శిలా రూపం చెంది భూమి. మరల అదే క్రమంలో ప్రళయకాలంలో, అన్ని సముద్రాలు కలిసిపోయి ఈ భూమి అంతా జలమయము అవుతుంది. అనావష్టి. ఎండలు. ప్రచండ సూర్యరశ్మి. ఆ ప్రచండాగ్నికి నీరు అంతా ఆవిరి అయి వాయువుగా మారి ఆకాశంలోకి చేరుతుంది.

చెవితో వినడం, నాలుకతో రుచి చూడటం, కంటితో చూడటం, ముక్కుతో వాసన చూడటం, స్పర్శతో (చర్మంతో) తెలుసుకోడం, ఇవి పంచేంద్రియములు చేసే పనులు.

అంటే పంచభూతముల గుణములు ఐన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఇంద్రియములకు విషయములు. ఈ పంచేంద్రియ ములకు మూలము మనస్సు. ఇది ఆరవది. ఆ పంచేంద్రియములు చేసే పనులకు తోడుగా ఇంకో రెండు. అవే బుద్ధి, అహంకారము. మొత్తం ఎనిమిది.

సత్త్వ, రజస్సు, తమోగుణములు ప్రతి మనిషిలోనూ ఉంటాయి. పై చెప్పబడిన మహా భూత ప్రపంచము అంతయూ అవ్యక్త ము అనే

తత్త్వము లోనుండి సృష్టింపబడి, మరల ఆ అవ్యక్తంలోనే లయమవుతుంది.

అవ్యక్తము అనగా వ్యక్తము కానిది. కనపడనిది. కంటికి, వాక్కుకు, మనస్సుకు గోచరము కానిది. కాని ఈ అవ్యక్త తత్త్వము మనకు దైనందిన వ్యవహారాలలో, పంచేంద్రియములు చేయు పనులలో, మన భావనలో, లింగ భేదం కల వివిధ రూపాలలో మనకు గోచరము అవుతూ ఉంటుంది. ఆ ప్రకారంగా మానవులు అవ్యక్తరూపాన్ని చూడగలరు. అసలు అది నిరాకారమైనను, మనము చేసే భావనలో, చేసే పనులలో వివిధ ఆకారాలలో కనపడుతూ ఉంటుంది.

మానవుడు పైన చెప్పిన శబ్ద, స్పర్శ,రస,రూప,గంధాదులకు వశుడై భోగలాలసుడు అవుతున్నాడు. తన ఇష్టం వచ్చినట్టు జీవిస్తున్నాడు. కాని మానవుడు వాటిని అదుపు లో పెట్టుకొని జ్ఞాన సముపార్జన చెయ్యాలి. ఆ జ్ఞానం పొందిన వాడు, అన్ని భూతములలో తనను చూచుకుంటాడు. తనలో అన్ని భూతములను చూచుకుంటాడు. తపస్సు అనగా వేరే ఏమీ కాదు. ఈ విషయ వాంఛలనుండి మనసును జ్ఞానము వైపుకు మళ్లించడం. అదే వైరాగ్యం. అలాంటి తపస్సు చేయు వానికి ఇంక చేయవలసిన పనులు ఏమీ ఉండవు. విషయవాంఛలనుండి

ఇంద్రియములను నివారించిన స్వర్గము. నివారించని ఎడల నరకము కలుగుతుంది.

( ఇక్కడ ఒక వేదవాక్యం ఉదహరిస్తున్నాను.

నమోక్షో నభసః । నపాతాళే న భూతలే । సర్వాశాసంక్షయే చేతః ।

క్షయో మోక్ష ఇతీర్యతే ॥ (అధర్వవేదం)

అనగా మోక్షం అనేది ఆకాశంలో గాని, పాతాళంలో కాని, ఎక్కడో లేదు. భూమి మీద లేదు. కోరికలతో సతమతమయ్యే మనసును, అదుపులో పెట్టుకోవడమే మోక్షం. అత్యాశ కు పోకుండా, ఉన్న దానితో తృప్తి పడటం నిజమైన స్వర్గం.

అలాకాకుండా, లోకంలో ఉన్న అన్నింటికి అర్రులు చాస్తూ, వాటిని పొందడానికి కాని పనులు చేస్తూ, పాపాలు చేస్తూ, మనసును దుఃఖ పెడితే అదే నిజమైన నరకం.)

ఆ దేహ ము అనేది ఒక రథము అనుకుంటే దానికి ఇంద్రియములు గుర్రములు, ఆత్మ సారథి. మనకు ఉన్న ధైర్యము పగ్గములు. మానవుడు మనస్సును నిగ్రహించి ధైర్యమనే పగ్గములను గట్టిగా పట్టుకొని, ఇంద్రియములు అనే అశ్వములను అదుపు చేస్తూ,

వేగంగా పోకుండా, క్షేమమైన మార్గాన ఈ దేహము అనే రథాన్ని నడిపిస్తాడో వాడే నిజమైన ధీరుడు.

మనము అనుదినము బయట ప్రపంచంలో తిరుగుతుంటాము. మన ఇంద్రియములు పోయిన చోటికి మనస్సుకూడా పోతూ ఉంటుంది. అది సహజము. మనము ఇంద్రియములను అదుపు చేయకున్న సుడిగాలికి సముద్రంలో పడవ కొట్టుకున్నట్టు మానవుని బుద్ధి చెడిపోతుంది. కాబట్టి ఇంద్రియములను అదుపులో ఉంచుకున్నవాడే జ్ఞాని, వాడే నిజమైన ధ్యానసమాధి లో ఉంటాడు.

ఇంక త్రిగుణముల గురించి వివరిస్తాను. గుణములు మూడు. సత్వ, రజస్తమోగుణములు. అందులో తమో గుణము అతి నీచమైనది. నింద్యార్హము. సత్వ గుణము ఉత్తమమైనది. జ్ఞానంతో కూడినది. జ్ఞాన సముపార్జనకు తగినది. ఇంక రజోగుణము పైరెండు గుణాల కలయిక.

సుఖంగా లేని ఆకారం, అతి నిద్ర, ఎప్పుడూ దీనంగా ఉండటం, అతిగా కోరికలు, వాటి మీద భ్రాంతి, సహనం లేక పోవడం ఇవీ తమో గుణ లక్షణములు.

ఎక్కువగా మమకారము, అన్నీ కావాలనే కోరిక, లోభము, జడత్వము (తన పనులు కూడా తాను చేసుకోకుండా ఇతరులతో చేయించుకోవడం), అహంకారము, ఇవన్నీ రాజస గుణాలు.

ధైర్యము, శాంతి, కరుణ, దయ, సంతోషము, విద్యల యందు ఆసక్తి, ఇవన్నీ సాత్విక గుణాలు.

సాత్వికుడు అయిన మనుజుడు, జ్ఞానాన్ని సంపాదిస్తాడు, ఈలోకంలో కనపడేవి అన్ని శాశ్వతములు కావు అని తెలుసుకుంటాడు. కోరికలను విడిచి పెడతాడు. సుఖదుఃఖాలకు అతీతంగా ఉంటాడు. అహంకారాన్ని అణిచి వేస్తాడు. ఇంద్రియాలను నిగ్రహిస్తాడు. అతడికి ఉత్తమ శాంతి లభిస్తుంది.

సత్తగుణములు కలిగినవాడు జన్మతః శూద్రుడైనా, తరువాతి జన్మలో వైశ్యునిగా జన్మించి, తరువాతి జన్మములలో క్షత్రియుడుగా బ్రాహ్మణుడిగా పుట్టి, కడకు కైవల్యం పొందుతాడు." అని ధర్మవ్యాధుడు కౌశికునితో చెప్పాడు.

అప్పుడు కౌశికుడు "అయ్యా! ఈ శరీరంలో అగ్ని ఎలా పుడుతుంది. ఈ శరీరంలో ఉండే వాయువులు ఎక్కడెక్కడ ఉంటాయి? దయచేసి వివరించండి" అని అడిగాడు. అప్పుడు ధర్మవ్యాధుడు ఇలా చెప్పసాగాడు.

" మన శరీరంలో ఆత్మ అనే అగ్ని శిరస్సు వరకు వ్యాపించి ఉంటుంది. దానికి ఆధారము నాభి. అంటే ఆత్మాగ్ని నాభి నుండి శిరస్సువరకు వ్యాపించి ఉంటుంది. మనలో ప్రాణవాయువు ఈ అగ్ని లో సంచరిస్తుంటాడు. ఆ ప్రాణ వాయువే సకల భూతములకు ఆధారము.

ప్రాణ వాయువు, అపాన వాయువు రెండూ కలిసి ఈ ప్రాణాగ్నిని జ్వలింప చేస్తూ ఉంటారు. మానవుడిలో, అపానము పొత్తికడుపు, గుదము మధ్యలో ప్రాణాగ్ని తో కూడి ఉంటుంది. ఆ అపానమే మల మూత్రవిసర్జనకు ఆధారము.

ఉదానము అనే వాయువు కంఠంలో ఉంటుంది. ఆ వాయువు మన కర్మబలాన్ని నియంత్రిస్తుంది.

వ్యానము అనే వాయువు, మన శరీరంలో ఉన్న ఒక అవయవం మరొక అవయవం కలిసే అన్ని చోట్ల సంచరిస్తూ ఉంటుంది.

పైన చెప్పి ప్రాణ అపాన వాయువులు ఆశ్రయించి ఉన్న అగ్నిని ఆధారం చేసుకొని సమాన వాయువు, మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేసి, దానిని రక్తంలో కలుపుతుంది. ఆ వాయువు నాభి దగ్గర ఉంటుంది. అదే మనలో ఉన్న సకల ధాతువులను పోషిస్తుంది.

ఈ పంచప్రాణములను గురించి ఆత్మాగ్నిని గూర్చి యోగులు మాత్రమే తెలుసుకొన గలరు. ఆ యోగులు నిరంతర అభ్యాసము వలన తమ ఆత్మను మూర్ధ్వతలమున నిల్పుకొంటారు.

పైన చెప్పిన ప్రాణ అపాన సమాన వాయువులలో చరించు చున్న అగ్ని సకల దేహముల యందును జీవాత్మగా వెలుగుతున్నాడు. ఆ జీవాత్మ, నీటిలో ఉన్న తామరాకు మాదిరి, మన దేహంలో ఉన్నప్పటికి, నిర్లిప్తంగా ఉంటాడు. ఆ జీవాత్మయే ఈ దేహాన్ని విడిచి నపుడు పరమాత్మ.

ఎలాంటి కదలికలు లేకుండా అచేతనంగా ఉన్న ఈ శరీరాన్ని, ఆ పరమాత్మయే, జీవాత్మ గా చైతన్యవంతం చేస్తాడు. ఆ పరమాత్మయే ఈ

లోకాలకు సృష్టికర్త. మనం చూచే అన్ని జీవులలో ఉన్న జీవాత్మను, బుద్ధిమంతులు, తమ బుద్ధి కుశలత చేత, పరమాత్మగా తెలుసుకుంటారు.

ఓ మహాత్మా! ఇప్పుడు మీకు బ్రహ్మవిద్యా ప్రభావము ఆచరణలో ఎలా సాధ్యమో ఆ రహస్యం చెబుతాను. తెలివిగల బుద్ధిమంతుడు శుభము, అశుభము లందు అసలు ప్రవేశించడు. రెండింటి పట్ల ఆసక్తి చూపించడు. క్రమ క్రమంగా, సుఖదుఃఖములు, రాగద్వేషములు, శీతోష్ణములు మొదలగు ద్వంద్వములు అన్నింటి పట్ల అతీతుడు ఉంటాడు.

అలాంటి పుణ్యాత్ముడు ప్రతిదినము నియమం ప్రకారం భుజిస్తాడు. ఇంద్రియాలను జయిస్తాడు. యోగసాధన చేస్తాడు. తన ఆత్మలో పరమాత్మను దర్శిస్తాడు. ఎలాంటి గాలి లేని చోట నిశ్చలంగా ఉన్న దీపం మాదిరి ప్రకాశిస్తాడు. అమరత్వం పొందుతాడు.

కాబట్టి ఓ మహాత్మా! ఎల్లప్పుడును, కామమును, క్రోధమును విడిచి పెట్టాలి. ఇది అత్యంత క్షేమకరము. అను నిత్యం మనం కర్మలను చేస్తూ ఉండాలి. కాని ఆ కర్మల వలన కలిగే ఫలితముల పట్ల ఆసక్తి

ఉండకూడదు. కర్మఫలత్యాగం చెయ్యాలి. తాను చేసే పనులలోనే ఎల్లప్పుడూ ఆసక్తి కలిగి ఉండకూడదు. జ్ఞాని అయినవాడు కర్మలను చేస్తాడు. ఫలితం ఆశించడు. అదే ఉత్తమమార్గం.

ఇంకొకమాట. మన జీవితాలు అశాశ్వతాలు. అస్థిరములు. అందువల్ల ఎవ్వరికి అపకారం చెయ్యకూడదు. అందరితోనూ మైత్రి కలిగి ఉండాలి. అందరి ఎడల జాలి, దయ కలిగి ఉండాలి. ఉన్నదానితో తృప్తి చెందాలి. ఇతరుల సొమ్ముకు ఆశించ కూడదు. ఇంద్రియ నిగ్రహం సాధించాలి. అలాంటి వాడు పరమ సుఖాన్ని పొందుతాడు.

మహాత్మా నీవు అడిగినవి అన్ని చెప్పాను. ఇంకా ఏమి వినవలెనని ఉన్నది" అని వినయంగా అడిగాడు ధర్మవ్యాధుడు.

"ఓ మహాత్మా! నీవలన అన్ని విషయములు తెలుసుకొన్నాను. ప్రబుద్ధుడు నయ్యాను. నీవు సర్వజ్ఞుడవు అని తెలుసుకున్నాను" అని కౌశికుడు పలికాడు.

“ ఓ కౌశిక మహర్షి! నీవు నన్ను సర్వజ్ఞుడవు అని అన్నావు. నాకు ఈ సర్వజ్ఞత కలగడానికి మూలమైన ధర్మం ఒకటి ఉన్నది. దానిని నీకు తెలుపుతాను” అని తన ఇంటిలోనికి తీసుకొని వెళ్లాడు.

లోపల ఒక సుఖాసనం మీద అతని తల్లి తండ్రి కూర్చుని ఉన్నారు. ధర్మవ్యాధుడు వారికి నమస్కరించాడు. వారిని కుశలం అడిగాడు. అప్పుడు ఆ తల్లి తండ్రులు ధర్మవ్యాధునితో “ కుమారా! నీ వంటి కుమారుడు ఉండగా మాకు ఏమి కొదువ చెప్పు. నీవు ఆచరించు ధర్మము ఎల్లప్పుడూ నీకు తోడుగా ఉంటుంది. నీకు ఆయువు, ఆరోగ్యము ప్రసాదిస్తాయి. నీ వలన మన వంశం పవిత్రమయింది. నీవు మనుష్య జన్మ ఏల ధరించావో కాని, నీవు దేవతా మూర్తివి. ఇందులో సందేహము లేదు. త్రికరణ శుద్ధిగా తల్లితండ్రులను సేవిస్తున్న నీవు ఆ పరశురాముడి కన్నా ముందుంటావు.” అని పలికారు.

అప్పుడు ఆ ధర్మవ్యాధుడు కౌశికుని చూపి “తండ్రీ! ఈయన మనలను చూడటానికి ఇక్కడకు వచ్చాడు.”

వారు కూడా కౌశికుని కుశలం అడిగారు.

అప్పుడు ధర్మవ్యాధుడు కౌశికునితో ఇలా అన్నాడు. " మహాత్మా! వీరు నా జననీ జనకులు. నేను వీరికి సేవ చేయడం వల్ల నాకు ఇంతటి జ్ఞానం సంప్రాప్తించింది. అందరూ అన్ని దేవుళ్లను పూజిస్తారు. కాని నాకు వేరే దేవుళ్లు తెలియదు. నా తల్లితుడ్రులే నా పాలిట దేవుళ్లు. నేను ప్రతిరోజూ వీరికి ఫలములు, ఆహారము వస్త్రములు ఇచ్చి సేవించుకుంటాను. నేను నా భార్య బిడ్డలతో వీరికి సేవలు చేస్తుంటాను. నాకు వేదములు, యజ్ఞములు, క్రతువులు అన్ని వీరే అని భావిస్తాను. తల్లి, తండ్రి, గురువు, అగ్ని, ఆత్మ ఈ ఐదుగురిని ఎవరు పూజిస్తారో వారే ఈ భూమిలో ధర్మాత్ములు.

అయ్యా! ఆ పతివ్రత పంపగా మీరు ధర్మజ్ఞానము కొరకు నా వద్దకు వచ్చినారు. ఆ పతివ్రత అనుగ్రహమున నేను మీకు నాకు తెలిసినంత వరకు చెప్పినాను. కాని నీవు అంటే నాకు ఇష్టం కలగటం లేదు. దానికి ఒక కారణం ఉన్నది. నీ తల్లితండ్రులు వృద్ధులు. వారికి నువ్వు తప్ప వేరే దిక్కు లేదు. కాని నీవు వారిని వదలి పెట్టి వేదాధ్యయనము కొరకు వచ్చినావు. వచ్చునపుడు వారి అనుమతి తీసుకొనలేదు. నీవు వేదములు శాస్త్రములు చదివి జ్ఞానమును ఆర్జించావు కాని నీ తల్లితండ్రుల ఎడల చాలా క్రూరంగా ప్రవర్తించావు. అది నాకు నచ్చలేదు. నీకోసం నీ తల్లితండ్రులు రోదించి రోదించి

గ్రుడ్డివారయ్యారు. ఆసంగతి నీకు తెలియదా! ఇంక నన్నా నీవు వారి వద్దకు వెళ్లి వారి యొక్క శోకమును చల్లార్చుము. నీవు చదువుకున్న చదువు గాని, నీవు ఆర్జించిన పుణ్యము గాని, వాటి కోసం నీవు పడే శ్రమ గాని, తల్లితండ్రుల సేవ చేయక పోవడం వలన నిష్ఫలములౌతాయి. కాబట్టి నేను చెప్పిన విధంగా చెయ్యి. నీకు మేలు చేకూరుతుంది." అని ధర్మవ్యాధుడు చెప్పాడు.

"మహాత్మా! నీవు చెప్పిన మాటలు అన్నియు విన్నాను. నీవు చెప్పిన ప్రకారము చేస్తాను. నా తల్లితండ్రులకు సేవ చేస్తాను. నా భాగ్య వశమున నాకు నీతోటి స్నేహం కలిగింది. నా మనస్సు చాలా ఆహ్లాదంగా ఉన్నది. నేను చేసిన పాపం వలన కలిగే దుర్గతిని మొయ్యకుండా నన్ను నీవు నీ బోధనలతో పునీతుని గావించినావు. నీవు నా పాలిట దైవసమానుడవు.

ఈ భూమిలో అందరికి ధర్మమార్గము లభించదు. పదివేలలో ఒకడు మాత్రం ధర్మమార్గాన చరిస్తాడు అన్నది కూడా సందేహమే. నీమాదిరి ధర్మ మార్గమును అనుసరించిన బుద్ధిమంతుడు వేరు ఎవ్వరునూ లేరు. నేను నిన్ను ఒక శూద్రునిగా తలచడం లేదు. నీగురించి వింటుంటే చాలా అద్భుతంగా ఉంది. నీవు భూత భవిష్యత్

వర్తమానములను ఎరిగిన వాడవు. నీవు ఏ కారణం చేత ఈ శూద్ర జన్మ ఎత్తినావో చెప్పుము." అని కౌశికుడు అడిగాడు. దానికి ఆ ధర్మవ్యాధుడు ఇలా చెప్పసాగాడు.

" మహాత్మా! నీవు అడిగినది చెప్పడం నా ధర్మం కదా! నేను పూర్వ జన్మలో ఒక బ్రాహ్మణుడను. వేద వేదాంగములను చదువుకున్నాను. నాకు ఒక రాజకుమారునితో స్నేహం కలిగింది. ఆ కారణంగా విలువిద్య కూడా నేర్చుకున్నాను. ఒక రోజు ఆ రాజకుమారునితో కూడా వేటకు వెళ్లాను. ఎన్నో జంతువులను చంపాను. నేను విడిచిన బాణము ఒకటి పొదలమాటున, గడ్డిచాటున ఉన్న ఒక మునీశ్వరునికి తగిలింది. ఆయన బాధతో నేలమీద పడ్డాడు. నేను ఆ మునీశ్వరుని వద్దకు వెళ్లాను. బాధతో నేలమీద దొర్లుచున్న ఆ మునీశ్వరుని తో అనునయ వాక్యాలు పలికాను. దానికి ఆ ముని నీవు పుట్టినది బ్రాహ్మణకులంలో కాని శూద్రులకు అనువైన కర్మలను చేసావు. కాబట్టి నీవు మృగములను చంపు వ్యాధుడిగా జన్మించుము." అని శపించాడు.

"అయ్యా! నేను ఎరుగక తప్పుచేసాను. నన్ను క్షమించ వచ్చును గదా! నన్ను హీనజన్మునిగా పుట్టమని శపించవలదు." అని ప్రార్థించాను.

అప్పుడు ఆ మునికి నా మీద దయకలిగి "నా శాపానికి తిరుగు లేదు కాని నీవు వ్యాధుడిగా జన్మించినప్పటికి, ధర్మసూక్ష్మాలు తెలిసిన వాడివి కాగలవు. నీ తల్లి తండ్రులకు సేవ చేస్తూ తరించు. నీవు తల్లి తండ్రులకు సేవచెయ్యడం వలన నీకు పూర్వజన్మ స్ఫురణ ఉంటుంది. తదుపరి జన్మలో మరల బ్రాహ్మణ జన్మ కలుగుతుంది." అని చెప్పాడు. అప్పుడు నేను ఆ ముని దేహమునుండి బాణమును బయటకు లాగాను. ఆయనను ఆశ్రమానికి చేర్చాను. ఆయన గాయానికి మందు వేసాను. ఆయనకు ప్రాణాపాయము తప్పింది గాని నాకు ఈ వ్యాధుని జన్మ సంప్రాప్తించింది." అని చెప్పాడు

"అయ్యా! నీవు వ్యాధుని జన్మ ఎత్తిననూ, నీవు బ్రాహ్మణుని వలే ప్రవర్తి స్తున్నావు. ఇది వింతగా నున్నది. నీవు నిజంగా బ్రాహ్మణుడివే. ఎందుకంటే పుట్టుకతో బ్రాహ్మణుడయ్యును, అతని చేసే పాపపు పనులవలన, అతను శూద్రుని కంటే నీచుడు అవుతాడు. కాని సత్యము, శౌచము, ధర్మము అనుసరించువాడు, జన్మతః శూద్రుడయ్యును, సద్బ్రాహ్మణునితో సమానము అని పెద్దలు చెప్పారు కదా. కాబట్టి ఓమహాత్మా! నీవు చేసిన కర్మవలన వ్యాధుని జన్మ ఎత్తవలసి వచ్చినదని బాధపడవలదు.

మనము చేసే మంచి కర్మల వలన, చెడు కర్మల వలన, మనకు మేలు కీడు కలుగుతుంటాయి. ఆ ప్రకారంగా కలిగే సుఖదుఃఖములను ప్రాజ్ఞులు సమానంగా చూస్తారు. వాటిని మంచి పనులు చేసి పోగొట్టుకుంటారు. మనకు ప్రియమైనవి దూరం కావటం, అప్రియమైనవి దగ్గర కావడం సర్వసాధారణం.

మూఢులు తమకు అప్రియములు కలిగినపుడు తీవ్రంగా చింతిస్తూ ఉంటారు. దాని వలన హృదయ తాపం తగ్గకపోగా ఎక్కువ అవుతుంది. కావున ధీరులు ఎన్ని దుఃఖములు వచ్చినను దుఃఖించరు. అలాగుననే ఎన్ని సుఖములు వచ్చినను పొంగిపోరు. జరిగిన దానికి జరుగబోవు దానికి ఎన్నటికి దుఃఖించ కూడదు. ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలి.

దుఃఖం వలన మనిషి తన ప్రకాశాన్ని కోల్పోతాడు. దుఃఖమువలన తనకు మంచి కలిగించే పనులు కూడా చెయ్యలేడు (విచక్షణ కోల్పోతాడు). కాబట్టి దుఃఖము కలిగినపుడు కుంగిపోక, ఆ దుఃఖాలను తొలగించుకొనే ప్రయత్నములను చేయువానికి అని శుభములు క లుగుతాయి. కాబట్టి ఓ వ్యాధుడా! అన్నిభూతములయందు సమత్వము

కలిగి ధీరుడవై ఉండుము" అని కౌశికుడు అనునయ వాక్యాలు పలికాడు.

" మహానుభావా! తమరుచెప్పినట్టే నేను దుఃఖమును వదలిపెట్టినాను. భవిష్యత్తులో మంచి జరుగుతుందని ఆశిస్తున్నాను." అని అన్నాడు ఆ వ్యాధుడు.

మహానుభావా! నీవు పుణ్య మూర్తివి. నీవు నీ జీవితమును ధర్మబద్ధంగా తీర్చి దిద్దుకొనుము. నీకు సదా శుభం కలుగుతుంది. నిన్ను కలుసుకొనడం చేత నా జన్మ ధన్యమయినది. ఎన్నో ధర్మములను తెలుసుకున్నాను. ఇంక నాకు సెలవు ప్రసాదించిన నేను పోయి వచ్చెదను" అని అన్నాడు.

ఆ ప్రకారం ఆ వ్యాధుని వద్ద సెలవు తీసుకొనిన తరువాత కౌశికుడు వెంటనే తన తల్లి తండ్రులవద్దకు వెళ్లి వారికి సేవలు చేసి తరించాడు.

కాబట్టి ఓ ధర్మరాజా! నీవు అడిగిన ప్రకారము పతివ్రతా మహాత్మ్యము, మాతా పితల శుశ్రూష విశేషము, హీనకులములో

పుట్టినవాడు  ఏ ప్రకారము ధర్మవిదుడు ఐనది చెప్పినాను కదా” అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు వివరించాడు.

(మహా భారతము - అరణ్య పర్వము -

పంచమాశ్వాసము -

మొదటి భాగము సంపూర్ణము.)

# మహా భారతము

## అరణ్యపర్వము

## పంచమాశ్వాసము(రెండవభాగము).

"ఓమార్కండేయ మహర్షి! నీ దయవలన అని విషయములను తెలుసు కున్నాను. పూర్వము అగ్నిదేవుడు గొప్ప తపస్సు చేసాడట. ఎందుకు చేసాడు? అంగిరసుడు ఏ ప్రకారము అగ్ని గా మారాడు. అగ్నులు ఎన్ని విధములు?. వీటి గురించి వివరించండి." అని అడిగాడు.

మార్కండేయ మహర్షి ఇలా చెప్పసాగాడు.

"అగ్ని దేవుడు హవ్యవాహనుడు. అనగా యజ్ఞములు యాగములు చేయునపుడు అందులో హోమద్రవ్యాలను వేస్తారు. ఆ హవిస్సులను, అగ్ని దేవుడు మోసుకొని పోయి అందరు దేవతలకు అందిస్తాడు.

ప్రతి సారి హవిస్సులను తీసుకొనిపోయి దేవతలకు ఇవ్వడంతో విసుగు చెందాడు అగ్ని. హవిస్సులను తీసుకు పోవడానికి ఇష్టపడక, అడవికి పోయి తపస్సు చేసుకుంటున్నాడు. దేహం అంతా కృశించి పోయింది.

“ ఇదేమిటి నేను నా విధులను మరచి ఈవిధంగా అడవికి వచ్చి తపస్సు చేసుకుంటున్నాను. అగ్ని లేకపోతే లోకం ఏమవుతుంది! స్థంభించి పోతుందా! ఒక వేళ అలా స్తంభించి పోయిన బ్రహ్మ దేవుడు మరొకరిని నా పదవిలో నియమించాడా! అపుడు నా పరిస్థితి ఏమిటి? నేను ఇచ్చుట ఉండరాదు. వెంటనే పోవలయును” అని తపము చాలించి తన స్వస్థలమునకు వెళ్లుచుండగా, అప్పటికే బ్రహ్మదేవుడు తన పదవిలో నియమించిన అంగిరసుడు అనే అగ్ని మూడు లోకములలో అగ్ని కార్యములు నిర్వర్తించడం చూచాడు. భయ పడ్డాడు.

వెనక్కు తిరిగి వెళ్ల బోతుంటే అంగిరసుడు అతనిని చూచి “ ఓ అగ్ని దేవా! నీవు పాప రహితుడవు. ముల్లోకముల చీకట్లు పోగొట్టేవాడివి. నిన్ను బ్రహ్మ మొదట అగ్ని దేవునిగా నియమించాడు. కాబట్టి ఎలాంటి సంశయము లేకుండా నీ పదవిని నీవు తీసుకొనుము. నేను మనస్ఫూర్తిగా చెబుతున్నాను. నేను ఈ పదవిలో ఉండలేను.” అని అన్నాడు.

ఆ మాటలకు అగ్ని “అయ్యా! నా కీర్తి లోకాలలో నిస్తేజమై పోయింది. ప్రస్తుతము నీవు ముల్లోకాలలో పూజలందుకుంటున్నావు. కాబట్టి ఈ అగ్ని పదవి నీది. నాకు పనికిరాదు. నీవు చెపుతున్నావు కాబట్టి నీవు ప్రథమ అగ్ని గా మొదటి స్థానంలో ఉండు. నేను రెండవ స్థానంలో ప్రాజపత్య అగ్ని గా ఉండెదను.” అని చెప్పాడు.

దానికి అంగిరసుడు “ ఓ దేవా! నీవు అట్లు నన్ను ఆజ్ఞాపించవలదు. ప్రథమ అగ్ని పదవి నీదే. నీవే తీసుకొనుము. నన్ను నీ మొదటి కుమారునిగా ఆదరిం పుము” అని ప్రార్ధించాడు. అగ్ని దేవుడు దానికి ఒప్పుకున్నాడు.

~~ఈ~~ ప్రకారంగా అంగిరసుడు అగ్ని దేవునికి కుమారునిగా, రెండవ అగ్నిగా ప్రకాశించాడు.

అంగిరసునకు శివ అనే భార్య వలన బృహత్కీర్తి, బృహజ్జ్యోతి, బృహద్బ్రహ్మ, బృహన్మనసుడు, బృహన్మంత్రుడు, బృహద్భానుడు, బృహస్పతి అనే ఏడుగురు కుమారులు, భానుమతి, రాగ, సినీవాలి, కుహువు, నర్చిష్మతి, మహిష్మతి, మహామతి అను ఏడుగురు కుమార్తెలు కలిగారు.

అంగిరసుని కుమారుడు బహస్పతికి శంయుడు జన్మించాడు. యాగములు చేయునపుడు నేతి హవిస్సును ఆయనకే అర్పించేవారు. ఆ శంయునకు భార్య సత్య. వారికి భరద్వాజుడు, భరతుడు అనే కుమారులు పుట్టారు. భరతునకు భారతుడు అనే కొడుకు, భారతి అనే కూతురు పుట్టారు. భారద్వాజునకు వీరుడు పుట్టాడు. ఆ వీరునకు భానుడు అనే కొడుకు పుట్టాడు. భానుడికి నిశ్చ్యవనుడు జన్మించాడు.

నిశ్చ్యవనుడికి నిష్కృతి అనే కుమారుడు పుట్టాడు. నిష్కృతి అనే అగ్నిని ఆరాధించేవారికి అన్ని పాపాలు పోతాయి. అందుకే అతనికి ఆ పేరు వచ్చింది.

ఆ నిష్కృతికి రుజస్కరుడు పుట్టాడు. రుజస్కరునికి క్రోధుడు జన్మించాడు. ఆ క్రోధునకు రసుడు, రసునకు స్వాహా అనే పుత్రిక, కాముడు అనే కొడుకు పుట్టారు. కాముడికి అమోఘుడు, అమోఘునకు సుక్థుడు అనే కొడుకు పుట్టాడు.

కాశ్యపుడు, వాసిష్ఠుడు, ప్రాణుడు, అంగిరసుడు, చ్యవనుడు అనే ఐదుగురు తమకు మంచి తేజోవంతుడైన కొడుకు పుట్టాలని తపస్సుచేస్తున్నారు. వారికి ఒక కొడుకు జన్మించాడు. అతడు తల నిప్పు రంగు లో ఉంది. చేతులు సూర్యుని మాదిరి ఉన్నాయి. కళ్లు బంగారు రంగులో ఉన్నాయి. శరీరం మాత్రం నల్లగా ఉంది. మంచి బలంగా ఉన్నాడు. ఐదుగురు తండ్రులకు పుట్టిన వాడు కాబట్టి అతడు పాంచజన్యుడు అయ్యాడు.

అతను పదివేల ఏళ్లు తపస్సుచేసాడు. అతడి శిరస్సు నుండి బృహద్రథంతరులు అను వారు, ముఖము నుండి హరి, నాభి నుండి శివుడు, బలము నుండి ఇంద్రుడు, ప్రాణముల నుండి వాయువు, అగ్ని,

భుజముల నుండి, దంతముల నుండి ప్రపంచము లోని అన్ని భూతములు సృష్టింప బడ్డాయి.

తపుడు అనే అగ్ని నిరంతరము తపస్సు చేసి, పదునైదు మంది పుత్రులను కన్నాడు. కాని వారు అందరూ కపట వృత్తిలో నిపుణులు అయ్యారు. ఆ పదునైదు మంది -- సుభీముడు, అతిభీముడు, భీముడు, భీమబలుడు, అతిబలుడు అను వారలు ఒక పక్క, సుమిత్రుడు, మిత్రవంతుడు, మిత్రజ్ఞుడు, మిత్రవర్ధనుడు, మిత్రధర్ముడు అను వారలు ఒక పక్క, సురప్రవీరుడు, వీరుడు, సువేషుండు, సువర్చసుడు, సురహంత అను వారలు ఒక పక్క చేరి, యజ్ఞఫలములు అపహరించు చుండేవారు. వారుచేయు పనులకు తరచు అగ్నికి శాంతి చేయవలసి వచ్చేది. బ్రాహ్మణులు వారిని తమ మంత్రశక్తులతో భయపెట్టి యజ్ఞశాలకు చేరనిచ్చేవారు కాదు.

ఆ తపునకు పైన చెప్పిన 15 మంది కాక, ఇంకా ఐదుగురు పుత్రులు కలిగారు. వారిలో మొదటి వాడైన వైశ్వానరుడు బ్రాహ్మణులచేత చాతుర్మాస్య వ్రతములలో పూజింపబడేవాడు. రెండవ వాడు విశ్వపతి. అతను జగత్తుకు ప్రభువు. మూడవ వాడు విశ్వకుడు. నాల్గవవాడు విశ్వభుక్కు. అతను భూతములు తిను ఆహారమును జీర్ణము చేసేవాడు. ఐదవ వాడు గోపతి. అతడు సమస్త ధర్మక్రియలకు కారణభూతుడు.

భానుడు అనే అగ్నికి ఆరుగురు కుమారులు, నిశ అనే కుమార్తె కలిగారు. పురంధరుడు అనే అగ్నికి మనువు అనే కుమారుడు కలిగాడు. అతను నిశ ను పెళ్లి చేసుకున్నాడు. ఆ మనువుకే ప్రాజాపత్యుడు అనే పేరుకూడా ఉంది. ఆ విధంగా పలురకాల అగ్నులు సకల ధర్మ క్రియలకు కారణములు అయినవి.

ఆపుడు అనే అగ్నికి ముదిత అనే కన్యకు "అగ్ని" జన్మించాడు. మూడు లోకాలలో జరిగే అన్ని వ్యవహారాలను ఆ అగ్ని నిర్వహిస్తున్నాడు. యజ్ఞయాగాలలో సమర్పించే హవిస్సులను దేవతలకు చేరవేస్తుంటాడు.

ఆ కార్యభారంతో అలసిపోయాడు అగ్ని. అధర్వుడు అనే వాడితో అగ్ని ఇలా చెప్పుకున్నాడు. " ఓ అధర్వా! ఆ యజ్ఞయాగాదులలో సమర్పించే హవిస్సులను నిరంతరం దేవతలకు చేరవేస్తూ నేను అలసిపోయాను. కాబట్టి ఇక మీదట నువ్వు ఈకార్యక్రమాన్ని నిర్వహించు" అని తన కార్యనిర్వహణను అధర్వునికి అప్పగించి అగ్ని సముద్రంలో దాక్కున్నాడు.

దేవతలందరూ అగ్ని ఎక్కడ ఉన్నాడో తెలియక వెదకసాగారు. ఇంతలో సముద్రంలో ఉన్న చేపలు అగ్ని దేవుడు సముద్రంలో దాక్కుని

ఉన్నాడని దేవతలకు సమాచారం అదించాయి. దానికి అగ్నిదేవుడు కోపించి “ ఓచేపలారా! మీ చేపజాతిని మానవులు నిర్దయులై చంపి తింటారు” అని శాపం ఇచ్చాడు.

“ ఓ అగ్ని దేవా! నీవు యధాప్రకారము హవిస్సులను మాకు అందించు” అని దేవతలందరూ అగ్నిని ప్రార్ధించారు. కాని అగ్ని అందుకు సమ్మతించచక తన శరీరాన్ని విడిచిపెట్టి భూమిలోకి ప్రవేశించాడు.

అతని దేహము భూమి మీద పడింది. ఆ అగ్ని దేవుని దేహమునుండి ఎన్నో ధాతువులు ఆవిర్భవించాయి. అగ్ని దేవుని దేహము నందు ఉన్న చీము నుండి గంధకము, ఎముకల నుండి దేవదారు వక్షములు, కఫం నుండి కర్పూరము, పిత్తమునుండి పచ్చలు, వాతము నుండి నల్లటి పాషాణములు, గోళ్లనుండి అభ్రకము, రక్తనాళముల నుండి పగడములు, ఏర్పడ్డాయి.

అగ్ని దేవుడు భూగర్భంలో తపస్సు చేసుకుంటున్నాడు. ఇక్కడ అధర్వుడు అగ్ని దేవుడు చేయవలసిన కార్యములు నిర్వర్తిస్తున్నాడు. దేవత లందరూ అధర్వుడినే పూజి స్తున్నారు.

అధర్వుని కాంతిని, అతని ద్వారా దేవతలు తృప్తి పడటాన్ని చూచి ఓర్వలేక అగ్ని దేవుడు మరల బయటకు వచ్చి తాను యధా ప్రకారము హవిస్సులను దేవతలకు అందిస్తానని ఒప్పుకున్నాడు.

ఓ ధర్మరాజా! ఆ విధంగా ఎందరో అగ్నులు ఉద్భవించారు. కాని అందరిలో వెలిగే అగ్ని ఒక్కటే." అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు వివరించాడు.

అంతట ధర్మరాజు "ఓ మహర్షి! మహా సేనుడు అనగా కుమారస్వామి అగ్ని దేవునికి, కృత్తికలకు, మహా శివునకు ఎలాగా కుమారుడు అయినాడు వివరించండి" అని అడిగాడు. దానికి మార్కండేయ మహర్షి ఇలా చెప్పసాగాడు.

పూర్వం రాక్షసులతో యుద్ధం చేసి దేవేంద్రుడు ఓడిపోయాడు. రాక్షసులను ఎలా గెలవాలా అని దేవేంద్రుడు మానస అనే కొండమీద కూర్చుని ఆలోచిస్తున్నాడు. ఇంతలో "రక్షించండి రక్షించండి" అని ఒక స్త్రీ ఆర్తనాదం వినపడింది. దేవేంద్రుడు అది విని ఆ స్త్రీని రక్షించడానికి వెళ్లాడు. అక్కడ కేశి అనే ఒక రాక్షసుడు ఒక స్త్రీని బలవంతంగా ఆకాశమార్గాన ఎత్తుకుపోతున్నాడు. దేవేంద్రుడు తన వజ్రాయుధం తీసుకొని ఆ రాక్షసుని వెంబడించాడు. ఆ రాక్షసుడు తన గదను దేవేంద్రుని మీదికి ప్రయోగించాడు. దేవేంద్రుడు తన వజ్రాయుధంలో ఆ

గదను ముక్కలు చేసాడు. ఆ రాక్షసుడు ఆ కన్యను వదలి పారిపోయాడు.

దేవేంద్రుడు ఆమెను చూచి " నీవు ఎవరవు? ఈరాక్షసుడికి ఎలా చిక్కావు?" అని అడిగాడు.

"అయ్యా నా పేరు దేవసేన నా అక్క పేరు దైత్యసేన. మేము అరిష్టనేమి అనే ప్రజాపతి పుత్రికలము. మేము ఇక్కడ విహరిస్తుండగా ఈ రాక్షసుడు మా దగ్గరకు వచ్చి మమ్ములను తన కామ చేష్టలతో వేధించసాగాడు. అవి మా సోదరి దైత్యసేనకు ఇష్టంగా ఉండేవి. కాని నాకు ఇష్టంలేదు. అందుకని వాడు మా అక్కను తీసుకొని వెళ్లాడు. అంతటితో ఆగక మరల వచ్చి నన్ను బలాత్కరించాడు. ఆ సమయంలో మీరు వచ్చి రక్షించారు" అని చెప్పింది.

"అమ్మా ! మీ తల్లి మా తల్లి దక్షుని పుత్రికలు. అందు వలన నీవు నాకు సోదరివి. నీకేం వరం కావాలో కోరుకో" అని అడిగాడు దేవేంద్రుడు.

" దేవేంద్రా! మా తండ్రి నా చిన్నతనం నుండి నాకు మహా పరాక్రమ వంతుడు, కీర్తిప్రతిష్టలు కలవాడు భర్త అవుతాడు అని చెప్పేవాడు. ఆ మాటను మీరు నిజం చెయ్యండి. దేవతల చేత,

*రాక్షసులచేత గెలువ శక్యం కాని వాడు, భయంకరమైన శత్రువులను చంపేవాడు, త్రిలోకములను రక్షించేవాడు, నీకు ఇష్టమైన వాడు అలాంటి వాడిని నాకు భర్తగా ప్రసాదించు" అని అడిగింది.*

*ఆ మాటలు విని దేవేంద్రుడు ఈ విధంగా ఆలోచించాడు.*

"ఈ రోజు అమావాస్య. సూర్యుడు చంద్రుడు ఏక రాసిలో ఉంటారు. ఇది రౌద్ర మహూర్తము. పైగా సూర్యోదయ సమయము. ఇప్పుడు అగ్ని దేవుడు మహా ఋషులు అర్పించిన హవిస్సులను తీసుకొని సూర్య మండలం ప్రవేశిస్తున్నాడు. కాబట్టి సూర్యుడు, చంద్రుడు, అగ్ని కలిసిన ఈ రౌద్రక నామ ముహూర్తములో సూర్య,చంద్ర,అగ్ని తేజములతో జన్మించిన వాడు ఈమెకు భర్త కాగలడు" అని అనుకున్నాడు.

వెంటనే దేవసేనను తీసుకొని దేవేంద్రుడు బ్రహ్మదేవుని వద్దకు వెళ్లాడు. దేవసేనకు తగిన భర్తను ప్రసాదించమని కోరాడు.

"దేవేంద్రా! ఈ కన్యకు గొప్ప వీరుడు భర్త కాగలడు. అతడు దేవ సేనలకు సేనాపతి కాగలడు. మీ కష్టములు అన్నియు తీర్చగలడు అని బ్రహ్మదేవుడు చెప్పాడు.

వశిష్టుడు మొదలైన సప్తఋషులు అమావాస్యా హోమం చేస్తున్నారు. హవిస్సులను స్వీకరించి దేవతలకు అందించడానికి అగ్నిదేవుడిని ఆహ్వానించారు. ఆ సమయంలో ముని పత్నుల భార్యలు అందరూ చక్కగా అలంకరించుకొని తమ తమ భర్తల పక్కన కూర్చుని యాగంలో పాల్గొంటున్నారు.

వారిని చూచాడు అగ్నిదేవుడు. వారి అందచందాలు చూచి అగ్నిదేవుడు వారిని కామించాడు. వారిని తాకాలని అనుకున్నాడు. ముని పత్నులు తన చుట్టు తిరుగుతున్నప్పుడు తన జ్వాలలను ప్రజ్వరిల్లజేసి వారిని తాకి ఆ స్పర్శ సుఖం పొందాలని ఆరాటపడుతున్నాడు.

ఆ హోమం ముగిసింది. సప్తఋషుల భార్యలు వెళ్లిపోయారు. అగ్ని దేవుడికి విరహ బాధ ఎక్కువ అయింది. అగ్నిదేవుని భార్య స్వాహా దేవి ఇది పసికట్టింది. తన భర్త కోరిక తీర్చడానికి సప్తఋషులలో ఒకరైన అంగిరసుని భార్య శివ అనే ఆమె రూపం తను ధరించింది. అగ్నిదేవుని దగ్గరకు వెళ్లింది.

“నేను అంగిరసుని భార్య శివను. నాకు, నా తోటి వారైన సప్తఋషుల భార్యలకు నీమీద వలపు ఏర్పడింది. మేము అందరము నిన్ను పొందాలని నిశ్చయించు కున్నాము. నీ మనసు తెలుసుకోడానికి

ముందుగా నన్ను పంపించారు. నాతో రతిక్రీడలలో మునిగి తేలుము” అని చెప్పింది.

అగ్నిదేవుని ఆనందానికి అవధులు లేవు. శివ రూపంలో ఉన్న భార్యతో కామసుఖాలు అనుభవించాడు. స్వాహాదేవి తన భర్త వీర్యాన్ని తనలో నింపుకొని, ఒక గరుడ పక్షిగా మారి, వాయు వేగంతో శ్వేత పర్వతానికి వెళ్లి అక్కడ రెల్లుగడ్డిలో పెట్టబడిన ఒక కుండలో తన భర్త వీర్యాన్ని దాచింది.

మరల తన భర్త అగ్ని దేవుని వద్దకు వచ్చింది. మరొక ఋషి భార్య రూపంలో తన భర్తతో కామ సుఖాలు అనుభవించింది. మరల పక్షి రూపంలో ఎగిరిపోయి భర్త వీర్యాన్ని ఆ కుండలో పెట్టింది.

ఈ ప్రకారం స్వాహాదేవి సప్తఋషుల భార్యల రూపాలలో తన భర్తతో సంగమించి, ఆ వీర్యాన్ని శ్వేతపర్వతంలో ఒక కుండలో నిక్షిప్తంచేసింది. కాని ఒక్క అరుంధతి రూపం మాత్రం ధరించలేక పోయింది.

ఆవిధంగా ఆరు మాఋులు కూర్చిన అగ్ని దేవుని వీర్యము నుండి సూర్య తేజంతో, ఆరు ముఖములు, పన్నెండు చేతులతో కుమారస్వామి జన్మించాడు.

శుక్లపక్షమున పాడ్యమి యందు వీర్య సేకరణ, విదియ నాడు గర్భము ధరించడం, తదియనాడు దేహం ఏర్పడటం, చవితినాడు అన్ని అవయవములు ఏర్పడటం, పంచమినాడు పూర్తి ఆకారంతో లేచి నిలబడటం, త్రిపురములను దహించినట్టి శివుని విల్లును ధరించడం, జరిగింది.

కుమారస్వామి ఆ విల్లును ఎక్కుపెట్టాడు ఆ ధ్వనికి ఐరావతము, సుప్రతీకము అనే ఏనుగులు కుమారస్వామి మీదికి లంఘించాయి. వాటిని కుమారస్వామి తన చేతులతో అణచి పెట్టాడు. ఒక చేత్తో తనకు సహజంగా వచ్చిన ఆయుధం శక్తిని పట్టుకున్నాడు. ఒక చేత్తో వినోదంగా ఒక కోడిని పట్టుకున్నాడు. శంఖం పూరించాడు. బొటన వేలిని నోటిలో పెట్టుకొని చప్పరించాడు. రెండు చేతులతో ఆకాశాన్ని చరిచాడు. ఒక బాణంతో క్రౌంచపర్వతాన్ని భేధించాడు. తన శక్తి ఆయుధాన్ని ప్రయోగించి శ్వేత పర్వతాన్ని ఛేధించాడు.

తన ఆరు ముఖములతో సింహనాదం చేసాడు. ఆ సింహనాదానికి పర్వతాలు చలించాయి. సముద్రాలు పొంగాయి. భూమి కంపించింది. ఆ ఉత్పాతాలకు భయపడి ఋషులు శాంతి హోమాలు చేసారు.

అప్పుడు చైత్రరధము అనే అడవిలో ఉన్న జనం అంతా " ఇది అంతా సప్త ఋషులభార్యలకు అగ్ని దేవుని వలన జన్మించిన బాలుని వలన జరుగుతూ ఉంది" అని ఆక్రోశించారు.

ఈ అపనింద భరించలేక ఋషులు తమ భార్యలను వదలి వేసారు. కాని కొంత మంది మాత్రం "ఇందులో వారి తప్పులేదు. అగ్ని దేవుని భార్య స్వాహాదేవి వారి రూపాలలో అగ్ని దేవునితో సంగమించింది" అని చెప్పుకున్నారు.

వెంటనే అగ్నిదేవుని భార్య స్వాహాదేవి ఋషుల దగ్గరకు వెళ్లి నిజం చెప్పింది.

"అయ్యా ఈ బాలుడు నాకూ నా భర్త కు జన్మించాడు. నీ భార్యలకు ఎలాంటి సంబంధం లేదు. వారిని విడిచిపెట్టడం న్యాయం కాదు" అని చెప్పింది. కాని ఋషులు ఇది నమ్మలేదు.

తరువాత విశ్వామిత్రుడు అనే ముని ఆ బాలకుని వద్దకు వెళ్లి అతనికి జాతక కర్మలు అన్ని చేసాడు. అప్పుడు దేవతలు దేవేంద్రుని వద్దకు వెళ్లి "దేవేంద్రా! అగ్ని కుమారుడు తేజోవంతుడు. గర్వం కలవాడు. నీ పదవిని ఆక్రమించడానికి నీమీదికి రాగలడు జాగ్రత్త

వెంటనే అతనిని సంహరించడం మంచిది. అలా ఐతేనే నీకు ఇంద్ర పదవి శాశ్వతంగా ఉంటుంది." అని చెప్పారు.

వెంటనే దేవేంద్రుడు సప్త మాతృకలను పిలిచాడు. "మీరు అగ్ని కుమారుడిని చంపండి." అని ఆజ్ఞాపించాడు.

వారు అలాగే అని ఆ బాలుడి వద్దకు వెళ్లారు. ఆ బాలుడి తేజానికి ఆశ్చర్య పోయారు. భయపడ్డారు. అతని శరణు వేడారు. "మేము లోక మాతలము. నీకు తల్లులము." అని చెప్పారు. కుమారస్వామి వారిని మన్నించాడు. సప్తమాతృకలు బాలుని సంరక్షణము కొరకు ఒక దాదిని సృష్టించారు. ఆమె పేరు లోహితాస్య.

అగ్ని దేవుడు కూడా తన కుమారుని వద్దకు వచ్చి అతని సంరక్షణభారం వహించాడు. ఇది అంతా విని దేవేంద్రుడు కోపించాడు. తన సేనలతో కుమారస్వామి మీదికి యుద్దానికి బయలు దేరాడు. కాని కుమారస్వామి ముఖముల నుండి వెలువడు అగ్ని జ్వాలలకు తట్టుకోలేక దేవతలు కుమారస్వామి శరణు కోరారు.

కాని దేవేంద్రుడు కుమారస్వామి మీదికి వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. అది కుమారస్వామి శరీరంలో కుడి భాగాన్ని తాకింది. అప్పుడు కుమార స్వామి కుడి భాగం నుండి బంగారు రంగులో ఉన్న

ఒక పురుషుడు, మేష ముఖంతో శక్తి ఆయుధంతో జన్మించాడు. అతడి పేరు విశాఖ. అతనితోపాటు ఎంతో మంది బాలురు బాలికలు కూడా పుట్టారు.

ఇది అంతా చూచి దేవేంద్రుడు భయపడి పోయాడు. కుమారస్వామిని శరణు వేడాడు. దేవతలందరూ సింహనాదాలు చేస్తూ కుమారస్వామి చుట్టూ నిలిచారు. అగ్ని హోత్రుని పుత్రుడు, దేదీప్యమానంగా వెలిగి పోతున్న ఆ కుమారస్వామిని చూచి, లక్ష్మీదేవి సాకారయ్యై వచ్చి అతని పక్కన నిలిచింది.

ఆరవ దినం నాడు ఋషులు అందరూ కుమారస్వామిని భక్తితో ఆరాధించారు. "ఓ కుమారా! నీవు పుట్టిన ఆరు దినములకే లోకములు అన్నియు జయించినావు. కాబట్టి నీవు ఇంద్రపదవిని అధిష్టించవలసినది. ఓ షణ్ముఖా! దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ సుపరిపాలన దేవేంద్రుని కర్తవ్యము. దానికి నీవు తగినవాడవు" అని దేవతలు, ఋషులు అందరూ పలికారు.

" ఓ కుమారస్వామీ! నీవు గొప్ప శౌర్య వంతుడివి. కాబట్టి నీవు దేవతలకు నాయకత్వము వహించుము" అని దేవేంద్రుడు కూడా పలికాడు.

“దేవేంద్రా! నాకు  ఈ ఇంద్ర పదవి అక్కరలేదు. ఎందుకనగా, నీ తేజస్సు చూచి దేవతలు నీవే మాకు ప్రభువు అని చెప్పి మరల నీకు ఆ పదవి మీద మోహము కలుగచేసిన, నీకు నా మీద కోపం రావచ్చును. అప్పుడు మన మధ్య శత్రుత్వం ఏర్పడుతుంది. అది మంచిది కాదు. కాబట్టి నీవే ఈ దేవేంద్ర పదవిని తీసకో” అని అన్నాడు.

దానికి దేవేంద్రుడు సంతోషించాడు. “ ఓ కుమారా! నీవు మా దేవతా సేనలకు ఆధిపత్యము వహించవలసినది” అని కోరాడు. దానికి కుమారస్వామి సమ్మతించాడు.

వెంటనే దేవతలు, మహర్షులు అందరూ కలసి జయ జయ ధ్వానముల మధ్య, కుమారస్వామిని అఖిల  దేవ సైన్యాధిపతిగా అభిషేకించారు.  అప్పుడు మహా శివుడు సిద్ధ గణాలతో సహా అక్కడకు వచ్చాడు.  కుమారస్వామిని కౌగలించుకొని అతనికి విశ్వకర్మ చేత కూర్చబడిన బంగారు పుష్పమాలికను ఇచ్చాడు.

ఇక్కడ ధర్మరాజుకు ఒక సందేహం వచ్చింది. “మార్కండేయ మహర్షి! కుమారస్వామిని రుద్రాంశ లో పుట్టిన వాడు అని చెప్పుదురు కదా! అది ఎలా జరిగినది?” అని అడిగాడు.  దానికి మార్కండేయుడు ఈవిధంగా చెప్ప సాగాడు. “”

“ధర్మజా! పూర్వము మహా శివుడు తన వీర్యాన్ని అగ్నియందు నిక్షేపించాడు. ఆ వీర్యము వలననే అగ్నిహోత్రుడు కుమారస్వామిని పుట్టించాడు. అదియును కాక అగ్నికి రుద్రుడు అని పేరుకూడా ఉన్నది. అందు చేత కుమారస్వామి అగ్నిపుత్రుడు, శివ పుత్రుడు అని చెప్పెదరు.

అగ్నిదేవుని భార్య స్వాహాదేవి కృత్తికలు అనే పేరు కల ఆరుగురు ముని పత్నుల రూపములు ధరించి తన భర్తతో చేరి శ్వేత పర్వతమున అగ్ని రేతస్సును ఉంచినందు వలన పుట్టిన వాడు కావున కుమారస్వామికి కార్తికేయుడు అనే పేరుకూడా వచ్చినది.

ఈసమయమున దేవేంద్రుడు, బ్రహ్మదేవుని ఆజ్ఞ మేరకు తన వద్ద పెంచు కుంటున్న దేవసేన అను కన్యను, అక్కడికి పిలిపించాడు.

“ కుమారా! ఈ కన్యను బ్రహ్మదేవుడు నీ కోసమే సృష్టించాడు. కావున నీవు ఈ కన్యను వివాహమాడుము” అని పలికాడు. దానికి కుమారస్వామి సమ్మతించాడు.

తను పుట్టిన ఆరవ రోజున కుమారస్వామి దేవసేనను వివాహం చేసు కున్నాడు. కాబట్టి నెలలో ఆరవ రోజు అనగా షష్టి లోకముల కెల్ల పర్వదినము గా వెలసినది. (అదే స్కంద షష్టి, సుబ్రహ్మణ్య షష్టి).

లక్ష్మీదేవి కుమారస్వామిని చేరిన రోజు పంచమి. ఆరోజు లక్ష్మికి నిలయమైనది.

ఈ సమయంలో భర్తల చేత విడువ బడిన ఆరుగురు ఋషిపత్నులు అక్కడకు వచ్చారు. "కుమారా! కొంతమంది దుర్జనులు, మేము అగ్నిదేవునితో వ్యభిచరించి నిన్ను కన్నామని అసత్య ప్రచారము చేసినారు. మాకు ఏమీ తెలియదు. కాని మా భర్తలు మమ్ములను విడిచి పెట్టారు. నీవు మాకు పుత్రుడవు. నీవే మమ్ములను కాపాడాలి" అని ప్రార్థించారు.

"అమ్మా! మీరు ఆరుగురు నాకు తల్లులు. నేను మీకు పుత్రుడను. ఇందులో సందేహము లేదు." అని దేవేంద్రుని చూచి "దేవేంద్రా! నా తల్లులకు తగు పదవిని ఇవ్వవలెను" అని చెప్పాడు.

అప్పుడు దేవేంద్రుడు "కుమారా! దక్షప్రజాపతి కుమార్తెలు చంద్రుని వివాహమాడారు. వారు చంద్రుని చుట్టూ తారలుగా విరాజిల్లుతున్నారు. అందులో రోహిణి నక్షత్రం పక్కనే ఉన్న అభిజిత్తు అనే తార తాను మిగిలిన తారల కన్నను చంద్రునికి ఎక్కువ ప్రియమైనది అగుటకు గాను తపస్సు చేయుటకు వెళ్లినది. ప్రస్తుతము ఆ స్థానము లో ఈ ఆరుగురు కృత్తికలను ఉంచ వచ్చును " అని చెప్పాడు. ఆ

ప్రకారము ఆ ఆరుగురు కత్తికలు రోహిణి పక్కన ఒక నక్షత్ర కూటమిగా ఏర్పడి విరాజిల్లుతున్నారు. (కృత్తికా నక్షత్రము).

ఇంతలో స్వాహాదేవి కూడా అక్కడకు వచ్చి "కుమారా! నీవు నా కుమారుడవు. నేనుకూడా ఎల్లప్పుడూ నీ వద్దనే ఉండవలెనని కోరికగా ఉన్నది" అని పలికినది.

" అమ్మా! అలాగే నువ్వు ఎల్లప్పుడూ నా చెంత ఉండి. నేనూ, నీ కోడలు చేయు సపర్యలు అందుకొంటూ సంతోషంగా ఉండమ్మా " అని అన్నాడు.

ఇంతలో సప్త మాతృక లైన హవిష, కాళి, కౌశిక, ఉద్ధత, శారిక, ఆర్య, వైధాత్రి కూడా అక్కడకు వచ్చారు.(వీరు మొదట దేవేంద్రుని చేత కుమారస్వామిని చంపడానికి పంపబడ్డారు).

"ఓ షణ్ముఖా! మమ్ములను మూడు లోకములకు మాతలుగా నియమింపుము. ఇప్పటి వరకు ఉన్న మాతలను ఆపదవినుండి తొలగింపుము" అని ప్రార్థించారు.

దానికి కుమారస్వామీ "అదేమిటమ్మా! వారిని తొలగించడం ఎందుకు. మీరు వేరు వరం కోరుకోండి." అని అన్నాడు. దానికి వారు

“మేము ఈ లోకాలలో ఉన్న పసిబిడ్డలకు ఎల్లప్పుడూ బాధలు పీడలు కలిగించే వరం ప్రసాదించు” అని అడిగారు.

“అయ్యో అదేమిటి! అలాంటి వరం కోరారు. ఇది న్యాయం కాదు. కాబట్టి మీకు అలాంటి వరమే ఇస్తున్నాను. మీకు మ్రొక్కిన, మిమ్ములను కొలిచిన, మిమ్ములను వేడినా, మీరు ఆ పసిబిడ్డలకు ఎలాంటి హాని చేయకుండా వారిని కాపాడుదురు కాక. మీరు నరులను పదియారేళ్ల ప్రాయం వచ్చుదాకా బాధించండి. మీకు నా అంశతో జన్మించిన వాడు రక్షగా ఉంటాడు” అని ఒక మగవాడిని పుట్టించాడు.

ఇంకనూ, శకుని మాత వినత, దైత్య మాత దితి, గోమాత సురభి, శునక మాత సరమ, వృక్షమాత కరంజ, సర్పమాత కద్రువ, కుమారుని మాత లోహితాస్య ఈ మాతృకలతో కలిసి గర్భస్థ శిశువులకు, పుట్టిన శిశువులకు బాధలు కలుగ చేస్తూ ఉంటారు.

అదియును కాక దేవగ్రహములు, పితృగ్రహములు, గాంధర్వ గ్రహములు, యక్ష గ్రహములు నరులకు బాధలు కలుగ చేస్తూ ఉంటాయి.

కాని ధర్మరాజా! ఈ గ్రహ బాధలు అన్నియు ఇంద్రియములను జయించిన వారికి, ఎల్లప్పుడూ శుభ్రతను పాటించేవారికి, శాంతి కాముకులకు, శివభక్తులకు, ఎలాంటి బాధలను కలిగించలేవు.

ధర్మరాజా! ఆ ప్రకారంగా కుమారస్వామి గ్రహ బాధల గురించి వివరిస్తు న్నప్పుడు, అగ్ని దేవుని భార్య అక్కడ కు వచ్చింది.

"కుమారా! నేను దక్షప్రజాపతి కూతురిని. నా తండ్రి నన్ను చిన్నతనముననే అగ్నిదేవునికి ఇచ్చి వివాహము చేసాడు. కాని నా భర్తకు నా మీద అనురాగంలేదు. నా భర్తకు నా మీద అనురాగం కలిగేట్టు చెయ్యి" అని కోరింది.

"అమ్మా! బ్రాహ్మణులు అగ్నిలో హవ్యములు వేసే టప్పుడు, స్వాహా కార మంత్రంతో వేస్తారు. దానిని బట్టి నీకు నీ భర్తతో నిరంతర సాన్నిహిత్యము సిద్ధిస్తుంది." అని కుమారస్వామి చెప్పాడు.

ఇంతలో బ్రహ్మదేవుడు కూడా అక్కడకు వచ్చాడు. అక్కడే ఉన్న శివుని చూచి బ్రహ్మదేవుడు " కుమారా! ~~ఈ~~యన మహా శివుడు. త్రినేత్రుడు, త్రిపురాంతకుడు. ~~ఈ~~మె ఆయన భార్య, పర్వత రాజ పుత్రి పార్వతి. వీరే నీ తల్లి తండ్రులు. ~~ఈ~~ పార్వతీ పరమేశ్వరులు అగ్ని యందు, ఆయన భార్య యందు తమ యోగ బలాన్ని ప్రవేశ పెట్టి నిన్ను కన్నారు. వీరిని భక్తితో ఆరాధించు" అని చెప్పాడు.

అప్పుడు కుమారస్వామి, పార్వతీ పరమేశ్వరులకు భక్తితో నమస్కరించాడు. తరువాత ఈశ్వరుడు కుమారస్వామి సమేతుడై భద్రవటం చేరుకున్నాడు. వారి వెంట కుబేరుడు, దేవేంద్రుడు, అమోఘుడు అనే యక్ష నాయకుడు, వసువులు, రుద్రులు, ఆదిత్యులు, యముడు, వరుణుడు, చంద్రుడు, వాయుదేవుడు, అగ్నిదేవుడు, వెంట నడిచారు.

ధర్మరాజా! ఆ సమయంలో మహిషాసురుడు రాక్షస సేనలతో దండెత్తి వచ్చాడు. క్ష ణాలలో దేవతల సైన్యాన్ని నాశనం చేసాడు. ఇది చూచి దేవతలు యుద్ధం చేయడానికి భయపడి పారిపోయారు. కాని దేవేంద్రుడు దేవతా సైన్యాని కి ధైర్యం చెప్పి మరల యుద్ధోన్ముఖులను చేసాడు. రాక్షసులకు దేవతలకు ఘోరంగా యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో శివుడు కూడా పాల్గొన్నాడు.

ఒక సమయంలో మహిషాసురుడు శివుని రథాన్ని పట్టుకొన్నాడు. రాక్షసులందరూ శివుడు మహిషాసురుని చేతిలో మరణిస్తాడు అని అనుకున్నారు. అప్పుడు శివుడు కుమారస్వామిని చూచి " కుమారా! చూచితివా వీడి సాహసము. నా రథాన్ని పట్టుకున్నాడు. వీడికి ఆయువు మూడినది. వీడిని వెంటనే సంహరించు" అని అన్నాడు.

కుమార స్వామి తన చేతిలో ఉన్న శక్తి ఆయుధాన్ని మహిషారుని మీద ప్రయోగించాడు. ఆ శక్తి మహిషాసురుని దహించింది. మిగిలిన రాక్షసులను సమూలంగా నాశనం చేసింది. దేవతలు అందరూ కుమారస్వామిని స్తుతించారు.

అప్పుడు శివుడు దేవేంద్రుని, దేవతలను చూచి "చూచితిరా కుమారుని పరాక్రమము. ఇంక మీదట మీరు నన్ను ఏ విధమైన పూజ్యభావంతో చూస్తారో అదే పూజ్యభావంతో కుమారస్వామిని కూడా పూజించండి" అని చెప్పి భద్రవటానికి వెళ్లాడు.

ఆ విధంగా షణ్ముఖుడు దేవతలకు శత్రువులైన రాక్షసులను అందరిని ఒక్క రోజులో జయించాడు.

ఈ కథను మనుజులు చదివినా, వినినా, సమస్త కష్టాలు తొలగి సుఖ సంతోషాలను పొందుతారు" అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు కుమారస్వామి జననము మొదలు దానవ సంహారము వరకు వివరించాడు.

ఈ రీతిగా ధర్మరాజు మార్కండేయ మహర్షి వలన ఎన్నో గాధలను విన్నాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడి భార్య అయిన సత్యభామ పాండవ పత్ని అయిన ద్రౌపది ఇష్టాగోష్టి సలుపుచున్నారు. అప్పుడు సత్యభామ

ద్రౌపదితో ఇలాపలికింది. "ఓ ద్రౌపదీ! నీకు ఐదుగురు భర్తలు. వారు నీయందు అనురాగం కలిగి ఉన్నారు. వారందరి మీద నీవు కూడా పతిభక్తి కలిగి ఉన్నావు. ఇది ఒక అద్భుతమైన వింత. ఇది ఎలా సాధ్యమయింది. ఐదుగురు భర్తలను సమానంగా ఆదరించి పూజించే మహిమ నీకు ఎలా చేకూరింది. ఇది ఏమన్నా మంత్ర ఔషధ ప్రభావమా! లేక నీకు వస్త్రముల అలంకరణలో ఉన్న నైపుణ్యమా! లేక నీవు చతుర సంభాషణ ములలో నేర్పరివా! ఎరింగింపుము. ఎందు వలన ననగా ఆ నేర్పరితనము చేతనే నేను కూడా నా భర్త ఐన శ్రీకృష్ణుని నా వశం చేసుకుంటాను" అని అడిగింది.

దానికి ద్రౌపదికి కించిత్ కోపం వచ్చింది. "సత్యా! నీవు నన్ను ఒక దుష్ట వనితగా జమకట్టి ఇటుల మాట్లాడవచ్చునా! నీవు ఆ పురుషోత్మతమునకు భార్యగా తగవు అని నా భావన. మంత్ర తంత్ర ఔషధములతో భర్తలను వశము చేసుకొనాలి అని అనుకోడం నీ తెలివి తక్కువ. అలాంటి పనులు చేస్తే భర్తకు భార్యమీద అంతకు ముందు ఉన్న ప్రేమకూడా నశిస్తుంది. అట్టి భార్యతో సంసారం పాముతో సహవాసం లాగా భావిస్తాడు. పైగా అలాంటి మందులు మాకులు పెడితే భర్తకు రోగం వస్తుంది. భార్యకు అపకీర్తి వస్తుంది. ఆఖరుకు నరకం ప్రాప్తిస్తుంది. కాబట్టి భార్యలు భర్తల పట్ల ఇలాంటి కపట భావనలతో మోసం చెయ్యరాదు.

భర్తకు అనుకూలవతిగా చరించడమే భార్యకు ఉత్తమ ధర్మము. నేను పాండవుల పట్ల నేను ఏవిధంగా ప్రవర్తిస్తానో వివరించెదను సావధానత్తవై వినుము.

నా భర్తలు పరస్త్రీలతో చరించను నేను అసూయ చెందను. నేను ఎప్పుడూ అహంకారంలో మాట్లాడను. భర్తల ఎడ పూజ్యభావనలో ఉంటాను. నా భర్తలు తప్ప మిగిలిన వారు దేవతలైనా, యక్ష, కిన్నరులైనా వారిని తృణప్రాయంగా చూస్తాను. స్నానము భోజనము, శయనము మొదలైన విషయములలో ముందు నా భర్తలకు సపర్యలు చేసి పిదప నేను వాటిని అనుభవిస్తాను. నా భర్తల మనసు కనిపెట్టి వారికి అవసరమైనవి అప్పటికప్పుడు సమకూరుస్తాను. ఏదీ వ్యర్థము చెయ్యను. అనవసరమైన వ్యయము చెయ్యను. ఇల్లు వాకిలి, పాత్రలు శుభ్రంగా ఉంచుతాను. నా భర్తల యొక్క బంధు మిత్రులయెడ అనుకూలంగా ఉంటాను. ఎక్కువసేపు వాకిట నిల బడటం, ఎక్కువగా నవ్వడం, చెడ్డవారితో స్నేహం చెయ్యడం, లాంటి వాటి జోలికి పోను. భర్తలు ఇంట లేనపుడు నేను పువ్వులు పెట్టుకొనను. అలంకరించను. నా భర్తలయందే మనసు నిల్పి వారి రాక కోసం నిరీక్షిస్తుంటాను. పాండవులు ఎంతలి సున్నిత మనస్కులో అంతటి కోపిష్టులు. అందుకని వారికి ఎప్పుడూ భయంతో సేవలు చేస్తుంటాను.

అదియును కాక, మా అత్తగారు, కుంతీ దేవికి స్నానపానాదులు నేనే స్వయంగా సమకూరుస్తాను.  నాభర్త ధర్మరాజు ప్రతిరోజూ తనతో పాటు పదివేలమంది బ్రాహ్మణులకు, పదివేల మంది యతీశ్వరులకు అన్న సంతర్పణ చేస్తారు. వారికి  అన్ని ఏర్పాట్లు నేను స్వయంగా చూస్తాను. వారికి సంతోషం కలిగిస్తాను.

ఇంకనూ అంతఃపురంలో వేలకొద్ది సేవకులు పనిచేస్తుంటారు. వారి బాగోగులే నేను స్వయంగా చూస్తుంటాను. వారు తమ తమ విధులను సక్రమంగా క్రమశిక్షణలో నిర్వర్తించేలా చూస్తుంటాను.  ఇంక భాండాగారములో ఉన్న రత్నములు, మణులు మొదలగు విలువైన ఆభరణములు, ధనము లెక్కలు నాకు తెలియును. పనివారికి ఇవ్వవలసిన జీతభత్యములు నేను ఇచ్చెదను. అందువలన పాండవులు సంసార భారము నంతయు  నా మీద మోపి నిశ్చింతగా  ఉండెదరు. నాకు రాత్రిళ్లు ఒక జాము మాత్రం నిద్రపోవడానికి సమయం లభిస్తుంది. సరిగా భోజనము చెయ్యడానికి కూడా తీరిక ఉండదు.

పైన చెప్పిన చర్యల వలన నేను నా భర్తల యొక్క అనురాగమును, ఆదరణను పొందుతున్నాను అంతేగాని మందులు కాదు మాకులు కాదు. ఇంద్రజాలము అసలేకాదు.” అని ద్రౌపది చెప్పింది.

దానికి సత్యభామ సిగ్గుపడి "ద్రౌపదీ! నాకు నీ సంగతి తెలియక ఏదో మాట్లాడాను. వాటిని ఏదో పరిహాసం గా పరిగణింపుము. నన్ను మన్నింపుము" అని పలికింది.

"అయ్యో దానిదేముంది. అది నేను నవ్వులాటగానే తీసుకున్నాను" అని ఇంకా ద్రౌపది ఇలా పలికింది.

"సత్యభామా! భర్తయొక్క మనసును చూరగొనే ధర్మ మైన ఉపాయం చెపుతాను వినుము. పతిని మించిన దైవం భార్యకు లేదు. భర్త దయవలననే భార్యకు సమస్త ఆభరణములు, ధన, ,దాన్యములు సమకూరుతాయి. మంచి సంతానము, కీర్తిప్రతిష్ఠలు కలుగుతాయి. కాబట్టి భర్తవలన కాక భార్యకు వేరువిధంగా పైచెప్పినవి కలుగవు.

మనం పుణ్యం చేసుకోవాలంటే, చాలా శ్రమపడాలి కాని భర్తకు సపరిచర్యలు చేస్తే పుణ్యం సులభంగా లభిస్తుంది. కాబట్టి నీ భర్తకు ప్రతిరోజూ ప్రేమతో, ఆరాధనలో సేవలు చేయుము. నీ ఎడల నీ భర్త అనురాగంతో ప్రవర్తిస్తాడు. నీ భర్త ఇంటిరాగానే గుమ్మం దగ్గరే ఎదురేగి స్వాగతం పలుకుము. నీ భర్తకు సపరిచర్యలు చెయ్యడానికి సేవకులు ఉన్నారని ఉపేక్షించకుము. నీవే స్వయంగా సపరిచర్యలు చేయుము. నీ భర్త ప్రసంగ వశాత్తు నీకు ఏదన్నా రహస్యము చెప్పినా దానిని బట్టబయలు చేయకుము. అది నీ సవతులకు తెలిసిన నీ మీద నిందలు

మోపగలరు. దాని వలన నీ భర్తకు నీమీద ప్రేమాభిమానాలు సన్నగిల్లుతాయి.

నీ భర్తయొక్క బంధుమిత్రులను ఆదరంతో గౌరవించి వారికి సపరిచర్యలు చేయుము. వారికి అపకారము చేయువారు నీకు మిత్రులైననూ వారిని ఆదరింపకుము.

ఇంకొక విషయము. ఆడువారి నడవడి కడు జాగరూకతతో ఉండవలెను. ప్రద్యుమ్నాదులు నీ పుత్రులు. కాని వారితో కూడా ఏకాంతముగా ఒకే శయ్యపైన కూర్చొనకుము. నీవు కులస్త్రీలతో మాత్రమే స్నేహయు చేయుము. అహంభావులతోనూ, ఎక్కువ విలాస జీవితము గడుపు వారితోనూ స్నేహయు చేయకుము. ఇవియే నీకు పరమ సౌభాగ్యమును చేకూర్చును." అని ద్రౌపది సత్యభామతో చెప్పెను.

ద్రౌపదీ! నీ భర్తలు దైవసమానులు. నీవు ధర్మం తెలిసిన దానవు. మీ రాజ్యము మీకు సంక్రమిస్తుంది. దుర్యోధనాదులు కష్టాలు అనుభవిస్తారు. నీ కుమారులు పరాక్రమ వంతులు. నీవు వీరమాతవు. నీవు మనసులో కలత చెందకుము. నీకుమారులు ద్వారకలో క్షేమంగా ఉన్నారు. వారిని రుక్మిణి సుభద్ర ఎంతో ప్రీతితో తమ కొడుకులకంటే ఎక్కువగా చూస్తున్నారు." అని పలికింది.

తరువాత శ్రీ కృష్ణుడు ధర్మరాజు వద్ద, మార్కండేయుని వద్ద సెలవు తీసుకొని ద్వారకా నగరానికి పయనమయ్యాడు. మార్కండేయ మహర్షి కూడా ధర్మరాజుకు అనునయ వాక్యాలు పలికి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. తరువాత పాండవులు కామ్యకవనమును విడిచి పెట్టి ద్వైతవనానికి చేరుకున్నారు.

హస్తినాపుర వాసి ఐన ఒక బ్రాహ్మణుడు ద్వైతవనములో ఉన్న పాండవులను దర్శించి తిరిగి హస్తినాపురం చేరుకున్నాడు. ధృతరాష్ట్రుడు ఆ బ్రాహ్మణుని పిలిచి పాండవుల యోగక్షేమములు విచారించాడు. ఆ బ్రాహ్మణుడు ధృతరాష్ట్రునితో పాండవులు ద్రౌపది అడవులలో పడుచున్న కష్టములు అన్ని వివరించాడు. ఆ విషయములు విన్న ధృతరాష్ట్రుడు ఎంతో దుఃఖించాడు.

"అయ్యో నా కుమారుని దుర్నీతి వలన కదా పాండవులకు ఇంత కష్టము దాపురించినది. దీనికంతకు నేనే కారకుడను. నేను ధర్మరాజును నా పెద్ద కొడుకుగా భావిస్తాను అతనికి ఆ బ్రహ్మ దేవుడు ఇన్ని కష్టాలు రాసి పెట్టాడుకదా. అందమైన సౌధములలో హంసతూలికా తల్పముల యందు పవళించవలసిన ధర్మరాజు కటిక నేలమీద నిద్రిస్తున్నాడు కదా. అనిల నందనుడు ఐన భీముడు అడవిసింహము వలే అడవులలో అలసిపోయి విహరిస్తున్నాడు కదా. తన అన్న దమ్ములు భార్య అడవులలో ఎన్నో కష్టములు పడుతుండగా అర్జునుడు లోలోపల ఎంతగా

రగిలిపోతున్నాడో కదా! సుకుమారులైన కవలలు అడవులలో ఎన్ని కష్టములు పడుతున్నారో కదా! వాయు పుత్రుడు భీముడు అమిత బలవంతుడు కేవలం అన్నగారి మాటలకు లోబడి అరణ్యవాసము అనుభవిస్తున్నాడు కాని లేని ఎడల అతని కోపం ఆపడం ఎవరి తరము? శకుని చేసిన మోసము, దుశ్శాశనుని దుశ్చర్యలు, కర్ణుని తులువతనము, దుర్యోధనుని దుర్నీతి భీముని మనస్సులో ముళ్లవలె గుచ్చుకొనుచున్నవి కదా! అలాంటి భీముని చేతిలో నా కుమారులకు మృత్యువు తప్పదేమో! కానిమ్ము. చేసిన కర్మములకు ఫలితం అనుభవించక తప్పదు. విచారించి ప్రయోజనము లేదు కదా. ఏమి చేయుదును. నేను ఎంతగా వారించినప్పటికిని దుర్యోధనుడు జూదానికి పాల్పడ్డాడు. ఇదంతా నా అహంకారము వలననే జరిగినది. సుఖదుఃఖాలు ఒకటి వెంట ఒకటి వచ్చును అంటారు కదా. సమస్త సంపదలను కోల్పోయి అడవుల పాలైన అర్జునుడు, శివుని మెప్పించి పాశుపతాన్ని పొందాడు. సశరీరంగా స్వర్గమునకు పోయి, దేవేంద్రుని మెప్పించి అతని అర్ధసింహాసనాన్ని అధిష్టించాడు. అది ఏ జన్మలోనో అర్జునుడు చేసిన పుణ్య కర్మఫలమో కదా! " అని ధృతరాష్ట్రుడు పరి పరి విధముల వాపోతున్నాడు.

ఆసమయములో దుర్యోధనుడు శకునిని చూచి "మామా! ఏమిటిది! నా తండ్రిగారు ~~ఈ~~ప్రకారము భీతుడగుచున్నాడు. దీని గురించి విచారింపవలెను". అని కర్ణుని పిలిపించి ఒక ఏకాంత ప్రదేశమునకు పోయి కార్యాలోచనము చేస్తున్నాడు.

అప్పుడు కర్ణుడు దుర్యోధనుని చూచి "సుయోధనా! పాండవులు అడవుల పాలైనారు. పాండవుల సంపదలన్నియు నీకు వశమైనవి. ఈ భూమండలములోని రాజులందరూ నీ ఆధిపత్యాన్ని అంగీకరించి నీకు కప్పము చెల్లిస్తున్నారు. నీవే సార్వభౌముడవు. నీ పరిపాలన సర్వజనామోదమైనది. పాండవులు ద్వైతవనములో అష్టకష్టములు పడుచున్నారు. ఇప్పుడు నీవు సపరివారముతో ద్వైతవనమునకు పోయి వారి ముందు నీ భోగభాగ్యములను ప్రదర్శించి వారి మనస్సుకు ఖేదము కలిగింపవలెను. మనము కూడా పాండవులు గడుపుచున్న దైన్యజీవితమును చూచి సంతోషింపవచ్చును. మన జీవితములు సార్ధకము చేసుకొనవచ్చును. నీ భార్యల సౌభాగ్యములు చూచి ద్రౌపది దుఃఖించవలెను." అని కర్ణుడు పలికాడు.

దానికి సుయోధనుడు మిత్రమా "కర్ణా! నా అభిప్రాయము కూడా అదే! కాని మనము ద్వైతవనానికి పోవడానికి ధృతరాష్ట్రుడు అంగీకరించునా అని సందేహము. ఇటీవల ధృతరాష్ట్రునకు పాండవులు అంటే ఎందుకో అంతులేని భయం ఏర్పడింది. ఎప్పుడూ వారి శౌర్యపరాక్రమములను తల్చుకుంటున్నాడు. విదురుడు కూడా ధృ తరాష్ట్రుని వద్ద నుండి పాండవులను ప్రశంసిస్తూ, పాండవ పక్షపాతమును చూపిస్తున్నాడు. కాబట్టి ధృతరాష్ట్రుడు మన ఆలోచనకు అంగీకరించునా అని నా అనుమానము. నీవు శకుని కలిసి ఆలోచించండి. " అని దుర్యోధనుడు తన అంతఃపురానికి వెళ్లాడు.

మరునాడు కర్ణుడు సుయోధనుని వద్దకు వచ్చాడు. "సుయోధనా! నాకు ఒక ఉపాయము తట్టినది. ద్వైతవనములో మనకు ఆవుల మందలు ఉన్నవికదా. వాటిని చూచు నెపంబున మనము ద్వైతవనమునకు పోవుటకు ధృతరాష్ట్రుని అనుమతి తీసుకొనెదము." అని అన్నాడు. "ఆహా కర్ణా సరిగ్గా ఇదే ఉపాయము నాకునూ తట్టినది. నేను నీతో ఏకీభవిస్తున్నాను" అని అన్నాడు.

వారు వెంటనే ఒక గొల్లవాడిని పిలిపించి వాడు ధృతరాష్ట్రుని ముందు ఇలా మాట్లాడవలెనో నేర్పారు. తరువాత సుయోధనుడు కర్ణ, శకునులో కలిసి ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లారు. ముందు ఆమాటా ఈమాటా మాట్లాడారు. ఇంతలో ఆ గొల్లవాడు వచ్చాడు.

ఆగొల్లవాడు ధృతరాష్ట్రునితో "మహారాజా! నేను ద్వైతవనమునుండి వచ్చుచున్నాను. అక్కడ మన ఆవులు ఇప్పటివరకు క్షేమముగా ఉన్నవి. కాని ఇటీవల క్రూర మృగములు విజృంభించి మన ఆవులకు హాని చేయుచున్నవి. అందుకని ఆవుల మందలను కాపాడటానికి తమరు తగు చర్యలు తీసుకొనవలెనని నా మనవి" అని సుయోధనాదులు చెప్పిన చిలుకపలుకులు పలికాడు.

*వెంటనే ఒక పక్క కర్ణుడు మరొక పక్క శకుని చేరి "అవును మహారాజా! ఆ గోపాలుడు చెప్పిమాటలు నిజమై అనిపిస్తున్నాయి. ఆ*

క్రూర మృగములను సంహరించుటకు ఆవులను రక్షించుటకు తమరి కుమారుడైన సుయోధనుని పంపండి" అని నమ్మబలికారు.

" క్రూరమృగములను సంహరించి గోరక్షణ చేయుట మంచిదే కాని అక్కడ మన పాండవులు ఉన్నారు. అక్కడి మీరు వెళ్లడం నా మనస్సుకు నచ్చడం లేదు. మీరు అక్కడకు వెళితే వారిని అవమానిస్తారు. పాండవులు ఇప్పటికే మీ చేత అవమానింపబడి ఉన్నారు. అందులోనూ భీముడు మీమీద అమితమైన కోపంతో ఉన్నాడు. మిమ్మల్ని చూస్తే ఊరుకోడు. ఇంక అర్జునుడు దేవేంద్రుని వలన అమోఘమైన అస్త్రసంపద పొంది ఉన్నాడు. అతనిని ఎదుర్కొనడం మీకు సాధ్యం కాదు. మీరు వారికి కీడు చేయడం వారే మీకు హానితలపెట్టడం అవివేకమైన పని. కాబట్టి ఆవుల మందలను కాపాడటానికి యోగ్యులైన వారిని వేరే వారిని పంపండి.మీరు వెళ్లవద్దు" అని ధృరాష్ట్రుడు పలికాడు.

ఆ మాటలకు శకుని ఈవిధంగా బదులు పలికాడు."మహారాజా! పాండవులు అమితమైన శౌర్యము కలవారు. వారికి మేము ఎందుకు హాని తలపెడతాము. ఒక వేళ మేము అటుల చేసిన, ధర్మరాజు తాను చేసిన సత్యము తప్పడు. అతని తమ్ములు ఆయన ఆజ్ఞ జవదాటరు. మాలో కూడా వేటాడవలెనని కోరిక కలుగుతూ ఉంది. మేము ఆవులను మాత్రం రక్షిస్తాము. దానివలన పాండవులకు కీడు ఎందుకు కలుగుతుంది" అని నచ్చచెప్పాడు.

చివరకు ధృతరాష్ట్రుడు అనుమతించాడు. వెంటనే సుయోధనుడు ఘోషయాత్రను ప్రకటించాడు. తన వెంట కర్ణుడు, శకుని, తమ్ములు, బంధువులు రాగా వాహనములతో పరివారముతో ద్వైత వనానికి బయలు దేరాడు సుయోధనుడు. ఒక చోట శిబిరాలను ఏర్పాటుచేసుకున్నారు. సుయోధనుడు అక్కడ ఉన్న ఆవులను చూచాడు. అక్కడ ఉన్న గొల్లవారిని అడిగి వాటి వివరాలను తెలుసుకున్నాడు. అడవికి పోయి వేటాడాడు. ఎన్నోమృగములను చంపాడు.

ఆ సమయంలో ధర్మరాజు సద్యస్కందము అనే యాగాన్ని అక్కడ ఉన్న ఋషుల సహాయంతో చేస్తున్నాడు. సుయోధనుడు ఆ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ తన విభవానికి తగ్గట్టు క్రీడాగృహాలు నిర్మించమని ఆజ్ఞాపించాడు. ఆసయమంలో అక్కడ కాపాలాగా ఉన్న గంధర్వులు వారిని అడ్డగించారు. "ఇది చిత్ర సేనుడు అనే గంధర్వరాజు చెందిన కొలను. ఇక్కడ మీరు రాకూడదు వెనక్కు వెళ్లండి" అని చెప్పారు.

"ఇక్కడకు మహా బలవంతుడైన సుయోధన సార్వభౌములు వనవిహారానికి వచ్చారు. అందుకనీ మీరే ఇక్కడ ఉండరాదు వెళ్లండి" అని కౌరవ భటులు చెప్పారు. గంధర్వులకు కోపం వచ్చింది. "ఓ భటులారా మీ రాజుకు తనబలము ఎదిరి బలము అస్సలు తెలియదు.

గంధర్వరాజుతో ఇలాంటి దుశ్చర్యలు చేయవలదని చెప్పండి” అని హేళనగా పలికారు.

కౌరవ భటులు ఆవిషయాన్ని సుయోధనునికి నివేదించారు సుయోధనునికి కోపం వచ్చింది. తన తమ్ములను, భటులను పిలిచి “మీరు తక్షణమే వెళ్లి ఆ గంధర్వుల గర్వము అణచండి. దేవేంద్రుడు దేవతలు సాయం వచ్చినా వారిని కూడా జయించండి” అని ఆజ్ఞాపించాడు. అప్పుడు కౌరవులు తమ బలాలతో గంధర్వుల మీదికి దండయాత్ర వెడలారు.

వారిని చూచి కొంతమంది గంధర్వులు “అయ్యా మీరు ఏల ఇక్కడకు వస్తున్నారు. మీకు మాకు ద్వేషం ఏముంది. ఆగండి” అని సానుకూలంగా చెప్పారు. కాని కౌరవ సేన వారిని లెక్క చేయలేదు. వారిమీద ఆయుధాలు ప్రయోగించారు. అప్పుడు గంధర్వులు వెంటనే వెళ్లి వారి రాజైన చిత్రసేనునికి జరిగినది అంతా వివరించారు.

గంధర్వరాజు చిత్రసేనునికి కోపం వ చ్చింది. “వెంటనే వెళ్లి కౌరవ సేనను చీల్చి చెండాడండి” అని తన సేనలకు ఆజ్ఞ ఇచ్చాడు. గంధర్వులు కౌరవ సేనతో తలపడ్డారు. గంధర్వుల ధాటికి కౌరవులు కౌరవ సేన నిలువలేక పోయింది. దుశ్శాసనుడు మొదలగు వారు పారిపోయారు. ఒక్క కర్ణుడు మాత్రం ధైర్యంగా పోరాడుతున్నాడు. ఇదివిని

దుర్యోధనుడు శకుని కూడా యుద్ధరంగానికి వచ్చారు. దుర్యోధనునికి గంధర్వులకు ఘోరయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో గంధర్వులు ఓడి పోయారు. వారు వెంటనే వెళ్లి తమ రాజు చిత్రసేనునికి జరిగిన విషయం చెప్పారు.

స్వయంగా చిత్రసేనుడు యుద్ధరంగానికి వచ్చాడు. అతను మాయాయుద్ధనిపుణుడు. అతని మాయా యుద్ధానికి కౌరవ సేన తట్టుకోలేక పోయింది. గంధర్వుల పరాక్రమానికి నిలువలేక కౌరవులు చిందర వందర అయ్యారు. ఒక్క కర్ణుడు తప్ప మిగిలిన వారు పారిపోయారు. దుర్యోధనుడు కర్ణుడికి సాయంగా నిలిచాడు. సుయోధనుని సోదరులు, శకుని దుర్యోధనునికి సాయంగా ఉన్నారు. గంధర్వులు కర్ణుని రథం విరగ్గొట్టారు. కర్ణుడు పక్కనే ఉన్న వికర్ణుని రథం ఎక్కి యుద్ధభూమి నుండి బయటకు వెళ్లాడు. అప్పుడు చిత్రసేనుడు దుర్యోధనుని రథం కూడా విరగ్గొట్టాడు. దుర్యోధనుని జుట్టుపట్టుకొని నేలమీద పడవేసి అతనిని కట్టి తన రథం మీద పెట్టుకొని పెద్దగా సింహనాదం చేసాడు. అది చూ మిగిలిన గంధర్వులు కౌరవులను, సుయోధనుని భార్యను, కౌరవుల భార్యలను, కౌరవుల కుమారులను, మంత్రులను పట్టి బంధిం త్రసేనుని ముందు ఉంచారు.

అది చూ చి మిగిలిన వారు రోదిస్తూ అక్కడే ఉన్న ధర్మరాజు వద్దకు పోయి కాపాడ మని మొరపెట్టుకొన్నారు. "ఓ ధర్మరాజా! గంధర్వ రాజైన

చిత్ర సేనుడు సుయోధనుని ఓడిం చి కౌరవ కాంతలను బందీలుగా పట్టుకున్నాడు. మీరు వారిని కాపాడాలి" అని పలికారు.

అది చూచి భీమసేనుడు సంతోషంతో "ఆహా మనం చెయ్యాల్సిన పని గంధర్వులు చేసారా. మనకు మహోపకారం చేసారు. ఏ శ్రమా లేకుండా మనకు విజయం లభించింది. పుట్టినప్పటినుండి పాపాలు చేయడానికి అలవాటు పడిన దుర్యోధనునికి ఈనాటికి గంధర్వుల చేత పరాభవం జరిపించిన ఆ బ్రహ్మదేవుడు ఎంతో నేర్పరి కదా! అడవులలో అష్టకష్టములు పడుచున్న మనలను అవమానించడానికి వచ్చిన వానికి తగిన పరాభవం జరిగినది. అందుకని దుర్యోధనుని మీద దయ చూపరాదు" అని అన్నయ్యతో పలికాడు భీమసేనుడు.

("కాగల కార్యం గంధర్వులే తీర్చారు" అనే సామెత మహా భారతంలో ఈ సంఘటన వలననే ఏర్పడింది అని అంటారు).

ఆ మాటలు విని ధర్మరాజు భీమ సేనునితో ఇలా పలికాడు. "భీమసేనా! నీవు ఇలాంటి పరుషపు మాటలు మాట్లాడటం తగునా! శరణు జొచ్చినవారిని చులకన చెయ్యం భావ్యమా! వారిమీద దయచూపాలి కదా! దాయాదుల మధ్య డబ్బు గురించి, ఆస్తి గురించి తగాదాలు సహజం. అంత మాత్రం చేత సహజమైన ప్రేమలు అంతరిస్తాయా చెప్పు. దాయాదులు వారిలో వారు తగాదాలు

పడవచ్చును కాని పరాయి వారి చేతిలో పరాభవం పొందునపుడు ఒకరికి ఒకరం సాయం చేసుకొనని ఎడల లోకులు నిందిచరా! సుయోధనుడు దుర్నీతి కలవాడు. అయినను భార్యలతో సహా పరులకు పట్టుబడినాడు. ఇప్పుడు మనము ఉపేక్షించిన మనకు కులహాని అవుతుంది. అదియునుకాక శరణాగత రక్షణము క్షత్రియులకు పరమ ధర్మము. నీవంటి పరాక్రమ వంతునకు అవశ్యము చేయవలసిన కార్యము. కాబట్టి నీవు నీ తమ్ములు సాయుధులై రథముల మీద వెళ్లి, ఆ గంధర్వరాజు చిత్రసేనుని ఓడించి సుయోధనుని వారి భార్యలను పరివారమును విడిపించండి. " అని ధర్మరాజుచెప్పాడు.

"అన్నయ్యా! దయా దాక్షిణ్యములు లేకుండా నన్ను నీటిలో తోయించాడు. విషం పెట్టి చంపించ పూనుకొన్నాడు. ఇంటిలో పెట్టి తగులపెట్టించాడు. మాయాద్యూతం ఆడించి మన రాజ్యాన్ని సమస్తసంపదలు అపహరించాడు. మన భార్య ద్రౌపదిని నిండుసభలో వలువలు ఊడదీసి అవమానించాడు. అన్నయ్యా! సుయోధనుడు మనకు కీడు చెయ్యని రోజు అసలు ఉందా! వాడు చేసిన దుశ్చర్యలు ఒక్కటి కూడా తలపకుండా అతని పట్ల ఔదార్యము చూపడం తగునా!"అని భీముడు పలికాడు.

దానికి ధర్మరాజు "భీమా! నన్ను కాపాడండి అని ఎవరైనా అడిగితే ఎంతటి దుర్బలుడైనా సాయం చేస్తాడే!. నీవంటి బలవంతుడు

ఊరకుండటం తగునా! శరణు జొచ్చిన శత్రువునైనా కాపాడమని పెద్దలు చెపుతారు. శరణాగత రక్షణ కన్నా వేరే ధర్మం ఉన్నదా! సుయోధనునికి మనయొక్క బలపరాక్రమములు తెలియును. అందుకని మనం వచ్చి తనను తన వారిని రక్షించెదమని ఎంతో ఆశతో ఉండి ఉంటాడు. ఇది మనకు పుణ్యము, కీర్తి కలుగుసమయము. అసలు నేను నిన్ను ఇబ్బంది పెట్టను. నేను వెళ్లి రక్షింపగలను. కాని నేను ప్రస్తుతము యజ్ఞదీక్షలో ఉన్నాను. అందుకని నిన్ను అర్థించుచున్నాను. కాబట్టి మీరు వెంటనే పోయి గంధర్వులకు మంచి మాటలు చెప్పి సుయోధనుని అతని పరివారమును విడిపించండి. గంధర్వులు మంచి మాటలతో వినని ఎడల మీ పరాక్రమముతోనైనా విడిపించండి. నా యజ్ఞాన్ని సఫలం చెయ్యండి." అని కోరాడు. ఎట్టకేలకు భీముడు సమ్మతించాడు.

భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు ఆయుధములు ధరించి గంధర్వ రాజు సైన్యాన్ని సమీపించారు. అప్పుడు అర్జునుడు గంధర్వులతో "ఓ గంధర్వులారా! మీకు మాకు విరోధము లేదు. మీరు స్నేహ పూర్వకముగా మా సుయోధనుని విడిచి పెట్టండి. ఇది ధర్మరాజు మీకు తన ఆజ్ఞ గా చెప్పమన్నాడు. ధర్మరాజు ఆజ్ఞ అనుల్లంఘనీయము అని తెలుసుకోండి" అని పలికాడు.

"అయ్యా! ధర్మరాజు మాకు రాజు కాదు అతని ఆజ్ఞ మేము ఎందుకు పాటించాలి. మాకు రాజు దేవేంద్రుడు. ఆయన మాత్రమే

మమ్ము శాసించగలడు. మిగిలిన వారు ఎంతటి వారైనా మేము భయపడము" అని పలికారు.

"ఓ గంధర్వులారా! మొదటనే మీతో యుద్ధానికి దిగటం మంచిది కాదని మంచి మాటలతో చెప్పి చూచాను. మీకు మంచి మాటలు రుచించవని తెలిసినది. కాబట్టి నా శౌర్యముతో నేను సుయోధనుని విడిపిస్తాను" అని వారిమీత శరప్రయోగం చేసాడు.

అప్పుడు పాండవులకు గంధర్వులకు ఘోరయుద్ధం జరిగింది. పాండవుల ధాటికి తాళలేక గంధర్వులు దుర్యోధనుని తీసుకొని ఆకాశమార్గాన పారిపోబోయారు. కాని అర్జునుడు తనబాణములతో అన్ని దిక్కులను బంధించాడు. చిత్రసేనుడు అర్జునుని మీద తన గదను ప్రయోగించాడు. దానిని అర్జునుడు తన బాణాలో ఖండించాడు. చిత్రసేనుడు మాయాయుద్ధం చేయసాగాడు. అర్జునుడు తన శబ్దవేధి బాణాలతో కనబడని చిత్రసేనుని వేధించాడు. ఇంక చేసేది లేక చిత్రసేనుడు అర్జునుని ముందుకు వ చ్చి నిలిచాడు.

అప్పుడు అర్జునుడు చిత్రసేనుని చూ చి "చిత్రసేనా నీకు కౌరవులతో శత్రుత్వము ఎందుకు. వారిని విడిచి పెట్టుము." అని పలికాడు.

“అర్జునా! నీకు నాకు ఎలాంటి శత్రుత్వంలేదు. పైగా నీవు నాకు మిత్రుడవు. నీకు అసలు విషయం తెలియదు. ఈ దుర్యోధనుడు పరమ దుర్మార్గుడు. మీరు అడవులలో పడరాని పాట్లు పడుతుంటే మిమ్ములను హేళన చెయ్యడానికి ఈ ఘోష యాత్ర మిషమీద ద్వైతవనానికి వచ్చాడు. ఇదంతా తెలుసుకొన్న దేవేంద్రుడు ఈ దురాత్ముడిని పట్టి బంధించి తన వద్దకు తీసుకు రమ్మని నాకు ఆజ్ఞాపించాడు. అందుకే ఇతనిని పట్టి బంధించి తీసుకొని దేవేంద్రుని వద్దకు తీసుకొని వెళ్తున్నాను.” అని చెప్పాడు.

“ మిత్రమా చిత్రసేనా! ఇతడు ఎంతటి దుర్మార్గుడైనను మాకు సోదరుడు. కాబట్టి ఇతనిని విడిచి పెట్టడమే తగిన పని. ఇది ధర్మరాజుకు ఆనందం కలిగిస్తుంది. నీవు చెప్పినట్టు ఇది దేవేంద్రుని ఆజ్ఞ కావచ్చును. ప్రస్తుతము మనము ఇతనిని ధర్మరాజు వద్దకు తీసుకొని పోయెదము ఆయన ఎలా చెపితే అలా చేసెదము కాబట్టి నా మాటమీద ధర్మరాజు వద్దకు రమ్ము” అని పలికాడు. దానికి చిత్రసేనుడు సమ్మతించాడు. అందరూ ధర్మరాజు దగ్గరకు వెళ్లారు.

చిత్ర సేనుని ధర్మరాజు సాదరంగా పూజించాడు. “చిత్రసేనా! ఈసుయోధనుడు, తన అనుజులతోనూ, అమాత్యులతోనూ, పరివారముతోనూ నీ చేత వధియింపబడలేదు. మీ కారణముగా మా కుటుంబానికి ఎలాంటి హానీకలగలేదు.నాకు చాలా సంతోషముగానున్నది.

ఇతని వల్ల ఎలాంటి అపరాధము కలిగినను క్షమించి అతనిని విడిచి పెట్టండి. ” అని ప్రార్థించాడు.

ధర్మరాజు మాట మన్నించి చిత్రసేనుడు సుయోధనుని అతని పరివారమును విడిచి పెట్టాడు. చిత్రసేనుడు వెంటనే దేవలోకమునకు పోయి జరిగినది అంతయూ దేవేంద్రునకు వివరించాడు. దేవేంద్రుడు తన అమృతవృష్టి చేత యుద్ధములో చనిపోయిన గంధర్వుల నందరిని బతికించాడు.

ఇక్కడ ధర్మరాజు సుయోధనుని బంధవిముక్తుని చేసి “సుయోధనా! ఎప్పుడూ ఇలాంటి సాహసములు చేయవద్దు. దుర్మార్గులు మాత్రమే ఇలాంటి సాహసక్రియలు చేసి నశిస్తారు. నీవు వెంటనే నీ తమ్ములను, సామంతులను తీసుకొని పొమ్ము. నీ మనసులో ఎలాంటి విషాదము పెట్టుకొనవద్దు” అని చెప్పాడు.

సుయోధనుడు మారు మాటాడక దీన వదనుడై అక్కడినుండి వెళ్లియాడు. అక్కడ ఉన్న ధౌమ్యుడు మొదలగు బ్రాహ్మణులు ధర్మరాజు ఔదార్యమును కొనియాడిరి.

(మహా భారతము- అరణ్య పర్వము - పంచమాశ్వాసము సంపూర్ణము).

# మహా భారతం

## అరణ్య పర్వము

## షష్టాశ్వాసము.

## (ఎఱ్ఱాప్రగ్గడ ప్రణీతము)

ఆ ప్రకారంగా, మహా భారత కథను, నైమిశారణ్యంలో, శౌనక మహర్షి ఆశ్రమంలో, రోమహర్షుణి కుమారుడైన ఉగ్రశ్రవసుడు (సూతి) అనే పౌరాణి కుడు, శౌనకాది మహా మునులకు ఇలా చెప్పసాగాడు.

ఇక్కడి దాకా కథను విన్న జనమేజయుడు వైశంపాయనుని చూచి ఓ మహర్షి! ఎల్లప్పుడూ పాండవులకు హాని తనపెట్టే దుర్యోధనుడు, ఆ ప్రకారం శత్రువులచే అవమానం పొందటం, పైగా పాండవులచేత రక్షింపబడటం జరిగింది కదా! ఇంత అవమానం పొందిన దుర్యోధనుడు ఎలా హస్తినాపురం చేరుకున్నాడు. దుర్యోధనుడు తాను అభిమాన ధనుడు అని చెప్పుకుంటాడు కదా! మరి, అంతటి అభిమాన ధనుడు తనకు జరిగిన పరాభవము ఎలా సహించాడు. తదుపరి దుర్యోధనుడు

ఎలా ప్రవర్తించాడు వివరించండి అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా బదులు చెప్పాడు.

ఆ ప్రకారంగా పాండవులచేత బంధ విముక్తుడైన దుర్యోధనుడు, అవమాన భారంతో, మితిమీరిన దుఃఖంతో, తన సేనలను మరల కూర్చుకొని, కొంత దూరం వెళ్లి, అక్కడ కుటీరములు వేయించి విడిది చేసాడు.

సుయోధనునికి నిద్ర పట్టలేదు. తన కుటీరంలో ఏకాతంగా పడుకొని దుఃఖిస్తూ ఉన్నాడు. ఆసయమంలో కర్ణుడు అక్కడకు వచ్చాడు.

"ఓ రారాజా! మానవులకు సాధ్యం కాని దానిని నువ్వు సాధించావు. గంధర్వులతో యుద్ధం చేసి గెలిచావు. నేను కూడా నా శక్తి వంచన లేకుండా శత్రువులను చంపాను కాని మన సేనలు నాకు సహకరించలేదు. నా రథము విరిగిపోయినది అందువలన నేను వికర్ణుని రథము ఎక్కి పక్కకు పోయినాను. నీవు శత్రువులను జయించినావని విని చాలా ఆనందించాను." అని కర్ణుడు పలికాడు.

ఆ మాటలు వినిన సుయోధనుడు "అయ్యో! ఇతనికి జరిగిన విషయము తెలిసినట్టులేదు" అని తలచి సిగ్గుతో కర్ణునితో ఇలా పలికాడు

"కర్ణా! నేను, తమ్ములు గంధర్వులను ఎదిరించాము. నాకు త్రసేనునికి యుద్ధం జరిగింది. అతడు నన్ను, నా భార్యను, తమ్ములనూ,పరివారమును అందరిని బంధించాడు. అంతలో మనవారు కొందరు ధర్మరాజు వద్దకు పోయి శరణు వేడారు. ధర్మరాజు తన తమ్ములను పంపాడు. వారు ముందు మంచి మాటలతో గంధర్వులకు నచ్చ చెప్పారు. వారు వినలేదు. పాండవులు గంధర్వులతో యుద్ధం చేసారు. చిత్ర సేనుడు అర్జునునితో మాటలాడి ప్రసన్నుని చేసుకొన్నాడు. భీముడు అర్జునుడు నకుల సహదేవులు, గంధర్వులు అందరూ నన్ను వెంటపెట్టుకొని ధర్మరాజు వద్దకు వెళ్లారు. అప్పుడు ధర్మరాజు నన్నువిడి చి పెట్టాడు.

కర్ణా! ఇంత అవమానము జరిగిన తరువాత జీవించి ఉండటం నిరర్ధకము. ఇంక నేను ప్రజలను ఎలా పాలించగలను! నన్నుచూసి జనులు నవ్వరా! గంధర్వులతో యుద్ధం చేయుచున్నప్పుడు మరణించి ఉండిన ఇంతటి అవమానము జరుగదు కదా! స్వర్గలోక ప్రాప్తి కలిగి ఉండెడిది గదా! కాబట్టి ఇంతటి అవమానముల పాలైన నేను ప్రాయోపవేశము చేసి మరణించుటయే ఉత్తమము.

నా తరువాత దుశ్శాసనుడు మీకు నాయకుడు. అతనితో మీరు హస్తినాపురమునకు పొండు.  ఆ అవమాన భారములో నేను హస్తినా పురమునకు రాలేను. పదిమందిలో తిరగలేను. తండ్రిగారు ధృ తరాష్ట్రునితో, తాత భీష్మునితో  ఎలా సంభాషించగలను. ఇది అంతా నా ఆత్మ దోషము. చేజేతులా చేసుకున్న కర్మము. అనుభవించితీరవలెను.

చెడ్డవాడు సిరి సంపదలతో తులతూగవచ్చును. మంచి విద్యలు నేర్వవచ్చును.కాని వాటిని సద్వినియోగము చేయకపోతే చెడిపోతాడు. నేనూ అంతే. ఐనా నా అంతటి వాడిని ఒక గంధర్వుడు చెఱపట్టడమా! ఎంతటి అవమానము!  ఆత్మాభిమానము చెడినపుడు, శరీరములో ప్రాణములు ఉండుట నిరర్ధకము. కాబట్టి వెంటనే ప్రాయోపవేశము చేసి ప్రాణత్యాగము చేసెదను. నా నిర్ణయమునకు తిరుగులేదు"  అన్నాడు దుర్యోధనుడు.

పక్కనే ఉన్న దుశ్శాసనుని చూచి "దుశ్శాసనా! నీకు రాజ్యాభి షేకము చేసెదను. శకుని, కర్ణుల సహాయముతో ఈ భూమండలమును ఏలుకొనుము. నీ తమ్ములకు సంతోషము కలిగించుము. బ్రాహ్మణులను

సన్మానింపుము. గురువులను భక్తి తో కొల్చుచూ, ప్రజలను పాలింపుము.” అని అన్నాడు.

ఆ మాటలకు దుశ్శాసనుడు తల్లడిల్లిపోయాడు. అతని కాళ్ల మీద పడి “అన్నయ్యా! ఆ భూమి బద్దలైననూ, హిమాలయములు చలించినను, సముద్రములు ఇంకిపోయినను, సూర్యుడు, చంద్రుడు వారి తేజములు కోల్పోయిననూ, నీవే సార్వభౌముడవు. నేను ఈ రాజ్య భారమును వహింపజాలను.” అంటూ దుశ్శాసనుడు ఏడవసాగాడు.

కర్ణుడు వారిద్దరిని చూచి “సుయోధనా! దుశ్శాసనా! మీరు ఇద్దరూ ఈ ప్రకారము చిన్న పిల్లలవలే రోదించుట తగదు. ధైర్యము వహించి శోకమును విడవండి. ఈవిధంగా శోకించువారిని చూచి శత్రువులు సంతోషించెదరు. కాబట్టి మీరు శోకించవలదు.

సుయోధనా! చంద్ర వంశపు రాజువు. ఒక అల్పుని మాదిరి దుఃఖించవచ్చునా! ఎన్నో భోగభాగ్యాలు అనుభవించవలసిన ఈ శరీరమును ఇలా త్యజించ దగునా! నీవే ఈప్రకారము దుఃఖించిన మమ్ములను ఓదార్చువారెవరు. కాబట్టి నీ నిర్ణయమును మార్చు కొనుము.

సుయోధనా! నువ్వు పాండవులచేత విముక్తుడవైతివని దుఃఖించుచున్నావు. అది సరి కాదు. ఏ రాజు పాలనలో ప్రజలు నిశ్చింతగా జీవించుచున్నారో, ఆ ప్రజలు రాజునకు సేవకులు. కావున, రాజు ఆపదలో ఉన్నప్పుడు తమ పౌరుషమును చూపి రాజును రక్షించుట వారి ధర్మము. పాండవులు నీ దేశములో నివశిస్తూ నీ ఆజ్ఞలకు లోబడ్డవారు. నీకు కింకరులు. నీకు ఆపద వచ్చినప్పుడు నిన్ను రక్షించుట వారి విధి. ధర్మము. వారి కర్తవ్యము వారు నెరవేర్చారు. దానికి ఇంత వగచుట ఎందులకు? అదియును కాక పాండవులు జూదమాడి తమ రాజ్యము పోగొట్టుకొని నీకు దాసులైనారు. వారి సమస్త సంపదలు నీ అధీనములు. వారు ఎల్లప్పుడూ నీకు దాస్యము చేయవలసిన వారు. ఈ మాత్రం సాయంచెయ్యడం పెద్ద గొప్ప ఏమున్నది. కాబట్టి దానికి నీవు వగవ వలదు. లెమ్ము హస్తినాపురమునకు పోవుదము." అని కర్ణుడు పలికాడు. కాని సుయోధనుడు అతని ప్రాయోపవేశ నిర్ణయమును మానలేదు.

అప్పుడు శకుని సుయోధనుని చూచి ఇలా అన్నాడు. "సుయోధనా! కర్ణుని మాటలు వినుము. నీ దుఃఖమును వీడుము. నేను పాండవుల సంపదలు అన్నియు నీకు కట్టబెట్టాను. అవి నీ పరాక్రమము చేత సంమాదించినవి కావు. నేను సంపాదించి ఇచ్చిన పాండవ

రాజ్యమును వదలి నీవు ప్రాయోపవేశము చేసిన నాకు మనసు బాధకలుగును. నీవు చిన్నప్పటి నుండి సిరిసంపదలతో పెరిగావు. పెద్దలకు సేవ చెయ్యలేదు. కాబట్టి నీకు వ్యవహారిక జ్ఞానం అంతగా లేదు.

అప్పుడప్పుడు మనసు వికలం అవుతుంది. కోపం వస్తుంది. ధీరుడైన వాడు వాటిని వెంటనే అంతమొందించాలి. పిరికితనము, ఏమరిపాటు, మెతకతనము రాజుకు ఉండకూడదు. పాండవులు నీకు ఉపకారం చేసారు. వారికి ప్రత్యుపకారం చెయ్యడం ధర్మం. వారిని తగురీతిని సత్కరించుము. అంతేకాని ఈ ప్రకారం ప్రాయోపవేశం చెయ్యడం అవివేకము. పాండవులను పిలిపించుము. వారు మంచివారు. పరాక్రమ వంతులు. వారి రాజ్యము వారికి ఇచ్చి వారిని సత్కరించుము. అప్పుడే నీకు ఎనలేని కీర్తి లభిస్తుంది. పాండవులు నీకు సోదరులు. మీరు ఇరువురూ కలిసి ఆ రాజ్యాన్ని పాలించండి. అందరూ సుఖంగా ఉండండి." అని శకుని సుయోధనునితో పలికాడు.

అప్పుడు సుయోధనుడు దుశ్శాసనుని, కర్ణుని, శకునిని చూచి "మీరు నన్ను ఎందుకు వారిస్తున్నారు. నాకు ఈ భోగ భాగ్యాలమీద ఆసక్తి లేదు. ప్రాయోపవేశము చెయ్యవలెనని నిశ్చయించుకొన్నాను.

మీరు నాకు అడ్డు చెప్పవలదు. మీరు మీ ఇష్టం వచ్చిన చోటుకు వెళ్లండి" అని సుయోధనుడు పలికాడు.

అప్పుడు వారు "నిన్నువిడిచి మేము ఎక్కడికి పోగలము. మేమూ నీ తో సహగమనము చేస్తాము" అని పలికారు.

ఇంతలో పొద్దు కూకింది. సుయోధనుడు స్నానము చేసి శుచియై, ధర్భాసనము మీద మౌనంగా కూర్చున్నాడు.

రాత్రి అయింది. ఆ సమయంలో దేవతలచేత ఓడింప బడి పాతాళంలో ఉన్న దానవులు ఈ విషయం తెలుసుకున్నారు. వెంటనే వారు శుక్రాచార్యుని ఆశ్రయించారు. ఆయన కృత్య అనే భీకరాకారాన్ని సృష్టించాడు. వెంటనే పోయి సుయోధనుని పాతాళానికి తీసుకురమ్మని కృత్యను ఆజ్ఞాపించాడు. ఆ ప్రకారం కృత్యపోయి సుయోధనుని పాతాళానికి తీసుకొని వచ్చింది. సుయోధనుని చూచి దానవులు అతనిని కౌగలించుకొని కుశలమడిగారు.

"సుయోధనా! నీవు శూరుడవు. భరతకులోధ్భవుడవు. ఇంతటి సాహసం ఎందుకు చేస్తున్నావు. ఆత్మ హత్య చేసుకున్నవాడికి లోక నింద, హీనత, దుర్గతి ప్రాప్తిస్తుంది అని తెలుసుకదా! నీ వంటి బుద్ధిమంతులు

ఈ ప్రకారం చేయ తగునా! కాబట్టి నీ నిర్ణయము మార్చుకొనుము. ధైర్యమును, ప్రతాపమును పాటింపుము. శత్రువులను ఓడించుము. అదియును కాక నీవు మామూలు మానవుడవు కావు. నీ జన్మ వృత్తాంతము చెప్పెదము వినుము.

మేము పరమేశ్వరుని గూర్చి తపస్సు చేసాము. అప్పుడు పరమేశ్వరుడు నిన్ను సృష్టించి మాకు ప్రసాదించాడు. నీ శరీరం పైభాగము వజ్రసమానముగా సృష్టించాడు. ఏ రకమైన అస్త్రశస్త్రములు నీ శరీర పైభాగమును ఛేధించలేవు. నీవు కారణ జన్ముడవు. నీకు సాయం చెయ్యడానికి చాలామంది రాక్షసులు క్షత్రియులుగా జన్మించారు. వారే భగదత్తుడు మొదలైన వారు. భీష్మ, ద్రోణ, కృపాచార్యుడు మొదలగు వారు దేవతాంశలతో జన్మించిననూ, వారి భావములో రాక్షసాంశలు ఉండుటచేత, వారు యుద్ధములో తమ పుత్రులు, పౌత్రులు, మిత్రులు, అన్నదమ్ములను, శిష్యులను, బాలురు వృద్ధులు, అనే బేధం లేకుండా పాండవులను వారి సేనలనూ నాశనం చేస్తారు.

నీ మనసులో అర్జునుడు అంటే కొంచెం భయం ఉంది. దానికి ఒక విరుగుడు ఆలోచించాము. శ్రీకృష్ణుడు నరకాసురుడిని చంపాడు. ఆ నరకాసురుడి అంశను కర్ణుడిలో ప్రవేశ పెట్టాము. అప్పుడు కర్ణుడు శ్రీ

కృష్ణుని, అర్జునుని మీద పగపట్టి చంపగలడు. దేవేంద్రుడు కూడా తనకుమారుడు అర్జునుని రక్షించుకొనుటకు బ్రాహ్మణుని వేషంలో వెళ్లి అతని కవచకుండలములు అపహరిస్తాడు. ఎందుకంటే దేవేంద్రుడు కూడా కర్ణుని అర్జునుడు గెలువలేడు అని అనుకుంటున్నాడు కదా!

అదియును కాక, లక్షల మంది రాక్షసవీరులు సంశప్తకులు అనే పేరున జన్మించినారు. వారి చేత అర్జునుడు ఓడించబడతాడు. ఈ సమస్త భూమండలాన్ని నీవే పరిపాలించగలవు. కాబటి నీ ధైన్యమును వదలి పెట్టుము." అని రాక్షస వీరులు అతనికి చెప్పారు.

తరువాత కృత్య మరల అతనిని భూలోకమునకు తీసుకొని వచ్చి అతని శయ్య మీద పడుకోబెట్టింది.

సూర్యోదయం కాగానే ని ద్రలేచాడు. రాత్రి జరిగినది అంతా కలా నిజమా అని తేల్చుకోలేకపోయాడు. కాని ఎవరికి చెప్పకూడదు అనుకున్నాడు. కాని తాను పాండవులను జయించగలను అని ఆత్మవిశ్వాసం కలిగింది.

తెల్లవారగానే కర్ణుడు మరల దుర్యోధనుని వద్దకు వచ్చాడు. "సుయోధనా! మనము మరణించి సాధించేది ఏముంది! మరణించిన తర్వాత శత్రువులను జయించలేము కదా! కాబట్టి ఆత్మహత్య వలన నిన్ను ఎవరూ మెచ్చరు. బతికి ఉంటేనే మనము శత్రువులను జయించి సమస్త సౌఖ్యములను అనుభవించగలము. కాబట్టి ఇది దుఃఖించ తగ్గ సమయం కాదు. సుయోధనా! నీకు అర్జునుడు అంటే భయం ఉంది. ఇదిగో ఈ ఆయుధాన్ని బట్టి శపథం చేస్తున్నాను. అరణ్య అజ్ఞాత వాసములు ముగిసిన మీదట, యుద్ధములో నేను అర్జునుని సంహరించ గలను. ఇదే నా ప్రతిజ్ఞ." అని భీకర ప్రతిజ్ఞ చేసాడు కర్ణుడు.

రాత్రి రాక్షసవీరులు పలికిన పలుకులు ఇప్పుడు కర్ణుని ప్రతిజ్ఞ సుయోధనునిలో కొత్త ఆశలు నింపాయి ప్రాయోపవేశాన్ని విరమించాడు. శకుని, కర్ణుడు, తమ్ములతో తిరిగి హస్తినాపురం ప్రవేశించాడు.

ఒకరోజు భీష్ముడు సుయోధనుని చూచి "సుయోధనా! నీవు పెద్దల మాటలను పెడచెవిని బెట్టి ఘోషయాత్రకు వెళ్ళావు. కాని ఏమి జరిగిందో చూచావు కదా! అజాత శత్రువు ధర్మరాజు దయవలన బతికి బయటపడ్డావు. లేకపోతే ఆ గంధర్వుని చెరలో ఉండేవాడివి. నీవు కర్ణుని నమ్ముతావు కదా! అతను ఏమి చేసాడు. నిన్ను నీ తమ్ములను వదలి

పారిపోయాడు. అతని యుద్ధనైపుణ్యం కనులారా చూచావు కదా! సుయోధనా! పాండవులు పరాక్రమవంతులు. వారితో పోలిస్తే కనీసం 16వ పాలుకూడా లేడు ఈ కర్ణుడు. అతడు ఒట్టి మాటల వీరుడు. అతనిని నమ్మి నీ వంశమును నాశనం చేసుకోకు. ఇప్పటి కన్నా పాండవులతో సంధి చేసుకొని సుఖంగా బతుకు. నీ మేలుకోరి చెపుతున్నాను." అని పలికాడు భీష్ముడు.

భీష్ముడు చెప్పిన మాటలకు ఏమాత్రం విలువ ఇవ్వకుండా, శకుని, కర్ణులతో నవ్వుకుంటూ అక్కడి నుండి వెళ్లిపోయాడు సుయోధనుడు.

సుయోధనుడు కర్ణుని చూచి "కర్ణా! ధర్మరాజు రాజసూయ యాగం చేసాడు కదా! అలాంటి యాగమే నేను చెయ్యాలని అనుకుంటున్నాను. తగు సన్నాహాలు కావించు." అన్నాడు సుయోధనుడు.

కర్ణుడు వెంటనే "అదెంతపని సుయోధనా. ఇప్పుడు ఈ భూమండలంలోని రాజులందరూ నీకు సామంతులు. వెంటనే ప్రారంభించు. రాజులందరికి ఆహ్వానాలు పంపు. బ్రాహ్మణోత్తములను సత్కరించు. యాగశాలలు నిర్మించు. అన్న సంతర్పణములకు తగిన

సంభారములు సమకూర్చు. దేవేంద్రుడి మాదిరి యాగం చెయ్యి" అన్నాడు కర్ణుడు.

వెంటనే సుయోధనుడు పురోహితులను పిలిచి రాజసూయ యాగం చెయ్యడానికి తగు సన్నాహాలు చెయ్యమన్నాడు. వారు ఆలోచించి "సుయోధనా! పాండవులు నీకు శత్రువులు. వారిని జయించిన గాని నీవు రాజసూయ యాగం చెయ్యలేవు. రాజసూయ యాగం వంటిదే వైష్ణవము అనే యాగము. దానిని ఇదివరకు వాసుదేవుడు చేశాడు. దానిని నీవు నిర్విఘ్నముగా చేయుము ఇది నీకు తగిన యాగము" అని చెప్పారు.

సుయోధనుడు దానికి సమ్మతించాడు. వెంటనే తల్లితండ్రులు ధృతరాష్ట్రుడు, గాంధారికి, తాత భీష్మునకు, గురువు ద్రోణునకు, కృపాచార్యునకు చెప్పి వారి అనుమతి తీసుకున్నాడు. అన్ని దేశాల రాజులను. బ్రాహ్మణోత్తముల కు ఆహ్వానాలు పంపాడు. పాండవులను ఆహ్వానించడానికి ఒక దూతను ద్వైతవనానికి పంపాడు.

అతను ద్వైతవనానికి పోయి ధర్మరాజును కలిసి "ధర్మరాజా! రారాజు సుయోధనుడు ఒక మహా యాగము చేస్తున్నాడు. మిమ్ములను

ఆహ్వానించడానికి నన్నుపంపాడు. కాబట్టి మీరు వేంచేయవలసినది " అని అర్థించాడు.

"సుయోధనుడు యాగం చెయ్యడం నాకు చాలా సంతోషంగా ఉన్నది. మా కురువంశం పావనము అవుతుంది. మేము చేసుకొనిన ఒప్పందం ప్రకారం అరణ్య అజ్ఞాతవాసములు చేస్తున్నాము. మేము ఇప్పుడు రావడం సమంజసంగా ఉండదు. దయచేసి ఆ విషయం మీ రాజుతో చెప్పండి" అని పలికాడు.

పక్కనే ఉన్న భీముడు అతనిని చూచి "అరణ్య అజ్ఞాతవాసములు గడచిన మీదట, మేమే పిలవకుండానే వచ్చి మా ఆయుధాలతో అగ్ని గుండం వేల్చి, అందులో నీ రాజు దుర్యోధనుని, అతని నూర్గురు తమ్ములను యజ్ఞపశువులుగా అర్పించగలము" అని చెప్పు అని పలికాడు. ఆ దూత అవే మాటలను సుయోధనునికి చెప్పాడు.

యాగనిర్వహణకు, యాగమునకు వచ్చినవారికి సత్కరించడానికి తగు ఏర్పాట్లు చెయ్యడానికి ధృతరాష్ట్రుడు విదురుని నియోగించాడు. యాగం నిర్విఘ్నంగా పరిసమాప్తి అయింది. యాగమునకు వచ్చినవారు సుయోధనుని చేసిన యాగమును పొగిడారు. కొంతమంది మాత్రం ఆ యాగం ధర్మరాజు చేసిన రాజసూయ యాగముతో సరిపోలదన్నారు.

కర్ణుడు సుయోధనుని చూచి సుయోధనా! నీవు వైష్ణవ యాగమును నిర్విఘ్నముగా నెరవేర్చావు. ఇదేమాదిరి పాండవులను జయించి రాజసూయయాగమును కూడా నెరవేర్చగలవు. నేను యుద్ధంలో అర్జునుని చంపినదాకా నా కాలి గోళ్లను కూడా కడుగుకొనను" అని శపథం చేసాడు.

దానికి సంతోషించి సుయోధనుడి గాఢాలింగనము చేసుకొని "కర్ణా నీ సాయం ఉన్నంతవరకు నేను పాండవులను జయించటం ఏమంత కష్టం కాదు." అని అభినందించాడు.

కర్ణుడు చేసిన శపథం విని ద్వైతవనంలో ఉన్న ధర్మరాజు భయపడ్డాడు. ఒకరోజు ధర్మరాజు నిద్రిస్తుండగా అతనికి స్వప్నములో ఒక అడవి జంతువు కనపడి "అయ్యా మీరు ప్రతిరోజూ మమ్ములను చంపి తింటున్నారు. మా జాతులు నామమాత్రము అవుతున్నాయి. మా వంశాలు నాశనం కాకముందే మీరు ఈ ప్రదేశమును విడిచి వెళ్లండి" అని అభ్యర్థించాయి.

మరునాడు ధర్మరాజు తన తమ్ములతో భార్యతో, పురోహితులతో బ్రాహ్మణులతో ద్వైతవనము విడిచి కామ్యకవనమునకు వెళ్లారు. అక్కడ కూడా కేవలం కాయలు పళ్లు, ఆకులు తింటూ జీవ హింస చేయ కుండా అరణ్య వాసములో పదకొండు ఏళ్లు గడిపారు. ఇంక ఆఖరి సంవత్స రానికి వచ్చేసారు.

ఒకరోజు వేదవ్యాసుడు పాండవుల వద్దకు వచ్చాడు. ధర్మజుడు ఆ మహా ఋషిని తగు రీతిని సత్కరించాడు. "మహాత్మా! తపస్సు, దానము గొప్పవి అంటారు కదా. ఆ రెంటిలో ఏది గొప్పదో చెప్పండి " అని అడిగాడు. దానికి వేదవ్యాసుడు ఇలా చెప్పసాగాడు.

"ధర్మరాజా! దానము అంటే తనకు ఉన్న దానిని పరులకు ఇవ్వడం. మనుష్యులకు ప్రాణముల కంటే ధనము అంటే ఎక్కువ తీపి కదా. మనుష్యులు ఎన్ని కష్టములు పడినా, ఏమి చేసినా ధనం కోసమే కదా! అన్ని కష్టములకు ఓర్చి సంపాదించిన ధనము పరులకు ఇవ్వడం గొప్ప విషయమే కదా. కాబట్టి దానమే గొప్పది.

సాధారణంగా బుద్ధిహీనులు తాము అక్రమంగా ఆర్జించిన ధనం దానం చేస్తుంటారు. దాని వలన పుణ్యం రాదు. న్యాయం గా

సంపాదించిన ధనం కొంచెం దానం చేసినా పుణ్యం వస్తుంది. అలాంటి న్యాయార్జిత మైన ధనము, సకాలంలో దానం చెయ్యాలి. సరి అయిన ప్రదేశంలో దానం చెయ్యాలి. అదీకూడా యోగ్యుడికి దానం చెయ్యాలి. అపాత్ర దానం చెయ్యరాదు. నీకు వ్రీహి ద్రోణాపాఖ్యానము చెపుతాను వినుము అని చెప్పసాగాడు.

దర్మజా! పూర్వము కురుక్షేత్రములో ముద్గలుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు పేద వాడు.కాని నిత్య సత్య వ్రతుడు. నిష్టాగరిష్ఠుడు. తనకు ఉన్న దానిలోనే అతిధులను సత్కరించేవాడు. పొలములలో రాలిన ధాన్యమును ఏరుకొని జీవనం సాగించేవాడు.

ఒక రోజు అతని ఇంటికి దుర్వాసుడు అనే మునీశ్వరుడు వచ్చాడు. అతని ఆకారం పిచ్చి వాని వలె ఉంది. ముద్గలుడు దుర్వాసునికి స్వాగతం పలికాడు. అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి సత్కరించాడు. తనకు ఉన్నదానిలోనే దుర్వాసునికి భోజనం పెట్టాడు. దుర్వాసుడు భోజనం చేసి వెళ్లిపోయాడు.

తరువాత దుర్వాసుడు ప్రతి అమావాస్య పౌర్ణమికి ముద్గలుని ఇంటికి వస్తూనే ఉన్నాడు. ముద్గలుడు తను నిరాహారుడై ఉండి ఆ

మహాముని కి భోజనం పెట్టేవాడు. ఆ విధంగా ఆరు పర్వదినాలు వరుసగా వచ్చాడు దుర్వాసుడు. ముద్గలుడు మనసులో ఏ మాత్రం కష్టపడకుండా ప్రీతిలో దుర్వాసునకు భోజనం పెట్టాడు. దుర్వాసుడు ఆశ్చర్యపోయాడు.

" ఓ ముద్గల మునీ! నీ వంటి దానశీలుని నేను ఈ లోకంలో చూడలేదు. నీవు సత్త్వగుణ సంపన్నుడవు. పుణ్యమూర్తివి. నీవు మనసులో ఏవగించు కొనక, అవమానము సేయక, కొంచెముకూడా కోపము లేకుండా, నీకు నాకు అతిథి పూజ చేసావు. నీకు ఈ అన్నదానము, సత్యము, నీ ధైర్యము, పరుల సొత్తును ఆశించక పోవడం, నీకు ధనములు.

మనస్సును ఇంద్రియములను సరిగా ఉంచునదే తపస్సు. అట్టి తపస్సు నువ్వు చేసావు. నీ అతిథి సత్కారముతో నేను తృప్తి చెందాను. నీకు సశరీరంగా స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది" అని చెప్పి దుర్వాసుడు వెళ్లిపోయాడు.

ఒక దేవదూత విమానాన్ని తీసుకొని ముద్గలుని వద్దకు వచ్చాడు. "ముద్గల మహా మునీ నీవు చేసిన పుణ్యము వలన నీకు స్వర్గలోక ప్రాప్తి

కలిగింది. విమానం ఎక్కుము" అని ప్రార్థించాడు. అప్పుడు ముద్గలుడు ఆ దేవదూతను చూచి "అయ్యా! దేవలోకం ఎలా ఉంటుంది." అని అడిగాడు. అప్పుడు ఆ దేవదూత ఈవిధంగాచెప్పసాగాడు.

"తపస్సుచేసి సిద్ధి పొందిన మహా మునులు, యజ్ఞాలు చేసిన వారు, సత్యసంధులు, ఇంద్రియములను జయించిన వారు, దానము చేసిన వారు, యుద్ధములో మరణించిన వీరులు, దేవలోకంలో నివసిస్తూ ఉంటారు. ఇంకా అప్సరసలు, సిద్ధులు,సాధ్యులు, దేవమునులు, మరుత్తులు, కూడా నివసిస్తూ ఉంటారు. మేరు పర్వత శిఖరం అక్కడే ఉంది. నందనోద్యానం ఉంది. అక్కడ ఆకలి దప్పులు ఉండవు. వ్యాధులు, ముసలి తనం ఉండదు. అక్కడ అందరికి తేజోమయ దేహాలు ఉంటాయి స్వర్గంలో ఉన్నంత కాలం ఎలాంటి దుఃఖాలు ఉండవు. నిరంతర సౌఖ్యము, ఆనందము ఉంటుంది.

స్వర్గలోకం పైన బ్రహ్మ లోకం ఉంది. మనువులు, మహా ఋషులు అక్కడ ఉంటారు. అక్కడ పునర్జన్మ ఉండదు. ప్రళయ కాలంలో అన్ని లోకాలు నాశనం అవుతాయి.కాని బ్రహ్మ లోకం మాత్రం నిలిచి ఉంటుంది.

మనుష్యుడు భూలోకంలో చేసిన పుణ్యాలకు ఫలితం స్వర్గలోకంలో అనుభవిస్తాడు. కాని అక్కడ ఎలాంటి పుణ్యం చెయ్యడానికి వీలులేదు. చేసిన పుణ్య ఫలం అనుభవించిన తరువాత, మరల భూలోకానికి రావలసిందే. స్వర్గ సుఖాలు అనుభవించిన తరువాత మరల భూలోకానికి వచ్చిన మనుషుడు వాటిని విడిచి పెట్టలేక వేదనకు గురి అవుతాడు. స్వర్గలోకం లో ఉన్న వారు కూడా, తమ కాన ఉన్నత స్థితిలో ఉన్న వారిని చూచి మనసులో బాధ పడతారు. బ్రహ్మలోకం శాశ్వతము. కాని స్వర్గలోకము అనుభవానికి మాత్రమే. భూలోకము కర్మభూమి. భూలోకంలో చేసిన కర్మ ఫలంస్వర్గంలో అనుభవిస్తారు. దేవలోకం గురించి చెప్పాను కదా. ఇంక రండి వెళదాము" అన్నాడు దేవ దూత.

అప్పుడు ముద్గలుడు "అయ్యా! నాకు అశాశ్వతము లైన స్వర్గ సుఖములు అవసరం లేదు. ఏ లోకానికి పోతే మరల తిరిగా జన్మ లేదో ఆ లోకానికి పోవడానికి ప్రయత్నం చేస్తాను. మీరు వెళ్లిరండి" అని పలికాడు. దేవదూత వెళ్లిపోయాడు. తరువాత ముద్గలుడు జ్ఞాన యోగి అయ్యాడు. ద్వందములయందు ఆసక్తిని విడిచి పెట్టాడు. అన్నింటిని సమభావంతో చూడ్డం అలవాటు చేసుకున్నాడు. జీవన్ముక్తుడు అయ్యాడు కాబట్టి ధర్మజా! నీవు రాజ్యాన్ని కోల్పోయినందుకు చింతించకుము." అని

వేదవ్యాసుడు పాండవులకు హితబోధ చేసాడు. తరువాత తన ఆశ్రమానికి వెళ్లాడు.

కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు పాండవులు వేటకు వెళ్లారు. ద్రౌపది కుటీరంలో ఒంటరిగా ఉంది. అప్పుడు ఆ సమయంలో సింధు దేశాన్ని పాలించే మహా రాజు సైంధవుడు (జయద్రధుడు) తన చతురంగ బలాలతో సాల్వరాజ పుత్రికను వివాహ మాడు నిమిత్తము పయనిస్తూ మార్గ మధ్యంలో కామ్యక వనం చేరుకున్నాడు.

తన కుటీరం ముందు నిలిచి ఉన్న ద్రౌపదిని చూచాడు. ఆమె అందానికి ఆశ్చర్యపోయాడు. ఆమెను కామించాడు. ఆమెను పొందాలి అనుకున్నాడు. తన మిత్రుడు కోటికాస్యుడు అనే వాడిని పిలిచి "ఈ సుందరాంగి ఎవరు? ఈమె మీద నా మనసు లగ్నమైనది. నీవు ఆమెను కలిసి వివరములను తెలుసుకొని ఆమెకు నాకు సంయోగం కలిగించాలి." అని అడిగాడు.

వాడు వెంటనే ద్రౌపది వద్దకు వెళ్లాడు. ద్రౌపదిని చూచి "ఓ లలనా! నీవు ఎవరు. క్రూర మృగములు సంచరించే వనములో ఎందుకు ఉన్నావు? నీవు వన దేవతవా? దేవేంద్రుని భార్య శచీదేవివా? లేక

లక్ష్మీదేవివా? నీ భర్త ఎవరు? నీ పేరేమి? నా పేరు కోటికాస్యుడు. మహా బలవంతుడను. అడుగో అక్కడ రథం మీద ఉన్న వాడు త్రిగర్త దేశాధి పతి. ఆ పక్కన ఉన్నవాడు కళింగ దేశాధి పతి. ఆ పక్కన ఉన్న వాడు సింధు దేశాధీశుడు జయద్రధుడు. అతనికి నీమీద మనసు కలిగినది. అందుకే ఇక్కడకు నన్ను పంపాడు" అని చెప్పాడు కోటికాస్యుడు.

ఆ మాటలు విన్న ద్రౌపది అతనిని చూచి "అన్నా! నేను ఒంటరి దానను. పుత్రులు కల దానిని. నీవు నా దగ్గరకు రావడం మంచిది కాదు. నన్ను సామాన్య స్త్రీగా ఎంచి ఇలా మాట్లాడటం తగదు. నేను పాంచాల దేశాధీశుని కుమార్తెను. నా పేరు కృష్ణ. నేను పాండవులకు ధర్మ పత్నిని. వారితో వనవాసం చేస్తున్నాను. కొంచెం సేపటిలో నా భర్తలు వస్తారు. మీరు కొంచెం సేపు ఈ సమీపంలో ఉండండి. పాండవులు రాగానే మీకు తగిన అతిధి సత్కారాలు చేయగలరు." అని చెప్పి కుటీరము లోనికి వెళ్లింది.

కోటి కాస్యుడు పోయి ద్రౌపదిని గూర్చి వివరాలు జయద్రధునికి చెప్పాడు. ఎలాగైనా ద్రౌపదిని అపహరించి తీసుకు వెళ్ల వలెననే తలంపుతో జయద్రధుడు ఆమె కుటీరం లోపలకు వెళ్లాడు. ద్రౌపదిని చూచి

"ద్రౌపదీ నీకు  క్షేమమేనా? పాండవులు క్షేమమేనా! " అని అడిగాడు.

"అయ్యా! అందరూ క్షేమమే. ఇప్పుడు నీవు మాకు అతిధివి. ఆ ఆసనాన్ని అలంకరించుము. నా భర్తలు వేటకు వెళ్లారు  వచ్చు సమయము అయినది. వారు వచ్చిన తరువాత వారిచేత అతిధి సత్కారములు పొంది వెళ్ల వచ్చును." అని పలికింది.

"ద్రౌపదీ! నీ మీద నాకు మనసు కలిగినది. నీవు నాతో రమ్ము వచ్చి రథము ఎక్కుము. రాజ్యమును పోగొట్టుకొన్న పాండవులతో నీవు ఏమి సౌఖ్యములు అనుభవించగలవు. నా తో రమ్ము" అని  పలికాడు.

ఆ మాటలకు ద్రౌపది భయపడి పోయింది. తన భర్తలు  ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తూ ఉంది. పాండవులు వ చ్చువరకు అతనితో ఏదో మాటలాడి కాలక్షేపం చేయవలెనని అనుకొన్నది.

" అయ్యా! నీవు ధృతరాష్ట్రుని కూతురు దుస్సలకు భర్తవు. అంటే నా భర్తలకు ఆమె సోదరి. నీవు నాకు సోదరుడవు. నీవు ఈ ప్రకారం పలకడం తగునా! " అని పలికింది.

దానికి జయద్రథుడు "ద్రౌపదీ! రాజులకు ఆడువారివిషయంలో ఈవావి వరుసలు పట్టించు కోనవసరం లేదు. అది రాజధర్మం. రాజులు వారి ఇష్టం వచ్చినట్టు వినోదించ వచ్చును. ద్రౌపదీ! నీకు ఒక విషయం తెలియునా. స్త్రీలు ఒకరి సొత్తు అని చెప్పడాని కి వీలులేదు. అందరూ అనుభవించ వచ్చును." అని పలికాడు.

వీడు మంచి మాటలతో వినే టట్టులేడు అని తలంచి ద్రౌపది

"ఓరీ! క్షత్రియ కులములో పుట్టిన అధముడా! పాండవుల శౌర్య పరాక్రమములు తెలిసీ నన్ను అవమానిస్తున్నావు. నీవు తగిన ఫలితాన్ని అనుభవిస్తావు. ఓ జయద్రథా! నీకు భీముని గురించి తెలుసుకదా! గుహలో పడుకున్న సింహం జూలుపట్టుకొని లాగుతున్నావు. జాగ్రత్త! అర్జునుని గాండీవం గురించి తెలియునా! అర్జునునికి కోపం తెప్పించిన వాడు బతకడం అసాధ్యం. నకుల సహదేవులను అవమానించడం త్రాచుపాముల జంటను తొక్కడం లాంటిది. ఎలా చూచినా నేటితో నీకు

ఆయువు తీరినది. నీకు  చావు తప్పదు. నీకు చావు మూడి నాతో ఇలా మాట్లాడుతున్నావు. జాగ్రత్త" అని హెచ్చరించింది.

ఆ మాటలకు జయద్రధుడు నవ్వుతూ "పాండవుల సంగతి నాకు బాగా తెలియును. నన్ను భయపెట్టకుము. మేమూ పరాక్రమ వంతులమే.  ఇంక మారు మాటలాడక నా వెంట రమ్ము అదుగో బంగారు రధము. ఎక్కుము." అని పలికాడు.

"జయద్రధా! నేను వీరుల ధర్మ పత్నిని. నీతో ఎక్కువగా మాట్లాడనవసరం లేదు. మరల చెపుతున్నాను. పాండవులు నా భర్తలు. శ్రీకృష్ణుడు నా అన్న. వారు నిన్ను నాశనం చేస్తారు. అర్జునుడు ఒక్కసారి గాండీవాన్ని ఎక్కుపెడితే నీవు ప్రాణభయంతో పారిపోతావు. భీమసేనుని ఒక్కసారి చూస్తేనే చాలు నీ మదం అణిగిపోతుంది. నేను పతివ్రతను. నా పాతివ్రత్యమే నన్ను కాపాడుతుంది." అని పలికింది.

కాని సైంధవుడు వినలేదు.  ఆమె పెద్దగా అరిచింది. ధౌమ్ముడిని పిలిచింది.  ఆయన వచ్చులోపలే  సైంధవుడు ద్రౌపదిని బలాత్కారంగా చీర  కొంగు పట్టుకొని లాగుతున్నాడు. ఆమె వాడిని బలవంతాగా

నెట్టింది. వాడు కింద పడ్డాడు. సైంధవునకు పట్టుదల పెరిగింది. పైకి లేచి ద్రౌపదిని బంధించి తన రథము మీద కూర్చోపెట్టుకొని బయలుదేరాడు.

అతనిని చూచి ధౌమ్యుడు "అయ్యా రాజులకు ఈ ప్రకారం దుష్కర్మలు చేయడం తగునా. ఆమెను విడిచి పెట్టుము. నీ పాపం నిన్ను నాశనం చేస్తుంది." అని పలుకుతూ ఆ రథాన్ని వెంబడించాడు. ఇంతలో పాండవులు కుటీరానికి వచ్చారు. వారికి దుశ్శకునాలు గోచరించాయి. ఇంతలో ద్రౌపది పరిచారిక వారిని చూచి "సైంధవుడు ద్రౌపదిని రథం మీద తీసుకొని పోయాడు" అని చెప్పింది. పాండవులకు కోపం వచ్చింది. వెంటనే సైంధవుడు వెళ్లిన దిక్కున వెళ్లారు.

రథం వెనక పరుగెత్తుతున్న ధౌమ్యుడు కనిపించాడు. ఆయనను వెనుకకు పంపి పాండవులు సైంధవుని వెంబడించారు. తన రథం వెనుక వస్తున్న పాండవులను చూచాడు సైంధవుడు. ద్రౌపదిని చూచి "ద్రౌపదీ అందులో నీ భర్తలు ఎవరు ఎవరో చెప్పవా" అని చమత్కారంగా అడిగాడు. "నీవు ఇప్పుడు పాండవులను గురించి తెలుసుకున్నా ప్రయోజనం లేదు. నీకు శిక్ష తప్పదు. అయినా అడిగావు కాబట్టి చెపుతున్నాను. చచ్చేముందు వారిని గురించి తెలుసుకో" అంటూ పాండవులను గురించి వివరంగా చెప్పింది.

సైంధవుడు తన సేనలను వారిమీదికి యుద్ధానికి సన్నద్ధం చేసాడు. కోటికాస్యుడు భీముని ఎదుర్కొన్నాడు. పాండవులు వారితో యుద్ధం చేసారు. ఇరువురికి భయంకరమైన యుద్ధం జరిగింది. పాండవుల ధాటికి సైంధవుని సేనలు ఆగలేకపోయాయి. ఆ యుద్ధంలో త్రిగర్త దేశాధీశుడు సుధన్వుడు, సురథుడు, మరణించారు. భీముడు కోటి కాస్యుని చంపాడు. అర్జునుడు అంగారకుడు, కుంజరుడు, సృంజయుడు, స్తుకుడు శత్రుంజయుడు, సుప్రబుద్ధుడు, శుభంకరుడు, భ్రమంకరుడు, శూరుడు, రథి, గుహకుడు, బలాఢ్యుడు, అనే పేరుగల సౌవీర వీరులను చంపాడు.

ఆ సమయంలో సైంధవుడు ద్రౌపదిని తన రథం మీది నుండి దింపి తాను రథం తోలుకొని పారిపోయాడు. అది చూచాడు అర్జునుడు, శత్రు సేనలను చంపుతున్న భీముని వద్దకు వచ్చాడు. "భీమసేనా! సైంధవుడు పారిపోయాడు. ఇంక అమాయకులైన వీరిని చంపడం మానుము" అని చెప్పాడు. అందరూ ద్రౌపది దగ్గరకు వచ్చారు.

అర్జునుడు ధర్మరాజును చూచి "అన్నయ్యా మీరు, ద్రౌపది, నకులసహదేవుడు, ధౌమ్యుడు ఆశ్రమానికి వెళ్ళండి. నేను భీమసేనుడు

సైంధవుని వెంబడిస్తాము" అని చెప్పారు. ద్రౌపదిభీమార్జునులను చూచి "సైంధవుడు దుర్మార్గుడు. వాడి పట్ల జాలి చూపవద్దు. వాడిని వధించండి" అని చెప్పింది.

వెంటనే అర్జునుడు జయద్రధుని వెంబడించి అతని రధాన్ని, గుర్రాలను కూల్చాడు. అప్పుడు జయద్రధుడు రధం నుండి కిందికి దూకి పారిపోయాడు. భీముడు అర్జునుడు వాడిని వెంబడించి వాడిని పట్టుకున్నారు. భీముడు వాడిని కింద పడవేసి వాడి మెడమీద కాలు వేసి నిలుచున్నాడు. భీముడు వాడిని చితక కొట్టాడు. వాడు స్పృహ తప్పాడు.

" అన్నయ్యా! ఇంక చాలు. ఇంకా కొడితే వీడు చస్తాడు. అన్న ధర్మజుని మాట ప్రకారము వీడిని మన్నించు" అన్నాడు. "అబ్బా అర్జునా! వీడిని మన్నించడమా! వీడిని మన్నిస్తే ఎన్నో అనర్ధాలు జరుగుతాయి. వీడివి తగినశాస్తి చేస్తాను" అంటూ భీముడు ఒక పదునైన కత్తితో వాడి తలను ఐదు శిఖలు గా గొరిగాడు. వాడిని లేపి "ఒరేయ్ జయద్రధా! నీవు పోయిన ప్రతిచోటా నేను పాండవ దాసుడను అని చెప్పాలి లేకపోతే చస్తావు" అని హెచ్చరించాడు.

తరువాత వాడిని కట్టి రథం మీద పడవేసి ధర్మరాజు వద్దకు తీసుకొని వచ్చారు. "అన్నయ్యా వీడు పాండవ దాసుడు జయద్రధుడు" అని వాడిని ధర్మరాజు పాదాల మీద పడేసాడు. ద్రౌపది వాడిని చూసి హేళనగా నవ్వింది. ధర్మరాజు వాడిని చూచి "ఇంకమీదట చెడ్డ పనులు చేయకుము బుద్ధిగా ఉండుము" అని మందలించి వదలి పెట్టాడు.

అవమాన భారంతో జయద్రధుడు గంగానదీ తీరానికి వెళ్లాడు. శివుడిని గూర్చి ఘోరమైన తపస్సుచేసాడు. శివుడు అతనికి ప్రత్యక్షమైనాడు. "దేవా! యుద్ధంలో నేను పాండవులను, వారి సేనను జయించే వరాన్ని ప్రసాదించు" అని కోరాడు. "జయద్రధా! అది అసాధ్యం. పాండవులను ఎవరూ జయించలేరు. కాని నువ్వు కోరావు కాబట్టి ఒక వరం ఇస్తున్నాను. అర్జునుని తప్ప మిగిలిన పాండవులను ఒక్కరోజు మాత్రం నువ్వు జయించే వరం ప్రసాదిస్తున్నాను. ఇందులో ఆంతర్యాన్ని గ్రహించి ప్రవర్తించు" అని అంతర్ధానమయ్యాడు శివుడు. తరువాత జయద్రధుడు సింధు దేశానికి వెళ్లిపోయాడు.

తరువాత ఒకరోజు ధర్మరాజు వద్దకు మార్కండేయ మహర్షి వచ్చాడు. ధర్మరాజు అతనిని సాదరంగా ఆహ్వానించాడు. ఉచితాసనము ఇచ్చి అర్ఘ్య పాద్యాదులతో సత్కరించాడు.

" మహర్షి! మేము, ద్రౌపది ఈ అడవులలో ఇన్ని కష్టాలు పడుతున్నాము కదా. మా వలె అడవులలో కష్టములు పడ్డ వారు ఉన్నారా?" అని అడిగాడు. దానికి మార్కండేయ మహర్షి ఇలా చెప్పసాగాడు.

"దర్మజా! పూర్వము ఇక్ష్వాకు వంశంలో అజుడు అనే రాజు ఉండేవాడు. అతని కుమారుడు దశరధుడు. అతనికి ముగ్గురు భార్యలు. వారిలో కౌసల్య అను భార్యకు రాముడు, కైకేయి అను భార్యకు భరతుడు, సుమిత్ర అను భార్యకు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు అనే కుమారులు కలిగారు.

బ్రహ్మకు మానస పుత్రు డైన పులస్త్యునకు వైశ్రవణుడు అనే కుమారుడు జన్మించాడు. వైశ్రవణుడు తన తండ్రి పులస్త్యుని మాట వినకుండా, బ్రహ్మను గూర్చి తపస్సు చేసాడు. నలకూబరుడు అనే

కుమారుడిని, లోకంలో ఉన్న ధనానికి ఆధిపత్యాన్ని, లంకా రాజ్యాన్ని, శివునితో స్నేహాన్ని కోరుకున్నాడు.

పులస్త్యుడు తన శరీరము నుండి విశ్రవసుడు అనే వాడిని సృష్టించి వైశ్రవణునికి హాని చెయ్యమని పంపాడు. ఇది తెలిసి వైశ్రవణుడు విశ్రవసుని వద్దకు పోయి “అయ్యా నేను నీకు పుత్రసమానుడను. దయచూపుము” అని ఆయనకు నృత్త గీత విద్యావిశారదలయిన పుష్పోత్కట, మాలిని, బక లనే రాక్షస వనితలను సృష్టించి ఇచ్చాడు. వారు విశ్రవసునకు పరిచర్యలు చేస్తున్నారు.

విశ్రవసుడు వారికి సంతానాన్ని ప్రసాదించాడు. పుష్పోత్కటకు రావణుడు, కుంభకర్ణుడు, మాలినికి విభీషణుడు, బక కు ఖరుడు, శూర్పణఖ అనే కవలలు జన్మించారు. విశ్రవసుడు వారికి నామకరణం చేసాడు. వారిలో రావణుడు అత్యంత పరాక్రమ వంతుడు. పది తలలు కలవాడు. కోపిష్టి. కుంభకర్ణుడు కూడా కఠిన హృదయుడు. గర్విష్ఠి. విభీషణుడు మంచి గుణాలు కలవాడు. ఖరుడు దుర్మార్గుడు. బ్రాహ్మణులను అవమానించేవాడు. రక్త, మాంసాలు ఆహారంగా తీసుకొనే వాడు. శూర్పణఖ కూడా పాపాత్మురాలు. అధర్మపరురాలు.

ఆ రాక్షస కుమారులు తండ్రి విశ్రవసుని దగ్గర వేద వేదాంగాలు, విలువిద్య అభ్యసించారు. ఒకరోజు వైశ్రవణుడు (కుబేరుడు) వారిని చూడటానికి వచ్చాడు. అతని వైభవాన్ని చూచారు రావణాదులు. అది అంతా అతనికి తపస్సు వలన సమకూరినది అని తెలుసుకున్నారు. వారుకూడా తపస్సు చెయ్యడానికి బయలుదేరారు.

రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు బ్రహ్మను గూర్చి వేయి సంవత్సరాలు తపస్సుచేసారు. వారికి శూర్పణఖ, ఖరుడు సేవలు చేస్తున్నారు. కాని బ్రహ్మ ప్రత్యక్షం కాలేదు. రావణుడు తన తలల లో ఒక తలను ఖండించి అగ్నికి ఆహుతి చేసాడు. కాని బ్రహ్మ దేవుడు సాక్షాత్కరించలేదు. ఆ ప్రకారం వేయి సంవత్సరాలకు ఒక తల చొప్పున తొమ్మిది తలలను అగ్నికి ఆహుతి చేసాడు. పదివేలసంవత్సరాలు పూర్తి అయ్యాయి. తన పదవ తలను ఆహుతి చెయ్యడాని సిద్ధం అయ్యాడు రావణుడు. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షం అయ్యాడు. రావణునికి ఖండించిన తొమ్మిది తలలు తిరిగి ప్రసాదించాడు. ఏమి వరము కావాలో కోరుకోమన్నాడు.

అప్పుడు రావణుడు "బ్రహ్మదేవా! నేను దేవతలచేత కాని. పితరులచేత గాని, రాక్షసులచేతగాని, పాములచేతగాని, గంధర్వ,

విద్యాధర,యక్షుల చేతగాని, నేను ఓడిపోకూడదు. విశ్వంలో ఎక్కడికైనా నా ఇష్టం వచ్చినట్టు సంచరించే కామరూపాన్ని ప్రసాదించు." అని కోరాడు. బ్రహ్మదేవుడు "రావణా! నీకు మనుజుల వల్ల తప్ప ఇతరుల వల్ల నీకు మరణభయం లేదు" అని వరం ఇచ్చాడు.

తరువాత కుంభకర్ణుని చూచి "నీకు ఏమి వరం కావాలో కోరుకో" అని అడిగాడు. దానికి కుంభకర్ణుడు విధివశాత్తు తనకు అత్యంత ప్రియమైన నిద్రను ప్రసాదించమన్నాడు. అలాగే అని బ్రహ్మదేవుడు వరం ఇచ్చాడు. తరువాత విభీషణుని చూచి నీకు ఏం వరం కావాలో కోరుకో అన్నాడు. దానికి విభీషణుడు "దేవా! నాకు ఎంతటి ఆపద వచ్చినా నాలో పాప చింతన పొడసూపకుండు గాక. నాకు బ్రహ్మాస్త్రాన్ని అనుగ్రహించు" అని ప్రార్థించాడు.

దానికి బ్రహ్మ "అయ్యా! నీవు రాక్షస వంశంలో పుట్టినను ఇంతటి ధర్మబుద్ధిని కలిగి ఉన్నావు. నీకు అమరత్వంప్రసాదిస్తున్నాను. నీవు కోరిన వరాలు ఇచ్చాను" అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

బ్రహ్మదేవుని వలన వరాలు పొందిన రావణుడు అమిత గర్వంతో కుబేరునిమీదికి లంకా నగరానికి యుద్ధానికి వెళ్లాడు. రావణుని శక్తి

తెలుసుకున్నా కుబేరుడు పుష్పక విమానము  ఎక్కి లంకను వదలి పారిపోయాడు. రావణుడు అతనిని వెంబడించి అతని విమానాన్ని అపహరించాడు. దానికి యక్షరాజైన కుబేరుడు కోపించి "పెద్దవాడైన నన్ను అవమానించి నా విమానాన్ని అపహరించావు. ఇది పరులపాలు అవుతుంది" అని శపించాడు.

తరువాత రావణుడు దేవలోకం మీదికి దండెత్తి ఇంద్రుడిని దేవతలను జయించాడు. లోకాలను గడగడలాడించాడు. అప్పుడు ఋషులు దేవతలు అందరూ కలిసి అగ్ని దేవుని వెంటపెట్టుకొని బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లారు.  "విశ్రవసుని కుమారుడు రావణుడు దేవతలను జయించి వారిని తన దాసులుగా చేసుకున్నాడు. లోకాలు భయంతో వణుకుతున్నాయి. మీను కాపాడాలి" అని ప్రార్థించారు.

" అయ్యా! నేను  ఈవిషయంలో నారాయణునితో ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నాను.  శ్రీమహావిష్ణువు మానవునిగా జన్మించి అతనిని హతమారుస్తాడు. ఇంద్రుడు, మిగిలిన దేవతలు కోతులుగా ఎలుగుబంట్లుగా జన్మిస్తారు." అని దుందుభి అనే యక్ష కాంతను పిలిచి ఆమెను కుబ్జ రూపమున మంధర అనే పరిచారికగా భూలోకములో జన్మించి దేవకార్యము నిర్వహించమన్నాడు.

బ్రహ్మదేవుని ఆజ్ఞ ప్రకారము దేవతలు పెద్ద కొండల వలె వజ్రసమానమైన శరీరములతో, అత్యంత పరాక్రమ వంతులైన కోతులుగా ఎలుగు బంట్లుగా జన్మించారు.

ఇది ఇలా ఉండగా అయోధ్యలో దశరథ మహా రాజుకు శ్రీరాముడు మొదలగు పుత్రులు కలిగారు. వారు పెరిగి పెద్ద వారయ్యారు. వేదవేదాంగాలు చదువుకున్నారు. విలువిద్యలో నిష్ణాతు లయ్యారు. దశరథుడు వారికి వివాహాలు జరిపించాడు.

శ్రీరాముడిని యవ్వరాజ్య పట్టాభిషిక్తుని చేయడానికి నిశ్చయించాడు దశరథుడు. మంత్రులను, పౌరులను సంప్రదించి ముహూర్తం నిర్ణయించాడు. ఆ సమయంలో కైకేయి కుమారుడైన భరతుని పెంచిన మంథర అను దాది కైకేయి వద్దకు పోయి “అమ్మా! ఇదే చోద్యం అమ్మా. నీ భర్తకు నీ మీద అసలు ప్రేమ లేదా. నీ మీద ఎంతటి ప్రేమ చూపించాడు. ఆయన మాయ మాటలు నమ్మి నీవుమోసపోయావు అమ్మా. దశరథునికి నీ మీద అస్సలు ప్రేమ లేదు. అదుగో ఆ కౌసల్య మీదనే ప్రేమ. అందుకే ఆమె కొడుకును రాముని రాజును చేస్తున్నాడు. ఇంక నేనేం చేసేది. నిన్ను నీ కొడుకును పక్కన బెట్టి రాముడు రాజ్యం చేస్తాడు.” అని పలికింది మంథర.

ఆమె మాటలు విని కైకేయి సంభ్రమంతో వెంటనే తన భర్త దశరథుని వద్దకు వెళ్లింది. "మహారాజా! ఇదివరకు మీరు నాకు ఒక వరం ఇచ్చారు. ఆ వరం  ఇప్పుడు ప్రసాదిస్తారా" అని అడిగింది. అలాగే అన్నాడు దశరథుడు.  అప్పుడు కైకేయి తన కుమారుడు భరతుని యౌవరాజ్యపదమునందు అభిషిక్తుని చేయుట, శ్రీరాముని పదునాలుగేళ్ల ఏళ్ల అడవులకు పంపుట అనే వరాన్ని ప్రసాదించమని అడిగింది.  ఆమాటలు విని దశరథుడు స్పృహ తప్పి పడిపోయాడు.

తన తల్లి కైకేయి వరం కోరడం, తన తండ్రి ఆడిన మాట తప్పలేక మూర్ఛ పోవడం గురించి తెలిసుకున్నాడు శ్రీరాముడు. వెంటనే  తన తల్లి కైకేయి మాట ప్రకారము తన భార్య సీతతో సహా అరణ్యానికి బయలు దేరాడు.  శ్రీరాముని తమ్ముడు లక్ష్మణుడు అతనిని అనుసరించాడు.

తరువాత  దశరథుడు మూర్ఛనుంచి తేరుకున్నాడు. తన కుమారుడు శ్రీరాముడు, భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో వనవాసం వెళ్లాడని తెలుసుకున్నాడు.  ఆ శోకం తట్టుకోలేక దశరథుడు మరణించాడు.

కైకేయి భరతుడిని పిలిపించింది. "కుమారా! నీ తండ్రి దశరథుడు మరణించాడు. నీ అన్నలు వనవాసం వెళ్లారు. ఇంక ఈ రాజ్యానికి వారసుడివి నువ్వే. కాబట్టి రాజ్యభారాన్ని వహించు" అని చెప్పింది. భరతునికి కోపం, దుఃఖం ఒకేసారి కలిగాయి. "అమ్మా! నీవు మా సూర్య వంశానికి మచ్చ తెచ్చావు. కోరరాని కోరిక కోరి నా తండ్రి మరణానికి కారణమయ్యావు. నా అన్న రాముని, లక్ష్మణుని అడవులకు పంపావు. నీవు చేసిన పాపమునకు అంతం లేదా. " అని తల్లిని తూలనాడాడు.

తరువాత తండ్రికి యధావిధి అంతిమ క్రియలు నిర్వర్తించాడు. మంత్రులతోనూ సామంతులతోనూ ముగ్గురు తల్లులతోనూ, తమ్ముడు శత్రుఘ్నునితోనూ రాముడు ఉన్న త్రకూట పర్వతమునకు బయలుదేరాడు. జటా వల్కలములు, చర్మమును ధరించి న రాముని చూచాడు. ఆయన కాళ్లమీద పడి "అన్నా! మన తండ్రి మరణించాడు. నీవే మాకు దిక్కు. నీవు అయోధ్యకు వచ్చి రాజ్యాభిషిక్తుడవై మమ్ములను పాలింపుము" అని ప్రార్థించాడు. కాని రాముడు దానికి సమ్మతించలేదు. అప్పుడు భరతుడు రాముని పాదుకలు తీసుకొని అయోధ్యకు వచ్చి, నంది గ్రామము వచ్చి, రామ పాదుకలను పూజించుచూ, రాముని ప్రతినిధిగా రాజ్య పాలన చేయసాగాడు.

తరువాత రాముడు శరభంగ ముని ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడి నుండి దండకారణ్యము వెళ్లాడు. గోదావరీ తీరంలో ఒక పర్ణశాలను నిర్మించుకొని అక్కడ నివసిస్తున్నాడు. అప్పుడు దశకంఠుని చెల్లెలు శూర్పణఖ అనునది అక్కడకు వచ్చి వారికి అపకారము చేయబోగా, ఆ రాజకుమారులు ఆమె ముక్కు, చెవులు కోసి పంపారు.

శూర్పణఖ సోదరులు ఖరుడు, దూషణుడు అను వారలు14,000 మంది రాక్షసులతో రాముని మీదికి యుద్ధానికి వచ్చారు. రాముడు వారిని సంహరించాడు. అప్పుడు శూర్పణఖ రావణుని వద్దకు వెళ్లి అతని పాదముల మీద పడి ఏడ్చింది.

ఆమెకు జరిగిన పరాభవమును చూచి రావణుడు "సోదరీ శూర్పణఖా! నీకు పరాభవము చేసిన వాడు ఎవడు? వాడు ఎవడో చెప్పు వాడికి ఆయువు తీరిపోయింది. వాడిని వెంటనే వధిస్తాను" అన్నాడు కోపంతో రావణుడు. అప్పుడు శూర్పణఖ తాను రామ లక్ష్మణుల వద్దకు పోయినప్పటినుండి, ఖరదూషణుల మరణం వరకూ జరిగినది అంతా సవిస్తరంగా చెప్పింది.

రావణాసురుడు వెంటనే గోకర్ణ క్షేత్రానికి వెళ్లాడు. అక్కడ శ్రీరాముని చేతిలో పరాభవాన్ని పొందిన మారీచుడు అనే రాక్షసుడు శివుని గూర్చి తపస్సు చేసుకుంటున్నాడు. మారీచుడు రావణాసురునికి మంత్రిగా పని చేసాడు. మారీచుడు రావణాసురుని ఆహ్వానించాడు. "మారీచా! రాముడు అనే వాడు మన ఖరుని, దూషణుని రాక్షసులను సంహరించాడు. ఇప్పుడు దండకారణ్యంలో ఉన్నాడు. వాడిని పరాభవించాలి. నీవు నాకు సాయం చెయ్యాలి" అని రావణుడు మారీచుని అడిగాడు.

ఆ మాటలు వినగానే మారీచుడు వణికిపోయాడు. "రావణా! యుద్ధంలో రాముని పరాక్రమం గురించి నీవు వినలేదేమో! శివుడు కూడా రామ బాణాని ఎదురు నిలువ లేదు. నీకు చేటు కాలము దాపురించి ఈ పని చేస్తున్నావు. ఈ ప్రయత్నము మానుము. నేను రామునితో యుద్ధలో ఓడిపోయి ఈ విధంగా తపస్సు చేసుకుంటున్నాను." అని చెప్పాడు.

"మారీచా! నీవు నా మాట వినకపోతే ఇప్పుడే నేను నిన్ను సంహరిస్తాను." అన్నాడు రావణుడు. వీడి చేత చచ్చే కంటే రాముని చేత చావడం మంచిది అని అనుకున్నాడు మారీచుడు. "రావణా! నీకు

మంచి చెప్పాను. నీవు వినలేదు. నీ ఇష్టం వచ్చి నట్టు చెయ్యి" అని అన్నాడు.

"మారీచా! నీవు ఒక బంగారు లేడి రూపం ధరించి రాముని భార్య సీత ముందు నిలిచి ఆమెను ప్రలోభ పెట్టుము. సీత ఆ బంగాలేడిని తెచ్చి ఇమ్మని రాముని అడుగుతుంది. రాముడు నిన్ను పట్టుకోడానికి వెళతాడు. అప్పుడు నేను సీతను అపహరిస్తాను. సీతా వియోగంతో అతను పరితపిస్తాడు." అని చె ప్పాడు.

రావణాసురుని ఆదేశం మేరకు మారీచుడు బంగారు లేడి రూపంలో రాముని ఆశ్రమం దగ్గర తిరుగుతున్నాడు. సీత చూచింది. బంగారు లేడిని తెచ్చి పెట్టమని రాముని అడిగింది. విధి ప్రేరితుండయి రాముడు, సీత సంరక్షించమని లక్ష్మణుని నియోగించి, బంగారు లేడిని తరుముకుంటూ వెళ్లాడు. అంది నట్టే అంది అందకుండా పారిపోయింది బంగారు లేడి. రాముడు దానిని తరుముతూ చాలా దూరం పరుగెత్తాడు. అప్పటికి అర్ధం అయింది రాముడికి అది రాక్షస మాయ అని. వెంటనే బాణాన్ని సంధించి విడిచాడు. అది మారీచునికి తగిలింది. వాడు "హా లక్ష్మణా! సీతా! " అని రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ అరిచి, కిందపడి మరణించాడు.

ఈ అరుపును సీత విన్నది. లక్ష్మణుని చూచి "లక్ష్మణా! మీ అన్నయ్య ఆపదలో ఉన్నట్టు ఉన్నాడు. నీవు వెళ్లి రక్షించు" అని చెప్పింది. "అమ్మా! సీతా! భయపడకుము. శ్రీరాముని గెలువగల శూరుడు ఈ లోకంలో లేడు. ఇప్పుడే రాముడు శత్రుసంహారం చేసి రాగలడు" అని పలికాడు.

సీతకు కోపం వచ్చింది. ఆ కోపావేశంలో లక్ష్మణుని మీద అనుమానం కలిగింది. "అక్ష్మణా! నాకు నీ తలంపు అర్థం అయింది. నా మీద నీకు ఈ విధమైన జాలి ఎందుకు? నేను చావనైనా చస్తాను గాని నీకు దక్కను." అని కఠోరంగా పలికింది. లక్ష్మణుడు ఆ మాటలు వినలేక చెవులు మూసుకున్నాడు. వెంటనే విల్లు అమ్ములు తీసుకొని రాముడు వెళ్లిన మార్గం వైపు వెళ్లాడు.

అవకాశం కోసం ఎదురు చూస్తున్న రావణుడు సన్యాసి వేషంలో అక్కడికి వచ్చాడు. మార్గాయాసంతో అలిసిపోయి నట్టు కనిపించాడు. సీత ఆ సన్యాసిని చూచింది. ఆయనకు అతిథి సత్కారాలు చేసింది. తినడానికి పండ్లు ఇచ్చింది. సీతను చూస్తూ రావణుడు మోహంతో వివశుడయ్యాడు.

“సుందరీ! నా పేరు రావణుడు. నేరు దానవ నాయకుడను. నా రాజధాని లంక. నీవు నన్ను వరించి నన్ను భర్తగా చేసుకో. దివ్యమైన భోగాలు అనుభవించు. అయినా రాఘవుడు ఎక్కడ? వాడితో  ఈ అడవులలో ఇన్ని కష్టముడు పడుతున్నావా! ఇంక నీ మనసులో వేరు ఆలోచన రానీయకు. నన్ను వరించు.”

“అయ్యా! తమరు ఈ ప్రకారం మాట్లాడటం తగునా?  ఆకాశం నేల కూలినా, ఈ భూమి బ్రద్దలైనా, సముద్రములు ఇంకిపోయినా, సూర్యచంద్రులు తమ తేజములు కోల్పోయినా, నేను నా భర్త రాముని తప్ప అన్యుని మనసులో తలపను.” అని సీత పలికి దూరంగా పోయి నిలుచుంది.

రావణుడు  సీతను పట్టుకొని ఆకాశానికి ఎగిరి లంకానగరం వైపు పోతున్నాడు. అప్పుడు సీత భయంతో పెద్దగా కేకలు పెట్టసాగింది.  “ఓ దేవతలారా! నేను జనకమహారాజు కూతురిని. శ్రీరాముని భార్యను.  ఈ రాక్షసుడు నన్ను బలవంతంగా  ఎత్తుకుపోతున్నాడు. నన్ను దయతో కాపాడండి. మీకు నమస్కారం చేస్తాను” అని రోదించింది.

ఈమె ఏడుపు జ టాయువు అనే పక్షి విన్నది. జటాయువు రావణుని అడ్డగించాడు. "ఓరి రావణా! నిలువుము. ఈమెను ఎందుకు బలాత్కారంగా ఎత్తుకుపోతున్నావు? ఈమెను విడువుము. లేకపోయిన నేను నిన్ను సంహరిస్తాను. నేను జటాయువును నీకు తెలియదా! " అని రావణుని అడ్డగించాడు. జటాయువుకు రావణునికి ఘోర యుద్ధం జరిగింది. జటాయువు తన ముక్కుతో గోళ్లతో రావణుని రక్తం వచ్చేట్టు రక్కాడు. రావణుడు కోపంతో జటాయువు రెక్కలు ఖండించాడు. సీతను తీసుకొని పోతున్నాడు.

ఇంక తనను రక్షించే వారు ఎవరూ లేరని, నిరాశతో కిందికి చూస్తూ ఉంది. ఒక పర్వత శిఖరము మీద కొంతమంది వానరులు తిరుగుతున్నట్టు చూచింది. తన కొంగును చించి తన ఆభరణములు అందుతో మూటకట్టి ఆ పర్వత శిఖరం మీద ఉన్న వానరుల దగ్గర పడేట్టు జారవిడిచింది.

రావణుడు సీతను లంకకు తీసుకొని వెళ్లాడు. సీతను అశోక వనంలో ఉంచాడు. ఆమె రక్షణ కొరకు కొందరు రాక్షస వనితలను నియమించాడు.

(స్త్రీలను బంధించి తెచ్చి చెరలో ఉంచినపుడు వారికి రక్షణగా స్త్రీలను భటులుగా నియమించాలని త్రేతాయుగంలోనే ఉంది. రావణుడు ఎంతటి దుర్మార్గుడైనా, రాక్షసుడైనా, పాలనా పరంగా నియమాలు పాటించాడు. కాని ఈనాడు మన పోలీసు స్టేషన్లలో మగవారే స్త్రీలకు కాపలాగా ఉంటున్నారు. స్త్రీలను రాత్రిళ్లు పోలీసు స్టేషన్లలో ఉంచరాదని, స్త్రీలను స్త్రీలే విచారించాలని, స్త్రీలే కాపలాగా ఉండాలని రూల్సు ఉన్నాయి. కాని, చట్టాలను రూల్సును ఎవరూ పట్టించుకోవడం లేదు.)

అక్కడ దండకారణ్యంలో మారీచుని సంహరించిన తరువాత రాముడు కుటీరానికి తిరిగి వస్తున్నాడు. దారిలో లక్ష్మణుడు కనిపించాడు. "లక్ష్మణా! రాక్షసులు తిరిగే ఈ అరణ్యం లో సీతను ఒంటరిగా వదలి రావడం తగునా" అని మందలించాడు. దానికి లక్ష్మణుడు సీత తనను అనుమానించినందున రావలసి వచ్చింది అని చెప్పాడు. కాని మనసులో రాముడు చాలా బాధ పడ్డాడు.

రాముడు, లక్ష్మణుడు సీతను వెదకు కొనుచూ అడవిలో తిరుగుతున్నారు. దారిలో జటాయువును చూచారు. జటాయువు వారిని చూచి "అయ్యా! నా పేరు జటాయువు. నేను నీ తండ్రి దశరథునకు మిత్రుడను. నీ భార్య సీతను రావణుడు ఎత్తుకొని దక్షిణ దిక్కుగా

పోయినాడు. నేను అడ్డగిస్తే నా రెక్కలు ఖండించాడు." అని రావణుని గురించి చెప్పి ప్రాణములు విడిచాడు. రాముడు జటాయువుకు అంతిమ సంస్కారాలు గావించాడు.

తరువాత రామలక్ష్మణుడు దక్షిణ దిక్కుగా సీతను వెతుకుతూ వెళ్లారు. వారికి దారిలో కబంధుడు కనిపించాడు. కబంధుడు ఒక వింతజీవి. దానికి గుండెలో కళ్లు, పొట్టలో నోరు ఉన్నాయి. చేతులు చాలా పొడుగు. చేతులు చాచి జంతువులను పట్టుకొని తింటుంది. ఆ కబంధుడు లక్ష్మణుని పట్టుకంది. అంతటి బలవంతుడైన లక్ష్మణుడు కూడా ఆ బంధనం విడిపించుకోలేక పోయాడు. "అన్నా! శ్రీరామా! నన్ను రక్షించు! నీకు అన్ని ఆపదలే కలిగాయి. నీకు రాజ్యం పోయింది. తండ్రి మరణించాడు. అడవులలో కష్టాలు పడుతున్నావు. భార్యను పోగొట్టుకున్నావు. ఇప్పుడు ఈరాక్షసుడు నన్ను పట్టుకున్నాడు. నా వంటి దురదృష్టవంతుడు ఉంటాడా! " అని అరిచాడు.

అప్పుడు రాముడు "లక్ష్మణా! నీకేం భయం లేదు నేను ఉన్నాను" అని బదులు చెప్పాడు. వెంటనే తన బాణాలతో కబంధుని చేతులు ఖండించాడు. లక్ష్మణుడు బయట పడ్డాడు. వెంటనే ఒక కత్తి తీసుకొని కబంధుడి పొట్టను చీల్చాడు. ఆ రాక్షసుడు ఒక దివ్యపురుషుడుగా మారిపోయాడు.

"రామా! నేను విశ్వావసు అనే గంధర్వుడను. బ్రహ్మదేవుని శాపం వలన నాకు ఈ రాక్షస జన్మ వచ్చింది. నేడు మీ వలన నాకు శాపం నుండి మోక్షం కలిగింది. రావణుడు అనే రాక్షసుడు నీ భార్యను సీతను తీసుకొని పోయి లంకా నగరంలో ఉంచాడు. మీరు ఇక్కడి నుండి పోతూ ఉంటే పంపా సరస్సు వస్తుంది. దానికి అవతల ఋష్యమూక పర్వతము కలదు. అక్క డ వాలి సోదరుడు అయిన సుగ్రీవుడు అనే వానరుడు తన మంత్రులతో నివశిస్తున్నాడు. అతని తో నీవు సఖ్యము చేయుము. నీ కార్యము సిద్ధిస్తుంది." అని చెప్పి ఆ గంధర్వుడు వెళ్లిపోయాడు.

తరువాత రామ లక్ష్మణుడు చాలా దూరం ప్రయాణం చేసి పంపా సరోవర తీరం చేరుకున్నారు. ప్రశాంతమైన ఆ సరోవర తీరం చూచి రాముడికి సీత జ్ఞాపకం వచ్చింది. సీతను తల్చుకుంటూ పెద్దగా ఏడవ సాగాడు. అప్పుడు లక్ష్మణుడు "అన్నయ్యా! నీవంటి పురుష శ్రేష్ఠులు ఇలా ఏడవ తగునా! ఆపదలు వచ్చినప్పుడు ధైర్యంతో ఎదుర్కోవాలి. ఓర్పు వహించాలి. అంతేగాని ఇలా దుఃఖించ తగదు. అన్నయ్యా! నేను నీ తమ్ముడను, నీ సేవకుడను. నేను పక్కనుండగా నీవు శోకించతగదు." అని చెప్పాడు.

తరువాత రాముడు  పంపా సరోవర తీరాన తన పితరులకు తర్పణం విడిచాడు. వారికి ఋష్యమూక పర్వతము చాలా ఎత్తుగా కనపడింది. వారు ఆ కొండను చేరుకున్నారు.

ఋష్యమూక పర్వతము శిఖరము మీద ఉన్న సుగ్రీవుడు లనే వానరరాజు రామలక్ష్మణులను చూచాడు వారి వృత్తాంతము తెలుసుకొనుటకు తన సచివుడు ఐన హనుమంతుని పంపించాడు. హనుమంతుడు చాకచక్యంగా వ్యవహరించి రామలక్ష్మణుల గురంచి సమస్త సమాచారము సేకరించాడు. దానిని  సుగ్రీవునకు నివేదించాడు. రామలక్ష్మణులకు, సుıగీవునకు మైత్రి చేసాడు.

వెంటనే సుగ్రీవుడు సీతాదేవి కింద జారవిడిచిన ఆభరణాల మూటను రాముడికి చూపించాడు. రాముడు ఆ ఆభరణాడు గుర్తు పట్టాడు. సుగ్రీవుడు తన అన్న వాలి తన రాజ్యము అపహరించి తనను వెడల గొట్టాడని, వాలిని చంపి తన రాజ్యం తనకు ఇప్పించమని కోరాడు బదులుగా తాను సీతా అన్వేషణలో సాయం చేస్తానని అన్నాడు. దానికి రాముడు ఒప్పుకున్నాడు. అందరూ వానర రాజధాని కిష్కింధకు వెళ్లారు.

సుగ్రీవుడు తన అన్న వాలిని యుద్ధానికి పిలిచాడు. వాలి సుగ్రీవునితో యుద్ధానికి పోతున్నాడు. వాలి భార్య తార అతనిని వారించింది. “నాధా! సుగ్రీవునికి ఏదో సాయం లభించినట్టు ఉన్నది. దశరధుని కుమారుడైన రామునితోనూ అతని తమ్ముడు లక్ష్మణుని తోనూ సుగ్రీవుడు మైత్రి కుదుర్చుకున్నట్టు నేను విన్నాను. రాముని భార్యను లంకాధిపతి రావణుడు అపహరించాడు. రాముడు సుగ్రీవుని సాయం కోరాడు. దానికి ప్రతిఫలంగా సుగ్రీవునికి సాయం చేస్తాను అన్నాడట. అదియును కాక మహా బలవంతులైన మైందుడు, ద్వివిదుడు, హనుమంతుడు, జాంబవంతుడు అతనికి మంత్రులుగా ఉన్నారు. కావున నీవు ఇప్పుడు సుగ్రీవునితో యుద్ధానికి పోవడం నాకు ఇష్టం లేదు.” అని చెప్పింది తార.

కాని సుగ్రీవుడు భార్య మాటలు లక్ష్య పెట్టలేదు. సుగ్రీవునితో యుద్ధానికి బయలు దేరాడు. సుగ్రీవుని చూచి వాలి “ఓరి దుష్టాత్మా! నేను నిన్ను ఎన్నోసార్లు ఓడించి తరిమి కొట్టాను. మరల సిగ్గు లేకుండా యుద్ధానికి ఎందుకు వచ్చావు” అని అడిగాడు.

“ఓరి వాలీ! నేను నా భార్యను పోగొట్టుకున్నాను. రాజ్యం పోగొట్టుకున్నాను. ఇంక నేను ఉండి చేసేదేముంది. అందుకే వచ్చాను”

అన్నాడు. వాలి సుగ్రీవులు చెట్లను, రాళ్లను ఆయుధములుగా చేసుకొని ఘోరంగా యుద్ధం చేసారు. తరువాత ఒకరితో ఒకరు ముష్టియుద్ధం చేసారు.

వాలి సుగ్రీవులు ఒకే విధంగా ఉన్నారు. వారిలో సుగ్రీవుని పోల్చుకోలేక, రాముడు వారి యుద్ధాన్ని చూస్తూ ఉన్నాడు. ఇది గమనించాడు ఆంజనేయుడు సుగ్రీవుని మెడలో ఒక మాలను వేసాడు. దానిని గుర్తు పెట్టుకొని రాముడు తన బాణంతో వాలిని చంపాడు. వాలి చని పోతూ దశరధ పుత్రుడైన రాముని నిందించుచూ ప్రాణాలు విడిచాడు. రాముడు సుగ్రీవుని వానర రాజ్యానికి పట్టాభి షిక్తుని గావించాడు. వాలి భార్య తారను సుగ్రీవునికి ఇచ్చాడు.

సుగ్రీవుడు రామునికి నమస్కరించి “రామా! నీ మాట నీవు నిలబెట్టుకున్నావు. ఇప్పుడు ఎండాకాలం, తరువాత వర్షాకాలం. తగిన సమయంకాదు. వర్షాకాలం కాగానే నేను వానరులను సీతాన్వేషణకు పంపుతాను” అని చెప్పాడు.

లంకలో అశోక వనంలో ఉన్న సీత రాముని మనసులో స్మరించుకుంటూ కాలం గడుపుతూ ఉంది. సీతకు కాపలాగా రాక్షస

వనితలు త్ర్యక్షి, లలాటాక్షి, త్రిస్తని, ఏకపాద, దీర్ఘజిహ్వ, అజిహ్వ, త్రిజట, ఏక లోచన, మొదలయిన వారు సీత చుట్టూ కాపలాగా ఉన్నారు. ఆమెను బాధిస్తున్నారు. రావణుని పెండ్లి చేసుకోమని బలవంతం చేస్తు న్నారు. అది భరించలేక సీత "అమ్మా నేను రాముని తప్ప మరొక పురుషుని మనసులో తలపను. ఇది నిజము. నీకు జీవించ వలెనని కోరిక లేదు. మీకు ఇష్టం వచ్చినట్టు చేయండి. ఇంక ఆలస్యం ఎందుకు." అని పలికింది. సీత చావడానికి కూడా భయపడటం లేదని కొంతమంది రాక్షస స్త్రీలు రావణునికి చెప్పడానికి వెళ్లారు.

త్రిజట అనే రాక్షసి సీత పక్కన చేరి "అమ్మా! సీతా! నీకు సంతోషం కలిగించే మాట ఒకటి చెపుతాను. నామాట నిజము. నమ్ము. అవింధ్యుడు అనే రాక్షసుడు రాముని మేలు కోరేవాడు నన్ను ఇక్కడి నియమించాడు. నీకు మంచి మాటలు చెప్పమన్నాడు. నిన్ను రావణుడు అపహరించిన తరువాత రామ లక్ష్మణులు కలుసుకున్నారు. నిన్ను వెదుకుతూ సుగ్రీవుని కలుసుకున్నారు. అతనితో స్నేహం చేసారు. సుగ్రీవుడు నిన్ను వెదకించే పని మీద ఉన్నాడు. రావణునికి, రంభ కారణంగా, నలకూబరుడు ఇచ్చిన శాపం ఒకటి ఉన్నది. ఆ శాప కారణంగా రావణుడు నిన్ను బలాత్కారం చెయ్యడు. నీకు రావణుని వలన భయం లేదు.

ఈ దుర్మార్గుడైన రావణునికి చేటు కాలం దాపురించినదని దెలిపే స్వప్నము నాకు వచ్చినది. గాడిదలు కట్టిన రధము మీద, ఒంటినిండా నూనె పూసుకొని, వెంట్రుకలు విరబోసుకొని, రావణుడు దక్షిణదిక్కుగా వెళుతున్నాడు. అతని చుట్టూ కుంభకర్ణుడు, ఇతర రాక్షసుడు  ఎర్రని పూలు ధరించి,  జుట్టు విరబోసుకొని, ఒంటి మీద బట్టలు లేకుండా, యముని దిక్కుగా వెళుతున్నారు. విభీషణుడు తెల్ల గొడుగు, తెల్ల పూలు ధరించి, తెల్లని కొండమీద తన మంత్రులతో  కొలువు తీరి ఉండటం నేను స్వప్నంలో చూచాను.

సీతా! నాకు రాముడు కూడా  కలలో కనిపించాడు. రాముడు పెద్ద ఏనుగును ఎక్కి, లక్ష్మణునితో కూడి, సంతోషంగా పాయసం ఆరగిస్తున్నట్టు కనపడింది. నా కల నిజము అవుతుంది.  నీవు నీ భర్తను వేగంగా పొందగలవు" అని పలికింది. త్రిజట మాటలు విని సీత కొంచెం ఊరట చెందింది.

రావణుడు సీత మీద మోహం చేత అశోక వనానికి వచ్చాడు. " ఓ సీతా! నీమీద నేను మనసు పడ్డాను. ఎందుకు  ఈవిధంగా అన్న పానీయాలు మాని కృశిస్తున్నావు. నన్ను  కృపతో ఏలుకొనుము. నేను దేవతలను,  యక్షులను, రాక్షసులను జయించిన వాడను.  ఎంతోమంది

స్త్రీలు నా అధీనంలో ఉన్నారు.కాని నేను నీ మీద మనసు పడ్డాను. అది నీ అదృష్టం. ఓ లలనా! రాముడు ఎవరు? రాజ్యం కోల్పోయి అడవులలో తిరుగుతున్నాడు. ఒక అల్పుడు. వాడి మీద నీకు ప్రేమ ఏమిటి? వాడి వల్ల నీవు ఏమి సుఖ పడతావు?

నేను సకల లోకములను ఈశ్వరుడను. నీకు 14 కోట్లమంది రాక్షసులు నాకు సేవచేస్తున్నారు. 28 కోట్ల మంది రాక్షసులు, 86 కోట్ల మంది యక్షులు, నన్ను సేవిస్తున్నారు. ధనాధ్యక్షుడు అయిన కుబేరుడు నా అన్న. విశ్రవసుడు నా తండ్రి. గంధర్వ కన్యలు, అప్సరసలు నన్ను సేవిస్తూ ఉంటారు. నన్ను పంచమ లోక పాలకుడు అని ముల్లోకములలో కీర్తిస్తుంటారు. దేవేంద్రుని గృహంలో ఉన్న సమస్తము నా గృహంలో ఉన్నా యి. ఇంతటి ఐశ్వర్యమునకు, నా జీవితమునకు అధీశ్వరివై సుఖించుము" అని రావణుడు పలికాడు.

దానికి సీత ఒక గడ్డిపోచను రావణునికి తనకు మధ్య పెట్టి, ఇలా పలికింది. "నేను పరస్త్రీని. అబలను. పతివ్రతను. మానవాంగనను. నీవు రాక్షసుడవు. నీయందు నాకు ఏమాత్రం ప్రేమ లేదు. నా తో నువ్వు ఏమి సుఖిస్తావు. నీవు బ్రహ్మదేవుని మనుమడివి అని, కుబేరుడి తమ్ముడిని అని చెప్పుకున్నావు. అలాంటి వాడికి ధర్మ తెలియాలి. చెడు ప్రవర్తన

విడిచి పెట్టాలి. అంతేకాని ఈ ప్రకారం సిగ్గులేకుండా మాట్లాడవచ్చునా!" అని సీత ఏడుస్తూ ఉంది. రావణుడు కూడా కొన్ని దుర్వచనములు మాట్లాడి వెళ్లిపోయాడు." అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు రామాయణ కథను వినిపించాడు.

మహా భారతము, అరణ్య పర్వము,

షష్ఠాశ్వాసము సమాప్తము.

ఓం తత్సత్.

# మహాభారతం

## అరణ్య పర్వము

### సప్తమాశ్వాసము.

(ఎఱ్ఱాప్రగ్గడ ప్రణీతము)

నైమిశారణ్యంలో, శౌనక మహర్షి ఆశ్రమంలో, రోమహర్షుణి కుమారుడైన ఉగ్రశ్రవసుడు (సూతి) అనే పౌరాణి కుడు, మహా భారత కధను, శౌనకాది మహా మునులకు ఇలా చెప్పసాగాడు.

సుగ్రీవుడు కిష్కింధలో రాజభోగాలు అనుభవిస్తున్నాడు. రాముడు, లక్ష్మణునితో సహా మాల్యవంతం అనే పర్వత గుహలో ఉన్నాడు. వర్షాకాలం గడిచిపోయింది.

రాముడు లక్ష్మణుని చూచి “లక్ష్మణా! ఈ సుగ్రీవుడు రాజభోగములతో కాలం గడుపుతున్నాడు. మనలను మరచినట్టున్నాడు. నీవు ఇప్పుడే కిష్కింధకు పోయి సుగ్రీవుని సంహరించి రమ్ము. ఒక వేళ సుగ్రీవుడు ఇంతకు ముందే సీతాన్వేషణకు ఏర్పాట్లు చేసి ఉంటే అతడిని ఇక్కడకు తీసుకొని రమ్ము.” అన్నాడు రాముడు.

అన్న ఆజ్ఞను శిరసావహించి లక్ష్మణుడు కిష్కింధకు వెళ్లాడు. సుగ్రీవుని కలిసి రాముని ఆజ్ఞను వినిపించాడు. సుగ్రీవుడు వణికిపోయాడు.

“నేను అన్న మాటను మరచునీచుడను కాను. సీతను వెదకుటకు వానరులను నలుదిక్కులకు పంపాను. ఒక నెలలో తిరిగి రమ్మని చెప్పాను. వారు తిరిగి రావడానికి ఇంక  ఐదు రోజులు గడువు ఉన్నది. సీతా దేవి గురించి  వార్త తెలియగానే నేను రాముని వద్దకు వస్తాను” అని వినయంతో చెప్పాడు.

ఆ సమాధానంతో తృప్తి చెందాడు లక్ష్మణుడు. సుగ్రీవునితో సహా రాముని వద్దకు వెళ్లాడు.  తాను చేసిన ఏర్పాట్లను గురించి రామునికి చెప్పాడు. రాముడు సంతృప్తి చెందాడు.

కొన్నిరోజులకు అన్ని దిక్కులకు వెళ్లిన కపులు తిరిగి వచ్చారు. సీత జా డ తెలియలేదు అని చెప్పారు. దక్షిణ దిక్కుకు వెళ్లిన కపులు ఇంకా రాలేదు. నెల రోజుల తర్వాత  కొంతమంది కపులు సుగ్రీవునితో ఇలా చెప్పారు.

“ మహారాజా! తమరు అత్యంత ప్రియముగా పెంచుకొనుచున్న మధువనము లో  అంగదుడు, హనుమంతుడు, మొదలైనవానరులు ఇష్టం వచ్చినట్టు తిరుగుచూ ఫలములు ఆరగించుచూ, వన రక్షకులమైన మేము వారిని వారించగా, మమ్ములను కొట్టారు.” అని చెప్పారు.

అంగదుడు హనుమంతుడు దక్షిణదిక్కుగా వెళ్లారు  వారు సీత గురించి మంచి వార్తను తెచ్చి ఉంటారు. అందుకే ఆనందంతో ఉత్సాహంలో తోటలో విహరిస్తున్నారు అని అనుకొన్నాడు సుగ్రీవుడు.

తరువాత వానరులందరూ  శ్రీరాముని సన్నిధికి వచ్చారు. హనుమంతుడు శ్రీరాముని, సుగ్రీవుని చూచి ఇలా పలికాడు.

"దేవా! సీతను నేను చూచాను. దక్షిణదిశగా పోయి, సీతాదేవిని చూచాను. అన్నివిషములను సవిస్తరంగా వివరిస్తాను. మేము సీతను వెదకుచూ పోతుండగా మాకు  ఒక పెద్ద సొరంగం కనపడింది.  ఆ  సొరంగంలో ప్రయాణించి కొన్నాళ్లకు ఒక నగరాన్ని చేరుకున్నాము. అక్కడ ఒక తాపసి మాకు కన్పించింది  మమ్ములను ఆదరించింది.

తరువాత మలయ పర్వతం చేరుకున్నాము. అది సముద్రతీరము.  ఆ సముద్రం దాటడానికి ఎవకిరి శక్యం కాలేదు. సీతను చూడకుండా వెళ్లడం కన్నా చావడం మేలు అని అనుకున్నాము. అలా మేము మాట్లాడుకుంటూ ఉంటే మాకు ఒక పక్షిరాజు కనిపించాడు.

"అయ్యా మీ మాటలలో నాకు జటాయువు అని పేరు వినపడింది మీరు ఎవ్వరు ఏపని మీద వచ్చారు.  నా పేరు సంపాతి. మా తమ్ముడు జటాయువు. నేను నా తమ్ముడు జటాయువు ఒకసారి సూర్యమండలానికి ఎగిరాము. నా

రెక్కలు మాడిపోయి నేను ఇక్కడ పడ్డాను. అప్పటి నుంటి ఇక్కడే ఉన్నాను. నా తమ్ముడు జటాయువు గురించి మీకు తెలిస్తే నాకు చెప్పండి” అని అడిగాడు.

అప్పుడు నేను సంపాతితో రావణుడు సీతను ఎత్తుకొని పోవడం, జటాయువు అడ్డగించడం, రావణుని చేతిలో చావడం గురించి చెప్పాను. అప్పుడు సంపాతి తన తమ్ముని మరణం గురించి విచారించాడు.

“అయ్యా నాకు రావణుని గురించి తెలియును. వాడు రాక్షసుడు. ఇక్కడికి నూరు యోజనముల దూరంలో లంక ఉన్నది. అక్కడ రావణుడునివసిస్తున్నాడు. మీకు అక్కడ సీతా దేవి కనిపించవచ్చును” అని చెప్పాడు.

కాని మా లో ఎవరికి సముద్రాన్ని దాటే శక్తిలేదు. కాని నాకు నా తండ్రి వాయుదేవుని దయ వలన ఆ శక్తి సమకూరింది. నేను సముద్రం దాటి లంకను చేరుకున్నాను.

లంకా నగరం చాలా పెద్దది. సీతా దేవిని వెదుకుచూ అనేక ప్రదేశాలు తిరిగాను. అశోక వనంలో కన్నీటితో, శోకంతో తల వంచుకొని కూర్చుని ఉన్న సీతను చూచాను. నేను పోయి సీతాదేవికి నన్ను నేను రామ దూతగా పరిచయం చేసుకున్నాను మీ క్షేమం గురించి చెప్పాను. త్వరలో వచ్చి మిమ్ములను తీసుకువెళ్తారు అని చెప్పాను ఆమె నా మాటలు నమ్మలేదు. నేను రాక్షసుడను కాను నా మాట నమ్మమని చెప్పాను.

"అయ్యా! నిన్ను నమ్ముతున్నాను. త్రిజట అనే రాక్షసి కూడా చెప్పింది. నువ్వు పోయి రామునికి నా గురించి చెప్పి సుగ్రీవ సహాయంతో నన్ను ఇక్కడినుండి తీసుకు పొమ్మని చెప్పు. నా ఆనవాలుగా ఆ శిరోభూషణంగా చూపించు" అని ఈ శిరోభూషణం నాకు ఇచ్చింది. ఇంకా తమరు చిత్రకూట పర్వతము మీద ఉండగా జరిగిన మాయకాకి కథకూడా చెప్పింది." అని హనుమంతుడు రామునితో చెప్పి శిరోభూషణాన్ని రామునికి అందచేసాడు.

రాముడు ఆ శిరోభూషణాన్ని తన గుండెలకు అదుముకున్నాడు . "సుగ్రీవా ఇంక ఆలస్యం ఎందులకు రావణుడిపై దండెత్తడానికి తగు సన్నాహాలు చెయ్యి" అని చెప్పాడు. సుగ్రీవుడు అందరి వానర వీరులకు వర్తమానం పంపాడు.

నలుదిక్కుల నుండి వానరులు లక్షలు కోట్ల సంఖ్యలో వస్తున్నారు. గవయుడు, గజుడు, కుముదుడు,సుషేణుడు, కోట్ల కొద్దివానరవీరులతో యుద్ధానికి తరలి వచ్చారు. జాంబవంతుడు అనే భల్లూకము తన భల్లూక సేనతో వచ్చాడు. ఒక శుభముహూర్తములో శ్రీరాముడు, లక్ష్మణుడితో సహా, సుగ్రీవుని ఆధ్వర్యములో రావణుని మీదికి దండయాత్రకు వెడలినాడు. ఆ సేనకు వాయునందనుడు (హనుమంతుడు) నాయకత్వం వహించాడు. అంగదుడు, నీలుడు, నలుడు మొదలైన వానర వీరులు అతనికిసాయంగా నిలిచారు.

కపి సైన్యం అంతా దక్షిణ సముద్రతీరానికి చేరింది. శ్రీరాముడుసుగ్రీవుని చూచి "సుగ్రీవా! ఈ సముద్రాన్ని దాటడానికి ఉపాయం నువ్వే ఆలోచించాలి." అని అన్నాడు. కొంతమంది తెప్పలు కట్టి దాటుదాము అని చెప్పారు.

దానికి శ్రీరాముడు "మన సైన్యము లెక్కకు మించి ఉన్నది. వీళ్లకు సరిపోవు తెప్పలు పడవలు తయారు చెయ్యడం అసాధ్యం. పైగా మనం సముద్రం తెప్పల మీద దాటుతుంటే శత్రు సైన్యాలు  ఊరుకుంటాయా. మనలను సముద్రంలో ముంచేస్తాయి.  నాకు తోచిన ఉపాయం చెపుతాను వినండి.  నేను ఉపవాస దీక్ష వహించి సముద్రుని పూజిస్తాను. సముద్రుని సహాయం లేనిది మనం ఏమీ చెయ్యలేము. సముద్రుడు సామో పాయంతో లొంగక పోతే, నా బాణాలతో సముద్రుని ఇంకింప చేస్తాను." అన్నాడు.

శ్రీరాముడు ఉపవాస దీక్షతో సముద్రుని ఆరాధిస్తున్నాడు. సముద్రుడు ప్రత్యక్షం అయ్యాడు "అయ్యా నీవు మాకులంకా నగరం పోవడానికి దారి ఇవ్వాలి. లేకపోతే సముద్రాన్ని ఇంకింప చేస్తాను" అని అన్నాడు శ్రీరాముడు.

దానికి సముద్రుడు "అయ్యా నేను నీకు ఏ విధంగా ఆటంకం కలిగించను. ఈరోజు నేను నీ బలప్రయోగానికి దారి ఇస్తే ప్రతివాడూ తన బలాన్ని చూపి నన్ను దారి  ఇమ్మంటాడు. నన్ను వశం చేసుకోడానికి చూస్తాడు. అది మంచిది కాదు. మీ కపి వీరులలో నలుడు అనే శిల్పకర్మ ఉన్నాడు. వాడి సాయంతో మీరు నా మీద ఒక సేతువు  కట్టండి. వాడు వేసే రాళ్లు అన్ని నేను ముంచకుండా తేలేట్టు చేస్తాను. మీరు ఆ సేతువుమీద సముద్రం దాటవచ్చును" అని ఉపాయం చెప్పాడు.

సముద్రుడు. శ్రీరాముడు నలుడిని పిలిచి వారధి కట్టమన్నాడు. నలుడు వంద యోజనములు పొడుగు,పది యోజనముల వెడల్పున ఒక వారధి నిర్మించాడు.

లంకలో ఉన్న విభీషణునికి అన్న రావణుని తో పొసగలేదు. అతను లంకనుంచి బయటకు వచ్చి శ్రీరాముని శరణు జొచ్చాడు. శ్రీరాముడు విభీషణుడికి అభయం ఇచ్చాడు. శ్రీరాముడు,వానర వీరులు, వానర సైన్యము నీలుడు కట్టిన వారధి మీద సముద్రమును దాటి లంకా పట్టణాన్ని చేరుకున్నాయి. శ్రీరాముడు త్రికూట పర్వతము మీద ఎక్కి లంకా నగరానికి నాలుగు పక్కల సైనిక శిబిరములు ఏర్పాటుచెయ్య మన్నాడు. వారన సైన్యము లంక చుట్టుపక్కల శిబిరాలు నిర్మించుకున్నాయి.

రావణుని గూఢ చారులైన శుకుడు, సారణుడు వానరుల ఆకారాలు దాల్చి వానరులలో కలిసిపోయారు. విభీషణుడు వారిని గుర్తించి రామునికి పట్టి ఇచ్చాడు. రాముడు వారికి తనసైన్యాన్ని అంతా చూపించి లంకకు పంపించి వేసాడు. శుకసారణులు లంకకు చేరి రాముడి సేన అజేయమనీ, గెలువసాధ్యం కాదని చెప్పారు. రావణుడు లంకకు తగిన రక్షణ కల్పించాడు.

శ్రీరాముడు అంగదుని పిలిచి "అంగదా నీవు రావణుని వద్దకు వెళ్లి సీతను వదలి పెట్టమని చెప్పుము. తగిన విధముగా బుద్ధిగా చెప్పుము" అని చెప్పాడు.

అంగదుడు రావణుని వద్దకు వెళ్లాడు. రావణుని కొలువు కూటము లోకి ప్రవేశించి రావణుని చూచి ఇలా అన్నాడు "రావణా! సూర్యవంశ సంజాతుడు, రాముడు నీతో ఇలా చెప్పమన్నాడు. అడవులలో తపస్సుచేసుకుంటున్న మునులను చంపావు. దేవతా స్త్రీలను బంధించావు. మహాపచారం చేసావు. ఇవి అన్నియు ఒక టి. నీవు నా ఎడల చేసిన అపరాధం ఒక్కటీ చాలా పెద్ద అపరాధము. నాతో యుద్ధం అన్నా చెయ్యి లేకపోతే నన్ను శరణు వేడుము. నా జానకిని నా వద్దకుపంపుము. మరొక విధంగా నీకు జీవించి ఉండటం కుదరదు. నీకు మనుష్యులు అంటే అనుమానంగా ఉంది. రాక్షసులను పేరుకూడా లేకుండా చేస్తాను. జాగ్రత్త" అని అంగదుడు పలికాడు.

ఈ మాటలు విన్న రావణుడు కనుసైగ చేసాడు. కొంతమంది రాక్షసులు అంగదుని పట్టుకోడానికి ప్రయత్నించారు. అంగదుడు పైకి ఎగిరి వాళ్లను కిందికి తోసాడు. ఆ తోపుడుకు వారు మరణించారు. అంగదుడు రాముని వద్దకుపోయి జరిగింది చెప్పాడు. శ్రీరాముడు యుద్ధానికి అనుమతి ఇచ్చాడు. వానరులు లంకను చుట్టుముట్టారు. లంకా నగరానికి కాపలా ఉన్న రాక్షసులను తరిమి వేసారు. కోట గోపురములను ధ్వంసం చేసారు.

ఇది తెలిసి రావణుడు తన సైన్యాన్ని యుద్ధానికి పంపాడు. రాక్షస వీరులు వానరులతో యుద్ధం చేస్తున్నారు. రాముడు, లక్ష్మణుడు కూడా యుద్ధానికి ఉపక్రమించారు. ఘోర మైన యుద్ధం జరిగింది. రాక్షస సైన్యం మాయాయుద్ధం చేస్తున్నారు. మాయా యుద్ధంలో ఆరితేరిన విభీషణుడు విజృంభించి రాక్షసులను సంహరించసాగాడు. రాక్షసులు ఈవిషయాన్ని రావణునికి చెప్పారు.

రావణుడే స్వయంగా రణరంగానికి బయలుదేరాడు  రామరావణుల యుద్ధం ప్రారంభం అయింది. లక్ష్మణుడు రావణుని కుమారుడైన ఇంద్రజిత్తును తన వాడి బాణాలతో ముంచెత్తాడు. రాముని బాణముల ధాటికి ఆగలేక రావణుడు లంకకు వెళ్లాడు. వీరుడైన ప్రహస్తుని రణరంగానికి పంపాడు. విభీషణుని నాయకత్వంలో వానర వీరులు, ప్రహస్తుని నాయకత్వంలో రాక్షస వీరులు యుద్ధం చేస్తున్నారు. విభీషణుడు తన శక్తి అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. ప్రహస్తుడు మరణించాడు. అతని స్థానంలో ధూమ్రాక్షుడు వచ్చాడు. అతనిని హనుమంతుడు ఎదుర్కొన్నాడు. హనుమంతుని బలం ముందు రాక్షస సేనలు నిలువలేక పోయాయి. హనుమంతుడు ధూమ్రాక్షునితో ద్వంద యుద్ధం చేసి అతనిని సంహరించాడు.

ప్రహస్తుడు, ధూమ్రాక్షుడు మరణించారని తెలుసుకొని రావణుడు చింతించాడు.  నిరంతర నిద్రలో ఉన్న కుంభకర్ణుని నిద్రలేపమని ఆజ్ఞ ఇచ్చాడు. రాక్షసవీరులు కుంభకర్ణుని నిద్రలేపడానికి సమాయత్తంఅయ్యారు.  దుంధుభులు మ్రోగించి, సింహనాదాలు చేసి, కుంభకర్ణుని నిద్రలేపారు.

నిద్రలేచిన కుంభకర్ణుని తో రావణుడు “తమ్ముడా! నీవు హాయిగా నిద్రపోతున్నావు. నేనే చాలా ఆపదలో ఉన్నాను. నేను దశరధ కుమారుడైన రాముని భార్యను అపహరించి తెచ్చాను. రాముడు వానర సాయంతో నా మీదకు యుద్ధానికి వచ్చాడు. మన వీరులు ప్రహస్తుడు, ధూమ్రాక్షుడు మరణించారు. కాబట్టి నీవు యుద్ధానికి బయలుదేరాలి. నీకు వజ్రవేగుడు, ప్రమాధుడు తోడుగా ఉంటారు” అని పలికాడు.

అన్న ఆజ్ఞ మేరకు కుంభకర్ణుడు యుద్ధానికి బయలుదేరాడు. కుంభకర్ణుని భయంకర ఆకారాన్ని చూచి వానరులు ఆశ్చర్యపోయారు. వానరవీరులను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా కుంభకర్ణుడు రామలక్ష్మణుల వైపుకు దూసుకుపోతున్నాడు. కుంభకర్ణుని ఆపడానికి వానరవీరులు విఫలయత్నం చేసారు. కాని కుంభకర్ణుడు వానరులను మ్రింగుతూ చంపుతూ ముందుకుపోతున్నాడు. కుంభకర్ణుడు సుగ్రీవుని పట్టుకున్నాడు. ఇది చూచి లక్ష్మణుడు తన బాణాలతో కుంభకర్ణుని కొట్టాడు. ఆ దెబ్బకు కుంభకర్ణుడు సుగ్రీవుని వదలి లక్ష్మణుని వైపు వచ్చాడు. లక్ష్మణుడు తన బాణాలతో కుంభకర్ణుని రెండు చేతులునరికాడు. కాని అతనికి మరల నాలుగు చేతులు మొలిచాయి. మరల ఖండించాడు. మరల మొలిచాయి. ఇలాకాదని లక్ష్మణుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి కుంభకర్ణుని సంహరించాడు.

ఇది చూచి వజ్రవేగుడు, ప్రమాధి అనే రాక్షసవీరులు లక్ష్మణుని మీదికి వచ్చారు. అప్పుడు హనుమంతుడు, నీలుడు రెండు కొండలు వారి మీదికి విసిరారు. వజ్రవేగుడు, ప్రమాధి అనే రాక్షసవీరులు మరణించారు. కుంభకర్ణుడు, వజ్రవేగుడు, ప్రమాధి అనే రాక్షసవీరులు మరణం గురించి తెలుసుకొని రావణుడు ఎంతో చింతించాడు.

అప్పుడు రావణుని కుమారుడు మేఘనాధుడు తండ్రి వద్దకు వచ్చాడు. "తండ్రీ! నన్ను రణరంగానికి పంపండి. వానరవీరులను నేను హతమారుస్తాను.

శత్రువులను సంహరిస్తాను. రామలక్ష్మణులను బంధించి తెచ్చి నీముందు ఉంచుతాను.” అని పలికాడు.

మేఘనాధుని ( ఇంద్రజిత్తు) మాటలకు రావణుడు సంతోషించాడు. కుమారుని ఆశీర్వదించి పంపాడు. ఇంద్రజిత్తు రణరంగానికి వెళ్లాడు. లక్ష్మణుని యుద్ధానికి ఆహ్వానించాడు. ఇంద్రజిత్తు, లక్ష్మణుడు ఒకరితో ఒకరు తీసిపోకుండా యుద్ధం చేసారు. ఇంతలో అంగదుడు విసురుగా పోయి ఇంద్రజిత్తును ఒక పెద్ద చెట్టుతో మోదాడు. అంగదుని మీదికి ఇంద్రజిత్తు ఒక ఈటెను విసిరాడు. దానిని లక్ష్మణుడు తన బాణాలతో విరిచాడు. అంగదుడు ఇంద్రజిత్తు రధాన్ని, సారధిని చిత్తు చిత్తు చేసాడు.

ఇంద్రజిత్తు ఆకాశానికి ఎగిరాడు. అదృశ్య యుద్ధం చేస్తున్నాడు ఇంద్రజిత్తు. రామలక్ష్మణులు శబ్దవేధి బాణాలు ప్రయోగిస్తున్నారు. కాని ఇంద్రజిత్తు నాగాస్త్రము ప్రయోగించి రామ లక్ష్మణులను బంధించాడు. రామ లక్ష్మణులు మూర్ఛిల్లారు. ఇదిచూచి హనుమంతుడు, జాంబవంతుడు,సుగ్రీవుడు దుఃఖించారు. విభీషణుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి వారిని నాగపాశవిముక్తులను గావించాడు. సుగ్రీవుడు విశల్యకరణి అనే ఔషధంతో వారి శరీరంలో ఉన్న విష పదార్ధాలను తొలగించాడు. రామలక్ష్మణులు మూర్ఛనుంచి తేరుకున్నారు.

విభీషణుడు రామలక్ష్మణులను చూచి “రామా! కుబేరుడు మీకోసం దివ్యజలాలను పంపాడు. ఈ జలాలతో మీరు మా కన్నులను ప్రక్షాళన చేసుకుంటే, మీకు అదృశ్యమైన వారుకూడా స్పష్ఠంగా కనపడతారు.” అని

దివ్యజలాలు ఇచ్చాడు. రామలక్ష్మణుడు వాటిని తమ కన్నులకు అద్దుకొని, ఆ జలాలతో తమ కన్నులను ప్రక్షాళన చేసుకున్నారు. ఆ జలం ప్రభావము వలన ఆకాశంలో అదృశ్యంగా తిరుగుతున్న ఇంద్రజిత్తు వారికి కనిపించాడు. లక్ష్మణుడు ఒక్కసారిగా విజృభించాడు. ఇంద్రజిత్తుమీద బాణాల వర్షం కురిపించాడు. ఇంద్రజిత్తు రెండు చేతులు ఖండించాడు. ఒక బల్లెంతో ఇంద్రజిత్తు తల నరికాడు.

కుమారుని మరణవార్త విని రావణుడు శోకంతో తల్లడిల్లిపోయాడు. పుత్ర శోకాన్ని తట్టుకోలేక, దీనికంతకూ కారణమైన సీతను సంహరించడానికి అశోకవనానికి వెళ్లాడు. మూర్తీభవించిన పుణ్యమా అని శోభిల్లుతున్న సీతను చంపడానికి కత్తిని దూసాడు. అక్కడే ఉన్న రాక్షస వృద్ధుడు, అవింధ్యుడు అతనిని వారించాడు.

“రావణా! మహేంద్రుని లాంటి వారిని జయించిన నీకు ఈ స్త్రీని చంపుట తగదు. నీకు పౌరుషము ఉంటే, శక్తి ఉంటే రాముని గెలువుము. కేవలం ఒక స్త్రీని చంపి నంత మాత్రాన నీకు కీర్తి రాదు” అని పలికాడు.

ఆ మాటలతో కోపం తగ్గిన రావణుడు, యుద్ధ సన్నద్ధుడై రాముని మీదికి యుద్ధానికి వెళ్లాడు. రామ రావణుల యుద్ధం మొదలైంది. రావణుని శరీరమునుండి వేనకు వేలు ఆయుధ ధారులైన రాక్షస వీరులు పుడుతున్నారు. వాళ్లందరిని రాముడు తన బాణాలతో చంపుతున్నాడు.

ఇంతలో మాతలి అనే ఇంద్రుని సారథి వైజయంతి అనే దేవ రథాన్ని తెచ్చి రామునికి ఇచ్చాడు. "రామా! ఇది దేవేంద్రుని రథం. దీనిని ఎక్కి దేవేంద్రుడు దేవదానవ యుద్ధంలో ఎంతో మంది రాక్షసులను సంహరించాడు. నీవు కూడా దీనిని అదిరోహించి యుద్ధము చేసి విజయము సాధించుము." అని పలికాడు. శ్రీరాముడు మాతలిని అభినందించాడు. ఆ రథాన్ని ఎక్కి రావణునితో యుద్ధం చేయసాగాడు.

రామ రావణులకు భయంకరమైన యుద్ధం జరిగింది. రాముడు బ్రహ్మాస్త్రాన్ని సంధించి రావణుని ని సంహరించాడు. లోక కంటకు డైన రావణుడు రాముని చేత సంహరించబడటం చూచి మూడు లోకాలు సంతోషించి ఉత్సవాలు చేసుకున్నాయి. అప్పుడు అవింధ్యుడు, విభీషణుడు వెంటరాగా, సీతా దేవిని తీసుకొని వచ్చి రామునికి అప్పగించాడు.

తన భార్య సీతను చూచి రాముడు ఇలా పలికాడు. "ఓ సీతా! చెడ్డ వాడైన రావణుడు ఇంత కాలము తన ఇంటిలో పెట్టి కొని ఉన్న నిన్ను నేను తిరిగి తీసుకొనిన, నాకు ధర్మహాని కలుగుతుంది కదా! నాకు చేసిన పరాభవమునకు తగిన ప్రతీకారము చెయ్యడానికి నా శత్రువైన రావణుని చంపాను. కాని నీకోసం చంపలేదు. నీవు మంచిదానివైనా, చెడ్డదాని వైనా, నిన్ను మాత్రము పరిగ్రహించను. నీ పరిస్థితి కుక్క ముట్టిన యజ్ఞద్రవ్యమైనది. నీవు నీ ఇష్టమైన చోటికి వెళ్లవచ్చును." అని పలికాడు రాముడు.

ఆ మాటలు విని భరించ లేక, సీత నేల మీదికి వాలి పోయింది. స్పృహ లోకి వచ్చిన తరువాత, లేచి రామునితో "ఓ జన నాయకుడైనా రామా! నీకు ధర్మహాని కలుగకుండా ఉండుటకు, ప్రజలకు నా నిర్మలత్వాన్ని నిరూపించుటకు, నేను అగ్ని ప్రవేశము చేసి బయటకు వస్తాను. అనుమతి ఇమ్ము" అని ప్రార్ధించింది.

రాముని అనుమతితో, సీత అగ్ని ప్రవేశం చేసింది "నేను ఎల్లప్పుడూ నీ పాదములు తక్క ఇతరము నా మనస్సులోకూడా తలపలేదు. అలా కాక పోతే పంచభూతాలు నన్ను దహించి వేస్తాయి." అని పలికింది. అప్పుడు పంచభూతములు తమ తమ పేర్లు చెప్పి "ఓ జన నాయకా! సీత ఉత్తమురాలు. నీవు సందేహ పడ పనిలేదు. ఇది మాకు తెలియును." అని పలికారు.

ఆసమయంలో బ్రహ్మదేవుడు సకల మునిగణముల తో కూడి అక్కడకు వచ్చాడు శ్రీరాముడు బ్రహ్మదేవుని సత్కరించాడు. "ఓ రామా! నీవు లోక కంటకుడైన రావణుని సంహరించి లోకాలకు హితము చేసావు. రావణునికి నలకూబరుని శాపము ఉన్నది. అందువలన, రావణుడు ఇతర స్త్రీలను తాకలేడు. బలాత్కారము చెయ్యలేడు. నీ ధర్మపత్నికి ఏ హానీ జరగలేదు. నీవు ఏ విధమైన విచారము లేకుండా ఈమెను స్వీకరింపుము." అని బ్రహ్మదేవుడు పలికాడు. తరువాత యుద్ధములో చనిపోయిన వానరుల నందరిని బతికించి వెళ్లిపోయాడు. దేవేంద్రుని సారధి మాతలి కూడా తన రధాన్ని తీసుకొని దేవలోకానికి వెళ్లిపోయాడు.

తరువాత రాముడు, సీతా లక్ష్మణ సమేతుడై పుష్పక విమానము ఎక్కి అయోధ్యకు వెళ్లాడు.

ధర్మరాజా! నీ వలెనే రాముడు కూడా అరణ్య వాసము చేసి ఎన్నో కష్టములు పడి, తుదకు తన రాజ్యమును పొంది సుఖించాడు. ఆ ప్రకారము నువ్వుకూడా నీ అరణ్య అజ్ఞాతవాసములు అనుభవించి నీ రాజ్యమును పొందెదవు"అని మార్కండేయ మహర్షి ధర్మరాజుకు శ్రీరామ చరిత్రను చెప్పాడు.

రామ కథను విన్న ధర్మరాజు రాముని పరాక్రమము, సీతా దేవిపాతివ్రత్యము ఇంత గొప్పదా అని ఆశ్చర్యపోయడు. "ఓ మహర్షి! సీతా దేవి మాదిరి పతివ్రతలు ఇంకా ఉన్నారా!" అని అడిగాడు. అప్పుడు మార్కండేయ మహర్షి ధర్మజునకు, సావిత్రి కథను చెప్ప నారంభించాడు.

"పూర్వము మద్ర దేశాన్ని అశ్వపతి అనే రాజు పరిపాలిస్తున్నాడు. వారికి సంతానము లేదు. అందుకని ఆయన సావిత్రీదేవిని పదునెనిమిది సంవత్సరాలు భక్తితో సేవించాడు. ఆయన భక్తికి మెచ్చిసావిత్రీ దేవి ఆ రాజుకుప్రత్యక్షం అయింది. "రాజా! నీకు ఏమి వరం కావాలో కోరుకో " అని అడిగింది. దానికి అశ్వపతి మహారాజు తనకు పుత్రుడు కావాలి అని అడిగాడు. కాని సావిత్రీదేవి నీకు ఒక కన్య జన్మిస్తుంది అని వరం ఇచ్చింది.

"అమ్మా! నిన్ను భక్తితో కొలిచాను. నా కోరిక మన్నించి నీవు వచ్చావు. మరి నా కోర్కిక తీరాలి కదా! " అని అడిగాడు.

" రాజా! నీ కోరిక గురించి నేను ఇంతకు ముందే బ్రహ్మ దేవునితో చర్చించాను. ఆయన నీకు పుత్రిక కలుగుతుంది అని నిర్దేశించాడు. ఆ యన ఆజ్ఞ అమోఘము. కాని నీకు ఆ పుత్రిక కారణంగా, నూర్గురుపుత్రులు జన్మిస్తారు. సంతోషించు." అని చెప్పి సావిత్రీ దేవి అంతర్ధానం అయింది.

కొన్ని రోజుల తర్వాత అశ్వపతి దంపతులకు ఒక కన్య జన్మించింది. ఆమె పేరు సావిత్రి. ఆ కన్య దినదినప్రవర్ధమానంగా గారాబంగా పెరుగుతూ ఉంది. సావిత్రికి యుక్త వయసు వచ్చింది. ఆమెకుపెళ్లి చెయ్యాలని నిశ్చ యించాడు అశ్వపతి. సావిత్రి తన చెలి కత్తెల వలన సాళ్వ దేశపు రాజు ద్యుమత్సేనుడి కుమారుడు, సత్యవంతుడు అనే రాకుమారుడు, రూప వంతుడు, గుణవంతుడు అని విని అతని మీద మనసు పడింది. కాని సిగ్గుతో ఆ విషయం ఎవ్వరికీ చెప్పలేదు.

ఒకరోజు నారద మహర్షి అశ్వపతి రాజు వద్దకు వచ్చాడు. రాజు నారదునికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి సత్కరించాడు. సావిత్రి కూడా వచ్చి తండ్రికి నారద మహర్షికి నమస్కరించింది. ఆ కన్యను చూచి నారదుడు "రాజా! నీ కుమార్తెకు ఇంకా ఎందుకు వివాహం చెయ్యలేదు" అని అడిగాడు.

అశ్వపతి మహారాజు సావిత్రి ని చూచి "అమ్మా! విన్నావుగా నారద మహర్షి మాటలు. నీకు తగ్గ వరుని నీవే వరించు. అదే నాకు సంతోషము" అని పలికాడు.

సావిత్రి కొంచెం సిగ్గుతో "తండ్రి! సాళ్వభూపతి తనయుడు సత్యవంతుడు నాకు తగిన భర్త అని మనస్సులో అనుకున్నాను. ఆతనికి ఇచ్చి నా వివాహం జరిపించు. కాని ఆ సాళ్వ దేశాధిపతి విధి వశాత్తు, కళ్లుపోగొట్టుకొని, శత్రువులు తన రాజ్యాన్ని ఆక్రమించగా, ప్రస్తుతము భార్య బిడ్డలతో అడవులలో నివసిస్తున్నాడు. అయినను నేను సత్యవంతునే వివాహం చేసుకుంటాను." అని నిశ్చయంగా చెప్పింది.

అప్పుడు అశ్వపతి నారదుని చూచి నారద మహర్షి! ఆ సత్యవంతుడి గుణగణములు ఎలాంటివి అని అడిగాడు. "రాజా! అతడు ఎల్లప్పుడూ సత్యం పలుకుటచే సత్యవంతుడు అనిసార్థక నామధేయుడు అయ్యాడు. అతని అసలు పేరు త్రాశ్వుడు. బుద్ధిలో బృహస్పతి లాంటి వాడు. శౌర్యము లో దేవేంద్రుని మించిన వాడు. తేజస్సులో చంద్రుడు, అందంలో అశ్వినీ దేవతలను మించి పోయాడు. శమము, దమము, బ్రాహ్మణుల మీద భక్తి, అతనికి ఎక్కువగా నున్నవి. కాని సత్యవంతుని లో ఒక లోపం ఉంది. అతడు పెళ్లి అయిన ఒక సంవత్సరమునకు మరణిస్తాడు. ఇది చెప్పవలసింది కాబట్టి చెప్పాను." అని చెప్పాడు నారదుడు.

అప్పుడు అశ్వపతి కుమార్తె మొహం చూచాడు. "అమ్మా! నీకు అర్థాయుష్కుడైన వరుడు ఎందుకు. మరొక రాకుమారుని వరించు." అని చెప్పాడు.

" తండ్రీ! త్రికరణములలో మనస్సు ప్రధానము కాదా. ఆ మనసులో నేను సత్యవంతుని వరించాను. అతను ఎలాంటి వాడైనా, నాకు అతనినే ఇచ్చి వివాహం జరిపించండి. నేను వేరు వరుని వరించను." అని పలికింది సావిత్రి.

"రాజా! నీ కుమార్తె గుణవతి. ఆమె మనసు మరల్చడం మనవల్ల కాదు. ఇంక అనుమానించవలదు. ఆమెకు సత్యవంతునీ ఇచ్చి వివాహం జరిపించండి. ఈమె చేసిన పుణ్యఫలము వలన సత్యవంతుడు చిరంజీవి కాగలడు." అని దీవించి నారదుడు వెళ్లిపోయాడు.

నారదుని ఆశీస్సు మేరకు అశ్వపతి మహారాజు వివాహ సంభారములతో అడవిలో ఉన్న ద్యుమత్సేనమహారాజు వద్దకు వెళ్లాడు. ఆయన అశ్వపతి మహారాజును సాదరంగా ఆహ్వానించాడు. సత్కరించాడు.

"ద్యుమత్సేనమహారాజా! ఈమె నా కుమార్తె సావిత్రి. గుణవంతురాలు. విద్యావంతురాలు. నామాట మన్నించి నా కుమార్తె సావిత్రిని నీ కోడలిగాస్వీకరింపుము." అని పలికాడు.

"అయ్యా! మేము రాజ్యమును కోల్పోయి అడవులలో ఉన్నాము. నీ కుమార్తె సుకుమారి. ఈ అడవులలో బాధలకు తట్టుకుంటుందా చెప్పండి. " అని అన్నాడు.

" రాజా సంపదలు శాశ్వతములు కావు కదా. ఈరోజు ఉంటాయి రేపు పోతాయి. వాటి కోసం దిగులు చెందటం ధీరుల లక్షణం కాదు. మా అమ్మాయి చిన్నపిల్లకాదు. అన్ని ఆలోచించే ఈ నిర్ణయం తీసుకుంది. కాదనకండి." అని అర్ధించాడు అశ్వపతి.

ద్యుమత్సేనుడు కాదనలేకపోయాడు. సావిత్రీ సత్యవంతుల వివాహం జరిగింది. అశ్వపతి తన కూతరికి వివిధ ఆభరణములు, వస్తువులు ఇచ్చి తన రాజధానికి వెళ్ళిపోయాడు. సావిత్రి భర్తతో పాటు నార చీరలు ధరించి , అత్తమామలకు సేవ చేస్తు, భర్తతో కాపురం చేస్తూ ఉంది. తృటిలో సంవత్సరం గడి చి పోయింది. ఇంక నాలుగు రోజులు మాత్రమే ఉంది. సావిత్రి మూడురాత్రుల దీక్ష తీసుకుంది.

ఆఖరి రోజు ఉదయమే లేచి స్నానాదికములు ముగించింది సావిత్రి. అత్తమామలకు నమస్కరించింది. భర్తకు సేవచేసింది. కొంచెం పొద్దు ఎక్కింది. సత్యవంతుడు "సావిత్రీ నేను అడవికి వెళ్ళి పండ్లు తీసుకొని వస్తాను." అని అన్నాడు.

" నేనూ మీతో వస్తాను" అని సావిత్రి కూడా సత్యవంతుని తో అడవికి బయలుదేరింది. సావిత్రి ఆ అడవి లోని అందాలను చూస్తూ ఉంది. కాని ఒక కంట భర్తలో వచ్చే మార్పులను గమనిస్తూ ఉంది. కొన్ని ఫలములను కోసిన తరువాత, సమిధల కోసం ఒక ఎండు చెట్టును గొడ్డలితో కొడుతున్నాడు సత్యవంతుడు. ఇంతలో తల భారంగా ఉందని చెప్పి గొడ్డలిని కిందపెట్టి తూలుతూ కింద

కూర్చున్నాడు. సావిత్రి వెంటనే తన తొడ మీద సత్యవంతుని తలను పెట్టుకొని ఆయనకు సపర్యలు చేస్తూ ఉంది. కొంత సేపటికి సత్యవంతుడు స్పృహ కోల్పోయాడు.

ఇంతలో నల్లటి ఆకారం కలవాడు, కోరలు కలవాడు, ఎర్రని నేత్రములు కలవాడు, బంగారు రంగు బట్టలు ధరించినవాడు, అత్యంత భీకరాకారుడు, చేతిలో పాశం ధరించిన వాడు అయిన ఒక దేవతా మూర్తి అక్కడకు వచ్చాడు.

అతనిని చూచి సావిత్రి "అయ్యా మీరు ఎవరు?" అని అడిగింది.

"సావిత్రీ నా పేరు యమధర్మరాజు. నీవు గొప్ప పతివ్రతవు కాబట్టి నన్ను చూడగలిగావు. నేను ఇతరులకు కనపడను. నీ భర్త సత్యవంతునికి ఆయువు తీరింది. అతడు గొప్ప పుణ్యపురుషుడు అందుకే అతని ప్రాణములు తీసుకొని పోవుటకు నేను స్వయంగా వచ్చాను." అని పలికి యమధర్మరాజు, తన పాశమును సత్యవంతుని మీదికి విసిరి అతని శరీరములో ఉన్న జీవుని బయటకు లాగాడు. వెంటనే దక్షిణ దిశగా వెళ్లుతున్నాడు.

వెంటనే సావిత్రి తన భర్త దేహమును ఎవ్వరికీ కనపడకుండా పొదలలో దాచి పెట్టి, యమధర్మరాజు పోయిన మార్గముననే తానూ అనుసరించింది. తన వెనక వస్తున్న సావిత్రిని చూచాడు

" అమ్మా నీవు ఎందుకు నా వెంట వస్తున్నావు. వద్దు నిలువుము. ఇంకమీదట నీవు ఈ మా ర్గమున రాలేవు" అని పలికాడు.

"యమధర్మరాజా! భర్తలు వెళ్లిన మార్గముననే భార్యలు వెళ్లడం ధర్మం కాదా. నీ దయవలన, నా పాతివ్రత్యము వలన నేను రాలేని చోటు కూడా ఉందా? అన్ని మార్గములలో ధర్మ మార్గము ప్రధానము. ధర్మమునకు ఆధారము సజ్జనులు. సజ్జన సందర్శనము ఎప్పుడూ వృధాకాదు. నీ వంటి సజ్జనమూర్తి దర్శనము వలన పరమ శుభములు పొందక నేను మామూలు మనిషి మాదిరి వెనుకకు ఎలాపోగలను." అని పలికింది సావిత్రి.

ఆమె మాటలకు యమధర్మరాజు ఆశ్చర్యపోయాడు. "అమ్మా! నీ మాటలకు మెచ్చాను. నీ భర్తప్రాణములు తప్ప ఒక వరం కోరుకో ఇస్తాను." అన్నాడు.

" యమధర్మరాజా! నా మామగారు సాళ్వరాజుకు కంటి చూపు లేదు. అతనికి చూపు వచ్చేట్టు వరం అనుగ్రహించండి. " అని పలికింది.

" సరే నీ మామ గారికి దృష్టిని ప్రసాదించాను. దీనిలో తృప్తి చెంది మరలి పొమ్ము" అని పలికాడు యమధర్మరాజు.

కాని సావిత్రి యమునిని వెంబడించి వెళ్లింది. "యమధర్మరాజా! మనస్సు, వాక్కు, కర్మలతో ఎవ్వరికీ కీడు తలపెట్టకుండా ఉండుట, దీనుల ఎడ కరుణ చూపుట, దాన ధర్మములు చేయుట, ఆశ్రితులను ఆదరించుట ఆర్యధర్మములు

అని మీకు తెలియును కదా! నీవు ధర్మదేవతవు. నీకు తెలియనిది ఏమున్నది. అందరి ఎడల సమబుద్ధితో ఉంటావు కాబట్టి నీకు సమవర్తి అని పేరు కదా! యమధర్మరాజా! నిన్ను యముడు, శమనుడు అని కూడా పిలుస్తారు కదా! ” అని పలికింది సావిత్రి.

“ అమ్మా సావిత్రీ నీ పలుకులు అమృతోపమానములు. నీకు మరి ఒక్క వరం ఇస్తాను. నీ భర్త ప్రాణములు తప్ప. కోరుకొనుము” అని అన్నాడు.

“యమధర్మరాజా! నా మామగారి రాజ్యమును అతని విరోధులు ఆక్రమించారు. అతని రాజ్యము అతనికి ఇప్పించండి.” అని కోరింది.

యమధర్మరాజు ఆ వరం కూడా ఇచ్చాడు. “సావిత్రీ! నీవుకోరిన వరాలు అన్ని ఇచ్చాను కదా. ఇంక నిలువుము ఇక్కడినుండి నీకు రావడానికి అనుమతి లేదు.” అని అన్నాడు.

“ ఓ ధర్మరాజా! నీకు తెలియనిది ఏమున్నది. ధర్మాత్ములు ఎట్టి విపత్కర పరిస్తితులలో నైనను తమ తమ ధర్మక్రియలు క్రమం తప్పకుండా నెరవేరుస్తారు. వారికి ఎటువంటి భ్రాంతి ఉండదు. కాబట్టి నేను కూడా ఎట్టి విపత్కర పరిస్థితులలోనూ నా భర్తను ఎలా విడిచి పెట్టేది. అది న్యాయం కాదు కదా. నేనూ ధర్మాన్ని ఆచరించాలి కదా! ” అని పలికింది.

"సావిత్రీ నీ ధర్మబుద్ధికి సంతసించితిని. మరొక వరము కూడా ఇచ్చెదను అదియును నీ భర్తప్రాణములు తక్క." అన్నాడు యమధర్మరాజు.

"యమధర్మరాజా! నా తండ్రి అశ్వపతికి పుత్రసంతానము లేరు. ఆయనకు నూర్గురు కుమారులను అనుగ్రహించుము." అని అడిగింది.

"సావిత్రీ! నీకు కోరినట్టు నీ తండ్రికి పుత్రశతమును అనుగ్రహించితిని. నీవు చాలా అలసి పోయావు ఇంక వెనుకకు మరలుము." అని చెప్పాడు యముడు.

" యమధర్మరాజా! సతులకు భర్త సేవయే పరమార్ధము. నా మనస్సు నా భర్త పాదసేవనలోనే లగ్నమైయున్నది. నాకు అలుపు ఎక్కడిది? తమ తమ ధర్మాన్ని నిష్ఠతో ఆచరించే వాళ్లు మనకు అరుదుగా కన్పిస్తారు. వారి ధర్మనిష్ఠతోనే కదా సూర్యచంద్రులు క్రమం తప్పకుండా సంచరిస్తున్నాయి. ఎవరితోనైనా ఏడు మాటలు మాటలాడిన వారు బంధువులు అవుతారు అంటారు. (సఖ్యం సాప్తపదీనమ్ అని ఆర్యోక్తి) నేను తమరితో ఎన్నో మాటలాడినాను. ఇప్పుడు నేను మీకు చుట్టము అయితిని అని వేరు చెప్పవలెనా! కావున నా కోరికను తమరు మన్నింపవలెను." అని పలికింది

దానికి యమధర్మరాజు సంతోషించి "సావిత్రీ! నీకు మరొక్క వరము ఇచ్చెదను కోరుకొనుము" అని చెప్పాడు

దానికి సావిత్రి సంతోషించి "యమధర్మరాజా! ఇప్పటిదాకా నువ్వు ఏవరం కోరుకోమన్నా నీ పతిప్రాణములు దక్క అని చెబుతూ వచ్చావు. కాని ఇప్పుడు ఆ మాట చెప్పలేదు కాబట్టి నా ఇష్టం వచ్చిన వరం, నా ఇష్టం వచ్చినట్టు కోరుకుంటాను. ఓయమధర్మరాజా! సతికి పతియే దైవము. పతిలేని జీవితము సతికి దుర్భరము. ఏ శుభకార్యములకు ఆమెను పిలవరు. కావున సాళ్వపతి పుత్రుడు సత్యవంతుని పునర్జీవుని చేయుము." అని అడిగింది.

ఆమె పట్టుదలకు సంతోషించి యమధర్మరాజు సత్యవంతుని జీవుని అతని శరీరంలో తిరిగి ప్రవేశపెట్టాడు. "సావిత్రీ! నీ భర్త నాలుగు వందల సంవత్సరములు జీవిస్తాడు. నీకు నూరుమంది కుమారులు కలుగుతారు. నీ భర్త కీర్తి మంతుడవుతాడు." అని వరము ఇచ్చి యమధర్మరాజు వెడలిపోయాడు.

సావిత్రి వెనుకకు తిరిగి తాను సత్యవంతుని దేహమును దాచిన చోటుకు వచ్చింది. భర్త తలను తన తొడమీద పెట్టుకొని కూర్చుంది. కొంత సేపటికి సత్యవంతుడు నిద్రనుండి లేచినట్టు లేచాడు.

"ఏమిటి సావిత్రీ! ఇంతసేపు నిద్రపోయాను. లేపవలదా! కాని ఎవరో నన్ను పట్టి లాగినట్టు అనిపించింది. ఎవరై ఉంటారు. అది కలకాదు నిజమే అన్నట్టు ఉన్నది." అని అడిగాడు

"నాధా! ఇప్పటికే చాలా పొద్దుపోయింది. మీ తల్లితండ్రులు మన కోసం ఎదురు చూస్తుంటారు. ఆవిషయాలన్ని రేపు చెపుతాను." అని చెప్పింది.

"అవును సావిత్రీ నా తల్లితండ్రులు మన కోసం పరితపిస్తుంటారు మనం వెంటనే ఆశ్రమానికి వెళ్లాలి" అని అన్నాడు. ఇద్దరూ ఆశ్రమానికి చేరుకున్నారు అప్పటికే సత్యవంతుని తండ్రి ద్యుమత్సేనుడికి చూపు వచ్చింది. ఎదురుగా తమ కుమారుడు సత్యవంతుడు కనిపించలేదు. కొడుకుకోసం వారు పరితపిస్తున్నారు. సావిత్రి సత్యవంతులు ఆశ్రమం చేరుకోగానే "నాయనా ఇంత పొద్దుపోయింది. ఇప్పటిదాకా ఎక్కడ ఉన్నారు!" అని అడిగాడు.

సత్యవంతుడు తనకు తలనొప్పి రావడం, పడుకోవడం, కలలో ఒక మహానుభావుడు కనిపించడం వరకు చెప్పాడు. తరువాత సావిత్రి తన మామ గారితో ఇలా చెప్పింది. "మహారాజా! నా భర్త సత్యవంతునికి ఈరోజు మరణము అని నారదుల వారు చెప్పారుకదా అందుకని నేను నా భర్తతో కూడా అడవికి వెళ్లాను అక్కడ నా భర్త స్పృహతప్పిపడిపోయాడు అప్పుడు యమధర్మరాజు నా భర్తప్రాణములను తీసుకొని పోవుటకువచ్చాడు. ఆయన నా భర్త ప్రాణములను తీసుకొని పోవుచుండగా నేనును ఆయన వెంటనే వెళ్లాను. యమధర్మరాజును స్తుతించి ఆయన కృపను పొంది, ఆయన చేత నాలుగు వరములుపొందాను. అందులో ఒకటి నాభర్త ప్రాణములు తిరిగి పొందుట. మరొక వరము తమరికి చూపు వచ్చుట మరొక వరము తమరికి తిరిగి రాజ్యము సంప్రాప్తించుట నాల్గవది నా తండ్రికి నూరుమంది పుత్రులు కలుగుట. ఆ ప్రకారము నాకు నా భర్తప్రాణములు దక్కినవి. " అని చెప్పింది.

"అమ్మా! ఆపత్సముద్రములో ఉన్న మాకు నీవు నావవైతివి. నీ పుణ్యచరిత్ర కీర్తినీయము." అని అన్నారు.

తరువాత కొన్నాళ్లకు సాళ్వరాజు ఆంతరంగికుటు మిత్రులు వచ్చి ఆయన శత్రురాజులు వారిలో వారు కొట్లాడుకొని మరణించినారని, ద్యుమత్సేనుని రాజ్యపాలనచేయమని కోరారు. ద్యుమత్సేనుడు తిరిగి రాజయ్యాడు. సత్యవంతుడు యువరాజు అయ్యాడు. సావిత్రి సమస్త రాజభోగములు అనుభవించింది.

కనుక ధర్మరాజా! ఆ పతివ్రత ఐన సావిత్రి వలెనే ఈ ద్రౌపదికూడా మీకు శుభములు కూరుస్తుంది." అని చెప్పి మార్కండేయ మహర్షి తన ఆశ్రమానికి వెళ్లాడు.

అప్పుడు జనమేజయుడు వైశంపాయనునితో " మహర్షి! ఇంద్రుడు కర్ణుని కవచ కుండలములు అపహరించాడు. అని చెపుతారు కదా ఆ కథ వివరించండి." అని అడిగాడు. వైశంపాయనుడు ఈవిధంగాచెప్పసాగాడు.

"ఆ ప్రకారముగా పాండవులు పండ్రెండేళ్లు వనవాసము గడిపారు. ఆఖరు సంవత్సరము లో ఉండగా, ఇంద్రుడు పాండవులకు మేలు చెయ్య దలచాడు. కర్ణుని కవచ కుండలములు మాయోపాయమున అపహరించ దలచాడు. ఈవిషయాన్ని సూర్యుడు తెలుసుకున్నాడు వెంటనే బ్రాహ్మణ వేషములో తన

పుత్రుడు కర్ణుని వద్దకు వెళ్లాడు. కర్ణుడు ఏకాంతములో ఉండగా అతనితో ఇలా చెప్పాడు.

"ఓ కర్ణా! నీ మేలుకోరి నీకు కొన్ని విషయాలను చెప్పడానికి వచ్చాను. దేవేంద్రుడు నీ కవచకుండలములను అపహరించడానికి వస్తున్నాడు. నీవు బ్రాహ్మణులకు అడిగినది కాదనకుండా ఇచ్చెదవని బ్రాహ్మణవేషంలో వస్తున్నాడు. కర్ణా! నీ కవచకుండలములు అమృతమయములు. అవి నీ ఒంటిమీద ఉన్నంతకాలము నిన్ను ఎవరూ చంపలేరు. అందుకని నీకు చెపుతున్నాను. మోసపోవద్దు." అని చెప్పాడు.

"అయ్యా మీరు ఎవరో నాకు తెలియదు. దయచేసి తమరు ఎవరో తెలపండి!" అని అడిగాడు.

దానికి ఆ బ్రాహ్మణుడు "కర్ణా! నేను సూర్యుడను. నా మనస్సులో నీ మీద మమకారము ఎక్కువ అందుకని వచ్చాను." అని అన్నాడు

"ఓ సూర్య దేవా! నేను బ్రాహ్మణులు ఏది అడిగినా అది ఇస్తాను అది నా ప్రతిజ్ఞ. అలాంటిది సాక్షాత్తు దేవేంద్రుడు వచ్చి దేహీ అని అడిగితేనా ప్రాణాలే ఇస్తాను. అలాంటిది నా కవచకుండలములు నాకు ఒక లెక్కా! అదియును కాక ముల్లోకాలను పాలించే ఇంద్రుడు ధర్మము తప్పి మారు వేషంలో నా వద్దకు రావడమా! అది అతని కీర్తికి హానికదా. కాని నాకు అది సుకృతమేకదా! ఎటు చూచినా నేను ధన్యుడను. ఈ లోకంలో కీర్తికి మించినది ఏదీ లేదు. కీర్తి తల్లివలే

కాపాడుతుంది. అపకీర్తి పొందిన వాడిని అన్ని కీడులు ఆవహిస్తాయి. బ్రాహ్మణులు కోరితే నాకు ఉన్నదానిలో దానం చేయడం, బలవంతులైన శత్రువులను చంపడం. యుద్ధంలో చావడం. శరణు వేడిన వాడిని కాపాడటం. బ్రాహ్మణులను, వృద్ధులను బాలురను చంపకపోవడం. అవి నా వ్రతాలు. వీటిని నేను తప్పను. కాబట్టి ఇంద్రుడు వచ్చి అడిగితే నా కవచకుండలమును సంతోషంగా ఇస్తాను.” అని కర్ణుడు చెప్పాడు.

“ఓ కర్ణా! నీ హితులు చెప్పేమాటలు నువ్వు వినవు. తనకు తన వారికి మేలు చేయు కీర్తి గడించడం మంచిది గాని నీకు నీ వారికి అపకారం చేయు కీర్తి ఎందుకు. ముందు నీ ప్రాణములు కాపాడుకో. నీవు బతికి ఉంటే మరింత కీర్తి సంపాదించవచ్చును. నీ మేనిలో ప్రాణములుండిన, నీ భార్యాబిడ్డలు రాజభోగములు అనుభవింపగలరు. మరణించిన తరువాత మనిషి బూడిద అవుతాడు. తనకు వచ్చిన కీర్తిని చూడలేడు. మృతునికి వచ్చిన కీర్తి శవానికి చేయు అలంకారము వంటిది. అదియును కాక, నీవు నాకు భక్తుడవు. భక్త రక్షణ నా కర్తవ్యము. మరియు ఇందులో ఒక దేవరహస్యము కలదు. అది నీకు కాలక్రమేణా తెలియగలదు. నీకు అర్జునుని మీద పగ ఉన్నది. యుద్ధములో నీకు కవచకుండలమును ఉన్నచో అర్జునుడునిన్ను చంపలేడు.” అని సూర్యుడు కర్ణుడుకి నచ్చ చెప్పాడు.

“సూర్యదేవా! నీకు నా మీద ఉన్న దయతో ఇంత చెప్పావుకాని నేను చెప్పేది కూడా కోపించకుండా వినుము. నేను అసత్యానికి భయపడినట్లు యమునికికూడా భయపడను. నా వ్రతమును వీడను. అర్జునుని నేను గెలువలేను అని

తలపవలదు. నా వద్ద ఉన్న అస్త్రములు నీకు తెలియును. పరశురాముడు, ద్రోణుడు నాకు ప్రసాదించిన అస్త్రములు సామాన్యమయినవికావు. వాటిసాయంతో నేను అర్జునుని సంహరింపగలను. తమరు వేరువిధంగా తలపక నన్ను ఆశీర్వదించండి” అని పలికాడు.

“కర్ణా! నీవునిశ్చయముగా నీ కవచకుండలములు  ఇంద్రునికి దానం చెయ్యడానికి నిశ్చయించుకుంటే ఒక పని చెయ్యి. ఇంద్రుని వద్ద అత్యంత భయంకరమైన “శక్తి ”అనే అస్త్రము ఒకటి ఉన్నది దానిని బదులుగా తీసుకొనుము.” అని చెప్పిసూర్యుడు వెళ్లిపోయాడు.  కర్ణుడు దేవేంద్రుని రాకకై ఎదురు చూస్తున్నాడు.

అని వైశంపాయనుడు చెప్పగా విని జనమేజయుడు  “ఓమహర్షి! సూర్యుడు కర్ణుని గురించి ఒక దేవ రహస్యము కలదని చెప్పినాడు కదా. అది ఏమిటి వివరించెదరా!” అని అడిగాడు. వైశంపాయనుడు  ఈ విధంగా చెప్పసాగాడు.

పాండవుల తల్లి కుంతీ దేవి (పృధ) కుంతి భోజుని కుమార్తె. ఆమెకు వివాహము కాక పూర్వము ఒక రోజు దుర్వాస మహా ముని వారి ఇంటికి వచ్చాడు. కుంతి భోజుడు  ఆయనకు అతిధి సత్కారాలు గావించాడు.

“మహారాజా! నాకు నీ ఇంటిలో కొన్ని దినములు  ఉండవలెనని ఉన్నది. నాకు ఎలాంటి లోపము రాకుండా పరిచర్యలు చెయ్యగలరా!” అని అడిగాడు.

కుంతిభోజుడు దానికి సమ్మతించాడు. తన కుమార్తె పృధ ను పిలిచి "అమ్మా ! ఈయన దుర్వాసమహాముని. మన ఇంట కొంతకాలము ఉంటారు నీవు ఆయనకు విసుగులేకుండా సపర్యలు చేయుము. నీవు ధైర్యవంతురాలివి. వినయశీలివి. కావున ఈయనను భక్తితో సేవించుము. ఆయనకు కోపం తెప్పించకుము." అని చెప్పాడు.

" తండ్రీ! నాకునూ బ్రాహ్మణులకు సేవలు చెయ్య వలెనని ఎల్లప్పుడూ మనస్సులో కోరుకుంటాను. నా కోరిక ఈ రోజుకు తీరినది. నీవు కోరిన విధముగా నేను ఈయనకు పరిచర్యలు చేసెదను. నా మీద భారము ఉంచుము." అని పలికింది.

"ఓ మహర్షి! ఈ చిన్నది నా కుమార్తె పృధ. తమరు మా ఇంట నున్నంత కాలము తమరికి సపర్యలు చేస్తుంది. ఎప్పుడైనా చిన్న తనం చేత, పొరపాటున తప్పుచేస్తే మన్నించండి."

తండ్రి కోరిక మేరకు పృధ దుర్వాసునకు సమరిచర్యలు చేస్తూ ఉంది. దుర్వాసుడుకూడా ఆమెను అప్పుడప్పుడు పరీక్షించేవాడు. ఉదయం వస్తానని రాత్రికి వచ్చేవాడు. రాత్రికి వస్తానని అంతకు ముందే వచ్చేవాడు. కాని పృధ అప్రమత్తయ్యె ఎల్లప్పుడూ విసుగు లేకుండా దుర్వాసుని సేవించింది. ఈ విధంగా ఒక్క సంవత్సర కాలం గడిచింది.

దుర్వాసుడు వెళ్లబోతూ "కుమారీ! నీవు చాలా చక్కగా సపరిచర్యలు చేసావు. ఒక వరం కోరుకో! " అన్నాడు.

దానికి పృథ "అయ్యా మీకు సంతోషం కలిగించాను. నాతండ్రి మాట నెరవేర్చాను. నాకు అది చాలు." అని వినయంగా బదులుచెప్పింది.

" పృధా! నీకు ఒక మంత్రం ఉపదేశిస్తాను. ఆ మంత్రం జపించి నీవు ఏ దేవతను ఆహ్వానించిన ఆ దేవత వచ్చి నీ వశంలో ఉంటాడు" అని చెప్పి ఒక మంత్రం ఉపదేశించాడు. తరువాత వెళ్లిపోయాడు.

ఒకరోజు పృథ ఒంటరిగా ఉన్నప్పు దుర్వాసుడు ఉపదేశించిన మంత్రాన్ని పరీక్షించ దలచింది. పొద్దుటే స్నానమాచరించి ఉదయిస్తున్న సూర్యుడిని చూచింది. సహజ కవచ కుండలములతో, వికసించిన పద్మంలా ప్రకాశిస్తున్న సూర్యభగవానుని చూచి ఆమె లో అనురాగం కలిగింది. మంత్రం పఠించి "నాకు నీ లాంటి కుమారుని ప్రసాదించు" అని కోరుకొంది.

వెంటనే సూర్యుడు మానవ రూపంలో ఆమె వద్దకు వచ్చాడు "కుంతీ కుమారీ నేను నీ మంత్రబలము చేత ఇక్కడకు వచ్చాను. నీవాడను. నీమనస్సుకు ఏది ప్రియమో అది చేస్తాను." అని అన్నాడు.

ఆయనను చూచి "కుంతి అయ్యా! ఇక్కడ మీరు చెయ్యవలసిన పని ఏమీ లేదు. ఏదో కుతూహలంచేత మంత్రం జపించాను. మీరు వెళ్లిరండి. " అని చెప్పింది.

"కుంతీ నేను తప్పు వెళతాను. కాని నీవు నీ మనస్సులో ఏమి కోరుకొని నన్ను పిలిచావు. నిజం చెప్పు. నా మాదిరి సహజ కవచకుండలములతో ఉన్న తేజశ్శాలి య్యైనా కుమారుడు నా వలన కావాలని కోరుకున్నావు కదూ. నీ కోరిక నేను నెరవేరుస్తాను. కాబట్టి నాతో సమాగమమునకు ఒప్పుకో. నీవు కోరినట్టు నీకు కుమారుడు జన్మిస్తాడు. లేని యెడల నీవు, నీ జననీ జనకులు భస్మం అయిపోతారు. అదియును కాక, నీ శీలాన్ని ఎరుంగకుండా నీకు మంత్రం ఉపదేశించిన ఆ దుర్వాసుని భస్మం చేస్తాను. అటు చూడు. దేవతలందరూ నన్నుచూచి నవ్వుతున్నారు." అని కోపంతో పలికాడు సూర్యుడు.

"అయ్యా! నన్ను నీకు సమర్పించుటకు అర్హులు నా తల్లితండ్రులు. వారి అనుమతి లేకుండా నేను నీ పొందు ఎలా అంగీకరింపగలను. నేను కేవలం బాల్య చాపల్యం చేత, మంత్రమహిమను పరీక్షించ గోరి ఇలా చేసాను. నన్ను క్షమించు." అని సూర్యుని బతిమాలింది. కాని సూర్యుడు ఒప్పుకోలేదు.

"మహానుభావా! కన్యకు తల్లితండ్రులు బంధుజనులు సమక్షంలో పెళ్లి జరిగిన తరువాత ఆమె తన భర్తతో మన్మధ కేళిలో మునిగి తేలవచ్చును. కాని పెళ్లి కాకముందు ఇలా పరపురుషునితో పొందు కోరుట ధర్మం కాదు కదా. ఈవిధంగా నిర్బంధంగా నన్ను అధర్మానికి పాల్పడమనడం నీకు తగునా. నీకు తెలియని ధర్మం ఏమున్నది. తల్లితండ్రులకు తెలియకుండా నీ పొందు కోరుట నీకు ధర్మం అని తోచిన, నీకు ఇష్టం వచ్చినట్టు చేయుము దాని వలన వచ్చు అపకీర్తి నేనే భరిస్తాను." అని పలికింది పృధ.

( ఇక్కడ సూర్యుడు ఒక వింత ఆచారాన్ని నెలకొల్పాడు. అది నేడు మన యువకులు యువతులు ప్రేమ పేరుతో ఆచరిస్తున్నారు. అదే యువతకు స్వేచ్ఛ అని నిర్వచనం ఇస్తున్నారు. ప్రేమించడం మా హక్కు అది కాదనే అధికారం పెద్దలకు లేదు అనే నినాదం ఇస్తున్నారు. అదేమిటో చదవండి).

సూర్యుడు ఆమెను చూచి "ఓ కుమారీ! నీ తల్లి తండ్రులు, బంధువులు నిన్ను కన్యాదానము చేయుటకు కర్తలు కారు. నీ శరీరానికి నీవే యజమానురాలివి. కన్య అనగా తన కోరికలను తీర్చుకొనేది అని అర్థం. ఇది నీ ఆంతరంగిక విషయం. నీ కోరిక తీర్చుకొనడంలో తప్పులేదు. అయినా ఇది అధర్మం అయితే నేను ఎందుకు చేస్తాను. దీని వలన నీ కన్యాత్వమునకు ఎలాంటి భంగం కలగదు. నీకు ఎలాంటి నింద రాదు. నీకు నావలన మహా తేజస్వి అయిన కుమారుడు జన్మిస్తాడు." అని చెప్పి కుంతీ దేవిని ఒప్పించాడు.

తరువాత సూర్యుడు కుంతీదేవితో సంగమించి ఆమెకు గర్భాదానం చేసాడు. కుంతీదేవి గర్భం దాల్చించింది. ఆమె దాల్చి న గర్భం దిన దిన ప్రవర్ధమానమై పెరుగుతూ ఉంది. కుంతీ దేవి గర్భం దాల్చి న సంగతి ఆమె దాది కూతురికి మాత్రమే తెలియును. ఒకనాటి రాత్రి వేళ కుంతీదేవి ఒక కుమారుడిని ప్రసవించింది. ఆ కుమారునికి సహజ కవచకుండలములు,పొడుగైన చేతులు,ధృడమైన శరీరము ఉన్నాయి.

ఆ కుమారుని చూచి కుంతీదేవి లోకాపవాదమునకు భయపడింది. ఆ బిడ్డను ఒక పెట్టెలో పెట్టింది. ఆ పెట్టెను ఒక తెప్పమీద పెట్టి గట్టిగా తాళ్ల తో

కట్టింది. ఆ పెట్టెను తన భవనము పక్కనే ప్రవహిస్తున్న అశ్వనది లో వదిలి పెట్టింది. తరువాత ఎంతో దుఃఖించింది. ఆ చిన్ని బాలుని నిర్దాక్షిణ్యంగా నదిలో వదిలినందుకు ఎంతగానో ఏడ్చింది.

ఆ తెప్పమీద ఉన్న పెట్టె ప్రవాహ వేగమునము కొట్టుకొనిపోయి మొదట చర్మణ్వతీ నదిలో చేరింది. అక్కడినుంది కొట్టుకొనిపోయి, యమునా నదిలో చేరింది. ఆఖరుకు గంగానదిలో చేరి కొట్టుకొని పోతూ ఆ పెట్టె పంపానగర సమీపానికి వచ్చింది. ఆ సమయంలో ధృతరాష్ట్రుని కి స్నేహితుడు ఐన అతిరథుడు అనే సూతుడు తన భార్యతో గంగానదిలో జలకాలాడుతున్నాడు. వారు ఆ పెట్టెను చూచారు. ఆ పెట్టెను తెరిపించాడు. సహజ కవచ కుండలములో ప్రకాశిస్తున్న బాలుని చూచాడు. తన భార్య రాధను పిలిచి "సంతానము లేని మనకు ఆ దేవుడు మనకు ఈబిడ్డను ప్రసాదిచించాడు. వీడు మానవుడు కాడు. దేవతలకు పుట్టినవాడు. ఈ బిడ్డను మనము పెంచుకొనెదము." అని అన్నాడు. రాధ ఆ బిడ్డను గుండెలకు అదుముకుంది.

ఆ బిడ్డ సహజ కుండలములు కర్ణములకు ఉన్నవాడు కావున కర్ణుడు అని నామకరణం చేసారు. బంగారు ఒంటి ఛాయ కలవాడు కనుక అతనిని వసుసేనుడు అని కూడా నామకరణం చేసారు బ్రాహ్మణులు. ఆ ప్రకారము సూర్యపుత్రుడు సూతపుత్రుడు అయ్యాడు. ఈ విషయమంతయూ కుంతీదేవి తన ఆంతరంగిక గూఢచారుల వలన తెలుసుకొని మనసుకు ఊరట చెందింది.

అతి రధుడు కర్ణుడు యుక్త వయస్కుడు కాగానే అతనిని ద్రోణాచార్యుని వద్ద విలు విద్య నేర్పించాడు. తరువాత కర్ణుడు కృపాచార్యుని వద్ద, పరశు రాముని వద్ద విలువిద్య నేర్చుకున్నాడు. ఎన్నో అస్త్రాలు సంపాదించాడు. తరువాత కర్ణునికి దుర్యోధనునితో స్నేహం ఏర్పడింది. దుర్యోధనునితో స్నేహం కారణంగా అతడు పాండవులకు విరోధి అయ్యాడు. కర్ణుడి కవచ కుండలములముల మహత్తును తెలుసుకొని ధర్మరాజు ఎంతో భయపడుతుండేవాడు. అతని భయం పోగొట్టడానికి ఇంద్రుడు కర్ణుని కవచ కుండలాలను అపహరించ దలచాడు.

ఒక రోజు బ్రాహ్మణ వేషధారియై కర్ణుని వద్దకు వచ్చాడు. ఆ సమయంలో కర్ణుడు సూర్యోపాసన చేసి బ్రాహ్మణులకు దానధర్మాలు చేస్తున్నాడు. అప్పుడు ఇంద్రుడు "భిక్షాందేహి" అని అర్ధించాడు.

"మీకు ఏమి కావాలో కోరుకొనండి. " అని అన్నాడు కర్ణుడు.

"నాకు నీ కవచకుండలములు కావాలి అవి ఇమ్ము." అని అడిగాడు ఇంద్రుడు. కర్ణునికి విషయం అర్ధం అయింది.

"బ్రాహ్మణోత్తమా! ఎందుకూ ఉపయోగపడని ఈకవచ కుండలములు నీకు ఎందుకు. వాటి బదులు నీకు ఉపయోగించే ధనము, బంగారము, మణిమాణిక్యాలు కోరుకో! " అని అన్నాడు.

కాని నాకు కవచ కుండలములు కావాలని పట్టుపట్టాడు బ్రాహ్మణ వేషంలో ఉన్న ఇంద్రుడు. "బ్రాహ్మణోత్తమా! పోనీ నా అంగ రాజ్యాన్ని నీకు ఇస్తాను స్వీకరించు" అని చెప్పాడు.

దానికి కూడా దేవేంద్రుడు  ఒప్పుకోలేదు. అప్పుడు కర్ణుడు దేవేంద్రుని చూచి "దేవా! నేను గుర్తు పట్టాను. నీవు దేవేంద్రుడవు. మీరు దేవతలు. మేము మిమ్ము వరాలు అడగాలి కాని మీరు వచ్చి మమ్మల్ను యాచించచడం ఏమిటి? వింతగా ఉంది."

"కర్ణా! నీ తండ్రి సూర్యుడు నీకు అన్ని విషయములు చెప్పి ఉంటాడు అందుకేనన్ను గుర్తించగలిగావు. కాబట్టి నేను కోరిన కవచకుండలములు నాకు ఇచ్చి పంపు" అన్నాడు ఇంద్రుడు.

"మరి నాకు మీ వద్ద ఉన్న సకల శత్రు సంహారి అయిన శక్తిని ప్రసాదించండి. నా కవచకుండలములు తీసుకొనండి. " అని అన్నాడు కర్ణుడు.

"నా శక్తి ని నీకు సంతోషంగా ఇస్తాను. కాని అది యుద్ధ సమయంలో నేను ప్రయోగించగానే అది నా శత్రువులను చంపి మరల నా దగ్గరకు వస్తుంది. కాబట్టి. నీవు కూడా  నీ శత్రువు మీద దానిని ప్రయోగించగానే అది అతనిని చంపి నీ దగ్గరకు రాదు. నా దగ్గరకు వస్తుంది. కాబట్టి నీవు దానిని ఒకే సారి ప్రయోగింప గలవు.  ఈ నియమానికి అంగీకరించి నా శక్తినీ తీసుకో. " అన్నాడు ఇంద్రుడు.

" దేవేంద్రా! నాకు ఉన్న శత్రువు ఒక్కడే. నీ శక్తి అతనిని వధియించుట నా కోరిక. అది నెరవేరితే చాలు." అన్నాడు కర్ణుడు.

ఇంద్రుడు నవ్వి "కర్ణా! నీ మనోరధము నాకు తెలియును నీవు అర్జునుని చంపవలెనని అనుకుంటున్నావు. కాని కృష్ణుడు అర్జునుని ప్రక్కన ఉన్నంత వరకు నీవు అర్జునుని ఏమీ చేయలేవు." అని అన్నాడు ఇంద్రుడు.

"అది సరేగాని, నా కవచకుండలములు నా శరీరమునుండి చీల్చి ఇచ్చిన నా శరీరం వికృతములవుతుంది కదా! మరి దీనికి ఏమంటారు?" అని అడిగాడు కర్ణుడు.

"నీకు  ఆ చింత లేదు నీ శరీరం నీ తండ్రి సూర్యుని మాదిరి ప్రకాశించగలదు." అని వరం ఇచ్చాడు. తరువాత ఇంద్రుడు తన శక్తిని కర్ణుడికి ఇచ్చి అతని కవచకుండలములు తీసుకొని దేవలోకం వెళ్లాడు.  ఈ వృత్తాంతం విని పాండవులు  ఆనందించారు కౌరవులు దుఃఖించారు.

జనమేజయ మహారాజా! ఆ విధంగా ఇంద్రుడు మాయోపాయంతో కర్ణుని కవచకుండలములు తీసుకున్నాడు." అని వైశంపాయనుడు చెప్పాడు.  తరువాత, వైశంపాయనుడు జనమే జయునితో భారత కధను కొనసాగించాడు.

"అరణ్య వాసములో  ఆఖరి సంవత్సరములో ఉన్న పాండవుల వద్దకు ఒక రోజు ఒక బ్రాహ్మణుడు వచ్చాడు.  "అయ్యా! నేను నా అరణిని ఒక చెట్టు కు

వేలాడ గట్టాను ఒక లేడి పరుగెత్తుకుంటూ వచ్చింది. నా అరణి దాని కొమ్ములకు తగులుకుంది. ఆ లేడి అరణితో కూడా పారిపోయింది. దయచేసి నా అరణిని నాకు తెచ్చి ఇవ్వండి. " అని ధర్మరాజును అడిగాడు.

అప్పుడు ధర్మరాజు విల్లు అమ్ములు ధరించి, తమ్ములతో ఆ లేడిని వెంబడించాడు. కాని అతను వేసిన బాణములు ఒకటి కూడా ఆ లేడికి తగలలేదు. అలా కొంత దూరం ఆ లేడి పరుగెత్తి మాయం అయింది. అప్పటికే పాండవులు అలసి పోయారు. ఒక చెట్టు నీడన విశ్రాంతి తీసుకుంటున్నారు.

అప్పుడు నకులుడు ధర్మరాజును చూచి ఇలా అన్నాడు. "అన్నయ్యా! మనం ఉన్నత మైన వంశంలో పుట్టాము. ధర్మశాస్త్రాలు చదువుకున్నాము. అందరి పట్ల కరుణ కలిగి ఉన్నాము. కాని మనకు ఇంతటి దుర్గతి దాపురించడానికి కారణం ఏమిటి? అని అడిగాడు.

దానికి ధర్మరాజు నవ్వి "నకులా! సుఖం కాని, దుఃఖం కాని మనకు కలగడానికి కారణం మనం చేసిన కర్మ. వేరే కారణం ఏమీ కాదు."

భీముడు నకులుని చూచి "తమ్ముడూ! ఆరోజు ప్రాతిగామి ద్రౌపదిని కొలువుకూటమునకు తీసుకొని వచ్చినపుడే ఆ కౌరవులను నరికి ఉంటే మనకు ఈ కష్టా లు తప్పేవి" అన్నాడు.

"అన్నయ్యా భీమా! అదియును కాక ఆ రోజు కర్ణుడు కొలువు కూటములో పలికిన మాటలకు మనం ఆగ్రహించక పిరికి వారివలె అడవులకు వచ్చామే అదీ అసలు కారణం. అన్నయ్యలూ! ఆరోజే ఆ మాయాజూదం ఆడిన శకునిని అడ్డంగా నరికి ఉంటే అసలు మనకు ఆ దుర్దశ దాపురించదు కదా!" అని అన్నాడు సహదేవుడు.

ఆ మాటలు వింటున్న ధర్మరాజు నకులుని చూచి "తమ్ముడూ ప్రస్తుతం, నీ అన్నయ్యలు అందరూ చాలా దాహంతో ఉన్నారు. నీళ్లు ఎక్కడైనా ఉన్నాయేమో చూడు." అన్నాడు.

నకులుడు ఆ చెట్టు ఎక్కి నలుపక్కలా చూచి, కొంచెందూరంలో ఒక కొలను చూచి "అన్నయ్యా అక్కడ నీళ్లు ఉన్నాయి" అన్నాడు

"అయితే నీవు పోయి నీరు త్రాగి మాకు కొన్ని నీరు తెమ్ము" అని అన్నాడు ధర్మరాజు.

నకులుడు అలాగే అని ఆ కొలను దగ్గరకు వెళ్లాడు. నీళ్లు తాగపోయాడు అప్పుడు ఒక శబ్దం వినపడింది.

"ఓ అన్నా! ఈ తటాకము నాది. నీవు తటాకములో నీరు తాగదలుచుకుంటే నా ప్రశ్నలకు ప్రత్యుత్తరము ఇవ్వాలి." అని వినిపించింది.

నకులుడు దానిని పట్టించుకోలేదు. ఆ నీరు తాగాడు. బయటకు వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. నీళ్లకు పోయిన నకులుడు ఎంతకూ రాకపోతే ధర్మరాజు సహదేవుని చూచి "సహదేవా! నీ అన్నయ్య నకులుడు జలములకు పోయి ఇంతకూ రాలేదు. నీవుపోయి చూచిరా!" అని అన్నాడు.

సహదేవుడు వెంటనే నకులుడు పోయిన దిక్కు వెళ్లాడు కొలను చూచాడు నీళ్లుతాగడాని కొలనులో దిగాడు. మరల అశరీరవాణి వినపడింది. "మహానుభావా! ఈకొలను నాది. సాహసంతో ఈకొలనులో దిగవద్దు నా ప్రశ్నలకు సమాధానం చెప్పు తరువాత నీరు తాగు." అని వినపడింది. సహదేవుడు ఆ మాటలు లక్ష్యపెట్టక కొలనులోకి దిగి నీరు తాగాడు. వెంటనే స్పృహతప్పి పడిపోయాడు.

పోయిన వాళ్లు ఎంతకూ రాకపోతే ధర్మరాజు అర్జునుని చూచి "అర్జునా! నీ తమ్ములు వెళ్లి చాలా సేపు అయింది ఏం జరిగిందో చూచిరా?" అని అన్నాడు. అర్జునుడు కూడా ఆ కొలను దగ్గరకు వెళ్లాడు. మరలా అశరీర వాణి వినిపించింది.

"ఎవరన్నా బలవంతంగా ఈకొలనులో నీరు తాగితే స్పృహతప్పి పడిపోతారు. కాబట్టి నా ప్రశ్నలకు సమాధానం చెప్పు." అని వినపడింది.

"ఎవడురా నువ్వు? దొంగలాగా దాగి మాట్లాడుతున్నావు. ఉండు నిన్ను సంహరిస్తాను." అంటూ అర్జునుడు శబ్దవేది బాణాన్ని ప్రయోగించాడు. మరల

అవే మాటలు వినబడ్డాయి. వాటిని లక్ష్యపెట్టక కొలనులో దిగి నీరు తాగాడు. యధాప్రకారం స్పృహతప్పి పడిపోయాడు.

వెళ్లిన ముగ్గురూ ఎంతకూ రాలేదు ధర్మజునకు ఆందోళనగా ఉంది. “భీమా నీవు వెళ్లి ఏంజరిగిందో చూచిరా!” అన్నాడు.

భీముడు వెంటనే అటుగా వెళ్లాడు. కొలను దగ్గరకు వచ్చాడు. మరల అదే శబ్దం వినపడింది. “ఎందుకయ్యా ఇంత సాహసానికి పూనుకుంటావు. నీకు శక్తి ఉంటే నా ప్రశ్నలకు సమాధానం చెప్పి నీరు తాగు.” అని వినపడింది. భీముడు వినిపించుకోకుండా కొలనులోకి దిగాడు. స్పృహతప్పాడు.

వెళ్లిన నలుగురూ ఎంతకూరాలేదు. ధర్మరాజు ఎంతో ఆతరత చెందాడు. వెంటనే తను కూడా బయలుదేరాడు. ఆ కొలను దగ్గరకు వెళ్లాడు. పరిసరాలను పరిశీలించాడు. స్పృహతప్పి పడిపోయిన తన తమ్ములను చూచాడు. అతని హృదయం తల్లడిల్లింది కొంచెం సేపటికి తేరుకున్నాడు. చుట్టుపక్కల పరికించాడు. అక్కడ వేరే వాళ్ల అడుగు జాడలు కనిపించలేదు. “వారికై వారు అలాకూలిపోవడానికి కారణం తెలియడం లేదు. ఈ కొలనులో నీరు విషపూరితమైనది అనడానికి వీరి శరీరములలో విషప్రయోగం జరిగిన లక్షణాలు లేవు. ఒకవేళ సుయోధనుడు అతని మిత్రులు ఇలా చేసారా! ఇప్పుడు కుంతీదేవికి తాను ఏమని సమాధానం చెప్పాలి? ” అనుకుంటూ కొలనులోకి దిగాడు

అప్పుడు మరల ఆకాశవాణి వినపడింది. "ఓధర్మరాజా! నేను ఒక కొంగను. ఈ కొలనునాది. నీ తమ్ములు నా మాటలు వినకుండా కొలనులో దిగి స్పృహ తప్పిపడిపోయారు. నీవు కూడా నా మాట వినకుంటా ఈ కొలనులో నీళ్లు తాగితే వాళ్ల గతే నీకూ పడుతుంది కాబట్టి నా ప్రశ్నలకు సమాధానం చెప్పి తరువాత నీళ్లు తాగు జాగ్రత్త!" అని వినిపించింది.

"అయ్యా! నీవు కొంగ రూపం ధరించిన రుద్రుడవో, అగ్నిదేవుడివో, వాయుదేవుడివో తెలియదు. లేని ఎడల అత్యంత పరాక్రమ వంతులైన నా తమ్ములు ఇలా పడిపోరు. నీవు ఎవ్వరవు? నీ తలంపు ఏమి? చెప్పు? " అని అడిగాడు.

"ధర్మరాజా! నేను కొంగనుకాను. యక్షుడను. నీ తమ్ములు నన్ను అవమానించి పడిపోయారు." అంటూ ధర్మరాజు ముందు నిలబడ్డాడు. " నా అనుమతి లేకుండా ఈ కొలనులో నీరు తాగితే ఎంతటి వారైనా ఇలాగే పడిపోతారు. నీవు తెలివికలవాడివికనుక నీరు తాగలేదు కాబట్టి నేను వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పు." అని అన్నాడు.

"అయ్యా! నీ వంటి వారికి సమాధానం చెప్పడం నాతరమా అయినను నాకు తెలిసిన విధంగా సమాధానాలు చెపుతాను" అని అన్నాడు ధర్మరాజు.

యక్షుడు: సూర్యుని ఎవరునడుపుతున్నారు? సూర్యుని ఎవరు కొలుస్తున్నారు? సూర్యుడు అస్తమించడం అంటే ఏమిటి? సూర్యునికి ఆధారభూతము ఏది? చెప్పు

ధర్మరాజు: సూర్యుని బ్రహ్మము నడుపుతుంది. దేవతలు సూర్యుని కొలుస్తారు. సూర్యుడు ధర్మం చేత అస్తమిస్తాడు. సూర్యునికి సత్యమే ఆధారము.

యక్షుడు: శ్రోత్రియుడు ఎలాఅవుతాడు? పురుషునికి మహిమలు ఇలాసిద్ధిస్తాయి? పురుషునకు సాయం ఎవరు! అతడు బుద్ధిమంతుడు ఎలా అవుతాడు?

ధర్మజ: శ్రుతము వలన శ్రోత్రియుడు అవుతాడు. అనగా వేదములు అధ్యయనము చేయడం వలన. తపస్సు వలన మహిమలు సిద్ధిస్తాయి. పురుషునకు అతని ధైర్యమే అతనికి సాయం. గొప్పవారికి, జ్ఞానులకు సేవచెయ్యడం వలన బుద్ధిమంతుడు అవుతాడు.

యక్షుడు: బ్రాహ్మణుడు దైవత్వము ఎలా పొందుతాడు? అతనికిసాధుభావము ఎలా ఏర్పడుతుంది అతడు దుష్కృతుడు ఎలా అవుతాడు? బ్రాహ్మణుడు మానవుడు ఎలా అవుతాడు?

ధర్మజ: బ్రాహ్మణుడు వేదపఠనము చేత దైవత్వముపొందుతాడు అధిక మైన నిష్ఠవలన సాధుభావము ఏర్పడుతుంది. తన నిష్ఠను కోల్పోయినపుడు దుష్కృ

తుడు అవుతాడు. శుచిత్వము పాటించని బ్రాహ్మణుడు మరణ భయముతో మానవుడు అవుతాడు

యక్షుడు: జీవన్మృతుడు అనగా ఎవరు?

ధర్మజ: దేవతలకు, అతిధులకు, పితృదేవతలకు తన వద్ద పని చేసే సేవకులకు పెట్టకుండా తినే వాడు, జీవించీ మరణించినట్లే.

యక్షుడు: భూమి కంటే బరువైనది ఏది? ఆకాశముకంటే పొడవైనది ఏది? గాలి కంటే వేగమైనది ఏది? గడ్డి కంటే విరివిగా పెరిగేది ఏది?

ధర్మజ: భూమి కంటే బరువైనది కన్నతల్లి. ఆకాశము కంటే పొడవైనవాడు తండ్రి. గాలి కంటే వేగమైనది మనస్సు. మనసులో కలిగిన చింత గడ్డికన్నా వేగంగా పెరుగుతుంది.

యక్షుడు: కన్నులుతెరిచి నిద్రించేది ఏది? పుట్టిన తరువాత కూడా కదలలేనిది ఏది? రూపం ఉండి కూడా హృదయం లేనిది ఏది? వేగం వలన వర్ధిల్లునది ఏది?

ధర్మజ: కన్నులు తెరిచీ నిద్రించేది చేప. పుట్టిన తరువాత కూడా కదలలేనిది అండము (గుడ్డు). రూపం కలిగి హృదయం లేనిది పాషాణం (రాయి) వేగం వలన వర్ధిల్లునది ఏరు.

యక్షుడు: దారిన నడచువానికి, రోగముతో ఉన్నవానికి, గృహస్తునకు, చనిపోయిన వారికి ఎవరు చుట్టములు?

ధర్మజ: దారిన నడచువానికి, తనతో నడచు వారు, రోగగ్రస్తునకు వైద్యుడు, గృహస్తునకు మంచి భార్య, చనిపోయిన వానికి అతను ఆచరించిన ధర్మము చుట్టములు.

యక్షుడు: ధర్మమునకు ఆధారము ఏది? కీర్తికి ఆశ్రయము ఏది? దేవలోకమునకు పోవు మార్గము ఏది? సుఖించుటకు మూలము ఏది?

ధర్మజ: కరుణ స్వభావము ధర్మమునకు ఆధారము. దానము చేయడం వలన కీర్తి వస్తుంది. సత్యము పలుకుటయే దేవలోకముకను మార్గము. మంచి ప్రవర్తన అన్ని సుఖములకు మూలము.

యక్షుడు: నరునకు ఆత్మ ఏది? దైవికమైన చుట్టము ఎవరు? అతడు దేని ఆధారంగా జీవిస్తాడు? నరుడు దేనివలన మంచితనము పొందుతాడు?

ధర్మజ: పుత్రుడే నరునకు ఆత్మ. భార్య దేవుడి చ్చిన చుట్టము. అతనికి జీవనం మేఘములు కల్పిస్తాయి దానము వలన నరుడు మంచి తనము పొందుతాడు

యక్షుడు: ధర్మములలో కన్న గొప్ప ధర్మము ఏది? ఏది మనకు పూర్ణమైన ఫలితాన్ని ఇస్తుంది? ఏది వదలి పెడితే మనకు ఆనందం కలుగుతుంది? ఎవరి తోటి స్నేహము ఎప్పుడూ చెడిపోదు?

ధర్మజ: అహింస పరమ ధర్మము. యజ్ఞయాగములు మనకుపూర్తి ఫలితాన్ని ఇస్తాయి. అహంకారము వదలిన ఆనందం కలుగుతుంది. మంచి వారితో స్నేహం ఎప్పుడూ చెడిపోదు.

యక్షుడు: ఈ లోకమునకు దిక్కు ఎవరు: జలము, అన్నము దేనివలన సంభవిస్తాయి? విషము అనగా నేమి? శ్రాద్ధ కార్యమునకు ఏది సమయము?

ధర్మజ: మంచివారే ఈలోకమునకు దిక్కు. మనకు నీరు, అన్నము మేఘముల వలన సంభవిస్తాయి. బ్రాహ్మణునికి చెందిన ధనము విషతుల్యము. బ్రాహ్మణుడు వచ్చినపుడే శ్రాద్ధమునకు మంచి సమయము.

యక్షుడు: మనుజుడు దేనిని వదలిపెడితే సర్వజనులకు ప్రియుడు, శోకము లేని వాడు, ధనము కలవాడు, సుఖి అవుతాడు?

ధర్మజ: గర్వము వదలి పెడితే సర్వజనులకు ప్రియుడు అవుతాడు. కోపం వదలి పెడితే వాడికి శోకమే ఉండదు. లోభి కానివాడు సంపన్నుడు అవుతాడు. అత్యాశను వదిలితే సుఖాన్ని పొందుతాడు.

యక్షుడు: పురుషుడు ఎవరు? అత్యంత ధనము కలవాడు ఎవరు?

ధర్మజ: ఎవడు కీర్తి వంతుడో అతడే పురుషుడు. ప్రియము, అప్రియము, సుఖదుఃఖములు, జరిగినవి, జరుగబోవునవి ఎవరు సమంగా చూచునో అతడే అత్యంత ధనవంతుడు.

ధర్మరాజు చెప్పి సమాధానాలు విని యక్షుడు సంతృప్తి చెందాడు.

"ధర్మజా! నా ప్రశ్నలకు సమయోచితముగా సమాధానాలు చెప్పి నన్ను తృప్తి పరిచావు. నీతమ్ములలో ఒక్కరి ప్రాణము తిరిగి ఇచ్చెదను కోరుకొనుము" అని అన్నాడు.

దానికి ధర్మరాజు "మహాత్మా! నా తమ్ముడు నకులుని ప్రాణములు తిరిగి ఇమ్ము" అని అడిగాడు.

"అదేమిటి! భీమార్జునులను వదలి పెట్టి నకులిని ప్రాణములు కోరుకున్నావు?" అన్నాడు యక్షుడు.

"అయ్యా! నా తండ్రికి ఇద్దరు భార్యలు. కుంతీదేవికి నేను, భీమార్జునులు, మాద్రికి నకుల సహదేవులు పుత్రులు. కుంతీపుత్రులలో నేను పెద్దవాడిని. మాద్రీపుత్రులలో నకులుడుపెద్దవాడు. అందుకని అతనిని కోరుకున్నాను. ఇది ధర్మం కదా! " అని అన్నాడు ధర్మజుడు.

"ధర్మరాజా! నీ ధర్మ నిరతికి మెచ్చాను. నీ తమ్ములందరూ పునర్జీవులౌతారు." అని వరం ఇచ్చాడు యక్షుడు. వెంటనే భీమార్జున,నకుల సహదేవులు నిద్రనుండి లేచి నట్టు లేచారు.

"మహాత్మా! నీవు మాములు యక్షుడివి కావు. నీవు ఎవరివో ఎరింగింపుము" అని ప్రార్థించాడు ధర్మరాజు.

"ధర్మజా! నేను యమధర్మరాజును.నీ తండ్రిని. నిన్ను చూడవలెనని కోరిక కలిగి వచ్చాను. సత్యము, శౌచము, దానము, తపము, శమము, కీర్తి వివేకము నా యొక్క మూర్తులు. పైగుణములను ఆశ్రయించిన వారు దుర్గతిని పొందరు. నీవు కోరిన వరాలు ఇస్తాను కోరుకో!" అన్నాడు యమధర్మరాజు.

"యమధర్మరాజా! నా ఆశ్రమంలో నివసిస్తున్న ఒక బ్రాహ్మణుని అరణిని ఒక లేడి అపహరించింది. దానిని తిరిగి ప్రసాదింపుము." అని అడిగాడు.

"ధర్మజా! నేనే ఆ లేడిని. నీ మనస్సు ఎలా ప్రవర్తిస్తూ ఉందో తెలుసుకోడానికి ఆ అరణిని నేనే తీసుకొని వచ్చాను. ఇదిగో అరణి తీసుకొనుము" అని అరణిని తిరిగి ఇచ్చాడు యమధర్మరాజు.

"పాండవులారా! మీరు అరణ్యవాసము పండ్రెండేళ్లు పూర్తి అయినవి. ఇంక ఒక వత్సరము అజ్ఞాత వాసము మిగిలి ఉన్నది అజ్ఞాత వాస సమయములో మీకు ఏ రూపాలు కోరితే ఆ రూపాలు మీకు వస్తాయి. మిమ్మల్ను ఎవరూ గుర్తింప

కుండా వరం ఇస్తున్నాను. మరొక వరము కోరుకొనుము." అని అడిగాడు యమధర్మరాజు.

" దేవతలలో ఆది దేవుడివి. నీవే నాకు కనపడ్డావు. ఇంతకన్నా నాకు వేరు వరం ఏమున్నది. నా మనస్సు ఎల్లప్పుడూ ధర్మమార్గాన చరించేటట్టు, క్రోధము, మోహము మొదలైనవి నా దగ్గర చేరకుండా వరం ప్రసాదించు." అని కోరాడు. యమధర్మరాజు అలాగే అని వరము ఇచ్చి అంతర్ధానం అయ్యాడు. పాండవులు ఆశ్రమానికి వెళ్లి అరణిని బ్రాహ్మణునికి ఇచ్చారు. అతని ఆశీర్వాదాన్ని పొందారు.

ఆ ప్రకారంగా పాండవులు తమ అరణ్య వాసం పూర్తి చేసారు." అని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పాడని, సూతుడు శౌనకాది మహా మునులకు మహా భారత కథను చెప్పాడు.

మహా భారతము - అరణ్య పర్వము - సప్త మాశ్వాసము -

ఎఱ్ఱాప్రగ్గడ ప్రణీతమైన అరణ్య పర్వశేషము

సర్వం సంపూర్ణం.

ఓం తత్సత్.

# మహాభారతము

## విరాట పర్వము

### ప్రధమ ఆశ్వాసము

శ్రీయన గౌరినాబరగు చెల్వకు జిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తి య్యై హరిహరంబగు రూపము దాల్చి విష్ణు రూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చ మెచ్చు పరతత్త్వము గొల్చెద నిష్టసిద్ధికిన్.

(తిక్కనామాత్యుడు పై ప్రార్ధనా పద్యంతో మహాభారతం, విరాట పర్వము ప్రారంభించాడు).

మహా భారతం సంస్కృతంలో భగవాన్ వేద వ్యాసుడు రచించాడు. దానిని తెలుగులో కవిత్రయం అనువదించారు. ఈ అనువాదం మొత్తం పద్యములు, వచనములో సాగింది.

క్రీ.శ.1022 ప్రాంతంలో రాజరాజ నరేంద్రుడు రాజమహేంద్రవరమును (ప్రస్తుత రాజమండ్రి) రాజధానిగా చేసుకొని ఆంధ్ర దేశాన్ని పరిపాలించాడు.

ఆయన ఆస్థానం లో నన్నయభట్టారకుడు అనే మహాకవి ఉండేవాడు. రాజ రాజ నరేంద్రుని కోరిక మేరకు నన్నయభట్టారకుడు క్రీ.శ.1055 ప్రాంతంలో మహా భారతం ఆదిపర్వము నుండి అరణ్యపర్వములో కొంత భాగము వరకు తెనిగించాడు.

తరువాత క్రీ.శ.1255-60 ప్రాంతంలో సింహపురి (ప్రస్తుత నెల్లూరు)ని పరిపాలించు మనుమసిద్ధి మహారాజు ఆస్థానంలో ఉన్న తిక్కనసోయయాజి అనే మహాకవి విరాట పర్వము నుండి మిగిలిన 15 పర్వములు తెనిగించాడు.

తరువాత క్రీ.శ.14 వ శతాబ్దము పూర్వార్ధములో ఎర్రాప్రగ్గడ అను మహాకవి  నన్నయ భట్టారకుడు తెనిగించగా మిగిలిన అరణ్య పర్వ శేషమును పూరించాడు.

ప్రస్తుతం మనము అరణ్య పర్వమును పూర్తి చేసుకొని విరాట పర్వములో ప్రవేశిస్తున్నాము. విరాట పర్వము నుండి మిగిలిన 15పర్వములు తెనిగించిన తిక్కనసోమయాజి గురించి తెలుసు కుందాము.

తిక్కన తండ్రి పేరు కొమ్మన దండనాధుడు. తల్లి పేరు అన్నమాంబ. గౌతమ గోత్రం. ఆపస్తంభ సూత్రీకుడు. ఒకరోజు తిక్కనకు తన తండ్రి

మరియు హరిహర నాధుడు కలలో కనిపించారు. హరిహర నాధుడు వ్యాసమహా భారతాన్ని తెనిగించమని తిక్కనను కోరాడు. హరిహర నాధుని కోరిక మేరకు తిక్కన వ్యాసమహా భారతాన్ని విరాటపర్వము నుండి తెనిగించాడు. హరిహరనాధునికి అంకితం ఇచ్చాడు.

నన్నయ తను తెని గించిన మహా భార తాన్ని తన ప్రభు వైన రాజ రాజ నరేంద్రునికి అంకితం ఇస్తే తిక్కన తను తెనిగించిన మహా భారతాన్ని పరమాత్ముడైన హరిహరనాధునికి అంకితం ఇచ్చాడు. అదీ విశేషం.

తిక్కన నిజ జీవితంలో కూడా మహాభారతంలోజరిగిన అతి ప్రసిద్ధమైన అజ్ఞాత వాసము, రాయబారఘట్టం జరిగాయి.

ఆ రోజుల్లో మనుమసిద్ధి నెల్లూరు మండలం పరిపాలిస్తున్నాడు. తిక్కన మనుమసిద్ధి ఆస్థానంలో మంత్రిగా ఉండేవాడు. కాకతీయ సామ్రాజ్యాన్ని గణపతి దేవుడు పరిపాలిస్తున్నాడు. మనుమసిద్ధిని అతని దాయాదులు, అక్కన, బయ్యనలు, రాజ్య భ్రష్టుడిని చేసారు. వారికి కులోత్తుంగ చోళరాజు సాయ పడ్డాడు. అప్పుడు తిక్కన మనుమసిద్ధిని అజ్ఞాతవాసంలో ఉంచాడు. తాను తన శిష్యులతో ఓరుగల్లు ప్రభువు గణపతి దేవుని వద్దకు రాయబారం వెళ్లాడు. గణపతి దేవునికి వ్యాసభారతం వివరంగా చెప్పాడు.

అనుమకొండనుండి వచ్చిన బౌద్ధులను వాదనలో ఓడించాడు. గణపతి దేవుడు తిక్కనను ఏమి కావాలి అని అడిగాడు అప్పుడు తిక్కన నెల్లూరులోని రాజకీయ పరిణామాలను, మనుమసిద్ధి అజ్ఞాతవాసాన్ని వివరించాడు. సహాయం అర్థించాడు. వెంటనే గణపతి దేవుడు సానుకూలంగా స్పందించాడు. కుళోత్తుంగ చోళుని ఓడించాడు. మనుమసిద్ధి దాయాదులను జయించి మనుమసిద్ధిని తిరిగి నెల్లూరు సింహాసనం మీద కూర్చోపెట్టాడు. ఆ విధంగా తిక్కన మనుమసిద్ధి రాజ్యస్థాపనాచార్యుడయ్యాడు.

చారిత్రకాధారాలను బట్టి తిక్కన క్రీ.శ.1210 నుండి 1288 వరకు (78 సంవత్సరాలు) జీవించాడని తెలుస్తూ ఉంది.

తిక్కన కవిత్వ ధోరణిని పరిశీలిస్తే తిక్కన భారత రచనలో నాటకీయత కనపడుతుంది. నన్నయ శ్రవ్య కావ్య ప్రక్రియలో దృశ్యకావ్య మర్యాదలను చొప్పించి నాటకీయతను కావ్య, ఇతిహాస, రచనలలో ప్రవేశపెట్టాడు. దానిని తిక్కన పరిపుష్టి చేసాడు. నన్నయ నాటకీయతలో ఆకృతి శిల్పం కనబడితే, తిక్కన నాటకీయతలో అభినయ శిల్పం అగ్రస్థానంలో నిలుస్తుంది. నన్నయ నాటకీయత ప్రయోగ సంబంధం అయితే, తిక్కన నాటకీయత ప్రదర్శన యోగ్యం అయింది.

అదియును కాక, తిక్కన కాలంలో ఓరుగల్లును గణపతిదేవుడు పరిపాలిస్తున్నాడు అని చెప్పుకున్నాము కదా! కాకతీయుల కాలంలో నాట్యకళ, శిల్పకళ ఎంతో ఆదరణకు నోచుకున్నాయి. ఆయన ఆస్థానంలో ఉన్న జాయప్ప సేనాని నృత్తరత్నాకరం అనే నాట్య గ్రంధాన్ని రచించాడు. ఓరుగల్లు దేవాలయ స్తంభాల మీద చెక్కిన నృత్య భంగిమలు వీటికి ఉదాహరణలు. ఈ పరిస్థితులలో తిక్కన మహాభారతం తెనిగించాడు. తిక్కన మహా భారతాన్ని అటు శ్రవ్యకావ్యం గానే కాకుండా ఇటు దృశ్య కావ్యంగా కూడా మలిచాడు. అందువలన తిక్కన మహాభారతంలో నాటకీయత మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

(తిరుమల తిరుపతి దేవస్థానములు వారు ప్రచురించిన శ్రీమదాంధ్ర మహాభారతము విరాటపర్వము పీఠిక ఆధారంగా).

తిక్కన తన మహా భారతాన్ని ఈ క్రింది వచనంతో ప్రారం భించాడు.

మహాభారతంబు సమస్త దురితాపహంబును నభిమత శుభా వహంబును, నశుభ హరణంబునుం, గావున నొక్క మహాఫలంబు గోరి జనమేజయుండు కృష్ణద్వైపాయన మహాముని కారుణ్యంబు వడసి తదీయ ప్రియశిష్యుండైన వైశంపాయను వలన వినిన కథ యగుటం జేసి తత్ప్రకారంబు నడపెద; నది ఎట్లనినం బరమ పవిత్రులగు పాండుపుత్రు చరిత్రం బుపాఖ్యాన సహితంబుగా వ్యాఖ్యానంబు సేయుచుండ వారల వనవాస సమ్యగనుష్ఠానంబు సవిస్తరంబుగా విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె.

‘‘ఓ మహర్షి! మా తాతలు పాండవులు వనవాసానంతరము అజ్ఞాత వాసమును అతి రహస్యంగా, చాతుర్యంగా, కౌరవులకు తెలియకుండా ఎలాగడిపారో సవిస్తరంగా చెప్పండి.’’ అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఈ విధంగా చెప్పసాగాడు.

‘‘జనమేజయా! పాండవులు తమ వనవాస కాలాన్ని పూర్తి చేసారు. తమతో వచ్చిన బ్రాహ్మణులనందరిని చూచి ధర్మరాజు ‘‘అయ్యా! ఇన్నాళ్ల మాతో పాటు మీరూ అడవులలో ఎన్నో కష్టాలు అనుభవించారు. ఇంక మేము అజ్ఞాతవాసము గడప వలసి ఉన్నది. ఈ అజ్ఞాత వాసము కూడా మేము నిర్విఘ్నముగా పూర్తి కావలెనని ఆశీర్వదించండి.’’ అని నమస్కరించాడు.

అప్పుడు ధౌమ్యుడు ధర్మజుని చూచి ‘‘ధర్మజా! నీవు ధర్మస్వరూపుడవు. నీ వలెనే పూర్వము ఇంద్రుడు వృత్రాసుర వధానంతరము, బ్రహ్మ హత్యా పాతకము పోగొట్టుకొనుటకు నిషధాచలముమీద, హరి అదితి గర్భంలో వామన మూర్తి గానూ, ఔర్వుడు తన తల్లి తొడలోనూ అజ్ఞాత వాసం గడిపారు. తరువాత కాలము కలిసి వచ్చిన తరువాత వారు తమ తమ పూర్వపు వైభవమును పొందారు. అటులనే నీవు కూడా అజ్ఞాత వాసానంతరము నీపూర్వ వైభవమును పొంద గలవు.’’ అని పలికాడు.

బ్రాహ్మణులందరూ పాండవులను దీవించి తమ తమ ప్రదేశాలకు వెళ్ళిపోయారు.

తరువాత ధర్మరాజు తన తమ్ములను చూచి "మనము ఐదుగురము. ద్రౌపది. ఆరుగురం. అజ్ఞాతవాసం గడిపే ఉపాయం చెప్పండి." అని అడిగాడు.

దానికి అర్జునుడు "అన్నయ్యా! మనకు యమధర్మరాజు ఇచ్చిన వరం ఉన్నది కదా మనలను ఎక్కడకు పోయినా ఎవరూ గుర్తుపట్టలేరు. కురు దేశం చుట్టు పాంచాల, ఛేది, మత్స్య , సాళ్వ, విదేహ, బాహ్లిక, దశార్ణ, శూరసేన, కళింగ మగధ, దేశములు సుభిక్షంగా మనకు నివాస యోగ్యంగా ఉన్నాయి. ఈ దేశములలో మనకు అనుకూలంగా ఉన్న రాజ్యములో మనము అజ్ఞాత వాసము గడిపెదము." అని అన్నాడు.

"నాకు తెలిసి విరాటరాజు సద్ధర్మ వర్తి, మంచివాడు, బలవంతుడు అతని పాలనలో మనము అజ్ఞాత వాసము గడపుట ఉచితము అని నాకు తోచుచున్నది. మరి మనము విరాట రాజు కొలువులో ఎవరెవరు ఏమేమి పనులు చేసెదమో వివరంగా తెలపండి." అని అన్నాడు ధర్మరాజు.

ఆ మాటలు విని అర్జునుడు ''అన్నయ్యా! నీవు మహనీయ మూర్తివి. సుకుమారుడవు. ఎంతో ప్రాభవమును అనుభవించినవాడవు. అలాంటి వాడివి నీవు ఒరులను ఎలా సేవించగలవు. నాకు తెలియడం లేదు.'' అని అన్నాడు అర్జునుడు.

''అర్జునా! నాకు శ్రౌతము, స్మార్తము, శకునము, జ్యోతిషము మొదలగు శాస్త్రములు తెలియును. ఈ విద్యలను ప్రదర్శిస్తూ నేను కాలం గడపగలను. నీకు తెలుసుగా నేను ద్యూత ప్రియుడను. విరాట రాజును నా ద్యూతక్రీడతో అలరిస్తాను. ఆయన నా గురించి అడిగితే నేను పూర్వము ధర్మరాజు వద్ద ఉంటూ అతనితో స్నేహంగా ఉండేవాడిని అని చెపుతాను.'' అని పలికాడు.

తరువాత ధర్మరాజు భీముని చూచి ''నా సంగతి సరే భీమా! బకాసురుని, కిమ్మీరుడిని, చంపిన వాడవు. అలాంటి వాడివి సేవకా వృత్తి ఎలా చెయ్యగలవు?'' అని అడిగాడు.

''అన్నయ్యా! నాకు రుచికరంగా వంటలు చేయడం వచ్చు కదా! నేను వంటలవాడిగా విరాటుని కొలువులో చేరుతాను. పైగా నాకు మల్లయుద్ధంలో ప్రావీణ్యం ఉంది కదా. అతని కొలువులో మల్లయుద్ధ ప్రదర్శనలు ఇస్తూ అందరికీ వినోదం కలిగిస్తాను. నా పూర్వ చరిత్రగురించి అడిగితే నేను ఇంతకు

ముందు ధర్మరాజు కొలువులో వంటలవాడిగా ఉండేవాడినని చెబుతాను.'' అని పలికాడు భీముడు.

ధర్మరాజు అర్జునుని చూచి ''అర్జునా! నీ సంగతి ఏమిటి నీవు ఎలాంటి కొలువు చేసెదవు?'' అని అడిగాడు.

దానికి అర్జునుడు ''అన్నయ్యా! నేను దేవేంద్రుని వద్దకు వెళ్లినప్పుడు నన్ను ఊర్వశి కామించగా నేను నిరాకరించాను. అప్పుడు ఊర్వశి నన్ను నపుంసకుడుగా శపించినది. దేవేంద్రుడు ఆ శాపము నన్ను ఈ అజ్ఞాతకాల సమయమున అనుభవించమని, అజ్ఞాత వాస కాలము పూర్తి కాగానే ఆ శాపము నుండి విముక్తి కాగలనని చెప్పాడు. ఆ శాపవశమున నేను పేడి రూపము తాల్చి బృహన్నల అను పేరుతో విరాటుని కొలువులో ప్రవేశిస్తాను. నాకు నాట్య విద్యలో ప్రవేశము కలదు. అంతఃపురము లో ఉన్న ఆడపిల్లలకు నాట్యం నేర్పుతాను. ఇంతకు ముందు నేను ద్రౌపది దగ్గర ఆమె అంతఃపురములో నాట్యాచార్యుడి గా ఉన్నానని చెబుతాను.'' అని అన్నాడు అర్జునుడు.

తరువాత ధర్మరాజు నకులుని చూచి "ఇతడు చాలా సుకుమారుడు అందగాడు ఇతడు తన నిజరూపమును ఎలా దాచగలడు. ఒరులను ఎలాసేవింపగలడు." అని బాధపడ్డాడు.

"అన్నయ్యా! నాకు అశ్వ శిక్షణలో ప్రవేశమున్నది. నేను అశ్వ శిక్షకుడిగా విరాటుని కొలువులో చేరుతాను. అశ్వశాల లోని గుర్రాలకు ఎలాంటి వ్యాధులు రాకుండా చూచుకుంటాను. నేను దామగ్రంధి అనే పేరుతో సంచరిస్తాను. ఇంతకు ముందు ధర్మరాజు వద్ద అశ్వశిక్షకుడిగా ఉన్నాని చెబుతాను." అని అన్నాడు నకులుడు.

ధర్మరాజు నవ్వి సహదేవుని వైపు చూచాడు. "అన్నయ్యా! నాకు పశుపోషణలో అనుభవం ఉన్నది. తంత్రీపాలుడు అనే పేరుతో గోరక్షకుడిగా విరటుని కొలువులో ప్రవేశిస్తాను. ఇంతకు ముందు ధర్మరాజు గోవుల శాలయందు పని చేసినానని చెబుతాను." అని అన్నాడు సహదేవుడు.

"ఇంక మిగిలింది ద్రౌపది సుకుమారి. పనులు చేయించుకొనడమే గాని ఒరులను సేవించి ఎరుగదు. ఇటువంటి ఈ ఉదాత్తచిత్త ఏ పని చెయ్యగలదు." అని మనసులో బాధ పడ్డాడు ధర్మజుడు.

అది గ్రహించిన ద్రౌపది ‘‘నేను సైరంధ్రీ వేషంలో మాలిని అనే పేరుతో విరాట రాజు అంతఃపురానికి వెళతాను. విరాటరాజు భార్య సుధేష్ణను ప్రసన్నం చేసుకుంటాను. అందరూ గౌరవించే విధంగా సైరంధ్రీ వ్రతం సాగిస్తాను. ఇంతకు ముందు నేను ద్రౌపది దగ్గర సైరంధ్రిగా పనిచేసానని చెబుతాను.’’ అని పలికింది ద్రౌపది .

‘‘అందరికి అన్ని పనులు కుదిరాయి. మనం అందరం అజ్ఞాతవాసాన్ని నిరపాయంగా గడుపుదాము’’ అని అన్నాడు ధర్మరాజు. ‘‘మన ధౌమ్యు లవారు అగ్ని హోత్రం రక్షిస్తుంటారు. మిగిలిన వారు వారి వారి స్వస్థలాలకు వెళ్తారు. ఎవరైనా మిమ్ములను మా గురించి అడిగిన ద్వైతవనమునుండి ఎటో వెళ్లిపోయినారని చెప్పండి.’’ అని ఆదేశించాడు ధర్మరాజు.

ధౌమ్యుడు పాండవులను చూచి ఇలా పలికాడు. ‘‘ధర్మజా! మీరు కురు వంశంలో జన్మించారు. గౌరవంగా బతికారు. ఈసమయంలో పరులను సేవించుట కొంచెం కష్టమే. కాని కాలం మనకు అనుకూలం కాదని మరిచి పోవద్దు. పరాక్రమాలు ప్రదర్శించడానికి ఇది సమయం కాదు. అందువలన అజ్ఞాత వాసం భగ్నమవుతుంది.

రాజులను సేవించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. రాజుతో చనువుగా ఉన్నాను అనుకొని రాచ మర్యాదను అతిక్రమిస్తే హాని కలుగుతుంది.

రాజు కన్నా అధికంగా మనము దుస్తులు వేసుకోడంగాని, రాజు కన్నా అధికమైన ఇంటిలో ఉండటంగాని, రాజు కన్నా అధికంగా మాట్లాడటం గాని చెయ్యకూడదు. సహజంగా రాజులు తమ ఆజ్ఞను అతిక్రమించిన వారిని పుత్రులైనా మిత్రులైనా శత్రువులుగానే చూస్తారు.

తాను చేయలేని పనిని కూడా నెత్తిన వేసుకొనకూడదు. తరువాత భంగపాటు తప్పదు.

రాజులవద్ద మౌనంగా ఉండరాదు; అని చెప్పి అధిక ప్రసంగము చేయరాదు. మితంగా, చతుర సంభాషణలతో రాజును ప్రసన్నం చేసుకోవాలి.

అంతఃపుర రహస్యాలను ఎప్పుడూ బయట పెట్టరాదు.

రాజు గారికి చెప్పదగిన మాటలను, రాజుగారు వినదగిన మాటలనే చెప్పాలి.

ఏదైనా ఆసనాన్ని రాజు అనుగ్రహంతోనే అధిరోహించాలి. రాజు కన్నా ఉన్నతమైన ఆసనాన్ని ఎప్పుడూ అధిరోహించరాదు. రాజు అభిమానించాడని పొంగిపోవడం, అవమానించాడని కుంగి పోవడం మంచిదికాదు.

రాజు చెప్పిన పనిని స్థలము, కాలము, ఎండ వాన, ఆకలి, దప్పిక, వీటితో నిమిత్తము లేకుండా శ్రద్ధతో చెయ్యాలి.

రాజధనాన్ని విషంగా భావించాలి. రాజధనాన్ని సంగ్రహించడం ప్రాణాలమీదికి తెచ్చుకోవడమే.

రాజు కొలువులో నవ్వడం, ఆవులించడం లాంటి అనుచిత కార్యాలు చేయరాదు. రాజుగారి శత్రువులతో గాని, వారి దూతలతో గాని సన్నిహితంగా మెలగరాదు.

భటుడు తనకు సంపద కలదు కదా అని ఎక్కువగా భోగింపరాదు. రాజుకు కంటగింపుగా ఉంటుంది.

కాబట్టి ఈ అజ్ఞాత వాస సమయమున మీరు జాగ్రత్తగా అణిగి మణిగి మెలగండి.'' అని చెప్పాడు ధౌమ్యుడు.

‘‘మాకు అన్ని మీరే. మాకు తెలియని ఎన్నోవిషయాలు చెప్పారు తప్పకుండా పాటిస్తాము.’’ అని చెప్పాడు ధర్మరాజు.

ధౌమ్యుని ఆశీర్వాదము పొంది పాండవులు, ధౌమ్యుడు అక్కడి నుండి విరాటు నగరానికి బయలుదేరారు. యమునా నది వెంట నడుస్తున్నారు. మత్స్యదేశం పొలిమేర చేరుకున్నారు. అక్కడ ధౌమ్యుడు ఒక ఆశ్రమంలో నిల్చిపోయాడు.

పాండవులు జనపదముల వెంట కాకుండా అరణ్యముల నడుమ నుండి విరాట నగరం వైపు నడుస్తున్నారు. చాలా దూరం నడిచారు. ద్రౌపది ఇంక నడవ లేక పోయింది. ఇంక విశ్రాంతి తీసుకుందాము అనుకుంది. కాని ధర్మరాజు ఒప్పుకోలేదు. త్వరగా విరాట నగరం చేరాలని అతని కోరిక పట్టుదల. ద్రౌపది ఇంక ఒక్క అడుగు వేయలేను అని చెప్పింది.

ధర్మజుడు నకులుని చూచి ‘‘నకులా! ద్రౌపది అలసి పోయింది. కొంచెం ఎత్తుకొని తీసుకొని రాగలవా!’’ అని అడిగాడు. ‘‘నేనుకూడా బాగా అలసి పోయాను అన్నయ్యా!’’ అన్నాడు నకులుడు. ధర్మరాజు తరువాత సహదేవుని అడిగాడు. అతడూ అదేసమాధానం ఇచ్చాడు. ఇంక అర్జునుని వంతు

వచ్చింది. అర్జునుడు ద్రౌపదిని అవలీలగా ఎత్తుకొని మోసుకుంటూ విరాటనగరం వైపు పయనించాడు.

అంతా విరాట నగరం పొలిమేర సమీపించారు. అక్కడ అందరూ ఆగారు. ధర్మరాజు తన తమ్ములను చూచి ''మనం ఈ ఆకారాలతోనూ ఆయుధాలతోనూ నగరంలో అడుగు పెడితే మనలను సులభంగా గుర్తుపడతారు. ముందు మనం మన ఆయుధాలను ఎక్కడైనా దాచి పెట్టాలి.'' అన్నాడు.

అందరూ చుట్టుపక్కల చూచారు. పక్కనే శ్మశానం ఉంది. అక్కడకు సామాన్యంగా ఎవరూ రారు. పైగా భూత ప్రేత పిశాచములు తిరుగాడుతుంటాయి అని భయం. అది అనువైన స్థలం అని అనుకున్నారు.

ఆ శ్మశానంలో ఒక జమ్మిచెట్టు ఆకాశం అంటే కొమ్మలతో దట్టమైన ఆకులతో, పగటి వేళలోనే దట్టమైన చీకటితో భయంకరంగా ఉంది. ఆ జమ్మిచెట్టును చూచి అర్జునుడు ''అన్నయ్యా ఈ జమ్మిచెట్టుమీద మన ఆయుధాలు భద్రపరుద్దాము.'' అని అన్నాడు.

పాండవులు తమతమ ఆయుధాలను అని ఒక చోట చేర్చి వాటిని వెంట్రుకలతో ఉన్న చర్మంలో కట్టారు. పక్కనే ఒక జంతువు చచ్చి పడి ఉంది. ధర్మజుడు దాని చర్మం ఒలిచి తెమ్మని సహదేవునికి చెప్పాడు. ఆ చర్మాన్ని ఆయుధాల మూటకు చుట్టారు. ఆపక్కనే ఒక అనాధ శవం పడి ఉంది. ఆ శవాన్ని కూడా ఆయుధాల మూటతో చేర్చి కట్టారు.

ధర్మరాజు ఆ జమ్మి చెట్టు ఎక్కి ఆ ఆయుధాల మూటను ఒక కొమ్మకు వేలాడ గట్టాడు. ఆ ఆయుధాల మూటకు నమస్కరించాడు. తనకూ అర్జునునికీ తప్ప వేరేవారు ఎవరికీ ఆయుధాల మాదిరి కనపడవద్దని, విషసర్పాల మాదిరి కనపడమని, భీముడు వస్తే అస్సలు కన పడవద్దని వేడుకున్నాడు.

(అజ్ఞాత వాస కాలంలో ఒళ్లుమండి ఎప్పుడైనా భీముడు పరుగెత్తుకుంటూ వచ్చి తన గదను తీసుకొని కౌరవులను అందరినీ చావగొడతాడని, అజ్ఞాత వాసం భగ్నం అవుతుందని ధర్మజుని భయం).

ధర్మరాజు చెట్టుదిగాడు. చుట్టూ చూసాడు. దూరంగా కొంతమంది పశువుల కాపరులు ఉన్నారు. వారు కూడా ఆ పక్కకు రాకుండా ఒక ఉపాయం పన్నాడు. వారి దగ్గరకుపోయి “అయ్యలారా! మా తల్లి చనిపోయింది.

మా కులాచారం ప్రకారం ఆమె శవాన్ని జమ్మి చెట్టు కొమ్మకు వేటాడ గట్టాలి అందుకే అలా వేటాడ గట్టాము.'' అంటూ శవాకృతిలో ఉన్న తమ ఆయుధాల మూట చూపించాడు. అమాయకులైన ఆ గోపాలురు అదిరి పోయారు. ఆ విషయం ఇతరులకు చెప్పడానికి పరుగు పరుగున వెళ్లారు.

తరువాత ధర్మరాజు యమధర్మరాజును ప్రార్ధించాడు. ధర్మరాజుకు సన్యాసి వేషము, భీమునకు వంటలవాడి వేషము, అర్జునునికి పేడి వేషము, నకుల సహదేవులకు అశ్వపాలకుడు, పశుపాలక వేషాలు లభించాయి. మీరు అందరూ ఒకరి వెంట వరుసగా విరాట నగరంలో ప్రవేశించండి అని చెప్పి ముందు తను కమండలం పాచికల కట్ట చంకన పెట్టుకొని నగర ప్రవేశం చేసాడు ధర్మరాజు.

దైవ వశాత్తు ఆ రోజు విరాట రాజు నగరసంచారం చేస్తున్నాడు. దూరం నుండి సన్యాసి వేషంలో ఉన్న ధర్మరాజును చూచాడు. ''ఆహా! ఏమి ఆ ఠీవి ఈ రాజసం రాజ్యాలను ఏలే చక్రవర్తి మాదిరి గోచరిస్తున్నాడు.'' అని మనసులో అనుకున్నాడు. ధర్మరాజుకు ఎదురు పోయి నమస్కరించాడు. ''అయ్యా! తమరు ఎవరు? ఏ ఊరు? మా నగరుకు ఎందుకు వచ్చారు? వివరించండి.'' అని అడిగాడు.

ధర్మరాజు చిరు నవ్వు నవ్వి " నేను బ్రాహ్మణుడను. కురు దేశంలో జన్మించాను. ధర్మరాజు స్నేహితుడను. ప్రస్తుతం సన్యాసాశ్రమము స్వీకరించాను. నాకు జూద విద్యలో ప్రవేశం ఉంది. నా శత్రువులు నా సంపదనంతా జూదం లో అపహరించారు. ఆ అవమానాన్ని భరించలేక దేశం విడిచి వచ్చాను. నా పేరు కంకుడు అంటారు. తమరు సజ్జనులైనా మహారాజులని విని వచ్చాను. నేను నీచ వృత్తి చేయను. నాకు ఒక సంవత్సరం వ్రతం ఉన్నది ఆ వ్రతకాలం తమరి దగ్గర ఉంటాను అనుగ్రహించండి తరువాత నాకు అపకారం చేసిన వాళ్లను వెతుక్కుంటూ వెళతాను." అని అన్నాడు ధర్మరాజు.

"అయ్యా! తమరు మా రాజ్యంలో ఉండటం కన్నా మహాద్భాగ్యం మరొకటి లేదు. నాకు జరిచే మర్యాదలు అన్ని తమరికి జరుగుతాయి. తమరు సంతోషంగా మా నగరులో ఉండండి." అని అన్నాడు

దానికి ధర్మరాజు "నాకు రాచ భోగాలు అక్కర లేదు. నేను హోమం చేయగా మిగిలిన పదార్థం తింటాను. నేలమీద పడుకుంటాను." అని అన్నాడు ధర్మరాజు.

''మీ ఇష్టం వచ్చినట్టు ఉండండి!'' అన్నాడు విరాటరాజు. ఆ విధంగా ధర్మరాజు విరాటరాజు కొలువులో స్థానం సంపాదించాడు.

తరువాత భీముడు, చేతిలో గరిటతో వంటలవాడిగా ప్రవేశించాడు. విరాట రాజుకు అభివాదం చేసాడు. ''అయ్యా! నేను నాల్గవ జాతి వాడను. వంటలు చేయగలను. నా పేరు వలలుడు. తమరి కొలువులో వంటలవాడిగా ఉంటాను. నేను ఇదివరకు ధర్మరాజు వద్ద వంటలవాడిగా ఉండేవాడిని ఆయనకు ప్రీతిగా రుచికరమైన వంటలు చేసేవాడిని. ధర్మరాజును సేవించినట్టే తమరిని సేవిస్తాను. నాకు మల్లయుద్ధం కూడా వచ్చు. తమరికి వినోదం కూడా కలిగిస్తాను. అనుగ్రహించండి. తమరికి ఇష్టం లేకపోతే వేరే చోటికి పోతాను.'' అని అన్నాడు భీముడు.

దానికి విరాట రాజు ''నీ మాటలకు నేను ముగ్ధుడనయ్యాను. మా వంటశాలలో చేరు.'' అని అన్నాడు. ఆ విధంగా భీముడు విరాటుని కొలువులో వంటలవాడయ్యాడు.

అర్జునుడు అందమైన చీర కట్టుతో, రవికతో, చక్కని తలక ట్టుతో, ఆడవేషంలో విరాటరాజు కొలువుకూటం ప్రవేశించాడు. అర్జునునిలో నపుంతకత్వము, ఆడతనము రెండూ మూర్తిభవిస్తున్నాయి.

విరాటుని చూచి ''మహారాజా! నా పేరు బృహన్నల. నేను పేడిని. ఆడపిల్లలకు ఆటపాట నేర్పుతాను. నన్ను తమరి కొలువులో చేర్చుకోండి.'' అని ప్రార్థించాడు.

''అయ్యో ఇంత అందమైన వాడివి నీకు పేడి రూపమా.'' అని అడిగాడు

''అవును మహారాజా! శాప వశమున నపుంసకత్వము అనుభవించవలసి వచ్చినది. పేడితనము వలన ఏ పనీ చెయ్యలేను. చిన్నప్పటి నుండి సంగీతము నృత్యము నేర్చుకున్నాను. అన్నిరకముల వాయిద్యములను కూడా వాయించగలను నాకు అలంకరణ విద్య లో కూడా ప్రవేశమున్నది.'' అని పలికాడు అర్జునుడు.

అతని పేడి వేషంలో ఏమీ దోషము లేదని గ్రహించాడు. వెంటనే తన కుమార్తె ఉత్తరను పిలిపించాడు. తండ్రి పిలుపు నందుకొని ఉత్తర మంద గమనంతో కొలువు కూటమునకు వచ్చింది.

''బృహన్నలా ఈమె నాకూతురు ఉత్తర. ఈమెకు నాట్యం నేర్పగలవా!'' అని అడిగాడు. బృహన్నల వినయంగా నేర్పుతాను అని సమాధానం చెప్పాడు.

''బృహన్నలా నా కూతురు ఉత్తర ఇంకా చిన్న పిల్ల ఆటపాటల మీద మక్కువ ఇంకా పోలేదు. నీవే ఆమెకు కళలయందు ఆసక్తి కలిగించాలి. నర్తనలో తగిన శిక్షణ ఇవ్వాలి. ఈమెకు రక్షకుడిగా ఉండాలి.'' అని పలికాడు.

ఉత్తరను చూ చి ''అమ్మా ఈమె నీ గురువు. ఎలా చెబితే అలా భక్తితో నడుచుకో.'' అని బృహన్నలకు ఉత్తరను అప్పగించాడు. ఆ విధంగా అర్జునుడు బృహన్నల నామంతో విరాటుని కొలువులో చేరాడు.

తరువాత నకులుడు అశ్వపాలకుని వేషంలో విరాటుని కొలువుకూటమునకు వచ్చాడు. అ సమయంలో విరాటుడు తన వద్దకు కొని రాబడిన గుర్రాలను పరిశీలిస్తున్నాడు. నకులుడు కూడా ఆ గుర్రాలను తదేకంగా చూస్తున్నాడు. ఇది గమనించాడు విరాటుడు. అతనికి అశ్వ విద్యలో నైపుణ్యం ఉన్నట్టు ఉన్నది అని తెలుసుకున్నాడు. అతని గురించి వివరాలను తెలుసుకొని రమ్మని తన మంత్రులను ఆజ్ఞాపిస్తున్న తరుణంలో నకులుడు విరాటుని వద్దకు వచ్చి

''మహారాజా! నా పేరు తామగ్రంధి. నా అశ్వ విషయములు అన్నియు తెలియును. అశ్వముల ఆయుఃప్రమాణము చెప్పగలను. అశ్వపోషణ చేయగలను. ఇంతకు ముందు ధర్మరాజు వద్ద అశ్వరక్షణ చేసేవాడిని. కాని

ధర్మరాజు అందరిని వదలి వెళ్లిపోయాడు. విరాటరాజు సుజనుడు, లోకోత్తర చరితుడు అని విని నేను తమరి కొలువులో చేరాలని కోరి తమరిని సేవించాలని వచ్చాను.'' అని అన్నాడు.

విరాటుడు అతని నైపుణ్యానికి మెచ్చి అతనిని తన అశ్వశాలలో చేర్చుకున్నాడు.

తరువాత సహదేవుడు చేతిలో ముల్లుకర్రతో, తలమీద తాళ్ల మూటతో, గోపాలుడి వేషంలో విరాటుని వద్దకు వచ్చాడు. ''మహారాజా! నా పేరు తంత్రీపాలుడు. నేను ఆల మందలను చక్కగా పెంచుతాను. పశువులలో ఉన్న రకాలు నాకు తెలియును పశువుల వ్యాధులకు చికిత్స చేయగలను. ఇంతకు ముందు ధర్మరాజు గారి వద్ద పశుపాలకుడిగా ఉండేవాడిని. నన్ను తమరి కొలువులో పశుపాలకునిగా నియోగించచేయండి.'' అని కోరాడు. విరాటుడు అతని మాటలకు మెచ్చి అతనిని పశుపాలకుడుగా నియోగించాడు.

ఆ ప్రకారం ఐదుగురుపాండవులు విరాటుని కొలువులో వివిధ వృత్తులలో చేరారు. ఇంక మిగిలింది పాండవపత్ని ద్రౌపది.

ద్రౌపది సైరంధ్రీ వేషానికి తగ్గట్టు తలకు కొప్పుపెట్టుకొంది మాసిన చీర ధరించింది. మహారాణి అయిన ద్రౌపది దాసీభావాన్ని మనసులో నింపుకుంది. విరాట నగరం రాజవీధిలో నడుస్తూ అంతఃపురం చేరుకుంది.

ఆ సమయంలో విరాటరాజు పత్ని సుధేష్ణాదేవి విహారం నిమిత్తం రాజప్రాసాదం పైకి ఎక్కి విహారం చేస్తూ రాజవీధి వెంట వస్తున్న సైరంధ్రిని చూచింది. ఆమె అందానికి ఆశ్చర్యపోయింది. ఆమెను తీసుకురమ్మని తన చెలికత్తెలను పంపింది. వారు వెళ్లి సైరంధ్రీవేషంలో ఉన్న ద్రౌపదిని సుధేష్ణ సముఖానికి తీసుకొని వచ్చారు.

''మానినీ నీవు ఎవరవు! నీ కులం ఏది! నీ పేరు ఏమి! ఏపనిమీద ఆ నగరానికి వచ్చావు!'' అని అడిగింది.

''అమ్మా! నేను సైరంధ్రీజాతి స్త్రీని. నా పేరు మాలిని అంటారు. నాకు ఐదుగురు భర్తలు. నేను ఒకానొక కారణమున నా విరోధుల చేతిలో నా భర్తల ముందే అవమానం పొందాను. అడవులకు వెళ్లాను భర్తలతో సహా అడవులలో ఉన్నాను. బ్రహ్మచారిగా కాలం గడిపాను. ఇంకొక్క నా వ్రతము ఉన్నది. మీరు ధర్మ వర్తనులు అని విని వ్రత కాలం తమరి వద్ద గడపాలని వచ్చాను. నా చేతనైన పనులు చేస్తాను. నేను ఇంతకు ముందు శ్రీకృష్ణుని భార్య సత్యభామ

దగ్గరా, పాండవ పత్ని ద్రౌపది దగ్గరా పని చేసాను. నాకు పూలమాలలు, చెండ్లు కట్టడం తెలుసు. రకరకాల తిలకాలు దిద్దగలను కురులను అందంగా అల్లగలను ముడవగలను.'' అని చెప్పింది ద్రౌపది.

కాని సుధేష్ణకు ఒక సందేహం కలిగింది. ''సైరంధ్రీ! నీవు అందగత్తెవు. నిన్ను చూచి మా రాజు నీ మీద మనసు పడితే నేనేంచేసేది? అసలు ఆడవాళ్లే నిన్ను వింతగా చూస్తారే ఇంక మగవాళ్ళు ఎంత? నిన్ను అంతఃపురంలో ఉంచుకోవడం చాలాకష్టం. నాకై నేనే నా వినాశం కోరుకోవడం వంటిది.'' అని పలికింది సుధేష్ణ.

''అమ్మా! తమరు అలా అనవలదు నా భర్తలు బలవంతులు. నీ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటారు ఎవరైనా నన్ను నీచ భావంతో చూస్తే వాడిని నా భర్తలు చంపుతారు. కాబట్టి పురుషులు నా వంక చూడరు. నాకు అలాంటి నీచ బుద్ధులు లేవు. నన్ను మీరు నమ్మవచ్చును. నన్ను తమరి సేవకురాలిగా స్వీకరించండి. కాని నాకు కొన్ని నియమాలు ఉన్నాయి. నేను ఇతరుల ఎంగిలితినను. నీచపు పనులు చెయ్యను.'' అని పలికింది.

సైరంధ్రి మాటలకు సంతోషించి సుధేష్ణ ఆమెను తన వద్ద పరిచారికగా చేర్చుకుంది. ఆ ప్రకారం ద్రౌపది కూడా విరాటుని కొలువులో చేరింది.

పాండవులు, ద్రౌపది  అజ్ఞాతంగా విరాటుని కొలువులో వివిధ  వృత్తులలో సంతోషంగా కాలం గడుపుతున్నారు.

మహా భారతము విరాట పర్వము

ప్రధమాశ్వాసము సంపూర్ణము.

ఓం తత్సత్.

# మహాభారతము

## విరాట పర్వము

## ద్వితీయాశ్వాసము

## (తిక్కనామాత్య ప్రణీతము)

ఆ ప్రకారము వైశంపాయనుడు జనమేజయునకు మహాభారత కధను ఇలా చెప్పసాగాడు.

ధర్మరాజు విరాట రాజు కొలువులో ధర్మ ప్రసంగములతో, ద్యూతా క్రీడ లతో కాలము గడుపుచూ, అందులో గెలిచిన ధనమును తమ్ములకు ఇస్తూ కాలము గడుపుతున్నాడు.

భీముడు వలలుని పేరుతో వంటల వాడుగా, విరాటునికి రుచికర మైన వంటలు చేయుచూ, మిగిలిన ఆహార పదార్ధములను తమ్ములకు ఇస్తూ కాలము గడుపుతున్నాడు.

అర్జునుడు తన సంగీత సాహిత్య ప్రసం గములకు వచ్చిన బహు మతు లను, ధనమును తమ్ములకు ఇస్తున్నాడు. నకులుడు, సహాదేవుడు తమ తమ విధినిర్వహణలో తాము ఆర్జించిన ధనమును తమ్ములకు ఇస్తున్నారు. అందరూ ద్రౌపదిని కంటికి రెప్పవలే కాపాడుకుంటున్నారు. ఆవిధంగా నాలుగు నెలలు గడిచాయి.

అంతట ఒకనాడు ఒక మల్లుడు విరాట రాజు కొలువుకు వచ్చాడు.

''ఓ మహారాజా నేను రాజుల నందరిని సందర్శించాను. ఎక్కడ కూడా నన్ను మల్లయుద్ధంలో గెలిచే వీరుడు కనిపించలేదు. అందుకే మీవద్దకు వచ్చాను'' అని పలికాడు.

అతని భయంకరాకారాన్ని చూచి విరాటుని కొలువులో ఉన్న మల్లులు అందరూ వెనకడుగు వేశారు. విరాట రాజు మొహం చిన్న బోయింది.

అప్పుడు ధర్మరాజు విరాటుని చూచి ''మహారాజా! ఇదివరకు నేను ధర్మరాజు కొలువులో పనిచేసేటప్పుడు ఒక మల్లయోధుని చూచాను. అతడు ఇప్పుడు తమరి కొలువులో వంట వాడుగా ఉన్నాడు. అతడు ఎందరినో మల్లయుద్ధం లో ఓడించాడు.'' అని చెప్పి ఊరు కున్నాడు.

విరాట రాజు వెంటనే వలలుని పిలిపించాడు.  వలలుడు రాగానే ''నీవు ఇతనితో మల్లయుద్ధమునకు సిద్ధము కమ్ము!'' అని ఆజ్ఞాపిం చాడు. అప్పుడు భీముడు అన్నగారి వైపు చూచాడు.  ధర్మరాజు అనుజ్ఞ ఇస్తున్నట్టు కనుసైగ చేసాడు.

''మహారాజా! నేను ధర్మరాజు గాని కొలువులో ఉన్నపుడు ఎంతో మంది మల్లయోధులతో పోరి ఆయనకు వినోదము కలిగించాను. ఇతనితో కూడా పోరి మీకు వినోదము కలిగిస్తాను.'' అని అన్నాడు.

వలలుని వేషంలో ఉన్న భీముడు మల్లయోధునితో  మల్లయుద్ధం మొదలు పెట్టాడు.  భీముడు ఉత్సాహంతో గర్జించాడు.  తొడలు కొట్టాడు. ఇరువులు ఒకరిని ఒకరు చూచుకున్నారు.  కిందికి ఒంగి మట్టిని నుదుట ధరించాడు.  ఒంటి కంతా మట్టి పూసుకున్నాడు.  చేతులు చాస్తూ అతని మీదికి ఉరికాడు.  రకరకాలైన కుస్తి పట్లతో రాజును రంజింప చేస్తున్నాడు వలలుడు. ఆఖరున మల్లుని పట్టుకొని ముక్కుమీద గుద్ది అవతలకు విసిరి వేసాడు .  ఆ విధంగా వలలుడు మల్లుని ఓడించాడు.

విరాట రాజు  వలలుని వేషంలో ఉన్న భీమునికి ఎన్నో కానుకలు ఇచ్చి సత్కరించాడు. భీముడు ఆ కానుకలను  అక్కడ ఉన్న పేదవారికి పంచి ఇచ్చాడు. మరల తన వంట శాలకు వెళ్లిపోయాడు.

ఆ ప్రకారంగా వలలుడు  మల్లులతో పోరుతూ రాజుకు, అంతః పుర కాంతలకు ఆనందం వినోదం కలుగ చేస్తున్నాడు. మల్లులు లేన పుడు సింహము లతో పులులతో పోరి అంతఃపుర కాంతలకు వినోదం కలిగించేవాడు.

ఆ ప్రకారంగా కాలం గడిచిపోతూ ఉంది. అజ్ఞాత వాసం ఇంక కొన్ని రోజులలో ముగుస్తుంది అనగా ఒక నాడు మత్స్యపతి విరాటుని మరిది,  ఆ రాజ్య దండ నాథుడు, కీచకులలో అందరికి పెద్దవాడు, మంచి అందగాడు, కాని తెలివి తక్కువ వాడు,  తన బల గర్వంతో విర్రవీగేవాడు అయిన సింహబలుడు, తన అక్క గారైన సుధేష్ణ కు నమస్కారం చెయ్యడానికి అంతఃపురానికి వచ్చాడు.

అప్పుడు అక్కడే ఉన్న ద్రౌపది అతని కంటపడింది. సింహబలుడు ద్రౌపది అందానికి ఆశ్చర్యపోయాడు. ఆమె మీదినుండి చూపు మరల్చు కోలేక పోయాడు.

‘‘ ఆహా! మానవులు ఎవరైనా ఇంతటి అంద కత్తెల ను చూచి ఉంటారా! ఈ సుందరాంగి ని పొందని జీవితం నిరర్ధకం కాదా! ఇంతటి అంద కత్తె ఆనాడు మన్మధుని వద్ద ఉంటే, శివుని సునాయా సంగా లొంగ తీసు కొనే వాడు కదా! బ్రహ్మదేవుడు మన్మధుని ఐదు బాణాలు కలిపి ఈ సుందరిని సృష్టించి నట్టు లున్నది. అసలు ఈ సుందరాంగిని చూస్తే మన్మధుడే విరహ వేదనతో కుంగిపోడా! ఇంతటి అందాల రాసికి జన్మనిచ్చిన తల్లిదండ్రులు ఎవరో కదా! ఈమె పేరు ఏమిటో! ఇంతటి అందాల రాసిని భార్యగా పొందిన ఆ అదృష్ట వంతు డెవరో! ఈమెను పొందే మార్గమేదో! ఆపనికి నాకు తోడు పడే వారెవరో! ’’ అని పరి పరివిధాల ఆలోచిస్తున్నాడు కీచకుడు.

ఆ సమయం లో ద్రౌపది మాసిన చీర కట్టుకొని ఉన్నది. అతని వికారమైన చూపులు చూచి అతనిని అసహ్యించుకుంటూ ఉన్నది.

‘‘ వీడేమిటి తన వైపు ఇలా చూస్తున్నాడు. ఇప్పుడు నాకు దిక్కెవ్వరు?’’ అని మనసులో అనుకుంటూ ఉంది.

కాని కీచకునికి ఇవేమీ పట్టలేదు. ఆమె చూపులు శృంగార చేష్టలని మురిసి పోతున్నాడు. పక్కనే అక్క సుధేష్ణ, పరిచారికలు చూస్తున్నారు అనే ధ్యాస లేకుండా కీచకుడు ద్రౌపది వైపు తదేకంగా మోహంతో చూస్తున్నాడు.

కొంత సేపటికి తేరుకొని అక్క సుధేష్ణను చూచి నమస్కరించాడు. ఆమె అతనికి ఉచితాసనము చూపించింది.

కీచకుడు ద్రౌపదిని చూపిస్తూ " అక్కా! ఈమె ఎవ్వరు? పేరేమి? ఏ ఊరు? ఈమె భర్త ఎవరు? ఇక్కడకు ఏపని మీద వచ్చింది?" అని అడిగాడు.

ఆ మాటలకు సుధేష్ణకు అతని మీద అనుమానం కలిగింది. "ఇతనికి మాలిని మీద కామం కలిగింది. ఇతని మనసు మరలించాలి." అని అనుకుంది.

కాని అంతలోనే కీచకుడు ద్రౌపది వద్దకు వెళ్లాడు. "ఓ సుందరీ! నీ అందచందాలు ఎవరికి ఉంటాయి చెప్పు. నీవు ఎవరవు? నీ పేరేమి? తల్లి తండ్రులు ఎవరు? నీ భర్త ఎవరు?" అని అడిగాడు. ద్రౌపది ఏమీ మాట్లాడకుండా నిలుచుంది.

" సుందరీ! నీ అందం నన్ను పిచ్చివాడిని చేసింది. నిన్ను తాకాలని ఉంది. కాని చేతులు వణుకుతున్నాయి. ఏమి చెయ్యాలి చెప్పు? ఇలాగే ఉంటే నేనుమన్మథ బాణాలకు బలి అయిపోతాను." అని మోహావేశంతో అన్నాడు.

ద్రౌపదికి కోపం ముంచుకొచ్చింది కాని తొందర పడకూడదు అని అనుకొంది.

"ఓఅన్నా! నేను చాలా కష్టాలలో ఉన్నాను. నా కట్టు, నా మాసిన చీర చూడు. ఈ పరిస్తితులలో కూడా నేను నీకు మన్మధవికారం కలిగి స్తు న్నానా! మీరు మంచి వారు. మీకు తోబుట్టువులు ఉన్నారు. నన్ను కూడా మీ ఆడ పడుచు గా భావించండి. నేను హీనకులంటో పుట్టిన దానను. పతివ్రతను. మీరు ఇలా మాట్లాడటం భావ్యమా!" అని అడిగింది.

కీచకుడు మన్మధావేశంతో ఉన్మత్తుడై "ఓ వనితా! నీ అందం నన్ను పిచ్చివాడిని చేసింది. నీవు నీచ జాతి స్త్రీవి కావు. నాకు పరస్త్రీ సాంగత్యం వలన వచ్చు పాపము నేను సహించగలను కాని మన్మధుని బాధ ఓర్వలేను." అన్నాడు కీచకుడు.

ఇంక ద్రౌపది కి కోపం వచ్చింది. ఆ దుర్మార్గుడికి బుద్ధి చెప్పాలనుకుంది. "ఓరీ కీచకా! ఐదుగురు గంధర్వులు నా భర్తలు. వారు నిన్ను హతమారుస్తారు జాగ్రత్త!" అని హెచ్చరించింది.

“ ఓ లతాంగీ! నీ భర్తలే కాదు. నన్ను ఎదిరించగల ధీరుడు ఈ భూమి మీద లేడు!” అన్నాడు కీచకుడు.

“ఓరీ వివేక హీనుడా! పూర్వము రావణాది రాక్షసులు నీ వలెనే పరస్త్రీని మోహించి పతనం చెందారు. తెలియదా! ” అని మరల హెచ్చరించింది. దుఃఖ భారంతో అక్కడి నుండి వెడలి పోయింది.

కీచకుడు అక్క సుధేష్ణ వద్దకు వెళ్లి “అక్కా! నా హృదయము ఈమె మీద మరులు కొన్నది. ఇప్పటి దాకా నీ వద్ద ఉన్నది. ఇంతలో ఎక్కడికి వెళ్లింది!” అని ద్రౌపది కోసం వెతుకుతున్నాడు.

సుధేష్ణ ఇది అంతా చూచింది. “నేను అనుకున్నంతా అయినది. ఈ సైరంధ్రిని చూచి కీచకుడు మోహావేశంలో పడ్డాడు. వీడికి ఏమి కీడు మూడు తుందో? వద్దన్నా వినే వాడు కాదు వీడు. దేవుడా నేను ఏమి చేసేది! అయినను నా శక్తి వంచన లేకుండా చెప్పి చూస్తాను” అని మనసులోనే తలచింది సుధేష్ణ.

“తమ్ముడా కీచకా! నీ అంతఃపురంలో ఎంతో మంది అందమైన కాంత లున్నారు కదా! ఈ నీరసాకార అయిన సైరంధ్రిని ఎందుకు కోరుకుంటావు? నా మాట విను“” అని అనునయించింది సుధేష్ణ.

''అక్కా! ఈ సైరంధ్రిని పోలిన సుందరాంగి మానవులలో నేకాదు దేవతలలో కూడా లేదు. అది నిక్కువము. ఆమె కళ్లు, మృదువైన ఆమె చేతులు, పద్మాలవంటి ఆ కాళ్లు, ఆ కోకిల కంఠస్వరము, ఆ మేని సొంపు ఈ సైరంధ్రిలోనే ఉన్నాయి. నీకు ఈవిషయం తెలియదు అక్కా! ఏ ఉపాయంతో నైనా సరే ఆమె నాకు కావాలి'' అని అన్నాడు కీచకుడు.

మామూలు మాటలతో వినడని సుధేష్ణ కొంచెం కటువుగా చెప్పసాగింది.

'' తమ్ముడా కీచకా! పరసతీ సంగమము వలన నీ కున్న ఆయుష్షు, ఐశ్వర్యము, కీర్తి హరిస్తాయి అని తెలియదా! ధర్మాత్ములు దీనిని హర్షించరు. ఇది వివేకం కాదు. అదియును కాక, భర్తకు తెలిస్తే ప్రాణము మీదికి వస్తుంది అనే భయంతో గుండెలు అదురు తుంటే, చుట్టుపక్కల వాళ్లు చూస్తే పరువు పోతుందనే భయంతోనూ, సాటి ఆడవారికి తెలిస్తే వారిలో గౌరవం పోతుంది అనే బాధతోనూ, బంధువులకు తెలిస్తే వంశ ప్రతిష్ట నాశనం అవుతుందనే వ్యధతోనూ, నిరంతరం భయంతో ఉండే పర స్త్రీతో ఏమి సుఖిస్తావు చెప్పు. అందుకే జారిణితో పొందు సుఖం కాదని అందరూ దానికి దూరంగా ఉంటారు. పైగా ఆమె భర్తలు ఐదుగురు గంధర్వులు. వాళ్లను తల్చుకుంటేనే నాకు భయంగా ఉంది. దాని సంగతి మర్చిపోరా తమ్ముడూ! చెడ్డ మార్గంలో పోతే

బతుకు బాగుంటుందా! అందుకనే నీ లాంటి బుద్ధిమంతులు అలాటి పనులు చెయ్యరు కదా! '' అని అనునయంగా పలికింది అక్క సుధేష్ణ.

అక్క చెప్పిన మాటలు ఏమాత్రం కీచకుని చెవికి ఎక్కలేదు.

'' ఓ సుధేష్ణా! ఒక్క మాట చెపు తున్నాను విను. ఈ భూలోకంలో నన్ను ఎదిరించి నిలువగల వీరుడు లేడు. నా భుజబలంతో ఆ గంధర్వులను చంపు తాను. కాబట్టి నాకు బుద్ధులు చెప్పడం మాని నాకు ఆమె ను పొందే సుఖాన్ని కలిగించు. లేక పోతే నేను మన్మధబాణాలతో చస్తాను. నన్ను నిందిం చక, నాకోరిక తీరే మార్గం చూడు.'' అని కిందికి ఒంగి అక్క పాదాలకు సాష్టాంగ ప్రమాణం చేసాడు కీచకుడు.

వీడు ఎంత చెప్పినా వినని మూర్ఖుడు. వీడు మాటలతో వినడు. వీడికి ఆమెను జతచేస్తే సరి. ఆమె భర్తలైన గంధర్వుల చేతిలో చస్తాడు. లేకపోతే మన్మధుడి చేతిలో చస్తాడు. ఎలాగైనా వీడి చావు తప్పదు.'' అని అనుకుంది సుధేష్ణ.

''తమ్ముడా కీచకా! ఎందుకు ఆరాటపడతావు? నీకు ఆమెతో పొందు కూర్చడం పెద్ద కష్టమేమీ కాదు. నీవు వెళ్లు. నేను ఈరోజే మద్యం తీసుకు

రమ్మని సైరంధ్రిని నీ మందిరానికి పంపుతాను. అక్కడ నీ ఇష్టం ప్రకారం నీ కోరిక తీర్చుకో! '' అని పలికింది సుధేష్ణ.

అక్క మాటలు విని కీచకుడు సంతోషించి తన మందిరానికి వెళ్లాడు. ఆ రోజు విందు భోజనం, వివిధములైన మధుర రసాలు ఏర్పాటు చేసాడు. పనివారందరిని పంపించి వేసాడు. తన మందిరంలో ఎవరూ లేకుండా చూసుకున్నాడు. ఒక అందమైన ప్రదేశంలో కూర్చుని సైరంధ్రి గురించి ఆమెతో పొందబోయే సుఖాన్ని తల్చుకుంటున్నాడు.

అక్కడ సుధేష్ణ సైరంధ్రిని పిలిచింది. ''మాలినీ! నాకు చాలా దాహంగా ఉంది. నాతమ్ముడు కీచకుని ఇంటియందు మంచి రుచికరమైన మద్యం ఉంది. నీవు త్వరగా వెళ్లి తీసుకొనిరా!'' అని చెప్పింది.

ఈ మాటలు విని ద్రౌపది కి మనసు తల్లడిల్లింది. చెమటలుపట్టాయి. ఈ ఆపద నుండి ఎలా గట్టెక్కాలా అని భగవంతుడిని ప్రార్ధించింది.

''అమ్మా! నన్ను వదిలి పెట్టు. మద్యం తీసుకురావడానికి వేరే వాళ్లను పంపండి. నేను మొదటనే చెప్పాను కేవలం ఉచితము లైన పనులు చేస్తాను కాని ఇలాంటి నీచమైన పనులు చేయనని. మీ గృహం అతి నిర్మలంగా ఉంటుందని,

నా  భర్తలు దగ్గర లేక పోయిననూ ధైర్యంగా ఉన్నాను. నాలాంటి అనాధలు మీలాంటి వారిని ఆశ్రయిస్తే మీరు నన్ను ఇలాంటి పనులకు పంపడం భావ్యమా!''  అని వినయంగా పలికింది ద్రౌపది.

'' ద్రౌపదీ!  నిన్ను  నేను మనసుపడి కోరుకున్న మద్యము తేవడానికి పంపుతున్నాను. దానికి వేరే నీచజాతి వారినిపంపుట భావ్యమా! ఇదేనా మన స్నేహము! అదియును కాక నీకు కీచకుని ఇల్లు పరాయి ఇల్లు కాదు కదా. అది నా తమ్ముని ఇల్లు.  కావున వెళ్లి మద్యము తీసుకొని రా!' అని పలికింది సుధేష్ణ.

ఆమె అంతగా చెపుతున్నపుడు కాదనలేక దేవుని మీద భారం వేసి కీచకుని ఇంటికి మద్మయు తెచ్చుటకు బయలు దేరింది ద్రౌపది.

సూర్యుడికి నమస్కారం చేసింది.  ''ఓ సూర్యభగవానుడా! నేను పాండు పుత్రులను తప్ప అన్యులను మనసులో తలపనేని, నాకు  ఈ కీచకుని వలన ఎలాంటి కీడు కలగకుండా కాపాడు!'' అని ప్రార్థించింది.

సూర్యుడు కరుణించాడు.  వెంటనే ద్రౌపదికి రక్షణగా ఒక రాక్షసుని పంపాడు. వాడు అదృశ్య రూపంలో  ద్రౌపది వెన్నంటి నడుస్తున్నాడు. ద్రౌపది

తడబడే అడుగులతో కీచకుని మందిరం ప్రవేశించింది.  ఆమె రాక కోసం ఎదురు చూస్తున్నాడు కీచకుడు.

‘‘మా దేవికి తృషతీరుటకు  మద్యము తీసుకు రమ్మని నన్ను పంపినది. త్వరగా మద్యము పోయించండి. ’’ అని అడిగింది ద్రౌపది.

‘‘ఓ సుందరాంగీ! మీ దేవి తృష తీర్చుటకు మద్యము కొరకు వచ్చినదానివి మరి నా తృష దీర్పవా!  నా మదన తాపాన్ని పోగొట్టవా! నన్ను నీ సేవకునిగా ఏలుకొనవా! ’’ అని అడిగాడు కీచకుడు.

‘‘ఆలస్యం అయితే మా దేవి కోపిస్తుంది. త్వరగా మద్యం పోయించండి.’’ అనిమరల అడిగింది ద్రౌపది.

‘‘నేను మీదేవికి వేరు వాళ్లతో మద్యం పంపుతాను. నీవు  ఈ మద్యం తాగి నా మదన తాపాన్ని పోగొట్టవా ! నిన్ను  నా రాణిని చేసుకుంటాను. అపారమైన మణి భూష ణాలు, విలాస గృహాలు నీకు అర్పించుకుంటాను. నా భార్యల అందరిని నీకు దాసీలుగా చేస్తాను. నేను కూడా నీ కనుసన్నలలో మెలుగు తాను.’’ అంటూ కీచకుడు ద్రౌపది పైన పడి ఆమెను పట్టుకో బోయాడు.

అంత లో ఆమెకు రక్షగా ఉన్న రాక్షసుడు ఆమెలో ఆవేశిం చాడు. అంత బలా ఢ్యుడైన సింహబలుని ఆమె విదిలించి కొట్టింది. వెంటనే బయటకు వచ్చింది. కీచకుడు ఆమెను వెంబడించాడు.

ఆమె పరుగెత్తింది. విరాట రాజు కొలువు కూటంలో ప్రవేశించింది. కీచకుడు కూడా ఆమె వెంట కొలుకు కూటంలోకి ప్రవేశించి, జంకుకొంకు లేకుండా ఆమెను పట్టుకొని జుట్టు పట్టు కొని లాగి కింద పడవేశాడు. ఆ సమయంలో ఆమెను రక్షిస్తున్న రాక్షసుడు కీచకునికొట్టి, లాగి నేలమీద పడ వేసాడు. కీచకుడు ఆ దెబ్బకు అవమానంతో కుంగి పోయాడు.

ఆ సమయంలో అన్న గారితో పాటు కొలువు కూటంలో ఉన్న భీముడు ఈ దృశ్యం చూచి కోపంతో ఊగిపోయాడు. ఒక్క క్షణం తన అజ్ఞాత వాస ప్రతిజ్ఞను మరచాడు. కీచకుని మీద పట్టరాని కోపంతో పక్కనే ఉన్న వృక్షమును చూచి వెంటనే ఒకసారి అన్నగారి వంక చూచాడు. ధర్మజుడు వెంటనే భీముని కనుసైగతో వారించాడు.

‘‘మహారాజా! మన వంటలవాడు వలలుడు ఎక్కడ చూచాడో కాని, వంట చెరకు కొరకు వేరే వృక్షములు లేవా! ఫలపుష్పాదులో ఉండి అందరికి నీడ నిచ్చే

ఆ వృక్షమును వంట చెరకు కొరకు ఖండించడం ఎందుకు?'' అని అన్నాడు ధర్మరాజు.

భీముని కోపము, ధర్మరాజు వారింపు ద్రౌపది చూచింది. మెల్లగా పైకి లేచింది. తన భర్తల వైపు తీక్షణంగా చూచింది.

''అయ్యా ధర్మాధర్మములను తెలిసినవారు, దుష్ట శిక్షణ, శిష్టరక్షణ చెయ్యగలవారు, శత్రువులను అవలీలగా చంపగలవారు, గంధర్వులు ఐన నా భర్తలు ఐదుగురు, ఈ కీచకుడు నన్ను ఈ విధంగా అవమానిస్తుంటే చూస్తూ ఊరు కున్నారు. ఇంక సామాన్యమైన స్త్రీలకు రక్షణ ఎక్కడిది? వారికి ఎవరు దిక్కు? ఈ విరాట రాజు సభలో ధర్మహాని జరుగుతుంటే ఎవరూ మాట్లాడటం లేదు. ఇంతమంది చూస్తూ ఉండగా ఒక స్త్రీని నిండు సభలో అవమానిస్తుంటే, కొంత మంది కైనా నా మీద కరుణ కలగ లేదా! ఏమి చెప్పాలి? ఈ దేశాన్ని ఏలే మహారాజును ఏమని నిందించాలి! ఎక్కడైనా ధర్మహాని జరిగితే దండించవలసిన రాజు, కీచకుడు నన్ను నిండు సభలో అవమానిస్తుంటే ఊరకుండుట భావ్యమా?'' అని సూటిగా ప్రశ్నించింది ద్రౌపది.

విరాటరాజు  ఆమె వంక చూచాడు.  విరాట రాజుకు కీచకుని మందలించే ధైర్యము లేక ద్రౌపదిని అనునయించాడు. అది చూచి కీచకుడు తన మందిరానికి వెళ్లిపోయాడు.

అప్పుడు కలత చెందిన హృదయంతో ధర్మరాజు ద్రౌపదిని చూచి

" ఓ సైరంధ్రీ! జరిగనది అంతా రాజు, సభాసదులు చూచారు. నీకు న్యాయం జరుగుతుంది. నీవు ఇంక అంతఃపురానికి వెళ్లు.  అయినా నీకు జరిగిన అవమానానికి నీ భర్తలు కోపించరా! అయినా సమయం కాదని  ఊరుకొని ఉంటారు. కాబట్టి నీ భర్తలను నిందించడం  ఉచితం కాదు.  ఒక కులస్త్రీ ఎన్ని కష్టములు పడినను  ఈ ప్రకారము నిండుసభలో నిలబడి మాట్లాడటం భావ్యమా?"' అని పలికాడు ధర్మరాజు.

కాని ద్రౌపది అక్కడి నుండి కదలలేదు.  ఏదో మాట్లాడాలని ప్రయత్నించబోతుంటే ధర్మ రాజు  "ఓ సైరంధ్రీ! ఏమిటిది! పది మందిలో నాట్యం చేస్తున్నట్లు నిల్చున్నావు. కులస్త్రీలకు ఇది తగదు." అని అన్నాడు ధర్మరాజు.

ద్రౌపది తల  ఎత్తి ధర్మజుని వైపు చూసింది. "ఓ  కంకు భట్టా! నా భర్త ఒక నటుడు. ఇది సత్యము. పెద్దలను బట్టి పిన్నలు ప్రవర్తిస్తారు. నా భర్త నటుడు

కాబట్టి నేను నర్తకినే. నా భర్త నటుడే కాదు. జూదరి కూడా! ఒక జూదరి భార్యకు గౌరవ మర్యాదలు ఎలా లభిస్తాయి?'' అంటూ వెళ్లిపోయింది.

తనను ఒక ధూర్తుని ఇంటికి మదిర కోసం పంపిన ఆ సుధేష్ణకు తన బాధలన్ని చెప్పుకొనుటకు సుధేష్ణ దగ్గరకు వెళ్లింది.

సుధేష్ణ ద్రౌపదిని చూచి కంగారు నటిస్తూ ''మాలినీ! ఏమిటిది! ఇలా ఉన్నావు! నిన్ను ఎవరు ఏమన్నా అన్నారా! ఏమి జరిగిందో చెప్పు! వారి అంతు జూస్తాను'' అని పలికింది సుధేష్ణ.

ద్రౌపది నిర్వేదంగా నవ్వి ''అమ్మా! అన్నియు తెలిసి కూడా ఇలా పలికిన నేను ఏమి చెప్పగలను? నీవు పంపిన విధంగా నేను మద్యము కొరకు తమరి తమ్ముడు కీచకుని ఇంటి వెళ్లాను. అతను నన్ను పట్టుకొనుటకు ప్రయత్నించాడు. నేను పరుగెత్తాను. అతను నన్ను వెంబడించి నా జుట్టు పట్టుకొని కొట్టాడు. ఇంతకంటే నేను ఏమి చెప్పగలను?'' అని పలికింది.

'' ద్రౌపదీ! విచారించకుము. నేను ఆ కీచకుని దండిస్తాను.'' అని అనునయించింది.

‘‘తమరు ఇంతగా అలుక చెందవలసిన పనిలేదు  లెండు. నాభర్తలు ఐదుగురు గంధర్వులు  ఉన్నారు.  వారు కీచకుని మీద పగ తీర్చుకుంటారు.’’ అని పలికింది.

ఆ మాటలు విని  సుధేష్ణ  భయభ్రాంతురాలైంది. ద్రౌపదిని ఎన్ని విధాలు గానో ఓదార్చింది. కాని ద్రౌపది కోపము తగ్గలేదు. అన్న పానీయాలు విసర్జించింది.  తన నివాసమునకు బోయి రోదిస్తూ ఉంది.

(అసలు ఈ కీచకుడు ఎవరు? అనే దానికి సమాధానంగా వ్యాసుని సంస్కృత మహాభారతం ఒక సంశోధిత  ప్రతిలో పాద పీఠికగా   ఈవిధంగా ఉంది. ఒక బ్రాహ్మణ స్త్రీయందు క్షత్రియుని వలన పుట్టిన వాడిని సూతుడు అంటారు.  అలాంటి వాడు క్షత్రియుని కంటే తక్కువ. వైశ్యుని కంటే కొంచెం ఎక్కువ. రాజ సంబంధములకు అర్హుడు.  అట్టి సూత వంశమున బుట్టిన వాడు కీచకుడు.  అతని భార్య పేరు మాళవి. వారికి 106 మంది కీచకులు కలిగారు. అందులో పెద్ద వాడి పేరు  సింహ బలుడు. మహా బలవంతుడు. అతను తన తల్లి చెల్లెలి కూతురైన సుధేష్ణ వద్ద విరాటనగరంలో ఉంటున్నాడు.  అతని తమ్ములు 105 మంది అతనిని అనుసరించి విరాట నగరంలో ఉంటున్నారు).

''ఆ కీచకుడు మహా బలవంతుడు. అతనిని చంపడానికి సమర్థుడు భీముడు ఒక్కడే. '' అని మనసులో తలచింది ద్రౌపది.

ఆ రోజు రాత్రి అందరూ నిద్రావస్థలో ఉండగా ద్రౌపది భీమసేనుడి వద్దకు వెళ్లింది. భీమసేనుడు హాయిగా నిద్రపోతున్నాడు.

''ఆహా! నన్ను అవమానించిన కీచకుడు హాయిగా నిద్రపోతున్నాడు. కాని అది చూచిన మీరు నిశ్చింతగా ఎలా నిద్రపోగలుగుతున్నారు. మీ అన్నగారు తమరు పరాక్రమము చూపడానికి ఇది సమయం కాదు అన్నాడనా! '' అని తలపోస్తూ అతడిని తట్టి లేపింది.

భీముడు ఉలిక్కిపడి లేచాడు ''ఎవరు?'' అని అడిగాడు.

''నేను మాలిని'' అని చెప్పింది ద్రౌపది.

భీమునికి ద్రౌపది ఎందుకు వచ్చిందో అర్థం అయింది. ఆమె నోటనే విందామని ''ఏమిటి! ఇంత పొద్దుపోయిన తరువాత ఎందుకు వచ్చావు? కారణమేమి? ఎవ్వరూ చూడకుండా వచ్చావు కదా! '' అని కంగారుగా అన్నాడు.

‘‘తెలిసి తెలిసి నన్ను అడుగడం ఏమిటి? అంతలోనే మరిచిపోతే నేనేమియు చెప్ప పని లేదు. నీవు వినం బనిలేదు. అలాకాకుండా జరిగినది అంతా నా నోట వినాలని అనుకుంటే చెపుతాను వినండి. విరాటుని బావమరిది కీచకుడు తన అక్కను చూడటానికి వచ్చి ఆమె మందిరానికి వచ్చాడు. అక్కడ ఉన్న నన్నుచూచాడు. మదనావేశంలో మాట్లాడాడు. నా పొందు కావాలని కోరాడు. నేను అతనితో నా భర్తలు ఐదుగురు గంధర్వులు, నీ ప్రాణాలు తీస్తారు అని చెప్పాను. అతను వెళ్లిపోయాడు.

తరువాత అతని అక్క సుధేష్ణ నన్ను మద్యము తెమ్మని అతని ఇంటికి పంపింది. నేను వెళ్లనన్నాను. కాని బలవంతం చేసింది. తప్పని పరిస్థితులలో కీచకుని ఇంటికి వెళ్లాను. అతడు నా చెయ్యి పట్టుకొన బోగా నేరు విదిలించుకొని పరుగెత్తాను. అతను నన్ను వెంబడించాడు. నేను మీరు ఉన్న ప్రదేశానికి వచ్చాను. అక్కడ ఏమి జరిగిందో మీరు చూచారు. ఇంతకన్నా ఏమి చెప్పగలను.

ఆనాడు కురు సభలో దుశ్శాసనుడు నన్ను అవమానించాడు. అడవిలో ఉండగా సైంధవుడు నన్ను తీసుకొని వెళ్లాడు. ఈ నాడు విరాటుని కొలువులో కీచకుడు ఈవిధంగా చేసాడు. ఈవిధంగా అవమానాలు పాలు కావడం నాకు వింత కాదు కదా! స్త్రీ ఆర్తనాదం విన్నా, గోమాత అరుపు విన్నా రక్షించడం వీరు

లకు పరిపాటి. అలాంటిది నేను అలా రోదిస్తున్నా ధర్మజుటు  ఎలా చూస్తూ ఊరు కున్నాడు?''  అని పలికింది ద్రౌపది.

''ద్రౌపదీ!  ఈ కీచకుడు నిన్ను అవమానించడం చూచిన నన్ను ధర్మజుడు అడ్డుపెట్టక పోతే అక్కడే వాడిని, వాడి సైన్యాన్ని, విరాటుని తో సహా  హతమార్చి ఉండేవాడిని. కాని ఆ సమయంలో అజ్ఞాత వాసం భంగం అయితే, జనం మనలను గుర్తిస్తే,  మరలా మనము అరణ్య వాసము చెయ్యాలి కదా!  అప్పుడు దీని కంతకూ నువ్వు, నేను కారణం అని అందరూమనలను నిందిచరా? కావున నన్ను వారించినందుకు ధర్మజుని నిందిచనవసరము లేదు.  సమయం మించిపోలేదు. ఆ కీచకుని చంపి నీకు సంతోషం కలిగిస్తాను. అయినను కీచకుని చంపడం ఎంత పని! కాని అది రహస్యంగా జరగాలి కాని బహిరంగం గాకాదు కదా! '' అని అన్నాడు భీముడు.

అది విన్న ద్రౌపది  ''నేను ఎవరికీ భయపడలేదు. మా అత్తగారు కుంతికి గాని,  భర్త లైన మీకు కూడా భయపడలేదు కాని   ఈ నాడు ఆ సుధేష్ణ కు భయపడుతున్నాను.   మూర్ఖుడైన కీచకుని చేతిలో పరాభవం పొందిన అవమాన భారంతో  అని అలా అన్నాను కాని అన్ని విషయములు తెలియక కాదు. ధర్మజుని నిందించాలని కాదు.'' అంది ద్రౌపది.

ధర్మరాజు గురించి ద్రౌపది ఇంకా ఇలా పలికింది. ‘‘భీమసేనా! అజాత శత్రువు అనే పేరు, రాజ సూయం నిర్విఘ్నంగా నెరవేర్చడం, ధర్మైకనిరతుడు అనే బిరుదు ధర్మరాజుకు తప్ప వేరెవరికి ఉంటాయి. అతనికి ఉన్న గాంభీర్యం, కరుణ, నిత్యసత్యవ్రతము మరొకరికి సాధ్యమా! అతడు సామాన్య మానవుడు కాడు. అట్టి మహాత్ముడు ఒకరి కింద ఊడిగంసేయడం చూస్తే చాలా బాధగా ఉంది. బకాసురుడు, కిమ్మీరుడు లాంటి రాక్షసులను సంహరించిన నీలాంటి వీరుడు కట్టెలు కొట్టడం, వంటలు చెయ్యడం చూస్తుంటే బాధగా ఉంది. పరమేశ్వరుని మెప్పించి పాశుపతాన్ని సంపాదించిన అర్జునుడు పేడి రూపంలో నాట్యం నేర్పుతుంటే చూడడానికి మనసు ఒప్పడం లేదు. అత్యంత సుందరుడు, అరివీరభయంకరుడైన నకులుడు ఒకరికింద ఊడిగం చేస్తూ గుర్రాలకు సేవ చేస్తుంటే చూస్తూ నిత్యం కన్నీరుపెట్టుకుంటాను. అత్యంత కోమలుడైన సహ దేవుడు పశువులను మేపుతుంటే దుఃఖంతో మనసు పరితపిస్తుంది. ఇంక నా సంగతి. *చి న్నప్పటినుండి నా తల్లితండ్రుల ప్రేమానురాగాలతో పెరిగాను. రాజసూయయాగంతో పునీతు రాలనైనాను. నా అత్తగారు కుంతీ దేవి కూడా నాకు పని చెప్పాలంటే వెనకాడేది. అలాంటి నేను ఒకసామాన్యురాలిగా సైరంధ్రిగా పరులకు ఊడిగం చేయడం బాధాకరం కాదా! భీమసేనా! నీవు ఆ కీచకుడిని చంపకపోతే నామనస్సుకు శాంతి లేదు.’’ అని దుఃఖించింది.*

‘‘ ద్రౌపదీ  ఈవిషయం నీవు ఇంతగా చెప్పవలెనా! రేపటి దినం ఆ కీచకునికి నా చేతిలో చావు మూడింది నీవు నిశ్చింతగా ఉండు. మన అజ్ఞాత వాస కాలం పూర్తి కావచ్చింది. ఇంక ఒక నెల మాత్రము ఉంది. నీవు ఒక పని చెయ్యి. కీచకుడి కోర్కె నీవు అంగీకరించి నట్టు అతనిని ఒంటరిగా నర్తన శాలకు రమ్మని చెప్పు. అక్కడ అతనిని ఎవ్వరికీ తెలియకుండా చంపుతాను. ఇదే నా నిర్ణయం. అదుగో తెల్లవార బోతున్నది. ఇంక నీవు వెళ్లు. ’’ అని ద్రౌపదికి ధైర్యం చెప్పి పంపాడు భీముడు.

‘‘ ’’

మరునాడు సూర్యోదయం అయింది. కీచకుడు నిద్రలేచాడు. కాలకృత్యాలు నిర్వర్తించాడు. అతనిలో ద్రౌపదిమీద మదనావేశం పెల్లుబికింది. చక్కగా అలంకరించుకున్నాడు.

ద్రౌపది కోసం సుధేష్ణ అంతఃపురానికి వెళ్లాడు. సైరంధ్రిని చూచాడు. మనస్సు చలించింది. ధైర్యాన్ని, వివేకాన్ని కోల్పోయాడు. ఆమె దగ్గరగా వెళ్లాడు. భీముడు చెప్పిన మాటలను మననం చేసుకుంది ద్రౌపది. కీచకుని చూచీ చూడనట్టుగా నటించింది.

‘‘మాలినీ! ఏమి ఈ తిరస్కారము. నన్ను మోహించడం ఇష్టంలేదా! లేక అసలు మగాళ్లు అంటేనే ఇష్టం లేదా! మాలినీ! నా సంపదలకు నీవే రాణివి.

ఈరాజ్యాన్ని ఏలే విరాటుడు పేరుకు మాత్రమే రాజు. నేనే అతనికి ఇంత కూడు పెడుతున్నాను. ఈ దేశంలో రాజ్య తంత్రమును నేనే నడుపుతున్నాను. ఈ రాజ్యంలో ప్రజలందరూ నన్నే రాజుగా ఆదరిస్తున్నారు. నేను ఎవరినైనా కోరు కుంటే వారు నా అధీనం కావాలసిందే. కాదనే ధైర్యం ఎవరికీ లేదు.'' అని పలికాడు కీచకుడు.

ద్రౌపది కొంచెం మెత్త బడినట్లు నటించింది. ''వద్దనీ ఎంత చెప్పినా వినకుండా నా మీద పడ్డావు. అది భావ్యమా! నీ హృదయం మన్మధతాపానికి గురి ఐనట్లే ఎదుటి వారి చిత్తములు కూడా మన్మధ తాపానికి గురి అవుతాయి కదా! మీరు పురుషులు. బయట పడతారు కాని మగువలు తమ మోహాన్ని ధైర్యం చేసి బయట పెట్టరు. కాబట్టి కీచకా! నీవు రహస్యంగా నీ కోర్కె తీర్చుకొనుము.'' అని పలికింది ద్రౌపది.

కీచకుని హృదయం ఆనందంతో పొంగి పోయింది. '' మాలినీ! నీ మనసు తెలుసుకున్నాను. మరి నా కోరిక ఎప్పుడు, ఎలా, తీరుస్తావో చెప్పు'' అన్నాడు అనునయంగా కీచకుడు.

''ఈ రోజు రాత్రికి ఒంటరిగా నర్తన శాలకు రండి. '' అని పలికింది ద్రౌపది.

''మాలినీ! నీ అనుమతి ప్రకారం చేస్తాను. ఒంటరిగా నర్తనశాలకు వస్తాను. ఇది నిశ్చయము. ఈ మాట మీద ఉండు.'' అన్నాడు కీచకుడు.

'' నీవు ఒక్కడివే రావాలి. లేకపోతే నేను వెడలిపోతాను. ఇది నిక్కువము. మనం ఇద్దరం ఇక్కడ ఉండటం భావ్యం కాదు. మీరు వెళ్లి పొండి. '' అంది ద్రౌపది.

కీచకుడు వెళ్లగానే ద్రౌపది వంటశాలకు వెళ్లింది. ''నా పని నేను పూర్తి చేసాను. ఇంక మీ పని మీరు పూర్తి చేయండి. ఈ రోజు రాత్రికి ఆ కీచకుని చంపాలి. మీ ఇష్టం ఎలా చేస్తారో చెప్పండి. '' అని పలికింది ద్రౌపది.

''అది సరే! నీవు ఆ కీచకుడు ఏమేమి మాట్లాడుకున్నారో చెప్పు! '' అన్నాడు భీముడు.

జరిగినది అంతా చెప్పింది ద్రౌపది. ఆ మాటలకు భీముడు పరమ ఆహ్లాదం పొందాడు.

''ద్రౌపదీ! ఇంక చాలు! ఆ కీచకుని మీద పగ తీర్చుకుంటాను. కాని వాడు నీవు చెప్పినట్టు వస్తాడంటావా! లేక తెలివి తక్కువగా అందరి కీ చెపుతాడా!

అయినా అలా ఎందుకు చేస్తాడు. నీవు నర్తనశాలకు ఒంటరిగా రమ్మని చెప్పినపుడు వాడి మొహంలో సంతోషం చూచావు కదా. వాడు నర్తన శాలకు తప్పక వస్తాడు. నిశ్చలంగా ఉన్న నన్ను తడిమి చూస్తాడు. నీవు కాదని తెలుసు కుంటాడు. అపుడు నేను వాడిని ఒడిసి పట్టుకుంటాను. వాడిని చిత్రవధ చేస్తాను. *వాడు నా చేతిలో చస్తాడు. నీవు నిశ్చింతగా ఉండు. ద్రౌపదీ!'' అన్నాడు భీముడు జరగ బోయేది వివరిస్తూ.*

*ద్రౌపది భయపడింది. కోపావేశంలో గుట్టుబయటపడి అజ్ఞాతవాసం భంగం అవుతుందేమో అని అనుమానించింది.*

''అయ్యో! మీ కోపావేశంలో రహస్యాన్ని బట్టబయలు చేయకండి. తరువాత ధర్మరాజు, తదితర జనులు అజ్ఞాతవాసం భంగం చేసి నందుకు మనలను నిందిస్తారు. అజ్ఞాతవాసం భంగం కాకుండా, గుట్టుగా కీచకుని చంపడమే మన ప్రయత్నం. అలా కాకపోతే వద్దు'' అంది ద్రౌపది.

''అబ్బా! ఇన్ని ఆంక్షలు పెడితే ఎలాగా ద్రౌపదీ! వాడు ఎదిరించి నిలబడితే ఇది గుట్టుగా చేయాలి....... ఇది బహిరంగంగా చేయాలి....... అని ఎలా ఆలోచించగలం చెప్పు. అయినా నీవు చెప్పిమాటలు మనసులో పెట్టుకుంటాను. రహస్యంగానే చంపడానికి ప్రయత్నిస్తాను. సరేనా! '' అన్నాడు భీముడు.

‘‘సుధేష్ణ నా కోసం వెదుకుతూ ఉంటుంది. నేను వెళతాను.’’ అని ద్రౌపది వెళ్లిపోయింది.

కీచకుడు తన మందిరంలో విరహ బాధను అనుభవిస్తున్నాడు. ఎంతకూ రాత్రి కాలేదేమా అని పరితపిస్తున్నాడు. కీచకుడికీ అనుమానంగానే ఉంది. మాలిని తను చెప్పినట్టు నర్తనశాలకు వస్తుందా! ఒకవేళ వచ్చినా నా కోరిక తీరుస్తుందా! రాత్రిలోగా ఆమెకు మనసు మారుతుందేమో! నిజంగా ఆమెకు ఐదుగురు గంధర్వులు భర్తలుగా ఉన్నారా! మాలిని నర్తనశాలకు వచ్చేటప్పుడు సుధేష్ణ ఏమైనా పని చెపుతుందా! ఒక వేళ మాలిని రాకపోతే నేను ఈ మదన తాపాన్ని తట్టుకోగలనా! మాలిని లేకుండా నేను బతక గలనా! అయినా ఆ సుందరి రాకుండా ఎలా ఉంటుంది? అంత కఠినాత్మురాలా! నాలో ఇంత కామాన్ని రేపిన మాలినికి అక్కడ మనసు ఎలా నిలుస్తుంది! అసలు నేను ఇంత విరహవేదనను అనుభవించడం ఎందుకు? నేనే వెళ్లి మాలినిని ఈడ్చుకొని వచ్చి అనుభవిస్తాను.’’ అని పరి పరి విధాల ఆలోచిస్తున్నాడు కీచకుడు.

విరహవేదనతో వేగిపోతున్నాడు కీచకుడు.. ఉద్యాన వనంలో విహరి స్తున్నాడు. తొందరగా అస్తమించనందుకు సూర్యుడిని నిందిస్తున్నాడు. నా కొరకు బ్రహ్మ ఈ రోజు అంతా పగలే గాని రాత్రి లేకుండా చేసాడా అని అనుమాన పడ్డాడు. ఎప్పుడు అస్తమిస్తాడా అని సూర్యుని వంక చూస్తున్నాడు.

ఎట్టకేలకు సూర్యాస్తమయం అయింది. చీకట్లు ఆవరించాయి. చంద్రోదయం అయింది.

ద్రౌపది సమయం కోసం ఎదురు చూస్తూ ఉంది. బాగా పొద్దుపోయింది చంద్రుడు కూడా అస్తమించాడు. చీకట్లు దట్టంగా ఆవరించాయి. ద్రౌపది తన మందిరము నుండి బయలుదేరి భీముని వంటశాల చేరుకుంది. సయయం ఆసన్న మయినదని భీముని తొందర పెట్టింది.

భీముడు ఒక చీరను తన తలకు తలపాగా మాదిరి చుట్టుకున్నాడు. నర్తనశాలకు బయలుదేరాడు భీముడు. ద్రౌపది అతనిని అనుసరించింది. ఇద్దరూ నర్తనశాలకు చేరుకున్నారు.

నర్తన శాలలో ఒక పక్క ఉత్తర పవళించే పాన్పు ఉన్నది. భీముడు దాని మీద కూర్చున్నాడు ద్రౌపది పక్కనే ఎవరికీ కనపడకుండా దాగుకొని ఉంది.

ఇంతలో కీచకుడు బాగా అలంకరించుకొని, మద్యము సేవించి, మత్తుగా, నర్తనశాలను సమీపించాడు. మాలిని అప్పటికే అక్కడకు వచ్చి ఉంటుంది అని అనుకున్నాడు. నర్తనశాల లోపలకు ప్రవేశించాడు. పాన్పుమీదకూర్చున్న భీముని

చూచి మాలిని అనుకున్నాడు. కామంతో పిచ్చివాడయ్యాడు. ఆమెను సమీపించాడు. తన చేతిని ఆ శయ్య మీద వేసాడు.

భీముడికి పట్టరాని కోపం వచ్చింది. కీచకుడు భీముని శరీరం మీద చెయ్యి వేసి, ''ఓ మాలినీ! నీకోసం ఎన్నో వస్తువులను తెచ్చాను. ఇప్పటి దాకా స్త్రీలు నన్ను పొందటానికి నాకు కానుకలు సమర్పించేవారు. అసలు నన్ను చూచిన స్త్రీ మరొకరి వంక కన్నెత్తి కూడా చూడదు. నా కోసం విరహాగ్నిలో పరితపిస్తుంది. అలాంటి నన్ను నువ్వు ఆకర్షించావు. నీకోసం నేను పరితపిస్తున్నాను. ఇంతకంటే నేను ఏమి చెప్పగలను.'' అని అన్నాడు కీచకుడు.

భీముడు కూడా స్త్రీ సహజమైన కంఠస్వరముతో ''మిమ్మల్ని మీరు పొగుడుకుంటున్నారు. కాని నా లాంటి స్త్రీ మీకు దొరుకునా! నీ శరీరానికి నా శరీరం తగిలినప్పుడు కలిగే అనుభూతి ఏమిటో నువ్వే తెలుసుకుంటావు. నన్ను ఒకసారి తాకిన తరువాత నీకు మరో స్త్రీని తాకే అవకాశం ఉండదు. నన్ను తాకినందుకు ఫలం ఇప్పుడే అనుభవిస్తావు!'' అంటూ తటాలున పైకి లేచాడు.

కీచకుని జుట్టుపట్టుకొని వంచాడు. మాలిని భర్త గంధర్వుడు వచ్చాడు అని అనుకున్నాడు కీచకుడు. భీముని పట్టు విడిపించుకొని భీముని బలంగా

లాగి నేలమీద పడవేసి మోకాళ్లతో అదిమాడు. ఇరువురి మధ్య భయంకరమైన పోరుసాగింది. ఒకరిని మించి ఒకరు బాహువులతో యుద్ధం చేస్తున్నారు.

ఇద్దరిలో ఒకవిధమైన భయం ఉంది. తాను అక్కడ ఉన్నట్టు ఎవరికన్నా తెలిస్తే పరువు పోతుంది అని కీచకుడు, తన విషయం తెలిస్తే అజ్ఞాతవాసం భంగం అవుతుంది అని భీముడు మనసులో భయపడుతూనే ఎక్కువ చప్పుడు చేయకుండా ద్వంద యుద్ధం చేస్తున్నారు.

క్రమక్రమంగా భీముని శక్తి పెరుగుతూ ఉంది. కీచకుని శక్తి సన్నగిల్ల సాగింది. ఆవిషయం తెలుసుకున్న భీముడు విజృంభించాడు. కీచకుని ఒడిసి పట్టుకొని అతని ఆయువుపట్టులో దారుణంగా పొడిచాడు. ఆ దెబ్బకు కీచకుడు విలవిలా తన్నుకున్నాడు. భీముడు కీచకుని వికృతంగా చంపాలను కున్నాడు. కీచకుని తలను, కాళ్లను చేతులను అతని మొండెలోకి జొప్పించాడు. కీచకుని నేలమీద వేసి నలిపి, పొర్లించి, ఒక మాసం ముద్దగా చేసాడు. కీచకుడు చచ్చిపోయాడు.

భీముడు ద్రౌపదిని పిలిచాడు. ద్రౌపది కీచకుని శవాన్ని ఆనందంతో ఆశ్చర్యంతో చూచింది. ‘‘కీచకా! ఇందుకా..... ఈసుఖం పొందడానికేనా ఇంతపని చేసావు!’’ అని అనుకుంది.

“ద్రౌపదీ! నేను అనుకున్నది చేసాను. నీ అవమానాన్ని పరితాపాన్ని పోగొట్టాను నీ కోపం శాంతించిందా! నీకు సంతోషమేనా! నా భుజబలం ఏమిటో తెలిసిందా! ఎవరైనా దుర్బుద్ధితో నిన్నుపొందడానికి ప్రయత్నిస్తే వారికి చావు తప్పదు!” అని అన్నాడు .

భీముని మాటలు విని ద్రౌపది మనసంతా ఆనందంతో నిండిపోయింది. “నిన్న కొలువులో నన్ను కీచకుడు అవమానించినపుడు నీ నిగ్రహం ఎంతో కొనియాడదగినది. ఈరోజు నర్తనశాలో పరుల కంటపడకుండా, మరొకరి సాయం కోరకుండా, కీచకుని వధించిన నీ సాహసం, పరాక్రమం, అపూర్వం అనితరసాధ్యం. నిన్ను అభినందించడం నా తరమా భీమసేనా! ” అంది ఆరాధనా పూర్వకంగా.

ద్రౌపది పలికిన ఆ పలుకులు విని భీముడు ఎంతో పొంగిపోయాడు. ఇంతలో అతనిలో వివేకం మేల్కొంది.

“ద్రౌపదీ! ఇక్కడ ఇంక ఆలస్యం చేయడం మంచిదికాదు. నేను వెళుతున్నాను.” అంటూ వడివడిగా వంటశాల వైపు వెళ్లాడు.

ఆ ప్రకారంగా భీముడు కీచకుని వధించిన ఘట్టాన్ని వైశంపాయనుడు జనమేజయునికి వివరించాడు.

## మహాభారతము విరాటపర్వము

### ద్వితీయాశ్వాసము సమాప్తము.

ఓం తత్సత్.

# మహా భారతము

## విరాట పర్వము

### తృతీయాశ్వాసము

వైశంపాయన మహర్షి జనమేజయ మహా రాజుకు మహా భారత కధను ఈ విధంగా చెప్ప సాగాడు.

కీచకుని చంపిన తరువాత భీముడు తాను నివసించే వంట ఇంటికి చేరుకున్నాడు. తన ఒంటిని శుభ్రంగా కడుక్కున్నాడు. ఏ విధమైన రక్తపు వాసన రాకుండా ఒంటికి మైపూతలు పూసుకున్నాడు. తన శయ్య మీద కూర్చున్నాడు.

అక్కడ ద్రౌపది తన భర్త భీముడు క్షేమంగా వంట ఇంటికి చేరుకున్నాడు అని ధృవపరచుకొని, అక్కడ ఉన్న కావలి వాళ్లను పిలిచింది.

"అయ్యో! నా భర్తలైన గంధర్వుల చేతిలో ఈ కీచకుడు ఎలాంటి దుర్గతి పాలయ్యాడో చూడండి. ' ' అని చెప్పింది. ఆ మాటలు విని వారు కలవర పడ్డారు. దివిటీలు తీసుకొని పెద్దగా అరుచుకుంటూ నర్తన శాలలోకి ప్రవేశించారు. ఈ అరుపులు విని సింహబలుని తమ్ములు కీచకులు కూడా అక్కడకు చేరుకున్నారు. అక్కడ మాంసపు ముద్దలాగా పడి ఉన్న కీచకుని చూచారు. అన్న చావును చూచి పెద్దగా ఏడిచారు. కిందపడి దొర్లారు. ఇంతలో వారి బంధువులు కూడా అక్కడకు చేరుకున్నారు.

"ఎన్నోచావులు చూచాము కాని ఇంతటి వింత చావు చూడలేదు. ఎందరినో జయించిన సింహబలుని బలం ఎందుకూ పనికి రాకుండా పోయింది. అసలు వీడికి చేతులు ఏవి? కాళ్లు ఏవి? గంధర్వులు ఇలాగే చంపుతారేమో!" అని ఆశ్చర్యపోతున్నారు.

"మనం ఎంతసేపు శోకించినా పోయిన వాడు తిరిగి వస్తాడా! ఇతనిని మనం శ్మశానానికి తీసుకుపోదాం" అన్నాడు ఒక కీచకుడు. మిగిలిన కీచకులు కూడా సరే అన్నారు.

సింహబలుని అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పక్కనే నిలబడి ఉన్న మాలిని (ద్రౌపది) వారు ఏమి చేస్తున్నారో అని వారికి దగ్గరగా నిలబడి చూస్తూ ఉన్నది. కీచకులు ఆమెను చూచారు. కోపంతో రెచ్చిపోయారు. తన అన్న మరణానికి కారణం ఆమే అనుకున్నారు. ఒక్కసారిగా ద్రౌపది మీదికి దూకి ఆమెను పట్టుకున్నారు. ఆమె చేతులు వెనక్కు తిప్పి కట్టారు.

"దీని వలననే, దీని అందం చూచి మోహించే తమ అన్న చని పోయాడు. ఇది బతక కూడదు. దీనిని కూడా అన్నయ్య శవంతో పాటు కట్టి కాల్చుట ఉచితము." అని నిర్ణయించారు. తమ నిర్ణయాన్ని విరాట రాజుకు తెలపడానికి వెళ్లారు.

అప్పటికే విరాటుడు చారుల ద్వారా కీచకుల మరణ వార్తను విన్నాడు. కీచకుని మరణానికి ఎంతో దుఃఖిస్తున్నాడు. "మహారాజా! మేము ఈ సైరంధ్రిని మా అన్న కీచకుని శవంతో కలిపి దహనం చెయ్యాలని నిర్ణయించాము. దానికి మీ అనుమతి కావాలి" అని అడిగారు.

"మీకు తోచిన విధంగా చెయ్యండి" అని అన్నాడు విరాటుడు. కీచకులు ద్రౌపదిని ఈడ్చుకొని వెళ్లి, సింహబలుని శవంతో కలిపి కట్టారు. తర్వాత అందరూ ఏడ్చుకుంటూ శ్మశానానికి బయలు దేరారు.

అనుకోని ఈ సంఘటనకు ద్రౌపది కలత చెందింది. తనను రక్షించు వారు లేరా అని ఎలుగెత్తి ఏడ్చింది. తన భర్తలను మారు పేర్లతో ఎలుగెత్తి పిలిచింది. "జయా! జయన్తా! విజయా! జయత్సేనా! జయద్బలా! నన్ను ఈ కీచకుని శవంతో పాటు కట్టి దహనం చేయడానికి తీసుకుపోతున్నారు. నన్ను రక్షించండి. " అని పాండవులను తనను రక్షించమని పిలిచింది. పెద్దగా ఏడ్చింది.

ద్రౌపది పెట్టు కేకలు భీముని చెవిని పడ్డాయి. అతను కోపంతో ఊగిపోయాడు. అందరి కన్నా ముందు శ్మశానం చేరుకున్నాడు. ఒక పెద్ద చెట్టును మొదలంటా పెకలించి బుజం మీద పెట్టుకొని కీచకుల రాకకై ఎదురు చూస్తున్నాడు.

శ్మశానానికి చేరుకున్న కీచకులు భయంకర రాకారంతో నిలబడి ఉన్న భీముని చూచి భయపడి పోయారు. "అమ్మో! గంధర్వులు వచ్చారు మనలను చుట్టుముట్టారు పారిపోండి. " అని అరుచుకుంటూ కీచకుని

శవాన్ని అక్కడేవదిలి పారిపోయారు. భీముడు వారిని తరిమి తరిమి కొట్టాడు. అందరిని కసిదీరా చంపాడు. పాంచాలిని విడిపించాడు. త్వరగా సుధేష్ణ మందిరానికి పొమ్మని చెప్పి తాను రహస్యంగా వంటశాలకు చేరుకున్నాడు.

విరాటుడు ఉప కీచకుల మరణ వార్తను విన్నాడు. తన భార్య సుధేష్ణ దగ్గరకు వెళ్లాడు. "ఎలాగైనా ఆ సైరంధ్రిని ఇక్కడినుండి పంపి వేయాలి. లేకపోతే ఇంకా ఎన్ని అనర్థాలు కలుగుతాయో. ఆమె పక్కకు మగవారు పోతేనే ప్రమాదంలో చిక్కు కుంటున్నారు. నామాటగా ఆమెకు చెప్పి ఆమెను పంపి వెయ్యి" అని అన్నాడు విరాటుడు.

శవాన్ని తాకిన మయల పోవడానికి ద్రౌపది సచేల స్నానం చేసింది. పుర వీధులలో నడుచుకుంటూ వస్తూ ఉంది. ఆమెను చూచి ప్రజలంతా హడలి పోయారు. "ఆమెను కోరిన కీచకునికే ఆ గతి పట్టిందే, ఇంక తామెంత. " అని కొన్నారు.

ద్రౌపది వంట ఇంటి దగ్గరకు వచ్చింది. భీముని చూచింది. ఎవరికీ అర్థం కాకుండా "కీచకుల బారి నుండి నన్ను కాపాడిన నా గంధర్వపతికి నమస్కరిస్తున్నాను." అని పల్కింది. దానికి భీముడు కూడా ఎవ్వరికీ

అర్ధం కాకుండా " అయినా భార్య చిక్కులో ఉంటే విడిపించకుండా ఏ భర్త అయినా ఊరుకుంటాడా. అది అతని కర్తవ్యం. దానికి పొగడ్త ఎందుకు!" అన్నాడు.

ద్రౌపది అక్కడి నుండి అర్జునుడు ఉన్న నర్తనశాలకు వెళ్ళింది. నాట్యం నేర్చుకుంటున్న కన్యలను చూస్తూ నిలబడింది. ఆమెను చూచి ఆ కన్యలు "అయ్యో! ఆ కీచకుడు అంతపని చేసాడా! తగిన శాస్తి అనుభవించాడు. అయినా ఆ ఉపకీచకులు నిన్ను శవంతో కట్టి శ్మశానానికి తీసుకుపోవడం ఏమిటి ? నీ భర్తలు వాళ్లకు కూడా తగిన శాస్తి చేసారు" అని వాళ్లలో వాళ్లు ద్రౌపదిని అనునయించారు.

ఆమెను చూచి బృహన్నల "మాలినీ! ఏమి జరిగింది వివరంగా చెప్పవా? " అని అడిగాడు. ద్రౌపది బృహన్నలతో ఇలా పలికింది.

" బృహన్నలా! నీవు అంతఃపురములో కన్యలకు ఆటపాటలు నేర్పు కుంటున్నావు. ఈ సైరంధ్రి కి ఏమి జరిగినా నీకు పట్టదుకదా! అందుకే ఏమయింది? అని అడుగుతున్నావు." అని బదులు చెప్పింది.

" అయ్యో సైరంధ్రీ! నీవు కష్టములు పడుతున్నా నిన్ను రక్షించలేని పుట్టుక నాది. ఏమి చెయ్యగలను? కాని మనసులో నేను పడే బాధ ఎవ్వరికి తెలుస్తుంది? ఏ తప్పు చెయ్యని నీవు నాకు పరిచయం లేదా! నీవు కష్టపడుతుంటే నాకు బాధగా లేదా! " అని నిగూఢంగా అన్నాడు బృహన్నల.

" అయ్యో! ఆసంగతి నాకు తెలియదా బృహన్నలా! అంతఃపురంలో నీవు నీకు తగిన విధంగా ఉండటమే నాకు కావల్సింది." అని పలికింది ద్రౌపది.

మిగిలిన అంతఃపుర కాంతలతో ద్రౌపది సుధేష్ణ దగ్గరకు వెళ్లింది. సుధేష్ణ ద్రౌపదిని సాదరంగా పలకరించింది తన పక్కనే కూర్చోపెట్టుకుంది.

" సైరంధ్రీ! నీవు చక్కనిదానవు! ఈ మగవాళ్లు ఏమాత్రం నిగ్రహం లేని వాళ్లు. విరాటరాజు దీని గురించి భయపడుతున్నారు. నీ ఇష్టం వచ్చిన చోటుకు నిన్ను పంపివేయమని తన మాటగా చెప్పమన్నారు. పైగా నీ భర్తలైన గంధర్వులచేత నువ్వు నీ వంక చూసిన వారందరినీ

చంపిస్తున్నావు. జనం నిన్ను చూడ్డానికే భయపడుతున్నారు. కాబట్టి నీవు మా దేశాన్ని విడిచి ఎక్కడి కైనా పొమ్ము. " అని పలికింది సుధేష్ణ.

"అమ్మా సుధేష్ణా! ఇదివరకు మాదిరి ఇంకొక్క పదమూడు దినములు నన్ను తమరి అంతఃపురంలో ఉండనివ్వండి. చాలు. నేను ఇక్కడకు వచ్చిన పని పూర్తి అవుతుంది. తరువాత నా భర్తలు మీకు కనిపించి మీ కోరిక తీరుస్తారు. అమ్మా! నా భర్తలు దయామయులు. పరులకు ఉపకారం చెయ్యడానికే ఎల్లప్పుడూ ప్రయత్నిస్తారు. వారికి ఉపకారం చేసిన విరాటుడికి వారు ఎల్లప్పుడూ ఉపకారం చెయ్యడానికే ఉద్యమిస్తారు. కాబట్టి నీ మనసులో ఉన్న అనుమానం గురించి ఆలోచించకు. ఇంతకాలం నన్ను నీతో సమానంగా ఆదరించావు. ఇప్పుడు ఈవిధంగా విడిచిపెట్టడం భావ్యమా చెప్పు! " అని పలికింది ద్రౌపది.

ఆమె మాటలకు చలించిపోయింది సుధేష్ణ. " మాలినీ! నీవు పెట్టిన గడువుపూర్తి అయ్యేదాకా నా అంతఃపురంలో ఉండవచ్చును. కాని నా భర్తను, కొడుకులను జాగ్రత్తగా చూచుకొమ్ము. నీవు అంతః పురంలో నే ఉండుము. నీకు కావలసినవి అన్ని నేను సమ కూరుస్తాను అని పలికింది సుధేష్ణ.

మత్స్యదేశంలో జనం మాత్రం నానావిధాలుగా అనుకుంటున్నారు. "విరాటుని బావమరిది సింహబలుడు అత్యధిక బలవంతుడు. ఒక్క ఆడుదాని కోసం గంధర్వుల చేతిలో ఘోరంగా చచ్చాడు. సూత వంశం సర్వనాశనం అయింది. ఇంక మత్స్యరాజు తన బలం కోల్పోయాడు." అని అనుకొనసాగారు.

హస్తినాపురం లో ఉన్న సుయోధనునికి ఈ విషయం చారుల వలన తెలిసింది. వెంటనే సభ ఏర్పాటు చేసాడు.

" పాండవులు తాము చేసుకున్న ఒప్పందం ప్రకారం అరణ్య అజ్ఞాత వాసములు ముగించుకొని వచ్చి, తమ రాజ్య భాగాన్ని అడగక ముందే వారిని మరల అరణ్యాలకు పంపే మార్గం గురించి ఆలోచించండి. " అని సుయోధనుడు తన మంత్రులను ఆదేశించాడు.

కర్ణుడు లేచి సుయోధనా! మనము వేల కొద్ది చారులను మారు వేషాలలో దేశం నలుమూలలకు పంపుదాము. వారు తప్పకుండా పాండవులను గుర్తిస్తారు." అని పలికాడు.

దుశ్శాసనుడు లేచి అన్నయ్యా! పాండవులగురించి నీవు విచార పడపనిలేదు. వారు అరణ్యవాసంలో తిరిగి తిరిగి క్రూరమృగాల పాలబడి ఎప్పుడో చచ్చి ఉంటారు. వారిని గురించి ఆలోచించడం అనవసరం." అని అన్నాడు.

వారి మాటలను విన్న ద్రోణాచార్యులు లేచి "సుయోధనా! పాండవులకు ఆపదలు కలగడం అసంభవం. కాబట్టి వారిని వెదికించే ఏర్పాట్లు ముమ్మరం చేయండి. " అని పలికాడు.

అప్పుడు తాత భీష్ముడు లేచి " సుయోధనా! ద్రోణాచార్యులు నిజంచెప్పారు. పాండవులు బాహుబలంలో, బుద్ధిబలంలో అసమాన్యులు. వారికి దైవబలం కూడా తోడయింది. కాబట్టి వారికి ఎలాంటి ఆపద కలుగదు. నాకు పాండవులు కౌరవులు సమానులే. అడిగారు కాబట్టి చెబుతున్నాను.

ధర్మరాజు పుణ్యాత్ముడు. అతడు ఏ దేశంలో ఉంటే ఆ దేశం సుభిక్షంగా ఉంటుంది. అక్కడి ప్రజలు ధర్మవర్తనులై ఉంటారు. ధర్మరాజు ఉన్న చోట పశుసంపదలు వృద్ధి చెందుతాయి. కాబట్టి

అలాంటి దేశాన్ని గుర్తించి అక్కడ పాండవులను గురించి వెదకించడం మంచిది." అని పలికాడు భీష్ముడు.

అది విన్న కృపాచార్యుడు " ఆలస్యం చేయకుండా పాండవులను వెదికించడం ప్రసుత కర్తవ్యం. పాండవులు అరణ్య వాసం పూర్తి చేసారు. అజ్ఞాతవాసం కూడా దాదాపు పూర్తి అయింది. పాండవులు సుయోధనుని మీద చాలా కోపంగా ఉన్నారు. పగవాడు అల్పుడైనను అతని పట్ల మనం అప్రమత్తంగా ఉండాలి. కాబట్టి మన సైన్యాన్ని బలోపేతం చెయ్యాలి. తక్షణం పాండవులను వెదికించడం, సైన్యాలను సమీకరించడం మన ప్రస్తుత కర్తవ్యం. అరణ్య అజ్ఞాత వాసములు పూర్తి చేసుకున్న తర్వాత పాండవులు యుద్ధానికి దిగకున్న వారితో సంధి చేసుకోడమే సముచితం. పాండవులు సంధికి ఒప్పుకొనక యుద్ధానికి సిద్ధం అయితే మనం కూడా యుద్ధానికి సిద్ధంగా ఉండాలి. పోనీ, పాండవులు అరణ్య వాసంలో మరణించారు అని అనుకుందాము. కాని పాండవులకు మిత్రులైన రాజులను మనం గెలవాలన్నా మనకు సైన్యబల సంపద కావాలి. కాబట్టి మనకు సైన్య సమీ కరణ అత్యంత ఆవశ్యకము." అని చెప్పాడు కృపాచార్యుడు.

అందరూ చెప్పిన మాటలు సావధానంగా విన్నాడు సుయోధనుడు. తగు నిర్ణయం తీసుకున్నాడు. సభను ఉద్దేశించి ఇలా అన్నాడు.

"కీచకుడు, భీముడు, శల్యుడు, బలరాముడు అసమాన బల సంపన్నులు. మల్లయుద్ధంలో ఆరితేరినవారు. ఈ నలుగురితో సమానమైన వారు భుజబల సంపన్నులు ప్రపంచంలో మరెవ్వరూ లేరు. వారిలో వారే ఒకరిని ఒకరు గెలవాలి కాని వారిని వేరేవాళ్లు గెలవలేరు.

మత్స్యదేశ సైన్యాధ్యక్షుడు కీచకుని ఒక కాంత కారణంగా మరణించాడని, అతనిని గంధర్వులు చంపారని మనకు చారుల వలన తెలిసింది. కీచకుని చంపాలంటే మిగిలిన ముగ్గురిలో ఎవరో ఒకరు చంపాలి. బలరాముడు, శల్యుడు చాలా దూరంలో ఉన్నారు. వారు కీచకుని చంపడం అసాధ్యం. ఇంక మిగిలింది భీముడు. పైగా ఒక కాంత కారణంగా చంపాడు అన్నారు. ఆ కాంత ద్రౌపది కావచ్చు. మిగిలిన ఉపకీచకులను అందరిని చంపారట. అది ఒక్క భీమసేనుడికి మాత్రమే సాధ్యం.

తాతగారైన భీష్ములు చెప్పిన లక్షణాలు గల రాజ్యం మత్స్యదేశం గా కనపడుతూ ఉంది. కాబట్టి పాండవులు మారువేషాలలో మత్స్యదేశంలో

తలదాచుకొంటూ ఉండవచ్చు. విరాటుడు మనకు శత్రు రాజు. కాబట్టి మనం మత్స్యదేశం మీద దండెత్తి వారి గోధనమును ముట్టడిస్తే పాండవులు విరాటునికి సాయంగా వస్తారు. అప్పుడు వారిని మనం బయట పెట్టవచ్చు. సమయభంగం అయినదని మరల వారిని అరణ్య అజ్ఞాతవాసములకు పంపవచ్చు. పాండవులు అక్కడ లేకున్నా మనం విరాటుని సంపదనంతా కొల్లగొడదాము. అదియును మనకు లాభమేకదా. ఎటుచూచినా ఇదే మన ప్రస్తుత కర్తవ్యం. ఇది మీకు సమ్మతమైతే తగు ప్రయత్నం చేయండి." అని అన్నాడు సుయోధనుడు.

ఇది విన్న త్రిగర్త దేశాధిపతి సుశర్మ, కర్ణునితోనూ, దుశ్శాసనుని తోనూ మంతనాలు జరిపాడు. తరువాత లేచి ఇలా అన్నాడు.

"సుయోధన సార్వభౌమా! ఇంతకు ముందు నన్ను కీచకుడు యుద్ధంలో గెలిచాడు. అతను చనిపోయాడు. అందువలన మరల కీచకునితో యుద్ధం చేసి గెలిచే అవకాశం లేదు. నన్ను విరాటుని మీదికి యుద్ధానికి పంపండి. నేను విరాట నగరాన్ని ముట్టడించి అతనిని ఓడిస్తాను. విరాటుని పశువులను మళ్లించి తెస్తాను. అక్కడ పాండవులు ఉంటే వారిని గుర్తిస్తాను. దీనికి నేనే తగిన వాడిని." అని అన్నాడు.

అది విని కర్ణుడు " సుయోధనా! త్రిగర్త దేశాధీశుడు ఉచితమైన మాటలు పలికాడు. దానికి మీరు అనుమతి ఇవ్వాలి." అని అన్నాడు. సుయోధనుడు ఆలోచించి దుశ్శాసనుని చూచి, ఈ సభలోని పెద్దలు నీకు అనుమతి ఇచ్చారు. మన సైన్యాన్ని సిద్ధం చెయ్యి. ముందు రోజు సుశర్మ తన బలగాలతో విరాటుని తో యద్ధానికి పోతాడు. మరునాడు మన సైన్యాలతో విరాటుని మీదికి యుద్ధానికి బయలుదేరుదాము." అని అన్నాడు సుయోధనుడు.

అలాగే చేస్తాను అన్నాడు దుశ్శాసనుడు. అప్పుడు సుయోధనుడు తన వ్యూహాన్ని సభాసదులకు ఈ విధంగా వివరించాడు.

"ముందు సుశర్మ తన బలగాలతో వెళ్ళి విరాటుని గోవులను ఒక వైపు నుండి మళ్ళిస్తాడు. అప్పుడు విరాటుడు తన సైన్యాలతో సుశర్మతో యుద్ధానికి దిగుతాడు. మరునాడు మనము మన సైన్యాలతో మరొక పక్కనుండి విరాటుని గోవులను పట్టుకుంటాము. అప్పుడు గత్యంతరం లేక పాండవులు యుద్ధానికి వస్తారు." అంటూ సుశర్మను చూచి "రాబోవు బహుళ అష్టమినాడు నీవు నీ బలగాలతో విరాటుని గోగణాన్ని అపహరించు. మరునాడు అంటే నవమి నాడు మేము మరొక

పక్కనుండి గోవులను పట్టుకుంటాము." అని నిర్ణయించాడు సుయోధనుడు.

అందరూ యుద్ధానికి సిద్ధం అయ్యారు కాని అప్పటికే పాండవుల అజ్ఞాతవాస కాలం దాదాపుపూర్తి అయినదని ఎవ్వరూ తలపలేదు.

వెంటనే సుశర్మ తన సేనలతో మత్స్యదేశము మీదికి దండెత్తాడు. చారుల వలన గోసమూహములు ఎక్కడ ఉన్నాయో తెలుసుకొని వాటిని పట్టు కొనడానికి ముందుకు సాగుతున్నాడు. విరాటుని గో సమూహములను ఆక్రమించి మళ్లిస్తున్నాడు. గోసమూహాలకు రక్షకులుగా ఉన్న గోరక్షకులు సుశర్మ సేనలతో పోరాడుతున్నారు. కాని సుశర్మ సేనల ధాటికి ఆగలేకపోతున్నారు.

వారందరూ వెంటనే విరాటరాజువద్దరకు పరుగెత్తారు. వారిని చూచి విరాటుడు, సభాసదులు వారికి ఏమయిందో అని భయపడ్డారు. "మహారాజా! త్రిగర్తాధీశుడు సుశర్మ తన సేనలతో వచ్చి మన గోసమూహాలను మళ్లించుకు పోతున్నాడు. తమరు వచ్చి కాపాడాలి." అని మొరపెట్టుకొన్నారు.

విరాటుడు ఆశ్చర్యపోయాడు. " అదేమిటి! మీరు చెపుతున్నది నిజమేనా! ఇదివరకు మన చేతిలో చావు దెబ్బ తిన్నాడు కదా! ఇంతలో సుశర్మకు అంతధైర్యం ఎలా వచ్చింది." అంటూ మంత్రులను చూచి "ఇప్పుడు మనము మన సేనలతో వెళ్లి సుశర్మతో యుద్ధం చేయాలి లేకపోతే మన పశుధనం మనకు దక్కదు. వెంటనే యుద్ధానికి సిద్ధం కండి. " అని ఆజ్ఞాపించాడు.

విరాటుడు కూడా యుద్ధానికి సిద్ధం అయ్యాడు. చారులవలన సుశర్మ గోగణాలతో ఎటు వెళుతున్నాడో తెలుసుకొని ఆ వైపుకు తన సేనలను మళ్లించాడు. విరాటుని పెద్ద తమ్ముడు శతానీకుడు, మరొక తమ్ముడు మదిరాశ్వుడు, అతని తమ్ముడు సూర్యదత్తుడు, తమ తమ సేనలతో విరాటుని వెంబడించారు. విరాటుని కుమారుడు శంఖుడు కూడా తన శంఖాన్ని భయంకరంగా పూరిస్తూ యుద్ధానికి సిద్ధం అయ్యాడు.

ఈ సమర సన్నాహాలు చూచి ధర్మరాజు, తన తమ్ములు, భీమ, నకుల సహదేవులతో కూడా విరాటుని వద్దకు వచ్చాడు. " మహారాజా! నేను ఇదివరకు ఒక ఋషి వద్ద ఎన్నో శస్త్రాస్త్రములను అభ్యసించాను. నాకు యుద్ధంచెయ్యడంలో ప్రావీణ్యం ఉంది. తమరు యుద్ధానికి వెళుతుంటే

నేను ఊరకుండటం న్యాయమా! అందుకని నేనుకూడా తమరి వెంట యుద్ధానికి వస్తాను." అన్నాడు. విరాటుడు సరే అన్నాడు.

వెంటనే ధర్మరాజు తన తమ్ములు భీమ, నకుల సహదేవులను రమ్మని సైగ చేసాడు. " మహారాజా! ఇతడు మన వంటవాడు. మీకు తెలుసుగా ఇతను మల్లయుద్ధంలో నేర్పరి. యుద్ధంలో మనకు అవసర మవుతాడు. ఇతను తామగ్రంధి. అశ్వపాలకుడు పైగా యుద్ధ ప్రవీణుడు. ఇతడు తంత్రీపాలుడు. ఇతనికీ యుద్ధక్రీడలో ప్రవేశం ఉంది. అందుకని, వీరిని యుద్ధానికి పిలుచుకుపోవడం యుక్తం అని తోస్తూ ఉంది." అని అన్నాడు.

విరాటుడు శతానీకుని పిలిచి వారికి కూడా రధాలు సిద్ధం చెయ్యమన్నాడు. అందరితో కలిసి విరాటుడు సుశర్మ గోవులను మరలించిన వైపుకు తన సేనలను నడిపించాడు. సుశర్మ సేనలను చేరుకున్నాడు.

సుశర్మ సేనలకు, విరాటుని సేనలకు ఘోర యుద్ధం జరిగింది. శతానీకుడు తన సేనలతో సుశర్మ సేనలను ముట్టడించాడు. మదిరాశ్వుడు కూడా తన సేనలతో సుశర్మ సేనలను నుగ్గు నుగ్గు

చేస్తున్నాడు. సూర్యదత్తుడు కూడా తనసేనలతో సుశర్మ సేనలను కకావికలు చేస్తున్నాడు. విరాటుడు కూడా యుద్ధ రంగంలో ఎక్కడ చూచినా తానే అయి యుద్ధం చేస్తున్నాడు.

విరాటుడు సుశర్మ రథాన్ని చూచాడు. వెంటనే తన రథాన్ని ఆ వైపుకు పోనిమ్మాడు. విరాటుడు సుశర్మను యుద్ధంలో ఎదుర్కొన్నాడు. ఇద్దరూ భయంకరంగా యుద్ధం చేస్తున్నారు. విరాటుని ధాటికి తాళలేక సుశర్మ సేనలు తిరుగు మొహం పట్టాయి.

ఇంతలో సూర్యాస్తమయం అయింది. చీకట్లు అలుముకున్నాయి. కళ్లు కనపడక అందరూ యుద్ధం ఆపారు. కొంత సేపటి తరువాత చంద్రోదయం అయింది. పండు వెన్నెల వచ్చింది. ఆ వెన్నెల వెలుగులో మరల ఇరు పక్క సేనలు యుద్ధానికి తలపడ్డాయి. సుశర్మ రెట్టించిన ఉత్సాహంతో యుద్ధ రంగానికి వచ్చాడు. విరాటుని సారధిని, గుర్రాలను చంపాడు. విరాటుని పట్టుకున్నాడు. తన రథం మీద కు లాగాడు. పెద్దగా సింహనాదం చేసాడు. విజయ దుంధుభులు మోగించాడు.

విరాటుని సుశర్మ పట్టుకున్నాడు అనే వార్త అందరికీ తెలిసింది. దర్మరాజు భీముని పిలిచాడు.. "భీమా! ఈ విరాటుని కొలువులో మనం

తలదాచుకొని బతుకుతున్నాము. సుశర్మ విరాటుని బందీగాపట్టుకున్నాడు. అతనిని విడిపించడం మన ధర్మం. సుశర్మను వెంబడించి విరాటుని విడిపించు." అని కోరాడు.

"అన్నయ్యా! అదెంతపని. నువ్వు తమ్ములు చూస్తూ ఉండండి. అదుగో ఆ మద్ది చెట్టును పెకలించి, శత్రు సేనలను చావగొడతాను. ఆ సుశర్మ మదమణుస్తాను. విరాటుని విడిపిస్తాను." అన్నాడు.

ధర్మరాజు నవ్వి "భీమా! నువ్వు అలా చేస్తే నువ్వు భీముడివి అని అందరికి తెలిసి పోతుంది. మన అజ్ఞాత వాసం భగ్నం అవుతుంది. కాబట్టి మామూలుగా విల్లు అమ్ములతో యుద్ధం చెయ్యి. నకుల సహదేవులు నీకు చక్ర రక్షకులుగా ఉంటారు." అని అన్నాడు.

భీముడికి ఒకింత నిరాశ కలిగింది. అన్న మాట ప్రకారం చెట్ల జోలికి పోకుండా "అన్నయ్యా! తమరు చెప్పినట్లే చేస్తాను. నా భుజబలంతో శత్రువులను ఓడిస్తాను. విరటుని తెచ్చి తమరికి అప్పగిస్తాను." అని పలికాడు.

అంతట ధర్మరాజు తాను ముందుండి సేనలను నడిపించాడు. త్రిగర్త సైనికులు ఇది చూచి ధర్మరాజు మీదికి బాణాలతో, కత్తులతో దాడి చేసారు. భీముడు శత్రువుల రథాలను విరగ్గొట్టాడు, సారథులను చంపాడు. ధర్మరాజు సుశర్మను ఎదుర్కొని యుద్ధం చేస్తున్నాడు. ఇది చూచి సుశర్మ రథంలో ఉన్న విరాటుడు పక్కనే ఉన్న గద ఒకటి తీసుకొని రథం మీది నుండి కిందికి దూకి సుశర్మను గదతో మోదాడు.

అదే అదునుగా భీముడు సుశర్మ రథం మీదికి దూకాడు. సుశర్మను పట్టుకొని అతడి చేతులు విరిచి పట్టుకొని, సింహనాదం చేసాడు. సుశర్మ సేనలు ఆశ్చర్యపోయాయి. సుశర్మ చక్రరక్షకులు పారిపోయారు. సుశర్మ సైనికులు వెనుకకు తిరిగారు. భీముడు వారిని వెంబడించి తరిమాడు. సుశర్మ తోలుకుపోతున్న పశుసంపదను మరలించాడు.

అన్నగారు, ధర్మరాజు తోనూ, నకుల సహదేవులతోనూ విరాటుని వద్దకు వచ్చాడు భీముడు. విరాటుడు సంభ్రమాశ్చర్యాలతో వారిని అభినందనలతో ముంచెత్తాడు. ధర్మరాజును చూచి "మీరు నా ధన, మాన ప్రాణములు కాపాడారు. దానికి ప్రతిగానేను మీకు ఏమి ఇచ్చుకోగలను. నా రాజ్యాన్ని తమరికి సమర్పించుకొంటాను. ఇదిమీరు కాపాడిన శరీరం.

ఈ రాజ్యం మీరు జయించినది. ఈ మత్స్య దేశాన్ని స్వీకరించండి. నన్ను రక్షించండి. " అని వేడుకున్నాడు విరాటుడు.

ధర్మరాజు విరాటుని చూచి "మహారాజా! అది మీకు నా మీద ఉన్న మన్నన. మీరు విజయోత్సాహంతో మత్స్యనగరమునకు విజయం చెయ్యడం కన్నా వేరు ఆనందం నాకు ఏముంటుంది. అయినా నేను చేసినది ఏమున్నది. దీనికి ఇంత పొగడవలెనా రాజా!" అన్నాడు ధర్మజుడు.

విరాటుడు ధర్మరాజు వైపు చూస్తూ "కంకా! నాకు అర్ధం కాని విషయం కాని ఒకటి ఉంది. ఇప్పుడు నువ్వు చేసింది నాకు ఉపకారమా! నా వద్ద పని చేస్తున్నందుకు సేవా తత్పరతా! లేక కృతజ్ఞతా! లేక నా మీద కృపా! లేక అశేష శత్రు సంహార మొనరించి కీర్తి పొందుదామనా! ఏ కారణంతో నువ్వు ఈ శత్రు సంహారం చేసావు?

అయినా ఈ వంటల వాడు ఏమిటి? ఇతనిపరాక్రమము ఏమిటి? ఆ యుద్ధం చెయ్యడం ఏమిటి? ఇతడే కదా నన్ను యుద్ధంలో గెలిపించింది. ఈ అశ్వ శిక్షకుడు, ఆ గోపాలుడు వీరిద్దరే ఈ యుద్ధంలో గాయపడకుండా శత్రు సంహారం చేసింది. ఆపదలలో ఉన్నపుడు

సాయం చేసిన వాడేనిజమైన మిత్రుడు. కంకా! నీ మైత్రిని నేను మరువలేను. నీ ఇష్టం వచ్చినవి కోరుకొండి. గజములా! హయములా! కాంచనమా! రత్నములా! వజ్రవైడూర్యములా! దేవతా కాంతల పోలు అందగత్తెలా!నానావిధ భోగ భోగ భాగ్యాలా! మీ ఇష్టం. కోరుకోండి. అవి నేను మీకు సమర్పించుకుంటాను." అన్నాడు విరాటుడు.

అది విని ధర్మరాజు, పాండవులు "మహారాజా! ఈవిధంగా మమ్ములను గౌరవించడమే మాకు ఎంతో ఎక్కువ! దీనికంటే తమరు ఇస్తానన్న కానుకలు విలువైనవి కావు కదా! మనం అందరం నగరానికి చేరుకున్న తరువాత మమ్ములను తగు రీతిని సత్కరించండి. " అన్నారు.

ధర్మరాజు విరాటుని చూచి "మహారాజా! నాది ఒక మనవి. మీరుకోరు కో మన్నారు కాబట్టి కోరుతున్నాను. ఈ సుశర్మను, అతని బంధు మిత్రులతో, ససైన్యంగా విడుదల చేయండి. ఇదేనేను కోరుకొనేది. వెంటనే ఈవిజయ వార్తను మన నగరంలో ప్రకటించండి. విజయోత్సవాలు జరిపించండి. " అని అన్నాడు.

ధర్మరాజు కోరిన ప్రకారం విరాటుడు సుశర్మను అతని బంధుమిత్రులను, సైన్యాన్ని విడుదల చేసాడు. ఆ రాత్రి అక్కడే గడిపి మరునాడు రాజధాని విరాట నగరానికి ప్రయాణ మయ్యారు.

మహా భారతము విరాటపర్వము

తృతీయాధ్యాయము సమాప్తము

ఓం తత్సత్.

# మహాభారతము

# విరాట పర్వము

# చతుర్థాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు ఈ విధంగా చెప్పాడు.

సుశర్మ తన సేనలతో విరాటుని గోవులను పట్టుకున్న మరునాడు సూర్యోదయ సమయంలో సుయోధనుడు తన సేనలతో భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మొదలైన వీరులతో కలిసి విరాట నగరం వైపు బయలు దేరాడు.

విరాట నగరానికి కొద్ది దూరంలో ఉన్న విరాటుని పశుసంపదను ముట్టడించారు. పశుసంపదకు కావలిగా ఉన్న కొద్దిపాటి సైన్యము అసంఖ్యాకంగా ఉన్న కౌరవ సేనను ఎదిరించ లేక పోయాయి.

విరాటుని గవాధ్యక్షడు వెంటనే తన రథము మీద విరాట నగరానికి చేరుకున్నాడు. ఆ సమయంలో అంతఃపురంలో ఉత్తర కుమారుడు మాత్రం ఉన్నాడు.

"ఉత్తరకుమారా! కురు సైన్యములు మన ఆవుల మందల మీద విరుచుకు పడ్డాయి. ఆవుల మందలను అపహరించుకొని పోతున్నాయి. తమరు వెంటనే వారితో యుద్ధము చేసి ఆవుల మందలను కాపాడాలి. తమరి తండ్రి విరాట మహారాజు తమరి పరాక్రమము గురించి, తమరి బాహు బలం గురించి, తమరి శౌర్యము గురించి, ఈ భూభారాన్ని భరించడానికి తగినవాడవని పది వేల మంది ముందు ఎప్పుడూ చెపుతూ ఉంటారు. తమరి బలపరాక్రమాలు ప్రదర్శించు సమయం ఆసన్నమయింది. వెంటనే బయలుదేరి కౌరవ సేనలను ఎదిరించి, మన ఆవులమందలను కాపాడండి." అని ప్రార్థించాడు.

గవాధ్యక్షుని పొగడ్తలకు విరాటుని కుమారుడు, ఉత్తరుడు పొంగిపోయాడు.

“గవాధ్యక్షా! నిజం పలికావు. నేను కౌరవ సేనలను చిత్తుచేస్తాను. ఆవుల మందలను క్షణం లో విడిపిస్తాను. కాని నాకు తగిన సారథి లేడు కదా! అందుకని మనసులో బాధగా ఉంది. సమర్ధుడైన సారథి దొరికితే కౌరవ సేనలను జయించడం ఎంత పని. నేను యుద్ధం చేస్తుంటే చూచి భీష్మ, ద్రోణ, కృపాశ్వత్థామలు, నన్ను అర్జునుడిగా భ్రమించేటట్టుగా యుద్ధం చేసి కౌరవ సేనలను చిత్తు చేసి ఆవుల మందలను విడిపించకపోతే నా తండ్రి, నా పరివారము నన్ను మెచ్చుతారా. ఆలస్యం అయితే ఆవుల మందలను దూరంగా తోలుకొని పోతారు. వెంటనే సమర్ధుడైన సారథిని వెతకండి” అని అన్నాడు ఉత్తరకుమారుడు.

ఆసమయంలో అక్కడే ఉన్న ద్రౌపది, ఉత్తరుడు తనను తాను అర్జునునితో పోల్చుకోడం చూసి నవ్వుకుంది. వెంటనే అర్జునుని వద్దకు వెళ్లింది. విషయమంతా వివరించింది. అర్జునుడు లెక్కలు వేసి తమ అజ్ఞాత వాసకాలం పూర్తి అయింది అని, తమను తాము ఎరుక పరుచుకోడానికి ఇదే సమయం అని నిర్ణయించుకున్నాడు.

ద్రౌపదిని చూచి "నీవు పోయి మన బృహన్నలకు సారధ్యం చేయు సామర్ధ్యము కలదు. పూర్వము ఖాండవ వన దహన సమయంలో అర్జునునికి సారధిగా పని చేసి అతని ప్రశంసలందుకున్నాడు. అతని సహకారం ఉంటే కౌరవ సేనలను జయించ వచ్చును. ఇందులో సందేహం లేదు అని వారితో చెప్పు. ఎలాగైనా నన్నుసారధిగా ఉండేట్టు వారితో అంగీకరింప చెయ్యి" అని అన్నాడు.

ద్రౌపది వెంటనే వెళ్లి ఉత్తర ను కలుసుకుంది "అమ్మా! మన రాకుమారుడు ఉత్తరుడు తగిన సారధి కోసం వెతుకుతున్నాడు అని తెలిసింది. మీ గురువు గారు బృహన్నల కు రథం నడపడంలో అర్జునుడు మెచ్చుకునే సామర్ధ్యం ఉన్నాయి. ఖాండవ వన దహన కాలంలోనూ, ఇతర సమయాలలోనూ అర్జునునికి సారధిగా ఉండి అతనికి విజయం చేకూర్చాడు. ఈవిషయం రాకుమారునికి చెప్పు." అని పలికింది.

వెంటనే ఉత్తర మాలినితో కలిసి అన్నయ్య వద్దకు వెళ్లి విషయమంతా చెప్పింది అది విని ఉత్తర కుమారుడు పక్కున నవ్వాడు.

"సైరంధ్రీ! నన్ను ఎందుకు ఎగతాళి చేస్తావు. నేను బృహన్నల వంటి వారి వైపు కన్నెత్తికూడా చూడనే అలాంటిది బృహన్నలను నాకు సారధిగా నియమిస్తానా? కౌరవ సైన్యాలు యుద్ధానికి వచ్చాయట? గోవులను పట్టుకున్నాయట? కౌరవుల మీద నా ప్రతాపం చూపడానికి నేను వెళుతున్నానట? ఇలాంటి సమయంలో నాకు బృహన్నల సారధిగా ఉంటే నలుగురూ నవ్వరా! అయినా మన దేశంలో సారధులకు ఇంత కరువు వచ్చిందా" అని ఆశ్చర్యపోయాడు ఉత్తర కుమారుడు.

అప్పుడు సైరంధ్రి ఉత్తర కుమారుని చూచి "కుమారా! ఒక్క కౌరవ సేనకాదు మూడులోకాలు ఒక్కటైవచ్చినా బృహన్నల సారధిగా ఉండిన, నువ్వుగెలవవచ్చు. ఏదో కారణం వలన పేడి రూపం వచ్చినంత మాత్రాన అతనిలో ఉన్న సామర్ధ్యం పోతుందా!"

అని పలికింది. వేరే సారథి లేకపోవడం వలన విధి లేక బృహన్నలను సారథిగా అంగీకరించాడు.

వెంటనే ఉత్తర నేను పోయి బృహన్నలను పిలుచుకొని వస్తాను అని చెంగు చెంగున నర్తనశాలకు పరుగెత్తింది. గురువు గారికి నమస్కరించి "మా అన్నయ్య సారథి ఒక యుద్ధంలో మరణించాడు. మరల వేరే సమర్థుడైన సారథిని నియమించలేదు. ఈ రోజు కౌరవ సేన మా పశుగణములను అపహరించింది. మా అన్నయ్య యుద్ధానికి పోవాలి. తగిన సారథి లేడనీ బాధపడుతున్నాడు. మీ గురించి సైరంధ్రి చెప్పింది. అందుకని మిమ్ములను తీసుకొని వెళ్లడానికి వచ్చాను నా మాట మన్నించి తమరు రావాలి. మా అన్నయ్య కు సారథిగా ఉండి ఈ ఆపద తప్పించాలి. నా మీద వాత్సల్యంతో తమరు ఒప్పుకోవాలి. " అని పలికింది ఉత్తర.

బృహన్నల నవ్వి "అమ్మా! ఉత్తరా! నాకు సారథ్యం చేసే నేర్పు ఉందా? ఏమో భయంగా ఉంది. నీ మాట ఎందుకు కాదనాలి.

నువ్వు అడిగావు కాబట్టి ఒక్క సారధ్యమే కాదు ఎంతటి కష్టతరమైన పని ఐనా చేసి పెడతాను.  పద పోదాం." అని ఉత్తర వెంట బయలుదేరాడు బృహన్నల.

అల్లంత దూరంలో బృహన్నలను చూచి ఉత్తరకుమారుడు "బృహన్నలా! కౌరవులతో నేను యుద్ధం చేయాల్సివచ్చింది. నీవు రధము నడపాలి. తొందరగా రా. రధము ఎక్కు. నీ గురించి సైరంధ్రి మాకు చెప్పింది."

"రాకుమారా! ఏదో ఆటపాటల గురించి నన్ను పిలవ వచ్చును గాని, యుద్ధము చేయుటకు సారధిగా నన్ను రమ్మనుట నీకు ఉచితమా! ఎక్కడైనా మంచి బలాఢ్యుడైన సారధిని నియమించు." అని అన్నాడు బృహన్నల.

"అదేమిటి బృహన్నలా! నాడు ఖాండవ వన దహన సమయమున అర్జునుని రధము నీవు నడిపావట కదా! అర్జునునికి విజయము చేకూర్చావట కదా! మరి ఆ చాతుర్యము శౌర్యము నీలో

తగ్గిపోయాయా! నా మీద స్నేహము పెంచుకో. నాకు మరోమాట చెప్పవద్దు. వెంటనే యుద్ధానికి తయారు కమ్ము. " అని అన్నాడు ఉత్తరుడు.

ఇష్టం లేనట్టుగా నటిస్తూ ఒప్పుకున్నాడు బృహన్నల. ఉత్తరకుమారుడు ఒక కవచం తెప్పించాడు. బృహన్నలకు ఇచ్చి తొడుక్కోమన్నాడు. దానిని తలకిందులుగా తొడుక్కొని అందరిని నవ్వించాడు బృహన్నల. తరువాత ఉత్తర కుమారుడు బృహన్నలకు కవచం తొడిగాడు.

"బృహన్నలా తొందరగా రథమునకు హయములు పూన్చుము. మన ధ్వజమును ఎత్తుము. మనం తొందరగా పోయి గోవులను విడిపింపవలయును." అని తొందర పెట్టాడు.

"నువ్వు ఏమి చెయ్యమంటే అది చేయవలయును. నీవు ఉన్న చోట ఉండవలయును. నీవు పొమ్మన్న చోటికి పోవలయును. నా

బలం తెలుసుకొని నా నుంచి పని తీసుకొని విజయం సాధించుము." అని అన్నాడు బృహన్నల.

బృహన్నల రథం సిద్ధం చేసాడు. కేతనం ఎగురవేసాడు. యుద్ధానికి వెళుతున్న అన్నయ్యను చూచి ఉత్తర "అన్నయ్యా! నీవు కౌరవ వీరులను గెల్చినపుడు వారి తలపాగాలలో రంగురంగులతో విరాజిల్లే వాటిని నాకు బొమ్మలకు అలంకరించడానికి తీసుకురావా!" అని అడిగింది.

"అదేమిటి ఉత్తరా! రాకుమారుడు విజయలక్ష్మితో తిరిగి వస్తాడు. బొమ్మలకు చీరలు తెచ్చుట ఒక పనియే! అలాగే తెస్తాడు." అని పలికాడు బృహన్నల.

తరువాత బృహన్నల వివిధములైన ఆయుధములను రథములో పెట్టించాడు. రథము ఎక్కాడు. ఉత్తర కుమారుడు పశువుల కాపరులను అడిగి కౌరవ సేన గోవులను ఏ పక్కగా తోలుకుపోయింది తెలుసుకున్నాడు. ఆ దిక్కుగా రథము

పోనివ్వమన్నాడు. బ్రాహ్మణులు, పుణ్యాంగనల దీవెనలు అందుకుంటూ ఉత్తరకుమారుడు ఊరిబయటకు చేరుకున్నాడు.

అల్లంత దూరంలో రేగిన ధూళిని బట్టి కౌరవ సేన పోయిన ప్రదేశము నకు చేరుకున్నాడు ఉత్తరుడు. కౌరవసేనను తేరిపార చూచాడు. భయపడి పోయాడు ఉత్తరకుమారుడు.

“బృహన్నలా! భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, దుర్యోధనుడు మొదలగు వీరులు, అసంఖ్యాకమైన శస్త్రాస్త్రములు కలిగిన కౌరవ సైన్యము భయంకరంగా ఉన్నది. వీరితో నేను యుద్ధం చెయ్యగలనా! నాకు విలు విద్యలో అంత ప్రావీణ్యము లేదు. బాలుడను. విలువిద్యలో నిష్ణాతులైన శకుని, జయద్రధ, దుర్ముఖ, వికర్ణ, కర్ణ, మొదలైన వీరులతో నేను యుద్ధం చేయగలనా! ఇక్కడ పరిస్థితి ఇలా ఉంటుందని తెలియక వచ్చాను. ఈ కౌరవ సేనను చూచి నా శరీరం వణుకుతూ ఉంది నీవేమో నీ పాటికి రధం తోలుతున్నావు. నేను కౌరవ సేనను ఎదుర్కొనడం జరగని పని. రధము వెనకకు

పోనిమ్ము  అన్నింటి కన్నా ప్రాణములు తీపి కదా!" అన్నాడు వణుకుతూ ఉత్తర కుమారుడు.

"ఉత్తరకుమారా! అసమాన్యమైన కౌరవ సేనమీదికి నేను రథం ఎందుకు పోనిస్తాను. చూడు గోవులను తోలుకు పోతున్న  ఆ కొద్దిపాటి సైన్యాన్ని ఎదిరించి మనం గోవులను మళ్లించుకు పోదాము.  పైగా అంతఃపురములో అందరి ముందర గోవులను మళ్లించుకు వస్తాను అని చెప్పావు కదా.  ఇప్పుడు ఇలా బెదిరి పోవడం తగునా! " అని అన్నాడు.

"అమ్మో! పశువుల మాట దేముడెరుగు  అంతఃపుర కాంతల సంతోషము నాకు ఎందుకు. నేను యుద్ధం చేయను అంతే!" అన్నాడు ఉత్తరకుమారుడు.

"అదికాదు ఉత్తర కుమారా! నీబలము ఎదిరి బలము చూచుకొని కొంచెంసేపు యుద్ధం చేసి నీ వలన కాక పోతే మరలి

పోదాము. అసలు నిన్ను కౌరవ సేన చూడనేలేదు కదా! ఇలామరలిపోతే వీరులుమెచ్చరు కదా! ” అని అన్నాడు.

“బృహన్నలా! సుశర్మ మన దేశంమీద దండెత్తి మన దక్షిణ వైపుఉన్న గోసమూహాలను అపహరించుకుపోయాడు. మా తండ్రిగారు, తన సేనలతో సుశర్మను ఎదిరించడానికి వెళ్లాడు. మనకు సాయంగా నగరంలో సైన్యము లేదు ఇలాంటి పరిస్థితులలో నేను ఒంటరిగా అపారమైన కౌరవ సేనలను ఎదిరించగలనా చెప్పు. వాళ్లు మనలను కానక ముందే మనము వెళ్లిపోవడం మంచిది రథము మరలింపుము.” అని అన్నాడు ఉత్తరకుమారుడు.

“అది కాదయ్యా! ఇలా ఆవులను వదిలి వెళితే పురజనులు నిన్ను మెచ్చరు. వెనక్కు వెళ్లడం పిరికి తనం అవుతుంది. నీకు తగినసారథి లేడని సైరంధ్రి చెబితే నేనునీకు సారధిగా వచ్చాను. ఇప్పుడు ఆవులను శత్రువులకు వదిలి వెళ్లలేను. నీకేం భయం లేదు. మనసును చిక్కబట్టుకో. కౌరవ సైన్యములను ఉపాయంతో

ఎదిరించి మనగోవులను మరలించుకు పోదము.!” అని అన్నాడు బృహన్నల.

“‘ఏంటి బృహన్నలా! నలుగురూ నవ్వుతారా! నవ్వనీ! నాకేంటి! నన్ను ఆపకు. నీకు అంత శక్తి ఉంటే నువ్వే ఎదిరించు.” అంటూ ధనుర్బాణములను రథంమీద విడిచి రథము దిగి పరుగెత్తాడు ఉత్తరకుమారుడు.

బృహన్నల కూడా రథము దిగి ఉత్తర కుమారుని వెంబడించాడు. ఇది చూచి కౌరవ సేనలో వారు హేళనగా నవ్వుకున్నారు. బృహన్నల ఉత్తర కుమారుని పట్టుకున్నాడు. ఉత్తరకుమారుని పరిస్థితి దారుణంగా ఉంది. నోరు ఎండి పోతోంది. మొహం వెలవెలపోయింది. కాళ్లు చేతులు గడగడ వణుకుతున్నాయి. గొంతు పూడుకుపోయింది.

"బృహన్నలా నీకు అనేక బహుమానాలు ఇస్తాను. నన్ను వదిలిపెట్టు. మా అమ్మ నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. నేను ఆమెను చూడాలి! " అని అన్నాడు దీనంగా.

"ఉత్తరకుమారా! భయపడకుము. నీకు కౌరవులతో యుద్ధం చెయ్యడం చేతకాకపోతే నా రధానికి సారధిగా ఉండు. నేను కౌరవ సేనతో యుద్ధం చేసి ఓడించి గోవులను విడిపిస్తాను." అంటూ బృహన్నల ఉత్తర కుమారుని తీసుకొని రధం దగ్గరకు వచ్చాడు.

తాను కూడా రధం ఎక్కి రధాన్ని శ్మశానంలో తాము ఆయుధములను దాచిన జమ్మి చెట్టువద్దకు పోనిచ్చాడు.

ఇదిచూచి కౌరవ సేనలు కొంచెం కలవర పడ్డాయి. వారికి కొన్ని అపశకునాలు కనిపించాయి. వాటిని చూచి ద్రోణుడు ధైర్యంగా ఉండమని తమ సైన్యాలకు హెచ్చరించాడు.

భీష్ముని చూచి "వీడు ఎవరో మహా గర్విష్టివలె ఉన్నాడు. వీడు ఎవరో తెలుసుకోవాలి! " అన్నాడు. భీష్ముడు దుర్యోధనుని తో ద్రోణుడు వినేటట్టు అన్యాపదేశంగా ఇలా అన్నాడు

"సుయోధనా! మనం శత్రువులకు అనుకూలమైన ప్రదేశాన్ని దాటాము. ఇంక మన శౌర్యప్రతాపాలు చూపవలసిన సమయం వచ్చింది. శత్రువులకు మనం చలింప వలసిన పనిలేదు." అని అన్నాడు. అందులో ఉన్న గూడార్ధం అర్ధం చేసుకున్నాడు ద్రోణుడు.

( ఇలా చెప్పుకోవచ్చు. మనం శత్రువులకు అనుకూలమైన ప్రదేశాన్ని దాటాము. అనగా అజ్ఞాతవాసం పూర్తి అయింది. ఇంక మన శౌర్యప్రతాపాలు చూపవలసిన సమయం వచ్చింది అనగా అర్జునుడు ఇంక బయల్పడి తన శౌర్యప్రతాపాలు చూపించ వలసిన సయయం ఆసన్నమయింది. శత్రువులకు మనం చలింప వలసిన పనిలేదు అనగా ఇంక పాండవులు కౌరవులకు సమయ భంగం అవుతుందని భయపడ పనిలేదు)

ఈ గూడార్థాన్ని గ్రహించాడు ద్రోణుడు. సుయోధనుని చూచి "సుయోధనా! ఇనాళ్ల సింహం ఆకలితో నకనక లాడుతూ గుహలో ఉండి బయటకు వచ్చినట్టు అర్జునుడు అరణ్య అజ్ఞాత వాసాలు ముగించుకొని మన మీద యుద్ధానికి వస్తున్నాడు. అతడితో యుద్ధం చెయ్యడానికి మనలో తగినవారు ఎవరున్నారు? అర్జునుడు గోవులను విడిపించుకు పోవడం తథ్యం." అని పలికాడు.

ఆ మాటలకు కర్ణుడికి కోపం వచ్చింది. "పెద్దలను ఏమీ అనకూడదని మీరు పాండవ పక్షపాతంతో నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారు. కురుసేనలో నువ్వు ఒక్కడివేనా వీరుడివి? అర్జునుడు నువ్వు అనుకొన్నంత గొప్పవాడా? అర్జునుడే వస్తే అతనిని నేనే జయిస్తాను." అని అన్నాడు కర్ణుడు.

సుయోధనుడు కర్ణుని చూచి "కర్ణా నీవు తప్పు పలికావు. అతడు నిజంగా అర్జునుడే అయితే మరల అరణ్య, అజ్ఞాత

వాసములు చేస్తాడు. అతడు అర్జునుడు కాక పోతే నేనే వాడిని జయిస్తాను." అని అన్నాడు సుయోధనుడు.

సుయోధనుని మాటలకు భీష్ముడు, ద్రోణుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు ఒప్పుకొన్నారు. మనసులో నవ్వుకున్నారు.

బృహన్నల తన రథాన్ని జమ్మిచెట్టు దగ్గరకు తీసుకుని వెళ్లి ఆపాడు. "ఉత్తరకుమారా! ఇవి మామూలు ధనుస్సులు. నా ప్రతాపానికి ఆగలేవు. ఈ జమ్మిచెట్టుమీద గాండీవము ఉన్నది. నీవు ఈ జమ్మి చెట్టు ఎక్కి ఆ గాండీవము నాకు తెచ్చి ఇమ్ము. పాండవులు తమ ఆయుధములను కట్టకట్టి ఆ జమ్మి చెట్టుమీద పెట్టారు." అంటూ శవాకారంలో ఉన్న ఆయుధాల కట్టను చూపాడు.

"బృహన్నలా! నేను రాజకుమారుడను నన్ను శవాన్ని తాకమంటావా! " అని అన్నాడు ఉత్తర కుమారుడు.

"కుమారా! అది శవము కాదు మనుష్యులు ఎవరూ అంటకుండా అలా కట్టి పెట్టారు. నేను నిన్ను అలాంటి పని చెయ్యమని చెపుతానా! నా మాట నమ్ము. అది ఆయుధముల మోపు కాని శవము కాదు."

(మోపు అంటే కట్ట అని నెల్లూరు పరిభాష. తిక్కన నెల్లూరులో ఉన్న వాడుక పదాలు ఎన్నో వాడాడు. నా స్వగ్రామము నెల్లూరు కావడం నా అదృష్టం).

బృహన్నల మాటలకు సమాధాన పడ్డ ఉత్తరకుమారుడు జమ్మి చెట్టు ఎక్కి ఆయుధముల కట్టను విప్పాడు. ఆయుధములు ఉత్తరకుమారునికి సర్పముల వలె కనపడ్డాయి. అతడు వణికి పోయాడు. బృహన్నల తగు మాటలతో ఆ భయాన్ని పోగొట్టాడు.

"బృహన్నలా! ఇక్కడ ఒక ధనుస్సు ఉన్నది. అమ్మో! కొండచిలువ వలె ఉన్నది. దీనిని పాండవులలో ఎవరు ఉపయోగిస్తారు." అని అడిగాడు ఉత్తర కుమారుడు గాండివము వంక ఆశ్చర్యముతో చూస్తూ.

"ఉత్తరకుమారా! అది గాండీవము దానిని అర్జునుడు ధరిస్తాడు. దాని ప్రభావంతో అర్జునుడు దేవదానవులను జయించాడు. దీనిని పూర్వము బ్రహ్మ లక్ష సంవత్సరములు ధరించాడు. తరువాత ప్రజాపతి అరవై నాలుగు వేల సంవత్సరాలు ధరించాడు. తరువాత ఇంద్రుడు ఎనభయి ఐదేండ్లు ధరించాడు. తరువాత చంద్రుడు ఐదువందల సంవత్సరములు ధరించాడు. తరువాత వరుణుడు నూరు సంవత్సరములు ధరించాడు. అగ్నిదేవుడు వరుణుడి వద్దనుండి దానిని తీసుకొని అర్జునునికి ఖాండవ వన దహన సయమంలో ఇచ్చాడు. ఈ గాండీవాన్ని అర్జునుడు అరవై ఐదేండ్లు ధరిస్తాడు." అని మిగిలిన ఆయుధముల ను గురించి అవి ఎవరెవరు ధరిస్తారు అని వివరంగా చెప్పాడు బృహన్నల.

ఉత్తర కుమారుడికి ఒకసందేహం వచ్చింది. "బృహన్నలా! పాండవులు తమ ఆయుధములు అన్ని ఇక్కడ పెట్టి ఎక్కడు పోయారో నీకు తెలియునా! పాండవులకు నేను మేనల్లుడిని వారు

నా బంధువులు మిత్రులు. అయ్యో! ధర్మరాజు ఎక్కడ ఉన్నాడో! భీమార్జునులు ఎక్కడ ఉన్నారో! కవలలు నకుల సహదేవులు ఎలా ఉన్నారో! మహా సాధ్వి ద్రౌపది ఎన్ని కష్టాలుపడుతున్నదో! " అని బాధపడుతూ అడిగాడు ఉత్తరకుమారుడు.

"ఉత్తర కుమారా! వారి గురించి నీవు ఏమీ చింతించ పనిలేదు వారు అరణ్య వాసము పూర్తిచేసుకొని మన నగరంలోనే అజ్ఞాతంగా ఉన్నారు. కంకు భట్టు ధర్మరాజు. వలలుడు భీముడు. దామగ్రంధి, తంత్రీపాలురు నకుల సహదేవులు. ఇంక దాపరికము ఎందులకు! నేనే అర్జునుడను. మాలిని పేరుతో సైరంధ్రిగా కాలము గడుపుతున్న సాధ్వి ద్రౌపది. ఆమె కారణం గానే భీముడు కీచకుని, అతని తమ్ములను చంపాడు." అని అన్నాడు.

ఆ మాటలు వినిన ఉత్తర కుమారుడికి సంభ్రమాశ్చర్యాలు, సందేహము ఒకేసారి కలిగాయి. "బృహన్నలా అర్జునునికి పది పేర్లు ఉన్నాయి అవి చెప్పు నేను నిన్ను అర్జునుడు అని నమ్ముతాను." అని అమాయకంగా పలికాడు.

బృహన్నల నవ్వుతో "అర్జునుడు, ఫల్గునుడు, పార్థుడు, కిరీటి, శ్వేతవాహనుడు, బీభత్సుడు, విజయుడు, జిష్ణుడు, సవ్యసాచి, ధనంజయుడు." అని పదిపేర్లు నాకు ఉన్నవి.

ఇంకా సందేహము వీడలేదు ఉత్తరునికి. "నీవు నిజంగా అర్జునుడివి అయితే నీకు ఆ పేర్లు ఎలా వచ్చాయో చెప్పు?" అన్నాడు. అర్జునుడు చిరునవ్వు నవ్వి ఇలా చెప్పసాగాడు.

"ఉత్తర కుమారా! నేను ఈ ధరణి నంతయు జయించి, ధనములు సముపార్జించితిని కాన నాకు ధనంజయుడు అని పేరు వచ్చినది.

నేను ఎలాంటి వారితోనైనా పోరాడి విజయలక్ష్మిని స్వంతం చేసుకుంటాను కాబట్టి నాకు విజయుడు అని పేరు.

నేను ఎల్లప్పుడూ నా రథమునకు తెల్లని గుర్రములను పూన్చుతాను అనే నియమం కలవాడిని కాబట్టి నాకు శ్వేతవాహనుడు అనే పేరు వచ్చినది.

నాకు ఇంద్రుడు ప్రసాదించిన కిరీటము నా తలమీద ప్రభాత సమయమున రవి ఉదయించునట్లు ప్రకాశిస్తూ ఉంటుంది కాబట్టి నన్ను కిరీటి అంటారు.

నేను యుద్ధంలో శత్రువులతో యుద్ధం చేసేటప్పుడు ఎలాంటి భీభత్స పరిస్థితులలోనైనను, సంయమనము కోల్పోక, ఎలాంటి జుగుప్సాకరమైన భీభత్సమైన పనులు చేయను కాబట్టి నాకు భీభత్సుడు అనే పేరు వచ్చినది.

నేను గాండీవాన్ని ఉపయోగించే సయమున రెండు చేతులతో నారిని సంధిస్తాను. కాని ఎక్కువగా ఎడమ చేతి వాటంగా సమర్ధ వంతంగా నారిని సంధిస్తాను. అందుకని నాకు సవ్యసాచి అనే పేరు వచ్చింది.

నేను ఎక్కువగా తెల్లగా ఉంటాను కాబట్టి నన్ను అర్జునుడు అని పిలుస్తారు.

నేను ఉత్తరఫల్గునీ నక్షత్ర ము లో జన్మించడం వలన నన్ను ఫల్గునుడు అంటారు.

మా అన్నయ్య ధర్మరాజు. నా కంటిముందర ఎవరైనా ఆయనకు హాని కలిగిస్తే, దేవతలు అడ్డుతగిలినా సరే, వారిని చంపుతాను. అందుకని నాకు జిష్ణుడు అనే పేరు.

మా అమ్మ అసలు పేరు పృథ. కుంతి భోజుని కుమార్తె కావున కుంతీ దేవి అయింది. పృథా కుమారుడను కావున నాకు పార్థుడు అనే పేరు వచ్చినది.

అయినను ఉత్తరకుమారా! నేను ఎల్లప్పుడూ సత్యమునే పలికెడు ధర్మరాజు సోదరుడను నీతో అబద్ధం చెబుతానా! నాకు ఈ పది పేర్లు ఈ విధంగా వచ్చినవి.

నేను శ్రీకృష్ణుని సాయంతో ఖాండవ వనమును దహించినపుడు, నాకు బ్రహ్మ రుద్రులు ప్రత్యక్షమై నాకు దివ్యాస్త్రాలు, కృష్ణుడు అనే పదకొండవ నామము బహూకరించారు.

తరువాత నేను నివాత కవచులు అనే రాక్షసులను చంపాను. దానికి మెచ్చి నాకు ఇంద్రుడు ఈ కిరీటాన్ని బహూకరించాడు.

దేవతలందరూ కలిసి నాకు ఈ శంఖమును ఇచ్చారు. అందుకని ఈ శంఖమును దేవదత్తము అంటారు.

చిత్రసేనుడు అనే గంధర్వుడు సుయోధనుని బందీగా చేసినపుడు గంధర్వులతో పోరాడి అతనిని విడిపించాను. కాబట్టి నువ్వు భయపడవలదు. కౌరవ సైన్యాన్ని గెలిచి మనము ఆవులను విడిపించు కొని పోయెదము." అని పలికాడు అర్జునుడు.

ఉత్తర కుమారునికి సంభ్రమాశ్చర్యాలు ఒకేసారి కలిగాయి. చెట్టుదిగి అర్జునునికి సాష్టాంగ ప్రమాణము చేసాడు.

“ అర్జునా! నాకు నువ్వు కనపడటం నా అదృష్ట దేవత నా ముందు సాక్షాత్కరించి నట్టులున్నది. నా ఆనందానికి అవధులు లేవు. నీవు ఎవరివో తెలియక చాపల్యము కొద్దీ నిన్ను ఏమేమో అన్నాను అవన్ని మరిచిపో. నన్ను కృపతో చూడు. ఇప్పుడు నాకు తగిన అండ దొరికిందను కుంటాను.” అని చేతులు జోడించి అభ్యర్థించాడు ఉత్తరకుమారుడు.

ఆ మాటలు విన్న అర్జునుడు రథము దిగి ఉత్తరకుమారుడిని ప్రియంగా కౌగలించుకున్నాడు.

“అర్జునా! ఇప్పుడు నాకు మనసులో ఉన్న భయం తొలగిపోయింది. నీవు రథం ఎక్కు. నేను నీకు సారథి నవుతాను. నేను ఏమి చేయాలో చెప్పు. కౌరవులను జయించి గోవులను మరల్పుము. నాకు ఎన్నో నాళ్లనుండి అర్జునుని రథమునకు సారధ్యము వహించవలెనని కోరికగా ఉన్నది విధి వశాత్తు అది ఈ నాటికి సిద్ధించింది.” అని అన్నాడు ఉత్తరకుమారుడు.

దానికి అర్జునుడు వాత్సల్యంతో “కుమారా! నీవు భయపడవలసిన అవసరం లేదు. నీ మీద గాలికూడా సోకనివ్వను. నీకు రక్షణ కల్పించడమే నా ముఖ్య కర్తవ్యము. నీవు ధైర్యంగా ఉండు.” అని అన్నాడు అర్జునుడు.

“అర్జునా! నీవు అర్జునుడు అని తెలిసినప్పుడే నాలో భయం పటాపంచలయింది. కాని నీకు ఈ పేడి రూపం ఎలా వచ్చిందో తెలుసుకోవాలని ఉంది!” అని అన్నాడు ఉత్తరకుమారుడు.

“కుమారా! నేను మా అన్న ధర్మజుని ఆజ్ఞ మేరకు బ్రహ్మచర్య వ్రతము స్వీకరించాను. ఆ సమయంలో దేవేంద్రుని వద్దకు వెళ్లాను అప్పుడు ఊర్వశి నన్నుచూచి కామించింది. నేను నిరాకరించాను. అప్పుడు నన్ను పేడిగా ఉండమని శపించింది. ఆ వరం ఈ అజ్ఞాత వాస సమయంలో అనుభవించాను. అజ్ఞాత వాసంతో పేడితనం కూడా పోయింది. ఇప్పుడు నేను అర్జునుడను.” అని అన్నాడు.

"అర్జునా! ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి అని అడిగాడు ఉత్తరుడు.

"నీవు గాండీవమును, తూణీరములను, ఇతర ఆయుధములను తీసుకొని మిగిలిన ఆయుధములను యధాప్రకారము కట్టగట్టి అక్కడే ఉంచుము." అని అన్నాడు.

ఉత్తర కుమారుడు అదే విధంగా చేసాడు. అర్జునుడు అవన్ని ధరించాడు. రధము ఎక్కి గాండీవాన్ని ఎక్కు పెట్టాడు. అల్లెత్రాటిని మ్రోగించాడు. అగ్నిదేవుని తల్చుకున్నాడు. అమోఘమైన కపిధ్వజము సాక్షాత్కరించింది. ఉత్తర కుమారుని ధ్వజము సింహపతాకము శమీవృక్షము మీద పెట్టించి తన రధానికి కపిధ్వజమును అలంకరిపంచేసాడు. మనసులో తలపగానే అర్జునుని చేతికి దేవదత్త శంఖము వచ్చి చేరింది.

"ఉత్తర కుమారా! నీవు రధమును జమ్మిచెట్టుకు ప్రదక్షిణ పూర్వకంగా నడిపి ముందుకు పోనిమ్ము. ఇప్పటికే ఆలస్యం

అయింది. పశువులు ఎంతో దూరం పోయి ఉంటాయి." అని అన్నాడు అర్జునుడు.

ఉత్తరుడు రథం మీద కూర్చుని రథం పోనిచ్చాడు. అర్జునుడు దేవదత్తం పూరించాడు. ఆ ధ్వని భూనభోంతరాళాలలో ప్రతిధ్వనించింది. రథానికి కట్టిన గుర్రాలు కిందపడి మూర్ఛపోయాయి. అర్జునుడు కిందికి దిగి గుర్రాలను నిమిరి వాటికి చైతన్యం కలిగించాడు.

"ఉత్తరుని చూచి కుమారా! యుద్ధసమయంలో ఇవి సహజమే కలత పడకుము." అని అన్నాడు.

"అర్జునా! నేను యుద్ధ సమయంలో ఎన్నో శంఖారావాలు విన్నాను కాని ఇది భరింపరానిది. నా చెవులు అవిసిపోయాయి. దిక్కులు తిరిగిపోయాయి. నా మనస్సు నీరు గారిపోయింది. ఈ కపిధ్వజము చూస్తుంటే నా కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి. నీ తేజము చూసి వివశుడనైనాను." అని అన్నాడు ఉత్తరుడు.

అర్జునుడునవ్వి మరల శంఖం పూరించాడు.

ఆ ధ్వని విన్నాడు ద్రోణుడు. "సుయోధనా! ఆ ధ్వని విన్నావా! ఆ ధనుష్ఠంకారం గాండీవం కాదూ! ఆ శంఖారావం దేవదత్తం కాదూ! ఆ కనపడునది కపిధ్వజము కాదూ! ఉజ్వలంగా మెరయుచున్న ఆ కిరీటము ఇంద్రుడు అర్జునునికి ప్రసాదించినది కాదూ! సమరోత్సాహంతో వచ్చునది అర్జునుడు కాక మరెవరు? అతనిని ఎదుర్కొనడానికి సన్నాహాలు చెయ్యండి." అంటూ కృపాశ్వత్థామలను చూచి "ముందు మనం రారాజు సుయోధనుని పంపుదాము. తరువాత గోసమూహములను పంపుదాము. ఆ వెనక మనము ఉంటాము. అర్జునుడు వచ్చిన మనము అతనితో యుద్ధ ము చేద్దాము." అని అన్నాడు ద్రోణుడు.

ఆ మాటలు విన్న "సుయోధనుడు భీష్మ, కృప, కర్ణ, వికర్ణుల వంక చూచి, నేను ఇదివరకే చెప్పాను. పాండవులు జూదములో ఓడిపోయి పండ్రెండు వత్సరములు అరణ్యవాసము, ఒక సంవత్సరము అజ్ఞాతవాసము ఒప్పందం చేసుకున్నారు. ఇంకా ఆ

సమయము పూర్తికాకుండానే పార్థుడు బయట పడ్డాడు. కాబట్టి పాండవులు మరల అరణ్యఅజ్ఞాతవాసయులు చెయ్యాలి. ~~ఈ~~విషయం మనం మోహంతో కాని, పాండవులు లోభంతో కాని గమనించలేదు. తాత భీష్ములు దీనిని నిర్ణయించ అర్హులు.

వచ్చునది ఉత్తర కుమారుడు కాకుండా గాండీవి అయితే మన పని సఫలం అయినట్టే. అసలు సుశర్మ దక్షిణ దిశగా, మనము ఉత్తర దిశగా విరాటుని గోవులను పట్టుటకు వచ్చినది, మత్స్యనగరమున ఉన్న పాండవులను బయట పెట్టుటకు కదా! ఆ ప్రకారము మనకు నిశ్చయించి చేసిన పనికి ఇప్పుడు విచారమేల?

ఆ వచ్చిన వాడు అర్జునుడు ఐతేనేమి ? దేవతలు ఐతేనేమి? మనము గోవులను పట్టుకున్నాము. వాటి కోసం యుద్ధం చేస్తాము. కాబట్టి ముందుగా మనమే యుద్ధం చేద్దాము. వెనకాడడం ఎందుకు? అయినను అర్జునుడు ఒక్కడు ఇంత పెద్ద కురుసైన్యాన్ని ఎలా గెలుస్తాడు? ఎవరైనా విని నవ్వుతారని అని కూడా అనుకోకుండా నా ముందు అర్జునుని పొగుడుతూ

ద్రోణుడు అలా పలికాడు. ఐనా పగవారిని వందుల వలె అలా పొగడటం మంచిది కాదు. అయినను ఆచార్యులవారు దూరంగా ఉండి పర్యవేక్షిస్తుంటారు.

యుద్ధానికి సంబంధించిన విషయములను వారిని అడగటం ఎందుకు? భోజన సమయంలో, విలువిద్య గఱపే సమయంలో, నీతి శాస్త్రవిషయములు బోధించేటప్పుడు వారిని మాట్లాడమనటం బాగుంటుందికాని, యుద్ధ సమయంలో కాదు కదా! అయినను వారు యుద్ధం చేయరు. వెనక ఉండి మన విజయం కాంక్షిస్తుంటారు." అని అన్నాడు సుయోధనుడు.

తండ్రిని అలా తూలనాడటం విని అశ్వత్థామ సుయోధనునితో ఇలా అన్నాడు. "సుయోధనా! పశువుల కాచేవారిని బెదిరించి ఆవులను పట్టుకున్నంత మాత్రాన గొప్పలు చెబుతున్నావు. మనం ఇంకా నగరం చేరలేదు. ఇంకా శత్రువులతో యుద్ధం చేయలేదు. యుద్ధంలో గెలిచిన వారు కూడా ఇలా మాట్లాడరు. జూదంలో రాజ్యాన్ని అపహరించి ఇలా మాట్లాడతావా?

ఇక్కడ జూదం  ఆడటం కుదరదు సుయోధనా! అయినా నువ్వు పాండవులను జయించేనా పాండవ పత్నిని సభలోకి  ఈడ్చుకు రమ్మని ఆజ్ఞాపించినది?  అది శకుని కుటిల నీతి కాదా? ఇప్పుడు నీ మీదికి వచ్చు శత్రువును ఆ శకుని వచ్చి ఎదుర్కొంటాడులే!

సభలో అవమానింపబడిన ఆ కపికేతనుడు నీ మీదికి యుద్ధానికి వస్తున్నాడు. నీవు గురువును అధిక్షేపించావు కాని, దేవదానవులను  జయించిన అర్జునుని ఎదుర్కొనగలవా?  వీరుడిని ఎవరైనా పొగుడుతారు. అయినను తన ప్రియశిష్యుడు, పుత్రసమానుడు ఐన అర్జునుని పొగడటం గురువుకు తగదా? ఇన్నిమాటలు అన్న తర్వాత కూడా సిగ్గుమాలి  ద్రోణుడు యుద్ధం చేస్తే చేస్తాడుకాని నేను మాత్రం చేయను.

సుయోధనా! యముడు చెలరేగినా, అగ్ని ఆగ్రహించినా, మృత్యుదేవత పురులు విప్పినా, కొంతైనా మిగులుతుంది కాని అర్జునుని బాణాలు సర్వనాశనం చేస్తాయి.  నీ కుటిల బుద్ధులు

ఇచ్చట పని చేయవు. అర్జునుడు పాచికలు విసరడు. గాండీవంతో శరసంధానం చేస్తాడు.

సుయోధనా! మనము మత్స్య దేశాధీశుని గోవులు పట్టు కున్నాము.మత్స్యదేశాధీశుడు, అతని సైన్యాలు వస్తే ఎదిరిస్తాము అంతే కాని అర్జునుడు వస్తే అతని సమీపానికి కూడా పోము." అని అన్నాడు అశ్వత్థామ.

ఆ మాటలకు కర్ణుడు కోపంతో ఊగిపోయాడు. "మనం ఎందుకు వచ్చాము? పాండవులను బయట పట్టడానికి, ఆవులమందలను గ్రహించడానికి మనము వచ్చాము. ఇప్పుడు అర్జునుని చూచి బెదరడం భావ్యమా! సుయోధనుని పిచ్చివాడిని చేయడం ఒప్పుతుందా! మీకు భయంగా ఉంటే దూరంగా ఉండండి. ఒక్కడిని ఎదిరించడానికి ఎంతమంది కావాలి? నేను ఒక్కడినే ఎదిరిస్తాను. కపిధ్వజాన్ని విరగ్గొడతాను. దానిని చుట్టుముట్టిన పిశాచములను నాశనం చేస్తాను. సారథిని చంపుతాను. అర్జునుని శరీరం నా బాణాలతో తూట్లుపడేట్టు

ఛేధిస్తాను. నా బాహుబలాన్ని, రౌద్రాన్నిచూస్తూ ఉండండి. అర్జునుడు పదమూడేండ్లు అరణ్య అజ్ఞాతవాసములు ముగించి యుద్ధానికి వస్తున్నాడు. నేనూ కౌరవ సేనలో మహా వీరుడను. మేము ఇద్దరం పోరాడటం ఉచితమే గదా! రారాజు సుయోధనుని ఋణం తీర్చుకోడానికి, అర్జునుని యుద్ధంలో గెలిచెదను అన్న నాప్రతిజ్ఞ నెరవేర్చుకోడానికి, కర్ణార్జునులలో ఎవ్వరు గొప్పో తేలిపోవడానికి, పరశురాముని వలన నేర్చిన నా విలువిద్య సార్థకం చేసుకోడానికి, తగిని సమయం ఆసన్నమయినది. మా ద్వందయుద్ధము ఇష్టం ఉన్న వారు చూడండి. లేనియడల ఆవుల వెంట నగరానికి పొండి.” అని దర్పంతో పలికాడు కర్ణుడు.

కర్ణుడి మాటలు విన్నాడు కృతవర్మ. “కర్ణా! నీవు ఎప్పుడూ కయ్యానికి కాలుదువ్వుతావు కాని కార్య సిద్ధి గురించి ఆలోచించవు. కార్య సాధనలో యుద్ధం ఒక నీచ మైన ప్రక్రియ అని రాజనీతి చెబుతుంది. దేశ, కాలమాన, పరిస్థితులను, తమ బలాన్ని ఎదిరి బలాన్ని తెలుసుకొని తెలివిగా యుద్ధం చెయ్యాలి గాని, మూర్ఖంగా, దుస్సాహసంతో యుద్ధం చేస్తే ఓటమి తప్పదు.

అర్జునుడు ఒంటరి వాడు అని నువ్వు అంటున్నావు.

ఇంద్రుని తో యుద్ధచేసి ఖాండవ వన దహనం చేసినప్పుడు అర్జునుడు ఒక్కడే కదా!

యాదవసైన్యాన్ని ఎదిరించి సుభద్రను పరిణయ మాడిన రోజున అర్జునుడు ఒక్కడే కదా!

రాజసూయ యాగ సమయమున దిగ్విజయము చేసిన వాడు అర్జునుడు ఒక్కడేకదా!

గంధర్వుడు సుయోధనుని అపహరించినపుడు అతనితో పోరి సుయోధనుని విడిపించిన వాడు అర్జునుడు ఒక్కడేకదా!

నివాత కవచులనే రాక్షసులను యుద్ధంలో జయించి దేవతలకు మేలు చేకూర్చినవాడు అర్జునుడు ఒక్కడే కదా!

దేవేంద్రులకు అజేయులైన కాలకేయులను రాక్షసులను జయించిన వాడు అర్జునుడు ఒక్కడేకదా!

అంతెందుకు నువ్వూ అక్కడే ఉన్నావు కదా! ద్రౌపదీ స్వయంవరములో అభేద్యమైన మత్స్య యంత్రమును కొట్టి ద్రౌపదిని చేపట్టినవాడు, తన మీద తిరగ బడిన రాజులను జయించిన వాడు అర్జునుడు ఒక్కడే కదా!

పాండవులందరూ తమ తమ శక్తి కొద్ది దిగ్విజయం చేసారు. కాని నువ్వు హస్తినాపురంలో కూర్చుని ప్రగల్బాలు పలుకుతున్నావు.

అట్టినీవు అర్జునుని ఎదిరిస్తాను అనడం ఒంటి చేత్తో సముద్రం ఈదటం లాంటిది. కాబట్టి ఆ దుస్సాహసం మంచిది కాదు. మనము ముందు రాజును కాపాడుకోవాలికాని యుద్ధోన్మాదులం కాకూడదు. మనం అందరం కలిసి అర్జునుని ఎదుర్కుందాము పోరాడుదాము. కాని నువ్వు ఒక్కడివే

పోరాడుతాను అని అనడం అవివేకం." అని కర్ణుని మందలించాడు కృపాచార్యుడు.

కర్ణునికి కోపం వచ్చింది. "కృపాచార్యా! నీవు శత్రువులకు మిత్రుడవని తెలిసి కూడా నిన్ను తోడుగా పిలిచాడే సుయోధనుడు! అమాయకుడు కదా! బాలురు, బంధువులు రాజుగారి సంపదలు అనుభవిస్తారు. సమయానికి తప్పుకుంటారు ఇంటికి వెళ్లి హాయిగా మృష్టాన్నములు ఆరగించు. అనవసరంగా రాజు నిన్ను యుద్ధంలో ప్రవేశపెట్టాడు. మారుమాటాడక వెళ్లు. నేను విల్లు అందుకుంటే పదునాలుగు భువనాలు గడగడలాడతాయి. ఒక్క రధికుడు అర్జునుడు ఎంత." అన్నాడు కర్ణుడు.

ఇదంతా మౌనంగా వింటున్న భీష్ముడు "సుయోధనా! ద్రోణుడు అశ్వత్థామ, కృపాచార్యుడు సమయోచితంగా మాట్లాడారు. కర్ణుడు కూడా వీరోచితంగా మాట్లాడాడు. కాని ఒకరిని ఒకరు నిందించుకోవడం మంచిదికాదు. అంత శక్తి

యున్నవాడు యుద్ధం చేయాలి కాని ఇలా ఇతరులను నిందించడం ఎందుకు? శత్రువులు ముట్టడించక ముందే, దూరంగా ఉన్నప్పుడే తగిన ఉపాయం ఆలోచించడం మంచిది కదా!

శత్రువు పరాక్రమ వంతుడైనపుడు పొగడటం సజ్జనులకు ఉచితం. పెద్దలను గౌరవించాలికాని ఎంత మాట అంటే అంత మాట అన కూడదు కదా! ప్రస్తుత కర్తవ్యం ఆలోచించండి.

అర్జునుడుమన మీదికి వస్తున్నాడు. ఆచార్యా! మనం అందరం కలిసి పోరాడుదాము. విభేధాలకు ఇది సమయం కాదు. నన్ను క్షమించండి. ఎవరో ఏదో తెలియక అంటే మీరు కోపగించుకుంటారా! పదండి ఆచార్యా! " అన్నాడు భీష్ముడు.

అయ్యో! మీరు క్షమించమనడం ఎందుకు మిమ్మల్ని క్షమించేటంతటి వారం కాదు మేము. ద్రోణులవారు శాంతిస్తే చాలు. మాకు అంత మర్యాద అవసరం లేదు." అన్నాడు

కృపాచార్యుడు. భీష్ముడు కర్ణునితో కూడా పోయి ద్రోణాచార్యుని, అశ్వత్థామను క్షమించమని కోరాడు. ద్రోణుడు శాంతించాడు.

"భీష్ములవారి మాటలతోనే నా కోపం పోయింది. పదండి. ముందుకు నడవండి. ముందు మనం రాజును కాపాడుకుందాము. అర్జునుడు చాలా కసితో వస్తున్నాడు. మనం అందరం అర్జునుని ఒక్కసారిగా ఎదుర్కొందాము. అదియును కాక అజ్ఞాత వాసము గురించి సుయోధనుడు ఒక మాట చెప్పాడు. దానికి భీష్ములవారు వివరణ ఇస్తారు." అని అన్నాడు ద్రోణుడు. భీష్ముని వైపుచూచాడు.

ద్రోణుని ఆంతర్యం గ్రహించాడు భీష్ముడు. సమయ నిర్ణయం చేయాల్సిన సమయం ఆసన్న మయినది అని అనుకున్నాడు.

"సుయోధనా! మన ప్రస్తుత కాలమాన ప్రకారము ప్రతి రెండు సంవత్సరములకు ఒక అధిక మాసము వస్తుంది. ఈ పదమూడేళ్లలో వచ్చిన ఆ అధిక మాసములు అన్ని పరిగణన లోకి

తీసుకొంటే నిన్నటి తోటి పాండవుల అజ్ఞాతవాసం పూర్తి అయినది. ఈ విషయం తెలిసే అర్జునుడు ఈరోజు మనకు నిజరూపంలో కనపడ్డాడు. అతడు ధర్మం తప్పడు. ధర్మం తప్పే వాడే అయితే జూదంలో ఓడిపోయిన రోజునే మూర్ఖత్వంతో యుద్ధం చేసి ఉండే వాళ్లు. ధర్మం కోసం కట్టుపడ్డారు. వేచి ఉన్నారు.

కాబట్టి ఇప్పుడు మన మీదికి యుద్ధానికి వచ్చిన వాడు ఫల్గునుడు. అతనిని మనము నిశ్చయంగా గెలుస్తాము అని చెప్పడానికి వీలు లేదు. యుద్ధంలో ఇరుపక్షాలకు జయం లభించదు కదా. మనం గెలవ వచ్చు. ఓడిపోవచ్చు. కాబట్టి ఫలితం గురించి ఆలోచించకుండా సంధి చేసుకోవడం ఉత్తమం." అని అన్నాడు భీష్ముడు.

సుయోధనుడు భీష్ముని చూచి "మనకు పాండవులకు పొందు ఎట్లు కలుగును. నేను రాజ్యములో భాగము ఈయను. వాళ్లతో యుద్ధం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. ఇది నిశ్చయము." అని తెగేసి చెప్పాడు సుయోధనుడు.

ఇది చూచి ద్రోణుడు యుద్ధ సమయములలో, కార్యమును నిర్ణయించుటలో రాజుకే ప్రాధాన్యము ఎక్కువ. దానిని కాదనలేము కదా.అయినను నాకుతోచిన మాటలు చెప్పెదను.

మన బలములో నాలుగవ భాగము తీసుకొని సుయోధనుడు ముందు నడుస్తాడు. మరొక నాలుగవ భాగము సైన్యము గోవులను రక్షిస్తూ ముందుకు కదులుతుంది. మిగిలిన సగం సైన్యంతో మనం వెనకగా కదులుతాము.

నేను మధ్యలో ఉంటాను. నాకు కుడి పక్క కృపాచార్యుడు, ఎడమవైపు అశ్వత్థామ, ముందు భాగములో కర్ణుడు ఉంటారు. వికర్ణుడూ, దుశ్శాసనుడూ, శకునీ, సైంధవుడూ, సోమదత్తుడూ, బాహ్లికుడూ, భూరిశ్రవుడూ, మొదలగు మహా వీరులు అక్కడక్కడా మోహరిస్తారు. అర్జునుడు ఎవరితో యుద్ధం చేస్తే అతనికి మనం అందరం సాయంగా వెళదాము.” అని అన్నాడు.

దీనికి భీష్ముడు తన ఆమోదాన్ని తెలిపాడు. తాను వెనక ఉండి సైన్యాన్ని నడిపించాడు.

ఆ పోరు చూడటానికి దేవతలందరూ విమానాలు ఎక్కి వచ్చి ఆకాశంలో నిలబడ్డారు. అర్జునుడు తన దేవదత్తం పూరిస్తూ అమిత వేగంతో కురుసైన్యాన్ని చేరుకున్నాడు. అతని పరాక్రమానికి కురు సైన్యము కొంచెం బెదిరింది.

అర్జునుడు ఉత్తర కుమారుని చూచి "కుమారా! చూచితివా! ముందు ఒక సైన్యం నడుస్తూ ఉంది. వెనక మరొక సైన్యం నడుస్తూ ఉంది. ఇందులో సుయోధనుడు ఎక్కడ ఉన్నాడో తెలియాలి. రథాన్ని సేనకు ఎడమ వైపుగా పోనివ్వు. రాజును పట్టుకుంటే కురు సైన్యం విచ్చిపోతుంది. మన పని సులభం అవుతుంది. గోవులను మరల్చుకొని పోదాము. లేదా గోవులు ఎక్కడ ఉన్నాయో అక్కడకు పోదాము. మనం గోవులను పట్టుకుంటే, వాటిని కాపాడటానికి సుయోధనుడు అక్కడకు వస్తాడు కదా! " అని అన్నాడు అర్జునుడు.

ఆ ప్రకారంగా ఉత్తరకుమారుడు సైన్యానికి ఎడమ పక్కగా తన రథాన్ని పోనిచ్చాడు. సైన్యాన్ని కలయ చూచాడు అర్జునుడు.

"కుమారా! వీరిలో సుయోధనుడు లేడు. వీరితో మనకు పోరు అనవసరం. రథాన్ని గోవులు ఉన్న దెసకు పోనివ్వు." అంటూ గురుడుకి, కృపాచార్యుడికి, భీష్ముడికి తగిలీ తగలనట్లుగా నమస్కార బాణాలు సంధించి వదిలాడు.

అర్జునుని గురుభక్తికి, పెద్దల ఎడ అతనికి ఉన్న గౌరవానికి భీష్ముడు,ద్రోణుడు కృపుడు ఎంతో సంతోషపడ్డాడు.

"ఆచార్యా! అర్జునుడు మనలను చూచి కూడా, మనతో యుద్ధం సేయక ముందుకుపోతున్నాడు అంటే అతడు సుయోధనుని కోసం వెతుకుతున్నాడు. సుయోధనుడు ఒక్కడు అర్జునుని ఎదిరించలేడు. మనకూ సుయోధనునికి మధ్య అర్జునుడు ప్రవేశిస్తే చాలా ప్రమాదం. కాబట్టి మనం సుయోధనుని

రక్షించాలి." అంటూ సుయోధనుని వెళ్లిన వైపుగా సైన్యాన్ని నడిపించాడు భీష్ముడు.

ఇంతలో అర్జునుని రథం ఆవుల మందలను చేరుకుంది.

"నేను ఆవులకు రక్షణగా ఉన్న సైన్యాన్ని ఎదిరిస్తాను. వాటి రక్షణ కోసం సుయోధనుడు వస్తాడు. మనచేతికి చిక్కుతాడు." అంటూ అర్జునుడు రథాన్ని తూర్పు దిక్కు పోనివ్వమన్నాడు. అర్జునుడు గోవులకు రక్షణగా పోతున్న కొద్దిపాటి సైన్యాన్ని ఎదిరించాడు. అర్జునుని శరపరంపర ధాటికి ఆ కొద్దిపాటి సైన్యము నిలువలేక పోయింది. అర్జునుడు గోవులను వెనక్కు మరల్చాడు. గోవులు, గోపాలురు వెంట రాగా వెనక్కు తిరిగి పరుగెత్తుతున్నాయి.

అర్జునుడు తన రథాన్ని గోవులకూ, సైన్యానికి మధ్య పోనిచ్చి సైన్యం గోవులను చేరకుండా ఎదిరించాడు. గోపాలురకు "మీరు భయం లేకుండా గోవులను తోలుకుని పొండి. " అని చెప్పాడు.

గోపాలురు గోవులు మరల్చు కొని పోతున్నారు. గోగణములు మత్స్య దేశ పొలి మేరలలో ప్రవేశించాయి.

ఇంతలో కురు సైన్యము అర్జునుని చుట్టు ముట్టింది.

మహాభారతము

విరాటపర్వము చతుర్ధాశ్వాసము

సంపూర్ణము.

ఓం తత్సత్.

# మహాభారతము

## విరాట పర్వము

### పంచమాశ్వాసము

మహా భారత కధను వైశంపాయనుడు జనమేజయునకు ఈ విధంగా చెప్పసాగాడు. ఆ ప్రకారంగా గోవులను విరాట నగరం వైపు మళ్లించిన అర్జునుడు, గోసమూహాలకు కురు సైన్యానికి మధ్యలో నిలబడ్డాడు. అల్లంత దూరంలో అర్జునునికి సుయోధనుడు కనిపించాడు.

"భూమింజయా! అడుగో సుయోధనుడు. ఆ వైపుగా రధం పోనివ్వు" అన్నాడు.

ఇంతలో కౌరవ సేనలోని ప్రముఖులైన భీష్ముడు, కర్ణుడు చెరి ఒక వెయ్యి రధములతో సుయోధనుడి వైపుకు వెళ్లారు. సుయోధనుడికి అర్జునుడికి మధ్య సైన్యం ముందు నిలిచారు. చేత చిక్కిన గోగణమును

అర్జునుడు తోలుకుపోవడంచూచి సుయోధనుడు నిట్టూర్చాడు. ఇంతలో మిగిలిన సేనలు రారాజుకు అండగా వచ్చి నిలిచాయి.

కురు సేననంతా తేరిపార చూచాడు అర్జునుడు.

"ఉత్తరకుమారా! అదిగో కురుసేన. అందులో ప్రముఖులను చూపిస్తాను చూడు. అదుగో! కాంచన మయ వేదిక తన గుర్తుగా కలిగిన కేతనము (ఫ్లాగ్) కలవాడు ద్రోణాచార్యుడు. ఎగురుతున్న సింహము తోక కల కేతనము కలవాడు అశ్వత్థామ. బంగారు గోవును కేతనముగా కలవాడు కృపాచార్యుడు. తెల్లని కేతనము కలవాడు కర్ణుడు. పాము పడగను తన కేతనముగా కలవాడు సుయోధనుడు. తాటి చెట్టును తన కేతనము మీద అలంకరించిన వాడు భీష్ముడు. ఈ కేతనములను బట్టి వారిని గుర్తుపెట్టుకో! " అన్నాడు అర్జునుడు.

"ఉత్తరకుమారా! ఇప్పుడు మన రథాన్ని గురువుగారు ద్రోణుడికి కుడి వైపుగా ప్రదక్షిణ పూర్వ కంగా పోనిమ్ము. ధనుర్విద్యలో ఆయన శక్తి అసమాన్యము. ఆయనను మనము అవమానించరాదు. ముందుగా మనము ఆయనతో యుద్ధానికి దిగరాదు. ముందుగా నేను సుయోధనునితో యుద్ధం చేస్తాను. సుయోధనుని రక్షించడానికి

గురువుగారు వస్తారు.  ఆయన నాతో యుద్ధం చేస్తే అప్పుడు నేను గురువుగారితోయుద్ధం చేస్తాను. ఆయన పక్కనే ఉన్నవాడు గురు పుత్రుడు అశ్వత్థామ. ఆయన శివుడి వరం వలన పుట్టాడు. అతి భీకరంగా యుద్ధం చేస్తాడు.  ఆ పక్కనే ఉన్నవాడు కృపాచార్యులు. మాకు చిన్నప్పటి నుండి విద్యనేర్పిన గురువు. ద్రోణుడితో సమానమైన పరాక్రమము కలవాడు. వీరలిరువురు  మనకుపూజ్యులు.  వీరితో మనం ముందుగా యుద్ధం చెయ్యకూడదు. వారు ఎదురుగా వచ్చినా రధం పక్కగా పోనిమ్ము ఎదురు పడవద్దు.

అదుగో అటు చూడు. సుయోధనునికి ప్రేమ పాత్రుడు కర్ణుడు. ఇతడు పరశురాముని వద్ద విలువిద్య నేర్చుకున్నాడు.  యుద్ధంలో ఎవరిని లెక్క చెయ్యడు. అత్యంత పరాక్రమ శాలి. ఇతడు నాకు సరిజోడు. కర్ణునితో యుద్ధ చేసే అవకాశం  ఈనాటికి లభించింది. మా యుద్ధం జాగ్రత్తగా పరికించు. కర్ణుడు నన్నుచూస్తే ఊరుకోడు నామీదికి యుద్ధానికి వస్తాడు. అతనిమీదికి చిచ్చర పిడుగులా దూకుతాను.  నువ్వు సందేహించకుండా కర్ణుని మీదికి రధం నడుపు.

ఇంక సుయోధనుడు. మా పెదనాన్న ధృతరాష్ట్రుని కుమారుడు. అభిమానధనుడు. కాని మంచి ఉన్నత మైన మనసున్నవాడు. అత్యంత

పరాక్రమవంతుడు. కాని కోపం ఎక్కువ. మామీద ద్వేషం పెంచుకున్నాడు. అత్యంత దుష్టుడు. సుయోధనుడు ఎదురు పడితే నాకు పండగే. అతని కోసం వెతుకు. ఎలాగైనా సరే మనం మెఱుపు మెఱిసి నట్టు అతనిని సమీపించాలి. అదుగో ఆయన మా తాతగారు భీష్ముడు. అత్యంత పరాక్రమ వంతుడు. ఎంతో బుద్ధి మంతుడు. ఎన్నో ఆయుధరహస్యాలు తెలిసినవాడు. యుద్ధంలో పరుశురాముని ఓడించిన మహావీరుడు. పొరపాటున కూడా అయన దరిదాపులకు కూడా వెళ్లకు. తాతగారికి కోపం వస్తే నన్ను సుయోధనుని దగ్గరకు కూడా పోనివ్వడు. జాగ్రత్త!" అంటూ కురు సేనలో వీరులను పరిచయం చేసాడు అర్జునుడు.

ఆ సమయంలో అశ్వత్థామ కర్ణుడుని చూచి ఇలా అన్నాడు: "కర్ణా! ఇందాక నిన్ను నువ్వు పొగుడు కున్నావు కదా! అదుగో అర్జునుడు యుద్ధానికి వచ్చాడు. పద. అతనిని ఎదుర్కొని పోరాడు. ఒక వేళ నీకు చేతకాక పోతే శకుని ఉన్నాడు కదా! అతనితో ఆలోచించు. రారాజు ఈ యుద్ధ కార్య నిర్వహణ నీమీద పెట్టాడు కదా! తప్పుతుందా వెళు!" అని అన్నాడు నవ్వుతూ.

"నీ మాదిరి నేను భీరువును కాను యుద్ధం నుండి తప్పుకోడానికి. నేనే

శూరుడను. అర్జునుడు కాదు వాడి తండ్రి ఇంద్రుడు వచ్చినా నేను భయపడను. నా పరాక్రమాన్ని కళ్లారా చూడు!" అన్నాడు కర్ణుడు కోపంతో.

కర్ణుడు ఆ మాటలు అంటూ ఉండగానే భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ సుయోధనునికి రక్షణగా నిలిచారు. వారి వెంట సుయోధనుడు, దుశ్శాసనుడు, బాహ్లిక సోమదత్తులు, వివిధ బలాల సేనాధిపతులు, కురు సైన్యము ముందుకు ఉరికింది.

అర్జునుడు గాండీవాన్ని సంధించాడు. గాండీవంనుండి బాణాలు పుంఖాను పుంఖాలుగా వచ్చి కురు సేనను చించిచెండాడుతున్నాయి. తనను చుట్టుముడుతున్న సైన్యాన్ని నుగ్గునుగ్గు చేస్తూ ముందుకు కదులుతున్నాడు అర్జునుడు. అప్పుడు కురు సైన్యము వజ్రవ్యూహముగా ఏర్పడి అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుడికి శరీరం పొంగింది. ఉత్తర కుమారుడు అర్జునుని యుద్ధ నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ పొగడ్తలతో ముంచెత్తు తున్నాడు. ఆ మాటలు వింటూ అర్జునుడు చెలరేగి పోయాడు. గాండీవం ఎప్పుడూ చక్రము వలె గుండ్రంగానే వెలుగుతూ ఉంది. అంటే అంత వేగంగా బాణాలు వేస్తున్నాడు అర్జునుడు. తనకు ఇరుపక్కల ఉన్న అమ్ముల పొదులలోనుండి రెండు చేతులతో బాణాలు

తీసి సంధిస్తున్నాడు. ఆ ప్రకారంగా బాణాలు సంధిస్తూ శత్రు సేనలను నుగ్గునుగ్గు చేస్తూ అర్జునుడు కౌరవ సేనలను చీల్చుకుంటూ ముందుకు చొచ్చుకుపోతున్నాడు. కురు సేన పన్నిన వజ్ర వ్యూహాన్ని ఛేధించాడు.

అర్జునుని బాణముల ధాటికి గుర్రములు రధములను విడిచి పరుగెత్తుతున్నాయి. రధికులు కింద పడి పోతున్నారు. అలాంటి వారిని ఏమీ చేయకుండా ముందుకు సాగుతున్నాడు అర్జునుడు. ఒకసారి అర్జునుడి ఎదుట పడ్డవాడు మరల కనిపించడం లేదు. కాని తన సారధి ఐన భూమింజయుడికి, రధమునకు, హయములకు ఎలాంటి ముప్పు రాకుండా కాపాడుకుంటున్నాడు.

అర్జునుడి వీర విహారానికి శత్రు సైనికులు నిస్తేజులవుతున్నారు. అతనితో యుద్ధానికి ఎవరూ సాహసించడం లేదు. అప్రతిహతంగా కురు సైన్యములో కలయ తిరుగుతున్నాడు అర్జునుడు. తరువాత ముఖ్యులైన ద్రోణాదుల మీదికి శరసంధానం చేసాడు. కర్ణుడి రధసారధిని కొట్టాడు. అతని రధాన్ని విరగ గొట్టాడు. అతని విల్లు విరిచాడు. దేవదత్తాన్ని పూరించాడు. కర్ణుడి అవస్థచూచి, కురు సేనలన్ని భీష్ముని వెనక చేరాయి. భీష్ముడు వారిని ఉత్సాహ పరుస్తూ యుద్ధానికి సన్నద్ధం చేసాడు.

ద్రోణుడు, కృపుడు, వికర్ణుడు మొదలైన వారు సుయోధనుని ముందు రక్షణ కవచంగా నిలబడ్డారు.

అప్పుడు అర్జునుడు ఉత్తర కుమారునితో "కుమారా! కొంచెం సేపు రథం ఆపు. మన ఎదురుగా మోహరించిన సైన్యాన్ని చూడు. అడుగో కర్ణుడు. ముందు వాడి మీదికి రథాన్ని పోనివ్వు. వాడి పొగరు అణిస్తే గాని వాడే దిక్కు అని నమ్మకున్న సుయోధనుడికి బాధ పుట్టదు." అన్నాడు అర్జునుడు. ఉత్తర కుమారుడు శరవేగంతో రథాన్ని కర్ణుని మీదికి పోనిచ్చాడు. కర్ణుడి వైపు శర వేగంతో దూసుకుపోతున్న అర్జునునిచూచి చిత్రాంగదుడు, చిత్రరథుడు, సంగ్రామచిత్తు, దుష్ప్రహుడు, చిత్రసేనుడు, వివింశతి, దుర్ముఖుడు, దుర్జయుడు, వికర్ణుడు, శత్రుంతపుడు, దుశ్శాసనుడు మొదలైన కురుకుమారులు, ఒక్కసారిగా అర్జునునిమీదికి ఉరికారు.

ముందుగా వికర్ణుని విల్లు విరిచాడు. దాంతో వికర్ణుడు పారిపోయాడు. తరువాత శత్రుంతపుని చంపాడు. దానితో మిగిలిన వారు పారిపోయారు. కర్ణుని తమ్ముడు సంగ్రామజిత్తుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు ఒక బల్లెము తీసుకొని వాడిని పొడిచి

చంపాడు. ఇది చూచిన కర్ణుడు కోపంతో అర్జునుని మీదికి బాణాలు సంధించాడు.

ఈ విధంగా యుద్ధంలో మొదటిసారిగా అర్జునుడు, కర్ణుడు తలపడ్డారు. కౌరవ సేనలో అందరూ యుద్ధం చెయ్యడం ఆపి వీరి ఇద్దరి యుద్ధం చూస్తూ నిల్చున్నారు.

అర్జునుడు కర్ణుని సమీపించి "కర్ణా! నిండు సభలో నాకు ఎదురు లేదు అని పలికావు కదా! ఇదుగో, యుద్ధం వచ్చింది. నీ పరాక్రమము ఇప్పుడు చూపు. ఎవరు గొప్పో తేల్చుకుందాము. సభలలో పలికినట్టు ప్రగల్భాలు పలకడం ఇక్కడ కుదరదు. నీ తమ్ముడి చావు కనులారా చూచావు కదా. ఇంత దాకా వచ్చిన తరువాత పారిపోవడానికి ప్రయత్నించకు. నాడు ద్రౌపదికి జరిగిన అవమానమును నిండు సభలో చూచి నవ్విన దానికి ఫలితం అనుభవించాలి కదా! ఆరోజు ధర్మజుని మాటకు కట్టుబడి కోపాన్ని బలవంతంగా అణచుకున్నాను. కాబట్టి ఆరోజు తప్పించుకున్నావు. కాని ఇప్పుడు చిక్కావు. ఎక్కడకు పోతావో చూస్తాను!" అన్నాడు అర్జునుడు.

"ఏమిటి అర్జునా! ఆరోజు అన్నగారి మీద పెట్టి తప్పుకుంటావా! అంత పోటుగాడివా! రా! నీ శక్తి ఏపాటిదో చూస్తాను! ఏదో ఒక విధంగా అరణ్యఅజ్ఞాత వాసములు గడిపితే రాజ్యం వస్తుందిలే అని అడవుల్లో తిరిగిన వాడివి. నీకు ధైర్య సాహసములు ఎక్కడున్నాయి! ఇంతకు ముందు నువ్వు ఏవేవో చేసావని అనుకుంటున్నారు. కాని నిన్ను చూస్తుంటే అవి నిజాలు కావేమో అని సందేహంగా ఉంది." అంటూనే కర్ణుడు అర్జునుని మీదికి బాణాలు గుప్పిస్తున్నాడు. అర్జునుడు కూడా తగురీతిలో సమాధానం ఇస్తున్నాడు.

కర్ణుడి విల్లు అర్జునుడు విరగ్గొట్టాడు. కర్ణుడు శక్తి బాణాన్ని అర్జునుని మీదికి ప్రయోగించాడు. అర్జునుడు దానిని తుత్తునియలు చేసాడు. కర్ణుడు మరొక విల్లు తీసుకొని అర్జునుని రథసారథి ఉత్తరుని మీద ఆరు బాణాలు అర్జునుని మీద పది బాణాలు వేసాడు. అర్జునుడు కోపించి కర్ణుని మీదికి బల్లెములు వర్షంలాగా విసిరాడు. ఆ బల్లెముల ధాటికి తట్టుకోలేక కర్ణుడు పారిపోయాడు. అది చూచి ఉత్తరకుమారుడు సంతోషంతో కేకలు పెట్టాడు. అర్జునుడు విజయ చిహ్నంగా దేవదత్తము శంఖమును పూరించాడు.

" ఉత్తర కుమారా! కురు సేనలో ముఖ్యుడు కర్ణుడుపారిపోయాడు. ఇంక మనకు ఎదురు నిలిచేది ద్రోణాచార్యులు మాత్రమే" అంటూ కురు సేనను చూస్తున్నాడు అర్జునుడు.

ఉత్తరకుమారుడు అర్జునుని చూచి "అర్జునా! నిన్ను చూస్తుంటే ఆశ్చర్యము, భయంము, విహ్వలభావము కలుగుతున్నాయి. నీ ధైర్యము, నీ శౌర్యము చూస్తుంటే నా మనసు భయంతో వణికిపోతూ ఉన్నది. కాళ్లు చేతులు ఆడటం లేదు. నాకు ఈ రథం నడపడం శక్యం కాకుండా ఉంది. నేను పుట్టినది మొదలు ఈ మాదిరి యుద్ధం చూడలేదు. నా మనస్సు పరవశించి పోతూ ఉంది. నా శరీరం నేను చెప్పిన మాట వినడం లేదు" అని అన్నాడు వణుకుతూ ఉత్తరుడు.

అర్జునుడు ఉత్తరుని చూచి నవ్వి "ఉత్తర కుమారా! నేను ఉండగా నీకేమియు భయము లేదు. నిర్భయంగా రథము తోలుము. అటు చూడు! ఎర్రని గుర్రములు కట్టిన రథం మీద ఉన్నాడే ఆయనే ద్రోణుడు. మా గురువుగారు. ఆయనకు ఎన్నో అస్త్ర, శస్త్రములు ప్రయోగ ఉపసంహారములతో కూడా తెలియును. సుజనహితుడు. తన కుమారుడు అశ్వత్థామ కంటే నన్ను ఎక్కువగా ఆదరించి నాకు విలువిద్య నేర్పాడు. రాజధర్మము ప్రకారం ఈనాడు ఈవిధంగా ఆయనను

యుద్ధంలో ఎదుర్కోవలసి వచ్చింది. నువ్వు మన రథమును ఆయనకు ఎదురుగా పోనిమ్ము. " అన్నాడు అర్జునుడు.

ఉత్తరుడు ఆ ప్రకారం చేసాడు. అర్జునుడు గురువుగారిని చూచి "గురువుగారూ! నమస్కారము. అడవులలో 12 ఏళ్లు, అజ్ఞాతంగా ఒక ఏడు గడపి, ఎన్నో బాధలు పడ్డాము. ఇది మంచి సమయము అని మీ ముందుకు వచ్చాను. నామీద కోపగించకుండా దయచూపండి. మీమీద బాణం వేయడానికి జంకుతున్నాను. కనుక ముందు మీరే నా మీద శరప్రయోగం చెయ్యండి. " అని వేడుకున్నాడు అర్జునుడు.

అతని మాటలకు సంతసించి ద్రోణాచార్యులు అర్జునుని మీద 20 బాణాలు సంధించాడు. వాటిని మధ్యలోనే విరిచేసాడు అర్జునుడు. ఇప్పుడు అర్జునుడికి ద్రోణుడికి ద్వంద్వయుద్ధం ఆరంభం అయింది. ఇద్దరూ అతి రథులు. అస్త్రశస్త్రకోవిదులు. అద్భుతమైన బాహుబలము కలవారు. పరాక్రమోపేతులు. వీరి ఇరువురి యుద్ధం చూడటానికా అన్నట్టు కురు సేనలు యుద్ధం ఆపి వీరినే చూస్తున్నాయి.

ద్రోణుడు ప్రయోగించే అస్త్రముల నన్నింటిని సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నాడు అర్జునుడు. వాటిని నిర్వీర్యం చేస్తున్నాడు.

కురుసేనను తునుమాడుతున్నాడు. అర్జునుని పరాక్రమం చూచి ద్రోణుడు విస్తుపోయాడు. తన సైన్యం తరిగిపోతూ ఉంది. అర్జునుని గెలవడం అసాధ్యం అనిపించింది. ఇంతలో అర్జునుడు తన బాణాలతో ద్రోణుని శరీరాన్ని, సారధిని, కేతనాన్ని ఒక్కసారిగా కొట్టాడు. కురు సైన్యం హాహాకారాలు చేసాయి.

తన తండ్రి పరిస్థితి చూచి అశ్వత్థామ తండ్రికి సాయంగా యుద్ధంలో కి దిగాడు. అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు అశ్వత్థామ రధాన్ని గుర్రాలను తన బాణాలతో కొట్టాడు. అశ్వత్థామ తన బాణాలతో అర్జునుని గాండీవం విల్లు త్రాటిని తెంపేసాడు. అర్జునుడు అల్లెత్రాడు బిగించుకుంటూ ఉంటే మరొక ఎనిమిది బాణాలతో అర్జునుని కొట్టాడు. అర్జునుడు గాండీవం సరిచేసుకొని అశ్వత్థామ వేసిన బాణాలు మధ్యలోనే తుంచి, అస్త్రాలను అశ్వత్థామ మీద సంధించాడు. అర్జునునికి అక్షయ తూణీరం ఉంది. కాని అశ్వత్థామకు లేదు. అందుకని అశ్వత్థాము బాణాలు అయిపోయాయి.

ఇది గమనించి కృపాచార్యుడు అశ్వత్థామకు సాయంగా వచ్చాడు. అర్జునుడు కృపాచార్యుని ఎదుర్కొన్నాడు. కృపాచార్యుడు విజృంభించి అర్జునుని కపిధ్వజమును కొట్టి జయజయధ్వానములు చేసాడు.

అర్జునుడు కోపించి కృపాచార్యుని రథాన్ని విరుగ గొట్టాడు. రథములకు కట్టిన హయములను చంపాడు. విల్లు విరగ్గొట్టాడు. సారధిని చంపాడు. కృపాచార్యుడు విరథుడు అయ్యాడు. కాని భయపడక శక్తి అనే అస్త్రాన్ని విసిరాడు. అర్జునుడు శక్తిని ముక్కలు చేసాడు. చేసేది లేక కత్తిడాలు తీసుకొని అర్జునుని ఎదిరించాడు. అర్జునుడు కృపుని కత్తి విరగ్గొట్టాడు. వెంటనే కృపుడు పక్కనే ఉన్న అశ్వత్థామ రథం ఎక్కాడు.

కృపాచార్యునికి పట్టిన గతి చూచి కౌరవ సేనలన్ని భీష్ముని వెనక చేరాయి. ఇది చూచి వృషసేనుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు అతనిని చూచి ఒక బల్లెంతో వృషసేనుని విల్లు విరుగ గొట్టి, అతని గుండెలమీద పొడిచాడు. ఆ దెబ్బకు వృషసేనుడు పారిపోయాడు. పక్కనే ఉన్న దుశ్శాసనుడు, దుర్ముఖుడు, వివింశతి, వికర్ణుడు, శకుని అర్జునుని ఒక్కమాటుగా చుట్టుముట్టారు. అర్జునుడు తన వాడి బాణాలతో వారి రథాలను ముక్కముక్కలు చేసి వారి విల్లులను తుంచాడు. వారందరూ అర్జునుని ధాటికి తట్టుకోలేక పారిపోయారు.

అర్జునునికి ఎవరూ ఎదురు నిలువలేకపోయారు. అప్పుడు అర్జునుడు ఉత్తరకుమారునితో "కుమారా! అటు చూడు. తాళవృక్షం ధ్వజంతో, మెరుపు వలె మెరుస్తున్న మా తాత భీష్ముని చూడు. ఇంక

ఆయన ఒక్కడే మిగిలి ఉన్నాడు. ఆయన వంకకు మన రధం పోనిమ్ము". అన్నాడు అర్జునుడు. ఉత్తరుడు భీష్ముని వంకకు రధం పోనిచ్చాడు.

అర్జునుని చూచి భీష్ముడు తన శంఖం పూరించాడు. అర్జునుడు కూడా దేవదత్తం పూరించాడు. రెండు వృషభములు ఒకటిని ఒకటి ఢీకొట్టడానికి సిద్ధంగా ఉన్నట్టుంది వారిరువురిని చూస్తూ ఉంటే. ముందు భీష్ముడు తన బాణాలతో కపిధ్వజమును, దానిని అనుసరించి ఉన్న భూతములను, రధ సారధిని కొట్టాడు. ఆ బాణములనన్నింటిని మధ్యలోనే తుంచేసాడు అర్జునుడు. తన బాణాలతో భీష్ముని కప్పేసాడు. అర్జునుడు వేసిన బాణాలను తన బాణాలతో పటాపంచలు చేసాడు భీష్ముడు. అర్జునుడు వేసే ప్రతి అస్త్రాన్ని భీష్ముడు ముక్కముక్కలు చేస్తున్నాడు.

అది ఎలా ఉందంటే అర్జునుడు తాను నేర్చుకున్న అస్త్రాలను తాత గారి ముందు ప్రదర్శిస్తూ, "తాత గారూ! చూడండి! ఈ అస్త్రశస్త్రాలు నేను సంపాదించాను" అని చూపిస్తుంటే, "బాగున్నాయిరా! ఇంకా చూపించు." అని తాతగారు అన్నట్టు ఉంది. తాను వేసిన ప్రతి అస్త్రాన్ని తాతగారు ముక్కలు చేస్తుంటే అర్జునునికి కోపం వచ్చింది. తాతగారి విల్లు

విరగ్గొట్టాడు. ఇప్పుడు మనుమడి మీద తాతగారికి కోపం వచ్చింది. అర్జునిని మీదికి శరపరంపర కురిపించాడు. అర్జునుడు తాతగారు వేసిన బాణాలు అన్ని మధ్యలో తుంచి, ఆయన రధాన్ని సారధిని గుర్రాలను కొట్టాడు. భీష్ముడు మరొక విల్లు తీసుకునే లోపల తాతగారి గుండెల మీద కొట్టాడు. భీష్ముడు సోలి రధాన్ని పట్టుకొని పడిపోయాడు. భీష్ముని పరిస్థితి చూచి అతని సారధిని భీష్ముని రధాన్ని పక్కకు తీసుకొని వెళ్లాడు.

అర్జునుడు ఇంకా ఎవరు మిగిలి ఉన్నారా అని చూస్తున్నాడు. ఒక పక్క ద్రోణుడు, కర్ణుడు, కృపుడు మొదలగువారు నిలబడి ఉన్నారు. అర్జునుడు వారిని చూచాడు. "ఉత్తరా! వారి వైపుకు రధం పోనిమ్ము" అన్నాడు.

అర్జునుడు తమవైపు రావడం చూచి అశ్వత్థామ కర్ణుడితో "కర్ణా! అర్జునుడు మనవైపే వస్తున్నాడు. మనము ఏం చేస్తాం చెప్పు. అర్జునుని ఎదుర్కొనడానికి నువ్వే సమర్ధుడవు. అర్జునుని నువ్వే ఓడించాలి" అని పరిహాసమాడుతూ కర్ణుని ముందుకు తోసాడు.

"నేను ఇప్పుడే ఇక్కడే అర్జునుని ఎదుర్కొంటాను. చూస్తూ ఉండు" అని అన్నాడు.

అప్పటికే తనతో యుద్ధం చేస్తున్న వీరులను మట్టికరిపిస్తున్నాడు అర్జునుడు. కౌరవ వీరులు అలసిపోయారు. ఇంక అర్జునునితో యుద్ధం మనవల్ల కాదని పక్కకు జరిగి దూరంగా నిల్చున్నారు. ఇక్కడ ఉత్తర కుమారుని పరిస్థితి కూడా అలాగే ఉంది.

"అర్జునా! నువ్వేమో అలుపూ సొలుపూ లేకుండా యుద్ధం చేస్తున్నావు నాకు దాహంగా ఉంది. కనీసం నీళ్లు తాగడానికైనా విరామం లేకుండా యుద్ధం చేస్తే ఎలాగా! ఇంక నా వల్లకాదు. నేను సారధ్యం చేయలేను." అని అన్నాడు.

"ఉత్తర కుమారా! కాస్త ఓపిక పట్టు. ఇంక సుయోధనుడు ఒక్కడే మిగిలాడు. అతడు అభిమానధనుడు. అతడు మనతో యుద్దాని సిద్ధం అవుతున్నట్టు తోస్తున్నది. కావలిస్తే నేను నీకు రధం నడపడంలో సాయం చేస్తాను. భయపడకుము" అని చెప్పాడు అర్జునుడు.

"అడుగో సుయోధనుడు అతని వైపు రధము నడుపుము" అని అన్నాడు. ఉత్తరుడు సుయోధనుడు ఉన్న వైపుకు రధం పోనిచ్చాడు. అర్జునుడు సుయోధనుని మీదికి ఆకలితో ఉన్న పులి మాదిరి విరుచుకు పడ్డాడు. మొదటనే సుయోధనుని గుండెలకు గురిపెట్టి రెండు బాణాలు

వేసాడు. సుయోధనుడు కూడా అర్జునుడి నుదుటిని కొట్టాడు. వాటిని విరిచి మరల సుయోధనుని మీదికి శరపరంపర కురిపించాడు అర్జునుడు.

ఇంతలో సుయోధనునికి సాయంగా వికర్ణుడు ఏనుగు మీద వచ్చి అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు. అర్జునుడు ఏనుగు కుంభస్థలం మీద పిడికిటితో గుద్దాడు. ఆ దెబ్బకు ఏనుగు కూలబడింది. వికర్ణుడు పడిపోయిన ఏనుగును వదిలి పక్కనే ఉన్న వివింశతి రథం ఎక్కాడు. మరలా అర్జునుడు సుయోధనుని గుండెలకు గురిపెట్టి బాణాలు వేస్తున్నాడు. దుర్యోధనుడు గాయపడ్డాడు. సుయోధనునికి సాయంగా ఉన్న వారిని కూడా అర్జునుడు గాయపరిచాడు. చేసేది లేక సుయోధనుడు కూడా వెనకకు మరలాడు.

అర్జునుడు సుయోధనుని తరుముకున్నాడు. అప్పుడు కర్ణుడు భీష్ముని చూచి "అర్జునుడు మనలను వెనకనుండి తరుముతున్నాడు. సుయోధనుడు పారిపోతున్నాడు. మనము సుయోధనుని కాపాడుకోవాలి. " అని అన్నాడు.

కర్ణుడి మాటలను భీష్మ ద్రోణ కృపాచార్యులు లెక్క చెయ్యలేదు. అప్పుడు సుయోధనుడు దీనంగా వారిని చూచి "అదేమటి! అలా వెళ్లిపోతున్నారు. ఇది మీకు ధర్మమా! మీకు రాజైన నాకు పరాజయం కలిగినపుడు నన్ను ఆదుకోవడం మీ ధర్మం కాదా! " అని దీనంగా అన్నాడు. అప్పుడు అందరూ ఆగారు భీష్ముడు సుయోధనుడిని ఓదారుస్తున్నాడు.

అర్జునుడు సుయోధనుని సమీపించి "సుయోధనా! కౌరవరాజా! అదేమిటయ్యా అలా పారి పోతున్నావు. ఇది క్షత్రియ ధర్మమా! నేను ఒక్కడినేనయ్యా! కుంతీ పుత్రులలో చిన్నవాడిని. అశక్తుడను. ఒంటరి వాడిని. కాని నువ్వు గాంధారీ పుత్రులలో అగ్రజుడవు. పైగా అపార సేనావాహినితో, నీ మిత్రులతో ఉన్నావు. ఇలా పారిపోతే నిన్ను నీ సాటి రాజులు, జనం మెచ్చుకుంటారా చెప్పు! ఓ కౌరవేశ్వరా! ఇలా యుద్ధంలో పారిపోయిన వాడివి రేపు హస్తినాపుర వీధులలో ఏనుగునెక్కి ఊరేగ గలవా! మణిమయ రత్నభూషణములు ధరించి నిండు పేరోలగమున సింహాసనము అధిష్టించగలవా! కర్పూర, చందన కస్తూరి మొదలగు సుగంధ ద్రవ్యములను సేవిస్తూ భోగభాగ్యములను అనుభవించగలవా! అదియును గాక అత్యంత సౌందర్యవతులైన అంగనలతో నీ ఇష్టానుసారము వేడుకగా

భోగింపగలవా! సుయోధనా! నా మాట విను. యుద్ధంలో చనిపోతే స్వర్గ సుఖాలు అనుభవించవచ్చు. యుద్ధంలో గెలిస్తే ఇహలోక సుఖాలు అనుభవించ వచ్చు కాని పారి పోవడం మంచిదికాదు. అయినా సుయోధనా! ఇక్కడ కూడా జూదము ఆడి గెలుద్దాము అని అనుకుంటావేమో! ఇది రణరంగము. ఇక్కడ జూదం ఆడటానికి వీలులేదు! అయినా నీలాంటి రారాజు పారి పోవడమా! ఛీ ఛీ. పారి పోకు" అని అధిక్షేపించాడు అర్జునుడు.

ఈ మాటలు విన్న సుయోధనునికి రోషం వచ్చింది. తన సైన్యాన్ని సన్నద్ధం చేసాడు. భీష్మ,ద్రోణ,కృప,అశ్వత్థామ, కర్ణులతో కలిసి ఒక్కుమ్మడిగా అర్జునుని మీద దాడి చేసాడు. అర్జునుని కురు వీరులందరూ చుట్టుముట్టారు. వారందరూ సుయోధనుని రక్షిస్తూ అర్జునుని మీదికి శరప్రయోగం చేస్తున్నారు. అర్జునుడు తన సారధిని, రధాన్ని, గుర్రాలను కాపాడుకుంటూ యుద్ధం చేస్తున్నాడు.

అర్జునుడు ఆలోచించాడు. ఇప్పుడు సుయోధనుని చంపడం ధర్మంకాదు. ఎందుకంటే సుయోధనుని చంపడం భీముని ప్రతిజ్ఞ. అప్పటికే అందరితో యుద్ధం చేసాడు. ఇంక అక్కడి నుండి వీరోచితంగా తప్పుకోవడం ఉత్తమం. పైగా ఉత్తర కుమారికి బొమ్మ పొత్తికలు తీసుకుని

వెళ్లాలి. కురు వీరుల తలపాగాలు తీసుకొని వెళ్లడం వల్ల వారిని అందరిని జయించి నట్టు అవుతుంది. అందుకని కురు వీరులను, కురు సేనలను భంగపాటు చేయ దలంచి, తనకు కుబేరుడు బహూకరించిన సమ్మోహనాస్త్రాన్ని కురు సేనల మీద ప్రయోగించాడు.

అది కురు వీరులలోని తేజస్సును హరించి నిస్తేజులుగా చేస్తుంది. అందరూ స్పృహ కోల్పోతారు. ఆ అస్త్రానికి ఇంద్రుడు అధిదేవత. ఒక సారి ప్రయోగిస్తే తిరుగులేని అస్త్రం. అర్జునుడు ప్రయోగించిన సమ్మోహనాస్త్రము మహిమకు కురువీరులందరూ తమ తమ ఆయుధములు విడచి, నిద్ర వచ్చినట్టు స్పృహ కోల్పోయారు.

అర్జునుడు ఉత్తర కుమారుని చూచి "కుమారా! కురు సైన్యము అంతా నిద్రావస్థలో ఉన్నది. నీవు పోయి దుర్యోధనుడు, అశ్వత్థామ, కర్ణుడు, ద్రోణుడు కృపాచార్యుడు ధరించిన తలపాగాలు మాత్రం తీసుకొని రమ్ము. మా తాత భీష్ముల వారి వద్దకు వెళ్లకు. ఆయన ఈ అస్త్రానికి బద్ధుడు కాడు. మేలుకొని ఉంటాడు. జాగ్రత్త! ఆయన వద్దకు వెళ్లకు" అని అన్నాడు.

ఉత్తర కుమారుడు సంతోషంగా రథం దిగి అర్జునుడు చెప్పినట్టు కురు వీరుల తలపాగాలు తీసుకొని వచ్చాడు. మరల రథం ఎక్కాడు.

"కుమారా! మన రథాన్ని యుద్ధ రంగము నుండి బయటకు పోనిమ్ము. " అని అన్నాడు. ఉత్తరకుమారుడు రథం తోలుకుంటూ వెళ్లిపోయాడు. అర్జునుడు కొంచెం దూరం వెళ్లి ఆగాడు.

ఇక్కడ కురువీరులందరకూ తెలివి వచ్చింది. సుయోధనుడు అర్జునుని అల్లంత దూరంలో చూచాడు. మరల అర్జునునితో యుద్ధానికి తయారయ్యాడు.

అప్పుడు భీష్ముడు సుయోధనునితో "సుయోధనా! ఏమి జరిగిందో నీకు తెలియదు. నేను తప్ప మీరు అందరూ తెలివి తప్పిపడి ఉన్నారు. అర్జునుడు కేవలం మీ తలపాగాలు మాత్రం తీసుకొని వెళ్లాడు. అతడు క్రూరత్వంతో మన తలలు కూడా తీసుకొని వెళ్లి ఉంటే ఏమయ్యేది. నువ్వు కూడా మెడ వాల్చి స్పృహ లేకుండా, ఒళ్లు తెలియని పరిస్థితిలో ఉంటే నిన్ను కూడా చంపకుండా వదిలాడంటే అర్జునుడు ఎంత కరుణామయుడో తెలుసుకో. ఆ పరిస్థితులలో మనం ఉన్నప్పుడు మన

ప్రాణాలు తీయకుండా వదిలాడు కాబట్టి ఇంక మనం యుద్ధం విరమించడం మంచిది. ఇంత జరిగినా మనం ఇంకా మన బాహు బలాన్ని నమ్ముకొని యుద్ధానికి దిగితే ఈ రోజే పూర్ణాహుతి జరగడం తథ్యం.

(పూర్ణాహుతి అంటే యజ్ఞం ముగిసేటప్పుడు పూర్ణాహుతి చేస్తారు. అప్పుడు నెయ్యి, కొబ్బరికాయలు, పూలు, తాంబూలాలు, నవరత్నాలు సమస్తం అగ్నిలో వేసి ఆహుతి చేస్తారు. ఆ మాదిరి ఈ రణ యజ్ఞంలో కూడా కురు వీరులనందరిని చంపి అర్జునుడు పూర్ణాహుతి చేస్తాడు అని భావన.)

సుయోధనా! ఇంత జరిగినా ఇంకా పట్టుదల ఎందుకయ్యా! పద మన రాజధానికి వెళదాం. మనం పట్టుకున్న గోవులను అర్జునుడు ఎప్పుడే విడిపించుకుపోయాడు. అవి మత్స్యనగరానికి చేరాయి. ఇంక దేనికోసం ఈ యుద్ధం. ఈ సైన్య నష్టం." అని అన్నాడు భీష్ముడు.

ఆ మాటలు విన్న సుయోధనుడు నిట్టూర్చాడు. మనసులో ఇంకా యుద్ధం చేయాలని ఉద్రేకంతో ఊగి పోతున్నా, చేసేది లేక తాత గారి మాటలకు తల వంచాడు. తక్కిన కురువీరులు కూడా ఎలాగైనా

సుయోధనుని అర్జునుని బారి నుండి రక్షించు కోడానికి యుద్ధవిరమణ మంచిది అని అనుకున్నారు. భీష్ముడి ఆదేశానుసారం కురు సైన్యం వెనుకకు మరలింది.

ఇదంతా దూరం నుండి చూస్తున్న అర్జునుడు దేవదత్తం పూరించాడు. భీష్మ ద్రోణ కృపాచార్యులకు నమస్కార బాణాలు వేసి వీడ్కోలు చెప్పాడు. ఒక్కబాణంతో సుయోధనుడి కిరీటానికి అమర్చి ఉన్న మణులను ఊడగొట్టాడు. ఇంక నేను పోయి వస్తాను అని పెద్దగా అరిచి చెప్పాడు.

కౌరవ సేన మరలిపోగానే, ఉత్తర కుమారుని చూచి "కుమారా! మనం అనుకున్నట్టు గోవులను మరల్చాము. శత్రుసేనలను జయించాము. కురువీరుల తలపాగాలుగా కట్టుకున్న చీరలు తెచ్చాము. ఇంక మనం కూడా రాజధానికి పోదాం." అని అన్నాడు.

అలాగే అంటూ ఉత్తరుడు రథాన్ని రాజధాని వైపు మరల్చాడు. "కుమారా! కురువీరులందరిని నీవే జయించి గోవులను మరలించానని చెప్పు. " అని అన్నాడు అర్జునుడు.

ఉత్తరుడు నవ్వి "అర్జునా! కురు వీరులను జయించడం నా వల్లకాదని అందరికీ తెలుసు. జనానికి నిజం తెలుసు. నీ గురించి చెప్పకుండా నిజం ఎలా దాచగలను. కాని నీమాట కాదనలేను. నీకు ఇష్టం వచ్చినపుడే నీ గురించి బయట పెడతాను." అని అన్నాడు భూమింజయుడు.

రథం శమీవృక్షం చేరుకుంది. గాండీవము మొదలైన ఆయుధములు యథాప్రకారము శమీవృక్షము మీద భద్రపరిచారు. అర్జునుడు ఇదివరకటి మాదిరి బృహన్నల వేషం వేసుకున్నాడు. రథసారథిగా కూర్చున్నాడు. భూమింజయుడు వీరుడిగా రథం ఎక్కాడు.

"కుమారా! నీ విజయం గురించి పట్టణంలో చెప్పడానికి గోపాలురను ముందుగా వెళ్లమని." చెప్పు అన్నాడు.

ఆ ప్రకారం ఉత్తరుడు గోపాలురను తమ విజయం గురించి విరాట నగరంలో తెలియచెయ్యడానికి వార్తాహరులను ముందు పంపాడు. అప్పటికే దక్షిణ గోగ్రహణంలో విజయం సాధించిన విరాట రాజు నగరం చేరుకున్నాడు. ఉత్తర కుమారుని గురించి అడిగాడు.

సుయోధనుడు, భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ ప్రభృతులతో కూడి ఉత్తరగోగ్రహణం చేసాడని, గోవులను విడిపించడానికి బృహన్నలను సారధిగా చేసుకొని ఉత్తరకుమారుడు వారిమీది యుద్ధానికి వెళ్లాడని తెలుసుకున్నాడు.

విచారవదనంతో మంత్రులను చూచి "అయ్యో! ఉత్తరుడు పసివాడు. కురు వీరుల పరాక్రమం గురించి తెలియక వారి మీదికి యుద్ధానికి వెళ్లాడు. కౌరవ సేన ఎక్కడ! ఉత్తర కుమారుడు ఎక్కడ! వెంటనే తగిన సేనలను సాయంగా పంపండి. " అని ఆజ్ఞాపించాడు.

పక్కనే ఉన్న కంకుభట్టు విరాటుని చూచి "రాజా! అక్కడ మనం సుశర్మను ఓడించాము. ఇక్కడ కూడా మనకు జయం కలుగుతుంది. ఉత్తరుడు ఒక్కడే వెళ్లలేదు కదా పక్కన బృహన్నల కూడా ఉన్నాడు కదా. అతడు అద్భుతమైన పరాక్రమము కలవాడు. దేవతలనైనా జయించగలడు." అని అన్నాడు.

కాని విరాటుడు "వెంటనే మన సేనలను ఉత్తరకుమారునికి సాయంగా పంపండి. ఉత్తర కుమారుని క్షేమం గురించి తెలుసు కోండి. " అని ఆజ్ఞాపించాడు.

ఇంతలో ఉత్తర దిక్కున ఉన్న గోపాలురు వచ్చారు. "జయము జయము మహారాజా! ఉత్తర కుమారుల వారు కురు సేనను జయించి గోవులను మరలించారు. ఆ విజయ వార్తను తమకు తెలియచేయమని ముందు మమ్ములను పంపారు" అని చెప్పారు.

విరాటునికి ఆనందభాష్పాలు కారిపోతున్నాయి. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. "ఏమిటీ! మన ఉత్తర కుమారుడు కురు సైన్యాన్ని గెలిచాడా! నిజమా! నగరమంతా ఈ విజయ వార్త ను చాటించండి. ఉత్సవాలు జరిపించండి. బ్రాహ్మణులు, సువాసినులు పురజనులువెళ్లి కుమారునికి స్వాగతం పలకండి. " అని ఆజ్ఞాపించాడు.

కంకుభట్టును(ధర్మరాజును) చూచి "కంకా! ఈ ఆనంద సమయంలో ఒక ఆడ ఆడదామా!" అని అన్నాడు.

"రాజా! తమరు మహా సంతోషంలో ఉన్నారు. ఈరోజు నేను తమతో ఆడి గెలువగలనా! " అని అన్నాడు కంకుడు. ఆ మాటలకు విరాటుడు పెద్దగా నవ్వాడు. అక్కడే ఉన్న సైరంధ్రిని చూచి "సైరంధ్రీ! నీవు పోయి పాచికలు తీసుకొని రా!" అని ఆజ్ఞాపించాడు. ఆట ప్రారంభించారు. రెట్టించిన ఉత్సాహంతో ఆడుతూ విరాటుడు "కంకా!

అశేషమైన కురుసైన్యాన్ని జయించి గోవులను మరల్చుకొని వచ్చాడంటే నా కుమారుడు ఉత్తరుడు ఎంతటి వీరుడో! అతని బాహుబలము ఎంతో గొప్పది! మా వంశప్రతిష్ఠను నా కుమారుడు నిలిపాడు" అని పొంగిపోతున్నాడు విరాటుడు.

అప్పుడు కంకుభట్టు విరాటునితో "రాజా! దుర్యోధన, భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణులతో కూడిన కౌరవ సేనను మన ఉత్తర కుమారుడు జయించి గోవులను మరలించాడంటే అంతకన్నా సంతోషకరమైన విషయం ఏముంటుంది. అతను లోక ప్రశిద్ధుడు కాడా! " అని అన్నాడు.

విరాటుడు కంకుభట్టు ను చూచాడు. విరాటుని కన్నులు కోపంతో ఎరుకెక్కాయి. ముక్కు పుటాలు అదురుతున్నాయి. "అంటే నా కుమారుని విజయం గురించి సందేహిస్తున్నావా! ఇంతవరకూ నువ్వు ఏమి మాట్లాడినా సహించాను. ఇంక మీదట ఇలా మాట్లాడకు." అని అన్నాడు విరాటుడు.

కాని కంకుభట్టు అనడం మానలేదు. "ఒక్క కౌరవసేన ఏల! దేవతలు రాక్షసులు అందరూ ఒక్కమారుగా యుద్ధానికి వచ్చినా, మన

బృహన్నల రథం మీద మధ్యందిన మార్తాండుని మాదిరి ప్రకాశిస్తూ ఉండగా ఉత్తరకుమారుడు గెలవక ఏం చేస్తాడు!" అని అన్నాడు.

విరాటరాజు కోపం పట్టలేకపోయాడు. ఊగిపోయాడు. "కంకూ! నువ్వు ఎన్నో వింతలు విశేషాలు చెప్పగా విన్నాను. ఒక సారథి ....అదీ ఒక పేడి...... రథం మీద సారథ్యం చేస్తూ శత్రువీరులను అణిచాడు అని ఎప్పుడూ వినలేదే! అయినా నా కుమారుడు శత్రువీరులతో పోరాడి గెలిచాడు అనే మాట ఎందుకు మాట్లాడవు. నీ మూర్ఖపు మాటలు నేను ఇంకసహించలేను. ఓవిప్రుడా! నీ మాటలు ఇంక కట్టిపెట్టు. " అన్నాడు విరాటుడు.

కాని ధర్మరాజు వినలేదు తనప్రసంగం కొనసాగించాడు. "అవును విరాటరాజా! బృహన్నలకు మనసులో యుద్ధం చెయ్యాలని కోరిక పుట్టి ఉంటుంది. అందుకని మన ఉత్తరకుమారుని సారథిగా చేసుకొని కౌరవ సేనతో యుద్ధం చేసి ఓడించి ఉంటాడు. మనగోవులను మరలించి ఉంటాడు. నామాట అబద్ధం కాదు. నువ్వే చూడు. వెంటనే బృహన్నల కౌరవ సేన మీద విజయం సాధించి వస్తున్నట్టు పురంలో చాటించు" అన్నాడు.

ఇంక కోపం పట్టలేక పోయాడు విరాటుడు. "ఆ పేడిని నా ముందు పొగుడుతావా! " అంటూ చేతిలో ఉన్న పాచికలు కంకుభట్టు మీదికి విసిరాడు. అందులో ఒక పాచిక కంకు భట్టు నుదుటికి తగిలి గాయం అయింది. ఆ విధంగా దెబ్బతిన్న కంకు భట్టు అక్కడేనిలబడి ఉన్న సైరంధ్రి వైపు చూచి తలదించుకున్నాడు. వెంటనే సైరంధ్రి పరుగున వచ్చి కంకుభట్టు నుదుటి మీద అయిన గాయం నుండి స్రవిస్తున్న రక్తాన్ని తన పమిట చెంగుతో అదిమింది. పక్కనే ఉన్న బంగారు కలశము లోనున్న నీటిలో తన చీర చెరుగును తడిపి గాయం మీద అదిమింది.

ఇదంతా చూస్తున్న విరాటుడు "సైరంధ్రీ! ఏమిటిది! అతని రక్తం నేలమీద పడకుండా ఎందుకు అదుముతున్నావు?" అని అడిగాడు.

"మహారాజా! ఉన్నత వంశ సంజాతుడైన ఈ పుణ్యాత్ముని రక్తం ఎన్ని చుక్కలు భూమి మీద పడితే అన్ని సంవత్సరములు ఆ భూమీమీద వర్షములు కురియవు. ఉత్తమవంశంలో పుట్టిన బ్రాహ్మణుని రక్తం కిందపడటం మనదేశానికి కీడు కలిగిస్తుంది. అందుకని అలా చేసాను" అని చెప్పింది సైరంధ్రి.

ఇంతలో తన అన్నయ్య విజయుడై తిరిగి వస్తుండగా ఉత్తర తన చెలికత్తెలతో ఎదురు వెళ్ళి అన్నయ్య ఉత్తర కుమారుని మీద, పక్కనే గురువుగారు బృహన్నలమీద చందనము, కుంకుమ, పుష్పములు చల్లుతూ స్వాగతం పలికింది. మిగిలిన వారుకూడా ఉత్తరకుమారుని కౌగలించుకొని తమ అభినందనలు తెలిపారు.

ఈ ప్రశంసలకు తట్టుకోలేక పోయాడు ఉత్తరకుమారుడు. "అయ్యా ఈ విజయం నాది కాదు. ఈ బృహన్నల సహాయ సహకారములతోనే నేను విజయం సాధించాను. ఈ విజయం నా ఒక్కడిది కాదు." అని నర్మగర్భంగా పలికాడు.

ఇంతలో ఉతర్తకుమారుడు విజయుడై వస్తున్నాడని విరాటునికి వర్తమానం అందింది. "వెంటనే రమ్మనండి! " అన్నాడు విరాటుడు ఆనందంగా. కంకుభట్టు ఆ భటుని చూచి మెల్లగా "నా నుదుటిమీద గాయం చూచి బృహన్నల కోపిస్తాడేమో! ఆవేశంలో ఏమన్నా చేస్తాడేమో! అందుకని ముందు ఉత్తరకుమారుని ప్రవేశపెట్టు. కొంచెం సేపు ఆగి బృహన్నలను ప్రవేశపెట్టు" అని అన్నాడు. విరాటుడు కుమారుని విజయోత్సాహంలో ఈమాటలు వినలేదు. కంకు భట్టు కోరిక మేరకుముందు ఉత్తరకుమారుని ప్రవేశ పెట్టాడు.

ఉత్తరకుమారుడు వచ్చి తండ్రి పాదాలకు నమస్కరించాడు. విరాటుడు తన కుమారుని లేపి కౌగలించుకున్నాడు. విజయుడై వచ్చినకుమారుని గాఢ పరిష్వంగనంలో పులకించి పోయాడు విరాటుడు. ఉత్తరుడు పక్కనే ఉన్న కంకుభట్టు వేషంలో ఉన్న ధర్మరాజుకు నమస్కరించాడు. అయ్యో అదేమిటి ఈ గాయం ఏమిటి? అని అడిగాడు. దానికి విరాటుడు నేను నీ విజయాన్ని పొగుడుతుంటే ఈ కంకుభట్టు ఈ విజయం నీదికాదు ఆ బృహన్నలది అన్నాడు. కోపం పట్టలేక నేను పాచికలు విసిరాను. గాయం అయింది అని అన్నాడు విరాటుడు. తండ్రీ! తప్పు చేసారు. మీరు ఇట్లు చెయ్యదగునా! వీరు ఏమి మాట్లాడినా మనం గౌరవించాలి. ముందు వారిని క్షమాపణ కోరండి. ఇలాంటి మహాత్ములు కోపిస్తే మనకు ఆయువు ఐశ్వర్యము ఎలా కలుగుతాయి అని అన్నాడు ఉత్తరకుమారుడు. కుమారుని మాటలు పాటించి విరాటుడు కంకుభట్టును క్షమాపణ కోరాడు. కంకుభట్టు నవ్వునవ్వి అసలునాకు కోపమే రాలేదు. ఇంక క్షమాపణ ఎందుకు విరాటరాజా! విరాటుడు సత్ప్రవర్తనుడు. ఎందుకో చెడు ఘడియలో ఇలా చేసాడు. అని అన్నాడు. విరాటుని మనసు కుదుట పడింది ఇంతలో బృహన్నల అక్కడికి ప్రవేశించాడు. బృహన్నల రాజుగారికి అభివాదం చేసాడు. అతడిని సాదరంగా ఆహ్వానించాడు విరాటుడు. అందరూ కూర్చున్నారు విరాటుడు కుమారుని చూచి

కుమారా! భీష్మ, ద్రోణ, కృప, అశ్వత్థామ, కర్ణులతో కూడిన కౌరవ సైన్యాన్ని నువ్వు ఎలాగెలిచావు. నీకు సైన్యమూ లేదు. ఒక్కడిని కొడితే వందమంది మీద పడతారు కదా! ఎలా గెలిచావు. పైగా ఒకడు పరశురాముని గెలిచినవాడు! మరొక్కడు ద్రోణాచార్యుడు. మరొకడు శివుని వరమున పుట్టిన వాడు (అశ్వత్థామ) మిగిలిన వారు దేవ దానవులను కూడా గెలువ సమర్థులు. ఇంక ధృతరాష్ట్రుని కుమారులు ఒక్కొక్కరు ఈ భూమినంతా గెలువగల సమర్థులు అలాంటి వారిని నువ్వు ఒక్కడికి శరీరం మీద ఒక్క గాయం కూడా కాకుండా ఎలా గెలిచావు. మన ఆవులను ఎలా మరలించగలిగావు. అభిమానధనుడైన సుయోధనుడు ఏ ప్రకారము పలాయన మైనాడు. ఇదంతా వింటుంటే నాకు ఆశ్చర్యం వేస్తూ ఉంది. అసలు ఏం జరిగిందో వివరంగా చెప్పు అని అడిగాడు విరాటుడు. (కొంచెం ఆలోచించిన మీదట ఇప్పుడు విరాటునికి బుద్ధి పనిచేసినట్టుంది. తన కుమారుని విజయం మీద అనుమానం తనే వ్యక్తం చేసాడు). తండ్రీ! ఆ కౌరవ సేనలను నేను గెలవలేదు. గోధనమును నేను మరల్పలేదు. మనకుఉన్న దైవబలమున ఒక మహానుభావుడు దైవాంశ సంభూతుడు వచ్చి నన్ను రక్షించాడు. కౌరవులను గెలిచాడు. గోవులను మరల్చాడు. అని మూడు ముక్కలలో తేల్చి తండ్రి మనసులో అనుమానం నివృత్తిచేసాడు. అసలు యుద్ధం ఎలా జరిగిందో చెబుతాను వినండి. అని చెప్పడం ప్రారంభించాడు

ఉత్తరుడు. బృహన్నలను సారధిగా చేసుకొని నేను యుద్ధానికి వెళ్లాను. కురు సేననుచూచాను.నాకుకాళ్లు చేతులు వణకసాగాయి. నేను రధం దిగిపారిపోయాను. అప్పుడు ఒక మహా పురుషుడు వచ్చాడు. నాకు ధైర్యం చెప్పాడు. నన్నురధం మీద కూర్చోపెట్టాడు. నేను రధం తోలు తుంటే అతను కౌరవ సేనలతో యుద్ధం చేసాడు. ఆవుల మందలను మన నగరం వైపు మరలించాడు. సుయోధనుని అడ్డగించాడు. వారిరువురికి ఘోర యుద్ధం జరిగింది. ఆ మహానుభావుడు కౌరవ సేనలను చిత్తుచేసాడు. కౌరవ వీరులను ఓడించాడు. కర్ణుని తమ్ముని చంపాడు. ద్రోణుణ్ణి ఎదిరించాడు. భీష్ముడిపై బాణాలు ప్రయోగించాడు. అతడు రణరంగంలో వీరవిహారం చేసాడు. రారాజును గాయపరిచాడు. కౌరవ సేనలను తరిమి తరిమి కొట్టాడు అని తనదైనశైలిలో చెప్పాడు ఉత్తరకుమారుడు. నిజమా కుమారా! ఇంతకూ ఆ మహానుభావుడు ఏడి? ఎక్కడ? కనిపిస్తే కౌగలించుకోవాలని ఉంది అని అన్నాడు విరాటుడు. తండ్రీ! అతను అక్కడే అంతరానమ్మైనాడు. అతడు నేడు కాని రేపుకాని కనపడతాడు అని చెప్పాడు. ఇది ఇలా జరుగుతుంటే కంకుభట్టు తన ముఖాన్ని ఉత్తరీయంతో కప్పుకొని తన నుదుటికి తగిలిన గాయం అర్జునుడు చూడకుండా జాగ్రత్త పడుతున్నాడు. అది అంతా అర్జునుని పరాక్రమమే అని మనసులో ఆనందపడుతున్నాడు.

బృహన్నల ఉత్తరకుమారుని చూచి చాలా బాగా సమయస్ఫూర్తి తో చెప్పావు. అని మెచ్చుకున్నాడు. తరువాత ఉత్తరకుమారుడు బృహన్నలతో కలిసి తల్లి సుధేష్ణ దగ్గరకు వెళ్ళాడు. ఆమె ఆశీర్వాదం తీసుకున్నాడు, తరువాత తాను తెచ్చిన బొమ్మ పొత్తికలతో ఉత్తర నాట్యం నేర్చుకుంటున్నా నర్తనశాలకువెళ్ళాడు. ఉత్తరా! నేను యుద్ధానికి వెళ్ళేటప్పుడు కురు వీరుల తలపాగాలు బొమ్మ పొత్తికలకు తెమ్మన్నావు కదా ఇవిగో తెచ్చాను అని తాను తెచ్చిన తలపాగా చీరలు ఆమెకు ఇచ్చాడు. అన్నయ్య పరాక్రమానికి ఉత్తర మురిసిపోయింది. తరువాత పాండవులు అందరూ ద్రౌపదితో కలిసి కంకుభట్టు మందిరంలో ఒక రహస్య ప్రదేశంలో సమావేశమయ్యారు. అర్జునుడు జరిగినది అంతా చెప్పాడు. తరువాత అర్జునుడు భీముని చూచి అన్నయ్య ఎందుకు నా వైపు చూడటం లేదు అని అడిగాడు. ఇంక దాచడం కుదరదని ధర్మరాజు ఇలా అన్నాడు. ఏమీలేదు అర్జునా! విరాటుడు తన కుమారుని పరాక్రమాన్ని పొగుడుతుంటే నేను మహా బలశాలి బృహన్నల ఉండగా ఉత్తరకుమారు జయించడంలో గొప్ప ఏముంది అని అన్నాను. ఆమాటలకుకోపించి నా ముందు ఒక పేడిని పొగుడుతావా అంటూ వివేకహీనుడై విరాటుడు పాచికలు విసిరాడు. చిన్న దెబ్బతగిలింది. అని అన్నాడు. ఆమాటలకు భీముడు ఉగ్రుడై ఇప్పుడే వెళ్ళి ఆ దురాత్ముని సకుటుంబంగా యమలోకానికి పంపిస్తాను అని అన్నాడు. అవును

అన్నయ్యా! వీడిని చంపి వీడి రాజ్యం మనం వశం చేసుకుందాము అని అన్నాడు. వారిద్దరినీ వారించాడు ధర్మరాజు. అయ్యో! అదేమిటి అలా అంటారు మనకు కష్టకాలంలో ఆశ్రయ మిచ్చిన వాడు విరాటుడు. అతని కి మనము ఎవరో తెలియదు కదా. అతనికి మనం కృతజ్ఞత చూపాలి కాని చంపకూడదు. ఇప్పుడు మనం ఎవరమో తెలియచేద్దాము. అప్పుడుకూడా గర్వంగా మాట్లాడితే అప్పుడు చూద్దాము అని అన్నాడు. మరునాడు పాండవులు ద్రౌపది ఉదయమే మంగళ స్నానములాచరించి, తమతమ యధారూపములతో అలంకరించుకొని, ధవళవస్త్రములు ధరించి, రాజకుమారులకు ఉచితమైన ఆభరణములు ధరించి, విరాటరాజు కొలువుకూటమునకు వెళ్లారు. అప్పుడు ధర్మరాజు విరాటుని సింహాసనము మీద కూర్చున్నాడు. విరాటుడు యధాప్రకారము కొలువు కూటమునకు వచ్చాడు. తన సింహాసనము మీద కంకుభట్టును చూచాడు. కోపం పట్టలేకపోయాడు. ఏమిటిది కంకా! నీవు ఉన్మాదుని వలే ఏ మాత్రం భయం లేకుండా మా సింహాసనం మీద కూర్చున్నాడు. నేనువచ్చినా దిగకుండా గర్వంతో, అహంకారం తో అలాగే కూర్చున్నావు. అని అడిగాడు. అప్పుడు అర్జునుడు విరాటుని చూచి విరాటరాజా! ఈయన ధర్మరాజు. ఎంతోమంది సామంతులను తన కనుసన్నలతో ఆజ్ఞాపించగల చక్రవర్తి. భూమి నాలుగు చెరుగులా జయించి రాజసూయ యాగమునిర్వహించిన మహానుభావుడు. నిత్యసత్యవ్రతుడు.

ధర్మమూర్తి. అజాత శత్రువు. ఇంద్రుని సింహాసనము కూడా ఎక్కడానికి అర్హుడు. నీ చిన్న రాజ్యంలో ఉన్న సింహాసము ఎక్కడానికి తగడా! అని అన్నాడు. అది విన్న విరాటునికి ఆశ్చర్యము, ఆనందము, అనుమానము ఒకేసారి కలిగాయి. మరి ఈయన ధర్మరాజు అయితే మిగిలిన పాండవులు, ద్రౌపది ఏరి? అని అడిగాడు. విరాటరాజా! ఇప్పటిదాకా నీ వంటశాలలో రుచికరమైన వంటలు చేసి, మల్లయుద్ధములు చేసి, నిన్ను మెప్పించిన వలలుడే భీమసేనుడు. బకాసురుని కిమ్మీరుడిని, హిడింబాసురుని చంపిన మహాబలశాలి. ఇంక నీ అశ్వశాలలో అశ్వములను రక్షిస్తూ తామగ్రంధి అనే పేరుతో నిన్ను సేవించినవాడు నకులుడు. మాతల్లి మాద్రి పెద్దకుమారుడు. నీ గోశాలలో ఉన్న గోవులను కాపాడుతున్న తంత్రీపాలుడు సహదేవుడు. మాద్రి రెండవకుమారుడు. నీ అంతఃపురములో సైరంధ్రీగా కొలువు చేస్తూ నీ భార్య సుధేష్ణాదేవిని సేవిస్తున్న మాలిని ద్రౌపది. ఆమెను అవమానించినందుకే భీముడు కీచకుని, ఉపకీచకులను సంహరించాడు. అని అన్నాడు. పక్కనే ఉన్న భీముడు అందుకని నీ అంతఃపురములో కాంతలకునాట్యం నేర్పుతూ బృహన్నల పేరుతో ఉన్న పేడి అర్జునుడు. అతడే ఖాండవవనదహన కాలంలో ఇంద్రుని జయించాడు. నివాతకవచులను సంహరించాడు. కాలకేయులను చంపాడు. ఇదంతా కలా నిజమా అని సంభ్రమాశ్చర్యాలతో కొట్టుమిట్టాడుతున్నా విరాటుని

వద్దకు వచ్చి ఉత్తరకుమారుడు అవును తండ్రీ! నేను చెప్పిన మహానుభావుడు! మహాపురుషుడు! ఇతడే. అర్జునుడు. నిన్నటి యుద్ధం లో నాకువిజయం చేకూర్చిని దివ్యపురుషుడు ఇతడే. నేను భయంతో వణుకుతుంటే నాకు ధైర్య చెప్పి, నన్ను సారధిగా ఉండమని తాను యుద్ధం చేసాడు. అంత ఘోర యుద్ధం నేను ఇంతకు ముందు చూడలేదు. నేను తేరును నడపలేకపోతేనాకు ధైర్యం చెప్పి, కురు సైన్యంతో యుద్ధం చేసిన వీరుడు. అతని అబ్యర్ధన మేరకు నిన్న నేను ఇతని పేరు వెల్లడించలేదు. కుమారుని మాటను విన్న విరాటుడు పరవశించి పోయాడు. అర్జునుని గట్టిగా కౌగలించుకున్నాడు. ధర్మరాజు పాదాలకునమస్కరించాడు. ధర్మరాజు అతనిని లేవదీసాడు. విరాటుడు భీముని నకుల సహదేవులను కౌగలించుకున్నాడు. అర్జునుడు తన తమ్ములను ఉత్తరకుమారునికి పరిచయం చేసాడు. విరాటుడు తన మంత్రులను, కుమారులను, అన్నదమ్ములను, ఇంకా యోగ్యులైన వారినందరినీ పాండవుల దర్శనానికి పిలిపించాడు. ద్రౌపది గురించి చెప్పమని, తగురీతిగా గౌరవించమని, సుధేష్ణకు వర్తమానం పంపాడు. అర్జునుడు విరాటుని చూచి రాజా! చాలా దుస్తరమైన అజ్ఞాతవాసము ఒక సంత్సరము నిర్బయంగా మీ కుటుంబసభ్యులమాదిరి గడిపాము. అదేమిటి అర్జునా! నేను పరాయివాడినా! అలామాట్లాడకు. మీరు అరణ్య వాసములో నానా అవస్థలు పడి, అజ్ఞాతవాసము నా రాజ్యంలో గడపడం

నాపూర్వజన్మసుకృతంగాభావిస్తున్నాను. ఇంకమీదట ఈమత్స్యదేశం మీది. మేము అందరం మిమ్ములను సేవించుకుంటాము. కౌరవులమీదికి దండెత్తాల్సివస్తే నేను కూడా సాయం చేస్తాను అని అన్నాడు. అదేమిటి తండ్రీ! మనకంటూ ఒక రాజ్యం ఉందా చెప్పండి. నన్ను నిన్ను రక్షించి మన రాజ్యాన్ని రక్షించిన వాళ్లు వీరు కారా! ఇది వీరి రాజ్యం. వారి రాజ్యం వారికివ్వడం ఏమిటి వింత కాకపోతే! పైగా ఇంతకాలము వీరు నివురు గప్పిన నిప్పులవలె మన దగ్గర అణిగి మణిగి ఉన్నారు మనం కూడా వారిని అనకూడని మాటలు అన్నాము. ఇప్పుడు వీరిని క్షమాపణ కోరడం మన ధర్మం. పైగా ఇందాక నేను చెప్పినట్టు ఈ రాజ్యం ధనం, సంపద అంతా వీరిదే. కాబట్టి మనం వీరికి ఒక కొత్త కానుక ఇవ్వాలి తండ్రీ వెంటనే ఉత్తరకుమారిని తీసుకురమ్మని చెప్పండి అని విరాటుడి తో చెప్పాడు. వెంటనే ఉత్తర కుమారిని తీసుకు రమ్మని మంత్రులను ఆజ్ఞాపించాడు విరాటుడు. వారు వెంటనే వెళ్లి సుధేష్ణాదేవి అనుమతితో ఉత్తరను సకలాలంకారభూషితురాలిని చేసి తీసుకొని వచ్చారు. మహాలక్ష్మీదేవి లాగా వస్తున్న ఉత్తరకు తండ్రి విరాటుడు ఎదురు వెళ్లి ఆమెను సాదరంగా ధర్మరాజు ఎదుటికి తీసుకొని వచ్చాడు. ధర్మజా! అజ్ఞానంతో నీ పట్ల నేను చేసిన అపరాధములనన్నింటినీ క్షమించమని ప్రార్థిస్తున్నాను. నా కుమార్తెను అర్జునునికి ఇచ్చి వివాహం చెయ్యడం మా అందరికి సమ్మతమే. మీతో బంధుత్వం మాకు ఎంతో శ్రేయోదాయకం. అని

అన్నాడు విరాటుడు. అర్జునుడు ధర్మరాజు వంక చూచాడు. అన్నగాని అనుమతితో అర్జునుడు విరాటునితో విరాటరాజా! నేను ఉత్తరకు గురువును నాట్యం నేర్పాను. గురువుతండ్రితో సమానం. కాబట్టి ఈమెను నా కోడలిగా స్వీకరిస్తాను. నా కుమారుడు అభిమన్యునికి ఇచ్చి వివాహం చెయ్యండి. అభిమన్యుడు శ్రీకృష్ణునికి మేనల్లుడు. సుభద్ర కుమారుడు అమితమైన బాహుబలం, పరాక్రమం కలవాడు. అత్యంత సౌందర్యవంతుడు, ఉదారుడు, ఆర్యులకు సమ్మతుడు. విద్యావైభవం కలవాడు. అని తన కుమారుని గుణగణాలను వివరించాడు. ఆ మాటలకు విరాటుడు సంతోషించాడు. అర్జునా! నీతో వియ్యమందడం కన్నా మాకు కావలసినది ఏమున్నది. అన్నగారు ధర్మరాజు కార్యము నిశ్చయం చేస్తే మేము ఆచరిస్తాము. దానికి ధర్మరాజు! అర్జునుడు మాట్లాడిన ది ఎంతో ఉచితంగా ఉన్నది. ఇది నాకూసమ్మతమే. వెంటనే మన బంధు మిత్రులకు ఈ వార్తను తెలియచేయండి. అని అన్నాడు. ధర్మరాజా! మీ కురు వంశంతో సంబంధం కలవడం వలన మా మత్స్య వంశం పావనం అయింది. అని పలికి ధర్మజ భీమార్జున నకుల సహదేవులకు తనకుమార్తె ఉత్తర చేత ప్రణామము చేయించాడు. వారు ఆమెను మనసారా దీవించారు. ఉత్తరకుమారి చెలులతో అంతఃపురానికి వెళ్ళింది. వెంటనే పురోహితులను పిలిపించి ముహుర్త నిర్ణయం చేయించారు. ఇరుపక్షములవారికి పెళ్ళికి రావాల్సిందిగా

ఆహ్వానాలుపంపారు. ధర్మరాజు విరాటుని చూచి విరాటా! నీవు మాకు మా అజ్ఞాతవాస కాలమున ఆశ్రయ మిచ్చి మమ్ములను కాపాడావు. మాకు శ్రీకృష్ణుడు ఒకటినువ్వు ఒకటీ కాదు. ఇరువురు మాకు సమానమే అంటే విరాటుని కౌగలించుకొని తన అభినందనలు తెలిపాడు.

( ఇక్కడ మనం ఒకవిషయం ప్రస్తావించుకోవాలి. భారత భాగవతాలు, భగవద్గీత ఎప్పుడో 60 ఏళ్ల తరువాత చదువుకోవాల్సినవి మాకు ఎందుకు అని ఈనాటి యువత అభిప్రాయం. కాని భారతం అన్ని వయసులవారికి వర్తిస్తుంది. పై సంఘటన నే ఉదాహరణగా తీసుకోండి. అర్జునుడి స్వభావం ఏమిటి? ఎక్కడికి వెళ్లినా అక్కడ ఒక అమ్మాయిని పెళ్లి చేసుకొని వెంట తీసుకొని వస్తుంటాడు. ఇక్కడ కూడా విరాటుడు అర్జునుని తన కుమార్తెను వివాహం చేసుకోమని కోరాడు. సాధారణం గా అయితే అర్జునుడు ఠక్కున ఒప్పుకోవాలి. కాని అర్జునుడు ఒప్పుకోలేదు. ధర్మంగా ఆలోచించాడు. విజ్ఞత ప్రదర్శించాడు. తాను ఆమెకు గురువు కాబట్టి తనకు పుత్రికతో సమానం అన్నాడు. అందుకే గురువును తల్లి తండ్రి సరసన చేర్చారు.

కాని నేడు జరుగుతున్న పరిణామాలు ఎలా ఉన్నాయి. మీరే చూస్తున్నారు. నాటి సుందర కాండ సినిమా మొదలు కొని నేటిదాకా

అమ్మాయిలు తమ టీచర్లను, లెక్చరర్లను ప్రేమించడం చేస్తున్నారు. టీచర్లు లెక్చరర్లుకూడా తమ విద్యార్థినులను ప్రేమిస్తున్నారు. కాదంటే కిడ్నాపులు చేస్తున్నారు. పెళ్లి చేసుకోమని బలవంతం చేస్తున్నారు. అది తప్పు అని చెప్పేవాళ్లు లేరు. అది ధర్మంకాదు అని భారతం చెబుతున్నది అనే విషయం వారికి తెలియదు. ఎందుకంటే వారికి భారతం అంటే ఏమిటో తెలియదు. విరాటపర్వము అంటే ఏదో సినిమా పేరు అని మాత్రం తెలుసు. అందుకని భారతం అన్ని వర్గాలవారికి అన్ని వయసుల వారికి వర్తిస్తుంది. కాబట్టి భారతం మనం చదవడమే కాకుండా మన పిల్లలతో కూడా చదివించాలి అని నా మనవి).

విరాటరాజు కొలువులో ఇలా పెళ్లిసంరంభం జరుగుతుండగా అక్కడ సుయోధనుడు తన సేనతో సహా హస్తినాపురం వెళుతూ మార్గ మధ్యంలో బస చేసాడు. అతనికి భీష్ముని మాటల మీద నమ్మకం లేదు. కర్ణ, శకుని మాటలు నమ్మాడు. ధర్మరాజు దగ్గరకు ఒక దూతను పంపాడు. వాడు ధర్మరాజు వద్దకు వచ్చాడు. "ధర్మరాజా! మీ అజ్ఞాత వాస కాలం పూర్తికాక ముందే అర్జునుడు బయటపడ్డాడు. నీవు లెక్కచూచి ఏది ఉచితమో అది చెయ్యి. " అని సుయోధనుని మాటలుగా విన్నవించాడు. ఆ మాటలలో మీరు చేసిన నిర్ణయం తప్పారు. కనుక మీరు మరల అరణ్యవాసం వెళ్లాలి అనే మాటధ్వనించింది.

ధర్మరాజు ఆ మాటలు విని నవ్వి "మేము సమ్మతించినట్లు 13 ఏళ్లు పూర్తిగా నిండాయి. వేరే మాట లేదు. నీవు పోయి పాండవులు అనుకున్నప్రకారము అరణ్యఅజ్ఞాతవాసములు పూర్తిచేసారు అని భీష్ముడు, మా గురువు ద్రోణుడు వినుచుండగా సుయోధనునితో చెప్పు." అని పలికాడు. ఈ దూత అదే ప్రకారం సుయోధనునితో చెప్పాడు.

తాను దూతను ధర్మరాజు వద్దకు పంపిన విషయం దాచి, సుయోధనుడు భీష్మ ద్రోణులతో ఇలా అన్నాడు. "తాతగారూ, ఆచార్యా! మనం మోసపోయి అనవసరంగా అర్జునునితో యుద్ధం చేసాము. అసలు అర్జునుడు తాము చేసిన ప్రతిజ్ఞ ప్రకారము 13 ఏళ్లు నిండిన తరువాత వచ్చాడో లేదో అన్న నిజాన్ని మనం విచారించలేదు." అని అన్నాడు.

దానికి భీష్ముడు "సుయోధనా! ఏమిటా మాటలు ఎవరన్నా వింటే నవ్వి పోతారు. ప్రతిజ్ఞా భంగం కాలేదని నేను అర్జునుడు వచ్చినపుడే చెప్పాను. మారు మాటాడక హస్తినకు పద. " అని అన్నాడు. చేసేది లేక సుయోధనుడు హస్తినకు బయలుదేరాడు.

పాండవులు అందరూ శమీ వృక్షమువద్దకు పోయి అక్కడ తాము శమీ వృక్షము కొమ్మ మీద దాచిపెట్టిన తమ తమ ఆయుధములను పూజించి తమ వెంట తెచ్చుకున్నారు. పాండవులు అందరూ ఉపప్లావ్యము అను చోట నివాసం ఏర్పరచుకున్నారు. విరాటరాజు ఆజ్ఞ ప్రకారము అక్కడ ఉన్న జనులు పాండవులకు ఎన్నో కానుకలు సమర్పించారు. విరాటుడు కూడా వారికి సమస్త సౌకర్యములు సమకూర్చాడు. పాండవులు ఉపప్లావ్యము లో సుఖంగా ఉన్నారు.

ఈ విషయం అంతా తెలుసుకున్న శ్రీకృష్ణుడు. బలరాముడు, రుక్మిణి సత్యభామ, సాత్యకి మున్నగు ప్రముఖులు, సుభద్ర, అభిమన్యుని తీసుకొని, కృతవర్మ, ప్రద్యుమ్నుడు, సాంబుడు, యుయుధానుడు, రుక్ముడు, అక్రూరుడు, ఇంద్రసేనుడు మొదలగు వీరులతో కూడి, అనేక మంది యాదవులు వెంటరాగా, పాండవులను చూడటానికి ఉపప్లావ్యం వచ్చాడు. పాండవులు శ్రీకృష్ణునికి ఎదురేగి స్వాగతం పలికారు.

ద్రుపదమహారాజు, కాశీరాజు శైబ్యుడు, పతీపుత్రసమేతంగా, తమతమ సైన్యములతో ఉపప్లావ్యమునకు వచ్చారు. వీరందరికి విరాటరాజు తగు మర్యాదలు చేసాడు. అనేక దేశములనుండి రాజులు ఉత్తరాభిమన్యుల పెళ్లికి ఆహూతులుగా వచ్చారు.

పెళ్లిపనులు అత్యంత శోభాయమానంగా జరుగుతున్నాయి. వివాహ వేదిక తయారయింది. ఉత్తరను పెళ్లికూతురిగా అలంకరించారు. విరాటరాజు పెళ్లి తరలి రావలసిందిగా పాండవులకు పురోహితుల ద్వారా వర్తమానం పంపాడు. ఇక్కడ అభిమన్యుని కూడా పెళ్లి కుమారుని చేసారు. అందరూపెళ్లికి తరలి వెళ్లారు. విరాటుడు పాండవులను, శ్రీకృష్ణుని సాదరంగా ఆహ్వానించాడు.

పెళ్లి తంతు ప్రారంభం అయింది. శ్రీకృష్ణుడు, బలరాముడు, ధర్మరాజు, అర్జునుడు, విరాటరాజు మొదలగు వారి ముందు వధూవరులను తెరదగ్గర నిలిపారు. జ్యోతిష్యుడు శుభలగ్నం సమీపించింది అని తెలిపాడు. మంగళవాద్యాలు మోగాయి. తెర తొలిగించారు. ఉత్తరాభిమన్యులు ఒకరిని ఒకరు చూచుకొన్నారు. వారి మనసులలో మన్మధభావాలు అంకురించాయి. అభిమన్యుడు తనకు కాబోయే భార్య ఉత్తర ముఖం వైపు తదేకంగా చూస్తూ ఆమె అందాలను తాగేస్తున్నాడు. ఉత్తర కూడా కొంచెంగా తల ఎత్తి క్రీగంటితో అభిమన్యుని చూచి మరల సిగ్గుతో తలదించు కుంటూ ఉంది. తమ తమ దోసిళ్లతో పోసిన తలంబ్రాలు ఒకరి శిరస్సున ఒకరు పోసుకున్నారు. అభిమన్యుడు ఉత్తర చేతిని పట్టుకొని పాణిగ్రహణం చేసాడు. ఇద్దరూ ఒకే ఆసనం మీద పక్క పక్కన కూర్చున్నారు.

విరాటరాజు పాండవులకు శ్రీకృష్ణుడికి మణిభూషణములు, ప్రకాశించే వస్త్రములను బహూకరించాడు. ద్రౌపదీ సుభద్రలకు అనేక ఆభరణాలు వస్త్రములు బహూకరించారు. ఈ విధంగా ఉత్తరాభిమన్యుల వివాహం అత్యంత వైభవోపేతంగా జరిగింది. అని వైశంపాయనుడు జనమేజయునకు మహాభారత కధలో విరాట పర్వము వివరించాడు.

# మహాభారతము,

# విరాటపర్వము చతుర్ధాశ్వాసము

# సంపూర్ణము.

# ఇంతటితో విరాటపర్వము పూర్తిఅయింది.

ఓం తత్సత్.

# మహా భారతము

# ఉద్యోగ పర్వము

# ప్రథమాశ్వాసము

వ్యాసమహా ముని శిష్యుడు వైశంపాయనుడు జనమేజయునితో మహా భారత కథను ఈ విధంగా చెప్పసాగాడు.

ఉత్తర అభిమన్యుల వివాహము వైభవంగా జరిగింది. నాలుగు రోజులు గడిచాయి. ఒక రోజు ధర్మరాజు, తన తమ్ములు, కొడుకులు వెంట రాగా విరాటరాజు కొలువుకూటమునకు వెళ్ళాడు. అక్కడ విరాటుడు, ద్రుపదుడు, శ్రీకృష్ణుడు, బలరాముడు, వారి సోదరులు, పుత్రులు ఇంకా వివాహమునకు వచ్చి న బంధువులు ఇష్టాగోష్టిగా మాట్లాడుకుంటున్నారు.

శ్రీకృష్ణుడు అక్కడ ఉన్న వారందరిని చూచి ఇలా అన్నాడు. "మీకు అందరకూ తెలుసు. కపటద్యూతములో పాండవులను శకుని ఓడించాడు. సుయోధనుడు పాండవుల రాజ్యమును అపహరించాడు.

పాండవులు రాజ్యభ్రష్టులైనారు. అనుకున్న ప్రకారము 12 ఏండ్లుఅరణ్య వాసము ఒక ఏడు అజ్ఞాతవాసము అనుభవించారు. మీకు అందరకూ పాండవులు ఎలాంటి వారో తెలుసు. కాబట్టి ఇటు పాండవులకు అటు కౌరవులకు హితము కలిగే విధంగా , ధర్మం తప్పకుండా, ఒక మార్గాన్ని మనం అన్వేషించాలి.

ధర్మరాజు ఎలాంటి వాడో మీకు తెలుసు. అధర్మ మార్గ ం లో ఇంద్రపదవి వచ్చినా నిరాకరిస్తాడు. ధర్మమార్గంలో ఎంత తక్కువ వచ్చినా సంతోషంగా స్వీకరిస్తాడు. పాండవులకు పితృధనంగా కొంత రాజ్యం లభించింది. తరువాత పాండవులు దిగ్విజయ యాత్ర చేసి, రాజసూయ యాగమును నిర్విఘ్నముగా నెరవేర్చి రాజ్యం విస్తరింపచేసారు. కాని ఆ రాజ్యాన్ని సుయోధనుడు మాయాద్యూతంలో అపహరించాడు. ఇది మనకందరకూ తెలుసు. అయినా ధర్మరాజు కోపగించలేదు. ఎన్ని అవమానాలు చేసినా సహించాడు. కౌరవులకు ఎలాంటి హానీ తలపెట్టలేదు.

కాబట్టి కురుసామ్రాజ్యము పాండవులకు కౌరవులకు చెందినది. ఇరువురూ అనుభవింప తగినది. ఈసందర్భంలో తగిన నిర్ణయం తీసుకోడానికి మీరు అందరూ అర్హులు. నాకు తోచినది నేను చెబుతాను.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

పాండవులు అనుకున్న ప్రకారం అరణ్య అజ్ఞాతవాసాలుపూర్తి చేసారు. తమతమ భుజబలాన్ని పరాక్రమాన్ని లోకానికి తెలియచేయాలని అనుకుంటున్నారు. ఈ విషయం తెలిసిన సుయోధనుడు, పాండవులు కొద్ది బలగంతో నిస్సహాయులుగా ఉన్నప్పుడు వారిని జయించాలని తన బలగాల్ని సమకూర్చుకుంటున్నాడు.

ఎంత బలపరాక్రమములు కలవారికైనా, తగిన సాయుధ సైన్య సంపత్తి లేనిదే శత్రువులను జయించడం కష్టం కదా! కాబట్టి పాండవుల పక్షం వహించే రాజులందరూ ఇక్కడ సమావేశం కావాలి. వారి సైన్య సహకారం అందించాలి. అప్పుడే కౌరవులతో యుద్ధం జరుగుతుంది. ఇదీ ప్రస్తుత కర్తవ్యం. కాని అక్కడ వారి మనసులో ఏమున్నదో మనకు తెలియదు. ఎదుటి వారి అభిప్రాయముల తెలుసుకోకుండా ఎట్టి కార్యమును నిశ్చయించ కూడదు. కాబట్టి, ఈ సందర్భంలో, ఒక తగిన మనిషిని కౌరవుల వద్దకు పంపడం మంచిది. దుర్యోధనుడు పాండవులకు వారికి చెందవలసిన రాజ్య భాగము పంచి ఇచ్చిన మేలుజరుగుతుంది. అలా జరగక పోతే, అప్పటికి ఏది ఉచితమో ఆవిధంగా నిర్ణయిద్దాము." అని చెప్పి కూర్చున్నాడు.

అప్పుడు బలరాముడు లేచి "నా తమ్ముడు శ్రీకృష్ణుడు చెప్పినది ఉచితముగా ఉన్నది. ఇరు పక్షములకు హితముగా ఉంది. పైగా ధర్మబద్ధముగా ఉంది. ఈపద్ధతిలో మనము ఇరు పక్షములను సమాధాన పరచవచ్చును.

పాండవులు కురు సామ్రాజ్యంలో తమకు చెందిన సగభాగం కోల్పోయారు. దానిని వారు ఇప్పుడు కోరుతున్నారు. పాండవుల రాజ్యభాగం వారికి ఇచ్చి మిగిలిన అర్ధరాజ్యంతో తృప్తిపడటం సుయోధనునికి యుక్తము. దాని వలన ఎవరికీ అపాయము లేదు. పాండవులు కూడా కౌరవులమీద శత్రుత్వము మాని బంధువులుగా మెలగుతారు. అది లోక ప్రియం కూడా.

కాబట్టి ఈకార్యమును చక్కదిద్దడానికి ఒక్కని మనము సుయోధనుని వద్దకుపంపవలెను. అతడు తన మాట పొందికతో, వినయంతో, కౌరవేంద్రుని మనసెరింగి మాట్లాడి, అతనిని ప్రార్ధించి వ్యవహారం చక్కబరచాలి. అది ఎలాగంటే, ధర్మరాజు సుయోధనుని గర్వమునకు లోబడి, సౌమ్యంగా ప్రవర్తించి, జూదంలో మోసపోయాడు. దుర్యోధనుడు తనకు అక్షవిద్యలో అనుభవం లేక పోవడంతో తన మేనమామ శకునిని తనకు బదులుగా జూడమాడటానికి

నియమించాడు. ఆ శకుని ద్యూతవిద్యలో పరిణతి చెందిన వాడు. కావున, ధర్మరాజు పెట్టిన పందెములు అన్ని గెల్చాడు. కాబట్టి ఇందులో సుయోధనుని తప్పు కనిపించడంలేదు. కాబట్టి వారిని అధర్మపరులు అని మనం నిందించలేము. కాబట్టి మనము పంపు మనిషి వినయంతో కార్యము చక్కదిద్దుకొని రావలయును." అని అన్నాడు బలరాముడు.

ఈ మాటలకు సాత్యకికి కోపం వచ్చింది. " మీరు ఇలా మాట్లాడ తగునా! ఇలా మాట్లాడటం నీ కే చెల్లింది. అయినా నిన్ను అని ఏం లాభం. "దుర్యోధనుడు మంచివాడు అతని తప్పులేదు" అని నువ్వు అంటుంటే నీ మాటలు వింటున్నారే వాళ్లను అనాలి.

ఏమీ! ధర్మరాజు వేడుక పుట్టి జూదం ఆడాడా! వారందరూ కలిసి కుట్రపన్ని బలవంతంగా జూదానికి పిల్చి కపటద్యూతము ఆడి గెలువ లేదా! ధర్మరాజులో ఎవరైన తప్పు చూపగలరా! అనుకున్న ప్రకారం అరణ్య అజ్ఞాతవాసాలు ముగించిన వారికి పిత్రార్జితములో భాగం ఇవ్వక తప్పదు. దానికి ఒకరిని యాచించ నవసరం లేదు. యుద్ధంలో రాజ్యలక్ష్మిని వరించడం రాజధర్మం. మంచి మాటలతో వినకపోతే సుయోధనుడికి నా బాణాల రుచి చూపిస్తాను. అసలు భీమార్జునులకు సాటి వీరులు ఉన్నారా! వారూ నేనూ యుద్ధభూమిలో ఉంటే మమ్మల్ని

ఎదిరించి ఎవరు నిలువగలరు? నకుల సహదేవులు, పాంచాలవీరులు, వృష్ణివరులు యుద్ధానికి దిగితే దుర్యోధనుడు వాడి నూర్గురు తమ్ములు నాశనం కావలిసిందే! ఈ విరాటుడు సామాన్యుడా! అతని అండ ఉంటే సాధించలేని కార్యము లేదు కదా! కాబట్టి యుద్ధమే తక్షణ కర్తవ్యం. ఈ లోపుగా ఎవరినైనా దూతగాపంపండి. కాని దీనంగా వేడుకోవద్దు. సుయోధనుడు న్యాయం గా పాండవులకు రావల్సిన రాజ్యభాగం ఇస్తే తీసుకొందాం. అలా కాక పోతే యుద్ధం తప్పదు" అని అన్నాడు సాత్యకి.

అప్పుడు ద్రుపదుడు లేచి "సాత్యకి సమయోచితంగా మాట్లాడాడు. బలరాముని మాటలు సమ్మతంగా లేవు. సాత్యకి చెప్పినట్లు సుయోధనుడు మంచిమాటలతో రాజ్య భాగం ఇవ్వకుంటే యుద్ధమే శరణ్యము. భీష్మ, ద్రోణులు సుయోధనుని ఆశ్రయంలో ఉన్నారు కాబట్టి అతనిని సమర్థిస్తారు. ధృతరాష్ట్రునికి పుత్రప్రేమ మెండు. ఇంక కర్ణుడు మొదలైన దుష్టులు అతనిని మంచివాడని పొగుడుతారు. కాబట్టి అతను సంధి మాటలు వినడు. యుద్ధము అనివార్యము. ఇప్పుడు మనము రాజులను, మిత్రులను వారి సైన్యాలతో పిలిపించాలి. దుర్యోధనుడు కూడా ఇలాంటి ప్రయత్నాలలోనే ఉండి ఉంటాడు. సాధారణంగా రాజులు మొదట కోరినవారికే తమ సైన్య సహాయం అందచేస్తారు కాబట్టి మనము ముందుగా అందరి రాజులను సైన్యసహకారం అర్థించాలి.

వెంటనే మన దూతలను శల్యుడు, కేకయ రాజు, దృష్టకేతుడు, జరాసంధుని కుమారుడు మొదలైన మన మిత్ర రాజులకు వారి బంధు మిత్రులకు పంపి, ఈ విషయం తెలియ చేద్దాం. ఇది నాకు తోచిన కర్తవ్యం." అని అన్నాడు ద్రుపదుడు.

తన పక్కనేకూర్చున్న బ్రాహ్మణుని చూపి, "ఇతను నాకు అగ్ర పురోహితుడు. ఇతనికి మనము అన్ని విషయములు చెప్పి ధృతరాష్ట్రుని వద్దకు పంపుదాము. అతడు తన చతుర వచనములతో, యుక్తి యుక్తముగా ధృతరాష్ట్రుని, అతని కుమారుడు సుయోధనుని, భీష్ముని, ద్రోణుని తో తగు విధంగా మాటలాడగలడు." అని అన్నాడు.

దానికి శ్రీకృష్ణుడు "దర్మజా! ద్రుపదుని మాట ప్రకారం చెయ్యండి. పెళ్లికి పిలిస్తే వచ్చాము. ఇంకా ఎక్కువ రోజులు ఇక్కడ ఉండటం మంచిదికాదు. మేము వెళ్తాము." అని ద్రుపదుని చూచి "మీరు మా అందరికి గురుస్థానములో ఉన్నారు. మీ మాట అంటే ధృతరాష్ట్రునికి ఎంతో మన్నన. మిమ్మల్ని భీష్ముడు కూడా ఆదరిస్తాడు. పైగా మీకు ద్రోణుడు, కృపాచార్యునికి మంచి స్నేహము. పాండవుల పక్షాన ఒక దూతను పంపు బాధ్యత మీదే. మీరు ఏమి చెప్పినా మేము అందరం ఆమోదిస్తాము. మీరు కోరినట్లు సుయోధనుడు పాండవులకు

రాజ్యభాగం ఇవ్వకపోతే యుద్ధం తప్పదు. మీరందరూ మీమీ నగరాలకు వెళ్లి యుద్ధ సన్నాహాలు చెయ్యండి. " అని అన్నాడు.

తరువాత అందరూ ఎవరి నగరాలకు వాళ్లు వెళ్లారు. శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్లాడు. పాండవులు, ద్రుపదుడు, విరాటుడు యుద్ధ సన్నాహాలు చేస్తున్నారు.

ఈ విషయాల నన్నింటినీ సుయోధనుడు తన చారుల వలన విన్నాడు. తాను కూడా యుద్ధసన్నాహాలు చేయడం ప్రారంభించాడు.

హస్తినాపురమునకు పాండవ దూతగా వెళ్లు తనపురోహితుడైన బ్రాహ్మణుని చూచి ద్రుపదుడు ఇలా అన్నాడు "విప్రోత్తమా! నీవు మాకు హితుడవు. మతిమంతుడవు. చతుర వచనములలో నిపుణుడవు సమయస్ఫూర్తి కలవాడవు. ఉన్నత వంశములో పుట్టినవాడవు. పైపెచ్చు నాకు స్నేహితుడవు. కాబట్టి నిన్ను ధృతరాష్ట్రుని వద్దకు దూతగా పంపుతున్నాను. సుయోధనుడు కుటిలుడు. ధర్మజుడు ధర్మాత్ముడు. నీవు ధృతరాష్ట్రునితో ధర్మనిష్ఠతో మాట్లాడి పాండవుల రాజ్యభాగము వారికి ఇమ్మని అర్థించాలి. పాండవులు పడ్డ కష్టాలు అక్కడి వారికి వివరంగా చెప్పి వారిని ఒప్పించాలి. ఇక్కడ శ్రీకృష్ణుడు మొదలగు వారు పలికిన పలుకులు

మీరు విన్నారు కదా వాటిని సమయోచితంగా అక్కడివారికి తెలియ చెయ్యాలి. మీరు భీష్ముని, ద్రోణుని, కృపాచార్యుడు మొదలగు పెద్దలను కలిసి వారి మనోభావాలకు తగ్గట్టు ప్రవర్తించాలి. దైవానుగ్రహము వలన నీవు చెప్పిన సూత్రమునకు సుయోధనుడు అంగీకరిస్తే అందరకూ మంచిదే కదా! " అని చెప్పాడు. విప్రుడు అందరి దగ్గర సెలవు తీసుకొని హస్తినకు ప్రయాణమయ్యాడు.

అక్కడ హస్తినా పురంలో కూడా ఇలాంటి చర్చలే జరుగుతున్నాయి. శ్రీకృష్ణుని వద్దకు ఒక దూతను పంపుదామా అనే ఆలోచన వచ్చింది సుయోధనునికి. ఎవరినో పంపడం ఎందుకని తానే స్వయంగా ద్వారకకు వెళ్లాడు సుయోధనుడు. అదే రోజు అర్జునుడు కూడా శ్రీకృష్ణుని దర్శనార్ధము ద్వారకకు వచ్చాడు.

ఆ సమయంలో శ్రీకృష్ణుడు శయనించి ఉన్నాడు. ముందుగా సుయోధనుడు వచ్చాడు. శ్రీకృష్ణుని తల వైపు ఉన్న ఆసనము అలంక రించాడు. తరువాత వచ్చిన అర్జునుడు శ్రీకృష్ణుని కాళ్ల వైపు ఉన్న ఆసనము మీద కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు నిద్ర లేచాడు. ఎదురుగా కనపడుతున్న అర్జునుని చూచాడు. తరువాత సుయోధనుని చూచాడు

ఇద్దరినీ తగురీతిగా సత్కరించాడు. "మీరు వచ్చిన కార్యము చెప్పండి" అని ఇరువురినీ అడిగాడు.

అప్పుడు సుయోధనుడు శ్రీకృష్ణుని చూచి "కృష్ణా! కౌరవ పాండవులకు యుద్ధము సంభవిస్తే నీ సహాయము కోసరం వచ్చాను. నీకు నేను, పాండవులు ఒక్కటే కదా! పైగా బంధువులము. అదియును కాక ముందుగా నేను నిన్ను చూడటానికి వచ్చాను. ముందుగా వచ్చిన వారిని ఆదరించడం మర్యాద కదా! కాబట్టి లోకములో ఉన్న న్యాయ మును పాటించి నాకు సహాయ పడవలసిందిగా కోరుతున్నాను."

దానికి శ్రీకృష్ణుడు "సుయోధనా! నీవు ముందుగా వచ్చిన మాట నిజమే. కాని నేను ముందుగా అర్జునుని చూచాను కదా! కాబట్టి మీ ఇద్దరకూ గౌరవ ప్రదంగా ఉండేట్టు ఒక ఏర్పాటు చేస్తాను. మీకు ఇష్టం వచ్చినది కోరుకోండి. అది ఏమంటే నా దగ్గర సుశిక్షుతులైన సైనికులు పదివేలమంది "నారాయణ" అనే పేరుగలవారు ఉన్నారు. వారు యుద్ధవిద్యానిపుణులు. మీ వైపు యుద్ధం చేస్తారు. కాని నేను మాత్రం యుద్ధం చెయ్యను. ఆయుధము పట్టను. నన్ను కోరుకున్నవారికి హితుడుగామాత్రం ఉంటాను. మీకు ఎవరు ఇష్టమో వారిని కోరు

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

కొనండి. కాని అర్జునుడు బాలుడు. ముందు అతను కోరుకొనడం ధర్మం." అని అన్నాడు

వెంటనే అర్జునుడు శ్రీకృష్ణుని తనకు కావాలి అని కోరుకున్నాడు. సుయోధనుడు మనసులో సంతోషించాడు. పదివేల మంది సైన్యమును తీసుకొని సుయోధనుడు బలరాముని వద్దకు వెళ్లాడు. బలరాముడు తన శిష్యుడైన సుయోధనుని ఉచితరీతిని సత్కరించాడు. సుయోధనుడు తాను వచ్చిన పని తెల్పి బలరాముని సహాయము కోరాడు.

" సుయోధనా! అభిమన్యుని వివాహ సందర్భంలో నేను నిన్ను సమర్ధించాను. దానికి కొంతమంది వ్యతిరేకించారు. నాకు కృష్ణుడు అంటే అభిమానం. అందుకని అప్పుడే ఏమి మాట్లాడలేదు. కాబట్టి నేను ఎవరి పక్షమూ వహించను ఊరికే ఉంటాను. ఇది నిజము." అని అన్నాడు.

సుయోధనుడు బలరాముని వద్ద వీడ్కోలు తీసుకొని, కృతవర్మ దగ్గరకు వెళ్లాడు. అతని దగ్గరనుండి ఒక అక్షౌహిణీ సేనను సాయంగా తీసుకున్నాడు. తరువాత హస్తినాపురమునకు వెళ్లాడు.

ఇక్కడ తన దగ్గర ఉన్న అర్జునుని చూచి శ్రీకృష్ణుడు "అర్జునా! అదేమిటి అలా కోరుకున్నావు. ఎంతో పరాక్రమ వంతులైన సైన్యమును కోరుకోకుండా యుద్ధము చెయ్యని నన్ను ఎందుకు కోరుకున్నావు. నీకు ఇది ఏమి మేలు చేకూరుస్తుంది." అని అడిగాడు.

"అదేమిటి కృష్ణా! నువ్వు యుద్ధం చేస్తే నువ్వే గెలుస్తావు. నీకు పేరు వస్తుంది. పైగా నువ్వు ఎదిరి పక్షంలో ఉంటే నిన్ను జయించడం కష్టం. ఎల్లప్పుడూ విజయలక్ష్మి వరించే నీ తోడ్పాటు మాకు అవసరం. కాబట్టి నిన్ను కాబట్టి నిన్ను కోరుకున్నాను. నీవు యుద్ధ చేయ నవసరం లేదు. మా పక్కన ఉంటే చాలు మాకు విజయం లభిస్తుంది. అందుకని చిర కాలమునుండి నేను కోరుకుంటున్న మాదిరి నా రథమునకు సారధ్యం వహించు. నన్ను గౌరవించు. అదే నాకు కావలసినది." అని అన్నాడు.

"అర్జునా! నీకోరిక తీర్చడం నా కర్తవ్యం. జరుగబోవు యుద్ధంలో నేను నీకు సారధ్యం వహిస్తాను. మనము ధర్మరాజు వద్దకు వెళ్లి తదుపరి కార్యాలోచనము చేద్దాము" అని పలికి శ్రీకృష్ణుడు అర్జునునితో కూడా ఉపప్లావ్యమునకు వచ్చాడు.

ధర్మరాజు పంపిన దూతలు శల్యుని వద్దకు వెళ్లి పాండవుల పక్షాన సైన్య సహాయము అర్ధించారు. శల్యుడు కూడా దానికి సంతోషించి సైన్య సమేతుడై పాండవుల వద్దకు ఉపప్లావ్యమునకు ప్రయాణమయ్యాడు.

ఈ విషయాన్ని చారుల వలన తెలుసుకున్న సుయోధనుడు శల్యుడు వచ్చు మార్గములో శల్యునికి వారి మంత్రులకు, సేనాపతులకు, సైన్యానిని సకల సౌకర్యాలు కల్పించాడు. తాత్కాలిక నివాసాలు నిర్మించాడు. విందులు వినోదాలు ఏర్పాటు చేయించాడు. సకల రాజ మర్యాదలు చేసాడు. ఇవన్ని చూచి శల్యుడు ఎంతో సంతోషించాడు.

"ఈ ఏర్పాట్లు ఎవరు చేస్తున్నారు వారు నా మర్యాదకు అర్హులు. ఈ ఏర్పాట్లు చేస్తున్న ధర్మరాజు అమాత్యులను పిలిపించండి. " అని అన్నాడు.

అప్పుడు సుయోధనుడు శల్యుని వద్దకు పోయి తనను తాను ఎరుక పరచుకొని అవ న్ని తానే చేసాను అని చెప్పాడు. శల్యుడు సంతోషించి "నీకు ఏమి కావాలో కోరుకో" అని అడిగాడు దానికి సుయోధనుడు "ఆర్యా! మీకు మేము, పాండవులు సమానమే కదా! కాబట్టి నన్నుకూడా అనుగ్రహించండి. " అని అడిగాడు.

" నీవు చెప్పినది నిక్కువము. నాకు మీ ఇరువురి మధ్య ఎలాంటి విబేధము లేదు. నీకు ఏమి కావాలో కోరుకో" అన్నాడు శల్యుడు.

"మీ సహాయ సహకారముల కంటే నాకు కావాలసినది ఏమున్నది. అవి ప్రసాదించండి. " అని అడిగాడు. శల్యుడు దానికి సమ్మతించాడు.

"నేను ధర్మరాజు వద్దకు వెళుతున్నాను. అతనిని దర్శించి తదుపరి నీ వద్దకు వస్తాను." అని చెప్పాడు.

"అలాగే వెళ్లిరండి. కాని నాకు ఇచ్చిన వరం మాత్రం మరువకండి. " అని అన్నాడు. అలాగే అని శల్యుడు ధర్మరాజు వద్దకు ప్రయాణ మయ్యాడు. శల్యుడు ఉపప్లావ్యము చేరుకున్నాడు.

ధర్మరాజు, తన తమ్ములతో ద్రౌపది, సుభద్ర, అభిమన్యుడు మొదలగు బంధుమిత్రులతో శల్యునికి సాదరంగా స్వాగతము పలికాడు. శల్యుడు ధర్మరాజును ఆలింగనముచేసుకొని "ధర్మజా! మిగుల కష్టసాధ్యమైన అరణ వాసమును పూర్తిచేసారు. అంతకంటే కష్టతరమైన అజ్ఞాతవాసమును అవలీలగా అధిగమించారు. మీరు నమ్ముకున్న సత్య

నిష్ఠ, ధర్మ నిష్ఠ మిమ్ములను కాపాడాయి." అని పలికి తరువాత తాను సుయోధనునికి ఇచ్చిన వరమును గురించి చెప్పాడు.

దానికి ధర్మజుడు "తమరు సుయోధనుడు చేసిన సేవలకు మెచ్చి వరం ఇవ్వడం మంచిదే.దానిని నెరవేర్చండి. కాని నా కోరిక ఒకటి నెరవేర్చండి. రాబోవు యుద్ధములో అర్జునునికి శ్రీకృష్ణుడు సారధిగా ఉన్నాడు. కర్ణుడు ఎల్లప్పుడూ అర్జునుడు అంటే పగ ద్వేషంతో రగిలి పోతుంటాడు. శ్రీకృష్ణునికి దీటుగా సారధ్యం వహించడానికి తమరు తప్ప వేరెవ్వరూ లేరు. అందుకని తమరు కర్ణునికి సారధ్యం వహించండి. కాని, మీరు కర్ణుని మనసుకు అనుక్షణం కలత కలిగిస్తూ, అవసర సమయములో సహాయ నిరాకరణ గావించి అర్జునుని కాపాడ వలయును. ఇది అకృత్యము అని తలపక నా ప్రార్ధనను మన్నించండి. " అని కోరాడు.

ధర్మజుని ఆంతర్యం గ్రహించాడు శల్యుడు. "నాకు కూడా ఇది యుక్తి యుక్తముగా కనిపిస్తూ ఉంది. సుయోధనుడు నన్ను కర్ణునికి సారధ్యము చెయ్యమని కోరితే తప్పకుండా నీకోరిక నెరవేరుస్తాను. అర్జునుని రక్షిస్తాను. కర్ణుని వంటి దుర్మార్గుని కర్ణ కఠోరమైన నా

మాటలతో కలత పరుస్తాను. అతని చేతులు ఆడకుండా చేస్తాను. అప్పుడు అర్జునుడు అతనిని తన బాణములతో గాయపరుస్తాడు.

ధర్మజా! ఈ ఒక్క కోరికే కాదు నువ్వు ఏమి కోరినా తీరుస్తాను. నాడు కౌరవ సభలో మీకు జరిగిన అవమానము, మీరు అడవులలో పడ్డ కష్టములు ఎవరు మరిచిపోగలరు? నువ్వేకాదు ఒక్కొక్కప్పుడు దేవతలు కూడా కష్టములు అనుభవిస్తారు. ఇంతకు పూ ర్వం ఇంద్రుడు కూడా ఇలాంటి బాధలు పడ్డాడు. విధి వ్రాతను తప్పించు కొనుటకు ఈ పరమ శివునకు కూడా శక్యము కాదు కదా! " అని అన్నాడు.

" మహానుభావా! ఇంద్రుడు,శచీదేవి ఎందుకు కష్టాల పాలయ్యారు, వివరించండి"అని ధర్మరాజు అడిగాడు.శల్యుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"దేవతలలో త్వష్ట అనే వాడు ఉన్నాడు అతను మంచి వాడు యోగ్యుడు. అతడు తన తపోశక్తితో మూడు తలలతో ఒక వ్యక్తిని సృష్టించాడు. అతని పేరు విశ్వరూపుడు. విశ్వరూపుడు ఇంద్రపదవిని కోరి ఘోర తపస్సు చేస్తున్నాడు. ఇది విని ఇంద్రుడు భయపడి పోయాడు. అతని తపస్సు భగ్నం చేయడానికి అప్సరసలను పంపాడు.

కాని అతడు వారికి తళుకు బెళుకులకు వశుడు కాలేదు. చేసేది లేక ఇంద్రుడు విశ్వరూపుని చంపాడు. కాని ఆవిషయం ఎవరికి తెలియ కుండా ఒక సంవత్సరము గడిపాడు.

తరువాత క్రమక్రమం గా అందరికీ తెలిసింది. భూతగణాలు ఇంద్రుని చర్యను నిరసించాయి. అతను చేసిన బ్రహ్మ హత్యను ఖండించాయి. ఆపాపం పోగొట్టుకోడానికి ఇంద్రుడు ఒక యాగం చేసాడు. తనకు అంటిన బ్రహ్మహత్యా పాతకాన్ని భూలోకంలో ఉన్న సముద్రములకు, స్త్రీలకు, సమానంగా పంచిపెట్టాడు. తాను పాపవిముక్తుడై సుఖంగా ఉన్నాడు.

ఇది అంతా తెలిసి త్వష్టకు కోపం వచ్చింది. ఏ అపరాధము చెయ్యక, తపస్సు చేసుకుంటున్న విశ్వరూపుని చంపిన పాపిని చంపడానికి ఒక శక్తిని పుట్టిస్తాను అని శపథం చేసాడు. ఒక హోమం చేసాడు. అందులో నుండి ఒక కుమారుడిని పుట్టించాడు. అతనికి వృత్రుడు అని నామకరణం చేసాడు. ఇంద్రుని మీదికి యుద్ధానికి పంపాడు.

అధిక బలసంపన్నుడైన వృత్రుడు తన భుబలంతో ఇంద్రుని జయించాడు. తన నోరు తెరిచి ఇంద్రుని మింగాడు. కడుపు బరువుగా

ఉండటం వలన వృత్రునికి నిద్ర వచ్చింది. గట్టిగా ఆవులించాడు. అప్పుడు ఇంద్రుడు తన శరీరాన్ని చిన్నదిగా చేసి అతని నోట్లోనుండి బయటకు దుమికాడు. మరల ఇంద్రుడు వృత్రాసురుడు యుద్ధం చేసారు. వృత్రుని ధాటికి తట్టుకోలేక ఇంద్రుడు ఋషులు, దేవతలతో సహా మంధర పర్వత శిఖరముమీదికి పారిపోయాడు.

అందరూ వృత్రుని చంపే ఉపాయం కోసం ఆలోచిస్తున్నారు. అందరూ విష్ణుమూర్తి దగ్గరకుపోయి వృత్రుడి విషయం అంతా వివరించారు. వృత్రాసురుని చంపే ఉపాయం కోసం అర్థించారు. అప్పుడు విష్ణువు దేవతలను, మునులను చూచి "మీరు వెళ్లి వృత్రునికి, ఇంద్రుడికి సంధి చేయండి. నేను తగిన సమయం చూచి ఇంద్రుని వజ్రాయుధములో ప్రవేశిస్తాను. అప్పుడు మీరు ఇంద్రుడు వృత్రాసురుని సంహరిస్తాడు." అని పలికాడు.

ఇంద్రుడు వృత్రుని వద్దకు ఋషులను పంపాడు. వారు పోయి వృత్రాసురుని తో "ఇంద్రుడు అజేయుడు. నీ భుజబలంతో ఇంద్రునితో గెలువ లేవు. అలాగే ఇంద్రుడు కూడా నిన్ను గెలవలేడు. కాబట్టి ఇంద్రునితో మైత్రి చేసుకో" అని ని అర్దించారు.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

దానికి వృత్రుడు ఒక వరం కోరాడు. తాను తడిసిన దానితో గాని, ఎండిన దానితో గాని, చెట్లతో గాని, రాళ్లతోగాని, అస్త్ర,శస్త్రములతోగాని, పగలుగాని, రాత్రిగాని, చంపబడకుండా వరం కావాలి అలాంటి వరం ఇస్తే నేను ఇంద్రునితో సంధి చేసుకుంటాను అని పలికాడు. ఋషులు దానికి ఒప్పుకున్నారు. వృత్రునికి ఆ ప్రకారం వరం ప్రసాదించారు. వృత్రుడు ఇంద్రునితో మైత్రి చేసుకున్నాడు. ఇంద్రుడు మాత్రం వృత్రుని చంపడానికి రంధ్రాన్వేషణ చేస్తున్నాడు.

ఒకరోజు అసురసంధ్య వేళ వృత్రుడు సముద్ర తీరమున విహరిస్తున్నాడు. అది చూచాడు ఇంద్రుడు. అది పగలు కాదు. రాత్రి కాదు. అందుకని వాడిని చంపడానికి తగిన సాధనం కోసం వెతుకుతున్నాడు. అప్పుడు సముద్రపు నురగనుచూచాడు అది తడి కాదు పొడి కాదు. అందుకని తన వజ్రాయుధమును ఆ నురగలో ముంచాడు. విష్ణువును ప్రార్థించాడు. విష్ణువు ఆ నురగలో ప్రవేసించాడు. ఇంద్రుడు ఆ నురగతో వృత్రుని సంహరించాడు. తన లోకానికి వెళ్లాడు.

ఈసంగతి తెలిసి భూతసంఘాలు ఆందోళన చెందాయి. బ్రహ్మహత్య చేసినందుకు ఇంద్రుని నిందించాయి. ఇంద్రుడిని ఆ పదవినుండి తొలగించాయి. ఇంద్రుడు నిషధాచలము లో తలదాచుకున్నాడు.

దేవతలందరూ ఇంద్రపదవిని అధిష్టించడానికి తగిన వ్యక్తి కోసం అన్వేషిస్తున్నారు.

భూలోకములో నహుషుడు అనే మహారాజు శత అశ్వమేధ యాగములు చేసి రెండవ ఇంద్రుని మాదిరి ప్రకాసిస్తున్నాడు. దేవతలు మునులు నహుషుని వద్దకు పోయి ఇంద్రపదవిని అధిష్టించమని కోరారు. దానికి నహుషుడు నాకు ఇంద్రపదవిని నిర్వహించే సామర్ధ్యము లేదు. నన్ను వదిలేయండి అని చెప్పాడు. అప్పుడు యముడు, వరుణుడు మొదలగు దేవతలు తమ తమ శక్తులను అతనికి పంచి ఇచ్చారు. నహుషుడు మహా శక్తివంతుడయ్యాడు.

దేవతలు, ఋషులు నహుషుని ఇంద్రపదవిలో అధిష్టింప చేసారు. దివిజ రాజ్యమునకు అభిషేకించారు. నహుషుడు ధర్మపరుడై సమస్త లోకములను పరిపాలిస్తున్నాడు. కిన్నరులు, కింపురుషుడు, గరుడులు, గంధర్వులు, సిద్ధలు, విద్యాధరులు, సమస్త దేవతల నుండి వారి వారి తేజో భాగములుస్వీకరించాడు. మునులందరూ నహుషుని సేవిస్తున్నారు. తుంబురుడు, నారదుడు అతడికి గాన వినోదం చేస్తున్నారు. రంభ మొదలగా అప్సరసలు తమతమ నాట్యములతో అతనిని వినోదం కల్గిస్తూ అతనిని సేవిస్తున్నారు.

ఇన్ని భోగాలు ఒక్కసారి సమకూరగా నహుషునిలో మదము ఆవహించింది. ఎల్లప్పుడూ మన్మథ వికారములతో కాలం గడుపు తున్నాడు. ఒకరోజు నహుషుడు ఇంద్రుని భార్య అయిన శచీదేవిని చూచాడు. శచీదేవి అందానికి ముగ్ధుడయ్యాడు. ఆమెను మోహించాడు.

"నేను స్వర్గలోకాధిపతిని. అందరూ నన్ను చూడటానికి వచ్చారు. ఈ సుందరాంగి ఎందుకు రాలేదు. కారణం ఏమి. వెంటనే ఆమెను పిలిపించండి" అని ఆజ్ఞాపించాడు నహుషుడు.

ఇది తెలిసి శచీదేవి భయపడింది. దేవగురువు బృహస్పతి ఇంటికి వెళ్ళింది. జరిగినది అంతా చెప్పింది "అమ్మా! శచీదేవి నిన్ను నేను కాపాడుతాను. నీ భర్త తప్పకుండా తిరిగి వస్తాడు. ఊరడిల్లుము." అని ఆమెను ఓదార్చాడు.

ఇది తెలిసి నహుషుడు కోపించాడు "నేను ఒక వనితను కోరితే బృహస్పతి ఆమెకు రక్షణ ఇస్తాడా! " అని దేవతలతో అన్నాడు.

" మీరు దేవేంద్రపదవిలో ఉన్నారు. మీరు పరస్త్రీలను కోరడం తగదు." అని అన్నారు.

దానికి నహుషుడు నవ్వి "మీ దేవేంద్రుడు గౌతముని భార్య అహల్యను అర్ధరాత్రి కామించినపుడు మీరు అతనికి ఈ బుద్ధులు ఎందుకు చెప్పలేదు? వెంటనే ఆమెను నా వద్దకు పంపమని బృహస్పతికి చెప్పండి" అని ఆజ్ఞాపించాడు.

దేవతలు మునులు బృహస్పతి వద్దకు పోయి "గురుదేవా! ఇప్పుడు నహుషుడు ఇంద్ర పదవిలో ఉన్నాడు. అతడు శచీదేవిని కోరడానికి తగిన వాడు. కావున శచీదేవిని అతని వద్దకు పంపండి. అతని కోపం పోగొట్టండి. " అని అర్థించారు.

బృహస్పతి చిరు నవ్వు నవ్వి "అకటా! నహుషుడు ఇంద్రపత్ని శచీదేవిని కోరడమా! దానికి మీరు ఆయనను సమర్థించడమా! అది మీ కర్తవ్యమా! ఇది లోకహితమా! అవును. మనం ఇంతటి మహత్కార్యాన్ని ఆచరించవలసినదే! అయినను శరణు జొచ్చిన వారిని కాపాడగలిగి ఉండి కూడా కాపాడకపోతే అది పాపము అని బ్రహ్మదేవుడు చెప్పాడు కదా! కాబట్టి నేను శచీదేవిని పంపను." అని చెప్పాడు.

"అయితే తగిన కర్తవ్యము ఆలోచించండి" అని బృహస్పతిని మునుడు అర్థించారు.

బృహస్పతి ఆలోచించి "ఒక పని చేద్దాము. శచీదేవి నహుషుని వద్దకు పోయి అతనితో సాంగత్యానికి కొంతసమయం అడుగుతుంది. తరువాత ఏమి చేయవలేనో మనం నిర్ణయిద్దాము." అని అన్నాడు.

బృహస్పతి మాట ప్రకారము శచీదేవి నహుషుని వద్దకు వెళ్ళింది. తాను కోరిన వనిత తన వద్దకు రాగానే నహుషుడు ఎంతో సంతోషిం చాడు. "నేను ఇంద్ర పత్నిని. శచీదేవిని. ఇంద్రుడు ఉన్నాడో లేడో తెలియదు. ఏ విషయమూ తెలియకుండా మనము తొందర పడటం పనికిరాదు. నా మనస్సు శంక గా ఉన్నది. తమరికి తెలియనిది ఏమున్నది. నాకు కొంత సమయము కావాలి. " అని అడిగింది. నహుషుడు దానికి ఒప్పుకున్నాడు.

తరువాత మునులు దేవతలు రహస్యంగా విష్ణుమూర్తిని కలిసారు. ఇంద్రుని పాపం పోగొట్టమని అడిగారు. దానికి విష్ణువు మీరు వెళ్ళి ఇంద్రునితో అశ్వమేధ యాగము చేయించండి. అతని పాపంపోతుంది అని చెప్పాడు. అందరూ ఇంద్రుని వద్దకు వెళ్లారు. అతని చేత అశ్వమేధ యాగము చేయించారు. ఇంద్రుడు కల్మష రహితుడు అయ్యాడు. ఇంద్రుడు వారితో కలిసి అమరావతికి వచ్చాడు. దేవేంద్ర పదవిలో ఉన్న నహుషుని చూచాడు అతని తేజోవిభవమునకు

ఆశ్చర్యపోయాడు. అక్కడ ఉండలేక ఎవ్వరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు.

ఇంద్రుడి జాడ తెలియక శచీదేవి మనసు బాధ పడింది. అర్ధరాత్రి పూట ఉపశ్రుతి అనే దేవతను ఆరాధించింది. ఆమె సాక్షాత్కరించింది. "అమ్మా! నీవు నీ భర్తను నీ పుణ్యఫలవశమున చూస్తావు. నేను ఉపశ్రుతి అనే దేవతను. నీ పాతివ్రత్యానికి మెచ్చి వచ్చాను. నా వెంట వస్తే నీ భర్తను నీకు చూపిస్తాను." అని శచీదేవిని తీసుకొని హిమవత్పర్వతమునకు ఉత్తర దిక్కుగా ఉన్న మంజుమంతము అనే పర్వతము వద్దకు వెళ్లింది. అక్కడ ఉన్న ఒక సరోవరంము లో ప్రవేశించారు. అక్కడ ఉన్న ఒక తామర పువ్వు కాడలో ప్రవేశించారు. ఆ కాడలో సూక్ష్మరూపంలో ఉన్నాడు ఇంద్రుడు. "అమ్మా ఇడుగో నీ భర్త" అని చూపించి ఉపశ్రుతి అదృశ్యమయింది.

శచీదేవిని చూచి ఇంద్రుడు ఆశ్చర్యపోయాడు. " నేను ఇక్కడ ఉన్నట్టు నీకు ఎలా తెలిసింది?" అని అడిగాడు.

శచీదేవి జరిగింది చెప్పింది. "నాథా! నువ్వు ఇప్పుడు నహుషుని జయించి నన్ను రక్షించాలి. " అని ప్రార్థించింది.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

" దేవీ! నహుషుడు నా కన్నా బలవంతుడు అతనికి దేవతలు, మునులు తమతమ శక్తులు అర్పించారు. కాబట్టి అతడు అజేయుడు. శత్రువు అజేయుడు అయినప్పుడు కొంత కాలం వేచి ఉండడం రాజనీతి. అతనికి నీ మీద మోహం కలిగింది దానిని మనకు అను కూలంగా మలుచుకోవాలి. నీవు అతనితో సఖ్యం నటించి "నీవు నన్ను ఎలాగైనా పొందాలి అనుకుంటే మునివర్గ వాహనముమీద నా దగ్గరకు రమ్ము" అని చెప్పు దానితో అతని పని అయిపోతుంది." అని చెప్పాడు. అలాగే అని నాధుని వద్ద నుండి అమరావతికి వచ్చింది శచీదేవి.

మరల నహుషుడు శచీదేవి వద్దకు వచ్చి తన కోరికను తీర్చమని అడిగాడు. "మహేంద్రా! నేను నీపెట్టిన గడువు కు ఇంకా కొంచెం సమయం మిగిలి ఉన్నది. ఆ గడువు తీరగానే నేను నిన్ను వరిస్తాను. కాని నీవు నా వద్ద మహాముని వాహనుడవుగా రావలెను. అది నాకు ఎంతో సంతోషం కలిగిస్తుంది. నీవు అనన్య సామాన్యమైన మహాముని వాహనము మీద వస్తుంటే నీ తేజము మరింత వర్ధిల్లుతుంది." అని పలికింది శచీదేవి.

మోహావేశములో ఉన్న నహుషునకు శచీదేవి కోరికలోని ఆంతర్యం అవగతం కాలేదు. గర్వంతో పొంగిపోయాడు. ఉచితానుచితాలు

మరిచాడు. "అవును శచీదేవీ! నాకు దక్క మరొకరికి అలాంటి వాహన యోగం లభ్యము కాదు. నీకు కోరినట్టు సప్తర్షులు నా అందలము(పల్లకి) మోస్తూ ఉంటే నీను నీ వద్దకు వస్తాను." అని శచీదేవి వద్దనుండి వెళ్లిపోయాడు. వెంటనే మునులను పిలిపించాడు. మూర్ఖత్వముతో వారిని తన వాహనముగా చేసుకొని తిరుగుతున్నాడు.

శచీదేవి బృహస్పతి వద్దకు పోయి "గురుదేవా! నహుషునికి నేను పెట్టిన గడువు అయిపోవచ్చింది. నన్ను, నా నాధుని నన్ను రక్షించండి. " అని అడిగింది.

"శచీదేవీ! నీకు ఎలాంటి ఆపద కలుగదు. అతని మునివాహనము వలననే అతను తన శక్తులన్ని కోల్పోతాడు. భయపడవలదు." అని పలికాడు.

తరువాత బృహస్పతి అగ్నిని ఆహ్వానించాడు. అతనిని దేవేంద్రుడు ఎక్కడ ఉన్నాడో వెతకమని చెప్పాడు. అగ్నిదేవుడు ఒక స్త్రీ రూపంలో మనోవేగంతో సర్వదిక్కులు, భూమి, అంతరిక్షము, కొండలు, అడవులు అన్ని వెతికాడు. ఎక్కడా దేవేంద్రుడు కనపడలేదు. అదేవిషయం బృహస్పతికి తెలిపాడు. "దేవగురూ! నేను అన్ని చోట్లా వెతికాను. కాని

నాకు జలప్రవేశము అసాధ్యము. సృష్టిక్రమంలో నీటి నుంటి అగ్ని, బ్రాహ్మణుల నుండి క్షత్రియులు, రాళ్లనుండి లోహములు పుట్టాయి. ఆ ప్రకారము పుట్టిన వాటికి తమ తమ ప్రతాపము ఎక్కడనైనా చెల్లుతుంది కాని వాటి జన్మస్థానములయందు చెల్లదు. కాబట్టి నాకు జలప్రవేశము నిషిద్ధము." అని పలికాడు.

దానికి బృహస్పతి "అగ్నిదేవా! నీకు సకలమైన చరాచరములలో (స్థావర జంగమములలో) ప్రవేశము గలదు. నీవు చొరరాని చోటు లేదు. నీకు నేను నీటిలో ప్రవేశించే అర్హత కల్పిస్తాను. నీవు సకల జలరాసులలో మహేంద్రుని వెతుకుము." అని అన్నాడు. బృహస్పతి మాటప్రకారము అగ్నిదేవుడు అన్నిజలరాసులలో వెదికి తుదకు తామర తూడులో ఉన్న ఇంద్రుని చూచి అతని గురించి బృహస్పతికి చెప్పాడు. వెంటనే బృహస్పతి ఇంద్రుని వద్దకు వెళ్లాడు.

"ఇంద్రా! నీవు ఏమీ తప్పు చేయలేదు. అసలు వృత్రాసుర వధ ఎలా పాపమో చెప్పు అని అడిగాడు నీవు అనవసరంగా నీ పదవి త్యజించావు. మేము ఆ పరిస్థితులో వేరే మార్గము లేక నహుషునికి ఇంద్రపదవి కట్టబెట్టాము. అతను మా అంశలతో మదమెక్కి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నాడు. ఇప్పుడు తనను మోయడానికి ముని

వర్గమును నియోగించాడు. అతడిని పదవీ భ్రష్టుడిని చేయడానికి ఇదే సమయం. నాడు విష్ణువు ఆదేశానుసారము నీవు అశ్వమేధయాగము చేసి బ్రహ్మ హత్యాపాతకము నుండి విముక్తి పొందావు. అప్పుడు నహుషుడు నిష్కల్మషుడు. అందు వలన నీవు తిరిగి నీ ఇంద్రపదవి పొందలేకపోయావు. కాని ఇప్పుడు ఇంద్రుడు మహామునులను అవమానపరచి తన తేజమును కోల్పోయాడు. కాబట్టి అతనిని నీవు జయించి తిరిగి నీ ఇంద్రపదవి పొందవచ్చు.

ఇంతలో ఇంద్రుడు ఉన్న చోటు తెలిసి యముడు, వరుణుడు, కుబేరుడు, చంద్రుడు కూడా అక్కడకు వచ్చారు. వారందరిని చూచి ఇంద్రుడు సంతోషించాడు. నహుషుని గెలిచే ఉపాయం గురించి ఆలోచిస్తున్నాడు.

ఇంతలో అగస్త్యుడు అనే మహాముని అక్కడు వచ్చాడు. "ఇంద్రా! నహుషుడు పదవీభ్రష్టుడయ్యాడు. నీవు ఇంక నీ ఇంద్రసింహాసనము స్వీకరించవచ్చు. " అని పలికాడు. ఇంద్రుడు అగస్త్యునికి నమస్కరించి నహుషుడు ఏ ప్రకారము పదవీభ్రష్టుడయ్యాడో తెలుపమని కోరాడు. అగస్త్యుడు ఇలా చెప్పసాగాడు.

"మును లందరూ అతని వాహనమును మోస్తూ చాలా బాధలు పడుతున్నారు. ఒక రోజు నహుషుడు ఆ బ్రాహ్మణులతో ఇష్టాగోష్ఠి సలుపుతున్నాడు. అప్పుడు అతనిని ఋషులు ఇలా అడిగారు "బ్రాహ్మణములయిన మంత్రములు గోసంప్రోక్షణము నందు చెప్పబడి ఉన్నవి అవి నీకు ప్రమాణ భూతములా! " అని అడుగగా నహుషుడు మదాతిశయముచేత అవి తనకు ప్రమాణములు కావు అని అన్నాడు. అతని మాటలకు నేను అడ్డు చెప్పాను. "పూర్వాచార్యులచేత అభినందితము లయిన మాటలను నిందించుట అజ్ఞానము" అని అతనితో అన్నాను దానికి నహుషుడు కోపించి నా తలమీద తన్నాడు. దానితో అతను తనపుణ్యమును, తేజస్సును కోల్పోయాడు. అప్పుడు నేను "నహుషా! నీవు మహామునులను వాహనములుగా చేసుకొని వారిని అవమా నించావు. వారు గౌరవించు మంత్రములను ప్రమాణములు కాదని అన్నావు. అదియును కాక నన్ను అవమానించావు. కావున నీవు తక్షణమే ఇంద్రపదవిన కోల్పోదువు కాక! చాలా సంవత్సరములు భూలోకమున సర్పరూపమున పడి ఉండుము." అని శపించాను. నహుషుని ప్రార్ధనతో అతనిని అనుగ్రహించాను. అతని వంశజుడు, యుధిష్ఠిరనామధేయుడు ఐన ఒక సత్పురుషుని చూచిన అతని పాపములు తీరి అతడికి పుణ్య లోకములు ప్రాప్తించును అని అనుగ్రహించాను కాబట్టి నహుషుడు ఇంద్రపదవీ భ్రష్టుడైనాడు." అని చెప్పాడు.

ఇంద్రుడు అగస్త్యుని పూజించాడు. అమరావతి అంతా అక్కడకు తరలివచ్చింది. ఇంద్రుని అభినందించింది. వారితో కూడి ఇంద్రుడు అమరావతికి పోయి తిరిగి ఇంద్రపదవి నధిష్ఠించి శచీదేవితో సుఖంగా ఉన్నాడు.

కాబట్టి ధర్మజా! తన అధికారానికి భంగం కలిగినపుడు ఎంతటి వాడైనా అనుభవించక తప్పదు. ఇంద్రుడి లాంటి వాడే అజ్ఞాతవాసము అనుభవించాడు. కాబట్టి మీరు అనుభవించిన కష్టములకు దుఃఖపడ వలసిన పనిలేదు. దుర్వర్తనుడైన సుయోధనుడు కూడా ఆ నహుషుని వలే నశిస్తాడు. ధర్మరాజు కూడా ఇంద్రుని వలె తిరిగి తన పూర్వ వైభవ మును రాజ్యాధికారమును పొందుతాడు." అని పలికాడు. శల్యుడు హస్తినా పురమునకు ప్రయాణమయ్యాడు. ధర్మరాజు శల్యునికి యుద్ధంలో కర్ణుని నిరుత్సాహపరచడం గురించి గుర్తుచేసాడు. శల్యుడు తన సేనలతో హస్తినాపురమునకు ప్రయాణమయ్యాడు.

సాత్యకి ఒక అక్షౌహిణి సేనతో పాండవుల వద్దకు వచ్చాడు.

(ఒక అక్షౌహిణి అనగా 21870 రథాలు, అదే సంఖ్యలో ఏనుగులు, 65610 గుర్రములు, 109350 కాల్బలము. సేకరణ: తితిదేవస్థాన భారత ప్రచురణ నుండి. ).

చేధి దేశాధీశుడు ధృష్టకేతుడు, జరాసంధకుమారుడు సహదేవుడు ఒక్కొక్క అక్షౌహిణీ సేనతో వచ్చి కలిసారు. కేకయ రాజులు ఐదుగురు కూడా ఒక్కొక్క అక్షౌహిణీ సేనతో వచ్చారు. ద్రుపదమహారాజు తన కుమారులతో కూడా కలిసి ఒక అక్షౌహిణీ సైన్యముతో వచ్చాడు. పర్వతప్రాంత రాజు కూడా ఒక అక్షౌహిణీ సైన్యముతో వచ్చాడు. విరాటుడు తన సైన్యముతో వచ్చి పాండవులను కలిసాడు. పాండ్యరాజు ఒక అక్షౌహిణీ సైన్యముతో వచ్చాడు. ఈ ప్రకారముగా పాండవ సైన్యము ఏడు అక్షౌహిణులు అయింది.

అక్కడ సుయోధనుడు కూడా తన సైన్యాన్ని యుద్ధానికి సమాయత్తం చేస్తున్నాడు. భగదత్తుడు ఒక అక్షౌహిణి తోనూ, భూరి శ్రవుడు, శల్యుడు ఒక్కొక్క అక్షౌహిణితోనూ, కాంభోజరాజు సుదక్షిణుడు ఒక్క అక్షౌహిణి తోనూ, సింధురాజు జయద్రధుడు ఒక్క అక్షౌహిణీ సైన్యముతోనూ, మాహిష్మతీపతి నీలుడు ఒక అక్షౌహిణితోనూ, యాదవ వీరుడు కృతవర్మ, అవంతీరాజులు విందానువిందులు ఒక్కొక్క అక్షౌహిణితోనూ, వివిధదేశములనుండివచ్చిన సైన్యము మరొక మూడు అక్షౌహిణులు మొత్తం 11 అక్షౌహిణులు సైన్యము కౌరవుల పక్షాన యుద్ధమునకు సన్నద్ధమయింది.

(కురుపాండవుల సేన 18 అక్షౌహిణులు, యుద్ధం జరిగి ఆ సేన మొత్తం హతమయినది 18 రోజులు, యుద్ధభూమిలో ఆవిర్భవించిన భగవద్గీత 18 అధ్యాయాలు. కేవలం యాదృచ్ఛికాలు కావు కదా!)

ద్రుపద మహా రాజు పంపిన పురోహితుడు హస్తినాపురము చేరుకున్నాడు. ధృతరాష్ట్రుని, భీష్ముని, ద్రోణుని, కృపాచార్యుని, విదురుని కలుసుకున్నాడు. తరువాత సుయోధనుని కలుసుకున్నాడు. మరునాడు, ధృతరాష్ట్రుని సభలో సభికులను చూచి ఇలా పలికాడు.

"ధృతరాష్ట్రుడు, పాండురాజు అన్నదమ్ములు. వారి కుమారులు కౌరవులు, పాండవులు. వారికి తమ తమ తండ్రులు సంపాదించిన రాజ్యముమీద వారసత్వహక్కు ఉండటం న్యాయసమ్మతము. అది ఉచితము అని మీకుఅందరకు తెలుసు కదా! గతచరిత్ర అంతామీకు తెలుసు. పాండవులను చంపడానికి చేసిన ప్రయత్నాలు, వాటినుండి వారు ఎలా బయట పడినది మీకందరకూ తెలుసు. పాండవులు తమ బాహుబలముతో రాజ్యమును సంపాదించు కున్నారు. దానిని వంచనతో అపహరించిన సంగతి మీకు తెలుసు. వీటి కంతటికి తన సమ్మతిని తెలిపిన పెద్దరాజును ఏమనగలము? ఒక స్త్రీని సభలోకి ఈడ్చి తెచ్చి ఆమె వలువలు ఒలిచిన విషయం, వారి రాజ్యము హరించడం వారిని

అడవులకు పంపడం ఎలా మరువగలము. ఇప్పుడు వారు అరణ్య అజ్ఞాతవాసములు ముగించు కున్నారు. వారికి రావలసిన రాజ్యభాగము కొరకు ఈసంధి ప్రయత్నము చేస్తున్నారు.

కౌరవుల,పాండవుల ప్రవర్తన ఎరిగిన మీరు ధృతరాష్ట్రునికి నచ్చ చెప్పడం మంచిది కదా! పాండవులు కౌరవులతో వైరానికి ఇష్టపడరు. అని చెప్పి పాండవులు బలహీనులు కారు. వారి సైన్యము 7 అక్షౌహిణులు, మీ సైన్య ము 11 అక్షౌహిణులు అని అనుకుంటారేమో! మహా బలవంతు డైన భీముడు, సాహసవీరుడు సాత్యకి వెయ్యి అక్షౌహిణుల సైన్యముతో సమానము. గాండీవము ధరించిన అర్జునుని యుద్ధములో ఎదుర్కొనే వీరుడు ఎవరున్నారు ? అన్నింటికి మించి చతురోపాయ పరాయణుడు శ్రీకృష్ణుడు పాండవుల పక్షమున ఉన్నాడు. ఇంక వారికి కావాలిసినది ఏమున్నది? కాబట్టి పాండవులను ఈ సభకు పిలిపించి వారి రాజ్యభాగమును వారికి ఇచ్చి అందరూ కలిసి ఉండండి. " అని చెప్పి కూర్చున్నాడు.

భీష్ముడు లేచి "పాండవులు, శ్రీకృష్ణునితో కలిసి ఉండటం, వారు శాంతి యుతంగా సమస్యను పరిష్కరించాలని అనుకోవడం చాలా అదృ ష్టం. మీ మాటలు వినడానికి కటువుగా ఉన్నా అందరికి నచ్చేవిధంగా

ఉన్నాయి. పాండవులు ఈ సభలో పడిన అవమానాలు, అరణ్యఅజ్ఞాత వాస క్లేశములు అన్ని ఈ లోకానికి తెలుసు. ఇంకా వారిని బాధపెట్టడం మంచిది కాదు. కాబట్టి మీరు చెప్పినట్లు పాండవులను తన కుమారుల వలె ఆదరించి, వారి రాజ్యభాగము వారికి ఇవ్వడం సముచితం. అలాకాని పక్షంలో అర్జునుని కోపాగ్నికి ఆహుతి కాక తప్పదు."

ఆ మాటలకు కర్ణుడు లేచి "ఇది అందరికి తెలిసిన విషయం. మాటి మాటికీ ప్రస్తావించడం అనవసరం కదా! దుర్యోధనుని కొరకు శకుని జూదం ఆడాడు. రాజ్యం గెల్చుకున్నాడు. ధర్మపుత్రుడు ఓడిపోయాడు. ఇందులో తప్పు ఏమి ఉంది? అనుకున్న ప్రకారం అరణ్య అజ్ఞాతవాసములుపూర్తి చేయకుండా ఇప్పుడు వచ్చి రాజ్యభాగము కోరడమే అసలు తప్పు. విరాటుని, ద్రుపదుని సహాయము ఉంది కదా అని మామీద దండెత్తితే దానికి భయపడి సుయోధనుడు సగం రాజ్యం ఇవ్వాలా! ఈ ప్రపంచంలో ఇలాంటి న్యాయం ఎక్కడన్నా ఉందా? " అని అన్నాడు కర్ణుడు.

దానికి భీష్ముడు బాధపడి "కర్ణా! ఏమిటి పెద్ద వీరుడి మాదిరి మాట్లాడుతున్నావు. విన్న వారలు నవ్వుతారని కూడా చూడ కుండా పెద్ద పెద్ద మాటలుమాట్లాడుతున్నావు. కొన్ని రోజుల క్రితం అర్జునుడు

మనలను అందరిని యుద్ధంలో గెలిచాడు. కాని ఈరోజు ఈ సభలో నువ్వు అతనిని మాటలతో గెలుస్తున్నావు. అర్జునుడు ఆవులను విడిపించుకు పోవడానికి వచ్చినపుడు, సుయోధనుడు నన్ను అడిగి నప్పుడు, నువ్వు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ అందరూ వింటూ ఉండగా నేను లెక్కలు వేసి, పాండవుల అరణ్య అజ్ఞాత వాసములు పూర్తి అయినవి అని నేను మీకు అందరకూ తెలిసేటట్టు చెప్పలేదా? మరలా ఇప్పుడా ఆ ప్రసక్తి ఎందుకు వచ్చింది." అని కోపంగా అడిగాడు.

ధృతరాష్ట్రుడు భీష్ముని శాంతింపచేసాడు. ద్రుపద పురోహితుని చూచి "విప్రోత్తమా! మీరు చెప్పినది అంతయు సావధానంగా విన్నాము. తగు విధంగా ఆలోచించి మేము కూడా ఒక సౌమ్యుని పాండవుల వద్దకు పంపి మా మనసులో మాట వారికి తెలియచేసెదము. మీరు వెళ్లిరండి. " అని చెప్పాడు ఆ విప్రునికి భూషణాంబరములు ఇచ్చి సత్కరించి పంపారు. ఆ విప్రుడు కూడా వెంటనే బయలుదేరి పాండవుల వద్దకు పోయి జరిగినది అంతా వివరంగాచెప్పాడు.

తరువాత ధృతరాష్ట్రుడు సంజయుని పిలిపించాడు. అతడితో ఇలా అన్నాడు. "సంజయా! పాండురాజు కుమారులు ఉపప్లావ్యములో ఉన్నారు. నీవు వారి వద్దకు పోయి శ్రీకృష్ణునితో కూడా వారిని చూచి

వారితో ఈవిధముగా చెప్పుము. మొదట వారు అరణ్య అజ్ఞాత వాసములు పూర్తి చేసుకొని సంతోషముగా ఉన్నందుకు నా అభినంద నలు తెలుపుము. సుయోధనుడు కార్యాకార్యములు తెలిసినవాడు కానందున ఇంతటి అనర్థము కలిగినదని తెలుపుము. ధైర్యవంతులు, పరాక్రమవంతులు అయిన పాండవులది ఏమీ దోషము లేదని తెలుపుము. పాలు నీరు కలసినట్లు అన్నదమ్ములు ఒకటిగా బ్రదుక వలెనని చెప్పుము. వారు కూడా తమ తండ్రికి చెందిన రాజ్యమును అనుభవించుటకు అర్హులని తెలుపుము.మనలను అసత్యవాదులని, అన్యాయపరులని పాండవులు నమ్మరు. కాని ధర్మం తెలిసిన వాడు ధర్మజుడు ఉన్నాడు కదా! పాండవులకు వారి రాజ్యభాగము వారికి ఇవ్వకుండా ఉండలేము కదా! ఈ సమయంలో మేము గర్వించి, వారి రాజ్యభాగము వారికి ఈయకున్న, కృష్ణుని సారధ్యములో అర్జునుడు గాండీవము ఎక్కుపెడితే ముల్లోకాలు సంక్షోభిస్తాయి కదా! భీముని గదాయుద్ధం తలుచుకుంటేనే మనస్సు కంపిస్తుంది. ఇంక నకుల సహదేవులు సామాన్యులు కారు. ద్రుపదుడు సామాన్యుడా! సాత్యకి తక్కువ వాడా! పాండ్యుడు, కేకయరాజులు, వారి మిత్రులు ఎవరికీ తీసిపోరు కదా! వీరినందరినీ గెలిచినా, ధర్మజుని కోపాన్ని ఎదుర్కోడం ఆ రుద్రుని కైనా సాధ్యంకాదు కదా! కాబట్టి నీవు ధర్మరాజు వద్దకుపోయి అతడు ఉన్న సభలో అతని తమ్ములు, బంధువులు, మిత్రులు వింటూ

ఉండగా వారికి ప్రీతి కలిగేటట్టుమాట్లాడుము. వారు మనతో స్నేహము పాటంచి, కోపం వదలి, యుద్ధం అనేమాట తలపెట్టకుండా, శాంతి పాంటించే విధంగా చెయ్యి వెళ్లు. " అని పలికాడు.

ధృతరాష్ట్రుని పంపున వెళ్లిన సంజయుడు ఉపప్లావ్యము చేరాడు. ముందు శ్రీకృష్ణుని వద్దకు వెళ్లాడు. అక్కడ అర్జునునితో కూడి ఉన్న శ్రీ కృష్ణుని కలుసుకొని భక్తితో నమస్కరించాడు. వారితో సంభాషించాడు. మరునాడు ధర్మరాజును నిండు పేరోలగమున కలుసుకున్నాడు. ధర్మజునకు నమస్కరించి అతనితో ఇలా అన్నాడు.

"ధర్మజా! నా అదృష్టవశమున నిన్ను చూడగలిగాను. మీ తండ్రి ధృతరాష్ట్రుడు మీరు ఇక్కడ ఉన్నారని తెలిసి చాలా సంతోషించాడు. మీ అందరి యోగక్షేమములు తెలిసికొని రమ్మని నన్నుపంపాడు." అని అన్నాడు.

దానికి ధర్మరాజు "మా పెదనాన్న ధృతరాష్ట్రుని కరుణ వలననే మేము ఈ మాదిరిసుఖంగా ఉన్నాము. ఆయన మా క్షేమములు కనుగొని రమ్మని మిమ్మల్నిపంపడం మాకు ఆనందంగా ఉంది. మా పెదనాన్నగారు

క్షేమంగా ఉన్నారా! వారి పుత్రులుసుఖంగా ఉన్నారా! మనుమలు బాగున్నారా! వారి రాజ్యంలో జనం సుఖంగా ఉన్నారా! భీష్మ, ద్రోణ, కృప,అశ్వత్థామలు క్షేమంగా ఉన్నారా! కౌరవులు వారిని ఆదరిస్తున్నారా! కురు సామ్రాజ్యంలో బ్రాహ్మణులను ఆదరిస్తున్నారా! మేము ఆ రోజుల్లో ఇచ్చిన దానములు వర్ధిల్లుతున్నాయా! మాగురించి మా పరాక్రమాల గురించి వారు ఎప్పుడన్నా తలుచుకుంటున్నారా! దుర్యోధనుని ఇంటిలో కార్యానికి, ఖడ్గానికి, కర్ణుని ఆర్యత్వము (అంటే పెద్దరికము, మాట) సాగుతూ ఉందా!

( ఇది ఒక జాతీయము. నెల్లూరులో ఒక సామెత ఉంది. పిడుగ్గు బియ్యానికి ఒకే మంత్రం అని. అంటే ప్రతి దానికి యుద్ధం అంటూ ముందుకు దూకే స్వభావము కర్ణుడిది. దానిని ఎత్తిపొడుపుగా అన్నాడు ధర్మరాజు. ఇది తిక్కనగారి రచనా చమత్కృతి).

సంజయా! మనము మధ్యస్తులము. అర్జునుని గాండీవానికి ఎదిరించి నిలబడే వారు ఉన్నారా చెప్పు. " అని పరోక్షంగా యుద్ధమే వస్తే కౌరవులు గెలవలేరు అని చెప్పకనే చెప్పాడు ధర్మరాజు.

ఆ మాటలు అర్ధం చేసుకున్నాడు సంజయుడు దానికి దీటుగా తన వాదన వినిపించాడు. "ధర్మజా! సుయోధనుని చుట్టూ అవినీతి పరులు, నీతిమంతులు, సత్త్వసంపన్నులు, దురహంకారులు, వివిధమైన

ప్రవృత్తులు కలవారు ఉన్నారు కదా! ఎవరి దోవ వారిది. ఒకరి మాట ఒకరు వినరు కాబట్టి వారిని అనవలసిన పని లేదు. కాబట్ట నేను చెప్పేది విను.

(కాబట్టి కర్ణుని గురించి ఆలోచించ నవసరంలేదని మొదటనే తేల్చేసాడు సంజయుడు).

ధర్మజా! నీవు మంచి మనసుతో సంధి చేసుకోడానికి ప్రయత్నం చేసావు. చాలా మంచిది. ధృతరాష్ట్ర మహారాజు వృద్ధుడు. మనసు ఒక విధంగా ఉండటం లేదు. కాబట్టి కొడుకుల మాటలను కాదన లేక పోతున్నాడు. కాని మరల మనసులో బాధ పడుతున్నాడు. కాబట్టి ఇలాంటి చిన్న చిన్న విషయాలను నువ్వు పెద్దమనసు చేసుకొని సహిస్తే బాగుంటుంది. నీవు అజాత శత్రువు అని లోకానికి తెలుసుకదా! ప్రపంచంలో ఉన్న అజ్ఞానాంధకారాన్ని ప్రాలదోరటానికి బ్రాహ్మణులను సృష్టించాడు బ్రహ్మ. అలాంటి వారికి ఇచ్చినా దానములు ఎవరన్నా అపహరిస్తారా చెప్పు. (సుయోధనుడు అంత దుర్మార్గుడు కాదు అని భావన). ధర్మజా! హస్తినా పుర ప్రజలు తమను శత్రువులు ఎదుర్కొన్నప్పుడు "అయ్యో ఈసమయంలో, మా భీముడు, అర్జునుడు, కవలలు నకులసహదేవులు ఉంటే ఎంత బాగుండు అనుకుంటారు కదా! పాండవులు శాంత స్వభావులు పగవారికి కూడా హాని చెయ్యరు అని కూడా అనుకుంటారు."

(మిమ్మల్ని కౌరవులు తల్చుకోకపోయినా మీరు ప్రజల హృదయాలలో నిల్చి ఉన్నారు అని సంజయుని ఆంతర్యము).

ధర్మజా! నీవు, శ్రీకృష్ణుడు, నీ తమ్ములు, పెద్దలు ఉండగా నేను నీకు నిండుసభలో నాకు తోచినది చెపుతాను. వాటిని సావధానంగా ఆలకించు." అని అన్నాడు.

దానికి ధర్మజుడు "సంజయా! అందరూ ఇక్కడే ఉన్నారుకదా. నీవు చెప్పవలసినది చెప్పు" అని సమాధానం చెప్పాడు.

సంజయుడు శ్రీకృష్ణుని, భీముని, అర్జునుని,నకుల సహదేవులను, ద్రుపదమహారాజును, విరాటుని చూచి ఇలా పలికాడు.

"మీ పెదనాన్న ధృతరాష్ట్రుడు, శాంత చిత్తుడై ఇరు పక్షములకు సంధి కూర్చమని నన్ను ఇక్కడకు పంపాడు. కాబట్టి మనం ఈ సమయంలో తెలివిగా ప్రవర్తించవలసియున్నది. మీరందరూ సర్వధర్మములు తెలిసిన వారు. శాంతస్వరూపులు. మీరు ఎప్పుడూ చులకనైన పనులు చేయరు. మడిబట్టకు మసి అంటినట్టు మీ

సత్కులమునకు సుయోధనుని వలన కల్మషము అంటినది. దానిని నీవు తుడి చి వెయ్యాలి.

యుద్ధము అంటే అఖిల జనక్షయము కలుగుతుంది పైగా జయాపజయములు కడకు సుఖాన్ని ఇవ్వవు. ఇలాంటియుద్ధానికి మీలాంటి ఉత్తములు ఒడిగడతారా! యుద్ధం అంటే అందులో బాలురు వృద్ధులు, సఖులు, బంధువులు నశిస్తారు. అందరిని పోగొట్టుకొని ఎవరు మాత్రం ఏమి సుఖపడతారు!. మీకు శ్రీకృష్ణుడు పెట్టని కోట. భీమార్జునులు యుద్ధములో భగభగ మండే మంటల లాంటివారు. సాత్యకి, విరాటులు, ద్రుపదుడు మేరు పర్వతాల్లాంటి చుట్టాలు నీకు. ఇంక నీ పరాక్రమము గురించి చెప్పేదేముంది. మిమ్మల్ను ఆ దేవతలైనా జయించగలరా! ఇంక ఆ పక్కన ద్రోణుడు, భీష్ముడు, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు, శల్యుడు సుయోధనుని కోసం తమ ప్రాణాలు అర్పిస్తారు. ఇంక సుయోధనుని తమ్ములు, కుమారులు అజేయులు. సోమదత్తుడు బాహ్లికుడు ఆ శివునికి కూడా లొంగరు. ఇలాంటి వారు ఒకరితో ఒకరు యుద్ధం చేసుకుంటే ఎవరికి మేలు? నాకు చూడగా మంచిది కాదు అని పిస్తుంది. కాబట్టి కృష్ణా! నీకు నమస్కరిస్తాను. అర్జునా నీకు చేతులు ఎత్తి మొక్కుతాను. మిగిలిన పాండవ బంధుమిత్రులకు సవినయంగా మనవి చేస్తున్నాను. అసూయలు

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

మానండి. క్రోధమును వీడండి. శాంతించండి. ఈ ధర్మరాజును శరణుకోరుతున్నాను" అంటూ ధర్మజును చూచి "దేవా! శాంతించుట మంచిది. దీనికి భీష్మద్రోణులు సంతసిస్తారు పైగా ఇది సర్వలోక సమ్మతము" అని పలికి కూర్చున్నాడు సంజయుడు.

" సంజయా! నా మాటలలో నీకు మైత్రి తప్ప యుద్ధం అనే మాట వినపడిందా! మాకు మాత్రం యుద్ధం అంటే ఇష్టమా! యుద్ధం చేయకుండా కార్యం సానుకూలమైతే అంతకన్నా కావలసింది ఏముంది! భీమార్జునులు ఎల్లప్పుడూ జనహితమైన పనులు చేస్తారు కాని దుష్కర్మములను చెయ్యరు. సాధారణంగా జనులు దురాశకు పోయి దుఃఖాన్ని కొని తెచ్చుకుంటారు. యుద్ధం దుఃఖాన్ని కాక సుఖాన్ని ఇస్తుందా!

సంజయా! మా పెదనాన్న ధృతరాష్ట్రుడు నీతి మార్గాన్ని విడిచి పెట్టి వక్ర మార్గాన్ని నడుస్తూ, మమ్మల్ని మాత్రం చక్కని మార్గంలో నడవమని నీతులు చెపుతున్నాడా! ఎదుటి వారు కూడా తాము నడిచే మార్గంలో నడవమని చెప్పాలి గాని, నాకు మొత్తం కుడుము ఇవ్వండి మీరు మాత్రం *న్న ముక్క తీసుకోండి అని చెప్పడం బాగుంటుందా!*

ఇప్పుడు మాకు సంపద లేదు. శక్తిలేదు. మమ్ములను పిలిచి ఆదరించడానికి ధృతరాష్ట్రుడు ఏమైనా వెర్రివాడా! ఆయన ప్రవర్తన మాకు కొత్త కాదు. ఆనాడే పెద్దలు చెప్పిన మాటలు వినలేదు. ఈ నాడు వింటాడా! ధృతరాష్ట్రుడికి తన కొడుకు అత్యంత పరాక్రమ వంతుడని నమ్మకం. అతడు విషం తాగమన్నా తాగుతాడు కాని మంచి మాటలు వింటాడా! జూదపు సిరికి ఆశపడకూడదని ఆనాడు విదురుడు చెప్పి మాటలు విని ఉంటే వ్యవహారం ఇంతదూరం వచ్చేది కాదు కదా!

ధృతరాష్ట్రుడు తన కుమారులు దుర్యోధనుడు, దుశ్శాసనుడు కర్ణుడు చెప్పిన మాటలు వింటాడు కాని మంచి మాటలు వినడు. ఇదీ ధృతరాష్ట్రుని మనస్తత్వము. అది తెలిసీ నువ్వు ఇలా మాట్లాడటం నీ అవివేకమా లేక లౌకికమా! సుయోధనుడు కర్ణుని భుజబలం వలన ఆ రాజ్యం నిష్కటంకం చేసుకోవాలని అనుకుం టున్నాడు. అతను శ్రీకృష్ణుడికి అర్జునుడికి భయపడడు.

భీష్మాదులకు యుద్ధం అంటే తెలియదా! ఆశాపాశము చుట్టుకున్న వారికి యుద్ధం తప్ప వేరొకటి తెలియదు. వారిని గాండీవి కపిధ్వజ కాంతులు గుడ్డివారిగా చెయ్యడం తథ్యం.

సంజయా! ముందు మమ్మల్ని మా పరాక్రమాలను పొగిడావు. తరువాత వారితో గెలువలేమని యుద్ధం వద్దు అంటున్నావు. నీ పక్షపాతబుద్ధి విడిచి పెట్టు. మేము యుద్ధంలో కౌరవులను గెలుస్తామో లేదో అది అటుండనీ. నీవు గుణవంతుడవు. మా కోపం పొయ్యేటట్టు మాట్లాడావు. మేము కాడా సహనం వహిస్తాము. మాకు ఎన్ని అవ మానాలు చేసినా అన్నిసహించాము అన్న సంగతి నీకు తెలుసు కదా! ఇంకనూ అలాగే సహిస్తాము. మేము ఎవరికీ కీడు చెయ్యము. మామీద అనుమానం వద్దు.

నిజంగా ధృతరాష్ట్రునికి మంచి బుద్ధ పుడితే, మా తో బంధుత్వము కాంక్షిస్తే, జనులందరూ మెచ్చగా, మమ్ములను పిలిపించి గౌరవించి, తన కొడుకులతో మాకు రాజ్యభాగము ఇవ్వమని చెప్పి, మాకు ఇంద్రప్రస్థముగాని వేరే ఒక పట్టణముగాని ఇచ్చి పంపుట ఉచితము కదా! " అని అన్నాడు ధర్మరాజు.

సంజయుడు లేచి "ధర్మజా! ఎన్ని తప్పులనైనా సహించి ఓర్పు వహిస్తావని తెలిసి నీకు ఇన్ని మాటలు చెప్పాను. ఇంకా కొన్ని మాటలు చెప్పదలుచు కున్నాను. నీవు నమ్ముకున్న సత్యము అహింస నీకు సర్వసంపదలు. కౌరవులు తమ దుశ్చర్యలతో మీకు రాజ్యం భాగం

ఇవ్వకపోయినా, మీకు మాత్రం ఆ నెత్తుటి కూటికన్నా భిక్షాన్నమైనా మేలు కదా! నీవు రాజసూయ యాగం చేసిన పుణ్యాత్ముడవు. అలాంటి నీ చరిత్ర హింసతో కళంకితం కాకూడదు కదా! నీతో మాయాద్యూతం ఆడి, నీ రాజ్యం హరించి, మిమ్మల్ను అడవులకు పంపిన వారిని, నీ ఓర్పుతో, లోకమంతా నిందించేట్టు చేసావు. అడవులలో ఎన్నో కష్టాలు పడ్డావు. అలాంటివాడివి ~~ఈరోజు~~ ~~ఈ~~నీచమైన యుద్ధానికి పాల్పడి, బంధు మిత్రులను చంపుకోడం న్యాయమా! హాలా హలం దిగమింగిన ఆ మహాశివుని తర్వాత, హాలాహలం వంటి కోపాన్ని దిగమింగు కున్న నిన్ను చెప్పుకోవచ్చు. కాబట్టి కోపం విడిచి పెట్టు. నీ కీర్తిసార్ధకం చేసుకో" అని అన్నాడు సంజయుడు.

సంజయుడు చెప్పినది అంతా సావధానంగా విన్న ధర్మజుడు సంజయుని చేచి ఇలా అన్నాడు. "సంజయా! నీవు పలికినది అంతా నిజమే. కాని కొన్ని కర్మలు పైకి ధర్మములు గాకనిపించినా అవి లోతుగా చూస్తే అవి అధర్మములే. కొన్ని పనులు మొదట అధర్మములు గా కనిపించినా కొంత కాలం తరువాత ధర్మంగా రూపాందుతాయి. కాబట్టి నన్ను తిట్ట తలచుకుంటే నేను చేసినది అధర్మము అని నిరూపించి తరువాత నన్ను తిట్టు.

నువ్వుచెప్పినట్టు కోపము నివారింపవలసినదే కాదనను. అహింస ఉత్తమ ధర్మము కాని, వంశ నాశకులను, లోకకంటకులను పాపాత్ములను నిర్మూలించుట ధర్మమని పెద్దలు చెప్పగా విన్నాను. యుద్ధము రాజధర్మము అవునో కాదో నీవే చెప్పాలి. ఇది కర్తవ్యము, ఇది కర్తవ్యము కాదు అని చెప్పడానికి మాకు శ్రీకృష్ణుడు ఉన్నాడు. మనకు ఈ వితర్కము ఎందులకు? శ్రీకృష్ణుడు ధర్మము అధర్మము తెలిసినవాడు. కార్యము, అకార్యముల నిరూపణ చేయదగినవాడు. ఇది ఉచితము, ఇది అనుచితము అని చెప్పగల దిట్ట. ఇతని మాట మీదనే కదా యదు, భోజ, అంధక, వృష్ణి, సృంజయ, కేకయ రాజులు నడచుచున్నారు. ముఖ్యంగా మాకు ఇతని బుద్ధిబలము, ఇతని మాట శిరోధార్యము." అన్నాడు ధర్మరాజు.

ఈ మాటలు విన్న శ్రీకృష్ణుడు లేచి "సంజయా! నేను ఎల్లప్పుడూ పాండవుల శుభం కోరుతుంటాను. ధృతరాష్ట్రుడు కూడా తన పుత్రపౌత్రుల మేలుకోరేవాడు. అతనికి కీడు తలపెట్టడం భావ్యంకాదు. అతడు ఇప్పుడు తెలివి తెచ్చుకొని పాండవులను పరామర్శించడానికి నిన్ను పంపాడు. నీవు కూడా నీకు తోచిన ధర్మాన్ని వినయంగా చెప్పావు. నీవుచెప్పిన శాంతి వచనాలు నాకు ఎంతో సంతోషాన్ని కలిగించాయి.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

పైకి చూస్తే అంతా సవ్యంగా ఉన్నప్పటికీ ధర్మరాజు మాటల వలన సంధి పొసగదని తెలుస్తూ ఉంది. ధర్మరాజు మాటకూడా సరి అయినదే! దుర్యోధనుడు దుర్మదాంధుడు. అతని తండ్రి ధృతరాష్ట్రుడు ఎలాంటి వాడో మనకు తెలుసు కదా! ధృతరాష్ట్రుని యొక్క తీపి మాటలు, ఆదరింపు గురించి నీవు ఎంతో గొప్పగా చెప్పావు. వాటితో తృప్తిపడి, పాండవులు తమ రాజ్యభాగము అడగకుండా ఉంటారా!

గతాన్ని తవ్వుకోకుండా, ధర్మరాజు ఓర్పువహించి, కౌరవులతో కూడా గౌరవంగా బతకాలనుకుంటున్నారు పాండవులు. అది వారి గొప్పతనము, కారుణ్యము. లోకాచార ప్రకారము సంక్రమించవలసిన తమ తండ్రిరాజ్యభాగము ఇవ్వను అంటే వారు విధిలేక యుద్ధానికి సన్నద్ధం అవడం ద్రోహం అవుతుందా! సంజయా! ఇలా ఒక పక్క అవమానాలు సహిస్తూ, పొగిడించుకుంటూ, దీనంగా బతకడం కంటే, యుద్ధం చెయ్యడమే మేలు అని నాకు అనిపిస్తూ ఉంది. యుద్ధము క్షత్రియులకు ధర్మమా కాదా అని నిన్ను ధర్మజుడు అడిగాడు కదా! ద్విజులకు (అనగా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఉపనయన అర్హత కల్గినవారు) వారి వారి కర్మములను నిర్దేశించునపుడు, ధర్మశాస్త్రవేత్తలు, క్షత్రియులు ఇవ్వడమేగాని తీసుకొనువారు కాదు, ఒకరిని వేడుకొను వారు కాదు అని చెప్పడం లోకంలో అందరికీ తెలుసు.

పైగా క్షత్రియులు వర్ణాశ్రమ ధర్మములను రక్షింప వలసినవారు. అట్టి క్షత్రియులు నిజధర్మాన్ని వదులుకుంటారా!

అదీ కాకుండా, తాము న్యాయంగా సంపాదించుకున్న ఆస్తిని, తమకు కలిగిన సంపదను అనుభవించుచూ ధర్మమార్గములో జీవిస్తున్న వారికి, ఇతరులు అన్యాయము చేస్తే అలాంటి వారి కోసం గదా ఈ ధర్మములు నిర్ణయింపబడినది.

(ఈనా టికి కూడా తాము న్యాయంగా కొనుక్కుని, స్వాధీనంలో ఉంటూ అనుభవిస్తున్న ఆస్తికి, వారి శాంతియుతమైన స్వాధీన అనుభవాలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే వెంటనే వారికి తగు రక్షణ కల్పించడానికి, ఆ దురాక్రమణ దారులను నిరోధించడానికి . Injunctions viz, Permanent Injunction, Temporary Injunction, Mandatory Injunction etc.) అని ఈనాటికీ కోర్టులు అనుసరిస్తున్నాయి. మన కోర్టులలో ఉండే 90 శాతం దావాలు ఇలాంటివే).

సంజయా! ఇప్పుడు నీవు ఇక్కడ పలికిన ధర్మములు కౌరవులకు చెప్ప వలదా! వారే కదా రాబోవు పరిణామాలను విస్మరించి, దుర్మార్గం ప్రవర్తించింది. అదియును కాక, నిండు సభలో, వెయ్యిమంది ఎదుట,

దుర్మార్గంగా ద్రౌపది వలువలు ఊడదీసిన వారు ఎంతటి తులువలో తెలుస్తూ ఉంది కదా! లోకంలో జూదం ఆడరా! జూదంలో ఓడిపోయిన వారిని ఇలాగే చేస్తున్నారా! చెప్పుసంజయా!" అని నిలదీసాడు కృష్ణుడు.

" శ్రీకృష్ణా! నీవు కూడా ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకుంటే కార్యం ఎలా సఫలం అవుతుంది చెప్పు. " అని అన్నాడు సంజయుడు.

దానికి మరల కృష్ణుడు "మరి ఆరోజు సభలో భీష్మ,ద్రోణ, కృపాచార్యులు మొదలగు వృద్ధులు ఉన్నారు కదా! వారెందుకు నోరు మెదపలేదు. ఆ ధృతరాష్ట్రుడు కూడా కొడుకులను పల్లెత్తు మాట అనలేదు. ఆ రోజే కనుక ధృతరాష్ట్రుడు వారించి ఉంటే నేనే కాదు లోకం అంతా సంతోషించేది కదా! దుర్మార్గు డైన దుశ్శాసనుడు తిట్టుకుంటూ ద్రౌపదిని నిండు కొలువులోకి ఈడ్చుకొస్తుంటే, మామ గారైన ధృతరాష్ట్రుడు ఎలా సహించగలిగాడు? ద్రౌపది ఏడ్పు అతనికి వినపడలేదా? వినపడ్డా ఎలా ఓర్చుకున్నాడు? ఇప్పుడు తగుదునమ్మా అంటూ వారి క్షేమం కనుక్కోడానికి దూతగా నిన్ను ఎలా పంపాడు?

ఒక స్త్రీని జుట్టుపట్టుకొని సభలోకి ఈడ్చుకొని వస్తే అది మంచిది కాదు అని తెలిసి కూడా సభలో వారంతా మిన్నకుంటే ఆమె తనకు తానే రక్షించుకుంది. అందుకని ఆమెకు అవమానం జరగలేదు. కాబట్టి కౌరవులు బతికిపోయారు. పాండవులు ఇలాంటి అవమానాలు సహించవలసిందేనా!

సంజయా! ఆనాడు నువ్వు కూడా సభలో ఉన్నావు కదా! చెవుల్లో శూలాలు పొడిచి నట్టు కర్ణుడు మాట్లాడిన మాటలు నువ్వు వినలేదా! "ఇక్కడ నీ భర్తలు లేరు. వీరు జూదములో నిన్ను ఓడిపోయి నిన్ను విడిచిపెట్టేశారు. ఈ సభలో నీ నచ్చిన మగాడిని భర్తగా వెతుక్కో. " అని నాడు కర్ణుడు అనలేదా! కర్ణుని మాటలు తన హృదయంలో శరముల మాదిరి నాటుకోగా దుర్భరవేదన అనుభవిస్తున్న ద్రౌపదిని చూచి ఎవరన్నా ఓదార్చారా నువ్వే చెప్పు. అంతే కాక, దుశ్శాసనుడు, "నీకు భర్తలు ఉండీ లేనట్టే. ఇక్కడ పౌరుషం ఉన్న మగాడెవ్వడు?" అని హేళన చేసాడు కదా.

నిజమే సంజయా! పాండవులు అప్రయోజకులే. కాని ఆమాటలు అనడం వల్ల వారికి ఏమి ప్రయోజనం కలిగింది. ఆ తరువాత అన్న మాటలు సభలో చెప్పవలసినవి కావు. కాబట్టి ఈ సంధి పొసగదు.

అయినప్పటికినీ, నేను పాండవులను ప్రార్థించి ఒప్పిస్తాను. హస్తినాపురానికి వస్తాను. కౌరవులకు బుద్ధిచెపుతాను. నామాటలకు ఒప్పుకొని వారు రాజ్యభాగము పాండవులకు ఇస్తే బతికిపోతారు. నా మాటలు మన్నించి, పాండవులకు అన్యాయము చెయ్యరని ఆశిస్తున్నాను. అలా కాకుండా ఏమన్నా కుటిలోపాయములు పన్నితే పాండవ బాణాగ్నికి ఆహుతి అవుతారు. వారి కుటిలత్వము, వారి దురాశ వారిని నాశనం చేస్తుంది. ఇది తథ్యము.

సంజయా! మరొక్కమాట సుయోధనుడు రోషంతో కూడిన మహా వృక్షము. అందులో కాండము కర్ణుడు. కొమ్మలు శకుని. వాటికి పుట్టిన దుష్ఫలములు దుశ్శాసనుడు. దానికి మూలం (వేరు) ధృతరాష్ట్రుడు.

కాని ఇక్కడ ధర్మరాజు ధర్మము అనే మహావృక్షము. దానికి కాండము అర్జునుడు. భీముడు శాఖోపశాఖలు. నకులసహదేవులు పుష్పములు, ఫలములు. ఈ మహా వృక్షమునకు మూలము సద్బ్రాహ్మణులు, వేదములు. ఈర్ష్యాసూయలు వదలి వీటి రెండింటిలో ఏది మంచిదో నువ్వే చెప్పు! ధృతరాష్ట్రుడు అతని కుమారులు మహారణ్యము అయితే అందులో తిరిగే సింహాలు పాండవులు. సింహాలు

లేని అడవిని కొట్టేస్తారు. అడవిని వదని సింహాలు బతకలేవు. కాబట్టి కురుపాండవులు ఒకరిని ఒకరు ఆశ్రయించుకొని జీవించాలి.

ధృతరాష్ట్రుడు కూడా పాండవులను తన కుమారుల మాదిరి చూడాలి ఆదరించాలి. అప్పుడు పాండవులు కూడా కౌరవులను అనుసరించుకొ ని ఉంటారు. కావున, ఈ పనిమీద నేను హస్తినా పురము నకు వస్తాను. అతడు నా మాటలకు ఒప్పుకుంటాడో లేదో చూస్తాను దానిని బట్టి కర్తవ్యమును నిర్ణయిస్తాను. ఈవిషయం నీవు ధృ తరాష్ట్రునకు చెప్పు. అని అన్నాడు శ్రీకృష్ణుడు ఆవేశంగా.

శ్రీకృష్ణుడు చెప్పిది అంతా విన్నాడు సంజయుడు. "అలా అయితే మరీ మంచిది. నేను వచ్చిన పని సఫలం అయినది అనుకుంటాను." అని భీమార్జున, నకుల సహదేవులను, సాత్యకి, ద్రుపద మహారాజు,విరాటరాజులను చూచి "అయ్యా! అందరూ నాకు అనుజ్ఞ ఇవ్వండి. నేనుపోయి వచ్చెదను నేను పలికిన పలుకులలో ఏమీ తప్పులేదు కదా! " అని ధర్మరాజు వైపు చూచాడు.

దానికి ధర్మజుడు "సంజయా! అందరూ వింటూ ఉండగా నీవు చెప్పిన మాటలలో ఒక్క మాటకూడా అనుచితము అయినది లేదు.

నీ నోటినుండి అవినీతి, అధర్మమైన మాటలు అసలు రావుకదా! మాకు నీవు ఒకటే, విదురుడు ఒకటి కాదు కదా! నీకు ఉన్న వినయము, నేర్పు మరొకరికి ఉంటాయా!

నీవు హస్తినాపురమునకు పోయి తాత భీష్మునకు, గురుడు ద్రోణునికి, కృపాచార్యునికి మా నమస్కారములు తెలుపుము. మా తండ్రి ధృతరాష్ట్రునికి నా నమస్కారములు తెలుపుము. సుయోధనుని క్షేమము అడిగానని చెప్పు. దుశ్శాసనుని కుశలము అడిగానని చెప్పు. విదురుని, శల్యుని వినయంగా అడిగానని చెప్పు. నా స్నేహితుడు అశ్వత్థామను అక్కున చేర్చుకున్నాని చెప్పు. బాహ్లికుని,సోమదత్తుని భూరిశ్రవసుని ప్రియంగా పలకరించానని చెప్పు. మరియు అక్కడ ఉన్న వృద్ధులైన రాజులకు, కృతవర్మకు, కర్ణ, శకుని, సైంధవుడు మొదలగు వారికి, మాతో యుద్ధం చెయ్యడానికి వచ్చిన సకలదేశాధీశులకు ఎవ్వరికి తగ్గట్టు వారికి వినయంగా, బంధుప్రీతితో, వాత్సల్యముతో, సముచిత రీతిలో నా ప్రణామములు నా బదులుగా అందజేయుము. దాసదాసీజనములని ఉపేక్షించకుండా, మేము శత్రువులను జయించి, వారిని ఆదరించెదమని చెప్పుము. తరువాత నా తండ్రి ధృతరాష్ట్రుడు సభలో ఉండగా నా మాటలుగా ఈ విధంగా చెప్పుము.

"అనఘా! నీ దయవలన మేము సుఖంగా ఉన్నాము. మాకు మా బాల్యములోనే మా తండ్రిగారి రాజ్యభాగము మాకు ఇచ్చి మమ్ములను దయతో కాపాడావు. నీవు శంతనుని వంశమును కాపాడుతున్నావు. ఈనాడు కూడా నీ ఇష్టప్రకారము పొందు చేసి, అధర్మమును, చావును తొలగించిన, ఈ జనము, రాజులు బ్రాహ్మణులు నిన్ను ప్రస్తుతిస్తారు కదా!

మా తాత భీష్మునితో "ఇంత అవమానము జరిగినా పాండవులు శాంతికాముకులు అనీ, యుద్ధము అనే మాట తలపెట్టరని" చెప్పుము.

సుయోధనునితో "మేము అత్యంత బలవంతులమ్మై కూడా, రాజ్యమునుండి వెళ్లగొట్టిన మీ వెర్రితనము, అడవులలో కూడా మమ్ము లను బాధలు పెట్టిన దురుసు తనము, నిండు సభలో పాండవ పత్నిని అవమానించిన మీ తులువతనము ధర్మరాజు సహించాడు" అని చెప్పు. అతనిని అతని సోదరులను అనవసర యుద్ధములో మరణించవద్దని చెప్పుము. "ఇతరుల సొత్తుకు ఆశించ కుండా, వారి రాజ్యభాగము వారికి ఇచ్చి, అందరం కలిసి బతుకుదాము" అని చెప్పు. మేము యుద్ధము జోలికి పోకుండా పొందు కోరుట తనకే మేలు అని చెప్పుము.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

సుయోధనునికి అతని దురాశ గురించి ఎవరూచెప్పకపోవడం వలన నేను చెప్పవలసి వచ్చినది. సుయోధనుని వైపు మహావీరులు ఉండవచ్చు. కాని మా పక్క ధర్మం ఉంది. ధర్మస్వరూపుడైన శ్రీకృష్ణుడు ఉన్నాడు. కాబట్టి మమ్మల్ని యుద్ధంలో గెలవడం కష్టం. నేను భీమార్జునులకే కాదు, సుయోధనునికూడా పెద్ద వాడినే. కాబట్టి నా మాట మన్నించి, నా శాంతి మార్గాన్ని సాగనిచ్చి, యుద్ధం జోలికి పోకుండా, ఎవరి రాజ్యం వారు అనుభవిస్తూ, అందరం సుఖంగా ఉందాము. ఇది పెద్దలకు, ప్రజలకు, బుద్ధిమంతులకు ఎంతో సంతోషాన్ని కలుగచేస్తుంది.ఒక వేళ మాకు అర్ధరాజ్యం ఇవ్వలేకపోతే కుశస్థలము,వృక్షస్థలము, వాసంతి, వారణావతము, ఇచ్చి మా అన్నదమ్ములకు నిలువ నీడ కల్పించమని చెప్పుము. దాని వలన సర్వజనములకు శాంతి, బంధుమిత్రులకు, సౌభాగ్యము కలుగుతుందని చెప్పు. దాని వలన, కురు, పాంచాల, యాదవ, మాత్స్య దేశముల వారు పరస్పర ప్రీతిపాత్రులై బ్రతుకుదురు అని చెప్పుము. ఇవి అన్నియు నా పెదతండ్రి ధృతరాష్ట్రునకు, సుయోధనునికి విశధంగా చెప్పుము." అని పలికాడు ధర్మరాజు.

దానికి సంజయుడు "దేవా! మీరు ఆనతిచ్చిన ప్రకారము చేస్తాను. మీ తండ్రిగారు నీకు, నీ తమ్ములకు, వాసుదేవునకు ప్రియం కలిగేట్టు చేస్తాడు అని విశ్వసిస్తున్నాను." అని అన్నాడు.

అర్జునుడు సంజయుని చూచి "మిత్రమా! నీవు నాకు బాల్య మిత్రుడవు. నీ మంచిదనము మాకు తెలియదా! ఆనాడు ధర్మరాజు దయాగుణము అనే అంకుశంతోనే భీముడు అనే మత్తగజాన్ని ఆపగలిగాడు. ఈరోజూ అదే జరుగుతోంది. ఇంక సుయోధనునికి విచారం ఎందుకుంటుంది చెప్పు. వెళ్లిరా!" అని పలికాడు.

అందరి దగ్గర సెలవు తీసుకొని సంజయుడు హస్తినాపురమునకు ప్రయాణమయ్యాడు.

## మహా భారతము ఉద్యోగపర్వము
## ప్రథమాశ్వాసము సంపూర్ణము.

# మహా భారతము

# ఉద్యోగపర్వము

# ద్వితీయాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు మహాభారత కధను ఈ విధంగా చెప్పసాగాడు.

ఆ ప్రకారము సంజయుడు ధర్మజుని వద్ద సెలవు తీసుకొని ఉపప్లావ్యము వదలి హస్తినాపురము చేరుకున్నాడు. ధృతరాష్ట్రుని అంతఃపురమునకు వెళ్లాడు. అతనిని దర్శించాడు. ధృతరాష్ట్రుడు అతనిని సమ్మానించి తన పక్కన కూర్చోపెట్టుకొని జరిగిన విషయములు చెప్పమని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

" మహారాజా! ధర్మరాజు మీ క్షేమసమాచారములు, నీ పుత్రుల క్షేమములు అడిగాడు." అని చెప్పాడు.

"సంజయా! ధర్మరాజుకు క్షేమమే కదా! అతని అన్నదమ్ములందరూ క్షేమంగా ఉన్నారా! అతని బంధువులు, మిత్రులు, మంత్రులు అతని యెడల ప్రీతితో మెలగుతున్నారా!" అని అడిగాడు.

" దేవా! మీ దయవలన అందరూ క్షేమంగా ఉన్నారు. ధర్మజునికి అహింస, ధర్మచింతన మెండు కదా. అతను తన భుజ బలం కన్నా ధర్మాన్ని, దైవాన్ని ఎక్కువగా నమ్ముతాడు. అతడు భారం నీ మీద పెట్టాడు. నీవు నీ కొడుకును నమ్ముకుంటావు. నీ కొడుకు కర్ణుడు, శకుని మాటలు నమ్ముతాడు. వారి అధీనంలో ఉంటాడు. కడుపుకు అన్నం తినే వారు నీ కొడుకులు చేసే దుర్మార్గాలు చూస్తూ ఊరుకుంటారా! నీవు ఒక్కడివే కొడుకులను కన్నావా! లోకంలో ఎవరికీ కొడుకులు లేరా! కొడుకులు దుర్మార్గులయితే వారికి బుద్ధిచెప్పవలదా! నీ మాదిరి చూస్తూ ఊరుకుంటారా! ప్రజలంతా నిన్ను తిడుతుంటే వినలేక నాచెవులు తూట్లు పడుతున్నాయి. నువ్వు, నీ కొడుకు సుయోధనుడు, దుశ్శాసనుడు, శకుని ఎలా ఆడిస్తే అలా ఆడుతున్నారు. పాండవులు సహిస్తున్నారు కాబట్టి సరిపోయింది లేకపోతే లేకపోతే నువ్వు నీ కుమారులు నాశనం అయి ఉండేవారు. నువ్వు, నీ కొడుకులు ధర్మరాజు శాంతగుణాన్ని భయం గా అనుకుంటున్నారు. అది తప్పు. అతడు తన తమ్ములను అదుపులో పెడుతున్నాడు కాబట్టి మీరు బతికిపోతున్నారు.

అతడే కనుక ఆగ్రహిస్తే మీరు మిగలరు. దేవా! జూదం ఆడిన రోజే అవినీతికి బీజం పడింది. అది కార్చిచ్చులాగా పాకిపోయింది. ధర్మరాజు మెత్తని పులి. నువ్వు నీ కొడుకు చేసే అకృత్యాలకు లోకులంతా నిన్ను నీ కొడుకులను నిందించేటట్టు చేస్తున్నాడు. కాని ఏమీ ఎరగనట్టు ఉంటాడు. అవసరం వచ్చినపుడు తిరగబడతాడు. అప్పుడు అతనిని ఎవరూ ఆపలేరు. అదిసరే ప్రయాణ బడలికవలన ఒళ్లంతానొప్పులుగా ఉన్నాయి. రేపు సభలో అని వివరిస్తాను." అని సంజయుడు వెళ్లిపోయాడు.

ధృతరాష్ట్రుడు వెంటనే విదురుని పిలిపించాడు. విదురుడు రాగానే అతనిని పక్కన కూర్చోపెట్టుకొని ఇలా అన్నాడు.

"విదురా! సంజయుడు ఉపప్లావ్యమునుండి వచ్చాడు.నన్ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు. రేపు వస్తానని వెళ్లాడు. మనసంతా వికలంగా ఉంది నిద్రపట్టడం లేదు." . అని అన్నాడు.

దానికి విదురుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "ధృతరాష్ట్రా! బలవంతుని చేతిలో దెబ్బలుతిన్న బలహీనుడు, డబ్బు పోగోట్టు కున్నవాడు, ఇతరుల డబ్బు ఎప్పుడు అపహరిద్దామా అని కాచుకొని

ఉన్నవాడు, కామంతో కైపెక్కినవాడు, నీలాగే నిద్రపట్టక బాధపడతారు. వీటిలో నీకు ఏ దోషం ఉంది? ఇతరుల ధనం నీవు ఒక్కడివే అనుభవించాలని అనుకుంటున్నావు కదా! అందుకే నీకు నిద్రపట్టడం లేదు."

" అదికాదు విదురా! అసలు ధర్మరాజు ఏమన్నాడో తెలియలేదు. అందుకే నిద్రపట్టడం లేదు." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

"ధృతరాష్ట్రా! బలవంతుని చేతిలో దెబ్బలుతిన్న బలహీనుడు, డబ్బు పోగోట్టుకున్నవాడు, ఇతరుల డబ్బు ఎప్పుడు అపహరిద్దామా అని కాచుకొని ఉన్నవాడు, కామంతో కైపెక్కినవాడు, నీలాగే నిద్రపట్టక బాధపడతారు. నీలో వీటిలో ఏ దోషం ఉంది? ఇతరుల ధనం నీవు ఒక్కడివే అనుభవించాలని అనుకుంటున్నావు కదా! అందుకే నీకు నిద్రపట్టడం లేదు."

" అదికాదు విదురా! అసలు ధర్మరాజు ఏమన్నాడో తెలియలేదు. అందుకే నిద్రపట్టడం లేదు." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

" రాజా! నీకు ధర్మరాజు నీకు బంధువు హితుడు. నీ సేవకుడు. పైగా అతడు శాంతమూర్తి. వినయ వివేకశీలి. అతడు తప్పు

మాట్లాడతాడా! నువ్వు నీ కొడుకే కదా వారికి అన్యాయం చేసి నానా బాధలకు గురి చేసింది. ఇప్పటికన్నా వారి రాజ్యభాగం వారికి ఇచ్చి న్యాయం చెయ్యి. నువ్వు నీ రాజ్య భారాన్ని శకుని, కర్ణుడు, దుశ్శాసనుని మీద మోపావు అది మంచిది కాదు. ధర్మరాజు కూడా నీవు తన పెదనాన్నవని మీరు చేసిన దుర్మార్గాలు అన్ని ఓపికతో సహించాడు. అది నీకూ తెలుసు." అని అన్నాడు విదురుడు.

" విదురా! రేపు సంజయుడు చెప్పబోవు మాటలు విని మనకు ఏది క్షేమకరమో అది నాచేతచేయించు. ఇప్పుడు నా మనసుకు శాంతము కలిగేటట్టు నీ వచనామృతము నామీద కురిపించు" అన్నాడు ధృతరాష్ట్రుడు.

అప్పుడు విదురుడు ధృతరాష్ట్రుడితో ఇలా చెప్పసాగాడు.

(దీనినే విదుర నీతి అంటారు).

"రాజా! ప్రతి వాడూ లోకం తనను నిందించే పనులు చేయరాదు. లోకహితమైన కార్యాలు ఆచరించాలి. పరుల సంపదకు ఈర్ష్య పడక, నలుగురితో కలిసిమెలిసి బతకాలి.

కోపగించుకోవడం, పరుల మాటలకు పొంగిపోవడం, గర్వించడం, ఎంత ఉన్నా తృప్తిలేక పోవడం, దురభిమానము, ఏపనీ చేయకపోవడం దుర్జనుల లక్షణాలు.

తనను పాలించే రాజునూ, లోకాన్ని పాలించే భగవంతుడిని, కట్టుకున్న భార్యను, బంధువులను సముచితంగా ఆదరించని వాడికి ఏపని చేసినా సత్ఫలితాన్ని ఇవ్వదు.

ఉపాయము తెలియని వారు, తమను ప్రేమించే వారిని ఇష్టపడరు. తాము అంటే ఇష్టం లేని వారి వెంట పడతారు. తమ కంటే ఎదుటివాడు బలవంతుడని తెలిసి వారి మీదికి వెళతాడు.

ధనమూ, విద్య, వంశము  మంచివారికి అణకువను, గౌరవాన్ని కలిగిస్తే, చెడ్డవారికి మదాన్ని గర్వాన్ని కలుగచేస్తుంది.

ఒక బాణం  ఒకడిని బాధిస్తుంది లేకపోతే తప్పిపోతుంది. కాని ఒకని నీతి,  సమయస్ఫూర్తి అతని శత్రువును నాశనం చేస్తుంది.

తాను ఒక్కడే తినడము, అందరూ నిద్రపోతున్నప్పుడు తాను ఒంటరిగా ఆలోచించడం, ఒంటరిగా ప్రయాణం చెయ్యడం మంచిది కాదు.

లోకంలో సత్యము ను మించిన గుణము మరొకటి లేదు. చాలామంది క్షమించే గుణాన్ని చేతగాని తనం గా భావిస్తారు. కాని క్షమాగుణాన్ని మించిన ధర్మము మరొకటి లేదు.

పరుషవాక్యములు మాట్లాడక పోవడం, పాపపు పనులు చెయ్యక పోవడం వలన మనిషి ఉత్తముడు అవుతాడు. బలవంతుడై కూడా శాంతంగా ఉండేవాడు, పేదవాడయికూడా దానం చేసేవాడు, పుణ్యపురుషుడు అనిపించుకుంటాడు.

న్యాయార్జితమైన ధనాన్ని అర్హులకు ఇవ్వకపోవడం, అనర్హులకు దానం చెయ్యడం వలన కీడు కలుగుతుంది.

పరస్త్రీ వ్యామోహం, మద్యపానము, వేటాడటం, పరుషంగా మాట్లాడటం, పోట్లాడటం, డబ్బువృధాగా ఖర్చుచెయ్యడం అనునవి సప్తవ్యసనములు. విజ్ఞులు వీటియందు ఆసక్తిచూపరు.

తనకు ఉచితమైన దుస్తులు ధరించడం, తనను తాను పొగుడుకోక పోవడం, ఒకరికి దానమిచ్చి ఎందుకు ఇచ్చానా అని బాధపడటం, కష్టకాలంలో కూడా ధర్మం తప్పకపోవడం మంచి నడవడి అనిపించుకుంటుంది.

స్నేహం చేసినా, మాట్లాడినా, పోట్లాడినా, తనకు సమానమైన వారి తోనే చెయ్యాలి గాని తమకంటే అధికులతో గాని అల్పులతో గాని చేయరాదు.

తనకు ఉన్నదానిలో పరులకు పెట్టి తాను తినడం మంచిది. అడిగితే శత్రువుకైనా ఇవ్వడం మంచిది. ఎక్కువ కష్టపడి కొంచెం సుఖపడటం మంచిది.

మంచివారు పొగడ్తలకు పొంగిపోకుండా పరులకు మేలు చేస్తారు. కీడు చేయరు.

నేను చెప్పిన పై లక్షణాలు అన్ని ధర్మరాజులో ఉన్నాయి. నీవు పాండవులను పెంచి పెద్దచేసావు. ఇప్పుడు వారిని నిరాదరణకుగురి చేసావు. కాబట్టి వారి రాజ్యభాగము వారికి ఇచ్చి నీకొడుకులతో పాటు వారిని కూడా ఆదరించడం ఉచితము. మీరు వారు ఒక్కటిగా ఉన్నంత

కాలము మీ వైపు దేవతలుకూడా కన్నెత్తి కూడా చూడలేరు." అని అన్నాడు విదురుడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు విదురునితో "అయితే ఇప్పుడు నన్ను ఏమి చెయ్యమంటావు?" అని అడిగాడు.

దానికి విదురుడు "అలా అడిగితే నేను ఏమని చెప్పను, ఉన్న మాట చెప్పడం తప్ప. రాజ్యం దక్కింది కదా అని నీ తమ్ముని కొడుకులకు భాగము కూడా నువ్వే మింగెయ్యాలని చూస్తున్నావు. ఇది ఎట్లుందంటే చేప ఎరతోపాటు గాలంకూడా మించినట్టుంది.

బాగా పండకుండా పండును కోస్తే రుచిగా ఉండక పోగా విత్తనానికి కూడా పనికిరాదు.

పరుల ధనానికి, పరుల విద్యకు, పరుల పరాక్రమానికి ఈర్ష్య పడేవాడు ఏ రోగం లేకుండానే బాధపడుతుంటాడు.

ఎదుటి వాడికి ప్రియంగా మాట్లాడ లేకపోతే నోరుమూసుకొని కూర్చోవాలి. మనం మాట్లాడే మాటల వలననే చెలిమి –పగ, తెలివి –

కలత, ధర్మము –పాపము, కీర్తి –అపకీర్తి కలుగుతాయి. కాబట్టి మంచి మాటలు మాట్లాడటం అలవర్చుకోవాలి. ఒక చెట్టును గొడ్డలితో నరికినా మరల చిగురిస్తుంది కాని మాటలతో చెడిన కార్యము బాగుపడదు. శరీరమునకు అయిన గాయములను మాన్పవచ్చుకాని మాటలతో మనసుకు అయిన గాయం మాన్పలేము.

రాజా! ధర్మరాజు నోట ఇప్పటిదాకా ఒక్క పరుషమైన మాట రాలేదు. కాని నీ కొడుకులు అత్యంత నీచంగా మాట్లాడిన మాటలు నీవు వింటున్నావు కదా! చేటు కాలము దాపురిస్తే చెడ్డ మాటలు తియ్యగా ఉంటాయి. చెడ్డ వాళ్లు చేసే పనులు వారికి మంచిగానే తోస్తాయి. కాని మనసు మాత్రం అవి చెడ్డ పనులు అని నిశ్చయిస్తుంది.

నీ బుద్ధి పాండవుల తో విరోధం కోరుతూ ఉంది. ఏం చేస్తాం. ధర్మనిరతుడైన ధర్మజుడు తన సంపదకు దూరమగుట న్యాయమా! అతడు నీ పెద్దతనాన్ని గౌరవిస్తున్నాడు.

ఎన్ని పుణ్యకార్యాలుచేసినా, అవి ధర్మవర్తనకు సరికావు. ధర్మ వర్తనునికి ఇహలోకంలో కీర్తి ఎంతకాలం ఉంటుందో అంతకాలం పరలోకంలో పుణ్యలోకాలు కలుగుతాయి.

పూర్వము ప్రహ్లాదుడు రాక్షస కులంలో జన్మించినా, ధర్మం తప్పలేదు. తన కొడుకు విరోచనుడికి, అంగిరసుడు అనే బ్రాహ్మణుని కుమారునికి ఒక వివాదం వస్తే, ప్రహ్లాదుడు తన కొడుకు అని కూడా చూడకుండా, అంగిరసుడుకి అనుకూలంగా తీర్పుచెప్పాడు. కాబట్టి నీవు కూడా ధర్మం తప్పకుండా నీకొడుకుల మీద పక్షపాతం వదలి ఇరువురికి సంధి చెయ్యి. దాని వలన ఇరువురూ ఆపదలు లేకుండా సుఖంగా ఉంటారు.

పెద్దవాళ్లు లేని సభ ఒకసభకాదు. అలాగే న్యాయం మాట్లాడలేని పెద్దలు పెద్దలు కాదు ధర్మాచరణలో సత్యం లేకపోతే అది ధర్మమేకాదు. ఏదో ఒక మిషమీద చెప్పే మాట సత్యమూకాదు.

నీతి మార్గంలో బతకడం ఉత్తమము. శౌర్యముతో సంపదలు పొందుట మధ్యమము. భారంగా బతుకు లాగడం అధమము.

నీతి తప్పి చరించేవారిని ఉత్తములు మెచ్చుకుంటారా! నీ పుత్రులు ఎల్లప్పుడూ యుద్ధోన్మాదంలో ఉరకలు వేస్తుంటారు. దానికి తోడు కర్ణుడు అగ్ని కి ఆజ్యం పోస్తుంటాడు. నీకేమో నీతి అంటే పట్టదు. పాండవులు అనవసరంగా యుద్ధానికి కాలు దువ్వరు. ఎదుటివాడు కయ్యానికి వస్తే వాడిని విడిచి పెట్టరు.

పాండవులు నిన్ను తమ తండ్రిమాదిరి గౌరవిస్తున్నారు. నువ్వు కూడా వారిని నీ కన్నకొడుకులతో సమానంగా చూడటం మంచిది.

మహారాజా! మేలు చేసిన వాడికి కీడు చేస్తే, వాడి శవాన్ని కుక్కలుకూడా తాకవు. కాబట్టి చేసిన మేలు మరవడం మహా పాపము. నీ తమ్ముడు పాండురాజు నీకు పరమ భక్తుడు. పాండురాజు కుమారులు పాండవులు కూడా నీకు ఎంతో మేలు చేసారు. వారిని ఆదరించడం మంచిది.

ప్రతి మనిషి జీవితంలో సుఖ దుఃఖాలు సర్వసాధారణం. వాటి గురించి దుఃఖించడం ఎందుకు. దుఃఖము వలన బలం తగ్గుతుంది. శరీరం కృశిస్తుంది. మతి చెడుతుంది. రోగం వస్తుంది. అది శత్రువులకు బలం చేకూరుస్తుంది. కాబట్టి దుఃఖించడం మానుకో. " అని అన్నాడు విదురుడు.

దానికి ధృతరాష్ట్రుడు విదురునితో "విదురా! నేను ధర్మతనయుడిని నా మాటలతో చేతలతో బాధించాను. దాని వలన నా కొడుకులకు

మరణం తథ్యం. కాబట్టి నాకు దుఃఖం కలగదా! ఆ దుఃఖం కలగకుండా ఉండే మార్గం చెప్పు. " అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

దానికి విదురుడు ఈ విధంగా చెప్పసాగాడు. " మహారాజా! ముందు నువ్వు లోభం విడిచి పెట్టు. ఇంద్రియములను అదుపులో పెట్టుకో. మనశ్శాంతి అదే లభిస్తుంది.

జ్ఞాతి వైరం వదలి పెట్టు. గోవులను అపహరించడం, బ్రాహ్మణులను అవమానించడం, స్త్రీలను అవమానించడం నివారించు. అన్నదమ్ములు అందరూ కలిసి ఉండేట్టు చూడు. ఎందుకంటే ఒకే చెట్టు ఉంటే దానిని ఎవరన్నా కూల్చవచ్చు. అదే చెట్లు గుంపుగా ఉంటే పెను గాలులు కూడా ఏమీ చెయ్యలేవు. అలాగే అన్నదమ్ములు అందరూ కలిసి ఉంటే శత్రువులు కూడా ఏమీ చెయ్యలేరు. కాబట్టి కౌరవులు పాండవులు కలిసి మెలిసి ఉంటే శత్రువులు ఏమీ చెయ్యలేరు.

అరణ్య అజ్ఞాతవాసములతో అలసి యున్న పాండుకుమారులను పిలిపించి వారి రాజ్యభాగము వారికి పంచి ఇమ్ము. నీ కొడుకులను బతికించుకో. జూదం ఆడుతున్న రోజే అది తగదని నీకు చెప్పాను. నా మాటలు నీకు రుచించలేదు.

అందుకే మరల చెపుతున్నాను. నువ్వు కాకుల వంటి నీ కొడుకులను నమ్ముకొని నెమళ్ల వంటి పాండవులను వదలివేసావు. ఈరోజు నీ ప్రాణం మీదికి వచ్చింది. తల్లడిల్లిపోతున్నావు. కుల నాశకుడు కొడుకైనా వదలివేయమన్నారు. ఇప్పుడు నువ్వు నీ కొడుకు సుయోధనుని వదలినందువలన నష్టం ఏముంది.

అది అటు ఉండనీ. ఒక్క విషయం ఆలోచించు. భీష్ముడు ధర్మరాజు, అర్జునుడు కర్ణుడు, భీముడు సుయోధనుడు, నీ మనుమలు లక్ష్మణ కుమారుడు అభిమన్యుడు, గురువులు ద్రోణుడు ద్రుపదుడు, వారి వారి బంధుమిత్రులు నిన్ను సేవిస్తూ ఉంటే, నీ వైభవం ఎంతగా వెలిగి పోతుందో ఆలోచించు. అసలే మీకు శత్రువులే ఉండరు." అన్నాడు విదురుడు.

" విదురా! నువ్వు చెప్పిన మాటలు బాగున్నాయి కాని నా కొడుకులను విడువలేను. ధర్మం జయిస్తుంది." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

" రాజా! పోనీ నీవు నా కొడుకులను విడిచి పెట్టనవసరం లేదు కాని పాండవులను ఎందుకు దూరం చేసుకుంటావు. నీ కొడుకులను ఒప్పించి

పాండవులకు కూడా కొన్ని చిన్న చిన్న పల్లెలను ఇప్పించు. యుద్ధం నివారించడానికి నీ కొడుకులను విడి చి పెట్టమన్నాను. అలా కాకపోతే పాండవులతో సంధి చేసుకో. రెండూ ఒకటే కదా!

మనిషికి చావు అనేది ఎలాగైనా తప్పదు. యుద్ధం కాకపోతే మరొక కారణంతో చావు వస్తుంది. ఎన్ని భోగాలు అనుభవించిన మహా రాజులైనా చావు తప్పించుకోలేరు కదా! కాబట్టి బాగా ఆలోచించు. ధర్మరాజును దూరం చేసుకోకు. నీ కొడుకులను ఒప్పించి పాండవులతో సంధి చేసుకో." అని విదురుడు పలికాడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు "విదురా! నీవు చెప్పిన మాటలు చాలా బాగున్నాయి. ఆ ప్రకారమే చేస్తాను." అని అన్నాడు.

విదురుడు చాలా సంతోషించాడు. "రాజా! ఆ మాట మీదనే ఉండు. నీ కొడుకులను చూచి మరల మనసు మార్చు కోకుండా, పాండవులతో సంధి చేసుకో. " అని అన్నాడు.

మరునాడు ధృతరాష్ట్రుడు కొలువు కూటమునకు వెళ్లాడు. భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, విదురుడు,

బాహ్లికుడు, సోమదత్తుడు, భూరిశ్రవుడు, సుయోధనుడు, దుశ్శాసనుడు, మొదలగు కుమారులు సభా ప్రాంగణములో కూర్చుని ఉన్నారు.

సంజయుడు వచ్చి ధృతరాష్ట్రుని అనుమతితో సభను ఉద్దేశించి ఇలా అన్నాడు. " దేవా! మీరు ఆదేశించిన మేరకు నేను ఉపప్లావ్యమునకు వెళ్లాను. ధర్మరాజును చూచాను. ధర్మరాజు అందరిని పేరు పేరునా యోగ క్షేమములు విచారించాడు. నేను కృష్ణార్జునులను కలిసాను.

శ్రీ కృష్ణుడు నాతో ఇలా అన్నాడు. "సంజయా! అజాత శత్రువైన ధర్మరాజుకు కోపం వస్తే నీటిలో నిప్పుపుడుతుంది. మీరు దానిని ఆర్పలేరు. యుద్ధం అనివార్యం అయింది. కాబట్టి మీరు అందరూ మీకు ఉన్న సమస్తసంపదలు యోగ్యులైన వారికి పంచి పెట్టి, బంధుమిత్రులతో సంతోషంగా గడపండి. అన్ని భోగాలను అనుభవించి యుద్ధానికి బయలుదేరండి. ప్రాణాలు అరిచేతిలో పెట్టుకోండి.

నాడు నిండు సభలో పాండురాజు కోడలు ద్రౌపది "గోవిందా! నన్ను రక్షించు" అని అరిచిన అరుపు ఇంకా నాకు వినిపిస్తూనే ఉంది. అది నేను తీర్చలేని అప్పు. ఆ అప్పు తీర్చడానికే నేను అర్జునునికి సారధ్యం

వహిస్తున్నాను. అర్జునుడు గాండీవం ఎక్కుపెడతాడు. ఇంక మీరు ఎక్కడికి పోతారు" అని కృష్ణుడు అన్నాడు.

అప్పుడు అర్జునుడు నాతో ఇలా అన్నాడు. "సంజయా! ధర్మరాజు రాజ్యంలో భాగం అడిగాడు. ఇవ్వకపోతే మరోమాట లేదు. ఇప్పటిదాకా దుర్యోధనుడు చేసిన అకృత్యాలకు నేను, భీముడు బదులు తీర్చు కుంటాము.

దుర్యోధనుడు అంపశయ్యమీద యుద్ధభూమిలో పరుండక పోతే ధర్మరాజు వనవాసకాలంలో భూతల శయనం చేసినప్పటి ఆయాసం తీరుతుందా!

భీముడు గదతీసుకొని యుద్ధభూమిలో వీరవిహారం చేస్తుంటే సుయోధనుడు రాజ్యభాగము ఇవ్వక ఏమి చేస్తాడు?

నకుల సహదేవులు, సాత్యకి, అభిమన్యుడు యుద్ధ భూమిలో వీరవిహారం చేస్తూ శత్రుసేనలను చంపడం చూచి సుయోధనుడు సంధి చేస్తాడు. శాంతిస్తాడు. కౌరవులు మాటలతో సంధి చేయరు. కేవలం యుద్ధంతోనే మాట వింటారు.

సుయోధనుడు యుద్ధంలో మరణించిన తరువాత, భీష్ముని మీదికి శిఖండి ఉరికినప్పుడైనా కౌరవులు సంధి చెయ్యక తప్పదు కదా!

ధృష్టద్యుమ్నుడు క్రోధంతో ద్రోణుని మీదికి యుద్ధానికి దిగడం చూచికాని మీరు యుద్ధం విరమించరు కదా!

సుయోధనుడు మహాత్ముడైన శ్రీకృష్ణుడిని కూడా లక్ష్యపెట్టడు. ఇంక నా సంగతి చెప్పేదేముంది. అయినా ఇందులో సుయోధనుని తప్పు ఏమీ లేదు! సంజయా! మేము భీష్మునికి, ద్రోణునికి, కృపునికి నమస్కరించి యుద్ధానికి దిగుతాము.

అన్యాయంగా మా రాజ్యాన్ని కోల్పోయి, అరణ్య, అజ్ఞాత వాసములు గడిపి, న్యాయంగా మా రాజ్యభాగము కోరుతున్న మమ్ములను కౌరవులు ఓడిస్తే ధర్మం ఓడిపోయినట్లే. అంతేకాని మేము చేసేది తప్పుకాదు. మాముందు శ్రీకృష్ణుడు ఉన్నాడు. గెలుపు మాదే. సందేహం లేదు. కర్ణుడితో సహా కౌరవులను సంహరించి మా రాజ్యభాగం తీసుకుంటాం. ఈవిషయములను నీవు నిండు పేరోలగమున పెద్దల అందరి ముందు ధృతరాష్ట్రునకు చెప్పు. ఈ మాటలు విన్న భీష్ముడు, ద్రోణుడు, కృపాశ్వత్థామలు, విదురుడు,

శల్యుడు విని ఏమి నిర్ణయిస్తారో, అదే జరుగుతుంది. సుయోధనాదులు ఆయుష్మంతులవుతారు" అని అర్జునుడు అన్నాడని సంజయుడు ధృతరాష్టునితో చెప్పాడు.

ఈ మాటలు విన్న భీష్ముడు సుయోధనుని చూచి ఇలా అన్నాడు "కుమారా! అర్జునుడు, శ్రీకృష్ణుడు నరనారాయణులు. ప్రతి యుగంలోనూ అవతరిస్తుంటారు. అధర్మాన్ని జయిస్తారు. ధర్మం ప్రతిష్టిస్తారు. పౌలోములను, కాలకేయులను, నివాత కవచులను చంపారు. నరనారాయణుడు ఒకే శక్తి. రెండుగా విడిపోయారు. వారు యుద్ధానికి దిగితే మనకే కాదు ఆ హరునికైనా గెలవడం సాధ్యం కాదు. శ్రీకృష్ణుడు సారధ్యం వహించే రథం పైన అర్జునుడు గాండీవం ఎక్కుపెట్టిన నాడు నీకు ఆ విషయం తెలుస్తుంది లే.

అయినా సుయోధనా! నువ్వు నా మాటలకు భయపడవు. నీకు ఏది తోస్తే అది చేస్తావు. నీలాంటి గర్విష్టిని ఏమంటాము! ఈ నాడు నువ్వు నామాటలు వినక పోతే యుద్ధ సయమంలో నీవు మా అందరి మరణ వార్తలు వినవలసి వస్తుంది. నువ్వు దుర్మార్గులైన దుశ్శాసన, కర్ణ, శకుని మాటలు తప్ప మా మాటలు వినవు కదా! " అని అంటున్న భీష్ముని చూచి కర్ణుడు ఇలా అన్నాడు.

" మీరు ఇట్లు మాట్లాడ తగునా! నేను ఏమీ చేసాను? సుయోధనుని కొలువులో ఉంటున్నాను. ఆయన పెట్టిన అన్నం తింటున్నాను. నాకు తోచిన మాటలు చెపుతున్నాను. నేను ఎప్పుడైనా ధృతరాష్ట్రుని సతీ, పుత్ర, పౌత్రులకు హితము కలిగిస్తాను. నేను కాని పనులు చేస్తే సుయోధనుడు నన్ను ఇంతటి వాడిని గా ఎందుకు చేస్తాడు. నిండిన సభలో తమరు ఇలా మాట్లాడ తగునా? " అని పలికాడు కర్ణుడు.

దానికి భీష్ముడు ఇలా అన్నాడు. "ధృతరాష్ట్రా! ఈ కర్ణుడు పాండవులలో ఒకరితో నైనా ఇసుమంత పోలడు. వీడు పాండవులను గెలుస్తాను అని ప్రగల్భాలు పలుకుతాడా! వీడిని నమ్ముకొని సుయోధనుడు పాండవులతో శత్రుత్వము వహించాడు. పాండవులలో ప్రతి ఒక్కరూ ఎన్నో విజయాలు పొందారు. వీడు ఒక్క విజయం ఐనా పొందాడా? వీడి తమ్ముడిని అర్జునుడు వాడి కళ్ల ముందే చంపితే ఏమీ చెయ్యలేక పోయాడు. అర్జునుడు పశువులను మళ్లించుకుపోతుంటే వీడు కూడా అక్కడ ఉన్నాడు కదా! ఏమి చేసాడు? ఘోషయాత్రలో నీ కొడుకును ఓడింప చేసాడు. ఈ దుర్మార్గుడు ఇప్పుడు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు. నీవు ఆ మాటలకు తల ఊపుతున్నావు." అని అన్నాడు భీష్ముడు.

అప్పుడు ద్రోణుడు లేచి "మహారాజా! భీష్ముడు అటు పాండవులకు, ఇటు కౌరవులకు కావలసినవాడు. ఆప్తుడు. కాబట్టి వారితో సంధి చేసుకొనుట మంచిది. అర్జునుడు అన్నంత పనీ చేస్తాడు. ఖాండవ వన దహనము మొదలుకొని అతను చేసిన వీర కృత్యాలు మనం మననం చేసుకొనడం మంచిది. ఎందరో విల్లు అమ్ములు ధరించారు. ఎంతో మంది యుద్ధాలు చేసారు. కాని విజయుడు అని అతనికే పేరు వచ్చింది. ఆలోచించండి. " అని పలికాడు.

భీష్మ,ద్రోణుడు పలికిన పలుకులు విననట్టే ఉన్నాడు ధృతరాష్ట్రుడు. వారికి తగినసమాధానం కూడా చెప్పలేదు.

సంజయుడి వైపు చూచి "సంజయా! ధర్మరాజు మనగురించి, మన సైన్యముగురించి ఏమనుకుంటున్నాడు? మన సైన్యము గురించి అతనికి తెలుసా! అతడి వైపు ఎవరెవరు ఉన్నారు?" అని అడిగాడు.

ఆ మాటలువిన్న సంజయుడు తన మనసులో "అయ్యో! ఇదేమిటి! ధృతరాష్ట్రుడు ఇంతటి వెర్రివాడా పాండవులకు ఎవరు సాయం

ఉన్నారు అని అడుగుతున్నాడు ఇతనికి ఎంత చెప్పినా ప్రయోజనము లేదు" అని అనుకొని

"దేవా! మరల చెపుతున్నాను. ధర్మరాజు తమతో సంధి చేసుకోవలెనని అనుకుంటున్నాడు. మీరు కనుక అతనికి రాజ్యంలో సగభాగం ఇస్తే ఎలాంటి కీడు తలపెట్టడు. యుద్ధమే వస్తే అతను ఎవరినీ లక్ష్యపెట్టడు.

అయినా దేవా! నీకు తెలియని వాళ్లు పాండవుల పక్షమున ఎవరున్నారు. బకుడిని, హిడింబుడిని, కీచకుడిని చంపిన భీముడు అక్కడ ఉన్నాడు. పాలాక్షుని ఓడించిన అర్జునుడు వారి పక్షంలో ఉన్నాడు. నకుల సహదేవులు వారి పక్షాన ఉన్నారు. ద్రౌపది కొడుకులు, సుభద్ర కొడుకు అభిమన్యుడు వారి పక్షాన ఉన్నారు. శ్రీకృష్ణుని తమ్ముడు సాత్యకి వారి పక్షాన ఉన్నాడు. ద్రౌపదీ సోదరులు వారి పక్షాన ఉన్నారు. ద్రుపదుడు, విరాటుడు, అతని తమ్ములు, ఐదుగురు కేకయ రాజులు, జరాసంధుని కుమారుడు సహదేవుడు, జయత్సేనుడు, శిశుపాలుని కుమారులు ధృష్టకేతుడు, వృషభుడు, యాదవ రాజు చేకితానుడు, శైబ్యుడు మొదలగు యోధులు వారి పక్షాన ఉన్నారు. ఇంకా భీముని కుమారుడు మాయావిద్యా విశారదుడు ఘటోత్కచుడు వారి పక్షాన

ఉన్నాడు. ఇంకా తూర్పు వైపు నుండి, ఉత్తర దేశమునుండి రాజులు ధర్మరాజుకు సాయంగా ఉన్నారు. అందరి కన్నా మిన్న. శ్రీకృష్ణుడు వారి పక్షాన ఉన్నాడు. ఇంక మన మీదికి దండెత్తి రావడానికి ధర్మరాజుకు ఇంకా ఎవరుకావాలి? " అని అన్నాడు సంజయుడు.

" అవును సంజయా! నీవు చెప్పింది వాస్తవము. బలంతో పోలిస్తే వారంతా ఒక ఎత్తు. ఒక్క భీముడు ఒక ఎత్తు. ఆ భీముడిని తల్చు కుంటేనే భయం వేస్తోంది. అతడిని ఎదుర్కొనేవాడు మనలో ఎవరున్నారు? ఏమిటో! ఈ భీముడు చిన్నప్పుడు కూడా నా మాట వినేవాడుకాదు. భీముడి చేత చిన్నప్పటి నుండి బాధలు పడుతూ కూడా మా వాళ్లు కయ్యాని కాలు దువ్వుతున్నారు. భీముడు జరాసంధుడిని ఒక్క వేటుతో చంపాడు. వాడికి ఏ ఆయుధమూ అక్కరలేదు. చేతులతోనే అందరిని చంపగలడు. అగ్నికి వాయువు తోడైనట్లు భీమునికి పక్కన అర్జునుడు ఉన్నాడు. ఇంక చెప్పేదేముంది.

సంజయా! అర్జునునితో సమానంగా యుద్ధం చెయ్యగల వీరుడిని మనం చూచామా! పైగా అతనికి సారధిగా శ్రీకృష్ణుడు. ఈవిధంగా భీముడు, అర్జునుడు, శ్రీకృష్ణుడ ముగ్గురూ ఒకటిగా చేరితే వారిని తట్టుకోడం ఎవరి తరమవుతుంది. కౌరవ సేనను దహిం చి వేస్తారు.

భీమార్జునుల గురించి భీష్మ,ద్రోణులకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. వాళ్ల సంగతి తెలిసి కూడా మన మీద అభిమానంతో మన వైపు యుద్ధం చేస్తారు. భీష్మ,ద్రోణులకు కురు,పాండవులుసమానమే కదా! నేను నా కుమారులకు నొక్కి చెప్పలేకపోతున్నాను. మొదట నుండి విదురుడు ఏమి చెపుతున్నాడో అదే జరుగుతూ ఉంది. సంజయా! నేనేమి చెయ్యాలోచెప్పు. నాకేది దారి. నాకు ఎవ్వరు శరణ్యము.

ధర్మరాజు వినయవంతుడు, వివేకశీలి. అతని అన్నదమ్ములు భీమార్జునులు. అతనికి అండగా ద్రుపదుడు, విరాటుడు ఉన్నారు. అలాంటి ధర్మరాజును గెలవాలనుకోడం మిడతలు పోయి మంటలలో పడటం లాంటిది. కాబట్టి పాండవులతో యుద్ధంసంభవిస్తే వంశ నాశనం తప్పదు. శాంతి పొందటం మేలు. నాకుమారులకు చెప్పడానికి ప్రయత్నిస్తాను." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

అప్పుడు సంజయుడు "దేవా! తమరు చెప్పినమాట చాలా మంచిది. ఆనాడు నీవు పాండవులను వదిలేసావు. ఈనాడు వారిని దగ్గరకు చేర్చుకో. దేవా! మీరు పాండవులను రాజ్య భ్రష్టులను చేసినప్పుడు వారు మిమ్మల్ని వదలి వెళ్లిపోయారా లేదే! ఘోష యాత్రలో

సుయోధనుని గంధర్వుని బారినుండి విడిపించలేదా! వారు ఏనాడూ నీ మాట అతిక్రమించరు. వారిని పిలిపించండి. వారు కోపం విడిచి పెట్టి మీతో కలిసిపోతారు." అని అన్నాడు సంజయుడు.

ఆ మాటలు విన్న సుయోధనుడు తండ్రితో ఇలాఅన్నాడు. తండ్రీ! మీరు చెప్పిన మాటలు చిత్రముగా నున్నవి. ఎక్కడో అడవులలో అష్టకష్టములు పడుతున్న వారిని శ్రీకృష్ణుడు తీసుకు వచ్చి మరి కొంతమంది పిరికి వాళ్లను కూర్చినంత మాత్రాన పాండవులు యుద్ధం చేయగలరా! రాజా! నీకు ఇంతటి భీతి ఎందులకు? మా బల పరాక్రమములను తక్కువగా చూడకు. మేమే గెలుస్తాము.

పరశురాముని గెలిచిన అత్యంత పరాక్రమ వంతుడు భీష్ముడు ఉండగా పాండవులు ఎంత? మా గురువు కృపాచార్యుడు ద్రోణుడు సామాన్యులా! ఈశ్వర వర ప్రసాదితుడు అశ్వత్థామ సామాన్యుడా! సహజ కవచకుండలములతో శోభిల్లుచున్న కర్ణుని ఎదిరించేవాడు పాండవులలో ఎవరున్నారో చెప్పు! వీరు కాక బాహ్లీకుడు, సోమదత్తుడు, సింధురాజు, గాంధార రాజు మహా వీరులుకారా! వీరంతా మన పక్క ఉండగా పాండవులకు మన వంక తేరిపార చూడటానికి ధైర్యం ఉందా చెప్పండి. మీరు ఏ మాత్రం సందేహించకండి. మేమే మాత్రం వారికి అడుగులకు

మడుగులొత్తము. పారిపోము. యుద్ధం చేస్తాము. ఇదే నా నిశ్చితాభిప్రాయం. మన కులములో మాకు తలవంపులు తేకండి. మా చేత బాధలు పడ్డవాళ్లు మా మీదికి దండెత్తి వస్తే పారిపోవడం పిరికితనం అవుతుంది కాని సఖ్యం కాదు కదా! మీరు వారిని బతిమాలుకుంటూ మా చావును కోరుకుంటూ విలపించితే నేనేమని అనగలను.

తండ్రీ! నీవు భీముని అత్యంత బలవంతుడు అని పొగిడావు. కాని అతడు నాతో సమానం కాగలడా! భీముడే కాదు నాతో సమానంగా గదా యుద్ధం చెయ్యగలవాడు ముల్లోకాలలో లేడు. ఆ భీముని నేనే చంపుతాను. భీముడు చనిపోతే ఇంక పాండవ సేనలో యుద్ధం చేసే వాడేలేడు. ఇదంతా తెలిసి ధర్మరాజు తనకు ఐదు ఊళ్లు ఇమ్మని ప్రాధేయపడుతున్నాడు. కర్ణుని వద్ద ఉన్న శక్తి అర్జునుని చంపుతుంది. భీష్మాదుల వద్ద ఉన్న అత్యంత శక్తి వంతమైన శరములు పాండవ సేనను నాశనం చేస్తాయి ఇంక నీ కుమారులు అత్యంత శక్తి మంతులు కారా! మనకు పదకొండు అక్షౌహిణుల సైన్యము ఉంది. వారికి ఏడు అక్షౌహిణులు మాత్రమే ఉంది. ఇవన్నీ ఆలోచించకుండా ఎందులకు భయపడుతున్నావు. దుఃఖిస్తున్నావు." అని సంజయుని చూచి సుయోధనుడు "సంజయా! ఇంతకూ అల్లరి మూకలను సమకూర్చుకున్న ఆ ధర్మరాజు ఏమంటాడో చెప్పు విందాము" అని అన్నాడు

సంజయుడు ఇలా చెప్పసాగాడు. "సుయోధనా! పాండవులు యుద్ధం అనగానే ఏదో పెళ్ళికి వెళ్ళినట్టు అనుకుంటున్నారు. యుద్ధం అంటే అస్సలు భయపడటం లేదు. అర్జునుని గాండీవము, పాశుపతాస్త్రము, భీముని గదా యుద్ధము నమ్మి వారు యుద్ధానికి దిగుతున్నారు." అని చెప్పి ధృతరాష్ట్రుని చూచి "దేవా! వారి మాటలను బట్టి భీష్ముడు శిఖండి వంతు, ద్రోణుడు ధృష్ట ద్యుమ్నుని వంతు, దుర్యోధనుడు అతని తమ్ములు భీముని వంతు, మీలోని యువకులంతా అభిమన్యుని వంతు, శకుని, సైంధవుడు, అశ్వత్థామ కర్ణుడు మొదలగు మహావీరులు అర్జునుని వంతు, కృతవర్మ సాత్యకి వంతు, సోమదత్తుడు, చేకితానుడు అనే యాదవరాజు వంతు. అని నిర్ణయించుకున్నారు. నకుల సహదేవులు శకునిని చంపుతారు. ధర్మరాజు శల్యుడిని సంహరిస్తాడు. వారు ఇలా అనుకుంటున్నారు. ఇంక మీకు ఎలా తోస్తే అలా చెయ్యండి. " అని అన్నాడు సంజయుడు.

దానికి ధృతరాష్ట్రుడు "అయ్యో! ఇంక నాకు దిక్కు ఎవరు? నా కొడుకులను ఎవరు రక్షిస్తారు? ధర్మరాజు శ్రీకృష్ణుడు ఉన్న సైన్యాన్ని నాకొడుకు లక్ష్య పెట్టక పోవడం నా ఖర్మ. సంజయా! ఇంక చాలు ఏమీ చెప్పకు. ఎలా జరగాలంటే అలా జరుగుతుంది." అని దుఃఖిస్తున్న

తండ్రిని చూచి సుయోధనుడు "తండ్రీ! మేము పాండవులు ఒకే చోట పుట్టి పెరిగాము కదా! మా కంటే వారు ఎలా బలవంతులు అవుతారు నువ్వు ఎప్పుడూ పాండవులను పొగుడుతుంటావు! ఎందుకు! ఈ రాజ్యం మాది. మాకే చెందాలని భగవంతుడునిర్ణయించాడు. ఎందుకు బాధపడతారు!" అని అన్నాడు

దానికి ధృతరాష్ట్రుడు సంజయుని చూచి "చూచావా సంజయా! నాకొడుకు పిచ్చి పిచ్చి గా మాట్లాడుతున్నాడు. అది సరే కాని పాండవుల వైపు, వారిని రెచ్చగొట్టి యుద్ధానికి పురి కొల్పుతున్నవారు ఎవరు" అని అడిగాడు.

దానికి సంజయుడు "దేవా! ధృష్టద్యుమ్నుడు తన మాటలతో పాండవులలో ఉన్న అగ్నిని ప్రజ్వలింపచేస్తుంటాడు. తాను ఒక్కడే కౌరవ సైన్యము నంతనూ హతమారుస్తాను అని అంటాడు. దానికి ధర్మరాజు కూడా నీవు అన్నత పనీ చేస్తావు అని అంటాడు. అప్పుడు ధృష్టద్యు మ్నుడు నన్ను చూచి సంజయా! మహేశ్వరుడు, ఇంద్రుని అనుగ్రహం పొందిన మా అర్జునునితో సరిపోలు వారు మీ వారిలో ఎవ్వరున్నారు. కాబట్టి మీవారిని మా ధర్మరాజు శరణువేడి బతకమని చెప్పు. అని అన్నాడు." అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

అది విని ధృతరాష్ట్రుడు తన కుమారుడు సుయోధనుని చూచి "కుమారా! నీకు నీ వారికి సగం రాజ్యం చాలదా! మిగిలిన సగం ధర్మరాజుకు ఇచ్చి ప్రశాంతంగా బతకవచ్చు కదా! యుద్ధం నాకే కాదు. భీష్ముడు మొదలైన పెద్దలకు ఎవరికీ ఇష్టం లేదు. ధర్మరాజుతో కలిసి బతకడం మనకందరికీ శ్రేయస్కరం. అసలు నీకు కర్ణుడు శకుని మాటలు ఎందుకు చెవికి ఎక్కుతాయి. పెద్దల మాటలు ఎందుకు వినవు." అని అన్న ధృతరాష్ట్రుని మాటలకు కోపించి సుయోధనుడు

"నా మాటలు ద్రోణాదులు ఒప్పుకొనడం లేదు. వారిని పెట్టుకొని ఎలా యుద్ధం చేస్తాను? నేను కర్ణుడు, దుశ్శాసనుడుని వెంట పెట్టుకొని యుద్ధం చేస్తాను. పాండువులను జయిస్తాను. సూదిమొన మోపినంత మేర భూమి కూడా పాండవులకు ఇవ్వను ఇది నా నిశ్చయము" అని పలికాడు సుయోధనుడు.

"కుమారా! నామాట విని యుద్ధంమానవయ్యా. కనీసం భీముడు తన గదాయుద్ధంలో నిన్ను నీ సైన్యాన్ని చించి చెండాడు తున్నప్పుడన్నా నా మాట వింటావా! అర్జునుడు తన గాండీవంతో నీ సేనను చంపుతుంటే నైనా నా మాట వింటావా! కుమారా! పాండవులకు దైవ శక్తి తోడుగా

ఉంది. నీకు కేవలంమానవ శక్తి ఉంది. అర్జునుడు అగ్నిదేవుని వలన తన పతాకాన్ని, అక్షయతూణీరాన్ని, పొందాడు. అదీకాక పాండవులను యముడు, వాయువు, ఇంద్రుడు, అశ్వినీదేవతలు కాపాడుతుంటారు. కాబట్టి నీ పక్షాన ఉన్న భీష్మ,ద్రోణులు వారిని గెలవడం కష్టం కదా! అంతదాకా ఎందుకు! ఒక్క అర్జునుడు దేవతలందరికి సమానం కదా! దేవతలకే శక్యం కాని రాక్షసులను అతను చంపాడు కదా! కాబట్టి కుమారా! శాంతి ఒక్కటే ప్రస్తుత కర్తవ్యం. కాబట్టి కుమారా వైరం మాని శాంతి చేసుకో. " అని హితోపదేశం చేసాడు ధృతరాష్ట్రుడు.

ఆ మాటలు విన్న సుయోధనుడు తండ్రితో ఇలా అన్నాడు "తండ్రీ! వారికి దేవతలు సాయం వస్తారు అని అన వద్దు. దేవత్వం అంటే ఏమిటి? రాగద్వేషాలకుఅతీతం కదా! దేవతలు ఎవరి వైపూ పక్షపాతం వహించరు. అలా కాక దేవతలు పక్షపాత బుద్ధితో వ్యవహరిస్తే వారికి దేవత్వం సిద్ధించదు. కాబట్టి పాండవులకు దేవతలు సాయం చేస్తారు అనడం సరికాదు. అసలు పాండవులకు దేవతలు తోడుగా ఉంటే పన్నెండేళ్ళు అడవులలో కష్టాలు పడతారా చెప్పండి. తండ్రీ! నాకే కోపం వస్తే ఏ దేవతలూ వారిని రక్షించలేరు. నేనేదో గర్వంతోమాట్లాడుతున్నాను అని తలంపకు. నేను చెప్పేదంతా నిజం. ఆత్మస్తుతి పురుషలక్షణం కాదని నాకూ తెలుసు. ధర్మతనయులు, ద్రుపదుడు మొదలగు

పాంచాలురు, విరాటుడు అతని తమ్ములు, కుమారులు, వాసుదేవుడు మొదలగు యాదవులు, కేకయ, పాండ్య, మాగధ, చైద్య, ప్రముఖ వీరులు అందరూ నా బారిన పడి అణిగారి పోవడం మీరు చెవులారా వింటారు. పై చెప్పిన వారి తేజము, ధైర్యము, పరాక్రమము నాతో సాటి రావు. పితామహుడు, ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ మొదలగు మహావీరులకు అస్త్ర,శస్త్ర విషయములలో ఏమేమి తెలుసునో అవి అన్నియు నాకు తెలుసు." అని పలికాడు సుయోధనుడు.

అదే సయమంలో కర్ణుడు సుయోధనుడితో ఇలా అన్నాడు. "మిత్రమా! నాకు మా గురువుగారి కోపం కారణంగా అస్త్రాస్త్ర శస్త్రములు గుర్తుకు రావు అని లోకులు అంటారు కాని అసలు విషయం వారికి తెలియదు. తరువాత ఆ మహానుభావుడు నన్ను కరుణించి నాకు వాటి స్ఫురణను ప్రసాదించాడు. కావున నాకు ఉన్న అస్త్రశస్త్ర సంపద అఖండితము. దేవతలకు కూడా నన్ను గెలవడం సాధ్యం కాదు. ఇంక ఆ అర్జునుడు ఒక లెక్కా! నేను పాండవులను గెలుస్తాను ఇది తథ్యం." అన్నాడు కర్ణుడు.

అప్పుడు భీష్ముడు లేచి కర్ణా! యముని ప్రేరణతో నువ్వు ఇలా మాట్లాడుతున్నావు నిన్ను వారించడం మా తరం కాదు. ఏమీ!

పాండవులు యుద్ధంలో కూలి పోతారా! అనవసరంగా వాగకు. నోరు నొప్పెడుతుంది. దేవేంద్రుడు నీకు ఇచ్చిన శక్తితో అర్జునుడు కూలిపోతాడు అనుకుంటున్నావేమో! ఆ శక్తి శ్రీకృష్ణుడి చేతిలో ముక్కలు అవుతుంది. అర్జునుడి కొరకు నీ వద్ద ఉన్న అన్ని శస్త్రాస్త్రాలు అన్నింటినీ శ్రీకృష్ణుడు నాశనం చేస్తాడు. ధృతరాష్ట్రా! దాయాదులు కలిసి ఉంటే అందరూ సంతోషంగా ఉంటారు. వారు విడిపోతే సమస్తం కోల్పోతారు. కాబట్టి ధర్మరాజుతో సంధి చేసుకో. " అని అన్నాడు.

తరువాత ధృతరాష్ట్రుడు సుయోధనునితో "నాయనా సుయోధనా! భీష్ముడి మాటలు పాటించు. ధర్మరాజును విడువకు. వారి రాజ్యభాగము వారికి ఇచ్చి సంధి చేసుకో" అని అన్నాడు.

కాని సుయోధనుడు ఆ మాటలు విననట్లే ఉన్నాడు. అప్పుడు దృతరాష్ట్రుని కి కోపం వచ్చింది. "సుయోధనా! ఏమి మాట్లాడవు. అర్జునుడు ఒక్కడూ విజృంభించి పశువులను విడిపించి నప్పుడు నీ సైన్యం పారిపోలేదా! నువ్వు కర్ణుడు అక్కడే ఉన్నారు కదా! అప్పుడు ఏమి చేసారు? కర్ణా! ఇది పశువులనుపట్టుకున్నప్పటి సమరంకాదు! ఇప్పుడు శ్రీకృష్ణుడు రధ సారధిగా అర్జునుడు, పక్కనే గదతో భీముడు విజృంభించు యుద్ధం. వాళ్లను ఎదుర్కొనడం నీ తరం కాదు. వారితో

యుద్ధంలో చచ్చి మంచి సేవకుడు అనే పేరు సంపాదిస్తావు. అదే నీకు మిగిలేది. నీ ప్రోద్బలంతో సుయోధనుని చావుకు దగ్గర చేస్తున్నావు." అని అన్నాడు.

దానికి కర్ణుడు సుయోధనుని చూచి విరక్తితో "రాజా! ఈ భీష్ముడు పలికిన పలుకులు నా మనసులు కలచి వేస్తున్నాయి. ఈ భీష్ముడు చచ్చేవరకు నేను యుద్ధభూమిలో అడుగు పెట్టను. ఆ తరువాత నా ప్రతాపం చూపిస్తాను." అని శస్త్రసన్యాసము చేసిన కర్ణుడు ఇంక అక్కడ ఉండకుండలేక కొలువు కూటము విడిచి వెళ్లిపోయాడు.

అప్పుడు భీష్ముడు నవ్వుతూ "అమ్మో సుయోధనా! ఇంతటి మహావీరుడు అలిగితే ఎలాగా! పాండవులు బతక గలరా! కుమారా! నీవు ఈ కర్ణుని అండ చూచుకొని యుద్ధానికి దిగుతావు. అప్పుడు చూద్దువు గాని మా పరాక్రమములలో వ్యత్యాసము. సుయోధనా! నేను, నా వెంట ద్రోణుడు, బాహ్లికుడు కలిసి శత్రువులను నాశనం చేస్తాము. అది నువ్వు చూడు." అని అన్నాడు.

కాని సుయోధనుడు కర్ణుని మీద పక్షపాత బుద్ధితో ఇలా అన్నాడు. "తెలిసో తెలియకో అందరూ పాండవులు గెలుస్తారు అని అంటున్నారు. మొదట్లో నిన్ను, ద్రోణుడిని, బాహ్లికుడిని నమ్ముకొని యుద్ధానికి

దిగాను. కాని ఇప్పుడు చెపుతున్నాను! నాకు కర్ణుడు, దుశ్శాసనుడు ఉంటే ఎవరి అండా అక్కరలేదు. నేను, వారు ఇద్దరూ ఉంటే విజయం మాదే! " అని అన్నాడు సుయోధనుడు.

తన కుమారుడి మాటలకు ఏమీ అనలేక ధృతరాష్ట్రుడు విదురుని చూచి ఇలా అన్నాడు "విదురా! నా కుమారుడు కర్ణునితో కలిసి మృత్యుపాశములలో చిక్కు కున్నాడు. ఈ సమయంలో ఏమి చెయ్యాలో చెప్పు. " అని అడిగాడు.

" మహారాజా! మన వాళ్లు ఇలా దుర్బలులయి వారిలో వారే ఇలా పోట్లాడుకుంటూ ఉంటే అది అర్జునునికి కార్యసాధనకు అనుకూలం కాదా! కాబట్టి అనవసరమైన మాటలు కట్టిపెట్టి పాండవులను పిలిపించి సంధి చేసుకోండి. " అని అన్నాడు విదురుడు.

తరువాత ధృతరాష్ట్రుడు సంజయుని చూచి "సంజయా! నీవు మరలి వచ్చునపుడు అర్జునుడు నీతో ఏమన్నాడో చెప్పు! " అని అడిగాడు.

దానికి సంజయుడు ఇలా అన్నాడు. "దేవా! నేను వచ్చునపుడు అర్జునుడు మీ అందరికి చెప్పమని అన్న మాటలను వివరిస్తాను.

"సంజయా! ధర్మరాజు స్వయంగా మాకు రావలసిన రాజ్యభాగం ఇవ్వమని కోరుతున్నాడు. దర్పంతో వారు ఇవ్వక పోతే వారిని యుద్ధంలో చంపడం తప్పదు." అని అన్నాడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు ఆరోజుకు సభ ముగించాడు అందరూ వెళ్లిపోయారు. ధృతరాష్ట్రుడు మాత్రమే ఉన్నారు.

" సంజయా! నీకు ఇరు పక్షములలో ఉన్న వీరులందరూ తెలుసు యుద్ధమేవస్తే ఎవరు గెలుస్తారో ఊహించగలవా! " అని అడిగాడు.

" దేవా! ఈ విషయం నన్ను అడగటం కన్నా గాంధారిని, మీ తండ్రి వ్యాసుడిని, అడగటం మంచిది. వారిని పిలిపించండి. " అని అన్నాడు.

వెంటనే ధృతరాష్ట్రుడు తన తండ్రి వ్యాసుని ధ్యానించాడు. గాంధారిని పిలిపించాడు. వ్యాసుడు సంజయుని చూచి "సంజయా! నీకు అన్ని తెలుసు. నేను వినేట్టు ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పు. " అని అడిగాడు.

సంజయుడు వ్యాసునికి నమస్కరించి ఇలా అన్నాడు "ధృతరాష్ట్రా! నీవు పాండవుల సేనకు కౌరవ సేనకు గల తారతమ్య గురించి అడిగావు. పాండవుల పక్షాన శ్రీకృష్ణుడు ఉన్నాడు అతని తో సమానమైన వాడు కౌరవ పక్షంలో ఎవరున్నారో చెప్పు. పాండవులకు బలము శ్రీకృష్ణుడే. సమస్తలోకములు ఒకపక్క శ్రీకృష్ణుడు ఒక పక్క ఉంటే శ్రీకృష్ణుడే గెలుస్తాడు సత్యం, ధర్మం, న్యాయం ఎక్కడ ఉంటుందో అక్కడ శ్రీకృ ష్ణుడు ఉంటాడు. శ్రీకృష్ణుడు ఉన్నచోట జయం ఉంటుంది. శ్రీకృష్ణుని ఆశ్రయించిన వారికి జయము తప్పదు." అని అన్నాడు సంజయుడు.

"సంజయా! శ్రీకృష్ణుని గురించి నాకు తెలియక పోవడానికి నీకు తెలియడానికి కారణమేమి?" అని అడిగాడు.

దానికి సంజయుడు ఇలా అన్నాడు. "లోకంలో విద్య, అవిద్య అని రెండు ఉన్నాయి. అవిద్య తో అలమటిస్తున్నవారు తమోగుణం ప్రధానంగా కలవారు విష్ణువును గురించి తెలుసుకోలేరు. విద్యా, వినయ భూషితుడు విష్ణువును గురించి తెలుసుకుంటాడు." అని అన్నాడు.

" విద్య అనగా నేమి! ఏ విద్య వలన నీవు విష్ణువు గురించి

తెలుసుకున్నావు? అవిద్య ఎలా ఉంటుంది వివరంగా చెప్పు. " అని అడిగాడు ధృతరాష్ట్రుడు.

సంజయుడు ఇలా చెప్పసాగాడు. "దేవా! ప్రతి మనిషికి సత్వ,రజస్తమోగుణములు ప్రధానంగా ఉంటాయి. నేను వాటికి లోబడను. నిర్వికారంగా పక్షపాత రహితంగా ఉంటాను. పవిత్రభావనతో ధర్మంగా ప్రవర్తిస్తాను. దీనినే విద్య అంటారు. దీని వలననే నేను విష్ణువును తెలుసుకున్నాను. నీకు గాని, వేరు ఎవరికైనా గాని విష్ణువును తెలుసు కోడానికి ఇది ఒక్కటే మార్గం. వేరు మార్గం లేదు. పై చెప్పినది కానిది, దానికి భిన్నంగా ఉన్నది అవిద్య అంటారు." అని అన్నాడు సంజయుడు.

పక్కనే ఉన్న కొడుకు సుయోధనుని చూచి ధృతరాష్ట్రుడు "నాయనా సుయోధనా! సంజయుడు మనకు ఆప్తుడు శ్రేయోభిలాషి. అతని మాట విను. శ్రీకృష్ణుని ఆ శ్రయించు. నీవు, నీ తమ్ములు, నీ కుమారులు సుఖంగా ఉండండి. " అని అన్నాడు.

దానికి సుయోధనుడు "తండ్రీ! ఈ లోకాలు సర్వనాశనం అయినా సరే నేను ధైర్యం వదలను. ఎవరినీ శరణు వేడను." అని అన్నాడు.

"గాంధారీ! విన్నావా నీ కుమారుని మాటలు. వీడు ఒక దురభిమాని. నీతి బాహ్యుడు. గర్విష్టి. అసూయా ద్వేషాలు మాని నా మాట వినడు. వీడు చెడిపోతాడు. వీడికి బతుకు లేదు." అని అన్నాడు నిర్వేదంగా.

గాంధారి సుయోధనునితో ఇలా చెప్పింది. "కుమారా సుయోధనా! నీ ఐశ్వర్యములు, సంపదలు, రాజ్యము, నీ ఆయుష్షు ఎందుకు వదులుకుంటావురా! దైవం భీముని రూపంలో వచ్చి నిన్ను చంపుతుందిరా! నీలాంటి అవినీతిపరుడు కూడా ఉంటాడా! " అని పలికింది.

వ్యాసుడు ధృతరాష్ట్రుని చూచి "నీకు శ్రీకృష్ణుడు అంటే భక్తి. అందుకే సంజయుని రాయబారిగా పంపావు. మంచి పని చేసావు. సంజయుని మాట విని శ్రీకృష్ణుని ఆశ్రయించు. రాగద్వేషాలు వదిలిపెట్టు. ఏకాగ్ర త్తంతో ఆరాధించిన వారికి శ్రీకృష్ణుడు చేరువ అవుతాడు. కామక్రోధములతో అలమటించే వారికి అతను దూరంగా ఉంటాడు." అని పలికాడు వ్యాసుడు.

"మీరు చెప్పినట్లే చేస్తాను." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

"సంజయా! శ్రీ కృష్ణునికి వాసుదేవుడు అనే పేరు ఎలా వచ్చింది అని అడిగాడు ధృతరాష్ట్రుడు.

దానికి సంజయుడు "దేవా! శ్రీకృష్ణుడు అంతటా ఉంటాడు. అన్ని అతనిలో ఉంటాయి. అందువలన అతనికి వాసుదేవుడు అని పేరు వచ్చింది. ఇంద్రియనిగ్రహంతో అతనిని ధ్యానిస్తే అతను వశం అవుతాడు. నీవు కూడా అన్ని చింతలను వదిలిపెట్టి శ్రీకృష్ణుని ఆశ్రయించు." అని అన్నాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు "వ్యాసమహర్షి! నేను కూడా శ్రీ కృష్ణుని శరణు వేడుతాను. కాని నాకు నేత్రములు లేవు. శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహమును దర్శించలేను. నిరంతరము శ్రీకృష్ణుని సన్నిధానములో ఉండి అతనిని సేవించుచున్న వారు ఎంతటి పుణ్యాత్ములోకదా! " అని విచారించాడు.

అంతట వ్యాసుడు వెళ్లిపోయాడు. దుర్యోధనుడు, సంజయుడు, గాంధారి కూడా తమ తమ నివాసములకు వెళ్లారు.

# మహా భారతము ఉద్యోగపర్వము ద్వితీయాశ్వాసము సంపూర్ణము.

# మహా భారతం

# ఉద్యోగపర్వము

# తృతీయ అధ్యాయము

వైశంపాయన మహర్షి జనమేజయునకు మహా భారత కధను ఈ విధంగా చెప్పసాగాడు.

సంజయుడు ధర్మరాజు వద్ద సెలవు తీసుకొని హస్తినాపురమునకు ప్రయాణమైన తరువాత, ధర్మరాజు మరునాడు తన తమ్ములతోనూ, సామంత రాజులతోనూ సమావేశమయ్యాడు.

"మనము అందరం శ్రీకృష్ణుని వద్దకు పోయి ఆయనను హస్తినాపురమునకు రాయబారిగా వెళ్లవలసిందిగా ప్రార్ధిస్తాము. దీని వలన యుద్ధం నివారించే అవకాశం ఉంది. యుద్ధములో ఒకరిని ఒకరం చంపుకొనే దురవస్థ తప్పుతుంది." అని పలికాడు. తరువాత అందరూ శ్రీకృష్ణుని వద్దకు వెళ్లారు.

శ్రీకృష్ణుని చూచి ధర్మజుడు " దేవా! మా తండ్రి పాండురాజు మాకు నిన్ను పెద్ద దిక్కుగా చూపాడు. నీవు మాకు మిత్రుడవు. ఆ మిత్రత్వమును పురస్కరించుకొని నీవు మా ప్రతినిధిగా హస్తినకు రాయబారిగా వెళ్లాలి. నీమాట సుయోధనుడు వింటాడని మా విశ్వాసము. మాకూ రాజ్యప్రాప్తి కలుగుతుంది. నీకు నీ పుత్రులు ప్రద్యుమ్నుడు మొదలగు కుమారులు ఎలాగో మేమూ అలాగే. మమ్మల్ని దయతో కాపాడు." అని అర్థించాడు.

ఆ మాటలకు శ్రీకృష్ణుడు "ధర్మజా! నీవుచెప్పినట్టే చేస్తాను. ఇంతకూ నేను ఏమి చెయ్యవలెనో చెప్పు" అని అడిగాడు.

"కృష్ణా! మా తండ్రిగారి తలపు, ఆయన కుమారుడు సుయోధనుని నిర్ణయము సంజయుని వలన తెలుసుకున్నాము. ఆ తండ్రి, కుమారుల చిత్తవృత్తులు సంజయునకు బాగా తెలుసు. మాకు రాజ్య భాగం ఇవ్వకుండా, మంచి మాటలతో బుజ్జగించాలని చూస్తున్నారు. మేము వారు చెప్పినట్లు అరణ్య, అజ్ఞాతవాసములు పూ ర్తి చేసినా, వారు మా మాటను మన్నించడం లేదు.

మా పెదనాన్నగారికి కుమారుని మీద దురభిమానము. తన కుమారుని వక్రబుద్ధి మాన్పలేకున్నాడు. ఇంతకంటె మాకు ఆపద ఏముంటుంది చెప్పు. మా తల్లి, బంధుమిత్రులు ఆనందం పొందేటట్టు ఇరుపక్షములకు సంధి గావించే విధము తెలియక ఈప్రకారము చేతగానివారిలా పడి ఉండటం పౌరుషము అని పించుకుంటుందా!

వాసుదేవా! నాడు నిండు కొలువులో అందరూ వినుచుండగా ఐదు ఊళ్లు ఇచ్చిన చాలు అని పలికాను కదా! అది యదార్ధమే. కాని ఆ సుయోధనుడు నేను అడిగిన ఐదు ఊళ్లు అయిన ఇస్తాడో లేదో తెలియదు. కాని ఆమాత్రం దానికి యుద్ధ చెయ్యడానికి నా మనసు ఒప్పడం లేదు. నాకు రాజ్యం అక్కరలేదు అని నేను ఊరుకున్నా నన్ను ఆశ్రయించుకున్నవారికి కూడుగుడ్డకు కొరత ఏర్పడుతుంది కదా! కాబట్టి కౌరవులకు మాకు ప్రియమైన ఒప్పందం అవసరం.

కృష్ణా! వారు నాకు విరోధులే. పరాయి వారే. కాని వారిని చంపాలని నేను ఎందుకు కోరుకోవాలి? యుద్ధం తప్ప వేరు మార్గం లేదా! మరో మంచి మార్గం లేదా! కౌరవుల పక్షములో మాకు బంధువులు మిత్రులు ఉన్నారు. నాకు రావాల్సిన రాజ్యం కోసం వారిని చంపడం ధర్మమా! పాపం కదా! ఇంతటి దురవస్థకు నేను ఓర్వలేను.

కృష్ణా! క్షాత్ర ధర్మము ఇంతటి కష్టమా! పరధర్మము ఆచరించుట తగదని పెద్దలు చెపుతారు కదా! కాబట్టి యుద్ధం చేసి బతకాలా! రాజ్యం కోసం యుద్ధం చేస్తే వంశనాశము అవుతుంది కదా! అది నా అభిమతము కాదు. యుద్ధం చేస్తే రాజ్యం వస్తుంది. కాని ప్రాణహాని కూడా కలుగుతుంది. ఇది సత్యము.

కృష్ణా! యుద్ధంలో మనం గెలవ వచ్చు. ఓడిపోవచ్చు. చెప్పలేము. యుద్ధంలో పరాజయం కలిగితే అది మరణం కన్నా ఎక్కువగా హృదయాన్ని కలచి వేస్తుంది. కాబట్టి యుద్ధం జోలికి పోకుండా ఉపాయంతో కార్యం చక్కపరచుకొనేవాడు సుఖంగా నిద్రపోగలడు. పాము ఉన్న ఇంట్లో కాపురం చెయ్యడం ఎంత కష్టమో, దీర్ఘ కాలం పగతో ఉండటం అంత కష్టం. పగను అణచి వేయడం ఎంతో శ్రేయస్కరం.

కాని విరోధాన్ని విరోధంతో అణిచి వెయ్యలేము కదా! అని చెప్పి విరోధి చేతిలో బాధలు పడలేము కదా! పగను నిర్మూలించా లంటే కొంచెం క్రూరంగా ప్రవర్తించాలి కదా! కాబట్టి పగ, విరోధము వలన కీడే కాని మేలు జరగదు అను మాట నిశ్చయము. కాబట్టి శాంతి పొందుటయే అన్నివిధాలా శ్రేయస్కరము.

అది అటుల ఉండనీ. నేను రాజ్యం కావాలని, కాని యుద్ధం వద్దని, కోరుకుంటున్నాను. ఎందుకంటే యుద్ధం వలన జన నష్టం, ధన నష్టం, వంశనాశనం జరుగుతుంది. కాబట్టి యుద్ధం జోలికి పోకుండా కార్యం చక్కబడే మార్గం మంచిది కదా!

కృష్ణా! నీవు మా మీద పక్షపాతం చూపనవసరం లేదు. ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన అనుకూలమైన మార్గం చూడు. మెత్తని మాటలతో వినక పోతే మందలించి ఐనా కార్యము చక్కపరుపుము. మనకు కురువృద్ధుల మాటలు ముఖ్యం. సుయోధనుడు పరుషంగా మాట్లాడినా సహించు. ధృతరాష్ట్రుడు తన కుమారుని పక్షం వహించి, నీతి తప్పి ఏ విషయమూ తేల్చక పోయినా, నీవు కోపపడి ఇంక సంధి పొసగదని తెగతెంపులు చేసుకోవద్దు. ఇన్ని సంకటములతో నా మనసు వికలమై ఉన్నది. మమ్ములను సక్రమమైన మార్గంలో నడిపించు. నీ మాట మాకు శిరోధార్యము.

నీవు సుయోదనుని వద్దకు పోవడం మంచిది కాదేమో అని కూడా అనుమానం వస్తూ ఉన్నది. ఎందుకంటే వారు దుర్మార్గులు. ఎంతకైనా తెగిస్తారు. నీ మాటలు చెవిని బెట్టరు. నీకు ఏమాత్రం కష్టం కలిగినా, దాని

వలన వచ్చు దేవేంద్రపదవి కూడా నాకు అక్కరలేదు. కాబట్టి నీవు ఒంటరిగా కురుసభకు వెళ్ల వద్దు." అని పలికాడు ధర్మరాజు.

"ధర్మజా! సుయోధనుడే కాదు. అతని తండ్రి ధృతరాష్ట్రుడు కూడా అలాంటి వాడే. నీ మాటలు సత్యములు. నీ తలపు నేను తెలుసుకున్నాను. నీకు అనుమానం వద్దు. నేనే ఆగ్రహిస్తే, అక్కడ నాతో యుద్ధం చెయ్యడానికి ఎవ్వరూ ఉండరు. నన్ను కౌరవ సభకు పంపించు. నేను హస్తినకు వెళ్లడం ఎందుకైనా మంచిది. మన మనసులోమాట వారికి చెప్పవచ్చు." అని అన్నాడు శ్రీకృష్ణుడు.

"కృష్ణా! కురుసభకు పోవడం మంచిది అని తోస్తే అలాగే వెళ్లి మాకూ వారికి సంధి కుదుర్చు. ఎందుకంటే సంధి అన్ని విధాలా శ్రేయస్కరం అని నా అభిప్రాయం. మా గురించి నీకు తెలుసు. వారి గురించి నీకు తెలుసు. మైత్రి అంటే ఏమిటో నీకు తెలుసు. ఈ క్లిష్టమైన కార్యమును ఎలా చ క్కబెట్టాలో నీకు తెలుసు. నీకు చెప్పతగ్గవాడిని కాదు." అని అన్నాడు ధర్మరాజు.

"ధర్మజా! నాడు సంజయుడు చెప్పిన మాటలు. నీవు పలికిన పలుకులు విన్నాను. నీవు ధర్మనిష్ట కలవాడవు. వారు విరోధము

వదిలిపెట్టరు. భీష్మ ద్రోణులు వారి వైపు ఉన్నారని వారికి గర్వము. కాబట్టి క్షత్రియులైన మీరు వారికి అణిగి మణిగి ఉండనవసరం లేదు. అక్రమంగా ఆర్జించిన రాజ్యమును అనుభవిస్తున్న వారు నీకు అందులో భాగం ఇస్తారా చెప్పు! ధృతరాష్ట్రుని కుమారులు అన్యాయానికి, అధర్మానికి జంకరు. కాబట్టి నీవు బాధపడవలదు. యుద్ధం చెయ్యి. శత్రువులను జయించు. రాజ్యం కైవసం చేసుకో. అనుభవించు. కీర్తి గడించు.

నాడు కౌరవ సభలో భీష్ముడు, ద్రోణుడు మొదలగు పెద్దల సమక్షంలో మీకు అపకారం చేసారు. కాని వారు ఈనాటికీ పశ్చాత్తాప పడలేదు. అట్టి వారిపై మనము జాలి, దయ, కరుణ చూపడం మంచిదా! అలాంటి క్రూరాత్ముల మీద మీద కోపపడని వారు ఎవరైనా ఉంటారా! కపట జూద కారణంగా మిమ్ములను అడవులకు పంపునపుడు దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు నవ్వుకుంటూ పలికిన పలుకులు ఈ నోటితో పలకలేను. ఆ మాటలు విన్న అందరూ ధృతరాష్ట్రుని నిందించారు. మీరు బలవంతులై ఉండి కూడా అనుకున్న మాట ప్రకారం అడవులకు వెళ్లుచున్న మిమ్ములను చూచి ఆశ్చర్యపడని వారు లేరు.

పాపాత్ములు దైవము చేతిలో ఎప్పుడో చంపబడి ఉంటారు. కాబట్టి అలాంటి వారిని చంపడం చాలా తేలిక. కాబట్టి క్రూరాత్ములైన కౌరవులు చంపదగ్గవారు. నీకు మాత్రం కౌరవులు చంపకూడని వారు ఎలా అయ్యారు? పాపాత్ములను, ఇతరులను హింసించేవారిని, పాములను చంపినట్టు చంపడమే మానవ కర్తవ్యము. దీనికి ఆలోచించ నవసరం లేదు.

నీవు మాత్రం పెద్దలైన భీష్మునిమీద, ధృతరాష్ట్రునిమీద భక్తి ప్రమత్తులు చూపు. వారి మీద నీ వినయవిధేయతలను కౌరవ సభలో నేను వారికి తెలియచేస్తాను. నీ సత్ప్రవర్తనను నీ వినయ విధేయతలను, నీ ధర్మనిరతిని కౌరవ సభలో అందరికీ తెలియ చేస్తాను. నా మాటలను వినక, దుర్యోధనుడు అన్యాయంగా అధర్మంగా మాట్లాడినా, కుమారుని మాటలను విని ధృతరాష్ట్రుడు ఊరకున్నా, సభలోని వారంతా వారి దుష్ప్రవర్తనకు ఈసడించుకుంటారు. అదే మనకు కావలసింది.

ధర్మజా! నా శక్తి కొలదీ సంధి చెయ్యడానికి ప్రయత్నిస్తాను. సంధి కుదిరితే మేలే కదా. ఒక సంధి చెడినా, అక్కడి వారు ఏమేమి అనుకుంటున్నారో, ఏమేమి యుద్ధప్రయత్నాలు చేస్తున్నారో, వారి బలాబలాలు ఎలా ఉన్నాయో అన్ని చూడవచ్చు కదా. ధర్మజా!

సుయోధనుడు తన దేహంలో ప్రాణం ఉన్నంతవరకూ నీకు రాజ్యంలో భాగం ఇవ్వడు. కాబట్టి యుద్ధం తప్పదు. అలాంటి శకునాలే కనిపిస్తున్నాయి. కాబట్టి నీవు కూడా యుద్దానికి సిద్ధం కాక తప్పదు. కాబట్టి సైన్యం సిద్ధం చేసుకో. సమరసన్నాహాలు గావించు." అని అన్నాడు కృష్ణుడు.

ఆ మాటలు విన్న భీమసేనుడు ఇలా అన్నాడు. "శ్రీ కృష్ణా! యుద్ధం యుద్ధం అంటూ మమ్మల్ని భయపెట్టకు. నీవు ముందు హస్తినకు పోయి ఆ కుమతి ఐన సుయోధనుని సౌజన్యముతో ఒప్పించి పని సానుకూలం అయ్యేట్టు చూడు. సుయోధనుడు మదాంధుడు నీ మాట వినడు అతడు మమ్మల్నే కాదు తన వారిని కూడా క్షోభ పెడుతున్నాడు. అక్కడ అతడి మాటకు ఎదురు లేదు.

అతనికి నేను అంటూ కూడా లెక్క లేదు. మొట్ట మొదటినుండి నేను ఎక్కడికి పోతే అక్కడికి వస్తూ నాతో తగాదాకు దిగుతుంటాడు. కానేంచేస్తాం. మా అన్నయ్య ధర్మజుని మాట మేరకు వారితో సంధి తప్పేట్టులేదు. సుయోధనునితో సహజీవనం నాకూ తప్పేట్టు లేదు. అసలు మేమంతా కలిసి మెలిసి ఉంటే వాడే దుర్బుద్ధితో ఇంత చేసాడు. కురు వంశ నాశనానికి కారణం అయ్యాడు. కనీసం నువ్వు అన్నా వాడికి

బుద్ధి చెప్పి దారిలో పెట్టు. కృష్ణా! వాడు చచ్చేంత వరకు మారడు. భరత వంశం అపకీర్తి పాలు అవుతుందనే ఆలోచన కూడా వాడికి లేదు. అందుకే ఎంత హీనతకైనా తల వంచి సంధి చేసుకోడం ఉత్తమం.

కృష్ణా! నిండు సభలో మా తాతగారు, మాగురువులు పెద్దలు వినుచుండా నా మాటగా సుయోధనునికి చెప్పు. "మనం అన్నదమ్ములము పరాయి వాళ్ల మనలను వేలెత్తి చూపేట్టు మనలో మనం కలహించు కోడం ఎందుకు. పెద్దల మాటవిని రాజ్యాన్ని పంచుకొని అనుభవించడం ఉత్తమం కదా!"

కాబట్టి కృష్ణా! ఎలాగైనా ఈ సంధి జరిగేట్లు చూడు. అన్నదమ్ములము అందరం కలిసి మెలిసి ఉంటే లోకం అంతా సుఖంగా ఉంటుంది కదా! " అని అన్నాడు భీముడు.

భీముని చూచి కృష్ణుడు నవ్వి "ఏమిటిది భీమసేనా! ఈ మాటలు నువ్వేనా అన్నది. నేనేనా విన్నది. అగ్ని చల్లారినట్టు, పర్వతం తేలిక అయినట్టు నీ నోట సంధి మాటలు విన బడుతున్నాయి. అసలు నీ సంకల్పం ఎట్టిది మరిచి పోయావా! యుద్ధం చేయడం. శత్రువులను గడగడలాడించడం. దుర్యోధనుని గర్వము అణచడం. నీ అన్న ధర్మజునికి

రాజ్యం కట్ట బెట్టడం. ఇవే కదా! భయం అంటే ఏమిటో ఎరుగని నువ్వు ఇలాంటి పిరికి మాటలు ఎలా మాట్లాడుతున్నావు? ఈ పిరికితనం నీకు ఎవ్వరు నేర్పారో! ” అంటూ నవ్వాడు శ్రీకృష్ణుడు.

భీమునికి కోపం వచ్చింది. “కృష్ణా! పెద్ద పెద్ద మాటలు మాట్లాడ వద్దు. మా అన్న ధర్మజుని మాటకు మేము ఎన్నడూ ఎదురు చెప్పము. నా శక్తిసామర్ధ్యాలు ఏమిటో విచారింపక నువ్వు ఇలా మాట్లాడం భావ్యంకాదు. అవసరం అయితే భూమ్యాకాశాలు ఏకం చేస్తాను.” అని అన్నాడు.

దానికి కృష్ణుడు భీముని చూచి “భీమా! ఏదో పరిహాసానికి అన్న మాటలకు అంత కోపం ఎందుకయ్యా! నీ శౌర్యము నాకు తెలియదా చెప్పు. నీకు నీ సహోదరులకు కౌరవులు చేసిన కీడు మరిచి నువ్వు అలా పౌరుషహీనంగా మాట్లాడుతుంటే క్షత్రియులకు అది తగదు అన్నాను. అర్జునుడు నన్ను తన సారధిగా ఉండమన్నాడు. నేను ఒప్పుకున్నాను. మరి నీవు పక్కన లేకపోతే మాకు విజయం చేకూరుతుందా చెప్పు. ” అని అన్న కృష్ణునితో భీముడు “సరేలేవయ్యా! నీవు అర్జునుడు యుద్ధంలో శత్రువులతో పోరుతుంటే నేను చేతులు ముడుచుకొని కూర్చుంటాలే గాని ముందు నువ్వు కురుసభకు పోయి మా అన్న ధర్మజుని మాట

ప్రకారం సంధి చెయ్యి. ఇలాంటి మాటలకు ఈ భీముడు కోపగించుకోడులే. అయినా యుద్ధమే జరిగితే ఈ భీముడు ఏనుగుల కుంభస్థలాలు పగుల గొడతాడు. గుర్రములను నేల కూలుస్తాడు. లప్పుడు ఏ మాత్రం అలిసిపోని నన్ను చూచి నువ్వు ఆశ్చర్యపోతావు తెలుసా! " అని అన్నాడు.

" భీమా! నీ శక్తి నాకు తెలియదా! నువ్వు అన్నదానికన్నా ఎక్కువే చేస్తావు. నేను కురుసభకు పోయి సంధి ప్రయత్నాలు చేస్తాను. ఒకవేళ యుద్ధమే వస్తే మా కంతా నువ్వే దిక్కు" అన్నాడు నవ్వుతూ.

తరువాత అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "వాసుదేవా! మా అన్నయ్య ధర్మజుడు నీకు చెప్పవలసినది అంతా చెప్పినాడు. ప్రత్యేకంగా చేను చెప్పేది ఏమీ లేదు. అయినా మా పెదనాన్న ధృతరాష్ట్రుడు దురాశాపరుడు. రాజ్యంలో భాగం ఇవ్వడానికి అంగీకరించడు. ఇంక అతని కుమారుడు సుయోధనుడు దుర్మార్గుడు. ఈ పరిస్థితులతో మాకు మార్గం చూపించు. నీవు తలపెట్టిన పని ఎల్లప్పుడూ దిగ్విజయంగా నెరవేరుతుంది. నీ సంకల్పబలం అటువంటిది. ధర్మరాజును మాయాద్యూతంలో ఓడించి, మమ్ములను నిండు సభలో అవమానించి అడవులకు పంపిన ఆ దుర్మార్గులు చంపదగ్గవారు.

అందుకే, నీకు మా మీద ఉన్న వాత్సల్యంలోనూ వారి మీద ఉన్న కోపంతోనూ, యుద్ధము అనివార్యము అని చెప్పావు. మేము కూడా ద్రౌపదిని నిండు సభలో కొప్పుపట్టి ఈడ్చి అవమానించినా సహించాము. తలవంచుకొని అడవులకు వెళ్లాం. అన్ని నీకు తెలుసు. కాబట్టి అవన్ని మనసులో పెట్టుకోకుండా ఇరు పక్షములకు సంధి గావించి అందరం సంతోషంగా ఉండేట్టు చూడు. ఇదే నేను కోరేది." అని అన్నాడు అర్జునుడు.

"అర్జునా! నీవు అంతగా చెప్పవలేనా! నా శాయ శక్తులా సంధి సలపడానికి ప్రయత్నిస్తాను. అయినా సుయోధనుడు రాజ్యంలో భాగం ఇవ్వడానికి ఇష్టపడేవాడు అయితే చిన్నతనంనుండీ మీతో విరోధం పెంచుకుంటాడా! నీకు ఇంకొక విషయం గుర్తు చేస్తాను. ఉత్తరగోగ్రహణ సమయంలో భీష్ముడు సుయోధనుని తో అన్నమాటలు ఒక్కసారి గుర్తుతెచ్చుకో! "వచ్చినవాడు ఫల్గునుడు. అతనిని సులభంగా గెలుస్తాము అని అనుకోకూడదు. జయాజయాలు దైవాధీనాలు కాబట్టి సంధి కుదుర్చుకోడం ఉత్తమం." అని భీష్ముడు అన్నప్పుడు సుయోధనుడు ఏమన్నాడో తెలుసు కదా. "మనకూ పాండవులకు పొత్తు ఎలా కుదురుతుంది నేను రాజ్యంలో భాగం ఇవ్వను. యుద్ధంలో వారిని జయించి రాజ్యం అంతా నేనే అనుభవిస్తాను." అని అన్నాడు కదా.

ఇప్పుడు సంధి ఎలా చేస్తాడు. పోనీలే. సంధి మాట ఎలా ఉన్నా నేను కురుసభకు వెళతాను. అక్కడి వారి మనోభావాలు తెలుసు కుంటాను." అని అన్నాడు కృష్ణుడు. తరువాత నకులుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

"కృష్ణా! మా అన్నయ్యలు చెప్పిన మాటలే మాకు అనుసరణీయాలు. ఆ రోజుల్లో, వనవాస కాలంలో, ఉన్న ఆవేశ కావేషాలు ఇప్పుడు లేవు. వాళ్లు తప్పు చేసారని మనం కూడాతప్పు చెయ్యాలా. గోగ్రహణ సమయములో అర్జునుని చేతిలో ఓడి పోయిన తరువాత కౌరవులలో మార్పు వచ్చినదని అనుకుంటాను. మా పక్షాన నువ్వు, ఏడు అక్షౌహిణుల సైన్యము, ఉన్నదని వారికి తెలిసే ఉంటుంది. మాకు పాంచాల, యాదవ, పాండ్య, మత్స్య దేశాధీశుల అండ, భీమార్జునుల బలపరాక్రమాలు, నీ తోడు ఉన్నాయని తెలిసీ వారు భయపడకుంటా ఉంటారా! ఈవిషమయులన్ని చెప్పి భీష్ముడు, ద్రోణుడు మొదలగు పెద్దలు వారికి నచ్చ చెప్పరా! అన్నింటిని మించి నీవు చేయబోవు హితబోధ వారిని తప్పకుండా మారుస్తుంది. నీ కార్యం సఫలమవుతుంది. మనకు విజయం సిద్ధిస్తుంది." అని అన్నాడు నకులుడు.

అన్ని విన్న సహదేవుడు కృష్ణునితో "కృష్ణా! మా అన్నయ్యలు శాంతి వచనాలు పలకడం బాగుంది. వాటికి నువ్వు కిమ్మనకుండా ఊ కొట్టడం బాగుంది. అంటే నువ్వు కౌరవులను వేడుకొనడానికి వెళ్తున్నావన్నమాట!

అయినా సుయోధనుడు ఎక్కడ! రాజ్యములో సగభాగం ఇచ్చుట ఎక్కడ! ఇది జరిగే పనేనా! పరాక్రమ వంతులైన భీమార్జునులు ఇలా ఇంత దీనంగా ఆలోచించ వచ్చునా! విన్న వాళ్లు చుట్టాలు తిట్టరా! మన కోసం యుద్ధం చెయ్యడానికి వచ్చిన రాజులు మన గురించి ఏమనుకుంటారు? ధర్మరాజు రాజ్య భాగంకోసం యాచించడం. దానిని శ్రీకృష్ణుడు కౌరవ సభలో అడగబోవడం. వారు గర్వంతో కాదనడం. ఇదంతా చూస్తుంటే ఇంత హీనమైన కార్యం మరొకటి ఉంటుందా చెప్పు. ఈ బిచ్చపు కూడు మాకు రుచిస్తుందా!

నీ రాయబారానికి ఒప్పుకొని వారు ఎంతో కొంత మాకు ఇచ్చినా, ఈ సంధి పొసగదు. యుద్ధమే శరణ్యము. కాబట్టి నా మాటగా కౌరవులతో ఈమాదిరి చెప్పుము. "సుయోధనా! నువ్వుకూడా మా వలెనే నీ తమ్ములతో పదమూడేండ్లు అడవులలో తిరిగి వచ్చి, రాజ్యభాగం అడిగితే, మేము ఇవ్వకపోతే, నీకు ఎలా ఉంటుంది. కాబట్టి మాకు కూడా నీవు రాజ్యభాగం ఇవ్వక తప్పదు. అలా కాక పోతే నీకు యుద్ధంలో

చావు తప్పదు. ఇంక నీ మాయ మాటలు వినే స్థితిలో మేము లేము." అని నా మాటగా చెప్పు. " అని అన్నాడు సహదేవుడు.

ఆ మాటలకు సాత్యకి సంతోషించాడు. "సహదేవా! చక్కగా పలికావు. దుర్యోధనునికి నీతులు చెప్పి ప్రయోజనము లేదు. వాడికి నీతులు చెపితే మన పరువు పోతుంది. ఇక్కడ చేరిన రాజులందరికీ యుద్ధమే ఇష్టం. కాబట్టి ఏ ప్రకారం ఆలోచించినా సంగ్రామమే అన్ని విధములా ప్రస్తుత కర్తవ్యము." అని పలికాడు.

సహదేవుడు, సాత్యకి, పలికిన పలుకులకు అందరూ హర్షధ్వానాలు చేస్తూ తమ అంగీకారం తెలిపారు.

తరువాత ద్రౌపది తన అభిప్రాయం శ్రీకృష్ణుడితో ఇలా చెప్పింది. "మా రాజ్యాన్ని అపహరించి మమ్ములను అడవులకు పంపినది చాలక మరలా సంజయునితో మాకు ఊరడింపు మాటలు చెప్పి పంపుతారా! ఆ మాటలకు ధర్మరాజు ఉబ్బిపోయి ఐదు ఊళ్లిచ్చినా చాలు అంటాడా! అదీ ఇవ్వకపోతే ఊరుకుంటాడా! ఏమి వింత?

ధర్మరాజు తన తమ్ముడగు సుయోధనుని మీద ప్రేమాతిశయముతో ఇన్ని అవమానాలు సహించి ఊరుకున్నాడేమో! కాని రాజ్యంలో భాగం కూడా తీసుకోకుండా ఊరుకుంటే పాండవులంతటి పిరికి వాళ్లు, అవివేకులు, అసర్థులు, సిగ్గులేనివారు లోకంలో లేరని అందరూ నిందించరా! అసలు మనము తక్కువ వారము అని ఎందుకు నిరూపించుకోవాలి కృష్ణా! ఈసంధి వారికే మేలు కలిగించేట్టు ఉంది. పాండవులతో పోల్చుకుంటే కౌరవులెంత? కౌరవులు ఎన్ని తప్పులు చేసినా సహించి ఊరుకొనడానికి పాండవులు ఏమన్నా బ్రాహ్మణులా!

సుయోధనుడి మనసులో భయం అసలు లేదు. నీ హిత వచనాలను ఆలకిస్తాడని నమ్మకం నాకు లేదు. మరి ఆ కౌరవ సభలో యుద్ధ వాతావరణం కనబడితే పాండవులు యుద్ధమే చేస్తారో లేక మరల అడవులకే వెళతారో వారికే తెలియాలి. నాకు తోచింది చెప్పాను. మీకు తోచింది చెయ్యండి.

కృష్ణా! నేను అగ్నిలో నుండి ఉద్భవించాను. భరతవంశం లోకి అడుగు పెట్టాను. పాండు రాజుకు కోడలయ్యాను. జనవంద్యులైన భర్తలను పొందాను. శౌర్యవంతులైన కుమారులను కన్నాను. నన్ను నీ చెల్లి సుభద్ర కంటే ఎక్కువగా గారవించావు. అలాంటి నన్ను, రాజసూయ

యాగానంతరము అవభృధస్నానయైన నన్ను, ఒకడు నా కొప్పుపట్టుకొని నా భర్తలు చూచు చుండగా కొలువులోకి ఈడ్చి తెచ్చాడు. లోకంలో ఎవరైనా ఇలా చేస్తారా! ఆ సమయంలో నా భర్తలు ఏమీ చేయలేక తలవంచుకొని కూర్చుంటే, నా మనస్సులో నిన్నే కదా నమ్ముకున్నాను. ఈ విషయాన్ని నీవు సంధి మాటలు మాట్లాడేటప్పుడు గుర్తుపెట్టుకోవాలి. అని నా మనవి.

ఆ సమయంలో నన్ను కోడలు అని కూడా తలపకుండా దాసి అని అవమానించిన ఆ ధృతరాష్ట్రునివద్దకు ఈ నాడు నా భర్తలు వెళితే, నేనుకూడా వారితో వెళ్లి ఆ పెద్దలకు కోడరికం చెయ్యాలా? లేక న్యాయప్రకారము ఊడిగము చెయ్యాలా? ఆలోచించు."

అంటూ ద్రౌపది ఒక్కసారి లేచి నిలబడింది. నిడుపైన తన నల్లటి శిరోజాలు ఒక చేత్తో పట్టుకుంది.

"కృష్ణా! ఈ శిరోజాలు ఆనాడు నిండు సభలో దుశ్శాసనుని చేతిలో చిక్కి మిగిలిపోయినవి. నీవు కౌరవులతో సంధి మాటలే మాట్లాడేటప్పుడు వీటిని కూడా తలంచుకో! కృష్ణా! నా కురులు పట్టి ఈడ్చిన వాడి చేతులు యుద్ధభూమిలో నరకబడినప్పుడే నామనస్సుకు శాంతి. నా

మనస్సులో చెలరేగుతున్న అగ్ని మామూలు మాటలతో చల్లారదు. యుద్ధభూమిలో నేను, ధర్మజుడు, సుయోధనుని శవాన్ని కనులార చూడకుండా ఉంటే అర్జునుని గాండీవం ఎందుకు? భీమసేనుని గద ఎందుకు? తగల పెట్టనా! మహా వీరు లైన భర్తలు, నీ లాంటి అన్న ఉండి కూడా పరాభవాగ్నిని ఒడిలో పెట్టుకొని భరిస్తున్నాను ఇంక ఎన్నాళ్లు భరించాలో కదా! " అని నిట్టూర్చింది ద్రౌపది.

ఈ మాటలు విన్న కృష్ణుడు ద్రౌపదితో "అమ్మా! కౌరవులు మనకు రాజ్యభాగం ఇవ్వరు. యుద్ధం తప్పదు. నీవు అనుకున్నట్లు శత్రు సంహారం తప్పదు. కాబట్టి నీ శోకము మానుము. ఇప్పటి దాకా నీవు ఎంత శోకించావో అంతకన్నా ఎక్కువగా కౌరవ కాంతలు శోకించే సమయం వచ్చింది. యముని వాహనమైన దున్నపోతు యొక్క మెడ గంటల శబ్దం వినబడుతున్న వారి చెవులకు నే చెప్పబోవు సంధి మాటలు వినబడతాయా! కాబట్టి యుద్ధం తప్పదు. ఇది నిజం." అని ద్రౌపదిని ఊరడించాడు శ్రీకృష్ణుడు.

ఇంతలో అర్జునుడు కృష్ణుని చూచి "ఏమో కృష్ణా! ఇరు వర్గాలకు మేలు కలిగేటట్లు చెయ్యి ఇదే నేను చెప్పేది" అని అన్నాడు.

ధర్మజుడు కృష్ణుని చూచి "కృష్ణా! నీ జన్మ నక్షత్రం రోహిణి నక్షత్రం. రేపు రేవతీ నక్షత్రం. నీకు చంద్రబలము తారాబలము బాగుగా ఉన్నది. కావున రేపే ప్రయాణమునకు సుముహూర్తము" అని నిశ్చయించాడు.

శ్రీకృష్ణుడు సాత్యకిని పిలిచి తన ఆయుధములు ఐన గద, చక్రము రథములో పెట్టించమన్నాడు. యాదవులలో హస్తినాపురమునకు రావలసిన వారిని నిర్ణయించాడు. తన సారధి ఐన దారుకుని రథం సిద్ధం చేయమన్నాడు. సాత్యకినీ చూచి "సాత్యకీ నీవు కూడా నా వెంటరా. కౌరవులు కుటిల బుద్ధులు. అందుకని వలసిన ఆయుధములు రథంలో పెట్టించు." అని చెప్పాడు. హస్తినాపురానికి ప్రయాణమయ్యాడు.

అర్జునుడు, ధర్మరాజు, శ్రీకృష్ణునితో పాటు ఊరి వెలుపలిదాకా వచ్చి సాగనంపారు. ఆఖరున ధర్మజుడు కృష్ణుని చూచి "కృష్ణా! నీవు మా తల్లి కుంతీదేవి వద్దకు పోయి ఆమెకు నా నమస్కారములు చెప్పు. ఆమెను ఊరడించు. మా గురువులు ద్రోణునికి కృపాచార్యునికి నా నమస్కారములుచెప్పు. విదురునికి నా నమస్కారములు చెప్పు. " అని అన్నాడు ధర్మరాజు. అలాగే అని అందరి వద్ద సెలవు తీసుకొని శ్రీకృష్ణుడు హస్తినాపురానికి ప్రయాణమయ్మాడు.

మధ్యలో కుశస్థలము చేరుకొని అక్కడ విడిది చేసాడు. శ్రీకృష్ణుడు రాయబారిగా వస్తున్నాడని, కుశస్థలిలో విడిది చేసి ఉన్నాడని, ధృతరాష్ట్రునికి తెలిసింది. వెంటనే ధృతరాష్ట్రుడు భీష్ముని, ద్రోణుని, విదురుని, దుర్యోధనుని, కర్ణుని, సైంధవుని, శకునిని పిలిపించాడు. "శ్రీకృష్ణుడు పాండవ కార్యార్థియై హస్తినకు వస్తున్నాడు కుశస్థలి వరకూ వచ్చాడు. మనము అతనికి తగిన విధంగా స్వాగత సత్కారములు గావింప వలెను. తగు సన్నాహములు చేయండి." అని ఆజ్ఞాపించాడు.

ఆ మాటలు విని భీష్ముడు, ద్రోణుడు, విదురుడు ఎంతో సంతోషించారు. సుయోధనుడు తగిన విధంగా స్వాగతసత్కార సన్నాహాలు గావిస్తున్నాడు. ధృతరాష్ట్రుడు విదురుని చూచి "విదురా! శ్రీకృష్ణునికి విడిది ఎక్కడ ఏర్పాటు చేయించాలి. మనము శ్రీకృష్ణునికి ఇష్టమైన ఏ యే వస్తువులు కానుకలుగా సమర్పించాలి. " అని అడిగాడు.

దానికి విదురుడు "రాజా! మనకు పాండవులకు ఐదు ఊళ్లు ఇవ్వడానికి కూడా శక్తిలేదు కదా. శ్రీకృష్ణునికి కానుకలు సమర్పించగలమా! నీ మనసులో మాట గ్రహించాను. ఏవో కానుకలు ఇచ్చి శ్రీకృష్ణుని లోబరచుకొని పాండవులకు కృష్ణునికి విభేధము

కలిగించాలని చూస్తున్నావు. నీవు ఇంత తెలివి లేని వాడివా! నీవు మేరుపర్వతాన్ని ఇచ్చినా శ్రీకృష్ణుడు అర్జునుని విడువడు. కాబట్టి ఈ రకమైన ఆలోచనలు వదిలిపెట్టు. శ్రీకృష్ణునికి కాళ్లుకడుక్కోడానికి నీళ్లు, నాలుగు కుశల ప్రశ్నలు ఇవి చాలు. వేరే అక్కరలేదు. శ్రీకృష్ణుడు మన వద్దకు ఏమి పని మీద వస్తున్నాడో ఆ పని నెరవేర్చి పంపడం అతనికి ఇష్టం. అది తప్ప మనం ఎన్ని చేసినా అతనికి ప్రియం కాదు." అని అన్నాడు విదురుడు.

దానికి సుయోధనుడు "తండ్రీ! విదురుడు చక్కగా పలికాడు. శ్రీకృష్ణుడు పాండవులను విడువడు. అది నిశ్చయము. ఇప్పుడు మనము అతనికి కానుకలు ఇచ్చి లోబరచుకోడానికి ప్రయత్నిస్తే మనం పాండవులకు భయపడి ఇదంతా చేసామని లోకులు అంటారు. కాబట్టి మనము శ్రీకృష్ణునికి కానుకలు ఇస్తే మన అల్పత్వం బయటపడుతుంది. ఇదిచూచి మన శత్రువులు రెచ్చిపోతారు. అది మనకు మంచిదికాదు." అని అన్నాడు సుయోధనుడు.

ఇంతలో భీష్ముడు ధృతరాష్ట్రుని చూచి "రాజా! నీవు కానుకలు ఇస్తే ఒకవిధంగానూ, ఇవ్వకపోతే ఒక విధంగానూ తలచే వాడా శ్రీకృష్ణుడు. ఆయన పాండవులకు మేలు చెయ్యడానికి ఇక్కడకు

వస్తున్నాడు. శ్రీకృష్ణుడు ధర్మయుక్తంగా చెప్పే మాటలు సావధానంగా విని, అతను వచ్చిన పని నెరవేర్చి పంపు. అది చాలు." అని అన్నాడు భీష్ముడు.

సుయోధనుడు భీష్ముని చూచి "శ్రీకృష్ణుడు వచ్చి పాండవులకు రాజ్యంలో సగభాగం ఇమ్మంటాడు. నేను ఇవ్వను అంటాను. అది అటుంచండి. మీరు చెప్పినట్టు పాండవులకు శ్రీకృష్ణుడు సర్వస్వము. కాబట్టి మనము ఈ తరుణంలో శ్రీకృష్ణుని పట్టి బంధించి చెరలో పెట్టిన, పాండవులు రెక్కలు తెగిన పక్షులు అవుతారు. యాదవులు, పాంచాలురు మన పక్షం వహిస్తారు. ఈ భూమినంతా నేనే ఏలుకుంటాను. దానికి తగిన సన్నాహాలు చేస్తున్నాను. ఇంక మీరు చెప్పేది ఏమిటో చెప్పండి. " అని అన్నాడు సుయోధనుడు.

సుయోధనుని మాటలు విని అందరూ నిర్ఘాంతపోయారు. ధృతరాష్ట్రుడు కుమారుని చూచి "ఏమీ! నీవు శ్రీకృష్ణుని బంధిస్తావా! మతి ఉంటే మాట్లాడుతున్నావా! లోకానికంతా కీడు చేస్తావా! నామాట విని ఈ దురాలోచన మానుము. శ్రీకృష్ణుడు మన దగ్గరకు దూతగా వస్తున్నాడు. అతనికి మర్యాద చెయ్యడం మన ధర్మం. ఇంతకూ అతనిని పట్టి బంధించడానికి అతను చేసిన తప్పు ఏమిటి? " అని అడిగాడు.

"రాజా! నీ కుమారుడు శ్రీకృష్ణుని బంధిస్తే సర్వనాశనం అయిపోతాడు. ఇంక ఇచ్చట నేను ఉండలేను. నేను వెళుతున్నాను." అని భీష్ముడు వెళ్లిపోయాడు.

"కుమారా! ఇలాంటి కొరగాని పనులు మానుము. వీటివలన కీడు తప్ప మేలు కలుగదు. తరువాత నీ ఇష్టం." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

తరువాత శ్రీకృష్ణునికి స్వాగతం పలకడానికి ధృతరాష్ట్రుడు భీష్ముని, ద్రోణుని, బాహ్లికుని మొదలగు వారిని నియమించాడు. అందరూ వెళ్లి శ్రీకృష్ణుని ఆహ్వానించారు. శ్రీకృష్ణుడు తనను ఆహ్వానించిన వారిని తగు రీతిని గౌరవించాడు. అందులో తనకు మిత్రుడైన కృతవర్మను తన వెంట బెట్టుకున్నాడు. హస్తినాపురం ప్రవేశించాడు.

ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణునికి ఎదురేగి అతనిని కౌగలించుకున్నాడు శ్రీకృష్ణుడు అతనిని కుశల ప్రశ్నలు వేసాడు. అందరి యోగక్షేమములు విచారించాడు. మిగిలిన వారి యోగక్షేమములు విచారించడానికి తన బదులు సాత్యకిని నియమించాడు.

ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని ఉన్నత ఆసనము మీద కూర్చోపెట్టి అర్ఘ్యపాద్యములు అర్పించాడు. శ్రీకృష్ణుడు భీష్మునికి, ద్రోణునికి మిగిలిన పెద్దలకు ధర్మరాజు నమస్కారాలు తెలియచేసాడు. తరువాత శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని అంగీకారము పొంది విదురుని మందిరమునకు వెళ్లాడు.

విదురునితో పాండవుల గురించి అన్ని విషయాలు మాట్లాడాడు తరువాత కుంతీ దేవిమందిరమునకు వెళ్లాడు. కుంతీదేవి తన మేనల్లుడిని పట్టుకొని ఏడ్చింది. ఆమెను ఓదార్చాడు.

“కృష్ణా! నీకు తెలియనిది ఏమున్నది నాయనా! పాండవులు నీతిమంతులు వీరులు. ఎన్నో సుఖములు అనుభవించవలసిన వారు. కాని అడవులపాలైనారు. తండ్రిలేని వారికి తల్లినైన నేనుకూడా దూరమైనాను. నాయనా కృష్ణా! ధర్మరాజు క్షేమమే కదా! బకుని చంపిన భీముడు క్షేమమే కదా! అర్జునుడు బాగున్నాడా! చిన్నవాళ్లు నకులసహదేవులు క్షేమమే కదా! నా కోడలు ద్రౌపది ఎలా ఉన్నది! ఆమె అంటే నాకు ఎంతో ఇష్టం. ఆమె నాకు చేసిన సేవలు మరిచి పోలేను. అలాంటి సాధ్వికి కురు సభలో జరిగిన అవమానం తల్చుకుంటేనే మనసు దుఃఖంతో కుంగిపోతున్నది. ఒక్క విదురుడు తప్ప ఆరోజు కౌరవుల చర్యను ఎవరూ ఖండించలేదు కదా! అయినా కృష్ణా! ఈ పదమూడేళ్లు

దాయాదుల ఇంట్లో పడి వీరు పెట్టిన దయమాలిన తిండితనడం ఎంతో బాధగా ఉంది. కాని నేను మాత్రం సుయోధనాదులను నా కన్న కొడుకుల మాదిరే గారవించాను. దానికి ఆ దేవుడే సాక్షి. జరిగినదానికి ఎవరినీ నిందించలేము.

"ఒకరిని దీనంగా యాచించి ఆర్జించిన సంపదలు ఎందుకు. పరాక్రమము లేని వారి మాటలను ఎవరూ లెక్కచెయ్యరు" అని ధర్మజునికి చెప్పు.

"క్షత్రియ కన్య కుమారులను ఎందుకు కంటుంది. తన కుమారులు అత్యంత పరాక్రమ వంతులు కావాలని కదా! అలాకాక పోతే వారు మగవారు అనిపించుకోరు" అని భీమార్జునులకు చెప్పు.

భుజబలంతో జీవించడం క్షత్రియధర్మమని అలాకాకుండా పిరికి వారిగా జీవించడం అత్యంత హేయము అని నకుల సహదేవులకు చెప్పు. ఇంకా తెలియక పోతే ద్రౌపదిని అడిగి తెలుసుకొనమని పాండవులందరికి చెప్పు. " అని పలికింది కుంతీ దేవి.

అత్తా! నీ మనసులోని మాట నెరవేరుతుంది. కలతపడకుము నీ కుమారులు వీరులు. వీరోచిత మైన సుఖాలు మాత్రమే అనుభవిస్తారు." అని పలికాడు శ్రీకృష్ణుడు.

" కృష్ణా! పాండవులకు తండ్రి, గురువు, దైవము అని నువ్వేకదా. వారి మంచి చెడూ నువ్వే చూడాలి. నిన్ను నమ్ముకున్న వారికి ఆపదలు రావు కదా! " అని పలికింది కుంతీదేవి.

శ్రీకృష్ణుడు అక్కడి నుండి బయలుదేరి సాత్యకి, కృతవర్మలతో కలిసి సుయోధనుని మందిరమునకు వెళ్లాడు. ఆసమయంలో సుయోధనుడు భీష్మ, ద్రోణులు, కర్ణుడు, శకుని, సైంధవుడు, దుశ్శాసనుడు, వికర్ణుడు, దుర్ముఖుడు, మొదలగు వారు పరివేష్టించి ఉండగా సింహాసనము మీద కూర్చుని ఉన్నాడు. శ్రీకృష్ణుని రాక తెలుసుకొని సుయోధనుడు అతనికి ఎదురుపోయి తోడ్కొ ని వచ్చాడు. శ్రీ కృష్ణుడు సుయోధనుని, దుశ్శాసనుని ఆలింగనము చేసుకొని కుశల ప్రశ్నలు వేసాడు. సుయోధనుడు శ్రీకృష్ణుని ఉచిత ఆసనము ఇచ్చి సత్కరించాడు. శ్రీకృష్ణుని తన ఇంటి లో భోజనానికి ఆహ్వానించాడు సుయోధనుడు. ఆ ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించాడు శ్రీకృష్ణుడు.

"కృష్ణా! మా ఇంటికి వచ్చి మా ఇంటిలో భోజనం చేయకపోవడం న్యాయం కాదు. నీవు కురుపాండవులకు సమానుడవు. మా తండ్రి ధృతరాష్ట్రునకు ఇష్టుడవు. మా ఇంటిలో భోజనము చెయ్యక పోవడానికి కారణమేమి?" అని అడిగాడు సుయోధనుడు.

"సుయోధనా! నేను రాయబారిగా వచ్చాను. వచ్చిన పని కాకుండా నేను మీ ఇంట విందులు కుడవడం, కానుకలు స్వీకరించడం ధర్మం కాదు కదా! నేను వచ్చిన పూర్తి అయిన తరువాత నీ ఇంట విందుకు వస్తాను." అని పలికాడు.

"అదేమిటి కృష్ణా! రాయబారం వేరు. విందు వేరు. దానికీ దీనికి లంకె ఏమిటి? హాయిగా విందు భోజనం చేసిన తరువాత అని పనులు చక్కపెట్టుకోవచ్చు కాని, భోజనం కూడా చేయనంటే ఎలా? కాబట్టి నీవు మా ఇంట్లో విందు భోజనం చేయను అనడానికి తగిన కారణం కనిపించడం లేదు." అని అన్నాడు సుయోధనుడు.

"సుయోధనా! ప్రేమతో పెట్టు భోజనం అత్యంత ప్రియమ్మైనది కాని ఆపద ఉన్న చోట చేసే భోజనం పియమ్మైనది కాదు. నీకు నా మీద ఎంతో ప్రేమ ఉన్నది. నీ వల్ల మాకు వచ్చే ఆపద ఏమీ లేదు. అయినా ప్రస్తుతం

మీ ఇంట్లో భోజనం చేయలేను. పగవారి ఇంట్లో భోజనం చేస్తుంటే వారు తనకు ఏమి పెడతారో అని అనుమానం కలుగుతుంది కదా! పాండవులు అంటే నీకు కోపం. పాండవులు అంటే నాకు ప్రాణ సమానము.

చిన్నతనము నుండి నీవు అకారణంగా పాండవులకు అపకారం చేస్తూనే ఉన్నావు. అది అందరికీ తెలుసు. అలాంటి పుణ్యాత్ములతో వైరం న్యాయమా చెప్పు! అలాంటి పుణ్యాత్ములకు హాని చేస్తున్న మీ ఇంటి భోజనం మంచిది కాదు. కాబట్టి నేను విదురుని ఇంటిలో భోజనం చేస్తాను." అని చెప్పి సుయోధనుని వద్ద సెలవు తీసుకొని విదురుని మందిరానికి వెళ్లాడు.

విదురుడు అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణునికి అతిథి మర్యాదలు గావించాడు. విందు భోజనం సమకూర్చాడు. భక్తితో విదురుడు ఇచ్చిన విందును ఇష్టంగా ఆరగించాడు శ్రీకృష్ణుడు. తరువాత శ్రీకృష్ణుడు విశ్రాంతి తీసుకునే సమయంలో విదురుడు శ్రీకృష్ణుని తో ఇలా అన్నాడు.

"కృష్ణా! దుర్యోధనుడు దుష్టబుద్ధి. నీచుడు. దురభిమాని. నీ మాట వింటాడా! అతడు తన పక్షాన ఉన్న పదకొండు అక్షౌహిణుల సైన్యం చూచుకొని గర్విస్తున్నాడు. తనకు కర్ణుడు ఒక్కడే విజయం చేకూర్చి

పెడతాడని నమ్మకంతో ఉన్నాడు. నీవు వస్తున్నావని వార్త విన్న వెంటనే సుయోధనాదులు నీమాట అసలు వినకూడదని, పాండవులకు భాగం పంచి ఇవ్వరాదని, ఈ భూమి నంతా తామే ఏలుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడ చేరిన రాజులందరూ రాజసూయ యాగ సమయంలో పాండవుల చేతిలో ఓడి పోయిన వారే! వారందరూ ఒకటై పాండవులకు వ్యతిరేకంగా యుద్ధ చేయడానికి సిద్ధం అయ్యారు. కనుక ఈ సంధి జరగదు. కౌరవులకు కాలం సమీపించినది. అందుకే వారు కయ్యానికి కాలు దువ్వుతున్నారు. అయినా ఆ దుర్మార్గుల మధ్య నువ్వు కూర్చుని వారు కూయు కారు కూతలు వినడం, వారి చేతిలో అవమానం పొందడం మంచిదికాదు. కాబట్టి నీవు కౌరవ సభకు వెళ్లవద్దు. ఇది నా అభ్యర్ధన. " అని పలికాడు విదురుడు.

దానికి శ్రీకృష్ణుడు "విదురా! నీవు చెప్పిన హితము మంచిదే. కాని నేను ఇచ్చటికి ఎందుకు వచ్చానో వారికి తెలియ చెప్పాలి కదా! దానికి వారు ఏమంటారో తెలుసుకోవాలికదా! దానికి అనుగుణంగా చెయ్యాలి కదా! నాకు దుర్యోధనుని దుర్మార్గము అంతా తెలుసు. ఈసంధి పొసగదని తెలుసు. ఒకడు పని కట్టుకొని పుణ్యం చేసినా, పాపం చేసినా, మధ్యలో దానికి విఘాతం కలిగినా, దాని ఫలితం సిద్ధిస్తుంది. కాబట్టి ఇక్కడ నా మాట ఫలించక పోయినా, దాని ఫలం మాత్రం సిద్ధిస్తుంది.

బంధువులలో వైరం ఏర్పడితే, వారితో కొట్లాడి అయినా ఆ పగను మాన్పక పోతే, పాపం వస్తుంది అని పెద్దలు చెపుతారు. కాబట్టి ఎంత కష్టమైనా కురు పాండవులకు సంధి చెయ్యడానికి ప్రయత్నం చేస్తాను. నాకు తోచిన సంధి వచనాలు సుయోధనునకు చెబుతాను. నన్ను పాండవ పక్షపాతిగా శంకించి అతను నా మాట వినడు. అదీ ఒకందుకు మంచిదే! అన్నదమ్ములు పోట్లాడుకుంటున్నప్పుడు, ఇరువురికీ ఇష్టుడైన కృష్ణుడు చూస్తూ ఊరుకున్నాడు, తాను తల్చుకుంటే వ్యవహారం చక్కదిద్ద లేడా! అని లోకులు నన్ను అంటారు అందుకని కార్యం చక్కబడటానికి అనుకూలమైన మాటలు చెబుతాను. సుయోధనాదులు నా మాటలు వింటే బాగుపడతారు. లేకపోతే లేదు. అంతే గదా! " అని పలికాడు శ్రీకృష్ణుడు. విదురుడు శ్రీకృష్ణుని వద్ద సెలవు తీసుకొని పరుండటానికి వెళ్లాడు.

మరునాడు శ్రీకృష్ణుడు నిద్రలేచి కాలకృత్యములు తీర్చుకొని, సాత్యకి, కృతవర్మ లతో కూర్చుని ఉన్నాడు. ఈ సమయమున సుయోధనుడు, కర్ణుడు, దుశ్శాసనుడు కలిసి శ్రీకృష్ణుని వద్దకు వచ్చారు. అందరూ కలిసి కొంతసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడుకున్నారు. తరువాత సుయోధనుడు శ్రీకృష్ణుని చూచి "కృష్ణా! నా తండ్రి ధృతరాష్ట్రుడు,

బంధు, మిత్ర, సపరివార, సమేతముగా కొలువు తీర్చి ఉన్నారు." అని చెప్పాడు.

అంతట శ్రీకృష్ణుడు సాత్యకి, కృతవర్మలు వెంటరాగా, సుయోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని వెంట రాజభవనానికి వచ్చాడు. విదురుడు ఎదురుగా వచ్చి శ్రీకృష్ణుని ఆహ్వానించాడు. సుయోధనుడు, కర్ణుడు శ్రీకృష్ణునికి దారి చూపారు. శ్రీకృష్ణుడు కొలువు కూటములోకి రాగానే ధృతరాష్ట్రుడు మొదలగువారు శ్రీకృష్ణునికి సాదరంగా స్వాగతంపలికారు. శ్రీకృష్ణుడు తనకు అమర్చినా ఉచితాసనము మీద కూర్చున్నాడు.

ఆ సభకు నారదాది మహా మునులు కూడా వచ్చి వారికి ఉచితమైనా ఆసనముల మీద కూర్చుని ఉన్నారు. సాత్యకి, కృతవర్మ శ్రీకృష్ణునికి ఇరుపక్కలా కూర్చుని ఉన్నారు. విదురుడు శ్రీకృష్ణుని వెనక ఒక పీఠం మీద కూర్చుని ఉన్నాడు. సుయోధనుడు, కర్ణుడు పక్కపక్కనే కూర్చుని ఉన్నారు. గాంధార రాజైన శకుని తన కుమారులతో ఒక పక్క ఆసీనుడై ఉన్నాడు. సభలో ఆసీనులైన వారందరూ శ్రీకృష్ణుడు ఏమి చెబుతాడో అని ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

శ్రీకృష్ణుడు లేచి ధృతరాష్ట్రుడిని ఉద్దేశించి ఇలా మాట్లాడాడు. "మహారాజా! నీకు తెలియనిది ఏమున్నది! అయినా భరతవంశము క్షేమమును దృష్టిలో పెట్టుకొని, ఇరు కుటుంబాల వారికి మేలు కలిగేట్టు, నాకు తోచిన హితమైన వాక్కులు చెప్పదలచుకున్నాను.

కౌరవులు పాండవులు పాలు నీరు మాదిరి కలిసి పోయి బతకడం మంచిది. ఆ ప్రకారం వారిని నడిపించవలసిన బాధ్యత నీది. అయినా పాండవులు వేరు, కౌరవులు అనే బేధ బుద్ధి నీకు లేదు కదా! మీ భరత వంశము ధర్మము, సత్యము, ఐకమత్యము, కరుణ, పెంపు కలిగి మిక్కిలి ప్రశిద్ధి చెందినది. అట్టి వంశములో నీవు, నీసహోదరుడు పాండురాజు, నీ పుత్రులు, పాండు పుత్రులు జన్మించారు. అంతటి చరిత్ర ఉన్న భరత వంశమును నేడు అప్రతిష్ట పాలు చెయ్యడం ఎందుకు?

ఈ కురువంశమునకు నీవే పెద్ద దిక్కు. నీ వంశంలో కలిగే మంచిచెడ్డలకు నీవే బాధ్యుడివి. కాబట్టి ఇరు కుటుంబాలవారి యోగ క్షేమముల ననుసరించి వారిని చక్కదిద్దవలసిన బాధ్యత నీది! కాని నీ కుమారులు ధర్మము తప్పి చరిస్తున్నారు. వాని నడవడి మంచిది కాదు. నీ బంధు మిత్రుల మనస్సులు బాధ పెట్టే పనులు చేస్తున్నారు. కౌరవులు పాండవులు ఒకే మంచి మార్గంలో పయనించి ప్రశాంతంగా జీవించడం

అందరికీ మంచిది. అలా కాకుండా యుద్ధమే సంభవిస్తే అది అందరికీ వినాశం కలుగ చేస్తుంది. కాబట్టి మహారాజా! నా మాటల మీద విశ్వాసం ఉంచి ఇరుపక్షములకు సంధి చేయుట మంచిది. అది నీ చేతిలో నున్నది. దానికి నీవే సమర్ధుడవు.

ఇంక బలాబలముల విషయానికి వస్తే భీమార్జునులను ఎదుర్కొనేవారు మీలో ఎవరున్నారో చెప్పు? ఇక్కడ ఉన్న భీష్మ, ద్రోణులను ఎదుర్కొనే వారు కూడా వారి పక్షాన లేరు. యుద్ధంలో ఇరు పక్షముల వారు చనిపోయేదాని కన్నా, సంధి చేసుకోడం మేలుకదా!

ఈ కురు సామ్రాజ్యానికి నీవే సామ్రాట్టువు. కురు పాండవులు నీ పుత్రులు. వారిలో ఒకరి పట్ల శత్రుత్వము వహించడం నీకు తగునా! ఈ సమయంలో నీవు ఉపేక్ష వహిస్తే నీవు ఈ భూప్రజలందరికీ ద్రోహం చేసినట్టవుతుంది. కడకు నీకు నువ్వే ద్రోహం చేసుకున్నట్టవుతుంది. మహారాజా! కురుపాండవులలో ఎవరు మరణించినా నీకే బాధ కదా! ఆ బాధ నీకు మేలు చెయ్యదు కదా!

అదియును కాక కౌరవులు పాండవులు పండితులు. పరాక్రమ వంతులు. బాహు బల సమన్వితులు. అలాంటి వారు ఈ కొరగాని

యుద్ధంలో మరణిస్తూ ఉంటే చూస్తూ ఊరుకోవడం మంచిదా! కాబట్టి కురు పాండవులను యుద్ధంలో మరణించకుండా నివారింపుము. అప్పుడు నిన్ను నీ రాజనీతిని జనులందరూ మెచ్చుకుంటారు.

అదియును కాక, పాండవులు తండ్రిలేని పిల్లలు. వారిని న్నప్పటినుండి చేరదీసి పెంచావుపెద్ద చేసావు విద్యాబుద్ధులు చెప్పించావు. ఇప్పుడు వారిని నిష్కారణంగా విడి పెట్టడం న్యాయమా! కడపటి వరకు వారిని ప్రేమతో చూడవలసింది నీవేకదా! పాండు కుమారులు నీకు భక్తితో నమస్కరించి నీకు ఐక్య కంఠంతో చెప్పమన్న మాటలు చెపుతాను.

“తండ్రీ! నీ మాట ప్రకారము మేము పన్నెండేళ్లు అరణ్యవాసము, ఒక ఏడు అజ్ఞాతవాసము చేసాము. మా తండ్రి పాండురాజు బతికి ఉన్నప్పుడు పరిపాలించిన అర్ధ రాజ్యమునకు మేము అర్హులము అని నిశ్చయించుకున్నాము. నీవే మాకు తల్లి, తండ్రి, బంధువు, రక్షకుడవు. కాబట్టి మా వల్ల ఏమైనా అపరాధము ఉంటే మన్నించి, ఇలా కాదు అలా నడచుకొనమని శాసించండి. ఏ నాటికి, మాకు నీవు తప్ప వేరు ఎవ్వరూ లేరు. మా గురించి, సుయోధనాదుల గురించి ఎవరూ అనుకోరు. మాలో ఎవరి తప్పు ఉన్నా నీవు ధర్మం తప్పకుండా సదభిప్రాయంతో ఉంటే, వంశ ధర్మము నిలిచి ఉంటుంది. సత్యము, ధర్మమునకు హాని

కలిగినప్పుడు, వాటిని రక్షించే శక్తి ఉండి కూడా, ఎవరైతే అశ్రద్ధ వహిస్తారో, అది వారికే హాని కలిగిస్తుంది." అని చెప్పమన్నారు.

మహారాజా! వారు పలికిన ఆ మాటలకు మీరు ఏమి చెపుతారో చెప్పండి. నేను ధర్మమును, నీతిని, మనకు ఉన్న బంధుత్వమును ముందు పెట్టుకొని నాకు తోచిన మాటలు చెప్పాను. మీరు క్రోధము, మత్సరము విడిచి తగి న నిర్ణయం తీసుకోండి. కాబట్టి పాండవులకు వారి రాజ్యభాగము పంచి ఇచ్చుట కంటే కార్యము వేరే ఏముంటుంది. దీనికంటే ధర్మము వేరే ఏముంటుంది? ఇంతకన్నా సముచితమైన విధానము ఏముంటుంది? ఇంతకన్నా నీవు చేయదగినది ఏమున్నది? ధర్మము నెరింగిన పెద్దలారా మీరైనా చెప్పండి.

కాబట్టి మహారాజా! నామాట విను. ధర్మం పాటించు. పాండవులకు చెందిన వారి తండ్రి రాజ్యభాగము వారికి ఇచ్చి నీకు చెందిన రాజ్య భాగము నీ కుమారులకు ఇమ్ము. అందరూ పుత్రపౌత్రాదులతో సుఖంగా ఉంటారు. అదియును కాక, ధర్మరాజు ధర్మనిష్ట, అతను నిన్ను ఆశ్రయించు కున్న తీరు నీకు తెలుసు కదా! అతడు ఇంద్రప్రస్థ పురంలో ఉంటూ నీకు గౌరవము, పేరు, ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాడు. దిగ్విజయం చేసాడు. తన రాజ్యంలో సుఖంగా ఉన్నాడు ఆ సమయంలో నీ

కుమారులు అతనిని ద్యూతక్రీడకు పిలిపించారు. అతని సంపద నెల్లా హరించారు. నిండు సభలో ద్రౌపదిని అవమానించారు. వీటి అన్నింటికి నీవు సమ్మతించావు. వారిని అడవులకు పంపావు. అష్టకష్టాల పాలు చేసావు. అంతటి కష్టములు పడి కూడా, వారు ఇప్పుడు మీతో సఖ్యత కోరుకుంటున్నారు. అలాంటి వాడు ధర్మరాజు. అతని ధర్మనిష్ఠ, సత్యవ్రతము ఈ లోకంలో ఎవరికున్నాయో చెప్పు.

ఓ ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారుల క్షేమం గోరి ఇన్ని మాటలు చెప్పాను. నీ కుమారుడైన సుయోధనుని మనసులోని దురాశను తొలగించు. పాండవులను పిలిపించుకో. వారు శాంత శూరులు. నీ పాదసేవ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నీ మనస్సుకు అది నచ్చక పోతే, వారు యుద్ధానికి కూడా సిద్ధంగా ఉన్నారు. ఈ రెండు మార్గములలో ఏది కావాలో నువ్వే తేల్చుకో! నీ నిర్ణయం కోసం వేచి ఉంటాను.” అని పలికి కూర్చున్నాడు శ్రీకృష్ణుడు.

సభ అంతా ఒక్క సారి నిశ్శబ్దము అయింది. అందరూ శ్రీ కృష్ణుడు చెప్పిన మాటలు శ్రద్ధగా విన్నారు. కాని బదులు చెప్పడానికి ఎవ్వరికీ ధైర్యములేదు. అందరూ నిశ్చేష్టులయి ఉన్నారు. ఇంతలో జమదగ్ని మహాముని లేచాడు.

"సుయోధనా! పూర్వము దంభోద్భవుడు అనే మహారాజు ఉండేవాడు. అతను తనకు ఆ లోకంలో ఎదురు ఎవ్వరూ లేరని గర్వించాడు. ఆ సయమంలో నరనారాయణులు గంధమాధన పర్వతము మీద తపస్సు చేసుకుంటున్నారు. ఆ దంభోద్భవుడు వారి మీదికి యుద్ధానికి వెళ్లాడు. అక్కడ తపస్సు చేసుకుంటున్న మునులు చెప్పినా వినలేదు ఆ సమయంలో నరుడు చేత దర్భలు ధరించి, ఆ దంభోద్భవుడి తో యుద్ధం చేసాడు. ఓడించాడు. ప్రాణాలతో వదలి వేసాడు. ఆ నరనారాయణులే ఈ కృష్ణార్జునులు. కాబట్టి ఆ దంభోద్భవుడి మాదిరి గర్వంతో వారిని ఎదిరించకు. పాండవులతో సంధి చేసుకో! " అని అన్నాడు.

వెంటనే కణ్వ మహా ముని లేచి "సుయోధనా! తన బలము ఎదర బలము ఎరుంగక గర్వముతో అహంకారంతో యుధ్ధము చేయుట మంచిది కాదు. ఇదే అహంకారము పూర్వము గరుత్మంతునకు గర్వభంగము కలిగించింది. దేవేంద్రుడి రథసారధి మాతలి. అతని కూతురు గుణకేశి. మాతలి తనకుమార్తెకు సర్పనాయకుడు ఐన ఆర్యకుని మనుమడు, కురుడు అనేవాడి కుమారుడు ఐన సుముఖుడిని భర్తగా నిర్ణయించాడు. ఆర్యకుని వద్దకు వెళ్లి విషయం చెప్పాడు. అప్పుడు ఆర్యకుడు "అయ్యా! గరుత్మంతుడు నా కుమారుడు కురుడిని

చంపాడు. అతని కుమారుడు సుముఖుడిని కూడా నెల రోజులలో చంపుతానని కోపంతో చెప్పి వెళ్లాడు. కాబట్టి ఈ సంబంధానికి నేను ఒప్పుకోలేను" అని అన్నాడు. దానికి మాతలి "నేను దేవేంద్రుడి దగ్గరకు వెళ్లి సుముఖుడి ప్రాణాలు కాపాడతాను రండి." అని దేవేంద్రుడి దగ్గరకు తీసుకొని వెళ్లాడు.

ఆ సమయంలో దేవేంద్రుడు, మహా విష్ణువు ఒకే చోట ఉన్నారు మాతలి విషయం అంతా వారికి విన్నవించాడు. దేవేంద్రుడు మహా విష్ణువు అనుమతితో సుముఖుడిని దీర్ఘాయుష్మంతుని చేసాడు. మాతలి తన కుమార్తెనె ఇచ్చి వివాహము చేసాడు. ఇది విన్న గరుత్మంతుడు కోపావేశంలో అక్కడికి వచ్చాడు. విష్ణువు ముందరే ఇంద్రునితో ఇలా అన్నాడు.

*"ఇంద్రా! నీవు అదితి పుత్రుడవు నేను వినతా పుత్రుడను. మనకు ఇద్దరికి కశ్యపుడు తండ్రి. మనం కలిసి రాక్షసులను వెదికి వెదికి చంపుదాము. నీకంటే నేను ఎందులో తక్కువ. నీవు నా నిర్ణయానికి ఎందుకు అడ్డు పడ్డావు." అని అన్నాడు గరుడుడు.*

దానికి ఇంద్రుడు "గరుడా! ఇది నా నిర్ణయం కాదు. విష్ణువు తీసుకున్న నిర్ణయం అని చెప్పాడు. దానికి గరుత్మంతుడు తమ్ముడా! నేనేమిటో నీకు తెలియదు. నీ దేవతా కులము మొత్తము నా ఒంటి మీద ఒక ఈకతో సమానం కాదు" అని గర్వంతో పలికాడు. విష్ణువు గరుడుని చూచి "నీవు అంతటి బలవంతుడివా. ఏదీ నీ బలం చూపించు" అంటే తన చేతిని గరుడుని వీపు మీద ఆనించాడు. ఆ భారానికి గరుడుడు బెదిరి పోయాడు. ఒక్కసారి కుప్పకూలి పోయాడు. పెద్దగా అరుస్తున్నాడు. అది చూచి విష్ణువు నవ్వి తన చేతిని పైకి లేపాడు. గరుడుడు లేచి కూర్చున్నాడు

"గరుడా! గర్వము మంచిదికాదు. బుద్ధిగా ఉండు." అని వెళ్లిపోయాడు. కావున సుయోధనా! గర్వము ఎన్నటికీ మంచిది కాదు. ఇదంతా నారదుల వారికి కూడా తెలుసు. కాబట్టి నీవు పాండవులతో సఖ్యంగా ఉండు." అని పలికాడు కణ్వుడు.

తరువాత నారదుడు సుయోధనుని చూచి "సుయోధనా! మనకు ఎంత బలము ఉన్నా ఎదిరి బలము ఎక్కువైనపుడు మన బలం తక్కువగానే ఉంటుంది. ఎంతటి శక్తి సంపన్నులకైనా ధర్మ మార్గము గొప్పది. దాని ముందు అహంకారము నిలబడలేదు. నేను ఇదే పని

చేస్తాను అని పట్టు పట్టడం మంచిది కాదు. అలాంటి వాడికి ఆపదలే కలుగుతాయి. అందుకు గాలవుడే మంచి ఉదాహరణ.

గాలవుడు అనే ముని కుమారుడు విశ్వామిత్రుని వద్ద విద్య నభ్యసించాడు. విద్యాభ్యాసము పూర్తి అయింది. గురువు గారికి గురుదక్షిణ ఇస్తాను అన్నాడు. విశ్వామిత్రుడు వద్దు అన్నాడు. కాని గాలవుడు ఒప్పుకోలేదు. మీరు గురు దక్షిణ అడగాల్సిందే అని మూర్ఖంగా పట్టుపట్టాడు. విశ్వామిత్రునికి కోపం వచ్చింది. అయితే ఒక చెవి మాత్రం నల్లగా ఉన్న తెల్లని గుర్రములు ఎనిమిది వందలు గురుదక్షిణగా సమర్పించుకోమన్నాడు. గాలవుడు అశ్వములకోసం బయలు దేరాడు.

ఎక్కడ వెదికినా అలాంటి అశ్వములు దొరకలేదు. గాలవుడు ఆహార నిద్రలు మాని వెతుకుతున్నాడు. ఒక చోట అతనికి గరుత్మంతుడు కనపడ్డాడు. గరుత్మంతుడు గాలవునికి చిన్న నాటి స్నేహితుడు. గరుడుడు గాలవుని తన వీపు మీద ఎక్కించుకొని యయాతి అనే రాజు వద్దకు తీసుకుని వెళ్లాడు. గాలవుని కోరిక విన్న యయాతి తన వద్ద అలాంటి గుర్రములు లేవని తనకుమార్తె మాధవిని అతనికి ఇచ్చాడు. మాధవితో సహా గాలవుడు మరల వెదకడం ప్రారంభించాడు.

ఇక్ష్వాకు మహారాజు పరిపాలిస్తున్న అయోధ్యా నగరానికి చేరుకున్నాడు. ఇక్ష్వాకు మహారాజు వద్ద అలాంటి గుర్రాలు రెండు వందలు ఉన్నాయి. సంతానం కోసం పరితపిస్తున్న ఇక్ష్వాకు మహారాజుకు మాధవిని ఇచ్చి బదులుగా 200 హయములు తీసుకున్నాడు. ఒక సంతానం కలిగే దాకా మాత్రమే మాధవి అతని దగ్గర ఉంటుందని ఒప్పందం చేసుకున్నాడు. ఇక్ష్వాకు మహారాజు మాధవి ద్వారా వసుమనస్సుడు అనే కుమారుని కన్నాడు. తిరిగి మాధవిని గాలవునికి ఇచ్చివేసాడు.

గాలవుడు మిగిలిన హయముల కోసం బయలు దేరాడు. ఇదే విధంగా అశ్వములను సంపాదించుకోమని చెప్పి గరుత్మంతుడు వెళ్ళిపోయాడు. గాలవుడు కాశీ రాజు దివోదాసుకు మాధవిని ఇచ్చి రెండు వందల గుర్రాలు తీసుకున్నాడు. మాధవి వలన దివోదాసుకు ప్రత్యర్ధనుడు అనే ఒక కుమారుడు కలిగాడు. తరువాత గాలవుడు మాధవిని భోజపురాధీశుడు ఔశీనరుడికి ఇచ్చి మరొక రెండు వందల గుర్రాలు పొందాడు. ఔశీనరుడికి మాధవి వలన శిబి అనే ఒక కుమారుడు జన్మించాడు. అయినా మాధవికి కన్యాత్వము చెడలేదు.

మిగిలిన గుర్రాల కోసం గాలవుడు వెదుకుతుంటే మరల గరుత్మంతుడు వచ్చాడు. గాలవా! ఇలాంటి గుర్రాలు ప్రపంచంలో ఇంకెక్కడా లేవు. ఈ ఆరు వందల గుర్రాలు నీ గురువుగారికి ఇమ్ము. మిగిలిన 200 గుర్రాలకు బదులు మాధవివి ఆయనకు ఇమ్ము. అని చెప్పాడు. అందరూ విశ్వామిత్రుని వద్దకు వెళ్లారు.

గరుత్మంతుడు విశ్వామిత్రుని చూచి అయ్యా! గాలవుడు పసివాడు. ఈ 600 గుర్రములు తీసుకొని ఇతనిని కరుణించు అని ప్రార్ధించాడు. విశ్వామిత్రుడు సరే అన్నాడు. మిగిలిన 200 గుర్రాలకు బదులు మాధవిని స్వీకరించాడు. ఆమె వలన అష్టకుడు అనే కుమారుడిని పొందాడు తిరిగి మాధవిని గాలవునికి అప్పగించాడు.

కాబట్టి సుయోధనా గాలవుని మాదిరి మూర్ఖత్వము పనికిరాదు. గురువుగారు గురుదక్షిణ వద్దు అన్నప్పుడు విజ్ఞతతో ఊరుకుంటే ఇంతదాకా రాదు కదా. కాబట్టి తన మాట నెగ్గాలనే మూర్ఖత్వము పనికి రాదు. దురహంకారము దుస్థితిని కలుగ చేస్తుంది. పాండవులతో శత్రుత్వము మానుము. శ్రీకృష్ణుని మాటలు విని కురువంశమును కాపాడుము.” అని చెప్పాడు నారదుడు.

ఆ మునీశ్వరుల మాటలు సుయోధనుని చెవికి ఎక్కలేదు. పైగా వారిని చూచి నవ్వి "మునీశ్వరులారా బ్రహ్మదేవుడు ఎలా రాసి పెట్టి ఉంటే అలా జరుగుతుంది. మీరు మాట్లాడటం చాలించండి. " అని అన్నాడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు"మునీశ్వరులారా! మీ మాటలు నా కుమారుడు వింటే మంచిదే. వినక పోతే నేను చేసేది ఏమీ లేదుకదా. " అని కృష్ణుని వంక తిరిగి "కృష్ణా! ఇహము పరము కలిగే విధంగా నీవు చెప్పావు. కాని నీవు చెప్పి నట్లు నడుచుకొనుటకు నాకు మార్గము కనిపించడం లేదు. నా కుమారుడు మూఢుడు. నీవు నాకు బంధువుడవు. నా కుమారుని ఎలాగైనా శాంతింపచెయ్యి."అని వేడుకున్నాడు.

అప్పుడు కృష్ణుడు సుయోధనుని చూచి "కుమారా సుయోధనా! నీవు శ్రేష్టమైన వంశంలో జన్మించావు. ఈ దురాగ్రము ఏల నయ్యా! ఎవరో తులువలు చేసినట్టు నీ వంటి మహారాజు చెయ్య వచ్చునా! నీ కుమారుడు, నీ తమ్ములు, నా స్నేహితులు చెడుదారిలో పోకుండా చూచుకొనుము. నీ తండ్రిగారు, పెద్దలు చెప్పినట్టు పాండువులతో సంధి చేసుకో. అల్పబుద్ధి కలవారి మాటలు నమ్మితే నీకు ఆపదలు

కలుగుతాయి. కర్ణుడు, శకుని మొదలగు వారు ఇచ్చు సలహాలు నీకు హాని చేస్తాయే కాని మేలు చెయ్యవు.

అమిత పరాక్రమ వంతులైన నీ సహోదరులు భీమార్జునులను వదలుకొని ఎవరో శక్తిహీనులైన పరాయివారి సాయం కోరుతున్నావు. పాండవులు నీ మీద ఎన్నడూ శత్రుత్వం వహించలేదు. అలాంటి వారి బంధుత్వము ఎందుకు కాదంటున్నావు? పాండవులు మీరు కలిసి ఉంటే మిగిలిన రాజులు మీకు సామంతులుగా ఉంటారు. అంతేకాని, నీకు పాండవులకు కయ్యము పెట్టిన వారు, యుద్ధమే జరిగితే ఎందుకూ పనికిరారు. ఎందుకంటే ఈ రాజులందరూ బలపరాక్రమములలో ఒక్క భీమునికి సాటిరారు. నీ సైన్యంలో అర్జునుని ఎదిరించగల వాడు ఒక్కడున్నా చాలు నీవు యుద్ధం చెయ్యి. అనవసరంగా ఎందుకు జననష్టం కలుగ చేస్తావు.

ఆనాడు మత్స్యదేశంలో మీరు గోవులు పట్టుకున్నప్పుడు, ఎలాంటి సైన్య సాయం లేకుండా అర్జునుడు ఒక్కడే గోవులను మళ్ళించుకు పోయాడన్న సంగతి అందరికీ తెలుసు కదా! మరి ఈనాడు నేను అర్జునునికి సారధిగా ఉన్నాను. సైన్య సహకారం ఉన్నది. కాబట్టి నీ ఆలోచన మానుకో. నీ మూలంగా నీ తమ్ములు, నీ కుమారులు,

నీ స్నేహితులు, అందరూ నాశనమవుతారు. నీవంటి వాడు కులనాశకుడు అయినాడు అన్న నింద పడటం మంచిదా! కాబట్టి నా మాట విను పాండవులతో కలిసి మెలిసి జీవించు.

నీ తండ్రి రాజ్యభారం వహిస్తుంటే, నీవు యువరాజుగా రాజ్యం చేస్తుంటే, పాండుకుమారులు నీ తండ్రి మనసుకు నచ్చినట్టు నడుచుకుంటూ ఉంటే, ఎంత బాగుంటుంది. పాండవులు నీతో సంధి కోసం స్నేహ హస్తం అందిస్తుంటే, నీవు నిరాకరించడం ముంగిటికి వచ్చిన లక్ష్మీ దేవిని నిరాకరించడం లాంటిది కదా ఆలోచించు." అని పలికాడు.

అప్పుడుభీష్ముడు ఇలా అన్నాడు "సుయోధనా! నీ తండ్రి మాటలు ప్రశాంతంగా విను. మన వంశం పావనం చెయ్యడానికి శ్రీకృష్ణుడు వచ్చి నాలుగు మంచి మాటలు చెప్పాడు. ఆయన మాటలు వినక పోవడం మంచిది కాదు. నీ తండ్రి కళ్ల ముందే నీ రాజ్యాన్ని కీర్తినీ ఎందుకు నాశనం చేస్తావు. కృష్ణార్జునులతో శత్రుత్వము నీ బంధులోకానికే కాదు, యావత్ ప్రపంచానికి వినాశకారి. " అని అనగా ద్రోణుడు లేచి "సుయోధనా! మేము నీ మేలు కోరుతున్న వాళ్లము. శ్రీకృష్ణుని మాటలు వింటే నీకు సిరిసంపదలు సమకూడుతాయి. ఇంతకు మించి ఏమీ చెప్పలేను." అని అన్నాడు.

వెంటనే ధృతరాష్ట్రుడు కుమారుని వంక చూచి "కుమారా! పెద్దలు గురువుల మాటలు పాటించి నీవు వెంటనే శ్రీకృష్ణుని వెంట వెళ్లి నీ అన్నగారు ధర్మరాజును  కలుసుకో. దాని వలన అన్ని పనులు సఫలమవుతాయి." అని అన్నాడు.

ఆ మాటలు విన్న భీష్మ, ద్రోణులు సుయోధనునితో "అవును సుయోధనా! శ్రీకృష్ణుడు సారధ్యం  చేస్తుంటే అర్జునుడు యుద్ధరంగంలో దిగక ముందే ధర్మరాజును కలుసుకొని కౌరవ వంశం కాపాడు. నీవు ధర్మజుని ముందు నిలబడి నమస్కరిస్తే అతను నిన్ను గాఢంగా కౌగలించుకుంటాడు. నీవు భీముడు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకోండి. అర్జునుడు, నకుల సహదేవులు నీకు నమస్కారం చేసినపుడు వారిని ఆదరించు.  ఈ ప్రకారం ఒకరిని ఒకరు ఆదరించుకోడం చూచి సమస్తరాజలోకం హర్షిస్తుంది. మీ కురు వంశం వర్ధిల్లుతుంది.  ఇరు పక్షాల యుద్ధ చేయడానికి వచ్చిరాజులు మీ అన్యోన్యత చూచి ఆనందించి వారి వారి రాజ్యాలకు తరలి వెళుతుంటే  ఈ భూమి జనం అంతా ఎంతో సంతోషిస్తారు కదా!  కాబట్టి మీ  ఇరువురూ రాజ్యమును పంచుకొని సుఖంగా ఉండండి. అందరికీ ఆనందం కలిగించండి. " అని పలికారు.

ఈ మాటలన్ని సావధానంగా విన్న సుయోధనుడు లేచి “కృష్ణా! తాత భీష్ముడు, గురువు ద్రోణుడు, తండ్రి ధృతరాష్ట్రుడు నన్ను ఎప్పుడూ తిడుతుంటారు. నువ్వు కూడా న్యాయం ఆలోచించకుండా అలాగే తిడితే నేను ఏమి చేయగలను. మేము ద్రౌపదిని మానభంగం చేసాము, వారిని అడవులకు పంపాము అని మా మీద అకారణ వైరం పెట్టుకున్నారు. మమ్మల్ని చంపడానికి ఆలోచిస్తున్నారు. కృష్ణా!న్యాయంగా ఆలోచిస్తే ఇందులో నా తప్పే మన్నా ఉందా! ధర్మరాజు జూదరి. జూదం ఆడతానని శకుని వెంట పడ్డాడు. ఆడాడు. రాజ్యం మొత్తం పోగొట్టుకున్నాడు. అంతటితో ఊరుకున్నాడా! లేదే! మరల పందెం ఒడ్డాడు. ఓడాడు. ఏమి చేసినా తన ఇష్టం ప్రకారం చేసాడు కాని మేమేమీ బలవంతం చెయ్యలేదే! అతను చేసిన పనుల వల్ల కలిగిన కష్ట నష్టాలకు నేను బాధ్యుడనా చెప్పు. ఇప్పుడు అతను మత్స్య రాజు, పాంచాల రాజు లతో కలిసి మాతో యుద్ధం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాడు. మేము ఎప్పుడన్నా ఇంతటి ఉగ్రవాదానికి పాల్పడ్డామా!

కృష్ణా! క్షత్రియ ధర్మం ప్రకారం యుద్ధంలో మరణిస్తే వీరుడన్న పేరు వస్తుంది. స్వర్గసుఖాలు లభిస్తాయి కాబట్టి నేను క్షత్రియ ధరము విడిచి, దేవేంద్రుడి ముందు కూడా మోకరిల్లను. మా చిన్నతనంలో మా *తండ్రి న్యాయం తెలియక వారికి రాజ్యం పంచి* ఇచ్చాడు. ఇప్పుడు కూడా

నా శక్తిసామర్ధ్యాలు తెలియక అలా చేస్తానంటే నేను ఎందుకు ఊరుకుంటాను. అలా సాగనివ్వను. మేము వారు రాజ్యం పంచుకోడం జరగదు. నేను సూది మొన మోపిన అంత మాత్రము కూడా నేను వారికి ఇవ్వను. యుద్ధంలో విజయం పొందిన వారు రాజ్యం చేస్తారు. ఇదే నా నిశ్చయము." అని కూర్చున్నాడు సుయోధనుడు.

ఆ మాటలకు కృష్ణునికి కోపం వచ్చింది. కాని తమాయించు కున్నాడు. చిరునవ్వు నవ్వుతూ "సుయోధనా! నీవు చెప్పినది తథ్యము. రేపే యుద్ధం వస్తుంది. అందులో నీవు నేలకూలడం తథ్యము.

ఏమీ! నీవు ఏమీ తప్పు చెయ్య లేదా! ఇందులో నీ తప్పు ఏమీ లేదా! నీవు ఏనాడు పాండవులకు కీడు చెయ్యలేదో చెప్పు. వారు పుట్టింది మొదలు జన్మవైరము సాగించావు కదా! విషం పెట్టి చంపాలని చూచావు. పెను బాముల చేత కరిపించావు. కాళ్లు చేతులు కట్టి నీళ్లలో పడవేశావు. లక్క ఇంట్లో పెట్టి కాల్చి చంపాలని ప్రయత్నం చేసావు. వారిని చంపాలని ఎన్నో ప్రయత్నాలే చేసావు. వారు నమ్ముకున్న సత్యం. ధర్మం వారిని కాపాడాయి. ఇంకా నీ పగ చల్లారక జూదము ఒకటి కల్పించావు. అందులో ధర్మజుని ఓడించావు. ఇంతటి దుస్థితికి కారకుడవు అయ్యావు.

అన్నదమ్ములతో జూదం ఆడి, వారి భార్యను జుట్టుపట్టి సభాస్థలమునకు ఈడ్చుకొచ్చి చీరలు ఊడదీసిన వారిని లోకంలో ఎక్కడా చూడము. నీ ఒక్కడిని తప్ప. ఆ రోజు నువ్వు, కర్ణుడు, పలికిన పలుకులు సభ్యత కల సభలో చెప్పదగినవి కావు. కులము, శీలము, గుణము కలిగిన ఒక పుణ్య కాంతలను ఆ ప్రకారం చెయ్యడం కళ్లారా చూసిన జనులు వినుచుండగా నువ్వు నాదేమీ తప్పు లేదని ఈ రోజు అనడం నీ ఒక్కడికే చెల్లింది కదా!

పైగా పాండవులు నీ మీదికి కయ్యానికి కాలు దువ్వుతున్నారు అని అంటున్నావు. అసలు నీదీ ఒక బతుకేనా! నీ తండ్రి, నీ తాత, నీ గురువు చెప్పే పలుకులు పెడచెవిని పెట్టావు. నీకూ పాండవులకు పొత్తు కుదరదని తెలిసి కూడా శాంతి కాముకుడనై నీకు ఇంతవరకూ చెబుతున్నాను. సంధి చేసుకో బాగు పడతావు." అని అన్నాడు శ్రీకృష్ణుడు.

ఈ మాటలకు కోపం వచ్చింది సుయోధనునికి. అతనిని చూచి దుశ్శాసనుడు ఇలా అన్నాడు. "అన్నయ్యా! మన తండ్రి, తాత, గురువు నీకు చెప్పే విధం ఇది కానేకాదు. నిన్ను వీళ్లు ఎలాగైనా సంధికి అంగీకరింప చేస్తారు . కాబట్టి నీవు ఇక్కడ ఉండటం మంచిది కాదు." అని దుశ్శాసనుడు పలుక గానే దుర్యోధనుడు సభా మర్యాదను కూడా

పాటించకుండా సభ విడిచి వెళ్లిపోయాడు. సుయోధనుడి వెంట కర్ణుడు, అతని సహోదరులు, శకుని, అతని మిత్ర రాజులు అందరూ సభవిడిచి వెళ్లారు. వారంతా ఒక గుంపుగా చేరి ఏదో ఆలోచిస్తున్నారు.

ఇది చూచాడు భీష్ముడు. "ఇది ఏమిటి వీడు ఇలా వెళ్లిపోయాడు. వీడికి మతి చలించిందా ఏమి! లేక లోభము, మోహము, మద, మాత్సర్యములతో కొట్టుకుంటున్నాడా. వాడి వెంట వీళ్లందరూ వెళ్లారు. వీరు ఏమి చెయ్యదల్చుకున్నారో ఏమో!". అని అనుకుంటూ శ్రీకృష్ణుని వద్దకువచ్చి "కృష్ణా! వీళ్లందరికీ కాలం మూడి నట్టుంది. లేకపోతే ఇలా చేస్తారా!" అని అన్నాడు.

తరువాత శ్రీకృష్ణుడు సభికులను చూచి "చూచారా! ఈ సుయోధనుడు ఎంత గర్విష్ఠి! వంశ ప్రతిష్ఠను కాపాడుకోడానికి జాతి గౌరవం నిలపడానికి ఇలాంటివారిని విడిచి పెడితే నష్టం లేదుకదా! కంసుడు ఇదే విధంగా వంశ ప్రతిష్టను నాశనం చేస్తుంటే నా బంధువులు వచ్చి నాతో చెప్పుకున్నారు. నేను ఆ దుష్టుని సంహరించి అతని తండ్రి ఉగ్రసేనునికి తిరిగి పట్టం కట్టాను. మీరు కూడా అలా చెయ్యడం మంచిది. దుర్యోధనుని పీడ విరగడ అయితే కురు వంశం వర్ధిల్లుతుంది.

కురు పాండవులకు కలిసి జీవించే మార్గం దొరుకుతుంది." అని అన్నాడు.

ఈ మాటలు విన్న ధృతరాష్ట్రుడు అదిరి పట్టాడు విదురుని పిలిచాడు. " నీవువెంటనే వెళ్లి గాంధారిని పిల్చుకొనిరా. కనీసం తల్లి మాట అన్నా వింటాడేమో వీడు." అని అన్నాడు.

విదురు వెంటనే వెళ్లి గాంధారిని తీసుకొని వచ్చాడు. "గాంధారీ! నీ కుమారుడు గర్వంతో సభను విడిచి వెళ్లిపోయాడు. ఇలాంటి దుర్మార్గుడు కూడా ఉంటాడా! నీవైనను చెప్పి వాడిని శాంతింప చెయ్యి. అప్పుడే ఈ కురువంశం బతికి ఉంటుంది." అని అన్నాడు, దృతరాష్ట్రుడు.

దానికి గాంధారి "మహారాజా! నీకొడుకు అవినీతి పరుడని తెలిసి కూడా వానిని ఎందుకు సమర్ధిస్తావు. నీవు పాండవులకు అర్ధ రాజ్యం ఇస్తే ఇక్కడ నిన్ను కాదనే వారెవరు?" అని పలికి విదురునితో "నేను చెప్పాను అని చెప్పి సుయోధనుని సభలోకి రమ్మని చెప్పండి." అని పలికింది

విదురుడు పోయి సుయోధనునికి ఆ విషయం చెప్పాడు. సుయోధనుడు ఒక్కడే వచ్చి సభలో కూర్చున్నాడు. మిగిలిన వారంతా అక్కడే నిలబడ్డారు. గాంధారి కూడా తనకు తోచి నట్టు సుయోధనునికి ధర్మము, నీతి, పాండవులతో చుట్టరికము, వారి బతుకు దెరువు, వారి శక్తియుక్తులు అని వివరించింది సుయోధనుని బుజ్జగించింది. కోపంగా మాట్లాడింది. కాని ఆమె మాటలను సుయోధనుడు లక్ష్యపెట్టలేదు. మరల లేచి వెళ్ళిపోయాడు. తన వారితో మంతనాలు జరుపుతున్నాడు.

"శ్రీకృష్ణుని తలంపు మంచిది కాదు. భీష్ముని, ద్రోణుని తన వశం చేసుకొని మన మీద వత్తిడి తెస్తున్నాడు. అతని మాటల బట్టి ఇది వెల్లడి అవుతూ ఉంది. పైగా తాను కంసుని చంపిన విధం కూడా చెబుతున్నాడు. ముందు ఇతనిని బంధిస్తే గాని పాండవుల గర్వము అణగదు. అప్పుడు వారు మన దారికి వస్తారు. ఒక వేళ వారు మనకు లొంగక పోతే యుద్ధంలో వారిని సులభంగా ఓడించ వచ్చు. కృష్ణుడు లేక పోతే వారు కోరలు తీసిన పాములే కదా కాబట్టి మనమందరం కృష్ణుని బంధిస్తాము." అని నిర్ణయించాడు సుయోధనుడు. ఆ ప్రకారం దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణుడు ఇంకా వారికి సాయంగా వచ్చిన రాజులు కృష్ణుని బంధించాలని నిశ్చయించుకున్నారు.

ఇదంతా సాత్యకి చూస్తున్నాడు, వెంటనే సాత్యకి కృతవర్మను పిల్చి "కృతవర్మా! మన సైన్యాన్ని సిద్ధం చెయ్యి. నువ్వు వాకిట్లో యుద్ధానికి సిద్ధం గా ఉండు . ఇక్కడ సంగతి నేను చూచుకుంటాను". అని చెప్పి కృత వర్మను పంపాడు. తాను కృష్ణుడికి విషయమంతా చెప్పాడు. ఆయన అంగీకారంతో భీష్మ, ద్రోణులను చూచి ఇలా అన్నాడు. "కౌరవులు శ్రీకృష్ణుని పట్టి బంధించడానికి ప్రయత్నిస్తున్నారు. అతనిని పట్టుకోడానికి ప్రయత్నించడం అగ్నిని మూటకట్టడమే అవుతుంది." అని పలికాడు.

ఆ మాటలువిన్న విదురుడు ధృతరాష్ట్రుడితో ఇలా అన్నాడు. "మహారాజా! నీ కొడుకులు శ్రీకృష్ణుని పట్టి బంధించడానికి ప్రయత్నం చేస్తున్నారు. మాడి మసైపోతారు." అని అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు సభ నుద్దేశించి ఇలా అన్నాడు. "మహారాజా! కౌరవులు నా మీద కోపంతో ఇలా చెయ్యడం తగునా. నాకు అనుజ్ఞ ఇవ్వండి. నేను వారికి తగిన విధంగా బుద్ధిచెపుతాను తరువాత వెళ్లి పోతాను." అని అన్నాడు.

ధృతరాష్ట్రుడు వెంటనే విదురునితో "నీవు వెళ్లి సుయోధనుని నా వద్దకు తీసుకొని రా!" అని అన్నాడు.

విదురుడు వెళ్లి సుయోధనుని సభకు తీసుకొని వచ్చాడు. సుయోధనుని చూచి ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు "సుయోధనా! ఏమిటీ దుర్బుద్ధి నీకు. శ్రీకృష్ణుని బంధిస్తావా! మీరంతా నాశనమై పోతారు. నేనేమీ చేయలేను." అని అన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు సుయోధనుని చూచి "సుయోధనా! నేను ఒక్కడిని అని నన్ను పట్టి బంధించడానికి ప్రయత్నిస్తున్నావా! నేను ఎవరో చూస్తావా" అంటూ ఒక్క చిరు నవ్వునవ్వాడు.

శ్రీకృషుడి నుదుటి మీద బ్రహ్మ, వక్షస్థలములో విరూపాక్షడు (శివుడు), ముఖంలో అగ్ని, పార్శ్వములలో ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, ఆదిత్యుడు, మరుత్తు, విశ్వేదేవులు, అశ్వినులు, ఉద్భవించారు. బాహువులనుండి బలరాముడు, అర్జునుడు, భుజములలో నుండి యుధిష్టిరుడు, భీముడు, నకుల సహదేవులు, యదు, వృష్ణి, భోజ, అంధక వీరులు ప్రభవించారు. శంఖము, చక్రము గద, ఖడ్గము, శారఙ్గము, మొదలగు ఆయుధములు చేతులలోకి చేరాయి. నేత్రములు, చెవులు, ముక్కుల నుండి ధూమముతో గూడిన మంటలు లేచాయి. రోమ కూపాలనుండి సూర్య కాంతులు వెదజల్లుతున్నాయి.

ఆ ప్రకారంగా శ్రీకృష్ణుడి చూడడానికి కూడా శక్యం కాకుండా ఉంది. అందరూ భయంతో కళ్లు మూసుకున్నారు. శ్రీకృష్ణుడు అక్కడ ఉన్న మునులకు, భీష్మాదులకు దివ్యదృష్టి ప్రసాదించాడు. దేవతలందరు సిద్ధులు సాధ్యులు విద్యాధరులు జయజయధ్వానాలు చేసారు.

ఆ కలకలం విని ధృతరాష్ట్రుడు అది దేవదేవుని విశ్వరూపము అయి ఉంటుందని భావించాడు. "వాసుదేవా నా మీద దయయుంచి నిన్ను దర్శించే భాగ్యం అనుగ్రహించు." అని ప్రార్ధించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునికి దృష్టిని ఇచ్చాడు. ధృతరాష్ణుడు శ్రీకృష్ణుని విశ్వరూపమును కనులారా చూచి "దేవా! నీ దివ్యమంగళ విగ్రహమును చూచిని ఈ కళ్లతో మరల ఈ లోకమును చూడలేను. మరల నన్ను అంధుడిగా చెయ్యి" అని ప్రార్ధించాడు. శ్రీకృష్ణుడు అలాగే అన్నాడు. ధృతరాష్ట్రుడు యధాప్రకారము అంధుడయ్యాడు. శ్రీకృష్ణుడు తన విశ్వరూపాన్ని ఉపసంహరించుకున్నాడు. సాత్యకి కృతవర్మలు తోడు రాగా సభవిడిచి వెళ్లిపోయాడు." అని వైశంపాయనుడు జనమేజయునికి మహాభారత కధను వివరించాడు.

మహాభారతము ఉద్యోగపర్వము తృతీయాశ్వాసము

సంపూర్ణము ఓం తత్సత్.

# శ్రీమదాంధ్ర మహా భారతము

## ఉద్యోగపర్వము

## చతుర్థాశ్వాసము.

జనమేజయునికి వైశంపాయనుడు మహాభారత కథను ఈవిధంగా చెప్పసాగాడు.

ఆ ప్రకారంగా శ్రీ కృష్ణుడు కురుసభనుండి బయటకు వచ్చాడు. అతనిని కౌరవ ప్రముఖులు మర్యాదపూర్వకంగా అనుసరించారు. బయట దారుకుడు రథంతో సహా వేచి ఉన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు తనతో వచ్చిన వారినందరిని చూచి "ఇంక మీరు ఉండండి నేను వెళతాను." అని చెప్పాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు కృష్ణుని చూచి, "కృష్ణా! కౌరవ పాండవులు కలిసి ప్రశాంతంగా జీవించడానికి నేను చేయ తగిన ప్రయత్నములు నేను చేసినాను. ఇది అందరికీ తెలుసు. నేను శుద్ధుడననీ ఇందులో నా తప్పు ఏమీ లేదని నీకు తెలిస్తే చాలు. అందరికీ తెలిసినట్టే. నీవు తెలుసుకొనడమే నాకు ముఖ్యం." అని అన్నాడు ధృతరాష్ట్రుడు. అప్పుడు కృష్ణుడు తనతో వచ్చిన బాహ్లీక, భీష్మ, ద్రోణ, కృప ప్రముఖులను చూచి

“సభలో జరిగినది అంతా మీకు తెలుసుకదా. మీరందరూ కనులారా చూచారు. చెవులారా విన్నారు. ఇప్పుడు మహారాజు ఇందులో తన తప్పు ఏమీ లేదు అంటున్నాడు. కావున నాకు ఇచ్చట ఉండవలసిన పని ఏమీ లేదు. నేను పోయి వచ్చెదను. ఇక్కడ జరిగినది అంతయూ ధర్మపుత్రునకు చెప్పవలెను కదా! ” అని వారికి చెప్పి రథం ఎక్కాడు. కాని కౌరవ ప్రముఖులు అందరూ అతని వెంట వచ్చారు. అందరూ కుంతీ దేవిమందిరమునకు వెళ్లారు. అక్కడ రథము దిగి కృష్ణుడు కుంతీదేవి దగ్గరకు వెళ్లాడు. కౌరవ సభలో జరిగినది అంతయూ కృష్ణుడు కుంతీదేవికి చెప్పాడు.

“కృష్ణా! కౌరవులు ఇన్నాళ్లు బాగా తిని పొగరుబట్టి జరగబోయేది తెలియకున్నారు అర్జునుని గాండీవము నుండి వచ్చు బాణ యుల రుచి చూస్తేగాని వారికి బుద్ధిరాదు.” అని పలికింది కుంతి.

“అత్తా! నేను తిరిగి పాండవుల వద్దకు వెళుతున్నాను. వారికి చెప్పునది ఏమైన ఉన్నదా!” అని అడిగాడు.

“క్షత్రియులు పరాక్రమమును నమ్ముకొని జీవించవలెను కాని వేరే మార్గము నిషిద్ధము అని చెప్పు. ఉత్తమ వంశములో పుట్టినవారు,

క్షత్రియధర్మమును ఆచరిస్తారు. బుద్ధిహీనులు ఏదో ఒకవిధంగా దీనంగా జీవిస్తారు. నీ బావమరుదులు సంధికోసం ఎంతో ప్రయత్నించారు. కాని అది కుదరలేదు. అదీ వారి మంచికే జరిగింది. క్షత్రియులకు వీరత్వము కులధర్మము. అర్జునుడు యుద్ధములో తన వీరత్వము చూపకుంటే నలుగురిలో పలుచనైపోడా. భీమునికి ఈ సంధి తగునా! అసలు వాళ్లమాటలు విని నీవు ఈ సంధికి రావచ్చునా! భగవంతుని దయవలన ఈ సంధి భగ్న మైనది. అయినా కృష్ణా! నాడు నిండు సభలో ద్రౌపదికి జరిగిన అవమానము పాండుపుత్రులు అప్పుడే మర్చిపోయారా! అప్పుడు ధర్మప్రకారము అడవులకు వెళ్లారు కాని ఇప్పుడేమయింది. తమకు రావలసిన అర్ధరాజ్యము ఇవ్వకపోతే యుద్ధము చేసి తీసుకొనవలెనని ఒకరు చెప్పాలా! కౌరవులు ధర్మవిరుద్ధంగా ప్రవర్తిస్తుంటే వారికి బుద్ధి చెప్ప పనిలేదా! ” అని పాండవులకు నా మాటగా చెప్పు.

“కృష్ణా! నేను ఇక్కడా బాగానే ఉన్నానని చెప్పు. వీరులుగా బతకమని వాళ్లకు చెప్పు నీవు పోయిరమ్మ.” అని పలికింది కుంతీదేవి.

తరువాత శ్రీకృష్ణుడు తనతో వచ్చిన వారందరినీ ఇంక ఉండమని చెప్పాడు. కర్ణుని చూచి “కర్ణా! రావయ్యా! ఊరి పొలిమేర వరకూ నన్ను సాగనంపవా! ” అని తన చెయ్యి అందించి రథం ఎక్క మన్నాడు. కర్ణుడు

శ్రీకృష్ణుని చెయ్యిపట్టుకొని రధం ఎక్కాడు. రధం హస్తినాపురం వదలి పెట్టింది. కర్ణుని రధం కృష్ణుని రధాన్ని వెంబడించింది.

తరువాత ధృతరాష్ట్రుడు మరల తన కొలువ కూటమునకు వెళ్లాడు. అందరూ కూర్చుని జరిగిన విషయములు చర్చించుకుంటున్నారు. "మహారాజా! అదేమిటి కుంతీ దేవి అలా మాట్లాడింది. మాకు ఆమె మాటలు చాలా ఆశ్చర్యము కలిగించాయి. కృష్ణుడూ అలాగే మాట్లాడాడుకదా. ఇంక ధర్మజునికి పట్టపగ్గాలుండవు. ఏమి జరుగుతుందో ఏమో." అని భీష్ముడు, ద్రోణుడు సుయోధనుని చూచి "సుయోధనా! ఇప్పటికి మించిపోయినది లేదు. నీవు వెంటనే వెళ్లి ధర్మపుత్రుని కలుసుకో. దారి మధ్యలో శ్రీకృష్ణుని కలుసుకో. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకో. మేము జీవన సంధ్యలో ఉన్నాము. ఈ వయసులో మాకు ఈ యుద్ధము ఏల తెచ్చిపెట్టెదవు. తరువాత నీ ఇష్టం. ఇంక మేము వెళ్లి వస్తాము." అని హితవు పలికి సభను విడిచి వెళ్లిపోయారు. తరువాత ధృతరాష్ట్రుడు సభ చాలించాడు.

అక్కడ శ్రీకృష్ణుడు కర్ణుని తో కలిసి ఊరి బయటకు వెళ్లాడు. కర్ణుని రధం అతనిని అనుసరించింది. ఒక నిర్జన ప్రదేశంలో తన రధం

ఆపించాడు శ్రీకృష్ణుడు. తమ మాటలు ఎవరూ వినడం లేదు అని ధృ వపరుచుకొని కర్ణునితో ఇలా అన్నాడు.

“కర్ణా! నీకు పెద్దలంటే గౌరవము. నేను చెప్పినది సావధానంగా విను. కుంతీదేవి కన్యగా ఉన్నపుడు, దుర్వాసుని మంత్ర మహిమ చేత, సూర్యుని వలన నిన్ను కన్నది. నీవు కుంతీ పుత్రుడువు. పాండవులలో పెద్దవాడవు. నీవు తన అన్న అని తెలిసిన ధర్మజుడు నీకు సాష్టాంగ ప్రమాణము చేస్తాడు. నీకు పట్టాభిషేకము చేస్తాడు. నీవు ఈ కురు సామ్రాజ్యానికి చక్రవర్తివి అవుతావు. నీవు చక్రవర్తిగా రధంలో వస్తుంటే, యువరాజు యుధిష్ఠిరుడు నీకు వింజామరలు వీస్తాడు. వాయు పుత్రుడు నీకు ఛత్రము పడతాడు. సవ్యసాచి అర్జునుడు నీ రథానికి సారథ్యం వహిస్తాడు. పాంచాల, యాదవ రాజులు నీ వెంట వస్తారు. అభిమన్యుడు మొదలగువారు నీ చుట్టూ ఉంటారు. ఇట్టి మహేంద్ర వైభవము అనుభవిస్తూ నీవు ఈ భూమండలాన్ని పరిపాలించు. కర్ణా! ఇంకొక విశేషము కూడా కలదు. ద్రౌపది తన భర్తలు ఐదు మందితో పాటు నిన్ను ఆరవ భర్తగా పొందుతుంది అని రహస్యంగా చెప్పాడు కృ ష్ణుడు.

( ఈ సందర్భంలో మనము మూలప్రతులలో ఏమి ఉన్నదో చూద్దాము. ఎందుకంటే ద్రౌపదిని గురించి కృష్ణుడు అలా మాట్లాడాడా అని సందేహం కలగడం సహజం.

సంస్కృత మూలంలో "షష్ఠే చత్వాం తథాకాలే ద్రౌపద్యుపగమిష్యతి." అని ఉన్నది. తథా కాలే అంటే ఎవరికి తోచిన అర్థం వారు తీసుకున్నారు. ఇంక తిక్కనగారి భారతంలో "పాంచాల రాజపుత్రియు నంచితముగ నిన్ను బొందు నాఱవ వరుసన్. " ఇక్కడ పొందు, వరుస అనే పదాలు ఉన్నాయి. వీటికి ఎవరికి తోచిన అర్థం వారు తీసుకున్నారు. ఇంక తిరుపతి వేంకట కవులు రచించిన "పాండవోద్యోగము" అనే నాటకంలో "నిన్నా సతి పెండ్లియాడగల దారవ భర్తగ సూర్య నందనా" అని ఉన్నది. పెండ్లి, భర్త అనే మాటలు ఈనాటకంలో మాత్రం వినబడ్డాయి.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. సాధారణంగా మనం మాట్లాడు కొనేటప్పుడు ఆ అమ్మాయి నీకు వరుస అవుతుంది అంటారు. అంటే పెండ్లి చేసుకోడానికి వరుస అవుతుంది అని అంతేగాని పెండ్లి చేసుకున్నది అని కాదు కదా. సాధారణంగా మేనత్త మేనమామల పిల్లలు వరుస అవుతారు. ఇక్కడ కూడా ద్రౌపది నీకు ఆరవ వరుస అవుతుంది అని అన్నాడే కాని నిన్ను పెండ్లి చేసుకుంటుంది అని

అనలేదు కదా. ఈ విధంగా అర్థం చేసుకుంటే కృష్ణుని పాత్ర ఔచిత్యానికి భంగం కలగదు అని నా భావన. )

ఈ మాటలు విన్న కర్ణుడు కృష్ణునితో ఇలా అన్నాడు. “కృష్ణా! నీవు చెప్పి న విషయములు నేను కూడా విన్నాను. కుంతీదేవి నన్ను ప్రసవించి, నిర్దయగా నన్ను ఒక నదిలో వదిలి పెడితే, దయతో నన్ను ఒక సూతుడు తెచ్చి పెంచి పెద్ద చేసాడు. తన కుమారులతో సమానంగా నన్ను పెంచాడు. ఆ సూతుని భార్య కూడా నన్ను తన కన్న కొడుకు కన్నా మిన్నగాపెంచింది. ఇప్పుడే అన్నావు కదా. నేను పెద్దలను గౌరవిస్తాను అని, ధర్మం తెలిసిన వాడిని అని. నాకు సూత కులాచార ప్రకారం అన్ని కర్మలు జరిగాయి. కాబట్టి నేను కూడా నా తల్లితండ్రులకు నా విద్యుక్త కర్మలు నిర్వర్తించాలికదా. అలా చేయకుండా ఇప్పుడు నేను రాజకుమారుడిని అని పాండవుల దగ్గరకు రావడం న్యాయమా! ధర్మ మా! నీవే చెప్పు. ఒక సూతుడిగా నాకూ బంధువులు, సోదరులు, మిత్రులు ఉన్నారు. వారిని విడిచి పెట్టడం ధర్మమా! ఇంతటి చక్రవర్తి నన్ను సూతుడు అని కూడా చూడకుండా నన్ను తన తమ్ముళ్లకంటే మిన్నగా చూచుకుంటున్నాడు. నన్ను ఒక రాజును చేసాడు. అటువంటి సుయోధనుని యుద్ధం ముంచుకొస్తున్న వేళ విడిచి పెట్టడం ధర్మ మా! పైగా సుయోధనుడు నన్ను అర్జునునికి దీటుగా భావిస్తున్నాడు. అతడి

నమ్మకం నేను ఎలా వమ్ము చెయ్యగలను. నేను అర్జునునితో యుద్ధం చేయకుండా తప్పుకుంటే లోకులు నవ్వరా! నేను ఇప్పుడు పాండవులతో చేరితో అది అర్జునునికే అపకీర్తి కదా! నాకూ అవమానమే కదా! కృష్ణా! నీకు తోచింది నువ్వు చెప్పావు. దయచేసి ~~ఈ~~విషయములు ఎవరికీ తెలియనీయకుండా నీ మనసులోనే దాచుకో. ఎందుకంటే ధర్మపుత్రునికి నేను తన అన్న అని తెలిస్తే రాజ్యాధికారానికి ఒప్పుకోడు. అలాంటి ధర్మత్ముడు ~~ఈ~~ భూమిని పరిపాలించడమే న్యాయంకదా! ధర్మరాజు యజ్ఞం చేస్తున్నాడు. అందులో మిగిలిన పాండువలు ఋత్విక్కులు. నీవు వారిని నడిపించే ఉపద్రష్టవు. ఆ యజ్ఞంలో కౌరవులు అనే పశువులను సంహరించి హోమం చేస్తారు. ఆ ధర్మయజ్ఞంలో పుణ్యభూమి అయిన కురుక్షేత్రములో మేము అందరమూ సద్గతులు పొందుతాము." అని పలికాడు కర్ణుడు.

" కర్ణా! నేను చెప్పిన మాటలు నీవు వినడం లేదు. నీకు అర్జునుని మీద మాత్సర్యము ఉన్నది. నీకు అర్జునుని చేతిలో పరాభవమో, మరణమో తథ్యము. అంతేకాని నీవు అర్జునుని గెలువలేవు. ~~ఈ~~ యుద్ధంలో పాండవులే గెలుస్తారు. కాబట్టి నీవు హస్తినకు పోయి అక్కడ భీష్మాదులకు, వెంటనే యుద్ధమునకు మహూర్త నిర్ణయము చెయ్యమని చెప్పు."అని అన్నాడు కృష్ణుడు.

"కృష్ణా! అది నీవు వేరే చెప్పాలా. అందుకే కదా నేను పాండవుల వద్దకు రానన్నది. పైగా ఈ యుద్ధానికి నాతో పాటు శకుని, దుశ్శాసనుడు కూడా కారణం. వారు పాండవులతో కలిస్తే కదా నేను కలవడానికి. అది అసాధ్యం కాబట్టి ఇదీ అసాధ్యం. కృష్ణా! నేను యుద్ధంలో గెలిస్తే మరల నిన్ను చూస్తాను. లేకపోతే స్వర్గంలో నీ దివ్యమంగళ విగ్రహం చూస్తాను. ఇంక నాకు సెలవు ఇప్పించు." అన్నాడు కర్ణుడు.

తరువాత కర్ణుడు తన రథం ఎక్కి హస్తినాపురం వెళ్లిపోయాడు. కృష్ణుడు తన రథం మీద ఉపప్లావ్యమునకు ప్రయాణం అయ్యాడు.

ఆ సమయంలో విదురుడు కుంతీ దేవి మందిరమునకు వెళ్లాడు. "అమ్మా కుంతీదేవీ! కురు వంశం అంతరించే విధంగా కురు పాండవ యుద్ధం దాపురించింది. ఎవ్వరు కూడా శ్రీకృష్ణుని మాట మన్నించలేదు. యుద్ధం ఆపలేదు. అయినా కౌరవులకు పాండవుల బలపరాక్రమములు ముఖ్యంగా అర్జునుని గాండీవం సంగతి తెలిసి కూడా, వారు ఈ యుద్ధానికి సిద్ధపడ్డారు. ఏమి జరుగుతుందో ఏమిటో! " అని ఆందోళన పడ్డాడు.

కుంతీ దేవి ఏమీ మాట్లాడలేదు. తరువాత విదురుడు తన మందిరానికి వెళ్లాడు. కాని కుంతీ దేవి మనసులో ఇలా అనుకుంది.

"కేవలం రాజ్యం కోసం, సంపదల కోసం తన వారిని చంపుకోడం ధర్మం అవుతుందా? కాని యుద్ధం చేయడం అంటే దుఃఖం కొని తెచ్చుకోవడమే కదా! అది క్లేశ రహిత కార్యము ఎలా అవుతుంది. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, వీరి వీరావేశము చల్లార్చడం అంత సులభం కాదు కదా. కర్ణుని మనసు ఎప్పుడూ పగతో రగిలిపోతూ ఉంది. కాని మిగిలిన వారికి యుద్ధం మీద అంత ఉత్సాహం ఉన్నట్లు లేదు. కర్ణుడికి తన జన్మ వృత్తాంతం చెప్పి పాండవుల మీద ప్రేమ కలిగిస్తే ఎలా ఉంటుంది? అప్పుడు కర్ణుడు యుద్ధం మాను కొనే అవకాశం ఉంది కదా!" అని ఆలోచించింది. ఎలాగైనా కర్ణుని కలుసుకోవాలని నిశ్చయించుకుంది.

ఆ సయమంలో కర్ణుడు అనుష్టానం చేసుకోడానికి గంగానదీ తీరానికి వెళ్లాడని తెలుసుకొని అక్కడకు వెళ్లింది. కర్ణుడు అనుష్ఠానం పూర్తి చేసాడు. అక్కడ కూర్చుని ఉన్న కుంతీదేవిని చూచాడు. తన గోత్రనామాలు చెప్పుకొని అభివాదం చేసాడు.

"అమ్మా కుంతీదేవీ! తమరు వచ్చిన కార్యము తెలుసుకొన వచ్చునా!" అని అడిగాడు.

"కుమారా! నీవు సూత పుత్రుడికి కావు.నీవు సూత కులములో జన్మించలేదు. నా వివాహం కాకముందు నేను కుంతిభోజుని ఇంటిలో ఉండగా ఒక మంత్ర ప్రభావమున సూర్యుని ప్రత్యక్షం చేసుకున్నాను. అతని వలన నీవు నాకు జన్మించావు. కాబట్టి నేటి ధర్మము ప్రకారము నీవు కూడా పాండు పుత్రుడవే. కాబట్టి నీవు క్షత్రియుడవు. మరొకరికి సేవ చెయ్యవలసిన అవసరం నీకు లేదు. ధర్మరాజు మొదలగు పాండు పుత్రులకు, దుర్యోధనాది కౌరవులకు నీవే పెద్దవాడవు. నీవే చక్రవర్తివి. ఈ లోకాన్ని అంతటిని పరిపాలించు. ఇంకా రాధేయుడుగా ఉండే అవసరం నీకు లేదు." అని చెప్పింది.

ఆ సమయంలో సూర్యబింబమునుండి ఒక వాణి వినిపించింది. "ఇది నిజము. ఆమెచెప్పినప్రకారం నడుచుకో!" అని వినిపించింది.

అన్ని విన్న కర్ణుడు కుంతీదేవి తో ఇలా అన్నాడు. "అమ్మా కుంతీ దేవి! నీవు చెప్పినది నిజము. కాని నేను చెప్పునది కూడా విను. నీవు నన్ను క్షత్రియోచితమైన సంస్కారములకు దూరం చేసావు. ఇప్పుడు

నన్ను క్షత్రియుడనీ నీ కుమారుడననీ అనడం భావ్యమా! నేను సూర్యుని వలన పుట్టాను. నా జన్మ నిందించ తగినది కాదు. కాని ఆ విషయం రహస్యంగా ఉంచబడింది. ఇప్పుడు దానిని అందరికీ తెలియచెయ్యడం ఏం బాగుంటుంది చెప్పు. అర్జునుడు అమిత పరాక్రమంతో ప్రఖ్యాతి చెందుతుంటే, నేను భాస్కరుని వలన కుంతికి పుట్టాను అని చెప్పుకుంటూ వారి పక్షంలో చేరితో, నేను అర్జునునికి భయపడి పాండవులతో చేరాను అని అనుకోరా! అమ్మా! నేను సుయోధనుని వలననే పేరు ప్రతిష్ఠలు గడించాను. ఇప్పుడు, ఈ యుద్ధ సమయంలో అతనిని విడిచి పెట్టడం భావ్యమా! ప్రస్తుతం నేను సుయోధనుని ఉప్పు తిని జీవిస్తున్నాను. అతనికి ద్రోహం తలపెట్టలేను. అలా చేస్తే సాటి రాజులు నన్ను నిందించరా! కాబట్టి నేను సుయోధనుని కొరకు నీ కుమారులతో యుద్ధం చేస్తాను. ఇది నా నిర్ణయం. ఇది మారదు. నీవు అడుగుతున్నావు కాబట్టి ఒక విషయం కపటం లేకుండా చెపుతాను. ధర్మరాజు, భీముడు నకుల సహదేవులు నాకు ఎదురుపడినా వారిని చంపను. అర్జునుని మాత్రం చంపి తీరుతాను. ఎందుకంటే నేను అర్జునుని చేతిలో చచ్చినా, నేను అర్జునుని చంపినా నాకు పేరు వస్తుంది. అర్జునుడు చచ్చినా, నాతో కలిపి నీకు కుమారులు ఐదుగురు. నేను పోతే అర్జునునితో నీకు ఐదుగురు కుమారులు. నీకు ఆరుగురు కుమారులు అనే మాట వదలి పెట్టు. ” అని పలికాడు కర్ణుడు.

Printer friendly pages from Telugu Bhakti Pages http://www.telugubhakti.com
For free downloads join http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

“ఏమి చేస్తాం. విధి ఎలా రాసి పెట్టి ఉంటే అలా జరుగుతంది. నీవు అన్న మాట ప్రకారం అర్జునుని చంపడానికి నేను ఒప్పుకుంటున్నాను. మిగిలిన వారిని వదిలి పెట్టు” అని అన్నది. దానికి సమ్మతించాడు కర్ణుడు. తరువాత అక్కడినుండి వెళ్లిపోయింది కుంతీ దేవి.

ఇంతలో శ్రీకృష్ణుడు ఉపప్లావ్యం చేరుకున్నాడు. ధర్మరాజు, భీమాదులు శ్రీకృష్ణునికి ఎదురేగి అతనికి స్వాగతం చెప్పారు.

“ధర్మజా! దుర్యోధనాదులకు కళ్లు మూసుకుపోయాయి వారు నా మాటవినలేదు. యుద్ధం తప్పదు.” అని అక్కడ జరిగిన విషయములన్ని చెప్పి తన మందిరమునకు వెళ్లిపోయాడు. ఆరోజు రాత్రి శ్రీకృష్ణుడు పాండవుల వద్దకు వెళ్ళాడు.

“ధర్మజా! నేను స్నేహ పూర్వకముగా ఎన్నో మాటలు చెప్పాను. కాని నా మాటలు సుయోధనుడు పెడచెవిని పెట్టాడు. ఏవేవో మాటలాడి నన్ను హేళన చేసాడు. అవన్ని చెప్పి ప్రయోజనం ఏమిటి! ” అని అన్నాడు కృష్ణుడు.

“కృష్ణా! సుయోధనుడు అలా నిన్ను హేళన చేసి మాట్లాడు తున్నప్పుడు సభలో ఉన్న ధృతరాష్ట్రుడు, భీష్మాదులు ఏమీ అనలేదా? అతనిని వారించలేదా? “” అని అడిగాడు ఆతురతగా.

“”ధర్మజా! ధృతరాష్ట్రుడు తన శాయశక్తులా ప్రయత్నించాడు. కాని దుర్యోధనుడు వినలేదు. నేను కూడా శంతన మహారాజు వంశము గురించి, మీ తండ్రి, ధృతరాష్ట్రుని పుట్టుక గురించి, మీ తండ్రిగారు చేసిన రాజ్యవిస్తరణ గురించి, మీరు రాజసూయయాగం చెయ్యడం, కపటద్యూతంలో మీ రాజ్యం అపహరించి మిమ్మల్ని 13 ఏళ్లు అడవులకు పంపడం మీరుపడ్డ కష్టములు అని వివరించి చెప్పాను. మీకు న్యాయప్రకారం రావలసిన రాజ్యభాగం ఇవ్వకపోతే కౌరవ నాశము తప్పదని మొహమాటం లేకుండా చెప్పాను. సభలోని వారందరూ కూడా వారికి తోచినట్లు చెప్పారు. కాని దుర్యోధనుడు వాటిని పెడచెవిని పెట్టి సభలో నుండి తన అనుయాయులతో బయటికి వెళ్లిపోయాడు. తరువాత ధృతరాష్ట్రుడు వెంటనే గాంధారిని సభకు పిలిపించాడు. గాంధారి సుయోధనుని సభకు రమ్మని పిలిచింది. ఆమెకూడా సుయోధనుడికి ఎన్నో మంచి మాటలు చెప్పింది. కాని సుయోధనుడు వినలేదు. తన వారిని యుద్ధానికి సమాయత్తంచేసాడు. నేను కూడా కొంచెం కోపం తెచ్చుకొని బెదిరించాను. మరల కార్యసాఫల్యం కోసం

శాంతం వహించాను. నాకు తోచిన ధర్మములు బోధించాను. సుయోధనుడు నా మీద బలప్రయోగానికి దిగాడు. నేను కొన్ని మాయలు ప్రదర్శించాను. ధర్మజా! నేను వారితో సంధి కొరకు నా శాయశక్తులా పోరాడాను. కాని ప్రయోజనం లేకపోయింది. ఇంక యుద్ధం తప్పదు. మీకు ఎలా తోస్తే అలా చేయండి." అని ముగించాడు కృష్ణుడు.

తరువాత ధర్మరాజు తమ్ముళ్లను చూచి "శ్రీకృష్ణుడు కురు సభలో జరిగినది అంతా చెప్పాడు. ఇంకా అనుమానం ఎందుకు. యుద్ధ సన్నాహాలు చెయ్యండి. " అని పలికి మరల కృష్ణుని చూచి "కృష్ణా! మా మనసులోని మాట, ధార్తరాష్ట్రుల మనసులోని మాట ఎరిగిన వాడవు. ధర్మహాని లేకుండా చేయవలసిన కార్యము నిర్ణయింపుము." అని కోరాడు.

"నిజమే ధర్మజా! ప్రస్తుతం యుద్ధం తప్ప తరుణోపాయం లేదు పైగా మీ తల్లి కుంతీ దేవి కూడా యుద్ధంచెయ్యడమే తక్షణ కర్తవ్యంగా మీకు చెప్పమని చెప్పింది." అని అన్నాడు.

"కాని కృష్ణా! ఈ కారణంగా నా బంధు వర్గమును యుద్ధములో చంపడానికి నా మనస్సు అంగీకరించడం లేదు. కాబట్టి ధర్మము హితము అయ్యే మార్గము అన్వేషించండి. " అని పలికాడు.

దానికి అర్జునుడు "అన్నయ్యా! ఏది ధర్మమో, ఏది హితమో మనకేం తెలుసు. అన్ని తెలిసినవాడు కృష్ణుడు. పైగా మన తల్లిగారు చెప్పిమాటల వలన మన సందేహాలు తీరిపోయాయి. తల్లిగారే యుద్ధము తక్షణ కర్తవ్యమని ఆదేశించారు కదా! శ్రీకృష్ణుడు కూడా యుద్ధమే సరియైన మార్గమని చెప్పాడు. ఇంక అనుమానం ఎందుకు?" అని పలికాడు అర్జునుడు.

"అఖిల ధర్మజ్ఞాన ఘనుడు కృష్ణుడు చెప్పిన తరువాత అతని మాటకు తిరుగు లేదు. యుద్ధసన్నాహాలు చెయ్యండి. మనకు ఉన్నది ఏడు అక్షౌహిణుల సైన్యం. దానిని సమర్ధవంతంగా నడిపేవాడు, భీష్మునికి దీటుగా మనకు సైన్యాధి పత్యం వహించేవాడు మనలో ఎవరున్నారో వెదకండి. అలాంటి వ్యక్తిని మనం సర్వసైన్యాధ్యక్షుడిగా అభిషేకించాలి" అని ఆదేశించాడు ధర్మరాజు. ఆ మాటలు విన్న సహదేవుడు ఇలా పలికాడు.

(మహాభారతము ఉద్యోగపర్వము చతుర్థాశ్వాసము మొదటిభాగము.)

# మహా భారతము

## ఉద్యోగ పర్వము

## చతుర్థాశ్వాసము

"యుద్ధము అనివార్యమైనది. మనకు పదకొండక్షౌహిణుల సైన్యము ఉన్నది. దానిని సమర్ధవంతముగా నడిపించుటకు, భీష్ముని యుద్ధములో ఎదుర్కొనుటకు, తగిన వీరుడు మనకు సర్వసై న్యాధ్యక్షుడుగా ఉండవలెను. అటువంటి వీరుడు ఎవరో నాకు తెలపండి ."అని ధర్మరాజు తమ్ములను అడిగాడు.

"అన్నయ్యా! అత్యధిక బాహుబలము కలవాడు, పుత్రులు, పౌత్రులు, సోదరులు కలవాడు అయిన మత్స్యదేశాధిపతి, విరాటుడు, మనకు తగిన సైన్యాధ్యక్షుడు." అని సహదేవుడు అన్నాడు.

వెంటనే నకులుడు లేచి "అన్నయ్యా! ఎక్కువగా బలగము, ప్రతాపము, కీర్తి, బాహుబలము కలవాడు ద్రుపదమహారాజు. అతనే మనకు సైన్యాధ్యక్షుడు" అని అన్నాడు.

అర్జునుడు లేచి "అన్నయ్యా! కేవలము ద్రోణుని చంపుటకు అగ్నికుండము లోనుండి పుట్టినవాడు, ధనుర్బాణములతో జన్మించిన వాడు, అత్యధిక బాహుబలము పరాక్రమము కలవాడు, అయిన ధృష్టద్యుమ్నుడు మనకు తగిన సైన్యాధ్యక్షుడు. అతను తక్క భీష్ముని తట్టుకొని నిలబడగలవాడు వేరేలేడు. పైగా, అతని తమ్ముడు శిఖండి భయంకరమైన వీరుడు. భీష్ముని చంపడానికే పుట్టినవాడు. కాబట్టి ధృష్టద్యుమ్నుడే మనకు తగిన సైన్యాధ్యక్షుడు." అని పలికాడు.

అప్పుడు ధర్మరాజు కృష్ణుని చూచి "కృష్ణా! నీవు సకలము తెలిసిన వాడవు. తగిన వాడిని నీవే నిర్ణయింపుము. మన ఏడు అక్షౌహిణుల సైన్యమునకు ఒక్కొక్క అక్షౌహిణికి తగిన నాయకుడిని కూడా నిర్ణయింపుము." అని వేడుకున్నాడు.

అప్పుడు కృష్ణుడు ధర్మజుని చూచి "ధర్మ నందనా! అర్జునుడు చెప్పినట్టు ధృష్టద్యుమ్నుడే మన ఏడు అక్షౌహిణుల సైన్యమునకు

సైన్యాధ్యక్షుడుగా తగినవాడు. అతనిని  సర్వ సైన్యాధ్యక్షునిగా అభిషేకించుము.  తరువాత, విడి విడిగా ఒక్కొక్క అక్షౌహిణికి, పాంచాలపతి ద్రుపదుడు, మత్స్యదేశాధిపతి విరటుడు, సాత్యకి, జరాసంధుని కుమారుడు సహదేవుడు, యాదవరాజు చేకితానుడు, శిశుపాలుని కుమారుడు ధృష్టకేతుడు, ద్రుపదమహారాజు కుమారుడు శిఖండి,  వీరిని ఒక్కొక్క అక్షౌహిణికి అధిపతిగా నియమించుము. ఇంక నీ తమ్ములతో కలిసి యుద్ధమునకు బయలు దేరుము." అని పలికాడు కృష్ణుడు.

(అక్షౌహిణి అనగా 21,870 రథములు, అదే సంఖ్యలో ఏనుగులు, 65,610 గుర్రములు, 1,09,350 కాల్బలము, కూడినది).

కృష్ణుని మాటలు శిరసావహించాడు ధర్మరాజు. మరునాడు నిండు కొలువులో యుద్ధప్రకటన చేసాడు. ధృష్టద్యుమ్నుని సర్వసైన్యాధ్యక్షునిగా, పైన చెప్పినవారిని   ఏడు అక్షౌహిణులకు అధిపతులుగా నియమించాడు. యుద్ధభేరులు మ్రోగించమని ఆజ్ఞాపించాడు. ద్రౌపది వద్దకు వెళ్లి పాండవులు అందరూ   ఆమెదగ్గర వీడ్కోలు తీసుకున్నారు.  బ్రాహ్మణులను అర్చించి వారి దీవెనలు అందుకున్నారు.  కృష్ణుడు రథం ఎక్కి సారథి స్థానంలో కూర్చున్నాడు.

గాండీవము, అక్షయ తూణీరము లతో అర్జునుడు రథం ఎక్కాడు. కపిధ్వజము అర్జునుని రథము మీద ఎగురుతూ ఉంది. కృష్ణుడు దేవదత్తము, అర్జునుడు పాంచజన్యము అను శంఖములను పూరించారు. కురుక్షేత్రమునకు సమస్త సైన్యముతో ఒక పెళ్లికి వెళుతున్నట్టు ప్రయాణమయ్యారు.

ధృష్టద్యుమ్నుడు ధర్మరాజుకు నమస్కరించి సర్వసైన్యాధ్యక్షుడు గా ముందు సాగాడు. అతని వెంట ధర్మరాజు, అతని తమ్ములు, యుద్ధము నకు వచ్చిన రాజులు నడిచారు. వారి వెంట సమస్త సైన్యము, భటులు, పరిచారకులు నడిచారు. వారందరూ కురుక్షేత్రము సమీపించారు. హిరణ్వతి నదీ తీరాన ఒక చదునైన ప్రదేశంలో అందరూ విడిది చేసారు.

వేగుల వారివలన పాండవ సైన్యము కురుక్షేత్రము దగ్గర విడిది చేసారని తెలుసుకున్నాడు సుయోధనుడు. కాని ఏమీ తెలియని వాడివలె ఉన్నాడు. కురుసభలో అందరిని చూచి సుయోధనుడు "కృష్ణుడు తనకు అనుకూలముగా మనము ప్రవర్తించలేదని, మనమీద కోపంతో పాండవులకు మనమీద ఏమేమో చెపుతాడు. ఆ మాటలు విని మనమీద కోపంతో ఉన్న పాండవులు మన మీదికి దండెత్తి వస్తారు. యుద్ధం తప్పదు. కాబట్టి మనము కూడా యుద్ధము ప్రకటిద్దాము. మన

సేనలతో  కురుక్షేత్రములో విడిది చేద్దాము.” అని పలికి దుశ్శాసనుని చూచి నీవు, కర్ణుడు, శకుని యుద్ధమునకు తగిన ఏర్పాట్లు చేయండి అని ఆజ్ఞాపించాడు. సుయోధనుని ఆజ్ఞప్రకారము యుద్ధము ప్రకటించారు.

మరునాడు సుయోధనుడు నిండుకొలువులో కూర్చుని ఉన్నాడు. ద్రోణాచార్యుని, కర్ణుని, అశ్వత్థామను, బాహ్లికుని, శల్యుని, కృపాచార్యుని, భూరిశ్రవుని, శకునిని, కృతవర్మను, కాంభోజరాజును, సైంధవుని తన పదకొండు అక్షౌహిణుల సైన్యమునకు అధినాయకులుగా నియమించాడు. వారిని సైన్యాధ్యక్షులుగా అభిషేకించాడు.  అక్షౌహిణీ నాయకులతో కలిసి సుయోధనుడు భీష్ముని వద్దకు వెళ్లాడు.

“ పితామహా! వీరంరూ మనకు పదకొండు అక్షౌహిణులకు అధిపతులు. వీరందరూ వివిధ దేశములకు చెందిన వారు. వీరిని ఒక తాటి మీద నడిపించవలసిన భారం మీమీద ఉన్నది. కాబట్టి మీరు మన సమస్త సైన్యమునకు  ఆధిపత్యము వహించాలి. ” అని ప్రార్థించాడు.

“ సుయోధనా! నాకు మీరు, పాండు కుమారులు,  సమానులే. నేను మీ వద్ద ఉన్నాను.  కాబట్టి యుద్ధంలో మీ పక్షం వహిస్తాను. నేను

సర్వసైన్యాధిపత్యము వహిస్తాను. నన్ను ఎదుర్కొనగలవాడు ఒక్క అర్జునుడు తప్ప వేరే వాడు ఈభూమి మీదలేడు. నేను శత్రువుల నందరినీ సంహరిస్తాను. కాని పాండుకుమారులను చంపడానికి నా చేతులాడవు. వారు కూడా నా మీద యుద్ధానికి రారు. కానిమ్ము. అప్పటికి ఏది జరగాలో అది జరుగుతుంది. కాని, ముందు నన్ను యుద్ధం చెయ్య మంటావా? లేక కర్ణుని యుద్ధం చెయ్యమంటావా? ఏదో ఒకటి తేల్చి చెప్పు. అది తేలితే గాని నేను సకల సేనాధిపత్యము వహించను." అని పలికాడు భీష్ముడు.

అప్పుడు కర్ణుడు సుయోధనునితో ఇప్పుడు "ఈ విషయం ప్రస్తావించడం ఎందుకు. ఎప్పుడు భీష్ముడు యుద్ధంలో పడిపోతాడో అప్పుడు నేను యుద్ధానికి వస్తాను అని ముందే చెప్పాను కదా! అని అన్నాడు కర్ణుడు.

"సుయోధనా అటులనే జరుగుతుంది లే" అని సేనా నాయ కత్వానికి సమ్మతించాడు భీష్ముడు.

ద్రోణాచార్యులు, కృపాచార్యులు, తదితర పెద్దల అనుమతితో సుయోధనుడు భీష్ముని సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించాడు. తాను

ఒక్కొక్క అక్షౌహిణి కి  అధిపతులుగా చేసిన వారిని భీష్మునికి పరిచయం చేసాడు.  సుయోధనుడు తల్లిదండ్రుల వద్ద సెలవు తీసుకొని యుద్ధానికి బయలుదేరాడు. తన సైన్యాలతో కురుక్షేత్రం చేరుకున్నాడు  ఒక రమణీయమైన ప్రదేశంలో విడిది చేసాడు.

ఆ ప్రకారము కురు పాండవుల సైన్యములు కురుక్షేత్రము చేరుకున్నారు. చెరి ఒక పక్క విడిది చేసారు.

ఈ విషయము లన్ని విన్న బలరాములు చాలా దుఃఖించాడు. వెంటనే బయలుదేరి ధర్మరాజు వద్దకు వచ్చాడు. ధర్మరాజు, అతని తమ్ములు, కృష్ణుడు బలరాముని సాదరంగా ఆహ్వానించారు.

"  కౌరవ పాండవులు అత్యంత క్రూరులై తమ బంధువులకు,  ఈ భూమిలో ఉన్న రాజులకు చేటు కలిగేట్టు యుద్ధం చెయ్యడానికి సమకట్టారు. ఇది మీకు తగునా! యుద్ధం నాకు సమ్మతం కాదు. నేను కృష్ణునితో ఇరుపక్షములకు సంధి కుదర్చమని ఎంతో చెప్పాను. కాని అతను అలా చెయ్యలేదు. యుద్ధం సమకూర్చాడు. అసలు మాట్లాడటమే తెలియని మూర్ఖులకు మంచి మాటలతో చెప్పి ఒప్పించాలి గాని, వారితో కోపంగా మాట్లాడటం, సంధి చెడగొట్టడం ఏమి పని!  కృష్ణునికి కౌరవ

పాండవులు సమానమే కదా!  కాని అతనికి అర్జునుడు అంటే అభిమానం ఎక్కువ. అందుకే పాండవులను ఒక చోట నిలువ నీయ కండా, వెంటవేసుకొని తిప్పుతుంటాడు.

అయినా పాండవులకు జయము, కౌరవులకు అపజయము తథ్యము. కాని నేను ఈ  యుద్ధం చూడలేను. భీముని, సుయోధనునికి గదాయుద్ధం నేర్పాను. వారి ఒకరితో ఒకరు కొట్టుకుంటుంటే ఎలా చూడ గలను.  కాబట్టి నేను సరస్వతీ నదీతీరానికి వెళుతున్నాను. మీతో చెప్పి పోదామని వచ్చాను." అని పలికాడు బలరాముడు. కృష్ణుడు, ధర్మనందనుడు సాగనంపగా తీర్థయాత్రలకు వెళ్లాడు బలరాముడు.

తరువాత శ్రీకృష్ణుని భార్య రుక్మిణికి సోదరుడు, కుండిన నగరాధినేత, రుక్మి అనే పేరు కలవాడు ధర్మరాజు వద్దకు వచ్చాడు. అతను అర్జునుని చూచి "అర్జునా! యుద్ధంచెయ్యడానికి నీకు భయంగా ఉంటేచెప్పు. నేను యుద్ధంలోకి దూకుతాను. నాకు ఎదురు నిలిచేవాడు ఈ భూమండలంలో ఎవ్వరూ లేరు."  అని ప్రగల్భాలు పలికాడు.

అది విని అర్జునుడు నవ్వి "రుక్మీ! నేను గంధర్వులతో యుద్ధం చేయునపుడు, గోగ్రహణ సమయంలో యుద్ధం చేయునపుడు తమరు

ఎక్కడ ఉన్నారు. నాకు నీ సాయం అవసరం లేదు. నీసాయం ఎవరికి కావలెనో వారికి తోడ్పడుము. ప్రస్తుతము నాకు కృష్ణుడు సాయంగా ఉన్నాడు. నాకు ఎలాంటి భయము లేదు. నాకు యుద్ధం అంటే భయం అని నేను పిలిచినప్పుడు గదా నువ్వు రావలసినది. నాకు అంత భయం కలిగినపుడు నన్ను కాపాడటానికి వీరందరూ ఉన్నారు. నీ సాయం అవసరం లేదు." అని అన్నాడు.

చేసేది లేక రుక్మి సుయోధనుని వద్దకు పోయి యథాప్రకారము ప్రగల్భాలు పలికాడు. సుయోధనుడు కూడా నాకు నీ సాయం అక్కరలేదు పొమ్మన్నాడు. రెంటికి చెడ్డ రేవడ మాదిరి రుక్మి కుండిన నగరం చేరుకున్నాడు. ఆ ప్రకారంగా బల రాముడు, రుక్మి తప్ప మిగిలిన రాజులందరూ కురు పాండవ యుద్ధంలో పాల్గొన్నారు.

ఆ సమయంలో ఒక రోజు రాత్రి ధృతరాష్ట్రుడు సంజయుని తన నివాసమునకు పిలిపించుకున్నాడు. "సంజయా! ఏది జరగాలో అది జరుగుతుంది మన చేతిలో ఏమీ లేదు కదా! రాజులకు యుద్ధములో చావడం మేలేకదా! అది సరే, పాండవులు కౌరవులు కురుక్షేత్రములో తమ తమ సైన్యములతో సహా విడిసి ఉన్నారు కదా. అక్కడ ఏమి జరుగుతుందో నాకు చెప్పు. " అని అడిగాడు. దానికి సంజయుడు

మహారాజా! నీ కుమారుడు సుయోధనుడు, తన అనుయాయులు దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని తో ఆలోచించి, శకుని కుమారుడైన ఉలూకుని ధర్మరాజు వద్దకు రాయబారం పంపాడు. ధర్మరాజు సభ చేసి ఉండగా, శ్రీకృష్ణుడు, పాండుకుమారులు, ద్రుపదుడు, విరాటుడు వింటూ ఉండగా చెప్పమని కొన్ని మాటలు చెప్పి పంపాడు. ఉలూకుడు వెంటనే ధర్మరాజు వద్దకు వెళ్లాడు.

" ధర్మరాజా! సుయోధనుడు నాకు కొన్ని మాటలు చెప్పి అవి మీ అందరికి వినిపించమని చెప్పి పంపాడు. నా మీద కోపం తెచ్చుకోకుండా వాటిని సావధానంగావినండి".అని అన్నాడు.

దానికి ధర్మరాజు "ఉలూకా! నీవు నిర్భయంగా ఆ బుద్ధిమంతుడు చెప్పమన్న తులువ మాటలు అన్ని వినిపించు." అని అన్నాడు. ఉలూకుడు ఈ విధంగా పలికాడు.

"యుద్ధం చెయ్యడానికి ఎంతో కాలం ఆలోచించి యుద్ధానికి వచ్చావు. సంజయునితో మీరు చాలా ఎక్కువగా ఎన్నో మాటలు మాట్లాడారు. మేము ద్రౌపదికి చేసిన అవమానమునకు, మీ రాజ్యము పోగొట్టుకున్నందుకు కోపించి. నీ వారినందరిని మోహరించుకొని నా

మీదికి యుద్ధానికి వచ్చావు. ఇంక నీవు తప్పించుకోలేవు. మీరందరూ భీష్మ, ద్రోణుల బాణముల రుచి చూస్తారు. వారి బారిన పడి మీ అర్జునుడు బతుక గలడా! మీకు కృష్ణుడు ఉన్నాడుగా. అతని వలననే అన్ని చక్కపెట్టుకోండి. భీముడు దుశ్శాసనుడి గుండెలు చీల్చి రక్తం తాగుతాను అన్నాడు కదా! రమ్మను. ఆలస్యం ఎందుకు. ఎలా తాగుతాడో చూస్తాను. భీమసేనా! నీవు నూతిలో కప్పలాంటి వాడివి. ఎదుటివారి బలం నీకు తెలియదు. యుద్ధంలో మా చేత చావు దెబ్బలు తినకుండా తప్పించుకోలేవు. అర్జునా! తాటి చెట్టంత పొడువు ఉన్న విల్లు ఒకటి నీకు ఉన్నదని, కృష్ణుడు నీ పక్క ఉన్నాడని మాకు బాగా తెలుసు. వీటికి భయపడి మేము రాజ్యం పంచి ఇవ్వడం కుదరదు. అదిసరే! దుశ్శాసనుడు మీ భార్య ద్రౌపదిని నిండు సభకు ఈడ్చుకొని వస్తుంటే భీముడి గద, అర్జునుడు గాండీవము ఎక్కడకు పోయాయి. ఆ రోజు జరిగిన అవమానాలు అప్పుడే మరిచి పోయారా! ఎందుకు బీరాలు పలుకుతారు? వంటల వాడిగా భీముడు, పేడి రూపంలో అర్జునుడు, సిగ్గు లేకుండా బతికి, ఇంకా రాజ్యం మీద ఆశతో యుద్ధానికి వచ్చారా! ఇది శూరుల లక్షణమా! మీ బాహుబలమా! నీవే చెప్పాలి. మీ కృష్ణుడు ఎన్ని మాయలు, ఇంద్రజాలములు చేసినప్పటికి, నీవు ఎన్ని ప్రగల్భములు పలికినప్పటికీ, యాభై వేల మంది భీములు, అర్జునులు వచ్చినప్పటికి,

మీము మీతో యుద్ధం చేస్తామే కాని, రాజ్యం మాత్రం పంచి ఇవ్వము. అది తెలుసుకోండి. ” అని పలికాడు ఉలూకుడు.

ఈ మాటలు విన్న భీమార్జునులు, నకుల సహదేవుడు కోపంతో ఊగి పోయారు. అది చూచి కృష్ణుడు చిరునవ్వుతో వారిని వారించాడు. ఉలూకుని దగ్గరకు వెళ్లి

“ఉలూకా! నీవు కూడా సుయోధనుని వద్దకు వెళ్లి అందరూ వింటూ ఉండగా నేను చెప్పినట్టు ఈ విధంగా చెప్పుము. సుయోధనా! రేపే యుద్ధం. వీరుడవైతే యుద్ధం చేసి మరణించు. నా సారధ్యంలో నడుస్తున్న అర్జునుని రథం నువ్వు ఎక్కడకుపోతే అక్కడకు నిన్ను వెంబడిస్తుంది. నువ్వు చూస్తూ ఉండగా భీముడు నీ తమ్ముడు దుశ్శాసనుని గుండెలు చీల్చి రక్తం తాగుతాడు. నీ పక్కన ఎంతోమంది వీరులు ఉన్నారని బీరాలుపలుకుతున్నావు. వారి పరాక్రమములు రేపు యుద్ధంలో చూస్తాము కదా! సుయోధనా నీవు పరుల పరాక్రమం నమ్ము కొని యుద్ధానికి దిగావు. వృద్ధుడైన భీష్ముని అనవసరంగా యుద్ధం లోకి దింపావు. అతనిని చంపాలని అనుకుంటున్నావు. కేవలం భీష్ముడు ఉన్నంత మాత్రాన యుద్ధంలో గెలుస్తారా! భీష్ముని చాటున ప్రాణాలు కాపాడుకోవాలని చూస్తున్నావు నువ్వు. కాని మొదట భీష్ముడినే మొదటి

ముద్దగా మింగుతాము. తరువాత ద్రోణుడు, తరువాత కర్ణుడు బలి అవుతారు. అప్పటికి గాని సుయోధనుని ఆశ చావదు. సుయోధనుడు తన తమ్ముల, తన కుమారుల మరణములు చూచి, తాను భీముని గదాఘాతంతో నేలమీద పొర్లుతున్నప్పుడు అయినా తాను చేసిన దుష్కృత్యములు తలుచుకుంటాడా! కాబట్టి నీవు వెంటనే వెళ్లి మీ సుయోధనుని యుద్ధానికి సిద్ధం కమ్మను." అని పలికాడు కృష్ణుడు.

దర్మరాజు ఉలూకునికి తాంబూలము, ఆభరణాలు ఇచ్చి సత్కరించి పంపాడు. ఉలూకుడు వెంటనే సుయోధనుని వద్దకు పోయి జరిగినది అంతా వివరించాడు. కురు పాండువులు మరునాడు యుద్ధం ప్రకటించారు." అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

"సంజయా! శ్రీ కృష్ణుని సహాయం కలిగిన అర్జునుని జయించడం భీష్మునికి సాధ్యం అవుతుందంటావా! ఉలూకుడు చెప్పిన మాటలు విని కురు సభలో ఎవరెవరు ఏమన్నారో చెప్పవా! " అని అడిగాడు. దానికి సంజయుడు ఇలా అన్నాడు.

" మహారాజా! ఉలూకుని మాటలు విన్న భీష్ముడు "సుయోధనా! నేను ఉండగా నీకు భయం ఎందుకు నేను సేనలను స్వయంగా పర్యవేక్షిస్తాను. నీకు జయం చేకూరుస్తాను." అని అన్నాడు.

దానికి సుయోధనుడు "తాతా! మీరు, మా గురువు ద్రోణుడు, ఉండగా నాకు భయం ఎందుకు! నేను గంధర్వ, కిన్నర, దానవులకు భయపడలేదు. ఈ అల్పులు పాండవులకు భయపడతానా! చిటికలో *వారి మదం అణుస్తాను. పితామహా! మనవారిలోనూ ఎదుటి వారిలోనూ ఉన్న వీరుల గురించి* తెలియచేయండి. " అని అడిగాడు సుయోధనుడు.

"సుయోధనా! నీవు అతిరధుడవు. నీ తమ్ములు సమరధులు. ఇంక నా గురించి నీకు తెలిసిందే. కృతవర్మ అతి రధుడు. శల్యుడు అతి రధుడు. భూరిశ్రవుడు అతి రధుడు. సైంధవుడు మహా రధుడు. కాంభోజరాజు సుధక్షిణుడు సమరధుడు. మహిష్మతి అధిపతి నీలుడు అర్ధరధుడు. అవంతీ దేశాధీశులు విందానువిందులు అర్ధరధులు. త్రిగర్తాధిపతులు ఐదుగురు మహారధులు. నీ కుమారుడు లక్ష్మణ కుమారుడు సమరధుడు. బృహద్బలుడు సమరధుడు. దండధారుడు అర్ధరధుడు. కృపాచార్యులు అతిరధులలో శ్రేష్ఠుడు. శకుని సమరధుడు. . అశ్వత్థామ అర్జునుడితో సమంగాయుద్ధం చేస్తాడు. అతనిని

బ్రాహ్మణుడు అని చెప్పతగదు. ద్రోణాచార్యుడు అతిరథులలో శ్రేష్టుడు. బాహ్లికుడు, అతని కుమారుడు సోమదత్తుడు అతి రథులు. అలంబసుడు సమరధుడు. భగదత్తుడు సమరధుడు. గాంధార రాజు వృక్షుడు, అచలుడు, సమరధులు. కర్ణుడు అర్ధరథుడు. ఎందుకంటే అతను జన్మసిద్ధముగా లభించిన కవచకుండలములను కోల్పోయాడు. అందువల్ల శక్తిహీనుడు. పరశురాముని శాపం వలన అతని శక్తి నాశనం అయింది. అందువల్ల అతడు యుద్ధములో అర్జునుని గెలువ లేడు." అని అన్నాడు భీష్ముడు.

" ప్రగల్బములు పలకడంలో ఇతడు అందరికంటే ముందు ఉంటాడు.కాని పిరికి తనంతో పారి పోవడానికి వెనుకాడడు. ఎప్పుడు పరాకుగా ఉంటాడు. అందు వల్ల భీష్ముడు చెప్పినట్టు కర్ణుడు అర్ధ రథుడు" అని అన్నాడు ద్రోణుడు. భీష్మ,ద్రోణుల మాటలు విన్న కర్ణుని మొహం ఎర్రగా అయింది.

"పితామహా! నా మీది ద్వేషంతో ఇలా పలకడం తగునా! ఈ ప్రకారం నన్ను తక్కువ చేసి మాట్లాడటం వలన మీకు ఏమి ఒరిగింది. గాంగేయా! నన్ను గురించి కొలువు లో కూడా చాలా చెడ్డగా మాట్లాడావు. సుయోధనుని మొహం చూచి ఊరుకుంటున్నాను. నా దృష్టిలో నీవు

కూడా అర్ధ రథుడివే. ” అని పలికి కర్ణుడు అక్కడ ఉన్న అందరిని చూచి "ఇతనిని మనము హితుడని నమ్మవచ్చునా! కార్యసాధన మార్గము ఇదేనా! అందరి రాజులను అతను ఎక్కువ ఇతను తక్కువ అని మాట్లాడుతున్నాడు. ఇలాంటి వారలను చూచి మనము ఏమనగలము." అని సుయోధనుని చూచి "మిత్రమా! కార్యము చెడిపోయింది. నీ సముఖంలో భీష్ముడు ఇలా మాట్లాడటం బాగాలేదు. ఎలా ఓర్చుకోవాలి. అయినా ఈభీష్ముని బలం ఏపాటిది? ఇతనిని మనం విడిచి పెడితే మాత్రం వచ్చిన నష్టం ఏమి? ఇతను పాండవ పక్షపాతి. మనసు పెట్టి యుద్ధం చేయడు. ఇతనిని వదిలించుకుంటేనే మన పక్షాన ఉన్న రాజులకు మనసు కుదుటపడుతుంది. వయసులో పెద్ద వాడు అని అతనిని గౌరవించండి. కాని అతని మాటలను స్వీకరించకండి. అసలు ఇతను సైన్యాధ్యక్షుడు గా ఉంటే మన పక్షాన ఉన్న రాజులు ఎలా యుద్ధం చేస్తారు. కాబట్టి ఇతను రణరంగంలో ఉంటే యుద్ధం చేయడానికి నేను అంగీకరించను." అని అన్నాడు కర్ణుడు.

ఆ మాటలు విన్న భీష్ముడు కర్ణుని చూచి "కర్ణా! ఏమన్నావు! నేను ముదుసలినా! నా అస్త్ర శస్త్ర బలము ఏ పాటితో నీ గురువు పరశురాముని అడిగి తెలుసుకో! యుద్ధంలో నన్ను ఎదిరించిన వారు ఏ గతిపట్టారో ఈ జగత్తుకు తెలుసు. నా ముసలితనము, నీ పడుచు తనము అర్జునుడు

చూస్తాడులే! సూతనందనా! నీ వలన నా గురించి నేను చెప్పుకోవలసి వచ్చినది. అసలు కార్యాలోచనకు నీవు కౌరవులకు లభించడం వలననే ఇన్ని అనర్ధములు కలిగినవి. ఈ అనర్థాలు తొలిగించడానికి మా శక్తిచాలదు. నీవు మహా వీరుడవైతే యుద్ధములో నీ ప్రతాపము చూపించు. యుద్ధం చేయడానికి భయపడి నా మీద నెపం బెట్టి ప్రస్తుతానికి యుద్ధం చెయ్యకుండాతప్పించుకున్నా, తరువాత నైనా తప్పించుకోలేవు. క్రమ క్రమంగా అర్జునుని చేతిలో అతిరధ మహారధులందరూ కూలిన పిమ్మట నీవు యుద్ధము చేయక తప్పదు. అప్పటికి చావగా మిగిలి ఉన్న సైన్యముతో నీ యుద్ధ పటిమ సుయోధనుడు తెలుసుకుంటాడు లే! సూతనందనా! ఈ సుయోధనుడు నా మీద ఈ యుద్ధ భారము మోపాడు. నన్ను నమ్ముకున్నాడు. అందుకని నీ మాటలు ఇంతవరకు సహించాను. అందుకని బతికిపోయావు. ఇంక ఊరుకుండుము." అని పలికిన గాంగేయుని వైపు చూచి సుయోధనుడు ఇలా అన్నాడు.

" పితమహా! ఈ సమయంలో మీరు కోపించవచ్చునా! నా మొహం చూచి, ముందు ఉన్న కార్యభారమును చూచి, సహించండి. " అని గాంగేయుని శాంత పరచి కర్ణుని చూచి "కర్ణా! నీవు, పితామహుడు ఒకటై ఈకార్యభారమును నడిపించవలెను కాని ఇలా వాదులాడు

కోవడం ఎందుకు!" అని కర్ణుని శాంత పరచి, భీష్ముని చూచి "పితామహా! పాండవుల పక్షములో ఉన్న వీరుల గురించి చెప్పండి." అని అడిగాడు.

అప్పుడు భీష్ముడు "సుయోధనా! నేను పాండవుల పక్షంలో ఉన్న వారిని గురించి చెబితే కర్ణుని మనసు నొచ్చుకుంటుంది. నీకు ఎలా ఉంటుందో నాకు తెలియదు. మధ్యలో నాకు ఎందుకు చెప్పు. పాండవ వీరుల గురించి మాట్లాడక పోవడం మంచిది." అని అన్నాడు. కాని సుయోధనుడు ఊరుకోలేదు. పదే పదే చెప్పమని అడిగాడు. తప్పని పరిస్థితులలో భీష్ముడు ఇలా అన్నాడు.

"ధర్మరాజు అతి రథుడు. భీముడు అతి రథులలో శ్రేష్ఠుడు. మహాబల సంపన్నుడు. నకుల సహదేవులు సమరథులు. అర్జునుడు ఇలాండి వాడు అని చెప్ప నా వశం కాదు. అంతటి పరాక్రమ వంతుడు ఈ భూమిలో లేడు. ఇంక పుట్టబోడు. అతనికి కృష్ణుడు తోడయ్యాడు. ఇంక ఏమి చెప్పాలి! అతను ఒక్కడే తన సేనలను రక్షించుకుంటూ శత్రు సేనలను నిర్మూలించగలడు.

ఇంక ఉపపాండవులు (ద్రౌపది వలన పాండవులకుపుట్టిన వారు) ఐదుగురు మహారథులు. వారితో సమానమైన వాడు ఉత్తరుడు. ఇంక అభిమన్యుడు అతిరథులలో శ్రేష్ఠుడు. కృష్ణార్జునులకు సాటి అయినవాడు. యుద్ధ నైపుణ్యం తెలిసినవాడు. సాత్యకి అతిరథుడు. ద్రుపదుడు, మత్స్యవిభుడు విరాటుడు మహారథులు, పాండవులకు బంధువులు. శిఖండి మహారధుడు. అతని తమ్ముడు ధృష్టద్యుమ్నుడు అతి రధుడు. దృష్టద్యుమ్నుని కుమారుడు ధృతవర్మడు అర్ధరథుడు. ఉత్తమౌజుడు, యుధామన్యుడు, క్షత్రదేవుడు, జయంతుడు, అమితౌజుడు, విరాటుడు, సత్యజితుడు ఈ ఏడుగురు మహారథులు. కేకయ దేశాధీశులు ఐదుగురు అన్నదమ్ములు మహా రథులు. కాశీశుడు, నీలుడు, సూర్యదత్తుడు, మదిరాక్షుడు, శంఖుడు, మహారధులు. చిత్రాయుధుడు, చేకితానుడు, చంద్రదత్తుడు, వ్యాఘ్రదత్తుడు మహారథులు. సేనాబిందుడు, పాండ్యరాజు అతి రథులు. కాశ్యుడు సమరథుడు. కుంతిభోజుడు అతిరథుడు. భీముని కుమారుడు ఘటోత్కచుడు అతిరధుడు. రాక్షసనాయకుడు. నాకు గుర్తు ఉన్నంతవరకూ వీరు పాండవపక్షంలో అతిరథ మహారథులు. వీరంతా ఎంత బలవంతులైనా నేను చంపగలను. కాని శిఖండిని మాత్రం నేను చంపలేను." అని అన్నాడు భీష్ముడు.

" పితామహా! అదేమిటి మీరు శిఖండిని ఎందుకు చంపలేరు అతను మీకన్నా బలవంతుడా. " అని అడిగాడు.

"నేను శిఖండిని చంపక పోవడానికి బలమైన కారణం ఉంది. చెపుతాను" అని భీష్ముడు ఈ విధంగా వివరించాడు.

" నేను రాజ్యాధి కారము వహించననీ, వివాహము చేసుకోననీ మా తండ్రి వివాహ సమయమున ప్రతిజ్ఞ చేసాను. నా తండ్రి మరణానంతరము నా తమ్ముడు చిత్రాంగదుడికి రాజ్యాభిషేకము చేసాను. చిత్రాంగదుడు మహావీరుడు. దుడుకుస్వభావము కలవాడు. గంధర్వులతో తలపడ్డాడు. గంధర్వరాజు *చిత్రాంగదుడిని సంహరించాడు. ఆసయమంలో శంతనుని రెండవ కుమారుడు* విచిత్రవీర్యుని రాజ్యాభిషిక్తుని చేసాను. విచిత్రవీర్యునికి యౌవనం రాగానే వివాహప్రయత్నాలు ప్రారంభించాను. ఆసమయంలో కాశీరాజు తన ముగ్గురు కుమార్తెలకు స్వయంవరం ప్రకటించాడు. నేను ఆ స్వయంవరానికి ఒంటరిగా వెళ్లాను . కాశీరాజు పెద్ద కూతురు అంబ అప్పటికే సాళ్వుడు అనే రాజుకు మనసిచ్చింది. ఆ విషయం కాశీరాజుకు తెలియదు. అందుకే స్వయంవరం చాటించాడు. కాని మరొక విధంగా జరిగింది. నేను కాశీరాజు కుమార్తెలు అయిన ఆ ముగ్గురు కన్యలను

అనగా అంబ, అంబిక, అంబాలిక అనే కన్యలను పట్టి నా రథం మీద పెట్టుకొని బలవంతంగా హస్తినాపురానికి తీసుకొని వచ్చాను. ఆ ముగ్గురిని తన తమ్ముడు విచిత్ర వీర్యుని వివాహం చేసుకోమన్నాను. అప్పుడు అంబ నా తో ఇలా అన్నది. "నాకు మొదటి నుండి సాళ్వుని మీద తలంపు ఉన్నది. అతనిని నేను ప్రేమించాను. అతడు కూడా నన్ను ప్రేమించాడు. నీవు ధర్మాత్ముడవు. మనసులేని మనువు చేయ తగదు. నన్ను అతని వద్దకు పంపండి. " అని ప్రార్థించింది. నాతప్పు నేను తెలుసుకున్నాను . వెంటనే సాదరంగా సగౌరవంగా అంబను సాళ్వుని వద్దకుపంపాను. కాని సాళ్వుడు అంబను వివాహం చేసుకోడానికి నిరాకరించాడు.

"నిన్ను భీష్ముడు బలవంతంగా తీసుకొని పోయాడు. నీకు ఇంకా కన్యాత్వము ఉంది అని నేను ఎలా నమ్మగలను. కాబట్టి నిన్ను భార్యగా స్వీకరించలేను." అని చెప్పాడు.

"అదేంటి అలా అంటారు. భీష్ముడు నన్ను బలాత్కారంగా తీసుకొని వెళ్లలేదు. తన తమ్ముని వివాహ నిమిత్తం తీసుకొని వెళ్లాడు. నేను నిన్ను ప్రేమించిన సంగతి చెప్పగానే నన్ను సాదరంగా ఇక్కడకు పంపాడు. ఇందులో నన్ను అనుమానించవలసిన పనిలేదు. పైగా మనం

పరస్పరం ప్రేమించుకోడం మా తండ్రి గారికి తెలియదు. అందుకని స్వయంవరం చాటించాడు. అందువల్ల ఈ అనర్థం జరిగింది. ఇందులో నా దోషం లేదు. భీష్ముడు కూడా అంబికను, అంబాలికను మాత్రమే తన తమ్ముడికి ఇచ్చి వివాహం చేసాడు. నన్ను సాదరంగా నీవద్దకు పంపాడు. ఇందులో తప్పు ఏముంది." అని ఎన్నో విధాలుగా బతిమాలింది. వేడుకుంది. కాని సాళ్వుడు ఆ మె మాటలను అంగీకరించలేదు. అంబ జాలిగా ఏడిచింది కాని సాళ్వుని హృదయం కరుగలేదు. అంబను ఇక్కడ ఉండవద్దు. ఎక్కడి కన్నా వెళ్లిపో అని తరిమేసాడు.

(కృత యుగము లో, నీళ్లు తేవడానికి కొలనుకు వెళ్లిన భార్య, రేణుక, అక్కడే భార్యలతో జలకాలాడుతున్న గంధర్వుని చూచి, మనసు చలించినది, అనే నెపంతో, తల్లి తల నరకమని, కొడుకు పరశురాముని ఆదేశించాడు, మహా తపస్వి జమదగ్ని. త్రేతాయుగంలో రాముడు, రావణుని చెరలో ఉన్న సీతను, స్వీకరించ డానికి నిరాకరించాడు. తరువాత, ఎవరో పౌరుడు ఏదో అన్నాడని, నిండు గర్భిణి అయిన భార్య, సీతను అడవులకు పంపాడు, శ్రీరామచంద్రుడు. ద్వాపరయుగంలో సాళ్వుడు కూడా భీష్ముని వద్ద ఉన్న అంబ యొక్క కన్యాత్వాన్ని శంకించాడు. నిర్దయగా తరిమేసాడు. నేడు కలియుగంలో కూడా భార్యలను అనుమానించని మొగుళ్లు అరుదుగా కనిపిస్తారు.

పెళ్లికి ముందు కన్యాత్వ పరీక్షలు జరిపే మగమహారాజులు కూడా లేకపోలేదు. కాబట్టి యుగాలు మారినా, తరాలు మారినా, మనుషులు మారలేదు. మగాళ్ల బుద్ధులు, స్త్రీల దీనగాధలు మారలేదు. ఇది చరిత్ర చెప్పిన సత్యం).

" అటు సాళ్వుని ప్రేమకు దూరమయ్యాను. ఇటు సంసార సుఖానికి పనికి రాకుండా పోయాను. ఇంక నాకేది దిక్కు దీని కంతా కారణం భీష్ముడు. అతని వద్దకు పోయె ప్రయోజనం లేదు. అతని మీద పగ తీర్చుకోవాలి. మహా బలవంతుడైన భీష్ముని సాధించుట నాకు సాధ్యంకాదు. తపస్సుతోనే సాధిస్తాను" అని అనుకుంటూ అంబ కొంతమంది మునీశ్వరులు తపస్సు చేసుకొనే ప్రదేశానికి వెళ్లింది. వారికి తన గాధ అంతా సవిస్తరంగా చెప్పింది.

"అమ్మా! ఇది మహారాజులు చేసిన పని. మా లాంటి సాధువుల వలన ఏమవుతుంది చెప్పు పైగా నీవు సుకుమారివి. నీకు కఠినమైన ఈ తపోనిష్ట తగదు నీ తండ్రి వద్దకు పో! " అని అన్నారు.

"అయ్యా! ఈ సమయంలో నేను నా తండ్రివద్దకు కానీ, బంధువుల వద్దకు కానీ ఏ మొహం పెట్టుకొని వెళ్లను. కాబట్టి ఇక్కడే ఉండి తపస్సు చేసుకుంటాను. ఇది నా  నిర్ణయం." అని చెప్పింది అంబ.

అంబ ఆ విధంగా అక్కడ ఉన్న మునులతో మాట్లాడుతున్నప్పుడు అక్కడకు హోత్రవాసుడు అనే రాజర్షి వచ్చాడు. అంబను చూచి "ఈ కన్య ఎవరు? ఈ వనసీమలలో ఎందుకు ఉన్నది ? " అని అడిగాడు అక్కడ ఉన్న మునులు జరిగినది అంతా సవిస్తరంగా చెప్పారు.

" అంబా! నీవు వరుసకు నాకు మనుమరాలివి అవుతావు. నీ తప్పు ఏమీ లేకుండా నీవు శిక్షింపబడ్డావు. దీనికి నీవు తపస్సు చెయ్యడం ఎందుకు. దీనికి నేను మార్గము చూపుతాను. నీకు అపకారము చేసిన భీష్మునికి గురువు పరశారాముడు. అతని మాట భీష్ముడు తప్పక వింటాడు. నిన్ను తప్పక కాపాడుతాడు. నీవు పరశురాముని వద్దకు వెళ్లు."  అని పలికాడు.

"తాతగారూ ఇప్పుడు ఆ పరశురాముడు ఎక్కడ ఉంటాడో కదా!" అని సందేహం వెలిబుచ్చింది అంబ.

ఇంతలో అక్కడకు పరశురాముని శిష్యుడు అకృతవ్రణుడు అక్కడకు వచ్చాడు. అతనిని భార్గవ రాముడు ఎక్కడ ఉన్నారు అని అడిగాడు హోత్రవాహనుడు.

"అయ్యా! మీరు మా గురువుగారికి ప్రియమిత్రులు. మీగురించి మా గురువు గారు ఎప్పుడూ చెబుతూ ఉంటారు. పరశురాముడు రేపు ఇక్కడకు వస్తున్నారు. ఆ విషయం చెప్పడానికే ఇక్కడకు వచ్చాను." అని పలికాడు. అందరూ సంతోషించారు.

మరునాడు పరశురాముడు ఆ ముని ఆశ్రమానికి వచ్చాడు. హోత్రవాహనుడు, తక్కినమునులు పరశురాముని సాదరంగా ఆహ్వానించారు అర్ఘ్య పాద్యాదులతో సత్కరించారు. హోత్రవాహనుడు అంబను చూపి ఆమె చరిత్ర అంతా వివరంగా చెప్పాడు.

పరశురాముడు అంబను చూచి "అమ్మా! నీకు హోత్రవాహనుడు ఎలాగో నేనూ అలాగే నీవు నిశ్చింతగా ఉండా. నీ దుఃఖం నేను పోగొడ తాను. నీకు ఇద్దరు అవమానం చేసారు. ఒకరు సాళ్వుడు. రెండవ వాడు భీష్ముడు. వీరిలో ఎవరిని శిక్షించమంటావు." అని అడిగాడు.

“ ఓ మహానుభావా! నన్ను ఎట్టి పరిస్థితులలోనూ సాళ్వుడు భార్యగా స్వీకరించడు.  అతనిని దండించి ప్రయోజనము లేదు. దీని కంతకూ కారకుడు భీష్ముడు. అతనిని చంపడానికే తపస్సు చెయ్యాలని అనుకుంటున్నాను. ఇప్పుడు మీ దర్శన భాగ్యం కలిగింది.” అని పలికింది.

వెంటనే పరశురాముడు అంబను తీసుకొని నా వద్దకు వచ్చాడు. సరస్వతీ తీరంలో విడిది చేసి నాకు వర్తమానము పంపాడు. నేను వెంటనే నా గురువుగారు పరశురాముని వద్దకు వెళ్లాను. ఆయనకు అర్ఘ్య పాద్యాదులు అర్పించి అర్చించాను. అతను నా వినయమునకు సంతోషించాడు.

“ గాంగేయా! నీవు  ఈకన్యను ఎందుకు బలాత్కారంగా తీసుకొని వచ్చావు. పోనీ తీసుకొని వచ్చిన వాడివి మరల ఎందుకు తిరస్కరించావు. వెంటనే ఈమెను నీ తమ్ముడికి ఇచ్చి వివాహం చెయ్యి. అంతేకాని ఈ ప్రకారం అనాధగా వదిలిపెట్టడం మంచిది కాదు.” అని పలికాడు పరశురాముడు.

"మహాత్మా! నా మాటకూడా వినండి.  ఈమెను నేను బలాత్కారంగా తీసుకొని వచ్చిన మాట నిజమే. కాని ఈమె తను సాళ్వుని ప్రేమించాను అని తెలిపిన వెంటనే సాదరంగా ఆమెను సాళ్వుని వద్దకు పంపాను కదా! ఇప్పుడు నేను ఈమెను నా తమ్మునికి ఇచ్చి  ఎలా పెళ్లి చెయ్యగలను." అని అన్నాను.

అందుకు పరశురాముడు కోపించి "నీవు ఇప్పుడు ఈ కన్యను నీ తమ్మునికి ఇచ్చి వివాహము చేయని పక్షంలో నేను నిన్ను,నీ బంధువులను పరివారమును చంపుతాను" అని అన్నాడు. నేను ఎన్నోవిధములుగా ఆయనకు నచ్చ చెప్పడానికి ప్రయత్నించాను కాని  ఆయన వినలేదు.

" నీవు నాకు గురుడవు. నాకు ధనుర్విద్యను నేర్పావు. నా మీద అకారణంగా కోపించడం తగునా! " అని అడిగాను.

"నీవు ఎన్ని చెప్పినను నా కోపం చల్లారదు. నీవు ముందు ఈమెను నీ తమ్మునికి ఇచ్చి వివాహం చెయ్యి. నాకు సంతోషం కలిగించు." అని పలికాడు పరశురాముడు.

" గురువర్యా! మీరు నన్ను అధర్మము చెయ్యమని పట్టుబడు తున్నారు. మరొకరి మీద మనసు ఉన్న కన్యను నా తమ్మునికి ఇచ్చి ఎలా వివాహం చెయ్యను. ఈ విధంగా చేయరాని పని చెయ్యడం కన్నా మీ ఆగ్రహానికి గురి కావడం మేలు. మరొక మాట. అహంకారంతో ఇది మంచి పని, ఇది చెడ్డ పని అని తెలుకోకుండా పలికే వారు గురువైనా దండనార్హుడు అని పెద్దలు చెపుతారు కదా! " అని అన్నాను.

ఆ మాటలకు పరశురాముడు మండి పడ్డాడు. "గాంగేయా యుద్ధానికి సిద్ధం కా!" అని హుంకరించాడు.

"గురువు గారూ! ఇదివరకు మీరు అహంకరించి క్షత్రియ కులమును నాశనం చేసారు. అప్పుడు భీష్ముడు లేడు. ఇప్పుడు ఉన్నాడు ఇంక మీ ఆటలు సాగవు. మీతో యుద్ధం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను." అని పలికాను.

నేను వెంటనే మా తల్లి సత్యవతీ దేవి వద్దకు వెళ్లాను. జరిగినది అంతా ఆమెకు వివరించాను. ఆమె ఆశీర్వాదము తీసుకొని యుద్ధము నకు సన్నద్ధుడను అయ్యాను. ఇంతలో నా తల్లి గంగాదేవి మానుష్య రూపంలో అక్కడకు వచ్చింది. పరశురామునికి నచ్చ చెప్పబోయింది. కాని

ఆయన వినలేదు. నేను కూడా నా పట్టు వీడలేదు. ఇంక ప్రయోజనం లేదని గంగాదేవి వెళ్లి పోయింది.

పరశురాముడు రథం ఎక్కాడు. అకృతవర్ణుడు అతనికి సారధిగా ఉన్నాడు. నేనూ రథం ఎక్కాను. గురువుగారికి నమస్కరించాను. మా ఇద్దరి మధ్య యుద్ధం మొదలయింది. పరశురాముడు నా మీద శరవర్షము కురిపించాడు.నీను ఆ శరములను మధ్యలో తుంచి వేసాను. నేను పరశురాముని విల్లు విరిచాను. ఆయన మరొక విల్లు తీసుకున్నాడు. నా బాణ ప్రయోగానికి పరశురాముని ఒళ్లు తూట్లు పడింది. రక్తం కారుతూ ఉంది. అధిక రక్త స్రావము వల్ల పరశురాముడు మూర్ఛిల్లాడు. గురువు గారిని ఆ పరిస్థితిలో చూచి నన్ను నేను తీవ్రంగా నిందించు కున్నాను. ఇంతలో పరశురాముడు మూర్ఛనుండి తేరుకున్నాడు. నా మీద ఒక అస్త్రము ప్రయోగించాడు. ఆ అస్త్రము ఏదో నాకు తెలియదు. నేను నేర్చుకోలేదు. ఆ అస్త్రము నా గుండెలో దిగబడింది. నేను కూలిపోయాను. నా సారధి రథం పక్కకు తీసుకొని వెళ్లాడు. ఇంతలో నేను తేరుకున్నాను. మరలా పరశురాముని నా బాణములతో ముంచెత్తాను.

ఈ ప్రకారము మేము ఇద్దరమూ ఇరవైరెండు రోజులు ఘోరంగా యుద్ధం గా చేసాము. నేను పరశురాముని మీద శక్త్యాయుధమును ప్రయోగించాను. దాని ప్రభావానికి పరశురాముడు మూర్ఛిల్లాడు. అక్కడ ఉన్న మునులు చాలా వ్యాకులం చెందారు పరశురాముడు మూర్ఛలోనుండి తేరుకొని తన బాణములతో నా సారథిని చంపాడు. నన్ను మూర్ఛపోయేట్టు కొట్టాడు. నేను తెలివి తప్పిన సమయంలో ఎనిమిది మంది బ్రాహ్మణులు(అష్ట వసువులు) వచ్చి నాకు సేవచేసారు . మా తల్లి గంగాదేవి నా రథం నడుపుతూ ఉంది. నాకు తెలివి వచ్చి నేను నా తల్లికి నమస్కరించాను. రథం నాకు అప్పగించి నా తల్లి వెళ్ళిపోయింది.

ఆ రోజు రాత్రి వేకువన నాకు ఎనిమిదిమంది (అష్ట వసువులు) నా కలలోకి వచ్చారు. "భీష్మా! నీవు మేము ఒకటే. పరశురాముని జయించగల అస్త్రము ఇది ఒకటే. " అని నాకు మోహనాస్త్రం ఇచ్చారు. నాకు మెలుకువ వచ్చింది. వారు ప్రసాదించిన మోహనాస్త్రం ప్రయోగ ఉపసంహారములతో అభ్యసించాను. మరునాడు మరల యుద్ధ రంగానికి వెళ్లాను. యుద్ధంమొదలయింది.

" నిన్న సగం చచ్చి వెళ్లావు రా ఈ రోజు నీ మదం అణుస్తాను." అంటూ నా మీద శరప్రయోగం చేసాడు. నేను ఆయన వేసిన అస్త్రములు తిప్పి కొట్టి, ఆయన గుండెలకు గురి పెట్టి శ క్త్యాయుధాన్ని ప్రయో గించాను. ఆ అస్త్రధాటికి పరశు రాముడు పడిపోయాడు. అతడి సారధి అకృతకర్ణుడు అతనికి స్ప ృహ కలిగించాడు. ఆయన తేరుకొని, కోపించి, నా మీద బ్రహ్మాస్త్రము ప్రయోగించాడు. నేను కూడా దానికి ప్రతిగా బ్రహ్మాస్త్రము ప్రయోగించాను. రెండు బ్రహ్మాస్త్రాలు విశ్వంలో విలయం సృష్టిస్తున్నాయి. ఈ సమయంలో నేను మోహనాస్త్రాన్ని ఆవాహన చేసాను.

ఆ సమయంలో నారద మహర్షి పరుగెత్తుకుంటూ నా వద్దకు వచ్చాడు "గాంగేయా! వద్దు. మోహనాస్త్రము ప్రయోగించ వద్దు. ఇది నీకు ఉచితం కాదు." అని వారించాడు. ఆకాశంలో నిలబడి ఉన్న అష్టవసువులు కూడా నన్ను వారించారు. నేను మోహనాస్త్రము ప్రయోగించడం ఆపాను. ఇంతలో పరశురాముని తండ్రి జమదగ్ని ఇతర పితృదేవతలు అతని ముందు ప్రత్యక్షం అయ్యారు "కుమారా పరశురామా! అతను సామాన్యుడు కాడు. అతడు వసువు. అతడిని గెలవడం ఎవరి తరమూ కాదు. అతనిని చంపడానికి నర నారాయణు లలో నరుడు అర్జునుడిగా జన్మించి అతనిని సంహరిస్తాడు. నీవు

బ్రాహ్మణుడవు. ఈ అనవసర యుద్ధ ము మానుము." అని హితబోధ చేసారు. కాని వారి మాట పరశు రాముడు వినలేదు. వారు నావద్దకు వచ్చారు. నాకూనచ్చ చెప్పారు. నాకూ పట్టుదల పెరిగింది. నేనూ వారి మాట వినలేదు. ఇంతలో నా తల్లి గంగాదేవి కూడా అక్కడకు వచ్చింది. అందరూ పలుమారుప్రయత్నించి మా చేత యుద్ధము  మాన్పించారు. మేము ఇద్దరం మేము ప్రయోగించిన బ్రహ్మాస్త్రములు ఉపసంహా రించు కున్నాము.

ఆ సమయంలో  నాకు కలలో కన్పించిన ఎనిమిది మంది బ్రాహ్మణులు అక్కడకు వచ్చాను. "గాంగేయా! నీ గురువు బ్రహ్మవిదుడు. అత్యంత పరాక్రమ వంతుడు. నీవు  ఆయన వద్దకు వెళ్లి నమస్కరించి ఆయన ఆశీర్వాదము తీసుకో" అని చెప్పారు.

తరువాత నారదుడు, దేవతలు, గంగాదేవి పరశురాముని వద్దకు పోయి,  "భార్గవరామా! దేవవ్రతుడు నీ శిష్యుడు. అతని మీద యుద్ధం చెయ్యడం తగునా. అధర్మము చెయ్యడం ఇష్ట పడక నీతో యుద్ధం చేసాడు కాని అతనికి నీ మీద ఎలాంటి విరోధము లేదు. అతనిని దయతో మన్నించుము." అని చెప్పారు.

నేను వెంటనే వెళ్లి, నా గురువు పరశురాముని పాదాలకు నమస్కరించాను. ఆయన వాత్సల్యంతో నన్ను లేవనెత్తి కౌగలించు కున్నాడు నన్ను మన్నించాడు. అప్పుడు పరశురాముడు అంబను చూచి "అమ్మా! జరిగింది చూచావుకదా! నేను చేయగలిగినది చేసాను. ఇంక నీ దారి నువ్వు చూచుకో. " అని చెప్పాడు

అప్పుడు అంబ "మహాత్మా! నిజమే నీవు చేయగలిగింది చేసావు. నేను తపస్సు చేసి నా తపో బలంతో భీష్ముని వధిస్తాను. ఈ జన్మలో కాక పోయినా మరొక జన్మలో అయినా నా పగ తీర్చుకుంటాను." అని ప్రతిజ్ఞ చేసి వెళ్లిపోయింది. నేను హస్తినాపురమునకు వెళ్లాను.

కాని నాకు అంబ విషయం మనసులో వేధిస్తూ నే ఉంది. ఒక రోజు నారద మహర్షి నా దగ్గరకు వచ్చాడు. ఆయనను అంబ గురించి అడిగాను. ఆయన ఈ విధంగా చెప్ప సాగాడు.

"గాంగేయా! నీ వద్దనుండి వెళ్లిపోయిన అంబ యమునా నదీ తీరంలో శివుని గూర్చి ఘోర తపస్సు చేసింది. అన్ని ముని ఆశ్రమాలు సందర్శించింది. ఒకరోజు నీ తల్లి గంగాదేవి ఆమె వద్దకుపోయి "అమ్మా! ఆడుదానివి ఇంత కఠోరమైన తపస్సు దేని కోసం చేస్తున్నావు." అని

అడిగింది. దానికి అంబ "నాకు భీష్ముని మీద కోపం అతని చావుకోరి తపస్సు చేస్తున్నాను.ఞ అని చెప్పింది. దానికి గంగ కోపించి ఞనీవు నదివై ప్రవహించుఞ అని శపించింది. అంబ చిరునవ్వు నవ్వింది. నీ తల్లి మాటలు లక్ష్యపెట్టక మత్స్యదేశానికి వెళ్లింది. అక్కడ ఇంకా కఠోర నియమాలతో తపస్సు చేసింది. తాను చేసిన తపస్సులో సగభాగం , దారపోసి గంగాదేవి శాప ప్రకారము మత్స్యదేశంలో నదిగా ప్రవహిం చింది. మిగిలిన సగం తపోబలంతో తన శరీరాన్ని యధాతధంగా నిలుకుపుంది. మరల శివుని గూర్చి ఘోర తపస్సుచేయసాగింది.

ఆమె తపస్సుకు మెచ్చి శంకరుడు ఆమెకు ప్రత్యక్షం అయ్యాడు. ఏమి కావాలో కోరుకో అన్నాడు. నేను భీష్ముని చంపే వరం ప్రసాదించ మని అడిగింది. అట్లేఅగుగాక అని వరం ఇచ్చాడు ఈశ్వరుడు. అంబ అంతటితో ఊరుకోలేదు. "అది ఎలాసాధ్యం అవుతుంది?" అని శివుని అడిగింది. "నీవు ఈ శరీరం విడిచి పెట్టి ద్రుపదమహారాజుకు కుమార్తెగా జన్మిస్తావు . తరువాత కుమారుడుగా రూపాంతరం చెందుతావు. శిఖండి అనే పేరుతో అత్యంత బలపరాక్రమములతో, ధరుర్విద్యానైపుణ్యంతో ప్రఖ్యాతి గడిస్తావు. యుద్ధంలో నీవు భీష్ముని సంహరిస్తావు." అని పలికి అంతర్ధానం అయ్యాడు.

వెంటనే అంబ అక్కడ చితి పేర్చి "నేను భీష్ముని వధిస్తాను, నేను భీష్ముని వధిస్తాను", అని అనుకుంటూ  అగ్నిలో ప్రవేశించి ఆహుతి అయింది.

ఇది ఇలా  ఉంటే ద్రుపద మహారాజుకు సంతానము లేదు. ఆయన భార్య సంతానం కోసం బెంగ పెట్టుకొని కృంగి కృశిస్తూ ఉంది. పైగా ద్రుపద మహారాజుకు భీష్ముని మీద కోపం ఉంది.  అందుకని ద్రుపదుడు  భీష్ముని చంపగల కుమారుని కోసం శివుని గూర్చి తపస్సు చేసాడు. శివుడు ప్రత్యక్షం అయ్యాడు. "వరం కోరుకో! " అన్నాడు. "భీష్ముని వధించగలకుమారుని ప్రసాదించు" అని కోరుకున్నాడు. అప్పుడు శివుడు "నీకు ఒక కుమార్తె జన్మిస్తుంది. తరువాత కొడుకుగా మారుతుంది. అతడు భీష్ముని యుద్ధంలోసంహరిస్తాడు." అని వరం ఇచ్చాడు.  అంతర్థానం అయ్యాడు.

ద్రుపదుడు  ఈవిషయం అంతా సవిస్తరంగా భార్యకు చెప్పాడు. శివుని వరప్రభావంతో ద్రుపదుని భార్య గర్భం దాల్చింది. ఆమెకు కూతురు పుట్టింది. కాని ఆ దంపతులు తమకు కుమారుడు పుట్టాడు అని అందరికీ చెప్పారు. శిఖండి అనే పేరు పెట్టారు. ఆ కుమార్తెను కుమారుడి గానే పెంచారు.  ద్రోణాచార్యుని వద్ద అస్త్రవిద్య నేర్పించారు.

శిఖండి యౌవనవతి అయింది. ద్రుపదుడు, అతని భార్య ఆలోచించారు. "శివుని వర ప్రభావంతో అమ్మాయికి ఇంకా పురుషత్వము రాలేదు. వివాహము చేయాల్సిన వయస్సు వచ్చింది. ముందు పెళ్లి చేద్దాము. తరువాత నిదానంగా పురుషత్వము వస్తుంది. శివుని వరం వృధాపోదు కదా! " అని అనుకున్నారు.

దశార్ణ దేశమును ఏలే మహారాజు హేమ వర్మ కుమార్తెతో వివాహం జరిపించారు. కోడలు ఇంటికి వచ్చింది. శిఖండి వింత ప్రవర్తన ఆమెకు అనుమానం కలిగించింది. నేర్పుగా అసలు రహస్యం తెలుసుకుంది. తన భర్త స్త్రీ అని తెలిసి కూడా ఏమీ ఎఱుగని దాని వలె ఉండి పోయింది. కాని రహస్యం ఎంత కాలం దాగుతుంది. శిఖండి భార్య తన దాసికి ఈ విషయం చెప్పింది. దాసి ఈ విషయం వెంటనే దశార్ణ మహారాజు హేమవర్మకు తెలియ చేసింది. దశార్ణ మహారాజు ఒక దూతను ద్రుపదుని వద్దకు పంపాడు. ఆ దూత ద్రుపదుని వద్దకు పోయి ఇలా చెప్పాడు.

"మహారాజా! నీవు నీ కూతురును కుమారుడు అని అబద్ధం చెప్పి హేమవర్మ కుమారునికి ఇచ్చి వివాహం చేసావు. దీని వలన నీకు వచ్చిన లాభమేమి తలవంపులు తప్ప. మా మహారాజు హేమ వర్మ అత్యంత

పరాక్రమ వంతుడు. కనీసం అతనితో యుద్ధం చేసి అయినా నీ మగతనం చూపించు. అని అన్నాడు ఆ దూత.

ఆ మాటలు పలికిన దూతను చూచి "అయ్యా! ఇది ఏమి మాట. అతను నా కుమారుడు. మగ వాడు. మీకు అతడు స్త్రీ అని ఎవరు చెప్పారు. అసలే ఇలా ఎక్కడన్నా జరుగుతుందా చెప్పు. " అని నచ్చ చెప్పి దూతను పంపి వేసాడు. ఆ దూత కూడా తిరిగి వెళ్లి హేమ వర్మకు జరిగిన విషయం చెప్పాడు.

హేమ వర్మ కు కోపం వచ్చింది. తన సేనలతో వచ్చి పాంచాల దేశాన్ని ముట్టడించాడు. ఇదంతా చూచి శిఖండికి తలవంపులు అయింది. తన మగతనం గురించి రెండు రాజ్యాలు యుద్ధం చేసుకోవడం చూచి సిగ్గు పడ్డాడు. అర్ధ రాత్రి లేచి పక్కనే ఉన్న అరణ్యం లోకి వెళ్లిపోయాడు.

ఈ అరణ్యములో స్థూలకర్ణుడు అనే యక్షుడు నివసిస్తున్నాడు. ఆ యక్షునికి భయపడి ఆ అరణ్యంలోకి మనుషులు పోరు. ఆ విషయం తెలిసే శిఖండి ఆ అరణ్యములోకి ప్రవేశించాడు. ఆమె ప్రాణములకు తెగించి ఆ అరణ్యములో కి ప్రవేశించింది అని తెలుసుకున్న ఆ యక్షుడు

"కుమారీ! నీవు ఎవరు. ప్రాణముల మీద  ఆశ వదలి ఈ అరణ్యములోకి ఎందుకు ప్రవేశించావు." అని అడిగాడు

"అయ్యా! నాకు మగతనం కావాలి అది ఒక్క ఈశ్వరుని వలననే సాధ్యం అవుతుంది." అని జరిగినది అంతా సవిస్తరంగా తెలిపింది. శిఖండి చెప్పినది అంతా విన్న యక్షుడు "అదెంత పని. నా మగతనం నీకు ఇస్తాను తీసుకో. కాని ఒక్క నియమము. నీకు  నా మగతనం ఇచ్చిన తరువాత, నీవుపోయి హేమ వర్మ కు నీవు మగాడివి అని నిరూపించుకో. పది రోజులు మగవాడుగా ఉండు. పరిస్థితులు చక్కబడిన తరువాత వచ్చి నా మగతనం నాకు ఇచ్చి మామూలుగా స్త్రీ గా  మారిపో." అన్నాడు యక్షుడు. "సరే" అన్నాడు శిఖండి ఆనందంగా.

యక్షుడు తన మగతనం శిఖండికి ఇచ్చాడు. శిఖండి మగ వాడిగా మారిపోయాడు. మరల తన నివాసానికి వచ్చాడు. ఆనందంగా తల్లి తండ్రులకు నమస్కరించాడు. జరిగినది అంతా వారికి చెప్పాడు. ప్రస్తుతానికి గండం గడిచింది అని సంతోషించాడు ద్రుపదుడు. మరునాడు ద్రుపదుడు పెద్దమనుషులను హేమవర్మ వద్దకు పంపాడు. తన మందిరమునకు ఆహ్వానించాడు. తన కుమారుడు మగవాడు అని నిరూపించాడు. హేమవర్మ తన తొందరపాటుకు సిగ్గుపడ్డాడు.

ద్రుపదుడు వారికి విందులు వినోదములు ఏర్పాటు చేసాడు. హేమ వర్మ ను సగౌరవంగా సాగనంపాడు. శిఖండి మగవాడుగా తిరుగుతున్నాడు.

రెండు రోజుల తర్వాత ఒకనాడు కుబేరుడు తన విమానం మీద విహారానికి బయలుదేరాడు. స్థూల కర్ణుడు నివసించుచున్న మందిరము వద్దకు వచ్చాడు. కాని ఎంతకూ స్థూల కర్ణుడు బయటకువచ్చి తనను ఆహ్వానించ లేదు కుబేరునకు కోపం వచ్చింది. కిన్నరులను లోపలకు పంపి స్థూలకర్ణుని విషయం కనుక్కొని రమ్మన్నాడు. వారు లోపలకు పోయి విషయం తెలుసుకొని బయటకు వచ్చి “కుబేరా! స్థూలకర్ణుడు స్త్రీ గా మారి పోయాడు. అందు వలన సిగ్గుతో బయటకు రావడం లేదు.” అని చెప్పారు. “దానికేముంది బయటకు రమ్మనండి.” అని చెప్పాడు కుబేరుడు. స్థూలకర్ణుడు స్త్రీరూపంలో బయటకు వచ్చి జరిగినది అంతా కుబేరునకు వివరించాడు. పది రోజులలో తన పురుషత్వము తనకు వస్తుంది అని పలికాడు.

కుబేరునకు విషయం అంతా అర్ధం అయింది. “స్థూలకర్ణా! ఇది దైవ సంకల్పము. జరుగవలసిన కార్యమునకు తగ్గట్టు నీవు ఈ స్త్రీరూపంలో లోనే ఉండు” అని శపించాడు. స్థూలకర్ణుడు అతని కాళ్లమీద పడి శాపవిమోచనం కోరాడు. “స్థూ లకర్ణా! నీవలన

పురుషుడు అయిన శిఖండి బతికి ఉన్నంత కాలు పురుషుడు గానే ఉంటాడు. అతను బతికి ఉన్నంత కాలం నీవు స్త్రీగా ఉండి తరువాత పురుషత్వం పొందుతావు." అని శాప విమోచనం అనుగ్రహించాడు. తరువాత అలకాపురికి వెళ్లిపోయాడు కుబేరుడు.

శిఖండి అనుకున్న ప్రకారము పది దినములకు స్థూ ల కర్ణుని వద్దకు వచ్చి తన పురుషత్వము తీసుకొని స్త్రీత్వము తిరిగి ప్రసాదించ మన్నాడు. "ఇందు నీ తప్పు ఏమీ లేదు. నీవు బతికినంతకాలము పురుడుగానే ఉండు. ఇది దైవ సంకల్పము." అని చెప్పాడుస్థూల కర్ణుడు. శిఖండికి పట్టరాని సంతోషం కలిగింది. తన తల్లి తండ్రుల వద్దకు వచ్చాడు. జరిగినది అంతా చెప్పాడు. ఎన్నోపూజలు వ్రతాలు చేసాడు. బ్రాహ్మణులకు, దేవతలను, గురువును పూజించాడు. తరువాత శిఖండి ద్రోణునికి ప్రియశిష్యుడై ఎన్నో అస్త్ర శస్త్ర విద్యలలో అత్యంత ప్రావీణ్యం సంపాదించాడు." అని నారదుడు అంబ వృత్తాంతము నాకు సవిస్తరంగా చెప్పాడు.

కాబట్టి కాశీ రాజ పుత్రి అంబ నన్ను చంపవలెనని ఆకాంక్షతో శిఖండిగా అవతరించింది. కాని నాకు ఒక నియమము ఉన్నది. నేను స్త్రీలను, స్త్రీల పేరు పెట్టుకున్నవారిని, మొదట స్త్రీగా పుట్టి తరువాత

పురుషుడుగా  మారిన వారిని, స్త్రీల ఆకారములో ఉన్న వారిని చంపను. ఇది నా నియమము. ఏది ఏమైనా నా వ్రతము భగ్నము చేయను." అని పలికాడు భీష్ముడు.

అది విన్న సుయోధనుడు తన మనసులో చింతించి మగవాడు అంటే భీష్ముడే అని తనమనసులో కొనియాడాడు.  "పితామహా! పాండవ సైన్యమును పూర్తిగా సంహరిచడానికి మీకు ఎన్ని రోజులు పడుతుంది. అలాగే ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, కర్ణుడు ఎంతకాలములో చంపగలరు."  అని అడిగాడు సుయోధనుడు.

"సుయోధనా! మా బలాబలములు తెలుసుకొనడానికి నీవు ప్రయత్నిస్తున్నావు. మంచిదే. నేను చెప్పేది శ్రద్ధగా వినుము. నా సామర్ధ్యము గురించి నేనుచెప్పుకుంటాను . వారి వారిసామర్ధ్యముల గురించి వారేచెప్పుకుంటారు. కాని నీకు నేను ఒక మాట ఇస్తున్నాను. నేను రోజుకు వెయ్యి మంది రధికులను చంపుతాను.  నా శరీరం అర్జునుని బాణ పరంపరకు గురి అయి భూమీ మీద పడేవరకు శత్రువులతో పోరాడుతాను.  నాకు రోజుకు పదివేలమందని చంపే సామర్ధ్యము కూడా కలదు.  పాండవుల ఏడు అక్షౌహిణుల సైన్యమును ఒక నెలరోజులలో చంపగలను." అని పలికాడు భీష్ముడు.

అప్పుడు సుయోధనుడు ద్రోణాదులను చూచి మీ మీ సామర్ధ్యముల గురించి వివరించండి అని పలికాడు. దానికి ద్రోణుడు "రాజా! నీనే వృద్ధుడను. నా ఓపిన కొలది యుద్ధం చేయగలను. పితామహుడు చెప్పినట్టు నేనుకూడా ఒక నెల రోజులలో పాండవ సైన్యమును సంహరించగలను." అని పలికాడు.

కృపాచార్యుడు మాత్రము తనకు రెండునెలలు పడుతుంది అని అన్నాడు. అశ్వత్థామ మాత్రం తాను నెల రోజులలో పాండవ సైన్యం హతమార్చగలనని పలికాడు. కర్ణుడు అందరిని చూచి "నేను ఐదు రోజులలో పాండవసైన్యమును హతమారుస్తాను." అని పలికాడు. అతనిని చూచి భీష్ముడు నవ్వి "సూత నందనా! ఒట్టి మాటలు ఎన్ని అయినా చెప్పవచ్చును. కాని అవి చేతలలో చూపించాలి కదా. రారాజు ముందు నీవు చెప్పిన దానికి బదులుచెప్పేవారు లేరు కదా! యుద్ధ భూమిలో అర్జునుని గాండీవము యొక్క అల్లెత్రాటి శబ్దం నీ చెవులు బద్దలు చేసేదాకా నీవు ఈ ప్రగల్భములుమానవు." అని పలికాడు భీష్ముడు.

ఇక్కడ జరిగే విషయములన్నియు చారుల వలన ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు ధర్మరాజు. తన తమ్ములను చూచి ఇలా అన్నాడు.

“మన చారులు ఇప్పుడే హస్తినా పురమునుండి వచ్చి మనకు విలువైన సమాచారం అందించారు. కౌరవ స్కంధావారంలో జరిగిన విషయాలు తెలిసాయి. భీష్ముడు మన సైన్యమును మాసము రోజులలో చంపుతాను అని అన్నాడట. అలాగే ద్రోణుడు కూడా మాసము రోజులు, కృపాచార్యుడు రెండు నెలలు, అశ్వత్థామ పది రోజులు, కర్ణుడు ఐదురోజులు చాలు అని అన్నారట. అర్జునా! నీవు కౌరవ సేనను ఎన్నిరోజులలో చంపగలవో చెప్పగలవా! ” అని అడిగాడు

“అన్నయ్యా! భీష్మాదులు అవక్రపరాక్రమ వంతులు. ధనుర్విద్యా పారంగతులు. అలా మాట్లాడటంలో తప్పులేదు కాని ఆ మాటలు నెరవేర్చుకోవాలి కదా! నా శక్తి, పరాక్రమము ఎలాంటితో నీకు తెలుసు. నేను ప్రత్యేకంగా చెప్ప పనిలేదు. శ్రీకృష్ణుని సాయంతో నేను ఒక్క నిమిషంలో కౌరవ సేనను చంపుతాను. ఎలా అంటే, నేను కిరాత రూపంలో ఉన్న మహాశివుని తో పోరి మెప్పించి పాశుపతాస్త్రాన్నిపొందాను అని మీకు తెలుసు కదా. దాని మహిమ భీష్మునికి కాని, ద్రోణునికి గాని, కర్ణునికి గాని, అశ్వత్థామకు కాని, తెలియదు. అది ఈ సకల భూమండలాన్ని ఒక్క నిమిషంలో భస్మీపటలం చేస్తుంది. కాని దానిని నేను ప్రయోగించను. నా పరాక్రమాన్ని కించపరుచు కోలేను. నా భుజబలంతో పరాక్రమంతో శత్రువులతో పోరి విజయం సాధిస్తే నాకు

పేరు వస్తుంది. ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. దానికి చింతించనేల! ఇంక మన బలము గురించి చెప్పాలి అంటే మన వైపు భీముడు, నకుల సహదేవులు, అభిమన్యుడు, ద్రౌపదీసుతులు, సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు,శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు, ఘటోత్కచుడు, మొదలైన అతిరధ, మహారధులు ఉన్నారు. ఇంక నీ శక్తి ఏమిటో నీవు ఎరుగవు. నీ కే కోపం వస్తే ఈ కౌరవ సేన నీకు ఒక లెక్కలోనిది కాదు. కాబట్టి మనకు విజయం తధ్యం.మీరు నిశ్చింతగా ఉండండి. " అని పలికాడు అర్జునుడు. అని సంజయుడు ధృతరాష్ట్రుని తో చెప్పినట్లు వైశంపాయన మహర్షి జనమేజయునకు వివరించాడు, అని తిక్కనా మాత్యుడు మహా భారత కధను హరిహరనాధునకు చెప్పాడు.

ఇది కొమ్మనామాత్య పుత్రుడు,పండిత పూజ్యుడు, అయిన
తిక్కనామాత్యుని చే రచింపబడిన
శ్రీ మహాభారతమున, ఉద్యోపర్వమున, చతుర్ధాశ్వాసముసమాప్తము.
ఈ చతుర్ధాశ్వాసముతో ఉద్యోగ పర్వము సర్వం సమాప్తము.
మహాభారతములో ఆది పంచకం సంపూర్ణము అయినది.
భీష్మ పర్వమునుండి యుద్ధ షట్కము ప్రారంభము అవుతుంది.
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

( ఒక్క మనవి: కలియుగ ప్రత్యక్ష దైవము శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్ష వీక్షణములతో,  అవాఙ్మ మానస గోచరుడు, ఈ చరాచర జగత్తులో నిండి నిబిడీకృతమై ఉన్న  ఆ పరమాత్ముని దయతో, మిత్రులైన శ్రీ కె.వి.రాఘవరావుగారు,  శ్రీ విష్ణుప్రసాద్ గారి సౌజన్యంతో మీ అందరి ఆశీస్సులతో,  ఈ బృహత్కార్యములో  ఆది పంచకము పూర్తి చేయ గలిగాను.  ఈ సందర్భంగా  మీ అందరికి శిరసు వంచి నా పాదాభివందనములు తెలుపు కుంటున్నాను. నా జీవన సంధ్యలో మొదలు పెట్టిన ఈ బృహత్కార్యము నిర్విఘ్నముగా సాగాలని  ఆ భగవంతుని ప్రార్ధిస్తున్నాను.

మొదలి వెంకట సుబ్రహ్మణ్యం, హైదరాబాదు.)

మనము ఇప్పటిదాకా మహా భారత కధలో ఎందరోరాజుల కధలను చదువుకున్నాము. ఆ రాజులందరూ రెండు వంశములకు చెందినవారు. ఒకటి సూర్య వంశము. రెండవది చంద్ర వంశము. చాలా మందికి ఆ రెండు వంశములు  ఎలా వచ్చాయో తెలియదు.  ఇప్పుడు మనము ఆ రెండు వంశములు ఎలా ఆవిర్భవించాయి, వాటి వంశ వృక్షముల గురించి తెలుసుకుందాము.

# సూర్య వంశము.

శ్రీ మహా విష్ణువు.

శ్రీ మహా విష్ణువు నాభి లో నుండి పుట్టిన వాడు బ్రహ్మ.

--బ్రహ్మ కుమారుడు --మరీచి--

కశ్యపుడు--అదితి--

సూర్యుడు--సంజ్ఞ--

వైవస్వత మనువు--శ్రద్ధ--

- ఇక్ష్వాకుడు
  - మనుమడు కాకుత్సుడు
- ఇళాకన్య (తరువాత సుద్యుమ్నుడు)
  - చంద్రుని కుమారుడు బుధునికి ఇళా కన్యకు పుట్టిన వాడు పురూరవుడు.
- శర్యాతి
  - చ్యవనుడు--సుకన్య.
- మనుమడు సుభాగుడు.
  - సుభాగుని కుమారుడు అంబరీషుడు.

కాకుత్సుని 16వ తరం వాడు మాంధాత.

మాంధాత--బిందుమతి

మాంధాతకు ముగ్గురు కుమారులు, 50 మంది కుమార్తెలు

| | |
|---|---|
| మాంధాత పెద్ద కుమారుడు-- | పురుకుత్సుడు--అతని భార్య నర్మద |
| పురుకుత్సుని ఏడవ తరం వాడు | త్రిశంకుడు. |
| త్రిశంకుని కుమారుడు --- | హరిశ్చంద్రుడు. |
| హరిశ్చంద్రుని ఎనిమదవ తరం వాడు | సగరుడు |
| సగరుని మనుమడు | అంశుమంతుడు |
| అంశుమంతుని మనుమడు | భగీరథుడు |
| భగీరథుని ఐదవ తరం వాడు | ఋతుపర్ణుడు |
| ఋతుపర్ణుని ఆరవ తరం వాడు | ఖట్వాంగుడు |
| ఖట్వాంగుని మనుమడు | రఘుమహారాజు |
| రఘుమహారాజు మనుమడు | దశరథుడు. |
| దశరథుని కుమారులు--- | శ్రీరామ చంద్రుడు, లక్ష్మణుడు, భరతుడు,శత్రుఘ్నుడు |
| శ్రీరామ చంద్రుని కుమారులు--- | లవకుశులు |
| లక్ష్మణుని కుమారులు--- | అంగదుడు, చంద్రకేతు |
| భరతుని కుమారులు ---- | దక్షుడు,పుష్కలుడు |
| శత్రుఘ్నుని కుమారులు--- | సుబాహుడు,శ్రుతసేనుడు. |

కశ్యప ప్రజాపతి కుమారుడు సూర్యుని నుండి పుట్టిన వంశం కాబట్టి సూర్యవంశము అని పేరు వచ్చింది. సూర్యవంశములో మనకు తెలిసినంతవరకూ త్రేతాయుగంలో శ్రీరామ చంద్రుడు, అతని తమ్ములు,వారి కుమారులు. తరువాత ద్వాపర యుగం ప్రవేశించింది. అందులో ముఖ్యమైన వారు పాండవులు, కౌరవులు, శ్రీకృష్ణుడు. వారు

చంద్రవంశపు రాజులు. కాబట్టి మనం చంద్ర వంశపు రాజులలో ముఖ్యుల గురించి తెలుసుకుందాము.

# చంద్రవంశము.

శ్రీమహా విష్ణువు

ఆయన నాభిలో నుండి పుట్టిన వాడు బ్రహ్మ

బ్రహ్మ కుమారుడు అత్రి మహా ముని

అత్రి మహా ముని క్రీగంటి చూపుల నుండి పుట్టినవాడు చంద్రుడు

చంద్రునికి, తారకు పుట్టిన వాడు బుధుడు.

బుధునికి, ఇళా కన్యకు పుట్టిన వాడు పురూరవచక్రవర్తి.

పురూరవునికి ఊర్వశికి పుట్టిన వాడు ఆయువు.

అయువు కుమారుడు నహుషుడు.

నహుషుని కుమారుడు యయాతి.

నహుషుని 10వ తరం వాడు గాధి.

గాధి కుమారుడు విశ్వామిత్రుడు.

యయాతి--దేవయాని

యదువు, తుర్వసుడు

(యదువంశము)

యయాతి-శర్మిష్ట

ద్రుహ్యుడు,అనువు,పూరుడు.

పూరునికి 14వ తరం వాడు దుష్యంతుడు. ఇతని భార్య శకుంతల

శకుంతలా దుష్యంతుల
కుమారుడు భరతుడు.
భరతుని 5వ తరం వాడు
రంతి దేవుడు.

భరతుని మనుమడు
బృహక్షత్రుడు.
బృహక్షత్రుని మనుమడు హస్తి
( ఇతను నిర్మించినదే
హస్తినాపురము.)
హస్తి కుమారుడు అజామీఢుడు
అజామీఢుని మనుమడు
సంవరణుడు
సంవరణుని కుమారుడు
కురువు ( ఇతని పేరుమీదనే
కురు వంశము, కురుక్షేత్రము
వెలసింది)
కురువు 13వ తరం వాడు
శంతనుడు.
శంతనుని కుమారుడు
దేవవ్రతుడు (భీష్ముడు).
శంతనుడు,సత్యవతికుమారులు
చిత్రాంగదుడు,విచిత్రవీర్యుడు
విచిత్రవీర్యుని కి అంబిక ద్వారా
ధృతరాష్ట్రుడు, అంబాలిక ద్వారా

పాండురాజు జన్మించారు.
ధృతరాష్ట్రునికి సుయోధనుడు
మొదలగు నూర్గురు
కుమారులు,దుస్సల కుమార్తె

పాండురాజుకు
ధర్మరాజు,భీముడు,
అర్జునుడు,నకులుడు,
సహదేవుడు అను ఐదుగురు
కుమారులు.
అర్జునుని కుమారుడు
అభిమన్యుడు.
అభిమన్యుని కుమారుడు
పరీక్షిత్తు మహారాజు
పరీక్షత్తుమహారాజు కుమారుడు
జనమేజయ మహారాజు.
మహాభారత శ్రోత.

(యదు వంశ చరిత్ర)

యయాతి, దేవయాని పెద్ద కుమారుడు యదువు.
యదువుకు 10 వ తరం వాడు కృతవీర్యుడు
కృతవీర్యుని కుమారుడు కార్తవీర్యార్జునుడు

యదువుకు 34వ తరం వాడు సాత్వతుడు
సాత్వతుని 12వ తరం వాడు శూరసేనుడు

యదువునకు 44వ తరం వాడు ఆహుకుడు
ఆహుకుని కుమారులు దేవకుడు, ఉగ్రసేనుడు

శూరసేనుడికి 10మంది కొడుకులు, ఐదుగురు
కుమార్తెలు. అందులో వసుదేవుడుపెద్దవాడు.

శూరసేనుడి కి పెద్ద కుమారుడు
వసుదేవుడు, ఐదుగురుకుమార్తెలు
(1)పృథ (కుంతీదేవి)
(భర్త పాండురాజు-
వీరి కుమారులు పాండవులు)
(2)శృతదేవ
(భర్త వృద్ధ శర్మ-వీరి కుమారుడు దంతవక్త్రుడు)
(3)శృతకీర్తి
(భర్త ధృష్టకేతువు వీరి కుమారులు ప్రతర్ధనుడు మొదలగువారు)
(4)శ్రుతశ్రవస
(భర్త దమఘోషుడు--వీరి కొడుకు శిశుపాలుడు)
(5)రాజాధి దేవి
(భర్త జయసేనుడు. వీరి కుమారులు విందానువిందులు).

దేవకుని కుమార్తె దేవకి. (భర్త వసుదేవుడు)
వీరి కుమారుడు శ్రీకృష్ణుడు, కుమార్తె సుబధ్ర
వసుదేవుని రెండవ భార్య రోహిణి.
వీరి కుమారులు బలరాముడు,గదుడు,
సారణుడు.
ఉగ్రసేనుడి కుమారుడు కంసుడు.( ఇంకా
9 మంది)

వీరందరు కూడా చంద్ర వంశపు వారే. కాని యదువు పేరుమీద యదువంశీయులుగా, యాదవులుగాప్రసిద్ధి గాంచారు.

శూరసేనుని కుమారుడు వసుదేవుడు, కుమార్తె పృథ.తన కుమార్తె పృథను తనమిత్రుడు కుంతి భోజునకు పెంపకం ఇచ్చాడు శూరసేనుడు.

అందువల్ల ఆమెకు కుంతి అనిపేరు వచ్చింది. కృష్ణుడి తండ్రి వసుదేవునకు పృధ (కుంతీదేవి) చెల్లెలు కాబట్టి, కుంతీదేవి శ్రీ కృష్ణునికి మేనత్త అయింది. అందుకని కుంతీదేవిని కృష్ణుడు అత్తా అని పిలుస్తాడు. పాండవులు కృష్ణుని బావా అని పిలుస్తారు. అలాగే కుంతీ దేవి చెల్లెలు శృతశ్రవస కుమారుడు శిశుపాలుడు. శ్రీకృష్ణునికి మేనత్త కుమారుడు శిశుపాలుడు.

చంద్ర వంశములో ఆఖరి వాడైన జనమేజయునికి వైశంపాయనుడు మహాభారత కథను వినిపించాడు.

ఇది సూర్య వంశపు రాజులు, చంద్రవంశపు రాజుల వంశవృక్షము.

# మహా భారతము

## భీష్మ పర్వము

## ప్రధమాశ్వాసము

దేవా హరి హర నాధా! జనమేజయుడు వైశంపాయనునికి మహా భారత కధను ఇలా చెప్పసాగాడు..

జనమేజయుడు వైశంపాయనుని చూచి, "ఓ వైశంపాయన మహర్షి! ఒకరిని ఒకరు గెలువ వలెనని తలంపుతో పాండవులు, కౌరవులు తమ తమ బాహు బల గర్వముతో ఎలా ప్రవర్తించారు? యుద్ధము ఏ విధంగా జరిగింది? నాకు వివరంగా చెప్పండి." అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఈ విధంగా చెప్పసాగాడు.

పుణ్య క్షేత్రమైన కురుక్షేత్రమందు రెండు పక్షముల వారు తమ తమ సైన్యములతో యుద్ధమునకు కాలు దువ్వుతూ విడిసి ఉన్నారు. తన కుమారుల దుర్వినయమునకు కలత నొందిన ధృతరాష్ట్రుడు సంజయుని తన వద్దకు పిలిపించుకున్నాడు. ఇద్దరూ ఏమి

జరుగబోతోందో అని వ్యాకులత చెందుచున్న సమయమున వ్యాసుడు వారి వద్దకు వచ్చాడు.

ధృతరాష్ట్రుడు వ్యాసునికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి అర్చించాడు. "ధృతరాష్ట్రా! ఈ భూమి మీద ఉన్న రాజులకు కాలం తీరిపోయింది. అందుకే ఈ మహాభారత యుద్ధము సంప్రాప్త మయినది. దీని గురించి నీవు చింతించి ప్రయోజనము లేదు. నేను నీకు దివ్యదృష్టిని ప్రసాదించెదను. అనుదినము జరుగు యుద్ధవిశేషములను కనులారా చూడుము." అని చెప్పాడు.

"వ్యాసమహర్షి! అన్నదమ్ములు ఘోరంగా యుద్ధం చేసుకుంటుంటే నేను చూడలేను. కేవలం నాకు యుద్ధవిశేషములు వినే భాగ్యం ప్రసాదించు." అని అడిగాడు. వ్యాసుడు పక్కనే ఉన్న సంజయుని చూచి

"సంజయా! నీవు ధృతరాష్ట్రునకు యుద్ధ విశేషములు అన్నియు సవిస్తరముగా వివరించుము. నీకు రెండు పక్షముల సైన్యములలో జరుగు అన్ని విషయములు, వారి రహస్య సంభాషణములు, వారి వారి మనో వృత్తులు, తెలుసుకోగలిగే శక్తిని ప్రసాదిస్తున్నాను. నీవు తలుచుకున్నంత మాత్రముననే యుద్ధభూమికిపోగలవు. యుద్ధభూమిలో తిరగ గలవు.

నీకు ఏ శస్త్రము, అస్త్రము తగలదు. కాబట్టి నీవు యుద్ధ విశేషములు అన్ని కనులారా చూచి, చూచింది చూచినట్టు ధృతరాష్ట్రునకు చెప్పుము." అని సంజయునకు శీఘ్రగమనము, దూర శ్రవణము మొదలగు శక్తులు ప్రసాదించాడు.

"ధృతరాష్ట్రా! ఇది భూభారమును తగ్గించుట కొరకు సంప్రాప్తమైన యుద్ధము. దీనికి చింతించి ప్రయోజనము లేదు. ధర్మము జయిస్తుంది. నీవు నిశ్చింతగా ఉండుము. ప్రస్తుతము ఎన్నో దుశ్శకునములు గోచరిస్తున్నాయి. భూమండలము మీద ఉన్న రాజులందరూ నశిస్తారు. కుల నాశము తప్పదు. ఇప్పటి కన్నా మించి పోయింది లేదు. నీవు నీ కుమారుని ఒప్పించి, పాండవులకు వారి రాజ్యభాగము వారికి ఇప్పించు. యుద్ధము నివారించు." అని పలికాడు వ్యాసుడు.

"మహాత్మా! మీరు నా మేలు గోరి ఈ విధంగా చెపుతున్నారు. కాని నా కుమారుల మూర్ఖత్వము గురించి నాకు తెలియును. వారు నా మాట వినరు. నా వల్ల తప్పులేకుండా ఎన్నో విధములుగా చెప్పి చూచాను. వ్యవహారము పాకము తప్పినది. ఇంక నేను ఏమీ చేయలేను." అని నిస్సహాయుడై పలికాడు ధృతరాష్ట్రుడు.

"ధృతరాష్ట్రా! యుద్ధములో జయాపజయములు దైవాధీనములు. ఎలా జరగాలో అలా జరుగుతుంది. నేను వెళ్లి వస్తాను." అని చెప్పి వెళ్లిపోయాడు వ్యాసుడు.

ధృతరాష్ట్రుడు సంజయుని చూచి "సంజయా! ఈ భూమి కోసం ఎందరో రాజులు ఎన్నో యుద్ధాలు చేసారు. ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ భూమి అంటే అంత తీపా! సంజయా! అసలు ఈ భూమి యొక్క స్వరూపమ్ము, పరిమాణము గురించి వివరింపుము." అని అడిగాడు. దానికి సంజయుడు ఇలా చెప్పసాగాడు.

"మహారాజా! ఈ భూమిలో నానావిధము లైన చరాచరములు జన్మిస్తుంటాయి. జీవిస్తుంటాయి. మరణిస్తుంటాయి. అన్ని జీవులకు నిలయము ఈ భూమి.

ఆకాశము యొక్క గుణము శబ్దము.

వాయువు యొక్క గుణములు శబ్దము, స్పర్శ.

తేజము(అగ్ని) యొక్క గుణములు శబ్ద, స్పర్శ,రూపములు.

నీటి యొక్క గుణములు శబ్ద,స్పర్శ,రూప,రసములు.

భూమికి శబ్దము,స్పర్శ,రూపము,రసము,గంధము(వాసన) గుణములు.

కాబట్టి పంచభూతములలో భూమి ప్రధానమ్మైనది.

మేరు పర్వతమునకు దక్షిణమున, సుదర్శనము అను పేరు గల ప్రదేశమున, 2,500 యోజనముల పొడవున విస్తరించి, మధుర ఫలములతో నిండిన, ఒక జంబూ వృక్షము గలదు. దాని పళ్లు ఎల్లప్పుడూ బాగా పండి పోయి ఆ చెట్టు కింద రాలు తుంటాయి. అవి చితికి పోయి, వాని రసము పొంగి పొరలుతూ ఏరులై పారుతూ, ఆ పర్వతమునకు చుట్టూ తిరిగి, ఉత్తర కురుభూములను ప్రవేశించి, ప్రవహిస్తూ చివరకు సముద్రము చేరుకుంటుంది. ఆ నదిని జంబూ నది అంటారు.

ఆ నదిలో ప్రవహించు నీరు సోకిన ప్రదేశమంతా బంగారు మయమగును. కాబట్టి అప్పటినుండి బంగారమునకు జాంబూనదము అని పేరు వచ్చినది. ఆ నదీ జలములు తాగిన జనులకు ముసలి తనము, రోగములు, దాహము ఉండదు అని చెప్పుకొందురు. ఆ జంబూ వృక్షము పేరిట ఈ ద్వీపమునకు జంబూ ద్వీపము, సుదర్శనద్వీపము అనుపేరు వచ్చినది.

ఈ ద్వీపమునకు తూర్పు, పడమరలు సముద్రముతో నిండి ఉండును. ఈ ద్వీపములో హిమాచలమును, దానికి ఆవల హేమ కూటమును, నిషధ పర్వతమును, తరువాత క్రమ క్రమమపుగా, నీల, శ్వేత, శృంగవంత పర్వతములు గోచరిస్తాయి. మొదట చెప్పిన మూడు

పర్వతములకు ఇవతల, తరువాత చెప్పిన మూడు పర్వతములకు అవతల, మధ్యలో మేరుపర్వతము ఉన్నది. అది 16,000 యోజనములు భూమిలోనికి చొచ్చుకొని యున్నది. ఆ పర్వతము పొడవు 84,000 యోజనములు.

ఈ మేరు పర్వతమున దేవతలను, దేవ మునులును, గంధర్వ, కింపురుషులు, దేవతలు, దేవేంద్రాది దిక్పాలకులు, బ్రహ్మదేవుడు విహరిస్తూ ఉండెదరు. దానికి ఉత్తరమున ఉన్న కర్ణికార వనంబున మహేశ్వరుడు గౌరీ సమేతుడై విహరించుచుండును.

ఈ జంబూ ద్వీపమున జనపదములు తొమ్మిది ఖండములుగా విభజింపబడినవి. వానిని వర్షములు అందురు. అవి వరుసగా

(1) ఉత్తర సముద్రము, శృంగవంతము నకు మధ్య ప్రదేశము ఐరావత వర్షము అందురు.

(2) శ్వేత పర్వతము, శృంగ వంతము నడుమ ప్రదేశము హైరణ్మయ వర్షము అందురు.

(3) నీల శైలమునకు ఉత్తర దక్షిణ ప్రదేశములు (3) రమణక వర్షము, (4) నిలాకృత వర్షము అని అందురు.

(4) మేరు పర్వతమునకు తూర్పు, పశ్చిమ ప్రాంతములు (5) భద్రాశ్వ వర్షము (6) కేతు మాలా వర్షము అందురు.

(5) మేరు పర్వతమునకు ఉత్తరమున ఉన్న ప్రదేశమును (7)హరి వర్షము అందురు.

(6) హిమవత్పర్వతమునకు అటు ఇటు ఉన్న ప్రదేశమును (8) కింపురుష వర్షము (9) భారత వర్షము అందురు.

ఈ జంబూ ద్వీపము 80,600 యోజనములు విస్తీర్ణము కలదు. దీనికి రెండింతలు విస్తీర్ణములతో, లవణ, ఇక్షురస, సుర, ఘృత, దధి, క్షీర, శుద్ధజల మయములయిన సముద్రములు, క్రమముగా ఒకటికి ఒకటి రెట్టింపుగా విస్తీర్ణముతో కలవు.

ఇందులో లక్ష ద్వీపము, శాల్మల ద్వీపము, క్రౌంచ ద్వీపము, కుశద్వీపము, శాకద్వీపము, పుష్కరద్వీపము అను ఆరు ద్వీపములు

కలవు. ఈ ద్వీపములలో అనేక పర్వతములు, నదులు, జనపదములు ఉన్నవి.

దీని కంతకు కర్త, భర్త, హర్త, అయిన శ్రీమన్నారాయణుడు పాలసముద్రమునకు ఆవల, కనక మయమై, ఎనిమిది చక్రములతో మనోజవమయిన ఒక దివ్యరధము మీద వైకుంఠమున, విహరించు చుండును." అని చెప్పాడు సంజయుడు.

"సంజయా! ఈ భరత వర్షంకోసం దురాశతో మైమరిచి పాండవులు కౌరవుడు పరస్పరం యుద్ధం చేసుకుంటున్నారు కదా! ఇంతకన్నా దురాశాపరులు ఈలోకంలో ఉంటారా!" అని అన్నాడు ధృ తరాష్ట్రుడు.

"మహారాజా! నీవు పాండవులను అన్యాయంగా నిందించుచున్నావు వారికి ఈ భూమి పై ఎలాంటి ఆశ లేదు. నీ కుమారుడే శకుని మాటలు విని, దురాశాపరుడై, దుశ్చర్యలకు పాల్పడ్డాడు. వరకు ఇంతచేటు దాపురించినది. ఎంతో మంది రాజులు తమ తమ దేశములనుండి వచ్చి పాండవులలో పోరిడి గెలువ వెనని తలంపుతో సుయోధనుని పక్షాన యుద్ధం చేస్తున్నారు. వారిని కూడా నిందించపనిలేదు.

పూర్వము ఎంతోమంది రాజులు ఈ భూమిని జయించవలెనని ఎన్నో యుద్ధాలు చేసారు వారిలో భగీరధుడు, యయాతి, రఘువు, నహుషుడు లాంటి మహానుభావులు ఈ భూమిని పాలించి యజ్ఞ యాగములు చేసి ఎంతో యశస్సు గడించారు.

ఈ భారత వర్షము రత్నగర్భ. అటువంటి ఈ భారత వర్షము కొరకు అందులో ఉన్న సంపదల కొరకు ఆశపడి, ఈర్ష్య, అసూయలతో యుద్ధములు చేయకుండా ఉంటారా చెప్పు. అదియును కాక.....

ఇటువంటి భరత వర్షమున, మలయము, శుక్తిమంతము, వింధ్య, పారియాత్ర, మహేంద్రము, ఋక్షవంతము, సహ్యాద్రి, అను ఏడు పర్వతములు కలవు. వీని యందు, రత్నములు, మణులు, ఇనుము, రాగి, తగరము, వెండి, బంగారము మొదలగు ఖనిజ విశేములు ఎన్నో కలవు.

ఇందులో గంగ, తుంగభద్ర, వేత్రవతి, వేదవతి, కృష్ణవేణి, పెన్న, యమున, తమస, శారావతి, కావేరి, గోదావరి, నర్మద, బాహుద, సరయు, శతద్రువు, వితస్త, విపాశ, తామ్రపర్ణి, అను మహా నదులు

ప్రవహించు చున్నవి. వీటి వలన భరత వర్షము, ధనధాన్యములు పాడి పంటలు సంపదలతో అలరారు చున్నది.

ఇవి కాక భరత వర్షమున, పాంచాల, పాండ్య, బర్బర, వత్స, మత్స్య, మగధ, మళయాళ, కళింగ, కుళింగ, కురు, కొంకణ, టెంకణ, త్రిగర్త, సాముద్ర, సాళ్వ, శూరసేన, సుధేష్ణ, సుహ్మ, కరూశ, కాశ, కోసల, యవన యుగంధర, ఆంధ్ర, సింధు, ఛేధి, చోళ,పుళింద, పుండ్రక, పాండ్య, అభీర, సౌవీర, సౌరాష్ట్ర, మహారాష్ట్ర, విదేహ, విదర్భ, ద్రవిడ, దశార్ణ, కర్ణాట, గౌళ, అంగ, వంగ, మరాఠ, లాట, బాహ్లిక, బహుదాన, కిరాత, కేకయ, అశ్మంతక, కాశ్మీర, గాంధార, కాంభోజ, కేరళ, మాళవ, నేపాళ, ఘూర్జర, కుంతల, అవంతి, మొదలగు జనపదములు కలవు. ఈ జనపదములలో వసించు జనులు సమస్త వస్తు సంపదలతో సుఖంగా జీవించుచున్నారు.

కాబట్టి సమస్త జనులకు, రాజులకు ఈ భూమి కామధేనువు వంటిది. ఇంత భూమి, ఇన్ని సంపదలు, ఖనిజములు, ఉన్నప్పటికిని, బలవంతులైన రాజులు తమకు ఉన్న భూమి చాలును అని అనరు. ఇంకా కావాలి ఇంకా కావాలి అంటూ తండ్రి, కొడుకులు,అన్నలు, తమ్ములు అన్న బేధము లేక ఈ భూమి కోసం యుద్ధములు చేసి ఒకరిని ఒకరు చంపుకుంటున్నారు. కాబట్టి కౌరవ పాండవులు ఈ భూమి కోసం

పోరాడటం ఎంత చేటు తెచ్చిపెడుతుందో కదా! ఈ భూమి మీద రాజులందరకు పోగాలము దాపురించినట్టులున్నది." అని అన్న సంజయునితో ధృతరాష్ట్రుడు "సంజయా! ఇంక నీవు పోయి యుద్ధరంగమున ఏమి జరుగుచున్నదో చూచి రమ్ము." అని అన్నాడు. సంజయుడు వెంటనే యుద్ధభూమికి బయలు దేరాడు.

సంజయుడు కురుక్షేత్రమునకుపోయి కొన్ని రోజులకు తిరిగి వచ్చాడు. రాగానే ధృతరాష్ట్రుని పాదముల మీద పడి ఏడుస్తున్నాడు.

"అయ్యో! పరాక్రమ వంతులలో కెల్ల పరాక్రమ వంతుడైన భీష్ముడు అంపశయ్య మీద పడి ఉన్నాడు. పరశురాముని జయించిన భీష్ముడు ఒక శిఖండి చేత భంగ పడ్డాడు. ఈ భీష్ముని అండ చూచుకొని నీ కొడుకు ఇంతకు ముందు జూదము ఆడి గెలిచాడు. ఇప్పుడు ఆ భీష్ముడే యుద్ధము అనే జూదములో ఓడిపోయాడు. పాండవుల సైన్యముతో పది రోజులు వీరోచితముగా పోరాడిన భీష్ముడు కడకు అస్తమించాడు. పదివేల మంది వీరులు తన మీదికి ఒక్కసారిగా ఎదిరించి వచ్చినా చలించని భీష్ముడు, ఒక్క శిఖండి చేతిలో ఓడిపోయాడు. ఈ మహానుభావుడు కేవలం నరుడు కాడు." అంటూ విలపిస్తున్న సంజయుని మాటలు విని, ధృతరాష్ట్రుడు కొంతసేపు మూర్ఛపోయాడు.

తరువాత తేరుకొని కంటినిండా నీరు పెట్టుకొని "సంజయా! దేవాసురులు ఒక్కటిగా వచ్చినా చలించని భీష్ముడు ఒక్క శిఖండి చేతిలో ఓడిపోయాడా! తన శస్త్రా స్త్రములతో విరోధులను మదమడంచుచున్న భీష్ముని, ఒక్క శిఖండి ఎదిరించాడా! ఇంత కన్నా ఆశ్చర్యం ఏముంటుంది సంజయా! భీష్ముడు అనే కాలమేఘాన్ని శిఖండి అనే చిరుగాలి చెదర గొట్టిందా! హతవిధీ! అంబకోసం తన మీదికి యుద్ధమునకు వచ్చిన పరశురాముని ఎదిరించి ఓడించిన భీష్ముడు, పాండవుల కోసం వచ్చిన శిఖండి చేతిలో ఓడిపోయాడా! అతని సత్వము, శౌర్యము, శీలము, పరాక్రమము, అతని శుద్ధవ్రతము, నాశము లేనివని నమ్మాను కదా సంజయా! ఇప్పుడు ఏమి చెయ్యాలి. " అని రోదించాడు ధృతరాష్ట్రుడు.

"సంజయా! శిఖండి భీష్ముని మీద బాణవర్షము కురిపించు చున్నపుడు మనవాళ్లు ఒక్కరూ అడ్డం రాలేదా! ఇన్ని అక్షౌహిణుల సైన్యము ఏమి చేయుచున్నది. ఒక్క శిఖండిని ఎదిరించలేకపోయారా! ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ, శల్యుడు పారిపోయారా! పాండవులు, శిఖండి కలిసి భీష్ముని ఎదిరించినపుడు, నా కొడుకులందరూ భయపడి, చేవ చచ్చి, అడవుల్లో దాక్కున్నారా! భీష్ముడు ఆహవ భూమిలో

అసహాయుడై పడి ఉన్నప్పుడే మన సేన అంతా చెల్లాచెదరై నశించి ఉండవలసినది. లేని ఎడల అటువంటి శరశాస్త్రకోవిదునికి ఈ తీరున రణరంగములో కూలిపోవలసిన దురవస్థ ఎందుకు దాపురించినది?

ఔరా! కుల వృద్ధు డైన గాంగేయుని చంపి రాజ్య చెయ్యడానికి సమ్మతించిన పాండవులకు ధైవము కూడా తోడు అయినది కదా! ధర్మము నశించింది. భీష్ముని చంపి రాజ్యము తీసుకొనడం అధర్మము, పాపం కాదా! అయ్యో! ఇప్పుడు కౌరవ సేన అనాధ అయినది కదా! నా కుమారులు ఏమయి పోయారో! ఎంత బాధపడుతున్నారో కదా! సంజయా! ఈ పది రోజులు యుద్ధము ఎలా జరిగింది. ఎవ్వరెవ్వరు ఎప్పుడెప్పుడు ఏమేమి చేసారు. ఇన్నిరోజులు గాంగేయుడు ఏ విధంగా యుద్ధం చేసాడు. సవిస్తరముగా చెప్పుము." అని అడిగాడు. దానికి సంజయుడు ఈ విధంగా చెప్ప సాగాడు.

"మహారాజా! నీ అవి నీతి వలననే కదా ధర్మపరులైన పాండవులు ఇన్ని కష్టములు కలిగాయి. ముందు వెనుకలు చూడకుండా పరులకు అపకారములు చేసిన వారికి ఎప్పటికైనా వాటి ఫలితము అనుభవించవలసినదే కదా! " అని చెప్పి సంజయుడు "రాజా! నీ ఆజ్ఞ మేరకు నేను యుద్ధరంగము నకు వెళ్లాను. నేను విన్నది, చూచినది,

నాకు తెలిసినది, వివరంగా చెప్పెదను. వినుము." అని మనసులో వేదవ్యాసుని ప్రార్థించాడు. ఆయన కృపతో ఈ విధంగా చెప్పసాగాడు.

"ఆ రోజు రాత్రి నిన్ను వదలి నేను మన సైన్యము నిలిచి ఉన్న ప్రదేశమునకు పోయి నీ కుమారుని స్థావరమునకు వెళ్లాను. అక్కడ గాంగేయుడు మొదలగు కురు వీరులు చుట్టూ కూర్చుని ఉండగా నీ కుమారుడు వారి మధ్యలో కూర్చుని మంతనాలు సలుపుతున్నాడు. నన్ను చూచి మర్యాదలు చేసాడు. నేను ఒక పక్క కూర్చుని అక్కడ జరిగిన విషయములు చూస్తూ ఉన్నాను.

సుయోధనుడు తన తమ్ముడు దుశ్శాసనుని చూచి "దుశ్శాసనా! మనము చిరకాలమునుండి పాండవులతో యుద్ధం చెయ్యడం కోసం ఎదురు చూచు చున్నాము. ఈ కోరిక ఈ నాటికి నెరవేరింది. మన సైన్యమునకు భీష్ముడు ఆరవ ప్రాణము. కాబట్టి మనము అందరము పితామహుని భీష్ముని కాపాడుకొనవలెను. ఇతను ఒక్కడే పాండవ సైన్యమును అంతమొందించ గల వీరుడు. మనలను అందరనూ రక్షించు ఇతనిని మనము కంటికి రెప్పలా కాపాడుకొనవలెను. ఎందుకనగా ఇతరు లెవ్వరూ ఇతనిని యుద్ధములో ఎదిరిం బతుక జాలరు, ఒక్క శిఖండి తప్ప. శిఖండి చేతిలో ఈ మహానుభావునికి ఓటమి రాకుండా

మనము రక్షించకొన వలయును. అసలు ఇతనికి శిఖండి ఎదురు పడకుండా చూడండి. " అని పలికాడు.

తరువాత యుద్ధమునకు సన్నాహములు మొదలయినవి. శంఖములు, దుందుభులు,మంగళ వాద్యములు మ్రోగుచుండగా కౌరవ సైన్యము యుద్ధమునకు బయలు దేరింది.

సువర్ణ తాళ కేతనముతో బీష్ముడు తన రధము మీద దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు.

కాంచనమయవేదిక తన కేతనముగా ద్రోణుడు తన రధము మీద బయలు దేరాడు.

బంగారు గోవును కేతనముగా గల కృపుడు, తోకతో గల సింహము తన కేతనముగా గల అశ్వత్థామ, అరటి చెట్టు తన కేతనముగా శల్యుడు, ఇంకా మిగిలిన రాజులు రణోత్సాహంతో బయలు దేరారు.

యాదవ బలములతో కృతవర్మ, మహా రధుడైన జయద్రధుడు తన సైన్యముతోనూ, ఏనుగుల బలగములతో విందానువిందులు, కళింగ

దేశపు రాజు భగదత్తుడు తన సైన్యము తోనూ, గాంధార దేశాధీశుడు శకుని, తన కొడుకులు, తమ్ములతో, తన సేనలో తోనూ, సోమదత్తుడు, భూరిశ్రవుడు, బాహ్లికుడు, తమ తమ సేనలతోనూ యుద్ధ భూమి లో మోహరించారు.

కాంభోజరాజు సుదక్షిణుడు, కోసల రాజు బృహద్బలుడు, మాహిష్మతీపుర నాధుడు నీలుడు, త్రిగర్తదేశాధీశుడు సుశర్మ, అసుర వీరుడు అలంబసుడు, సాళ్వ, సౌవీర, శూరసేన, యవన రాజులందరూ తమ తమ సేనలతో మోహరించారు. వీరందరూ 10 అక్షౌహిణులు ఉన్నారు.

పదకొండవ అక్షౌహిణి సైన్యముతో పాము పడగ కేతనముతో నీ కుమారుడు, ఏనుగు నెక్కి బయలుదేరాడు. నీ కుమారునికి ఇరు పక్కల, దుశ్శాసనుడు, దుర్మర్షణుడు, వివింశతి, వికర్ణుడు మొదలగు వారు తమ తమ వాహనముల మీద అనుసరించారు. ఈ ప్రకారము కౌరవ సేన యుద్ధభూమి చేరుకుంది.

అప్పుడు సర్వసైన్యాధ్యక్షుడైన భీష్ముడు అక్కడకు చేరుకున్న రాజులనందరనూ పిలిచి "మహావీరులారా! క్షత్రియులకు యుద్ధ

సమయములో స్వర్గ ద్వారములు ఎప్పుడూ తెరుచుకొని ఉంటాయి. ఇంతకు ముందు ఎందరో మహానుభావులుయుద్ధములో మరణించి ఆ స్వర్గ ద్వారముల వెంట నడిచారు. మీరు అందరూ కూడా ఆ మార్గమున నడచుటకు సిద్ధంగా ఉండాలి. ఎందుకంటే క్షత్రియ వీరులకు, ఇంటిలో ఉండి, రోగముల బారి పడి చావడం కంటే పాపము మరొకటి ఉందా. కాబట్టి క్షత్రియునకు రణరంగములో పోరాటము ఒక పెన్నిధి వంటిది." అని పలికాడు భీష్ముడు.

ఆ మాటలు విన్న క్షత్రియ వీరులు "మేము మీ వెంట ఉంటాము. విజయమో వీరస్వర్గమో తేల్చుకుంటాము." అని జయజయధ్వానాలు చేసారు. తమ తమ సైన్యములతో యుద్ధమునకు సన్నద్ధమైనారు.

ఆ సమయంలో భీష్ముడు సుయోధనుని చూచి "సుయోధనా! నేను యుద్ధము చేయు సమయమున కర్ణుడు తన పుత్ర, మిత్ర, అమాత్య, బంధు సహితముగా యుద్ధమునకు రాకూడదు." అని రూఢి చేసుకున్నాడు.

"ఎట్టి పరిస్థితులలోనూ కర్ణుడు యుద్ధ భూమిలో అడుగుపెట్టడు." అని సుయోధనుడు పలికాడు. మరియు

“పితామహా! మీరు ఒక సమ యోచితమైన వ్యూహరచన చెయ్యండి. ” అని ప్రార్ధించాడు. అలాగే అని భీష్ముడు ఒక విచిత్రమైన వ్యూహ రచన చేసాడు.

భీష్ముడు, ద్రోణుడు పడమర ముఖంగా నిల్చున్నారు. తమకు ఒకపక్క కృపాచార్యులు, అశ్వత్థామలను, మరొక పక్క కృతవర్మ, శల్యులను నిలువమన్నారు. వెనుక పక్క బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవసులను నిలిపారు. మధ్యలో సుయోధనుడు నిల్చున్నాడు. సంశప్తకులైన సుశర్మ మొదలగు వారిని అక్కడక్కడ నిలిపారు. ~~ఈ~~ ప్రకారము ఒక వ్యూహము పన్నాడు భీష్ముడు.

పాండవులు కూడా తమ తమ సైన్యములతో యుద్ధభూమిలో ప్రవేశించారు. అగ్రభాగాన యుధిష్ఠరుడు తన రధము మీద వెలిగిపోతున్నాడు. ధర్మజునికి అటు పక్క భీముడు తన గదాయుధంతో, ఇటు పక్క అర్జునుడు తన చేతిలో ఇంద్ర ధనుస్సు లాంటి గాండీవంతో నిల్చున్నారు. శ్రీకృష్ణుడు అర్జునుని రధసారధిగా రధంమీద కూర్చుని ఉన్నాడు. అర్జునుని రధం పైన కపిధ్వజము రెపరెపలాడుతూ ఉంది. అర్జునుడు గాండీవమును ఎక్కుపెట్టి ధనుష్టంకారము చేసాడు. నకుల సహదేవులు అతనిని అనుసరించారు. ద్రౌపదీ పుత్రులైన ఉపపాండవులు తమ తమ సైన్యములతో మోహరించారు. ప్రతి

వింధ్యుడు, శ్రుతసోముడు, శ్రుతకీర్తి, శతానీకుడు, శ్రుతసేనుడు, సౌభద్రుడు, తమ తమ సైన్యములతో రణభూమి ప్రవేశించారు.

పాంచాల రాజు ద్రుపదుడు తన ఏనుగుల సైన్యముతో వచ్చాడు. తన కుమారులు, తన అన్నదమ్ములతో యుద్ధానికి సిద్ధమైనాడు మత్స్యదేశాధిపతి విరాటుడు. యాదవ యోధులతో సాత్యకి, వీరప్రలాపములు చేస్తూ చేకితానుడు, వారి వెంట తన సైన్యముతో వీరుడు శిఖండి యుద్ధభూమిలో విహరిస్తున్నారు. మగధ దేశాధీశుడు సహదేవుడు సముద్రమును పోలిన తన సేనతో యుద్ధ రంగం ప్రవేశించాడు. తన పరాక్రమము వెల్లి విరియ, అధిక మైన భుజబలంతో ధృష్టకేతుడు, తన సహోదరునితో యుద్ధసన్నద్ధమై వచ్చాడు.

రాక్షస వీరుడు, భీముని కుమారుడు, అయిన ఘటోత్కచుడు తన రాక్షస సైన్యముతో యుద్ధభూమిలో ప్రవేశించాడు. అలాగే పాండ్య రాజు, కేకయ రాజులు ఐదుగురు, శైబ్యుడు, ఇంకా వివిద దేశాధీశులు తమ తమ సైన్యములతో పాండవుల పక్షాన యుద్ధ చేయడానికి సన్నద్ధమైనారు. ఈ ప్రకారము పాండవుల పక్షాన ఏడు అక్షౌహిణుల సైన్యం యుద్ధభూమిలో మోహరించింది. ఈసైన్యమును సర్వసైన్యాధ్యక్షుడైన ధృష్టద్యుమ్నుడు ముందుండి నడిపిస్తున్నాడు. ఆ ప్రకారము పాండవ సైన్యము శమంతపంచకము సమీపమునకు చేరుకున్నది.

పాండవాగ్రజుడు యుధిష్టరుడు, పాంచాల, మత్స్యదేశాధీశులు చుట్టు ఉండగా తూర్పు మొహం గా నిలబడి ఉన్నాడు. వారి ఎదురుగా భీష్మాదులున్న కౌరవ సేన నిలబడి ఉన్నది. యుధిష్ఠిరుడు తన సైన్యములోని వివిధ రాజ్యాధినేతలను చూచి,

"వీరాధివీరులారా! మనము ఈ యుద్ధమున గెలిస్తే ఈ భూమినంతయు కైవసం చేసుకుంటాము లేని ఎడల స్వర్గలోక సుఖములు అనుభవిస్తాము. మనము దేని కైనా సిద్ధముగా ఉండాలి. " అని వీరోచితంగా పలికాడు. ఆ మాటలు విని వివిధ దేశాధిపతులు జయజయధ్వానాలు చేసారు . తమ తమ శంఖములు పూరించారు." అని చెప్పాడు సంజయుడు.

అది విని దృతరాష్ట్రుడు "సంజయా! మన సైన్యములు ఎక్కువ. పాండవుల సైన్యలు స్వల్పము. కాని ఏ ధైర్యంతో వారు యుద్ధానికి దిగుతున్నారు." అని అడిగాడు. "రాజా! అది కూడా చెబుతాను విను." అని సంజయుడు చెప్పసాగాడు.

ధర్మరాజు అర్జునుని చూచి "అర్జునా! చూడు. కౌరవ సైన్యము చాలా బలంగా ఉంది. మన సైన్యము వారి ముందు చాలా స్వల్పముగా

ఉంది కదూ!" అని అంటున్న అన్నయ్య ధర్మజుని మొహంలోకి చూచి అర్జునుడు ఇలా అన్నాడు.

"అన్నయ్యా! పూర్వము ఒకసారి నారదుడు భీష్మ ద్రోణులు వింటూ ఉండగా నాకు ఇలా చెప్పాడు. అధర్మ వర్తనులకు ఎక్కువ సైన్యము ఉన్నప్పటికినీ, కొంచెం గా ఉన్న ధర్మతత్పరులైన వారి సేనలు వారిని గెలువగలవు.

అది అలా ఉన్నప్పటికినీ, అన్నయ్యా! అమానుష శక్తి గల భీముని గదా విహారము తట్టుకోడానికి ఎవరి కన్నా వీలవుతుందా! ధృష్టద్యుముని, శిఖండిని మొదలుగాగల పాంచాల భూపతులను గెలవ డానికి ఎవరి తరం అవుతుంది చెప్పు! ఇంకా విరాటుడు, మొదలగు మాత్స్య భూపతుల పరాక్రమము నీకు తెలియనిది కాదు కదా! ఇంకా మనవైపు సాత్యకి, చేకితానుడు మొదలగు యాదవ రాజులు ఉన్నారు. ఇంకా అవక్ర పరాక్రమ వంతుడు అభిమన్యుడు, మాయా విద్యా విశారదుడు ఘటోత్కచుడు ఉన్నారు కదా. వీటన్నిటిని మించి నీ ధర్మనిరతి, శ్రీకృష్ణుని సంరక్షణ మనకు ఉన్నాయి కదా! ఇంక నీ గాండీవము సంగతి నీకు తెలియనిది కాదు. అయినా అన్నయ్యా నీ శక్తి నీకు తెలియదు. నీవు దేవతలనే జయించగలవాడవు. నీకు కోపము వస్తే ఎవరు ఏమవుతారో

వాళ్లకే తెలియదు. కాబట్టి నీవు మన సైన్యమును గురించి కలత చెంద వలదు." అని అన్నాడు అర్జునుడు.

అది విని ధర్మనందనుడు "అర్జునా! నీ వచనములు నా మనసుకు ఎంతో ఆనందాన్ని కలిగించాయి. కౌరవులకు దీటుగా మనము కూడా ఒక వ్యూహము పన్న వలెనని ధృష్టద్యుమ్మునికి చెప్పు." అని అన్నాడు.

"అటులనే అన్న య్యా" అంటూ అర్జునుడు ధృష్టద్యుమ్ముని వద్దకు పోయి ధర్మజుని మనోగతము తెలిపాడు.

ధృష్టద్యుమ్నుడు ఒక వ్యూహము రూపొందించాడు. అభిమన్యుని, ఉపపాండవులను, నకుల సహదేవులను వెంటపెట్టుకొని భీమసేనుడు సేనకు అగ్రభాగంలో నిలిచాడు. చేకితానుడు, సాత్యకి, పాంచాల, మత్స్యాధి పతులు తమ తమ బలగములతో ఉత్తర, దక్షిణ భాగములో నిలిచారు. నడుమ గజారూఢుడై ధర్మరాజు నిలిచాడు. అందరి కన్నా ముందు అర్జునుడు వెంట ఉండి రక్షిస్తూ ఉండగా, శిఖండి భీష్ముని ఎదురుగా నిలిచాడు. వెనుక భాగమున మగధ రాజు సహదేవుడు, ధృష్ట కేతుడు మొదలగు వారి నిలిచారు. రధములు, ఏనుగులు, అశ్వములు,

కాల్బములతో కురు పాండవ సైన్యములు నేన ఈని నట్టు కనపడుతున్నాయి.

ఈ భూమి మీద ఉన్న , బాలురు వృద్ధులు తప్ప మిగిలిన మగవారందరూ ఆ యుద్ధంలో పాల్గొంటున్నారు. అందరూ విజయం తమదే అంటూ జయజయధ్వానాలు చేస్తున్నారు." అని అన్నాడు సంజయుడు.

ఇది విని ధృతరాష్ట్రుడు "సంజయా! పాండవ కౌరవ సైన్యములలో ఎవరి సైన్యం బలంగా ఉందంటావు." అని సందేహం వెలిబుచ్చాడు.

"దేవా! రెండు పక్కల ఉన్న వారలు ఎదుటి వారి కంటే తమ బలమే ఎక్కువని పలుకుతున్నారు. నీ కుమారుడు సుయోధనుడు కూడా తన బలమే ఎక్కువ అనుకుంటున్నాడు. కాని నాకూ చూడగా, శ్రీకృష్ణుని అండ ఉన్న పాండవుల బలమే ఎక్కువ అని పిస్తూ ఉంది.

తరువాత, కృష్ణార్జునులు తమ తమ శంఖములు, పాంచజన్య దేవదత్తములు, పూరించారు. ఆ శంఖ నాదములు విని పాండవ సైన్యములో ఉత్సాహం పెల్లుబికింది. కౌరవ సైన్యము గుండెల్లో గుబులు

పుట్టింది. తమ తమ సేనలకు ఉత్సాహం కలిగించడానికి కౌరవ సైన్యములో కూడా మంగళ తూర్యనాదములు మ్రోగాయి.

ఆ సమయమున ధర్మరాజు తన ఆయుధములను రథములో విడిచి పెట్టి, కవచము విడిచి, రథము దిగి, పాద చారియై, మౌనంగా, చేతులు కట్టుకొని, కౌరవ సేనలో ఉన్న భీష్ముని వంకకు పోతున్నాడు. అది చూచి పాండవులు, కృష్ణుడు, సాత్యకి, ఇంకా ధర్మజునికి ఆప్తులైన రాజులు కలవర పడ్డారు. వారు కూడా రథములు దిగి ధర్మజుని వెంబడించారు.

"మేమంతా ఉండగా నీవు కాలి నడకన వెళ్లడానికి కారణమేమి? యుద్ధమునకు అన్ని సిద్ధము చేసుకొని ఇప్పుడు ఇలా నడిచి వెళ్లడం భావ్యమా! శత్రువులు మనలను హేళన చేయరా! పిరికి వాడు అనుకోరా!" అని భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు తలకొక మాట అడుగుతున్నారు. కాని ధర్మజుడు మారు మాటాడక ముందుకు వెళుతున్నాడు.

అది చూచి కృష్ణుడు "ధర్మజుని తలంపు నాకు తెలియును. అతడు భీష్మ, ద్రోణ, కృప, శల్యులకు నమస్కరించి, వారల వద్దనుండి

యుద్ధము చేయుటకు అనుమతి కోసం వెళుతున్నాడు. పెద్దల అనుమతి తీసుకొని యుద్ధం చేస్తే విజయం తథ్యం అని పెద్దలు చెబుతారు కదా. కాబట్టి ఆ మంచి పని చెయ్యడానికి ధర్మజుడు వెళుతున్నాడు." అని పలికాడు కృష్ణుడు.

ఆ మాటలు విన్న వారు అలాగే నిలబడిపోయారు. ధర్మజుడు ఏమి చేస్తాడో అని చూస్తూ ఉన్నారు. కృష్ణార్జునులు, భీముడు, నకుల, సహదేవులు, ధర్మజుని వెంట వెంట వెళ్లారు. ధర్మజుడు భీష్ముని రథం వద్దకు వెళ్లాడు.

అది చూచి కౌరవ సేనలో ఉన్న ప్రముఖులు "ధర్మరాజు ఇప్పుడు ఇక్కడకు ఎందుకు వచ్చాడో! " అని తలలు ఎత్తి చూస్తున్నారు. ఇంక కొంతమంది, "ధర్మజుని వెంట భీమార్జునులు, నకుల సహదేవులు, అభిమన్యుడు, సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి తమ పక్షాన ఉండగా ఇంకా ధర్మజునికి భయం ఎందుకు." అని అనుకున్నారు.

ఇంకొంతమంది "అయినా ధర్మరాజు పిరికి వాడు కాదు కదా! ఈ సయమంలో ఇక్కడు ఎందుకువచ్చాడో! " అని ఆశ్చర్య పోతున్నారు. ఈ ప్రకారము తలకొక విధంగా తర్కించుకుంటున్నారు.

"కౌరవ సేనలో ఉన్న వారు మానధనుడైన ధర్మనందనుడు భీష్మునితో ఏమి మాట్లాడతాడు? భీష్ముడు ధర్మజుని ఏ విధంగా సన్మానిస్తాడు? కృష్ణార్జునులు ఏమంటారో? భీముడు, నకుల సహదేవులు ఏ విధంగా మాట్లాడతారో? అసలు వీళ్లందరూ ఈ సమయంలో ఇలా రావడం ఏమిటి? " అని వారిలో వారే మాట్లాడుకుంటున్నారు.

ధర్మరాజు మౌనంగా భీష్ముని వద్దకు వెళ్లాడు. నమస్కారం చేసాడు. "మహానుభావా! నీకు ఎదురు నిలిచి యుద్ధం చేసే దుస్థితి దాపురించి నందులకు చింతిస్తున్నాను. ముందుగా మిమ్ములను కలిసి మీ అనుజ్ఞ తీసుకోడానికి వచ్చాను. యుద్ధము చేయుటకు నాకు అనుజ్ఞ ఇవ్వండి. మీ దీవెనలు తీసుకొని వెళితే నేను శత్రువులను గెలువగలను." అని అన్నాడు ధర్మరాజు.

"ధర్మజా! ఈ సమయంలో నీ రాక అత్యంత సముచితము, శ్రేయస్కరముగా నున్నది. నీవు కనుక ఇలా రాక పోయినట్టయితే నీకు శాపం ఇచ్చి ఉండేవాడిని. నీవు వచ్చావు. నీకు మేలు కలుగుతుంది. నీవు శత్రువులను గెలుస్తావు. నీకు కావలసిన ఒక వరం కోరుకో, నీపక్షాన యుద్ధం చెయ్యడం తప్ప!" అని అన్నాడు.

"పితామహా! మీరు రారాజు పక్షాన మాత్రమే యుద్ధం చెయ్యండి కాని నాకు మాత్రం హితము చేయండి. " అని అన్నాడు.

"దర్మజా! నీ మనసులో ఏముందో చెప్పు? " అని అడిగాడు భీష్ముడు.

"పితామహా! ఏమియు లేదు--మీతో యుద్ధం చేసి గెలిచే ఉపాయం చెప్పండి! " అని అడిగాడు.

భీష్ముడు చిరునవ్వు నవ్వాడు."ధర్మజా! యుద్ధములో నన్ను ఎదిరించి గెలవడం ఈ దేవతలకు కూడా సాధ్యంకాదు." అని అన్నాడు.

అందుకే కదా మిమ్ములను ప్రార్థించడం అన్నాడు ధర్మజుడు.

"నా చేతిలో ఆయుధము కిందపడిన గాని నన్ను వధించడం ఎవరికీ సాధ్యంకాదు. ఇప్పటికి ఇంతే చెప్పగలను. ఇంతకన్నా వివరంగా చెప్పడానికి ఇది తరుణం కాదు. ఈ సారి నన్ను కలిసినప్పుడు నీ మనోరథం నెరవేరుస్తాను." అని అన్నాడు భీష్ముడు.

"అయితే మరల మిమ్ములను మరలా కలుస్తాను. అనుజ్ఞ ఇవ్వండి. " అని భీష్మునికి నమస్కరించి ఆయన అనుమతి పొంది, భీష్ముని వద్దనుండి బయలు దేరాడు.

కృష్ణార్జునులతో సహా ధర్మరాజు, ద్రోణుడు, కృపాచార్యుడు, శల్యుల వద్దకు క్రమముగా వెళ్లాడు. వారి పాదములకు నమస్కారము చేసాడు. ఒక్కొక్కరి వద్ద నుండి యుద్ధము చేయుటకు అనుమతి తీసుకున్నాడు. తనకు జయము కలుగవలెనని ఆశీర్వదించమని ప్రార్థించాడు.

"ధర్మజా! నీకు తోడుగా కృష్ణుడు ఉండగా మరొకరిని జయం కలుగవలెనని ఆశీర్వదించమనడం ధర్మము కాదు. ఏ పక్షాన కృష్ణుడు ఉంటాడో ఆ పక్షానికి జయం కలుగుతుంది. ఇది సత్యం." అని అన్నాడు ద్రోణుడు.

అప్పుడు ధర్మజుడు అతనిని వధించు ఉపాయం చెప్పమన్నాడు.

“ ధర్మజా! నా చేతిలో ఆయుధము ఉన్నంతవరకు నన్ను గెలవడం ఎవరికీ సాధ్యంకాదు. కాని నేను ప్రాయోపవేశము చేసి, నా శస్త్రాస్త్రములను విడిచి పెట్టినప్పుడు, నన్ను చంపవచ్చును. బాగా నమ్మదగ్గవాడు నాకు అత్యంత దుస్సహమైన అశుభ వార్త చెప్పినపుడు మాత్రమే నేను అస్త్రసన్యాసం చేస్తాను. ఈ సమయంలో శత్రువులు నన్ను చంపగలరు.” అని పలికాడు ద్రోణుడు.

ధర్మజుడు కృపాచార్యుని కూడా అతనిని వధించు ఉపాయము అడిగాడు. “ధర్మజా! నేను ఎవరి చేతులోనూ చంపబడను. కాని నీకు జయం కలుగుతుంది.” అని పలికాడు. కృపాచార్యుడు ధర్మజుని విజయునిగా దీవించాడు.

(మహాభారతయుద్ధములో చావ కుండా బతికి బయట పడ్డవాళ్లు కృపాచార్యుడు, కృతవర్మ, అశ్వత్థామ మాత్రమే. వీళ్లనే రధిక త్రయము అన్నారు.).

ధర్మజుడు మద్రపతి శల్యుని వద్దకు పోయి తమరు కర్ణునికి సారధి అగుట సంభవించినపుడు అతనిని శూలముల వంటి మాటలతో చికాకు పరచ వలెనని తనకు శల్యుడు ఇదివరకు ఇచ్చిన మాటను గుర్తుచేసాడు.

" ధర్మజా! నాకు ఆ మాట గుర్తు ఉన్నది. ఆ ప్రకారమే చేస్తాను. నిశ్చింతగా ఉండు." అని పలికాడు.

ధర్మరాజు ఈ ప్రకారము అందరి వద్ద ఆ శీర్వాదము తీసుకుంటూ ఉండగా శ్రీకృష్ణుడు, యుద్ధము ఎలా జరుగుతున్నదో అని వినోదంగా చూడటానికి వచ్చిన కర్ణుని వద్దకు పోయి "కర్ణా! నీవు భీష్ముని మీది కోపంతో యుద్ధం చెయ్యనని అలిగావు అని విన్నాను. మరి భీష్ముడు చనిపోయే దాకా పాండవుల పక్షాన వినోదంగా యుద్ధం చెయ్యరాదా! " అని అడిగాడు.

"కృష్ణా! నేను భీష్ముని మీద కోపంతో యుద్ధం నుండి వైదొలిగాను. కాని నేను సుయోధనునికి ఇచ్చిన మాట తప్పను. అది నీకు తెలుసు కదా! " అని అన్నాడు కర్ణుడు. ఆమాటలు విన్న కృష్ణుడు నవ్వుతూ పాండవుల వెంట వెళ్లాడు.

ధర్మరాజు కొంచెం దూరం పోయి కౌరవ సైన్యము ఎదురుగా నిలిచి "ఓ కౌరవ సైన్య ప్రముఖులారా! మీలో ఎవరైనా నా మీద అభిమానంతో నా పక్షాన రాదలచు కొన్న రావచ్చును. వారిని నా తమ్ముల వలె ఆదరిస్తాను అని పలికాడు.

ఆ మాటలు విని నీ కుమారుడు యుయుత్సుడు (సుయోధనుని తమ్ముడు) "నేను వస్తాను నన్ను మీలో కలుపుకోండి. " అని పెద్దగా అరిచాడు. ధర్మరాజు సంతోషించి రమ్మన్నాడు. యుయుత్సుడు సుయోధనుని దుర్మార్గములను ఖండించుచూ, పాండవులను పొగుడుతూ, తన సేనలతో సహా పాండవ పక్షం చేరాడు. ధర్మజుడు యుయుత్సుని తన పక్షమునకు సాదరంగా ఆహ్వానించాడు.

తరువాత ధర్మజుడు తన రధం వద్దకు వచ్చాడు. రధాన్ని అధిరోహించాడు. కవచము తొడుక్కున్నాడు. ధనుర్బాణములను ధరించాడు. అది చూచి తక్కిన యోధులు అందరూ తమ తమ రధములను అధిష్టించారు. ధృష్టద్యుమ్నుడు పన్నిన వ్యూహం ప్రకారము నిలిచారు." అని చెప్పిన సంజయుని చూచి ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

(పాఠకులకు ఒక్క మనవి: ఇక్కడి నుండి భగవద్గీత ప్రారంభం అవు తుంది. భగవద్గీత విషయంలో కొంత మందికి కొన్ని అపోహలు ఉన్నాయి.

(1) భగవద్గీత మహాభారతంలో అంతర్భాగమా లేక వ్యాసుడు విడిగా రాసాడా?

మనకు నాలుగు వేదాలు ఉన్నాయి. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము.( కొంతమంది మూడు వేదములు అని కూడా అంటారు.) ఈ వేదములలో చెప్పబడిన రాజుల కథలు, దేవతల కథలు, యజ్ఞయాగాది క్రతువులు, రాజనీతి విషయాలు, నీతి విషయాలు, యుద్ధరీతులు, అనుసరించవలసిన వ్యూహములు, ఇత్యాది విషయములు అన్ని మహాభారతములో మనకు కనపడతాయి.

వేదాంగములు అయిన ఉపనిషత్తులలో ఉన్న విషయములు అన్నియు, క్రోడీకరించి, సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో భగవద్గీతరూపంలో 18 అధ్యాయములలో పొందుపరిచాడు వ్యాసభగవానుడు. అందుకే మహా భారతమును పంచమ వేదము అన్నారు. మహాభారతము 18 పర్వములయితే, భగవద్గీత 18

అధ్యాయాలు. యుద్ధముకూడా 18 రోజులు జరిగింది. ఒకటికి ఒకటి అనుసంధానమయి ఉన్నాయి. కాబట్టి భగవద్గీత మహాభారతములో అంతర్భాగము అన్న విషయంలో ఏ మాత్రం సందేహం లేదు.

2. ఇరుపక్షముల సైన్యములు మోహరించి యుద్ధము చెయ్యడానికి కదను తొక్కుతుంటే, ఇరుసైన్యముల మధ్య నిలబడి, కృష్ణుడు తీరుబడిగా, 700 శ్లోకములు అర్జునుడికి చెప్పాడా!

ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఏమిటంటే వ్యాసుడు సందర్భము వచ్చినప్పుడల్లా నీతి శాస్త్రము ఏదో ఒక పాత్ర చేత మనకు బోధించాడు. నారదుడు ధర్మరాజుకు రాజనీతి బోధించాడు. విదురుడు ధృతరాష్ట్రునకు నీతిసూత్రాలు బోధించాడు. ద్రౌపది సత్యభామకు పతివ్రతా లక్షణాలు వివరించింది. మనం చదువుకున్నాము. భగవద్గీతలో ఉపనిషత్సారము పూర్తిగా అందించాడు. కాబట్టి దానిని మనం చదివి అధ్యయనం చేసి ఆచరించవలె కాని, ఎక్కడ చెప్పాడు, ఎప్పుడు చెప్పాడు, ఎలాచెప్పాడు, అది సాధ్యమా? ఇదిసాధ్యమా? అని కుశంకలతో పొద్దుపుచ్చకూడదు. కనీసం భగవద్గీతలో ఒక్క శ్లోకం అన్నా చదివి, అర్థంచేసుకొని ఆచరించడానికి ప్రయత్నం చేస్తే మనజన్మలు సార్థకం

అవుతాయి కాని ఇలా సందేహాలు లేవ నెత్తుతుంటే నిత్యశంకితులుగానే మిగిలిపోతాము.

ఇంకా కొంతమందికి మరొక సందేహం వచ్చింది. భగవద్గీతలో చెప్పిందే చెప్పారండీ. శ్రీ కృష్ణుడు ఇలా చెప్పిందే చెప్పి సుత్తి కొడతాడా! వ్యాసుడు అలా రాస్తాడా! అందుకని ఇప్పుడు మనం చదివే భగవద్గీత అంతా వ్యాసుడు రాయలేదు. కాలక్రమేణా ఎన్నో శ్లోకములు ప్రక్షిప్తములు (అనగా తరువాత ఇతరుల చేత చేర్చబడినవి అని అర్థము) అయినాయి అని కొంతమంది వాదన. ఆ వాదనకు అనుకూలంగా వారు అలాంటి ప్రక్షిప్తములను తొలగించి, ఒక సంక్షిప్త గీతను ప్రచురించారు కూడా.

ఈ వాదోపవాదాలలో నిజం ఉన్నా లేకపోయినా, ఒక్కటి మాత్రం నిజం. మనం సర్వజ్ఞులము కాము. మన మేధస్సు పరిమితం అయినది. ఒకసారి చెబితే అర్థం కాదు. పదే పదే చెప్పాలి. చెప్పవలసిన విషయం అతి క్లిష్టమయినది. కాబట్టి ఒక విషయం పలుమారు చెప్పినందువలన తప్పులేదు కదా!

భగవద్గీత మొదటి అధ్యాయంలో భగవద్గీత ఏ సందర్భంలో ఎవరికి ఎందుకు చెప్పవలసి వచ్చింది అన్న విషయం వివరించారు. రెండవ

అధ్యాయములో, తరువాత చెప్పబోవు విషయములు అన్నియు ఒక విషయసూచికలో మాదిరి వివరించారు. మూడవ అధ్యాయము నుండి కర్మయోగముతో మొదలెట్టి ఉపనిషత్తులతో ఉన్న విషయములు అన్ని వివరంగా చెప్పారు. మధ్యలో మనకు పూర్తిగా అర్థం అయ్యేవిధంగా విజువల్సు కూడా చూపించారు (విశ్వరూప సందర్శనం). తరువాత ఈ విద్య ఎంత గుహ్యమైనదో వివరించారు. అర్జునుడు లేవనెత్తిన సందేహములు అన్ని ఓపికగా తీర్చారు. ఆఖరు అధ్యాయంలో అప్పటిదాకా చెప్పిన విషయములు అన్ని ఒక్కసారి సింహావలోకనం చేసారు. ఆఖరున ఫలశ్రుతి గా శ్రీకృష్ణుడు, అర్జునుడు ఎక్కడ ఉంటారో అక్కడ సర్వసంపదలు, సకల ఐశ్వర్యములు సుస్థిరమైన నీతి సమృద్ధిగా ఉంటాయి అని ముగించారు.

కాబట్టి ఇలాంటి సందేహములు సరికావు.

ఇంకా కొంతమంది దేహధారులకు మరొక విచిత్రమైన సందేహం కలుగుతూ ఉంది. భగవద్గీత ఒక మతగ్రంథం అని అది హిందువులకు మాత్రం పరిమితం అయినది అని.

భగవద్గీత చెప్పబడిన కాలం ద్వాపర యుగం. అప్పుడు మతాలు లేవు. ఆ రోజుల్లో రాజ్యం కోసం, కొట్లాడుకున్నారేకాని, మతం కోసం కొట్లాడుకోలేదు. భగవద్గీతలో హిందూమతం అనే పదం ఎక్కడా మనకు వినపడదు. కాబట్టి ఇది ఒక సంకుచితమైన అభిప్రాయం. భగవద్గీత ఒక యూనివర్సల్ కోడ్ ఆఫ్ కాండక్ట్. ఈ ప్రపంచంలో అందరూ అనుసరించ తగ్గది. ఈ లోకంలో ప్రతి మనిషి మాతృగర్భం నుండి భూగర్భం దాకా చేసే సుదీర్ఘమైన ప్రయాణంలో అనుదినము ఎలా ప్రవర్తించాలో వివరంచి చెప్పిన గ్రంధం భగవద్గీత. నేటి విద్యార్థులలో, యువకులలో, యువతులలో తలెత్తుతున్న నిరాశా వాదాన్ని పారద్రోలి, వారిని కార్యోన్ముఖులును చేసే చక్కని ఔషధము భగవద్గీత. ఈ గీతలో ప్రతి శ్లోకము ఆణిముత్యమే. ప్రతి పదమూ అనుసరణీయమే. భగవద్గీతలోని ఏ ఒక్క శ్లోకమును చదివి, అర్థం చేసుకొని, త్రికరణశుద్ధిగా ఆచరిస్తే వారి జీవితం శోభాయమానం అవుతుంది అనడంలో అతిశయోక్తి లేదు.

తిక్కన గారు భగవద్గీతను క్లుప్తంగా వివరించారు. అది ఇక్కడినుండి మొదలవుతుంది.)

# భగవద్గీత

ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా అంటున్నాడు.

"సంజయా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమున యుద్ధము చెయ్యడానికి సిద్ధమైన మన బలములు, పాండవ బలములు ఏమి చేయుచున్నారో చెప్పు" అని అ డిగాడు

దానికి సంజయుడు ఇలా చెప్పాడు. "మహారాజా! దుర్యోధనుడు పాండవులు పన్నిన యుద్ధ వ్యూహమును చూచాడు. ఆచార్యుడైన ద్రోణుని వద్దకు పోయి ఇలా అంటున్నాడు.

"ఆచార్యా! చూడండి! నీకు శిష్యుడు, ద్రుపద పుత్రుడు అయిన దృష్టద్యుమ్నుడు పన్నిన వ్యూహం చూడండి. పాండవుల సేన బలంగా ఉన్నది. అందులో భీమార్జునులను పోలిన వీరులు సాత్యకి, ద్రుపదుడు, ధృష్టకేతుడు, చేకితానుడు, కాశిరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ద్రౌపది పుత్రులు, మొదలగు వారందరూ యుద్ధసన్నద్ధులై ఉన్నారు. భీముని చే రక్షింపబడుతున్న పరిమితమైన పాండవ సేనను చూడండి.

ఇంక మన సేనలో, మీరు, భీష్ముడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, శల్యుడు,వికర్ణుడు, భూరిశ్రవుడు, ఇంకా పెక్కుమంది రధికులు, నానా అస్త్ర శస్త్ర కోవిదులు, వివిధ యుద్ధరీతులలో విశారదులు ఉన్నారు. వీరందరూ నా కోసం తమ తమ ప్రాణములు విడుచుటకు సిద్ధంగా ఉన్నారు. భీష్మాభి రక్షితమైన మన సేన అపరిమితము. మీరందరూ మన సేనానాయకుడు భీష్మునికి రక్షణగా నిలవండి." అని అన్నాడు సుయోధనుడు.

ఈ మాటలు విన్న భీష్ముడు సుయోధనునికి ప్రియం కలిగేటట్టు సింహనాదం చేసాడు. తన శంఖము పూరించాడు. మిగిలిన వారు కూడా తమతమ శంఖములు పూరించారు. వివిధములైన తూర్యనాదములు దిక్కులు పిక్కటిల్లేటట్టు మోగాయి.

అప్పుడు కృష్ణుడు పాంచజన్యమును, అర్జునుడు దేవదత్తమును, భీమసేనుడు పౌండ్రమును, యుధిష్ఠిరుడు అనంత విజయమును, నకులసహదేవులు, సుఘోష, మణి పుష్పకములును, పాంచాల, విరాట, సాత్యకి, ధృష్టద్యుమ్నులు, శిఖండి, ఇతర ప్రముఖ దండనాయకులు తమ తమ శంఖములు పూరించారు. ఈ శంఖ నాదములకు కౌరవుల

హృదయములు పగిలిపోయినవి. పాండవులు, వారి పుత్రులు, ఇతర యోధుల మనసులు ఆనందంతో పరవళ్లు తొక్కాయి.

యుద్ధమునకు సమయమయినది. అర్జునుడు గాండీవము చేతిలోకి తీసుకున్నాడు. నారిని సారించాడు. కౌరవుల పక్షాన ఉన్న వీరులను తేరిపార చూచాడు. కృష్ణుని చూచి ఇలా అన్నాడు.

"కృష్ణా! ఇప్పుడు నేను కౌరవులలో ఎవరెవరితో యుద్ధం చేయాలో చూడాలి కదా. కాబట్టి మన రథమును ఉభయ సైన్యములకు మధ్యలో నిలుపుము." అని అన్నాడు.

అప్పుడు కృష్ణుడు భీష్మ, ద్రోణ, ప్రముఖ యోధులు చూచుచుండగా తన రథమును అర్జునుడు చెప్పినట్టు నిలిపాడు.

"అర్జునా! ఇప్పుడు కౌరవులలో ఉన్న ప్రముఖ వీరులను చూడుము." అని అన్నాడు

అప్పుడు పార్థుడు తన బలములలోనూ, కౌరవ బలములలోనూ ఉన్న సోదరులను, సుతులను, మేనమామలను, గురువులను, బంధువులను, పెద్దలను చూచి విషాదంతో కుంగిపోయాడు.

కృష్ణుని చూచి "కృష్ణా! దుర్మదాంధుడైన సుయోధనుని వలన గదా ఈ యుద్ధము దాపురించినది. ఈ యుద్ధ భూమి లో ఇరుపక్షముల లోని బంధువులను మిత్రులను చూచి నా మనసు వికలమైనది. కంపరముగానున్నది. గాండీవము చేతిలో నిలువడం లేదు. కాళ్లు తేలిపోవుచున్నవి. ఈ యుద్ధము నేను చేయజాలను.

ఎవ్వరి కోసం అయితే ఈ భూమిని జయించాలని యుద్ధం చేస్తున్నామో, ఎవ్వరి సుఖం కోరి ఈ యుద్ధమునకు పాల్పడ్డామో, వారందరూ తమ తమ ధన, మాన, ప్రాణములు పణంగా పెట్టి యుద్ధ ము చేస్తున్నారు. చావడానికి సిద్ధంగా ఉన్నారు. తాతలను, మామలను, సుతులను, తండ్రులను, తమ్ములను, అన్నలను, గురువులను, శిష్యులను, మిత్రులను, వధియించి నేను సాధించే ఈ నెత్తుటి తో తడిసిన రాజ్యభోగములు నాకు ప్రీతిని కలిగిస్తాయా! నాకు కీర్తి దశదిశలా వ్యాపిస్తుందా! నాకు శ్రేయస్సు కలుగుతుందా! అక్కడ ఉన్న బంధువులను మనం చంపుతున్నాము. వారి చేతిలో మన బంధువులు చస్తున్నారు.

ఇంక మిగిలిందేమిటి! కాబట్టి ఈ పాపముతో కూడిన యుద్ధమునకు నేను అంగీకరించను.

ఈ పదునాలుగు భువనములు ఏలడానికైనా సరే ఇలాంటి యుద్ధము ఎలా చెయ్యగలను? కృష్ణా! వాళ్లు యుద్ధం చేస్తే చెయ్యనీ. నాకు మాత్రం వారితో యుద్ధం చెయ్యడానికి మనసు రావడం లేదు. ఆ తరవాత వచ్చే కీడును, దుష్పరిణామాలను, తలంచ కుండా, అత్యంత లోభంతో, ధృతరాష్ట్రుని పుత్రులు కుల క్షయానికి పాల్పడు తున్నారు. యుద్ధం చేస్తున్నారు. ఈ విషయం నీకు తెలుసు నాకు తెలుసు. తెలిసి కూడా వీరిని మనం నిర్దయగా చంపడం వలన మనకు ఏమి ఒరుగుతుంది చెప్పు.

కృష్ణా! కులనాశము అయితే కులధర్మములు అంతరించిపోతాయి. దాని వలన వర్ణ సంకరము కలుగుతుంది. ఈ కులనాశకులు నరకానికి పోతారు. ఇంతపాపం మనం మూటకట్టుకోడం ఎందుకు చెప్పు! రాజ్యలోభంతో సమస్త బంధుజనులను నేను చంపలేను. చంపను. అని రథం మీద కూర్చున్నాడు అర్జునుడు.

ఆ ప్రకారంగా శోకసంవిగ్న మానసుడు, విషాదంతో విహ్వాలుడు అయిన అర్జునుని చూచి కృష్ణుడు ఇలా అన్నాడు.

"ఈ యుద్ధ సమయంలో నీకు ఈ విధమైన మోహము, విరుద్ధ భావము ఎలా కలిగింది అర్జునా! నీకు ఇలాంటి పిరికి తనము తగునా! ఇది వివేక హీనులు అనుసరించ దగినది కానీ నీ వంటి వీరుడకు తగదు. వీరుడవై లెమ్ము. మనసులో ఉన్న పిరికి తనము పారద్రోలుము. యుద్ధమునకు సన్నద్ధుడవు కమ్ము" అనిన కృష్ణుని మాటలు విని అర్జునుడు ఇలా అన్నాడు.

"కృష్ణా! భీష్మద్రోణులు పూజార్హులు. వారిని బాణములతో బాధించడం ధర్మమా! మాన్యులను చంపడం మగతనం అనిపించుకుంటుందా! దీనికన్నా భిక్షము ఎత్తుకొని జీవించడం అత్యంత సుఖప్రదము కాదా! నాకు ఎదురుగా నిలిచినది, నేను చంపబోవునది ధృతరాష్ట్రుని తనయులు కారా! కృష్ణా! ఈ శోకము నా ఇంద్రియములను నిలువునా దహించుచున్నది. నాకు ఇంద్రపదవి ఇచ్చినను నా ఈ శోకాగ్ని చల్లారదు. కాబట్టి నేను ఈయుద్ధము చేయలేను. నేను నా గురువులను, బంధుజనులను యుద్ధములో నొప్పించలేను.

ఈయుద్ధములో మనము గెలిచినా, వారు గెలిచినా ఈ రెంటికి పెద్ద వ్యత్యాసము ఉండదు. నేను కార్పణ్యదోషాపహత స్వభావుడను. ధర్మమూఢచేతస్కుడను. ధర్మాధర్మ విచక్షణ చేయలేకున్నాను. అందులకే నిన్ను శరణుజొచ్చినాను. నీ శిష్యుని మాదిరి నన్ను మన్నింపుము. నన్ను శాసింపుము. నాకు తరుణోపాయము ఉపదేశింపుము." అని ప్రార్థించాడు అర్జునుడు.

ఆ మాటలు విన్న కృష్ణుడు చిరునవ్వునవ్వి ఇలా అన్నాడు

"అర్జునా! శోకించుటకు తగని వారి కొరకు నీవు హృదయ విదార కంగా శోకించుచున్నావు. పైగా బాగా అన్నియు తెలిసిన పండితుని వలె మాట్లాడు తున్నావు. ఎక్కడైె నాపండితులు ఉన్న వారిని గురించి గాని, చనిపోయిన వారిని గురించి గాని ఆలోచించెదరా! నీవు అవివేకంతో ఆరాట పడుతున్నావు. నీమనస్సు వివేక వంతమయిన ఎడల, ఇటువంటి శోకములన్నియు పటాపంచలైపోతాయి.

పార్థా! పరమ జ్ఞానమునకు కారణములైన వాక్యములు చెపుతాను విను. మనము ఈ దేహమున బాల్యము, యౌవనము, వార్థక్యము మొదలగు అవస్థలు పొందినట్టుగానే, మనము పాత వస్త్రములు విడిచి కొత్త వస్త్రములు ధరించినట్టుగానే, ఈ దేహము విడిచి మరొక

దేహమును ధరిస్తూ ఉంటాము. దానివలన ఆత్మహాని జరగదు. ఈ పుట్టుక, చావు ఈ దేహానికి మాత్రమే కాని ఆత్మకు కావు. మన శరీరము కత్తులతో గాని ఆయుధములతో గాని ఖండింపబడినట్లు, ఆత్మ ఖండింపబడదు. మనలో ఉన్న పురుషుడు నొప్పించే వాడు కాదు. నొప్పింపబడే వాడు కాదు. ఆత్మ కు అభావము (లేకుండా పోవడం)అనేది ఉండదు. అలాగే ఈ శరీరము శాశ్వతము కాదు. ఆత్మ స్వభావము ఈ ప్రకారం గా ఉండటం వలన నీవు ఎవ్వరి గురించి శోకింప అవసరము లేదు.

మనలో ఉన్న ఆత్మ నాశనము అవుతుందని, మరొకరు ఆత్మను నాశనం చేస్తారని చెప్పేవారు అవివేకులు. మనలో ఉన్న పురుషుడు ఎవ్వరిని చెడుపడు. తాను చెడడు. ఆత్మ నాశనము లేనిది. ఎవరూ దానిని నాశనము చేయలేరు. పురుషుడు అని వేరే ఎవరూ లేరు. నేనే ఆ పురుషుడను. పురుషోత్తముడను. ఈ ఆత్మ బాధపడునది కాని, బాధింపబడునది కాని కాదు." అని అర్జునునికి ఆత్మ తత్త్వమును వివరించాడు శ్రీకృష్ణుడు.

"మనలో కలిగే సుఖదుఃఖములకు మూలము అహంకారము. నీవు అహంకారమును వదలి నీ స్వకర్మమును ఆచరింపుము.

నీ స్వకర్మము యుద్ధము. కాబట్టి రణోత్సాహముతో యుద్ధము చేయుము." అని బోధించాడు.

"అర్జునా! యుద్ధము క్షత్రియులకు ఉత్తమ ధర్మము. యుద్ధము తెరిచియున్న స్వర్గద్వారము వంటిది. కాబట్టి లెమ్ము. యుద్ధము చేయుము. దీనికి ఇంక అనుమాన పడవలసిన పనిలేదు."

"అర్జునా! కర్మఫలములను బ్రహ్మార్పణము చేసి నీవు కర్మము చేయవలయును. ఈ తత్వజ్ఞానము కలిగిన ఎడల కర్మల ఎడల ఆసక్తి దానంతట అదే నశించును." అని శ్రీకృష్ణుడు కర్మయోగము గురించి అనేక వాక్యములు చెప్పాడు.

విజయుడు అడిగిన అనేక ప్రశ్నలకు తగు రీతిలో సమాధానాలు ఇచ్చాడు.

అది వినిన అర్జునుడు శ్రీకృష్ణునితో "కృష్ణా! అతి గుహ్యమైన ఈ శాస్త్రమును నా మీద కృపతో, అనుగ్రహంతో, దయతో నాకు ఉపదేశించితివి. అది విని నాలో ఉన్న భ్రమలు అన్నియు తొలగిపోయినవి. యోగుల హృదయములకు మాత్రమే సాధ్యమైన నీ అతులిత, ఐశ్వర్య, విభూతులతో ఒప్పు నీ రూపమును కనులారా గాంచవలెనని కోరికగా

ఉన్నది. నీ దివ్యరూపమును నేను చూచు భాగ్యమును నాకు కలిగించి నా కనులకు ప్రీతి గావించు." అని ప్రార్థించాడు అర్జునుడు.

అప్పుడు శ్రీకృష్ణుడు "నానా వర్ణములు, నానావిధములైన ఆకృతులు గలిగి, ఇదివరకు ఎన్నడు కని విని ఎరుగని, అపూర్వమైన, ఆశ్చర్యకరమైన రూపములతో కూడిన నా దివ్య రూపమును చూపెదను చూడుము. నా ఈ రూపము చూచుటకు మానుష నేత్రములకు అలవి కాదు. కాబట్టి నా దివ్య రూపమును చూచుటకు వలయు దివ్యదృష్టిని ఇచ్చుచున్నాను." అని అర్జునునికి దివ్యదృష్టి ప్రసాదించాడు.

యోగీశ్వరేశ్వరుడైన ఆ లక్ష్మీపతి, తన దివ్యరూపమును అర్జునునికి చూపించాడు. ఆ విశ్వరూపుని దివ్య తేజము, వేయిసూర్యుల కాంతితో సమానమై అలరారింది. ఆ మహా మూర్తిని చూచి అర్జునుడు విస్మయంతో పులకించిపోయాడు. అనేక దండప్రణామములు ఆచరించాడు. చేతులు జోడించి ఇలా ప్రార్థించాడు.

"దేవా! నీ దివ్య దేహము నందు దేవతలు, రాక్షసులు, గంధర్వులు మొదలగు దేవయోనులు, బ్రహ్మ దేవుడు, ఈ చరాచరమైన సమస్త జగత్తు, నాకు కనపడుతున్నది. నీ ముఖములు, నీ బాహువులు, నీ

పాదములు, నీ కన్నులు, అనేకములు కనపడుచున్నవి. అనేక కిరీటములు, అనేక భూషణములు, చక్రము, గద మొదలగు ఆయుధములు కలిగి అనేక రూపములలో కన్పట్టుచున్నావు. ఇది చాలా ఆశ్చర్యముగా నున్నది. మొదలు ఏదో, మధ్య భాగము ఏదో, తుది ఏదో తెలియకున్నది. నీ తేజము అప్రమేయమై, దేదీప్యమానమై వెలుగొందుచున్నది. అద్భుతమైన నీ విరాట్ రూపము దుర్నిరీక్షమై యున్నది. ఈ సమస్త జగములకు మూలకారణము పరమ పురుషుడ వగు నీవే అని చూస్తున్నాను. భూమి, ఆకాశము, అంతయు నీవే నిండి యున్నావు. నీవు లేని ప్రదేశము లేదు. సూర్య చంద్రులు నీ కన్నులు గా, పెద్ద పెద్ద కోరలు కలిగిన నీ ముఖములు ప్రజ్వరిల్లుచున్నవి. నీలో రుద్రులు, ఆదిత్యులు, మరుత్తులు, వసువులు ప్రవేశిస్తున్నారు. గుంపులు గుంపులుగా మహా మునులు వచ్చి నిన్ను ప్రస్తుతిస్తున్నారు. సిద్ధ, సాధ్య, గంధర్వులు నిన్ను ఆశ్చర్యంతో చూస్తున్నారు. ఇటువంటి నీ ఉగ్రరూపమును చూచి నాకు విభ్రాంతి కలుగుచున్నది. నా ధైర్యము సడలిపోయినది. అశాంతి తో ఉన్నాను. నీవు ప్రసన్నుడవై నన్ను రక్షింపుము. భయంకరమైన నీ ముఖములలో నుండి అగ్నిజ్వాలలు వెలువడుచున్నవి. ఆ అగ్నిజ్వాలలోకి ధృతరాష్ట్ర సంతతి అంతయూ, భీష్మాదులు, ఈసమస్త రాజలోకము, ఒక్కమారుగా వచ్చి నీలో ప్రవేశిస్తున్నారు. ఓ మహానుభావా! నా యందు కరుణాయక చిత్తుడవై

నీవు ఎవరవో తెలిపి నన్ను కృతార్థుడిని చేయుము." అని వేడుకున్నాడు అర్జునుడు.

"అర్జునా! నేనే పరమేశ్వరుడను. లోక క్షయ కర్తయగు కాలుడను. ఇచ్చట ఈ జనమును నాశనము చేయుటకు ప్రవృత్తుండనైనాను. ఇక్కడ నీవు చంపవలసినది ఏదీ లేదు. గురువు, భీష్ముడు మొదలగు వారు నా చేత ఎప్పుడో చంపబడ్డారు. నా చేతిలో చంపబడిన వారిని అందరిని నీవు జయించుట, చంపుట నిమిత్తమాత్రము. కావున లెమ్ము. యుద్ధము చేసి రాజ్యము కైవసము చేసుకొనుము." అని పలికాడు పరమాత్మ.

ఆ మాటలు వినిన గాండీవి గడగడ వణుకుచూ "నీవు వాయు దేవుడవు వరుణుడవు, సూర్యుడవు, చంద్రుడవు, అగ్నివి. వివిధ తత్త్వములు నీవే. విశ్వలోక సంప్రవర్తన కరుడవు నీవే. నీవు శాశ్వతుడవు. అచ్యుతుడవు. పుండరీకాక్షుడవు. నీ మహిమ ఎరుంగక, నీవు యాదవుడవని, నా సఖుడవని, నా మేనబావ యని నీతో సల్లాపములు ఆడాను. నీతో సహభోజనము చేయుచు నిన్ను మేలమాడాను. ఇంకా ఎన్నో లోక సామాన్యమైన పనులు, అపరాధములు, నీ పట్ల ఆచరించాను. నన్ను క్షమింపుము. తల్లితండ్రులు తమ తమ బిడ్డలను తప్పులు చేసినా

క్షమించినట్టు నన్ను క్షమింపుము దేవా!" అని పెక్కువిధముల ప్రార్థించాడు అర్జునుడు.

మరియు శ్రీకృష్ణుని విశ్వరూపమును చూచి "దేవా! మునుపు ఎన్నడూ చూడని నీ దివ్వరూపమును కనులారా గాంచ గలిగితిని. నా మనసు సంతోషముతో నిండిపోయినది కాని భయము కూడా కలుగుతున్నది. కాబట్టి, దేవా! నా యందు దయయుంచి నీ పూర్వము సౌమ్యాకారమును ధరింపుము. నాకు ఆహ్లాదము కలిగింపుము." అని వేడుకున్నాడు అర్జునుడు.

దయార్ద్రచిత్తుడగు ఆ పరమేశ్వరుడు అర్జునునితో ఇలా అన్నాడు. "ఎన్నో తపములు చేసిన వారికి గాని, వేదాధ్యయనము చేసిన వారికి గాని దుర్లభమైన నా దివ్యపరమాకృతి నీకు నా యందు ఉన్న భక్తి భావము చేత నీకు మాత్రమే గోచరించినది. ఇతరులు ఎవ్వరికీ చూడ శక్యము కాదు. నా ఈ రూపమును చూచి నీవు ఎటువంటి భయాందోళనలకు గురి కావద్దు. నీ భయమును విడిచి సంప్రీతమనస్కుడవు కమ్ము." అని చెప్పి శ్రీకృష్ణుడు తన పూర్వ రూపమును ధరించాడు. అర్జునుడు శ్రీకృష్ణుని సౌమ్య రూపమును చూచి పులకించి పోయాడు.

"దేవా! నీ సౌమ్య రూపమును చూచి నేను కుదుట పడ్డాను. మరల నా సహజత్వమును పొందాను." అని పలికాడు.

వాసుదేవుడు అర్జునుని చూచి "అర్జునా! తాను చేయు కర్తవ్య కర్మలను నా కే అర్పించు వాడు, నా యందు అచంచలమైన భక్తి కల వాడు, నన్ను పొందగలడు." అని పలికాడు.

ఈవిధంగా శ్రీ కృష్ణుడు అర్జునునకు ఉపనిషత్ సారమును తెలియచెప్పి అతని మనసులోని సందేహములను పోగొట్టి వివేకమును కలిగించాడు.

"అర్జునా! నీకు ఈ గుహ్యతరమైన జ్ఞానము ఉపదేశించితిని. దీనిని తెలుసుకొని, నీకు ఎట్లు చేయవలెనని తోచినతో అట్లు చేయుము. ఇంతకంటే పరమ రహస్యము ఒకటి చెప్పెదను వినుము. సర్వ, ధర్మములను విడిచి ధృఢముగా నన్నే శరణు వేడుము. నన్నే ఆశ్రయింపుము. నీకు ప్రమోదము కలిగేటట్లు నీ యొక్క సకల దురితములను నేను తొలగించెదను. నియతి, తపస్సు, నా యందు భయభక్తులు కలిగి, నాకు భక్తుడైన వానికి ఈ గీతాశాస్త్రమును ప్రీతితో చెప్పుము. పైలక్షణములు లేని వారికి చెప్పవలదు."

"అర్జునా! నేను చెప్పినది బాగుగా వింటివా! నీ అజ్ఞానము, మోహము తొలగినదా! " అని అడిగిన కృష్ణునికి అర్జునుడు "దేవా! నా మోహము తొలగినది. నా సందేహములన్నియు తొలగిపోయినవి. నీ యొక్క దివ్వరూపమును చూచితిని. స్థిరమైన మనస్సుతో ఉన్నాను. దేవా! నీవు సర్వలోక నిర్వాహకుడవు. నీ మాటలు నాకు శిరోధార్యములు. నీవు చెప్పినట్లు చేసెదను." అని అన్నాడు అర్జునుడు.

శ్రీ కృష్ణునికి సాష్టాంగ దండ ప్రమాణము చేసాడు. మరల తన ధనుర్బాణములను చేతిలో ధరించాడు." అని చెప్పి సంజయుడు "దేవా! నేను కూడా మహానుభావుడు భగవాన్ వేదవ్యాసుని కరుణ వలన కృష్ణార్జునుల సంవాదమును విన్నాను. మహా యోగీంద్ర హృదయానంద కరుడైన ఆ దేవదేవుని దివ్యరూపమును చూచాను. ధన్యుడనైనాను. ఆ మహాత్ముడు తన మధుర వాక్యములతో పలికిన అత్యంత గుహ్యమైన యోగ శాస్త్రమును చెవులారా విన్నాను. ఆ మహానుభావుని సంభాషణములు, ఆ విశ్వరూపుని మహనీయాకారము తలంచి తలంచి ఆశ్చర్యపోతున్నాను. నా మనసంతా ఆనందంతో నిండి పోయింది. ఓ మహా రాజా! యోగీశ్వరేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారి యైన అర్జునుడు ఎచ్చట నిలిచి ఉందురో, అచ్చట

విజయము, నీతి, సిరిసంపదలు, ఎల్లప్పుడూ నిత్యంగా నిలిచి ఉంటాయి." అని భక్తితో అన్నాడు సంజయుడు.

(శ్రీ తిక్కనామాత్యవిరచిత శ్రీమదాంధ్ర మహాభారతములో భగవద్గీత సంపూర్ణము).

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు, "ఒకరికొకరు ఎదురెదురుగా నిలిచిన కౌరవ పాండవులు ఏ ప్రకారము యుద్ధము చేయుచున్నారో విశధంగా తెలుపుము." అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

"మహారాజా! నీ కుమారుడైన సుయోధనుడు పనుపున అతని తమ్ముడు దుశ్శాసనుని తన సైన్యమును యుద్ధమునకు పురి కొల్పాడు. అప్పుడు కౌరవ సైన్యము శంఖ, భేరీ, మృదంగధ్వానములు చేసింది. ముందు గాంగేయుడు యుద్ధానికి కదిలాడు. పాండవులు కూడా యుద్ధమునకు సన్నద్ధమైనారు. ఒకరిని చూచి ఒకరు గర్జించు కుంటున్నారు. తూర్యనాదములు మిన్నంటుతున్నాయి భీముడు సింహనాదము చేసాడు. యుద్ధం మొదలయింది.

భీముని దుశ్శాసనుడు, దుర్ముఖుడు, దుష్ప్రహుడు, దుర్మర్షణుడు, వివింశతి, వృషసేనుడు, చిత్రసేనుడు, వికర్ణుడు, పురుమిత్రుడు ఎదుర్కొన్నారు. అది చూచి సుయోదనుడు సంతోషించాడు.

నకుల సహదేవులు, అభిమన్యుడు, ఉప పాండవులు, ధృష్టద్యుమ్నుని ఆధ్వర్యములో కౌరవ సేనపై శర పరంపర కురిపించారు. వారి పరాక్రమముచూచి ఇరు పక్షముల సైన్యములు కొంచెంసేపు నిశ్చేష్టులయ్యారు. అది చూచి దుర్యోధనుడు, ధర్మనందనుడు తమ తమ బలగములను యుద్ధం చేయండని పురి కొల్పారు. ఉభయ సైన్యములు ఒకరితో ఒకరు తలపడ్డారు.

రథములు, హయములు, గజములు, కాల్బలము ఒకరితో ఒకరు భీకరంగా పోరాడుతున్నారు భీష్ముడు, కౌరవులకు ఉత్సాహం కలిగిస్తూ మధ్యందిన మార్తాండుని మాదిరి వెలిగిపోతున్నాడు. అర్జునుడు తన దేవదత్తమును పూరించి, గాండీవము సంధించి, నారి సారించి, భీష్మునితో యుద్ధానికి తలపడ్డాడు. ఇరువురు ఒకరిమీద ఒకరు అనేక అస్త్ర,శస్త్రములు ప్రయోగించసాగారు.

సాత్యకి కృతవర్మను ఎదుర్కొన్నాడు ఇరువురు ఘోరంగా యుద్ధము చేస్తున్నారు. ఇరవురి శరీరములు రక్తంతో తడిసిపోయాయి.

అభిమన్యుడు కోసల రాజుతో యుద్ధం చేసున్నాడు. కోసల రాజు అభిమన్యుని సారధిని పడగొట్టి హయములను చంపాడు. అభిమన్యుడు అతని కేతనమును, విల్లును, విరుగ గొట్టి అతనిని గాయపరిచాడు.

భీముని పై భీష్ముడు యుద్ధం చేస్తున్నాడు. ఇరువురు అతి భీకరంగా పోరుతున్నారు.

నకులుని దుశ్శాసనుడు ఎదుర్కొన్నాడు. నకులుడు ఒకే ఒక బాణముతో దుశ్శాసనుని విల్లు విరిచి, అతనిని గాయపరిచాడు. దుశ్శాసనుడు వేరే విల్లు తీసుకొని నకులుని బాణములను విరిచి అతని కేతనము విరిచాడు.

దుర్ముఖుడు సహదేవునితో యుద్ధం చేస్తున్నాడు. నకులుని మీద శరవర్షము కురిపించాడు. సహదేవుడు అతని బాణములను తుంచి, రధమునకు కట్టిన హయములను చంపి, సారధిని అంతమొందించాడు

యుధిష్ఠిరుడు శల్యునితో యుద్ధమునకు తలపడ్డాడు. యుధిష్ఠిరుడు శల్యుని విల్లును తుంచాడు. శల్యుడు వేరే విల్లుతీసుకొని యుధిష్ఠిరుని మీద బాణ వర్షము కురిపించాడు.

ధృష్టద్యుమ్నుడు ద్రోణుని పైకి ఉరికాడు. ద్రోణుడు అతని విల్లును మూడు ఖండములుగా విరిచాడు. ధృష్టద్యుమ్నుడు వేరొక విల్లుతీసుకొని ద్రోణుని మీద 14 శరములు సంధించాడు.

మగధ రాజు సహదేవుడు భూరిశ్రవునితో యుద్ధం చేస్తున్నాడు. వారు ఇద్దరూ ఇంద్రుడు, వృత్రాసురుని మాదిరి యుద్ధం చేస్తున్నారు.

దృష్టకేతుడు బాహ్లికునితో యుద్ధానికి తలపడ్డాడు.

రాక్షస వీరుడు అలంబసుడు భీముని కుమారుడైన ఘటోత్కచుడితో యుద్ధమునకు తలపడ్డాడు.

మహావీరుడైన శిఖండి ద్రోణుని కుమారుడైన అశ్వత్థామతో తలపడ్డాడు. అశ్వత్థామ శిఖండి ఒంటినిండా శరములు నాటాడు.

శిఖండి కూడా అశ్వత్థామ హృదయము చీలునట్లు శరసంధానము చేసాడు.

భగదత్తుడు విరాటునిపై ఉరికాడు. అతను వేసిన బాణములు ఆకాశం అంతా కప్పివేసాయి.

కేకయ రాజు బృహత్క్షత్ర విభుడు కృపాచార్యుని ఎదుర్కొన్నాడు. వారు ఒకరి కేతనములు ఒకరు విరుగగొట్టుకున్నారు. చెరి ఒక కత్తిపట్టుకొని రధములు దిగి యుద్ధం చేస్తున్నారు. అది చూచి జయద్రధుడు, ద్రుపదుడు చెరి ఒక పక్కనుండి వచ్చి వారి సహాయంగా నిలిచారు.

వికర్ణుడు యుధామన్యునితో యుద్ధం చేస్తున్నాడు. ఒకరితో ఒకరు రౌద్రంగా పోరాడుతున్నారు.

చేకితానుడు త్రిగర్తాధీశుడు సుశర్మ మీదికి యుద్ధానికి వెడలాడు. అతనిని తన శరపరంపరతో ఒళ్లంతా తూట్లు పొడిచాడు.

శకుని యుధిష్ఠిరుని కుమారుడు, ప్రతివింధ్యునితో యుద్ధం చేస్తున్నాడు.

భీముని కుమారుడు శ్రుతసోముడు కాంభోజ రాజు సుదక్షిణునితో పోరుతున్నాడు.

అర్జునుని కుమారుడు ఇరావంతుడు శ్రుతాయువుతో యుద్ధం చేస్తున్నాడు. ఒకరి రథము ఒకరు విరగ్గొట్టుకున్నారు. వేరే రథములు ఎక్కి మరల యుద్ధం చేస్తున్నారు.

వింధాను వింధులు కుంతి భోజుని, అతని కుమారుని ఎదిరించారు. కుంతి భోజుడు వేయి బాణములు ఎదుర్కొంటూ అను వింధుడు అతనిపై శరపరంపర కురిపించాడు.

కేకయ రాజులు ఐదుగురు, గాంధారరాజులు ఐదుగురి మీద యుద్ధం చేస్తున్నారు.

విరాటుని కుమారుడు ఉత్తరుని మీద నీ కుమారుడు దీర్ఘబాహుడు దుమికాడు.

నకులుని కుమారుడు శతానీకుడు ఉలూకునితో తలపడ్డాడు.

ఈ ప్రకారంగా రెండుసేనలు ఒకరితో ఒకరు ఘోరంగా యుద్ధం చేసుకుంటున్నారు. చతురంగ బలములలో ఒక్కొక్క బలము పదులు, వందలు, వేలుగా ఒకరితో ఒకరు పోరుతున్నారు. ఉభయ సైన్యములు ఒకరి మీద ఒకరు బాణములతోనూ, కత్తులతోనూ, ఏనుగుల దంతములతోనూ, రథములు ఒకటితో ఒకటి ఢీ కొంటూ, అతి భయంకరంగా యుద్ధం చేస్తున్నారు. ఎదురుగా వచ్చుచున్న ఏనుగులు, రథముల తాకిడికి కాల్బలము తట్టుకోలేక పోతూ ఉంది. గజారోహకులు అది ఇది అనకుండా విచక్షణా రహితంగా అందరిని తొక్కుకుంటూ యుద్ధభూమి అంతా విహరిస్తున్నారు. మంధరపర్వతముతో చిలికినపుడు పాలసముద్రము ఎలా అల్లకల్లోలంగా ఉందో అలా ఉంది యుద్ధభూమి. బాణవర్షములు వర్షంలా కురుస్తున్నాయి. నేలమీద కత్తియుద్ధములు సాగుతున్నాయి. గదలతోనూ, ఈటెల తోనూ, శస్త్రాస్త్రములతోనూ, ఏనుగులు, హయములు, భటులతోనూ, వారు చేసే రణవిన్యాసములతోనూ, భయంకరమైన శబ్దములతోనూ, రణభూమి మార్మోగుతూ ఉంది. వారి రక్తంతో రణభూమి తడిసిపోయింది. ఒక చేయి నరకబడినా మరొక చేత్తో కత్తి పట్టుకొని యుద్ధం చేస్తున్నారు. కాలు తెగినా అమాంతం ఎదుటి వారి మీదికి ఎగిరి వారిని పట్టుకుంటున్నారు.

తల తెగిన తరువాత కూడా తన తల తెంచిన వాడి తల నరికి కింద పడుతున్నారు. తలలు తెగి పడినా కూడా ఆముఖములలో వీరత్వము కనపడుతూ ఉంది. తమ తమ ఏనుగులు, హయములు, రధములు పడిపోయినా కూడా, పక్కవాడి వాహనము ఎక్కి యుద్ధం చేస్తున్నారు. తాము గాయ పడ్డా తమ బంధువులు, స్నేహితులకు సాయంగా పోతున్నారు. ఎదుటి వాడు తన బంధువైనా సరే వాడితో యుద్ధము చేసి చంపుతున్నారు. సారధి చనిపోయిన తరువాత, రధములకు కట్టిన హయములు దిక్కుతోచక అటు ఇటు పరుగెడుతున్నాయి. ఆ రధ చక్రముల కిందపడి పదాతి దళములు నలిగిపోతున్నాయి. కింద పడ్డవారిని ఏనుగులు తమతమ కాళ్లతో తొక్కుతున్నాయి. దంతములతో ఎత్తి అవతల విసురుతున్నాయి.

ఈ ప్రకారం సమరం సాగుతుంటే మధ్యాహ్న కాలం అయింది. అప్పుడు నీ కుమారుడు సుయోధనుడు ప్రేరేపించగా దుర్ముఖుడు, కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడు,వివింశతులు, తమ తమ బాణాగ్నులతో పంచాగ్నుల మాదిరి విజృంభించి భీష్మునికి ఇరుపక్కలా చేరి పాండవ సేనను తరిమి తరిమి కొడుతున్నారు. భీష్ముడు విజృంభించి పాండవ సేనను తుత్తునియలు చేస్తున్నాడు.

చేది, పాంచాల, కేకయ రాజులు వారి ధాటికి తట్టుకోలేక పోతున్నారు. తెగి పడ్డ తలలు, విరిగిన విల్లులు, నేలకూలు శరీరములు, విరగుతున్న రధములు, తమ పక్క తరుగుతున్నసేనలను చూచి పాండవ బలములు తల్లడిల్లుతున్నాయి. ప్రళయకాల రుద్రుని వలె విజృంభిస్తున్న భీష్ముని ఎదుర్కొనే వారు లేక పాండవ సైన్యము కకావికలవుతూ ఉంది.

ఇంతలో అభిమన్యుడు విజృంభించాడు. శల్యుని ఐదు బాణములతో కొట్టాడు. ఒక బాణంతో కృతవర్మ గుండెలు చీల్చాడు. మరియొక బాణముతో దుర్ముఖుని సారధిని చంపాడు. వివింశతిని తరిమి తరిమి అతని విల్లు విరిచాడు. మూడు బాణములతో కృపాచార్యుని రధమునకు కట్టిన హయములను చంపాడు. తరువాత భీష్ముని మీదికి ఉరికాడు. భీష్ముని ఒళ్లంతా శరములు నాటాడు. అందరూ ఆశ్చర్యంగా అభిమన్యుని పరాక్రమము చూస్తున్నారు. భీష్ముడు కూడా "ఏమిటిది వీడు మరొక అర్జునుని మాదిరి విజృంభిస్తున్నాడు వీడుసామాన్యుడు కాడు." అని అనుకొన్నాడు.

వెంటనే రెండు మూడు బాణములతో అభిమన్యుని కేతనము విరిచాడు. సూతుని చంపాడు. మిగిలిన వారు కూడా అభిమన్యుని మీద శరవర్షము కురిపించారు. అంతట అభిమన్యుడు ఉగ్రడయ్యాడు. వారు కురిపించుచున్న శరవర్షమును సమర్ధంగా తిప్పికొట్టాడు. తన

బాణములతో భీష్ముని తాళధ్వజమును విరగ గొట్టాడు. అది చూచి పాండవ సేనలు హర్షధ్వానాలు చేసాయి. కౌరవ సేనలో కలకలం రేగింది.

ఇంతలో భీముడు సింహనాదం చేస్తూ అభిమన్యునికి సాయంగా వచ్చాడు. భీష్ముడు కోపంతో భీముని కేతనము విరిచాడు. భీముడు మూడు బాణములతో భీష్ముని కొట్టాడు. కృపాచార్యుని, కృతవర్మను ఎనిమిది బాణములతో కొట్టాడు. శల్యుని ఎదుర్కొన్నాడు. అప్పుడు అతనికి సాయంగా ఉన్న వీరులు భీముని ఎదుర్కొన్నారు. అప్పుడు భీముడు రౌద్రమూర్తి యై వారితో యుద్ధం చేసాడు. వారి వారి సూతులను, హయములను, చంపాడు. వారు విరథులయ్యారు.

తరువాత సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, కేకయ రాజులు, విరాటుడు, అతని కొడుకులు, ఉత్తరుడు మొదలగు వారు ఆతనికి సాయంగా వచ్చారు. వారి నందరినీ భీష్ముడు ఎదిరించాడు. మూడు బాణములతో వారిని గాయపరిచాడు.

విరాటుని కుమారుడు ఉత్తరుడు తన గజబలముతో శల్యుని ఎదిరించాడు. ఉత్తరుని ఏనుగు శల్యుని రథం విరుగ గొట్టింది. రథమునకు కట్టిన గుర్రములను నేలకేసి బాదింది. కాలితో

నలిపేసింది. ఇది చూచి శల్యుడు కోపించాడు. విరటుని కుమారుని గుండెలకు గురిపెట్టి శక్తి అనే ఆయుధము విసిరాడు. ఆ శక్తి ఆయుధము విస్ఫులింగములు విరజిమ్ముతూ ఉత్తరకుమారుని గుండెను చీల్చుకుంటూ ఆవలికి వెళ్ళింది. ఉత్తరుడు తన ఏనుగు మీదినుండి భూమి మీద పడ్డాడు. మరునిమిషంలోనే వీరస్వర్గము అలంకరించాడు.

అంతటితో ఆగక శల్యుడు తన కత్తిని దూసి ఉత్తరుని ఏనుగు తొండమును నరికాడు. ఉత్తరుని ఏనుగును చంపాడు. పక్కనే ఉన్న కృత వర్మ రధం మీదికి సింహం మాదిరి దూకాడు.

తన అనుజుని మరణం కళ్లారా చూచిన ఉత్తరుని సోదరుడు శంఖుడు కోపించి శల్యుని మీదికి దాడి చేసాడు. తన గజబలంతో శల్యుని తో ఘోర యుద్ధం చేస్తున్నాడు. శంఖుని వెంట ఉన్న రధికులు ఒక్కమారుగా శల్యుని మీద పడ్డారు. అది చూచి భీష్ముడు మరి కొందరు రధికులను తీసుకొని శల్యునికి సాయంగా వచ్చాడు. భీష్ముని ధాటికి శంఖుని వెంట వచ్చిన రధికులు, వారి సైన్యములు నిలువలేక పోయాయి. అది చూచి అర్జునుడు శంఖునికి సాయంగా వచ్చాడు. శంఖునికి, భీష్మునికి మధ్యలో నిలిచాడు. అర్జునుడు భీష్ముడు ఘోరంగా యుద్ధం చేస్తున్నారు. ఇంతలో అపరాహ్ణమయింది.

అప్పటి దాకా కృతవర్మ రథం మీద ఉన్న శల్యుడు, రథం దిగి తన గద దీసుకొని శంఖుని రెథం విరగ్గొట్టాడు. రథము విరిగిన శంఖుడు ఒక కత్తి తీసుకొని రథము దిగి వేగంగా అర్జునుని రథము చాటుకు వెళ్లాడు.

భీష్ముడు శంఖుని విడిచి ద్రుపదుని సేనలోకి చొచ్చుకు పోయాడు. వీర విహారం చేస్తున్నాడు. మంచి ఎండలలో కార్చిచ్చు రగిలితే ఎలా అడవిని దగ్ధం చేస్తుందో ఆప్రకారము భీష్ముని ధాటికి పాండవ సేనలు నేలకూలుతున్నాయి. కేకయబలములు చికాకు పడగా భీష్ముడు తన రథమును చిత్ర విచిత్ర రీతులలో నడుపుతూ, ఎక్కడా తానే అయి కనపడుతూ యుద్ధం చేస్తున్నాడు. తరువాత విరాటుని సైన్యముమీద పడి దానిని దునుమాడుతున్నాడు భీష్ముడు.

భీష్ముని చేతిలో తమ బలములు చావు దెబ్బ తినడం చూచి పాండవులు నివ్వెరపోయారు. సూర్యుడు పశ్చిమాద్రిన కుంగినప్పటికినీ, తానే మధ్యందిన మార్తాండుడై వెలుగొందుతున్నాడా అన్నట్లు తన పరాక్రమంతో తేజస్సుతో వెలిగిపోతున్నాడు భీష్ముడు. చంద్రవంశపు రాజైన భీష్ముడు తన ప్రతాపము చూపిస్తూ వెలిగిపోతూ ఉంటే, సూర్యుడు సిగ్గుపడ్డాడా అన్నట్టు సూర్యాస్తమయము అయింది.

ఇరు పక్షములు యుద్ధం చాలించారు. పాండవుల మొహములు చిన్నబోయినట్టు చీకటులు ఆవరించాయి. ఉభయ సేనలు తమతమ స్కంధావారాలకు వెళ్లారు.” అని సంజయుడు ధృతరాష్ట్రునికి మొదటి రోజు యుద్ధవిశేషములు వివరించాడు.” అని వైశంపాయనుడు జనమేజయునకు భారతకధ చెప్పసాగాడు.

మహాభారతము భీష్మపర్వము

ప్రధమాశ్వాసము సంపూర్ణము

ఓంతత్సత్ ఓంతత్సత్ ఓంతత్సత్

# మహాభారతము

## భీష్మపర్వము

### ద్వితీయాశ్వాసము

హరిహరనాధా! వైశంపానుడు మహాభారత కధను జనమే జయునికి ఇలా చెప్పసాగాడు.

ఆ ప్రకారము తమ పక్షానికి విజయం చేకూరిన దానికి సంతోషించి ధృతరాష్ట్రుడు, సంజయుని చూచి "సంజయా! తరువాత ఏమి జరిగినది. చక్కగా వివరింపుము" అని అడిగాడు సంజయుడు , ధృతరాష్ట్రునితో మహా భారత యుద్ధక్రమమును ఇలా చెప్పసాగాడు.

ఆరాత్రి ధర్మతనయుడు మొదటి రోజునే తమకు ఓటమి సంభవించి నందుకు దుఃఖితుడై తన తమ్ములతోను, మిగిలిన మిత్ర రాజులతోనూ గూడి శ్రీకృష్ణుని వద్దకు వెళ్లాడు.

“కృష్ణా! చూచితివి గదా! ఈ రోజు భీష్ముడు, కార్చిచ్చు అడవిని కాల్చినట్టు భీష్ముడు మన సేనలను నాశనం చేసాడు. మనం అతనిని చంపు మార్గం కనపడటంలేదు. లోకభీకరుడైన భీష్ముని మామూలు వీరునిగా తలచి భంగ పడ్డాను. నీ మరుదులు, అనగా నా తమ్ములు బాగా గాయపడ్డారు. ఆ భీష్మునితో యుద్ధం చేయడానికి దిక్పాలకులు కూడా చాలరు అని తెలిసింది. భీష్ముని జయిస్తాడని మనం అర్జునుని నమ్ముకున్నాము. ఈ రోజు అర్జునుడు తన పరాక్రమము ఏమియు చూపలేదు. భీముడు మాత్రమే తన యావచ్ఛక్తి ఉపయోగించి కౌరవ సేనలను ఎదిరించాడు. నాకు ఏమి చెయ్యాలో తోచడం లేదు. అయినా జరిగిన దానికి వారిని వీరిని నిందించడం దేనికి? ఈయుద్ధం మానేస్తాను. మనకు సాయం వచ్చిన రాజులందరిని భీష్మునికి ఎరగా పెట్టలేను. దీని కన్నా మరల అడవులకు పోయి అక్కడ ఆకుకూరలు తినడం మేలు. నీవు ఎలా చెబితే అలా చేస్తాను. నీ వలన కదా మేము ఇప్పటి దాకా అపజయ మెరుగక జయ పరంపరలతో కొనసాగు తున్నాము. కాబట్టి ప్రస్తుత కర్తవ్యమును ఉపదేశింపుము.” అని వేడుకున్నాడు.

ధర్మనందనుని చూచి కృష్ణుడు ఇలా అన్నాడు. “ధర్మజా! ఏమిటి ఇలా మాట్లాడుతున్నావు. ఈ మనో వేదన ఎందుకు? అసలు నీకు ఎదురు నిల్చేదెవరు చెప్పు. నీ తమ్ములు ఈ ప్రపంచము మొత్తం గెలువ

సమర్థులు. భీష్ముని చంపుటకు శిఖండి ఉన్నాడు కదా. భయమెందుకు. సాత్యకి బాహుబలం, అతని అత్యాశ్చర్యకరమైన యుద్ధరీతులు నీకు ఇంకా అవగతము కాలేదు.ద్రుపదుడు, విరాటరాజు నీ కోసం తమ తమ ప్రాణాలు ఇవ్వడానికి కూడాసిద్ధంగా ఉన్నారు కదా. నువ్వు ఎందుకు ఈ ప్రకారము నిరుత్సాహపడతావు. అంతదాకా ఎందుకు ఒక్క ధృష్ట ద్యుమ్నుడు చాలు కౌరవసేన మట్టుపెట్టడానికి. " అని పలికాడు

అప్పుడు ధర్మతనయుడు ధృష్టద్యుమ్నుని చూచి "నాడు శ్రీ కృష్ణుడు నిన్ను మాకు చూపించి ఇతడు మన సర్వసైన్యమునకు ఆధి పత్యము వహించునని ఆదేశించాడు. ఆ ప్రకారము నిన్ను సర్వ సైన్యాధ్యక్షుడిని చేసాము. శ్రీకృష్ణుడు, నేను, నా తమ్ములు, మన మిత్ర రాజులు నీ వెంట ఉన్నాము. నీవు నీ సర్వశక్తులు ఒడ్డి మాకు విజయం చేకూర్చవలసింది." అని అన్నాడు.

దానికి ధృష్టద్యుమ్నుడు "ధర్మనందనా! నన్ను ద్రోణుని చంపుటకు మాత్రమే బ్రహ్మ సృష్టించాడని జగమెరిగిన సత్యము. కాబట్టి దాని గురించి మరల మరల చెప్ప పని లేదు. భీష్మునితో సహా కురు సేనలో ఉన్న ప్రముఖ యోధులను ఎలా మట్టుబెట్టెదనో చూడండి. " అని పలికాడు.

ఆ మాటలు విని పాండు కుమారులు, సకల భూపతులు, శ్రీ కృష్ణుడు సంతసించారు. తరువాత ధర్మనందనుడు

దృష్టద్యుమ్నునితో ఇలా అన్నాడు.

"పూర్వము దేవ దానవ యుద్ధమున బృహస్పతి దేవేంద్రునికి చెప్పిన యుద్ధవ్యూహము పేరు క్రౌంచ వ్యూహము. అది శత్రు భయంకర మైనది. రేపు నీవు క్రౌంచ వ్యూహమును పన్నుము." అని అన్నాడు.

"అలాగే చేసెదను." అన్నాడు ధృష్టద్యుమ్నుడు.

ధర్మనందనుడు మనసు తేలికపడి తన తమ్ములతో కలిసి తన స్కంధావారమునకు వెళ్లాడు. ఎవరి నిజనివాసములకు వారు వెళ్లారు.

మరునాడు సూర్యోదయం అయింది. పాండవ సైనికుల హృదయ పద్మములు వికసించాయి. ధర్మనందనుడు క్రౌంచ వ్యూహమును పరిశీలించుటకు వెళ్లాడు.

అర్జునుడు తన గాండీవము, కపిధ్వజముతో గూడా రథము మీద క్రౌంచ పక్షి ముక్కు భాగంలో నిలిచాడు. కుంతి భోజుడు, శైబ్యుడు, క్రౌంచమునకు నేత్రముల స్థానములో నిలిచారు. ద్రుపదుడు క్రౌంచమునకు శిఖ మాదిరి నిలిచాడు. దశార్ణ, శూరసేన, కిరాత, దేశాధీశులు కంఠాకారములో నిలిచారు. భీమసేనుడు ధృష్టద్యుమ్నుడు చెరి ఒక పక్కన క్రౌంచ పక్షి రెక్కలమాదిరి నిలిచారు. అభిమన్యుడు, సాత్యకి, ఉప పాండవులు, పౌండ్రుడు, చోళులు, పాండ్యులు, భీమ సేనుని పక్కన, నకుల సహదేవులు, ఘటోత్కచుడు, శంబరుడు, వత్స రాజులు, ధృష్టద్యుమ్నుని పక్కన నిలిచారు. కేకయ, కాశి రాజులతో కూడి

విరాటుడు క్రౌంచ పక్షి జఘన భాగంలో నిలిచాడు. హూణపతి మొదలగు ప్రముఖులు తన చుట్టు ఉండగా ధర్మరాజు వెన్ను భాగంలో నిలిచాడు.

ఆ సయమంలో దుర్యోధనుడు, భీష్మ, ద్రోణ, అశ్వత్థామ, కృప, శల్య, కృత వర్మలను చూచి "మీరు ఒక్కొక్కరు పాండవ బలములను గెలువ గల సమర్థులు కదా! మీ రందరూ ఒక్కచోట గూడితే సాక్షాత్తూ ఆ పరమేశ్వ రునికైనా మిమ్ములను గెలువ శక్యం కాదు కదా! కాని పాండవుల సైన్యము క్రౌంచ వ్యూహమును పన్ని నిలిచి యున్నది. మనము కూడా తగిన వ్యూహమును పన్ని నిలువ వలయును కదా!" అని పలికాడు.

సుయోధనుని మాట మేరకు భీష్ముడు ప్రతి వ్యూహము రచించాడు. భీష్ముని ఆదేశము మేరకు కౌరవ సైన్యము మోహరించింది. దుశ్శాసన, వికర్ణ, విందాను విందులు, శూరసేనుడును, యవన, త్రిగర్త రాజులును, ఒక పక్క నిలిచారు. ద్రోణాచార్యులు, కుంతల, దశార్ణ, విదర్భ దేశాధీశులు, గాంధార, సింధు, సౌవీర రాజులు ఒక పక్కను, భీష్ముడు మహాసైన్యముతో నడుమ భాగము లోనూ, మూడు భాగములుగా నిలిచారు. కృతవర్మ, శల్యుడు, అశ్మంత, కాశ్మీరాధీశులు, సుయోధనుని తమ్ములు కొంతమంది, సుయోధనుడు, భీష్ముని వెనుక

నిలిచారు. ఈ ప్రకారము ఇరుపక్షముల వారు తమ తమ సేనలను మోహరించారు.

యుద్ధము ఆరంభం అయింది. దుర్యోధనుడు తన చేతిని ఊపుతూ యుద్ధం చెయ్యండని తన సేనలను పురి కొల్పాడు. కౌరవ సైన్యము పాండవ సైన్యముతో తలపడింది.

భీష్ముడు పాండవులు పన్నిన క్రౌంచ వ్యూహమును చించి చెండాడాడు. రెక్కలు చించాడు. కంఠమును తుంచాడు. తల పగులకొట్టాడు. క్రౌంచ వ్యూహమును కకావికలు చేసాడు అన్ని దిశలు తానే అయి విజృభించాడు భీష్ముడు. ఇది చూ చి అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు.

" బావా! భీష్ముడు మన సేనలను చిందర వందర చేస్తున్నాడు. నా వైపు రావడం లేదు. ఇతని పటాటోపము అణచాలి. ముందు రథము భీష్ముని మీదికి నడుపుము." అని అన్నాడు.

"అర్జునా! నీ మాట ప్రకారము రథం నడుపుతాను. కాని నా మాట కూడా విను. కంగారు పడకు. నీ పరాక్రమంతో, శౌర్యముతో భీష్ముని సమర్ధవంతంగా ఎదిరించు. పక్కనే ఉన్న శల్యుడు మొదలగు కురు సేనలకు భయం కలిగించు." అంటూ కృష్ణుడు తమ రథమును భీష్ముని మీదికి నడిపాడు.

అర్జునుడు తనకు అడ్డము వచ్చిన శూరసేనుడి సైన్యములను తన బాణములతో చిందర వందర చేసాడు. గాంగేయుని మీదికి అత్యంత

పరాక్రమముతో ఉరికాడు. ఇది చూచి గాంగేయుడు 77 క్రూరమైన బాణములతో అర్జునుని నొప్పించాడు. వెంటనే ద్రోణుడు 25 బాణములతోనూ, కృపాచార్యుడు 500 బాణములతోనూ, వికర్ణుడు మూడు బాణములతోనూ, శల్యుడు 9 బాణములతోనూ, దుర్యోధనుడు 64 బాణములతోనూ అర్జునుని మీదికి లంఘించారు. కొండ మీద వర్షము కురిసినట్టు కురియుచున్న ఆ బాణ పరంపర చూచి అర్జునుడు సుస్థిరముగా నిలిచాడు. 20 బాణములతో భీష్ముని, 60 బాణములతో ద్రోణుని, 9 బాణములతో కృపుని, వికర్ణుని, శల్యుని చెరి మూడు బాణములతో, దుర్యోధనుని 5 క్రూర మైన బాణములతోనూ అర్జునుడు నొప్పించాడు.

ఆ సమయంలో సాత్యకి, మత్స్య రాజైన విరాటుడు, ధృష్ట ద్యుమ్నుడు, ఉప పాండవులు, అభిమన్యుడు అక్కడకు చేరుకున్నారు. భీష్మునికి తోడుగా వచ్చిన యోధులందరి మీదకు ఒక్క మారుగా దాడి చేసారు. అప్పుడు భీష్ముడు 50 పదునైన బాణములను ఒక్కసారిగా అర్జునుని మీదికి వదిలాడు. ఆ బాణములను ఇసుమంతైనను లక్ష్యపెట్టక అర్జునుడు కౌరవ సేనలమీద శర వర్షము కురిపించాడు. ఆ దెబ్బకు కౌరవ సేన పారిపోయారు. అర్జునుడు వారిని తరిమి కొట్టాడు.

అర్జునుడు తన రథమును కౌరవ సైన్యము మీదికి నడిపించి వారిని విచక్షణా రహితంగా రధికులను, సూతులను (రథము నడుపువారు సూతులు) నరికాడు. అర్జునుని పరాక్రమానికి కౌరవ సేన భయపడి పోయారు.

అప్పుడు సుయోధనుడు భీష్ముని వద్దకు వచ్చి ఇలా అన్నాడు. "పితామహా! చూస్తున్నారుగా అర్జునుని ప్రతాపము. మన సేనలను విచక్షణా రహితంగా చంపుతున్నాడు. మరి మీకు ఇది బాగుందా! అర్జునుని సమర్ధవంతంగా ఎదుర్కొన జాలిన కర్ణుని కూడా యుద్ధానికి రాకుండా చేసారు. మీరేమో ఏమీ చెయ్యడం లేదు. ఏమిటో! " అని అన్నాడు నిస్పృహతో.

"ఏమిటిది! సుయోధనుడు ఇలా అంటున్నాడు. నా శాయశక్తులా యుద్ధం చేస్తున్నాను కదా! అతను ఇలా మాట్లాడటం బాగా లేదు." అని మనసులో బాధ పడి తన రథమును అర్జునుని మీదికి పోనిమ్మన్నాడు. దుర్యోధనుడు, వికర్ణుడు ఒక పక్క, అశ్వత్థామ ఒక పక్క భీష్ముడికి బాసటగా నిలిచారు. అందరూ ఒక్కుమ్మడిగా అర్జునుని ఎదుర్కొని అతని మీద బాణ వర్షము కురిపించారు.

అప్పుడు అర్జునునికి సాయంగా ధర్మరాజు, భీముడు, నకుల, సహదేవులు వచ్చారు. అర్జునునికి, గాంగేయునికి లోకభీకరంగా యుద్ధం జరిగింది. భీష్ముడు అర్జునుని రథ సారధి అయిన శ్రీకృష్ణుని గుండెలు తాకేట్టు బాణములు సంధించి వదిలాడు. ఆ బాణములు శ్రీకృష్ణుని గుండెల్లోకి దూసుకుపోయి రక్తం ప్రవహించింది. అది చూచి అర్జునుడు కోపంతో ఊగిపోయాడు. భీష్ముని మీద బాణ వర్షము కురిపించాడు. ఆ బాణములను తిప్పికొట్టి భీష్ముడు అర్జునుని రథమును తన శరములతో ముంచెత్తాడు. ఈ ప్రకారము ఒకరికి ఒకరు తీసిపోకుండా భీష్ముడు అర్జునుడు యుద్ధం చేస్తున్నారు.

అప్పటికి మధ్యాహ్నం అయింది. సూర్యుడు నడి నెత్తిమీదికి వచ్చాడు. ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు ద్రోణుని మీదికి తన రథం పోనిచ్చాడు. ద్రోణాచార్యుని తన నిశిత శరములతో నొప్పించాడు. ద్రోణుడు కోపించి తన క్రూరమైన బాణములతో ముందు దృష్టద్యుమ్యుని సూతుని చంపాడు. నాలుగు బాణములతో అశ్వములను చంపాడు. అతని విల్లును నడిమికి విరిచాడు. ధ్వజమును విరిచాడు. అంతతోనే ధృష్టద్యుమ్మడు అమిత మైన క్రోధంతో ద్రోణుని మీద శరపరంపర కురిపించాడు. వాటిని ద్రోణుడు సమర్ధంగా ఎదుర్కొన్నాడు. మరల ధృష్టద్యుమ్యునిమీద శర వర్షము కురిపించాడు. ధృష్టద్యుమ్నుడు

వాటిని మధ్యలోనే విరిచి మరల ద్రోణుని మీదికి శరములు సంధించాడు. ఆప్రకారం ఇరువురి మధ్మ పోరు భీకరంగా సాగింది.

ధృష్టద్యుమ్నుడు ద్రోణుని మీదికి తన గదాయుధము ప్రయోగించాడు. దానిని ద్రోణుడు పొడి పొడి చేసాడు. తరువాత ప్రయోగించిన బల్లెములను మధ్యలో విరిచాడు. తన బాణములతో ధృష్టద్యుమ్నుని విల్లు విరగ్గొట్టాడు. మరొక విల్లు తీసుకొని ధృష్టద్యుమ్నుడు ద్రోణుని మీద శరవర్షము కురిపించాడు. ద్రోణుడు మరల రెండు బాణములతో ధృష్టద్యుమ్నుని సూతుని, అశ్వములను చంపాడు. అతని విల్లు ఖండించాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు రథము దిగి గద తీసుకొని గిర గిరా తిప్పి ద్రోణుని మీదికి విసిరాడు. ఆ గదను ద్రోణుడు తన శరములతో నుగ్గు నుగ్గు చేసాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు తన కరవాలమును తీసుకొని విజృంభించాడు. ఆ ప్రకారము ధృష్టద్యుమ్నుడు ద్రోణుడు ఘోరంగాయుద్ధం చేస్తున్నారు.

ద్రోణుని శర పరంపర ధాటికి ధృష్ట ద్యుమ్నుడు తట్టుకోలేక పోయాడు. ఇది చూచి భీముడు ధృష్టద్యుమ్మనికి సాయంగా వచ్చాడు. ద్రోణుని మీదికి 7 బాణములు సంధించాడు. ధృష్టద్యుమ్యుని వేరు రథం ఎక్కించాడు. ఇది చూచి సుయోధనుడు కళింగ రాజులకు చేయి ఊపి భీముని ఎదుర్కొన మని సైగ చేసాడు. కళింగ రాజు తన సైన్యముతో

భీముని మీదికి వచ్చాడు. ఇంతలో ద్రోణుడు విజృంభించి విరాటుని, ద్రుపదుని మీదికి బాణములనుసంధించాడు.

ఇంతలో ధర్మతనయుడు ధృష్టద్యుమ్నునికి సాయంగా నిలిచాడు. ఛేది, కరూశ దేశాల సైన్యాలు భీమునికి అడ్డం వచ్చాయి. కేతు మంతుడు భీమునిమీదికి ఉరికాడు. కేతు మంతుని బాణ ధాటికి ఆగలేక పాండవ సైన్యములు మంటల్లో పడ్డ పురుగు మాదిరి మాడిపోయాయి. మిగిలిన వారు పారిపోయారు.

ఆ విజయోత్సాహంతో కేతుమంతుడు ముందు వెనుక చూడకుండా భీముని మీద తన బాణ వృష్టి కురిపించాడు. భీముని హయములు చంపాడు భీమునికి కోపం వచ్చింది. తన గదను తీసుకొని వాడిమీదికి విసిరాడు. ఆ గదాఘాతానికి వాడు, వాడి రథం, వాడి కేతనము నేలకూలాయి. కేతు మంతుడు స్వర్గలోకం చేరుకున్నాడు. భీముడు తన కత్తిని తీసుకొని వీరవిహారం చేస్తున్నాడు.

అది చూచిన కళింగ రాజు కుమారుడు శక్రదేవుడు ఆగ్రహంతో భీముని మీదికి ఉరికాడు. కరకు బాణములతో భీముని రథాశ్వాలను వధించాడు. భీముని ఒళ్లంతా బాణములతో కొట్టాడు. భీముడు చలించక తన గదాఘాతంతో శక్రదేవుని ఒకే వేటుకుసంహరించాడు.

కొడుకు చావు చూచిన కళింగ రాజు శ్రుతాయువు కోపించి భీముని మీదికి రథం నడిపాడు. భీముని మీద 14 తోమరములు ప్రయోగించాడు. వాటినన్నింటిని తన కత్తితో తుత్తునియలు చేసాడు భీముడు. అప్పుడు కళింగరాజు సోదరుడు భానుమంతుడు తన గజబలముతో భీముని ఎదుర్కొన్నాడు. భీముని మీద బాణ పరంపర కురిపించాడు. తన ఏనుగును భీముని మీదికి నడిపించాడు. భీమ సేనుడు సింహనాదముచేసాడు. ఆ సింహ నాదానికి దిక్కులు దద్దరిల్లాయి. భీముడు భానుమంతుని ఏనుగును పట్టుకున్నాడు. దాని దంతములు విరిచాడు. భానుమంతుని మీదికి లంఘించి అతనిని తనకత్తితో నరికాడు. అతని ఏనుగును నరికాడు.

అది చూచి కళింగుడు ఒక్కసారిగా భీముని మీద పడమని తన గజ సైన్యమును పురికొల్పాడు. అప్పుడు భీముడు ఒంటరిగా నేల మీద ఉన్నాడు. కత్తి తీసుకొని ఆ గజముల తొండములను ఒక్కొక్కటిగా నరుకుతున్నాడు. రధికులను, సారధులను, రథములకు కట్టిన గుర్రములను నరుకుతున్నాడు. ఇంతలో భీముని రథ సారధి భీముని రథమును తెచ్చి అతని ముందట నిలిపాడు. భీముడు తనసారధిని మెచ్చుకొని రథం ఎక్కాడు. విల్లు చేతిలోకి తీసుకున్నాడు. అయిదు బాణములతో కళింగుని కొట్టాడు. ఈ దెబ్బలకు కళింగుడు మూర్ఛ

పోయాడు. అతని చక్ర రక్షకులైన సత్యుడు,  సత్య దేవుని భీముడు తన బాణములతో చంపాడు. కౌరవ సేన కకావికలయింది.

కళింగుని రధమును సారధి పక్కకు తీసుకొని వెళ్లాడు. అది చూచి భీముడు తన శంఖమును పూరించాడు.  ఆ శంఖ నాదము విని గాంగేయుడు  తరిగి తన శంఖము పూరించి తమ సైన్యములను ఉత్సాహ పరిచాడు. ఇంతలో ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి ముగ్గరు భీమునికి తోడుగా నిలిచారు. అందరూ కలిసి భీష్మునికి ఎదురు నిలిచారు. భీష్మడు శిఖండితో తప్ప మిగిలిన వారందరితో యుద్ధం చేస్తున్నాడు. భీష్మడు భీముని రధమునకు  కట్టిన  గుఱ్ఱములను చంపాడు. అంతట కోపించిన భీముడు తన గద తీసుకొని రధము దిగి భీష్మని మీదికి ఉరికాడు. వెంటనే సాత్యకి భీమునికి అడ్డంగా వచ్చి తన బాణములతో భీష్మని రధ సారధిని చంపాడు.  సారధి లేని గుఱ్ఱములు భీష్మని రధమును లాగుకొని ఎటోవెళ్లాయి.

అదే అదనుగా భీముడు కౌరవ సైన్యమును తన గదతో తును మాడుతున్నాడు. భీముని ధాటికి తాళలేక కౌరవ సైన్యములు పారి పోయాయి.  ధృష్టద్యుమ్నుడు భీముని తన రధము మీద ఎక్కించు కున్నాడు. ఇంతలో సాత్యకి తన రధము తీసుకొని వచ్చాడు. "భీమసేనా! ఒంటరిగా కళింగుని బలం అణిచావు. అతని  పుత్రులను, సోదరులను,

ఆప్తులను, సైన్యమును ఒంటి చేతితో ఓడించావు." సాత్యకి భీమసేనుని ప్రశంసించాడు.

కళింగ రాజు పరాజయమును పరికించిన శల్యుడు, కృపుడు, అశ్వత్థామ అక్కడకు రావడం చూచి ధృష్టద్యుమ్నుడు భీముని తన రధము నుండి దించాడు. "భీమసేనా నీవునా వెనక ఉండి నన్ను రక్షించు." అని వారి వైపు తన రధము నడిపాడు. అశ్వత్థాము రధము నకు కట్టిన అశ్వములను పది బాణములతో చంపాడు. అశ్వత్థామ శల్యుని రధం ఎక్కాడు. ధృష్టద్యుమ్నుని మీదికి అస్త్రములు ప్రయో గించాడు.

ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ, శల్య, కృపులతో ఒంటరిగాయుద్ధం చెయ్యడం చూచిన అభిమన్యుడు అక్కడకు రధం తోలుకుంటూ వచ్చాడు. కృపుడు, అశ్వత్థామల మీద తొమ్మిదేసి బాణములు ప్రయో గించాడు. శల్యుని శరీరం మీదికి బాణవృష్టి కురిపించాడు. వారు కూడా అభిమన్యుని మీద ఒక్కొక్కరు 12 బాణములు ప్రయోగించారు.

ఆ సమయములో సుయోధనుని కుమారుడు లక్ష్మణుడు అభిమన్యునితో తలపడ్డాడు. మర్మభేధులైన బాణములతో అభిమన్యుని నొప్పించాడు. అభిమన్యుడు కూడా లక్ష్మణ కుమారుని 50 బాణములతో

తిప్పికొట్టాడు. లక్ష్మణుడు అభిమన్యుని విల్లువిరిచాడు. అప్పుడు కౌరవులు హర్షధ్వానాలు చేసారు. అభిమన్యుడు వేరొక విల్లు తీసుకొని లక్ష్మణుని మీదికి బాణ వృష్టి కురిపించాడు. అతని కవచం బేధించాడు.

ఇది చూచి దుర్యోధనుడు తన రధమును అభిమన్యుని మీదికి మరలించాడు. సుయోధనునికి సాయంగా భీష్మ, ద్రోణులు ఇతర ప్రముఖ రధికులు వచ్చారు. వారినందరిని చూచి అభిమన్యుడు భయపడలేదు. వారిని చూచి నవ్వుతూ వారితోయుద్ధం చేస్తున్నాడు. ఈ సమయమున అర్జునుడు తన దేవ దత్తమును పూరించుచూ భీష్మ, ద్రోణుల మీద శరవర్షము కురిపించుచూ అభిమన్మునికి సాయంగా వచ్చాడు. ఇది చూచి యుధిష్ఠిరుడు తన సేనలకు చేయి విసిరి సైగ చేసాడు. పాండవ సేన ఒక్కుమ్మడిగా అక్కడకు చేరుకుంది.

అర్జునుడు తన వివిధబాణములతో కౌరవ సేనను తుత్తునియలు చేస్తున్నాడు. అర్జునుని బాణములు ఆకాశమంతా కప్పాయి. విరిగిన శరములతో, కరవాలములతో, గదలతో, తలలతో మొండెములతో, ఆ యుద్ధ భూమి భయంకరంగా ఉంది. గజములను నడుపు తున్న వీరులు తమకు ఎవరు అడ్డం వచ్చిన లెక్కచెయ్యకుండా వారిని తొక్కుకుంటూ

వీరవిహారం చేస్తున్నారు. శ్రీకృష్ణుడు, అర్జునుడు తమ తమ శంఖములు, పాంచజన్య,దేవదత్తములను పూరించారు.

అప్పుడు భీష్ముడు ద్రోణుని చూచి "ఆచార్యా! ఈరోజు అర్జునుడు శ్రీకృష్ణుని సారథ్యంలో చెలరేగి పోయాడు. అతనిని ఎదుర్కొనే వీరుడు కనిపించలేదు. నన్ను కూడా లెక్కచెయ్యలేదు. మన సేనలు కూడా బాగా అలసిపోయి ఉన్నాయి. సూర్యుడు పశ్చిమాద్రి చేరుకున్నాడు. ఈ రోజుకు యుద్ధం చాలించడం మంచిది అన్నాడు. ద్రోణుడు కూడా అందుకు అంగీకరించాడు. యుద్ధము ఆపమని తమ వారికి సూచించాడు. ఇరు పక్షములు యుద్ధం ఆ రోజుకు చాలించారు. తమ తమ స్కంధా వారములకు చేరుకున్నారు.

మరునాడు భీష్ముడు తమ సేనలతో గరుడ వ్యూహం పన్నాడు. ఆ గరుడ వ్యూహమునకు, తాను ముక్కు భాగములో నిలిచాడు.ద్రోణుడు, కృతవర్మలు కళ్లు ఉండవలసిన స్థానములో నిలిచారు. కృపాచార్యుడు, అశ్వత్థామ తలభాగమున నిలిచారు. త్రిగర్తులతో కూడి భూరి శ్రవసుడు, శల్యుడు, భగదత్తుడు, సౌవీరుడు, జయద్రధుడు కంఠ భాగమున నిలిచారు. సుయోధనుని తమ్ములును, సుయోధనుడు వెన్ను భాగమున నిలిచాడు. విందానువిందులు, కాంభోజరాజు, శూరసేనుడు తోక భాగ మున నిలిచారు. మగధ, కళింగాది రాజులు కుడి రెక్కగా నిలిచారు.

కర్ణాటక, కోసల రాజులు ఎడమ రెక్కగా నిలిచారు. ఈ ప్రకారము గరుడుని ఆకారంలో గరుడవ్యూహం పన్నాడు భీష్ముడు.

ఇది చూచాడు అర్జునుడు, ధృష్టద్యుమ్నుని పిలిచాడు. గరుడ వ్యూహమునకు ప్రతిగా అర్ధ చంద్ర వ్యూహమును పన్నమని ఆదేశించాడు. ధృష్టద్యుమ్నుడు అర్ధ చంద్రవ్యూహము రచించాడు. పాండ్య, మగధ రాజులతో కలిసి భీమసేనుడు కుడి పక్కన ఉన్న చంద్రుడి కొమ్ము దగ్గర నిలిచాడు. విరాటుడు, ద్రుపదుడు,నీలుడు,తమ తమ సైన్యములతో భీముడికి ఎడమ పక్కన నిలిచారు. శిఖండి సహితుడై ధృష్టద్యుమ్నుడు ముందు నిలువగా, యుధిష్ఠిరుడు తన సేనలతో చంద్రుని మధ్యభాగమున నిలిచాడు. వారి పక్కన, సాత్యకి, నకులసహదేవులు, ఉప పాండవులు,అభిమన్యుడు,ఘటోత్కచుడు, కేకయ రాజులు, తమ తమ సేనలతో నిలిచారు. అర్జునుడు ఎడమ పక్కన ఉన్న కొమ్ముదగ్గర నిలిచాడు. ఈ ప్రకారము అర్ధ చంద్రాకారములో పాండవ సైన్యము నిలిచింది.

భేరీ తూర్యనాదములు మిన్నుముట్టాయి. సమయము ఆసన్నం కాగానే ఇరుపక్షములు యుద్ధమునకు తలపడ్డాయి. మూడవ రోజు యుద్ధం ప్రారంభం అయింది.

అర్జునుడు తన గాండీవము సారించి, శత్రుపక్షములోని వారి రధములను, రధికులను, రధములకు కట్టిన హయములను, వారి వారి ధ్వజములను, తన బాణములతో నుగ్గు నుగ్గు చేస్తున్నాడు. గాంధారీ పుత్రులు ఒక్కసారి అర్జునుని మీద పడ్డారు. ఇది చూచి మిగిలిన పాండవులు తమ తమ సైన్యముతో అర్జునునికి సాయంగా వచ్చారు. భీష్ముని ఆధ్వర్యంలో కౌరవ సైన్యము, భీముని కనుసన్నలలో పాండవ సైన్యము భీకరంగా పోరుతున్నారు.

ఆ సమయంలో భీష్ముడు, ద్రోణుడు, సైంధవుడు, శకుని, వికర్ణుడు, ఒక్కుమ్మడిగా పాండవ సేనపై పడ్డారు. భీమసేనుడు, ఘటోత్కచుడు, సాత్యకి, శైబ్యుడు, చేకితానుడు, ఉపపాండవులు వారిని ఎదుర్కొన్నారు. పోరు ఘోరంగా సాగుతూ ఉంది. దుర్యోధనుడు తన రధమును భీముని మీదికి పోనిచ్చాడు. ఇది చూచి భీష్ముడు, ద్రోణుడు సుయోధనునికి సాయంగా నిలిచారు. ఇది చూచి అర్జునుడు తన రధమును వారికి మధ్యగా నిలిపాడు. సుయోధనుని మీదికి, భీష్మ ద్రోణుల మీదికి శరసంధానం చేసాడు. వారిని తన బాణములతో ముంచెత్తాడు.

అర్జునుని పక్కన సాత్యకి సాయంగా నిలిచాడు. ఆ ఇద్దరూ కౌరవ సేనను చించి చెండాడారు. శకుని తన బాణములతో సాత్యకి రథము విరగ్గొట్టాడు. సాత్యకి తన రథము దిగి పక్కనే ఉన్న అభిమన్యుని రథం ఎక్కాడు. సాత్యకి, అభిమన్యుడు కలిసి శకుని ని తమ బాణములతో కొట్టారు. యుధిష్ఠిరుడు భీష్ముని మీదికి తన రథం పోనిచ్చాడు. గాంగేయునితో పోరాటం సాగించాడు.

ఇంతలో సుయోధనుడు భీముని మీద శరప్రయోగం చేసాడు. భీముడు వాటిని మధ్యలోనే తుంచి సుయోధనుని వక్షమునకు గురిపెట్టి ఒక్కటే ఒక్క బాణము వేసాడు.  ఆ బాణ ధాటికి సుయోదనుడు తన రథంమీద పడి మూర్ఛ పోయాడు. సుయోధనుని రథ సారధి కంగారుగా తన రథమును పక్కకు తీసుకొని వెళ్లాడు. ఇది చూచి సుయోధనుడు పడి పోయాడని కౌరవ సేనలు భీతి చెందాయి. చెల్లాచెదరయ్యాయి. ఈ పరిణామమును చూచి ధృష్టద్యుమ్నుడు కౌరవ సేనను తరమసాగాడు. అతనికి భీముడు తోడయ్యాడు. కౌరవ సేనలు పారి పోతున్నాయి.

భీష్ముడు, ద్రోణుడు కంగారు పడ్డారు. “నిలువండి. పారి పోకండి. సుయోధనుడు క్షేమంగా ఉన్నాడు.”అని అరుస్తూ తమ సేనలను నిలువరిస్తున్నారు. కాని భీముని ధాటికి భయపడి వారుపారి పోతున్నారు.

శకునిని ఎదుర్కొంటున్న అభిమన్యుడు, సాత్యకి, అదే ప్రకారము శకునిని, అతని సైన్యమును తరుముతున్నారు.. శకుని తన బంధు వులతో, సైన్యముతో సహా పారి పోయాడు. మరొక పక్క నుండి అర్జు నుడు కౌరవ సేనను తునుమాడుతున్నాడు.

అంతా భీభత్సంగా ఉన్న సమయంలో సుయోధనుడు మూర్ఛ నుండి తేరుకున్నాడు. జరిగింది గమనించాడు. తన రధమును యుద్ధ భూమి నుండి పక్కకు తీసుకొని వచ్చినందుకు సారధిని కోప పడ్డాడు. భీష్ముడు, ద్రోణుడు ఉన్న చోటనే కదలకుండా నిలబడి ఉండటం చూచాడు. ముందు తన సైన్యమును పారి పోకుండా ఆపాడు. తాను క్షేమంగా ఉన్నానని అందరికి తెలియజేసాడు. సైన్యము కుదుట పడగానే సుయోధనుడు భీష్మ ద్రోణుల వద్దకు వెళ్లాడు.

"పితామహా! ద్రోణాచార్యా! మూడులోకములు ఒక్కసారి ఎత్తివచ్చినను మీ రొక్కరే జయించగల సమర్థులు. మీ ఒంట్లో ఊపిరి ఉండగా మన సేనలకు ఇలాంటి దురవస్థ కలుగునా! మీరు పాండ వులతో యుద్ధం చేయనని నాకు ముందే చెప్పి ఉండవచ్చు కదా! పితామహా! మీరు ఆనాడే చెప్పి ఉంటే నేను కర్ణునితో ఎలాగోలాగా సర్ది

చెప్పుకొని యుద్ధమునకు రప్పించి ఉండేవాడిని. నిన్ను నమ్మి భంగపడ్డాను. ఇంక మాటలు ఎందుకు లెండి." అని నిష్ఠూరంగా మాట్లాడాడు.

ఆ మాటలు విన్న భీష్ముడు చిరు నవ్వు నవ్వి "సుయోధనా! దేవ సేనతో ఇంద్రుడు దిగి వచ్చినా యుద్ధములో పాండవులను గెలువ శక్యము కాదు. అన్ని తెలిసి నీవు ఇలా మాట్లాడటం ధర్మం కాదు. నాలాంటి వృద్ధులు, ఇప్పటికే సగం చచ్చిన వారు, దుర్బుద్ధి కలవారి చేతిలో పాండుకుమారులు ఓడి పోతారా! సుయోధనా! కాని నా ఓపిక ఉన్నంత వరకూ పాండు సేనలతో ఎదిరించి పోరాడెదను." అని పలికాడు.

భీష్ముడు, కౌరవ యోధులు తమ తమ శంఖములను పూరించారు. అది విన్న పాండు కుమారులు తమ తమ శంఖములు పూరించారు. భేరి తూర్యనాదములు మిన్నుముట్టాయి. భీష్ముడు విజృంభించాడు. అర్జునుని మీదికి తన రథం నడిపాడు. అప్పటికి సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చాడు.

కౌరవ వీరులందరూ భీష్మునికి సాయంగా నిలిచారు. భీముడు మొదలైన వారు అర్జునునికి వెన్నుదన్నుగా నిలబడ్డారు. ఇరువర్గములకు

పోరు ఘోరమయింది.హుంకారములు, అదలింపులు, రంకెలు, ధిక్కారములు, పొగడ్తలు, వీరాలాపములు, చేస్తూ ఇరు సైన్యములు వీరవిహారం చేస్తున్నాయి. విరిగిన రధములు, కాళ్లు చేతులు లేని మొండెములు, రక్తపు మడుగులు, కింద పడ్డ గుఱ్ఱములు, తలలు తెగిన ఏనుగులు మొదలగు వాటితో యుద్ధభూమి భీకరంగా ఉంది. ఈ ప్రకారంగా భయంకరంగా ఉన్న యుద్ధ భూమిలో తిరగడం ఇష్టం లేని సైన్యములు గుంపులు గుంపులు గా చేరి చూస్తూ ఉన్నాయి.

భీష్ముడు మాత్రం ఎక్కడ చూచినా తానే అయి యుద్ధ భూమి అంతా వీరవిహారం చేస్తున్నాడు. ఆయనను ఎదిరించడం ఎవరికీ శక్యం కావడం లేదు. ఆయన ఒక్క బాణం వేస్తుంటే అందులోనుండి వేయి బాణములుపుడుతున్నాయి. అడవిలో పుట్టిన కార్చిచ్చుమాదిరి భీష్ముడు పాండవ సేనలను తుత్తునియలు చేస్తున్నాడు. ప్రళయ కాలరుద్రుని మాదిరి యుద్ధరంగమున పరాక్రమ నృత్యం చేస్తున్నాడు. అది చూచి పాంచాలురు మొదలుగాగల పాండవ యోధులు భయభ్రాంతులై నివ్వెరపోయి చూస్తున్నారు.

ఇది చూచాడు శ్రీకృష్ణుడు. పార్థుని చూచి "అర్జునా! ఏంటయ్యా! కృపుని, ద్రోణ సహితంగా భీష్ముని గెలుస్తాను అన్నావు. కౌరవ సేనను

మట్టు పెడతాను అన్నావు. ఇప్పుడు చూడు భీష్ముడు ఎలా విజృంభి స్తున్నాడో. మరి నీవు ఏమి చేస్తున్నావు." అని చురక అంటించాడు.

" అదేమిటి బావా! అలా అంటావు. మన రధం భీష్ముని మీదికి పోనిమ్ము. పితామహుని సంగతి నేను చూస్తాను." అన్నాడు అర్జునుడు.

వెంటనే కృష్ణుడు అర్జునుని రధమును భీష్ముని ఉన్న చోటికి పోనిచ్చాడు. అతనికి ఎదురుగా నిలిపాడు. ఇది చూచి భీష్ముడు అర్జునుని రధములకు కట్టిన హయములమీద , అర్జునుని మీద, కృష్ణుని మీద శరములు సంధించాడు. తన మీద బాణములు వేసిన భీష్ముని మీద కోపించాడు కృష్ణుడు. ఇది చూచి అర్జునుడు భీష్ముని మీద ఒకే ఒక బాణముతో భీష్ముని విల్లు విరిచాడు. భీష్ముడు మరొక విల్లు తీసుకున్నాడు. దానిని విరగ్గొట్టాడు అర్జునుడు. మరొక విల్లు చేపట్టి భీష్ముడు అర్జునుని మీద, కృష్ణుని మీద శరవర్షము కురిపించాడు. నొప్పించాడు. కృష్ణుడు అర్జునుని రధమును అతి చిత్ర విచిత్ర రీతుల పోనిస్తూ ఆ బాణముల బారి నుండి అర్జునుని తప్పించాడు. అర్జునుడు కూడా భీష్ముని మీద అతి క్రూరములైన బాణములను సంధించి విడిచాడు.

అప్పటి కి అపరాహ్ణము అయింది. కృష్ణుడు బాగా గాయ పడ్డాడు. గాయ పడ్డ అర్జునుని చూచాడు. తన మనసులో ఇలా అనుకున్నాడు. "పాండవ సైన్యములు అని పారిపోతున్నాయి. వీళ్లలో ఒక్కరికి  కూడా భీష్ముని ఎదుర్కొని నిలిచే ధైర్యము ఉన్నట్లు లేదు. అర్జునుడు కూడా బాగా గాయ పడ్డాడు. పరిస్థితి ఇదే ప్రకారం కొనసాగితే సుయోధనుని సమస్త కోరికలు   ఈ రోజే భీష్ముడు నెరవేర్చగలడు. యాదవులు, కేకయ రాజులు, పాంచాలురు పారి పోతున్నారు. ఇది చూచి కౌరవ సైన్యము ఉన్నాదంతో ఊగి పోతున్నారు. ఇప్పుడు నేను ఊరుకుంటే లాభం లేదు. ఆ భీష్ముని చంపి ధర్మ తనయుని గెలిపించ వలెను." అని మనసులో తలచాడు శ్రీకృష్ణుడు.

ఇంతలోనే భీష్ముడు  మరల అర్జునుని మీద బాణ వర్షము కురిపించాడు. అర్జునుడు ఇంక శరసంధానము చెయ్యలేకపోయాడు. ఇది చూచి కృపాచార్యుడు, కృతవర్మ,అశ్వత్థాము,భూరిశ్రవుడు, సైంధవుడు, వికర్ణుడు, ఒక్క సారిగా తమ తమ రధములను అర్జునుని మీదికి పోనిచ్చారు.  ఆ సమయమున సాత్యకి తన గజ బలమును అర్జునికి సాయంగా నిలిపాడు. పాండవ సేనలను చూచి సాత్యకి "ఎందుకు అలా పారి పోతున్నారు. మీరు పలికిన పలుకులు మరిచారా! ఈ భీష్ముడు మనలను ఏమి చేస్తాడు. ఈ భీష్ముని సంగతి మనకు

తెలియదా! భీష్ముడు లేడు గీష్ముడు లేదు. తరమండి. నరకండి. "
అని తన సేనలను ప్రోత్సహిస్తూ అర్జునుని రథం దగ్గరకు వచ్చాడు.

"సాత్యకీ! పారిపోయే పిరికి పందలను ఎందుకు రమ్మంటావు. ఈ రోజు నేను భీష్ముని చంపుతాను. ద్రోణుని పని చక్కపెడతాను. కౌరవ వీరులను తునుమాడుతాను. వారి సైన్యమును నాశనం చేస్తాను. చతుస్సాగర వేలావలయుత ధరణీతలంబంతయును ధర్మతనయునకు కట్టబెడతాను. నా చక్రాయుధమును ధరిస్తాను. నా పరాక్రమంతో విజృంభి స్తాను." అని పలికి తన సుదర్శనమును మనసులో తలంచాడు. తక్షణము సుదర్శనము వెలుగులు విరజిమ్ముతూ శ్రీకృష్ణుని చేతిని అలంకరించింది.

శ్రీ కృష్ణుడు రథమున కున్న పగ్గములను నొగల మీద పెట్టాడు. రథం మీదినుండి దుమికాడు. కట్టుకున్న పీతాంబరము జారిపోతున్నా లెక్క చెయ్యలేదు. మహా కోపంతో రగిలిపోతున్నాడు కృష్ణుడు. తన చక్రాయుధము తో సహా భీష్ముని మీదికి లంఘించాడు. ఇది చూచి కౌరవ సైనికులు నిశ్చేష్టులయ్యారు. అలాగే నిల్చుని చూస్తున్నారు.

ఇది చూచాడు భీష్ముడు. సంభ్రమముతో రథం దిగాడు. శ్రీకృష్ణునికి ఎదురు పోయాడు. "కృష్ణా! రావయ్యా! నన్ను కృతార్థుని చెయ్యి. రా! నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి. " అని చేతులు జోడించి ప్రార్థించాడు.

ఇది చూచాడు అర్జునుడు. తనూ రథం దిగాడు. శ్రీకృష్ణుని వెనక నుండి పట్టుకున్నాడు. కాని శ్రీకృష్ణుని బలానికి తట్టుకోలేక పోయాడు. చతికిల పడ్డాడు. మరల పైకి లేచి శ్రీకృష్ణుని గట్టిగా పట్టుకున్నాడు.

"కృష్ణా! నీ కోపం వదలవయ్యా! యాదవులకు, పాండవులకు నీవే కదా దిక్కు. నీవే ఈ ప్రకారం అధైర్యపడితే ఎలాగా! ధర్మనందనుని ధైర్యము, బాహబలము,వీర్యము, ఏమి కావాలి! ఇది నీకు తగునా లోక నాయకా! శాంతించవయ్యా! నీ సాయం తో నేను కౌరవ సేనను రూపు మాపుతాను. నాకు అపకీర్తి తేవడం నీకు భావ్యమా!" అని ప్రార్థించాడు.

ఆ మాటలకు శ్రీకృష్ణుడు శాంతించాడు. తన కోపమును ఉప సంహరించుకున్నాడు. తిరిగి వచ్చి అర్జునుని రథం మీద కూర్చున్నాడు. మరల పగ్గములు చేత ధరించాడు. అర్జునుడు రథం ఎక్కాడు. శ్రీకృష్ణుడు పాంచజన్యము, అర్జునుడు దేవదత్తము పూరించారు.

గాండీవాన్ని సంధించాడు. ఇది చూచి కౌరవ బలములు భేరీ మృదంగతూర్య నాదములు మ్రోగించాయి. అర్జునుడు శరసంధానం చేసాడు.

ఇది చూచి భీష్ముడు, భూరిశ్రవుడు, శల్యుడు, దుర్యోధనుడు ఒక్కసారిగా అర్జునుని పై శక్తి, గద, తోమరములు ప్రయోగించారు. అర్జునుడు శక్తిని, గదను, తోమరమును ఒక్కొక్క బాణముతో తుత్తునియలు చేసాడు. వారి మీద ఇంద్రాస్త్రము ప్రయోగించాడు. ఆ ఇంద్రాస్త్రము నానా విధములుగా కౌరవ సేనను నాశనం చేసింది. అర్జునుడు భీష్ముని మీద అతి క్రూరములైన అస్త్రములు ప్రయోగించాడు. భూరిశ్రవుని విల్లు విరిచాడు. తొమ్మిది బాణములతో శల్యుని నొప్పించాడు. అంతలో పాంచాలురు,విరాట సైన్యము అక్కడకు చేరుకున్నారు.

అర్జునుని పరాక్రమమునకు కౌరవ సేనలు తల్లడిల్లి పోయాయి. కౌరవులు అందరూ కలిసి అర్జునుని రథమును చుట్టుముట్టారు. అర్జునుడు ప్రయోగించిన ఇంద్రాస్త్రము కౌరవసేనలను నాశనం చేస్తూ ఉంది. హయములు,రథములు చాపచుట్టగా పడిపోతున్నాయి. ఏనుగులు కూలిపోతున్నాయి. చామరములు, ఛత్రములు, కేతనములు (జండాలు) ఆయుధములు తుక్కు తుక్కు అవుతున్నాయి. అర్జునుడు

దేవదత్తమును, శ్రీకృష్ణుడు పాంచజన్యమును పూరించారు. సింహ నాదము చేసారు. సూర్యుడు పడమట దిక్కుకు చేరుకున్నాడు. అర్జునుని బాణముల ధాటికి ఆగలేక ఆరోజుకు యుద్ధము చాలించారు.

భీష్ముడు, ద్రోణుడు, బాహ్లీకుడు, దుర్యోధనుడు తమ తమ బలములతో స్కంధావారములు చేరుకున్నారు. పాండవులు కూడా శ్రీకృష్ణునితో సహా తమ విజయమునకు పొంగి పోతూ వంది మాగధులు కీర్తిస్తూ ఉండగా తమ తమ శిబిరములుచేరుకున్నారు. ఈ ప్రకారము మూడవ నాటి యుద్ధం ముగిసింది." అని సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పాడు.

మరునాడు నాలుగవ రోజు యుద్ధం ప్రారంభం అయింది. భీష్ముడు అపార మైన కౌరవ సేనతో కురుక్షేత్రమునకు కదలి వచ్చాడు. ద్రోణుడు, సుయోధనుడు,బాహ్లీకుడు, రణ రంగము చేరుకున్నారు. భీష్ముడు భయంకరంగా శంఖ నాదం చేసాడు. గజ సమూహముల ఘీంకారములు ప్రతిధ్వనించాయి. పాండవ సైన్యము కూడా యుద్ధ రంగము ప్రవేశించింది. కృష్ణుడు, అర్జునుడు పాండవ సైన్యములో సూర్య, చంద్రుల మాదిరి ప్రకాశించారు. పాంచజన్య, దేవదత్తములు

పూరించారు. భేరీ తూర్యనాదములు మిన్నుముట్టాయి. ఇరు సేనలు నాలుగవ రోజుయుద్ధమునకు సన్నద్ధము అయ్యాయి.

ఇరుపక్షములలోని చతురంగ బలములు ఒకరితో ఒకరు తలపడ్డారు. తోమరములు, కుంతములు,క్షురికలు, బల్లెములు, గదలు మొదలగు ఆయుధములతో కాల్బలము పోరు సాగిస్తూ ఉంది. కరవాలములు తిప్పుతూ శత్రువులను తునుమాడుతున్నారు. గదలు, ముసలములు, ముద్గరములు, మొదలగు వానితో ఒకరిని ఒకరు మోదుకుంటున్నారు. భీష్ముడు ఎక్కడచూచినా తానే అయి యుద్ధ భూమి అంతా కలయతిరుగుతున్నాడు. సుయోధనుడు, ద్రోణుడు, వివింశతి, కృపాచార్యుడు, సోమదత్తుడు, శల్యుడు కలిసి భీష్ముని వెన్నంటి ఉన్నారు. ఇది చూచాడు అభిమన్యుడు. వీరందరినీ ఒకేసారి ఎదుర్కొన్నాడు. వారు ప్రయోగించిన బాణములను మధ్యలోనే తుంచాడు.

భీష్ముడు అభిమన్యుని విడిచి పెట్టి అర్జునుని మీద శరవర్షము కురిపించాడు. అర్జునుడు వాటిని సమర్ధ వంతంగా ఎదుర్కొన్నాడు. భీష్మార్జునుల పోరు ఘోరమయింది. ఇరు పక్షములవారు వారి పోరును ఆసక్తిగా తిలకిస్తున్నారు.

అశ్వత్థామ, భూరిశ్రవ, శల్యుని కుమారుడు, చిత్రసేనుడు, కలిసి ఒక్కుమ్మడిగా అభిమన్యుని ఎదుర్కొన్నారు. అభిమన్యుడు చిరు నవ్వుతో

అశ్వత్థామ గుండెలకు గురిపెట్టి కొట్టాడు. శల్యుని కుమారుని విల్లు విరిచాడు. సుయోధనుని విల్లు విరిచాడు. భూరిశ్రవసుని ఓడించాడు. అభిమన్యునితో దీటుగాపోరాడ గల వీరుడే కౌరవ సైన్యములో కరువయ్యాడు. ఆ ప్రకారము ఒకేసారి అనేక మందితో పోరాడుతున్న అభిమన్యుని చూచి అర్జునుడు తాను కూడా ఎక్కడ చూచినా తా నే అయి కురు వీరులను చించి చెండాడుతున్నాడు.

అప్పుడు సుయోధనుడు త్రిగర్తులను, కృతవర్మను, కేకయ రాజులను, 35 వేల రధికులతో ఒకేసారి అభిమన్యుని చుట్టుముట్టమని ఆదేశించాడు. వారు అదే ప్రకారము అభిమన్యుని ఎదుర్కొన్నారు. అర్జునుని కొంచెం దూరంలో చూచి ధృష్టద్యుమ్నుడు తన రధమును అర్జునుని వద్దకు పోనిమ్మన్నాడు. ధృష్టద్యుమ్నుడు అర్జునుని రధమును అధిగమించి ముందుకుపోయి, కృపాచార్యుని మూడు శరములతో, పది శరములతో శల్యుని , కృతవర్మమీద ఒక్క బాణమును సంధించాడు. వారి వారి రధములను, హయములను కూల్చాడు.

అప్పుడు శల్యుని కుమారుడు పది అమ్ములతో ధృష్టద్యుమ్నుని, మరొక పది బాణములతో అతని సూతుని కొట్టాడు. అది చూచి ధృ ష్టద్యుమ్నుడు కోపించి ఒక భల్ల బాణముతో శల్యుని కుమారుని విల్లు

తుంచాడు. నాగాస్త్రము సంధించాడు. శల్య కుమారుని రధసారధిని, రధమును, హయములను కొట్టాడు. శల్యతనయుడు రధమును దిగాడు. తన డాలు కత్తి తీసుకొని శత్రువులను తునుమాడుతున్నాడు. ఇది చూచి ధృష్టద్యుమ్నుడు ఒక గద తీసుకొని శల్యకుమారుని ఎదుర్కొన్నాడు. అతని గదాప్రహారములకు, శల్య నందనుని కత్తి విరిగిపోయింది. డాలు తునా తునకలయింది. రెండవ దెబ్బకు శల్యనందనుని తల పగిలిపోయింది. అతడు తన కత్తి డాలు విడిచి కింద పడిపోయాడు. తనకుమారుని మరణం చూచాడు శల్యుడు. క్రోధంతో ధృష్ట ద్యుమ్నుని మీదికి ఉరికాడు. అద్భుతమైన బాణములను అతని మీద సంధించాడు.

సంజయుని ద్వారా ఇదంతా వినిన ధృతరాష్ట్రుడు మనసులో కలతచెందాడు. "అయ్యో ! మానవ ప్రయత్నం సర్వం దైవ యత్నము ముందు వృధాయే కదా. ఆ పాండవులు మన సేనలను సర్వము నిర్మూలించడం తధ్యం. నా కుమారుని దుర్నయము వలన గదా నేడు ఇలాంటి దుర్వార్తలు వింటున్నాను కదా! కౌంతేయులను గెల్చు ఉపాయము ఏదీ తెలియకున్నది." అని అన్నాడు.

అది విని సంజయుడు  ధృతరాష్ట్ర మహారాజా! ఇదేం చూచావు ఇంకా ఎంతోమంది వీరులు చనిపోయారు. చెపుతాను విను.

ఆ ప్రకారము శల్యుడు ధృష్టద్యుమ్నుని మీద శరవర్షము కురిపించాడు. అతని విల్లు విరిచాడు. వివిధములైన అస్త్రములతో ధృష్టద్యుమ్నుని నొప్పించాడు. అది చూచి అభిమన్యుడు శల్యుని మీదికి వచ్చాడు.  ఇది చూచి, సుయోధనుని చేత ప్రేరేపించబడి, దుర్ముఖుడు, దుస్సహుడు, దుర్మర్షణుడు, సత్యవ్రతుడు, చిత్రసేనుడు, పురుమిత్రుడు, వివింశతి, వికర్ణుడు వారి వారి సేనలతో అభిమన్యుని ధృష్టద్యుమ్నిని చుట్టుముట్టారు. కాని వారి నందరినీ ధృష్టద్యుమ్నుడు సమర్ధంగా ఎదుర్కొన్నాడు.  ఒక్కొక్కరికి తన బాణములతో సమాధానం చెప్పాడు. నకులుడు, సహదేవుడు కూడా అతనికి సాయంగా వచ్చారు. శల్యుని తోయుద్ధం చేస్తున్నారు.  వారి నందరినీ శల్యుడు తన బాణములతో నొప్పించాడు. తరిమి కొట్టాడు.

పాంచాల, మత్స్య దేశాధి పతులు నకుల సహదేవులకు ఇరుపక్కలా నిలబడి శల్యునితో యుద్ధం చేస్తున్నారు. కౌరవ సైన్యమును తరిమి తరిమి కొట్టారు.  ఇది చూచి మన సైన్యములో ఉన్న వీరులు శల్యునికి సాయంగా వెళ్లారు.  అప్పటికి సూర్యుడు నడి నెత్తిమీదికి వచ్చాడు. నేడే సమరమునకు సమాప్తమో అన్నట్టు భీమసేనుడు తన గద

తీసుకొని తీవ్ర కోపంతో నీ కుమారుడు సుయోధనుని కి ఎదురు నిలిచాడు. అప్పుడు నీకుమారులందరూ కలవరపడ్డారు. సుయోధనుడు మగధ దేశాధీశుని తన గజబలముతో భీముని ఎదుర్కొనమని చెప్పాడు.

మగధ దేశాధీశుని గజబలమును చూచాడు భీముడు. చిరు నవ్వు నవ్వాడు. భుజం మీద గద పెట్టుకున్నాడు. రథం దిగాడు. పర్వతముల మీద ఇంద్రుడు పడ్డట్టు ఆ ఏనుగుల సమూహముమీద పడ్డాడు. భీముడు సింహనాదము చేస్తుంటే ఆ ఏనుగుల గుండెలు పగిలి పోయాయి. దొరికిన ఏనుగును దొరికినట్టు చంపుతున్నాడు భీముడు. ఇంతలో ద్రౌపది కుమారులు, అభిమన్యుడు, నకుల సహదేవులు, ,ధృ ష్టద్యుమ్నుడు, భీమునికి ఇరు పక్కలా తోడుగా నిలిచారు. తమ నిశిత శరములను ఆ ఏనుగుల సైన్యము మీద గుప్పించ సాగారు.

మగధ రాజు తన ఏనుగును అభిమన్యుని మీదికి నడిపించాడు. ఒకే ఒక్క బాణంలో ఆ ఏనుగును కొట్టాడు అభిమన్యుడు. మరొక బాణంతో మాగధుని కొట్టాడు. ఏనుగు మీదినుండి మగధ రాజు కింద పడ్డాడు. చనిపోయాడు. ధృష్టద్యుమ్నుడు తన బాణములతో ఆ ఏనుగు బలమును చించి చెండాడాడు. భీముడు తన గదతో ఏనుగులను మోదుతున్నాడు. అతను కొట్టిన దెబ్బలకు, ఆ ఏనుగులకు

కొన్నింటికి తొండములు తెగి పడ్డాయి. మరి కొన్ని దంతములు తెగాయి. మరి కొన్నింటికి కుంభస్థలములు పగిలాయి. కొన్నింటికి కాళ్లు నుగ్గునుగ్గు అయ్యాయి. భీముని ధాటికి ఆగలేక ఏనుగులు ఘీంకరిస్తూ అక్కడ నుండి పారిపోయాయి. ఆ ఏనుగులను అలా చంపుతూ భీముడు ఆ ఏనుగుల బలం మధ్య తిరుగుతున్నాడు. అభిమన్యుడు, ధృష్టద్యుమ్నుడు భీమునికి సాయంగాయుద్ధం చేస్తున్నారు. ఆ ఏనుగుల నెత్తురుతో భీముని గద, భీముని శరీరము తడిసి ముద్ద అయ్యాయి. ప్రళయ కాలంలో యముని మాదిరి విజృంభించి భీముడు ఆ ఏనుగులను తునుమాడుతున్నాడు. ఆ బాణముల వేగమునకు గదాఘాతములకు, బెదిరిన ఏనుగులను పశువుల కాపరి పశువులను తోలినట్టు ఆ ఏనుగులను తరిమాడు భీముడు.

ఇది చూచాడు సుయోధనుడు. తన కకావికలవుతున్న తన సైన్యమును నాలుగు పక్కలనుండి భీముని మీదికి పురికొల్పాడు. సముద్రము పొంగినట్టు కురు సైన్యము భీముని మీదికి ఉరికింది. భీముడు ఆ సైన్యజలధిని చెలియలి కట్టమాదిరి నిలువరించాడు. ధృష్ట ద్యుమ్నుడు, అభిమన్యుడు, ఉపపాండవులు భీమునికి తోడుగా నిలిచారు. తమ శర పరంపరలతో కౌరవ సైన్యమును తునుమాడు తున్నారు. అడవిలో కార్చిచ్చు కాల్చినట్టు భీముడు కౌరవ సైన్యమును

మట్టుపెడుతున్నాడు. కౌరవ సైన్యములను చాపకట్టు మాదిరి నేలమీద పడుతుంటే భీముడు ఒక్కొకరిని గదతో మోదుతున్నాడు. తామర కొలనులో గజరాజు ఆడినట్టు ఆ కౌరవ సైన్యము మధ్య భీముడు ఆడుకుంటున్నాడు. ఆ ప్రకారము విజృంభిస్తున్న భీముని చూచి కౌరవ బలాలు గుండెలు జారిపోయాయి. కకావికలయ్యాయి. ప్రాణభీతితో పారిపోతున్నారు.

ఇది చూచి భీష్ముడు భీముని మీదికి తన రధం నడిపించాడు. భీముని మీద శరవర్షము కురిపించాడు. అప్పుడు సాత్యకి భీష్ముని అడ్డుకున్నాడు. ఇది చూచాడు రాక్షస వీరుడు అలంబసుడు. సాత్యకి ని అడ్డగించి అతనితో యుద్ధానికి తలపడ్డాడు. పదిబాణములను సాత్యకి మీద ప్రయో గించాడు. సాత్యకి నాలుగు బాణములతో అలంబసుని కొట్టాడు. సోమదత్తుని కుమారుడు భూరిశ్రవుడు సాత్యకిని తొమ్మిది బాణములతో నొప్పించాడు. దానికి ప్రతిగా సాత్యకి భూరిశ్రవుని తన బాణ పరంపరతో ముంచెత్తాడు.

ఇంతలో సుయోధనుడు తన తమ్ములతో భూరిశ్రవునికి సాయంగా వచ్చాడు. అందరూ ఒక్కుమ్మడి సాత్యకిని చుట్టుముట్టారు. ఇది చూచి భీముడు రెచ్చిపోయాడు. సుయోధనుని మీద, అతని

తమ్ముల మీద శరవర్షము కురిపించాడు. భీముని ధాటికి ఆగలేక సుయోధనుని తమ్ములు తలకొక దిక్కుగా పారిపోయారు. తమ్ముల అవస్థ చూచిన సుయోధనుడు కళ్ళలో నిప్పులు కురుస్తుండగా తొమ్మిది బాణములు భీముని మీద ప్రయోగించాడు. అప్పటి దాకా నేలమీద ఉండి యుద్ధం చేస్తున్నా భీముడు తన రథం మీద ఎక్కాడు. తన బాణము తీసుకొని సుయోధనుని మీద పది బాణములను వేసాడు. మూడు శరములతో సుయోధనుని రథ సారథి నందకుని కొట్టాడు. దానికి ప్రతిగా సుయోధనుడు భీముని మీద, భీముని రథసారథి విశోకుని మీద 60 బాణములు ప్రయోగించాడు. ఇంకొక బాణముతో భీముని విల్లు తుంచాడు. భీముడు కోపంతో మరియొక విల్లు తీసుకున్నాడు. సుయోధనుని విల్లు ఒక భల్ల బాణంతో తుంచాడు. సుయోధనుడు మరియొక విల్లు చేబూని వజ్రసమానమైన బాణంతో భీముని గుండెలకు గురి పెట్టి కొట్టాడు. ఆ దెబ్బకు భీముడు మూర్ఛపోయాడు.

ఇది చూచాడు అభిమన్యుడు. ధృష్టద్యుమ్నుడు, ఉపపాండవులతో కలిసి ఒక్కమాటుగా సుయోధనుని మీద పడ్డారు. ఇంతలో సేదదీరాడు భీముడు. పైకి లేచాడు. ఒక్కసారిగా కౌరవ సైన్యముమీద పడ్డాడు. సుయోధనుని మీద, శల్యుని మీద శర పరంపర కురిపించాడు. సింహమును చూచిన ఏనుగుల మాదిరి కౌరవ సైన్యము పలాయనం

చిత్తగించింది. ఆ సమయంలో సూర్యుడు పడమటి దిక్కుకు వాలాడు. అపరాహ్ణము అయింది.

ఈసమయంలో నీ కుమారులు, సేనాపతి, సుషేణుడు, జలసంధుడు, సులోచనుడు, భీముడు, భీమరథుడు, భీమబాహుడు, దుష్ప్రదర్షుడు, దుర్ముఖుడు,వివిత్సుడు, ఇంకా కొంత మంది కలిసి ఒక్కుమ్మడిగా భీముని ఎదుర్కొన్నారు. భీముని మీద బాణ వర్షము కురిపించారు. భీముడు వారి మీదికి పెద్దపులి బాలమృగముల మీదికి ఉరికినట్లు ఉరికాడు. సేనాపతి శిరము తుంచాడు. మూడు బాణము లతో జలసంధుని చంపాడు. సుషేణుని వక్షస్థలము చీల్చాడు. భీమ బాహుని ఐదు బాణములతో చంపాడు. ఉగ్రుని శిరము తుంచాడు. భీముని, భీమ రథుని ఒకేసారి తన బాణములతో చంపాడు. సులోచనుని నాలుగు బాణములతో చంపాడు. భీముని వీర విహారము చూచి అందరూ భయభ్రాంతులయ్యారు. కౌరవ సైన్యము పారిపోయింది.

భీముని వీర విహారము చూచాడు భీష్ముడు. తన సైన్యములోని యోధాను యోధులను చూచి "ఓ యోధాను యోధులారా! భీముడు రాచ కుమారులను నరుకు తున్నాడు, మీరు ఉపేక్షించడం తగునా. రండి భీమునితో పోరాడండి. " అని ఎలుగెత్తి అరిగాడు. ఆ హెచ్చరిక విన్న

భగదత్తుడు భీముని మీదికి తన ఏనుగును నడిపాడు. భీముని మీద సూర్యుని పైన మేఘాలు కప్పినట్టు శరవర్షము కురిపించాడు. ఆ శరపరంపరతో భీముని రధము కాసేపు అదృశ్యము అయింది.

ఇది చూచి అభిమన్యుడు, ఉపపాండవులు కోపోద్దీప్తులయ్యారు. భగదత్తుని ఏనుగు పై బాణవర్షము కురిపించాడు. ఆ ఏనుగు ఇది తట్టుకోలేక ఘీంకరిస్తూ పాండవ సేన మీద పడింది. తన ఇష్టం వచ్చినట్టు పాండవ సేనను తొక్కుతూ, తొండముతో ఎత్తి విసిరి వేస్తూ, పాండవ సేనను నిర్మూలించసాగింది. దాని పాదముల కిందపడి ఎంతోమంది పాండవ యోధులు పరమపదించారు.

ఇది చూచి పొంగి పోయిన సుయోధనుడు తన రధమును భీముని మీదికి పోనిచ్చాడు. భీముని గుండెలు తాకేట్టు పలుబాణములు ప్రయోగించాడు. భీముడు కొంతసేపు దిమ్మరపోయాడు. ఇది చూచాడు ఘటోత్కచుడు. తండ్రికి సాయంగా వచ్చాడు. సాయం సమయం అవుతోంది. తన మాయా యుద్ధమునకు అనువైన సమయం అను కున్నాడు ఘటోత్కచుడు.. ఒక ఏనుగు ఎక్కాడు. కౌరవ సేన ముందు నిలిచాడు. ఇంద్రుడు ఐరావతమును ఎక్కి వస్తున్నాడా అన్నట్టు భ్రమ

కలిగించాడు. తన చుట్టూ దిక్పాలకుల మాదిరి దానవ వీరులు వస్తున్నారు.

ఘటోత్కచుడు సుయోధనుని మీదికి తన ఏనుగును పోనిచ్చాడు. అతనిని తన క్రూరమైన నారాచములతో నొప్పించాడు. ఇంతలో భగ దత్తుడు ఘటోత్కచునికి అడ్డుతగిలాడు. ఘటోత్కచుడు వాడిని పట్టు కున్నాడు. వాడి ఏనుగును చంపాడు. భగదత్తుని అవతలకు విసిరేసాడు. అది చూచి కౌరవ సేనలు పారిపోయాయి.

మరల సుయోధనుని మీదికి వచ్చాడు ఘటోత్కచుడు. ఇది చూచి భీష్ముడు ద్రోణుని తో ఇలాఅన్నాడు. "ఆచార్యా! మాయా యుద్ధంలో ఘటోత్కచుడు ఆరితేరినవాడు. భగదత్తుని చంపాడు. సుయోధనుని మీదికి పోతున్నాడు. మనము వాడికి అడ్డుపడాలి. అసలు భగదత్తుడు మహా వీరుడు. ఘటోత్కచుని తో యుద్ధం చెయ్యడానికి సమర్ధుడు. కాని ఒక్కదెబ్బకు భగదత్తుడు, వాడి ఏనుగు మట్టికరిచాయి." అన్నాడు.

"కౌరవ వీరులారా! ఘటోత్కచుడు సుయోధనుని మీదికి పోతున్నాడు, రండి. సుయోధనునికి సాయంగా నిలవండి. " అంటూ తన చేయి పైకి ఎత్తి అన్నిసేనలను అక్కడకు రమ్మని పిలిచాడు. తన

రధమును కూడా ఘటోత్కచుని మీదికి ఉరికించాడు. అందరూ ఒక్కసారిగా ఘటోత్కచుని మీద పడ్డారు. ఇది చూచిన యుధిష్ఠిరుడు మొదలగు పాండవులు, పాంచాల సైన్యము, మత్స్యసైన్యము, ప్రముఖ దండనాయకులు, కౌరవ వీరుల మీదికి ఉరికారు. యుద్ధము భీషణ రూపం దాల్చింది.

భీష్ముడు పాండవ సేనను తునుమాడుతున్నాడు. వీరవిహారం చేస్తున్నాడు. ఘటోత్కచుడు కూడా విజృంభించాడు. సింహనాదము చేసాడు. అతని సింహనాదము విని కౌరవ సేనలోని ఏనుగులు నిజంగా సింహము వచ్చినదనుకొని కకావికలయ్యాయి.

ఇది చూచి భీష్ముడు ద్రోణునితో "ఆచార్యా! సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఘటోత్కచునితో ఇప్పుడు యుద్ధం చెయ్యడం మంచిది కాదు. ఇప్పుడు పోయి రేపు వచ్చెదము." అని అన్నాడు. ద్రోణుడు "సరే" అన్నాడు. ఈవిషయం అందరు రధికులకు తెలియచేసారు. యుద్ధం ఆగిపోయింది. కౌరవ బలములు వెను దిరిగాయి. పాండవ బలములు, భేరీ, శంఖ, తూర్య, భీషణ ఘోషతో సింహనాదములు చేసుకుంటూ తమ తమ శిబిరములకు వెళ్ళారు. ఈ ప్రకారము నాలుగవ రోజు యుద్ధ విశేషములు వివరించాడు సంజయుడు.

నాల్గవ నాటి యుద్ధంలో తన వారు పరాజయము పాలయ్యారు అని విన్న ధృతరాష్ట్రుడు, "సంజయా! నువ్వు ఎప్పుడూ పాండవుల విజయ వార్తలు చెపుతుంటావు. వారికి మేలు చేస్తుంటావు. నా కుమారుల పరాక్రమమును తక్కువ చేసి మాట్లాడతావు. మరి భీష్ముడు, ద్రోణుడు, శల్యుడు, మిగిలిన శూరులు పాండవులతో యుద్ధం చెయ్యడం లేదా! అయినప్పటికీ పాండవులు విజయులగుటకు కారణమేమి? వివరంగా చెప్పు అని అడిగాడు.

( ఇక్కడ ఒక చిన్న విషయం ప్రస్తావించుకుందాము. సంజయుడు ఒక వార్తా పత్రిక లాంటి వాడు. టి.వి.ఛానల్ లాంటి వాడు. ఉన్నది ఉన్నట్టు రాయడం, చూసింది చూచినట్టు చెప్పడం అతని ధర్మం. కాని ధృత రాష్ట్రుడు నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. సంజయుని పక్షపాతిగా నిందించాడు. తనకు అనుకూలంగా వార్తలు చెప్పమని అడిగాడు.

ఈనాడు కూడా అదే జరుగుతూ ఉంది. ఒక విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు నేరుగా సినిమారంగంనుండి రాజకీయరంగ ప్రవేశం జరిగినప్పుడు ఒక పత్రిక అదే పనిగా వార్తలు రాసి అతనిని గెలిపించి, ముఖ్యమంత్రిని చేసింది. ప్రస్తుతం ఒక్కొక్క పార్టీకి ఒకొక్క పత్రిక బాకా

ఊదుతూ ఉంది.  ఒక ముఖ్యమంత్రి కుమారుడైతే  ఏకంగా ఒక పత్రికే పెట్టాడు. తనకు అనుకూలంగా వార్త రాస్తే వాడు ఉత్తముడు.  లేకపోతే వాడి పత్రిక మీద దాడి చెయ్యడం. ఇదీ నేటి వరస. నాటి ధృతరాష్ట్రునికి నేటి రాజకీయ నేతలకు తేడా ఏముంది. యుగాలు మారినా, తరాలు మారిన, మనుషుల మనస్తత్వాలు మారలేదు కదా!)

"ధృతరాష్ట్ర మహా రాజా!   పాండవుల వద్ద ఎలాంటిమంత్ర తంత్రములు, ఔషధగుణములు కాని లేవు. పాండు రాజ కుమారులు ధర్మము, సత్యము తప్పని వారు.  కాని నీ పుత్రులు ఆ మార్గాన నడవరు. వారు పాపం చెయ్యడం నువ్వు కళ్లారా చూచావు కదా! ధర్మమేవ జయతే అని కదా ఆర్యోక్తి. కాబట్టి వారు గెల్చుట, మీరు ఓడుట ధృవము. విదురుడు చెప్పిన మాటలు మనము విన్నాము కదా!  నీవు అడిగిన మాదిరే అక్కడ సుయోధనుడు కూడా భీష్ముడిని అడిగాడు. దానికి నీ తండ్రి భీష్ముడు ఏమి సమాధానం చెప్పాడో విను.

"సుయోధనా! నేను నీకు  ఎన్నోసార్లు చెప్పాను. పాండవులకు వాసుదేవుడు సాయంగా ఉన్నాడు అని. కాబట్టి పాండవులకు అసాధ్యము ఏమీ లేదు.    ఆ పరమేశ్వరుని రూపు మహాత్మ్యము ఎరిగిన వారు ఎవరూ లేరు. ఎరిగిన వారికి ఆపదలు లేవు. కుంతీ కుమారులు శ్రీకృష్ణ

ని మహాత్మ్యము ఎరింగి అతనిని ఆశ్రయించారు. కానీ మీరు ఆతని మాటలు పెడచెవిని పెట్టారు.

ఒకసారి కమలసంభవుడు అయిన బ్రహ్మ మానస సరోవరం ఉత్తర పర్వత శిఖరము మీద దేవతలు, మునులు, గంధర్వులు, అప్సరసలు, మొదలగువారితో కొలువు ఉన్నాడు. అప్పుడు ఒక విమానము ఒకటి ఆకాశ మార్గమున ఎగురుతూ ఉంది. ఆ విమానములో సర్వాత్ముడు తన సఖునితో కూడా ఉన్నాడని తెలుసుకున్న బ్రహ్మ ధిగ్గున లేచి నమస్కరించాడు. "ఈ లోకముల ఉత్పత్తి, స్థితి, విలయములను వినోదముగా చేయుచూ, మునిగణములతో అర్చింపబడుచూ, నిర్గుణాత్మకుడు, శోక, భయములను రూపు మాపు శుభకర మూర్తి! నీకు నమస్కారము." అని స్తుతించాడు.

" ఓ నారాయణా! నీను నీకు పుట్టిన వాడను. ఈ జగముల నన్నింటిని సృష్టి చేసాను. నీ రక్షణలో ఈ లోకములు వర్ధిల్లుచున్నవి. ఈసమయమున మనుష్య లోకము తల్లడిల్లి పోవుతున్నది. అసుర ప్రవృత్తి విజృంభించు చున్నది. నీవు యదు వంశమున పుట్టవలసిన సమయము ఆసన్నమయినది. నీకు సఖుడు నరుడు. నీవు. నీ సఖుడు నరుడు నరలోకమున జన్మించి, నానారకములైన దైత్యులను సంహ

రింపుము. ధరణీభారమును తగ్గింపుము." అని ఆ దేవ దేవుని, అతని సఖుడు నరుని వేడుకున్నాడు. అప్పుడు నారాయణుడు అట్లే అగుగాక అని దీవించాడు. తరువాత నర నారాయణుడు వెళ్లిపోయారు.

అప్పుడు అక్కడ కొలువు దీరిన వారు బ్రహ్మను చూచి "దేవా! నీవు ఎంతో వినయంతో ప్రార్ధించావు కదా! వీరలు ఎవ్వరు?" అని అడిగారు. దానికి బ్రహ్మ ఇలా చెప్పాడు. "వీరు పరమ మునులు. ఆది పురుషులు. నరనారాయణులు. వీరు నాకు ఆరాధ్యులు. అందుకే వారిని భూ లోకంలో పుట్టమని ప్రార్ధించాను. దానికి వారు సమ్మతించారు. భూ లోకములో పుట్టిన వీరలను కేవలము మర్త్యులు అని భావించుచూ వారిని లక్ష్యపెట్టని వారు చెడిపోతారు. వారిని భక్తిలో కొలిచెడు వారికి అన్ని శుభములు జరుగుతాయి." అని చెప్పి బ్రహ్మ సత్యలోకమునకు వెళ్లిపోయాడు. అక్కడ ఉన్నవారు కూడా తమ తమ నిజస్థానములకు వెళ్లిపోయారు.

"సుయోధనా! ఈ కధను నేను నారదుడు, పరశురాముడు, వ్యాసుడు వారి వల్ల విన్నాను. ఇంతకు ముందు కూడా నిన్ను మహామునులు కూడా నరనారాయణులతో వైరము మంచిది కాదని వారించారు కదా! కాని నీవు మదాంధుడవై వారి మాటలు వినలేదు.

ఇప్పటి కైనను మించి పోలేదు. నీవు కృష్ణుని ఆశ్రయించి పాండవులతో స్నేహంగా ఉండు." అని చెప్పాడు భీష్ముడు.

నీ కుమారుడు సుయోధనుడు తాత భీష్ముని మాటలు పెడచెవిని పెట్టాడు. రాజా! నువ్వు, నీ కొడుకు మంచివారి మాటలను వింటారా చెప్పు! అది సరే ఐదవ దినము యుద్ధము జరిగిన విధము చెపుతాను విను." అని చెప్పసాగాడు సంజయుడు.

ఐదవ రోజుయుద్ధమునకు కౌరవ సేనలుసమాయత్తమయ్యాయి. భీష్ముడు ఆ రోజు మకర వ్యూహమును పన్నాడు. (అనగా సైన్యమును మకరము అనగా మొసలి ఆకారములో అమర్చుట.). దానికి దీటుగా పాండవులు శ్యేన వ్యూహమును పన్నారు (అనగా సైన్యమును శ్యేనము అనగా డేగ ( ఈగిల్) ఆకారములో అమర్చుట. ఈ శ్యేన వ్యూహమున పాండవ యోధులు ఈ ప్రకారం నిలిచారు.

ముఖభాగమున భీముడు నిల్చున్నాడు. డేగ కన్నుల మాదిరి ధృష్టద్యుమ్నుడు, శిఖండినిల్చున్నారు. తల దగ్గర సాత్యకి నిల్చున్నాడు. మెడభాగమున అర్జునుడు నిల్చున్నాడు. ఎడమ రెక్క వైపు విరాటుడు, ద్రుపదుడు తమతమసేనలతో నిల్చున్నారు. కుడి రెక్క వైపు కేకయ

రాజులు తమ తమ సైన్యములతో నిల్చున్నారు. వీపు భాగమున అభిమన్యుడు, ఉప పాండవులు నిల్చున్నారు. తోక భాగమున నకుల సహదేవులు వెంట రాగాయుధిష్టిరుడు నిల్చున్నాడు. ఈ విధంగా శ్యేన వ్యూహము నిర్మితమయింది.

ఇరు పక్షములలో ఉన్న సైనికులు చేసిన భేరీ,తూర్య నాదములు, శంఖనాదములు మిన్నుముట్టాయి. యుద్ధం ఆరంభం అయింది.

ముందు ఉన్న భీముడు కౌరవులు పన్నిన మకరవ్యూహములోనికి చొచ్చుకుపోయాడు. కకావికలు చేసాడు. నేరుగా భీష్ముని ఎదుర్కొన్నాడు. ఆయన మీద శర వర్షము కురిపించాడు. భీష్ముడు ఆ శరములను మధ్య లోనే తుంచి, మరల భీముని మీద శరవర్షము కురిపించాడు. ఇంతలో అర్జునుడు భీమునికి సాయంగా వచ్చాడు. భీష్మునితో తలపడ్డాడు. కౌరవ సేనలను చించి చెండాడుతున్నాడు. ఒక పక్క భీముడు, మరొక పక్క అర్జునుడు కౌరవ సేనలను భీభత్సం చేస్తున్నారు.

ఇది చూచాడు సుయోధనుడు. ద్రోణుని వద్దకు వెళ్లాడు. "ఆచార్యా! మీరు పాండవ సైన్యమును పట్టి పల్లారుస్తారు అనుకున్నాను. భీష్ముడు అలిగిన దేవతలు కూడా అతని ముందు నిలువలేరు

అనుకున్నాను కాని ఇదేమిటి? అర్జునుడు ఆ ప్రకారము విజృంభిస్తుంటే మీరు చూస్తూ ఊరుకుంటున్నారు." అని నిష్టూరంగా మాట్లాడాడు. "సుయోధనా! అర్జునుడు శౌర్య సముద్రుడు. అతనిని గెలవడం అసాధ్యము అని చెప్పాను కదా.. మాకు చేతనైనంత వరకు మేము పోరాడతాము. ఒక్క రోజులో వారిని గెలవడం మాకు శక్యమా!" అని పలికాడు.

తర్వాత పాండవులతో యుద్ధం చెయ్యడానికి ఉపక్రమించాడు. ఇంతలో సాత్యకి ద్రోణుని మీదికి దూకాడు. ద్రోణుని మీద బాణ వర్షము కురిపించాడు. దానికి ప్రతిగా ద్రోణుడు సాత్యకి మీద బాణప్రయోగం చేసాడు. ఇది చూచి భీముడు తన రథమును సాత్యకి వైపు మళ్లించి, సాత్యకి కి సాయంగా వచ్చాడు. ద్రోణుని మీద అతి క్రూరమైన బాణ పరంపర కురిపించాడు. ఇది చూచి శల్యుడు, భీష్ముడు ద్రోణునికి సాయంగా నిలిచారు. భీముని మీద శరపరంపర కురిపించారు.

ఇంతలో ద్రౌపదీ సుతులు, అభిమన్యుడు భీమునికి సాయంగా వచ్చారు. వారు అభిమన్యునితో కలిసి భీష్మ,ద్రోణులను ఎదుర్కొన్నారు. అదే సందని శిఖండి ధనుష్టంకారము చేస్తూ భీష్ముని మీదికి ఉరికాడు. శిఖండిని చూచి భీష్ముడు తన రథమును మరొక పక్కకు మరలించాడు.

ఇది చూచి సుయోధనుడు ద్రోణాచార్యుని శిఖండి మీదికి పురికొల్పాడు. ద్రోణుడు శిఖండిమీద అస్త్రప్రయోగం చేసాడు. పోరు ఘోరమయింది.

రథ,గజ,తురగ,పదాతి , దళముల పదఘట్టనములతో రేగినధూళి ఆకాశం కప్పివేసింది. గుర్రముల పేగులు గుట్టలుగా పడ్డాయి. ఏనుగుల కళేబరములు కుప్పలుగా పడ్డాయి. రక్తం కాలువలుకట్టి పారుతూఉంది. ఇరు పక్షములు ఘోరంగా పోరుతున్నారు. ఒక పక్క భీముడు, మరొక పక్క భీష్ముడు తమ తమ సైన్యములకు ముందు నిలిచి పోరుతున్నారు. అర్జునుడు, ద్రోణుడు భీకరంగా యుద్ధం చేస్తున్నారు.

నీ కుమారులందరూ ఒక్కుమ్మడిగా భీముని మీదికి ఉరికారు. తమ తమ రథములను భీముని రథము మీదికి దూకించారు. ఎత్తైన కొండ ను మేఘాలు కప్పినట్టు నీ కుమారులు భీముని కమ్ముకున్నారు. ఇదిచూచి అర్జునుడు గాండీవమును ఎక్కుపెట్టి నీ కుమారులను ఎదుర్కొన్నాడు. అర్జునుని ధాటికి ఆగలేక కౌరవ సైన్యములు భయంతో భీష్ముని వెనక చేరాయి. తన సేనలు పారిపోవడం చూచాడు సుయోధనుడు. తన చెయ్యి ఊపుతూ అక్కడకు వచ్చాడు. అది చూచి కాంభోజ, సింధు, గాంధార, సౌవీర, త్రిగర్త, కళింగ సేనలు అక్కడకు చేరుకున్నాయి. వారందరూ ఒక్కుమ్మడిగా భీమార్జునులను ముట్టడించారు.

ఇది చూచిన ధర్మనందనుడు, చేది, కాశ, కరూశ, పాంచాల సైన్యమును ధృష్టద్యుమ్నుని నాయకత్వంలో అక్కడకు రావించాడు. అప్పుడు విందాను విందులు కాశిరాజును, సైంధవుడు భీమసేనుని, వికర్ణుడు సహదేవుని, చిత్రసేనుడు శిఖండిని, దుర్యోధనుడు విరాటుని, త్రిగర్తులు నకులుని, ద్రోణుడు చేకితాన, సాత్యకులను, కృపాచార్యుడు ధృష్టద్యుమ్నుని, అభిమన్యుడు సాళ్వ, కేకయ రాజులను, ధృష్టకేతు, ఘటోత్కచులు నీ కుమారుల తోనూ తలపడ్డారు. యుధిష్టిరుడు శల్యుని ఎదుర్కొన్నాడు.

సమరం సంకులమయినది. అస్త్రశస్త్రములు ఒకటిని ఒకటి తాకి మంటలు చెలరేగుతున్నాయి. రధములను ఢీకొని కిందపడ్డ ఏనుగులు, ఆ ఏనుగులు తమ తొండములో ఎత్తి కిందికి విసిరిన రధములును, గుర్రముల తాకిడికి గాయపడ్డ పదాతి దళములును, చూచి ఖేచరులు కూడా ఖిన్నులయ్యారు.

భీముని పరాక్రమము చూచిన భీష్ముడు అతనిని తన బాణ పరంపరతో నొప్పించాడు. ఇది చూచి సాత్యకి భీమునికి తోడుగా నిలిచాడు. ఉజ్వలమైన వాడి వాడి బాణములను భీష్ముని మీద వేసాడు. భీష్మునికి కోసం వచ్చింది. వెంటనే భీష్ముడు సాత్యకి రధసారధిని

చంపాడు. అప్పుడు సాత్యకి రధము అటు ఇటు ఊగిస లాడింది. రధమునకు కట్టిన గుర్రములు కకావికలయ్యాయి. వికల రధుడైన సాత్యకి మీద బాణములు వేయుటకు ఇష్టము లేక అతనిని విడిచి పెట్టి భీష్ముడు పాండవ వ్యూహమును చించి చెండాడుతున్నాడు.

ఇంతలో విరాటుడు భీష్ముని ఎదుర్కొన్నాడు. మూడు బాణములతో భీష్ముని కొట్టాడు. భీష్ముడు ఆ బాణములను మధ్యలో తుంచి మరల పది బాణములతో విరాటుని కొట్టాడు. భీష్ముని ఎదుర్కొనడానికి అర్జునుడు వచ్చాడు. వెంటనే అశ్వత్థామ అర్జునునికి అడ్డంగా వచ్చాడు. ఆరు బాణములతో అర్జునుని కొట్టాడు. అర్జునుడు నవ్వుతూ అశ్వత్థాము విల్లును విరిచాడు. అశ్వత్థాము వేరొక విల్లును తీసుకొని అర్జునుని మీద శరపరంపర కురిపించాడు. అశ్వత్తామ అస్త్ర శస్త్ర ధాటికి నర నారాయణు లైన అర్జునుడు, కృష్ణుడు బాగా నొ చ్చుకున్నారు. అర్జునుడు కోపించి అశ్వత్థామ ఒళ్లంతా తన బాణములతో కొట్టాడు.

ఇంతలో భీముడు భీష్ముని ఎదుర్కొన్నాడు. భీమునికి సుయోధనుడు అడ్డం వచ్చి అతని మీద ఐదుబాణములు వదిలాడు. భీముని కవచమును ఛేధించాడు. భీమ సుయోధనులు ఘోరంగా పోరాడుతున్నారు. సుయోధనునికి సాయంగా భీష్ముడు, చిత్రసేనుడు,

పురు మిత్రుడు, సాయంగా వచ్చారు. వారిని అభిమన్యుడు సమర్ధ వంతంగా ఎదుర్కొన్నాడు. పురుమిత్రుని మీద ఏడు శరములు, భీష్ముని మీద ఏడు బాణములు, చిత్రసేనుని మీద పది బాణములు ప్రయో గించాడు అభిమన్యుడు. అభి మన్యుడు ఎన్ని బాణములు వేసినను వాటిని మధ్యలోనే త్రుంచి చిత్ర సేనుడు పురుమిత్రుడు అభిమన్యుని మీద బాణవృష్టి కురిపించారు.

అంతట అభిమన్యుడు కోపించి వేసవిలో దావాగ్ని అడవిని కాల్చినట్టు, అత్యంత క్రూరములైన బాణపరంపరను వారి మీద ప్రయోగించాడు. చిత్ర సేనుని విల్లు విరిచాడు. అతని అశ్వములను చంపాడు. ఆ ప్రకారము తన అవిక్ర పరాక్రమును ప్రదర్శిస్తున్న అభిమన్యుని చూచి సుయోధనుని కుమారుడు లక్ష్మణుడు, అభిమన్యుని మీదికి ఉరికాడు.

అభిమన్యుడు ముందు లక్ష్మణుని రధమునకు కట్టిన గుర్రములను చంపాడు. తర్వాత రధ సారధిని చంపాడు. రధమును కూలగొట్టాడు. రధము విరిగిన లక్ష్మణుడు శక్తి బాణమును అభిమన్యుని మీద ప్రయోగించాడు. దానిని మధ్యలోనే తుంచాడు అభిమన్యుడు. లక్ష్మణుని ఒళ్లంతా తూట్లు పడేట్టు బాణములను ప్రయోగించాడు అభిమన్యుడు.

ఇది చూచి కృతవర్మ లక్ష్మణకుమారుని తన రధముమీద ఎక్కించుకొని పక్కకు తీసుకొని వెళ్లాడు. సుయోధనుడు తనసేనలను పోరునకు ఉత్సాహ పరిచాడు. భీష్ముడు కూడా పాండవసేనను తును మాడు తున్నాడు.

సాత్యకి తన శరజాలముతో కౌరవ సేనను చికాకుపరుస్తున్నాడు. ఇది చూ చి సోమదత్తుని కుమారుడు భూరి శ్రవసుడు సాత్యకి తో పోరు కుసిద్ధం అయ్యాడు. భూరిశ్రవసుని ధాటికి ఆగ లేక సాత్యకి సైన్యము పారిపోయింది. అప్పుడుసాత్యకి కుమారులు అమిత పరాక్రమముతో భూరిశ్రవసుని ఎదిరించారు. "భూరిశ్రవసా! నీతో వినోదంగా యుద్ధం చేయడానికి వచ్చాము. చేవ వుంటే నీతో యుద్ధం చెయ్యడానికి మా లో ఒక్కరిని కోరుకో నీ పరాక్రమము తెలుస్తుంది." అని అన్నారు.

ఆ మాటలువిన్న భూరిశ్రవసుడు మీరందరూ ఒక్కుమ్మడి వచ్చినా నాకేం భయం లేదు అన్నాడు. వారందరూ ఒక్కుమ్మడి బాణవర్షము కురిపించారు. ఆ బాణములను అన్ని మధ్యలో విరిచి, భూరిశ్రవసుడు వారిని తన శరపరంపరతో ముంచెత్తాడు. సాత్యకి కుమారులు కూడా వీరోచితంగా పోరాడుతున్నారు. భూరిశ్రవసుడు వారి విల్లులు విరిచి వారి తలలు నరికి భూదేవికి బలి ఇచ్చాడు.

అది చూచి కౌరవ వీరులు హర్షధ్వానములు చేసారు. తన కుమారుల మరణం చూచినసాత్యకి చలించిపోయాడు. ఉగ్రుడయ్యాడు. తన రధాన్ని కౌరవ సేనమీదికి పోనిచ్చాడు. దొరికిన వాడిని దొరికినట్టు తునుమాడుతున్నాడు. భూరిశ్రవసుని రధమునకు కట్టిన హయములను చంపాడు సారధిని చంపాడు. భూరిశ్రవసుడు కూడా సాత్యకి రధమును విరుగగొట్టాడు. ఇద్దరూ నేల మీదికి దుమికారు. చెరి ఒక కరవాలము తీసుకొని యుద్ధం చేస్తున్నారు. ఇంతలో సాత్యకిని భీముడు, భూరి శ్రవసుని సుయోధనుడు తమ తమ రధముల మీద ఎక్కించుకుని పక్కకు తీసుకెళ్లారు.

అర్జునుడు కౌరవ సేన మీదికి దుమికి తన శస్త్రపరంపరతో వారిని ముంచెత్తుతున్నాడు. అర్జునుని అస్త్ర,శస్త్ర ధాటికి కౌరవ సేనలునుగ్గు నుగ్గు అవుతున్నాయి. సూర్యుడు పశ్చిమాద్రికి చేరుకున్నాడు. ఈ రోజుకు యుద్ధము చాలింతము అని భీష్ముడు ప్రకటించాడు. వీరులందరూ తమ తమ శిబిరములకు వెళ్లారు. ఆ ప్రకారము ఐదవ రోజు యుద్ధము ముగిసినది." అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

మరునాటితెల్లవారు జామున అర్జునుడు ధృష్టద్యుమ్నుని పిలిచి మకరవ్యూహము పన్నమని చెప్పాడు. ఆ ప్రకారము ధృష్టద్యుమ్నుడు

మకర వ్యూహము రచించాడు. అర్జునుడు, పాంచాల రాజులు తల వైపు ఉన్నారు. నకుల సహదేవులు కన్నుల మాదిరి నిల్చున్నారు. భీమసేనుడు నోటి దగ్గర, అభిమన్యుడు, ఉపపాండవులు, ఘటోత్కచుడు గండ స్థలము(దవడలు), సాత్యకీ సమేతంగా యుధిష్ఠిరుడు కంఠ భాగమున, ధృష్టద్యుమ్న సహితంగా విరాటుడు వెన్నుభాగమున, కేకయ రాజులు ఎడమ పక్కన, దృష్టకేతుడు, కరూశ రాజు కుడి పక్కన, కుంతిభోజ, శతానీకులు జఘన భాగమున, శిఖండి, ఇరావంతుడు తోకభాగమున, నిల్చున్నారు.

ఈ మకర వ్యూహమునకు దీటుగా భీష్ముడు క్రౌంచ వ్యూహమును పన్నాడు. ముక్కుభాగమున భీష్ముడు, ద్రోణుడు తమ తమ సేనలతో నిల్చున్నారు. కృపాచార్యుడు, అశ్వత్థామ నేత్రముల మాదిరి అమరారు. తల భాగమున కృతవర్మ తన సేనలతో నిల్చున్నాడు. కాంభోజ, బాహ్లికులు కంఠభాగమున నిలబడ్డారు. శూరసేనుడితో సహా సుయోధనుడు కడుపు భాగమున తన సేనలతో మోహరించాడు. సౌవీరునితో సహా భగదత్తుడు వీపు భాగమున, విందానువిందులు ఎడమ పక్కన, సుశర్మ కుడి పక్కన, యవనరాజు, శ్రుతాయువు, భూరిశ్రవసుడు తోక వైపు నిలిచారు. ఇట్టు ఉభయ సైన్యములు తమ తమ సేనలను మోహరించి యుద్ధమునకు సన్నద్ధమయ్యాయి.

శంఖ, భేరి, తూర్యనాదములు మిన్నుముట్టాయి. మకరమునకు తలవైపు జోర బడుచున్న ద్రోణుని చూచి భీముడు తన రధమును అతని మీదికి నడిపాడు. భీముని ధాటికి ద్రోణుని ముందు ఉన్న సేనలు పారి పోయాయి. ద్రోణుడు ఉగ్రుడయ్యాడు. భీముని మేను మీద క్రూరమైన బాణములు నాటాడు. భీముడు ద్రోణుని సూతుని చంపాడు. తానే రధం తోలుకొనుచూ ద్రోణుడు వైరి వీరులను తునుమాడుతున్నాడు. ఇది చూచి భీష్ముడు ద్రోణునికి తోడుగా వచ్చాడు. భీష్మ, ద్రోణుల ధాటికి కేకయ రాజులు భయంతో వెనక్కు తగ్గారు.

ఇది చూచిన భీముడు కౌరసేనలను చావ కొట్టాడు. వారందరూ చాపకట్టు మాదిరి పడిపోతున్నారు. ఒక పక్క సుయోధనుడు, మరొక పక్క ధర్మరాజు తమ తమ సేనలను చేతులు ఆడిస్తూ, ప్రోత్స హిస్తున్నారు. ఇనుమడించిన ఉత్సాహంతో ఇరుసేనలు పోరుతున్నారు." అని సంజయుడు ధృతరాష్టునికి ఆరవ దిన యుద్ధమువివరిస్తున్నాడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు "సంజయా! మన సైన్యములో ఎంతో మంది వీరాధి వీరులు ఉండి కూడా, పాండవులను గెలువ లేకపోవడం దైవ లీల కాకపోతే మరేమిటి చెప్పు. ఇలా జరుగు తుందని నాకు విదురుడు ముందే చెప్పాడు. విదురుడు ఎంత చెప్పినా,

దుర్మార్గుడైన నా కుమారుడు వినలేదు. బుద్ధిఃకర్మానుసారిణి అని అన్నారు కదా ఇదేనేమో! విధికృతము తప్పింప ఎవ్వరి తరము. కానున్నది కాక మానదు కదా! " అని వేదాంత ధోరణిలో మాట్లాడాడు ధృతరాష్ట్రుడు.

ఆ మాటలకు సంజయుడు "మహారాజా! నీ కుమారుడు తెలిసి తెలియని వాడు. యుక్తాయుక్త వివేచన లేని వాడు. అతని గురించి ఎందుకు. నాడు జూదమాడు నాడు మనమందరము ఉపేక్షించ బట్టికదా ఈనాడు ఇంతటి దారుణ యుద్ధము దాపురించినది. ఎవ్వరిని అని ఏమి లాభము. ఇంక పశ్చాత్తాపము పడడం మాని, యుద్ధక్రమము వినమని ప్రార్ధన. " అని సంజయుడు చెప్పసాగాడు.

ఆ సమయంలో భీమసేనుడు కౌరవసేనలో చొచ్చుకొని పోతూ నీ కుమారులు దుశ్శాసనుడు, దుస్సహుడు, జయుడు, జయత్సేనుడు, వికర్ణుడు, చిత్రసేనుడు,సుదర్శనుడు, చారుచిత్రుడు, సువర్మడు, దుష్కరుణుడు ఒక చోట చేరి ఉండటం చూచాడు. వారి మీదికి తన రథం పోనిచ్చాడు. భీముని చూచి, నీ కుమారులు, ఇదుగో భీముడు వచ్చాడు రండి అందరం కలిసి వీడిని చంపేద్దాము అని భీముడిని తమ తమ సైన్యములతో చుట్టుముట్టారు. భీముడు తన రథ సారథిని చూచి నీవు మన రథము ఇక్కడే నిలిపి ఉంచు అని చెప్పి తన గదను తీసుకొని

రథము నుండి కిందికి దూకి  యుగాంతమున యమధర్మరాజు మాదిరి కౌరవ సైన్యమును చంపుతున్నాడు, తన గదతో ఏనుగుల కుంభ స్థలములు మోది చంపుతున్నాడు. రథములను నుగ్గు నుగ్గు చేస్తున్నాడు. హయములను చంపుతున్నాడు.  అందరితోనూ తాను ఒక్కడే రథము దిగి యుద్ధము చేస్తున్నాడు.

అప్పటి దాకా ద్రోణుని తో యుద్ధము చేసి అలసి పోయిన ధృష్ట ద్యుమ్నుడు భీముడు యుద్ధము చేయుచున్న ప్రదేశమునకు వచ్చాడు. భీముడు లేని రథము చూచాడు. ఖిన్నుడయ్యాడు. భీముని రథసారథి విశోకుని చూచి  ఏమయింది? భీముడ  ఎక్కడ ఉన్నాడు? అతడు నా ప్రాణానికి ప్రాణం. అతడు లేకుండా నేను బతకలేను. తొందరగా చెప్పు అని అడిగాడు. మహారాజా! అడుగో భీముడు రథం దిగి  ఒంటరిగా కౌరవులతో యుద్ధం చేస్తున్నాడు. నన్ను ఇక్కడే ఉండమన్నాడు అని చెప్పాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు భీముని దగ్గరకు వెళ్లాడు. భీమసేనా! నేను నీకు సాయంగా ఉన్నాను.  నీ పరాక్రమము చూపించు. నేను కూడా వీరిని నుగ్గునుగ్గుచేస్తాను అని కౌరవుల మీద పడ్డాడు.

అది చూచి నీ కుమారుడు సుయోధనుడు  " ఈ ధృష్టద్యుమ్నుని వదలకండి చంపండి అని ఎలుగెత్తి అరిచాడు. వెంటనే కౌరవ కుమారులు

ఒక్కుమ్మడి ధృష్టద్యుమ్నుని చుట్టుముట్టారు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు తనకు గురువైన ద్రోణుడు ప్రసాదించిన ప్రమోహనము అనే అస్త్రమును ప్రయోగించాడు. కురు కుమారులు అందరూ మూర్ఛపోయారు. అప్పుడు భీముడు పక్కనే ఉన్న మడుగు వద్దకు పోయి అందు లో ఉన్న జలములతో దాహం తీర్చుకున్నాడు. మరల వచ్చి ధృష్టద్యుమ్నుని కలుసుకున్నాడు.

ఇంతలో ద్రోణుడు తనతో యుద్ధం చేస్తున్న ధృష్టద్యుమ్నుడు పక్కకు తప్పుకున్న తరువాత, పాంచాలరాజు ద్రుపదుడు ద్రోణుని తో తల పడ్డాడు. కాని ద్రోణుని బాణముల ధాటికి ఆగలేకపోయాడు. పక్కకు తప్పుకున్నాడు. తన వద్దనుండి తప్పుకున్న ధృష్టద్యుమ్నుడు ఎక్కడ ఉన్నాడా అని చూచాడు ద్రోణుడు. అప్పుడు చూచాడు తమ సేనలన్ని ప్రమోహన బాణ ప్రభావంతో మూర్ఛపోయారు అని. వెంటనే అక్కడకు తన రథం పోనిమ్మన్నాడు. ప్రమోహన బాణమునకు విరుగుడుగాప్రజ్ఞాస్త్రమును ప్రయోగించి అందరిని మూర్ఛనుండి విముక్తులను చేసాడు. మూర్ఛనుండి తేరుకున్న నీ కుమారులు, ద్రోణాచార్యులు తమకు అండగా ఉండటం చూచి, వారి వారి సైన్యములతో మరల భీముని మీదికి, ధృష్టద్యుమ్నుని మీదికి ఉరికారు.

ఈ సమయంలో యుధిష్ఠిరుడు, కేకయ రాజులు ఐదుగురు, ఉపపాండవులను, ధృష్టకేతుని చూచి మీరందరూ అభిమన్యుడితో కలిసి మీ మీ సైన్యములతో ధృష్టద్యుమ్నునికి, భీమునికి సాయంగా పొండి అని అరిచాడు. వెంటనే వారందరూ భీమునికి సాయంగా వెళ్లారు. వీరందరి సాయంతో భీముడు కౌరవ సేనను పాద చారియై తన గదాయుధంతో ఊచకోత కోస్తున్నాడు.

ద్రోణుడు పాండవ సైన్యము మీద శరవర్షము కురిపిస్తున్నాడు. ధృష్టద్యుమ్నుని విల్లు విరిచాడు. అతను మరొక విల్లు తీసుకున్నాడు. దానిని కూడా విరిచాడు ద్రోణుడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు అభిమన్యుని రథము మీదికి ఎక్కాడు. అది చూచి పాండవ బలములు వెనక్కు తిరిగాయి. ఇంతలో సుయోధనుడు భీముని మీదికి వచ్చాడు. ధృష్టద్యుమ్నుని సారథి మరొక రథమును తీసుకొని వచ్చాడు. ధృష్ట ద్యుమ్నుడు అందులోకి ఎక్కాడు. మరల ద్రోణుని తో యుద్ధం చేస్తున్నాడు.

ఇంతలో విశోకుడు తన రథమును అక్కడకు తీసుకొని రాగా, భీముడు కూడా తన రథమును ఎక్కాడు. సుయోధనుని మీద బాణవర్షము కురిపించాడు. సుయోధనుడు కూడా భీముని తన శరములతో ముంచెత్తాడు. నీ కుమారులు ఎలాగైనా భీముని పట్టుకొన

వలెనని ఉత్సాహంగా ముందుకు కదిలారు. ఇది చూచి అభిమన్యుడు, ఉపపాండవులు,ధృష్టకేతువు, కేకయరాజులు కలిసి నీ కుమారులను ఎదుర్కొన్నారు. భీముడు కూడా వారితో కలిసి నీ కుమారులను, వారి సైన్యమును తరిమి తరిమి కొట్టారు.

భీముని ధాటికి ఆగలేక నీ కుమారులు పారి పోతుంటే, "వీళ్లందరూ ఈ రోజు నా చేతిలో చచ్చారు!" అంటూ తరుముతున్నాడు భీముడు. ఇది చూచిన సుయోధనుడు తన సైన్యమును భీమాదులను ఎదుర్కొమ్మని పురి కొల్పాడు. అప్పటికి అపరాహ్ణము అయింది. భీమ సుయోధనుల మధ్య పోరు ఘోరంగా సాగుతూ ఉంది.

ఆ సమయంలో మరొక రంగమున వికర్ణుడు, చిత్రసేనుడు కలిసి అభిమన్యుని మీదికి కవిసి పడ్డారు. అభిమన్యుడు వికర్ణుని రధమునకు కట్టిన హయములను చంపాడు. అతని మీద 20 బాణములు ప్రయో గించాడు. వికర్ణుడు తన రధము దిగి భయంతో చిత్రసేనుని రధం మీదికి ఎక్కాడు. ఇరువురు పారిపోయారు. ఇంతలో ఉప పాండవులు ఐదుగురు భీమునికి అడ్డంపడి, సుయోధనుని తాకారు. సుయోధనుని శరీరం రక్తసిక్తం చేసారు. 5 బాణములతో రారాజును కొట్టారు.

గాంగేయుడు పాండవ సేనలను నుగ్గునుగ్గు చేస్తుంటే అర్జునుడు గాంగేయునితో పోరుతున్నాడు. రక్తం ఏరులుగా పారుతూ ఉంటే యోధవరులు తమ తమ బాహబలము ప్రకాశింపగా యుద్ధం చేస్తున్నారు. ఇంతలో సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకుంటున్నాడు. వాయునందనుడైన భీముడు ఈ రోజు ఎలాగైనా సుయోధనుని సంహరించవలెనని తలంపుతో సుయోధనుని ఎదురుగా నిల్చి

" సుయోధనా! ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమయం భగవంతుని దయవలన నేడు ఆసన్నం అయింది. కుంతీదేవి దుఃఖము, ఆమె కోడలు ద్రౌపది పగ తీరే సమయం వచ్చింది. నాడు శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు నీవు వినలేదు. పైగా ఉలూకుని పంపి పరుషమైన మాటలాడించావు. ఆ మాటలన్ని ఈ రోజు నీతో కక్కిస్తాను. నా పరాక్రమము చూపిస్తాను. చేవ ఉంటే నిలబడి నీ మగతనం చూపించు." అని పలుకుతూ భీముడు అత్యంత వేగంతో సుయోధనుని రధమునకు కట్టిన హయములను, రధసారధిని చంపాడు. సుయోధనుని విల్లు విరిచాడు. సుయోధనుని కేతనమును నరికాడు. సుయోధనుడు వేరే విల్లు తీసుకొనే లోపల సుయోధనుని శరీరంలో పది బాణములు నాటాడు. సుయోధనునికి శరీరంలో నుండి రక్తం ఉబికింది. మూర్ఛవచ్చినట్టయింది.

ఇంతలో జయద్రధుడు తన సైన్యముతో వచ్చాడు. కృపాచార్యుడు సుయోధనుని తన రధంమీద ఎక్కించుకొని పక్కకు తీసుకొని పోయాడు. అభిమన్యుడు, ఉపపాండవులు, భీమునితో కలిసి సైంధవునితో తలపడ్డారు. చిత్రసేనుడు, చిత్రుడు, చిత్రాక్షుడు, చారు త్రుడు, సులోచనుడు, నందుడు, ఉపనందుడు రౌద్రముతో అభి మన్యునితో పోరాడుతున్నారు. అత్యంత బలవంతుడైన అభిమన్యుడు ఒక్కొక్కరిని ఐదేసి బాణములతో కొట్టాడు. వారి శరీరములు రక్తసిక్తము లైనాయి.

ఇంతకు ముందే రధము విరిగిన వికర్ణుడు మరొక రధము అధిరోహిం చి తన సోదరులకు సాయంగా వచ్చాడు. అభిమన్యుడు వికర్ణుని విల్లు తుంచాడు. సారధిని చంపాడు. హయములను చంపాడు. వికర్ణుని కేతనమును విరిచాడు ఇది చూ చి కురు కుమారులు ఒక్కుమ్మడిగా అభిమన్యునితో తలపడ్డారు. ఉపపాండవులు ఐదుగురు అభిమన్యునికి అడ్డంగా వచ్చి కురుకుమారులను ఎదుర్కొన్నారు. వారి కేతనములన్ని తుంచారు. వారి మీద బాణవర్షము కురిపించారు. నీ కుమారులు వారి ధాటికి ఆగలేకపోయారు.

ఆ సమయంలో నకులుని కుమారుడు శతానీకుడు తన సైన్యముతో కేకయ, పాంచాల రాజులకు సాయంగా వచ్చాడు. వారితో కలిసి కౌరవ సేనలను తునుమాడుతున్నాడు. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. భీష్ముడు ఆ రోజుకు యుద్ధం చాలించమని అనుజ్ఞ ఇచ్చాడు. ఇరు పక్షముల సైన్యములు తమ తమ శిబిరములకు మరలాయి.

ఈ ప్రకారము సంజయుడు ఆరవ దినము జరిగిన యుద్ధ విశేషములను ధృతరాష్ట్రునకు ఎరింగించాడు. అని వైశంపాయనుడు జనమేజయునకు మహా భారత కధను సవిస్తరంగా చెప్పాడు.

మహాభారతము, భీష్మ పర్వము,

ద్వితీయ ఆశ్వాసము సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహా భారతము

## భీష్మ పర్వము

## తృతీయాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు మహాభారత కధను ఈ విధంగా చెప్ప సాగాడు.

ఆరవ రోజు యుద్ధములో తన కుమారుడు దెబ్బతినడం, మూర్ఛిల్లడం విన్న ధృతరాష్ట్రుడు తీవ్రమైన ఖేదమును పొంది సంజయునితో తరువాత ఏమి జరిగినది అని అడిగాడు. దానికి సంజయుడు ఇలా చెప్ప సాగాడు.

" మహారాజా! ఆ రోజు రాత్రి నీ కుమారుడు సుయోధనుడు తాత భీష్ముని వద్దకు పోయి "పితామహా! పాండవుల బలములు రోజు రోజుకూ రెచ్చిపోతున్నాయి. ఈ రోజు నీ ఎదుటనే నేను భీముని చేతిలో మూర్ఛ పోయి భంగపడ్డాను. ఇంతకన్న అవమానము నాకు ఏమి కలదు? కుంతీ తనయులను గెలవడానికి నిన్నే నమ్ముకున్నాను. నీవు యుద్ధములో దేవతలను కూడా జయిస్తావని అంటారు. కాని పాండువు

లను ఏమీ చెయ్యలేక పోతున్నావు. మరి వారికి ఇంత బలము ఎలా వచ్చిందో తెలియడం లేదు." అని అన్నాడు.

దానికి భీష్ముడు "సుయోధనా! నన్ను నిందించెద వేలనయ్యా. నేనేమన్నా యుద్ధము చెయ్యకుండా ఊరుకున్నానా! నా రథం చూడగానే ఎన్ని సార్లు శత్రుసైన్యము వెన్నిచ్చి పారిపోలేదు! నీకు ఎప్పటి నుండియో చెపుతున్నాను. పాండవులను గెలవడం అంత సులభం కాదు అని. కాని నా మాట నీవు పెడచెవిని పెట్టావు. అయినా నీవు వగవకుము. నీకు విజయం కలిగేట్టు పోరాడతాను." అని అన్నాడు.
ఆమాటలతో ఊరట చెందిన సుయోధనుడు తన శిబిరమునకు పోయి ఆ రోజు నిద్రించాడు.

మరునాడు ఉదయం కురు సైన్యము, పాండవ సైన్యము బారులు తీర్చాయి. భీష్ముడు కౌరవ సైన్యముతో మండల వ్యూహమును పన్నాడు. సుయోధనుడు తన సైన్యముతో వ్యూహ మధ్యమున నిలిచాడు. నీ కుమారులు అతనికి ఇరుపక్కల నిలిచారు.

యుధిష్టిరుడు మన మండల వ్యూహమును పరికించి, తన సేనా పతి ధృష్టద్యుమ్నుని పిలిచి వజ్రవ్యూహమును పన్నమని చెప్పాడు.

ఇరు పక్షములు యుద్ధమునకు సన్నద్ధమైనాయి. తూర్యనాదములు మిన్నుముట్టాయి. ఒకరితో ఒకరు తలపడ్డారు. ద్రోణుడు విరాటుని, అశ్వత్థామ శిఖండిని, దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుని, మద్రపతి శల్యుడు నకులసహదేవులను, విందానువిందులు యుధామన్యుని, పెక్కుమంది రాజులు అర్జునుని మార్కొన్నారు. పోరు ఘోరంగా జరుగుతూ ఉంది.

భీమసేనుడు కృతవర్మను; అభిమన్యుడు చిత్రసేన, దుశ్శాసన, వికర్ణులను; ఘటోత్కచుడు, భగదత్తుని; సాత్యకి అలంబసుని; ధృష్ట కేతుడు భూరిశ్రవసుని; చేకితానుడు కృపాచార్యుని; ధర్మరాజు శ్రుతా యువును, పలువురు రాజులు భీష్ముని, యుద్ధంలో ఎదు ర్కొన్నారు.

అర్జునుడు తన మీదకు వచ్చిన యోధులపై తన రెండు హస్తము లతో గాండీవము నుండి శర వర్షము కురిపించాడు. వారలం దరూ ఒక్కపెట్టున చెలరేగారు. కృష్ణార్జునులను తమ బాణము లతో ముంచె త్తారు. అది చూచి నీ కుమారులందరూ జయజయ ధ్వానాలు చేసారు. అప్పుడు అర్జునుడు కోపించి మహేంద్ర అస్త్రమును ప్రయోగించాడు. ఆ అస్త్రము కౌరవ వీరులు ప్రయోగించిన శరములను చించి చెండా డింది. వారి రథములకు కట్టిన హయములను చంపింది. మంధర

పర్వతము పాలసముద్రమును చిలికినట్టు కౌరవ బలములను మహేం ద్రాస్త్రము కలచి వేసింది. ఆ మహేంద్రాస్త్ర ధాటికి తట్టుకోలేక కౌరవ యోధులందరూ భీష్ముని వెనక చేరారు.

త్రిగర్తాధీశుడు మొదలగు రాజులు తమ తమ సైన్యములతో పక్కలకు పారిపోతున్నారు. భీష్ముడు ఒక్కడే తన రధమును అర్జునుని మీదికి పోనిచ్చాడు. ఇది చూచాడు సుయోధనుడు. " కౌరవ యోధు లారా! ఏమిటిది! మీరు పారిపోతున్నారా! తాత భీష్ములు ఒంటరిగా పోరాడుతుండగా మీరు చూస్తూ ఉంటారా! మీలాంటి మనుషులను నేను ఇంతవరకూ చూడలేదు. వెళ్లండి. భీష్మునికి తోడుగా నిలవండి." అని అరిచాడు. అప్పుడు రోషం తెచ్చుకొని కురుయోధులు భీష్మునికి ఇరు పక్కల చేరి ఆయనకు తోడుపడ్డారు.

మరొక చోట ద్రోణుడు విరాటుని విల్లును, ధ్వజమును రెండు బాణములతో విరిచాడు. విరాటుడు మరొక విల్లు తీసుకున్నాడు. ద్రోణుని శరీరములో మూడు బాణములను దించాడు. ద్రోణుని రధ సారధిని చంపాడు. మరొక నాలుగు బాణములతో ద్రోణుని విల్లు విరిచాడు. ద్రోణుడు కోపంతో ఊగిపోయాడు. ఎనిమిది బాణములతో విరాటుని రధాశ్వములను ఖండించాడు. రధమును కూల్చాడు.

విరాటుడు వెంటనే తన కుమారుడు శంఖుని రధము అధిరోహించాడు. తన కుమారుని తో కలిసి ద్రోణుని మీద శర వర్షము కురిపించాడు. ద్రోణుడు వెంటనే ఒక దివ్యాస్త్రం సంధించి విరాటుని కుమారుడు శంఖుని కొట్టాడు. ఆ బాణము అతని గుండెలను చీల్చుకుంటూ వెళ్లింది. విరాటుని కుమారుడైన శంఖుడు విల్లు అమ్ములు విడిచి పెట్టి రధము మీద కూలిపోయాడు. మరణించాడు.

తన కుమారుని మరణం చూచిన విరాటుడు తన సైన్యముతో సహా అక్కడ నుండి పారిపోయాడు. అది చూచిన శిఖండి, అశ్వత్థామ ఫాల భాగమున మూడు క్రూరమైన బాణములు నాటాడు. అశ్వత్థామ కోపించి శిఖండి వేసిన బాణములను మధ్యలో తుంచి, తన బాణపరంపరతో శిఖండి రధమునకు కట్టిన హయములను, సూతుని చంపాడు. విల్లును, రధమునకు కట్టిన కేతనమును విరిచాడు. శిఖండి రధమునుండి కిందికి దుమికి ఒక ఖడ్గమును తీసుకొని అశ్వత్థామ వేయు బాణములను తన కరవాలముతో త్రుంచుతున్నాడు. అది చూచి అశ్వత్థామ శిఖండి పట్టు కున్న కత్తిని విరగ గొట్టాడు. శిఖండి వెంటనే పక్కనే ఉన్న సాత్యకి రధం ఎక్కాడు.

మరొక రంగమున, ధృష్టద్యుమ్నుడు సుయోధనుని మీద శర వర్షం కురిపించాడు. నీ కుమారుడు, సుయోధనుడు, వాటిని మధ్య లోనే ఖండించి, అతి క్రూరమైన బాణములను ధృష్టద్యుమ్నుని మీదికి ప్రయోగించాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు సుయోధనుని విల్లు విరిచాడు. సుయోధనుడు మరొక విల్లు తీసుకునే లోపల ఆ విల్లు కూడా విరిచాడు. అతని రధాశ్వములను చంపాడు. రధం విరగ్గొట్టాడు. సుయోధనుడు తన కరవాలము తీసుకొని నేల మీదికి దుమికాడు. ధృష్టద్యుమ్నుని మీదికి ఉరికాడు. అప్పుడు శకుని సుయోధనుని తన రధం మీదికి ఎక్కించుకొని పక్కకు తీసుకెళ్లాడు.

సాత్యకి అలంబసుని మీద అతి క్రూరమైన బాణప్రయోగము చేసాడు. అప్పుడు రాక్షసవీరుడు అలంబసుడు అర్ధ చంద్రబాణముతో సాత్యకి విల్లు విరిచాడు. సాత్యకి శరీరం అంతా తూట్లు పడేట్టు బాణములను వదిలాడు. అప్పుడు సాత్యకి ఇంద్రాస్త్రమును ప్రయోగించాడు. అలంబసుని మాయలు మటుమాయం చేసాడు. అలంబసుని ముప్పుతిప్పలు పెట్టాడు. సింహనాదం చేసాడు. అలంబసుడు అక్కడనుండి పారిపోయాడు. అంతట సాత్యకి కురుబలముల మీద విరుచుకుపడ్డాడు.

మరొక రంగమున  కృతవర్మ భీమసేనుని తో యుద్ధానికి దిగాడు. భీముడు కృతవర్మ రథమునకు కట్టిన హయములను చంపాడు. సారధిని చంపాడు. రథం విరగ్గొట్టాడు. కృతవర్మ ఒళ్లంతా బాణములతో ముంచెత్తాడు. అప్పుడు కృతవర్మ వృషకుని రథము ఎక్కాడు. భీమసేనుడు కృతవర్మను వదలి, తన రథమును మహా వేగంతో కౌరవ సేనల మీదికి పోనిచ్చాడు."

అని చెప్పిన సంజయుని చూచి ధృతరాష్ట్రుడు "సంజయా! నువ్వు ఎప్పుడూ  కౌరవ సేనల రథములు విరిగాయి, కౌరవులు చచ్చారు అని మన వాళ్ల గురించే చెపుతావు. మరి పాండవుల బలములలో ఏమాత్రం తరగు లేనట్టు వారు విజయులైనట్టు  మాట్లాడతావు. ఇది ఏమి మాయ?" అని అన్నాడు వ్యంగంగా.

దానికి సంజయుడు "మహారాజా! కౌరవ బలములు కూడా వారి వారి శక్తి మేరకు యుద్ధం చేస్తున్నాయి. కాని సముద్రములోనికి చొచ్చుకొని పోయిన నదుల వలె, పాండవ బలముల ధాటికి తాళలేకున్నారు. వెనక్కు మరలుతున్నారు. అది వాళ్ల తప్పు కాదు. నీవు చేసిన తప్పుకు, దాని వలన వాటిల్లిన చేటుకు,  ఇప్పుడు శోకించి ప్రయోజనము లేదు.

యుద్ధము జరిగిన విధము చెప్పెదను. అవధరింపుము.” అని మరల యుద్ధ విశేషములను చెప్పసాగాడు.

“అవంతీ దేశాధీశులగు విందానువిందులను యుధామన్యుడు తన శరపరంపరతో కప్పివేసాడు. అనువిందుని రధమును విరగ్గొట్టాడు. అనువిందుడు విందుని రధం ఎక్కాడు. అప్పుడు యుధామన్యుడు విందుని రధ సారధిని ఒక బాణంతో కొట్టాడు. సారధి చనిపోగానే, రధమునకు కట్టిన హయములు చెల్లాచెదరయ్యాయి. వారి సైన్యము కూడా కకావికలయింది.

మరొక చోట, భగదత్తుని ధాటికి పాండవున సేనలు వెను దిరి గాయి. అప్పుడు ఘటోత్కచుడు రంగంలోకి దిగి తమ సేనలకు ధైర్యం చెప్పాడు. అతనిని చూచి మరల పాండవుల సేనలు యుద్ధోన్ముఖు లయ్యాయి. ఘటోత్కచుడుభగదత్తుని మీద శరవర్షము కురిపించాడు. తన మీద ప్రయోగించిన బాణములు అన్ని భగదత్తుడు విరిచాడు. పదు నాలుగు బాణములతో ఆ అసురుని కొట్టాడు. అతని రధం విరి చాడు. అప్పుడు ఘటోత్కచుడు శక్తిని ప్రయోగించాడు. భగదత్తుడు ఆ శక్తిని మధ్యలోనే తుంచాడు. ఘటోత్కచుని తన బాణములతో నొప్పిం చాడు.

భగదత్తుని ధాటికి ఆగలేక ఘటోత్కచుడు పారిపోయాడు. అంతట భగదత్తుడు తన గజముతో పాండవ సైన్యము మీద విరుచుకు పడ్డాడు.

మరొక రంగమున శల్యుని మీద నకుల సహదేవులు శరవృష్టి కురిపించారు. అప్పుడు శల్యుడు బెదరక నకులుని రథం విరగ్గొట్టాడు. నకులుడు సహదేవుని రథము ఎక్కాడు. అప్పుడు సహదేవుడు ఒక క్రూరమైన బాణమును ప్రయోగించాడు. ఆ బాణము శల్యుని తాకి అతనిని మూర్ఛిల్ల చేసింది. శల్యుడు రథం లో పడిపోయాడు. అప్పుడు శల్యుని రథ సారధి తన రథమును పక్కకు తీసుకుని వెళ్లాడు. అది చూచి నకులసహదేవులు సింహనాదం చేసారు. శంఖములుపూరించారు.

అప్పటికి మధ్యాహ్నం అయింది. మరొక చోట యుధిష్టిరుడు శ్రుతాయువు మీద తొమ్మిది అమ్ములు ప్రయోగించాడు. శ్రుతాయువు వాటిని మధ్యలోనే తుంచి, ఏడు బాణములను యుధిష్టిరుని మీద వదిలాడు. ధర్మరాజుకు కోపం వచ్చింది. వరాహ కర్ణ మును పోలి ఉన్న నారాచము తో శ్రుతాయువు వక్షస్థలముచీల్చాడు. మరొక బాణముతో అతని జండా విరగ్గొట్టాడు. శ్రుతాయువు ఏడు బాణములతో ధర్మజుని నొప్పించాడు. ధర్మజుడు మహోగ్ర కోపమున శ్రుతాయువు రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. అతని విల్లువిరిచాడు. కేతనమును

ఖండించాడు. అతని శరీరం రక్తమయం చేసాడు. అప్పుడు శ్రుతాయువు భీతుడయి పారిపోయాడు.  అది గమనించిన  కౌరవ సేనలు కకావిక లయ్యాయి. పాండవ యోధుల జయజయధ్వానాలు మిన్నుముట్టాయి.

మరొక చోట చేకితానుడు, కృపాచార్యుడు ఒకరి మీద  ఒకరువిజృం భించారు.  చేకితానుడు కృపాచార్యుని పై నిశితమైన శరములు గుప్పిం చాడు. చేకితానుని విల్లు విరిచాడు. రథాశ్వములను చంపాడు. చేకి తా నుడు తన గదను తీసుకొని రథము దిగి  కృపాచార్యుని రథము విర గ్గొట్టాడు. రథమునకు కట్టిన హయములను చంపాడు.  అప్పుడు కృపా చార్యుడు   16  నిశితమైన బాణములతో చేకితానుని కొట్టాడు. చేకి తానుడు తన గదను కృపాచార్యుని మీదికి విసిరాడు. కృపాచార్యుడు ఆ గదలను మధ్యలోనే ఖండించాడు. వెంటనే చేకితానుడు తన రథము నుండి దిగి ఒక వాడియైన ఖడ్గమును తీసుకున్నాడు.  అది చూచి కృపా చార్యుడు కూడా ఒక ఖడ్గమును తీసుకొని చేకితానుని మీదికి దూకాడు. ఒకరితో ఒకరు ఖడ్గ యుద్ధము చేసుకొని ఇరువురూ మూర్ఛిల్లారు. అది చూచి కౌరవబలములోనుండి శకుని, పాండవుల బలములలో నుండి కరకర్షణుడు వచ్చి ఆ  ఇరువురిని తమ తమ రథముల మీద ఎక్కించు కొని ఆవలకు తీసుకొని వెళ్లారు.

మరొక చోట ధృష్టకేతుడు భూరిశ్రవసుడు ఘోరంగా యుద్ధం చేస్తున్నారు. ధృష్టకేతుడు తొమ్మిది బాణములను భూరిశ్రవసుని మీద ప్రయోగించాడు. భూరిశ్రవసుడు దానికి ప్రతిగా ధృష్టకేతుని రథ మునకు కట్టిన హయములను చంపాడు. అతని శరీరముపై కరకు టమ్ములను ప్రయోగించాడు. ధృష్టకేతువు ఇంక పోరాడలేక కొంచెం దూరంలో నున్న శతానీకుని రథం మీదకు ఎక్కి వేరొక చోటికి వెళ్లాడు.

మరొక చోట అభిమన్యునకు, దుశ్శాసన, వికర్ణ, చిత్రసేనులకు మధ్య మహాయుద్ధం జరిగింది. అభిమన్యుడు వారందరి రథములు విరగ్గొట్టాడు. కాని వారిని చంపలేదు. భీముని కోసం అట్టిపెట్టాడు. ఇది చూచిన భీష్ముడు అనేక మంది రాజులతో కూడి అక్కడికి వచ్చి దుశ్శాస నునికి సాయంగా అభిమన్యునితో యుద్ధం చేస్తున్నాడు. అప్పుడు అభిమన్యుడు ఒంటరి వాడయ్యాడు.

ఇది చూచి అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా! భీష్మునితో సహా మహా యోధులందరూ ఒకే చోట ఉన్నారు. మన రథమును అక్కడకుపోనిమ్ము. " అన్నాడు. వెంటనే కృష్ణుడు తమ రథమును భీష్ముని వద్దకు తీసుకొని వెళ్లాడు. కాని మధ్యలోనే త్రిగర్త దేశాధీశుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. అతనిని చూచి అర్జునుడు

"తమరు కౌరవ సేనలో కల్లా మేటి యోధులని విన్నాము. ఈ రోజు తమరు నాతో భయపడకుండా యుద్ధం చెయ్యాలి. " అని అన్నాడు. వెంటనే అతని మీద శరవర్షముకురిపించాడు. అది చూచిన కౌరవ సైన్యము పార్ధుని మీదికి ఒక్కపెట్టున ఉరికింది. పాండవ బలములు కూడా అర్జునునికి తోడుగా కౌరవ బలములతో పోరుకుతల పడ్డాయి. పోరు ఘోరమయింది. అప్పుడు అర్జునుడు తన నిశిత బాణములతో కౌరవ వీరుల రధముల కు కట్టిన హయములను చంపాడు. రధములను విరగ్గొట్టాడు. కేతనములను విరిచాడు. వారి విల్లులను విరగ్గొట్టాడు. యుద్ధరంగమంతా యధేచ్ఛగా విహరిస్తున్నాడు.

ఇంతలో సాయంత్రం అయింది. అప్పుడు త్రిగర్తాధీశుడు తన చక్రరక్షకులు 32 మందిని అర్జునుని మీదికి పంపాడు. వారందరినీ అర్జునుడు 64 బాణములతో సంహరించాడు. అది చూచి త్రిగర్తాధీశుడు సుశర్మ తానే స్వయంగా అర్జునునితో తలపడ్డాడు. ఇంతలో శిఖండి మొదలగు వీరులు వారి మధ్యకు వచ్చి సుశర్మను ఎదుర్కొన్నారు.

తనకు ఎదురుగా దుర్యోధనుడు, సైంధవుడు ఉన్నప్పటికినీ వారిని క్రీగంటితో చూచుచూ, వారి జోలికి పోకుండా భీష్ముని మీదికి తన రధం పోనిమ్మన్నాడు అర్జునుడు. తన మీదికి వచ్చుచున్న శల్యుని తో యుద్ధం

చేయకుండా యుధిష్ఠిరుడు, భీముడు, నకుల సహదేవులతో కూడి, పార్థునికి సాయంగా వెళ్లాడు. ఆ ప్రకారము తన మీదికి వచ్చిన పాండవు లతో పోరుతున్నాడు భీష్ముడు.

ఇంతలో నీ కుమారుడు సుయోధనుడు, సైంధవునితో కలిసి పాండవుల మీదికి దూకాడు. శలుడు, శల్యుడు, చిత్రసేనుడు, కృపా చార్యునితో కలిసి పాండవులతో తలపడ్డారు. ఇంతలో శిఖండి మధ్యలో దూరి భీష్మునికి ఎదురుగా నిలబడ్డాడు. భీష్ముడు వాడితో యుద్ధం చెయ్యడం ఇష్టం లేక శిఖండి విల్లును మాత్రం తుంచి పక్కకు పోయాడు. ఇది చూచిన యుధిష్టిరుడు "శిఖండీ! భీష్ముని చంపుతాను అన్న నీ ప్రతిజ్ఞ మరిచావా! భీష్ముని తో యుద్ధం చెయ్యి. " అని అరిచాడు. ఆ మాటలు విన్న శిఖండి భీష్ముని మీద బాణ వర్షం కురిపించాడు. అది చూచిన శల్యుడు  శిఖండి మీద ఆగ్నేయాస్త్రము ప్రయోగించాడు. దానికి జంకక శిఖండి దానికి విరుగుడుగా శల్యుని మీద వరుణాస్త్రము ప్రయోగించాడు.

భీష్ముడు ధర్మతనయుని విల్లును తుంచాడు. కేతనమును విరిచాడు. అది చూచి భీముడు రథము దిగి తన గద తీసుకొని సుయోధనుని మీదికి వెళ్లాడు. ఈ సమయమున సైంధవుడు మహా

రౌద్రముతో 500 వాడియైన బాణములు భీముని మీద ప్రయోగించాడు. భీముడు వాటిని లక్ష్యపెట్టక తన గదతో వాటిని చూర్ణము చేసాడు. సైంధవుని గుర్రములను చంపాడు. రధం విరిచాడు. వెంటనే సైంధవుడు వేరొక రధం ఎక్కిపారిపోయాడు. అతని వెంట కౌరవ సైన్యముకూడా పారిపోసాగారు.

ఇది చూచిన సుయోధనుడు తన సైన్యమును పారిపోవలదని వారిస్తూనే, భీముని తో తలపడ్డాడు. ఇంతలో చిత్ర సేనుడు మధ్యలో వచ్చి భీముని మీద తన శక్తి బాణమును ప్రయోగించాడు. భీముడు తన గదను చిత్రసేనుని మీదికి విసిరాడు. ఆ గద ఆ శక్తి బాణమును ఖండించి ఆకాశంలో గిరా గిరా తిరుగుతుంటే అది తమ మీద పడు తుందేమోనని కౌరవ సైనికులు భీతి చెందారు. రారాజు మాటకూడా వినకుండా పారిపోసాగారు. ఆ గద తన మీదికి రావడం చూచిన త్రసేనుడు రధం మీది నుండి దిగి పారిపోయాడు. తరువాత ఆగద చి త్ర సేనుని రధమును, గుర్రములను పొడి పొడి చేసింది. ఆప్రకారం పారిపోతున్న చిత్రసేనుని తన రధం మీదికి ఎక్కించుకొని పారిపోయాడు వికర్ణుడు.

భీష్ముడు పాండవాగ్రజుని రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. అతని శరీరం నిండా బాణపరంపరకురిపించాడు. ధర్మనందనుడు కోపించి శక్తి బాణమును ప్రయోగించాడు. భీష్ముడు దానిని తుంచాడు. ధర్మనందనుడు పక్కనే ఉన్న నకుల సహదేవుల రథము మీదికి ఎక్కాడు. భీష్ముడు నకుల సహదేవుల మీద శరసంధానము చేసాడు. వారిని నొప్పించాడు. ధర్మరాజు తన సైన్యములో గల రాజులను భీష్మునితో పోరవలసినదని ఆదేశించాడు. పాండవ సైన్యము ఒక్కపెట్టున భీష్మునితో తలపడింది. భీష్ముడు ఏమాత్రం జంకక, పాండవ సైనికుల శిరములు తాటి పండ్ల వలె ఖండించాడు. పాండవ సైన్యములో యధేచ్చగా విహరిస్తూ పాండవ సేనలను నిర్మూలిస్తున్నాడు. పాండవులు ఆశ్చర్యంతో చూస్తున్నారు.

ఇంతలో శిఖండి భీష్మునికి ఎదురుగా పోయి అతని మీద అతి క్రూరమైన అస్త్రములు ప్రయోగించాడు. వాటిని లక్ష్యపెట్టక భీష్ముడు అతని ముఖము కూడా చూడకుండా మరొక దిక్కుగా తిరిగి పాండవ సైన్యమును తునుమాడుతున్నాడు.

యుద్ధ రంగమున మరి యొక చోట సాత్యకి, ధృష్టద్యుమ్నుడు కలిసి కురు సేనలను తునుమాడుతున్నారు. వారిని విందాను విందులు

ఎదుర్కొన్నారు. ధృష్టద్యుమ్ముని రధమునకు కట్టిన గుర్రములను చంపారు. విరధుడైన ధష్టద్యుమ్నుడు సాత్యకి రధము ఎక్కాడు. ఇది చూచి ధర్మజుడు తన బలములతో వారికి సాయంగా వచ్చాడు. రారాజు తన సేనలకు ధర్మరాజును ఎదుర్కొనమని చేతితో సైగ చేసాడు. తాను కూడా భీష్ముడు, ద్రోణుని తో సహా ధర్మరాజును ఎదుర్కొన్నాడు.

ధర్మజునికి అర్జునుడుసాయంగా వచ్చాడు. ద్రోణుడు అర్జునుని మీద క్రూరమైన బాణములు ప్రయోగించాడు. ఇది చూచిన కౌరవ సేనలు ఇనుమడించిన ఉత్సాహంతో పాండవుల సేనల మీదికి దుమికాయి. ధర్మరాజు తన సేనలకు ధైర్యము చెపుతూ రణమునకు పురికొల్పాడు. ఇరు పక్షములు ఘోరంగా యుద్ధం చేస్తున్నాయి.

ఇంతలో సాయంత్రం అయింది. సూర్యుడు పడమటి దిక్కున అస్తమించాడు. త్రిగర్తాధీశుడు సుశర్మను, సైంధవుడు మొదలగు రాజ ప్రముఖులను ఓడించి సవ్యసాచి, ధర్మజునకు ఆనందం కలిగించాడు. భీమసేనుడు అన్నగారైన అర్జునునకు బాసటగానిలిచి కురువీరులను తునుమాడాడు. ఆ రోజుకు యుద్ధం విరమించవలసినదని ధర్మరాజు ఆదేశించాడు. వెల్లివిరిసిన ఆనందోత్సాహాలతో పాండవులు తమ తమ శిబిరములకు వెళ్లారు. నీ కుమారుడు కూడా యుద్ధం విరమించాడు.

అందరూ తమ తమ స్కంధావారములను చేరుకున్నారు. ఆ ప్రకారము ఏడవ నాటియుద్ధము ముగిసినది." అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

ఎనిమిదవ రోజున భీష్ముడు కూర్మ వ్యూహమును పన్నాడు. (కూర్మము అనగా తాబేలు. టార్టాయిస్) వేగుల వలన ఆ సమాచారము తెలుసు కున్న ధర్మతనయుడు ధృష్టద్యుమ్నుని చూచి "భీష్ముడు కూర్మ వ్యూహము పన్నాడు. దానికి ప్రతి వ్యూహము ఏది అని ఆలోచించండి. " అని అడి గాడు. కౌరవ వ్యూహమునకు ప్రతిగా ధృష్టద్యుమ్నుడు శృంగా టక వ్యూహము పన్నాడు.

ఇరు పక్షముల సైన్యములు తమ తమ వ్యూహ ములతో ఎనిమిదవ రోజు యుద్ధమునకు సన్నద్ధమయ్యాయి. భేరి మృదంగ ధ్వానాలు మిన్ను ముట్టాయి. యుద్ధం మొదలయింది. రథములు, ఏనుగులు, హయ ములు, కాల్బలము రణరంగ లో విహరిస్తుంటే రేగిన దుమ్ము ఆకాశం అంతటిని కప్పివేసింది. భీష్ముడు సింహనాదం చేసాడు. పాండవ సైన్యము లో కి చొచ్చుకుని పోయి వీరవిహారం చేస్తున్నాడు. భీష్ముని పరాక్రమానికి ఆగలేక పాండవ సైన్యాలు పలాయనమయ్యాయి.

అది చూచి భీమ సేనుడు ఆగ్రహంతో భీష్ముని ఎదుర్కొన్నాడు. ఒకే ఒక్క బాణంతో భీష్ముని సారధిని చంపాడు. భీష్ముని రధమునకు కట్టిన అశ్వములు పట్టుదప్పి తమ ఇష్టం వచ్చినట్లు పరుగెత్తాయి. అది చూచి పాండవ వీరులు, సైనికులు జయజయధ్వానాలు చేసాయి. ఆ సమయ ములో నీ కుమారుడు సునాభుడు అమిత మైన పరాక్రమంతో భీమ సేనుని ఎదుర్కొన్నాడు. భీమసేనుడు కోపంతో ఒకే ఒక్క బాణంతో సునాభుని తల నరికాడు. భీకరంగా సింహనాదం చేసాడు.

అది చూచి ఖిన్నులైన నీ కుమారులు ఆదిత్యకేతుడు, అపరా జితుడు, బహ్వాసి, పండితుడు, కుండధారుడు, విశాలాక్షుడు, మహోదరుడు, ఒక్కుమ్మడిగా భీమసేనుని మీద పడ్డారు. తమ తమ బాణములతో భీమసేనుని శరీరమును కొట్టారు. భీమసేనుడు జంక కుండా, వారి మీద, అతి క్రూరమైన బాణములు ప్రయోగించాడు. అర్ధ చంద్రాకార బాణములతో వారి నందరిని యమసదనమునకు పంపాడు.

ఇది చూచిన నీ కుమారులు "భీమసేనుడు నాడు కురుసభలో చేసిన భీషణ ప్రతిజ్ఞ ఈ రోజే నెరవేర్చు కుంటాడేమో!" అను కున్నారు. "విదురుని పలు కులు సత్యములు అవుతున్నాయి." అని మనసులో తల్చుకున్నారు. భీమసేనుని ధాటికి నిలువలేక పారిపోయారు.

సుయోధనుడు తన చుట్టు ఉన్న కురు వీరులను చూచి వారి నందరినీ భీమసేనునితోయుద్ధం చేయండని పురికొల్పాడు. వడివడిగా భీష్ముని వద్దకు పోయి "పితామహా! చూచితిరా! భీమసేనుడు నా తమ్ముల నందరిని చంపుతూ ఉంటే మీరు చూస్తూ ఊరుకుంటారా! మీలో ఒక్కరికీ పౌరుషం రాలేదా! మిగిలిన నా తమ్ములను కూడా ఒక్కుమ్మడిగి చావగోరి ఈ ప్రకారం మౌనం వహించారా!" అని వాపోయాడు. సుయోధనుని దుఃఖమును చూచి భీష్ముడు కూడా చలించిపోయాడు.

" సుయోధనా! నీకు ముందే చెప్పానుకదా. పాండవులను జయించుటకు ఆ పరమేశ్వరుని కైనా సాధ్యం కాదని. నీ తమ్ములలో ఎవరు భీమ సేనునికి ఎదురుపడ్డా వారిని రక్షించడం నా కే కాదు ఎవరికీ సాధ్యంకాదు. దీని గురించి శోకించి ప్రయోజనము లేదు. ఇంక మనకు మిగిలింది ఒకటే మార్గము. యుద్ధంలో మరణిస్తే వీర స్వర్గలోకప్రాప్తి కలుగుతుంది అనే ఆశతో పోరాడాలి. మా శక్తి కొలదీ మేము పోరాడతాము. విజయము మనలనే వరించవచ్చుకదా! " అని పలికాడు భీష్ముడు." అని చెప్పాడు సంజయుడు.

సంజయుని మాటలు విన్న ధృతరాష్ట్రుడు "అయ్యో! ఎంతటి దురవస్థ దాపురించినది. భీష్మ,ద్రోణులు  ఉండి కూడా నా కుమారులు దారుణంగా భీమసేనుని చేతిలో మరణించారే!  ఏం చేస్తాం. నేను చెప్పిన మాటలు వినకుండా సుయోధనుడు తన తమ్ముల చావును కొని తెచ్చుకున్నాడు. సంజయా! గతజలసేతుబంధనమేల గాని తరువాత జరిగిన విశేషములు వివరింపుము." అని దుఃఖంతో అడిగాడు.

సంజయుడు ఎనిమిదవ నాటియుద్ధవిశేషములు ఇలా చెప్ప సాగాడు. "ఆ ప్రకారము కురుకుమారుల మరణమును చూచిన భీష్ముడు కోపోద్రిక్తుడయ్యాడు. భీమసేనుని మీదికి తన రధమును పోనిచ్చాడు.  ఇది చూచిన ధర్మనందనుడు చేయి ఊపి ధృష్టద్యుమ్నుని, శిఖండిని, సాత్యకిని, భీమునికి సాయంగా  అక్కడికి రమ్మని సైగ చేసాడు. వారందరూ వెంటనే అక్కడికి చేరుకున్నారు. సుయోధనునితో ప్రేరేపింప బడిన రధికులు అర్జునుని ఎదుర్కొన్నారు.  చేకితానుడు, ద్రౌపదీ కుమారులు సాయం రాగా, అర్జునుడు వారందరి మీద విరుచుకుపడ్డాడు.

మరొక పక్క అభిమన్యుడు, భీమకుమారుడు ఘటోత్కచుడు కౌరవ సేనను తునుమాడుతున్నారు. ద్రోణాచార్యుడు త్ర విచిత్ర రీతులతో తన రధమును నడిపించుచూ ద్రుపదుని సేనలమీద

శరవర్షము కురిపిస్తున్నాడు. భీమసేనుడు కౌరవ సేనలో గల గజ బలమును తన నిశిత శరములతో నేల కూలుస్తున్నాడు. నకుల సహదేవులు మహా పరాక్రమంతో తమ తమ కరవాలములతో కౌరవుల ఆశ్విక సైన్యమును మట్టుపెడుతున్నారు.

ఈ సమయంలో అర్జునుని కుమారుడు ఇరావంతుడు (నాగ కన్య ఉలూచి కుమారుడు) తన ఆశ్వి క దళంతో కౌరవ సైన్యమును చుట్టుముట్టాడు. అది చూచిన శకుని తమ్ములు ఆరుగురు, శుకుడు, శర్మ వంతుడు, వృషకుడు, ఆర్జవుడు, గజుడు, గవాక్షుడు, అను వారలు తమ తమ ఆశ్విక బలములతో ఇరావంతుని ఎదుర్కొన్నారు. వారి మధ్యపోరు ఘోరంగా సాగుతూ ఉంది. వారు ఇరావంతుని గుర్రమును చంపారు. అప్పుడు ఇరావంతుడు తన అశ్వము మీది నుండి కిందికి దుమికి తన కరవాలముతో యుద్ధం చేస్తున్నాడు. శకుని తమ్ములు కూడా తమ తమ అశ్వముల మీది నుండి కిందికి దిగి యుద్ధం చేస్తున్నారు. ఇరావంతుడు చిత్ర వి చి త్ర గతులతో కత్తిని తిప్పుతూ వారి ఖడ్గ ప్రహారములను ఎదుర్కొంటున్నాడు. అదును చూచి ఆ ఆరుగురు శకుని తమ్ములను పన్నెండు ముక్కలుగా నరికాడు ఇరా వంతుడు.

ఇది చూచిన సుయోధనుడు రాక్షస వీరుడు అలంబసుని చూచి "అలంబసా! వీడు  ఈరోజు మన కురుసైన్యమును పూర్తిగా నాశనం చేసేట్టు ఉన్నాడు. నీవువెంటనే వాడిని ఎదుర్కొని హతమార్చు! " అని చెప్పాడు. అప్పుడు రాక్షస వీరుడైన అలంబసుడు ఇరావంతుని అశ్వ సేనకు సమాంతరంగా మరొక అశ్వసేనను సృష్టించాడు.  రెండు ఆశ్వికదళాలు ఒకదానితో ఒకటి తలపడ్డాయి. రెండు   ఆశ్విక దళాలు నశించి పోయాయి.

ఇరావంతుడు ఒంటరిగా పోరుతున్నాడు.  అలం బసుని ఖడ్గము, విల్లు విరిచాడు. అలంబసుడు ఆకాశంలోకి ఎగిరాడు.  మాయాయుద్ధం మొదలెట్టాడు. తన మాయాశరములతో  ఇరావంతుని కొట్టాడు. ఇరావం తుడు కూడా అతనికి దీటుగా ఆకాశంలోకి ఎగిరాడు. అలంబసునితో మాయా యుద్ధం చేస్తున్నాడు. తన  వాడియైన బాణము లతో ఇరావం తుడు అలంబసుని తలను ఖండించాడు. కాని అలంబసుడు చావలేదు. ఇరావంతుడు, తన తల్లిని, తాతగారిని తల్చుకున్నాడు. భయంకరమైన విషనాగులను సృష్టించాడు. ( ఇరావంతుడు నాగరాజు మనుమడు, నాగ దేవత ఉలూచికి, అర్జునునికి జన్మించిన నాగ  కుమారుడు.)  అది చూచిన అలంబసుడు తాను డేగ రూపం ధరించాడు. ఆ విషనాగుల

నన్నింటిని చంపాడు. వెంటనే నిజాకృతి ధరించాడు. ఒకే ఒక వేటుతో ఇరావంతుని శిరస్సు ఖండించాడు. ఇరావంతుడు చనిపోయాడు.

అప్పటికి మధ్యాహ్నం అయింది. ఇరావంతుని మరణము చూచిన ఘటోత్కచుడు తన రాక్షస సైన్యముతో కౌరవ సేన మీద విరుచుకు పడ్డాడు. తన శూలాయుధంతో గజ, అశ్వ, పదాతి దళములను గుచ్చి పైకెత్తి, నేలకేసి బాదుతున్నాడు. అందరినీ మూకుమ్మడిగి చంపు తున్నాడు. ఇది చూచిన సుయోధనుడు, వంగ దేశాధిపతి, తమ తమ గజసైన్యములతో ఘటోత్కచుని ఎదుర్కొన్నారు. ఆ గజబలమును చూచి ఘటోత్కచుడు పొంగిపోయాడు. భుజములు చరిచాడు. ఒక కరవాల ముతో ఆ ఏనుగుల తొండములను, దంతములను, శిరములను ఖండిస్తున్నాడు. సుయోధనుని గజబలమును నాశనం చేస్తున్నాడు.

ఇది చూచి సుయోధనుడు తానే రణరంగములోకి దిగాడు. తన అత్యంత పదునైన బాణములతో ఘటోత్కచుని ప్రధాన అనుచరులైన వేగవంతుడు, విద్యుజ్జిహ్వుడు, బహ్వాసి మొదలగు వారిని చంపాడు. ఘలోత్కచుని శరీరాన్ని తన వాడి బాణములతో కప్పివేసాడు. ఘటో త్కచుడు కూడా ఒక విల్లు తీసుకొని సుయోధనుని మీద శర వర్షము కురిపించాడు.

సుయోధనుని చూచి "సుయోధనా! నాడు నిండుసభలో సత్యము, ధర్మము మరిచిపోయి, పాండవులను, మా తల్లిగారు ద్రౌపదిని అవమానించావు. దానికి ప్రతిఫలము ఇప్పుడే నేను నీకు అనుభవింప చేస్తాను." అని నల్లతాచులను పోలిన బాణములను సుయోధనుని మీద ప్రయోగించాడు. వాటిని మధ్యలోనే త్రుంచి, సుయోధనుడు 20 ఉగ్రమైన శరములను ఘటోత్కచుని మీద ప్రయోగించాడు. అప్పుడు ఘటోత్కచుడు అత్యంత శక్తివంతమైన శక్తి ఆయుధాన్ని సుయోధనుని మీద ప్రయోగించాడు. అప్పుడు వంగదేశాధిపతి ఆ శక్తి ఆయుధాన్ని అడ్డుకున్నాడు. కాని ఆ ఆయుధము వంగరాజు గజమును చీల్చింది. వంగరాజు నేల మీదికి దూకి పారిపోయి తనప్రాణాలు కాపాడుకున్నాడు.

ఇది చూచి అతని సైన్యము హాహా కారాలు చేసారు. అందరూ తలా ఒక దిక్కుకు పారిపోయారు. కాని సుయోధనుడు ఒక్కడే ఘటోత్కచుని ధైర్యంతో ఎదుర్కొన్నాడు. తాను నేర్చిని అన్ని అస్త్ర, శస్త్రములను ప్రయోగించాడు. కాని అవి అన్నియూ ఘటోత్కచుని మాయాబలము ముందు వ్యర్థములైనాయి. అప్పుడు సుయోధనుడు ఘటోత్కచుని మీద ఒక మహాస్త్రమును ప్రయోగించాడు. దానిని ఘటోత్కచుడు ఆకాశంలేనే పొడిపొడి చేసాడు. విజయోత్సాహంతో సింహనాదము చేసాడు.

అది విన్న భీష్ముడు సుయోధనుడు ఆపదలో ఉన్నాడని గ్రహించాడు. వెంటనే గొంతెత్తి "ఘటోత్కచుడు దేవతలకు కూడా అజేయుడు. అతని బారి నుండి సుయోధనుని రక్షించండి. " అని అరిచాడు. ఆ కేకలు విన్న ద్రోణుడు, అశ్వత్థామ, కృపా చార్యుడు, చిత్రసేనుడు, బృహద్బలుడు, బాహ్లికుడు, అవంతీనాధుడు, భూరి శ్రవసుడు, సైంధవుడు, సోమదత్తుడు, వివింశతి, వికర్ణుడు, ఒక్కుమ్మ డిగా తమ తమ సైన్యములతో రధములు తోలుకొనుచూ నీ కుమారుని చుట్టు రక్షణగా నిలిచారు. వారందరూ ఘటోత్కచునితో యుద్ధం చేస్తున్నారు.

వారిని చూ చి ఘటోత్కచుడు రెట్టించిన ఉత్సాహంతో వారందరి మీద తన నిశిత శరములు ప్రయోగిస్తున్నాడు. వారి యొక్క రధ సారధు లను చంపాడు. విల్లులు విరిచాడు. రధములను విరగ్గొట్టాడు. ఆ ప్రకా రము ఆ అతిరధ మహారధులను చికాకు పరిచాడు. అప్పుడు ద్రోణా చార్యులు మొదలగు 12 మంది అతిరధ మహారధులు ఒక్కుమ్మడిగా ఘటోత్కచుని చుట్టుముట్టారు. మహాస్త్రములు ప్రయోగించారు. ఘటోత్కచుడు ఆకాశానికి ఎగిరాడు. అక్కడనుండి మాయాయుద్ధం చేస్తున్నాడు.

ఇది చూచాడు ,దర్మనందనుడు. "భీమసేనా! ఇక్కడ అర్జునుడు భీష్మునితో యుద్ధం చేస్తున్నాడు. నీవు వెళ్లి ద్రోణాచార్యునితో యుద్ధం చేస్తున్న ఘటోత్కచుని రక్షింపుము." అని చెప్పాడు. వెంటనే భీమ సేనుడు సింహనాదం చేసుకుంటూ తన కుమారుడైన ఘటోత్కచుని వైపు పరుగెత్తాడు.అప్పుడు సుయోధనుడు ఒక అర్ధ చంద్ర బాణమును ఘటోత్కచుని మీద ప్రయోగించాడు. భీముని చేతిలోని ధనుస్సును ఖండించాడు. మరొక క్రూరమైన నారాచముతో భీముని వక్షస్థలముమీద కొట్టాడు. ఆ దెబ్బకు భీమసేనుడు కొంచెంసేపు దిమ్మెరపోయాడు.

అది చూచిన ద్రౌపదీసుతులు సుయోధనుని ఎదుర్కొన్నారు. ఇంతలో అభిమన్యుడు, ఘటోత్కచుడు వారికి సాయంగా వచ్చారు. అందరూ కలిసి సుయోధనుని మీద నిశితమైన శర వర్షము కురిపించారు. కృపాచార్యుడు, బాహ్లికుడు, భూరిశ్రవసుడు మొదలగు కురు వీరులు పాండుకుమారులను ఎదుర్కొన్నారు. ఇంతలో భీమసేనుడు తేరుకున్నాడు. మరల శత్రుసేనల మీదికి లంఘించాడు. ద్రోణుడు తన వాడి శరములతో భీమసేనుని ముంచెత్తాడు. భీముడు ఒక క్రూరమైన నారాచమును ద్రోణుని గుండెలకు గురి పెట్టి కొట్టాడు. ఆ శరముల ధాటికి ద్రోణుడు మూర్ఛపోయాడు.

తండ్రి అవస్థ చూచి అశ్వత్థామ, సుయోధనుడు తమ తమ బలగములతో ద్రోణుని కి సాయంగా వచ్చారు. భీమసేనుని ఎదుర్కొ న్నారు. భీముని మీద అత్యంత శక్తివంతము లైన బాణములను ప్రయో గించారు. భీముడు తన గద తీసుకొని రధము నుండి కిందికి దుమి కాడు. అశ్వత్థామ, సుయోధనుడు వేస్తున్న బాణములను తన గదతో ఛిన్నాభిన్నం చేసాడు.

ఇంతలో ద్రోణాచార్యుడు మూర్ఛ నుండి లేచాడు. వెంటనే తన ధనుస్సు తీసుకొని భీమసేనుని మీద శర పరంపర కురిపించాడు. ఇది గమ నించి న ఘటోత్కచుడు, అభిమన్యుడు, ద్రౌపదీసుతులు, భీమ సేనునికి సాయం వచ్చారు. భీమసేనుని మిత్రుడైన నీలుడు అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. కాని అశ్వత్థామ తన వాడి యైన బాణములతో నీలుని తీవ్రంగా గాయపరిచాడు. ఇది చూచిన ఘటోత్కచుడు అశ్వత్థామ మీద శరవర్షము కురిపించాడు. ద్రోణుడు తన అతి క్రూరమైన బాణములతో ఘటోత్కచుని నిలువెల్లా కొట్టాడు.

ఇలా కాదని ఘటోత్కచుడు మాయా యుద్ధం ప్రారంభించాడు. తన అపూర్వమైన శక్తితో సుయోధనుడు, కృపాచార్యుడు, ద్రోణుడు,

మొదలగు వారు తన బాణఘాతములకు తీవ్రంగా గాయపడి, నెత్తు రోడుతూ మూర్ఛపోయినట్టు తన మాయాశక్తితో కౌరవ సేనలకు కని పించేట్టు చేసాడు. అది నిజమని భ్రమపడిన కురు సైన్యము భయపడి పారిపోయారు. అది చూచిన భీష్ముడు "నిలవండి! ఇదంతా రాక్షస మాయ. ఎవరూ గాయపడలేదు. అంతా క్షేమంగా ఉన్నారు." అని అరుస్తూ కౌరవ సైన్యమును హెచ్చరించాడు. భీష్ముని మాటలు ఎవరూ విన లేదు. యుద్ధభూమిని విడిచి పారిపోసాగారు.

ఇదంతా వీక్షించిన సుయోధనుడు దీనమైన మొహంతో భీష్ముని వద్దకుపోయి "పితామహా! మీరు, ద్రోణాచార్యులు రణరంగమున పోరాడు తుండగనే నాకు ఇంత అవమానము జరిగినది. ఇంతకన్న తలవంపులు ఏముంటుంది. కాబట్టి నేను ఒంటరిగా పాండవులతో పోరాడుతాను. విజయమో, వీరస్వర్గమో తేల్చుకుంటాను." అని అన్నాడు.

"సుయోధనా! పాండవులంతటి వారిని నీవు ఒక్కడివీ ఎలా ఎదుర్కొంటావు. అయినా ఈరాక్షసమాయలు ఎదుర్కొనడానికి మేము లేమా! నీవునిశ్చింతగా ఉండు." అని పలికి భగదత్తుని పిలిచి

"భగదత్తా! ఈ అసుర మాయలు నీ దగ్గర పని చెయ్యవు. నీవు పోయి ఘటోత్కచుని ఎదుర్కొనుము." అని చెప్పాడు.

భీష్ముని మాటలకు భగదత్తుడు పొంగిపోయాడు. సుప్రతీకము అను తన ఏనుగును ఎక్కి, తన సేనలతో ఘటోత్కచుని ఎదుర్కొన్నాడు. ఇది చూచిన కౌరవ బలములు ధైర్యము తెచ్చుకొని పారిపోకుండా వెనుకకు మరలాయి. ఉభయ సైన్యములు పోరుకు తలపడ్డాయి. అపరాహ్ణాము అయింది. కొండమాదిరి ఉన్న తన ఏనుగును ఎక్కి ఘటో త్కచుడు భగదత్తుని మీద యుద్ధానికి తలపడ్డాడు.

ఆ సమయం లో భీమసేనుడు, అభిమన్యుడు, ద్రౌపదీసుతులు కలిసి ఘటోత్కచునికి తోడుగా నిలబడ్డారు. ఘటోత్కచుడు తన భల్లముల వంటి బాణము లతో భగదత్తుని ఏనుగును గాయపరిచాడు. మరొక శూలమును భగ దత్తుని మీద ప్రయోగించాడు. దానిని భగదత్తుడు మధ్యనే తుంచాడు. భగదత్తుడు ఘటోత్కచుని రథమునకు కట్టిన హయములను చంపాడు. అభిమన్యుడు, ద్రౌపదీ పుత్రుల మీద శరవర్షము కురిపించాడు. వారి యొక్క హయములను చంపాడు. రథములను విరగ్గొట్టాడు. వారి సైన్యమును హతమార్చాడు. మంధర పర్వతము పాలసముద్రములో తిరుగుతున్నట్టు, భగదత్తుడు తన

సుప్రతీకము మీద పాండవుల సేనలో కలయతిరుగుతూ వారిని చంపుతున్నాడు భగదత్తుడు. సుప్రతీకమను ఆ గజము తనకు అడ్డము వచ్చిన సైనికులను, గుర్రములను, గజములను తన కాళ్ల కింద పడేసి తొక్కుతూ యథేచ్ఛగా రణరంగములో విహరిస్తూ ఉంది. ఈ ప్రకారము భగదత్తుడు యుద్ధం చేస్తుంటే, అతనికి తోడుగా సుయోధనుడు, ద్రోణుడు, కృపాచార్యుడు, మొదలగు రధికులు తోడుగా నిల్చి వీర విహారం చేస్తున్నారు. వారి ధాటికి పాండవ వీరులు తట్టుకోలేక పోతున్నారు.

ఇది చూచాడు ధర్మతనయుడు. తన సేనలకు చెయ్యి ఊపి ప్రోత్సహిస్తూ అర్జునునితోనూ, పాంచాల భూపతి తోనూ కలిసి కౌరవ యోధులను ఎదుర్కొంటున్నాడు. అర్జునుడు తన దేవదత్తమును పూరించుచూ, గాండీవముతో ధనుష్టంకారము చేయుచూ కౌరవ సేనల మీద శరపరంపర కురిపిస్తున్నాడు. అప్పుడు అతని వద్దకు భీముడు వచ్చి" ఇరావంతుడు చనిపోయాడు." అని చెప్పాడు. ఖిన్నుడయ్యాడు పార్థుడు. "ఇరావంతుడు ఎక్కడ పడి ఉన్నాడు." అని అడిగాడు. భీముడు దారి చూపగా ఇరావంతుడు పడి ఉన్న చోటికి వెళ్లాడు అర్జునుడు.

తలతెగి నేలమీద పడి ఉన్న ఇరావంతుని చూచాడు అర్జునుడు. అతని శోకం కట్టలు తెంచుకుంది. కళ్లనిండా నీళ్లునిండాయి. సుయో, దనుని అవినీతి, ధర్మతనయుని సంధి ప్రయత్నములు, సుయోధనుని మూర్ఖత్వము తలుచుకొని బాధపడ్డాడు.

ఆ ప్రకారము పుత్రశోకముతో అలమటించు చున్న అర్జునుని వంక చూచాడు కృష్ణుడు. చిరు నవ్వు నవ్వాడు. అర్జునునికి కృష్ణుని ఆంత ర్యము అర్ధం అయింది. "నా నోటి వెంట అత్యంత గుహ్యమైన యోగ శాస్త్రము విని ఎనిమిది రోజులు కూడా కాలేదు. అప్పుడే ఈ విషాదం ఏమిటి! " అని అడిగినట్టుంది. వెంటనే కళ్లు తుడుచుకున్నాడు అర్జునుడు.

" పరంధామా! నీ నోటి వెంట గీతాశాస్త్రము విన్నది మొదలు సుఖదుఃఖాలు, రాగద్వేషాలు వదిలేసాను." అని మనసులో అనుకొని "కృష్ణా! మన రథమును రణరంగమునకు పోనిమ్ము. నా కర్తవ్యం నేను నిర్వర్తించాలి. " అని అన్నాడు. కృష్ణుడు నవ్వు కుంటూ రథమును కౌరవ సేనలమీదికి పోనిచ్చాడు. అర్జునుడు శత్రువీరుల మీద బాణ పరంపర కురిపించాడు. అప్పుడు భగదత్తుడు, కృపాచార్యుడు, త్రిగర్తా

ధీశుడు, భీష్మునితో కూడుకొని అర్జునుని ఎదిరించారు. అర్జునుని మీద శరసంధానము చేసారు.

ఇంతలో సాత్యకి వారి మధ్యకు వచ్చాడు. కృతవర్మ, బాహ్లీకుడు సాత్యకిని ఎదుర్కొన్నారు. భీమసేనుని ద్రోణుడు ఎదుర్కొన్నాడు. నీ కుమారుడు ద్రోణునికి సాయంగా నిలబడి భీమసేనునితో పోరాడు తున్నాడు. ద్రోణుడు, సుయోధనుడు వేసిన బాణములను మధ్యలోనే తుంచి, భీమసేనుడు వారిని తన నిశితములైన బాణములతో నొప్పించాడు. ఆ శరముల ధాటికి, నీ కుమారులైన కుండభేధి, అనాధృష్యుడు, కనకధ్వజుడు, విరావి, సుబాహుడు, దీర్ఘబాహుడు, దీర్ఘ లోచనుడు, దీర్ఘ నిద్రపొందారు (మరణించారు). నీ మిగిలిన కుమారులు భీమసేనుని ధాటికి ఆగలేక పారిపోయారు.

భీమసేనుడు కౌరవ సేనలో ప్రవేశించి అందరిని దొరికిన వారిని దొరికినట్లు హతమారుస్తున్నాడు. ఇది చూచిన సుయోధనుడు, భయము చెందక, తన సేనలను ప్రోత్సహిస్తూ, భీమసేనుని మీదికి దూకుతున్నాడు. కాని భీమసేనుని పరాక్రమము చూసిన పాండవ సేనలు విజృంభించి కౌరవ సేనలను చించి చెండాడుతున్నాయి. రణభూమిలో నెత్తురు కాలువలు కట్టి పారుతూ ఉంది. చనిపోయిన వీరుల ఆభరణ

ములతో రణభూమి ప్రకాశించింది. ఇంతలో చీకటి పడింది. ఇరు పక్షముల వారు రణము చాలించి తమ తమ నెలవులకు వెళ్లారు.

తన తమ్ముల మరణంతో ఎంతో కలత చెందాడు సుయోధనుడు. ఎనిమిదవ రోజు రాత్రి సుయోధనుడు తన నివాసనమునకు కూడా పోకుండా, దుశ్శాసనుని పిలిచి వెంటనే శకునిని, కర్ణుని పిల్చుకొని రమ్మని చెప్పాడు. దుశ్శాసనుడు వెంటనే కర్ణ, శకునిలతో సహా సుయోధనుని వద్దకు వచ్చాడు. ఏకాంతంలో సుయోధనుడు వారితో ఇలా అన్నాడు.

"తాత భీష్ముడు, గురువులు, ద్రోణుడు, కృపాచార్యుడు, తటస్థంగా ఉన్నారు. పాండవులను చంపడానికి వారందరూ వెనుకాడు తున్నారు. పాండవుల సైన్యమునకు నష్టం కలిగించడం లేదు. కాని మన సైన్యము మాత్రం నానాటికి నశించి పోతూ ఉంది. ఇప్పుడు మనము ఏమి చెయ్యాలి? " అని అడిగాడు.

ఆ మాటలు విన్న కర్ణుడు రణక్రీడా లంపటుడై "సుయోధనా! ఇంక భీష్ముని యుద్ధమునకు రావలదని చెప్పు. నేను రణరంగప్రవేశము చేసి పాండవులను, వారి సేనల యొక్క మదము అణుస్తాను." అని అన్నాడు. ఆ మాటలు విన్న సుయోధనుడు "దుశ్శాసనా! పద పోదాం.

తాత గారి వద్దకు పోయి ఈ విషయము చెపుదాము." అని దుశ్శాసనునితో కలిసి భీష్ముని నివాసమునకు వెళ్లాడు. కర్ణుడు, శకుని తమ తమ నివాసములకు వెళ్లారు.

పితామహుని పాదములకు నమస్కరించి పక్కనే ఉన్న ఆసనము మీద కూర్చున్నాడు సుయోధనుడు. "పితామహా! నిన్ను ఎంతగానో నమ్ముకొని, నేను పాండవులతోయుద్ధమునకు తలపడ్డాను. కాని మీరు యుద్ధము చేయు విధానము తెలియక దిక్కులు చూస్తున్నాను. యుద్ధ రంగమున మీరు దేవ దానవులనైనను ఎదిరింపగలరు. కాని గత ఎనిమిది రోజులనుండి మీరు పాండవ వీరులతో యుద్ధం చేస్తున్నారు. కాని ఒక్కరినీ చంపడం లేదు. కనీసం అర్జునుడు కూడా చావలేదు. కాని నా తమ్ముళ్లు మాత్రం రోజుకు పదిమంది చస్తున్నారు. ఇంతకు మించి మీకు నేను ఏమీ చెప్ప లేను. కాబట్టి మిమ్మల్ని ప్రార్థి స్తున్నాను. తమరు యుద్ధము నుండి తప్పుకుంటే మంచిది. తమరు రణరంగమునుండి విరమించి కర్ణునికి యుద్ధంచేసే అవకాశం ఇవ్వండి. " అని ప్రార్థించాడు.

వాడియైన బాణముల మాదిరి ఉన్న సుయోధనుని వాగ్బాణములు విన్న భీష్ముడు మనసులో ఎంతో నొచ్చుకున్నాడు. కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాడు. గాఢంగా నిట్టూర్పు విడిచాడు. సుయో ధనుని చూచి

ఇలా అన్నాడు. "సుయోధనా! అర్జునుడు సామాన్యుడు కాడు. ఇంద్రుని జయించి ఖాండవ వన దహనం చేయించాడు. శివునితో హోరాహోరి పోరాడి ఓడించాడు. పాశు పతం సాధించాడు. నిన్ను, నీ వారిని గంధ ర్వుడు పట్టి బంధించి నపుడు, ఈ కర్ణుడు నిన్ను వదలి పారిపోయి నపుడు, ఆ గంధర్వుని గర్వమణిచి నిన్ను విడిపించినది ఈ అర్జునుడే కదా! ఈ అర్జునుడు, నిన్ను, నన్ను, ద్రోణుని, కృపుని, కర్ణుని జయించి సమ్మోహి తు లను చేసి, గోవులను తోలుకు పోయిన సంగతి అప్పుడే మరిచి పోయావా! ఇంకా విజయుని విజయ పరం పరలు ఎన్నో విన్నాము కదా!

ఈ ఎనిమిది రోజులు నేను నా శాయ శక్తులా యుద్ధం చేసాను. కాని నీ నోటి వెంట ఇలాంటి మాటలు వింటున్నాను. ఇది నీకు తగని పని అని కూడా తలచ కుండా పాండవులతో పగ పూనావు. ఇంక వట్టి మాటలు కట్టి పెట్టి నీ ప్రతాపము పాండవుల మీద చూపించు. ఇంకా చెపుతున్నాను. నేను గాండీవిని రణములో గెలువ లేను. శిఖండిని చంపడం నా వల్ల కాదు. వీళ్లు ఇద్దరు తప్ప వేరు ఎవరు నన్ను ఎదిరించినా వారిని ప్రాణాలతో వదిలిపెట్టను. నేను నా సైన్యముతో కలిసి ద్రుపదుని, విరాటుడు, యాదవులను, వారి సైన్యముతో పోరాడతాను. మీరంతా పాండవులను, వారి పుత్రులను, వారి సైన్యమును మీ పరాక్ర

మంతో గెలవండి. అంతేకాని ఈ ప్రకారము అర్ధ రాత్రి వచ్చి నన్ను ములుకుల వంటి మాటలతో బాధ పెడితే నీకు జయం కలుగు తుందా! వేయి మాటలేల. రేపు నా పరాక్రమాన్ని చవి చూస్తావు. ఇంక వెళ్లు. ” అన్నాడు భీష్ముడు.

భీష్ముని మాటలకు మనసులో సంతసించి సుయోధనుడు తన నివాసమునకు వెళ్లాడు. మరునాడు అందరూ తొమ్మిదవ రోజు యుద్ధ మునకు సిద్ధమయ్యారు. భీష్ముని చూపించి నీ కుమారుడు సుయో ధనుడు కౌరవ యోధులతో ఇలా అన్నాడు. “మహా యోధులారా! పాంచాల దేశాధీశులతో సహా అందరి రాజులను సంహరిస్తానని, పాండ వులను యుద్ధభూమిలో గెలుస్తానని నిన్నరాత్రి భీష్ముడు నాతో పలికాడు. మనమందరము ఆయన మాట నెరవేర్చవలెను.” అని వ్యంగంగా అన్నాడు. అతడు ఆడిన తులువ మాటలు విన్న భీష్ముడు కోపించాడు కాని మనసులోనే అణచుకున్నాడు.

ఇది గమనించిన సుయోధనుడు దుశ్శాసనుని చూచి “మీరు అందరూ తాతగారి దగ్గర ఉండి ఆయనను జాగ్రత్తగా కాపాడండి. అతనికి సాయంగా 22,000 రధికులను ఉంచండి. ” అని ఆజ్ఞాపిం చాడు. తరువాత సుయోధనుడు ద్రోణుడు, కృపాచార్యులు, అశ్వత్థామ

ను చూచి "మహామహులారా! నిత్యసత్యవ్రతుడగు భీష్ముడు శిఖండి పై యుద్ధము చేయనని ప్రతిన పూనిన సంగతిమనకు తెలియును. కాబట్టి మనమందరము ఆ నీచుడు భీష్ముని ఎదురుగా రాకుండా చూడాలి." అని ఆదేశించాడు.

భీష్ముడు తొమ్మిదవరోజు యుద్ధమున సర్వతోభద్ర వ్యూహమును రూపొందించాడు. కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడు, శకుని, సుదక్షిణుడు, సైంధవుడు, కురుకుమారులు, తాను వ్యూహమునకు మొదట నిలబడ్డారు. ద్రోణుడు, భూరిశ్రవసుడు, భగదత్తుడు కుడివైపున, సోమదత్తుడు, అశ్వత్థామ, విందానువిందులు ఎడమ వైపున, శ్రుతాయువు వెనుకపక్క, త్రిగర్తాధీశునితో సహా సుయోధనుడు మధ్యభాగమున నిలిచారు.

ఈ వ్యూహ రచన చూచిన ధర్మనందనుడు ధృష్ట ద్యుమ్నుని తో ఇలా అన్నాడు. "ధృష్టద్యుమ్నా! తాత భీష్ములు పన్నిన వ్యూహమును చూచితివి కదా! మనము ఈ రోజు శిఖండిని ముందుపెట్టుకొని అతనికి వెన్ను దన్నుగా మనమందరము అతని వెనుక నిలబడి తాత గారితో పోరు సలపవలెను. దానికి అనువైన వ్యూహ రచన చేయుము." అని ఆదేశించాడు. అతడు అట్లే చేయుదునని ప్రతివ్యూహరచన చేసాడు.

సాత్యకి విరాటులు కుడి కైపున, అభి మన్యుడు,పాంచాల కేకయ రాజులు ఎడమ వైపున, నకుల సహ దేవ, ద్రౌపదేయు లతో సహా యుధి ష్ఠిరుడు  మధ్యభాగమున, చేకితాన, కుంతిభోజులు వెనుక భాగమున, అందరి కన్నా ముందు భాగమున  శిఖండిని ఉంచి, అతనికి ఇరుపక్కల, అనగా, భీమసేన ఘటోత్కచులు ఒక పక్క, అర్జునుడు ఒక పక్క నిలబడి, తక్కిన యోధులు అందరూ వారికి చుట్టు నిలబెట్ట బడిన  ఒక అద్భుత వ్యూహమును రచించాడు ధృష్టద్యుమ్నుడు.

ఇట్లు  ఇరు పక్కల సేనలు తమ తమ సైనిక వ్యూహములతో యుద్ధమునకు సన్నద్ధమైనాయి. రణ భేరీ నినాదములు, శంఖములు యొక్క శబ్దములు మిన్నుముట్టాయి. పోరు ఆరంభం అయింది. అభిమన్యుడు కౌరవ వ్యూహంలో కి దూసుకుపోయాడు. దూదిని అంటుకున్న నిప్పువలె చరా చరా పాకి పోయాడు.  కౌరవ సైన్యమును చించి చెండాడుతున్నాడు. తన రథమును గుండ్రంగా తిప్పుతూ ద్రోణాచార్యులు, కృపాచార్యులు, సైంధవుడు మొదలగు వీరులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాడు.

ఇది చూచిన సుయోధనుడు అలంబసుని చూచి "అలంబసా! చూచితివా! అభిమన్యుడు చిచ్చరపిడుగు వలె విజృంభిస్తున్నాడు. నీవే అతనిని ఎదుర్కొనాలి. వీడితో యుద్ధం చేసి వాడిని చంపెయ్యి! " అని ఆదేశించాడు. అలంబసుడు తన రాక్షస సైన్యముతో అభిమన్యుని మీదపడ్డాడు. పాండవ సైన్యమును తరుముతున్నాడు. పెనుగాలికి ఎండుటాకులు ఎగిరిపోవునట్టు అతని ధాటికి పాండవ సైన్యము కకా వికలయింది. అప్పుడు ద్రౌపదీ కుమారులు అక్కడికి చేరుకొని, అభి మన్యునికి సాయంగా, రాక్షస సైన్యమును హతమారుస్తున్నారు. అలంబసుడు కోపిం చి పాండవ కుమారుల మీద శరవర్షము కురి పించాడు. పాండవ కుమారులు కూడా అలంబసుని మీద జడి వాన కురిసి నట్టు బాణములు గుప్పించారు. ఆ బాణముల ధాటికి అలంబసుడు తెలివి తప్పాడు. మరు నిమిషంలోనే తేరుకొని పుంఖాను పుంఖాలుగా శరప్రయోగము చేసి ద్రౌపదీ పుత్రుల విల్లులను, కేతనము లను విరిచాడు. ఒక్కొక్కరిమీద ఐదేసి బాణములను సంధిం చాడు. తన సోదరుల అవస్థను, అలంబసుని విజృంభణను చూచిన అభి మన్యుడు అలంబసుని మీద అతి క్రూరమైన నారాచములు ప్రయో గించాడు. అది చూచిన వారలు, "అలంబసుడు మాయా యుద్ధ ప్రవీణుడు, అభిమన్యుడు దివ్య శరసంధానములో దిట్ట, వీరి ఇరువురి

యుద్ధం ఎంత రసవత్తరంగా ఉంటుందో! ” అని ఆతురతగా చూస్తు న్నారు.

అభిమన్య, అలంబసులు, దేవేంద్రుడు, వృత్రాసురుడు మాదిరి ఘోరంగా యుద్ధం చేస్తున్నారు. ఇద్దరి శరీరములు రక్తముతో తడిసి ముద్ద అయ్యాయి. ఆ సమయంలో అలంబసుడు తన మయా శక్తితో యుద్ధభూమి అంతా అంధకారం వ్యాపించేటట్టు చేసాడు. అది చూచిన అభిమన్యుడు భాస్కరాస్త్రముతో ఈ చీకట్లను పటాపంచలు చేసాడు. అలంబసుడు తరువాత ఎన్నో మాయలు ప్రదర్శించాడు. కాని ఆ మాయలన్నింటిని అభిమన్యుడు తిప్పికొట్టాడు. అభిమన్యుని శస్త్రధాటికి తట్టుకోలేక అలంబసుడు రథం దిగి పారిపోయాడు.

అలంబసుడు పారిపోగానే రెట్టించిన ఉత్సాహంతో అభిమన్యుడు కౌరవసేనల మీద పడ్డాడు. వారిని ఊచకోత కోస్తున్నాడు. కౌరవ సేనలు భయంతో వణికి పోతున్నాయి. ఆ సమయంలో భీష్ముడు అనేక మంది రధికులతో వచ్చి అభిమన్యుని ఎదుర్కొన్నాడు. అభిమన్యుడు ఏమాత్రం జంకక, అందరికి అన్ని రూపములతో కనిపిస్తూ, రణరంగములో వీర విహారం చేస్తున్నాడు. దూరంనుండి ఇది చూచిన అర్జునుడు తన కుమారుని వీర విక్రమ పరాక్రమమునకు సంతసించి, తన రథమును

భీష్ముని మీదికి మళ్లించాడు. భీష్మునికి, అర్జునునికి పోరు ఘోర మయింది.

ఇంతలో కృపాచార్యుడు అభిమన్యుని మీద శరవర్షము కురిపించాడు. వెంటనే సాత్యకి కృపాచార్యుడు వేసిన శరములను మధ్యలో తుంచి, అనేక క్రూరమైన బాణములను కృపాచార్యుని మీద ప్రయోగించాడు. వాటిని అశ్వత్థామ మధ్యలోనే అడ్డుకున్నాడు. అశ్వత్థామ సాత్యకి విల్లును విరిచాడు. సాత్యకి వేరొక విల్లు అందు కున్నాడు. ఉగ్రమైన బాణములతో అశ్వత్థామ ను మూర్ఛపోయేట్లు కొట్టాడు. అశ్వత్థామ అంతలోనే తేరుకొని, వెంటనే సాత్యకి గుండెలకు గురిపెట్టి శరసంధానము చేసాడు. మరొక బాణంతో అతని కేతనమును కొట్టాడు. భీకరంగా గర్జించాడు.

సాత్యకి కి కోపం వచ్చింది. అతి నిశితమైన బాణములతో అశ్వత్థామ రథం కనిపించకుండా కొట్టాడు. ఆ శరవర్షములో చిక్కుకుపోయిన తన కుమారుడు అశ్వత్థామను చూచాడు ద్రోణుడు. వెంటనే తన రథమును సాత్యకి మీదికి పోనిచ్చాడు. సాత్యకి మీద శర వర్షము కురిపించాడు. ఇది చూచిన అర్జునుడు సాత్యకికి తోడుగా నిలిచి ద్రోణుని ఎదుర్కొన్నాడు." అని చెప్పాడు సంజయుడు.

“ సంజయా! అర్జునుడు ద్రోణుని ప్రియశిష్యుడుకదా! అర్జునునికి కూడా గురువు గారు అంటే ఎంతో భక్తి గౌరవము. మరి వారివురు ఏ ప్రకారము యుద్ధం చేసారు? వివరంగాచెప్పు వినవలెనని కుతూహలంగా ఉన్నది.” అని అడిగాడు.

సంజయుడు అర్జున ద్రోణుల మధ్య జరిగిన యుద్ధ విశేషము లను చెప్పసాగాడు. “మహారాజా! క్షత్రియ ధర్మము ప్రకారము యుద్ధ భూమిలో తలపడిన తరువాత గురువు, తండ్రి, తమ్ములు, పుత్రులు, పౌత్రులు, శిష్యులు, మామలు అనే బేధము లేకుండా యుద్ధము చేయవలయును, కాని బంధుమిత్రులు అనుకుంటే యుద్ధము చేయడం కుదరదు కదా! కాబట్టి ద్రోణుడు, అర్జునుడు ఒకరితో ఒకరు శత్రుపక్షము వారితో యుద్ధముచేసినట్టు చేసారు కాని గురుశిష్యుల మాదిరి కాదు. ఆ విశేషములను చెపుతాను వినండి.

అర్జునుడు ద్రోణుని మీద మూడు అతి క్రూరమైన నారాచములు (బాణములు) ప్రయోగించాడు. వెంటనే వాటిని తుంచి, అర్జునుని మీద శరవర్షము కురిపించాడు ద్రోణుడు. సుయోధనుడు ప్రేరేపింపగా త్రిగర్త రాజు ద్రోణునికి సాయంగా వెళ్లాడు. త్రిగర్తుడు ద్రోణుని

రధమును దాటిపోయి అర్జునుని మీద భల్లబాణములను ప్రయో గించాడు. వెంటనే సవ్యసాచి ఆ బాణములను మధ్యలోనే తుంచి, తరువాత వాయవ్యాస్త్రమును త్రిగర్తుని సైన్యము మీద ప్రయోగించాడు. ఆ వాయవ్యాస్త్రము ధాటికి త్రిగర్తుని సైన్యము చెల్లాచెదరయింది. కాని ద్రోణుడు వాయవ్యాస్త్రానికి విరుగుడుగా శైలాస్త్రమును సందించాడు. దానితో వాయవ్యాస్త్రము ఉధృతి తగ్గింది.

ఇది చూచిన అర్జునుడు తన వాడి బాణములతో త్రిగర్తుని కుమా రులను దూరంగా తరిమి కొట్టాడు. ఇది చూచిన సుయో ధనుడు, కృపాచార్యుడు, శల్యుడు, బాహ్లికుడు, మొదలగు రధికులతో కలిసి పార్ధుని మీదికి దూసుకు పోయాడు. సుయోధనాదులనే కాకుండా, ద్రోణుని కూడా, తన వాడియైన బాణములతో కొట్టి చికాకుపరిచాడు అర్జునుడు. అర్జునుని పరాక్రమోద్ధతి చూ చి వారందరూ నిశ్చేష్టు లయ్యారు. ఇంతలో భీష్ముడు అర్జునుని మీదికి తన రధమును పోనిచ్చాడు. అర్జునుని మీద శరపరంపర కురిపించాడు. వేలకు వేల శత్రువుల శిరస్సులను తన క్రూరమైన బాణములతో ఖండించాడు.

మరియొక చోట శకుని, భూరిశ్రవసులు నకుల సహదేవులతో తలపడ్డారు. కళింగరాజు, భగదత్తుడు తమ తమ గజ బలములతో

భీమసేనుని తో యుద్ధం చేస్తున్నారు. కొండ మీది నుండి సింహము కింది కి దూకి నట్టు తన రథము మీది నుండి భీమసేనుడు కిందికి దూకి తన గదాయుధముతో ఏనుగుల కుంభస్థలములను పగుల గొడు తున్నాడు. భీమసేనుని గదాఘాతములకు బెదిరి పోయిన ఏనుగుల బలము చెల్లాచెదరయింది. తలొక దిక్కుకా పారిపోయాయి. తమ తమ గజబలము ఆ ప్రకారము చెల్లాచెదరయి పోగా, శ్రుతాయువు, భగ దత్తుడు తమ తమ వాడియైన బాణములతో భీమసేనుని కవచమును ఛేదించారు. మరొక పక్క భీష్ముడు పాండవ సైన్యమును చించి చెండాడు తున్నాడు.

ఇది గమనించిన ధర్మరాజు చేయెత్తి భీమసేనుని రమ్మని పిలి చాడు. అది చూచి భీమసేనుడు కళింగరాజు, భగదత్తులను విడిచి, అన్నయ్య దగ్గరకు వచ్చాడు. అంతకు ముందే విరాటుడు, ద్రుపదుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి ధర్మనందనుని వద్దకు చేరుకున్నారు. అందరూ కలిసి ఒక్కుమ్మడిగా భీష్ముని మీదికి లంఘించారు. భీష్ముడు కూడా శిఖండిని వదిలి పెట్టి మిగిలిన వారి మీద బాణ వర్షము కురిపిం చాడు. ఆ రధికులు కూడా వివిధ రకములైన బాణములను భీష్ముని మీదకు విసిరారు. ఆ ప్రకారము వారి మధ్య పోరుఘోర మయింది.

సూర్యుడు నడి నెత్తి మీదికి వచ్చాడు. విరిగిన రధములు, చచ్చిన హయములు, పారుతున్న నెత్తుటి ఏరులతో ఆ రణభూమిమహా భయంకరంగా ఉంది. ఉభయ సైన్యములు వాటిమధ్య తిరుగుతూ ఒకరితో ఒకరు పోరు తున్నారు. కాని మన బలములలో నైతిక స్థైర్యము లోపించింది. వారిలో వారు "అయ్యో ఆ సుయోధనుని లోభత్వము, మూర్ఖత్వము వలన కదా ఇంతటి మారణ హోమము, జనక్షయము దాపురించినది. అసలుపాండవులను జయించే వాళ్లు ఎక్కడన్నా ఉన్నారా" అని తమలో తాము తర్కించుకుంటున్నారు.

వారి మాటలు సావధానంగా వింటున్న భీష్మాదులను చూచి సుయోధనుడు "మహావీరులారా! వారి పనికిమాలినమాటలు వినెదరేల? ఎంతోమంది ఎన్నో మాటలు అనుకుంటూ ఉంటారు. మనము యుద్ధం చేద్దాం రండి! " అని వారిని రణము వైపు ప్రోత్స హించాడు.

ఆ సమయంలో భీమసేనుడు తన గదతీసుకొని రణరంగములో వీర విహారము చేస్తున్నాడు. శత్రు సైన్యమును ఊచకోత కోస్తున్నాడు. ఇంతలో భీమసేనుని రధ సారధి తమ రధమును తీసుకొని వచ్చి భీమసేనుని ముందు నిలిపాడు. భీమసేనుడు ఆ రధము అధిరోహించాడు.

మరల తన విల్లు చేత బూని అత్యంత నిశితమ్మైన శరములతో బాహ్లికుని రధము విరగ్గొట్టాడు.

చిత్ర సేనుడు తన చి త్ర విచిత్ర మ్మైన శరములతో అభిమన్యుని చికాకు పెట్టాడు. దానిని లక్ష్యపెట్టక అభిమన్యుడు చిత్ర రధుని రధము విరగ్గొట్టాడు. సారధిని చంపాడు. రధమునకు కట్టిన హయములను చంపాడు. చిత్రరధుడు వెంటనే దుర్ముఖుని రధం ఎక్కాడు. ఇద్దరూ కలిసి వేరే చోటికి వెళ్లిపోయారు.

పాంచాలపతి ద్రుపదుడు ద్రోణుని ఎదుర్కొని అతని మీద శస్త్రప్రయోగం చేసాడు. ద్రోణుడు కోపిం చి తిరిగి అతి పదునైన బాణములతో ద్రుపదుని కవచము ను చీల్చాడు. ద్రోణుని ధాటికి తాళలేక ద్రుపదుడు వేరేచోటికి పోయాడు.

మరొక చోట సుశర్మ అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు. అర్జునుని మీద, కృష్ణుని మీద శరవర్షము కురిపించాడు. వాటిని మధ్యలోనే తుంచి, అర్జునుడు సుశర్మను అత్యంత క్రూరమ్మైన బాణఘాతములతో తరి మి తరిమి కొట్టాడు. అతని సైన్యము చెల్లాచెదరయింది. అర్జునుని బాణ దాటికి తట్టుకోలేక సుశర్మ తనసైన్యము తో సహా పారిపోయాడు.

అది చూచిన భీష్ముడు అర్జునుని మీదికి విజృంభించాడు. వారి మధ్యలోకి సాత్యకి వచ్చాడు. భీష్ముని మీద  అంపవర్షము కురిపించాడు. భీష్ముడు కోపించి భయంకర మైన శక్తి ఆయుధమును సాత్యకి మీదికి విసిరాడు. తన శరీరమును ఒంచి దానిని తప్పించుకున్నాడు సాత్యకి. దానిని తన చేత్తో ఒడిసి పట్టుకొని తిరిగి  దానిని భీష్ముని మీదికి విసిరి సింహనాదం చేసాడు. భీష్ముడు తన ఆయుధమును తానే తుంచాడు. వెంటనే సాత్యకి మీద తొమ్మిది అత్యంత పదునైన బాణములను ప్రయోగించాడు. వెంటనే పాండవ సైన్యము ఒక్కుమ్మడిగా భీష్ముని పైన పడింది.

ఇది చూచి సుయోధనుడు దుశ్శాసనుని చూచి ఇలా అన్నాడు. "దుశ్శాసనా! తాత భీష్ముడు ఒంటరిగా పోరుతున్నారు. నీవు వెంటనే శకునిని తీసుకొని తాతగారికి సాయంగా వెళ్లు" అని ఆదేశించాడు. వెంటనే దుశ్శాసనుడు తన సైన్యముతో శకునితో కలిసి  భీష్ముని వద్దకు వెళ్లాడు. అందరూ కలిసి పాండవ సైన్యము ను కకావికలు చేస్తున్నారు.

ఇది దూరంనుండి గమనించిన ధర్మనందనుడు నకుల సహదేవులను అక్కడకు వెళ్లమని చేయి  ఊపాడు. నకులసహదేవులు భీష్ముని మీదికి యుద్ధానికి వెళ్లారు. పాండవ సైన్యమును చూచి సుయో ధనుడు

పదివేల మంది  ఆశ్విక దళమును పాండవ సైన్యమును ఎదు ర్కొన డానికి పంపాడు.  ఆ ఆశ్వికసేన పాండవ సైన్యములో జొరబడి దొరికిన వాడిని దొరికినట్టు చంపుతూ ఉంది. ఇది చూచిన ధర్మనంద నుడు, నకుల సహదేవులు తమ తమ వాడి శిలీముఖములతో ఆ గుర్రములను కొట్ట నారంభించారు. కాళ్లు తెగిన హయములు నేలమీద పడి పోతుంటే రణరంగము భీభత్సమయింది. పదివేల మంది ఆశ్వికదళము అంత కంతకూ తరిగిపోతూ ఉంది. తమ పైన ఉన్న సైనికులను లక్ష్యపెట్టక ఆ హయములు దిక్కుతోచక పరుగెడుతున్నాయి. వాటి కాళ్ల కింద పడి చాలామంది సైనికులు చనిపోతున్నారు. చాలా హయములు తమ తమ రౌతులను కిండ పడవేసి పరుగెడుతున్నాయి. ఆ ప్రకారము కింద పడ్డ వాళ్లు అదే గుర్రాల పాదాల కింద పడి చనిపోతున్నారు.  పదివేల ఆశ్విక దళము నశించి పోయింది. పాండవ సైన్యములో భేరీ తూర్య నాదములు మిన్ను ముట్టాయి.

ఇది చూచిన  సుయోధనుడు శల్యునితో దీనంగా ఇలా అన్నాడు. "మద్రదేశాధీశా! ధర్మనందనుని సేనలు చెలియలి కట్ట తెంచుకొని ఉప్పొంగుతున్న మహాసముద్రము లాగా  ఉప్పొంగి, మన సేనలను చించి చెండాడుతున్నాయి. ఆ మహా సముద్రమునకు నీవు చెలియలి కట్ట కావాలి. " అని ప్రార్థించాడు.  వెంటనే శల్యుడు తన సేనలతో ధర్మనంద

ునిని, నకుల సమదేవులను ముట్టడించాడు.  తన బాహు బలమును ప్రదర్శిస్తూ, పెక్కు బాణములతో వారిని నొప్పించాడు. ఇది చూచిన అర్జునుడు, భీమసేనుడు  ఒక్క మారుగా శల్యుని మీద విరుచుకు పడ్డారు. వాడియైన బాణములతో శల్యుని మీద శరవర్షము కురి పించారు.

ఇది చూచిన భీష్మ ద్రోణులు భీమార్జునుల మీదికి తమ తమ రధములనునడిపించారు. వివిధ శస్త్ర అస్త్రములతో వారిని నొప్పించారు. అప్పటికి అపరాహ్ణము అయింది. భీష్ముడు  వేసవి కాలములో సూర్యుని మాదిరి ప్రచండంగా వెలుగుతూ పాండవుల సేనలోకి చొచ్చుకొని పోయి వారిని  తన వాడి యైన బాణములతో కొడుతున్నాడు.  12 నారాచములతో ధర్మనందనుని, అర్జునుని, భీమ,నకుల సహదేవులను ఒక్కొకరిని మూడేసి బాణములతోనూ, సాత్యకిని, ధృష్టద్యుమ్నుని తన వాడియైన బాణములతోనూ  కొట్టి వారి శరీరములను గాయపరిచాడు.

వెంటనే విరాటుడు, పాండ్యరాజు, సోమకుడు, మగధ దేశాధీశుడు,  కరూశదేశాధిపతి, తమ తమ సేనావాహినులతో భీష్ముని చుట్టు ముట్టారు.  ద్రోణాచార్యుడు తన వాడియైన అస్త్రములతో సాత్యకిని, పాండుపుత్రులను ఎదుర్కొన్నాడు, ఎక్కడ చూచినా తానే అయి వీర

విహారం చేస్తున్నాడు. భీష్ముడు తనను చుట్టుముట్టిన వారిని తన శర పరంపరలతో  అస్త్ర శస్త్ర ములతో భయకంపితులను చేసాడు. తన రధము ను చిత్ర విచి త్ర రీతులతో నడుపుతూ పాండవ సేనను నిర్మూలి స్తున్నాడు.  గజములను, హయములను, తన శరములతో తునుమాడు తున్నాడు. ఎటు చూచినా ఏనుగులు, గుర్రముల కళేబరములతో రణభూమి నిండిపోయింది. భీష్ముని ధాటికి పాండవ సేన నిలువలేక పోయింది. అతనిని ఎదిరించి నిలిచే మగాడే కనపడలేదు  ఆ రోజు భీష్ముని విజృంభణము చూచి  పాండవులు కూడా ఆశ్చర్యపోయి చూస్తున్నారు.

భీష్ముడు ఎక్కడ చూచినా తానే అయి రణరంగమంతా కలయ తిరుగుతూ శత్రుసేనలను నిర్మూలిస్తున్నాడు. రధికులను, ఆశ్వికులను, గజబలమును దొరికినవారిని దొరికినట్టు చంపుతున్నాడు.   ఇంక కాల్బలము సంగతి చెప్ప పనిలేదు. కాళ్లు ఒక చోట, చేతులు ఒక చోట, తల ఎక్కడో పడి పోయి, భీకరంగా ఉంది. రధములు విరిగిన చప్పుళ్లు, ఏనుగులు, హయములు భయంతో చేయు ఘీంకారములు, సకిలిం పులు, కాల్బలము చేయు హాహాకారములతో రణభూమి మార్మోగి పోయింది.  వెదురు అడవిని కార్చిచ్చు దహించినట్టు భీష్ముడు పాండవ సేనను నాశనం చేస్తున్నాడు.

ఆ సమయంలో శ్రీకృష్ణుడు అర్జునుని చూచి "అర్జునా! ఈ రోజు భీష్ముడు అత్యంత శౌర్యముతో మన సేనలను సంహరిస్తున్నాడు. నీవేమో చోద్యం చూస్తూ ఊరుకున్నావు. నీవంటి వీరునికి ఇది తగునా!" అని ఎత్తిపొడిచాడు. అర్జునుడు మాత్రం డోలాయమాన మనస్కుడై నిరుత్సాహంతో ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు.

అది చూచి కృష్ణుడు "అర్జునా! నా మాటలు నీకు వినపడలేదా! నాడు విరాటుని కొలువు కూటములో సంజయుని తో పలికిన పలుకులు మరచితివా! ఈ సమయంలో నిన్ను నమ్మి యుద్ధమునకు దిగిన రథికు లందరూ భీరువైన నిన్ను చూచి నవ్వరా!" అని ఎత్తిపోడిచాడు కృష్ణుడు.

"కృష్ణా! సకల బంధు జనులను చంపి, కురు వంశము నాశనమైన తర్వాత, ఏమి సుకృతము చేసానని ఈరాజ్యమును ఏలుకొనాలి? యుద్ధం చెయ్యడానికి నాకు చేతులాడటం లేదు. కాని ఏమి చేసేది. ఎన్ని మాటలాడినా క్షత్రియ ధర్మం తప్పదు కదా! మన రధమును భీష్ముని మీదికి పోనిమ్ము. తాతగారిని ఎదుర్కొంటాను." అన్నాడు నిర్వేదంగా. కృష్ణుడు చిరు నవ్వు నవ్వుతూ రధమును భీష్మునికి ఎదురుగా నిలిపాడు.

అర్జునుడు పారి పోతున్న తన సైన్యమును గొంతెత్తి పిలిచాడు. "నిలవండి. పారిపోకండి. అందరం కలిసి భీష్ముని ఎదుర్కొందాము" అని ధైర్యవచనాలు పలికాడు. సింహనాదం చేసాడు. గాండీవం సంధిం చాడు. మహాస్త్రములు భీష్ముని మీద సంధించాడు. ఇది చూ చి భీష్ముడు చిరునవ్వుతో అర్జునుని సమర్ధవంతంగా ఎదుర్కొన్నాడు. అర్జునుని అస్త్రములను మధ్యలోనే ముక్కలు చేసి అర్జునుని శరీరం అంతా తన బాణములతోకొట్టాడు. అర్జునుని శరీరం రక్తసిక్తమైంది. మరల పాండవ సేనలను తరిమి తరిమి కొట్టాడు.

అర్జునుడు అవమాన భారంతో కుంగిపోయాడు. పౌరుషం ప్రజ్వ రిల్లింది. పదునైన బాణములతో భీష్ముని విల్లు విరగ్గొట్టాడు. భీష్ముడు మరొక విల్లు తీసుకొని విజృంభించాడు. మరల ఆవిల్లును కూడా తుంచాడు అర్జునుడు. బీష్ముడు తన మనుమని అస్త్రవిన్యాసానికి మురిసిపోతూ మరొక విల్లు చేతబూని పాండవ సేనలను తన శరవర్ష ములో ముంచెత్తాడు. అర్జునుని శరీరం అంతా తన అస్త్రములతో తూట్లు పడేట్టు కొట్టాడు. అర్జునుడు అలసిపోయాడు. శరీరం అంతా బాధ పెడుతూ ఉంది. నిలువలేకపోయాడు. అర్జునుడు వివశుడైన కొద్దీ భీష్ముడు విజృంభిస్తున్నాడు. అర్జునుడే ఊరకుంటే మిగిలిన వారు భీష్మునికి ఎదురు నిలవలేక పోయారు. కకావికలయ్యారు.

పరిస్థితి చేయిదాటి పోతోంది అని గ్రహించాడు కృష్ణుడు. కోపంతో ఊగిపోయాడు. చేతనున్న పగ్గములను నొగల మీద ఉంచాడు. ఒక్క ఉదుటున రథం మీది నుండి కిందికి దూకాడు. ధరణీ చక్రమే కదిలిందా అనిపించింది. దిక్కులు కంపించాయా అన్న భ్రమ కలిగింది. కృష్ణుడు భీష్ముని మీదికి లంఘించాడు. పైన వేసుకున్న పీతాంబరము జారిపోతూ ఉంది. మెరుపులతో కూడిన కారు మబ్బులు కదిలి వస్తున్నాయా అన్నట్టు కృష్ణుడు భీష్ముని మీదికి వస్తున్నాడు. "అయ్యో ఈ రోజు భీష్ముడికి ఈరోజు అంతిమఘడియలు సమీపించాయి" అని కౌరవ ప్రముఖులు నిశ్చేష్టులయి చూస్తున్నారు.

ఇది చూచాడు భీష్ముడు. మనసంతా ఆనందంతో నిండి పోయింది. రథం దిగాడు. చేతులు మోడ్చాడు. "రావయ్యా కృష్ణా! రావయ్యా! వేగమే రా! నన్ను సంహరించు. నాకు మోక్షం ప్రసాదించు." అని కృష్ణుని ముందు మోకరిల్లాడు.

ఇదంతా చూస్తున్న అర్జునునికి మతిపోయింది. రథమునుండి దూకాడు. కృష్ణుని వెంట పరుగెత్తాడు. వెనుక నుండి కృష్ణుని పట్టుకొని వెనక్కు లాగుతున్నాడు. కృష్ణుడు విదిలించుకొని ముందుకు పోతు

న్నాడు.  మరో పది అడుగులలో అర్జునుడు మరల కృష్ణుని పట్టుకున్నాడు. తన కాళ్లు భూమి మీద  ఆనించి బలంగా కృష్ణుని వెనక్కు లాగుతున్నాడు.

"బావా! కృష్ణా! యుద్ధము చేయనని నాకు మాట ఇచ్చావుకదా! మరల ఇదేమిటి? నీ ప్రతిజ్ఞ నువ్వే తప్పుతావా! లోకం ఏమనుకుంటుంది చెప్పు!  నాకు అలసట తీరింది. ఇప్పుడు నేను భీష్మునితోపోరాడతాను. నువ్వు వెనక్కు వచ్చి రథం ఎక్కు. నాకు అపవాదు తీసుకొని రాకు." అని ప్రార్థించాడు.

పార్థుని పలుకులు ఆలకించిన కృష్ణుడు తన కోపమును ఉపసంహ రించు కున్నాడు. శాంతచిత్తుడై వెనుకకు మరలాడు.  ఇద్దరూ రథం ఎక్కారు. ప్రళయకాల మేఘము వలె గర్జించాడు అర్జునుడు. గాండీవ మును సంధించాడు. కౌరవ సేనను రూపుమాపుతున్నాడు.

వచ్చిన మహదవకాశము చేజారి పోగా, భీష్ముడు మరల తన రథం ఎక్కాడు.  కృష్ణార్జునుల మీద శరసంధానం చేసాడు. వారి దేహముల నిండా తన బాణములు నాటాడు. పాండవుల సేనను చించి చెండాడుతున్నాడు.  పాండవులు కృష్ణుడు నిశ్చేష్టులై చూస్తున్నారు.  అత్యంత భారీ

కాయుడు నేలమీద ఉన్న చలిచీమలను కాలితో నలిపి చంపుతున్నట్టు గాంగేయుడు పాంచాల సేనను నిర్మూలిస్తున్నాడు. ఈ ఘోరం చూడలేక సూర్యుడు అస్తమించాడు. ఆ నాటికి యుద్ధం చాలించారు. ఎవరి శిబి రము లకు వారు వెళ్లారు.

ఆ నాటి భీష్ముని విజృంభణము చూచి ధర్మనందనుడు ఎంతో చింతించాడు. భీష్ముని చేతిలో భంగపడి పాండవులతో కలిసి తన శిబి రము నకు వెళ్లాడు. కౌరవుల శిబిరంలో ఆనందోత్సాహాలు మిన్ను ముట్టాయి. భీష్ముని శౌర్యపరాక్రమాలను వేనోళ్ల పొగిడారు. సుయో ధనుడు మొదలగు నీ కుమారులు భీష్ముని ఉదాత్త వాక్యములతో ప్రస్తు తించారు. నీ కుమారుల ఆనందానికి అవధులు లేవు." అని తొమ్మిదవ రోజు యుద్ధమును వివరించాడు సంజయుడు.

"ఆ రోజు రాత్రి ధర్మనందనునకు నిద్రపట్టలేదు. తన తమ్ములతో కృష్ణుని శిబిరమునకు వెళ్లాడు. "కృష్ణా! చూ చి తివి కదా! కార్చిచ్చు అడవిలోని మృగములను నాశనము చేసినట్టు నేడు భీష్ముడు మన సేనలను నాశనం చేసాడు. ఆ మహావీరుని శౌర్య పరాక్రమములు మనందరము కనులారా చూచాము. మనవాళ్లు ఎవ్వరూ భీష్ముని ముందు నిలువలేక పోయారు. కార్యాకార్య విచక్షణ లోపించిన నేను ఈ

సర్వ వినాశకరమైన యుద్ధమును కోరుకున్నాను. అందరిని చంపుకొని నేను ఈ రాజ్యమును ఎలా పాలింపగలను. కాబట్టి మరల నేను నిశ్చింతగా అడవులకు పోతాను. అక్కడ ఆకులలములు తింటూ శేష జీవితమును గడుపుతాను. నా తమ్ములతో కూడి ముని వృత్తిని స్వీకరిస్తాను. ఇంతకు ముందు కూడా నా కారణం చేతనే నా తమ్ములు అడవులలో ఎన్నో క ష్టాలు అనుభవించారు. వీరిని నేను ఈరోజు భీష్మునికి బలిపెట్టలేను. నా తమ్ముల క్షేమమే నాకు ముఖ్యం. కృష్ణా! నీకు మా మీద ఏమాత్ర మన్నా అభిమానం ఉంటే, ధర్మ విరోధము కాని మార్గము ఏదైనా మాకు ఉపదేశించు." అని పలికాడు ధర్మ నందనుడు.

అతను పలికిన పలుకులు అన్ని సావధానంగా విన్నాడు కృష్ణుడు. "ధర్మనందనా! నీవు సత్యవాక్పరిపాలకుడవు. నీ తమ్ములు నాలుగు దిక్కులు జయిం చిన వారు. మీకు ఎలాంటి దుర్గతి కలుగదు. పైగా మీకు నా సహాయ సంపత్తి కలదు. నేను మీకు అమాత్యుడనై మీకు రాజ్యసిద్ధి కలుగ చేస్తాను. కాబట్టి నీవు చింతించవలదు. ఒకవేళ అర్జునుడు తెగబడ కుంటే నేను భీష్ముని సంహరిస్తాను. మిమ్ములను రక్షిస్తాను. అర్జునుడు నాకు సఖుడు. బంధువు. శిష్యుడు. అతని కోసం నేను ప్రేమతో నా శరీరాన్ని అయినా కోసి ఇస్తాను. అర్జునుడు కూడా నా ఎడల అంతటి భక్తిప్రపత్తులతో ఉంటాడు. నాడు ఉపప్లావ్యములో

సంజయునితోనూ, ఉలూకునితోనూ అర్జునుడు పలికిన పలుకులు నిజం చేయవలసిన బాధ్యత నా మీద ఉన్నది. ఆ సమయంలో నేను కూడా వారితో తగినట్లు మాట్లాడాను కదా! అవన్ని నీవుకూడా విన్నావుకదా! నేను, అర్జునుడు కలిసి మాట్లాడిన మాటలు, చేసిన శపథములు మేము ఇద్దరం నెరవేర్చుకోవాలి కదా! దానికి తగిన సమయం ఆసన్నమయినది. నీవు నిశ్చింతగా ఉండుము." అని పలికాడు కృష్ణుడు.

"అదికాదు కృష్ణా! నీవు యుద్ధము చేయనని కదా మాకు సాయం చెయ్యడానికి మాత్రం ఒప్పుకున్నావు. నీతో యుద్ధం చేయిస్తానా! అకటా! దైవము నాకు ఎన్ని కష్టములు కలిగిస్తున్నాడు. కృష్ణా! తాత భీష్ముడు నాకు ఒక మాట ఇచ్చి ఉన్నాడు. ఆ మహాత్ముడు తాను కౌరవుల పక్షము న యుద్ధము చేసెద ననియు, కాని నాకు తగు సాయము చేసెదననియు మాట ఇచ్చి ఉన్నాడు. కృష్ణా! మా తండ్రి చనిపోయినప్పటినుండి మమ్ము లను అల్లారు ముద్దుగాపెంచాడు భీష్ముడు. అలాంటి మహాత్మునికి అప కారం తలపెట్టడానికి మనసు రావడం లేదు.కాని తప్పడం లేదు. రాజ ధర్మము ఎంత క్రూరమైనదోకదా! " అని ఖేదంతో పలికాడు.

కృష్ణునికి ధర్మనందనుని ఆంతర్యము అర్థం అయింది. అతడు భీష్ముని కలిసి అతని వధోపాయము తెలుసు కొనవలెనని అనుకుంటు

న్నాడు. ఆరోజు భీష్ముని కలిసినపుడు మరల కలుస్తాను  అని అన్న మాటలకు అర్ధం ఇదే కాబోలు అని అనుకున్నాడు.

"ధర్మనందనా! నీ ఆలోచన బాగున్నది.  భీష్ముడు కోపంతో చూస్తే అతని ముందు ఎవరూ నిలువ లేరు అని నీవే అన్నావు కదా! నీవు వెళ్లి అడిగితే చాలు భీష్ముడు తనను వధించే ఉపాయము నీకు తప్పక  వివరిం చగలడు. కాబట్టి మనమందరము రహస్యంగా పోయి  భీష్ముని సంద ర్శించ వలయును.  ఆయనను భక్తితో ప్రార్ధించి, అతని వలన  ఉపదేశ మును పొందవలయును."  అని పలికాడు.

అప్పుడు ధర్మనందనుడు, సామ్యమైన వేషధారణతో, తన తమ్ముల తో కలిసి, భీష్ముని మందిరమునకు వెళ్లాడు. భీష్మునికి సాష్టాంగ ప్రమా ణము చేసారు.  భీష్ముడు వీరిని చూచి సముచితముగా సత్కరించాడు. పేరు పేరునా వారి క్షేమమును అడిగాడు.  "ధర్మనందనా! మీరు  ఈ సమయంలో నా వద్దకు వచ్చుటకు కారణమేమి? సంకోచము లేకుండా అడగండి.   ఎంతటి దుష్కర కార్యమైనను నెరవేర్చెదను."  అని పలికాడు.

దీనమ్మైన వదనంతో ధర్మనందనుడు ఇలా అన్నాడు. " పితామహా! మాకు రాజ్యప్రాప్తి ఎలా కలుగుతుంది? మా సైన్యము క్షీణత నొంద కుండా ఎలా కాపాడుకోవాలి? దయచేసి సెలవియ్యండి. " అని అడిగాడు.

" ధర్మనందనా! నేను రణభూమిలో ఉండి యుద్ధ ము చేస్తున్నంత సేపూ మీ సైన్యము క్షీణించక తప్పదు. మీకు రాజ్యలాభము కలుగదు. నన్ను నిర్జిస్తేగాని మీకు శుభం కలగదు." అని పలికాడు భీష్ముడు.

"పితామహా! సాక్షాత్తు ఆ మహాశివుడు చేత త్రిశూలము ధరించి నట్టు మీరు రణ భూమిలో నిల్చుంటే నిన్ను గెలవడానికి ఏ మగవాడి తరము అవుతుంది. కాబట్టి నిన్ను గెల్చు ఉపాయము మాకు చెప్పవా! " అని అడిగాడు.

" ధర్మనందనా! నీవు చెప్పినది యదార్ధము. నా చేతిలో ధనుస్సు ఉండగా ఆ దేవతలు కూడా నన్ను గెలువలేరు. నా శక్తి తెలుసుకొని నన్ను గెల్చు ఉపాయము కొరకు మీరందరూ నా వద్దకు వచ్చారు. నీకుప్రియము చేయుట కన్నా నాకు సుకృతము ఏమున్నది. నేను నా ఆయుధమును విసర్జించిన తరువాత నన్ను గెలువ వచ్చును. నేను ఈ క్రింది పరిస్థితు

లలో  ఆయుధమును విసర్జించెదను.  ఒంటి నుండి కవచము తీసిన వాడిని, ఆయుధము ధరించని వాడిని, తన కేతనము (ఫ్లాగ్) ను దించిన వాడిని, స్త్రీలను, ఇంతకు ముందు స్త్రీగా ఉండి తరువాత పురుషత్వము పొందిన వాడిని,  స్త్రీల పేరు పెట్టుకొనిననవాడిని, తలపాగాను తీసిన వాడిని, అన్నదమ్ములు లేని వాడిని, పుత్రులులేని వాడిని, చూచిన నేను వారితో యుద్ధము చేయను. వెంటనే నా ఆయుధమును విడిచి పెట్టె దను.  నాకు ఇంకొక వ్రతము కలదు. పుట్టినప్పుడు పురుషుడు కాని వాడితోనూ, మధ్మలో  దైవ వశాత్తు పురుషత్వము పొందిని వాడితోనూ నేను యుద్ధము చేయను.  కాబట్టి మీకు ఒక ఉపాయము చెప్పెదను. ద్రుపదుని కుమారుడు శిఖండి.  అతను పుట్టుకతో స్త్రీ. కాని దైవికముగా పురుషత్వము పొందాడు.  అది మీరందరకూ తెలియును. నేను శిఖండి తో యుద్ధ చేయను. కాబట్టి అర్జునుడు శిఖండిని ముందు పెట్టుకొని యుద్ధము చేసిన నేను ఆయుధమును విసర్జించెదను. అప్పుడు శిఖండి ని అడ్డు పెట్టుకొని అర్జునుడు నన్ను సంహరించ వచ్చును. తరువాత బంధు మిత్రులతో సహా సుయోధనుని గెలుచుట సులభము.  కాబట్టి నేను చెప్పినట్టు చేయండి. " అని పలికాడు.

కావలసిన కార్యము సఫల మైనందున భీష్ముని వద్ద సెలవు తీసుకొని ధర్మనందనుడు, తన తమ్ములతో కూడి అక్కడ నుండి తమ

తమ శిబిరములకు వెళ్లారు. దారిలో పోతూ, తనను చంపుటకు పరలోకమునకు పంపుటకు తానుగా ఉపాయము చెప్పిన భీష్ముని తలుచుకుంటూ విషాదహృదయుడై అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు.

"కృష్ణా! భీష్ముడు నాకు గురుడు. ధర్మనిరతుడు. వయోవృద్ధుడు. లోకమాన్యుడు. దయాళువు. అలాంటి మహానుభావుని వంచనతో చంపుటకు నాకు బుద్ధిపుట్టడంలేదు. నేను మట్టిలో ఆడుకొని ఒళ్లంతా మట్టిపూసుకొని వస్తే, నన్ను ఎత్తుకొని, ముద్దాడి, చిన్న తనములోనే మరణించిన నా తండ్రిని తలచుకొని కన్నీరుపెట్టుకొనేవాడు. తండ్రిని కోల్పోయి అనాధగా మిగిలిన మమ్ములను చేర దీసిపెంచి పెద్ద చేసిన పితామహుని ఈ ప్రకారం చంపడం మంచిదికాదు. పితామహుడు తన పరాక్రమంతో మన సేనల నన్నింటినీ అంతమొందించినా సరే, నేను ఉపేక్షిస్తాను కాని తాతగారిని చంపను. ధర్మము తప్పను. ధర్మనందనుని తమ్ములు అంత క్రూరులు కారు కదా! " అని పలికాడు.

ఆ పలుకు లాలించిన కృష్ణుడు ఇలా అన్నాడు. "అర్జునా! నీకు క్షత్రియ ధర్మము తెలియదా! క్షత్రియులు, కొంచెము క్రూరత్వము నకు ఓర్చుకొని, ఏ మాత్రం కలత చెందకుండా, అన్ని విధములా శత్రు సంహా

రము చేసి, తన ప్రజలను కంటికి రెప్పలా కాపాడవలెనని, వారు కట్టు పన్ను లతో ప్రజాక్షేమకరమైన పనులను చేపట్టి సమాజశ్రేయస్సు కొరకు పాటుపడాలని, ఇదే రాజధర్మమని, ఇంతకు మునుపు బృహస్పతి ఇంద్రుడికి చెప్పాడు. మరి ఆ మాటలు తప్పు కాదు కదా! పైగా, యుద్ధం లో నీవు భీష్ముని చంపుతానని ఎన్నోసార్లు ప్రతిజ్ఞ చేసావు. మరి ఇప్పుడు ఇలా జారి పోతే, లోకులు నిన్ను చూసి నవ్వరా! అది రాజ ధర్మము అవుతుంది కాని క్రూరకర్మము కాదు కదా! కాబట్టి ఖేదము మాని, భీష్ముని చంప డానికి ప్రయత్నించు. " అని అన్నాడు కృష్ణుడు.

" అది సరే కృష్ణా! భీష్ముని చంపడంకోసమే శిఖండి పుట్టాడు అన్న సంగతి లోకానికి తెలుసు. శిఖండి ని చూస్తే నేను విల్లు పట్టనని పితామహుడు చెప్పాడు కదా! నేను వేరే వాళ్ల తోయుద్ధం చేస్తాను. శిఖండి పితామహునితో యుద్ధం చేసి చంపుతాడు." అన్నాడు అర్జునుడు.

"అర్జునా ఇన్ని మాటలేలనయ్యా! భీష్ముడు అత్యంత పరాక్రమశాలి. అతనికి మరణము నీ చేతిలోనే ఉన్నది. నీవు ఎన్ని చెప్పినను విధి లిఖితము తప్పించలేరు. ఇతర మాటలతో కాలయాపన చేయక భీష్ముని వధించు." అని పలికాడు.

ఇంక చేసేది లేక అర్జునుడు, "రేపటి యుద్ధంలో ఎలాజరగాలో అలా జరుగుతుంది. మీరు చెప్పినట్టే చేస్తాను." అని ఒప్పుకున్నాడు. అందరూ తమ తమ శిబిరములకు వెళ్లారు." అని సంజయుడు ధృతరాష్ట్రునకు తొమ్మిదవ రోజు యుద్ధ విశేషములను వివరించాడు.

అది విన్న ధృతరాష్ట్రుడు "సంజయా! పాండుసుతులు ఏ ప్రకారంగా పదవ రోజు యుద్ధమున శిఖండిని ముందుంచుకొని భీష్మునిపై యుద్ధం చేసారు. నాకు వివరంగా చెప్పు. " అని అడిగాడు. సంజయుడు పదవ రోజు యుద్ధ విశేషాలు చెప్పసాగాడు.

మరునాడు సూర్యోదయం అయింది. పాండవులు సేనా సమేతులై రణ రంగమునకు వెడలారు. ముందు శిఖండిని నిలిపారు. అతనికి ఇరు వైపుల భీమార్జునులను, వెనుక వైపు అభిమన్యుని, ద్రౌపదీ పుత్రులను, వారికి ఇరు పక్కల చేకితానుడు, సాత్యకి, వారి వెనుక ధృష్టద్యుమ్నుడు మొదలగు పాంచాల కుమారులను నిలిపారు. నకుల సహదేవులను ఇరు పక్కల ఉంచుకొని యుధిష్ఠిరుడు, వీరందరినీ పరిరక్షిస్తూ విరాటుడు, ద్రుపదుడు మొదలగు ముఖ్యులగు రాజులు, కేకయ రాజులు ఐదుగురు, ధృష్టకేతువు మోహరించారు.

వీరిని చూచి కౌరవులుకూడా తమ తమ సైన్యములను తగు విధముగా మోహరించారు. అందరి కన్నా ముందు భీష్ముడు నిల్చున్నాడు. నీ కుమారులందరూ భీష్ముని చుట్టు నిలిచారు. ద్రోణుడు, అశ్వత్థామ, కుడి ఎడమల నిలిచారు. కృపాచార్యుడు, కృతవర్మ భగదత్తునితో కలిసి సుయోధనుడు మధ్య భాగమున నిలిచాడు. బృహద్బలుడు, కాంభోజరాజు మొదలగు ముఖ్యులైన రాజులు రారాజు చుట్టు నిలిచారు. త్రిగర్తాధీశుడు సుశర్మ రారాజు వెనుక నిలిచాడు. ఈ ప్రకారము మన సైన్యము యుద్ధ భూమిలో నిలిచింది.

ఇరువైపుల వివిధ తూర్య నాదములు మిన్నుముట్టాయి. ఒకరితో ఒకరు యుద్ధం చెయ్యడం మొదలెట్టారు. ఆరోజు యుద్ధము దేవ దానవ యుద్ధమును తలపించింది. యమపురిలో సందడి మొదలయినట్టు ఉంది. నకులసహదేవులు చెలరేగిన పరాక్రమంతో కౌరవ సేన మీద పడి తునుమాడుతున్నారు. భీమార్జునులు మరొక పక్కనుండి కౌరవ సేనలను ఊచకోత కోస్తున్నారు. పాండవ సేన విజృంభించి కౌర వ సేనలను నాశనం చేస్తూ ఉంది.

ఇది చూచాడుభీష్ముడు. కల్పాంతంలో విజృంభించిన రుద్రుడి మాదిరి పాండవ సేనల మీద శరవర్షము కురిపించాడు. ఒకరితో ఒకరు పోరాడుతున్న కాల్బలములు, రథమునకు కట్టిన హయములు, గజ సైన్యములోని ఏనుగులు నేలకూలుతున్నాయి. శిఖండి భీష్ముని మీద మూడు బాణములు గుప్పించాడు. భీష్ముడు అతని వైపు కూడా చూడకుండా "నిన్ను బ్రహ్మ ఆడుదానిగా సృష్టించాడు. కాని మధ్యలో మగతనం పొందావు. నువ్వు నా మీద శరవర్షము కురిపించినా సరే నవ్వి ఊరుకుంటాను కాని నీతో నేను యుద్ధం చేయను. నీమీద నాకు కోపం పుట్టదు." అని పలికాడు.

ఆ మాటలు విన్న శిఖండి "భీష్మా! ఎంతోమంది రాజులను గెలిచావు. పరశురామునికి ప్రతి వీరుడవై నిలిచావు. మరి నీ శౌర్యము బలము నాకు చూపవా! నీవు నామీద శరసంధానము చేయక పోయినను నేను మాత్రం నిన్ను వదలను. నా క్రూరములైన శరములతో నిన్ను చంపుతాను. నేను ఎవరైతే నీకు ఎందుకు. నాతో యుద్ధం చెయ్యి. " అని కవ్వించాడు శిఖండి.

ఇది చూచాడు అర్జునుడు. "నేడు శిఖండి వైఖరి వింతగా నున్నది. భీష్ముడు పడిపోవుటకు సమ యము ఆసన్న మయినట్టున్నది.

అందుకే దైవ ప్రేరితుడై శిఖండి ఈ ప్రకారము ప్రవర్తిస్తున్నాడు." అని మనసులో అనుకున్నాడు.

అర్జునుడు శిఖండి ని చూచి "శిఖండీ! ఇన్ని మాటలాడిన తరువాత నీవు ఏమీ చేయక పోతే లోకం నిన్ను చూచి నవ్వుతుంది. నీ వెనుక నేనున్నాను. నీకేం భయము లేదు. నీవు భీష్ముని మీదికి ఉరికి అతనిని చంపు." అని ప్రోత్సహించాడు.

కాని గాంగేయుడు అక్కడి నుండి తొలగిపోయి పాంచాల రాజు సైన్యమును తునుమాడుతున్నాడు. అర్జునుడు తన సైన్యముతో కలిసి భీష్మునితోయుద్దానికి దిగాడు. అర్జునుని ధాటికి కౌరవ సేన నిలువలేక పారిపోయింది. అప్పుడు సుయోధనుడు భీష్ముని చూచి "పితామహా! నీవు ఉండగనే, నీ ఎదురుగానే మన సేనలు పారిపోతున్నాయి. మరి మీరు చూస్తూ ఊరుకోడం న్యాయమా!" అన్నాడు.

ఆ మాటలకు నొచ్చుకున్న భీష్ముడు "సుయోధనా! నేను పది రోజులకు పది వేలమందిని చంపుతానని నీకు మాట ఇచ్చాను. పది వేల మందిని చంపాను. నీ ఋణం తీర్చుకున్నాను. నేటి యుద్ధము నడిచే తీరు చూస్తుంటే ఈ రోజు నన్ను పాండవులో లేక నేను పాండవులనో

చంపడం తథ్యం అని తెలుస్తూ ఉంది. కాని నేను మానవుడను. వారు దైవాంశ సంభూతులు. కాబట్టి ఒక మానవుడి చేతిలో దైవాంశ సంభూతులు మరణించడం అసాధ్యం. ఐనను నా పరాక్రమము చూపించెదను చూడు." అంటూభీష్ముడు వివిధ రాజుల సైన్యములను వెంటబెట్టుకొని, పాండవ సైన్యమును నిర్మూలించసాగాడు. భీష్మునికి సాయంగా నీ పుత్రులు అతని పక్కన నిలిచి పోరుతున్నారు.

ఇది చూచి పాండవులు, మత్స్య, పాంచాల, యాదవ, పాండ్య, కేకయ రాజులు తమ తమ సేనలతో ఒక్కుమ్మడిగా భీష్ముని మీదికి లంఘించారు. పోరు ఘోరమయింది. అర్జునుడు శిఖండిని చూచి "శిఖండీ! నీవు భీష్ముని ఎదిరించుము. నేను నీ పక్కనే ఉంటాను. నీకేం భయం లేదు. నిన్ను చూచి భీష్ముడు అస్త్రసన్యాసం చేస్తాడు. అప్పుడు నేను నా బాణములతో అతనిని కూలుస్తాను." అని ప్రోత్సహించాడు.

ఈ పలుకులు విన్న ధృష్ట ద్యుమ్ముడు తనసేనలతో "రండి! మన యోధులందరూ రండి. ఒక్కుమ్మడిగా భీష్ముని పైకి రండి. మనకు వెన్నుదన్నుగా అర్జునుడు ఉన్నాడు, మనకేం భయం లేదు." అని ఎలుగెత్తి అరిచాడు. అప్పుడు ధర్మజుడు, భీముడు, నకులుడు, సహదేవుడు, అభిమన్యుడు, ద్రౌపదీ సుతులు, విరాటుడు, సాత్యకి, చేకితానుడు, ధృష్టకేతు, కేకయ రాజులు, మాగధులు, వారి వారి

సైన్యములు, ఇంకా ఇతర రాజులు అందరూ ఒక్కుమ్మడిగా భీష్ముని చుట్టుముట్టారు.

ఇది చూచిన అశ్వత్థామ, భూరి శ్రవసుడు, కృతవర్మ, కృపాచార్యుడు, కాంభోజరాజు, వికర్ణుడు, దుర్ము ఖుడు, వివింశతి, త్రసేనుడు, మొదలగు యోధాను యోధులు భీష్మునికి అండగా నిలిచారు. శిఖండిని ముందు పెట్టుకొని యుద్ధము చేయుచున్న అర్జుననికి భీష్మునికి మధ్యలో దుశ్శాసనుడు నిలిచాడు. కృష్ణార్జునుల మీద 20 పదునైన బాణములు వదిలాడు. వాటిని మధ్యలోను త్రుంచిన అర్జునుడు, దుశ్శాసనుని మీద 100 నారాచములు ప్రయోగించాడు. దుశ్శాసనుడు 5 బాణములు అర్జునుని ఫాల భాగమున నాటాడు. అర్జునుడు దుశ్శాసనుని విల్లు తుంచాడు. దుశ్శాసనుడు మరొక విల్లు తీసుకొని 20 బాణములు అర్జునుని మీదికి సంధించాడు. వాటిని నరికిన అర్జునుడు, మరియొక వాడి బాణముతో దుశ్వాసనుని వక్షస్థలము మీద కొట్టాడు. ఆ దెబ్బకు దుశ్శాసనుడు మూర్ఛపోయాడు. వెంటనే దుశ్శాసనుని సారథి, తన రథమును వెనుకకు మరలించి భీష్ముని వెనుకకు తీసుకొని వెళ్లాడు. ఇంతలో తెలివి తెచ్చుకున్న దుశ్శాసనుడు మరల ముందుకు వచ్చాడు. అర్జుననితోయుద్ధం చేయడం మొదలెట్టాడు.

ఆ సమయమున సాత్యకితో అలంబసుడు, భగదత్తుడు; అభిమన్యునితో సుదక్షిణుడు, విరాట, ద్రుపద మహారాజులతో అశ్వత్థామ, సహదేవునితో కృపాచార్యుడు, నకులునితో వికర్ణుడు, ఘటోత్క చునితో దుర్ముఖుడు, భీమసేనునితో భూరిశ్రవసుడు, చేకితానునితో చిత్రసేనుడు, ధర్మనందనునితో ద్రోణుడు, ఒకరితో ఒకరు తలపడ్డారు.

ఇరుపక్కల నున్న యోధులు ఒకరి కేతనములు ఒకరు విరుచు కుంటున్నారు. ఒకరి విల్లు మరొకరు విరుచుకుంటున్నారు. గుర్రము లను, ఏనుగులను చంపుకుంటున్నారు. ఒకరిని ఒకరు నరుక్కుం టున్నారు. రక్తం కాలువలు కట్టి పారుతూ ఉంది. ఇంతలో మధ్యాహ్నం అయింది. సూర్యుడు నడి నెత్తి మీదికి వచ్చాడు. దుశ్శాసనుడు తన మీద సంధించి విడిచిన అస్త్ర శస్త్ర ములను అన్నింటిని మధ్యలోనే త్రుంచిన అర్జునుడు, దుశ్శాసనుని కేతనము ఖండించాడు. అతని విల్లు తుంచాడు. అతని శరీరం నిండా బాణములను గుచ్చాడు. జయ జయ ధ్వానములు చేసాడు. అర్జునుని ధాటికి తట్టుకోలేక దుశ్శాసనుడు అక్కడి నుండి వేరే చోటికి వెళ్లిపోయాడు.

తర్వాత అర్జునుడు భీష్ముని ముందు నిలిచిన బలగములను వరస పెట్టి చంపుతున్నాడు. అది చూచిన ద్రోణుడు మహా కోపంతో అర్జునుని ఎదుర్కొన్నాడు. ఇంతలో అపార సేనావాహినితో ధర్మతనయుడు అక్కడకు వచ్చి ద్రోణుని తో యుద్ధానికి దిగాడు. ఈ పరిణామమును గమనించిన ద్రోణుడు తన కుమారుడైన అశ్వత్థామను పిలిచి ఈ విధంగా చెప్పాడు. "కుమారా! ఈ రోజు ఎందుకో తడబాటు కలుగుతూ ఉంది. దివ్య అస్త్రములు స్ఫురణకు రావడం లేదు. చేతులు వణుకుతున్నాయి. విల్లు చేతినుండి జారిపోతూ ఉంది. మనస్సు వశం తప్పుతూ ఉంది. పిడికిలి పట్టు సడలుతూ ఉంది. నేటితో అర్జునుడు గాంగేయుని హతమారుస్తాడు అని, తన ప్రతిజ్ఞ నెరవేర్చుకుంటాడు అని అనుమానంగా ఉంది. ఒకసారి అటు చూడు. అర్జునుని ధాటికి గుఱ్ఱములు కూలుతున్నాయి. ఏనుగులు నేల మీద వాలిపోతున్నాయి. రథములు విరుగుతున్నాయి. యముడు విహరిస్తున్నాడా అని అనిపిస్తూ ఉంది. అనేక దుశ్శకునములు గోచరిస్తున్నాయి. ఎందుకో భీష్మునికి కీడు కలుగుతుంది అని అనుమానంగా ఉంది. యుధిష్ఠిరుని మొహంలో కోపం ప్రజ్వరిల్లుతూ ఉంది. ద్రౌపదేయులు, నకుల సహదేవుల సహితంగా పోరాడుతున్న ధర్మనందనుని విడిచి నేను రాలేను. కాబట్టి నువ్వు వెంటనే పోయి భీష్ముని కి సాయంగా నిలువుము." అని పలికాడు.

ఆ మాటలు విన్న అశ్వత్థామ తండ్రి ఆదేశము మేరకు తన రథమును భీష్ముని వంకకు మరల్చాడు. ఆ సమయంలో భీమసేనుడు గాంగేయుని ముందు నిలిచి అతనికి రక్షణగా పోరుతున్న కౌరవ సైన్యము ను నిర్మూలించాడు. అది చూచి భగదత్తుడు, కృపాచార్యుడు, కృతవర్మ, శల్యుడు, సైంధవుడు, చిత్రసేనుడు, దుర్మర్షణుడు, వింద, అను విందులు, అను పదిమంది మహారథులు అందరూ ఒక్కచోటచేరి భీష్మునికి రక్షణగా నిలిచారు. నానాశస్త్రములతో భీమసేనునితో పోరాడుతున్నారు.

కాని భీముడు చలించడం లేదు. ఇంతలో అర్జునుడు భీమ సేనునికి సాయంగా వచ్చాడు. వారందరి కేతనములు విరిచాడు. విల్లులు తుంచాడు. రథములు విరగ్గొట్టాడు. వీరవిహారం చేస్తున్నాడు. ఇది చూ చి న సుయోధనుడు సుశర్మను తన సైన్యముతో సహా భీమార్జునులతో పోరమని నియోగించాడు. సుశర్మ వెంటనే ఆపదిమంది యోధులను కలుసుకొని భీమార్జునులతో పోరుతున్నాడు. కాని ఎవ్వరూ ఒక్క అడుగు కూడా ముందుకు కదప లేక పోతున్నారు.

సుయోధనుడు కలవర పడ్డాడు. తన సైన్యము యావత్తు అక్కడకు రావలసిందిగా ఎలుగెత్తి అరిచాడు. యుద్ధం మొత్తం అక్కడే

జరుగుతున్నదా అనిపించింది. భీమార్జునులు ఒంటరిగా పోరుతున్న సంగతి గమనించి అభిమన్యుడు, సాత్యకి మున్నగు ప్రముఖవీరులు తమ తమ సైన్యములతో వేగంగా అచ్చటకు చేరు కున్నారు. పాండవుల విజయోత్సాహము చూచిన భీష్ముడు కోపించి తన అస్త్ర శస్త్రములతో వారిని ఎదుర్కొన్నాడు. ఆ భయంకర యుద్ధంలో రధసారధులు చచ్చి పోతున్నారు. హయములు, ఏనుగులు అతి క్రూరంగా చంప బడు తున్నాయి. భీష్ముడు ఎక్కడ చూచినా తానే అయి రణరంగ మంతా కలయ తిరుగుతున్నాడు.

అప్పటికి అపరాహ్ణమయింది. భీష్ముడు తన మనసులో కలత చెందుతున్నాడు. "ఈ పది రోజులనుండి ఎంతో మంది ఉత్తమ క్షత్రియు లను దారుణంగా వధించాను. వేలకొలది సైనికులను చంపాను. విసిగిపోయాను. ఈ శరీరంతో బంధం ఇంక తెంచుకుంటే మంచిది అని పిస్తూ ఉంది." అని మనసు లో తలంచిన భీష్ముడు తన రధమును యుధిష్ఠిరుని వద్దకు పోనిచ్చాడు. అతనితో యుద్ధం చేస్తున్నట్టు నటిస్తూ ఇలా అన్నాడు

"యుధిష్ఠిరా! నేనుపుట్టి నప్పటి నుండి ఎందరో రాజులను అతి క్రూరంగా చంపాను. ఇంకా చంపుతూనే ఉన్నాను. కాలం గడిచి పోతూ

ఉంది. నాకు వయసు  అయిపోయింది.  ఈ రాక్షసమైన జీవితం తో విసిగిపోయాను. అసహ్యం కలుగుతోంది.  మీరు  నా మేలు కోరే వారయితే శిఖండిని ముందు పెట్టుకొని అందరూ నా పైన యుద్ధానికి రండి. ఇంక ఆలస్యం చెయ్యకండి. నాకు ఈ దేహమునుండి, విముక్తి ప్రసాదించండి. " అని ధర్మజుని తో పలికి,  తన రథమును వేరొక వైపునకు మళ్లించాడు.  యథావిధిగా యుద్ధం చేస్తూ శాత్రవ సైన్యమును నిర్మూలిస్తున్నాడు.

ఆ పలుకులు విన్న యుధిష్ఠిరుడు పక్కనే ఉన్న ధృష్టద్యుమ్నుని చూచి "వింటివి కదా పితామహుని పలుకులు. నువ్వు,  భీమసేనుడు, అర్జునుడు,  మనసైన్యములోని  యోధాను  యోధులందరూ  కలిసి ఒక్కుమ్మడిగాభీష్ముని చుట్టుముట్టండి. " అని ఆదేశించాడు. వెంటనే ధృష్టద్యుమ్నుడు మత్స్య కేకయ రాజులను, తక్కుంగల మహారథికులను చేయి ఊపి పిలిచాడు. అందరిని భీష్ముని మీదికి వెళ్లమని సైగ చేసాడు. తాను కూడా, భీమసేనుడు, అర్జునుడు తో కూడా కలిసి భీష్ముని చుట్టుముట్టారు.

ఇది చూచిన సుయోధనుడు కూడా తన తమ్ములు, మిగిలిన రాజులను కూడగట్టుకొని భీష్మునికి అండగా నిలిచాడు.  ఇరుపక్షముల

మధ్య పోరు ఘోర మయింది. అభిమన్యుడు తన సైన్యముతో సుయోధనుని మీదికి దుమికాడు. అతనిని తన క్రూరమ్మైన నాచారములతో నొప్పించాడు. అశ్వత్థామ సాత్యకి ఒంటి నిండా బాణములను నాటాడు. భీమసేనుడు రారాజును ఎదుర్కొన్నాడు.

"భీష్ముని వెంటనే చంపండి" అని పాండవుల సైన్యము. "ఎలాగైనా భీష్ముని కాపాడండి" అని కౌరవ సైన్యము ఒకరితో ఒకరు వీరాపాలు పలుకుతూ యుద్ధం చేస్తున్నారు. సింహంతో మరొక సింహం పోరుతున్నట్టు అర్జునుడు భీష్మునితో పోరుతున్నాడు. వారిద్దరి మధ్యకు దుశ్శాసనుడు తన సైన్యముతో అడ్డం వచ్చాడు. అర్జునుడు తన పదునైన బాణములతో దుశ్శాసనుని కొట్టాడు. అర్జునుని ధాటికి తట్టుకోలేక దుశ్శాసనుడు భీష్ముని వెనక దాక్కున్నాడు.

అర్జునుడు భగదత్తుని ఎదుర్కొన్నాడు. అతను ఎక్కిన గజమును గాయపరిచాడు. భగదత్తుడు అర్జునుని వదలి పాంచాల భూపతి మీదికి వెళ్లాడు. అర్జునుడు శిఖండిని చూచి "నీవువెంటనే భీష్ముని గుండెలకు గురిపెట్టి బాణములు వదులు." అని ప్రోత్సహించాడు. కౌరవ యోధులు అర్జునుని ఎదుర్కొన్నారు. అర్జునుడు వారిని దూది పింజల మాదిరి ఎగరగొట్టాడు.

శిఖండి భీష్ముని వక్షస్థలమునకు గురిపెట్టి శరములను గుప్పించాడు. కాని భీష్ముడు అతని వైపు కూడా చూడలేదు. మరొక పక్కకు తిరిగి యుద్ధం చేస్తున్నాడు. శిఖండి భీష్ముని వక్షస్థలము భుజముల మధ్యభాగములో మర్మస్థానములలో కొడుతున్నాడు. కాని భీష్ముడు అతని వంకకూడా చూడటం లేదు. అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు. ఇది చూచిన దుశ్శాసనుడు కోపంతో రగిలిపోయాడు. భీష్మునికి అడ్డం వచ్చి అర్జునునితో తలపడ్డాడు. సుయోధనుడు కూడా కళింగ, మాళవ, బాహ్లిక, విదేహ రాజులను, శూరసేనుడు మొదలగు ప్రముఖులను చూచి, చేయి ఊపుతూ అక్కడకు చేరుకొమ్మని సైగ చేసాడు. వారందరూ తమ తమ సేనావాహినులతో అక్కడకు వచ్చి అర్జునుని ఎదుర్కొన్నారు. అర్జునుడు ఏ మాత్రం తొట్రుపడక, ఆ రాజులందరిని వారి సైన్యములతో సహా కట్టడి చేసాడు. దూరంగా తరిమి కొట్టాడు.

అర్జునుడు శిఖండిని చూచి వెంటనే భీష్ముని మీద శరసంధానము చేయవలసినదిగా ఆదేశించాడు. అర్జునుని అండ చూచుకొని శిఖండి తన క్రూరమైన నారాచములతో భీష్ముని వక్షస్థలమునకు గురిపెట్టి కొట్టాడు. భీష్ముని మేను రక్తసిక్తమయింది. శిఖండి తన శంఖం

పూరించి సింహనాదం చేసాడు. దుశ్శాసనుడు తేరుకొని, కృపాచార్యుడు, శల్యుడు, వివింశతి, వికర్ణుడు మొదలగు కురు వీరులను కూర్చుకొని, తన సైన్యమును కూడగట్టుకొని భీష్మునికి అర్జునునికి మధ్య ప్రవేశించాడు. అర్జునుని వారందరి రథములు విరుగగొట్టాడు. ఇది చూచిన సుయోధనుడు, అతని తమ్ములు క్రోధంతో రగిలిపోయారు. సుయోధనుడు తన అక్షౌహిణీల సైన్యమును అర్జునుని తో పోరవలసినదిగా చేయి ఊపి సైగ చేసాడు. సుయోధనుని ఆజ్ఞ మేరకు కురు సైన్యము అర్జునుని చుట్టుముట్టారు.

భీష్ముడు ఒక్క ఉగ్రమైన అస్త్రమును ప్రయో గించి పాండవ సైన్యమును నిర్మూలించవలెనని అనుకున్నాడు. అస్త్ర ప్రయోగము చేయబోవగా ఎదురుగా శిఖండి కనిపించాడు. వెంటనే అస్త్రప్రయోగము విరమించు కొని మరొక పక్కకు తిరిగి విరాటుని సైన్యములతో యుద్ధం చేయసాగాడు. భీష్ముని ధాటికి విరాటుని సేనలు నిలువలేకపోయాయి. విరాటుని తమ్ముడు శతానీకుడు అను వాడు తన సైన్యమునకు ధైర్యము చెబుతూ బీష్ముని మీదికి విరుచుకుపడ్డాడు. భీష్ముని వక్షస్థలము మీద అతి క్రూరమైన నారాచములు ప్రయోగించాడు. భీష్ముడు కోపంతో ఊగిపోయాడు. శతానీకుని విల్లు ఖండించాడు. కేతనం కూల్చాడు. రథసారధిని చంపాడు. రథమునకు కట్టిన హయములను చంపాడు.

భీష్ముని పరాక్రమము తట్టుకోలేక పోయాడు శతానీకుడు తనవద్ద ఉన్న శక్తి అస్త్రమును ప్రయోగించాడు. భీష్ముడు శతానీకుడు వేసిన శక్తి అస్త్రమును మధ్యలోనే తుంచి, మరొక నిశితమైన అస్త్రముతో శతానీకుని శిరస్సు ఖండించాడు. ఇది చూచిన విరాటుని సేనలు పారిపోయాయి.

ఇదంతా చూస్తున్న కృష్ణుడు అర్జునుని చూచి ఇలా అన్నాడు. "అర్జునా! మన సేనలు చూడు! భీష్ముని ధాటికి నిలువలేక పారి పోతు న్నాయి. నీవు భీష్ముని చంపక తప్పదు. వెంటనే భయంకర అస్త్రములను భీష్ముని మీద ప్రయోగించు." అని అన్నాడు. కృష్ణుని మాట శిరసా వ హించిన అర్జునుడు భీష్ముని మీద శరసంధానము చేసాడు. భీష్ముని రధసారధిని చంపాడు. రధమునకు కట్టిన గుర్రములను చంపాడు.

ఇది చూచి శిఖండి కూడా రెచ్చిపోయాడు. వాడియైన బాణ ములు భీష్ముని మీదకు ప్రయోగించాడు. శిఖండిని చూచిన భీష్ముడు శరసంధానము చేయలేదు. అప్పుడు అర్జునుడు భీష్ముని విల్లు తుంచాడు. ఇది చూచి సహించ లేని శల్య, కృప, కృతవర్మ, చిత్రసేన, భూరిశ్రవస ప్రభృతులు దివ్యాస్త్రములు అర్జునుని మీద ప్రయోగిస్తూ, తమ తమ సైన్యములను పురికొల్పుతూ, భీష్మునికి అడ్డుగా నిలిచారు.

ఇది చూ చిన భీముడు, సాత్యకి, అభిమన్యుడు, విరాటుడు, ద్రుపదుడు, ఘటోత్కచుడు మొదలగు ప్రముఖ యోధులు తమ తమ సేనలతో శత్రుసైన్యములను ఎదుర్కొన్నారు. ఇరు పక్షముల మధ్య పోరు ఘోరమయింది. అర్జునుడు ఎక్కడ చూచినా తానే అయి రణరంగ మంతా విహరిస్తున్నాడు. ఇంద్ర, వారుణ, ఆగ్నేయాస్త్రములను ప్రయో గిస్తున్నాడు.

మరొక పక్క శిఖండిని రక్షిస్తూ, అతనిని భీష్మని మీద శర ప్రయోగము చేయ మని ప్రోత్సహి స్తున్నాడు. భీష్మని విల్లు ను విరిచాడు. భీష్మడు ఎన్ని ధనువులు ఎత్తినా అన్నింటిని విరుస్తున్నాడు. భీష్మని శరసంధానము చేయకుండా ఆపుతున్నాడు. విసిగి పోయిన భీష్మడు ఒక భయంకర శక్తిని ప్రయోగించాడు. కాని దానిని మధ్యలోనే తుత్తుని యలు చేసాడు అర్జునుడు. భీష్మని రధ సారధిని చంపాడు. కేతనము విరిచాడు. దేవదత్తమును పూరించాడు.

అర్జునుని పరాక్రమము చూచిన భీష్మడు, "ఈ అర్జునునికి కృ ష్ణుని తోడు లేనిచో ఇతనిని నేను నిర్జించలేనా. పోనిమ్ము. ధర్మరాజాదులు నన్ను స్వవధోపాయము చెప్పమని అడిగినపుడు వారిని అను గ్రహిం చాను. నా చావు నేనే కోరుకున్నాను. ఇప్పుడు వీరావేశంతో పోరాడి

ప్రయోజన మేమున్నది. ప్రస్తుతము సమరమును విరమించి ప్రశాంతంగా ఉండటమే తక్షణ కర్తవ్యము." అని అనుకున్నాడు.

భీష్ముని నిర్ణయాన్ని అతని మనసు తెలిసిన దేవతలు, మహా మునులు కూడా అభినందించారు. వాళ్ల అభినందనలు ఒక్క భీష్మునికి, వ్యాసభగవానుని కరుణ వలన నాకు వినబడ్డాయి. కాని తాను రణము చేయ కుండా ఉపేక్షించిన సుయోధనుడు మొదలగువారు తన గురించి చెడెగా అనుకుంటారని మరొక విల్లు తీసుకొని శరసంధానము చేయ బోయాడు.

కాని ఆ సమయంలో శిఖండి భీష్ముని మీద దారుణమైన శరములను సంధించాడు. భీష్ముడు చిరు నవ్వు నవ్వి ఆ బాణములను లెక్కపెట్టలేదు. పక్కనే ఉన్న అర్జునుడు భీష్ముని మీద పుంఖాను పుం ఖములుగా శరవర్షము కురిపించాడు. భీష్ముడు ఆగ్రహించి అర్జునుని శరములను మధ్యలోనే తుంచాడు. మరల అర్జునుని మీద అత్యంత వాడియైన శరములను ప్రయోగించాడు. అర్జునుడు వాటిని మధ్యలోనే తుంచాడు. మరొక బాణముతో భీష్ముని చేతిలోని విల్లును తుంచాడు. భీష్ముని వక్షస్థలమునకు గురి పెట్టి అతి నిశితమైన నారాచములను ప్రయోగించాడు.

ఇది చూచి సుయోధనుడు నిశ్చేష్టుడయ్యాడు. భీష్ముడు సుయో, దనుని తన వద్దకు పిలిచాడు. "సుయోధనా! చూచితివా అర్జునుని పరాక్రమము. దేవాసురులకు కూడా రణరంగమున అర్జునుని ఎదిరించి నిలుచుట సాధ్యము కాదు. ఇంక మానవ మాత్రులు అతనిని ఎదిరించి నిలువలేరు." అని పలికాడు.

ఇంతలో అర్జునుడు తన వింటిని శిఖండి చేతిలో ఉన్న విల్లు వెనక పెట్టి అతి క్రూరమైన నారాచములను భీష్ముని మీద ప్రయోగించాడు. తన శరీరమున నాటుకొనుచున్న ఆ నారాచములను చూచి భీష్ముడు దుశ్శాసనుని దగ్గరకు పిలిచి, "దుశ్శాసనా! చూచితివా! ఇవి శిఖండి విల్లునుండి వచ్చిన బాణములు కావు. అర్జునుని గాండీవము నుండి వెలువడిన బ్రహ్మ దండముల వంటి బాణములు. నాకు మర్మస్థానము లలో తగులుతున్నవి. యమదూతల వంటి ఇలాంటి బాణములను వేయుటకు శిఖండికి చేతకాదు. ఈ బాణములు ధృడంగా ఉన్నాయి. గురి తప్పడం లేదు. అత్యంత దీప్తివంతములుగా ఉన్నాయి. ఏ మాత్రం లక్ష్యం తప్పకుండా మర్మస్థానములలో తగులుతున్నాయి. సునిశితంగా ఉన్నాయి. ఇటువంటి నారసములు అర్జునుని గాండివము నుండి కాక శిఖండి విల్లునుండి వెలువడుట అసంభవము." అని అన్నాడు.

వెంటనే తన యావచ్ఛక్తిని కూడగట్టుకొని భీష్ముడు శక్తి ఆయుధమును అర్జునుని మీద ప్రయోగించాడు. అర్జునుడు ఆ శక్తిని మధ్యలోనే తుత్తునియలు చేసాడు. వెంటనే భీష్ముడు తన ఖడ్గము, డాలు తీసుకొని రధమునుండి దిగుటకు ప్రయత్నించాడు. కాని అర్జునుడు భీష్ముని కత్తిని, డాలును తన బాణములతో ఖండించాడు. సింహనాదం చేసాడు.

"భయపడకండి. భీష్మునితో పోరండి. అతనిని చుట్టుముట్టండి. చంపండి" అని తనసేనలను పురికొల్పాడు. అర్జునుని పలుకులు ఆలకించిన పాండవ యోధులు "పొడువుడు. వ్రేయుడు, నరకండి. చంపండి" అని కేకలు వేస్తూ భీష్ముని పైకి వస్తున్నారు. వారిని కౌరవ సైనికులు అడ్డుకున్నారు. ఇరుపక్షముల మధ్య పోరు ఘోరమయింది. సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకుంటున్నాడు.

ఆ సమయంలో అర్జునుడు అతి క్రూరమైన నారాచములను గాంగేయుని శరీరమున నాటి ఆయనను పడగొట్టాడు. అర్జునుడు సింహ నాదం చేసాడు. దేవదత్తం పూరించాడు. భీష్ముడు రథం మీది నుండి కింద పడిపోయాడు. ఆ పడడం తూర్పుదిక్కు తల ఉండేట్టు

పడ్డాడు. భీష్ముని శరీరము భూమిని తాక కుండగా అతని శరీరములో నాటిన బాణములు అతనికి శయ్యవలె నిలిచాయి.

భీష్మునిలో పారమార్థిక చింత మొదలయింది. దేవభావం ఆవేశించింది. ఆకాశం నుండి చూచుచున్న దేవతలో "అయ్యో ఇది దక్షిణాయనము భీష్ముడు దక్షిణాయనములో చనిపోతాడేమో" అని కలవర పడ్డారు. దేవతల మనసు తెలుసుకున్న భీష్ముడు చిరు నవ్వు నవ్వి " ఓ దేవతా మూర్తులారా! కాలగతిని బట్టి దక్షిణాయనమున ప్రాణములు విడుచుట దుష్టమని తలచి నా ప్రాణములను నా మేనిలో నిలుపుకున్నాను. పూర్వము నా తండ్రి సత్యవతిని వివాహమాడు సమయమున నాకు స్వచ్ఛంద మరణమును వరముగా ప్రసాదించినాడు. ఆ వర ప్రభావమున నేను నా ప్రాణములు వదలు నంతవరకు నా ప్రాణములు నా వశంలో ఉంటాయి." అని పలికాడు. ఆ మాటలు విన్న దేవతలు ఎంతో సంతోషించారు.

భీష్ముని తల్లి గంగాదేవి పంపగా కొంతమంది మునులు హంసల రూపములో భీష్మునికి దక్షిణాయము గురించి తెలుపడానికి వచ్చారు. అప్పటికే భీష్మునికి ఆ విషయం తెలుసునని ఎరింగి సంతసించి వెళ్లి పోయారు.

భీష్ముని పాటును చూచిన దుర్యోధనుడు వెంటనే ఈ విషయం ద్రోణునికి ఎరిగించి రమ్మని దుశ్శాసనుని పంపాడు. దుశ్శాసనుని వలన ఈ విషయం విన్న ద్రోణుడు మూర్ఛపోయాడు. వెంటనే తేరుకున్న ద్రోణుడు భీష్ముని పాటుకు ఎంతో విలపించాడు. వెంటనే భీష్ముడు పడి ఉన్న చోటికి వెళ్లాడు.

భీష్ముడు పడిపోవడం చూచి పాండవ సైన్యములో ఆనందోత్సాహములు మిన్నుముట్టాయి. పాండవేయులు, మత్స్య, పాంచాల,యాదవ సహితముగా అందరూ చాలా సంతోషించారు. తూర్యనాదములు, మంగళ వాద్యముల ఘోష ఆకాశాన్నంటింది. నీ కుమారులు. కౌరవ సైన్యములోని ప్రముఖులు అత్యంత విషాదమునకు లోనయ్యారు. ఆ తరువాత యుద్ధం ఆగిపోయింది. ఇంతలోనే సాయంత్రం అయింది. నలుదిక్కులా చీకట్లు అలముకున్నాయి." అని సంజయుడు పదవ రోజు యుద్ధ విశేషములను, భీష్ముని పతనమును ధృతరాష్ట్రునికి వివరించాడు.

" సంజయా! ఇంతటి ఘోర వార్తను విని కూడా నా మనస్సు ఆవంతయును చలించడం లేదు.నాది హృదయమా! లేక పాషాణమా!

తెలియకున్నది. ఇంతేనా ఇంకా ఏమన్నా చెప్పవలసినది ఉన్నదా! ” అని అడిగాడు.

అంతట సంజయుడు తదనంతర విశేషములు చెప్ప నారంభించాడు. “అప్పుడు కౌరవులు పాండవులు తమ తమ ఆయుధములు విడిచి గాంగేయుని వద్దకు వెళ్లారు. ధనుంజయుడు మాత్రం తన గాండీవము తో సహా తాత గారి దగ్గరకు వెళ్లాడు. ఆ సమయములో ఇరు పక్షముల వారు తమ తమ ఆవేశ కావేషములను, రోషములను విడిచి పితామహుని ముందు నిలిచారు.

భీష్ముడు నీ తనయుల వంక చూచి “నా తల వాలిపోవుతున్నది దానికి ఒక ఆధారము కావలెను” అని అడుగగా నీ పుత్రులు పోయి వెను వెంటనే అతి సుతిమెత్తని దిండ్లు తీసుకొని వచ్చారు. వాటిని సున్నితంగా తిరస్కరించి, గాంగేయుడు అర్జునుని వైపు చూచాడు. అప్పుడు అర్జునుడు కళ్లలో నీరు కుక్కుకుంటూ, తన గాండీవముతో తాత గారి తల వైపున మూడు బాణములు భూమిలో నాటాడు. వాటి మీద తన తల పెట్టుకున్నాడు గాంగేయుడు.

కౌరవ పాండవులను చూచి " నేను ఉత్తరాయణ పుణ్యకాలము వచ్చు వరకు ఈ శరతల్పమున శయనించెదను. అప్పటి దాకా నాకు తగు రక్షణ కల్పించండి. " అని అడిగాడు. వారు వెంటనే అత్యంత భక్తితో, భీష్ముడు పడి పోయిన ప్రాంతము చుట్టు ఒక ప్రాకారము నిర్మించారు.

ఇంతలో సుయోధనుని పంపున వైద్యులు వచ్చారు. భీష్మునికి వైద్యం చేయుటకు అనుమతి కొరకు ప్రార్థించారు. గాంగేయుడు సున్నితంగా వారి వైద్య సహాయమును తిరస్కరించాడు. ఇంతలో దేవవ్రతునికి దాహం వేసింది. నీరు కావలెనని సైగ చేసాడు. నీ కుమారులు వెంటనే మధురమైన శీతల పానీయములు అక్కడకు తెప్పించారు. కాని వాటిని భీష్ముడు ముట్టలేదు. "నేను శరతల్పగతుడనై ఉన్నాను. ఇతరములగు నీటిని ముట్టను. నాకు తేజోమయమైన అస్త్రవిన్యాసముతో భూగర్భజలమును ఉపరితలమునకు తెచ్చిన, ఆ నీటిని సేవించెదను." అని పలికాడు.

ఆమాటలు విన్న నీ కుమారులు, తక్కిన రాజులు భూగర్భ జలమును ఏ విధముగా ఉపరితలమునకు తీసుకు రావలెనా అని ఆలోచించుచుండగా, గాంగేయుడు అర్జునుని చూచి "అర్జునా! ఈ

బాణముల వలన కలుగు బాధ నా సర్వాంగములను వేధించుచున్నది. నా దాహము తీర్చుటకు జలములు నీవే కొని తేవలెను." అని పలికాడు.

అప్పుడు అర్జునుడు పితామహునికి ప్రదక్షిణము చేసి, ఒక దివ్యాస్త్రమును సంధించాడు. పర్జన్య మంత్రము తో ఆ శరమును అభిమంత్రించాడు. ఆ బాణమును భూమిలోకి వదిలాడు. భూమిలో నుండి స్వచ్ఛమైన భూగర్భ జలములు ధారాపాతముగా పైకి ఎగిసాయి. అది చూచి కౌరవులు ఆశ్చర్యపోయారు. పాండుకుమారులు ఎంతో సంతోషించారు. ఆ భూగర్భజలములతో తన దాహం తీర్చు కున్నాడు భీష్ముడు.

ఆ ప్రకారము తృప్తి చెందిన భీష్ముడు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! నేను పూర్వము నారదుని వలన నిన్ను నరునిగా తెలుసు కున్నాను. నర నారాయణులైన నీవు, శ్రీకృష్ణుడు కలిస్తే మీకు అసాధ్యము లేదు. మీ ఇద్దరితో వైరము తగదు అని ఎన్నిసార్లు చెప్పినా ఈ కురునాధుడు వినలేదు. అతను భీముని చేతిలో తగు ఫలితము అనుభవించగలడు. అది తధ్యము." అని పలికి నీ కుమారుడు సుయోధనుని చూచి "సుయోధనా! అర్జునుడు నరుడు. అత్యద్భుత పరాక్రమశాలి. అతనికి నారాయణుడైన శ్రీకృష్ణుడు ఆప్తుడు. ఈ

నరనారాయణులను జయించుటకు ఎవరి తరము కాదు. ఇప్పటి కైనను నా మాట విని అజాతశత్రువైన ధర్మనందనునకు ఇంద్రప్రస్థముతోసహా అతనికి సగము రాజ్యము పంచి ఇమ్ము. మిగిలిన వాళ్లయినా నిండు నూరేళ్లు బతకండి. ఈ యుద్ధము మానండి. " అని హితవు పలికాడు. ఎవరూ బదులు చెప్పలేదు. భీష్మునికి నమస్కరించి ఎవరి నివాసములకు వారు వెళ్లారు.

ఆ సమయమున కృష్ణుడు ధర్మనందనుని చూచి "ధర్మజా! దేవతలకు కూడా అజేయుడు అర్జునుడు. అతనిని గెలుచుట ఎవ్వరి తరమూ కాదు." అని పలికాడు దానికి ధర్మజుడు "కృష్ణా! ఈ విజయము అంతయు నీ యొక్క తోడ్పాటు వలన కలిగినదే కదా! ఇందులో మా పరాక్రమము ఇసుమంతయును లేదు." అని వినయంగాపలికాడు.

ఆ ప్రకారము ఒకరిని ఒకరు ప్రశంసించుకొనుచూ అందరూ తమ తమ నివాసములకు వెళ్లారు. అనంతరము, కర్ణుడు ఒంటరిగా భీష్ముని వద్దకు వెళ్లాడు. అతని పాద ములకు భక్తితో నమస్కరించాడు. "పితామహా! నా మీద కోపము మాని, నన్ను అధిక వాత్సల్యముతో చల్లగా చూచి తగిన మాటలాడండి. " అని ప్రార్థించాడు.

అప్పుడు భీష్ముడు కర్ణుని ప్రేమతో దగ్గరకు పిలిచాడు. ఒక చెయ్యి ఎత్తి అతనిని కౌగలించుకున్నాడు. అక్కడ ఉన్న రక్షక భటులను దూరంగా వెళ్లమని చెప్పాడు. తమ మాటలు ఎవరూ వినడం లేదని తెలుసు కొని కర్ణునితో ఇలా అన్నాడు. "కర్ణా! నా కెందుకయ్యా నీ మీద కోపము. నీవు కులభేదముతో మాట్లాడుతున్నావని, కురు పాండవులకు మధ్య వైరము ను ఎగదోయు చున్నావని నిన్ను నిందించానే గాని నాకు నీ మీద ఏ మాత్రం కోపము లేదు. అది పెద్దవాడిగా నేను నీకు వేసిన శిక్ష గాని ద్వేషము కాదు. నీ పుట్టుక దైవికము. అందువలన మామూలు మానవులు నిన్ను ఎదిరింపజాలరు గెలువ జాలరు. నీవు కుంతీ పుత్రు డవు గాని రాధా పుత్రుడవు కావు. ఈ విషయములు వ్యాసుడు నాకు ఏకాంతములో చెప్పాడు. నాకు నీ యొక్క పరాక్రమము తెలియును. నీవు పాండు తనయుడవు కావున నాకు నీ యందు వాత్సల్యమే గాని, మత్సరము లేదు. ఇంకొక్క మాట. నేను కురు పాండవులకు వైరము తగదు అని చెప్పాను ఎందుకంటే పాండవులు అజేయులు. అప్రమేయు డగు శ్రీకృష్ణుడు వారికి అండగా ఉన్నాడు. కాబట్టి వారితో విరోధము మంచిది కాదు. నీవుకూడా మరొక తలపు మనసులో పెట్టుకోకుండా పాండవులతో కలిసి ఉండు." అని హితవు పలికాడు భీష్ముడు.

దానికి కర్ణుడు " పితామహా! నేను రాధేయుడను కాను కౌంతేయుడను అని ఇంతకు ముందే విన్నాను. కాని ఈసమయమున కుంతీ పుత్రులతో నాకు పొత్తు కుదురుతుందా చెప్పండి. పాండవులు మహా బలులు. వారికి శ్రీకృష్ణుని సహాయము కలదు. వారిని యుద్ధములో జయింపలేము. ఇది తథ్యము. కాని ఇప్పటి దాకా సుయోధనుని ప్రాపున, ఆయన చేత సకలమైన మన్ననలు పొంది, ఈ సమయములో అతనిని విడిచి పోవుట ధర్మమా! న్యాయమా! అది వీరత్వమనిపించుకుంటుందా! అదియును కాక నేను నాడు కౌరవ సభలో పాండవులను పెక్కు విధములుగా నిందించాను. పాండవులకు అహర్నిశమూ కీడు తలపెట్టాను. కౌరవులకు, పాండవులకు మధ్య వైరమును రగిల్చాను. పెంచి పోషించాను. నేనంటే పాండవులకు అసహ్యము పుట్టేట్టు ప్రవర్తించాను. ఈ పరిస్థితులతో నాకు వారితో యుద్ధమే శరణ్యము గాని పొత్తుకాదు. సర్వము దైవాధీనము. మన చేతిలో ఏమియును లేదు కదా! మీరు మారు మాట్లాడక నన్ను పాండవులతో యుద్ధమునకు దీవించి పంపండి. నా సేవా ధర్మము నేను నిర్వర్తించెదను. నా బల పరాక్రమములు కృష్ణార్జునుల ముందు ప్రదర్శించెదను." అని పలికాడు కర్ణుడు.

"కర్ణా! నీవు అంతటి పరాక్రమ శాలివి అని నాకు తెలియును. సుయోధనునికి నీ భుజ బలమే కదా అత్యంత సహాయకారి. కావున, రారాజుకు ప్రియం కలిగేటట్టు సకలము ఆచరింపుము. నీకు నేను అనుజ్ఞ ఇస్తున్నాను. ఏ మాత్రం అనుమాన పడకుండా నీ మనసుకు తోచినట్టు చేయుము." అని పలికాడు.

భీష్ముని ఆదరపూర్వకమైన పలుకులకు ఎంతో ఆనందించాడు కర్ణుడు. భీష్ముని వద్ద అనుజ్ఞ పొంది తన నివాసమునకు వెళ్లాడు." అని సంజయుడు పదవ రోజుయుద్ధ విశేషములను ధృతరాష్ట్రునికి వివరించాడు అని వైశంపాయనుడు జనమేజయునకు మహాభారత కథను చెప్పాడు.

ఇది

తిక్కనామాత్య ప్రణీతమైన

మహాభారతము భీష్మపర్వము, తృతీయాశ్వాసము

సంపూర్ణము. భీష్మపర్వము సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహా భారతము

## ద్రోణ పర్వము

### ప్రధమాశ్వాసము

ఆ ప్రకారయు దేవవ్రతుడు శాంతి పొందిన విధము తెలుసుకొనిన తరువాత ధృతరాష్ట్రుడు ఏమి చేసాడు? వివరించండి అని జనమే జయుడు వైశంపాయన మహర్షిని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు మహాభారత కధను జనమేజయునకు ఈ విధంగా చెప్పసాగాడు.

భీష్ముడు యుద్ధ రంగమున పడిపోయిన వార్త విన్న తరువాత ధృత రాష్ట్రుడు ఎంతో ఖిన్నుడయ్యాడు. "సంజయా! నీవు సత్వరమే యుద్ధభూమికి పోయి తరువాత జరిగిన విషయములు తెలుసుకొని రమ్ము" అని చెప్పి తన కుమారుడు సుయోధనుని విజయమును ఆకాక్షిస్తున్న ధృతరాష్ట్రుడు సంజ యుని యుద్ధభూమికి పంపాడు.

కొన్ని దినములు గడిచాయి. వ్యాసుని మహిమ చేత ఉభయ సైన్యముల యుద్ధవిశేషములను ప్రత్యక్షంగా చూచిన సంజయుడు ఒక రోజు అర్ధరాత్రిసమయమున హస్తినాపురమునకు తిరిగివచ్చాడు.

వెంటనే సంజయుడు ధృతరాష్ట్రుని అంతఃపురమునకు వెళ్లాడు. ధృత రాష్ట్రుడు అతనిని ఆహ్వానించి ఉచితాసనమిచ్చి సముచితముగా సత్కరించాడు.

"సంజయా! మా తండ్రిగారు భీష్ముడు యుద్ధరంగమున పడిపోయిన తరువాత, మన యోధులు ఎవ్వరి సాయముతో పాండవుల మీద యుద్ధము చేసారు. ఆ సమయములో కౌరవులు ఏమి చేసారు. ఇరువురి మధ్య యుద్ధం ఏ ప్రకారము సాగింది. వివరంగా చెప్పు. " అని అడిగాడు. దానికి సంజయుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"మహారాజా! నీకు ఇప్పటి వరకు భీష్ముడు దేవభావమును పొందడం, కురుపాండవులు అతని వద్దకు రావడం, ఆ సమయమున జరిగిన విశేషములు, అన్నియు నీకు సవిస్తరముగా వివరించాను. శరతల్పగతుడయిన శాంతనవుడు చెప్పిన మంచి మాటలు నీ కుమారుడు సుయోధనుడు పెడచెవిని పెట్టాడు. కోపంతో అక్కడినుండి వెళ్లిపోయాడు. నీ వద్దనుండి నేను నాటి వేకువ జామున యుద్ధరంగమునకు చేరుకున్నాను.

మరునాటి యుద్ధమునకు సన్నాహాలు జరుగుతున్నాయి. చతురంగ బలములు (అనగా రథములు, ఏనుగులు, గుర్రములు, కాల్బలము) యుద్ధమునకు సమాయత్త మవుతున్నాయి. కాని కురు వీరుల ముఖములు వివర్ణమై ఉన్నాయి. భీష్ముడు లేకపోవడంతో కౌరవ సేనలు కళా కాంతులు కోల్పోయాయి. ఒకరి ముఖములు ఒకరు చూచుకుంటున్నారు. ఆ సమయంలో అందరి దృష్టి కర్ణుడిమీద ఉంది. అతడి కోసం అందరూ ఎదురు చూస్తున్నారు.

రథికులందరూ కలిసి సుయోధనుని వద్దకు వెళ్లారు. "సుయోధనా! మీ తాత గారు భీష్ముడు లేని సైన్యము పతిని కోల్పోయిన సతి మాదిరి, పంటభూములు లేని భూదేవి మాదిరి కళావిహీనమైనది. భీష్ముడు లేకపోవడం చూచి పాండవ సేనలు విజృంభించుచున్నవి. ఈసమయమున కర్ణుడే వచ్చి మనలను రక్షించాలి. ఈ పదిరోజులు భీష్ముని మాటలకు కోపించి కర్ణుడు యుద్ధభూమికి రాలేదు. సుయోధనా! భీష్ముడు కర్ణుని అర్ధరధుడు అని అవమానించబట్టి అతడు మనసులో నొచ్చుకొని "నీవు యుద్ధభూమిలో ఉన్నంత వరకు నేను రణరంగమున అడుగుపెట్టను. యుద్ధములో నీకు జయం కలిగితే నేను వనములకు పోతాను. లేక నిన్ను శాత్రవులునిర్జిస్తే వాళ్లను నేను నిర్జిస్తాను." అని ప్రతిజ్ఞ చేసాడు కదా. ఆ కారణం చేత కర్ణుడు ఈ పది

రోజులు యుద్ధభూమికి రాలేదు. ఇప్పుడు మనవారి మనసంతా కర్ణుని మీద ఉన్నది.” అనిపలికారు.” అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు సంజయునితో “సంజయా! ఈ తరువాత ఏమి జరిగింది? కర్ణుడు యుద్ధరంగంలో ప్రవేశించాడా? పాండవులను ఓడించాడా? మనవారి మనోరథము సఫలమైనదా! ” అని ఆతురతగా అడిగాడు. దానికి సంజయుడు ఈవిధంగా చెప్పాడు.

“ మహారాజా! అంతలో కర్ణుడు అక్కడకు వచ్చాడు. సుయోధనుడు కర్ణుని సాదరంగా ఆహ్వానించాడు. అక్కడున్న రాజులందరిని చూచి కర్ణుడు ఇలా అన్నాడు. “దమము, సత్వగుణము, తపము, దానము, శీలము, అస్త్రవిద్యానైపుణ్యము, వీరత్వము, శౌర్యము ఆభరణములు గా కల మహానుభావుడు భీష్ముడు రణరంగమున పడిపోయాడు. ఆయన నాయకత్వము లేని ఈ అక్షౌహిణిల సైన్యము ఉండటం వలన ప్రయోజనమేమి? సుయోధనుని సమస్త సంపదలు సమసి పోయినట్టున్నది.” అని దుఃఖించాడు కర్ణుడు.

అతనితోపాటు అక్కడ ఉన్న రాజులుకూడా భీముని పాటుకు దుఃఖించారు. తనను తాను ఉపశమింప చేసుకొని కర్ణుడు ఇలా అన్నాడు. "మీరంతా చూస్తూ ఉండగా భీష్ముడు మేరు పర్వతము పడిపోయినట్టు పడిపోయాడు. ఈ సమయములో నేను మన సైన్యమును రక్షిస్తాను. అర్జునుని గర్వము అణుస్తాను. భీష్ముని మాదిరి యుద్ధభూమిలో చెలరేగుతాను. శత్రుసేనలను చించి చెండాడుతాను. పాండవులు ఆ కృష్ణుని అండ చూచుకొని విర్రవీగుతున్నారు. వారి నందరిని నా శరపరంపరలతో హతమారుస్తాను. ఈ సువిశాల కురు సామ్రాజ్యమునకు సుయోధనుని పట్టాభిషిక్తుని చేస్తాను. అలా జరగని నాడు నేను వీరస్వర్గము అలంకరిస్తాను. కౌరవులను రక్షిస్తూ, పాండవులను నిర్జిస్తూ, కీర్తి గడిస్తూ, స్వర్గంలో భీష్ముని కలుసుకుంటాను. అంతకన్నా నాకు కావాల్సిందేమున్నది." అని సగర్వంగా పలికాడు కర్ణుడు.

ఆ మాటలకు సుయోధనుడు చాలాసంతోషించాడు. తరువాత కర్ణుడు తన రథమును ఎక్కి భీష్ముడు అంపశయ్యమీద పడి ఉన్న చోటికి వెళ్లాడు. ఇంకి పోయిన మహా సముద్రము మాదిరి అంప శయ్య మీద ఉన్న భీష్ముని చూచి అల్లంత దూరములో రథము దిగి పాద చారియై భీష్ముని వద్దకు విళ్లాడు. కన్నీటితో ఆ మహానుభావుని పాదాలకు

ప్రణమిల్లాడు. "పితామహా! రాధేయుడను తమరి దర్శనార్ధము వచ్చాను. కళ్లు తెరిచి చూడండి. తమరు ఈ ప్రకారము అంపశయ్యమీద పడి ఉండటం విధివిలాసము కాక మరేమున్నది. పరమపావనములయిన తమరి పలుకులతో నన్ను ఆదరించండి. నేను ఈ రోజునుండి పాండవుల మీదికి యుద్ధానికి వెళుతున్నాను." అని పలికాడు.

భీష్ముడు కళ్లు తెరిచి చూచాడు. కర్ణుడు భీష్మునికి నమస్కరించి "అనఘా! అర్జునుని అహంకారమును నేను ఒక్కడినే అణచి వేస్తాను. తమరి ఆశీర్వాదంతో పాండవులు గడ్డి కరుస్తారు. నన్ను ఆశీర్వదించండి." అని నమస్కరించాడు. "కర్ణా! సుయోధనాదులు నీ అండ చూచుకొనేకదా సుఖంగా ఉంటున్నారు. కౌరవులకు సుయోధనుడు ఎలాగో నువ్వు అలాగే కదా! జన్మతః వచ్చిన బంధుత్వము కన్నా స్నేహితము గొప్పది కదా! ఈ కురు సామ్రాజ్యం భారము నీవే వహించి సుయోధనునకు ఆనందము కలుగ చేయుము. అంబష్ఠ, విదేహ, పౌండ్ర,మొదలగు దేశములను గెల్చి సుయోధనుని అధీనము గావించిన నీకు నేను చెప్పవలసినది ఏమున్నది. నాకు సుయోధనుడు ఎంతో నువ్వు అంతే కదా! నీవు కౌరవ సేనలను నడిపించి సుయోధనునికి విజయం చేకూర్చు." అని పలికాడు భీష్ముడు.

కర్ణుడు మరొకసారి భీష్ముని పాదములకు నమస్కరించి ఆయన అనుమతితో అక్కడినుండి యుద్ధరంగమునకు బయలుదేరాడు. కౌరవ సేనలను చేరుకున్నాడు. రథ, గజ, తురగ, పదాతి దళములను సమీకరించాడు. వారిని తన వీరాలాపములతో ఉత్సాహపరిచాడు. కౌరవ సేనలు జయజయధ్వానాలు చేశారు. ఇంతలో సుయోధనుడు కర్ణుని వద్దకు వచ్చాడు. "కర్ణా! నీరాకతో కౌరవ సేనలో ఆనందోత్సాహాలు వెల్లుబికాయి. మనసేనలు యుద్ధానికి ఉరకలు వేస్తున్నాయి. మన ప్రస్తుత కర్తవ్యము ఏమిటి? " అని అడిగాడు. ""

"సుయోధనా! నీవు రారాజువు. నీ ఆజ్ఞ మాకు శిరోధార్యము. ప్రస్తుత కర్తవ్యమును నీవే నిర్ణయింపుము." అని పలికాడు కర్ణుడు. సుయోధనుడు కొంచెం ఆలోచించి "కర్ణా! ఈ పదిరోజులు మన సేనానాయకుడు భీష్ముని నాయకత్వంలో మన సేనలు నడిచాయి. ప్రస్తుతము మనకు ఒక సేనానాయకుడు కావాలి. కౌరవ సేనలకు నాయకత్వము వహించుటకు ఎవరు అర్హులో నిర్ణయించాలి." అని అన్నాడు సుయోధనుడు.

"సుయోధనా! నీ వద్ద ఉన్న మహా వీరులందరూ సేనాపతి పదవికి అర్హులే! కాని వారిలో ఒకరిని సైన్యాధ్యక్షునిగా నియమించిన మిగిలిన

వారిలో మత్సరము రగుల్కొనును. కాని ద్రోణుని సైన్యాధ్యక్షుని చేసిన అతనిని కాదను వారు ఎవ్వరూ లేరు. అతను మనందరికి ఆచార్యుడు, పూజ్యుడు, బ్రాహ్మణుడు, వివిధ రణ తంత్ర కోవిదుడు. వయోవృద్ధుడైనను మహా బలవుంతుడు, శూరుడు. అతనిని సర్వసైన్యధ్యక్షునిగా అభిషేకించండి." అని పలికాడు కర్ణుడు. కర్ణుని నిర్ణయంతో ఏకీభవించాడు సుయోధనుడు.

వెంటనే సుయోధనుడు తన తమ్ములు మిత్రరాజులతో కలిసి ద్రోణాచార్యుని వద్దకు వెళ్లాడు. ఆయనతో సవినయంగా ఇలా అన్నాడు. "ఆచార్యా! వయసులోనూ, శౌర్యములోనూ, అస్త్ర,శస్త్ర విద్యలలోనూ తమరు అగ్రగణ్యులు. ఇప్పటి వరకూ తాత భీష్ములవారు సర్వసైన్యధ్యక్ష పదవినలంకరించారు. ఇపుడు మీరు ఆ పదవిని అలంకరించి మమ్ము ఆనందింప చేయండి. మేమందరము తమరి ఆజ్ఞానుబద్ధులమై నడచుకుంటాము. నాడు దేవసేనను నడిపించిన కుమారస్వామి వలె తమరు కౌరవ సేనను నడిపించమని మా కోరిక." అని ప్రార్థించాడు.

ఆ మాటలకు సంతోషించి ద్రోణాచార్యుడు ఇలా అన్నాడు. "సుయోధనా! నేను బ్రాహ్మణుడను. వేదవేదాంగములు అభ్యసించాను. నాలో క్షత్రియోచిత లక్షణములైన ధైర్మము, పరాక్రమము మొదలగు

లక్షణములు లేవు. అయినను మీరందరూ నన్ను ఇంతగా ఆదరిస్తున్నారు కాబట్టి సుయోధనుని కోరిక మేరకు నేను ఈ సర్వసైన్యాధ్యక్ష పదవిని స్వీకరించడానికి ఒప్పుకుంటున్నాను. చెదరి పోయిన మన సైన్యమును ఒక చోట చేర్చి పాండవుల సైన్యము తో పోరాడి నీకు విజయము చేకూర్చెదను." అని పలికాడు.

ద్రోణాచార్యుని పలుకులకు సంతసించి సుయోధనుడు వెంటనే సువర్ణ కలశములతో పవిత్ర గంగాజలము ను తెప్పించాడు. పుణ్యాహవాచన కార్యక్రములు పూర్తి చేయించాడు. పుణ్యాంగనల ఆశీర్వచనములు వందిమాగధుల స్తోత్రపాఠముల మధ్య ద్రోణుని సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించాడు. కౌరవ ప్రముఖులు తమ తమ శంఖములు పూరించారు. భేరీ మృదంగధ్వానములు మిన్నుముట్టాయి. సర్వసైన్యాధ్యక్షుడైన ద్రోణాచార్యుడు ముందు నిలువగా కౌరవసేనలు యుద్ధానికి సన్నద్ధమైనాయి. ద్రోణాచార్యుడు ఐదు దినములు పాండవసైన్యముతో హోరాహోరి పోరాడాడు. ఒక అక్షౌహిణి సైన్యమును చంపాడు. ఎందరో మహా వీరులు ద్రోణాచార్యుని ధాటికి తట్టుకోలేక వీరస్వర్గమలంకరించారు. ఆ మహావీరుడు ఆ ప్రకారము ఐదు దినములు నిరంతర వీరవిహారము చేసి వీరస్వర్గమలంకరించాడు." అని చెప్పాడు సంజయుడు.

ద్రోణుని మరణ వార్త విని ధృతరాష్ట్రుడు ఎంతో దుఃఖించాడు. కాసేపు మౌనంగా ఉన్నాడు. "సంజయా! ద్రోణుడు అస్త్రశస్త్రవిద్యలో ప్రావీణ్యుడు కదా. అత్యంత పరాక్రమ వంతుడు కదా! అట్టివాడు పాండవుల చేతిలో ఎలా మరణించాడు? పాంచాలురు అతని విల్లు విరగగొట్టారా! రథం విరిగిపోయిందా! రథసారథిని చంపారా! ద్రోణుడు అలసిపోయి నపుడు ఆ పాపాత్ముడు ధృష్టద్యుమ్నుడు అతి క్రూరంగా ఆచార్యుని చంపాడా! అంతటి మహావీరుని మరణ వార్త విని కూడా నా గుండెలు వేయి వ్రక్కలు కాలేదేమి! నాది గుండె కాదు. పాషాణము." అని పరి పరి విధముల దుఃఖించి మూర్ఛపోయాడు.

మరల తెలివి తెచ్చుకొని "సంజయా! నరనారాయణులు రథి, సారథి అయి నపుడు ఆ రథము ఎల్లప్పుడూ సిద్ధమనోరథమే అవుతుంది కదా! నకుల సహదేవులు అత్యంత పరాక్రమ వంతులు. సాత్యకి అమిత పరాక్రమశాలి. ఉత్తమౌజుడు అమిత బలవంతుడు. ధృష్ట కేతుడు ధీరుడు. భీష్ముని కూల్చిన శిఖండి అఖండ పరాక్రమ వంతుడు. అభిమన్యుడు రెండవ రుద్రుడు. చేకితానుడు మానధనుడు. ద్రౌపదీసుతులు అజేయులు. ఐదుగురు కేకయరాజులు ఒక్కొక్కరు 50 మంది వీరులకు సమానము. యుయుధానునికి మత్సరమెక్కువ. ద్రోణుని చంపడానికే పుట్టిన వాడు ధృష్టద్యుమ్నుడు, అత్యంత

బలశాలి. ఘటోత్కచుడు కాలయముడు. యాదవ వీరులు అతిలోక వీరులు. గదాధారి భీముడు ఎవ్వరికీ అలవిగాడు. కౌరవ సేనను పూర్తిగా తాను ఒక్కడే చంపగల మహా వీరుడు. ఇంక ధర్మరాజు పరమ ధార్మికుడు. సత్యాది మహాగుణగరిష్టుడు. అతనిని గెలువ దేవలతకు కూడా శక్యంకాదు.

సంజయా! ఇంకొక విషయమును చెప్పెదను వినుము. యదువంశములో లోకరక్షణార్థము శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో అవతరించాడు. బాల్యములోనే ఎన్నోలీలలు ప్రదర్శించాడు. ఎందరో రాక్షసులను చంపాడు. కంసుని పరిమార్చాడు. ఇంద్రుని దగ్గర నుండి పారిజాత వృ క్షమును భూలోకమునకు తీసుకొని వచ్చాడు. దుష్ట శిక్షణ, శిష్టరక్షణ చేసాడు. అంతటి మహానుభావుడు శ్రీకృష్ణుని ప్రాపకం సంపాదించిన వారు పాండవులు. కాబట్టి పాండవులను గెలవడం చాలాకష్టం. అదీ కాకుండా హరికి ఆత్మ అర్జునుడు. ఆ హరి అర్జునునికి ఆత్మ. శరీరాలు వేరైనా వారి ఆత్మలు ఒక్కటే. ఆ ఇరువురిని తన కంటివెలుగులుగా చేసుకున్న పుణ్యమూర్తి ధర్మరాజు. అతడు యుద్ధమునకు ఎందుకు భయపడతాడు. అందులకే కౌరవులకు చేటుకాలము దాపురించినది." అని పరి పరి విధములుగా దుఃఖించాడు ధృతరాష్ట్రుడు.

“సంజయా! ఇప్పుడు ఏమి అనుకున్నను ఏమియు ప్రయోజనము లేదు కదా! ద్రోణుడు ఏ ప్రకారము యుద్ధం చేసాడో వినవలెనని కుతూహలముగా నున్నది. తరువాతి యుద్ధ విశేషములు వివరింపుము.” అని అడిగాడు. అప్పుడు సంజయుడు ద్రోణుడు సర్వసైన్యాధ్యక్ష పదవి వహించిన తదుపరి యుద్ధ విశేషములు వివరంప నారంభించాడు.

“ఆ ప్రకారము సర్వసైన్యాధిపత్యము వహించిన ద్రోణుడు చాలా సంతోషించాడు. అందరూ వింటూ ఉండగా సుయోధనుని తో ఇలా అన్నాడు. “సుయోధనా! భీష్ముని తర్వాత నన్ను అంతటి వాడిని చేసి గౌరవించావు. దానికి ప్రతిఫలముగా నీవు ఏదైనా కోరుకో నెరవేర్చెదను.” అని పలికాడు. సుయోధనుడు కర్ణ,దుశ్శాసనులతో ఆలోచించి, సవినయముగా ద్రోణునితో ఇలా అన్నాడు.

“ఆచార్యా! తమరు కోరుకోమన్నారు కాబట్టి కోరుకుంటున్నాను. ధర్మరాజును ప్రాణములతో పట్టి తెచ్చి నాకు అప్పగించండి.” అని అడిగాడు. ద్రోణుడు ఆశ్చర్యంగా సుయోధనుని చూచి “సుయోధనా! ధర్మరాజు అజాత శత్రువు అన్న పేరు సార్ధకం చేసుకున్నాడు. ధర్మరాజును చంపమని కోరకుండా అతనిని ప్రాణములతో పట్టి తెమ్మని

కోరడంలో ఆంతర్యమేమి? పాండవులను యుద్ధములో గెలిచిన తరువాత వారికి అర్ధ రాజ్యము కట్టబెట్టదల్చుకున్నావా! ధర్మరాజును ప్రాణములతో పట్టి ఇస్తే ఏమి చేస్తావు?" అని అడిగాడు. దానికి సుయోధనుడు ఇలా బదులు చెప్పాడు.

"గురువర్యా! ధర్మరుజును యుద్ధములో చంపితే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. అర్జునుడు తన గాండీవముతో సమస్త కురు సైన్యమును అంతమొందించి తన పగ తీర్చుకుంటాడు. ఒకవేళ మేము పాండవులను అందరనూ చంపితే, శ్రీకృష్ణుడు తన చక్రాయుధముతో కురు వంశాన్ని నిర్మూలిస్తాడు. సమస్త కురు సామ్రాజ్యాన్ని కనీసం కుంతీదేవి కైనా అప్పగిస్తాడు. అలా కాకుండా మీరు ధర్మరాజును ప్రాణాలతో అప్పగిస్తే, ద్యూతప్రియుడైన ధర్మరాజుతో మరల జూదమాడి, ఓడించి మరల అతనిని, అతని తమ్ములు, భార్య బిడ్డలతో సహా జీవితాంతం అడవులకు పంపుతాము. నేను సమస్త కురు సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రాధిపత్యముగా ఏలుకుంటాను. అప్పుడు కృష్ణుడు కూడా ఏమి చెయ్యలేడు." అని అన్నాడు.

సుయోధనుని కుటిల బుద్ధికి ద్రోణాచార్యుడు మనసులో అసహ్యించుకున్నాడు. ఎలాగైనా తాను అనాలోచితంగా ఇచ్చిన

వరమునకు విఘాతము కల్గించ దల్చుకున్నాడు. సుయోధనుని చూచి "సుయోధనా! నీ కోరిక సమంజసమే. కాని ఇందులో ఒక చిక్కు ఉన్నది. ధర్మరాజు పక్కన అర్జునుడు ఉన్నంత వరకూ దేవతలు కూడా ధర్మరాజు వైపు కన్నెత్తి చూడలేరు.. ఇది జగమెరిగిన సత్యము. కాబట్టి మీరు ఎలాగైనా అర్జునుని ధర్మరాజు వద్దనుండి దూరముగా తీసుకొని వెళ్లిన నేను ధర్మజుని ప్రాణములతో పట్టి నీకు అప్పగించెదను." అని అన్నాడు ద్రోణుడు.

ఆ మాటలు విన్న నీ కుమారులు సంతోషించారు. అప్పుడే ధర్మరాజు ప్రాణాలతో పట్టుబడ్డట్టు పొంగిపోయారు. ఈ విషయాన్ని కౌరవ సైన్యము లో ఉన్న అందరు ప్రముఖులకు తెలియపరిచారు. కౌరవ వీరులు సింహనాదాలు చేసారు. భేరీ మృదంగ నాదాలు మిన్ను ముట్టాయి.

ఈ విషయములన్నియు తన చారుల ద్వారా తెలుసు కున్నాడు ధర్మరాజు. వెంటనే తన తమ్ములతో సమావేశం అయ్యాడు. అర్జునుని చూ చి "అర్జునా! ద్రోణాచార్యులవారి ప్రతిజ్ఞ వింటివి కదా! నన్ను ప్రాణములతో పట్టి బంధించి సుయోధనునికి అప్పగిస్తానని మాట

ఇచ్చాడట. నీవు దానిని వమ్ము చేయవలయును. ఎల్లప్పుడూ నా పక్కనే ఉండి నన్ను సదా కాపాడ వలయును." అని అన్నాడు.

ఆమాటలు విన్న అర్జునుడు, అన్నగారు ధర్మజుని తో ఇలా అన్నాడు. "అన్నయ్యా! యుద్ధరంగంలో నిన్ను ఒంటరిగా వదలి నేను వేరే చోట యుద్ధం చెయ్యడం అసంభవం. అది గురువును వధించినంత పాపం. అంత పాపానికి నేను ఒడి గట్టను. సదా నీ పక్కనే ఉండి నిన్ను రక్షిస్తూ ఉంటాను. అయినా కౌరవుల దురాశ గాని, నేను నీ పక్కన ఉండగా ఆ ద్రోణుడే కాదు, ముల్లోకాలు ఒకటై నిలిచినా, నిన్ను ఏమీ చేయలేరు." అని అన్నాడు.

అర్జునుని మాటలు విన్న ధర్మజుడు ఎంతో సంతోషించాడు. శంఖములు, భేరీ మృదంగములు, మంగళ తూర్యనాదములు మ్రోగుతుండగా పాండవులు యుద్ధరంగమునకు బయలుదేరారు. పాండవులు ఆ రోజు క్రౌంచ వ్యూహమును పన్నారు. క్రౌంచ వ్యూహము ముందు భాగమున అర్జునుడు నిల్చున్నాడు. అర్జునుని పక్కన ధృ ష్టద్యుమ్నుడు నిలిచాడు. భీముడు, నకుల సహదేవులు, అభిమన్యుడు ద్రౌపదీ పుత్రులు పాంచాల రాజు, మొదలగు యోధాను యోధులు వారి

వారి స్థానములలో నిలబడ్డారు. యుధిష్ఠిరుడు వ్యూహ మధ్యభాగములో నిలబడ్డాడు.

నీ కుమారులు కూడా దానికి దీటుగా శకటవ్యూహమును రచించారు. సింధురాజు, కళింగ భూపతి, వికర్ణుడు, దక్షిణభాగమున, నిలిచారు. వారి పక్కన శకుని, తన సేనలతో నిలిచాడు. కృతవర్మ, వివింశతి, చి త్రసేనుడు, దుశ్శాసనుడు, ఉత్తర భాగంలో నిలిచారు. కాంభోజ, శక, యవన రాజులు తమ తమ స్థానాలలో నిలిచారు. త్రిగర్త, మద్ర, శూరసేన, దేశాధీశులు తమ తమ సేనావాహినులతో సుయోధనునికి రక్షగా వ్యూహమునకు మధ్య భాగమున నిలిచారు. వారి అందరికి ముందు అంగ రాజైన కర్ణుడు తన సేనలతో సుయోధనునికి అండగా నిలిచాడు.

కౌరవ సేనలకు నుదుట తిలకము దిద్దినట్టుగా నిలబడిన కర్ణుని చూ చి కౌరవ సేనలు ఎంతో సంతోషించారు. "ఇన్ని రోజులు భీష్ముడు పక్షపాత బుద్ధితో ప్రవర్తించాడు. పాండవులను ఉపేక్షించాడు. కాని ఇపుడు కర్ణుడు పాండవుల ఉధృతికి అడ్డుకట్ట వేస్తాడు. అర్జునుడికి సరిజోడు కర్ణుడే కదా!" అని తమలో తాము అనుకుంటున్నారు.

ద్రోణుని నాయకత్వములో మనసేనలు యుద్ధమునకు బయలు దేరాయి. అప్పుడు ఎన్నో దుర్నిమిత్తములు గోచరించాయి. కాని సుయోధనుడు వాటిని లక్ష్య పెట్టలేదు. అర్జునుడు కర్ణుడు యుద్ధం చేస్తుంటే చూడాలని కోరికతో ఇరుపక్షములు ఎంతో ఆతురతగా ఎదురు చూస్తున్నాయి. ద్రోణుడు ఉజ్వలమైన తన రథము మీద రణభూమిలో ప్రవేశించాడు. ఇరు పక్షములు యుద్ధము ప్రారంభించారు.

రథములు, ఏనుగులు, గుర్రముల పదఘట్టనములతో రేగిన ధూళి ఆకాశం అంతా దట్టంగా కమ్మింది. శరములతో శరములు, ఖడ్గములతో ఖడ్గములు, అస్త్రములతో అస్త్రములు ఢీకొని వాటినుండి చెలరేగిన మంటలు సూర్యకాంతిని తలపిస్తున్నాయి. పగిలిన ఏనుగుల కుంభస్థలములు, తెగిపడిన హయముల అవయవములు, విరిగిన రథములు, వివిధ కాల్బలముల కళేబరములు, ఏరులయి పారుతున్న రక్తము, రణరంగమంతా భీభత్సంగా తయారయింది.

ద్రోణాచార్యులు తన రథము మీద చి త్ర వి త్ర విన్యాసములతో ఎక్కడచూ చి నా తానే అయి కనపడుతూ పాండవ సేనలమీద శరవర్షము కురిపిస్తున్నాడు. గజములను చంపుతున్నాడు. గుర్రముల కళేబర

ములు నెత్తుటిలో తేలుతున్నాయి. రధములు విరుగుతున్నాయి. ద్రోణుని ధాటికి తట్టుకోలేక పాండవసైన్యములు  పారిపోతున్నాయి.

ఇదంతా చూచిన ధర్మజుడు కలవర పడ్డాడు.  ధృష్టద్యుమ్నుని, అర్జునుని పిలిచాడు.  ద్రోణాచార్యుని ఉధృతిని ఆపమని  ఆదేశించాడు. ధృష్టద్యుమ్నుడు తన సేనలతో ద్రోణుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు పారి పోతున్న పాండవ సైన్యమునకు ధైర్యవచనములు చెప్పి వారిని మరల యుద్ధోన్ముఖులను చేస్తున్నాడు.  అందరూ  కలిసి ద్రోణుని నలుపక్కల నుండి చుట్టుముట్టారు.  కాని ద్రోణుడు  వయసులో  వృద్ధుడైనను కుమార స్వామి వలె విజృంభించాడు.  అయినా పాండవ సైన్యములు ద్రోణుని  ధైర్యంగా  ఎదుర్కొంటున్నాయి.  ద్రోణుని  సారధిని, హయములను  రక్తం కారేట్టు కొట్టాయి. ద్రోణుడు వేసే బాణాలను మధ్యలోనే తుంచాయి.  ద్రోణుని సేనల మీద వివిధ అస్త్ర శస్త్ర ములను ప్రయోగించాయి.

ద్రోణుడు  ధృష్టద్యుమ్నుడు మధ్య యుద్ధం ఘోరంగా సాగుతూ ఉంది. వారు ఇరువురూ ఒకరి మీద ఒకరు వేసుకున్న బాణములతో గగనతలము నిండిపోయింది.  ఇది చూచి ధర్మరాజు తన సైన్యముతో ద్రోణుని మీద శరవర్షము కురిపించాడు.

శకుని సహదేవునితో యుద్ధం చేస్తున్నాడు. శకుని సహదేవుని గుర్రములను చంపాడు. కేతనము విరగ గొట్టాడు. సహదేవుడు కోపించి శకుని రథము విరగ్గొట్టాడు. అతని కేతనము తుంచాడు. శకుని తన గద తీసుకొని నేలమీదికి దూకాడు. సహ దేవుని రథసారథిని చంపాడు. సహదేవుడు కూడా తన గద తీసుకొని నేలమీదికి దూకి శకునితో యుద్ధం చేస్తున్నాడు.

భీమసేనుడు వివింశతి మీద శరవర్షము కురిపించాడు. వివింశతి బెదరక భీముని విల్లు రెండుగా ఖండించాడు. భీముడు తన గదతీసుకొని నేలమీదికి దూకి వివింశతి రథమునకు కట్టిన హయములను చంపాడు.

భూరిశ్రవసుడు ధృష్టద్యుమ్నుని ఎదుర్కొన్నాడు. అతని శరీరం అంతా బాణములు నాటాడు. అన్నయ్య పరిస్థితి చూచి శిఖండి భూరిశ్రవసుని ఎదుర్కొన్నాడు. తన బాణములతో అతనిని తరిమి తరిమి కొట్టాడు.

ఘటోత్కచుడు అలంబసుడు ఇద్దరూ మాయా యుద్ధం చేస్తున్నారు. క్షత్రదేవుడు లక్ష్మణునితో యుద్ధం చేస్తున్నాడు. చేకితానుడు

అనువిందునితో యుద్ధం చేస్తున్నాడు. శల్యుడు నకులునితో యుద్ధం చేస్తున్నాడు. నకులుడు శల్యుని కేతనము విరిచాడు. రధమును విరగ్గొట్టాడు.

ధృష్టకేతుడు కృపాచార్యునితో యుద్ధం చేస్తున్నాడు. సాత్యకి కృత వర్మ గుండెలకు గురిపెట్టి 70 బాణములను కొట్టాడు. కృతవర్మ కూడా 77 బాణములతో సాత్యకిని కొట్టాడు. ధృష్టద్యుమ్నుడు సుశర్మ తో యుద్ధం చేస్తున్నాడు. సుశర్మ మర్మస్థానములలో కొట్టాడు. విరాటుడు కర్ణుని ఎదుర్కొన్నాడు. విరాటుని సైన్యమునకు కర్ణుని సైన్యమునకు మధ్య పోరు ఘోరంగా సాగుతూ ఉంది. కర్ణుడు విరాటుని సైన్యములోని ఏనుగులను, హయములను చీల్చి చెండాడాడు. రధములు విరగ్గొట్టాడు.

ద్రుపదుడు త్రిగర్తాధిపది ఒకరి బలాబలములు ఒకరు పరీక్షించుకుంటున్నారు. పౌరవ రాజు అభిమన్యునితో తలపడ్డాడు. అభిమన్యుడు కోపంతో పౌరవ రాజు కేతనము ధనుస్సు విరిచాడు. ఐదు బాణములతో హయములను, రధసారధిని కొట్టాడు. మరొక బాణంతో పౌరవ రాజు శిరస్సును ఖండించబోవగా కృతవర్మ రెండు బాణములతో అభిమన్యుని విల్లు ఖండించాడు. అభిమన్యుడు తన కత్తి

డాలు తీసుకొని కిందికి దూకి పౌరవ రాజు రథమును విరగ్గొట్టాడు. రథసారథిని కిందికి ఈడ్చాడు. పౌరవుని చంపడానికి అతని మెడ పట్టుకున్నాడు. అంతలో సైంధవుడు కత్తి తీసుకొని అభిమన్యుని ఎదుర్కొన్నాడు. అభిమన్యుడు పౌరవుని వదలి సైంధవుని మీద పడ్డాడు. అభిమన్యుడు కోపంతో సైంధవుని కత్తి డాలు విరగ్గొట్టాడు. అభిమన్యుని ధాటికి తట్టుకోలేక సైంధవుడు పారిపోయాడు. అభిమన్యుడు సైంధవుని సేనల మీద పడి వారిని నరుకుతున్నాడు.

పారిపోతున్న సైంధవుని చూచి మిగిలిన రాజులు ఒక్కుమ్మడిగా అభిమన్యుని మీద పడ్డారు. మద్రదేశాధిపతి శల్యుడు అభిమన్యుని మీద భీకరమైన శక్తి ప్రయోగించాడు. అభిమన్యుడు ఆ శక్తిని తన చేతితో పట్టుకొని తిరిగి శల్యుని మీదికి విసిరాడు. ఆ శక్తి శల్యుని రథ సారథి శిరస్సు ఖండించింది.

ఆ సమయంలో విరాటుడు, ద్రుపదుడు, ధృష్టకేతు, యుధిష్ఠిరుడు, సాత్యకి, కేకయరాజులు, భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, నకులసహదేవులు, ద్రౌపదీసుతులు, అభిమన్యునికి సాయంగా వచ్చారు. అభిమన్యుని రథం చుట్టు రక్షణ గా నిలబడ్డారు. శత్రుసేనలను

తునుమాడుతున్నారు. ఇది చూచి నీ కుమారులందరూ కలిసి అభిమన్యుని మీద శరవర్షము, భల్లబాణములు కురిపించారు.

తన సారథి చనిపోవడంతో శల్యుడు తన గద తీసుకొని రథమునుండి కిందికి దుమికి అభిమన్యుని మీదికి ఉరికాడు. అభిమన్యుడు కూడా తన గద తీసుకొని రథమునుండి దిగి శల్యుని ఎదుర్కొన్నాడు. ఇది చూచిన భీమసేనుడు శల్యుని చెయ్యిపట్టుకొని పక్కకు లాగి తనతో గదా యుద్ధము చెయ్యమని గర్జించాడు. శల్యుడు అభిమన్యుని వదలి భీమసేనునితో గదాయుద్ధము చేస్తున్నాడు. ఒకళ్ల చుట్టు ఒకళ్లు తిరుగుతూ చి త్ర వి చి త్ర గతులతో గదా యుద్ధము చేస్తున్నారు. ఒకరికి ఒకరు తీసిపోని శల్యుడు, భీమసేనుడు ఒకరి గదాఘాతాలకు ఒకరు తట్టుకోలేక ఇద్దరూ మూర్ఛపోయారు. ఇది చూచిన కృతవర్మ వేగంగా వచ్చి శల్యుని తన రథము మీద ఎక్కించుకొని దూరంగా తీసుకొని వెళ్లాడు.

అంతలోనే మూర్ఛనుండి తేరుకున్న భీముడు శల్యుని కానక, కౌరవ సేనమీద పడ్డాడు. తన గదతో కౌరవ సేనను నిర్మూలించుచున్న భీముని చూచి నీ కుమారులు భీముని చుట్టుముట్టారు. అతని మీద వివిధములైన అస్త్ర శస్త్రములను ప్రయోగిస్తున్నారు. భీమునికి

సాయంగా నకుల సహదేవులు వచ్చారు. ఆ ముప్పురూ అత్యంత పరాక్రమముతో నీ కుమారులను ఎదుర్కొన్నారు.

ఇంతలో అపరాహ్ణము అయింది. పాండవులదీ పై చేయి అయింది. పాండవ సేనలలో జయజయధ్వానాలు మిన్నుముట్టాయి. కర్ణుని కుమారుడు వృషసేనుడు సింహనాదం చేస్తూ పాండవ సైన్యములోకి దూసుకుపోయాడు. పాండవ సైన్యాన్ని ఊచకోత కోస్తున్నాడు. అతని పరాక్రమానికి పాండవసేనలు తట్టుకోలేక పోయాయి. హయములు ఏనుగులు తలలు తెగి పడుతున్నాయి. రథ సారథులు చనిపోతున్నారు. రథములు విరుగుతున్నాయి. కాల్బలము నశించి పోతూ ఉంది. రక్తం ఏరులుగా పారుతూ ఉంది. కర్ణకుమారుడు వృషసేనుని ధాటికి పాండవ సేనలు ఎదురు నిల్చి పోరాడలేక పోతున్నాయి. ఇది చూచి, నకులుని కుమారుడు, శతానీకుడు మహాకోపంతో వృషసేనుని మీదికి లంఘించాడు. పది బాణములను అతనికి గురి చూసి కొట్టాడు. వృషసేనుడు శతానీకుని విల్లు తుంచాడు. అతని కేతనం ఖండించాడు. ఇది చూచిన ద్రౌపదీపుత్రులు ఐదుగురూ శతానీకునికి సాయంగా వచ్చారు. వివిధ శస్త్ర అస్త్రములతో అతనిని ముంచెత్తారు.

అశ్వత్థామ తన సేనలతో పాండవ సేనలను ఎదుర్కొన్నాడు. ధర్మరాజు, కేకయ రాజులు, విరాటుడు, ద్రుపదుడు, వారి వారి సేనలతో వచ్చి అశ్వత్థామను వృషసేనుని ఎదుర్కొన్నారు. ఇరుపక్షములకు పోరు ఘోరమయింది. భీముడు, కర్ణుడు, కృపుడు, ద్రోణుడు, అశ్వత్థామ, ధృ ష్టద్యుమ్నుడు, విరాటుడు, అత్యంత పరాక్రమముతో, సూర్యుడు సప్త అవతారములు ధరించినాడా అని వెలుగొందుతూ ఒకరితో ఒకరు పోరుతున్నారు. కొంత సేపటికి పాండవుల ధాటికి తట్టుకోలేక మన సైన్యములు పారిపోసాగాయి.

ఇది చూచిన ద్రోణుడు అత్యంత కోపోద్రిక్తుడై మన సైనికులను "నిలు నిలు" అంటూ నిలువరించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. సారధిని చూచి ఇలా అన్నాడు. "సారథీ! చూచితివా! మనసేనలన్నియు పారిపోతున్నాయి. ధర్మజుని ముఖము గర్వము తో వెలిగి పోతున్నది. ఇపుడు పాండవుల మీద విజృంభించక పోతే మన సేనలను ఆపలేము. ధర్మజుడు, భీముడు, సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు, వారి కుమారులు నా ముందు క్షణ కాలము నిలువలేరు. అర్జునునికి విలువిద్య నేర్పినది నేను కదా. ఈ సమయములో నేను ఒళ్లు దాచుకోకూడదు. నీ చాతుర్యము చూపించి రథమును తోలుము. నా చేతుల దురద తీరునంతవరకూ పాండవ సేనను చీల్చి చెండాడెదను." అని పలికాడు.

ఆ మాటలకు పొంగిపోయిన ద్రోణుని రధసారధి తన రధమును అతి చిత్ర వి చి త్ర రీతులతో రధమును నడుపుతున్నాడు. ద్రోణుడు పాండవ సైన్యములోనికి చొచ్చుకొని పోయి తన నిశిత శరములతో చించి చెండాడు తున్నాడు.

పొంగుతున్న సముద్రము మాదిరి విజృంభిస్తున్న ద్రోణుని చూచి ధర్మనందనుని చక్రరక్షకుడు సుకుమారుడు ద్రోణుని చెలియలి కట్ట మాదిరి అడ్డుకున్నాడు. తన పదునైన బాణములను ద్రోణుని గుండెలకు గురిపెట్టి కొట్టాడు. ద్రోణుడు కోపించి ఒకే ఒక బాణంతో సుకుమారుని తల తెగ నరికాడు.

అది చూచి పాండ యోధులందరూ ద్రోణుని ఒక్కమారుగా చుట్టుముట్టారు. వారిని చూచి ద్రోణుడు, ఐదు బాణములతో నకులుని, ఐదుబాణములతో సహదేవుని, తొమ్మిదిబాణములతో విరాటుని, ఏడు బాణములతో సాత్యకిని, మూడేసి బాణములతో ద్రౌపదీసుతులను, ఇరవై బాణములతో వింశతిని, పంద్రెండు బాణములతో ధర్మజుని శిఖండిని కట్టడి చేసాడు. తన ఎదురుగా వచ్చిన ఏ రధికుడు ప్రాణాలతో మరలిపోలేదు.

యుగంధరుడు అనే రాజు ధర్మజునికి ద్రోణునికి మధ్య నిలిచాడు. ద్రోణుడు కోపించి ఒకే ఒక బాణంతో యుగంధరుని చంపాడు. అది చూచి కేకయ రాజులు, ద్రుపదుడు, సింహసేనుడు, వ్యాఘ్రదత్తుడు, మొదలగు యోధులు ద్రోణునితో తలపడ్డారు సింహ సేనుడు, వ్యాఘ్రదత్తుడు తమ తమ అస్త్ర శస్త్ర ములను ద్రోణుని మీద ప్రయోగించారు. ద్రోణుడు వారి మీద కన్నెర్ర చేసాడు. రెండు వాడి అయిన అమ్ములతో ఇద్దరి శిరస్సులను ఖండించాడు. ఇది చూచిన మిగిలిన రధికులు పక్కతొలిగారు. ద్రోణుడు సింహనాదం చేసాడు.

ఈ అలజడి చూచి పాండ సేనలో కలకలం రేగింది "ద్రోణుడు ధర్మరాజును పట్టుకున్నాడు. సుయోధనుని సముఖమునకు తీసుకొని వెళుతున్నాడు." అని ఆక్రోశించారు. అది కార్చిచ్చులా వ్యాపించింది. పాండవ సైనికులు భయంతో వణికిపోయారు. ఇది చెవి సోకిన అర్జునుడు ద్రోణుని మీదికి తన రధం పోనిచ్చాడు. అది చూచి కౌరవ యోధులు ద్రోణునికి అండగా నిలిచారు. అర్జునుడు తన గాండీవం సంధించాడు. కౌరవ సేనల మీద శరపరంపర కురిపించాడు. కౌరవ సేనల తలలు ఎగిరి పడుతున్నాయి. రక్తం వరదలై పారుతూ ఉంది. మొండెములు నేలకూలుతున్నాయి. అర్జునుని ధాటికి కౌరవ సేనలు తట్టుకోలేక పోతున్నాయి.

ఇంతలో సూర్యుడు అస్తమించాడు. చీకట్లు కమ్ముకున్నాయి. ఆ రోజుకు యుద్ధం చాలించారు. అందరూ తమ తమ నెలవులకు వెళ్ళారు.” అని సంజయుడు దృతరాష్ట్రునితో ద్రోణుని ప్రథమ దివస యుద్ధ విశేషములను వివరించాడు.

మరునాడు ఉదయం  ఉభయ సైన్యములు యుద్ధమునకు సన్నద్ధమైనాయి. ఆసమయములో ద్రోణుడు సుయోధనుని చూచి “సుయోధనా! నిన్నటి రోజు నేను నా ప్రతిజ్ఞను నెరవేర్చుకోలేక పోయాను. ఎందుకంటే అర్జునుడు ధర్మజుని ఒక్క క్షణం కూడా విడిచి ఉండలేదు. ఆఖరి క్షణాలలో కూడా అర్జునుడు వచ్చి మన సేనలను తునుమాడాడు. కాబట్టి మీరు అర్జునుని దూరంగా తీసుకొని వెళ్లని ఎడల ధర్మరాజును పట్టుకోవడం సాధ్య పడదు. అర్జునుడు దగ్గర లేకపోతే ధర్మరాజు నన్ను చూచి పారిపోతాడు. అప్పుడు మనము అతనిని వెంబడించి పట్టుకొని బంధించ వచ్చును. ఆ ప్రయత్నము చేయండి.” అని అన్నాడు.

ఆ మాటలువిన్న సుశర్మ సుయోధనునితో ఇలా అన్నాడు. “సుయోధనా! అర్జునుడు ఎల్లప్పుడూ మమ్మల్ని అవమానిస్తుంటాడు. అర్జునుని మీద మాకు చాలా కోపంగా ఉంది. అతని మీద కక్ష

తీర్చుకోడానికి తహతహలాడుతున్నాము. ఈ రోజు రణరంగములో ఈ సుశర్మ అన్నా ఉండాలి లేక ఆ అర్జునుడు అన్నా ఉండాలి. యుద్ధంలో మేము అర్జునుని ఏ విధంగానూ తీసి పోము." అని అన్నాడు.

సుశర్మ తన తమ్ములైన సత్యవ్రతుడు, సత్యకర్ముడు, సత్య వర్ముడు తనకు తోడు నిలువగా అమిత మైన గర్వంతో అర్జునుని యుద్ధంలో ఓడిస్తానని ప్రగల్భాలు పలికాడు. వారి పక్షమున నున్న ర థికులు అందరూ సుశర్మ మాటలకు తమ సంతోషం వ్యక్తం చేసారు. అతనిని అభినందించారు. ఇది చూచి సుయోధనుడు ఆనంద భరితుడయ్యాడు. ఈ విధంగా త్రిగర్తాధీశులు తమ తోడి 15మంది యోధులు, వారిని అనుసరిస్తున్న కేరళ, మాళవ, శిలీంద్ర, మగధ మొదలగు దేశాధీశులతో అర్జునుని మీదికి యుద్ధమునకు సన్నద్ధమయ్యారు. స్నానాదికములుముగించి, అగ్నికార్యము గావించి ఆ అగ్ని మీద ఆ విధంగా ప్రమాణం చేసారు.

" మేమందరము ఈరోజు రణరంగమున అర్జునుని చంపుతాము. ఒక వేళ మేము అర్జునుని చేతిలో ఓడిపోయి పారి పోయిన ఎడల, మేమం దరమూ, గోవధ, స్త్రీవధ, బ్రాహ్మణ వధ, ఇతరుల భార్యలతో వ్యభిచ రించడం, బ్రాహ్మణుల ధనమును అపహరించడం, ఇతరుల ధనమును

అపహరించడం, గురువుకు అపకారము చెయ్యడం, శరణు అన్నవారిని రక్షించక పోవడం, అబద్ధ మాడటం, మద్యపానము చేయడం, దేహీ అన్నవారికి లేదు అని చెప్పడం, గృహ దహనము చెయ్యడం, ఈ పాతకములు చేసిన వారు ఎలాంటి పాప లోకములకు పోతారో అలాంటి పాప లోకములు మాకు సంప్రాప్తిస్తాయి. మేము అర్జునుని చేతిలో హతమైన నాడు మేము వీర స్వర్గము అలంకరిస్తాము. ఇదే మా ప్రతిజ్ఞ." అని అగ్ని మీద ప్రమాణముచేసారు. వెంటనే వారు తమ తమ సైన్యములతో రణ రంగములో ప్రవేశించారు.

రెండవ రోజు యుద్ధమునకు ద్రోణుడు గరుడ వ్యూహమును పన్నాడు. ఆ వ్యూహమున గరుడ పక్షి ముక్కు స్థానమున ద్రోణుడు సైన్యసమేతుడై నిల్చున్నాడు. సుయోధనుడు, అతని తమ్ములు, తలవైపు నిల్చున్నారు. కృపాచార్యుడు, కృతవర్మ, నేత్రస్థానములలో నిల్చున్నారు. సింహళ, అభీర, శూరసేన రాజులు మెడభాగమున నిలబడ్డారు. బాహ్లీక, భూరిశ్రవస, సోమదత్తులు, శలుడు, శల్యుడు, గరుడ పక్షి కుడి రెక్క వైపున, అశ్వత్థామ, సుదక్షిణుడు, విందుడు, అనువిందుడు, ఎడమ రెక్క వైపున, నిలబడ్డారు. శకుని, పౌండ్రకుడు, కళింగుడు, అంబష్ఠుడు, మగధరాజు, వెన్నుభాగమున నిలబడ్డారు. కర్ణుడు తన సేనలతో తోక భాగమున నిలబడ్డారు. సైంధవుడు మొదలగు దేశాధీశులు, అక్కడక్కడ

నిలబడ్డారు. కౌరవ సేన మహాసముద్రము వలె పరవళ్లు తొక్కుతూ ఉంది. భగదత్తుడు తన గజము మీద ఎక్కి గరుడ వ్యూహ మధ్య భాగమున నిలబడ్డారు.

త్రిగర్త దేశాధీశులు ఈ వ్యూహములో నిలబడకుండా వేరుగా పోయి, పాండవ సైన్యమునకు దక్షిణభాగంలో నిలబడ్డారు. అక్కడ నుండి వారు అర్జునుని యుద్ధమునకు రమ్మని కవ్వించారు. అది చూచి అర్జునుడు ధర్మ రాజుతో ఇలా అన్నాడు. "అన్నయ్యా! సుశర్మ అతని తమ్ములు నన్ను యుద్ధమునకు రమ్మని పిలుస్తున్నారు. యుద్ధానికి పిల్చినప్పుడు పోకపోవడం ధర్మంకాదు. తమరు అనుజ్ఞ ఇస్తే నేను వెళ్లి వారితో యుద్ధం చేసి వారిని ఓడించి విజయుడనై తిరిగి వస్తాను. ఈ కొద్ది సేపట్లో నీకు ఏమీ కాదు." అని నమస్కరించి అనుమతి కోరాడు.

ఆ మాటలు విన్న ధర్మరాజు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! ద్రోణుని శౌర్య ప్రతాపములు నీకు తెలియనివి కావు. నన్ను పట్టి సుయోధనునికి అప్పగిస్తానని ద్రోణుడు ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు కదా. మనమందరము ఆ ప్రతిజ్ఞ భంగపరచ వలెను. దానికి నీవు ఏమి చెయ్యాలో ఆలోచించు. నీకు ఏది మంచిది అని తోస్తే అది చెయ్యి. " అని పలికాడు.

ఆ మాటలు విన్న అర్జునుడు "అన్నయ్యా! యుద్ధమునకు పిల్చినపుడు పోకపోతే పిరికి వాడు అని లోకం నన్ను గేలి చేస్తుంది. కాబట్టి నేను ఆ త్రిగర్తులతో యుద్ధమునకు పోవడం తప్పదు. ఇతని పేరు సత్య జిత్తు. ఇతనిని నీకు రక్షణగా నియమిస్తున్నాను. ఇతను నీ పక్కన ఉండగా నీవు భయపడవలసిన పనిలేదు. ఒక వేళ ఇతను మరణిస్తే మనం వెంటనే యుద్ధమునుండి తొలగి పోవడం మంచిది. అంతకన్నా వేరు మార్గము లేదు. కాని అలా జరగదని అనుకుంటున్నాను." అని పలికాడు అర్జునుడు.

ఇంక చేసేది లేక ధర్మరాజు అర్జునునికి అనుమతి ఇచ్చాడు. ధర్మజునికి నమస్కరించి అర్జునుడు సంశప్తకుల మీదికి యుద్ధమునకు వెళ్లాడు. అర్జునుడు సంశప్తకుల మీదికి యుద్ధమునకు పోవడం చూసి కౌరవ సైన్యములో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. జయ జయ ధ్వానాలు చేసారు. ధర్మరాజు ధృష్టద్యుమ్నుని చూచి "ద్రోణుడు గరుడ వ్యూహమును పన్నాడు. దానికి ప్రతిగా మనము కూడా తగిన వ్యూహము రూపొందించాలి. మన సేనలను మండలార్థ వ్యూహమున నిలుపుము." అని అన్నాడు.

అప్పుడు ధృష్టద్యుమ్నుడు ధర్మరాజు ఆదేశానుసారము మండలార్ధ వ్యూహమును రూపొందించాడు. ఉభయ సైన్యములలో శంఖ, భేరీ, తూర్య నాదములు మిన్నుముట్టాయి. ధర్మరాజు ధృష్ట ద్యుమ్నుని చూచి "నేను ద్రోణుని చేతికి చి క్క కుండా ఉండాలంటే మీరందరూ నన్ను అత్యంత జాగరూకతతో వెన్నంటి ఉండాలి. మీ మీ శౌర్య ప్రతాపములు ప్రదర్శించి కౌరవ సేనలను ఒక్క అడుగు కూడా ముందుకు వేయనీయరాదు." అని ఆదేశించాడు.

" ధర్మ నందనా! నేను ఉండగా ద్రోణుడు మీ దరిదాపులకు కూడా రాలేడు. నన్ను ద్రోణుడు ఎన్నటికినీ గెలువ లేడు. మీరు నిశ్చింతగా ఉండండి." అని అన్నాడు ధృష్టద్యుమ్నుడు.

యుద్ధం ప్రారంభం అయింది. ధృష్టద్యుమ్నుడు అందరికన్నా ముందు నిలిచాడు. ద్రోణుని రథం ముందు తన రథం నిలిపాడు. యుద్ధ ప్రారంభముననే ధృష్టద్యుమ్నుని చూడటం అరిష్టమని తలచి ద్రోణుడు పక్కకు తిరిగి పాంచాల సేనలతో యుద్ధం చేస్తున్నాడు.

అర్జునుడు ఆకలి గొన్న సింహము వలె సంశప్తకుల మీద పడ్డాడు. వారు కూడా అర్ధ చంద్రాకారములో మోహరించి అర్జునుని

ఎదుర్కొన్నారు. సంశప్తకులు జయజయధ్వానములు చేస్తూ అర్జునుని మీదికి లంఘించారు. అర్జునుడు తన దేవదత్తమును పూరించాడు. దేవదత్త శంఖ ఘోషను విన్న సంశప్తకుల సైన్యము ఒక్క మాటుగా నిశ్చేష్ఠులయ్యారు. అంతలో తేరుకొని ఒకరిని ఒకరు ప్రోత్సహించు కుంటూ అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుని మీద వాడియైన అస్త్రములు ప్రయోగించారు. వాటిని అర్జునుడు మధ్యలో త్రుంచి , తన వాడియైన బాణములతో 15 వేల మంది రధికులను చంపాడు. ఎవరైనా తన మీదికి 10శరములు ప్రయోగిస్తే వారిని కేవలం 5 బాణములతో చంపాడు. ఎవరైనా తనమీద 5 బాణములు ప్రయోగిస్తే వారిని కేవలం రెండు బాణములతో చంపాడు.

ఆ సమయమున సుశర్మ, సుబాహుడు, సుధన్వుడు, సురధుడు,అర్జుననితో పోరాడుతున్నారు. అర్జునుడు వారి కేతనములు విరగ్గొట్టాడు. సుధన్వుని హయములను చంపాడు. అతని విల్లు తుంచాడు. ఒకే ఒక బాణంతో అతని తల నరికాడు. విజయ సూచకంగా దేవదత్తం పూరించాడు. సంశప్తకుల సైన్యము మీద పడి వారి రధములను విరగ్గొడుతున్నాడు. అర్జునుని ధాటికి తట్టుకోలేక సంశప్తకుల సైన్యములు చెల్లాచెదరయి పారిపోసాగాయి.

ఇది చూచాడు సుశర్మ. కంగారు పడ్డాడు. ఎలుగెత్తి అరుస్తున్నాడు. "భయపడకండి. వెనక్కు రండి. మనకు అర్జునుని పరాక్రమము ఎలాంటితో తెలియదా! మనకు సుయోధనుని ముందు చేసిన ప్రతిజ్ఞ మరిచితిరా! ఇలా పారిపోతే మనము సుయోధనుని ఎదుట ఎలా తల ఎత్తుకొని తిరగ గలము." అని బిగ్గరగా అరుస్తూ తన సైన్యమును ప్రోత్సాహిస్తున్నాడు. అతని ప్రోత్సాహ వచనములు విని పారిపోతున్న సైన్యము వెనక్కు మరలింది. సైన్యాధి పతులందరు తమ తమ సైన్యములతో అర్జునుని చుట్టుముట్టారు.

ఇది చూచాడు అర్జునుడు. కృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా! ఈ త్రిగర్తులు తమ తమ శరీరములలో ప్రాణములు ఉన్నంత వరకూ పోరాడుతుంటారు. వీరిని యమపురికి పంపిన గాని మన పని పూర్తికాదు. మన రధమును వారి వైపుకు పోనిమ్ము." అని అన్నాడు. అర్జునుని మాటననుసరించి కృష్ణుడు రధమును సంశప్తకుల మీదికి పోనిచ్చాడు.

ఆసమయములో నారాయణాభిధానులు పది వేల మంది అక్కడ ఉన్నారు. వారి కందరికీ కృష్ణార్జునుల మీద చాలా కోపంగా ఉంది. మహా భారత యుద్ధానికి పూర్వము సుయోధనుడు, అర్జునుడు, శ్రీకృష్ణుని

సైన్య సహాయము కోరడానికి ద్వారకకు వెళ్లినపుడు, శ్రీకృష్ణుడు తాను ఒక పక్క, పదివేల మంది నారాయణాభి ధానులు, ఒక పక్క అని చెప్పి నీకు తోచిన వారికి కోరుకోమన్నప్పుడు, అర్జునుడు శ్రీకృష్ణుని కోరుకొని తమను కృష్ణుని నుండి వేరు చేసి సుయోధనుని పరం చేసాడు. అందుకని వారికి అర్జునుని మీద, కృష్ణుని మీద కసిగా కోపంగా ఉంది. ఆ కోపం ఇప్పుడు తీర్చుకుంటున్నారు. కృష్ణార్జునుల మీద శర వర్షము కురిపించారు.

అర్జునునికి వారిని చంపడం ఇష్టం లేదు. అందుకని అర్జునుడు తనకు త్వష్టప్రజాపతి అనుగ్రహించిన దివ్యాస్త్రమును వారి మీద ప్రయోగించాడు. ఆ అస్త్ర ప్రభావము వలన, నారాయణాభి ధానులలో, ప్రతి వాడికి తన ఎదురుగా ఉన్నవాడు అర్జునుని మాదిరి కనిపించ సాగాడు. ఎదురుగా ఉన్నవాడు అర్జునుడు అనుకొని వాడిని సంహరించసాగాడు. ఆ ప్రకారం ఆ పదివేల మంది నారాయణాభిధానులు వారిలో వారు నరుక్కొని చనిపోయారు. ఇంతలో ఆ అస్త్రము శాంతించింది. అస్త్ర ప్రభావము నశించింది. అర్జునుడు దేవదత్తము పూరించాడు. అప్పటికే చాలామంది నారాయణాభిధానులు మరణించారు. మిగిలినవారు మగధ, కేరళ, మొదలగు మహారాజులతో కలిసి మహా కోపంతో అర్జునుని రథం చుట్టు

ముట్టారు. అర్జునుని మీద అత్యంత శక్తి వంతములైన అస్త్ర శస్త్ర ములు ప్రయోగించారు. అర్జునుడు వారి ప్రయోగించిన అస్త్రశస్త్రములు మధ్యలోనే శకలములు గావించి, వారి శిరములను తన వాడియైన బాణములతో ఖండించాడు. వారి సైన్యములోని ఏనుగులు, హయములు, పదాతి దళము అర్జునుని బాణములకు ఆహుతి అయ్యాయి.

ఇంతలో సంశప్తకులు (త్రిగర్తాధీశులు) తమ తమ సైన్యములను సమీకరించుకొని అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుని మీద శరవృష్టి కురిపించారు. వారిలో కొంత మంది వారి వారి వాహనములుదిగి అర్జునుని రధము మీద, హయముల మీద దాడి చేసారు. అర్జునునికి ఊపిరి ఆడకుండా దాడి చేసారు. అన్ని దిక్కులనుండి శరప్రయోగం చేస్తున్నారు. పాండవ సైనికులకు అర్జునుని రథం గోచరం కాలేదు. వారిలో ఆందోళన కలిగింది. కృష్ణార్జునులు సంశప్తకుల చేతిలో మరణించారు అని అపోహ పడ్డారు. వారి ఆందోళన గమనించిన సంశప్తకులు సింహనాదాలు చేసారు. శంఖములు పూరించారు.

ఇది ఇలా ఉంటే రథము నొగల మీద కూర్చుని రథము నడుపుతున్న కృష్ణునికి కూడా వెనక నున్న అర్జునుడు కనపడలేదు. కృష్ణు

డు ఆందోళన చెందాడు. "అర్జునా అర్జునా" అని ఎలుగెత్తి అరిచాడు. సంశప్తకుల బాణ పరంపరలో చి క్కుకుపోయిన అర్జునుడు, పరిస్థితి అదుపు తప్పుతూ ఉందని గ్రహించాడు. వెంటనే వాయవ్యాస్త్రమును ప్రయోగించాడు. సంశప్తకుల సైన్యమును చెల్లాచెదరు చేసాడు. పాండవ సేనకు కృష్ణార్జునుల రథము గోచర మయింది. అంతా ఊపిరి పీల్చుకున్నారు. పాండవ సేనలు హర్షధ్వానాలు చేసారు.

సంశప్తకులు ఊరుకోలేదు. మరల తమ తమసైన్యములను కూడగట్టుకున్నారు. ఒక్కుమ్మడిగా అర్జునుని మీద దాడి చేసారు. అర్జునుడు వారు ప్రయోగిం చి న అస్త్రములను మధ్యలోనే తుంచి మరల వారి మీద అతి క్రూరమైన నారాచములు ప్రయోగించాడు. త్రిగర్త సైనికుల శిరములు తెగి పడుతున్నాయి. మొండెములు, కాళ్లు చేతులు చెల్లా చెదరుగా విసిరి వేయబడుతున్నాయి. ఏనుగులు, హయములు, రథములు తునా తునకలవుతున్నాయి. అయినా భయపడకుండా త్రిగర్త సైనికులు అర్జునుని మీద శరపరంపర కురిపిస్తున్నారు. ఈ ప్రకారంగా అర్జునుడు సంశప్తకులతో పోరు సాగిస్తున్నాడు.

ఇక్కడ ద్రోణుడు ఎలాగైనా ధర్మరాజును పట్టుకొన వలెనని తలంపుతో, పాండ సైన్యమును తరిమి తరిమి కొడుతున్నాడు. ధర్మజుని

రధమును సమీపించవలెనని ప్రయత్నిస్తున్నాడు. నీ కుమారుడు దుర్ముఖుడు ధృష్టద్యుమ్నునితో తలపడ్డాడు. ద్రోణుని ధాటికి పాండవ బలాలు వెనక్కు తగ్గాయి. ఇది చూచిన ధర్మజుడు తన బలములను ప్రోత్సహిస్తూ యుద్ధోన్ముఖులను చేస్తున్నాడు. ద్రోణుని చేతిలో వేలకు వేలసైనికులు వీరస్వర్గము అలంకరిస్తున్నారు. ర క్తం ఏరులై పారుతూ ఉంది. ముందుకు దూకుతున్న రధచక్రముల కింద పడి ఎంతో మంది సైనికులు మురణిస్తున్నారు. మదించిన ఏనుగులు తమకు అడ్డం వచ్చిన సైనికులను తమ తొండములతో ఎత్తి నేలకేసి బాదుతున్నాయి. వాటి కాళ్ల కింద పడి ఎంతో మంది చనిపోతున్నారు. యుద్ధ భూమి అంతా అతి భయంకరంగా తయారయింది.

ద్రోణుడు తన సైన్యము తో కలిసి ధర్మరాజు మీదికి వెళ్లాడు. ధర్మరాజుకు రక్షణగా ఉంచిన సత్యజిత్తు ద్రోణుని ఎదుర్కొన్నాడు. ద్రోణుడు సత్యజిత్తు విల్లు విరిచాడు. సత్యజిత్తు వేరు విల్లు తీసుకున్నాడు. అతి క్రూరమైన ముప్పది భల్లబాణములు ద్రోణుని మీద ప్రయోగించాడు. ఆసమయంలో మరొక పాంచాల రాకుమారుడు వృ కుడు సత్యజిత్తు తో కలిసాడు. అరవై బాణములు ద్రోణుని మీద సంధించాడు. ఇది చూచిన పాండవ బలములు హర్ష ధ్వానాలు చేసాయి ద్రోణునికి పట్టరాని కోసం వచ్చింది. సత్యజిత్తును, వృకుని తన

బాణపరంపరలతో ముంచెత్తాడు. వాటికి వెరవ కుండా సత్యజిత్తు, వృకుడు ద్రోణుని సారధిని, హయములను, కేతనమును కొట్టారు. ద్రోణుడు సత్యజిత్తు శరీరము మీద పది నారాచములు ప్రయోగించాడు. అతని విల్లు విరిచాడు. సత్యజిత్తు మరొక విల్లు తీసుకున్నాడు. ద్రోణుని శరీరము మీద శిలీముఖములు నాటాడు.

ద్రోణుడు సత్యజిత్తు ధనుస్సు విరిచాడు. వృకుని తల తెగ నరికాడు. అతని రధమును, హయములను సారధిని చంపాడు. సత్యజిత్తు వేరొక ధనుస్సుతీసుకొని ద్రోణుని మీద శరవర్షము కురిపించాడు. ద్రోణుడు మరల సత్యజిత్తు ధనుస్సు ఖండించాడు. సత్యజిత్తు తీసుకుంటున్న ప్రతి విల్లును ఖండిస్తున్నాడు. ఒక అర్ధ చంద్ర బాణముతో సత్యజిత్తు శిరస్సును ఖండించాడు. సత్యజిత్తు మరణమును చూచిన ధర్మజుడు ఆందోళన చెందాడు. అర్జునుని మాటలు గుర్తుకు వచ్చాయి. అక్కడ ఉంటే ద్రోణునికి పట్టుపడక తప్పదని మెల్లగా యుద్ధ భూమి నుండి నిష్క్రమించాడు. ద్రోణుడు తనకు అడ్డం వచ్చిన వారినందరినీ చంపుతూ ధర్మరాజు కోసం వెతుకుతున్నాడు.

అంతలోనే విరాటుని తమ్ముడు సూర్యదత్తు ద్రోణుని ఎదుర్కొన్నాడు. ద్రోణుని మీద కరకుటమ్ములు ప్రయోగించాడు. చి

రాకుపడ్డ ద్రోణుడు ఒకే ఒక బాణంతో సూర్యదత్తుని శిరము ఖండించాడు. ఇది చూచిన విరాటుని సేనలు పారిపోయాయి. ద్రోణుని పరాక్రమానికి అడ్డులేకపోయింది. అతనిని ఎదిరించి నిలిచే వీరుడే లేకుండా పోయాడు. ఆ రోజు ఎలాగైనా ధర్మజుని పట్టుకొని తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనవలెనని ధృడసంకల్పముతో ఉన్నాడు ద్రోణుడు.

అపుడు యుధామన్యుడు, ఉత్తమౌజుడు, వసుదానుడు, శిఖండి ఒక్కుమ్మడిగా ద్రోణుని ఎదుర్కొన్నారు. ఒక్కొక్కరు ఐదేసి బాణములను ద్రోణుని మీద ప్రయోగించారు. సాత్యకి 12 బాణములను, క్షత్రధర్ముడు పది బాణములను ద్రోణుని మీద ప్రయోగించారు. ఒక పక్క యుధిష్టిరుని కాపాడుతూ, ధృష్టద్యుమ్నుడు, చేకితానుడు ద్రోణుని తోయుద్ధం చేస్తున్నారు. ఒకేసారి 300 శరములను ప్రయోగించారు.

వారి అండదండలతో ధైర్యము తెచ్చుకొని ధర్మరాజు మరల యుద్ధ భూమిని ప్రవేశించాడు. ద్రోణుని మీద 12 బాణములను ప్రయోగించాడు. యుధిష్ఠిరుని చూచిన ద్రోణుడు రెచ్చిపోయాడు. వసుదానుని శిరస్సు ఒకే బాణంతో ఖండించాడు. ఉత్తమౌజుడు, శిఖండి, సాత్యకి, మీద కరకుటమ్ములు ప్రయోగించాడు. ధర్మరాజు రధం

వైపు తన రథము పోనిచ్చాడు. ఇది చూచిన ధర్మజుడు మరల యుద్ధ భూమి నుండి నిష్క్రమించాడు.

చేతికి చిక్కిన ధర్మజుడు కనపడక పోయేసరికి ద్రోణుడు చిరాకు పడ్డాడు. పాండవ సైన్యమును చించి చెండాడుతున్నాడు. రథములు, కేతనములు విరిగిపడుతున్నాయి. ఏనుగులు హయములు నేలకూలు తున్నాయి. వాటి తలలు నేల మీద దొర్లుతున్నాయి. ఇది చూచిన కౌరవ సేనలు పాండవ సేనలను తరిమి తరిమి కొడుతున్నాయి. ఇంతలో వార్ధక్షేమి, చి త్ర సేనుడు, సేనాబిందుడు, సువర్చసుడు, ధృష్ట ద్యుమ్నుడు, చేకితానుడు, శిఖండి, సాత్యకి, సుమిత్రుడు తమ తమ బలములను కూడగట్టుకొని ఒక్కుమ్మడిగా ద్రోణుని ఎదుర్కొన్నారు. ద్రోణుడు తన రథమును వేగంగా తిప్పుతూ అందరికీ అన్ని రూపములతో కనపడుతూ, శరవర్షము కురిపిస్తున్నాడు. సుమిత్రుని చంపాడు. ఇది చూచిన కేకయ రాజులు, మత్స్య రాజులు, వారి వారి సైన్యములతో ద్రోణుని ధాటికి తట్టుకోలేక పారిపోయారు. ధృ ష్టద్యుమ్నుడు, సాత్యకి, సేనాబిందుడు, మొదలగు ప్రముఖ రథికులు కూడా నిశ్చేష్టులై ఆశ్చర్యంతో ద్రోణుని యుద్ధ వైఖరిని తిలకిస్తున్నారు.

ఇది చూచిన సుయోధనుడు పట్టరాని ఆనందంతో కర్ణుని చూచి "కర్ణా! చూచితివా! పెనుగాలికి కూలిపోయిన వృక్షముల వలే పాండవ సేన కూలిపోయింది. ద్రోణుని అస్త్రధాటికి ఎదురు నిలువగల ధీరుడు పాండవసైన్యములో కనిపించడం లేదు కదా! అదుగో భీముని చూడు. పాపం పక్కన ఎవరూ లేకుండా ఒంటరిగా నిస్సహాయంగా నిలబడి ఉన్నాడు. ఈ రోజు ద్రోణుని అస్త్రధాటికి నిలువ లేక, రాజ్య కాంక్ష విడిచి, పారిపోతున్నాడు." అని వికటాట్టహాసం చేసాడు.

అప్పుడు కర్ణుడు సుయోధనునితో ఇలా అన్నాడు. "సుయోధనా. పాండవుల బలమును అంత తేలిగ్గా తీసిపారెయ్యకు. పాండవులు మహా వీరులు. వారందరూ కలిసి భీముని ముందు నిలుపుకొని ద్రోణుని మీదికి దాడి చెయ్యకుండా ఉంటారా! కాబట్టి మనము ప్రస్తుతము ద్రోణుని రక్షించుకొన వలెను. మొహమాటం లేకుండా మనసులో ఉన్న మాట చెప్పాను. ఏమీ అనుకోవద్దు." అని పలికాడు కర్ణుడు.

కర్ణుని ఊహ నిజం చేస్తూ ధర్మరాజు తన సేనలను ఒకటిగా చేర్చాడు. భీముని, నకుల సహదేవులను ఒక్క చోటికి రమ్మన్నాడు. భీముని ముందు నిలువ మన్నాడు. నకుల సహదేవులను అతనికి ఇరుపక్కలా నిలువ మన్నాడు. ద్రుపద, మత్స్య, యాదవ ప్రముఖులను

చుట్టు మోహరించాడు. సాత్యకి, విరాటుడు, ద్రుపదుడు మున్నగు మహారథులు వెనక నిలిపాడు. అందరూ ఒకేసారి ద్రోణుని మీదికి లంఘించారు. ఆ ప్రకారము పాండవ బలములు మేఘములు కొండ శిఖరమును ఆవరించి నట్టు ద్రోణుని చుట్టు ముట్టాయి. వారి మధ్యలో ద్రోణుని రథం కనిపించకుండా పోయింది.

ద్రోణుడు పాండవుల చేతిలో హతమయినాడు అని కౌరవ సేనలలో కలవరం రేగింది. సుయోధనుడు తనసేనలను వెంటబెట్టుకొని పాండవ సేనల మీద విరుచుకు పడ్డాడు. సాత్యకిని కృతవర్మ, క్షత్రధర్మని సైంధవుడు, యుయుత్సుని సుబాహుడు, నకులుని దుశ్శాసనుడు, సహదేవుని చిత్రవర్మడు, ధర్మనందనుని శల్యుడు, ద్రుపదుని బాహ్లికుడు, విరాటుని విందానువిందులు, శృతకీర్తిని వివింశతి, శృతసేనుని సాల్వుడు, శ్రుతసోముని చిత్రసేనుడు, శతానీకుని శృతవర్మ, ప్రతివింద్యుని అశ్వత్థామ, అభిమన్యుని లక్ష్మణుడు, శిఖండిని వికర్ణుడు, కుంతిభోజుని దుర్మఖుడు, కేకయరాజులను కర్ణుడు, కాశీరాజును జయుడు, పాండ్యరాజును జయత్సేనుడు, వార్ధక్షేమిని కృపాచార్యుడు, మణిమంతుని భూరిశ్రవసుడు, ఘటోత్కచుని అలంబసుడు, రణరంగములో ఎదుర్కొన్నారు.

ఆ ప్రకారంగా ద్రోణుని చంపడానికి పాండసేనలు ప్రయత్నించాయి. ఇరుపక్షములకు పోరు ఘోరమయింది. ఒకరి కేతనములు ఒకరు విరగ్గొట్టుకుంటున్నారు. హయములను చంపారు. రధసారధుల శిరస్సులు ఖండించారు. రధములు విరుగుతున్నాయి. ధనుస్సులు ముక్కలవుతున్నాయి. రక్తం వరదలై పారుతూ ఉంది. ఈ ప్రకారంగా ఘోరసంగ్రామము జరుగుతుండగా మధ్యాహ్నం అయింది.

తన మీదికి వస్తున్న ధృష్టద్యుమ్నుని ద్రోణుడు తన బాణపరంపరలతో కట్టడి చేస్తున్నాడు. ఆ సమయంలో నీ కుమారుడు సుయోధనుడు తన ఏనుగుల బలంతో భీమునితో యుద్ధానికి దిగాడు. భీమసేనుడు తన క్రూరమైన బాణములతో సుయోధనుని గజబలమును నాశనం చేస్తున్నాడు. ఇంతలో వంగ దేశాధీశుడు తన ఏనుగును ఎక్కి భీమసేనుని మీద అస్త్రప్రయోగం చేసాడు. భీమసేనుడు కోపించి ఒకే ఒక బాణంతో వంగ దేశాధీశుని చంపాడు. అది చూచి వంగదేశ సైన్యము యుద్ధ భూమిని విడిచి పారిపోయింది.

ఆ సమయములో భగదత్తుడు సుప్రతీకము అను తన ఏనుగును ఎక్కి పాండవ వీరులతో తలపడ్డాడు. ఈ సుప్రతీకము మొదట ఇంద్రుని వాహనము. ఇంద్రుడు దాని మీద ఎక్కి దానవులను

సంహరించాడు. ఆ సుప్రతీకమును భగదత్తుని తండ్రి నరకాసురుడు ఇంద్రలోకము నుండి తెచ్చాడు. నరకాసుర వధానంతరము అది భగదత్తుని వద్దకు చేరింది. ఇప్పుడు భగదత్తుడు దాని మీద ఎక్కి పాండవులతో యుద్ధం చేస్తున్నాడు. ఈ ఏనుగు ధాటికి పాండవ సేన చెల్లాచెదరయింది. ఆ సుప్రతీకము భీమసేనుని మీదికి అత్యంత వేగంతో దూకింది. పాండవ సేనలలో కలకలం చెలరేగింది. సుప్రతీకము భీమసేనుని చంపి వేసింది అని ఆర్తనాదాలు మిన్నుముట్టాయి.

ఆసమయములో ధర్మరాజు తన సేనలను ప్రోత్సహించాడు. "భీముడు క్షేమంగా ఉన్నాడు" అని అరిచి చెప్పాడు. సైన్యమును యుద్ధోన్ముఖులను చేసాడు. భగదత్తుని సుప్రతీకము పాండవ సేనలను నుగ్గు నుగ్గు చేస్తూ ఉంది. రథములను, హయములను, ఏనుగులను, తన తొండముతో ఎత్తి నేలకేసి బాదుతూ ఉంది. అవతలకు విసిరి వేస్తూ ఉంది. దాని కాళ్ల కిందపడి వందలకొద్ది సైనికులు మరణిస్తున్నారు.

ఇది చూచి దశార్ణ భూపతి తన గజము మీద ఎక్కి భగదత్తుని ఎదుర్కొన్నాడు. సుప్రతీకము కోపించి దశార్ణ భూపతి ఎక్కిన ఏనుగును కింద పడదోసింది. దాని మీద ఉన్న దశార్ణ భూపతి కిందపడ్డాడు.

భగదత్తుడు ఏడు తోమర ములతో అతనిని చంపాడు. పాండవ బలములతో భయాందోళనలు మొదలయ్యాయి.

ఇంతలో సాత్యకి భగదత్తుని ఎదుర్కొన్నాడు. సుప్రతీకము మీద శరవర్షము కురిపించాడు. సుప్రతీకము గిర్రున తిరిగి ఆ శరముల నుండి తప్పించుకుంది. సాత్యకి ఎక్కిన రధమును తన తొండముతో ఎత్తి అవతలకు విసిరేసింది. సాత్యకి తన రధమునుండి లాఘవముగా నేల మీదికి దూకి తప్పించుకున్నాడు. సాత్యకి సారధి వెంటనే రధమును నిలబెట్టాడు. రధము దెబ్బతినలేదు అని తెలుసుకొని సాత్యకి మరల తన రధము మీద ఎక్కాడు.

ఇంతలో భీముడు భగదత్తుని ఎదుర్కొన్నాడు. కాని సుప్రతీకము ధాటికి తట్టుకొనలేక భీముని రధమునకు కట్టిన హయములు రధమును పక్కకు లాగుకొని వెళ్లాయి. ఆ సమయములో సుపర్ణుడు సుప్రతీకమును ఎదుర్కొని దాని కాళ్ల కిందపడి నలిగిపోయాడు. సుపర్ణుడు మరణించడం చూసిన అభిమన్యుడు, ద్రౌపదీ సుతులు ఐదుగురు, చేకితానుడు, ధృష్టకేతుడు, యుయుత్సుడు, ఒక్కుమ్మడిగా సుప్రతీకమును ఎదుర్కొన్నారు. దాని మీద శరవర్షము కురిపించారు. కాని అవి అన్ని వృధా అయ్యాయి. సుప్రతీకము కోపించి వారి

రథములను కాళ్ల కింద వేసి విరగ్గొట్టింది. యుయుత్సుని సారధిని చంపింది. అతడు అభిమన్యుని రథము ఎక్కాడు. అభిమన్యుడు మొదలగు మహావీరులు సుప్రతీకము మీద ప్రయోగించిన అన్ని రకములైన అస్త్రములు దాని శరీరం తాకి ముక్కలవుతున్నాయి.

భగదత్తుడు తాను ఎక్కిన సుప్రతీకమును నలుదిక్కులకూ పరుగెత్తిస్తూ పాండవ సైన్యములోని రథ,గజ,తురగ,పదాతి దళములను నాశనం చేస్తున్నాడు. దాని ముందు ఎవరూ నిలువలేకపోతున్నారు. పాండవుల సేనలు భయంతో పారిపోతున్నాయి.

దూరంనుండి సుప్రతీకము చేయు విధ్వంసమును చూచిన అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా! భగదత్తుని గజము సుప్రతీకము పాండవ సేనను చెల్లాచెదరు చేయుచున్నది. ఎదుర్కొనడానికి ఎవరికీ సాధ్యం కావడం లేదు. మనిద్దరం లేకపోవడంతో ధర్మరాజు, భీముడు ఎన్ని కష్టాలు పడుతున్నారో కదా! వెంటనే మన రథమును భగదత్తుని వైపు మరలింపుము." అని పలికాడు. శ్రీ కృష్ణుడు సరే అని రథమును వెనక్కు తిప్పాడు.పాండవ సైన్యము వైపుపోనిచ్చాడు.

ఇంతలో సంశప్తకులు  వీరాలాపములు పలుకుతూ అర్జునుని మీద అస్త్రవర్షము కురిపించారు.  పదునాలుగు వేలమంది రధికులు అర్జునుని చుట్టుముట్టారు. “కృష్ణా! మన బలములను తరువాత రక్షించవచ్చును. ముందు వీరిని హతమార్చవలెను. మన రధమును సంశప్తకుల మీదికి పోనిమ్ము. వారిని వధించుట మన తక్షణకర్తవ్యము.” అని పలికాడు. శ్రీకృష్ణుడు తమ రధమును సంశప్తకుల మీదికి పోనిచ్చాడు.

అర్జునుడు గాండీవము సంధించాడు. దేవదత్తము పూరించాడు. దివ్యమైన బాణములను సంశప్తకుల మీద ప్రయోగించాడు.  అర్జునుని అస్త్రధాటికి కేతనములు, రధములు విరుగుతున్నాయి. హయములు, ఏనుగులు తలలు తెగి పడుతున్నాయి. కాల్బలము, తలలు, చేతులు, కాళ్లు తెగి నేలమీద దొర్లుతున్నారు. వారి శిరములు బంతుల వలె ఎగురుతున్నాయి. అర్జునుని విజృంభణము చూచి కృష్ణుడు  కూడా అర్జునుని ప్రశంసించాడు.  కృష్ణుని ప్రశంసలకు  పొంగిపోయిన అర్జునుడు  ద్విగుణీకృతమైన ఉత్సాహంతో  సంశప్తకుల సైన్యము మీద విరుచుకు పడ్డాడు. వారిని సర్వనాశనము గావించాడు.

"కృష్ణా ఇక్కడ శత్రు సంహారము పూర్తి అయినది. ఇంక మన రథమును మన సైన్యము వంక మరల్చుము." అని పలికాడు. కృష్ణుడు రథమును మళ్లించాడు. ఇంతలో వెనుక నుండి సుశర్మ తన తమ్ములతో కలిసి పెద్దగా అరుస్తున్నాడు. "అర్జునా! అదేమిటయ్యా! మేము యుద్ధానికి పిలుస్తుంటే పారిపోతున్నావు. మాతోయుద్ధం చెయ్యవా! " అని అరుస్తున్నారు.

"కృష్ణా! యుద్ధమునకు పిలుస్తుంటే మరలిపోవడం వీరుల లక్షణం కాదు. కాని మన సైన్యము చాలా దైన్య స్థితిలో ఉన్నది. నాకు సరియైన మార్గము తోచడం లేదు. నీవే తగు నిర్ణయము తీసుకో! " అని అడిగాడు. కృష్ణుడు మారుమాట్లాడకుండా రథమును సంశప్తకుల మీదికి పోనిచ్చాడు.

అర్జునుడు మహా కోపంతో త్రిగర్తుని విల్లు తుంచాడు. కేతనములు విరిచాడు. తన మీదికి వచ్చిన అతని తమ్ముల శిరస్సులు ఖండించాడు. అది చూచి త్రిగర్తుడు మూర్ఛపోయాడు. ఇంతలో పాండవ సేనలు యుద్ధ భూమి నుండి పారిపోవడం అర్జునుని కంటపడింది. "కృష్ణా! అటు చూడు. సుప్రతీకము ధాటికి ఆగలేక మన

సేనలు పారిపోతున్నాయి. సుప్రతీకము మన వారిని తరుముతున్నది. వెంటనే మన రథమును అటు వైపు మరల్పుము.” అని అన్నాడు.

శ్రీకృష్ణుడు అపరిమితమైన వేగంతో తమ రథమును పాండవ సేనల వైపు పరుగెత్తించాడు. అర్జునుడు దేవదత్తమునుపూరించాడు. భగదత్తుని మీద కరకుటమ్ములు ప్రయోగించాడు. సుప్రతీకమునకు అడ్డంగా నిలిచాడు. భగదత్తుడు ఉగ్రమైన బాణములను అర్జునుని మీద ప్రయోగించాడు. అర్జునుడు చి రునవ్వుతో వాటిని మధ్యలోనే ముక్కలు చేసి అతి ధృడమైన బాణములను సుప్రతీకము మీద భగదత్తుని మీద ప్రయోగించాడు. అర్జునుడు వేసిన బాణములు సుప్రతీకము నకు నొప్పి కలిగించాయి. అమితరౌద్రముతో సుప్రతీకము అర్జునుని రథము మీదికి అమితమైన వేగంతో ఉరికింది.

“అయ్యో! ఇంకేముంది. అర్జునుడు, కృష్ణుడు సుప్రతీకము ధాటికి ప్రాణాలు కోల్పోయారు.” అని పాండవ సేనలో హాహా కారాలు చెలరేగాయి. అప్పుడు కృష్ణుడు తమ రథమును సుప్రతీకము దారి నుండి పక్కకు తొలగించాడు. సుప్రతీకము అదే వేగముతో పాండవ సైన్యము మీదికి దూసుకుపోయింది. దాని కాళ్ల కిందపడి పాండవ సైనికులు వందలకొద్ది మరణించారు. ఇది చూ అర్జునునికి కృష్ణుని మీద

కోపం వచ్చింది. కాని ఏమీ అనలేక తన కోపమును తనలోనే అణచుకున్నాడు. "కృష్ణా! మన రథమును సుప్రతీకము నకు ఎదురుగా పోనిమ్ము" అని ఆదేశించాడు. కృష్ణుడు తమ రథమును భగదత్తునికి ఎదురుగా నిలిపాడు.

భగదత్తుడు తన తండ్రి నరకాసురుని చంపిన కృష్ణుని మీద అతి క్రూరమైన బాణములను ప్రయోగించాడు. అర్జునుడు వాటిని ఖండించి, భగదత్తుని విల్లు విరిచాడు. భగదత్తుని శరీరము మీద వాడియై న బాణములు నాటాడు. భగదత్తుడు అమిత కోపంతో 14 తోమరములు అర్జునుని మీద ప్రయోగించాడు. అర్జునుడు వాటిని మధ్యలోనే ముక్కలు చేసి సుప్రతీకమునకు తొడిగిన కవచమును బేధించాడు. కవచము తొలగిన ఆ ఏనుగు మేఘములు తొలగిన కొండ శిఖరము వలె ప్రకాశించింది.

భగదత్తుడు అర్జునుని మీద శక్తి బాణమును ప్రయోగించాడు. అర్జునుడు ఆ శక్తిని నిర్వీర్యముచేసాడు. భగదత్తుడు అర్జునుని కిరీటమునకు గురి పెట్టి ఒక తోమరము విసిరాడు. అర్జునుడు కోపించి ఏడు బాణములతో భగదత్తుని కొట్టాడు. భగదత్తుడు తన చేతిలో ఉన్న అంకుశమును వైష్ణవాస్త్రముగా మంత్రించి అర్జునుని మీద

ప్రయోగించాడు. ఆ వైష్ణవాస్త్రము అమిత రౌద్రాకారముతో నిప్పులు విరజిమ్ముతూ అర్జునుని వైపు దూసుకువస్తూ ఉంది. ఇది చూచాడు కృష్ణుడు. రథము మీదినుండి లేచి నిలబడ్డాడు. తన గుండెలను ఆ వైష్ణవాస్త్రమునకు ఎదురుగా పెట్టి నిలిచాడు. రౌద్రమైన ఆ వైష్ణవాస్త్రము అమిత వేగంతో వచ్చి శ్రీకృష్ణుని గుండెలను పువ్వు వలె తాకి కింద పడిపోయింది.

అర్జునుడు కోపం తట్టుకోలేక పోయాడు. "కృష్ణా! నామీద దయవలన నాకు సారధ్యం చెయ్యడానికి ఒప్పుకున్నావు. కాని ఆయుధము పట్టనని మాట ఇచ్చావు. కాని ఈ విధంగా యుద్ధంలో పాలు పంచుకోడం భావ్యంగా ఉందా. ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు? అర్జునుడు చేతగాని వాడు అనుకోరా! సరేలే ఇంక మాటలెందుకు కాని రథమును పోనిమ్ము." అని నిష్ఠూరంగా మాట్లాడాడు.

కృష్ణుడు అర్జునుని చూచి "అర్జునా! రథ సారధిగా నిన్ను కాపాడుకోడం నా కర్తవ్యము. ఈ సమయములో నీకో విషయం చెప్పాలి. పూర్వము శ్రీ మహా విష్ణువు యోగనిద్ర నుండి లేచిన సమయమున భూదేవి శ్రీ మహా విష్ణువును కామించి ఆయనతో సంగమం కోరింది.

మహా విష్ణువు ఆమె కోరికను మన్నించాడు. ఆమెకు వైష్ణవాస్త్రమును అనుగ్రహించాడు. వారి సంగమ ఫలితముగా నరకాసురుడు జన్మించాడు. భూదేవి వైష్ణవాస్త్రమును నరకాసురునికి ఇచ్చింది. నరకాసురుని నుండి ఆ వైష్ణవాస్త్రము అతని కుమారుడు భగదత్తునికి సంక్రమించింది. ఆ వైష్ణవాస్త్రము అత్యంత మహిమాన్వితము. విష్ణ్వాంశతో జన్మించిన నాచేత మాత్రమే ఆ వైష్ణవాస్త్రము నిర్వీర్యము అవుతుంది. అందులకే నా గుండె లను అడ్డుపెట్టి దానిని ఆపాను. అంతేగాని నీవు వీరుడవు కావని కాదు. నీ పరాక్రమమును శంకించి కాదు. తాను ప్రయోగించిన వైష్ణవాస్త్రము వృధా ఐనందుకు భగదత్తుడు నిరాశతో ఉన్నాడు. ఇదే సమయము. నేను నరకాసురుని సంహరించినట్టు భగదత్తుని నీవు సంహరించు." అని అన్నాడు కృష్ణుడు.

అర్జునుడు వెంటనే గాండీవమును సంధించాడు. ఒక క్రూరమ్మైన నారాచమును సుప్రతీకము కుంభస్థలమునకు గురిపెట్టి కొట్టాడు. ఆ దెబ్బకు సుప్రతీకము కుంభస్థలము పగిలి కిందకు ఒరిగింది. దాని మీద ఉన్న భగదత్తుడు కిందపడ్డాడు. వెంటనే అర్జునుడు ఒక అర్ధచంద్రాకార బాణముతో భగదత్తుని శిరస్సు ఖండించాడు. ఆప్రకారము

భగదత్తుడు, అతని గజము సుప్రతీకము అర్జునుని చేతిలో సంహరింపబడ్డారు.

భగదత్తుని మరణము చూచి శకుని, అతని తమ్ములు వృషకుడు, అచలుడు కలిసి అర్జునుని మీదికి దూకారు. అపుడు అర్జునుడు వృష కుని రథమును, హయములను, కేతనమును ఖండించాడు. వృషకుడు తన సోదరుని రథం ఎక్కాడు. అర్జునుడు తనకు అడ్డుపడిన గాంధార రథికులు 500 మందిని చంపాడు. ఒకే రథము మీద ఉన్న వృషకుడు, అచలుడిని ఒకే ఒక్క బాణంతో చంపాడు. వారి మరణమును కనులారా చూచిన నీ కుమారుడు ఎంతో సంతాపం చెందాడు.

శకుని కోపంతో రగిలిపోయాడు. అర్జునుని ఎదుర్కొన్నాడు. శకుని తన మాయా శక్తితో అనేక మాయలను కల్పించాడు. రాళ్ల వర్షము కురుస్తున్నట్టు, వృక్షములు మీద పడుతున్నట్టు, భయంకరమైన సరీసృ పములు, పెద్దపులులు మీద పడుతున్నట్టు భ్రమ కల్పించాడు. అర్జునుడు తన దివ్యాస్త్రముచేత ఆ మాయలను పటాపంచలుచేసాడు.

శకునిని చూచి "శకుని మామా! నీ మాయలన్ని ఆ నాటి మాయా ద్యూతంతోనే అంతరించాయి. ఇదియుద్ధ రంగము. ఇక్కడ నీ పాచికలు

పారవు. ఇక్కడ తీవ్రమైన శరములు మాట్లాడతాయి. ఇక్కడ నీ మాయలు చెల్లవు కాని వెళ్లు. ” అంటూ శకుని మీద అతిక్రూరమైన శరములు ప్రయోగించాడు. ఆ బాణధాటికి త ట్టుకోలేక శకుని తన సైన్యములతో పారిపోయాడు.

అప్పుడు సాత్యకి, భీమసేనుడు, అర్జునునికి చెరి ఒక పక్క నిలిచారు. వారు ముగ్గురు అపరిమితమైన పరాక్రమముతో సుయోధనుడు, ద్రోణుడు ఉన్న చోటికి తమ రధములను మరలించారు. వారి బాణ ధాటికి తట్టుకోలేక కౌరవ సైన్యము రెండు పాయలుగా విడిపోయి సుయోధనుని వెనుక, ద్రోణుని వెనుక దాక్కున్నారు. పాండవ సైనికులు రెట్టించిన ఉత్సాహంతో “ద్రోణుని పట్టుకోండి చంపండి నరకండి” అని వీరాలాపాలు పలుకుతూ కౌరవ సేనల మీదికి లంఘించారు. కౌరవ సేనలు ద్రోణుని చుట్టు చేరి అతనికి రక్షణ కవచంగా నిలిచాయి.

ఇరుపక్షముల మధ్య పోరు ఘోరమయింది. ద్రోణుడు ఎటు పోతే అటు ధృష్టద్యుమ్నుడు ద్రోణుడికి ఎదురు నిలిచి అతనితో యుద్ధమునకు తలపడుతున్నాడు. ఒక పక్క ధర్మరాజు, మరొక పక్క సుయోధనుడు తమ తమ సేనలను ప్రోత్సహిస్తున్నారు. ఇంతలో

నీలుడు అనే రాజు తన సేనలతో  అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. అశ్వత్థామ  ఒకే ఒక బాణంతో నీలుడిని సంహరించాడు.  అతని సైన్యములు పారిపోయాయి.  ఇది చూచిన  పాండవ సేనలు కలత చెందాయి.

ధృష్టద్యుమ్నుడు తన సేనలకు ప్రోత్సాహ వచనాలు పలుకుతూ వారిని యుద్ధోన్ముఖులను చేసాడు.  ఇంతలో సంశప్తకులు, అర్జునుడు చంపగా మిగిలిన సైన్మమును కూడ గట్టుకొని  దక్షిణ భాగం నుండి పెద్దగా అరవడం మొదలెట్టారు. "అర్జునా! మేమేమన్నా రణరంగం నుండి పారిపోమాయా! ఓడి పోయామా! మమ్మల్ని అలా వదిలేసి వస్తే ఎలా!  ఏడీ ఆ వీరుడు అర్జునుడు ఏడీ! మాతో పోరాటంమానేస్తే అర్జునుడికి విజయం చేకూరుతుందా! అర్జునా! మాకు భయపడి దాక్కున్నా వా! రా మాతో యుద్దానికి రా!" అని కవ్వించసాగారు.

వారి మాటలకు రోషం తెచ్చుకున్న అర్జునుడు తన రథం  దక్షిణ దిక్కుకు మరలించాడు. అప్పుడ కౌరవ ప్రముఖులు పాండవ సైన్యము మీద శర వర్షము కురిపిస్తున్నారు. పాండక సైన్యము చెల్లాచెదరయింది. ఈ సమయమున భీముడు పాండ సైన్యమును ప్రోత్సహిస్తున్నాడు. కౌరవ పక్షమున యుద్ధం చేస్తున్న బాహ్లికుని ఎదుర్కొని అతని మీద

క్రూరమైన బాణములు ప్రయోగించాడు. అది చూచి సుయోధనుడు, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, కలిసి భీముని మీద శర వర్షము కురిపించారు.

భీమసేనుని ఒంటరి వాడిని చేసి అంత మంది కౌరవ యోధులు యుద్ధం చెయ్యడం చూసిన ధర్మరాజు నకుల, సహదేవులను, సాత్యకిని, అభిమన్యుని భీమసేనుడికి సాయంగా వెళ్లమన్నాడు. వారందరూ భీమసేనుని కలుసుకొని దుర్యోధనాదులతో పోరుతున్నారు.

అపుడు అపరాహ్ణ మయింది. రధములు విరిగి పడుతున్నాయి. కరవాలముల దెబ్బలకు తలలు తెగి పడుతున్నాయి. మొండెముల నుండి ప్రేవులు బయటకు వస్తున్నాయి. కాళ్లు చేతులు తెగి పడుతున్నాయి. కుంభస్థలములు పగిలిన ఏనుగులు కిందపడి దొర్లుతున్నాయి. ఏనుగుల మీద ఉన్న వీరులు చేతిలోని అంకుశములతో సహా కిందపడి మరణిస్తున్నారు. ఏనుగుల కాళ్ల కిందపడి మరణిస్తున్నా, సైనికులు తమ తమ చేతులలోని కరవాలములు పట్టు వీడటం లేదు. తలలు తెగిన తరువాత కూడా మొండెములు కొంతసేపు తమ తమ చేతులతో కరవాలములను ఝుళిపించి తరువాత కిందపడుతున్నాయి. రణరంగమంతా పీనుగుల పెంటగా మారిపోయింది.

ఆ సమయములో ధృష్టద్యుమ్నుడు ద్రోణుని చంపుటకు ఇదే సమయమని ఎంచి తన సైన్యముతో సహా ద్రోణుని ఎదుర్కొన్నాడు. ద్రోణుని మీద అనేకము లైన దివ్యాస్త్రములు సంధించాడు. ఇంతలో సంశప్తకుల సైన్యమును పూర్తిగా నిర్మూలించిన అర్జునుడు మరల పాండవ సైన్యము వద్దకుచేరుకున్నాడు. భీమునికి తోడుగా నిలిచాడు. ధృష్టద్యుమ్నునికి తోడుగా భీమార్జునులు ద్రోణుని మీద యుద్ధమునకు దిగారు. కౌరవ బలములను సర్వనాశనము చేస్తున్నారు.

ఆ ముగ్గురి వీరుల ధాటికి తట్టుకోలేక కౌరవ బలములు ఆక్రోశించాయి. "కర్ణా! కర్ణా! మాకు నీవే దిక్కు" అంటూ పారి పోయి కర్ణుని వెనక చేరాయి.

"పారిపోకండి నిలువండి. మీకేం భయం లేదు." అని ధైర్య వచనాలు పలికాడు కర్ణుడు. ఎదురుగా వచ్చిన అర్జునుని మీద ఆగ్నేయాస్త్రమును ప్రయోగించాడు. అర్జునుడు వారుణాస్త్రాన్ని ప్రయోగించి ఆగ్నేయాస్త్రాన్ని నిర్వీర్యం చేసాడు. భీముడు, సాత్యకి, ధృ ష్టద్యుమ్నుడు కర్ణుని శరీరంలో మూడేసి బాణములు నాటారు. కర్ణుడు కూడా అర్జునుడు తన మీద ప్రయోగించిన బాణములను మధ్యలోనే ఖండించాడు. భీమ, సాత్యకి, ధృష్టద్యుమ్నుల ధనుస్సులను

ఖండించాడు.   ఆ ముగ్గురూ కర్ణుని మీద శక్తి బాణములు ప్రయోగించారు. కర్ణుడు వాటిని కూడా నిర్వీర్యము చేసాడు. అర్జునుడు ఏడు బాణములతో కర్ణుని కొట్టాడు.  కర్ణుని తమ్ములు ముగ్గురి తలలు నరికి భూదేవికి బలి  ఇచ్చాడు.

ఇంతలో భీముడు  తన రథము దిగి  గదను భుజము మీద పెట్టుకొని  కర్ణుని సైనికులను పదివేల మందిని చంపి మరల తన రథం అధిరోహించాడు.  మరొక విల్లు తీసుకొని వాడియైన శరములతో కర్ణుని శరీరం మొత్తం కొట్టాడు.  ఇంతలో ధృష్టద్యుమ్నుడు సాత్యకి, వేరు విల్లులు తీసుకొని కర్ణుని సారధిని చంపారు. కర్ణుని విల్లు విరిచారు. ఆసమయమున  దుర్యోధనుడు, ద్రోణుడు, జయద్రధుడు కలిసి కర్ణుని అక్కడినుండి తప్పించారు.

ఇరు పక్షముల వారు అతి భయంకరంగా పోరాడుతున్నారు. రథములు, హయములు, ఏనుగులు, కాల్బలములు నేల కూలుతున్నాయి. కాలువలై పారుతున్న నెత్తుటిమడుగులలో మృత దేహములు తేలియాడుతున్నాయి. మానవుల, హయముల, ఏనుగుల ప్రేవులు, మాంసము ముద్దలు  గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి.

యుద్ధ భూమి అంతా రౌద్రముగా, భీభత్సముగా, ఘోరంగా కనపడుతూ ఉంది.

ఒక పక్క ద్రోణుడు, మరోక పక్క అర్జునుడు తీవ్రంగా యుద్ధం చేస్తున్నారు. ఇంతలో సూర్యుడు పశ్చిమాద్రిని చేరుకున్నాడు. రణరంగములో పడి ఉన్న శవములను తినుటకు గాను గ్రద్దలు ఆకాశంలో తిరుగాడుతున్నాయి. ఇరుపక్షములు ఆ రోజుకు యుద్ధము విరమించారు. ఆనందోత్సాహములతో పాండవ సైన్యములు తమ తమ శిబిరములకు మరలాయి. కౌరవ సేనలు మాత్రం నిరాశా నిస్పృహలతో తమ శిబిరములకు మరలారు. అందరూ ఆ రోజు కూడా ద్రోణుడు తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనలేక పోవడం, అర్జునుడు తన పరాక్రమముతో విజృంభిచడం, అతనికి కృష్ణుడు తోడుగా నిలిచి అనుక్షణం కాపాడటం గురించి మాట్లాడు కుంటున్నారు.

ఆ సమయంలో సుయోధనుడు ద్రోణుని చూచి ఇలాఅన్నాడు "ఆచార్యా! ధర్మరాజును పట్టి బంధించి నాకు అప్పగిస్తానని నాకు వరం ప్రసాదించారు. కాని రెండురోజులైనా మీ ప్రతిజ్ఞ నెరవేర్చుకొనలేక పోయారు. ధర్మజుడు మీకు చేజిక్కినా ఆ అవకాశములను చేజార్చుకున్నారు. లోకుల దృష్టిలో మీరు నేను అసమర్ధులుగా

మిగిలిపోయాము. ఈ ప్రకారము కుటిలమైన వ్యర్థపు మాటలతో మీరు నన్ను వంచించి నందు వలన మీకు కలుగు ప్రయోజన మేమి? మీలాంటి ఆశ్రితగుణశ్రేష్టుడు ఈ ప్రకారం వంచించ దగునా? " అని కర్ణ కఠోరంగా పలికాడు.

ఆ మాటలకు ఎంతో నొచ్చుకున్న ద్రోణుడు ఆ విషయం బయట పడనీయక శాంతంతో సుయోధనునితో ఇలా అన్నాడు. "సుయోధనా! నరుని పరాక్రమము, నారాయణుని మహత్తు ఎరిగి కూడా నీవు ఇలా మాట్లాడటం తగునా! నిన్న,ఈ రోజు వారు ధర్మనందనుని విడిచి ఒక్కక్షణమైనా ఉన్నారా. ఈ రోజు రణరంగములో అర్జునుడు లేకుండా పక్కకు తీసుకొని పోవుటకు ఎవరి నైనా నియోగింపుము. నీవు ఎందుకో నన్ను తప్పుగా అర్ధం చేసుకున్నావు. నా నోట నవ్వులాట కైనను అసత్యము ఎన్నటికీ రాదు. గుర్తు పెట్టుకో. నేనునా ప్రతిజ్ఞను నెరవేర్చి తీరుతాను." అన్నాడు ద్రోణుడు.

ఆ సమయములో సంశప్తకులు అక్కడకు వచ్చారు. "సుయోధనా! మాకు తక్క అర్జునుని పక్కకు మరల్చు నేర్పు మరి ఎవరికి ఉన్నది." అంటూ ప్రగల్బాలు పలికారు.

ధృతరాష్ట్ర మహారాజా! ఆ ప్రకారము సంశప్తకులు అర్జునుని తమ వైపు యుద్ధమునకు రమ్మని కవ్వించారు. అర్జునుడు దేవదత్తము పూరించి వారితో యుద్ధమునకు దిగాడు. ఇక్కడ ద్రోణుడు పద్మవ్యూహము పన్నాడు. ధర్మరాజు అనుమతితో అభిమన్యుడు ఆ పద్మవ్యూహమును భేదించాడు. బృహద్బలుడు లక్ష్మణ కుమారుడు మొదలగు రాకుమారులను పెక్కుమందిని చంపాడు. కాని పద్మ వ్యూహము నుండి బయట కు వచ్చు మార్గము కానక కౌరవుల చేతిలో మృతి చెందాడు. కౌరవ సేనలు అభిమన్యుని మృతి చూచి ఆనందోత్సాహాలతో ఆరోజు యుద్ధం ముగించాయి. పాండవ సైన్యములలో విషాదచ్ఛాయలు నెలకొన్నాయి." అని సంజయుడు మూడవ రోజు యుద్ధ క్రమమును ధృతరాష్ట్రునకు వివరించాడు.

మహాభారతము

ద్రోణ పర్వము ప్రథమాశ్వాసము

సమాప్తము.

ఓంతత్సత్ ఓంతత్సత్ ఓంతత్సత్

# మహాభారతము

## ద్రోణ పర్వము

## ద్వితీయాశ్వాసము.

వైశంపాయనుడు జనమేజయునకు మహా భారత కధను ఇలా వివరించాడు.

అభిమన్యుడు యుద్ధ రంగమునమరణించాడు అన్న వార్త విని ధృతరాష్ట్రుడు ఎంతో పరితపించాడు. "సంజయా! నా మనుమడు, అమిత తేజస్కుడు, సద్గుణసంపన్నుడు అయిన అభిమన్యుని మనసైన్యములోని ఉగ్ర మనస్కులైన యోధులు అందరూ కలిసి ఎలా చంపారు. నాకు వివరంగా చెప్పు." అని అడిగాడు. సంజయుడు ద్రోణుడు పన్నిన పద్మవ్యూహము, అభిమన్యుడు మరణించిన తీరు ఈవిధంగా వివరించాడు.

"మహారాజా! మూడవ రోజున, ద్రోణాచార్యుడు కౌరవ సేనలను పద్మవ్యూహము ఆకారములో నిలిపాడు. దానిని చక్రవ్యూహము అని కూడా అంటారు. ఆ పద్మవ్యూహమున, వివిధదేశాధీశులు ఆ

పద్మమునందు రేకులమాదిరి నిలిచారు. వారి కుమారులు అందరూ కేసరములు (తామర పువ్వు మధ్యభాగము) మాదిరి నిలిచారు. కర్ణుడు, దుశ్శాసనుడు, తమ తమ సేనలతో కూడా పద్మము యొక్క అంతర్భాగమున నిలిచారు. వారి మధ్య సుయోధనుడు తన సైన్యముతో నిలిచాడు. సైంధవుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు, శకుని, కృతవర్మ, భూరిశ్రవసుడు, శలుడు, శల్యుడు, నీ కుమారులు, నీ మనుమలు, తమ తమ స్థానములలో నిలిచారు.

పాండవ సేనలో భీమసేనుడు మొదలగు వారు, సాత్యకి, ధష్ట ద్యుమ్నుడు, కుంతిభోజుడు, చేకితానుడు, క్షత్రధర్ముడు, క్షత్రవర్మ, ధృ ష్టకేతు, నకుల సహదేవులు, ఉత్తమౌజుడు, శిఖండి, యుధామన్యుడు, ఘటోత్కచుడు, విరాటరాజు, ద్రుపదుడు, ద్రౌపదీ పుత్రులు, కేకయ రాజులు, సంజయులు, వారందరూ కలిసి ఒక్కుమ్మడిగా ద్రోణుని మీద యుద్ధమునకు తలపడ్డారు.

ద్రోణుడు వారి విజంభణకు జంకక, వారి మీద వాడియైన బాణములుప్రయోగించాడు. ద్రోణుని పరాక్రమమునకు తట్టుకోలేక పాండవ వీరులు పారిపోయారు. పాండవ వీరులలో ఎవ్వరికి కూడా ద్రోణుడు పన్నిన పద్మవ్యూహము లోనికి చొరపడడానికి సాధ్యం కాలేదు.

అప్పుడు ధర్మరాజు "ఈ పద్మవ్యూహమును బేధించడం ఎవరి తరమూ కాదు. ఒక్క అభిమన్యునికి తక్క" అని తలంచి తన రధమును అభిమన్యుని రధము వద్దకు పోనిచ్చాడు. అభిమన్యునితో ఇలా అన్నాడు.

"కుమారా! అభిమన్యు! ఈ పద్మవ్యూహములోని చొరపడటం ఎవ్వరికీ తెలియదు. నీకు, నీ తండ్రి అర్జునుడు, శ్రీకృష్ణుడు, ప్రద్యుమ్నుడు వీరికి మాత్రమే తెలియును. మనలను చూచి నీ తండ్రి, అర్జునుడు, హేళన చెయ్యకుండా నీవు ఆ పద్మవ్యూహమును ఛేధించ వలమును."అని అర్థించాడు.

"తండ్రీ! నా తండ్రి అర్జునుడు నాకు ఈ పద్మవ్యూహమును బేధించి లోపల ప్రవేశించడం వరకూ నాకు చెప్పారు. కాబట్టి నేను ఈ పద్మవ్యూహములోనికి ప్రవేశించి కౌరవ సైన్యమును చించి చెండాడతాను." అని అన్నాడు అభిమన్యుడు.

"ఆ మాత్రం చాలు కుమారా! నీవు తోవ చూపి పద్యవ్యూహములోనికి ప్రవే శించిన నీ వెను వెంటనే మేమందరమూ పద్మవ్యూహములోనికి ప్రవేశించెదము. కాబట్టి నీవు పద్మవ్యూహ ప్రవేశము మాత్రము చేయుము." అని అభ్యర్థించాడు.

పక్కనే ఉన్న భీముడు కూడా "కుమారా! నీవు పద్మవ్యూహమును బేధించిన చాలును. నీ వెంటనే నేను, ధృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు, సాత్యకి, విరాటుడు, పద్మవ్యూహములోనికి ప్రవేశించి శత్రు సేనలను మట్టుపెట్టెదము." అని అన్నాడు.

"పెదనాన్నగారూ! దీనికి మీరు ఇంతగా అడుగవలెనా! పద్మ వ్యూహమును రచించిన ద్రోణుడు మెచ్చగా, నేను పద్మవ్యూహములో ప్రవేశించి శత్రు నిర్మూలనము గావిస్తాను. ధర్మజుని మాట నిలబెడతాను. నా తల్లితండ్రులు నన్ను మెచ్చుకొనేలాగా నా యుద్ధ ప్రావీణ్యము ప్రదర్శిస్తాను. ఇంత చి న్నవాడు కౌరవ వీరులతో పోరాడుతున్నాడు అని జనులు మెచ్చగా నా మేనమామ శ్రీకష్ణునకు ప్రీతి కలిగేటట్టు నా తండ్రి సంతసించేటట్టు కౌరవేంద్రుడు ఆశ్చర్యపడేటట్టు నేను రణరంగములో వీర విహారమొనరిస్తాను." అని పలికాడు.

ఆ మాటలకు సంతసించిన ధర్మరాజు "కుమారా! నీ ధైర్యము, నీ శౌర్యము, నీ బలము, నీ కీర్తి వర్ధిల్లుగాక!" అని దీవించాడు. అప్పుడు అభిమన్యుడు సుమిత్రుడు అనే పేరు గల తన సారధితో రధమును ద్రోణుని వైపు పోనిమ్మన్నాడు. అప్పుడు సుమిత్రుడు అభిమన్యుని చూచి

“కుమారా! నీవు బాలుడవు. నీ ఎదుట ఉన్నది ద్రోణాచార్యుని సైన్యము. వారు అతిరథులు మహారథులు.అత్యంత క్రూరాత్ములు. వారు నీ చేతిలో మరణించు వారు కారు. కాబట్టి పద్మవ్యూహమును ప్రవేశించే ముందు ఆలోచించుకో! ” అని అన్నాడు.

అభిమన్యుడు నవ్వి “సుమిత్రా! ఆ దేవేంద్రుడే దేవగణములతో దిగివచ్చిననూ, ఆ పరమేశ్వరుడు తన భూతగుణములతో నా మీదికి యుద్ధమునకు వచ్చినను, ఆఖరుకు నా తండ్రి అర్జునుడు, నా మేన మామ శ్రీకష్ణుడే నా మీదికి యుద్ధమునకు దిగినను, నేనువారిని జయించెదను. కాబట్టి సందేహించక మన రథమును ద్రోణుని మీదికి పోనిమ్ము” అని పలికాడు.

మనసులో అనుమానమున్నను, మారు మాటాడక సుమిత్రుడు అభిమన్యుని రథమును కౌరవ సేనల వైపు పోనిచ్చాడు. అది చూచిన కౌరవ ప్రముఖులు ఒక్కుమ్మడిగా అభిమన్యుని మీదికి లంఘించారు. అప్పుడు వారి మధ్య సమరం సంకులమయింది. మెరుపు మెరిసినట్టుగా అభిమన్యుడు కౌరవ సేనలను ఛేదిస్తూ పద్మవ్యూహములోనికి జొరబడ్డాడు.

ఆ ప్రకారంగా దుర్భేధ్యమైన పద్మవ్యూహము లోనికి చొచ్చిన అభిమన్యుడు అమిత రౌద్రముతో  బాగా ఎండిపోయిన అడవిలో మండుచున్న కార్చిచ్చు మాదిరి గా కౌరవ సేనలను హతమారుస్తున్నాడు. అభిమన్యుని చేత ప్రయోగింపబడుతున్న అస్త్ర శస్త్రముల ధాటికి రధములు విరుగుతున్నాయి, హయముల తలలు తెగుతున్నాయి. కాల్బలములు నాశనమవుతున్నాయి. కేతనములు విరిగి పడుతున్నాయి. సారధులు చచ్చిపడుతున్నారు. ధనుస్సులు విరుగుతున్నాయి. శత్రు సైన్యము శరీరముల నిండా అత్యంత క్రూరమైన బాణములు నాటు కుంటున్నాయి. రణరంగమంతా పీనుగులతో నిండిపోయింది.  కౌరవ సైన్యము కకావికలయింది. అభిమన్యుని ధాటికి పద్మవ్యూహము చెల్లాచెదరయింది. కౌరవ సేనలు పారిపోతున్నాయి.

అది చూచాడు సుయోధనుడు. వెను వెంటనే తన సైన్యముతో అభిమన్యుని ఎదుర్కొన్నాడు. దూరంనుండి ద్రోణుడు  ఇది గమ నించాడు.  తమ సైన్యములోని అతి రధ మహా రధులను పిలిచాడు. "మన సుయోధనుడు అభిమన్యుని ఎదుర్కొంటున్నాడు. మీరందరూ సుయోధనునికి సాయంగా వెళ్లండి. " అని చెప్పాడు. అప్పుడు కృ పాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ, కర్ణుడు, శలుడు, శకుని, పౌరవుడు, వృషసేనుడు, అందరూ కలిసి సుయోధనునికి సాయంగా వెళ్లారు.

వారందరూ ఒక్కుమ్మడిగా అభిమన్యుని చుట్టుముట్టి శరవర్షము కురిపించారు.

చేతికి చి క్కిన సుయోధనుడు చేజారి పోయినందుకు కోపోద్రిక్తుడయ్యాడు అభిమన్యుడు. ఆ అతిరధ మహారధుల మీద అస్త్రశస్త్రములను ప్రయోగించాడు. అభిమన్యుని ధాటికి తట్టుకోలేక కౌరవ సేనలు పారిపోయాయి. ఇది చూ చి న ద్రోణుడు అభిమన్యుని మీదికి తన రధమును పోనిచ్చాడు. తన పరాక్రమముతో అభిమన్యుని మీద బాణ వర్షము కురిపించాడు. పారిపోయిన కౌరవ యోధులు మరల తిరిగి వచ్చి అభిమన్యుని తో పోరుతున్నారు.

అభిమన్యుడు అతి లాఘవంగా వారు ప్రయోగించిన శరములను మధ్యలోనే త్రుంచి వారి శరీరములను తన బాణపరంపరతో తూట్లు తూట్లు గా కొట్టాడు. అభిమన్యుని పరాక్రమము చూచి సుయోధనుడు ఆశ్చర్యపోయాడు. పారి పోతున్న తన సేనలను చేయి ఊపి పిలుస్తున్నాడు. తన రధమును అభిమన్యుని మీదికి పోనిచ్చాడు. సుయోధనుడు, కృపాచార్యుడు, భూరిశ్రవసుడు ఒక్కొక్కరు మూడు అమ్ములతోనూ, ద్రోణుడు 17 అమ్ములతోనూ, వివింశతి 20 అమ్ములతోనూ, అశ్వత్థామ 5 బాణములతోనూ, బృహద్బలుడు ఎనిమిది బాణములతోనూ,

శల్యుడు ఆరు బాణ ములతోనూ, కృతవర్మ ఏడు బాణములతోనూ, శకుని రెండు బాణములతోనూ, దుశ్శాసనుడు 12 బాణములతోనూ, దుస్సహుడు తొమ్మిది బాణములతోనూ, ఒకేసారి అభిమన్యుని కొట్టారు.

ఆ బాణముల నన్నింటిని తుత్తునియలు చేసిన అభిమన్యుడు వారి ఒక్కొక్కరి శరీరములలో మూడేసి బాణములను గుచ్చాడు. అశ్మకుని కేతనము విరిచి వాని విల్లు తుంచి, వాని శిరస్సును ఖండించాడు. అశ్మకుని మరణమును చూచిన కౌరవ బలములు భయంతో పారి పోయినవి. అది చూచిన ఆచార్యుడు కౌరవ సేనలను తన ప్రోత్సాహపు మాటలతో మరల రణోన్ముఖులను గావించాడు. నీ కొడుకులందరను కూడగట్టుకొని, అభిమన్యుని మీద అనేక అస్త్ర, శస్త్రములను ప్రయోగించారు. వాటిని చూచి భయపడక, అభిమన్యుడు వారి అందరి శరీరములను నానా రకములైన బాణములతో నొప్పించాడు.

తరువాత అభిమన్యుడు  కర్ణుని మీదికి తన రధమును పోనిచ్చాడు. కర్ణుని కవచమును పగులగొట్టాడు. కర్ణుని వక్షస్థలము మీద ఒక క్రూరమైన బాణమును నాటాడు.  ఆ బాణము దెబ్బకు కర్ణు డు మూర్ఛపోయాడు. నీ కుమారులందరిని అభిమన్యుడు  వెనక్కు తరిమాడు.  ఇంతలో శల్యుడు అభిమన్యుని మీదికి  ఉరికాడు. అత్యంత

పదునైన బాణములతో శల్యుని కొట్టాడు అభిమన్యుడు. శల్యుడు మూర్ఛపోయాడు. అభిమన్యుడు సింహనాదం చేసాడు. ద్రోణుడు వద్దు వద్దు అని వారిస్తున్నా అతని మాటలు లక్ష్యపెట్టక, కౌరవ సేనలు పారిపోయాయి." అని సంజయుడు ధృతరాష్ట్రునితో అభిమన్యుని రణ విద్యా కౌశలమును గురించి చెప్పాడు.

అది విని ధృతరాష్ట్రుడు "సంజయా! ఆ సమయంలో అభిమన్యుని ఎవరు ఎదుర్కొన్నారు? వారి మధ్యయుద్ధం ఎలా జరిగింది వివరంగా చెప్పు!" అని అడిడు. సంజయుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"శల్యుడు మూర్ఛపోవడం చూచి అతని తమ్ముడు అభిమన్యుని ఎదిరించాడు. అభిమన్యుని శరీరము మీద పది తీవ్రమైన బాణములు ప్రయోగించాడు. అభిమన్యుడు ఆ బాణములను మధ్యలోనే తుంచాడు. శల్యుని తమ్ముని రధమును విరగ్గొట్టాడు. హయములను చంపాడు. వాడి చేతులు నరికాడు. ఆఖరున అతని శిరమును ఖండించాడు. ఇది చూచిన మిగిలిన రాజ కుమారులు భయ భ్రాంతులయ్యారు. ద్రోణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ, బృహద్బలుడు, కర్ణుడు, మొదలగు ప్రముఖ యోధులు ఒకరినొకరు పిలుచుకొనుచూ, ధైర్యము

చెప్పుకుంటూ, తమ తమ బలములను కూడగట్టుకొని, అభిమన్యుని చుట్టుముట్టారు.

వారిని చూచి అభిమన్యుడు సింహము వలె గర్జించాడు. సాక్షాత్తు అర్జునుడే అక్కడ ఉన్నాడా అన్నట్టు అందరికీ తానే అయి కనిపిస్తూ, తన విల్లు గుండ్రముగా ఉన్నదా అన్న భ్రమ కలిగిస్తూ అత్యంత వేగంతో వారి మీద శర వర్షము కురిపించాడు. కౌరవ వీరుల మీద భల్లములు, అంజలకములు, క్షురపములు, కూర్మనఖములు మొదలగు బాణములను ప్రయోగిస్తున్నాడు. అభిమన్యుని పరాక్రమమునకు తట్టుకోలేక కౌరవ వీరులు భయంతో పరుగులు తీస్తున్నారు. ద్రోణుడు నిస్సహాయంగా చూస్తున్నాడు." అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

అభిమన్యుని ప్రతాపము గురించి విని, మనమున ఖేదము, మోదము రెండును కలుగగా, ధృతరాష్ట్రుడు, తరువాత ఏమయింది అని ఆతురతగా అడిగాడు.

"ఆ ప్రకారంగా పారి పోతున్న కౌరవ సైన్యమును చూచి అభిమన్యుడు వారిని పారిపోనీక వారి చుట్టూ తన రథమును

చక్రాకారముతో తిప్పుతూ, ఎడతెగకుండా బాణవర్షము కురిపిస్తూ, రణరంగమంతా పీనుగు పెంటలు చేసాడు. అభిమన్యుని ప్రతాపమును చూచి ద్రోణుడు అపరిమితమైన సంతోషంతో పక్కన ఉన్న కృపా చార్యుని తో ఇలాఅంటున్నాడు. "ఆచార్యా! తన అన్న దమ్ములు, స్నేహితులు, తండ్రులు, మామలు, అందరూ సంతోషించగా విజయుని కొడుకు అభిమన్యుడు శాత్రవ సంహారము చేస్తున్నాడు. హయములను, ఏనుగులను అసంఖ్యాకంగా నేలకూలుస్తున్నాడు. అతని ముందు మన సైన్యములో పేరు గల వీరాధి వీరులెవరూ నిలువలేకున్నారు." అని పలికాడు.

ఆ మాటలు విన్న సుయోధనుడు, అతి దీనమైన ముఖముతో చిరునవ్వు మొహము మీదికి తెచ్చుకొని భూరిశ్రవసుడు, కర్ణుడు,శల్యుడు మొదలగు వారితో ఇలా అన్నాడు.

"విన్నారా! మన గురువుగారు ద్రోణాచార్యులవారి పలుకులు విన్నారా! విల్లుపట్ట నేర్చిన ప్రతివాడికీ ద్రోణాచార్యులే గురువు గారు కదా. అలాంటి వాడు ఒక పసివాడిని మహా వీరుడు అని పొగుడుతున్నాడు. కాని అతనిని చంపడానికి మాత్రం ప్రయత్నించడం లేదు. ఎంతయినా ద్రోణుడు పార్థునికి అనుకూలుడు కదా. అతని కుమారుని ఎలా

చంపుతాడు. అయినా, మన గురువుగారు  ఉ పేక్షించ బట్టి అభిమన్యుడు అలా చెలరేగి పోతున్నాడు. అదంతా తన ప్రావీణ్యము అని పొంగిపోతున్నాడు. ఇప్పుడు మనమందరము  కలిసి అభిమన్యుని ఎదు ర్కొందాము."  అని అందరిని  కూడగడుతుంటే దుశ్శాసనుడు ముందుకు వచ్చి

"అన్నయ్యా!  ఈ మాత్రం దానికి ఇంతమంది యోధాను యోధులు కావలెనా! నేను చాలనా! నా అవక్ర విక్రమ పరాక్రమముతో అభిమన్యుని చంపుతాను. అభిమన్యుడు చచ్చాడు అన్న వార్త విని అర్జునుడు, కృష్ణుడు అతి శోకభారంతో మరణిస్తారు. మనపగ తీరుతుంది." అని అన్నాడు.

వెంటనే దుశ్శాసనుడు తన విల్లు సారిం చి శరవర్షము కురిపిస్తూ అభిమన్యుని తో యుద్ధమునకు దిగాడు. అభిమన్యుడు దుశ్శాసనుడు ప్రయో గించిన బాణములనన్నింటిని మధ్యలోనే తుంచి, అతని మీద 26 అతి క్రూరమైన శరములను ప్రయోగించాడు. దుశ్శాసన అభిమన్యుల యుద్ధము చేయుటను  మిగిలిన వారు యుద్ధము చేయుట మాని చూస్తున్నారు.

ఇంతలో అభిమన్యుడు దుశ్శాసనుని విల్లు తుంచాడు. అతి క్రూరమైన భల్లబాణములతో దుశ్శాసనుని ఒళ్లంతా తూట్లుగా కొట్టాడు. అభిమన్యుడు నవ్వుతూ దుశ్శాసనునితో ఇలా అన్నాడు: "దుశ్శాసనా! నాడు, నిండు పేరోలగములో మా తండ్రిగారు ధర్మరాజును నీవు ఆడిన మాటలకు ఈరోజు బదులు తీర్చుకుంటాను. కొంచెంసేపు అలాగే నిలబడు. మదాంధుడవైన నీ తల ఖండించి నా తల్లి తండ్రులకు మనోల్లాసం గావిస్తాను." అంటూ అభిమన్యుడు వెంటనే రెండు వాడియైన బాణములు దుశ్శాసనుని వక్షస్థలము మీద నాటాడు. ఆ బాణముల దెబ్బకు దుశ్శాసనుడు చచ్చినట్టు రథం మీద కూలబడ్డాడు. ఆ ప్రకారము మూర్ఛపోయిన దుశ్శాసనుని రథమును సారధి పక్కకు మళ్లించుకొని పోయాడు.

అంతకు ముందే అభిమన్యుడు దారి చేయగా పద్మవ్యూహము లోనికి చొచ్చుకు వచ్చిన పాండవ వీరులు, వారి సైన్యములు, కౌరవ వీరులతో ఘోరంగా పోరుతున్నారు. మరొక పక్క అభిమన్యుని పరాక్రమమును చూచి పొంగిపోతున్నారు. దుశ్శాసనుడు మూర్ఛపోవడం చూచి హర్షధ్వానాలు చేసారు. అప్పుడు సుయోధనుడు కర్ణుని చూచి "కర్ణా! దుశ్శాసనుడు అభిమన్యుని చేతిలో దెబ్బతిని మూ ర్ఛపోయాడు గదా! " అని నిట్టూర్చాడు.

ఆ మాటలు విన్న కర్ణుడు తన సైన్యముతో అభిమన్యుని మీదికి లంఘిం చాడు. 73 బాణములను అభిమన్యుని మీద ప్రయోగించాడు. కాని కర్ణుడు వేసిన బాణములను  అభిమన్యుడు లక్ష్యపెట్టక వాటిని మధ్యలోని పొడి  పొడి చేసిన అభిమన్యుడు, కర్ణుని అలసి పోయేదాకా కొట్టాడు. ఆ సమయంలో కర్ణుని తమ్ముడు అభిమన్యుని మీదికి వచ్చాడు. అభిమన్యుని హయముల మీద, రథసారధి మీద శరవర్షము కురిపించాడు.  అభిమన్యుడు చి రునవ్వుతో అతని శిరస్సును ఒకే ఒక భల్ల బాణంతో నరికాడు.

తమ్ముని మరణం చూచిన కర్ణుడు తన సైన్యముతో పక్కకుతొలిగాడు.  ఇది చూచిన కౌరవ సేనలు  విజృంభించాయి. వారి నందరిని తన  బాణ వర్షముతో  కట్టడి చేసిన అభిమన్యుడు తనసైన్మముతో పారిపోతున్న కర్ణుని దగ్గరకు పోయి అతనిని తరుముతున్నాడు. కర్ణుడు కూడా ప్రాణభయంతో పారిపోయాడు. అతని వెంట కౌరవ సైన్యము పారిపోయింది.

అది చూచాడు ద్రోణుడు. తల్లడిల్లిపోయాడు.  "కృపాచార్యా! కర్ణా! నిలవండి. పారి పోకండి. మీవంటి యోధాను  యోధులు ఈ ప్రకారం

పారిపోవడం భావ్యమా! బాహ్లికా! సుయోధనా! ఇప్పుడే కదా మీ మీ పరాక్రమాలు చూపించాలి. నిలవండి. వెనుతిరగండి. అభిమన్యునితో పోరాడండి." అని ఎంత అరిచినా వారు వినిపించుకోకుండా పారిపోతున్నారు. అభిమన్యుని శరాఘాతములకు నిలువలేక కౌరవ సేన పారిపోతూ ఉన్నది.

అది చూచి అభిమన్యుడుసింహనాదం చేసాడు. తన శంఖము పూరిం చాడు. తన విల్లు సారించి, నిరంతర శరవర్షము కురిపిస్తూ కౌరవ సైన్యమును సర్వనాశనం చేస్తున్నాడు. అతని అస్త్రధాటికి ఎదురు లేకపోయింది. రణరంగ మంతా హయములు, ఏనుగులు, సైనికుల కళేబరములతో నిండి పోయింది. విరిగిన రథములు కుప్పకుప్పలుగా పడి ఉన్నాయి. ఇంక విరిగిన చేతులు కాళ్లు, మొండెములు చెప్పనక్కరలేదు. విరిగిన కేతనములు, గొడుగులు, ధనుస్సులు కుప్పకుప్పలుగా పడి ఉన్నాయి. ఆకాశము మధ్యలో రెండవ సూర్యునిలా వెలిగిపోతున్నాడు అభిమన్యుడు." అని సంజయుడు ధృతరాష్ట్రుని తో అన్నాడు.

ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు "సంజయా! ఇప్పటిదాకా అభిమన్యుడు ఒక్కడే యుద్ధం చేస్తున్నట్టు చెప్పావు. మిగిలిన పాండవులు, విరాటుడు, పాంచాల భూపతి మొదలగు వారు ఏమయ్యారు. వారు

ఎందుకు అభిమన్యునినికి సాయంగా రాలేదు." అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

"మహారాజా! అభిమన్యునికి తోడ్పడవలెనని పాండవ ప్రముఖులు, వారి వారి సైన్యములతో, అభిమన్యుని వెంట పద్మవ్యూహములో ప్రవేశించారు. కౌరవ సైన్యములను నిర్మూలిస్తున్నారు. అది చూచి కౌరవ యోధులు నిశ్చేష్టులయ్యారు. పాంచాల, యాదవ, పాండ్య, కేకయ, మాత్స్య ప్రముఖ వీరులు తమ తమ సైన్యములతో ధర్మరాజుకు తోడుగా నిలిచి పోరుతున్నారు. అప్పుడు వారికి అడ్డు తగిలాడు సైంధవుడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు ఆశ్చర్యంతో "అదేమిటి! సైంధవుడు అడ్డు తగలడం ఏమిటి? అతడు గొప్ప వీరుడే కాని పాండవుల నందరినీ ఏ ప్రకారము అడ్డగించగలిగాడు. ఏ మహా తపము చేస్తే అతనికి ఆ శక్తి సిద్ధించింది." అని అడిగాడు. సంజయుడు ధృతరాష్ట్రునికి ఈవిధంగా చెప్పసాగాడు.

"మహారాజా! పాండవులు అరణ్యవాసము చేయుచున్నప్పుడు, ఒకనాడు సైంధవుడు ద్రౌపదీ కారణంగా భీముని చేతిలో భంగపడ్డాడు కదా. ఆ అవమానము భరించలేక సైంధవుడు పరమేశ్వరుని గూర్చి

తపస్సు చేసాడు. భక్తవత్సలుడగు పరమేశ్వరుడు అతనికి ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకోమన్నాడు, అప్పుడు సైంధవుడు పాండవులను జయించునట్టు వరం ప్రసాదించమని కోరాడు. "ఒక్క అర్జునుని తక్క మిగిలిన పాండవులను నీవు ఒక్కరోజు మాత్రం నివారించగలవు" అని వరము ఇచ్చాడు. ఆ వర ప్రభావముతో ఆ రోజు సైంధవుడు పాండవులను అడ్డగించగలిగాడు. అది ఎలా జరిగిందో సవిస్తరముగా చెప్పెదను వినుము.

అభిమన్యుడు పద్మవ్యూహములో ప్రవేశించగానే తక్కినపాండవ వీరులు కూడా అతనిని అనుసరించబోగా నీ అల్లుడు సైంధవుడు తన వరప్రభావంతో అడ్డుపడ్డాడు.

(సింధు రాజైన సైంధవుడు (జయద్రధుడు) ధృతరాష్ట్రుని కుమార్తె, సుయోధనుని చెల్లెలు అయిన దుస్సల అను అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. అందువల్ల ధృతరాష్ట్రుడుకి అల్లుడు అయ్యాడు.)

ఆ విధంగా అడ్డుపడ్డ సైంధవుడు మూడు బాణములతో సాత్యకిని, ఎనిమిది బాణములతో ధష్టద్యుమ్నుని, ఇరువది అమ్ములతో విరాటుని, పది బాణములతో శిఖండిని, ఏడు బాణములతో పాంచాల

భూపతిని, ద్రౌపదీ సుతులను 15 బాణములతోనూ, 25 బాణములతో కేకయరాజులను, ధర్మరాజును 75 బాణములతోనూ కొట్టాడు.

అప్పుడు ధర్మరాజు సైంధవుని విల్లు విరిచాడు. సైంధవుని మీద అతి క్రూరమైన బాణములను ప్రయోగించాడు. సైంధవుడు మరొక విల్లు అందుకని మంటలు విరజిమ్మే బాణములను ధర్మరాజుమీదను, అతని అనుచరుల మీదను ప్రయోగించాడు. అప్పుడు భీమసేనుడు సైంధవుని మీదికి ఉరికి మూడు బాణములతో అతని ఛత్రమును, విల్లును, కేతనమును విరగ గొట్టాడు. నీ అల్లుడు సైంధవుడు మరొక విల్లును చేత బట్టి భీముని ఛత్రమును, విల్లును, కేతనమును విరగ గొట్టాడు. భీమసేనుని రధము విరగ గొట్టాడు. రధము విరిగిన భీమసేనుడు సాత్యకి రధం మీదికి ఎక్కాడు. సైంధవుని మీద అనేకానేక అస్త్రములను ప్రయోగించాడు. సైంధవుడు వాటినన్నింటిని మధ్యలోనే తుంచాడు. పాండవ సైనికుల మీద అతి క్రూర నారాచములను ప్రయోగించాడు. సైంధవుని అస్త్ర ధాటికి త ట్టుకోలేక పాండవ సైన్యముపారిపోయారు. ~~ఈ~~ ప్రకారము సైంధవుడు పాండవులను పద్మవ్యూహములో ముందుకు పోకుండా నిలువరించాడు.

పాండవులకు సైంధవునకు పోరు ఘోరంగా సాగుతూ ఉంది. అక్కడ ద్రోణుని ప్రోత్సాహ వచనములతో వెను దిరిగిన కౌరవ సైన్యము

అభిమన్యుని రథమును చుట్టుముట్టి అతని మీద బాణ వర్షము కురిపించింది. అభిమన్యుడు అపరిమితమైన ఉత్సాహంతో వారినందరినీ సంహరించి సింహగర్జన చేసాడు. కౌరవ సైన్యములో భయోత్పాతము కలిగించాడు.

అంతలో వృష సేనుడు తన సైన్యముతో అభిమన్యుని ఎదుర్కొన్నాడు. అభిమన్యుని శరీరం మీద క్రూర నారాచములు ప్రయోగించాడు. అభిమన్యుడు కోపంతో వషసేనుడి కేతనము విరగ్గొట్టాడు. అశ్వములను గాయపరిచాడు. వషసేనుడి శరీరం మొత్తం మీద పదునైన బాణములను దింపాడు. ఆ బాణముల ధాటికి వ షసేనుడు మూర్ఛపోయాడు. అతని రథమును ఈడ్చుకుంటూ రథాశ్వములు ఎటోవెళ్లాయి.

ఇంతలో శౌర్యధనుడగు వసాపతి భూపతి ఆరు బాణములతో అభిమన్యుని కొట్టాడు. అతని వంక ఆశ్చర్యంతో చూచాడు అభిమన్యుడు. ఒకే ఒక బాణంతో వసాపతి భూపతిని చంపాడు. అతని చావు చూచిన కౌరవ ప్రముఖులు తమ తమసైన్యములతో అభిమన్యుని మీదికి లంఘించారు. వారందరూ అభిమన్యుని క్రోధాగ్నిలో కార్చిచ్చులో మాడిన

మిడుతలదండు వలె మాడిపోయారు. మిగిలిన కౌరవ సైనికులు అభిమన్యుని ధాటికి తట్టుకోలేక పారిపోయారు.

అది చూచిన కౌరవ యోధులు, నానాదేశాధీశులు అందరూ ఒక్కచోట గుమిగూడి ఒక్కుమ్మడిగా అభిమన్యునిమీదికి ఉరికారు. అభిమన్యుడు లేళ్ల గుంపును చూచిన పెద్దపులి వలె వారి మీదికి లంఘించాడు. వారందరినీ మట్టుబెట్టాడు. తెగి పడిన అంగములు, మాంస ఖండములు, ఏనుగులు, హయముల కళేబరములు, రణరంగమంతా చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. అభిమన్యుని ఎదుట నిలువ డానికి ఎవరికీ ధైర్యము చాలడం లేదు. దొరికిన వాడిని దొరికినట్టు యమపురికి పంపుతున్నాడు అభిమన్యుడు. కౌరవ సైన్యమంతయు భయంతో నలుదిక్కులకు పారిపోయింది.

ఆ సమయంలో శల్యుని కుమారుడు, రుక్మరథుడు అను వాడు, ముందుకు వచ్చి "వీడికి మనం ఓడటం ఏమిటి. నేను వచ్చాను. మీకేం భయం లేదు. వీడిని నేను పట్టి మీకు అప్పగిస్తాను. నా పరాక్రమము ఏపాటిదో మీకు తెలుస్తుంది" అని అభిమన్యుని మీదికి యుద్ధమునకు వెడలాడు. తొమ్మిది బాణములను అభిమన్యుని భుజములమీద, రొమ్ము

భాగమున నాటాడు.  అభిమన్యుడు ఒకే ఒక్క బాణముతో అతని తలను నేల మీద పడవేసాడు.

రుక్మరథుని మరణము చూచిన అతని స్నేహితులు, సాటి రాజులు ఒక్కుమ్మడిగా అభిమన్యుని మీదికి విజంభించారు. అతని మీద శర వర్షము కురిపించారు. వారి శర వర్షములో అభిమన్యుని రథము కనిపించడం లేదు. సుయోధనుడు అభిమన్యుడు మరణించాడని సంతోషించాడు.

అభిమన్యుడు అప్పుడు  తన శత్రువుల మీద గాంధర్వ మాయను ప్రయోగించాడు. ఆ గాంధర్వ మాయను పూర్వము అర్జునుని తపస్సుకు మెచ్చి తుంబురుడు అర్జునునికి ప్రసాదించాడు. అర్జునుడు దానిని అభిమన్యుడికి ప్రసాదించాడు. దానిని ఇప్పుడు అభిమన్యుడు తన శత్రువుల మీద ప్రయోగించాడు.  ఆ గాంధర్వ మాయా ప్రభావంతో తమ ముందు ఎన్నో రథముల మీద అనేక మంది రథికులు ఎక్కి  శస్త్రాస్త్రములు తమ మీద ప్రయోగిస్తున్నట్లు భ్రమ కలిగిస్తుంది. ఆ దృశ్యములకు శాత్రవసేన భయపడి పోయింది. కదలక మెదలక నిల్చుండిపోయారు. అభిమన్యుడు తన రథములు వారి  చుట్టు తిప్పుతూ వారిని

సంహరిస్తున్నాడు. కొంతసేపటికి వారిలో ఒక్కరు కూడా మిగల లేదు. వారి మృత దేహములు మాత్రము రణభూమిలో పడి ఉన్నాయి.

అభిమన్యుని యుద్ధ చాతుర్యము చూచి పాండవ సేనలు ఆశ్చర్యపోయాయి. ఇది పని కాదని సుయోధనుడు స్వయంగా అభిమన్యునితో యుద్ధం చేసాడు. కాని అభిమన్యుని ధాటికి తట్టుకొన లేక పక్కకు తొలగి ప్రాణములు దక్కించుకున్నాడు." .

ధృతరాష్ట్రుడు అభిమన్యుని పరాక్రమ చాతుర్యము విని "సంజయా! ఆ ఒక్క బాలుడు, ఇంతమందని వధించాడా! నమ్మలేక పోతున్నాను! అవునులే అభిమన్యుడు ధర్మాన్ని ఆశ్రయించాడు. ధర్మం ఎప్పుడూ అధర్మాన్ని జయిస్తుంది గదా! " అని అన్నాడు. సంజయుడు యుద్ధ విశేషములను చెప్ప నారంభించాడు.

అభిమన్యుని పరాక్రమ ధాటికి ఎందరో రాజులు మరణించారు. సుయోధనుడు మొదలగు వారు పారిపోయారు. నీ కుమారులకు చెమటలు పట్టాయి. దిక్కులు చూస్తున్నారు. పారిపోయిన సుయోధనుడు, అశ్వత్థామను, కృప, కర్ణ, కృతవర్మ, బృహద్బలుడు, శకుని మొదలగు

వారిని కూడగట్టుకొని అభిమన్యుని ఎదుర్కొన్నాడు. అభిమన్యుడు వారి మీద పెద్ద పిడుగు పడ్డట్టు పడ్డాడు. మేఘము వలె గర్జించాడు.

ఆ సమయములో సుయోధనుని కుమారుడు, నీ మనుమడు, లక్ష్మణ కుమారుడు అభిమన్యుని మీదికి ఉరికాడు. అభిమన్యుని మీద నిరంతర శర ప్రయోగము గావించాడు. తన కుమారుని విడిచి పోలేక, సుయోధనుడు కూడా లక్ష్మణ కుమారునికి తోడుగా అభిమన్యునితో యుద్ధం చేస్తున్నాడు. అభిమన్యుడు కూడా లక్ష్మణ కుమారుని మీద శర ప్రయోగం చేసాడు. ఇద్దరి మధ్య పోరు ఘోరమయింది. అభిమన్యుడు ఒకే ఒక్క బాణంతో లక్ష్మణ కుమారుని తల తెగనరికాడు.

తన కుమారుని మరణము కనులారా గాంచిన సుయోధనుడు మిక్కుటమైన కోపంతో ఊగిపోయాడు. వీడిని కొట్టండి చంపండి నరకండి అని ఆక్రోశించాడు. అప్పుడు కృతవర్మ, కృపాచార్యుడు, ద్రోణుడు, అశ్వత్థామ, కర్ణుడు, బృహద్బలుడు, అత్యంత ప్రభావముగల శరములను అభిమన్యుని మీద ప్రయోగించారు. అభిమన్యుడు వారు ప్రయోగించిన అస్త్రశస్త్రములను మధ్యలోనే తుంచి, తన సా రధితో రథమును సైంధవుని వైపు మళ్లింపమని ఆదేశించాడు.

ఇంతలో కళింగులు, నిషాదులు, తమ తమ గజ సైన్యములతో అభిమన్యుని అడ్డగించారు. అభిమన్యుడు వారి నందరిని తన వీరావేశంతో తునుమాడుతున్నాడు. అక్కడ సైంధవుడు పాండవ బలములను, పాండవ వీరులను లోపలకు రానీయకుండా అడ్డ పడుతున్నాడు.

(ఇప్పటికీ మన పనికి ఎవరైనా అడ్డు తగిలితే "ఏంటీ వీడు సైంధవుడిలాగా ప్రతిపనికి అడ్డుపడుతున్నాడు." అని అంటూ ఉంటాము. పాండవులను పద్మవ్యూహములోనికి పోనీయకుండా అడ్డుకోడంవలననే, తెలుగువారి నోట సైంధవుని పేరు శాశ్వతంగా నిల్చిపోయింది).

అప్పుడు అభిమన్యుడు ద్రోణుని మీద 50 బాణములు, కృతవర్మ మీద 80 బాణములను, అశ్వత్థామ మీద పది బాణములు, కర్ణుని మీద ఒక్క బాణము, వేసి వారిని నొప్పించాడు. కృపాచార్యుని రథము విరగ్గొట్టాడు. బృహద్బలుని శరీరము మీద 30 బాణములు ప్రయోగించాడు. వారికి సాయంగా ఉన్న సైనికులను అసంఖ్యాకములైన బాణములతో నిర్మూలించాడు. క్రోధలిప్తుడు, బృందారకుడు అను రాజుల శిరస్సులను ఖండించాడు. ఆ సమయమున కృపాచార్యుడు

వేరొక రధము ఎక్కాడు. అభిమన్యుని మీద శర పరంపర కురిపించసాగాడు.

ఇంతలో బృహద్బలుడు వీరందరినీ తోసుకొని ముందుకు వచ్చి అభిమన్యుని ఎదుర్కొన్నాడు. అభిమన్యుడు తన తీవ్ర మైన బాణములతో బృహద్బలుని సారధిని చంపాడు. అతని విల్లు విరిచాడు. కేతనము తుంచాడు. అతని అశ్వములను వధించాడు. బృహద్బలుడు తన కత్తి డాలు తీసుకొని రధము దిగి అభిమన్యుని తో యుద్ధం చేస్తున్నాడు. అభిమన్యుడు ఒకే ఒక భల్ల బాణముతో బృహద్బలుని శిరస్సు ఖండించాడు.

ఈ ప్రకారము అభిమన్యుడు కోసల దేశాధీశుని చంపడం చూచి, అతని బంధు మిత్రులు ఒక్కుమ్మడిగా అభిమన్యుని మీద పడ్డారు. వారి నందరినీ యమపురికి సాగనంపి, అభిమన్యుడు కర్ణుని మీదికి రధము మళ్లించాడు. అభిమన్యునికి కర్ణునికి పోరు ఘోరమయింది. ఒకరి శరీరములు ఒకరు రక్తసిక్తము చేసుకున్నారు. ఇంతలో కర్ణుని సైన్యాధి పతులు ఆరుగురు తమలో తాము ఆలోచించుకొని ఒక్కుమ్మడిగా అభిమన్యుని మీదికి లంఘించారు. అభిమన్యుడు వారిని చూచి నవ్వి వారి నందరినీ ఒక్కొక్క బాణ ఘాతముతో చంపాడు.

తరువాత ద్రోణుడు మొదలగు కౌరవ ప్రముఖుల మీదికి తన ద ష్టి మరలించాడు. అంతలో మగధరాజు కుమారుడైన అశ్మంతకుడు బాలుడైనను అపరిమితమైన ధైర్యసాహసములతో అభిమన్యుని ఎదుర్కొన్నాడు. వెంటనే అభిమన్యుడు ముందు అతని సూతుని, హయములను చంపాడు. మరొక బాణముతో అతని తలను తెగ నరికాడు. అభిమన్యుడు సింహనాదం చేసాడు.

ఇది చూచి సహించలేక పోయాడు దుశ్శాసనుని కుమారుడు. అభిమన్యుని రథమునకు కట్టిన హయములను, రథసారథిని తన బాణములతో కొట్టాడు. అది చూచి అభిమన్యుడు నవ్వుతూ "కుమారా! నీ తండ్రి దుశ్శాసనుడు నా ముందు నిలువ లేక పారిపోయాడు. ఇప్పుడు నువ్వు వచ్చావా. నా ప్రతాపం రుచి చూడు." అంటూ ఒకే ఒక నారసముతో అతని వక్షస్థలము మీద కొట్టాడు. ఇంతలో అశ్వత్థామ అభిమన్యుడు ప్రయోగించిన బాణమును మధ్యలోనే తుత్తునియలు చేసి దుశ్శాసన కుమారుని రక్షించాడు. అభిమన్యుడు కనీసం అశ్వత్థా మ వైపు కూడా చూడ కుండా దుశ్శాసన కుమారుని విల్లు తుంచాడు. అతని సారథిని చంపాడు. ఆరు బాణములను అతని గుండెలలో దించాడు. అభిమన్యుని ధాటికి తట్టుకోలేక దుశ్శాసనకుమారుడు పారిపోయాడు. ఇంతలో అపరాహ్ణమయింది.

ఆ సమయమున శత్రుంజయుడు, చంద్ర కేతుడు, సువర్చసుడు, సూర్యభానుడు, మేఘ వేగుడు మొదలగు వారు ఒక్కుమ్మడిగా అభిమన్యుని మీద పడ్డారు. అభిమన్యుడు తన అస్త్ర శస్త్రములతో వారి నందరినీ దూరంగా తరిమి కొట్టాడు. ఇంతలో శకుని అభిమన్యుని ఎదుర్కొన్నాడు. అభిమన్యుడు అతనిని తన తీవ్రమైన బాణ ఘాతములతో నొప్పించాడు. తన రథమును సుయోధనుని వైపు పోనిచ్చాడు. ఇది చూచాడు కర్ణుడు. పక్కనే ఉన్న ద్రోణుని చూచి "ఆచార్యా! కౌరవ సేనలో మహా మహులందరిని ఓడించి అభిమన్యుడు సుయోధనుని మీదికి పోతున్నాడు. ఈ సమయములో మీరు ఊరకుండుట భావ్యమా! ఏదో ఒకటి చెయ్యండి. అభిమన్యుని చంపడానికి మార్గం ఆలోచించండి." అని పలికి కర్ణుడు సుయోధనునికి సాయంగా వెళ్లాడు.

అప్పుడు ద్రోణుడు తన పక్కన ఉన్న కౌరవ యోధులను చూచి "అభిమన్యుడు చి న్నవాడైనను తన తండ్రి అర్జునునితో సమానంగా యుద్ధం చేస్తున్నాడు. ఎంతో మంది కౌరవ ప్రముఖులను చంపాడు. ఇంక ఉపేక్షించరాదు. మనమందరము ఒక్కుమ్మడిగా ఇతనిని

ఎదుర్కొనవలయును" అని పలికాడు. ఇంతలో అభిమన్యుడి చేతిలో చావు దెబ్బలు తిన్న కర్ణుడు అక్కడకు వచ్చాడు.

"ఆచార్యా! చూచారా! అభిమన్యుడు నన్ను ఎలాదెబ్బతీసాడో. నేను మీ దగ్గరే ఉంటాను. ఇంత కన్నా నాకు సురక్షిత ప్రదేశం లేదు. అర్జునుని పరాక్రమమును గురించి విన్నాను కాని అతని కొడుకు అతని కంటే పరాక్రమ వంతుడు అని అర్ధం అయింది." అని పలికాడు కర్ణుడు.

అప్పుడు ద్రోణుడు కర్ణుని చూచి ఇలా అన్నాడు. "కర్ణా! నేను అర్జునునికి కవచధారణ అనే విద్యను ఉపదేశించాను. దానిని అర్జునుడు తన కుమారునికి ఉపదేశించాడు. ఆ కవచ ధారణ విద్య వలన అతని శరీరము మీద ఎవ్వరూ శరములను నాటలేరు. ఏదో ఒక వంచనతో ఇతనిని మనము చంపవలెను. ముందు అతని విల్లు విరగ్గొట్టాలి. వేరొకరు వెంటనే అతని అశ్వములను చంపాలి. వెంటనే మరొకరు రధ సారధిని చంపాలి. అదే సమయంలో అతని రధమును విరగ్గొట్టాలి. ఇవన్ని ఒకే సమయంలో జరగాలి. అంతేగాని అభిమన్యుని చేతిలో విల్లు ఉన్నంత వరకూ ఎవ్వరు కూడా అతనిని జయించలేరు. నీకు చేతనైతే ఈ కపటోపాయముతో అతనిని చంపు." అని అన్నాడు ద్రోణుడు.

అది విన్న కర్ణుడు కొంచె ఆలోచించాడు. తన దగ్గరలో ఉన్న కౌరవ యోధులను కూడ గట్టుకున్నాడు, అందరూ ఒక్కుమ్మడిగా అభిమన్యుని మీదకు లంఘించారు. ముందు కొంతమంది అభిమన్యుని విల్లు విరగ్గొట్టారు. వెంటనే ద్రోణుడు అభిమన్యుని రధాశ్వములను చంపాడు. ఒక పక్కనుండి కృపాచార్యుడు అభిమన్యుని రధ సారధిని చంపాడు. అప్పుడు అభిమన్యుడు నిరాయుధుడు, విరధుడు అయ్యాడు. అదే సమయమని శకుని, కృతవర్మ, శలుడు, బాహ్లికుడు, అశ్వత్థామ మొదలగు వారు నలుపక్కలనుండి ఆ నిరాయుధుడైన అభిమన్యుని మీద బాణ వర్షము కురిపించారు. అప్పుడు అభిమన్యుడు తన ఖడ్గము, డాలు తీసుకొని రధమునుండి కిందికి దుమికాడు. గాలిలోనే గిరగిరా తిరుగుతూ కౌరవ యోధులను నరుకుతున్నాడు. అభిమన్యుడు ఎప్పుడు తమ మీదికి వాలి తమ తల ఖండిస్తాడేమో అని భయంతో కౌరవ ప్రముఖులు పారిపోయారు. ద్రోణుడు ఒక బల్లెము తీసుకొని దానితో అభిమన్యుని కత్తిని విరిచాడు. ఇంతలో కర్ణుడు అభిమన్యుని డాలును ఖండించాడు.

అప్పుడు అభిమన్యుడు తన రధములోని చక్రాయుధమును తీసుకున్నాడు. దానిని గిరా గిరా తిప్పుతూ శత్రుసేనలను చంపుతున్నాడు. సింహనాదం చేస్తున్నాడు. రక్తసిక్తమైన అతని మొహము చూచి

శత్రుసేనలు భయ భ్రాంతులయ్యాయి. అభిమన్యుడు తన చక్రాయుధంతో శత్రువులు వేస్తున్న బాణములను ఖండిస్తూ, శత్రుసేనలను నాశనం చేస్తున్నాడు. ద్రోణుని వైపుగా దూసుకుపోతున్నాడు. తనకు అడ్డువచ్చిన కౌరవ సైన్యమును చించి చెండాడు తున్నాడు.

ఆ సమయమున శకుని, కృతవర్మ, కృపాచార్యుడు, శల్యుడు, మొదలగు యోధులు చాలా మంది కలిసారు. అన్ని పక్కల నుండి అభిమన్యుని చుట్టుముట్టి అతని చక్రాయుధమును ముక్కలుచేసారు. అప్పుడు అభిమన్యుడు తన గదను చేతిలోకి తీసుకున్నాడు, దానితో అశ్వత్థామ మీదికి లంఘించాడు. అభిమన్యుని దెబ్బకు భయపడి అశ్వత్థామ తన రథం నుండి కిందికి దుమికి రథం వెనక్కు పోయి దాక్కున్నాడు. అప్పుడు అభిమన్యుడు అశ్వత్థామ రథమునకు కట్టిన అశ్వములను, రథ సారథిని చంపాడు.

వెంటనే పక్కనే ఉన్న శకుని మీదికి లంఘించాడు. శకునికి రక్షణగా 27 మంది గాంధార యోధులు శకుని రథం ముందు నిలబడ్డారు. వారి నందరినీ తన గదతో మోది చంపాడు అభిమన్యుడు. అంతలో 10 మంది యోధులు ఏనుగుల మీద ఎక్కి అభిమన్యుని

ఎదుర్కొన్నారు. వారినందరినీ అభిమన్యుడు ఏనుగులతో సహా గదతో మోది యమపురికి పంపాడు. కేకయ రాజులను ఏడుగురిని ఒకేసారి చంపాడు.

ఇంతలో దుశ్శాసనుని కుమారుడు అభిమన్యుని ఎదుర్కొన్నాడు. అభిమన్యుని మీద నానావిధములైన బాణములను గుప్పించాడు. అభిమన్యుడు అతను వేసిన బాణముల నన్నింటిని తన గదా దండముతో అడ్డుకున్నాడు. అతని అశ్వములను, సారధిని చంపాడు. రధమును గదతో విరగ్గొట్టాడు. దుశ్శాసనుని కుమారుడు తన రధము దిగి గదాయుధము తీసుకొని అభిమన్యునిమీదికి లంఘించాడు.

వారిద్దరికి ఘోరసంగ్రామము జరిగింది. ఇరుపక్షముల వీరులు యుద్ధము మాని వారి గదాయుద్ధము చూస్తున్నారు. ఇరువురి శరీరములనుండి రక్తం ధారలుగా స్రవిస్తూ ఉంది. అభిమన్యుడు, దుశ్శాసన కుమారుడు తమ తమ గదలతో ఒకరిని ఒకరు మోదుకొని కింద పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వారి శరీరముల నుండి వారి ప్రాణములు వేరయి స్వర్గలోకం చేరుకున్నాయి. ఇంకా కసి దీరక దారి తప్పిన ఏనుగును కిరాతకులైన వేటగాళ్లు చుట్టుముట్టి చంపినట్టు, కౌరవ యోధులు అభిమన్యుని చుట్టుముట్టి అతనిని నిర్ధయగా పొడిచి పొడిచి చంపారు.

అప్పటికి సూర్యుడు అస్తమించాడు. పాండవుల కీర్తిని ఇనుమడింపచేస్తూ కౌరవ యోధులతో అత్యంత పరాక్రమంతో పోరాడి అభిమన్యుడు వీరస్వర్గ మలంకరించాడు. ధృతరాష్ట్ర మహారాజా! ఆ ప్రకారము యోధాను యోధుడైన అభిమన్యకుమారుడు రణరంగమున మృతి చెందగానే కౌరవ సేనలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. కేరింతలు కొడుతున్నారు. ఈ సమయమున ఆక్కడ చేరిన భూతగణములు "అభిమన్యుని అమానుషంగా అధర్మ యుద్ధంలో పలువురు కలిసి వధించారు" అని ఆక్రోశించాయి.

అభిమన్యుడు మరణించగానే పాండవ సేనలు పారిపోయాయి. ఇది అంతా దూరంనుండి చూచిన ధర్మరాజు ఇలా అన్నాడు.

"మన అభిమన్య కుమారుడు దుర్భేధ్యమైన పద్మవ్యూహములో ప్రవేశించి, ఏనుగులను, హయములను చంపి, రధములను విరగ్గొట్టి, పదాతి దళములను తునుమాడి, అనేక మంది సైనిక ప్రముఖులను చంపి, ద్రోణుడు మొదలగు అతిరధ మహారధులను భయభ్రాంతులను చేసి, వీరస్వర్గమలంకరించాడు. అటువంటి మహా యోధుని మరణమునకు మనకు చింతింప పనిలేదు." అని పలికాడు.

అప్పటికి చీ కట్లు కమ్ముకున్నాయి. అందరూ ఆ రోజుకు యుద్ధము మాని వారి వారి శిబిరములకు వెళ్లారు. నీ కుమారులు మహా సంతోషముతో వికసించిన ముఖాలతో తమ తమ శిబిరములకు చేరుకున్నారు. పాండవులు శోక విషణ్ణ హృ దయాలతో తమ శిబిరములకు చేరుకున్నారు.

ధర్మరాజు తన శిబిరములో కూర్చుని ఇలా చింతిస్తున్నాడు. "ద్రోణా చార్యులు, మున్నగు వారిచే సంరక్షింపబడుచున్న, దుర్భేధ్యమయిన పద్మ వ్యూహమును ఛేథించుటకు నేను అభిమన్యుని ఏల పంపవలే. నన్ను సంతోష పెట్టుట కొరకు పసిబాలుడైన అభిమన్యుడు పద్మవ్యూహమున ఏల జొరబడవలె. దుశ్శాసనుడు లాంటి మహాయోధులను ఓడించాడు. ఎంతోమంది కౌరవ ప్రముఖులను చంపాడు. ఇది ఒరులకు సాధ్యమా! అర్జునుడు వ చ్చి నా కొడుకు ఏడీ? అని అడిగిన నేను ఏమి సమాధానము చెప్పను. కృష్ణుడు వచ్చి నా గారాల మేనల్లుడు ఏడీ? అని అడిగిన ఏమని చెప్పను.

అయ్యో! అభిమన్యుడు బాలుడే. సుకుమారుడు. యుద్ధరీతులు తెలియని వాడు. అటువంటి కుమారుని మహా వీరులకే చొరబడుటకు

శక్యముగాని పద్మవ్యూహము బేధించుటకు పంపినాను కదా! చిన్నవారికి పెద్దవారు బహు మానముల తోనూ తినుటకు ఇచ్చుట ద్వారా గారవింపవలెను గాని నేను యుద్ధమునకు పంపినాను. ఎంతటి పాషండుడను. నేను కూడా అభిమన్యుని తో పాటు ఎందుకు మరణించలేదు. పుత్ర శోకంతో అలమటించు అర్జునుని మొహం ఎలా చూడను. ఇంద్రుని అంత వానికి ఆపద వ చ్చినపుడు, అతనికి అండగా నిలి చి కాలకేయులను చంపిన మహా వీరుడు అర్జునుని కుమారుడు అభిమన్యుడు ఈ ప్రకారము పగవారలచే హతుడు కావలసిన దుర్ధశ దాపురించినది కదా! తన కొడుకును చంపినారన్న కోపంతో ద్రోణుడు మొదలగు కౌరవ వీరులను అర్జునుడు చంపగలడు. కాని అతని పుత్రశోకము ఆర్పలేము కదా! ఈ భూమిలో ఉన్న ధనమునంతకు, స్వర్గలోక సుఖములకు, చిరునవ్వులు చిందించు అభిమన్యు కుమారుని ముఖారవిందము సాటి వచ్చునా!" అని పరి పరి విధముల విలపిస్తున్నాడు ధర్మరాజు.

అప్పుడు అతని వద్దకు కృష్ణ ద్వైపాయనుడు (వ్యాసుడు) వచ్చాడు. ధర్మరాజు ఆ మహామునికి అర్ఘ్య పాద్యాదులు ఇ చ్చి సత్కరిం చి ఇలా అన్నాడు. "మహానుభావా! శత్రుసేనలను జయించడానికి నేను అభిమన్యుని పంపాను. అభిమన్యుడు పద్మవ్యూహము లో కి చొరబడ్డాడు.

వెనుకనే మేము కూడా అభిమన్యుని వెంట వెళ్లాము. కాని వరప్రభావమున సైంధవుడు మమ్ములను అడ్డగించాడు. అప్పుడు కౌరవ యోధులు పెక్కుమంది కలిసి అభిమన్యుని చుట్టుముట్టి రకరకములైన ఆయుధములతో ఆ కుమారుని సంహరించారు. బాలుని ఒంటరిగా యుద్ధమునకు పంపిన నాలాంటి పాపాత్ముడు ఎక్కడైనా ఉంటాడా! విపరీతమైన దుఃఖముతో నా మనసు ఉడికిపోవుచున్నది. నా పాపానికి నిష్కృతి లేదు." అని విలపించాడు.

అప్పుడు వ్యాసుడు "ధర్మజా! శోకింపకుము. ఎంతోమంది యోధాను యోధులను చంపిన అభిమన్యుడు బాలుడా! శత్రువులు అతని మీద క్రూరమైన బాణములు సంధించక పూల బాణములు వేస్తారా! తెలివిగలవారు విపత్తులు వచ్చినప్పుడు నీ మాదిరి శోకింపరు. పైగా మరణము అత్యంత సహజము. గరుడ, ఉరగ, దానవులకే మరణముతప్పలేదు. మానవ మాత్రులము మన మెంత. విధిని తప్పించుకొనుటకు ఎవ్వరి తరము కాదు. కాబట్టి ధైర్యము తెచ్చుకొనుము. కాగల కార్యము గురించి ఆలోచింపుము." అని పలికాడు.

"మునీంద్రా! ఈ భూమిని ఎంతమందో ధైర్యశాలురు, పరాక్రమ వంతులు అయిన మహారాజులు, మహాత్ములు ఏలారు కదా! ఒక్కరు

కూడా మత్యుముఖము నుండి తప్పించుకొన లేదే! ఏమి కారణము!"
అని అడిగాడు.

దానికి వ్యాసుడు ఇలా అన్నాడు. "ధర్మజా! పూర్వ కాలమున అకంపనుడు అను రాజు పుత్ర మరణంతో పరితపించి పోతూ, నారద ముని వలన మృత్యువు గురించి వివరంగా విన్నాడు. ఆ కథ వింటే నీ మనస్సుకు శోకము పోయి శాంతి చేకూరుతుంది. ఆ కథ చెప్పెదను వినుము.

పూర్వము అకంపనుడు అనే రాజు ఉండేవాడు. అతని మీదికి శత్రు రాజులు దండెత్తి వచ్చారు. యుద్ధము చేసారు. అకంపనుడిని పట్టుకొని కారాగారంలో నిర్బంధించారు. అది చూచి అతని కుమారుడు హరి అను వాడు, శత్రువులను ఎదుర్కొన్నాడు. వారిని జయించి తన తండ్రి అకంపనుడిని చెరనుండి విడిపించాడు. మరల శత్రువులతో ఘోరంగా పోరు సాగించాడు. అప్పుడు శత్రువులు అతనిని ఒక్కుమ్మడిగా చుట్టుముట్టి చంపారు. తరువాత అకంపనుడు విజృంభించి శత్రువులను తన అవక్ర పరాక్రమంతో జయించి విజయలక్ష్మిని వరించి రాజధానిలో అడుగుపెట్టాడు. కాని కుమారుని తలుచుకుంటూ దుఃఖిస్తున్నాడు.

అప్పుడు నారదుడు అకంపనుడి వద్దకు వచ్చాడు. అకంపనుడు నారదమహర్షిని అర్ఘ్య పాద్యాదులు ఇచ్చి సత్కరించాడు. అకంపనుడు జరిగినది అంతా నారదునికి వివరించాడు. తన కొడుకు ఎంతటి పరాక్రమ వంతుడో అతని మరణించడం వలన తనకు విజయము కలిగినను, సంతోషముగా లేదని పలికాడు.

" నారద మునీంద్రా! మృత్యువును ఈ లోకములో ఎవరూ ఎదిరించలేరని విన్నాను. అది ఎలాగ? మృత్యువు పుట్టుక, దాని ప్రభావము వినవలెనని కుతూహలముగా ఉన్నది. నాకు వినిపించండి. " అని అడిగాడు. అప్పుడు నారదుడు అకంపనుడికి మత్యుప్రభావము ఇలా ఎరింగించాడు.

"అకంపనా! బంధువుల మరణము వలన కలుగు దుఃఖమును పోగొట్టు మృత్యుప్రకార కథను వినిపించెదను వినుము. మొట్టమొదట ప్రజాపతి ప్రజలను సృష్టించాడు. కాని చావును సృష్టించ లేదు. వారికి చావు లేని కారణంగా, భూమికి భారం ఎక్కువ అయింది. ప్రజలు చనిపోవడానికి తగిన ఉపకరణం (సాధనము) కనిపించలేదు. అందువల్ల ప్రజాపతి చి ంతాక్రాంతుడై ఉన్నాడు. అప్పుడు అతని ఇంద్రియములనుండి మంటలు చెలరేగాయి. ఆ మంటలు ఈ భూమి

మీద ఉన్న చరాచర భూతకోటిని దహించ సాగాయి. జరిగిన సృష్టి అంతా ఆ ప్రకారము దహించుకు పోవడం చూ చి సహించలేక పోయాడు మహా శివుడు. లోక కల్యా ణార్థము బ్రహ్మదేవుని వద్దకు వచ్చాడు.

ప్రజ్వరిల్లుతున్న బ్రహ్మ దేవుడు శివుని చూచి "మహా శివా! నీవు నా వద్దకు వచ్చిన కారణం బేమి! అడుగుము. తప్పక నెరవేర్చెదను." అని ఆదరంగా అన్నాడు.

అప్పుడు మహా శివుడు ఇలా అన్నాడు. "బ్రహ్మదేవా! ఈ అఖిల సృష్టి క్రియకు నీవే కర్తవు. ఈ భూతకోటి అంతా నీచేత సృష్టింప బడినది. నీవు చేసిన సృష్టిని కోపంతో ఇప్పుడు ఎందుకు నాశనం చేస్తున్నావు. నా మీద దయయుంచి సమస్త లోకములను కరుణతో ఆదరింపుము." అని కోరాడు.

"పరమశివా! నా యందు కోపము కాని, కామము గాని లేవు. ప్రజలను సృష్టించాను. కాని మరణమును సృష్టించలేదు. అందువలన వారికి మరణము లేదు. పుడమి భారము ఎక్కువైనది. భూభారము పోగొట్టమని భూదేవి నన్ను ప్రార్థించినది. భూదేవికి హితము చేయుటకు ఈ సంహారక్రియ చేయుచున్నాను. ఇంత కన్నా భూభారము

తగ్గించుటకు నాకు వేరు ఉపాయము తోచలేదు. ఆ కారణం చేత నాలో కోపం ప్రవేశించింది. నా కోపానల జ్వాలలలో ఈ భూతకోటి భస్మీ పటలమగుచున్నది." అని పలికాడు.

అప్పుడు పరమశివుడు "అనఘా! నీ ఆజ్ఞ మేరకు నీవు సృష్టించిన ఈ భూతకోటిని నేను పరిపాలిస్తున్నాను. ఇప్పుడు నీవు ఈ విధంగా లోకాలను దహించి వేస్తున్నావు. ఇది ధర్మమా! ఈ కోపావేశము నీకు తగునా! అయినను భూభారము పోగొట్టుటకు చరాచర జీవ రాసులను ఒక్క పెట్టున భస్మీపటలము చేయవలెనా? ఒక పద్ధతి ప్రకారము సంహారము జరుగు నటుల వేరొక ఉపాయము కనుగొనవలదా! నాయందు దయయుంచి ఈ సంహారక క్రియను ఉపసంహరింపుము. నాకు ఈ వరము ప్రసాదింపుము." అని పరమ శివుడు బ్రహ్మదేవుని వేడుకున్నాడు.

అప్పుడు శంకరుని కోరిక మేరకు బ్రహ్మదేవుడు తన కోపాగ్నిని ఉపసంహ రించాడు. సకల భువనములు ఎంతో ఆనందించాయి. శంకరుని బ్రహ్మదేవుని వేనోళ్ల స్తుతించాయి. బ్రహ్మ దేవుడు తన కోపానలమును ఉపసంహరించు సమయమున అతని ఇంద్రియముల నుండి రక్త వర్ణముతో, ఎర్రటి కన్నులతో, ఎర్రటి చీ ర కట్టుకొని ఒక స్త్రీ

ఆవిర్భవించినది. ఆమె శివుని వంక, బ్రహ్మదేవుని వంక చూచి, దక్షిణ దిశగా పోతూ ఉంది.

అప్పుడు బ్రహ్మదేవుడు "ఓ మృత్యుదేవతా! ఎక్కడికిపోతున్నావు. ఇక్కడికి రా!" అని పిలిచాడు. మృత్యుదేవత వచ్చి బ్రహ్మదేవుని ముందు నిల్చున్నది.

అప్పుడు బ్రహ్మదేవుడు "ఓ మృత్యుదేవతా! నాలో సంహారము చేయవలెను అన్న కోరిక పుట్టగానే నీవు పుట్టావు. కాబట్టి నీవు ఒక పద్ధతి ప్రకారము, పక్షపాత బుద్ధిలేకుండా ఈ చరాచర జీవకోటిని సంహరింపుము. నీవు నా ఆజ్ఞ ప్రకారం ఈ కార్యము నిర్వహిస్తున్నావు కాబట్టి నీకు ఎలాంటి పాపము అంటదు." అని ఆజ్ఞాపించాడు. అప్పుడు మత్యుదేవత దుఃఖించ సాగింది. మత్యుదేవత కళ్లనుండి కారుచున్న కన్నీరును తన దోసిట పట్టుకున్నాడు బ్రహ్మదేవుడు. తరువాత ఆమెను ఎన్నో రీతుల అనునయించాడు. అప్పుడు మత్యు దేవత శోకంతో ఇలా అన్నది.

"ఓ మహానుభావా! నీవు నన్ను సృష్టించావు. కాని ఈ పాపకార్యమునకు నన్ను నియోగిస్తావా! ఈ పాప కార్యము నేను ఎలా చేయను! బంధువులు, మిత్రుల మరణము వలన శోకంతో విలపించు

జనుల ఏడుపులు నేను వినలేను. ఈ అధర్మమునకు నేను ఒడి గట్టలేను. నా మీద దయయుంచి నేను తపస్సు చేసుకొనుటకు అనుమతి ఇమ్ము . నాకు ఈ వరము ప్రసాదింపుము. నీ అనుమతితో నేను ధేనుకాశ్రమమునకు పోయెదను." అనిపలికింది.

ఆ మాటలు విన్న పరమేష్టి "ఓ మృత్యుదేవతా! నేను నిన్ను ప్రజా సంహారమునకు మాత్రమే సంకల్పించి సష్టించాను. కావున నీ మనస్సులో ఏ విచారము పెట్టుకోవద్దు. నా ఆజ్ఞ ప్రకారము సంహారక క్రియ నెరవేర్పుము." అని ఆజ్ఞాపించాడు. ఆయనకు భయపడి ప్రస్తుతానికి అంగీకరించినట్టు అక్కడే నిలబడి పోయింది. మృత్యుదేవత తన ఆజ్ఞ పాటించినదని తెలిసి బ్రహ్మదేవుడు సంతోషించాడు. తాను సృష్టిం చిన లోకాలవైపు చూచాడు. అవికూడా ఈ ఏర్పాటుకు సంతోషిం చాయి. తాను వచ్చిన కార్యము పూర్తి అయినందున పరమ శివుడు కూడా కైలాసమునకు వెళ్లాడు.

అప్పుడు మృత్యుదేవత బ్రహ్మ దేవునికి నమస్కారము చేసి ధేనుకాశ్రమ మునకు వెళ్లింది. అచ్చట నంద, కౌశికి అను నదుల దగ్గర అత్యంత నియమ నిష్టలతో ఎన్నో వ్రతములు చేసింది. హిమాలయ పర్వతములమీద బ్రహ్మదేవుని గురించి ఘోర తపస్సు చేసింది. మ

త్యుదేవత తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు ఆమె ముందు సాక్షాత్కరించాడు.

"ఓ మృత్యు దేవతా! నీవు ఎందుకు ఇన్ని నియమనిష్ఠలు ఆచరించెదవు." అని అడిగాడు.

దానికి మృత్యుదేవత "ఓ బ్రహ్మదేవా! నేను ప్రజల మెడలు నులిమి చంపలేను. నన్ను ఈ పనికి పంపవద్దు. అధర్మభయముతో నిన్ను ఆశ్రయించాను. ఆర్తితో నిన్ను శరణు వేడుతున్నాను." అని పలికింది.

అప్పుడు బ్రహ్మదేవుడు మృత్యుదేవతతో ఇలా అన్నాడు. "ఇందులో నీకు అధర్మం ఏముంది. నీవు నేను చెప్పినట్టు చేస్తున్నావు. నా ఆజ్ఞను పాటిస్తున్నావు. ఇది నీకు పరమధర్మము. దీని వల్లనీకు కీర్తి ప్రతిష్ఠలు కలిగేటట్టు నేను పరమేశ్వరుడు వరములు ప్రసాదిస్తాము. అయినను నేను అనుసంధించిన పనికి నీకు భయం ఎందుకు. నాలుగు విధములైన భూతకోటులను సంహరింపుము." అని పలికాడు బ్రహ్మదేవుడు.

ఆ మాటలకు మత్యుదేవత ఇలా పలికింది. "దేవా! నేను నీ ఆజ్ఞ శిరసావహిస్తాను. నీవు చెప్పినట్టు చేస్తాను. కాని నా విన్నపము కూడా

వినుము. మానవులలో జంతువులలో, లోభము, క్రోధము, ఈర్ష్య, అసూయ కలిగేట్టు చెయ్యి. అప్పుడు నేను నా విధిని సక్రమంగా నెరవేరుస్తాను.” అని చెప్పింది.

“అలాగే చేస్తాను. అంతేకాదు. నీవు ఏడ్చినపుడు నేను నీ అశ్రు బిందువులు (కన్నీళ్లు) దోసిటితో పట్టాను కదా. నీ కన్నీరు ఒక్కొక్క బిందువు ఒక్కొక్క వ్యాధిగా ప్రజ్వరిల్లి భూతకోటిని పీడిస్తుంటుంది. కాబట్టి వారు ఆ వ్యాధులతోనే చస్తారు. నీకు ఏపాపమూ అంటదు. అది అధర్మము కాదు. నీవు కేవలము ప్రాణుల ప్రాణములు మాత్రం తీస్తావు కాబట్టి అది నీకు పరమ ధర్మము అవుతుంది. ఎల్లప్పుడు నేను నీ శుభము కోరుతుంటాను. నీవు ధర్మస్వరూపిణివి. ఈ లోకమునకు ఈశ్వరివి. సమస్తజీవుల ప్రాణములు నీ అధీనములో ఉంటాయి. కాబట్టి సమస్తజీవుల పట్ల కామము, రోషము వదిలి వారి ప్రాణములు తీయుము. ఆ ప్రకారంగా నీవు నీ ధర్మము నిర్వర్తింపుము. నీకు భయము ఏమియు లేదు. దుర్మార్గులను వారు చేయు దుర్మార్గపు పనులే వారిని చంపుతాయి. నీకేమియు భయము లేదు.” అని చెప్పాడు బ్రహ్మదేవుడు.

తనకు అధర్మము పాపము అంటదని బ్రహ్మదేవుడు వరం ఇచ్చాడు. పైగా ఆయన మాటను అతిక్రమిస్తే శాపము పెడతాడని భయం. అందుచేత  మృత్యు దేవత  సమస్త జీవకోటి సంహారక క్రియకు అంగీకరించింది.  బ్రహ్మదేవుని ఆజ్ఞాను సారము, నానారకములైన వ్యాధులు సమస్త జీవ కోటి శరీరములను కృశింప చేస్తుంటే, మృత్యుదేవత వారి ప్రాణములను మాత్రం  తీస్తూ ఉంది.  ఆ ప్రాణములు కూడా ఒక దేహమును వదలి మరొక దేహమును ఆశ్రయించి బతుకుతున్నాయి. మనుషుల ఆత్మలు కూడా ఒక దేహమును వదిలి మరొక దేహమును ఆశ్ర యిస్తున్నాయి.

వాయుదేవుడు సర్వవ్యాపి. అమిత శక్తిమంతుడు. అపరిమితమ్మైన తేజస్సు కలవాడు. ఈ చరాచర జగత్తునకు ప్రాణదాత.  ఈ శరీరము వృద్ధి చెందడానికి. కృశించడానికి అతనే కారకుడు. ప్రాణవాయువు ఈ శరీరంలో ప్రవేశించడం, మరల బయటకు వెడలి పోవడంలో వింత ఏమియు లేదు. దేవతలు మానవులుగా అవతరిస్తారు. మరల మానవులు దైవత్వాన్ని పొందుతారు.  కాబట్టి నీ కుమారుడు కూడా స్వర్గసుఖాలు అనుభవిస్తున్నాడు. దానికి చింత ఎందులకు.

ఈ జగత్తు అంతా అత్యంత దుఃఖభూయిష్టము. నీ కుమారుడు దుఃఖభూయిష్టమైన ఈ లోకమును వదిలి శోకము అనే మాట కూడా వినపడని పుణ్యలోకములకు పోయాడు. దానికి చింతింప పనిలేదు. ఇది బ్రహ్మ కల్పితము. ధీరులైన వారు పోయిన వారి కోసము చింతింపరు." అని నారదుడు మృత్యుదేవతా ప్రభావమును వివరించాడు.

అప్పుడు అకంపనుడు నారదునితో ఇలా అన్నాడు. "నీవు చెప్పినదంతయు విని నాకు శోకము తొలగిపోయినది. నా మనసుకు స్వస్థత కలిగినది." అని నారదునికి నమస్కరించాడు. తరువాత నారదుడు అక్కడ నుండి అశోక వనమునకు వెళ్లాడు" అని వ్యాసుడు ధర్మరాజుకు అకంపనుడి వత్తాంతము వివరించాడు.

"ధర్మరాజా! ఈ కథ రాసిన వారికి, చదివినవారికి, విన్న వారికి ఆయురారోగ్య ఐశ్వర్యములు కలుగును. అభిమన్యుడు రణరంగమున వివిధములైన ఆయుధములతో శత్రువులతో పోరాడి వీరస్వర్గ మలంకరించాడు. ప్రపంచ ప్రఖ్యాతి గడించాడు. అతని మరణమునకు నీవు యింతింప పనిలేదు." అని పలికాడు వ్యాసుడు.

ధర్మరాజు తన మనస్సులో ఉత్తమ క్షత్రియ ధర్మము ఇట్టిదే కదా అని అనుకొని, అభిమన్యుని వంటి వీరాధి వీరులు వీరస్వర ్గమలంకరిస్తారు అన్న నిజాన్ని తలంచుకొని మనసులో ఊరట చెందాడు.

వ్యాసుని చూ చి "మునీంద్రా! ఇంతకు ముందు ఉన్న మహా రాజులు ఏ యే యజ్ఞయాగములు ఏవిధంగా చేసారు. వాటికి వచ్చి న ఫలము లేమిటి వివరంగా తెలియ చేయండి. " అని అడిగాడు. ధర్మరాజు మనసులో మాట గ్రహించిన వ్యాసుడు ఈ విధంగా చెప్పసాగాడు..

"ధర్మరాజా! నీ కుమారుడు అభిమన్యుడు కూడా పూర్వపు మహారాజుల వంటి వాడే. కాబట్టి అభిమన్యునికి కూడా ఎలాంటి పుణ్యలోకములు లభిస్తాయో అని ఆలోచిస్తున్నావు కదా. " అని అన్నాడు.

" మహాత్మా! మీ దివ్యచిత్తమునకు తెలియనిది ఏమున్నది. దానిని గురించి వినగోరుతున్నాను." అని అన్నాడు ధర్మరాజు.

అప్పుడు వ్యాసుడు ఈ విధంగా చెప్పసాగాడు. "ఎన్నో యజ్ఞయాగములు చేసినవారు, తపస్సు చేసినవారు, దాన ధర్మములు చేసిన వారు, ఉదాత్తమైన సద్గుణములు కలవారు, తాము మరణించిన

తరువాత పుణ్యలోకములు పొంది సుఖములు అనుభవిస్తున్నారు. కాని నిస్వార్ధంగా యుద్ధము చేసి వీర మరణము పొందిన అభిమన్యుని లాంటి వీరులు అంతకంటే ఉన్నతమైన పుణ్యలోకములలో సుఖించగలరు. అదీ కాకుండా, మహితాత్ములైన మహా రాజులు చేసిన యజ్ఞ యాగాదుల గురించి వారొనరించిన కర్మాను ష్టానము గురించి తెలుసు కోవాలను కుంటున్నావు కదా. నీ మనస్సు ఉపశమించునట్లు చెప్పెదను వినుము.

పూర్వము ఈ భూమిని సంజయుడు అనే రాజు పరిపాలిస్తుండే వాడు. అతనికి సంతానము లేదు. సంతానము కొరకు అతను బ్రాహ్మణులకు ఎల్లప్పుడూ పూజలు చేస్తూ ఉండేవాడు. అతనికి నారదుడు ప్రియమిత్రుడు. అందువల్ల నారదుడు సంజయుని వద్దకు పలుమార్లు వస్తూ ఉండేవాడు. ఒక రోజు ఆక్కడ ఉన్న బ్రాహ్మణులు అందరూ కలిసి సృంజయుని కోరిక తీర్చమని నారదుని ప్రార్ధించారు. అప్పుడు నారదుడు సృంజయుని వద్దకు పోయి "మిత్రమా! నీ మనసులో ఉన్న కోరి క ఏమిటి? నాకు ఇంతకాలము ఎందుకు చెప్పలేదు?" అని అడిగాడు.

అప్పుడు సృంజయుడు నారదునితో తనకు గుణవంతుడు రూపవంతుడు ఐన కుమారుడు కావాలని, ఆ కుమారుని మూత్రము,

పురీషము, కన్నీరు, చెమట అన్ని కూడా బంగారం మయం గా ఉండాలని, అలాంటి కుమారుని ప్రసాదించ మని అడిగాడు. నారదుడు నవ్వి సృ ంజయునికి అలాంటి వరం ప్రసాదించాడు. నారదుని వర ప్రభావము వలన సృంజయునికి ఒక కుమారుడు కలిగాడు. అతనికి సువర్ణష్ఠీవి అనే పేరు బెట్టి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాడు సృం జయుడు. ఆ కుమారుని వలన అతని ఇంటిలో బంగారము దినదినాభివద్ధి కలుగుతూ ఉంది. అతని ఇంటిలోని ప్రతి వస్తువూ బంగారు మయం అయింది. పడుకొనే మంచము, కూర్చునే ఆసనము, ఇండ్లు, ప్రాకారాలు మొదలగు సమస్త వస్తువులు బంగారు మయం అయాయి.

ఇది చూచిన కొంత మంది దొంగలు ఒక రోజు సృంజయుని కుమారుని అపహరించుకొని పోయారు. ఒక అరణ్యములోని కి పారి పోయారు. అక్కడ ఆ కుమారుని చంపి పొట్టను చీ ల్చి చూచారు. కాని వారికి ఎక్కడా బంగారం కనపడలేదు. ఆ శవమును అక్కడ పడవేసి వెళ్లిపోయారు. కారి వారు చేసిన హత్య వారిని వెంటాడింది. వారిలో వారికి తగాదాలు వచ్చాయి. వారిలో వారు కొట్టుకొని మరణించారు. సృ ంజయుడు కూడా తనకుమారుని కానక అతని కోసం వెదికి వెదికి అడవిలో అతని మృత దేహమును చూచి, అతనికి అంత్యక్రియలు చేసాడు. అప్పటినుండి తీరని శోకంతో పరితపిస్తున్నాడు.

అప్పుడు నారదుడు అతని వద్దకు వచ్చాడు. "సృంజయా! పోయిన వారి గురించి ఏడిస్తే వారు తిరిగి వస్తారా! ఈ ప్రకారం ఏడుస్తుంటే నీ ప్రాణాలు కూడా నిన్ను విడిచి పెట్టి పోతాయి. కాబట్టి శోకించడం మాను. నీకు నాకు ఉన్న స్నేహము వలన నీకు కొన్ని మంచి మాటలు చెబుతాను విను.

పూర్వకాలమున మరుత్తు అను మహారాజు ఎన్నో యజ్ఞ యాగములు చేసాడు. బంగారము, వెండి, వస్త్రములు దానం చేసాడు. అమితమైన కీర్తి గడించాడు. కాని ఆ మరుత్తు ఈనాడు ఉన్నాడా. కాల గర్భంలో కలిసిపోలేదా!

సుహోత్రుడు అనే మహారాజు అనేక పూజలు వ్రతాలు చేసాడు ఎన్నో దాన ధర్మాలు చేసాడు. అనేక అశ్వమేధ యాగాలు చేసాడు. కాని అతను కూడా మరణించాడు కాని ఇక్కడే శాశ్వతంగా ఉండిపోలేదు.

అంగుడు అనే మహా రాజు ఎన్నో రత్నములు, మణులు మాణిక్యములు బ్రాహ్మణులకు దానం చేసాడు. అతడు కూడా పరలోకం చేరుకున్నాడు.

ఇంక శిబి చక్రవర్తి కథ నీకు తెలుసు కదా! అతని రథము ఏడు దీవులలో తిరిగింది. అతడు ధనము కొరకు తన ప్రజలను ఎప్పుడూ అడగ లేదు. అతడు పరమేశ్వరుడు ఇచ్చి న ధనముతో ఎన్నో అశ్వమేధములు ఆచరించాడు. లెక్కలేనన్ని గోవులను బ్రాహ్మణులకు దానం చేసాడు. అతడు కూడా నేడు లేడు కదా.

మరి శ్రీరాముని చరిత్ర నీకు తెలిసినదే. చి న్నతనములోనే రాక్షస సంహారము గావిం చి, లోక కంటకుడైన దశకంఠుని చంపి, అయోధ్యను జనరంజకముగా పాలించిన ఆ దశరథరాముడు పరలోకము చేరలేదా! ఇక్కడే ఉన్నాడా!

భగీరథుడు, గంగను భూమి మీదకి తీసుకొని వచ్చాడు. ఎన్నో యజ్ఞ యాగములు చేసాడు. ఎన్నో దాన ధర్మములు చేసాడు. అతను కూడా పరలోక గతుడయ్యాడు కదా!

ఇంక దిలీప మహారాజు. అతను చేసిన క్రతువులలో మేనక, విశ్వావసుడు మొదలగు గంధర్వులు స్వయంగా పాల్గొన్నారు. ఎంతోమంది దేవఋషులు కూడా వచ్చారు. ఎన్నో దాన ధర్మములు

చేసాడు. అతను చేసిన నూరవ అశ్వమేధ యాగమునకు ఇంద్రుడు వచ్చి యాగాశ్వమును తీసుకున్నాడు, మరి అంతటి దిలీప మహారాజు ఇక్కడే ఉండిపోయాడా! స్వర్గధామము చేరుకోలేదా!

తరువాత మాంధాత మహిమలు నేను చెప్ప పనిలేదు కదా! 12 రోజుల శిశువుగా ఉండగా ఇంద్రుని బొటన వేలినుండి స్రవించు అమృత ధారలు తాగి పెరిగిన మహానుభావుడు. 12 వ ఏటనే సామ్రాజ్యాధీశుడు అయ్యాడు. ఈభూమినంతా ఏలాడు. కాలం తీరిన తరువాత అతను ఒక్కక్షణమైనా ఈ ప్రపంచం లో ఉన్నాడా చెప్పు.

యయాతి మహారాజు. దేవాసుర యుద్ధంలో ఇంద్రుడికి తోడుగా ఉండి తన జీవితం అంతా ధారపోసాడు. మనుషులలో వర్ణాశ్రమ ధర్మములు ఏర్పరిచాడు. ఈ భూమి నంతా పాలించాడు. అగ్ని ష్టోమము, అశ్వమేధము, వాజిపేయము, అతి రాత్రము, పౌండరీకము మొదలగు యజ్ఞములు చేసి కీర్తి గడించిన యయాతి పరలోకము చేరుకొన లేదా! ఇక్కడ నేడు లేడు కదా!

అంబరీష చక్రవర్తి కూడా తన మీదికి తన శత్రురాజు లందరూ ఒక్కుమ్మడిగా వచ్చినా, వారిని జయించి, తన శరణు చొచ్చినవారిని

కరుణతో మన్నించి, ఎన్నో యజ్ఞ యాగములు నిర్వర్తించి, అనేక దానధర్మములు చేసి, తరువాత ఏమయ్యాడో చెప్పు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు. పరలోకమునసే కదా!

శశిబిందు మహారాజుకు లక్షమంది భార్యలు. ఒకొక్క భార్యకు వెయ్యిమంది కుమారులు. వారు కూడా మహా పరాక్రమ వంతులు. అనేక అశ్వమేధయాగములు చేసాడు. ఎన్నో దాన ధర్మములు చేసాడు. అతను ఏమన్నా సశరీరంగా ఇక్కడే ఉన్నాడా. పరలోకమునకు ఏగలేదా!

ఇంక గయ మహారాజు. ఘోరమైన తపస్సు చేసి అగ్ని దేవుని ప్రసన్నం చేసుకున్నాడు. అతని అనుగ్రహం వలన శమము, దమము, బ్రహ్మచర్యము, సౌశీల్యము, పాండిత్యము, అహింస, దానధర్మములు మొదలగు సద్గుణములతో విరాజిల్లాడు. 36 యోజనముల వేదిక నేర్పరిచి దానిమీద ఒక మహా యజ్ఞమును నిర్వహించాడు. బ్రాహ్మణులకు ఎన్నో దాన ధర్మములు చేసాడు. గయ క్షేత్రంలో అతని పేర ఒక పెద్ద మర్రి చెట్టు ఉన్నది. అటువంటి మహానుభావుడు గయ మహారాజు మరణించలేదా!

ఇంక రంతి దేవుడు. అనుక్షణం 20,000 మంది వంటవాళ్లు వండి వారుస్తుంటే. నిరంతర అన్నదానము చేసి ప్రసిద్ధి కెక్కాడు కదా. సత్రయాగం చేసాడు. అటువంటి రంతిదేవునికి పరలోక యాత్ర తప్పలేదు కదా!

ఇంక భరతుడు. చిన్నతనంలోనే క్రూరమృగములను మ చి చ్చక చేసుకొని వాటి మీద కణ్వాశ్రమములో విహరిం చి న మహా పరా క్రమ వంతుడు.ఈ భరత భూమిని ఏకఛత్రాధి పత్యంగా పరిపాలించాడు. గంగా, యమునా, సరస్వతీ నదీ తీరములో అనేక యజ్ఞయాగములు చేసాడు. గజ,తురగ,రథములను ప్రీతితో బ్రాహ్మణులకు దానం చేసాడు.అటువంటి భరతుడు నేడులేడు కదా! తన కాలం తీరగానే వెళ్లిపోయాడు కదా!

ఇంక పృథు చక్రవర్తి. ఎగుడు దిగుడు గా ఉంటూ రథములు తిరగడానికి అవరోధము కల్గించు చున్న పృథివిని చదును చేసిన మహా రాజు పృథు చక్రవర్తి. అతని పేరనే భూమికి పృథివి అనే పేరు వచ్చింది. అతను చేసిన యజ్ఞ యాగములు లెక్క లేదు. తన ప్రజలను కన్నబిడ్డలవలె పాలించాడు. ఈ భూమినంతను బ్రాహ్మణులకు

దానమిచ్చి ఖ్యాతి గాంచాడు. మరి అతని శరీరము సుస్థిరముగా నిల్చిపోయిందా. అతని కీర్తి మాత్రం నిలిచిపోయింది కాని.

బ్రాహ్మణుల మీద ద్వేషంతో తన తండ్రి జమదగ్నిని చంపిన కార్తవీర్యార్జునుని చంపి, ఇరువది ఒక్కసార్లు క్షత్రియుల మీదికి దండెత్తి, క్షత్రియ వంశ నిర్మూలనము చేసిన భార్గవ రాముడు, ఈ భూమి నంతను తానే ఏలిన వాడు, ఎన్నో యజ్ఞములు యాగములు నిర్వహించినవాడు, ఆ పరశురాముడు ఇప్పుడు బతికి లేడు కదా! అలాంటి వారికే మత్యువు అనివార్యము అయినప్పుడు ఇంక సామాన్య మానవుల మాట చెప్పవలెనా!

సృంజయా! నీ కుమారుడు వీరందరికంటే ఉదాత్తుడు. కాని ఎవ్వరునూ మృత్యువు నుండి తప్పించుకోలేరు." అని 16 రాజుల చరిత్రలను చెప్పాడు నారదుడు.

ఆ రాజుల చరిత్రలను విన్న సృం జ యుడు ఏమీ మాట్లాడలేదు. అప్పుడు సృంజయుని చూచి నారదుడు "సృంజయా! ఇప్పటి వరకూ నేను చెప్పిన దంతయూ నీ బుద్ధిలోనికి ప్రవేసించినదా లేక బూడిదలో పోసిన పన్నీరు మాదిరి నిష్ఫల మయినదా!" అని అడిగాడు. అప్పుడు

సృంజయుడు నారదునితో ఇలా అన్నాడు. "నారదా! నీవు చెప్పిన కథల వలన నా మనస్తాపము, పుత్రశోకము తొలగి పోయినవి. మనసు ప్రశాంత మయినది." అని అన్నాడు.

అప్పుడు నారదుడు "సృంజయా! నీకు ఏమి కావాలో కోరుకో నేను ఇచ్చెదను." అని అన్నాడు. అప్పుడు సృంజయుడు "దేవా! నీవు నాకు ప్రసన్నుడవయినావు. అంత కన్నా నాకు కావలసినది ఏమున్నది." అని అన్నాడు. అప్పుడు నారదుడు సంతోషించి "సృంజయా! కొంతమంది చోరుల మూర్ఖత్యమునకు బలి అయి నరక వాసమునకు పోయిన నీ కుమారుని నేను తెచ్చి ఇచ్చెదను. నీవు చి ంతింపకుము." అని అన్నాడు. నారదుడు.

నారదుడు ఇ చి ్చ న వరము మేరకు సువర్ణష్ఠివి సజీవంగా తిరిగి వచ్చాడు. సృంజయుడు సజీవంగా తిరిగి వచ్చిన తన కుమారుని చూచి సంతోషించి, అతని కి అస్త్రవిద్యలతో సహా సకల విద్యలు నేర్పించాడు. వివాహం చేసాడు. అతను సంతానవంతుడైనాడు. కాని అతను కూడా కాలం తీరగానే మరణించాడు.

ధర్మజా! మృత్యువు ను జయించుట ఎవరి తరమూ కాదు. నీ కుమారుడు అభిమన్యుడు వీరస్వర్గ మలంకరించి అక్కడ సురలోక భోగములు అనుభవించు చున్నాడు. అతని మృతికి నీవు చి ంతించుట అనవసరము. నీవు ఇంతమంది మహారాజుల చరిత్రలు ఆలకించావు కదా! కాబట్టి నీ మనస్సుకు ధైర్యము తెచ్చుకొని సుస్థిరుడవై నీ కర్తవ్య నిర్వహణలో ఉండుము." అని చెప్పి వ్యాసుడు వెళ్ళిపోయాడు.

వ్యాసుని మాటలతో మనసుకు ఊరట కలిగినా అర్జునుడు వచ్చి తనకుమారుని గురించి అడిగితే ఏమని బదులు చెప్పాలి అని మధన పడుతున్నాడు." అని సంజయుడు ధృతరాష్ట్రుని కి చెప్పాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు సంజయుని చూచి "సంజయా! సంశప్తకులమీదికి యుద్ధమునకు పోయిన అర్జునుడు వారితో ఎలా యుద్ధము చేసాడు. అభిమన్యుని మరణ వార్త అతనికి ఎలా తెలిసింది వివరంగా చెప్పు. " అని అడిగాడు. దానికి సంజయుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"మహారాజా!అర్జునుడు తన బల పరాక్రమములతో సంశప్తకులను సమూలంగా నిర్మూలించాడు. తిరిగి వస్తుండగా అతని కి ఎన్నో

దుశ్శకునములు గోచరించాయి. అర్జునుడు శ్రీ కృష్ణుని చూచి "కృష్ణా! ఎన్నడూ లేనిది ఎన్నో దుర్నిమిత్తములు గోచరించుచున్నవి. నా మనస్సు ఎంతో అలజడి చెందుచున్నది. శరీరము గగుర్పాటు చెందుచున్నది. ద్రోణాచార్యుడు సామాన్యుడు కాదు. మా అన్నయ్య ధర్మజునికి ఏ అపాయము జరగలేదుకదా! " అని అన్నాడు.

ఆ మాటలు విని కృష్ణుడు అర్జునుని చూచి "అర్జునా! ధర్మజునికి అతని తమ్ములకు ఏ ఆపదా కలుగదు.వారు తప్ప వేరే వారికి ఏ ఆపద కలిగినా మనకు త్వరలోనే తెలుస్తుంది కదా! " అని అన్నాడు.

తరువాత కృష్ణార్జునులు పాండవ శిబిరముల లోనికి ప్రవేశించారు. పాండవ శిబిరములు స్కంధావారములు నిస్తేజములై ఉన్నవి. అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా! సైనికులు అందరూ నన్నుచూచి తలలు వంచుకుంటున్నారు. వారి ముఖములలో విషాదఛ్ఛాయలు గోచరించుచున్నవి. మన శిబిరములనుండి ఎలాంటి సందడి వినపడటం లేదు. నేను రాగానే నా కెదురు వచ్చు అభిమన్యుడు ఈరోజు ఎందుకో కనపడటం లేదు. ఎలాంటి దుర్వార్త వినవలసి వస్తుందో అని భయంగా ఉంది." అని అన్నాడు.

కాని ఏ మాటకూ క ృ ష్ణుడు బదులు చెప్పలేదు. అర్జునుడు వెంటనే ధర్మరాజు శిబిరమునకు వెళ్లాడు. అక్కడ ధర్మరాజు మొదలగు వారు కూర్చుని ఉన్నారు. వారిలో అభిమన్యుడు లేదు. అది చూచి అర్జునునికి కాళ్లు తొట్రుపడ్డాయి.

"అన్నయ్యా! మీరంరూ మీ మీ ఆసనముల మీద విచార వదనులై కూర్చుని ఉన్నారు. మీలో అభిమన్యుడు నాకు కనపడటం లేదు.అతనికి ఏమయిందో చెప్పండి. ఈ రోజు ద్రోణుడు పద్మవ్యూహము పన్నాడు. దానిలోకి ప్రవేశించడం నాకు మాత్రమే తెలియును. నా అనుమానం నిజమయితే మీరు అభిమన్యుని పద్మవ్యూహం భేధించడానికి పంపలేదుకదా!

అయ్యో! అభిమన్యునికి పద్మవ్యూహమున ప్రవేశించుటకు మాత్రమే తెలియును. తిరిగిరావడం తెలియదు. మీరు కోరినంతనే అతడు పద్మ వ్యూహములో ప్రవేశించి తిరిగి రాలేక కురు సైన్యము చేతిలో ప్రాణములు పోగొట్టుకోలేదు కదా! శ్రీక ృ ష్ణుని మేనల్లుడు, కుంతీదేవి మనుమడు, నా కుమారుడు, యుద్ధవిద్యానిపుణుడు, దివ్యములైన శరసంధానము తెలిసినవాడు, అలాంటి అభిమన్యుని శత్రువులు ఏ మాయోపాయంతో చంపారో కదా!

గురువుల యెడ భక్తి కలవాడు, అత్యంత ఉదారుడు, కరుణాత్ముడు, శౌర్యవంతుడు, ధైర్యశాలి, ఇంద్రుని మనుమడు అయిన అభిమన్యుడు లేకపోవడం దుస్సహము కదా! అభిమన్యుని నవ్వు ముఖము, ఆ విశాల మైన కన్నులు, విశాలమైన అతని గుండెలు చూచి కదా ఇన్నాళ్లు నేను బతుకుతున్నది. అభిమన్యుని చూడకుండా నేను ఎలా బతుకగలను. అయ్యో! హంసతూలికా తల్పమున పవళించు అతని శరీరము నేడు కఠినమైన నేలమీద పడి ఉన్నదా! ఎల్లప్పుడూ తెల్లని గొడుగుల నీడన ప్రకాశించు అతని మోము నేడు ధూళిధూసరమైనదా! ఎల్లప్పుడూ అందమైన నెచ్చెలుల మధ్య వెలుగొందు అభిమన్యుడు నేడు క్రూరమైన నక్కల మధ్య ఉన్నాడా! నానాజనములకు నాథుడైన అభిమన్యుడు నేడు అనాథగా పడి ఉన్నాడా! ఎంతో వినయవిధేయతలు గల సుభద్ర కుమారుడు, దేవేంద్రుని మనుమడు, నా కుమారుడు ఇంక లేడుకదా! నా లాంటి మందభాగ్యునికి అంతటి కుమారుడు ఎలా దక్కుతాడు. విధాత ఎంత నిర్దయుడో కదా! మంచి వారిని ఎక్కువ కాలము బతుకనీయడు. అయిననూ ఆ సంశప్తకులు యుద్ధమునకు పిల్చిల నేనేల వారి వెంట యుద్ధమునకు పోవలయును. దాని వలన నా కుమారుని కోల్పోయితిని కదా! " అని శోకించుచూ అర్జునుడు అక్కడేకూల బడ్డాడు.

"అభిమన్యా! ధర్మరాజు ముద్దుల కొడుకా! నీ తల్లి సుభద్రను విడిచి వెళ్లడం నీకు ధర్మమా! నీ మేనమామ క ృ ష్ణుడు వచ్చాడు. ఒక్కసారి రావా! నీ ప్రియమైన మాటలతో నీ భార్య ఉత్తరను ఊరడింపవా! " అంటూ అనేక విధముల పలవరిస్తున్నాడు అర్జునుడు.

అర్జునుడు యుధిష్ఠిరుని చూచి "అన్నయ్యా! ఇది ఎలా జరిగింది? అభిమన్యుని వెంట భీమసేనుడు లేడా? ధ ృ ష్టద్యుమ్నుడు ఏమయినాడు? అతనిని వేరే చోటికి పంపావా? ద్రుపదుడు,సాత్యకి ఎక్కడ ఉన్నారు? మహావీరుడు విరాటరాజు ఎక్కడకుపోయాడు? కనీసం నువ్వయినా అభిమన్యుని కాపాడలేక పోయావా? లేక వేరేచోట యుద్ధం చేస్తున్నావా? లేని ఎడల నా కుమారుడు దిక్కులేకుండా మరణించి ఉండడు కదా? నా కుమారుడు రణరంగమున అత్యంత ధైర్య శైర్య పరాక్రమములను చూపి మరణించినాడు కదా! నా కుమారుని అభిమన్యుని పలువురు చుట్టుముట్టి తమ యొక్క బాణములు, కత్తులు, అస్త్ర శస్త్రములతో చంపుచుండగా, తనకు తోడుపడు వారు లేక నా కుమారుడు నన్ను మనసులో తలంచుకొని "తండ్రీ నా శత్రువులను వధించి నన్ను కాపాడవా" అని ఎంత బాధపడ్డాడో కదా! ఇదేమిటి నేను ఇలా అనుకుంటున్నాను. నా కుమారుడు, శ్రీ క ృ ష్ణుని అల్లుడు, అమిత ధైర్యశాలి, ఆకాశం విరిగి మీద పడ్డా ఆహవ రంగమున ధైర్యంగా

పోరాడు తాడు గాని పరుల సహాయము అర్థిస్తాడా! చి రు నవ్వు ముఖముతో ఉన్న నా కుమారుని చూడ కుండా నేను ఎలా బతుకగలను. నా కుమారుని మరణ వార్త విని నా హృదయము ఇంకా ముక్కలైపోదేమి? పలువురు కూడి అత్యంత క్రూరంగా నా కుమారుని వధించునపుడు వారికి నా గాండీవము ధనుష్టంకారము, శ్రీ కృ ష్ణుని చక్రజ్వాలలు గాని గుర్తుకు రాలేదా! అయ్యో నా కుమారుడు నెత్తుటి మడుగులో ఎక్కడ పడి ఉన్నాడో కదా! అతడు ఎక్కడ ఉన్నాడో నాకు చూపు వారు లేరా! రణరంగమున చనిపోయి పడి ఉన్న నా కుమారుడు భూమిమీద ఉదయిం చి న చంద్రుని వలే ప్రకాశిస్తున్నాడు కదా! తన ప్రాణముకన్న మిన్నగా ప్రేమించిన సుభద్ర యొక్క దుఃఖమును ఎవరు ఉపశమింపచేయగలరు. కొడుకు కోసం తల్లడిల్లు ద్రౌపది దుఃఖమును మాన్ప ఎవరి తరము?" అని పలువిధములుగా పరితపిస్తున్నాడు అర్జునుడు.

తరువాత ధర్మజుని మొహము చూచి "ధర్మజా! నేను సంశప్తకులతో పోరుతున్నప్పుడు కౌర వీరుల సింహనాదములు విన్నాను. యుయుత్సుడు ఎలుగెత్తి అన్న మాటలు విన్నాను. "మీరు అర్జునునితో పోరాడలేక బాలుని డైన అభిమన్యుని పలువురు కలిసి చంపారు. ఇది మీకు సంతోషంగా ఉందా! మీరు అర్జునునికి, కృ ష్ణునికి అపకారము

చేసి బదుక గలరా! అది ఎట్లున్నను, ఈ దుష్కార్యమువలన మీకుపాపము చుట్టుకొని మీకు అపకారము చెయ్యకుండా ఉంటుందా!" అని యుయుత్సుడు పలుకగా నేను చెవులారా విన్నాను. నేను, కృష్ణుడు ఆ మాటలు విని కూడా, నమ్మలేదు. ధర్మజా! నీవు తగిన సమయంలో నాకు ఈ విషయం తెలిపిన నేను వెంటనే వచ్చి నా కుమారుని చుట్టుముట్టిన వీరులందరిని సంహరించి ఉండెడి వాడను కదా!" ఆ ప్రకారంగా శోకిస్తున్న అర్జునుని తన బాహువులతో ఆలింగనము చేసుకొని శ్రీకృష్ణుడు ఈ విధంగా అనునయిస్తున్నాడు.

"అర్జునా! ఏమిటీ వెర్రి! రణ రంగమున యోధులకు వీర మరణము సహజమే కదా! నీ కుమారుడు అభిమన్యుడు ఒంటరిగా అనేక మంది కురు యోధులను ఎదుర్కొని వీరోచితంగా పోరాడి వీరమరణం చెందాడు. దానికి సంతోషించ వలసినది పోయి ధుఃఖింప దగునా! తెలుసుకోదగినదంతా తెలుసుకున్న కోవిదుడవు. అటువంటి నీవు ఈ ప్రకారము శోకింప దగునా! నీవు దుఃఖించుట చూచి నీ వారలందరూ ఎలా దీనంగా చూస్తున్నారో చూడు. వారిని ఓదార్పవలసిన నీవు ఈ ప్రకారం శోకించుట దగునా! ఇంకనైనా నీ శోకము వీడి వారి నోదార్పుము." అని పలికాడు కష్ణుడు.

"నా కుమారుడు అభిమన్యుని గూర్చిన మాటలు నాకు చెప్పండి. నా కుమారుని అతి క్రూరంగా చంపిన వారు ఎవరు? నేను వెంటనే పోయి వారి నందరినీ చంపి వైచెదను. ఈరోజు ఇక్కడ యుద్ధం ఎలా జరిగింది. నాకు వివరంగా చెప్పండి. మీరందరూ అత్యంత శౌర్యము,పరాక్రమము కలవారు. అనేక అస్త్ర శస్త్రములు తెలిసిన వారు. మీరు ఇందరుండగా నా కుమారుని వాళ్లు ఎలా చంపగలిగారు. ఏ విధంగా చూచినా ఇది అసంభవమని తోచుచున్నది. ధర్మజా! మిమ్ములను, పాంచాలురను నమ్మి నేను చెడ్డాను. మీకు నా కుమారుని రక్షించు ప్రౌఢత్వము (మగతనము) లేదని తెలిసి కూడా నేను వేరు మార్గములలో నా కుమారుని కాపాడుకోలేకపోయాను. ఇంతకూ మీరందరూ మీ మీ రధములతో యుద ్ధరంగమున చొచ్చుకొనిపోవునపుడు కుమారునికి సాయం అందకుండా ఎవరు అడ్డగించారు. చెప్పండి. అయినా నా వెర్రి గాని, మీకు బలపరాక్రమములు, ధైర్యసాహసములు ఎక్కడివి. మీరు ఇందరు ఉండి కూడా నాకుమారుని ఒక్కడిని రక్షించలేకపోయారు కదా. మీవంటి చేతగాని వారిని ఎన్ని అన్నా ప్రయోజనమే మున్నది. మీరందరూ బలహీనులు, యుద్ధమంటే భయపడే వారు అని తెలిసి కూడా నా కుమారుని మీ వద్ద వదిలి నేను ఆ సంశప్తకులతో యుద్ధమునకు వెళ్లాను. దానికి నన్ను నేను నిందించుకోవాలి. మిమ్ములను అని ప్రయోజనమేమున్నది. మీరు పైకి మాత్రం వీరులవలె శూరువలె

కన్పట్టుచున్నారు. లేని ఎడల మీరు నా కుమారుని రక్షించి ఉండెడి వారు కదా! మీకు ఆ ఆయుధములు కేవలం అలంకారప్రాయములు కాని యుద్ధము చేయుటకు కాదు కదా!" అని అర్జునుడు తన మనస్సులో క్రోధము శోకము పెనవేసుకొని ఉండగా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

అక్కడ ఉన్న మహా రాజులు, మిత్ర రాజులు ఎవ్వరు కూడా అర్జునునికి బదులు చెప్ప సాహసించడం లేదు. కృ ష్ణుడు ఒక్కడే అర్జునుని తన అనునయ మాటలతో ఓదారుస్తున్నాడు. అప్పుడు ధర్మరాజు అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా! నీవు సంశప్తకులతో యుద్ధం చెయ్యడానికి వెళ్లావు కదా! ద్రోణుడు పద్మవ్యూహము పన్నాడు. ఆ పద్మవ్యూహములో మేము ఎంత ప్రయత్నించినా ఒక్క అడుగుకూడా ముందుకు వెళ్లలేక పోయాము. అభిమన్యుడు ఒక్కడికే ఆ పద్మవ్యూహము లో ప్రవేశించుట తెలియును. అందు వలన నేను అభిమన్యుని వద్దకు పోయి "కుమారా! మాకు ఎవ్వరికీ పద్మవ్యూహమున ప్రవేశించుట తెలియదు. నీవు మార్గము చూపిన మేము నిన్ను అనుసరించెదము." అని చెప్పాను. దానికి కుమారుడు సరే అన్నాడు. వెంటనే తన రథముతో గూడా

పద్మవ్యూహములో ప్రవేశించాడు. కౌరవ సేనలను చించి చెండాడుతున్నాడు. మేము కూడా వెంటనే అతని వెంట పద్మవ్యూహము లో ప్రవేశించవలెనని ముందుకు ఉరికాము. కాని సైంధవుడు మమ్ములను అడ్డుకున్నాడు. మా అందరను ఒక్కరోజు ర ణ రంగమున అడ్డుకొను శక్తి అతనికి మహాశివుని వర ప్రభావమున కలిగినదట. ఆ వర ప్రభావంతో సైంధవుడు మమ్ములను పద్మవ్యూహములోనికి చొరబడి కుమారునికి సాయంగా వెళ్లకుండా అడ్డుకున్నాడు. మేము అతనిని ఎదిరించలేక అక్కడే నిలబడి పోయాము. అభిమన్యుడు, కర్ణుడు మొదలగు మహా వీరులను ఎదిరించాడు. ద్రోణుడు, కర్ణుడు, కృ తవర్మ, క ృ పాచార్యుడు, అశ్వత్థామ మొదలగు యోధులు ఒక్కమారుగా లబిమన్యుని చుట్టు ముట్టి తీవ్రంగా గాయపరిచారు. అయననూ వెరవక అభిమన్యకుమారుడు సుయోధన కుమారుడు లక్ష్మణుని, బ ృ హద్బలుని మొదలగు అనేక మంది రాకుమారులను చంపాడు. వారు తన రథము విరగ గొట్టగా అభిమన్యుడు తన గదను తీసుకొని కిందికి దూకి యుద్ధము చేస్తున్నాడు. అప్పుడు దుశ్శాసనుని కుమారుడు అభిమన్యుని మీదికి దూకాడు. అభిమన్యుడు అతని రథం విరగ్గొట్టాడు. అతడు కూడా తన గదతో కిందికి దూకి యుద్ధ చేస్తున్నాడు. అభిమన్యుడు, దుశ్శాసనుని కుమారుడితో ఘోరంగా యుద్ధ చేసి ఇద్దరూ నేల మీద పడిపోయి తమ తమ గదా ఘాతములతో మరణించారు. ఆ ప్రకారంగా

అభిమన్యుడు తన తండ్రి, మేనమామ కీర్తి ప్రతిష్ఠలను నిలబెట్టాడు. వీరస్వర్గ మలంకరించి అక్కడ నాకలోక సుఖాలు అనుభవిస్తున్నాడు." అని చెప్పాడు ధర్మరాజు.

తనకుమారుడు చనిపోయిన విధము వివరంగా తెలుసుకున్న అర్జునుడు మనస్సు వికలము కాగా మూ ర్ఛపోయాడు. శ్రీకృ ష్ణుడు, యుధిష్ఠిరుడు అతనికి ఉపచారములు చేసారు. మూర్ఛనుండి తేరుకున్నాడు అర్జునుడు. కోపంతో ఊగిపోయాడు. మొహం అంతా ఎర్రబడింది.

"అందరూ వినండి ఇదే నా ప్రతిజ్ఞ. ఆ సైంధవుని రేపటి సాయం సమయము లోపుగా అవశ్యము చంపుతాను. ఆ సైంధవుడు భయంతో నిన్ను శరణు వేడినా, ఆశ్రీకృ ష్ణుని శరణు వేడినా, కడకు నన్ను శరణు వేడినా సరే, అతను రణ భూమి విడిచి వెనకు తిరిగి పారిపోతే తప్ప, వాడిని వదలను. నా కుమారుని మృ తికి కారకుడైన ఆ సైంధవుని కాపాడుటకై కౌరవ సేన యావత్తు నా మీద ఒక్కుమ్మడిగా వచ్చి నా మీద అస్త్రశస్త్రములు ప్రయోగించినా సరే వాడిని వదలను. చంపి తీరుతాను. నా ఈ ప్రతిజ్ఞకు తప్పిన యడల, నేను గురుద్రోహము, బ్రహ్మహత్య,మద్యపానము మొదలగు ఘోర పాతకములు చేసిన

పాపమున పోవుదును. మరియు నా ఈ ప్రతిజ్ఞను కూడా ఆలకింపుడు. దేవతలు, రాక్షసులు, కింపురుషులు, మొదలగు వారు ఎవ్వరు వచ్చి వాడిని రక్షించినా సరే! వాడిని రేపు సాయంత్రం సూర్యుడు అస్తమించు లోపల నేను చంపి తీరుతాను. అలా కాని పక్షంలో నేను అగ్ని ప్రవేశము చేసి ఆత్మాహుతి చేసుకుంటాను ఇదేనా ప్రతిజ్ఞ." అని పలికాడు అర్జునుడు.

వెంటనే తన గాండీవమును తెప్పించాడు. దానికి పూజాదికములు నిర్వర్తించాడు. నారి సారించాడు. శ్రీ కృ ష్ణుడు తన పాంచజన్యమును పూరించాడు. అర్జునుడు తన దేవదత్తమును పూరించాడు. పాండవ సైన్యములో తూర్య నాదములు మిన్ను ముట్టాయి. సైనికులు సింహనాదములు చేస్తున్నారు. అర్జునుని అక్షయతూణీరము లోని అస్త్ర శస్త్రములు వీరావేశంతో నృ త్యం చేసాయి. పక్కనే ఉన్న భీమసేనుడు అర్జునుని చూచి "అర్జునా! నీ వెంట నేను ఉన్నాను. విజృ ం భించు. సైంధవుని త్రుంచు. దేవదత్తము, పాంచజన్య ఘోషలు విని కౌరవ వీరుల గుండెలు పగులుతాయి. ఇది తథ్యం." అని అన్నాడు.

ఆ రాత్రి అకస్మాత్తుగా పాంచజన్యము, దేవదత్తము ఘోషలు విని కౌరవ యోధులు కలవరపడ్డారు. వెంటనే చారులను పిలిపించి అడిగారు.

వారు పాండవ శిబిరములలో జరిగినది అంతా సవిస్తరంగా చెప్పారు. అది విన్న సైంధవునికి శరీరం కంపించింది. నిలవ లేకపోయాడు. వెంటనే సిగ్గు విడిచి నీ కుమారుడు సుయోధనుని వద్దకు పరుగు తీసాడు. "సుయోధనా! నేను ఒక్కడినే అతని కి అపకారము చేసినట్టు అర్జునుడు నా మీద పగబూనాడు. నన్ను చంపుతానని ప్రతిజ్ఞ చేసాడట. మీరందరూ సంతోషముగా ఉండగా నాకీ దుఃఖమేల? నేను ఎక్కడికన్నా పోయి తలదాచుకుంటాను. అయినా అర్జునుడి ప్రతిజ్ఞకు దేవాసురులు గాని, సిద్ధ సాధ్యులు గాని అడ్డుపడగలరా? సుయోధనా! ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, శల్యుడు, నీవు, బాహ్లీకుడు మొదలగు వారు తల్చుకుంటే యముడు పట్టుకు పోయిన వాడిని కూడా వెనుకకు తీసుకు రాగలరు. కానీ మీరు నన్ను కాపాడవలెనని తల్చుకుంటున్నట్టు లేదు. ఇంక నాకు ఆ దేవుడే దిక్కు." అంటూ ఎండి పోతున్న పెదవులు తడుపుకుంటున్నాడు, కాళ్లు వణుకుతున్నాయి. నిలబడలేకపోతున్నాడు.

"సుయోధనా! ముందు నేను అర్జునుని కంటపడకుండా దాక్కుంటాను. మీ అందరి దగ్గర సెలవు తీసుకుంటున్నాను. బతికి ఉంటే రేపు కలుస్తాను." అని వెళ్లిపోబోతున్నాడు సైంధవుడు.

అప్పుడు సుయోధనుడు అతడిని ఆపి ఇలా అన్నాడు. "సైంధవా! ఏమిటీ వెర్రి! ఇప్పుడే కదా మమ్ములను అత్యంత పరాక్రమ వంతులు అని అన్నావు. ద్రోణుని పరాక్రమము, శకుని శౌర్యము, సోమదత్తుని ధైర్యము, శలుని వీరత్వము, నీకు తెలియదా. వారందరూ నిన్ను విడిచిపెడతారా! నన్ను నమ్ము. భయపడకుము. నేను, నా తమ్ములు, కౌరవ వీరులు నిన్ను వెన్నంటి ఉంటారు." అని ధైర్యవచనాలు పలికాడు.

వెంటనే సుయోధనుడు సైంధవుని వెంట పెట్టుకొని ద్రోణుని వద్దకు వెళ్లాడు. అప్పుడు సైంధవుడు ద్రోణునితో తనకు, అర్జునునికి ధనుర్విద్యలో ఉన్న తారతమ్యములు అడిగాడు. దానికి ద్రోణుడు ఈ విధంగా చెప్పాడు. "సైంధవా! మీరందరూ నా దగ్గర విలు విద్య అభ్యసించారు. నేను మీకందరకూ సమానంగా విలువిద్యనేర్పాను. కాని అర్జునుడు అత్యంత కఠోర మైన శ్రమకోర్చి విలు విద్యలో ఎన్నో ప్రయోగములు చేసి, న్నో మెళుకువలు సాధించాడు. కాబట్టి మీకంటే అర్జునుడు అధికుడు. అయినా నీవు అర్జునునికి భయపడ పనిలేదు. నా బాణముల రక్షణలో ఉన్న నిన్ను దేవతలు కూడా తేరి పార చూడలేరు. ఆ అర్జునుడు కూడా బేధింప లేని ఒక వ్యూహమును రేపు నేను పన్నుతాను. నీవు క్షత్రియ ధర్మము ప్రకారము యుద్ధము చేయుము.

అదియును కాక సైంధవా! నీవు వేద వేదాంగములు అభ్యసించావు. ఎన్నో యజ్ఞయాగములు చేసావు. అలాంటి నీవు మ ృ త్యువుకు భయపడటం ఏమిటి చెప్పు? ఈ యాదవులు, కౌరవులు, పాండవులు మొదలగు వారు ఈ భూమి మీద శాశ్వతంగా ఉండి పోతారా! అందరూ కాలము తీరగానే ఈ లోకం విడిచి వెళ్లిపోవలసిన వారే కదా!. దానికి ఇంత భయం ఎందుకు చెప్పు! మహా మునులు ఎన్నో య జ్ఞములు యాగములు చేసి పొందు ఫలములు వీరులు యుద్ధము చేస్తూ మరణించి నందువలన పొందగలరు. కాబట్టి నిశ్చింతగా ఉండు." అని పలికాడు ద్రోణుడు.

ఆ మాటలకు ఊరట చెందిన సైంధవుడు సుయోధనుని తోకలిసి తన శిబిరమునకువెళ్లాడు. ఇరు పక్కల సైన్యములు ఆ రోజు జరిగిన విషాదమును తలపక, మరునాటి యుద్ధ మునకు సన్నద్ధులయ్యారు. సుయోధనుని శిబిరంలో మరునాటి యుద్ధము గురించి చర్చలు జరుగుతున్నాయి. అక్కడ ధర్మరాజు పాంచాల, మత్స్య, పాండ్య, యాదవ, కేకయ మొదలగు రాజుల నందరనూ పిలిపించి మరునాటి యుద్ధమునకు సన్నాహాలు చేస్తున్నాడు.

అప్పుడు శ్రీ కృ ష్ణుడు అర్జునుని చూచి ఇలా అన్నాడు. "అర్జునా! ఏ మాత్రం నాతో ఒక్క మాట కూడా చెప్పకుంటా అనాలోచితంగా ఘోరమైన ప్రతిజ్ఞ చేసావు. అది ఎంత దుస్తరమో తెలియునా! ఏ కారణం చేతనైనా నీవు ఆ ప్రతిజ్ఞను నెరవేర్చకపోతే నీకూ నాకు ఎంత బాధ కలుగుతుందో  ఆలోచించావా! . ఇప్పుడే వేగుల వారు సమాచారం అందించారు. నీప్రతిజ్ఞ సంగతి విని, నీవు నీ కుమారుని చంపిన వారి మీద కక్ష తీర్చుకోడానికి  ఏ క్షణములో నైనా వారి మీదకు విరుచుకు పడతావని గ్రహించారు. సైంధవుడు సిగ్గు లేకుండా సుయోధనుని వద్దకు పోయి నీ ప్రతిజ్ఞ గురించి చెప్పి తనను ఎవ్వరూ కాపాడలేరని. తాను ఎక్కడికన్నా పోయి తలదాచుకుంటానని వేడుకున్నాడు. అప్పుడు ద్రోణ, కృప,            కృ తవర్మ, అశ్వత్థామ, కర్ణ, శల్య ప్రభృ తులు అతనికి ప్రాణ భయం లేదని అభయం ఇచ్చారట. ద్రోణుడు అత్యంత దురవగాహ మైన వ్యూహము పన్నుతున్నాడట. ఆ వ్యూహ మధ్యమున సైంధవుని ఉంచి నీకు అందకుండా చేయునట. అతని చుట్టు అంతమంది యోధులు  ఉండగా అతనిని చంపుట ఎంతకష్టమో ఆలోచించు. కా బట్టి దీని గురించి  మనకు ఆప్తులైనా వారితో ఆలోచించు." అన్నాడు కృష్ణుడు.

“ కృష్ణా! కౌరవ ప్రముఖుల బల పరాక్రమములు ఎటువంటివో నాకు బాగుగా తెలియును. నా గురించి కూడా వారికి బాగుగా తెలియును. నీ సహాయ సంపత్తి ఉంటే తప్ప సైంధవుని ఎవ్వరూ రక్షించలేరు. నేను సైంధవుని చంపుటకు ప్రయత్నించినపుడు ఎవరైనా నాకు అడ్డం వస్తే వారిని నా క్రూర నారాచములకు బలి చేసెదను. కౌరవ సైన్యములోని ప్రముఖుల అస్త్ర శస్త్రములు నేను సముపార్జించిన అస్త్ర శస్త్ర ముల ధాటికి నిలువలేవు. కృష్ణా! ద్రోణుడు మున్నగువారు చూచు చుండగా నేను రేపటి యుద్ధములో సైంధవుని తల తెగ నరుకుతాను. ఒక్క సుయోధనుని బలములే కాదు, ఈ చరాచర భూతజాలము అడ్డగించినా సరే నేను సైంధవుని చంపుతాను. నీ మీద, నా గాండీవము మీద, నా దివ్యములైన అస్త్ర శస్త్ర ముల మీద ఆన. రేపు సైంధవుని తల తెగుట ఖాయం. దీనికి సాధనము నా గాండీవము. నా సారధి శ్రీకృష్ణుడు. సమర కర్త అర్జునుడు. నా రధమును సాక్షాత్తు ఆ పరమశివుడు కూడా అడ్డగించలేడు. సైంధవుని కాపాడలేడు. అయినా శ్రీ కృష్ణా! నీవు పక్కనుండగా, నాకు నీ సహాయ సహకారాలు ఉండగా, నా కు ఏది అడ్డు. నేను చేసిన ఈ ప్రతిజ్ఞను ఎలా నెరవేర్చవలె నో నాకు తగు విధముగా సలహాల నిచ్చి నన్ను కృతార్ధుని చెయ్యి.” అని నమస్కరించాడు.

ఆ మాటలకు సంతోషించాడు కృష్ణుడు. "అర్జునా! నీ మనస్సు సుస్థిరముగా ఉన్నది. నీవు వెళ్లి నిద్రపొమ్ము" అని అన్నాడు. అర్జునుడు తన శిబిరమునకు వెళ్లాడు. అప్పటికే అక్కడకు పాంచాలి, సుభద్ర, ఉత్తర వచ్చి ఉన్నారు. ఈ విషయం తెలిసి కృష్ణుడు కూడా అక్కడకు చేరుకున్నాడు. చెల్లెలు సుభద్రను ఓదారుస్తున్నాడు.

"అమ్మా! సుభద్రా! క్షత్రియ కాంతలకు ఈ ప్రకారము వగచుట తగునా! రణ రంగమున మరణించుట, వీరస్వర్గము పొందుట సహజమే కదా! నీ కుమారుడు అభిమన్యుడు, తుచ్ఛమైన ఈలోకమును విడిచి పుణ్యలోకములకు పోయినాడు. దానికి చింతించనేల? బ్రహ్మచర్యము, తపస్సు, ఉత్తమమైన దానధర్మములు చేసిన వారు పొందు లోకములు నీ కుమారుడు వీరమరణము చెంది అనాయాసంగా సంపాదించుకున్నాడు. దానికి నీవు దుఃఖ పడనేలనమ్మా! క్షత్రియ కాంతలు వీరులను తమ పుత్రులుగా పొందుట, వాడు అతిలోకవీరుడై ప్రపంచ ప్రసిద్ధి గాంచుట, అతని తల్లి వీర మాత, అతని భార్య వీర పత్ని అగుట, అలాంటి వీరుడు శత్రువులను తునుమాడి వీరమరణము పొందుట సహజమే కదా! అలాంటి వీరుని కన్నందుకు సంతోషించాలి గాని దుఃఖపడతారా చెప్పు! ఎంతటి వీరులైనా, గొప్పవారైనా కాలము తీరగానే ఈ లోకము విడిచి పోవలసిన వారే కదా! ఈ లోకంలో శాశ్వతముగా ఉండటం ఎవరి తరమూ కాదు! ఈ సత్యము గ్రహించి కూడా అవివేక జనముల మాదిరి

శోకించుట తగునా! నీవే ఈ ప్రకారము శోకించిన నీ కోడలు ఉత్తరను ఓదార్చువారెవరు. ముందు నీవు నీ కోడలిని ఓదార్చుము. నీ లాంటి ధైర్య వంతురాలు ఈ ప్రకారం శోకించడం తగదు. అసలు మాకందరకూ ధైర్యము చెప్పాల్సింది పోయి నువ్వే ఈ ప్రకారం దుఃఖించడం తగునా! నీ భర్త రేపే ఆ సైంధవుని చంపి అతని తలను నీ పాదముల చెంత ఉంచుతాడు. అతడు తన ప్రతిజ్ఞ తప్పకుండా నెరవేర్చుకుంటాడు. నా మాటలు నమ్ము. నీవు ధైర్యంగా ఉండు." అని చెల్లి సుభద్రను అనునయించాడు కృష్ణుడు.

కాని సుభద్ర పుత్ర శోకం తట్టు కోలేకుండా కుమారుని తల్చుకొని ఏడుస్తూ నే ఉంది. "నాయనా అభిమన్యా! నేను నిన్ను కని పుణ్యం చేసుకున్నానే కాని నీ ముద్దు ముచ్చటలు చూచే భాగ్యానికి నోచుకోలేదయ్యా! అత్యంత పరాక్రమ వంతులైన కౌరవ వీరులను ఎందరినో రణరంగమున చంపిన నీవు ఈ ప్రకారం దిక్కుమాలిన మరణం పొందుట మా మనసులు కలిచివేయు చున్నదయ్యా! నీవు శిశువుగా ఉన్నప్పుడు నీ సగం శరీరం మెత్తటిశయ్యమీద, మిగిలిన సగం శరీరం నాశరీరం మీద ఆనుకొని నిద్రించేవాడివి. కాని ఇప్పుడు కటిక నేలమీద పడి ఉన్నావా తండ్రీ! ప్రతిరోజూ వంది మాగధుల స్తోత్రపాఠములతో నిద్రలేచు నీవు ఈ నాడు నక్కల ఊళలు

వినుచున్నావా! ఇంత మంది మహా వీరులు, పాండవులు, అందులోనూ భీముడు, సాత్యకి, ద్రుపదుడు, మత్స్యదేశాధిపతి ఇందరుండగా, నిన్ను ఒక్కరూ రక్షించలేకపోయారే! నీవు లేకపోతే నాకు ఈ లోకమంతా పా డు బడ్డట్టు ఉన్నదయ్యా! నీవు మహా పరాక్రమవంతుడైన అర్జునుని కుమారుడవు, శ్రీ క ృష్ణుని మేనల్లుడవు, నీవు ఇతరుల చేతిలో చంపబడటం చోద్యము గా నున్నదయ్యా! నాయనా అభిమన్యూ! నీ భార్య ఉత్తర చూడు! నీ కోసం ఎంతగా రోదిస్తూ ఉందో! రా నాయనా! వచ్చి ఆమెను ఓదార్చు అనునయించు." అని పలు రకములు గా రోదిస్తూ ఉంది సుభద్ర.

అప్పుడు ద్రౌపది తన రెండు చేతులో సుభద్రను, ఉత్తరను గట్టిగా పొదివి పట్టుకొని అలాగే భూమి మీద వివశు రాలై పడిపోయింది. శ్రీ క ృ ష్ణుడు వారి వద్దకు పోయి వారిని ఉచిత వచనములతో ఓదార్చాడు. మరలా పాండవుల వద్దకు వచ్చాడు. అందరిని తమ తమ నివాసములకు పొమ్మన్నాడు. తాను కూడా అర్జునుని తో సహా అర్జునుని శిబిరమునకు వెళ్లాడు.

ఒక ప్రదేశమున దర్భాసనము పరిచి దాని మీద గాండీవము, దేవదత్తము, పాంచజన్యము, సుదర్శనము మొదలగు ఆయుధము లను

ఉంచి వాటిని అర్చించారు. వాటిమధ్య అర్జునుని పడుకొని నిద్రించమన్నాడు. తరువాత తన సారథి దారుకునితో కూడి తన శిబిరమునకు వెళ్లాడు. తాను కూడా నిద్ర పోదామని పడుకున్నాడు. కాని నిద్ర రాలేదు. పాండవ శిబిరములలో ఆ రాత్రి ఎవ్వరూ నిద్ర పోలేదు. పాండవ శిబిరములలో పాండవ యోధులందరూ ఈ విధంగా ఆలోచిస్తున్నారు. "కొడుకును చంపినారు అన్న కోపంలో అర్జునుడు భీ కర మైన ప్రతిజ్ఞ చేసాడు. దానిని కౌరవులు ఎలాగైనా వమ్ముచేస్తారు. అప్పుడు ఏం జరుగు తుంది? రే పు సా యం త్రం లోపల సైంధవుని చంపకున్న అర్జునుడు అగ్ని ప్రవేశం చెయ్యాలి. అప్పుడు పాండవుల పరిస్థితి ఏమిటి? మన పరిస్థితి ఏమిటి? మన పూజలు ఫలించి అర్జునుడు సైంధవుని చంపితే బతికి బయటపడతాము. ఈ ప్రకారం జరగాలని భగవంతుని ప్రార్థిస్తాము." అని అనుకున్నారు. ద్రోణుడు లాంటి వాళ్లు పదివేలమంది రక్షించినా సైంధవుడు రేపటి సాయంత్రం లోగా అర్జునుని చేతిలో చచ్చునట్టు వరం ప్రసాదించమని ముక్కోటి దేవతలను వేడు కున్నారు. ఈ ప్రకారము పాండవ యోధులు పరి పరి విధముల తల పోస్తున్నారు.

శ్రీ కృష్ణుడికి కూడా నిద్ర పట్టలేదు. తన సారథిని చూచి ఇలా అంటున్నాడు. "దారుకా! అర్జునుని ప్రతిజ్ఞ విన్నావు కదా! రేపటి

సాయంత్రం లోపల సైంధవుని చంపడం అంతసులభమా! ఒక వేళ అర్జునుడు చంపలేక పోతే ఎంతటి దుర్దశ సంప్రాప్తిస్తుంది. నీకు తెలుసు కదా! నాలో సగభాగం అర్జునుడు. రేపు యుద్ధములో అర్జునునికి ఏ కీడు జరిగినా, అర్జునుని విడిచి నేను బతుక లేను. కాబట్టి అర్జునుని రక్షించుకోడం నాకు తక్షణ కర్తవ్యం. నాకు ఈ ద్రోణుడు ఒక లెక్క కాదు. రే పు ఈ చరాచరము భూతములు నా పరాక్రమమును తిలకిస్తాయి. నాకు పాండవులు అంటే ఎంత ప్రేమో లోకానికి తెలియ చేస్తాను. రేపు నేను విజ ృంభించి అత్యంత పరాక్రమంతో, సాయంత్రం లోపల సైంధవుని చంపుతాను. ఆ గర్వాంధుడు సుయోధనుడు, అతని తమ్ములు, అతని మిత్రులు, అతని బంధువులు కలిసి వచ్చి సైంధవుని రక్షింప ప్రయత్నించినా. వారి నందరినీ హతమార్చి, సైంధవుని చంపుతాను. ఇది సత్యం.

దారుకా! నా రథం సిద్ధం చెయ్యి. శైబ్య,సుగ్రీవ,మొదలగు అశ్వరాజములను రథమునకు కట్టు. గరుడధ–్వజము ఎత్తించు. నా ఆయుధములైన చక్రము, గద, ప్రముఖములైన అస్త్ర, శస్త్రములు రథములో పెట్టించు. రేపు చాలా జాగ రూకతతో ఉండు. నేను పాంచజన్యం పూరించిన వెంటనే అత్యంత వేగంతో నీవు రథమును

తీసుకొని వచ్చి నా దగ్గర నిలుపు. అప్పుడు నేను అర్జునుని రథము వదిలి నారథము ఎక్కి సైంధవుని వధిస్తాను." అని పలికాడు శ్రీకృష్ణుడు.

"మహానుభావా! నీ ఆజ్ఞ శిరసావహిస్తాను. రథము సిద్ధం చేస్తాను. మీ ఆజ్ఞ కొరకు వేచి ఉంటాను. అసలు మీరు అర్జునుని రథం అధిరోహించి పాం చజన్యము పూరించగానే కౌరవుల గుండెలు జారిపోతాయి. తమరు యుద్ధం చేసే అవకాశమే ఉండదు. అయినా తమరి ఆజ్ఞ ప్రకారము నడుచుకుంటాను." అని అన్నాడు దారుకుడు.

ఈ విధంగా శ్రీ కృ ష్ణుడు దారుకునితో సముచితసల్లాపములు చేస్తుండగా, అక్కడ అర్జునుడు దర్భాసనం మీద కలత నిద్రలో ఉన్నాడు. అప్పుడు అర్జునునికి ఒక స్వప్నము వచ్చింది. ఆ స్వప్నంలో కృష్ణుడు అర్జునుని దగ్గరకు వచ్చాడు. అర్జునుడు క ృష్ణునికి భక్తి తో నమస్కరించాడు. ఆసీనుడిని చేసాడు. పూలమాలలతో పూజించాడు. పక్కనే నిలబడ్డాడు. అర్జునుని చూచి కృష్ణుడు ఇలా అన్నాడు.

"అర్జునా! నీవు శోకింపకుము. శోకార్తుడు తన శత్రువుల చేతిలో ఓడి పోతాడు కాని తాను గెలువ లేడు. నీ ప్ర తిజ్ఞ నెరవేరు ఉపాయ మాలోచింపుము." అని అన్నాడు క ృష్ణుడు. దానికి బదులుగా

అర్జునుడు ఇలా అన్నాడు "కృ ష్ణా! నాకు శోకము కాక మరేమున్నది. రేపటి సాయంసమయము లోపల సైంధవుని చంపెదనని ప్రతినపూనాను. కాని ద్రోణుడు అతనిని కాపాడెదనని ప్రతిన పూనాడు. సైంధవుడు రే పు సాయంత్రము వరకు వారి వెనుక దా గి ఉండగలడు. నాకు కనిపించడు. ఇదంతా తలచుకుంటే మనసులో శోక ము కాక మరేమున్నది." అని అన్నాడు అర్జునుడు.

"అర్జునా! అది నిజమే. కాని ఒక పని చేయుము. నీవు తూర్పు ముఖముగా నిలిచి ఆ పరమ శివుని మనసారా ధ్యానించి ఆతనికి అత్యంత ప్రియమైన పాశుపతాస్త్రమును నీకు ప్రస్ఫుటమగునటుల ప్రార్థించుము. పాశుపతాస్త్రము నీ వశమైన సైంధవుడు ఎక్కడ ఉన్నను నీవు వధించగలవు . కాబట్టి పరమేశ్వరుని ధ్యానింపుము." అని పలికాడు కృష్ణుడు.

అర్జునుడు కూడా ఆచమనము చేసి శుచియై దర్భాసనము మీద కూర్చుండి, పరమేశ్వరుని మనసులో నిలిపి, భక్తితో ధ్యానం చేసాడు. ఆ పరమేశ్వరుని కృ ప వలన, అర్జునుడు, కృ ష్ణుడు గగన మార్గమున ఉత్తర దిక్కుగా కైలాసమునకు పోతున్నారు. వారు సిద్ధులు, చారణులు, గంధర్వులు సేవించు మార్గమున పోతున్నారు. కై లాసము చేరుకున్నారు.

ఒక మహా మందిరం లోనికి ప్రవేశించారు. అక్కడ ప్రమధ గణముల తో పరివేష్ఠితుడై, పార్వతీ సహితుడైన పరమేశ్వరుని చూచారు. అర్జునుడు, కృష్ణుడు పరమేశ్వరునికి సాష్టాంగ దండప్రమాణ మాచరించారు. పరమేశ్వరుడు నరనారాయణులైన కృష్ణార్జులనుచూచి మందహాసం చేసాడు. "నరనారాయణులకు స్వాగతము. మీరు వచ్చుటకు కారణమేమి? మీ మనసులోని కోరికలను అవశ్యం తీర్చెదను." అని అన్నాడు.

కృష్ణార్జునులు తమ మనస్సులో పరమేశ్వరుని మీద భక్తి పొంగి పొరలగా ఈ మహేశ్వరుని పలువిధములుగా స్తుతించారు. అప్పుడు కృష్ణుడు పరమేశ్వరునితో "దేవా! నీవు దయయుంచి పాశుపతమును అర్జునునికి ఉపదేశింపుము." అని ప్రార్థించాడు.

అప్పుడు అర్జునుడు పరమశివుని చూచి ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే తాను కైలాసమునకు బయలు దేరకముందు అర్ధ రాత్రి పూట శ్రీకృష్ణునికి అర్పించిన పూజా ద్రవ్యములు శివుని శరీరం మీద కనపడుతున్నాయి. ఆహా! శివకేశవులకు బేధమే లేదు కదా అని అనుకున్నాడు మనసులో.

(శివాయ విష్ణురూపాయ, శివ రూపాయ విష్ణవే, శివస్య హృదయం విష్ణుః విష్ణూశ్చ హృదయగ్ంం శివః... సంధ్యావందన మంత్రము).

అర్జునుడు కూడా ఆ పరమేశ్వరుని తనకు పాశుపతము ప్రసాదించమని అర్థించాడు. అప్పుడు మహా శివుడు వారిద్దరిని దరహాసంతో చూచి "అర్జునా! అదుగో ఆ తామర కొలనులో నా బాణములు, విల్లు ఉన్నవి. వాటిని తీసుకొని రా." అని అన్నాడు అర్జునుడు వాటిని తాకపోవగా అవి మహా సర్పముల మాదిరి నాలుకలు చాచుచూ బుసలు కొట్టుచున్నవి. అర్జునుడు పాదప్రక్షాళనము గావించుకొని, మహాశివుని భక్తితో ధ్యానించాడు. రుద్రము జపించాడు. అప్పుడు ఆ మహా సర్పములు విల్లు, అమ్ముల మాదిరి కనిపించాయి వాటిని తీసుకొని అర్జునుడు పరమేశ్వరుని వద్దకు వచ్చాడు.

అప్పుడు నీల లోహిత వర్ణము గల ఒక బాలుడు మహేశ్వరుని పక్కన నిల్చుని ఉన్నాడు. అర్జునుడు తెచ్చిన విల్లు అమ్ములు తీసుకొని శరసంధానము చేసాడు. గాండీవి ఏకాగ్రతతో పాశుపతాస్త్రము ప్రయోగము ఉపసంహారము మంత్ర సహితంగా నేర్చుకున్నాడు. మరల పరమేశ్వరుని ఆజ్ఞ మేరకు ఆ విల్లు అమ్ములు ఆ సరస్సులో పెట్టాడు అర్జునుడు.

ఇంతకు మునుపు అరణ్యవాస కాలమున పరమేశ్వరుడు అనుగ్రహించిన పాశుపతము ఇప్పుడు సమంత్రముగా ప్రయోగ ఉపసంహారములతో అర్జునునికి అనుగ్రహించాడు పరమ శివుడు. అర్జునుని దేహము పులకించింది. తరువాత ఆ కృష్ణార్జునులు పరమశివునికి ప్రణమిల్లి, కురుక్షేత్రములో ఉన్న తమ తమ శిబిరములకు వచ్చారు. ఈ ప్రకారంగా కల కన్నాడు అర్జునుడు." అని సంజయుడు ధృతరాష్ట్రునకు యుద్ధ విశేషములను ఎరింగించాడు....... అని సూతుడు అను పౌరాణికుడు శౌనకాది మహా మునులకు మహా భారత కధను చెప్పాడు.

మహా భారతము ....ద్రోణపర్వము

ద్వితీయాశ్వాసము.... సమాప్తము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

శ్రీరామ

# మహా భారతం

## ద్రోణ పర్వము తృతీయాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు మహా భారత కథను ఈ విధంగా చెప్పసాగాడు.

సైంధవుని చంపడానికి శ్రీకృష్ణుడు మార్గమును చూపాడు అని విన్న ధృతరాష్ట్రుడు ఉలిక్కి పడ్డాడు. 'సైంధవా! పాండవులు ఈ కార్యక్రమమును ఏ విధంగా నిర్వర్తించారు. ద్రోణుడు సైంధవుని కాపాడగలిగాడా! విశధంగా చెప్పు.' అని అడిగాడు. సంజయుడు ధృతరాష్ట్రునికి ఈ విధంగా చెప్పసాగాడు.

ధృతరాష్ట్ర మహారాజా! మరునాడు ధర్మరాజు వందిమాగధుల స్తోత్ర పాఠములతో నిద్రలేచాడు. కాలకృత్యములు, దేవతార్చన ముగించుకొని బ్రాహ్మణులకు దాన ధర్మములు చేసి ఆస్థాన మండపమునకు వచ్చాడు. అప్పుడు శ్రీకృష్ణుడు అక్కడకు వచ్చాడు. ధర్మరాజు శ్రీకృష్ణుని సాదరంగా ఆహ్వానించి ఉచితాసనము చూపించాడు.

తరువాత భీముడు, నకుల సహదేవులు, సాత్యకి, ద్రౌపదేయులు, ఘటోత్కచుడు, ద్రుపదుడు, విరాటుడు, కేకయరాజులు, మొదలగా వారు వచ్చి వారి వారి ఆసనములు అలంకరించారు. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

'శ్రీకృష్ణా! ఇప్పటి దాకా మాకు అన్ని విధాలా నీ సహాయ సహకారాలు అందించావు. ఇప్పుడు కూడా ఈ ఆపద నుండి మమ్ములను కాపాడు.' అని ప్రార్థించాడు.

'ధర్మజా! ఈరోజు అర్జునుడు రణరంగమున వీరవిహారము చేస్తాడు. సైంధవుని సంహరిస్తాడు. ఇది తథ్యము.' అని పలికాడు.

ఇంతలో అర్జునుడు అక్కడకు వచ్చాడు. ముందు రోజు రాత్రి తాను కన్న కలను గూర్చి అందరికి వివరించాడు. అది విని సభాసదులందరూ విస్మయం చెందారు. తరువాత అందరూ యుద్ధసన్నాహములు చేయుటకు వెళ్లారు. కృష్ణుడు,అర్జునుడు, సాత్యకి అందరూ కలిసి అర్జునుని శిబిరమునకు వెళ్లారు. శ్రీకృష్ణుడు రథము ఎక్కి, రథసారథిగా కూర్చున్నాడు. అర్జునుడు రథం ఎక్కాడు. సాత్యకిని చూచి ఇలా అన్నాడు.

'సాత్యకీ! మనకు మంచి శకునములు కనపడుతున్నాయి. ఈ రోజు నేను సైంధవుని సంహరిస్తాను. నేను నా శపథమును నిర్వర్తించడానికి వెళతాను. మనకు సైంధవ వధ ఎంత ముఖ్యమో ధర్మరాజు రక్షణ కూడా అంతే ముఖ్యము. అదీ కాకుండా నీకు ఆచార్య ద్రోణుని ప్రతిజ్ఞ గురించి తెలుసు కదా! కాబట్టి నీవు ధర్మరాజు రక్షణ కొరకు వెళ్లు.' అని అన్నాడు.

అర్జునుని మాట మేరకు సాత్యకి ధర్మరాజు కు రక్షణగా వెళ్లాడు. అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు 'సంజయా! కొడుకు చనిపోయినాడని శోకము, అందువలన జనించిన కోపము రెండూ ముప్పిరి గొనగా మృత్యుదేవత మాదిరి వచ్చుచున్న అర్జునుని కౌరవులు ఎదుర్కొనగలరా! సైంధవుని ఇంటిలో ఆర్తనాదములు వినిపించుచున్నవి. సంజయా! నేను, భీష్ముడు, ద్రోణుడు చెప్పిన మాటలు సుయోధనుడు వినలేదు. కర్ణుడు, శకుని, దుశ్శాసనుని మాటలు విన్నాడు. సంధి చెడ గొట్టాడు. తనవాళ్లందరినీ చంపుకుంటున్నాడు. పైగా శివుని ఓడించిన అర్జునునితో వైరము పెట్టుకున్నాడు. అర్జునునికి సారథి శ్రీకృష్ణుడు. అలాంటి వాడితో విరోధం ఎందుకని ఎంతచెప్పినా రాజ్యం మీద లోభంతో నా మాట వినలేదు. నేను

ఏమి చెయ్యను? సరేలే. ఏం జరిగిందో చెప్పు. ' అని అడిగాడు ధృతరాష్ట్రుడు.

'మహారాజా! గతజలసేతు బంధనమేలనయ్యా! నీవు మాయాజూదము నాడే అడ్డుకొన వలసినది. పోనీ శ్రీకృష్ణుడు సంధి మాటలు చెప్పినప్పుడైనా నీవు సంధి గావించవలసినది. లోకులు నిన్ను లుబ్ధుడు, అధర్మపరుడు అని నిందించకుండా ఎలా ఉంటారు? నీ తమ్ముడు పాండురాజు ఏ విధంగా రాజ్య పాలన చేసి కురు సామ్రాజ్యము విస్తరించాడో నీకు తెలుసుకదా! మరి పాండవులకు వారి రాజ్యభాగము వారికి ఇవ్వడానికి నీకు అభ్యంతరం ఏమిటి? నీవు చేసిన పనికి నీ కుమారుని మీద నింద ఏల మోపెదవు? నీవు చేసిన దుర్నీతికి ఫలితం నువ్వు అనుభవిస్తున్నావు. దానికి కౌరవులు ఏమి చేస్తారు? గాండీవము ఘోష, పాంచజన్యము తీవ్రమైన ధ్వని, రథము మీద ఉన్న కపిధ్వజము రెపరెపలు సహించుటకు దేవతలకు కూడా శక్యము కాదు. ఇంక నీ కుమారులు ఎంత? ఏమి జరిగిందో చెపుతాను విను.

ద్రోణుడు రణరంగము ప్రవేశించాడు. శంఖము పూరించాడు. సైంధవునితో ఇలా అన్నాడు. నీవు, భూరిశ్రవసుడు, కర్ణుడు, శల్యుడు, అశ్వత్థామ, వృషసేనుడు, కృపాచార్యుడు అందరూ కలిసి ఉండండి. మన

బలములలో 14,000 ఏనుగులు, 60,000 రధములు, ఒక లక్ష గుర్రములు, పది లక్షలు పదాతి దళము, మీ వెంట ఉంటుంది.

నేను పన్ను యుద్ధ వ్యూహమునకు మీరందరూ మూడు యోజనముల దూరంలో ఉండండి. అప్పుడు పాండవులు మీ వంక కూడా చూడలేరు' అని అన్నాడు. తరువాత, ద్రోణుడు 12 యోజనముల పొడవు, 5 యోజనముల వెడల్పు గల శకట వ్యూహ మును పన్నాడు. ఆ శకట వ్యూహమునకు పడ మరగా ఉన్న అర్ధ భాగం లోపల పద్మవ్యూహము పన్నాడు. ఆ పద్మవ్యూహము మధ్యనుండి, శకట వ్యూహము మొదలు వరకు, ఒక సూచీ వ్యూహము(సూది ఆకారంతో పొడవుగా) నిర్మించాడు.

ఆ సూచీ వ్యూహము ముఖ భాగమున కృతవర్మ, అతని వెనుక కాంభోజరాజు, వారి వెనక ఒక లక్ష మంది యోధులతో సుయోధనుడు, వారందరికీ మూలస్థానములో సైంధవుని నిలిపాడు.

దుర్మర్షుడు అను వాడు ఈ వ్యూహములో నేను నిలబడేదేమిటి నేను ఒక్కడినే అర్జునుని చంపుతాను అని తన సేనలతో వేరుగా నిలబడ్డాడు. ద్రోణుడు పన్నిన వ్యూహమునకు 1500 ధనుస్సుల దూరంలో దుశ్శాసనుడు, వికర్ణుడు, సైంధవుని రక్షించుటకు సిద్ధంగా

ఉన్నారు. ద్రోణాచార్యుడు శకటవ్యూహము మొదట్లో నిల్చున్నాడు. ఈ వ్యూహమును చూచి రారాజు సుయోధనుడు ఎంతో సంతోషించాడు.

కపిధ్వజము తన రథము మీద ఎగురుతుండగా అర్జునుడు రణ రంగము ప్రవేశించాడు. పాండవ సేనానాయకుడు ధృష్ట ద్యుమ్నుడు కౌరవ వ్యూహమునకు ప్రతి వ్యూహము పన్నాడు. ఇరు పక్షములలో యుద్ధభేరీలు మోగుతున్నాయి.

అందరి కంటే దుర్మర్షణుడు విజృంభించాడు. 'కృష్ణా! మన రథము దుర్మర్షణుడి వైపు తోలుము. ముందు వాడిని చంపి ఈ రోజుయుద్ధంలో వాడిని మొదటి కబళంగా భక్షిస్తాను.' అని అన్నాడు అర్జునుడు. కృష్ణుడు అర్జునుని రథమును దుర్మర్షణుడి వైపు పోనిచ్చాడు. దుర్మర్షణుడి ఏనుగుల సైన్యము అర్జునుని చుట్టు ముట్టింది. అర్జునుడు ఒక్కడే కదా అని అతనిని తమ తమ బాణములతో ముంచెత్తారు.

అర్జునుడు విజృంభించాడు. మరుక్షణంలో రణభూమి అంతా సైనికుల తలలతో ఏనుగుల కళేబరములతో నిండిపోయింది. కౌరవ సైన్యము కూడా అర్జునుని మీద శరవర్షము కురిపించింది. అర్జునుడు వారి శరములను మధ్యలో తుంచి. దుర్మర్షుణి ఏనుగుల బలమును,

ఆశ్వికబలమును, రధికులను ముక్కముక్కలుగా నరికాడు. దుర్మర్షణుడి సేనల యొక్క ధనుస్సులు విరిగాయి. రధములు నేలకూలాయి. అర్జునుడి శరముల ధాటికి తట్టుకోలేక దుర్మర్షణుడు పారిపోయాడు. అతని మిగిలిన సైన్యములు కూడా పారిపోయాయి.

ఇంతలో తన సేనలతో దుశ్శాసనుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. దుశ్శాసనుని చూడగానే అర్జునుడు కోపంతో ఊగి పోయాడు. గాండీవం సంధించాడు. ధారాపాతంగా అమ్ములవర్షం కురిపించాడు. ఏనుగులు అలాగే నిలబడిపోయాయి. వాటి మీద ఉన్న యోధుల తలలు మాత్రం తాటి పండ్ల మాదిరి తెగి పడుతున్నాయి. సైనికుల చేతులు కాళ్లు నేల మీద దొర్లు తున్నాయి.

దుశ్శాసనుడు తన సైన్యంతో సహా పారిపోతున్నాడు. అది చూచాడు అర్జునుడు. 'దుశ్శాసనా! నిలువుము. ఎక్కడికి పారిపోతావు. నీవు పారిపోతే చావు తప్పుతుందా! ఆనాడు కురు సభలో నీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడి అందరిని నొప్పించావుకదా! దానికి ఫలితం అనుభవించవా! ' అంటూ దుశ్శాసనుని మీద పది బాణములు ప్రయోగించాడు. దుశ్శాసనుడు తిరిగి కూడా చూడకుండా ద్రోణాచార్యుని వద్దకు పారిపోయాడు.

కృష్ణుడు చెప్పగా  అర్జునుడు తన గురువుగారు ద్రోణాచార్యునికి చేతులెత్తి నమస్కరించాడు.   'ఓ భూసురోత్తమా! నాకు నా అన్న ధర్మరాజు, బావ శ్రీకృష్ణుడు ఎలాగో మీరూ అలాగే. నా శ్రేయోభిలాషులు. మీరు మీ కుమారుడు అశ్వత్థామను ఆదరించినట్లే నన్ను కూడా ఆదరించారు. నేను ఈ రోజు మీ వ్యూహములో ప్రవేశించి సైంధవుని చంపుతాను.  నన్ను దయతో కాపాడండి. నా ప్రతిజ్ఞ నెరవేరేట్టు చెయ్యండి. ' అని ప్రార్థించాడు.

'అర్జునా! నేను ఇక్కడ ఉండగా నీవు సైంధవుని ఎలా చంపుతావు?' అంటూ అర్జునుని మీద బాణవర్షము కురిపించాడు. ముందు గురువుగారు బాణములు వెయ్యగానే అర్జునుడు కూడా విజృంభించాడు. ద్రోణుని తొమ్మిది బాణములతో కొట్టాడు. వాటిని మధ్యలోనే త్రుంచి ద్రోణుడు అర్జునుని మీద కృష్ణుని మీద శరపరంపర కురిపించాడు. ద్రోణుడు అర్జునుని విల్లు త్రాడు తుంచాడు. అర్జునుని రథాన్ని తన బాణ వర్షముతో కప్పివేసాడు.

అర్జునుడు తన వింటి నారిని బిగించుకున్నాడు. ద్రోణాచార్యుని వదిలి అతని సైన్యమును ఎదుర్కొన్నాడు. గాండీవంనుండి

వెలువడుతున్న బాణ సమూహములు కురు సైన్యమును తుత్తునియలు చేస్తున్నాయి. ద్రోణుడు అర్జునునికి అడ్డుపడి అతని బాణములు తన సైన్యమును తాకకుండా అడ్డుకుంటున్నాడు. మరలా అర్జునుని రథమును తన బాణసమూహముతో కప్పివేసాడు.

అర్జునుడు ద్రోణుని దాటి ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేక పోయాడు. అప్పుడు కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. 'అర్జునా! ద్రోణుని మీద కోపం వదిలిపెట్టు. అతనిని వదిలి పెట్టు. ముందు శకట వ్యూహంలోకి ప్రవేశించు.' అని చెప్పాడు.

'అలా గే కృష్ణా! మన రథమును శకట వ్యూహము వైపుపోనిమ్ము' అన్నాడు అర్జునుడు.

తనను తప్పుకొని పోతున్న అర్జునుని చూచి ద్రోణుడు నవ్వి 'అర్జునా! ఇదేమిటయ్యా! యుద్ధం చేస్తున్నవాడిని వదిలి పక్కకు వెళతావెందుకు. శత్రువును చంపవా! ' అని అడిగాడు.

'ఆచార్యా! మీరు నాకు గురువు గారు. శత్రువు కాదు. అయినా మిమ్మల్ని ఓడించి చంపడం ఆ ఈశ్వరునికే సాధ్యం కాదు. నేనెంత! '

అంటూ పక్కకు వెళ్లాడు. అర్జునుడు, అతని చక్ర రక్షకులు యుధామన్యుడు, ఉత్తమౌజుడు శకటవ్యూహంలోకి ప్రవేశించారు.

అక్కడే ఉన్న కృతవర్మ, కాంభోజరాజు, శ్రుతాయువు అర్జునుని చూచారు. కృతవర్మ కృష్ణార్జునుల మీద ఇరవై అయిదు బాణములు ప్రయో గించాడు. అర్జునుడు కృతవర్మ ధనుస్సును విరిచాడు. కృతవర్మ మీద ఇరవై ఒక్క బాణములు వేసాడు. కృతవర్మ మరొక విల్లు తీసుకున్నాడు. అర్జునుని గుండెలకు గురిపెట్టి పది బాణములు వేసాడు.

కృష్ణుడు అర్జునునితో 'అర్జునా! కృతవర్మ మీద జాలి ఎందుకు అతనిని చంపు.' అన్నాడు.

వెంటనే అర్జునుడు కృతవర్మను మూర్ఛిల్లునట్టు చేసాడు. అర్జునుడు ముందుకుపోతున్నాడు. ఇంతలో కృతవర్మ లేచి అర్జునుని చక్రరక్షకులను అడ్డుకున్నాడు. వారుకూడా కృతవర్మ విల్లు ముక్కలు చేసారు. కృతవర్మ వేరు విల్లు తీసుకొని ఉత్తమౌజుడు, యుధామన్యుని విల్లులు రెండింటినీ త్రుంచాడు. వారు మరొక విల్లు తీసుకొని కృతవర్మ వేయు బాణములను అడ్డుకున్నారు. కాని వారు కృతవర్మను దాటి అర్జునుని చేరలేకపోయారు.

ముందుకు దూసుకుపోతున్న అర్జునుని శ్రుతాయుధుడు ఎదుర్కొన్నాడు. కృష్ణార్జునుల మీద బాణములు సంధించాడు. అర్జునుని పతాకమును తుంచాడు. అర్జునుని మీద 90 బాణములను వర్షంగా కురిపించాడు. అర్జునుడు కోపించి శ్రుతాయుధుని విల్లు తుంచి అతని గుండెలకు గురిపెట్టి ఏడు బాణములను వేసాడు. శ్రుతాయుధుడు వేరొక విల్లు తీసుకొని తొమ్మిది బాణములను అర్జునుని గుండెలకు గురి పెట్టి కొట్టాడు. అర్జునుడు శ్రుతాయుధుని సారధిని చంపాడు. అతని అశ్వములను చంపాడు. అతని శరీరం అంతా తూట్లు పడేట్లు కొట్టాడు.

శ్రుతాయుధుడు రధము దిగి భయంకరమైన తన గదను తీసుకున్నాడు. శ్రుతాయుధుడు వరుణుని కుమారుడు. ఆ గద అతనికి వరుణుడు ఇచ్చాడు. దానికి ఒక గుణము ఉంది. దానిని ధరించిన వాడు అజేయుడు. దానిని ఎవరి మీద ప్రయోగించినా అది ఎదుటి వానిని చంపుతుంది. ఆ గదను యుద్ధమునకు సిద్ధముగా లేని వాడి మీద, నిరాయుధుని మీద ప్రయోగిస్తే, అది వాడిని చంపడానికి బదులు, తిరిగి వచ్చి దానిని విసిరిన వాడిని చంపుతుంది.

ఆవేశంలో ఈ విషయం శ్రుతాయుధునకు గుర్తు రాలేదు. ఆ గదను శ్రీ కృష్ణుని మీద ప్రయోగించాడు. కేవలం సారథిగా ఉన్న శ్రీకృష్ణుని ఆ గద ఏమీ చెయ్యలేక పోయింది. తిరిగి వచ్చి శ్రుతాయుధుని వధించింది. అది చూచిన అతని సైన్యము పారిపోయింది.

ఆసమయంలో అక్కడే ఉన్న కాంభోజరాజు అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు కాంభోజరాజు ఒకరి మీద ఒకరు శరప్రయోగం చేసుకున్నారు. అర్జునుడు అతని సారథిని, హయములను చంపాడు. అతని విల్లు విరిచాడు. అతని కేతనము విరుగ గొట్టాడు. పదునైన నారసములతో అతని గుండెలు పగుల గొట్టాడు. ఆ దెబ్బకు కాంభోజరాజు నేలకూలి మరణించాడు.

కాంభోజరాజు మరణించగానే, శూరసేనుడుచ శిబి, వసాతి మొదలగు మహారాజులు అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుడు తన బాణములతో వారి నందరినీ యమలోకానికి పంపాడు. ఇంతలో శ్రుతాయువు, ఆయుతా యువు అర్జునుని మీద బాణపరంపర కురిపించారు. అర్జునుడు ఇంద్రాస్త్రము ప్రయోగించాడు. శ్రుతాయుడు, ఆయుతాయువు మరణించారు.

ఇదిచూచిన సుయోధనుని ఆదేశము మేరకు, కళింగులు, దాక్షిణాత్యులు, ఆటవికులు కలిసి వారి వారి గజబలములతో అర్జునుని ఎదుర్కొన్నారు. అప్పుడు అర్జునుడు ఆ ఏనుగుల సమూహమును చించి చెండాడాడు. తొండములు , కాళ్లు తెగిన ఏనుగులు, మావటీ వాళ్లు నేల మీద పడి దొర్లుతున్నారు.

యవనుడు, పారదులు, శకులు మొదలగు వారు అర్జునుని ఎదుర్కొన్నారు. వారినందరినీ తన బాణపరంపరతో అర్జునుడు అంతమొందించాడు.

అంబష్ఠ దేశపు రాజు శ్రుతాయువు అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు శ్రుతాయువు వింటిని విరిచాడు. హయములను చంపాడు. శ్రుతాయువు తన గదతో శ్రీ కృష్ణుని కొట్టాడు. అర్జునుడు ఆ గదను విరగ్గొట్టాడు. మరొక బాణముతో శ్రుతాయువు తల తెగ నరికాడు.

అర్జునుని పరాక్రమమును చూచిన సుయోధనుడు ద్రోణుడి వద్దకు పోయి 'ఆచార్యా! నిన్నుకూడా లక్ష్యపెట్టకుండా అర్జునుడు నిన్ను దాటి వెళ్లాడు. అందరినీ చంపుతున్నాడు. మీరు ఏమీ చెయ్యడం లేదు. అర్జునుని వంక కూడా చూడటం లేదు. తమరు నాకు ఇచ్చిన

వరం ఏమైనట్టు? సైంధవుడు మిమ్ము నమ్ముకొని ఎచ్చటకూ పోకుండా నిలిచాడు. కాని మీరు అతనిని రక్షించు ప్రయత్నం చెయ్యటం లేదు. ఎందుకని? అర్జునుని చేతిలో అతని చావు చూడాలనా? అసలే మీరు మనుషులేనా! అని అనుమానం వస్తూ ఉంది. అటు చూడండి. సైంధవునికి అండగా ఉండి రక్షిస్తున్న రధికులందరూ పారిపోతున్నారు. నా మనసుకు చాలా బాధగా ఉండి ఇలా మాట్లాడు తున్నాను. దయచేసి సైంధవుని రక్షించండి. ' అని ప్రార్ధించాడు.

ద్రోణుడు సుయోధనుని చూచి నవ్వి 'సుయోధనా! నీ మాటలకు అశ్వత్థామ మాటలకు నేను కోపిస్తానా! శ్రీకృష్ణుని తలంపు కంటే అతని గుర్రాలు వేగంగాపరుగెత్తుతున్నాయి. వెనక నున్న అర్జునుడు అంత కంటే వేగంగా బాణాలు వేస్తున్నాడు వాటిని నేను ఆపగలనా! ఇంకొక మాట. నేను ఈ స్థానం విడిచి అర్జునుని వెంట బడితే, ఇక్కడ సైన్యం అల్లకల్లోలం అవుతుంది. అప్పుడు సైంధవుని కాపాడటం కష్టం. అందుకని నేను సేనా ముఖం నుండి కదలడం లేదు. పైగా నేను ధర్మరాజును బంధిస్తానని చెప్పాను. ఆ తరుణం కోసం వేచి ఉన్నాను. నేనా వృద్ధుడిని. వడి వడి గా పరుగెత్తలేను. నువ్వు అర్జునుడు సమవయస్కులు. అందువలన నువ్వు అర్జునుని ఎదుర్కొని పోరాడు.' అని చెప్పాడు ద్రోణుడు.

'ఆచార్యా! నిన్ను కృతవర్మను గెలిచి ముందుకు దూసుకుపోతున్న అర్జునుని ఎదుర్కొనడం సామాన్యమా చెప్పు. తమరు చెబుతున్నారు కాబట్టి నేను పోయి అర్జునుని ఎదుర్కొంటాను.' అని అన్నాడు సుయోధనుడు. ఆ మాటలకు సంతోషించాడు ద్రోణుడు.

'సుయోధనా! నీకు కవచధారణ విద్యను ఉపదేశిస్తాను. ఈ కవచధారణతో నీవు రక్షింప బడతావు. అర్జునుడు వేసిన శరములు నీ ఒంటిని తాకవు' అని ఒక బంగారు కవచము మీద కవచధారణ శక్తిని ఆవహింపచేసాడు ద్రోణుడు. ఆ కవచమును సుయోధనునికి ఇచ్చాడు.

'సుయోధనా! తొలుత ఈ కవచ ధారణ విద్యను దేవతల సంరక్షణార్ధము బ్రహ్మదేవుడు దేవేంద్రునికి ఇచ్చాడు. దేవేంద్రుడు దానిని అంగిరసునకు ఇచ్చాడు. అంగిరసుడు బృహస్పతికి, బృహస్పతి అగ్నివేశునకు, అగ్నివేశుడు దానిని ద్రోణునికి అంటే నాకు ఇచ్చాడు. దానిని ఇప్పుడు నేను నీకు ఇస్తున్నాను. ఇది ధరించి విజయుడవు కమ్ము' అని దీవించాడు. సుయోధనుడు ఆ కవచ ధారణ చేసి అర్జునునితో యుద్ధ ము నకు సన్నద్ధమయ్యాడు.

కురు పాండవ సైన్యములు ఒకరికి ఒకరు తీసిపోకుండా పోరాడు తున్నాయి. పోరు ఘోరమయింది. ద్రోణుడు, ధృష్టద్యుమ్నులు. ఒకరితో ఒకరు యుద్ధం చేస్తున్నారు. ధృష్టద్యుమ్నుని పరాక్రమానికి కౌరవ సేనలు పీనుగు పెంటలవుతున్నాయి. అతని ముందు నిలిచి యుద్ధం చేయుటకు ఎవ్వరికీ ధైర్యం చిక్కడం లేదు.

ఇది చూచి ద్రోణుడు మహా కోపంతో పాంచాల, కేకయ సేనలను ఎదుర్కొన్నాడు. ఇంతలో తన సోదరులతో సహా ధర్మరాజు ధృష్టద్యుమ్నునికి సాయంగా వచ్చాడు. వాళ్లను చూచి, వికర్ణుడు, వివింశతి, చిత్ర సేనుడు భీముని, బాహ్లికుడు ఉప పాండవులను, దుశ్శాసనుడు సాత్యకిని, శకుని నకుల సహదేవులను, సోమదత్తుడు శిఖండిని, అలంబసుడు ఘటోత్కచుని ఎదుర్కొన్నారు.

శల్యుడు మాత్రం సైంధవుని పక్కనే ఉండి అతనిని రక్షిస్తున్నాడు. కాని చేతులు ఊరుకోక అక్కడే ఉన్న ధర్మరాజును ఎదు ర్కొన్నాడు. దుశ్శాసనుడు సాత్యకిని మూర్ఛపోయేట్టు కొట్టాడు. కాని వెంటనే సాత్యకి తేరుకొని దుశ్శాసనుని తరిమి తరిమి కొట్టాడు. నకుల సహదేవుల పరాక్రమానికి తట్టుకోలేక శకుని పరుగెత్తిపోయి ద్రోణుని వెనక

దాక్కున్నాడు. ద్రోణుడు ధృష్టద్యుమ్నుని, భీముని ధర్మరాజును ఎదుర్కొన్నాడు.

కురు పాండసైన్యములు ఆ విధంగా ఘోరంగా పోరుతుంటే విరిగిన రథములు, ధనుస్తులు, సైనికుల చేతులు, కాళ్లు, చచ్చి పడిన గుర్రములు ఏనుగులు కుప్పలు కుప్పలుగా రణరంగమంతా పడి ఉన్నాయి. ద్రోణుడు తాను పన్నిన శకట వ్యూహము చెదర కుండా కాపాడుతున్నాడు.

ఇంతలో ధృష్టద్యుమ్నుడు తన రథమును ద్రోణుని రథముతో ఢీ కొట్టాడు. వెంటనే తన కత్తి, డాలు తీసుకొని తన రథము మీద ఉండి ద్రోణుని రథము మీదికి దుమికాడు. క్షణమాత్రములో జరిగిన ఈ పరిణామ మునకు జంకక ద్రోణుడు ధృష్టద్యుమ్నుని కత్తిని ముక్కలు చేసాడు. డాలును విరిచాడు. అతని రథసారధిని, రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. ధృష్టద్యుమ్నుని కేతనము విరిచాడు. ధృష్టద్యుమ్నుని మీదికి ఒక క్రూర నారసము ప్రయోగించాడు. దానిని సాత్యకి మధ్యలోనే ఖండించాడు. ధృష్టద్యుమ్నుని రక్షించాడు. ధృష్టద్యుమ్నుని రథం ఎక్కాడు. ఆ ఇరువురూ అక్కడి నుండి పక్కకు తప్పుకున్నారు.

చేతికి చిక్కిన ధృష్టద్యుమ్నుని తప్పించినందుకు సాత్యకి మీద ద్రోణునికి విపరీతంగా కోపం వచ్చింది. వెంటనే ద్రోణుడు సాత్యకి మీదికి దూకాడు. సాత్యకి కూడా తనరథమును ద్రోణుని మీదికి పోనిచ్చాడు. ద్రోణుడు సాత్యకి ఒకరితో ఒకరు ఘోరంగా యుద్ధం చేస్తున్నారు. ఆ యుద్ధంలో కేతనములు విరుగుతున్నాయి. రథములు కూలుతున్నాయి. సైనికుల శరీరాలు నేలమీద దొర్లుతున్నాయి.

అప్పుడు సాత్యకి ద్రోణుని విల్లు విరిచాడు.ద్రోణుడు మరొక విల్లు తీసుకొని సంధించే లోపల దానినీ విరిచాడు సాత్యకి. ఆ ప్రకారం ద్రోణుడు ఎన్ని విల్లులు తీసుకున్నా వాటిని అన్ని విరిచాడు సాత్యకి. పట్టువీడని ద్రోణుడు మరొక విల్లు తీసుకొని అమిత వేగంగా బాణములు సాత్యకిమీద ప్రయోగిం చాడు. వాటిని అన్నింటిని తుత్తునియలు చేసాడు సాత్యకి. ఇది పనికాదని ద్రోణుడు ఆగ్నేయాస్త్రము ప్రయోగించాడు. అది ప్రళయభీకర జ్వాలలతో ఆకాశం అంతా నిండుకుంది. ఇంతలో సాత్యకి వారుణాస్త్రము వేసి ఆగ్నేయాస్త్రమును నిర్వీర్యము చేసాడు.

ఇంతలో  ధర్మరాజు, భీముడు, నకులుడు, సహదేవుడు సాత్యకికి బాసటగా నిలిచి యుద్ధం చేస్తున్నారు. దుశ్శాసనుడు మొదలగు వారు ద్రోణునికి బాసటగా నిల్చి యుద్ధం చేస్తున్నారు.

అక్కడ అర్జునుడు తాను వెళ్లే మార్గంలో సైనికులను హతమారుస్తూ  సైంధవుని కోసం ముందుకు  దూసుకు వెళ్తున్నాడు. ఇంతలో విందాను విందులు తమ తమ సైన్యములతో  అర్జునుని చుట్టుముట్టారు.  అర్జునుని మీద, కృష్ణుని మీద  శరవర్షము కురిపించసాగారు.  అర్జునుడు వారి ధనుస్సులను విరిచి. వారి పతాకములను విరగగొట్టి, వారి రధాశ్వములను చంపాడు.  ముందుగా ఒక బల్లెముతో  విందుని తల తెగ నరికాడు.

అన్నగారి మరణము చూచి కోపంతో ఊగిపోయాడు అనువిందుడు.  అనువిందుడు తన గదను తీసుకున్నాడు. రధం దిగాడు. వేగంగా అర్జునుని రధం సమీపించి తన గదను శ్రీకృష్ణుని మీదికి విసిరాడు. అర్జునుడు ఆ గదను విరిచాడు. మరొక బాణముతో అనువిందుని శిరస్సు ఖండించాడు.  విందాను విందులు మరణించగానే వారి సేనలు అర్జునుని చుట్టుముట్టాయి.  అర్జునుడు వారినందరినీ  తన శరాఘాతములతో తరిమి తరిమి కొట్టాడు.

అప్పటికి అర్జునుడు అలసి పోయాడు. రథాశ్వములు కూడా అలిసి పోయాయి. సైంధవుడు కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ పరిస్థితి చూచి కౌరవ సేనలు సింహనాదాలు చేస్తూ పాండవ సేనలను తరుము తున్నాయి.

'కృష్ణా! నేను వీరిని నిలువరిస్తాను. నీవు రథమును ఆపి గుర్రము లకు విశ్రాంతినిమ్ము' అని అన్నాడు. అర్జునుడు రథము దిగి గాండీవముతో కౌరవ సేనల ఎదురుగా నిలబడ్డాడు. ఇదే అదననుకొని కౌరవ యోధులు అర్జునుని మీద బాణ వర్షము కురిపించారు. వాటిని మధ్యలో తుంచి, అర్జునుడు వారి మీద శరప్రయోగం చేసాడు. సముద్ర తరంగముల వలె తన మీదికి వస్తున్న కౌరవ సేనలను చెలియలి కట్ట వలె నిలువరిస్తున్నాడు అర్జునుడు. అర్జునుడు తన భల్ల బాణములతో రథములను ముక్కలు చేస్తున్నాడు. అర్ధ చంద్ర బాణములతో ఏనుగులను చంపుతున్నాడు. క్రూర నారాచములతో హయములను నేలబడదోస్తున్నాడు. రణరంగమంతా మాంస ఖండముల తోనూ, తెగి పడిన తలలతోనూ ఏనుగుల, అశ్వముల కళేబరములతో నిండిపోయింది.

అప్పుడు కృష్ణుడు అర్జునునితో 'అర్జునా! మన గుఱ్ఱములు సేద దీరాయి కాని వాటికి దాహం వేస్తూ ఉంది. అవి నీరు తాగితే గాని తెప్పరిల్లవు ఎలాగా!' అని అడిగాడు.

'దానికేముంది కృష్ణా! ఇదుగో! ఇప్పుడు ఇక్కడే నీరు తెప్పిస్తాను' అని అక్కడి కక్కడే భూమిని చీల్చి, ఒక కొలను ఏర్పరిచి, దానిని నీటితో నింపాడు. అది చూచి కౌరవ సేనలు ఆశ్చర్యపోయారు. శ్రీకృష్ణుడు అర్జునుని ప్రశంసించి, రధాశ్వములను నీరు త్రావించాడు. తరువాత వాటిని రధమునకు కట్టి రధము సిద్ధం చేసాడు. అర్జునుడు రధం ఎక్కాడు. కృష్ణుడు నొగల మీద కూర్చున్నాడు.

అంతలో దూరంగా సుయోధనుడు కనిపించాడు. కృష్ణుడు రధం సుయోధనుని వంకకుపోనిచ్చాడు. అది చూచిన కౌరవ యోధులు తమలో తాము ఇలా అనుకున్నారు. 'ఇప్పటిదాకా కౌరవ సేనలను పీనుగు పెంటలు చేసాడు. ఇప్పుడు సుయోధనుని మీదికి వెళుతున్నాడు. ఏమవుతుందో ఏమో' అని అనుకుంటున్నారు. అర్జునుని ఎదుర్కొనే వీరుడే లేకపోయాడు. ఇంతలో పొద్దు వాలడం గమనించారు. పాంచజన్య దేవదత్తములు పూరించారు. ఆ ధ్వనికి కౌరవ రాజుల గుండెలు జారి

పోయాయి. సైంధవుని సంగతి దేవుడెరుగు తమ ప్రాణాలు రక్షించు కోవాలి అని సైంధవుని రక్షణ వలయం నుండి తొలగిపోయారు.

'కృష్ణా! అదుగో సైంధవుడు. వాడికి చుట్టు కృపాచార్యుడు, శల్యుడు, అశ్వత్థామ, బాహ్లీకుడు, కర్ణుడు, కర్ణుని కుమారులు రక్షణగా నిల్చి ఉన్నారు. వీళ్లందరూ సైంధవుడిని ఏమి రక్షిస్తారు. వాడి చావు నా చేతిలో మూడింది . వీ రే కాదు, దేవతలు దండెత్తి వచ్చినా ఈరోజు పొద్దు కుంకేలోపల వీడిని చంపి తీరుతాను.' అని అన్నాడు అర్జునుడు.

అమిత శౌర్యంతో దూసుకువస్తున్న అర్జునుని చూచి కౌరవ యోధులు సైంధవుని మీద ఆశలు వదులుకున్నారు. అర్జునునికి సైంధవుడు కనపడ్డాడు. అర్జునుడు సింహనాదం చేసాడు. సైంధవుని వైపు రధం పోనిచ్చాడు కృష్ణుడు. ఇంతలో ద్రోణుడు ఇచ్చిన కవచధారణతో భయం తొలగిన సుయోధనుడు అర్జునుడిని ఎదుర్కొన్నాడు.

సుయోధనుడు అర్జునుని ఎదుర్కొనడం చూచి కౌరవ సేన ఉత్సాహంతో అర్జునుని చుట్టుముట్టారు. ఆ విధంగా తమ ఎదుట నిలిచిన సుయోధనుని చూచి కృష్ణుడు అర్జునునితో ఇలాఅన్నాడు.

'అర్జునా! ఈ సుయోధనుడు మన మీద నిరంతర శత్రుత్వముతో, కోపంగా ఉన్నాడు. ఇప్పుడు మనకు, సుయోధనునికి మధ్య జరిగే జూదంలో సైంధవుడు పందెం గా ఉన్నాడు. ఈ సుయోధనుని జయించి అతనికి మనమీద ఉన్న కోపం నిర్మూలించు. అసలు మీకు కలిగిని ఆపదలకు అన్నింటికి మూలకారణము ఈ సుయోధనుడే. ధర్మరాజును మాయా ద్యూతంలో ఓడించి అతనిని అవమానించిన పాపాత్ముడు ఇతడే. మీ భార్య ద్రౌపదిని నిండుకొలువులో మానభంగమొనరించిన దురాత్ముడు వీడే. వీడికి నీ పరాక్రమము రుచి చూపించు. ఇది నీకు శుభం చేకూరుస్తుంది.

అర్జునా! నీ పరాక్రమము తెలిస్తే వీడి నీ జోలికి రాడు. వీడు నీ ఎదుటికి రావడం మనకు దైవమిచ్చిన వరం. దీనిని సద్వినియోగం చేసుకో. వీడి తల వెంటనే నరుకు. వీడు చస్తే కాని మన పీడ వదలదు.

అర్జునా! వీడు నీ ఎదురుగా నిల్చి నీ గాండీవానికి ఎర గావడం నీ పూర్వజన్మ సుకృతము. సందే హించకు. ఈ సుయోధనుడు మరణించగానే అతని సైన్యము చెదరిపోతుంది. మనము సైంధవుని తరిమి తరిమి చంపవచ్చు. ' అని పలికాడు కృష్ణుడు.

'కృష్ణా! ఇతడు మమ్ములను, ద్రౌపదిని పెట్టిన కష్టములు ఎలా మరిచిపోతాను. సత్వరమే వీడిని చంపి మా పగ తీర్చుకుంటాను. కృష్ణా! మన రథములు సుయోధనునికి ఎదురుగా తోలుము.' అని అన్నాడు.

సుయోధనుడు కూడా అమితమైన గర్వంతో అర్జునునికి ఎదురుగా వెళ్లాడు. కృష్ణార్జునులు తమ తమ శంఖములు పూరించారు. కృష్ణార్జునుల ఆవేశాన్ని కనులారా చూచిన కౌరవసైనికులు ఈరోజు సుయోధనుడు అర్జునుని చేతిలో చచ్చాడు అని అనుకున్నారు.

సుయోధనుడు అర్జునుని చూచి 'ఓ అర్జునా! నీ వద్ద దివ్యాస్త్రములు ఉన్నవి కదా అని ఇప్పటిదాకా విర్రవీగుతున్నావు. ఈ రోజుతో ఆ పేరు చెల్లిపోయింది. నీ బలము, కృష్ణుని నేర్పరితనము చూచుటకు నీతో యుద్ధానికి వచ్చాను. నీవు నిజంగా పాండురాజుకు పుట్టిన వాడివైతే నీ శౌర్యము ప్రతాపము, నీ అస్త్ర కౌశలము చూపించు.' అని అతి క్రూరమైన నారాచములు అర్జునుని మీద ప్రయోగించాడు సుయోధనుడు. నాలుగు బాణములతో అర్జునుని హయములను కొట్టాడు. పది బాణములతో కృష్ణుని కొట్టాడు.

అది చూచి కోపంతో ఊగిపోయాడు అర్జునుడు. సుయోధనుని మీద 14 నిశితములైన బాణములను ప్రయోగించాడు. ఆ బాణములు సుయో ధనుని శరీరము తాకి కిందపడుతున్నాయి. అర్జునుడు మరలా 21 బాణ ములు ప్రయోగించాడు. అవి కూడా వ్యర్థమయ్యాయి. ఇది చూచాడు కృష్ణుడు.

'అర్జునా! ఏమిటీ నీ శరములు అన్ని వ్యర్థమవుతున్నాయి. ఆశ్చర్యంగా ఉందే? ఏమి కారణము? నీ చేతులలో బలం తగ్గిందా? లేక నీ శర కౌశలము చచ్చిపోయిందా? నిజం చెప్పు! అర్జునా! ఏమయింది. నీవు వదిలిన ఒక్కొక్క బాణము పిడుగు పాటు మాదిరి శత్రువులను తునుమాడుతుందే! ఇదేమిటి నీ శరములు అన్ని నిర్వీర్యమవుతున్నయి. నాకు విస్మయము, కలత రెండూ కలుగుతున్నాయి.' అని అన్నాడు కృష్ణుడు.

'కృష్ణా! నా చేతిలో బలము తగ్గలేదు. నా శరముల వాడి వేడి తరగ లేదు. ఇది కవచధారణ విద్య. ఇది ఒక్క ద్రోణుని మాత్రము తెలియును. దానిని నాకు మాత్రం నేర్పాడు. ఇప్పుడు సుయోధనునికి నేర్పాడు. ఇదంతా కవచధారణ ప్రభావమే కాని వేరు కాదు. ఆ కవచము బేధించుటకు ఎవరికీ తరము కాదు.

కాని కృష్ణా! వీడు కవచము మాత్రం తొడుక్కున్నాడు కాని దాని గురించి సుయోధనునికి ఏమీ తెలియదు. నువ్వు చూస్తూ ఉండు. నా గాండీవము శక్తి, నా పరాక్రమము చూడు. సుయోధనుడు కవచధారణ చేసినప్పటికినీ వాడిని ముప్పుతిప్పలు పెడతాను.

కృష్ణా! అంగిరసుడు దేవేంద్రునికి ఒక మహాస్త్రము ఇచ్చాడు. దానిని దేవేంద్రుడు నాకు ఇచ్చాడు. అది నిఖిలకవచభేద్యము. అంటే ఎటువంటి కవచమునైనా అది చీలుస్తుంది. దానికి తిరుగులేదు. నేను సుయోధనుని మీద ఆ మహాస్త్రము ప్రయోగించి అతడు తొడుక్కున్న కవచమును చీలుస్తాను.' అని పలికాడు.

వెంటనే అర్జునుడు తనకు దేవేంద్రుడు ఇచ్చిన మహాస్త్రాన్ని గాండీవం లో సంధించాడు. మంత్రం జపించాడు. ఇది చూచాడు అశ్వత్థామ. రాబోయే ప్రమాదాన్ని పసికట్టాడు. వెంటనే ఆ మహాస్త్రము ప్రయోగించక ముందే తన బాణంతో ఆ మహాస్త్రమును తుత్తునియలు చేసాడు. అర్జునుడు హతాశు డయ్యాడు. కృష్ణుని వంక చూచాడు.

'కృష్ణా! అశ్వత్థామ నా మహాస్త్రమును నిర్వీర్యము చేసాడు. దానిని మరల ప్రయోగిస్తే నాకే కీడు చేస్తుంది. నేను నా అస్త్రములనే

నమ్ముకుంటాను.' అని అంటూ ఉండగానే సుయోధనుడు ఒక్కొక్కరిని తొమ్మిదేసి బాణముల చొప్పున కృష్ణార్జునులను కొట్టాడు. సింహనాదం చేసాడు.

అర్జునునికి కోపం వచ్చింది. ఇంక ఉపేక్షించి లాభం లేదనుకున్నాడు. సుయోధనుని సారధిని, రధాశ్వములను చంపాడు. అతని కేతనం విరిచాడు. అతని అరిచేతులలో బాణములు గుచ్చాడు. గాయపడ్డ సుయోధనుడు ఖిన్నుడయ్యాడు. ఈ కవచం బాగులేదని దానిని విడిచి మరో కవచం తొడుక్కున్నాడు. ఇది చూచిన అతని సైన్యాధిపతులు ముందుకు దూకి అర్జునుని చుట్టుముట్టారు.

అర్జునుడు విజృంభించాడు. రధములు విరుగుతున్నాయి. అశ్వములు నేలకూలుతున్నాయి. ఏనుగుల కుంభస్థలములు పగులుతున్నాయి. సైనికుల తలలు బంతుల్లా ఎగురుతున్నాయి. రణరంగమంతా భీభత్సంగా తయార యింది. కౌరవసైన్యం భయంతో పారిపోయింది. ఇంతలో సింధురాజు అయిన సైంధవుని రక్షిస్తున్న సైన్యము సింహనాదాలు చేసారు. వారి ఉత్సాహాన్ని గమనించాడు అర్జునుడు. సుయోధనుని మీదికి తన రధం పోనిచ్చాడు.

ఇంతలో సుయోధనునికి రక్షణగా ఉన్న ఎనిమిది మంది యోధులు కృష్ణార్జునుల మీదికి వచ్చారు. ఆ ఎనిమిది మంది వృషసేనుడు, శలుడు, కృపాచార్యుడు, కర్ణుడు, అశ్వత్థామ, శల్యుడు, భూరిశ్రవసుడు మొదలగువారు. ఈ ఎనిమిది మంది ఒక్కుమ్మడి అర్జునుని మీదికి దూకి అతనిని తరమ సాగారు. అప్పుడు అర్జునుడు తన దేవదత్తమును పూరించాడు. ఆ యోధులను దాటుకొని సైంధవుడు ఉన్న దిక్కుకు పోతున్నాడు.

అది గమనించి మిగిలిన వారు అర్జునుని మీద శరవృష్టి కురిపించారు. అశ్వత్థామ రెచ్చిపోయాడు. 73 బాణములతో కృష్ణుని, మూడు బాణములతో అర్జునుని కొట్టాడు. అర్జునుని కేతనమును విరిచాడు. అర్జునుడు కోపించి 106 బాణములను అశ్వత్థామ మీద ప్రయోగించాడు. పది బాణములతో కర్ణుని కొట్టాడు. వృషసేనుని మీద మూడు బాణములు ప్రయోగించాడు. ఒకే ఒక బాణంతో శల్యుని విల్లు విరిచాడు. శల్యుడు మరొక విల్లు తీసు కున్నాడు. అర్జునుని మీద తొమ్మిది బాణములు ప్రయోగించాడు. కర్ణుడు 32 బాణములు, భూరిశ్రవసుడు, వృషసేనుడు 5బాణములు, కృపాచార్యుడు 10 బాణములు, అశ్వత్థామ 60 బాణములు అర్జునుని మీద ప్రయోగించారు. అంతే కాకుండా అనేక దివ్యాస్త్రములు కృష్ణార్జునుల మీద ప్రయోగించారు.

సైంధవుడు వారి చాటున  నిలబడి తన వంతుగా 73 బాణములు అర్జునుని మీద వదిలాడు.

ఇది చూచి అర్జునునికి కోపం, నవ్వు ఒకేసారి వచ్చాయి. కర్ణుని మీద 12బాణములు, అతని కుమారుడిమీద 3 బాణములు ప్రయోగించాడు. ఒకే ఒక బాణంతో శల్యుని విల్లు తుంచాడు. వెంటనే తొమ్మిది బాణములతో శల్యుని కొట్టాడు. 3 బాణములతో భూరిశ్రవసుని, 8 బాణములతో అశ్వత్థామను, 22 బాణములతో కృపాచార్యుని, నొప్పించాడు. మరొక 20 బాణములు అశ్వత్థామ శరీరం అంతా గుచ్చాడు.

సైంధవుడు కనపడినప్పుడల్లా అతని మీద బాణప్రయోగం చేస్తున్నాడు. సైంధవుడు అర్జునుని కంటపడకుండా వారి వెనుక దాక్కుంటున్నాడు. చెదిరి పోయిన కౌరవ సైన్యము ఒకరికి ఒకరు ధైర్యం చెప్పుకుంటూ ఒక చోట కూడు కొని అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుడు వారి నందరినీ తన బాణములకు ఎరగా వేసాడు.

( ఇక్కడ తిక్కన, పాండవ, కౌరవ యోధుల కేతనముల గురించి చెప్పాడు. అర్జునునికి హను మంతుడు(కపిధ్వజము), అశ్వత్థామకు సింహము దాని తోక, కృపాచార్యునికి ఎద్దు, కర్ణునికి ఏనుగు, వృ షసేనునికి పెద్ద నెమలి, శల్యునికి హలము (నాగేలు అనగా ప్లౌ) శలుడికి

బంగారు రంగులో ఉన్న ఏనుగు, భూరిశ్రవసునికి రత్నాలు పొదిగిన యూపస్థంభము ... యూపస్థంభమనగా యజ్ఞములు చేసే టప్పుడు ఇదివరకు మేకలను బలి ఇచ్చేవాళ్లు. ఆ మేకలను ఊపస్థంబమునకు కట్టేవాళ్లు......అంటే బలిపశువును కట్టే స్థంభము అని అర్థము, సైంధవునికి వెండి రంగులో ఉన్న వరాహము, సుయోధనునికి భయంకరమైన సర్పము దాని పడగ, కేతనములుగా ఉన్నాయి.)

అర్జునుడు ఉన్న చోట ఇలా ఉంటే. అక్కడ ధర్మరాజు, ద్రోణుడు ఉన్న రణ రంగమున పరిస్థితి భయంకరంగా ఉంది. యుద్ధం ఘోరంగా సాగుతూ ఉంది. ఆ యుద్ధంలో బృహత్ క్షత్రుడిని క్షేమధూర్తి, ధృ ష్టకేతుడిని వీర ధన్వుడు, నకులుడిని కర్ణుడు, సహదేవుడిని దుర్ముఖుడు, సాత్యకిని వ్యాఘ్రదత్తుడు ఎదుర్కొని వారితో యుద్ధం చేస్తున్నారు. శల్యుడు మాత్రం అటు శకట వ్యూహం దగ్గర నుండి ఇటు పద్మవ్యూహం దాకా అటు ఇటు తిరుగుతున్నాడు. మధ్యలో ఉపపాండవులతో యుద్ధంచేస్తున్నాడు.

అలంబసుడు భీమసేనుని ఎదుర్కొన్నాడు. ద్రోణాచార్యుడు ధర్మరాజుతో యుద్ధం చేస్తున్నాడు. ధర్మరాజు ద్రోణాచార్యుని శరీరములో 90 బాణము లను గుచ్చాడు. ద్రోణుడు 25 బాణములు ధర్మరాజు గుండెలకు గురిపెట్టి కొట్టాడు. ద్రోణుడు తన బాణములతో ధర్మరాజు

రథమును ముంచెత్తాడు. ధర్మజుడు ద్రోణుడు వేసిన బాణములను నిర్వీర్యము చేసాడు. ద్రోణుడు కోపించి ధర్మజుని విల్లు తుంచాడు.

అది చూచిన వారందరూ ఈ రోజు ధర్మరాజు ద్రోణుని చేతిలో చిక్కిబందీ అయ్యాడు అని అనుకున్నారు. కాని ధర్మరాజు మరొక విల్లు తీసుకొని విజృం భించి ద్రోణుడు వేసిన బాణములనన్నింటినీ తుంచాడు. వెంటనే ద్రోణుని మీద శక్తి ఆయుధమును ప్రయోగించాడు. ధర్మరాజు ప్రయోగించిన శక్తి ఆచార్యుని దహించి వేస్తుంది అని అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ద్రోణుడు ఆ శక్తిని ఎదుర్కొనడానికి బ్రహ్మాస్త్రమును ప్రయోగించాడు. ద్రోణుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము ధర్మజుడు ప్రయోగించిన శక్తిని నిర్వీర్యము చేసింది. తిరిగి ఆ బ్రహ్మాస్త్రము ధర్మజుని వంకకు దూసుకుపోతూ ఉంది. ధర్మజుడు మరొక బ్రహ్మాస్త్రము ప్రయోగించి ద్రోణుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును నిర్వీర్యము చేసాడు. ధర్మజుడు ద్రోణుడి శరీరము మీద ఐదు బాణములను నాటాడు. ద్రోణుని విల్లు తుంచాడు. ద్రోణుడు ధర్మజుని మీదికి తన గదాయుధము విసిరాడు. ధర్మజుడు కూడా తన గదాయుధమును విసిరాడు. రెండుగదలు ఒకదానితో ఒకటి కొట్టుకొని నేలకూలాయి.

ద్రోణుడు ధర్మరాజు రథము విరగ్గొట్టాడు. సారథిని చంపాడు. రథాశ్వములను చంపాడు. ధర్మరాజు విరిగిన రథము దిగి నిరాయుధుడై చేతులెత్తి నిల్చున్నాడు. ద్రోణుడిలో దయార్ద్రరసము పెల్లుబికింది. ధర్మజుని చంపడానికి చేతులు రాలేదు. కాని ఆ కోపం చల్లారడానికి పక్కనే పాండవ బలములను కసిదీరా చంపాడు. ఇది చూచిన వారందరూ ధర్మరాజును ద్రోణుడు తప్పకుండా పట్టుకొని బందీ చేస్తాడు అని అనుకుంటూ ఉన్నంతలో ధర్మరాజు పరుగెత్తుకుంటూ వెళ్లి తన తమ్ముడు సహదేవుని రథం ఎక్కాడు. సహదేవుడు ధర్మరాజుతో సహా తన రథమును దూరంగా తీసుకొని వెళ్లాడు.

క్షేమధూర్తి అనే వాడు బృహత్క్షత్రుని వింటిని త్రుంచాడు. అతడు వేరొక వింటిని తీసుకొని క్షేమధూర్తి యొక్క రథాశ్వము లను చంపాడు. అతని కేతనము కూల్చాడు. సారథిని చంపాడు. మరొక బాణంతో క్షేమధూర్తి తలను నరికాడు.

ఇంతలో త్రిగర్తదేశాధిపతి వీరధన్వుడు ధృష్టకేతు యొక్క ధనుస్సు విరిచాడు. మరొక బాణంతో అతనిని చంపాడు. సహదేవుడు మరల రణ రంగమునకు తిరిగి వచ్చాడు. సుయోధనుని తమ్ముడు దుర్ముఖిని ఎదు ర్కొన్నాడు అతని రథాశ్వములను, సారథిని చంపాడు.

అతని శరీరము మీద 5 బాణములను గుచ్చాడు. దుర్ముఖి వెంటనే పక్కనే ఉన్న త్రిగర్త రాజ కుమారుడు నిరమిత్రుడి రధము మీదికి దూకి పారిపోయాడు. అది చూచి పాండవ సైన్యం హర్షధ్వానాలు చేసింది. కాని సహదేవుడు వారిని వదిలి పెట్టలేదు. నిరమిత్రుడిని తరిమి తరిమి చంపాడు.

వికర్ణుడు నకులుడి తో తలపడ్డాడు. కాని ఎక్కువసేపు నిలబడలేక పారిపోయాడు. వ్యాఘ్రదత్తుడు సాత్యకితో తలపడి అతనిని తన బాణ వర్షములో ముంచాడు. సాత్యకి కోపించి అతని సారధిని, రధాశ్వములను చంపాడు. వ్యాఘ్రదత్తుని తల నరికాడు.

శల్యుడు ద్రౌపదీ పుత్రులైన ఉప పాండవులను ఎదుర్కొన్నాడు, ఒక్కొక్కరిని ఐదేసిబాణములతో నొప్పించాడు. ఉపపాండవులందరూ శ ల్యుని ఒక్కమారుగా చుట్టుముట్టారు. అర్జునుని కుమారుడు శల్యుని రధాశ్వములను చంపాడు. భీముని కుమారుడు శల్యుని ధనుస్సును, ధర్మరాజు కొడుకు శల్యుని రధము పై ఉన్న కేతనమును, విరిచారు. నకులుడి కుమారుడు శల్యుని రధసారధిని చంపాడు.

భీముడు అలంబసునితో యుద్ధం చేస్తున్నాడు. అలంబసుని బాణధాటికి భీముడు మూర్ఛపోయాడు. కాని అంతలోనే తేరుకున్నాడు.

అలంబసుని శరీరం మొత్తం బాణములతో కొట్టాడు. కాని అలంబసుడు తన శరీరాన్ని పెంచాడు. ఆ బాణములు అతనిని ఏమీ చెయ్యలేకపోయాయి. అప్పుడు అలంబసుడు భీమసేనునితో ఇలా అన్నాడు.

'ఓ భీమసేనా! నా తండ్రి బకాసురుని చంపినప్పుడు నేను లేను. ఇప్పుడు రా! నీ ప్రతాపం చూపించు!' అని అరిచాడు. భీముడికి కోపం వచ్చింది. అలంబసుని మీద బ్రహ్మాస్త్రమును ప్రయోగించి అతనిని తరిమి తరిమి కొట్టాడు.

ద్రోణుడు సాత్యకి మొదలైన పాండవ వీరులను ఎదుర్కొన్నాడు. వారిని తన బాణ ప్రయోగముతో ముందుకు పోకుండా ఆపుతున్నాడు. ఇంతలో ఘటోత్కచుడు ద్రోణుని ఎదుర్కొన్నాడు. ఇది చూచి అలంబసుడు ఘటోత్కచుని ఎదుర్కొన్నాడు. తనకు అడ్డంగా ఉన్న సాత్యకిని పక్కకు నెట్టి ఘటోత్కచుడు అలంబసుని మీద శరవర్షము కురిపించాడు.

అలంబసుడు ఘటోత్కచుని మీద ఒక పెద్ద చక్రమును విసిరాడు. దానిని ఘటోత్కచుడు తన గదతో నుగ్గునుగ్గుచేసాడు. తన చక్రాయుధము నిరుపయోగం కావడంతో అలంబసుడు ఘటోత్కచుని

మీద అనేక మాయలు ప్రయోగించాడు. కాని ఘటోత్కచుని అర్ధ చంద్ర శరముల ముందు అవి పని చేయలేదు. వారి ఇద్దరి మధ్య మాయాయుద్ధం ఘోరంగా సాగుతూ ఉంది. ఒకరికి ఒకరు తీసిపోనట్టు ద్వందయుద్ధం చేస్తున్నారు.

ఉప పాండవులు తమ తమ బాణములతో అలంబసుని కప్పివేసారు. అలంబసుడు వారి బాణములకు బెదరక, భీముడిని 25 బాణములతోనూ, ధర్మరాజును 3 బాణములతోనూ, ఉప పాండవులను సహదేవుడినీ, ఘటోత్కచుడిని 25 బాణములతోనూ కొట్టాడు. సింహనాదం చేసాడు

ఘటోత్కచుడు అలంబసుని సారధిని చంపాడు రధాశ్వములను చంపాడు. రధమును విరగ్గొట్టాడు. తన రధము విరిగిపోగా అలంబసుడు నేల మీదికి దుమికాడు. తన మాయాజాలంతో పాండవులమీద మాయాశరవర్షము కురిపించాడు. ఘటోట్కచుడు కూడా తనరధము దిగాడు. తాను కూడా మాయా యుద్ధమునకు తలపడ్డాడు. అలంబసుని మీద తన మాయచేత బాణవర్షము కురిపించాడు. అప్పుడు అలంబసుడు తన ఖడ్గం తీసుకొని ఆకాశానికి ఎగిరాడు. అతనితోపాటు ఘటోత్కచుడు కూడా ఖడ్గపాణియై

ఆకాశానికి ఎగిసాడు. ఇద్దరూ మేఘాల మీదిరి ఒకరిచుట్టు ఒకరు తిరుగుతున్నారు. చిత్రవిచిత్ర గతులతో యుద్ధం చేస్తున్నారు.

తరువాత ఇద్దరూ భూమి మీద పడ్డారు. ఒకరి మీదికి ఒకరు కత్తులు విసురుకున్నారు. అవి ఒకదానితో ఒకటి కొట్టుకొని పడిపోయాయి. తరువాత ఇద్దరూ ఒకరితో ఒకరు మల్లయుద్ధానికి దిగారు. ఒకరిని ఒకరు కొట్టుచూ, త్రోయుచూ, పొడుచుచూ, అనేక ప్రకారముల ద్వందయుద్ధము చేస్తున్నారు. ఆయుద్ధంలో అలంబసుడు అలసిపోయాడు. ఇదే అదనుగా ఘటోత్కచుడు అలంబసుని కిందికి తోసి అతని మీద కూర్చున్నాడు. అతడిని చేతితోనూ కాలితోనూ తన్ని పొడిచి, కుమ్మి, ముద్దచేసాడు. ఆ విధంగా అలంబసుడు ఘటోత్కచుని చేతిలో ప్రాణాలు విడిచాడు. ఘటోట్కచుడు సింహనాదం చేసాడు. ధర్మరాజు ఘటోత్కచుని కౌగలించుకొని అతనిని అభినందించాడు.

సాత్యకి కౌరవ సేనను తరుముతున్నాడు. దొరికిన వాడిని దొరికినట్టు చంపుతున్నాడు. అది చూచి ద్రోణుడు సాత్యకిని ఎదుర్కొన్నాడు. సాత్యకి 25 బాణములను ద్రోణుడి మీద ప్రయోగించాడు. ద్రోణుడు సాత్యకిని 3 వాడి బాణములతో కొట్టాడు సాత్యకి ద్రోణుడి మీద 50నారసములు సంధించాడు. ద్రోణుడు వాటిని

9 బాణములతో కొట్టాడు. సాత్యకి వాటిని తప్పించు కుంటూ ఉండగా ద్రోణుడు సాత్యకి మీద 100 బాణములు ప్రయోగించాడు. సాత్యకి నిస్సహాయంగా నిలబడ్డాడు అప్పుడు నీ కుమారులు సింహనాదాలు చేసారు.

అది చూచి ధర్మరాజు 'యోధులారా! రండి! ధృష్టద్యుమ్నుడు ఆపదలో ఉన్నాడు. రక్షించండి!' అని అరిచాడు. ఆ మాటలు విని భీముడు పరుగెత్తు కుంటూ సాత్యకి వద్దకు వచ్చాడు. మిగిలిన పాండవ యోధులు కూడా సాత్యకిని దాటి పోయి ద్రోణుని ఎదుర్కొన్నారు. వారిని చూచి ద్రోణుడు చిరు నవ్వు నవ్వాడు. వారందరిమీద తన వాడియైన బాణములు వదిలాడు ఆ దెబ్బకు పాంచాలురు 25మంది, కేకయ రాజులు నూరు మంది, తలలు తెగి భూమి మీద పడ్డారు. పాండవ సైన్యము ద్రోణుని దాటి ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేక పోయింది.

ఇంతలో పాంచజన్య ఘోష వినిపించింది. అది విని ధర్మరాజు సాత్యకిని చూచి 'సాత్యకీ! అటు చూడు. అర్జునుని దేవదత్త నవ్వడి వినిపించడం లేదు. అశ్వత్థామ, కర్ణ, శల్య, కృప, భూరిశ్రవసులు కలిసి, సైంధవుని కాపాడటం కోసం, అర్జునుని చుట్టుముట్టినట్టున్నారు.

అర్జునుడు ఏదన్నా ఆపదలో చిక్కుకున్నాడో ఏమో! ఈ సమయంలో నాకు నీవు దక్క వేరెవ్వరూ లేరు. నీవు వెళ్లి అర్జునుని కాపాడు.' అని ప్రార్థించాడు.

అప్పుడు సాత్యకి ధర్మజునితో ఇలా అన్నాడు. 'ధర్మనందనా! నీవు చెప్పినది సత్యము. కాని అర్జునుడు సైంధవుని చంపడానికి పోతూ నా తో చెప్పిన విషయం మీకు మనవి చేస్తాను.

'సాత్యకీ! శకునములు మనకు అనుకూలంగా ఉన్నాయి. నేను సైంధవుని చంపడానికి వెళుతున్నాను. నేను వచ్చునంతవరకూ నీవు ధర్మజుని కాపాడు. మనకు సైంధవుని చంపడం ఎంత ముఖ్యమో, ధర్మజుని రక్షణ కూడా అంతే ముఖ్యం. కాబట్టి నేను ఒక పనీ, నీవు ఒక పనీ చెయ్యడం ధర్మం కదా. నీవు ధర్మరాజు పక్కన ఉంటే నేను ఉన్నట్టే. నా పక్కన కృష్ణుడు ఉన్నట్టే నీవు ధర్మజుని పక్కన ఉండు. నా గురించి చింతించకు. నీవు నిర్భయంగా ధర్మజునికి రక్షణగా ఉండు.'

కాబట్టి నేనుతమరికి రక్షణగా ఉండాలి. ఇది అర్జునుని అభిమతము. పైగా మీకు ద్రోణుని ప్రతిజ్ఞ తెలుసు కదా. ద్రోణుడు తగిన సమయం కోసం వేచి ఉన్నాడు. ద్రోణుడు తమరిని పట్టుకుంటే, అర్జునుడు సైంధవుని చంపడం కూడా వ్యర్థమే కదా! కృష్ణుడు సారధిగా ఉన్నంతవరకూ అర్జునునికి ఏమీ భయం లేదు. నన్ను తమరి రక్షణ

కొరకు నియోగించాడు అర్జునుడు. కాబట్టి నేను తమరిని విడిచి వెళ్లలేను.' అని అన్నాడు సాత్యకి.

'సాత్యకీ! నీవు చెప్పినది అంతా యదార్థమే కావచ్చు. కాని ఈ సమయంలో నీవు అర్జునునికి రక్షణగా వెళ్లడమే మిగుల యుక్తియుక్తముగా తోచుచున్నది. భీముడు కూడా నీకు తోడుగా వస్తాడు. అర్జునుడు క్షేమంగా ఉంటేనే కదా మనందరికి రక్షణ కలుగుతుంది. కనుక నేను చెప్పినట్టు నీవు అర్జునునికి సాయంగా వెళ్లు. ఇక్కడ నాకు సాయంగా ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, ద్రుపదుడు, కేకయ రాజులు, శిఖండి, ఉపపాండవులు ఇంకా యోధానుయోధులు ఉన్నారు. ద్రోణుని చంపడానికే పుట్టిన ధృష్టద్యుమ్నుడు ఉన్నాడు. ఒక్క ధృష్టద్యుమ్నుడు చాలు ద్రోణునికి దీటుగా యుద్ధం చెయ్యడానికి. కాబట్టి, నాకేమీ భయం లేదు.' అని అన్నాడు ధర్మజుడు.

సాత్యకి ఇంకేమీ బదులు చెప్పలేకపోయాడు. సాత్యకి ధర్మరాజుకు నమస్కరించి అతని అనుమతి తీసుకున్నాడు. భీముని ధర్మజునికి రక్షణగా అక్కడే ఉండమన్నాడు. సాత్యకి మాట ప్రకారము, భీముడు ధర్మరాజుకు రక్షణగా అక్కడే ఉన్నాడు.

సైంధవుని చంపి అర్జునునితో సహా విజయుడనై తిరిగి వస్తానని ప్రతిజ్ఞ చేసి సాత్యకి, తన రథం ఎక్కి అర్జునుని సాయంగా వెళ్లాడు.

మహా భారతము, ద్రోణ పర్వము, తృతీయాశ్వాసము

సమాప్తము.

ఓం తత్సత్... ఓం తత్సత్ ...ఓం తత్సత్.

# మహాభారతం

## ద్రోణ పర్వము

### చతుర్ధాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన మహా భారత కధను, నైమిశారణ్యంలో జరుగుతున్న సత్రయాగమునకు వచ్చిన మహామునుల కోరిక మేరకు, ఉగ్రశ్రవసుడు అను సూతి ఈ విధంగా చెప్పసాగాడు.

దృతరాష్ట్రునితో సంజయుడు ఇలా అన్నాడు. "సంజయా! ధర్మరాజు అనుజ్ఞ పొందిన అర్జునుని వద్దకు వెళ్లిన సాత్యకి అర్జునుని కలిసాడా! మన సైన్యము అతనిని అడ్డుకొనలేదా? తరువాత ఏమిజరిగింది? వివరంగా చెప్పు!" అని అడిగాడు.

సంజయుడు ఈ ప్రకారం చెప్పసాగాడు.

ధర్మరాజుతో అనుజ్ఞాతుడై సాత్యకి అర్జుని వైపు దూసుకుపోతున్నాడు.

అడ్డు వచ్చిన కౌరవ సైనికులను చంపుతున్నాడు. సాత్యకి తనతో యుద్ధము నకు వచ్చిన ఏడుగురు కౌరవ వీరులను సాత్యకి యమపురికి పంపాడు.

ద్రోణుడు సాత్యకిని ఎదుర్కొన్నాడు. అతనిని ఏడు అతి క్రూరమైన బాణములతో కొట్టాడు. సాత్యకి ఎక్కిన రథము నకు కట్టిన హయములను, సారధిని కొట్టాడు. సాత్యకి కోపించి ద్రోణుని మీద బాణవర్షము కురిపించాడు. ద్రోణుడు కూడా అంతే పరాక్రమముతో సాత్యకి వేసిన బాణములను త్రుంచి, మరల సాత్యకిని తన బాణ పరంపరతో ముంచెత్తాడు.

"సాత్యకీ! నా పరాక్రమానికి తట్టుకోలేక నీ గురువు అర్జునుడు నా తో యుద్ధం చెయ్యకుండా పారిపోయాడు. ఇప్పుడు నువ్వు వచ్చావు. నా పరాక్రమం రుచి చూడు." అన్నాడు ద్రోణుడు.

సాత్యకి ద్రోణునికి నమస్కరించి "ఆచార్యా! నేను అంతటి వాడిని కాను. ధర్మరాజు ఆజ్ఞ మేరకు అర్జునునికి సాయంగా వెళుతున్నాను. దయయుంచి నన్ను విడువుము. నా వంటి చిన్న వారిని దయచూడటం తమబోటి పెద్దల ధర్మం కదా!" అని ప్రా ర్ధించాడు.

కాని ద్రోణుడు సాత్యకికి దారి విడువ లేదు. అప్పుడు సాత్యకి తనకు అడ్డుగా నిలిచి ఉన్న బాహ్లీక, అంగ, దాక్షిణాత్య సేనల మధ్యగా దూరి ఆవలకు వెళ్లాడు. ఇంతలో కృతవర్మ సాత్యకిని ఎదుర్కొన్నాడు. ఆరు బాణములతో సాత్యకిని కొట్టాడు. నాలుగు బాణములతో సాత్యకి రథమునకు కట్టిన హయములను కొట్టాడు.

సాత్యకిని కృతవర్మ అడ్డుకొనడం చూచి, ద్రోణుడు ధర్మరాజు వైపుకు వెళ్లాడు. సాత్యకి కృతవర్మను 16 శరములతో కొట్టాడు. అతడి విల్లు విరిచాడు. అతని సారధిని చంపాడు. కృతవర్మ తన రధమును తానే తోలుకుంటూ యుద్ధం చేస్తున్నాడు.

కృతవర్మ సాత్యకిని వదిలిపెట్టి భీమసేనుడు ఉన్న దెసకు తనరధమును పోనిచ్చాడు. సాత్యకి తన రధముతో కాంభోజసేనలో ప్రవేశించాడు. అక్కడి వీరులను తునుమాడుతున్నాడు. ఇంతలో ద్రోణుడు కృతవర్మకు మరొక సారధిని ఏర్పాటు చేసాడు.

కృతవర్మ ధర్మరాజును అతని కి సాయంగా ఉన్న వీరులను ఎదుర్కొన్నాడు. భీముడు వారికి సాయంగా వచ్చాడు. భీముడు, ధృష్ట ద్యుమ్నుడు మూడేసి బాణములతోనూ, ధర్మరాజు, ద్రుపదుడు ఐదేసి బాణములతోనూ, ఘటోత్కచుడు ఏడు బాణములతోనూ, విరాటరాజు 15 బాణములతోనూ, సహదేవుడు 25 బాణముటతోనూ, శిఖండి 20 బాణముల తోనూ, ఉపపాండవులు 75 బాణములతోనూ నకులుడు నూరు బాణముల తోనూ, కృతవర్మను చుట్టుముట్టి కొడుతున్నారు.

కాని కృతవర్మ జంకక, ఒక్కొకరిని ఐదేసి బాణములతో కొడుతున్నాడు. భీముడి మీద ఏడుబాణములు ప్రయోగించాడు. భీముని విల్లు, పతాకము త్రుంచాడు. భీముని గుండెలకు గురిపెట్టి 70

బాణములు కొట్టాడు. ఆ దెబ్బకు భీముడు మూర్ఛపోయాడు. ఇదిచూచిన పాండవ వీరులు ఒక్కుమ్మడిగా కృతవర్మను చుట్టుముట్టారు.

ఇంతలో భీముడు మూర్ఛనుండి తేరుకున్నాడు. కృతవర్మమీద ఒక ఉజ్వలమైన శక్తిని ప్రయోగించాడు. కృతవర్మ ఆ శక్తిని మూడు ముక్కలు చేసాడు. భీముడు తన విల్లుతీసుకొని కృతవర్మను నెత్తురు కారేట్టుకొట్టాడు. కృతవర్మను మూడు బాణములతో తిప్పికొట్టాడు. కృ తవర్మను పాండవ వీరులందరూ చుట్టుముట్టారు. తీవ్రమైన బాణములతో అతనిని నొప్పించారు.

కృతవర్మ కూడా ఏ మాత్రం జంకక శిఖండివిల్లు తుంచాడు. భీముడు మొదలైన రధికుల మీద బాణ వర్షము కురిపించాడు. శిఖండి మీద శర వర్షము కురిపించాడు. ఆ దెబ్బకు శిఖండి రధము మీద పడిపోయాడు. అతని సారధి శిఖండిని దూరంగా తీసుకెళ్లాడు.

శిఖండి గాయపడటం చూచిన మత్స్య, ఛేది, కేకయ రాజులు, వారి సైన్యములు, కృత వర్మమీదికి దూకాయి. కృత వర్మ తన మర్మబేధి బాణములతో వారిని బాధించాడు. ~~ఈ~~ కలకలము విని సాత్యకి తమ సైన్యములు పారి పోవడం గమనించాడు. అర్జునునకు దగ్గరకు తరువాత పోవచ్చును. ముందు ధర్మజుని రక్షణ ముఖ్యం అని అనుకొని తనకు అడ్డముగా ఉన్న ద్రోణుని పక్కనుండి కృతవర్మ దగ్గరకు వెళ్లాడు.

సాత్యకి కృతవర్మతో యుద్ధం చేస్తున్నాడు. ఒక భల్లబాణముతో కృతవర్మ వింటిని త్రుంచాడు. నాల్గు బాణములతో అతని రధమునకు కట్టిన హయము లను చంపాడు. ఒక అగ్ని బాణంతో సారధిని కొట్టాడు. ఇంతలో తనకు అడ్డు వచ్చిన త్రిగర్త సైన్యమును నాశనం చేసాడు.

రధము విరిగిన కృతవర్మను పాండవ సైన్యము చుట్టుముట్టింది. ఇది చూచాడు ద్రోణుడు. సాత్యకి తో యుద్ధం చెయ్యకుండా పాండవ సైన్యమును ఎదుర్కొన్నాడు. ఇంతలో జలసంధుడు అనే రాజు సాత్యకిని ఎదుర్కొన్నాడు. తన ఏనుగును సాత్యకిమీదికి తోలాడు. సాత్యకి దానిని ఆపాడు. అప్పుడు జలసంధుడు సాత్యకి వింటిని విరిచాడు. 50 బాణములను సాత్యకి గుండెలకు గురిపెట్టి కొట్టాడు.

సాత్యకి కోపించి జలసంధుని వింటిని నరికి, 60 బాణములు అతని శరీరములో గుచ్చాడు. జలసంధుడు ఒక తోమరంతో సాత్యకిని కొట్టాడు. ఒక పెద్ద కత్తి తీసుకొని సాత్యకి విల్లు త్రుంచాడు. సాత్యకి మరొక విల్లు తీసుకొని ఆలస్యం చేయకుండా తన క్రూరమైన బాణములతో జలసంధుని చేతులు నరికాడు. తరువాత మరొక బాణముతో అతని తలను త్రుంచాడు. అతను ఎక్కిన ఏనుగును మరొక బాణముతో దూరంగా తరిమి కొట్టాడు.

సాత్యకి పరాక్రమమును చూచి కౌరవ సైన్యము భయంతో వణికి పోయింది. ఇది చూచాడు ద్రోణుడు. కృత వర్మను తనకు బదులుగా

శకట వ్యూహము దగ్గర నిలిపాడు తాను సాత్యకిని ఎదుర్కొన్నాడు. తనకు ఎదురుగా ఆచార్య ద్రోణుడు రావడం చూచాడు. అతని వెనుక కురు కుమారులైన దుర్మర్షణ, దుస్సహ, వికర్ణ, దుర్ముఖ, దుశ్శాసన, చిత్రసేన మొదలగు ప్రముఖ వీరులు రావడం చూచాడు. ఇంతలో దుర్యోధనుడు కూడా వచ్చి తన తమ్ములను చేరుకున్నాడు.

వీరందరను చూచాడు ద్రోణుడు. సుయోధనుడు తన తమ్ములతో కలిసి సాత్యకి పరాక్రమును అణచ గలడు అని అనుకొని మరల వ్యూహ రక్షణ కొరకు, వ్యూహముఖమునకు వచ్చి నిలిచాడు. సాత్యకి కురు కుమారు లందరకూ ఒక్కొక్కరికి ఒక్కొక్క సాత్యకి మాదిరి కనిపిస్తూ వారితో ఏకకాలంలో యుద్ధం చేస్తున్నాడు. ఆ ప్రకారం యుద్ధం చేస్తూ, సాత్యకి సుయోధనుని విల్లు విరిచాడు. సుయోధనుని శరీరం అంతా తూట్లు పడేట్లు కొట్టాడు. ఇది చూచి కురుకుమారులు సాత్యకి మీద బాణ వర్షము కురిపించారు.

ఒక్కొక్క కురుకుమారుని మీద ఐదేసి బాణముల చొప్పును వారినందరిని తన బాణములతో కొట్టాడు. సుయోధనుని మీద ఎనిమిది బాణములను ప్రయోగించాడు. సుయోధనుని కేతనమును విరిచాడు. సుయోధనుని వింటిని విరిచాడు. అతని హయములను చంపాడు. సారథిని కొట్టాడు. సుయోధనుడు సాత్యకి పరాక్రమమునకు భయపడి పారిపోయాడు. పక్కనే ఉన్న చిత్ర సేనుని రథం ఎక్కాడు.

ఇది చూచిన కౌరవ సైన్యము హాహాకారములు చేసింది. అది విన్న కృతవర్మ తన రధమును తోలుకొని అక్కడకు వచ్చాడు. సాత్యకి తన రధమును కృతవర్మకు ఎదురుగా నిలిపాడు. ఇద్దరూ ఒకరి మీద ఒకరు బాణవర్షము కురిపించారు. కాని సాత్యకి కృతవర్మ సారధిని చంపాడు. అతని విల్లు విరిచాడు. మరొక బాణంతో కృతవర్మను మూర్ఛపోయేట్టు కొట్టాడు. ఆ దెబ్బకు కృతవర్మ తన రధం మీద కూలి పోయేట్టు పడ్డాడు. కృతవర్మ చచ్చిపోయాడు అని అనుకున్నాడు సాత్యకి. వెంటనే అర్జునుడి దగ్గరకు పోవడానికి ఆయత్తమయ్యాడు.

ఇంతలో కృత వర్మ తెప్పరిల్లాడు. మరల యుద్ధ రంగానికి వచ్చాడు. ద్రోణుడు అతనిని తనకు మారుగా వ్యూహము ద్వారముదగ్గర నిలిపి, తాను సాత్యకి అర్జునుని వద్దకు వెళ్లకుండా ఆపడానికి వెళ్లాడు. ద్రోణుడు సాత్యకి నుదుటి మీద మూడు అతి క్రూరమైన బాణములతో కొట్టాడు. దానికి ప్రతిగా సాత్యకి కూడా ద్రోణుడిమీద బాణప్రయోగం చేసాడు. ఇరువురి మధ్య పోరు ఘోరమయింది.

ద్రోణాచార్యుడు సాత్యకి మీద శక్తి అస్త్రము ప్రయోగించాడు. కాని ఆ శక్తి విధివశమున గురి తప్పి సాత్యకి రధమును తాకింది. సాత్యకి మరొక బాణంతో ద్రోణుని బుజం మీద కొట్టాడు. ద్రోణుడు సాత్యకి విల్లు

త్రుంచాడు. రథ సారధిని మూర్ఛపోయేట్టు కొట్టాడు. సాత్యకి తానే సారధి అయి రథము తోలుకుంటూ యుద్ధము చేస్తున్నాడు.

సాత్యకి ద్రోణాచార్యుని రథ సారధిని చంపాడు. సారధి లేని ద్రోణుని రథమును గుఱ్ఱములు ఎటో లాక్కుని వెళ్లాయి. ఈ ప్రకారం ద్రోణుని రథము అక్కడక్కడ తిరిగి వ్యూహముఖమునకు చేరింది.

ద్రోణుని అడ్డు తొలగగానే తన రథమును అర్జునుని వద్దకు పోనిమ్మన్నాడు సాత్యకి. సాత్యకి రథం శర వేగంతో అర్జునుడు ఉన్న వైపుకు దూసుకుపోతూ ఉంది. ఇంతలో సాత్యకి ని సుదర్శనుడు అనే రాజు ఎదుర్కొన్నాడు. సాత్యకి మీద బాణ వర్షము కురిపించాడు. సాత్యకి తన మీదకు వచ్చు బాణములను తునాతునకలు చేసాడు. సుదర్శనుని రథమునకు కట్టిన హయములను చంపాడు.సారధిని చంపాడు. ఆఖరున సుదర్శనుడి తలనరికాడు.

సాత్యకి తన రథ సారధితో "నేను మహా సముద్రము తో సమానమైన ద్రోణుని నే దాటి వచ్చాను. ఈ పిల్ల కాలువలు ఒక లెక్కా!" అని అన్నాడు. ఈ మాటలకు సాత్యకి రథ సారధి "ఆ విషయం నాకు తెలియదా! ఇప్పుడు ఎవరితో యుద్ధం చెయ్యాలి. ఎవరి మీదికి రథం తోలాలి?" అని అడిగాడు.

"సారధీ! ఇక్కడ ఎక్కువగా ఏనుగులు, హయములు, సైనికులు చచ్చి పడి ఉన్నారు. వీరిని అర్జునుడు చంపి ఉండవచ్చును. అదుగో

గాండీవము యొక్క ధనుష్టంకారము వినిపించు చున్నది. ఈ మార్గంలో రథము పోనిమ్ము." అని అన్నాడు.

ఇంతలో కాంభోజ రాజ సైన్యములు సాత్యకిని చుట్టుముట్టాయి. సాత్యకి వారిని ఎదుర్కొన్నాడు. తన బాణ సమూహము తో వారి నందరిని యమ సదనమునకుపంపాడు. ఆ ప్రాంత మంతా పీనుగు పెంటలతో నిండిపోయింది. వారి మీదుగా రథము నడుపుకుంటూ సాత్యకి అర్జునుడు ఉన్న ప్రాంతమునకు పోతున్నాడు. ఇంతలో వెనుక నుండి దుర్యోధనుడు, దుశ్శాసనుడు, చిత్ర సేనుడు, వివింశతి, శకుని, దుస్సహుడు, దుర్ధర్షణుడు, మొదలగు వారు తన సేనలతో సాత్యకిని తరుముకొని వస్తున్నారు.

వారిని చూచాడు సాత్యకి. "సారథీ! రథము వెనుకకు తిప్పు. వీరి సంగతి చూచి తరువాత అర్జునుని వద్దకు పోదాము." అని అన్నాడు. సారథి రథమును వెనుకకు తిప్పి కురు వీరులకు ఎదురుగా నిలిపాడు. అప్పుడు కురుసేనలు సాత్యకిని చుట్టుముట్టాయి. సాత్యకి భయపడకుండా నాలుగు వందల ఏనుగులను, మూడు వందల హయములను ఒకేసారి చంపాడు. కౌరవ సైనికులలో సాత్యకి బాణం తగలని వాడు లేడంటే అతిశయోక్తి కాదు.

కాని సుయోధనుడు మొదలగు కౌరవ వీరులు సాత్యకి మీద శరవర్షము ధారాపాతంగాకురిపించారు. సుయోధనుడు అతని

సేనానాయకులు సాత్యకి మీద ,శరవర్షము కురిపించారు. సాత్యకి వారి నందరినీ ఎదుర్కొని వారి కేతనములను, రథములను ముక్కలు చేసాడు. హయములను, సారథులను చంపాడు. ఇంతలో శకుని సుయోధనునకు సాయంగా వచ్చాడు. సుయోధనుడు శకుని కలిసి మరలా సాత్యకిని ఎదుర్కొన్నారు.

సాత్యకి విజృభించి శకుని పట్టుకున్న విల్లును విరిచాడు. సుయోధనుని సారథిని చంపాడు. శకుని రథమునకు కట్టిన గుఱ్ఱములు శకుని రథమును ఎటో ఈడ్చుకొని వెళ్లాయి. సుయోధనుడు అతని తమ్ములు తప్పుకోగా, సాత్యకి నిరాటంకంగా ముందుకుసాగాడు.

దుశ్శాసనుడు కొండజాతివారిని సాత్యకి మీదికి పురికొల్పాడు. వారందరూ సాత్యకిని అడ్డుకున్నారు. రాళ్లతోయుద్ధం చేస్తున్నారు. సాత్యకి తన బాణములతో ఆ రాళ్లతో పొడి పొడి చేస్తున్నాడు. ఆ కొండజాతి వాళ్లు సాత్యకితోయుద్ధం చేయలేక పారిపోయారు. దుశ్శాసనుడు ద్రోణుడి దగ్గరకు పరుగెత్తాడు.

ద్రోణుడు దుశ్శాసనుని చూచి "అదేమి యువరాజా! అదేమిటి అలా పరుగెత్తుకుంటూ వచ్చావు. సుయోధనుడు క్షేమమే కదా! అర్జునుడు సైంధవుని ఏమన్నా చేసాడా! మరి నీవెందుకుసైన్యముతో సహా అలా పారిపోతున్నావు? అయినా దుశ్శాసనా! నాడు అధికార గర్వంతో

విర్రవీగి పాండవులను అష్టకష్టాలు పెట్టిన దానికి ఫలితం అనుభవించాలి కదా! నాడు నిండు సభలో ద్రౌపదిని జుట్టుపట్టుకొని ఈడ్చి అవమానించడం అప్పుడే మరిచిపోయావా! ఆరోజు పాండవులను అవమానిస్తూ పల్కిన పలుకులు కూడా మరచావా! మరి ఆనాటి అధికారము, గర్వం, ఈనాడు ఏమయ్యాయి? భీరువులా పరుగెడుతున్నావు. అవునులే నీకు ప్రాణముల మీద తీపి ఎక్కువ కదా!

దుశ్శాసనా! ఇప్పటికన్నా నీకు బతుకుమీద ఆశ ఉంటే... నాలుగు కాలాలపాటు బతకాలని ఉంటే .....నీ అన్న సుయోధనుని పాండవులతో సంధికి ఒప్పించు. అందరి ప్రాణాలు కాపాడు. అయినా నీ అన్న ఒట్టి వెర్రివాడు దుశ్శాసనా! తాతగారు భీష్ములవారి మాటవినకుండా చెడ్డాడు. ఒకరొకరిగా తన తమ్ములను చంపుకుంటున్నాడు. నీ వంతు కూడా వస్తుందిలే! అటు చూడు. సాత్యకి నీ పక్షాన యుద్ధం చెయ్యడానికి వచ్చినరాజులను ఎలా తరుము తున్నాడో. వెళ్లు. వారికి సాయంగా నిలబడు. అంతే గాని, ఇలా పారిపోయి రావచ్చునా!" అని అన్నాడు ద్రోణుడు.

ద్రోణుడి మాటలతో పౌరుషం తెచ్చుకున్న దుశ్శాసనుడు మరలా సాత్యకి మీదికి యుద్ధమునకు బయలుదేరాడు. ద్రోణుడు పాండవ వీరులతో యుద్ధం చేస్తున్నాడు. పాండవ వీరుడు వీరకేతుడు ద్రోణుని ఎదుర్కొని మరుక్షణం ద్రోణుడి బాణాలకు బలి అయ్యాడు.

వీరకేతుని మరణం చూచిన చిత్రకేతుడు, సుధన్వుడు, చిత్రవర్మ, చిత్రరథుడు మొదలగు వారు ఒక్కుమ్మడిగా ద్రోణుని రథమును చుట్టు ముట్టారు. ద్రోణుడు కోపించి వారి నందరినీ ఒక్కొక్క బాణంతో చంపాడు. వారి తలలు భూమి మీద దొర్లుతున్నాయి. ఇది చూచి ధృ ష్టద్యుమ్నుడు బాధపడ్డాడు. మహా కోపంతో ద్రోణుని ఎదుర్కొన్నాడు. అతని రథమును తన బాణములతో కప్పివేసాడు. ద్రోణుడి వక్షస్థలం మీద కొట్టాడు. ఆ దెబ్బకు ద్రోణుడు మూర్ఛపోయాడు. ధృష్టద్యుమ్యుడు కత్తి డాలు తీసుకొని తన రథము దిగి ద్రోణుని తల నరకడానికి అతని రథం ఎక్కాడు.

ఆ సమయానికి ద్రోణుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. చేతికి అందిన ఆయుధం తీసుకున్నాడు. ధృష్టద్యుమ్యుడిని ఒళ్లంతా పొడిచాడు. ఆ బాధకు తట్టుకోలేక ధృష్టద్యుమ్నుడు మరలా తన రథముమీదికి దుమికాడు. తన విల్లు తీసుకొని ద్రోణుని మీద శరవర్షము కురిపించాడు. ద్రోణుడు కోపంతో ధృష్ట ద్యుమ్నుని రథసారథిని చంపాడు. అతని విల్లు విరిచాడు. హయములను కొట్టాడు. ఆ బాధకు తట్టుకోలేక ధృ ష్టద్యుమ్యుని రథమునకు కట్టిన గుర్రములు అతని రథమును పక్కకు లాగుకొని వెళ్లాయి.

ద్రోణుని పరాక్రమాన్ని చవి చూచిన పాండవ వీరులు అతని ఎదుట పడటాకిని జంకుతూ పక్కలకు తొలగి పోతున్నారు. తాను అన్న

మాటలకు రోషం వచ్చిన దుశ్శాసనుడు సాత్యకి మీదికి పోరుకు వెళ్లడం చూచిన ద్రోణుడు, అతనికి సాయంగా త్రిగర్త సైనికులను మూడు వేల మందిని పంపాడు. సాత్యకి వారినందరినీ చూచి ఒకే దెబ్బకు 500 మందిని యమసదనానికి పంపాడు. మిగిలిన వారిని కూడా అడ్డంగా నరుకుతున్నాడు. సాత్యకి దెబ్బకు తట్టుకోలేక త్రిగర్తసైన్యము ద్రోణుని వంకకు పారిపోయాయి.

ఎదురుగా ఉన్న దుశ్శాసనుడిని చూచాడు సాత్యకి. ముందు అతని విల్లు త్రుంచాడు. దుశ్శాసనుడు వేరొక విల్లు తీసుకొని సాత్యకి మీద శక్తి బాణమును ప్రయోగించాడు. సాత్యకి ఆ శక్తిని ముక్కలు చేసాడు. సాత్యకి మరలా దుశ్శాసనుడి విల్లు విరిచి అతని సారథిని చంపాడు. కేతనమును పడగొట్టాడు. దుశ్శాసనుడిని మూర్ఛ పోయేట్టు కొట్టాడు.

ఆ సమయంలో దుశ్శాసనుని సాత్యకి చంప వచ్చును.... కాని చంపలేదు. అతనిని చంపడానికి భీముడు చేసిన ప్రతిజ్ఞ గుర్తుకు వచ్చి దుశ్శాసనుని ప్రాణాలతో వదిలిపెట్టాడు.

సాత్యకి దుశ్శాసనుని వదిలిపెట్టి అర్జునుడు ఉన్న వైపుకు దూసుకు పోతున్నాడు. సాత్యకికి సాయంగా వెళ్లడానికి ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుని ముందు పెట్టుకొని కౌరవ సేనలను తరుము తున్నారు. అర్జునుడు కౌరవ సేనా మధ్యలో చేరి

కౌరవ సేనలను తునుమాడు తున్నాడు. సాత్యకి అర్జునుని వైపుకు దూసుకు పోతూ అడ్డుగా వచ్చిన కౌరవ సేనలను హతమారుస్తున్నాడు.

ద్రోణుడు పాండు కుమారులను, వారి సైన్యమును శకట వ్యూహము లోనికి పోనీకుండా అడ్డుపడుతున్నాడు. ఈ ప్రకారంగా సాత్యకి, అర్జునుడు, ద్రోణుడు వీరి చేతులలో ఇరుపక్షముల సైనికులు మరణిస్తున్నారు. మారణహోమం జరుగుతూ ఉంది. అక్కడ ఏమి జరుగుతుందో చూడ్డానికి వచ్చాడు సుయోధనుడు. పాండవులను చూచాడు. భీముని మీద పది బాణములు, నకుల సహదేవులు, ద్రుపదుడు, విరాటరాజు, ఉప పాండవుల మీద మూడేసి బాణములను, కేకయ రాజులు ఐదుగురి మీద రెండేసి బాణములను, శిఖండి మీద మూడు బాణములను, ధృష్టద్యుమ్నుని మీద 20 బాణములను, ధర్మజుని మీద ఐదు బాణములను, ప్రయోగించాడు. ,

దర్మరాజు దుర్యోధనుని విల్లు విరిచాడు. మిగిలిన పాండవులు అతనిని చుట్టుముట్టారు. సుయోధనుడు మరలా సైంధవుని వద్దకు వెళ్లాడు. ద్రోణునికి కేకయ రాజులకు యుద్ధం జరుగుతూ ఉంది. ద్రోణుడు వేసిన బాణములను కేకయరాజులు తిప్పికొడుతున్నారు. ద్రోణుడు 60 బాణము లతో బృహక్షత్రుని కొట్టాడు. బృహక్షత్రుడు కోపించి ద్రోణుని సారధిని కొట్టాడు. ఇంతలో శిశుపాలుని కొడుకు ధృ ష్టకేతు ద్రోణుని మీదికి లంఘించాడు. ద్రోణుడు అతని విల్లు విరిచాడు.

ధృష్టకేతు తన గదతో ద్రోణుని కొట్టాడు. ఆ గదను తుత్తునియలు చేసాడు ద్రోణుడు. మరొక బాణంతో ద్రోణుడు ధృష్టకేతు గుండెలకు గురి పెట్టి కొట్టాడు. ఆ దెబ్బకు ధృష్టకేతు యమలోకం చేరుకున్నాడు.

ధృష్టకేతు కొడుకు తండ్రి మరణము చూచి కోపించి ద్రోణాచార్యుని ఎదుర్కొన్నాడు. ఒకే ఒక్క బాణంతో ద్రోణుడు ధృష్టకేతు కుమారుని తుదముట్టించాడు. వెంటనే జరాసంధుని కుమారుడు ద్రోణుని ఎదు ర్కొన్నాడు. ద్రోణుడు వీడి పటాటోపము చూచి వాడిని, వాడి సైన్యము ఎదుటనే చంపాడు.

ఇది చూచి భీముడు "ధృష్టద్యుమ్నా! ఈ బ్రాహ్మణుడు మన సేనలను అవిశ్రాంతంగా చంపుతున్నాడు." అని అరుస్తూ ద్రోణుని ఎదుర్కొన్నాడు. ఇంతలో క్షత్రవర్మ ద్రోణుని విల్లు విరిచాడు. ద్రోణుడు మరొక విల్లు అందు కున్నాడు. అగ్ని శిఖలు విరజిమ్మే బాణములతో క్షత్రవర్మను చంపాడు. చేకితానుడు ఆచార్యుని ఎదుర్కొన్నాడు. ద్రోణుని రథము విరిచాడు. అతని సారథిని కొట్టాడు. ద్రోణుని శరీరం అంతా బాణములు నాటాడు.

ద్రోణునికి కోపం వచ్చింది. చేకితానుడి భుజం నరికాడు. అతని సూతుని చంపాడు. హయములను చంపాడు. ద్రోణుని పరాక్రమం తట్టుకోలేక చేకితానుడు యుద్ధం నుండి తొలగిపోయాడు. ఇది చూచిన

ద్రుపదుడు తన సేనలతో ద్రోణుని ఎదుర్కొన్నాడు. ఇరువురికి పోరు ఘోరమయింది.

ధర్మరాజు తనలో తాను ఇలా అనుకుంటున్నాడు. "అర్జునునికి సాయంగా సాత్యకిని పంపాను. అతని జాడతెలియలేదు. అర్జునుడి జాడ కూడా తెలియడం లేదు." అని అనుకుంటూ భీముని పిలిచాడు.

"భీమసేనా! నీ తమ్ముడు అర్జునుని జాడ తెలియడం లేదు. అతనికి సాయంగా వెళ్లిన సాత్యకి ఏమయ్యాడో కూడా తెలియడం లేదు. నాకు ఆందోళనగా ఉంది." అని అన్నాడు.

"అన్నయ్యా! నేను ఏంచెయ్యాలో చెప్పు. సత్వరం ఆచరిస్తాను." అని అన్నాడు.

"భీమసేనా! నాకు పాంచజన్యం శబ్దం మాత్రం వినవచ్చింది. అర్జునుని దేవదత్త శంఖధ్వని వినరాలేదు. అందుకని సాత్యకిని పంపాను. కాని అతని జాడ కూడా తెలియడం లేదు. నీవు వెళ్లి అర్జునుడి క్షేమం కనుక్కొని రా!" అని అన్నాడు.

"అదేమిటి అన్నయ్యా! అర్జునుని పరాక్రమము గురించి నీకు తెలియదా. అతని గురించి దిగులుపడవచ్చునా! అయిననూ నీ ఆజ్ఞ శిరసావ హించి నేను వెంటనే వెళుతున్నాను. నన్ను ఆశీర్వదించు." అని అన్నగారి ఆశీర్వాదములు తీసుకొని దృష్టద్యుమ్నుని చూచి "ధృ

ష్టద్యుమ్నా! నీకు ద్రోణుని ప్రతిజ్ఞ గురించి తెలియును కదా! అన్నగారు జాగ్రత్త! నేను అర్జునునికి సాయంగా వెళుతున్నాను." అని చెప్పాడు.

"భీమసేనా! ఈ దృష్టద్యుమ్నుని మేని లో ప్రాణములు ఉన్నంతవరకూ ధర్మజుని మీద ఈగ వాలనీయను. నీవు నిశ్చింతగా వెళ్లిరమ్ము." అని అన్నాడు.

ఇంతలో పాంచజన్యం ఘోష వినిపించింది. ధర్మరాజు కంగారుగా ఉన్నాడు. "భీమసేనా! విన్నావుగా కృష్ణుడు పాంచజన్యం పూరిస్తున్నాడు. కాని అర్జునుని దేవదత్తశంఖ ఘోష వినిపించుటలేదు. అర్జునుడు ఆపదలో ఉన్నాడని ఇది సూచన. నీవు తొందరగా అర్జునునికి సాయంగా వెళ్లు." అని భీమసేనుని తొందరపెట్టాడు. వెంటనే భీముడు పాంజజన్య శంఖ శబ్దము వచ్చిన దిశగా తన రధముమీద బయలుదేరాడు.

ఇంతలో నీ కుమారులు దుశ్శలుడు, చిత్రసేనుడు, కుండభేది, వివింశతి, దుర్ముఖుడు, దుస్సహుడు, వికర్ణుడు, శలుడు, విందుడు, అనువిందుడు, సుముఖుడు, దీర్ఘబాహుడు, సుదర్శనుడు, బృందారకుడు, సుహస్తుడు, సుషేణుడు, దీర్ఘలోచనుడు, అభయుడు, రౌద్రకర్ముడు, సుశర్మ, దుర్విమోచనుడు మొదలగువారు మార్గ మధ్యంలో భీమసేనుని ఎదుర్కొన్నారు. భీమసేనుడు వారిని నిలువరిస్తూ అర్జునుని వైపు పోతున్నాడు. బృందారకుడిని చంపాడు. అభయుని, రౌద్రకర్ముని, దుర్విమోచనుని చంపాడు. కాని కురు కుమారులు

భయపడకుండా భీమసేనుని చుట్టుముట్టారు. భీముడు కోపించి విందానువిందులను, సుశర్మను చంపాడు. సుద ర్శనుని భూమిమీద పడేట్టు కొట్టాడు. ఆదెబ్బకు కౌరవ సేన పారి పోయారు. భీముడు సింహనాదం చేస్తూ అర్జునుని వెతుకుతూ వెళు తున్నాడు.

కాని ద్రోణుడు భీముని అర్జునునికి సాయంగా పోకుండా నిలువ రించాడు. భీముని మీద బాణవర్షము కురిపించాడు. భీమసేనుని చూచి ద్రోణుడు "ఓ భీమసేనా! ఇక్కడ నేను ఉన్నాను. నన్నుగెలిచి గాని నీవు లోపలకు పోవడానికి వీలు లేదు. నీ తమ్ముడు అర్జునుడు కూడా నా అనుమతి తోనే లోపలకు ప్రవేశించాడు." అని నర్మగర్భంగా అన్నాడు. కాని భీమునికి అది అర్ధం కాలేదు. కోపంతో ఊగిపోయాడు.

"ద్రోణాచార్యా! నా తమ్ముడు ఎప్పుడూ అలాంటి పని చెయ్యడు. ఒక రధికుని సాయంతో తాను వ్యూహంలో చొరపడతాడా! అది అసంభవము. అది అటుండనిమ్ము. ఏవేవో తియ్యటి మాటలు చెప్పి పక్కనుండి తప్పుకొని పోవడానికి నేను పార్ధుడిని కాను. నేను భీమసేనుడను. నా తండ్రిగా, గురువుగారు గా మిమ్మల్ని గౌరవిస్తాను. కాని మీరు నా శత్రువులపక్షాన ఉన్నారు. వారికి విజయం కట్టబెడుతుంటే నేను చూస్తూ ఊరుకోను." అంటూ తన గదను ద్రోణుడి పైకి విసిరాడు.

అది ఆకాశంలోకి ఎగిరింది. గిరా గిరా తిరుగుతూ ద్రోణుడి రథము మీద పడింది. రథము నుగ్గు నుగ్గు అయింది. హయములు చనిపోయాయి. సారధి చనిపోయాడు. ఇదిచూచి నీ కుమారులు భీమసేనుని ఎదుర్కొన్నారు కాని ఎక్కువ సేపు నిలువలేక పారిపోయారు.

అప్పుడు ద్రోణుడు మరొక రథం ఎక్కాడు. మరొక విల్లు అందుకొని భీమసేనుని మీద శరవర్షము కురిపించాడు. భీమసేనుడు తన రథము దిగాడు. ద్రోణుడు కురిపిస్తున్న బాణవర్షములో నుండి నడిచి వెళుతున్నాడు. వర్షములో ఎద్దు నడిచివెడుతున్నట్టుగా వెళుతున్నాడు. ద్రోణుని రథము దగ్గరకు వెళ్లాడు. రథమును పట్టుకొని పైకి ఎత్తాడు. అవతలకు విసిరివేసాడు. మరలా ద్రోణుని రథము నుగ్గు నుగ్గు అయింది. ద్రోణుడు వేరొక రథము ఎక్కాడు. వీడితో ఎందుకని పక్కకు తొలిగాడు.

భీముని రథసారధి విశోకుడు భీముని రథమును తెచ్చిఅక్కడ నిలిపాడు. భీముడు ఆ రథము ఎక్కి అర్జునుడు ఉన్న దిక్కుగా సాగి పోయాడు. ద్రోణుని జయించి ముందుకు దూకుతున్న భీమసేనుని చూచి భోజ, కాంభోజ,యవన సేనలు భయంతో పక్కకు తొలిగాయి. కౌరవ సేనలలో భీముని ఎదుర్కొనే వాడే లేక పోయాడు. మధ్యలో కౌరవ సేనలతో యుద్ధం చేస్తున్న సాత్యకిని చూచి అక్కడి నుండి దాటి అర్జునుడు ఉన్న చోటికి చేరుకున్నాడు. కృష్ణార్జునులను చూచి

సింహనాదం చేసాడు.  భీముని చూచి కృష్ణార్జునులు కూడా సింహనాదాలు చేసారు.ఈ కల కలంవిన్న ధర్మజుడు అర్జునుడు క్షేమంగా ఉన్నాడని తలచి ఆనంద పరవశుడయ్యాడు.”

అని సంజయుడు చెప్పగా విని ధృతరాష్ట్రుడు “అదేమిటిసంజయా! మన సైన్యములో భీమసేనుని ఎదుర్కొనే మగాడు వీరుడు లేడా! అవునులే భీమసేనుడు నా కుమారులను చంపడానికే పుట్టాడు. వాడికి ఎదురే ముంటుంది.” అని మనసులో అనుకున్నాడు. సంజయుడు చెప్పసాగాడు.

“ఆ సమయములో కర్ణుడు భీమసేనుని ఎదుర్కొన్నాడు. 20 బాణములు భీముని మీద ప్రయోగించాడు.  భీమసేనుడు ఆ బాణములను తుంచి, మరలా కర్ణుని మీద 63 నిశిత శరములను ప్రయోగించాడు. మరొక బాణముతో కర్ణుని కేతనమును తుంచాడు. కర్ణుని విల్లు విరగ్గొట్టాడు. కర్ణుడు మరొక విల్లుతీసుకొని భీముని మీద శర సంధానము చేసాడు. భీముడు మరలా ఆ విల్లును కూడా విరిచిచ కర్ణుని సారధిని, రథమునకు కట్టిన హయములను చంపాడు. కర్ణుడు వృషసేనుడి రథము ఎక్కి పారిపోయాడు.

ఇది చూచి కౌరవ సేనలలో కలకలము రేగింది. ఆ కలకలము విన్న సుయోధనుడు హుటాహుటిన ద్రోణుని వద్దకు వెళ్లాడు. “ఆచార్యా! అటు చూడండి ఆచార్యా! అర్జునుడు,సాత్యకి, భీమసేనుడు సైంధవుడు

ఉన్న చోటికి చేరుకున్నారు. అర్జునుడు చొరబడితే చొరబడ్డాడు. కాని సాత్యకిని, భీమసేనుడిని ఎందుకు వదిలిపెట్టారు. ఇది మీకు భావ్యమా! ఆఖరుకు సాత్యకిని కూడా మీరు ఆపలేకపోయారా! మీరు ఈమాదిరిగా అందరి ముందు తలవంచడం మా దౌర్భాగ్యము కాక మరేమున్నది.”అని నిష్ఠూరంగా మాట్లాడాడు.

ఆ మాటలకు ద్రోణుడు ఇలా అన్నాడు. “సుయోధనా! ఇక్కడ ఎవరు ఎలా వెళ్లారు అని కాదు మనము చూడవలసినది. సైంధవుడు క్షేమంగా ఉన్నాడా లేదా అని. సైంధవుని క్షేమము మన తక్షణ కర్తవ్యము. ఈ దినం నీకూ అర్జునునికీ జరుగుతున్న యుద్ధం ఒక జూదం లాంటిది. ఇందులో సైంధవుడు ఒక పందెం. ఈ జూదం శకుని తెలివి తేటలతో గెలిచేది కాదు. రణకౌశలంతో గెలువ వలసినది. కాబట్టి నీవు ధైర్యంగా ఉండు. కర్ణుడు, అశ్వత్థామ మొదలగు వీరులతో నీవు సైంధవుని కాపాడు. నేను ఇక్కడ నిల్చి అర్జునుడు, సాత్యకి, భీమసేనులకు సాయం అందకుండా నిరోధిస్తాను. నేను నీతో వస్తే ఇక్కడ ద్వారములు తెరిచినట్టు పాండవ సైన్యము ఒక్కసారిగా ముందుకు చొరపడుతుంది. అప్పుడు మనము సైంధవుని కాపాడటం కష్టం అవుతుంది. కాబట్టి నేను నీతో రాలేను. నీవు వెళ్లు.” అని అన్నాడు ద్రోణుడు.

ద్రోణుని మాటలుమన్నించి సుయోధనుడు సైంధవుని వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కృతవర్మ సాత్యకితో యుద్ధం చేస్తున్నాడు.

సాత్యకి కృతవర్మను జయించి అర్జునుని వద్దకు వెళ్లగలిగాడు. అది చూచి సుయోధనుడు వారి ముగ్గురినీ ప్రతిఘటించాడు. సాత్యకి పక్కన ఉన్న ఉత్తమౌజుడు సుయోధనుని విల్లు విరిచాడు. నిశితమైన బాణములతో సుయోధనుని గుండెలకు గురి చూచి కొట్టాడు. సుయోధనుడు మరొక విల్లు అందుకొని ఉత్తమౌజుని సారథిని చంపాడు. గుర్రములను చంపాడు.

ఉత్తమౌజుడు సాత్యకి రథం ఎక్కాడు. మరొక విల్లు తీసుకొని సుయోధనుని రథము విరగ్గొట్టాడు. సుయోధనుని విల్లు విరిచాడు. సుయోధనుడు తన రథము నుండి కిందికి దూకి, గద తీసుకొని సాత్యకి రథమును విరగ్గొట్టాడు. సాత్యకి, ఉత్తమౌజులు తమ రథము నుండి కిందికి దూకారు. సుయోధనుడు శల్యుని రథము ఎక్కాడు. సాత్యకి, ఉత్తమౌజుడు తమ తమ గదాయుధములతో సుయోధనుని, శల్యుని చావగొట్టి, వారిని రథమునుండి కిందికి తోసి, ఆ రథము ఎక్కి అర్జునుని చేరుకున్నారు."

అని పలికిన సంజయుని మాటలు విని ధృతరాష్ట్రుడు, "అదేమిటి సంజయా! మన వాళ్లందరూ కర్ణుడు పాండవులను గెలిచి మనలను కాపాడతారని అనుకుంటే ఇదేమిటి ఇలా అయింది. కర్ణుడు ఎక్కడకు పోయాడు. ఏం చేస్తున్నాడు వివరంగా చెప్పు" అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

" వృష సేనుని రథము ఎక్కి పారిపోయిన కర్ణుడు, మరలా భీముని వద్దకు వచ్చి "భీమసేనా!" అని ఎలుగెత్తి పిలిచాడు. ఆ పిలుపు విని భీమసేనునికి కోపం వచ్చింది. కర్ణుని మీద శరవర్షము కురిపించాడు. కర్ణుడు కూడా భీమసేనుడు వేసిన బాణములను తుంచి తిరిగి భీమసేనుని అతి క్రూరమైన బాణములతో ముంచెత్తాడు. ఇరువురి మధ్యపోరు ఘోరంగా సాగుతూ ఉంది.

భీమసేనుడు కర్ణుని విల్లు త్రుంచాడు. కర్ణుని రథమునకు కట్టిన హయములను, సారధిని చంపాడు. కర్ణుడు చికాకు పడి పక్కకు పోయి వేరొక రథము ఎక్కాడు." అని చెప్పిన సంజయుని చూచి "ఛా! మా సుయోధనుడు ఎంతగానో నమ్మిన కర్ణుడు ఈ విధంగా చెయ్యడం చూచి బుద్ధి హీనుడైన మా సుయోధనుడు ఏమనుకున్నాడో ఏమో! అదిసరే అన్ని డంబములు పలికిన కర్ణుడు తరువాత ఏమి చేసాడో చెప్పు." అని అడిగాడు ధృతరాష్ట్రుడు. సంజయుడు చెప్పసాగాడు.

"అవమానంతో రగిలిపోతున్న కర్ణుడు తిరిగి భీమసేనుని ఎదుర్కొన్నాడు. ఆ ఇరువురి మధ్య పోరు ఘోరంగా సాగుతూ ఉంది. భీమసేనుని చేతిలో కర్ణుని సైన్యం మొత్తం హతమై పోయింది." అని చెప్పాడు సంజయుడు.

అది విన్న ధృతరాష్ట్రుడు "సంజయా! కర్ణుడు అర్జునుని జయిస్తాడనే గుడ్డి నమ్మకంతో అహంకారంతో మదమెక్కి

సుయోధనుడు పాండవులతోయుద్ధానికి దిగాడు. కాని ఈ కర్ణుడు కనీసం భీమసేనుని కూడా జయించలేకపోయాడు. వీడు అర్జునుని, తక్కిన పాండవులను ఎలాగెలువ గలడు? ఆ నాడు శ్రీకృష్ణుడు సంధి చేయడానికి ప్రయత్నించినా తృణీక రించాడు. ఫలితం అనుభవిస్తున్నాడు. సరేలే. అయినదేదో అయింది. తరువాత ఏంజరిగిందో చెప్పు." అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు:

"తన సేన మొత్తం నాశనం కావడం చూచిన కర్ణుడు కోపంతో ఊగి పోయాడు. భీముని మీద 30 నిశిత శరములు ప్రయోగించాడు. మరలా భీముడు కర్ణుని రథసారథిని చంపి అతని రథమునకు కట్టిన హయములను చంపాడు. కర్ణుడు తన రథమును తానే తోలుకుంటూయుద్ధం చేస్తున్నాడు. భీముని మీద శక్తి అనే ఆయుధాన్ని ప్రయోగించాడు. భీముడు ఆ శక్తిని తునాతునకలు చేసాడు. కర్ణుని శరీరాన్ని 9 వాడి బాణములతో కొట్టాడు. కర్ణుడు మరొక విల్లు తీసుకొని భీముని మీద అవిశ్రాంతంగా శరవర్షము కురిపించాడు. ఇరువురూ సింహనాదములు చేస్తూ ఒకరితో ఒకరు పోరుతున్నారు. భీముడు కర్ణుని విల్లు విరిచి, అతని హయములను చంపాడు. కర్ణుని ఒంటినిండా బాణములు నాటాడు.

ఇదిచూచి సుయోధనుడు కర్ణునికి సాయంగా దుర్జయుని పంపాడు. దుర్జయుడు అత్యంత సాహసంతో భీమసేనుని ఎదుర్కొన్నాడు. దుర్జయుడు భీమసేనుని రథమునకు కట్టిన హయములను, రథసారథిని గాయపరిచాడు. భీముడు కోపంతో ఊగి పోయాడు. కర్ణుడు చూస్తూ ఉండగా భీమసేనుడు ఒకే ఒక బాణంతో దుర్జయుని తల నరికాడు.

కర్ణుడు మరలా భీముని ఎదుర్కొన్నాడు. భీముని వక్షస్థలం మీద ఒక వాడియైన బాణము నాటాడు. భీముడు తన గద తీసుకొని కర్ణుని రథము విరగ గొట్టాడు. సారథిని చంపాడు. కేతనము విరిచాడు. రథము విరిగిననూ కర్ణుడు వెనుదిరగలేదు.

ఇంతలో సుయోధనుడు తన తమ్ముడైన దుర్ముఖుని కర్ణునికి సాయంగా పంపాడు. దుర్ముఖుడు భీముని తనపరాక్రమంతో ఎదుర్కొన్నాడు. ఒక పక్క కర్ణునితోయుద్ధం చేస్తూనే, తొమ్మిది నిశిత శరములతో భీముడు దుర్ముఖుని చంపాడు. దుర్ముఖుని చావు కళ్లారా చూచిన కర్ణుడు దుఃఖంతో కుమిలి పోయాడు. మరలా భీమసేనుని ఎదుర్కొన్నాడు. కర్ణునికి భీమునికి పోరు ఘోరమయింది. భీముడు అత్యంత క్రూరమైన బాణములను కర్ణుని గుండెలకు గురిపెట్టి కొట్టాడు. భీముని దెబ్బకు తట్టుకొనలేక కర్ణుడు తన రథమును పక్కకు మరలించాడు.” అని చెప్పాడు సంజయుడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా అన్నాడు. “సంజయా! విధి వైచిత్ర్యము కాకపోతే భీముని చేతిలో కర్ణుడు పరాజితుడు కావడం ఏమిటి? ఈ కర్ణుడిని నమ్ముకునే కదా నా కుమారుడు సుయోధనుడు పాండవులతో వైరం పెంచుకున్నాడు. ఈ యుద్ధానికి దిగాడు. కర్ణుడు పాండవులను యుద్ధంలో జయిస్తాడు అని పొగుడుతుంటాడు. ఈ విషయం వింటే సుయోధనుడు ఎంత బాధపడతాడో కదా!

అయినా సంజయా! భీమసేనుడు ఆ దేవతలకు, రాక్షసులకు, నాగులకే భయపడలేదు. ఈ మనుషులు ఒక లెక్కా! భీమసేనుడు జరాసంధుని చంపాడు అని తెలిసికూడా పసివారు దుర్జయుడు, దుర్ముఖుడు అతని మీదికి యుద్ధానికి ఎందుకు వెళ్లారు! సంజయా! ఒక్క భీముడేమి? సాత్యకి తక్కువ వాడా! దుర్యోధనుడు సాత్యకిని ఎదుర్కొనగలడా? మనవాళ్లకు ఓటమి తప్పదు అనిపిస్తూ ఉంది.” అని బాధపడ్డాడు ధృతరాష్ట్రుడు.

ఆ మాటలు విన్న సంజయుడు “మహారాజా! కావాలని విషాన్ని తాగి, శరీరం బాధపడుతున్నది అని అనుకుంటే ఎలాగా! నీవు, నీ కుమారుడు ప్రయత్నపూర్వకముగా ఈయుద్ధమును కోరుకున్నారు. అనుభవిస్తున్నారు. దానికి బాధపడటం దేనికి. ఇంక మారు

మాటాడకుంటా యుద్ధ విశేషములను వినండి." అని చెప్పసాగాడు సంజయుడు.

"కర్ణుడు ఆ ప్రకారం ఓడి పోవడం చూచి నీ కుమారులు దుర్మర్షణుడు, దుర్మదుడు, దుస్సహుడు, విజయుడు, విచిత్రుడు ఒక్కుమ్మడిగా భీముని చుట్టుముట్టారు. వారి అండ చూచుకొని కర్ణుడు కూడా భీముని మీద శరప్రయోగము చేస్తున్నాడు. భీమసేనుడు విజృంభించాడు. నీ కుమారు లందరినీ తన వాడి బాణములతో చంపాడు. వారి రథములను విరగ్గొట్టాడు.

అది చూచిన కర్ణుడు భీముని మీద 75 బాణములను ప్రయోగించాడు. వాటిని మధ్యలోనే తుంచిన భీముడు, కర్ణుని శరీరములో 105 బాణములను గుచ్చాడు. కర్ణుని వింటిని విరిచాడు. కర్ణుడు మరొక విల్లు తీసుకున్నాడు. అంతలో భీముడు కర్ణుని సారథిని చంపాడు. మరలా అతని విల్లు విరిచాడు. రథమునకు కట్టిన హయములను చంపాడు. కర్ణుడు ఒక గదతీసుకొని భీమసేనుని మీదికి విసిరాడు. భీమసేనుడు ఆ గదను ముక్కలు చేసాడు. కర్ణుడు మరొక విల్లు తీసుకున్నాడు, భీమసేనుని కవచమును భేధించాడు. భీమసేనుడు కూడా కర్ణుడు తొడుక్కున్న కవచమును కొట్టాడు.

కర్ణుడు నేల మీద నిలబడియుద్ధం చెయ్యడం చూచిన సుయోధనుడు వెంటనే తన సోదరులైన చిత్రుడు, విచిత్రుడు,

చారుచిత్రుడు, చిత్రధ్వజుడు, చిత్రాయుధుడు, చిత్రకర్ముడు, వీరిని భీమసేనుని మీదికి పంపాడు. భీమసేనుడు వారి రథములను అన్నింటిని విరిచాడు. వారి సారథులను చంపాడు. వాడి బాణములతో నీ ఏడుగురుకొడుకుల తలలు నరికాడు.

ఈ వ్యవధిలో కర్ణుడు మరొక రథము ఎక్కి భీముని మీదికి ఉరికాడు. ఇరువురి మధ్య పోరు ఘోర మయింది. ఒకరికి ఒకరు తీసిపోనట్టు పోరు తున్నారు. ఇంతలో నీ కుమారులైన శత్రుంజయుడు, శత్రుసహుడు, సుదేహుడు, మదనుడు, ద్రుముడు, చిత్రబాహుడు, వికర్ణుడు మొదలగా వారు కర్ణునికి రక్షణగా భీమసేనునితో యుద్ధం చేస్తున్నారు. వారందరూ ఒక్కుమ్మడిగా భీమసేనుని చుట్టుముట్టారు. భీముని మీద బాణవర్షము కురిపించారు. భీముడు పట్టరాని కోపంతో ఒక్కొక్కరిని ఒక్కొక్క బాణంతో యమసదనానికి పంపాడు. విజయోత్సాహంతో సింహనాదంచేసాడు.

భీమసేనుని చేతిలో తన తమ్ములు మరణించడం చూచి సుయోధనుడు ఎంతో బాధ పడ్డాడు" అని సంజయుడుచెప్పాడు. తన కుమారుల మరణము గురించి విన్న ధృతరాష్ట్రుడు దుఃఖంతో "సంజయా! ఆనాడు జూదం జరుగుతున్నప్పుడు విదురుడు అన్నమాటలు అని అక్షరాలా నిజమవు తున్నాయి. ఇప్పుడు విచారించి ప్రయోజనము ఏమిటి? నా కుమారుల దుర్మరణము గురించి వినడం

తప్ప నాకు మిగిలినదేమున్నది. సుయోధనుని కుయుక్తి, దుర్బుద్ధితో ఇదంతా దాపురించినది. ఒకరిని నిందించి ప్రయోజనము లేదు. జరుగనున్నది జరుగక మానదు. తరువాత ఏమి జరిగినదో చెప్పు." అని అన్నాడు ధృతరాష్ట్రుడు. సంజయుడు చెప్పనారంభించాడు.

భీముడి సింహనాదం విన్న కర్ణుడు కోపంతో ఊగిపోయాడు. మరలా భీమసేనుని మీదకు విజృంభించాడు. కౌరవసేనలు భీమసేనుని కమ్ము కున్నాయి. భీమసేనుడు వారందరితో యుద్ధం చేస్తున్నాడు. వారి రధములను విరగ్గొట్టాడు. వార రధములను కట్టిన కేతనములను, వారి రధసారధులను, రధములకు కట్టిన హయములను చంపుతున్నాడు. కౌరవ సేనలను వరుస పెట్టి నరుకుతున్నాడు. వారి నెత్తురు కాలువలుగా ప్రవహిస్తూ ఉంది. చావగా మిగిలిన కౌరవ సేనలు భీముని ఎదురు పడకుండా పక్కకు తప్పు కుంటున్నాయి. భీమసేనుని ఎదుర్కొనే వారే లేకపోయారు.

భీమసేనుని ఎదురుగా కర్ణుడు ఒక్కడే మిగిలాడు. భీమసేనుడు కర్ణుని గుండెలకు గురి చూచి కొడుతున్నాడు. కర్ణుని నుదుటిమీద వరుసగా బాణములు నాటాడు. దానికి ప్రతిగా కర్ణుడు భీమసేనుని మీద 100 బాణములు ప్రయోగించాడు. దానికి కోపించి భీముడు కర్ణుని విల్లు విరగ్గొట్టాడు.

కర్ణుడు మరొక విల్లుతీసుకొని భీమసేనుని మీద శర పరంపర కురిపించాడు. కర్ణుడు భీముని విల్లు విరిచాడు. భీముని కేతనమును పడగొట్టాడు. భీముని రధసారధిని కొట్టాడు. భీముడు కర్ణుని మీదికి శక్తి బాణము ప్రయోగించాడు. కర్ణుడు దానిని తొమ్మిది శరములతో త్రుంచాడు. భీముడు తన కత్తి, డాలు తీసుకున్నాడు. కర్ణుడు భీముని డాలును విరగ్గొట్టాడు. భీముడు తన కత్తితో కర్ణుని విల్లు విరగ్గొట్టాడు. కర్ణుడు వేరు విల్లు తీసుకొనే లోపల భీముడు కర్ణుని రధంమీదికి లంఘించాడు. కర్ణుడు భయపడ్డాడు. తన రధము వెనకకు పోయి దాక్కున్నాడు.

రధము మీద కర్ణుడు కనపడలేదు. కర్ణుడు ఎక్కడకు పోయాడా అని భీముడు నలుదిక్కులా చూస్తున్నాడు. ఒక వేళ రధము కింద దాక్కున్నా డేమోఅని తేరు కిందికి చూచిన భీముని మీదికి కర్ణుడు బాణములను ప్రయోగించాడు. ఈ బాణముల ధాటికి తట్టుకోలేక పోయాడు భీముడు. అక్కడే పడి ఉన్న సైనికుల శవములగుట్టలను అడ్డం పెట్టుకొని వాటిలోకి దూరిపోయాడు భీముడు.

భీముని దైన్య స్థితిని చూచిన కర్ణుడు అతని వద్దకు పోయి అతని పొట్ట మీద విల్లు పెట్టి విలాసంగా నిలబడి భీమునితో ఇలా అన్నాడు. " ఓరి భీమసేనా! తిండిపోతా! నీకు యుద్ధం ఎందుకురా! కడుపు నిండా మింగి ఒక పక్క కూర్చోక నీకు యుద్ధం కావాల్సి వచ్చిందా! అంతగా

మిడిసి పడుతున్నావు! అడవులలో మృగాలమాదిరి తిరిగిన మీకు, ఆకులలములు, పచ్చిమాంసం తిన్న మీకు, యుద్ధం ఎందుకురా? అయినా నీ శక్తి తెలుసుకొని, నీకు తగిన వారితో యుద్ధం చెయ్యి కాని నా తో పెట్టుకోకు. అరుగో కృష్ణార్జునులు వారి వద్దకు పోయి తలదాచుకో పో!" అని భీముని నిందించాడు కర్ణుడు.

ఇది చూచాడు అర్జునుడు. భీముని దుఃఖమును నివారించడానికి కర్ణుని తో యుద్ధానికి తలపడ్డాడు. ఇది చూచి కర్ణునికి సాయంగా అశ్వత్థామ వచ్చాడు. అర్జునుడు కర్ణుని మీద వేసిన బాణములు అన్ని అశ్వత్థామ మధ్యలోనే తుంచాడు. అర్జునుని మీద 64 బాణములను ప్రయోగించాడు. ఇది చూచి అర్జునుడు అశ్వత్థామను తరుముకున్నాడు. అశ్వత్థామ ఏనుగుల సేనలోకి దూరిపోయాడు. ఇంతలో భీముని రథసారథి విశోకుడు రథమును సిద్ధంచేసి తెచ్చాడు. భీముడు ఆ రథం ఎక్కి అర్జునుని రథం దగ్గరకు వచ్చాడు. ఈ సమయములోనే సాత్యకి కూడా అర్జునుని వద్దకు వచ్చాడు." అని సంజయుడు ధృతరాష్ట్రుని తో చెప్పాడు.

అది విన్న ధృతరాష్ట్రుడు "సంజయా! బలవంతులతో వైరము ఎన్నటికీ మంచిది కాదు కదా! ఇప్పటి కైనా నా కుమారులు పాండవుల రాజ్యభాగము వారికి ఇచ్చిన మంచిదికదా! కాని నా కుమారుడు పెద్ద మూర్ఖుడు. నా మాట వినడు. ఎందుకంటే వాడికి తెలియదు. ఒకరు

చెపితే వినడు. ఇలాంటి కొడుకు తో ఏమన గలను! అది అటుండనిమ్ము. ఎప్పుడైతే అర్జునుడు ద్రోణుని దాటి శకటవ్యూహములో ప్రవేశించాడో అప్పుడు సైంధవుడు సగం చచ్చాడు. ఇప్పుడు అదే దారిలో సాత్యకి, భీముడు అర్జునుని చేరుకున్నారు. ఇంక సైంధవుని మరణము తథ్యము గదా! సరే ఇప్పుడు ఏమనుకున్నను ఏమున్నది. యుద్ధవిశేషములు వివరింపుము." అని అన్నాడు ధృతరాష్ట్రుడు. సంజయుడు తదుపరి యుద్ధవిశేషములు చెప్పసాగాడు.

"సాత్యకి, భీమసేనుడు అర్జునుని వద్దకు చేరుకున్నప్పుడు అలంబసుడు అనే రాజు వారిని ఎదుర్కొన్నాడు. సాత్యకి, అలంబసుడు ఘోరంగా యుద్ధ చేస్తున్నారు. ఒకరి విల్లు ఒకరు విరిచారు. కవచాలను చీల్చుకున్నారు. సాత్యకి కోపించి అలంబసుని రథసారథిని, హయములను చంపి ఒక అర్ధ చంద్ర బాణముతో అలంబసుని తల తెగ నరికాడు.

ఇంతలో నీ కుమారులు అందరూ దుశ్శాసనుని ముందుంచుకొని సాత్యకిని ఎదుర్కొన్నారు. సాత్యకి ఎదురుగా ఉన్న దుశ్శాసనుని హయము లను చంపాడు. దుశ్శాసునుని రథము మీదికి దూకపోయాడు. అప్పుడు త్రిగర్త సైనికులు అతనిని ఎదుర్కొన్నారు. సాత్యకి వారిలో 50 మందిని వెను వెంటనే చంపాడు. అదిచూచి మిగిలిన సైనికులు పారిపోయారు.

అప్పుడు సాత్యకి శూరసేన దేశాధీశుని సైనికులను వెంబడించాడు. కళింగ సైనికులను నాశనం చేసాడు. సాత్యకి బలపరాక్రమములను చూచిన కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా! అటు చూడు. మన సాత్యకి, అదే నీ శిష్యుడు, నీ పేరు నిలబెడుతున్నాడు. ద్రోణుడు అంతటి వాడిని జయించి లోపలకు రాగలిగాడు. ధర్మరాజు మీది భక్తి నీ మీద ఉన్న మైత్రి అతనిని ఇక్కడి దాకా తీసుకు వచ్చాయి." అని ప్రశంసించాడు.

దానికి అర్జునుడు కృష్ణునితో "కృష్ణా! నేను సాత్యకిని ధర్మరాజుకు రక్షణగా ఉండమన్నాను. కాని అతను నా మాట పాటించక ఇక్కడకు వచ్చాడు. ఇక్కడ ధర్మరాజు పరిస్థితి ఎలా ఉందో కదా! ఇప్పుడు ధర్మజుడు ద్రోణుని బారిన పడ్డాడు. ఇక్కడ చూడపోతే సైంధవుడు చావడం లేదు. సూర్యుడు అస్తమించబోతున్నాడు. ఏమి చెయ్యాలో తోచడం లేదు! పైగా, సాత్యకి ఇప్పటి దాకా ద్రోణుడు, కృపాచార్యుడు,కృతవర్మ మొదలగు వారితో పోరి అలసిపోయాడు. అడుగో అటు చూడు! భూరిశ్రవసుడు సాత్యకితో యుద్ధమునకు తలపడుతున్నాడు. సాత్యకి అతనితో ఎలాయుద్ధం చేస్తాడో ఏమిటో! అయినా మా అన్నయ్య ధర్మజుడు సాత్యకిని ఇక్కడికి ఎందుకు పంపినట్టు? ద్రోణాచార్యుడు, పక్షికోసం పొంచి ఉన్న డేగ వలె, తన కోసం పొంచి ఉన్నాడని తెలియదా! ఈ

ఆలోచన కూడా ధర్మజునకు రాలేదా! ఏమిటో! ఏమీ అర్ధం కాకుండా ఉంది." అని తనలో తను పరితపిస్తున్నాడు.

ఇంతలో సోమదత్తుని కుమారుడు భూరిశ్రవసుడు సాత్యకి మీద విరుచుకు పడ్డాడు. ఇరువురికి ఘోర సంగ్రామం జరిగింది. ఒకరి మీద ఒకరు బాణ వర్షం కురిపించారు. ఒకరి కవచము ఒకరి చీల్చుకుంటున్నారు. ఒకరి రథములనకు కట్టిన హయములను మరొకరు చంపారు. రథ సారధు లను చంపుకుంటున్నారు. రథములు దిగి నేల మీద కత్తి యుద్ధం చేస్తున్నారు. అవికూడా కింద పారవేసి మల్లయుద్ధం చేస్తున్నారు. కాని ఇద్దరిలో భూరిశ్రవ సునితో పై చేయిగా ఉండటం కృష్ణుడు చూచాడు.

"అర్జునా! ఏమిటి అలాచూస్తున్నావు. నీ కోసం నీకు సాయంగా వచ్చిన సాత్యకి భూరిశ్రవసునితో యుద్ధం చేసి అలసిపోయాడు. సత్వరమే అతనిని రక్షించు." అని పలికాడు. అలా కృష్ణుడు చెపుతూ ఉండగానే భూరిశ్రవసుడు సాత్యకిని బలంగా పైకెత్తి కిందికి విసిరేసాడు.

ఇది చూచిన కృష్ణుడు "అర్జునా! ఇది న్యాయం కాదు. నీకు సాయంగా వచ్చిన నీ శిష్యుడు ఆపదలో ఉన్నాడు. అతనిని రక్షించడం నీ ధర్మం. సత్వరమే అతనిని రక్షించు." అని పలికాడు.

"కృష్ణా! వారిద్దరూ ఒకరితో ఒకరు మల్లయుద్ధం చేస్తున్నారు. ఇప్పుడు వారి మధ్యకు నేను వెళ్లి బాణప్రయోగం చేయడం ధర్మం

కాదుకదా! అని చెప్పి నా మిత్రుడి చావు చూడలేను. కాబట్టి ఎలాగైనా సాత్యకిని కాపాడుతాను." అని అన్నాడు అర్జునుడు.

అర్జునుడు ఇలా అంటూ ఉండగానే మరలా భూరిశ్రవసుడు సాత్యకిని రెండు చేతులో పైకి ఎత్తి బలంగా నేల కేసి మోదాడు. సాత్యకి గుండెల మీద కాలు పెట్టి నిలబడ్డాడు. కత్తితీసుకొని సాత్యకి తల నరకడానికి కత్తి పైకి ఎత్తాడు. అది చూచిన కృష్ణుడు "అర్జునా! ఇంకా ఆలస్యం దేనికి? బాణప్రయోగం చెయ్యి" అని తొందరపెట్టాడు.

వెంటనే అర్జునుడు గాండీవం ఎక్కుబెట్టి ఒకే ఒక బాణంతో ఎత్తిన భూరిశ్రవసుని చెయ్యి తెగనరికాడు. భూరిశ్రవసుని చెయ్యి తెగి కింద పడింది. అప్పుడు భూరిశ్రవసుడు అర్జునుని వంక చూచాడు. "అర్జునా! ఇంతటి అన్యాయానికి పాల్పడతావని నేను అనుకోలేదు. నేను నీతో యుద్ధం చేస్తున్నానా! లేదే! నేను సాత్యకితో యుద్ధం చేస్తుంటే నీవు మధ్యలో ఎందుకు వచ్చావు? ఇది క్షత్రియధర్మమా! యుద్ధనీతియా! ఇంతటి నీచ మైన యుద్ధ నీతిని నీకు నీ గురువు ద్రోణుడు నేర్పాడా! లేక నిన్ను పుట్టించిన ఇంద్రుడు చెప్పాడా! లేక నీ వంటి అధర్మపరుడికి పాశుపతం ప్రసాదించిన ఆ పరమ శివుడు బోధించాడా! నీ పక్కనే కూర్చున్న ఆ శ్రీకృష్ణుడు ఇదంతా చూస్తూ ఎలా సహిస్తున్నాడు. నీ చేత ఇంత పాపం ఎలా చేయిస్తున్నాడు?" అని అడిగాడు భూరశ్రవసుడు.

ఆ మాటలు విన్న అర్జునుడు నవ్వి "భూరిశ్రవసా! నీవు నాకు నీతులు చెపుతున్నావా? యుద్ధ రంగంలో వీరులు యుద్ధం చేస్తుంటే, వారి బంధువులు కాపాడటం అధర్మమా! అయినా నువ్వు ఆపదలో ఉన్నప్పుడు నీ సేనాధి పతులు, నీ మిత్రులు ఏమి చేస్తున్నారు? వారు వచ్చి నిన్ను ఎందుకు కాపాడలేదు? నీవు చేసిన పని మాత్రం ఏమిటి? ఇప్పటికే యుద్ధ రంగమున అలసి పోయి ఉన్న సాత్యకిని, నిరాయుధుడైన సాత్యకిని, అమానుషంగా చంపడానికి పూనుకొన లేదా! ఆ సమయంలో సాత్యకిని నేను రక్షించడం అధర్మం ఎందుకవుతుంది. అయినా నిన్న జరిగిన యుద్ధములో మీరందరూ కలిసి బాలుడైన అభిమన్యుని చుట్టుముట్టి తుదముట్టించారే ! అది అధర్మము కాదా!" అని అన్నాడు.

భూరిశ్రవసుడు మారు మాటాడలేకపోయాడు. అప్పుడు అర్జునుడు అనునయంగా "భూరిశ్రవసా! నేను నిన్ను అవమానించలేదు. నేను చేసిన ప్రతిజ్ఞ తెలుసుకదా! దానిని గురించి కూడా కొంచెం ఆలోచించు. నేను క్షత్రియధర్మము ప్రకారమే చేసాను. కాని ఇన్ని అధర్మాలకు కారణం ఆ సుయోధనుడే అని మరిచిపోతున్నావు. సుయోధనునికి నరక ప్రాప్తి తథ్యం. నీవు మాత్రం వీరస్వర్గం అలంకరిస్తావు." అని అన్నాడు.

ఒక చేయి తెగిన భూరిశ్రవసుడు తన బాణములను నేలమీద పరిచి వాటి మీద కూర్చుని ప్రాయోపవేశం చేసాడు. అప్పటి దాకా ఇదంతా చూస్తున్న సాత్యకి ఒక కత్తి తీసుకున్నాడు. భూరిశ్రవసుని మీదికి లంఘించాడు. అప్పుడు అక్కడ ఉన్న శ్రీ కృష్ణుడు, అర్జునుడు, భీమసేనుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు, కర్ణుడు మొదలగా వారు "వద్దు..... వద్దు" అంటూ వారిస్తున్నా వినకుండా, విపరీతమైన కోపంతో ఉన్మాదిగా మారి, ఒకే వేటుతో భూరిశ్రవసుని తల నరికాడు. భూరిశ్రవసుడు వీరస్వర్గము అలంకరించాడు. అప్పుడు తనను వారించిన వారందరికి అభిమన్యుడు ఎలా చనిపోయాడో వివరించి తాను భూరిశ్రవసుని తల నరకడం తప్పుకాదని సమర్థించుకున్నాడు." అని సంజయుడు ధృత రాష్ట్రునికి వివరించాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు "సంజయా! సాత్యకి మహా బలవంతుడు కదా! అతను భూరిశ్రవసుని చేతిలో ఎందుకు అవమానాలపాలయ్యాడు. దీని కేమైనా కారణం ఉన్నదా?" అని అడిగాడు. సంజయుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"మహారాజా! చంద్ర వంశపు రాజైన యయాతి కుమారుడు యదువు. అతని వలన వచ్చినదే యాదవకులము. ఆ యాదవ కులము లో జన్మించిన దేవమీఢునకు పుట్టినవాడు శూరుడు. శూరుని కొడుకు వసుదేవుడు. దేవకుడు అనే రాజు తన కుమార్తె దేవకి కి వివాహం

చేయునిమిత్తం స్వయం వరం చాటించాడు. యాదవ కులంలో పుట్టిన మహారాజు శిని. దేవకిని వసుదేవునికి ఇచ్చివివాహం చేయు నిమిత్తం శిని మహారాజు బలవంతంగా దేవకిని తీసుకొని వచ్చాడు. స్వయంవరమునకు వచ్చిన రాజులు ఎవ్వరూ శిని కి ఎదురునిల్చి పోరాడలేక పోయారు. ఒక్క సోమదత్తుడు(భూరిశ్రవసుని తండ్రి) మాత్రం శిని ని ఎదిరించాడు. ఇరువురికీ దేవకి నిమిత్తం ఘోరయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో శిని సోమదత్తుని ఓడించాడు. కింద పడదోసాడు. జుట్టుపట్టుకొని ఈడ్చాడు. అవమానించాడు. చంపకుండా వదిలేసాడు.

ఆ అవమాన భారంతో తల ఎత్తుకోలేకపోయాడు సోమదత్తుడు. రాజ్యం విడచి అడవులకు పోయాడు. శివుని గూర్చి ఘోర తపస్సు చేసాడు. శివుడు ప్రత్యక్షం అయ్యాడు. అప్పటికే శిని, శిని కుమారుడు చనిపోయారు కాబట్టి శిని మనుమడైన సాత్యకిని ఓడించే కుమారుడిని ప్రసాదించమని అడిగాడు. శివుడు అతడు కోరిన వరం ఇచ్చాడు. ఆ వరప్రభావంతో సోమదత్తునికి భూరిశ్రవసుడు జన్మించాడు. ఈ విధంగా భూరిశ్రవసుడు సాత్యకిని అవమానించాడు." అని చెప్పి తరువాత జరిగిన యుద్ధ సంఘటనలను సంజయుడు వివరించసాగాడు.

" ఆ ప్రకారంగా సాత్యకి చేతిలో భూరిశ్రవసుడు మరణించాడు. అర్జునుడు తన రథమును సైంధవుడు ఉన్న చోటికి పోనిమ్మని కృష్ణునికి

చెప్పాడు. ఆ సమయంలో సుయోధనుడు, అశ్వత్థామ, కర్ణుడు మొదలగు వారు అర్జునునికి అడ్డుపడ్డారు. సాత్యకి కర్ణుని ఎదుర్కొన్నాడు. ఇరువురికీ పోరు సాగింది. ధృతరాష్ట్ర మహారాజా! ముందు రోజు శ్రీకృష్ణుడు తనసారధి దారుకునికి రధము సిద్ధం చేసి ఉంచమని, తాను పాంచజన్యం పూరించగానే తన వద్దకు తీసుకురమ్మని చెప్పాడు కదా. ఆ ప్రకారమే కృష్ణుడు పాంచజన్యం పూరించాడు. అప్పుడు దారుకుడు గరుడధ్వజముతో, శైల్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకము అను హయములను కట్టిన కృష్ణుని రథమును వేగంగా తోలుకుంటూ కృష్ణుని వద్దకు తీసుకొని వచ్చి ఆపాడు. శ్రీకృష్ణుడు సాత్యకి తో "తమ్ముడా ఆ రధం ఎక్కి కర్ణునితో యుద్ధం చెయ్యి" అని చెప్పాడు. వెంటనే సాత్యకి కృ ష్ణుని రధం ఎక్కాడు. కర్ణునితో యుద్ధం చేస్తున్నాడు. ఇది అంతా ఆశ్చర్యంతో చూస్తున్నాడు అర్జునుడు.

"అర్జునా! తరువాత ఆశ్చర్యపడుదువు గాని,ముందు సైంధవుడు ఎక్కడున్నాడో చూడు. పొద్దు కుంకుచున్నది. త్వరగా చూడు." అని హెచ్చరించాడు. "మరి సాత్యకి......" అని అన్నాడు అర్జునుడు.

"కర్ణుడు,సాత్యకి ఒకరికి ఒకరు తీసిపోరు. నా చక్ర రక్షకులు సాత్యకిని రక్షిస్తూ ఉంటారు. వారి సంగతి మనకు ఎందుకు. ముందు సైంధవుని సంగతి చూడు." అంటూ కృష్ణుడు రధమును సైంధవుడు ఉన్న వైపుకు వేగంగా పోనిచ్చాడు.

సాత్యకి రెట్టించిన పరాక్రమంతో కర్ణుడిని ఒళ్లంతా తూట్లుపడేట్టు కొట్టాడు. కర్ణుడి రథం విరగ్గొట్టాడు. కేతనము త్రుంచాడు. సారథిని చంపాడు. హయములను చంపాడు. అది శ్రీకృష్ణుని రథం కాబట్టి, దారుకుడు అందులో సమృద్ధిగా ఆయుధములు పెట్టాడు కాబట్టి, సాత్యకి వాటిని ఉపయోగించి, కర్ణుని, అతని సైన్యమును తరిమి తరిమి కొట్టాడు.

ఇంతలో నీ కుమారులు మరొక రథము సిద్ధం చేసి కర్ణుని వద్దకు తీసుకొని వచ్చారు. కర్ణుడు ఆ రథం ఎక్కి మరలా సాత్యకిని ఎదుర్కొన్నాడు. అంతకు ముందు కర్ణుని చేతిలో అవమానాల పాలైన భీముడు తల వంచుకొని తమ్ముడు అర్జునుని వద్దకు పోయి తనను కర్ణుడు అన్న మాటలన్ని చెప్పాడు. "తమ్ముడూ! నేను వెంటనే పోయి కర్ణునికి తగిన గుణపాఠం చెపుతాను." అని అన్నాడు.

దానికి అర్జునుడు "అన్నయ్యా! ఆ కర్ణుడు నిన్ను అనడం, నన్ను అన్నట్టే కదా. ఉండు. నేను వెళ్లి ఆ కర్ణుడి మదం అణుస్తాను." అని అర్జునుడు తన రథం కర్ణుడి వైపు మళ్లించాడు. శ్రీకృష్ణుడు కర్ణుని ఎదురుగా రథం నిలిపాడు. అప్పుడు అర్జునుడు కర్ణుని తో ఇలా అన్నాడు.

"ఏరా కర్ణా! మా అన్నయ్య భీమసేనుని ఎందుకు అలా తూలనాడావు? భీమసేనుడు తరిమితే సిగ్గు లేకుండా వెనక్కుతిరిగి

పరుగెత్తావే! అప్పుడు నిన్ను మేము ఎవరమైనా తిట్టామా! యుద్ధంలో ఒకసారి గెలవడం మరొకసారి ఓడిపోవడం సహజమని నీకు తెలియదా! ఒక్కసారి భీమసేనుని మీద నీది పై చెయి అయినంతమాత్రాన అంత గర్వపడాలా! నీ గురించి నీ పరాక్రమము గురించి నీకు తెలియదా. ఇప్పుడు నువ్వు సాత్యకి చేతిలో ఓడిపోలేదా! ఎంతటి యుద్ధ విశారదులకైనా గెలుపు ఓటములు కలుగుతాయి. అది మరిచిపోయి నీ సాటి వీరుడిని తూలనాడతావా! నీ బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు.

నీ కులమేమిటో నీ గుణం ఏమిటో అందరికీ తెలుసు. నేను ఇంత మాత్రమే చెప్పగలను. నా మాటలు మరిచిపోకు! నేను లేనపుడు అందరూ చుట్టుముట్టి నా కుమారుడు అభిమన్యుని చంపారే! నీవు ఒక్కడివే అధర్మంగా నా కుమారుడి విల్లు విరిచావు. కాని నేను ఈ రోజు ఇప్పుడు ధర్మబద్ధంగా నీకుమారుని వృషసేనుని చంపుతాను. చూస్తూ ఉండు. నిన్ను ఒక్కడినే కాదు, నిన్నటి దినమున నా కుమారుని అక్రమంగా, అన్యాయంగా, అధర్మంగా చంపిన అందరినీ ఏంచేస్తానో చూస్తూ ఉండు.” అంటూ కర్ణుడిని తరిమాడు.

అప్పుకు కౌరవ సేనలు అర్జునుని చుట్టుముట్టాయి. పోరు ఘోర మయింది. ఇంతలో పొద్దు కుంకపోతోంది. అప్పుడు సుయోధనుడు కర్ణుని చూచి ఇలా అన్నాడు.

“కర్ణా! సాత్యకీ భీముడు తోడు రాగా అర్జునుడు మన సేనలను సైంధవుడు ఉన్న వైపుకు తరుముతున్నాడు. ఇదేమాదిరి ఇంకొంచెం సేపు మనము అర్జునుని ఆపగలిగితే సూర్యుడు అస్తమిస్తాడు. అర్జునుని ప్రతిజ్ఞా భంగం అవుతుంది. మనకు విజయం చేకూరుతుంది. కాబట్టి, నువ్వు, నేను, శల్యుడు, అశ్వత్థామ,కృపాచార్యుడు, దుశ్శాసనుడు కలిసి సూర్యాస్తమయం దాకా అతనిని ఆపగలమా! అర్జునుడు పోగాలము దాపురించి అలాంటి ప్రతిజ్ఞ చేసాడు. దానిని మనము సద్వినియోగం చేసుకోవాలి. అర్జునుడు చస్తే వాడి అన్నదమ్ములు అందరూ మరణిస్తారు. అప్పుడు కురు సామ్రాజ్యము యావత్తు మనం ఏలుకోవచ్చు. కాబట్టి ఈ సమయం లో నీ పట్టుదల పరాక్రమము చూపించు.” అని అన్నాడు.

ఆ మాటలు విన్న కర్ణుడు సుయోధనునితో “రారాజా! నీవు ఏమీ దిగులు పడకు. ఈ మాత్రం చెయ్యకపోతే ఈ కర్ణు డెందుకు. నీవునిశ్చింతగా ఉండు. నా బలపరాక్రమములతో అర్జునుని ఆపుతాను. ఆ పైన దైవమున్నాడు.” అని పలికాడు కర్ణుడు.

అక్కడ తనకు భీమసేనుడు సాత్యకి తోడు రాగా అర్జునుడు కౌరవ సేనను తుత్తునియలు చేస్తున్నాడు. రక్తము ఏరులై పారుతూ ఉంది. అప్పుడు కర్ణుడు, వృషసేనుడు, శల్యుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ సైంధవునికి రక్షణగా నిలబడి అర్జునునితో యుద్ధం చేస్తున్నారు. వారు వేసిన బాణముల నన్నింటిని అర్జునుడు ముక్కలుచేసాడు. వారందరూ

ఒక్కుమ్మడిగా కృష్ణార్జునుల మీద దాడి చేసి వారి శరీరములు అంతా బాణములతో నొప్పించారు. వాటిని లక్ష్య పెట్టక అర్జునుడు సైంధవుడు ఉన్న దెసకుదూసుకుపోతున్నాడు. అడ్డం వచ్చిన కర్ణుని మీద అర్జునుడు, భీముడు సాత్యకి  బాణ వర్షము కురిపించారు.

దానికి కోపించి కర్ణుడు 60 బాణములతో వారిని కొట్టాడు. భీమ సాత్యకుల మర్మస్థానములలో కొట్టాడు. అర్జునుడు కర్ణుని మీద 100 వాడి యైన బాణములు వేసాడు.  వాటిని కర్ణుడు 500 బాణములతో తిప్పికొట్టాడు. అర్జునుడు కర్ణుని విల్లు తుంచాడు. కర్ణుని గుండెలకు గురిపెట్టి బాణ ప్రయోగం చేసాడు. ఆ బాణములను అశ్వత్థాము తన అర్ధ చంద్ర బాణములతో  వమ్ము చేసాడు.  కర్ణుడు మరొక విల్లు తీసుకున్నాడు.  అర్జునుడు కర్ణుడు ఒకరి మీద ఒకరు తీవ్రమైన బాణములను ప్రయోగించు కుంటున్నారు..

అది చూచి సుయోధనుడు తన సైన్యమును కర్ణునికి సాయంగా పంపాడు.  ఇంతలో అర్జునుడు కర్ణుని రథమునకు కట్టిన హయములను చంపాడు. అతని రథ సారధిని చంపాడు. కర్ణుని తన భయంకరమైన బాణములతో కొట్టాడు. అశ్వత్థామ కర్ణుని తన రథము మీద ఎక్కించు కున్నాడు. ఇంతలో శల్యుడు కర్ణుని కి సాయంగా వచ్చాడు. అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు.   కృపాచార్యుడు, వృషసేనుడు, శల్యుడు,

అశ్వత్థామ చేరి అర్జునుని మీద శరప్రయోగం చేస్తున్నారు. వారి వెనుక దాక్కున్నాడు సైంధవుడు.

అర్జునుడు వీరందరి బాణములను అడ్డుకుంటూ, సైంధవుని మీద బాణములు సంధిస్తున్నాడు. సైంధవుడు ఆపదలో ఉన్నాడని తెలుసుకొని సుయోధనుడు తన సేనలనన్నింటిని అక్కడకు రమ్మని చేతితో సైగచేసాడు. కౌరవ సేనలు ఒక్కుమ్మడిగా అర్జునుని చుట్టుముట్టాయి. సైంధవుడు కంటపడగానే అర్జునునికి ఉత్సాహం రెట్టింపయింది. కౌరవ సేనను పటా పంచలు చేస్తూ సైంధవుని మీద బాణములు సంధిస్తున్నాడు. సైంధవుడి రథము మీద ఉన్న వరాహ కేతనాన్ని విరిచాడు. సైంధవుడి రథ సారధి తల నరికాడు. అది చూచి కౌరవ సేనలు భయంతో కంపించాయి.

కృపాచార్యులు, అశ్వత్థామ, వృషసేనుడు, శల్యుడు, కలిసి సైంధవునికి అడ్డంగా నిలబడ్డారు. వారి వెనక సైంధవుడు ఉన్నాడు. సైంధవుని కొట్టే మార్గం లేక అర్జునుడు సూర్యుని వంక చూచాడు. అది గమనించాడు కృష్ణుడు.

"అర్జునా! ఇప్పుడు న్యాయం, ధర్మం అని ఆలోచిస్తుంటే ప్రయోజనం లేదు. సూర్యుడు పశ్చిమ దిక్కు కు పోతున్నాడు. నేను ఒక ఉపాయం చెపుతాను. ఆ ప్రకారం చెయ్యి. నేను కపటోపాయంతో సూర్యమండలాన్ని మరుగు పరుస్తాను. సూర్యుడు అస్తమించాడని

సైంధవుడు, కౌరవ ప్రముఖులు నీ ప్రతిజ్ఞ భంగ మైనదని ఆనందంతో ఇది యుద్ధ భూమి అని మరిచి విచ్చలవిడిగా తిరుగుతారు. ఒకరినొకరు మెచ్చుకొనుచూ పొంగి పోతారు. అప్పుడు నువ్వు సైంధవుని చంపు." అని అన్నాడు.

కాని అర్జునుడు దీనికి ఒప్పుకోలేదు. "ఒక పరాక్రమ వంతుడైన వీరుడు చెయ్యవలసిన కార్యమా" ఇది అని మనసులో బాధ పడ్డాడు. కాని చేసేది లేక ఊరుకున్నాడు.

కృష్ణుడు తన మాయతో చీకట్లు సృష్టించాడు. సూర్యుడిని తన మాయతో కప్పివేసాడు. దానిని సూర్యాస్తమయంగా భావించారు కౌరవులు. సైంధవుడు మున్నగు కౌరవ వీరులు సంతోషంతో గర్వంతో సింహనాదాలే చేసారు. సైంధవుడు తల ఎత్తి సూర్యుని వంక చూస్తున్నాడు.

అర్జునా! అదుగో సైంధవుని తల.సూర్యుని వంక చూస్తూ ఉంది. వెంటనే తెగ నరుకు." అని అరిచాడు. అర్జునుడు వెంటనే ఒక వాడి యైన బాణమును గాండివములో సంధించి, ఒక్క వేటుతో సైంధవుని తల తెగ నరికాడు అర్జునుడు.

ఆకాశంలో విహరిస్తున్న డేగ నేల మీద ఉన్న పిట్టను తన్నుకుపోయినట్టు అర్జునుని బాణము సైంధవుని తలను పైకి తన్నుకు పోయింది. సైంధవ వధ కాగానే కృష్ణ మాయ విచ్చిపోయింది. చీకట్లు

తొలగి సూర్యుడు ఆకాశంలో ప్రకాశిస్తున్నాడు. ఇది చూచి కౌరవ ప్రముఖులు ఆశ్చర్యపోయారు. కోపంతో ఊగి పోయారు. అర్జునుని చుట్టుముట్టారు.

ఇంతలో కృష్ణుడు అర్జునునితో "అర్జునా! సైంధవుని తల నేల మీద పడితే ప్రమాదం సంభవిస్తుంది. దానిని నేల మీద పడకుంటా ఆపు." అన్నాడు. వెంటనే అర్జునుడు ఒకటి వెంట ఒకటిగా బాణములు సంధిస్తూ సైంధవుని తల నేల మీద పడకుండా ఆకాశంలోనిలిపాడు. అర్జునుని బాణముల ధాటికి సైంధవుని తల ఆకాశంలో బంతిలా తిరుగుతూ ఉంది. ఒక పక్క కౌరవ వీరులతో యుద్ధం చేస్తూ, మరొక పక్క సైంధవుని తల నేల మీద పడకుండా ఆపుతున్నాడు అర్జునుడు.

" కృష్ణా ఎంత సేపు ఇలా వీడి తన ఆకాశంలో ఉంచాలి." అని అడిగాడు.

"అర్జునా! సైంధవుని తండ్రి పేరు వృద్ధక్షత్రుడు. అతడు సింధుదేశపు రాజు. వరప్రసాదంగా అతనికి సైంధవుడుపుట్టాడు. ఒకరోజు ఆకాశ వాణి "సైంధవుని తల యుద్ధంలో త్రుంచబడుతుంది," అని పలికింది. అది విన్న వృద్ధ క్షత్రుడు "నా కుమారుని తన నేలమీద పడవేసిన వాని శిరము ముక్కలవుతుంది." అని శపించాడు. తరువాత ఆ వృద్ధ క్షత్రుడు తమస్సు చేసుకొనుటకు అడవులకువెళ్లాడు.

కాబట్టి ఇప్పుడు నీవు ఈ సైంధవుని తలను అతని తండ్రి వృద్ధక్షత్రుని ఒడిలో పడేట్టు చెయ్యాలి. అది మామూలు బాణముల వల్ల కాదు. ఒక పాశుపతము వలననే ఇది సాధ్యమౌతుంది. దాని శక్తి అటువంటిది." అని అన్నాడు.

"అది సరే కృష్ణా! ఇప్పుడు ఆ వృద్ధ క్షత్రుడు ఎక్కడు ఉన్నాడు. నేను పాశుపతమును ఏ దిక్కుకు ప్రయోగించాలి." అని అడిగాడు.

"అర్జునా! ఆ వృద్ధక్షత్రుడు శమంతక పంచకము సమీపమున ఒక ఆశ్రమములో తపస్సు చేసుకుంటున్నాడు. అక్కడకు ప్రయోగించు." అని చెప్పాడు.

అర్జునుడు పరమేశ్వరుని ప్రసాదమైన పాశుపతాస్త్రమును భక్తితో మనసులో స్మరించాడు. పాశుపతమును సంధించాడు. సైంధవుని తల శమంతక పంచకము సమీపమున ఉన్న ఆశ్రమములో తపస్సుచేసుకొనుచున్న అతని తండ్రి వృద్ధక్షత్రుని ఒడిలో పడేట్టు కొట్టాడు. పాశుపతాస్త్ర ప్రభావమున సైంధవుని తల అతని తండ్రి వృద్ధ క్షత్రుని ఒడిలోపడింది. హటాత్తుగా తన ఒడిలో పడిన మానవ మస్తకమును చూచి కంగారు పడ్డాడు వృద్ధక్షత్రుడు. ఆ మానవ మస్తకమును తన చేతులతో కిందికి తోసాడు. అతని శాపప్రభావమున, అతని వలననే సైంధవుని తల నేల మీద పడినది కాబట్టి, ఆ వృద్ధక్షత్రుని తల పగిలిపోయింది.

కృష్ణుడు అర్జునుని ప్రశంసించాడు. కౌరవ సేనలు భయంతో పలాయనమయ్యాయి. సైంధవుని తల భూమి మీద పడేదాకా సైంధవుని మొండెము అలాగే నిలబడి ఉంది. సైంధవుని తల భూమి మీద పడగానే అతని మొండెము కూడా భూమి మీదికి ఒరిగిపోయింది. ఈ వింతను అందరూ ఆశ్చర్యంతో చూచారు.

ఈ ప్రకారము శ్రీకృష్ణుని సాయంతో అర్జునుడు తన ప్రతిజ్ఞను నెరవేర్చుకున్నాడు. భీమసేనుడు,సాత్యకి సింహనాదాలు చేసారు. సుయోధనుడు, కౌరవులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. పాండవుల ఆనందానికి అంతు లేదు. ఇది తెలిసి ధర్మరాజు ఆనంద సాగరంలో ఓలలాడాడు. పాండవ సైన్యములో తూర్యనాదములు, భేరీ మృదంగ ధ్వానములు మిన్నుముట్టాయి." అని సంజయుడు ధృతరాష్ట్రునకు సైంధవ వధ వృత్తాంతమును సవిస్తరంగా వివరించాడు.

ఈ ప్రకారంగా వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన మహా భారత కథను, నైమిశారణ్యంలో జరుగు తున్న సత్రయాగ సందర్భంలో, సూతుడు శౌనకాదిమహామునులకు వినిపించాడు.

# మహాభారతము

ద్రోణపర్వము చతుర్ధాశ్వాసము సమాప్తము.

ఓంతత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహా భారతము

ద్రోణపర్వము

పంచమాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన మహా భారత కథను, నైమిశారణ్యములో, సత్రయాగ సందర్భమున, సూతుడు శౌనకాది మహామునులకు వినిపించసాగాడు. “ ”

ధృతరాష్ట్ర మహారాజు  సైంధవధ సందర్భమున  శ్రీకృష్ణుడు, అర్జునుడు చూపిన అత్యంత ప్రతిభను చూచి భయకంపితుడయ్యాడు. “సంజయా! సైంధవ వధానంతరము నా కుమారులు ఏమి చేసారో వివరింపుము.” అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

సైంధవ వధతో పాండవులలో ఉత్సాహము పెల్లుబికింది. వారందరూ రెట్టించిన పరాక్రమముతో కౌరవ సైన్యముతో తలపడ్డారు. అశ్వత్థామ,  కృపాచార్యుడు అర్జునుని మీద అంపవాన కురిపించసాగారు.  అర్జునుడు ఆ శరముల నన్నింటినీ ఖండించాడు. తిరిగి వారిమీద శరవర్షము కురిపించాడు. అర్జునుని శరముల ధాటికి తట్టుకోలేక కృపాచార్యుడు స్పృహతప్పాడు. రథము మీద పడిపోయాడు. అతని సారథి కృపాచార్యుని రథమును పక్కకు తీసుకొని పోయాడు. అశ్వత్థామ కూడా కృపాచార్యుని వెంటవెళ్లాడు.

తన బాణఘాతములకుమూర్ఛపోయిన కృపాచార్యుని చూచి అర్జునుడు ఖిన్ను డయ్యాడు. అదిచూచి కృష్ణుడు అర్జునుని

ఓదారుస్తున్నాడు. "అర్జునా! ఈ కౌరవ సైన్యమును గెలవడం ఆ దేవేంద్రునికైనా సాధ్యంకాదు. అట్టి కౌరవసేనావాహినిని నీవు ఒంటి చేత్తో గెలిచావు. నీ పరాక్రమము మిక్కిలి ప్రశంసనీయము. మహా తపోధనుడైన వృద్ధక్షత్రుని ఒడిలో నేర్పుగా సైంధవుని తల పడవేసి అతని మరణమునకు కారకుడవయ్యావు. ఇంక కర్ణుడు ఒక్కడే మిగిలాడు. అతడు ఇంద్రుడిచ్చిన శక్త్యాయుధముతో విర్రవీగుతున్నాడు. కర్ణుని జయించి నీవు అత్యంత ప్రశంసాపాత్రుడవు కమ్ము. నీ శ్రేయస్సుకన్నా నాకు కావలసినదేమున్నది." అన్నాడు కృష్ణుడు.

"అదేమిటి కృష్ణా అలా అంటావు. నేను సైంధవుని చంపి నా ప్రతిజ్ఞ నెరవేర్చుకొనడం అంతా నీదయ వలననే కదా. నాకే కాదు నీ కృప కలిగిన వాడికి కార్యసిద్ధి తప్పదు. అది సత్యము. ఇందులో నాదేముంది. నీవు చెప్పినట్టు చేసాను." అన్నాడు అర్జునుడు. ఆ మాటలకు కృష్ణుడు చిరునవ్వు నవ్వాడు.

"అర్జునా మనకోసం ధర్మరాజు ఎదురు చూస్తూ ఉంటాడు. మనము ధర్మజుని వద్దకు పోవాలి." అన్నాడు. అర్జునుడు, కృష్ణుడు, భీముడు, సాత్యకి, ఉత్తమౌజుడు అందరూ ధర్మరాజు వద్దకుపోతున్నారు. ఇంతలో సూర్యాస్తమయము అయింది. ఇరుపక్షములవారు యుద్ధము చెయ్యడం ఆపారు. తమ తమ శిబిరములకు వెళ్లారు. ధర్మరాజు శిబిరమును చూచి కృష్ణుడు పాంచజన్యముపూరించాడు. ఆ శంఖ ధ్వని విని ధర్మజుడు తన శిబిరమునుండి వెలుపలికి వచ్చాడు. కృష్ణార్జునులకు ఎదురు వెళ్లాడు. ఒకేసారి వారిద్దరినీ గాఢంగా కౌగలించుకున్నాడు. ఆనందభాష్పాలు రాల్చాడు.

"అర్జునా! నీవు నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకొని నన్ను కలుసుకుంటావని

అనుకోలేదు. కాని ఈ మహానుభావుని దయవలన మనం ఈ గండం గడిచి బయటపడ్డాము." అని కృష్ణుని వంక కృతజ్ఞతాభావంతో చూచాడు.

"ధర్మజా! ఆ కౌరవుల మీద నీకు ఉన్న కోపమే మా విజయానికి కారణం అయింది. మీ బోటి సత్పురుషుల కోపాన్ని తట్టుకోవడం ఎవరికీ సాధ్యంకాదు కదా! ఆ సమయంలో ఒక్క అర్జునుడే కాదు, ఒక్క సైంధవుని వధించుటే కాదు, ఎంతటి దుస్సాధ్యమైన కార్యమైనా ఎవరైనా అవలీలగా చేయగలరు. మీ లాంటిసత్పురుషుల కోపప్రభావము అటువంటిది." అని అన్నాడు శ్రీ కృష్ణుడు.

"అలా కాదు కృష్ణా! నీవే అలిగిన నాడు దేవాసుర సంఘములు రూపుమాసిపోతాయి. ఇంక ఈ మానవులు ఎంత. నీ దయ ఉంటే ముల్లోకములలో ఉన్న జీవరాసులు సుఖంగా జీవిస్తాయి. నీ దయ మా మీద ప్రసరించునంత కాలము మాకు విజయము సిద్ధిస్తుంది." అని వినయంగా పలికాడు ధర్మరాజు.

ఇంతలో భీముడు సాత్యకి వచ్చి ధర్మరాజుకు నమస్కరించారు. ధర్మరాజు వారిని లేవ నెత్తికౌగలించుకున్నాడు. శత్రు సంహారంతో ధర్మరాజు ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

అదే సమయంలో దుర్యోధనుని శిబిరంలో విషాదచ్ఛాయలు అలముకున్నాయి. సుయోధనుడు తనలో తాను ఇలా తర్కించు కుంటున్నాడు. "ఆ అర్జునునికే కోపం వచ్చిననాడు, అతనిని జయించుటకు ఆ దేవతలకైనను సాధ్యం కాదు, ఇంక ద్రోణుడు, కర్ణుడు ఎంత? అని నేడు తేటతెల్లమయినది. ద్రోణుడు, కర్ణుడు మమ్ములను ఆదుకొనవలెనని ఎంత

ప్రయత్నించిననూ, అర్జునుని ముందు ఏ మాత్రం శక్తి లేని వారు అనీ, ఎందుకూ పనికిరారు అని స్పష్టమయినది." అని తనలో తాను తర్కించుకుంటూ సుయోధనుడు ద్రోణుని వద్దకు వెళ్లాడు.

"ఆచార్యా! ప్రతిరోజూ యుద్ధంలో మనకు పరాజయము, పాండవులకు జయము వరిస్తూ ఉంది. నా తమ్ములతో సహా ఎంతోమంది కౌరవ వీరులు మరణించారు. ఆ శిఖండి కారణంగా మహా బలవంతుడైన భీష్ముడు మరణించాడు. మన సైన్యములో ఏడు అక్షౌహిణుల సైన్యం తగ్గిపోయింది. ఈ రోజు సైంధవుడు కూడా మరణించాడు. నా కోసం తమ తమ ప్రాణాలు కూడా లెక్కచెయ్యకుండా యుద్ధమునకు వచ్చిన ఎంతోమంది రాజులు మరణించారు. ఇంక నేను, ధర్మరాజు మొదలగు పాండవులను సంహరించి రాజ్యము చేజిక్కించుకోవడమో లేక మరణించి వీరస్వర్గము పొందడమో మిగిలినట్టు తోచుచున్నది. లేక మూడవ మార్గమేదైనా కలదేని సెలవివ్వండి.

మీకు అర్జునుడు అత్యంత ప్రియమైన శిష్యుడు. అందుకని అతనిని మీరు చేత చిక్కినా చంపడం లేదు. పైగా సాయం చేస్తున్నారు. మన సేనలో మిగిలిన వీరుడు కర్ణుడు. అతడు యుద్ధము చెయ్యగలడేమో కాని, కార్య సాధనలో గాని, నేర్పుతో యుద్ధం చెయ్యడంలో గాని మీకు ఉన్నంత అనుభవం లేదు. ఉపాయము, అనుభవము ఉన్న మీరు మాకు సాయం చెయ్యడం లేదు. ఈ రోజు కర్ణుడు సైంధవుని కాపాడటానికి ఎంతో ప్రయత్నించాడు కాని సాధ్యం కాలేదు. కాపాడతగిన మీరు కాపాడలేదు. నాకు ఏం చెయ్యాలో తోచడం లేదు." అని అన్నాడు సుయోధనుడు.

ఆ సూటిపోటి మాటలకు మనసులో నొచ్చుకున్నాడు ద్రోణుడు మనసులో ఎంతగానో నొచ్చుకున్నాడు. "సుయోధనా! నా గుండెలు తూట్లు

పొడిచే మాటలతో ఎందుకు నన్ను బాధపెడతావు. నేను నీకు ఎప్పుడో చెప్పాను. కృష్ణుని సాయం ఉన్నంతవరకూ అర్జునుని జయించడం ఎవరికీ సాధ్యంకాదు అని. నీవు వినలేదు. ఆ దేవతలకే అజేయుడైన భీష్ముని పడగొట్టాడు అర్జునుడు. నేను నీ పక్షాన యుద్ధం చేస్తున్నాను అంటే నేనేదో పాండవులనుజయిస్తానని కాదు. నా అభిమానమును కాపాడుకొనుటకు యుద్ధం చేస్తున్నాను. సుయోధనా! నాడు నిండు సభలో శకుని పాచికలతో నీవు అర్జునుని బాధ పెట్టావు. ఆ పాచికలే నేడు అర్జునుని బాణముల రూపంలో నిన్ను బాధిస్తున్నాయి. వాటిని ఆపడం ఎవరి తరం అవుతుంది చెప్పు.

పైగా, నాడు, విదురుడు ఎంత చెప్పినా వినకుండా, మీరందరూ పాండవుల భార్యను కొలువు కూటమునకు ఈడ్చి తెచ్చి చేసిన అవమానము ఊరికే పోతుందా. నేడు అది నిన్ను నీ తమ్ములను కట్టికుడుపుతూ ఉంది. ఆ సభలో నీవు, దుశ్శాసనుడు, కర్ణుడు, అధికార గర్వంతో, కళ్లు నెత్తికెక్కి , ప్రశస్త చరిత్రులు అయిన పాండవులకు చేసిన అవమానము వారిని అన్నమాటలు ఊరికే పోతాయా! మీకు చెరుపు చేయవా?

సుయోధనా! మీరు ఎన్ని అవమానములుచేసిననూ పాండవులు సహించారు. మీరు అడవులకు పంపితే అడవులకు వెళ్లారు. అజ్ఞాత వాసము చేసారు. తరువాత తమకు రావలసిన అర్ధభాగము కొరకు మిమ్ములను ఎన్నోవిధములుగా అర్థించారు. కాని మీరు కనికరం లేకుండా నిర్దాక్షిణ్యంగా నిరాకరించారు. మీరు ఇన్ని అధర్మములు చేసిననూ, మీయొక్క అధర్మ వర్తనమును సహిస్తూ ఇంకా మీ పక్షానయుద్ధం చేస్తున్నాను అంటే నేనూ ఒక బ్రాహ్మణుడనా! నాదీ ఒక బ్రాహ్మణ జన్మేనా?

నేను సరే శకటవ్యూహము ద్వారము వద్ద ఉన్నాను. నీవు, కర్ణుడు, మిగిలిన యోధులు సైంధవుని వద్దనే ఉన్నారు కదా. మీరందరూ కలిసి సైంధవుని ఎందుకు రక్షించలేకపోయారు. నీవు వారందరినీ ఎందుకు నీ మాటలతో బాధించడం లేదు. నన్ను మాత్రమే ఎందుకు నిందిస్తున్నావు? వారు నీకు కావాల్సిన వారా? నేను నీ వాడిని కానా! పరాయి వాడినా? యుద్ధంలో పాండవులు, వారి సైన్యము, నన్ను వారి వారి శరములతో బాధిస్తున్నారు. యుద్ధము అయిపోగానే నీవు నన్ను నీ మాటలనే శరములతో బాధిస్తున్నావు. ఇది నీకు న్యాయమా! అయిననూ సుయోధనా!

ఇప్పుడు గతజలసేతుబంధనమేల! కావలసిన కార్యము గురించి ఆలోచింపుము. రేపు యుద్ధం లో మీరందరూ వీరోచితంగా పోరాడండి. నేను కూడా రేపు పాంచాలురను చంపకుండా విడువను. కాబట్టి మన సైన్యముల ధైర్య, స్థైర్యములు చెడకుండా వారిని యుద్ధోన్ముఖులను చెయ్యి. వారి మనసుల్లో ఉత్సాహాన్ని నింపు. నీ పరాక్రమముకూడా చూపు.

సుయోధనా! నా కుమారుడు అశ్వత్థామకు నా మాటగా చెప్పు. రేపు నేను యుద్ధానికి వెళుతున్నాను. జరగకూడనిది జరిగి నేను తిరిగి రాకపోతే అశ్వత్థామ తట్టుకోలేడు. నా కడపటి మాటలుగా అశ్వత్థామకు ఈ మాటలు చెప్పు. "నాయనా అశ్వత్థామా! నీవు బ్రాహ్మణుల ఎడ భక్తితోనూ, వృద్ధుల ఎడ గౌరవంతోనూ, ధర్మపథవర్తనుడివై మెలగుము. అశ్వత్థామా! నేను చంపగా మిగిలిన పాంచాల వీరులను నువ్వు తుదముట్టించు. ఇదే నా కడపటి సందేశము." అని చెప్పు. అని పలికాడు ద్రోణుడు.

ఈ మాటలు వినిన సుయోధనుడు మారు మాటాడకుండా కర్ణుని వద్దకు వెళ్లాడు.

"కర్ణా! నేడు జరిగిన యుద్ధమును పరికించితివా! మన గురువు ద్రోణుడు శత్రుదుర్భేద్యమైన శకటవ్యూహమును పన్నాడు కాని అర్జునుని, సాత్యకిని అందులోకి సులభంగా విడిచిపెట్టాడు. దీనిని బట్టి చూస్తే ద్రోణుడు మనకు కీడు చేస్తున్నాడు అని నా అనుమానము. అయినా ఒక్క అర్జునుడు మాత్రమే దుర్భేద్యమైన మన వ్యూహములోని ప్రవేశించి, మనము సైంధవుని రక్షణకై వినియోగించిన రాజులను వారి సైన్యములను తుదముట్టించి, సైంధవుని ఎలా చంపగలడు? అంటే అర్జునుని వీర విహారమును ద్రోణుడు ఆపలేకపోయాడా! అది నిజమని మనము నమ్మాలా! ద్రోణుడు తాను సైంధవుని రక్షిస్తాను అని మాట ఇస్తేనే కదా మనము సైంధవుని యుద్ధ రంగమునకు తీసుకొని వచ్చాము. లేకపోతే అతని ఇష్టప్రకారము అతను ఎక్కడో ఉండేవాడు కదా! కేవలం సైంధవుని రక్షించుటకొరకు మనము మన సైన్యమును నష్టపోవలసిన అవసరమూ ఉండేది కాదు గదా!

కర్ణా! ద్రోణునికి మనము ఎంత కాని వారమో అర్జునుడు అంతగా కావలసిన వాడు అయ్యాడు. ఇంక ఏమనాలి చెప్పు. ఈ పరిస్థితులలో ద్రోణుని నమ్ముకొని మనము పాండవులతోయుద్ధం చెయ్యడం ఎంత మాత్రము సమంజసమో నీవే ఆలోచించు." అని అన్నాడు సుయోధనుడు. సుయోధనుడు అనిన మాటలన్ని సావధానంగా విన్నాడు కర్ణుడు.

"రారాజా! మనము ద్రోణుని నిందించడం ఎందుకు? అతడు తన శక్తి కొలదీ యుద్ధ చేస్తూనే ఉన్నాడు కదా! కాని అతను అర్జునుని చంపలేక పోతున్నాడు. కారణం. ద్రోణునికి కూడా అర్జునుని చంపడం సాధ్యం కాదు. పాండవులను చంపడానికి మనం ఎన్ని ప్రయత్నాలు చేసాము. విషం పెట్టాము. ఇంట్లో పెట్టి కాల్చాము. అడవులకు పంపాము. కాని వారు నాశనము కాలేదు. ఇది విధి విలాసము కాక మరేమున్నది. కాబట్టి మన సైంధవుని చంపినది

విధివిలాసము. దైవఘటన. అర్జునుడు నిమిత్తమాత్రుడు. కాబట్టి దీనిని గురించి బాధపడి ధైర్య కోల్పోవద్దు. మన పని శక్తి వంచన లేకుండా యుద్ధం చెయ్యడమే. ఫలితం దైవనిర్ణయం. సైంధవుని రక్షించడంలో మనం చెయ్య వలసినదంతా చేసాము కదా! ఇంకా బాధపడటం దేనికి చెప్పు." అని పలికాడు కర్ణుడు.

ఇరుపక్షముల సైన్యములు యుద్ధమునకు మోహరించాయి. యుద్ధం మొదలయింది. సుయోధనుడు సైంధవ వధతో కలిగిన దుఃఖముతో తెగించాడు. అంత సాహసం పనికిరాదు అని ద్రోణుడు, కృపుడు, అశ్వత్థామ ఎంత చెప్పినా వినలేదు. పాండవులతో ఘోరంగా యుద్ధం చేస్తున్నాడు. భీముని పది బాణములతోనూ, నకులుడిని మూడు బాణములతోనూ, శిఖండిని నూరు బాణములతోనూ, ధృష్టద్యుమ్ముని 70 బాణములతోనూ, ధర్మరాజును, సాత్యకిని  ఐదేసి బాణములతోనూ ఘటోత్కచుని 60 బాణములతోనూ, కేకయ రాజులను లెక్కలేనన్ని బాణములతోనూ ఎదుర్కొన్నాడు. సింహనాదం చేసాడు.

ఇది చూచి ధర్మరాజు కోపంతో ఊగిపోయాడు. సుయోధనుని విల్లు విరిచాడు. సుయోధనుని స్పృహపోయేట్టు కొట్టాడు. సుయోధనుడు రథం మీద కూలబడ్డాడు.  సుయోధనుడు మరణించాడని వార్త గుప్పుమంది. పాండవ సైన్యములో సంతోషం వెల్లివిరిసింది. భేరీ నినాదాలు మిన్నుముట్టాయి. ఇది చూచాడు ద్రోణుడు. వెంటనే పాండవ సేనలమీద విరుచుకుపడ్డాడు. ఇంతలో సుయోధనుడు మూర్ఛనుండి తేరుకున్నాడు.  ఎదురుగా ఉన్న ధర్మరాజును ఎదుర్కొన్నాడు. కౌరవ సేనలు పాండవ సేనలను ఎదు ర్కొన్నాయి. అప్పుడు పాండవులందరూ, సాత్యకి మొదలగు యాదవ వీరులు, ద్రుపదుడు మొదలగు పాంచాల వీరులు, విరాటరాజు మొదలగు మత్స్య దేశపు వీరులు, ఉపపాండవులు, ద్రోణుడి మీద శరవర్షము కురిపిస్తున్నారు.

కర్ణుడు, ద్రోణుడు పాండవసైన్యం మీద తమ తమ అవక్ర విక్రమ పరాక్రమములతో విజృంభించారు. ఇరు పక్షముల మధ్య పోరు ఘోర మయింది. నెత్తురు వరదలైపారుతూ ఉంది.

ద్రోణాచార్యుడు పాండవ పక్షములో ఉన్న అనేక మంది కేకయ వీరులను, ధృష్టద్యుమ్నుని కుమారులను హతమార్చాడు ఆ సమయములో శిబి అనే రాజు ద్రోణాచార్యుని ఎదుర్కొన్నాడు. ద్రోణుని రథ సారథిని నరికాడు. మరొక 30 బాణములతో ద్రోణుని శరీరం మొత్తం తూట్లుపడేట్టు కొట్టాడు. ద్రోణునికి భరించలేని కోపం వచ్చింది. వెంటనే ద్రోణుడు 6 భయంకరమైన భల్ల బాణములతో శిబి హయములను, సారథిని నరికాడు. మరొక నిశితమైన బాణముతో శిబి తల తెగ నరికాడు.

ఇంతలో భానుమంతుని కుమారుడు భీమసేనుని ఎదుర్కొన్నాడు. భీముని మీద శరవర్షము కురిపించాడు. వెంటనే భీముడు భానుమంతుని కుమారుని మీదికి తన రథమును పోనిచ్చాడు. తన రథముతో అతని రథమును ఢీ కొట్టాడు. అతని రథము మీదికి లంఘించి అతనిని కాలితో తన్నాడు. అతని ఎముకలు విరిగేట్టు కొట్టాడు. ఆ దెబ్బకు భానుమంతుని కుమారుడు చనిపోయాడు. పాంచాల సైనికులు సింహనాదం చేసారు.

వారి జయజయధ్వానములు చూచి సహించలేక కళింగ రాజ కుమారుని సోదరులు ధ్రువుడు, జయరాతుడు అనువారలు భీముని మీద విరుచుకుపడ్డారు. వెంటనే భీముడు ధ్రువుని రథము మీదికి దుమికి అతనిని తన పిడికిటితో పొడిచి పొడిచి చంపాడు. అక్కడనుండి జయరాతుని రథము మీదికి దుమికి అతనిని అతని రథ సారథిని ఇద్దరినీ తుదముట్టించాడు.

అది చూచి కర్ణుడు తన శక్తి ఆయుధమును భీముని పై ప్రయోగించాడు. భీముడు తన మీదికి వచ్చిన ఆ శక్తిని చేత్తోపట్టుకొని తిరిగి దానిని కర్ణుని మీదికి విసిరాడు. అది చూచిన శకుని ఆ శక్తిని మధ్యలోనే తన భల్ల ఆయుధముతో ఖండించాడు.

ఇంతలో ధృతరాష్ట్రుని కుమారులు దుర్మదుడు, దుష్కర్ణుడు అను వారలు భీమసేనుని చుట్టుముట్టారు. భీమసేనునికి కోపం వచ్చింది. ఒక్క ఉదుటున దుర్మదుని రథము మీదికి లంఘించాడు. దుర్మదుని రథ సారథిని చంపాడు. అప్పుడు దుర్మదుడు తన రథము మీదినుండి దుష్కర్ణుని రథము మీదికి దుమికాడు. ఆ ఇద్దరూ కలిసి భీమసేనుని మీద బాణవర్షము కురిపించారు. భీముని రథమును కూలదోసారు. భీముడు తన రథమును అవతల పడేట్టు తన్నాడు. తాను కూడా వారి రథముమీద ఎక్కాడు. దుర్మదుడిని, దుష్కర్ణుడిని కాళ్ల తో చేతులతో మర్దించాడు. ఇద్దరినీ మాంసపు ముద్దలుగా చేసి చంపాడు.

ఇది చూచాడు సుయోధనుడు. కాని ఏమీ చెయ్యలేకపోయాడు. భీముని పరాక్రమమును కనులారా చూచిన కౌరవ సైన్యము భీముని ముందు నిలువలేక పారిపోయారు. అప్పుడు ద్రోణుడు భీముని ఎదుర్కొన్నాడు. ద్రోణునికి కర్ణుడు మొదలగు వారు తోడైనారు. అందరూ భీముని మీద అస్త్రములు గుప్పించారు. భీమునికి సాయంగా ధర్మరాజు, నకులుడు, సహదేవుడు, ద్రుపదుడు, విరాటుడు, సాత్యకి యుద్ధం చేస్తున్నారు.

అంతలో సోమదత్తుడు సాత్యకిని చూచి "ఓ సాత్యకీ! నిలువుము! ప్రాయోపవేశం చేస్తున్న భూరిశ్రవసుని కిరాతుడు మృగమును చంపినట్టు చంపడం వీరత్వమనిపించుకుంటుందా! అది రాజధర్మమా! ఈ రోజు నువ్వు

నా చేతిలో చచ్చావు!" అంటూ సాత్యకి మీదికి దూకాడు.

ఆ మాటలకు సాత్యకి నవ్వి "సోమదత్తా! భూరిశ్రవసుని చంపడం రాజధర్మం కాదని నువ్వు అంటే, ఇప్పుడు నిన్ను చంపి రాజధర్మం అంటే ఏమిటో నిరూపిస్తాను.కాచుకో !" అంటూ సోమదత్తునితో తలపడ్డాడు. ఇంతలో సుయోధనుడు తన సైన్యముతో వచ్చి సోమదత్తునికి అండగా నిలిచాడు. ఒంటరిగా పోరాడుతున్న సాత్యకిని చూచి ధృష్టద్యుమ్నుడు తన అపారమై న సైన్యముతో సాత్యకికి సాయంగా వచ్చాడు.సోమదత్తుడు తొమ్మిది సునిశితమైన అస్త్రములతో సాత్యకిని కొట్టాడు. దానికి ప్రతిగా సాత్యకి తొమ్మిది బాణములతో సోమదత్తుని మూర్ఛపోయేట్టు కొట్టాడు. సోమదత్తుని రథసారధి, రథమును రణభూమినుండి దూరంగా తీసుకొని వెళ్లాడు.

ఇది చూచాడు అశ్వత్థామ. సాత్యకిని ఎదుర్కొన్నాడు. కాని మధ్యలోనే అశ్వత్థామను ఘటోత్కచుడు, తన రాక్షస సైన్యంతో ఎదుర్కొన్నాడు. ఇది చూచి భయపడిన సుయోధనుడు, కర్ణుడు మొదలగు వారు అక్కడి నుండి పక్కకు తొలిగారు. అప్పుడు సంధ్యా సమయం అయింది. ఆ సయమంలో రాక్షసులకు బలం పెరుగుతుంది. కాబట్టి కురుసైన్యములో ఉన్న మహా మహా యోధులు కూడా ఘటోత్కచుని ముందు నిలువలేకపోయారు. కాని అశ్వత్థామ మాత్రం స్థిరంగా నిలబడి ఘటోత్కచుని తో యుద్ధం చేస్తున్నాడు. ఘటోత్కచుని గుండెలకు గురిపెట్టి పది తీవ్రమైన బాణములను కొట్టాడు. ఘటోత్కచుడు తన చక్రాయుధాన్ని అశ్వత్థామ మీద ప్రయోగించాడు. ఆ చక్రాయుధాన్ని మధ్యలోనే నరికాడు అశ్వత్థామ.

ఈ సమయంలో ఘటోత్కచుని కుమారుడు అంజన పర్వుడు అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. అశ్వత్థామ మీద శర వర్షము కురిపించాడు.

అశ్వత్థామ అంజనపర్వుని విల్లు త్రుంచాడు. అతని రథము విరగ్గొట్టాడు. అప్పుడు అంజనపర్వుడు ఒక ఖడ్గము తీసుకొని అశ్వత్థామ మీదికి ఉరికాడు. అశ్వత్థాము ఆ ఖడ్గమును విరగ్గొట్టాడు. ఆ రాక్షస వీరుడు ఆకాశము లోకి ఎగిరాడు. అశ్వత్థామ మీద శర వర్షము కురిపించాడు. అశ్వత్థామ ఆ శరములను తుత్తునియలు చేసాడు. ప్రతిగా ఆ రాక్షసుని ఒంటినిండా తీవ్రమైన శరములు నాటాడు. ఆ బాధ తట్టుకోలేక అంజనపర్వుడు భూమి మీదికి దిగి మరలా తన రథము మీద ఎక్కాడు. అశ్వత్థా మ మీద శర సంధానము చేసాడు. అశ్వత్థామ ఒక వాడియైన బాణంతో అంజనపర్వుని తల తెగనరికాడు.

అశ్వత్థామ మిగిలిన పాండవ సైన్యమును సంహరిస్తున్నాడు. కొడుకు మరణమును కళ్లారా చూచిన ఘటోత్కచుడు తీవ్రమైన కోపంతో అశ్వత్థామ ను చూచి "అశ్వత్థామా! నిలు నిలు. ~~ఈ~~రోజు నన్ను తప్పించుకొని నీవు ఎక్కడకూ పోలేవు. నిన్ను సంహరించి తీరుతాను." అంటూ అశ్వత్థామ మీదికి వచ్చాడు. అప్పుడు అశ్వత్థామ

"ఘటోత్కచా! నీవు బాలుడవు. నాతో యుద్ధం చేయలేవు. నీవు నాకు పుత్రసమానుడవు. నీ మీద నాకు కోపం రావడం లేదు. కోపం రానిది నేను యుద్ధ చేయను. వెళ్లు" అన్నాడు. "అశ్వత్థాయా! కొడుకును పోగొట్టుకున్న దుఃఖంలో ఉన్నాను. నీవు నాకు ఎక్కడి తండ్రివి. నేను భీమసేనుని కుమారుడను. నిన్ను వధించి తీరుతాను." అన్నాడు ఘటోత్కచుడు.

ఘటోత్కచుడు వెంటనే తన అసుర మాయలు అశ్వత్థామ మీద ప్రయోగించాడు. అశ్వత్థామ వాటిని తిప్పి కొట్టాడు. కొండమాదిరి తన మీదికి వస్తున్న ఘటోత్కచుని తన వజ్రాస్త్రముతో కొట్టాడు అశ్వత్థామ. వెంటనే

ఘటోత్కచుడు మేఘంలాగా మారిపోయాడు. అశ్వత్థామ వాయవ్యాస్త్రమును ప్రయోగించి ఆ మేఘమును చెదరగొట్టాడు. వెంటనే ఘటోత్కచుడు ఒక ఉగ్రమైన ఆకారం దాల్చాడు. అతని అనుచరులైన రాక్షసులు కూడా ఘోరాకృతులలో  కౌరవ సైన్యముతో తలపడ్డారు. సుయోధనుడి బలములను నిర్మూలిస్తున్నారు.

ఇది చూచి సుయోధనుడు ఖిన్నుడయ్యాడు.  ఘటోత్కచునితో స్వయంగా తానే యుద్ధమునకు దిగాడు. అప్పుడు అశ్వత్థా మ అతనితో "రారాజా! ఈ రాక్షసునితో యుద్ధం చెయ్యడానికి నువ్వు కావాలా చెప్పు! నేను చాలనా! నువ్వు చూస్తూ ఉండు." అంటే అశ్వత్థామ ఘటోత్కచునితో యుద్ధానికి తలపడ్డాడు.

సుయోధనుడు శకునిని చూచి "మామా! ఇంక మనకు భయంలేదు. ఘటోత్కచుడు, పాండవ సైన్యము ఇంక నిర్మూలింప బడినట్టే. మనం జయించామని ప్రకటించు. మామా! నీవు కృపాచార్యుడు, కర్ణుడు మొదలగు యోధులతో అశ్వత్థామకు తోడుగా వెళ్లు"  అన్నాడు. శకుని అశ్వత్థామకు తోడుగా ఘటోత్కచుని మీదికి యుద్ధమునకు వెళ్లాడు.

ఘటోత్కచుడు అశ్వత్థామ విల్లు విరిచాడు. అశ్వత్థామ రెండో విల్లు తీసుకున్నాడు. ఘటోత్కచుని రాక్షస సైన్యమును క్షణాలలో నాశనం చేస్తున్నాడు. ఇది చూచి సుయోధనుడు అశ్వత్థామను ఎంతగానో కొనియాడాడు.  ఈ ప్రకారం అశ్వత్థామ, ఘటోత్కచుని సైన్యమును, పాండవుల సేనలను చించి చెండాడుతుంటే, పాండవ యోధులు దిక్కుతోచక అటు ఇటు చూస్తున్నారు. ఘటోత్కచుడు అశ్వత్థామ మీదికి పరిఘ ను విసిరాడు. అశ్వత్థాము దానిని పట్టుకొని తిరిగి దానిని ఘటోత్కచుని మీదికి

విసిరాడు. ఘటోత్కచుడు దానిని తప్పుకొనుటకు తన రథము మీదినుండి ధృష్టద్యుమ్నుని రథముమీదికి లంఘించాడు. అశ్వత్థామ విసిరిన పరిఘ ఘటోత్కచుని రథమును, అతని రథసారథిని ముక్కలు ముక్కలు చేసింది. ఘటోత్కచుడు, ధృష్టద్యుమ్నుడు కలిసి ఒకే రథము మీదినుండి అశ్వత్థామ తో యుద్ధం చేస్తున్నారు.

ఇంతలో భీముడు తన సైన్యముతో వచ్చి వారిని చేరుకున్నాడు. అది చూచిన అశ్వత్థామ వారి ముగ్గురిమీద శరవర్షము కురిపించాడు. అశ్వత్థామ చేసే యుద్ధమునకు రణరంగమంతా పీనుగులపెంట గా మారి పోయింది. ఏనుగులు, గుర్రముల కళేబరములతో నిండిపోయింది. విరిగిన రథములు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఈ ప్రకారం ఆ ఒక్కరోజే అశ్వత్థామ ఒక అక్షౌహిణి సైన్యమును సంహరించాడు. ఇది చూచి ద్రుపదుని కుమారులు అయిన సురథుడు, శత్రుంజయుడు, బలానీకుడు, పృషధ్రుడు, జయానీకుడు, జయుడు, చంద్రసేనుడు అశ్వత్థామను ఎదుర్కొన్నారు. అశ్వత్థామ మీద శరవర్షము కురిపించారు. మరుక్షణంలో అశ్వత్థామ వారినందరినీ యమపురికి అతిథులుగా పంపాడు.

ఆ రోజు అశ్వత్థామను ఎదుర్కొనేవాళ్లు ఎవరూలేరు అని అనుకుంటున్న తరుణంలో, కుంతిభోజుని కుమారులు అత్యంత పరాక్రమంతో అశ్వత్థామను ఎదుర్కొన్నారు. అశ్వత్థామ అత్యంత విలాసంగా వారినందరినీ త్రుటిలో సంహరించాడు. ఘటోత్కచుని మీద కాల దండము మాదిరి ఉన్న బాణమును ప్రయోగించాడు. ఆ బాణము ధాటికి ఘటోత్కచుడు తన రథము మీద పడిపోయి మూర్ఛపోయాడు. వెంటనే ధృష్టద్యుమ్నుని రణరంగమునుండి దూరంగా తీసుకొని వెళ్లాడు.

అది చూచి అశ్వత్థామ సింహనాదం చేసాడు.  ఇంతలో ధర్మరాజు, సాత్యకి వచ్చి భీముడిని కలిసారు.  ఘటోత్కచుడు మూర్ఛనుండి తేరుకొని మరలా తన రథం ఎక్కి అశ్వత్థామను ఎదుర్కొన్నాడు.  పాండవ సైన్యములు ధృష్టద్యుమ్నుని నాయకత్వములో ఒక వ్యూహం గా ఏర్పడి అశ్వత్థామను చుట్టుముట్టాయి.  అది చూచి కౌరవ సేనలు సోమదత్తుడు, బాహ్లికుని ముందుంచు కొని పాండవులతో యుద్ధమునకు తలపడ్డాయి.

అప్పటికి సాయం సమయం అయింది. సాత్యకి సోమదత్తుని ఒక నిశితమైన శరముతోకొట్టాడు. ఘటోత్కచుడు సోమదత్తుని ముద్గర అనే ఆయుధంతో కొట్టాడు. ఆ దెబ్బలకు సోమదత్తుడు సొలిపోయాడు.  తన కుమారుడు సోమదత్తుడు మూర్ఛపోగానే అతని తండ్రి బాహ్లికుడు సాత్యకితో యుద్ధమునకు తలపడ్డాడు. భీముడు బాహ్లికుడిని తన బాణములతో కొట్టాడు. బాహ్లికుడు భీముని మీద శక్తి అనే  ఆయుధాన్ని ప్రయోగించాడు. ఆ శక్తి తగలగానే భీముడు స్ప ృహతప్పాడు.  వెంటనే తేరుకొని బాహ్లికుని ముద్గరతో కొట్టాడు.  ఆ ముద్గర దెబ్బకు బాహ్లికుని తల పగిలిపోయింది. వయస్సులో పెద్దవాడైన బాహ్లికుడు  అ క్కడికక్కడే మరణించాడు. పాండవ సేనలలో జయజయధ్వానాలు మిన్నుముట్టాయి.

బాహ్లికుని మరణమును కనులారా చూచిన సుయోధనుని తమ్ములు పదిమంది భీముని చుట్టుముట్టారు.  భీమసేనుడు ఆ పదిమంది కురు కుమారులను పది బాణములతో సంహరించాడు. అది చూచిన కర్ణుని తమ్ముడు వృకరథుడు భీముని మీదికి తన రథము పోనిచ్చాడు. అతనిని దగ్గరగా రానిచ్చి భీముడు ఒకే దెబ్బతో అతనిని చంపాడు.  ఇంతలో శకుని తమ్ములు 12 మంది భీమునితో తలపడ్డారు. భీముడు వారిని కూడా అవలీలగా సంహరించాడు.

ఈ ప్రకారంగా భీముని పరాక్రమానికి ఎదురులేకుండా పోయింది. భీముని ఎదుట పడ్డవాడు ప్రాణాలతో బయటపడటం లేదు. ఇది పని కాదని త్రిగర్త, శూరసేన,వసాతి,మాళవ,బాహ్లీక దేశాల సైన్యాలు భీముని నలు దిక్కుల నుండి చుట్టుముట్టాయి. ఇది చూచిన ధర్మరాజు తన సైన్యముతో భీమునికి తోడుగా వచ్చాడు. ధర్మరాజు, భీమసేనుడు కలిసి కౌరవ సేనను చించి చెండాడుతున్నారు. కౌరవ సేన క్రమక్రమంగా సన్నగిల్లి పోతూ ఉంది.

ఇది చూచాడు సుయోధనుడు. వెంటనే ద్రోణుని వద్దకు వెళ్లాడు. జరిగిన విషయం చెప్పాడు. ద్రోణుడు ధర్మరాజును ఎదుర్కొన్నాడు. అతని మీద తన వద్ద ఉన్న దివ్యాస్త్రాలను ప్రయోగించాడు. ధర్మరాజు ఆ అస్త్రముల నన్నింటిని సమర్ధవంతంగా ఎదుర్కొన్నాడు. ద్రోణుడు ధర్మరాజు మీద ఇంద్రాస్త్రమును ప్రయోగించాడు. ధర్మరాజు తాను కూడా అదే అస్త్రమును ప్రయోగించాడు. రెండు అస్త్రములు నిర్వీర్యమయ్యాయి. ద్రోణుడు ధర్మరాజు మీద బ్రహ్మాస్త్రమును ప్రయోగించాడు. ధర్మరాజు కూడా బ్రహ్మాస్త్రప్రయోగము చేసాడు. రెండు అస్త్రములు ఒకదానిని ఒకటి ఢీకొని తునాతునకలయ్యాయి.

ఇంతలో ధృష్టద్యుమ్నుడు ద్రోణుని ఎదుర్కొన్నాడు. ద్రోణుడు ధృష్టద్యుమ్నుని వంక చూడకుండా పాంచాల సేనలను సంహరిస్తున్నాడు. వారిని పారిపోయేట్టు చేసాడు. ఇది చూచి భీమార్జునులు ద్రోణుని తో యుద్ధానికి దిగారు. అదే సమయంలో మత్స్య, కేకయ సేనలు కౌరవ సేనలను చుట్టుముట్టాయి. అందరూ కలిసి కౌరవ సేనలను తరుముతున్నారు.

ఇది చూచి సుయోధనుడు కర్ణునితో తన పరాక్రమమును ప్రదర్శించమని అర్థించాడు. దానికి కర్ణుడు "సుయోధనా! ఈ అర్జునుడు, భీముడు నాకు ఒక లెక్కా! నేను ఒక్కడినే వీరిరువురినీ సంహరిస్తాను. మీ

మనసుకు ఆనందం చేకూరుస్తాను.”అని అన్నాడు కర్ణుడు. వారి సంభాషణను విన్నాడు కృపాచార్యుడు.

“కర్ణా! చాలా బాగా పలికావు. ఈరోజుతో పాండవుల చావు, సుయోధన పట్టాభిషేకం చేయించేట్టు ఉన్నావు. మరి ఈ పరాక్రమమంతా నాడు ఘోష యాత్రాసమయమున, ఉత్తర గోగ్రహణ సమయమున ఏమయినది కర్ణా! ప్రగల్భములు పలుకుట కాదు. కార్యములో చూపించు. అయినా నీవు పాండవులతో యుద్ధం చెయ్యడం నేను ఎన్నడూచూడలేదు గదా!. మరి వారిని ఎలా జయిస్తావు. అదిసరే! మనమందరం అర్జునుని చేతిలో ఎన్నిసార్లు ఓడిపోయామో నీకు తెలుసు కదా! ఇప్పుడు అర్జునునికి తోడు ధర్మరాజు, భీముడు. ఘటోత్కచుడు కూడా ఉన్నారు. ఇంకసాత్యకి సంగతి సరేసరి. మరి ఇంతమందిని నీవు ఒక్కడివే గెలువగలవా! ఆలోచించుకో!” అని అన్నాడు.

ఆ మాటలకు కర్ణుడికి రోషం వచ్చింది. “కృపాచార్యా! నేను ఆడినమాట తప్పువాడను కాను. అన్న మాట నెరవేర్చుకుంటాను. పాండవులను జయించి తీరుతాను. అదే కాకుండా మీరందరూ ఎప్పుడూ అర్జునుని పొగుడుతుంటారు. దాంతో కౌరవ వీరులలో ఉత్సాహం చచ్చిపోతోంది. మన పక్క మాత్రం నేను, ద్రోణుడు, అశ్వత్థామ, శల్యుడు మొదలగు అతిరథ మహా రథులు లేరా! నీ మాటలతో వారిని కూడా కాని వారిని చేస్తున్నావు ఎందుకు? ఇప్పటిదాకా నీవు బ్రాహ్మణుడవని నీ అధిక ప్రసంగమును సహించాను. ఇంక ఒక్క మాట మాట్లాడితే నీనాలుక కోస్తాను.జాగ్రత్త!” అని హెచ్చరించాడు.

తన మేన మామ అయిన కృపాచార్యుని (అశ్వత్థామ తల్లి కృపాచార్యుని చెల్లెలు) కర్ణుడు అనరాని మాటలు అనడం చూచి అశ్వత్తామ కోపంతో

ఊగిపోయాడు. కత్తితీసుకొని కర్ణుని మీదికి ఉరికాడు. సుయోధనుడు అశ్వత్థామను వారించాడు. అతనితోపాటు కృపాచార్యుడు కూడా అశ్వత్థామను పట్టుకున్నాడు. "నాయనా! అశ్వత్థామా! అంత కోపం పనికిరాదు నాయనా శాంతం వహించు" అని అనునయించాడు.

సుయోధనుడు అశ్వత్థామను చూచి "గురుపుత్రా! మీరందరి లక్ష్యం ఒకటే. ఈ యుద్ధంలో గెలవడం. నన్ను ఈ సర్వంసహా భూమండలానికి పట్టాభిషిక్తుని చేయడం. కాబట్టి మనమందరం విజయం కోసం పాటుపడాలి కాని ఇలా పరస్పరం కలహించుకోడం తగునా! మీ రందరూ కలిసి కర్ణుడిని క్షమించండి. అతని బదులుగా నేను క్షమాపణ అడుగుతున్నాను." అని అన్నాడు. ఆ మాటలకు అశ్వత్థామ శాంతించాడు. కర్ణుడు కూడా శాంతించి మరల యుద్ధసన్నద్ధుడయ్యాడు.

కర్ణుడు యుద్ధానికి రావడం చూచారు పాండవుల పక్షాన యుద్ధ చేస్తున్న మిత్ర రాజులు. "మన పాండవులు ఈ దుర్దశకు రావడానికి, ఈ వినాశనమున కంతటికి కారణం ఈ కర్ణుడే. వీడిని చుట్టుముట్టండి చంపండి." అంటూ అందరూ ఒక్కుమ్మడి కర్ణుడిని చుట్టుముట్టారు. కర్ణుడు కూడా తన మొక్కవోని పరాక్రమంతో పాండవ సేనలను చించి చెండాడు తున్నాడు. ఇది చూచి అర్జునుడు కర్ణుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు కర్ణుని 30 బాణములతో కొట్టాడు. కర్ణుని చేతిలో నుండి విల్లు జారిపోయింది. వెంటనే తన విల్లు అందుకున్న కర్ణుడు అర్జునుడు ఆశ్చర్యపడే విధంగా శరపరంపర కురిపించాడు. అర్జునుడికి మహా కోపం వచ్చింది. ఒకే ఒక బాణంతో కర్ణుని ధనుస్తువిరిచాడు. అతని సారథిని, హయములను సంహరించాడు. కర్ణు ని శరీరం అంతా బాణములతో ముంచెత్తాడు. వెంటనే కర్ణుడు పక్కనే ఉన్న కృపాచార్యుని రథం మీదికి దూకాడు. అంతకు ముందే

కృపాచార్యుని పరుష వాక్యములతో దూషించాను అన్న సిగ్గు కూడా లేకుండా కృపాచార్యుని రధము మీద తలదాచుకున్నాడు కర్ణుడు. కృపాచార్యుని రధము యుద్ధరంగమునుండి నిష్క్రమించింది.

ఆ ప్రకారము కర్ణుడు పారిపోగానే కౌరవ సైన్యములు కూడా పారిపోసాగాయి. ఇది చూచాడు సుయోధనుడు. "సైనికులారా పారిపోకండి నేను ఉన్నాను. మనం పాండవులను జయిస్తాము" అని అరుస్తూ అర్జునుని మీదికి యుద్ధమునకు వెళ్లాడు. ఇది చూచాడు కృపాచార్యుడు. అశ్వత్థామను సమీపించి "కుమారా అశ్వత్థామా! రారాజు సుయోధనుడు తన బలము ఏపాటిదో ఎరుగక అర్జునుని మీదికి యుద్ధమునకు పోతున్నాడు. అతడు అర్జునునికి పట్టుబడతాడు. నువ్వు నేను ఇక్కడ ఉండి కూడా రారాజును కాపాడలేకపోవడం పాడి కాదు. కాబట్టి వెంటనే నువ్వు రారాజు వద్దకు వెళ్లు" అన్నాడు.

అశ్వత్థామ రారాజు వద్దకుపోయి "రారాజా! సుయోధనా! నీ కెందుకయ్యా ఈ శ్రమ? నేను ఉన్నాను కదా. నేను అర్జునునితో యుద్ధం చేస్తాను. నీవు వెనక్కు వెళ్లు." అన్నాడు.

"గురుపుత్రా! నీకు, నీ తండ్రి ద్రోణునికి అర్జునుడు అంటే వల్లమాలిన ప్రేమ. మీరు అర్జునునితో మనసుపెట్టి యుద్ధం చెయ్యరు. అతనిని చంపరు. ఇప్పటికే నా తమ్ములు నా సేనలు నశించాయి. కాబట్టి ఇంక మీరు పాండవుల వంక రావద్దు. నేను పాండవులతో యుద్ధం చేస్తాను. మీరు మిగిలిన పాండవ సేనలతో యుద్ధం చెయ్యండి." అని పలికాడు.

దానికి అశ్వత్థామ "రారాజా! నాకు నా తండ్రికి అర్జునుడు అంటే అభిమానము ఉన్నమాట వాస్తవమే. కాని యుద్ధ రంగమున ప్రవేశించిన తరువాత బంధుత్వమునకు, మిత్రత్వమునకు, అభిమానాలకు తావు లేదు కదా! అయినా రారాజా! ఎన్నో మారులు, నేను నా తండ్రి యుద్ధచెయ్యడం నువ్వు చూచావు కదా. మేము మా ఒడలు దాచుకోకుండా యుద్ధం చేస్తాము. కాని అది నీవు నమ్మడం లేదు. ఎందుకంటే నువ్వు మమ్మే కాదు. ఎవ్వరినీ నమ్మవు. అసలు నిన్ను నువ్వే నమ్మవు. ఇప్పుడు అవన్నీ ఎందుకు కానీ. నేను శత్రు సేనలలోకి ప్రవేశిస్తున్నాను. పాంచాల వీరులైన ధృష్టద్యుమ్నుడు అతని సైన్యమును పారదోలుతాను." అంటూ సుయోధనుని దాటుకొని పాండవ సేనలోకి ప్రవేశించాడు అశ్వత్థామ.

అది గమనించిన కేకయ,పాంచాల సేనలు అశ్వత్థామను చుట్టు ముట్టాయి. అశ్వత్థామ వారి మీద బాణ వర్షము కురిపించాడు. అశ్వత్థా మ ధాటికి తట్టుకోలేక పాంచాల సేనలు పారిపోతున్నాయి. ఇది చూచిన ధృ ష్టద్యుమ్నుడు అశ్వత్థామను ఎదుర్కొన్నాడు.

"ఓ అశ్వత్థామా! నేనెవరో తెలియునా! నీ తండ్రి ద్రోణుని చంపడానికి పుట్టి న వరప్రసాదిని. నీ తండ్రిని వధించి నిన్నుకూడాసంహరిస్తాను రా!" అంటూ అశ్వత్థామ మీదికి దూకాడు.

అతనిని నిలువరిస్తూ అశ్వత్తామ ఇలా అన్నాడు "ఓ ధృష్టద్యుమ్నా! రా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను. రా! ఇన్నాళ్ల నుండి నీ కోసం వెదుకుతుంటే ఈ నాటికి దొరికావు! రా! నా బాణములకునిన్ను బలిచేస్తాను." అంటూ ధృ ష్టద్యుమ్నుని ఎదుర్కొన్నాడు.

"నీ తండ్రి సంగతి తర్వాత చూస్తాను. ముందు నిన్ను చంపి తర్వాత నీ తండ్రి పనిపడతాను." అంటూ ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ మీద శర సంధానము చేసాడు.

అశ్వత్థామ మితిమీరిన కోపంతో ధృష్టద్యుమ్నుని కేతనమును ఖండించాడు. అతని సారధిని, హయములను చంపాడు. అతనికి రక్షణగా యుద్ధం చేస్తున్న 100 మంది రక్షకులను, పార్శ్వరక్షకులను చంపాడు. అశ్వత్థామ సింహనాదం చేసాడు. ఇది చూచి సుయోధనుడు ఎంతో సంతోషించాడు. అశ్వత్థా మ కు ఎదురు నిల్చి యుద్ధ చేసే సాహసం ఎవరికీ లేకుండా పోయింది. పాంచాల సైనికులు చెల్లాచెదరయ్యారు.

ఇది చూచిన ధర్మరాజు, భీముడు తమ తమ సేనలతో ధృష్టద్యుమ్నునికి సాయంగా వచ్చారు. సుయోధనుడుకూడా ద్రోణాచార్యుని తీసుకొని అశ్వత్థామకు సాయంగా నిలిచాడు. ఇది చూచిన అర్జునుడు ధృష్టద్యుమ్యునికి సాయంగా వచ్చాడు. ఇరుపక్షముల మధ్యపోరు ఘోరమయింది. అర్జునుడు తన వాడియైన బాణములతో మగధ, మద్ర, వంగ దేశముల సైన్యములను నాశనం చేస్తున్నాడు. భీముడు అంబష్ట,శిబి, వంగ దేశ సైన్యములను తుద ముట్టించాడు.

ఇది చూచిన ద్రోణుడుకోపం ఆపుకోలేకపోయాడు. వాయవ్యాస్త్రమును సంధించాడు. ఆ అస్త్రము ధాటికి పాండవ సైన్యము పెనుగాలికి ఎండుటాకులు ఎగిరిపోయినట్టు చెల్లాచెదరయ్యాయి. అర్జునుడు, భీముడు కలిసి ద్రోణునికి చెరి ఒకపక్క చేరి ఆయనను శరవర్షములో ముంచెత్తారు. కాని ద్రోణుడు బెదరక, పాండవ సేనను తరుముతున్నాడు అతనికి తోడుగా సుయోధనుడు కూడా కలిసి పాండవసేనను చెల్లాచెదరు చేస్తున్నారు.

అప్పుడు సోమదత్తుడు పాండవ సైనికులను ఎదుర్కొన్నాడు. సాత్యకి అతనితో యుద్ధం చేస్తున్నాడు. సోమదత్తుడు ఒకే ఒక బాణంతో సాత్యకి వింటిని నరికాడు. 35 బాణములతో సాత్యకిని కొట్టాడు. సాత్యకి మరొక విల్లు తీసుకున్నాడు. ముందు సోమదత్తుని కేతనమును కూల్చాడు. విల్లు రెండుగా విరిచాడు. సోమదత్తుడు మరొక విల్లు అందుకున్నాడు. ఇది చూచి భీముడు సోమదత్తుని ఎదుర్కొన్నాడు. ఘటోత్కచుడు సోమదత్తుని మీద పరిఘను ప్రయోగించాడు. సోమదత్తుడు దానిని రెండుగా నరికాడు. సాత్యకి తన వాడియైన బాణములతో అతని హయములను, సారధిని చంపాడు. మరొక నారసముతో సాత్యకి సోమదత్తుని తల నరికాడు.

సోమదత్తుని మరణం చూచిన కౌరవ సేనలు సాత్యకిమీద ఒక్కుమ్మడిగా పడ్డారు. ధర్మరాజు ఇది చూచి సాత్యకిని అక్కడినుండి తప్పించాడు. తాను ద్రోణునితోయుద్ధం చేస్తున్నాడు. ద్రోణుడు తన శరములతో ధర్మరాజు విల్లు విరిచాడు. కేతనమును పడగొట్టాడు. ధర్మరాజు ఒళ్లంతా తూట్లు పడేట్టు కొట్టాడు. ధర్మరాజు రోషంతో ఉగ్రరూపం దాల్చాడు. మరొక విల్లు తీసుకొని ద్రోణుని శరీరంలోకి చొచ్చుకుపోయేట్టు వాడి బాణములు సంధించాడు. ద్రోణుడు తన రధము మీదనే మూర్ఛపోయాడు.

కొంచెంసేపటికి తేరుకొని ద్రోణుడు మరలా విజృంభించాడు. పాండవ సేనల మీద వాయవ్యాస్త్రమును ప్రయోగించాడు. ధర్మరాజు కూడా వాయవ్యాస్త్రమును ప్రయోగించి, ద్రోణుడు ప్రయోగించిన అస్త్రమును నిర్వీర్యము చేసాడు. ద్రోణుని మీద బాణవర్షము కురిపించాడు. ఇది చూచాడు కృష్ణుడు. ధర్మరాజు వద్దకు పోయి "ధర్మజా! నిన్ను పట్టుకొని సుయోధనునికి అప్పగిస్తాను అని ద్రోణుడు చేసినప్రతిజ్ఞను మరిచిపోయావా! ద్రోణునితో యుద్ధమునకు తలపడుతున్నావు. ఇది మంచిదికాదు. వెంటనే ఇక్కడి నుండి

తొలగిపో. భీముడు అక్కడ యుద్ధం చేస్తున్నాడు. అతనికిసాయంగా వెళ్లు."
అని చెప్పాడు. కృష్ణుని మాట ప్రకారము ధర్మజుడు ద్రోణుని విడిచి భీముని
వద్దకు వెళ్లాడు. ద్రోణుడు కూడా పాంచాల సేనల వైపుకు వెళ్లాడు.

ధర్మరాజు, భీముడు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి కలిసి కౌరవ సేనలను తునుమాడుతున్నారు. వారిని కృపాచార్యుడు, కర్ణుడు, ద్రోణుడు వారితో యుద్ధమునకు తలపడ్డారు. వారి మధ్య ఘోరంగా యుద్ధం జరుగుతూ ఉంది. వారి సైన్యముల పదఘట్టనలకు లేచిన ధూళి ఆకాశం అంతా కమ్మింది. సూర్యుడు కనిపించడం లేదు. యుద్ధ భూమి అంతా చీకట్లు కమ్ము కున్నట్టయింది. సైనికులకు కళ్లు కనిపించడం లేదు. కౌరవ సేన చెల్లాచెదరయింది. ద్రోణాచార్యుడు ఒక పక్క సుయోధనుడు ఒక పక్క కౌరవ సేనలను ప్రోత్సహిస్తూ యుద్ధోన్ముఖులను చేసారు.

ద్రోణుడు అప్పటికప్పుడు ఒక వ్యూహమును పన్నాడు. ఆ వ్యూహము మొదట తనునిల్చున్నాడు. ఆ వ్యూహమునకు అటు ఇటు అశ్వత్థామను, శకునిని నిలిపాడు. మధ్యలో శల్యుడు నిల్చున్నాడు. సుయోధనుడు వ్యూహం అంతా కలయ తిరుగుతూ పర్యవేక్షిస్తున్నాడు.

సుయోధనుడు తన సైనికులను దివిటీలుపట్టుకొమ్మని ఆజ్ఞాపించాడు. అప్పటికప్పుడు అందరికీ దివిటీలు అందించారు. రధమునకు ఐదు దివిటీలు, ఏనుగునకు మూడు దివిటీలు, అశ్వమునకు ఒక దివిటీ చొప్పున ఇచ్చారు. వ్యూహమునకు ముందు భాగమున దివిటీలు పట్టుకున్న సైనికులు బారులు తీరారు. పాండవ సైనికులు కూడా దివిటీలు పట్టుకున్నారు. రధానికి 10, ఏనుగుకు 7, అశ్వమునకు 2 చొప్పున దివిటీలుపంచారు.

అప్పుడు సుయోధనుడు తనసోదరులను పిలిచి "సోదరులారా! మీరూ, శల్యుడు, కృతవర్మ, మొదలగువారు అందరూ కలిసి ద్రోణుడు ధృ ష్టద్యుమ్నునితోయుద్ధం చెయ్యకుండా ఆపండి. ద్రోణుడు మిగిలిన వారితో యుద్ధం చేస్తాడు. కర్ణుడు ధృష్టద్యుమ్ముని చంపి తరువాత అర్జునుని జయిస్తాడు. నేను భీమునితో యుద్ధం చేసి గెలుస్తాను." అని పలికాడు. సైన్యములను కదలమని చేతితో సంజ్ఞ చేసాడు.

ధర్మరాజు తాను కూడా ద్రోణుని మీదికి యుద్ధమునకు పోబోతూ ఉండగా మధ్యలో కృతవర్మ ఎదుర్కొన్నాడు. ధర్మరాజు కృతవర్మతో యుద్ధం చేస్తున్నాడు. సాత్యకితో భూరి అనే రాజు, సహదేవునితో కర్ణుడు, భీమునితో సుయోధనుడు, నకులునితో శకుని, శిఖండితో కృపాచార్యుడు, ప్రతివింధ్యునితో దుశ్శాసనుడు, ఘటోత్కచునితో అశ్వత్థామ, ద్రుపదుని తో వృ షసేనుడు, విరాటరాజుతో శల్యుడు, శతానీకునితో చిత్రసేనుడు, అర్జునునితో అలంబసుడు అనే రాక్షసరాజు,యుద్ధం చేస్తున్నారు. వీరందరూ ఒకపక్క యుద్ధం చేస్తూ మరొక పక్క ద్రోణుని కాపాడుతున్నారు. పాండవ పక్షం లో ఉన్న అతి రథ మహా రథులు ద్రోణుని మీదికి దూకుతుంటే, కౌరవ పక్షంలో ఉన్న వారు వారిని శాయశక్తులా ఆపుతున్నారు.

ద్రోణుడు సోమక సైన్యంతో యుద్ధం చేసి వారిని హతమార్చాడు. ఆసమయంలో ధృష్టద్యుమ్నుడు ద్రోణుని మీదికి దూసుకొని వచ్చాడు. వారిరువురికి ఘోరంగా యుద్ధం జరుగుతూ ఉంది. కృతవర్మ ధర్మరాజు విల్లు విరిచాడు. ధర్మరాజు మరొక విల్లు తీసుకొని కృతవర్మ విల్లు విరిచాడు. వెంటనే కృతవర్మమీద శక్తిని ప్రయోగించాడు. ఆ శక్తి కృతవర్మ చేతిని చీల్చింది. కృ తవర్మ మరొక విల్లు తీసుకొని ధర్మరాజు రథసారథిని, హయములను చంపాడు ధర్మరాజు విల్లు విరిచాడు. ధర్మరాజు తోమరము అనే ఆయుధాన్ని

తీసుకున్నాడు. కృతవర్మ ఆ ఆయుధమును కూడా రెండు ముక్కలు చేసాడు. ధర్మరాజు కవచము చీల్చుకొని పోయేట్టుగా బాణములతో కొట్టాడు. కృతవర్మతో యుద్ధం చేయలేక ధర్మరాజు యుద్ధభూమినుండి తొలగిపోయాడు.

కురు వంశీయుడైన భూరి మహారాజుతో సాత్యకి యుద్ధం చేస్తున్నాడు. సాత్యకి అతని విల్లు విరిచాడు. భూరి మరియొక విల్లు తీసుకున్నాడు. సాత్యకి ధనుస్సును ముక్కలు చేసాడు. సాత్యకి శక్తి ఆయుధాన్ని భూరి మీద ప్రయోగించాడు. ఆ శక్తి అనే ఆయుధము భూరి తల తెగ నరికింది. ఇది చూచాడు అశ్వత్థామ. వెంటనే సాత్యకిని ఎదుర్కొన్నాడు.

ఇంతలో ఘటోత్కచుడు అశ్వత్థామ మీదికి ఉరికాడు. పది బాణములతో అశ్వత్థామ వక్షస్థలము మీద కొట్టాడు. ఆ బాణముల ధాటికి తట్టుకోలేక అశ్వత్థామ రథముమీద సొమ్మసిల్లినట్టు తూలిపోయాడు. వెను వెంటనే తేరుకున్నాడు. ఘటోత్కచుని గుండెలకు గురిపెట్టి తీవ్రమైన బాణములు సంధించాడు. అశ్వత్థామ శరములు ఘటోత్కచుని గుండెలను గాయపరచగా అతను కూడా సొమ్మసిల్లాడు. అతని రథసారధి రథమును పక్కకు తీసుకొని వెళ్లాడు.

మరొక చోట సుయోధనుడు, భీముడు ఒకరికొకకు తీసిపోకుండా ఘోరంగా యుద్ధం చేస్తున్నారు. భీముడు సుయోధనుని ధనుస్సును ముక్కలు చేసాడు. అతని కేతనమును విరిచాడు. సుయోధనుని శరీరం అంతా తూట్లు పడేట్టు కొట్టాడు. సుయోధనుడు మరొక ధనుస్సు తీసుకొని భీముని విల్లు విరిచాడు. భీముడు మరొక విల్లు తీసుకొని ఏడు బాణములతో సుయోధనుని తీవ్రంగా గాయపరిచాడు. సుయోధనుని విల్లు విరిచాడు. సుయోధనుడు మరొక విల్లు తీసుకోగానే దానిని కూడా విరిచాడు. ఆ ప్రకారం

సుయోధనుని నాలుగు ధనుస్సులు విరిచాడు. సుయోధనుని రథాశ్వములను, సారధిని చంపాడు. సుయోధనునికి భీముడంటే భయం వేసింది. ఎవరూ చూడకుండా పక్కకు తప్పుకున్నాడు. భీముడు అది చూడలేదు. సుయోధనుడు మరణించాడు అనుకున్నాడు. సింహనాదం చేసాడు. సుయోధనుడు కనపడకపోయేసరికి కౌరవ సేనలు కూడా అతను మరణించాడు అని భావించాయి. వారిలో కలకలం పుట్టింది. పాండవసేనలలో ఆనందోత్సాహాలు పెల్లుబికాయి. ఇంతలో సుయోధనుడు వేరొక రధము ఎక్కి అక్కడకు వచ్చాడు. అంతా సద్దు మణిగింది.

మరొక వైపు కర్ణుడు,సహదేవుడు తీవ్రంగా యుద్ధం చేస్తున్నారు. సహదేవుడు కర్ణుని తొమ్మిది బాణములతో కొట్టాడు. కర్ణుడు 100 బాణములతో సహదేవుని మర్మస్థానములలో కొట్టాడు. సహదేవుని ధనుస్సు ముక్కలు చేసాడు. సహదేవుడు మరొక విల్లు తీసుకున్నాడు. వెంటనే కర్ణుడు సహదేవుని రథ సారథిని, అశ్వములను చంపాడు. సహదేవుడు కత్తి, డాలు తీసుకున్నాడు. వాటిని కూడా ముక్కలు చేసాడు కర్ణుడు. సహదేవుడు కర్ణుని మీదికి గదాయుధము విసిరాడు. కర్ణుడు ఆ గదను మధ్యలోనే తన శరములతో ఖండించాడు. వెంటనే సహదేవుడు శక్తి అనే ఆయుధాన్ని కర్ణుని మీద ప్రయోగించాడు. కర్ణుడు దానిని కూడా ముక్కలుచేసాడు. ఇంక చేసేది లేక సహదేవుడు రథ చక్రమును కర్ణుని మీదికి విసిరాడు. ఆ రథచక్రము కూడా కర్ణుని బాణముల ధాటికి ఆగలేకపోయింది. కర్ణుడి తో యుద్ధం చెయ్యలేక సహదేవుడు యుద్ధరంగమునుండి పోబోతుంటే కర్ణుడు అతనిని వెంబడించి పట్టుకున్నాడు. వెంటనే సహదేవుని సంహరించబోయాడు. ఇంతలో కర్ణునికి తాను కుంతికి ఇచ్చిన మాట గుర్తుకు వచ్చింది. (అర్జునుని తప్ప, మిగిలిన పాండవులు యుద్ధములో తన చేతికి చిక్కినా చంపను అని కర్ణుడు కుంతికి వాగ్దానం చేసాడు. ఉద్యోగపర్వము.) తాను కుంతికి ఇచ్చిన

మాట ప్రకారము సహదేవుని చంపకుండా విడిచిపెట్టాడు. కాని అతనితో కొంచెంసేపు హేళనగా మాట్లాడాడు. “సహదేవా! నీ బలమును, ఎదుటివారి బలమును తెలుసుకొని యుద్ధం చెయ్యి. నీ కంటే బలవంతులతో యుద్ధం చెయ్యడం అవివేకం. అలా ఎప్పుడూ చెయ్యకు. పో.” అని అన్నాడు. సహదేవుడు కూడా అవమాన భారంతో కుమిలిపోతూ అక్కడ నుండి వెళ్లాడు. మరొక రథము ఎక్కి అక్కడినుండి వెళ్లిపోయాడు.

మరొక పక్క విరాటుడు శల్యునితో యుద్ధం చేస్తున్నాడు. శల్యుడు విరాటుని అశ్వములను చంపాడు. శల్యుని పై విరాటుడు శరవర్షము కురిపించాడు. విరాటుని తమ్ముడు శతానీకుడు అన్నకు తోడుగా వచ్చాడు. అన్న విరాటుని తన రథం మీద ఎక్కించుకున్నాడు. శల్యుని ఎదుర్కొన్నాడు. శల్యుడు ఒక వాడియై న బాణంతో శతానీకుని సంహరించాడు.

తన తమ్ముడి చావు కళ్లారా చూచిన విరాటునికి లోపల భయం పట్టుకుంది. కాని పైకి ధైర్యంగా శల్యుని ఎదుర్కొన్నాడు. శల్యుడు తన పదునైన బాణములతో విరాలుని మూర్ఛపోయేట్టు కొట్టాడు. వెంటనే విరాటుని రథసారథి రథమును రణరంగమునుండి దూరంగా తీసుకొని వెళ్లాడు. విరాటుని సేనలు కూడా శల్యుని ధాటికి ఆగలేక పక్కతొలిగాయి. ఇది చూచిన అర్జునుడు పరుగు పరుగున వచ్చి ఆ సైన్యములను ఆపాడు. వారిని ముందునిలిచి శల్యునితో యుద్ధం చేస్తున్నాడు.

ఇంతలో అలంబసుడు అనే రాక్షసుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు అలంబసుని విల్లు విరిచాడు. అతని ధ్వజమును నేలకూల్చాడు. అతని రథమునకు కట్టిన హయములను చంపాడు. అలంబసుడు ఒక ఖడ్గము తీసుకొని అర్జునునితో తలపడ్డాడు. అర్జునుడు ఆ ఖడ్గమును

విరగ్గొట్టాడు. నాలుగు భయంకరమైన  బాణములతో ఆ రాక్షసుని కొట్టాడు. అర్జునుని బాణధాటికి తట్టుకోలేక అలంబసుడు పారిపోయాడు.

మరొక వైపు నకులుని కుమారుడు శతానీకుడు సుయోధనుని తమ్ముడు చిత్రసేనునితో యుద్ధం చేస్తున్నాడు. శతానీకుడు చిత్రసేనుని కవచము ను చించాడు. విల్లు నరికాడు. అతని ధ్వజమును విరగ్గొట్టాడు. చిత్రసేనుడు మరొక విల్లు తీసుకొని శతానీకుని మీద బాణ ములు ప్రయోగించాడు. కాని శతానీకుడు చిత్రసేనుని రథాశ్వములను చంపాడు. సారథిని చంపాడు. చిత్ర సేనుడు 25 బాణములతో శతానీకుని వళ్లంతా తూట్లుపడేట్టు కొట్టాడు.  శతానీకుడు ఒకే ఒక బాణంటో చిత్రసేనుని విల్లు విరిచాడు. రథమును విరగ్గొట్టాడు. చిత్రసేనుడు తన రథమునుండి కిందికి దూకి పక్కనే ఉన్న హార్దిక్యుడి రథము ఎక్కిపారిపోయాడు.

మరొక పక్క ద్రుపదుడు కర్ణుని కుమారుడైన వృషసేనుడితో యుద్ధం చేస్తున్నాడు. ద్రుపదుని మీద వృషసేనుడిదే పైచేయిగా ఉంది. ద్రుపదుని నిస్సహాయత చూచి  పాంచాల సేనలు ద్రుపదుని ముందు నిలిచి వృష సేనుని తో పోరుతున్నాయి. కాని వృషసేనుడు కురిపించే శరవర్షమునకు తట్టుకోలేక పారిపోయాయి.

మరొక పక్క ధర్మరాజు కుమారుడైన ప్రతివింధ్యుడు దుశ్శాసనునితో పోరుతున్నాడు.  దుశ్శాసనుడు ప్రతి వింధ్యుని ధ్వజమును, విల్లును విరగ్గొట్టాడు.  సారథిని, హయములను చంపాడు.  ఇంతలో ప్రతివింధ్యుని సోదరులు అతనికి సాయంగా వచ్చి యుద్ధం చేస్తున్నారు. భీముని కుమారుడు శ్రుతసేనుడు ప్రతివింధ్యుని తన రథము మీద ఎక్కించుకున్నాడు. ప్రతి వింధ్యుడు మరొక విల్లు తీసుకొని దుశ్శాసనునితో  యుద్ధం చేస్తున్నాడు.

మరొక పక్క నకులుడు శకునితో యుద్ధం చేస్తున్నాడు.  శకుని ఒక పదునైన బాణంతో నకులుని మూర్ఛపోయేట్టు కొట్టాడు. నకులుడు వెంటనే తేరుకొని ఒక పదునైన బాణాలతో శకుని  విల్లును, కేతనమును, విరిగేట్టు కొట్టాడు.  శకుని తొడలపై బాణములు సంధించి అతనిని కదలకుండా చేసాడు. నకులుని బాణ ధాటికి శకుని మూర్ఛపోయాడు. శకుని రథ సారధి రథమును పక్కకు తీసుకొని వెళ్లాడు.

కృపాచార్యుడు శిఖండితోయుద్ధం చేస్తున్నాడు. శిఖండి కృపాచార్యుని చేతిలో ఉన్న విల్లు విరగ్గొట్టాడు. కృపాచార్యుడు మరొక విల్లు తీసుకొని శిఖండి మీద శక్తిని ప్రయోగించాడు. శిఖండి ఆ శక్తిని నిర్వీర్యం చేసాడు.  కృపా చార్యుడు మరొక ధృడమైన బాణంతో శిఖండి మూర్ఛపోయేట్టు కొట్టాడు. శిఖండి రథంమీద సొమ్మసిల్లి పడిపోయాడు.  కృపాచార్యుడు శిఖండిని చంపుదామని మరొక పదునైన బాణం సంధించాడు.  ఇంతలోనే పాంచాల వీరులు శిఖండికి అడ్డం వచ్చి కృపాచార్యునితో యుద్ధానికి దిగారు. రథసారధి శిఖండి రథమును పక్కకు తప్పించాడు.

కాగడాల వెలుగులలో ఆ నాటియుద్ధం రసవత్తరంగా సాగింది. ధృష్ట ద్యుమ్నుడు ద్రోణాచార్యుని ఐదు బాణములతో కొట్టాడు. ద్రోణుడు ధృ ష్టద్యుమ్నుని విల్లు విరగ్గొట్టాడు. ధృష్టద్యుమ్నుడు మరొక విల్లుతీసుకొని అగ్ని బాణాన్ని ప్రయోగించాడు.  అది చూచిన కర్ణుడు తన బాణములతో ఆ అగ్ని బాణములు మధ్యలోనే తుంచాడు.  ఇంతలో సుయోధనుడు, దుశ్శాసనుడు, శల్యుడు కూడా అక్కడకు వచ్చిచేరారు. వారందరితో  ధృష్టద్యుమ్నుడు ఒంటరిగా యుద్ధంచేస్తున్నాడు.

ద్రుమసేనుడు కర్ణునితో తలపడ్డాడు.  ఒకేక బాణంతో కర్ణుడు ద్రుమసేనుని చంపాడు. అది చూచిన ధృష్టద్యుమ్నుడు కోపంతో

ఊగిపోయాడు. కర్ణుని విల్లు విరిచాడు. కర్ణుడు మరియొక విల్లు తీసుకున్నాడు. ధృష్టద్యుమ్నునితో యుద్ధం చేస్తున్నాడు. ఇంతలో సాత్యకి వచ్చి కర్ణుని ఎదుర్కొన్నాడు. సాత్యకి కర్ణుడు యుద్ధం చేస్తుంటే మధ్యలో కర్ణుని కుమారుడు వృషసేనుడు వచ్చాడు. సాత్యకిని ఎదుర్కొన్నాడు. సాత్యకి ఒకే ఒక బాణంతో వృష సేనుని మూర్ఛపోయేట్టు కొట్టాడు. కర్ణుడు తన కుమారుడు వృష సేనుడు మరణించాడని చాలా బాధపడ్డాడు. సాత్యకి మీది కోపంతో అతని మీద శరవర్షము కురిపించాడు. ఇంతలో వృషసేనుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. తన తండ్రి కర్ణుని కలిసి సాత్యకితో యుద్ధం చేస్తున్నాడు.

ఇంతలో అర్జునుడు తన దేవదత్తమును పూరించాడు. ఇది విన్నాడు కర్ణుడు. సుయోధనుని తో ఇలా అన్నాడు. “రారాజా! అర్జునుడు ~~ఈ~~ వైపే వస్తున్నాడు. మనము అర్జునుడు సాత్యకిని చేరకుండా ఆపితే, ఇక్కడ సాత్యకిని మనము చంపవచ్చు. ఇది నీకు ఇష్టమేనా! ఇలా చేస్తేనే మనము సాత్యకిని అభిమన్యుని చంపినట్టు చంపవచ్చు. నీ గెలుపునకు ఇది నాంది అవుతుంది. మనము సాత్యకిని చంపాము అని తెలిసిన మరుక్షణం అర్జునుడు ఇక్కడకు వస్తాడు. కాబట్టి సాత్యకి చావు అతనికి తెలియనివ్వకూడదు. కాబట్టి అర్జునుడు ఇక్కడకు రాకుండా కొంతమంది మహారథులను అక్కడకుపంపు.” అని చెప్పాడు.

కర్ణుని ఆలోచన సుయోధనునికి నచ్చింది. పక్కనే ఉన్న శకునిని చూచి మామా! నీవు 10,000 ఏనుగులు, 10,000 రథములను తీసుకొని అర్జునుని ఎదిరించి అతను ఇక్కడకు రాకుండా ఆపు. నీ వెంట నా తమ్ములు దుశ్శాసనుడు, సుబాహుడు, దుష్ప్రదర్షణుడు, దుర్విషహుడు తోడుగా వస్తారు. నీవు అర్జునుడు,భీముడు,ధర్మరాజు తోయుద్ధం చేసి విజయం సాధించు.” అని అన్నాడు. సుయోధనుని మాటప్రకారము శకుని, తన మేనల్లులతో కలిసి అర్జునునిమీదికి యుద్ధానికి బయలుదేరాడు.

ఇక్కడ కర్ణుడు తన సైన్యముతో సాత్యకితోయుద్ధం చేస్తున్నాడు. కాని సాత్యకి యుద్ధకౌశలానికి కౌరవ సేన నిలువలేకపోయింది. సుయోధనుడు తన రథమును సాత్యకి వైపు దూకించాడు. సాత్యకి సుయోధనుడు యుద్ధం చేస్తున్నారు. సాత్యకి సుయోధనుని సారథిని, రథాశ్వములను నరికాడు. సుయోధనుని విల్లు విరిచాడు. సుయోధనుడు నేలమీదికి దూకి మరొకరి రథం ఎక్కాడు. సుయోధనుని పరాజయం చూచి కౌరవ సేన పారిపోయింది.

అక్కడ శకుని అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు. శకుని కుమారుడు ఉలూకుడు కూడా తండ్రితో కలిసి అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు. ఉలూకుడు అర్జునుని మీద, కృష్ణుని మీద బాణవర్షము కురిపించాడు.  ఇది చూచాడు అర్జునుడు. ముందు శకుని రథ సారథిని, అతని రథాశ్వములను ఖండించాడు. శకుని విల్లు విరిచాడు. అతని రథమును విరగ్గొట్టాడు. శకుని వెంటనే తన కుమారుని రథం మీదకు దూకాడు. మరలా అర్జునుని తో యుద్ధం చేస్తున్నాడు. కాని అర్జునుని గాండీవము కురిపించే అస్త్రశస్త్రముల ధాటికి శకుని అతని కుమారుడు తట్టుకోలేకపోయారు. శకునికి సాయంగా వచ్చిన రథికులు అలసిపోయారు. అతని సైన్యం పారిపోయింది. శకుని అతని కుమారుడు దిక్కు తోచకుండా నిలబడిపోయారు.

మరొకచోట ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యునితో యుద్ధం చేస్తున్నాడు. ధృష్టద్యుమ్నుడు  ద్రోణాచార్యుని వింటినారి తెంచాడు. ద్రోణుడు మరొక విల్లు తీసుకొని  ధృష్టద్యుమ్నుని మీద శరములు ప్రయోగించాడు.  ఈ ప్రకారం సాత్యకి, అర్జునుడు,  ధృష్టద్యుమ్నుడు  కౌరవ సేనలను చించి చెండాడు తుంటే, అవి పారిపోయాయి. అర్జునుడు దేవదత్తమును, కృష్ణుడు పాంచజన్యమును,  ధృష్టద్యుమ్నుడు  మొదలగు వారు తమ తమ శంఖములను విజయసూచకంగా పూరించారు.

ఇది చూచిన కర్ణుడు కోపంతో ఊగిపోయాడు. పాండవ సైన్యమును తరుముతున్నాడు. దొరికిన వాడిని దొరికినట్టు చంపుతున్నాడు. ధర్మరాజు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా చూచితివా కర్ణుని పరాక్రమము. ఈ అర్ధరాత్రిలో మధ్యందిన మార్తాండుని మాదిరి వెలిగిపోతున్నాడు. మనం ఊరకుంటే ఈ రోజే కర్ణుడు పాండవ సేనను హతమార్చేట్టు న్నాడు. అతని ని ఆపే మార్గం ఆలోచించు." అని అన్నాడు ధర్మరాజు.

అర్జునుడు కృష్ణుని చూచి "కృష్ణా! అన్నయ్య ధర్మజుడు మన సేనలు పారిపోవడం చూచి భయపడుతున్నాడు. ఒక పక్క కర్ణుడు, మరొక పక్క ద్రోణుడు మన సేనలను తరుముతున్నారు. ముందు నేను కర్ణుని ఎదుర్కొంటాను. తరువాత ద్రోణుని సంగతి చూద్దాము. మన రథమును కర్ణుని మీదికి పోనిమ్ము "అని అన్నాడు.

ఆమాటలకు కృష్ణుడు బదులుగా ఇలా అన్నాడు. "అర్జునా! రాక్షసులకు రాత్రిసమయమందు బలం ఎక్కువ కదా. కావున నువ్వు ఘటోత్కచుని కర్ణుని మీదికి పంపు. అతడు మాయాయుద్ధంలో ప్రవీణుడు. అతని వద్ద ఎన్నో దివ్యాస్త్రములు ఉన్నాయి. కాబట్టి ఘటోత్కచుడు కర్ణుని ఎదుర్కొంటాడు. మనము ద్రోణుని ఎదుర్కొందాము." అని అన్నాడు.

కృష్ణుని మాటప్రకారము అర్జునుడు ఘటోత్కచుని పిలిచాడు. "కుమారా ఘటోత్కచా! అటు చూడు. కర్ణుని ధాటికి నిలువలేక పాండవ సైన్యములు పారిపోతున్నాయి. నీవు నీ శౌర్యము,పరాక్రమముతో వారిని నిలువరింపుము. కర్ణుడు రాత్రి యుద్ధంలో నీతో సమానంగాయుద్ధం చెయ్యలేడు. ఈ సమయంలో నీవు కర్ణునితో యుద్ధం చేసి నీ తండ్రుల పేరు నిలుపు." అని అన్నాడు.

ఘటోత్కచుడు అర్జునునికి కృష్ణునికి నమస్కరించి కర్ణుడు ఉన్న పక్కకు వెళ్లాడు. అదే సమయములో జటాసురుని కుమారుడైన అలంబసుడు అనే రాక్షసుడు సుయోధనుని వద్దకు పోయి "రారాజా! నాకు మొదటినుండి పాండవుల మీద పగ ఉన్నది. మీరు నాకు అనుజ్ఞ ఇస్తే నేను పాండవులను సంహరిస్తాను." అని అన్నాడు.

సుయోధనుడు సంతోషంతో ఉబ్బితబ్బియ్యాడు.వెంటనే అనుజ్ఞ ఇచ్చాడు. అలంబసుడు కర్ణుని దాటుకొని ఘటోత్కచుని మీదికి వెళ్లాడు. ఇద్దరు రాక్షసవీరులు మొదట విల్లు అమ్ములతో యుద్ధం మొదలెట్టారు. తరువాత రాక్షసమాయలు ప్రయోగించుకుంటూ ఒకరితో ఒకరు యుద్ధం చేస్తున్నారు. ఒకరు సర్పంగా మారితే మరొకరు గరుడుడుగా మారారు. ఒకడు ఏనుగుగా మారితే మరొకడు సింహంగా మారాడు. ఈ ప్రకారము ఒకరికి ఒకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు. ఆఖరున ముష్టియుద్ధము చేస్తున్నారు. ఘటోత్కచుడు అలంబసుని పట్టుకొని కిందపడవేసి అతని గుండెల మీద కాలు పెట్టి అతని తలను బలవంతంగా తిప్పాడు. అలంబసుని తల ఘటోత్కచుని చేతికి వచ్చింది. ఘటోత్కచుడు అలంబసుని తలను సుయోధనుని రథము మీదికి విసిరేసాడు.

ఆ తలను చూచి ఆశ్చర్యపోతున్న సుయోధనునితో ఘటోత్కచుడు ఇలా అన్నాడు. "ఓ సుయోధనా! అది నీ స్నేహితుడు అలంబసుని తల. గుర్తుపట్టావా! ఇంకొంచెం సేపటిలో కర్ణుని తల కూడా నీ రథం మీదికి విసురుతాను. కాచుకో! నీ వంతు వచ్చినప్పుడు నీ తలను కూడా విసిరేస్తాను. నేనెవరో తెలుసుకదా! నేను భీమసేనుని కుమారుడను! జాగ్రత్త!" అని గర్జించాడు.

వెంటనే ఘటోత్కచుడు కర్ణుడు ఉన్న వైపుకు పరుగుతీసాడు. భయంకరమైన ఆకారంతో తన మీదికి వస్తున్న ఘటోత్కచుని చూచాడు కర్ణుడు. అతని మీద అత్యంత పదునైన బాణములను వర్షించాడు. ఒకరికి ఒకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు ఘటోత్కచుడు, కర్ణుడు. కర్ణుడు ఒక దివ్యాస్త్రమును ఘటోత్కచుని మీద ప్రయోగించాడు. కాని దానిని తిప్పి కొట్టాడు ఘటోత్కచుడు. ఘటోత్కచుడు ప్రయోగించిన అస్త్రములను తిప్పికొడు తున్నాడు కర్ణుడు.

ఇది పని కాదని ఘటోత్కచుడు మాయా యుద్ధము ప్రకటించాడు. తన మాయతో మాయాసైన్యమును సృష్టించాడు. ఆ మాయాసైన్యము రకరకాలైన ఆయుధములను కౌరవ సేనమీద ప్రయోగించింది. ఆ ఆయుధములను వారు అంతకు ముందు చూచి ఉండలేదు. వాటి ధాటికి తట్టుకోలేక కౌరవ సైన్యము పారిపోయింది. ఘటోత్కచుడు కర్ణుని మీద తన చక్రాయుధమును ప్రయోగించాడు. కర్ణుడు దానిని ఖండించాడు. ఘటోత్కచుడు తన గదను కర్ణుని మీదికి విసిరాడు. కర్ణుడు దానిని ముక్కలు చేసాడు. ఘటోత్కచుడు ఆకాశమునకు ఎగిరి అక్కడినుండి రాళ్లను, చెట్లను, వర్షంలాగా కురిపి స్తున్నాడు. కర్ణుడు వాటిని తన బాణములతో నుగ్గు నుగ్గు చేస్తున్నాడు.

ఇది పని కాదని ఘటోత్కచుడు భూమి మీదికి దిగాడు. తన రధము మీద ఎక్కి కర్ణునితో తలపడ్డాడు కర్ణుడు వెంటనే ఘటోత్కచుని రధసారధిని, హయములను చంపాడు. ఘటోత్కచుని రధమును ముక్కముక్కలుగా ఖండించాడు. ఘటోత్కచుని శరీరము నిండా నిశితమైన శరములు నాటాడు. ఘటోత్కచుడు తన నోరు పెద్ద కొండ గుహ మాదిరి తెరిచి కర్ణుడు వేసే బాణములను అన్నింటిని మింగుతున్నాడు. కర్ణుడు అతని ముఖము నిండా బాణములతో నింపాడు.

ఆ దెబ్బకు ఘటోత్కచుడు చచ్చాడు అనుకున్నారు అందరూ. కాని ఘటోత్కచుడు తేరుకొని కర్ణుని రథాశ్వములను చంపాడు. అతని విల్లు తునాతునకలు చేసాడు. ఇంతలో బకాసురుని తమ్ముడు అలాయుధుడు భీముని తో పూర్వ వైరము పురస్కరించుకొని తన రాక్షస బలముతో సుయోధనుని పక్షం వహించాడు. "ఓ సుయోధనా! ఈ భీముడు మా అన్న బకాసురుని చంపాడు. దానికి ప్రతీకారం తీర్చుకోవాలి. నాకు అనుమతి ఇవ్వండి." అని అడిగాడు.

సుయోధనుడు ఆలోచించాడు. ఒక పక్క ఘటోత్కచుడు కర్ణుని మీద పైచేయి గా ఉన్నాడు. ద్రోణుడు అశ్వత్థామ, కృపుడు, కర్ణ, ఘటోత్కచుల యుద్ధం ఆశ్చర్యంగా చూస్తున్నారు. వారు కర్ణుని మీద ఆశ వదులుకున్నారు. అలాయుధుని కి అనుజ్ఞ ఇవ్వడం మంచిది అనుకున్నాడు. అలాయుధుని తో సుయోధనుడు ఇలా అన్నాడు. "అలాయుధా! నీవు వెంటనే నీ శత్రువు భీముని కుమారుడు ఘటోత్కచుని మీద యుద్ధం చెయ్యి .అతనిని ఓడించు. తరువాత భీముని మీద, అతని అన్నదమ్ముల మీద ప్రతీకారం తీర్చుకో." అని అన్నాడు. ఆ మాటలు విని సంతోషించి అలాయుధుడు తన రాక్షస సైన్యముతో ఘటోత్కచుని మీదికి వెళ్లాడు.

ఘటోత్కచుడు అలాయుధుల మధ్య యుద్ధం మొదలయింది. ఇరువురు రాక్షస వీరులు, సమ ఉజ్జీలు. ఒకరికి ఒకరు తీసిపోకుండాయుద్ధం చేస్తున్నారు. కర్ణుడు అక్కడి నుండి తప్పుకొని భీముని తో యుద్ధం చేయడానికి ఆ పక్కకు వెళ్లాడు. కాని భీముడు, కర్ణుని దాటుకొని తన కుమారుడు ఘటోత్కచుని వంకకు వెళ్లాడు. అప్పుడు అలాయుధుని అనుచరులైన రాక్షసవీరులు ఒక్కుమ్మడిగా భీమసేనుని చుట్టుముట్టారు. వారినందరినీ భీమసేనుడు సునాయాసంగా చంపాడు. అలాయుధుడు

మాత్రం ఒంటరిగా యుద్ధం చేస్తున్నాడు.  అలాయుధుడు తన రాక్షస సేనలను పాంచాల సైన్యము పైకి యుద్ధమునకు ప్రేరేపించాడు. అది చూచాడు కృష్ణుడు. "అర్జునా! రాక్షసులకు రాత్రిపూట బలం ఎక్కువ. కాబట్టి వెంటనే సాత్యకిని నకుల సహదేవులను వారితో యుద్ధం చెయ్యడానికిపంపు.  కర్ణుని మీదికి శిఖండి, ధృష్టద్యుమ్నుని పంపు. నీవు ద్రోణునితో పోరాడు." అని పలికాడు.

ఆసమయంలో అలాయుధుడు భీముని విల్లు ముక్కలు గా విరిచాడు. భీముడు మరొక విల్లు తీసుకొనే లోపల అలాయుధుడు భీముని రథ సారథిని, హయములను  చంపాడు. భీముడు తన గదను తీసుకొని అలాయుధుని మీదికి దుమికాడు. అలాయుధుడు కూడా మరియొక గదను తీసుకొని భీముని ఎదుర్కొన్నాడు. వారిరువురి గదలు పొడి పొడి అయ్యాయి. ఇద్దరూ చేతికి దొరికిన రథములను, వాటి చక్రములను నొగలను ఒకరి మీద ఒకరు విసురుకుంటూయుద్ధం చేస్తున్నారు.  అక్కడే చచ్చిపడి ఉన్న ఏనుగుల దంతములను ఊడబెరికి వాటితో యుద్ధం చేస్తున్నారు.

భీముడు అలిసిపోయినట్టు గమనించిన కృష్ణుడు ఘటోత్కచుని తన వద్దకు పిలిచాడు. "కుమారా ఘటోత్కచా! నీ తండ్రి భీమసేనుడు అలాయుధునితో పోరి అలసిపోయాడు. ఇంక నీవు వెళ్లి అలాయుధుని ఎదుర్కో" అన్నాడు.  వెంటనే ఘటోత్కచుడు కర్ణుని వదిలి అలాయుధుని తో పోరుతున్నాడు.  అతనికి తోడు నకులుడు మొదలగు పాండవవీరులు రాక్షస సైన్యమును తరిమివేసారు.

కాని కర్ణుడు పాంచాల సైన్యముతో పోరుతున్నాడు.  ఇది చూచిన భీముడు కర్ణుని ఢీకొన్నాడు.

అలాయుధుడు ఘటోత్కచుని పై ఒక పరిఘను విసిరాడు.అది తగిలి ఘటోత్కచుడు మూర్ఛపోయాడు. కాని వెంటనే తేరుకున్నాడు. తన గదను తీసుకొని గిరా గిరా తిప్పి అలాయుధుని మీద విసిరాడు. ఆ గద పోయి అలాయుధుని సారధిని, అతని రధాశ్వములను, ధ్వజమును రధమును నుగ్గు నుగ్గు చేసాయి. వెంటనే అలాయుధుడు ఒక మేఘంగా మారిపోయాడు. ఆకాశంనుండి నెత్తుటి వాన కురిపించాడు. ఘటోత్కచుడు కూడా ఆకాశమునకు ఎగిరి అలాయుధుని మాయను తిప్పికొట్టాడు.

తరువాత ఇద్దరు రాక్షసవీరులు భూమి మీదికి దిగారు. చెట్లతో, రాళ్లతో యుద్ధం చేస్తున్నారు. అలాయుధుడు తన ఖడ్గము తీసుకొని ఘటోత్కచుని మీదికి దూకాడు. ఘటోత్కచుడుకూడా మరొక కత్తి తీసుకున్నాడు. ఇద్దరూ కత్తియుద్ధం చేస్తున్నారు. ఘటోత్కచుడు అలాయుధుని పట్టుకొని కింద పడవేసి అతని కంఠమును తెగ నరికాడు. సింహనాదం చేసాడు. పాండవ సైన్యములో ఆనందోత్సాహములు వెల్లువికాయి.భేరీ నినాదాలు మిన్నుముట్టాయి. ఘటోత్కచుడు అలాయుధుని తలను పట్టుకొని సుయోధనుని వైపు వెళ్లి, ఆ తలను సుయోధనుని రధము మీదికి విసిరేసాడు. అది చూచి సుయోధనుడు చింతాక్రాంతుడయ్యాడు.

ఘటోత్కచుడు అలాయుధుని సంహరిస్తున్నప్పుడు కర్ణుడు పాండవ సేనల మీద విరుచుకుపడుతున్నాడు. దొరికిన వాడిని దొరికినట్టు చంపు తున్నాడు. ఇది చూచి ఘటోత్కచుడు కర్ణుని ఎదుర్కొన్నాడు. కర్ణుడు ఘటోత్కచుని రధాశ్వములను చంపాడు. ఘటోత్కచుడు తన రధముతో సహా మాయం అయ్యాడు. ఇప్పుడు కౌరవ వీరులలో భయం పట్టుకుంది. ఘటోత్కచుడు ఎవరి ముందు ప్రత్యక్షం అవుతాడో, ఎవరి మీద పడతాడో, ఎవరిని చంపుతాడో అని హడలిపోతున్నారు. అటు ఇటు బెదురు చూపులు

చూస్తున్నారు.

ఉన్నట్టుండి ఘటోత్కచుడు ఒక నల్లని మేఘంగా మారిపోయాడు. ఆకాశంనుండి  బాణములు, కత్తులు, ముద్గరలు, పరిఘలు కురిపిస్తున్నాడు. అవి మీదపడి కౌరవ సైనికులు చస్తున్నారు.  ఆకాశంనుండి పెద్ద పెద్ద బండరాళ్లు పడుతుంటే కౌరవుల రథములు నుగ్గు నుగ్గు అవుతున్నాయి. ఏ పక్కనుండి ఏరాయి వస్తుందో అని హడలిపోతున్నారు.

కర్ణుడు మాత్రం ధైర్యంగా పోరాడుతున్నాడు. తన దివ్యాస్త్రములతో ఆ రాక్షసమాయలను విచ్ఛిన్నంచేస్తున్నాడు. అప్పటిదాకా రాళ్ల వాన కురిపిస్తున్న మేఘం విచ్ఛిన్నం అయింది. కర్ణుని ధైర్యసాహసములను కౌరవ వీరులు ప్రస్తుతించారు. మరలా వారందరూ కర్ణునితో ఇలా అన్నారు.

"కర్ణా! నీవు మహా వీరుడవు లేనిచో ఈ రాక్షస మాయను ఛేధించలేవు. కాని నిన్ను నీవు కాపాడుకోవాలి కదా! ఘటోత్కచుడు బతికి ఉన్నంతకాలం అది దుస్సాధ్యము. కాబట్టి నీవు అవశ్యం నీకు ఇంద్రుడు, నీ కవచ కుండలములు దానముగా పరిగ్రహించు సమయమున, నీకు  ప్రసాదించిన అమోఘమైన  శక్తిని అతని మీద ప్రయోగించి ఘటోత్కచుని సంహరించు. అయినా ఈ సమయంలో కాకుండా ఇంక ఏసమయంలో ఆ శక్తిని ప్రయోగిస్తావు? ఎవరి కోసం దానిని దాచి ఉంచుతావు?  ఎప్పుడో భీమార్జునులను చంపడానికి ఆ శక్తిని దాచి ఉంచడం వృధా. ఎందుకంటే ఇప్పుడు మనము ఈ ఘటోత్కచుని బారి నుండి ప్రాణాలతో బయటపడితే కదా, తరువాత భీమార్జునుల మాట.   కాబట్టి వెంటనే ఇంద్ర దత్తమైన శక్తిని ఘటోత్కచుని మీద ప్రయోగించు." అని  వత్తిడి చేసారు.

అదే సమయంలో ఘటోత్కచుడు కర్ణుని చంపుదామని అతని మీదికి ఉరుకుతున్నాడు.  ఘటోత్కచుడు తన గదతో కర్ణుని రధము విరగ్గొట్టాడు. సారధిని, అశ్వములను చంపాడు. కర్ణుడు రధం లేకుండా నిలబడి ఉన్నాడు. కర్ణుని చంపడానికి ఘటోత్కచుడు గదపైకి ఎత్తాడు. ఇంక తనకు ఘటోత్కచుని చేతిలో చావు తప్పదనుకున్నాడు కర్ణుడు. గత్యంతరము లేక ఇంద్రుడు తనకు ఇచ్చిన అమోఘమైన శక్తిని ఘటోత్కచుని మీద ప్రయోగించడానికి నిశ్చయించుకున్నాడు.

ఇంద్ర దత్తమైన ఆ శక్తి మహా భయంకరమైనది. అది ఒకరిని మాత్రం చంపి తిరిగి ఇంద్రుని వద్దకు చేరుతుంది. అందుకని దానిని అర్జునుని కోసం అట్టిపెట్టాడు కర్ణుడు. కాని ఇప్పుడు ఘటోత్కచుని మీద ప్రయోగించక తప్పని పరిస్థితి వచ్చింది.  వేరు మార్గాతరం లేక కర్ణుడు ఆ శక్తిని ఘటోత్కచుడు లక్ష్యంగా చేసి అతని  మీద ప్రయోగించాడు.

తన మీదికి దూసుకువస్తున్న ఆ శక్తిని చూచి ఘటోత్కచుడు భయపడిపోయాడు. ఆ శక్తి  ఘటోత్కచుని  మాయాశక్తులన్నింటిని హరించి వేసింది. తరువాత ఘటోత్కచుని గుండెలను చీల్చుకుంటూ అవతలి వైపుకు దూసుకుపోయింది.  ఆ శక్తి దెబ్బకు ఘటోత్కచుడు నేలమీద పడిపోయాడు. ఘటోత్కచుని ప్రాణవాయువులు అనంతవాయువులలో కలిసిపోయాయి. ఒక మహా వీరుడు అంతరించాడు.  కౌరవ సేనలు ఆనందంతో హర్షధ్వానాలు చేసాయి. కౌరవ వీరులు సింహనాదాలు చేసారు. సుయోధనుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. అందరూ కర్ణుని పరాక్రమమును పలువిధములుగా శ్లాఘించారు. సుయోధనుడు పరుగు పరుగున వచ్చి కర్ణుని గాఢంగా కౌగలించుకున్నాడు.

ఘటోత్కచుని మరణ వార్తవిని పాండవులు కన్నీరు మున్నీరుగా విలపించారు. భీమసేనుని దుఃఖమునకు అంతు లేదు. కాని కృష్ణుడు రథము మీద లేచి నిలబడి ఆనందంతో నాట్యం చేస్తున్నాడు. కేరింతలు కొడుతున్నాడు. సింహనాదం చేసాడు. ఆనందంతో పాంచజన్యం పూరించాడు. కృష్ణుని విపరీత ప్రవర్తన చూచి అర్జునుడు ఆశ్చర్యపోయాడు.

" కృష్ణా! ఆపు! ఏమిటిది మేమంతా ఘటోత్కచుని మరణానికి విలపిస్తుంటే నీవు ఆనందంతో గెంతులు వేస్తున్నావా! చాలు. ఇంక ఆపు. ఎవరన్నా చూస్తే నవ్వుతారు." అన్నాడు ఈసడింపుగా. కాని కృష్ణుడు తన ఆనంద హేల ఆపలేదు. అలా ఆడుతూ పాడుతున్నాడు. ఆనందంతో గెంతుతున్నాడు.

అంతలో తెలివి తెచ్చుకున్నాడు అర్జునుడు. కృష్ణుని చూచి "కృష్ణా! నీవు అన్ని తెలిసినవాడవు. మహానుభావుడవు. నీ ఈ వింత ప్రవర్తనకు ఏదో మహత్తరమైన కారణం ఉండే ఉంటుంది. అది నాకు చెప్పవా!" అని అను నయంగా అడిగాడు. అప్పుడు కృష్ణుడు అర్జునునితో ఇలా చెప్పసాగాడు.

"అర్జునా! నీ తండ్రి నీ క్షేమము గోరి కర్ణుని వద్దనుండి అతని సహజ కవచకుండలములను దానంగా పరిగ్రహించాడు. ఆ సమయంలో కర్ణునికి ఇంద్రుడు ఒక మహత్తర శక్తిని కానుకగా ఇచ్చాడు. అది ఒకసారి మాత్రమే ఒకరి మీద మాత్రమో ప్రయోగింపబడుతుంది. దానిని కర్ణుడు నిన్ను చంపడానికి మాత్రమే దాచాడు. అది నేడు ఘటోత్కచుని మీద ప్రయోగించాడు. కాబట్టి ఇంక కర్ణుడు నిన్ను ఏమీ చెయ్యలేడు. అందుకే నాకు మహా సంతోషంగా ఉంది.

అర్జునా! కర్ణుడు సామాన్యుడు కాడు. దైవాంశ సంభూతుడు. అతని వద్ద ఇంద్రుడు ఇచ్చిన శక్తి ఉన్నంతవరకూ, నీ గాండీవము గాని, నా సుదర్శనము గాని అతనిని ఏమీ చెయ్యలేదు. నీ తండ్రి కర్ణుని వద్దనుండి కవచ కుండలములు పరిగ్రహించని ఎడల అతనిని నీవేకాదు, ముల్లోకములలో ఎవరూ జయించలేరు. ఈ కవచకుండలములు దానం ఇవ్వడంతో అతను సామాన్య మానవుడయ్యాడు. కాని ఇప్పటిదాకా అతని వద్ద ఇంద్ర దత్తమైన శక్తి ఉంది. ఇప్పుడు అదీ పోయింది. కాబట్టి నీవు కర్ణుని సులభంగా గెలువ వచ్చును. మరి ఇది నాకు సంతోషం కాదా చెప్పు.

ఇంకా చెప్పనా! నేను జరా సంధుని, శిశుపాలుని, ఏకలవ్యుని నీ కోసం చంపించాను. వారందరూ బతికి ఉన్నట్టయితే ఈ సుయోధనుడు వారి నందరినీ తనకు సాయంగా తెచ్చుకొనేవాడు. వారితో కర్ణుడు కలిస్తే, వారందరినీ గెలవడం నీ తరం కాదు. ఇంక ఘటోత్కచుడు రాక్షస వంశ సంజాతుడు. ఎంత భీముని కుమారుడైనా అతను రాక్షసుడు. ధర్మద్వేషము, హరి ద్వేషము అతని నరనరాలలో జీర్ణించుకుపోయి ఉంది. అతడు బతికి ఉంటే ఎప్పుడో ఒకప్పుడు నా మీద తిరగబడతాడు. అప్పుడన్నా అతను నా చేతిలో చావక తప్పదు. ఆ పని కర్ణుడు పూర్తిచేసాడు.

అన్నింటికి మించి నీవు నాకు ఆప్తుడవు. నీ క్షేమమే నాకు ముఖ్యం. ఇప్పుడు నీకు కర్ణుని చేతిలో చావు లేదు. అదేనా సంతోషమునకు కారణము. మన సైన్యములు అన్ని అలసిపోయాయి. వారికి ఉత్సాహం కలిగించి, మరలా యుద్ధమునకు ఉపక్రమించు.” అని అన్నాడు కృష్ణుడు.” అని ధృతరాష్ట్రునితో సంజయుడు ఘటోత్కచుని మరణ వృత్తాంతమును ఎరింగించాడు.

ఇప్పుడు ధృతరాష్ట్రునికి ఒక అనుమానం వచ్చింది. “సంజయా! మరి అంత ప్రభావము కలిగిన శక్తిని తన వద్ద పెట్టుకొని ఇన్నాళ్లు కర్ణుడు అర్జునుని చంపకుండా ఎందుకు ఊరుకొన్నాడు. పైగా ఆ శక్తి ఒకరిని మాత్రమే చంపుతుంది అని తెలుసుకదా. మరి ఆ శక్తి ఉన్న సంగతి కర్ణునిని జ్ఞాపకం లేదా! ఉంటే ఇన్నాళ్లు అర్జునుని ఎందుకు చంపలేదు. ముందే అర్జునుని చంపితే ఈ యుద్ధం, ఇంత జననష్టం లేకపోను కదా. పాండవులు ఎప్పుడో యుద్ధం విరమించి ఉండేవారు కదా! మనకు సులభంగా విజయలక్ష్మి వరించి ఉండేది కదా! యుద్ధానికి పిలిస్తే అర్జునుడు కర్ణునితో యుధ్ధానికి రాకుండా ఉంటాడా చెప్పు. అప్పుడు ఈ శక్తితో సులభంగా కర్ణుడు అర్జునుని సంహరించి ఉండవచ్చుకదా! కర్ణుడా ఆవిధంగా చెయ్యకుండా ఇంత తెలివి తక్కువగా ఎందుకు ప్రవర్తించాడు. పోనీ కర్ణునికి ఆ శక్తిని గురించి నా కుమారుడు సుయోధనుడు గుర్తుచెయ్యలేదా. నీవు కూడా అక్కడే ఉన్నావు కదా! నీవన్నా కర్ణునికి ఆ శక్తి గురించి గుర్తు చెయ్యవచ్చుకదా! చేతిలో తియ్యని మామిడి పండు పెట్టుకొని తినకుండా ఉన్నట్టు అయింది కదా! అది అనవసరంగా ఘటోత్కచుని చంపడానికి ఉపయోగించాడు. సంజయా! దీనికంతటికీ వేరుకారణం ఏమైనా ఉందా!” అని ఆతురతగా అడిగాడు ధృ తరాష్ట్రుడు. ఆ మాటలకు సంజయుడు ఇలా అన్నాడు.

“ అదేమిటి మహారాజా! మేము ఎందుకు గుర్తుచెయ్యకుండా ఉంటాము. నేను, నీ కుమారులు సుయోధనుడు, దుశ్శాసనుడు ప్రతి రోజూ రాత్రి .... మరునాడు నీవు శక్తి ఆయుధము ఉపయోగించి అర్జునుని చంపాలి .......అని చెపుతూనే ఉన్నాము కర్ణుడు కూడా....... సరే అలాగే చంపుతాను......... అని అనేవాడు. కాని మరునాడు యుద్ధ భూమిలో ప్రవేశించగానే ఆ విషయం ఎవరికీ గుర్తు ఉండేదికాదు. మరలా రాత్రి సమయంలో మాత్రమే గుర్తుకు వచ్చేది. మరి ఇది దైవ మాయ కాక

మరేముంటుంది చెప్పు.

ఇదే కాదు మహారాజా! సుయోధనుడు ఇంకా ఇలా కూడా అన్నాడు. "కర్ణా! నీవు కేవలం అర్జునుని చంపితే ఆ కృష్ణుడు మనలనందరినీ చంపి మరొక పాండుకుమారునికి పట్టం కడతాడు. కాబట్టి మనం ఆ శక్తి తో కృష్ణ ని చంపితే మనము ఈ ధరాతలమును ఏకఛత్రాధి పత్యముగా పరిపాలించవచ్చు." అని కూడా చెప్పాడు. ......అలాగే కృష్ణుని చంపుతాను...... అనేవాడు కర్ణుడు . కాని మరునాడు అన్ని మరిచిపోయేవాడు. ఇది ఏమి చిత్రమో! ......

మహారాజా! మరియొక విశేషము. ఘటోత్కచుడు మరణించినపుడు కృష్ణుడు రధం మీద నృత్యం చేసాడని చెప్పానా ఆ విషయం ఏమిటో కనుక్కుందామని నేను పాండవ శిబిరమునకు వెళ్లాను. ఎవరికీ కనపడకుండా పొంచి ఉండి వారి మాటలు విన్నాను. కృష్ణుడు ఆ ప్రకారము నృత్యము చేయుటకు కారణమేమని అర్జునుడు అడిగినప్పుడు కృష్ణుడు సమాధానం చెపుతుండగా, అక్కడే ఉన్న సాత్యకి తన అన్నయ్య కృష్ణ ని చూచి "అన్నయ్యా మరి ఇంతకాలము కర్ణుడు అంత శక్తివంతమైన ఇంద్ర శక్తిని ఎందుకు అర్జునుని మీద ప్రయోగించలేదు." అని అడిగాడు. అప్పుడు కృష్ణుడు ఈ ప్రకారము బదులు చెప్పాడు "సాత్యకీ! కర్ణుడికి ప్రతి రోజూ సుయోధ నాదులు ఆ శక్తిని అర్జునుని మీద ప్రయోగించమని చెపుతూనే ఉండేవారు. కర్ణుడు కూడా అలాగే అంటూ ఉండేవాడు. కాని యుద్ధరంగమున ప్రవేశించగానే నేను అతనిని నా మాయలో పడవేసి అతనికి ఆవిషయం గుర్తుకు రాకుండా చేసేవాడిని. అందువల్ల కర్ణుడు ఆ శక్తిని ఇప్పటిదాకా అర్జునుని మీద ప్రయోగించలేకపోయాడు. సాత్యకీ! నీ కన్నా, ధృష్టద్యుమ్నుని కన్నా, మిగిలిన పాండవుల కన్నా నాకు అర్జునుడు అంటేనే ఎక్కువ ప్రేమ. అర్జునుడు నా

ప్రాణం. ఇంతకాలం కర్ణుని వద్ద ఉన్న శక్తి వలన అర్జునునికి ప్రమాదం పొంచి ఉన్నదని శంకించాను. ఇన్ని రోజులు నిద్రలేని రాత్రులు గడిపాను. ఈ రోజుతో ఆ శంక తీరిపోయింది. హాయిగా సుఖంగా నిద్రపోతాను.'' అని అన్నాడు కృష్ణుడు.'' అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

'' సంజయా! దురదృష్టం సుయోధనుని వెన్నంటి ఉన్నప్పుడు మనం మాత్రం ఏం చెయ్యగలము చెప్పు. ఘటోత్కచుని మరణం తరువాత పరిణామాలు వివరించు.'' అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

ఘటోత్కచుని మరణ వార్త విని ధర్మరాజు దుఃఖంతో రథం మీద కూలబడ్డాడు. రోదిస్తున్నాడు. కృష్ణుడు ధర్మరాజు దగ్గరకుపోయి ''ధర్మనందనా! ఏమిటీ వెర్రి! యుద్ధంలో వీరులు మరణించకుండా ఉంటారా! దానికి ఇంత చింతించవలెనా! నీవే ఇలా అధైర్య పడితే నీ సైన్యము ను ఎవరు ఓదారుస్తారు. లే. యుద్ధమునకు సన్నద్ధము గా!'' అని పలికాడు.

''కృష్ణా! నీకు తెలియదా చెప్పు! మాకు ఘటోత్కచుడు ఎంత సాయం చేసాడో. అరణ్యవాస సమయమున మాకు తోడుగా ఉన్నాడు. నేనంటే ఘటోత్కచునికి ఎంతో గౌరవము. నేను కూడా ఘటోత్కచుని సహదేవుని కంటే ఎక్కువగా ప్రేమిస్తాను. అలాంటి ఘటోత్కచుడు ఇంక లేడు అంటే శోకం ఉండదా!'' అని అన్నాడు.

అంతలోనే ధర్మరాజు ఉగ్రుడయ్యాడు. ''కృష్ణా! దీనికంతటికినీ కారణం ఆ కర్ణుడు. నాడు అభిమన్యుని విల్లు ఖండించి అతని మరణమునకు కారణం అయ్యాడు. నేడు ఘటోత్కచుని తానే సంహరించాడు. కర్ణుని మీద ప్రతీకారం తీర్చుకోవాలి. అసలు ఆ కర్ణునికి సాయం చేసిన వాడు ద్రోణుడు. భీముడు

ద్రోణుని పని పడతాడు. నేను కర్ణుని చంపుతాను." అంటూ తన రథమును కర్ణుని వైపు వేగంగా తోలాడు.

అది చూచి కృష్ణుడు కలవరపడ్డాడు. "అర్జునా! అటు చూడు! మీ అన్నయ్య కర్ణుని మీదికి యుద్ధమునకుపోతున్నాడు. అతనిని అనుసరించు" అంటూ రథమును ధర్మరాజు వెళ్లిన వైపు పోనిచ్చాడు.

ఈ ప్రకారంగా వేగంగా పోతున్న ధర్మరాజు వద్దకు వ్యాసమహర్షి వచ్చాడు. ధర్మరాజు వ్యాసునికి నమస్కరించాడు.

"ధర్మనందనా! కర్ణుడు అర్జునుని చంపుట కొరకే ఇంద్రుడు తనకు ఇచ్చిన శక్తిని దాచి ఉంచాడు. ఇప్పుడు అది ఘటోత్కచుని మీద ప్రయోగింప బడింది. ఒక వేళ ఆ శక్తిని కర్ణుడు అర్జునుని మీద ప్రయోగించి ఉంటే నీ దుఃఖం ఎంతటి దారుణంగా ఉండేదో ఆలోచించు. ఇప్పుడు నువ్వు కొలది పాటి దుఃఖముతోనే బయట పడ్డావు. ఇది కూడా నీ మంచికే జరిగింది. కాబట్టి అకారణంగా కోపం తెచ్చుకోకుండా వివేకంతో ఆలోచించు. నీ వారినందరినీ కలుపుకొని కౌరవులతో యుద్ధం కొనసాగించు. ఒక్క విషయం చెపుతాను. నేటికి ఐదవ రోజున కౌరవ రాజ్యలక్ష్మి నిన్ను వరిస్తుంది. సందేహం లేదు." అని పలికి వ్యాసుడు వెళ్లిపోయాడు.

వ్యాసుడు వెళ్లిన మీదట ధర్మరాజు తన మనసును కుదుట పరచుకున్నాడు. ధృష్టద్యుమ్నుని పిలిచాడు. "భీముడు ద్రోణునితో యుద్ధం చేస్తున్నాడు. ఇంక మీదట నువ్వు ద్రోణునితో యుద్ధం చెయ్యి. నీవు ద్రోణుని చంపడం కొరకేపుట్టావు కదా! పాంచాల సేనలను, శిఖండిని మొదలగు వారిని వెంటతీసుకొని పోయి ద్రోణుని ఎదిరించు." అని చెప్పాడు.

మిగిలిన వీరులను చూచి "ఓ విరాటా రాజా! ద్రుపద మహారాజా! సాత్యకీ! నకుల సహదేవులారా! ఉపపాండవులారా! మన ముందున్న ఏకైక లక్ష్యం ద్రోణ వధ. మీ కందరకూ పార్థుడు నాయకత్వం వహిస్తాడు." అని చెప్పాడు.

అప్పటికే ఇరుపక్షముల సైన్యములు బాగా అలసిపోయాయి. ఒకపగలు ఒక రాత్రి యుద్ధం చేసారు. నిద్రలేకుండా యుద్ధం చేయడంతో అందరూ నిద్రమత్తులో ఉన్నారు. వారికి ఒక్కొక్క క్షణం ఒక యుగంగా ఉంది. నిద్ర ముంచుకొస్తూ ఉంది. తూలిపోతున్నారు. ఇదంతా గమనించాడు అర్జునుడు ఇరుపక్షముల సైనికులను ఉద్దేశించి ఇలా అన్నాడు. "సైనికులారా! మీరందరూ బాగా అలసిపోయారు. పైగా మీకు బాగా నిద్రవస్తూ ఉంది. కాబట్టి మీరంతా కాసేపు హాయిగా నిద్రపొండి. మరొక జాములో చంద్రోదయం అవుతుంది. చంద్రుడు వచ్చిన తరువాత ఆ వెన్నెల వెలుగులో మరలా మనం యుద్ధం చేద్దాము. అప్పటిదాకా విశ్రాంతి తీసుకోండి." అని అన్నాడు.

ఈ సూచనకు ఇరుపక్షముల వీరులు అంగీకరించారు. అర్జునుని దయా గుణానికి కౌరవ సైనికులు కూడా అతనిని శ్లాఘించారు. ఎక్కడి వారక్కడ నిద్రకు ఉపక్రమించారు. ఆ ప్రకారము వారు చంద్రోదయం దాకా నిద్రించారు. ఇంతలో చంద్రుడు వచ్చాడు. పండు వెన్నెల కాచింది. పాండవ సైన్యములు కౌరవ సేనలు నిద్రనుండి మేల్కొన్నాయి. యుద్ధానికి సన్నద్ధం అవుతున్నాయి.

సుయోధనుడు ద్రోణాచార్యుని వద్దకుపోయి నిష్ఠురంగా ఇలా అన్నాడు. "ఆచార్యా! నీవు చాలా గొప్పవాడవు. మహా వీరుడవు. ఎవరూ నీ ముందు నిలువలేరు. కాని నీ శిష్యులైన పాండవులను చంపకుండా ఉపేక్షిస్తున్నావు.

నేను ఏమి అనగలను? అది నా దురదృష్టం." అని అన్నాడు.

ఆ మాటలకు ద్రోణునికి కోపం వచ్చింది. "సుయోధనా! అంటే నేను పాండవులను కేవలం నా శిష్యులు అని వదలి వేస్తున్నానా!

నాడు ఖాండవ వన దహన సమయంలో అర్జునుడు అగ్నిదేవునికి సాయంగా ఉన్నప్పుడు, ఇంద్రుడు అతనిని నా శిష్యుడు అని వదిలేసాడా?

నాడు ఘోష యాత్రాసమయమున చిత్రసేనుడను గంధర్వుడు నిన్ను బందీగా పట్టుకున్నప్పుడు, అర్జునుని ఆ చిత్ర సేనుడు నా శిష్యుడు అనే మిషమీద వదిలేసి పారిపోయాడా?

కాలకేయుల మొదలగు రాక్షసులు కూడా అర్జునుడు నా శిష్యుడు అని అతని చేతిలో చచ్చారా?

అర్జునుని పరాక్రమం తెలిసికూడా నీవు ఇలా మాట్లాడటం భావ్యంకాదు!" అని గట్టిగా అన్నాడు ద్రోణుడు.

"ఆచార్యా! మీరు ఇంతవరకూ అర్జునుని అవకాశం వచ్చినప్పుడల్లా పొగుడుతూనే ఉన్నారు. పోనీలెండి అలా పొగుడుతూనే ఉండండి. అర్జునుని, పాండవులను నాకు వదిలిపెట్టండి. నేను, కర్ణుడు,దుశ్శాసనుడు,శకుని కలిసి వారిని అంతమొందిస్తాము. మీరు మీకు ఇష్టం అయిన వారితోనే యుద్ధం చేయండి." అని పలికాడు.

ఆ మాటలకు ద్రోణుడు నవ్వి "అలాగే సుయోధనా! మీరంతా వెళ్లి

అర్జునుని ఎదుర్కోండి. ఏమో! మీరే అర్జునుని గెలుస్తారేమో! నాకు మాత్రం అర్జునుని చేతిలో మరణిస్తాను అన్న భయం తప్పించావు. నాకు అదే చాలు." అని అన్నాడు.

తరువాత ద్రోణుడు పాంచాల సైన్యము మీదికి యుద్ధం చెయ్యడానికి వెళ్లాడు. అప్పటికి తెల్లవారు జాము అయింది. సుయోధనుడు, కర్ణుడు, దుశ్శాసనుడు, శకుని ఒక్కుమ్మడిగా అర్జునుని ఎదుర్కొని అతని మీద శరవర్షము కురిపిస్తున్నారు. మహావీరుడైన ద్రోణుడు అతిరథమహారథులతో యుద్ధం చెయ్యకుండా తమలాంటి సామాన్య సైనికులతో యుద్ధం చెయ్యడం చూచి పాంచాల సైనికులు ఆశ్చర్యపోతున్నారు. కొంతమంది అంతటి మహావీరునితో యుద్ధం చేసి చావడమే మేలని ద్రోణుని ఎదుర్కొంటున్నారు.

ఇంతలో విరాటరాజు, ద్రుపదుడు, అతని మనుమలు, కేకయ రాజులు తమ తమ సేనలతో ద్రోణుని ఎదుర్కొన్నారు. ద్రోణుడు తన వాడియైన బాణములతో పాంచాల, మత్స్యసేనలను హతమారుస్తున్నాడు, ద్రుపదుడి ముగ్గురు మనుమలను తన బాణములకు ఆహుతి చేసాడు. కేకయ రాజుల తలలను చెట్టునుండి పండ్లు రాల గొట్టినట్టు నేలమీద పడగొట్టాడు. ఇది చూచిన విరాటుడు ద్రుపదుడు వీరావేశంతో ద్రోణుని ఎదుర్కొన్నారు. ద్రోణుడు కూడా అమిత మైన పరాక్రమంతో వారిద్దరినీ చెరి ఒక బాణంతో నేలగూల్చాడు. ఆ ప్రకారం పాంచాల దేశాధీశుడు ద్రుపద మహారాజు, మత్స్యదేశాధీశుడు విరాటరాజు ద్రోణుని చేతిలో మరణించారు.

తన తండ్రి మరణమును కళ్లారా చూచాడు ధృష్టద్యుమ్నుడు. "నేను కనుక ద్రోణుని సంహరించకపోతే నా కులాచారధర్మములకు తప్పిన వాడనవుతాను." అని ఘోర ప్రతిజ్ఞ చేసాడు. వెంటనే పాంచాల సైన్యమును

తీసుకొని ద్రోణుని మీదికి వెళ్లాడు. ఇది చూచి సుయోధనుడు, కర్ణుని తో సహా ధృష్టద్యుమ్నునికి అడ్డు తగిలాడు. వారికి భీముడు అడ్డు తగిలి ధృష్ట ద్యుమ్నుని తన వెంట రమ్మని చెప్పి ద్రోణుని మీదికి ఉరికాడు.

అప్పటికి సూర్యోదయం అయింది. ఇరుపక్షముల వారు కొంత సేపు యుద్ధ ము ఆపి కాలకృత్యములు తీర్చుకొని, మరలా యుద్ధము చేయడానికి ఉపక్రమించారు. సుయోధనుడు నకులుడిని, దుశ్శాసనుడు సహదేవుని, ద్రోణుడు అర్జునుని, భీముడు కర్ణుని, ఎదుర్కొని పోరాడుతున్నారు. సహదేవుని సారథిని దుశ్శాసనుడు చంపాడు. దుశ్శాసనుడు తానే రథము తోలుకుంటూ యుద్ధ ము చేస్తున్నాడు. సహదేవుడు హయములను గాయపరిచాడు. ఆ దెబ్బకు దుశ్శాసనుని రథమునకు కట్టిన హయములు రథమును ఎటోలాక్కుని వెళ్లాయి.

భీముడు కర్ణుడు మొదట పదునైన బాణములతోయుద్ధం చేసారు. తరువాత గదాయుద్ధం చేసారు. మరలా కర్ణుడు తన విల్లు తీసుకొని భయంకరమైన బాణములతో భీముని రథమును విరగొట్టాడు. భీముడు సహదేవుని రథము మీదకు దూకాడు. ద్రోణుడు, అర్జునుడు ఒకరి మీద ఒకరు దివ్యాస్త్రములను ప్రయోగించుకుంటున్నారు. ఒకరు అస్త్రము ప్రయోగిస్తే మరొకరు దానికి ప్రత్యస్త్రము ప్రయోగిస్తున్నారు. ఎవరు ఎప్పుడు ఏ అస్త్రము ప్రయోగిస్తారో తెలియక చూచేవారు ఆశ్చర్యపోతున్నారు. ఈ ప్రకారము గురువు, శిష్యుడు ఘోరంగా యుద్ధం చేస్తున్నారు.

ఆకాశమునుండి వీరి యుద్ధమును చూస్తున్న దేవతలకు ద్రోణుడు, అర్జునుడు, పరమశివుడు వినోదార్థము తానే రెండు గా విడిపోయి, రెండు రూపములు ధరించి, ఒక రూపముతో మరొకరూపము యుద్ధం చేస్తూ

ఉందా,   అని భ్రమ కలిగించేట్టు ఉంది.

( ఇది ఒక అధ్భుతమైన ప్రయోగము. ద్రోణుడు,  అర్జునుడు ఎవరికి వారే సాటి అని చెప్పడానికి తిక్కనగారు,  ఈ విధమైన ప్రయోగం చేసారు.).

ఇంక ఇది పని కాదని ద్రోణుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడానికి సంకల్పించాడు. నియమ నిష్ఠలతో మంత్రం జపించాడు. బ్రహ్మాస్త్రాన్ని ఎక్కుపెట్టాడు. ఆ సమయంలో దిక్కులు కంపించాయి. సముద్రాలు పొంగాయి. దేవతలు భయంతో వణికిపోయారు. ఇది ఏదీ లెక్కచెయ్యకుండా ద్రోణుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అర్జునుడు ఏమీ భయపడలేదు. దానికి ప్రతిగా తానుకూడా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి, ద్రోణుడు ప్రయోగించిన ( బహ్మాస్త్రాన్ని నివారించాడు. రెండు బ్రహ్మాస్త్రాలు ఒక దానితో ఒకటి ఢీకొని నిర్వీర్యం అయిపోయాయి.

ఇంక ఒకరితో ఒకరు యుద్ధం చేసి ప్రయోజనం లేదని ద్రోణుడు పాంచాల సేనల వైపు, అర్జునుడు కౌరవ సేనల వైపు వెళ్లారు.  అప్పుడు దుశ్శాసనుడు ధృష్టద్యుమ్మునితో పోరాడుతున్నాడు కాని ధృష్టద్యుమ్నుని అస్త్ర ధాటికి తట్టుకోలేక దుశ్శాసనుడు పారిపోయాడు.

నకుల సహదేవులు వెంటరాగా ధృష్టద్యుమ్నుడు ద్రోణుడి వైపువెళ్లాడు. మరొక పక్క సుయోధనుడు సాత్యకి ఒకరికి ఒకరు ఎదురు పడ్డారు.

సుయోధనుడు సాత్యకి చిన్ననాటి స్నేహితులు. కాసేపు ఇద్దరూ తమ మధ్య ఉన్న శత్రుత్వం మరిచిపోయారు. రధాలు పక్కపక్కన నిలిపి కుశల ప్రశ్నలు వేసుకున్నారు. చిన్ననాటి కబుర్లు  చేసిన చిలిపిపనులు చెప్పుకున్నారు.

కాసేపు బాల్యం గుర్తుతెచ్చుకొని పొంగిపోయారు. రాజధర్మం ప్రకారం ఈ నాడు ఒకరితో ఒకరు యుద్ధం చెయ్యవలసి వచ్చింది కదా అని బాధపడ్డారు. కాని తప్పదు కదా కాసేపు యుద్ధం చేద్దాము అనుకొని యుద్ధం చెయ్యడం మొదలెట్టారు. మిత్రత్వం మరిచిపోయి శత్రువుల మాదిరియుద్ధం చేసారు. సాత్యకి సుయోధనుని విల్లు విరగ్గొట్టాడు. అతని శరీరం అంతా తూట్లు పడేట్టు కొట్టాడు. సుయోధనుడు అలసిపోయి యుద్ధ రంగం నుండి తొలగిపోయాడు. కాసేపు విశ్రాంతి తీసుకొని మరలా వచ్చి ఎప్పటి మాదిరే సాత్యకితో యుద్ధం చేస్తున్నాడు.

సుయోధనుడి కి సాయంగా కర్ణుడు సాత్యకితో యుద్ధం చేస్తున్నాడు. అది చూచి భీముడు కర్ణుని తో పోరుతున్నాడు. కర్ణుడు భీముని సారధిని మూర్ఛపోయేట్టు కొట్టాడు. భీముని విల్లు విరిచాడు. భీముడు తన గదను తీసుకున్నాడు. తన గదను గిరా గిరా తిప్పి కర్ణుని రథం మీదికి విసిరాడు. ఆ గద పోయి కర్ణుని సారధి తల పగులకొట్టింది. కర్ణుని రథాన్ని ముక్కలు చేసింది. అయినా కర్ణుడు మరొక రథం ఎక్కి యుద్ధం చేస్తున్నాడు.

ధర్మరాజు మత్స్య, పాంచాల సేనలు వెంటరాగా ద్రోణుని మీదికి యుద్ధాని సన్నద్ధం అయ్యాడు. అప్పటికి రెండు జాముల పొద్దు ఎక్కింది. నకుల సహదేవులు, భీముడు అర్జునుని చూచి ఇలా అరిచారు.

"అర్జునా! ఇక్కడ ద్రోణుడు మన సేనలను అంతమొందిస్తున్నాడు. నీవు అతనికి సాయంగా ఉన్న కౌరవ సేనలను పారద్రోలుము. అప్పుడు ద్రోణుడు ఒంటరిగా మాకు చిక్కుతాడు. పాంచాల సేన అతనిని అంతమొం దిస్తుంది." అరుస్తూ ద్రోణుని మీదికి దూకారు. కాని ద్రోణుడు తనకు అడ్డం వచ్చిన వారిని హతమారుస్తున్నాడు. అలా ముందుకు దూసుకు పోతున్నాడు.

ద్రోణుడు వేలాది సైనికులను హతమారుస్తున్నాడు. నకుల సహదేవులు, ధర్మరాజు, భీముడు నిస్సహాయంగా చూస్తున్నారు. తమలో తాము ఇలా అనుకున్నారు. "ఈ ద్రోణుడు ఈ రోజు చెలరేగి పోతున్నాడు. ఇలాగే వదిలేస్తే ఈరోజుతో పాండవ సైన్యం మొత్తం సర్వనాశనం అయేట్టుంది. ఆఖరుకు మనలను కూడా చంపి, రారాజుకు విజయం చేకూర్చేట్టు ఉన్నాడు. ఇతనిని నిలువరించడం ఎవరి తరమూ కాదు. అర్జునుడు మాత్రం గురువును చంపడం మహాపాపమని ఉపేక్షిస్తున్నాడు."

వీరందరూ మధనపడటం చూచాడు కృష్ణుడు. తమ రధాన్ని వారు ఉన్న వైపుకు మళ్లించాడు. ధర్మరాజు మొదలగు వారు వినేట్టు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! ద్రోణుడు చేతిలో ధనుస్సు ఉన్నంత వరకూ అతనిని దేవదానవులు కాని మానవ మాత్రులుగాని ఆపలేరు. ద్రోణుడు అస్త్రసన్యాసం చెయ్యాలంటే ఒకే ఒక మార్గం ఉంది. "అశ్వత్థా మ చనిపోయాడు" అని ఒక మాట చెబితే చాలు ద్రోణుడు అస్త్రసన్యాసం చేస్తాడు. అప్పుడు మీరు అతనిని సులభంగా చంపవచ్చు. ఇంతకంటే మరొక మార్గం లేదు. కాబట్టి అశ్వత్థా మ చచ్చాడు అని ఎవరో ఒకరు అతనితో చెప్పాలి." అని చెప్పాడు.

ఇది విన్న భీముడు వెంటనే పరుగెత్తాడు. మాళవ రాజు ఏనుగు పేరు అశ్వత్థామ. వెంటనే దానిని చంపాడు. మరలా వెనక్కు వచ్చి ద్రోణుని దగ్గరగా పోయి "ఆచార్యా! అశ్వత్థా మ మరణించాడు" అని చెప్పాడు భీముడు. ద్రోణాచార్యుని మనస్సు ఒక్కసారిగా జల్లుమంది. కాని తన కుమారుని బలపరాక్రమములు మనసు లో తలంచుకున్నాడు. భీముని మాటలు లెక్కచెయ్యలేదు. కాని మనసులో ఏదో అనుమానం వేధిస్తూనే ఉంది. బయటకు మాత్రం ఏమీ లేనట్టు ధృష్టద్యుమ్నుని మీద శరవర్షము కురిపించాడు. తనకు అడ్డం వచ్చిన పాంచాల సైనికులను పదివేలమందిని

నిర్దాక్షిణ్యంగా వధించాడు.. మత్స్యరాజు బలములో 500 రథములను విరగ్గొట్టాడు. 10,000 ఏనుగులను, అన్ని హయములను చంపాడు. మధ్యందిన మార్తాడుడి మాదిరి వెలిగిపోతున్నడు.

ఇంతలో విశ్వామిత్రుడు, జమదగ్ని,భరద్వాజుడు,గౌతముడు, కశ్యపుడు,వశిష్టుడు, ఇంకా ఇతర మునులు తమ తమ దివ్యరూపములతో ద్రోణుని వద్దకు వచ్చారు. "ఓ భారద్వాజా! నీవు బ్రహ్మ వంశ సంజాతుడవు. వేదవేదాంగ విదుడవు. ఈ ప్రకారం క్షాత్రధర్మము ననుసరించి యుద్ధం చెయ్యడం నీకు ధర్మమా? ఇప్పటి దాకా చేసిన యుద్ధము చాలు. నీకు కాలం పూర్ణంగా తీరిపోయింది. ఇంక ఈ యుద్ధము చెయ్యడం మాను. మా మాటలు మన్నించి ఆయుధములు వదిలిపెట్టు. శాంతి అవలంబించు." అని పలికి వెళ్లిపోయారు.

అప్పుడు ఒక్కసారిగా అశ్వత్థామ మరణించాడు అని భీమసేనుడు చెప్పిన మాటలు మరలా గుర్తుకు వచ్చాయి. ఎదురుగా ధృష్టద్యుమ్నుడు అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. ద్రోణునికి మనసంతా వికలమయింది. దుఃఖం ముంచుకొచ్చింది. అయినా తన మనసులో ఉన్న అనుమానం తీర్చుకోడానికి తన కుమారుడు అశ్వత్థామ బ్రతికి ఉన్నాడా లేక చనిపోయాడా అని ధర్మరాజును అడిగాడు.

ధర్మరాజు అబద్ధం ఆడడని ద్రోణునికి నమ్మకం. అప్పుడు కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధర్మజా! మనం ఇలాగే ద్రోణుని వదిలి వేస్తే ఈ రోజుసాయంత్రానికి పాండవ సేన మొత్తం సర్వనాశనం అవుతుంది. మా అందరినీ ఈ ద్రోణుని అస్త్ర శస్త్ర ధాటికి బలిచేయకుండా కాపాడవలసిన బాధ్యత నీమీద ఉన్నది. ప్రాణాలను కాపాడుకోవడానికి అసత్యం ఆడినా

ధర్మమే అని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. కాబట్టి అశ్వత్థామ మరణించాడు అని ద్రోణుని తో చెప్పు." అని అన్నాడు.

ఆ మాటలు విన్న భీముడు "అన్నయ్యా! నీవు అబద్ధం చెప్పనిలేదు. ఇందాక నేను మీ మాటలు వినగానే పోయి మాళవరాజు గజము అశ్వత్థా మ అను పేరుగల దానిని సంహరించాను. వెంటనే నేను పోయి అశ్వత్థామ మరణించాడు అని ద్రోణునితో చెప్పాను. కాని ద్రోణుడు నా మాటను నమ్మలేదు. ఇప్పుడు నువ్వు కూడా అదే మాట చెప్పు. మన హితము కోరి చెప్పిన కృష్ణుని మాట మన్నించు. నీ మాటలు నమ్మి ద్రోణుడు యుద్ధం చెయ్యడం మాని వేస్తాడు." అని అన్నాడు.

కృష్ణుడు, భీముడు చెప్పిన మాటలు ధర్మరాజు మనసులో బాగా పనిచేసాయి. అనృతం చెప్పడం అన్న భయం కన్నా రాజ్యకాంక్ష అతనిలో బలీయంగా ఉంది. అబద్ధం చెప్పడం అన్న భయాన్ని అణగతొక్కింది. వెంటనే ధర్మరాజు ద్రోణుని రథం వద్దకు పోయి బిగ్గరగా "ఆచార్యా! అశ్వత్థామ మరణించాడు." అని అరిచాడు. "కాని అది ఒక ఏనుగు" అని మెల్లగా అన్నాడు.

అశ్వత్థా మ మరణించాడు అని ధర్మరాజు నోటవిన్న తరువాత మిగిలిన మాటలు ద్రోణునికి వినిపించలేదు. అలాగే రథం మీద కూలిపోయాడు. ద్రోణునిలో పరివర్తన మొదలయింది. తాను పాండవుల పట్ల పాపం చేసానని కుమిలిపోయాడు. ఋషులు చెప్పిన మాటలు చెవుల్లో మారుమోగుతున్నాయి. తాను ఎంతోమంది అమాయకులైన సైనికులను నిర్దాక్షిణ్యంగా చంపాడు. తనపాపానికి నిష్కృతి లేదు. ఇలా తలపోస్తూ తన తల పైకి ఎత్తాడు. ఎదురుగా ధృష్టద్యుమ్నుడు అవకాశం కోసం పొంచి ఉన్నాడు. అతనితో

యుద్ధం చేయాలని ఉన్నా చేతులు రావడం లేదు. ధనుర్బాణాలు చేతులనుండి జారిపోయాయి. అతనిలో ఉన్న శౌర్యము, గర్వము,  యుద్ధ నిష్ట, అన్ని నశించాయి. తన కుమారుడు మరణించాడు అన్న దుఃఖము అతనిని కుంగదీసింది.  అతని అవయవాలన్ని ముడుచుకుపోయాయి.  అలాగే రథం మీద కూర్చుండిపోయాడు.

ద్రోణ వధ కోసం అగ్నిలో నుండి పుట్టినవాడు ధృష్టద్యుమ్నుడు. అతని మనసులో ద్రోణుని వధించాలి అన్న కోరిక బలీయంగా ఉంది. ద్రోణుని మీద యుద్ధమునకు దిగాడు.  ద్రోణుని మీద బాణములను వర్షం గా కురిపించాడు. ద్రోణుడు యుద్ధం చేయాలని ఉన్న చెయ్యలేకపోతున్నాడు. దివ్యాస్త్రములు స్ఫురణకు రావడం లేదు. తన వద్ద ఉన్న మామూలు బాణములతో ధృష్ట ద్యుమ్నుడు వేసిన బాణములను ఖండిస్తున్నాడు. ధృష్టద్యుమ్నుని ధ్వజమును, రధమును విరగ్గొట్టాడు.  రథ సారధిని, అశ్వములను చంపాడు. ధృష్ట ద్యుమ్నుడు  వెంటనే రథము నుండి కిందికి దూకి గద చేతిలోకి తీసు కున్నాడు. ద్రోణుడు ఆ గదను తనబాణములతో ఖండించాడు. ద్రోణుడు కేవలం స్వీయరక్షణ చేసుకుంటున్నాడు.

ధృష్టద్యుమ్నుడు వెంటనే ఒక కత్తిని, డాలును తీసుకొని ద్రోణుని రథము మీదికి ఉరికాడు. ద్రోణుని రథసారధిని, హయములను చంపాడు. ద్రోణాచార్యుడు తన బాణములతో ధృష్టద్యుమ్నుని కత్తిని, డాలును ఖండించాడు.  ఆ సమయంలో సాత్యకి మరొక చోట కర్ణుడు, కృపాచార్యుడు, కృతవర్మలతో యుద్ధం చేస్తున్నాడు.  దూరంనుండి ఇదంతా గమనించాడు. వెంటనే పది బాణములను ద్రోణాచార్యుని మీద వేసాడు.

భీముడు తన రథము మీద వచ్చి విరథుడై ఉన్న ధృష్టద్యుమ్నుని తన రథము మీద ఎక్కించుకుని పక్కకు తీసుకెళ్లాడు. ద్రోణుడు అతనిని వెంటాడ లేదు. పోతే పోనీలే అనుకున్నాడు.

ఇప్పుడు ద్రోణాచార్యుని మనస్సు ప్రశాంతంగా ఉంది. తన రథం మీద కూర్చున్నాడు. యోగనిష్టలో నిమగ్నమయ్యాడు. ఓ ధృతరాష్ట్ర మహారాజా! భీష్ముడు పడిపోయిన తరువాత ద్రోణుడు నాలుగు రోజులు ఒక రాత్రి మాత్రం యుద్ధం చేసాడు. మరుసటి దినమున 20 గడియలు మాత్రం యుద్ధం చేసాడు. ఆ 20 గడియల కాలంలో అతను 21 వేల మంది సైనికులను చంపాడు. అంతటితో ద్రోణుని యుద్ధ ఘట్టముపూర్తిఅయింది. మనసులో శాంతి పొందాడు. చుట్టు చూసాడు.

ఓ కర్ణా! ఓ కృపాచార్యా ఓ సుయోధనా! మీరు నన్ను ఎప్పుడూ యుద్ధం చేయనని ఎత్తిపొడుస్తుంటారు. నేను నా చేతనయినంత వరకూ యుద్ధం చేసాను. ఇంక నిశ్చింతగా పై లోకాలు చేరుకుంటాను. ఇదిగో నా ధనుర్బాణము లను విడిచి, అస్త్రసన్యాసం చేస్తున్నాను. మీరందరూ ఇకనైనా తెలివి కలిగి ప్రవర్తించండి. అని ఎలుగెత్తి అరిచాడు.

ద్రోణుడు తన ధనుర్బాణములను రథము మీద పెట్టాడు. రథము మీద యోగనిష్టలో కూర్చున్నాడు. తేజోమయమైన ఆత్మతో వెలుగొందు తున్నాడు.

ఆ సమయంలో ధృష్టద్యుమ్నుడు చేతిలో కత్తితో ద్రోణుని వైపు నడిచి వస్తున్నాడు. ధృష్టద్యుమ్నుడు ద్రోణుని చంపడానికి పోతున్నాడని తెలిసి ఉభయ సైన్యములు హాహాకారాలు చేసాయి.

అప్పటికే ద్రోణుని ప్రాణవాయువులు అనంత వాయువులలో కలిసిపోయాయి. అతని ఆత్మ జ్యోతి రూపంలో పైకి ఎగిసి పరమస్థానము చేరుకుంది. ఆయన ఆత్మతేజోరూపంతో పైకి వెళ్లడం నేనూ, కృష్ణుడు, ధర్మరాజు, అర్జునుడు, కృపాచార్యుడు మాత్రం చూడగలిగాము. మిగిలిన వారికి ఆ దృశ్యం గోచరం కాలేదు.

ఇంతలో ధృష్టద్యుమ్నుడు చేతిలో కత్తితో ద్రోణుని రథం మీదికి దుమికాడు. ద్రోణుని శవమును పట్టుకున్నాడు. అతని జుట్టుపట్టుకొని ద్రోణుని మెడ నరకడానికి కత్తి ఎత్తాడు. ఒక పక్కనుండి వద్దు వద్దు అని అర్జునుడు అరుస్తున్నా, అలా చెయ్యడం పాపం ధర్మ విరుద్ధం అని ధర్మజుడు అరుస్తున్నా ధృష్టద్యుమ్నుడు లెక్కచెయ్యలేదు. అప్పటికే ప్రాణములు విడిచిన ద్రోణుని తల తెగనరికాడు. ద్రోణుని తలను మొండెమును నేల మీద పడవేసాడు.

ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆ ప్రకారంగా, అప్పటికే దాదాపు నూరు సంవత్సరములు బతికిన ద్రోణుడు, నీ యొక్క, నీ కుమారుల యొక్క, దుర్నీతికి బలిఅయిపోయాడు.

నాధుడులేని కౌరవ సైన్యము మీదికి పాండవ సేనలు ఒక్కుమ్మడిగా దాడి చేసాయి. పాండవ సేనల ధాటికి ఆగలేక కౌరవ సేనలు పారిపోయాయి. నీ కుమారులు కూడా వారిని అనుసరించారు. సుయోధనుడు, కర్ణుడు, కృపాచార్యుడు, కృతవర్మ, శకుని కూడా వెనుకకు తిరిగి చూస్తూ పోతున్నారు. పోతూపోతూ వారిలో వారు ఇలా అనుకుంటున్నారు. "ఎంతఘోరం జరిగిపోయింది. ఇంక ఏం చెయ్యాలో తోచకున్నది. దీనికి అంతం లేదా ~~ఈ~~ నరమేధం ఇలా జరగవలసినదేనా" అనుకుంటూ పోతున్నారు.

ఆ సమయంలో మరొక పక్క యుద్ధం చేస్తున్న అశ్వత్థామ కౌరవ సైనికులు, కౌరవ వీరులు వెనక్కు తిరిగి చూస్తూ పారిపోవడం గమనించాడు. వెంటనే అశ్వత్థామ సుయోధనుని వద్దకు వెళ్లాడు.

" సుయోధనా! ఏమిటిది? మన సేనలకు ఏమయింది అలా వెనక్కు చూసుకుంటూ పరుగెడుతున్నాయి. కృపాచార్యుడు, కర్ణుడు ఎందుకు అలా మ్లానవదనులై ఉన్నారు. ఏం జరిగింది" అని అడిగాడు.

సుయోధనుడు బదులు చెప్పలేక పోయాడు.దుఃఖం తో మాట రావడం లేదు. అశ్వత్థామకు తండ్రి మరణవార్త ఎలా చెప్పాలి అని మధన పడు తున్నాడు. అశ్వత్థామ మేనమామ కృపాచార్యుడు అశ్వత్థామ వెన్నునిమిరి, ఇలా చెప్పసాగాడు.

"కుమారా! మీ తండ్రి పాంచాలసేనలను చాలా పెద్దమొత్తంలో చంపు తున్నాడు. పాండవులు ఎలాగైనా నీ తండ్రిని చంపాలని అనుకున్నారు. భీముడు నీ తండ్రివద్దకు పోయి అశ్వత్థామ మరణించాడు అని అబద్ధం చెప్పాడు. కాని మీ తండ్రిఅతని మాట నమ్మలేదు. యుద్ధం చేస్తూనే ఉన్నాడు. కాని అనుమానం వచ్చి నీ తండ్రి ధర్మరాజు వద్దకు పోయి నిజం చెప్పమని అడిగాడు. అంతకు ముందు భీముని చేతిలో అశ్వత్థామ అనే గజము చావడం వలన, ధర్మజుడు కూడా అశ్వత్థా మ మరణించాడు అని చెప్పాడు. ఆమాట వినగానే నీ తం డ్రి అస్త్రసన్యాసము చేసాడు. యోగసమాధిలో కి వెళ్లిపోయాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుడు నీ తండ్రి ఉన్న రథం మీదికి దుమికి అతని తల తెగనరికాడు. ధర్మరాజు, అర్జునుడు వద్దు వద్దు అలా చెయ్య కూడదు అది ధర్మంకాదు అని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. నీ తండ్రి మరణించగానే మన సేనలు భయపడి పారిపోయాయి. మాకు కూడా కాళ్లు

చేతులు ఆడలేదు. నిరుత్సాహంతో నిల్చుండిపోయాము. కాని ఇది అంతా కృ ష్ణుడు ఆడించిన నాటకం అని తోస్తూ ఉంది. లేకపోతే భీముడికి ఇన్ని తెలివి తేటలు లేవు. ధర్మరాజు ఇంతటి అధర్మానికి ఒడికట్టడు.  ఇది జరిగింది." అని చెప్పాడు కృపాచార్యుడు.

కృపాచార్యుడు చెప్పినది  అంతా ప్రశాంతంగా విన్నాడు అశ్వత్థామ. "మామా! కృపాచార్యా!  జాతస్య మరణం ధృవం. పుట్టినవాడు చావక తప్పదు. పైగా యుద్ధం చేస్తుంటే చావు వెన్నంటే ఉంటుంది. నేను దానికి బాధ పడటం లేదు. కాని లోకారాధ్యుడైన నా తండ్రిని, నిరాయుధుడైన నా తండ్రిని, యోగసమాధిలో ఉన్న నా తండ్రిని,  ఒకడు జుట్టుపట్టుకొని మెడ నరకడమే బాధాకరంగా ఉంది. అవమాన కరంగా ఉంది కూడా.

సుయోధనా! నాకు నా తండ్రి ప్రసాదించిన దివ్యాస్త్రములు, నా అస్త్ర విద్య నా తండ్రిని కాపాడు కోలేక పోయాయి. ఇవన్ని ఎందుకు నాకు. నా తండ్రి, నా గురుడు, నా దైవము దిక్కుమాలిన చావు చస్తుంటే ఆపలేకపోయాను. సుయోధనా! దీనికంతటికి మూలం ఆ ధర్మరాజు. పేరుకు ధర్మరాజు ...మాట్లాడేవి అసత్యాలు. అతనిని అంతమొందిస్తేగాని నా తండ్రి  ఆత్మ శాంతించదు.

సుయోధనా! నా తండ్రి నన్ను కుమారునిగా కన్నది అవసాన దశలో ఇంతటి అవమానం పొందడానికా చెప్పు. ఇదిగో నా ప్రతిజ్ఞ విను.  ఆ దేవతలంతా అడ్డుపడినా సరే, ఆ కృష్ణుడే రక్షణగా ఉన్నా సరే. నేను పాండవులను సంహరిస్తాను. ఇదేనా ప్రతిజ్ఞ." అని ఘోరంగా ప్రతిజ్ఞ చేసాడు అశ్వత్థామ.

"సుయోధనా! నా పరాక్రమం గురించి నేను చెప్పుకోకూడదు. అది తప్పు. కాని నా తండ్రికి జరిగిన పరాభవం తట్టుకోలేక అలా అన్నాను. కాని నా మాట  ఇప్పుడు కాకపోతే ఎప్పుడైనా ఎలాగైనా నెరవేర్చుకొని తీరుతాను" అని అన్నాడు అశ్వత్థామ.

(కాని యుద్ధం ముగిసే లోపల పాండవులను చంపలేకపోయాడు అశ్వత్థామ. సుయోధనుని పతనం తరువాత, రాత్రిపూట, అందరూ ప్రశాంతంగా  నిద్రపోతున్నప్పుడు,  పాండవులనుకొని, ఉపపాండవుల నందరిని  దారుణంగా హతమార్చాడు అశ్వత్థామ..... పాండవ వంశము నిర్వంశము చేయవలెనని, అభిమన్యుని భార్య ఉత్తర గర్భలో ఉన్నశిశువు మీదికి తన బ్రహ్మాస్త్రమును మళ్లించాడు. కాని ఏదీ నెరవేర్చలేకపోయాడు. అన్నింటికి కృష్ణుడు చక్రం అడ్డు వేసి పాండవులను, వారి వంశమును పరిరక్షించాడు.)

మరలా అశ్వత్థామ సుయోధనునితో ఇలా అన్నాడు. "సుయోధనా! నా తండ్రి శ్రీమన్నారాయణుని ఆరాధించి. నారాయణాస్త్రాన్ని పొందాడు. ఆ అస్త్రమును నా తండ్రి నాకు ప్రసాదించాడు. ఆ నారాయణాస్త్రము వారు వీరు, తన వారు, మనవారు అనే బేధం లేకుండా అందరినీ హతమారుస్తుంది. విధ్వంసము సృష్టిస్తుంది. ఇప్పుడు నేను ఆ నారాయణాస్త్రమును ప్రయోగించి శత్రువులను గెలుస్తాను." అని అన్నాడు.  ఆ మాటలు విన్న సుయోధనుడు ఎంతో సంతోషించాడు. తన వారినందరినీ ఉత్సాహపరిచాడు. తన శంఖము పూరించాడు. యుద్ధమునకు సమాయత్తమయ్యాడు.   ఇది చూచి ధర్మరాజాదులు కూడా యుద్ధమునకు సమాయత్తమయ్యారు.

అప్పుడు ధర్మరాజు అర్జునుని చూచి ఇలా అన్నాడు. "అర్జునా! తమ సైన్యాధ్యక్షుడైన ద్రోణుడు చనిపోగానే చెల్లాచెదరుగా పారిపోయిన కౌరవ సేన

మరలా అంతలోనే యుద్ధమునకు సమాయత్తము కావడం ఆశ్చర్యం వేస్తోంది. దీనికి కారణం ఏమయి ఉంటుంది. కౌరవ సేనలలో కోలాహలం మిక్కుటంగా కానవస్తూ ఉంది. మనము ద్రోణుని చంపామన్న కోపంతో, నీ తండ్రి ఇంద్రుడు తన దేవ సైన్యముతో వారికి సాయంగా వచ్చాడా? ఏమీ అర్ధం కాకుండా ఉంది." అని అన్నాడు.

అర్జునుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "అన్నయ్యా! అస్త్రసన్యాసం చేసిన ఆచార్యుని అధర్మంగా వధించిన వారి మీద కోపంతో అశ్వత్థామ ఊరు కుంటాడా. అశ్వత్థామ వద్ద ఎంతో దివ్యాస్త్ర సంపద ఉన్నది. పైగా అతడు సహజంగా మహాద్భుత శౌర్య సంపన్నుడు. జగమెరిగిన అతిమానుషవిక్రమ శాలి. ఈసమయంలో అశ్వత్థామను ఎదుర్కొనడం చాలా కష్టం.

అన్నయ్యా! అశ్వత్థామ పుట్టగానే ఉచ్చైశ్రవము మాదిరి సకిలించాడట. ( దేవాసురులు సముద్రమథనము చేసినపుడు ఉద్భవించిన దేవతాశ్వము పేరు ఉచ్చైశ్రవము అనగా దివ్యమైన గుర్రము.) అప్పుడు అశరీరవాణి అందరూ వింటూ ఉండగా ఈ బాలుడు అశ్వత్థామ అనే పేరుతో వర్ధిల్లుతాడు అని పలికినదట. అందుకని ద్రోణుడు ఆ బాలునికి అశ్వత్థామ అని పేరు పెట్టాడట. అశ్వత్థామ సార్ధకనామధేయుడయ్యాడు. ఇప్పుడు కౌరవ సైన్యము ఈ ప్రకారము విజృంభిస్తున్నదంటే దానికి కారణం అశ్వత్థామ తప్ప వేరు కాదు. ఎప్పుడూ పాపం చెయ్యని ఓ ధర్మజా! నిన్ను తన శిష్యుడు అనీ, ధర్మం తప్పని వాడవనీ, ఎల్లప్పుడూ సత్యమే పలుకుతావనీ నమ్మి అత్యంత ఆదరంతో ద్రోణుడు, తన కుమారుని మరణము గురించి, నిన్ను అడిగాడు. కాని నీవు, ధర్మహానికి తలపడ్డావు. అశ్వత్థామ మరణించాడని అసత్యం పలికావు. అందుకే ద్రోణుడు తన కుమారుడు మరణించాడని నిశ్చయించుకున్నాడు.

అన్నయ్యా! ఇంతటి అధర్మమునకుపాల్పడి అయినా ఈ రాజ్యం పొందడం అవసరమా? దీని వలన మనకు వచ్చిన ఐశ్వర్యము మనకు మేలు చేస్తుందా? ఈ లోకమంతా మనలను దూషించదా? వెలివేయదా? అలా చెయ్య వద్దు. అది అధర్మము అని నేను అరుస్తూనే ఉన్నాను. కాని ఆ ధృష్టద్యుమ్నుడు ఏమి చేసాడు? ద్రోణుడి తల వెంట్రుకలు పట్టుకొని, అతని తల ఎందుకు నరకాలి? దీని వలన ధర్మము నశిస్తుందని అతనికి తెలియదా? మరి మనయు ఇన్ని ధర్మవిరుద్ధమైన పనులు చేసినపుడు, అతని కుమారుడు కోపం తెచ్చుకోకుండా, మన మీదికి యుద్ధమునకు రాకుండా ఊరుకుంటాడా! మన సేనలను సర్వనాశనం చెయ్యడానికి అశ్వత్థామ ఆగ్రహోదగ్రుడై వస్తున్నాడు. అతనిని మనం ఎదుర్కోనాలి. సిద్ధంగా ఉండండి. కాని అతని బారినుండి ఆ ధృష్టద్యుమ్నుని కాపాడటం నీకూ నాకే కాదు ... ఎవరి తరమూకాదు." అని అన్నాడు అర్జునుడు.

ఈ మాటలన్ని విన్న భీముడు కోపంతో ఊగిపోయాడు. "అర్జునా! నీవు యుద్ధం చేసే వీరుడివా లేక అరణ్యములలో కందమూలములు తినే ఋషి పుంగవుడివా! ఏమిటీ పిరికి మాటలు. ద్రోణుడిని చంపడం గురువును చంపడం మహా పాపం అని నీవు ద్రోణుని చంపలేదు. కాని ఒకసారి యుద్ధ రంగమున ప్రవేశించినపుడు, బంధుత్వముగాని, గురుశిష్యసంబంధము గాని పనికి రాదని రాజనీతి ఘోషిస్తోంది. మరి నీవు నీ రాజ ధర్మం ఎప్పుడూ తప్పలేదా. మరి ఆ కౌరవులు ధర్మయుద్ధం చేస్తున్నారా? ధర్మంగా ప్రవర్తిస్తున్నారా? నాడు నిండు కొలువులో శీలవతియై న ద్రౌపదిని ఈడ్చి తెచ్చి వలువలు ఊడ్చుటకు ప్రయత్నించిన వారికి ఇలాంటి అధర్మములు ఎన్ని చేసిననూ మనకు ఎలాంటి కల్మషము అంటదు. అర్జునా! శత్రువులు మన మీదికి వచ్చినపుడు ఎలా ఎదుర్కోవాలి అని మేమే ఆలోచిస్తుంటే నీవు ఈ ప్రకారం ధర్మము, అధర్మము అంటూ పిరికి మాటలు మాట్లాడటం ధర్మం

కాదు. అర్జునా! నేనంటే ఏమిటో నా పరాక్రమమేమిటో సుయోధనునికి తెలుసు. వారంటే ఏమిటో నాకూ తెలుసు. వారే కనుక మన మీదికి వస్తే వారిని ఊరక పోనిస్తానా! సర్వనాశనం చెయ్యకుండా వదలను.” అని భీముడు కోపంతో రోషంతో పలికాడు.

ఆ సయములో అక్కడే ఉన్న ధృష్టద్యుమ్నుడు కూడా అర్జునునితో “అర్జునా! నీ గురువు ద్రోణుడు మాత్రం అధర్మమునకు పాల్పడలేదా. కేవలం చేతితో పట్టుకొని ఉన్న ఆయుధములు తప్ప వేరే ఏవిధమైన అస్త్రశస్త్రములు తెలియనివారు, ఎలాంటి బలము లేని వారు, ఎలాంటి యుద్ధప్రక్రియలు తెలియని వారు, అలాంటి సామాన్యులైన పాంచాల సైనికుల మీద తన దివ్యమైన అస్త్ర శస్త్రములను ప్రయోగించి, వేల కొద్ది సైనికులను క్షణ కాలములో చంపలేదా. అది ధర్మమా! అది దయా గుణమా! ద్రోణునిది క్రూరత్వము కాదా! అర్జునా! నేను ద్రోణుని చంపడానికేపుట్టాను. చంపాను. అంతే. ఇందులో పాప పుణ్యముల ప్రసక్తి లేదు. అయినా అర్జునా! నీవు చేసినదేమిటి? నీ తండ్రికి మిత్రుడైన భగదత్తుని చంపావు కదా! శిఖండిని అడ్డంపెట్టుకొని నీ తాతగారిని చంపావు కదా! అవి అధర్మాలు కావా? వారు నీతో యుద్ధం చెయ్యకపోయినా వారిని నీవు చంపడం పుణ్యమా! నా మీద యుద్ధం చేస్తూ నా పాంచాల సైన్యమును నాశనం చేస్తున్న ద్రోణుని చంపడం పాపమా! ఇది ఎక్కడి ధర్మమయ్యా! అయినా నేను చెబుతున్నాను విను. ధర్మరాజు ఏ పాపమూచెయ్యలేదు. అసత్యమూ పలక లేదు. అశ్వత్థామ అనే ఏనుగును భీముడు చంపాడు. అదే విషయం ధర్మరాజు ద్రోణునితో చెప్పాడు. అంతే. ఆ మాట కొస్తే నేనూ ధర్మం తప్పలేదు. తనశిష్యులనే వంచించిన గురువును చంపాను. నా సైన్యాన్ని గెలిపించాను. అనవసరంగా నన్ను ఎందుకు నిందిస్తావు. ఇప్పుడు ద్రోణ వధలో నీ మార్గం నిష్కంటకమయింది. శత్రువులను జయించి విజయలక్ష్మిని వరించు.” అని నిర్ద్వంద్వంగా పలికాడు

ధృష్టద్యుమ్నుడు.

(యుద్ధము సరిసమానమైన వారితోనే చెయ్యాలి అని యుద్ధనీతి. ద్రోణుడు మహారధుడు. పాంచాల సైనికులు రధములే లేని వాళ్లు. కాల్బలము. అలాంటి వారిని చంపడం, అది కూడా తన దివ్యమైన అస్త్ర శస్త్ర ములు ప్రయోగించి చంపడం, అధర్మం అని ధృష్టద్యుమ్నుని భావన).

ఆ మాటలు అంటున్న ధృష్టద్యుమ్నుని చూచి, ఒక పక్క ద్రోణ వధతో పెల్లుబుకుతున్న దుఃఖమును అణుచుకుంటూ అర్జునుడు ఇలా అన్నాడు. "ధృష్టద్యుమ్నా! చాలు... చాలు.... ఇంక అలాంటి అసహ్యకరమైన మాటలు కట్టిపెట్టు. చేసింది చాలక ఇంకా చేసిన దానినిసమర్ధించుకుంటున్నావా?" అని అన్నాడు.

పక్కనే ఉన్న సాత్యకి కోపంతో ఊగిపోతున్నాడు. "అవును ధృష్టద్యుమ్నా! నీవు చేసింది ముమ్మాటికీ అధర్మమే! నీవు ఇన్ని మాటలు అన్నా నీ నాలుక చీల కుండా, నీ తల పగలకుండా ఉంది అంటే నీవు ధర్మజుని ఎదుట ఉండటమే! ఇంక ఒక్క మాట మాట్లాడినా నేను అన్నంతపనీ జరుగుతుంది. భీష్ముని చంపడానికే శిఖండి జన్మించాడు. చంపాడు. అతనికి అర్జునుడు తోడుగా వెళ్లాడు. అంతే. భీష్ముడు కూడా తనను పడగొట్టమని, అదికూడా అర్జునుడే ఆ పని చెయ్యాలని ధర్మరాజును ఆదేశించాడు. తదనుగుణంగానే ధర్మరాజు అర్జునునికి, శిఖండికి ఆదేశాలు ఇచ్చాడు. ఇదంతా భీష్ముని ఇష్టాను సారమే జరిగింది. ఓ ధృష్టద్యుమ్నా! నీవు శిఖండి, పాంచాల వంశములో జన్మించి ఆ వంశమునకే కళంకము తెచ్చారు." అని అన్నాడు సాత్యకి.

ఆ మాటలకు నవ్వుతూ ధృష్టద్యుమ్నుడు ఇలా అన్నాడు "ఓ సాత్యకీ! నీవా నాకు నీతులు చెప్పేది. నీ చరిత్ర ఎవరికి తెలియదు. అర్జునుడు భూరిశ్రవసుని చేతిని నరికిన తరువాత తమరు అతనిని చంపారు. అంతటి మహా వీరుడివి నువ్వు. ఇది యుద్ధ ధర్మమా వివేకహీనుడా! ఆ భూరిశ్రవసుడు నిన్ను కింద పడద్రోసి నీ గుండెల మీద కాలు పెట్టి నీ తల ఖండించ పోవు నప్పుడు నువ్వు ఏంచేస్తున్నావు. ఇదా నీ వీరత్వం. భూరిశ్రవసుడు చేయి తెగి కిందపడి, ఆయుధములు విడిచి, ప్రాయోపవేశము చేయునప్పుడు నువ్వు అతని తలను నరికావు కదా . మరి దీనికేమంటావు? నీ తప్పు నువ్వు తెలుసు కొని తరువాత ఎదుటి వారి తప్పులు ఎంచు! ఎన్నిసార్లు ద్రోణుడు మనలను మన సైన్యములను తరిమి తరిమి కొట్టలేదు. అప్పుడు నువ్వు ఏం చేస్తున్నావు? ఎక్కడున్నావు? ద్రోణుని ఎందుకు ఎదిరించలేదు? నీవు భూరిశ్రవసుని ఏ పరిస్థితులలో సంహరించావో నేనూ ద్రోణుని అదే పరిస్థితులలో సంహరించాను. నీకే అంటని పాపం నాకు ఎలా అంటుతుంది. అంతటి పరాక్రమశాలి ద్రోణుని వధించి నందుకు నన్ను అభినందించవలసినది పోయి నన్నే తప్పు పడుతున్నారా మీరు. ఓ సాత్యకీ! నీవు అనవసరంగా నా విషయాలలోజోక్యం చేసుకుంటున్నావు. అనవసరంగా మాట్లాడి నాకు కోపం తెప్పిస్తున్నావు. ఇంకొక్క మాట మాట్లాడితే నీ తలపగులుతుంది జాగ్రత్త. నేనుకోపం అణుచుకుంటున్నాను. మనందరం పాండవుల పక్షాన యుద్ధం చేయడానికి వచ్చాము. రా. మన ధర్మం నిర్వర్తిద్దాము."అని పరుషంగా పలికాడు ధృష్టద్యుమ్నుడు.

ఆమాటలు విన్న సాత్యకి రోషకషాయితనేత్రుడయ్యాడు. రథములో ఉన్న గద చేతిలోకి తీసుకున్నాడు. "ధృష్టద్యుమ్నా! ఇంక మాటలతో పని లేదు రా ఇప్పుడే నీతల పగలగొడతాను." అంటూ ముందుకు దూకాడు.

ఇది అంతా వినోదంగా చూస్తున్న కృష్ణుడు సాత్యకిని ఆపడానికి భీముని పంపాడు. వెంటనే భీముడు రథము దిగి సాత్యకిని కదలకుండా పట్టుకున్నాడు. ఇంతలో సహదేవుడు అక్కడకు వచ్చి సాత్యకితో "సాత్యకీ! ఎందుకయ్యా మీలో మీరు ఇలా తగవులాడుకుంటారు. యాదవులు, పాంచాలురు మాకు బంధువులే. మాకు సమానులే. మీలో మీరు ఇలా తగవులాడుకుంటే శత్రువులు చూచి ఏమనుకుంటారు? తగవులు మానండి." అని అన్నాడు.

ఇంతలో ధృష్టద్యుమ్నుడు భీమునితో "భీమా! సాత్యకిని ఆపవద్దు. రానీ ఏంచేస్తాడో చూస్తాను . అతడి పొగరు పౌరుషం అణుస్తాను. నేనేమీ చెయ్యి తెగిన భూరిశ్రవసుడిని కాను... అతని చేతిలో చావడానికి. రానీ..." అన్నాడు.

ఇంక కొనసాగించడం మంచిది కాదని కృష్ణుడు, ధర్మరాజు పోయి ఇద్దరికీ సర్ది చెప్పారు. ఇంతలో ఇరు పక్షములలోభేరీ మృదంగ, శంఖ ధ్వానములు మారుమ్రోగాయి. ఉభయ సైన్యములు యుద్ధమునకు సన్నద్ధమైనాయి. ద్రోణుని జయించాము అన్న గర్వంతో పాండవ పక్షము, మనకు అశ్వత్థామ మనకు తోడున్నాడు అన్న ధైర్యంతో కౌరవ పక్షము తమ తమ బలాలను ప్రదర్శిస్తున్నారు.

అశ్వత్థామ మనసులో నారాయణాస్త్రాన్ని ధ్యానించాడు. విల్లు సంధించాడు. నారాయణాస్త్రాన్ని పాండు సేనలమీద ప్రయోగించాడు. ఆ అస్త్రధాటికి భూమి దద్దరిల్లింది. దిక్కులు కంపించాయి. సముద్రాలు పొంగాయి. ఆ దివ్యాస్త్రము నుండి అనేక రకములైన ఆయుధములు పుడుతున్నాయి. పాండవసైన్యము మీదికి వస్తున్నాయి. పాండవవీరులు వాటిని శాయశక్తులా ఎదుర్కొంటున్నారు. కాని తాళలేకపోతున్నారు.

నారాయణాస్త్రము పాండవుల సైన్యాన్ని నాశనం చేస్తూ ఉంది.

అది చూచిన ధర్మరాజు అర్జునుడి వంక చూచాడు. అర్జునుడు మాట్లాడకుండా ఊరుకున్నాడు. ధర్మరాజు  అర్జునుడు,కృష్ణుడు వినేట్టుగా సాత్యకి, ధృష్టద్యుమ్నులతో  ఇలా అన్నాడు.

"ఆ ద్రోణుడు ఎంతటి క్రూరాత్ముడంటే నాడు నిండు కొలువులో ద్రౌపదిని అవమానిస్తుంటే చూస్తూ ఊరుకున్నాడే కాని ఒక్కమాటకూడా మాట్లాడలేదు.  బాలుడైన అభిమన్యుని మరణానికి కారకుడయ్యాడు. సూర్యాస్తమయము అయితే అర్జునుడు అగ్నిప్రవేశము చెయ్యాల్సివస్తుందని తెలిసి కూడా, మనలను అర్జునునికి సాయంగా పోకుండా ఆపింది ఆ ద్రోణుడే కదా! మరి అలాంటి ధర్మపరుని తో మనము సరితూగ గలమా.  ~~ఈ~~ నారాయణాస్త్రము సాక్షిగా చెపుతున్నాను. మీరి పారిపోయి మీ మీ ప్రాణాలు దక్కించుకోండి. అప్పుడు పార్ధుని కోరిక నెరవేరుతుంది.  కృష్ణుడు ఏం చేస్తాడో ఆయన  ఇష్టం." అని నిష్ఠూరంగా అన్నాడు.

ఇంక కృష్ణుడు ఊరుకోలేకపోయాడు. రథము మీద లేచి నిలబడ్డాడు. పాండవ సైనికులను  ఉద్దేశించి ఇలా అన్నాడు. "ఓ సైనికులారా! పాండవీరులారా! భయపడకండి. మీరందరూ మీ మీ రథములు, వాహనములు, మీ మీ గజములు, హయములు  దిగి నేలమీద నిలబడండి. మీ మీ ఆయుధములు కింద పెట్టండి. అప్పుడు ఆ నారాయణాస్త్రము మిమ్మల్ని ఏమీ చెయ్యదు.  నారాయణాస్త్రమునకు విరుగుడు ఇదే. దీనికి ఉపసంహారము లేదు." అని అరిచాడు కృష్ణుడు.

కృష్ణుడి మాట ప్రకారము అందరూ తమ తమ వాహనములు, దిగుతున్నారు. ఇంతలో భీముడు వారికి అడ్డు పడ్డాడు. "సైనికులారా! మహా వీరులారా! ఆగండి. ఎవరూ మీ మీ వాహనములు దిగకండి. వీరోచితంగా పోరాడండి. నేను ఉన్నాను. నేను మహాస్త్రములను ప్రయోగిస్తాను. నా గదతో అందరినీ గెలుస్తాను." అని ఎలుగెత్తి అరిచాడు.

తన గదతీసుకొని అశ్వత్థామ మీదికి ఉరికాడు. అశ్వత్థామ నారాయణాస్త్రాన్ని భీముని మీదికి మళ్లించాడు. భీముని మాట వినకుండా అందరూ తమ తమ వాహనములు దిగి ఆయుధములు కిందపెట్టారు. ఆ నారాయణాస్త్రము వారి నందరినీ విడిచిపెట్టి ఆయుధధారి యైన భీముని వెంటపడింది.

అది చూచాడు భీముడు. వెంటనే వారుణాస్త్రాన్ని ప్రయోగించాడు. వారుణాస్త్రము శక్తికి నారాయణాస్త్రము శక్తి కొద్దిగాతగ్గింది. వెంటనే అశ్వత్థామ దాని శక్తిని కొద్దిగ పెంచాడు. దానిని మరింత శక్తివంతం చేసాడు. ఆ నారాయణాస్త్రము భీముని చుట్టుముట్టింది. కృష్ణుడు ఇది గమనించాడు. కృష్ణుని మాట ప్రకారము ఒక్క భీముడు తప్ప ఎవ్వరూ యుద్ధము చేయడం లేదు. అందుకని నారాయణాస్త్రము వారినందరినీ విడిచి ఒక్క భీముడి చుట్టు తీవ్రమైన అగ్ని జ్వాలలను విరజిమ్ముతూ తిరుగుతూ ఉంది.

కృష్ణుడు, అర్జునుడు తమ తమ ఆయుధములు రథము మీద పెట్టి, రథము దిగి భీముని రథము వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చారు. అతనిని రథము మీదినుండి కిందికి తొయ్యడానికి ప్రయత్నించారు. కాని భీముడు రథము దిగలేదు. మూర్ఖంగా అలాగే ఉన్నాడు.

అప్పుడు కృష్ణుడు భీమునితో ఇలా అన్నాడు. "భీమసేనా! ఓ మహా వీరా! ఈ అస్త్రమును ఉపసంహరించే శక్తి ఆ అశ్వత్థామకు కూడా లేదు. దీనికి ఒకటే విరుగుడు. ఆయుధములు విడిచి, వాహనములు దిగడమే. నా మాటవిని రథము దిగవయ్యా ..." అని బతిమాలుతూనే కృష్ణుడు భీముని చేతిలోని ఆయుధములు లాగేసాడు. అర్జునుడు, కృష్ణుడు ఇద్దరూ కలిసి భీముని ఒక్క తోపుతో రథం మీది నుండి కిందికి తోసారు.

ఇంక పాండవ సైన్యములో ఎవ్వరూ ఆయుధము పట్టిన వారు లేరు కాబట్టి ఆ అస్త్రము వెనుకకు తిరిగింది. శాంతించింది. అమ్మయ్య అనుకున్నాడు కృష్ణుడు. వెను వెంటనే అందరినీ ఆయుధములు ధరించి యుద్ధమునకు సిద్ధం కమ్మన్నాడు కృష్ణుడు. పాండవ సైన్యములు కౌరవ సైన్యమీదికి విజృంభించింది.

అప్పుడు సుయోధనుడు అశ్వత్థామను చూచి "గురుపుత్రా! మరలా నారాయణాస్త్రము ప్రయోగింపుము" అని అన్నాడు.

అశ్వత్థామ సుయోధనుని చూచి "రారాజా! ఈ నారాయణాస్త్రము ఒకసారి మాత్రమే ప్రయోగింపబడుతుంది రెండవసారి ప్రయోగిస్తే ప్రయోగించిన వారిని సంహరిస్తుంది. మా తండ్రికి ఈ అస్త్రము ఇచ్చునప్పుడు నారాయణుడు ఆ విధంగా ఆదేశించాడట. యుద్ధములో వాహనములు దిగి ఆయుధములు కిందపెట్టడం అంటే మరణంతో సమానం కదా అందుకని వాహనములు దిగి ఆయుధములు కిందపెట్టిన వారిని ఈ అస్త్రము ఏమీ చెయ్యలేదు. కృష్ణునికి ఈ విషయం తెలుసు అందుకని పాండవులను, తన వారినీ రక్షించుకున్నాడు. మనమేం చేస్తాము చెప్పు." అని అన్నాడు అశ్వత్థామ.

"అశ్వత్థామా! పోనీలే. నారాయణాస్త్రము నిరుపయోగమైనంత మాత్రమున నిరుత్సాహ పడవలసిన పనిలేదు. మన వద్ద ఇంకా దివ్యాస్త్రములు ఉన్నవి కాదా. వాటిని ప్రయోగించి పాండవులను గెలుద్దాము" అన్నాడు.

"అవును సుయోధనా అలాగే చేద్దాము" అని పాండవుల మీదికి యుద్ధమునకు బయలు దేరాడు.

యుద్ధభూమిలో అశ్వత్థామకు ధృష్టద్యుమ్నుడు కనపడ్డాడు. కోపంతో ఊగిపోయాడు అశ్వత్థామ. తన నిశితమైన బాణములతో ధృష్టద్యుమ్నుని సారధిని, రధాశ్వములను చంపాడు. అతని విల్లు విరగ్గొట్టాడు. కేతనమును త్రుంచాడు. ఇంతలో సాత్యకి ధృష్టద్యుమ్యునికి తోడుగా వచ్చాడు. అశ్వత్థామ ఒకే ఒక బాణంతో సాత్యకిని మూర్ఛ పోయేట్టు కొట్టాడు. తరువాత ధృష్ట ద్యుమ్నుని కూడా మూర్ఛపోయేట్టు కొట్టాడు. అశ్వత్థామ విజయోత్సాహంతో సింహనాదం చేసాడు.

ఇది చూచిన భీమార్జునులు అశ్వత్థామ ను ఎదిరించారు. వారికి తోడుగా ఛేది దేశపు రాజు సుదర్శనుడు (శిశుపాలుని మనుమడు), వృద్ధక్షత్రుడు వారికి సాయంగా వచ్చారు. అశ్వత్థామ తన పదునైన బాణములతో సుదర్శనుని, వృద్ధక్షత్రుని తలలు నరికి వేసాడు. ఎక్కడ చూచినా తానే అయి పాండవ సేనలతో యుద్ధం చేస్తున్నాడు. అశ్వత్థామ పరాక్రమానికి పాండవ సేనలు పారిపోతున్నాయి. భీమార్జునులు తమ శాయశక్తులా పాండవ సేనలకు ధైర్యం చెపుతున్నారు.

అర్జునుడు అశ్వత్థామ మీద నిశితమైన అస్త్రములను ప్రయోగించాడు. అశ్వత్థామ కోపించి అర్జునుని మీద ఆగ్నేయాస్త్రము ప్రయోగించాడు. ఆ

అస్త్రము అగ్నిజ్వాలలు విరజిమ్ముతూ అర్జునుని మీదికి వచ్చింది. ఒక్క త్రుటిలో పాండవుల సైన్యము ఒక అక్షౌహిణీ సైన్యమును ఆగ్నేయాస్త్రము నశింపచేసింది. కౌరవ ప్రముఖులు అందరూ అర్జునుడు, కృష్ణుడు ఆగ్నేయాస్త్రపు మంటలలో మాడి మసి అయిపోతారు అనుకున్నారు జయ జయ ధ్వానాలు చేస్తున్నారు. కాని అర్జునుడు తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రమును ప్రయోగించాడు. అశ్వత్థా మ ప్రయోగించిన ఆగ్నేయాస్త్రము అర్జునుని ముందు నిలువలేకపోయింది. ఒక్కక్షణంలో ఆగ్నేయాస్త్రము నిర్వీర్యము అయింది. అర్జునుడు, కృష్ణుడు తమ తమ శంఖములు పూరించారు. పాండవ సేనలు జయజయధ్వానాలు చేసాయి. ఆనందోత్సాహాలలో తేలి పోతున్నాయి. అప్పటిదాకా జయజయధ్వానాలు చేసిన కౌరవ సైన్యము ఇది చూచి పారిపోయింది.

అశ్వత్థామ పరాభవంతో తలవంచుకున్నాడు. తన చేతిలోని ధనుర్బాణములను కింద పడవేసాడు. "నాకు దివ్యాస్త్రముల బలము లేదని తేటతెల్లమయింది. సిగ్గుమాలి ఇంకా యుద్ధం చెయ్యడం ఎందుకు. వెంటనే యుద్ధము మాని వేస్తాను." అని మనసులో అనుకొని రథము దిగి పాదచారియై యుద్ధభూమి విడిచి పోతున్నాడు.

కొంతదూరము పోగానే అశ్వత్థామకు వ్యాసమహాముని ఎదురుగా వస్తూ కనిపించాడు. అశ్వత్థామ వినయంతో ఆ మహాఋషికి నమస్కరించాడు. "మునీంద్రా! నాకు ఒక సందేహము కలదు. నేను సంధించిన ఆగ్నేయాస్త్రము అత్యంత మహిమాన్వితమైనది. దేవ దానవ గంధర్వులు కూడా దాని శకి ముందు ఆగలేరు. కాని అది సామాన్యమానవులైన కృష్ణార్జునులను ఏమీచేయలేదు. కారణం ఏమిటి? అని అడిగాడు. దానికి వ్యాసుడు ఈ విధంగా బదులు చెప్పాడు.

"ఓ అశ్వత్థామా! పూర్వము శ్రీ మహా విష్ణువు ఈ లోకములను రక్షించుటకొరకు భూలోకములో నారాయణ ఋషిగా జన్మించాడు. తపస్సు చేసుకొనుటకు మైనాక పర్వతమునకు వెళ్లాడు. అక్కడ శివుని గూర్చి ఘోరమైన తపస్సు చేసాడు. ఆ తపస్సునకు సంతోషించి మహాశివుడు నారాయణునికి ప్రత్యక్షం అయ్యాడు. నారాయణుడు మహా శివుని అనేకవిధములుగా స్తోత్రము చేసాడు. "మహేశ్వరా! నిన్ను ఎల్లప్పుడూ భక్తితో భజించు నాకు అనన్యసులభ మైన ప్రభావము ఒసంగుము." అని అడిగాడు. దానికి మహాశివుడు సంతసించి నీవు నర, సుర, గంధర్వ, కిన్నర, గరుడ, ఉరగ, మొదలగు భూతకోటిని అవలీలగా గెలువగలవు. పరమతేజోవిరాజమానుడవై ఉండెదవు. నీకు ఏ అస్త్రములతో గాని, శస్త్రములతో గాని, అగ్నితో గాని, జలముతో గాని, వజ్రాయుధముతోగాని, తడి వస్తువుతోగాని, పొడివస్తువుతోగాని, స్థావర జంగమములతో గాని, బాధ గాని, చావు గాని లేదు. ఒకవేళ నేనే నీ మీదికి వచ్చినా నన్నుకూడా జయించగలవు. అని వరము ఇచ్చాడు. కావున ఆ నారాయణుడు అజేయుడు. అశ్వత్థామా! నారాయణుడు తపస్సు చేసుకుంటున్న సమయమున అతని తేజస్సునుండి పుట్టినవాడు నరుడు. ఆ ఇద్దరూ నరనారాయణులు అని ప్రసిద్ధి కెక్కారు. వీరిద్దరూ విష్ణ్వంశ సంభూతులు. మహా ఋషులు. నారాయణుడు తన లీలలతో జగన్మోహనుడై విహరిస్తూ దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూ ఉంటాడు. ఈ మహాత్ములు ఇద్దరూ దానవులను వధియించుటకు, ధర్మసంస్థాపనకు అవసరమైనప్పుడల్లా అవతరిస్తూ ఉంటారు. ఆ నరనారాయణులే ఈ కృష్ణార్జునులు. నారాయణుడు శ్రీకృష్ణుడైతే, నరుడు అర్జునుడు.

ఓ అశ్వత్థామా! నీవు కూడా తపస్సు,తేజస్సు,విద్య,విభవము కూడిన సమగ్రమూర్తి వైన దేవతా స్వరూపుడవు. నీకూ ఆ నరనారాయణులకు గల అంతరమును వివరిస్తాను వినుము. నీవు పూర్వ జన్మలో మృత్తికతో ఒక

విగ్రహమును తయారు చేసి అందు ఆ పరమాత్మను ఆవహింపచేసి అత్యంత నిష్టతో పూజించావు. కాని ఈ నరనారాయణులు ఆ పరమాత్మను, ఆ గౌరీ పతిని, లింగాకృతిగా పూజించారు. భగవాతారాధనము ఏ విధముగా చేసినా సర్వార్ధసాధనమే. కాని పరమాత్మను లింగాకృతిలో పూజించుట, ప్రతిమా కారములో పూజించుట కన్నా అనేక రెట్లు ఎక్కువ. కాబట్టి పరమాత్మను లింగాకృతిలో ఆరాధించిన ఆ నరనారాయణులను ప్రతిమాకృతిలో ఆరాధించిన నీవు ఎలా జయింపగలవు. మీరు మీ మీ పూర్వజన్మములలో చేసిన అర్చన ఫలము వలన ఈ తారతమ్యము సంభవించినది. ఇది అనుభవింపక తప్పదు." అని చెప్పాడు వ్యాసుడు. ఆ మాటలు విని పులకాంకితుడయ్యాడు అశ్వత్థామ. మనసులో ఆ పరమేశ్వరునికి భక్తితో నమస్కరించాడు. వ్యాసునికి భక్తితో అభివందనము చేసాడు. అంతట వ్యాసుడు అక్కడినుండి వెడలిపోయాడు.

అశ్వత్థామ మరలా తన రథము వద్దకు వచ్చాడు. రథము ఎక్కాడు. కాని అప్పటికే సాయంసమయమైనది. కాబట్టి ఆ రోజుకు యుద్ధము ముగించమని సుయోధనునికి చెప్పాడు. ఇరు పక్షముల వారు తమ తమ శిబిరములకు వెళ్లారు. పాండవుల సేనలు మంగళతూర్యనాదములతో వెళుతుంటే కౌరవ సేనలు విషణ్ణ వదనములతో వెళ్లారు.

అశ్వత్థామ వద్దనుండి వెడలిన వ్యాసుడు అర్జునుని శిబిరమునకు వెళ్లాడు. సాక్షాత్తు ధర్మమూర్తి అయిన వ్యాసునికి అర్జునుడు భక్తితో నమస్కరించి అర్ఘ్యపాద్యాదులతో సత్కరించాడు. అప్పుడు అర్జునునికి కూడా ఒక సందేహం మనసులో మెదులుతూ ఉంది. అది వ్యాసుని ముందు బయట పెట్టాడు అర్జునుడు.

“ వ్యాసమునీంద్రా! నేను రణరంగములో యుద్ధము చేస్తున్నప్పుడు నా ముందు ఒక ఆకారము, పాదములు నేలనంటకుండా, అగ్నిదేవుని మాదిరి వెలుగుతూ, తన చేతిలో క భయంకరమైన  శూలమును ధరించి నేను చంపబోయే వారిని ముందుగా తానే చంపుతూ ఉన్నాడు. ఆ శూలమునుండి అనేకానేక శూలములు ఉద్భవించి శత్రుసంహారం చేస్తున్నాయి.  ఆ తేజోమూర్తి చంపినవారిని నేను నామమాత్రంగా నా బాణములతో చంపుతున్నాను. కాని వారినందరినీ నేనే చంపాను అనుకుంటున్నాను. నిజానికి నేను ఎవరినీ చంపడంలేదు. కాని వారిని చంపిన కీర్తి విజయం నాకు దక్కాయి.   ఇంతకూ ఆ మహానుభావుడు ఎవరు? ఎందుకు అలా చంపుతున్నాడు? నాకు వివరంగా చెప్పండి.” అని అడిగాడు.

ఆ మాటలు విన్న వ్యాసుడు అర్జునునితో ఇలా అన్నాడు. “అర్జునా! అతడు ఎవరోకాదు. ఈ సృష్టికి మూల కర్త.  ఆది మధ్యాంత రహితుడు. ఈ లోకముల కన్నింటికిని ప్రభువు. అవ్యయుడు. వేదములనే తన తత్వ రూపముగా కలవాడు. భక్తపరాధీనుడు. త్రినేత్రుడు. ఆ పార్వతీనాధుడు. ఆ మహాశివుడు అతడే.  అతడు యోగీశ్వరుల హృదయకమలములలో ఎల్లప్పుడూ విహరిస్తుంటాడు.  మనకు గోచరించే చరాచర ప్రకృతి,పురుషుడు అతడే. విషయములకు లోబడని స్వరూపము కలవాడు. నిరాకారుడు. నిర్మలమైన భక్తితో పూజించేవారికి అత్యంతసులభంగా అందేవాడు. నీల కంఠుడు.శంకరుడు. నిత్యుడు. సత్యస్వరూపుడు. ప్రళయకాలాగ్నిని కూడా తన చల్లని కిరణములతో చల్లార్చగల శక్తి ఉన్న బాలచంద్రుని తన శిరోభూషణంగా కలవాడు. అంతటా తానై ఉన్నవాడు. నిర్మలుడు. శాంతిప్రియుడు. అటువంటి రుద్రుడే నీ రథం ముందు నిలిచి నీవు సంహరించ దలచిన వారిని ముందుగా  తానే సంహరిస్తున్నాడు.” అని పలికాడు ఇంకనూ ఆ పరమేశ్వరుని నామములను, దివ్యలీలలను విపులంగా

చెప్పాడు.

"ఓ అర్జునా! అట్టి పరమశివుడు నీ సన్నిధిలో ఉండి నిన్ను కరుణించాడు. నిరుపేదకు పెన్నిధి దొరికినట్లు నీకు ఈశ్వర కరుణాకటాక్షము కలిగింది. నీ జన్మ ధన్యమైనది. ఆ పరమేశ్వరుని అనుగ్రహంతో నీవు విజయుడవవుతావు. సాక్షాత్తు ఆ పరమశివుడే నీ ముందు నడిచి శత్రుసంహారం చేస్తుంటే నీకు కాక మరెవరికి విజయం లభిస్తుంది. నీ తపస్సుకు మెచ్చి నీకు పాశుపతాస్త్రము ప్రసాదించాడు కదా! అంతటితో తనివి తీరక, తన భక్తపరాధీనతను ఈ విధంగా ప్రకటించుకున్నాడు. నీవు పుణ్యాత్ముడవు. ఆ పరమేశ్వరుని నిత్యము ఆత్మలో నిలుపుకొని ధ్యానింపుము. ఆ కరుణాకరుండైన ఆ పరమేశ్వరుడు తన శరణాగతులకు ఆయురారోగ్యైశ్వరములను సకల అభిమతములను ప్రసాదిస్తాడు." అని చెప్పాడు వ్యాసుడు. అర్జునుడు ఆనందంతో పొంగిపోయాడు. ఆ పరమేశ్వరుడికి భక్తితో నమస్కరించాడు. తరువాత వ్యాసునికి భక్తితో ప్రణామం చేసాడు. అర్జునుని సుఖీభవ అని దీవించి వ్యాసుడు అక్కడి నుండి వెడలిపోయాడు.

ఈ ప్రకారంగా జనమేజయునకు వైశంపాయనుడు మహాభారత కధను వివరించాడు అని నైమిశారణ్యంలో ఉన్న శౌనకాది మహా మునులకు ఉగ్రశ్రవసుడు అను సూతి మహా భారత కధను వివరించాడు.

మహాభారతము

ద్రోణ పర్వము

పంచమాశ్వాసము సమాప్తము.

ఈ ఆశ్వాసముతో ద్రోణపర్వము సమాప్తము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహాభారతము

కర్ణపర్వము

ప్రధమాశ్వాసము.

వై శంపాయనుడు జనమేజయునితో మహాభారత కధను ఈ విధం గా చెప్పసాగాడు.

సంజయుడు రెండు రోజుల పాటు కురుక్షేత్రములో యుద్ధరంగమున పర్యటించి, ఈ రెండు రోజుల యుద్ధమును కళ్లారా చూచి, ఆ యుద్ధ విశేషములను ధృతరాష్ట్రునకు చెప్పుటకు హస్తినాపురమునకు వచ్చాడు. తాను వచ్చినట్టు ధృతరాష్ట్రునకు వర్తమానముపంపాడు. అంతఃపురములో ఉన్న ధృతరాష్ట్రుడు, వెంటనే సంజయుని లోపలకు రమ్మన్నాడు. సంజయుడు ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లాడు. ధృతరాష్ట్రుడు సంజయునికి ఉచితాసనము ఇచ్చి గౌరవించాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

“ మహారాజా! నేను యుద్ధ రంగమునపర్యటించి ఈ రెండు రోజుల యుద్ధమును చూచి వచ్చాను. ఆ విశేషములను తమరికి మనవి చేస్తాను. (వ్యాసుని వరప్రభావమువలన సంజయునికి యుద్ధరంగములో పర్యటించినను ఆ బాణములు తగలవు. ఎలాంటి ఆపద కలగదు. పైగా వారి మాటలన్ని స్పష్టంగా వినిపిస్తాయి. అందుచేత సంజయుడు యుద్ధ రంగమునకు వెళ్లి, మొదటి పదిరోజులు యుద్ధమును చూచి, భీష్ముడు పడిపోయిన తరువాత వచ్చి ధృతరాష్ట్రునికి ఆ పది రోజుల యుద్ధ విశేషములు వివరించాడు. తరువాత మరలా యుద్ధ రంగమునకుపోయి నాలుగురోజుల పాటు ఉండి యుద్ధమును

చూచి, ద్రోణుడు మరణించిన తరువాత హస్తినాపురమునకు వచ్చి ఆ నాలుగు రోజుల యుద్ధ విశేషములను వివరించాడు. మరలా ధృతరాష్ట్రుని ఆదేశాను సారము యుద్ధ రంగమునకు పోయి, రెండు రోజుల యుద్ధ విశేషములు చూచి, కర్ణుని మరణానంతరము హస్తినాపురమునకు వచ్చాడు. ధృతరాష్ట్రుని కలిసి ఆ రెండు రోజుల యుద్ధ విశేషములు వివరిస్తున్నాడు. ఇంక చదవండి.)

“ మహారాజా! కర్ణుడు అత్యంత పరాక్రమముతో యుద్ధం చేసాడు. పాండవ సేనలను లక్ష్యపెట్టకుండా చెల్లాచెదరు చేసాడు. కర్ణుని ధాటికి పాండవ సేనలు పారిపోయాయి. రెండురోజుల పాటు పాండవులను వారి సేనలను కలవర పెట్టాడు. కడకు, అర్జునుని బాహుబలమునకు తలవంచాడు. అర్జునుని చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. ఒక మదించిన ఆంబోతు పెద్దపులికి ఆహారమైనట్టు, అర్జునుని కి కర్ణుడు బలి అయ్యాడు. పాండవులపగ చల్లారింది.” అని చెబుతూ సంజయుడు కూడా దుఃఖించాడు.

ఒక్క నిట్టూర్పు విడిచాడు. “మహారాజా! ఇంకొక విషాద వార్త కూడా మీరు వినవలసి యున్నది. నీ కుమారులు జయించెదరు అనే ఆశ అడుగంటి పోయేటట్టు భీమసేనుడి చేతిలో నీ కుమారుడు దుశ్శాసనుడు మరణించాడు. భీమసేనుడు నీ కుమారుని గుండెలు చీల్చి అతని నెత్తురు తాగాడు. నాడు నిండు సభలో చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాడు. మహారాజా! మీ వంతు వచ్చిన రాజ్యమును అనుభవించక, దురాశతో పాండవుల రాజ్యమును కూడా అపహ రించవలెనని దుర్బుద్ధితో మీరు చేసిన అకృత్యములకు ఫలితము అను భవిం పక తప్పుతుందా చెప్పు.” అని అన్నాడు.

దుశ్శాసనుడు మరణించాడు అన్న మాట వినగానే, తన కుమారుడు సుయోధనుడు కూడా మరణించి ఉంటాడు అని తలంచాడు ధృతరాష్ట్రుడు.

ఒళ్లంతా కంపించిది. మూర్ఛపోయాడు. అప్పుడే అక్కడకు వచ్చి విదురుడు, సేవకులు అందరూ ధృతరాష్ట్రుని ఒక శయ్యమీద పరుండచేసి శైత్యోపచార ములు చేసారు.

కొంతసేపటికి తేరుకున్నాడు ధృతరాష్ట్రుడు. తమకు ఈ దుస్థితి కల్పించిన విధిని తిట్టాడు. పాండవుల నీతిని, ధర్మనిరతిని మెచ్చుకున్నాడు. కన్న కొడుకులను సరియైన మార్గములో పెట్టలేని తన అసమర్థతను తిట్టుకున్నాడు. ఇంత వినాశనమునకు కారణమైన శకునిని తిట్టాడు. తనను తాను సంబాళించుకున్నాడు. "సంజయా! నీవు చెప్పి మాటలు నేను సరిగా విన లేదు. మరలా చెప్పు సుయోధనుడు క్షేమంగా ఉన్నాడా. లేక అతను కూడా మరణించాడా." అని ఆతురతగా అడిగాడు.

" మహారాజా! ఈ రెండు రోజుల యుద్ధంలో కర్ణుడు అతని కుమారులు, తమ్ములు మరణించారు. భీమసేనుడు నీ కుమారుడు దుశ్శాసనుని గుండెలు చీల్చి నెత్తురు తాగాడు. ఆ దృశ్యం చూడడానికి అత్యంత భయంకరంగా, అసహ్యకరంగా ఉంది." అని చెప్పగానే "ఆపు సంజయా! ఇంక చాలు. ఊరుకో. ఏమీ చెప్పకు. నీ మాటలతో నా మనస్సంతా కలత చెందింది. నీ మాటలు వినే స్థితిలో లేను." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

కొంచెంసేపు అంతా మౌనంగా ఉన్నారు. తరువాత ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా అన్నాడు. "సంజయా! నేను అనుసరించిన దుర్నీతి వలన, నా కుమారుని బుద్ధిహీనత వలన, ఇలా జరిగింది. సందేహములేదు. నాకు దుఃఖము ఆగటం లేదు సంజయా. ఈ దుఃఖము ఉపశమించే మార్గము కనిపించడం లేదు. అది సరే. ఇప్పుడు ఇరుపక్షములలో ఎవరెవరు బతికి ఉన్నారు. ఎవరెవరు మరణించారు. నాకు వివరంగా చెప్పు. దానికి

సమాధానంగా సంజయుడు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

" మహారాజా! మన యందు భీష్మ, ద్రోణ, కర్ణ, వికర్ణ, వృషసేన, దుశ్శాసన, లక్ష్మణులు మరణించారు. వారిలో విరాజుడు, శతానీకుడు, ద్రుపదుడు, ఘటోత్కచుడు, అభిమన్యుడు,పాండ్యరాజులు, మరణించారు." అని చెప్పాడు.

"సంజయా! ప్రస్తుతము కురు సేనలో ఎవరెవరు వీరులు ఉన్నారు." అని అడిగాడు.

"మహారాజా! కౌరవ సేనలో అశ్వత్థామ, కృతవర్మ, శల్యుడు, శకుని, కృపాచార్యుడు, ఇంకా నీ కుమారులు కొంతమంది బతికి ఉన్నారు. కర్ణుని కుమారులు కొంతమంది బతికి ఉన్నారు. వీరి సాయంతో నీ కుమారుడు సుయోధనుడు తనలో పరాక్రమము తగ్గకుండా పాండవులను జయించ వలెనని ఆశతో ఉన్నాడు." అని చెప్పాడు సంజయుడు.

అతని మాటలో కొంత ఊరట చెందిన ధృతరాష్ట్రుడు, సంజయునితో ఇలా అన్నాడు. "సంజయా! కర్ణుడు మదించిన ఆబోతు వలె ఉండెడి వాడు. అలాంటి వాడు కూడా అర్జునుని చేతిలో చచ్చాడా! ఆశ్చర్యంగా ఉంది. అసలు కర్ణుడు, అర్జునుని, కృష్ణుని కూడా లెక్కచేసేవాడు కాదు. వారిని గెలుస్తాను అంటూనే చనిపోయాడు. వింతగా ఉంది. సంజయా! ఈ కర్ణుని బలపరాక్రమములు చూచుకొని కదా సుయోధనుడు పాండువులతో వైరముపెంచుకొన్నది. అలాంటి కర్ణుడే లేనపుడు ఇంక సుయోధనుని కి బ్రతుకు ఎక్కడిది. రేపటినుండి యుద్ధము ఎలా చేస్తాడు! అసలు ఇంక యుద్ధం చెయ్యడం ఎందుకు వృధా కదా! ఇన్ని వార్తలు విని కూడా నా మనసు

పాషాణం లాగా పగిలిపోకుండా ఉంది.

సంజయా! నా బ్రదుకు చూచావు కదా! నా కళ్లముందే నా కొడుకులు, మనుమలు చనిపోయారని వార్తలు  వింటూ శిలలాగా నిలబడి ఉన్నాను. ఇంక  నావల్ల కాదు. ఎక్కడైనా దూకుతాను. లేకపోతే విషంతాగుతాను. ప్రాయోపవేశం చేస్తాను. ఇలాంటి వార్తలు వింటూ బతకడం వృధా!" అంటూ బలవన్మరణానికి పాల్పడ్డాడు ధృతరాష్ట్రుడు.

అప్పుడు సంజయుడు ఇలా అన్నాడు. "మహారాజా! ఏమిటీ వెర్రి! నీ లాంటి చక్రవర్తి మనోధైర్యము సడలి ఇలా బేలగా మారవచ్చునా! నీవు చదివిన చదువులు, నీ గొప్పదనము  ఒక్కసారి గుర్తుకు తెచ్చుకో. ధైర్యముగా ఉండు." అని ఊరడించాడు.  "అది కాదు సంజయా! కర్ణుడు చనిపోయాడు అని వినగానే నాలో నిరాశ ఆవరించింది. మనకు ఖచ్చితంగా ఓడిపోతాము అన్న భావన బలంగా మనసులో నాటింది. అంతటి కర్ణుడే మరణించాక,  ఇంక యుద్ధం చెయ్యడానికి ఎవరున్నారని సుయోధనుడు యుద్ధం కొనసాగిస్తాడు? అయినా నేను అంత తొందరగా చావనులే. భయపడకు. చచ్చేవాడినే అయితే కర్ణుడు, దుశ్శాసనుడు మరణించాడు అన్న వార్త విన్నతరువాత నా హృదయం వెయ్యి ముక్కలు అయిపోయి ఉండేది. అలా కాలేదంటే నాకు దీర్ఘాయువు ఉందన్నమాట.

ఒకప్పుడు అందరూ నన్ను గౌరవించారు. ఇప్పుడు అందరూ నన్ను  నా దుర్దశను చూచి జాలిపడుతున్నారు. వారి జాలి చూపులు తట్టుకోవడం నాకు వల్లకాదు.  అయినా సంజయా! భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, దుశ్శాసనుడు ఒకరి తర్వాత ఒకరుగా మరణిస్తుంటే ఎలా తట్టుకోను.  అన్నింటికన్నా కర్ణుని చావు నాకు అశనిపాతం అయింది. సుయోధనుడికి తాను గెలుస్తాను అన్న

ఆశ అడియాస అయింది గదా! మన సైన్యం ధైర్యసాహసాలు కోల్పోయింది గదా! ఇంక సుయోధనుడు ఎలా యుద్ధం చేస్తాడు చెప్పు. కర్ణుడు చనిపోయిన తరువాత సుయోధనుడు తాను పాండవులను గెలుస్తాను అని అనుకోవడం కుంటివాడు నడుస్తాను అని అనుకోవడం, ముసలివాడు పడుచు వేశ్యలకోసం ప్రయత్నించడం లాంటిది కదా!

అయినా సంజయా! నాడు ధర్మరాజు మనలో మనకు కలహం ఎందుకు. సామరస్యంగా ఉందాము అని వర్తమానము పంపినా మూర్ఖంగా దానిని తిరస్కరించాను. దానికి ఫలితం నేడు అనుభవిస్తున్నాను. సంజయా! నువ్వేచెప్పావు కదా! భీష్ముడు శరతల్పగతుడైనపుడు నీరు కావాలని అడిగితే అర్జునుడు పాతాళజలమును భీష్మునికి అందించాడు. అప్పుడు భీష్ముడు అర్జునుని ప్రతిభ ను చూచి సుయోధనునితో ఇంకనైనా పాండవులతో వైరము మాని సంధి చేసుకో అని చెప్పాడు. కనీసం అప్పుడు భీష్ముని మాట విన్నా ఈనాడు ఇంత దుర్గతి పట్టకపోను.

సంజయా! గతజలసేతుబంధనమేల! అసలు కర్ణుడు ఎలా చనిపోయాడు. అర్జునుడు భీష్ముని చంపడానికి కపటోపాయం పన్నినట్టు కర్ణుని చంపడానికి కూడా ఏదైనా కపటోపాయం పన్నాడా! మన సైనికులు వీరులూ కర్ణుని రక్షించడానికి ప్రయత్నించలేదా! అందరూకర్ణుని వదిలిపెట్టి పారిపోయారా! సంజయా! కర్ణుడు సామాన్యుడు కాడు కదా! పరశురాముని వలన బ్రహ్మాస్త్రము పొందాడు. పైగా అతనికి సర్పముఖాస్త్రము తెలుసు. అవి కాక అనేక దివ్యాస్త్రములు కర్ణునివద్ద ఉన్నాయి. అన్నింటి కన్నా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఉపాయశాలి. ఆ ఉపాయము తోనే కదా అభిమన్యుని చంపాడు. భీమసేనుని లాంటి వాడిని ఓడించి అవమానించాడు. సహదేవుడిని ఓడించి, ప్రాణాలతో విడిచిపెట్టాడు. అసురవీరుడు, మహామాయావి, నిశాచరుడు,

మాయాయుద్ధనిపుణుడు ఐన ఘటోత్కచుని ఓడించి సంహరించాడు. అలాంటి మహా వీరుడు ఎలా మరణించాడు? అతని దివ్యాస్త్రాలు ఏమయ్యాయి? నశించాయా! ఏదో జరిగి ఉంటుంది. అతని రథమన్నా విరిగి ఉండాలి. అతని దివ్యాస్త్రాలు నిష్ప్రయోజనము అయి ఉండాలి. లేకపోతే కర్ణుని చంపడం ఆ దేవేంద్రునికైనా సాధ్యంగాదు.

సంజయా! అతని సారథి శల్యుడు కదా! కర్ణుని అర్జునుడు చంపే టప్పుడు అశ్వత్థామ, కృపాచార్యుడు, శకుని అడ్డుపడలేదా! కృతవర్మను సుయోధనుడు ఎక్కువగా అభిమానిస్తుంటాడు. మరి అతనైనా కర్ణునికి సాయంగా రాలేదా! కనీసం నాకుమారుడు సుయోధనుడు కూడా కర్ణునికి సాయంగా వెళ్లలేదా! వీళ్లంతా ఏమి చేస్తున్నారు? అశ్వత్థామ,కృప,శకుని, కృతవర్మలు వెంటరాగా, సుయోధనుడు వెనక నడుస్తుంటే, ఏ కారణం లేకుండా కర్ణుడు చచ్చాడు అంటే నమ్మశక్యం కాకుండా ఉంది. సంజయా! అసలు పాండవులు కర్ణుని మీద ఎలా దాడి చేసారు? కర్ణుడు ప్రయోగించిన సర్పముఖాస్త్రము బారి నుండి అర్జునుడు ఎలా బతికి బయటపడ్డాడు. మిగిలిన పాండవులు కర్ణునితో ఎలా యుద్ధం చేసారు? ఈ రెండు రోజులు యుద్ధం ఎలా జరిగింది? ఏంజరిగింది? వివరించు." అని అడిగాడు.

సంజయుడు ఇలా చెప్పసాగాడు. "మహారాజా! ద్రోణాచార్యులు పడిపోయిన తరువాత, సాయంత్రము అయినందున అశ్వత్థామ కౌరవ సేనలను విశ్రాంతి తీసుకొమ్మని ఆ రోజుకు యుద్ధము విరమింపచేసాడు. సుయోధనుడు, తన శిబిరములో అశ్వత్థామ, కర్ణుడు, దుశ్శాసనుడు మొదలగు కౌరవ యోధులతో సమాలోచనలు గావించాడు. ద్రోణుని తర్వాత సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు అని అశ్వత్థా మ అభిప్రాయము అడిగాడు.

(ఇక్కడ సుయోధనుడు రాజకీయం ప్రదర్శించాడు. సుయోధనునికి ఆప్తుడు కర్ణుడు. కాని గురు పుత్రుడు అశ్వత్థామను వదిలి కర్ణుని తాను సర్వసైన్యాధ్యక్షునిగా ప్రతిపాదిస్తే, అశ్వత్థామకు మనస్తాపం కలగవచ్చు కోపం రావచ్చు కాని అశ్వత్థామ తనకు తానుగా నోరు తెరిచి నాకు సర్వసైన్యాధ్యక్ష పదవి ఇమ్మని అడగలేడు. ఈ సందిగ్ధంలో, సూటిగా అశ్వత్థామనే అడిగాడు సుయోధనుడు. అశ్వత్థామ తరువాత సర్వసైన్యాధ్యక్ష పదవికి తగిన వాడు కర్ణుడు. అందుకని అశ్వత్థామ ఖచ్చితంగా కర్ణుని ప్రతిపాదించాలి. ఇదీ సుయోధనుని ఎత్తుగడ.)

అశ్వత్థామ సరిగ్గా సుయోధనుడు అనుకున్నట్టు గానే అన్నాడు. "సుయోధనా! సద్గుణ సంపన్నులైన భీష్ముడు, ద్రోణుడు వెళ్లిపోయారు. ఇంక ఈ భారమును నువ్వే వహించాలి. మన సైన్యములో సర్వసైన్యాధ్యక్ష పదవికి అర్హులు ఎందరో ఉన్నారు. వారిలో ఒకరిని ఎంచుకో. కాని నా అభిప్రాయం ప్రకారము కర్ణుడు దీనికి తగినవాడు. అతని వద్ద అశేషమైన దివ్యాస్త్ర సంపద ఉన్నది. అతను శత్రు సైన్యమును నాశనం చెయ్యడంలో మేటి. పైగా నీకు అత్యంత విశ్వాసపాత్రుడు. అందుకని కర్ణుని సర్వసైన్యాద్యక్షునిగా చేయుము." అని పలికాడు.

సుయోధనుని ఆనందానికి అవధులు లేవు. సుయోధనుడు కర్ణుని చూచి ఇలా అన్నాడు. "మిత్రమా కర్ణా! భీష్మ,ద్రోణుల తర్వాత అంతటి సమర్ధుడికి నువ్వే. ఇన్నాళ్లు పాండవుల మీద పక్షపాతము చేత భీష్మ,ద్రోణులు పాండవులను చంపకుండా ఉపేక్షించారు. లేకపోతే ఆ పాండవులను చంపడానికి భీష్మునికి ద్రోణునికి ఇన్నాళ్లు కావాలా! నీవే సేనా నాయకుడివి అయి ఉంటే పాండవ నిర్మూలనము ఎప్పుడో జరిగి ఉండేది. ఈ పాటికి యుద్ధం ముగిసి పోయి ఉండేది. అందుకే నిన్ను సేనాపతిని చేస్తున్నాను.

పాండవులను నిర్జించి విజయలక్ష్మిని వరించు.” అన్నాడు.

ఈ మాటలకు కర్ణుడు పొంగిపోయాడు. “సుయోధనా! నేను నీకు పాండవుల నందరినీ జయిస్తాను అని మాట ఇచ్చాను. ఆ మాట ఇప్పుడు నెరవేర్చుకుంటాను. నిన్ను సర్వం సహా కురు రాజ్యమునకు పట్టాభిషిక్తుని చేస్తాను. ఈ యుద్ధమునకు నేను ఒక్కడినే చాలు. నీవు ఒక పక్క నిలబడి యుద్ధము ఎలా జరుగుతుందో చూస్తూ ఉండు.” అని గర్వంతో అన్నాడు.

వెంటనే సుయోధనుడు పుణ్యనదీ జలములు తెప్పించాడు. ఒక ఉన్నతాసనమును వేయించాడు. కర్ణుని అందులో ఆశీనుడిని చేసి, పుణ్యనదీ జలములతో అభిషేకించి, పుణ్యాహవాచనము మొదలగు క్రతువులు నిర్వర్తించి, వంది మాగధుల జయజయధ్వానముల మధ్య కర్ణుని సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించాడు.

అప్పుడు కర్ణుడు సుయోధనుని చూచి “మిత్రమా! నాడు నన్ను అంగరాజ్యాభిషిక్తుని చేసి పది మందిలో నా పరువు నిలబెట్టావు. నేడు నన్ను కౌరవ సైన్యమునకు సర్వసైన్యాధ్యక్షుని చేసి గౌరవించావు. ప్రతిగా నేను నీకు ఏమి ఇవ్వగలను. బంధుమిత్రసమేతంగా అర్జునుని చంపి, నీకు కౌరవ సామ్రాజ్యలక్ష్మిని కానుకగా ఇస్తాను. పుత్ర పౌత్ర సమేతంగా నీవు ఈ కౌరవ సామ్రాజ్యమును ఆచంద్రార్కము పాలించు.” అని అన్నాడు.

సుయోధనుడు ఆ మాటలకు పరమానందభరితుడైనాడు. తరువాత ఎవరి నివాసములకు వారు వెళ్లారు. నేను కూడా వెంటనే బయలుదేరి హస్తినా పురమునకు వచ్చి మీకు ద్రోణుని వధ గురించి సవిస్తరముగా వివరించాను మరలా తమరి అనుమతి తీసుకొని మరునాటి ఉదయాని కల్లా యుద్ధ

భూమికి చేరుకున్నాను.

మరునాటి ఉదయం కర్ణుడు, కౌరవ సైన్యములు వెంటరాగా, సర్వ సైన్యాధ్యక్షునిగా యుద్ధభూమి లోకి ప్రవేశించాడు. ఆరోజు యుద్ధములో మకర వ్యూహమును పన్నాడు.

(మకరవ్యూహము అనగా మొసలి ఆకారంలో సైన్యమును నిలపడం. మొసలి ఎలా నీటిలో చొచ్చుకొని పోతుందో అలా శత్రుసైన్యములోనికి చొచ్చుకు పోవడం.)

మొసలి నోరు ఉన్న ప్రదేశములో కర్ణుడు నిలిచాడు. ఒక్కొక్క కన్ను దగ్గర శకుని, అతని కుమారుడు ఉలూకుడు నిల్చున్నారు. తల భాగంలో అశ్వత్థామ నిలిచాడు. మెడప్రాంతములో తన తమ్ములను నిలిపాడు సుయోధనుడు. ఇంక ముందరి పాదముల వద్ద కృతవర్మ, కృపాచార్యుని నియమించాడు. కడుపు భాగము వద్ద సుయోధనుడు తానే స్వయంగా నిల్చున్నాడు. ఇంక వెనక కాళ్ల దగ్గర, శల్యుడు, సుషేణుడు తమ తమ సైన్యములతో నిలబడ్డారు. మొసలి తోక దగ్గర చిత్రుడు, చిత్రసేనుడు తమ తమ సైన్యములతో బారులు తీరారు. మిగిలిన సేనలను వ్యూహము చుట్టు నిలిపాడు కర్ణుడు. ఇలా మకరవ్యూహమును తీర్చిదిద్దాడు కర్ణుడు.

యుధిష్టిరుడు కూడా తమ సైన్యములతో యుద్ధ రంగమును ప్రవేశించాడు. కర్ణుని సర్వసైన్యాధ్యక్షునిగా చూచాడు. ఇదివరకు యుధిష్ఠిరునకు కర్ణుడు అంటూ భయం ఉండేది. ఇప్పుడు అతని వద్ద ఇంద్రశక్తిలేదు. సహజ కవచకుండలములు లేవు. ఆదుకోడానికి ద్రోణుడు లేడు. అందుకని కర్ణుని సునాయాసంగా కడతేర్చవచ్చును అనుకున్నాడు

యుధిష్ఠిరుడు.

అర్జునుని చూచి ఇలా అన్నాడు. "అర్జునా! చూచావా! కర్ణుడు కురు సైన్యములకు అధిపతి అయ్యాడు. మనము 12 సంవత్సరములు అరణ్యవాసము చెయ్యడానికి ముఖ్యకారకుడు కర్ణుడు. అతని మీద పగ తీర్చుకో. కౌరవ సేనలో చెప్పుకోతగ్గవాడు కర్ణుడు ఒక్కడే. నీవు అతనిని సంహరిస్తే, కౌరవులను మనము అనాయాసంగా జయించవచ్చు. నీవు విజయుడవు అవుతావు. కాబట్టి కర్ణుడు పన్నిన మకర వ్యూహమునకు తగ్గ వ్యూహము పన్ను." అని అన్నాడు.

అర్జునుడు తమ సేనలను అర్ధ చంద్ర వ్యూహములో మోహరించాడు. వ్యూహ మధ్యన తాను నిలబడ్డాడు. ఎడమ కొమ్మున భీమసేనుడిని, కుడి కొమ్మున ధృష్టద్యుమ్నుడిని, ధర్మరాజును, నకులసహదేవులను వ్యూహము వెనక భాగమున నిలబెట్టాడు. అర్జునుడికి చక్రరక్షకులుగా యుధామన్యుడు, ఉత్తమౌజుడు నిల్చున్నారు. ఈ ప్రకారము ఇరు పక్షములు తమ తమ వ్యూహములు అమర్చుకొని యుద్ధమునకుసిద్ధంగా ఉన్నారు.

మహారాజా! ఆ రోజు కర్ణుడి చేతిలో కృష్ణార్జునులు ఓడిపోతారు అని నీ కుమారుడు సుయోధనుడు మహదానందంతో ఉన్నాడు. కాని అదేరోజు కర్ణుడు అర్జునుని చేతిలో యుద్ధములో మరణిస్తాడని యుధిష్టిరుడు గట్టి నమ్మకంతో ఉన్నాడు.

తమ తమ సైన్యాధ్యక్షులు ఇచ్చిన ఆజ్ఞలతో ఇరుపక్షముల సైన్యము ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి. ఏనుగులు, రథములు, హయములు, కాల్బలము క్షణాలలో నాశనం అవుతున్నాయి. కర్ణుడు, అర్జునుడు ఒకరికి

ఒకరు తీసిపోనట్టు పోరుతున్నారు. ఏనుగుల కాళ్లకింద, రథచక్రముల కింద పడి సైన్యము చితికిపోతున్నారు.

సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, చేకితానుడు, ఉపపాండవులు కలిసి, కౌరవ సేనలలో ఉన్న ప్రభద్రక, ఛేది, పాండ్య, చోళ, మగధ, వంగ, మొదలగు దేశముల నుండి సుయోధనునికి సాయంగ వచ్చిన సైన్యములను తరుము తున్నారు. భీమసేనుడు తన గజవాహనము మీద తిరుగుతున్నాడు. ఆ గజము కాళ్ల కిందపడి కౌరవ సేనలు మరణిస్తున్నారు.

ఇంతలో, కులూత దేశపు రాజు క్షేమధూర్తి తన ఏనుగు మీద వచ్చి భీమసేనుని ఎదుర్కొన్నాడు. క్షేమధూర్తి సైన్యములు భీమసేనుని చుట్టుముట్టాయి. భీమసేనుడు క్షేమధూర్తి ఒకరి మీద ఒకరు ఈటెలు విసురు కున్నారు. ఒకరి విల్లు ఒకరు నరుక్కున్నారు. వాళ్ల ఏనుగులు కూడా ఒకదాని చుట్టు ఒకటి తిరుగుతూ కొండల మాదిరి కదులుతున్నాయి. క్షేమధూర్తి భీమసేనుని గుండెల్లో కి ఒక ఈటె దించాడు. భీమసేనుడు ప్రయోగించిన ఈటెలను మధ్యలోనే నరుకుతున్నాడు క్షేమధూర్తి. భీమసేనుడి శరీరానికి గుచ్చుకునేట్టు 60 బాణాలు ప్రయోగించాడు. భీమసేనుడు తన విల్లు తీసుకొని క్షేమధూర్తి ఎక్కిన ఏనుగు ఒంటినిండా బాణములు గుచ్చాడు. ఆ బాధకు తాళలేక క్షేమధూర్తి ఎక్కిన ఏనుగుపారిపోయింది.

భీముడు క్షేమధూర్తిని తరుముతున్నాడు. అతి కష్టం మీద క్షేమధూర్తి తన ఏనుగును అదుపులోకి తెచ్చుకొని మరలా భీమసేనుని శరీరం మీద, అతని ఏనుగు మీద శరప్రయోగం చేసాడు. ఆ దెబ్బలకు భీమసేనుడు ఎక్కిన ఏనుగు కిందపడిపోయింది. తన గద తీసుకొని భీమసేనుడు, పడిపోయిన ఏనుగు మీదినుండి కిందికి దిగాడు. ఒకే ఒక దెబ్బతో క్షేమధూర్తి ఎక్కిన

ఏనుగును పడగొట్టాడు. క్షేమధూర్తి తన ఏనుగు మీదినుండి కిందికి దూకి కత్తి తీసుకున్నాడు. భీముడు తన గద పైకి ఎత్తి క్షేమధూర్తి తలమీద మోదాడు. క్షేమధూర్తి తలపగిలి అక్కడే కూలబడి మరణించాడు. క్షేమధూర్తి మరణించ గానే అతని సైన్యము కకావికలై పారిపోయాయి. భీమసేనుడు ఉత్సాహంతో కర్ణుడి వైపు పోతున్నాడు.

కర్ణుడు తన బాణములతో పాండవ సైన్యములోని ఏనుగుల తలలు పగుల గొడు తున్నాడు అవి కిందపడి మరణిస్తున్నాయి. ఆ సమయంలో నకులుడు కర్ణునితో యుద్ధం చేస్తున్నాడు. భీమసేనుడు అశ్వత్థామను, సాత్యకి కేకయ రాజులయిన విందానువిందులను, చిత్రసేనుడు శ్రుతవర్మను, ప్రతి వింధ్యుడు చిత్రుడు అనే రాజును, యుధిష్ఠిరుడు సుయోధనుని, అర్జునుడు సంశప్తకులను, ధృష్టద్యుమ్నుడు కృపాచార్యుడిని, శిఖండి కృతవర్మను, శృతకీర్తి శల్యుడిని, సహదేవుడు దుశ్శాసనుడిని ఎదుర్కొన్నారు. పోరు ఘోరంగా సాగుతూ ఉంది.

సాత్యకి విందానువిందుల విల్లులు నరికాడు. వారి శరీరముల నిండు బాణములతో ముంచెత్తాడు. విందానువిందులు వేరే ధనుస్సులు తీసుకొని మరలా సాత్యకి మీద శరప్రయోగం చేసారు. సాత్యకి ఒక పదునైన బాణంతో అనువిందుడి తలనరికాడు. తమ్ముడు చనిపోగానే విందుడు సాత్యకిని అనేక బాణములతో కొట్టాడు. సాత్యకి, విందుడు ఒకరి సారథిని ఒకరు చంపు కున్నారు. ఒకరి హయములను ఒకరు నరుక్కున్నారు. ఒకరి రథము ఒకరు విరగ్గొట్టుకున్నారు. ఇద్దరూ తమ తమ రథములు దిగి కత్తులు డాలుతీసుకొని కత్తియుద్ధం చేస్తున్నారు. ఆ యుద్ధంలో సాత్యకి పక్కకు ఒంగినట్టు వంగి, ఒకే వేటుతో విందుని తల ఖండించాడు. ~~ఈ~~ ప్రకారంగా సాత్యకి, విందాను విందులను చంపాడు. పక్కనే ఉన్న యుధామన్యుడి రథము ఎక్కాడు.

త్వరలో మరొక రథము సమకూర్చుకున్నాడు. కైకేయ బలములను తరుము తున్నాడు.

ఇంతలో, చిత్రసేన మహారాజు, సహదేవుని కుమారుడైన శ్రుతకర్మతో పోరుతున్నాడు. చిత్రసేనుడు ఐదు వాడిబాణములతో శ్రుతకర్మను కొట్టాడు. దానికి కోపించి శ్రుతకర్మ చిత్రసేనుని మూర్ఛపోయేట్టు కొట్టాడు. చిత్రసేనుడు తెలివితెచ్చుకొని, శ్రుతకర్మ విల్లు విరగ్గొట్టాడు. శ్రుత కర్మ మరొక విల్లు తీసుకొని ఒకే ఒక వాడియైన బాణంతో చిత్రసేనుని తల ఎగుర గొట్టాడు. తమ మహారాజు పడిపోవడం చూచి చిత్రసేనుని సైన్యములు విజృంభించాయి. ఒక్కసారిగా శ్రుత కర్మను చుట్టుముట్టాయి. శ్రుత కర్మ అమితమైన పరాక్రమంతో వారిని దూరంగా తరిమివేసాడు.

మరొక పక్క ప్రతివింధ్యుడు చిత్రుడితో యుద్ధం చేస్తున్నాడు. ప్రతి వింధ్యుడు చిత్రుని రథసారథి గుండెల్లో మూడు నారసములు దించాడు. అతని కేతనము విరిచాడు. విల్లు విరిచాడు. చిత్రుడు విసిరిన ఈటెను రెండుగా విరిచాడు. చిత్రుడు కోపంతో తన గద విసిరాడు. ఆ గదాయుధము దెబ్బకు ప్రతి వింధ్యుని హయములు, రథసారది మరణించారు. ప్రతి వింధ్యునికి కోపం వచ్చి ఒక తోమరమును చిత్రుని మీదికి విసిరాడు. ఆ తోమరము చిత్రుని గుండెలను చీల్చింది. అతను కింద పడి మరణించాడు. చిత్రుడు మరణించగానే కౌరవ సైన్యములు ప్రతి వింధ్యునితో తలపడ్డాయి. ఇంతలో పాండవ సేన అతనికి సాయంగా వచ్చారు. ప్రతి వింధ్యుని ధాటికి తట్టుకోలేక కౌరవసేనలు పారిపోయాయి.

మరొక పక్క భీమసేనుడు అశ్వత్థామ తో యుద్ధం చేస్తున్నాడు. అశ్వత్థామ భీమసేనుని రథమును తన బాణములతో కప్పివేసాడు.

భీమసేనుడు కూడా అశ్వత్థామ మీద బాణ వర్షము కురిపించాడు. ఒకరితో ఒకరు భయంకరంగా పోరుతున్నారు. భీముడు, అశ్వత్థామ ఒకరి కేతనములు ఒకరు విరగ్గొట్టుకున్నారు. ఒకరి సూతుడిని ఒకరు బాణాలతో కొట్టారు. ఒకరి దేహములలో ఒకరు బాణములను దించారు. ఇది చూచారు ఇరువురి సారధులు. ఇంకా అక్కడ ఉంటే ముప్పు అని వారు తమ తమ రధములను యుద్ధ భూమి నుండి దూరంగా తీసుకుపోయారు.

అర్జునుని కుమారుడు శృతకీర్తి, శల్యునితో యుద్ధం చేస్తున్నాడు. శల్యుడు శృతకీర్తి విల్లు విరగ్గొట్టాడు. అతని శరీరము మీద ఏడు బాణములను దించాడు. శృతకీర్తి మరొక విల్లు తీసుకొని శల్యుని మీద 64 బాణములు సంధించాడు. మరలా శల్యుడు 90 బాణములను శృతకీర్తి మీద ప్రయోగించి అతని విల్లు మరలా విరగ్గొట్టాడు. శృతకీర్తి తన గదను తీసుకున్నాడు. శల్యుడు దానిని కూడా ముక్కలు చేసాడు. శృతకీర్తి సారధిని నరికాడు. అప్పుడు రధాశ్వములు బెదిరి శృతకీర్తిరధమును దూరంగా లాగుకొని వెళ్లాయి. తరువాత శల్యుడు ధర్మరాజు సైన్యములోకి ప్రవేశించి అందరినీ నరుకుతున్నాడు.

మరొక పక్క సహదేవుడు, దుశ్శాసనుడు యుద్ధం చేస్తున్నారు. దుశ్శాసనుడు సహదేవుని వక్షస్థలము మీద నిశితమైన బాణములతో కొట్టాడు. సహదేవుడు విజృంభించి దుశ్శాసనుని 70 బాణములతో కొట్టాడు. దుశ్శాసనుడు సహదేవుని విల్లు విరగ్గొట్టాడు. తను కూడా 70 బాణములతో సహదేవుని కొట్టాడు. అప్పుడు సహదేవుడు ఒక కత్తి తీసుకొని దుశ్శాసనుని విల్లు విరగ్గొట్టాడు. దుశ్శాసనుడు కత్తితీసుకొని సహదేవుని మీదికి విసిరాడు. సహదేవుడు దానిని మధ్యలోనే నరికాడు. దుశ్శాసనుడు మరొక విల్లు తీసుకొని సహదేవుని మీద 64 పదునైన బాణములు ప్రయోగించాడు. వాటినన్నింటినీ

సహదేవుడు మధ్యలోనే త్రుంచాడు. సహదేవుడు 100 శిలీముఖములు దుశ్శాసనుని మీదికి వదిలాడు. దుశ్శాసనుడు వాటిని మూడుబాణములతో త్రుంచాడు. రెండు సాయకములను సహదేవుని మీద ప్రయోగించాడు. సహదేవుడు ఒక కాంతులు వెదజల్లే ఒక అస్త్రమును దుశ్శాసనుని మీద ప్రయోగించాడు. ఆ అస్త్రము దుశ్శాసనుని కవచమును చీల్చింది. ఆ దెబ్బకు దుశ్శాసనుడు మూర్ఛపోయాడు. అతని సారధి వణుకుతూ దుశ్శాసనుని రథమును దూరంగా తోలుకొని వెళ్లాడు.

ఆ సమయములో కర్ణుడు నకులుని తో యుద్ధం చేస్తున్నాడు. "కర్ణా! ఈ రోజు మంచి రోజు. నిన్ను నా ఎదుట పడేట్టు చేసాడు. కౌరవ పాండవుల మధ్య వైరమునకు కారణము నువ్వు. నిన్నుచంపనిది కాని నాకు కసి తీరదు. ఈ రోజుతో నీకు ఆయువు సరి." అంటూ కర్ణుడి మీదికి దూకాడు నకులుడు.

"ఓ నకులా! నీవు రాజకుమారుడవు.మహాస్త్ర కోవిదుడవు. నీవు ఆ ప్రకారము మాట్లాడటం సహజమే. కాని వృధా మాట లెందుకు. రా! మనం ఇద్దరం యుద్ధం చేద్దాము. మన బలాబలములు తేల్చుకుందాము." అని అన్నాడు కర్ణుడు.

కర్ణుడు నకులుని 73 బాణములతో కప్పివేసాడు. నకులుడు కూడా మరొక 70 వాడియైన బాణములతో కర్ణుని కొట్టాడు. కర్ణుడు నకులుని విల్లు విరిచాడు. నకులుడు మరొక విల్లుతీసుకొని 70 బాణములతో కర్ణు ని శరీరం అంతా కొట్టాడు. మరొక బాణంతో కర్ణుని ధనుస్సువిరిచాడు. 300 బాణము లతో కర్ణుని రథమును కప్పివేసాడు. కర్ణుడు మరొక ధనుస్సు తీసు కున్నాడు. 5 బాణములను నకులుని వక్షస్థలములో దింపాడు. నకులుడు ఏడు బాణము లతో కర్ణుని ధనుస్సు విరిచాడు. కర్ణుడు మరొక విల్లు తీసుకున్నాడు. ఆ

ప్రకారంగా కర్ణుడు నకులుడు ఒకరికి ఒకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు.

ఆ సమయంలో ద్రుపదుని సేనలు నకులునికి సాయంగా వచ్చాయి. వారిపై కర్ణుడు అతి క్రూరమైన బాణములు ప్రయోగించి వారిని చెదరగొట్టాడు. కర్ణుడు మరలా నకులుని విల్లు విరిచాడు. అతని హయములను చంపాడు. సారథిని గాయపరిచాడు. నకులుని చక్రరక్షకులను చంపాడు. నకులుని కేతనము విరిచాడు. అప్పుడు నకులుడు కత్తి డాలు తీసుకొని కర్ణుని ఎదుర్కొన్నాడు. కర్ణుడు వాటిని రెండుగా నరికాడు. నకులుడు గద తీసు కున్నాడు. కర్ణుడు ఆ గదను పగులగొట్టాడు. అంతటితో ఆగక కర్ణుడు నకులుని ఆయువు పట్టు లో కొడుతున్నాడు. కర్ణుని బాణము దెబ్బలకు తట్టుకోలేక నకులుడు పారిపోయాడు. కర్ణుడు నకులుడిని వెంబడించి పట్టుకున్నాడు.

"నకులా! ఇందాక నన్ను వృధాగా అనరాని మాటలు అన్నావు! తప్పు కదా! మాట్లాడేటప్పుడు ఎవరితో మాట్లాడుతున్నాను, ఎన్ని మాటలు మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి, అని తెలుసుకొని మాట్లాడు. కనీసం నీ స్థాయికి తగ్గట్టు మాట్లాడు. కనీసం ఇప్పటికన్నా నా కంటే నీవు తక్కువ స్థాయి వీరుడవు అని తెలుసుకున్నావు అంతే చాలు. యుద్ధం చేసేటప్పుడు నీ బలము ఎదిరి బలము తెలుసుకొని యుద్ధం చెయ్యి. అంతేకాని నీ కన్నా బలవంతుని తో యుద్ధం చేసి పారిపోకూడదు. నీవు నా కన్నా చాలా చిన్నవాడవు. అందుకని నిన్ను నేను చంపను. విడిచిపెడుతున్నాను. కుమారా! నీవు అర్జునుని దగ్గరకు పో." అని అన్నాడు.

( ఆ సమయంలో తాను తన తల్లి కుంతికి ఇచ్చిన మాట గుర్తుకు

వచ్చింది కర్ణునికి. అందుకే నకులుని ప్రాణాలతో విడిచిపెట్టాడు.) నకులుడు చేసేది లేక సిగ్గుతో తల వంచుకొని వెళ్లి యుధిష్ఠిరుని రథం ఎక్కాడు. అప్పటికి మధ్యాహ్నం అయింది.

నకులుని పరాభవంతో కర్ణుడు విజృంభించాడు. పాండవ సేనను ఛిన్నాభిన్నం చేస్తున్నాడు. సారథులనుచంపుతున్నాడు. హయములను నేలకూలుస్తున్నాడు. రథములు విరగ్గొడుతున్నాడు. రథికుల తలలు నరుకుతున్నాడు. పాండవ సేనను నిర్మూలనం చేస్తున్నాడు.

ఆ సమయంలో యుయుత్సుడు ఉలూకుడిని ఎదుర్కొన్నాడు. ఉలూకుడు యుయుత్సుని విల్లు విరిచాడు. కేతనము త్రుంచాడు. యుయుత్సుడు మరొక ధనుస్సుతీసుకున్నాడు. ఉలూకుడి వక్షస్థలము మీద 5 బాణములు గుచ్చాడు. ఉలూకుడు ఒకే ఒక్క బాణంతో యుయుత్సుడి సారథిని చంపాడు. రథాశ్వములను చంపాడు. యుయుత్సుడు తన రథము దిగి మరియొక రథము ఎక్కాడు. ఉలూకుడు తన రథమును పాంచాల సైన్యము మీదికి పోనిచ్చాడు.

శ్రుత కర్మ నకులుని కుమారుడైన శతానీకుని ఎదుర్కొన్నాడు. అతని హయములను చంపాడు. సారథిని చంపాడు. శతానీకుడు తన గదను శ్రుతకర్మ మీదికి విసిరి అతని రథము విరగగొట్టాడు. అతని రథ సారథిని, హయములను చంపాడు. శ్రుత కర్మ వేరు రథము మీదకు ఎక్కాడు.

భీముని కుమారుడు శ్రుతసోమునితో శకుని యుద్ధం చేస్తున్నాడు. శ్రుతసోముడు శకుని మీద అనేకానేక అస్త్ర శస్త్రములు ప్రయోగించాడు. శకుని వాటిని ముక్కలుగా నరికాడు. శకుని తన వాడియైన బాణములతో

శ్రుతసోముని రథమును విరిచాడు. హయములను చంపాడు. పతాకమును విరిచాడు. శ్రుతసోముడు నేలమీదకు దూకాడు. నేలమీది నుండే శకుని రథమును తన బాణములతో ముంచెత్తాడు. శకుని ఒక పదునైన బాణముతో శ్రుతసోముని విల్లు నరికాడు. శ్రుతసోముడు ఒక కత్తి తీసుకొని శకుని వేస్తున్న బాణముల నన్నింటిని నరుకుతున్నాడు. శకుని ఒకే ఒక బాణంతో శ్రుతసోముడు పట్టుకున్న కత్తి విరగ్గొట్టాడు. శ్రుత సోముడు విరిగిన కత్తిని విసిరి  శకుని విల్లును విరిచాడు.   వెంటనే వెళ్లి శ్రుతకీర్తి రథం ఎక్కాడు. శకుని మరొక విల్లు చేతబూని పాండవ సేనను నాశనం చేస్తున్నాడు.

మరొక పక్క ధృష్టద్యుమ్నుడు కృపాచార్యునితో యుద్ధం చేస్తున్నాడు. తన బావగారిని చంపిన ధృష్టద్యుమ్నుని చంపాలని కృపాచార్యుడు శతవిధాల ప్రయత్ని స్తున్నాడు. ధృష్టద్యుమ్నుని మీద అనేక పదునైన శరములు ప్రయోగించాడు. సారధిని, హయములను కొట్టాడు. ఇది చూచాడు ధృ ష్టద్యుమ్నుని రథసారధి. అతని తో ఇలా అన్నాడు. "ధృష్టద్యుమ్నా! ఈ బ్రాహ్మణుడు అత్యంత భుజశాలి. అస్త్రవిద్యాసంపన్నుడు. ఇతనిని నువ్వు చంపలేవు. ఇతని తో యుద్ధం ప్రస్తుతం మంచిదికాదు.   మన రథమును అవతలకు తీసుకొని వెళ్లమంటావా." అని అడిగాడు.  సారధి ఆలోచన మంచిది గానే కనిపించింది ధృష్టద్యుమ్నునికి. అలాగే అన్నాడు. సారధి ధృ ష్టద్యుమ్నుని రథమును పక్కకు  మళ్లించాడు. తమ రథమును భీమసేనుని రథము వద్దకు తీసుకొని వెళ్లాడు.

కృపాచార్యుడు మహోత్సాహంతో ధనుష్టంకారం చేసి శంఖము పూరించాడు.  పాండవ సేనలో చొరబడి వారిని నాశనం చేస్తున్నాడు. ఇంతలో శిఖండి కృతవర్మను  ఎదుర్కొన్నాడు. శిఖండి 5 శరములను కృతవర్మ గుండెలకు గురిపెట్టి కొట్టాడు.  కృతవర్మ 60 బాణములతో శిఖండిని నిలువెల్లా

కొట్టి అతని విల్లు విరగ్గొట్టాడు. కృతవర్మ మరొక విల్లు తీసుకొని 70 బాణము లతో శిఖండిని శరీరం అంతా రక్తం కారేట్టు కొట్టాడు. శిఖండి కూడా కృతవర్మ మీద 3 అతి నిశితమైన బాణములు ప్రయోగించాడు. కాని కృతవర్మ ప్రయోగించిన నారాచముల ధాటికి తట్టుకోలేక శిఖండి మూర్ఛపోయాడు. శిఖండి రథసారథి తన రథమును అక్కడి నుండి పక్కకు మరలించాడు. శిఖండి సైన్యము కూడా పారిపోయింది.

అర్జునుడు త్రిగర్తమహారాజుతో యుద్ధం చేస్తున్నాడు. త్రిగర్తునికి శిబి, త్రిగర్త, సాల్వ, సంశప్తక సైన్యము తోడుగా నిలిచాయి. అతని సోదరులైన సత్యసేనుడు, చంద్రదేవుడు, మిత్రదేవుడు, మిత్రవర్మ, సౌశ్రుతి, సువర్మ, సుశర్మ మొదలగు వారు కూడా అతనికి తోడుగా ఉన్నారు. వారందరూ అర్జునుని మీద శరవర్షము కురిపిస్తున్నారు. ఆ శర వర్షమునకు చలించ కుండా అర్జునుడు వారిని కూడా తన బాణములతో ముంచెత్తాడు. 5 బాణములు ప్రయోగించి సౌశ్రుతిని చంపాడు. 8 బాణములతో చంద్రదేవుడిని చంపాడు. శత్రుదేవుడిని శిలీముఖములతో సంహరించాడు.

సత్యసేనుడు ఒక ఈటెను బలంగా విసిరాడు. అది కృష్ణుని భుజాన్ని చీల్చింది. అతని చేతిలోని కొరడా కింద పడింది. అది చూచి అర్జునుడు కోపోద్రిక్తుడయ్యాడు. ఒకే బాణంతో సత్యసేనుడి తల నరికాడు. మరొక బాణంలో మిత్రవర్మను చంపాడు. త్రిగర్త సైనికులు అర్జునుని చుట్టుముట్టారు. కాని అర్జునుడు తన బాణములతో వారిని చెల్లాచెదరు చేసాడు. వెండి మొన గల బాణమును ప్రయోగించి మిత్రసేనుడి తల నరికాడు. మరొక ఇనప బాణంతో సువర్మ వక్షస్థలంలో కొట్టాడు. సంశప్తకులు పెద్దగా అరుచుకుంటూ అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుని మీద అనేక బాణములు, అస్త్రములు ప్రయోగించారు.

వారి ఆర్భాటం చూసి అర్జునుడు చిరునవ్వు నవ్వాడు. వారి మీద ఇంద్ర అస్త్రము ప్రయోగించాడు. ఆ ఇంద్ర అస్త్రములో నుండి భల్లము, అంజలికము మొదలగు అనేక రకములైన ఆయుధములు వెడలి సంశప్తకు లను సంహరింపసాగాయి. రథములు విరుగుతున్నాయి. పతాకములు పతనమవుతున్నాయి. సారధులు చస్తున్నారు. ఏనుగులు, హయములు, సైనికుల కళేబరములతో రణభూమి నిండిపోయింది. రక్తం ఏరులైపారుతూ ఉంది. అర్జునుని అస్త్ర శస్త్ర ధాటికి తట్టుకోలేక సంశప్తక సేన పారిపోయింది.

మరొక పక్క సుయోధనుడు ధర్మజునితో యుద్ధం చేస్తున్నాడు. సుయోధనుడు ధర్మజుని మీద తొమ్మిది బాణములు సారథి మీద ఒక బాణము వేసాడు. దానికి ధర్మజుడు కోపించి, సుయోధనుని హయములను, రథ సారధిని కొట్టాడు. పతాకమును విరిచాడు. సుయోధనుడు తీసుకున్న ఖడ్గముకూడా విరగ్గొట్టాడు. దానితో సుయోధనుడు రథము నుండి కిందికి దుమికి, యుద్ధరంగమునుండి తొలగిపోయాడు. అది చూచి అశ్వత్థామ, కర్ణుడు, కృపాచార్యుడు ఇతర రాజులుసుయోధనునికి సాయంగా వచ్చారు. భీమార్జున నకుల సహదేవులు ధర్మజునికిసాయంగా వచ్చారు. అప్పటికి అపరాహ్ణము అయింది. మహా మహా వీరులందరూ ఒక్కచోటికి చేరుకున్నారు. తమ తమ బలములను ఉత్సాహ పరుస్తూ యుద్ధం చేస్తున్నారు. యుద్ధం భయంకరంగా సాగుతూ ఉంది." అని చెపుతున్నసంజయునికి అడ్డు తగిలి ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు.

" సంజయా! అందరి గురించి చెపుతున్నావు. మా సుయోధనుని గురించి చెప్పు. అతను ఏమయ్యాడు? ఎక్కడకు వెళ్లాడు?" అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

"ధృతరాష్ట్ర మహారాజా! నీకుమారుడు విరథుడు అయ్యాడే కాని రణరంగమునుండి పారిపోలేదు. మరియొక రథమును సమకూర్చుకొని వెంటనే రణరంగమునకు వచ్చాడు. తన సారథితో "సారథీ! నీవు వెంటనే మన రథమును ధర్మరాజు రథము వద్దకు పోనిమ్ము" అని అన్నాడు. ఇది చూచాడు ధర్మరాజు "సారథీ ఆ వచ్చువాడు సుయోధనుడు. మన రథము అతని రథమునకు ఎదురుగా నిలుపుము." అని అన్నాడు. ఆ మహా యోధులిద్దరూ ఎదురెదురుగా నిలబడి ఉన్నారు. మహా కోపంతో సుయో ధనుడు యుధిష్ఠిరుని విల్లు విరిచాడు. ధర్మరాజు మరొక విల్లు తీసు కొని సుయోధనుని విల్లు నరికాడు. నీ కుమారుడు మరొక ధనుస్సు తీసుకొని ధర్మరాజు మీద బాణప్రయోగము చేసాడు. ఒకరి శరీరము మీద ఒకరు బాణవృష్టి కురిపించుకున్నారు. ఇద్దరి శరీరములు గాయపడ్డాయి.

సుయోధనుడు ఒక బల్లెమును ధర్మజుని మీదికి విసిరాడు. ధర్మజుడు దానిని మధ్యలోనే ఖండించి సుయోధనుని గుండెల మీద కొట్టాడు. ధర్మరాజు ఒక శిలీముఖముతో సుయోధనుని శరీరం చీలేట్టు కొట్టాడు. సుయోధనుడు తన గద తీసుకున్నాడు. కిందికి దిగి ధర్మరాజు మీదికి వస్తున్నాడు. ధర్మరాజు శక్తి బాణము సుయోధనుని మీద ప్రయోగించాడు. సుయోధనుడు మరలా రథం ఎక్కి ధర్మజుని మీద బాణప్రయోగము చేసాడు. కాని అప్పటికే సుయోధనునికి బాగా రక్తస్రావము అయింది. అందుకనీ ఒకింత మూర్ఛిల్లాడు. ఇది చూచి కృతవర్మ సుయోధనునికి, యుధిష్ఠిరునికి మధ్యలో ప్రవేశించాడు. ఇది చూచి భీమసేనుడు కృతవర్మను ఎదుర్కొన్నాడు. అప్పుడు కౌరవ సైన్య ము కృతవర్మకు సాయంగా వచ్చింది.

ఇంతలో సుయోధనుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. ఎదురుగా అర్జునుడు కనిపించాడు. అర్జునుని మీద అత్యంత పదునైన బాణములను

వేసాడు. వెంటనే అర్జునుడు సుయోధనుని పతాకమును తుంచి, సారథిని, హయములను కొట్టాడు. అశ్వత్థామ ఆ బాణములను మధ్యలోనే తుంచాడు. అర్జునుడు సుయోధనుని వదిలి అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. అశ్వత్థామ విల్లును విరిచి అతని హయములను, సంహరించాడు. ఇంతలో కృపాచార్యుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు కృపాచార్యుని ధనుస్సు ఖండించాడు. కృతవర్మ అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు కృతవర్మ విల్లును ఖండించి, అతని పతాకమును పడగొట్టాడు. హయములను చంపాడు. ఇంతలో దుశ్శాసనుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. అర్జునుడు అతని విల్లురెండుగా ఖండించాడు.

అర్జునుడు వీరిని వదిలి కర్ణుని ఉన్న వంకకు తన రధముపోనిచ్చాడు. అది చూచి కర్ణుడు అర్జునుని మూడు బాణములతోనూ, కృష్ణుని 20 బాణములతోనూ ఒళ్లు చీరుకుపోయేట్టు కొట్టాడు. అప్పటిదాకా కర్ణుడు సాత్యకితో యుద్ధం చేస్తున్నాడు. అర్జునుడు వచ్చిన తరువాత కూడా కర్ణుడు, అర్జునునితోనూ సాత్యకితోనూ కలిసి యుద్ధం చేస్తున్నాడు. కర్ణుడు 100 శిలీముఖ బాణములతో సాత్యకి సారధిని, పతాకమును, హయములను, రథమును కొట్టాడు.

ఇది చూచిన యుధామన్యుడు, శిఖండి, ద్రౌపదేయులు, ఉత్తమౌజుడు, యుయుత్సుడు, నకులసహదేవులు, ధృష్టద్యుమ్నుడు, చేకితానుడు, ప్రభద్రకము, ఛేది, కరూశ,మాత్స్య, కేకయ రాజ కుమారులు అర్జునునికి సాయంగా వచ్చారు. కర్ణుడి మీద పలు అస్త్ర శస్త్రములను ప్రయోగించాడు. కాని కర్ణుడు అత్యంత చాకచక్యముతో ఆ అస్త్రములను తిప్పి కొట్టాడు. తన మీదకు వచ్చిన పాండవ వీరులను వారి సైన్యమును కకావికలు చేసాడు.

ఇది చూచిన అర్జునుడు, కర్ణుడు ప్రయోగించిన అస్త్రములను అన్నింటిని నిర్వీర్యము చేసాడు. తన శిలీముఖ బాణములతో కౌరవ సేనలను చెదరగొట్టాడు. అప్పటికి సాయంత్రం అయింది. నలుపక్కలా చీకట్లు కమ్ముకుంటున్నాయి. అప్పటికి కౌరవ సేనలు అర్జునుడి ధాటికి తట్టుకోలేక పారిపోతున్నాయి. పాండవ సేనలు కూడా తమ తమ విడుదులకు చేరుకున్నాయి. కర్ణుని మొదటి రోజు యుద్ధం అలా ముగిసింది." అని సంజయుడు ధృతరాష్ట్రమహా రాజుకు కర్ణుని మొదటిరోజు యుద్ధ విశేషములను వివరించాడు.

అది విన్న ధృతరాష్ట్రుడు "సంజయా! నాకు తెలియక అడుగుతాను. అర్జునుడు కౌరవులనందరినీ చంపదల్చుకుంటే కర్ణుడు అడ్డు వచ్చినా, అందరినీ ఆరోజే చంపి ఉండేవాడు. ఎందుకంటే అతను దేవేంద్రుని కొడుకు. నా కుమారుడి లాంటి మామూలు మానవమాత్రులు అతనికి ఒక లెక్కా చెప్పు. అయినా అర్జునుడు సామాన్యుడా! యాదవ వీరులను ఎదిరించి సుభద్రను తీసుకురాలేదా! ఇంద్రుని ఎదిరించి ఖాండవ వనము దహించలేదా! కిరాత రూపంలో ఉన్న ఆ పరమేశ్వరుని ఎదిరించలేదా! నా కుమారుడు ఆ గంధర్వుల చేత చిక్కితే, వారితో పోరి విడిపించలేదా! కాలకేయులను ఒంటి చేత్తో సంహరించలేదా! ఇన్ని చేసినవాడికి ఈయుద్ధము ఒక లెక్కా చెప్పు. కాబట్టి అర్జునుని చేతిలో మనవారు ఓడిపోయారని మనము పాండవులను నిందించ కూడదు. అసలు అర్జునుని చేతిలో ఓడిపోవడమే మన వారికి కీర్తి. సరేలే. తరువాత ఏం జరిగిందో చెప్పు." అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

సుయోధనుడు తన శిబిరములో ముఖ్యులైన వారితో ఆ రోజు యుద్ధ విశేషములను చర్చిస్తున్నాడు. అప్పుడు కర్ణుడు సుయోధనునితో ఇలా

అన్నాడు. "రారాజా! మనమందరము ఒక్క విషయం గుర్తుపెట్టుకోవాలి. అర్జునుడు అత్యంత శక్తియుక్తులు కలవాడు. దానికి తోడు అతనికి సరైన సమయంలో తగు సలహాల నివ్వడానికి కృష్ణుడు ఉండనే ఉన్నాడు. నేను ఇంద్రప్రసాదితమైన శక్తిని అర్జున వధ కోసం అట్టిపెడితే, దానిని ఘటోత్కచుని మీదప్రయోగించేట్టు పరిస్థితులను సృష్టించి, మనలను మోసంచేసి, నాతో ఘటోత్కచుని చంపించి అర్జునుని రక్షించిన మాట మరిచిపోకూడదు. ఈ విషయంలోనే కృష్ణుని మోసం తెలిసిపోయింది. అయినా మనకేం భయం లేదు. మనం మన శక్తిని నమ్ముకున్నాము. నా అస్త్ర శస్త్ర ములతో రేపు అర్జునుని, కృష్ణుని రూపు మాపుతాను." అని అన్నాడు కర్ణుడు. ఆ మాటలకు సుయోధనుడు ఎంతో సంతోషించాడు. అందరూ తమ తమ శిబిరములకు వెళ్లారు.

మరునాడు ఉదయము ఇరు పక్షములవారు యుద్ధమునకు సిద్ధం అయ్యారు. ధర్మరాజు పూర్వం బృహస్పతి పన్నిన దుర్జయ వ్యూహము పన్నాడు. దానికి ప్రతిగా కౌరవ సేనలు మరొక వ్యూహము కొరకు కర్ణుని కొరకు ఎదురుచూస్తున్నారు." అని చెప్పాడు సంజయుడు.

" సంజయా! కర్ణుడు వచ్చి మాత్రం ఏమి చేస్తాడు చెప్పు. తనను సర్వసైన్యాధ్యక్షునిగా చేసిన మొదటి రోజునే సుయోధనునికి పరాజయం మూటకట్టాడు. రెండవ రోజు మాత్రం ఆయన వచ్చి చేసేదేముందిలే. అయినా నా కొడుకు తెలివి తక్కువ తనం కాకపోతే, అలాంటి వాడిని నమ్ముకుంటాడా చెప్పు. శకుని కపటనీతి, కర్ణుని బాహుబలము తనను గెలిపిస్తాయని నమ్మి ఈ యుద్ధానికి దిగాడు. సంజయా! అసలు జూదం ఆడిన రోజునే మనకు ఈ దుర్దశ మొదలయింది. అది పెరిగి పెరిగి నిరంతర దుఃఖపరంపరగా తయారయింది. ఎవరిని అని మాత్రం ఏముందిలే. నేను, నా కుమారుడు

సుయోధనుడు కాని పనులు చేసాము. ఫలితం అనుభవిస్తున్నాము.
సంజయా! ఒక్క విషయం గమనించావా! ఇన్నాళ్ల యుద్ధంలో పాండవులలో ఒక్కరంటే ఒక్కరుకూడా మరణించలేదు. కాని నా కొడుకులు అనేకమంది మరణించారు. భీష్మద్రోణులు పడిపోయారు. పాండవులు యుద్ధ రంగంలో, మన వాళ్ల మధ్య , అంతఃపురంలో స్త్రీల మధ్య సరససల్లాపాలు ఆడుతూ తిరిగినట్టు, తిరుగుతున్నారు. అంతా విధి విలాసము కాక మరేమున్నది." అని నిట్టూర్చాడు ధృతరాష్ట్రుడు.

దానికి సంజయుడు ఇలా అన్నాడు. "మహారాజా! జరిగిన దానికి వగచి ప్రయోజనము లేదు. దీనికి నీ కుమారుడు సుయోధనుని ఒక్కడిని నిందించి ప్రయోజనములేదు. అతను చెప్పిన దానికంతా తల ఊపి ఇంతటి అనర్ధము తెచ్చిపెట్టినది నీవు కాదా! నాడే విదురుని మాట విని, జూదము వలదని మందలించిన, వ్యవహారము ఇంత దనుక రాదు కదా! నీవు పాండవులకు చేసిన అపకారములు, పాపములు నిన్ను కట్టికుడుపుతున్నాయి. ఇది అనుభవించక తప్పదు. తరువాతి యుద్ధ విశేషములను చెప్పెదను. సావధానంగా విను. కర్ణుడు తన రధమును సుయోధనునికి దగ్గరగా నిలిపాడు.

"సుయోధనా! ఈ రోజునుండి యుద్ధము నాకూ అర్జునుని మధ్యనే సాగుతుంది. అర్జునుని చంపడమే నా లక్ష్యం. నా వద్ద ఇంద్ర శక్తి లేదని అర్జునుడు నిర్భయంగా విజృంభిస్తాడు. కాబట్టి మనము అర్జునుని చంపే ఉపాయం కోసం ఆలోచించాలి. అర్జునుని వద్ద, నా వద్ద, ఉన్న అస్త్ర శస్త్రములు సమానమే. అందులో అర్జునుడు ఎక్కువేమీ కాదు. పైగా యుద్ధంలో చురుకుగా కదలడంలో నేనే అర్జునుని కన్నా మిన్న.

అర్జునుని వద్ద గాండీవం ఉంది నా దగ్గర లేదు.  పూర్వము దేవాసుర యుద్ధంలో, దేవేంద్రునికి విశ్వ కర్మ ఒక ధృఢమైన విల్లు తయారుచేసి ఇచ్చాడు. దానితో దేవేంద్రుడు అసురులను సంహరించాడు.  దేవేంద్రుడు ఆ విల్లును పరశురామునికి ఇచ్చాడు. మా గురువుగారైన పరశురాముడు దానిని నాకు వాత్సల్యంతో ప్రసాదించాడు. ఆ మహనీయ చాపంతో నేను ఈ రోజు యుద్ధం చేసి అర్జునుని సంహరించి యుద్ధం విడిచిపెడతాను. నీకు ఈ కురుసామ్రాజ్యమును కట్టబెడతాను. నా ధనుస్సు, గాండీవము తో సరిసమానమైనది.

ఇవి కాక అర్జునుని వద్ద అగ్ని దేవుడిచ్చిన అక్షయ తూణీరము, అపూర్వమైన రధము, ఎన్నటికి మరణించని హయములు,  ఉన్నవి.  వాటి గురించి నాకు భయం లేదు.  ఎందుకంటే నా రధము వెనక అనేకానేక బాణములతో ఉన్న శకటములు వస్తూ ఉంటాయి. నిరంతరం నాకు అస్త్రశస్త్రములు అందుతూ ఉంటాయి. అక్షయ తూణీరము మాదిరే ఉంటాయి. ఇంక అత్యంత మేలుజాతికి చెందిన అశ్వములు నా రధము వెంట  ఉంటాయి. నా అశ్వములు పడిపోగానే వాటిని సమకూర్చుకుంటాను. అదేమాదిరి అనేకానేక రధములు నా వెంట ఉంటాయి కాబట్టి ఒకరధము పోతే మరొక రధము వెంటనే అధిరోహించి యుద్ధం కొనసాగిస్తాను.  ఈ విధంగా అక్షయతూణీరము, దివ్యాశ్యములు, దివ్యరధము లేని లోటు తీర్చుకొన వచ్చును.

ఇంక అర్జునునికి నాకూ ఉన్న బేధము ఒక్కటే. సారధి. అర్జునునికి రధ సారధి గా కృష్ణుడు ఉన్నాడు. అతనికి దీటుగా ఉన్న సారధి నాకు కావాలి.  కృ ష్ణునితో సమానంగా సారధ్యం చెయ్య గలవాడు ఒక్కడున్నాడు. అతడు మద్రదేశాధిపతి శల్యుడు. అతనికి అశ్వహృదయం తెలుసు. కృష్ణుని కన్నా

మేలుగా సారథ్యం చెయ్యగల నేర్పు అతనికి ఉంది.  అతనిని ఒప్పించి అతనిని నాకుసారథిగా చెయ్యాలి.  అని పలికాడు కర్ణుడు. ఆ మాటలకు సుయోధనుడు ఎంతో సంతోషించాడు.

"అదెంతపని కర్ణా! ఇప్పుడే మద్ర దేశాధీశుడిని ఒప్పిస్తాను.  నీకు సారథిగా చేస్తాను . నీవు కోరినట్టు నీ రథం వెంట అనేకానేక శకటములలో రకరకాలైన అస్త్రములు, శస్త్రములు వస్తాయి. నీ వెంట శతాధికంగా రథములు, అశ్వములు నడుస్తాయి.  ఆ ఏర్పాట్లు నేను చేస్తాను. మనము శల్యుని వద్దకు పోదాం రా." అని కర్ణుని శల్యుని వద్దకు తీసుకొని వెళ్లాడు సుయోధనుడు.

సుయోధనుడు శల్యునికి నమస్కరించాడు. "శల్యమహారాజా!  మీరు నిత్యసత్యవ్రతులు. మాకు పెద్దలు. పూజ్యులు. కాబట్టి నిన్ను నేను అత్యధికంగా గౌరవిస్తాను. ఇందరి మధ్య నిన్ను నేను ఒక కోరిక కోరుతున్నాను. కాదనకుండా తీర్చండి. ఈతడు కర్ణుడు. నా మిత్రుడు.  ప్రస్తుతము కౌరవ సర్వ సైన్యాధ్యక్షుడు. అర్జునసంహారమునకు బద్ధ కంకణుడు. ప్రస్తుత పరిస్థితులలో అర్జునసంహారము అత్యవసరము. అర్జునునికి సారథి కృష్ణుడు. కృష్ణునికి దీటుగా రథము తోలు సామర్థ్యము మీకే కలదు.  భీష్మ,ద్రోణులు పడిపోయిన తరువాత, మిమ్మల్ని కర్ణుని చూచుకొని నేను ఈ యుద్ధమును కొనసాగి స్తున్నాను. అందుకని, తమరు కర్ణునికి రథ సారథిగా ఉండాలి. అప్పుడే మనము  అర్జునుని సంహరించగలము.  కాదనకండి." అని అడిగాడు.

ఆ మాటలు విన్న శల్యుడు కోపంతో ఊగిపోయాడు. "సుయోధనా! నేనెవరో తెలిసి కూడా నన్ను ఇలాంటి నీచపు కోరిక కోరతావా! నీవు వర్ణాశ్రమ ధర్మములు ఎరుగవా!  మద్రరాజ్యాధిపతిని.  సుక్షత్రియుడను. నన్ను ఒక సూతునికి సారథిగా ఉండమంటావా! ఒక సూతునికి నేను సేవ చెయ్యాలా!

కుదరదు. నేను ఒక సూతకుల సంజాతునికి సారథిగా ఉండలేను. నేను నీకు సాయంగా వచ్చాను. యుద్ధం చేస్తాను. నువ్వు ఎవరితో యుద్ధం చెయ్యమంటే వారితో యుద్ధం చేస్తాను. ఎవరిని చంపమంటే వారిని చంపుతాను. లేకపోతే అందరినీ చంపుతాను. నాకున్న బలంలో ఈ సూత పుత్రునికి 16వ వంతుకూడా లేదు. నేను రణరంగములో అర్జునుని కానీ, కృష్ణుని కాని లెక్క చెయ్యను. ఇంక ఈ కర్ణుడెంత. నువ్వు తెలియక అడిగి ఉంటే మంచిదే. కాని తెలిసి తెలిసి మరలా నన్ను కర్ణునికి సారథిగా ఉండమంటే, నా దారిన నేను పోతాను. అంతేగాని ఇటువంటి నీచపు పని నేను చెయ్యను." అని తెగేసి చెప్పాడు మద్రదేశాధీశుడు శల్యుడు. లేచి వెళ్ల బోతున్న శల్యుని పట్టుకుని ఆపాడు సుయోధనుడు.

"మద్రదేశాధీశా! నేను అలా అన లేను. ఒక్క ఈ కర్ణు డే కాదు, ఈ భూమండలంలో నీకు సాటి రాగల వీరుడెవ్వరూ లేరు అది సత్యము. నీవు సార్థకనామధేయుడవు. ( ఎదుటి వారి గుండెల్లో బల్లెము, భల్లబాణము మాదిరి గుచ్చుకొనేవాడు శల్యుడు.) నీ కన్నా కర్ణుడు పరాక్రమములో ఎక్కువ వాడని నిన్ను కర్ణునికి సారథ్యం వహించమనడం లేదు. ఇందులకు ఒక బలవత్తరమైన కారణం ఉంది.

మన సేనలో అర్జునుడికి దీటుగా యుద్ధం చెయ్యగలవాడు కర్ణుడు. కాని మన ఎత్తులన్ని అర్జునునికి సారథిగా ఉన్న కృష్ణుడు భంగపరుస్తున్నాడు. ఆ శ్రీ కృష్ణునికి సరిసమానంగా ఎత్తుకు పైఎత్తు వెయ్యగల దిట్ట మీరుగాక వేరెవరున్నారు. అందుకు సమర్థులు మీరే కదా! అందుకే మిమ్ము ప్రార్థించాను. దీనివలన తమరిని నేను ఎక్కువగా గౌరవించుకుంటున్నాను. ఈ మహత్కార్యం తమరి వలననే జరగాలి. ఇతరుల వలన సాధ్యము కాదు." అని సవినయంగా పలికాడు సుయోధనుడు.

ఆ పొగడ్తలకు పొంగిపోయాడు శల్యుడు. సుయోధనా! నీ మనసు తెలియక కోపగించుకున్నాను. నన్ను కృష్ణుడి కంటే గొప్పవాడికి అని ప్రశంసించావు. అదే చాలు నాకు. నేను ఈ కర్ణునికి సారధిగా ఉంటాను. కాని నాకు ఒక నియమం ఉంది. అదేమంటే....నేను ఇతనితో నా ఇష్టం వచ్చినట్టు మాట్లాడతాను. అతను కాదనకూడదు. కోపగించుకోకూడదు. తన పని తాను చేసుకోవాలి." అని అన్నాడు శల్యుడు. కాదంటే ఎక్కడ మరలా శల్యుడు తాను సారథ్యం చేయనంటాడో అని వెంటనే ఒప్పుసుకున్నాడు సుయోధనుడు.

"మద్రదేశాధీశా! ఒకనాడు మార్కండేయ మహర్షి మా తండ్రిగారు ధృతరాష్ట్రమహారాజుతో ఇలా అంటుంటే నేను విన్నాను. దేవాసుర యుద్ధంలో తారాకాసురుడు మరణించాడు. అతనికి ముగ్గురు కుమారులు. విద్యున్మాలి, తారకాక్షుడు, కమలాక్షుడు. వారు ముగ్గురూ అత్యంత నియమ నిష్టలతో బ్రహ్మను గూర్చి తపస్సు చేసారు. వారికి బ్రహ్మదేవుడు ప్రత్యక్షం అయ్యాడు. వరం కోరుకోమన్నాడు. ముగ్గురూ ఒకేసారి గా "సకలభూతముల వలన సర్వకాలములలో మాకు చావులేకుండా వరము ఇవ్వండి." అని అడిగారు.

అప్పుడు బ్రహ్మ "ఇలాంటి కోరిక ఎక్కడైనా కోరతారా! మీరు కోరిన కోరిక నేను ఇవ్వలేను. మీరు పుచ్చుకొనలేరు. నేను ఇవ్వడానికి అనువైన కోరిక కోరండి." అని అడిగాడు.

"అలా అయితే మా ముగ్గురుకీ మూడు పురములు ఇవ్వండి. అవి మా ఇష్టం వచ్చిన చోటికి వెళ్లేట్టు ఉండాలి. దేవ, దానవ, యక్ష, ఉరగ, మొదలగు జాతులవారి చేత కూడా అవి జయింప బడకూడదు. అప్పుడు మీము నీ దయవలన నిర్భయంగా సంచరించెదము." అని అడిగారు. దానికి బ్రహ్మగారు "మంచిది అలాగే ఇస్తాను. మరి ప్రతిదానికీ ఒక అంతం

ఉండాలిగదా. అది ఏమంటే ఈ మూడు పురములు ఒక్కచోట కలుసుకుంటే ఎవడైనా బలవంతుడు వాటిని నాశనం చేస్తాడు. ఈ మూడు పురములు ఒక్కచోట చేరనంతవరకూ వాటిని ఎవరూ ఏమీ చెయ్యలేరు. మీరు మీకు తోచినట్టు మూడు పురములు నిర్మించుకోండి. అవి మీరు కోరినట్టు ప్రతిభావంతమవుతాయి." అని వరము ఇచ్చి బ్రహ్మదేవుడు అతర్ధానమయ్యాడు..

( ఈ ముగ్గురూ రాక్షసులు. దుర్మార్గులు. ఈ ముగ్గురూ ఒక చోట చేరితే సర్వనాశనం అవుతుంది. కాబట్టి బ్రహ్మ తెలివిగా వారిని ఒకచోట చేరకుండా చేసాడు. ఒకచోట చేరితే చస్తారు అన్న షరతు విధించాడు. విభజించి పాలించు (డివైడ్ అండ్ రూల్) అన్న సూత్రం ఈరకంగా ప్రతిపాదించాడు బ్రహ్మ అని అనుకోవచ్చేమో.)

బ్రహ్మ ఇచ్చిన వరంతోపొంగిపోయారు ఆ ముగ్గురు రాక్షసులు. మయుడిని తమకు మూడు నగరాలు నిర్మించి ఇవ్వమని అడిగారు. ఆ ప్రకారమే మయుడు మూడు పురములు నిర్మించి ఇచ్చాడు. తారకాక్షుడు సువర్ణపురమునకు, కమలాక్షుడు రజిత పురమునకు, విద్యున్మాలి ఇనపపురమునకు అధిపతులయ్యారు. . సువర్ణ పురము దేవ లోకంలోనూ, రజిత పురము ఆకాశంలోనూ, ఇనప పురము భూలోకము లోనూ సంచరిస్తూ ఉండేది. ఆ ముగ్గురు రాక్షసులు మూడు లోకములను ఆ క్రమించుకొని, ఆ లోకములలో యధేచ్ఛగా తిరుగుతూ ఉన్నారు. ఆ ప్రకారము కొన్ని కోట్లసంవత్సరాలు గడిచిపోయాయి.

( ఈ వరస చూస్తుంటే ఆది మానవుడు రాతి యుగము తరువాత, పరిణామ క్రమంలో సువర్ణము, రజితము, తరువాత ఇనుము లోహముల

గురించి తెలుసుకొని వాటిని తన దైనందిన జీవితంలో వాడడం ప్రారంభించాడు అని సూచన ప్రాయంగా చెప్పడమేనా! ఈ పరిణామము కొన్ని కోట్ల సంవత్సరాలు జరిగిందని చెప్పారు కూడా! )

తారకాక్షునికి ఒక కుమారుడు కలిగాడు. అతని పేరు హరి. అతను కూడా బ్రహ్మను గురించి తపస్సు చేసాడు. బ్రహ్మదేవుడు అతనికి ప్రత్యక్షం అయ్యాడు. అతను ఒక విచిత్రమైన కోరిక కోరాడు. ఈ మూడు పురములలో ఎవరైనా చనిపోతే వారిని ఒక బావిలో ఉన్న నీటిలో పడవేయాలి. ఆ శవం నీటిలో నాని, ఒక్కొక్క శవం నుండి పదిమంది వీరులుపుట్టాలి. వారు ఆ చనిపోయిన వాడంత బలవంతుడు కావాలి. అలాంటి బావులు మూడు పురములలో మూడు ఉండాలి. ఆ బావులలో నీరు ఎప్పటికీ ఇంకిపోకూడదు. అని కోరాడు. బ్రహ్మ ఆ వరాలిచ్చి వెళ్లిపోయాడు.

ఈ ప్రకారము బ్రహ్మవరముచేత ఆ మూడు పురములలోని వారు చావు లేని వారయ్యారు. ఒక వేళ చచ్చినా వారు ఒక్కొక్కరికీ పది మంది అవుతున్నారు. వారంటే దేవతలుకూడా భయపడసాగారు. ఆ మూడు పురములలోని వారు దేవ లోకములను, పితృలోకములను, ముని ఆశ్రమములు అన్నింటికి హాని కలగచేయసాగారు. ఇంద్రుడు కూడా తన దేవసేనలతో వారిమీదికి దండెత్తి వెళ్లి పరాజితుడయ్యాడు.

తరువాత ఇంద్రుడు తక్కిన దేవతలు, దేవ మునులు బ్రహ్మదగ్గరకు వెళ్లి మొరపెట్టుకున్నారు. ఆ ముగ్గురిని సంహరించడానికి ఉపాయం చెప్పమని ప్రార్థించారు. బ్రహ్మ వారితో ఇలా అన్నాడు." వారి ముగ్గురిని ఒకేసారి ఒకే బాణంతో చంపాలి. ఒక రుద్రుడు మాత్రమే ఆ పని చెయ్యగలడు. ఇతరులకు ఇది సాధ్యం కాదు. కాబట్టి మీరందరూ రుద్రుని వద్దకు వెళ్లి ప్రార్థించండి. నేను

కూడా మీ వెంట వస్తాను." అని చెప్పాడు.

అప్పుడు దేవేంద్రుడు, దేవతలు, మునులు పరమేశ్వరు ని వద్దకు వెళ్లారు. ఆ దేవదేవుడు వీరిని చూచి "మీరు వచ్చి పని ఏమి?" అని అడిగాడు.

దానికి దేవేంద్రుడు "పరమేశ్వరా! నీవు నిత్యసత్యస్వరూపుడవు. జ్ఞానమూర్తివి. నీకు తెలియనిది లేదు." అని స్తుతించాడు. పరమేశ్వరుడు సంతోషించి "మీకు ఏం కావాలి?" అని అడిగాడు.

అప్పుడు బ్రహ్మ పరమేశ్వరునితో "మహేశ్వరా! నీవు నన్ను ప్రజలకు పతిగా నియోగించావు. ఆ అధికారములను పురస్కరించుకొని నేను ఈ ముగ్గురు రాక్షసులకు వరాలు ప్రసాదించాను. ఆ వర గర్వమున వారు మూడు పురములను నిర్మించుకొని విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. దేవతలకు, మునులకు క్షోభకలిగిస్తున్నారు. వారిని జయించుటకు ఎవరికీ శక్యము కావడం లేదు. నీవే దానికి సమర్థుడవు. కాబట్టి నిన్ను వీరందరూ శరణు జొచ్చారు. కరుణతో వీరిని కాపాడు. ఆ ముగ్గురు రాక్షసులను సంహరించి ముల్లోకములను కాపాడు." అని ప్రార్థించాడు.

" బ్రహ్మదేవా! నీవు చెప్పినది నిజమే. ఆ ముగ్గురు రాక్షసులు చంపదగ వారే కాని వారు మహా బలవంతులు. కాబట్టి నేను ఒక్కడిని వారిని సంహరించ లేను. అందుకని నా తేజస్సులో సగభాగం మీకు ఇస్తాను. మీరందరూ కలిసి వారిని సంహరించండి." అని పలికాడు.

ఆ మాటలకు దేవతలు ఇలా బదులుచెప్పారు. "పరమేశ్వరా! మా

బలమునకు ఆ ముగ్వురి బలము రెట్టింపు ఉంది. అందుకని మేము వారిని గెలువలేము. పైగా నీ మహా తేజస్సును భరించే శక్తి మాకు లేదు. అందుకని మేమే మా శక్తులన్ని మీకే ధారపోస్తాము. నీవే వారిని సంహరించు అని ప్రార్థించారు.

ఆ మాటలకు జగన్నాధుడు ఇలా అన్నాడు. "దేవతలారా! నాకు, మీరూ రాక్షసులు సమానమే. మీరే కాదు నేను అన్ని ప్రాణుల యెడ సమభావంతో ఉంటాను. అందుకనే నాకు శివుడు అనే నామము సార్ధకమయినది. అందరికీ ఆనందం కలిగిస్తూ ఉంటాను. దుష్టశిక్షణ, శిష్టరక్షణ నా కర్తవ్యం. పరులను పీడించే దుర్జనులను సంహరించి ధర్మవర్తనులై న మీకు క్షేమం కలిగిస్తాను. ఆ రాక్షసులను సంహరించి మీకు సంతోషం కలిగిస్తాను. కాబట్టి మీరందరూ మీ మీ తేజస్సులు, మీమీ భుజబలమును సగం నాకు చెందేట్లు చేయండి.

నేను ఈ కార్యము నిర్వహించడానికి ఈ లోకముల కెల్లను పశుత్వము, నాకు పశుపతిత్వము కావాలి. అప్పుడే నాకు పశువులను చంపిన పాపము అంటదు. మీరందరూ కలిసి నాకు ఒక దివ్యరధమును, ఒక రధ సారధిని, దివ్యాశ్వములను, ఒక విల్లు, బాణము నాకు సమకూర్చండి. అప్పుడు నేను ఆ రాక్షసుల మూడు పురములు ఒకేసారి నాశనం చేస్తాను." అని అన్నాడు. ఆ మాటలకు దేవతలు కొంచెం సంకోచించారు. తమకు కూడా పశుత్వము కలుగుతుందని శంకించారు. తలలు వాల్చి నిల్చున్నారు. వారి అనుమానం అర్ధం చేసుకున్నాడు పరమేశ్వరుడు.

"దేవతలారా! మీరు భయపడవలదు. మీకు కలుగు పశుభావమునుండి విముక్తి కలుగు మార్గము కలదు. మీరందరూ పాశుపత వ్రతము

ఆచరించినందువలన పశుత్వమునుండి మోక్షము కలుగుతుంది. ఆ వ్రతము 12 సంవత్సరములు చేయవలయును. చేసేవారి నిష్ఠను బట్టి ఆ వ్రతము ఒక సంవత్సరమునకు కాని, ఆరు నెలలకు గాని, ఒక రుతువులో గాని (అనగా రెండునెలలు), ఒక నెలలో గాని కనీసపక్షము పన్నెండు దినములలోగాని ఫలితము ఇస్తుంది. అని పలికాడు. ఆ మాటలకు దేవత లందరూ సమ్మతించారు. అన్నిలోకములకు పశుత్వము కలగటానికి. పరమశివునకు పశుపతిత్వము కలగటానికి ఒప్పుకున్నారు. నువ్వు పశువతివి అని పరమశివుని కీర్తించారు.

తమ తమ తేజములలో, భుజబలములో సగ భాగమును పరమశివునికి ధారపోసారు. ఆయాదేవతల తేజస్సు,బలము లను తీసుకొని పరమశివుడు మరింత తేజోవంతుడయ్యాడు. దేవేంద్రుడు, దేవతలు అందరూ కలిసి పరమ శివుని త్రిపురాసుర సంహారానికి అభిషిక్తుని చేసారు. దేవతలందరూ త్వష్ట ప్రజాపతిని చూచి మహాశివునికి ఒక రథమును, హయములను, విల్లును, అమ్మును తయారు చేసి ఇవ్వమని అడిగారు.

త్వష్టప్రజాపతి విశ్వంభరా చక్రమును (భూమిని) రథముగా చేసాడు. సూర్యుని, చంద్రుని దానికి చక్రములుగా అమర్చాడు. మహాసముద్రములను ఇరుసులుగా చేసాడు. హిమవత్పర్వతము, వింధ్యా చలము, అస్తాచలమును స్తంభములుగా అమర్చాడు. త్రేతాగ్నులను (అంటే మూడు అగ్నులను) అశ్వములకు కట్టిన తాళ్లుగా అమర్చాడు. మేరు పర్వతమును ఛత్రముగా అమర్చాడు. నాలుగు వేదములు నాలుగు అశ్వములుగా అమర్చాడు. ఒక సంవత్సరమును(అనగా కాలమును) విల్లుగా మార్చాడు. విష్ణువును బాణముగా ఉండమని ప్రార్థించాడు. ఈ ప్రకారంగా ఒక రథమును ఆయుధములను సమకూర్చాడు త్వష్టప్రజాపతి. అది చూచి సంతోషించాడు

పరమశివుడు. గ్రహ మండలమునే ఉపాదాన కారణముగా చేసుకొని విశ్వకర్మ నిర్మించిన కవచమును తొడుక్కున్నాడు. వృషభమును తన ధ్వజము మీద నిలిపాడు. త్వష్టప్రజాపతి తన కోసం రూపొందించిన రథం ఎక్కాడు. విల్లు పట్టుకున్నాడు.

"దేవేంద్రా! నా రథమునకు సారధి ఎవరు?" అని అడిగాడు.

"పరమేశ్వరా! నీకు నచ్చిన సారధిని నీవే ఎన్నుకో!" అని అన్నారు.

అప్పుడు పరమశివుడు "దేవేంద్రా! నా సారధి, నా కన్నా అధికుడై ఉండాలి. అలాంటి వాడిని నాకుసారధిగా నియమించండి." అని అడిగాడు.

అప్పుడు దేవతలందరూ మహామునులతో సంప్రదించారు. అందరూ బ్రహ్మగారి వద్దకు వెళ్లారు. "దేవా! నీవుకోరిన ప్రకారము త్రిపురాసుర సంహారమునకు ఆ దేవదేవుడు అంగీకరించాడు. ఆయనకు మేము రథము ఆయుధములు సమకూర్చాము. కాని ఆయనను మించిన సారధి దొరకలేదు. ఈ భూమిని రథముగా, వేదములు హయములు గా, రుద్రుడే రధికుడుగా ఉన్న రథమునకు సారధి గా ఉండుటకు తమరు తప్ప వేరే ఎవరూ మాకు కనపడటం లేదు. కాబట్టి మీరే ఈ భారం వహించాలి. ఆ రుద్రునకు సారధి కావాలి." అని ప్రార్ధించారు.

అప్పుడు బ్రహ్మదేవుడు వారి ప్రార్ధనను ఆలకించి ఆ పరమేశ్వరునకు సారధిగా ఉండుటకు ఒప్పుకున్నాడు. ఈ భూమి అనే రథము మీద కూర్చుని రుద్రునికి సారధి అయ్యాడు. కాని రథము మీద ఉన్న ఇద్దరు మూర్తులను భరించే శక్తి లేక ఆ హయములు కింద పడుకున్నాయి. బ్రహ్మ

దేవుడు ఆ అశ్వములను లేపి వాటికి తగిన బలము, శౌర్యము ప్రసాదించి త్రిపురాసురులతో యుద్ధమునకు సన్నద్ధము చేసాడు.

అప్పుడు పరమేశ్వరుడు "ఓ బ్రహ్మదేవా! ఆ రాక్షసులు ఉన్న వైపుకు మన రథము పోనిమ్ము" అని ఆదేశించాడు.

అప్పుడు ఆ బ్రహ్మ దేవుడు వాయు వేగ మనో వేగములతో రథమును తోలాడు. అధర్వుడు, అంగిరసుడు తనకు చక్ర రక్షకులుగా రాగా పరమే శ్వరుడు ఆ అసురుల మీదికి రణమునకు బయలుదేరాడు. అప్పుడు రుద్రుడు తన విల్లు ఎక్కుపెట్టి, పాశుపతమును స్మరించి, బాణము సంధించాడు. మనసులో ఆ త్రిపురములను తలచుకొన్నాడు. ఆయన సంకల్పము మేరకు ఆ మూడు పురములు ఒకేచోటకు చేరాయి. అప్పుడు రుద్రుడు పాశుపతము ప్రయోగించాడు. ఆ మూడు పురములను దగ్ధంచేసాడు. కాని పాశుపతము నుండి పుట్టిన మహాగ్ని జ్వాలలో మూడు లోకములు దహించుకుపోతున్నాయి. అప్పుడు హరుడు ఆ మహాగ్నులను ఆర్పివేసాడు. అప్పుడు మహాఋషులు, దేవతలు అందరూ ఆ మహాదేవుని స్తుతించారు. అందరూ తమ తమ లోకములకే వెళ్లారు. ఆ ప్రకారంగా త్రిపురాసుర సంహారం జరిగింది. ఆ పరమశివుడు త్రిపురాంతకుడు అయ్యాడు.

కాబట్టి ఓ శల్య మహారాజా! ఆ పరమేశ్వరునకు పరమేష్ఠి సారధి అయినట్టే తమరు కూడా కర్ణునికి సారథ్యం వహించాలి. నా గౌరవం కాపాడాలి. ఎందుకంటే నీవు ~~ఈ~~ కర్ణుని కంటే, ఆ పార్ధుని కంటే ఆ సారధి కృష్ణుని కంటే బలములో శౌర్యములో గొప్పవాడవు. నా జీవితము, నారాజ్యము

మీ చేతిలో ఉన్నాయి. నాకు జయమును సుఖమును ప్రసాదించుటకు మీరే సమర్ధులు. కాబట్టి ఈ కార్యము చేసి నన్ను రక్షింపుము.

అదియును గాక మరియొక వృత్తాంతమును నేను మా తండ్రి గారికి ఒక ధర్మప్రవీణుడగు బ్రాహ్మణుడు చెప్పగా విన్నాను.

భార్గవ వంశములో ప్రశిద్ధుడైన జమదగ్ని మహామునికి అత్యంత నిర్మలుడైన రాముడు పుత్రుడుగా ఉదయించాడు. అతడు శివుని గూర్చి తపస్సు చేసాడు. శివుడు ప్రత్యక్షం అయ్యాడు. రాముడు శివుని దివ్యాస్త్రములు ప్రసాదించమని ప్రార్ధించాడు. మహా శివుడు " నేను ఇచ్చు దివ్యాస్త్రములు అశుచులు ఐన వారిని దహిస్తాయి. అందువలన నీవు శుచివై రమ్ము, ఆ దివ్యాస్త్రముల శక్తి నీకు లభిస్తుంది." అని చెప్పాడు.

అప్పుడు రాముడు పరమశివునితో "మహాశివా! నేను నీ అస్త్రములు స్వీకరించుటకు పాత్రుడను అని ఎప్పుడు నీవు తలిస్తే అప్పుడే నాకు అనుగ్రహించు. అప్పటి దాకా నాకు నీ శుశ్రూష చేయు భాగ్యము అను గ్రహించు." అని అన్నాడు. పరమ శివుడు ఆ ప్రకారమే అనుగ్రహించాడు. పరశురాముడు ఆ పరమేశ్వరుని అనేక సంవత్సరములు నిష్ఠతో అర్చించాడు.

ఒక రోజు పరమేశ్వరుడు తన భార్య పార్వతికి పరశురాముని చూపించి "దేవీ! అతను రాముడు. నన్ను నిష్కలంక చిత్తముతో ఆరాధించుచున్నాడు. అతను నాకు పరమ భక్తుడు." అని అన్నాడు.

ఈ సమయంలో దేవతలు పరమశివుని వద్దకు వచ్చి తమకు రాక్షస బాధ ఎక్కువగా ఉన్నదని దానిని నివారించమని కోరారు. వెంటనే

పరమశివుడు భార్గవరాముని చూచి “వెంటనే నీవు వెళ్లి రాక్షససంహారము చెయ్యి” అని ఆజ్ఞాపించాడు. దానికి రాముడు “మహాదేవా! నేను ఏ అస్త్రములు అభ్యసించలేదు. రాక్షసులు బలవంతులు. నేను వారిని గెలువగలనా!“ అని సందేహం వెలిబుచ్చాడు.

అప్పుడు పరమ శివుడు “రామా! నేను నా తలంపును నీమీదనే నిలుపుతాను. నా సంకల్ప బలం చేత నీవు రాక్షసులను నిర్జించు.” అని అన్నాడు. రాముడు అలాగే అని రాక్షసుల మీదికి యుద్ధమునకు బయలు దేరాడు. రాక్షసులతో అత్యంత భయంకరంగా యుద్ధము చేసాడు. ఆ పరమేశ్వరుని సంకల్పబలంతో వారిని నిర్జించాడు. అప్పుడు రాముని ఒళ్లంతా గాయములయ్యాయి. రాముని శరీరమును చేతితో నిమిరాడు పరమశివుడు. ఆ గాయములు అన్ని మాయం అయ్యాయి.

పరమశివుడు అతనిని చూచి “రామా! నా స్పర్శ వలన నీ శరీరమునకు ఎలాంటి ఆయుధము తగిలినా గాయము కాదు. నీవు నా వలన వరములు పొందుటకు ఇదే సమయము.” అని అన్నాడు. పరమశివుడు రామునికి అనేక దివ్యమైన ఆయుధములు, అస్త్రములు అనుగ్రహించాడు. వాటిని దయతో స్వీకరించాడు రాముడు. తరువాత తన ఆశ్రమమునకు వెళ్లాడు భార్గవరాముడు.

తరువాత ఈ కర్ణుడు ఆ భార్గవరాముని తన సేవలతో ప్రసన్నం చేసుకొని ఆతని వలన అనేక దివ్యాస్త్రములు పొందాడు. మరి కర్ణుడు హీనకులజుడైన, భార్గవరాముడు ఆ దివ్యాస్త్రములు అనుగ్రహిస్తాడా! భార్గవరాముడే ఆదరించాడు కాబట్టి కర్ణుడు ఉత్కృష్ట కులజుడు అని తలుస్తాను. అతని ఆజానుబాహువైన ఆకారము చూస్తుంటే అతడు

దేవకుమారుడు మాదిరి ఉన్నాడు కదా! ఒక మామూలు స్త్రీ సహజ కవచకుండలములతో సూర్యప్రభలతో సమానంగా వెలిగి పోతున్న ఇలాంటి పుత్రుని పొందగలదా! ఒక లేడికి సింహము పుడుతుందా! కాని కర్ణునకు సూతుని చేత పెంచబడ్డాడు అనే అపవాదు వచ్చింది.

కాబట్టి ఓ శల్య మహారాజా! నా మనవి నాలకించి, రుద్రునికి శిష్యుడైన ఆ భార్గరాముని ప్రియశిష్యుడైన ఈ కర్ణునికి, నాడు పరమశివునికి బ్రహ్మ సారధ్యము వహించినట్టు, మీరు సారధ్యము వహించాలి. ఎందుకంటే రధికుని కంటే సారధి గొప్పవాడుగా ఉండాలి అన్న నీతి ఉన్నది కదా! దానికి నీవు ఒప్పుకున్నావు కాబట్టి నా కోర్కె సిద్ధించింది." అని పలికాడు సుయోధనుడు.

సుయోధనుని యుక్తియుక్తములగు పలుకులు విని శల్యుడు పొంగిపోయాడు. సుయోధనుని ఆదరంతో కౌగలించుకున్నాడు. సుయోధనా! నన్ను, నా పరాక్రమమును, నీవు గ్రహించగలిగావు. చాలా సంతోషంగా ఉంది. కాని ఒక్క మాట. నేను నాకు తోచినట్టు మాట్లాడుతుంటాను. సలహాల నిస్తుంటాను. మీరు ఏమీ అనుకోకూడదు. ఓపికగా వినాలి గాని కోపగించు కోకూడదు."

అప్పుడు కర్ణుడు శల్యునితో ఇలా అన్నాడు "మహానుభావా! నీవు ఆ పరమేశ్వరునికి బ్రహ్మవలె, అర్జునునికి కృష్ణుని వలే నాకు సారధ్యం వహించు." అని అన్నాడు.

" కర్ణా! నేను ఆ ఇంద్రుని రధము నైనా నడపగలను. నాకు తోచిన విషయములు చెపుతూ ఉంటాను. నా రధికుని క్షణం కూడా ఏమరిపాటుగా

ఉండనివ్వను. కృష్ణుని సారథ్యముతో ఘనుడైన అర్జునుని నా సారథ్యములో నీవు గెలువ దల్చుకున్నావు. కాబట్టి నీ రథం నేను తోలుతున్నాను.” అని అన్నాడు.

అప్పుడు సుయోధనుడు కర్ణుని చూచి “కర్ణా! శల్యునితో పోలిస్తే కృష్ణుడు సారథ్యంలో చాలా తక్కువ. ఆ మాటకొస్తే ఇంద్రుడి సారథి మాతలి కూడా శల్యునితో సరితూగడు. నీ భాగ్యవశాత్తు శల్యుడు నీకు సారథిగా సమకూరాడు. శల్యసారథ్యంలో నీవు అర్జునుని గెలవడం తథ్యం.” అని అన్నాడు సుయోధనుడు.

వెంటనే కర్ణుడు, శల్యుడు సారథ్యం వహించడానికి తగిన రథమును సమాయత్తం చేయమన్నాడు. అందరూ కలిసి ఆ రథమునకు పూజాదిక ములు నిర్వర్తించారు. కర్ణుడు ఆ రథము చుట్టు తిరిగి నమస్కరించి సూర్యునికి నమస్కరించాడు. శల్యుని రథము ఎక్కమని చెప్పాడు. తాను కూడా రథం ఎక్కాడు.

ఆ ప్రకారంగా శల్యుడు కర్ణునికి సారథి కావడం, శల్యసారథ్యంలో కర్ణుడు అర్జునుని మీదికి యుద్ధమునకు పోవడం గురించి సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పాడు. ఈ ప్రకారము వైశంపాయనుడు జనమేజయునికి చెప్పిన మహా భారత కథను, నైమిశారణ్యంలో, ఉగ్రశ్రవసుడను సూతి సత్రయాగమునకు ఏతెంచిన శౌనకాది మహామునులకు చెప్పాడు.

మహాభారతము కర్ణపర్వము ప్రథమాశ్వాసము సమాప్తము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహాభారతము

## కర్ణ పర్వము

## ద్వితీయాశ్వాసము.

వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన విధమున, నైమిశారణ్యమున, సూతుడు శౌనకాది మహామునులకు మహాభారత కధను ఈ ప్రకారము చెప్పసాగాడు.

సంజయుడు ధృతరాష్ట్రునికి ఆనాటియుద్ధ విశేషములు వివరిస్తున్నాడు.

కర్ణుని చూచి సుయోధనుడు "కర్ణా! భీష్ముడు, ద్రోణుడు పాండవులను సంహరిస్తారని ఎంతో ఆశించాను. కాని వారు నా ఆశయము నెరవేర్చలేదు. కనీసం నీవైనా నా కోరిక తీర్చుము. ధర్మరాజును బంధించు. పాండవ సైన్యమును నిర్మూలించు. నా మనస్సుకు సంతోషము చేకూర్చు." అని అడిగాడు.

కర్ణుడు శల్యుని చూచి రథమును పోనిమ్మన్నాడు. కర్ణుడు తన రథసారథి శల్యుని చూచి ఇలా అన్నాడు. "శల్యా! నేను వేయు నారాచములు మొదలగు బాణములను చూచి పాండవులు భయపడతారు. దేవతలు నా పరాక్రమము చూచి నన్ను పొగుడుతారు. నా భుజబలము చూచి నువ్వు కూడా మెచ్చుకొనేట్టు చేస్తాను." అని అన్నాడు.

"కర్ణా! పాండవులు సత్య వంతులు. అత్యంత పరాక్రమము కలవారు. శౌర్యధనులు, భుజవీర్య మహిమాన్వితులు. తేజోధనులు. అఖిలాస్త్ర పారం గతులు. సాక్షాత్తు ఇంద్రుడికే భయము పుట్టిస్తారు. వాళ్లను గూర్చి నీవు ఇలా పలుకుట సరికాదు. అర్జునుని గాండీవ ధ్వనికి నీ చెవులు గింగురుమంటాయి. భీముని గదా నైపుణ్యము చూచి నీ కళ్లు మిరుమిట్లు గొలుపుతాయి. నీవు భయంతో వణకిపోతావు. అర్జునుని శరాఘాతములకు రథములు కూలు తుంటే, భీముని గదాఘాతములకు ఏనుగుల తలలు పగులుతుంటే, ధర్మరాజు, నకుల సహదేవులు నిన్ను నీ బలములను చించిచెండాడుతుంటే, అది చూచి కూడా నీవు ధైర్యంతో నిలబడి ఉంటే, అప్పుడు నీ మాటలు నమ్ముతాను." అని అన్నాడు శల్యుడు.

ఆ మాటలు వినీ విననట్లుగా “శల్యా! నా పరాక్రమమును చూపిస్తాను రథమును పాండవుల మీదికి పోనిమ్ము. నేను విల్లు పడితే దేవేంద్రుడు కూడా నా ముందు నిలువలేడు. అసలు పాండవుల బలం ఏపాటిదని భీష్ముడు, ద్రోణుడు వాళ్ల చేతుల్లో చచ్చారు.  నాకే అర్ధం కావడం లేదు. నువ్వు చూస్తూ ఉండు నేను అర్జునుని చిటికలో సంహరిస్తాను.  పాండుకుమారులు అందరూ కలిసి ఒక్కుమ్మడి గా నా మీద పడ్డా నేను జంకను. చించి చెండాడుతాను. భీష్ముడు, ద్రోణుడు పడిపోయినా,  దివ్యాస్త్రసంపన్నుడైన ఈ కర్ణుడు ఉన్నాడు అని వారికి తెలిసేట్టు చేస్తాను. నా ప్రాణాలకు కూడా తెగించి అర్జునుడిని సంహరించి, సుయోధనుని మనసుకు ఆనందం కలిగిస్తాను.” అని గర్వంతో  అన్నాడు కర్ణుడు.

ఆ మాటలకు నవ్వుకున్నాడు శల్యుడు. “కర్ణా!  ఎందుకయ్యా ఈ వ్యర్థప్రేలాపనలు. ఎవరైనా వింటే నవ్విపోతారు. ఎన్నటికీ నువ్వు అర్జునుడికి సాటిరావు. అది అందరికీ తెలుసు. అర్జునుడి చేతిలో ఓడిపోయిన అంగారపర్ణుని కన్నా, సుయోధనుని బంధించిన చిత్రసేనుడనే గంధర్వుడి కన్నా, వరాహం కోసం అర్జునుని తో  కిరాత రూపంలో పోరిన పరమేశ్వరుని కన్నా, నువ్వు ఎందులో గొప్పవాడివి. వాళ్లకు కూడా సాటిరాని నువ్వు అర్జునుని గెలుస్తాను అనడం నీ

నోటిదురద కాక ఏముంది. కర్ణా! ఉత్తరగోగ్రహణ సమయమున అర్జునుని చేతిలో మీరు పొందిన భంగపాటు అప్పుడే మరిచిపోయారా! అర్జునుని బాణములు అప్పుడే తుప్పుపట్టాయి అనుకున్నారా! ఇంతకు ముందు మాదిరి కాకుండా ప్రాణాలకు తెగించి అర్జునునితో పోరాడతాను అన్నావు కదా! అదే నిజమవుతుందేమో! ఎందుకంటే అర్జునుని చేతిలో నువ్వు చచ్చినా నీ మాట నిలబెట్టుకున్నవాడివి అవుతావు కదా!" అని అన్నాడు శల్యుడు.

శల్యుని మాటలకు కర్ణుని కోసం కట్టలు తెంచుకుంది కాని తమాయించు కున్నాడు. " శల్యా! నీవు అర్జునుని పొగడటమే పనిగా పెట్టుకున్నట్టున్నావు. నేను అర్జునుడు యుద్ధం చేస్తున్నప్పుడు ఎవరు పరాక్రమ వంతులో చూచి అప్పుడు పొగుడు. అప్పటిదాకా నోరుమూసుకొని రథము నడుపు." అని అన్నాడు.

శల్యుడు నవ్వుకుంటూ రథము తోలుతున్నాడు. కర్ణుడు తన పక్కన ఉన్న సైనికులను చూచి "సైనికులారా! ఏడీ! అర్జునుడు ఏడీ! నాకు చూపించండి. అర్జునుని రథం ఎక్కడుందో నాకు చూపండి. వారికి నేను కోరిన కానుకలు ఇస్తాను." అని కర్ణుడు తన శంఖం పూరించాడు.

ఆ మాటలకు శల్యుడు పకా పకా నవ్వాడు. "కర్ణా! అర్జునుని ఒకరు చూపించ నవసరం లేదు. నీకై నువ్వే చూస్తావు. నీ వద్ద డబ్బు ఎక్కువగా ఉంటే దానిని సద్వినియోగము చెయ్యి. అంతేగాని ఈ అపాత్రదానాలు ఎందుకు. అయినా "కర్ణా! నువ్వు కృష్ణార్జునులను జయిస్తాను అని అంటున్నావు కదా. ఎక్కడన్నా నక్క సింహాన్ని జయిస్తుందా. అర్జునుడితో ఒంటరిగా యుద్ధం చెయ్యడం అంటే అగ్ని ప్రవేశం చెయ్యడం లాంటిది సుమా! అందుకని నీ సైన్యమును ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకో. ఏదో ! నేను సుయోధనునికి మిత్రుడిని కాబట్టి నీకు రుచించకున్నా, ఇదంతా చెబుతున్నాను. నా మీద కోపగించుకోకుండా నా మాట విను." అని అన్నాడు శల్యుడు.

" శల్యా! నీ మాటలకు నేను భయపడను. అర్జునుడితో ఒంటరిగానే పోరాడతాను. నా నిర్ణయాన్ని ఇంద్రుడు కూడా ఆపలేడు. ముందు రథం పోనిమ్ము" అని అన్నాడు కర్ణుడు కోపంతో.

కర్ణుడిని ఇంకా ఉడికించాలని శల్యుడు "కర్ణా! నా మాటలు నీకు చెవికి ఎక్కవులే. అర్జునుని గాండీవం శబ్దం నీ చెవుల్లో గింగురుమంటుంటే, నీ మీద అర్జునుడు శరవర్షము కురిపిస్తుంటే, అప్పుడైనా నీకు బుద్ధివస్తుందేమో! అయినా కర్ణా! అర్జునుని తో

ద్వంద్వయుద్ధ ము అంటే మాటలా! సింహంతో జింక పిల్ల, ఏనుగుతో కుందేలు, పెద్దపులితో కుక్క, గ్రద్దతో పాము యుద్ధం చెయ్యడం లాంటిది! అయినా కర్ణా! నీకు అర్జునునితో పోరాడగల బలము, శక్తి సామర్ధ్యము ఉన్నాయంటావా!" అని అన్నాడు శల్యుడు.

శల్యుని మాటలకు కర్ణుడి కోపం హద్దులు దాటింది. "శల్యా! ఆపు. నీ అధిక ప్రసంగము. ఒక గుణవంతుడి గుణగణములు నీ లాంటి నిర్గుణుడికేం తెలుసు. గుణహీనుడవైన నీకు నాలాంటి వీరుడి గుణగణములు ఎలా తెలుస్తాయి. అర్జునుడి గురించి నాకు తెలిసినంతగా నీకేం తెలుసు. నాకు కృష్ణార్జునుల బలాబలములు తెలుసు కాబట్టే నేను వారిని సంహరించగలనని గట్టి నమ్మకంతో ఉన్నాను. నా దగ్గర ఉన్న సర్పముఖాస్త్రమును నేను నిత్యము పూజిస్తుంటాను. దాని బారి నుండి తప్పించుకోడం కృష్ణార్జునులకే కాదు ఎవకిరి కూడా సాధ్యం కాదు. అదీ తప్పితే భార్గవాస్త్రముతో అర్జునుని చంపుతాను. అందుకే అర్జునుని చావు తథ్యం అంటున్నాను. అయినా నేను కృష్ణార్జునుల కపిధ్వజమును, గాండీవమును చూచి బెదిరే వాడిని కాను. వెయ్యి మంది కృష్ణులు, పది వేల మంది పార్ధులు వచ్చినా పోరాడతాను. కాబట్టి పాండవ పక్షపాతంతో నోటికి వచ్చినట్టు మాట్లాడక రథముపోనిమ్ము.

ఇంకా ఇదే మాదిరి మాట్లాడుతుంటే నీ ఒంట్లో ప్రాణములుండవు." అని అన్నాడు కర్ణుడు.

ఇంకా శల్యుడు ఏదో మాట్లాడ బోతే "ఆగు శల్యా! నీవు పాపాత్ముడవు. క్షత్రియాధముడవు. నీచుడవు. నీకు దుర్బుద్ధి కాక సద్బుద్ధి ఎలా ఉంటుంది. అసలు మీ మద్రదేశం వాళ్లంతా దుష్టులు. దుర్మార్గులు. మిత్రద్రోహులు. నువ్వు అలాంటి వాడివే కదా! అసలు మీ దేశంలో ఆడా మగా వావి వరసా లేకుండా కలుస్తారట గదా! పైగా మీకు అది తప్పు కాదు కదా! పుట్టగానే తల్లిపాలకు ముందే మద్యం సేవించే మీరు, మీ గుణములు, ఎవరికి తెలియవు! మీరు ఎవరు ఎవరికి పుట్టారో మీకే తెలియదు. నిరంతర మద్యపానంతో పెరిగే మీకు గుణము, శీలము, మంచి మాటలు గురించి ఎలా తెలుస్తాయిలే! నీవు శత్రు పక్షం మేలుకోరుతున్నావు అని నాకు తెలుసు. యుద్ధంలో శత్రుసైన్యములను తునుమాడి వీరమరణం పొందుతాను. నీలాంటి వారు నన్ను ఆపలేరు. ఇంకా నాకు కోపం తెప్పిస్తే ఈ గదతో నీ తల బద్దలు కొడతాను. ముందు రథం పోనిమ్ము "అని కోపంతో పలికాడు కర్ణుడు.

"అదేంటి కర్ణా! అలా అంటావు. నేను, నీకూ సుయోధనుడికి సాయం చెయ్యడానికి కదా వచ్చాను నాకు తోచిన మాటలు చెప్పడం

తప్పొ చెప్పు. అయినా ఉన్నమాల చెప్పడం తప్పొ! అసలు సారధి అంటే ఏమనుకున్నావు. సారధి దక్షుడై ఉండాలి. రధికుని బలము, అశ్వముల బలము తెలిసి ఉండాలి. ఆయుధముల ప్రయోగము, యుద్ధములో మెళుకువలు తెలిసి ఉండాలి కదా. అన్ని తెలిసిన వాడిని కాబట్టే నీకు హితము చెబుతున్నాను. నీకు కోపం వచ్చినా అలా చెప్పడం సారధిగా నా ధర్మం, నీతి.

అయినా కర్ణా! నేనేం తప్పు చేసానని నా తల బద్దలు కొడతాను అంటావు. నువ్వు ఎన్ని అన్నా నేను నీ శ్రేయోభిలాషిని. నీకు హితోపదేశము చెయ్యకుండా మానను. నీకు ఒక దృష్టాంతము వివరించెదను. వినుము. అది విన్న తరువాత నీవు నేను చెప్పి నట్టు చేసినా చేయకపోయినా నాకు బాధ లేదు.

ఒక సముద్రములో ఒక దీవి కలదు. అందులో ధర్మవర్తనుడైన ఒక వైశ్యుడు ఉండెడి వాడు. అతను యజ్ఞములు చేసిన సత్కర్ముడు. శాంత వంతుడు. కరుణా మూర్తి. నిరంతర దాన శీలుడు. అతడు ధన ధాన్యములతో శోభిస్తున్నాడు. అతనికి చాలా మంది సంతానము ఉన్నారు. అలాంటి అతని ఇంటికి ఒక కాకి వచ్చింది. అతని కుమారులు ఆ కాకికి తాము తినగా మిగిలిన అన్నం పెట్టి పెంచసాగారు. వాళ్ళు పెట్టిన

ఆహారము తిని ఆ కాకి బాగా బలిసింది. మిగిలిన పక్షులను లెక్కచెయ్యడం లేదు.  కొంత కాలానికి   ఆ ద్వీపానికి కొన్ని హంసలు వచ్చాయి. అవి చాలా పెద్దవి. ఆ వైశ్యకుమారుడు ఆ కాకిని చూచి ఇలా అన్నాడు

"ఓకాకీ! ఆ హంసలను చూడు. ఎలా ఆనందంగా  ఆకాశంలో విహరిస్తున్నాయో. నువ్వు కూడా వాటితో సమానంగా ఎగిరి వాటిని ఓడించాలి." అని అన్నారు. ఆ మూర్ఖులు చెప్పి మాటలకు ఆ కాకి తల ఊపింది.

ఆ హంసల దగ్గరకు వెళ్లి   "నాతో సమానంగా ఎగురగలవారు మీలో ఉన్నారా!" అని అడిగింది.  ఆ మాటలకు ఆ హంసలు నవ్వి ఆ కాకితో ఇలా అన్నాయి.  "ఓ కాకీ!  మేము మానసరోవరంలో ఉంటాము మేము ఎంత దూరమ్మైనా అలసట అనేది ఎరుగ కుండా ఎగరగలము. నీవేమో మాలో బలశాలి య్యైన హంస ఎవరూ అని అడుగుతున్నావు. అసలు హంసలతో సమానమ్మైన కాకి ఈ లోకంలో ఉందా!" అని అడిగాయి.

అప్పుడు ఆ కాకి " నేను నూట ఒక్క రీతులలో ఎగుర గలను. శతయోజముల దూరము  ఎగిరిపోగలను.   భూమి నుండి నేరుగా ఆశాశము లోకి ఎగిరి మరలా నేరుగా కిందికి దిగగలను. నేను ఎలాంటి

హంసనైనా ఓడించగలను.'' అని అన్నది.  ఆ మాటలు  విని ఒక హంస ముందుకు వచ్చి ''నీవు చిత్రవిచిత్ర రీతులలో ఎగుర గలవా!  ఐతే నాతో సమానంగా ఎగురు.'' అని పలికింది. అక్కడ చేరిన కాకులు ''వద్దు నువ్వు ఆ హంసతో ఎగురలేవు. భంగపాటు పొందెదవు.'' అని అన్నా వినకుండా ఆ కాకి హంసతో పోటీ పడింది.

ఆ హంస ముందు నెమ్మదిగా ఎగురుతూ ఉంది. కాకి మాత్రం అతి తీవ్రంగా ఎగురుతూ ఉంది.  హంస కన్నా ముందుకు పోయి మరలా వెనక్కు వచ్చి ''ఇంకా నువ్వు ఇక్కడే ఉన్నావా?'' అని మరలా ముందుకు వెళ్లేది.  ఇది చూచి మిగిలిన కాకులు హంసలను గేలిచేయసాగాయి. కొద్ది సేపటికి కాకికి ఆయాసం వచ్చింది.  కాని హంస అలుపనేది ఎరుగ కుండా ఎగురుతూ ఉంది ఇప్పుడు కాకి హంసతో పాటు ఎగురలేక వెనక పడింది.  ''అయ్యో! అనవసరంగా దీనితో పోటికి దిగాను. ఎక్కడన్నా దిగుదాము అంటే  నేల అనేది లేదు. కింద అంతా సముద్రము. జలచరాలు తినేస్తాయి.'' అని దిగులుగా ఎగురుతూ ఉంది.

ఆ కాకిని చూచి హంస  ఇలా అంది. ''ఓ కాకీ! ఇది ఏ రకమైన ఎగరడం చెప్పగలవా! నాకన్నా వెనక బడ్డావు ఎందుకూ!'' అని అడిగింది. కిందినుండి సముద్రపు అలలు కాకిని తాకుతున్నాయి. ఎగరడానికి బలం లేదు. అంతకంతకూ కిందికి దిగిపోతూ ఉంది కాకి.  '' ఓ హంసా! ఆ

వైశ్యకుమారులు పెట్టిన ఎంగిలిమెతుకు తిని కొవ్వు బట్టి, నా కన్నా బలవంతులు లేరని గర్వించాను. ఆ గరుత్మంతుని కూడా గెలువగలను అనుకున్నాను. కాని నా బలము ఏ పాటిదో ఇప్పుడు తెలుసుకున్నాను. దయచేసి నన్ను తీసుకెళ్లి మిగిలిన కాకులతో చేర్చు." అని దీనంగాఅడిగింది కాకి.

అంతకంతకూ నీటిలో మునగబోతున్న కాకిని ఆ హంస తన కాళ్లతో గట్టిగా పట్టుకొని ఒడ్డుకు చేర్చింది. మిగిలిన కాకులు ఆ కాకిని చూచి ఇలాంటి తెలివి తక్కువ పని ఎప్పుడూ చెయ్యకు అని మందలించాయి.

" కర్ణా వింటివా ఆ కాకి కథ! ఈ కథలో కాకి వైశ్యకుమారుల ఎంగిళ్లు తిని గర్వించినట్టు, నీవు కూడా ఆ కురుకుమారులుపెట్టిన మృ ష్టాన్నములు తిని గర్వించావు. కాని నీ కన్నా బలవంతుడు హంసలాంటి వాడైన అర్జునుని తో తలపడుతున్నావు. దీని వల్ల నీకే హాని. నా మాటవిను. అయినా, నాడు ఉత్తర గోగ్రహణ సమయమున నీ తమ్ముని చంపి, గోవులను మరలించినపుడు నీవు ఎక్కడ ఉన్నావు? ఘోష యాత్ర సమయమున సుయోధనుని విడిచి ఎందుకు పారిపోయావు? నాడు నిండు కొలువులో కృష్ణార్జునుల భుజ బలమును గూర్చి మహాఋషులు, భీష్మ,ద్రోణులు చెప్పలేదా! ఆ మాటలు విని కూడా నీవు అర్జునునితో

యుద్ధమునకు తలపడుతున్నావా! ఎందుకంటే అర్జునుని ఓడించడానికి ఆ పరమశివుని కైనా శక్తి చాలదు. కాబట్టి నీకు తగిన వీరులతో యుద్ధం చెయ్యడం మంచిది. నాకు తోచింది నేను చెప్పాను." అని అన్నాడు శల్యుడు.

"అదేమిటి శల్యా! నేను కృష్ణార్జునుల బలపరాక్రమములు తెలుపు కోకుండానే వారితో యుద్ధమునకు తలపడుతున్నాను అనుకొన్నావా! నీవు ఎన్ని చెప్పినను వారితో యుద్ధంచెయ్యకుండా మానను. నేనో, అర్జునుడో, ఎవరో ఒకరు మిగలాలి. కాబట్టి ఈ వ్యర్థమైన మాటలు మానుము." అని శల్యుని తో అన్నాడు. అక్కడే ఉన్న మిగిలిన రాజులు వింటూ ఉండగా శల్యునితో ఇలా అన్నాడు.

"శల్యా! నాకు పరశురాముని కోపము, బ్రాహ్మణ శాపము మనసుకు సంతాపము కలుగ చేస్తున్నాయి. లేకపోతే నేను అర్జునుని అసలు లక్ష్యపెట్టను. నేను అస్త్ర విద్య నేర్చుకొనుటకు పరశురాముని వద్దకు వెళ్లాను. అప్పుడు ఆయన నన్ను నీ కులము ఏది అని అడిగాడు. బ్రహ్మాస్త్రము నేర్చుకొనుటకు నేను బ్రాహ్మణుడను అని అబద్ధము చెప్పాను. నా మాటలు నమ్మి నాకు పరశురాముడు ఎన్నో అస్త్ర శస్త్ర విద్యలు బోధించాడు పరశురాముడు. తరువాత బ్రహ్మాస్త్రము కూడా నాకు

బోధించాడు. కాని దానిని యుద్ధ సమయమున అత్యవసర సమయమున ఆపదలో మాత్రం ప్రయోగించమని చెప్పాడు.

తరువాత ఒక నాడు నా గురువు పరశురాముడు అలసి పోయి నా తొడ మీద  తల పెట్టుకొని నిద్రిస్తున్నాడు. అప్పుడు ఒక పురుగు నా తొడకింద చేరి నా తొడను తొలవసాగింది.  నేను కదిలిన నా గురువు కు నిద్రాభంగమగునని నేను ఆ బాధను సహించాను కాని కదలలేదు. ఆ పురుగు చేసిన గాయము నుండి రక్తము కారుతూ ఉంది. అప్పుడు నా గురుదేవుడు నిద్ర లేచాడు. రక్తస్రావమునుచూచాడు.  ఏంజరిగింది అని నన్ను అడిగాడు. నేను జరిగించి చెప్పాను. నా ధైర్యమునకు సహన శక్తికి ఆ శ్చర్యపడి నిజం చెప్పు నీవు ఎవరు? నీవు నిజంగా బ్రాహ్మణుడివా. ఎందుకంటే బ్రాహ్మణులకు ఇంతటి సహనశక్తి అరుదు అని అడిగాడు. నేను భయపడి నేను బ్రాహ్మణుడను కాను సూతుడను అని చెప్పాను. అప్పుడు ఆ పరశురాముడు నా పై కోపించి   బ్రహ్మాస్త్రము నాకు ఆపదలో గుర్తుకు రాదని, మృత్యువు ఆసన్నమైనపుడు మాత్రము గుర్తుకు వస్తుందని,  నాకు  ఎలాంటి ఆపద సంభవించినా నాకు భార్గవాస్త్రము గుర్తుకు రాదని శాపము ఇచ్చాడు.

ఆ పరశురాముని శాపం ఆ విధంగా నన్ను వెంటాడు తుంటే, నాకు మరొక బ్రాహ్మణ శాపం కూడా తగిలింది. ఒక సారి నేను అస్త్రవిద్యను అభ్యసిస్తున్నాను. ఒక సారి నా బాణము గురి తప్పి ఒక ఆవు దూడకు తగిలింది. అది మరణించింది. ఆ ఆవుదూడ యొక్క యజమాని యైన బ్రాహ్మణుడు, ఇది హోమధేనువు. దీనిని చంపావు. కాబట్టి నీ ప్రాణాలు కూడా యుద్ధంలో పోతాయి. నీ రధచక్రాలు యుద్ధభూమిలో దిగబడతాయి. నీవు ఎవరినైతే చంపాలని ఇన్ని అస్త్ర శస్త్రాలు అభ్యసించావో అతని చేతిలోనే నీ మరణం సంభవిస్తుంది. అని శపించాడు. నాకు ఎంతో భయం వేసింది. ఓ బ్రాహ్మణోత్తమా! నీవు కోల్పోయిన ఆవు దూడకు బదులుగా వెయ్యి ఆవులు, 600 ఎద్దులు, 100 రధములు, నూరు మంది స్త్రీలను, 700 ఏనుగులను ఇస్తాను. శాంతించి నన్ను శాప విముక్తిడిని చెయ్యి అని వేడుకున్నాను. కాని ఆ బ్రాహ్మణుడు కరుణించలేదు. కర్ణా! నా శాపమునకు తిరుగులేదు కాని నా శాపము నీకు ఉత్తమ లోక ప్రాప్తి కి అడ్డురాదు. అని అన్నాడు.

శల్యా! నేను నా గురువు శాపమునకు, బ్రాహ్మణ శాపమునకు భయపడుతున్నాను కాని కృష్ణార్జునులకు భయపడటం లేదు. శల్యా! నాకు ఇంకా బ్రహ్మాస్త్రము గుర్తుకు వస్తూ ఉంది. వెంటనే మన రధము అర్జునుని వంకకు పోనిమ్ము . అతనిని సంహరిస్తాను. అర్జునుని

చంపడం నాకు తప్ప వేరే వాళ్లకు సాధ్యం కాదు కదా!" అని అన్నాడు కర్ణుడు.

అప్పుడు శల్యు డు తనలో తాను ఇలా అనుకున్నాడు. నేను పలికిన పలుకులు విని తాను అర్జునుని చేతిలో చావడం తథ్యం అనుకుంటున్నాడు. అందుకే తనలో ఉన్న లోపాలను తనకు కల గురు శాపము, బ్రాహ్మణ శాపము గురించి అందరకూ చెప్పాడు. నేను అర్జునుని బలపరాక్రమములు గురించి చెప్పడం వల్ల వీడి మనసు బాగా బలహీనమయింది. నేను ధర్మరాజుకు ఇచ్చినమాట నెరవేరింది. అని అనుకున్నాడు శల్యుడు.

తనను కాకి తోనూ అర్జునుని హంసతోనూ పోల్చడం తో కర్ణునికి బాగా కోపం వచ్చింది. "నీచుడా! నన్ను ఇలా నీచంగా పోల్చడం నీకు ధర్మమా! అవునులే. నీచులకు నీచోపమానములు తక్క వేరే ఏమి స్ఫురిస్తాయి. కాని నీ మాటలకు నేను భయపడను. అసలు అర్జునుని పరాక్రమం గురించి నేను నిన్ను అడిగానా? అనవసరంగా అందరిముందు అర్జునుని ఎందుకు పొగుడుతున్నావు? మిత్రుడ నైన నాకు ద్రోహం చేస్తున్నావు. యుద్ధములో శత్రువులను పొగిడేవాళ్లను క్షమించకూడదు. కాని నీకు సుయోధనుడు నాకు సూతుడుగా ఉండు

బాధ్యతను అప్పగించాడు కాబట్టి ఊరుకుంటున్నాను. నేను సుయోధనుడు మంచి మిత్రులము. లోకోత్తరమైనది మా మైత్రి. కాని నీవు నాకు బద్ధవిరోధివి. నా మిత్రుడు సుయోధనునికి సంతోషం కలిగేట్టు నీకు బాధకలిగేట్టు నేను అర్జునుని జయిస్తాను. కాని నా రథం భూమిలో కూరుకు పోకుండా ఉండాలి. లేకపోతే నాకు అర్జునుని సంహరించడం ఒక పని కాదు." అని అన్నాడు కర్ణుడు.

ఆ మాటలకు నవ్వాడు శల్యుడు. "కర్ణా! ఏలనయ్యా ఈ వ్యర్థ ప్రేలాపనలు. నీ లాంటి వాళ్లు వెయ్యి మంది వచ్చినా అర్జునుని గెలువ లేరు." అని అన్నాడు శల్యుడు. కర్ణుడికి పట్టరాని కోపం వచ్చింది.

"శల్యా! ఒకానొక రోజు ఒక వృద్ధ బ్రాహ్మణుడు బాహ్లిక దేశస్థులు మద్యపానమదోన్మత్తులని, మాంసభక్షకులనీ, దిగంబరంగా దురాచారాలు చేస్తుంటారనీ నిందించాడు. వారి కన్నా మీ మద్రదేశస్థులు అవినీత పరులని పేర్కొన్నాడు. అలాంటి వారికి నువ్వు రాజువు. నువ్వు నోరుమూసుకొని ఉండటం మంచిది." అని అన్నాడు.

"అదేంటి కర్ణా! అలా అంటావు. నీ గురించి నీకు తెలియదా. నిన్ను భీష్ముడు అర్ధరథుడు అని నిర్ణయించలేదా. పైగా మీ అంగదేశస్థులు

ఆడవాళ్లను అమ్ముకుంటారట కదా! నిజమేనా! అలాంటి వారికి రాజువు. నీవు నన్ను అంటావా! ముందు నీ తప్పులు తెలుసుకొని తరువాత ఎదుటివారి తప్పులు పట్టు. ఎందుకంటే, అన్ని దేశములలోనూ మంచివారు ఉంటారు, చెడ్డ వారు ఉంటారు. అందరినీ ఒకే త్రాట కట్టరాదు కదా! ఎదుటి వ్యక్తులలోని మంచి చెడులను విచారించి మాట్లాడాలి. అంతేగాని అవివేకంతో మాట్లాడరాదు." అని అన్నాడు శల్యుడు.

వీరి వివాదము చూచి సుయోధనుడు వచ్చి సముచితమైన మాటలతో ఇద్దరినీ సమాధాన పరిచాడు. శల్యుడు కర్ణుని రథము ముందుకు పోనిచ్చాడు.

"కర్ణా! నీవు అర్జునుని జయించినచో నీవే మా మహారాజువు. కానీ మనకు ఎన్నో దుశ్శకునములు గోచరిస్తూ ఉన్నవి. ఈ రోజు యుద్ధం ఘోరంగా జరుగ బోయేట్టు ఉంది. అదుగో కర్ణా! అర్జునుని కపిధ్వజము. అటు చూడు అర్జునుడు త్రిగర్త వీరులను చించి చెండాడుతున్నాడు. కర్ణా! ఎందుకైనా మంచిది. అర్జునుని గెలుస్తానని మనం మనం అనుకొని సంతోషిద్దాం. పెద్దగా అనకు పరువుపోతుంది. ఎందుకంటే అర్జునుని గెలవడం ఆ దేవేంద్రునికైనా సాధ్యం కాదని మనకు తెలుసు కదా! కర్ణా!

కర్ణా అటు చూడు. ఆహా! భీముడు, ధర్మరాజు, నకుల సహదేవులు, ఉప పాండవులు ఎలా అరివీర భయంకరులై మెరిసిపోతున్నారో! ఎంతైనా పాండవులు ధర్మపరులు కర్ణా! అందుకే ధర్మం ఎప్పుడూ వారినే వరిస్తుంది కదా! "అన్నాడు శల్యుడు.

అతని మాటలకు బదులు చెప్పలేదు కర్ణుడు. ఇంతలో సుయోధనుడు తన పక్షము లో ఉన్న యోధులను ఉద్దేశించి ఇలా అన్నాడు. "మహా యోధులారా! మీరందరూ అత్యంత పరాక్రమ వంతులు మీ బలపరాక్రమ ములు చూపు సమయం వచ్చింది. అందరూ ప్రాణాల మీద ఆశ విడిచి యుద్ధం చేయండి. విజయమో వీర స్వర్గమో తేల్చుకోండి." అని ఉత్సాహ పరిచాడు.

అంతలో అశ్వత్థామ ఇలా అన్నాడు "నా తండ్రిని చంపిన దృష్ట ద్యుమ్నుని చంపి కాని నేను ఈ కవచము విప్పను. భీమార్జునులు అడ్డంవచ్చినా సరే వారిని చంపి, దృష్టద్యుమ్నుని చంపుతాను." అని పలికాడు అశ్వత్థామ.

ఇరుపక్షములకు పోరు మొదలయింది . సుయోధనుడు తన గజసైన్యముతో బీముని ఎదుర్కొన్నాడు. కర్ణుడు ధర్మరాజును

ఎదుర్కొన్నాడు. అప్పుడు ధర్మరాజు అర్జునుని తన దగ్గరగా పిలిచి "అర్జునా! అటు  చూడు. కర్ణుడు పటిష్ఠమైన వ్యూహముతో యుద్ధమునకు దిగాడు. మనము కూడా అతనికి తగు విధంగా సమాధానము చెప్పాలి." అని అన్నాడు. "అన్నయ్యా! కర్ణుని సంహరించడం పెద్ద పనేమీ కాదు కదా!" అని అన్నాడు.  "అయితే నీవు రాధేయుని గెలువుము. భీమసేనుడు సుయోధనుని,  నకులుడు వృషసేనుని, సహదేవుడు సౌబలుని, శతానీకుడు దుశ్శాసనుని, సాత్యకి కృతవర్మను, ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామను,  ఉపపాండవులు శిఖండి కలిసి మిగిలిన ధృతరాష్ట్ర పుత్రులను ఎదుర్కొంటారు. నేను కృపాచార్యుని ఎదుర్కొంటాను." అని అన్నాడు.

కాని ఆ రోజు యుద్ధంలో ధర్మరాజు చెప్పినట్టు యుద్ధం జరగ లేదు. ఎవరి   ఇష్టం వచ్చినట్టు వారు యుద్ధం చేస్తున్నారు. అర్జునుడు కర్ణునితో తలపడ్డాడు.  మరొక పక్కనుండి సంశప్తకులు అర్జునుని మీద పడ్డారు. అర్జునుడు కర్ణుని వదిలి సంశప్తకులను ఊచకోతకోస్తున్నాడు. కాని సంశప్తకులు అర్జునుని రథమును చుట్టుముట్టారు.  కాని అర్జునుడు ఆ సంశప్తకులను తన బాణములతో చించి చెండాడుతున్నాడు.

కృపాచార్యుడు, సౌబలుడు, కృతవర్మ పాండవులతో పోరుతున్నారు. రక్తం కాలువలు కడుతూ ఉంది రధములు విరుగుతున్నాయి గజములు, హయములు నేలకూలుతున్నాయి. పదాతి దళముల కళేబరములతో రణభూమి నిండిపోయింది. సుయోధనుడు కర్ణునికి సాయంగా వెళ్లాడు. కర్ణుడు పాంచాల సైన్యమును ఎదుర్కొన్నాడు. పాంచాల సైన్యమునకు బాసటగా ఛేది సైన్యము వచ్చి చేరింది. వారందరినీ కర్ణుడు తరిమి తరిమి కొడుతున్నాడు. కర్ణుడు వారందరికీ స్వర్గ ప్రాప్తి కలిగిస్తున్నాడు.

తరువాత కర్ణుడు ధర్మజుని ఎదుర్కొన్నాడు. అప్పుడు ధృ ష్టద్యుమ్నుడు కర్ణుని ఎదుర్కొన్నాడు. మరొకపక్కనుండి ప్రభద్రకులు కూడా కర్ణుని మీద పడ్డారు. కర్ణుడు ప్రభద్రకులను ఏడుబాణములతో చంపాడు. అది చూచి పాంచాలురు మహా కోపంతో కర్ణుని మీదికి వచ్చారు. కర్ణుడు 25 బాణములతో 25 మంది పాంచాలురను వధించాడు. తరువాత భానుదేవుడు, చిత్రసేనుడు, సేనాబిందు, తపనుడు, శూరసేనుడు అను ఐదుగురు పాంచాలురు కర్ణుని ఎదుర్కొనగా, 5 బాణములతో వారిని వధించాడు కర్ణుడు.

కర్ణుని వెంట అతని కుమారుడు సుషేణుడు, సత్యసేనుడు, వృషసేనుడు అతనికి తోడుగా వస్తున్నారు. అపుడు భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, జనమే జయుడు, సాత్యకి, నకుల సహదేవులు, ఉప పాండవులు కేకయ, మత్స్య, యోధులు కర్ణుని ఎదుర్కొన్నారు. వారందరూ కర్ణుని మీద, అతని కుమారుల మీద ధారాపాతంగా అంప వర్షము కురిపించారు. ఇది చూచిన దుర్యోధనుడు, దుశ్శాసనుడు, వారి కుమారులు తమ తమ గజసేనలతో వచ్చి భీమసేనుని ఎదుర్కొన్నారు. సుయోధనుడు వారి మీద శరవర్షము కురిపించాడు. కాని భీముడు వాటిని ఛిన్నాభిన్నం చేసి, మరలా సుయోధనుని మీద అత్యంత పదునైన బాణములను ప్రయోగించాడు. వాటి ధాటికి సుయోధనుడు అతని పరివారము నిలువలేకపోయారు. భీముని బాణముల దెబ్బకు ఏనుగులు కూలి పోతున్నాయి. హయములు ప్రాణాలు కోల్పోతున్నాయి.

అప్పుడు కృపా చార్యుడు భీమసేనునితో తలపడ్డాడు. దుశ్శాసనుడు అతనికి తోడుగా నిలిచాడు. కర్ణుని కుమారులు భీమసేనునితో యుద్ధమునకు దిగారు. కర్ణుని కుమారుడు సుషేణుడు భీముని విల్లు విరిచాడు. భీముని గుండెలలోకి దిగేట్టు ఏడు బాణములు కొట్టాడు. భీముడు మరొక విల్లు తీసుకున్నాడు. కర్ణుని కుమారుడైన

సుషేణుని ధనుస్సు విరిచాడు. అతనిమీద 14 బాణములు ప్రయోగించాడు.  కర్ణుని మీద 73 బాణములు సంధించాడు.

ఇంతలో కర్ణుని కుమారుడు సత్యసేనుడు భీ మసేనుని ఎదుర్కొన్నాడు. భీమసేనుడు అతని సారధిని చంపాడు. ధ్వజమును విరిచాడు. మరియొక వాడియైన బాణముతో సత్యసేనుని శిరస్సును ఖండించాడు. తరువాత కృపాచార్యుడు, కృతవర్మ మొదలగు రధికుల ధనుస్సులు విరిచాడు. వారిని అతి క్రూరమైన బాణములతోకొట్టాడు. దుశ్శాసనుని మీద 5 బాణములు, సౌబలుని మీద 6 బాణముల ప్రయోగించాడు.  ఉలూకుని అతని తమ్ముని రథములను విరిచాడు.

కర్ణుని కుమారుని చూచి "ఓరి సుషేణా!  ఈ దెబ్బతో చచ్చావురా!" అంటూ వాడి యైన బాణములు అతని మీద ప్రయోగించాడు. కర్ణుడు మధ్యలోనే ఆ బాణములను త్రుంచాడు. భీముని మీద మూడు అతి క్రూరమైన బాణములను ప్రయోగించాడు. భీముడు మరలా సుషేణుని మీద బాణవర్షము కురిపించాడు.  కర్ణుడు ఆ బాణముల నన్నింటినీ ఖండించాడు. భీముని మీద 73 తీవ్రమైనబాణములను ప్రయోగించాడు.

ఆ సమయములో నకులుడు వచ్చి కర్ణుని ఎదుర్కొన్నాడు. సుషేణుడు నకులుని మీద బాణ వర్షము కురిపించాడు. నకులుని విల్లు విరిచాడు. నకులుడు మరొక విల్లు తీసుకొని సుషేణుని విల్లు విరిచాడు. సుషేణుడు మరొక విల్లు తీసుకొని నకులుని మీద 60 బాణములు సంధించాడు. సహదేవుడు నకులునికి సాయంగా వచ్చాడు. సుషేణుడు సహదేవుని మీద 7 బాణములు వేశాడు. నకుల సహదేవులిద్దరూ సుషేణుని తో ఘోరంగా యుద్ధం చేస్తున్నారు.

సుషేణుని తమ్ముడైన వృషసేనుడు సాత్యకిని ఎదుర్కొన్నాడు. సాత్యకి వృషసేనుడిమీద 77 బాణములు ప్రయోగించాడు. అతడి సూతుని మీద 3 బాణములు వేసి అతనిని నొప్పించాడు. వృషసేనుడి విల్లు విరిచాడు. హయములను చంపాడు. అతని పతాకమును ఖండించాడు. వృషసేనుడి గుండెలకు గురిపెట్టి కొట్టాడు. వృషసేనుడు తన కత్తి డాలు తీసుకొని రథము దిగి సాత్యకిని ఎదుర్కొన్నాడు. సాత్యకి అతని కత్తి డాలును ఖండించాడు. అప్పుడు దుశ్శాసనుడు వచ్చి వృషసేనుని తన రథము మీద ఎక్కించుకుని వెళ్ళిపోయాడు.

కర్ణుడు సాత్యకి పైన బాణములు సంధించాడు. సాత్యకి రథమును కూల్చాడు. సాత్యకి మరొక రథమును ఎక్కి కర్ణుని ఎదుర్కొన్నాడు

ఇంతలో ఉప పాండవులు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, భీముడు, నకుల సహదేవులు సాత్యకికి సాయంగా వచ్చాడు. కర్ణునికి సాత్యకికి ఘోర యుద్ధం జరిగింది. సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, భీమసేనుడు, ఉప పాండవులు కలిసి కర్ణుని మీద శరవర్షము కురిపించారు. కర్ణుడు వారందరి రథములను విరిచాడు. అందరినీ విరథులను చేసాడు.

కర్ణుడు ధర్మరాజు మీదికి దూకాడు అప్పుడు ఛేది సైన్యము ధర్మరాజుకు సాయంగా వచ్చింది. కర్ణుడు వారినందరినీ తరుముతున్నాడు. ఇంతలో సాత్యకి, శిఖండి, మరి కొందరు వీరులు ధర్మరాజుకు సాయంగా వచ్చారు. వారి మధ్య యుద్ధం తీవ్రతరమయింది. కాని కర్ణుని పరాక్రమము ముందు పాండవ సేనలు వెల వెల పోతున్నాయి. కర్ణుడు ధర్మరాజు మీద శరవర్షము కురిపిస్తున్నాడు. ధర్మరాజు ధనుస్సును ఖండించాడు. 90 బాణములతో ధర్మరాజు తొడుక్కున్న కవచమును చీల్చాడు. ధర్మరాజు శక్తి ఆయుధమును కర్ణుని మీదికి విసిరాడు కర్ణుడు దానిని ముక్కలు ముక్కలుగా ఖండించాడు. ధర్మరాజు కర్ణుని శరీరం అంతా బాణములతో కొట్టాడు. కర్ణుడు ధర్మజుని పతాకమును ఖండించి, అతని సారధిని చంపాడు.

సాత్యకి, శిఖండి కర్ణుని మీద బాణ వర్షము కురిపించారు. కర్ణుడు వారి రథములను విరగ్గొట్టాడు. వారి ధనుస్సులను విరిచాడు. వెంటనే ధర్మరాజు శరీరం అంతా వాడియైన బాణములతో కొట్టాడు. కర్ణుని విజృంభణ తట్టుకోలేక ధర్మరాజు తన రథమును పక్కకు మళ్లించి, యుద్ధభూమి నుండి తొలగిపోయాడు.

కర్ణుడు ధర్మరాజు వెంట తరిమాడు. పరిహాసంగా ఇలా అన్నాడు. " ఓ ధర్మరాజా! నీవు క్షత్రియకులములో పుట్టావు. ధర్మాధర్మ విచక్షణ తెలిసిన వాడవు. ఈ ప్రకారము భీరువు మాదిరి ప్రాణములు కాపాడుకొనుటకు యుద్ధరంగమునుండి పారిపోవుటతగునా! నీకు రాజనీతి తెలియదు. నీవు బ్రాహ్మణ సహజమైన పిరివివాడివి. వెళ్లు...... వెళ్లి యజ్ఞ యాగములు చేసికొని జీవించు. నీకు యుద్ధం ఎందుకు? నా వంటి వారలతో యుద్ధం చేస్తే నీకు ఆపదలే ఎదురవుతాయి. నేను నీ ప్రాణములు తీయను కాని నీవు వెంటనే కృష్ణార్జునుల ఉన్న చోటికి పో !" అని అన్నాడు.

ఇక్కడ కూడా తాను తన తల్లి కుంతికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు కర్ణుడు. ధర్మరాజును చంపకుండా వదిలిపెట్టాడు. ఇది తెలియని ధర్మరాజు సిగ్గుతో తలవంచుకొని అక్కడి నుండి

వెళ్లిపోయాడు. కర్ణుడు ధర్మరాజును విడిచి అతని సైన్యమును హతమారు స్తున్నాడు. ధర్మరాజు అక్కడి నుండి వెళ్లడం చూచి అతని సైన్యము కూడా పారిపోయింది. కౌరవ సైన్యములో హర్షధ్వానాలు, భేరీ మృదంగ ధ్వానాలు చెలరేగాయి.

తన సైన్యము పారి పోవడం చూచాడు ధర్మరాజు. వారిని ధైర్యవచనము లతో యుద్ధమునకు పురి కొల్పాడు.  ధర్మజుని మాటలకు రోషంతెచ్చుకున్న పాండవ సేన భీమసేనుని నాయకత్వంలో మరలా విజృంభిం చారు.  భీముడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు కలిసి కౌరవ సేనను నిర్మూలిస్తున్నారు. వారి ధాటికి తట్టుకోలేక కౌరవ సైన్యము పారిపోసాగింది. కర్ణుడు వారికి ధైర్యము చెప్పి మరలా యుద్ధోన్ముఖులను చేసాడు.

భీముడు సాత్యకీ ధృష్టద్యుమ్నులతో ఇలా అన్నాడు. " నా అన్న యుధిష్ఠిరుని భంగపాటు నాకు చాలా బాధ కలిగించింది.  ఆయనను రక్షించే బాధ్యత మీకు అప్పగిస్తు న్నాను. నేను వెళ్లి  నా అన్న ను అవమానించిన కర్ణుని మీద పగ తీర్చు కుంటాను.  ఈ రోజు నేను కర్ణుడో ఎవరో ఒకరే మిగలాలి." అన్నాడు భీమసేనుడు.  వారికి ధర్మరాజు రక్షణ బాధ్యత అప్పగించి తాను కర్ణుని మీదికి వెళ్లాడు.

మహాక్రోధంతో తన మీదికి వస్తున్న భీమసేనుని చూచి శల్యుడు కర్ణుని తో ఇలా అన్నాడు. "కర్ణా! అటు చూడు. భీమసేనుడు అపరిమితమైన క్రోధంతో ఇటే వస్తున్నాడు. అతడు కోపించిన మూడులోకములను కూడా లెక్కచెయ్యడు. నీవు అతనిని ఎదుర్కొని నీ బలపరాక్రమములు చూపించు." అని అన్నాడు.

" శల్యా! భీముడుపరాక్రమ వంతుడు కాదు. అల్పుడు. ఇతనిని చంపితే నాకు కీర్తి ఎలా వస్తుంది. అందుకని ఇతనిని నేను చంపను. వీడితో యుద్ధం చేస్తాను. భీమసేనుడి కొరకు అర్జునుడు రావాలి. నేను అర్జునుని చంపాలి. అప్పుడే నా పరాక్రమానికి పరాకాష్ఠ. అంతేకాని ఈ భీముడు ఒక లెక్క కాదు. మన రథము భీముని ఎదురుగా పోనిమ్ము."అన్నాడు కర్ణుడు.

కర్ణుడు భీమసేనుని మీద శరవర్షము కురిపించాడు. కర్ణుడు భీముని విల్లు తుంచాడు. భీముడు మరొక విల్లు అందుకొని కర్ణుని వక్షస్థలమును గురి చూచి కొట్టాడు. కర్ణుడు కూడా భీముని కవచాన్ని తన బాణములతో చీల్చాడు. భీముడు కర్ణుని మీదికి ఒక బల్లెం విసిరాడు ఆ బల్లెము కర్ణుని వక్షస్థలము తాకింది. కర్ణుడు తన రథము మీద

మూర్ఛపోయాడు. తన అన్నను తూల నాడిన నాలుకను కోస్తానని భీముడు ఒక ఖడ్గము తీసుకొని కర్ణుని రధం మీదికి ఉరికాడు.

శల్యుడు అతనిని వారించాడు." భీమసేనా! ఆగు. కర్ణుడు చావలేదు. మూర్ఛపోయాడు. ఇప్పుడు నీవు అతని నాలుక కోస్తే తీవ్ర రక్తస్రావంతో మరణిస్తాడు అప్పుడు నీ అన్న ప్రతిజ్ఞ నెరవేరదు. కాబట్టి ఇతనిని వదిలిపెట్టు." అని అన్నాడు.

భీమసేనుడు ఆగిపోయాడు. "శల్యా! మీరు నిజం చెప్పారు. నా అన్నను తూలనాడాడు అన్న కోపంతో వాస్తవాలు మరిచాను. నాడు కౌరవ సభలో ద్రౌపదిని అవమానిం చినపుడు నా అన్న ధర్మరాజు మాటమీద నా కోపం అణుచు కొన్నాను. ఈరోజు దానికి ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నాను. కాని ఇప్పుడు నేను కర్ణుని చంపితే నా అన్న ప్రతిజ్ఞా భంగంఅవుతుంది. అది నేను భరించలేను. నాకు సరి అయిన సమయంలో గుర్తు చేసారు." అంటూ కర్ణుని వదిలిపెట్టి వెళ్లాడు భీమసేనుడు. శల్యుడు రథమును పక్కకు తీసుకొని పోయాడు.

ఇది చూచాడు సుయోధనుడు. తన తమ్ములను చూచి కర్ణుడు భీమసేనుని చేతిలో భంగపడినట్టున్నాడు. మీరు కర్ణునికి సాయంగా

వెళ్లండి అని ఆదేశించాడు. వెంటనే శ్రుత వర్మ మొదలగు వారు భీమసేనుని చుట్టుముట్టారు. అది చూచిన భీమసేనుడు విజృంభించాడు. శ్రుత వర్మను, అతని అనుచరులను ఒకే వేటుతో నేలకూల్చాడు. వికటుడు, సముడు, నందుడు, ఉపనందుడు, గ్రాధుడు మొదలగు కురుకుమారులను తన బల్లెంతో చంపాడు. ఇంతలో కర్ణుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. వెంటనే భీముని ధనుస్సు ఖండించాడు. భీముడు కర్ణునిపై తన గదను ప్రయో గించాడు. కర్ణుడు ఆ గదను ఖండించాడు. భీమసేనుని మీద అత్యంత ప్రకాశంతో వెలిగిపోయే పది దివ్యాస్త్రములను ప్రయోగించాడు. భీమసేనుడు వాటి బారినుండి తప్పుకొని కర్ణుని వక్షస్థలమునకు గురిపెట్టి ఒక బాణం విసిరాడు. ఆ బాణము కర్ణుని వక్షస్థలమును చీల్చింది. వెంటనే కర్ణుడు భీముని విల్లు విరిచి, అతని మీద 25 బాణములు ప్రయోగించాడు. అతని హయములను చంపాడు.

భీముడు తన గదతీసుకొని నేలమీదికి దిగాడు. కర్ణుని మీదికి ఉరికాడు. అడ్డంగా వచ్చి ఏనుగులను, హయములను చంపుతున్నాడు. శకునికి చెందిన 3000 వేల మంది గాంధార అశ్వ సైన్యమును తునుమాడాడు. రథములను విరగ్గొడుతున్నాడు. ఏనుగులను, హయములను, కాల్బలమును చంపుతున్నాడు. తన గదాయుధముతో

రణభూమి అంతా తానే అయి విహరిస్తున్నాడు. ఇంతలో 600 మంది గాంధార యోధులు భీమసేనుని చుట్టుముట్టారు. వారి నందరినీ భీమ సేనుడు సూతులు, అశ్వములు, పతాకములు, రథములు, సహితంగా నాశనం చేసాడు. ఇది చూచిన శకుని యవన సైనికులు 3000 మందిని భీమసేనుని మీదికి పంపాడు. వారినందరినీ అడవిలో కార్చిచ్చు వెదురు పొదలను కాల్చినట్టు సర్వ నాశనం చేసాడు భీమసేనుడు. ఇంతలో భీమసేనుడు మరొక రథం ఎక్కాడు. రథం మీదినుండి యుద్ధం చేస్తున్నాడు.

మరొక పక్క కర్ణుడు తన తీవ్రమైన బాణములతో ధర్మరాజుతోయుద్ధం చేస్తున్నాడు. ధర్మరాజు సారథిని చంపాడు. సారథి చనిపోగానే ధర్మజుని రథమునకు కట్టిన అశ్వములు రథమును పక్కకు లాగుకొని వెళ్ళాయి. ఇది చూచి భీమసేనుడు మరలా కర్ణుని ఎదుర్కొన్నాడు. అప్పుడు సాత్యకి భీముని దాటుకుంటూ కర్ణుని మీదికి ఉరికాడు. ఇరువురు తమ తమ బాణములతో ఆకాశాన్ని కప్పివేసారు.

అప్పటికి మధ్యాహ్నం అయింది. కర్ణుని కి సాయంగా కృపాచార్యుడు, శకుని, కృతవర్మ, అశ్వత్థామ తమ తమ సైన్యములతో వచ్చారు. ఇరు పక్షములకు పోరు ఘోరమయింది. రక్తం వరదలై

పారుతూ ఉంది. రథములు విరుగుతున్నాయి. హయములు, ఏనుగుల కళేబరములతో రణభూమి నిండిపోయింది.  తెగిన తలలు, విరిగిన  కాళ్లు చేతులు,  తునాతునకలైన ధనుస్సులు, నేల మీద దొర్లే కిరీటములు, ఛత్రములు, చామరములు, పతాకములు, కరి,హయ,నర కళేబరముల గుట్టలు, వీటితో రణరంగమంతటా నిండిపోయింది.

అర్జునుడు తనను ఎదిరించిన త్రిగర్త సైనికులతో ఘోరంగా యుద్ధం చేస్తున్నాడు. సుశర్మ అర్జునుని మీద 10 అస్త్రములు ప్రయోగించాడు. కృష్ణుని 3 బాణములతో కొట్టాడు. కపిధ్వజమును తెగనరికాడు. కపిధ్వజము మీద ఉన్న హనుమంతుడు బిగ్గరగా అరిచాడు. ఆ అరుపుకు  సంశప్తక సైన్యము మూర్ఛపోయారు.  వెంటనే తేరుకొని అర్జునుని రథమును చుట్టుముట్టారు.  అర్జునుడు వారి మీద బాణప్రయోగం చేస్తుంటే కృష్ణుడు అవలీలగా తన రధమును వారి మధ్యనుండిబయటకు తీసుకొని వచ్చాడు.

అర్జునుడు సర్పాస్త్రము ప్రయోగించి సంశప్తకుల కాళ్లను బంధించాడు.  నాగాస్త్ర బంధంలో చిక్కుకున్న  త్రిగర్త సైనికులు అర్జునుని రథమును  వదిలిపెట్టారు.  ఇంతలో సుశర్మ గరుడాస్త్రము ప్రయోగించి తన సైన్యమును నాగాస్త్రము నుండి విముక్తిచేసాడు.

అర్జునుని మీద ఒక దివ్యాస్త్రము ప్రయోగించాడు. ఆ అస్త్ర ప్రభావమునకు అర్జునుడు తన రథము మీద పడి మూర్ఛపోయాడు. అర్జునుడు చనిపోయాడని కౌరవ సైన్యము హర్షధ్వానాలు చేసింది. భేరీ మృదంగ ధ్వానములు మిన్నుముట్టాయి.

ఇంతలో అర్జునుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. సుశర్మను తన బాణములతో ముంచెత్తాడు. త్రిగర్త సైన్మము మీద ఇంద్ర అస్త్రము ప్రయోగించాడు. ఆ అస్త్రము ప్రభావమున అందు నుండి వివిధ బాణాకృతులు వెలువడి త్రిగర్త సైన్యమును బలి తీసుకున్నాయి. పోయిన వాళ్లు పోగా మిగిలిన 14,000 మంది సంశప్తక సైన్యము ఒక్కుమ్మడిగా అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుడు వారితో భీకరంగా యుద్ధం చేస్తున్నాడు.

మరొక పక్క పాండవ సైన్యము ధాటికి తట్టుకోలేక కౌరవ సైన్యము పారిపోతుంటే సుయోధనుడు, కృతవర్మ, దుశ్శాసనుడు, మొదలగువారు తమ తమ సైనికులను తిరిగి యుద్ధోన్ముఖులను చేస్తున్నారు. కృపాచార్యుడు పాంచాల సైన్యము మీద శరములను వర్షము మాదిరి కురిపిస్తున్నాడు. శిఖండి ఎక్కిన రధమును విరిచాడు. సారధిని చంపాడు. హయములను చంపాడు. శిఖండి తన రధము దిగి

ఒక పెద్ద కత్తి తీసుకొని కృపాచార్యుని మీదికి వస్తున్నాడు. కృపాచార్యుడు శిఖండి మీద బాణములను గుప్పిస్తున్నాడు.

ఇంతలో ధృష్టద్యుమ్నుడు కృపాచార్యుని ఎదుర్కొన్నాడు. కృతవర్మ మధ్యలో వచ్చి ధృష్టద్యుమ్నుని ఎదుర్కొన్నాడు. ధర్మరాజు, ఉపపాండవులతో కూడి అశ్వత్థామను, నకుల సహదేవులు సుయోధనుని, భీమసేనుడు కర్ణుని, ఎదుర్కొని యుద్ధం చేస్తున్నారు. ఇంతలో కృ పాచార్యుడు శిఖండి చేతిలో ఉన్న డాలును ఖండించాడు. శిఖండి తన చేతిలో ఉన్న కత్తితోనే కృపాచార్యుని ఎదుర్కొంటున్నాడు.

ఇంతలో సుకేతుడు మధ్యగా వచ్చి కృపాచార్యుని ఎదుర్కొన్నాడు. శిఖండి అక్కడి నుండి వెళ్లిపోయాడు. కృపాచార్యుడు సుకేతుని మీద ఆరు బాణములు వేసి అతని విల్లు ఖండించాడు. సుకేతుడు మరొక విల్లు తీసుకోగా, కృపాచార్యుడు దానిని కూడా ఖండించాడు. సుకేతుడు మరొక విల్లు తీసుకొని కృపాచార్యుని విల్లు విరిచాడు. అతని అశ్వములను సారధిని కొట్టాడు. కృపాచార్యుడు మరొక విల్లు తీసుకొని సుకేతుని మీద 30 బాణములు ప్రయోగించాడు. కృపాచార్యుని బాణముల ధాటికి తట్టుకోలేకపోయాడు సుకేతుడు. అప్పుడు కృపాచార్యుడు ఒకే ఒక బాణంతో సుకేతుని శిరస్సు ఖండించాడు. సుకేతుని మరణము చూచిన అతని సేనలు చెల్లాచెదరయ్యాయి.

ధృష్టద్యుమ్నుడు కృతవర్మ వక్షస్థలాన్ని గురిపెట్టి తొమ్మిది బాణములు వేసాడు. కృతవర్మ సారధిని, అశ్వములను, ధ్వజమును, రధమును తన బాణములతో కప్పివేసాడు.  కృత వర్మ రధమునుండి కిందికి దిగి అక్కడినుండి వెళ్లిపోయాడు.  ధృష్టద్యుమ్నుడు కృతవర్మ కోసం వెతుకుతూ, దొరికిన అతని సారధిని చంపాడు. ఇంతలో కృతవర్మ నేను ఇక్కడ ఉన్నాను అని పెద్దగా అరిచాడు. ధృష్టద్యుమ్నుడు ఆ వైపుకు పరుగెట్టాడు. కృతవర్మ  నేల మీద నిలబడి ఒక విల్లు అందుకున్నాడు. ధృ ష్టద్యుమ్నునితో తలపడ్డాడు. ఇది చూచిన కౌరవ వీరుడు, కృత వర్మను తన రధము మీదికి లాగుకొని అక్కడి నుండి  దూరంగా తీసుకొని వెళ్లాడు.  చేతికి చిక్కిన కృతవర్మ తప్పించుకొని పోవడంతో, ధృ ష్టద్యుమ్నుడు  కౌరవ సేన మీదపడ్డాడు.

ధర్మరాజు అశ్వత్థామతో యుద్ధం చేస్తుంటే, అతనికి తోడుగా సాత్యకి వచ్చాడు. అశ్వత్థామ వారి నందరినీ తన శరపరంపరలతో ముంచెత్తాడు. ధర్మరాజు కూడా అశ్వత్థామ మీద బాణ వర్షము కురిపించాడు. అశ్వత్థామ ధర్మరాజు విల్లు త్రుంచి   అతని మీద మూడు బాణములు వేసాడు. ఇంతలో సాత్యకి అశ్వత్థామ విల్లు త్రుంచాడు. అశ్వత్థామ  ఒక ఈటె తీసుకొని సాత్యకి  సారధిని చంపాడు. అతనిపై

బాణవర్షము కురిపించాడు. సారధి లేని సాత్యకి రధమును గుర్రములు ఎటో ఈడ్చుకొని వెళ్లాయి.

పాండవ సైనికులు అశ్వత్థామ మీద శర వర్షము కురిపించారు. అశ్వత్థామ  కోపోద్రిక్తుడై పాండవ సైనికులను ఊచకోత కోసాడు.  ఇది విన్న సుయోధనుడు పాండవులు కూడా అశ్వత్థామ చేతిలో హతమయ్యారని సంతోషించాడు.  ఇంతలో ధర్మరాజు అశ్వత్థాను తరుముతున్న దృశ్యం కంటపడి హతాశుడయ్యాడు.  ఈ ప్రకారంగా జయాపజయాలు క్షణక్షణము మారుతున్నాయి.

ధర్మరాజుఅశ్వత్థామను చూచి "గురుపుత్రా! అశ్వత్థామా! నీవు అత్యంత బలవంతుడివి.  అస్త్రశస్త్రపారంగతుడివి.  నీ పరాక్రమము నా మీద కాకుండా నా సేనాపతి ధృష్టద్యుమ్నుని మీద చూపించు. అయినా నీవు బ్రాహ్మణుడవు. కాని నీకు దయా, జాలి, కృతజ్ఞత ఏ కోశానా లేవు కదా! నీవు బ్రాహ్మణ సహజమైన జపతపాదులు విడిచి ఇలా విల్లుపట్టి యుద్ధం చెయ్యడం ధర్మం అనిపించు కుంటుందా!" అని అన్నాడు. కాని ఈ మాటలు పట్టించుకోకుండా అశ్వత్థామ ధర్మరాజు మీద బాణవర్షము కురిపించాడు. అశ్వత్థామ బాణముల ధాటికి తట్టుకోలేక ధర్మరాజు అక్కడినుండి పారిపోయాడు.

ఇంతలో అప్పటిదాకా భీమసేనుని తో యుద్ధం చేస్తున్న కర్ణుడు కృపా చార్యునికి సాయంగా అక్కడికి వచ్చాడు. భీముడు కౌరవ సేనలను చెల్లాచెదరు చేస్తున్నాడు. సుయోధనుడు నకులసహదేవులతో యుద్ధం చేస్తున్నాడు. సుయోధనుడు సహదేవుని ధ్వజమును ఖండించాడు. వారిద్దరి ధనుస్సులను త్రుంచాడు. నకుల సహదేవులు వేరు  ధన్సులు ధరించి సుయోధనుని మీద శరవర్షము కురిపించారు.  కోపించిన సుయోధనుడు వారిరువురిని తన బాణములతో కప్పివేసాడు. వారి మరణం సుయోధనుని చేతిలో తథ్యం అనుకుంటున్న తరుణంలో ధృష్టద్యుమ్నుడు అక్కడకు వేగంగా వచ్చి వారిని రక్షించాడు.

సుయోధనుడు ధృష్టద్యుమ్నుని మీద అత్యంత తీవ్రమైన బాణములను ప్రయోగించాడు. అతని విల్లు ఖండించాడు. ధృష్టద్యుమ్నుడు వేరొక విల్లు తీసుకొని సుయోధనుని మీద బాణవర్షము కురిపించాడు. సుయోధనుడు ధృష్టద్యుమ్ముని ధనుస్సు ఖండించి అతని నొసట మీద 10 అస్త్రములను నాటాడు. ధృష్టద్యుమ్నునికి కోపం అవధులు దాటింది. వేరొక విల్లు చేబూని సుయో ధనుని ధనుస్సును, పతాకమును, రధమును ఖండించాడు. సుయోధనుడు కూడా ఏ మాత్రం జంకకుండా  ధృష్టద్యుమ్నుడి బల్లెము, ఖడ్గము, ధ్వజము,

అశ్వములను, సారధిని, కవచమును తునాతునకలుగా ఖండించాడు. ఇది చూచిన ధృష్టద్యుమ్నుని సోదరుడు అతనిని వెంటనే తన రథము మీదికి లాగి అక్కడి నుండి తప్పించాడు.

అప్పటి వరకూ సాత్యకి తో పోరుతున్న కర్ణుడు అతనిని విడిచి ధృ ష్ట ద్యుమ్నుని వెంబడించాడు. సాత్యకి కర్ణుని తరుముతున్నాడు. కర్ణునికి ధృష్టద్యుమ్నుని కి ఘోర యుద్ధం జరిగింది. పాంచాల రాకుమారులు ఎనిమిది మంది మధ్యలో వచ్చి కర్ణుని ఎదుర్కొన్నారు. కర్ణుడు వారినందరినీ యమ పురికి పంపాడు. ఛేది, పాంచాల వీరులు కర్ణుని చుట్టుముట్టారు. కర్ణుడు వారినందరినీ సంహరించాడు. తరువాత ధర్మరాజు వైపుకు వెళుతున్నాడు. అది చూచి ధృష్టద్యుమ్నుడు, ఉప పాండవులు, నకుల సహదేవులు, శిఖండి, సాత్యకి ఒక్కుమ్మడిగా కర్ణుని చుట్టుముట్టారు.

మరొక పక్క భీమసేనుడు కౌరవ సైన్యమును నిర్దాక్షిణ్యముగా సంహ రిస్తున్నాడు. అతని వీర విహారమునకు మారణ హోమమునకు భయపడి కౌరవ సైన్యము అతని ఎదుట పడుటకు సాహసించుటలేదు. మరొక పక్క అర్జునుడు సంశప్తకుల నందరినీ సంహరించి, మిగిలిన త్రిగర్త సైనికులను తరుముతున్నాడు. త్రిగర్త సైనికులు పారిపోగా, అర్జునుడు తన రథమును కర్ణునికి అభిముఖంగా తోలమన్నాడు.

ఇది చూచిన సుయోధనుడు త్రిగర్త సైనికులను ప్రోత్సాహపరిచి యుద్ధోన్ముఖులను చేస్తున్నాడు. అప్పుడు త్రిగర్త సైనికులు, కాంభోజరాజ సేనల సాయంతో మరలా అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుడు కాంభోజరాజ సేనల తో సహా త్రిగర్త సైనికుల తలలు నరికాడు. రణభూమి అంతా వారి మొండెములతో నిండిపోయింది. ఇంతలో కాంభోజరాజు సోదరుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. ఒకే ఒక బాణంతో అర్జునుడు అతని చేతులు ఖండించాడు. అది చూచిన యవనసేనలు అర్జునుని చుట్టుముట్టాయి. కాని అర్జునుని చేతిలో అంతలోనే హతమయ్యాయి.

శ్రీ కృష్ణుని సారథ్యంలో అర్జునుడు ఎక్కడ చూచి నా తా నే అయి రణభూమి అంతా వీరవిహారం చేస్తున్నాడు. అది చూచిన అశ్వత్థామ అర్జునుని తన దగ్గరకు పిలిచి "అర్జునా! నీవు నా తో యుద్ధం చెయ్యడం లేదు. రా. నన్ను నీ అతిథిగా పిలిచి నాకు యుద్ధమును ఆతిథ్యంగా ఇవ్వు" అని అన్నాడు. అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుని వంక చూచాడు. కృష్ణుడు అశ్వత్థామ ఎదురుగా రథము నిలిపి "అశ్వత్థామా! అర్జునునితో తనివిదీరా యుద్ధము చేసి సుయోధనుని రుణం తీర్చుకో" అన్నాడు.

వెంటనే అశ్వత్థామ కృష్ణుడి మీద 60 బాణములు ప్రయోగించాడు. అర్జునుని మీద మూడు బాణములు వేసాడు. అర్జునుడు వెంటనే అశ్వత్థామ విల్లును విరిచాడు. అశ్వత్థామ మరొక ధనుస్సు తీసుకొని అర్జునుని శరీరం అంతా తీవ్రమైన బాణములు ప్రయోగించాడు. తరువాత అశ్వత్థామ కృష్ణార్జునుల మీద శరవర్షము కురిపించి వారి రథమును తన బాణసమూహంతో కప్పివేసాడు. వారి రథమును కదలకుండా చేసాడు.

కృష్ణార్జునులకు ఏమయిందో తెలియక సైనికులు హా హా కారాలు చేసారు. కృష్ణుడు అర్జునుని వంక చూచి "అర్జునా! ఇదేమి వింత. నీవు అశ్వత్థామ చేతిలో ఓడిపోవడమా! నీ లో పరాక్రమం నశించిందా. నీ గాండీవంలో బలం తగ్గిందా! లేక అశ్వత్థా నీ గురుపుత్రుడని జాలి చూపిస్తున్నావా! లేక నీలో నీవే అధైర్యపడుతున్నావా!" అని అన్నాడు.

దానికి అర్జునునికి కోపం వచ్చింది. వెంటనే పదునైన బాణములతో అశ్వత్థామ విల్లు ఖండించాడు. అతని పతాకము ను విరిచాడు. అశ్వత్థామ ఒక బల్లెం తీసుకున్నాడు. అర్జునుడు దానిని కూడా ఖండించాడు. అశ్వత్థామ నిరాయుధుడయ్యాడు. ఇది చూచారు సంశప్తకులు. అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుడు వారినందరినీ

క్షణాలలో చంపాడు. వారి సైన్యములోని రధములను విరగ్గొట్టాడు. ఏనుగులను, హయములను చంపాడు.

సంశప్తకులకు తోడుగా అంగ, వంగ, నిషాద,కళింగ దేశాల సేనలు అర్జునుని మీదికి దూకాయి. ఇంతలో అశ్వత్థామ వేరొక రధమును, విల్లును సమకూర్చుకొని, మరలా అర్జునుని ఎదుర్కొన్నాడు.అర్జునుని మీద కృష్ణుని మీదా అత్యంత క్రూరమైన అస్త్రములను ప్రయోగించాడు. వెంటనే అర్జునుడు అశ్వత్థామ శిరమున, కంఠము మీద, చేతుల మీద, గుండెలమీద, పాదముల మీద శరప్రయోగం చేసాడు. అశ్వత్థామ ఎక్కిన రధమునకు కట్టిన గుర్రముల పగ్గములను ఖండించాడు. అప్పుడు ఆ రథాశ్వములు అదు పు తప్పి అశ్వత్థామ రధమును ఎటోలాగుకొని వెళ్లాయి. అశ్వత్థామ తన రధమును అదుపులోకి తెచ్చుకొని కర్ణుని వైపు వెళ్లాడు. మిగిలిన సంశప్తకుల గర్వము అణచుటకు అర్జునుడు వారి వంకకు వెళ్లాడు.

ఇంతలో మగధ రాజు దండధారుడు అను వాడు తన గజమును ఎక్కి పాండవ సైన్యములో చొరబడి నాశనం చేస్తున్నాడు అది చూచి కృ ష్ణుడు అర్జునా! ముందు వాడి పని పట్టు అని అన్నాడు. రధమును అతని వైపుకు పోనిచ్చాడు. దండధారుడు కూడా కృష్ణార్జునులకు ఎదురుగా

తన ఏనుగును పోనిచ్చి వారి మీద అత్యంత పదునైన బాణములు విసిరాడు. తన బాణములతో కృష్ణార్జునులను ముంచెత్తాడు. అర్జునుడు ఒకే ఒక బాణంతో  దండధారుని రెండు చేతులు నరికాడు. అతడి ఏనుగును మరొక బాణంతో వధించాడు. అతడి సైన్యాన్ని చెల్లాచెదరు చేసాడు.

మరలా అర్జునుడు సంశప్తక సైన్యము మీదికి వెళ్లాడు. ఇంతలో సుయోధనుడు తన సైన్యముతో వచ్చి కర్ణుని కలిసాడు. ఇరువురి సైన్యములు పాండవుల సేనలను చుట్టుముట్టాయి. ఇంతలో పుళింద, బాహ్లిక, ఆంధ్ర.భోజ సైన్యాలు వచ్చి సుయోధనునికి అండగా నిలిచాయి. అపారమైన సేనావాహినితో సుయోధనుడు, కర్ణుడు పాండవసైన్యమును చుట్టుముట్టారు. వారి ధాటికి ఆగలేక పాండవ సేనలు పారిపోసాగాయి.

పాండ్య రాజు మలయధ్వజుడు కౌరవ సేనలను కకావికలు చేస్తున్నాడు. అతడిని  అశ్వత్థామ ఎదుర్కొన్నాడు. ఇరువురు ఒకరికి ఒకరు తీసిపోకుండా  ఘోరంగా యుద్ధం చేస్తున్నారు. మలయధ్వజుడు అశ్వత్థామ ధనుస్సుకు కట్టిన తాడును (నారిని) ఖండించాడు. అశ్వత్థామ మరొక విల్లు తీసుకొని  మలయధ్వజుని మీద శరవర్షము కురిపించాడు. పాండ్య రాజు వాయవ్యాస్త్రము సంధించి అశ్వత్థామ  వేసిన

బాణములను చెల్లాచెదరుచేసాడు. అశ్వత్థామ చక్రరక్షకులను చంపాడు. అతని విల్లు విరిచాడు. రథాన్ని కూలగొట్టాడు. అశ్వత్థామ బెదరక మలయధ్వజుడు వేసిన బాణములను సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నాడు.

ఇంతలో పాండ్యరాజు తన ఏనుగును ఎక్కి, ఒకే ఒక బాణంతో అశ్వత్థామ తల మీద ఉన్న మణిని కింద పడేట్టు కొట్టాడు. అశ్వత్థామ కోపం కట్టలు తెంచుకుంది. వీరావేశంతో ఊగిపోయాడు. పాండ్యరాజు అనుచరులను, అతని ఏనుగును చంపాడు. పదునైన భల్లబాణములతో పాండ్యరాజు తలను నరికాడు. ఇది చూచి పాండ్యరాజు సేనలు పారిపోయాయి. సుయోధనుడు అశ్వత్థామను పొగడ్తలతో ముంచెత్తాడు. అశ్వత్థామ కర్ణునికి అండగా నిలిచి పాండవ సేనలను తునుమాడుతున్నాడు . పాండవ సేనలకు అండగా అర్జునుడు వారి మధ్యకు వచ్చి నిలిచాడు. అర్జునుడు ఉన్నాడన్న ధైర్యంతో పాండవసేనలు పారిపోకుండా నిలిచాయి. అప్పటికే ధృష్టద్యుమ్నుడు కర్ణునితో యుద్ధం చేస్తున్నాడు.

ఇంతలో అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని చూచి "ఓరీ బ్రహ్మఘ్నా! (బ్రాహ్మణుడైన నా తండ్రిని చంపిన వాడా!). నా తండ్రిని చంపిన

పాపానికి నిన్ను చంపకుండా వదలను. ఈరోజుతో నా చేతిలో నీ ఆయువు మూడింది.” అని ధృష్టద్యుమ్నుని మీదికి ఉరికాడు. ఆ మాటలకు ధృష్టద్యుమ్నుడు “అశ్వత్థామా! నన్ను బ్రహ్మఘ్నుడు అంటావా. స్వధర్మాన్ని మరచి పరధర్మాన్ని ఆశ్రయించిన మీరు బ్రాహ్మణులా! బ్రాహ్మణులను చంపితే పాపం కాని, బ్రాహ్మణ కులానికే చెడ్డ పేరు తెచ్చిన నీ తండ్రిని చంపి నేను పుణ్యం చేసుకున్నాను. నీ తండ్రిని చంపిన ఖడ్గము నీ కోసమే అట్టిపెట్టాను. దానితో నీ తల కూడా నరుకుతాను.” అని అన్నాడు.

అలా ఒకరికి ఒకరు నిందించుకుంటూ ఒకరి మీద ఒకరు బాణ ప్రయోగం చేసుకుంటున్నారు. ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామ విల్లు విరిచాడు. అశ్వత్థామ మరొక విల్లు తీసుకొని ధృష్టద్యుమ్నుని హయములను, సారథిని చంపాడు. అతని విల్లు, పతాకము విరిచాడు. ధృష్టద్యుమ్నుడు తన గద తీసుకున్నాడు. దానిని కూడా తునా తునకలు చేసాడు అశ్వత్థామ. ధృష్ట ద్యుమ్నుడు తన కత్తి డాలు తీసుకున్నాడు. అశ్వత్థామ వాటిని కూడా ఖండించాడు. తాను కూడా ఒక కత్తి తీసుకొని ధృష్టద్యుమ్నును నరకడానికి అతని మీదికి దుమికాడు.

ఇది చూచాడు కృష్ణుడు. "అర్జునా! ధృష్ట ద్యుమ్నుడు ఆపదలో ఉన్నాడు. రక్షించు." అని అరిచాడు. వెంటనే అర్జునుడు అతి క్రూరమైన బాణములను అశ్వత్థామ మీదికి ప్రయోగించాడు. ఆ బాణముల ధాటికి తట్టుకోలేక అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని వదిలి తన రథము దగ్గరకు వచ్చాడు. పక్కనే ఉన్న సహదేవుడు ధృష్టద్యుమ్నుని తన రథము మీద ఎక్కించుకొని అక్కడి పక్కకు తొలిగాడు. అశ్వత్థామ అర్జునుని తో యుద్ధం చేస్తున్నాడు. అర్జునుడు అశ్వత్థామను మూర్ఛపోయేట్టు కొట్టాడు. అశ్వత్థామ రథ సారధి రథమును పక్కకు తీసుకొని వెళ్లాడు.

పాండవ సైన్యాధిపతులు అర్జునుని కొనియాడారు. భేరీమృదంగధ్వానములు, శంఖఘోషలు మిన్నుముట్టాయి. ఇది చూచిన కర్ణుడు అర్జునుని ఎదుర్కొన్నాడు. మరొక పక్కనుండి త్రిగర్త వీరులు అర్జునుని యుద్ధమునకు రమ్మని కవ్విస్తున్నారు.

"కృష్ణా! కర్ణుడు, త్రిగర్తులు మనలను కవ్విస్తున్నారు. ఇప్పుడు కర్ణుని ఎదుర్కొంటే త్రిగర్తులకు ఓడిపోయిన వారము అవుతాము. కర్ణుని సంగతి తరువాత చూడవచ్చు. ముందు మన రథమును త్రిగర్తుమీదికి పోనిమ్ము"అని అన్నాడు అర్జునుడు. కృష్ణుడు రథమును త్రిగర్తుల మీదికి పోనిచ్చాడు. అర్జునుడు త్రిగర్తసేనలను చించి చెండాడుతున్నాడు.

అప్పుడు కర్ణుడు ధర్మరాజుతో తలపడ్డాడు. ఇరువురికి ఘోరంగా యుద్ధం సాగింది. కర్ణుడు తన పదునైన బాణములతో పాండవ సైన్యములోని ప్రముఖులను, వారి రధములను, సారధులను, అశ్వములను దారుణంగా వధిస్తున్నాడు. పాంచాల వీరులు, నకులసహదేవులు, ఉప పాండవులు,సాత్యకి కర్ణుని ఎదుర్కొన్నారు. కర్ణుడు ఒక్కడే వీరందరినీ ఎదుర్కొన్నాడు. వారిని తన బాణ పరంపరలతో ముంచెత్తాడు. సుయోధనుడు గజ సైన్యమును రంగం లోకి దింపాడు. కళింగ, అంగ, వంగ, మగధ, పౌండ్రక, సుహ్మ దేశములకు చెందిన గజసైన్యమును పాండవులపైకి పురికొల్పాడు. ఆగజసైన్యము పాండవ సైన్యములోకి చొచ్చుకొని పోయి, వారినందరినీ కాళ్ల కింద పడవేసి తొక్కుతూ ఉంది.

సాత్యకి అత్యంత సాహసంతో వంగరాజును అతని ఏనుగులను సంహరించాడు. సహదేవుడు పౌండ్రరాజును, నకులుడు సుహ్మరాజును ఎదుర్కొని వారిని వారి గజములతో సహా వధించారు. వీరి మరణము చూచి, వారి వారి గజసైన్యములు పాండవుల మీదికి విజృంభించాయి. సహదేవుడు అత్యంత శక్తివంతమైన బాణములతో ఆ ఏనుగులను వధిస్తున్నాడు. ధృష్టద్యుమ్నుడు మొదలగువారు కూడా ఏనుగుల

గుంపును హత మారుస్తున్నారు. యుద్ధం తీవ్రమైంది. రథములు విరుగుతున్నాయి.తలలు, కాళ్లు చేతులు తెగి పడుతున్నాయి. ఏనుగుల కళేబరములు కొండలమాదిరి గుట్టగుట్టలుగా పెరిగిపోతున్నాయి. రక్తం కాలువలు కట్టింది.

ఇంతలో సుయోధనుడు ధర్మరాజును ప్రాణములతో బంధించడానికి తన అనుయాయులతో చుట్టుముట్టాడు. కాని భీముడు, సాత్యకి వారిని ఎదుర్కొని ధర్మరాజును కాపాడారు. కర్ణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ సుయోధనునికి సాయంగా వచ్చారు. వారందరూ భీమసేనుని మీద, సాత్యకి మీద బాణ వర్షము కురిపించారు. ధర్మరాజు కవచమును ఖండించాడు. కర్ణుడు పాండవ వీరులను తునుమాడుతున్నాడు. అర్జునుడి కోసం ఎదురు చూస్తున్నాడు.

ఇది చూచి కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! కర్ణుడునీ కోసం ఎదురు చూస్తున్నాడు. వెళ్లు. అతనిని వధించు. కర్ణుడు చస్తే సుయోధనుడు ఒంటరి వాడవుతాడు. అప్పుడు కౌరవసామ్రాజ్యలక్ష్మీనీ వశమవుతుంది." అనిఅన్నాడు. ఇంతలో భీమసేనుడు తన వెంట ధృష్టద్యుమ్నుడు, సాత్యకి రాగా, కౌరవ సేనలను తరిమి తరిమి కొడుతున్నాడు.

నిషాద రాజ కుమారుడు భీమసేనునితో తలపడ్డాడు. భీముడు అతని మీద నాలుగు బాణములు వేసి అతని తలను, అతను ఎక్కిన ఏనుగు తలను ఏకకాలంలో ఖండించాడు. ఆ నిషాద రాజకుమారుని సైన్యం పారిపోయింది. ప్రళయ కాల రుద్రునివలె విలయ తాండవం చేస్తున్న భీముని ఎదుర్కొనే వారే లేక పోయారు. ఇది చూచిన దుర్యోధనుడు భీమసేనుని అడ్డగించాడు. సుయోధనునికి తోడుగా కర్ణుడు నిలిచాడు.

కర్ణుడు తన బాణములతో శిఖండి సారధిని చంపాడు. అతని కేతనము ఖండించాడు. శిఖండి పారిపోయాడు. దుశ్శాసనుడు ధృ ష్టద్యుమ్నుడు ఒకరితో ఒకరు తీసిపోకుండాయుద్ధం చేస్తున్నారు. నకులుడు కర్ణుని కుమారు డైన వృషసేనుడి సారధి తలను ఖండించాడు. వృషసేనుడి సైన్యం చెల్లాచెద రయింది. వృషసేనుడు మరొక సారధిని తీసుకొని మరలా యుద్ధరంగం ప్రవేశించాడు. సహదేవుడు శకుని కుమారుడైన ఉలూకుని తీవ్రంగా గాయపరిచాడు. ఉలూకుడు యుద్ధరంగమునుండి పారిపోయాడు.

సాత్యకి, శకుని ఒకరితో ఒకరు తీవ్రంగా యుద్ధంచేస్తున్నారు. సాత్యకి శకుని ఎక్కిన రధమునకు కట్టిన హయములను చంపాడు. శకుని రథము దిగిపారిపోయాడు. ఇంతలో భీముడు సుయోధనుని సారధిని వధించాడు. అతని రథమును విరగ్గొట్టాడు. సుయోధనుడు మరొకరి రథము ఎక్కి పక్కకు తొలగిపోయాడు.

యుధామన్యుడు కృపాచార్యుని ఎదుర్కొన్నాడు. అతని విల్లు ఖండించాడు. కృపాచార్యుడు మరొక విల్లు తీసుకున్నాడు. యుయుధానుడి సారధిని చంపాడు. అతని కేతనము విల్లు ఖండించాడు. యుయుధానుడు పారిపోయాడు. అశ్వత్థామ అర్జునుని ఎదుర్కొన్నాడు. ఇరువురి మధ్య ఘోరమైన యుద్ధం జరిగింది. అశ్వత్థామ కృష్ణార్జునుల మీద శరవర్షము కురిపించాడు. అర్జునుడు కూడా అశ్వత్థామ మీద అనాకానేక దివ్యాస్త్రములు సంధించాడు.

మరొక వైపు ధర్మరాజు చిత్ర సేనుని ఎదుర్కొన్నాడు. భీముడు, నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు కలిసి సుయోధనుని అతని పరివారమును ఎదుర్కొన్నాడు. ఇదిచూచి కర్ణుడు సుయోధనునికి సాయంగా వచ్చాడు. కర్ణుడు ధర్మరాజు గుండెలకు గురిపెట్టి ఒక బాణము కొట్టాడు. ఆ బాణము దెబ్బకు ధర్మరాజు రథము మీద

కూలబడ్డాడు. రథమును పక్కకుపోనిమ్మన్నాడు. కౌరవులు ధర్మరాజు రథమును తరిమారు. అప్పుడు కేకయ పాంచాల వీరులు అడ్డుగా వచ్చి ధర్మరాజును రక్షించారు.

భీముడు సుయోధనునితో యుద్ధం చేస్తున్నాడు. కర్ణుడు పాంచాల, కేకయ వీరులతో యుద్ధం చేస్తున్నాడు. వారి నుగ్గు నుగ్గు చేసి యుద్ధ భూమి నుండి వెనుదిరిగి పోతున్న ధర్మరాజును వెంబడించాడు కర్ణుడు. ధర్మరాజు వెనక్కు తిరిగి కర్ణుడు మీద శరవర్షము కురిపించాడు. కర్ణుని సారధిని హయములను చంపాడు. నకుల సహదేవులు ధర్మరాజుకు సాయంగా వచ్చారు. కర్ణుడిని తమ బాణములతో ముంచెత్తారు. కర్ణుడు విజృంభించి, ధర్మరాజు హయములను చంపి, అతని తలపాగా పడగొట్టాడు. ధర్మరాజు నకులుడి రథం ఎక్కాడు.

ఇంతలో శల్యుడు కర్ణుని చూచి "కర్ణా! ఏమిటాపని! నీ పరాక్రమము అర్జునుని మీద చూపించు. ధర్మరాజు మీద కాదు. పొరపాటున నువ్వు ధర్మరాజును చంపితే నీ చావు అర్జునుని చేతిలో తధ్యం. కాబట్టి ధర్మరాజును వదిలి అర్జునుని వెంబడించు. కర్ణా! అటు చూడు. నీ అనుంగు మిత్రుడు సుయోధనుడు నిరాయుధుడై భీముని చేతిలో చిక్కాడు. ముందు సుయోధనుని సంగతి చూడు. భీముని

చేతిలో సుయోధనుడు చస్తే నీ శ్రమ అంతా వృధా అవుతుంది. అప్పుడు నీవు పాండవులను చంపినా ప్రయోజనం లేదు కదా!" అని అన్నాడు. శల్యుని మాటలు విని కర్ణుడు ధర్మజుని వదిలి సుయోధనుని వైపు వెళ్లాడు.

కర్ణుడు తనను విడిచి వెళ్లగానే ధర్మరాజు నకుల సహదేవులతో కలిసి తన శిబిరము చేరుకున్నాడు." అని సంజయుడు ధృతరాష్ట్రునకు ఆ నాటి యుద్ధ విశేషములు వర్ణించి చెప్పాడు.

ఈ ప్రకారంగా వైశంపాయనుడు జనమేజయునకు మహా భారత కథను వినిపించాడు అని నైమిశారణ్యంలో సూతుడు శౌనకాది మహామునులకు మహా భారత కథను సవిస్తరంగా చెప్పాడు.

మహాభారతము

కర్ణపర్వము

ద్వితీయాశ్వాసము

సమాప్తము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహాభారతము

## కర్ణ పర్వము

## తృతీయాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన మహా భారత కథను , నైమిశారణ్యములో సత్రయాగ సందర్భమున, సూతుడు శౌనకాదిమహా మునులకు ఈ విధంగా వివరించసాగాడు.

కర్ణుడు చేత చిక్కిన ధర్మరాజును విడిచి పెట్టి సుయోధనుని సహాయమునకు వెళ్లాడు అని విని ధృతరాష్ట్రుడు, "సంజయా! కర్ణునికి బుద్ధి లేదా? చేత చిక్కిన ధర్మరాజును చంపకుండా ఎలా విడిచి పెట్టాడు. నా కుమారుడు సుయోధనుడు ఆ మాత్రం భీమసేనునితోయుద్ధం చేయలేడా? అతని సాయానికి కర్ణుడు ఎందుకు వెళ్లాలి? కర్ణుడు మోసం చేసాడంటావా? సరేలే. తరువాత యుద్ధం ఎలా జరిగిందో చెప్పు." అని అన్నాడు. సంజయుడు చెప్పసాగాడు.

ఆ ప్రకారంగా కర్ణునిచేత విడువబడిన ధర్మరాజు తన శిబిరమునకు వెళ్లాడు. రథం దిగి శిబిరం లోకి వెళ్లాడు. మెత్తటి శయ్య మీద పడుకొని, తన ఒంటికి తగిలిన బాణములను తీయించుకున్నాడు. తనకు జరిగిన పరాభవమును తల్చుకొని బాధపడుతున్నాడు.

ఇంతలో నకుల సహదేవులు కూడా లోపలకు వచ్చారు. వారిని వెంటనే

భీమసేనుని సహాయమునకు వెళ్లమని చెప్పాడు. నకుల సహదేవులు వెంటనే భీముని వద్దకు వెళ్లారు.

ఆ సమయంలో అర్జునుడు అశ్వత్థామతో యుద్ధం చేస్తున్నాడు. అర్జునుడు వేసిన తీవ్రమైన బాణములను సమర్ధవంతంగా ఎదుర్కొంటూ, అశ్వత్థామ అర్జునుని మీదికి తన గదను విసిరాడు. ఆ గదను అర్జునుడు ముక్కలు చేసాడు. వెనువెంటనే పది వాడిబాణములను అశ్వత్థామ శరీరములో గుచ్చాడు. అశ్వత్థామ సారథిని హతమార్చాడు.

అశ్వత్థామకు పట్టరాని కోపం వచ్చింది. అర్జునుని మీద, కృష్ణుని మీద శరవర్షము కురిపించాడు. అర్జునుడు ఆ బాణములను మధ్యలోనే తుంచి, అశ్వత్థామ ఎక్కిన రథము నకు కట్టిన అశ్వముల పగ్గములను తెగ్గొట్టాడు. పగ్గములు తెగిన అశ్వములు అశ్వత్థామ రథమును పక్కకు లాగుకొని వెళ్లాయి. ఇది చూచిన కౌరవ సేన పారిపోయింది. పాండవ సేనలో జయజయధ్వానాలు మిన్ను ముట్టాయి.

అది చూచి సుయోధనుడు కర్ణునితో ఇలా అన్నాడు. "కర్ణా! నీవు యుద్ధభూమిలో ఉండగానే, నీవు యుద్ధం చేస్తుండగానే మనసేనలకు ఇలాంటి దుర్గతి పట్టడం వింతగా ఉంది. నీవు సరిగ్గా యుద్ధం చేస్తే పాండ వులు నీకు ఒక లెక్క కాదు కదా! నీ పరాక్రమాన్ని ప్రదర్శించు. నీ వివిధా స్త్రములను ప్రయోగించు." అని పురికొల్పాడు.

అప్పుడు కర్ణుడు శల్యుని చూచి "శల్యా! విన్నావుగా సుయోధనుని మాటలు. మన రథమును అర్జునునికి ఎదురుగా పోనిమ్ము. అర్జునుని, కృష్ణుని, భీముని సంహరిస్తాను. నా ప్రతాపం ఏమిటో లోకానికి తెలియ చేస్తాను. ఈ సువిశాల

భారతావనిని సుయోధనుడు పాలించేటట్టు చేస్తాను. నీ సారథ్యములో మెళుకువలు ప్రదర్శించు." అని అన్నాడు. వెంటనే తన విల్లు ఎక్కుపెట్టి భార్గవాస్త్రం సంధించాడు. అర్జునుని మీద ప్రయోగించాడు.

ఆ అస్త్రము వివిధములైన ఆయుధముల ఆకృతులు ధరించి పాండవ సేనను నాశనం చేస్తూ ఉంది. రధములు విరుగుతున్నాయి. అశ్వములు, ఏనుగులు గుట్ట గుట్టలుగా చచ్చి పడు తున్నాయి. భార్గవాస్త్రము శక్తికి తాళలేక పాండు సేనలు పరుగులుపెట్టాయి. ఇది చూచాడు కృష్ణుడు.

"అర్జునా! చూచావుగా కర్ణుని కోప జ్వాల. భగా భగా మండిపోతున్నాడు. ఇప్పుడు మనం తెలివిగా ప్రవర్తించాలి గాని కోపం తెచ్చుకోకూడదు." అని అన్నాడు.

దానికి అర్జునుడు "కృష్ణా! నీవు చెప్పినది యదార్ధము. మన రధమును వెనక్కుతిప్పు. బతికి ఉంటే పలు సుఖాలు అనుభవించవచ్చును." అని అన్నాడు.

అప్పుడు కృష్ణుడు భీమసేనుని వంక చూచాడు. భీమసేనుడు కర్ణునితో యుద్ధం చేస్తున్నాడు. భీమసేనుని చూచిన పాండవ సేనలు ధైర్యము తెచ్చుకొని, మరలా రణభూమికి తిరిగివచ్చాయి. అది చూచిన ధృష్ట ద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, ఉపపాండవులు మొదలగువారు కర్ణుని చుట్టుముట్టారు. అర్జునుడు విశ్రాంతి కోరుకుంటున్నాడు అని తలచిన కృష్ణుడు తమ రధమును దూరంగా తీసుకొని వెళ్లాడు.

"అర్జునా! మనము అశ్వత్థామతో యుద్ధయు చేయునప్పుడు, ధర్మరాజు కర్ణుని తో యుద్ధము చేసి అతని చేతిలో చిక్కాడు. అతని కేమయినదో తెలియదు.

కర్ణుని తో మనవాళ్లు యుద్ధం చేస్తున్నారు. కాబట్టి మనము వెళ్లి ధర్మరాజు క్షేమము కనుక్కుందాము. తరువాత వచ్చి కర్ణునితో యుద్ధము చేస్తాము." అని అన్నాడు.

అర్జునుడు కూడా ధర్మరాజు కోసం నలుపక్కలా చూచాడు. ఎక్కడా ధర్మరాజు కనిపించలేదు. వెంటనే భీమసేనుని ధర్మరాజు గురించి అడిగాడు.

"అర్జునా! నేను కౌరవులతో యుద్ధం చేస్తున్నప్పుడు ధర్మరాజు కర్ణుని తో యుద్ధం చెయ్యడం చూచాను. కర్ణుడు అన్నయ్య శరీరం నిండా శరములతో నింపాడు. తరువాత ధర్మజుడు యుద్ధభూమి విడిచి వెళ్లాడు. అన్నయ్యకు ఏమీ కాదు. కృష్ణుడు మన చెంత నుండగా ఏమవుతుంది!" అని అన్నాడు భీమసేనుడు.

అప్పుడు అర్జునుడు భీమసేనుని చూచి "భీమసేనా! నేను కర్ణునితో యుద్ధం చేస్తాను. నువ్వు వెంటనే వెళ్లి ధర్మజుని యోగక్షేమం తెలుసుకొని రా!" అని అన్నాడు.

అర్జునా! అలాంటి పని నీవు చేస్తావేమో కాని నేను మాత్రం చెయ్యను. భీమసేనుడు భయపాడి పారి పోయాడు అని జనం అనుకుంటారు. అదుగో సంశప్తకులు నా మీదికి వస్తున్నారు. నేను వారిని విడిచి నేను ఎలా వెళ్లగలను. వీరందరినీ నేను హతమారుస్తాను. నువ్వే వెళ్లి అన్నయ్య క్షేమం కనుక్కో." అన్నాడు భీమసేనుడు.

ఇంక చేసేది లేక అర్జునుడు కృష్ణునితో "కృష్ణా! మన రథమును త్వరగా ధర్మరాజు శిబిరమునకుపోనిమ్ము. నాకు అన్నయ్యను చూడవలెనని ఆతురతగా ఉన్నది." అని అన్నాడు.

అర్జునుని మాట ననుసరించి కృష్ణుడు తమ రథమును వేగంగా ధర్మరాజు

శిబిరము వద్దకు పోనిచ్చాడు. అర్జునుడు రథము దిగి లోపలకు వెళ్లాడు. ఒంటరిగా శయ్యమీద పడుకొని ఉన్న ధర్మరాజును చూచాడు. అర్జునుని మనసు కుదుట పడింది. వెంటనే వెళ్లి ధర్మరాజు పాదములకు నమస్కరించాడు.

అర్జునుడు కర్ణుని సంహరించి, తన ఆశీర్వాదము కొరకు వచ్చాడు అని అనుకున్నాడు ధర్మరాజు. చాలా సంతోషించాడు.

"కృష్ణార్జునులారా! దేవతలకుకూడా జయింప సాధ్యంకాని కర్ణుని, పరశురామ ప్రసాదిత మైన అస్త్ర శస్త్రములు కలిగిన కర్ణుని, మహా బలవంతుడైన కర్ణుని, యుద్ధము లో సంహరించి, విజయులై తిరిగి వచ్చిన మీ ఇద్దరినీ అభినందిస్తున్నాను. నా మనస్సుకు సంతోషం కలిగించారు.

ఇంతకు ముందే నాకూ కర్ణునికీ యుద్ధంజరిగింది. అందరి సమక్షములో కర్ణుడు నా సారథిని చంపాడు. పతాకమును విరిచాడు. నా శరీరం నిండా శరములతో నింపాడు. ఇంతలో భీమసేనుడు సుయోధనుని నిరాయుధుని చేసి చంపబోయాడు. కర్ణుడు నన్ను వదలి సుయోధనుని వంకకు పోయాడు. నేను యుద్ధభూమి నుండి శిబిరమునకు తిరిగి వచ్చాను.

అర్జునా! కర్ణుడు నన్ను ఘోరంగా అవమానించాడు. నేను ఎంతో బాధ పడ్డాను. నీ వంటి తమ్ముడి వలన నాకు ఆ అవమాన భారం తీరిపోయింది. అర్జునా! అత్యంత బలవంతుడైన కర్ణుని నీవు ఎలా సంహరించగలిగావు? కర్ణుని కొడుకులు, అతని బంధువులు, అతని సేనలు, కురుకుమారులు, ఎల్లప్పుడు కర్ణుని వెన్నంటి ఉంటారు కదా! నీవు కొంచెంకూడా గాయపడకుంటా కర్ణుని చంపడం ఎంతో ప్రశంసనీయము. నీ బాహుబలము, పరాక్రమము ఏమిటో లోకానికి నిరూపించావు.

నాడు నిండుసభలో కర్ణుడు ద్రౌపదిని అన్నమాటలు నాచెవులలో ఇంకా మారుమోగుతున్నాయి. నాడు కర్ణుని చేతిలో ద్రౌపదికి జరిగిన పరాభవము ఎలా మరచి పోగలను. నేడు నీవు ఆ పరాభవాగ్నిని చల్లార్చావు. అర్జునా! అతి గర్వ సమున్నత మైన అతని తల ను ఎలా ఎగురగొట్ట గలిగావు. కర్ణుడు నీ మీద శర పరంపర కురిపిస్తుంటే, నీవు అతని గుండెలకు గురిపెట్టి కొట్టగా అతను చచ్చాడు కదా!" అని సంతోషంతో పొంగిపోతున్న ధర్మరాజును చూచి అర్జునుడు ఇలా అన్నాడు.

"అన్నయ్యా! నేను సంశప్తకులతోయుద్ధం చేస్తున్నప్పుడు, అశ్వత్థామ తన సేనలతో నన్ను చుట్టుముట్టాడు. నేను అతని సేనల లోని 500 రధములను విరగ్గొట్టాను. వారి నందరినీ చంపాను. రణభూమిని వారి శవాలతో నింపాను. అప్పుడు అశ్వత్థామ నన్ను నా రధమును కప్పేటట్టు బాణవర్షము కురిపించాడు. మాకు దిక్కుతోచలేదు. ఆ తరువాత అశ్వత్థామ నన్ను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. నేను నీ కోసం వెదికాను. నీవు కనపడలేదు. నీవు ఇక్కడ ఉన్నట్టు భీమసేనుడు చెప్పాడు. నీ యోగక్షేమములు తెలుసుకొనుటకు ఇక్కడకు వచ్చాను. క్షేమంగా ఉన్న నిన్నుచూచి నా మనస్సు శాంతించింది. నేను మరలా యుద్ధభూమికి వెళుతున్నాను. నీ కోరిక తీరేట్టు కర్ణుని శిరస్సు ఖండించి తిరిగి వస్తాను. నీ మనస్సుకు ఆనందం కలిగిస్తాను." అని పలికాడు.

కర్ణుడు ఇంకా ప్రాణాలతో ఉన్నాడు అని తెలిసి ధర్మరాజు కోపంతో ఊగిపోయాడు.

"అర్జునా! నేను రణభూమి నుండి తొలగి రావడంతో మీ అందరకూ చులకనైపోయాను. నేనే కాదు, నీవు కూడా కర్ణుని చేతిలో ఓడిపోయావు. భీముడు, నకుల సహదేవులు ఇంతకు ముందే కర్ణుని చేతిలో ఓడిపోయారు. మనతో చేరి

కృష్ణుడు కూడా కర్ణుని చేతిలో ఓడి పోయాడు. కాబట్టి మనం ఇంక యుద్ధ భూమికి పోవలసిన పని లేదు. యుద్ధం చేయవలసిన అగత్యం లేదు. మరొక సారి అందరం అడవులకు పోయి తాపస వృత్తి స్వీకరిద్దాము. అలా కాని పక్షంలో అనవసరపు బీరములు పలుక కుండా, సుయోధనుని వద్దకు పోయి, అతడు చెప్పుచేతలలో నడుస్తూ అతని కాళ్ల వద్ద పడి ఉందాము." అన్నాడు ధర్మజుడు.

ఆ మాటలు అంటుంటే అతని కన్నులు ఎర్రబారి నిప్పులు కక్కుతున్నాయి.

"అర్జునా! నీవు ఇలాంటి వాడివి అని తెలిస్తే అసలు నేను యుద్ధము వంకకు పోయి ఉండేవాడిని కాదు. ఏదో మనకు తోచిన పనులు మనము చేసుకొనే వాళ్లము. యుద్ధమునకు ముందే నువ్వు నాకు "కర్ణుని జయించడం నా వల్లకాదు" అని చెప్పి ఉంటే అసలు నేను ~~ఈ~~ యుద్ధమునకు ఎందుకు పూనుకుంటాను. అప్రయోజకులమైన మనకు రాజ్యము, రాజ్యపాలన ఎందుకుచెప్పు?

యుద్ధానికి ముందు ఏమి చెప్పావు నేను కర్ణుని వధిస్తాను అని అన్నావు కదా. కాని ఇప్పుడు అదే కర్ణుని చేతిలో ఓడిపోయి, పారిపోయి, వచ్చావు. నన్ను అవమానాలపాలు చేసావు. అసలు నన్ను ఆకాశానికి ఎత్తి ఆశలు కల్పించడం ఎందుకు. మరలా పాతాళానికి అణగ తొక్కడం ఎందుకు? ఆ నాడు నీవు కృష్ణుని ముందు అన్న మాటలు అన్ని అనృతములే కదా!

నీవు పుట్టినప్పుడు, ఎందరో మహామునులు, ఆకాశవాణి నీవు ఎంతో పరాక్రమ వంతుడివి అవుతావు. శత్రువులను నిర్జిస్తావు అని పలికారు. కడకు వాళ్ల మాటలు కూడా వమ్ముచేసిన నిన్ను ఏమనాలి? అర్జునా! నిజం చెపుతున్నాను. నిన్ను నమ్మి నేను సుయోధనునితో వైరం కొని తెచ్చుకున్నాను. యుద్ధంలో నువ్వు కర్ణుడంటే భయపడతావని నాకు అప్పుడు తెలియదు సుమా!

అయినా అర్జునా! నీకేం తక్కువ. దేవతలిచ్చిన రథం, అశ్వములు ఉన్నాయి. నీ రథం మీద నిరంతరం కపిధ్వజము ఎగురుతూ ఉంటుంది. దేవత లిచ్చిన గాండీవము నీ చేతిలో ఉంది. అన్నిటికి మించి దేవదేవుడైన శ్రీ కృష్ణుడు నీకు రథసారథి. ఇన్ని ఉండి కూడా నీవు కర్ణుడి తో యుద్ధం లో ఎందుకు ఓడిపోయి పారిపోయావు. నాకే అర్థం కావడం లేదు.

నీకు తెలుసో లేదో. నువ్వు కర్ణుడికి సాటి రావని, ఓడిపోతావని సుయో, దనుడు నాకు ముందే చెప్పాడు. కాని నేనే నీమీద అనవసరమైన ఆశలు పెంచుకున్నాను. భంగపడ్డాను. నేను నిన్ను నమ్మాను. మన ఇద్దరినీ మన మిత్ర రాజులు నమ్మారు. కోరి కష్టాలు కొని తెచ్చుకున్నారు. అనసనరంగా యుద్ధంలో తమ తమ ప్రాణాలు పణంగా పెట్టారు." అని పలు నిష్టురోక్తులు పలికాడు ధర్మరాజు.

అర్జునుడు మాట్లాడలేదు. తలవంచుకొని ఉన్నాడు. ధర్మరాజు కృష్ణుని చూచి "కృష్ణా! ఇంక లాభం లేదు. కర్ణుని జయించడం మనకు శక్యంకాదు అని తేలిపోయింది. ఈరోజు సుయోధనుడు మొదలగు శత్రురాజుల ముందు ఘోరంగా అవమానింపబడ్డాను. భీముని వలన ప్రాణాలతో బయట పడ్డాను. కాబట్టి ఇంక నేను ప్రాణములతో ఉండటం అనవసరం. పాపం భీముడు ఒక్కడే ప్రాణాలకు తెగించి యుద్ధం చేస్తున్నాడు. అర్జునుని మాదిరి పారిపోయి రాలేదు." అని అన్నాడు.

కాసేపాగి అర్జునుని వంక చూచి "అర్జునా ఈ రోజు అభిమన్యుడు కాని, ఘటోత్కచుడు కాని ఉంటే ఎంత బాగుండేది. అయినా చేసిన పాపాలు అనుభవించాలి కదా. వాళ్లు మనకు ఎందుకు దక్కుతారు చెప్పు. అసలు చుట్టము అంటేనే ఆపదలలో ఆదుకొనే వాడు అని అర్థము. అలాంటి చుట్టము కృష్ణుడు

వెంట ఉండగా నువ్వు ఎందుకు రణరంగమునుండి పారిపోయి వచ్చావు.

ఒక పనిచెయ్యి నీ గాండీవము కృష్ణునికి ఇచ్చి నువ్వు రథం తోలు. కృష్ణుడు యుద్ధం చేస్తాడు. క్షణాలలో కర్ణుని చంపుతాడు. సుయోధనుని రాజ్యం అపహరిస్తాడు. అసలు నువ్వు కుంతీ దేవి గర్భవాసమున పుట్టకుండా ఉండాల్సింది. నువ్వు పుట్టక ముందే ఆమెకు గర్భస్రావమై ఉంటే, ఈ రోజు ఇంతటి దుర్గతి పట్టదు కదా! అని అన్నాడు ధర్మరాజు.

అన్ని మాటలను మౌనంగా భరించిన అర్జునుడు ఆఖరున ధర్మజుడు నీ గాండీవమును కృష్ణునికి ఇచ్చి నువ్వు రథము తోలు" అన్న మాటలు విని తట్టుకోలేక పోయాడు. పక్కనే ఉన్న కత్తి తీసుకొని ధర్మరాజును నరకపోయాడు. కృష్ణుడు అర్జునుని చెయ్యి పట్టుకొని వారించాడు.

"అర్జునా! ఇప్పుడు, ఇక్కడ, కత్తి తో పని ఏముంది చెప్పు. ఇక్కడ నీకు విరోధులు ఎవరూ లేరు కదా! మనం ధర్మరాజు క్షేమం తెలుసుకొనడానికి వచ్చాము. మీ అన్న ధర్మజుడు క్షేమంగా ఉన్నాడని తెలుసుకున్నాము. ఇది సంతోషించవలసిన సమయం కాని కోపం తెచ్చు కోవలసిన సమయం కాదు కదా! అయినా ఇక్కడ చంపదగిన విరోధులు ఎవరున్నారని నీకు అంత కోపం వచ్చింది." అని అన్నాడు కృష్ణుడు.

ఆ మాటలకు అర్జునుడు "కృష్ణా! నా గాండీవమును ఎవరికైనా ఇమ్మని ఎవరైనా అంటే వాళ్ల తల పగుల గొడతానని నా ప్రతిజ్ఞ. మనసును బాధించే ఇలాంటి మాటలు పలికిన వాడి తల నరకడం ధర్మం కాదా! ఆ మాటలన్ని నువ్వుకూడా విన్నావు కదా! అలాంటి మాటలు పలికిన వాడు ఎంతటి ధర్మరాజు అయినా అతడి తలనరకడం తక్షణ కర్తవ్యం. కాబట్టి నా ప్రతిజ్ఞ నెరవేర్చుకొని అసత్యదోషం

నివారించుకుంటాను. పోనీ నీవు లోక జ్ఞానం కలవాడికి ఈ పరిస్థితులలో ఏమి చెయ్యలో చెప్పు. ఆ ప్రకారం చేస్తాను.” అని అన్నాడు అర్జునుడు.

“ అర్జునా! చాలు... చాలు..... ఇంక వ్యర్థ ప్రేలాపనలు కట్టి పెట్టు. నీ మాటలు ఎవరన్నా వింటే నీకు పెద్దలమీద గౌరవం లేదు, పెద్దలను గౌరవించడం తెలియదు, అని అనుకుంటారు. ధర్మాధర్మవిచక్షణ తెలిసిన వారు నీ మాదిరి మాట్లాడరు. ప్రస్తుతము ఏం చెయ్యాలో, ఏం చెయ్యకూడదో, ఏది ధర్మమో, ఏది అధర్మమో, విచక్షణా జ్ఞానంతో తెలుసుకొని ప్రవర్తించు.

సత్యము, అహింస పరమ ధర్మములు. అహింసతో సత్యమును కాపాడాలి. ఆ సత్యమే అహింసాచరణకు తోడ్పడుతుంది. మనము చేసే ప్రతి కర్మ అత్యంత సూక్ష్మంగా ఉంటుంది. అందులో ఉచితానుచితములు ఎరిగి మనము ఆ కర్మ చెయ్యాలి. అది తెలుసుకోకుండా, నీ అన్నయ్యను, నీ హితం కోరేవాడు, ధర్మం తెలిసినవాడు పైగా మనందరికి మహారాజు అయిన ఈ ధర్మజుని చంపబోవడం ధర్మమని పించుకుంటుందా!

నీవు చిన్నప్పుడు, తెలిసీ తెలియని వయసులో ఏదో వ్రతం పూనావు. ఇప్పుడు, ఈ వయసులో, ధర్మాధర్మ విచక్షణ లేకుండా ఆ వ్రతం నెరవేర్చు కోవాలను కోవడం మూర్ఖత్వం కాదా! దానిని పెద్దలు ఆమోదించరు. ధన, మాన, ప్రాణములకు హాని కలిగినపుడు, పలికే అబద్ధములను నిజాలుగా, నిజములను అబద్ధములుగా స్వీకరించడంలో తప్పులేదు. ఈ సందర్భములో నీకు ఒక దృ ష్టాంతము చెపుతాను.

పూర్వము కౌశికుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. వాడికి పెద్దలు చెప్పిన మాటలు వినే అలవాటు లేదు. తాను నమ్మిందే ఆచరిస్తాడు. అతడు ఒకసారి

తన ఆశ్రమంలో తపస్సు చేసుకుంటున్నాడు. కొంతమంది దొంగలు దారినపోయే బాటసారులను తరుముకుంటూ వస్తున్నారు. ఆ బాటసారులు తమ తమ ధనము, ఆభరణముల మూటలతో  అతడు తపస్సు చేసుకుంటున్న ఆశ్రమ సమీపమున ఉన్న పొదలలో దాక్కున్నారు. ఇంతలో వారిని తరుముతున్న దొంగలు అక్కడకు వచ్చారు.  తాము తరుముతున్న బాటసారులు ఎటు వెళ్లారు అని కౌశికుడిని అడిగారు.  అతడిని సత్యాసత్య విచక్షణ తెలియని కాడు కావడం చేత,  అసత్యం చెబితే తనకు దోషం చుట్టుకుంటుందని, అదుగో ఆ పొదల మాటున దాక్కున్నారు అని నిజం చెప్పాడు. అంతే ఆ దొంగలు  వారి నందరినీ చంపి వారి ధనాన్ని దోచుకొని పోయారు. మరణానంతరము కౌశికుడు ఘోరనరకానికి పోయాడు.

కాబట్టి అర్జునా! హింసతో కూడిన సత్యము ధర్మము కాదు. సత్యాసత్య నిరూపణము పెద్దల వలన తెలుసుకోవాలి గాని మనకు ఏం తోస్తే అది చేసెయ్యకూడదు. కాబట్టి నీ అన్న ధర్మరాజును నువ్వు వధించడం ధర్మం కాదు.” అని పలికాడు.

అప్పటికి శాంతించాడు అర్జునుడు. “కృష్ణా! నా అజ్ఞానాన్ని  మన్నించు. నా తల్లి తండ్రుల మాదిరి నాకు హితము చెప్పి నేను అనుచిత కార్యము చెయ్యకుండా నివారించావు. లేకపోతే ఘోరం జరిగిపోయి ఉండేది.  కాని ఒక్క విషయం.  నన్ను ప్రజలు,  వృధా ప్రతిజ్ఞలు చేసేవాడు, చేసిన ప్రతిజ్ఞను ఆచరించని అయోగ్యుడు, అని నిందించకుండా, నా అన్నయ్యకు ఎలాంటి ఆపద వాటిల్లకుండా, ఒక ఉపాయం చెప్పు.” అని అన్నాడు అర్జునుడు.

“అర్జునా! కర్ణుడి చేతిలో వాడి బాణాల దెబ్బలు తిని ఆ బాధ తట్టుకోలేక ఏవేవో మాటలు అన్నాడే కాని నీ అన్నయ్యకు నీ మీద ప్రేమ లేకనా చెప్పు. నీకు ప్రభువు, అన్న, ఆ మాత్రం అనకూడదా. నీవు పడకూడదా! నీవు, భీముడు, కవలలు

ఎల్లప్పుడూ అతని వశంలో ఉంటారు కదా! మీమీద ఆయనకు కోపం ఎందుకుంటుంది. నీవు ఆయనను చంపుతాను అని కత్తి ఎత్తావు కదా. ఆ భావనే మనసులో పెట్టుకొని నీ అన్నయ్యలో ఉన్న లోపాలను ఎత్తి చూపుతూ నిందించు. కాని ఆ మాటలు మనససులో పెట్టుకోవద్దని వినయంగా నమస్కరించు. ఆ ప్రకారంగా నీకు అనృత దోషం పోతుంది. నీ మనస్సు శాంతిస్తుంది. తరువాత మనం కర్ణుని చంపడానికి యుద్ధరంగానికి వెళదాము." అని అన్నాడు కృష్ణుడు.

వెంటనే అర్జునుడు ధర్మరాజును నిందించాడు. "ఓ ధర్మజా! అత్యంత పరాక్రమవంతుడైన భీముడు నన్ను నిందిస్తే నేను పడతాను గాని, కర్ణుడికి బెదిరి యుద్ధంలో పారి పోయి వచ్చినవాడిని నీవు నిందిస్నే నేను సహిస్తానా! నేనేంటో నా పరాక్రమేంటో తెలిసికూడా నీవు ఇలామాట్లాడటం నీకు తగునా? నన్ను ఈ ప్రకారం నిందించిన నీ నాలుక వేయిచీలికలు ఎందుకు కాలేదు? నన్ను నా పరాక్రమాన్ని నిందించావే! అసలు నీకు యుద్ధం గురించి ఏమి తెలుసు? నీవు ఎప్పుడన్నా ఎవరితో నన్నా యుద్ధం చేసావా? గెలిచావా! కనీసం నకుల సహదేవులు తమకు చేతనైనంత వరకూ యుద్ధం చేస్తారు గాని నీ మాదిరి వ్యర్థ ప్రేలాపనలు చెయ్యరు కదా!

అసలు ఈ మారణ హోమానికి కారణం నువ్వు కాదా! ఆనాడు నీవు తెలివి తక్కువగా జూదం ఆడక పోయి ఉంటే మాకీ దుర్గతి పట్టదు కదా! ఈ మారణ హోమం, జనక్షయము జరగదు కదా! నీ వలననే కదా మాకు అరణ్య వాసము అజ్ఞాతవాసము సంప్రాప్తించింది. ఇంత జరిగినా నీకు సిగ్గు అనేది లేకుండా మమ్మల్ని నిందిస్తావా! అవునులే. యుద్ధం చెయ్యలేనివాడికి చేతకాని వాడికి, ఓర్పు అనేది కవచంలా ఉంటుంది. ఓర్పు చాటున బతికేస్తుంటాడు. జరిగిందేదో జరిగింది. ఇంకనైనా బుద్ధి తెచ్చుకొని దుర్బుద్ధులు మాని, పౌరుషము చంపుకొని, నోరుమూసుకొని ఉండు. నీ వల్ల ఇన్ని కష్టములు పడ్డవారము ఇంకా నీ మాటలు

సహించి ఊరుకోము." అని ధర్మరాజును నిందించి, మనసులో ఎంతో సంతాపం చెందాడు అర్జునుడు.

మరలా తన ఒరలో నుండి కత్తి దూసాడు. "అర్జునా! మరలా కత్తి ఎందుకు దూసావు?" అని కంగారుగా అడిగాడు కృష్ణుడు.

"ఆ మహాను భావుడిని ఇన్ని మాటలు అన్నందుకు గాను నా తల నరికి అతని పాదాల చెంత పెడతాను. అదే నాకు తగిన శిక్ష." అని అన్నాడు.

"అర్జునా! దానికీ ఒక ప్రాయశ్చింత్తం ఉందయ్యా! నిన్ను నీవు పొగుడుకుంటే అది నిన్ను నీవు చంపుకున్నట్టే. కాబట్టి ఆపని చెయ్యి." అని అన్నాడు.

అప్పుడు అర్జునుడు కత్తి ఒరలో పెట్టి ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధర్మజా! నేనెవరో నా పరాక్రమమేమిటో నీకు తెలియదా! నేను సంశప్తకులను నాశనం చేసాను. నా చేతిలో చచ్చి న కౌరవ సేనలు ఎలా పడి ఉన్నాయో ఒక్కసారి చూడు!" అని గర్వంగా పలికి అంతలోనే అన్నయ్య కు సాష్టాంగ దండప్రమాణము చేసి "అన్నయ్యా! నేను నీ తో కారు కూతలు కూసాను. వాటిని నీవు పట్టించుకోవద్దు. ఎప్పటిలా నన్ను ఆదరింపుము. వినుము! ఓ ధర్మజా! నేను సత్యం పలుకు తున్నాను. నా శరీరము, నా ప్రాణము, నా జీవితము నీ అధీనములు. అక్కడ భీమసేనుడు ఒంటరిగా పోరాడుతున్నాడు. అతనికి సాయంగా వెళ్లడానికి నాకు అనుజ్ఞ ఇమ్ము. నేను వెళ్లి భీమసేనునికి సాయం చేస్తాను. కౌరవ సేనలను నాశనం చేస్తాను. కర్ణుని సంహరిస్తాను. సుయోధనుని గర్వం అణుస్తాను. నేడు కర్ణుని తల్లి రాధకైనా పుత్రశోకం కలగాలి లేకున్న నా తల్లి కుంతి కన్నా పుత్రశోకం కలగాలి. ఏదో ఒకటి తప్పదు." అని అన్నాడు అర్జునుడు.

(వీరిరువురిలో ఎవరు చచ్చినా పుత్రశోకం కుంతీదేవికి తప్పదని అర్జునుడికి తెలియదు. ఇరువురూ కుంతీ పుత్రులే!)

అర్జునుడు పలికిన మాటలు విన్న ధర్మరాజు "అర్జునా! నీవు అన్ని సత్యమే పలికావు. కుటుంబ పెద్దగా ఉండి మీ యోగక్షేమాలు చూడవలసినది పోయి, మీకు అనేక కష్ట నష్టములు కలిగించాను. నీవు నన్ను చంపకపోయినా నాకు నేను ప్రాయశ్చింత్త చేసుకోవాలి. నేను ఇప్పుడే సర్వసంగపరిత్యాగినై అడవులకుపోతాను. మీరందరూ హాయిగా జీవించండి. నా లాంటి పిరికిపందకు, బలహీనునకు, యుద్ధమంటే భయపడేవాడికి, రాజ్యాధికారము తగదు. భీమసేనుని ఈ కురు సామ్రాజ్యము నకు పట్టాభిషిక్తుని చేయుము." అని పలికి చకా చకా తాను కూర్చున్న ఆసనం దిగి వనవాసము పోవుటకు ఉపక్రమించాడు ధర్మరాజు.

అది చూచి కృష్ణుడు ధర్మరాజు పాదాలకు నమస్కరించాడు. "ధర్మజా! అర్జునుని ప్రతిజ్ఞ గురించి నాకు తెలియదు. అర్జునుడు తన గాండీవాన్ని ఇతరులకు ఇమ్మని ఎవరైనా అంటే వారిని చంపుతానని ప్రతిజ్ఞ పూనాడు. ఆ మాట ఈరోజు అనాలోచితంగా నువ్వు అన్నావు. నిన్నుచంపకపోతే అర్జునునికి ప్రతిజ్ఞా భంగం అవుతుంది. చంపితే మహా ఘోరం జరిగిపోతుంది. అందుకని, పెద్దలను దూషించడం వారిని చంపడంతో సమానమని నిన్ను దూషించమని అర్జునుని తో చెప్పాను. దానికి మీరు మనస్తాపం చెందారు. అందుకని నీ పాదాలు పట్టుకొని ప్రార్ధిస్తున్నాను. నన్ను, అర్జునుని మన్నించు. నేను సత్యం చెబుతున్నాను విను. ఈ రోజు అర్జునుని కర్ణుని వధిస్తాడు. ఇది నిక్కువము." అని పలికిన కృష్ణుని పైకి లేవనెత్తి అతని ఎదుట చేతులు జోడించి ఇలా అన్నాడు.

" మహాత్మా! కృష్ణా! ఏ మాత్రం వివేచనా జ్ఞానం లేకుండా నోటికి వచ్చినట్టు కారు కూతలు కూసాను. నా హృదయం కలక బారింది. నన్ను క్షమించి, నాకు

హితబోధ చేసావు. నీ మేలు ఎన్నటికీ మరిచిపోలేను." అని అన్నాడు.

వెంటనే కృష్ణుడు తలదించుకొని దీనంగా మొహం పెట్టి ఉన్న అర్జునుని వంక చూచాడు. "అర్జునా! నీ అన్న ప్రసన్నుడైనాడు. అతని అనుమతి తీసుకొని మనం యుద్ధరంగానికి వెళదాము. కర్ణుని చంపడమే మన తక్షణ కర్తవ్యము. రణ రంగమున వీర విహారమొనరించి, కర్ణుని వధించి, నీ అన్న మనసుకు ఆహ్లాదం కలిగించు. అసలు విషయం తెలుసుకోకుండా ధర్మజుడు నిన్ను అనరాని మాటలు అనడం వల్లనే ఇంత వరకూ వచ్చింది. ఆ మాటలకు కోపించి, ఆవేశంలో నీవు నీ అన్నను చంపి ఉండే ఏమయి ఉండేది. దైవానుగ్రహము వలన ఘోర విపత్తు తప్పినది." అని అనగానే అర్జునుడు క న్నీళ్లు ధారాపాతంగా కారుతుండగా ధర్మరాజు కాళ్ల మీద పడ్డాడు.

ధర్మరాజు కూడా కన్నీళ్లు తుడుచుకుంటూ అర్జునుని పైకి లేపి గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు. "అర్జునా! ఆ కర్ణుడు నా విల్లు, నా రధము విరిచి, ములుకుల్లాంటి మాటలతో నా శరీరము, నా మనసు గాయపరిచాడు. అలాంటి దుర్మార్గుని ఇప్పుడు నీవు చంపక పోతే నేను బతికి ఉండటం ఉచితమా!" అని అన్నాడు.

ఆ మాటలకు అర్జునుడు "మహారాజా! ధర్మజా! ఈ రోజు నేను కర్ణుని చంపి నేలమీద పడవేస్తాను. కర్ణుని చంపకుండా నీ మొహం కూడా చూడను. కృష్ణుని సారధిగా కలిగిన ఈ అర్జునుడు మాట తప్పడు." అని అన్నాడు అర్జునుడు.

కృష్ణుని చూచి "కృష్ణా! నీ మనసులో ఈ రోజు కర్ణుని అర్జునుడు చంపుతాడు అని సంకల్పించు. ఆ సంకల్ప బలంతో నేను కర్ణుని చంపుతాను." అని అన్నాడు. "తథాస్తు "అన్నాడు కృష్ణుడు.

కృష్ణుడు ధర్మరాజును చూచి "ధర్మజా! నీ తమ్ముడు అర్జునుని దీవించి పంపు." అన్నాడు.

ధర్మరాజు అర్జునుని దగ్గరకు తీసుకొని "తమ్ముడా అర్జునా! అనాలోచితంగా నేను అన్న మాటలకు బాధపడకు. కృష్ణుని అనుమతితో నీవు అన్న మాటలకు కూడా నేను బాధ పడను. విజయా! నీవు కర్ణుని గెలిచి విజయుడవై తిరిగిరా! విజయుడు అన్న నీ పేరు సార్ధకం చేసుకో." అని అన్నాడు.

కృష్ణార్జునులు రధారూఢులై రణరంగమునకు బయలుదేరారు. కాని ఎందుకో అర్జునుని మనసులో భీతి బెరుకు ఆవహించాయి. అది గమనించాడు కృష్ణుడు. అర్జునుని చూచి ఇలా అన్నాడు.

"అర్జునా! నీవు అమరులకు కూడా అజేయుడవు. నీకు భుజబలము, అస్త్ర బలము, దైవ బలము ఉన్నాయి. నీ పరాక్రమానికి తట్టుకోలేక భీష్ముడు అంపశయ్య మీద ఉన్నాడు. ద్రోణుడు ప్రాణాలు విడిచాడు. జయద్రధుడు (సైంధవుడు) రూపు మాసిపోయాడు. మిగిలింది కర్ణుడు. అతడిని నమ్మి సుయోధనుడు మీతోయుద్ధానికి దిగాడు. ఇప్పుడు నీవు అతనిని చంపి సుయోధనుని నమ్మకం వమ్ము గావించు. నీ కీర్తి ఇనుమడిస్తుంది. వీరే కాదు, కృపాచార్యుడు, అశ్వత్థామ, కర్ణుడు, శల్యుడు నీ చేత చావవలసిన వారే! కృపాచార్యుడు, అశ్వత్థామ బ్రాహ్మణులని నీవు వదలి వేసినా, నాకు బంధువను మిష మీద కృతవర్మను మాత్రం వదలకు. శల్యుడు నీకు మేనమామ. కాని అతడు పరుల పక్షమున యుద్ధం చేస్తున్నాడు కాబట్టి అతడు కూడా చంపదగినవాడే!

ఇంక కర్ణుడు. మీకు కలిగిన కష్టనష్టములకు మూలకారకుడు. లాక్షాగృహదహనము, కపటద్యూతము, పాండవపత్నికి జరిగిన పరాభవము, సుయోధనుని

దుర్నయములకు మూలము అతడే. అదంతా ఒక ఎత్తు. కర్ణుడు ద్రౌపదిని సభలో తన మాటలతో అవమానించిన తీరు దుస్సహము. నాడు కౌరవ సభలో ద్రౌపదిని అన్న మాటలు నీవు కూడా విన్నావు కదా. "నీ మగలు నిన్ను జూదములో పణంగా పెట్టి ఓడిపోయి, చేతకాని వారి వలె చేతులు ముడుచుకొని కూర్చున్నారు. ఈ కౌరవ సభలో మగటిమి గల మగాడిని మగనిగా ఎన్నుకో." అని అన్నది కర్ణుడే కదా! నేను సంధి కొరకు కౌరవ సభకు వెళ్లినప్పుడు, సుయోధనుడు అతని తమ్ముల మనసులలో నా మీద పగ రగల్చ చేసి నన్ను బంధించ యత్నించినది ఈ కర్ణుడే కదా! మీకు దాపురించిన కష్టముల కన్నింటికి కారణము ఈ కర్ణుడే కదా! నీ కుమారుడు అభిమన్యుడు లోకభీకరంగా ఒంటరిగా యుద్ధం చేస్తున్నప్పుడు, దొంగచాటుగా అతని విల్లు త్రుంచి అతని మరణానికి కారకుడైన వాడు ఈ కర్ణుడే కదా! అటువంటి దురాత్ముడిని, పాపాత్ముడిని చంపడానికి వెనుకాడుతున్నావా అర్జునా! నీవు కర్ణుని చంపితే మిగిలిన రాజులు, చావగా మిగిలిన ధృతరాష్ట్రుని కుమారులు, నీ ఎదుట నిలువలేరు. విజయలక్ష్మి మిమ్ములను వరిస్తుంది." అని అన్నాడు కృష్ణుడు.

ఆ మాటలు విన్న అర్జునుడు "కృష్ణా! నీవు తోడు ఉంటే నాకు ఇంక ఏమి కావాలి! ఈ రోజు కర్ణుడి చావు నా చేతిలో తథ్యం. నా ప్రతాపాన్ని చూచి సుయోధనుడు, కర్ణుడు, శకుని, వారు ఆడించిన కపట ద్యూతం గుర్తుకు తెచ్చుకోవాలి. కర్ణుడి చావు కనులారా చూచి సుయోధనుడు, నాడు విదురుని మాటలు విననందుకు విచారించాలి. ధార్తరాష్ట్రులు కురుసామ్రాజ్యము మీద ఆశ వదులుకోవాలి. కర్ణ వధ విన్న నా అన్న ధర్మజుని మొహంలో చిరునవ్వు చూడాలి." అన్నాడు అర్జునుడు.

అప్పటికి వారు రణరంగమును సమీపించారు. యుద్ధం ఘోరంగా జరుగుతూ ఉంది. ఇరు పక్షముల వారు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు.

కర్ణుని కుమారులలో ఒకడు ఉత్తమౌజుని చేతిలో మరణించాడు. అది చూచిన కర్ణుడు ఉత్తమౌజుని రథాశ్వములను, కేతనమును నరికాడు. ఉత్తమౌజుడు కత్తి తీసుకొని కిందికి దుమికి, తనకు అడ్డంగా వచ్చిన కృపాచార్యుని రథమునకు కట్టిన హయములను చంపాడు. వెంటనే శిఖండి రథం ఎక్కాడు. ఇంతలో అశ్వత్థామ అక్కడికి వచ్చి కృపాచార్యుని తన రథము మీద ఎక్కించుకొని అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

భీమసేనుని పరాక్రమానికి తట్టుకోలేక కౌరవ సైన్యము పారిపోసాగింది. అది చూచిన భీమసేనుడు తన రథసారథి విశోకునితో ఇలా అన్నాడు. "విశోకా! అన్న ధర్మజుడు రణరంగమునుండి తొలగిపోయాడు. అన్న క్షేమము కనుగొనడానికి వెళ్లిన అర్జునుడు కూడా రాలేదు. ఏమయి ఉంటుంది! ఆ ఇద్దరికీ ఏమన్నా కీడు మూడిందా! అదే జరిగితే నేను యుద్ధం చేసి కూడా ప్రయోజనం లేదు కదా! అయిన ఇప్పుడు నేను చేయగలిగినది ఏముంది శత్రువులను నిర్మూలించడం తప్ప. విశోకా! అటు చూడు. ఆ కేతనములను బట్టి అందు ఉన్న రథికులను పోల్చుకోగలవా! అది సరే. మనకు బాణములు సరిపడా ఉన్నవా!" చూచి చెప్పు అని అడిగాడు.

దానికి విశోకుడు భీమసేనునితో ఇలా అన్నాడు. "భీమసేనా! మనకు ఉన్న అస్త్రములు, శస్త్రములు గురించి చింతలేదు. అవి సమృద్ధిగా ఉన్నాయి. మన వెనుక వచ్చు బండిలోని ఆయుధములు ఇసుమంతయు వ్యయము కాలేదు. అసలు నీ చేతిలో గద ఉండగా, ఈ ఆయుధములు నీకు ఎందుకు. నీ చేతిలోని గద చాలు శత్రునిర్మూలన చేయుటకు." అని పలికాడు.

ఆ మాటలకు భీమసేనుడు ఎంతో సంతోషించాడు. ఇంతలో విశోకుడు బిగ్గరగా "భీమసేనా! అడుగో నీ తమ్ముడు అర్జునుడు ఆ ఏనుగుల సమూ

హములను తరుముతున్నాడు" అని బిగ్గరగా అన్నాడు. ఆ మాటలు విన్న భీమసేనుని హృదయం సంతోషంతో ఉప్పొంగింది. "విశోకా! మన రథమును అర్జునుని రథము వద్దకు పోనిమ్ము." అని అన్నాడు.

వెంటనే విశోకుడు రథమును అర్జునుని వద్దకు పోనిచ్చాడు. అర్జునుడు రణరంగము ప్రవేశించి కౌరవ సేనను హతమారుస్తున్నాడు. అర్జునుని పరాక్రమానికి తట్టుకోలేక కౌరవ సైన్యము పారిపోసాగింది. అర్జునుడు త్వర త్వరగా కర్ణుడు ఉన్న వైపుకు పోసాగాడు. మరొక పక్కనుండి భీమసేనుడు కూడా వాయువేగంతో కౌరవ సైన్యములోకి చొచ్చుకు పోతూ శత్రుసైన్యమునకు భయం కలిగిస్తున్నాడు.

ఇది చూచాడు సుయోధనుడు "ఈ భీమసేనుడు చస్తేగాని పాండవ సైన్యము పారిపోదు. ముందు వీడిని చుట్టుముట్టి చంపండి." అని కౌరవ వీరులను ప్రోత్సహించాడు. కౌరవ సైన్యములోని ప్రముఖ వీరులందరూ తమ తమ బలములతో భీమసేనుని చుట్టుముట్టారు. యుద్ధం ఘోరంగా సాగుతూ ఉంది. భీమసేనుడు శత్రుసేనలను విచక్షణారహితంగా సంహరిస్తున్నాడు.

శకుని భీమసేనుని ఎదుర్కొని అతని రొమ్ముకు గురిపెట్టి బాణప్రయోగము చేసాడు. భీముడు శకుని విల్లు విరిచాడు. శకుని వేరొక విల్లు తీసుకొని పదునారు బాణములతో భీముని సారథిని, హయములను కొట్టాడు. తీవ్రంగా గాయపరిచాడు. భీముడు కోపించి శక్తి ఆయుధమును శకుని మీద ప్రయోగించాడు. కాని శకుని అతి లాఘవంతో ఆ శక్తిని చేతితో పట్టుకొని తిరిగి భీమసేనుని మీదికి విసిరాడు. భీమసేనుని చెయ్యి బాగా గాయపడింది. కౌరవ సేనల హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. వెంటనే భీమసేనుడు తన ధనుస్సు తీసుకొని శకుని విల్లు విరిచాడు. శకుని శరీరం అంతా శరములతో నింపాడు. శకుని రథం మీద కూలిపోయాడు. మూర్ఛపోయాడు. ఇది చూచిన సుయోధనుడు శకునిని తన

రథము మీద ఎక్కించుకొని పక్కకు తీసుకొని పోయాడు.

తరువాత భీముడు శిఖండి, ధృష్టద్యుమ్నుడు, ఉపపాండవుల సాయంతో కర్ణుని ఎదుర్కొన్నాడు. ఇంతలో నకుల సహదేవులు కూడా వచ్చి చేరారు. వారందరూ కలిసి కర్ణుని ఎదుర్కొన్నారు. కాని కర్ణుడు వెరవక వీరవిహారం చేస్తున్నాడు. కర్ణుని పరాక్రమానికి తట్టుకోలేక పాండవ సేనలు పారిపోసాగాయి. కర్ణుని పరాక్రమాన్ని చూసి పాండవ వీరు లందరూ ఆశ్చర్యపోతున్నారు. తమ తమ సేనలతో కర్ణుని చుట్టుముట్టారు. కర్ణుడు ఇసుమంతయును వెరవక తనను చుట్టు ముట్టి పాంచాల, ఛేది, మత్స్య దేశ సైన్యములను చెల్లాచెదరు చేస్తున్నాడు రణరంగ మంతా పీనుగులపెంట చేస్తున్నాడు. అతనికి తోడుగా సుయోధనుడు, కృపాచార్యుడు, దుశ్శాసనుడు, అశ్వత్థామ, శకుని, కృతవర్మ మొదలగువారు పాండసేన మీద పడి మారణహోమం చేస్తున్నారు.

మరొక పక్క భీమ, నకుల,సహదేవ,ధృష్టద్యుమ్న,శిఖండి మొదలగు వారు కౌరవ సేనలను తుదముట్టిస్తున్నారు. ఇరుపక్షముల మధ్య పోరు ఘోరంగా సాగుతూ ఉంది, ఇరువైపులా నష్టం అపారంగా ఉంది. అర్జునుడు వేగంగా కర్ణుని సమీపించాడు. అర్జునుని రథం చూచి శల్యుడు కర్ణునితో ఇలా అన్నాడు. "కర్ణా! అటు చూడు. అర్జునుడు ఇటే వచ్చుచున్నాడు. అర్జునుడు ఎదుర్కొనే ధైర్యంలేక కౌరవ సేనపక్కకు తొలగి పోతూ ఉంది. ఇదే సమయం. అర్జునుని ఎదిరించు. జయించు. సుయోధనుని ఋణం తీర్చుకో." అని ప్రోత్సహించాడు. తమ రథమును అర్జునునికి ఎదురుగా పోనిచ్చాడు.

ఇంతలో భీముడు అర్జునుని కలుసుకున్నాడు అర్జునుడు అన్న ధర్మజుడు క్షేమంగా ఉన్నాడని భీమసేనునికి చెప్పాడు. తాను కర్ణుని ఎదుర్కొనడానికి వెళ్లాడు. అర్జునుడు కౌరవ సేనల మీద తీవ్రంగా దాడి చేసాడు.

ఇంతలో నీ కుమారులు పది మంది (ధృతరాష్ట్రకుమారులు) అర్జునుని మీద దాడిచేసారు. అర్జునుడు వారి నందరినీ ఒకేసారి యమసదనానికి పంపాడు. వెంటనే 90 మంది కౌరవ వీరులు అర్జునుని చుట్టుముట్టారు. వారినందరినీ ఒక్కొక్కరినీ ఒక్కొక్క బాణంతో చంపాడు అర్జునుడు. మిగిలిన వారిని తరుము తున్నాడు అర్జునుడు. ఇంతలో మ్లేచ్ఛ సేనలు 1300 ఏనుగులతో అర్జునుని మీదికి దూకాయి. అర్జునుడు భీముని సాయంతో ఆ గజ సైన్యమును చించి చెండాడాడు. కాని వారు భీమసేనుని వదలక వెంటపడుతున్నారు. భీమసేనుడు తన గద తీసుకొని రథం దిగి ఏనుగుల కుంభస్థలములు పగులగొడుతున్నాడు. ఒక పక్క అర్జునుని పదునైన బాణములు, మరొక పక్క భీమసేనుని గదాఘాతములు కౌరవ సేనను అల్లకల్లోలం చేస్తున్నాయి. కౌరవసేనలు అన్ని భయంతో కర్ణుని వెనక చేరాయి.

కర్ణుడు కూడా విజృంభించాడు. భీముడి కొడుకు, నకులుని కొడుకు ధరించిన ధనుస్సులను విరగ గొట్టాడు. ధృష్టద్యుమ్నుడి హయములను, సాత్యకి హయములను చంపాడు. కేకయపుత్రుడిని హతమార్చాడు. దానికి ప్రతిగా కేకయ రాజు కర్ణుని కుమారుడు ప్రసేనుని చంపాడు. పుత్రశోకంతో నిండిన కర్ణుడు కేకయరాజును చంపాడు. సాత్యకి మరొక రథం ఎక్కి కర్ణుని మనుమడు సుషేణుని ఎదుర్కొన్నాడు. సాత్యకి సుషేణుని హయములను చంపి, సుషేణుని చంపడానికి శరప్రయోగం చేసాడు. అప్పుడు కర్ణుడు "ఒరేయ్ సాత్యకీ చచ్చావురా!" అని అరుస్తూ ఒక నిశితశరమును ప్రయోగించాడు. ఆ బాణమును శిఖండి అడ్డుకున్నాడు. కర్ణుడు మహా కోపంతో శిఖండి కేతనము విరిచాడు.

కర్ణుడు ద్రుపదుని కుమారుడైన సుదేవుడిని చంపాడు. ఇది చూచి పాంచాల వీరులు కర్ణుని చుట్టుముట్టారు. అర్జునుడు, భీముడు కలిసి కర్ణుని రథమును సమీపించారు. ఉత్తమౌజుడు, జనమేజయుడు, యుధామన్యుడు, శిఖండి,

ధృష్టద్యుమ్నుడు అర్జునుని దాటుకొని పోయి కర్ణుని ఎదుర్కొన్నారు. కర్ణుడు వారందరినీ సమర్ధవంతంగా ఎదుర్కొన్నాడు. కర్ణుడు వారందరి ధ్వజములను, ఛత్రములను, సూతులను, హయములను, ధనుస్సులను, నుగ్గు నుగ్గు చేసాడు.

ఇంతలో ద్రౌపది కుమారులు కర్ణుని చుట్టుముట్టారు. వారి పక్కనే సాత్యకి నిలబడి కర్ణుడు వేసే ప్రతి బాణమును త్రుంచుతున్నాడు. కర్ణునికి సాయంగా వచ్చిన సుయోధనుని శరీరంనిండా బాణములు గుచ్చాడు. ఇది చూచిన అర్జునుడు సుయోధనునికి కర్ణుని కి సాయంగా వచ్చిన వారినందరినీ తరిమి కొట్టాడు.

ఇంతలో దుశ్శాసనుడు భీమునితో తలపడ్డాడు. అప్పుడు దుశ్శాసనుని చూచి భీమసేనుడు ఇలా అన్నాడు. "తమ్ముడా దుశ్శాసనా! నాడు కౌరవ సభలో నీవు చేసిన దుష్కర్మలకు, అవమానములకు, నీ రుణం, వడ్డీతో సహా తీర్చుకోడానికి వచ్చాను. ఆ నాడు నేను చేసిన ప్రతిజ్ఞ నెరవేర్చుకుంటాను. ఆడిన మాట నెరవేర్చుకొనే నా లాంటి పుణ్యాత్ములు లోకంతో ఇంక ఎవరూ ఉండరు. ఆ భగవంతుడు నా మీద దయతో ఈ రోజు నిన్ను నా ఎదురుగా నిలబెట్టాడు." " అన్నాడు భీమసేనుడు.

ఆ మాటలకు దుశ్శాసనుడు హేళనగా నవ్వుతూ "ఓ భీమసేనా! అదేమిటి ! అప్పుడే మరచిపోయావా! మేము నిన్ను, నీ వారిని లక్క ఇంట్లో పెట్టి తగల బెట్టడం. నీ అన్నతో మాయా జూదం ఆడించి మీ రాజ్యం అంతా కొల్ల గొట్టడం. మిమ్ములను అడవులకు వెళ్లగొట్టడం. దిక్కులేని వారివలే మీరు విరాటరాజు కొలువులో తలదాచుకోవడం. ఇంతకంటే దైన్యము అవమానము మీకు ఇంకేం ఉంటుంది చెప్పు. ఇన్ని జరిగినా తగుదునమ్మా అని మరలా యుద్ధానికి వచ్చారా! అవన్ని మీరు మరిచిపోయినా నేను మరిచిపోను" అన్నాడు

దుశ్శాసనుడు.

ఆ మాటలకు బదులుగా భీముడు దుశ్శాసనుని కేతనమును విరగ్గొట్టాడు. విల్లు విరిచాడు. సారథిని చంపాడు. సూటిగా ఒకే ఒక బాణము దుశ్శాసనుని నుదుట నాటాడు. తన రథము తానే నడుపుకుంటూ దుశ్శాసనుడు మరొక విల్లు తీసుకొని భీముని విల్లు విరిచాడు. భీముని రథసారథిని కొట్టాడు. భీముడు మరొక విల్లు చేబూనాడు. దుశ్శాసనుని శరీరంలో 50 బాణములు నాటాడు. వెంటనే దుశ్శాసనుడు భీమసేనుని రథమునకు కట్టిన అశ్వములను చంపాడు.

భీముడు తన గదను చేతిలోకి తీసుకున్నాడు. రథం మీదినుండి దూకి దుశ్శాసనుని రథం దగ్గరకు వచ్చాడు. దుశ్శాసనుని రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. దుశ్శాసనుని రథం విరగ్గొట్టాడు. దుశ్శాసనుడు కూడా తన గదను చేతిలోకి తీసుకొని తటాలున రథం నుండి కిందికి దూకాడు. భీముడి మీద తోమరం విసిరాడు. ఆ తోమరాన్ని భీముడు విరిచాడు.

దుశ్శాసనుని దగ్గరనుండి చూడగానే తాము 13 ఏళ్లు పడ్డ పాట్లు గుర్తుకువచ్చాయి భీమసేనుడికి. కోపంతో రగిలిపోయాడు. నాడు కౌరవ సభలో దుశ్శాసనుని గుండెలు చీల్చి రక్తంతాగుతాను అన్న తన ప్రతిజ్ఞ గుర్తుకు వచ్చింది. తన బలం అంతా కూడగట్టుకొని తన గదను పైకి ఎత్తి దుశ్శాసనుని తలమీద మోదాడు. ఆ దెబ్బకు దుశ్శాసనుడు కింద పడ్డాడు. దుశ్శాసనుని మీద పడ్డాడు భీముడు. దుశ్శాసనుని మెడమీద కాలుపెట్టి అదిమాడు. మెడను నులుము తున్నాడు.

“ఒరేయ్ దుశ్శాసనా! నాడు నిండుకొలువులో మమ్ములను అవమానం చేసింది చాలక చావడానికి, నన్ను వెతుక్కుంటూ వచ్చావా! చావరా! ఈ రోజు నీ

చావు తప్పదు." అని దుశ్శాసనుని గొంతుమీద పాదం పెట్టి అదుముతుంటే ఉభయసేనలు భయభ్రాతులయ్యారు. దూరంగా పారిపోయారు. అప్పుడు భీమసేనుడు దుశ్శాసనుని శరీదాన్ని రెండు చేతులతో పైకి ఎత్తి పట్టుకున్నాడు. గాలిలో గిరా గిరా తిప్పాడు. నేలకేసి బాదాడు. తన కాళ్లతో ఎగిసెగిసి తన్నాడు. దుశ్శాససుడి మెడమీద మోకాలు పెట్టి అదివూడు. లేచి నిలబడ్డాడు. దుశ్శాసనుడు బతికాడో చచ్చాడో చూడలేదు. వికటాట్టహాసం చేసాడు. మోకాళ్ల మీద కూర్చున్నాడు. దుశ్శాసనుని మొహం లోకి చూస్తూ "ఒరేయ్ దుశ్శాసనా! ఈ రోజు నీ గుండెలు చీల్చి నీ వెచ్చని నెత్తురు తేనె తాగినట్టు తాగాతానురా! పిలవరా! నీ వాళ్లను పిలువు! ఎవడు అడ్డం వస్తాడో చూస్తాను." అంటూ ఒక గండ్ర గొడ్డలితీసుకొని దుశ్శాసనుని మొహం మీద ఆడించాడు.

నాడు హిరణ్య కశిపుని పొట్టను నరసింహస్వామి చీల్చినట్టు అమిత రౌద్రంతో భీమసేనుడు దుశ్శాసనుని గుండెలలోకి తన గోళ్లు గుచ్చి అతని గుండెలు చీల్చాడు. అతని గుండెల్లో నుండి రక్తం పెల్లుబికింది. ఆ నెత్తురును దోసిలితో పట్టుకొని ఆస్వాదించాడు. మిగిలిన రక్తం మొహానికి ఒంటికి పూసుకున్నాడు. మరలా దుశ్శాసనుని మొహంలోకి చూచాడు. వికటాట్టహాసం చేసాడు. పైకి లేచాడు. పూనకం వచ్చిన వాడి మాదిరి ఎగురుతున్నాడు. "ఒరేయ్ దుశ్శాసనా! అబ్బా నీ నెత్తురు ఎంత రుచిగా ఉందిరా! ఈ నాటికి నా దాహం తీరింది. నా ప్రతిజ్ఞ నెరవేరింది." అని అరుస్తున్నాడు. గెంతులు వేస్తున్నాడు.భుజాలు చరుచు కుంటున్నాడు. అతడు మానవుడా ......రాక్షసుడా .....అని అక్కడ ఉన్న సైనికులకు భ్రమ కలిగింది. అందరూ యుద్ధం మాని అవాక్కయ్యారు. శిలాప్రతిమల మాదిరి నిలబడ్డారు.

భీముడు గదను భుజం మీద పెట్టుకున్నాడు. ఒళ్లంతా రక్తంతో ఎర్రగా ఉంది. ప్రళయ కాళ యముని మాదిరి విజృంభించాడు. కౌరవ సేనలను తరుము

తున్నాడు. భీముని చూడగానే కౌరవ సేనలుపారిపోయాయి. భీముడు వెనక్కు తిరిగి మరలా దుశ్శాసనుని దగ్గరకు వచ్చాడు.

"ఒరేయ్ ఏంట్రా అలా పడి ఉన్నావు! అరవరా! పశువు మాదిరి అరవరా! ఒరేయ్ పశువా! నామాటలకు బదులు చెప్పే వాడు ఎవడున్నాడురా! పిలువు." అంటూ దుశ్శాసనుడు దగ్గర కూర్చున్నాడు.

"ఒరేయ్! పశువా! నా మీద నీకు కోపం ఎందుకురా! నేను మిమ్మల్ని ఏంచేసానురా! నాకు విషం పెట్టారు. నీళ్లలో తోసారు. విషసర్పములతో కరిపించారు. అందరి ముందు నిండు సభలో నన్ను అవమానాల పాలు చేసారు. ఎందుకురా! ఇందుకేనా! నాడు జూదంలో గెలిచిన దానికి ప్రతిఫలం ఇదేరా! అనుభవించు." అంటూ పైకి లేచాడు.

తన దగ్గరగా వస్తున్న కౌరవ యోధులను చూచి ఇలా అన్నాడు. "చూడండి! ఈ దుశ్శాసనుని దుర్గతి. వీడి వల్ల వీడి తండ్రి ధృతరాష్ట్రుడు పరువు పోగొట్టు కున్నాడు. అవమానాల పాలయ్యాడు. ఆ నాడు కౌరవ సభలో వీడిని మందలించి ఉంటే, వారించి ఉంటే ఇంత జరగదుకదా! ఒరేయ్! నాడు కౌరవ సభలో ద్రౌపదిని చూచి ఏమన్నావురా! నీకు మగడు లేడు! అని కదరా! చూడరా! ద్రౌపదికి భర్త ఉన్నాడురా! నేనే రా ద్రౌపది భర్తను. కాని మీ కౌరవుల భార్యలం దరికీ భర్తలు లేకుండా చేస్తానురా! వారు తమ భర్తలకోసం భోరున ఏడవాలిరా! ఒరేయ్! దుశ్శాసనా! నా ప్రతిజ్ఞ ఒకటి నెరవేరిందిరా! నీ అన్న సుయోధనుని తొడలు విరగ్గొట్టి అతని తల తన్నడం మిగిలింది. ఆ పని మీద బయలుదేరుతున్నానురా!" అంటూ ఊగిపోతున్నాడు.

దుశ్శాసనుని గదతో మోది మోది చిత్రవధ చేసాడు భీముడు. దుశ్శాసనుడు

మరణించాడు. పరస్త్రీ మీద చెయ్యివేసిన వాడికి ఏం శాస్తి జరుగుతుందో లోకానికి తెలియచేసాడు భీముడు. భీముని భయంకరాకృతి చూచి కర్ణుడు మొదలగు కౌరవ వీరులు భయంతో తల్లడిల్లిపోయారు. వారికి కాలూ చెయ్యి ఆడటం లేదు.

కాని ధృతరాష్ట్రకుమారులు అయిన కవచి, నిషంగి, పాశి, దండధారుడు, ధనుర్గ్రహుడు, అలోపుడు, సహుడు, షండుడు, వాతవేగుడు, సువర్చసుడు భీమసేనుని ఎదుర్కొన్నారు. భీమసేనుడు పది భల్లబాణములతో ఆ పదిమంది కురుకుమారుల శిరస్సులు తుంచాడు. అది చూచిన కర్ణుడు కూడా దిక్కు తోచకుంటా అటు ఇటు చూస్తున్నాడు.

అప్పుడు శల్యుడు కర్ణుని చూచి ఇలా అన్నాడు. "కర్ణా! ఏమయింది! భయపడ్డావా! నీలో పిరికితనం ఆవహించిందా! నీ మిత్రుడు సుయోధనుడు కూడా దుశ్శాసనుని దుర్మరణం చూచి తన వంతు ఎప్పుడు వస్తుందో అని భయపడుతున్నాడు. నువ్వుకూడా భయపడితే ఎలాగా! కృపాచార్యుడు, అశ్వత్థామ మొదలగు వీరులు నీ ఆజ్ఞకోసం నిరీక్షిస్తున్నారు. సైన్యమును కూడగట్టుకొని యుద్ధమునకు ఉపక్రమించు. అదుగో నీ కుమారుడు వృషసేనుడు పాండవుల మీదికి పోతున్నాడు. నువ్వుకూడా అర్జునుని ఎదిరించు. ఎందుకంటే ఈ యుద్ధభారమును రారాజు నీ భుజస్కంధముల మీద నిలిపాడు. మరి నీవు ఇలా నిర్వీర్యుడివి కావడం తగునా!" అని పలికాడు.

ఈ మాటలతో కర్ణునిలో చైతన్యం వచ్చింది. యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. ఇంతలో కర్ణుని కుమారుడు వృషసేనుడు భీమసేనుని ఎదుర్కొన్నాడు. నకులుడు అడ్డు పడ్డాడు. వృషసేనుని ఛత్రమును, పతాకమును, విల్లును త్రుంచాడు. వృషసేనుడు వేరొక విల్లు తీసుకొని నకులుడి రథమును విరగ్గొట్టాడు. అశ్వములను చంపాడు. నకులుడు కత్తి డాలు తీసుకొని కిందికి దుమికాడు. వృషసేనుడి మీదికి

యుద్ధమునకు సంసిద్ధుడయ్యాడు. వృషసేనుడు నకులుని ఖడ్గమును విరిచాడు. నకులుని శరీరం నిండా శరములను నాటాడు.

అది చూచిన యుధామన్యుడు, ఉత్తమౌజుడు, శిఖండి, జనమే జయుడు, సాత్యకి, ఉపపాండవులు అమిత రౌద్రంతో వృషసేనుని మీదికి ఉరికారు. ఇంతలో కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ, సుయోధనుడు, శకుని, వృషసేనునికి సాయంగా నిలిచారు. భీముడు వారందరినీ తరిమి తరిమి కొట్టాడు. నకుల కుమారుడు కౌరవ సేనలోని గజసైన్యమును నాశనం చేస్తున్నాడు. అది చూచిన వృషసేనుడు విజృంభించి నకులుని కుమారుని, అతని రథసారథిని చంపాడు. అది చూచిన అర్జునుడు వృషసేనుడి మీదికి దూకాడు. కాని వృషసేనుడు అమిత పరాక్రమంతో అర్జునుని మీద, భీమసేనుని మీద శరవర్షము కురిపించాడు. శతానీకుని మీద కూడా శరప్రయోగము చేసాడు. నకులుని శరీరంలో 7 బాణములను, కృష్ణుని శరీరములో 12 బాణములను నాటాడు.

అర్జునుడు వృషసేనుడి మీద బాణప్రయోగం చేసాడు. కాని వృషసేనుడు ఆ బాణములను మధ్యలోనే తుంచి, అర్జునుని శరీరం లో 10బాణములను నాటాడు. మరలా కృష్ణుని మీద 9 బాణములను వేసాడు. వృషసేనుని విజృంభణము చూచి అర్జునుడు కోపంతో ఊగిపోయాడు. వృషసేనుడి విల్లును త్రుంచాడు. అతని భుజములు విరగ్గొట్టాడు. మరొక బాణంతో వృషసేనుడి తల త్రుంచాడు. తన ఎదుటనే కన్నకొడుకును అర్జునుడు చంపడం చూచి కర్ణుడు తల్లడిల్లిపోయాడు. అర్జునునికి అభిముఖంగా తన రథమును పోనిచ్చాడు.

అర్జునుడు కర్ణుడు ఒకరి ఎదురుగా ఒకరు నిలబడి ఉన్నారు. అప్పుడు కర్ణుడు శల్యుని చూచి ఇలా అన్నాడు. "మద్రరాజా! అర్జునుడు నన్ను జయిస్తే మీరు ఏమి చేస్తారు?" అని అడిగాడు.

“ నేను కృష్ణార్జునులతో యుద్ధం చేస్తాను.” అని అన్నాడు శల్యుడు.

అక్కడ అర్జునుడు కూడా కృష్ణుని తో “కృష్ణా! కర్ణుడు నన్ను జయిస్తే నీవు ఏమి చేస్తావు.” అని అడిగాడు.

“అర్జునా! సూర్యుడు పశ్చిమ దిక్కుగా ఉదయించినా కర్ణుని చేతిలో నీవు ఓడిపోవడం జరగదు. కాబట్టి నీవు వేసిన ప్రశ్న ఉదయించదు. కాని విధి వక్రించి నీవు అన్నదే జరిగితే అలాంటి దురవస్థను నేను నవ్వులాటకు కూడా భరించలేను. ఆ కర్ణుని, శల్యుని ఒంటి చేత్తో అంతమొందిస్తాను. కౌరవ వంశ నిర్మూలన గావించి ధర్మరాజుకు ఈ కురుసామ్రాజ్యమునకు పట్టం కడతాను. ఇది నిశ్చయము.” అని అన్నాడు కృష్ణుడు.

“కృష్ణా! నేను కూడా నవ్వులాటకు అన్నాను కానీ నీ దాకా రానిస్తానా! నాడు కౌరవ సభలో ద్రౌపదికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోకుండా ఊరుకుంటానా! ఆ త్రిమూర్తులు అడ్డు వచ్చినా నేడు కర్ణుని చావు నా చేతిలో తథ్యం. కర్ణుడి తల నేను నరకడం నీవు వినోదంగా చూడు. కర్ణుని భార్య, శల్యుని భార్యను విధవలుగా చేస్తాను.” అని అన్నాడు అర్జునుడు.

ఇరుపక్షముల సైన్యములు ఒకరికి ఎదురుగా ఒకరు నిలిచారు. కర్ణుడు అర్జునుని మధ్య లోకోత్తరమైన యుద్ధం జరగబోతోందని, యుద్ధమును కనులారా చూడడానికి ఆకాశంలో దేవతలందరూ గుమి గూడారు. ఆ సమయంలో అశ్వత్థామ సుయోధనుని సమీపించి ఇలా అన్నాడు.

“ సుయోధనా! భీష్ముడు అంతటి వాడు అర్జునుని చేతిలో ఓడిపోయాడు.

ఈ కర్ణుడు అతని కన్నా గొప్పవాడా చెప్పు. అర్జునుని ఎదిరించి నిలువగలడా! నేను అర్జునుని సమాధాన పరుస్తాను. నీవు కర్ణుని అనునయించు. మనం అందరం ధర్మరాజుతో సంధి చేసుకుందాము. వ్యవహారం చక్కబడుతుంది. భీముడు, నకుల సహదేవులు ధర్మరాజు చెప్పినట్టు వింటారు. నేను చెప్పిన మాటలే వింటే నీకూ, నీ సహోదరులకు, సకల రాజన్యులకు, సామాన్య జనులకు క్షేమదాయక మవుతుంది. ఆలోచించు. నీవు నన్ను , కృపాచార్యుని, నమ్ముకున్నావు. నేనూ, కృపాచార్యుడు, ఎవరి చేతిలో నూ చావమని, అర్జునుని గెలుస్తామని అనుకోవడం పొరపాటు. ఎందుకంటే భీష్ముడు, ద్రోణుడు అరివీరభయంకరులనీ, ఎవరి చేతిలో ఓడిపోరని అనుకున్నారు. కాని కృష్ణుని సాయంతో అర్జునుడు వారిని ఓడించాడు. మేమూ అంతే కదా! అందుచేత పాండవులతో సంధి ఉత్తమము అని నా అభిప్రాయము. కృష్ణుడు రాయబారిగా వచ్చినప్పుడు మనము ఏమేమో మాట్లాడినామని, ఇంక సంధి అసాధ్యమని అనుకోవద్దు. నీ తండ్రి ధృతరాష్ట్రుని, ధర్మరాజు, చక్రవర్తిగా అంగీకరిస్తాడు. అందరం అతని పాలనలో హాయిగా ఉందాము. కర్ణుడు కూడా నా మాట వింటాడు. మాకు, నీవు బతకడం కూడా కావాలి. బ్రతికి ఉంటే సుఖములు అనుభవించవచ్చు కదా! కాబట్టి అసూయ, ద్వేషము మానుకో. చచ్చి ఏమి సాధిస్తావు. కాబట్టి పెడతలంపులు మాని సంధికి ఒడంబడటం మంచిది. ఇది అందరికీ శ్రేయోదాయకము. నీవు దీనికి ఒప్పుకోకపోతే, సాము చేస్తున్న తాడు మీదినుండి కింద పడినట్టు అధః పాతాళానికి పడిపోతావు. జాగ్రత్త!" అని పలికాడు అశ్వత్థామ.

ఆ మాటలు అన్ని సావధానంగా విన్నాడు సుయోధనుడు. విరక్తిగా నవ్వాడు. "అశ్వత్థామా! నీవు ఎంత వెర్రివాడవయ్యా! భీముడు, నా తమ్ముడు, దుశ్శాసనుని చంపి, తాను చేసిన ప్రతిజ్ఞలలో మొదటిది నెరవేర్చుకున్నాడు. నన్ను చంపి, రెండవ ప్రతిన కూడా నెరవేర్చుకోకుండా మానుతాడా చెప్పు! ఇంతజరిగిన తరువాత సంధి చేసుకోడం ఏం బావుంటుంది. ఈ సమయంలో కర్ణుడు యుద్ధం

ఎలా మానుతాడు. కాబట్టి కానున్నది కాక మానదు. నీ ప్రయత్నం విరమించడం మంచిది. ప్రస్తుతానికి అర్జునుడు బాగా అలసిపోయి ఉన్నాడు. కాని కర్ణుడు అవక్రపరాక్రమముతో విరాజిల్లుతున్నాడు. ఈరోజు కర్ణుని చేతిలో అర్జునుని వధ తథ్యం." అని పలికాడు సుయోధనుడు.

సుయోధనుడు తనసేనలను యుద్ధమునకు ప్రోత్సహించాడు. కర్ణుడు అర్జునుడు ఒకరితో ఒకరు ఢీ కొన్నారు. యుద్ధం తీవ్రతరమైంది.

అర్జునుని చూచి కృష్ణుడు ఇలా అన్నాడు. "అర్జునా! అడుగో కర్ణుడు. నీ ప్రతాపం చూపించు. కర్ణుని శరీరం నిండా శరములను నాటు. ఈ కర్ణుడు నీకు ఎందులోనూ సమానం కాడు. అర్జునా! విజృంభించు. కర్ణుని వధించు." అని ప్రోత్సహించాడు.

అక్కడ కర్ణుని కూడా కౌరవ వీరులు ఉత్సాహపరుస్తున్నారు. "కర్ణా! ఇన్నాళ్లు అడవులలో మృగముల మాదిరి తిరిగిన పాండవులు ఇప్పుడు యుద్ధమునకు వచ్చారు. నువ్వు ఈ అర్జునుని చంపితే మిగిలిన పాండవులు తిరిగి అడవులకు వెళ్తా రు. సుయోధనుడు ఈ కురుసామ్రాజ్యానికి అధిపతి అవుతాడు. నీ శక్తినంతా ప్రయోగించి అర్జునుని చంపు." అని ప్రోత్సహించారు.

కర్ణుడు అర్జునుని శరీరంలో 10 బాణములు గుచ్చాడు. అర్జునుడు 19 బాణములతో కర్ణుని కొట్టాడు. కర్ణుడు 9 అత్యంత పదునైన బాణములను అర్జునుని మీద ప్రయోగించాడు. కర్ణుడు కృష్ణుని కూడా వదల లేదు. అది చూచిన అర్జునుడు తన బాణములతో కర్ణుని నెత్తురు కారేట్టు కొట్టాడు. కర్ణుడు కోపంతో ఊగిపోయాడు. తన పదునైన బాణములతో అర్జునుని కృష్ణుని కొట్టాడు. అప్పుడు అర్జునుడు కర్ణుని సారధిని, అశ్వములను కొట్టాడు. కర్ణుని మీద ఆగ్నేయాస్త్రాన్ని

ప్రయోగించాడు. దానికి విరుగుడుగా కర్ణుడు వారుణాస్త్రాన్ని ప్రయోగించి అర్జునుడు ప్రయోగించిన ఆగ్నేయాస్త్రాన్ని నిర్వీర్యం చేసాడు.

అర్జునుడు కర్ణుని మీద మేఘాస్త్రము ప్రయోగించాడు. ఆ అస్త్ర మహిమతో ఆకాశం మేఘావృతమయింది. చీకట్లు అలుముకున్నాయి. దానికి విరుగుడుగా కర్ణుడు అనిలాస్త్రము(వాయవ్యాస్త్రము) సంధించాడు. వాయవ్యాస్త్రము ధాటికి మేఘములు చెల్లాచెదరయ్యాయి. అంతటాసూర్యరస్మి ప్రసరించింది.

అంతలో అర్జునుడు ఇంద్ర శక్తిని ప్రయోగించాడు. కర్ణుడు తన మంత్రశక్తితో ఆ ఇంద్రశక్తిని నిర్వీర్యము చేసాడు. మరలా అర్జునుని మీద అత్యంత పదునైన బాణములు ప్రయోగించాడు.

అది చూచిన భీముడు అర్జునునితో ఇలా అన్నాడు. "తమ్ముడా అర్జునా! ఈ కర్ణుడు ఈ రోజు మనతో అటో ఇటో తేల్చుకోవాలని వచ్చినట్టున్నాడు. నీ ప్రతిజ్ఞా భంగం కాకుండా నువ్వు చంపుతావా! లేక నన్ను చంపమంటే నా గదా ఘాతంతో కర్ణుని తల వక్కలు చేస్తాను." అని ఆవేశంతో అన్నాడు భీమసేనుడు.

వారిని చూచి కృష్ణుడు ఇలా అన్నాడు. "అర్జునా! నీవుప్రయోగించిన దివ్యాస్త్రములన్ని కర్ణుడు తిప్పి కొడుతున్నాడు. పైగా కర్ణుడు తన బాణములతో నిన్ను తీవ్రంగా గాయపరుస్తున్నాడు. నీ పరిస్థితి చూచి కౌరవ సేనలో ఉత్సాహము, పాండవ సేనలో నిరుత్సాహము ప్రబలుతూ ఉంది. కారణంతెలియడం లేదు. పోనీ నా చక్రము ఇస్తాను. దానిని ప్రయోగించి కర్ణుని తల తుంచు." అన్నాడు కృష్ణుడు.

"కృష్ణా! అంతపని వద్దులే. నేను కర్ణుని మీద బ్రహ్మాస్త్రము ప్రయోగిస్తున్నాను.

చూడు అంటూ బ్రహ్మాస్త్రమునుసంధించాడు. అది కర్ణుని వంక అతి వేగంగా దూసుకుపోతూ ఉంది. అర్జునుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకు కర్ణుడు ఏ మాత్రం బెదర లేదు. నిశ్చలంగా ఉన్నాడు. తన మంత్ర శక్తితో అర్జునుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును నిర్వీర్యముచేసాడు. అర్జునుని మీద, కృష్ణుని బాణప్రయోగముచేసాడు.

అర్జునుడు కూడా కర్ణ శల్యులమీద చెరి 9 బాణములు ప్రయోగించాడు. కర్ణుడు అర్జునుని గాండీవమునకు కట్టిన త్రాటిని తెంచాడు. అర్జునుడు తన వింటినారి సరిచేసుకొని కర్ణుని వింటినారి తెంచాడు. ఈ ప్రకారంగా కర్ణుడు అర్జునుడు పోరు ఘోరంగా సాగుతూ ఉంది. ఒకరికి ఒకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు. అర్జునుని ధాటికి తట్టుకోలేక కర్ణుని చక్రరక్షకులు పారిపోయారు. ఇది చూచిన సుయోధనుడు తన సైన్యమును అర్జునుని చంపమని పురికొల్పాడు. సుయోధనుని బలగములు ఒక్కుమ్మడిగా అర్జునుని చుట్టుముట్టాయి. అర్జునుడు తన వాడియైన బాణములు ప్రయోగించి సుయోధనుని సైన్యమును చెదర గొట్టాడు.

ఇరు పక్షములలో ఉన్న వీరులుయుద్ధం చెయ్యడం మాని కర్ణార్జునుల యుద్ధము వీక్షిస్తున్నారు. ఇది చూచిన సుయోధనుడు వారిని చూచి ఇలా అన్నాడు. “మహా వీరులారా! కర్ణుడు అత్యంత సాహసంతో అర్జునుని తో పోరుతుండగా మీరు చూస్తూ ఉండటం భావ్యమా. మీరు కూడా కర్ణునికి సాయంగా పోరండి.” అని అన్నాడు.

ఆ మాటలకు పౌరుషం తెచ్చుకున్న కౌరవ వీరులు కర్ణుని కి సాయంగా అర్జునుని తో యుద్ధం చేస్తున్నారు. అది చూచిన అర్జునుడు తన పదునైన బాణములతో కౌరవ వీరుల పతాకాలను కూల్చాడు. రధములు విరుగగొట్టాడు. హయములను చంపాడు. ధనుస్సులను విరిచాడు. అర్జునుని ధాటికి ఆగలేక

కౌరవ వీరులుచెల్లాచెదరయ్యారు. వెనుకకు పోతేసుయోధనుడు, ముందుకు పొమ్మని హెచ్చరిస్తున్నాడు. ముందుకు పోతే అర్జునుడు చంపుతున్నాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్నారు కౌరవ వీరులు.

కర్ణుని వద్ద సర్పముఖాస్త్రము ఉంది. దానికి అధిపతి తక్షకుని కొడుకు అశ్వసేనుడు. దానిని అర్జునుని చంపడానికే దాచి ఉంచాడు కర్ణుడు. ఇప్పుడు దానిని బయటకు తీసాడు. అర్జునుని మీద సంధించాడు. అర్జునుని కంఠానికి గురి పెట్టాడు. కాని గురి కొంచెం కిందుగా ఉండటం గమనించాడు శల్యుడు.

“కర్ణా! నీ గురి తప్పుతూ ఉంది. అర్జునుని కంఠానికి సూటిగా గురిపెట్టు” అని హెచ్చరిం చాడు శల్యుడు. తన గురినే ఆక్షేపించిన శల్యుని చూచి కోపంతో ఇలా అన్నాడు. “శల్యా! నా గురినే ఆక్షేపించే అర్హత నీకు లేదు. చూస్తూ ఉండు. ఈ అస్త్రధాటికి అర్జునుని తల తెగి నేలమీద పడుతుంది.” అంటూ సర్పముఖాస్త్రమును ప్రయోగించాడు.

తమ వంక నిప్పులు కక్కుతూ వస్తున్న సర్పముఖాస్త్రమును చూచాడు కృష్ణుడు. వెంటనే తన బలమంతా ఉపయోగించి రథమును భూమిలోకి ఐదు అంగుళముల లోతుకు కూరుకుపోయేట్టు తొక్కాడు. కర్ణుడు అర్జునుని కంఠమునకు పెట్టిన గురి తప్పింది. అర్జునుని తల మీదుగా దూసుకు పోతూ అర్జునుని కిరీటమును ఎగురగొట్టింది. ఈ కిరీటము బ్రహ్మదేవుడు దేవేంద్రునకు ప్రసాదించాడు. ఆ కిరీటమును అర్జునుడు నివాత కవచులను సంహరించిన సందర్భంగా, దేవేంద్రుడు అర్జునునికి బహూకరించాడు. ఇప్పుడు ఆ కిరీటమును నాగాస్త్రము ధ్వంసం చేసింది. వెంటనే అర్జునుడు ఒక తెల్లని పాగాను కిరీటము బదులు తలకు చుట్టుకున్నాడు. ఆ నాగాస్త్రము అర్జునుని కిరీటమును నేల పడగొట్టి మరలా అర్జునుని వైపుకు అమిత వేగంతో దూసుకొని వస్తూ ఉంది.

ఇది చూచాడు అర్జునుడు. "కృష్ణా! ఏమిటిది! ఈ నాగాస్త్రము ఎవరు. నన్ను ఎందుకు తరుముతూ." ఉంది అని అడిగాడు.

"అప్పుడే మర్చిపోయావా అర్జునా! నీవు ఖాండవ వనమును దహించు సమయమున  అశ్వసేన అనే నాగ కన్య తన తల్లిని రక్షించుకొని తీసుకు పోతూ ఉంటే నీవు నీ బాణములతో ఆ నాగ కన్యను చంపావు. ఆ నాగ కన్య పగబట్టి తక్షకుడికి కుమారుడిగా అశ్వసేనుడు అనే పేరుతో జన్మించి నిన్ను చంపడానికి నాగ ముఖాస్త్రము రూపంలో కర్ణుని వద్ద పూజలందుకుంటూ ఉంది. ఇప్పుడు నీవు నీ దివ్యాస్త్రములతో ఆ నాగ కన్యనుసంహరించు." అని అన్నాడు. వెంటనే అర్జునుడు అశ్వసేనుని సంహరించాడు. నాగాస్త్రాన్ని ముక్కలు చేసాడు.  తరువాత అర్జునుడు కర్ణుని శరీరం మీద 12 బాణములు ప్రయో గించాడు.

తాను ప్రయోగించిన నాగాస్త్రము గురి తప్పిందని, దానికి కారణం కృష్ణుడు అని తెలుసుకున్నాడు కర్ణుడు. వెంటనే 13 బాణములు కృష్ణుని మీద, 100 బాణములు అర్జునుని మీద ప్రయోగించాడు.  అర్జునుడు ఒకే ఒక బాణంతో కర్ణుని కుండలములను కొట్టాడు.

( కర్ణుడు సహజ కవచ కుండలములతో జన్మించాడు. కర్ణుని వద్దనుండి దేవేంద్రుడు సహజముగా ఉన్న కవచమును మాత్రం దానముగా తీసుకున్నాడు. ఇప్పుడు మిగిలిన కుండలములను అర్జునుడు నేలపాలు చేసాడు. కర్ణుని పతనం ప్రారంభం అయింది అని సూచన.)

కాని కర్ణుడు బెదర లేదు అర్జునుని మీద  శర వర్షము కురిపిస్తున్నాడు. కర్ణుడు  వేసిన బాణములను మధ్యలోనే విరగ్గొడుతున్నాడు అర్జునుడు. కర్ణుని శరీరం అంతా రక్తమయం అయింది. సూర్యకుమారుడు కూడా అస్తమించు

సమయం ఆసన్నమయిందన్న సూచనగా  సూర్యుడు అస్తమించే సమయం ఆసన్నమయింది. అప్పుడు యమధర్మరాజు అక్కడకు వచ్చాడు. కాని ఎవరికీ కనపడటం లేదు. అతని వాణి మాత్రం వినిపిస్తూ ఉంది.

"ఇప్పుడు బ్రాహ్మణ శాప వశాత్తు కర్ణుని రధచక్రములు భూమిలోకి కుంగి పోతాయి.  కర్ణునికి అవసాన సమయం ఆసన్నం అయింది." అని వినిపించింది. అది విన్నాడు కర్ణుడు. కాని ధైర్యం కోల్పోలేదు. భార్గవాస్త్రము స్మరించాడు. కాని అది గుర్తుకు రాలేదు. పరశురామ శాపం పని చెయ్యడం మొదలయింది అని అనుకున్నాడు. "నేను ధర్మపరుడిని. ధర్మం నన్ను రక్షిస్తుంది అని అనుకున్నాను. కాని అది అసత్యం అయింది." అని తనలో తాను అనుకుంటున్న సమయంలో అర్జునుడు కర్ణుని మీద శరములు వర్షంలా కురిపించాడు.

కర్ణుడు తన బాహుబలాన్ని నమ్ముకున్నాడు. విల్లు తీసుకొని అర్జునుని మీద, కృష్ణుని మీద పదునైన బాణములను  ప్రయోగించాడు.  అప్పుడు అర్జునుడు కర్ణుని మీద బ్రహ్మాస్త్రము ప్రయోగించాడు.  కర్ణుడు ఇంద్రాస్త్రముతో దానిని అడ్డుకున్నాడు. అర్జునుడు తాను ప్రయోగించిన  బ్రహ్మాస్త్రము కర్ణుడు ప్రయోగించిన  ఇంద్రాస్త్రముతో వృదా అయినందుకు బాధపడుతున్నాడు.

అప్పుడు కృష్ణుడు అర్జునునితో  "అర్జునా నీ బ్రహ్మాస్త్రము ఎందుకు వృధా అయిందో నీకు తెలుసా! నీవు ఉపాయంతో యుద్ధం చేస్తే కర్ణుడు నీ ముందు నిలబడగలడా! కాబట్టి  శ్రమపడకుండా ఉపాయంతో కర్ణుని సంహరించు." అని సలహా ఇచ్చాడు కృష్ణుడు.

ఇంతలో కర్ణుడు రుద్ర అస్త్రమును ప్రయోగించడానికి మంత్రపఠనం చేస్తున్నాడు. ఇంతలో అతని రధ చక్రము మరింత భూమిలోకి కూరుకుపోయింది.

కర్ణుని రథం ఒక పక్క ఒరిగిపోయింది. అందుకని కర్ణునికి రుద్రాస్త్ర ప్రయోగము సాధ్యం కాలేదు.

కర్ణుడు రథం దిగాడు. అర్జునుని చూచి ఇలా అన్నాడు. "అర్జునా! నీను ప్రస్తుతము విరథుడను. నా రథచక్రము భూమిలో కూరుకుపోయింది. నేను దానిని ఎత్తుకొనవలెను. నీవురథము మీద ఉన్నావు. నేను భూమి మీద ఉన్నాను. నీవు నా మీద బాణ ప్రయోగం చెయ్యడం ధర్మం కాదు. కాబట్టి నేను నా రథ చక్రము ఎత్తుకొనుదాకా నా మీద బాణప్రయోగము చేయకుము. ఇది కేవలం నీకు యుద్ధ ధర్మం తెలియ చెప్పడానికే చెబుతున్నాను. కాని నీకూ, కృష్ణునికి భయపడి మా త్రం కాదు." అని అన్నాడు కర్ణుడు.

కృష్ణునికి సమయం చిక్కింది. అందుకని కర్ణుని తో నవ్వుతూ ఇలా అన్నాడు. "అదేమిటి కర్ణా! నీవు ధర్మాధర్మ వివేచన చేస్తున్నావా! ఇది ఎప్పటి నుండి? నీవు ఆపదలో ఉన్నావు కనక నీకు ధర్మము గుర్తుకు వచ్చింది. అహంకారంతో, దుర్మార్గంతో విర్రవీగుతున్నప్పుడు నీకు ధర్మం గుర్తుకు రాలేదా! కర్ణా! పాండవులు ధర్మమార్గంలో పయనిస్తున్నారు. వారికి జయం తథ్యం. అధర్మపరులైన ధృతరాష్ట్ర నందనులకు అపజయం అనివార్యము. నీవు నీ అనుంగు మిత్రుడు సుయో, దనునితో కలిసి చేసిన అకృత్యములు అప్పుడే మరిచిపోయావా! పాండవులను లక్క ఇంటిలో పెట్టి కాల్చమని ప్రోత్సహించినది నువ్వు కాదా! కపటజూదం ఆడించి పాండవులను అడవుల పాలుచేసింది నువ్వు కాదా! ద్రౌపదిని సభకు ఈడ్చుకొని వచ్చినప్పుడు అనరాని మాటలు అని ఆమెను భంగ పరచినది నువ్వు కాదా! పాండవులను అడవులలో కూడా ప్రశాంతంగా బతకనీయకుండా ఘోషయాత్రను సంకల్పించినది నువ్వు కాదా! అభిమన్యు కుమారుని మీరందరూ చుట్టుముట్టి చంపుటకు ప్రోత్సహించినది నువ్వు కాదా! ఇవన్నీ ప్రత్యక్షంగా చేసినది సుయోధనుడు అయినా పరోక్షంగా నువ్వే కారకుడవు. అప్పుడు ఈ న్యాయం

ధర్మం నీకు గుర్తుకు రాలేదా!" అని అన్నాడు కృష్ణుడు.

కృష్ణుడు ఒక్కొక్కమాట అంటుంటే అర్జునునికి కోపం పెల్లుబికింది. దయా దాక్షిణ్యం లేకుండా కర్ణుని మీద శరవర్షము కురిపించాడు. కర్ణుడు కూడా నేల మీది నుండే అర్జునుడు వేసే బాణములను ఎదుర్కొంటూ అర్జునుడితో యుద్ధం చేస్తున్నాడు. అర్జునుడు కర్ణుని పతాకమును విరగ్గొట్టాడు. కర్ణుడు మహా కోపంతో కృష్ణుని మీద అర్జును ని మీద వాడియైన బాణములను ప్రయోగించాడు. మధ్య మధ్య రథ చక్రమును ఎత్తుకొన డానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాని ప్రయోజనం లేకపోయింది.

ఇంతలో కష్ణుడు అర్జునునితో కర్ణుని సంహరించమని చెప్పాడు. అర్జునుడు అత్యంత శక్తి వంతమైన మహాస్త్రమును ఎక్కు పెట్టాడు. మనసులో ఇలా సంకల్పించాడు. "నేనే కనుక తపస్సు చెయ్యడంలో దాన ధర్మాలు చెయ్యడంలో, గురువులను సేవించడంలో, బ్రాహ్మణులకు, గురువులకు తృప్తి కలిగించిన వాడనైతే, అనునిత్యం పుణ్య కర్మలను ఆచరించు వాడనైతే, ఈ అస్త్రము కర్ణుని తల త్రుంచును గాక"అని సంకల్పించి, గాండీవమును ఆకర్ణాంతం లాగి అస్త్రప్రయోగం చేసాడు.

ఆ దివ్యాస్త్రము నిప్పులు కక్కుతూ దూసుకొని పోయి కర్ణుని శిరస్సును ఖండించింది. కర్ణుడి దేహం నేలమీద పడింది. సూర్యాస్తమయం అయింది. కర్ణుని శరీరం నుండి అందరూ చూస్తూ ఉండగా ఒక తేజము వెలువడి, అస్తమించు చున్న సూర్యబింబములో కలిసిపోయింది. బ్రాహ్మణ శాపము కర్ణుని మరణంతో అంత్యమయినట్టు, అప్పటి దాకా భూమి లో కూరుకుపోయిన రథచక్రము యథాప్రకారము భూమి మీద నిలిచి ఉంది. కర్ణుని అస్తమయం, సూర్యాస్తమయం ఒకేసారి జరిగాయి. దిక్కు మొక్కు లేకుండా రణభూమిలో ఒంటరిగా పడి ఉన్న

తన కుమారుడు కర్ణుని మృత దేహమును చూడలేక, మయల స్నానం చెయ్యడానికి కాబోలు  సూర్యుడు పశ్చిమాద్రిలోకి జారి పోయాడు.

కర్ణుని మరణంతో పాండవ సేనలలో జయజయధ్వానాలు మిన్నుముట్టాయి. శల్యుడు చేసేది లేక కర్ణుని లేని రథమును తోలుకుంటూ వెళ్లిపోయాడు. కౌరవ సైన్యములు భీతితోపారిపోయాయి.  కర్ణుని పతనం చూచిన భీమసేనుడు ఆనందంతో పెద్దగా అరుస్తున్నాడు. కేకలు వేస్తున్నాడు.

కర్ణుడులేని రథమును తోలుకొని శల్యుడు సుయోధనుని వద్దకు పోయి ఇలా అన్నాడు. "సుయోధనా! ఇంతకు ముందు నేను ఎన్నో యుద్ధములుచూచాను కాని ఈ రోజు జరిగిన కర్ణార్జున యుద్ధమును చూడలేదు. అది అద్భుతము, అమోఘము. అనిర్వచనీయము. కర్ణుడి ధాటికి ఒక దశలో కృష్ణార్జునులు భయపడిపోయారు. కాని విధి బలీయమయింది.  అంతటి పరాక్రమ శాలి అయిన కర్ణుని బలితీసుకొంది.   కృష్ణార్జునుల శంఖధ్వానాలు వింటున్నావు కదా. సూర్యాస్తమయం అయింది. ఈ రోజుకు యుద్ధం చాలించడం మంచిది." అని అన్నాడు శల్యుడు. కర్ణుని మరణ వార్త విన్న సుయోధనుడు నిశ్చేష్టుడయ్యాడు. నోట మాట లేకుండా నిలబడిపోయాడు.  ఇంతలో విషయం తెలుసుకున్న కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మ, శకుని, సుశర్మ విషణ్ణవదనాలతో అక్కడికి చేరుకున్నారు.  సుయోధనుని దుఃఖమునకు అవధులు లేవు. కర్ణా కర్ణా అని ఆక్రోశిస్తూ తన శిబిరమునకు వెళ్లాడు.

కృష్ణార్జునులు కూడా ఆ రోజుకు యుద్ధం ఆపమని తమ సేనలకు చెప్పారు. అందరూ తమ తమ శిబిరములకు చేరుకున్నారు. అందరూ ధర్మరాజు దగ్గరకు వెళ్లారు. అన్న మాట నిలబెట్టు కున్నందుకు ధర్మరాజు అర్జునుని అభినందించాడు.

కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు: "ధర్మజా! ఈ రోజు కర్ణుడు మహా పరాక్రమంతో విజృంభించాడు. అతని ని సంహరించడం ఎవరికీ సాధ్యం కాదు. నీ కోపాగ్నిలోనే అతను మాడి మసైపోయాడు అని అనుకొనవలసి వస్తోంది. కర్ణుని చావుతో నీకు కౌరవుల బాధ తీరిపోయింది. నీవు ఇంక నిశ్చింతగా ఉండు." అని అన్నాడు.

"కృష్ణా! అట్లు కాదు. నీ కృపాకటాక్షవీక్షణములు మా మీద ప్రసరించి నంతవరకూ మాకు అపజయము లేదు. అని నా నమ్మకం." అని అన్నాడు ధర్మజుడు.

" ధర్మజా! నేను కేవలం నిమిత్తమాత్రుడను. నీ తమ్ములు, నీ బావలు అందరూ అమిత పరాక్రమ వంతులు. అందరి సమిష్ఠి కృషి వలననే మీకు ఈ విజయం సిద్ధించినది." అని అన్నాడు.

అప్పుడు ధర్మరాజు "ఒకసారి రణభూమికి వెళ్లి కర్ణుని చూడవలెనని కోరికగా ఉన్నది." అని అన్నాడు.

తరువాత ధర్మరాజు బంధు మిత్రులు తోడు రాగా, సపరివార సమేతముగా కర్ణుని మరణించిన చోటికి వెళ్లాడు. రణభూమిలో తల తెగిన కర్ణుని, అతని పుత్రుల దేహములను చూచాడు. కర్ణుని చావుతో తనకు పునర్జన్మ కలిగినట్టు సంతోషించాడు ధర్మరాజు." అని సంజయుడు ధృతరాష్ట్రునకు కర్ణ వధ, దుశ్శాసన వధ, ఆ నాటి యుద్ధ విశేషములను వివరించాడు, అని వైశంపాయనుడు జనమేజయునకు వినిపించిన మహా భారత కథను, నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో సూతుడు శౌనకాది మహా మునులకు మహా భారత సవిస్తరముగా వివరించాడు.

మహా భారతము, కర్ణపర్వము, తృతీయాధ్యాయము సమాప్తము.

దీనితో కర్ణపర్వము పూర్తి అయినది.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహా భారతము

## శల్య పర్వము

## ప్రధమాశ్వాసము

వైశంపాయన మహర్షి జనమేజయునకు చెప్పిన మహా భారత కధను, నైమిశారణ్యంలో, సత్రయాగ సందర్భమున, సూతి, శౌనకాది మహామును లకు వినిపించాడు.

పదునేడవ నాటి యుద్ధం ముగిసింది. దుశ్శాసనుడు, కర్ణుడు పరమ పదించారు. మిగిలిన వీరులతో సుయోధనుడు తన విడిదికి వెళ్లాడు శల్యుడిని తన సేనాపతిగా నియమించాడు. 18వ రోజు యుద్ధమునకు ఇరు పక్షములు సమాయత్తమయ్యాయి. మధ్యాహ్న సమయానికి ధర్మరాజు అత్యంత పరాక్రమంతో శల్యుని చంపాడు. ఆ తరువాత వెంట వెంటనే కౌరవ పక్షమున యుద్ధం చేయుచున్న మహావీరులు ఒక్కరొక్కరే మరణించారు.

సుయోధనుడు యుద్ధం విరమించాడు. ఒంటరిగా ఒక మడుగులో దాగుకున్నాడు. పాండవులు సుయోధనుని వెదుకుకొనుచూ ఆ మడుగు దగ్గరకు వచ్చారు. సుయోధనుని సూటిపోటీ మాటలతో యుద్ధమునకు ప్రేరేపించారు. సుయోధనునకు భీమునికీ గదా యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో భీమసేనుడు సుయోధనుని తొడలు విరుగ గొట్టాడు. 18వ రోజు సూర్యాస్తమయ సమయానికి సుయోధనుడు కుప్పకూలిపోయాడు.

మహాభారత యుద్ధం పరిసమాప్తమయింది. ఆరోజు అర్ధ రాత్రి అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ తన వెంటరాగా, పాండవ శిబిరములో ప్రవేశించి, చావగా మిగిలిన పాంచాల, ప్రభద్రక, మాత్స్య సైనికులను హతమార్చాడు.

ఇదంతా కళ్లారా చూచిన సంజయుడు అపరిమితమైన దుఃఖముతో, పై విషయములన్నియి విశధముగా ధృతరాష్ట్రమహా రాజుకు వివరించుటకు హస్తినాపురమునకు వెళ్లాడు. ధృతరాష్ట్రుని మందిరము ప్రవేశించాడు. ఆంతరంగిక మందిరములో గాంధారి, విదురుడు,గాంధారి కోడళ్లు అందరూ గుమిగూడి ఉన్నారు వారిని చూచి సంజయుడు ఏడుస్తూ "ధృతరాష్ట్ర మహారాజా! శల్యుడు, శకుని, ఉలూకుడు,సంశప్తకులు, కాంభోజరాజు, శతానీకుడు, యవనులు, పర్వతరాజులు, మ్లేచ్ఛ బలములు, నలు దిక్కుల నుండి మనకు సాయం చెయ్యడానికి వచ్చిన మహారాజులు అందరూ యుద్ధంలో మరణించారు. కర్ణుడి కుమారులు, అందరూ మరణించారు. నీ కుమారుడైన సుయోధనుని తొడలు విరుగ గొట్టి భీమసేనుడు తన ప్రతిన నెరవేర్చుకున్నాడు. ప్రస్తుతము రారాజు సుయోధనుడు కటిక నేల మీద, ధూళిధూసరితాంగుడై పొరలుతున్నాడు.

అదీ కా కుండా పాండవ పక్షమున కూడా ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు మొదలగు పాంచాల వీరులు, చేది, మత్స్య,ప్రభద్రక రాజులు వారి బలములు, ప్రతి వింద్యుడు మొదలగు ద్రౌపదీ పుత్రులు, మిగిలిన సకల రధములు, అశ్వములు, గజసమూహములు, సంపూర్ణంగా నాశనం అయ్యాయి. అటు కౌరవ శిబిరములలోనూ, ఇటు పాండవ శిబిరములలోనూ ఆడు వారు తప్ప మగపురుగు కనిపించడం లేదు.

మన పక్షములో అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ అను ముగ్గురు

రథికులు, పాండవ పక్షమున, పంచ పాండవులు, కృష్ణుడు, సాత్యకి, నీ కుమారుడు యుయుత్సుడు, మిగిలి ఉన్నారు. సుయోధనుని 11 అక్షౌహిణుల సైన్యము సర్వనాశనమయింది.” అని దుఃఖంతో చెప్పాడు సంజయుడు.

ఆ మాటలువిని ధృతరాష్ట్రుడు, గాంధారి, ఆమె కోడళ్లు మూర్ఛ పోయారు. మిగిలిన వారు నిశ్చేష్టులయ్యారు. కొంతసేపటికి తేరుకున్నారు. ధృతరాష్ట్రుడు పక్కనే ఉన్న విదురుని చూచి “విదురా! నేను పుత్రహీనుడను, అనాథను అయ్యాను. నాకు బంధువు అనేవాడివి నువ్వు ఒక్కడివేమిగిలావు.” అని పలికి మరలా మూర్ఛపోయాడు. దాసదాసీజనములు చేసిన శైత్యోప చారములతో సేదదీరాడు ధృతరాష్ట్రుడు. కుండలో పెట్టిన మహా నాగము మాదిరి దీర్ఘ నిశ్వాసములు విడుస్తున్నాడు.

“విదురా! నా మనసు నా వశములో లేదు వీరి నందరినీ తమ తమ నివాసములకు పంపివేయుము.” అని అన్నాడు. విదురుడు స్త్రీల నందరినీ వారి వారి నివాసములకుపంపించాడు.

“విదురా! ఇప్పుడు నాకు ఏది గతి? నా కొడుకులు అందరూ చచ్చినా ఆ పాండవులు ఒక్కరూ చావలేదు. చిత్రంగా ఉంది కదూ! నూరుగురు కొడుకులు మరణించారు అని వినిన తరువాత కూడా నా హృదయం బద్దలు కాలేదంటే అది హృదయంకాదు కఠిన పాషాణము. నేను పుట్టు గుడ్డి నైనందున నా కుమారుల చిన్నతనము ముచ్చటలు ఆటపాటలు చూడడానికి నోచుకోలేదు. కాని వారి మరణ వార్త విని కుంగిపోవు దుర్గతి పట్టింది.

సుయోధనా! ఎక్కడున్నావురా! మీ అమ్మ గాంధారి పిలుస్తూ ఉంది రా! రా!

ఈ ముసలి తనములో మమ్ములను విడిచి ఎక్కడకు వెళ్లావయ్యా! ఇన్నాళ్లు నువ్వు మా మీద చూపించిన ప్రేమ, ఆప్యాయత ఎక్కడకు పోయాయి. ఈ వయసులో మమ్ములను అనాధలనుచేసి వెళ్లావు. నిరంతరము సేవలందుకొనే నీవు దిక్కులేకుండా కటికనేలమీద పడి ఉన్నావా నాయనా! నాడు నీవు నాతో చెప్పిన మాటలు మరిచిపోయావా సుయోధనా! “తండ్రీ! నా వెంట భీష్మ,ద్రోణ,కృప, అశ్వత్థామలు, ఉన్నారు. అందరినీ మించి కర్ణుడు ఉన్నాడు పాండవులను సర్వనాశనం చేస్తాడు, వీరుగాక, బాహ్లీక, సోమదత్త, శకుని, భూరిశ్రవస, శల్య, సింధురాజులు మొదలగు రధిక శ్రేష్ఠులు ఉన్నారు. మేమందరమూ కలిసి పాండవులను జయిస్తాము చూడండి.”అని పలికావు కదా. ఈ నాడు ఆ పాండవుల చేతిలోనే హతమయ్యావా తండ్రీ! శిఖండిని అడ్డం పెట్టుకొని భీష్మునే పడగొట్ట గలిగాడు అర్జునుడు. అతనికి అసాధ్యము ఏముంటుంది. ద్రోణుడు సామాన్యుడా! అతనిని ఓడించడం ఎవరికి సాధ్యం. అలాంటి వాడిని కూడా ఆ అర్జునుడు ఓడించాడే! నా అల్లుడు జయద్రధుడు (సైంధవుడు) మాత్రం తక్కువ వాడా. మహా బలవంతుడు. ఒక్కవేటుతో వాడిని చంపాడే ఆ అర్జునుడు. అంతా విధి వైపరీత్యకు కాక మరేమిటి? నాయనా సుయోధనా! నీవు నమ్మిన కర్ణుడు పాండవులలో ఒక్కని కూడా సంహరించలేదయ్యా! నమ్మశక్యంగా లేదు కదూ!

(కర్ణుడు తాను కుంతికి ఇచ్చిన మాట ప్రకారము తన చేత చిక్కిన నలుగురు పాండులను చంపకుండా వదిలివేసాడు).

ఇంక మహా బలశాలి శల్యుడు కూడా ఎవరినీ సంహరించలేదు. నా తమ్ములతో కూడి పాండవుల నందరినీ సంహరిస్తాను అన్నావు. కాని నీ తమ్ములే లేకుండా పోయారు కదయ్యాసుయోధనా! నేను అదృష్టహీనుడిని. నాకు శుభాలు ఎలా కలుగుతాయి. నా కొడుకులందరూ చచ్చారు. నేను ఎవరినీ

చూచుకొని బతకాలి. ఆ భీమసేనుడు నన్ను అనునిత్యం సూటిపోటీ మాటలతో వేధిస్తుంటే ఇక్కడ ఎలా ఉండ గలను. నేను అడవులకు పోతాను. శేషజీవితం ప్రశాంతంగా గడుపుతాను. సంజయా! ఆ ఏర్పాట్లు చూడవయ్యా.

అది సరే సంజయా! నాకు తెలియక అడుగుతాను. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మరణించారు కదా. ఇంకా ఎవరి అండ చూచుకొని నా కుమారుడు సుయోధనుడు యుద్ధమును కొనసాగించాడు. మూర్ఖత్వం కాక మరేమిటి చెప్పు. నాకు విదురుడు ముందే చెప్పాడు. నీకొడుకు మూర్ఖుడు. వాడిని వదిలివెయ్యి అని నేను వినలేదు. తగిన ఫలితం అనుభవిస్తున్నాను. సంజయా! కర్ణుని చావు తరువాత సేనాపతి ఎవరు. యుద్ధం ఎలా జరిగింది వివరంగా చెప్పు. కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ, ఎలా బతికి బయట పడ్డారు. ధృష్టద్యుమ్నుడు, శిఖండి మొదలగు పాంచాల వీరులు, చేది, మత్స్య,ప్రభద్రక వీరులు, నా మనుమలు ద్రౌపది పుత్రులు, మొదలగు వారు ఎలా మరణించారు. ఇంతకూ పాండవులు, కృష్ణుడు ఎలా తప్పించుకున్నారు. వివరంగా చెప్పు.” అని అడిగాడు.

సంజయుడు ఇలా చెప్పసాగాడు.

కర్ణుడు చనిపోయిన విషయం శల్యుని ద్వారా విన్న సుయోధనుడు పిచ్చెత్తినట్టు అరుచుకుంటూ తన నివాసమునకు వెళ్లాడు. కాని లోపలకు వెళ్ల లేదు. తన ఆంతరంగికులతో కలిసి దూరంగా ఒక చోట ఆరు బయట సమావేశమయ్యాడు. దుఃఖమును ఆపుకొని కార్యాచరణకు పూనుకున్నాడు.

ఆ సమయములో కృపాచార్యుడు సుయోధనునితో ఇలా అన్నాడు. “సుయోధనా! క్షత్రియులకు యుద్ధము పరమ ధర్మము. కాని నేను

బ్రాహ్మణుడను. క్షత్రియధర్మమునకు విరుద్ధంగా ఒక మాట చెపుతాను. భీష్మ,ద్రోణ,కర్ణులు మహా బలవంతులు. దైవీబలసంపత్తి కలవారు. అట్టివారే అర్జునుని చేతిలో మరణించారు. అర్జునుడు దావాగ్ని అయితే, శ్రీకృష్ణుడు దానిని ప్రజ్వరిల్లచేసే వాయువు. అగ్నికి వాయువు తోడైతే ఇంక చెప్పేదేముంది. సర్వనాశనం తప్ప. ఇప్పుడు అదే జరిగింది. ప్రస్తుతము మన వద్ద తగినంతగా సైన్యము లేదు. మిగిలి ఉన్న సైనికులు కూడా బాగా అలసిపోయారు. ఇప్పుడు ఎవరు సైన్యాధ్యక్షుడైనా, ఈ కొద్దిపాటి సైన్యముతో పాండవులను జయించడం కష్టసాధ్యము. కాబట్టి ఈ సమయంలో పాండవులతో సంధి చేసుకొనుట ఉత్తమం అని నా అభిప్రాయము. నా మీద కోప పడవద్దు. పాండవుల మీద ఆగ్రహం విడిచిపెట్టు. అసలు ఈ యుద్ధము నీ అకారణ కోపము, అకారణ వైరము వలన సంభవించింది. కొంచెం లౌక్యము ప్రదర్శించి ఉంటే యుద్ధం నివారింపబడి ఉండేది.

మరొక మాట. మనకు శక్తి సామర్థ్యాలు అధికంగా ఉన్నప్పుడు యుద్ధం చెయ్యడం అవసరణీయము. కాని మన శక్తిసన్నగిల్లినపుడు, సంధి చేసు కొనడం ఉత్తమం. ఇది యుద్ధ నీతి. నీవు ఈ యుద్ధం ఎందుకు చేస్తున్నావు. ఈ సమస్త రాజ్యమును కైవసం చేసుకొనడానికి, పాలించడానికి. సకలసుఖములు అనుభవించడానికే కదా! కాని ఈ కొద్దిపాటి సైన్యముతో అది సిద్ధిస్తుందా? ఆలోచించు. ఏదైనా మనం బతికి ఉంటే కదా ఇహలోక సుఖములు అనుభవించడానికి. కాబట్టి బతుకు మార్గం ఆలోచించు.

ధర్మరాజు సౌమ్యుడు. సంధికి అంగీకరిస్తాడు. శ్రీకృష్ణుడు కూడా సంధికి కాదనడు. శ్రీకృష్ణుడు, ధర్మరాజు ఏ విధంగా నిర్ణయిస్తే, భీమార్జున, నకుల సహదేవులు దానిని శిరసావహిస్తారు. నీవు అవునంటే సంధి జరిగి తీరుతుంది. పట్టుదలలు మాని సంధికి ప్రయత్నించు.” అని చెప్పాడు కృపాచార్యుడు.

కృపాచార్యుని మాటలు సావధానంగా విన్నాడు సుయోధనుడు.

"ఆచార్యా! మీరు నా క్షేమం కోరేవారు. నేను చెడిపోవడం ఓర్వలేక మీరు నాలుగు మంచిమాటలు చెప్పారు. కాని ఆ మాటలు నాకు అంగీకారం కావు కదా! ఎందుకంటే, మాయాజూదం ఆడించి పాండవుల రాజ్యం అపహరించి వారిని అరణ్యాలకు పంపాను. నిండు సభలో పాండవ పత్ని ద్రౌపదిని జుట్టు పట్టి ఈడ్పించి ఘోరంగా అవమానించాను. సంధి చేయవచ్చిన కృష్ణుని బంధించడానికి ప్రయత్నించాను. భీష్మ,ద్రోణ, సైంధవ,కర్ణుల చావు కళ్లారా చూచాను. పసివాడైన అభిమన్యుని ఒంటరి వాడిని చేసి అందరం చుట్టుముట్టి కిరాతకంగా చంపాము. నేడు నా తమ్ముడు దుశ్శాసనుని ఆ భీముడు గుండెలు చీల్చి నెత్తురు తాగడం కళ్లారా చూచాను. ఇన్ని చేసిన నేను, ఇన్ని చూచిన నేను, భీమసేనుడు తన రెండవ శపధం నెరవేర్చుకుంటాడని, నా తొడలు విరుగగొట్టి చంపుతాడని భయపడి సంధి చేసుకుంటే లోకులు ఏమనుకుంటారు. స్వార్ధపరుడని నిందించరా! ఏం జరుగుతుందో అదే జరుగుతుంది. ఒకరి దయాదాక్షిణ్యాల మీద వచ్చే రాజ్యభోగాల కంటే, యుద్ధంలో మరణించి, వీరస్వర్గం పొందడం శ్రేయస్కరము అని నా భావన. కాబట్టి యుద్ధం కొనసాగించడానికే నిశ్చయించుకున్నాను. అడ్డు చెప్పకండి. నేను మిగిలిన సైన్యంతో వెళ్లి పాండవులను జయిస్తాను. ఏమో! ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు!" అని తన మిగిలిన సైన్యమునకు ఉత్సాహం కలిగించే మాటలు చెప్పి వారిని రణోన్ముఖులను చేసాడు.

తరువాత అందరూ కలిసి మరునాడు జరగబోవు 18వ రోజు యుద్ధమునకు ఏ వ్యూహం పన్నాలో ఆలోచించసాగారు. అశ్వత్థామ, శకుని, శల్యుడు, కృపాచార్యుడు, కృతవర్మ కలిసి ఆలోచించి సుయోధనునితో ఇలా అన్నారు.

“ సుయోధనా! మనమీ రాత్రి ఇచ్చట ఉండటం, మన మన శిబిరములలో నిద్రించడం  మంచిదికాదు. ఎందుకంటే విజయోత్సాహంలో ఉన్న పాండవులు, అర్ధరాత్రి మన శిబిరముల మీద పడి మనలను సంహరించే అవకాశం ఉంది. కాబట్టి మనము దూరంగా వెళ్లి విడిది చేద్దాము.” అని అన్నారు.

ఆ మాటలకు సుయోధనుడు సంతోషించాడు.  సుయోధనుడు తన బంధుమిత్రులు,సైన్యముతో సహా అక్కడికి రెండు ఆమడల దూరంలో ఉన్న సరస్వతీ తీరంలో విడిది చేసారు. ఆ నదిలో అలసట తీరేట్టు స్నానాలు చేసారు. అక్కడే తమ వెంట ఉన్న ఆహార పదార్ధాలను తిని సేదదీరారు.  అప్పుడు అందరూ కలిసి మరునాటి యుద్ధమునకు తగిన సేనాధిపతి ఎవరు అని చర్చించారు. సుయోధనుడు ఆ బాధ్యతను అశ్వత్థామ మీద పెట్టాడు. అశ్వత్థామ సుయోధనుని చూచి ఇలా అన్నాడు.

“ సుయోధనా! ఈ క్లిష్ట సమయములో,  మనందరిలోకి వయసులో పెద్ద వాడు, రణవిద్యలో నేర్పరి, పైగా తన మేనల్లుళ్లను వదలి మనమీద అభిమానంతో మన పక్షానయుద్ధం చేస్తున్న మద్రదేశాధీశుడు శల్యుని కంటే కురు సైన్యమునకు సారధ్యం వహించ గలవారు వేరెవరున్నారు. కాబట్టి అవశ్యము మద్రదేశాధిపతి శల్యుని సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకింపుము.” అని పలికాడు.

ఆ మాటలు విన్న సుయోధనుడు శల్యుని చూచి  “శల్యమహారాజా! తమరిని సమస్త  కురుసైన్యమునకు ఆధిపత్యము వహించవలసిందిగా కోరుచున్నాను.  తమరు దయతో అంగీకరించాలి.” అని చేతులు జోడించి ప్రార్ధించాడు. అందులకు శల్యుడు అంగీకరించాడు. వెంటనే సుయోధనుడు సరస్వతీ జలములు తెప్పించి శల్యుని సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించాడు.

విజయ సూచకంగా కౌరవ సేనలు శంఖములు పూరించాయి. జయ జయ ,
ద్వానాలు చేసాయి.

పాండవ శిబిరంలో ధర్మరాజు చారుల వలన కౌరవ శిబిరములో జరుగుతున్న విశేషాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు. శల్యుడు సర్వసైన్యాధ్యక్షుడు అని తెలిసి కృష్ణునితో ఇలా అన్నాడు.

"కృష్ణా! వింటివా. సుయోధనుడు శల్యుని సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించాడట. మనము దీనికి దీటుగా ఎలాంటి ప్రయత్నములు చెయ్యాలి." అని అడిగాడు. ,

"ధర్మరాజా! శల్యుడు మహా బలవంతుడు. ధైర్యశాలి. భుజ బల సంపన్నుడు. రణకౌశలములో భీష్మ,ద్రోణ,కర్ణులను మించిన వాడు. నివురు గప్పిన నిప్పు. శల్యుడు రణరంగములో విజృంభిస్తే అతనిని మీరు ఎదుర్కొన లేరు. నువ్వు ఒక్కడివే అతనిని ఎదుర్కొనగల సమర్ధుడివి అని నా అభి ప్రాయము. కాబట్టి నువ్వు రేపు ఆ శల్యుని సంహరించే ఉపాయం చూడు. మరొక మాట. అతను మీకు మేనమామ. మాద్రికి సోదరుడు. కాబట్టి నీకు అతని మీద గౌరవము, అభిమానము ఉండవచ్చు. కాని అతను ఇప్పుడు మన శత్రుపక్షమున సైన్యాధ్యక్షుడు. కాబట్టి అతని మీద జాలి చూపడం మంచిది కాదు. నిర్ధాక్షిణ్యం అతనిని సంహరించు. నీకు విజయం చేకూరుతుంది." అని పలికాడు శ్రీకృష్ణుడు.

" కృష్ణా! నీవు చెప్పినట్టే చేస్తాను. మనకు యుద్ధంలో విజయం ముఖ్యం గాని బంధుత్వాలు కావు." అని అన్నాడు ధర్మరాజు.

మరునాడు సూర్యోదయవేళ ఉభయ సైన్యములు యుద్ధమునకు

సన్నద్ధమయ్యాయి. ఆజానుబాహుడు అయిన శల్యుడు ముందు నడవగా కురు సేనలు కురుక్షేత్రము చేరుకున్నాయి. పాండవ సైన్యము కూడా పాండవులు ముందు నడవగా యుద్ధభూమి చేరుకున్నాయి." అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

" ఇంకెందుకు ఆలస్యం సంజయా! పాండవులు శల్యుని, నా కుమారుడు సుయోధనుని ఎలా సంహరించారో చెప్పు." వినిసంతోషిస్తాను అని ఎకసెక్కంగా అన్నాడు ధృతరాష్ట్రుడు.

"మహారాజా! ఇంకా నువ్వు అలాంటి మరణ వార్తలు వినే స్థితిలో ఉన్నావా! ముందు నేను చెప్పే యుద్ధ వార్తలు విను. వాళ్ల మరణ వార్తలు ఎటూ వినాలిగా! తప్పదు." అని చెప్పసాగాడు.

"నీ కుమారుడు సుయోధనుడు కనీసం 18 వరోజన్నా తాను పాండవులను జయించి కురు సామ్రాజ్యమును కైవసం చేసుకుందామని పేరాశతో ఉన్నాడు. శల్యుడు కురు సైన్యమును సర్వతోభద్ర వ్యూహముగా తీర్చి దిద్దాడు. ముఖ ద్వారము వద్ద తాను కర్ణుని పుత్రులతో కూడి నిలుచున్నాడు. కుడి వైపు కృపాచార్యుడు నిలబడ్డాడు. ఎడమ వైపు త్రిగర్త వీరులతో కృతవర్మ నిలుచున్నాడు. వెనుక వైపు కాంభోజదేశాధీశులతో కలిసి అశ్వత్థామ నిలబడ్డాడు. మధ్యభాగంలో సుయోధనుడు తన గజబలంతో నిలబడ్డాడు.

పాండవులు కూడా తమతమ సేనలను త్రిముఖ వ్యూహంగా నిలిపారు. ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి ఒక్కొక్క ముఖద్వారము దగ్గర నిలబడ్డారు. భీమార్జునులు, ధర్మరాజు ముందు, అ తనికి రక్షణగా నిలబడ్డారు. అని చెబుతున్న సంజయునికి ధృతరాష్ట్రునికి అడ్డు తగిలి "సంజయా! ఇంతకూ ఈ

17 రోజుల యుద్ధం తరువాత ఇరు పక్షములలో  ఎవరికి ఎంతెంత సేనలు మిగిలాయి వివరించు.” అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

“మహారాజా! మన పక్షాన అనగా కౌరవుల పక్షాన 11,000 రథములు, 10,700  ఏనుగులు, 2,00,000 హయములు, మూడు కోట్ల సైనికులు మిగిలారు. అలాగే పాండవులకు 6,000 రథములు, 3000 ఏనుగులు, ఒక లక్ష గుర్రములు, ఒక కోటి కాల్బలము మిగిలాయి.

మరునాడు సూర్యోదయం అయింది. కురుక్షేత్రమహా సంగ్రామంలో ఆఖరి రోజు అనగా 18వ రోజు యుద్ధం ప్రారంభం అయింది.  ఇరు పక్షము లలో భేరీ మృదంగ ధ్వానములు చెలరేగాయి.కురు పాండవ సైన్యములు ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి. యుద్ధం భయంకరంగా సాగుతూ ఉంది. ఆ రోజు అటో ఇటో తేల్చుకోవాలని పట్టుదలతో పోరుతున్నారు. రథాలు విరుగుతున్నాయి. కాళ్లు చేతులు తెగిన సైనికులు కిందపడి దొర్లుతున్నారు. కొందరి తలలు తెగి పడుతున్నాయి.  హయములు, ఏనుగుల కళేబరములు కుప్పలు కుప్పలుగా పెరిగిపోతున్నాయి. వాటి  మధ్య రథములు సంచ రిస్తున్నాయి.  రణభూమి అంతా రక్తంతో తడిసి పోయి రక్తం కాలువలుగా పారుతూ ఉంది. అయినా భయపడక వీరులందరూ వీరవిహారం చేస్తున్నారు.

కర్ణుని మనుమడు చిత్రసేనుడు అను వాడు నకులుని విల్లు విరిచాడు. మూడు బాణములు నకులుని నుదుటిపై నాటాడు. నకులుని పతాకమును పడగొట్టాడు. సారథిని చంపాడు.

నకులుడు కత్తి డాలు తీసుకొని చిత్రసేనుడు వేయు బాణములు తప్పించుకుంటూ చిత్రసేనుని రథం దగ్గరగా వెళ్లాడు.  ఒక్కసారిగా విజృం

భించి, నకులుడు చిత్రసేనుని రథం మీదికి లంఘించి, చిత్రసేనుని తలను తన కత్తితో ఖండించాడు.

అది చూచి, చిత్రసేనుని సోదరులు సత్యసేనుడు, సుషేణుడు నకులుని తో కలియబడ్డారు. నకులుడు మరొక రథం ఎక్కాడు. సత్యసేనుడు, సుషేణుడు ఇద్దరూ నకులుని మీదికి బల్లెములు విసిరారు. నకులుడు అవలీలగా వారు ఎక్కిన రథమునకు కట్టిన హయములను చంపాడు. సత్యసేనుడు మరొక రథం ఎక్కాడు. తన బాణములతో నకులుని విల్లువిరిచాడు. నకులుడు మరొక విల్లుతీసుకొని సుషుణుని కేతనం ఖండించాడు. అతని విల్లు విరిచాడు. వారిద్దరూ కలిసి నకులుని సారథిని చంపారు. నకులుని విల్లు ఖండించారు. నకులుడు శక్తి ఆయుధమును తీసుకొని సత్యసేనుడి మీద ప్రయోగించాడు. సత్యసేనుని తల తెగి కిందపడింది.

అది చూచిన సుషేణుడు నకులుని మీద బాణ వర్షము కురిపించాడు. నకులుడు భీముని పుత్రుడైన శ్రుతసోముని రథం ఎక్కాడు. మరొక విల్లు తీసుకొని సుషేణుని మీద శరములు వర్షంలా కురిపించాడు. ఒక అర్ధ చంద్ర బాణంతో సుషేణుని తలను ఖండించాడు. అది చూచిన సుయోధనుని సైన్యం పారిపోయింది. శల్యుడు సింహంలా గర్జిస్తూ కౌరవ సేనలను పారిపోకుండా నిలువరించాడు. మరలా కౌరవ సేనలు పాండవ సేనలతో యుద్ధానికి తల పడ్డాయి.

ధర్మరాజు ముందు రక్షణగా భీమసేనుడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉపపాండవులు, నకుల సహదేవులు నిలబడ్డారు. శల్యుడు ముందు వారితో యుద్ధం చేస్తున్నాడు. ఇంతలో పాంచాల వీరులు, ప్రభద్రక వీరులు శల్యుని చుట్టుముట్టారు. శల్యుడి వారినందరినీ తన శరవర్షంలో ముంచెత్తాడు.

వారందరూ యమసదనానికి ప్రయాణమయ్యారు. అది చూచి సుయోధనుడు ఎంతో ఆనందించాడు.

ఇది చూచిన ధర్మరాజు శల్యుని ఎదుర్కొన్నాడు. శల్యుడు ఒక నారాచమును ధర్మరాజు శరీరమును చీల్చుకొని పోయేట్టు ప్రయోగించాడు. అది చూచిన భీముడు ఏడు బాణములు, సహదేవుడు 5 బాణములు, నకులుడు తొమ్మిది బాణములు, ఉపపాండవులు లెక్కలేనన్ని బాణములతో శల్యుని కొట్టారు. ఇది చూచి కృపాచార్యుడు, కృతవర్మ, శకుని, అతని కుమారుడు ఉలూకుడు, శల్యునికి సాయంగా వచ్చారు.

శల్యుడు భీమసేనుని హయములను చంపాడు. భీముడు తన గద తీసుకొని రథము దిగి కౌరవ సేనలను తునుమాడుతున్నాడు, సహదేవుడు కూడా శల్యుని మీద ధారాపాతంగా బాణ వర్షము కురిపించాడు. కాని శల్యుడు తన బాణములతో సహదేవుని హయములను సంహరించాడు. శల్యుని కుమారుడు రుక్మాంగదుడు సహదేవుని ఎదుర్కొన్నాడు. సహదేవుడు కత్తి తీసుకొని తన రథం మీదినుండి కిందికి దూకి. రుక్మాంగదుని వైపు దూసుకు పోయాడు. అతని రథము మీదికి లంఘించి, సహదేవుడు తన కత్తితో రుక్మాంగదుని శిరస్సు ఖండించాడు.

కుమారుని మరణము కళ్లారా చూచిన శల్యు డుకోపం తట్టుకోలేక పాండవ సైన్యమును తునుమాడుతున్నాడు. ధర్మరాజు మీద అతి క్రూరమైన బాణములను ప్రయోగించాడు. అది చూచిన భీమసేనుడు తన గద తీసుకొని కిందికి దూకి, శల్యుని రథమునకు కట్టిన హయములను చంపాడు. శల్యుడు భీముని మీదికి తోమరం విసిరాడు. అది భీమసేనుని గుండెలను చీల్చింది. భీమసేనుడు ఆ తోమరమును లాగి, దానితో శల్యుని రథ సారథిని మోదాడు.

ఆ దెబ్బకు సారథి మరణించాడు. శల్యుడు ముద్గర అనే ఆయుధము తీసుకొని రథము నుండి కిందికి దూకాడు. భీముడు కూడా శల్యుని తన గదాయుధముతో ఎదుర్కొన్నాడు.

ఇరుపక్షముల సేనలూ యుద్ధము ఆపి వారిరువురి గదాయుద్ధమును చూస్తున్నాయి. శల్యుడు, భీముడు, గుండ్రంగా తిరుగుతూ సింహగర్జనలు చేస్తూ, రెండు ఏనుగులు ఢీకొన్నట్టు ఢీకొంటున్నాయి. ఇరువురి గదా ఘాతములతో వారి ఇరువురి శరీరములు రక్తసిక్తములయ్యాయి. ఒక సమయంలో ఇద్దరూ ఒకరినొకరు కొట్టుకొని కిందపడ్డారు. మూర్ఛపోయారు. అది చూచిన కృపాచార్యుడు అక్కడకు వచ్చి శల్యుని తన రథము మీద ఎక్కించుకొని అవతలకు తీసుకొని వెళ్లాడు.

ఇంతలో భీమసేనుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. శల్యుడు కనపడలేదు. పెద్దగా అరుస్తూ శల్యుని పిలుస్తున్నాడు. అది విన్న సుయోధనుడు తన సేనలతో వచ్చి భీమసేనుని ఎదుర్కొన్నాడు. ఇంతలో చేకితానుని ఆధ్వర్యంలో పాండవ సేన భీమసేనుని ముందుకు వచ్చి సుయోధననుని సేనను ఎదుర్కొంది. సుయోధనుడు ఒక ఈటెను తీసుకొని బలంగా చేకితానుని మీదికి విసిరాడు. ఆ ఈటె చేకితానుని వధించింది.

ఇంతలో శల్యుడు తేరుకొని అక్కడకు చేరుకున్నాడు. శల్యుడు ధర్మజుని, సుయోధనుడు ధృష్టద్యుమ్నుని, అశ్వత్థామ అర్జునుని ఎదుర్కొన్నారు. అశ్వత్థామకు సాయంగా త్రిగర్త సైన్యము వచ్చింది. శల్యుడు అమితమైన శౌర్యంతో ధర్మరాజు మీద బాణములు ప్రయోగిస్తున్నాడు. ధర్మరాజు కూడా 14 బాణములు శల్యుని శరీరము నిండా గుచ్చాడు. శల్యుడు అత్యంత శక్తివంత మైన బాణమును ధర్మజుని వక్షస్థలములో గుచ్చాడు.. ధర్మరాజు కూడా విజృం

భించి శల్యుని చక్ర రక్షకుని చంపాడు. తొమ్మిది బాణములతో శల్యుని రథసారధిని చంపాడు. సాత్యకి, భీముడు చేది సేనలతో కలిసి శల్యుని మీద బాణవర్షము కురిపించారు.

ఇంతలో నకుల సహదేవులు శల్యుని మీదికి వచ్చారు. శల్యుడు కూడా నకుల సహదేవుల శరీరముల నిండా బాణములతో కొట్టాడు. ధర్మరాజు శల్యుని కేతనమును విరిచి అతని శరీరం నిండా బాణములు గుచ్చాడు. శల్యుడు ఆ బాణములను ఖండించి, భీమసేనుడు, నకుల సహదేవులు,సాత్యకిని తన వాడియైన బాణములతో కొట్టాడు. సహదేవుడు తన మేనమామ శల్యుని అత్యంత క్రూరమైన బాణములతో కొట్టాడు. భీమసేనుడు, సాత్యకి, ధర్మరాజు కూడా శల్యుని చుట్టుముట్టి అతనిని బాణ పరంపరలతో ముంచెత్తారు.

శల్యుని శరీరం నుండి రక్తం ధారాపాతంగా ప్రహిస్తూ ఉంది. కాని శల్యుడు తగ్గలేదు. తన బాణములతో ధర్మరాజు వింటిని ఖండించాడు. ధర్మరాజు మరొక విల్లుతీసుకొని తన అత్యంత ప్రతిభావంతమైన బాణములతో శల్యుని హయములను, సారధిని కొట్టాడు. శల్యుడు కోపించి ధర్మరాజు మూర్ఛపోయేట్టు కొట్టాడు. అది చూచి సాత్యకి వచ్చి శల్యుని ఎదుర్కొన్నాడు. శల్యుడు కోపించి సాత్యకి ధనుస్సు నరికాడు. నకులుని, భీముడిని, సహదేవుడిని ఒక్కొక్కరిని మూడేసి బాణములతో కొట్టాడు.

ఇంతలో ధర్మరాజు మూర్ఛనుండి లేచాడు. తన ముద్గరతో శల్యుని కొట్టాడు. అదే సమయములో భీముడు బల్లెమును, నకులుడు శక్తిని, సహదేవుడు గదాయుధమును ఒకేసారి ప్రయోగించారు. శల్యుడు కోపించి తన బాణములతో ఆ ఐదుగు వీరులను మూర్ఛపోయేట్టు కొట్టాడు. శల్యుని పరాక్రమానికి ఆ ఐదుగురు చచ్చారు అనుకున్నాడు సుయోధనుడు. సాత్యకి,

నకుల సహదేవులు వెనువెంటనే మూర్ఛనుండి తేరుకొని శల్యునితో పోరాడుతున్నారు.

ఇంతలో ధర్మరాజు శల్యుని మరొక చక్రరక్షకుని చంపాడు. చక్రరక్షకులు లేకపోయినా శల్యుడు మొక్కవోని ధైర్యముతో పాండవులతో యుద్ధం చేస్తున్నాడు. ఆ ఐదుగురు వీరులను రక్తంకారేట్టు కొట్టాడు. అది చూచి ధర్మరాజు ఎంతో దుఃఖించాడు. "శ్రీకృష్ణుడు నిజం చెప్పాడు. శల్యుని పరాక్రమాన్ని తట్టుకోవడానికి భీమునికి కూడా వల్లకావడం లేదు. ఇంక తానే శల్యుని సంహరించాలి." అని అనుకున్నాడు. తన సేనలను చేయి ఊపి పిలిచాడు.

కాని శల్యుడు భీమ,నకుల,సహదేవ,సాత్యకి,ధృష్టద్యుమ్నులను, ధర్మరాజును తన బాణములతో కప్పివేసాడు. ధర్మరాజాదులకు ది క్కు తోచలేదు. ఇది ఇలా ఉండగా, అశ్వత్థామ నాయకత్వంలో సంశప్తకులు అర్జునునితో యుద్ధం చేస్తున్నారు. అశ్వత్థామ సంశప్తకులతో కలిసి అర్జునుడిని రక రకాల బాణములతో, చిత్రవిచిత్రములైన అస్త్ర శస్త్రములతో చికాకు పరుస్తున్నాడు.

అర్జునునికి పట్టరానికోపం వచ్చింది. తను కూడా విజృం భించాడు. సంశప్తకులను చించి చెండాడుతున్నాడు. వారి హయములను చంపాడు. కేతనములు విరిచాడు. ధనుస్సులు విరగ్గొట్టాడు. కవచాలను బేధించాడు. ఆ ప్రకారంగా 2,000 మంది సంశప్తకులను చంపాడు అర్జునుడు.

అశ్వత్థామ అర్జునునితో స్వయంగా యుద్ధానికి వచ్చాడు. అశ్వత్థామ 12 బాణములతో అర్జునుని, 10 బాణములతో కృష్ణుని కొట్టాడు. గురుపుత్రుడు,

బ్రాహ్మణుడు, అయిన అశ్వత్థామకు మనసులోనే నమస్కరించాడు అర్జునుడు. అశ్వత్థామ హయములను చంపాడు. అతని సారధిని చంపాడు. అశ్వత్థామ ముసలమును, పరిఘను అర్జునుని మీద ప్రయోగించాడు. అర్జునుడు ఆ ముసలము, పరిఘను తునా తునకలు చేసాడు. అత్యంత శక్తిమంతమయిన మూడు బాణములను అశ్వత్థామ శరీరంలో నాటాడు. ఇది చూచిన సంశప్తకులు అశ్వత్థామను దాటుకొని అర్జునుని మీదికి దూకారు.

ఇంతలో సురథుడు అనే పాంచాల రాకుమారుడు అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. అశ్వత్థామ ఒకే ఒక బాణంతో సురథుని తల నరికాడు. మరలా అర్జునుని తో యుద్ధమునకు సన్నద్ధుడయ్యాడు. సుయోధనుడు ధృ ష్టద్యుమ్నుని ఎదుర్కొన్నాడు. వాడియైన ఐదు బాణములు ప్రయోగించాడు. దానికి ప్రతిగా దృష్టద్యుమ్నుడు 70 బాణములు సుయోధనుని మీద ప్రయోగించాడు. ఇది చూచిన సుయోధనుని తమ్ములు అన్నకు సాయంగా వచ్చి ధృష్టద్యుమ్నుని తో యుద్ధం చేస్తున్నారు.

ధృష్టద్యుమ్నుడు మహా కోపంతో ఊగి పోతూ సుయోధనుని తమ్ములమీద మిక్కిలి వాడియైన అస్త్రములను ప్రయోగించాడు. శిఖండి, ప్రభద్రకులు కృపాచార్యుని, కృతవర్మను, ఎదుర్కొన్నారు. శల్యుడు ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులను ఎదుర్కొంటున్నాడు. ఇరుపక్షముల మధ్య పోరు ఘోరంగా సాగుతూ ఉంది. నకులుడు 10 బాణములను శల్యుని గుండెలకు గురిచూచి కొట్టాడు. శల్యుడు నకులుడి మీద మూడు బాణములు వేసాడు. నకులుని విల్లు విరిచాడు. నకులుడు మరియొక విల్లు తీసుకున్నాడు. ఆ ఐదుగురూ ఒక్కుమ్మడిగా శల్యుని ఎదుర్కొన్నారు.

కాని శల్యుడు జంకక, వారి నందరినీ తన బాణములతో నొప్పించాడు. ఇది చూచిన సుయోధనుడు తన బలములతో శల్యునికి సాయంగా వచ్చాడు. కృ

ష్టార్జునులు తమ తమ సైన్యములను ఒక చోట సమీకరించారు. అర్జునుడు కృపాచార్యుడు, కృతవర్మలను, సహదేవుడు శకునిని, ఉపపాండవులు కౌరవ పక్షమున పోరుతున్న మిత్ర రాజులను, శిఖండి అశ్వత్థామను, భీమసేనుడు తన సమజ్జీ అయిన సుయోధనుని, ఎదుర్కొన్నారు. ధర్మరాజు తన వెంట నకులుడు రాగా, శల్యుని ఎదుర్కొన్నాడు. ఇరు పక్షముల మధ్య పోరు తీవ్రంగా సాగుతూ ఉంది.

శల్యుడు మహా క్రోధంతో ఎక్కడ చూచినా తానే అయి యుద్ధం చేస్తున్నాడు. అప్పటికి మధ్యాహ్నం అయింది. సూర్యుడు ఆకాశం మధ్యలో నిలబడి ఆఖరి రోజు యుద్ధం చూస్తున్నట్టు ప్రకాశిస్తున్నాడు. రణరంగంలో కూడా మరొక సూర్యుడు ఉన్నాడా అని భ్రమ కలిగేట్టు శల్యుడు అత్యంత పరాక్రమంతో యుద్ధం చేస్తున్నాడు. శల్యుని ధాటికి ఆగలేక, పాండవుల సేనలు వెనుకంజ వేస్తున్నాయి.

అది చూచిన ధర్మరాజు తన చేతులు ఊపుతూ వారికి ఉత్సాహం కలుగ చేస్తున్నాడు. తన తమ్ములను దగ్గరకు పిలిచాడు. "మీరందరూ మీ మీ పరాక్రమాలకు అనుగుణంగా భీష్మ,ద్రోణ,కర్ణ మొదలగు వీరులను చంపారు. ఈ రోజు నేను మహా వీరుడైన శల్యుని చంపుతాను. అది ఎలాగంటే వినండి. నా రధమునకు నకులుడు, సాత్యకి, కుడి వైపున, సహదేవుడు, ధృష్టద్యుమ్నుడు ఎడమవైపునా రక్షకులుగా నిలవాలి. నా వెనక అర్జునుడు నిలుస్తాడు. నాముందు భీమసేనుడు ఉంటాడు. ఎందుకంటే శల్యునికి రక్షకులుగా కృపాచార్యుడు, కృతవర్మ, శకుని,అశ్వత్థామ నిలుస్తారు. వారికి దీటుగా మీరు నిలవాలి." అని ఆదేశించాడు. ధర్మరాజు మాట ప్రకారము పాండవులు, ధృష్టద్యుమ్నుడు నిలిచారు. ఇది చూచిన సుయోధనుడు శల్యునికి రక్షణగా అశ్వత్థామ, కృపాచార్య, కృతవర్మలను, శకునిని నియమించాడు. ధర్మరాజు,

శల్యుని ఎదుర్కొన్నాడు. పోరు ఘోరంగా సాగుతూ ఉంది.

సుయోధనుడు భీమునితో యుద్ధానికి దిగాడు. భీముడి విలు విరిచాడు. అతని కేతనము పడగొట్టాడు. భీమసేనుడు కోపించి సుయోధనుని గుండెలకు గురిపెట్టి శక్తి ఆయుధమును ప్రయోగించాడు. సుయోధనుడు తన రథము మీద పడి మూర్ఛపోయాడు. మరొక బాణంతో భీముడు సుయోధనుని రథసారథిని చంపాడు. సారథి లేని గుఱ్ఱములు సుయోధనుని రథమును ఎటో లాక్కుని వెళ్లాయి.

అర్జునుడు అశ్వత్థామ,కృపాచార్యుడు, కృత వర్మల ను ఎదుర్కొన్నాడు. శల్యుని సైన్యము ధర్మరాజును చుట్టుముట్టింది. ధర్మజుడు కోపించి విజృంభించాడు. రథములు విరుగుతున్నాయి. హయములు, గజములు చచ్చి పడుతున్నాయి. రణభూమి అంతా కళేబరములతో నిండిపోయింది. ధర్మరాజు శల్యుడు తమ తమ శంఖములు పూరించారు. ఒకరి మీద ఒకరు అస్త్ర శస్త్రములు ప్రయోగించు కుంటున్నారు. ఇరువురి శరీరములనుండి రక్తము ధారలుగా ప్రవహిస్తూ ఉంది.

శల్యుడు ధర్మరాజు విల్లు విరిచాడు. ధర్మజుడు మరొక విల్లు తీసుకొని శల్యుని విల్లు విరిచాడు. శల్యుడు ఊపిరి సలపకుండా అతని మీద 300 బాణములు ప్రయోగించాడు. శల్యుని రథమునకు కట్టిన గుఱ్ఱములను చంపాడు. అతని కేతనము పడగొట్టాడు. శల్యుడు రథము మీద కూల బడ్డాడు. అది చూచిన అశ్వత్థామ శల్యుని తన రథము మీదికి చేర్చి, దూరంగా తీసుకొని వెళ్లాడు.

శల్యుడు పడి పోగానే ధర్మరాజు పొలికేకలు పెడుతూ విజృంభించాడు.

కౌరవ సైన్యమును తరుముతున్నాడు. ఇంతలో శల్యుడు మూర్ఛనుండి తేరుకొని మరియొక రధము మీద ఎక్కి మరలా ధర్మజుని ఎదుర్కొన్నాడు. అప్పుడు, ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, నకుల సహదేవులు శల్యుని ఎదుర్కొన్నారు. శల్యుడు వారి నందరినీ తన వాడియైన బాణములతో కొట్టి వారిని పక్కకు తప్పించి, మరలా ధర్మరాజును ఎదుర్కొన్నాడు. ధర్మరాజు అత్యంత వాడి యైన బాణములు శల్యుని గుండెలకు గురి చూచి కొట్టాడు.

అది చూచిన సుయోధనుడు తన సేనలను శల్యునికి సాయంగా పంపాడు. వారి అండ చూచుకొని శల్యుడు విజృంభించాడు. ధర్మరాజు దేహంలో ఏడు భయంకరమైన బాణములు నాటాడు. సుయోధనుని సేనలు భీమునితో పోరుతున్నాయి. ధర్మరాజు తొమ్మిది బాణములను శల్యుని శరీరంలో గుచ్చాడు. ఈ ప్రకారము శల్యుడు ధర్మజుడు ఒకరితో ఒకరు తీసిపోకుండా పోరుతున్నారు.

శల్యుడు ఒక బలమైన బాణమును ధర్మజుని గుండెలకు గురి పెట్టి కొట్టాడు. ధర్మజుడు శల్యుని తన బాణములతో మూర్ఛపోయేట్లు కొట్టాడు. అంతలోనే తేరుకొని, శల్యుడు ధర్మరాజు మీద బాణ ప్రయోగం చేసాడు. ధర్మరాజు శల్యుని కవచమును చీల్చాడు. శల్యుడు ధర్మజుని విల్లు ఖండించాడు. ధర్మజుడు మరియొక విల్లు తీసుకొని శల్యుని శరీరం నిండా శరములతో నింపాడు. శల్యుడు తన బాణములతో ధర్మరాజు, భీమసేనుని కవచములను చీల్చాడు.

ఇంతలో కృపాచార్యుడు ధర్మరాజు సారధిని కొట్టాడు. శల్యుడు ధర్మరాజు రధమునకు కట్టిన హయములను చంపాడు. ధర్మరాజు విరధుడయ్యాడు.

ధర్మరాజు తనలో తాను ఇలా అనుకున్నాడు. "శ్రీ కృష్ణుడు నన్ను శల్యుని చంపమని నియోగించాడు. ఆ మహానుభావుని మాట వమ్ము అయేట్టు ఉంది. ఏంచెయ్యాలి? ఇంక నాకు ఆ పరమేశ్వరుడే దిక్కు ."అంటూ రథం మీదినుండి పరమేశ్వరుని ఇలా ప్రార్థించాడు.

" ఓ పరమేశ్వరా! నీవు త్రినేత్రుడవు. త్రిశూలధారివి. నిర్గుణుడివి. నిరాకారుడివి. సృష్టి, స్థితి, లయకారకుడివి. త్రిభువనములకు పూజనీయుడివి. నిన్ను నేను ఆశ్రయిస్తున్నాను. నన్ను ఈ గండంనుండి బయట పడ వేయుము." అని మనస్ఫూర్తిగా పరమేశ్వరుని ప్రార్థించాడు.

మెల్లగా పైకి లేచాడు. శల్యుని మీద శర ప్రయోగం చేసాడు. ధర్మరాజు శక్తిహీనుడయ్యాడు అని గమనించాడు శల్యుడు. రెట్టించిన ఉత్సాహంలో ధర్మరాజు మీద బాణములు వదిలాడు. అప్పుడు భీమసేనుడు మధ్యలో వచ్చి శల్యుని విల్లు విరిచాడు. అతని హయములను చంపాడు. శల్యుని రథ సారథిని చంపాడు. శల్యుడు కూడా విరథుడు అయ్యాడు.

శల్యుడు తన కత్తిడాలు తీసుకొని, భీమసేనుని విడిచి ధర్మరాజు మీదికి విజృంభించాడు. పాదచారియై తన మీదికి వస్తున్న శల్యుడిని చూచాడు ధర్మరాజు. తన ఒంట్లోని శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకున్నాడు. "శ్రీకృష్ణుడు నన్ను శల్యుడిని చంప మన్నాడు. ఈ శల్యుడు నా వంతు" అని మనస్సులో ధృఢంగా సంకల్పించాడు. పూర్వము తనకు పరమశివుడు ప్రసాదించిన శక్తి ఆయుధమును బయటకు తీసాడు. అప్పటి దాకా దానిని భక్తితో పూజిస్తున్నాడు. ఆ శక్తి ఆయుధమునకు భక్తితో నమస్కరించాడు. ధర్మరాజు కళ్లలో నిప్పులు కురిసాయి. ముఖం భయంకరంగా తయారయింది. క్రోధం పెల్లుబికింది. ప్రళయకాల రుద్రుని లాగా విజృంభించాడు. తన శక్తి కొద్ది ఆ శక్తి

ఆయుధాన్ని తన మీదికి వస్తున్న శల్యుని మీదికి  బలంగా విసిరాడు.  ఆ శక్తి నిప్పులు వెదజల్లుతూ శల్యుని మీదికి దూసుకుపోయింది. అతని కవచమును చీల్చింది. శల్యుని గుండెలో నుంచి దూసుకుపోయి భూమిలోకి ప్రవేశించింది. శల్యుని శరీరము లోనుండి రక్తం ధారాపాతంగా స్రవించింది. మొదలు నరికిన చెట్టు వలె శల్యుడు నేలమీద బోర్లా పడ్డాడు. శల్యుని ప్రాణవాయువులు అనంత వాయువులలో కలిసిపోయాయి.

శల్యుని మరణాన్ని కళ్లారా చూచిన శల్యుని తమ్ముడు కోపంతో ఊగి పోయాడు. ధర్మరాజును తన సైన్యంతో చుట్టుముట్టాడు. ధర్మరాజు అతని మీదికి ఒక పదునైన బల్లెం విసిరి అతని తలను ఖండించాడు. శల్యుడు, అతని సోదరుడు,  మరణాన్ని చూచి కౌరవ సేనలు పారిపోసాగాయి. సాత్యకి కౌరవ సేనను తరుముతున్నాడు. ఇది చూచిన  కృతవర్మ సాత్యకిని ఎదుర్కొన్నాడు. ( ఇద్దరూ యాదవ వీరులే. ఇద్దరూ శ్రీకృష్ణునికి బంధువులే).

కృతవర్మ సాత్యకి విల్లు విరిచాడు. సాత్యకి మరొక ధనుస్సు తీసు కున్నాడు. కృతవర్మ రథమునకు కట్టిన హయములను, రథసారథిని చంపాడు. ఇది చూచిన కృపాచార్యుడు కృతవర్మను తన రథం మీద ఎక్కించుకొని తీసుకొని వెళ్లాడు. సాత్యకి పరాక్రమానికి తట్టుకోలేక కౌరవ సైన్యం పారిపోయింది. పాండవ సైన్యం కౌరవ సేనను వెంటాడుతూ ఉంది. సుయోధనుడు ఒక్కడే పాండవ సేనకు ఎదురు నిలిచాడు.

మరొక రథమును  సమకూర్చుకొని మరలా కృతవర్మ అక్కడకు వచ్చాడు. మరలా ధర్మరాజును ఎదిరించాడు. ధర్మరాజు కోపంతో కృతవర్మ గుర్రములను చంపాడు.  అశ్వత్థామ కృతవర్మను తన రథం మీద ఎక్కించుకుని పక్కకు తీసుకొని వెళ్లాడు.  ,

ధర్మరాజు ఆరు బాణములతో కృపాచార్యుని కొట్టాడు. కృపాచార్యుడు 16 బాణములతో ధర్మరాజును కొట్టాడు. సుయోధనుడు తన ఏనుగును ఎక్కి సైన్యమును ప్రోత్సహిస్తూ యుద్ధ భూమి అంతా తిరుగుతున్నాడు. సుయోధనుని మాటలతో ధైర్యం తెచ్చుకున్న కౌరవ సేనలు పాండవ సేనలను ఎదిరించారు. సుయోధనుని అండ చూచుకొని శల్యుని బంధువులు ధర్మరాజుమీదికి దూకారు. కాని సుయోధనుడు వారిని వారించాడు. "తొందర పడకండి. నా వెనుక నిలవండి. మనమందరం ధర్మరాజును  ఎదిరిద్దాము." అని అరుస్తున్నా లెక్కచెయ్యకుండా వారు ధర్మరాజు మీదికి దూకారు.

ఇంతలో భీముడు, నకుల సహదేవుడు,  ఉప పాండవులు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు,శిఖండి తమ తమ బలాలతో వారిని చుట్టుముట్టారు.  అది చూచిన శకుని సుయోధనునితో "సుయోధనా! శల్యుని బంధువుల నందరినీ పాండవ వీరులు చంపుతారు. వారిని కాపాడవయ్యా." అని అరిచాడు.

దానికి సుయోధనుడు "నేనేం చెయ్యను. వాళ్లు నా మాట కూడా వినకుండా వెళ్లారు. ఫలితం అనుభవిస్తారు." అని అన్నాడు నిర్వేదంగా.

"అది కాదు సుయోధనా! వారు నిన్ను నమ్మి నీ పక్షాన యుద్ధం చెయ్యడానికి వచ్చారు. వారు ఆపదలో ఉన్నప్పుడు నువ్వే కదా రక్షించాలి." అని అన్నాడు.

శకుని మాటలు విన్న సుయోధనుడు "సరే వెళుతున్నాను. వారిని రక్షిస్తాను." అని తన సేనలతో ముందుకు దూకాడు. కాని అప్పటికే  ఆలస్యం అయిపోయింది. సాత్యకి, భీమసేనుడు, నకులసహదేవులు మొదలగువారు

శల్యుని బంధుగణమును నిశ్శేసంగా యమసదనమునకుపంపారు. అది చూచిన సుయోధనుని సైన్యకు వెనుకకు తిరిగి పారిపోసాగింది.

కౌరవ సేనలలో నిరాశ నిస్ప ృహ ఆవరించాయి. ఇంక ఈ కురు సామ్రాజ్యానికి అధిపతి ధర్మరాజు సుయోధనుని పతనం తథ్యం అని నిర్ణయించుకున్నారు. అది చూచాడు సుయోధనుడు. ఏనుగును దిగి ఒక రథం ఎక్కాడు. తన సైన్యం మధ్య తిరుగుతూ వారికి ధైర్యం కలిగించే మాటలు చెబుతూ వారిని యుద్ధోన్ముఖులను చెయ్యడానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాడు. "సైనికులారా! వెనుకకు మరలండి. విజయమో వీరస్వర్గమో తేల్చుకొంది. పిరికి పందల్లా పారిపోకండి. మీరుపారి పోయినంత మాత్రాన శత్రువులు మిమ్ములను విడువరు. తరిమి తరిమి చంపుతారు. అలాంటి దిక్కులేని చావు చచ్చేకంటే, వీరోచితంగా పోరాడి మరణించండి. వీరస్వర్గము పొందండి మన బలం ఎక్కువగా ఉంది. పాండవుల సైన్యం తక్కువగా ఉంది. తప్పకుండా మనమే గెలుస్తాము. రండి వెనక్కు తిరగండి." అని అరుస్తున్నాడు.

ఆ మాటలకు కౌరవ సేనలో ధైర్యోత్సాహాలు పెల్లుబికాయి. వారందరూ రణభూమికి తిరిగి వచ్చారు. అందరూ కలిసి భీమసేనుని చుట్టుముట్టారు. భీముడు తన గద తీసుకొని కౌరవ సేనలను మారణ హోమం చేసాడు. ఒకే దెబ్బకు 21,000 వేలమందిని చంపాడు. మరొక పక్కనుండి అర్జునుడు కౌరవ సేనలకు తన గాండీవం నుండి వెలువడే బాణాల రుచి చూపిస్తున్నాడు.

నకులుడు, సహదేవుడు, సాత్యకి కలిసి శకుని ని ఎదుర్కొన్నారు. శకుని కూడా వారిని ధైర్యంతో ఎదిరించాడు. ఇంతలో సాళ్వుడు ఒక ఏనుగు మీద ఎక్కి పాండవ సేనలో ప్రవేశించాడు. పాండవ సేనలను కకావికలు చేస్తున్నాడు.

సాళ్వుడు ధృష్టద్యుమ్నుని ఎదుర్కొన్నాడు. ధృష్టద్యుమ్నుడు తన బాణములతో సాళ్వుని ఏనుగు కుంభస్థలము మీద కొట్టాడు. ఆ దెబ్బకు ఆ ఏనుగు పారి పోయింది. కాని సాళ్వుడా ఆ మదగజమును మరలా దారిలోకి తెచ్చుకొని ధృ ష్టద్యుమ్నుని మీదికి దూకాడు.  సాళ్వుని ఏనుగు ధృష్టద్యుమ్నుడు ఎక్కిన రధమును తన తొండముతో పైకి ఎత్తింది.

ఇది గమనించిన ధృష్టద్యుమ్నుడు తన గద తీసుకొని రధమునుండి కిందికి దుమికాడు. భీముడు, శిఖండి, సాత్యకి కూడా సాళ్వుని ఎదు ర్కొన్నారు. సాళ్వుడు కూడా అత్యంత ధైర్యసాహసములతో వారిని ఎదుర్కొన్నాడు. ధృష్టద్యుమ్నుడు  తన గదతో ఆ ఏనుగు కుంభస్థలము మీద కొట్టాడు.  సాళ్వుడు ఎక్కిన ఏనుగు కిందపడిపోయింది. సాత్యకి  ఒకే ఒక బాణంతో సాళ్వుని శిరస్సును ఖండించాడు.

సాళ్వుని మరణం చూచి కౌరవ సైన్యము పారిపోసాగింది. కృతవర్మ తన సైన్యమునకు ధైర్యవచనములు చెబుతూ మరలాయుద్ధమునకు సన్నద్ధము చేస్తున్నాడు. సాత్యకి ఎనిమిది వాడియైన శరములతో కృతవర్మను కొట్టాడు. కృ తవర్మ సాత్యకి విల్లును విరిచాడు. సాత్యకి మరొక విల్లుతీసుకొని కృతవర్మ హయములను, సారధిని చంపాడు.  విరధుడైన కృతవర్మ ఒక శూలము తీసుకొన్నాడు. ఇది చూచి కృపాచార్యుడు వెంటనే తన రధము మీదికి కృ తవర్మను లాక్కొన్నాడు.

అప్పటికి కురుసైన్యము చెల్లాచెదరయింది.  నీ కుమారుడు సుయోధనుడు మాత్రము ఒంటరిగా పాండవులను ఎదుర్కొన్నాడు.  పాండవ పక్షమున కల పేరుగల వీరులందరూ ఒక్కచోట చేరి సుయోధనుని

ఎదుర్కొన్నారు. సుయోధనుడు ఎక్కడ చూచినా తానే అయి పాండవులతో యుద్ధం చేస్తున్నాడు. ధర్మరాజు మీద 100 బాణములు, భీమసేనుడిమీద 70 బాణములు సంధించాడు. సహదేవుని విల్లు విరిచాడు. సహదేవుడు మరొక విల్లు తీసుకొని తన సైన్యముతో సుయోధనుని ఎదిరించాడు.

కురు సైన్యము ప్రాణముల మీద ఆశ వదులుకొని యుద్ధం చేస్తున్నారు. ఇంతలో శకుని ధర్మరాజు ఎక్కిన రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. సహదేవుడు వెంటనే ధర్మజుని తన రథము మీద ఎక్కించు కున్నాడు. ధర్మరాజు తన బాణములతో శకునిని కప్పివేసాడు.

శకుని కుమారుడు ఉలూకుడు నకులునితో యుద్ధం చేస్తున్నాడు. సాత్యకి కృతవర్మతో యుద్ధం చేస్తున్నాడు. సుయోధనుడు ధృష్టద్యుమ్నుని విల్లు నరికాడు. ధృష్టద్యుమ్నుడు మరియొక విల్లు తీసుకొని సుయోధనుని మీద బాణప్రయోగం చేసాడు.

ఇంతలో ద్రౌపది పుత్రులు ఐదుగురు సుయోధనుని, పంచేద్రియములు అజ్ఞానిని (మూర్ఖుని) ఎదుర్కొన్నట్టు, ఎదుర్కొన్నారు.

(పాండవులు పంచభూతములకు ప్రతీకలు. పంచభూతములకు అధిష్టాన దేవతలు యముడు, ఇంద్రుడు,వాయువు, అశ్వినులు. శబ్ద,స్పర్శ,రూప,రస,గంధములు వాటి యొక్క గుణములు. కుంతీ దేవి ప్రకృతి స్వరూపిణి. ద్రౌపది శక్తి స్వరూపిణి. పంచభూతములు శక్తితో సంయోగము చెందినపుడు పుట్టినవారు ఉప పాండవులు. వారు పంచేంద్రియములకు ప్రతీకలు. సుయోధనుడు అన్ని తెలిసిన అజ్ఞాని. మూర్ఖుడు. అందుకని పంచేంద్రియములకు చిక్కిన మూర్ఖుడిలాగా ఉపపాండవులకు సుయోధనుడు

చిక్కాడు అని తిక్కన భావార్ధము. (సేకరణ: తి.తి.దే.వారి మహాభారతము నుండి.).

ధర్మరాజు మూడు శరములతో కృపాచార్యుని కొట్టాడు. నాలుగు బాణములతో కృతవర్మ హయములను చంపాడు. అశ్వత్థామ కృతవర్మను తన రధము మీద ఎక్కించుకొని తీసుకొని పోయాడు.

సుయోధనుడు ఏడు వందల రధములతో  ఒక్కసారిగా ధర్మరాజును చుట్టుముట్టాడు. శిఖండి విజృంభించి ఆ రధములను తన బాణములతో ఖండించాడు. శకుని తన సేనలతో ధర్మరాజును ఎదుర్కొన్నాడు. ధర్మరాజు సహదేవుని చూచి శకునిని ఎదుర్కొమ్మని ఆదేశించాడు.

శకుని, సహదేవుల మధ్య యుద్ధం ఘోరంగా సాగుతూ ఉంది. ఇరు పక్షములలో   ఐదు వేల మూడు వందల  హయములు నేలకూలాయి. యుద్ధ భూమి అంతా పీనుగుల పెంట అయింది.  మిగిలిన 700 హయములతో శకుని తప్పించుకున్నాడు. వెంటనే సుయోధనుని వద్దకు పోయి అతనితో ఇలా అన్నాడు. "సుయోధనా! ముందు మనము పాండవుల గజబలమును ఆశ్విక బలమును తుదముట్టించాలి. తరువాత కాల్బలమును నాశనము చెయ్యవచ్చు."   శకుని మాటలు విని  సుయోధనుడు వెంటనే తన గజబలమును, ఆశ్విక బలమును సమాయత్తం చేసాడు.

ఇది చూచి అర్జునుడు కృష్ణుని చూచి ఇలా అన్నాడు. "కృష్ణా! ఈ 18 రోజుల యుద్ధంలో కౌరవ సైన్యము పూర్తిగా రూపు మాసి పోయింది. కాని వీరికి ఇంకా బుద్ధిరాలేదు. నాడు భీష్ముడు పడిపోయిన రోజునైనా వీరు సంధి

చేసుకొన వలసినది. కాని సుయోధనుని మూర్ఖత్వము అందుకు సమ్మతించ లేదు.  భీష్ముని పతనము తరువాత  కూడా సుయోధనుడు యుద్ధం కొనసాగించడం మూర్ఖత్వమే అయింది. సర్వనాశనము అయింది. కనీసం ద్రోణుడు, జయద్రధుడు, భగదత్తుడు, మున్నగు వారి మరణములను కళ్లారా చూచి అయినా సుయోధనుని మనసు మారలేదు. అతడు  ఎవరి మాట లక్ష్యపెట్టలేదు. కనీసం తన ఆప్తులు దుశ్శాసన,కర్ణుల చావు చూచి కూడా అతనికి బుద్ధిరాలేదు.  ఆఖరుడు శల్యుని చావు చూచికూడా యుద్ధం కొనసాగిస్తున్నాడు. అతని మూర్ఖత్వం ఏమనాలి? సుయోధనుడు తన శరీరంలో ప్రాణం ఉన్నంత వరకూ రాజ్యములోభాగము ఈయడు అని స్పష్టంగా తేలిపోయింది. కాబట్టి సుయోధనుని మరణం తప్పదు." అని అన్నాడు.

అప్పుడు కృష్ణుడు అర్జునునితో "అర్జునా!  నేను మీ ఇరువురికి సంధి చేయడానికి కురు సభము వెళ్లినపుడు విదురుడు ఇదేమాట అన్నాడు. "కృష్ణా! నీవు ఇక్కడకు ఏల వచ్చావయ్యా? ఈ సుయోధనుడు వివేక హీనుడు దుర్మదాంధుడు. సుయోధనుడు మంచి మాటలతో రాజ్యభాగము ఇయ్యడు. కాబట్టి యుద్ధమే ఉచితము."  అని అన్నాడు. అది ఒకటేకాదు. సుయోధనుడు జన్మించినపుడు మహామునులు అప్పుడు జరిగిన ఉత్పాతములు చూచి ఇతడు "సమస్త రాజలోకమునకు క్షయకారకుడవుతాడు." అని చెప్పారు. అది అక్షరాలా నిజమయింది." అని అన్నాడు కృష్ణుడు.

"అవును కృష్ణా! సుయోధనుని మూర్ఖత్వము, స్వార్ధము అతను చావుతో కాని వదలదు. అందుకనే సైన్యము అంతా క్షీణించినా ఇంకా యుద్ధం కొనసాగిస్తున్నాడు." అని అన్నాడు అర్జునుడు.

ఈ ప్రకారము విశ్లేషించిన కృష్ణార్జునులు, శేషించిన కురు సేనలతో యుద్ధమునకు తలపడ్డారు. అర్జునుని ధాటికి ఆగలేక కౌరవ సేనలు పారిపోతున్నాయి. సుయోధనుడు వారికి ధైర్యము చెబుతూ చేయి ఊపుతూ వారిని యుద్ధమునకు పురికొల్పుతున్నాడు. మరొక పక్క ధృష్టద్యుమ్నుడు, శతానీకుడు కౌరవ సేనను తమ తమ బాణములతో తుదముట్టిస్తున్నారు.

సుయోధనుడు ధృష్టద్యుమ్నుని తన బాణములతో వక్షస్థలము మీద కొట్టాడు. ధృష్టద్యుమ్నుడు తన వాడి యై న బాణములతో సుయోధనుని హయములను చంపి, సారధిని పడకొట్టాడు. సుయోధనుడు రధము దిగి తన గుర్రమును ఎక్కాడు.  తన గజబలముతో అర్జునుని ఎదుర్కొన్నాడు. అప్పుడు అర్జునుడు సుయోధనుని గజబలము మీద బాణవర్షము కురిపించాడు. మరొక పక్క గద ధరించి భీమసేనుడు సుయోధనుని గజబలమును నిర్మూలిస్తున్నాడు. ఇది చూచి ధర్మరాజు, నకులుడు సహదేవుడు అక్కడకు చేరుకున్నారు. వీరి మధ్య సుయోధనుడు చిక్కుపడిపోయాడు.

సుయోధనుడు కనపడనందున అశ్వత్థామ, కృపాచార్యుడు సుయోధనుడు పాండవుల చేతిలో మరణించాడేమో అని భ్రమ పడ్డారు. వారు సుయోధనుని కొరకు వెతుకుతూ శకుని దగ్గరకు చేరుకున్నారు. మిగిలిన వారు మాత్రం  సుయోధనుని కొరకు వెదకడం వృధా. సుయోధనుడు చచ్చినా ఒకటే బతికినా ఒకటే అని అనుకున్నారు. భీముడు ఒక పక్కనుండి కౌరవ సేనలో ఉన్న గజబలమును నాశనం చేస్తున్నాడు. అది చూచి చావగా మిగిలిన కౌరవ సేనలు భీమసేనుని చుట్టుముట్టాయి.  భీముడు ఆగ్రహోదగ్రు డయ్యాడు. తన గదతో వారిని చావమోదాడు. 500 రధములను, 700

ఏనుగులను, 800 హయములను, 10000 సైనికులను చంపాడు. మిగిలిన వారు భీమసేనుని వంక చూడ్డానికి కూడా సాహసించడం లేదు.

ధృతరాష్ట్ర మహారాజా! భీమసేనుడు నీకుమారులైన దుర్మర్షణుడు, శ్రుతాంతుడు, జైత్రుడు, భూరిబలుడు, జయత్సేనుడు, సుజాతుడు, దుర్విషహుడు, దుర్విమోచనుడు, అరిహుడు, దుష్ప్రధర్షుడు, శ్రుతపర్వుడు, మహాబాహుడు మొదలగు వారిని చంపాడు. సుయోధనుని నూరుగురు తమ్ములలో ఒక్కడే మిగిలాడు. వాడి పేరు సుదర్శనుడు. కొద్దిపాటి సైన్యముతో సుయోధనుడు, సుదర్శనుడు మిగిలారు.

వారిని చూచి శ్రీకృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! శత్రు వినాశం దాదాపు పూర్తి అయింది. ఇంక సుయోధనుడు, అతని తమ్ముడు సుదర్శనుడు కొద్దిపాటి సైన్యము మిగిలారు. ఇంక సుయోధనుని వధ మాత్రంమిగిలింది. అది కూడా పూర్తి గావించి కీర్తిమంతుడవు కా!" అని అన్నాడు.

"కృష్ణా! ఇంకా శకుని మిగిలి ఉన్నాడు. అతని వెంట 200 రధములు, 100 ఏనుగులు, 2000 కాల్బలము , 500 హయములు ఉన్నాయి. ఇంకా కృపాచార్యుడు, అశ్వత్థామ, కృతవర్మకూడా మిగిలారు. వీరంతా నాకు ఒక లెక్కకాదు. తృటి లో సంహరిస్తాను." అని పలికాడు అర్జునుడు.

కృష్ణుడు రధమును సుయోధనుని వంక పోనిచ్చాడు. సహదేవుడు, భీముడు సుయోధనుని చంపడానికి చెరి ఒక పక్క నుండి వచ్చారు. ఇంతలో శకుని తన సైన్యముతో వచ్చి వారి ముందు నిలిచాడు. శకుని, సుశర్ముడు అర్జునుని, సుదర్శనుడు భీమసేనుని, సుయోధనుడు సహదేవుని

ఎదుర్కొన్నారు.

సుయోధనుడు ఒక బల్లెము తీసుకొని సహదేవుని మీదికి విసిరాడు. ఆ దెబ్బకు సహదేవుడు మూర్ఛపోయాడు. వెంటనే తెలివి తెచ్చుకొని సహదేవుడు సుయోధనుని మీద అత్యంత వాడియైన బాణములు ప్రయోగించాడు. కౌరవ సైనికులు తోమరములతో అర్జునుని కప్పివేశారు. అర్జునుడు కోపించి వాడియైన బల్లెములతో గాంధార సైనికుల కంఠములు తెగనరికాడు.

ఇంతలో త్రిగర్త సైనికులు అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుడు సంశప్తకులలో ఒకడైన సత్యకర్ముడి తలను నేలమీద పడి దొర్లేట్టు కొట్టాడు. మరొక సంశప్తకుడు సత్యేషుడిని కూడా చంపాడు. ఆఖరున మిగిలిన సంశప్తకుడు, సుశర్మ, వక్షస్థలమునకు గురిపెట్టి ఒక బల్లెంవిసిరాడు. ఆ బల్లెం సుశర్మ వక్షస్థలము చీల్చింది. అతను మరణించాడు. వెంటనే అర్జునుడు సుశర్మ కుమారులు అందరినీ ఒక్కొకిరిని మూడేసి బాణములతో సంహరిం చాడు. సంశప్తక సైన్యము పారిపోయింది. భీముడు, చావగా మిగిలిన ధృ తరాష్ట్ర కుమారులలో, ఒక్కడే ఒక్కడు అయిన సుయోధనుని తమ్ముడు సుదర్శనుని సంహరించాడు.

" ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఇంక నీ కుమారులలో సుయోధనుడు ఒక్కడే మిగిలాడు. శకుని సహదేవుని తో తలపడ్డాడు. పది బాణాలు అతని శరీరంలో గుచ్చాడు. ఆ దెబ్బకు సహదేవుడు మూర్ఛపోయాడు. అది చూచిన భీమసేనుడు ముందు శకుని వెంట ఉన్న గాంధార సైన్యమును సర్వనాశనం చేసాడు. ఇది చూచి మిగిలిన కౌరవ సేన పారిపోయింది. సుయోధనుడు వారి వెంట పడి వారికి ధైర్యము చెప్పి వెనుకకు మరలించాడు.

ఇంతలో సహదేవుడు మూర్ఛనుండి తేరుకున్నాడు. శకునిపై పది శరములు ప్రయోగించి అతని విల్లు ఖండించాడు. శకుని వేరొక ధనుస్సు తీసుకొని నకులుని మీద శరవర్షము కురిపించాడు. శకుని కుమారుడైన ఉలూకుడు సహదేవుని మీద, భీమసేనుని మీద బాణవర్షము కురిపించాడు. సహదేవుడు కోపించి ఒకే ఒక బల్లెము విసిరి ఉలూకుని శిరస్సు ఖండించాడు.

తన కళ్ల ఎదుట తన కుమారుని చావుచూచి శకుని చలించిపోయాడు. అంతలోనే ఆగ్రహోదగ్రుడైన శకుని సహదేవుని మీద వాడియైన బాణములు మూడు నాటాడు. సహదేవుడు ఆ మూడు బాణములను ఖండించి, శకుని విల్లు విరిచాడు. శకుని మహా కోపంతో సహదేవుని మీద కత్తిని, గదను, బల్లెములను ప్రయోగించాడు. సహదేవుడు వాటినన్నింటిని మధ్యలోనే ఖండించాడు. అది చూచి శకుని అక్కడి నుండి తన రధరక్షకులతో సహా పారిపోయాడు.

సహదేవుడు శకునిని వెంబడించాడు. అతనిని నిలువరించి ఇలా అన్నాడు "ఓ గాంధార రాజా! రాజధర్మము విడిచి ఇలా పారిపోవడం నీ వంటి సుక్షత్రియునకు తగునా? నాడు జూదం ఆడినప్పుడు చూపిన చాతుర్యము ఇప్పుడు చూపించు. నాడు నీవు ఆడించిన మాయాద్యూతమునకు ఫలితం చూచావుకదా! సర్వనాశనం అయింది. నాడు జూదంలో ఓడిపోయి తలలు వంచుకున్న మాలో ప్రజ్వరిల్లిన కోపజ్వాలల ఫలితం చూచావు కదా! మా అందరినీ అవమానించిన ఫలితం .......అందరినీ పోగొట్టుకొని ఒంటరి వాడైన సుయోధనుడు అనుభవస్తున్నాడు. ఆ సుయోధనుడు చూస్తూ ఉండగా నీ తల తెగి నేలమీద పడేట్టు నేను కొడతాను." అంటూ సహదేవుడు శకుని యొక్క హయములను, కేతనమును, విల్లును ఖండించాడు. అది చూచిన శకుని, అత్యంత భయంకరమైన శక్తి ఆయుధమును సహదేవుని మీదికి

విసిరాడు. సహదేవుడు ఆ శక్తిని తన బల్లెముతో ఖండించాడు. సహదేవుడు రెండు చేతులతో రెండు బల్లెములను పట్టుకొని అత్యంత వేగంతో శకుని మీదికి విసిరాడు. వెంటనే శకుని తల శరీరం నుండి వేరయి కింద పడింది. వెంటనే శకుని శరీరం కూడా నేల మీద కు దొర్లింది. మహా భారత యుద్ధమునకు కారణ భూతుడైన గాంధార రాజు, శకుని, సహదేవుని చేతిలో మరణించాడు.

అది చూచిన పాండవులు జయజయధ్వానాలు చేసారు. పరమ ప్రమోదంతో శంఖములు పూరించారు కృష్ణుడు పాంచజన్యము పూరించాడు. ఆ శంఖధ్వనులు ఆకాశాన్నంటాయి . కాని గాంధార సేనలు బెదరలేదు. తమ రాజు శకుని మరణానికి కారకు డైన సహదేవుని మీద తిరగబడింది. సహ దేవునికి తోడుగా అర్జునుడు, భీముడు నిలబడ్డారు. వారి ధాటికి తట్టు కోలేక పోయింది గాంధార సైన్యము. వారి బాణములకు ఆహుతి అయ్యారు.

సుయోధనుడు చుట్టూ చూచాడు ఎవ్వరూ లేరు. రణభూమిలో ఒంటరిగా నిలబడి ఉన్నాడు. ఎదురుగా ఆనందాతిరేకంతో హర్షధ్వానాలు చేస్తున్న పాండవులు వారి సేనలు నిలబడి ఉన్నారు. సుయోధనుడు యుద్ధభూమి నుండి తొలగిపోవడానికి నిశ్చయించుకున్నాడు." అని సంజయుడు ధృ తరాష్ట్రునికి 18వ రోజుయుద్ధ విశేషములను వివరించాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా అన్నాడు. "సంజయా! ఆ సమయంలో ఇరు పక్షముల బలాబలములు ఎలా ఉన్నాయి అని అన్నాడు.

"మహారాజా! ఒక్కసుయోధనుడు తప్ప కౌరవ సైన్యము అంతా సర్వనాశనము అయింది. పాండవుల పక్షాన మాత్రం 2000 రధములు, 700 వందల ఏనుగులు, 500 హయములు, 10,000 కాల్బలము మిగిలారు.

సుయోధనుడు తన గదను బుజాన పెట్టుకొని రణభూమిని విడిచి పెట్టి ఎటో వెళ్లిపోయాడు.” అని సంజయుడు ధృతరాష్ట్రునితో అన్నాడు.

సుయోధనుని నిష్క్రమణతో 18 రోజులు కురుక్షేత్రములో అవిచ్ఛిన్నంగా సాగిన మహాభారత సంగ్రామము పరిసమాప్తమయింది. ఇక్కడ ఎవరు గెలిచారు! ఎవరు ఓడారు! అని కాదు. గెలిచిన వారికి చివరకు మిగిలింది భస్మసింహాసనము మాత్రమే!

మహాభారతము,
శల్యపర్వము,
ప్రథమాశ్వాసము, సమాప్తము.
ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహాభారతము

## శల్యపర్వము

## ద్వితీయాశ్వాసము

వైశంపాయన మహర్షి జనమేజయునకు చెప్పిన మహాభారత కధను, నైమిశారణ్యములో సత్రయాగ సందర్భమున, సూతుడు శౌనకాది మహామునులకు వినిపించాడు.

ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా అన్నాడు. “సంజయా! నా కుమారుడు సుయోధనుడు, మదం బాగా, అణిగి గద చేత్తో పట్టుకొని కాలి నడకన ఎటు వెళ్లాడు. రారాజుకు ఇంత దౌర్భాగ్యస్థితి కలిగిందా! సరేలే తరువాత ఏంజరిగిందో చెప్పు.” అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

“ మహారాజా! ఏకాదశ అక్షౌహిణులకు అధిపతి ఐన సుయోధనుడు, వంది మాగధుల కైవారములు లేకుండా ఎక్కడకూ వెళ్లని రారాజు, ఒంటరిగా, తోడు లేకుండా, ఏకాకిగా యుద్ధ భూమి నుండివెళ్లిపోయాడు. కురు క్షేత్రమునకు ఈశాన్యమూలగా, ఒక క్రోసెడు దూరములో ఉన్న ద్వైపాయన మడుగులో దిగి నీటి అడుగున కూర్చున్నాడు. నాడు విదురుని మాటలు విననందుకు తీరుబడిగా పశ్చాత్తాపపడుతున్నాడు.

సుయోధనుడు వెళ్లిపోగానే, భీమార్జునులు, మిగిలిన కౌరవ సైన్యమును

సమూలంగా నాశనం చేసారు. మన పక్క అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ అనే ముగ్గురు రధిక త్రయం మిగిలారు. అక్కడే తచ్చాడుతున్న నన్ను సాత్యకి పట్టుకున్నాడు.

అది చూచిన ధృష్టద్యుమ్నుడు “సాత్యకీ! వీడిని ఎందుకు పట్టుకున్నావు. అందరూ చచ్చారు.  వీడి వలన మనకేమి ఎగ్గు కలుగుతుంది. వీడిని విడిచి పెట్టు.” అన్నాడు.

దానికి ధృష్టద్యుమ్నుడు “వీడు కౌరవ పక్షమునకు చెందిన వాడు. శత్రుశేషము మిగలరాదు. వీడిని నరుకుతాను.” అంటూ కత్తి ఎత్తాడు.

అప్పుడు వ్యాస మహాముని అక్కడకు వచ్చాడు. సాత్యకిని వారించాడు. “సాత్యకీ! సంజయుని చంపుట అనుచితము. అతను నిరాయుధుడు. అతనిని విడిచి పెట్టు.” అని అన్నాడు.  సాత్యకి వ్యాసునికి నమస్కరించి నన్ను విడిచి పెట్టాడు. నేను బతుకుజీవుడా అంటూ అక్కడి నుండి పారిపోయాను.

అక్కడికి క్రోసెడు దూరములో ఉన్న ద్వైపాయన మడుగు వద్దకు వెళ్లాను. అక్కడ సుయోధనుని కలుసుకున్నాను. సుయోధనునికి నన్నుచూచి నోటమాటరాలేదు. నేను జరిగినది అంతా సుయోధనునికి చెప్పాను. సుయోధనుడు నాతో ఇలా అన్నాడు.

“సంజయా! మన పక్షమున ఇంకా ఎవరైనా బతికి ఉన్నారా?” అని అడిగాడు.

“అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ అనే రధికత్రయం తప్ప మిగిలిన

వారందరూ మరణించారు.” అని చెప్పాను.

“అవును సంజయా! నేను కూడా పాండవుల పాల బడకుండా తప్పించుకున్నాను. ఇదే నాకు పట్టిన అదృష్టం అనుకుంటాను. పాండవులకు లొంగిపోయి వారి దయా ధర్మబిక్షమీద ఆధారపడి బతకడం నాకు ఇష్టం లేదు. అయినా సంజయా! పాండవులు నా సోదరులను, నా బంధువులను, మిత్రులను అందరినీ చంపారు. చాలాసంతోషంగా ఉన్నారు. వారి సంతోషమును చూచి నేను సహించగలనా! నా తండ్రి ధృతరాష్ట్రునికి ఈ విషయం చెప్పు.” అని చెప్పి మరలా ద్వైపాయన మడుగులోకి వెళ్లాడు. తను నేర్చిన సంస్తంభన విద్యతో నీరు తన శరీరమునకు సోకకుండా మడుగు అడుగున దాక్కున్నాడు.

ఇంతలో యుద్ధభూమి నుండి పారిపోయిన అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యుడు, ఒంటి నిండా దుమ్ము కొట్టుకొని, సుయోధనుని కొరకు వెతుకుతూ నన్ను చూచారు. “సంజయా! నువ్వు బతికే ఉన్నావా! మన రారాజు, సుయోధనుడు ప్రాణాలతో ఉన్నాడా! ” అని అడిగారు. నేను సుయోధనుడు ద్వైపాయ నమడుగు అడుగున దాక్కున్న విషయం వారికి చెప్పాను. నా మాటలు విని వారు ఎంతో దుఃఖించారు.

“సంజయా! రారాజుకు మేము రణరంగములో చావలేదని తెలియదు. మా గురించి దుఃఖపడుతున్నాడు. మమ్ములను కలుసుకొనడం దుస్తరమని తలచి తాను ఆ మడుగులో దాగి ఉన్నాడు. అయినా అష్టైశ్వైర్యములు అనుభవించిన రారాజుకు ఎంతటి దుస్థితి దాపురించినది. సంజయా! మేము సుయోధనునితో మాట్లాడుతుండగా, పాండవులు తమ తమ సైన్యములతో మమ్ములను చుట్టుముట్టారు. ఇంక అక్కడ ఉండటం క్షేమం కాదని

అక్కడినుండి పారిపోయాము."అని చెప్పాడు కృపాచార్యుడు.

తరువాత, రధిక త్రయము ద్వైపాయన మడుగులో దాగిన సుయోధనుని కలుసుకొనుటకు అక్కడినుండి వెళ్లిపోయారు. యుద్ధం అయిపోయిందని తెలిసి కౌరవ స్త్రీలందరూ రణభూమి కి వచ్చి తమ తమ భర్తలకోసం, కొడుకులకోసం, రోదిస్తున్నారు. నీ కుమారుడు యుయుత్సుడు కూడా అక్కడే ఉన్నాడు. "సుయోధనుడు యుద్ధభూమి నుండి పారిపోయాడు. యుద్ధం పరిసమాప్తమయింది. ఇంక ఈస్త్రీలను హస్తినకు పంపండి." అని చెప్పాడు.

ఇంతలో ధర్మరాజు కృష్ణార్జునులతో సహా అక్కడికి వచ్చాడు. యుయుత్సుని కౌగలించుకొని ఓదార్చాడు. ధర్మరాజు యుయుత్సునితో కౌరవ కాంతలందరినీ హస్తినాపురమునకు తీసుకెళ్లవచ్చు అని చెప్పాడు. యుయుత్సుడు అంతఃపుర స్త్రీలను వృద్ధ కంచుకులతో సహా హస్తినాపురానికి తీసుకెళ్లాడు. విదురుడు వారికి ఎదురు వచ్చాడు. యుయుత్సుడు జరిగిన దంతా విదురునికి విశధంగా చెప్పాడు. రారాజు ఒంటరిగా యుద్ధభూమిని వదలి ఎటో వెళ్లిపోయాడు అని చెప్పాడు.

ఆ విషయములు వినిన విదురుడు అమితమైన శోకంతో వికలమనస్కుడైనాడు. యుయుత్సునితో ఇలా అన్నాడు. "యుయుత్సా! సంజయుడు వచ్చిజరిగినది అంతా ధృతరాష్ట్రునికి చెపుతాడు. మనం ఏమీ చెప్పనవసరం లేదు. నీవు అంతఃపుర స్త్రీలను తీసుకొని వారి వారి నివాసములకుచేర్చు." అని చెప్పాడు. యుయుత్సుడు ఆ పని మీద వెళ్లాడు.

ఇంక యుద్ధ రంగములో కౌరవ సైనికులు అక్కడక్కడా నిలబడి

ఉన్నారు.  ఈ పదునెనిమిది రోజులు రణగొణధ్వనులతో చతురంగ బలముల పదఘట్టనములతో అత్యంత కోలాహలంగా ఉండే రణరంగము ఈ నాడు నిశ్శబ్దముగా ఉంది. పాండవులందరూ  శ్రీకృష్ణునితో సహా సుయోధనుని వెతుక్కుంటూ ద్వైపాయన మడుగు దగ్గరకు వచ్చారు. వారిని చూచి అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ అక్కడి నుండి వేరుచోటికి పోయి దాక్కున్నారు. సుయోధనుడు ఎక్కడా కనపడలేదని పాండవులు మరలా తమ తమ శిబిరముల వద్దకు వెళ్లారు.  కౌరవ శిబిరములలో ఉన్న స్త్రీలకుజనులకు ధర్మరాజు ఏమీ భయము లేదు నిశ్చింతగా ఉండమని అభయం ఇచ్చాడు.

పాండవులు అటుపోగానే, నేను సుయోధనుడు దాగిన కొలను వద్దకు వెళ్లాను. పాండవులు వెళ్లిపోయారని రధికత్రయము కూడా అక్కడకు వచ్చారు. మేమందరము రారాజుకు మా రాకను  గురించి తెలిపాము. రారాజు వెలుపలకు వచ్చాడు.  అశ్వత్థామ మొదలగు వారు సుయోధనునితో ఇలా అన్నారు.

"రారాజా! ఇదేమిటి? పిరికి వానిలా మడుగులో దాగుకొనడం ఏమిటి! లే! ముందుకు కదులు. మా సాయంతో పాండవుల మీద యుద్ధం ప్రకటించు. పాండవ సేనలను సంహరించు.  పాండవులను జయించు. సుయోధనా! క్షత్రియునికి శత్రువులను జయించడమో లేక యుద్ధములో మరణించి స్వర్గలోక సుఖములు అనుభవించడమో. అంతేకాని ఈ విధంగా పిరికివానిలా దాగుకొనడం నీ వంటి వానికి భావ్యమా!"  అని అన్నారు.

ఆ మాటలు వినిన సుయోధనుడు ఆ రధిక త్రయముతో ఇలా అన్నాడు. "యోధులారా! నాకు క్షత్రియ ధర్మము తెలియక కాదు. ప్రస్తుతము నా శరీరం అంతా గాయములతో నిండి ఉన్నది. శరీరము వశము తప్పినది. విశ్రాంతి

కోరుచున్నది. మీరు కూడా బాగా అలసి పోయినట్లున్నారు. ఈ రోజుకు వెళ్లి విశ్రాంతి తీసుకొనుడు. మనము బలము పుంజుకొని రేపటి దినమున శత్రువులతో పోరాడెదము.” అని అన్నాడు.

ఈ మాటలు వినిన అశ్వత్థామ “రారాజా! ఏల నీకు అనుమానము. నేను ఒక్కడినే కురు పాండవుల మధ్య ఉన్న వైరమును నిర్మూలించెదను. నా వాడి శరములతో పాంచాలురను, పాండవులను చంపుతాను. నీకు, నీ తండ్రి గారికి సంతోషము కలిగిస్తాను.” అని అన్నాడు.

అంతకు ముందే ధర్మరాజు, భీమసేనుడు కొంత మంది బోయ వారిని పిలిచి, వారు వేటాడునప్పుడు ఎక్కడైనా సుయోధనుడు కనిపిస్తే తమకు తెలియచెయ్యమని చెప్పారు.  ఆ బోయలలో ఒకడు, వేటాడిన జంతువులను మోసుకుంటూ అటుగా వచ్చాడు. సుయోధనుడు, రధిక త్రయముతో మాట్లాడటం చూచాడు. తనలో ఇలా అనుకున్నాడు. “తప్పకుండా ఇతనే సుయోధనుడు. ఈ విషయము నేను ధర్మరాజుల వారికి భీమసేనుల వారికి చెప్పిన మంచి బహుమానకు లభిస్తుంది.” అని అనుకున్నాడు. వెంటనే ఆజంతువులను అక్కడే వదలి, పరుగు పరుగున భీమసేనుని  శిబిరమునకు వెళ్లాడు. సుయోధనుడు ఉనికిని  భీమసేనునకు  ఎరింగించాడు. భీమసేనుడు వారికి అంతులేని బహుమానములను ఇచ్చాడు.

భీమసేనుడు  ధర్మరాజు వద్దకుపోయి “అన్నయ్యా! సుయోధనుని జాడ తెలిసింది. ఇక్కడకు కోసెడు దూరములో ఉన్న ద్వైపాయన మడుగులో దాగి ఉన్నాడట. తనకు తెలిసిన క్షుద్ర విద్య సాయంతో జలములు తన శరీరమునకు తాకకుండా దాగి ఉన్నాడట. ఇదిగో ఈ బోయవారు చూచి వచ్చి చెప్పారు. రణరంగమునుండి పారిపోయిన రధిక త్రయము సుయోధనునితో

మాట్లాడుతున్నారట." అని చెప్పాడు.

ఆ మాటలు విన్న ధర్మరాజు  ఆవిషయమును కృష్ణునికి తక్కిన వీరులకు ఎరింగించాడు.  ధర్మరాజు, తనతమ్ములతో, కృష్ణునితో, చతురంగ బలములతో సుయోధనుడు దాగి ఉన్న ద్వైపాయన మడుగు సమీపించాడు.

పాండవులు వస్తున్న కోలాహలము విన్న అశ్వత్థామ ప్రభృతులు సుయోధనునితో ఇలా అన్నారు. "రారాజా! పాండవులకు నీ ఉనికి తెలిసిపోయినట్టుంది. చతురంగ బలములతో ఇటే వస్తున్నారు. ప్రస్తుత కర్తవ్యము ఏమిటి ? వారిని ఎదుర్కొని యుద్ధం చేద్దామా లేక ప్రస్తుతానికి ఎక్కడైనా తల దాచుకొని అదును చూచి దెబ్బతీద్దామా?" అని అడిగారు. దానికి సుయోధనుడు "రధికులారా!   ఇప్పుడు మనము  బాగా అలసి పోయి ఉన్నాము. మీరు ఎక్కడి కైనా వెళ్లి,రాత్రి అయిన తరువాత నా దగ్గరకు రండి. నేను మడుగులో ఉన్న సంగతి వారు కనిపెట్టలేరు. కాబట్టి వారు హస్తినా పురమునకు వెళు తున్నారు. ఒక వేళ  వారు  ఈ మడుగు దగ్గరకు వచ్చినా నేను మడుగు లోపల ఉన్న విషయం తెలుసుకోలేరు. నేను నా జలస్థంభన విద్యా ప్రభావంతో ఎవరికీతెలియకుండా ఈ మడుగులో దాగి ఉండగలను." అని అన్నాడు.

సుయోధనుని మాటలు విని బరువెక్కిన హృదయంతో ఆ రధిక త్రయము అక్కడి నుండివెళ్లిపోయారు. నేను కూడా సుయోధనుని వదలి రధికత్రయముతో కొంతదూరం వెళ్లాను. తరువాత వారిని విడిచి ఆ మడుగు దగ్గర ఉన్న పొదలో దాగుకొని ఉన్నాను. నాకు మడుగు, అక్కడ జరిగే విషయాలు కనపడుతున్నాయి, వినపడుతున్నాయి.

కొంతసేపటికి పాండవులు కృష్ణుడు అక్కడకు చేరుకున్నారు. ఆ మడుగును పరిశీలించి కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధర్మజా! నిశ్చలంగా ఉన్న ఈ మడుగు లోనే సుయోధనుడు దాగి ఉన్నాడు. అతని జలస్థంభన విద్యా ప్రభావము వలన జలము నిశ్చలముగా ఉన్నది." అన్నాడు.

"కృష్ణా! సుయోధనుడు పోయి ఆ స్వర్గాధిపతి దగ్గర దాగినా నానుండి తప్పించుకొన లేడు." అని అన్నాడు.

అప్పుడు కృష్ణుడు ధర్మజునితో "ధర్మజా! ఇలాంటి మాయలు దుర్మార్గుడైన సుయోధనుడు తప్ప వేరే ఎవరు పన్నగలరు. ఇలాంటి మోసగాళ్లను మనము మోసము తోనే జయించాలి. కాబట్టి సుయోధనుడు ఆ మడుగునుండి బయల్పడే విధానము చూడుము." అని అన్నాడు.

అప్పుడు ధర్మరాజు మడుగులో దాగుకొని ఉన్న నీ కుమారుడు సుయోధనుని ఉద్దేశించి ఇలా అన్నాడు." ఓ సుయోధనా! నీ కోసం ఎందరో రాజులు యుద్ధములో వీర మరణం పొందారు. నీవు మాత్రం నీ ప్రాణములు రక్షించుకొనుటకు ఈ మడుగులో దాక్కున్నావు. ఇది నీ వంటి వీరునకు భావ్యమా! నీవు ఈ మడుగులో దాక్కున్న మాత్రాన చావు తప్పుతుందా! నీవు గొప్ప వీరుడవు అని అంటారే. మడుగులో దాక్కొనడం వీరత్వమా! నీ అభిమానం ఎక్కడకుపోయింది? వీరులు ఎక్కడైనా యుద్ధములో వెన్ను చూపిస్తారా! సుక్షత్రియ వంశమైన కౌరవ వంశములో పుట్టి ఇటువంటి నీచమైన చావుకు పాల్పడతావా! నీ కీర్తిప్రతిష్టలు వదిలిపెట్టి నలుగురు నవ్వేట్టు మడుగులో దాక్కుంటావా!

సుయోధనా! క్షత్రియ ధర్మము వదిలితే నీకు ఇహము పరము రెండు

ఉంటాయా! నాడు నిండు పేరోలగమున అన్న మాటలుమరిచిపోయావా! నీ నూరుగురు సోదరులనూ యుద్ధములో పోగొట్టుకొని నీ ప్రాణం కోసం పాకులాడుతున్నావా! అభిమానధనుడవే! నీ అభిమానం నీ ప్రాణం కన్నా గొప్పది కాదా! రారాజు పాండవులకు భయపడి మడుగులో దాక్కున్నాడని నలుగురూనవ్వరా! నీ భజబలం, నీ దర్పం, నీ అభిమానం మంటగలిసాయా!

నాడు కర్ణుడు, దుశ్శాసనుడు, శకుని అండ బలము చూచుకొని విర్రవీగావు. నేడు వారు మరణించగానే ఈ ప్రకారం దీనుడవైనావా! కాబట్టి సుయోధనా! నీ భయమును పిరికి తనాన్ని వదిలిపెట్టు వీరుడవైతే మడుగునుండి బయటకు వచ్చి మాతో యుద్ధం చెయ్యి. వీరుడవన్న నీ కీర్తిప్రతిష్టలు నిలబెట్టుకో! ఈ యుద్ధములో నీవు మమ్మలను ఓడిస్తే నీకు ఈ భూమండలమంతా దక్కుతుంది. ఓడిపోతే, వీరస్వర్గము సంప్రాప్తిస్తుంది. విజయమో వీర స్వర్గమో! ఏదో ఒకటి కోరుకో! అంతేకాని పిరికితనమును ఆశ్రయించకు. ప్రస్తుత నీ కర్తవ్యము మాతో యుద్ధం చెయ్యడమే. నీవు మగాడి వైతే మాతో యుద్ధం చెయ్యి. " అని ఎత్తిపొడిచాడు.

ఆ మాటలకు రోషం వచ్చిన సుయోధనుడు మడుగు లోపలినుండి ఇలా అన్నాడు. "ధర్మజా! మానవునకు ప్రాణభయం సహజమే కదా! నాకు ప్రస్తుతము రథము, సారధి, చక్రరక్షకులు, సైన్యము, అస్త్రశస్త్రములు లేవు. పైగా ఒంటినిండా గాయములతో డస్సి ఉన్నాను. అందువలన ప్రస్తుతము యుద్ధము చెయ్యలేను. కొంచెము అలసట తీర్చుకొనిన తరువాత మీతో యుద్ధం చేస్తాను. మిమ్ములను ఓడిస్తాను. మీరుకూడా ఈ 18 రోజుల యుద్ధములో బాగాఅలసి పోయి ఉన్నారు. మీరూ అలసట తీర్చుకొని రండు." అని అన్నాడు.

ఆ మాటలకు ధర్మరాజు ఇలా అన్నాడు. "సుయోధనా! మేము యుద్ధమువలన కలిగిన అలసట తీర్చుకున్నాము. నీవుకూడా మడుగులో విశ్రాంతి తీసుకున్నావు కదా! కాబట్టి మాతో యుద్ధం చెయ్యి." అని అన్నాడు

దానికి సుయోధనుడు "ధర్మజా! నేను ఎవరి కోసం ఈ యుద్ధం తలపెట్టానో ఆ తమ్ముళ్ళు, బంధు,మిత్రులు ఈ నాడు లేరు. నా సైన్యమంతా నాశనమయింది. ఇంకా నేను ఎవరి కోసం యుద్ధం చెయ్యాలి. ఒక వేళ నేను మిమ్మల్నందరిని గెలిచి రాజ్యం పొందినా, నా కర్ణుడు, భీష్ముడు, ద్రోణుడు లేని రాజ్యం నాకెందుకు. ఎందుకంటే నా సోదరులు బంధువులు మిత్రులు తో సహా ఈ రాజ్యపాలన చేసి సుఖములు అనుభవించిన నాకు సంతోషము గాని, ఈ ఒంటరి బతుకుతో నేను ఏ సుఖములు అనుభవించగలను. నీకు నీ సోదరులు, బంధువులు బతికి ఉన్నారు. వారితో కూడా ఈ రాజ్యము ఏలుకో. నేను నా రాజ్యమును నీ కు ఇచ్చి అడవులకు పోయి ముని వృత్తితో శేషజీవితమును గడిపెదను. ఓ ధర్మజా! నేను యుద్ధములో ఓడిపోయి ఇక్కడకు వచ్చాను. నా కు ఇప్పుడు గర్వము, అభిమానము లేవు. ప్రశాంతంగా ఉన్నాను. ఈ భూమి నీవు పరిపాలించు. గుర్రములు, ఏనుగులు, కాల్బలము లేని ఈ రణభూమిని నీ తలమీద కట్టుకొని ఊరేగు. పో." అని పలికాడు సుయోధనుడు.

దానికి ధర్మరాజు సుయోధనునితో ఇలా అన్నాడు. "అదేమిటి సుయోధనా! భీష్మ,ద్రోణ,కర్ణులు గతించిన తరువాత కూడా శల్యుని సర్వసైన్యాధ్యక్షుని చేసి ఈ భూమండల మంతా ఏలుకొన వలెనని తలంపుతో యుద్ధము కొనసాగించింది నీవే కదా! ఒట్టి మాటలు కట్టిపెట్టి మడుగునుండి బయటకు వచ్చి మాతో యుద్ధము చెయ్యి ! శత్రువు ఐన నీవు బతికి ఉండగా నేను రాజ్యము పరిపాలించడం రాజధర్మం కాదు. నిన్ను చంపి, శత్రుశేషము

గావించి, ఈ భూమండలము పరిపాలించెదను. నీకు చేతనయితో మమ్ములను జయించి ఈ భూమి నంతా నీవే ఏలుకో! అయినా సుయోధనా! నీవు నాకు ఈ భూమిని ధారపోస్తావా! నీ దానమును నేను పరిగ్రహించాలా! నీవేనా ఆ మాటలు మాట్లాడుతున్నది. ఈ మాటలు నాడు ఏమయినవి. నాడే మాకు రావలసిన రాజ్యభాగము కానీ ఐదు ఊళ్లుకాని ఇచ్చిన ఇంతటి మారణ హోమము జరిగి ఉండేది కాదు కదా! నాడు శాంతి స్థాపనకు న్యాయముగా మాకు రావలసిన రాజ్యభాగము అర్థించుటకు వచ్చిన శ్రీకృష్ణునితో ఏమన్నావు? సూదిమొన మోపినంత కూడా భూమిని ఇవ్వనన్నావు కదా! మరి ఈ నాడు నీ రాజ్యము నాకు ఏల ధారపోస్తానంటున్నావు. ఏ విధంగానూ యుద్ధములో గెలిచి రాజ్యమును తిరిగి సంపాదించలేనని కదా ఈ మాటలు అంటున్నావు.

సుయోధనా! ఈ నాడు నీ కంటూ ఒక రాజ్యము ఉంటే కదా నాకు దానం ఇవ్వడానికి. అయినా నీ దయా ధర్మభిక్ష నేను స్వీకరించను. నిన్ను చంపి గాని ఈ భూమిని స్వీకరించను. కాబట్టి మడుగులోనుండి బయటకు వచ్చి మాతో యుద్ధం చెయ్యి. ఎందుకంటే నీ ప్రాణాలు మా చేతిలో ఉన్నాయి. మా ప్రాణాలు నీ చేతిలో ఉన్నాయి. ఈ రోజు ఏదో ఒకటి తేల్చుకుందాము. మారు మాటాడక క్షత్రియధర్మమైన యుద్ధము చెయ్యి.

నాడు మమ్ములను లక్క ఇంటిలో పెట్టి కాల్పించావు. విషము పెట్టి చంపింప చూచావు. పాములతో కరిపించావు. నీళ్లలో తోయించావు. నీ కుట్రలకు కుతంత్రములకు మేము బలికాలేదు. ఈ నాడు అటువంటి కుతంత్రములు చెల్లవు. యుద్ధమే శరణ్యము. ఇంకా ఆ నీళ్లలో దాగి ఎందుకు బాధపడతావు. బయటకు వచ్చి మాతో యుద్ధంచెయ్యి." అని ధర్మజుడు సుయోధనుని యుద్ధము చేయుటకు ఎన్నోవిధముల రెచ్చగొట్టాడు.

అప్పుడు సుయోధనుడు మడుగులోనుండి ధర్మజునితో ఇలా అన్నాడు. "ధర్మజా! మీరు  ఐదుగురు. నేను ఒక్కడను. మీకు చతురంగ బలము లున్నవి. నేను సైన్య విహీనుడను. మీ వద్ద అనేకములైన అస్త్ర శస్త్రములు ఉన్నవి. నా వద్ద ఏ  ఆయుధము లేదు. మీకు హయములు, ఏనుగులు కాల్బలము ఉన్నవి. నేను ఒంటరివాడను. పైగా నేను 18 రోజులు యుద్ధము చేసి అలసి ఉన్నాను. మీరందరూ విజయగర్వముతో ద్విగుణీకృతోత్సాహముతో ఉన్నారు. మీరు ఐదుగురు నా తో ఒకేసారి యుద్ధం చెయ్యడం ధర్మం కాదు. మీరు ఒక్కొక్కరే వచ్చి నా తో యుద్ధం చెయ్యండి. దానికి మీరు ఒప్పుకుంటే నేను వెలుపలికి వచ్చి మిమ్ములనందరినీ బంధు మిత్ర సమేతంగా రూపు మాపుతాను. అంతేగాని మీరందరూ కలిసి ఒక్కడితో యుద్ధం చెయ్యడం ధర్మం కాదు.  ధర్మరాజా! నీకు,  కృష్ణునికి,  వెరచి నేను ఇంతసేపు మీతో మాట్లాడలేదు. మీకు యుద్ధనీతి తెలియచేసాను. నిన్ను, నీ తమ్ములను, నీ బంధు మిత్రులను నేను ఒక్కడినే సంహరించగలను.  మీ అందరిని తుదముట్టించి భీష్మ,ద్రోణ,కర్ణ,భగదత్త,బాహ్లిక,జయద్రధ,శకుని,శల్య మొదలగు కురు వీరుల ఋణం తీర్చుకుంటాను." అని అన్నాడు సుయోధనుడు.

ఆ మాటలు విన్న ధర్మజుడు సుయోధనునితో ఇలా అన్నాడు. "సుయోధనా! నీ ధైర్యానికి మెచ్చుకుంటున్నాను. మమ్ములనందరినీ ఒంటి చేత్తో సంహరించవలెనని అనుకోడం సమంజసమే. కాని నేను అధర్మపరుడను కాను కదా! నీకు అవసరమైన అస్త్ర శస్త్రములను, రధమును తీసుకో. మాలో ఒక్కరిని కోరుకో. అతనే నిన్ను ఎదిరిస్తాడు.  నీవు అతనిని  ఓడించినట్లయితే ఈ రాజ్యం అంతా నీవే  ఏలుకో.  ఇక్కడ ఉన్న బంధు మిత్రుల సాక్షిగా అతడు నీతో ధర్మ యుద్ధం చేస్తాడు." అని పలికాడు.

దానికి సుయోధనుడు ఇలా అన్నాడు. "ధర్మజా! రధములతో, అస్త్ర శస్త్రములతో ఇన్నాళ్లు భయంకరంగా యుద్ధ చేసాము కదా. ఈ రోజు కొత్త రకంగా పోరాటం సాగిద్దాము. నేను, నీ పక్షములోని వాడు ఇద్దరం నేల మీద నిలబడి గదా యుద్ధము చేస్తాము. నా గదతో నిన్ను, నీ తమ్ములను తృటిలో సంహరిస్తాను. నీకు సమ్మతమేనా!" అని అన్నాడు.

ధర్మరాజు ఆలోచనలో పడ్డాడు. అదే అదనుగా భావించి సుయోధనుడు బుసలు కొడుతూ మడుగునుండి బయటకు వచ్చాడు. అక్కడ ఉన్న వారందరికీ సుయోధనుడు కాలయముడి లాగా సాక్షాత్కరించాడు. అతనిని చూచి పాండవులు, పాంచాలురూ చిరు నవ్వు నవ్వుతూ అతనిని అపహాస్యం చేసారు. సుయోధనుడు కోపంతో మండిపోయాడు.

" అలా నవ్వకండి. నేను మీ అందరనూ ఒక్కొక్కరినీ నా గదా దండంతో బలి తీసుకుంటుంటే అప్పటి దాకా మాత్రమే నవ్వండి." అని అన్నాడు రోషంతో.

కాని సుయోధనుడికి మనసులో ఒక అనుమానం మెదులుతూ ఉంది. పాండవులందరూ,పాంచాలురతో సహా ఒక్కుమ్మడిగా తన మీద దాడి చేస్తారని శంకించాడు. వెంటనే ధర్మరాజును చూచి ",దర్మజా! మన ఒప్పందం ప్రకారం ఒక్కొక్కరే నా తో యుద్ధానికి రండి. ఎందుకంటే మీరు చాలామంది ఉన్నారు. నేను ఒక్కడినే ఉన్నాను. పైగా నేను బాగా అలసిపోయాను." అని అన్నాడు.

దానికి ధర్మజుడు నవ్వి "అదేమిటి సుయోధనా! నాడు పద్మవ్యూహములో బాలుడైన అభిమన్యుని అనేకులు చుట్టుముట్టి నిర్దాక్షిణ్యముగా చంపారుకదా. ఇదీ అలాగే అనుకో!" అన్నాడు.

సుయోధనుడు మారు మాట్లాడలేదు. మౌనంగా నిలబడ్డాడు. "భయపడకు సుయోధనా! నీవు చేసిన అకృత్యము గురించి చెప్పాను కాని ఆడిన మాట తప్పను. యుద్ధనీతికి వ్యతిరేకముగా ప్రవర్తించను. నీ తల వెంట్రుకలు సరి చేసుకో. నీకు నచ్చిన కవచములు ధరించు. యుద్ధమునకు సన్నద్ధుడివి కా! మేము ఐదుగురము ఉన్నాము. మాలో నీకు నచ్చినవాడిని ఎన్నుకో. అతడే నీతో యుద్ధము చేస్తాడు. నీవు వాడిని చంపితే కౌరవ సామ్రాజ్యము, సమస్త సంపదలు నీకు దక్కుతాయి. యధేచ్ఛగా ఈ రాజ్యము ఏలుకో. వాడి చేతిలో నీవు చస్తే, వీరస్వర్గము చేరుకో. ఇది నేను చేస్తున్న ప్రతిజ్ఞ. నీ ఇష్టం వచ్చిన కవచములు తీసుకో. నిన్ను ప్రాణాలతో విడిచి పెట్టడం తప్ప నీకు అన్ని ఇస్తాను. ఎంత చెడ్డా, మనం మనం అన్నదమ్ములం కదా." అని అన్నాడు ధర్మరాజు.

అప్పుడు సుయోధనుడు ధర్మజుని తో ఇలా అన్నాడు. "ధర్మజా! నీ సంగతి నాకు తెలుసు. నా మీద నీకు కోపం ఎందుకుంటుంది. మనం మనం అన్నదమ్ములం కదా!" అంటూ బంగారు తో చేయబడ్డ కవచము, శిరస్త్రాణము, కంకటములు తీసుకొని తొడుక్కున్నాడు.

చేతిలో గదతో మేరు పర్వతము మాదిరి ప్రకాశిస్తున్న సుయోధనుడు ధర్మజునితో "ఓ ధర్మజా! సహదేవుడో, నకులుడో, అర్జునుడు, భీముడో లేక నీవో ఒక్కొక్కరుగా రండి. నా గదాయుధమునకు మిమ్ములను ఆహారం చేస్తాను. మీ చావు కళ్లారా చూస్తాను. రండి. ఒక్కొక్కరుగా రండి. నా గదతో చంపుతాను. నాతో గదా యుద్ధమునకు సాక్షాత్తు ఈశ్వరుడుకూడా సాహసించడు. నేడు మీరు ఎక్కడకుపోతారు. నా చేతిలో చస్తారు." రండి అని గదాయుద్ధమునకు ఆహ్వానించాడు.

సుయోధనుని ప్రగల్భములు విని శ్రీకృష్ణుడు ధర్మరాజుతో రహస్యంగా ఇలా అన్నాడు. “ధర్మజా! నీవు ఇంత తెలివి తక్కువ వాడివి బుద్ధి హీనుడివి అనుకోలేదు. ఇదేమన్నా శకునితో జూదం అనుకున్నావా, మీలో ఒకరిని ఓడించగానే రాజ్యము అంతా సుయోధనుడికి ఇవ్వడానికి. సుయోధనుడు ఒక్క భీముని తప్ప మీలో ఎవరినో ఒకరిని  కోరుకొనిన,  అతనిని ఒక నిమేషములో తన గదతో చంపుతాడు. నీవు సుయోధనునికి రాజ్యము ఇచ్చి అడవులకు పోతావా! ఆఖరుకు ఇది పందెపు యుద్ధం గా తయారయింది. ఇన్నాళ్లు కష్టపడి యుద్ధం చేసి, ఇంతమందిని ఆహుతి చేసినది  ఆఖరుకు పందెము ఆడటానికా! అయినా ఒక్కడిని చంపితే సకల భూమిని తీసుకోమని చెప్పడం,  నాడు శకుని .....ఈ ఒక్క పందెం గెలిస్తే నీవు  ఓడినదంతా నీ వశం అవుతుందని పందెం కాయడంతో సమానం కాదా! ఆ పందెం ఓడే కదా నీవు 13 ఏళ్లు నీ రాజ్యమును సుయోధనునికి సమర్పించావు.

కాబట్టి ధర్మజా! దీనికి నేను ఒప్పుకోను. మీలో ఒక్కరొక్కరుగా యుద్ధం చెయ్యడానికి భీమసేనుని కూడా పంపడానికి కూడా  నేను ఒప్పుకోను. ఎందుకంటే గదా యుద్ధములో సుయోధనునికి నేర్పు ఎక్కువ. భీముడికి బాహు బలమున్నది కాని గదాయుద్ధములో నేర్పులేదు.  సుయోధనుడు గదాయుద్ధంలో చూపించే నేర్పునకు భీమసేనుని భుజబలం ఎందుకూపనికిరాదు.  తరువాత నీ ఇష్టం.  జాగ్రత్త .”అని ధర్మజుని మెత్తగా మందలించాడు.

ఆ మాటలు విన్న భీమసేనుడు కృష్ణుని తో ఇలా అన్నాడు. “అన్నగారి ఆజ్ఞ, నీ అనుగ్రహము, నా చేతిలో గద ఉండాలే గాని ఈ పదునాలుగు భువనములు త్రుటిలో జయించగలను. ఇంక ఈ సుయోధనుడెంత! వదరుబోతు వలె మాట్లాడుతున్న  ఈ సుయోధనుడు నా ముందు

క్షణకాలము కూడా నిలువలేడు.  ఈ మాత్రం దానికి అన్నగారిని అనరాని మాటలు అనవలెనా! ఈ రోజు నేను నా గదాఘాతములతో సుయోధనుని చంపి,  నీకు సంతోషం కలుగచేస్తాను." అని అన్నాడు భీమసేనుడు.

కృష్ణుడు భీముని ప్రీతితో చూచి బుజం తట్టి "భీమసేనా! నేను నిన్ను తక్కువ చేసి మాట్లాడలేదు. నీవు బకుడిని, హిడింబుని,కీచకుని చంపినవాడవు. ఉపాయంతో జరాసంధుని తుదముట్టించావు. ఇవన్ని మామూలు మనుషులు చేసే పనులేనా! నీ ముందు ఈ సుయోధనుడెంత. ఏదో అనాలోచితంగా మాట్లాడిన మాటలు పట్టించుకోకు. అయినా భీమసేనా! నువ్వు దుశ్శాసనుని చంపి గుండెలు చీల్చి రక్తం తాగుతుంటే బొమ్మలాగా నిలబడ్డాడే గాని నీతో యుద్ధానికి దిగాడా ఈ సుయోధనుడు. అప్పుడే తెలిసింది ఇతని పరాక్రమమేమిటో!

సుయోధనుడు బయటకురాగానే అందరూ చుట్టుముట్టి తుద ముట్టించ కుండా,  ధర్మజుడు అనాలోచితంగా చేసిన ప్రతిజ్ఞ గురించి అలా అన్నానే గాని నీ పరాక్రమము తెలియక కాదు.  నాడు కౌరవ సభలో పాంచాలిని జుట్టుపట్టుకొని  ఈడ్చినపుడు నీవు చేసిన ప్రతిజ్ఞలలో ఒకటి నెరవేర్చుకున్నావు. ఇంక రెండవది అదే సుయోధనుని తొడలు విరగ్గొట్టి చంపడం మిగిలి ఉంది కదా. దానిని ఇప్పుడు నీవు నెరవేర్చు. ప్రతిజ్ఞాపాలన గావించు. విజృంభించు. ఈ సుయోధనుని చంపు. నీ అన్న ధర్మజుని కురుసామ్రాజ్యాభిషిక్తుని చెయ్యి. నీవు నీ తమ్ములు, బంధు మిత్ర పరివారసమేతంగా రాజ్యసుఖములు అనుభవించండి. ఇంకెందుకు ఆలస్యం. నీ గదకు పండగ చెయ్యి. నీగదా ఘాతంతో సుయోధనుడు నిర్జితుడవుతాడు. నీ వెనుక నేనున్నాను. నీ పరాక్రమమంతా చూపు." అని ఉత్సాహపరిచాడు కృష్ణుడు.

ఆ మాటలకు భీమసేనుడు పొంగిపోయాడు. అంతలో కృష్ణుడు భీమసేనునితో " భీమసేనా! ఒక మాట మాత్ర మరువకుము. సుయోధనుడు గదాయుద్ధములో నిష్ణాతుడు. ఎన్నో ఏళ్లు కఠోరశ్రమచేసి సాధన చేసాడు. కాబట్టి కొంచెం జాగ్రత్తగా ఉండు." అని అన్నాడు.

సాత్యకి మున్నగు వారు కూడా భీమసేనుని బలపరాక్రమములను పొగిడారు. వారందరినీ చూచి భీమసేనుడు "ధర్మరాజా! విను! ఈ కులనాశకునిపై నాకు అపరిమితమైన కోపం ఉంది. అర్జునుడు ఖాండవ వన దహనము చేయించినట్టు, నేను వీడిప్రాణాలు తీస్తాను. నిన్ను ఈ కురుసామ్రాజ్యాభిషిక్తుని చేస్తాను. తన కొడుకు చావు వార్తవిని ధృతరాష్ట్రుడు ఈ రోజు దుఃఖిస్తాడుభ" అని పలికి భీమసేనుడు తన గద తీసుకొని సుయోధనుని ఎదురుగా నిలబడ్డాడు. సుయోధనుడు ఎదురుగా కనపడగానే భీమసేనుడు కోపంతో రగిలిపోయాడు.

"సుయోధనా! మమ్ములను లక్క ఇంట్లో ఉంచి నిప్పుపెట్టావు. మా అన్న ధర్మజుని మాయాజూదం ఆడించి ఓడించావు. మా రాజ్యభాగమును హరించావు. నిండుకొలువులో ద్రౌపదిని అవమానించావు. ఈ దుశ్చర్యలన్నింటికి నేడు ఫలితం అనుభవిస్తావు. అందుకే నా ఎదురుగా నిలిచావు. భీష్మ,ద్రోణ,కర్ణ,శల్యులు నీ కొరకు తమ తమ ప్రాణాలు బలిపెట్టారు. నీ కోసం ఎంతోమంది బంధువులు, మిత్రులు తమ తమ ప్రాణాలు కోల్పోయారు. అంతేకాకుండా ఎంతోమంది రాజులను తోడుతెచ్చుకున్నావు. వారందరూ యుద్ధంలో మరణించారు. వారి వారి అన్నలు, తమ్ములు కూడా కూలిపోయారు. అసలు ఈ దారుణ మారణ కాండకు మూలపురుషుడైన శకుని నీ కళ్లముందే చచ్చాడు. నీ ఒక్కడవు మిగిలావు. నిన్ను నేడు నా గదకు ఎరగా వేసి ఈ లోకంలో ఉన్న కల్మషమును నేను పోగొడతాను. అనవసరమైన

మాటలు మాని నీ యుద్ధం చేసి చచ్చిపో." అని అన్నాడు భీమసేనుడు.

ఆ మాటలకు నీ కుమారుడుసుయోధనుడు ఇలా అన్నాడు: "భీమసేనా! ఎక్కువగా మాట్లాడకు. నాతో గదాయుద్ధముచెయ్యడానికి ఆ ఇంద్రుడే భయపడతాడు.  ఇంక నీవెంత. నువ్వుకూడా నాతో తొందరగా యుద్ధం చేసి చచ్చిపో. నాకు రాజ్యం సర్వస్వం ధారబొయ్యి."అని అన్నాడు.

భీముడు, తన ప్రియ శిష్యుడైన  సుయోధనుడు గదాయుద్ధము చేస్తున్నారని తెలిసి  ఆ యుద్ధము చూడటానికి బలరాముడు అక్కడకు వచ్చాడు.  బలరాముని చూచి పాండవులు ఎదురేగి  ఆయనకు నమస్కరించి అర్ఘ్యపాద్యాదులతో సత్కరించి ఉచితాసనము మీద  కూర్చుండచేసారు. బలరాముడు కూడా వారితో తగురీతిగా సంభాషించి వారికి ప్రియము చేసాడు. శ్రీకృష్ణుడు, సాత్యకి వచ్చి అన్నగారికి నమస్కరించి ఒక పక్క నిలబడ్డారు. మిగిలిన వారందరూ బలరాముని కుశలప్రశ్నలు వేసి యోగక్షేమములు అడిగి తెలుసుకున్నారు. బలరాముడు వారందరినీ చూచి ఈ యుద్ధములో పాల్గొనడం ఇష్టం లేక నేను తీర్థయాత్రలకు వెళ్లాను. అందువలన మిమ్ములనందరినీ చూచి చాలా దినములయినది.  నా శిష్యులు గదాయుద్ధము చేస్తున్నారని తెలిసి ఆ గదాయుద్ధము చూచుటకు, మిమ్ములనందరినీ కలియుటకు నేను ఇక్కడకు వచ్చాను." అని పలికాడు.

తరువాత భీమసేనుడు,సుయోధనుడు తమ తమ గదలనుచేత ధరించి వచ్చి బలరామునికి ప్రణామము చేసారు.  ఆయన వారిని ఆశీర్వదించాడు. అప్పుడు ధర్మరాజు లేచి బలరామునితో సుయోధనుడు, భీమసేనుడు ద్వందయుద్ధము ఎందుకు చేయవలసి వచ్చినదో కారణములు వివరించి, వారి గదా యుద్ధము చూడమని అర్థించాడు. తాము ఆనతిచ్చిన వారు

ద్వందయుద్ధము మొదలు పెడతారు అని పలికాడు. బలరాముడు కూడా అంతా విని మంచిది అని తల ఊపాడు. గదాయుద్ధమునకు అనుజ్ఞ ఇచ్చాడు." అని సంజయుడు ధృతరాష్ట్రునికి వివరించాడు అని వైశంపాయనుడు జనమేజయుడు చెప్పాడు.

ఆ మాటలు వినిన జనమేజయుడు "మునివర్యా! ఉభయపక్షములు యుద్ధమునకు సన్నద్ధమైన సమయమున బలరాముడు వచ్చి కృష్ణుడు పాండవ పక్షపాతి అని అందరు వింటూ ఉండగా పలికి ఈ అకారణమై న అనవసరమైన యుద్ధమును, నేను చూడలేను. నేను సరస్వతీ తీర్ధమునకు వెళ్లిపోదలచాను. ఆ మాటమీకు చెప్పిపోవడానికి వచ్చాను అని తన మనసులో మాట చెప్పాడని, అప్పుడు శ్రీకృష్ణుడు, ధర్మరాజు ఆయనను సాదరంగా తీర్ధయాత్రలకు పంపారు అని చెప్పారు కదా! మరలా బలరాముడు సుయోధన బలరాముల గదాయుద్ధమును చూచుటకు అక్కడకు ఎలా రాగలిగాడు. ఈ మధ్య ఏమి జరిగినది. వివరించండి." అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు జనమేజయునకు ఈ విధంగా వివరించాడు.

"జనమేజయ మహారాజా! బలరాముడు శ్రీకృష్ణునికి, ధర్మజునికి చెప్పి, బ్రాహ్మణులు వెంటరాగా, యజ్ఞకార్యమునకు కావలసిన సంభారములు తీసుకొని, సరస్వతీ నది సాగరములో సంగమించు చోటికి చేరుకున్నాడు. ఆ ప్రదేశమును ప్రభాస తీర్ధము అని అంటారు. బలరాముడు ఆ తీర్ధమును సేవించాడు. తరువాత అక్కడకు సమీపములో ఉన్న తీర్ధములను కూడా సేవించాడు. గోవులను, ధనమును బ్రాహ్మణులకు దానమిచ్చాడు." అని వైశంపాయనుడు చెప్పగా, జనమేజయుడు ప్రభాసతీర్ధ మహాత్మ్యమును గురించి చెప్పమని అడిగాడు. వైశంపాయనుడు ఈవిధంగా చెప్పసాగాడు.

"జనమేజయ మహారాజా! ఈ క్షేత్రమున చంద్రుడు స్నానమాచరించి తన క్షయ రోగమును పోగొట్టుకున్నాడు అని ప్రతీతి. ఆ కథను వివరించెదను. దక్షప్రజాపతికి 27 మంది కుమార్తెలు ఉన్నారు. ఆ 27 మందిని చంద్రుడు వివాహం చేసుకున్నాడు. వారిలో రోహిణి అత్యంత రూపవతి. అందుకని చంద్రుడు ఆమె మీద ఎక్కువ ప్రేమ, మక్కువ చూపించేవాడు. అది మిగిలిన భార్యలకు కంటగింపుగా ఉండేది. వారందరూ తమ తండ్రియైన దక్షుని వద్దకు వెళ్లి చంద్రుడు తమకు చేస్తున్న అన్యాయమును గురించి చెప్పారు.

దక్షుడు వెంటనే చంద్రుని పిలిపించాడు. "చంద్రా! నీవు చేయుపని అన్యాయము. అధర్మము. ఇంక మీదట బుద్ధిగా మసలుకో. నీ భార్యలందరినీ సమానంగా చూడు. లేని యడల నా శాపాగ్నిగి ఆహుతి అవుతావు." అని అన్నాడు. కాని చంద్రుడు దక్షుని మాటలను లక్ష్యపెట్టలేదు. ఇదివరకు మాదిరే రోహిణియందు అత్యధిక ప్రేమ చూపిస్తూ మిగిలిన భార్యలను నిరాదరించ సాగాడు. దక్షునికి కోపం వచ్చింది. క్షయ వ్యాధి పీడితుడవు కమ్మని చంద్రుడికి శాపం ఇచ్చాడు. అప్పటినుండి చంద్రుడు క్షీణించడం ప్రారంభించాడు. చంద్రునిలో ఉన్న ఓషధీ ప్రభావం తగ్గిపోసాగింది. దాని వలన ప్రజలు రోగపీడితులయ్యారు. దీని కంతటికీ చంద్రుడు కృశించి పోవడమేనని తెలుసుకొని దేవతలు అతని వద్దకు వెళ్లారు. "చంద్రా! నీవు ఎందుకు కృశించి పోతున్నావు. కారణమేమి" అని అడిగారు. చంద్రుడు జరిగినదంతా దేవతలకు చెప్పాడు.

అప్పుడు దేవతలు చంద్రుని తమ వెంట తీసుకొని దక్షుని వద్దకు వెళ్లారు. చంద్రునికి శాపవిమోచనము అనుగ్రహించమని ప్రార్థించారు. వారి ప్రార్ధనను మన్నించాడు దక్షుడు. చంద్రుడు తన భార్యలయందు సమంగా ప్రేమానురాగములు కలిగి ఉండవలెనని, ఎప్పుడు కూడా స్త్రీలను,

బ్రాహ్మణులను అవమానం చేయరాదు అని కోరాడు. చంద్రుడు సరస్వతీ సంగమప్రాంతములో మునిగిన, నిరంతర క్షీణత బదులు, 15 రోజులు క్షీణత మరలా 15 రోజులు వృద్ధి కలుగుతుంది అని చెప్పాడు. అందుకని చంద్రుడు ప్రతి అమావాస్యనాడు ఈ తీర్థములో స్నానమాచరించి శుక్లపాడ్యమి నుండి వృద్ధి పొందుతాడు అందుకని ఆ తీర్థమునకు ప్రభాస తీర్థము అని పేరు వచ్చినది.

బలరాముడు ప్రభాస తీర్థములో స్నానమాచరించి, తరువాత చమసోద్భేదనము అను తీర్థమునందు ఒక రాత్రి విశ్రమించాడు. ఆ తీర్థ విశేషమును చెప్పెదను వినుము. త్రితుడు, ద్వితుడు, ఏకతుడు అని ముగ్గురు ముని కుమారులు ఉన్నారు. ఆ ముని కుమారులు క్షత్రియులకు యజ్ఞ దీక్ష నిచ్చి వారి వద్దనుండి గోవులను దానంగా తీసుకున్నారు. వారు తిరిగి తమ ఇంటికి వస్తుండగా మొదటి ఇద్దరూ మూడవ వాడైన త్రితుని మోసగించి అతని గోవులను కూడా అపహరింపవలెనని అనుకున్నారు. ఇంతలో ఒక తోడేలు వారిని తరిమింది. తోడేలును చూచి బెదిరిన త్రితుడు పక్కనే ఉన్న పాడుబడ్డ బావిలో పడ్డాడు. ఏకతుడు,ద్వితుడు అన్ని గోవులను కూడా తోలుకొని వెళ్లిపోయారు. త్రితుడు దిక్కుతోచక ఆ బావిలో పడి ఉన్నాడు.యజ్ఞము చేసి సోమపానం చేస్తే గాని తనకు విముక్తిలేదని గ్రహించిన త్రితుడు, సంకల్ప మాత్రంచేత మనసులోనే యజ్ఞం చేసాడు. దేవతలనందరినీ ఆహ్వానించాడు. వారందరూ వచ్చి హవిస్సులు స్వీకరించారు. సరస్వతి నదిని ప్రార్థించి తనకు పుణ్య నదీ జలాలను ప్రసాదించమని కోరాడు. అంతట సరస్వతి కరుణించి ఆ బావిని తన స్వచ్ఛమైన నీటితోనింపింది. అప్పుడు దేవతలు అతనిని ఏదైనా వరము కోరుకోమన్నారు. ఈ తీర్థములో స్నానమాచరించిన వారికి యజ్ఞములో సోమపానము చేసిన ఫలము లభించాలి అని ప్రార్థించాడు. వారు త్రితునికి కోరిన వరం ఇచ్చి వెళ్లిపోయారు. అప్పటి నుండి ఆ తీర్థము

ప్రసిద్ధిచెందింది.

తరువాత బలరాముడు వినశనానికి వెళ్లాడు. ఆ తీర్థము తక్కువ జాతి వారికి కనపడకుండా నశిస్తుంది. అందుకని దానికి వినశనము అని పేరు వచ్చింది.

తరువాత బలరాముడు భూమిక అనే తీర్థము కూడా సేవించాడు. అక్కడ అప్సరసలు నాట్యం చేస్తుంటారు.

తరువాత బలరాముడు గంధర్వ తీర్థమునకు వెళ్లాడు. ఆ తీర్థము విశ్వావసుడు మొదలగు గంధర్వులు తపస్సిద్ధి పొందిన క్షేత్రము.

అక్కడనుండి గర్గ క్షేత్రమునకు వెళ్లాడు. అక్కడు గర్గుడు చాలాకాలము నివసించాడు. అక్కడి నుండి బలరాముడు శంఖతీర్థమునకు, నైసర్గికమునకు, నాగధన్వమునకు వెళ్లాడు. నాగధన్వము వాసుకి నివాసస్థానము. పూర్వము దేవతలు అక్కడ వాసుకిని అభిషేకించారు.

అక్కడనుండి బలరాముడు నైమిశారణ్యమునకు వెళ్లాడు. అక్కడికి సరస్వతీ నది చాలా దూరంలో ఉంది. అప్పుడు నైమిశారణ్య వాసులైన మునులు ఒక క్రతువు చేసారు. వారి కోసరము సరస్వతీ నది తన గతి మార్చుకొని వారు క్రతువు చేయుచున్న నైమిశారణ్యము పక్కన నుండి ప్రవహించసాగింది.

అక్కడ నుండి బలరాముడు సప్తసారస్వతమునకు వెళ్లాడు. అక్కడ మంకణుడు అనే మహా ముని నివసిస్తున్నాడు. పూర్వము అక్కడ బ్రహ్మ చేసిన

యాగమునకు, నైమిశారణ్యములోని మునులుచేసిన యాగమునకు, గయుడు చేసినయజ్ఞమునకు, ఉద్దాలకుడు చేసినయజ్ఞమునకు, వశిష్టుడు చేసిన యాగమునకు, గురువు చేసిన యాగమునకు సరస్వతీ నది స్త్రీ వేషములలో వెళ్లి అత్యంతగౌరవ మర్యాదలుపొందినది. అందువలన ఆ క్షేత్రము సప్తసారస్వతము అని పిలువబడుతున్నది.

ఒకరోజు మంకణ మహర్షి సరస్వతీ నదిలో స్నానం చేస్తున్నాడు. కొంచెందూరంలో ఒక స్త్రీ వివస్త్ర అయి స్నానం చేస్తూ ఉంది. అది చూచిన మంకణుడికి రేతఃపతనమయినది. మంకణుడు ఆ రేతస్సును ఒక కుండలో భద్రపరిచాడు. ఈ రేతస్సు ఏడు భాగములై ఏడుగురు మహారుషులు ఉద్భవించారు. వారే మరుద్గణముల జననమునకు కారణమయ్యారు.

తరువాత ఒక రోజు ఆ తాపసి చేతి వేలికి దర్భ గుచ్చుకుంది. ఆ గాయము నుండి రక్తము బదులు ఆకు పసరు కారింది. అది చూచిన ఆ ముని తన తపస్సు ఫలించినదని ఆనందంతో నృత్యం చేసాడు. ఈ నృత్యమునకు లోకములన్నియుసంక్షోభించాయి. అప్పుడు దేవతలందరూ పరమేశ్వరుని వద్దకు వెళ్లి జరిగినది అంతా చెప్పారు. అప్పుడు ఈశ్వరుడు మంకణముని వద్దకుపోయి "నీవు చేసిన తపస్సుకు ఫలితం ఇదేనా. ఇంక నాట్యం ఆపు." అని తన వేలిని మరో వేలితో గీరాడు. అప్పుడు భస్మం రాలింది. "చూచావా ఈ మాత్రం దానికేనా ఈ నాట్యం" అన్నాడు. మంకణ మహా ముని సిగ్గుపడి నాట్యం ఆపాడు. పరమేశ్వరుని శరణు వేడాడు. పరమేశ్వరుడు అతని తపస్సు క్షీణించ కుండావరం ఇచ్చాడు. మంకణుడు నాట్యం ఆపగానే లోకములన్ని శాంతించాయి.

ఆ క్షేత్రమహాత్మ్యమును తెలుసుకొనిన తరువాత బలరాముడు

ఔశనతీర్థమునకు వెళ్లాడు. పూర్వము రఘురాముడు మహోదరుడు అనే రాక్షసుని చంపాడు.  ఆ రాక్షసుని పుర్రె ఒక తాపసి కాలికి తగిలి గుచ్చుకుంది. ఎంత తీసినా రాలేదు. ఆ తాపసి బాధపడుతుంటే  అక్కడ ఉన్న తాపసులు "ఔశన తీర్థములో దేవేంద్రుడు తపస్సు చేసాడు. అక్కడికి పోయిన నీ బాధ తొలగిపోతుంది." అని అన్నారు. అప్పుడు ఆ తాపసి అక్కడకు పోగానే ఆ కపాలము అతని కాలినుండి ఊడి వచ్చింది.  అందువలన ఆ క్షేత్రమునకు కపాల మోచనము అనేపేరు వచ్చింది.

బలరాముడు అక్కడ నుండి పృధూదకమునకు వెళ్లాడు.  ఆ క్షేత్ర మహాత్మ్యము ఏమనిన..... పూర్వము గాధి మహారాజునకు విశ్వామిత్రుడు అనే కుమారుడు ఉన్నాడు. విశ్వామిత్రుడు రాక్షససంహారం చేస్తూ ఒక రోజు వశిష్టుని ఆశ్రమానికి వెళ్లాడు. విశ్వామిత్రుని సేనలు అదుము తప్పి ప్రవర్తించాయి. దానికి కోపించి వశిష్టుడు తన హోమధేనువునుచూచి నీ బలము ప్రదర్శించు అని అన్నాడు.  ఆహోమధేనువు మహాత్మ్యమున ఘోరాకారులైన వీరులు  ఉద్భవించారు. వారు విశ్వామిత్రుని సేనలను తరిమి తరిమి కొట్టారు.  తన సేన కు పట్టిన అవస్థ చూచి విశ్వామిత్రుడు చింతించాడు. బాహు బలము కన్నా తపోబలము గొప్పదని విశ్వసించి, ఈ పృ ధూదక తీర్థములో తపస్సు చేసాడు.

అక్కడి నుండి బలభద్రుడు బకాశ్రమమునకు వెళ్లాడు. అక్కడ బకుడు అనే ముని ధృతరాష్ట్రుడు అనే రాజు మీది కోపంతో అతనికి హాని చెయ్యడానికి నేతి తోనూ నరమాంసముతోనూ హోమం చేసాడు. అది తెలిసి ధృతరాష్ట్రుడు ఆ బకుని శరణువేడాడు. అతనికి ఎన్నో గోవులను దానం చేసాడు.

బలరాముడు బకాశ్రమము నుండి యయాతమునకు వెళ్లాడు. అక్కడ

యయాతి మహారాజు యజ్ఞము చేసాడు.

తరువాత బలరాముడు వశిష్ట ఆశ్రమమునకు వచ్చాడు. అది పూర్వము విశ్వామిత్రుని ఆశ్రమము. అతడు తపస్సు విషయంగా వశిష్టుని మీద ఎంతో మత్సరము కలిగి ఉన్నాడు. వశిష్టుని ఎలాగైనా చంపవలెనని విశ్వామిత్రుడు సరస్వతీ నదిని తలచుకున్నాడు. సరస్వతీ నది వచ్చి విశ్వామిత్రుని ముందు నిలిచి నన్నుపిలిచిన పని ఏమి అని అడిగింది. వశిష్టుని నా వద్దకు తీసుకొని రా అని ఆజ్ఞాపించాడు. సరస్వతీ నదికి వశిష్ట విశ్వామిత్రుల తపశ్శక్తి తెలుసు. అందుకని మారు మాటాడక వశిష్టుని వద్దకుపోయి విషయం అంతా వివరించింది.

వశిష్టుడు చిరు నవ్వు నవ్వి "సరస్వతీ! నీవు నన్ను తీసుకొని పోకపోతేనీకు విశ్వామిత్రుడు శాపం ఇస్తాడు. కాబట్టి నేనునీవెంట వస్తాను." అని అన్నాడు. వశిష్టుడు సరస్వతీ తీరంలో జపం చేసుకుంటూ ఉండగా అతడు ఉన్న ప్రదేశమును తన అలలతో కోసి ఆయననుమోసుకొని విశ్వామిత్రుని వద్దకు చేర్చింది. విశ్వామిత్రుడు వశిష్టుని చంపడానికి మార్గం వెతుకుతుండగా సరస్వతీ నది వశిష్టుని అక్కడినుండి తప్పించింది. దానికి కోపించి విశ్వామిత్రుడు నీవు రక్తపుటేరువు అగుదువు గాక అని సరస్వతీ నదిని శపించాడు. రక్తము రాక్షసులకుప్రీతి గావున ఒక సంవత్సరము ఆ నది రాక్షసులకు ప్రీతిపాత్రమైనది. అప్పుడు సరస్వతీ తీరమునకు కొందరు మహామునులు వచ్చారు. ఆ నదీమ తల్లి అవస్థను చూచారు. ఆమెను అడిగి జరిగినదంతా తెలుసుకున్నారు. తమ తమ తపోబలముతో సరస్వతీ నదిని మరలా మామూలుగా పవిత్ర జలములు ప్రవహించేట్టు చేసారు. ఆ నదిలో పుణ్యస్నానములు ఆచరించారు.

అప్పుడు కొంతమంది బ్రహ్మరాక్షసులు ఆమహామునులకు నమస్కరించి "మహామునులారా! మేమందరమూ బ్రాహ్మణులను ద్వేషించాము. గురుజనములను అవమానించాము. నరమాంసము భక్షించాము. ఎన్నోమహాపాతకాలు చేసాము. మాకు నిష్కృతి ప్రసాదించండి." అని వేడుకున్నారు. ఆ మహామునులు ఆ పని చేయుటకుసరస్వతీ నదిని ప్రార్ధించారు. అప్పుడు సరస్వతీ నది అరుణా నదిని తనలో అంతర్వాహినిగా చేసి అందులో మునగమని ఆ బ్రహ్మరాక్షసులకుచెప్పింది. ఆ బ్రహ్మరాక్షసులు ఆ అరుణానదిలో మునిగి తమ తమ రాక్షస శరీరములు విడిచి దైవత్వము పొందారు. ఈ విషయమంతా దేవేంద్రుడు తెలుసుకున్నాడు. దేవేంద్రుడు నముచి అనే రాక్షసుడిని నమ్మించి మోసం చేసి చంపాడు. తద్వారా పాపం మూటకట్టుకున్నాడు. ఈ విషయం తెలిసి దేవేంద్రుడు సరస్వతీ నదీ పుణ్యజలములలో మునిగి తనపాపము పోగొట్టు కున్నాడు." అని వైశంపాయనుడు జనమేజయునకు బలరాముని యాత్రా విశేషములు వివరిస్తున్నాడు.

వైశంపాయనుడు ఇంకా ఇలా అన్నాడు. "జనమేజయ మహారాజా! అక్కడి నుండి బలరాముడు సోమతీర్థమునకు వెళ్లాడు. అక్కడ సోముడు రాజసూయ యాగము చేసాడు. ఆ ప్రదేశములోనే దేవతలు షణ్ముఖుని దేవసేనకు అధిపతిగా అభిషేకించారు. తదుపరి షణ్ముఖుడు తారాకాసురుడు మొదలగా రాక్షసులను తెగటార్చాడు. ఆ వృత్తాంతమును నీకు చెప్పెదను వినుము.

పరమేశ్వరుడు తన వీర్యమును అగ్నిలో నిక్షిప్తం చేసి ఉంచాడు. అగ్ని ఆ తేజస్సును భరించలేకపోయాడు. ఆ విషయం బ్రహ్మకు చెప్పాడు. బ్రహ్మ ఆ వీర్యమును గంగానదీ గర్భంలో దాచమని చెప్పాడు. అగ్ని ఆ ప్రకారము

చేసాడు. గంగానదీ గర్భంలో విడువ బడిన పరమేశ్వరుని వీర్యము వలన కలిగిన కుమారుని గంగానది హిమవత్పర్వతము మీద ఉంచింది. ఆ కుమారుడు రెల్లు గడ్డిలో బంగారం లాగా మెరిసిపోతున్నాడు. ఆ కుమారుని కృత్తికలు... వీడు తమ కుమారుడు అంటే తమ కుమారుడు... అని ఎత్తుకొని పెంచారు. అప్పుడు వారికి చనుబాలు చేపాయి. వారందరూ ఆ బిడ్డకు తల్లులయి పెంచారు. ఆ సప్త మాతృకల స్తన్యము కుడిచి ఆ బిడ్డ ఆరుముఖములతో విరాజిల్లాడు. ఆ కుమారుడు అగ్నిభవుడు, గాంగేయుడు,శరజన్ముడు, కార్తికేయుడు అయ్యాడు. ఆ సమయములో బృహస్పతిఅక్కడకు వచ్చి ఆ కుమారునికి జాతక కర్మలు మొదలగు అనుష్ఠానములు నిర్వర్తించాడు.

ఒక రోజు ఆ కుమారుని చూచుటకు పరమేశ్వరుడు పార్వతీసమేతుడై, ప్రమధగణములతో సహా ఆ ప్రదేశమునకు వచ్చాడు. ఆ సమయములో బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, దిక్పాలకులు, రుద్రులు, ఆదిత్యులు,మరుత్తులు మొదలగు సకల దేవతలు, పితృదేవతలు తమ తమ అనుచర గణములతో అక్కడకు వచ్చారు. తనను చూచుటకు వచ్చిన వారందరినీ చూచి షణ్ముఖుడు వారి ఎదురుగా నిలిచాడు.

అప్పుడు శివుడు తన మనసులో ఇలా అనుకున్నాడు "ఇక్కడ నేను, పార్వతి, అగ్ని, గంగ ఉన్నారు కదా. ముందు ఎవరి దగ్గరకు వస్తాడు. అందరిలోకీ అధికుడైన నా దగ్గరకు భక్తితో వస్తాడా!" అని అనుకున్నాడు. పార్వతీ, గంగ, అగ్ని కూడా తమ తమ మనసులలో అలాగే అనుకున్నారు. వారి వారి మనసులో ఆలోచనలను తన యోగమహిమతో గ్రహించాడు షణ్ముఖుడు. వారి నలుగురివద్దకు నాలుగు రూపులు దాల్చి ఏకకాలంలో వెళ్లాడు. వారందరికీ ఆశ్చర్యం కలిగించాడు.

అప్పుడు పరమశివుడు బ్రహ్మను చూచి “మహాత్మా! ఈ కుమారుడు తేజోమూర్తి. ఇతనికి ఒక ఉదాత్తమైన పదవి ఇవ్వండి.” అని అడిగాడు. అప్పుడు బ్రహ్మ పరమేశ్వరునితో “మహాదేవా! ఈకుమారుడు దేవతలకు హితం కోరేవాడు. కాబట్టి ఇతనిని దేవసేనకు అధిపతిని చెయ్యండి.” అని పలికాడు. అక్కడ ఉన్న వారందరూ బ్రహ్మదేవుని పలుకులకు ఆమోదం తెలిపారు.

అందరూసరస్వతీ తీరం చేరుకున్నారు. అక్కడ రత్నఖచితమైన ఒక సింహాసనమును ఏర్పాటుచేసారు. దాని మీద షణ్ముఖుని ఆసీనుని గా చేసారు. బృహస్పతి హోమకార్యము నిర్వర్తించాడు. ఈశానుడు, విష్ణువు ఇతర దేవతా ముఖ్యులు అభిషేక ద్రవ్యములు, పుణ్యాజలములతో నిండిన పూర్ణ కలశములు ధరించారు. గంధర్వులు, అప్సరసలు, మంగళ గీతాలు ఆలపించారు. మహామునులు పుణ్యాహవాచనములు నిర్వర్తించారు. లక్ష్మీదేవి, సరస్వతి, శచీదేవి మొదలగు పుణ్యస్త్రీలు షణ్ముఖుని దీవించారు. ఆ ప్రకారంగా షణ్ముఖుని దేవ సేనకు అధిపతిని చేసారు.

పరమశివుడు, విష్ణువు, దేవతలు తమ తమ బల పరాక్రమములను కానుకగా ఇచ్చారు. శంకరుడు ఉదయభాస్కరుని తో సమానమైన పతాకాన్ని ఇచ్చాడు. బ్రహ్మదేవుడు రాక్షసులను విధ్వంసం చేసే శక్తిని ప్రసాదించాడు. విష్ణువు వనమాలను ఇచ్చాడు. పార్వతీదేవి మాయని పట్టువస్త్రములు బహూకరించింది. గంగాదేవి ఉజ్వలమైన, అమృతమయమైన కమండలం బహూకరించింది. గురుడు ఒక దండము ఇచ్చాడు. గరుడుడు నెమలిని బహూరించాడు. వరుణుడు ఒక తామ్రచూడమును, కుబేరుడు మేకలను, బ్రహ్మ కృష్ణాజినమును బహూకరించారు. అతని వైభవమును చూచి పరమేశ్వరుడు “ఇతడు రాక్షస సంహారము అనాయాసంగా చేస్తాడు.” అని

అన్నాడు. అతనికి భూతమయమైన సైన్యమును ఇచ్చాడు. అందరూ శంఖములు పూరించారు. భేరీ నినాదములు మిన్నుముట్టాయి. అప్పుడు షణ్ముఖుడు వారందరినీ చూచి "మీరు ఏ శత్రువులను చంప మంటే వారిని చంపుతాను." అని అన్నాడు. తరువాత అందరూ తమ తమ నివాసములకు వెళ్లారు.

తరువాత షణ్ముఖుడు దేవతలకు తారకాసుని వలన ముప్పు ఉందని గ్రహించి ఆ తారకాసురుని మీదికి యుద్ధమునకు వెళ్లాడు. తారకాసుడు కూడా తన సైన్యములతో షణ్ముఖుని ఎదుర్కొన్నాడు. షణ్ముఖుడు తారకాసుని మీద శక్తి ఆయుధమును ప్రయోగించాడు. ఆ శక్తి ఆయుధములోనుండి వేనకు వేలు సైనికులు పుట్టి రాక్షసులను నాశనం చేసారు. తుదకు ఆ శక్తి ఆయుధము తారకాసురుని సంహరించింది. షణ్ముఖుడు విజయోత్సాహంతో వెలిగిపోయాడు.

బలిచక్రవర్తి కుమారుడు బాణుడు అని ఒక రాక్షసరాజు ఉన్నాడు. అతడు దేవతలను బాధపెడుతూ ఉండే వాడు. ఈవిషయం తెలిసిన షణ్ముఖుడు బాణుని తన శక్తితో చంపాడు. ముల్లోకాలకు శాంతి చేకూర్చాడు.

బలరాముడు అక్కడి నుండి అగ్ని తీర్థమునకు వెళ్లాడు. పూర్వము భృగుశాపమునకు అలిగి అగ్ని దేవుడు అక్కడ దాగి ఉండగా దేవతలంతరూ అగ్ని దేవుడిని చూడడానికి ఆ తీర్థమునకు వచ్చారు. ఆ సమయంలో అగ్నిదేవునికి భృగు శాపము వలన సర్వభక్షకత్వము సంప్రాప్తించినది. అప్పుడు బ్రహ్మ మొదలగు దేవతలు అగ్ని వద్దకు వచ్చి "నీవుసర్వభక్షకుండవయ్యును దేవ,మానవులకు పూజ్యుడవు." అని వరము ఇచ్చారు. మరలా అగ్ని తన విధులను నిర్వర్తించసాగాడు. అందువలన ఆ తీర్థమునకు అగ్ని తీర్థము అని

పేరువచ్చినది.

బలరాముడు  ఆ తీర్థములో స్నానమాచరించి అక్కడినుండి కుబేర తీర్థమునకు వెళ్లాడు.  అక్కడి నుండి బదరిపాచనము అనే తీర్థమునకు వెళ్లాడు. పూర్వము భరద్వాజుని కుమార్తె ప్రభావతి అను కన్య తాను ఇంద్రుని మాత్రమే పెళ్లి చేసుకొనెదనని తపస్సు చేసింది. అప్పుడు ఇంద్రుడు వశిష్ఠుడి వేషంలో ఆమె దగ్గరకు వచ్చాడు. ఆమె తనమనసులో కోరిక చెప్పింది. అప్పుడు ఇంద్రుడు కొన్ని రేగు పండ్లను ఆమెకు ఇచ్చి వాటిని పచనము చేయమని చెప్పాడు.  ఆమె స్నానము చేసి శుచియై అగ్నిని వెలిగించి వాటిని వండసాగింది. అవి ఎంతకును  ఉడకలేదు. ఎన్నో కట్టెలు కాలుతున్నాయి కాని ఆ పండ్లు మాత్రం ఉడకలేదు. తాను తెచ్చుకున్న కట్టెలుఅయిపోయాయి.  లోపలకు పోయి మరి కొన్ని కట్టెలు తెచ్చు లోపల పాకము చెడిపోవునని తన రెండు కాళ్లను కట్టెలుగా  పెట్టి వండసాగింది. ఆమె నిష్ఠకు మెచ్చుకొని ఇంద్రుడు "శుభాంగి నీ నిష్ఠకు మెచ్చితిని. నీవు కోరిన వరము ప్రసాదించెదను. నీవు ఈశరీరము విడిచి దేవలోకము రమ్ము." అని ఆహ్వానించాడు. ఆ ప్రభావతి ఆ ప్రకారము తన శరీరమువిడిగి దేవలోకము పోయింది. అప్పటినుండి ఆ తీర్థము సర్వ పాపహరమై  ఆమె పేరుతో ప్రశిద్ధి చెందింది.

తరువాత బలరాముడు ఇంద్ర తీర్థమునకు వెళ్లాడు.  ఆ తీర్థములో ఇంద్రుడు నూరు అశ్వమేధ యాగములు చేసి శతక్రతువు అని కీర్తి పొందాడు.

అక్కడి నుండి బలరాముడు రామ తీర్థమునకు వెళ్లాడు. అక్కడ పరశురాముడు 21 మారులు క్షత్రియుల మీద యుద్ధము చేసి వారిని చంపి, అంతటితో  తృప్తి చెందక, కశ్యపుని సాయంతో ఆ క్షేత్రంలో ఎన్నో

రాజసూయములు, అశ్వమేధ యాగములు, వాజపేయములు చేసాడు. దక్షిణ కింద కశ్యపునికి తాను జయించిన భూమినంతా ఇచ్చాడు.

రామ తీర్థము నుండి బలరాముడు యామున క్షేత్రమునకు వెళ్లాడు. అక్కడ వరుణుడు ఎన్నోరాజసూయ యాగములు చేసాడు. అవి పూర్తి అయ్యేలోపల దేవాసుర యుద్ధము సంభవించినది.

అక్కడినుండి బలరాముడు ఆదిత్య తీర్థమునకు వెళ్లాడు. ఆ తీర్థములో సూర్యుడు యాగము చేసి జ్యోతిషాధిపత్యము పొందాడు. అక్కడినుండి బలరాముడు సారస్వతము అనే పేరుగల వశిష్ట తీర్థమునకు వెళ్లాడు. పూర్వము ఆ స్థలములో దధీచి అనే మహా ముని ఘోరమైన తపస్సు చేసాడు. ఆ తపస్సుకు దేవేంద్రుడు భయపడ్డాడు. అతని తపస్సును ఎలాగైనా భగ్నం చెయ్యాలని అనుకున్నాడు. ఆలంబుస అనే అప్సరసను పంపాడు. దధీచికి ఆ అప్సరసను చూడగానే వీర్యస్ఖలనమయింది. ఆ వీర్యమును సరస్వతీ నది తన గర్భములో దాచుకుంది. తత్ఫలితంగా ఆమెకు ఒక కుమారుడు కలిగాడు. సరస్వతి ఆ కుమారుని దధీచి వద్దకు తీసుకొని వచ్చి "వీడు నీ కుమారుడు. నీ వీర్యం వృధాకాకుండా నేను ధరించి ఈ బిడ్డను కన్నాను." అని చెప్పింది. దధీచి ఆ కొడుకు తన చేతుల్లోకి తీసుకొని ఆలింగనం చేసుకున్నాడు. సరస్వతీ నదిని చూచి "అమ్మా! నీవు బ్రహ్మ సరస్సున పుట్టావు. పుణ్యనదులలో మేటివి. నీ జలములలో పితృదేవతలకు తర్పణము విడిచిన విశ్వేదేవతలు, పితృ దేవతలు, గంధర్వులు తృప్తి చెందుతారు. ఈ కుమారుడు నీ పేరుతో సారస్వతుడు అని పిలవబడతాడు. ఇప్పటినుండి 12 ఏండ్లు అనావృష్టి వస్తుంది. కాని అనావృష్టి నుండి ఈకుమారుడు మహామునులను రక్షించి వారితో వేదాధ్యయనముచేయిస్తాడు." అనిచెప్పాడు. ఆబిడ్డను తిరిగి సరస్వతీ నదికి అప్పగించాడు. ఆమె ఆ కుమారుని తీసుకొని వెళ్లింది.

ఆ సమయంలోనే దేవాసురయుద్ధం సంభవించింది. ఇంద్రుడికి ఒక ప్రశస్తమైన ఆయుధము కావాల్సి వచ్చింది. అందరూ దధీచిని ప్రార్ధించారు. దధీచి తన వెన్నుముకను వజ్రాయుధంగా చేసి ఇచ్చాడు. తానుమాత్రం తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఇంద్రుడు ఆ వజ్రాయుధంతో అసురులతోయుద్ధం చేసాడు.

తరువాత 12 ఏండ్లు అనావృష్టి సంభవించింది. దధీచి కుమారుడైన సారస్వతుడు మునులందరినీ చేరదీసి సరస్వతీ నదీ తీరమున వేదాధ్యయనం చేయించాడు.

బలరాముడు సారస్వత తీర్థమునుండి వృద్ధకన్యాశ్రమమునకు వెళ్లాడు. పూర్వము ఖని అనే కన్య తపస్సు చేసుకుంటూ ఉంది. ఆమె వృద్ధు రాలయింది. ఆమెకు తాను చనిపోయిన తరువాత స్వర్గమునకు వెళ్ల వలెనని ఆసక్తి కలిగింది. అప్పుడు నారదుడు ఆమె వద్దకు వచ్చాడు. " ఓ కన్యకా! నీవు అవివాహితవు. అవివాహితలకు స్వర్గలోక ప్రవేశము నిషిద్ధము." అని చెప్పాడు.

అప్పుడు ఆమె తన తపస్సులో సగం ధారపోసి గాలవుడు అనే ముని యొక్క కుమారుడిని వివాహం ఆడింది. కాని ఒక షరతు పెట్టింది. ఒక రోజు మాత్రం అతనితో సంసారం చేస్తాను అని చెప్పింది. తన తపశ్శక్తితో ఆమె యవ్వనవతియై ఆ మునికుమారునితో ఒక్క రోజు సాంసారిక సుఖములు అనుభవించింది. మరునాడు తాను స్వర్గానికి వెళ్లిపోతాను అని ఆ ముని కుమారునికి చెప్పింది. అతను చాలా బాధ పడ్డాడు. ఆ వృద్ధ కన్య ఆ క్షేత్రమునకు ఒక వరం ప్రసాదించింది. ఎవరైనా ఆ క్షేత్రములో ఒక రోజు ఉపవాసం చేసి, దేవతలను పితరులను తృప్తిపరచిన అతనికి 50 ఏళ్లు బ్రహ్మ చ

ర్య దీక్ష ఫలితం దక్కుతుంది అని పలికి స్వర్గముకు వెళ్లింది.

ఆ క్షేత్రమును సేవించిన తరువాత బలరామునికి కురుక్షేత్రయుద్ధములో కౌరవులందరూ సమూలంగా నాశనమయ్యారు అన్న విషయం తెలిసింది.చాలా దుఃఖించాడు బలరాముడు. కురుక్షేత్రమునకు దగ్గరలో ఉన్న శమంతకపంచక తీర్థమునకు వెళ్లాడు. అక్కడ ఉన్న మునులను కురుక్షేత్రము లో జరిగిన విశేషముల గురించి అడిగి తెలుసుకున్నాడు. వారు ఈ విధంగా చెప్పారు.

"ఆ ప్రదేశమును కురు అనే రాజు దున్నడం వలన దానికి కురుక్షేత్రము అనే పేరు వచ్చింది. అక్కడ ఎందరో దేవతలు యజ్ఞ యాగాదులు చేసారు. కురు అనే మహారాజు ఆ ప్రదేశములో పుట్టిన వారందరూ స్వర్గమునకు పోవలెను అనే కోరికతో ఆ ప్రదేశమును దున్నుతుండగా, దేవేంద్రుడు వచ్చి ఆ విషయం తెలుసుకున్నాడు. భూమి దున్నితో స్వర్గం వస్తుందా అని దేవేంద్రుడు హేళనగా నవ్వాడు. కాని ఆ రాజు తన పట్టుదల వదలక దున్నుతున్నాడు. అతని పట్టుదల చూచిన దేవేంద్రుడు ఆ పవిత్రక్షేత్రములో ఉపవసించి, చనిపోయిన వారికి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది అని వరము ఇచ్చి వెళ్లిపోయాడు." అని అక్కడి మునులు కురుక్షేత్రము యొక్క ప్రాశస్త్యమును వివరించారు.

అప్పుడు నారదుడు అక్కడకు వచ్చాడు. కురుక్షేత్ర సంగ్రామములో భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యుల మరణముల గురించి చెప్పాడు. "బలరామా! ఈ 18 రోజుల యుద్ధంలో కౌరవ సైన్యము పూర్తిగా నశించిపోయింది. అశ్వత్థామ,కృతవర్మ,కృపాచార్యుడు అను ముప్పురు రధికులు (రధిక త్రయము) మాత్రం సజీవంగా మిగిలారు. సుయోధనుడు ఒంటరిగా యుద్ధ భూమిని వదలి ద్వైపాయనము అనే మడుగులో దాగి ఉన్నాడు. పాండవుల

సూటిపోటీ మాటలతో అతను బయటకు వచ్చి భీమసేనునితో గదా యుద్ధమునకు సిద్ధపడ్డాడు. వారిరువురూనీ శిష్యులే కాబట్టి ఆ యుద్ధము కనులారా చూడుము." అని వివరించాడు.

వెంటనే బలరాముడు తన రథము ఎక్కి భీమసుయోధనుల గదాయుద్ధము జరుగుతున్న ప్రదేశమునకు వచ్చాడు. అని వైశంపాయనుడు జనమేజయునకువివరించాడు.

పక్కనేపొదలలో దాగి ఉండి ఆ గదా యుద్ధమును కనులారా చూచిన సంజయుడు ధృతరాష్ట్రునకు ఆ యుద్ధ విశేషములను వివరించాడు. ,

"ధృతరాష్ట్ర మహారాజా! బలరాముని చూచి నీ కుమారుడు సుయోధనుని ముఖం వికసించింది. తన పక్షమున తన గురువుగారు ఉన్నాడు అన్న ధైర్యము వచ్చింది.

సుయోధనుడు ధర్మజుని చూచి "ధర్మనందనా! ఇక్కడకు దగ్గరలో ఉన్న శమంతకపంచకము అత్యంత పుణ్యస్థలము. అక్కడ మరణించిన వారికి ఉత్తమలోకములు కలుగుతాయి. కాబట్టి ఈ యుద్ధము అక్కడ జరుగుట సముచితము." అని అన్నాడు. బలరాముడు అతనిని సమర్ధించాడు. అందరూ శమంతకపంచకమునకు వెళ్లారు.

శ్రీకృష్ణుడు, బలరాముడు, పాండవులు, పాంచాలురు, యాదవులు చతురంగ బలములు చుట్టుకూర్చున్నారు. మధ్యలో భీమసుయోధనుడు గదాయుద్ధమునకు సమాయత్త మయ్యారు. అప్పుడు భీమసేనుడు ధర్మరాజును చూచి ఇలా అన్నాడు. ,

“ధర్మజా! ఈ నీచుడు ఎన్నోపాపాలు చేసాడు. వీడికి ఈ రోజుతో ఆయుష్షు తీరింది. ఇతడి తొడలు విరుగ గొట్టి చంపుతాను. నా ప్రతిజ్ఞ నెరవేర్చుకుంటాను. సుయోధనా! ఈ రోజు నా చేతికి చిక్కావు. ఇంకెక్కడికి పోగలవు. నా చేతిలో చావడం తప్ప నీకు మరోమార్గంలేదు.” అని తొడగొట్టాడు భీమసేనుడు.

సుయోధనుడు కూడా “ఈ రోజూ నీకూ నా చేతిలో చావు మూడింది. నా తో గదాయుద్ధముచెయ్యడానికి ఆ ఈశ్వరుడు కూడా సాహసించడు. ఇంక నీ వెంత! నిన్నుచంపి సర్వంసహా కురుసామ్రాజ్యమును నా హస్తగతం చేసుకుంటాను.” అని అన్నాడు.

ఈ ప్రకారము ఒకరినొకరు దూషించు కుంటూ ఉండగా యుద్ధ ప్రారంభ సూచిక మ్రోగింది. భీమసుయోధనుడు తమ తమ గదలతో యుద్ధానికి తలపడ్డారు. ఇరువురి ఉద్రేకములు పొంగగా యుద్ధం చేస్తున్నారు. బలరాముడు ఆసక్తిగా చూస్తున్నాడు. ఒకరిని ఒకరు బెదిరించుకుంటున్నారు. గుండ్రంగా తిరుగుతున్నారు. గదలతో మోదుకుంటున్నారు. ఒకరికి ఒకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు. వారి పాదఘట్టనలతో భూమి కంపిస్తూ ఉంది. వారి గదాఘాతములకు వారి కిరీటములు కిందపడ్డాయి. ఆభరణములు నేలరాలాయి. కవచాలు విరిగిపోయాయి. ఒకరి గదను మరొకరి గదకు చుట్టి లాగుతున్నారు. అంతలోనే వెనక్కు తగ్గుతున్నారు. ఏనుగుల మాదిరి ఢీకొంటున్నారు. ఒకరు కొట్టే దెబ్బలు మరొకరు తప్పించు కుంటున్నారు. తిరిగి దెబ్బతీస్తున్నారు. గదాఘాతముల వలన వారి శరీరములు రక్తసిక్త మయ్యాయి. అయినా చలించడం లేదు. నిలబడే కాసేపు సొమ్మసిల్లినట్టు ఉండి తిరిగి యుద్ధం చేస్తున్నారు. వారిద్దరి మధ్య జయాపజయములు నిర్ణ యించడం చాలా కష్టంగా ఉంది.

అప్పుడు అర్జునుడు శ్రీ కృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా! చూచావు కదా! భీమ సుయోధనులు ఒకరికి ఒకరు తీసిపోకుండా యుద్ధం చేస్తున్నారు. వీరిలో గెలుపు ఎవరిది అంటావు" అని అడిగాడు.

అప్పుడు కృష్ణుడు అర్జునుని తో ఇలా అన్నాడు. "అర్జునా! ఇద్దరూ ఒకే గురువు వద్ద విద్యనేర్చుకున్నారు. భీమునికి శారీరక బలము ఎక్కువ కాని బుద్ధి బలము నేర్పు శూన్యము. సుయోధనునికి శారీరక బలము, బుద్ధి బలము, నేర్పు ఉన్నాయి. అందువలన భీముని కంటే సుయోధనుడికే గెలుపు అవకాశములు ఎక్కువ. కాబట్టి ధర్మయుద్ధములో భీమసేనుడు గెలవడం అసాధ్యం. ఎదుటి వాడు నేర్పుతో మాయోపాయములతో యుద్ధం చేస్తుంటే మనం ధర్మయుద్ధం చెయ్యడం సరికాదు. మనము కూడా అలాంటి నేర్పు మాయోపాయములు పన్నవలె. నాడు కౌరవ సభలో భీముడు సుయోధనుని తొడలు విరుగ గొట్టెదనని ప్రతిన పూనాడు. కాని గదా యుద్ధమున నాభికి కింద అంటే తొడల మీద కొట్టుట ధర్మ విరుద్ధము. కాని భీమసేనుడు తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనుటకు నాభి కింద కొట్టాడు అని మనము సమర్ధించు కొనవచ్చును. కాబట్టి కేవలం ధర్మయుద్ధము చేసినందు వలన జయము సిద్ధింపదు. కాబట్టి ధర్మ విరుద్ధమైనను సుయోధనుని తొడలు విరుగ గొట్టుట ప్రస్తుత కర్తవ్యము.

అదియును కాక మన ధర్మజుని వలన మనకు లేని పోని చిక్కు వచ్చి పడింది. మీరంతా కష్టపడి యుద్ధమే చేసి భీష్మ,ద్రోణ,కర్ణ,శల్యులను చంపి విజయము సాధించారు. కాని నేడు "ధర్మజుడు మాలో ఎవరినో ఒకరిని జయించి కురు సామ్రాజ్యమును, సమస్త సంపదలు కైవసము చేసికో" అని సుయోధనునితో అన్నాడు. కాబట్టి ఇప్పుడు భీమసేనుడు గెలవడం ముఖ్యం. అయినా అర్జునా! మన ధర్మజుడు ఇంత బుద్ధి హీనుడు అవుతాడని నేను

అనుకోలేదు. సమస్త సైన్యమును, బంధుమిత్రులను సమరములో పోగొట్టుకొని మడుగులో దాగియున్న శత్రువును చుట్టుముట్టి చంపకుండా, మాలో ఎవరితో ఒకరితో ద్వంద యుద్ధ ముచెయ్యమని పిలవడం, గెలిస్తే కురుసామ్రాజ్యమును ఇస్తాననడం తెలివితక్కువ తనం కాక మరేమిటి. అసలు భీమసేనుని గెలడమే సుయోధనుని చిరకాల వాంఛ. మరి ఆఅవకాశము సుయోధనుడు జారవిడుస్తాడా! కాబట్టి ఇంక ఆలస్యం చేయకుండా, సుయోధనుని అధర్మయుద్ధము లో చంపడమే ఉత్తమం. లేకపోతే సుయోధనుడు మీకు అందరికీ చక్రవర్తి అవుతాడు. మీరు అతనికి దాసులవుతారు. తరువాత మీ ఇష్టం." అని తెగేసి చెప్పాడు కృష్ణుడు.

అర్జునునికి విషయం అర్ధం అయింది. భీమసేనుని వంకనే చూస్తున్నాడు. భీమసేనుడు తన వంక చూడగానే తొడమీద చరిచి అక్కడ కొట్టమని సైగ చేసాడు. కృష్ణుడు కూడా ఆమోద సూచకంగా నవ్వాడు. ఆ సైగను భీముడు గ్రహించాడు. అధర్మయుద్ధమునకు కృష్ణుడే అనుజ్ఞ ఇచ్చిన ఇంక ఆలస్యం ఎందుకు అనుకున్నాడు. సుయోధనుని తొడలు విరుగ గొట్టడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నాడు.

ముందు భీముడు గదతో సుయోధనుని ఒక దెబ్బ కొట్టాడు. సుయోధనుడు ఆ దెబ్బ తప్పించుకొని భీముని తన గదతో మోదాడు. భీముడు ఆ దెబ్బకు సొమ్మసిల్లాడు. సుయోధనుడు విజయగర్వంతో ఒడలు మరిచి పైకి ఎగిరాడు. గాలిలో గిర గిరా తిరుగుతున్నాడు. తన గదలో భీమసేనుని తల మీద బలంగా మోది చంపవలెనని గద పైకి లేపాడు. అదే సమయమని భీముడు తన గదకు అనువుగా ఉన్న సుయోధనుని తొడల మీద బలంగా మోదాడు. సుయోధనుని తొడలు విరిగాయి. మొదలునరికిన చెట్టు మాదిరి నేలకూలాడు.

నేల మీద పడియున్న సుయోధనుని చూచాడు భీమసేనుడు.

"ఒరేయ్ సుయోధనా! నాడునిండు కొలువులో ఏక వస్త్రగా ఉన్న పాంచాలిని ఈడ్చి తెమ్మని ఆజ్ఞాపించిన దానికి ఫలం అనుభవించు." అంటూ సుయోధనుని తలను తన ఎడమ కాలితో బలంగా ఈడ్చి తన్నాడు.

" ఒరేయ్ సుయోధనా! ఇది గదా యుద్ధము. అక్ష క్రీడకాదు మోసంతో గెలవడానికి. ఒరేయ్! మమ్ములను బానిసలనీ, పశువులనీ అవమానించిన దానికి ఫలితం అనుభవించరా పశువా!" అని గట్టిగా అరిచాడు.

" కృష్ణా! అర్జునా! పాంచాల వీరులారా! చూడండి. సిగ్గులేకుండా తాకరాని దానిని ఏక వస్త్రను సభలోకి ఈడ్పించిన దానికి ఫలితం అనుభవిస్తున్న ఈ దుర్మార్గుడిని చూడండి. ఆపాంచాలి కోపాగ్ని లో మాడి మసైపోతున్న వాడిని చూడండి. మమ్ములని వ్యర్థులనీ, బానిసలనీ తిట్టినటువంటి దుర్మార్గులను, దుష్టులను వారి వారి సైన్యముతో సహా సర్వనాశనం చేసాము. ఇంక మాకు అమరలోక ప్రాప్తి కలిగినా లేక నరకలోక ప్రాప్తి కలిగినా ఒకటే!" అంటూ భీమసేనుడు తన కుడికాలును సుయోధనుని మెడ మీద పెట్టి అదిమి, ఎడమ కాలుతో మరలా తన్నాడు.

ఈ పరిణామాలు చూచి ధర్మజుడు కోపంతో ఊగిపోయాడు. "భీమసేనా! ఆగు! ఏమిటా పిచ్చితనము. ఆ పిచ్చి ప్రేలాపనలేమిటి! ఆ తల తన్నడం ఏమిటి? ఇది అధర్మము అన్యాయము. చూడ్డానికే అసహ్యం వేస్తూ ఉంది. తన బంధు మిత్రులు సమస్త సైన్యము కోల్పోయినసుయోధనుడు, నా మాట మన్నించి నీతో గదాయుద్ధములో పాల్గొన్నాడు. వీరోచితంగా నేలకొరిగాడు. కాని నీవు ఏం చేసావు? అతని తల తన్నావు. ఇది లోకం

మెచ్చుతుందా! ఇప్పటిదాకా భీమసేనుడు ధర్మం తప్పడని కీర్తి పొందావు. ఈ కాని నేడు ధర్మం తప్పి ప్రవర్తించావు. గర్వంతో విర్రవీగుతున్నావు. దీని వలన నీకు కలుగు ప్రయోజనమేమిటి? అపకీర్తి తప్ప." అని భీమసేనుని మందలించి సుయోధనుని వద్దకు పోయి

"సుయోధనా! విధిప్రతికూలించి మన మధ్య వైరం ఏర్పడింది. ఒకరి మీద ఒకరం వైరం పెంచుకున్నాము. ద్వేషించుకున్నాము. సర్వం పోగొట్టుకొని ఈ స్థితికి చేరాము. బాల్యమునుండి నీకు అలవడిన లోభము, మధము, అధర్మపరత్వము నీకు ఈ గతి పట్టించాయి. నీ వలన నా బంధువు లందరూ యుద్ధములో మరణించారు. కులనాశనము అయింది. నా పెదనాన్న ధృ తరాష్ట్రుని కోడళ్లు అందరికీ వైధవ్యము ప్రాప్తించింది. కాని దీని కంతకూ కారణమని నన్ను నిందిస్తారు." అని సుయోధనుని ఓదార్చాడు. అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

"సంజయా! భీమసేనుడు అధర్మయుద్ధములో నా కొడుకు తొడలువిరగ్గొట్టి కూలదోసాడు కదా. మరి వారి గురువైన బలరాముడు అక్కడే ఉన్నాడు కదా. మరి ఆయన ఏమీ అనలేదా! భీముని మందలించలేదా!" అని అడిగాడు.

సంజయుడు ఇలా చెప్పసాగాడు. "ధృతరాష్ట్రమహారాజా! భీమసేనుడు సుయోధనుని తొడల మీద కొట్టి నేలమీద పడవేయడం చూచి బలరాముడు కోపంతో లేచి నిలబడ్డాడు. అక్కడు ఉన్న రాజులనుందరినిచూచి ఇలా అన్నాడు.

"చూచారా! ఈ భీముని ఆగడము. ఈ దేశంలో ఇలాంటి యుద్ధంకాని

అధర్మం కాని ఎప్పుడన్నా చూచామా! గదాయుద్ధములో నాభికి దిగువ భాగమున కొట్టుట ధర్మముకాదు అని మనమందరము వినలేదా! మరి వీడు విచ్చలవిడిగా నాభి కింద కొట్టి సుయోధనుని కూల్చాడు. ఇది న్యాయమా!" అని పలికి తన హలాయుధమును తీసుకొని భీమసేనుని మీదికి పోతున్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు బలరాముని వద్దకు పోయి ఆయనను తన రెండుచేతులతో పట్టుకొని వారించాడు. "అన్నయ్యా! తాను తన మిత్రులు వృద్ధిలోకి రావడం, తనకు మిత్ర బృందం మిక్కిలిగా పెరగటం, శత్రువుకు ఇవన్నీ కలుగ కుండా నిరోధించడం మానవ లక్షణం. ఇందులో విపరీతము ఏమున్నది. తన మిత్రునికి కీడు కలిగినప్పుడు, సాటి మిత్రుడు ఆదుకొనడం అతని ధర్మం. పాండవులు మనకు మిత్రులు, బంధువులు. విశేషించి మనకు మేనత్త కొడుకులు. అర్జునుడు మన చెల్లెలి భర్త. వారందరూ అవినీతి పరులచే భంగపడ్డారు. కాబట్టి వారికి సాయం చెయ్యడం, వారి అభివృద్ధిని కోరడం మన ధర్మం కాదా!

అదీ కాక, ప్రతిజ్ఞలు చెయ్యడం క్షత్రియులకు పరమ ధర్మము కదా! భీమసేనుడు సుయోధనుని తొడలు విరుగ గొట్టి చంపుతానని ప్రతిజ్ఞ చేసాడు. మరి ఈ ప్రతిజ్ఞ నెరవేర్చుకొనడం అధర్మం ఎలా అవుతుంది. అన్నయ్యా! అదియును కాక, సుయోధనుని తొడలు భీమసేనుని గదా ఘాతముల వలన భగ్నములు అవుతాయి అని మైత్రేయ మహా ముని శాపము. ఆ శాపం ఇప్పుడు కార్యరూపం దాల్చింది. కాబట్టి ఇందులో భీమసేనుని దోషము దోషము ఏమున్నది? కాబట్టి నీ అకారణ కోపము ఉపశమింప చేయుము. శాంతింపుము." అని బలరాముని అనునయించాడు కృష్ణుడు.

కాని బలరాముని కోపం తగ్గలేదు. "కృష్ణా! ధర్మార్ధకామమోక్షములు

ఒకదాని కొకటి అనుసంధానయ్యై ఉన్నవి. అవి ఒకదానిని ఒకటి నాశనం చేసుకోకూడదు.  పురుషార్ధములలో మొదటిది అయిన ధర్మము తప్పి, అధర్మ వర్తనము వలన  మిగిలిన పురుషార్ధములైన అర్ధ కామములను పొందు వాడు నిందితుడు కాడా!  నువ్వు మునిశాపం అన్నావు. భీముని ప్రతిజ్ఞ అన్నావు. అయి ఉండవచ్చు.  కాని వాటిని నెరవేర్చడంలో ధర్మం తప్పడం న్యాయమా! భీముడు గదా యుద్ధంలో ధర్మం తప్పి ప్రవర్తించాడు.. ఇది కాదనలేని సత్యం." అని అన్నాడు బలరాముడు.

"అన్నయ్యా! ఈ లోకమంతా నిన్ను అత్యంత ధర్మనిరతుడు,  చక్కని నడవడిక కలవాడు,  లవలేశమైనా  దోషము లేని వాడు గా  ఎల్లప్పుడూ కీర్తిస్తుంది.  కాబట్టి ఈ అకారణ కోపం వదిలిపెట్టు. భీమసేనుడు తన ప్రతిజ్ఞా పాలనకొరకు తన శత్రువును గదతో కొట్టాడు. ఇది అధర్మము ఎలా అవుతుంది. అన్నయ్యా! మరొక మాట. భీమసేనుడు సుయోధనుడిని  నిలబడి ఉన్నప్పుడు నాభి కింద కొట్టలేదు. సుయోధనుడు గాలిలోకి ఎగిరాడు. అప్పుడు భీమసేనుడు గద విసిరాడు.అది నాభి కింద తగిలింది. అందు భీమసేనుని తప్పు ఏమున్నది. సుయోధనుడు భీమసేనుని తల మీద గదతో మోది చంపుటకుపైకి ఎగిరాడు. సుయోధనుడు కొట్టబోవు గదా ఘాతమును కాచుకొనుటకు, తన ప్రతిజ్ఞ నెరవేర్చుకొనుటకు భీముడు సుయోధనుని బొడ్డు కింద కొట్టాడు. అలా కొట్టక పోతే భీముడు చస్తాడు కదా. ఆసమయంలో ధర్మము అధర్మము అని  ఆలోచిస్తారా!  అందుకని స్వీయరక్షణ కొరకు నాభి కింద  కొట్టడం తప్పుకాదుకదా!  సుయోధనుని ఊరుభంగముచేసెదనని భీమసేనుడు ప్రతిజ్ఞ చేసి దానికొరకు 13 ఏండ్ల సుదీర్ఘ కాలము వేచి ఉన్నాడు. ఈ రోజు తగినసమయము చిక్కినది. తన ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాడు. మరి ఈ విషయం సుయోధనుని కి తెలియదా! తగిన జాగ్రత్తలుసుయోధనుడు ఎందుకు తీసుకోలేదు.  అన్నయ్యా! నీకు

తెలియనిది ఏమున్నది. చిన్న తనమునుండియు పాండవులనే హతమార్చుటకు ఈ సుయోధనుడు ఎన్నో కుటిలోపాయములు పన్నాడు. మరి అటువంటి కుటిలుడిని కుటిలోపాయముతో అంతమొందించుట అధర్మము ఎలా అవుతుంది. అదియును గాక ఈసుయోధనుడు మన చెల్లెలు సుభద్ర కుమారుడు అభిమన్యుని ఎలా హతమార్చాడో మనకందరకూ తెలుసు గదా. చెల్లుకు చెల్లు. అధర్మాన్ని అధర్మం జయించింది.'' అని అన్నాడు శ్రీకృష్ణుడు.

''కృష్ణా! నీ వాదనా పటిమతో అధర్మాన్ని ధర్మంగా నిరూపించలేవు. నీ దృష్టిలో ఇలాంటి నీచమైన గెలుపు సాధించిన భీమసేనుడు ప్రశంసాపాత్రుడు అవుతాడేమో! కాని యుద్ధనీతిని అక్షరాలా పాటించిన ధర్మాత్ముడు సుయోధనునికి ఉత్తమలోకములు సిద్ధిస్తాయి.'' అని పలికాడు. వెంటనే తన రధము ఎక్కి ద్వారకకు వెళ్లిపోయాడు.

శ్రీకృష్ణుడు ధర్మరాజు వంక చూచాడు. ధర్మరాజు చింతాక్రాంతుడై తల దించుకొని నిలబడి ఉన్నాడు. అప్పుడు కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. ''ధర్మనందనా! బంధు నాశకుడు, పాపాత్ముడు అయిన సుయోధనుడు తాను చేసిన పాపములను అనుభవించాడు. భీమసేనుడు తనప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాడు. దీనికి బాధపడటం ఎందుకు?'' అని పలికిన కృష్ణునితో ధర్మరాజు ఇలా అన్నాడు.

''కృష్ణా! భీమసేనుడు సుయోధనుని తొడలు విరగ గొట్టి ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నాడు. కాని సుయోధనుని తల దన్ని అవమానించడం ధర్మమా! అసలే కురువంశ నాశనం అయినందుకు పరితాపం చెందుతున్న నాకు భీమసేనుని చర్య అమిత దుఃఖం కలిగించింది. భీమసేనునికి తానుపడ్డ కష్టాలు

గుర్తుకు వచ్చి ఉంటాయి. అందుకే అలా చేసి ఉంటాడు. పోనీలే కృష్ణా! ఇప్పుడు పాపపుణ్యాల చర్చ ఎందుకు.” అని అన్నాడు ధర్మజుడు.

“ధర్మనందనా! మీకు జరిగిన అన్ని అవమానములకు కారణమైన వాడు, పాపాత్ముడు, కౌరవ కుల నాశకుడు ఐన సుయోధనుడు నేలకూలాడు. సర్వంసహా కురుసామ్రాజ్యమునకు చక్రవర్తివి నువ్వు. రాజ్యభారమును వహించి ప్రజలను పాలించు.” అని అన్నాడు కృష్ణుడు.

అప్పుడు ధర్మరాజు భీమసేనుని చూచి ఇలా అన్నాడు. “భీమసేనా! నీ ధైర్యము, నీ భుజబలము, శ్రీకృష్ణుని సాయంతో నువ్వు సుయోధనుని వధించ గలిగావు. నీకు నా అభినందనలు.” అని సంజయుడు ధృతరాష్ట్రునితో చెప్పాడు.

“సంజయా! తొడలు విరిగి నేల మీద పడి ఉన్న నా కుమారుడు సుయోధనుని చూచి పాండవులు, పాంచాలురు ఏమన్నారు. వివరించు.” అని అడిగాడు. సంజయుడు ఇలాచెప్పాడు.

“ధృతరాష్ట్ర మహారాజా! సుయోధనుడు నేలకొరగ గానే పాండవులు, పాంచాలురు ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోయారు. శంఖాలు పూరించారు. భేరీ నినాదాలు మిన్నుముట్టాయి. అందరూ పెద్దగా అరుస్తూ కేకలు వేస్తూ భీముని తో ఇలా అన్నారు.

“భీమసేనా! ఈ సుయోధనుడు గదా యుద్ధములో అత్యంత నేర్పరి. అలాంటి వాడు అనాలోచితంగా పైకి ఎగిరినపుడు అత్యంత నైపుణ్యంతో అతని తొడ మీద కొట్టి నేలకూల్చావు. నీవు సుయోధనునితో యుద్ధము

చేస్తున్నప్పుడు మాకు కలిగిన గగుర్పాటు ఇంకనూ తగ్గలేదు." అని భీమసేనుని ప్రశంసించారు.

కాని కొంతమంది మాత్రం తమ తమ మనసులలో భీముడు అధర్మయుద్ధములో సుయోధనుని నేలకూల్చాడు అని అనుకోవడం కృష్ణుడు గమనించాడు. అక్కడ చేరిన వారిని చూచి ఇలాఅన్నాడు.

"మహావీరులారా! భీమసేనుడు సుయోధనుని అక్రమంగా చంపాడని మీరు తలవ వద్దు. ఈ దుర్మార్గుడైన సుయోధనుడు ఏక వస్త్ర అనే కనికరం లేకుండా ద్రౌపదిని సభకీడ్పించి వలువలు ఊడదీయమని ఆదేశించాడు. కాని ధర్మజుడు మాత్రం అదేమీ మనసులో ఉంచుకోకుండా రాజ్యములో భాగం మాత్రం అడిగాడు. దానిని కూడా తృణీకరించాడు ఈ పాపాత్ముడు. అలాంటి అధర్మవర్తనునకు అధర్మ యుద్ధమే తగియున్నది. విదురుడు మొదలగు వారు ఎన్ని విధముల చెప్పినా ఇతడు యుద్ధమార్గమునే అనుసరించాడు. కౌరవ కుల నాశనమునకు కారకుడయ్యాడు. కాబట్టి ఇతని గురించి ధర్మాధర్మ తర్కము లేల! మీ మీ స్థానములను కదలండి." అని పలికాడు.

నేల మీద పడి ఉన్న సుయోధనుడు తన గురించి శ్రీకృష్ణుడు అన్న మాటలు విన్నాడు. రోషంతో అతని గుండెలు మండిపోతున్నాయి.

"ఓ కంసుని దాసుడైన వసుదేవుని కుమారుడా! కృష్ణా! నీ తప్పులు నీవు తెలుసుకోకుండా సిగ్గు లేకుండా ఏమేమో ప్రేలుతున్నావు. నీవు చెప్పిన మాటలు విని, అర్జునుడు సైగ చేస్తే ఆసైగను అందుకని ఈ పాపాత్ముడు భీముడు నా తొడమీద కొట్టి నన్ను పడగొట్టాడు. లేని యడల ఇటువంటి భీములు పదివేల మంది వచ్చినా నన్ను పడగొట్టలేరు. నేను ఒక్కడినే మీ

అందరనూ నాశనం చేసి ఉండేవాడిని. శిఖండిని ముందు పెట్టి భీష్మని పడగొట్టేట్టు చేసావు. ధర్మరాజుతో అబద్ధ మాడించి ద్రోణుని చావుకు కారకుడవయ్యావు. భూమిలో కూరుకున్న రధమును ఎత్తుకొనుచున్న కర్ణుని అక్రమంగా చంపించావు. ఇన్ని అధర్మములకు ఒడి గట్టిన నిన్ను ఏమనాలి? నీ మోసాలకు అంతు లేదా! భీష్మ, ద్రోణ, కర్ణ, భూరిశ్రవస, జయద్రధులను మోసంతో కాకుండా ధర్మంగా గెలవడం నీకూ, నీ పాండవులకు చేతనవుతుందా!" అని పలికిన సుయోధనుని చూచి కృష్ణుడు ఇలా అన్నాడు.

"సుయోధనా!నీవు చేసిన అక్రమాలు నీకు గుర్తులేవా! ఈనాడు నిన్ను కూల్చిన భీమసేనుని బాలుడుగా ఉండగా పాముల తో కరిపించావు. విషంపెట్టి చంపాలని చూచావు. నీటిలో ముంచావు. అదీకాక, కుంతీ దేవి తన కుమారులతో గాఢ నిద్రలో ఉండగా, నీవు లక్క ఇల్లు తగలపెట్టించి వారిని చంపబూనావు. ధర్మనిరతుడైన ధర్మరాజును మాయాద్యూతమునకు ఆహ్వానించి అతని రాజ్యమును, సంపదలను అపహరించావు. అంతటితో తనివిదీరక, ఏకవస్త్రగా ఉన్న యాజ్ఞసేనిని సభకీడ్పించి ఘోరంగా అవమానించావు. అన్నమాట తప్పని ధర్మజుడు, నీవు చేసిన అవమానముల నన్నింటినీ సహించి, తమ్ములతో భార్యతో అడవులకు వెళ్లాడు. అరణ్య,అజ్ఞాత వాసానంతరము ధర్మజుడు పంపగా నేను రాజ్యములో భాగము అడగడానికి వచ్చాను. నీవు తిరస్కరించావు. దానికి ఫలితం ఈనాడు అనుభవించావు. నీ లోభత్వము వలన, పాప చింతన వలన, దుర్మదము వలన, శాంత మనస్కులైన భీష్మ, ద్రోణులకు ప్రాణహాని కలిగింది.

ఇంకా చెపుతాను విను. ద్రుపదుడు చేసిన తపోయజ్ఞ ప్రబావంతో అగ్ని కుండములోనుండి జన్మించిన, శిఖండి, ధృష్టద్యుమ్నులు కారణ జన్మలు. వారు భీష్మ,ద్రోణుల మరణములకు నిమిత్తమాత్రులు. కాని వారి

మరణమునకు కారణభూతుడవు నీవు. వారిని అకారణ యుద్ధములో కి దించి చంపించావు. అప్పటికే ఎంతో సేపు యుద్ధము చేసి డస్సియున్న సాత్యకిని రక్షించుటకు భూరిశ్రవసుని చంపుట అధర్మము కాదు కదా! కాని అనేకులు కలిసి బాలుడు, నా మేనల్లుడు అయిన అభిమన్యుని చుట్టుముట్టి చంపడం నీకు అధర్మము అనిపించలేదా! చెల్లెలి వరస అని కూడా చూడకుండా పాంచాలిని అరణ్యములో నిర్బంధించి, అపహరించిన జయద్రధుని చంపుట పాపమా! అలాంటి జయద్రధుని చంపకుండా విడిచి పెట్టి అగ్నిప్రవేశం చెయ్యడానికి అర్జునుడేమన్నా వెర్రివాడా! నీవు పాప చింతనతో, అడవులలో ప్రశాంత జీవనము గడుపుతున్న పాండవులను అధిక్షేపించుటకు, ఘోష యాత్ర నెపముతో, వారున్న చోటికి వెళ్లినపుడు, నిన్ను గంధర్వులు అపహరించుకు పోతే నిన్ను కాపాడిన వాడు అర్జునుడు అని మరచిపోయావా! గాంగేయ,కుంభసంభవ,కర్ణ,అశ్వత్థామ,కృపాచార్యులు వెంటరాగా నీవు మత్స్య దేశములో, ఉత్తరగోగ్రహణము చేసినపుడు, మీరందరనూ తన సమ్మోహనాస్త్రముతో మూర్చపోగొట్టి కూడా, మిమ్ములను చంపకుండా సురక్షితంగా విడిచి పెట్టిన అర్జునుని ధర్మనిరతి, దయాగుణము నీవు ఎరుగవా! నీవు చేసిన మహా పాపముల కన్నింటికి మూలపురుషుడైన కర్ణుడు రణ రంగమున భూమిలో కుంగిన రధమును ఎత్తుకొనునపుడు, అర్జునుడు చంపకుండా ఎందుకు ఊరకుంటాడు. చేజిక్కిన అవకాశమును ఎందుకు వదులుకుంటాడు? ఒక వేళ అర్జునుడు కర్ణుని చంపకుండా విడిచి పెట్టినా, బ్రాహ్మణ శాపగ్రస్తమైన రథ చక్రము పైకి లేస్తుందా! కాబట్టి ఆ సమయమున ఆ నీచుడైన కర్ణుని చంపడం సముచితము. యుధిష్టిరుడు శల్యుని చంపడం మాత్రం అధర్మము అని నీవు అనలేదు. మహాసంతోషము.

సుయోధనా! ఒక్క విషయం ఆలోచించు. చిన్నతనము నుండి నీవు నీ తమ్ములు పాండవుల మీద కక్షపెంచుకున్నారు కాని పాండవులు నిన్ను కాని నీ

తమ్ముళ్లను కానీ ద్వేషించలేదు. కురు వంశమును కూకటి వేళ్లతో పెకలించి వేయుటకు నీవే మాయాద్యూతము అను గునపమును చేతపూనావు. దాని వలన సర్వనాశనం అయింది. అయినా సుయోధనా! భీమసేనుడు చేసిన ప్రతిజ్ఞను నీవు వింటివి గదా! గదతో తొడలను విరుగ గొట్టెదను అని ప్రతిజ్ఞ చేసిన వాడు పిడి గుద్దులు గుద్దుతాడా చెప్పు. కాబట్టి వృధా మాటలు కట్టిపెట్టు." " అని అన్నాడు కృష్ణుడు.

ఆ మాటలు విన్న సుయోధనుడు ఇలా అన్నాడు. " కృష్ణా! నేను వేదములు వేదాంగములు, అనేక శాస్త్రములు చదివాను. ఎన్నో యజ్ఞ యాగములు చేసాను. ఎన్నో సిరి సంపదలు అనుభవించాను. ఎందరో రాజులతో నీరాజనాలు అందుకున్నాను. నా శత్రువుల మదము అణిచాను. ఇప్పుడు బంధు మిత్ర సమేతంగా స్వర్గసుఖములు అనుభవించుటకు వెళుతున్నాను. నీ దృష్టిలో నేను చెడ్డవాడను, దుర్మార్గుడనే కావచ్చు. కాని మీరందరూ మీ శేష జీవితములు పశ్చాత్తాపంతో గడుపుతారు." అని అన్నాడు.

అప్పుడు పాండవులందరూ తాము భీష్మ,ద్రోణ,కర్ణులను అధర్మయుద్ధం లో చంపామా అన్నట్టు తలలు దించుకున్నారు. వారిని చూచి కృష్ణుడు ఇలా అన్నాడు.

"మీరందరూ భీష్మ,ద్రోణ,కర్ణులను ధర్మపరంగా చంపలేదని బాధ పడవలదు. వారు మ హా యోధులు. ధర్మయుద్ధములో వారిని గెలవడం చాలా కష్టం. కాబట్టి నేను బహు విధములైన ఉపాయములతో ఈ ప్రకారము చేయవలసి వచ్చినది. లేనియెడల, ఆ మహా యోధులు అత్యంత పరాక్రమ వంతులు మామూలుగా మరణిస్తారా! అదియును కాక, వారి పురాకృత

కర్మముల వలన ఇటువంటి మరణముసంప్రాప్తించినది. దైవఘటలను తప్పించడం మీతరమా! కాబట్టి ఈ సంతోష సమయమున దుఃఖించడం తగదు.'' అని అన్నాడు.

అప్పటికి పొద్దు కుంకింది. కృష్ణుడు పాంచజన్యమును, అర్జునుడు దేవదత్తమును, యుధిష్టిరుడు అనంత విజయము అను శంఖమును, భీమసేనుడు పౌండ్రము అను శంఖమును, నకుల సహదేవులు సుఘోష, మణిపుష్పకములను విజయ సూచకముగా పూరించారు. భేరీ మృదంగ నినాదములు మిన్నుముట్టాయి. అక్కడ ఉన్న వారందరూ విజయుడైన ధర్మరాజును పొగడ్తలతో ముంచెత్తారు. పాండవులు కౌరవ శిబిరములకు వెళ్లారు. వారితో కూడా సాత్యకి వెళ్లాడు.

ధృష్టద్యుముడు మొదలగు ప్రముఖ వీరులు, ద్రుపదుని దాయాదులు, ద్రౌపదీకుమారులు, మిగిలిన మహారాజులు అందరూ ధర్మరాజు వద్ద అనుజ్ఞ తీసుకొని సైన్య సమేతముగా తమ తమ శిబిరములకు వెళ్లారు. మరునాడు హస్తినాపురమునకు వెళ్లవలెనని నిశ్చయించుకున్నారు.

పాండవులు కౌరవుల శిబిరములు ప్రవేశించారు. నీ కుమారుని శిబిరము నిర్మానుష్యంగా ఉంది. నాటకము అయి పోయి, అందరూ వెళ్లిపోయిన తరువాత, నిశ్శబ్దముగా ఉన్న రంగస్థలి మాదిరి ఉన్నది. అక్కడ ఉన్న పరిచారికలు ధర్మజునకు స్వాగతం పలికారు. అతనిని గంధపుష్పాక్షతలతో సత్కరించారు. కుంతీకుమారులు రథం దిగుతున్నారు. ఆసమయంలో కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు.

“అర్జునా! నీ గాండీవము, అక్షయతూణీరము తీసుకొని ముందు

నీవురథం దిగు. తరువాత నేను దిగుతాను.” అని అన్నాడు. అలాగే అని గాండీవధారియై అర్జునుడు ముందు రథం దిగాడు. తరువాత శ్రీకృష్ణుడు పగ్గములను నొగలమీద పెట్టి తానూ రథం దిగాడు. రథము పైన ఉన్న కపిధ్వజము మీద ఉన్న ఆంజనేయుడు తన భూతగణముతో అక్కడి నుండి తొలగిపోయాడు. వెంటనే ఆ రథము భగా భగా మండిపోయింది. అది చూచి అర్జునుడు ఆశ్చర్యపోయాడు. రెండు చేతులు జోడించి “కృష్ణా! ఏమిటీ వింత!” అని అడిగాడు. దానికి కృష్ణుడు ఈ విధంగా చెప్పాడు.

“ అర్జునా! ఇప్పటిదాకా యుద్ధం లో గెలవడం నీ మహిమ అనుకుం టున్నావు. కర్ణుడి అస్త్ర శస్త్ర ధాటికి ఈ రథం ఎప్పుడో కాలిపోయింది. కాని ఇప్పటి దాకా నేను నొగల మీద, కపిధ్వజము మీద ఆంజనేయుడు ఉన్నాము. కాబట్టి ఈ రథము మండిపోకుండా ఇప్పటి దాకా నిలిచి ఉంది. ఆంజనేయుడు తొలగిపోయాడు. నేను రథం దిగాను. అందుకే కాలిపోయింది. ఇందులో వింత ఏమున్నది.” అని అన్నాడు.

కృష్ణుడు ధర్మజుని కౌగలించుకొని “ధర్మజా! నేను ఉపప్లావ్యమునకు వచ్చి నిన్ను కలిసినపుడు నీవు నాకు వస్త్రములు ఇచ్చి అర్జునుని నా చేతిలోపెట్టి, “వీడిని నీవు కాపాడాలి” అని అర్థించావు. నేనుకూడా దానికి ఒప్పుకున్నాను. ఇదుగో యుద్ధములో విజయుడై తిరిగి వచ్చిన నీ అర్జునుని నీకు క్షేమంగా అప్పగిస్తున్నాను. ఇకమీదట జరగవలసిన కార్యములు గురించి ఆలోచించు.” అని పలికాడు.

“అదేమిటి కృష్ణా! ఈ 18 రోజుల యుద్ధంలో నీవు మమ్ములను అనుక్షణం కాపాడక పోతే మేము ఈ యుద్ధసాగరమును దాటగలమా! నాడు వ్యాసుడు చెప్పనే చెప్పాడు. శ్రీకృష్ణుడు ఎక్కడ ఉంటాడో విజయం అక్కడే

ఉంటుంది అని. నీ కరుణ వలననే మాకీ విజయం సంప్రాప్తమయింది." అని అన్నాడు ధర్మరాజు.

"ధర్మజా! యుద్ధ ప్రారంభంలో అర్జునునికి యుద్ధం చెయ్యడం ఇష్టం లేదు. నిర్వేదంలో విషాదంలో ఉన్న అర్జునునికి గీత బోధించి రణోన్ముఖుని గా చేసాను. కాని ఇప్పటికీ అర్జునునికి ఈ యుద్ధం ఈ మారణకాండ ఇష్టం లేదు. కాని అతడు ఇంద్రుని కుమారుడు. ఏ పని చేయుటకైనా సమర్ధుడు. అర్జునునికి కోపం వస్తే ముల్లోకాలను తృటిలో నాశనం చెయ్యగలడు. కాబట్టి ఇందులో నేను చేసినది ఏమియు లేదు." అని అన్నాడు.

ఆ ప్రకారము అందరూ సరససల్లాపములతో తేలియాడారు. ధర్మరాజు అత్యధిక సంపదలు కలిగిన సుయోధనుని ధనాగారము అంతా స్వాధీనము చేసుకున్నాడు. మిగిలిన కౌరవ సేనలను చూచుకుంటూ ఉల్లాసంగా తిరుగుతున్నాడు. అప్పుడు కృష్ణుడు ధర్మరాజుతో "ధర్మనందనా! సుయోధనుడు లేని ఈ శిబిరము పాడుబడింది. అందువలన మనము ఇక్కడ ఉండటం మంచిది కాదు. వేరొక ప్రశాంత స్థలమునకు పోవుదము." అని అన్నాడు.

తరువాత శ్రీకృష్ణుడు పాండవులను, సాత్యకిని తనతో పాటు ఓఘవతి అను పుణ్యనదీ తీరమునకు తీసుకొని వెళ్లాడు. అక్కడ అందరూ విడిది చేసారు. ధర్మరాజుకు మనసులో భయం పట్టుకుంది. అర్జునుడు చేసిన సైగతో భీముడు అధర్మప్రవర్తనతో సుయోధనుడి తొడలు విరుగ గొట్టాడు. కాలితో తన్నాడు. ఈ విషయం సుయోధనుని తల్లి గాంధారి వినిన తనను శపించుట తథ్యము. కాబట్టి ఆమెను శాంతింపచేయాలి. ఆ కార్యమునకు తగిన వ్యక్తి శ్రీకృష్ణుడు అనుకొని అతనిని గాంధారి వద్దకు హస్తినాపురమునకు పంపాడు. ,

ధర్మజుని మాట మేరకు కృష్ణుడు హస్తినాపురమునకు వెళ్లాడు. తాను వచ్చినట్టు ధృతరాష్ట్రునకు వర్తమానం పంపాడు. ధృతరాష్ట్రుడు కృష్ణుని సాదరంగా లోనికి తీసుకురమ్మన్నాడు. కృష్ణుడు ధృతరాష్ట్రుని అంతఃపురమునకు వెళ్లాడు. కొడుకులను పోగొట్టుకున్న ధృతరాష్ట్ర, గాంధారిలను ఓదార్చడానికి అప్పటికే వ్యాసు డు అక్కడకు వచ్చి ఉన్నాడు.

వ్యాసుని చూచి కృష్ణుడు సంభ్రమంతో వ్యాసుని పాదములకు సాష్టాంగ ప్రణామం చేసాడు. పక్కనే ఉన్న ధృతరాష్ట్రునికి గాంధారికి నమస్కరించాడు. ధృతరాష్ట్రుని పక్కన నేలమీద కూర్చున్నాడు. ధృతరాష్ట్రుని చేతులు తన చేతులలోకి తీసుకొని ఆయనను ఓదారుస్తున్నాడు.

"మహారాజా! మీ వంశము అంతా నిష్కారణంగా నాశనం అయింది. ఇలాంటి పరిస్థితి కలగకూడదనే ఆనాడు పాండవులు నన్ను మీ వద్దకు దూతగా పంపారు. ఈ సంగతి నీకూ తెలుసు కదా! ఆ రోజు సంధి జరిగి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో మనసులో ఊహించు. మహారాజా! లోకంలో జూదము ఆడటం గెలవడం, ఓడటం సహజమే కదా! ఎక్కడన్నా అంతఃపురములో ఉన్న కుల కాంతలను, ఏక వస్త్రలను, సభ కీడ్చించి, వలువలూడ్పించి అవమానించుట కన్నామా! విన్నామా! కాని దానికీ పాండవులకు కోపం రాలేదు. ఆ మాటకొస్తే 12 ఏండ్లు అరణ్యావాసం చేసినా వారికి కోపం రాలేదు. అందుకే ఐదు మంది ఉండటానికి, మనిషికి ఒక ఊరు, ఇమ్మని అర్థించారు. నీ కుమారుడు లోభంతో, అహంభావంతో ఆ ప్రతిపాదన తిరస్కరించాడు. ఆ రోజు, విదురుడు, ఇంకా బంధు మిత్రులుకూడా చెప్పారు కదా. కాని నీవు కాని, సుయోధనుడు కాని వారి మాటలు వినలేదు. కాలోపహతులు మంచి మాటలు వినరు కదా. ఇప్పుడు దానిని గురించి ఆలోచించడం అనవసరం.

ఎందుకంటే విధి నిర్ణయం ఎవరూ ఆపలేరు.

ధృతరాష్ట్ర మహారాజా! పాండవులు  కల్మషంలేని మనసు కలవారు. జరిగిన దానికి మీరు, వారి మీద కోపగించవలదని వేడుకుంటున్నాను. ప్రస్తుతం మీ కుమారులందరూ గతించారు కాబట్టి మీకు, గాంధారికి అంత్యక్రియలు చేయవలసిన వారు పాండవులే. అందుకని వారి శుభం మీరు కోరుట మంచిది. మీ మనసులకు ఎంతో కష్టం కలిగిందని ధర్మరాజు ఎంతో దుఃఖిస్తున్నాడు. తన మనోభావములను మీకు తెలుపమని నన్ను పంపాడు." అని అన్నాడు శ్రీకృష్ణుడు.

తరువాత గాంధారిని చూచి "అమ్మా గాంధారీ!  నీకు సాటి వచ్చు రాజమాతను ఈ భూమిలో నేను చూడలేదు.  లేకపోతే నాడు నిండుసభలో రాజలోకము సర్వము వినుచుండ నీ కుమారుడు సుయోధనునికి బుద్ధి చెప్పడానికి  ప్రయత్నిస్తావా!  నాడు నీవు సుయోధనునికి చెప్పిన మాటలు నా చెవుల్లో  ఈరోజుకు కూడా గింగురుమంటున్నాయి. కాని నీ కుమారుడు లోక విరుద్ధముగా నీ మాటలు పెడచెవిని పెట్టాడు. తనకు ఏది మేలో ఏది కీడో తెలుసుకోలేకపోయాడు. నాడు సుయోధనుడు నీ మాటలు విని అభిమానంతో తృళ్లిపడకుండా, కొంత రాజ్యము పంచి ఇచ్చిన, ఈనాడు ఇంత దాకా రాదు కదా!  నీవు ఆనాడే కీడు జరుగుతుంది అని చెప్పావు. అలాగే జరిగింది. ఇందులో పాండవుల తప్పు ఏమీ లేదు అని నీకు తెలుసు. పాండవుల మీద కోప పడవద్దని నేను వేడుకుంటున్నాను.  ఎందుకంటే నీవు కోపంతో చూస్తే చాలు ముల్లోకములు భస్మం అవుతాయి. అంతటి తపశ్శాలివి నీవు. అందుకని నిన్ను ప్రార్థిస్తున్నాను."  అని అన్నాడు.

అప్పుడుగాంధారి ఇలా అంది. "దాందేముందిలే కృష్ణా! అంతా నీవు

చెప్పినట్లే జరిగింది కదా! ఇంతవరకూ నా కుమారుల మరణములకు దుఃఖిస్తున్న నాకు, అమృతోపమానమయిన నీ పలుకులు ఊరట కలిగించాయి. కృష్ణా! ఈ రాజు అంధుడు. దీనుడు. వృద్ధుడు. ఈయనను నీవు, పాండుకుమారులు కాపాడాలి." అని గాంధారి తన పైట చెరగును ముఖానికి కప్పుకొని ఏడ్చింది. కృష్ణుడు ఆమెను, ధృతరాష్ట్రుని తగు విధంగా ఓదార్చాడు.

ధృతరాష్ట్ర మహారాజా! జరిగిన దానికి బాధపడవలదు. అశ్వత్థామ మిగుల కోపిష్ఠి. అతను పాండవులకు ఏమి కీడు తలపెడతాడో అని భయంగా ఉంది. నేను వెళ్లివస్తాను" అని అన్నాడు.

దానికి ధృతరాష్ట్రుడు "త్వరగావెళ్లవయ్యా కృష్ణా!పాండవులను కంటికి రెప్పలా కాపాడటం నీ ధర్మం కదా! వారు నిన్ను వెయ్యివిధాలుగా ఆశ్రయించారు. వారి ఆశ్రయాన్ని నీవు సఫలం చెయ్యాలి కదా. వెళ్లు. మరలా కనిపించు." అని అన్నాడు. వారి వద్ద సెలవు తీసుకొని కృష్ణుడు ధర్మరాజు వద్దకు వెళ్లాడు.

వ్యాసుడు కూడా గాంధారీ ధృతరాష్ట్రులతో ఇలా అన్నాడు. "మహారాజా! గాంధారీ! ప్రస్తుతము కృష్ణుడు మీ శోకోపశమనము కొరకు పలికిన పలుకులు మీరు ఆదరించతగ్గవి." అని వారిరువురినీ తగుమాటలతో ఓదార్చి అక్కడి నుండి వెళ్లిపోయాడు.

హస్తినాపురమునుండి బయలు దేరిన శ్రీకృష్ణుడు అతి త్వరితముగా ఓఘవతీ నదీ తీరమును చేరుకున్నాడు. అక్కడ విడిది చేసి ఉన్న పాండవులను కలుసుకున్నాడు. హస్తినాపురమునందు జరిగినది అంతయూ ధర్మరాజుకు

వివరించాడు.” అని వైశంపాయనుడు జనమేజయునకు వివరించాడు. వైశంపాయనుడు భారత కథను ఇంకా ఇలా చెప్పసాగాడు. జనమేజయ మహారాజా! ధృతరాష్ట్రుడు సంజయునితో ఇలా అన్నాడు.

“సంజయా! భీమసేనుడు నా కుమారుడు సుయోధనుని తొడలు విరుగగొట్టిన తరువాత ఏమిజరిగింది. నా కుమారుని గతి ఏమయింది చెప్పు” అని అడిగాడు. అప్పుడు సంజయుడు ధృతరాష్ట్రునితో ఇలా చెప్పసాగాడు.

“మహారాజా! భీమసుయోధనుల గదాయుద్ధమును నేను పక్కనే ఉన్న పొదలలో కూర్చుని చూచాను. పాండవులు వెడలిపోగానే నేను వెలుపలికి వచ్చాను. సుయోధనుని వద్దకు వెళ్లాను. సుయోధనుడి మొహం అంతా ధూళితో నిండి ఉంది. మొహం మీద పడ్డ వెంట్రుకలు పక్కకు తోసుకొని కన్నుల నీరు నింపుకొని నన్ను చూచి ఇలా అన్నాడు.

“సంజయా! చతుస్సముద్రవేలావలయుత ధరణీతలంబంతయు ఏకచ్ఛత్రాధిపత్యముగా పరిపాలించిన సుయోధన సార్వభౌమునికి ఎంతటి దుర్గతి పట్టినదో చూచావా! పదకొండు అక్షౌహిణీలసైన్యమునకు అధిపతిని. నా సామంత రాజులందరూ నాకు అణిగిమణిగి ఉన్నారు. అంతటి వైభవమును అనుభవించిన నేను ఎలా ఉన్నానో చూడు! లోక నిందకైనను వెరవక భీముడు గదాయుద్ధమున నియమములను అతిక్రమించి నన్ను తొడల మీద గదతో మోది పడదోసాడని మనవాళ్లందరికీ చెప్పు. నాడు భీష్ముని, ద్రోణుని, కర్ణుని, భూరిశ్రవసుని అక్రమంగా చంపారు. నేడు నన్ను భీముడు అధర్మయుద్ధంలో చంపాడు. అదీ ఒక విజయమేనా! దీనికి లోకులు పాండవులను, పురుగులు పడిపోతారని, తిట్టరా! పాండవులకు ఇది వృధా విజయం కాక మరేమున్నది. అధర్మంగా నన్ను కూలదోసిన భీముడు ఏం బాగుపడతాడు లే! మరొక

విషయం సంజయా! నన్ను అధర్మయుద్ధంలో కూలదోసింది చాలక భీముడు నా తలను తన వామపాదంతో తన్నాడు. దీనిని లోకులు మెచ్చుతారా! నేను రారాజుగా ఉన్నప్పుడు నన్ను తృణీకరించారు. నేను పడిపోగానే కాలుతో తన్నారు. ప్రజలు దీనిని గర్హింపరా! నేను ఎన్నో యజ్ఞాలు యాగాలు చేసాను. అడిగిన వారికి లేదనకుండా ఎంత మందికో దానాలు చేసాను. వారిని శ్రీమంతులను చేసాను. విప్రులకు అగ్రహారాలు ఇచ్చి ఆదరించాను. నా బాహు బలంతో ఈ రాజ్యాన్ని సుభిక్షంగా ప్రజారంజకంగా పరిపాలించాను. ఇదిగో ఈ శమంతక పంచకములో మరణిస్తున్నాను. పుణ్యలోకములకు పోతాను. నా గురించి నాకు ఎలాంటి చింత లేదు. పాండవులే నన్ను అధర్మయుద్ధములో గెలిచి రాజ్యము కైవసము చేసుకున్నారు. నీకు అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ కనపడితే, జరిగినది అంతా వారికి విశదంగా నా మాటగా చెప్పు. పాండవులు అందరూ అనుకున్నట్టు ధర్మాత్ములు కారు. వారు అసత్యవాదులు. అధర్మపరులు. ధర్మము అనే ముసుగును ధరించి లోకమును మోసము చేస్తున్నారు. వారిని ఎన్నటికీ నమ్మరాదు.” అని పలికాడు.

ఇంతలో చుట్టు పక్కల జనపదములలో ఉన్న వారు.ముని ఆశ్రమము లలో ఉన్న ముని కుమారులు, సుయోధనుని చూడడానికి వచ్చారు. వారితో పాటు రధికత్రయమైన అశ్వత్థామ, కృపాచార్యుడు, కృత వర్మ కూడా అక్కడకు వచ్చారు. సుయోధనుని ఆ స్థితిలో చూచి కన్నీరు మున్నీరుగా విలపించారు.

అశ్వత్థామ సుయోధనుని చూచి “రారాజా! ఎల్లప్పుడు పలువురు రాజన్యులు నీ చుట్టు చేరి నిన్ను ప్రశంసిస్తూ ఉంటారు కదా! ఇప్పుడెందు కయ్యా ఒంటరిగా ఉన్నావు! కురుసామ్రాజ్య సింహాసనము అధిష్టించిన నీవు కటిక నేల పడి ఉండమని ఆ విధాత నీ నుదుటను రాసాడా రారాజా!

రారాజా! నీ బలము. నీ శౌర్యము ఎక్కడు పోయాయి! నీ సైన్యాధి పతులందరూ ఏమయ్యారు ఒక్కరూ నిన్నుచూడ్డానికి రాలేదా రారాజా! రారాజా! సేవకులు నీకు అహర్నిశముపట్టు ఆ పట్టు గొడుగులేవి! అయ్యో! ఇలా ధూళిలో పడి ఉన్నావేమయ్యా! నీ ఒళ్లంతా దుమ్ము కొట్టుకొని ఉన్నదయ్యా! పన్నీటి జలకాలు ఎందుకు ఆడవు సుయోధనా! భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు నీ పక్కన ఆసీనులయి ఉండగా, దుశ్శాసనుడు, వికర్ణుడు నీ కంటి వెలుగులై ఉండగా, అష్టైశ్వర్యములు అనుభవించిన నిన్ను ఆ రాజు లందరూమరిచినారా! ఒక్కరూ రారేమి రారాజా! రారాజా! నీ పట్ల లక్ష్మీదేవి చంచల మైనదయ్యా. విధి నీ పట్ల క్రూరంగా ప్రవర్తించింది. నేనేం చెయ్యను రారాజా!" అని విలపిస్తున్నాడు అశ్వత్థామ.

అశ్వత్థామను చూచి సుయోధనుడు ఇలా అన్నాడు. "గురుపుత్రా! నీవెరుగనిది ఏమున్నది! మనుజుల విధివిధానములు ఆ బ్రహ్మ సృష్టించినవే కదా: సుఖ దుఃఖములు వస్తుంటాయి పోతుంటాయి. మనం అన్నింటినీ సమంగా చూడాలి. నా బంధువులు మిత్రులు, మహా వీరులు అందరూ యుద్ధంలో మరణించినప్పుడు నేను ఒక్కడిని బతికి ఉండటం భావ్యమా! నా బాహు బలము, నా వీరత్వము, నా ధైర్యము సడలిపోగా, నా శత్రువులు ఈ ప్రకారము నన్ను పడదోసారు. నాకు సద్గతి కలిగించారు. అదియును కాక, శత్రువుల పాల బడకుంటా మీరు ముగ్గురూ నా కంటపడటం నాకు ఎంతో ఆనందంగా ఉంది." అని పాండవులు అక్కడకు వచ్చినప్పటినుండి జరిగిన విషయములు సవిస్తరముగా వారికి వివరించాడు. అది విని అశ్వత్థామ కోపంతో ఊగిపోయాడు.

రారాజా! నా తండ్రిని అర్జునుడు అధర్మంగా వధించినపుడే నా గుండెలు మండిపోయాయి. ఇప్పుడునిన్నుకూడా అక్రమంగా, అధర్మంగా పడదోసారు.

ఆ పాండవుల నందరినీ నా అస్త్రములతో దగ్ధం చేయకున్న నేను బతికి ఉండటం వ్యర్థము. రారాజా! సుయోధనా సార్వభౌమా! నేను సత్యం పలుకుతున్నాను! పాండవులను పాంచాలురను, వారి వారి బంధుమిత్రులను కృష్ణుడు చూస్తూ ఉండగా నేను వధిస్తాను. ఇదేనాప్రతిజ్ఞ. నన్ను ఆజ్ఞాపించండి." అని సుయోధనుని ముందు మోకరిల్లాడు.

సుయోధనుని మనసు ఆహ్లాదంతో నిండిపోయింది. "కృపాచార్యా వెంటనే పుణ్యాజలములు తెప్పించండి." అన్నాడు. వారిని చూడటానికి వచ్చిన ముని కుమారులను అడిగి పుణ్యాజలములు తీసుకొని వచ్చాడు కృతవర్మ. అప్పుడు సుయోధనుడు కృపాచార్యుని చూచి "కృపాచార్యా! మీరు వెంటనే అశ్వత్థామను కౌరవ సేనకు సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించండి. అశ్వత్థా పుట్టుకతో బ్రాహ్మణుడైనా, రారాజు కోరికమేరకు యుద్ధం చెయ్యడం పరమ ధర్మము. అశ్వత్థామను అభిషేకించండి." అని కోరాడు.

కృపాచార్యుడు పుణ్యాహవాచన మంత్రములు, అభిషేక మంత్రములు చదివి అశ్వత్థామను కౌరవ సైన్యమునకు సర్వసైన్యాధ్యక్షునిగా అభిషేకించాడు. తనకు దక్కిన గౌరవానికి అశ్వత్థామ పొంగిపోయాడు. రారాజు ఆదర పూర్వకముగా గుండెలకు హత్తుకున్నాడు. వెంటనే పైకి లేచి సింహనాదం చేసాడు. "రారాజా! పాండవులను సమూలంగా నాశనం చేసి మీ దర్శనం చేసుకుంటాను." అని పలికాడు. కృతవర్మ, కృపాచార్యుడు వెంటరాగా, పాండవ శిబిరముల వంక వెళ్లాడు. అక్కడ జరిగిన విషయములన్నీ సంజయుడు ధృతరాష్ట్రునికి తెలిపాడు అని వైశంపాయనుడు జనమేజయునికి వివరించాడు.

మహాభారతము శల్య పర్వము ద్వితీయాశ్వాసము సమాప్తము.

శల్య పర్వము సర్వం సమాప్తము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహా భారతము

## సౌప్తిక పర్వము

### ప్రధమాశ్వాసము

వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుకు చెప్పిన మహా భారత కధను నైమిశారణ్యములో సత్రయాగ సందర్భములో సూతుడు అను పౌరాణికుడు శౌనకాది మహా మునులకు ఈ విధంగా చెప్పాడు.

ధృతరాష్ట్రుడు సంజయుని చూచి "సంజయా! నా కుమారుని వద్దనుండి బయలు దేరిన అశ్వత్థామ మొదలగు రథిక త్రయము అక్కడి నుండి ఎక్కడకు వెళ్లారు? ఏమి చేసారు. వివరంగా చెప్పు." అని అడిగాడు. సంజయుడు ఇలా చెప్పసాగాడు.

" మహారాజా! అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మలు తమ తమ రధముల మీద దక్షిణ దిక్కుగా ఉన్న పాండవ శిబిరముల వంకకు బయలు దేరారు. ఆ సమయంలో పాండవ శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివిరు స్తున్నాయి. అందరూ ఆడుతూ పాడుతూ సంతోషాంబుధిలో తేలియాడు తున్నారు. ఆ సమయంలో అక్కడకు పోతే వారి చేతిలో చావు తప్పదని రథిక త్రయము అక్కడి నుండి తూర్పుదిక్కుగా వెళ్లారు. కొంత దూరముపోయి ఒక కొలను వద్ద ఉన్న మర్రిచెట్టు కింద రధములు దిగారు. సాయం సంధ్యలు నిర్వర్తించారు. ఇంతలో చీకట్లు కమ్ముకున్నాయి. వారు ముగ్గురూ నేల మీద శయ్యలు ఏర్పాటుచేసుకొని మేను వాల్చారు.

కృపాచార్యుడు కృతవర్మ నిద్రపోయారు. కాని అశ్వత్థామకు నిద్ర పట్ట

లేదు. దిక్కులు చూస్తూ కూర్చున్నాడు. ఆ మర్రి చెట్టుమీద ఎన్నో కాకులు గూళ్లు కట్టుకొని ఉన్నాయి. ఆ గూళ్లలో ఎన్నో కాకి పిల్లలు నిద్రిస్తూ ఉన్నాయి. ఆ సమయములో ఒక గుడ్లగూబ ఆ చెట్టుమీదవాలింది. గుడ్లగూబ కాకి గూళ్లను చూచింది. మెల్ల మెల్లగా చప్పుడు చేయకుండా ఆ కాకి గూళ్లను సమీపించింది. ఆ గుడ్లగూబ కొన్ని కాకుల పీకలు కొరికింది. మరి కొన్నింటిని కాళ్లు చేతులు విరుగగొట్టింది. కొన్నింటి రెక్కలు విరిచింది. వాటిపొట్టలు చీల్చింది. ఆ ప్రకారంగా ఆ ఉలూకము నిద్ర పోతున్న ఆ కాకులను అత్యంత వేగంగా చంపింది.

ఇది అంతా చూచాడు అశ్వత్థామ. అతని మెదడులో ఒక మెరుపులాంటి ఆలోచన తళుక్కుమని మెరిసింది. "ఆహా! నిద్రపోవునపుడు శత్రుసంహారం చెయ్యమని ఈ ఉలూకము నాకు చక్కని ఉపదేశమిచ్చినది. నేనుకూడా ఇదే విధంగా పాండవులను,పాంచాలురను నిద్రించు సమయమున దారుణంగా వధిస్తాను. పాండురాజు కొడుకులను, వారి కొడుకులను బంధు మిత్ర సమేతంగా వధిస్తానని కౌరవాధినాధునకు మాట ఇచ్చాను. ఇది నెరవేరాలంటే ఇది ఒకటే మార్గము. నేను ఒక్కడిని ఎలాంటి సైన్య సహాయమూ లేకుండా అత్యంత పరాక్రమ వంతులైన వారినం దరినీ సంహరించలేను. అది మంచిదికాదు.

ఏం మాత్రం సందేహించకుండా పాండవ శిబిరములు ప్రవేశించి ఆదమరిచి నిద్రబోవు పాండవులను, పాండవ పుత్రులను, వారి బంధు మిత్రులను, తుదముట్టిస్తాను. ఆ పని ఈరోజే చేయాలి. ఎప్పుడో చేసి ఏమి ప్రయోజనము. రారాజు మేనిలో ప్రాణములుండగనే అపాండవం చేసిన యెడల రారాజు నిశ్చింతగా కన్నుమూస్తాడు. పాండవులను వారి బంధు మిత్రులను ఎలా చంపాలా అని ఆలోచిస్తున్న నాకు ఈ ఉలూకము

కర్తవ్యోపదేశము చేసినది.

ఈసమయములో ధర్మాధర్మ విచక్షణ పనికిరాదు. శత్రు సంహారము చేయునపుడు అధర్మం అని తలపక ఉపాయంతో కార్యం నెరవేర్చవలెను. అది శాస్త్రసమ్మతం కూడా. శత్రురాజులమీద దండెత్తినపుడు, శత్రురాజులు విడిది చేసినపుడు, శత్రువులు ఇరుకు దారిలో వెళుతున్నపుడు, నిద్రించునపుడు శత్రువుల మీద పడి చంపడం శాస్త్రసమ్మతమని పెద్దలు చెపుతారు కదా! పైగా నేను క్షాత్రధర్మమును అంగీకరించాను. కాబట్టి నేను ఇలా చెయ్యడం తప్పుకాదు.

అదియును కాక, పాండవులు, భీష్ముని, ద్రోణుని, కర్ణుని చంపునపుడు ధర్మము పాటించి చంపారా! వారుఅధర్మము ను ఆశ్రయించినపుడు నేను మాత్రం ధర్మంగా ఎందుకు ప్రవర్తించాలి. కాబట్టి కల్మషహృదయులగు పాండవులను, వారి బంధుమిత్రులను నిద్రపోవునపుడు చంపడం రణ నీతి కాని నిందార్హము కాదు." అని తనలో తాను నిశ్చయించుకున్నాడు అశ్వత్థామ.

వెంటనేతన మేనమామ అయిన కృపాచార్యుని, కృతవర్మను మే ల్కొలిపాడు.

"మిత్రమా కృతవర్మా! మామా కృపాచార్యా! రారాజును ఒక్కడిని చేసి ఆ పాండవులు అధర్మంగా అతనిని కూలదోసారు. పదకొండు అక్షౌహిణీల సైన్యమునకు అధిపతి అతి దీనుడై నేలమీద పడి ఉన్నాడు. ఆ పాపాత్ముడు భీమసేనుడు రారాజును కాలితో తలమీద తన్నాడు. మనము ఇంతమంది ఉండీ రారాజు దిక్కులేని వాడయ్యాడు. మనం ఈ సమయములో ఏమి చెయ్యాలో ఆలోచనచెయ్యండి." అని అన్నాడు.

దానికి కృపాచార్యుడు "అశ్వత్థామా! నీ మనసులో ఏమున్నదో మాకు తెలియచెయ్యి. అప్పుడు మేము మాకు తోచిన ఉపాయము చెపుతాము. కాని నేను చెప్పు నాలుగు మాటలు విని నీ అభిప్రాయం చెప్పు.

ఏ పని ప్రారంభించడానికైనా పురుషప్రయత్నము, దైవసహాయము, రెండూ తప్పకుండా కావాలి. ఏ ఒక్కదానితో కూడా పని సానుకూలపడదు. దైవం అనుకూలించి వర్షము కురిసినా, రైతు నేలలో విత్తనములు వేయని ఎడల పంట పండదు. అలాగే రైతు నేలలో విత్తనములు నాటినను, దైవము అనుకూలించి వర్షము కురిపించని ఎడల, పంట పండదు. కాబట్టి, పురుష ప్రయత్నము, దైవ సాయము తప్పకుండా అవసరము.

ధర్మం తప్పకుండా చేసే ఏపని కైనా దైవసాయము ఉంటుంది. ఆ పని సానుకూలమవుతుంది. అధర్మంతో చేయుపనులు ప్రారంభంలో మంచి ఫలితమును ఇచ్చినా, కాలక్రమములో అవి ఆ వ్యక్తిని బాధిస్తాయి. మన సుయోధనుని విషయంలో ఇదే జరిగింది. సుయోధనుడు మొదట్లో వివేకము కోల్పోయి, క్రోధము, మోహము మనసులో గూడు కట్టుకొనగా, దురభి మానంతో, ఎన్నిచెప్పినా వినకుండా పాండవులను ద్రౌపదిని పరాభవించాడు. దానికి ఫలితం అనుభవిస్తున్నాడు. కాబట్టి ధర్మము తప్పకుండా మనము కార్యము నెరవేర్చాలి.

ఇప్పుడు మనం అందరం ధృతరాష్ట్రుని వద్దకు వెళదాము. అతనికి గాంధారికి పరిస్థితులు తెలియచేసి వాళ్లు ఏమి చెబితే దానిని ఆచరిద్దాము. పైగా అక్కడ విదురుడు కూడా ఉంటాడు. వారి చెప్పిన మాట ధర్మబద్ధము అవుతుందేకాని ధర్మవిరుద్ధము కాదు. కాబట్టి బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకో" అని అన్నాడు కృపాచార్యుడు.

మామా! ధర్మము దేశ కాలమాన పరిస్థితులను బట్టి మారుతుంటుంది. ఒకడు ధర్మము అనుకొన్నది మరొకడికి అధర్మం కావచ్చు. పేదవాడుగా ఉన్నప్పుడు ధర్మం అనిపించింది, ధనవంతుడైనపుడు అదే అధర్మంగా అనిపించవచ్చు. కాబట్టి నేను నమ్మినదే ధర్మం. దానిని నేను నా మరణానికి కూడా భయపడకుండా ఆచరిస్తాను.

నేను బ్రాహ్మణ వంశంలో పుట్టాను. నా దౌర్భాగ్యం కొద్దీ విల్లు పట్టాను. క్షాత్రం అవలంబించాను. ఇంత కాలం తరువాత మరలా నేను బ్రాహ్మణ్యం వంక మరలడం నాకు చేతకాదు. నా తండ్రిని, అస్త్రసన్యాసం చేసిన వాడిని, ఒకడు దారుణంగా చంపాడు. వాడింకా బతికే ఉన్నాడు. నా తండ్రిని చంపిన వాడు బతికి ఉండగా నేను మనశ్శాంతితో ఎలా ఉండగలను. ఈ రోజు, నా తండ్రిని చంపిన దుర్మార్గుడితో సహా అందరినీ హతమారుస్తాను. దానికి ఒక ఉపాయం ఆలోచించాను.

నా శత్రువులు అందరూ విజయ గర్వంతో ఆనందోత్సాహాలలో తేలియాడి అలసి సొలసి గాఢంగా నిద్ర పోతున్నారు. వారిని సంహరించడానికి ఇదేసమయం. పైగా మనం బతికి ఉన్నామని వాళ్లకు తెలియదు. నేను వచ్చి వారిని వధిస్తానని వాళ్లు ఊహించి ఉండరు. ఏమరుపాటున ఉన్న శత్రువుల మీద విరుచుకు పడతాను. వారి పీకలను కోసి దారుణంగా చంపుతాను. వారి శిబిరములను పీనుగుల పెంట చేసి భూతములకు ఆహారంగా వేస్తాను. నా తండ్రిని చంపిన వాడి అవయవాలు ఆ పీనుగుల పెంటల మధ్య చచ్చి ఏనుగులు, హయముల కళేబరముల మధ్య చెల్లాచెదురుగా పడి ఉండటం నేను కళ్లారా చూడాలి.

మామా! ఇదే నా శపథం. ఆ నీచుడు ధృష్టద్యుమ్నుని పీక పటు ్టకుంటాను. వాడి మదం అణుస్తాను. వాడిని అస్త్ర శస్త్రములతో చంపను. వాడిని పశువును చంపినట్టు చంపుతాను. పాండవులను, పాండవ సుతులను నా ఇష్టం వచ్చినట్టు అత్యంత దారుణంగా వధిస్తాను. వారి రక్తంతో నా తండ్రికి పితృతర్పణం విడుస్తాను. ఇదే నా ప్రతిజ్ఞ. నాప్రస్తుత కర్తవ్యం." అని అన్నాడు అశ్వత్థామ.

అశ్వత్థామ చెప్పినది అంతా శాంతంగా విన్నాడు కృపాచార్యుడు. "అశ్వత్థామా! నీకు అపకారం చేసిన వాడికి తిరిగి అపకారం చెయ్యాలి అని అనుకోడంలో తప్పులేదు. దానికి నీవు ఒక పద్ధతి అవలంబిస్తున్నావు. దానికీ అభ్యంతరం లేదు. మేము కూడా నీతోపాటు ఉండి నీ ప్రయత్నంలో పాలుపంచుకుంటాము. కాని మనం ముగ్గురం బాగాఅలసిపోయి ఉన్నాము. ఈ రాత్రికి విశ్రాంతి తీసుకొని రేపు ఉదయమే మన ప్రయత్నం ప్రారంభిస్తాము. నీవు ద్విగుణీకృతోత్సాహంతో శత్రువులను గెలుస్తావు. నీవు యుద్ధభూమిలో నిలబడితో నిన్ను గెలువ గలవాడు ఎవ్వడూ లేడు. ఇంక నా సంగతి నీకు తెలుసు. ఈ కృతవర్మ అత్యంత బలాఢ్యుడు. అస్త్రశస్త్రకోవిదుడు. శౌర్యవంతుడు.

కాబట్టి ప్రస్తుతానికి ఆ కవచము తొలగించి హాయి విశ్రాంతి తీసుకో. రేపు ఉదయం మనం ముగ్గురం పాండవుల మీద యుద్ధానికి వెళదాము. మనం వాళ్లను చంపడమో, వారి చేతిలో చావడమో ఏదో ఒకటి జరుగుతుంది. అంతేగాని  ఒట్టి చేతులతో రాము కదా!" అని అన్నాడు కృపాచార్యుడు.

" కృపాచార్యా!  ఈ లోకంలో కోపంతో ఉన్నవాడికీ, డబ్బు సంపాదనలో పడ్డ వాడికీ, వ్యాధితో బాధపడుతున్నవాడికీ, కామంతో కళ్లుమూసుకుపోయిన

వాడికి నిద్రపడుతుందా. నా శరీరం కోపంతో దహించుకుపోతూ ఉంది. నా తండ్రి మరణాన్ని తలుచుకొని నా గుండెలు రగులుతున్నాయి. శత్రువులను చంపి నా స్వామి సుయోధనుని ఋణం తీర్చుకోవాలి. అంతదాకా నాకు నిద్రరాదు.

పగలు మనము పాండవులను ఎదిరించి నిలువలేము. వారికి అర్జునుడు, కృష్ణుడు అండగా ఉంటారు. కాబట్టి ఈ రాత్రి పూటనే శత్రు సంహారం కావిస్తాను. దయచేసి నన్ను వారించకండి. ఈ రాత్రి నేను పాండవులు, వారి బంధుమిత్రులు, సైనికులు గాఢ నిద్రలో ఉండగా వారి మీద దాడి చేసి దారుణంగా వధిస్తాను. ఇది నా నిశ్చయము. వారి నందరినీ చంపి ఆ విషయము రారాజు సుయోధనునికి చెప్పి ఆవల సుఖంగా నిద్రిస్తాను." అని అన్నాడు అశ్వత్థామ.

"అశ్వత్థామా! కోపంతో ఉన్నవాడికి కార్యాకార్య విచక్షణ తెలియదు. ప్రస్తుతము నీవు అదేస్థితిలో ఉన్నావు. ధర్మాధర్మములు ఎరుగకున్నావు. కాబట్టి ధర్మమార్గాన నడువు. నీకు మేలు కలుగుతుంది. కాబట్టి కోపము, క్రూరత్వము, విడిచి  నా మాటలు సావధానంగా విను.

నిద్రించుచున్నవారిని, ఆయుధములు విడిచిన వానిని, వాహన వైకల్యముపొందిన వానిని, శరణు చొచ్చిన వానిని, జుట్టు ముడి వీడిన వాడిని (అనగా కిరీటం కిందపడిన వాడిని,) వధించడం ధర్మము కాదు. ఈ సమయములో పాండవుల సమస్త సైన్యము,  పాండవులు, పాంచాలురు, గాఢంగా నిద్ర పోతున్నారు. నిద్రపోయే మనిషి చచ్చిన వాడి తో సమానము. చచ్చిన వారి మాదిరి పడి ఉన్న వారిని చంపి నరకమునకు ఏల పోయెదవు. మహాస్త్ర కోవిదులలో, మహా రధులలో ప్రధముడవు. అలాంటి నీవు ఇలాంటి నీచ

కార్యమునకు ఒడబడెదవా! కాబట్టి రేపు ఉదయము మనము పాండవులతో యుద్ధం చేద్దాము.” అని అన్నాడు కృపాచార్యుడు.

“ మామా! కృపాచార్యా! నీవు పెద్దవాడవు. నన్ను శాసింప దగ్గ వాడవు. నీవు చెప్పినది అంతా సత్యము. కాని నేను చెప్పేది కూడా వినండి. అందరు రాజులు చూస్తూ ఉండగా నా తండ్రిని, అస్త్రసన్యాసము చేసిన వానిని, పాంచాల రాజకుమారుడు, ధృష్టద్యుమ్నుడు, అది పాతకము అని కూడా తలపకుండా నా తండ్రి జుట్టు పట్టుకొని, తల నరికాడు. శిఖండిని అడ్డం పెట్టుకొని భీష్ముని అర్జునుడు పడగొట్టాడు. భూమిలో రథ చక్రము కూరుకుపోగా, దానిని ఎత్తుకొనుచున్న కర్ణుని చంపాడు అర్జునుడు. అర్జునుడు భూరిశ్రవసుని చెయ్యి నరికిన తరువాత, అతడు ప్రాయోపవేశం చేసాడు. ప్రాయోపవేశం చేస్తున్న భూరిశ్రవసుని సాత్యకి అతి దారుణంగా చంపాడు.

ఇదంతా ఎందుకు. ఎక్కడో మడుగులో దాక్కున్న రారాజును బయటకు లాగి అందరూ చుట్టుముట్టి, భీమసేనుని పురికొల్పి అధర్మంగా అతని తొడలు విరుగగొట్టి పడగొట్టారు. ఇన్ని విధాలుగా యుద్ధ ధర్మాలను అతిక్రమించిన వారిని, యుద్ధధర్మము అనే వంతెనను కూల్చిన వారిని, వదిలిపెట్టి, నన్ను మాత్రం ధర్మం గా నడవ మనడం న్యాయంగా ఉందా మామా!

మామా! తొడలు విరిగి నేలమీద పడి ఉన్న రారాజు నన్నుచూచి దీనంగా పలికినపలుకులు నువ్వు వినలేదా! నీకు కోపం రాలేదా! అందుకనే మామా! నేను చేసేది అధర్మమైనా నేను బాధ పడను. నా తండ్రిని అధర్మంగా చంపిన ధృష్టద్యుమ్నుని అధర్మమార్గంలోనే చంపుతాను. దాని వలన నేను కీటకంగా జన్మించినా బాధపడను. ఇది నా నిశ్చయము. నన్ను ఆపడం ఎవరి తరమూ కాదు.” అని అంటూనే రథం ఎక్కాడు అశ్వత్థామ.

" అశ్వత్థామా! నువ్వూ, నేనూ, ఈ కృతవర్మా, అందరం ఒకే పని మీద బయలుదేరాము. అటువంటప్పుడు మమ్ములను వదిలి నీవు ఒంటరిగా వెళ్లడం భావ్యమా! మేముకూడా నీతో వస్తాము." అని కృపచార్యుడు కృతవర్మలు కూడాతమ తమ రథాలు ఎక్కారు.

"చాలా సంతోషం మామా! నేను వెళ్లి నా తండ్రిని చంపిన వాడిని తుద ముట్టిస్తాను. మీరు కూడా నా తో వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది నాతో పాటు త్వరగా రండి." అన్నాడు అశ్వత్థామ తన రథమును ముందుకు నడుపుతూ.

ఈ ముఫ్వురు రథికులూ పాండవులు విడిది చేసి ఉన్న స్కంధావారముల వైపు సాగిపోయారు. అశ్వత్థాము ముందుకు దూసుకు పోతున్నాడు. కృపాచార్యుడు కృతవర్మ వెనక బడ్డారు. ఆ సమయమున ఒక భయంకరమైన భూతం అశ్వత్థామ ఎదురుగా వచ్చి నిలిచింది. అశ్వత్థామ ఆ భూతానికి బెదరకుండా దాని మీద అస్త్ర శస్త్ర ములు ప్రయోగించాడు కాని వాటినన్నింటినీ ఆ భూతం తన నోరు తెరిచి మింగేసింది. అశ్వత్థా మ వద్ద ఉన్న అస్త్ర శస్త్ర ములు అన్ని అయిపోయాయి. అశ్వత్థామకు ఏమీ తోచలేదు. తన ఒరలో నుండి ఖడ్గము తీసి ఆ భూతాన్ని ఎదుర్కొన్నాడు. కాని ఆ కత్తి భూతాన్ని తాకగానే మాడి పోయింది. అశ్వత్థామ తన వద్దనున్న తోమరములను, చక్రాయుధ ములను ఆ భూతము మీదికి విసిరాడు. కాని అవన్నీ ఆ భూతానికి తగిలి తునా తునకలయ్యాయి. అశ్వత్థామ తన గదను దానిమీదికి విసిరాడు. ఆ భూతం ఆ గదను మింగేసింది.

వెనుకకు చూచాడు. కృపాచార్యుడు, కృతవర్మ కనుచూపు మేరలో లేరు. కృపాచార్యుని మాటలు వినకుండా ముందుకు దూకినందుకు తగినశాస్తి

జరిగింది అని చింతించాడు అశ్వత్థామ.

"గోవులను, బ్రాహ్మణులను, బాలురను, వృద్ధులను, అంధులను, మిత్రులను, సఖులను, తోబుట్టువులను, జడులను, ఏమరుపాటున ఉన్న వారిని, మత్తులో ఉన్న వారిని, పిచ్చివారిని, నిద్రించువారిని, భయపడుతున్న వాడిని, ఆడువారిని, అస్త్ర శస్త్రములతో కొట్టడం మహాపాపం. అది విహితము కాదు. అని పెద్దలు చెపుతారు. అట్టి ధర్మమార్గము విడిచినవారికి అసురప్రవృత్తి అవలంబించినవారికి కార్యసిద్ధి కలుగదు. బ్రాహ్మణ వంశంలో జన్మించి ఇట్టి అపనిందల పాలు కావడానికి నేను అర్హుడినా! అందుకే కాబోలు నాకు ఈ భూతము దాపురించినది. ఇప్పుడు ఏమి చెయ్యాలి. నాకు ఎవరు దిక్కు" అని చింతిస్తున్నాడు అశ్వత్థామ.

కడకు మనసు కుదుట పరచుకున్నాడు. ఈ సమయంలో నాకు ఆ పరమేశ్వరుడే దిక్కు. ఆయననే ధ్యానిస్తాను. అంటూ అచంచల మైన మనస్సుతో ఆ పరమేశ్వరుడిని ధ్యానించాడు. " మహాదేవా! నేను ఈ గండం గడిచి గట్టెక్కితే నిన్ను నానాభోతోపహారములతో కొత్తరకంగా అర్చిస్తాను. నీకు ప్రీతి కలిగిస్తాను." అని అనేక స్తోత్రములతో ఆ మహాశివుడిని ప్రార్థించాడు.

అప్పుడు అశ్వత్థామ ముందు ఒక బంగారు వేదిక కనపడింది దాని మీద అగ్ని గుండం మండుతూ ఉంది. ఆ అగ్నినుండి అనేకానేక ఆకృతులతో ప్రమథగణాలు బయటకు వచ్చాయి. వాటిని చూచి అశ్వత్థామ భయపడలేదు. అతని మనసు ఈ శ్వరుని మీద లగ్నమై ఉంది. ఎంత ప్రార్థించిననూ ఈశ్వరుడు ప్రత్యక్షం కాలేదు. తన విల్లంబులతో సహా ఆ అగ్ని దూకడానికి సంసిద్ధమయ్యాడు అశ్వత్థామ. కాని తనను దహించేందుకు సరిపడా ఆ అగ్ని ప్రజ్వరిల్లలేదు. అందుకని అశ్వత్థామ తన విల్లు, అమ్ములు, అస్త్రములు,

శస్త్రములు, బాణములు, రకారకాలైన ఆయుధములు అన్ని తెచ్చి అగ్నిలో వేసి ప్రజ్వరిల్లచేసాడు.  అప్పుడు అగ్ని బాగా ప్రజ్వరిల్లింది.

“పరమేశ్వరా! నాకు ఏమి చెయ్యాలో తోచడం లేదు. నీవు నాకు ప్రత్యక్షమై నా శత్రువులను చంపే బలము, శక్తి ప్రసాదించు. లేని యడల నేను ఆత్మబలి దానం చేయదలచు కున్నాను. హర హర మహాదేవ...” అని ఆ మంటలలోకి దూకబోయాడు అశ్వత్థామ.

అప్పుడు ఆ పరమేశ్వరుడు అశ్వత్థా మ ముందు సాక్షాత్కరించాడు.

“అశ్వత్థామా! ఆగు. నీ అచంచలమైన భక్తికి, అకుంఠిత దీక్షకు సంతోషించాను. నీవు కోరిన వరం ఇస్తాను. కాని ఒక్క మాట. నేను, విష్ణ్వంశ సంభూతుడైన శ్రీకృష్ణుడు ఒకటే. కృష్ణుడు నన్ను పూజిస్తాడు. కృష్ణుడు అంటే నాకు ఎంతో ఇష్టం.      ఆ కృష్ణుని మీది గౌరవం చేతనే నేను భూతాకృతి లో వచ్చి నిన్ను పాండవ శిబిరముల వంక పోకుండా అడ్డగించాను.   నీ మనసులో మాట తెలుసుకోవాలనే నీకు నేను అన్ని ఆటంకాలు కల్పించాను.  ఇంతెందుకు ఆ పాంచాలురకు పోగాలము దాపురించినది. ఈ రోజు వాళ్లు నీ చేతిలో చస్తారు. ఇదిగో ఈ ఖడ్గంతో వారిని సంహరించు.” అని ఒక మహనీయమైన ఖడ్గం అశ్వత్థామకు ఇచ్చాడు. అశ్వత్థామకు తెలియకుండా ఈశ్వరుడు అతనిలో ప్రవేశించాడు. ఆవహించాడు.

అశ్వత్థామలో నూతన శక్తి, ధైర్యము, తెగింపు ఉద్భవించాయి. తన రథం దగ్గరకు వెళ్లాడు.  అగ్ని లో వేసి దహించిన అతని విల్లు, అమ్ములు, అస్త్ర శస్త్రములు యధాతథంగా రథం మీద ఉన్నాయి. అశ్వత్థామ రథం మీదకు ఎక్కాడు. ఇంతలో కృపాచార్యుడు కృతవర్మ అక్కడకు చేరుకున్నారు.

ముగ్గురు పాండవ శిబిరముల వంకకు బయలుదేరారు. అశ్వత్థామలో ఆవహించిన మహాశివుని అనుసరించి ప్రమథగణములు అదృశ్యరూపములో అతనిని వెంబడించాయి. అందరూ పాండవ శిబిరములు ప్రవేశించారు. కృపాచార్యుడు, కృతవర్మలను ముఖ ద్వారము వద్ద ఉంచి, అశ్వత్థామ తాను ఒక్కడే పాండవ శిబిరములలో ప్రవేశించాడు.

ముందు ధృష్టద్యుమ్నుని శిబిరమునకు వెళ్లాడు. మనస్సులో ఈశ్వరుని తల్చుకున్నాడు. పరమేశ్వర దత్తమైన ఖడ్గము చేత బూనాడు. అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. అశ్వత్థామ, గాఢంగా నిద్రిస్తున్న ధృష్టద్యుమ్నుడిని చూచాడు. అశ్వత్థా మ కళ్లలో కసి, కోపం, ఇన్నాళ్లకు తన తండ్రిని చంపినవాడిని చంపుతున్నాను, అన్న సంతోషం కనపడుతున్నాయి. ధృష్టద్యుమ్నుడిని కాలితో చాచి తన్ని, నిద్రలేపాడు. నేల మీద పడేసాడు. అతడి గుండెల మీద మోకాలు పెట్టి అదిమాడు. అతని గుండెల మీద పిడికిళ్లతో మోదాడు.

అనుకోని ఈ హటాత్పరిణామానికి ధృష్టద్యుమ్నుడు నోట మాట లేకుండా పడిపోయాడు. అశ్వత్థా మ తన వింటికి ఉన్న త్రాడును విప్పాడు. దానిని ధృష్టద్యుమ్నుడి కంఠానికి చుట్టి ఉరి బిగించాడు. పశువును చంపినట్టు చంపుతున్నాడు. గుండెల మీద, మెడమీద, కాళ్లతో తొక్కుతున్నాడు. ధృష్టద్యుమ్నుడిని నోటమాట రావడం లేదు. కడకు మాట పెగల్చుకొని "అశ్వత్థామా! నన్ను నీ అస్త్రములు, శస్త్రములు, ప్రయోగించి చంపెయ్యి. నాకు ఉత్తమ గతులు కల్గించు ఇలా నీచంగా చంపకు." అని ప్రార్థించాడు.

" వీలు లేదు. నా తండ్రిని చంపిన వాడికి ఉత్తమ గతులు కలగ కూడదు. నిన్ను ఇలాగే దారుణంగా చంపుతాను." అని అశ్వత్థామ తన పిడికిళ్లతో

గుద్దుతున్నాడు.

అప్పటికే చుట్టుపక్కల వాళ్లు మేల్కొన్నారు. కాని అశ్వత్థా మ ఉగ్రాకృతి చూచి, అతనిని రాక్షసుడని తలంచి, ఎవరూ ముందుకు రాలేదు. అశ్వత్థామ తన కాళ్లతో చేతులతో మోది మోది, కాళ్లతో తన్ని, ధృష్టద్యుమ్నుని అతి క్రూరంగా చంపాడు. ధృష్టద్యుమ్నుని కంఠమునకు చుట్టిన తాడు తీసి మరలా తన వింటికి కట్టాడు. ధృష్టద్యుమ్నుని శిబిరము నుండి బయటకు వచ్చి రథం ఎక్కాడు. మిగిలిన శిబిరముల వంక కు వెళ్లాడు.

అప్పటిదాకా కళ్లప్పగించి చూస్తున్న కాపలా దారులు ఒక్క సారి గా ఎలుగెత్తి అరిచారు. ఆ అరుపులకు చుట్టు పక్కల ఉన్న శిబిరములలో నిద్రిస్తున్న రాజులు సైనికులు అంతా నిద్ర లేచారు. ఏం జరిగిందో అని అందరికీ అయోమయం గా ఉంది. ఎవరో భయంకరాకారుడు వచ్చి ధృష్టద్యుమ్నుని చంపాడు అని మాత్రం చెబుతున్నారు కాపలాదారులు.

" వాడ్నిపోనీకండి ....పట్టుకోండి .....పొడవండి..." అనే కేకలుమిన్నుముట్టాయి. అందరూ ఆ వైపుకు పరుగెత్తారు. అందరూ కలిసి అశ్వత్థామను పట్టుకున్నారు. తన మీద ఆవేశించిన రుద్రుని శక్తితో అశ్వత్థామ వారినందరినీ ఒక్క క్షణంలో చంపాడు. తరువాత ఉత్తమౌజుని గుడారంలో ప్రవేశించి అతని జుట్టుపట్టుకొని ఈడ్చి, నేల మీద పడేసి, కత్తితో అతని తల నరికాడు. అది చూచిన యుధామన్యుడు అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. అదే కత్తితో అశ్వత్థామ యుధామన్యుని తల తెగ నరికాడు.

అశ్వత్థామను అడ్డుకొనే వారు లేకపోయారు. పాంచాల వీరులందరీని వరుస బెట్టి నరుకుతున్నాడు అశ్వత్థామ. అశ్వతామ ఒళ్లంతా రక్తంతో

తడిసిపోయింది. అత్యంత భీకరంగా కనిపిస్తున్నాడు. అశ్వత్థామను చూడగానే చాలామందికి ప్రాణాలు పోయాయి.

ద్రుపదుడి కుమారుల శిబిరములలో ప్రవేశించి వారినందరినీ యమపురికి అతిథులుగా పంపాడు. గుర్రపు శాలలు, ఏనుగుల శాలలు ప్రవేశించి, ఏనుగులను, గుర్రములను తెగ నరికాడు. మనిషి ,పశువు, అనే బేధం లేకుండా అడ్డంవచ్చిన వాడిని అడ్డంగా నరుకుతూ వెళుతున్నాడు అశ్వత్థామ. అక్కడ మృత్యుదేవత తాండవిస్తోందా అన్నంత భయంకరంగా మారణ కాండ సాగిస్తున్నాడు అశ్వత్థామ.

ఒక్కొక్క శిబిరములలోనికి ప్రవేశించడం అందులో నిద్రిస్తున్న వారిని నరకడం, పక్కనే కట్టి ఉన్న గుర్రములను ఏనుగులను నరకడం మరి యొక శిబిరము లోనికి దూరడం.... ఆ ప్రకారంగా మారణ కాండ సాగిస్తున్న అశ్వత్థామను చూ చి అందరూ "ఎవరో రాక్షసుడు వచ్చి నరుకుతున్నాడు" అని భీతి చెందుతున్నారు.

ఈ కలకలం విని శిఖండి, ఉప పాండవులు తమ తమ సేనలతో ఒక వ్యూహంగా నిలిచారు. అశ్వత్థామను ఎదుర్కొన్నారు. వారినందరినీ చూచాడు అశ్వత్థామ. అతనిలో ఆవేశించిన రుద్రుడు విజృంభించాడు. పరమేశ్వర దత్త ఖడ్గముతో వారి నందరినీ తృటిలో నరికాడు.

అడ్డం వచ్చిన ప్రతి వింధ్యుడిని రెండు ముక్కలు చేసాడు. ఇంతలో భీమసేనుని కుమారుడైన శ్రుతసోముడు భయంకరంగా అరుస్తూ అశ్వత్థామను ఎదుర్కొన్నాడు. కాని నిలవలేక పోయాడు. శ్రతసోముని చేతిలో ఉన్న ఖడ్గమును ఖండించి, అశ్వత్థామ శ్రుతసోముని తన ఖడ్గముతో

ముక్కలుముక్కలు గా నరికాడు.  అంతలో నకులుని కుమారుడైన శతానీకుడు అశ్వత్థామ మీదికి ఉరికాడు. తన చక్రాయుధంతో అశ్వత్థామ వక్షమును చీల్చాడు. అశ్వత్థామ శతానీకుని కిందపడదోసి, అతని శిరస్సు ఖండించాడు. ఇది చూచిన సహదేవుని కుమారుడు శ్రుతసేనుడు అశ్వత్థామను  ఎదుర్కొన్నాడు.  అశ్వత్థామను తన గదతో కొట్టాడు. అశ్వత్థామ తన చేత్తో శ్రుతసేనుని మొహం మీద చరిచాడు. మొహం పగిలి అతను చచ్చాడు. తన సోదరుల మరణము కళ్లారా చూచిన అర్జునుని కుమారుడైన శ్రుతకీర్తి కూడా అశ్వత్థామ ముందు నిలువలేపోయాడు. అశ్వత్థామ కత్తి దెబ్బకు కంఠం తెగి నేలకొరిగాడు.  ~~ఈ~~ప్రకారంగా ఉప పాండవులను అనగా ద్రౌపదీ సుతులను తెగటార్చాడు అశ్వత్థామ.

ఇంక శిఖండి వంతు వచ్చింది. అతని వెంట ప్రభద్రకులు కూడా అశ్వత్థామను ఎదుర్కొన్నారు. కొంచెంసేపు వారి మధ్య యుద్ధం జరిగింది. కాని అశ్వత్థామ మానవాతీత శక్తి ముందు ఎక్కువసేపు నిలువలేకపోయారు. అశ్వత్థామ శిఖండిని అడ్డంగా రెండు ముక్కలుగా నరికాడు. మిగిలిన వారిని కూడా దారుణంగా వధించాడు.   మహేశ్వర దత్తమైన ఖడ్గమునకు ఎదురు లేకుండా పోయింది.  ఏ ఒక్క వేటు కూడా వృధాకావడం లేదు. వేటుకు ఒక తల తెగి నేల పడుతూ ఉంది.

పాంచాలురు, వారి  సేనలు, ప్రభద్రకులు, ద్రౌపదీ కుమారులు, పాండవుల మిగిలిన సేనలు వారి హయములు, ఏనుగులు, నిశ్శేషంగా మరణించారు.  కాని అశ్వత్థామకు పాండవులు కాని, కృష్ణుడు కాని సాత్యకి కాని కనిపించలేదు. కాని కొంతమంది పాండవ సైన్యము,  పాంచాలురు పారిపోతూ కనిపించారు. అశ్వత్థా మ వారిని కూడా వెంటబడి తరిమి తరిమి తన శరములతో  చంపాడు. అశ్వత్థామ చేతినుండి తప్పించుకున్న ఏనుగులు

ఘీంకరిస్తూ పరుగెత్తసాగాయి. వాటి కాళ్ల కిందపడి ఎంతోమంది మర ణించారు. ఏనుగులు, గుర్రములు, ఒకదాని కాళ్ల కింద మరొకటి పడి నలిగిపోయాయి. ఏం జరిగిందో ఎవరికీ తెలికయక ఒకరిని ఒకరు చంపు కుంటున్నారు. పాండవ, పాంచాల శిబిరములు అల్లకల్లోల మయ్యాయి. అర్ధ రాత్రి అప్పుడు ఎవరిని ఎవరు చంపుతున్నారో తెలియడం లేదు. ఆ ప్రకారంగా అశ్వత్థామ బారి నుండి తప్పించుకున్న రాజులు సైనికులు ముఖద్వారము వద్దకు రాగా అక్కడ ఉన్న కృపాచార్యుడు, కృత వర్మ, వారిని తమ తమ అస్త్ర శస్త్రములతో నిర్దాక్షిణ్యంగా చంపారు.

ఇంతలో తెలతెలవారుతూ ఉంది. ఆ సౌప్తికవేళ దారుణ మారణ కాండ ముగించుకొని అశ్వత్థామ, కృపాచార్యుడు కృతవర్మను కలుసుకున్నాడు. "మామా! సకల పాంచాలురు చచ్చారు. పాంచాలి కొడుకులందరూ యమ సదనానికి వెళ్లారు. మత్స్య, ప్రభద్ర, మొదలగు సైనిక బలములు ఒక్కరూ మిగలలేదు. హయములు, ఏనుగులు, అన్నీచచ్చాయి. కాని కృష్ణుడు, పాండవులు, సాత్యకి మాత్రం చావలేదు. వారు ఎక్కడ ఉన్నారో తెలియదు." అని అన్నాడు అశ్వత్థామ.

కృపాచార్యుడు, కృతవర్మ అశ్వత్థామ బలపరాక్రమాలను పొగిడారు. "మామా! పాండవులను తప్ప మిగిలిన వాళ్లనందరినీ చంపాను. ఫలితం ఏముంది చెప్పు. అపాండవం చేస్తే రారాజు మనస్సుకు శాంతిగాని, తక్కినవారు ఎంతమందిని చంపితే ఏమి ఫలము." అని అన్నాడు అశ్వత్థామ.

"అదేమిటి అశ్వత్థామా! ఒకే ఒక్క రాత్రిలో ధృష్టద్యుమ్నుడు మొదలగు పాంచాలురను, ద్రౌపదీ సుతులను, వారి వారి సైన్యములను, ఒక్కరినీ వదలకుండా పేరు పేరునా చంపావు. అది మాత్రం సామాన్యమైన విషయమా

చెప్పు." అని అశ్వత్థామను కీర్తించారు.

" మామా, కృతవర్మా! ఇప్పుడు మనము రారాజు సుయోధనుని వద్దకు పోయి జరిగిన విషయం చెప్పి అతని మనస్సుకు శాంతి చేకూరుస్తాము." అని పలికి ఆ ముగ్గురు రథికులు సుయోధనుని వద్దకు వెళ్లారు.

ఆ సమయంలో సుయోధనుడు రక్తంతో తడిసిన నేల మీద పొర్లు తున్నాడు. ఊపిరి అందడం లేదు. ప్రాణాలు శరీరం వదలి పోవడం లేదు. మరణ యాతన పడుతున్నాడు. క్రమక్రమంగా కాళ్లు చేతులు స్వాధీనం తప్పుతున్నాయి. ఆసమయంలో అశ్వత్థామ సుయోధనుని వద్దకు చేరుకున్నాడు.

"రారాజా! ఈ ధరణీతలంబంతయూ ఏకచ్ఛత్రాధిపత్యముగా ఏలిన నీవు ఇలా కటిక నేలమీద పడి పొర్లుతున్నావా. ఏమి విధి వైపరీత్యము! నీ బలము, దర్పము, ధీరత్వము,నీవు చేసిన గదాయుద్ధ సాధన, అవన్నీ నీకు కొరగాకుండా పోయాయా రారాజా! అయినా సుయోధనా! నీవు పరమ పవిత్రమైన శమంతక పంచకములో ప్రాణాలు విడుస్తున్నావు. నీకు ఉత్తమగతులు సంప్రాప్తిస్తాయి. బలరాముని శిష్యులలో కెల్లా నీవు అగ్రగణ్యుడవు. అలాంటి నిన్ను భీముడు అక్రమంగా పడగొట్టాడు. వాడేం బాగు పడతాడు. వాడి కీర్తి అంతా నాశనం అయిపోదా! సుయోధనా! నీవు నన్ను చిన్నప్పటినుండి చేరదీసి పెంచావు. నాకు కూడూగుడ్డా ఇచ్చి ఆదరించావు. యజ్ఞములు యాగములు చేయుటకు కావలసిన ధనము సమకూర్చావు. నాకు ఒక కొండగా నిలిచావు. కాని ఇప్పుడు నీవు చనిపోతూ ఉంటే నేను బతికి ఉన్నాను. నేను నీకేమి సేవ చెయ్యగలను సుయోధనా! సుయోధనా! నీవు న్యాయంగా యుద్ధం చేసావు. వీర మరణం

పొందుతున్నావు. నీ శత్రువులను హతమార్చి నీ ఆఖరి కోర్కె తీర్చే అదృష్టం మాకు దక్కింది.

రారాజా! నీవు పుణ్యలోకములకు పోయినపుడు, నా తండ్రి ని చూచి ఆయనతో నా మాటగా చెప్పు. "ద్రోణాచార్యా! నిన్ను అన్యాయంగా, అక్రమంగా చంపిన ఆ నీచుడు ధృష్టద్యుమ్నుని, నీ కుమారుడు అశ్వత్థామ పశువును చంపినట్టు అతి దారుణంగా చంపాడు." అని చెప్పు. నా తండ్రిని నాకు మారుగా నీవు కౌగలించుకో! సుయోధనా! ఇప్పటికే వీరస్వర్గము అలంకరించిన బాహ్లికునీ, సోమదత్తునీ, భూరిశ్రవసునీ, సైంధవునీ నేను అడిగినట్టు చెప్పు.

అయ్యో సుయోధనా! నిన్ను ఈ స్థితిలో చూచిన ఉద్వేగంలో అసలు విషయం మరిచిపోయాను. నిన్న రాత్రి జరిగిన విషయం చెపుతాను. రారాజా! నీ చెవులకు అమృతోపమానమయిన పలుకులు చెపుతాను. విను. నేను, నిన్న రాత్రి, సౌప్తికవేళ , శత్రువుల శిబిరములలోకి ప్రవేశించాను. ముందు ఆ దురాత్ముడు ధృష్టద్యుమ్నుని పశువును చంపినట్టు చంపాను. తరువాత వాడి బంధువుల నెల్ల కసీదీరా చంపాను. ద్రౌపదీ పుత్రుల నందరినీ పేరు పేరునా చంపాను. పాండవ సైనికుల నందరినీ ఊచకోత కోసాను. వారి హయములను, గజములను నరికాను. వారి శిబిరములు అన్ని పీనుగు పెంట చేసాను. కాని సుయోధనా! ఐదుగురు పాండవులు, కృష్ణుడు, సాత్యకి నా పాల బడలేదు. అపాండవం కాలేదు సుయోధనా! నే ను అక్కడికి వస్తానని ముందే ఊహించి కృష్ణుడు పాండవులను అక్కడి నుండి తప్పించినట్టున్నాడు. పోనీలే. అందరూ చచ్చిన తరువాత వాళ్లు బతికి ఉండీ ప్రయోజనం ఏమిటి? రారాజా! నా మామ కృపాచార్యుడు, కృతవర్మల తోడు లేకుండా నాకు ఈ పని సాధ్యమయ్యేది కాదు." అని అన్నాడు అశ్వత్థామ.

ఆ మాటలు విన్నాడు సుయోధనుడు. నోట మాట రావడం లేదు. కాని ఎలాగో నోరుపెగుల్చుకొని ఇలా అన్నాడు.

"అశ్వత్థామా! నాడు భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు చేసిన దానికన్నా ఈ రోజు మీ ముగ్గురు చేసిన వీరోచిత కార్యము ఎంతో గొప్పది. ఎందుకంటే ఇది చాలా కష్టసాధ్యమైనది. మనం కర్ణుడిని, శల్యుడిని చాలా గొప్పవాళ్లని పొగుడు తాము. కాని నా అవసాన సమయంలో మీ ముగ్గురే నాకు అత్యంత ప్రీతి కలిగించారు. వారు కూడా చెయ్యలేని కార్యము మీరు నెరవేర్చారు. మీరందరూ సుఖంగా ఉండండి. మరలా అందరం స్వర్గంలో కలుసుకుందాము." అని పలికి ప్రాణాలు విడిచాడు.

సుయోధనుని ప్రాణవాయువులు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. అతని పార్థివ శరీరం మాత్రం దిక్కులేకుండా నేలమీద పడి ఉంది.

అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ రారాజు శరీరం చుట్టు ముమ్మారు ప్రదక్షిణం చేసి నమస్కరించి అక్కడి నుండి తమతమ రథములు ఎక్కి వెళ్లిపోయారు. మరునాడు సూర్యోదయం అయింది. ఈ విషయములు అన్ని చూచిన నేను తమరికి చెపుదామని అక్కడి నుండి మీ వద్దకు వచ్చాను." అని సంజయుడు ధృతరాష్ట్రునికి సుయోధనుని మరణవృత్తాంతం సవిస్తరముగా వినిపించాడు.

వైశంపాయనుడు జనమేజయునికి చెప్పిన మహా భారత కథను , సూతుడు శౌనకాది మహామునులకు, నైమిశారణ్యంలో మహాసత్రయాగ సందర్భములో వినిపించాడు.

మహాభారతము

సౌప్తిక పర్వము ప్రథమాశ్వాసము సమాప్తము.

ఓం తత్సత్

# మహా భారతము

సౌప్తిక పర్వము

ద్వితీయాశ్వాసము

నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంగా, సూతుడు శౌనకాది మహా మునులకు, తొల్లి వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన మహా భారత కధను సవిస్తరంగా చెప్పసాగాడు.

మరునాడు సూర్యోదయం అయింది. ధర్మరాజు, తన సోదరులు భీమార్జున, నకులసహదేవులు, సాత్యకి, కృష్ణుడు పరివేష్టించి ఉండగా, ధృష్టద్యుమ్నుని రధ సారధి వారి వద్దకు వచ్చి సాష్టాంగ దండ ప్రణామము చేసి చేతులు కట్టుకొని నిల్చుని ఇలా చెప్పాడు.

"ధర్మరాజా! నిన్న అర్ధరాత్రి మన శిబిరములలోకి అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ ప్రవేశించారు. కృపాచార్యుడు, కృతవర్మ ముఖద్వారము వద్ద నిలువగా, అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని శిబిరములోకి ప్రవేశించి,అతనిని అత్యంతం దారుణంగా వధించాడు. తరువాత అశ్వత్థామ ధృష్టద్యుమ్నుని సోదరులను, కుమారులను, పాంచాల రాకుమారులనందరినీ, అర్ధరాత్రి ఆదమరిచి నిదురించువేళ, అక్రమంగా అతి క్రూరంగా చంపాడు. తరువాత చేది,మాత్స్య,ప్రబద్రక సైన్యములను హతమార్చాడు. ఇంతలో మేలుకున్న ద్రౌపదీకుమారులు, శిఖండి అతనిని ఎదుర్కొన్నారు. అశ్వత్థామ ద్రౌపదీ సుతులందరినీ, శిఖండినీ ఒక్క త్రుటిలో హతమార్చాడు. అశ్వత్థామ ఒక రాక్షసుని మాదిరి చెలరేగి మనవాళ్లందరినీ చంపాడు. అతని ధాటికి మన

సైన్యము, గజములు హయములు ఆగలేకపోయాయి. దయాదాక్షిణ్యాలు లేకుండా వాటినన్నింటిని ఖండించాడు. అశ్వత్థామ చేతిలో  చావు తప్పించుకున్నవారు  ముఖద్వారము వైపు పారిపోయారు.  కాని అక్కడ ఉన్న కృపాచార్యుడు, కృతవర్మ వారిని పట్టుకొని చిత్రవధ చేసారు. మన శిబిరములను పీనుగు పెంటలుగా మార్చారు. నేను కృతవర్మచేతికి దొరికాను. నేను అతనిని కాళ్లు పట్టుకొని వేడుకొనగా కనికరించి  నన్ను వదిలిపెట్టాడు. బతుకు జీవుడా అని జరిగిన విషయం మీకు మనవి చేద్దామని ఇక్కడకు వచ్చాను." అని చెప్పాడు.

ఈ మాటలు విన్న ధర్మరాజు మూర్ఛపోయాడు. అందరూ అయనను పట్టుకొని  శైత్యోపచారాలు చేసారు. ధర్మరాజు మూర్ఛనుండి తేరుకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.  "యుద్ధంలో చావడం సహజమే. కాని యుద్ధం అయిపోయింది. నేను విజయం సాధించాను. విజయోత్సవాలు జరుపుకుంటున్న ఈ తరుణంలో  ఈ దారుణం ఏమిటి? ఇంక నేను యుద్ధములో విజయం సాధించి ప్రయోజనం ఏమిటి? సముద్రాన్ని దాటి పిల్ల కాలువలో పడి మరణించినట్టయింది నాపరిస్థితి.  అసలే తండ్రిని పోగొట్టుకున్న ద్రౌపది, సోదరుల మరణమును, కుమారుల మరణమును ఎలా తట్టుకొంటుంది. ఆ మె అసలు బ్రతుకగలదా! ద్రౌపదికి వెంటనే ఈ విషయం తెలియచెయ్యండి" అని ఆజ్ఞాపించాడు.

ఆ సమయంలో ద్రౌపది, సుభద్రతో సహా విరాటనగరంలో ఉంది. తన తండ్రి ద్రుపదుడు చని పోయినందుకు, తల్లిని ఓదార్చుటకు ముందు పాంచాలనగరం వెళ్లింది. తరువాత విరాటుని మరణంతో కుమిలిపోతున్న సుధేష్ణను  ఓదార్చుటకు సుభద్రతో కలిసి విరాట నగరం వెళ్లింది.  , అక్కడినుండి ద్వారకు వెళ్లడానికి సుభద్ర విరాటనగరంలోనే ఉంది. ద్రౌపది

ఉపప్లావ్యమునకు వచ్చింది.

ధర్మరాజు నకులుని చూచి "నకులా! నీవు త్వరగా ఉపప్లావ్యమునకు వెళ్లి ద్రౌపదిని, మిగిలిన స్త్రీలను నీ వెంటతీసుకొనిరా." అని అన్నాడు. అన్నగారి ఆజ్ఞ మేరకు నకులుడు ఉపప్లావ్యమునకు వెళ్లాడు. ధర్మరాజు అమిత మైన దుఃఖంతో రోదిస్తూ, కృష్ణసాత్యకులు వెంటరాగా, పాండవ శిబిరములకు వచ్చాడు. అక్కడ చెల్లాచెదరుగా పడి ఉన్న తన కుమారులు, స్నేహితులు, బంధువుల శవాలను చూచాడు. కన్నీరు మున్నీరుగా విలపించాడు. కృష్ణార్జునులు ఎంత ఓదార్చినా అతని దుఃఖం ఆగలేదు. కొంతసేపటికి తేరుకున్నాడు. తన కొడుకులకూ, బంధువులకు, స్నేహితులకూ దహనకార్యములు యధావిధిగానెరవేర్చాడు. ద్రౌపది కొరకు నిరీక్షిస్తూ ఒక చోట కూర్చున్నాడు.

ధర్మరాజు ఆదేశము మేరకు నకులుడు ఉపప్లావ్యము వెళ్లాడు. ద్రౌపదికి ఈవిషయం చెప్పాడు. తన సోదరులు, తన కుమారుల మరణ వార్తవిని ద్రౌపది కుప్పకూలిపోయింది. వెంటనే నకులుని వెంట రథము మీద పాండవ శిబిరముల వద్దకు వచ్చింది. రథం దిగింది. కాని నడవలేకపోయింది. దుఃఖం ఆగడం లేదు. నేలమీద కూలబడింది. భీముడు వచ్చి ఆమెను పట్టుకున్నాడు. ధర్మరాజు వద్దకు తీసుకొని వచ్చాడు.

" మహారాజా ధర్మనందనా! ఏమిటీ వైపరీత్యము. రాజ్యలక్ష్మిని కైవసము చేసుకున్న మీరు మీ కుమారుల ముద్దుముచ్చటలు చూచుటకు నోచుకొనలేదా! నాడు అభిమన్యుడు, నేడు నా కుమారులు దారుణంగా చంపబడ్డారు. ఈ గర్భశోకానికి అంతు లేదా." అని బిగ్గరగా ఏడుస్తూ ఉంది.

ఇంతలో ద్రౌపదికి తన కుమారులను అశ్వత్థామ అర్ధరాత్రి సమయమున

అతి క్రూరంగా చంపాడన్న విషయం గుర్తుకు వచ్చింది. కోపంతో ఊగిపోయింది.

“ మహారాజా! నా కుమారులు గాఢనిద్రలో ఉన్న సమయాన గురుపుత్రుడైన అశ్వత్థామ అత్యంత క్రూరంగా చంపాడు. అది నా మనస్సులో ఆరని చిచ్చు రేపింది. అశ్వత్థామను చంపడం కంటే మరొక మార్గం లేదు. మహారాజా! ధర్మనందనా! ఇప్పుడే నేను భీముని పంపి ఆ క్రూరాత్ముడు అశ్వత్థామను చంపిస్తాను. అలాచేయలేకపోతే నేను ప్రాయోపవేశం చేసి ప్రాణత్యాగం చేస్తాను. నా దుఃఖం ఉపశమించడానికి వేరు ఉపాయం లేదు.” అని ఘోరమైన ప్రతిజ్ఞ చేసింది.

వెంటనే ధర్మరాజు ఆమెను ఓదార్చాడు. “ద్రౌపదీ! క్షత్రియులు యుద్ధంలో మరణించడం సహజమే కదా. అలాగే నీ సోదరులు నీ కుమారులు మరణించారు. వీరస్వర్గము పొందారు. దానికి నీవు ఇంతటి కఠోర నిర్ణయం తీసుకోడం తగునా! మనస్వినీ! శాంతించు. నీ శోకము తగ్గించుకో. నిజమే. నీ శోకము, నీ కోపము అశ్వత్థామను చంపితేగాని పోదని నాకు తెలుసు. కాని ఆ అశ్వత్థామ అడవుల పాలైపోయి ఉంటాడు. ఒకవేళ వాడిని చంపినా ఆవిషయం మనకు ఎలా తెలుస్తుంది.” అని లౌక్యంగా అన్నాడు.

దానికి ద్రౌపది “మహారాజా! ఆ అశ్వత్థామకు సహజ శిరోభూషణం గా ఒక రత్నం కలదు. దానిని తీసుకొని వచ్చి నాకు చూపించిన అతను మరణించినాడని నేను నమ్ముతాను. అప్పుడు నేను జీవిస్తాను.” అని పక్కనే ఉన్న భీమసేనుని చూచి “భీమసేనా! నీవు క్షత్రియధర్మమును మనసులో నిలుపుకొని, వెంటనే పోయి, ఆ పాపాత్ముడు అశ్వత్థామను పట్టి చంపి, నా మనస్సుకు శాంతి చేకూర్చు. నాడు లక్క ఇంట్లో మిమ్ములను కాల్చ

తలపెట్టినప్పుడు ఉన్న పౌరుషము, హిడింబాసురుని చంపునపుడు ఉన్న శౌర్యము, యక్షులతో యుద్ధము చేసినప్పుడు ఉన్న ధైర్యము, కీచకుని చంపుతున్నప్పుడు చూపిన పరాక్రమము గుర్తుకు తెచ్చుకో. జనులందరూ నిన్ను పొడిడేటట్టు ఆ హంతకుని హతమార్చు." అని క్రోధంతో పలికింది ద్రౌపది.

ఆ మాటలు విన్న భీముడు పౌరుషంతో బుసలు కొట్టాడు. వెంటనే తన రధము మీద బయలు దేరాడు. నకులుడు భీమునికి సారధిగా రధము తోలుతున్నాడు. ఇద్దరూ కురుక్షేత్రము వైపుకు వెళ్లారు. అక్కడ ఉన్నవారిని అశ్వత్థామ గురించి అడిగారు. వారు అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మలతో కలిసి హస్తినాపురం వైపు వెళ్లారని, కాని మరలా వెనుకకు వచ్చి గంగానది వైపు వెళ్లారని, దారి మధ్యలో కృపాచార్యుడు, కృతవర్మ అశ్వత్థామను విడిచి ఎటో వెళ్లారని, అశ్వత్థా మ మాత్రం వ్యాసాశ్రమమునకు వెళ్లాడని చెప్పారు. వెంటనే భీమసేనుడు గంగానదీ తీరంలో ఉండే వ్యాసాశ్రమమునకు వెళ్లాడు.

భీముడు వెళ్లిన తరువాత, కృష్ణుడు ధర్మరాజుని చూచి ఇలా అన్నాడు. "ధర్మనందనా! భీముడు ఒక్కడే అశ్వత్థామీదికియుద్ధమునకు వెళ్లాడు. కాని అశ్వత్థామ పరాక్రమము ముందు భీమసేనుడు చాలడు. అందుకని మీరందరూ వెళ్లడం మంచిది. మరొక మాట. ద్రోణుడు తన కుమారునికి అత్యంత భయంకరమైన బ్రహ్మశిరోనామాస్త్రము ను ప్రీతితో ఇచ్చాడు. అది అశ్వత్థా మ వద్ద ఉన్నది. అశ్వత్థామకు దానిని ప్రయోగించడమే గాని ఉప సంహారము తెలియదు. అదియును కాక, ద్రోణుడు అశ్వత్థామతో బ్రహ్మశిరోనామ కాస్త్రము జనావాసముల మీద ప్రయోగించవద్దని, ఎంత ఆపద వచ్చినా వేరు అస్త్రములు ప్రయోగించి కాపాడుకోమని, కట్టడి చేసాడు. అశ్వత్థామ మహా గర్విష్టి. పొగరు బోతు, దురహంకారి. ఎవరినీ లక్ష్యపెట్టడు.

ఇంక తండ్రిమాట వింటాడా!

మీరు వనవాసములో ఉండగా ఒకసారి అశ్వత్థామ ద్వారకకు వచ్చాడు. నా దగ్గరకు వచ్చి "కృష్ణా! పూర్వము అగస్త్యుడు తాను బ్రహ్మ వద్దనుండి పొందిన బ్రహ్మశిరము అనే అస్త్రము మా తండ్రి ద్రోణుడికి ఇచ్చాడు. మా తండ్రి ద్రోణుడు దానిని నాకు ప్రసాదించాడు. కృష్ణా! ఆ అస్త్రమును నీకు ఇస్తాను. నాకు నీ చక్రాయుధమును నాకు ఇస్తావా!" అని అడిగాడు.

నాకు అశ్వత్థామ దురహంకారము అర్థంఅయింది. నేను నా వద్దనున్న ఆయుధములు, ధనుస్సు, ఖడ్గము,గద, చక్రము చూపించి "అశ్వత్థామా! వీటిలో నీకు ఏది కావాలో, నీకు దేనిని ధరించి ప్రయోగించుటకు శక్తి ఉన్నదో దానిని తీసుకో. వీటికి బదులుగా నువ్వు నాకు ఏమీ ఇవ్వనవసరము లేదు. నువ్వు నాకు మిత్రుడవు. నేను ఇచ్చిన దానికి మారుగా నీ వద్దనుండి మరియొకటి పుచ్చుకొనుట ధర్మము కాదు." అని అన్నాను.

దానికి అశ్వత్థామ "నాకు చక్రాయుధము కావాలి." అని అడిగాడు.

" సరే తీసుకో" అన్నాను.

అశ్వత్థామ అమితమైన పొగరుతో ముందు ఎడమ చేత్తో ఆ చక్రాయుధము ఎత్తబోయాడు. కాని అది కదలలేదు. తరువాత కుడి చేత్తో ఎత్తాడు. అది లేవలేదు. తుదకు రెండు చేతులు ఉపయోగించి ఎత్తినా నా చక్రాయుధమును ఎత్తలేకపోయాడు. అలసి పోయి నిలబడ్డాడు అశ్వత్థామ. నేను అశ్వత్థామను చూచి, "అశ్వత్థామా! నేను హిమవత్పర్వతముల మీద, రుక్మిణీ సమేతంగా ఉండి కూడా కఠోర బ్రహ్మచర్యము అవలంబించి, పన్నెండు

సంవత్సరములు ఉగ్రతపస్సు చేసి అత్యంత మహిమాన్వితమైన ఈ చక్రాయుధమును పొందాను. దీని ప్రభావంతో దేవ,దానవ, గంధర్వాది సమస్తభూతములు నాకు సాటిరావు. నా దగ్గరున్న ఈ చక్రాయుధమును నా అన్న బలభద్రుడు కానీ, నా కుమారులు ప్రద్యుమ్నుడు, సాంబుడు కానీ మిగిలిన యాదవశ్రేష్టులు గానీ అడగలేదు. తన తపోదీక్షతో అర్జునుడు గాండీవము, శ్వేతాశ్వములు, కపిధ్వజము పొందాడు. తరువాత పరమశివుని మెప్పించి పాశుపతమును పొందాడు. అటువంటి అర్జునుడు నాకు ప్రాణ సమానుడు. అతను అడిగితే నేను ఇవ్వనిది ఏదీ లేదు. కాని అర్జునుడు కూడా ఈ చక్రాయుధము తనకు ఇవ్వమని అడగలేదు. భరత వంశ సంజాతులకు గురువైన ద్రోణునికి కుమారుడవు. నీవు దీనిని అడుగవచ్చునా. అయినా నీవు ఎవరితో యుద్ధము చేయుటకు ఈ చక్రాయుధము అడుగుచున్నావు." అని అడిగాను.

"కృష్ణా! నీవు ఈ చక్రాయుధము నాకు ఇచ్చిన, నీ పాదములు పట్టుకొని ప్రార్థించి అయినా నిన్ను నా తోయుద్ధమునకు ఒప్పించి, నీతో యుద్ధము చేసి, నీమీదనే ఈ చక్రాయుధము ప్రయోగించవలెనని నా కోరిక. కాని ఈ చక్రాయుధమును నీవు నాకు ఇవ్వడం లేదు కదా. నీ దగ్గరే ఉంచుకో. ఈ చక్రాయుధము లేకున్న నాకు ఎలాంటి నష్టం లేదు. రాబోయే మహాభారత సంగ్రామంలో ఎటూ నీతో నేను యుద్ధం చేస్తాను కదా." అని అన్నాడు అశ్వత్థామ.

నాకు నవ్వు వచ్చింది. కాని బ్రాహ్మణుడు అడిగాడు కదా అని నాకు తోచిన బహుమానములు ఇచ్చి పంపాను. అతని అహంకారమునకు కారణము అతని వద్దనున్న బ్రహ్మశిరోనామకాస్త్రము. కాని అతను క్రూరుడు. అతని చేతిలో మన భీముడు బాధపడకుండా ఉండాలని నా కోరిక "అని

ధర్మరాజుతో అన్నాడు కృష్ణుడు.

కృష్ణుడు తన తమ్ముడు సాత్యకిని, సహదేవుడిని ద్రౌపదికి తోడుగా ఉండమని, తానూ ధర్మరాజు అర్జునుడు కలిసి భీముడు వెళ్లిన వైపుకు వెళ్లారు. దారిలో వారు భీముని కలుసుకున్నారు. భీముడి వలన అశ్వత్థామ ఉన్న చోటు తెలుసుకున్నారు. అందరూ వ్యాసాశ్రమమునకు వెళ్లారు. గంగానది ఒడ్డున, ఒంటినిండావిభూది పూసుకొని, నిశ్చలంగా కూర్చుని తపస్సు చేసుకుంటున్న అశ్వత్థామను చూచారు. భీముని కోపం మిన్నంటింది.

“ఓరి అశ్వత్థామా! బ్రాహ్మణాధమా! క్రూరాత్ముడా! కపట సన్యాసీ! నిన్నరాత్రి అంతటి దారుణ మారణ కాండ సలిపి, ఏమీ ఎరగనట్టు ఇంత తొందరలో తాపస వృత్తి ఎలా స్వీకరించావురా! నీవు తాపసి వైనంత మాత్రాన చావు తప్పుతుందా! చేసిన తపస్సు చాలు , లే. నాతో యుద్ధానికి రా!” అని సింహంవలె గర్జించాడు భీమసేనుడు.

అశ్వత్థామ భీమసేనుని, అతని వెనుకనున్న అర్జునుని చూచాడు. అర్జునుని అస్త్ర శస్త్ర సంపద ఎరిగిన వాడు కావున వెంటనే పక్కనే ఉన్న రెల్లు గడ్డి పొదలోంచి ఒక రెల్లుగడ్డి పోచ తీసుకొని దానిని అభిమంత్రించి, బ్రహ్మశిరోనామకాస్త్రమును దాని మీదికి ఆవహింప చేసి, “అపాండవమగు గాక” అని సంకల్పించి భీమార్జునులమీదికి ప్రయోగించాడు. ఆ దివ్యాస్త్రమునుండి భయంకరమైన అగ్నిజ్వాలలు వెలువడ్డాయి. పెద్ద విస్ఫోటం జరిగింది. అప్పుడు అర్జునుని చూచాడు కృష్ణుడు.

“అర్జునా! ఇది బ్రహ్మశిరోనామకాస్త్రము. అత్యంత భయంకరమైనది. దీనికిదేసాటి. దీనిని ఏ అస్త్రము నిరోధించలేదు. కాబట్టి నీవుకూడా నీకు

ద్రోణాచార్యుడు ప్రసాదించిన బ్రహ్మశిరోనామకాస్త్రము ప్రయోగించి, అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రమును నిరోధించి నిన్ను నీ సోదరులను కాపాడుకో" అని తొందరపెట్టాడు.

వెంటనే అర్జునుడు రథం దిగాడు. తన ఆచార్యుడు ద్రోణుని మనస్సులో తల్చుకున్నాడు. గాండీవము తీసుకున్నాడు. బ్రహ్మశిరోనామ కాస్త్రమును ఎక్కుపెట్టాడు. తనలో ఇలా సంకల్పించాడు. "ఈ మహా అస్త్రమును నేను, అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రమును నిరోధించుటకు మాత్రమే, ప్రయోగించుచున్నాను. ఈ అస్త్రమువలన నాకు కానీ, నా సోదరులకు కానీ, గురు పుత్రుడు అశ్వత్థామకు కానీ కీడు కలుగకుండు గాక" అని ప్రార్థించి అస్త్రప్రయోగము చేసాడు.

అర్జునుడు ప్రయోగించిన అస్త్రము నింగి కెగసి, అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రమును నిరోధించే ప్రయత్నం చేసింది. ఆ అస్త్రములు రెండూ ఒకదానితో ఒకటి ఢీకొట్టడంతో సముద్రాలు పొంగాయి. ఆకాశంనుండి ఉల్కలురాలాయి. సూర్యుడు తన కాంతి కోల్పోయాడు. భూమి కంపించింది. ఆకాశంనుండి రాళ్ల వర్షం కురిసింది. పిడుగులు పడుతున్నాయి. ఆకస్మికంగా జరుగుతున్న ఈ ఉత్పాతాలు చూచి జనం ఆశ్చర్యపోతున్నారు. భయపడి పరుగులు తీస్తున్నారు. భయంతో వణికిపోతున్నారు.

ఈ ఉత్పాతాలు చూచి నారదుడు పరుగు పరుగున వ్యాసుని వద్దకు వచ్చాడు. నారదుడూ, వ్యాసుడూ కలిసి అశ్వత్థామ, కృష్ణార్జునులు ఉన్న చోటికి వచ్చారు. అశ్వత్థామ అర్జునుడి మధ్య నిల్చున్నారు.

"ఓ అకల్మషులారా! ఇది వరకు ఎంతో మంది వీరులు,

భుజబలసంపన్నులు, శూరులు ఈ పుడమిలో జన్మించారు. గతించారు. వారెవ్వరూ ఈ బ్రహ్మశిరోనామకాస్త్రమును జనావాసముల మీద ప్రయోగించలేదు. మీరెందుకు ఇంతటి సాహసమునకు ఒడిగట్టారు." అని అన్నాడు వ్యాసుడు.

అర్జునుడు వ్యాసునికి, నారదునికి నమస్కరించి ఇలా అన్నాడు. "ఓ మహాత్ములారా! అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రమును పాండవ వంశ నిర్మూలనకు ప్రయోగించాడు . శ్రీ కృష్ణుని ఆదేశము మేరకు ఆ అస్త్రమును నిరోధించుటకు మాత్రమే నేను కూడా అదే అస్త్రమును ప్రయోగించాను. అంతేగాని, జనావాసముల మీద ప్రయోగింపవలెనని క్రూర తలంపుతో ప్రయోగించలేదు. తమరు ఆజ్ఞాపిస్తే నేను ప్రయోగించిన బ్రహ్మశిరోనామ కాస్త్రమును ఉపసంహరించెదను. కాని నేను నా అస్త్రమును ఉపసంహరిస్తే, ఈ దుర్మార్గుడు తాను ప్రయోగించిన అస్త్రముతో మమ్ములనందరినీ దహిస్తాడు. మీరు మా క్షేమం కూడా ఆలోచించాలి." అని వినయంగా పలికాడు అర్జునుడు. వెంటనే తాను ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రమును అవలీలగా ఉపసంహరించాడు.

వ్యాసుడు అశ్వత్థామ వంక చూచి "అశ్వత్థామా నీవు కూడా నీచేత ప్రయోగింపబడ్డ ఆ మహాస్త్రమును ఉపసంహరించు." అని అన్నాడు. అశ్వత్థామ తాను ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రమును ఉపసంహరింప ప్రయత్నించాడు కాని అతనికి సాధ్యం కాలేదు. అప్పుడు అశ్వత్థామ వ్యాసుని చూచి ఇలా అన్నాడు. "మహాత్మా! ఈ భీమసేనుడు సిగ్గులేకుండా సుయోధనుని అక్రమ మార్గంలో చంపాడు. అంతటితో ఆగక నన్ను వెదుక్కుంటూ వచ్చి ముని వృత్తి నవలంబించిన నా ప్రాణాలు తీయాలని ప్రయత్నించాడు. అందుకని కోపంతోనూ ప్రాణ భీతితోనూ వివేకం కోల్పోయి,

ఈ బ్రహ్మ శిరోనామ కాస్త్రమును ప్రయోగించాను. దాని ఉపసంహారము నాకు తెలియదు. అది పాండవులను దహించివేస్తుంది. ఇది పాపము అని తెలిసినా తప్పనిసరి పరిస్థితులలో దానిని ప్రయోగించాను." అని అన్నాడు అశ్వత్థామ.

అశ్వత్థామ చెప్పిన మాటలు సావధానంగా విన్నాడు వ్యాసుడు. "అశ్వత్థామా! నీ తండ్రి తన ప్రియశిష్యుడైన అర్జునునికి బ్రహ్మశిరోనామ కాస్త్రమును ప్రీతితో ఇచ్చాడు. కాబట్టి అర్జునుడు నీకు కీడు తలపెట్టడు.నీవు ప్రయోగించిన మహాస్త్రమును ఉపసంహరించేందుకే తానుకూడా ప్రయోగించాడు. మేము కోరిన వెంటనే ఉపసంహరించాడు. ఇంతటి అస్త్రవిద్యానైపుణ్యము గల అర్జునుని వధించడం నీ తరం కాదు. ఈ బ్రహ్మ శిరోనామకాస్త్రము గురించి చెబుతానువిను. ఇది ఏ దేశంలో ప్రయోగించ బడుతుందో అక్కడ 12 ఏళ్లు అనావృష్టి సంభవిస్తుంది. కాబట్టి నిన్నూ, పాండవులను రక్షించడానికి ఈ ఉపాయం చెప్పాము. కాబట్టి నీవు ప్రయోగించిన మహాస్త్రమును ఎలాగుననైనా ఉపసంహరించాలి. నువ్వు తాపస వృత్తి నవలంబించావు. కోపం విడిచి పెట్టు. నీ శిరోమణిని ఇతనికి ఇవ్వు. పాండవులందరూ నిన్ను చంపినంతగాసంతోషిస్తారు. ఇది అందరికీ ఆమోదయోగ్యమైనది. ఆ ప్రకారం చెయ్యి." అన్నాడు వ్యాసుడు.

అశ్వత్థామ వ్యాసుని చూచి "మహాత్మా! పాండవులకు రత్నములు కొత్తా! కౌరవనాథుడైన సుయోధనుని రత్నభాండాగారమెల్ల కొల్లగొట్టారు కదా. ఇంకా వారికి నా రత్నం కావలసి వచ్చిందా మహాత్మా! ఈ రత్నము ఎవరి దగ్గర ఉంటుందో వారికి చోరభయమూ, రాక్షసభయమూ, దేవతలభయమూ, ఉండదు. పైగా వారికి ఆకలి, దప్పిక, నిద్ర,రోగము మొదలగునవి పుట్టవు. అందువల్ల ఈ రత్నము వీరికి ఎలా ఇచ్చేది. కాని మునిసత్తమా! నీ మాటను జవదాటను. కాబట్టి ఈ రత్నము నీకు సమర్పిస్తున్నాను. ఇప్పుడు

చెబుతున్నాను వినండి. నేను ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రము పాండవేయ రాగ పాత్ర గర్భములకు (పాండవుల భార్యల గర్భములకు) హానికలిగించి, వారు ధరించిన గర్భములను విచ్ఛిత్తి చేసి, పిదప శాంతిచెందుతుంది." అని పలికాడు అశ్వత్థామ.

వెంటనే వ్యాసుడు "తథాస్తు. అలాగే జరుగుగాక . అశ్వత్థామా! అంతటితో తృప్తిపడు. వేరేదానికి ఆశించకు." అని అన్నాడు.

అశ్వత్థామ ఆలోచనలో పడ్డాడు. ప్రస్తుతము పాండవుల పత్నులెవరూ గర్భవతులుగా లేరు. కాబట్టి తన మాటలు వృధా అవుతాయి. వెంటనే మాట మార్చాడు. " వ్యాసమునీంద్రా! ఇంకొక్కమాట. పాండవేయ రాగ పాత్ర గర్భములనిన తత్సంతాన సంజాత గర్భములు అని నా అభిప్రాయము. కాబట్టి పాండవుల సంతానముల వలన కలిగిన గర్భముల కన్నింటికీ హాని కలిగించి శాంతిపొందుతుంది. నా చే ప్రయోగింపబడిన అస్త్రము సకల గర్భ విధ్వంసము గావిస్తుంది. ఇది తథ్యము." అని మాట మార్చాడు అశ్వత్థామ.

వ్యాసుడు హతాశుడయ్యాడు. వీరువురి సంవాదము విలాసంగా తిలకిస్తున్నాడు కృష్ణుడు. "ఈ అశ్వత్థామ వ్యాసుని మాటను అబద్ధం చేసి తన మాట నెగ్గించుకుంటున్నాడు. ఇప్పుడు నేను వీడికి అడ్డుపడక తప్పదు." అని మనసులో అనుకున్నాడు. కృష్ణుని మనసులో మాట గ్రహించిన వ్యాసుడు మాట్లాడ కుండా మిన్నకున్నాడు. అప్పుడు కృష్ణుడు అశ్వత్థామతో ఇలా అన్నాడు.

"అశ్వత్థామా! పాండవుల కుమారులనందరినీ చంపి పాపం మూట గట్టుకున్నావు. ఇప్పుడు వారి సంతానము, వారి వారి సంతానముల

గర్భములను కూడా విచ్ఛిత్తి చెయ్యాలనుకుంటున్నావు. ఇది మహా పాపము. కాని పాండవ వంశము నిలబెట్టుటకు ఒకే ఒక్క గర్భమును నిలప నిశ్చయించాను. పాండవ వంశం నిలబెడతాను. కాబట్టి ఒక్క గర్భము మాత్రము నిలిపి మిగిలిన గర్భములను నీ అస్త్రములో దహించు." అని అన్నాడు కృష్ణుడు. ఆ మాటలకు అశ్వత్థామకు కోపం వచ్చింది.

"కృష్ణా! నీ ఆలోచననాకు తెలియును. నీవు పాండవ పక్షపాతివి. కాబట్టి అలా మాట్లాడావు. కాని నేను అలా ఎందుకు చేస్తాను. నీవు విరాట రాజపుత్రి ఉత్తర గర్భమును రక్షించడానికి ప్రయత్నిస్తున్నావు. నీవు ఆపని చేస్తే, నేను నా అస్త్రముతో ఉత్తర గర్భమును కూడా నాశనం చేస్తాను." అని పలికాడు. దానికి కృష్ణుడు దీటుగా సమాధానం ఇచ్చాడు.

"అసంభవము అశ్వత్థామా! అది ఎన్నటికీ జరగదు. విను. ఇప్పుడు అభిమన్యుని మహా తేజము ఉత్తర గర్భములో దినదినప్రవర్ధమానముగా పెరుగుతున్నది. నీవే కనక నీ అస్త్రముతో ఆ గర్భవిచ్ఛిత్తి కి పాల్పడితే నేను ఆ కుమారునకు దీర్ఘాయువును ఇస్తున్నాను."

ఆ మాటలకు అశ్వత్థామ నవ్వాడు. "అస్త్రదగ్ధుడికి నీవు దీర్ఘాయువు ఇస్తావా కృష్ణా! అది అసాధ్యము. కానిమ్ము. మీ ఇద్దరూ ప్రయత్నించండి." అని విలాసంగా నవ్వాడు అశ్వత్థామ.

వ్యాసుని మాటలు,కృష్ణుని మాటలు లక్ష్యపెట్టకుండా అశ్వత్థామ, తాను సంధించిన బ్రహ్మశిరోనామకాస్త్రమును పాండవేయరాగపాత్రగర్భముల మీదికి, తత్సంతాన సంజాత గర్భముల అన్నింటి మీదికి, మళ్లించాడు. అప్పుడు కృ ష్ణుడు అశ్వత్థామతో ఇలా అన్నాడు.

"గురుపుత్రా! ఇందు నేను చేసేదేమీ లేదు. ఒకనాడు త్రికాలవేదియగు ఒక బ్రాహ్మణుడు ఉపప్లావ్యములో ఉన్న ఉత్తర వద్దకు వచ్చి ఆమెను చూచి, అమ్మా! నీవు చేసుకున్న పుణ్యవిశేషమువలన నీకు ప్రాణములు పరిక్షీణములైన పుత్రుడు జన్మిస్తాడు. ఆ కారణంగా అతడు పరీక్షిత్తు అనే నామధేయంతో ఈ భూమిని చిరకాలము పరిపాలిస్తాడు. అని పలికాడు. కాబట్టి అశ్వత్థామా! ఆ బ్రాహ్మణుని మాటలు అబద్ధములు కావు కదా! కనుక పాండవ వంశ నిర్మూలనము అనే నీ సంకల్పము ఫలించదు. ఉత్తరకు పుట్టబోయే బిడ్డ పాండవ వంశకరుడవుతాడు." అని పలికాడు.

కాని కృష్ణునికి అశ్వత్థామ మీది కోపం చల్లారలేదు. "అశ్వత్థామా! నీవు బాలఘాతివి. బాలురు, యువకులు అనే బేధం లేకుండా అర్ధరాత్రి అందరినీ చంపావు. కాబట్టి ఇదే నా శాపము... అనుభవించు. నేటి నుండీ నీకు అన్నం దొరకదు. నీకు ఎవ్వరూసాయం చెయ్యరు. నీ ఒంటినిండా చీము నెత్తురు కారుతుంటుంది. ఈ ప్రకారము 3000 సంవత్సరములు దేశద్రిమ్మరివై అందరి చేతా అసహ్యంపబడుతూ తిరుగుతావు. కాని నాచేత రక్షింపబడిన ఉత్తర గర్భ సంజాతుడు, కృపాచార్యుని వద్ద ధనుర్విద్యాభ్యాసము చేసి చాలా సంవత్సరములు ఈ భూమిని పాలిస్తాడు. అతనికి జనమేజయుడు అనే కుమారుడు కలిగి నీ కళ్లెదుటనే ఈ భూమిని జనరంజకంగా పరిపాలిస్తాడు. ఇది సత్యం." అని పలికాడు కృష్ణుడు.

ఆ మాటలు విన్న వ్యాసుడు "గురుకుమారా! నీవు బ్రాహ్మణ వంశములో జన్మించినా క్షాత్రము అవలంబించావు. దారుణ మారణ కాండకు పాల్పడ్డావు. విచక్షణా రహితంగా బ్రహ్మశిరోనామకాస్త్రప్రయోగము గావించావు. కనీసం నామాటలు కూడా నీవు లక్ష్యపెట్టలేదు. కాబట్టి కృష్ణుని మాటలు అక్షరాలా జరిగితీరుతాయి." అని పలికాడు.

దానికి అశ్వత్థామ కోపించి "వ్యాసమునీంద్రా! నీవు కూడా మాలాంటి మనుష్యుల మధ్యనేజీవించు. ఇదే నా ప్రతి శాపము." అని అన్నాడు. వెంటనే తన శిరోరత్నమును తీసి పాండవులకు ఇచ్చాడు. తాను తపస్సుచేసుకొనుటకు తపోవనములకు వెళ్లిపోయాడు.

పాండవులు, కృష్ణుడు వ్యాసునికి నమస్కరించి మరలా ద్రౌపది ఉన్న చోటుకు వచ్చారు. భీముడు అశ్వత్థామ శిరో రత్నమును ద్రౌపదికి ఇచ్చాడు. "ద్రౌపదీ! శత్రుకార్యము పూర్తి అయింది. గురు పుత్రుడు అవడం వల్ల అర్జునుడు అశ్వత్థామను చంపడానికి ఇష్టపడలేదు. అందుకని అతని శిరోరత్నము తీసుకొని అతని కీర్తి శరీరము పడగొట్టాము. అతను ఇంక బతికీ చచ్చినట్టే. ఇంక నీ దుఃఖము మానుము. ధర్మరాజు దుఃఖమును పోగొట్టుము." అని అన్నాడు.

అప్పుడు ద్రౌపది అత్యంత మహిమాన్వితమైన ఆ రత్నమును చేతిలో పెట్టుకొని ధర్మరాజును చూచి "ఈ రత్నము పొందినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. దీనిని ధరించుటకు మీరు అర్హులు." అంటూ ఆరత్నమును ధర్మరాజుకు ఇచ్చింది. ధర్మరాజు కూడా తనకు అశ్వత్థామ మీద ఉన్న గౌరవము, భక్తిప్రపత్తులకు నిదర్శనంగా ఆ రత్నమును తన శిరస్సున ధరించాడు. అప్పుడు ధర్మరాజు అందరు వినేటట్టు తాము అక్కడినుండి బయలు దేరినప్పటినుండి తిరిగి అక్కడకు వచ్చుదాకా జరిగిన విశేషములు అన్ని ద్రౌపదికి, సహదేవునకు మిగిలిన వారికి వివరించాడు. బ్రహ్మశిరో నామకాస్త్ర ప్రభావంచేత అప్పటిదాకా నిల్చిన పాండవుల కుమారుల పత్నుల గర్భము లన్ని విచ్చిత్తి పొందాయి. కాని ఉత్తర గర్భము మాత్రం యధాతథంగా ఉంది. ఈ విషయం ఉత్తరకు కూడా తెలియదు.

(మహాభారతము, భాగవతము రాసినది వ్యాసుడే అయినా, పైన చెప్పిన ఘట్టము భాగవతములో వేరు విధంగా రాయబడినది. అందులో పాండవులు అశ్వత్థామను బంధించి ద్రౌపది వద్దకు తీసుకొని వస్తారు. అప్పుడు ద్రౌపది అశ్వత్థామను క్షమించి వదిలిపెడుతుంది. ఈ తేడాను గమనించగలరు.)

అప్పుడు ధర్మరాజు కృష్ణుని తో ఇలా అన్నాడు. "కృష్ణా! బలంలో శౌర్యములో, ద్రౌపదీ కుమారులు ఎంతో పరాక్రమ వంతులు కదా. అశ్వత్థామ ఒక్కడు వారినందరినీ చుట్టుముట్టి ఎలా చంపగలిగాడు. అతనికి అంతటి శక్తిసామర్ధ్యాలు ఎలా వచ్చాయి. పైగా ధృష్టద్యుమ్నుడు అజేయ బాహుబల సంపన్నుడు. మరి అలాంటి వాడు అశ్వత్థామ చేతిలో దారుణంగా మరణించ డానికి కారణం ఏమిటి? నాకు చెప్పండి." అని అడిగాడు. దానికి కృష్ణుడు ఇలా చెప్పసాగాడు.

"ధర్మనందనా! నాకు మహాశివుడు బాగా తెలుసు. అతను ప్రాణికోటి జన్మించుటకు, జీవించుటకు, లయించుటకు కారకుడు. అతడు తన సంకల్ప మాత్రం చేతనే ఈ జీవకోటిని సృష్టించగలడు, లయింపచేయ గలడు. కాని అతడు భక్తి సులభుడు. భక్తి తో తప్ప ఇతరత్రా అతనిని వశపరచుకొనుట అసాధ్యము. అందుకని అతడు ఇంత శక్తి మంతుడు అని చెప్పుట అసాధ్యము.

తొలుత బ్రహ్మ ఈ ప్రాణికోటిని సృష్టించవలెనని తలంపుతో మహాశివుని వద్దకు వెళ్లాడు. తన మనస్సులో మాట చెప్పాడు. అప్పుడు మహాశివుడు బ్రహ్మతో "బ్రహ్మదేవా! ఏ కార్యము సిద్ధించుటకైనా తపస్సు ముఖ్యం. తపస్సుతో తప్ప వేరు ఏ సాధనము తోనూ కార్యసాధన జరగదు. అందుకని ముందు నేను తమస్సు చేస్తాను." అని పలికాడు. తరువాత నీటిలో మునిగి

తపస్సుచెయ్యడం మొదలెట్టాడు.

అలా కొన్ని వేల సంవత్సరములు గడిచిపోయాయి. ఎంతకూ పరమశివుడు బయటకు రాలేదు. బ్రహ్మదేవునికి విసుగు పుట్టింది. తుదకు, బ్రహ్మదేవుడు, మహాశివుని సాయం లేకుండానే, తన తపఃప్రభావంచేత దక్షప్రజాపతిని సృష్టించాడు. "దక్షప్రజాపతీ! నీవు నా ఆజ్ఞచేత ప్రజలను సృష్టించు" అని ఆజ్ఞాపించాడు బ్రహ్మ.

"బ్రహ్మదేవా! నా కన్నా వేరే పెద్దవాళ్లు ఎవరూ లేని యడల నీవు చెప్పినట్టు సృష్టి కార్యక్రమము నిర్వర్తిస్తాను." అని అన్నాడు.

"దక్షప్రజాపతీ! పరమేశ్వరుడు జలంలో మునిగి తపస్సు చేస్తున్నాడు. ప్రజలను సృష్టించు వారు ఇంక ఎవ్వరూ లేరు. కాబట్టి నీవే ఈ సృష్టి కార్యక్రమమును నిర్వర్తించు." అని పలికాడు.

తరువాత దక్షప్రజాపతి దేవతలను, అసురులను, మనుష్యులను, తిర్యగ్జాతులను మొదలగు భూతములను సృష్టించాడు. కాని వాటికి తగిన ఆహారమును సృష్టించలేదు. అందుకని దక్షుడు సృష్టించిన ఆ ప్రాణులు ఆకలితో దక్షప్రజాపతిని భక్షించడానికి ప్రయత్నించాయి. అప్పుడు దక్షప్రజాపతి బ్రహ్మదేవుని వద్దకు వెళ్లాడు.

"బ్రహ్మదేవా! ఈ ప్రాణకోటి అంతా ఆకలితో నా వెంట పడుతున్నాయి. వీటి బారినుండి నన్ను రక్షించు. ఈ ప్రాణులంతటికీ ఆహారమును కల్పించు." అని ప్రార్థించాడు.

వెంటనే బ్రహ్మదేవుడు ఓషధులు, ఫలములు, కందమూలములు మొదలగు భక్ష్యములకు మూలమైన వృక్షములను, లతలను, పొదలను సృష్టించి ప్రాణులకు ఆహారము సమకూర్చాడు. మరియు బలిష్టమైన జంతువులకు బలహీనమైన జంతువులను ఆహారంగా సమకూర్చాడు. ఈ ఏర్పాటుకు ప్రాణులన్ని సంతోషించి వెళ్లిపోయాయి. అప్పటినుండి సృష్టి నిరాఘాటంగా కొనసాగుతూ ఉంది. అప్పటికే సృష్టించబడిన ప్రాణులకు సంతానాభివృద్ధిచెందుతూ ఉంది.

ఈ ప్రకారం సృష్టి క్రమము జరుగుతూ ఉండగా, మహాశివుడు తపస్సు ముగించుకొని జలమునుండి బయటకు వచ్చాడు. లోకమంతా ప్రాణులు సృష్టించబడటం, వారికి సంతానం కలగడం, సృష్టి నిరాఘాటంగా సాగటం చూచాడు. మహాశివునికి కోపం వచ్చింది. సృష్టించడానికి పనికిరాని లింగము (పురుషాంగము) నాకెందుకని దానిని పెరికి భూమి మీద పెట్టాడు. అది చూచిన బ్రహ్మదేవుడు "మహాదేవా! ఏమిటిది! ఇలా ఎందుకు చేసావు?" అని అడిగాడు.

"బ్రహ్మదేవా! ప్రాణులను సృష్టించడానికి నేను నీళ్లలో మునిగి అత్యంత ఉగ్రమైన తపస్సు చేసాను. తపస్సు పూర్తిచేసుకొని వచ్చాను. కాని, ఇప్పటికే వేరొకరి చేత ప్రాణులు సృష్టింప బడ్డారు. అందువలన ఇలా చేసాను. ప్రాణులను సృష్టించడానికి పనికిరాని ఈ లింగము నాకేల." అని పలికాడు కోపంతో ఊగిపోతూ. ఇంక అక్కడ ఉండటానికి ఇష్టపడక మాల్యవంత పర్వతమునకు పోయి తపస్సు చేసుకుంటున్నాడు.

మహాశివుని చేత భూమి మీద పెట్టబడిన లింగము బ్రహ్మదేవాదులకు మహా సుందరంగా ప్రకాశవంతంగా కనిపించింది. ఇంద్రుడూ మొదలగు

దేవతలందరూ దానికి పూజలు చేయడం మొదలెట్టారు. అలా చాలా కాలం గడిచింది.

దేవతలు ఒక మహా యజ్ఞము చేయడానికి తలపెట్టారు. యజ్ఞమునకు కావలసిన వస్తువులు అన్ని సమకూర్చుకున్నారు. యజ్ఞ భాగములు అందు కోడానికి అర్హులైన దేవతలను నిర్ణయించారు. కాని మహాశివునికి మాత్రం యజ్ఞభాగము కల్పించలేదు. యజ్ఞం మొదలయింది.

ఈ విషయం మహాశివునికి తెలిసింది. వెంటనే చాలా పొడవైన విల్లు ఒకటి సృష్టించాడు. దానిని చేత ధరించి మహోగ్రుడై దేవతలు యజ్ఞం చేసే ప్రదేశానికి వచ్చాడు. మహాశివుని కోపానికి భూమి దద్దరిల్లింది. ఆకాశం గర్జించింది. పర్వతాలు పెళ్లగించబడ్డాయి. సూర్యచంద్రులు తమ ప్రకాశం కోల్పోయారు. దేవతలందరూ భయపడి పరుగులు తీసారు. యజ్ఞమునకు ఆధ్వర్యము వహించుచున్న దేవతలు భయంతో బొమ్మలలా నిలబడిపోయారు. మహాదేవుడా ఆ యజ్ఞాన్ని కొట్టాడు. ఆ వేటుకు యజ్ఞము, అక్కడ వేల్చుతున్న అగ్నితో సహా పారిపోయింది. యజ్ఞం ఆగిపోయింది.

మహాశివుడు యజ్ఞమును నిర్వహించుచున్న పూషుని పళ్లు ఊడగొట్టాడు. సవిత్రుని చేతులు విరిచాడు.భగుడి కళ్లలో పొడిచాడు. మిగిలిన దేవతలందరూ భయభ్రాంతులై అక్కడ ఉన్న యజ్ఞోపకరణములు తీసుకొని తలా ఒక దిక్కుకుపారిపోయారు. కాని మహాశివుడు వారిని పారిపోకుండా నలుదిక్కులా తానే అయి విల్లు సంధించి నిరోధించాడు. దేవతలు చేసేది లేక మహాశివుని కాళ్లమీద పడ్డారు. పారిపోయిన యజ్ఞము, అగ్నితో సహా వచ్చి మహాశివుని కాళ్లమీద పడింది.

మహాశివుడు శాంతించాడు.  తన కోపాన్ని ఒక సరస్సులోకి విసిరేసాడు. ఆ కోపాగ్నికి ఆ సరస్సు ఎండిపోయింది.  పరమేశ్వరుని దయవలన సవితకు చేతులూ, పూషుడికి పళ్లు, భగుడికి కళ్లు యధాప్రకారము వచ్చాయి. దేవతలందరూ పరమేశ్వరుని భక్తితో కొలిచి ఆ యాగములో  అతనికి కూడా భాగం కల్పించారు. దేవతలు తలపెట్టిన యాగం నిర్విఘ్నంగా నెరవేరింది.

ఓ ధర్మరాజా! ఆ దేవదేవుడైన పరమేశ్వరుని లీలలు ఇలా ఉంటాయి.  ఆ మహాదేవుడు కోపిస్తే లోకాలన్ని భస్మం అయిపోతాయి. ఆ దేవదేవుడు కరుణిస్తే లోకాలన్నీ సుభిక్షంగా ఉంటాయి. అశ్వత్థామకు ఆ దేవదేవుడు తోడుగా ఉండబట్టి ఉపపాండవులను, ధృష్టద్యుమ్నుని, శిఖండిని సంహరించగలిగాడు. కాబట్టి ఇది అశ్వత్థామ పరాక్రమము కాదు. ఈ యుద్ధములో మీరు భీష్మని పడగొట్టడం, ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు  మొదలగు మహావీరులను చంపడం, సుయోధనుడు మొదలగు కురుకుమారులను చంపడం, భీముడు తన ప్రతిజ్ఞలు నెరవేర్చుకోడం,  అంతా దైవమానుషలీల అంతేకాని మీ పరాక్రమము కాదు. కాబట్టి సాధించిన విజయమునకు ఆనందపడు. కారణాలు వెతక్కు" అని అన్నాడు కృష్ణుడు.

## మహాభారతము

సౌప్తిక పర్వము ద్వితీయాశ్వాసము సమాప్తము.

దీనితో సౌప్తిక పర్వము సర్వం సమాప్తము.

ఓం తత్సత్ ఓం తత్సత్  ఓం తత్సత్

ఒక్క మాట.

సౌప్తిక పర్వముతో మహాభారతయుద్ధము ముగిసింది.

కాని మహా భారత యుద్ధము గురించి ఒక విశ్లేషణ సమర్పిస్తున్నాను.

అవధరించండి.

# మహా భారత యుద్ధము

ఒక విశ్లేషణ

మహా భారత యుద్ధము 18 రోజులు జరిగింది
దాదాపు 17 అక్షౌహిణీల సైన్యము మరణించింది.
వారి భార్యలు విధవలయ్యారు.... అనాధలయ్యారు
వారి కొడుకులు, కూతుళ్లు తండ్రి లేని వాళ్లయ్యారు.
వారి తల్లులకు గర్భశోకం మిగిలింది.
దీని వల్ల కలిగిన ఫలితం ఏమిటి? శూన్యం.
వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కౌరవ వంశం సర్వనాశనం అయింది.
ఇద్దరు అన్నదమ్ముల కుమారుల మధ్య వచ్చిన ఆస్తి తగాదాకు ఇంతమంది బలికావాలా?
జవాబు లేని ప్రశ్న.
అసలు ఈ యుద్ధమునకు అసలు కారణం ఏమిటి?
కేవలం రాజ్యభాగమేనా లేక పరువు, ప్రతిష్ట, పట్టుదల, అభిమానము, అభిజాత్యము, లోభత్వమా?

ధృతరాష్ట్రుడు, పాండురాజు అక్కచెల్లెళ్ల పిల్లలు.
వారు కూడా దేవర న్యాయము ననుసరించి వ్యాసుడికి పుట్టారు.
కాని, క్షేత్రప్రాధాన్యము చేత రాచబిడ్డలయ్యారు
పెద్దవాడు ధృతరాష్ట్రుడు పుట్టుగుడ్డి.
రెండవ వాడు పాండురాజు బలవంతుడు.
మూడవ వాడు విదురుడు దాసీ పుత్రుడు. రాజ్యార్హత లేదు.
నాడు నేడు ఒకే ధర్మము.

హిందూ అవిభక్త కుటుంబములో పెద్దవాడే కర్త.
ఆ ధర్మము ననుసరించి ధృతరాష్ట్రునికి పట్టం కట్టారు.

(ధృతరాష్ట్రునికి పట్టాభిషేకం జరిగిందా లేదా అన్న దాని మీద భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. నన్నయ గారి భారతం ప్రకారం పెద్దవాడు ధృతరాష్ట్రునికే పట్టాభిషేకం జరిగింది. కాని సంస్కృత ప్రతులలో పాండురాజుకు పట్టాభిషేకం జరిగినట్టు ఉంది. దీని గురించి వాదన ప్రస్తుతం అప్రస్తుతం).

రాజప్రతినిధిగా పాండురాజు రాజ్యభారం వహించాడు. రాజ్యమును విస్తరించాడు. కాని కొన్ని కారణముల వలన తన ఇద్దరు భార్యలు కుంతి,మాద్రిలతో అడవులకు వెళ్లాడు.
అక్కడ కుంతికి ధర్మరాజు, భీముడు,అర్జునుడు,
మాద్రికి నకుల,సహదేవులు,
పాండు రాజు వలన కాకుండా దైవిక శక్తులవలన జన్మించారు.
కాని క్షేత్ర ప్రాధాన్యము చేత క్షత్రియులయ్యారు.
ధృతరాష్ట్రుడి వలన గాంధారికి సుయోధనుడు పెద్దవాడుగా, 100 మంది జన్మించారు.
వయసు రీత్యా ధర్మరాజు పెద్దవాడు. సుయోధనుడు చిన్నవాడు.
కాని సుయోధనుడు ధృతరాష్ట్రుని(చక్రవర్తి) పెద్ద కొడుకు.
ధర్మరాజు రాజ్యమును వదిలి అడవులకు వెళ్లిన పాండురాజు కుమారుడు.
ఇదీ తేడా.
పాండురాజు చనిపోయాడు. మాద్రి భర్తతో సహగమనం చేసింది.
కుంతి, తన పిల్లలను తీసుకొని హస్తినాపురం వచ్చింది.
అప్పటికి వారి వయసులు....

ధర్మరాజు(16),భీమసేనుడు(15),అర్జునుడు(14),
నకులుడు(13),సహదేవుడు(13).

ఉన్నట్టుండి ఆకాశంనుండి ఊడిపడ్డట్టు వచ్చిన ఈ దాయాదులను చూచి సుయోధనుని మనసు కొంచెం కలత చెందింది. అప్పటిదాకా తానే రారాజు అనుకుంటున్నాడు. కాని రాజ్యములో భాగానికి మరో ఐదుగురు తయారయ్యారు. అదే అన్నదమ్ముల మధ్య మనస్పర్ధలకు నాంది.

భీముడు బలవంతుడు. సాధారణంగా బలవంతునికి బలహీనులను చూస్తే అలుసు. అందుకని భీముడు మిగిలిన వారిని చావగొట్టి ఆనందించే వాడు. వీడి ఆగడాలను తట్టుకోలేక, వీడి పీడా వదిలించుకోవాలని సుయోధనుడు మిగిలిన వారు భీముని చంపడానికి అనేక ప్రయత్నాలు చేసారు. కాని అవి ఫలించలేదు.అక్కడి నుండి వైషమ్యాలు మొదలయ్యాయి.

పెద్ద వాళ్లు ఊరుకోరు కదా. భీష్ముడు, విదురుడు కలిసి అందరిలోకీ పెద్ద వాడైన ధర్మరాజుకు యౌవరాజ్య పట్టాభి షేకం చేసారు. పుండు మీద కారం చల్లినట్టయింది సుయోధనుడికి. ద్వేషంతో కుమిలిపోతున్నాడు. దానికి తోడు శకుని అగ్నిలో ఆజ్యం పో స్తున్నాడు. పాండవుల పీడ వదిలించు కోవాలను కున్నాడు సుయోధనుడు.

ఫలితంగా, తండ్రిని ఒప్పించి, పాండవులను వారణావతానికి పంపాడు. అక్కడ వారిని సజీవ దహనం చెయ్యాలని కుట్రపన్నాడు సుయోధనుడు. అగ్ని ప్రమాదంగా చిత్రించాలను కున్నాడు. కాని బెడిసికొట్టింది. పాండవులు చనిపోయారు అని సుయోధనుడు అనుకుంటే, విదురుని మంత్రాంగంతో వారు బయటపడ్డారు.

తంతే బూర్ల గంపలో పడ్డట్టు, పాంచాల దేశం చేరి పెళ్లి కొడుకు లయ్యారు. తన పిల్లలు పరాయి దేశంలో ఉండటం బాగోలేదని ధృతరాష్ట్రుడు వారిని హస్తినకు పిలిపించాడు. పాండవులకు అర్ధ రాజ్యము ఇస్తానని భీష్మ,ద్రోణ,సుయోధనాది ప్రముఖుల ముందు, ధర్మరాజు మొదలగువారి ముందు, కృష్ణుని సాక్షిగా ప్రకటించాడు ధృతరాష్ట్రుడు. ఖాండవ ప్రస్థము రాజధానిగా చేసుకొని అర్ధరాజ్యము అనుభవించమని ఆదేశించాడు.

అగ్నిలో ఆహుతి కావలసిన వాళ్లు పెళ్లిచేసుకొని హస్తినలో అడుగుపెట్టగానే సుయోధనుడికి ఒంటినిండా కారం పూసినట్టయింది. పైగా రాజ్యభాగం ఇస్తానని తండ్రి ప్రకటించడం. తట్టుకోలేకపోయాడు సుయోధనుడు. కాని ఏమీ చెయ్యలేక చేతులు ముడుచుకున్నాడు.

పాండవుల మంచితనం, కృష్ణుని మంత్రాంగం వారికి అన్ని శుభాలు కలిగించాయి, మయుడు మయసభ నిర్మించి ఇచ్చాడు. భీమార్జున నకుల సహదేవులు నాలుగు దిక్కులు జయించి రాజ్యవిస్తరణ చేసారు. రాజసూయం చేయ సంకల్పించాడు ధర్మరాజు. కృష్ణుని ఆధ్వర్యంలో రాజసూయ యాగం నిర్విఘ్నంగా నెరవేరింది.

కాని అక్కడ రెండుసంఘటనలు జరిగాయి.

1. తమ సామంతులు తెచ్చి ఇచ్చిన కానుకలు అన్నింటిని జాగ్రత్తగా తీసుకొని భద్ర పరిచే పని సుయోధనుని అప్ప చెప్పాడు ధర్మరాజు. ఎందరో సామంత రాజులు కళ్లు చెదిరే కానుకలు తెచ్చి ఇస్తుంటే చూచి రారాజు కళ్లు కుట్టాయి. మనసంతా ద్వేషంతో రగిలిపోయింది. తన రాజ్యంలో భాగం పంచుకొని

తనకన్నా మిన్నగా వెలిగిపోతున్న పాండవుల రాజ్యసంపద రారాజు కు కంటిమీద కునుకు లేకుండా చేసింది.

2. రాజసూయ యాగము అయిపోయింది. అందరూ వెళ్లిపోయారు. ఒక రోజు రారాజు, పాండవులు, పాంచాలి తోసహా మయసభను చూడ్డానికి వెళ్లాడు. తలా ఒక పక్కకుపోయి చూస్తున్నారు. రారాజుకు ఒక చోట ఒక కొలను కనిపించింది. జీరాడుతున్న పంచ తడుస్తుందని ఎత్తిపట్టుకొని నడిచాడు. కాని అక్కడ నీరు లేదు. మరొక చోట కూడా అలాగే ఉంది. ఇక్కడా అంతే కదా అనుకొని ధీమాగా నడిచాడు. నీటిలోపడ్డాడు. కొంచెం దూరంలో ఉన్న ద్రౌపది మానవ సహజమైన నవ్వు ఆపుకోలేకపోయింది.(మొగుడు కాలుజారి కిందపడ్డా కిసుక్కున నవ్వుతుంది భార్య. అది అసంకల్పంగా జరిగే చర్య). కాని ఆ నవ్వు సుయోధనుని లోని అహాన్ని ఆత్మాభిమానాన్ని రెచ్చగొట్టింది. కోపంతో రగిలిపోయాడు. భీమసేనుడు గబాగబా వచ్చి చెయ్యి అందించి లేవ దీసాడు. ధర్మజుడు కొత్త బట్టలు తెప్పించాడు. కాని పాంచాలి నవ్వు రారాజు మనసులో ములుకు లాగా గుచ్చుకుంది. సలుపుతూ ఉంది.

పాండవుల వైభవము, పాంచాలి నవ్వు. ఈ రెండింటినీ మరిచి పోలేక పోయాడు రారాజు. హస్తినకు రాగానే తండ్రితోనూ, మామ శకునితోనూ మంతనాలు సాగించాడు. ఫలితం మాయాద్యూతం. ఒక్క రక్తపు బొట్టు నేలబడకుండా పాండవ శ్రీని నీకు ధారాదత్తం చేస్తానన్నాడు శకుని.

నాడు ఒక్క రక్తపు బొట్టు నేల బడకుండా రాజ్యం అపహరించిన రారాజు సుయోధనుడు, మహాభారత యుద్ధంలో 18 అక్షౌహిణుల సైన్యం యొక్క రక్తం కురుక్షేత్రంలో కాలువలై, ఏరులై పారించాడు.

ధర్మరాజు, రారాజు బదులు శకుని, జూదం ఆడారు. మొదట్లో కొన్నిపందాలు గెలిచినా తరువాత వరుస పరాజయాలు మూటగట్టుకున్నాడు ధర్మరాజు. ధర్మజునిలో పట్టుదల పెంచి అతనిలో ఉన్న వివేకమును నశింపచేసాడు చతురుడైన శకుని. ఫలితం తన తమ్ములు నలుపక్కలా దిగ్విజయం చేసి సంపాదించిన రాజ్యంతో సహా, ఆ నలుగురు తమ్ములను, తనను, తన భార్యను జూదంలో పణంగా ఒడ్డి ఓడిపోయాడు ధర్మరాజు.

ఇక్కడితో కథ ఆగిపోతే మహా భారత యుద్ధం జరిగి ఉండేది కాదు. కాని ఇప్పటి వరకూజరిగిన సంఘటనలు ఏవీ యుద్ధానికి దారి తీయలేదు. ఓడి పోయిన పాండవులను ద్రౌపదిని వారి మానాన వారిని వదిలి పెట్టి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది.

ధర్మరాజు ఒక్కొక్క పందెం ఓడిపోతుంటే ఎలాగైతే పట్టుదల పెరిగి, ఉచ్చనీచములు తెలియకుండా తనను, తమ్ములను, భార్యను పందెంగా ఒడ్డాడో, ఓడాడో, అలాగే పాండవులు, ద్రౌపది, ఓడిపోగానే వారు తనకు దాసులు, అనే విపరీతమైన భావన సుయోధనుని మనసులో పుట్టింది. అదే అతని సర్వనాశనానికి దారి తీసింది.

ధర్మరాజు ద్రౌపదిని ఓడిపోగానే సుయోధనుడు అన్నమాటలు ఇవి:

“విదురా! పాండవుల ప్రియమైన భార్యను ఇక్కడకు తీసుకొని రా! ఆమెను నా అంతఃపురము శుభ్రం చెయ్యమని చెప్పు. ఆమెను మా దాసీలు ఉండే చోట ఉండమను.”

ద్రౌపది తన అన్నభార్య. తనకు వదిన. పాండురాజు కోడలు. ఆమెను అంత నీచంగా పది మందిలో పిలిపించవచ్చునా అనే ఆలోచన రారాజుకు రాలేదు. పైగా విదురుణ్ణి తీసుకురమ్మన్నాడు. విదురుడు మందలించినా, తిట్టినా బుద్ధిరాలేదు. అధికార మదం, గర్వం తల కెక్కింది. అదే అతని పతనానికి దారి తీసింది.

తరువాత ప్రతీహారిని పంపాడు. ప్రతీహారి సభలో జరిగిన విషయాలు, రారాజు ఆజ్ఞ విన్నవించాడు. ద్రౌపది కొన్ని ప్రశ్నలు అడిగింది. వాటిని ప్రతీహారి రారాజుకు విన్నవించాడు.

పాంచాల రాజకుమారిని ఈ సభకు వచ్చి ప్రశ్నించమను. ఆమె ప్రశ్న, ధర్మరాజు జవాబు సభలో అందరూవింటారు అన్నాడు సుయోధనుడు.

ఎంతకూ ద్రౌపది రాలేదు. అప్పుడు ధర్మరాజు ఒక దూతను పంపాడు. ఆమె ఏ పరిస్థితిలో ఉన్నా సభకు వచ్చి, ధృతరాష్ట్రునికి జరిగిన విషయం చెప్పమని ఆదేశించాడు. ఆ దూతకు ఏమి చెయ్యాలో తోచలేదు. ద్రౌపదికి ఏమి చెప్పాలి అని మరలా అడిగాడు.

సుయోధనుడికి సహనం నశించింది. దుశ్శాసనుడిని పిలిచాడు. “దుశ్శాసనా! ఈ ప్రతీహారి భీముడికి భయపడుతున్నాడు. వాళ్లు ఇప్పుడు మన బానిసలు. వాళ్లేం చేస్తారు నీవుపోయి యాజ్ఞసేనిని బలవంతంగా సభకు తీసుకొని రా!” అని ఆదేశించాడు. దుశ్శాసనుడు ద్రౌపది దగ్గరకు వెళ్లి అన్నగారి ఆదేశం వినిపించాడు. చేసేది లేక ద్రౌపది సభకు వెళ్లి సభలో ఆడవాళ్లు ఉన్నచోటకు వెళ్లి నిలబడింది.

అక్కడితో ఆగినా బాగుండిపోను. ఇక్కడ దుశ్శాసనుడు అత్యుత్సాహం ప్రదర్శించాడు. ద్రౌపది జుట్టపట్టుకొని లాగి సభకు ఈడ్చుకు వచ్చాడు. ఇంకా రెచ్చిపోయాడు. "నువ్వు ఏక వస్త్ర వైతేనేమి వివస్త్ర వై తే నేమి. నిన్ను నీ భర్తలు జూదంలో ఓడిపోయారు. నిన్ను మా దాసిగా చేసారు. నువ్వు మా దాసీల పక్కన నిలబడాలి కాని అంతఃపుర కాంతల పక్కన కాదు." అంటూ జుట్టు పట్టుకొని లాగాడు. అదే వాడి పతనానికి నాంది అయింది.

నిస్సహాయ స్థితిలో ఉన్న ద్రౌపది తన గోడు సభలో ఉన్నవారికి చెప్పుకుంది. కాని ఎవరు వింటారు. దాసీ దాసీ అంటూ దుశ్శాసనుడు అరుస్తున్నాడు. కర్ణుడు, శకుని బిగ్గరగాఅరుస్తూ దుశ్శాసనుడిని ప్రోత్సహించారు. ద్రౌపది పరిస్థితి చూచి భీమార్జున నకుల సహదేవులు ధర్మరాజును తిట్టారు.

ఇంతలో సుయోధనుని తమ్ములలో ఒకడైన వికర్ణుడు లేచి, ద్రౌపది అధర్మవిజిత (అధర్మముగా గెలువబడినది) అని వాదించాడు. అప్పటిదాకా దుశ్శాసనుని ప్రోత్సహించిన కర్ణుడు కూడా అత్యుత్సాహము ప్రదర్శించాడు.

కర్ణుడికి కురు వంశానికి బాహ్యంగా ఎలాంటి సంబంధం లేదు. ఎందుకంటే అతడు కుంతీ కుమారుడని లోకానికి తెలియదు. అప్పటికి అతనికీ తెలియదు. అస్త్రవిద్యా ప్రదర్శన సమయంలో నే రారాజుకు కర్ణునితో పరిచయం అయింది. అర్జునునికి దీటుగా తన పక్షములో ఉండటానికి అతనితో స్నేహం చేసాడు రారాజు. అతనిని అంగదేశానికి రాజును చేసాడు. కాబట్టి కర్ణుడు కేవలం రారాజు మిత్రుడు. అంగరాజు.

కాని కర్ణుడు మిగిలిన సామంత రాజుల మాదిరి ఊరుకోక అత్యుత్సాహం ప్రదర్శించడమే భారత యుద్ధానికి మరొక కారణమయింది. ఈ విషయం కర్ణుడి మాటలు వింటే మీకే అర్థం అవుతుంది.

కర్ణుడు రాజకుమారుడైన వికర్ణుని మందలించాడు.

"తాను ధర్మవిజితనా, అధర్మ విజితనా అన్న ప్రశ్నకు పాండవులే జవాబు చెప్పలేదు. నీకెందుకు. భగవంతుడు ఒక స్త్రీకి ఒక భర్తను నిర్ణయించాడు.కాని ఈ ద్రౌపది ఐదుగురిని పెళ్లి చేసుకుంది. కాబట్టి ఈమె శీలవతి కాదు. ఏక వస్త్రగా ఉన్న ఈమెను సభకు ఈడ్చుకురావడం తప్పుకాదు. అసలు బట్టలు ఊడదీసినా తప్పులేదు."

ఈ మాటలు విన్న సుయోదనుడు "దుశ్శాసనా! బానిసలైన పాండవులకు, ద్రౌపదికి బట్టలు అనవసరం. వాటి లాగేసుకో" అన్నాడు.

(ఇక్కడ ఒక సంశయం. వ్యాసమహా భారతంలో పైన ఉదహరించిన మాటలు కర్ణు డు అన్నట్టు ఉంది. కాని నన్నయ్య భారతంలో సుయోధనుడు అన్నట్టు ఉంది. కాని మనకు వ్యాసభారతం ప్రమాణం కాబట్టి ద్రౌపది ఒంటి మీద ఉన్న బట్టలు విప్పమన్నది కర్ణుడు అనే అనుకోవాలి.)

కర్ణుడి మాటలు దుశ్శాసనుడిలో ఉత్సాహం రేపాయి. పాండవులు తమ తమ పైగుడ్డలు తీసి కింద పెట్టారు. కాని ద్రౌపది ఏకవస్త్ర. అందుకని మిన్నకుంది. దుశ్శాసనుడు ద్రౌపది చీర కొంగు పట్టుకొని లాగాడు. ఆమె వెనక్కు లాగే కొద్దీ బలవంతంగా లాగుతున్నాడు. అప్పుడు భీముడు తట్టుకోలేకపోయాడు. దుశ్శాసనుని గుండెలు చీల్చి నెత్తురు తాగుతానని

శపథం చేసాడు.

అసలు ఈ బట్టలు విప్పడం అనేది సుయోధనుని ఆలోచన కాదు. కర్ణుడు అలాంటి ఆలోచన సుయోధనుని మెదడులో ప్రవేశ పెట్టాడు. ద్రౌపదీ వస్త్రాపహరణము, భీముని ప్రతిజ్ఞ, మహాభారత యుద్ధానికి పునాది. దానికి ఆద్యుడు కర్ణుడు, ఆచరించినది సుయోధనుడు, దుశ్శాసనుడు.

కర్ణుడు అంతటితో ఊరుకోలేదు. ఇంకా అధిక ప్రసంగం చేసాడు.

" ఓ ద్రౌపదీ! ఇప్పుడు నీ భర్తలు బానిసలు. వారికి ఏ ధనమూ లేదు. నీవు ధృతరాష్ట్రుని అంతఃపురమునకు పోయి అక్కడ వారికి సేవలు చెయ్యి. ఇప్పుడు నీ యజమానులు పాండవులు కాదు. ధృతరాష్ట్రుని కుమారులు. ఇక్కడ ఉన్న వారిలో నీకు తగిన వాడిని, మరలా నిన్ను జూదంలో ఒడ్డి ఓడి పోని వాడిని భర్తగా ఎంచుకో. నీ భర్తలు బానిసలు కాబట్టి వారు నీ భర్తలు గా ఉండటానికి అనర్హులు." అని అన్నాడు.

మిత్రుని మాటలకు పొంగిపోయాడు సుయోధనుడు. తన పంచెను పక్కకు నెట్టి తన ఎడమ తొడ చూపిస్తూ ద్రౌపది వంక చూచి నవ్వుతూ సైగ చేసాడు. ద్రౌపదికి నువ్వు ఏతొడ చూపించావో ఆ తొడలు విరుగ గొడతాను అని ప్రతిజ్ఞ చేసాడు భీముడు.

భీముడు రెండు ప్రతిజ్ఞలు చేసాడు--- ఒకటి దుశ్శాసనుని గుండెలు చీల్చి నెత్తురు తాగడం. రెండు సుయోధనుని తొడలు విరుగ గొట్టడం. ఈ ప్రతిజ్ఞలు నెరవేరడానికే మహాభారతయుద్ధం సంక్రమించింది. ఈ రెండు ప్రతిజ్ఞలు భీముడు చెయ్యడానికి ప్రత్యక్ష కారణం కర్ణుడు.

అసలు కర్ణుడికి ఈ విషయంలో సంబంధం ఏమిటి? అందరి మాదిరి నోరుమూసుకొని కూర్చోవచ్చు కదా. కర్ణుడు సుయోధనుడికి బంధువు కాదు. కేవలం స్నేహితుడు. సుయోధనుని దయాధర్మము వలన అంగదేశానికి రాజయ్యాడు. సుయోధనుడు ఇచ్చిన చనువును దుర్వినియోగం చేసాడు కర్ణుడు. మారణహోమానికి కారకు డయ్యాడు.

అసలు కర్ణుడికి ద్రౌపది మీద కోపం, పగ ఎందుకు. ఏ కారణం లేక పోతే కర్ణుడు ఎందుకు అలా అంటాడు అని మీకు సందేహం రావచ్చు. దీనికీ ఒక కారణం ఉంది.

మనం ఒక్కసారి ద్రౌపదీ స్వయంవరం సభకు వెళదాము. అందరి మాదిరి మత్స్యయంత్రము కొట్టడానికి కర్ణుడు లేచాడు. అప్పుడు ద్రౌపది అభ్యంతరం చెప్పింది. అతడుసూతపుత్రుడు. అతడు మత్స్య యంత్రము కొట్టినా అతనిని నేను వివాహం చేసుకోను అని నిక్కచ్చిగా చెప్పింది.

వ్యాస మహా భారతంలో దీనికి సంబంధించిన శ్లోకం చదవండి.

ధృష్ట్వాతు తం ద్రౌపదీ వాక్యముచ్చైర్ జగాద "నాహం వరయామి సూతం"।
సామర్షహాసం ప్రసమీక్ష్యసూర్యం తత్యాజ కర్ణః స్ఫురితం ధనుస్తత్॥
(మత్స్యయంత్రమును కొట్టుటకు సమాయత్తమవుతున్న కర్ణుని చూచి ద్రౌపది "నేను సూతుడిని వరుడిగా అంగీకరించను" అని పలికింది. ఆ పలుకులు విన్న కర్ణుడు తన విల్లును పక్కన పడేసి ఆకాశంలో వెలుగుతున్న సూర్యుని వంకచూచి, విరక్తిగా ఒక నవ్వు నవ్వి అక్కడి నుండి వెళ్లిపోయాడు.)

కాని ఈ విషయం నన్నయ భారతంలో లేదు. వ్యాసభారతంలో ఉంది.

ఇది బాగానే ఉంది. కర్ణుడు సూతపుత్రుడు అని ఈసడించిన ద్రౌపది, మరి బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునుడు మత్స్యయంత్రము కొట్టడానికి వెళుతున్నప్పుడు ఎందుకు అభ్యంతరం చెప్పలేదు. అప్పటికి మత్స్య యంత్రమును కొట్టడానికి వెళుతున్న బ్రాహ్మణ కుమారుడు అర్జునుడు అని ఆమెకు తెలియదు. అంటే బ్రాహ్మణుడు ఐతే పరవాలేదు అనుకుందా. లేక ఈ బ్రాహ్మణుడు మత్స్య యంత్రమును ఏం కొడతాడులే అని నిర్లక్ష్యం గా ఉందా! (కాని ఆ నాటి ఆచారం ప్రకారం బ్రాహ్మణులకు క్షత్రియ,వైశ్య,శూద్ర కన్యలను వివాహమాడే అర్హత ఉంది.) అందుకే అనుకుంటా నన్నయ ఈ వివాదాస్పద విషయం రాయకుండా వదిలేసాడు.

ఇంక అసలు విషయానికి వద్దాము

నిండు సభలో అవమానం జరిగిన కర్ణుడు ఊరుకుంటాడా. కర్ణుడి మనసు భగా భగా మండిపోతూ ఉంది. అవకాశం చిక్కింది. ద్రౌపదిని ని ండు సభలో ఘోరంగా అవమానించాడు. బదులుకు బదులు తీర్చుకున్నాడు. అని అనుకున్నప్పటికీ, అతని ప్రతీకారం ఒక దారుణ మారణ కాండకు దారి తీసింది.

మరలా మనం కురు సభకు వద్దాము.

పోనీ కర్ణుడు ఏవో అవాకులు చవాకులు పేలాడు అనుకుందాము. సుయోధనుడు సకలవిద్యా విశారదుడు. ధర్మవేత్త. అతడి విచక్షణా జ్ఞానం

ఏమయింది. స్నేహితుడు అన్నంత మాత్రాన గుడ్డిగా  తాను కూడా వంత పాడాలా!  కాని సుయోధనుని రాజ్యకాంక్ష, లోభత్వము, గర్వము, స్వాభిమానము, అతని విచక్షణా జ్ఞానాన్ని అణిచి వేసాయి. మూర్ఖంగా ప్రవర్తించేట్టు చేసాయి.

ఇప్పుడు ఒకసారి సింహావలోకనం చేద్దాము.

1.చిన్నతనంలో భీముడి ఆగడాలు. అతనిని చంపడానికి ప్రయత్నం.
2.ధర్మరాజును యువరాజుగా అభిషేకించడం. సుయోధనుని ద్వేషం.
3.లాక్షాగృహదహనం.
4.పాండవులకు ధృతరాష్ట్రుడు అర్ధరాజ్యం పంచి ఇవ్వడం
5.పాండవుల వైభవము చూచి సుయోధనునికి కన్నుకుట్టడం. వాళ్ల సంపద అపహరించవలెనని ఆలోచన
6.మయసభలో సుయోధనుని అవమానము.
7. పాండవులు ద్యూతములో సర్వము కోల్పోయిన తరువాత, సుయోధనుడు ద్రౌపదిని బానిసగా అవమానించడం. సభకు ఈడ్చుకు రమ్మని ఆదేశించడం.
8.సుయోధనుడు(కర్ణుడు) బట్టలు విప్పమని ఆదేశించడం. దుశ్శాసనుని చే ద్రౌపదీ వస్త్రాపహరణం. భీముని ప్రతిజ్ఞ
9.కర్ణుడు ద్రౌపదిని మరొక భర్తను చూసుకోమని  సలహా ఇవ్వడం. సుయోధనుడు తన తొడ చూపించడం. భీముని ప్రతిజ్ఞ.

ఈ తొమ్మిది కారణాలు ఒకదానితో ఒకటి పెనవేసుకొని ఉన్నాయి. అన్ని కలిసి మహాభారతయుద్ధానికి, మారణహోమానికి నాంది పలికాయని అనుకోవచ్చు.

కాని ఇవి కూడా సరియైన కారణాలు కాకపోవచ్చు. కేవలం భీముడు తన ప్రతిజ్ఞలు నెరవేర్చుకోడానికి యుద్ధమే రానవసరం లేదు. దుశ్శాసనుని గుండెలు చీల్చడానికి సుయోధనుని తొడలు విరగగొట్టడానికి యుద్ధమే కావాలా.

మరి యుద్ధం ఎందుకు వచ్చింది? ఇది కృష్ణుని మంత్రాంగం అని కూడా చెప్పవచ్చు.

పాండవులు తాము ధర్మబద్ధంగా సంపాదించుకున్న రాజ్యాన్ని, జూదంలో పణంగా పెట్టి ఓడిపోయారు. రాజ్యభ్రష్టులయ్యారు. పైగా 12 ఏళ్లు వనవాసం వెళ్లడానికి ఒప్పుకున్నారు. ఎందుకన్నా మంచిదని శకుని మరొక ఏడుకలిపాడు. ఆ ఏడు అజ్ఞాతవాసం చెయ్యాలని, ఆ సమయంలో పాండవులను గుర్తు పడితే మరలా 12 ఏళ్లు వనసాసంచెయ్యాలని. అంటే పాండవులు జీవితాంతం అడవుల్లో కాలం గడపాలని, సుయోధనుడు జీవితాంతం రాజ్యపాలన చెయ్యాలని వారి ఊహ.

ఎవరైనా తమ ఆస్తిని, తమ అనుమతి లేకుండా, పరాయి వాళ్లు అనుభవిస్తూ ఉండగా చూస్తూ 12 ఏళ్లు గడిపితే, వారికి ఆ ఆస్తి మీద హక్కు పోతుంది. ఇదీ నేటి చట్టం.(Law of Adverse Possession--Indian Limitation Act). అదే చట్టం ద్వాపరయుగంలో కూడా అమలులో ఉంది. త్రేతాయుగంలో అది 14 ఏళ్లు ఉండేది. అందుకే కైక రాముడిని 14 ఏళ్లు వనవాసం పంపింది. కాబట్టి 12 ఏళ్లు వనవాసం ఒక ఏడు అజ్ఞాతవాసం తరువాత పాండవులు తమ రాజ్యంమీద హక్కును కోల్పోయారు అని కృష్ణుడికి తెలుసు. పాండవులు తిరిగి తమరాజ్యం పొందాలంటే యుద్ధం ఒకటే శరణ్యం. రాజ్యం వీరభోజ్యం.

కాని ధర్మరాజు సంధి అంటున్నాడు. సంధి జరిగితే పాండవులు సుయోధనుని దయాధర్మము మీద ఆధారపడాలి కాని స్వతంత్రరాజులు కాలేరు. కాబట్టి సంధి శ్రేయోదాయకం కాదని కృష్ణుని కి తెలుసు. కాని లోకాచారప్రకారం సంధికి వెళ్లాడు. అక్కడు పాండవుల ప్రాభవాలను, వారికి ఉన్న బలాన్ని ఏకరువు పెట్టాడు. రాబోయే యుద్ధంలో భీముడు సుయోధన, దుశ్శాసనులను ఎలా చంపుతాడో సవివరంగా ఏకరువుపెట్టాడు. రాబోయే యుద్ధంలో అంటూ యుద్ధం తధ్యం అనే సంకేతాలు పంపాడు. సుయోధనునిలో అహం రెచ్చగొట్టాడు. సంధి చెడగొట్టాడు.

కృష్ణుని ఆలోచన పాండవులను యావత్తు కురు సామ్రాజ్యానికి పట్టాభిషిక్తులనుచేద్దామని. దానికి యుద్ధం తప్ప వేరే మార్గం లేదు. కాబట్టి కృష్ణుని ఆలోచనా విధానం కూడా మహాభారత యుద్ధానికి కారణం అయింది.

కారణాలు ఏవైనా జరిగింది మారణహోమం. అపార జననష్టం. వర్ణ సంకరం. ఎందరో తల్లులకు గర్భశోకం. ఎందరో భార్యలకు భర్తృవియోగం.

ఇక్కడ ఒక చిన్న విషయం మనం చెప్పుకోవాలి. మహా భారతము ఒక ఇతిహాసము. ఇతిహాసము అంటే ఇలా జరిగింది అని అర్థము. కాబట్టి మనం అందరం ఈ మహా భారత కథ నిజంగా జరిగింది అని విశ్వసిస్తున్నాము. మన విశ్వాసమునకు విఘాతం లేకుండా ఒక విషయం చెప్పుకుందాము.

వ్యాసుడు ఈ మహా భారత ఇతిహాసము రాయడానికి ప్రేరణ ఏమైనా ఉందా.

వ్యాసుడు మహా భారతమునకు ముందే వేదములను నాలుగు భాగములుగా విభజించాడు. (కొంతమంది మూడు వేదములు అంటారు. త్రయీ విద్య అని. ఇప్పుడు ఆ విషయం అప్రస్తుతము). ఋగ్వేదములో ద్యూత సూక్తము అని ఒక సూక్తము ఉంది. ఆ సూక్తము నుండి కొన్ని శ్లోకాలు ఆ శ్లోకాలకు సాయణా చార్య భాష్యము, దానికి తెలుగు అనువాదము మీకోసం ఇస్తున్నాను.

# ఋగ్వేదసూక్తములు

## సాయణాచార్య భాష్యమునకు తెలుగు అనువాదము

డా॥కురుమద్దాలి హయగ్రీవ శర్మ, యం. ఏ., పి.హెచ్.డి.

## ద్యూత సూక్తము

2 నమామి మేధ నజిహేళ ఏషా శివాసఖిభ్య ఉతమహ్యామాసీత్।
అక్షస్యాహ మేక పరస్య హేతోరనువ్రతామవజాయామరోధమ్॥

అనువాదము:

ఏషా=నా భార్య, మా=జూదరినగు, నన్ను, నమిమేధ=కోపగించుకొనుటలేదు. నజిహేళే=సిగ్గుపడుటలేదు, సఖిభ్యః=నా స్నేహితులకు, శివా=సుఖమును కలుగచేయునదిగా, ఆసీత్= ఉండెను, ఉత= ఇంకనూ, మహ్యం=నాకు సంతోషమును కలుగచేయునదిగ నుండెను ఇత్థం= ఇట్లు, అను వ్రతామ్= అనుకూలమైన, జాయామ్=భార్యను, ఏకపరస్య=ప్రధానమైన ఒక, అక్షస్యహేతోః=పాచిక కారణముగా అహమ్ అవరోధమ్=నేను వదలిపెట్టినాను.

4. అన్యేజాయాం పరిమృశన్త్యస్య యస్యాగృధద్వే దనే వాజ్య ఉక్షః।
పితామాతాభ్రాతర ఏనమాహుః నజానీమో నయతాబద్ధతమ్॥

యస్య= ఏ జూదరికి, వేదనే=ధనమునందు, వాజీ=బలవంతమగు, అక్షః=పాచిక, అగృధత్=కోరికలను ( ఆశను) కలుగచేయుచున్నదో, తస్యఅస్య=అటువంటి జూదరి యొక్క, జాయాం=భార్యను, అన్యే=తోటిజూదరులు, పరిమృశన్తి=వస్త్ర, కేశములను లాగుచూ ఆలింగనము చేయుచున్నారు. ఇంకనూ  పితామాతా=జూదరి తల్లి తండ్రులు, భ్రాతరః=సహోదరులు, ఏనం= జూదరిని గూర్చి, ఆహుః= ఇట్లు చెప్పుచున్నారు.  మాకు ఇతనిని గూర్చి తెలియదు త్రాడుతో, బద్ధమేతం=బంధించబడిన ఈ జూదరిని, ఓజూదరులారా! నయత=మీ ఇష్టము వచ్చిన ప్రదేశమునకు తీసుకు వెళ్లండి.

7.అక్షాన ఇదఙ్కు శినోనితోదినో నికృత్వానస్త వనాస్తావయిష్ణవః।
కుమారదేష్ణా జయతః పునర్హణో కితవస్యబర్హణా॥

అక్షాస ఇత్=  పాచికలే, అంకుశినః=అంకుశము వంటివి. నితోదినః=బాధను కలుగచేయునవి. నికృత్వానః=పరాజయమునందు (ఖండించునవి, ఛేధించునవి), కితవస్య=జూదరికి, తపనాః= పరాజయముద్వారా సంతాపమును కలుగజేయునవి. తావయిష్ణవః= సర్వస్వమును హరించుట ద్వారా కుటుంబమును దహించుచున్నవి.  ఇంకనూ జయతః=జయించవలెనను, కితవస్య=జూదరికి, కుమారదేష్ణాః (చిన్న పిల్లలు బహుమతులిచ్చి మరల వెనుకకు తీసుకున్నట్టు) ధనమును కలుగచేసి మరలా పోగొట్టుచున్నవి,  మధ్వా=తేనెతో, సంపృక్తాః= కూడిన మాటలవలె ప్రత్యర్థియగు

జూదరి ద్వారా, బర్హణా=సర్వస్వమును హరించుటచేత,
కితవస్యపునర్హణః=జూదరిని మరల హింసించునవిగా నున్నవి.

పైశ్లోకాలు చదువుతుంటే మనకు మహా భారతములోని ద్యూత సన్నివేశము గుర్తుకు వస్తుంది.

ధర్మరాజు ద్యూత వ్యసనము, శకుని ధర్మరాజును తన తేనె లాంటి మాటలతో మోసగించి, రాజ్యమును, సోదరులను తుదకు భార్యను ఒడ్డేట్టు చెయ్యడం, ద్యూతములో ఓడి పోయిన వారిని అతని సోదరులు దూషించడం, ద్యూతములో గెలిచినవారు, ఓడిపోయిన వారి భార్యల వస్త్రములు ఊడదీయడం.

(పరిమృశన్తి=వస్త్రకేశములను లాగుచూ ఆలింగనము చేయుచున్నారు-- ఇక్కడ కూడా దుశ్శాసనుడు కేశములు లాగాడు, వస్త్రములు లాగాడు, సుయోధనుడు ద్రౌపదిని వచ్చి తన తొడమీద కూర్చోమన్నాడు).

మహాభారతంలో ద్యూతము అత్యంత ముఖ్య ఘట్టము. మహాభారత యుద్ధమునకు ద్యూతము నాంది. అలాంటి ద్యూతము గురించి ఋగ్వేదములో కొన్ని మంత్రములు ఉండటం యాదృచ్ఛికమే. కాని ఆ మంత్రములు మహాభారత రచనకు ప్రేరణ కావచ్చు.... కాకపోవచ్చు.

ఏది ఏమైనా, మహాభారతయుద్ధము వినాశనాన్ని మిగిల్చింది అన్నది అక్షరసత్యము. కృతయుగాంతంలో దేవాసుర యుద్ధము, త్రేతాయుగాంతంలో రామరావణ యుద్ధము జరిగాయి.

కాని అవి మహాభారత యుద్ధమంతటి తీవ్రమైనవి కావు. ఇంతటి జననష్టము జరగలేదు. కాని మహాభారత యుద్ధము గెలిచిన ధర్మరాజుకు భస్మసింహాసనమును మాత్రం మిగిల్చింది.

కాబట్టి ఈ మహా భారత యుద్ధమును చూచి అయినా మరొక ప్రపంచ యుద్ధానికి నాంది పలకకుండా ఉంటే అదే చాలు.

భవదీయుడు

మొదలి వెంకటసుబ్రహ్మణ్యం.

# మహాభారతము

## స్త్రీ పర్వము

### ప్రథమాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన మహా భారత కథను, నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంగా సూతుడు శౌనకాది మహా మునులకు, వివరించసాగాడు.

మహాభారత కథను వింటున్న జనమేజయుడు వైశంపాయనుని చూచి" మహాత్మా! తన కుమారుడు సుయోధనుడు, భీముని చేతిలో చనిపోయిన విషయం సంజయుని వలన వినిన తరువాత ధృతరాష్ట్రుడు ఏమి చేసాడు; సుయోధనుని వద్దనుండి బయలు దేరిన అశ్వత్థామ, కృపా చార్యుడు, కృతవర్మ హస్తినాపురం వచ్చారని విన్నాము. వారు హస్తినకు ఎందుకు వచ్చారు; ఎవరెవరిని కలిసారు; తరువాత ఎక్కడకు వెళ్లారు; అశ్వత్థామ వ్యాసుని ఆశ్రమము నకు వెళ్లిన తరువాత, కృపాచార్యుడు, కృతవర్మ ఎక్కడకు వెళ్లారు; ఒక పక్క మహా విజయము, మరొక పక్క కొడుకుల దుర్మరణము ధర్మరాజు ఎలా తట్టుకున్నాడు; ఏమి చేసాడు; వివరంగా చెప్పండి." అని అడిగాడు. వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

తన నూరుగురు కుమారులు యుద్ధములో మరణించారు అని తెలిసిన ధృతరాష్ట్రుడు మొదలు నరికిన వృక్షము మాదిరి కూలిపోయాడు. భరించరాని దుఃఖంలో మునిగిపోయాడు. అతని హృద యము కకావికలయింది. దుఃఖభారంతో తనలో తనే కుమిలిపోతున్నాడు. ధృతరాష్ట్రుని చూచి సంజయుడు ఇలా అన్నాడు:

"ధృతరాష్ట్ర మహారాజా! ఏమిటీ వెర్రి? ఎవ్వరి కోసం దుఃఖపడు తున్నావు? నీ శోకానికి అంతు లేదా? దుఃఖాన్ని వదిలిపెట్టి నేను చెప్పేది విను! కురుక్షేత్ర మహాసంగ్రామంలో పదునెనిమిది అక్షౌహిణుల సైన్యం మరణించారు. నీ తాతలు, తండ్రులు, అన్నలు, తమ్ములు, మిత్రులు, బంధువులు, ఎందరో రాజులు, సామంత రాజులు, నీ కోసం మరణించారు. వారందరికీ దహన సంస్కారాలు చెయ్యాలి కదా. పద యుద్ధభూమికి వెళదాము." అని అన్నాడు.

కాని ధృతరాష్ట్రుడు కదల లేదు. తల బాదుకుంటున్నాడు. "సంజయా! నా కొడుకులంతా చచ్చారయ్యా. నా వైభవం అంతా నశించిదయ్యా! అతి దీనంగా బతుకుతున్నానయ్యా! ఈ దేహం మాత్రం ఎందుకు చెప్పు! ఒకరి దయాధర్మభిక్ష మీద బతకడానికా! నాదీ ఒక బతుకేనా! బతికి నేను సాధించే దేముంది.

సంజయా! కృష్ణుడు సంధి చేయడానికి వచ్చినపుడు నాకు ఎంతో నచ్చ చెప్పాడు. భీష్ముడు, ద్రోణుడు నా హితం కోరి చెప్పారు. పరశురాముడు మొదలగు మహానుభావులు కూడా ఎన్నోవిధాల చెప్పారు. నేను దుర్బుద్ధితో వారు చెప్పిన మాటలు పెడచెవిని పెట్టాను. పాండవులకు వారి రాజ్యభాగము వారికి పంచి ఇవ్వడానికి నిరాకరించాను. ఫలితం అనుభవిస్తున్నాను. కొడుకులను పోగొట్టుకున్నాను. చుట్టములు, స్నేహితులు, సామంతరాజులు అందరూ మరణించారు. వారికి దహన క్రియలు చెయ్యడానికి మాత్రం నేను మిగిలి ఉన్నాను.

సంజయా! నేను ఎంత మూర్ఖుడిని. రాబోయే ఆపద తెలిసి కూడా

పాండవులకు రాజ్యభాగము ఇవ్వలేదు. అందుకే నా కొడుకులకు బంధువులకు దూరమయ్యాను. సంజయా! నేడు ఇలా కావడానికి నా పూర్వజన్మ కర్మఫలం తప్ప వేరుకాదు. అయినా సంజయా! యుద్ధములో చనిపోయిన వారందరికీ దహన క్రియలు నిర్వర్తించుటకు ధర్మరాజు ఉన్నాడు కదా! నేనెందుకు? పాండవులు నా కొడుకులను చంపి తమ తమ ప్రతిజ్ఞలు నెరవేర్చుకున్నారు. ఈ పని కూడా వారే చేస్తారులే!" అన్నాడు ధృతరాష్ట్రుడు.

అతనిని చూచి సంజయుడు ఇలా అన్నాడు. "ధృతరాష్ట్ర మహారాజా! నీకు తెలియని శాస్త్రములు లేవు. నీవే పామరుడి వలె ఇలా దుఃఖిస్తే లోకులు నిన్ను చూచి నవ్వరా! ఇంతకుముందు నేను నీకు సృంజయుని కథ చెబితే విన్నావు కదా! అభిమన్యుడు చనిపోయినందుకు ధర్మరాజు దుఃఖిస్తుంటే, నారదుడు ధర్మరాజుకు సృంజయుని కథ చెప్పాడు. ఆ కథ విన్న తరువాత కూడా నీవు ఇలా దుఃఖించడం తగదు. ఏమన్నావు! నీ మంచి కోరేవారు, మంత్రులు చెప్పిన మాటలు వినలేదు అని అన్నావు కదా! నీకూ, నీ కుమారుడు సుయోధనునికీ మంత్రులు--దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని-- వీరేనా మీ మంత్రులు! వీరే మీకు హితులు అయితే ఇంక చెప్పేదేముంది! నీ కొడుకు ఎప్పుడూ ఎదుటి వారి మీద కత్తి దుయ్యడానికి ఇష్టపడ్డాడు కాని మంత్రాంగము వైపు ఎన్నడన్నా బుద్ధిమరల్చాడా! విదురుడు చెప్పింది విన్నాడా! పోనీ నీవేమన్నా అతనిని కట్టడి చేసావా? అతనికి బుద్ధిచెప్పావా! అతని అకృత్యాలను ఆపగలిగావా! నీకూ నీ కుమారునికి లోభత్వము బాగా మనసులో నాటుకుంది. అందుకే ఎవరీ మాటా మీరు వినలేదు. దానికి ఒకరిని నిందించడం ఎందుకు చెప్పు. అంతా నీ స్వయంకృతాపరాధము. జరిగిన దానికి ఈనాడు ఎంత వగచినా ప్రయోజనం లేదు. కాబట్టి నీ దుఃఖము మాను. నీ పని ఎలా ఉందంటే చుట్టు మంట పెట్టుకొని మధ్యలో కూర్చుని, అయ్యో కాలిపోతున్నాను, కాపాడండి అంటూ గొంతెండిపోయేట్టు

అరిచినట్టుంది.  ఈ పరిస్థితులలో నిన్ను చూచి అందరూ నవ్వుతారు గానీ జాలిచూపరు.  నీ కుమారుడి పరుషములైన నిష్టుర పలుకులకు, అర్జునుని కోపాగ్నికి నీ వారందరూ దగ్ధమయ్యారు. ఇంకా విచారించడం ఎందుకు?" అని ఎన్నో విధాలుగా అనునయించాడు సంజయుడు.

ఇంతలో విదురుడు అక్కడకు వచ్చాడు. ధృతరాష్ట్రుని చూచి " చేసింది చాలక ఇంకానేలమీదపడి దొర్లి దొర్లి ఏడుస్తున్నావా! ఏడిచింది చాలుగాని  ఇంక లే!" అన్నాడు.

విదురుడి మాటలు విని ధృతరాష్ట్రుడు లేచి కూర్చున్నాడు. దుఃఖము ఆపుకున్నాడు. ధృతరాష్ట్రుని చూచి విదురుడు ఇలా అంటున్నాడు.

" ధృతరాష్ట్ర మహారాజా!  పెరగటం విరగడం కొరకే!   కొత్త కొత్త రుచుల కోసం అర్రులు చాస్తే అసలు రుచే పోతుంది. పుట్టిన ప్రతి మనిషీ చావక తప్పదు.  ఎంత దగ్గరయితే అంత దూరం అవుతారు. ఇది ప్రకృతి సహజం. దీనిని తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు.  యమధర్మరాజు తన పాశముతో మనుషుల ప్రాణములు తీయునపుడు వీడు ధనికుడా, పేదవాడా, మహారాజా, శూరుడా, పిరికివాడా, అని చూడడు. మనిషి ఎలాంటి వాడైనా వాడికి చావు తప్పదు.  ఒక్క యుద్ధం చేస్తేనే మనిషి చస్తాడా! ఒకడు ఇలా చావాలి, ఇక్కడే చావాలి అనే నియమం లేదు.  వాడు  ఎక్కడున్నా, ఎలా ఉన్నా చావు తప్పించుకోలేడు. కాబట్టి చావును గురించి, చచ్చిన వారి గురించి దుఃఖించడం దండగ. నీ కొడుకులందరూ యుద్ధంలో మరణించి వీరస్వర్గం పొందారు. స్వర్గ సుఖాలు అనుభవిస్తున్నారు.  కాని వారి కోసం నువ్వు ఇక్కడ ఏడుస్తున్నావు. ఇది సరి కాదు. కాబట్టి నీ దుఃఖము మానుము.

అయినా నీవు పండితుడవు. జ్ఞానివి. నీకు తెలియనిది ఏమున్నది! మనిషి పుట్టిన తరువాత, బాల్యము, యౌవనము, అంద చందాలు, ఈ ప్రకృతి, అందులోని పదార్ధములు అన్నీ మిధ్య. అశాశ్వతములే కదా. ఏదీ స్థిరంగా ఉండదు. వాటి కోసం దుఃఖించడం ఎందుకు? దుఃఖము సర్వఅనర్ధములకు మూలము. తెలివిగలవారు ఎప్పుడూదుఃఖింపరు. కాబట్టి దుఃఖము వదిలి కాగల కార్యము గురించి విచారించు.

మహారాజా! మామూలు మనుషుల ఆలోచనా పరిధి చాలా తక్కువగా ఉంటుంది. అందుకే వారు చిన్న కష్టం వచ్చినా తట్టుకోలేరు. తనకు ప్రియమైన వస్తువు చెయి దాటిపోయినా, దక్కకపోయినా దుఃఖిస్తారు. వారి జ్ఞానం నశిస్తుంది. చెయ్యకూడని పనులుచెయ్యడానికి కూడా వెనుదియ్యరు. కాని పండితులకు, జ్ఞానులకు ఇది ప్రియము, ఇది అప్రియము అని ఉండదు. అన్నీ సమానంగా చూస్తారు." అని అన్నాడు విదురుడు.

విదురుని మాటలు విన్న ధృతరాష్ట్రుడు దుఃఖించడం మానాడు. విదురుని వంక తిరిగి "విదురా! నీ మాటలతో నా దుఃఖము ఉపశమించినది. నీవు ఇప్పుడే చెప్పావుకదా! పండితులు, జ్ఞానులకు ప్రియము, అప్రియము అనేవి ఉండవు. అన్నీ సమానంగా చూస్తారు అన్నావు కదా. వారు అలా ఎలా ఉండగలరు. దాని గురించి వివరించు." అని అడిగాడు. విదురుడు ఇలా చెప్పసాగాడు.

"ఓ ధృతరాష్ట్ర మహారాజా! సంసారము అనే ఈ వృక్షము అరటి చెట్టువలె చాలా దుర్బలమైనది. నిస్సారమైనది. కాని మానవుడు ఈ సంసారము నందే అనురక్తుడై, నిరంతర వ్యధకు గురి అవుతున్నాడు. ప్రస్తుతము మనకు ఈ శరీరం లభించింది. ఈ శరీరం పతనం కాగానే మరొక

శరీరం లభిస్తుంది కాని ఇదే శరీరం శాశ్వతము కాదు కదా! ఇది తెలుసు కున్నవాడు నీ మాదిరి వ్యధ చెందడు. ఎలాగంటే ఒక ఇంటినుండి మరొక ఇంటికి పోయిన మాదిరి, ఒక వస్త్రమును విడిచి మరొక నూతన వస్త్రమును ధరించిన మాదిరి ఒక శరీరమును వదిలి మరొక శరీరమును ధరిస్తాడు. కుమ్మరి వాడు కుండను చెయ్యడానికి మట్టిని సారె మీద పెట్టి తిప్పుతాడు. అది వెంటనే విరిగిపోవచ్చు. లేక కుండగా తయారయిన తరువాత పగిలి పోవచ్చు. లేక దానిని కాల్చేటప్పుడు పగిలిపోవచ్చు. దానిని మనము వాడుకునే టప్పుడు కిందపడి పగిలిపోవచ్చు. కాబట్టి ఈ మట్టి కుండ ఏ దశలో పగిలిపోతుందో చెప్పలేము కదా! మానవుడు కూడా అంతే.

పురుషుడు వీర్యం స్త్రీ శోణితంతో కలిసి అండంగా తయారవుతుంది కదా. ఆ దశలోనే ఆ అండం విచ్ఛిత్తి కావచ్చు. లేక గర్భస్రావము కావచ్చు. ఆ పిండం శిశువుగా రూపుదిద్దు కొనే సమయంలో గాని, ప్రసవం అయ్యే సమయంలో గాని, శిశువు జన్మించిన తరువాత గాని, బాల్యంలో గాని, యౌవనం లోగాని, వృద్ధాప్యంలోగాని, ఎప్పుడన్నా మరణం సంభవించవచ్చు. కాబట్టి ఈ శరీరానికి నిరంతరం మరణం సంభవిస్తూ ఉంటుంది. కాబట్టి మరణం ఈ విధంగా సంభవిస్తుంది అని చెప్పలేము. మరణానంతరము, మనము చేసిన సుకృత, దుష్కృతముల ఫలితము ప్రకారము మనకు స్వర్గ, నరకములు సంప్రాప్తిస్తాయి. కాబట్టి మరణించిన వారి గురించి దుఃఖించడం అవివేకము. వివేకము గలవారు, ఈ సంసారము దుఃఖభూయిష్టము అని తెలుసుకొని, దానిలో చిక్కుకొనరు. కాబట్టి నీవు కూడా చచ్చిన వారికోసం బాధపడకుండా నీ ముక్తిమార్గం కొరకు ప్రయత్నించు." అని చెప్పాడు విదురుడు.

విదురుని మాటలతో ధృతరాష్ట్రునికి దుఃఖము నుండి ఉపశమనము

కలిగింది.

"విదురా! అసలు సంసారంలో దుఃఖము ఎందుకుంటుంది. దానిని మనము ఎలా నివృత్తి చేసుకోవాలి వివరంగా చెప్పు." అని అడిగాడు. విదురుడు ఇలా చెప్పసాగాడు.

" మహారాజా! ఇందాకే చెప్పాను కదా! పురుషుడి నుండి విడుదల అయిన శుక్లము స్త్రీగర్భములోని శోణితముతో కలిసి పిండముగా రూపుదిద్దు కుంటుంది. క్రమక్రమంగా అవయవాలు రూపుదిద్దుకుంటాయి. శిశువుగా తయారవుతుంది. ఆ శిశువులోనికి ప్రాణవాయువు ప్రవేశిస్తుంది. ఈ శిశువు తల్లి గర్భంలో గిరా గిరా తిరుగుతూ తీవ్రమైన బాధ అనుభవిస్తుంది. తల్లి యోని ద్వారము వద్దకు చేరుకుంటుంది. ఆ సమయంలో ఆ శిశువును ఎన్నో గ్రహములు భూతములు బాధిస్తాయి. తరువాత ఆ శిశువు తల్లి గర్భం నుండి బయట పడుతుంది. ఆ శిశువు బాలుడిగా ఉన్నప్పుడు శుచి, అశుచి తెలియదు. వివేకము తెలియదు. ఆటపాటలలో ఎన్నో దుష్టచేష్టలు చేస్తాడు. ఆ బాల్య చేష్టలతో కాలంగడిచిపోతుంది. బాల్యంనుండి యౌవనం లోకి రాగానే కామ పరమైన చేష్టల మీద ఆసక్తి పుడుతుంది. స్త్రీ సౌఖ్యము కోసం పాకులాడతాడు. ఇంద్రియ లోలత్వము అధికంగా ఉంటుంది. దాని వల్ల సుఖము, దుఃఖము సంభవిస్తాయి. ఎన్నో బాధలకు గురిఅవుతాడు. చెయ్యరాని పనులు చేస్తాడు. కాబట్టి, బాల్యం మాదిరి యౌవనం కూడా దుఃఖమును కలిగిస్తుంది. తరువాత వృద్ధాప్యము వస్తుంది. ఉన్న బలము, శక్తి నశించిపోతాయి. ఉచితము అనుచితము అనే బేధము తెలియదు. అనుచిత కార్యములనే ఆచరిస్తాడు. ఒంట్లో శక్తి నశించి అన్ని రకాలైన వ్యాధులు ప్రబలుతాయి. వాటితో కృంగి కృశించి పోతాడు. అప్పుడు యముడు తన పాశంతో అతని ప్రాణములు హరిస్తాడు. అప్పుడు ఈ దేహమును విడిచి

పోలేక పోలేక యాతన అనుభవిస్తాడు. అంతటితో ఈ జన్మ ముగుస్తుంది.

కాబట్టి ఈ సంసారము ఏ దశలోనూ సుఖప్రదము కాకపోగా నిరంతర దుఃఖ భూయిష్టము అనునది విస్పష్టము. పైగా ఈ శరీరంలో ఉన్నప్పుడు మానవులు లోభ,క్రోధ,మదోన్మత్తులై, ఎన్నో దుర్మార్గాలు చేస్తారు. కాస్త సుఖం కోసం ఒకరిని ఒకరు చెరుచుకుంటారు. చంపుకుంటారు. ధర్మం వదిలి పెట్టి అధర్మపరులవుతారు. తుదకు యమభటుల చేతికి చిక్కుతారు. ఈ విషయములను పెద్దల వలన విన్న సజ్జనులు, సన్మార్గంలో పయనించి, నిత్యానందం పొందుతారు.

ఈ సంసారమును ఎలాంటిదో, ఎలా అధిగమించాలో నేను పెద్దల వలన వినిన మాటలు నీకు చెబుతాను. శ్రద్ధగా విను. ఒక దుర్గమమైన అరణ్యంలో ఒక బ్రాహ్మణుడు వెళుతున్నాడు. అప్పుడు పులులు, సింహాలు, ఏనుగులు మొదలగు అడవి జంతువులు అతనిని చుట్టుముట్టాయి. ఆ బ్రాహ్మణుడికి భయం వేసి అడ్డదారిలో పరుగెత్తాడు. ఆ క్రూర జంతువులు అతనిని వదిలిపెట్టి వెళ్లిపోయాయి. ఇంతలో ఒక దొంగల గుంపు అతనిని అడ్డగించింది. ఆ బ్రాహ్మణుడు భయంతో వణికిపోయాడు. కాళ్లు తడబడు తున్నాయి. ప్రాణభయంతో చలనం లేకుండా పోయాడు. దిక్కులు చూస్తున్నాడు. ఆ అడవిలో తనను కాపాడే వాళ్లు ఎవరూ లేరని తెలుసుకున్నాడు. అతనికి ఇంకా భయం ఎక్కువయింది. వెనక్కు తిరిగి పారిపోతున్నాడు. కాని ఎంత పరుగెత్తినా అడవికి అంతం కనిపించడం లేదు. వెనక నుండి దొంగలు ముందు నుండి క్రూరమృగాలు తరుముతున్నాయి. ఇంతలో ఒక భయంక రాకారంతో ఉన్న స్త్రీ అతనిని కౌగలించుకుంది. ఐదుతలల ఏనుగులు ఆ అడవిలో తిరగడం చూచాడు ఆ బ్రాహ్మణుడు.

ఆ భయంకరమైన స్త్రీని తప్పించుకొని పరుగెత్తుతుంటే ఒక బావి కనిపించింది. ఆ బావిమీద తీగలు అక్కడ బావి ఉన్నట్టు తెలియ కుండా బావి మీద అల్లుకొని ఉన్నాయి. అది తెలియని ఆ బ్రాహ్మణుడు ఆ బావిలో పడ్డాడు. పడుతూ పడుతూ ఒక తీగను గట్టిగా పట్టుకొని తలకిందులుగా వేలాడు తున్నాడు. కిందికి చూచాడు. ఆబావిలో ఒక పెద్ద పాము నాలుకలు చాస్తూ అతని మీదికి రాసాగింది. పైకి చూచాడు. 6 తలలు, పన్నెండు కాళ్లు కల ఒక ఏనుగు ఆ బావి ఒడ్డున ఉన్న ఒక చెట్టు వద్దకు వచ్చింది. ఆ చెట్టు కొమ్మలు రెమ్మలు చిత్రవిచిత్ర రంగులతో మెరిసిపోన్నాయి. తుమ్మెదలు ఆ చెట్టు పూవుల లోని మకరందం తాగుతున్నాయి. కాని ఆ చెట్టు మొదలును నల్లని, తెల్లని ఎలుకలు కొరుకుతున్నాయి. ఆ చెట్ల పూల నుండి కారుతున్న మకరందము ఆ బ్రాహ్మణుడి నోటిలో బొట్టు బొట్టుగా కారుతుంటే ఆ మధువును తాగుతూ ఆనందిస్తున్నాడు. ఆ మధువు ఎంత తాగినా అతనికి తృప్తి కలగ లేదు. తాను ఏ దుస్థితిలో ఉన్నాడో కూడా మరిచిపోయి ఆనందిస్తున్నాడు.

ఈ ప్రకారంగా తీగలను పట్టుకొని తలకిందులుగా వేలాడుతున్న ఆ బ్రాహ్మణుడికి కింద ఉన్న పాములు, పైన ఉన్న ఏనుగు, అడవిలో ఉన్న క్రూరమృగములు, ఆ భయంకరాకారంతో ఉన్న స్త్రీ, చెట్టును కొరుకుతున్న ఎలుకలు, ఆ చెట్టు పడిపోతుందన్న ఆలోచన, చుట్టు ఝుంకారంతో తిరుగుతున్న తుమ్మెదలు, వీటితో అతని మనసు కకావికలయింది. కాని అతనికి జీవితం మీద వ్యామోహం పోలేదు. ప్రాణాల మీద తీపి చావలేదు." అని అన్నాడు విదురుడు.

"విదురా! ఈ కథ నాకేమీ అర్థం కాలేదు. వివరంగా చెప్పు" అని అడిగాడు. విదురు ఇలా చెప్పసాగాడు.

"మహారాజా! ప్రపంచంలో మనుషులకు సన్మార్గమును బోధించుటకు, మోక్ష కాంక్ష కలుగ చేయుటకు పెద్దలు ఈకథ చెబుతారు. మనజీవితం ఎలాంటిదో ఈ కథ కూడా అలాంటిదే. కాని ఈ కథను సరిగా వివరిస్తేగాని అర్ధం కాదు. చెబుతాను విను. ఆ బ్రాహ్మణుడు ప్రయాణం చేస్తున్న అడవే సంసారము. అందులో ఉన్న పులులు, సింహములు మొదలగు క్రూర మృగములు దొంగలు. క్రూర మృగముల కొరకు పన్నిన ఉచ్చులు రోగములు. భయంకరాకారంతో కౌగలించుకున్న స్త్రీ ముసలితనము. ఐదు తలల ఏనుగు మన పంచేంద్రియములు. బావిలో ఉన్న పాము యమధర్మరాజు. ఆ బ్రాహ్మణుడు పట్టుకున్న తీగ జీవించాలన్న ఆశ. బావి ఒడ్డున ఉన్న చెట్టు ఆయుష్షు. దాని వంకకు వస్తున్న ఏనుగు ఒక సంవత్సరం. దాని ఆరు తలలు ఆరు ఋతువులు. దానికి ఉన్న పన్నెండు కాళ్లు పన్నెండు నెలలు. ఆ చెట్టును కొరుకుతున్న నల్లని తెల్లని ఎలుకలు, రాత్రి పగలు. ఆ బ్రాహ్మణుడి చుట్టు ఝుంకారం చేస్తూ తిరుగుతున్న తుమ్మెదలు కోరికలు. ఆ బ్రాహ్మణుడి నోట్లోకి కారుతున్న మకరందము సుఃఖసంతోషాలు. తన చుట్టు ఇన్ని బాధలు ఉన్నా ఆ సుఖ సంతోషాల కోసం పాకులాడుతుంటాడు జీవుడు. కలకాలం బతకాలనుకుంటాడు. ఇందు లో ఉన్న బ్రాహ్మణుడే జీవుడు. ఇదే సంసార చక్రం. వివేకవంతులైన వాళ్లు ఈ సంసార చక్రం అనే వలలో పడరు. బయట ఉండి శాశ్వతానందం పొందుతారు. ఒకవేళ పడ్డా ఆ పాశాలను ఛేధించుకొని బయట పడతారు.

ఓ ధృతరాష్ట్ర మహారాజా! నిరంతరము ప్రాపంచిక సుఖాల కోసం వ్యామోహంలో పడి, ఆ బురద గుంటలో మునుగుచు తేలుచూ తనను తాను మరిచిపోతాడు మానవుడు. శరీరంలో శక్తి తగ్గగానే రోగాలు ఆవరిస్తాయి. ఇంతలో ముసలి తనం మీద పడుతుంది. అందం అంతరిస్తుంది. దేహం

సుఖాలు అనుభవించడానికి పనికిరాదు. చివరకు దిక్కులేని చావు చస్తాడు.

, ధృతరాష్ట్ర మహారాజా! తరచి చూడగా ఈ దేహమే ఒక రథము. బుద్ధి రథసారథి. పంచేంద్రియములే గుఱ్ఱములు. మన ఆలోచనలే పగ్గాలు. పంచేంద్రియాలు అనే గుఱ్ఱాలు వేగంగా అటూ ఇటూ పరుగుపెడుతుంటాయి. బుద్ధి అనే పగ్గాలు పటిష్టంగా లేకపోతే రథాన్ని గుఱ్ఱాలు తమ ఇష్టం వచ్చినట్లు లాగుకొని వెళతాయి. కాబట్టి బుద్ధి తన ఆలోచనలనే పగ్గాలతో పంచేంద్రియాలను నియంత్రించాలి. అలా చేసిన నాడు మానవుడు సంసారం దుఃఖభాజనం కాకుండా కాపాడుకోగలడు.

ఇంకొక మాట. పుట్టినప్పటినుండి మన జీవితం యమధర్మరాజు అధీనంలో ఉంటుంది. ఈ జీవితం అనేక దుఃఖాలకు ఆలవాలము. పుణ్యాత్ములు వివేకము అనే మందును ఉపయోగించి తమ దుఃఖాలను తొలగించుకుంటారు. ఈ శరీరము అనే రథమును అదుపులో ఉంచుకుంటారు. వివేక వంతులు తమ గుణ శీలములతో ఆలోచనలనే పగ్గాలను పట్టుకొని ఈ శరీరము అనే రథమును సక్రమ మార్గంలో నడిపిస్తారు. వారికి చావు పుట్టుక లంటే భయం ఉండదు. తుదకు మోక్షమును పొందుతారు.

కాబట్టి ధృతరాష్ట్రమహారాజా! జరిగినదానికి దుఃఖించడం మాని, యుద్ధములో చనిపోయిన నీ కుమారులకు, బంధు మిత్రులకు, తక్కిన వారికి అంత్యక్రియలు జరిపించు. వారికి ఉత్తమ గతులు కలిగేట్టు చెయ్యి." అని అన్నాడు విదురుడు.

విదురుడు చెప్పిందంతా విన్న ధృతరాష్ట్రుడు చని పోయిన కుమారులు గుర్తుకు వచ్చేసరికి వారిని తల్చుకొని ఏడుస్తూ మరలా మూర్ఛపోయాడు.

పరిచారికలు అతని మొహం మీద  చల్లని నీళ్లు చిలకరించి మూర్ఛనుండి సేదదీర్చారు.

ఇంతలో వ్యాసుడు అక్కడకు వచ్చాడు.  అనుకోకుండా వచ్చిన వ్యాసుని చూచి విదురుడు, సంజయుడు లేచి నిలబడి నమస్కరించారు. మూర్ఛనుండి తేరుకున్న ధృతరాష్ట్రునికి వ్యాసమహాముని వచ్చాడని చెప్పారు. ధృతరాష్ట్రుడు కూడా వణుకుతున్న చేతులతో నమస్కరించాడు.

"మహామునీ! చూచితివా నా దుర్గతి. నేను ఇంకా ఎందుకు బతికి ఉన్నానో తెలియడం లేదు. ఈ మానవ జన్మ ఎంత దుర్భరమైనదో ఇప్పుడు తెలిసింది. నన్ను ఎంత దీనస్థితికి తెచ్చిందో చూచారుకదా! ఉన్న  సంపదలంతా నశించిపోయాయి.  కన్నకుమారులందరూ మరణించారు. బంధువులందరూ రూపుమాసిపోయారు.  నాకు మాత్రం చావు రాలేదు. నేను ఒంటరిగా మిగిలాను.  ఇదంతా నా దౌర్భాగ్యం కాకపోతే మరేమున్నది.  ఇంతమంది చావు చూచి కూడా నా ప్రాణం ఈ శరీరాన్ని విడిచి పెట్టడం లేదు. ఏం చెయ్యాలో తోచడం లేదు." అని పలికాడు ధృతరాష్ట్రుడు.

దుఃఖముతో మునిగిపోయిన ధృతరాష్ట్రుని చూచి వ్యాసమహాముని ఇలా అన్నాడు. "కుమారా! నీ దుఃఖము పోగొట్టడానికే నేను ఇక్కడకు వచ్చాను. నీవు సకల ధర్మములు తెలిసినవాడవు. నీతిశాస్త్రకోవిదుడవు.  చనిపోయిన నీ కుమారుల గురించి దుఃఖించడం సమంజసం కాదు.  ఎందుకంటే ఈ ప్రాణములు శాశ్వతములు కావు.  పుట్టినవాడు చావక తప్పదు. ఎవడూ మరణం తప్పించుకోలేడు.  ఈ జ్ఞానము అలవర్చుకో . నీ దుఃఖము పోగొట్టుకో.   ఇంక అసలు విషయానికి వద్దాము.

కుమారా! నీకుమారులకు, పాండు కుమారులకు నీకు తెలియకుండానే వైరం సంభవించిందా! దీని కంతకూ నీ కుమారుడు కారణం కాదా! అందుకే కురు వంశము నాశనమైంది. ఇదేం కొత్త విషయం కాదు. దీనికి నువ్వు దుఃఖించడం ఎందుకు. ద్యూతక్రీడా సమయంలో ఈ విదురుడు నీకు ఎన్నోవిధములుగా నీతి బోధ చేసాడు. కాని నీవు వినలేదు. ఫలితం అనుభవిస్తున్నావు. పోనీలే ఇలా జరగాలని విధి నిర్ణయించింది. అలాగే జరిగింది. కాబట్టి నీ శోకాన్ని పోగొట్టుకో. బాధపడకు.

నీ మేలు కోరి నీకు ఒక విషయము చెబుతాను. ఇది దేవ రహస్యం. శ్రద్ధగా విను. ఒక సారి నేను దేవ సభకు వెళ్లాను. అక్కడ ఇంద్రుడు మొదలగు దేవతలు, నారదుడు మొదలగు మహా ఋషులు ఉన్నారు. అప్పుడు భూదేవి వచ్చి దేవతలను ఇలా అంది.

"దేవతలారా! ఇదివరకు మీరు బ్రహ్మ సభలో నాకు పెరిగిన భారమును తగ్గించుటకు చాలా ఉత్సాహము చూపించారు. ఏ కారణం చేతలో ఆ విషయం మరిచారు. నాకు రోజు రోజుకూ భారం పెరిగిపోతూ ఉంది. దీనిని తగ్గించే ఉపాయం ఆలోచించండి" అని అడిగింది.

అప్పుడు శ్రీమహావిష్ణువు నవ్వి "భూదేవీ! దానికి తగు సమయం వచ్చినది. ధృతరాష్ట్రుడు అనే మహారాజు కు నూర్గురు సంతానము కలుగుతుంది. అందులో దుర్యోధనుడు అనే వాడు జ్యేష్టుడు. అతడే నీ భారము అంతా పోగొడతాడు. అది తొందరలోనే జరుగుతుంది. అతని కారణంగా కురుక్షేత్రమహాసంగ్రామం జరుగుతుంది. ఈ భూమండలములోని రాజులందరూ అతనికి సాయం చెయ్యడానికి అతని పక్కన నిలుస్తారు. ఆ మహా యుద్ధంలో అందరూ మరణిస్తారు. తన సోదర శతముతో సహా

దుర్యోధనుడు కూడామరణిస్తాడు. నీ భారం పూర్తిగా తగ్గిపోతుంది. నిశ్చింతగా ఉండు." అని పలికాడు. ఆ మాటలకు సమ్మతించి భూదేవి అక్కడనుండి వెళ్ళిపోయింది.

విష్ణువు మాట ప్రకారము కలి అంశతో దుర్యోధనుడు నీకు కొడుకుగా జన్మించాడు. అతడు పరుల ఉన్నతిని సహించలేడు. మహా బలవంతుడు. మహా కోపిష్టి. ఎవరి మాటా వినడు. అందరితో వైరము పెట్టుకుంటాడు. అతనికి తోడుగా అతని తమ్ముడుచ దుశ్శాసనుడు, మేనమామ శకుని, అంగ రాజు కర్ణుడు అనుచరులుగా ఉంటారు. వారి సాహచర్యంలో అతను ఎన్నో తప్పులు చేస్తాడు. తాను చేసిన తప్పులకు తాను నశిస్తూ అందరినీ నశింప చేస్తాడు. కాబట్టి ఇది అంతా దేవతల ఇష్ట ప్రకారము జరిగింది. నీవు శోకించపనిలేదు.

కాని నీ మనసులో ఒక అనుమానం పొడసూపింది. నిన్ను ధర్మ తనయులు ఆదరిస్తారా అని. పాండవుల వలన నీకు ఎలాంటి కీడు జరగదు. నీ కుమారుడు వారికి రాజ్యభాగము ఇవ్వలేదు. ఈ భూమండలము నంతా తానే పరిపాలించవలెనని దుర్బుద్ధి పుట్టింది. కానీ, పాండవులు మీకు ఎన్నడూ ఏ అపకారమూ తలపెట్టలేదు. పైగా సంధికొరకు తీవ్రంగా ప్రయత్నం చేసారు. ఆ సమయంలో నేను కూడా నాకు తోచినట్టు సంధి చేసుకోమని నీ కుమారుని తో చెప్పాను. కాని నీ కుమారుడు ఎవరి మాటా వినలేదు. ఫలితం అనుభ వించాడు.

కాబట్టి అటువంటి కుమారుల గురించి నీవు శోకించ పనిలేదు. ఎందుకంటే ఇది దైవ నిర్ణయం. ఎవరూ తప్పించలేరు. నీ తమ్ముని కుమారుడు ధర్మరాజు అజాత శత్రువు. అతను సాటి మానవుల యందేకాదు, పశుపక్ష్యాదుల యందుకూడా జాలి కరుణ కలిగి ఉంటాడు. అతని గురించి

నీకు బాగా తెలుసు. కాబట్టి నీ మీద ధర్మజునకు ఎలాంటి విముఖత లేదు. కాబట్టి ఇంకమీదట పాండవులను నీ కుమారులుగా భావించు. ఆదరించు. నీవు మహాజ్ఞానివి. ఆ జ్ఞానాగ్నిలో నీ శోకాన్ని దగ్ధంచెయ్యి. ప్రశాంతిపొందు." అని పలికాడు వ్యాసుడు.

"మహానుభావా! అమృత తుల్యములైన నీ మాటలతో నామనసు ప్రశాంతి పొందినది. పాండవుల మీద ప్రేమ పెంచుకుంటాను. వారిని నా కుమారుల వలె ఆదరిస్తాను." అని పలికాడు. ఆ మాటలు విన్న వ్యాసుడు ధృతరాష్ట్రుని ఆశీర్వదించి వెళ్లిపోయాడు.

దృతరాష్ట్రుడు సంజయుని చూచి "సంజయా! మనము యుద్ధభూమికి వెళ్లెదము. ప్రయాణ సన్నాహములు చేయుము. గాంధారిని, అంతఃపుర స్త్రీలను ప్రయాణమునకు సిద్ధము కమ్మని చెప్పు." అని అన్నాడు. సంజయుడు ఆ ప్రకారమే అన్ని ఏర్పాట్లు చేసాడు.

పుత్రశోకంతో గాంధారి నడవ లేకపోతూ ఉంది. కాళ్లు నిలవడం లేదు. ఆమె కోడళ్లు కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తున్నారు. వారి జుట్టు ఊడి పోయింది. పమిటలు తొలగిపోయాయి. కాని వారు పట్టించుకొనే స్థితిలో లేరు. శోకభారంతో కుమిలిపోతున్నారు. కుంతీదేవి మొదలగు వారు వారిని ఓదారుస్తున్నారు. అందరూ యుద్ధభూమికి వస్తున్నారు.

అంతఃపుర స్త్రీలసంగతి ఇలా ఉంటే హస్తినాపురములో ఉన్న సాధారణ సైనికులు, సైనికాధికారుల భార్యలు పెద్దగా ఏడుస్తున్నారు. మగవారందరూ యుద్ధం లో మరణించారు కాబట్టి వారిని ఓదార్చేవారే కరువయ్యారు. ఒకరిని ఒకరు ఓదార్చుకుంటూ ఆవేదన చెందుతున్నారు. అందరి ఇళ్లలో ఏడుపులు,

ఆర్తనాదాలు తప్ప మరొకటి వినిపించడం లేదు.

ఇదంతా చూచి విదురునికి నోట మాట రావడం లేదు. యుద్ధ పరిణామము ఇంతభయంకరంగా ఉంటుందా అని మనసులో బాధపడుతున్నాడు. ఎంత మందిని అని ఓదార్చగలడు. అందరూ యుద్ధభూమికి బయలు దేరి కొంత దూరం వెళ్లునప్పటికి అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యుడు వారికి ఎదురు వచ్చారు. వారు ధృతరాష్ట్రుని చూచి ఇలా అన్నారు.

" మహారాజా! నీ కుమారుడుసుయోధనుడు, దేవతలు మెచ్చేట్టు యుద్ధము చేసి వీరమరణముపొందాడు. మేము ముగ్గురము తప్ప కౌరవ సైన్యము అంతా యుద్ధములో మరణించారు." అని అన్నారు.

గాంధారిని చూచి కృపాచార్యునికి దుఃఖము ఆగలేదు. "అమ్మా! గాంధారీ! నీ కుమారులు యుద్ధభూమిలో వీరోచితముగా పోరాడి తమ ప్రాణాలు అర్పించారు. వీరస్వర్గము అలంకరించారు. వారి గురించి నీవు చింతించటం తగదమ్మా! నీ కొడుకుల్లో ఒక్కడు కూడా రణభూమిలో వెన్నిచ్చి పారిపోలేదు. యుద్ధమంటే భయపడలేదు. అమ్మా! పాండవులు గెలిచినా వారికి సంతోషము కలగలేదమ్మా! భీముడు అధర్మయుద్ధములో సుయోధనుని నాభి అధోభాగమున కొట్టి కూలదోసాడు. అతి క్రూరంగా చంపాడు. అతని తల తన్నాడు. మాకు కోపం ఆగలేదు. మేము మువ్వురము అర్ధరాత్రి పాండవ శిబిరములలో ప్రవేశించి, పాండవులను తక్క మిగిలిన వారందరినీ, పాండు సుతులను, వారి బంధుమిత్రులను, పాంచాల కుమారులను, వారి సైన్యమును, గజములను హయములను దారుణం గా చంపాము. కనుక పాండవులు సాధించిన విజయము వ్యర్థమయింది. ఆసమయంలో పాండవులు శిబిరములో లేరు. కాబట్టి బతికిపోయారు.

లేకపోయిన అపాండవము అయి ఉండేది. సుయోధనుని చివరి కోరిక నెరవేరి ఉండేది.

మేము అర్ధరాత్రి వారి సుతులను, బంధుమిత్రులను చంపిన విషయం తెలుసుకున్న పాండవులు అపరిమితమై క్రోధంతో మాకోసం వెతుకుతూ ఉంటారు. కాబట్టి మాకుసెలవు ఇప్పించండి. మేము వెళ్లుతాము." అని చెప్పివారి వద్ద సెలవు తీసుకొని తమ తమ రథముల మీద వెళ్లిపోయారు.

కొంత దూరం వెళ్లిన తరువాత కృపాచార్యుడు తిరిగి హస్తినా పురము నకు తిరిగి వచ్చాడు. కృతవర్మ ద్వారకకు వెళ్లిపోయాడు. అశ్వత్థామ గంగా తీరమున ఉన్న వ్యాస మహాముని ఆశ్రమము వంక సాగిపోయాడు.

ఓ జనమేజయ మహారాజా! వ్యాసాశ్రమము దగ్గర జరిగిన విషయ ములు నీకు ఇంతకుముందే చెప్పాను కదా! తరువాత, ధృతరాష్ట్రుడు అంతఃపుర స్త్రీలతో సహా యుద్ధభూమికి వెళ్లాడు.

ధృతరాష్ట్రుడు యుద్ధభూమికి వస్తున్నాడు అని తెలిసి ధర్మరాజు తన తమ్ములతోనూ, కృష్ణునితోనూ కలిసి వారికి ఎదురు వచ్చాడు. కాని తన కుమారు లందరనూ పోగొట్టుకున్న ధృతరాష్ట్రుడు, మనసంతా దహించుకు పోతుంటే యుద్ధభూమికి వస్తున్నాడు అన్న ఆలోచన ధర్మరాజు మనసును కలిచివేసింది. ధృతరాష్ట్రుని కలుసుకొనడానికి వడివడిగా ముందుకు వెళ్లాడు. ధర్మరాజు వెంట సాత్యకి, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు ద్రౌపది వెళ్లారు.

కౌరవ వనిత లందరూ ధర్మరాజును చూచి హాహాకారాలు చేసారు.

ఇంకొంత మంది ధర్మరాజును తిట్టిపోసారు. "ఇతడు ధర్మరాజట! ఇతనికి అసలు ధర్మం తెలుసా! ఇతనికి దయ,జాలి ఉన్నయా! నిర్దాక్షిణ్యంగా తన తండ్రులను, మామలను, తమ్ముళ్లను, కొడుకులను చంపాడు. విద్యలు నేర్పిన గురువులను చంపాడు. వీడికి కనికరమా!" అని ఈసడించు కున్నారు.

ఇంకొంత మంది అతని ఎదురుగా పోయి "ఓయి ధర్మరాజా! చదువు చెప్పిన గురువునే చంపావే! నీకు మనసెలా ఒప్పింది?" అని అడిగారు.

మరి కొంతమంది "అయ్యో! నీ చెల్లెలు భర్త అని చూడకుండా జయద్రధుని చంపించావే! ఈ రాజ్యమంతా కట్టకట్టుకొని ఊరేగు! ఈ శ్మశానం ఏలుకో!" అని తిట్టారు.

ఎవరేమన్నా, పాండవులు ఒక్క మాటకూడా మాటాడలేదు. కాని వారు విడవ లేదు. ఇంకొంత మంది అతనికి అడ్డుగా వచ్చి "ఓయి ధర్మజా! నీ వల్ల కదా అభిమన్యుడు మరణించింది. ద్రౌపది కొడుకులు వధించబడింది. నీ మరుదులందరినీ మింగేసావు. ఇంకా నీ రక్తదాహం తీరలేదా!" అని తిట్టారు.

అందరి తిట్లను భరిస్తూ ధర్మరాజు ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లాడు. పక్కన ఉన్న వారు ధర్మజుడు వచ్చాడని చెప్పారు. ధృతరాష్ట్రునికి దుఃఖం కట్టలు తెంచుకుంది. భోరున ఏడ్చాడు. ధర్మరాజును కౌగలించుకున్నాడు. తరువాత భీమార్జున నకుల సహదేవులు వచ్చారని పక్కన ఉన్న వారు తెలిపారు. భీముడు అన్న మాట వినగానే ధృతరాష్ట్రుని మొహం వికృతంగా మారింది. కోపంతో దహించుకుపోయాడు. భీముని కౌగలించుకోబోయాడు.

ఏదో విపత్తు జరుగుతుందని ముందే గ్రహించిన కృష్ణుడు తాను అంతకు ముందే తయారుగా ఉంచిన భీముని పోలిన ఇనుప విగ్రహమును ధృ తరాష్ట్రుని ముందుకు తోసాడు. ఆ ఇనప విగ్రహమే భీముడు అని అనుకొని, ఆ విగ్రహమును గట్టిగా కౌగలించుకొని నలిపేసాడు. ధృతరాష్ట్రుని కౌగిలిలో ఆ విగ్రహం ముక్కలయింది. ఆ ముక్కలు గుచ్చుకొని ధృతరాష్ట్రుని వక్షస్థలము నకు గాయాలయ్యాయి. మొహం లోనుండి రక్తం చిమ్మింది. ధృతరాష్ట్రుడు స్పహతప్పి పడిపోబోయాడు. "నా కుమారులను చంపిన వాడిని చంపేసాను. నా పగ తీరింది." అంటున్నాడు. అతని మొహంలో సంతోషం వెల్లివిరిసింది. కాని పక్కన ఉన్న వారు ఏమనుకుంటారేమో అని బయటకు దుఃఖం అభిన యిస్తూ భీమసేనుడు చనిపోయినందుకు ఏడుస్తున్నాడు.

శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుని పక్కననిలబడి అతని బుజం తట్టి "మహారాజా! భీముడు నీ చేతిలో చావలేదు. నీవు దుఃఖించ పనిలేదు. నీవు నలిపివేసినది భీముని పోలిన ఇనుప విగ్రహము. భీముని మాట వింటేనే నీకు కలిగే కోపమును ముందే ఊహించి భీముని వెనుకకు లాగి అతని పోలిన విగ్రహము నీ ముందుకు నెట్టాను. ధృతరాష్ట్ర మహారాజా! నీ కున్న బలములో ఈ భీముడు ఎంత! ఒక్క భీముడే కాదు ముల్లోకములలో ఎవరూ నీ బలమునకు సాటిరారు. కొడుకులు చనిపోయారన్న దుఃఖములో భీముని చంపాలి అనుకున్నావు. కాని భీముని చావు నీ చేతిలో లేదుకదా! అయినా మహారాజా! భీమునే కాదు. పాండవులనందరినీ చంపినా నీ కుమారులు తిరిగి వస్తారా! అనవసరంగా అపవాదు మూటగట్టుకోడం తప్పు." అని అన్నాడు. ,

ధృతరాష్ట్రుడు సిగ్గుతో తల వంచుకున్నాడు, తన ఒంటికి అంటిన రక్తం, గాయాల నుండి స్రవిస్తున్న రక్తం కడుక్కున్నాడు. మరలా కృషుడు ఇలా అన్నాడు.

"ధృతరాష్ట్ర మహారాజా! నీవు వేద వేదాంగ పారంగతుడవు. ఎన్నో శాస్త్రములను పురాణములను విన్నావు. వాటి సారం అంతా గ్రహించావు. కాని నీ తప్పు నీవు తెలుసుకోకుండా ఇతరులను నిందిస్తున్నావు, నీలో నీవే దుఃఖిస్తున్నావు. నేను, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు నీ కు ఎన్నో విషయాలు చెప్పాము. కాని నీవు వినలేదు. ఫలితం అనుభవిస్తున్నావు. స్వయంకృతాపరాధమునకు చింతించుట ఎందులకు? భీమార్జునులు రణరంగములో ఉంటే జయం మరొకరిది ఎలా అవుతుంది! నీ మనసు నీ స్వాధీనములో లేదు. దానిని నీవు నియంత్రించలేకపోయావు. నీ కొడుకు చెడుదారిలో పోతున్నప్పుడు నీవు అతనిని మందలించి సరియైన మార్గములో పెట్టలేదు. ద్యూతక్రీడలో గెలిచాము అన్న నెపంతో నీ కుమారులు, పాండవ పత్ని, నీ కోడలు అయిన ద్రౌపది బట్టలు పది మందిలో ఊడదీస్తున్నారు అని తెలిసి కూడా వారిని నీవు నివారించలేదు. కాని భీముడు నీ కుమారులను చంపినందుకు, తన ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నందుకు కోపం తో దహించుక పోతున్నావు. ఇదేమన్నా బాగుందా చెప్పు! నీ కొడుకుల అవినీతి, దుర్వర్తన గుర్తుకు తెచ్చుకొని నీ కోపం విడిచి పెట్టు." అని హితోపదేశము చేసాడు కృష్ణుడు.

"కృష్ణా! నీవు చెప్పినది అంతా నిజమే. కొడుకులు పోగొట్టుకున్న దుఃఖంలో అనుచితంగా ప్రవర్తించాను. సిగ్గుపడుతున్నాను. నీ మాటలతో నాకు జ్ఞానోదయం అయింది. ఇంక పాండు కుమారుల ను నాకుమారులుగా భావిస్తాను." అని పలికాడు. తరువాత వాత్సల్యంతో భీమార్జున నకుల సహదేవులను కౌగలించుకొని దీవించాడు.

ఆఖరున ధృతరాష్ట్రుని కొడుకైన యుయుత్సుడు వచ్చాడని చెప్పారు. (యుయుత్సుడు ధృతరాష్ట్రునికి ఒక వైశ్య కన్య యందు జన్మించిన

కుమారుడు). కనీసం ఒక్క కుమారుడు అన్నా మిగిలాడు అన్న సంతోషంతో యుయుత్సుని కౌగలించుకున్నాడు ధృతరాష్ట్రుడు.

" పాండు కుమారులారా! మీ తల్లి గాంధారి వద్దకు వెళ్లండి. ఆమెను ఓదార్చండి." అని చెప్పాడు ధృతరాష్ట్రుడు. ధర్మరాజాదులు తమ పెదతల్లి గాంధారి వద్దకు వెళ్లారు. ఆమెకు నమస్కరించారు. కొడుకుల మరణంతో ఆమె హృదయం రగిలిపోతూ ఉంది. ధర్మరాజును శపించడానికి ఉద్యుక్తురాలయింది.

ఇంతలో వ్యాసుడు అక్కడు వచ్చాడు. అందరూ ఆ మహాముునికి నమస్కరించారు. గాంధారి మనసు తెలుసుకున్న వ్యాసుడు ఆమెను వారించాడు.

"అమ్మా! గాంధారీ ధర్మజుని శపించడం ఉచితం కాదు. శాంతించు. ధర్మజుని మీద కోపం మాను. నీకు ఇంత రజోగుణం ఎందుకు? సాత్త్వికంగా ఉండు. నామాటలు విను. నీ కుమారుడు సుయోధనుడు యుద్ధమునకు పోతూ నీకు నమస్కరించి నీ ఆశీర్వాదము కోరాడు. అప్పుడు నీవు ఏమని ఆశీర్వదించావో తెలుసా! "ధర్మము ఎక్కడ ఉంటుందో జయం అక్కడ ఉంటుంది." అని పలికావు. అదే నిజమయింది. జరిగిన కురుక్షేత్ర మహా సంగ్రామంలో పాండవులకు విజయం లభించింది. నీ మాట ప్రకారం ధర్మం జయించినట్టేకదా! కాబట్టి పాండవులు ధర్మపరులే కదా! కాబట్టి అసూయ మాని వారిలో ఉన్న ధర్మ నిరతిని చూడు. ఆలోచిస్తే నీకే అర్థం అవుతుంది. అమ్మా! ఏనాడో జరిగిపోయిన సంగతులు మనసులో పెట్టుకొని ఇప్పుడు కోపం తెచ్చుకుంటే ప్రయోజనం ఏముంది? కాబట్టి నీ కుమారులైన పాండవుల మీద కోపం మాను." అని పలికాడు వ్యాసుడు.

ఆ మాటలకు శాంతించిన గాంధారి "మహర్షీ! నాకు పాండవుల మీద కోపము అసూయ ఎన్నటికీ లేదు. వారికి ఎన్నడూచెడు తలపెట్టలేదు. కొడుకులను పోగొట్టుకున్న దుఃఖంలో ఏదో అన్నాను కానీ, పాండవులు కుంతికి ఎలాగో నాకూ అలాగే కదా! నా కుమారుడు సుయోధనుని తులువ తనముతో, దుర్మార్గులైన కర్ణ,దుశ్శాసన, శకుని ప్రోద్బలంతో కౌరవ వంశము నాశన మయింది. యుద్ధధర్మము ననుసరించి పాండవులు కౌరవులను చంపారు. దానికి నేను బాధపడటం లేదు. కాని ఈ భీముడు నా కుమారుని గదాయుద్ధంలో నాభి కింద కొట్టి పడగొట్టాడు. అదీ కృష్ణుని సమక్షంలో జరిగింది. ఇది న్యాయంగా ఉందా! ఇది తల్లి నైన నాకు మనస్సుకు క్షోభ కలిగించదా! యుద్ధంలో చంపడం-- చావడం సహజం. కాని యుద్ధనీతి తప్పి చంపడం ద్రోహం కాదా!" అని పలికింది గాంధారి.

ఆ మాటలు విన్న భీముడు గడా గడా వణికిపోతూ గాంధారిని సమీపించి ఇలా అన్నాడు.

"అమ్మా గాంధారీ దేవీ! నేను చేసింది ధర్మమో, అధర్మమో, ప్రాణ భయంతో చేసానో, అలా జరిగిపోయింది. దయతో నన్ను క్షమించమ్మా! నీ కుమారుడు సుయోధనుడు నా కన్నా బలవంతుడు. గదాయుద్ధంలో నేర్పరి. సుయోధనుని ఓడించడం నా వల్ల కాదని నాకు తెలుసు. అందుకని అలా చెయ్యవలసి వచ్చింది. అయినా అమ్మా! నీకుమారుడు ధర్మరాజుకు చేసిన అవమానము ధర్మ బద్ధమా! ఏకవస్త్రగా ఉన్న ద్రౌపదిని సభకు ఈడ్చించి వలువలు ఊడదీయడం ధర్మమా! తల్లితో సమానమైన వదిన గారికి తన తొడలు చూపించడం, కూర్చోమనడం ధర్మమా! ఆ సమయంలో కోపం

పట్టలేక నీ కొడుకు తొడలు విరగ్గొట్టి చంపుతానని ప్రతిజ్ఞ చేసాను. చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనడం క్షత్రియ ధర్మం. నేను క్షత్రియుడను. అందుకనే నేను చేసిన ప్రతిజ్ఞను ఈ విధంగా నెరవేర్చుకున్నాను. అసలు కురు సభలోనే సుయోధనుని తొడలు విరగ గొట్టి ఉంటే బాగుండేది . కాని అన్నగారి మాట జవదాటలేక మిన్నకున్నాను. అందుకనే అడవులను వెళ్లాము అష్టకష్టాలు అనుభవించాము.

మా అన్నయ్య ధర్మజుడు శ్రీ కృష్ణుని కురుసభకు రాయబారిగా పంపునపుడు నేను కృష్ణునితో నా మాటగా పలికిన పలుకులు వింటే మీరు నన్ను తప్పుపట్టరు. "సుయోధనా! మనం అందరం అన్నదమ్ములం. మనలను పరులు వేలు ఎత్తిచూపకూడదు. మనం ఒకరితో ఒకరం తగవులాడుకోడం ఎందుకు? పెద్దవారి మాటలు విని ఎవరి భాగంవారు పంచుకొని అందరం సుఖంగా ఉంటాము" అని చెప్పాను కాని నీ కుమారుడు ఆమాటలు వినలేదు. మాతో వైరము పెట్టుకున్నాడు. యుద్ధం అనివార్య మయింది. పోగొట్టుకున్న రాజ్యం కోసం ధర్మరాజు, చేసిన ప్రతిజ్ఞలు నెరవేర్చుకోడానికి నేనూ యుద్ధం చేసాము. అది మా కర్తవ్యము. అమ్మా! నీవు సర్వము తెలిసినదానవు. మేము తప్పు చేసామో లేదో నీవే నిర్ణయించు." అని పలికాడు భీమసేనుడు.

గాంధారి కొంచెం ఆలోచించింది. "భీమసేనా! నువ్వు చెప్పింది నిజమే. నా కుమారుడు దుర్మార్గుడు. కాని నీవు అలా తొడలు విరగగొట్టి చంపడం నీకు ధర్మమా! పోనీలే నీ ప్రతిజ్ఞ నీవు నెరవేర్చుకున్నావు. కాని వృకోదరా! (అంటే తోడేలు లాంటిపొట్టగలవాడా!) యుద్ధంలో శత్రువును చంపడం సహజం. కాని ఎక్కడన్నా సాటి మానవుని గుండెలు చీల్చి నెత్తురు తాగే క్రూరులు ఉంటారా! రాక్షసులు మాత్రమే అలా చేస్తారు. కాని నువ్వు అలాచేసావు? తోడేలు మాదిరి

దుశ్శాసనుని రక్తం తాగావు. ఇది ధర్మమా!" అని అడిగింది గాంధారి.

"అమ్మా! నేను అంతటి క్రూరుడిని కాను. నేను ఎవరి నెత్తురూ తాగలేదు. నేను కురుసభలో ద్రౌపది వలువలు ఊడదీసినప్పుడు ఆవేశంలో కోపంలో ఒళ్లుమరిచిపోయి దుశ్శాసనుని గుండెలు చీల్చి నెత్తురు తాగుతాను అని ప్రతిజ్ఞ చేసాను. ఆ ప్రతిజ్ఞ నెరవేర్చుకోడానికి దుశ్శాసనుని గుండెలు చీల్చి, ఆ నెత్తురు కేవలం నా నోటికి తాకించాను. అంతేకాని రాక్షసుని మాదిరి రక్తం తాగలేదు. అమ్మా! నేనూ మనిషినే. రాక్షసుణ్ని కాదు.

అమ్మా! ఇంకొక విషయం. నేను దుశ్శాసనుని చంపినపుడు కురు వీరులు, తమ తమ సైన్యములతో నన్ను చుట్టుముట్టారు. నేను ఊరుకుంటే వారు నన్ను ముక్కముక్కలుగా నరుకుతారు. అందుకని స్వీయరక్షణ కోసం అలా భీకరాకారం దాల్చి, రక్తం తాగుతున్నట్టు నటించాను కాని నిజంగా రక్తం తాగలేదు అమ్మా. అమ్మా! సాటి మానవుల రక్తం తాగడం మహా పాతకం అని నాకు తెలుసు అమ్మా. అందులోనూ నా తమ్ముడి రక్తం నేను తాగుతానా! నేను అంత వెర్రివాడనా. అంత పాపం చేసేవాడినా నేను. అంత కరుణ లేనివాడనా అమ్మా! నన్ను నమ్ము నేను రక్తం తాగలేదు అమ్మా." అన్నాడు భీమసేనుడు.

అంతటితో ఊరుకోలేదు గాంధారి. "భీమసేనా! నాకు నూరుగురు కొడుకులు. ఈ గుడ్డివాళ్లను కడతేర్చడానికి ఒక్క కుమారుడినైనా మిగల్చకుండా అందరినీ దయా దాక్షిణ్యాలు లేకుండా చంపావే! ఇది నీకు ధర్మమా! నా నూర్గురు కుమారులలో నీకు అపకారం చెయ్యని వాడు ఒక్కడూనీకు కనపడలేదా భీమసేనా! నా కుమారులలో ఒక్కడిని చంపనంత మాత్రాన నీ ప్రతిజ్ఞ నెరవేరదా! నీ అన్న ధర్మరాజు రాజ్యం చేయడానికి నా కుమారుడు అడ్డు వస్తాడని అనుకున్నావా!" అని గాంధారి పక్కకు తిరిగి

"ఎక్కడ? ఆ మహా రాజు ధర్మరాజు ఎక్కడ?" అని అరిచింది.

ఆ అరుపుకు గజగజా వణికిపోయాడు ధర్మరాజు. "అమ్మా! ఇక్కడ ఉన్నానమ్మా. నేనేనమ్మా పాండవాగ్రజుడను ధర్మరాజును. నీ నూర్గురు కొడుకులను చంపించిన పాపాత్ముడను. క్రూరచిత్తుడను. అమ్మా! నన్ను క్షమించకు. నీ ఇష్టం వచ్చినట్టు దూషించు. నీ శాపాగ్నిలో దగ్ధం చెయ్యి. అమ్మా! నీ నూర్గురు కొడుకులనే కాదమ్మా! ఈ భూమండలం లోని మహారాజులందరినీ రణభూమికి బలి ఇచ్చిన పాపాత్ముడనమ్మా నేను. నీ ఇష్టం వచ్చిన శిక్ష విధించమ్మా భరిస్తాను. అనుభవిస్తాను. అమ్మా! కొడుకులను, అన్నదమ్ములను, చుట్టాలను పోగొట్టుకున్న నాకు రాజ్యం ఎందుకమ్మా! అసలు ఈ మేనిలో ప్రాణాలు ఎందుకమ్మా! నా లాంటి ద్రోహికి స్వర్గసుఖాలు ఎందుకమ్మా?" అని భోరున ఏడ్చాడు ధర్మరాజు.

ధర్మరాజు మాటలు విన్న గాంధారికి నోటమాట రాలేదు. ఒక్క నిట్టూర్పు విడిచింది. కిందికి చూచింది. ఆమె కళ్లు కనపడకుండా కట్టుకున్న బట్ట కిందినుండి ఆమె చూపు ధర్మరాజు కాలి గోళ్లమీద పడింది. ఆ చూపుల తీక్ష్ణతకు ధర్మరాజు కాలి వేలి గోళ్లు ఎర్రగా అయ్యాయి. అది చూచిన భీమార్జున నకుల సహదేవులు పక్కకు తప్పుకున్నారు. అంతలో శాంతించింది గాంధారి. ధర్మరాజును తల నిమిరి "నాయనలారా! మీ అమ్మ కుంతీదేవిని కలుసుకొని ఆమె దీవెనలుపొందండి." అని పలికంది. హమ్మయ్య అని ఒక నిట్టూర్పు విడిచి పాండవులు తమ తల్లి కుంతీదేవి దగ్గరకు వెళ్లారు.

కుంతీ దేవి, అప్పటికి తన కుమారులను చూచి చాలాకాలం అయింది. ఇన్నాళ్ల తరువాత పాండవులను చూస్తుంటే వారు అరణ్య, అజ్ఞాత వాసములలో పడ్డ బాధలు విని అలమటించి పోయింది. తరువాత జరిగిన యుద్ధంలో తన

మనుమలు అందరూ చనిపోయారని తెలిసి మరింత దుఃఖించింది. తనకు నమస్కరిస్తున్న పాండవుల తలలు నిమిరి భోరున ఏడ్చింది.

"పాండు కుమారాలారా! వచ్చారా! ఇన్నాళ్లకు ఈ అమ్మ మీద దయ కలిగిందా!" అని పాండవుల శరీరాలు తడుముతూ కుమిలిపోయింది.

పక్కనే మూర్తీభవించిన శోకదేవతలా ఉన్న ద్రౌపదిని చూచి "అమ్మా! ఏరమ్మా! నా మనుమళ్లు ఏరమ్మా! అభిమన్యుడు ఏడమ్మా! ఎక్కడికి వెళ్లారమ్మా! నన్ను చూడటానికి రారేమమ్మా!" అని పేరు పేరునా పిలిచింది.

ఆ మాటలతో ఇంకా దుఃఖం ఎక్కువైన ద్రౌపది మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది. కుంతీదేవి కూడా కోడలిని పొదివి పట్టుకొని భోరున ఏడ్చింది. కొంచెం సేపటికి కుంతీదేవి ద్రౌపదిని ఓదార్చి ఆమెను గాంధారి వద్దకు తీసుకొని వెళ్లింది. ద్రౌపది గాంధారి కాళ్ల మీద పడింది.

గాంధారి ద్రౌపదిని ఓదారుస్తూ "అమ్మా! ద్రౌపదీ! ఊరుకోమ్మా. పాండవులకు మాత్రం తమ కొడుకులను పోగొట్టుకున్న బాధలేదా! మీ అత్తగారు కుంతీదేవికి తన మనుమలను పోగొట్టుకున్న దుఃఖం లేదా.

అమ్మా ద్రౌపదీ! మనం ఇద్దరం ఒకే రకమైన దుఃఖము అనుభవిస్తున్నామమ్మా! నీకూ నీ కొడుకులు మరణించారు. నాకూ నా కొడుకులు మరణించారు. ఇలా జరుగుతుందని తెలిసే ఆనాడు కురు సభలో విదురుడు ఎంతగానో చెప్పాడు. నేను మాత్రం నా కుమారుల దుశ్చర్యలు ఆపలేకపోయాను. ఫలితం ఇద్దరం అనుభవిస్తున్నాము.

అయినా మన చేతిలో  ఏ ముందమ్మా! అంతా విధి
విలాసము.కాలమహిమ.  ఊరుకో తల్లీ" అంటూ ద్రౌపదిని ఓదార్చింది.

మహాభారతము
స్త్రీ పర్వము ప్రథమాశ్వాసము
సమాప్తము.
ఓం తత్సత్  ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహాభారతం

## స్త్రీ పర్వము

### ద్వితీయాశ్వాసము

వైశంపాయన మహర్షి జనమేజయునకు చెప్పిన మహా భారత కధను సూతుడు శౌనకాది మహా మునులకు ఈ క్రింది విధంగా వివరించసాగాడు.

ఆ ప్రకారంగా ద్రౌపదిని ఓదార్చిన తరువాత గాంధారి యుద్ధ భూమికి బయలు దేరింది. వ్యాసమహాముని కరుణ వలన ఆమె కళ్లకు గంతలు ఉన్నా, యుద్ధ భూమి అంతా సవిస్తరంగా కనిపిస్తూ ఉంది. సుదూరంలో ఉన్న వస్తువులు కూడా దగ్గరగా ఉన్నట్టు కనిపిస్తున్నాయి.

గాంధారి యుద్ధ భూమి అంతా పరికిస్తూ ముందుకునడుస్తూ ఉంది. సుయోధనుని శవం కోసం ఆమె కళ్లు గాలిస్తున్నాయి. ఆమె కళ్లకు విరిగిన రథాలు, ముక్కలైన ధ్వజములు, చచ్చిన ఏనుగుల, గుర్రాల కళేబరాలు, గుట్టలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. ఇంక చని పోయిన రధికులు, సారధులు, సైనికుల శవాలు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. తల ఒక చోట ఉంటే మొండెము ఒకచోట ఉంది.

ఇది చూచి గాంధారి హృదయం కలత చెందింది. మహా మహా సామ్రాజ్యాలు ఏలిన మహా రాజులు నోళ్లు తెరుచుకొని దిక్కులేకుండా శవాలై పడి ఉన్నారు. వారి శరీరాల నుండి కారిన రక్తం కాలువలైపారుతూ ఉంది. వారు ధరించిన కత్తులు,

గదలు, విల్లు, అమ్ములు గుట్టలుగా గుట్టలుగా పడి ఉన్నాయి. కొంత మందికి శరీర భాగాలు  గుర్తు పట్టడానికి కూడా వీలు లేకుండా పడి ఉన్నాయి. వాటి కోసం రాబందులు, గద్దలు అక్కడక్కడా ఎగురుతూ దొరికిన శవాలను దొరికినట్టు పీక్కుతింటున్నాయి.  తోడేళ్లు యుద్ధ భూమి అంతటా స్వైర విహారం చేస్తూ శవాలను చీల్చి, కండలు ఊడపెరికి తింటున్నాయి.

ఇదంతా చూసిన గాంధారికి హృదయం బాధతో విల విల లాడిపోయింది. తన కొడుకు మూర్ఖత్వం ఇంతటి మారణ హోమానికి దారితీసిందని గాంధారి మనసు ఎంతో బాధ పడింది.

వ్యాసుడు ధృతరాష్ట్రునితో యుద్ధభూమిలో ఉన్న శవాలన్నింటికీ సామూహిక దహన కాండ జరిపించమని చెప్పి వెళ్లిపోయాడు. పాండవులు, శ్రీ కృష్ణుడు ధృతరాష్ట్రుని నడిపించుకుంటూ యుద్ధ భూమికి వచ్చారు.

గాంధారి కోడళ్లు అందరూ తమ తమ భర్తల శరీరాలను వెతుక్కుంటూ యుద్ధభూమి అంత కలయ తిరుగుతున్నారు. వారితో పాటు ఇతర కౌరవ స్త్రీలు, హస్తినాపుర స్త్రీలు కూడా తమ తమ భర్త  కళేబరాల కోసం వెతుకుతున్నారు. అందరూ బిగ్గరగా ఏడుస్తూ తమ తమ భర్తలను, కుమారులను పిలుస్తూ తూలుతూ నడుస్తున్నారు.

ఇంకొంత మంది తమ తమ కొడుకులు, తమ్ముళ్లు, అన్నలు,  మనుమళ్లు, స్నేహితులు శవాలుగా పడి ఉండగా చూచి తట్టుకోలేక హాహాకారాలు చేస్తూ మూర్ఛపోయారు. మరి కొంత మంది చని పోయిన వారిని పిలుస్తూ వారి గురించి మాట్లాడుకుంటూ తలలు బాదుకుంటున్నారు.

ఇదంతా చూచింది గాంధారి. ఆమె మనసు కకావికలయింది. దూరంగా నిలబడి ఉన్న కృష్ణుని దగ్గరకుపిలిచింది.

“కృష్ణా! చూడవయ్యా! ధృతరా ష్ట్ర మహారాజుకోడళ్లను చూడు! కన్నీరు మున్నీరుగా ఎలా విలపిస్తున్నారో చూడు! వారి వారి భర్తల శరీరాలను ఎలా వెతుక్కుంటున్నారో చూడు. ఒకరి భర్తల శరీరాలను మరొకరు కనుగొని ఏడుస్తూ వారి వారి భార్యలను ఎలా పిలుస్తున్నారో చూడవయ్యా!

నా కుమారుల మీద కసి ద్వేషం పెంచుకున్నవారి కళ్లు ఈ దృశ్యాలు చూచి చల్ల బడ్డాయా కృష్ణా! వీరంతా ఏం పాపం చేసారని వీరికి ఈ శిక్ష వేసారయ్యా మీరు! అలా చూడవయ్యా! అడుగో భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు, ద్రుపదుడు వీరంతా చని పోయినా వారి మొహాల్లో కళా కాంతీ తగ్గలేదు. వాళ్లంతా ఎలా వెలిగిపోతున్నారో చూడవయ్యా!

అత్యంత రాజభోగాలు అనుభవించిన ఆ మహాను భావులు దిక్కు లేకుండా ఎలా పడి ఉన్నారో చూడవయ్యా! పొద్దుటే వందిమాగధుల కైవారములతో గాని నిద్ర లేవని ఆ మహా మహులు ఇప్పుడు నక్కల ఊళలు చెవులారా వింటు న్నారయ్యా. హంస తూలికా తల్పముల మీదగాని మెత్తని పట్టుపరుపుల మీద గాని శయనించని మహారాజులు, వివిధ దేశాధీశులు కటిక నేలమీద పడి దొర్లుతున్నారయ్యా. చందన, సుగంధ లేపనములతో విరాజిల్లు రాజోత్తములు రక్తములో అంటిన మట్టిలో పడి దొర్లుతున్నారయ్యా.

కృష్ణా! ఇవన్నీ చూచి ఎలా భరిస్తున్నావయ్యా .....కృష్ణా! ఇదంతా నువ్వు సాధించిన ఘన కార్యము కాదా!.... శ్రీ కృష్ణా! అదుగో అటు చూడవయ్యా! కొంత మంది కౌరవ స్త్రీలకు తమ తమ భర్తల తలలు కనిపించడం లేదయ్యా! వాటి కోసం

విలపిస్తూ వెతుకుతున్నారయ్యా! మరి కొందరు తలకాయలు చేతి లో పట్టుకొని మొండెముల కోసం వెతుకుతూ అవి కనపడక ఏడుస్తున్నారయ్యా! మరి కొందరు తమ తమ భర్తల శవాలు ముక్కలై పోగా వాటిని అన్నింటినీ ఒక చోట చేర్చి పోల్చుకొని విలపిస్తున్నారయ్యా! కొన్ని దేహాలను నక్కలు, తోడేళ్లు తిని వేయడంతో వారి దేహాలు కాన క అల్లల్లాడిపోతున్నారయ్యా!

ఇలాంటి దురవస్థలను చూడ్డానికి నేను ఏ జన్మలో ఏం పాపం చేసానో కృష్ణా! నా కొడుకులను, నా కోడళ్లను, తమ్ముళ్లను బంధువులను ఇలాంటి దుస్థితిలో చూస్తున్నాను."

కాని కృష్ణుడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మౌనంగా గాంధారి వెంట నడుస్తున్నాడు. ఇంతలో దూరంగా సుయోధనుని శవం గాంధారికి కనిపించింది. దిక్కులేకుండా పడి ఉన్న అభిమానధనుడైన తన కుమారుని శవం చూచి గాంధారి కుప్పకూలిపోయింది. తన కుమారుని శవం మీద పడి బిగ్గరగా ఏడుస్తూ ఉంది.

"నాయనా సుయోధనా! ఏంటయ్యా ఇది! నీ శరీరం దుమ్ముధూళిలో పొరలడం ఏమిటయ్యా! నేనయ్యా .....నీ తల్లి గాంధారిని. నన్ను చూచికూడా లేచి నిలబడవా నాయనా! కృష్ణా! చూడవయ్యా నా కుమారుని చూడు. వీడు యుద్ధమునకు వెళుతూ నా ఆశీర్వాదము కొరకు వచ్చాడయ్యా! నాకు పాదాభి వందనం చేసాడయ్యా! అప్పుడు నేను ఏమని ఆశీర్వాదించానో తెలుసా! ధర్మం జయిస్తుందని ఆశీర్వదించానయ్యా. అలా ఎందుకు ఆశీర్వదించానో తెలుసా కృష్ణా! నాడు నిండు సభలో జూదప్రక్రియ తరువాత పాండవులకు జరిగిన అవమానము, ద్రౌపదికి జరిగిన ఘోరావమానము కళ్లారా చూచిన వారు ఏమని భయపడ్డారో తెలుసా. "ఎన్నటికన్నా ధర్మం జయిస్తుంది. కౌరవులకు నాశనం తప్పదు." అని అనుకున్నారు. నా బుద్ధికి కూడా అలాగే తోచింది. అందుకనే ఆ

మాదిరి దీవించాను. నా కుమారుడని నేను వాడిని ఉపేక్షించలేదు. కృష్ణా! వాడితో ఇంకా ఏమన్నానో తెలుసా! .....కుమారా! యుద్ధంలో వెనుదిరి గి పారి పోవడం కంటే యుద్ధంలో పోరాడి వీరమరణం పొందడం మేలు. అప్పుడు వీరస్వర్గం లభిస్తుంది. కాబట్టి వస్తే విజయ లక్ష్మితో తిరిగి రా లేకపోతే వీరస్వర్గము అలంకరించి స్వర్గసుఖాలు అనుభవించు...... అని పలికానయ్యా. నాకుమారు డు రెండవ మాట నిజం చేసాడు. ఇప్పుడు వాడి గురించి ఏడుస్తున్నాను అంటే కడుపు తీపి తప్ప వేరుకాదు.

వాడి వీరమరణానికి నేను చింతించడం లేదు. శత్రువుతో వీరోచితంగా పోరాడి వీర మరణం పొందిన నా కుమారుని గురించి నేను ఎందుకు దుఃఖిస్తానయ్యా! ఈ ముదిమి వయసులో నాకూ నా భర్తకూ కొడుకుల ఆసరా లేకుండా పోయిందే అన్న బాధ మనసును కలచి వేస్తోంది కృష్ణా! నా కుమారుడు అష్టైశ్వర్య సంపన్నుడు. అభిమాన ధనుడు. అలాంటి వాడికి ఇలాంటి దుర్మరణం సంప్రాప్తించిందే అని బాధగా ఉందయ్యా!

ఏం చేస్తాం. విధి వ్రాత. విదురుడు నాభర్తకు, నా కుమారునికి ఎన్నో నీతులు చెప్పాడు. కాని వారు మదించిన గర్వంతో ఆయన మాటలు వినలేదు. విదురుని మాట ఒక్కటి విన్నా ఈ వినాశనం, దుర్మరణాలు తప్పేవి కదా కృష్ణా! పదకొండు అక్షౌహిణీల సైన్యం వెంట ఉన్న నా కుమారుడు చివరకు ఒంటరి చావు చచ్చాడు. నాడు నా భర్త, నా కుమారుడు ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించిన ఈ కురు సామ్రాజ్యము పరుల హస్తగతమువడం చూచే దౌర్భాగ్యం నాకు పట్టిందయ్యా!

పోయిన కొడుకులు ఎటూ పోయారు. కాని బతికి ఉన్న నా కోడళ్ల దుఃఖం చూడలేకపోతున్నాను. వాళ్లు ఏం పాపం చేసారయ్యా ఇంతటి మనో వేదన పొందడానికి. వారికి ఈ రాజకీయాలు ఏమీ తెలియవు. యుద్ధం ఎందుకు

వచ్చిందో వారికి తెలియదు. కాని ఆ యుద్ధం వల్ల కలిగిన దుష్పరిణామాలను మాత్రం వారు అనుభవిస్తున్నారు. అలా చూడవయ్యా నా పెద్ద కోడలు భానుమతిని చూడు. భర్త ముఖం చూస్తూ ఎలా తలబాదుకుంటూ ఏడుస్తూ ఉందో. కడుపున బుట్టిన కుమారుని మొహం చూస్తూ గుండెలు పగిలేలా రోదిస్తూ ఉందయ్యా! ఆమె కన్నీటికి నా కుమారుడు, ఆమె కుమారుడు శవాలు తడిసిపోతున్నాయయ్యా!

అలా చూడవయ్యా! కురులు విరబోసుకొని పిచ్చి వాళ్లలా తిరుగుతూ రోదిస్తున్న నా కోడళ్లను చూడవయ్యా! ఏం పాపం చేసారని వాళ్లకు ఈ చిత్తక్షోభ! నా కుమారుడు సుయోధనుని సరసన విరాజిల్లిన నా కోడలుభానుమతి మొహం నేను ఎలా చూడగలనయ్యా! నా కొడుకులకేం. చచ్చిస్వర్గాన ఉన్నారు. బతికి ఉన్న వాళ్ల భార్యలే గుండెలు అవిసేలా రోదిస్తున్నారు. వీళ్ల దుఃఖానికి అంతే లేదా కృష్ణా!

అలా చూడవయ్యా! నా నూరుగురు కొడుకులు భీమసేనుని చేతిలో నేల కూలారయ్యా! నా కోడళ్లందరూ వారి వారి భర్తల శవాల దగ్గర ఎలా రోదిస్తున్నారో చూడవయ్యా! ఎప్పుడూ చందన చర్చితలై, పాలరాతి భవనాలలో తిరిగే నా కోడళ్లు కటిక నేల మీద పొర్లాడుతూ చనిపోయిన వారి వారి భర్తల కోసం అల్లాడు తున్నారయ్యా! అయ్యో కృష్ణా! వాళ్లు ఇంకా చిన్న వాళ్లయ్యా! ఏ ముద్దూ ముచ్చటా తీరలేదయ్యా! అలాంటి వారికి ఏ దుర్గతి పట్టిందో చూడవయ్యా! కృష్ణా! ఇదంతా నేను నా భర్తా చేసిన మహా పాప ఫలం గాక పోతే నా నూరు గురూ కొడుకులనూ ఆ ధర్మరాజు నాశనం చేస్తాడా! ” అంటూ గాంధారి పరి పరి విధములుగా విలపిస్తూ ఉంది.

ఆమె పక్కన ఉన్న కృష్ణుడు బదులుచెప్పడం లేదు. లోపల ఉన్న బాధ, దుఃఖం బహిర్గతం అయితే గాని మనసు కుదుటపడదు అని అనుకున్నాడు. ఇంతలో గాంధారికి దుశ్శాసనుని శవం కనిపించింది. గాంధారి మహోద్వేగంతో కృష్ణుని

చూచి " కృష్ణా! కృష్ణా! వీడేనయ్యా నా కుమారుడు దుశ్శాసనుడు. మహా భుజబల సంపన్నుడు. భీమసేనుని గదాఘాతములకు బలియై దిక్కు లేకుండా నేల మీద పడి ఉన్నాడు. భీముడు వీడి గుండెలు చీల్చి రక్తం పూర్తిగా తాగిన తరువాత నిర్జీవుడై పడి ఉన్నాడయ్యా!

వీడేనయ్యా నా కోడలు ద్రౌపదిని నిండు కొలువుకు ఈడ్చుకొని వచ్చాడయ్యా! భీముని గుండెలు మండేట్టు ద్రౌపది ఏడుస్తుంటే, తన అన్న సుయోధనునికి, అంగరాజు కర్ణునికి ప్రీతి గొలిపేట్టు ఆమె వలువలు ఊడదీసి అవమానించాడయ్యా! ఆ పాపం ఊరికే పోతుందా! అనుభవించాడు. దిక్కులేని చావు చచ్చాడు. ఈ విషయం విని నేను సుయోధనునితో ఏమన్నానో తెలుసా కృష్ణా!

"కుమారా! ఈ ద్రౌపది తన అన్న కృష్ణుని సంరక్షణలో ఉన్న సంగతి మీకు తెలుసా! ఆమెను ఇంత నీచంగా అవమానించడం మంచిదికాదు. దీని పర్యవసానం మీకు తెలిసే మీరు ఈ పనికి ఒకగట్టారా! భీముని బలపరాక్రమాలు తెలిసే అతనిని అతని భార్యను మీరు అవమానిస్తున్నారా! తక్షణమే ఆమెను విడిచిపెట్టండి. కౌరవ కులకాంత అయిన ద్రౌపదిని గౌరవించండి. నా తమ్ముడు ఉన్నాడే శకుని. వాడు ఒక దౌర్భాగ్యుడు. క్రూరాత్ముడు. అత్యంత నీచుడు. వాడిమాటవినకు. వాడి స్నేహం వదిలి పెట్టు.కౌరవ వంశాన్ని రక్షించు" అని ఎన్నోవిధాలుగా నా కొడుకులకు నచ్చ చెప్పానయ్యా. కాని నా మాటలు ఎవరూ వినలేదయ్యా! ఇదిగో ఇలా చచ్చారయ్యా! విధి రాతను ఎవరు తప్పించగలరు కృష్ణా!

కృష్ణా! ఆ భీముడు ఆనాడు కౌరవ సభలో నాకొడుకులు ఎన్ని మాటలన్నా, ఎంత అవమాన పరిచినా సహించాడు, భరించాడు. సమయం కోసం పగబట్టిన తాచుపాములా కాచుకొని ఉన్నాడు. యుద్ధంలో నా కొడుకుల నందరినీ తన గదతో

మోది చంపాడు. పగ తీర్చుకోడం న్యాయమే కృష్ణా! కాని ఈ మాదిరి దుశ్శాసనుడి గుండెలు చీల్చి రక్తం తాగడం సమంజసమా! మహా వీరుడైన భీమసేనుడు ఇటువంటి నీచమైన పని చేయవచ్చునా కృష్ణా! దీని వల్ల భీమునికి ఏమన్నా మంచి పేరు వస్తుందా! అతని కీర్తి పెరుగుతుందా!

చూడవయ్యా! నా కొడుకు దుశ్శాసనుడిని చూడవయ్యా! కాళ్లు, చేతులు, మొహం ఎక్కడి వక్కడ చెల్లాచెదరుగా పడి ఉన్నావయ్యా! సింహం తన గోళ్లతో చీల్చినట్టు దుశ్శాసనుడి గుండెలు ఎంత భయంకరంగా చీల్చాడో చూడ వయ్యా ..... కని పెంచి పెద్దచేసిన కొడుకును ఈ స్థితిలో చూచిన ఏ తల్లి మనసు దుఃఖంతో కుమిలిపోకుండా ఉంటుందయ్యా!

అయ్యో! వికర్ణుడు. ఇక్కడే ఉన్నాడయ్యా! ఆ ఏనుగుల కళేబరాల మధ్య పడి ఉన్నాడయ్యా! వికర్ణుడి భార్య, నా కోడలు భర్త పక్కన కూర్చుని ఎలా హృదయ విదారకంగా ఏడుస్తూ ఉందో చూడవయ్యా! గద్దలు, రాబందులూ వికర్ణుడి శరీరం పొడుచుకు తినడానికి మీద వాలుతుంటే వాటిని అదిలిస్తూ భర్త శరీరం మీద పడి ఏడుస్తూ ఉందయ్యా .

కృష్ణా! ఇలాంటి పరిస్థితుల లో కొడుకులను కోడళ్లను చూచే తల్లులుంటారా చెప్పవయ్యా! నేనున్నానయ్యా! నేనెంత దౌర్భాగ్యురాలినో కదా! ఎలాంటి వీరుడినైనా యుద్ధములో అవలీలగా ఎదుర్కొనేవాడు, దుర్ముఖుడు. అలాంటివాడిని తన గదతో మోది చంపాడయ్యా ఆ భీముడు. నా కొడుకు శూరసేనుడిని చూడవయ్యా. వాడి శవం చుట్టు చేరి అతని భార్య లు ఎలా రోదిస్తున్నారో. కాకులు గద్దలు పొడుచుకొని తిని వాడి శరీరం గుర్తుపట్టడానికి వీలులేకుండా పోయిందయ్యా కృష్ణా!

నా కొడుకు వివింశతి ని చూడు కృష్ణా! వీడికి సంగీతం అంటే ఎంతో ప్రాణం. ఎల్లప్పుడూ తన చుట్టు సంగీత విద్యావిశారదులైన అప్సరసల్లాంటి స్త్రీలతో సేవలందుకుంటూ, వారి గానామృతంలో తేలియాడేవాడు ఇప్పుడు నక్కల ఊళలను తనివిదీరా వింటు న్నాడయ్యా." అని పరి పరి విధాలా తన కుమారుల మృత కళేబరములను చూచి విలపిస్తూ ఉన్న గాంధారికి అభిమన్యుని మృత కళేబరము కనిపించింది.

ఒక్కసారి ఆమె మనసు బాధతో ఆక్రోశించింది. "కృష్ణా! వాడేనయ్యా అభిమన్యుడు. శత్రు దుర్భేధ్యమైన పద్మవ్యూహమును ఛేధించి అరి వీరభయంకరుడైన సుయోధనునిని ఎదిరించిన మహావీరుడు అభిమన్యుడు. చివరకు ద్రోణ, కర్ణ, అశ్వత్థామ, శల్య, కృపాది యోధానుయోధులందరూ అతనిని ఒక్కసారిగా చుట్టుముట్టి కడతేర్చారయ్యా! ఆ సుభద్రాపుత్రుడిని చూడవయ్యా! అచ్చం నిద్రపోతున్నట్టే ఉందయ్యా వాడి మొహం. అతని మొహంలో చావు కళ ఇసుమంతైనా లేదు కృష్ణా! అందు కే కాబోలు ఆ ఉత్తర తన భర్త గుండెల మీద తల పెట్టి రోదిస్తూ తన మొహాన్ని అభిమన్యుని మొహం మీద పెట్టి నిద్రలేవమని ప్రార్థిస్తూ ఉందయ్యా!

అభిమన్యుని అల్లంత దూరంలో చూడగానే పారిపోయే ఆ సుకుమారి ఇప్పుడు పదిమంది ముందు అభిమన్యుని శరీరమును కౌగలించుకొని నెత్తీనోరూ బాదుకుంటూ రోదిస్తూ ఉందయ్యా కృష్ణా! ఉత్తర ఏమని ఏడుస్తూ ఉందో వినవయ్యా!

" ఓ అభిమన్యకుమారా! మీ అమ్మ సుభద్ర, మీ తండ్రి అర్జునుడు మీ కోసం ఎదురు చూస్తున్నారయ్యా! వారిని వదిలి ఎక్కడకు వెళ్లావు! నీ మేనమామ కృష్ణుడు వచ్చాడు లేవయ్యా! నేను ఇన్ని విధాలుగా ప్రార్థిస్తున్నా ఒక్క మాటకూడా

మాట్లాడవేమి ఆర్యపుత్రా! అయ్యో దైవమా! గురువుగారు ద్రోణుడు, కృపాచార్యుడు, అంగరాజు కర్ణుడు, గురు పుత్రుడు అశ్వత్థామ వీరంతా న్యాయం, ధర్మం తెలిసిన ధర్మాత్ములు అని అంటారే! అటాంటి వారు ఒంటరి వాడైన నిన్ను చుట్టుముట్టి ఎలా తుదముట్టించారయ్యా! వారిదీ ఒక మగతనమేనా! ఇంతటి నీచ కార్యమునకు పాల్పడుటకు వారికి మనసెలా ఒప్పిందో! తాను చెంత లేకుండా చూసి ఆ దుర్మార్గులు అందరూచుట్టు ముట్టి అభిమన్యుని తుదముట్టించారు అని తెలిసి అర్జునుడు ఎంత బాధ పడ్డాడో కదా! నాథా! శత్రురాజులను జయించి రాజ్యలక్ష్మిని కైవసం చేసుకున్న ఆనందం నీ మరణంతో ఆవిరి అయిపోయింది కదా! ఇప్పుడు ఈ రాజ్యము లభించీ లాభం ఏముంది చెప్పు నాథా! నన్ను విడిచి స్వర్గలోకానికి వెళ్లి అక్కడ ఉన్న అప్సరసాంగనలతో సుఖించడానికి నీకు మనసెలా ఒప్పిందయ్యా" అంటూ రోదిస్తున్న ఆ ఉత్తరను చూడు కృష్ణా. ఈ వయసులో ఆమెకు భర్తృవియోగం సమంజసమా!

ఉత్తర తండ్రి విరాటుడు మహా వీరుడు. ఆయన దగ్గర చేరి ఆయన భార్య సుధేష్ణఎలా రోదిస్తూ ఉందో చూడవయ్యా! ఆ పక్కన ఆమె కుమారుడు ఉత్తరుడు చచ్చి పడి ఉన్నాడు. మరణించిన భర్త కోసం దుఃఖిస్తుందా.... లేక చచ్చిన కొడుకు కోసం రోదిస్తుందా! ఆ అభాగ్యురాలు సుధేష్ణ ఎంతటి దురదృష్టంవంతురాలో కదా! కృష్ణా!

కృష్ణా! అదుగో చూడు. కర్ణుని కళేబరము వద్ద అతని భార్యలు చుట్టుముట్టి ఎలా దుఃఖిస్తున్నారో! ఈ కర్ణుని నమ్ముకునేకదా నా కుమారుడు ఈ ఘోర యుద్ధమునకు శ్రీకారం చుట్టాడు. తుదకు దుర్మరణం పొందాడు. అటు చూడవయ్యా! కర్ణుని ధర్మపత్ని, వృషసేనుడి తల్లి, అటు భర్త మరణానికీ ఇటు కొడుకు మరణానికీ ఎలా విలపిస్తూ ఉందో చూడవయ్యా. ఆమె మాటలు వినవయ్యా.

"నాథా! పరశురాముని శాపము, బ్రాహ్మణుని శాపము, అర్జునుని బాణములు నిన్ను బలిగొన్నాయా నాథా!" అంటూ విలపిస్తూ ఉందయ్యా!

అడుగో! మహావీరుడు బాహ్లికుడు. చచ్చి నట్టు లేడయ్యా. గాఢనిద్రలో ఉన్నట్టు ఉన్నాడు కదూ! కృష్ణా.....

కృష్ణా! అటు చూడు.నా అల్లుడు, దుస్సల భర్త..... సైంధవుడు .... అర్జునుడు చేసిన ప్రతినకు బలైపోయాడు. నాడు అరణ్యములో ద్రౌపదిని చూచి కామించిన నాడే వాడు సగం చచ్చాడయ్యా! నా కూతురు మొహం చూచి పాండవులు వాడిని వదిలిపెట్టారు. కాని ఈ నాడు అదే పాండవులు సైంధవుడు తమ చెల్లెలు భర్త అనే కనికరం లేకుండా చంపారయ్యా! పాపం దుస్సల భర్త శిరస్సు కోసం ఎలా వెదుకుతూ ఉందో చూడవయ్యా! ఇలాంటి పరిస్థితులలో కూతురును చూడ్డం కన్నా దురదృష్టం ఏ తల్లికి ఉంటుందిచెప్పు!

కృష్ణా! నీకు తెలుసో లేదో! అర్జునుడు ఆరోజు సూర్యాస్తమయం లోగా సైంధవుని చంపుతాను అని చేసిన ప్రతిజ్ఞ గురించి తెలిసిన దుస్సల ఆ రాత్రి భర్తకు ఎంతగానో చెప్పిందయ్యా!

"నాథా! అర్జునుని ప్రతినకు ముల్లోకాలలోనూ తిరుగు లేదు. నా మాటవిని ధర్మరాజును శరణు వేడు. అతను నిన్ను తప్పక కాపాడుతాడు" అని ఎన్నోవిధాలుగా చెప్పిందయ్యా కాని సైంధవుడు వినలేదు. ఇలా దుర్మరణం పాలయ్యాడు. "ఏ శుభకార్యానికి కూడా వెళ్లకుండా నీ చెల్లిని విధవరాలిని చేసారా" అంటూ పాండవులను నా కూతురు దుస్సల ఎలా నిందిస్తూ ఉందో వినవయ్యా!

అయినా కృష్ణా! సైంధవుడు చేసిన తప్పు ఏమిటి! యుద్ధ ధర్మము ప్రకారము

భీమ,నకుల సహదేవులను అభిమన్యునికి సాయంగా వెళ్లకుండా ఆపాడు. అయినా బాలుడైన అభిమన్యుడు మహావీరులైన ద్రోణ,కర్ణ,అశ్వత్థామలను ఎదుర్కోడం తప్పుకదా! అభిమన్యుని దుస్సాహసమే అతని మృతికి కారణం అయింది. అయినా చంపిన వారిని వదిలి, అడ్డగించిన సైంధవుని చంపుతానని ప్రతిజ్ఞ చెయ్యడం ధర్మమో అధర్మమో ఆ అర్జునునికే తెలియాలి!

కృష్ణా! మహావీరుడైన శల్యుడు ...... ధర్మనిరతిలో ధర్మజునితో సమానుడు. అలాంటివాడు, దుర్యోధన పక్షం వహించి,కర్ణుని కి సారధ్యం చేస్తూ అతనిని సూటి పోటి మాటలతో బాధించాడు. అలాంటి శల్యుని చుట్టు అతని భార్యలు, బంధువులు ఎలా ఏడుస్తున్నారో చూడవయ్యా!

కృష్ణా! ఇతడు భగదత్తుడు. ఇతనిని చూచావా! మహేంద్రుడిని కూడా గెలువ సమర్ధుడు. అర్జునుని మీది ప్రేమతో ఇతనిని దారుణంగా చంపించింది నువ్వే కదా కృష్ణా!

అడుగో! భీష్ముడు. శర తల్పము మీద ఎలా పడుకొని ఉన్నాడో చూడు. కోరి కోరి తన మృత్యువును కొని తెచ్చుకున్నాడు. లేకపోతే మహావీరుడైన భీష్ముని గెలవడం మానవ మాత్రులకు సాధ్యమా కృష్ణా! అతనికి నిజమైన శిష్యుడు అర్జునుడే కదా! అతనిని శరతల్పము ను ఏర్పరిచి పాతాళ గంగతో అతని దాహార్తిని తీర్చిన వీరుడు అర్జునుడు. సూర్యుడే భూమిమీద కు దిగి వచ్చి, శరతల్పము మీద పడుకొని విశ్రాంతి తీసుకుంటున్నట్టు ఉంది కదూ! అలాంటి భీష్ముడు స్వర్గస్థుడైన తరువాత కురుకుమారులకు ధర్మసూక్ష్మములను వివరిస్తూ దిశానిర్దేశము ఎవరు చేస్తారు కృష్ణా!

ఇంద్రుడితో సమానమైన పరాక్రమ వంతుడు ద్రోణుడు, వేదవేదాంగ పారంగతుడు. ధనుర్వేదమును ఆపోశనపట్టిన వాడు. ఎందరో కురుకుమారులకు విద్య నేర్పినవాడు. నేడు దిక్కులేకుండా పడి ఉన్నాడు. విధి ఎంత క్రూరమైనది కృష్ణా! ద్రోణాచార్యులను నమ్ముకునే కదా నా కుమారుడు పాండవులతో యుద్ధం ప్రకటించాడు. కాని ఆయన తలను ద్రుపద పుత్రుడు, ధృష్టద్యుమ్నుడు దారుణంగా నరికాడు. ఇది సంభవమంటావా కృష్ణా! ద్రోణుడి భార్య భర్త శవం దగ్గర కూర్చుని ఎలా రోదిస్తూ ఉందో చూచావా! ద్రోణుడి శిష్యులు అతనిని దహనం చెయ్యడానికి కట్టెలు దొరక్క అక్కడ ఉన్న అమ్ములు, ధనుస్సులు పోగుచేసి చితి పేరుస్తున్నారు. కృపి మొదలగు వారు ద్రోణుని చితికి అపసవ్యముగా ప్రదక్షిణ మాచరించి స్నానము చేయుటకు వెళుతున్నారయ్యా!

కృష్ణా! సాత్యకి అమానుషంగా తల నరికిన సోమదత్తుని కుమారుడు భూరిశ్రవసుని చూడు. అతని శరీరవమును గ్రద్దలు, నక్కలు ఎలా పీక్కు తింటున్నాయో. ఆ భూరిశ్రవసుని తల్లి, కుమారులు, భార్య అతని పక్కన కూర్చుని ఎలా రోదిస్తున్నారో చూడు కృష్ణా! అర్జునుడు భుజం తెగనరికితే, సాత్యకి తలనరికాడు. అది తల్చుకొని తల్చుకొని ఏడుస్తున్నారయ్యా వాళ్లు!

అయినా కృష్ణా! మహా వీరులైన అర్జునుడు, సాత్యకి ఇంతటి నీచ కర్మమునకు ఎలా ఒడిగట్టారు కృష్ణా! సాత్యకి మీది ప్రేమతో అర్జునుడు ఇలాచేసి ఉంటాడంటావా! అయినా ఆ భూరిశ్రవసువు మంచివాడు. సాధువు. అతనిని చంపితే అర్జునునికి ఏం ఒరిగింది కృష్ణా! సాత్యకి ఏం సాధించాడు. ప్రాయోపవేశం చేస్తున్న వాడిని చంపాడు అన్న అపకీర్తి మూటకట్టుకోడం తప్ప.

కృష్ణా! ఇదంతా నీ కళ్ల ముందే జరిగింది కదా! భూరిశ్రవసుడు సాత్యకితో యుద్ధం చేస్తున్నప్పుడు అర్జునుడు సిగ్గు మాలి అతని చేయి ఎందుకు నరికాడు!

అర్జునుడు చేసిన పనిని నీవు హర్షిస్తావా కృష్ణా!" అని పరి పరి విధముల విలపిస్తూ ఉంది గాంధారి.

కృష్ణుడు ఒక్క మాట కూడా మాట్లాడ కుండా ఆమెను అనుసరిస్తున్నాడు. ఇంతలో గాంధారికి తన తమ్ముడు శకుని కళేబరము కనపడింది. ఆమె మొహం కోసంతో జేవురించింది.

"కృష్ణా! తన మేనల్లుడు నకులుని చేతిలో చచ్చిన నా తమ్ముడు శకునిని చూచావా! వీడొక మాయావి. కాని వీడి మాయలు నీ ముందు పనిచేయలేదు. నాడు మాయాద్యూతంలో ధర్మరాజును ఓడించి అడవులకు పంపాడు. కాని, యుద్ధమనే జూదంలో తన ప్రాణాలు ఒడ్డి ఓడిపోయాడు. కురు పాండవులకు మధ్య శత్రుత్వానికి కారణం వీడే కృష్ణా! నీకు హితం చేస్తున్నాను అని నా కుమారుడు సుయోధనుని నమ్మించి నట్టేట్లో ముంచాడు. వీడు మాత్రం బాగు పడ్డాడా. తన పుత్రపౌత్రులతో యుద్ధంలో మరణించాడు . అసలు నా కొడుకులకు బుద్ధి లేదు. లేకపోతే మాయావి అయిన వీడి మాటలు నమ్ముతారా! అందుకే ఫలితం అనుభవించారు.

కృష్ణా! అడుగో కళింగ దేశాధిపతి, ఇదుగో మగధదేశాధిపతి శరీరం. ఇతడు కోసలదేశాధీశుడు బృహద్బలుడు. తమ తమ రాజ్యములలో సకల భోగ భాగ్యములను అనుభవించిన వారు నేడు దిక్కు లేకుండా పడి ఉన్నారు. వారి చుట్టు చేరి వారి భార్యలు, బిడ్డలు ఎలా రోదిస్తున్నారో చూడవయ్యా! ఇలాంటి రోదనలు ఎన్నడన్నా కని విని ఎరుగుదుమా కృష్ణా!

ఇరుగో కేకయ రాజులు. ద్రోణాచార్యుల చేతిలో హతమైనట్టున్నారు. అడుగో పాంచాల రాజు ద్రుపదుడు. తన సహాధ్యాయి ద్రోణుని చేతిలో చచ్చాడు. చిత్రం

కాకపోతే అతని తెల్ల గొడుగు ఇంకా అతని మీద ఎండ పడకుండా నిల్చి ఉంది చూచావా కృష్ణా! అటు చూడవయ్యా! ఆ మహా రాజుల భార్యలు, కొడుకులు, తమ తమ భర్తలకు, తండ్రులకు దహనసంస్కారాలు గావించి రోదిస్తూ మయల స్నానం చెయ్యడానికి గంగ వైపుకు వెళుతున్నారు. ఇంకా కొంతమంది మమకారం వీడక చచ్చిన వారి తలలను తమ తొడల మీద పెట్టుకొని రోదిస్తున్నారయ్యా!

కృష్ణా! ఇతనిని గుర్తు పట్టావా! వీడేనయ్యా నీ మేనత్త కుమారుడు శిశుపాలుని కుమారుడు ధృష్ట కేతువు. అతని కుమారుడు సుకేతుడు. తండ్రి కొడుకులు ఇద్దరూ మరణించారయ్యా. తండ్రికొడుకులు ఒకేసారి మరణించగా వారి భార్యలు తల్లులు బంధువులు ఎలా రోదిస్తున్నారో చూడవయ్యా!

కృష్ణా! అవంతీ పాలకులు విందాను విందులు నీకు తెలుసుగా! వారే వీరు. పెనుగాలికి కూలిన వృక్షముల మాదిరి ఎలా కూలిపోయారో చూచావా!

ఇదంతా చూస్తుంటే నాకు ఒక సందేహం కలుగుతోందికృష్ణా!

భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, అశ్వత్థామ, భూరిశ్రవసుడు, కృపుడు, సైంధవుడు, కృతవర్మ, నా కుమారుడు సుయోధనుడు వీరంతా అతిరధ మహారధులు. వీరందరితో యుద్ధం చేసి కూడా నువ్వు, నీ తమ్ముడు సాత్యకి, పాండవులు నిరపాయంగా ఎలా బయట పడ్డారయ్యా! మహాద్భుతంగా ఉంది కదూ! నాకు నమ్మ బుద్ధి కావడం లేదు కృష్ణా! అపారమైన దైవ బలం ఉంటేకాని ఇదిసాధ్యం కాదు. కాని ఆ దైవం కూడా దయమాలి నా కుమారులు నూర్గురికీ అన్యాయం చేసింది అంటేనే బాధగా ఉందయ్యా!

కాని ఏం చేస్తాం. నా కుమారుల నందరినీ పోగొట్టుకున్నాను. అనాధ నయ్యాను.

ఈ ముదిమి వయసులో నాకు, నా భర్తకు ఆసరాగా ఒక్క కుమారుని కూడా మిగల్చ లేదయ్యా ఆ భీముడు. ఆ భీముడు మాత్రం ఏం చేస్తాడులే. అంతా నేను నా కొడుకులు చేసుకున్న ప్రారబ్ధం. ఆనాడు నువ్వు రాయబారానికి వచ్చి చెప్పిన మాటలు విన్నట్టయితే ఇంత జరిగేదా! నువ్వే కాదు ...... భీష్ముడు, విదురుడు కూడా ఎన్నో హితోక్తులు పలికారయ్యా! నేను, నా భర్త ఆ మాటలు పెడచెవిని పెట్టాము.

కృష్ణా! నాడు నీవు పలికిన పలుకులు నిజమయ్యాయి. ఈ సర్వ నాశనానికి నువ్వే కారకుడవు. ఊరికే హితములు కూర్చోకుండా నువ్వు నా కొడుకులు, పాండవుల మీద అసూయతో చేస్తున్న అకృత్యములకు ఎందుకు అడ్డు పడలేదు? నువ్వు తల్చుకుంటే ఈ యుద్ధం ఆపలేవా! నాడు కొలువు కూటములో ఎంత మంది పెద్దలున్నారు. మాననీయ వాక్చాతుర్యము కల వాడవు, ధర్మవేత్తవు నువ్వు ఉన్నావు. మీరందరూ కలిసి రాయబారం విఫలం చేసారు. ఈ ఘోర కలికి కారకులయ్యారు.

కృష్ణా! నువ్వు సుయోధనుని నాశనం చెయ్యడానికే ఈ రాయబార నాటకం ఆడావు. ఎందరో రాజులను ఈ రణభూమికి బలి ఇచ్చావు. దీనికి అంతకంతా నువ్వు అనుభవిస్తావు కృష్ణా! ఇదుగో నా శాపము. నేను నా జీవితమంతా సంపాదించుకున్న పాతివ్రత్య పుణ్యఫలమును పణంగా పెట్టి పలుకుతున్నాను. నీవు ఎలాగైతే దాయాదులను ఈ కురుక్షేత్ర మహా సంగ్రామంలో చంపించావో అలాగే నీ వారందరూ తమలో తాము కలహించుకొని, దారుణంగా మరణిస్తారు. నువ్వు కూడా నేటికి సరిగ్గా ఒక సంవత్సరము 36 దినములకు, అతి క్రూరంగా, దిక్కులేని చావు చస్తావు. నేడు నా వాళ్ల ఎలా ఏడుస్తున్నారో, ఆనాడు నీ వాళ్ల కూడా తమ తమ భర్తలను, కుమారులరు, సహోదరులను బంధువులను

పోగొట్టుకొని ఇదే విధంగా ఏడుస్తారు. ఇదే నా శాపం. అనుభవించు." అని ఘోరంగా శపించింది గాంధారి.

ఆ శాపాన్ని చిరునవ్వుతో స్వీకరించాడు శ్రీకృష్ణుడు.

" అమ్మా! గాంధారీ! నీవు ఈ రోజు ఇచ్చిన శాపం నాకు కొత్త కాదమ్మా! ఇది ఇంతకు ముందే ఉన్నది. ఇది వరలో మా యాదవులు ఒక మహామునిని అవహేళన చేసిన కారణంగా, ఆ మహాముని యాదవులను ఇదే విధంగా శపించాడు. ఆ మాటలే మరలా నీ నోటినుండి వెలువడ్డాయి. ఎందుకంటే యాదవులకు ఎవరి చేతిలోనూ చావు లేదు. అందుకే వారు ఒకరిని ఒకరు కొట్టుకొని చావాలి. దానికి నీ శాపం ఉపకరిస్తుంది." అని పలికాడు శ్రీకృష్ణుడు.

ఆ మాటలు విని పాండవులు కంపించి పోయారు. శ్రీకృష్ణుడే లేనపుడు తాము జీవించి వృథా అనుకొని తమ తమ జీవితముల మీద ఆశ వదులుకున్నారు పాండవులు.

అప్పుడు శ్రీకృష్ణుడు గాంధారిని చూచి "అమ్మా! ఇంక లే. చనిపోయిన వారికి దహన క్రియలు జరిపించాలి." అని పలికాడు.

గాంధారి పైకి లేచింది. గాంధారిని పట్టుకొని నడిపిస్తూ శ్రీకృష్ణుడు ఆమెతో ఇలా అన్నాడు. "అమ్మా! నీ కుమారులు సుయోధనుడు, దుశ్శాసనుడు చేసిన దుర్మార్గపుపనులునీకు తెలియనివా! నీకుమారుని దుర్మార్గములను నేను కానీ, భీష్ముడుకానీ, ద్రోణుడు, బాహ్లికుడు కానీ, కడకు నీ భర్త ధృతరాష్ట్రుడు కానీ మాన్పలేక పోయాము కదమ్మా! వారి దుర్నయముల వల్ల కదటమ్మా ఇంతటి చేటు దాపురించినది. దీనికి నన్ను నిందించి ప్రయోజనము ఏముందమ్మా!కాబట్టి

ఇంకనైనా నీవు శోకించడంమాను. ఇలా శోకిస్తూ ఉంటేనీ శోకం రెండింతలు అవుతుంది. నీవు వీరమాతవు. మహా వీరులను నీ పుత్రులుగా పొందావు. వారి మరణమునకు శోకించడం తగదు." అని అన్నాడు కృష్ణుడు.

ఈ మాటలతో గాంధారి చించించడం మానుకుంది. అప్పుడు ధృ తరాష్ట్రుడు ధర్మరాజునుచూచి, "కుమారా! ఇరు పక్షముల లోని సైన్యముల లెక్క నీకు తెలుసు కదా! ఇరు పక్షముల సైన్యములలో ఎంత మంది మరణించారో చెప్పగలవా!" అని అడిగాడు.

దానికి ధర్మరాజు "తండ్రీ! మన సైన్యములో ఉత్తమ క్షత్రియులు 76 కోట్ల ఇరవై వేల మంది, మిగిలిన సైనికులు 24 వేల మూడు వందల ఇరవై మంది యుద్ధంలో చనిపోయారు. వీరందరూ యుద్ధములో చనిపోయారు కాబట్టి వీర స్వర్గము అలంకరించారు. కాని కొంత మంది యుద్ధములో గాయపడి భయపడి పారిపోయారు. వారందరూ గుహ్యక లోకానికి వెళతారు. కాని యుద్ధములో ఏ విధంగా మరణించినా నరకలోకమునకు మాత్రం వెళ్లరు." అని అన్నాడు ధర్మరాజు.

ధర్మజా! యుద్ధములో చని పోయిన వారిలో అనాధలు అయిన వారు కూడా ఉన్నారు కదా! వారికి అగ్ని కార్యము చేయడంలో తప్పులేదు కదా!" అని అడిగాడు.

"మహారాజా! ఈ యుద్ధమే ఒక మహా యజ్ఞము. ఈ మహా యజ్ఞములో వీరందరూ ఆహుతి అయ్యారు. కాబట్టి వీరందరూ అగ్ని కార్యమునకు అర్హులే. కాకాపోతే వీరిలో చాలామంది అనాధలు ఉన్నారు. వారందరికి కూడా మనము అగ్ని కార్యము నెరవేర్చి వారికి ఉత్తమ లోకములు కలిగేట్టు చేద్దాము ."అని పలికాడు.

వెంటనే తన పురోహితుడు ధౌమ్యుని, విదురుని, సంజయుని పిలిపించి, భరత వంశ సంజాతులకు తప్ప మిగిలిన వారికి దహనక్రియలు నిర్వర్తించమని ఆదేశించాడు. దానికి కావలసిన చందనము, అగరు, కస్తూరి మొదలగు సుగంధ ద్రవ్యములు, తదితర సామగ్రిని, వలసిన మనుషులను వారికి అప్పగించాడు.

తరువాత ధర్మరాజు బ్రాహ్మణ సంఘముల తోడ్పాటుతో దుర్యోధన, దుశ్శాసన,కర్ణ,శల్య మొదలగు వారికీ, అభిమన్యు,ఘటోత్కచ,విరాట,ధృష్టకేతు, ప్రముఖులకు, నానాదేశాధీశులకు, చితులు పేర్పించి అగ్ని కార్యము నిర్వర్తించాడు.

అనాధలుగా మిగిలిన రాజుల కళేబరములకు, వేనకు వేలుగా ప్రోవులుగా పెట్టించి, సామూహిక దహన క్రియను జరిపించాడు.అక్కడ కట్టెలు దొరక్కపోవడం వల్ల, విరిగిన రధములు, బాణములు, ధనుస్సులు వీటిని సేకరించి వాటితో దహన క్రియను నిర్వర్తించాడు.

తరువాత ధృతరాష్ట్రుని తో సహా ధర్మరాజు, అంతఃపుర కాంతలతో కలిసి పక్కనే ఉన్న నదికి వెళ్లి స్నానములు ఆచరించారు. కౌరవులందరికీ ధృతరాష్ట్రుడు తర్పణములు విడిచాడు.

ఆ సమయంలో కుంతీ దేవి కన్నీటితో అందరూ వింటూ ఉండగా ఇలా పలికింది.

"అయ్యా! అందరూ వినండి. కౌరవులందరికీ పెట్టని కోటగా విరాజిల్లిన కర్ణుడు, పార్థుని చేతిలో హతమైన కర్ణుడు, రాధ కుమారుడిగా లోకానికి తెలిసి రాధేయుడిగా ప్రసిద్ధి చెందిన కర్ణుడు, నిజానికి రాధ కుమారుడు కాడు. రాధేయుడు కాడు. కర్ణుడు నా కుమారుడు. కౌంతేయుడు. మీ అందరికీ కర్ణుడు

అగ్రజుడు. నేను కన్నెగా ఉండగా, భాస్కరుని దయవలన సహజ కవచ కుండలము లతో నాకు జన్మించాడు. కాబట్టి మీరు కర్ణునికి కూడా తిలోదకములు ఇవ్వండి" అని ధర్మరాజుతో పలికింది.

ఆమాటలు విన్న ధర్మరాజు వివశు డయ్యాడు. మిగిలిన పాండవులు అమిత దుఃఖముతో విలపించసాగారు. ఎలాగో మాట పెగల్చుకొని ధర్మరాజు తల్లి కుంతీ దేవితో  ఇలా అన్నాడు.

"అమ్మా!  కర్ణుడు నీకు జ్యేష్ఠపుత్రుడు,  మాకు అన్నగారు,  అన్న విషయం కొంగున నిప్పు కట్టు కున్నట్టు ఎలా దాచి పెట్టావమ్మా!  ~~ఈ~~లోకంలో ఒక్క అర్జునుడు తప్ప కర్ణుని ఎదిరించి నిలవగల వీరుడు ఎవరున్నారు చెప్పు! అమ్మా !  అమ్మా! కర్ణుని తొలి చూలుగా ఎందుకు కన్నావమ్మా! నీకు దుర్వాసుడు ఇచ్చిన మంత్రము మా పట్ల శాపంగా పరిణమించింది కదమ్మా! మాకు అంతులేని శోకం మిగిల్చింది కదమ్మా!

అమ్మా! అభిమన్యుడు, ఉపపాండవులు  మరణించి నప్పుడు కూడా ఇంత దుఃఖమును పొందలేదమ్మా! ద్రుపదుని కుమారులు, ధృతరాష్ట్రుని కుమారులు చనిపోయినప్పుడు కూడా ఇంతటి వ్యధ చెందలేదమ్మా! అమ్మా! కర్ణుడు మాకు అన్న అని తెలిసిన మరుక్షణం మా ప్రవర్తన వేరుగా  ఉండేది కదమ్మా! ఇంతటి మారణ హోమం జరిగి ఉండేది కాదు కదమ్మా!" అని పరి పరి విధముల వాపోయాడు ధర్మరాజు.

వెంటనే  కర్ణుని గోత్ర నామములు చెప్పుచూ అతనికి తిలోదకములు విడిచాడు ధర్మరాజు. తరువాత భీమార్జున నకుల సహదేవులు కూడా తమ అన్నగారైన కర్ణునికి తిలోదకములు విడిచారు.   కర్ణుడు కుంతీకుమారుడు అని

తెలిసిన మరుక్షణం పాండవ స్త్రీలలో కౌరవ స్త్రీలలో హాహాకారాలు చెలరేగాయి. ధృతరాష్ట్రుడు కూడా గాంధారీ సహితంగా, కుంతీ దేవితో కూడి కర్ణునికి ఉదక కర్మ చేసాడు.

వెంటనే ధర్మరాజు, కర్ణుని పట్ల సోదర భావంతో, కర్ణుని భార్యలను, అతని బంధువులను పిలిపించి సముచిత రీతిని గౌరవించాడు. వారిని ఓదార్చాడు. వారితో కర్ణునికి ఉత్తమ లోక ప్రాప్తి కొరకు అనేక దాన ధర్మములు చేయించాడు. తరువాత బంధు మిత్రులతో గంగానదిని దాటి అక్కడ లెక్కలేని దానధర్మములు ఆచరించాడు.

మహా భారతము

స్త్రీపర్వము

ద్వితీయాశ్వాసము

సమాప్తము.

దీనితో

స్త్రీపర్వము సమాప్తము.

యుద్ధ షట్కము పూర్తి అయినది. ఇంక శాంతి సప్తకము శాంతి పర్వముతో మొదలవుతుంది. ఆది పంచకము, యుద్ధషట్కము నిర్విఘ్నముగా కొనసాగినందుకు సర్వాంతర్యామి తిరుమల వాసుడు శ్రీ వేంకటేశ్వరునికి, ఎప్పటి కప్పుడు మీ ఆశీస్సులు అందిస్తూ ఆదరించిన పాఠకులకు అందరికీ, ముఖ్యంగా శ్రీయుతులు విష్ణుప్రసాద్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుసుకుంటున్నాను.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహాభారతము

## శాంతి పర్వము
## మొదటి ఆశ్వాసము.

వైశంపాయన మహర్షి జనమేజయునకు చెప్పిన మహాభారత కధను, రోమహర్షణుడు (సూతి) అనే కధకుడు నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంగా శౌనకాది మహామునులకు ఈ విధంగా చెప్ప సాగాడు.

ఆ ప్రకారంగా ధర్మ రాజు అతని తమ్ములు సకల బంధు మిత్ర జనులకు ఉదక కర్మలు నిర్వర్తించారు. తమ తమ బంధువుల మరణముల వలన కలిగిన అశౌచము తీరు వరకు గంగా తీరమున ఒక సమతల ప్రదేశమున కుటీరములు నిర్మించుకొని అందులో ఉంటున్నారు. ధృతరాష్ట్రుడు, విదురుడు, తమ తమ భార్యలతో అక్కడ ఒక నెల పాటు నివసించారు.

ఆ సమయములో అక్కడకు వ్యాసుడు, నారదుడు, దేవలుడు, కణ్వుడు మొదలకు మహా ఋషులు తమ తమ శిష్య గణములతో ధర్మ రాజును చూడడానికి వచ్చారు. ధర్మ రాజు, తన తమ్ములతో నూ, భార్య ద్రౌపది తోనూ వారికి అర్ఘ్య పాద్యాదులు ఇచ్చి సత్కరించాడు. ఆ సమయములో నారదుడు ధర్మ రాజును చూచి ఇలా అన్నాడు.

"ధర్మజా! నీవు అదృష్ట వంతుడవు. శ్రీ కృష్ణుడు ఎల్లప్పుడూ నీ మేలు కోరుతూ నీ చెంతనే ఉంటాడు. మహా బల శాలి అయిన అర్జునుని సాయంతో ఈ భూ మండలం అంతా జన రంజకంగా పాలిస్తావు. ధర్మజా! ఇంతటి ఘోర యుద్ధం సంభవించినప్పుడు కూడా నీవు నీ ధర్మ గుణమును విడనాడ లేదు. నీ ధర్మ నిరతి నీకు విజయం చేకూర్చిపెట్టింది. నీకు సంతోషంగా ఉందా?"

దానికి ధర్మ రాజు ఇలా బదులు చెప్పాడు. "ఓ నారద మహర్షీ శ్రీ కృష్ణుని కృపా కటాక్ష వీక్షణ ములతోనూ, బ్రాహ్మణుల అనుగ్రహం తోనూ, భీమార్జునుల బాహు బలం తోనూ, నాకు విజయ లక్ష్మి చేకూరింది. కాని నేను నా అన్నదమ్ములను, బంధు మిత్రులను, గురువులను, తండ్రులను, ముఖ్యంగా నా కుమారుడు అభిమన్యుడు, ఉప పాండవులను పోగొట్టుకున్నాను. నాకు కలిగిన విజయమూ ఒక విజయమేనా చెప్పండి.

అదియును కాక, మొదటి నుండీ సుయోధనునికి కుడి భుజముగా ఉన్న కర్ణుడు మా అన్నయ్య అని తెలిసిన తరువాత నా మనస్సు రగిలి పోతూ ఉంది. నా తల్లి కుంతీ దేవి ఒంటరిగా కర్ణుని వద్దకు పోయి తాను వర ప్రసాదముగా సూర్యుని వలన కర్ణుని కుమారునిగా పొందుటయూ, మాకూ కౌరవులకూ మధ్య ఉన్న వైరమును మాన్పించమని అర్థించుటయూ మొదలగు విషయములను మాకు చెప్పింది. మా తల్లి కుంతీ దేవి తన కుమారుడు కర్ణుని మాతో చేరమని అర్థించినప్పుడు కర్ణుడు ఆమెతో ఇలా అన్నాడట:

"అమ్మా! ఇన్నాళ్లు సుయోధనునితో ఉండి ఇప్పుడు ఆయనను విడిచిన బాగుంటుందా. అర్జునునితో యుద్ధము చెయ్యడానికే కదా సుయోధనుడు నన్ను చేరదీసినది. కాబట్టి ఆ వరము మాత్రము ఇయ్యను. కాక పోతే అర్జునుడు తక్క మిగిలిన వారు ఎవరు నాకు చిక్కినా వారికి హాని చెయ్యను." అని పలికాడట.ఆ మాటకు కట్టుబడిన కర్ణుడు మేము నలుగురము అతనికి చిక్కినా మాకు ఏ హాని తలపెట్టకుండా వదిలి వేసాడు.

ఈ విషయాలన్నీ మా అమ్మ కుంతీ దేవి మాకు చెప్పకుండా దాచింది. అందువలన కర్ణుడు మా అనుజుడు అని మేము తెలుసు కోలేక పోయాము. దాని ఫలితంగానే ఇంత ఘోరం జరిగి పోయింది. అంతే కాదు, ఆ నాడు కురు సభలో సుయోధనుని సంతోష పెట్టడానికి కర్ణుడు మమ్ములను, ద్రౌపదిని, అనరాని మాటలు అన్నా నాకు అతని మీద కోపం రాలేదు. ఒక్కొక్క సారి నాకు కర్ణునిలో మా

అమ్మ కుంతీ దేవి పోలికలు కనిపించేవి. కాని వాటిని నేను పట్టించుకోలేదు. సుయోధనుని మాటలకు నాకు ఎంత కోపం వచ్చినా, కర్ణుని మొహం చూచేసరికి ఆ కోపం స్థానంలో శాంతం ఆవహించేది.

నారద మహర్షీ!కర్ణుని చంప కుండా నా మొహం చూడవద్దని అర్జునిని తూలనాడాను. నేనే కర్ణుడిని నా చేజేతులా చంపుకున్నాను. ఓ నారద మునీంద్రా! అసలు కర్ణుని రథ చక్రం యుద్ధ భూమిలో భూమిలోనికి ఎందుకు కుంగి పోయింది. దానికి కారణం ఏమిటి? నాకు తెలియ చేయండి" అని అడిగాడు ధర్మరాజు. దానికి నారదుడు ఈప్రకారం చెప్ప సాగాడు.

"ధర్మరాజా! తాను కన్నెగా ఉన్నప్పుడు దూర్వాస మహా ముని ప్రసాదించిన మంత్ర ప్రభావం చేత సూర్య దేవుడు ప్రత్యక్షం అయి ఆమెకు ఒక కుమారుని ప్రసాదించాడు. ఆ విషయం ఆమె సిగ్గుతో బయటకు చెప్పలేక పోయింది. సూర్య దేవుని వలన ఆమెకు కొడుకు పుట్టినా, ఆమె కన్యాత్వానికి భంగం కలగ లేదు. భయంతో, సిగ్గుతో, కుంతి ఆమె కుమారుని నదిలో విడిచిపెట్టింది. ఆ బిడ్డను ఒక సూతుడు పెంచాడు. అందుకని అతను సూత పుత్రుడు అయ్యాడు. కర్ణుడు మీ మీద మాత్సర్యం పెంచుకున్నాడు . భీమార్జునుల బల పరాక్రమములు, నకుల సహదేవుల నీతి శాస్త్ర పాండిత్యము, మి మ్మల్ని ప్రజలందరూ మెచ్చుకోడం అతనికి కంటగింపుగా ఉండేది. అది అతని స్వభావము. మీ మీద ఉన్న అసూయ ద్వేషములతో అతను సుయోధనునితో మైత్రి చేసాడు.

విలువిద్యలో అర్జునిని ఉన్న నైపుణ్యం చూచి, ఒక రోజు కర్ణుడు ద్రోణాచార్యుని వద్దకు పోయి తనకు బ్రహ్మాస్త్రమును నేర్పమని, అర్జునునితో సమానం చెయ్యమని కోరాడు. ఆ మాటలు విన్న ద్రోణుడు ఇలా అన్నాడు. "కర్ణా! బ్రహ్మాస్త్రము బ్రాహ్మణులకు, క్షత్రియులకు తప్ప వేరే ఎవరికీ ఉపదేశింప కూడదు కాబట్టి నీకు బ్రహ్మాస్త్రము ఉపదేశింపలేను" అని పలికాడు. కర్ణుడు మౌనంగా తన మందిరమునకు వెళ్లి పోయాడు.

మరు నాడు మహేంద్ర గిరి మీద ఉన్న పరశురాముని కి తాను బ్రాహ్మణుడు అని అబద్ధము చెప్పి శిష్యుడుగా ఆశ్రయించాడు. పరశు రాముడు కర్ణుని తన ప్రియ శిష్యుని గా స్వీకరించాడు. కర్ణుడు పరశురాముని వద్ద అస్త్ర విద్య నేర్చుకుంటున్నాడు. ఒక రోజు కర్ణుడు అస్త్ర విద్య ను అభ్యాసం చేస్తుంటే అతని బాణ ము తగిలి ఒక బ్రాహ్మణుని హోమ ధేనువు చనిపోయింది. ఆ బ్రాహ్మణుడు కోపించి, "యుద్ధ సమయమున నీ రథ చక్రము భూమిలో కూరుకొని పోవు గాక" అని శాపం పెట్టాడు.

తరువాత కర్ణునికి పరశు రాముని శాపం కూడా తగిలింది. అది ఎలాగో వివరిస్తాను. కర్ణుడు పరశు రాముని వద్ద బ్రహ్మాస్త్రము మొదలుకొని అన్ని అస్త్రములు అభ్యసించాడు. ఒక రోజు పరశు రాముడు అలసిపోయి కర్ణుని తొడ మీద తలపెట్టుకొని నిద్రిస్తున్నాడు. ఇంతలో భయంకరమైన పురుగు ఒకటి కర్ణుని తొడను తొలిచి రంధ్రం చెయ్య సాగింది. తన కాలు కదిపితే గురువు గారికి నిద్ర భంగం అవుతుందని కర్ణుడు ఆ బాధను భరించాడు. ఆ గాయం నుండి కారిన నెత్తురు పరశురాముని శరీరాన్ని చల్లగా తాకింది.

పరశు రాముడు నిద్ర నుండి లేచాడు. "ఏమి జరిగింది!" అని అడిగాడు. జరిగింది చెప్పాడు కర్ణుడు. పరశు రాముడు ఆ పురుగును చూచాడు. పరశు రాముని చూపులతో ఆ పురుగుకు శాప విమోచనం అయింది ఆ పురుగు ఒక రాక్షస రూపం ధరించింది.

"మహాత్మా! తమరి వీక్షణములతో నాకు శాప విమోచనం అయింది. ధన్యుడను, నేను గ్రస్తుడు అనే రాక్షసుడను. పూర్వము నేను భృగు మహర్షి భార్యను అపహరించి ఆయన ఇచ్చిన శాపంతో ఇలా కీటకంగా మారాను. అమృత సమానమైన తమరి చూపులతో నాకు శాప విమోచనం కలిగింది" అని చెప్పి వెళ్లి పోయాడు.

పరశు రాముడు కర్ణుని చూచాడు. "కర్ణా నీవు చూపిన ఓర్పు, సహనము బ్రాహ్మణునికి తగినది కాదు. నీవు ఎవరవు నిజం చెప్పు" అని అడిగాడు.

కర్ణుడు భయంతో వణికి పోయాడు.

"గురుదేవా! నేను బ్రాహ్మణుడను కాను. సూత పుత్రుడను" అని సమాధానం ఇచ్చాడు.

"నీవు కపటంతో బ్రాహ్మణుడు అని నన్ను నమ్మించి నా వద్ద అస్త్ర విద్య నేర్చుకున్నావు కాబట్టి నీవు నేర్చుకున్న అన్ని అస్త్రములు నీకు పనికి రాకుండా పోతాయి" అని శపించాడు.

కర్ణుడు ఖిన్న వదనుడై అక్కడి నుండి సుయోధనుని వద్దకు వచ్చి జరిగింది చెప్పాడు.

కాబట్టి ధర్మ రాజా! నీ అన్న కర్ణుడు అబద్ధాలు చెప్పడం లో ఆరి తేరిన వాడు. తరువాత కథ విను.

కళింగ దేశపు రాజు చిత్రాంగదుడు తన కుమార్తె శుభాంగికి స్వయంవరం ప్రకటించాడు. ఆ స్వయంవరానికి, శిశుపాలుడు, జరాసంధుడు, రుక్మి, మొదలగు రాజులు వచ్చారు. సుయోధనుడు కూడా కర్ణునితో కలిసి ఆ స్వయంవరానికి వెళ్లాడు. స్వయం వరంలో శుభాంగికి ఆమె చెలికత్తె ఒక్కొక్క మహా రాజును పరిచయం చేస్తూ నడుస్తూ వుంది.. శుభాంగి ఎవరి మెడలోనూ వర మాల వెయ్యలేదు. సుయోధనుని కూడా దాటి పోయింది.

అది చూచి రారాజు సుయోధనునికి కోపం వచ్చింది. శుభాంగిని వెంటనే పట్టి తన రథం మీద పెట్టమని ఆజ్ఞాపించాడు. స్వయం వరానికి వచ్చిన రాజులందరూ రారాజు సుయోధనుని మీద తిరగ బడ్డారు. సుయోధనుడు వారితో ఘోరంగా యుద్ధం చేసాడు. కర్ణుడు తన అస్త్ర విద్యా బలం తో ఆ రాజులను, వారి బలాలను మట్టు బెట్టాడు. కర్ణుని ధాటికి తట్టుకోలేక మిగిలిన రాజులు పారి పోయారు. సుయోధనుడు శుభాంగిని తీసుకొని హస్తినా పురానికి వచ్చాడు.

తనకు జరిగిన పరాభవాన్ని మనసులో పెట్టుకొని జరాసంధుడు, కర్ణుని తనతో యుద్ధం చెయ్యమని ఆహ్వానించాడు. కర్ణుడు దానికి అంగీకరించాడు. జరాసంధునితో యుద్ధం చేసాడు. ముందు అస్త్ర శస్త్రాలతో యుద్ధం చేసారు. తరువాత బాహాబాహి యుద్ధం చేసారు. కర్ణుడు జరాసంధుని ద్వంద యుద్ధంలో ఓడించాడు. కర్ణుని పరాక్రమానికి మెచ్చి జరాసంధుడు అతనికి మాలినీ నగరాన్ని బహూకరించాడు.

కర్ణుని గొప్పతనాన్ని, పరాక్రమాన్ని ఓర్వలేని ఇంద్రుడు, కపట బ్రాహ్మణ వేషంలో పోయి కర్ణుని సహజ కవచ కుండలములను అపహరించాడు.

ఇన్ని కారణముల చేత అర్జునుడు కర్ణుని సంహరించ గలిగాడు. కాబట్టి ధర్మజా! నేను చెప్పేది జాగ్రత్తగా విను! మొదట బ్రాహ్మణ శాపము, తరువాత పరశురాముని శాపము, తరువాత ఇంద్రునిచేత సహజ కవచ కుండలముల అపహరణ. తరువాత కుంతికి ఇచ్చిన వరము చేత, అర్జునుని దక్క మిగిలిన వారిని కాపాడటం. భీష్ముడు కర్ణుని అర్ధ రధునిగా ప్రకటించి అవమానించడం, శల్యుడు తన ములుకుల వంటి మాటలతో కర్ణుని ధైర్యాన్ని నీరు కార్చడం. ఇవన్నీ తోడయితే నే అర్జునుడు కర్ణుని వధించ గలిగాడు.

అదియును కాక, ధర్మజా! పరమ శివుడు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, ద్రోణుడు, కృపుడు, వీరందరూ తమ తమ దివ్యాస్త్రాలను అర్జునునికి ఇచ్చారు. అందువలననే అర్జునుడు కర్ణుని సంహరించ గలిగాడు. లేకపోతే కర్ణుని జయించడం అర్జునుని వల్ల కాని పని" అని పలికాడు నారదుడు.

నారదుని మాటలను సావధానంగా విన్నాడు ధర్మ రాజు. తీవ్రమైన శోకంతో కలత చెందాడు. పక్కనే ఉన్న కుంతీ దేవి ధర్మ రాజును ఓదార్చింది.

"నేను నా కుమారుడు కర్ణునితో అతని జన్మ రహస్యమును తెలిపి అతనిని మీ వైపుకు రమ్మని ఆహ్వానించినపుడు సూర్య

భగవానుడు కూడా వచ్చి "కుంతి చెప్పిన ది నిజము" అని పలికాడు. కాని కర్ణుడు సుయోధనుని విడిచి రాలేక పోయాడు. అట్టి కర్ణుని గురించి ఇప్పుడు నువ్వు ఎందుకు బాధ పడతావు" అని పలికింది కుంతి.

ధర్మరాజు తన తల్లి కుంతి వైపు ఏహ్య భావంతో చూచాడు. "అమ్మా! నువ్వు ఈ రహస్యాన్ని దాచడం వల్లనే కదా ఇంతటి అనర్థం దాపురించింది. అమ్మా! ఈ రోజు నుండి స్త్రీలకు రహస్యాన్ని దాచే శక్తి వారి మనస్సులకు లేకుండా పోవు గాక" అని స్త్రీ జాతి నంతా శపించాడు ధర్మరాజు.

కాని ధర్మరాజు మనస్సుకు శాంతి కలగ లేదు. అర్జునుని చూచి ధర్మరాజు ఇలా అన్నాడు.

""అర్జునా! ఎవ్వరూ లేని ఈ రాజ్యం మనకు ఎందుకు. ఎక్కడికైనా పోయి అక్కడ భిక్షుక వృత్తి స్వీకరించి బ్రతుకు వెళ్లబుచ్చుదాము. అప్పుడే నా మనస్సుకు శాంతి లభిస్తుంది. అర్జునా! మనం అందరం మన జ్ఞాతులను (అన్నదమ్ములను) అందరినీ చంపాము. అది మనలను మనము చంపుకోడం తో సమానం కాదా! ఎందుకీ క్షత్రియ ధర్మము! ఫాల్గునా! వనములలో ఉండే మహాత్ములకు అహింసా వ్రతమును పాటిస్తూ, మత్సరమును వీడి బతకడం ధర్మం కదా! అందుకని మనము మరలా వనవాసం చేద్దాము. ఈ రాజ్యము అనే మాంసం కోసం అన్నదమ్ములం కుక్కల మాదిరి కొట్టుకున్నాము ఒకరిని ఒకరం చంపుకున్నాము. వంశ నాశనం చేసుకున్నాము. ఇప్పుడు ఇంతటి కుత్సితపు బతుకు బతుకుతున్నాము.

అర్జునా! నాకు ఈ కురు రాజ్య మేకాదు. త్రిలోకాధి పత్య మిచ్చినా, నాకు సంతోషం కలిగించదు. నాకీ రాజ్యం వద్దు మీరే ఏలుకోండి. మన పెదనాన్న పుత్ర వ్యామోహంతో తన కుమారుడు సుయోధనుని కట్టడి చేయలేక పోయాడు. అతనిని సన్మార్గంలో పెట్టడానికి ఎలాంటి ప్రయత్నం చెయ్య లేదు. ఫలితంగా ఆ నీచుడు వంశ నాశనం చేసాడు. సుయోధనుని చంపడం వల్ల మన కోపం చల్లారింది కానీ మనసంతా శోకంతో నిండి పోయింది. నేను మాత్రం

ఏమి చేసాను. రాజ్య కాంక్షతో ఈ యుద్ధానికి పాల్పడ్డాను. పాపం చేసాను. ఈ హేయమైన యుద్ధం వలన లభించిన రాజ్యమును వదిలితే గానీ నా మనస్సుకు శాంతి లేదు. ఈ రాజ్యం వదిలితే గానీ నా మనసు పరిశుద్ధం కాదు. అందుకని నేను తపోవనానికి వెళ్లి మునుల మధ్య ముని వృత్తి స్వీకరించి శేష జీవితం ఆనందంగా గడుపుతాను." అని అన్నాడు ధర్మ రాజు.

ఆ మాటలకు అర్జునునికి పట్టరాని కోపం వచ్చింది. కాని ఆ కోపాన్ని మనసులోనే అణుచుకొని పైకి చిరు నవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు.

"అన్నయ్యా! ఇలాంటి మాటలు ఎక్కడన్నా ఉన్నాయా! ఎప్పుడన్నా విన్నామా! అరి వీర భయంకరులమై యుద్ధములో శత్రువులను ఓడించి రాజ్య లక్ష్మిని వరించాము. అదంతా మరిచిపోయి, ఇప్పుడు ముని వృత్తి స్వీకరిస్తాను అంటావేమిటి? అయినా మనం సుయోధనుని మాదిరి అధర్మంగా ఈ రాజ్యాన్ని పొందలేదు. ధర్మ పరంగా ఈ రాజ్యాన్ని కైవసం చేసుకున్నాము. ధర్మబద్ధమైన రాజ్యమును పాలించకుండా వదిలి వేయడం ధర్మమా! అలాంటి వాడివి యుద్ధంలో అందరు రాజులను ఎందుకు చంపావు. ఇంతా చేసి ఇప్పుడు రాజ్యం వదిలి అడవులకు వెళితే నిన్ను పిరికి వాడు అంటారే గానీ నిన్ను మెచ్చుకుంటారా?

మనం యుద్ధం చేసినందువల్ల పాపం సంక్రమించి ఉంటే ఆ పాపం అశ్వమేధము మొదలగు యాగములుచేసి పోగొట్టుకోవచ్చు కదా! అంతే కాని క్షత్రియ ధర్మం వదిలి ముని వృత్తి స్వీకరించడం ధర్మమా? అన్ని ధర్మములకు మూలకు సంపద. ఆ సంపద లేని నాడు మనిషి చచ్చిన వాడితో సమానం కదా! మరి ఆ విషయం కూడా నువ్వు ఆలోచించాలి కదా! సంపదలు ఉంటే బంధువులు వారంతట వారే మన దగ్గరకు వస్తారు. సంపద ఉంటే మిత్రులు మన దగ్గరకు చేరుతారు. సంపద ఉంటే శౌర్యము, ధైర్యము కలుగుతాయి. సంపద సద్బుద్ధి ప్రసాదిస్తుంది. కాబట్టి సంపద పురుషార్ధములలో మేటి. అలాంటి రాజ్య సంపద మనకు ధర్మ బద్ధంగా లభించింది. ఆ సంపదను అనుభవించడం మన కర్తవ్యం.

ఇంక జ్ఞాతులు మరణించారు అని కదా అన్నావు. మరి దేవతలు జ్ఞాతులను నాశనం చేసే కదా వృద్ధి చెందారు. (దేవతలు, దానవులు జ్ఞాతులు). జ్ఞాతులను చంపకుండా, శత్రు నాశనం కాకుండా రాజ్య సంపద లభిస్తుందా. ఇంక వేదాలు కూడా ఈవిధంగా చెబుతున్నాయి. బల పరాక్రమములు ప్రదర్శించి, శత్రువులను సంహరించి, రాజ్య సంపదను చేజిక్కించుకోడం, యజ్ఞ యాగాదులు చేసి దేవతలను సంతోష పెట్టడం, చని పోయిన తరువాత ఉత్తమ గతులు పొందటం, క్షత్రియుని లక్షణము. మన పూర్వీకులైన దిలీపుడు, నృగుడు, అంబరీషుడు, సగరుడు, నహుషుడు, మాంధాత మొదలగు చక్రవర్తులు ఇదే దారి అవలంబించారు. ఉత్తమ గతులు పొందారు. ప్రస్తుతం ఆ చక్రవర్తి పదవి నిన్ను వరించింది. దానిని నీవు త్యజించుట న్యాయమా! నువ్వు కూడా నీ పూర్వీకుల మాదిరి యజ్ఞ యాగాదులు చేసి పునీతుడివి కా! లేక పోతే, నీకు పుణ్యం ఎలా లభిస్తుంది. అశ్వమేధ యాగం చేసిన చక్రవర్తులందరూ పునీతులయ్యారు." అని పలికాడు అర్జునుడు. .

ఎన్ని చెప్పినా ధర్మ రాజు తన మనసులో ఉన్న కలతను వీడ లేదు.

"అర్జునా! ఎందుకోనా మనసు ఈ రాజ్య పాలనకు అంగీకరించ డం లేదు. ఈ లోకంలో తృప్తిని మించిన సుఖం, సంపద వేరొకటి లేదు. ఈ సార హీనమైన సంసార సుఖములు విడిచిపెట్టి, ఒంటరిగా అడవులకు పోయి, అక్కడ ఉన్న తాపసుల ఉపదేశములను వీనుల విందుగా వింటూ, అందరితో స్నేహంగా ఉంటూ, ఎవరితోనూ వైరం పెట్టుకోకుండా, నిందను స్తుతిని సమంగా స్వీకరిస్తూ, కత్తితో పొడిచిన వాడిని, మేనికి చందనము అలదిన వాడిని సమానంగా పరిగణిస్తూ, మూగ వాడి మాదిరి మౌన వ్రతం పాటిస్తూ, తగిన సమయములలో పర్ణశాలలకు పోయి, ఎవ్వరు ఏమి ఇచ్చినా దానిని మహా ప్రసాదమని స్వీకరించి, దానితో తృప్తి పడటం కన్నా ఈ లోకం లో కలిగే సుఖం ఏముంటుంది చెప్పు.

అలా కాకుండా కర్మ మార్గంలోపయనిస్తే మనకు ఒరిగేదేముంది

పాప ము మూట కట్టుకోడం తప్పు. అందుకని నేను మోక్ష మార్గ ము నకు దూరం కాలేను. భగవంతుని దయవలన నాకు అమృత తుల్యమైన విజ్ఞాన ము లభించింది. ఆ జ్ఞాన మే శాశ్వత ము. అదే మోక్ష మార్గ ము. దానిని నేను వదులుకోలేను." అని అన్నాడు ధర్మ రాజు.

ఆ మాటలు విన్న భీమసేనుడు అన్న ధర్మ రాజు తో ఇలా అన్నాడు: "అన్నయ్యా! నీవు కర్మ యోగి వి. శ్రుతి విహిత మైన కర్మలు ఆచరించకుండా నువ్వు జ్ఞాన మార్గం అవలంబించడం ధర్మ మా! నిజ మే. యుద్ధ ములో ఇంత మంది చనిపోవడం చేత తాత్కాలికంగా నీకు రాజ ధర్మం మీద కోప ము, అసూయ కలిగాయి. కాని ఈ వైరాగ్య ము, ఈ కోప ము, ఈ అసూయ యుద్ధ మునకు ముందు కలిగి ఉంటే ఎంతో మంది రాజులు, బంధువులు, స్నేహితులు బతికి పోయి ఉండే వారు కదా! మేము కూడా రాజ్య ము మీద ఆశ వదిలి, ముని వృత్తిని స్వీకరించి ఉండే వాళ్ల ము. ఈ మహాభారత యుద్ధ ము సంభవించి ఉండేది కాదు. ఇంత ప్రాణ నష్ట ము జరిగేది కాదు. మరి ఆ నాడు భీకర మైన ప్రతిజ్ఞలుచేసి, యుద్ధ ములో పాల్గొని, అందరినీ చంపి, ఇప్పుడు నేను అడవులకు పోతాను అంటే విన్న వారు ఏమను కుంటారు. ఈ భూమి మీద బతుకుతున్న వాళ్లు నిన్నుచూచి హేళన చెయ్యరా?

వెనకటికి నీ లాంటి వాడు, కష్ట పడి బావిని తవ్వి అందులో ఉన్న నీళ్లు తాగకుండా ఊరుకున్నాడట. ఎత్తైన చెట్టు ఎక్కి, తేనె పట్టు కొట్టి, తేనెను తాగకుండా వెళ్లి పోయాడట. విస్తరి నిండా మృష్టాన్నము వడ్డిస్తే, తినకుండా లేచి పోయాడట. కోరి వచ్చిన వనితను అనుభ వించ కుండా వదిలి వేసాడట. నీ భుజ బల ముతో, శక్తి యుక్తులతో రాజ్య లక్ష్మిని కైవస ముచేసుకొని, రాజ్య పాలన చెయ్యకుండా అడవులకు పోతాను అనడం కూడా అటువంటిదే కదా.

అయినా నీకు అన్నీ తెలుసు. ఇంకా నేను చెప్పేదే ముంది. అన్నయ్యా! నువ్వు అడవులకు పోతుంటే నీ వెనక మేము నడుస్తుంటే, లోకులు మా అందరిని చూచి హేళనగా నవ్వుతూ " ఈ వెర్రి వాళ్లు ధర్మ రాజును అడవులకు పోవడం ఆపకుండా, ఆయన వెనక వెళుతున్నారు." అని నవ్వుకోరా. నువ్వు అడవులకు పోయి నీ

తమ్ముల నందరినీ ఈ రాజ్య సంపదలకు, భోగ భాగ్యాలకు దూరం చేస్తావా? నీ ప్రజలందరినీ శోక సముద్రం లో ముంచుతావా! ధర్మ రాజా! కర్మ రాహిత్యమే మోక్ష మార్గమే అయితే, అడవులలో ఉన్న చెట్లు అన్నీ కర్మ చెయ్యడం లేదు. వాటికి మోక్షం రావడం లేదే. నీకూ అంతే కదా.

అన్నయ్యా! కర్మలను త్యాగం చెయ్యడం కాదు. కర్మలు ఆచరిస్తూ కర్మ ఫలాన్ని త్యాగం చెయ్యాలి. తాను చేసిన కర్మల ఫలాన్ని బ్రహ్మార్పణము అంటూ నిష్కామ కర్మ లో మునిగి తేలాలి. అప్పుడే తత్వ జ్ఞానము కలుగుతుంది. కర్మ రాహిత్యము దానంతట అదే కలుగుతుంది. కాబట్టి కేవలం కర్మలు చెయ్యకుండా అడవులకు వెళితే మోక్షం రాదు." అని అన్నాడు భీముడు.

అంతలో అర్జునుడు అందుకున్నాడు. " ధర్మ రాజా! నాకు తెలిసిన ఒక ఇతిహాసమును చెపుతాను.

పూర్వము కొంతమంది బ్రాహ్మణ బ్రహ్మచారులు తమ తమ కులమునకు ఉచిత మైన ఆచారములను వదిలిపెట్టి అడవులకు వెళ్లారు. ఇంద్రుడు వారి మీద దయ కలిగి ఒక పక్షి రూపంలో వారి వద్దకు వెళ్లాడు. "మీరు ఎంచుకున్న మార్గము తప్పు." అని చెప్పాడు. అప్పుడు ఆ బ్రహ్మచారులు ఆ పక్షిని ఒక మహాత్మునిగా ఎరింగి తమకు మంచి మార్గము ఉపదేశించమని అడిగారు. అప్పుడు పక్షి రూపంలో ఉన్న ఇంద్రుడు వారితో ఇలా చెప్పసాగాడు.

చతుష్పాదములలో గోవు, శబ్దములలో మంత్రము, లోహములలో బంగారము, మనుష్యులలో బ్రాహ్మణుడు, అత్యంత శ్రేష్టమైనవి అని వేదవిదులు చెబుతారు. కాబట్టి బ్రాహ్మణుడు మంత్రములను ఉపాశించి, తనకు నిర్దేశించిన కర్మలు చెయ్యడం అతని కర్తవ్యము. కాని నిర్లక్ష్యము చేత గానీ, కోపము చేతగానీ, శోకము చేత గానీ, తనకు నిర్దేశించిన విద్యుక్త కర్మలను చెయ్యకపోవడం మహా పాతకము. అజ్ఞాను లైన అర్థహీనులు సన్యాసము

గురించి తెలియక ఉభయభ్రష్టులౌతున్నారు. ఎవరైతే గృహస్థ ధర్మమును పాటిస్తూ, అతిథులను, దేవతలను, పితృదేవతలను, సంతృప్తిపరస్తాడో, అతనికి పుణ్యలోకములు అరచేతిలో ఉంటాయి. మంచి కర్మలు చేస్తూ వాటిని బ్రహ్మార్పణము చేస్తే మహదానందము కలుగుతుంది." అని చెప్పాడు.

ఆ మాటలు వినిన ఆ బ్రాహ్మణ బ్రహ్మచారులు గృహస్థాశ్రమము స్వీకరించి తమ తమ విద్యుక్త ధర్మములను నిర్వర్తించుటకు వెనకకు వెళ్లిపోయారు.

కాబట్టి ధర్మరాజా! నీవు నీ రాజ్యమును జనరంజకంగా పాలించు. యజ్ఞయాగములు చేసి పుణ్యలోకములు సంపాదించు." అని పలికాడు.

తరువాత నకులుడు ధర్మరాజు మనస్తాపమును నివారించుటకు ఇలా అన్నాడు. "అన్నయ్యా! బ్రాహ్మణులు వారి విద్యుక్త ధర్మమైన వేదాధ్యయనము చేసి పాపము నుండి విముక్తి పొందుతున్నారు. కేవలం యజ్ఞయాగాలు మానినందున ఏమి ప్రయోజనము ఉంటుంది. ఫలాపేక్ష లేకుండా ధనమును సంపాదించి, యజ్ఞయాగాదులు చేసి, బ్రాహ్మణులను తృప్తిపరచిన అది నిస్సంగ ప్రవృత్తి అవుతుంది కానీ మనలో ఉన్న కామక్రోధములను, శోక మోహములను, విడిచి పెట్టకుండా, అడవులకు పోయి ముక్కు మూసుకొని తపస్సు చేసినందు వలన ప్రయోజనము ఏమి ఉన్నది.

అదీకూడా కాకుండా, ఒక పక్క గృహస్థాశ్రమ ధర్మమును, మరొక పక్క బ్రహ్మచర్యము, వానప్రస్థము,సన్యాసము ధర్మములను తులా దండములో వేసిన, గృహస్థాశ్రమము వైపు తుల తూగింది. క్షత్రియులు, ధనమును కూడ బెట్టి, దానితో క్రతువులుచెయ్యక పోతే పాపం వస్తుందని వేదములు

చెబుతున్నాయి కదా!

గాడాంధకారబంధురమ్మైన ఈ విశాల విశ్వంలో వెలుగునిచ్చే వాడు ఆ ఈశ్వరుడు. అతడే ఈ వర్ణ వ్యవస్థను, ఆశ్రమ ధర్మాలను ఏర్పాటు చేసాడు. కర్మయోగ విశేషములన్ని ఆయన కల్పనలే. ఈ యుద్ధము ఆయన కల్పించినదే. ఈ యుద్ధము వలన కలిగిన శోకములో భగవంతుడు ఏర్పరచిన ఆశ్రమ ధర్మములు విడిచిపెట్టుటన్యాయమా!

ఇంక యుద్ధములో కలిగిన హింస వలన పాపము వచ్చినదని అంటున్నావు. మనకు ముందు ఈ భూమిని ఏలిన చక్రవరులలో ఎవరైనా, యుద్ధములు చెయ్యకుండా, హింస చెయ్యకుండా రాజ్యపరిపాలన చేసారా? వారందరూ మంచి గతులు పొందలేదా! నీకుకూడా యుద్ధము వలన పాపం అంటక పోగా ఉత్తమ గతులు లభిస్తాయి. క్షత్రియుని పాలనలో ప్రజలు రక్షణకోరుతుంటారు. ప్రజలు సుఖంగా జీవించడానికి కావలసిన పరిస్థితులు కల్పించడం రాజు విధి. ఆ విధి నెరవేర్చకపోవడం పాపం కాదా! దానధర్మములు చెయ్యడం క్షత్రియ ధర్మం. అర్హులైన వారికి నీవు దాన ధర్మములు చెయ్యాలి. ఇవన్నీ వదిలి అడవులకు పోతాననడం నీ వంటి ఉత్తములకు భావ్యమా!" అని పలికాడు నకులుడు.

తరువాత సహదేవుడు లేచి "అన్నయ్యా! మానవుడు పై పైన ఉన్న కోరికలు విడిచి జీవించిన అది మోక్షము కలిగిస్తుందా! అన్నయ్యా నువ్వు కూడా, శారీరక సుఖములు వదిలిపెట్టి, నీ వంశ ధర్మములు నిర్వర్తించు. మమత... బంధమును, మమత లేకపోవడం... మోక్షమును కలిగిస్తాయి. ఈ రాజ్యమును వదిలిపెట్టి నువ్వు అరణ్యమునకు వెళ్లినా, నీ దైనందిన జీవితమునకు కావలసిన వస్తువుల మీద మమత మమకారం వదిలిపెట్ట లేవు

కదా! అదే ఈ సంసార చక్రమునకు మూలం కదా!

అన్నయ్యా! నీవు నా చుట్టము, పక్కము, చెలి, తల్లి, తండ్రి, గురువు, దైవము. కాబట్టి నా మాటలు విని నీ మనసు మార్చుకో. నేను చెప్పినది అబద్ధమో  నిజమో నాకు తెలియదు. కాని నా మాటలు భక్తి తో కూడినవి. కాబట్టి నా పలుకులు కరుణతో విశ్వసించు." అని పలికాడు.

నకుల సహదేవులు  చెప్పిన మాటలు సావధానంగా విన్నాడు ధర్మరాజు కాని ఒక్కమాట కూడా బదులుచెప్పలేదు.

అప్పటిదాకా పెదవి విప్పని ద్రౌపది లేచి ధర్మరాజు వద్దకు వచ్చి "నాథా! నాకు అనుమతి ఇచ్చిన నా తోచిన మాటలు చెప్పెదను." అని ధర్మజుని అనుమతితో ఈ విధంగా చెప్పసాగింది.

" నాథా! మనము అడవులలో ఉన్న రోజులు ఒక్కసారి జ్ఞాపకం చేసుకోండి. అరణ్య అజ్ఞాత వాసములు పరిసమాప్తి కాగానే, సుయోధనుని చంపి మన రాజ్య సంపదలను తిరిగి అనుభవించెదమని మీరు మీ తమ్ములను అనునయించలేదా!  మీరు చెప్పిన ప్రకారం సుయోధనుని చంపి మీరు రాజ్యమును కైవసం చేసుకున్నారు. కాని అన్న మాట మరిచి,  రాజ్యత్యాగము చేసి అడవులకు పోతానంటున్నారు.  ధర్మము, సత్యము వ్రతము గా పెట్టుకున్న  మీకు  ఈ ప్రకారం పలకడం న్యాయమా!

రాజు ఎప్పుడూ పేద మనసుతో ఉండకూడదు. రాజు తన రాజ్యమును, ప్రజలను రక్షించాలి. దుర్మార్గులను నిర్దయగా శిక్షించి, సన్మార్గులను దయతో రక్షించాలి. బ్రహ్మదేవుడు క్షత్రియుని లోకాన్ని రక్షించడానికే సృష్టించాడు.  రాజు

మానుష రూపం లో ఉన్న దేవుడు. అలాంటి రాజు చేతకాని వాడైతే దుర్మార్గులు విజృంభిస్తారు. రాజు నందు దేవుడు దండనీతి ని ప్రతిష్టించాడు. అపరాధులను శిక్షించడం రాజ ధర్మం. దాని వలన ఇహపరములు సిద్ధిస్తాయి.

తప్పుచేసిన బ్రాహ్మణుడి నైనా శిక్షించడం రాజధర్మము. అదే రాజ , దర్మమును నీవు నిర్వర్తించావు. రజస్వలను, ఏకవస్త్రను అయిన నన్ను సభకు ఈడ్చుకొని వచ్చి, వలువలు ఊడదీసి, తన తొడ చూపి అవమానించిన దుర్యోధన, దుశ్శాసన, కర్ణులను నీవు ఒక రాజుగా శిక్షించావు. అది పాపం కాదు. దానికి నీవు చింతింప పనిలేదు.

విషప్రయోగం చేసిన వాళ్లను, గృహదహనముచేసిన వాళ్లను, రాజకీయ రహస్యములను బహిరంగ పరచిన వాళ్లను, హంతకులను, పర సతిని కోరిన వాడిని, బంధువులను చంపిన వాడిని, దండించడం రాజ ,దర్మము. అది పుణ్యకార్యము కూడా!

ఇంకొక మాట! దండించతగ్గ వాళ్లను దండించక పోవడం మహా పాపం. రాజు దండనీతిని అమలుపరచడం వల్ల పేదలకు, సాధులకు, తాపసులకు మేలే జరుగుతుంది. వారికి రక్షణను కల్పిస్తుంది. దుష్ట శిక్షణ, శిష్టరక్షణ చెయ్యాల్సిన రాజు, బ్రాహ్మణుని వలె ఇంద్రియ నిగ్రహము పాటించడం ధర్మమా! కాబట్టి మీ మనసులో ఉన్న శంకను తొలగించు.

నాధా! నా మాదిరి జీవితములో కష్ట పడ్డ స్త్రీలు ఎవరన్నా ఉన్నారా! కాని నేను అన్నిటినీ సహించి గృహస్థ ధర్మము విడిచి పెట్టకుండా ఉండలేదా! కౌరవులు వారి గోతిని వారే తవ్వుకున్నారు. వారి పాపం వారే అనుభవించారు. దానికి మీరు బాధపడటం దేనికి? కాబట్టి మీరు రాజ్యభారం వహించి, ప్రజలను

జనరంజకంగా పాలించండి.

యుద్ధనీతి గురించి మీకు తెలియనిది కాదు. పూర్వము బృహస్పతి, శుక్రుడు యుద్ధనీతిని లోకానికి తెలియచేసారు. ఆనీతిని మీరు కూలంకషంగా అభ్యసించారు. దానిని మీరు ఆచరించండి" అని వేడుకుంది ద్రౌపది.

అర్జునుడు మరలా అందుకొని ఇలా చెప్పాడు.

"ప్రజలను రక్షించవలసిన రాజు దండనీతిని వదిలి పెట్టిన, సన్యాసులు కూడా సన్మార్గాన్ని వదిలి పెట్టి అక్రమాలకు పాల్పడతారు. ప్రజలు ఒకరి ఆస్తులను, ధనాన్ని, భార్యలను మరొకరు అపహరిస్తారు. అరాచకం చెలరేగుతుంది. ఆ పాపం రాజుకు చుట్టుకుంటుంది. కాబట్టి దండనీతిని హింసగా తలచవద్దు. దుర్మార్గులను వధించిన రుద్రుడు, గోవిందుడు, ఇంద్రుడు, గుహుడు మొదలగువారు పాపము పొందలేదు కదా! పైగా వారికి గౌరవాభిమానములు లభించాయి. కాబట్టి అన్నయ్యా! దండనీతి వలన అధర్మము నశిస్తుంది. ధర్మము వృద్ధి చెందుతుంది.

అన్నయ్యా! సామాన్య ప్రజలు కూడా తమ తమ దైనందిన కార్యములలో కూడా హింసకు పాల్పడుతున్నారు. మనకు తినే కాయలలో, పండ్లలో, నీటిలో ఎన్నో సూక్ష్మజీవులు ఉన్నాయి కదా. వాటిని మనము చంపుతున్నాము కదా! మనము కందమూలముల కొరకు తవ్వుతున్నప్పుడు ఎన్నో జీవులు చస్తాయి కదా! అది పాపం ఎలా అవుతుంది.

మన ప్రాణాలు నిలుపుకోవాలంటే ఆహారం కావాలి. ఆహారం కావాలంటే హింస తప్పదు. భగవంతుడు కూడా ఒక ప్రాణిని మరొక ప్రాణికి

ఆహారంగా సమకూర్చాడని మరిచిపోయావా? కాబట్టి అన్నయ్యా! అన్యాయంగా, అధర్మంగా కాకుండా అవసరం కొద్దీ చేసే హింస, అహింసతో సమానము. దుర్మార్గులైన శత్రువులను దండించడం హింస కాదు.

మన తండ్రి పాండురాజు సంపాదించిన రాజ్యమును మనము తిరిగి పొందడం అన్యాయము ఎలా అవుతుంది? మనము ధర్మయుద్ధము చేసామో అధర్మయుద్ధమే చేసామో ఆ దైవానికి తెలుసు. కాబట్టి ఆ చింత మాని దక్షుడవై ఈ రాజ్యాన్ని పాలించు." అని పలికాడు అర్జునుడు.

ధర్మరాజులో చలనం లేదు. అది చూచి భీముడు ఇలా అన్నాడు.

"అన్నయ్యా! నీవు అన్ని ధర్మములు తెలిసినవాడవు. మేము నీకు చెప్పే అంతటి వాళ్లము కాదు. కాని నా ఓర్పు నశించింది. అందుకని మరలా మరలా చెప్పవలసి వచ్చింది. న్యాయ మార్గంలో సంపాదించిన రాజ్యసంపదను విడిచి పెట్టడం పిరికితనం అనిపించుకుంటుంది. ప్రజలు నిన్ను, మమ్ములను పిరికి వాడిని చూసినట్టు చూస్తారు. చీదరించుకుంటారు.

కపట ద్యూతము పర్యవసానంగా మనం అందరం ఎన్నో కష్టాలు పడ్డాము. అవమానాల పాలయ్యాము. కాని నీవు సత్యాన్ని నమ్ముకున్నావు. మేమూ నిన్ను అనుసరించాము. యుద్ధములో దుర్మార్గులను చంపాము. నీకు ఎనలేని కీర్తి లభించింది. మనకు సామ్రాజ్య లక్ష్మి దక్కింది.

అసలు మనము యుద్ధం ఎందుకు చెయ్యవలసి వచ్చింది. కౌరవ సభలో భరించిన అవమానాలు, అడవులలో పడిన కష్టాలు, అజ్ఞాత వాసంలో కలిగిన శోకం, వీటివలన కలిగిన దుఃఖము పోవడానికే శ్రీకృష్ణుని నిర్ణయం మేరకు

యుద్ధము చేయడానికి నిర్ణయం తీసుకున్నాము. యుద్ధం చేసాము. యుద్ధంలో మనమో కౌరవులో చావడం తథ్యమని అప్పుడు తెలియదా? మరి ఇప్పుడు శత్రువులు చచ్చారని బాధపడటం దేనికి?

కాబట్టి అన్నయ్యా! రాజ్యభారం వహించు. దుష్ట శిక్షణ చెయ్యి." అని పలికాడు భీముడు.

ధర్మరాజు భీముని మాటలను సావధానంగా విన్నాడు. తరువాత ఇలా అన్నాడు:

"మీరందరూ మదము, కోరికలు, భయము, మొదలగు వాటితో సతమవుతూ ఈ రాజ్యమును పాలించమని కోరుతున్నారు. కాని రాజ్య పాలన దుఃఖ భూయిష్టమని పెద్దలు అంటారు. రాజ్యాంతే నరకం ధృవం అని ఆర్యోక్తి. రాజుకు నరకం తప్పదు. కాబట్టి రాజ్యపాలనలో సుఖం, శాంతి ఎక్కడుంది. కామ పరమైన భోగములను అనుభవించడంలో శాంతి లేదు. వాటిని విడిచి పెడితే కలిగే ఆనందం వర్ణనాతీతం.

అరణ్యములలో ఆశ్రమములలో కంద మూలములు తింటూ జీవిస్తున్న మునిపుంగవులు వెర్రి వాళ్లా! దుర్మతులు విషయ సంబంధ మైన కోరికలనే బంధాలలో సతమతమవుతున్నారు. విజ్ఞులు కోరికల జోలికి పోక ప్రశాంత చిత్తులయి జీవిస్తున్నారు. ఈ విషయంలో జనక మహారాజు మాటలు మనకు తెలుసు కదా!

"దేని మీదా కోరిక లేని వాడికి ఎటువంటి సంపదలూ అవసరం లేదు.

ఎందుకంటే అన్ని ఉన్నట్టే భావిస్తాడు. మిథిలా నగరం కాలిపోతున్నా, నేను అందులో ఏ వస్తువూకాలనట్టే భావిస్తాను." అని అన్నాడు కదా.

మరి జనక మహారాజును అందరూ గౌరవించారు కదా! మీరంతా బాగా ఆలోచించే శక్తి ఉన్నవాళ్లు. సంసార సుఖాల జోలికి పోకుండా శాంతిని పొందువాడు నిందార్హుడని పలకడం మీ అజ్ఞానానికి నిదర్శనం. సంసార సుఖాలకు దూరంగా ఉంటున్న సర్వసంగ పరిత్యాగికి, ఆ సంసార సుఖాలలో పడి దొర్లుతున్నవాళ్లు, కొండ పైనున్న వాడికి కొండ కింది వాళ్లు ఎలా కనిపిస్తారో అలా కనిపిస్తారు." అని పలికాడు ధర్మరాజు.

వెంటనే అర్జునుడు అందుకున్నాడు "అన్నయ్యా! నీవు చెప్పావే ఆ జనక మహారాజుకు ఆయన భార్య కు జరిగిన సంవాదము గురించి చెబుతాను విను. నీ మాదిరే జనకుడు కూడా రాజ్యమును వదిలి భిక్షుకవృత్తికి స్వీకరించ నిశ్చయించినపుడు ఆయన భార్య అతనితో ఇలా అంది.

" నాథా! నీవు రాజ్యపాలన వదిలి భిక్షాటన కు పోయిన ఇక్కడ అతిథి సత్కారములు, దేవతర్పణములు, పితృతర్పణములు, ఎవరు చేస్తారు? కాషాయము ధరించి, శిరోముండనముచేయించు కున్నందు వల్ల, భిక్షకోసం ఇల్లిల్లు తిరగాలి కదా! మరి ఆ గృహస్థు మీకు అన్నదానము చేసి పుణ్యము పొందుతాడుకదా! అన్నదానము వలన అధిక పుణ్యము లభిస్తుంది కదా! చేయి కింద పెట్టి దానం తీసుకొనే వాడి కంటే దానం చేసే వాడే గొప్ప కదా! ~~ఈ~~ మాత్రం కూడా మీకు తెలియదా!

వేదవిదులు రాజుల మీద ఆధార పడతారు. రాజైన మీరే మీరు చేయవలసిన కర్మలు వదిలివేస్తే, వారికి దిక్కెవ్వరు? వారి బతుకులు చెరపడం

మీకు ధర్మమా! మీరు మీ కన్న తల్లినీ, కట్టుకున్న భార్యనూ శోకసముద్రములో ముంచి, మీకు విధించిన ధర్మములు వదిలి అడవులకు పోయి, ఏం సాధిస్తారు?

ఎండాకాలంలో చలువ పందిరి మాదిరి, చెట్టుకు ఫలముల మాదిరి ప్రజల కష్టములు తీర్చడానికి కదా మీరు ఉన్నది. అలాంటి మీరు ఇంతటి దీనమైన వృత్తిని స్వీకరించ తగునా? కాబట్టి మీరు చేస్తున్న పని ధర్మవిరోధం. దీని వల్ల మీకు మోక్షం కలుగుతుంది అని నాకు అనిపించడం లేదు."

అని జనకుని భార్య జనకునితో చెప్పింది." అని అర్జునుడు ధర్మరాజుతో అన్నాడు.

ఆ మాటలన్నీ మౌనంగా విన్న ధర్మరాజు అర్జునునితో ఇలా అన్నాడు.

"అర్జునా! వేదములు మానవులు అనుసరించ వలసిన కర్మ మార్గమును నిర్దేశించాయి. అదే వేదములు, కర్మసన్యాసము వలన ఉత్తమ గతులు కలుగుతాయని కూడా చెప్పాయి. మానవుడు తన విజ్ఞతతో ఉత్తమ మైన మార్గము ఎన్నుకోవాలి. మంచి పనులు చేస్తే పరలోక సుఖం ప్రాప్తిస్తుంది. నీవు చెప్పేది లోక ధర్మము. అదీ న్యాయమే. కాని విజ్ఞులు, వేదవిదులు నేను చేయబోయే పని తప్పు అని అనలేరు.

నీవు, భీముడు దైవాంశ సంభూతులు, ఇంద్రుడు, వాయువు వరమున పుట్టిన వారు. శత్రుభయంకరులు. శ్రీకృష్ణుడు మన దగ్గర ఉండటం వల్ల, ఆయన తేజస్సు కూడా మీకు సంక్రమించింది. మీరిరువురు యుద్ధవిద్యా విశారదులు కాని ధర్మవేత్తలు, తత్వజ్ఞానులు కారు కదా! ఈ సంసారము

సారహీనమయినదని తత్వవేత్తలు అంటారు.

ఆశాపాశములు వదిలి, కర్మలు చెయ్యడం మాని, నిర్మలమైన మనసు కలవాడు సుఖి. ఎప్పుడూ ధనము, సంపదల కోసం పాకులాడు వాడు ఎన్నడూ సుఖించలేదు. వేదములు, శాస్త్రములు చదివి, తత్వసారమును రుచి చూచి కూడా, జ్ఞానము లేని వారు, కర్మ మార్గమే మంచిదని ప్రబోధిస్తూ, కర్మములలో పడి కొట్టు మిట్టాడుతుంటారు కాని శాశ్వత సుఖమును పొందలేరు.

జ్ఞాన సముపార్జన చేసిన వారు శమము, దమము, త్యాగము శాశ్వతానందమునకు మూలములు అని చెబుతారు. వాటిని నాలాంటి విచక్షణాజ్ఞానము కలవారు అంగీకరిస్తారు, ఆచరిస్తారు." అని పలికాడు ధర్మరాజు.

అక్కడే ఉన్న దేవస్థానుడు అనే ముని ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"ధర్మజా! ఈ లోకంలో సుఖంగా జీవించాలంటే ధనము, సంపదలు కావాలి అన్న అర్జునుని మాట సత్యము. యోగ మార్గమునకు చక్కటి సోపానములు కలవు. నీవు ఆ మార్గం గుండా వెళితేనే మోక్షమునుపొందగలవు. కాని ధనమును కేవలం భోగములు అనుభవించడానికి ఆర్జిస్తే తప్పు. కాని యజ్ఞయాగములు చేయుటకు దానధర్మములుచేయుటకు ధనార్జన తప్పుకాదు. పైగా దాని వలన మోక్షం కలుగుతుంది. యజ్ఞయాగాదులకు వినియోగించగా మిగిలిన ధనము మనస్తాపాన్ని పోగొడుతుంది. దాని వలన శమము, దమము కలుగుతాయి. కాబట్టి ధనము సముపార్జించి, యజ్ఞయాగములు, దాన ధర్మములు చేయుము.

ధర్మరాజా! శివుడు సర్వమేధము అనే యజ్ఞం చేసాడు. బ్రహ్మ, దిక్పాలకులు ఎన్నో యజ్ఞాలు చేసారు. మరుత్తులు మొదలగు వారు ఎన్నో యజ్ఞములు చేసి ఖ్యాతినిపొందారు. ఒకసారి ఇంద్రుడు అడుగగా బృహస్పతి అతని ఈ విధంగా మంచి మార్గమును చూపించాడు.

"ఇంద్రా! కామము, క్రోధము మనసులోకి రానీయకుండా, ఇంద్రియ నిగ్రహము పాటిస్తూ, శోకమును దగ్గరకు చేరనీయకుండా, తాను సుఖుడై, ప్రజలను సుఖపెడుతూ రాజ్య పాలన చేసే వాడికి, సర్వ మహిమలు వాటంతట అవే వచ్చి చేరతాయి."

ధర్మరాజా! కర్మ చెయ్యడం, కర్మలను విడిచి పెట్టడం, రెండూ మేలు అనడం ఒప్పదు. కర్మలు చేస్తూ ఆ కర్మ ఫలమును ఈశ్వరుని కి అర్పించడం ధర్మములలో కల్లా ఉత్తమధర్మము అని పెద్దలు చెబుతారు కదా! కాబట్టి మంచి చెడ్డలను సమానంగా చూస్తూ, ఎవరికీ ద్రోహం తలపెట్టకుండా, క్షత్రియ ధర్మాన్ని పాటిస్తూ రాజ్యపాలన చెయ్యడం ఉత్తమం. నీకు పూర్వు లైనా రాజులందరూ ఇదే విధంగా ఈ భూమిని పాలించారు. తరువాత వారి కుమారులకు రాజ్యం అప్పగించి వానప్రస్థ ఆశ్రమము స్వీకరించారు. నీవు కూడా అలా చెయ్యి" అని పలికాడు దేవస్థానుడు.

తరువాత అర్జునుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "అన్నయ్యా! క్షత్రియ ధర్మము ప్రకారము ఈ యుద్ధము చేసావు. యుద్ధములో చనిపోయిన శత్రురాజులు ఉత్తమ గతులుపొందారు. రాజధర్మము రౌద్రమని బాలురకు కూడా తెలుసు. రాజ్యపాలనలో పాపాలకు తావు లేదు. రాజైన వాడు

రాజ్యపాలన చెయ్యాలి గాని ఒకరు పెడితే తిని కూచోడం బాగుంటుందా! అలాంటిది కౌరవకులములో అగ్రగణ్యుడవు నీకు అది తగునా!

రాజుల మనసులు వజ్రము వాదిరి కఠినంగా ఉండాలి కాని బేలగా ఉండకూడదు. కాబట్టి శోకము వదిలిపెట్టు.రాజ్యపాలనకు అంగీకరించు. ఈ యుద్ధమూ, శత్రుసంహారమూ, శత్రువులకు స్వర్గలోక ప్రాప్తి అన్నీ దైవ నిర్ణయాలు. దానికి మనం బాధపడి ప్రయోజనం లేదు. నీకు అన్ని ధర్మాలు తెలుసు. కాబట్టి ధైర్యం తెచ్చుకో. నీకు సంక్రమించిన ఈ కురు సామ్రాజ్యాన్ని జనరంజకంగా పాలించు." అని పలికాడు అర్జునుడు.

కాని ధర్మరాజు మనోనిశ్చయం మారినట్టు లేదు. అందుకే మౌనంగా ఉన్నాడు.

అప్పుడు వ్యాసమహర్షి ఇలా అన్నాడు.

"ధర్మరాజా! అర్జునుడు పలికిన పలుకులు అక్షరసత్యములు. అన్ని ధర్మములలో కల్లా గృహస్థ ధర్మము గొప్పది అని చెబుతారు కదా. ఒక్క మానవులకే కాదు, పశుపక్ష్యాదులకు కూడా అది ధర్మము. క్షత్రియులకు గృహస్థ ధర్మము తప్ప తక్కిన ధర్మము లైన తపస్సు, ఇంద్రియ నిగ్రహము, బ్రహ్మచర్యము ఆచరణయోగ్యములు కావు.

ధనము సంపాదించకుండా ఉండటం, ప్రజా రక్షణను మరవడం, యుద్ధము చేయకుండా పారిపోవడం, క్షత్రియునకు మహాపాతకములు. ఇది వేద వాక్కు. కాబట్టి నీవు వేదములు చెప్పినట్టు నడుచుకో. ఈ భూమిని జనరంజకంగా పాలించు.

ధర్మజా! నీవు గురువుల దగ్గర విద్యనభ్యసించావు. వర్ణాశ్రమ ధర్మముల గురించి తెలియదా! భూమినేలే మహారాజుకు దండనీతి తప్ప మరొక ధర్మం లేదు కదా! సద్యుమ్నుడు అనే మహారాజు దండనీతిని అమలు పరిచి దుష్టులను శిక్షించి చివరకు మోక్షం పొందాడు. అతని వృత్తాంతము చెప్పెదను వినుము.

పూర్వము బాహుదా నదీ తీరంలో శంఖుడు, లిఖితుడు అనే ఇద్దరు అన్నదమ్ములైన బ్రాహ్మణులు నివసిస్తున్నారు. ఇద్దరూ ధర్మ తత్పరులు. వారి ఆశ్రమములలో కాయలు, పండ్లు సమృద్ధిగా పండే ఒక వృక్షములు చాలా ఉన్నాయి.

ఒకరోజు శంఖుడు ఇంట్లో లేనపుడు లిఖితుడు అతని ఆశ్రమ మునకు పోయి ఒక చెట్టునుండి బాగా పండిన పండ్లను కోసి తింటున్నాడు. అప్పుడు శంఖుడు అక్కడకు వచ్చాడు.

"ఈ పండ్లు ఎక్కడివి?" అని అడిగాడు.

"మీ చెట్లో కోసుకున్నాను" అని బదులు చెప్పాడు లిఖితుడు.

" నా అనుమతి లేకుండా నా చెట్టునుండి పండ్లు కోయవచ్చా? అది దొంగతనం కాదా? నీకు పాపం అంటింది. నీకు రాజ దండనతో కాని ఆ పాపం పోదు" అని అన్నాడు.

వెంటనే లిఖితుడు రాజభవనము వద్దకు వెళ్లాడు. ప్రతీహారి చేత మహారాజు సుద్యుమ్నునకు వర్తమానము పంపాడు. సుద్యుమ్న మహారాజు

తన మంత్రులతో లిఖితుని వద్దకు వచ్చాడు.

"విప్రోత్తమా! మీరు ఇచ్చటికి వచ్చిన కారణమేమి? ఆజ్ఞాపించండి. మీరుచెప్పినట్టు చేసెదను." అని అన్నాడు.

దానికి లిఖితుడు "రాజా! మీరు మాట తప్పకూడదు. నేను చెప్పినట్టు చెయ్యాలి. నేను నా మిత్రుని ఆశ్రమములోని పండ్లను దొంగిలించాను. దానికి మీరు తగిన శిక్ష విధించి నన్ను పాప విముక్తుడిని చెయ్యండి." అని ప్రార్థించాడు.

ఆ మాట విన్న రాజు చాలా బాధ పడ్డాడు. కాని తప్పలేదు. లిఖితుని రెండు చేతులు నరకమని దండన విధించాడు. లిఖితుడు రాజును దీవించి వెళ్లిపోయాడు. అతనికి దండన అమలు జరిగింది.

లిఖితుడు శంఖుని వద్దకుపోయి "నేను రాజ దండన అనుభవించాను" అని తన తెగినచేతులు చూపించాడు. ఆ మాటలకు శంఖుడు సంతోషించాడు.

"లిఖితా! ఎవరూ ధర్మమార్గమును తప్పకూడదు. నీ జీవితము ధన్యమయినది. నీవు బాహుదా నదికి పోయి దేవ తర్పణములు, పితృ తర్పణములు విడిచి పెట్టు. లిఖితా! కల్లు తాగడం, గురు పత్నిని కామించడం, బ్రాహ్మణుని చంపడం, బ్రాహ్మణుల సొత్తు అపహరించడం ఇవి మహా పాతకములు. ఈ మహా పాతకములలో ఏ ఒక్కటి చేసినా అది ఎవరు చేసినా, అతను బ్రాహ్మణుడైనా అతను దండనార్హుడు. ముఖ్యంగా దొంగిలించిన వాడు శరీర దండనమునకు తగినవాడు. రాజుచే దండింప

బడినవారు పుణ్యలోకములకు పోతారు. నీవు కూడా రాజ దండన పొందావు కాబట్టి నీవు పుణ్యాత్ముడవు. దానికి నీవు సంతోషించాలి" అని చెప్పాడు.

వెంటనే లిఖితుడు బాహుదా నదికి పోయి తెగిన చేతులతోనే దేవ తర్పణములు పితృతర్పణములు విడిచాడు. అతనికి ఆశ్చర్యము కలిగేట్టు అతని చేతులు యధాప్రకారము మొలిచాయి. లిఖితుడు శంఖుని దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. తన చేతులు చూపించాడు.

"దీనికి ఆశ్చర్యం ఎందుకు? ఇది నా తపో మహిమ చేత, దైవ కృపచేత కలిగింది. నీవు నిర్మల మనస్కుడవు అందుకని నీకు దైవానుగ్రహము కలిగింది. నిన్ను దండించిన సుద్యుమ్న మహారాజుకు కూడా తన పితృ దేవతలోకూడా పుణ్యాత్ముడయ్యాడు." అని పలికాడు శంఖుడు.

కాబట్టి ధర్మరాజా! నీవు కూడా తగిన విధంగా ప్రజారక్షణ ఆచ రించుము. నీ తమ్ములు చెప్పిన మాటలు వేదవాక్కులు. రాజనీతి దండనము చేత తప్ప మరొక విధముగా నిర్వర్తింప బడదు. కాబట్టి నీ శోకమును వదిలిపెట్టు. గొప్ప గొప్ప యజ్ఞములు చేసి, చక్కగా రాజ్యపాలన చెయ్యి.

ధర్మనందనా! నీ తమ్ములు, భార్య నీ మాటప్రకారము 12 ఏళ్లు అడవులలో, ఒక ఏడు అజ్ఞాతముగా నానా కష్టములు పడ్డారు. ఇప్పుడు వారి మాట మన్నించి వారికి సుఖశాంతులు కలుగచెయ్యి. విరాగియై అడవులకు పోయి దేవతలకు, నీ పితృదేవతలకు బాధ కలిగించవద్దు.

నీకు న్యాయశాస్త్రం బాగా తెలుసు. ప్రజల మనోభీష్టములు తెలిసికొని, శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ చేసి, దండనీతిని అమలు పరచే రాజుకు అన్నీ శుభాలే

కలుగుతాయి. ప్రజల ఆదాయము నుండి ఆరవ భాగము పన్నుగా వసూలుచెయ్యి. ప్రజలను కన్నతండ్రి వలే పాలించు. ఇదే మోక్షమునకు మార్గము చూపుతుంది. నీ మనసులో ఉన్న భయము, సంశయము వదిలిపెట్టు.

కాని ధర్మరాజా! రాజైనవాడు అహంకరించి, కామ క్రోధములకు వశుడై ప్రజాకంటకంగా పాలిస్తే, అతనికి ప్రజలు చేసే పాపాలలో నాలుగవ భాగం చెందుతుంది.

శత్రువులను నిర్మూలించడం క్షత్రియ ధర్మము. పాపాత్ములైన రాజులతో సంధి చేసుకోడం దోషం. శత్రువులతోసంధి చేసుకొని తన రాజ్యములో కొంత భాగం ఇవ్వడం మంచిదికాదు. యుద్ధం చేసి రాజ్యరక్షణ చెయ్యడం క్షత్రియ ధర్మం.

కాబట్టి నువ్వు యుద్ధం చేసినందుకు చింతింప బనిలేదు. దుర్యోధను నితో సంధి చేసుకోక పోవడం వలననే ఈ ఘోర యుద్ధము సంభవించినది అని అనుకోవడం నీ అవివేకం. పూర్వము హయగ్రీవుడు అనే మహా రాజు యుద్ధ ములు చేసి, శత్రువులను జయించి, దుండగులను శిక్షించి, సన్మార్గులను కాపాడి, ప్రజారంజకంగా పాలించి యజ్ఞములుచేసి తుదకు సద్గతి పొందాడు. కాబట్టి యుద్ధములు రాజులకు కీడుచెయ్యవు. యుద్దములో చంపడం, చావడం, అలాగే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ క్షత్రియధర్మము. కాబట్టి దండనీతిలో హింస జరుగుతుందని అనుమానము విడిచిపెట్టి, సమర్థు లైన నీతి మంతులైన రాజోద్యోగుల సాయంతో రాజ్యకార్యములు నిర్వర్తింపుము.”

అని పలికాడు వ్యాసుడు.

ఇన్ని చెప్పినా మనసు కరుగని ధర్మరాజునుచూచి అర్జునుని గుండెలు రగిలిపోతున్నాయి. కాని మనసులో కోపం బయటకు కనపడకుండా నిల్చున్నాడు అర్జునుడు. ధర్మరాజు వ్యాసుని చూచి ఇలా అన్నాడు:

"ఓ మహర్షీ! ఈ యుద్ధంలో ఎందరో తమ తమ భర్తలను, కుమారులను, సోదరులను పోగొట్టుకున్నారు. వారి విలాపములు, శోక సంతాపములు నా హృదయము నకు శాంతి లేకుండా చేస్తున్నాయి. ఈ పరిస్థితులలో నేను ఈ రాజ్యమును ఎలా ఏలగలను?" అని పలికాడు.

దానికి వ్యాసుడు ఇలా అన్నాడు. "ధర్మజా! సుఖ దుఃఖములు నీ వశంలో ఉన్నట్టు మాట్లాడుతున్నావు. దుఃఖాలు పొమ్మంటే పోతాయా! సుఖాలు రమ్మంటే వస్తాయా! ఈ లోకంలో అనుభవించే సుఖదుఃఖములకు హేతువు పూర్వజన్మలో వారు వారు చేసుకున్న సుకృతములు, దుష్కృతములు. అయినా ఈ సుఖదుఃఖములు శాశ్వతములు కావు కదా. సుఖం వెంట దుఃఖము, దుఃఖము వెంటసుఖమూ వస్తూ పోతూ ఉంటాయి.

దుర్మార్గుడికైనా, వాడి కాలం కలిసి వస్తే అనంతమైన సంపదలు కలుగుతాయి. కాలం కలిసి రాక పోతే, ఎంతటి సుగుణ వంతుడికి కానీ ధనం లభించదు. అలాగే కాలం కలిసి రాకపోతే మంత్ర తంత్రములు కూడా పని చేయవు. వర్షము, తాపము, చీకటి, వెన్నెల దైవ కల్పితములు. కమలములు వికసించడం, చెట్లకు పూలుపూయడం, కాయలు కాయడం,పండ్లు పండటం అన్నీ కాల మహిమలు, ఋతు ధర్మములు. మరియు, జనన మరణములు, వృద్ధి పొందటం, క్షీణించిపోవడం మొదలగునవి కాలములో పాటు జరుగు తుంటాయి. వీటికోసం నీవు శోకించడం అవివేకము.

పూర్వము సేనజిత్తు మహారాజు కు పుత్రశోకం కలిగింది. కాని అతడు నీ మాదిరి శోకించలేదు. తనకు తానే. ఆ శోకమును పోగొట్టుకున్నాడు. అతడు పలికిన పలుకులు చెబుతాను విను.

"ఈ లోకంలో కొందరు ఇతరులను బాధ పెడతారు. మరి కొందరు ఇతరుల చేత బాధపడుతుంటారు. ఇవన్నీ కాల మహిమ వలన కలుగు తున్నాయి అని గ్రహించాలి కాని తాను ఎవరినో దుఃఖ పెట్టాననీ, ఎవరో తనను దుఃఖపెట్టారనీ భావించకూడదు. వాటి వలన సుఖము, దుఃఖము పొంద కూడదు. ధనము, భార్య, సంతానము, బంధువులు పోయినారని దుఃఖిం చడం అవివేకము. మనం దుఃఖించినందువల్ల మనకు కలిగిన బాధ తొలగి పోతుందా!

మనకు కలిగిన శోకమునకు, భయమునకు ఎన్నోకారణములు ఉంటాయి. అన్ని తెలిసిన వాడు శోకమునకు, భయమునకు తల వంచడు. మూర్ఖుడైన వాడు వాటికి లోబడి దుఃఖిస్తుంటాడు. సుఖదుఃఖములు శాశ్వతములు కావు. కాబట్టి అవి కలిగినపుడు ఆనందించడం, కుంగిపోవడం మంచిది కాదు. ఏమీ తెలియని వాడు, అన్ని తెలిసిన వాడూ సుఖదుఃఖములు కలిగినపుడు బాధపడడు. తెలిసీ తెలియని వాడే సుఖము వస్తే పొంగి పోతాడు, దుఃఖము వస్తే కుంగిపోతాడు." అని చెప్పాడు సేనజిత్తు మహారాజు.

ఆ మాటలు నీకు కూడా వర్తిస్తాయి. నీ శోకాన్ని పోగొడతాయి. ధర్మరాజా! వర్ణాశ్రమ ధర్మములు పాటిస్తూ, దండనీతిని అమలు పరుస్తూ, ఈ రాజ్యమును పాలించు. అది క్షత్రియ ధర్మము. చనిపోయిన తరువాత కూడా ఎవడిని గురించి ప్రజలు తల్చుకుంటారో అతడే నిజమైన సత్పురుషుడు. కాబట్టి క్షత్రియధర్మమైన రాజ్యపాలన నిర్వర్తించు." అని పలికాడు వ్యాసుడు.

మహర్షి! మీరు ఎన్ని చెప్పిననూ అభిమన్యుని, ద్రౌపదేయులను, కర్ణుని, విరాటుని, ద్రుపదుని, ధృష్టకేతుని, మరిచి పోలేకపోతున్నాను. నాకు మనశ్శాంతి లేకుండా పోతోంది. మునీంద్రా! నేను ఎంతటి పాపాత్ముడి నంటే, చిన్నతనంలో నన్ను తన తొడ మీద కూర్చోపెట్టుకొని అన్నం తినిపించిన తాత భీష్ముని చంపించాను. అర్జునుడు వేసే బాణాలు తన శరీరం అంతా గుచ్చుకుంటూ ఉంటే, భీష్ముడు శిఖండి వంక చూసిన చూపులు నేను మర్చిపోలేక పోతున్నాను. పరశురాముని గెల్చిన యోధుడు అటువంటి దుర్మరణం పాలవడం తల్చుకుంటేనే బాధగా ఉంది. ఈ తుచ్ఛమైన రాజ్యము కోసం, అలాంటి మహానుభావుని చంపించాను.

విద్య చెప్పిన ద్రోణుడు నా మీద నమ్మకంతో నేను నిజం చెబుతానని తన కుమారుని గురించి నన్ను అడిగాడు. కాని నేనేం చేసాను. చచ్చిన ఏనుగును దృష్టిలో పెట్టుకొని అబద్ధం ఆడాను. ఆయన నమ్మకం వమ్ము చేసాను. నేను ఎంతటి పాపాత్ముడిని. గురుద్రోహిని. మునీంద్రా! మీరే చెప్పండి. అశాశ్వతమైన రాజ్యం కోసం గురువునే వధించిన వాడికి ఏమి శిక్ష విధిస్తారో మీరే చెప్పండి.

మునీంద్రా! నా అన్నయ్య కర్ణుడు. స్వంత అన్నను చంపి ఏలుకొనే రాజ్యము నాకు సుఖసంతోషాలు కలుగ చేస్తుందా! భగ భగ మండే అగ్ని లాంటి పద్మవ్యూహములోకి బాలుడైన అభిమన్యుని పంపిన క్రూరాత్ముడిని. సుభద్ర అర్జునులు కాబట్టి నా క్రూరత్వాన్ని సహించారు. ఇంకొకరైతే నన్ను నరికి పారేసేవారు. పసివాడిని అగ్ని గుండంలోకి తోసి చంపిన వాడికి ఈ రాజ్యం పాలించే అర్హత ఉంటుందంటారా!

కడుపున బుట్టిన ఐదుగురు బిడ్డలను పోగొట్టుకున్న ద్రౌపది దుఃఖం చూసి నేను తట్టుకోలేకపోతున్నాను. దీని కంతటికీ కారణం నేను కాదా! కాబట్టి నన్ను వెళ్ల నివ్వండి. ప్రాయోపవేశం చేసి నా మరణం కోసం ఎదురు చూడనివ్వండి." అని పలికాడు ధర్మరాజు.

ఆ మాటలు విన్న వ్యాసుడు ధర్మజుని తో ఇలా అన్నాడు.

"ధర్మరాజా! క్షత్రియుడవైన నీకు ఈ బేలతనం తగదయ్యా! ఎన్ని చెప్పినా నీ శోకం మానడం లేదు. ఈ సారి నా మాటలు మనసు పెట్టి వినవయ్యా!

ఈ లోకమంతా ద్వందములతో నిండి ఉంది. వృద్ధి చెందడం నశించడం కొరకే; పెరగడం తగ్గడం కొరకే; పుట్టడం చావడం కొరకే. సుఖం వెంటనే దుఃఖం ఉంటుంది.

మిత్రులంతా మనకు మంచి చేస్తారని, శత్రువుల వల్లనే దుఃఖాలు కలుగుతాయని, మంచి వారికే ధనలాభం కలుగుతుందనీ, ధనం వలన సుఖములు భోగములు వస్తాయని అనుకోడం భ్రాంతి. అలా అనుకోడం బ్రహ్మరాతను ధిక్కరించడమే అవుతుంది.

విధాత అయిన బ్రహ్మ నిన్ను ఎందుకు పుట్టించాడో నీవు ఆ కర్మను నిర్వర్తించాలి. నా ఇష్టం వచ్చినట్టు చేస్తానంటే కుదరదు. పూర్వము విదేహ రాజ్యమును జనకుడు అనే రాజు పాలించేవాడు. ఆయనకు అప్పటికి పరిపూర్ణ జ్ఞానము కలగ లేదు. ఆయనకు ఒకసారి బంధు వియోగము కలిగింది. దానికి ఆయన బాధపడ్డాడు. ఇల్లు విడిచి పెట్టి వెళ్ల డానికి సిద్ధ పడ్డాడు. ఆ సమయంలో అతని వద్దకు అశ్మకుడు అనే బ్రాహ్మణుడు వచ్చాడు. జనకుడు

అతనికి అతిథి సత్కారములు చేసాడు.

"విప్రోత్తమా! మానవునకు డబ్బు, బంధువులు ఉన్నప్పుడు కలిగే అహంకారము, మదము, అవి పోయి నప్పుడు కలిగే విషాదము దేని వలన కలుగుతాయి. నాకు తెలియ చెప్పండి." అని అడిగాడు. దానికి ఆ బ్రాహ్మణుడు ఈ విధంగా చెప్పాడు. "జనకమహారాజా! సంసారము అన్నప్పుడు సుఖము, దుఃఖము మానవుని వెన్నంటి ఉండటం సహజం. అవి సంసారములో అతని మనస్సును చెదర గొడతాయి. మరి దానికి మందు ఏమి టంటే, ఈ లోకంలో ఎవరికీ ఎక్కువ సుఖాలు కానీ, ఎక్కువ దుఃఖాలు కానీ లేవు అని తెలుసుకోవడమే. ఈ భూమిని మొత్తం పరిపాలించే చక్రవర్తికి కూడా, వార్ధక్యాన్ని, మరణాన్ని ఆపగలిగే శక్తి లేదు. కాబట్టి మన జీవితంలో ఏది జరిగినా మనస్సును బుద్ధిని చెదరనీయకుండా, మనకు అంత వరకే ప్రాప్తం అని అనుకోవడం విజ్ఞుల లక్షణం.

ప్రతి మనిషికీ మంచి ఆహారము, భోగములు, మంచి పడక, మంచి మంచి ఆసనములు అన్నీ కాలము వలన కలుగు తుంటాయి. మరలా పోతుంటాయి. కాబట్టి ఉన్నప్పుడు పొంగి పోవడం లేనప్పుడు కుంగిపోవడం వివేకము కాదు. వాటిని నమ్మక పోవడమే శ్రేయస్కరము. వైద్యులు వైద్య శాస్త్రమును అభ్యసించి అందులో ప్రావీణ్యము పొంది, రోగికి మంచి మంచి మందులు ఇచ్చి రోగములను తగ్గించడానికి ప్రయత్నిస్తారు. కాని కొన్ని రోగములు తగ్గడం లేదు. ఒక్కోసారి అదే రోగము వైద్యునికి కూడా రావడం మనం చూస్తున్నాము కదా! కాబట్టి మన చేతిలో ఏమీ లేదు. అంతా విధివ్రాత. మన ప్రయత్నం మనం చెయ్యడం మన విద్యుక్త ధర్మము.

మంచి ధనవంతుల ఇంట్లో, యోగ్యుల ఇంట్లో పుట్టడం, అందచందాలు

కలిగి ఉండటం, బలవంతులవడం, అదృష్టవంతులవడం, భోగాలు అనుభ వించడం అన్నీ మనం క్రితం జన్మలలో చేసుకున్న పుణ్య ఫలాన్ని బట్టి లభిస్తాయి. ఆ పూటకు తిండి లేని వారికి పిల్లలు తామరతంపరగా పుడతారు. కాని అవసరానికి మించి ధనధాన్యములు భోగభాగ్యములు కల వారికి ఎన్ని ప్రయత్నాలు చేసినా సంతానము కలగరు.

దరిద్రులకు ఆకలి ఎక్కువ. వారు ఎలాంటి ఆహార మునైనా తిని అరిగించుకోగలరు. కాని ధనవంతులు పట్టెడు మెతుకులు తిని అరిగించు కోలేరు. పరస్త్రీవ్యామోహము, జూదమాడటం, సురా పానము, జంతువులను వేటాడటం పెద్దలు నిషేధించారు. కానీ, ఎక్కువమంది పైన చెప్పిన చెడ్డ పనులుచేసి చెడిపోతుంటారు. కారణం. దైవ సంకల్పం. ఇది నాకు ఇష్టము, ఇది ఇష్టం లేదు అనే దానికి కారణములు మనం కనుక్కోలేము.

భార్యాబిడ్డలు, బంధువులు, ప్రవాహములో కొట్టుకొని వస్తున్న కట్టెల మాదిరి క లుస్తుంటారు విడిపోతుంటారు. మానవుడు ఎన్నో జన్మలు ఎత్తు తుంటాడు. ఆయా జన్మలలో ఎందరో తల్లులు, తండ్రులు, భార్యలు, కుమారులు కుమార్తెలు, బంధువులు కలుగుతుంటారు. ఎవరి కోసం అని ఏడుస్తాడు చెప్పు. కాబట్టి ఈ మానవ జీవితం అశాశ్వతం అని తెలుసుకోడం వివేకుల లక్షణం.

నిరంతరం సాగుతున్న ఈకాల చక్రం ఒక మహా సముద్రం లాంటిది. అందులో చావు పుట్టుక అనే మొసళ్లు సంచరిస్తుంటాయి. కాబట్టి మానవునికి చావు పుట్టుకలు అనివార్యములు. అది తెలుసుకొని మానవుడు శోకం వదిలి పెట్టాలి.

ఓ జనక మహారాజా! మన శరీరమే మనం అప్పుగా తెచ్చుకున్నాము. ఇంక దారాసుతులు, బంధు మిత్రులు శాశ్వతమా! మనం ఎంత ఏడ్చినా చచ్చిన వాడు తిరిగి రాడు కదా! చచ్చిన వాళ్ల కోసం ఏడ్చినందువల్ల బాధపడినందువల్ల మనకు శోకం కలుగుతుంది తప్ప వేరే ప్రయోజనం లేదు. కాబట్టి జనక మహారాజా! బంధు వియోగము వలన కలిగిన శోకమును వదిలి పెట్టు. నీ విద్యుక్త ధర్మమైన రాజ్యపాలన చేపట్టు. అప్పుడే నీకు కీర్తి ప్రతిష్టలు కలుగుతాయి." అని చెప్పాడు.

అశ్మకుని మాటలతో జనకునికి జ్ఞానోదయం అయింది. ఇల్లు వదిలి వెళ్లాలి అనే ఆలోచన వదిలి రాజ్యపాలన చేపట్టాడు.

కాబట్టి ధర్మరాజా! నీవు కూడా క్షత్రియధర్మమైన రాజ్యపాలనను నిర్వర్తించు." అని పలికాడు వ్యాసుడు.

వ్యాసుడు చెప్పి మాటలకు ధర్మరాజు బదులుచెప్పలేదు. అప్పుడు అర్జునుడు పక్కనే ఉన్న శ్రీకృష్ణుని తో ఇలా అన్నాడు.

"కృష్ణా! చాలా మంది బంధువులు, కుమారులు అన్నదమ్ములు ఒకేసారి యుద్ధంలోమరణించడం వల్ల అన్న ధర్మజుని మనసు వికలమై ఉన్నది. నీ వచనామృతధారలతో అతనికి ఊరట కలిగించు." అని అర్థించాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజు దగ్గరగా పోయి అతని చేతులు పట్టుకొని అనునయిస్తూ "బావా ధర్మజా! నీ కెందుకయ్యా ఈ మనోవేదన. నీ బంధు మిత్రులు రణరంగములో అవక్రవిక్రమంతో పోరాడి మరణించి వీరస్వర్గ మలంకరించారు. ఈ రాజరికం అంతా ఒక కల. ఒక్క రాజులే కాదు ఏ

మనిషికైనా పూర్ణాయుర్దాయము ఉంటుందని చెప్పగలమా!

ధర్మ నందనా! పూర్వము సంవర్తుడు అనే మహా ముని ఉండేవాడు. అతనికి దేవగురువు బృహస్పతి అంటే అసూయ. అతడు హిమాచల పర్వత ప్రాంతమున మరుత్తు చేత ఎన్నో యజ్ఞాలు యాగాలు చేయించాడు. కాని ఈమరుత్తు కూడా కాలప్రవాహంలో కలిసిపోయాడు.

సుహోత్రుడు అనే మహారాజు అశ్వమేధము మున్నగు యాగములు ఎన్నో చేసాడు. కాని అతను కూడా కాల గర్భంలో కలిసిపోయాడు. అలాగే అంగుడు అనే చక్రవర్తి ఎన్నోదాన ధర్మాలు చేసాడు. ఎందరికో వివాహములు జరిపించాడు. అతను కూడా కాలధర్మం చెందాడు. ఇంక శిబి చక్రవర్తి. ఏడు ద్వీపములలో తన రధము నడిపాడు. అనేక యజ్ఞ యాగములు చేసాడు. చివరకు మరణించాడు. ఉత్తమ గతులు పొందాడు.

అదే ప్రకారంగా దశరధపుత్రుడైన శ్రీరాముడు, భగీరధుడు, దిలీప చక్రవర్తి, మాంధాత, యయాతి, అంబరీషుడు, శశిబిందుడు, గయుడు, రంతిదేవుడు, భరతుడు, పృధు చక్రవర్తి వీరందరూ ఈ భూమిని ఏలిన చక్రవర్తులు. ఎన్నో యజ్ఞ యాగములు, దాన ధర్మములు చేసారు. కాని వారందరూ పరలోక గతులయ్యారు గానీ ఈభూమి మీద శాశ్వత నివాసము ఏర్పరచుకోలేదు.

అదే విధంగా జమదగ్ని కుమారుడైన పరశురాముడు 21 మారులు క్షత్రియుల నందరినీ జయించి ఈ భూమిని ఆక్రమించాడు. కాని ఆ భూమి నంతా కశ్యపునికి దానంగా ఇచ్చాడు. అతను కూడా కలకాలం ఈ భూమి మీద జీవించలేకపోయాడు.

వీరి కథలన్నీ నీవు అభిమన్యుని మరణ సమయమున శోక తప్తుడవై యుండగా నారదుని వలన విని ఉన్నావు. కాని ఇంకా నీ అవివేకమును మానకున్నావు." అని చెప్పి న కృష్ణుని తో ధర్మరాజు ఇలా అన్నాడు.

"కృష్ణా! సృజంయుని వృత్తాంతము వినవలెనని కోరికగా ఉన్నది. వివరించు." అని అడిగాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు ఇలా చెప్పనారంభించాడు.

"ధర్మనందనా! నీవు వ్యాసుని వలన నారదుని వృత్తాంతము మాత్రము విని ఉన్నావు. పర్వతుని వృత్తాంతము విన లేదు. అది కూడా చెబుతాను సావధానంగా విను.

నారదుని చెలియలి కొడుకు పర్వతుడు. ఇద్దరూ ఒక సారి దివి నుండి భువికి వినోదంగా విహరించడానికి వచ్చారు. ఆసమయంలో వారివురూ ఒక ఒప్పందం చేసుకున్నారు. ఒకరి మనసులో ఉన్న విషయములను మరొకరికి దాపరికం లేకుండా చెప్పాలని, అలా చెప్పని యెడల శాపగ్రస్థులవుతారని ఒప్పందం చేసుకున్నారు. అలా విహరిస్తూ ఒక రోజు వారు సృంజయుని చూచారు. అతని ఇంటిలో కొంతకాలం ఉందామని అనుకున్నారు.

సృంజయుడు తన కుమార్తె సుకుమారిని పిలిచి "అమ్మా! వీరు మహర్షులు. వీరి సేవ చేసి తరించు." అని పలికాడు. ఆమె అందుకు అంగీకరించింది. సుకుమారి సేవలతో నారదుడు పర్వతుడు ఆనందంగా కాలం గడుపుతున్నారు.

సుకుమారి అతి లోక సుందరి. ఆమె అందాన్ని చూచి నారదుడు ఆమె మీద మోహం పెంచుకున్నాడు. కాని బయటకు చెప్పుకోలేక లోలోపలే కృంగి

పోతున్నాడు. నారదుడు అలా చిక్కి పోవడం బాధపడటం చూచి పర్వతునికి అనుమానం కలిగింది. తన దివ్యదృష్టితో నారదుని మనసులో ఉన్న భావములను తెలుసుకున్నాడు.

నారదుడు తన మనసులోని మాట బయటకు చెప్పనందుకు కోపించాడు. "నారదా! నీకు సుకుమారి మీద మనసు ఉందన్న విషయం మన ఒప్పందం ప్రకారం నాకు నువ్వు చెప్పలేదు. అందుకని నేను నిన్ను శపిస్తున్నాను. నీవు ఆమెమీద మనసు పడ్డావు కాబట్టి ఆమెను వివాహం చేసుకోకుండా ఉండలేవు. ఆమెను వివాహం చేసుకున్న మరుక్షణం నీకు కోతి మొహం వస్తుంది." అని శపించాడు. దానికి నారదునికి కోపం వచ్చింది. "నీకు ఇంక స్వర్గ లోక ప్రవేశం లేకుండు గాక !"అని ప్రతి శాపం ఇచ్చాడు. పర్వతుడు అక్కడినుండి వెళ్లిపోయాడు.

తరువాత నారదుడు శాపమునకు భయపడకుండా, సృంజయుని అడిగి అతని కుమార్తెను వివాహం చేసుకున్నాడు. నారదునికి వెంటనే వానర రూపం వచ్చింది. అతని భార్య అతని కురూపమునకు అసహ్యించుకోకుండా, అతనికి సేవలుచేస్తూ సంతోషంగా సంసారం చేస్తూ ఉంది.

ఒకరోజు నారదుడు సమీపములో ఉన్న అడవికి వెళ్లాడు. అక్కడ అతనికి పర్వతుడు కనిపించాడు. "నారదా! నీవు ఇచ్చిన శాపము మరల్చవా!" అని అడిగాడు. "పర్వతా! నువ్వేకదా నాకు ముందుగా శాపం ఇచ్చింది. కాబట్టి ముందు నువ్వు నాకు ఇచ్చిన శాపం మరల్చు. తరువాత నా శాపం నేనువెనక్కు తీసుకుంటాను." అని అన్నాడు.

నారదుడు పర్వతుడు ఇద్దరూ తమ తమ శాపములను వెనక్కు తీసుకున్నారు. నారదునికి యధారూపము వచ్చింది. నారదుడు పర్వతుడు ఇంటికి వచ్చారు. సుకుమారి ఎవరో పరాయి వాళ్లు వచ్చారని తలచి మొహం తిప్పుకొని లోపలకు వెళ్లిపోయింది. ఆమె భర్తను గుర్తించలేదు. అప్పుడు పర్వతుడు "సుకుమారీ! ఇతను నారదుడు. నీ భర్త. నేను ఇచ్చిన శాపము చేత వానర మొహం వచ్చింది. ఈ రోజు నేను నా శాపం వెనక్కుతీసుకున్నాను. నీభర్తకు పూర్వరూపం వచ్చింది. ఇతడే నీ భర్త." అని పలికాడు. సుకుమారి కూడా తన భర్తను గుర్తించింది." అని చెప్పాడు కృష్ణుడు.

తరువాత కథను నారదుడు చెప్ప సాగాడు. "ధర్మనందనా! ఆ ప్రకారము నేను, పర్వతుడు సృంజయుని ఇంట్లో కొంతకాలం ఉన్నాము. కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఇంక మేము తిరిగి స్వర్గ లోకము వెళుదాము అని అనుకున్నాము. సృంజయునకు ఏదైనా ఉపకారం చేద్దాము అని అనుకున్నాము. సృంజయునకు దేవతలకన్నా ఉన్నతు డైన కుమారుడు కలుగుతాడు అని వరం ఇచ్చాను.

పర్వతుడు సందేహించాడు. నా వరం వలన దేవేంద్రునికి ఆపద కలుగుతుందని తలచి "సృంజయా! ఆకుమారుడు అర్ధాయుష్కుడు అవుతాడు." అని అన్నాడు. నాకు కోపం వచ్చింది. "సృంజయా! నీ కుమారుని నీకు చేతనైనంత వరకూ కాపాడుకో. నీ శక్తికి మించి కుమారునకు మరణం సంభవిస్తే, నన్ను తల్చుకో. నేను వచ్చి అతనికి ప్రాణదానం చేస్తాను. నీకు ఇంకొక వరంకూడా ఇస్తున్నాను. నీ కుమారుడు శరీరంలో నుండి వచ్చే ఉమ్మి మొదలగునవి సువర్ణమయం అవుతాయి. అందుకని అతడు సువర్ణష్ఠీవి అనే పేరుతో పిలువ బడుతాడు." అని అన్నాను.

నా మాటలకు సృంజయునకు సంతోషించాడు.  తరువాత మేము వెళ్లిపోయాము. నా వరం వలన సృంజయునకు ఒక కుమారుడు కలిగాడు. ఆ కుమారుని మలమూత్రములు, చెమట ఉమ్మి అన్నీ బంగారంగా మారి పోసాగాయి. సృంజయుని ఇల్లంతా బంగారంతో నిండిపోయింది.

ఈ విషయాన్ని కొంతమంది దొంగలు పసికట్టారు. ఒక రోజు ఆ దొంగలు సువర్ణష్టీవిని అపహరించి, నోట్లో గుడ్డలు కుక్కి సమీపములో ఉన్న అడవికి తీసుకొని వెళ్లారు. అతని ఒళ్లంతా వెతికారు. ఎక్కడా బంగారం కనపడలేదు. ఆ దొంగలు ఆ సువర్ణష్టీవిని చంపి అక్కడ పారవేసి పోయారు.

సృంజయుడు తన కుమారుని  కొరకు వెదికించాడు. ఎక్కడా దొరకలేదు.  నన్ను తలచు కున్నాడు. నేను అతని వద్దకు వెళ్లాను. జరిగిన విషయం తెలుసుకున్నాను. సువర్ణష్టీవిని దొంగలు చంపి పడవేసారని చెప్పాను. సృంజయుడు కుమారుని మరణానికి ఎంతో దుఃఖించాడు.  "సృంజయా!  నీ కుమారుడు యమలోకంలో ఉన్నాడు.  నీ కొడుకును నేను తెచ్చి ఇస్తాను." అని చెప్పి నేను సువర్ణష్ఠీవిని తిరిగిపునర్జీవుతుడిని చేసాను.సృంజయుడు చాలా సంతోషించాడు.  "సృం జయా! నీ కుమారుని చంపడానికి ఇంద్రుడు ఎదురు చూస్తున్నాడు. జాగ్రత్తగా ఉండు." అని చెప్పి వెళ్లిపోయాను.

దేవేంద్రుడికి తనకు సువర్ణష్ఠీవి వలన ఆపద కలుగుతుందని భయం పట్టుకుంది. తన వజ్రాయుధమును వ్యాఘ్రురూపంలో అతని మీద ప్రయో గించాడు.   ఆ సమయంలో సృంజ యుడు గంగానదీ తీరంలో భార్యలతో విహరిస్తున్నాడు. సమయం కోసం చూస్తున్న వజ్రాయుధం పెద్దపులి రూపం ధరించి సువర్ణష్ఠీవి మీద పడి చీల్చి చంపి మాయం అయింది.  సువర్ణష్ఠీవి మరణించాడు.

ఇది చూచి స్పృంజయుడు అతని భార్యలు పరుగు పరుగున వచ్చారు. కుమారుని మరణానికి దుఃఖించారు. వెంటనే స్పృంజయుడు నన్ను తలుచుకున్నాడు. నేను వెళ్లాను. ఆ బాలుడిని బతికించాను. తరువాత నేను వెళ్లిపోయాను. సువర్ణష్టీవి చిరంజీవిగా వేలాది సంవత్సరములు రాజ్యపాలన చేసాడు. కాబట్టి ధర్మరాజా! నీవు కూడా నీ పట్టుదల వీడి రాజ్యభారం వహించు." అని పలికాడు నారదుడు.

ధర్మరాజు ఏమీ మాట్లాడ లేదు. మరలా వ్యాసుడు ధర్మరాజుతో ఇలాఅన్నాడు.

"ధర్మజా! క్షత్రియులకు ప్రజా రక్షణ ను మించిన ధర్మము వేరే ఉన్నదా! దాని వలన వేద ములో చెప్పబడిన విప్రకర్మలు బాగుగా ఆచరించబడుతాయి. విప్రకర్మలు ఆచరించని ఎడల సమాజమునకు నష్టము సంభవిస్తుంది. వేద ములో చెప్పబడిన విప్రకర్మలు ఆచరించిన పుణ్యము, లేని ఎడల పాపము రాజుకు సంభవిస్తాయి. కాబట్టి నీకు ప్రజారక్షణ ముఖ్యము." అని పలికాడు వ్యాసుడు.

ధర్మరాజు వ్యాసుని చూచి ఇలా అన్నాడు." వ్యాసమహర్షీ! మీరు చెప్పినది నిక్కువమే. నేను కూడా మితిమీరిన రాజ్యకాంక్షతో యుద్ధము చేయడానికి పాల్పడ్డాను. నరమేధము చేసాను. చంపకూడని వారిని చంపాను. దాని వలన నా ఆత్మ దహించుకుపోతూ ఉంది. కాని మీరు చెప్పిన మాటలు వినక పోవడం కూడా భావ్యము కాదని పిస్తూ ఉంది. ఏమి చెయ్యడానికి తోచడం లేదు." అని అన్నాడు. దానికి వ్యాసుడు ఇలా అన్నాడు.

" ఈ పని చెయ్యాలి ఈ పని చెయ్యకూడదది అని నిర్ణయించడానికి

మనమెవరము. మనము నిమిత్తమాత్రులము. అంతా ఈశ్వరుని ఆజ్ఞ మేరకు జరుగుతూ ఉంటుంది. గొడ్డలితీసుకొని చెట్టును నరికితే ఆ పాపం గొడ్డలికి అంటుకుంటుందా చెప్పు. సర్వము పరమాత్మ ఆజ్ఞాను సారం చేస్తున్నాను అనే భావన కలిగిన నాడు నీకు ఏ పాపమూఅంటదు.

నీవు కర్మ చెయ్యి. కర్మ ఫలమును పరమేశ్వరునికి అర్పించు. జ్ఞానులందరూ వేదములో చెప్పబడిన కర్మలను పరమాత్మ పరంగానే చేస్తారు. అందు వలన వారికి ఏ పాపమూ అంటదు. యుద్ధములో శత్రువులను చంపాను. దాని వలన నాకు పాపం వచ్చింది అని నీవు అనుకుంటే దానికి తగిన ప్రాయశ్చిత్తము చేసుకో. యజ్ఞయాగములు చెయ్యి. పాప పరిహారం చేసుకో. అంతే కాని పాపమునకు భయపడి రాజ్యమును రాజ్యపాలనను, ప్రజారక్షణను వదలడం మంచిది కాదు." అని అన్నాడు వ్యాసుడు.

ధర్మరాజు వ్యాసుని చూచి "ఓ మహర్షీ! ఈ యుద్ధములో నా కొడుకులు, మనుమలు, అన్నలు, తమ్ములు, తండ్రులు, తాతలు, మామలు, గురువులు, సంబంధిలు, మిత్రులు, అల్లుళ్లు, బావలు, మరుదులు, మరియు ఎంతో మంది రాజులు, మహారాజులు, చక్రవర్తులు నా చేత చంపబడ్డారు. వారికి సంబంధించిన స్త్రీలు, వారి వారి భర్తలకోసం, కొడుకుల కోసం, తండ్రుల కోసం ఎంతో శోకిస్తున్నారు. ప్రాణాలుకూడా విడుస్తున్నారు. వాటిని అన్నింటినీ పరిశీలిస్తే, నాకు ఆ స్త్రీలను కూడా వధించిన మహా పాతకము చుట్టుకుంది. ఇన్ని పాపములు చేసిన నేను నిష్కల్మషుడను ఎలా అవుతాను. ఇంతగా పరితపిస్తున్న నా మనసు రాజ్యపాలనకు ఎలా సుముఖత చూపుతుంది. ఉగ్రమైన తపస్సు చేసి ప్రాణ త్యాగముచెయ్యడం కన్నా నాకు మరోదారి కనిపించడం లేదు." అని అన్నాడు.

ఆ మాటలు విన్న వ్యాసుడు ధర్మజునితో ఇలా అన్నాడు. "నీ మనసులో శోకమును, బాధను పక్కన బెట్టి నా మాటలు విను. నీవు చెప్పిన వారందరూ ఊరికే చావలేదు. రాజ్యమునకు ఆశపడి, వారి అభివృద్ధి, పేరు ప్రతిష్టల కోసం యుద్ధం చేసారు. చచ్చారు. వారి చావు వలన నీకు పాపం ఎలా చుట్టు కుంటుంది. వారికి ఏ కర్మపరిపాకమువలన మరణము సంభవించిందో నీకు ఎలా తెలుసు?

ఎవరిని ఎప్పుడు ఎలా చంపాలో యమునికి తెలుసు. ఆ ప్రకారమే యముడు మానవుల ప్రాణాలు తీస్తుంటాడు. దానికి నీవు కారణమని శోకించుట వెర్రి. అందుకోసం రాజ్య త్యాగము చేయుట, ఇల్లు విడిచి అడవులకుపోవుట ఇంకా పెద్ద వెర్రి. తోలుబొమ్మలాటలో బొమ్మలు ఆడినట్టు మనం ఆడుతున్నాము. మనలను ఆడించేవాడు వేరు ఉన్నాడు.

ఈ యుద్ధములో చనిపోయిన రాజుల రాజ్యములను వారి వారి కుమారులను పట్టాభిషిక్తులనుచెయ్యి. వారికి కుమారులు లేక పోతే వారి వారి కుమార్తెలను సింహాసనము మీద కూర్చోపెట్టు. దీని వలన వారి వారి తల్లులు సంతోషిస్తారు. నీకు కూడా పుణ్యము, కీర్తి వస్తాయి.

( ఇదే పని ఈ రోజుల్లో కూడా చేస్తున్నారు. ఒక ఎం. ఎల్. ఏ కానీ ఎం.పి.కానీ చని పోతే అతని భార్యనో, కొడుకునో,కూతురినో ఎన్నికలలో నిలబెట్టి వేరే పార్టీల వాళ్లు పోటీచెయ్యకుండా ఆపి, వారిని ఎన్నికయేట్టు చేస్తున్నారు.)

యుద్ధము లో జరిగిన నర మేధ గురించి నీవు చింతించ నవసరము లేదు దేవదానవ యుద్ధములో దేవేంద్రుడు రాక్షసులను అతికిరాతకంగా నరికి నెత్తురు ఏరులు పారించాడు. ఆ రాక్షసులు ఎవరు? ఇంద్రుని సోదరులే కదా!

మహా మునులందరూ ఇంద్రుడు చేసిన కార్యమును శ్లాఘించారు కదా! ఆ ఇంద్రునికి యజ్ఞ యాగములలో హవిర్భాగములను అర్పిస్తున్నారు కదా! మరి ఆ ఇంద్రుడే స్వర్గాధి పతిగా పాలిస్తున్నాడు కదా! మన భూలోకము పైన ఉన్నది స్వర్గలోకమే కదా!

అదే ప్రకారము దుష్టులైన నీ అన్నదమ్ములను బంధువులను, మిత్రులను పుణ్య మార్గమైన యుద్ధములో సంహరించావు. క్షత్రియధర్మము నిర్వర్తించావు. దేవేంద్రుని వలె నీవు కూడా రాజ్యపాలన కు అర్హుడవు. నీకు ఇష్టం అయితే ఇంద్రుని వలె యజ్ఞ యాగములు చెయ్యి. ముఖ్యంగా అశ్వమేధ యాగము చెయ్యి. అశ్వ మేధ యాగము చెయ్యాలంటే ధనము కావాలి కదా! ధనము కావాలంటే రాజ్యము కావాలి కదా! అందుకని రాజ్యము స్వీకరించు." అని అన్నాడు వ్యాసుడు.

ఈ మాటలతో ధర్మరాజు శోకం విడిచి పెట్టాడు. "వ్యాసమునీంద్రా! ఏ కర్మమునకు ఏ పాపం వస్తుంది. ఏ పాపమునకు ఏది ప్రాయశ్చిత్తము. దీనిని నాకు వివరంగా తెలపండి." అని అడిగాడు. వ్యాసుడు ధర్మరాజుడు ధర్మ సూక్ష్మములు వివరిస్తున్నాడు.

"ధర్మజా! సూర్యుడు ఉదయించే కాలంలోఅస్తమించే కాలంలో నిద్రపోవడం, అతిధి ఇంటికి వచ్చినపుడు సత్కరించకపోవడం, పరస్త్రీలను కామించడం, గురువు మాటకు ఎదురు చెప్పడం, ఉన్న ఊరును నాశనం చెయ్యడం, వేదవిద్యను అమ్ముకోడం, భగవంతు డిచ్చిన భూమిని అమ్ముకోడం, సేవకులకు ఆపద వచ్చినప్పుడు కాపాడకపోవడం, ఎల్లప్పుడూ కపటంగా ప్రవర్తించడం, అడవులను తగులపెట్టడం, స్వధర్మమును విడిచిపెట్టి పరధర్మమును ఆచరించడం, తనకు ఇచ్చిన పని చెయ్యక పోవడం,

(వీటిని నేటికి అన్వయించుకుంటే, స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులు ఎగ్గొట్టి సినిమాలకు, క్రికెట్ మాచ్ లకు వెళ్లడం పరధర్మము. స్కూలుకు కాలేజీకి వెళ్లి చదువుకోడం స్వధర్మము. ఆ సమయంలో ఇతరత్రా గడపడం పరధర్మం. అలాగే ఆఫీసుకు వెళ్లి తనకు అప్పగించిన పని చెయ్యడం స్వధర్మము. దానిని వదిలి వేరే విధంగా కాలక్షేపం చెయ్యడం పరధర్మము).

జంతువులను అకారణంగా కొట్టడం, హింసించడం, బ్రాహ్మణులకు చెందిన సంపదను హరించడం, తనను శరణు కోరిన వాడిని రక్షించకపోవడం, బ్రాహ్మణులను చంపడం మహా పాపములు అని పెద్దలు అంటారు.

కాని కొన్ని పనులు పైకి పాపములు గా కనిపించినా అవి నిందించ తగినవికావు. అవి ఏమిటంటే......... యుద్ధములో కత్తి తీసుకొని తనను చంపడానికి వస్తున్న వాడు వేదవిదుడైన బ్రాహ్మణుడైనా సరే, అతనిని చంపితే పాపం రాదు. (రైట్ ఆఫ్ సెల్ఫ్ డిఫెన్స్. సెక్షన్ 100 ఐ.పి.సి) అలాగే బ్రాహ్మణుని ఆస్తిని సంపదను ఎవరైన అపహరిస్తుంటే వారిని చంపడం పాపం కాదు. ప్రాణాపాయ పరిస్థితులలో, అన్నమునీళ్లు దొరకనప్పుడు, కల్లు తాగినప్పటికినీ, తాను తాగేది కల్లు అని తెలియకుండా తాగినప్పటికీ, దాని వల్ల పాపం పుణ్యకార్యములు చేస్తే పోతుంది.

ప్రాణహాని కలిగినప్పుడు, ప్రమాద కరమైన ఆపదలు కలిగినపుడు, బ్రాహ్మణుల ధనములు ఎవరైనా అపహరించి నపుడు, వివాహ సమయము లలో పెద్దల పనులు నిర్వర్తించేటప్పుడు, గురువులను రక్షించేటప్పుడు, స్త్రీలతో మాట్లాడేటప్పుడు, తనకు ఉన్న సంపదలు సర్వము నాశనమయ్యే సమయం లోనూ అబద్ధములు చెప్పినా అది పాపం కాదు.

ఎవరి కైనా స్వప్నములో స్ఖలనమైనచో అది తప్పుకాదు. అతని బ్రహ్మ చర్యము నకు భంగము వాటిల్లదు. అగ్నిలో నేతిని హోమం చేస్తే ఆ దోషం పోతుంది.

తన అన్న దుర్మార్గుడైనా, చెడు మార్గము పట్టినా, లేక సన్యాసము తీసు కున్నా అన్న భార్యను తాను భార్యగా స్వీకరించడం తప్పుకాదు. గోవులను రక్షించడం కోసం అడవులను తగల పెట్టడం, యజ్ఞయాగములలో పశువులను చంపడం, అర్హుడు కాని వాడికి దానం చెయ్యడం, తప్పుచేసిన సేవకుడిని శిక్షించకుండా వదలడం పాపాలుకావు.

( వ్యాసుడు ఏయే పనులు చేస్తే పాపము వస్తుందో ముందు చెప్పి, అవే పనులు ఏ పరిస్థితులలో చేస్తే పాపములు కావో చెప్పాడు. అలాగే, ప్రస్తుతం ఉన్న శిక్షాస్మృతి ఐ.పి.సి లో కూడా ముందు నేరముల గురించి చెప్పి, కొన్ని నేరములు ఏ పరిస్థితులలో నేరములు కావో జనరల్ ఎక్సెప్షన్స్ క్రింద చెప్పారు. దీనికి మూలం 4000 ఏళ్ల కిందట వ్యాసుడు చెప్పిన పైవిషయములు కావచ్చును అని మనం అనుకోవచ్చు. నేను పైన చెప్పిన సెక్షన్ 100 అందులోనిదే. )

ధర్మరాజా! ఇంక పై చెప్పిన పాపములకు పరిహారముచెబుతాను. శ్రద్ధగా విను. బ్రాహ్మణుని చంపిన దోషము పోవడానికి తాను చేసిన పని అందరికీ చెపుతూ, బిక్షాటనతో జీవిస్తూ, రోజుకు ఒక్కసారి మాత్రమే తింటూ, బ్రహ్మచర్యము అవలంబిస్తూ, నేలమీద పడుకుంటూ, 12 సంవత్సరములు నియమబద్ధంగా జీవితం గడపాలి. లేని ఎడల ఆరు సంవత్సరములు కృచ్ఛ్రము వ్రతం చెయ్యాలి. లేని యడల మూడు సంవత్సరములు చాంద్రాయణ వ్రతం చెయ్యాలి. అదీ కాని ఎడల, నెల కొక్క మారు తింటూ ఒక సంవత్సరము

ఉండాలి. అదీ కాని ఎడల, అశ్వమేధ యాగం చెయ్యాలి. బ్రాహ్మణులకు ఒక లక్ష గోవులను కానీ, వంద గుర్రములు కానీ దానం చెయ్యాలి. దీనితో బ్రాహ్మణుల ధనాపహరణ పాపము, బ్రహ్మ హత్యా పాతకం నశిస్తాయి.

ఇంక సురాపానముచేసిన పాపమునకు ఆ మద్యమును ఎర్రగా కాచి దానిని వాడి చేత తాగించాలి. లేక కళ్లు మూసుకొని నిప్పులలో దూకాలి. లేక మహా ప్రస్థానం చెయ్యాలి. లేక బృహస్పతి యాగము చెయ్యాలి. లేక భూదానము చెయ్యాలి. అలా చేసే సురాపానముచేసిన పాపం తొలగి పోతుంది.

గురువు గారి భార్యను కామించిన వాడిని బాగా ఎర్రగా కాల్చిన ఇనప స్త్రీ విగ్రహమును కౌగలించుకొనేట్టు చెయ్యాలి. లేక తన పురుషాంగమును కోసి చేత్తోపట్టుకొని ఆకాశం చూస్తూ మరణించాలి. లేక యుద్ధములో తన గురువుగారికోసం మరణించాలి. లేక తనకు ఉన్న ధనము నంతా విప్రులకు దానం చెయ్యాలి.

బ్రాహ్మణుని వద్దనుండి బంగారము దొంగిలించిన వాడు, వాడి దగ్గర ఉన్న అదేపరిమాణముగల బంగారము తిరిగి ఇచ్చెయ్యాలి. అబద్ధం ఆడిన పాపానికి, ఆ అబద్ధం వలన ఎవరికి అపచారం జరిగిందో వాడికి సంతోషం కలిగేట్టు చెయ్యాలి. గురువును ఎదిరించిన పాపానికి ఆ గురువుకు నమస్కరించి గురుదక్షిణ ఇస్తే సరిపోతుంది.

ఇతరుల భార్యలను కామించిన పాపానికి ఒక సంవత్సరం కృచ్ఛము వ్రతం చెయ్యాలి.

(మనకు కృచ్ఛము వ్రతం అని రెండు సార్లు వచ్చింది. దీనికి వివరణ తిరుపతి తిరుమల దేవస్థానం వారు ప్రచురించిన శ్రీమదాంధ్ర మహా భారతము వ్యాఖ్యానములో దొరుకుతుంది. దానిని మీకు అంద జేస్తున్నాను.
కృచ్ఛము అనగా మూడు రోజులు పగలు భోజనం చేసి, మూడు రోజులు రాత్రి భోజనం చేసి, మూడు రోజులు ఎవరినీ అడగ కుండా తనకు దొరికింది తిని, మూడు రోజులు అసలు ఏమీ తినకుండా ఉపవాసం ఉండే వ్రతం.).

తనకు వరస కాని స్త్రీని కామించిన వాడికి తడిబట్టలు కట్టుకొని బూడిదలో పడుకుంటే, ఆరునెలలలో పోతుంది. ( ఈ పాపం ఈ నాడు ఇంసెస్టు అనే పేరుతో విదేశాలలో విస్తృతంగా ఉంది. ఈ భయంకరమైన జాడ్యం ఇంటర్‌నెట్ పుణ్యమా అని మన దేశంలోకూడా క్రమ క్రమంగా వ్యాప్తి చెందుతూ ఉంది).

పరపురుషునితో సంగమించిన స్త్రీకి, రజో దర్శనంతో ఆ మలినం పోయి, ఆ పాపం నుండి విముక్తి పొందుతుంది.

( ఇక్కడ సూక్ష్మం గమనించండి. రజోదర్శనం అయిందంటే ఆమెకు ఆ పరపురుషుని వలన గర్భం రాలేదు అని అర్థం.)

నరకకూడని చెట్టును నరికినా, జంతువులను చంపినా, దాని వలన కలిగే పాపము మూడు రోజులు నిరాహారంగా ఉపవాసం ఉంటేపోతుంది. ఇంకా, తెలిసి చేసినవి, తెలియకుండా చేసిన పాపాలు, మితంగా ఆహారం తీసుకుంటూ, ఉదయం, సాయంత్రం, గాయత్రీ మంత్రం జపం చేస్తే పోతాయి. పూర్వ జన్మలలో చేసిన పాపాలు పోవాలంటే మంచి పనులు చేస్తూ, దానధర్మాలు చేయాలి. అంతేగాని, నాస్తికులు, శ్రద్ధ, వినయము లేని వారు

ఏమీ చేసినా వారు చేసిన పాపములు పోగొట్టుకొనలేరు.

నీవు ఆస్తికుడవు. వినయము శ్రద్ధ పుష్కలంగా కలిగినవాడవు. కాబట్టి నీవు స్వల్పంగా ప్రాయశ్చిత్తములు చేసుకుంటే అన్ని పాపాలుపోతాయి. నీవు చేసిన పాపమల్లా యుద్ధం చెయ్యడం. అందులో వీరులను చంపడం. దానిని మనం ఆత్మ రక్షణ కోసం చేసింది, క్షత్రియ ధర్మం కోసం చేసింది  కాబట్టి పాపం కాదు అని నిరూపించాము.  అదియును కాక నీ మనస్సులో  పుట్టిన కరుణ, పశ్చాత్తాపము నిన్ను పరిశుద్ధునిగా చేసాయి. కాబట్టి నీవు ఏ తపస్సు చెయ్య నవసరం లేదు.  క్షత్రియునకు  సహజమైన రాజ్యపాలన చేయుము."  అని పలికాడు వ్యాసుడు.

అప్పుడు ధర్మరాజు వ్యాసునితో  "మహాత్మా! తాగకూడ నివి ఏవి? తినకూడనివి ఏవి? ఎవరు యోగ్యులు ఎవరు అయోగ్యులు." వివరంగా చెప్పండి అని అడిగాడు.

దానికి వ్యాసుడు ఇలా చెప్పసాగాడు. "ధర్మనందనా!  గుర్రము, ఒంటె, గాడిద పాలు తాగ కూడదు. బ్రాహ్మణుడు ఆడ గుర్రము, ఆడ ఒంటె, ఆడ గాడిద...  దరి దాపులకు కూడా వెళ్ల కూడదు.  మనిషి పాలు అసలు తాగ కూడదు.  ఈనిన పది రోజుల లోపల ఆవు పాలు తాగకూడదు. ప్రేతము వెడలిన ఇంటి  అన్నమును, పురుటి ఇంటి అన్నమును, తలారి ఇచ్చిన అన్నమును, కులట ఇచ్చిన అన్నమును, స్త్రీ సంపాదన మీద బతికే వాడు ఇచ్చిన అన్నమును,  ఆట పాటలతో జీవించే వాడు ఇచ్చిన అన్నమును, జూదరి ఇచ్చిన అన్నమును, పూలమ్ముకొనే వాడు ఇచ్చిన అన్నమును, ఊరి నుండి కాని కులము నుండి వెలి వేసిన వాడు ఇచ్చిన అన్నమును,  అన్న కంటే ముందు పెళ్లి చేసుకున్న వాడు ఇచ్చిన అన్నమును,  తినరాదు. అవి అభోజ్యములు.

ఇతరులను పొగుడుతూ బతికే వాడి చేతి అన్నము అత్యంత హేయము. ఇంకా నిలవ ఉన్న అన్నము, పాచిపోయిన అన్నము తినకూడదు. సురాపానంతో సంబంధించిన అన్నము ఏదైనా తినకూడదు.

పులగము, పాయసము, అప్పములు, నువ్వులతో చేసిన వంటకములు దేవునికి అర్చన చేసి నివేదన చేసి మాత్రమే తినవలెను. మామూలుగా వండుకొని తినరాదు.

గృహస్థాశ్రమ ధర్మమును పాటించేవారు, దేవతార్చన చెయ్యకుండా, దేవతలకు నివేదన పెట్టకుండా, పితృదేవతలకు పెట్టకుండా, అతిథులకు పెట్టకుండా భుజించరాదు.

గృహస్థుడు అయిన వాడు, భార్య బిడ్డలు, బంధువులతో సంచరిస్తూనే అంటీ అంటకుండా ఉండాలి. వారి ప్రేమానురాగములలో పూర్తిగా మునిగి పోకూడదు.

ధర్మ నందనా! ఇంక అయోగ్యుల గురించి చెబుతాను విను. పాటలు పాడుతూ, నృత్యములు చేసి జీవించేవారూ, విదూషకులు, దుర్జనులు, నపుంసకులు, మోసగాండ్రు, వేదము చదవని వారు, తక్కువ కులము వారు, ఇతరులకు హాని చెయ్యడమే వృత్తిగా కలవారు, వీరు దానము స్వీకరించడానికి అర్హులు కారు. పేదవారు, ఆపదలలో ఉన్న వారు, దానానికి అర్హులు. నీకు దాన గుణం ఎక్కువగా ఉన్నా, పెద్ద వారికి దానం చెయ్యడం వల్ల ప్రయోజనం ఉండదు. అపాత్ర దానము మంచిది కాదు.

అర్హులుకాని వారికి  దానం చేస్తే నపుంసకునకు కన్యను దానం చేసినట్టు, బూడిదలో నెయ్యి పోసినట్టు,  ఓటి కుండలో నీళ్లు పోసినట్టు అవుతుంది. దానము పుచ్చుకునే దానికి అర్హుడైన వాడికి దానం చేస్తే దానం చేసిన వాడు, పుచ్చుకున్నవాడు, ఈ లోకంలో నే కాదు పరలోకంలోకూడా సుఖమును సంతోషమును  పొందుతాడు. ధర్మరాజా! నేను నీకు సంక్షిప్తంగా మంచీ చెడు గురించి వివరంగా చెప్పాను. నా పలుకులు మన్నించి నియమం ప్రకారం ప్రవర్తించు." అని అన్నాడు వ్యాసుడు.

అప్పుడు ధర్మరాజు వ్యాసునితో ఇలా అన్నాడు. "మహాత్మా!మీరు చెప్పిన మాటలు నా మనసుకు చాలా హర్షమును కలిగించాయి. మీరు ఆనతిచ్చిన ప్రకారము నేను ధర్మ మార్గము అవలంబించి  రాజ్యభారము వహించి అమంగళం కలగ కుండా చూస్తాను.  నా మీద కృపతో మీరు రాజధర్మములు, వర్ణాశ్రమ ధర్మములు, ఆపద్ధర్మములు నాకు తెలియ చెప్పండి. నాకు చూడగా రాజధర్మము, ధర్మాచరణము పరస్పర విరుద్ధముగా తోచుచున్నవి. అందుకని ఈ విధంగా అడుగుతున్నాను." అని అన్నాడు.

ఆ మాటలకు వ్యాసుడు పక్కనే ఉన్న నారదుని చూచి "నారద మహర్షీ! ఈ మహారాజును  భీష్ముని వద్దకు వెళ్లాలి. భీష్ముని వలననే  ఇతడు సకల ధర్మములు తెలుసుకొనుటకు అర్హుడు." అని అన్నాడు.

అవును "మహర్షీ! మీరుచెప్పినది యుక్తముగా ఉన్నది." అని అన్నాడు. అప్పుడు వ్యాసుడు  ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"ధర్మనందనా! భీష్ముడు కురువృద్ధుడు. ఇంద్రాదులకు కూడా పూజనీయుడు. కుటిలత్వము అంటే తెలియని వాడు. పరశురాముని వలన

విలు విద్యారహస్యములు నేర్చినవాడు. సుగుణాలకు పుట్టినిల్లు. భీష్ముడు పరమ పవిత్రమైన గంగాదేవి గర్భవాసాన జన్మించినవాడు. ఆయనకు తెలియని ధర్మములు లేవు. చ్యవనుడు, మార్కండేయుడు, వశిష్ఠుడు మొదలగు మహా ఋషుల వల్ల ధర్మసూక్ష్మములు నేర్చినవాడు. ఆయన స్వచ్ఛంద మరణము వరముగా పొందిన వాడు. తన ప్రాణములను తగిన సమయములో వదలడానికి మేనిలో నిలుపుకొని ఉన్నాడు. అంతటి మహానుభావుడు. బీష్మునికి నీవు అంటే ఎంతో అభిమానము. నీవు అతని వద్దకు వెళ్లు. అతడు నీకు జ్ఞానమును, ధర్మమును ప్రబోధించగలడు. దీని వలన నీవు కీర్తిమంతుడవు అవుతావు. ఇదిమా అందరి అభిమతము. పైగా భీష్మునికి అవసాన కాలము సమీపిస్తూ ఉంది. ఇంక ఆలస్యము చేయకుము." అని అన్నాడు.

దానికి ధర్మరాజు "మునివర్యా! ఎంతో మంది బంధువులను, మిత్రులను వధించిన వాడను. ఆయన ఎదుట ఎలా నిలవ గలను? విలు విద్యా విశారదుడైన భీష్ముని కృత్రిమ సమరంలో కూల్చిన పాతకుడిని. మరలా ఆయన ఎదుటగా పోయి, ఆయన మొహం చూస్తూ నాకు ధర్మములు ప్రబోధించమని ఎలా అడగ గలను." అని అన్నాడు.

దానికి శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "ధర్మజా! అలా అనుకోడం ఎందుకు. నీవు వ్యాసమహాముని ఆజ్ఞ మేరకు భీష్ముని వద్దకు వెళుతున్నావు. కాని ఈ శోకంలో వెళ్లడం మంచిది కాదు. ముందు నీవు రాజధానికి వెళ్లు తరువాత భీష్ముని వద్దకు వెళ్ల వచ్చు. ఇప్పుడే వెళ్లాలని లేదు కదా! నీ కోసం బ్రాహ్మణులు, నీతమ్ములు, పురజనులు ఎదురు చూస్తున్నారు. హస్తినా పుర ప్రవేశము చేసి వారందరికీ ఆనందం కలిగించు." అని పలికాడు.

ఈ ప్రకారంగా వ్యాసుడు, నారదుడు, దేవలుడు, శ్రీకృష్ణుడు చెప్పిన

మాటలతో తన శోకమును వదిలిపెట్టిన ధర్మరాజుకు  రాజ్యపాలన పట్ల ఆసక్తి కలిగింది.  ధర్మరాజు ఆ మునులందరికీ ప్రదక్షిణము చేసి నమస్కరించి, వారి ఆశీర్వాదములు తీసుకొన్నాడు.  తరువాత ఆ మునులు తమ తమ స్థానములకు వెళ్లారు.

తరువాత ధర్మరాజు దేవతలను, బ్రాహ్మణులను పూజించాడు. తన దర్శనము కోసం వేచి ఉన్న సామంత రాజులను కలుసుకున్నాడు. వారు ఇచ్చిన కానుకలను స్వీకరించాడు.

మరునాడు వేకువనే లేచి అభ్యంగన మాచరించి, తెల్లని వస్త్రములు, విలువైన నగలు అలంకరించుకున్నాడు. పదునారు తెల్లని  గుర్రములను కట్టినరథమును అధిరోహించాడు. భీముడు సారథి స్థానములో కూర్చున్నాడు. అర్జునుడు వెనక నిలబడి తెల్ల గొడుగు పట్టుకున్నాడు. నకుల సహదేవులు వింజామరలు వీస్తున్నారు.   శ్రీకృష్ణుడు సాత్యకి పక్కన ఉన్నారు. వాద్యఘోష మిన్నుముట్టింది. విదురుడు, కుంతీదేవి, ఇతర అంతఃపుర స్త్రీజనములు వారి వారికి ఉచిత మైన వాహనములలో, పల్లకీలలో వస్తున్నారు.  సామంత రాజులు తమ తమ సైన్యములతో అన్ని పక్కలనుండి అనుసరిస్తున్నారు.  ఈ ప్రకారంగా ధర్మరాజు హస్తినాపురానికి పయనమయ్యాడు.  వంది మాగధులు ధర్మరాజు గుణగణాలను, కురు వంశ చరిత్రను  కీర్తిస్తున్నారు.  వేద పండితులు  వేదపఠనం చేస్తున్నారు. ఆ ప్రకారంగా ధర్మరాజు హస్తినాపుర ప్రవేశం చేసాడు.

హస్తినాపురప్రజలు అంతకు ముందే  నగరమును  పచ్చని తోరణములతో అలంకరించారు. అరటి చెట్లు గుమ్మములకు కట్టారు. పూర్ణ కలశములను ఇంటిముందు అలంకరించారు.  కస్తూరితో కళాపు చల్లి

ముత్యాలముగ్గులతో తీర్చి దిద్దారు. ఆ బాలగోపాలము నూతన వస్త్రములు ధరించారు. అంతటా పండగ వాతావరణం నెలకొంది.

ధర్మరాజు రాజవీధిలో ప్రవేశించాడు. ధర్మరాజును చూచి హస్తినా పుర వాసులు తమలో తాము ఇలా అనుకుంటున్నారు.

“నలుదిక్కుల రాజులను జయించిన అజాత శత్రువు ఇతడే. రాజసూయ యాగము చేసి బ్రాహ్మణులకు ధన,కనక,రత్నములను దానముగా ఇచ్చినది ఇతడే! సత్యమునే నిత్య వ్రతముగా పాలించునది ఇతడే! ధర్మనిరతుడు అని చెప్పతగ్గవాడు అతడొక్కడే! శత్రురాజులను జయించి విజయలక్ష్మిని వరించి నది ఇతడే!” అని ధర్మరాజును పొగుడుతున్నారు. మరి కొంత మంది భీమార్జున నకుల సహదేవులను పొగుడుతున్నారు. వారి పొగడ్తలు మిన్నుముడుతున్నాయి. వ్రతములు చెయ్యడంలోనూ, అదృష్టంలోనూ ధైర్యములోనూ ద్రౌపదిని మించిన మహా పతివ్రత మరొకరు లేదు. అని అనుకుంటున్నారు.

అప్పుడు ధర్మరాజు రాజమందిర ద్వారముదగ్గరకు వచ్చాడు. బ్రాహ్మణులు, పుణ్యస్త్రీలు, శోభన ద్రవ్యములతో ఎదురు వచ్చారు. వారు ఇచ్చినవి పుచ్చుకొనుచూ ధర్మరాజు గజశాల దగ్గర తన రథము దిగాడు. పురోహితుడైన ధౌమ్యుడు, పెదనాన్న ధృతరాష్ట్రుడు మున్నగువారితో సహా అతఃపురము ప్రవేశించాడు. గృహ దేవతలకు పూజలు చేసాడు. తరువాత బయటకు వచ్చాడు. నగర దేవతలకు పూజలు చేసాడు. బ్రాహ్మణ సంఘములను పిలిపించాడు. వారికి బంగారము, గోవులు దానంగా ఇచ్చాడు. వారి ఆశీర్వాదములు తీసుకున్నాడు.

ఆ సమయములో సుయోధనునికి మిత్రుడైన చార్వాకుడు అనే రాక్షసుడు బ్రాహ్మణుని వేషంలో వచ్చాడు. తక్కిన బ్రాహ్మణులతో కలిసిపోయి ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"ఓ ధర్మరాజా! సకల బ్రాహ్మణులు నన్ను తమ ప్రతినిధిగా పంపారు. వారి సందేశం విను. మహాపాపములు చేసిన వాడు ఇతడేమి రాజు? తండ్రులను, అన్నలను, తమ్ములను, పుత్రులను శంక లేకుండా చంపాడు. విద్య నేర్పిన గురువు అని కూడా చూడకుండా ద్రోణుని చంపాడు. వీడిజన్మ ఎందుకు కాల్చనా! ఈ ప్రకారంగా అందరూ నిన్ను అసహ్యంచుకుంటున్నారు. ఇంకా నీకీ రాజ్యమెందుకు? బంధువుల నందరినీ చంపి రాజభోగములు అనుభవి స్తున్నావా! నీకు మహా పాపం చుట్టుకుంటుంది." అని పలికాడు.

చార్వాకుని మాటలు విన్న బ్రాహ్మణులు ఒకరి మొహం ఒకరు చూచుకున్నారు. ధర్మరాజు వారి వంక చూచి చేతులు జోడించి "బ్రాహ్మణోత్తములారా! నేను మీకు మ్రొక్కి వేడుకుంటున్నాను. నన్ను మీరు నిందించకండి. ఆదరించండి వ్యాసుడు, నారదుడు మొదలగు మహా మునులు ఆజ్ఞాపిస్తేనే నేను ఈ రాజ్యపాలనకు ఒప్పుకున్నాను." అని ప్రార్థించాడు.

అప్పుడు ఆ బ్రాహ్మణులు "మహారాజా! ఈ మాటలు మావి కావు. ఎలా వచ్చాయో తెలియడం లేదు. నీవు ఉత్తమక్షత్రియ ధర్మంతో సముపార్జించిన ఈ రాజ్యలక్ష్మి సుస్థిరతను పొందుతుంది." అని ఆశీర్వదించారు. వెంటనే చార్వాకుని వంక చూచారు. దివ్యదృష్టితో అతడు సుయోధనుని అనుయాయుడు అని తెలుసుకున్నారు.

"మహారాజా! వీడు బ్రాహ్మణుడు కాదు. సుయోధనుని మిత్రుడగు రాక్షసుడు. కపట సన్యాసి వేషంలో వచ్చాడు. మిమ్మల్ని అనరాని మాటలన్నాడు. వీడు కుక్కలాగా మొరిగిన మాత్రాన మీ కీర్తికి కళంకం కలుగుతుందా! ధర్మాత్ములగు నీ తమ్ముల సాయంతో ఈ సామ్రాజ్య లక్ష్మిని చేపట్టుము." అని పలికారు.

వెంటనే ఆ బ్రాహ్మణులంతా ఆ చార్వాకుని చూచి ఒక్కసారి హుంకరించారు. ఆ హుంకారానికి వాడు భయంకరమైన తన నిజ స్వరూపము ధరించి భస్మము అయి పోయాడు. ధర్మరాజు ఆ బ్రాహ్మణులందరినీ ఆదరించి పంపించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"ధర్మ నందనా! కృతయుగంలో చార్వాకుడు అనే రాక్షసుడు బ్రహ్మను గూర్చి ఘోర తపస్సు చేసాడు. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షం అయ్యాడు. ఆ చార్వాకుడు తనకు సకల భూతముల వలన భయం లేకుండా వరం ఇమ్మని అడిగాడు. అప్పుడు బ్రహ్మదేవుడు "నీవు బ్రాహ్మణులకు ఇష్టంలేని పనులు చెయ్యవద్దు. వాళ్లకు కోపం తెప్పించవద్దు అలా చేసిననాడు నీకు అదే ఆఖరి రోజు." అని ఆ రాక్షసుడు కోరిన వరం ఇచ్చాడు.

ఆప్రకారంగా బ్రహ్మదేవుని వలన వరం పొంది ఆ చార్వాకుడు దేవతలను బాధించసాగాడు వారందరూ బ్రహ్మదేవుని వద్దకు పోయి చార్వాకుని నుండి తమను రక్షించమని మొర పెట్టుకున్నారు. బ్రహ్మదేవుడు వారిని చూచి "ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు. అందుకని నేను తగిన ఏర్పాటు ముందే చేసాను. ద్వాపర యుగంలో సుయోధనుడు అనే రాజుకు ఈ చార్వాకుడు మిత్రుడిగా ఉంటాడు. అప్పుడు ఈ చార్వాకుడు బ్రాహ్మణులకు

మనోవ్యధ కలిగించే పనులు చేస్తాడు. ఆ కారణంగా వారి కోపమునకు బలియై భస్మమైపోతాడు." అని చెప్పాడు. ఆ ప్రకారం గానే ఆ రాక్షసుడు నేడు ఇక్కడకు వచ్చాడు. బ్రాహ్మణుల కోపానికి బలైపోయాడు." అని చెప్పాడు.

శ్రీ కృష్ణుడు ఇంకా ఇలా అన్నాడు. "ధర్మరాజా! నిన్ను ఎదిరించిన వారిని నాశనం చెయ్యి. ప్రజలను కన్నబిడ్డలవలె పాలించు. బ్రాహ్మణులను ఆదరించు. సమస్త బంధువులు ఆశ్రితులు సుఖంగా ఉండేట్టు చూడు. కురు సామ్రాజ్య మునకు పట్టాభిషిక్తుడివి కమ్ము ." అనిపలికాడు.

పట్టాభిషేకమునకు తగు ఏర్పాట్లు జరిగాయి. కురు మహా సభలో ఎత్తైన బంగారు సింహాసము ఏర్పాటుచేసారు. పెద్దలకు మంత్రులకు సామంతులకు సైన్యాధ్యక్షులకు ఎవరికి తగిన ఆసనములు వారికి ఏర్పాటు చేసారు.

ఒక శుభ ముహూర్తాన ధర్మరాజు మనసులో బాధను దిగమింగుకొని, బంగారు సింహాసనం మీద తూర్పుముఖంగా కూర్చున్నాడు. అతని ఎదురుగా మరొక బంగారు ఆసనము మీద సాత్యకీ సమేతంగా శ్రీకృష్ణుడుకూర్చున్నాడు. ధర్మరాజుకు ఇరు పక్కలా మణిమయ పీఠములమీద భీమార్జునులు కూర్చున్నారు. వెనక పక్క బంగారు పీఠముల మీద నకుల సహదేవులు కూర్చున్నారు. వారి పక్కన కుంతీ దేవి ఒక ఉచితాసనము మీద కూర్చుంది. శ్రీకృష్ణుని దక్షిణ భాగంలో ఒక ఉజ్వలమైన ఆసనం మీద ధృతరాష్ట్రుడు కూర్చున్నాడు. అతనికి తూర్పు పడమర దిక్కున విదురుడు, ధౌమ్యుడు కూర్చున్నారు. ధృతరాష్ట్రుని వెనక భాగాన అర్హమైన పీఠముల మీద గాంధారి, యుయుత్సుడు, సంజయుడు కూర్చున్నారు.

ఆ సమయమున కృపా చార్యుడు అక్కడకు వచ్చాడు. ధర్మరాజు

ఆయనకు ధౌమ్యుని సమీపంలో ఉచితాసనము ఏర్పాటు చేసాడు.

అప్పుడు ధర్మరాజు తెల్లని పూలతోనూ,అక్షితలతోనూ, బంగారు, వెండితోనూ భూదేవిని అర్చించి ఆమెను తాకాడు. పండితులు, వివిధ దేశాధీశులు, మంత్రులు, ఉన్నతోద్యోగులు, వ్యాపార వేత్తలు, పరిచర్యలు చేసే సేవకులు, వైశ్యప్రముఖులు, పౌర సంఘములు, కర్షకులు,జానపదులు, గాయకులు, విదూషకులు, వేశ్యలు మొదలగు వారంతా ధర్మరాజును దర్శించుకున్నారు. ధర్మరాజు వారికి ఉచితమైన కానుకలు ఇచ్చిసత్కరించాడు.

ఇంతలో అభిషేక ద్రవ్యములు సిద్ధమైనాయి. శ్రీకృష్ణుని అనుమతితో ధౌమ్యుడు ఈశాన్య దిక్కుగా ఉన్న వేదికను అలంకరించాడు. అందు నవరత్నఖచితమైన సింహాసనము ప్రతిష్టింపచేసాడు. దాని మీద పెద్దపులి తోలు కప్పాడు. శంఖమును అక్కడ స్థాపించి పూజించాడు. దాని చుట్టూ బంగారు పాత్రలలో గంగా జలం నింపి వాటిని మంత్రపూతంగా ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, ఆవుపంచితము, గోమయము మొదలగు పంచగవ్యములతో శుద్ధి చేసాడు. ధర్మరాజు చుట్టు బ్రాహ్మణులు మంత్ర పఠనం చేస్తున్నారు.

ధౌమ్యుడు ధర్మరాజును తన వెంట తీసుకొని పోయి సింహాసనం మీద కూర్చోపెట్టాడు. ఎదురుగా అగ్నిని వేల్చి దేవతా యజ్ఞం చేసాడు. ఇంతలో శుభ ముహూర్తము సమీపించింది.

శ్రీకృష్ణుడు ధర్మరాజును సమీపించి, పూజింపబడిన శంఖము పైకి ఎత్తి “ధర్మరాజా! నీవు ఈ కురు సామ్రాజ్యమునకు అధిపతివి కమ్ము” అని అభిషేకించాడు.

ఆ సమయంలో ప్రశాంత చిత్తుడైన ధృత రాష్ట్రుడు ధౌమ్యుడు ఒక బంగారు కలశమును తన చేతికి అందివ్వగా, అందున్న గంగా జలముతో ధర్మరాజును అభిషేకించాడు.

తరువాత వరుసగా వారి వారి ప్రాధాన్యముల ప్రకారము అందరూ ధర్మరాజును అభిషేకించారు. శంఖములు, భేరీ మృదంగ ధ్వానములు మిన్నుముట్టాయి. ఈ ప్రకారంగా ధర్మరాజు కురు సామ్రాజ్యము నకు పట్టాభిషిక్తుడయ్యాడు.

ఆ సందర్భంగా బ్రాహ్మణులకు, పేదలకు ఎన్నో దాన ధర్మాలు చేసాడు. అప్పుడు పండితులైన బ్రాహ్మణులు ధర్మరాజుకు ఎదురుగా నిలబడి "దేవా! దైవబలము, మానుష బలము రెండూ కలిసినఫలితంగా మానవాతీతమైన ఈ విజయము, వసుధాధిపత్యము నీకు సంప్రాప్తించాయి. " అని పలికారు.

దానికి ధర్మరాజు "అయ్యా! మీరు చెప్పిన సద్గుణములు నాలో ఉన్నాయో లేవో కాని, మీరందరూ ఇలా అంటుంటే పాండవులందరూ అదృ ష్టవంతులు అని నేను భావిస్తున్నాను." అని ధృతరాష్ట్రుని చూచి

"మాకు తండ్రి, గురువు, దైవము ఇతడే. ఇతని ఆజ్ఞలు అమలు చేయడం మీ కర్తవ్యం. మునుపటి మాదిరి మీరందరూ ఇతనిని గౌరవించండి ఆదరించండి. అదే మాకు ప్రియము. మేము జ్ఞాతులను చంపి, ఈ సింహాసనం అధిష్టించడం, ధృతరాష్టుని సేవించడం కోసమే. మనకందరకూ అధిపతి ఈ ధృతరాష్ట్రుడే అని మీరందరూ మరువ వద్దు" అని పలికాడు.

తరువాత సభ చాలించాడు. ధృతరాష్ట్రుని గాంధారిని

రాజప్రాసాదములోనికి పంపాడు. పౌరులను, జానపదులను సభవిడిచి పోవడానికి అనుజ్ఞ ఇచ్చాడు. కృపాచార్యుని సగౌరవంగా ఆయన నివాసానికి పంపాడు.

యువరాజుగా భీమసేనుని నియమించాడు. మంత్రాంగము నిర్వర్తించుటకు విదురుని మంత్రిగా నియమించాడు. న్యాయ వ్యవహారములు పర్యవేక్షించడానికి సంజయుని నియమించాడు. సైనికుల నియామకమునకు, వారి జీతభత్యముల గురించి నిర్ణయము తీసుకొనుటకు, సకల కార్య నిర్వహణకు నకులుని నియమించాడు. అహంకారులను, దుష్టులను శిక్షించుటకు, పరాయి రాజ్యముల మీదికి దండెత్తుట జయించుట తదితర కార్యములకు అర్జునుని నియమించాడు.

బ్రాహ్మణ కార్యములకు, శ్రౌత, స్మార్త కర్మల అనుష్టానమునకు ధౌమ్యుని నియమించాడు. సహదేవుని తన ఆంతరంగిక కార్యదర్శిగా, ప్రధాన అంగరక్షకునిగా నియమించుకున్నాడు. మిగిలిన అధికారములను అర్హత కలవారికి అప్పగించాడు.

యుయుత్సుని, విదురుని, సంజయుని చూచి "మీరు ప్రతి దినము రాచనగరులో వారి యోగక్షేమములు పర్యవేక్షించండి. ప్రజాహిత కార్యములను ఆయా అధికారులకు అప్పగించి అవి సక్రమంగా నిర్వర్తిపబడేట్టు చూడండి." అని ఆజ్ఞాపించాడు. కుంతీదేవిని ద్రౌపదితో సహా అంతఃపురమునకుపంపాడు.

తరువాత బ్రాహ్మణుల అనుమతితో యుద్ధములో చనిపోయిన బంధువు

లందరికీ శ్రాద్ధ కర్మలు భక్తితో నిర్వర్తించాడు. వారి పేరుతో ఎన్నో దానధర్మాలు చేసాడు. (

ద్రోణాచార్యులకు, ద్రుపదునకు, వారి వారి బంధువులకు, విరాటునికి వారి జ్ఞాతులకు, ప్రత్యేకంగా కర్ణునికి, అభిమన్యునికి పరలోక క్రియలు నిర్వర్తించాడు. వారి పేరుతో బ్రాహ్మణులకు దక్షిణలు సమర్పించాడు. దుర్యోధనుడికి అతని తమ్ములకు ధృతరాష్ట్రుని చేత అపర కర్మలు వైభవంగా నిర్వర్తింప చేసాడు. ఎవరూ వారసులు లేని వారికి, ధౌమ్యుని చేత కర్మకాండలు, దాన ధర్మములు నిర్వర్తింప చేసాడు.

చనిపోయిన తన బంధువుల ప్రీతి కొరకు, వారికి ఉత్తమ గతులు కలగుట కొరకు వారి వారి పేరులతో రాజ్యములో చలివేంద్రములు పెట్టించాడు, సత్రములు కట్టించాడు. చెరువులు తవ్వించాడు. దేవాలయాలు నిర్మించాడు. బ్రాహ్మణులకు గోవులను దానం చేసాడు. ఆ ప్రకారంగా వారి ఋణం తీర్చుకున్నాడు.

తరువాత శ్రీకృష్ణుని ఎదురుగా నిలబడి " శ్రీ కృష్ణా! నీ కరుణా కటాక్ష వీక్షణముల వలన నేను ఈ కురు సామ్రాజ్యమునకు చక్రవర్తిని అయ్యాను. నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. నీవు సదా మా వెన్నంటి ఉండి మమ్ములను కాపాడుతూ ఉన్నావు. నీవు లేకపోతే మేమెంత! మా పరాక్రమము లెంత!

నీవు ఈ సృష్టికి ఆది పురుషుడవు అని వేదాలు ఘోషిస్తున్నాయి. నీ గురించి పూర్తి గా చెప్పడానికి ఆ వేదాలకే వల్ల కాలేదు. ఇంక మేమెంత! నీ నామ స్మరణ చేతనే పాపాలు పోతాయి. పుణ్యములు చేకూరుతాయి.

సద్బ్రాహ్మణులు నీ నామములనుసదా పారాయణం చేస్తుంటారు.” అని ధర్మరాజు కృష్ణుని విష్ణు, విశ్వాత్మ,జిష్ణు, శర్వ, హంస, దామోదర, శంభు మొదలగు నామములతో కీర్తించాడు.

ధర్మరాజు మాటలతో కృష్ణుడు సంతృప్తి చెందాడు. తరువాత ధర్మరాజు తన తమ్ముల వంక తిరిగి “మీరందరూ నా వలన అడవులలో అష్టకష్టాలు పడ్డారు. అజ్ఞాత వాసములో పరులకు ఊడిగం చేసారు. నా కోసం యుద్ధం చేసారు. నా అన్న వారందరినీ పోగొట్టుకొని అమిత మైన దుఃఖమునకు గురయ్యారు. నన్ను చక్రవర్తిని చేసి ధన్యుడిని చేసారు. శ్రీ కృష్ణుని దయతో మనకు సంప్రాప్తమైన ఈ రాజ్యాన్ని నాతో పాటుమీరూ అనుభవిస్తూ, రాజును, మంత్రాంగమును, ధనాగారమును, హస్తినాపురమును, మన సైన్యాన్ని, మన ప్రజలను, మన మిత్రరాజులను కంటికి రెప్పలా జాకరూకతతో కాపాడండి.

భీమసేనా నీవు రారాజు సుయోధనుని మందిరంలో ఉండు. అర్జునా! నీవు దుశ్శాసనుని మందిరంలో నివశించు. దుర్మర్షణుడు, దుర్ముఖుని మందిరములలో నకుల సహదేవులు నివశిస్తారు. విదురుని, యుయుత్సుని, సంజయుని, ధౌమ్యుని చూచి, మీరు మీకు ఇష్ట వచ్చిన భవనములలో నివసించండి. మా పెదనాన్న ధృతరాష్ట్రుడు ఇప్పటి దాకా ఆయన ఉన్న భవనంలోనే నివశిస్తాడు. శ్రీ కృష్ణునికి సాత్యకికి అర్జునుని రాజ ప్రాసాదములో విడిది ఏర్పాటుచెయ్యండి. అని ఆదేశాలిచ్చాడు ధర్మరాజు.

తరువాత ధర్మరాజు తన అభ్యంతర మందిరమునకు వెళ్లాడు. అని వైశంపాయనుడు జనమేజయునకు వివరించాడు.

తరువాత జనమేజయుడు "ఓ వైశంపాయన మహర్షీ! ఈ విధంగా రాజ్యం పొంది పట్టాభిషిక్తుడైన ధర్మరాజు తరువాత ఏ విధంగా ప్రవర్తించాడు? శ్రీ కృష్ణుడు ఏం చేసాడు; ఎక్కడ ఉన్నాడు; వివరంగా చెప్పండి అని అడిగాడు.

తదుపరి మహాభారత కధను వైశంపాయనుడు జనమేజయునకు ఈ విధంగాచెప్పసాగాడు.

మహాభారతము

శాంతి పర్వము ప్రధమాశ్వాసము

సమాప్తము

ఓంతత్సత్ ఓంతత్సత్ ఓం తత్సత్.

# మహా భారతము

# శాంతి పర్వము

## ద్వితీయాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు మహా భారత కధను ఈ విధంగా చెప్ప సాగాడు.

ధర్మ రాజు కురుసామ్రాజ్యమునకు పట్టాభి షిక్తుడయ్యాడు. ధృత రాష్ట్ర నకు, గాంధారికీ, విదురునకు రాజ్యాధికారము ఇచ్చాడు. వారు చెప్పి నట్టు రాజ్యపాలన చేస్తున్నాడు. భర్తలను పోగొట్టుకున్న భార్యలను ఉచిత రీతిని కరుణ తో వారి యోగక్షేమములు చూస్తున్నాడు.

కృపాచార్యుడు, యుయుత్సుడు, సంజయులకు గౌరవ మంత్రుల పదవులు ఇచ్చి గౌరవించాడు. తల్లి కుంతీదేవికి శుశ్రూష చేస్తున్నాడు. ద్రౌపదిని సౌమనస్యంతో ఆదరిస్తున్నాడు. ధౌమ్యునకు సకల సంపదలు ఇచ్చి గౌరవిం చాడు. ఆయన ఆధ్యర్యంలో దేవ, పితృ పూజలు, అతిధి తర్పణములు, విప్రార్చనలు చేస్తున్నాడు. దీనులను, అనాధలను పోషిస్తున్నాడు. పైపనులు అన్నీ నిర్వర్తిస్తూ అమితానందం పొందుతున్నాడు.శ్రీ కృష్ణుని దైవముమాదిరి ఆరాధిస్తున్నాడు. సమస్త పౌరుల, జానపదుల మనస్సులకు ఆనందం కలుగ చేస్తున్నాడు.

ఒకనాడు ధర్మరాజు శ్రీకృష్ణుని మందిరమునకు వెళ్లాడు. కృష్ణునికి చేతులు జోడించి నమస్కరించాడు.

"కృష్ణా! రాత్రి సుఖంగా నిద్రపట్టిందిగా! నీ మనస్సు ప్రసన్నంగా ఉంది కదా! నీవు చూపిన ధర్మమార్గమున పయనించి నేను ఈ రాజ్యాధికారమును పొందగలిగాను." అని అన్నాడు.

దానికి కృష్ణుడు మారు మాట్లాడలేదు. ధ్యానంలో నిమగ్నుడయి ఉన్నాడు. ధ్యానముద్రలో ఉన్న శ్రీకృష్ణుని చూచి ధర్మరాజు ఇలా అన్నాడు.

" కృష్ణా! నిశ్చల మనస్సుతో ధ్యానంలో ఉన్నావు. క్షరుడవు, అక్షరుడవు నీవే కదా! కర్తవు, వికర్తవు నీవే కదా! ఈ సృష్టికి ఆది, అంతము నీవే కదా! ఒక్కడుగా వెలుగుతున్న నిశ్చల చైతన్యము నీవేకదా! పురుషోత్తముడవునీవే కదా! నీవు ఎవరి గురించి ధ్యానము చేస్తున్నావు? దీనికి కారణమేమి?" అని అడిగాడు.

అప్పుడు శ్రీ కృష్ణుడు ధ్యానము ముగించి నవ్వు మొహంతో ధర్మరాజును చూచి ఇలా అన్నాడు.

"ధర్మ నందనా! గంగా దేవి తన గర్భ వాసాన ఎవనిని కన్నదో, పరశు రాముడు ఎవనిని తన శిష్యునిగా స్వీకరించి సమస్త విద్యలు నేర్పించాడో, అదే పరశురాముడు ఎవనితో యుద్ధము చేసి అలసిపోయాడో, కాశీరాజు కన్యల మూలంగా ఎవని చేతిలో అనేకమంది రాజులు ఓడిపోయారో, నాలుగు వేదములను, ధనుర్వేదమును ఎవరు ఆమూలాగ్రంగా అభ్యసించారో, ఆ భీష్ముడు నిర్మల మనస్సుతో నన్ను తల్చుకుంటున్నాడు. నా మనస్సు అతనిలో

లీనమయింది." అని అన్నాడు. అప్పుడు ధర్మరాజు ఇలా అన్నాడు.

" కృష్ణా! భీష్ముని ప్రతిభా విశేషముల గురించి ఇదివరకు విని ఉన్నాను. ఇప్పుడు నీవు చెప్పావు. కృష్ణా! నాకు మా తాత భీష్ముని చూడవలెనని కుతూహలముగా ఉన్నది. నీతో పాటు నన్ను చూస్తే ఆయన ఎంతో ఆనందిస్తాడు." అని అన్నాడు.

వెంటనే కృష్ణుడు రథం సిద్ధం చెయ్యమని కోరాడు. దారుకుడు రథం సిద్ధం చేసాడు.

అదే సమయంలో ముని ఆశ్రమములలో నుండి వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థాణుడు, వాత్స్యుడు, దేవరాతుడు మొదలగు మహా ఋషులు భీష్ముని వద్దకు వెళ్లారు. ఆ సమయంలో భీష్ముడు శ్రీకృష్ణుని మనస్సులో నిలుపుకొని ఈ ప్రకారం ప్రార్థించాడు.

"అగ్ని,సూర్యుడు,బ్రహ్మకు సమానుడైన శ్రీకృష్ణుని మనసారా ప్రార్థిస్తున్నాను.

మహామునులు, దేవతలు, ఎవని స్వరూపమును తెలుసుకొనలేరో, అట్టి సర్వము తెలిసిన వానిని నేను పూజిస్తాను. దుఃఖమునకు పరమౌషధముగా ఎవనిని శ్రుతులు పేర్కొంటాయో అతనిని నేను పూజిస్తాను. ఈ సృష్టి ఆది, మధ్యము, అంతము ఎవడై ఉన్నాడో అతనిని కొలుస్తాను. ఈ అనంత విశ్వము నకు మూలకారణ మైన పుండరీకాక్షుని నేను కొలుస్తాను.

సహస్రశీర్షుడు, సహస్రాక్షుడు, వేదములే తాను అయిన వాడు,

సహస్రపాదుడు, చిన్నవారిలో చిన్నవాడు, పెద్దలలో పెద్దవాడు అయిన ఆ దయాళువుని నేను ఆరాధిస్తాను. అమృతమూర్తి, ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదములు, ఉపనిషత్తులు తానే అయిన ఆ పురుషోత్తముని నేను తలుస్తాను.

దేవకీ గర్భవాసమున యజ్ఞయాగములను సంరక్షించుటకు ఉద్భవించిన దేవదేవుని మనసులో ధ్యానిస్తాను. ఒక్కడే పన్నెండు మూర్తులుగా వెలుగుతూ, అదితి గర్భమున జన్మించిన వామన మూర్తిని నేను ధ్యానిస్తాను.

నెలలో శుక్ల పక్షములో దేవతలను, కృష్ణపక్షములో పితరులను తన అమృతంతో పోషిస్తూ ఓషధీయుక్తుడైన చంద్రుని రూపమైన శ్రీహరిని ద్యానిస్తాను. గరుత్మంతుని వాహనముగా గల విష్ణువును ధ్యానిస్తాను.

వ్యక్తమయే ఈ దేహంలో అవ్యక్తంగా ఉన్న పరమాత్మస్వరూపుడైన విష్ణువును ధ్యానిస్తాను. నిరంతరము శాంతమూర్తులై జీవిస్తున్న యోగులకు మాత్రమే వ్యక్తమైన నీ రూపమును ధ్యానిస్తున్నాను. ప్రాపంచిక విషయములలో వైరాగ్యమును పొందిన మహాఋషులు పొందే బ్రహ్మానందస్వరూపుడవైన నిన్ను నేను స్మరిస్తాను.

ఈ భూమియే పాదాలుగా, బొడ్డు ఆకాశంగా, తల స్వర్గంగా, రెండు కళ్లు సూర్య చంద్రులుగా, ముఖం అగ్నిగా, చెవులు దిక్కులుగా, అయి ఒప్పుతున్న మహావిష్ణువును నేను స్మరిస్తాను. ప్రళయ కాలంలో యోగనిద్రలో మర్రి ఆకు మీద పసిపాపలా తేలియాడు ఆ మహావిష్ణువును నేను స్మరిస్తాను.

మేఘములను వెంట్రుకలుగా, నదులను శరీరములోని సంధులుగా, సముద్రములను పొట్టలో నింపుకున్న దేవకీ సుతుని పూజిస్తాను. ఎవని ముఖమునుండి బ్రాహ్మణులు, భుజములనుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదముల నండి శూద్రులు ఉద్భవించారో అటువంటి వర్ణాత్మకుని ప్రణుతి చేస్తాను.

మాసములు, పక్షములు, అయనములు,సంవత్సములు మొదలగు కాలస్వరూపుడయి, యోగి, భోగి తానే అయి, సృష్టి ప్రళయము లకు కర్త అయిన ఆ మహా విష్ణువును భజిస్తాను. మునులు, దేవతలు నివసించే లోకములను అనంతుడు అనే పేరుతో భరిస్తూ ఉన్న ఆదిశేషు రూపుడవైన నిన్ను ప్రార్థిస్తున్నాను.

ఆదిత్యులు, మరుత్తులు, అసురులు, రుద్రులు, దేవతలు మొదలగు వారు అంగములుగా కలిగిన మహావిష్ణువును స్మరిస్తాను. ఈసృష్టి సర్వము తానే అయి, తనలో ఈ సృష్టినంతనూ నిలుపుకున్న ఆ సర్వాత్మకుని ప్రార్థిస్తాను.

సోమకాసురుని చంపి వేదములను రక్షించిన మత్స్యావతారుని స్మరిస్తాను. ఈ భూమి నంతనూ తన ఒంటి కొమ్ము మీద నిలిపిన వరహావ తారుని స్మరిస్తాను. లోక కంటకుడైన హిరణ్యకశిపుని సంహరించుటకు నరశింహావతారమెత్తిన ఆ శ్రీ మహా విష్ణువుని మనసారా తలుస్తాను.

బలిచక్రవర్తి ద్వారా మూడడుగుల భూమి దానంగా పుచ్చుకున్న వామనావతారుని స్మరిస్తాను. ఇరవై ఒక్కసార్లు లోకంలో రాజులందరినీ

జయించి, పరశురామావతారుని మనసారా స్మరిస్తాను. దశరథుని కుమారునిగా జన్మించి, రావణుని మొదలగు రాక్షసులను సంహరించిన శ్రీరామావతారుని ధ్యానిస్తాను.

యాదవ కులతిలకుడుగా జన్మించిన బలరామావతారుడైన నిన్ను స్మరిస్తాను. దేవకీ వసుదేవుల గర్భవాసమున జన్మించి, పసిపాపగా ఉండగానే రాక్షస సంహారము గావించి, కంసుని చంపి, అర్జునునికి సారధ్యము వహించి, భూభారము తొలగించిన శ్రీకృష్ణావతారుని స్మరిస్తాను. కలియుగంలో ధర్మోద్ధరణము అవతరించిన కల్కి అవతారుడైన ఆ శ్రీమహా విష్ణువును ధ్యానిస్తాను.

నశించే ఈ భూతములలో అక్షరముగా వెలుగొందుచున్న ఆ పరమాత్మను స్మరిస్తాను. ఓ పరమేశ్వరా, సుబ్రహ్మణ్యా, భక్తవత్సలా, మహాదేవా, విశ్వప్రకాశా, హృషీకేశా, వరదా, నారాయణా, రాజీవనయనా, హిరణ్యనాభా, అఖిల లోకములచేత ఆరాధింపబడు పాదపద్మములు కలవాడా, అచ్యుతా, అమృతరూపా, నీకు మనసారా మ్రొక్కుతున్నాను. నన్ను కరుణించు.

నిన్ను మనసులో నిరంతరము తలచు వారలకు భయము లేదు. అన్ని కార్యములు సఫలమవుతాయి. నీవు మంగళ కరుడవు. నీవే పరబ్రహ్మము. నీవే పరము. నీవేసత్యము. నీవే తపము. నీవు అగ్నిస్వరూపుడవు. నీవే హవిస్సు. సర్వమును విష్ణుమయము. నీవు సమస్త తపస్సులకు, సమస్త విద్యలకు మూలము. పుట్టుకలేని నీవు యజ్ఞస్వరూపుడవు. నిన్ను కనులారా గాంచిననాకు ఏ కల్మషము అంటదు. నేను నీకు శరణాగతుడను. నాకు మోక్షము ప్రసాదించు." అని మనసారా విష్ణుమూర్తిని ప్రార్థించాడు భీష్ముడు.

శ్రీమహావిష్ణువును మనసారా స్తుతించిన భీష్ముని మహాఋషులందరూ ఎంతగానో ప్రశంసించారు.  శ్రీ కృష్ణుడు భీష్ముడుచేసిన స్తుతికి పరమానంద భరితుడయ్యాడు.

"ధర్మజా! మనము భీష్ముని వద్దకు వెళదాము" అని అన్నాడు.

శ్రీ కృష్ణుడు, సాత్యకి ఒక రథం ఎక్కారు. ధర్మరాజు  అర్జునుడు మరొక రథం ఎక్కారు.  భీముడు, నకులుడు, సహదేవుడు మరొక రథం ఎక్కారు. కృపాచార్యులు, యుయుత్సుడు, సంజయుడు మరొక రథం ఎక్కారు. అందరూ భీష్ముడు అంపశయ్య మీద పడుకొని ఉన్న చోటికి వెళుతున్నారు.

దారిలో శ్రీకృష్ణుడు ధర్మరాజుకు  అయిదు మడుగులు చూపించాడు. "ధర్మనందనా! అదుగో దూరంగా కనపడుతున్నాయే ఐదు మడుగులు. లోకములో ఉన్న రాజులందరినీ సంహరించి, పరశురాముడు   ఆ రాజుల రక్తముతో తన తండ్రి జమదగ్నికి  అక్కడే రక్తతర్పణము విడిచాడు." అని అన్నాడు.

అప్పుడు ధర్మరాజు "శ్రీ కృష్ణా! ఈ క్రూరమైన పనిని పరశురాముడు ఎందుకు చేసాడు? దానికి కారణమేమి? మరి ఇప్పుడు క్షత్రియులు ఉన్నారు కదా. చచ్చిన వారు మరలా ఎలా బతికి వచ్చారు? ఈ భూమిని ఎలా ఏలుతున్నారు? నాకు వివరంగా చెప్పు." అని అడిగాడు.

అప్పుడు శ్రీ కృష్ణుడు ధర్మరాజుకు పరశురాముని జన్మ వృత్తాంతము ఈ ప్రకారం చెప్పసాగాడు.

"ధర్మ నందనా! పూర్వము జహ్నుడు అనే రాజు ఉండేవాడు. అతని కుమారుని పేరు ఉజహ్నుడు. అతని మనుమడు వల్లభుడు. ముని మనుమడు కుశికుడు. కుశికుడు ఘోర తపస్సు చేసి ఇంద్రుని ప్రసన్నుని చేసుకున్నాడు. జగములలో కెల్ల మేటియగుపుత్రుడు కావాలని కోరుకున్నాడు. ఇంద్రుడు వరము ఇచ్చాడు. కుశికునకు కౌశికుడు అనే కుమారుడు కలిగాడు. అతడే గాధి అనే పేరుతో ఈ లోకంలో ప్రశిద్ధుడయ్యాడు.

ఆ గాధికి ఒక కుమార్తె కలిగింది. ఆమెపేరు సత్యవతి. గాధి తన కుమార్తె సత్యవతిని ఋచీకుడు అనే వానికి ఇచ్చి వివాహం జరిపించాడు. ఆ ఋచీకుడు గొప్ప తపశ్శాలి. తనకు, తన మామ గారికి సంతానము కలగాలని ఒక యాగం చేసాడు. యాగ ఫలంగా రెండు పాత్రలలో హవిస్సులు ఉంచాడు. తన భార్య తో ఇలా అన్నాడు.

"ఈ పాత్రలో ఉన్న హవిస్సు సేవించిన క్షత్రియులకు అజేయుడు, క్షత్రియులను చంపేవాడు పుడతాడు. కాబట్టి దీనిని మీ తల్లిగారికి ఇవ్వు. ఈ రెండవపాత్రలో ఉన్న హవిస్సును సేవించిన, అత్యంత తపోధనుడు, ఉత్కృష్టుడు బ్రాహ్మణోత్తముడు జన్మిస్తాడు. కాబట్టి దీనిని నీవు సేవించు." అని పలికాడు. రెండు పాత్రలు భార్యకు ఇచ్చి తాను స్నానము చెయ్యడానికి వెళ్లాడు.

ఇంతలో సత్యవతి తల్లి తండ్రులు అక్కడకు వచ్చారు. సత్యవతి తన భర్త చెప్పిన విషయం చెప్పి మొదటి పాత్రను తల్లికి ఇచ్చింది. కాని సత్యవతి తల్లి బుద్ధిపూర్వకంగా ఆ పాత్రలు మార్చింది. కుమార్తెకు ఇచ్చిన పాత్రలో ఉన్న హవిస్సును తాను సేవించింది. అది తెలియక సత్యవతి తన తల్లికి ఉద్దేశించిన

పాత్రలో ఉన్న హవిస్సును తానుసేవించింది. ఋచీకుడు స్నానం చేసి వచ్చాడు. దివ్యదృష్టితో జరిగింది తెలుసుకున్నాడు.

“ సత్యవతీ! నీ గర్భంలో అత్యంత క్రూరుడు పెరుగుతున్నాడు.” అని పలికాడు.

సత్యవతి జరిగిన పొరపాటు తెలుసుకొని తల్లడిల్లిపోయింది. భర్తను శరణు వేడింది.

“ సత్యవతీ! నేనేమీ చెయ్యలేను. నీ తల్లి గర్భాన బ్రహ్మజ్ఞాని పుడతాడు. నీ కడుపున ఒక క్రూరాత్ముడు జన్మిస్తాడు.” అని పలికాడు.

“నాకు పిల్లలు లేక పోయినా పర్వాలేదు. క్రూరాత్ముడు మాత్రం వద్దు.” అని చెప్పింది సత్యవతి.

ఋచీకుడు కరుణించి, “సత్యవతీ! నీ కుమారునికి బదులు నీ మనుమడు క్రూరాత్ముడు అవుతాడు.” అని పలికాడు. సత్యవతి చేసేది లేక సరేఅంది.

ఆ ప్రకారము సత్యవతికి జమదగ్ని అనే మహా ముని జన్మించాడు. సత్యవతి తల్లికి విశ్వామిత్రుడు జన్మించాడు. తపోనిష్ఠాగరిష్టుడు అగు జమదగ్నికి పరశురాముడు కుమారుడిగా జన్మించాడు. పరశురాముడు ధనుర్వేదంలో ప్రావీణ్యం సంపాదించాడు.

ఆ సమయంలో హైహయ వంశంలో పుట్టిన కార్తవీర్యార్జునుడు అనే

రాజు ఏడు దీవులతో కూడిన ఈ భూమిని పరిపాలిస్తున్నాడు. అతడికి వెయ్యి చేతులు ఉన్నాయి. కార్తవీర్యార్జునుడు మహా పరాక్రమ శాలి. నీతి మంతుడు.

ఒక రోజు అగ్నిదేవుడు కార్తవీర్యార్జునుని వద్దకు వచ్చి తనకు ఆహారం కావాలని అడిగాడు. అప్పుడు కార్తవీర్యార్జునుడు తన అధినంలో ఉన్న గ్రామములను ముని ఆశ్రమములను భక్షించమని అనుమతి ఇచ్చాడు. అగ్నిదేవుడు అన్ని ముని ఆశ్రమములతోపాటు వశిష్టమహాముని ఆశ్రమమునుకూడా తగుల పెట్టాడు.

దానికి కోపించిన వశిష్టుడు, దీనికి కారణం కార్తవీర్యార్జునుడు అనితెలుసుకొని అతని బాహువులను పరశురాముడు ఖండిస్తాడు అని శాపం ఇచ్చాడు. ఇది తెలిసి కార్తవీర్యర్జునుడు ఖిన్నుడయ్యాడు.

కాల క్రమేణా కార్తవీర్యార్జునునికి నీతి బాహ్యులయిన అనేక మంది కుమారులు కలిగారు. ఒకరోజు వారు వేటకు వెళ్లారు. అలసి పోయి జమదగ్ని ఆశ్రమమునకు వెళ్లారు. అహంకారంతో అక్కడ ఉన్న హోమ ధేనువును, దూడను పట్టి తెచ్చి తమ భవనంలో కట్టేసారు. ఈవిషయం కార్తవీర్యార్జునునకు తెలియదు.

ఈ విషయం తెలిసిన పరశురాముడు కోపించి, కార్తవీర్యార్జునునిమీదికి దాడి వెళ్లాడు. తన గండ్ర గొడ్డలితో కార్తవీర్యార్జునుని చేతులు,తల నరికి తన హోమ ధేనువును దూడను తీసుకొని వచ్చాడు. దీనికి ప్రతీకారంగా కార్తవీర్యార్జునుని పుత్రులు, పరశురాముడు ఆశ్రమంలో లేని సమయంలో వచ్చి పరశురాముని తండ్రి జమదగ్నిని సంహరించారు.

ఈవిషయం తల్లి వలన తెలుసుకున్న పరశురాముడు కోపంతో ఊగిపోయాడు. కార్తవీర్యార్జునుని కుమారులనే కాకుండా హైహాయ వంశ రాజులందరినీ సంహరించాడు. దానితో తృప్తి పడక, లోకములోని క్షత్రియు లందరినీ సంహరించి వారి రక్తముతో తన తండ్రికి తర్పణము విడిచాడు. తరువాత తపస్సుకు వెళ్లాడు.

తరువాత విశ్వామిత్రుని మనుమడు పరావసు అనే వాడు గర్వాంధుడై పరశురాముని పిరికి వాడివి, క్షత్రియులకు భయపడి దాక్కున్నావు అని తిట్టాడు. ఈ మాటలకు కోపించి పరశురాముడు బాలురు, వృద్ధులు అని కూడా చూడకుండా క్షత్రియు లందరినీ తుదముట్టించాడు. ఈ ప్రకారము 21 సార్లు క్షత్రియుల మీదికి దండెత్తి వారిని సమూలంగా నాశనం చేసాడు.

తరువాత అశ్వమేధ యాగం చేసాడు. ఆయాగ సందర్భంలో తాను క్షత్రియుల నందరినీ జయించి, చంపి ఆర్జించిన రాజ్యములను కశ్యపునకు దానం చేసాడు. అప్పుడు కశ్యపుడు పరశురాముడు ఇక్కడే ఉంటే ఇంకా ఎంత మంది రాజులను చంపుతాడో అని భయపడి పరశురామునితో ఇలా అన్నాడు.

"పరశురామా! నీవు క్షత్రియుల నందరినీ జయించి సంపాదించిన రాజ్యమును సర్వస్వము నాకు దానం ఇచ్చావు. ఇంక నీకు ఇక్కడ నిలువ నీడ లేదు. తక్షణమే దక్షిణ దేశము వెళ్లిపో" అని పలికాడు.

కశ్యపుని ఆంతర్యము తెలుసుకున్న పరశారాముడు అలాగే అని దక్షిణ దేశం వెళ్లాడు. దక్షిణ దిశగా ఉన్న సముద్రుడు పరశురామునికి భయపడి తన తీరమున ఉన్న కొంత భూమిని అతనికి దానంగా ఇచ్చాడు.

ఇక్కడ పరశురాముని వలన దానంగా పొందిన రాజ్యములను కశ్యపుడు బ్రాహ్మణులకు దానంగా ఇచ్చి తాను తపస్సు చేసుకోడానికి వెళ్లిపోయాడు. అప్పటి నుండి ఈ భూమి కాశ్యపి అనే పేరుతో పిలువ బడుతూ ఉంది.

తరువాత కొన్నాళ్లకు వైశ్యులు, శూద్రుల లో ప్రముఖులు గర్వించి బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన భూమిని, ఆబ్రాహ్మణుల భార్యలను బలవంతంగా అపహరించారు. దానితో బ్రాహ్మణులు కూడా అదుపు తప్పారు. వారి ధర్మమును విస్మరించారు. మద్యపానమునకు, దొంగతనములకు పాల్పడ్డం, ఇతరుల భార్యలను అపహరించడం మొదలగు అకృత్యాలకు పాల్పడ్డారు. వారు చేయవలసిన యజ్ఞయాగములను మరచిపోయారు. ధర్మము అంతరించి అధర్మము రాజ్యమేలసాగింది.

ఈ అధర్మాన్ని భరించలేక భూదేవి కుచించుకుపోయింది. ఇది చూచిన కశ్యపుడు తన ఊరువులతో భూమిని పైకి ఎత్తాడు. అప్పటి నుండి భూమికి ఉర్వి అని పేరుసార్ధకమయింది.

భూదేవి ఆలోచించింది. "ఒక్క క్షత్రియులు మాత్రమే దండ నీతి ప్రయోగించి ఈ భూమిని రక్షించగలరు." అని అనుకొంది. కశ్యపుని చూచి ఇలా అంది." ఓ మునీంద్రా! పరశురాముడు చంపగా మిగిలిన క్షత్రియులు ఇంకా అక్కడక్కడ జీవించి ఉన్నారు. వారి నందరినీ ఒక చోట చేర్చి ఈ భూమిని పాలించు భారం వారికి అప్పగించు.

పరశురాముని చేతిలో చావకుండా కొంతమంది హైహయ రాజులు బతికి బయటపడ్డారు.

అందులో కురు వంశ సంజాతుడు విదూరథుడు అనే వాడు ఎలుగు బంట్లతో  రక్షింప బడ్డాడు.

సుదాసు వంశంలో మరొకడు బతికాడు. అతనిని పరాశరుడు అనే ఋషి చేరదీసాడు. అతడు శూద్రుడైనా, అతని చేత సర్వకర్మలు చేయించాడు.

శిబి అనే చక్రవర్తి మనుమడు గోపతి అనే వాడు అడవిలో గోవుల చేత రక్షింపబడ్డాడు.

ప్రతర్ధనుడి కుమారుడు వత్సుడు అనే వాడు గోశాలలో దాక్కొని బతికిపోయాడు.

దధివాహనుడు అనే వాడి కుమారుడు అంగుడు అనే వాడు గౌతమ మునీంద్రుని చేత ర క్షింపబడ్డాడు.

బృహద్రధకులములో పుట్టిన భూరి అనే వాడు ఒర గృధ్రకూటము అనే పర్వతము మీద కొండముచ్చులతో రక్షింప బడ్డాడు.

మరుత్తుల సంతానమైన ముగ్గురు నాలుగేళ్ల వయసు కలవారు సముద్రుని చేత రక్షింప బడ్డారు.

వీరందరూ ఉత్తమ క్షత్రియులు. వీరు ఈ భూమిని సమర్ధవంతంగా పాలించ గలరు." అని చెప్పింది భూదేవి.

ఆ ప్రకారంగా కశ్యపుడు ఆ రాజులంద రినీ పిలిపించి వారికి ఈ భూమి

నంతటినీ పంచి ఇచ్చాడు. వారి నుంచి అనేక రాజ వంశములు ఉద్భవించాయి. ఈ ప్రకారంగా ఉద్భవించిన రాజ వంశములు అన్ని ఈ మహా భారత యుద్ధములో సర్వనాశనం అయ్యాయి. కాని అక్కడక్కడా కొంత మంది యుద్ధములో చావకుండా బతికి బయట పడ్డారు." అని చెప్పాడు శ్రీకృష్ణుడు.

తరువాత వారు ఓఘవతీ నదీ తీరంలో అంపశయ్యమీద పడుకొని ఉన్న భీష్ముని వద్దకు చేరుకున్నారు. అందరూతమ తమ రథములు దిగారు.

శ్రీకృష్ణుడు భీష్ముని వద్దకు పోయి "ఓ తేజోవంతుడ డైన భీష్మా! నీ మనసు వ్యాకులము చెందకుండా ప్రశాంతముగా ఉన్నదా! నీ శరీరములో గుచ్చుకున్న బాణములు నొప్పి పెడుతున్నాయా! కాని నీకు ఆ బాధ తెలియడం లేదంటే నీ తండ్రి గారు ఇచ్చిన వరమే కారణం కదా! నీకు తెలియని విషయములు లేవు. నీవు క్షత్రియుడుగా జన్మించినా కోరికలను వదిలిపెట్టి కఠోరమైన బ్రహ్మచర్యము అవలంబించావు.రాజ్యమును తృణప్రాయంగా త్యాగం చేసావు. నీ లాంటి వాడు అరుదుగా జన్మిస్తాడు. దేవతలు, రాక్షసులు, యక్షులు, నాగ జాతి, గంధర్వులు అందరూ కలిసి ఒక్కసారిగా దండెత్తి వచ్చినా వారినందరినీ జయించ గల సమర్థుడివి. అంతేకాకుండా ఇంద్రియ నిగ్రహము, సత్యము, తపము, దానము, ధనుర్వేదము వీటిలో నైపుణ్యము సంపాదించావు. ధర్మ చింతనలో అగ్రగణ్యుడివినీవు. ఇవన్నీ ఒక ఎత్తు. శరీరం నిండా శరములు గుచ్చుకున్నా, "నా ఇష్టం వచ్చినప్పుడు నేను మరణిస్తాను" అని చెప్పగల వీరుడవు. నీకు నీవే సాటి. పైగా అష్ట వసువులలో పెద్దవాడివి. గంగా గర్భమున జన్మించిన వాడివి. నీ గురించి ఎంతో మంది బ్రాహ్మణులు చెప్పగా విన్నాను.

ఇదిగో ధర్మరాజు. తన వారి నందరినీ పోగొట్టుకొని బాధాతప్త హృదయుడై ఉన్నాడు. అమృతోపమానమైన నీ వచనములతో అతని మనసులోని బాధను పోగొట్టుము. నీకు తెలియని విషయములు లేవు. నాలుగు వర్ణములు, నాలుగు ఆశ్రమములు, వాటి ధర్మములు, నాలుగు వేదములలో చెప్పిన ధర్మములు, నీకు బాగా తెలియును. ప్రవృత్తి, నివృత్తి, సాంఖ్యము, పురాణములు, ఇతిహాసములు, ధర్మశాస్త్రములు నీకు కరతలామలకములు. మనసులో అంకురించిన ఏ సంశయమునైనా తీర్చగల సమర్ధుడవు. ఈ ధర్మరాజును ఆదరించి అతని సంశయములు పోగొట్టుము. శోకముతో మోహముతో ఆవరింపబడి ఉన్న జనుల యొక్క బాధలు పోగొట్టడమే కదా మీ లాంటి వారు నేర్చుకున్న విద్యలకు సార్ధకత." అని పలికిన శ్రీ కృష్ణుని వైపుకు తిరిగి నమస్కరించి ఇలా అన్నాడు భీష్ముడు.

" పరంధామా! ఈ జగములకు నీవే కర్తవు. నీవే భర్తవు. నీవే సంహార్తవు. నీవు యోగీశ్వరేశ్వరుడవు. అందరి దుఃఖములు తీర్చుటకు సమర్ధుడవు. నేను ఏం చెయ్యాలో నువ్వే చెప్పు." అని పలికాడు.

"మహానుభావా! నా యందు నీకు కల భక్తి అచంచలము అని నాకు తెలియును. భక్తి, సత్ప్రవర్తన ఈ రెండే నా నివాసములు. ఈ రెండింటిలో ఏ ఒక్కటి కొరవడ్డా నేను అచ్చట నిలువను. నీకు ఆ రెండూపుష్కలంగా ఉన్నాయి. ఈ రోజునుండి 56 రోజులకు సూర్యుడు ఉత్తరాయనములో సంచరిస్తాడు. అప్పుడు నీవు ఈ దేహమును వదిలి పెట్టి మరలా జన్మలేకుండా మోక్షం పొందు. నీ సహచర వసువులు నీ రాక కోసం మానవులకు కనపడకుండా ఆకాశంలో ఎదురుచూస్తున్నారు. నీవు పరమ పదిస్తే నీ తోపాటునీవు ఆర్జించినజ్ఞానం కూడా మరుగున పడి పోతుంది." అని

ధర్మరాజును, అక్కడ ఉన్న వారిని చూపించి "భీష్మా! నీ వల్ల ధర్మబోధనలు విన డానికి వీరంతా వచ్చారు. వీరికి ధర్మబోధన గావించు. నీవు సముపార్జించిన జ్ఞానమును వీరందరికీ పంచిపెట్టు. నీవు ధన్యత చెంది వీరందరినీ ధన్యులనుచెయ్యి." అని పలికాడు కృష్ణుడు.

అప్పుడు భీష్ముడు కృష్ణునితో ఇలా అన్నాడు. "శివంకరా! అచ్యుతా! నారాయణా! నీ పలుకులు నా చెవినిపడగానే నా జన్మ తరించింది. నేను ధన్యుడనయ్యాను. నీతో మాట్లాడటం నీ మాటకు ఎదురు చెప్పడం ఆ బ్రహ్మకు కూడాసాధ్యం కాదు. ఇంక నేనెంత. కాని నా ఒంట్లో గుచ్చుకున్న ఈ బాణములు తీరని బాధ పెడుతున్నాయి. మాట్లాడటానికి ఓపిక లేదు. నా గొంతు, నా నాలుక నాతో సహకరించడం లేదు. మాట్లాడటానికి, అడిగిన దానికి తిరిగి జవాబు చెప్పడానికీ శక్తిలేదు. కాబట్టి ఆ ధర్మసూక్ష్మములు ధర్మరాజుకు నీవే చెప్పు. నీవు ఉండగా నేను చెప్పడం భావ్యం కాదు కదా! గురువు ముందర శిష్యుడు ఉపన్యాసం చెప్పినట్టు ఉంటుంది." అని అన్నాడు భీష్ముడు.

ఆ మాటలకు కృష్ణుడు ఇలా అన్నాడు. "నీ బాధ నాకు అర్థం అయింది. నీకు మూడు వరాలు ఇస్తున్నాను. నీ శరీరంలో గుచ్చుకున్న బాణముల వలన ఏ బాధా లేకుండా, నీవు స్పృహ తప్పి పోకుండా, నీకు నొప్పితెలియకుండా, అసలు నీకు ఏమీ జరగనట్టుగా ఉండే వరమును ప్రసాదిస్తున్నాను. నీకు ఇంక ఆకలి, దప్పిక లేకుండా మరొక వరం ఇస్తున్నాను. నీ మనస్సు ఈ ప్రాపంచిక విషయములలో తగులుకొనకుండా దివ్యజ్ఞానంతో ప్రకాశించునట్టు మరొక వరం ప్రసాదిస్తున్నాను." అని పలికాడు శ్రీకృష్ణుడు.

అప్పుడు దేవ దుందుభులు మోగాయి. పుష్పవృష్టి కురిసింది.

ఇంతలో సూర్యాస్తమయము అయింది. ఆ సమయంలో అక్కడకు వచ్చిన మునులు శ్రీకృష్ణుడు, ధర్మజుడు, భీష్ముని వద్ద సెలవు తీసుకొని మరుసటి రోజు వస్తామని చెప్పి వెళ్లిపోయారు.

శ్రీకృష్ణుడు, ధర్మరాజు మొదలగు వారుకూడా మరునాడు వస్తామని చెప్పి భీష్ముని వద్ద సెలవు తీసుకుని తమ తమ రథములు ఎక్కి హస్తినా పురమునకువెళ్లారు.

మరునాడు ఉదయమే అందరూ నిద్రలేచి మంగళ స్నానములు ఆచరించి భీష్ముని వద్దకు పోవుటకు సిద్ధం అయ్యారు. ధర్మరాజు అర్జునునితో "ఈ రోజు సైన్యమును గానీ, పరిచారకులను గానీ రానీయ వద్దు. కేవలము ధృతరాష్ట్రుడు మొదలగు వారిని మాత్రము రమ్మని చెప్పు" అని చెప్పాడు.

ధర్మరాజు అర్జునుడు ఒక రథము మీద భీముడు, నకుల సహదేవులు మరొకరథము మీద, శ్రీకృష్ణుడు మరొక రథము మీద, కృపాచార్యుడు, యుయుత్సుడు, సంజయుడు మరొక రథము మీద బయలు దేరారు. వీరు భీష్ముని వద్దకు రాక ముందే నారదుడు మొదలగు మహా మునులు భీష్ముని వద్దకు చేరుకున్నారు. శ్రీ కృష్ణుడు, ధర్మరాజు మున్నగు వారు తమ తమ రథములు దిగి భీష్ముని వద్దకు పోయి అతనికి నమస్కరించారు.

ముందు ఎవరు భీష్ముని తో మాట్లాడాలా అని ఒకరి మొహం ఒకరు చూసుకుంటున్నారు. అది చూచి ధర్మరాజు కృష్ణునితో "కృష్ణా! భీష్ముని తో సంభాషించుటకు నీవు తక్క మరొకరు లేదు. కాబట్టి నీవేసంభాషణ మొదలుపెట్టు" అని అన్నాడు.

శ్రీ కృష్ణుడు భీష్ముని దగ్గరగా వెళ్లి అతని యోగక్షేమములు విచారించాడు. అప్పుడు భీష్ముడు ఇలా అన్నాడు.

"దేవా! నీ దయ వలన నాకు ఆకలి దప్పులు, అలసట కలగటం లేదు. నా మనస్సు ప్రశాంతంగా ఉంది. నేను వయో వృద్ధుడనైనా ప్రస్తుతము బాలుని వలే అత్యంత ఉత్సాహంగా ఉన్నాను. నీవు చెప్పిన ప్రకారము పాండవులకు చెప్పవలసినవి అన్నీ నేను చెబుతాను. కానీ, నీవు సర్వజ్ఞుడవు కదా నీవే చెప్పవచ్చును కదా! ఇందులో నీ ఆంతర్యమేమి?" అని అడిగాడు.

దానికి కృష్ణుడు ఇలా అన్నాడు. "భీష్మా! ఈ లోకంలో సమస్త యశస్సుకు, కీర్తికి నేనే కారణము. ఇప్పుడు నాకు కొత్తగా వచ్చే కీర్తి ఏమీ లేదు. ఈ అవసాన దశలో నీకు కీర్తి ప్రతిష్ఠలు కలుగ చేద్దామని ఇలా అడిగాను. నీవు అన్ని సందేహములు తీర్చే విధంగా నా జ్ఞానమును నీలో ప్రవేశ పెట్టాను. దీని వల్ల నీ కీర్తి ఆచంద్రార్కము నిలిచి ఉంటుంది. నీవు ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు చెప్పే సమాధానాలు ఈ లోకంలో ఉన్న ధర్మపరులకు మార్గదర్శకా లవుతాయి. నీ జన్మ ధన్యం అవుతుంది. కాబట్టి నీవు ధర్మరాజు అడిగిన ప్రశ్నలకు తగు విధంగా సమాధానాలు చెప్పు." అని పలికాడు.

ఆ మాటలకు భీష్ముడు మిక్కిలి సంతోషించాడు. "కృష్ణా! ధర్మరాజు పుట్టగానే మునీంద్రులు అందరూ సంతోషించారు. ఈ భరత కులంలో ధర్మరాజు పరమధార్మికుడయ్యాడు. సత్యము, శాంతి, దాంతి, శౌచము మొదలగు గుణములకు ఆలవాలము ధర్మజుడు. కామంతో గానీ, ధనముతో గానీ, భయముతో గానీ ధర్మం తప్పని వాడు ధర్మరాజు. అలాంటి వాడు నన్ను ఏమో అడగ దలచాడో అడగమను. నాకు తెలిసినంతవరకూ చెబుతాను." అని అన్నాడు భీష్ముడు.

ఆ మాటలకు కృష్ణుడు నవ్వి "భీష్మా! ఈ యుద్ధంలో గురువులను, బంధువులను, మిత్రులను సంహరించాడు ధర్మరాజు. లెక్క లేనంత మందిని రణభూమికి బలి ఇచ్చాడు. అతనిలో దయ జాలి మచ్చుకైనా కాన పడవు... అని నీవు అంటావేమో అని నీ ఎదుటికి రావడానికి భయపడుతున్నాడు." అని అన్నాడు.

దానికి భీష్ముడు ఇలా అన్నాడు. "కృష్ణా! బ్రాహ్మణులకు వేదాధ్యయనము, యజ్ఞయాగములు చెయ్యడం విద్యుక్త ధర్మము. అలాగే క్షత్రియునకు యుద్ధం చేయడం అతని విద్యుక్తధర్మము. మరి యుద్ధము చేసేటప్పుడు, తండ్రులను, కుమారులను, మనుమలను, గురువులను చంపడం ధర్మమే కదా. ఎందుకంటే వారు తమ తమ ధర్మములను విడిచి అన్యాయంగా యుద్ధం చేసారు. అలాంటి వారిని యుద్ధములో చంపడంలో పాపం కాదు. అన్యాయం చేసే వారిని యుద్ధంలో వధించడం పుణ్యమే అవుతుంది. ధర్మరాజు తన క్షత్రియ ధర్మము నెరవేర్చాడు. కాబట్టి అతను ధర్మాత్ముడే." అని అన్నాడు భీష్ముడు.

ఈ మాటలు విన్న ధర్మరాజు చేతులు జోడించి భీష్మునికి దగ్గరగావచ్చాడు. భీష్ముని పాదాలకు తన తల ఆనించి నమస్కరించాడు. భీష్ముడు ధర్మరాజు తలను తన రెండు చేతులతో పట్టుకొని నుదుటి మీద చుంబించాడు.

"ధర్మనందనా! నీ మనసులో మెదులుచున్న సందేహములను అడగవయ్యా."అని అడిగాడు. అప్పుడు ధర్మజుడు అందరి అనుమతి తీసుకొని భీష్ముని ఇలా అన్నాడు.

“పితామహా! ధర్మార్థకామములలో రాజధర్మము గొప్పది. ఏనుగుకు అంకుశం ఎలాగో, గుర్రమునకు పగ్గము ఎలాగో మానవ మనుగడకు రాజధర్మము అత్యావశ్యకము. మా పూర్వులు ఆచరించిన రాజధర్మమును ఆచరించక పోతే అరాచకం పెరుగుతుంది. ధర్మం నశిస్తుంది. ఈ ప్రజలు చేసే పాపాలను రాజధర్మంతో నే అణిచి వేయడం ధర్మం అవుతుంది. ప్రజలు, ధర్మం తెలిసిన వారు, రాజును ధర్మస్వరూపుడుగా భావిస్తారు. కాబట్టి రాజుకు రాజధర్మము తెలియడం ముఖ్యం. కాబట్టి నాకు రాజధర్మములు, అందులో సూక్ష్మములు వివరించు. వినవలెనని కుతూహలముగా ఉన్నది.” అని అన్నాడు ధర్మరాజు.

భీష్ముడు ధర్మరాజును చూచి ఇలా చెప్పసాగాడు. “తనకు మేలు జరగాలని కోరుకొనే రాజు ముందు దేవతలను, బ్రాహ్మణులను పూజించాలి. ఏ పనికైనా దైవబలము, మానవ ప్రయత్నము అవసరము. పై రెండింటిలో మానవ యత్నము అత్యంత అవసరము. మానవ యత్నం చేయు రాజుకు దేవతలు కూడా సాయపడతారు. కొన్ని సందర్భాలలో మానవ యత్నం ఫలించక పోయినా రాజు కలత చెంద కూడదు. అది దైవనిర్ణయంగా భావించాలి.

రాజుకు శాంతి, దాంతి, విజితాత్మ, శీలము మొదలగు సుగుణములు ఉండాలి. అలాంటి రాజుకు కీర్తి, సమస్త సుఖములు సమకూరుతాయి. రాజు తన రాజ్యపాలనను విజ్ఞతతో నడపాలి. దానికి మంచి నడవడి, సత్యసంధత ముఖ్యమైనవి. దండనీతిని సమర్థ వంతంగా, జాగరూకతతో అమలు చేయాలి. అప్పుడే రాజు కీర్తి మంతుడవుతాడు.

రాతిలోనుండి ఇనుము పుడుతుంది. నీటిలోనుండి అగ్నిపుడుతుంది.

బ్రాహ్మణుని వలన రాజు తయారవుతాడు. కాని అదే ఇనుముతో రాతిని కొడితో ఇనుము విరిగి పోతుంది. అలాగే అగ్నితో నీటిని కాల్చబోతే అగ్ని ఆరిపోతుంది. బ్రాహ్మణుని అగౌరవ పరిస్తే ఆ రాజు నాశనమవుతాడు. ఈ మాటలు నీవు ఎల్లపుడూ మనసులో ఉంచుకో.

బ్రాహ్మణులు వేదస్వరూపులు. బ్రాహ్మణులను గౌరవించు. ఆదరించు. కాని తప్పుచేసిన బ్రాహ్మణుడు కూడా దండనార్హుడు. దాని గురించి శుక్రనీతిలో ఇలా చెప్పబడింది.

"యుద్ధ సమయంలో విల్లు, అమ్ములు, అస్త్ర శస్త్రములు ధరించి క్రోధంతో తన మీదికి వస్తున్న బ్రాహ్మణుని వధించడం పాపం కాదు. రాజుకు అదే పరమ ధర్మము. గురువు గారి భార్యను కామించిన వాడిని, చిన్న పిల్లలను చంపిన వాడిని, రాజద్రోహము చేసిన వాడిని, సాటి బ్రాహ్మణుని చంపిన వాడిని, అతడు బ్రాహ్మణుడైనా సరే అతనిని దేశం నుండి బహిష్కరించాలి గాని చంప కూడదు."

ఇంక రాజుకు దుర్గ రక్షణ ముఖ్యమైనది. దుర్గములు ఎల్లప్పుడూ చతురంగ బలములతో రక్షింపబడాలి. రాజు తన రాజ్యములో ఉన్న బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను సమానంగా చూడాలి. వర్ణ వివక్షత చూపకూడదు. అందరి మీదా దయ చూపాలి. కానీ దయ చూపడం నెపంతో మెతక దనం చూపకూడదు.

ఈ విషయంలో బృహస్పతి చెప్పిన విషయాలు మనం గమనించాలి.

"రాజు అతిగా దయచూపడం వల్ల, మృదు ప్రవర్తన వల్ల, ప్రజలలో

చులకన అవుతాడు. అప్పుడు ప్రజలు తమ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తారు. రాజుతో ఆడుకుంటారు. కాని రాజు అమిత క్రోధ స్వభావుడైతే నియంతృత్వం ప్రబలుతుంది. ప్రజలు భయభ్రాంతులవుతారు. కాబట్టి రాజు అతి మృదు స్వభావుడు కాకూడదు. అలాగని అతి క్రూరత్వం ప్రదర్శించకూడదు. దయ, దండన సమపాళ్లలో రంగరించి ప్రజలను పాలించాలి. ఇది రాజధర్మములో ప్రధానమైనది.

రాజు తన కోపతాపములను ప్రజల మీద ప్రదర్శించకుండా, తొందర పాటు లేకుండా, సంయమనంతో వ్యవహరించాలి. రాజు ఎల్లప్పుడూ తన ప్రజలకు క్షేమకరమైన రీతిలో నడుచుకోవాలి.

రాజు గంభీరంగా ఉండాలి. అంతేగాని ప్రజలతో పరిహాసంగా, తన క్రింది ఉద్యోగులతో పరాచకాలాడుతూ రాజ్యపాలన చెయ్య కూడదు. ఆ పరిస్థితులలో ప్రజలు, ఉద్యోగులు రాజును లెక్కచెయ్యరు. అతనికి హాని చెయ్యడానికి కూడా వెనకాడరు. అతనికి వ్యతిరేకంగా పని చేసి, రాజు యొక్క రాచరికానికే ముప్పు తీసుకొని వస్తారు. కాబట్టి తన కింది ఉద్యోగులతో పరాచకలాడుతూ కలిసి మెలిసి ఉండకూడదు. వారి మీద దయచూపాలి గానీ గంభీరంగా ఉండాలి.

రాజ్యమునకు రాజ్యపాలనకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి కాని మెతక దనం చూపకూడదు. వారిని వెంటనే వదిలించు కోవాలి. గర్వాంధుడై, తన కర్తవ్యమును మరచి ప్రవర్తించే వాడు తన గురువైనా, బ్రాహ్మణుడైనా, రాజు అతనిని వదిలించుకోవాలికాని భరించ కూడదు. అది రాజధర్మము."

పై ధర్మములు బృహస్పతి మరుత్తు అనే మహారాజుకు చెప్పినట్టు

భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

కాబట్టి ధర్మరాజా! తప్పు చేసిన వాడు గురువైనా, మిత్రుడైనా, సుత్రుడైనా మన్నించ కూడదు. కఠినంగా శిక్షించాలి. సగర మహారాజు తన కుమారుడు అసమంజసుడు పురజనులను బాధిస్తున్నాడని తెలిసి అతనిని వదిలి వేసాడు. అలాగే ఉద్దాలక మహాముని తన కుమారుడైన శ్వేత కేతువు బ్రాహ్మణులను బాధపెడుతున్నాడు అని తెలుసుకొని వదిలి వేసాడు. మనము వారిని ఆదర్శంగా తీసుకొని రాజ్యపాలన చెయ్యాలి.

రాజు సత్యము, ధర్మము పాటిస్తూ క్షమాగుణము కలిగి రాజ్య పాలన సాగిస్తే ప్రజలు సంతోషిస్తారు. రాజు తనకు కీడు కలుగుతుంది అని శంకించి నపుడు వాటిని వైదిక కర్మలతో నివృత్తి చేసుకొనాలి.

రాజు నాలుగు వర్ణముల వారిని సమానంగా ఆదరించాలి. తనను పొగిడే వారిని దూరంగా ఉంచాలి. అవినీతిని అంతమొందించాలి. అవినీతి పరుల ధనమును స్వాధీనముచేసుకొని బాధితులకు పంచి పెట్టాలి. ఎవరినీ అతిగా నమ్మరాదు. అలాగని ఎవరినీ నమ్మకుండా ఉండరాదు. తన వివేచనతో ఉచితము అనుచితము తెలుసుకొని ప్రవర్తించాలి.

ప్రజలను పీడించి ధనమును అపహరించే రాజుకు శత్రువులు బయటనుండి రారు. అతని ప్రజలే అతనికి శత్రువులు. ధర్మనిరతులను అర్థశాస్త్రములో నిపుణులను, స్థిరమైన చిత్తము కలవారిని, రాజాజ్ఞ మేరకు నడుచుకొనే వారిని, నీతిమంతులను, ఉత్తమ కులజులను తన కొలువులో నియమించుకొనాలి. అలాంటి రాజు పాలనలో ప్రజలు కపటము లేకుండా, రాజు మీద ప్రేమతో, రాజుగారి పుత్రులవలె సంతోషంగా జీవిస్తారు.

రాజు అత్యంత పరాక్రమ వంతుడై ఉండాలి. లేనియెడల తన ప్రజల ధన, మాన , ప్రాణమును రక్షించలేడు, అని శుక్రాచార్యుడుచెప్పాడు.

పరాక్రమ హీనుడు, ప్రజలను రక్షించలేని రాజు, చదువుకోని ఋత్విక్కు వంటి వాడు అని మనువు చెప్పాడు.

రాజుకు ప్రజా సంరక్షణమే పరమధర్మము అని బృహస్పతి, భారద్వాజుడు, ఇంద్రుడు చెప్పారు.

రాజైన వాడు ఎప్పుడూ ఉత్సాహ వంతుడై ఉండాలి. న్యాయ మార్గమున గానీ, అన్యాయ మార్గమున గానీ శత్రువులను నాశనం చెయ్యాలి. శత్రువు అల్పుడని వదిలేస్తే, వాడి విషం కక్కుతాడు. కాబట్టి శత్రుసంహారము రాజుకు శ్రేయోదాయకము. ఎన్ని అడ్డంకులు వచ్చినప్పటికీ వీరుడైన రాజు తన రాజ్యమును అన్యాక్రాంతము చెయ్యడు.” అని చెప్పాడు భీష్ముడు.

అప్పటికి సూర్యాస్తమయం అయింది. శ్రీకృష్ణుడు ధర్మరాజు మొదలగు వారు, అక్కడకు వచ్చిన మునులు అందరూ భీష్ముని వద్ద సెలవు తీసుకొని వెళ్లిపోయారు.

మరునాడు, శ్రీ కృష్ణుడు, ధర్మరాజు మొదలగువారు, మహామునులు వచ్చి భీష్ముని చుట్టు కూర్చున్నారు. అప్పుడు ధర్మరాజు చేతులు జోడించి ఇలా అన్నాడు.

“ తాతగారూ! మామూలు ప్రజలకూ, మహారాజుకూ భేధం ఏమీ లేదు.

ఇరువురికీ, చావు పుట్టుక, వ్యాధులు ఉన్నాయి. అందరికీ తల, చేతులు, కాళ్లు, తల సమానంగా ఉంటాయి. అటువంటప్పుడు రాజు తన ప్రజలను తన వశంలో ఎలా ఉంచుకోగలడు. ఎలా సంరక్షిస్తాడు. ఎలా దండిస్తాడు. రాజు దేవునితో సమానం ఎలా అవుతాడు. దయచేసి వివరించండి."అని అడిగాడు. దానికి భీష్ముడు ఈ విధంగా చెప్పసాగాడు.

" ధర్మనందనా! కృతయుగంలో రాజు అనేవాడు ఎవరూ లేరు. కేవలం ధర్మం మాత్రమే ఉండేది. అందరూ దర్మబద్ధులై నడుచుకొనే వాళ్లు. ఒకరిని ఒకరు రక్షించుకొనే వాళ్లు.

తరువాత మనుషులలో లోభత్వము ప్రబలింది. ఇది నాది ... అది నీది... అనే తత్వం మనసులో పాతుకుపోయింది. స్వార్ధము పెరిగి ధర్మం నాశనమైంది. ప్రజలు అకృత్యములకు అలవాటు పడ్డారు. క్రమక్రమంగా కోరికలు ప్రబలాయి. అవి తీరక ఒకరి మీద ఒకరికి మత్సరం పెరిగింది. మదం, ద్వేషం ప్రబలింది. వేదములు చదవడం మానివేసారు. అధర్మము రాజ్యమేల సాగింది.

అప్పుడు దేవేంద్రుడు మొదలగువారు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లారు. "దేవా! మానవ లోకంలో వేదాధ్యయనము సన్నగిల్లింది. యజ్ఞ యాగములు ఎవరూ చెయ్యడం లేదు. ధర్మము నకు హాని కలిగింది." అని మొరపెట్టు కున్నారు.

బ్రహ్మదేవుడు నవ్వి "నేను దానికి తగిన ప్రతి క్రియ చేస్తాను. మీరు భయపడవద్దు." అని చెప్పాడు.

తరువాత బ్రహ్మదేవుడు నీతి శాస్త్రమును రచించాడు. ఆ నీతి శాస్త్రము లో, రాజు, మంత్రి, దుర్గము, కోశాగారము, మిత్ర బృందము, వార్తా సేకరణ, దండనీతి (పీనల్ కోడ్), శత్రువు, మిత్రుడు, ఉదాశీనుడు అనే మూడు రకముల వ్యక్తులను, సంధి చేసుకోడం మొదలగు రాజ తంత్రములు, ధర్మము, అర్థము, కామము, మోక్షము అనే నాలుగు పురుషార్థములు, పొందుపరిచాడు.

ఆ నీతి శాస్త్రము లక్ష అధ్యాయములు కలిగి ఉంది. ఈ లోకమున కంతకూ ఆచరణ యోగ్యమైంది. లోకమును నిర్మలంగా ఉంచడానికి తోడ్పడుతుంది అని భావించాడు బ్రహ్మ.

ఆ సమయంలో బ్రహ్మ దేవుని నొసటి నుండి ఆది అంతము లేని వాడు, ఈ విశ్వమునకు కర్త అయిన వాడు సర్వభూతములలో తానే అయి ఉన్నవాడు, సనాతనుడు, వికృతము, విశాలము అయిన కన్నులు కలవాడు అయిన శివుడు, విశాలాక్షుడు అనే పేరుతో ఆవిర్భవించాడు.

విశాలాక్షుడు బ్రహ్మ రచించిన లక్ష అధ్యాయములు గల నీతి శాస్త్రమును ఆములాగ్రము చదివాడు. ఈ నీతి శాస్త్రము చదవడానికి, నేర్చుకొనడానికి మానవుల ఆయుష్షు, బుద్ధి సరిపోదు అని అనుకున్నాడు. అందువలన ఆ నీతి శాస్త్రమును పదివేల అధ్యాయములకు కుదించి వైశాలాక్షము అనే నీతి శాస్త్రమును రచించాడు.

తరువాత ఆ నీతి శాస్త్రమును మహేంద్రుడు చదివాడు. మహేంద్రుడు దానిని ఐదు వేల అధ్యాయములకు కుదించాడు.

తరువాత ఆ నీతి శాస్త్రమును బృహస్పతి మూడు వేల అధ్యాయములకు కుదించి అందరికీ అర్ధమయేటట్లు రచించాడు.

దానిని శుక్రాచార్యుడు వేయి అధ్యాములకు కుదించాడు. అదే శుక్రనీతి.

కాలక్రమేణా, ఆ నీతి శాస్త్రమును, మహా మునులు జనులకు అర్ధం అయ్యే విధంగా చిన్న చిన్న గ్రంధములుగా రచించారు. ఈ విధంగా నీతి శాస్త్రము వివిధ రకాలుగా మానవ లోకంలో పరిణామం చెందింది.

దేవతలందరూ విష్ణు దేవుని వద్దకు పోయి నీతి శాస్త్రము పరిణామము చెందిన విధము వివరించి ఆ నీతి శాస్త్రమును మానవ లోకమున అమలు చేయుటకు ఒక సమర్ధుని నిర్దేశించండి అని వేడుకున్నారు.

అప్పుడు విష్ణుమూర్తి తన తేజస్సుతో ఒక మానస పుత్రుని పుట్టించాడు. అతని పేరు విరజుడు. అతనిని లోకమునకు రాజును చేసాడు. అతడు రాజ్యముచెయ్యడానికి ఒప్పుకోలేదు. విరజుని కుమారుడు కర్దముడు. అతడు కూడా రాజ్యాధికారమును తృణీకరించి తపస్సు చేసుకోడానికి పోయాడు.

కర్దముని కుమారుడు అనంగుడు నీతి శాస్త్రములో చెప్పబడిన దండనీతిని అనుసరించి ప్రజలను పాలించాడు. అతని తర్వాత అతని కుమారుడు నీతి పట్టాభిషిక్తుడయ్యాడు. అతడు మృత్యువు కుమార్తె సునీధ అనే యువతిని వివాహం చేసుకున్నాడు. వారికి వేనుడు అనే కుమారుడు కలిగాడు.

అతడు రాగ ద్వేషాలకు లోనయి ప్రజాకంటకుడయ్యాడు.  అప్పుడు మహా మునులు వచ్చి దర్భలతో అతని కుడి తొడను మధించారు. వేనుడి కుడి తొడనుండి నల్లని వాడు, వికృతాకారుడు అయిన అశుచి అనే పేరుగల వాడు జన్మించాడు.  వాడిని చూచి మహా మునులు "నిషీద...  నిషీద" అన్నారు. అంటే "కూర్చో ...కూర్చో" అన్నారు. అందువలన అశుచికి కలిగిన సంతానము నిషాదులు అనే పేరుతో పిలువ బడ్డారు. వారందరూ వింధ్య పర్వత ప్రాంతము లలో అత్యంత క్రూరులై తిరిగారు.

తరువాత మహా మునులు  వేనుని కుడి భుజాన్ని మధించారు. అప్పుడు ప్రకాశించే కవచంతో, ధనుర్బాణములతో, వేద వేదాంగ ధనుర్వేద పారంగతుడు అయిన ఒక మహా పురుషుడు జన్మించాడు.  వెంటనే నీతి శాస్త్రములో చెప్పబడిన దండనీతి అతనిని ఆశ్రయించింది.

ఆ మహా పురుషుడు మహామునులకు నమస్కరించి "ఏ పని మీద నన్ను సృష్టించారు". అని అడిగాడు

" ఓ మహా పురుషా! నీ పేరు వైన్యుడు. నీవు  అహంకారము, లోభము, కామము, క్రోధము విడిచి పెట్టి, సమస్త జనులను సమంగా చూస్తూ నీతి శాస్త్ర ము ననుసరించి  ధర్మ రక్షణ చేస్తూ ఈ లోకాన్ని పరి పాలించు. నీ ఇష్టా ఇష్టములకు విలువ ఇవ్వకుండా ప్రజలను రక్షించు. దండనీతిని ఆశ్రయించి ధర్మమును రక్షించు.  వేద వేదాంగములను రక్షించు. వర్ణ సంకరమును అరి కట్టు. బ్రాహ్మణులను, నీతి పరులను దయతో పాలించు." అని ఆజ్ఞాపించారు.

అప్పుడు ఆ వైన్యుడు  "మహా మునులారా! నేను బ్రాహ్మణుల సహాయంతో మీరు చెప్పిన కార్యములను నిర్వర్తిస్తాను." అని పలికాడు.

దానికి మహా మునులు సంతోషించారు. వైన్యుడికి బ్రాహ్మణులను సహాయకులుగా అనుమతించారు. ఆ మహా మునులు వైన్యుని సకల భూమండలానికి పట్టాభిషిక్తుని చేసారు. శుక్రుని పురోహితునిగా నియమించారు. వాలఖిల్యులలో సారస్వతులను మంత్రులుగా నియమించారు. గర్గుడుని జ్యోతిష్కుడుగా నియమించారు. ఇంద్రుడు, కుబేరుడు, అధిక సంపదలను ఇచ్చారు. వైన్యుడు ~~ఈ~~లోకమునకు ప్రభుత్వాధి పతియై శాస్త్రప్రకారము, దండనీతిని అమలు పరుస్తూ, ధర్మంగా పరిపాలన సాగించాడు. వైన్యుడి పాలనలో ప్రజలుసుఖ శాంతులతో జీవించారు.

ధర్మరాజా! బ్రాహ్మణులను ప్రజలను వినాశం నుండి రక్షించిన వాడవటంవల్ల అతనికి క్షత్రియుడు అనే పేరు, ప్రజలను రంజింప చేసాడు కాబట్టి రాజు అనే పేరు వచ్చాయి. వైన్యుడి సంతతి వారందరూ క్షత్రియులుగా పిలువ బడ్డారు. రాజత్వము వహించి, దండనీతిని అమలు చేస్తూ రాజ్యపాలన చేసారు. కాబట్టి రాజు విష్ణు అంశ నుండి ఉద్భవించాడు. అందుకే ప్రజలను పాలించు రాజు లందరూ విష్ణ్వంశ సంభూతులు. అందుకే ప్రజారక్షణ రాజుల చేతిలో ఉంది.

సిరి (సంపద) శ్రీ మహావిష్ణువు ఫాలభాగమునుండి జన్మించింది. ధర్మమునకు భార్య అయింది. అర్థము అనే కుమారుని కన్నది. కాబట్టి ధర్మము, సిరి, అర్థము రాజును ఆశ్రయించుకొని ఉంటారు.

ధర్మరాజా! అందుకని, రాజు ఇతరుల మాదిరి ఎలా ఉంటాడు?

అతను అందరిలోకి పుణ్యాత్ముడు. స్వర్గలోకమునకు పోవుటకు అర్హుడవుతాడు. రాజు దండనీతిని భూలోకములో అమలు చేయుటకు స్వర్గంనుండి భూమికి దిగివచ్చిన విష్ణ్వంశ సంభూతుడు. కాబట్టి వర్ణాశ్రమ ధర్మములు, ఆచార వ్యవహారములు, వేదములు, పురాణములు, ఇతిహాసములు రాజుల అధీనంలో ఉంటాయి. విష్ణుదేవుని మహి మ వలన రాజు సౌందర్యము, శౌర్యము, చతురత, మొదలగు కలిగి ఉంటాడు అని జనం అనుకుంటారు. అందుకే రాజును దేవతలతో సమానుడు అని ప్రజలు భావిస్తారు.

ధర్మజా! ఇంకా నీకు ఏమన్నా సందేహాలు ఉంటే అడుగు." అని అన్నాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు భీష్ముని ఇలా అడిగాడు "భీష్మ పితామహా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అనే నాలుగు వర్ణములు, బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము అనేనాలుగు ఆశ్రమములు, వాటిని ఆచరించు విధానములు, ఈ ప్రపంచములో అనుసరించు రాజ ధర్మములు వివరంగా తెలపండి." అని అడిగాడు.

భీష్ముడు ఇలా చెప్ప సాగాడు.

"ధర్మ నందనా! కోపం లేకుండా ఉండటం, సత్యము పలకడం, తన భార్యయందు అనురక్తుడై ఉండటం, రాజ్యమునకు సంబంధించిన రహస్యములను కాపాడటం, పరుల యడల ద్రోహ చింతన లేకుండా ఉండటం, మొదలగు ఉత్తమ గుణములను రాజు పాటించాలి. బ్రాహ్మణునకు

ఇంద్రియ నిగ్రహము అత్యంత  ఆవశ్యకము. బ్రాహ్మణుడు రోజూ వేదాధ్యయనము చెయ్యాలి.  యజ్ఞ యాగములు నిష్టతో చెయ్యాలి. బ్రాహ్మణుడు చెడుగా ప్రవర్తించకూడదు. కరుణ కలిగి ఉండవలెను. శాంతస్వభావుడై ప్రవర్తించవలెను.  బ్రాహ్మణునకు సంపద లభిస్తే అతడు దానిని తనసంతానము కొరకు, పరుల కొరకు వినియోగించాలి.

ఇంక క్షత్రియ ధర్మములు ఏవంటే--  యజ్ఞములుచెయ్యడం, దాన ధర్మములు చెయ్యడం, వేదములు చదవడం, దుర్మార్గులను కఠినంగా శిక్షించడం, ప్రజలను అనురాగంతో పాలించడం, యుద్ధములో భయం లేకుండా పోరాడటం. వీటిలో యుద్ధము చెయ్యడం క్షత్రియునకు పరమ ధర్మము.

ఇంక వైశ్య ధర్మములు గురించి వివరిస్తాను. వైశ్యుడు వేదాధ్యయనము చెయ్యాలి. యజ్ఞయాగములు చెయ్యాలి. న్యాయంగా ధనముసంపాదించాలి. కూడబెట్టాలి.  పశువులను పోషించాలి, రక్షించాలి. ఇది వైశ్యునకు ఉత్తమ ధర్మము.

పై చెప్పిన మూడు వర్ణముల వారికి పనులు చేసిపెట్టడం శూద్రుడి ధర్మము.  శూద్రుడు రాజానుమతితో ధనము, ధాన్యముసేకరించవచ్చు.  కాని దాన, ధర్మముల కొరకు రాజాను మతి లేకుండానే ధనము, ధాన్యము సేకరించవచ్చు. తప్పు లేదు.  బ్రహ్మ,క్షత్రియ,వైశ్యులకు యజ్ఞ యాగములు చెయ్యడం పరమ ధర్మము.

ఇంక  ఆశ్రమ ధర్మములు గురించి చెపుతాను. విను.

గురువుకు శుశ్రూష చేయుట, ఆగమ శాస్త్రములు అధ్యయనము చేయుట, బాహ్య అలంకారముల మీద ఆసక్తి లేకుండుట, భిక్షుక వృత్తితో జీవించుట, ఎవరి మీద ప్రేమ గానీ ద్వేషము గానీ లేకుండా ఉండటం, ఎల్లప్పుడూ మంచి పనులే చెయ్యడం బ్రహ్మచర్యాశ్రమములో ఆచరించదగినవి.

తన నిజ భార్య మీద ఆసక్తితో ఉండటం, కరుణ, సత్యనిష్ట, ఓర్పు, సజ్జన సాంగత్యము, దేవ కార్యములు, పితృకార్యములు శ్రద్ధతో నిర్వర్తించడం, నిత్యాగ్ని హోత్రం చెయ్యడం, అతిధులను ఆదరించడం గృహస్థాశ్రమ ములో ఆచరించదగ్గవి.

తాను గానీ, తన భార్యతో గానీ అడవులకు వెళ్లడం, మానము, అహంకారము వదిలిపెట్టడం, ఇంద్రియములను అదుపులో ఉంచుకోడం, జడధారియై వేదములు శాస్త్రములు చదవడం, సజ్జనులతో గోష్టి సల్పడం, వానప్రస్థములో ఆచరించవలసిన నియమములు.

ఇంక సన్యాస ఆశ్రమము స్వీకరించిన వాడు ఎక్కడ నైనా ఉంటాడు. ఆకలి వేస్తే దొరికింది తింటాడు. రాత్రి కాగానే ఎక్కడ ఉంటే అక్కడ పడుకుంటాడు. సన్యాసాశ్రమములో అగ్ని కార్యము చెయ్యవలసిన అవసరం లేదు. తనకు తానుగా ఏమీ కోరడు. ఇచ్చింది పుచ్చుకుంటాడు. ఇంద్రియ నిగ్రహం పాటిస్తాడు. వినయంతో ఉంటాడు. ఇవి సన్యాశ్రమములో ఆచరించవలసిన విధులు.

ఈ నాలుగు ఆశ్రమములు బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు ఆచరించవచ్చును. కాని శూద్రుడు మొదటి మూడు ఆశ్రమములు

ఆచరించవచ్చును. సన్యాసాశ్రమమునకు  అర్హుడు కాడు.  ధర్మపరుడైన బ్రాహ్మణుడు యజ్ఞ యాగములలో  దానమును స్వీకరించుటకు అర్హుడు. రాజులకు అటువంటి బ్రాహ్మణులకు దానము చెయ్యడంతో కీర్తి వస్తుంది.

రాజైన వాడు వర్ణాశ్రమ ధర్మములను ప్రజల చేత  ఆచరింపజేసి  ఈ లోకములో పరలోకములో సిద్ధిపొందుతాడు. సకల ధర్మములు రాజధర్మము నకు లోబడి ఉంటాయి. రాజు దండనీతిని విస్మరిస్తే యజ్ఞయాగములకు విఘాతము కలుగుతుంది. ప్రజలకు కీడు కలుగుతుంది.  రాజు దండనీతిని అమలు చేస్తూ ప్రజలను దయతో పాలిస్తే, జనులు సుఖసంతోషాలతో జీవిస్తారు. కాబట్టి ధర్మములో కల్లా రాజధర్మము గొప్పది.  రాజధర్మమును ఆచరించు రాజు దైవ సమానుడు.

పూర్వము మాందాత అనే  రాజు విష్ణువును గూర్చి తపస్సు చేసాడు. మాంధాతకు ఇంద్రుడు ప్రత్యక్షం అయ్యాడు. మాంధాత ఇంద్రుడికి నమస్కారం చేసాడు. ఇంద్రుడు మాంధాతతో ఇలా అన్నాడు.   “మాంధాతా! నువ్వు విష్ణువు గురించి తపస్సు చేసావు. కాని విష్ణువును ప్రసన్నం చేసుకోడం అంత సులభ సాధ్యం కాదు అందుకని నేను ప్రత్యక్షం అయ్యాను. నీ కోరిక ఏమిటో చెబితే నేను నెరవేరుస్తాను.” అని అన్నాడు.

“ మహేంద్రా! నాకు ఈ సంసారం మీద విరక్తి కలిగించి, భిక్షుక వృత్తి మీద ఆసక్తి కలిగించు.” అని అడిగాడు మాంధాత.

అప్పుడు ఇంద్రుడు మాందాత తో ఇలా అన్నాడు.  “ఓ మహారాజా! అన్ని ధర్మములలోకి రాజధర్మము గొప్పది.  రాజైన వాడు, కామ క్రోధములను

విడిచి పెట్టి, దండనీతిని అమలు పరుస్తూ రాజ్యమును పాలించాలి. అప్పుడు ఆ రాజుకు ఉత్తమ గతులు కలుగుతాయి. అలాంటి మహారాజైన నీకు భిక్షుక వృత్తి ఆచరణ యోగ్యము కాదు.

ప్రజలను రక్షించడం, యుద్ధములో మరణించడం క్షత్రియ ధర్మము. భిక్షుక వృత్తి రాజధర్మము కాదు. మానవులందరిలో కల్లా రాజు గొప్పవాడు అని వేదములు, పురాణములు శాస్త్రములు ఘోషిస్తున్నాయి. ధర్మబద్ధమైన దండనీతికి సాటి వేరే నీతి లేదు అని పెద్దలు చెప్పారు. కాబట్టి, ఓ మహారాజా! నీవు కామ క్రోధములను విడిచి పెట్టి, దండనీతిని అమలు చేస్తూ రాజ్యము చెయ్యి. అంతే గాని భిక్షుక వృత్తి నీకు సరిగాదు." అని మాంధాతతో అన్నాడు దేవేంద్రుడు.

కాబట్టి ధర్మనందనా! అతిథులను, దీనులను, పేదవారిని, దయతో చూడు. సంతోషము, అహంకారము, దుఃఖము నీ మనసులోనికి రానీయక నిర్మల మనస్కుడవై ఉండు. స్వార్థాన్ని విడిచి పెట్టి ప్రజా రక్షణ కొరకు పాటుపడు. అదే పరమ ధర్మము." అని పలికాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు భీష్మునితో ఇలా అన్నాడు.

"భీష్మ పితామహా! రాజులకు ఆచరించ వలసిన వర్ణాశ్రమ ధర్మముల గురించి చెప్పారు. మరి ప్రజలు ఏ ధర్మమును ఆచరించి సుఖంగా జీవిస్తారు." అని అడిగాడు.

భీష్ముడు ధర్మరాజుకు ఇలా చెప్పాడు.

“ప్రజలు తమకు ఒక రాజును నియమించుకొని  ఆయనను రాజ్యమునకు అభిషిక్తుని చేసి, ఆయన పాలనలో ప్రజలు సుఖంగా జీవిస్తున్నారు.  ఆ ప్రకారం తమను పాలించే రాజు లేకపోతే ప్రజలు దుర్మార్గులై, ఒకరి ధనమును ఒకరు, ఒకరి భార్యను ఒకరు అపహరించుచూ, బలవంతులు బలహీనులను దోచుకుంటూ,   విచ్చలవిడిగా బతుకుతుంటారు. కాబట్టి రాజు లేకుండా జనము జీవించలేరు.  వ్యవసాయము, వ్యాపారము, గోవులను రక్షించుట మొదలగు వృత్తులు నాశనమవుతాయి.

ఒకానొక సమయమున ప్రజలలో, రాజు లేకుండా ఉండటం వలన, అరాచకం ఏర్పడింది. దొంగతనము, రంకుతనమూ క్రూరత్వమూ పెచ్చుమీరి పోయాయి.  అలాంటి దుర్మార్గులను కట్టడి చేసే రాజు లేడు.  అందుకని సాధారణ ప్రజలు అందరూ కలిసి బ్రహ్మదేవుని వద్దకుపోయారు.  తమకు రక్షకుడుగా ఒక రాజును ప్రసాదించమని, అతని పాలనలో తాము సుఖంగా జీవిస్తామని  కోరారు.

బ్రహ్మ దేవుడు సరే అని  మనువును రాజుగా నియమించాడు.

తాను అసత్యమాడే వారికి దుర్మార్గులకు రాజుగా ఉండనని చెప్పాడు మనువు.

అప్పుడు జనమంతా కలిసి మనువుతో ఇలా అన్నారు. “పశువులలోనూ, బంగారములోనూ సగ భాగము పన్ను కింద  చెల్లిస్తాము. పండించిన ధాన్యములో  పదవ భాగము నీకు పన్ను కింద సమర్పించుకుంటాము. కాబట్టి మంచి సైన్యమును సమకూర్చుకొని, నీ బలపరాక్రమములతో దుష్టులను శిక్షిస్తూ, శిష్టులను రక్షిస్తూ రాజ్యపాలన చెయ్యండి. ప్రజలంతా నీ ఆజ్ఞలకు

లోబడి ఉంటారు. అధర్మ వర్తనులు నీ చేత శిక్షింపబడతారు. ధర్మాత్ములు తాము చేసిన ధర్మములో ఆరవ వంతు నీకు చెందుతుంది. ఇంద్రుడు దేవతలను రక్షించి నట్టు మీరు మమ్ములను రక్షించండి." అని వేడుకున్నారు.

మనువు వారి ప్రార్ధనను అంగీకరించాడు. మనువు తన బల పరాక్రమ ములతో నీతి మంతుడయి, ఈ భూమిని పరిపాలించాడు. అతని పాలనలో ప్రజలు సుఖించారు.

కాబట్టి ధర్మరాజా! రాజాజ్ఞను పాలించడం ప్రజల కర్తవ్యం. ప్రజలు రాజును దైవ సమానంగా పూజించాలి. రాజు ఎప్పుడైన పొరపాటున ధర్మం తప్పి ప్రవర్తించినా, దానిని ప్రజలు సహించాలి. ఆ ప్రకారంగా ప్రజలు రాజును సంభావిస్తేనే, శత్రువులు కూడా రాజుకు భయపడతారు. తాను పాలించే ప్రజలే రాజును లెక్క చెయ్యనపుడు, ఇంక శత్రువులు రాజును ఏం లెక్క చేస్తారు? కాబట్టి రాజు పట్ల ప్రజలు భయభక్తులతో మెలగటం ఉచితము.

రాజుకు మంచి మంచి వాహనములు, సింహాసనము, మంచి నివాస గృ హము, రుచికరమైన ఆహార పదార్ధములు, ఆడంబరమైన వస్త్రములు, అంగ రక్షకులు అత్యవసరములు. వాటిని సమకూర్చడం ప్రజట కర్తవ్యము." అని చెప్పాడు భీష్ముడు. ఇంకా ఇలా చెప్పసాగాడు.

" ఓ ధర్మరాజా! ఈ లోకములకు, లోక ధర్మములకు రాజు మూలము. రాజు లేని రాజ్యము నీరు లేని సరస్సు లాంటిది. రాజ్యపాలన లేక పోతే ప్రజలు సూర్యరశ్మి లేనట్టు బాధపడతారు. రాజు రక్షణ లేక పోతే ప్రజలు తమ తమ ధనమును ప్రశాంతంగా అనుభవించలేరు. రాజు లేకుంటే ప్రజలు భయాందో ళనలు చెందుతారు. రాజు రక్షణ లోనే ప్రజలు యజ్ఞములు యాగములు

చెయ్యగలుగుతారు. రాజు శత్రువులను జయించి వారి సంపదలను తనకు ఇష్టమైన వారికి దానం చేస్తాడు.

రాజు చార చక్షువుగా చరించునపుడు సూర్యుడి గానూ, దుర్మార్గులను దండించునపుడు యముడు గానూ ప్రవర్తించాలి. కాబట్టి రాజును దైవసమానుడు అంటారు. అందుకనే రాజును విరాట్, సామ్రాట్ అని పిలుస్తారు. ఎవరైతే ఇంద్రియ నిగ్రహము పాటిస్తూ, భక్తితో, రాజును మనసారా పూజిస్తారో వారిని రాజు అన్నిసంపదలతో సత్కరిస్తాడు.

రాజునకు ప్రజలు శరీరం వంటి వారు. రాజు ప్రజలకు ఆత్మవంటి వాడు. కాబట్టి రాజును ప్రజలు పూజించాలి. ప్రజలను రాజు రక్షించాలి. పైవిషయములన్నీ బృహస్పతి వసుమనుడు అనే రాజుకు బోధించాడు. వాటిని జాగ్రత్తగా పాటిస్తూ వసుమనుడు రాజ్యపాలన చేసాడు" అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

అప్పుడు ధర్మరాజు భీష్మునితో "పితామహా! రాజు జనపదపాలనము, శత్రు సంహారము ఎలా చెయ్యాలో వివరించండి." అని అడిగాడు.

భీష్ముడు ధర్మరాజుతో ఇలా చెప్పసాగాడు.

"ధర్మనందనా! రాజైన వాడు ముందు తనను తాను గెలవాలి. తరువాత శత్రువులను గెలవాలి. తనను తాను గెలువ లేని వాడు శత్రువులను ఎలాగెలువగలడు? ధర్మనందనా! తనను తాను గెలవడంఅంటే తనలో ఉన్న కామము, క్రోధము, మోహము, లోభము, మదము, మాత్సర్యము లను గెలవాలి. జితేంద్రియుడు కావాలి. ఆ ప్రకారంగా అరిషడ్వర్గములను

జయించిన రాజు శత్రువులను సులభంగా జయించగలడు.

రాజు తన రాజ్య సరిహద్దులను, రాజ్యములో జనసంచార స్థలములను, దుర్గములను, సింహ ద్వారములను, అంతః పురములను తగిన రక్షక భటులను నియోగించి రక్షించుకొన వలెను. రాజు చార చక్షువుగా ప్రవర్తించాలి. శత్రురాజుల దగ్గర, తన రాజ్యమంతటా, అంతః పురములోనూ చారులను నియోగించి ఎప్పటికప్పుడు సమాచారమును సేకరించవలెను.

రాజు తాను బలహీనుడైనపుడు, ఆవిషయం శత్రురాజులు  పసిగట్టక ముందే మరొక బలవంతుడైన మిత్ర రాజుతో సంధి చేసుకొన వలెను. శత్రురాజుకు కప్పము కట్టిఅయినా సరే తన రాజ్యమును రక్షించుకొనవలెను. శత్రురాజు బలహీనుడైనప్పుడు అతడు మైమరిచి  ఉండగా చూచి అతని మీద దాడి చెయ్యాలి.  విషప్రయోగము చేతగానీ, అగ్నిని ప్రయోగించి గానీ అతని రాజ్యమును ఛిన్నాభిన్నం చెయ్యాలి.  అని చెప్పి అనవసరంగా ఎవరితోనూ కయ్యమునకు కాలు దువ్వకూడదు. ముందు  మంచి మాటలతో చెప్పి చూడాలి. తరువాత శత్రు రాజులలో విబేధాలు కల్పించాలి. లొంగదీసు కోవాలి. ఆఖరి అస్త్రంగా యుద్ధము చెయ్యాలి.

రాజు తన ప్రజలను కన్న తండ్రి వలె పరిపాలించాలి. ప్రజల సంపాదనలో ఆరవ వంతు మాత్రము పన్నుగా వసూలు చెయ్యాలి.  ఆదాయపు వనరులు సమృద్ధిగా లభించే  అటవీ సంపద, గోవులు, గనులు,   మొదలగు వాటిని సమర్ధులైన అధికారులను నియమించి అభివృద్ధి చెయ్యాలి.  తన రాజ్యములో జరిగే అన్ని  అభివృద్ధి పనులను రాజు ఒక కంటితో చూస్తూ ఉండాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుంది.

రాజు తన రాజ్యములో కోటను ఎల్లప్పుడూ సంరక్షించుకుంటూ ఉండాలి. పశువులకు గడ్డి, గుర్రములకు దాణా, ప్రజలకు కావలసిని ఆహార పదార్థములు, నూనెలు, నెయ్యి, ఆయుధములు, ఔషధములు, యంత్రములను సమృద్ధిగా నిల్వ ఉంచుకొన వలెను. మంచి నీటికి బావులను తవ్వించవలెను. సమర్థులైన వారిని సైన్యములో నియోగించవలెను.

శత్రువు తన మీదికి దండెత్తి రావడం పసిగట్టి వారు వచ్చు త్రోవలోవారికి వారి సైన్యమునకు ఆహారపదార్థములు, నీరు దొరకకుండా జాగ్రత్త పడవలెను. రాజ్యములో రాజును, మంత్రులను, జనపదములను, కోశాగారమును సైన్యమును, దుర్గమును, మిత్రరాజులను జాగ్రత్తగా చూచుకొనాలి. అలాగే రాజ్యతంత్రమును సమర్థ వంతంగా నడపాలి.

ధర్మము, అర్థము, కామము అను మూడు పురుషార్థములను పాటించాలి. సత్వ, రజస్, తమోగుణములను సమపాళ్లలో పాటించడమే రాజధర్మము. ప్రమాద వశాత్తు అర్థము, కామము బలహీనమైనప్పటికీ, ధర్మము మాత్రము తప్పరాదు అని అంగిరసుడు, భారద్వాజుడు చెప్పారు.

రాజైన వాడు ఇంద్రియములను జయించాలి. వాటికి వశుడు కారాదు. కామము వలన ప్రేరేపింపబడే జూదము, వేట, స్త్రీ సంభోగము, మద్యపానము, ధనమును విచ్చలవిడిగా ఖర్చుపెట్టడం, మొదలగు వాటిని, క్రోధము వలన కలిగే దురుసుగా మాట్లాడటం, అనవసరంగా ఇతరులను దండించడం మొదలగు వాటిని వదిలిపెట్టాలి.

వేదాధ్యయనము, యజ్ఞములు, యాగములు, దాన ధర్మములు చెయ్యాలి. తనకు హాని తలపెట్టే వారి కుటిల మైన మాటలకు లొంగిపోకూడదు.

నీతి మంతులైన మంత్రులతో దైవ చింతన, సుపరిపాలన సాగించాలి. దేవతలను బ్రాహ్మణులను నిత్యం పూజించాలి. పితృదేవతలకు తర్పణ క్రియలు ఆచరించాలి. అశుభములను పారద్రోలి,నిత్యం శుభప్రదములైన పనులుచేస్తూ రాజ్యపాలన సాగించాలి. అటువంటిరాజు ఈ లోకములోనే కాదు పరలోకములో కూడా సిద్ధి పొందుతాడు." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

అప్పుడు ధర్మరాజు భీష్మునితో "పితామహా! రాజు దండనీతిని ఎలా ఉపయోగించాలి వివరించండి." అని అడిగాడు.

భీష్ముడు ఇలా చెప్ప సాగాడు.

"కృతయుగారంభంనుండి రాజు దండనీతిని ధర్మమైన పద్ధతిలో ఉపయోగిస్తున్నాడు. రాజు దండనీతిని ధర్మబద్ధంగా ఆచరించడం వల్ల ధర్మనిరతి పెరుగుతుంది. మనం చేసే కర్మలు సత్ఫలితాలను ఇస్తాయి. ఋతువులు మనకు శుభాలు చేకూరుస్తాయి. ప్రజల జీవిత కాలం పెరుగుతుంది. దున్నకుండానే భూమి ఫలసాయము అందిస్తుంది.

తరువాత వచ్చిన త్రేతాయుగములో ధర్మము కొంచెం క్షీణిస్తుంది. మూడు పాదములతో నడుస్తుంది. దానితోనే ప్రజలు సంతృప్తి పొందుతారు.

ఇంక ద్వాపర యుగములో రాజు ధర్మమును రెండు పాదములతో మాత్రమేనడుపుతాడు. ప్రజలు దానితోనేసంతృప్తి చెందుతారు.

ఇంక రాబోవు కలియుగములో రాజుకు ధర్మాచరణము మీద శ్రద్ధ

సన్నగిల్లుతుంది. అధర్మము పెరుగుతుంది. వర్ణాశ్రమ ధర్మములు గతి తప్పుతాయి. ఇదంతా కాల గతిని బట్టి జరుగుతుంటుంది.

కాని రాజైన వాడు రాజ నీతిని కాల గతిని బట్టి కాక, కృతయుగములో వలె ఆచరించిన, ధర్మము నాలుగు పాదములతో వర్ధిల్లుతుంది. లేనిచో క్రమ క్రమంగా కాలగతిని క్షీణిస్తుంది.

దానికి రాజు ఈ ప్రకారం ఆచరించాలి. రాజు ప్రజలు చేసే పనులను, వారు చేసే తప్పులను జాగ్రత్తగా పరిశీలించాలి. ఎవడైనా తనను తాను పొగుడుకుంటున్నాడు అంటే వాడికి మదము, అహంకారము,లోభము, దుర్మార్గము ఎక్కువగా ఉంటుంది అని తెలుసుకోవాలి. అవి లేని వాడు తనను తాను పొగుడుకొనడు.

సజ్జనుడైన రాజు నియమ బద్ధంగా జీవిస్తాడు. వాడికి పరాక్రమం ఉంటుంది కాని గర్వం ఉండదు. పరస్త్రీలను కామించడు. వాడికి కోపం ఉండదు. సామంత రాజులను ధనం కోసం పీడించడు. ఇచ్చింది తీసుకుంటాడు.

రాజుకు వేదవేదాంగ పారంగతుడైన పురోహితుడు అవసరము. ఎల్లప్పుడూ అతను పురములోనే ఉండాలి. రాజును సక్రమ మార్గంలో నడిపించాలి.

సామంత రాజులనుండి కప్పములు, ప్రజల నుండి కానుకలు గ్రహించే ఉద్యోగము, దయ, కరుణ, చతురత కలిగిన మంత్రులకు అప్పగించాలి. రాజు పన్నుల కోసం ప్రజలను పీడించరాదు. అది పాల కోసం ఆవు పొదుగును

కోయడంతో సమానం.

రాజు ప్రజల నుండి పన్నులను, తోటమాలి చెట్టు నుండి పండ్లను కోసే మాదిరి సున్నితంగా వసూలు చేయాలి. ముందుగా ప్రజలకు అవసరమైన సౌకర్యములు కల్పించి, ప్రజలకు రక్షణ కల్పించి, తరువాత పన్నులు వసూలుచేయాలి.

(దీనినే Quid Pro Quo (Latin word) గా న్యాయ శాస్త్రంలో పిలుస్తారు. something for something అని అర్థం. మనం కట్టే పన్నులకు తగిన సేవలు ప్రభుత్వం మనకు అందించాలి. దీనిని భీష్ముడు రాజ నీతిలో ప్రతి పాదించాడు. కాని ఈ రోజుల్లో ప్రజలు రూపాయి పన్ను కట్టినా అందులో పది పైసలు కూడా సేవల రూపంలో ప్రజలకు లభించడం లేదు.).

ప్రజలను రక్షించడం, ప్రజలకు కావలసిన సౌకర్యములు కల్పించడం రాజు బాధ్యత. ఎన్ని యజ్ఞములు, యాగములు, తపస్సులు చేసినా అవి ప్రజారక్షణతో సాటి రావు అని రాజు గ్రహించాలి." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

ఇంకా ఇలా చెప్పసాగాడు "ధర్మనందనా! ఇలాదేవికి పురూరవుడు అనే కుమారుడు ఉండేవాడు. పురూరవ చక్రవర్తి ఈ భూమినంతా పాలించాడు. ఆ పురూరవుడు వాయుదేవుని ..... " బ్రాహ్మణులు, క్షత్రియుల లో ఈ భూమి ఎవరి సంపదగా విరాజిల్లుతుంది......" అని అడిగాడు. దానికి వాయుదేవుడు ఇలా చెప్పాడు.

“బ్రహ్మ యొక్క ముఖం నుండి బ్రాహ్మణుడు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు జన్మించారు. ఉత్కృష్టమైన ముఖమునుండి జన్మించిన బ్రాహ్మణుడు, ఈ భూమిలోని సకల సంపదలను అనుభవించుటకు, ఒకరికి ఇచ్చుటకు అర్హుడు. దండనీతిని అమలు చేయుటకు క్షత్రియుని, సహజంగా శాంతి కాముకుడైన బ్రాహ్మణుని అతని పురోహితునిగా నియమించారు. అటువంటి పురోహితునికి సమస్త సంపదలు సమకూర్చి అతని అడుగుజాడలలో రాజ్యపాలన చేయు రాజు ఈ లోకంలో పరలోకంలో సుఖసంతోషాలుపొందుతాడు. ప్రజల యొక్క భయమును పోగొట్టి రక్షించడమే రాజు యొక్కపరమ ధర్మము.” అని వాయుదేవుడు పురూరవుడికి తెలిపాడు.” అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

అప్పుడు ధర్మరాజు భీష్ముని తో ఇలా అన్నాడు. “పితామహా! ఏ యే పనులు చేస్తే బ్రాహ్మణులు గౌరవాన్ని పొందుతారు.” అని అడిగాడు.

భీష్ముడు ఇలా చెప్పసాగాడు.

“ధర్మ నందనా! పూర్వము శుక్రాచార్యుడు పురోహితుని గురించి చెప్పిన మాటలు నీకు చెబుతాను విను. రాజు పురోహితుని ఆధ్వర్యములో యజ్ఞ యాగములు చేసి దేవతలను, గరుడ, గంధర్వ, విద్యాధరులను తృప్తి పరచవలెను. పురోహితుడి రక్షణ లేని రాజును రాక్షసులు, పిశాచములు పీడిస్తుంటాయి. రాజుకు అనుదినము కలి గే అశుభములను పురోహితుడు శాంతి కార్యములతో నివారిస్తాడు. రాజుకు జరిగే అశుభములను తన శాంతి హోమములతో రక్షిస్తూ, శత్రురాజులను మంత్ర తంత్రములతో పురోహితులు

నాశనం చేస్తారు. కాబట్టి నువ్వు ఉత్తముడైన పురోహితుని నియమించుకొని రాజ్యపాలన చెయ్యి .

కాని పరిశుద్ధుడు కాని కుత్సితుడైన పురోహితుడు రాజుకు హాని కలిగిస్తాడు. తానూ నాశనం అవుతాడు. కాబట్టి రాజు ఆరోగ్యవంతుడు, గుణవంతుడు, బుద్ధిమంతుడు అయిన బ్రాహ్మణుని పురోహితునిగా నియమించుకోవాలి. ప్రతి కార్యములో కూడా రాజు, పురోహితుడు, ఒకే మాట మీద నిలబడి ఆ కార్యమును నిర్వర్తించాలి.

ధర్మనందనా! దీని గురించి ఒక ఇతిహాసము చెప్పెదను విను. బ్రాహ్మణునికి క్షత్రియునికి ఉన్న సంబంధము గురించి కశ్యప ప్రజాపతి ఐలుడికి ~~ఈ~~ విధంగావివరించాడు. క్షత్రియుడు బ్రాహ్మణుని నుండి పుట్టాడు. బ్రాహ్మణుడు క్షత్రియుని వల్ల నియమింప బడ్డాడు. కాబట్టి బ్రాహ్మణ క్షత్రియులు ఒకరి మీద ఒకరు ఆధారపడి జీవిస్తారు.

రాజు పురోహితుడు పరస్పరం గౌరవించుకుంటూ పాలన సాగిస్తే ప్రజలు రాజును గౌరవిస్తారు లేని యడల ఆ రాజు పట్ల, పురోహితుని పట్ల ప్రజలు గౌరవం చూపించరు. అధర్మము ప్రజ్వరిల్లుతుంది. బ్రాహ్మణుడికి క్షత్రియుడికి సఖ్యత లేక పోతే రుద్రుడికి కోపం వస్తుంది. రుద్రుడికి కోపం వస్తే ప్రపంచం సర్వ నాశనం అవుతుంది కాబట్టి బ్రాహ్మణుడు క్షత్రియుడు ఒకరిని ఒకరు గౌరవించుకోవాలి.

ఇంకా పురోహితుడు ఎలా ఉండాలి అనే విషయం గూర్చి కుబేరుడు ముచికుందుడు అనే మహారాజుకు ఇలా చెప్పాడు.

పూర్వ కాలంలో ముచికుందుడు అనే రాజు రాజ్య కాంక్షతో కుబేరుని మీదికి దండెత్తాడు. కుబేరుడు తన సైన్యములను పంపి ముచికుందుని ఓడించాడు. ముచికుందుడికి కోపం వచ్చింది. తన ఓటమికి కారణం పురోహితుడని తలచి అతనిని నిందించాడు. ముచి కుందుని పురోహితుడు వెంటనే హోమములు, పూజలు, తపస్సు చేసి తన మంత్ర శక్తితో ముచి కుందుని సేనలకు బలపరాక్రమములు సమకూర్చాడు. ముచికుందుడు మరలా కుబేరుని మీదికియుద్ధానికి వెళ్లాడు.

అప్పుడు కుబేరుడు ముచి కుందుని చూచి "నీవు నీ పురోహితుని తపః బలముతో మంత్ర శక్తితో వచ్చావు. నీ స్వశక్తి మీద రాలేదు" అని అవహేళన చేసాడు. అప్పుడు ముచి కుందుడు కుబేరునితో ఇలా అన్నాడు. "బ్రాహ్మణుడు, క్షత్రియుడు వేరు వేరు కాదు. ఒకరి మీద ఒకరు ఆధారపడి ఉంటారు అని ఆ బ్రహ్మ అనుగ్రహించాడు. కాబట్టి నాపురోహితుని బలమే నా బలము. మారు మాటాడక యుద్ధానికి రా." అని పిలిచాడు.

దానికి కుబేరుడు నేను నీతో యుద్ధము చేయను. నీకు కావాల్సింది నా రాజ్యము కదా దానిని తీసుకో అని అన్నాడు.

నాకు నీ దయాధర్మ భిక్ష అక్కర లేదు నిన్ను జయించి నీ రాజ్యము తీసుకుంటాను అన్నాడు ముచికుందుడు.

ముచి కుందుని పరాక్రమానికి సంతోషించాడు కుబేరుడు. అలాగే నేను నీకు ఓడి పోయాను అన్నాడు. ముచి కుందుడు సంతోషించాడు. ఈ సమస్త భూ మండలాన్ని చాలా సంవత్సరాలు పరిపాలించాడు .

కాబట్టి ఓ ధర్మ రాజా! నీవు ఎల్లప్పుడూ నీ ప్రజలకు అభయ హస్తమిచ్చి, రక్షించి ఈ భూమిని పాలించు. అదియే రాజధర్మము." అని చెప్పాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు "పితామహా! బ్రాహ్మణులు మొదలగు వారు తమ తమ వృత్తిధర్మములు, కుల ధర్మములు విడిచి ప్రవర్తించిన ఏమి చేయవల యును వివరించండి." అని అడిగాడు.

దానికి భీష్ముడు ఈ ప్రకారంగా బదులు చెప్పాడు.

"ఓ ధర్మరాజా! ఆపదలు సంభవించిన సమయంలో ఏ కులము వారైనా తమ తమ కులధర్మములను విడిచి ప్రవర్తించిన వారికి ఏ పాపమూఅంటదు. కాని, క్షత్రియుడు పట్ట వలసిన కత్తి బ్రాహ్మణుడు పడితే, బ్రాహ్మణుడు తన బ్రాహ్మణ్యము కోల్పోయి క్షత్రియుడు అవుతాడు. అలాగే బ్రాహ్మణుడు తన కుల ధర్మము వీడి వైశ్య ధర్మమయిన వ్యాపారము చేసిన వైశ్యుడౌతాడు. అలాగే బ్రాహ్మణుడు శూద్ర ధర్మమైన ధనార్జన కొరకు ఒకరికి ఊడిగము చేసిన శూద్రుడౌతాడు. ఇదే మాదిరి తక్కిన జాతుల వారు కూడా తమ తమ ధర్మములు వీడి పరధర్మములను ఆచరించిన, కుల హీనులవుతారు. అటువంటి వారు మరలా తమ తమ కర్మలను ఆచరించుటకు అర్హులు కారు. రాజు ఈ విషయముల నన్ని తెలుసుకొని ఎవరూ తమ తమధర్మము తప్పకుండా చూడాలి.

ప్రజలు సంపాదించుకొన్న పుణ్యములో కానీ, పాపములో కానీ నాలుగవ వంతు రాజుకు చెందుతుంది. కాబట్టి ప్రజలు వర్ణాశ్రమ ధర్మములు తప్పి చరించిన ఆ పాపములో నాలుగవ వంతు రాజు అనుభవించాలి."అని భీష్ముడు

ధర్మరాజుకు వివరించాడు.

అప్పుడు ధర్మరాజు భీష్ముని తో ఇలా అన్నాడు. "పితామహా! నాకు ఈ రాజ్యసుఖములు అనుభవించాలని గానీ, రాజ్యాధికారము చేపట్టాలని గానీ లేదు. కానీ నేను ధర్మరక్షణ, ప్రజారక్షణ నిర్వర్తించగలనా! అని సందేహము కలుగుచున్నది. ఈ రాజ్యభారము పాపభూయిష్టము. పైగా ప్రజల మీద దండనీతిని ప్రయోగించి వారి ఆగ్రహానికి గురి కావాలి. అందుకని నీకు ఈ రాజ్యభారము అక్కర లేదు. మరలా అడవులకు వెళతాను."అని అన్నాడు.

దానికి భీష్ముడు నవ్వి నీవు క్షత్రియుడవు. కాని నీవు వైరాగ్యము కోరుకుంటున్నావు. అది రాజధర్మము ఎలా అవుతుంది. నీ మనసు చాలా సున్నితము. కానీ ఇది క్షత్రియలక్షణము కాదు కదా! నీకు బుద్ధులు చెప్పడానికి నీ తండ్రి పాండురాజు, నీ తాత విచిత్రవీర్యుడు నీ ముత్తాత శంతన మహారాజు ఇక్కడ లేరు కదా. కాబట్టి నా మాట విను.

నీకు ముందు ఈ భూమిని ఏలిన రాజు లందరూ రాజ ధర్మము, దండనీతి ఆచరించి రాజ్య పాలన చేయలేదా! అలాగే నువ్వు కూడా ప్రజలను పాలించు. యజ్ఞములు, యాగములు చెయ్యడం క్షత్రియ ధర్మము. అలా చేయక పోవడం మహా పాపం. వర్ణాశ్రమ ధర్మములను నీవు పాటిస్తూ, నీ ప్రజలతో పాటించేట్టు చెయ్యి. అదియే రాజధర్మము.

ఈ సందర్భంలో నీకు ఒక ఇతిహాసము చెబుతాను విను. పూర్వము కేకయ రాజు వేదాధ్యయనము కొరకు అరణ్యములకు వెళ్లాడు. అక్కడ ఒక రాక్షసుడు ఆ రాజును పట్టుకొన్నాడు. ఆ రాక్షసుడిని ఎదిరించే బలం కేకయ రాజుకు లేదు. అపుడు కేకయ రాజు రాక్షసునితో ఇలా అన్నాడు.

"ఓ దానవేంద్రా! నా రాజ్యములో దొంగతనములు, రంకు తనములు మచ్చుకైనా లేవు. నా రాజ్యములో బ్రాహ్మణులు వేదాధ్యయనము, యజ్ఞ యాగములు నిరంతరము చేస్తుంటారు. రాజులు బ్రాహ్మణులను ఆరాధిస్తుంటారు. యజ్ఞములు చేస్తుంటారు. వైశ్యులు గోరక్షణ, వ్యాపారము మొదలగు విధులు నిర్వర్తిస్తుంటారు. పై మూడు జాతులకు సేవ చేస్తూ శూద్రులు జీవనం సాగిస్తున్నారు. నా రాజ్యంలో నేను నా ప్రజలూ వర్ణాశ్రమ ధర్మములు పాటిస్తూ జీవనం సాగిస్తున్నాము. నేను నా ప్రజలు ఏం పాపం చేసామని నన్ను ఇలా నిర్బంధించావు." అని నిలదీసాడు.

కేకయ రాజు మాటలకు ఆ దానవుడు ఎంతో సంతోషించాడు. కేకయ రాజును ప్రశంసించి అతనిని విడిచి పెట్టాడు. కాబట్టి ధర్మరాజా! కేకయ రాజు మాదిరి రాజులందరూ ధర్మంగా రాజ్యపాలన చేసే అతనికి ఏ పాపమూ అంటదు" అని చెప్పాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు భీష్మునితో ఇలా అన్నాడు. "పితామహా! రాజాశ్రయం దొరకని బ్రాహ్మణుడు కష్టకాలంలో ఎలా జీవించగలడు. తెలుపండి."అని అడిగాడు.

భీష్ముడు ఇలా అన్నాడు.

"బ్రాహ్మణుడు తన వృత్తిధర్మములో జీవనం సాగించడం దుర్భర మైనపుడు ఆపద్ధర్మంగా వైశ్యవృత్తిని స్వీకరించవచ్చు. కాని ఎక్కువ ధనాశతో ఉప్పు, నువ్వులు, మాంసము, ఆవు, ఎద్దు, అన్నము, మద్యము ,నెయ్యి, నూనెలు మొదలగు వాటిలో వ్యాపారముచేయరాదు." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! యజ్ఞములు ఏ ప్రకారము ఆచరించాలి." అని అడిగాడు.

"ధర్మనందనా! యజ్ఞములకు శ్రద్ధముఖ్యము. మిధ్యాచారముగా యజ్ఞములు చెయ్యకూడదు. వేదములను అపహాస్యము చెయ్యకూడదు. యజ్ఞ యాగము లలో బ్రాహ్మణులకు దక్షిణలు సమర్పించి తృప్తిపరచవలెను. యజ్ఞయాగముల కన్నా తపస్సు అధికమైనది. తపస్సు అనగా ప్రసన్నం గా ఉండటం, అహింసావ్రతము ఆచరించడం, ఎల్లప్పుడూ సత్యం పలకడం, దయగలిగి ఉంటడం, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండటం." అని చెప్పాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు భీష్ముని తో ఇలా అన్నాడు. "పితామహా! రాజు ఎలాంటి వారిని నమ్మాలి ? నమ్మక మైన స్నేహితులు లేని రాజు రాజధర్మమును సక్రమంగా నెరవేర్చ లేడు గదా!" అని అడిగాడు.

భీష్ముడు ఇలా చెప్ప సాగాడు.

"రాజు ఎవరినీ అతిగా నమ్మకూడదు. అలాగని చెప్పి ఎవరినీ అసలు నమ్మకుండా ఉండకూడదు. నమ్మీ నమ్మనట్టు ఉండి కార్యసాధన చెయ్యాలి. రాజుకు ఎల్లప్పుడూ మేలు చేసే వాడే నిజమైన స్నేహితుడు. అతని స్నేహం వల్ల రాజుకు సమస్త శుభములు సమకూరుతాయి. ఎల్లప్పుడూ అప్రమత్తుడై చరించే మిత్రుని మీద కార్యభారము మోపిన, ఆ కార్యము సఫలమవుతుంది. సుఖ దుఃఖములను సమానంగా భావించి, పాపచింతన లేక కార్యములు నెరవేర్చు మిత్రుని రాజు సముచితంగా గౌరవించాలి. అలాంటి మిత్రుని మంత్రిగా చేసుకొనిన, అతడు కామ, క్రోధ, మోహములకు వశుడు కాకుండా నీతి మంతుడై, తన విద్యుక్తధర్మములను సక్రమంగా నెరవేర్చగలడు.

ఇంక రాజుకు అన్నదమ్ములు ఉండటం మంచిది. వారు పెద్ద వారైనా రాజు వారిని గౌరవించాలి. రాజుకు అన్నదమ్ములు, బంధు మిత్రులు ఎంతో బలాన్ని చేకూరుస్తారు. అన్నదమ్ములు, బంధుమిత్రులు సమృద్ధిగా ఉన్న రాజు వంక కన్నెత్తి చూడటానికి శత్రురాజులు జంకుతారు.

అంగ బలం లేని రాజును శత్రురాజులు చులకనగా చూస్తారు. అన్న దమ్ములతో, బంధు మిత్రులతో బేధాభిప్రాయాలు ఉన్నా, పైకి మాత్రం అందరితో కలిసి ఉండాలి. అది రాజుకు క్షేమం.

కొంత మంది రాజును పైపైన పొగుడుతూ లోపల అతని లోపముల గురించి ఆలోచిస్తుంటారు. అలాంటి వారు సమయం వచ్చినప్పుడు రాజుకు ఎలాంటి హాని నైన తలపెట్టడానికి వెనుకాడరు. కాబట్టి, అలాంటి వారిని గుర్తించి, వారిని నాశనం చెయ్యడం రాజనీతి." అని అన్నాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు భీష్మునితో "పితా మహా! ధనార్జన ఎలా చెయ్యాలో వివరించండి." అడిగాడు.

భీష్ముడు ఇలా చెప్పసాగాడు.

"రాజుకు ధనార్జన చేయు వ్యక్తి ఎంతో అవసరం. అలాంటి వ్యక్తిని ప్రజలు సహించరు. అతనిని జాగ్రత్తగా సంరక్షించుకోడం రాజు బాధ్యత. ఈ విషయంలో ఒక ఇతిహాసము ఉన్నది. చెబుతాను విను.

పూర్వము కాలకవృక్షీయుడు అనే ముని ఉండేవాడు. అతని వద్ద ఒక కాకి ఉండేది. ఆ కాకిని ఒక పంజరంలో పెట్టాడు. ఆ కాకి త్రికాల వేది అని

జనానికి చెబుతూ ఉండేవాడు. ఆ కాకితో సహా ఆ ముని కోసలదేశాధీశుడైన క్షేమదర్శి వద్దకు వెళ్లాడు.

"మహారాజా! ఈ కాకి త్రికాలవేది. నీవు ధనార్జన పట్ల ఏమరుపాటు గా ఉన్నావు. దాని వలన నీకు ఆపదలు కలిగే ప్రమాదం ఉంది. నీకు రాబోయే ప్రమాదమును గూర్చి ఈ కాకి నీకు చెప్పగలదు. నీ రాజ్యములో ఉండి నీకు హాని చేయుచున్న దొంగలను పట్టి ఇస్తుంది." అని చెప్పాడు.

రాజు అతనిని సాదరంగా ఆహ్వానించి రాజ మందిరంలో విడిది చేయించాడు. ఆ రోజు రాత్రి కొంతమంది రాజోద్యోగులు ఆ కాకిని చంపేసారు. మరునాడు కాలక వృక్షీయుడు ఆవిషయం రాజుకు చెప్పాడు.

"రాజా! నా పేరు కాలక వృక్షీయుడు. నేను నీ తండ్రికి మంచి మిత్రుడను. మీ తండ్రి గారు చనిపోయిన తరువాత ఈ రాజ్యములో ఉండటం ఇష్టం లేక అడవులకు వెళ్లి తపస్సు చేసుకుంటున్నాను. నీ తండ్రి తరువాత నీవురాజువు అయ్యావు అని తెలిసింది. నీ పరిపాలన ఎలా ఉందో తెలుసుకొనడానికి నీ రాజ్యానికి వచ్చాను. నీ రాజ్యం అంతా తిరిగాను. నీ రాజ్యం సుభిక్షంగా ఉన్నప్పటికినీ, కొంతమంది అధముల వలన,వారి కుయుక్తుల వలన, నీ రాజ్యం ప్రమాదంలో ఉందని తెలుసుకున్నాను. ఆ విషయం నీకు తెలుపడానికి వచ్చాను. అది మామూలు కాకి. దానికి ఏ మహిమలూ లేవు. నేను ఆ కాకి త్రికాలవేది అని అందరినీ నమ్మించాను. ఆకాకి ఎక్కడ తమ దుర్మార్గాలు బయట పెడుతుదేమో అని ఆ దుర్మార్గులు దానిని చంపేసారు. కాబట్టి నీ అంతఃపురంలోనే దుర్మార్గాలు జరుగు తున్నాయి. ప్రస్తుతం నన్ను నమ్మనట్టుగా నటించి నన్ను వెళ్ల గొట్టు. తరువాత ఆ దుర్మార్గులను నేర్పుగా కనిపెట్టి వారిలో వారికి విరోధము కల్పించి, వారి

దుర్మార్గాలు బయట పెట్టి, వారిని శిక్షించు. ఇదే ప్రస్తుత కర్తవ్యము అని చెప్పాడు. అతని మాట ప్రకారము ఆ రాజు దుర్మార్గులను శిక్షించాడు. సుఖంగా రాజ్యపాలన చేసాడు. కాబట్టి మిత్రుడు అలా ఉండాలి." అని చెప్పాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు "పితామహా! మంత్రి ఎలా ఉండాలి? అతని లక్షణములు ఏమి?" అని అడిగాడు.

భీష్ముడు ఇలా చెప్పసాగాడు.

"ధర్మనందనా! మంత్రి అనే వాడు ఈ క్రింది లక్షణములు కలిగి ఉండాలి.

1.మంత్రి జ్ఞానపరుడై ఉండాలి
2.పురజనులకు బంధువుగా మెలిగేవాడుగా ఉండాలి.
3.కార్యశూరుడై ఉండాలి.
4.ధైర్యవంతుడు, శౌర్యవంతుడు అయి ఉండాలి.
5.క్రూరత్వము లేకుండా పరిశుద్ధమైన మనస్సు కలవాడై ఉండాలి.
6.రాజు పట్ల భక్తి శ్రద్ధలు, అనురాగము కలిగి ఉండాలి.
7.సుఖములను, దుఃఖములను సమానంగా అనుభవించేవాడుగా ఉండాలి.
8.తన చెమటను నెత్తురుగా భావించి పనిచేయాలి.
9. ఏ సందర్భంలో నైనా రాజు తన మీద నేరము మోపినా, కోపంతో తిట్టినా, తాను కోపగించుకోకుండా, రాజుతో సంబంధ బాంధవ్యములను చెడనీయక, నిజా నిజములు రాజుకు వివరించే ఓర్పునేర్పు కలవాడై ఉండాలి.

10. తన లోని లోపములను కప్పిపుచ్చుకుంటూ, శత్రువుల లోని లోపములను కనిపెట్టి తగురీతిగా ప్రవర్తించే బుద్ధిమంతుడై ఉండాలి.

పై లక్షణములు కలవాడే మంత్రిగా ఉండటానికి అర్హుడు.

రాజు కూడా తన మంత్రులను ఆదరంతో చూడాలి. ప్రజలను మృదు మధుర వాక్కులతో, చిరునవ్వుతో సంతోషం కలిగించాలి. కేవలం దానధర్మములు చేసినందువలన, ప్రియంగా మాట్లాడి నందువల్ల ప్రజలకు సంతోషం కలగదు. అందుకే రాజు ఎదుటి వారి మనసు తెలుసు కొని, వారి మనసును నొప్పించకుండా పొందికగా మాట్లాడి ప్రజలకు సంతోషం కలిగించాలి." అని పలికాడు భీష్ముడు.

" పితా మహా! ప్రజల మధ్య వివాదములను పరిష్కరించునపుడు రాజుకు పాపం అంట కుంటా ఉండే విధం తెలపండి."అని అడిగాడు.

దానికి భీష్ముడు ఈ విధంగా చెప్ప సాగాడు.

"ధర్మనందనా! రాజు చెప్పే తీర్పులలో స్వచ్ఛత, నిజాయితీ, నిష్పక్ష పాతము ఎంతో అవసరము. ఆ తీర్పులు ధర్మబద్ధంగా ఉండవలెను. తీర్పులు చెప్పునపుడు నిత్యసత్యవ్రతులు అయిన బ్రాహ్మణుల సాయం తీసుకొన వలెను . ఇరుపక్షముల వారి వాదనలు శ్రద్ధగా, ఓపికగా విని ధర్మబద్ధంగా, న్యాయ బద్ధంగా తీర్పు చెప్పవలెను. ధనవంతులకు ఒక మాదిరి పేదవారికి ఒక మాదిరి తీర్పు చెప్పకూడదు. శిక్షలు విధించునపుడు నేరమునకు అనుగుణంగా శిక్షలు విధించవలెను. రాజు తీర్పులు చెప్పుటలో పక్షపాతము వహించిన, ప్రజలు రాజు వద్దము తమ తమ వివాదములు తీసుకొని రారు.

ఉరి శిక్ష విధించడం, నేరస్తుని ఆస్తులను జప్తు చేయడం, కారాగారంలో బంధించడం మొదలగు శిక్షలు విధించునపుడు న్యాయబద్ధంగా వ్యవహరించ వలెను.

ఇతర రాజుల వద్దనుండి దూతలు వచ్చినపుడు, వారు నిర్మొహమాటంగా తమ తమ రాజుల మాటలను చెప్పినపుడు, రాజు కోపగించుకొనరాదు. దూతను చంపడం మహా పాపము. నరకం వస్తుంది. ఇంక దూతకు ఉండ వలసిన లక్షణములు చెప్పెదను వినుము.

దూత ఉత్తమ కులములో పుట్టిన వాడై ఉండవలెను. మంచి శీలవంతుడై ఉండవలెను. చెప్పదలచుకున్న సందేశమును అత్యంత నేర్పుతో, లౌక్యంగా, కార్యము నెరవేరునట్టు పొందికగా చెప్పగలిగి ఉండవలెను. దూతకు సమయస్ఫూర్తి, కార్య దక్షత మంచి లక్షణములు.

ఇంక సైన్యాధ్యక్షునికి ఉండవలసిన లక్షణములు చెప్పెదను వినుము. సైన్యాధ్యక్షుడు దుర్భేధ్యమైన వ్యూహములు పన్ను నేర్పు ఉండవలెను. యుద్ధమునకు కావలసిన యంత్రములు తయారీలో నేర్పు, ఆ ఆయుధములు ప్రయోగించుటలో నేర్పు, యుద్ధముచేయుటలో సామర్ధ్యము కలిగి ఉండవలెను.

రాజైన వాడు ఎవరినీ అతిగా నమ్మకూడదు. తన కొడుకుల నైనా అతిగా నమ్మితే సర్వస్వము కోల్పోతాడు. రాజైన వాడు  అందరినీ నమ్మినట్టు నటిస్తూ, నమ్మీ నమ్మనట్టు ఉండవలెను. అదియే రాజధర్మము" అని పలికాడు భీష్ముడు.

"పితామహా! రాజధాని ఎలా ఉండాలి? ఎలా ఉంటే బాగుంటుంది." అని

అడిగాడు.

దానికి భీష్ముడు ఇలా చెప్ప సాగాడు.

"ధర్మరాజా! కోటచుట్టు లోతైన కందకము ఉండాలి. తగినన్ని ద్వారములు ఉండాలి. ఆ ద్వారముల వద్ద పటిష్ఠమైన కావలి భద్రత ఉండాలి. విశాల మైన వీధులు, వీధుల ఇరు పక్కల గృహ ములు, అంగళ్లు ఉండవలెను. అంగళ్లలో సమస్త వస్తువులు లభించవలెను. రాజధానిలో ధన, ధాన్యములు ఆహార పదార్థములు సమృద్ధిగా నిలవ వుండవలెను. అన్ని రకముల నూనెలు, నెయ్యి, ద్రవ్యములు నిలవ ఉండవలెను.

పుర రక్షణము కొరకు నానా విధములైన యంత్రములు, ఆయుధములు, ఆయుధాగారములు, రణవిశారదులైన యోధులు ఉండవలెను. ప్రజ్ఞావంతులైన పండితులు, విలాసినులు, పరిచారికలు, పరిజనములు ఉండవలెను. అలాంటి పురములో ఉన్న ప్రజలకు, వారి ఆస్తులకు, రత్నములకు, బంగారమునకు, పదార్థములకు, బంధుమిత్రులకు రక్షణ కల్పించడం రాజు బాధ్యత.

రాజు తన రాజ్యములో ఉన్న ముఖ్యమైన పట్టణములలో విశ్వాస వంతులైన ఉన్నతోద్యోగులను, న్యాయాధికారులను మంచి వేతనములు ఇచ్చి నియమించి, వర్ణాశ్రమ ధర్మములకు విఘాతం కలగ కుండా రాజ్యపాలన సాగించవలెను. రాజు తన రాజ్యములో చోర భయము, దుండగుల భయము, జారుల భయము లేకుండా ప్రజలను పాలించవలెను. రాజు తన రాజ్యములో పశు సంపదను వృద్ధి చేయవలెను. వాణిజ్యము, వ్యవసాయము పశు సంపద వృద్ధి పొందునట్లు తగిన చర్యలు తీసుకొన వలెను.

రాజు ప్రజల నుంచి పన్నులను న్యాయబద్ధంగా ధర్మబద్ధంగా వసూలు చెయ్యాలి. అధికంగా పన్నులు వేస్తే, దూడకు పాలు మిగల్చ కుండా ఆవు నుండి పాలు మొత్తం పితికి దూడలను చంపినట్టు అవుతుంది. కాబట్టి వ్యాపారస్థులమీద, రైతుల మీద, సామంత రాజుల మీద సముచితంగా పన్నులు వేసి ధనాగారము నింపుకొనాలి.

ధనాగారము నింపుకొనడానికి రాజు ధర్మ మార్గమునే అనుసరించాలి. కపటోపాయములతో ధనార్జన పనికిరాదు. రాజునకు ఎక్కువ ధనము సంపాదించినా ప్రయోజనము లేదు. ఆ ధనమును అర్హులైన వారికి దానం చేసినప్పుడే ఆ ధనము సంపాదించినందుకు సార్ధకత కలుగుతుంది.

ధర్మ నందనా! నీవు పై చెప్పిన ప్రకారము నడుచుకుంటే, నీవు, నీ ప్రజలు సుఖిస్తారు. నీ ధనాగారము ధనముతో నిండుగా ఉంటుంది. ఈ ప్రకారం నీవు ప్రజలను రక్షించు. యుద్ధము సంభవించినప్పుడు విరోధులను చంపు. శాంతి సమయములో యజ్ఞములు యాగములు చెయ్యి. నీ రాజ్యములో దరిద్రులైన బ్రాహ్మణులను గుర్తించి వారి కుటుంబ రక్షణ చెయ్యి.

ఈ సందర్భంలో మాంధాతకు ఉతథ్యుడు చెప్పిన మాటలుచెబుతాను. విను. "రాజు ధర్మరక్షణ కొరకే జన్మించాడు. కాబట్టి రాజు రోషమును, కోపమును, కోరికలను వదిలిపెట్టి, ధర్మనిరతుడు కావాలి. ఎందుకంటే ధర్మం వలననే ప్రజలు వృద్ధి చెందుతారు. ధర్మము బ్రాహ్మణుల నుండి జన్మించింది. రాజైన వాడు బ్రాహ్మణులను భక్తితో సేవించాలి. గౌరవించాలి. రాజుకు సంపద కలిగిన వెంటనే అహంకారం కూడా కలుగుతుంది. దేవతలైనా మునీశ్వరులైన ఆ అహాకారానికి వశులైతే నాశనం అవుతారు. కాబట్టి రాజుఅహంకారి కాకూడదు.

రాజుకు పరస్త్రీ కాముకుడా కారాదు. అటువంటి వాని రాజ్యములో వర్షములు కురియవు. ప్రజలు దీనత్వముం పొందుతారు. వ్యాధులు వ్యాపిస్తాయి. రాజు పరాక్రమము నశిస్తుంది. ఆ రాజును బంధు మిత్రులు వదిలేస్తారు. శత్రురాజులు దండెత్తి వస్తారు. కాబట్టి రాజు అటువంటి చెడ్డ పనులు చేయకూడదు. ధర్మనిరతితో పరిపాలించు రాజు తన సంతానంతో, బంధుమిత్రులతో సుఖంగా జీవిస్తాడు."అని ఉతధ్యుడు అనే మహా ముని మాంధాత కు చెప్పాడు." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

అప్పుడు ధర్మరాజు "పితామహా! రాజు ధర్మమార్గంలో ఎలా వృద్ధి చెందుతాడు." అని అడిగాడు.

దానికి భీష్ముడు ఇలా చెప్పాడు.

"ధర్మనందనా! పూర్వము కోసల దేశాధీశుడు వసుమనుడు అనే మహారాజు వామదేవుడు అనే మహా మునిని ఇదే ప్రశ్న వేసాడు. దానికి వామదేవుడు చెప్పిన సమాధానము విను.

"రాజుకు ధన సంపాదన కంటే ధర్మనిరతి తో ప్రజాపాలన చెయ్యడం ఎంతో శ్రేష్టం. దాని వలన సకల సిద్ధులు సిద్ధిస్తాయి. శాశ్వతకీర్తి లభిస్తుంది. ధనమును సంపాదించడం కొరకు అతడు అధర్మం గా ప్రవర్తిస్తే, ఆ సంపాదించిన ధనము కూడా నిలువదు. పైగా అతడికి అపకీర్తి, నరకము లభిస్తాయి. కాబట్టి ధర్మబద్ధంగా ధనమును సంపాదించాలి. రాజుకు ఇంకా ఇంకా ధనము సంపాదించాలని కోరిక కంటే ఇంకా ఇంకా ధర్మ మార్గములో నడవాలి అనే కోరిక అతనికి ఉత్తమ ఫలితములను ఇస్తుంది.

రాజు ఎల్లప్పుడూ తన సైన్యమును సంతృప్తిగా ఉండేట్టు చూడాలి. అది శత్రురాజుల మీదికి దండెత్తినప్పుడు ఎంతో లాభిస్తుంది. రాజునకు ఎల్లప్పుడూ పరాయి దేశముల మీదికి దండెత్తి వారి సంపదలను అపహరించ వలెననే కోరిక మంచిదికాదు. రాజు కోపము, అహంకారము విడిచిపెట్టి పొరుగు రాజులతో ఎల్లప్పుడూ మిత్రత్వం పాటించాలి. అలాంటి రాజుకు శతృవులు ఉండనే ఉండరు. ఒక వేళ పొరుగురాజులు తనతో శతృత్వం పాటించినా, రాజు దానిని సామోపాయంతో పరిష్కరించుకోవాలి కాని యుద్ధమునకు పాల్పడరాదు.

ఒక వేళ తన సైన్యములో అంతఃకలహములు చెలరేగినప్పుడు పరాయి రాజులతో మూర్ఖంగా యుద్ధమునకు దిగరాదు. కప్పంకట్టి సంధి చేసుకోడం ఉత్తమం. అదీకాక పోతే, కార్యసాధకులను ప్రయోగించి, ఉపాయంతో పరాయి రాజులలో ఒకరంటే ఒకరికి బేధము కల్పించి, వారు ఒకరితో ఒకరు యుద్ధమే చేసుకునేట్టు చెయ్యాలి.

సామ, దాన, బేధ, దండోపాయములు విఫలమైతే, రాజు శుక్రనీతిపాటించాలి. అదే ఉపేక్ష. శతృవును పట్టించుకోకుండా ఉపేక్ష వహించాలి. ముల్లును ముల్లుతోనే తీయాలి అనే సూత్రంపాటించాలి." అని వామదేవుడు వసుమనుడికి చెప్పిన మాటలు భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

"పితామహా! యుద్ధములో శత్రువును జయించే సమయంలో ఎటువంటి యుద్ధనీతి అనుసరించాలి వివరించండి."అని అడిగాడు.

అప్పుడు భీష్ముడు ఈ విధంగా చెప్పసాగాడు.

యుద్ధము లో సరి సమానమైనయుద్ధ నీతి పాటించాలి. శత్రువు తన

చతురంగ బలములతో యుద్ధం చేస్తుంటే,నువ్వు కూడా నీ చతురంగ బలములతో యుద్ధం చెయ్యాలి. శత్రువు ఒంటిగాయుద్ధం చేస్తుంటే నువ్వు కూడా ఒంటిగానే అతనిని ఎదుర్కొనాలి. నీ శత్రువు మాయోపాయములు, కపటో పాయములు ప్రయోగిస్తే నీవుకూడా అవే ఉపాయములు ప్రయోగించాలి.

కాని, వెనక్కు తిరిగి పారిపోతున్న వారిని, ప్రమాదములో ఉన్న వారిని, కత్తి, ధనుస్సు విరిగిన వారిని, శరణు జొచ్చినవారిని, గుర్రము నుండి కిందపడ్డవానిని, మరొకరితో యుద్ధము చేయుచున్న వారిని చంపరాదు. శత్రువునైనా అధర్మ మార్గములో చంపరాదు. దాని కంటే ధర్మమార్గంలో యుద్ధం చేస్తూ చావడం ఉత్తమం.

రాజైన వాడు ఇంట్లో పడక మీద పడుకొని చావకూడదు. యుద్ధములో పారిపోయి రాకూడదు. వీరమరణమే అత్యుత్తమం. విషపూరిత మైన ఆయుధమును ప్రయోగించిన వాడు నరకానికి పోతాడు. శత్రువు మీదికి యుద్ధమునకు పోయి అతని పట్టణమును ముట్టడించి అతని ప్రజలను బాధించడం, హింసించడం మహా పాపము. రాజు అంతటి కాఠిన్యాన్ని వహించకూడదు. బ్రాహ్మణుల ఇళ్లను, దేవాలయములను కొల్లగొట్టడం మానుకోవాలి." అని చెప్పాడు భీష్ముడు.

" పితామహా! అందుకే రాజధర్మము కంటే మహా పాపము మరొకటి లేదు అని మీకు చెప్పాను కదా. ఏ ప్రకారం చూచినా రాజుకు అధోగతి తప్పదు కదా!" అని అన్నాడు ధర్మరాజు.

అప్పుడు భీష్ముడు ధర్మజునితో "ధర్మనందనా! నీవు చెప్పింది నిజమే

కాని ఈ పాపములకు పరిహారము ఉన్నదికదా! తన శరణు చొచ్చిన వారిని ఆదరించడం; యుద్ధములో గాయపడిన వారికి చికిత్స చేయించడం; మరణించిన వారి కుటుంబములను ఆర్థికంగా ఆదుకోవడం; బ్రాహ్మణులను ఆదరించడం, యజ్ఞయాగములు చెయ్యడం; ఇలాంటి పనులు చేసి ఆ పాపమునకు పరిహారము చేసుకొన వచ్చును. రాజధర్మమును అనుసరించి రాజ్యపాలన చేస్తే ఉత్తమ గతులు కలుగుతాయి." అని భీష్ముడు చెప్పాడు.

"పితామహా! యుద్ధములో తన పరాక్రమమును ప్రదర్శించి మరణించిన వీరులకు ఎటువంటి లోకములు కలుగుతాయి." అని అడిగాడు.

ఈ సందర్భంలో భీష్ముడు ధర్మజునికి ఇంద్రుడికి అంబరీషుడికీ జరిగిన సంవాదము వినిపించాడు.

"ధర్మనందనా! పూర్వము అంబరీషుడు అనే మహారాజు ఎన్నో యాగములుచేసాడు. పుణ్యం సంపాదించాడు. మరణించిన తరువాత స్వర్గలోకమునకు పోయాడు. స్వర్గ లోకంలో, తన దగ్గర పరిచారకుడుగా, సైనికుడుగా ఉన్న సుదేవుడు అనే వాడు, ఉజ్వల మైన విమానం ఎక్కి తిరగడం చూచాడు.

వెంటనే అంబరీషుడు దేవేంద్రుని దగ్గరకు పోయి "దేవేంద్రా! ఇతడు భూలోకంలో నా సేవకుడు. ఎలాంటి యజ్ఞ యాగములుచెయ్యలేదు. ఏ కారణం చేత నా కంటే ఎక్కువగా స్వర్గ లోక సుఖములు అనుభవిస్తున్నాడు." అని అడిగాడు.

అప్పుడు దేవేంద్రుడు అంబరీషునికి సుదేవుని గూర్చి ఇలా చెప్పాడు.

పూర్వము శతశృంగుడు అనే రాక్షసుడు ఉండేవాడు. వాడికి  సదముడు, విదముడు, దముడు అనే ముగ్గురు కుమారులు  ఉండేవారు. ఆ ముగ్గురు రాక్షసులు నీ మీదికి దండెత్తి వచ్చారు. అప్పుడు నీవు నీ సేనాధిపతి సుదేవుడిని సైన్యంతో వాళ్ల మీదికి  యుద్ధానికి పంపావు. "వస్తే విజయంతో తిరిగా రా! లేకపోతే ప్రాణాలతో తిరిగిరాకు" అని ఆజ్ఞాపించావు.   నీ ఆజ్ఞ మేరకు సుదేవుడు ఆ ముగ్గురు రాక్షసుల మీదికి యుద్ధానికి వెళ్లాడు. తన చారుల వలన వారి మాయోపాయములు తెలుసుకున్నాడు. వారితో యుద్ధం చేస్తే ఓటమి తప్పదు అని తెలుసుకున్నాడు. సైన్యం వెనక్కు పంపాడు. తాను మహాశివుని ప్రార్థించి తన తలను శివుని అర్పించడానికి నిశ్చయించుకున్నాడు. కత్తి పైకెత్తి తన తలను నరకడానికి ఉద్యుక్తుడయ్యాడు.

అంతలో మహా శివుడు ప్రత్యక్షం అయ్యాడు. అతని చేతిలో ఉన్న కత్తిని పట్టుకొని " మహావీరా! నీ వంటి వీరుడికి ఇంత సాహసం తగదు.  దీనికి కారణ మేమి" అని అడిగాడు. అతడు జరిగిన విషయం వివరించాడు. యుద్ధం చేసి జన నష్టం కావడం ఇష్టం లేక  అంతటిసాహసానికి పాల్పడ్డానని చెప్పాడు.  అప్పుడు శివుడు అతనికి ఒక దివ్య రథమును, ఒక దివ్వ ధనుస్సును, దివ్యాస్త్రములు కల అమ్ముల పొదిని ఇచ్చాడు. శత్రు సంహారం చెయ్యి అని ఆజ్ఞాపించాడు. కాని ఏ పరిస్థితులలో కూడా కింద కాలు పెట్టకు అని హెచ్చరించాడు.

సుదేవుడు ద్విగుణీకృతోత్సాహంతో ఆ రాక్షసుల మీదికి యుద్ధానికి వెళ్లాడు. శివుడు ఇచ్చిన దివ్యాస్త్రములతో సదముడు, దముడు అనే రాక్షసులను ఓడించాడు. సోదరుల మరణము చూచిన విదముడు కోపంతో ఊగిపోయాడు. సుదేవుని మీద విరుచుకు పడ్డాడు. ఆ సంభ్రమంలో సుదేవుడు శివుని హెచ్చరికను మరిచాడు. రథం దిగాడు. ఆ రాక్షసుని వంక కు

నడిచి వెళ్ళాడు. ఆ రాక్షసుడి మీద పడ్డాడు. కాని ఆ రాక్షసుడు తన కత్తితో సుదేవుని నరికాడు. సుదేవుడు కూడా ఆ రాక్షసుని తన కత్తితో నరికి కిందపడిపోయాడు. సుదేవుడు విదముడు ఒకరిని ఒకరు నరుక్కుని మరణించారు. రాక్షసుని సైన్యం చెల్లాచెదరయింది. నీకు విజయం చేకూరింది. యుద్ధంలో వీరమరణం చెందినందువల్ల సుదేవుడు వీరస్వర్గం చేరుకున్నాడు. కాబట్టి ఎన్ని యజ్ఞములు యాగములు చేసినా యుద్ధములో వీరమరణం పొందిన దానితో సాటిరావు." అని ఇంద్రుడు అంబరీషునితో చెప్పాడు." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

"ధర్మనందనా! ఒకసారి జనకునకు ప్రత్యర్ధునకు యుద్ధం సంభవించింది. అప్పుడు జనకుడు తన సైన్యములో ఉన్న వీరులను ఉద్దేశించి ఇలా అన్నాడు. "ఓ మహా వీరులారా! మీకు సమస్తసుఖములను ఆలవాలమై, యుద్ధములో వీర మరణము చెందిన వీరులకు మాత్రమే లభ్యమైన స్వర్గము కావాలా! పిరికివారికి మాత్రమే ప్రవేశముకల దుఃఖ మయమైన నరకము కావాలా! మీకు ఏది కావాలి." అని అడిగాడు.

జనకుని ఆంతర్యమును గ్రహించిన వీరులు యుద్ధములో ప్రాణాలకు తెగించి యుద్ధం చేసారు. జనకునికి విజయం సాధించి పెట్టారు. కాబట్టి ధర్మనందనా, వీరుడికి స్వర్గ ద్వారాలు ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయి" అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

అని వైశంపాయనుడు జనమేజయునకు మహా భారత కథను వివరించాడు.

మహా భారతము శాంతి పర్వము ద్వితీయాశ్వాసము సమాప్తము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహా భారతము
# శాంతి పర్వము
# తృతీయాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు మహా భారత కధను ఈ విధంగా చెప్ప సాగాడు.

"జనమేజయ మహారాజా! ఆ ప్రకారంగా భీష్ముడు ధర్మరాజు సందేహాలను తగు సమాధానాలిచ్చి తీరుస్తుండగా, ధర్మరాజు భీష్ముని ఇలా అడిగాడు.

"పితామహా! యుద్ధము చేయుటకు తగు సమయమును, యుద్ధమునకు చేయవలసిన సన్నాహములను గురించి వివరించండి." అని అడిగాడు.

"ధర్మరాజా! వానాకాలము, శీతాకాలముల లో యుద్ధము చేయరాదు. ఎండాకాలము రాక ముందే యుద్ధమునకు వెడలుట మంచిది. ఈ సమయంలో పంటలు చేతికి వస్తాయి. ధాన్యము పుష్కలంగా ఉంటుంది. ఎన్ని రోజులు యుద్ధము చేసినా ఇబ్బంది ఉండదు. శత్రురాజు మీదికి దండెత్తి పోవునపుడు పచ్చిక బయళ్లు, నీరు సమృద్ధిగా దొరికే త్రోవలో వెళ్లడం మంచిది. ఎత్తైన జండాలు, కవచములు, కత్తులు డాళ్లు, రథములు లెక్కకు మించి తీసుకొని వెళ్లాలి. శంఖములు,భేరీ మృదంగ వాద్యములు దిక్కులు పిక్కటిల్లేటట్టు మోగించాలి. వాటిని చూచి శత్రు రాజులు భయపడాలి.

సైన్యము విడిది చెయ్యడానికి చదునైన ప్రదేశమును ఎన్నుకొనాలి.

ముందుగా శత్రురాజుల వద్దకు చారులను పంపి వారి ఎత్తుగడలను ముందే పసిగట్టాలి. శత్రు రాజులు దుర్గమ మార్గములో ప్రయాణం చేస్తున్నప్పుడుగానీ, వారు అలసిపోయి, ఆదమరిచి విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు గానీ, హటాత్తుగా వారి మీద పడి చంపాలి. కాల్బలము ప్రయాణం చెయ్యడానికి చెట్లు పుట్టలు గుట్టలు ఉన్న దారిని, ఆశ్విక దళము ప్రయాణించుటకు నీళ్లు బురదా లేని సమతల మార్గమునూ, నేల గట్టిగా ఉండి చక్రములు దిగబడని మార్గమును రథములు ప్రయాణించుటకు ఎన్నుకోవాలి. చెట్లు, గుంటలు ఉండే చోట గజబలమును ఉంచాలి.

ఇంక సేనలను నడిపించే పద్ధతి చెబుతాను విను. ముందు కత్తులు, డాళ్లు ధరించిన పదాతి దళము యుద్ధమునకు వెళ్లాలి. వారి వెనక ధనుర్ధారులు నిలవాలి. వారి వెనుక ఆశ్విక దళము నిలవాలి. ఆశ్విక దళము వెనక గజదళమునూ వారి వెనక రధికులను నిలపాలి.

గాంధారము, సింధు, సౌవీర దేశముల నుండి వచ్చిన వీరులు కత్తి యుద్ధములో, బల్లెములు విసరడంలో నేర్పరులు. ఔశీనర దేశం వాళ్లు అన్ని రకముల ఆయుధములను ప్రయోగించడంలో నేర్పరులు. ప్రాచ్య దేశము వారు గజబలమును నడిపించడంలో నేర్పరులు. వారు కపటయుద్ధములో ఆరితేరిన వారు. యవనులు, కాంభోజులు, మధుర చుట్టు పక్కల ప్రాంతాల వీరులు అశ్వములను ఎక్కి యుద్ధము చేయడంలో బాగా ప్రావీణ్యము సంపాదించినవారు. ఘూర్జర దేశస్థులు విలువిద్యలో ప్రావీణ్యులు. మాళవ దేశస్థులు, రధములు ఎక్కి యుద్ధమే చెయ్యడంలో నేర్పరులు. ఇతర దేశస్థులు కూడా యుద్ధ ప్రావీణ్యము కలవారు ఎంతో మంది ఉన్నారు. వారి వారి ప్రావీణ్యమునకు తగ్గట్టు వారిని మనము వినియోగించుకోవాలి.” అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

అప్పుడు ధర్మరాజు భీష్మునితో "పితామహా! యుద్ధమునందు విజయం సాధించాలంటే మన సేనకు ఏయే లక్షణములు ఉండాలి?" అని అడిగాడు.

"ధర్మనందనా! ఎల్లప్పుడూ ధైర్యంగా ఉత్సాహంగా ఉండే సైనికులు, సకిలించే గుర్రాలు, ఘీంకరించే ఏనుగులు ఉన్న సైన్యము విజయం సాధిస్తుంది. యుద్ధమునకు బయలు దేరు ముందు పక్షులు అటూ ఇటూ అనుకూలంగా తిరుగాడుతూ ఉంటే అతి మంచి శకునము. అగ్ని జ్వాలలు కుడివైపుగా తిరుగుతుండాలి. అది కూడా మంచి శకునము. కాని ఒక్క విషయం గమనించాలి. ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా అకారణంగా యుద్ధమునకు కాలు దువ్వే రాజుకు పాపం చుట్టుకుంటుంది.

యుద్ధములో పారి పోయే సైన్యమును తరమడం చంపడం మహాపాపము. మన పక్క సైన్యము కొద్దిగా ఉన్నా, ధైర్యోత్సాహములతో ముందుకు ఉరికితే ఎంత పెద్ద సైన్యమైనా పారి పోతుంది. రాజుకు ఓర్పు ఉండాలి. కాని దానికీ ఒక హద్దు ఉండాలి. అతి ఓర్పు అనర్థదాయకము. శత్రురాజు పొగరుబోతు తనంతో తన మీదికి వస్తుంటే వాడిని అణచడం ఉత్తమం." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

"పితామహా! రాజు తన శత్రువుపట్ల ఎలా నడుచుకోవాలి?" అని ధర్మరాజు భీష్ముని అడిగాడు

" ధర్మజా! అదను చూచి శత్రువును తుదముట్టించాలి గానీ, తొందరపడి శత్రువును తూలనాడకూడదు. ముందు శత్రువును మంచి మాటలతో మచ్చిక చేసుకొని ఆదమరిచి ఉన్నసమయమున హతమార్చాలి. శత్రువు పట్ల అప్రమత్తంగా ఉండరాదు. అనవసరంగా కయ్యానికి కాలు దువ్వరాదు. సంధి కుదిరే సమయంలో యుద్ధము చేయరాదు. తనకు కాలం కలిసిరానపుడు, శత్రువుకు కాలం

కలిసివస్తున్నప్పుడు, ఒక అడుగు వెనక్కువేసి సంధి కుదుర్చుకొనడం ఉత్తమం. తరువాత అవకాశం కోసం వేచి ఉండి, అదను దొరికినప్పుడు శత్రువును హతమార్చాలి. శత్రువులను మెల్లిగమెల్లిగా, నది గట్టును కోసినట్టు, హతమార్చాలి. అంతేగాని దూకుడు పనికిరాదు. శత్రురాజులందరితోనూ ఏక కాలంలో పగ పెంచుకొనరాదు. వాళ్లందరూ కలిసి నిన్ను ఓడించే ప్రమాదం ఉంది." అని చెప్పాడు భీష్ముడు.

" ఓ పితామహా! ఓడి పోయిన రాజుతో ఎలా ప్రవర్తించాలో చెప్పండి" అని ధర్మరాజు అడిగాడు.

" ధర్మనందనా! పూర్వము కోసల దేశపురాజు క్షేమదర్శి విదేహ దేశపు రాజు చేతిలో ఓడిపోయి అడవులు పట్టిపోయాడు. అక్కడ తమ వద్ద ఇది వరకు పనిచేసిన మంత్రి కాలకవృక్షీయుడిని కలుసుకున్నాడు. అప్పుడు కాలక వృక్షీయుడు క్షేమదర్శితో ఇలా చెప్పాడు.

""సిరి సంపదలు ఉన్నప్పుడు అవి శాశ్వతము కావు అని అనుకుంటే, సిరి సంపదలు ఉన్నా లేకున్నా ఒకేమాదిరి ఉంటారు. ఎందుకంటే మన కళ్ల ముందే చనిపోతున్న తల్లి తండ్రులను, బంధువులను మనకు కాపాడుకోలేనపుడు, మన వద్ద ఉన్న సిరిసంపదలను ఎలా కాపాడుకోగలము. బాధపడితే ఎలా పోయిన వారిని పొందలేమో, అలాగే సిరి సంపదలు పోయినాయని బాధపడితే పోయిన సిరిసంపదలు తిరిగిరావు. ఈ సత్యం గ్రహిస్తే చాలు, సిరి సంపదలు ఉన్నా లేకపోయినా చింత ఉండదు. ప్రతిదీ దైవానుగ్రహము అనుకొని తృప్తిపడాలి. ఎందుకంటే దైవానుగ్రహము ఉంటే సిరి సంపదలు వాటంతట అవే వచ్చిపడతాయి. లేకపోతే ఎంతటి సిరి అయినా సర్వనాశనం అవుతుంది. కాబట్టి సిరిసంపదలు శాశ్వతం కాదు అని గ్రహించాలి. అందుకని సిరి సంపదలు ఉన్నా లేకపోయినా

మాట తూలకుండా  సంయమనంతో మెలగాలి. సిరిసంపదలు పోయినప్పుడు మొదట్లో బాధగా ఉన్నా తరువాత తేరుకుంటాడు మనిషి. కానికాలము వచ్చినప్పుడు శత్రువుతోనైనా మంచిగా మెలగడం ఉత్తమం. కాలం కలిసి వచ్చినప్పుడు సైన్యమును సమకూర్చుకొని శత్రువులను ఓడించాలి." అని చెప్పాడు కాలక వృక్షీయుడు.

తరువాత కాలక వృక్షీయుడు కోసల రాజును ఓడించిన విదేహ రాజును కలుసుకున్నాడు. కోసల రాజు గురించి చెప్పి సంధి చేసుకోమన్నాడు. కోసల రాజు విదేహ రాజు వియ్యమందారు సంధి చేసు కున్నారు.

కాబట్టి ధర్మనందనా!  క్షత్రియునకు గెలుపు ఓటమి సర్వసాధారణములు వాటికి చింత పడకూడదు. తరుణోపాయము ఆలోచించాలి" అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! అంతఃపురములోని పరిజనులను, కార్యస్థానములలో పని చేసే గణజనులను  ఎలా పరిపాలించాలో తెలపండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా!   ధనాగారములో పని చేసే వారూ,  మంత్రాంగము చేసే మంత్రులు, ఆయుధాగారములలో పని  చేసే సైనికులు మొదలగు వారిని గణ జనములు అని అంటారు. మిగిలిన పరాచారకులను పరిజనములు అంటారు. రాజు వీరందరినీ ఎంతో ఆదరంగా చూడాలి.  గణజనులు అందరూ వివిధ కులముల వారు అయినందున వారందరూ కుల ముల ప్రకారము విడిపోయి కలహించుకొనుచుందురు. ఒకరితో ఒకరికి పొసగదు. వారిలో వారికి మాత్సర్యము, ద్వేషము ప్రబలుతుంది. అలాంటి వారి వలన రాజ్యమునకే చేటు వస్తుంది. కాబట్టి రాజు వీరందరినీ ఒకే విధంగా చూ స్తూ వారిలో వారికి కలతలు రాకుండా చూడాలి.

గణజనులందరూ ఐకమత్యముతో ఉంటే ఆ రాజ్యము సుఖసంతోషములతో వర్ధిల్లుతుంది.” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! ధర్మము నాలుగు విధములు కదా. అందులో ఏది శ్రేష్ఠమైనదో వివరించండి.” అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మనందనా! తల్లి, తండ్రి, గురువు పూజనీయులు. వారిని భక్తితో కొలవవలయును. వారు ఏది చెబితే దానిని ఆచరించాలి. అదియే పరమ ధర్మము. పైగా తల్లి, తండ్రి, గురువు మూడు వేదములు, మూడు అగ్నులు, త్రిమూర్తుల వంటి వారు. వీరందరిలో తల్లి ఎక్కువ పూజనీయురాలు.

సత్యము పలకడం అన్ని ధర్మముల లోకల్లా ఉత్తమమైన ధర్మము. అబద్ధము ఆడటం మహా పాతకము. కాని, ధనం కోసం ప్రాణములను కూడా తీసే కిరాతకులతో నిజం చెప్పడం మహా పాపము. అలాంటిసమయములలో అబద్ధము చెప్పి అయినా, తనను తాను రక్షించుకోవాలి. ఇతరులను రక్షించాలి. ప్రజలకు, సమాజానికి మేలు చేసేది, అబద్ధమైనా, అది ధర్మమే. ప్రజలకు చేటు చేసే నిజము కూడా అధర్మము తో సమానము.” అని పలికాడు భీష్ముడు.

“పితామహా! ఎటువంటి వారు తాము చేసిన పాపములను నివృత్తి చేసుకొనగలరు.”అని అడిగాడు ధర్మరాజు.

“ ధర్మరాజా! వర్ణాశ్రమ ధర్మములను సక్రమంగా పాటించేవారు; విషయాసక్తి లేని వారు; తాము పరాక్రమవంతులయ్యునూ తమ మీద మోపబడిన నిందలను భరిస్తూ సహనంతో ఉండేవాళ్లు; అతిథులను పూజించే వాళ్లు; వేదాధ్యయనము చేసేవారు; నిత్యాగ్నిహోత్రులు; యుద్ధములో వెన్నుజూపకుండా యుద్ధము

చేయువారు; నిత్యము సత్యమునే పలికెడివారు; సాధుజనములను పోషించేవారు అందరు దేవుళ్లను, దేవతలను సమానంగా పూజించేవారు; తాము పాపం చేసినా దానిని సులభంగా నివృత్తి చేసుకోగలరు. అలాంటి వారిని ఆ మహా విష్ణువు సదా కాపాడుతూ ఉంటాడు. సాక్షాత్తు ఆ మహా విష్ణువు నీకు శ్రీ కృష్ణుని రూపంలో నీ చెంతనే ఉన్నాడు. కాబట్టి పాపము నీ చెంతకు కూడా రాదు. ఆ పరమాత్మను భక్తితో కొలిచేవారికి ఎలాంటి పాపమూ అంటదు." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! చాలా మంది లోపల సౌమ్యంగా ఉండి పైకి దుర్మార్గంగా కనిపిస్తుంటారు. మరి కొందరు లోపల దుర్మార్గులుగా ఉండి పైకి చాలా సౌమ్యులుగా కనిపిస్తుంటారు. మరి వారి వారి మనసులో ఏమి ఉందో ఎలా తెలుసుకోవడం? వివరించండి." అని అడిగాడు ధర్మరాజు. దానికి భీష్ముడు సమాధానంగా ఒక కథ చెప్పాడు.

"ధర్మనందనా! నీవు అడిగిన దానికి నేను ఒక పులి నక్క కథ చెపుతాను విను. పురిక అనే పురమును పౌరికుడు అనే రాజు పరిపాలించేవాడు. ఆ రాజు చాలా క్రూరుడు. ఆ రాజు చచ్చిపోయిన తరువాత ఒక నక్క గా పుట్టాడు. కనీసం ఈ జన్మలోనైనా బాగా బతుకుదామని ఆ నక్క జీవహింస చెయ్యకుండా ఆకులు అలములు తిని బతుకుతూ చిక్కి శల్యము అయింది. దాని తోడి నక్కలు "అయ్యో ఇదేమి వ్రతము. మనము మాంసాహారులము కదా. నువ్వేంటి శాకాహారము తింటున్నావు." అని అడిగారు. దానికి నక్క బదులు చెప్పలేదు.

ఈ విషయం ఆ అడవిలో ఉన్న ఒక పులికి తెలిసింది. అది ఆ నక్క దగ్గరకు వచ్చింది. " ఓ నక్కా! నీవు చాలా సౌమ్యుడివి అని విన్నాను. నాతో స్నేహం చెయ్యి. లోకం అంతా నన్ను క్రూర జంతువు అనుకుంటూ ఉంది. నువ్వు పక్కన ఉంటే నాకు ఆ అపనింద పోతుంది." అని చెప్పింది.

దానికి నక్క ఇలా అంది "ఓ పులిరాజా! నువ్వు చెప్పింది నిజమే. కాని నా మనస్సు ఈ సుఖముల మీదికి మళ్లడం లేదు. కాబట్టి నీ మాటలు నీకు ఇంపుగా లేవు. కానీ నీ పక్కనే ఉండి నాకు తోచిన ట్టు మంచీ చెడూ చెబుతూ ఉంటాను. నీతో స్నేహంగా ఉంటాను. నేను నీతో స్నేహంగా ఉంటే నీ వాళ్లు నీ మీద అసూయ పెంచుకుంటారు. నీతో వైరం పెట్టుకుంటారు. నువ్వు వారి మాటలు వినకుండా నాతో ఉంటేనే నేను నీతో స్నేహం చేస్తాను." అని పలికింది నక్క. పులి దానికి ఒప్పుకుంది. పులి నక్క స్నేహంగా ఉన్నారు.

కాని పులి నక్కతో స్నేహం చెయ్యడం మిగిలిన పులులకు ఇష్టం లేదు. వాటి మధ్య బేధం కల్పించాలని అనుకున్నాయి. ఒక రోజు పులి తినాల్సిన మాంసమును నక్క నివసిస్తున్న గుహలో పెట్టాయి. తరువాత పులి దగ్గరకుపోయి నీ మాంసము నక్క కాజేసింది. ఇలాగే ఉంటే నీ ప్రాణాలు కూడా తీస్తుంది అని చాడీలు చెప్పాయి. ఆ మాటలు నమ్మిన పులి నక్కను చంపమని ఆదేశించింది. కాని పులి తల్లి మాత్రం ఆ మాటలు నమ్మలేదు. పులి తో ఇలా అంది. "కుమారా! నీవు చెప్పుడు మాటలు విని తప్పు చేస్తున్నావు. నక్క గురించి పూర్తిగా తెలుసుకోకుండా దానిని చంపమన్నావు. అది తప్పు. నీతో ఎప్పుడన్నా నక్క నీ వారి మీద ఇలాంటి మాటలు చెప్పిందా! నీ సేవకులు పుట్టుకతోనే మోసగాళ్లు. వాళ్ల మాటలు వినకు. బుద్ధి మంతులను చూచి బుద్ధి హీనులు, అందగాళ్లను చూచి అందవిహీనులు, అధి కులను చూచి హీనులు అసూపడటం సహజం. కాని నీవు రాజువు. ఇలాంటి విషయాలు తెలుసుకొని ప్రవర్తించాలి కాని తొందరపడకూడదు.

కుమారా! పైపైన చూస్తే ఒక్కొక్కసారి ధర్మం అధర్మంగా కనిపించవచ్చు. అధర్మం ఒక్కొక్కసారి ధర్మంగా కనిపించవచ్చు. తెలివిగల వాడు వాటి తారతమ్యం తెలుసుకొని ప్రవర్తించాలి. నీకు నక్కగురించి బాగా తెలుసు. ఆ నక్క కేవలం మాంసము గురించి అలా చేస్తుందా అని ఆలోచించావా. నీ వారి మాటలు విని

నక్కను చంపమనడం భావ్యమా! రాజైన వాడు ప్రతి విషయము కూలంకషంగా విచారించి నిర్ణయం తీసుకోవాలి. కాని తొందరపాటు నిర్ణయాలు చెయ్యకూడదు." అని తల్లి పులి బోధించింది.

ఇంతలోనక్క వచ్చింది. జరిగింది తెలుసుకొంది. ఒకే మాట చెప్పింది. "ఓ పులి రాజా! నన్ను మొదట అందరి ముందూ మంచివాడు అని మెచ్చుకున్నావు. ఇప్పుడు అదే నోటితో చెడ్డవాడు అంటున్నావు. నన్ను నీ స్నేహితుడిగా చేసుకోక ముందే నీవారి చెప్పుడు మాటలు వినను అనీ, నా మాటలు మాత్రమే వింటాను అని చెప్పావు. కాని మాట తప్పావు. ఇంక నేను ఇక్కడ ఉండటం మంచిది కాదు నేను వెళుతున్నాను." అని చెప్పి ఆ నక్క అడవులకు వెళ్లి పోయింది. తరువాత నిరాహార దీక్ష పూని ఈ శరీరం వదలి పుణ్యలోకాలు చేరుకుంది.

కాబట్టి ధర్మరాజా! రాజు చెప్పుడు మాటలు విని తొందరపాటు నిర్ణయాలు తీసుకొనరాదు. ఏది మంచో ఏది చెడో తెలుసుకొని తగు నిర్ణయాలు తీసుకోవాలి." అని భీష్ముడు చెప్పాడు.

" ఓ పితామహా! రాజైన వాడు ఎలా ప్రవర్తిస్తే సుఖపడతాడు." అని అడిగాడు.

"ధర్మనందనా! రాజు ఏ పనీ ఆలస్యం చేయకూడదు. ఈపని నేను చెయ్యలేను అని నిస్సహాయత చెందకూడదు. ఈ రెండు లక్షణములు లేకపోతే ఆ రాజు సుఖపడతాడు. పూర్వము ఒక ఒంటె బ్రహ్మ దేవుని గూర్చి తపస్సు చేసింది. బ్రహ్మ ప్రత్యక్షం అయి ఏమి వరం కావాలి అని అడిగాడు. నా మెడ నూరు యోజనముల దూరము సాగాలి. అని అడిగింది. తథాస్తు అన్నాడు బ్రహ్మ. అప్పటి నుండి ఆ ఒంటె ఆహారం కోసం తిరగడంమానేసింది. ఒక చోట కూర్చుని తన మెడ చాచి ఎంతదూరంలో ఉన్న ఆహారమ్మైనా తినగలిగేది. ఆ ప్రకారము

ఒకరోజు ఆహారం తింటూ ఉండగా పెద్ద వాన వచ్చింది. అప్పుడు ఆ ఒంటె పక్కనే ఉన్న కొండగుహలో తన తల దూర్చింది. ఇంతలో ఒక నక్క, దాని భార్య అక్కడకు వచ్చారు. ఆ నక్క దంపతులు బాగా ఆకలిగా ఉన్నారు. ఆ ఒంటె మెడను పట్టుకొని కొరికి ముక్కలు చేసి తినేసాయి. ఒంటె చచ్చిపోయింది. కాబట్టి ఏ పని లో అలసత్వం, సోమరి తనం పనికిరాదు." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! శత్రురాజు బలం అధికంగా ఉంటే, కొద్దిగా సైన్యం ఉన్న రాజు అతనితో ఎలా యుద్ధం చెయ్యగలడు." అని ధర్మరాజు అడిగాడు.

" ధర్మనందనా! ఒక సారి సముద్రుడు నదులతో ఇలా అన్నాడు.

"మీరు గట్టు ఒరుసుకుంటూ పారుతుంటారు కదా. పెద్ద పెద్ద వృక్షములు కూడా ఆ ప్రవాహంలో కొట్టుకుపోతుంటాయి కదా. కాని ఒడ్డున ఉన్న రెల్లు దుబ్బులు మాత్రం అలాగే ఉంటాయి కారణమేమి?" అని అడిగాడు. దానికి నది ఇలా జవాబు చెప్పింది. "ఓ సాగరోత్తమా! గట్లు మీద చెట్లన్నీ నిటారుగా పొగరుగా నిలబడతాయి. అందుకని అవి నా వేగానికి తట్టుకోలేక కూలిపోతాయి. కాని రెల్లు దుబ్బులు ప్రవాహము వచ్చినప్పుడు తలవంచి ప్రవాహము పోగానే తల ఎత్తి నిలబడతాయి. అందుకని వాటికి ఏ హానీ జరగదు." అని నది చెప్పింది.

కాబట్టి ధర్మనందనా! బలహీనుడైన రాజు తన బలము, శత్రువు బలమును ముందుగా తెలుసుకొని తదనుగుణంగా ప్రవర్తించాలి కాని మూర్ఖంగా యుద్ధము నకు దిగకూడదు." అని చెప్పాడు భీష్ముడు.

" తాతగారూ! నా రాజ్యములో ఉన్నతమైన పదవులలో నియమించుటకు తగు జనము దొరకని ఎడల నేను ఏమి చేయవలెను" అని అడిగాడు.

" ధర్మనందనా! ఈ సందర్భంగా నీకు ఒక కథచెబుతాను సావధానంగా విను. పూర్వము ఒక అడవిలో ఒకముని తపస్సు చేసుకుంటున్నాడు. అతని ఆశ్రమములో సాధు జంతువులు, క్రూర జంతువులు సఖ్యతగా జీవిస్తూ ఉండేవి. ఆ ముని వెంట ఒక కుక్క ఎల్లప్పుడూ అతని వెన్నంటి ఉండేది. అక్కడే ఉన్న ఒక పులి ఇది చూచి సహించలేకపోయింది. ఒకరోజు ఆ కుక్కమీదకు తన పంజా విసిరింది. ఆ కుక్క పోయి ముని వెనక దాక్కుంది. అది చూచాడు ముని. వెంటనే ఆ కుక్కను ఒక పులిగా మార్చాడు. ఆ పులిని చూచి అసలు పులి పారిపోయింది. ఇంకొక సారి ఒక ఏనుగు కుక్కమీద దాడి చేసింది. అప్పుడు ఆ ముని ఆ కుక్కను ఏనుగుగా మార్చాడు. అలా ఏ జంతువు కుక్క మీద దాడి చేస్తే ఆ జంతువుగా మారుస్తున్నాడు. ఇది చూచి కుక్కకు ఒక ఆలోచన వచ్చింది. నా మీదజాలితో ఈ ముని నన్ను రకరకాల జంతువులుగా మారుస్తున్నాడు. ఇదే జాలి ఇంకొక జంతువు మీద చూపించి నా మీదికి వదిలితే నా గతి ఏంకాను. అందుకని ఆ మునిని చంపాలని నిశ్చయించుకుంది. ఈ విషయం తన దివ్యదృష్టితో గ్రహించాడు ఆ ముని. ఎంత మేలుచేసినా కుక్క తన నీచమైన బుద్ధి పోనిచ్చుకోలేదు అని అనుకున్నాడు. ఆ కుక్కను మామూలుగా కుక్కగా మార్చాడు. అది తాను వేరే జంతువుల మాదిరి మారే శక్తికోల్పోయింది.

కాబట్టి ధర్మనందనా! దుష్టులకు మంచి పదవులు ఇవ్వరాదు. మనుషులలో వారి వారి యోగ్యతలను బట్టి ఉత్తమ, మధ్య, హీన పదవులు ఇచ్చి గౌరవించాలి శౌర్యము, పరాక్రమము, సత్యము, సత్కార్యములు చేయు బుద్ధి, భక్తి, గాంభీర్యము కలవాడు హీన కులజుడైనను, వాడు ఉన్నత పదవులకు అర్హుడు. వాడి కులంతో పని లేదు. సింహములు ఎల్లప్పుడూ తన తోటి సింహములతో స్నేహము చేసి కార్యము సాధిస్తుంది కాని కుక్కలతో స్నేహము చెయ్యదు కదా! పరిజనమునకు నేర్పరి తనమూ, కులమూ రెండూ ఉండాలి. నేర్పు, భక్తి కలిగిన స్నేహితులు ఉన్న రాజు ఏ కార్యమునైనా సాధించగలడు. రాజు కూడా మంచి పరాక్రమ వంతుడై

ఉండాలి గాని పిరికి వాడు కారాదు. రాజు తన పరిజనముతో గూఢచర్యము నడపాలి. అంతఃపురములో రహస్యంగా తన పరిజనమును చారులు గా నియమించి, అంతఃపుర రహస్యములను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి.

ఇంక రాజు అవలంబించవలసిన దండనీతి గురించి చెబుతాను విను. ఈ దండనీతి సజ్జనులను రక్షించుటకు, దుర్జనులను శిక్షించుటకు ఉద్దేశింపబడింది. సాక్షాత్తు విష్ణుమూర్తి దండనీతి రూపంలో ఉంటాడు. విష్ణువు దండనీతి రూపంలో ఉన్నప్పుడు ధర్మపాలుడని, ధర్ముడని, విజయుడని, రక్షించేవాడనీ, శిక్షించేవాడని రకరకాల పేర్లతో పిలుస్తారు. దండనీతిని సక్రమంగా పాటిస్తే ధర్మము, సుఖము, నీతి, లాభములు, బలము, రక్షణ కలుగుతాయి. దండనీతిని సక్రమంగా పాటించకపోతే అధర్మము, దుఃఖము, అవినీతి, నష్టము, పిరికితనము కలుగు తాయి. కాబట్టి రాజు ప్రజా క్షేమమును దృష్టిలో పెట్టుకొని తప్పకుండా దండనీతిని అమలు చేయాలి.

అసలు ఈ దండనీతి ఎలా ఉద్భవించింది నీకు తెలియచేస్తాను. వసుహోముడు అను పేరుగల అంగదేశపురాజు భార్యాసమేతంగా హిమాలయ పర్వతములకు వెళ్లాడు. అక్క డ మునిజనులను సేవిస్తూ కాలం గడుపుతున్నాడు. ఒకరోజు ఆ రాజు వద్దకు మాంధాత వచ్చాడు. తనకు దండనీతి గురించి చెప్పమని అడిగాడు. అప్పుడు వసుహోముడు మాంధాతలో ఈ విధంగా చెప్పసాగాడు.

"ఒక సారి బ్రహ్మ దేవుడు యాగం చెయ్య తలపెట్టాడు. దానికి మంచి ఋత్విక్కు కోసం వెతుకుతున్నాడు. ఎక్కడా దొరక లేదు. తుదకు తన తుమ్ము ద్వారా ఒక ఋత్విక్కును పుట్టించాడు. అతని పేరు క్షుతుడు. క్షుతుడిని ఋత్విక్కుగా పెట్టుకొని బ్రహ్మ యజ్ఞం చేస్తున్నాడు. తరువాత బ్రహ్మ విష్ణువును

తోడు తీసుకొని పరమేశ్వరుని వద్దకు వెళ్లాడు. అప్పుడు శివుడు దండనీతిని సృష్టించాడు. దానిని తానే అధ్యయనం చేసాడు. నాలుగు వేదములు (ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము), ఆరు వేదాంగములు (కల్పము, శిక్ష, వ్యాకరణము, ఛందస్సు నిరుక్తం, జ్యోతిషం), మొత్తము పది విద్యలు, పురాణములు అన్ని కలిపి ఒక విద్య, ధర్మశాస్త్రములు అన్ని కలిపి ఒక విద్య, న్యాయ శాస్త్రము ఒక విద్య, మీమాంస ఒక విద్య, మొత్తము 14 విద్యలు అయినాయి. వైద్యము, ధనుర్వేదము, గాంధర్వము, అర్థశాస్త్రము, నాలుగు విద్యలు. మొత్తము 18 విద్యలు. ఈ 18 విద్యలను శివుడు లోక హితము కోరి ఏర్పాటుచేసాడు. శివుడు, దండనీతిని, పైన చెప్పిన 18 విద్యలను విష్ణువుకు అప్పగించాడు. వాటిని బ్రహ్మ తుమ్ము నుండి పుట్టిన క్షుతుని ద్వారా ప్రపంచములో వ్యాప్తి చేసాడు.

తరువాత విష్ణువు తన అధీనములో ఉన్న దండనీతిని అంగిరసునికి, అంగిరసుడు ఇంద్రునికి, ఇంద్రుడు మరీచికి, మరీచి భృగునకు, భృగుడు అనేక మంది మునులకు దండనీతిని అధ్యయనం చేయించాడు. ఆ విధంగా దండనీతి లోకంలో విస్తరించింది. దండనీతిని సమర్ధవంతంగా అమలు జరిపిన రాజు ఇహ పర లోకములలో సుఖములు పొందుతాడు." అని వసుహోముడు మాంధాతకు దండనీతి ఉద్భవించిన తీరి వివరించాడు." అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

"పితామహా! ధర్మము, అర్ధము, కామము అను పురుషార్థములను రాజు ఎలా ఆచరించాలో తెలు పండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మరాజా! ఇదివరకు కామందకుడు అనే ముని ఆంగరిష్ఠుడను రాజునకు చెప్పిన విషయములు నీకు చెబుతాను. విను. ఎల్లప్పుడూ కామము కొరకు దాని వలన వచ్చు సుఖముల కొరకు పాకులాడే వాడికి ధర్మము, అర్థము

ఆచరణసాధ్యములు కావు. అలాంటి వాడు కష్టముల పాలవుతాడు. అతని వద్దకు స్నేహితులు చేరరు. చివరకు మృత్యువు కబళిస్తుంది. ధర్మాచరణమునకు అర్ధము ముఖ్యము. కాని, డబ్బు సంపాదనలో పడి రాజు ధర్మము మరువరాదు. కామ సంబంధమైన కోరికలు తప్ప తక్కిన సుఖములు అనుభవించు రాజు మహోన్నతు డవుతాడు. కాబట్టి ధర్మము, అర్ధము గొప్పవి." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

"పితామహా! మనిషికి శీలము ముఖ్యం కదా. దాని స్వరూప స్వభావములు వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! నువ్వు, నీ తమ్ములు ఇంద్రప్రస్థములో సుఖంగా ఉన్న రోజుల్లో సుయోధనుడు అసూయతో రగిలిపోయాడు. నీవు చేసిన రాజసూయమునకు, నీకు ఉన్న మయసభను చూచి ఓర్వలేకపోయాడు. నీకు పట్టిన అదృష్టమునకు అసూయ పడి తన దుఃఖమును తన తండ్రి ధృతరాష్ట్రుని దగ్గర చెప్పుకున్నాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు సుయోధనునితో ఇలా అన్నాడు.

"కుమారా! నీకు ఉన్న ఐశ్వర్యము తో పోలిస్తే ధర్మజునకు ఉన్న ఐశ్వర్యము తక్కువే. కాని ధర్మరాజుకు మంచి శీలము ఉంది. నీకు అదిలేదు. ధర్మరాజుకు ఉన్న ధనము కన్నా మంచిప్రవర్తన ఎక్కువగా ఉంది. కాబట్టి నీ కన్నా ఎక్కువ సంపన్నుడుగా నీ కు కనపడుతున్నాడు. నీవు కూడా మంచి గుణములు అలవరచు కొనుము. అప్పుడు నీ కు ఉన్న సంపద ఎక్కువగా కనిపిస్తుంది. నీ పూర్వీకులైన మాంధాత, నాభాగుడు మొదలగు చక్రవర్తులు తమ తమ శీల సంపద చేత ఈ లోకంలో గౌరవాభిమానములు పొందారు.

పూర్వము ప్రహ్లాదుడు తన శీల సంపదతో ఇంద్రుని జయించాడు. ముల్లోకము లను ధర్మబద్ధంగా స్వాధీనపరచుకున్నాడు. అప్పుడు ఇంద్రుడు బృ

హస్పతి వద్దకు పోయి తిరిగి తన రాజ్యమును సంపాదించుకొనే ఉపాయం చెప్పమని అడిగాడు. అప్పుడు బృహస్పతి ఇంద్రుని శుక్రాచార్యుని వద్దకు పంపాడు. ఇంద్రుడు శుక్రాచార్యుని వద్దకుపోయి తనకు మేలు సమకూరే మార్గము చెప్పమని అడిగాడు. అప్పుడు శుక్రాచార్యుడు ఇంద్రుని ప్రహ్లాదుని వద్దకు వెళ్లమని చెప్పాడు. అప్పుడు ఇంద్రుడు బ్రాహ్మణ వేషంలో ప్రహ్లాదుని వద్దకుపోయి అతనికి వద్ద శిష్యరికం చేస్తున్నాడు.

అతని భక్తి శ్రద్ధలకు మెచ్చి ప్రహ్లాదుడు ఇంద్రుని ఏమి కావాలి అని అడిగాడు. "ప్రహ్లాదా! నీవు స్వర్గాధిపతి ఇంద్రుని ఎలా గెలువ గలిగావు." అని అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు ఇంద్రుని తో ఇలా చెప్పాడు. "విప్రోత్తమా! నేను రాజును అనే గర్వంతో ఎవరినీ అగౌరవ పరచను. అందరికీ దానధర్మములు చేస్తుంటాను. బ్రాహ్మణులను ఆదరిస్తుంటాను. నా శీలమే నన్ను గొప్పవాడిని చేసింది. నాకు విజయము చేకూర్చి పెట్టింది." అని చెప్పాడు.

" ఓ ప్రహ్లాదా! నాకు నీ శీలము దానంగా ప్రసాదించు." అని అడిగాడు. ప్రహ్లాదుడు కాదనకుండా తన శీలమును ఇంద్రునికి ధారపోసాడు. శీల సంపన్నుడైన ఇంద్రుడు వెళ్లిపోయాడు. అప్పుడ ప్రహ్లాదుని లోనుండి ఒక తేజోవంతుడైన ఆకారం బయటకు వచ్చింది. ప్రహ్లాదుడు అతనిని చూచి నీవు ఎవరు అని అడిగాడు. "ప్రహ్లాదా! నేను నీ శీలము. నన్ను ఇంద్రుడికి దానం ఇచ్చావు.నేను అతని వద్దకు వెళుతున్నాను." అని వెళ్లిపోయాడు. అతని వెంట ధర్మము, సత్యము, మంచి ప్రవర్తన, బలము మొదలగు మంచి లక్షణములు తేజోమయ ఆకారములతో ప్రహ్లాదుని విడిచి వెళ్లిపోయాయి.

ఆఖరున ఒక స్త్రీ ఆకారము బయటకు వచ్చింది. నీవు ఎవరు అని అడిగాడు ప్రహ్లాదుడు.

“నేను సిరి ని. బలము ఎక్కడ ఉంటుందో అక్కడ నేను ఉంటాను.” అని చెప్పి వెళ్లిపోయింది.

“అమ్మా అమ్మా ఆగు. నాకు ఒక్క విషయం చెప్పు. నానుంచి శీలము దానము గా గ్రహించిన వాడు ఎవరు.” అని అడిగాడు.

“ప్రహ్లాదా! తాను పోగొట్టు కున్న స్వర్గాధిపత్యమును తిరిగిపొందుటకు ఆ ఇంద్రుడేవిప్రుని వేషమున నీ వద్ద శిష్యరికం చేసాడు. నీ వద్దనుండి నీ శీలమును దానంగా పొందాడు. నీవు నీ శీలము పోగొట్టుకున్నావు. ప్రహ్లాదా! మనిషికి శీలం ప్రధాన మైనది. శీలము వలన ధర్మము వర్ధిల్లుతుంది. ధర్మము వలన సత్యము వర్ధిల్లుతుంది. సత్యము వలన మంచి ప్రవర్తన, మంచి ప్రవర్తన వలన బలము వర్ధిల్లుతాయి. ఎక్కడ బలం ఉంటుందో అక్కడ నేను (సిరి) ఉంటాను. కాబట్టి సమస్త గుణములకు శీలము ముఖ్యము.” అని చెప్పి సిరి ఇంద్రుని వద్దకు వెళ్లిపోయింది.

ఇదంతా విన్న సుయోధనుడు “అసలు శీలం అంటే ఏమిటి” అని తండ్రిని అడిగాడు. దానికి ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు. “త్రికరణ శుద్ధిగా అనగా మనస్సు, మాట, పని... వీటిలో పరుల యెడ ద్రోహ చింతన పనికిరాదు. సమస్త భూతములను సమానంగా ఆదరించాలి. పరులకు హాని చెయ్యకూడదు. సిగ్గుతో తలదించుకొనే పనులు చెయ్యకూడదు.. అని అందరికీ తెలియ చెప్పాలి. జనమునకు ఇష్టమయిన రీతిలో నడచుకోవాలి. దానినే శీలము అంటారు. దీనిని మనసులో ఉంచుకొని ప్రవర్తించిన వాడికి అపజయము లేదు.” అని చెప్పాడు ధృతరాష్ట్రుడు.

కాబట్టి ధర్మనందనా! నీకు శీలముపుట్టుకతోనే వచ్చింది. పైగా నేను కూడా నీకు శీలము గురించి చెప్పాను. కాబట్టి శీలవంతుడవై మెలగుము.” అని భీష్ముడు

ధర్మజునికి చెప్పాడు.

"అవును పితామహా! ఆశకు అంతు లేదు. అది అనంతము. తాను ఆశపడి నది, కోరుకొన్నది, లభించకపోతే అధికమైన దుఃఖం కలుగుతుంది. సుయోధను నితో కలిసి ఉండాలని నేను ఎంతగానో ప్రయత్నించాను. కాని అతను నా మాట వినలేదు. పైగా నన్ను దుర్బుద్ధిని చేసాడు.(అంటే నా చేత యుద్ధం చేయించాడు అని భావము) అదే నాకు బాధగా ఉంది. కాబట్టి ఆశలు అణచుకోడం చాలా అరుదు కదా!" అని పలికాడు ధర్మరాజు. ఆ మాటలకు భీష్ముడు ఇలా అన్నాడు.

"ధర్మనందనా! ఈ సందర్భం లో నేను నీకు ఒక ఇతి హాసము చెబుతాను విను. హైహయ దేశపు రాజు సుమిత్రుడు. అతడు ఒక రోజు వేటకు వెళ్లాడు. ఒక మృగమును కొట్టాడు. దెబ్బతిన్న ఆ మృగము పారిపోయింది. రాజు ఆ మృగము వెంట పడ్డాడు. ఆ మృగము వెంట పరుగెత్తి పరుగెత్తి అలసిపోయి ఒక ముని ఆశ్రమము చేరుకున్నాడు. ముని కుమారులు ఆ రాజుకు తాగడానికి నీళ్లు ఇచ్చారు. రాజు సేదదీరాడు. ఆ ఆశ్రమములో ఉన్న ఋషభుడు అనే ముని ఆ రాజుతో ఇలా అన్నాడు. "ఓ రాజా! నువ్వు ఈ అడవికి ఏ పని మీద వచ్చావు? ఎందుకు దిగులుగా ఉన్నావు?" అని అడిగాడు. దానికి ఆ రాజు "ఓ మునీశ్వరా! నేను వేట నిమిత్తమై ఈ అడవికి వచ్చాను. ఒక జింకను వేటాడాను. అది తప్పించుకొని పారిపోయింది. దానిని తరుముకుంటూ ఇక్కడకు వచ్చాను. ఆశపడి వేటాడిన మృగం తప్పించు కుంటే వేటగాడికి ఎంత బాధగా ఉంటుంది. ఎలాంటి వాడైనా ఆశను తప్పించుకోలేడు కదా!" అని అన్నాడు.

ఆ మాటలు విన్న ఆ ముని ఇలా అన్నాడు. "ఓ రాజా! నేను ఒక సారి తీర్థయాత్రలు చేస్తూ బదరికాశ్రమమునకు వెళ్లాను. అక్కడ కృశించిన శరీరముగల తనుడు అనే మునిని చూచాను. నేను ఆ మునికి భక్తితో నమస్కరించాను. ఆ

ముని నాకు అతిథి సత్కారములు చేసాడు. ఇంతలో అక్కడికి ఒక రాజు వచ్చాడు. ఆ ముని, రాజుకు అతని కుటుంబమునకు పరివారమునకు అతిథి సత్కారములు చేసాడు. రాజు అక్కడికి రావడానికి కారణం అడిగాడు. రాజు మునితో ఇలా అన్నాడు. "ఓ మునీంద్రా! నాకు ఒక కుమారుడు న్నాడు. వాడు మంచి గుణవంతుడు. వాడు ఒక రోజు ఆడుకోడానికి అడవిలోకి వెళ్లాడు. తిరిగి రాలేదు. వాడిని వెతుకుతూ ఇక్కడికి వచ్చాను. నా కుమారుడు ఎక్కడన్నా కనపడకపోతాడా అని ఆశతో వెదుకుతున్నాను. నా ఆశ తీరేట్టు లేదు. ఆశపడ్డది దొరక్కపోతే నా మనసు తట్టు కోగలదా మునీంద్రా!" అని అన్నాడు.

" ఓ రాజా! ఎవరైనా మనసును దిట్ట పరచుకొని తనకు ఉచితమైన రీతిలో ప్రవర్తిస్తే అతనికి అసాధ్యమైన కార్యము లేదు. ఎవరైనా ధనం కోసం యాచిస్తే అతనిని అవమానించకుండా అతని కోర్కె తీర్చేవాడు ఎక్కడా కనపడడు. నువ్వు ఆశపడటంలో తప్పులేదు. కాని ఆ ఆశ తీరక పోతే దుఃఖపడటం మంచిది కాదు. నీ కర్తవ్యం నువ్వు చెయ్యి. నీ ఆశ సఫలం కాకపోతే బాధపడకు. నీ కుమారుని నేను తెచ్చి ఇస్తాను." అని పలికి తన తపో మహిమ చేత ఆ రాజకుమారుని తెచ్చి ఇచ్చాడు. ఆ రాజు సంతోషంతో వెళ్లి పోయాడు.

కాబట్టి ఓరాజా! వేటకు రావడం తప్పు. కొట్టిన మృగం పారి పోతే దాని వెంటపడి దుఃఖ పడటం మరో తప్పు. కాబట్టి మృగం మీద ఆశ వదిలి నీ రాజధానికి వెళ్లు. ఇంక మీదట అనవసరంగా వేటకు రాకు." అని చెప్పాడు.

కాబట్టి ధర్మరాజా! ఆశపడటం లో తప్పులేదు. ఆ ఆశ నెరవేరకపోతే బాధపడటం, ఆ ఆశ తీరడం కోసం అక్రమాలు చెయ్యడం మంచిది కాదు. అప్పుడు మనిషి సుఖ శాంతులతో జీవించగలడు. మామూలు మనిషి కానీ, రాజు కాని ధనం సంపాదించాలి. రాజ్యమునకు, మనిషికి ధనం అవసరం. కాని ఆ ధనము

సంపాదించడానికి అకృత్యాలు చెయ్యకూడదు. ప్రజల వద్దనుండి సానుకూలంగా ధనమును రాబట్టాలి. రాజు తన శక్తికి మించి ధనార్జనకు పాల్పడకూడదు. తాను ఒక్కడే అందరిలోకీ ధనవంతుడు కావాలని అనుకోకూడదు. అది అన్ని అనర్థాలకు దారి తీస్తుంది. అసలుకే ముప్పు తెస్తుంది. కడకు అతని ప్రాణాలనే హరిస్తుంది. అని చెప్పి ధనం సంపాదించకుండా ఉండకూడదు. ఎందుకంటే ధనం లేని వాడిని ప్రజలు గౌరవించరు. దొంగలను, దారి దోపిడీదారులను రాజు తన బలగములో చేర్చుకొన కూడదు. అలా చేస్తే కోరి కోరి అవస్థలు తెచ్చిపెట్టుకోవడమే అవుతుంది. తన సైన్యము లో అధర్మపరులుంటే ఆ రాజుకు విజయం చేకూరదు.

పూర్వము పారియాత్ర పర్వతం మీద ఒక వేటకాడు ఉండే వాడు. వాడి వృత్తి వేటాడటం... అయినా అతను న్యాయాన్ని ధర్మాన్ని పాటించేవాడు. తల్లి తండ్రులను పూజించేవాడు. పక్కన ఉన్న మున్యాశ్రమములలో ఉన్న మునులకు కందమూలములు ఫలములు అందించేవాడు. తన మీదికి ఎవరన్నా వస్తే వారిని చించి చెండాడేవాడు. అతని పేరు కాపవ్యుడు. అక్కడ ఉన్న వేటకాళ్లందరూ అతనిని తమ నాయకునిగా ఎన్నుకోవాలని అనుకున్నారు. అతని వద్దకు వెళ్లి ఇలా అన్నారు. "నీవు అత్యంత బలవంతుడవు. ధర్మాత్ముడవు. నీవు మా అందరికీ నాయకుడిగా ఉండాలి. మేము నీ ఆజ్ఞ మేరకు నడచుకుంటాము" అని అన్నారు.

దానికి కాపవ్యుడు ఇలా అన్నాడు. "నాకు కొన్ని నియమాలున్నాయి. మనము పసిబిడ్డలను, మునులను, స్త్రీలను చంప కూడదు, వారికి హానిచెయ్యకూడదు. స్త్రీలను చెరపట్టడం బలాత్కారం చెయ్యడం చెయ్యకూడదు. జంతువులలో కూడా ఆడ జంతువులను మనం వేటాడకూడదు. గోవులకు బ్రాహ్మణులకు హాని చెయ్యకూడదు. గోబ్రాహ్మణుల రక్షణ కోసం మనం పాటుపడాలి. పంట పొలాలను నాశనం చెయ్యకూడదు. ప్రజలను బాధించి మనం బాగు పడకూడదు. మీరు ఈ ప్రకారం నడుచుకుంటాను అని మాట ఇస్తే నేను మీకు నాయకుడిగా

ఉంటాను.” అని చెప్పాడు. దానికి వారు ఎంతో సంతోషించారు. ఆ ప్రకారం నడచు కుంటామన్నారు. ఆ ప్రకారంగా కాపవ్యుడు అప్పటి వరకూ వేటాడుతూ, దొంగతనాలు చేస్తూ బతుకుతున్న ఆ వేటగాళ్లను తన మంచి తనంతో సజ్జనులుగా మార్చివేసాడు.

ధర్మనందనా! ఈ సందర్భంగా నీకు ఇంకొక కథ చెబుతాను విను. ఒక మడుగులో మూడు చేపలు ఉన్నాయి. వాటి పేరు దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు. ఇంతలో వేసవి కాలం వచ్చింది. ఎండలకు ఆ మడుగులో నీళ్ల ఇంకిపోసాగాయి. అది చూచి దీర్ఘదర్శి మిగిలిన చేపలతో ఇలా అంది. “మిత్రులారా! మనం ఉన్న చెరువు లోని నీరు ఇంకి పోతూ ఉంది. బాగా నీ ళ్ల ఉన్నప్పుడే మనం వేరే సమృద్ధిగా నీరు ఉన్న మడుగులోనికి మారి పోదాము.” అని చెప్పింది. ప్రాప్తకాలజ్ఞుడు ఇలా అన్నాడు. “నీతో నేను ఏకీభవించను. చెరువు ఎండి పోయినప్పుడు తగిన ఉపాయము ఆలోచిద్దాము ఇప్పటి నుండి దిగులుపడటం ఎందుకు.” అని అంది. ఆ మాటలకు దీర్ఘ సూత్రుడు ఇలా అన్నాడు. “ఇంకా ఈ చెరువులో నీళ్ల సమృద్ధిగా ఉన్నాయి. నీళ్ల ఎండి పోయినప్పుడు చూద్దాము. ఇప్పుడే భయపడ పని లేదు.” అన్నాడు.

దీర్ఘదర్శి తన ప్రయత్నం తాను చేసుకొని వేరే చెరువుకు మారిపోయింది. వేసవి కాలం తీవ్రంగా ఉంది. ఎండలు ముదిరాయి. చెరువులో నీళ్ల ఎండి పోయాయి. జాలర్లు వలలు పట్టుకొని చేపలుపట్టడానికి తయారయ్యారు. ప్రాప్త కాలజ్ఞుడు ఆలోచించాడు. ఒక జాలరి వద్ద ఉన్న వలలో ఒక తాడును కరిచి పట్టుకొని చచ్చిన చేపవలె పడి ఉన్నాడు. ఆ జాలరి వాడు వలను బయటకు తీసి ఒడ్డు మీద జాడించాడు. అప్పుడు ప్రాప్త కాలజ్ఞుడు ఎగిరి పక్కనే ఉన్న బురద గుంటలో పడ్డాడు. అక్కడే దాక్కున్నాడు. దీర్ఘ సూత్రుడు మాత్రం ఏ ఉపాయం లేకుండా జాలరి వలలో పడ్డాడు. చచ్చాడు.

కాబట్టి రాబోయే ఆపదను ముందుగా పసికట్టి ఆ ఆపదను తప్పించుకొన్నాడు దీర్ఘదర్శి. అతడు నీతిమంతుడు. సుఖపడ్డాడు. అప్పటి కప్పుడు ఉపాయం ఆలోచించి ఆపదను తప్పించుకొన్నాడు ప్రాప్తకాలజ్ఞుడు. అత డం ప్రతిదానినీ సందేహిస్తుంటాడు. ఒకనిర్ణయానికి రాలేడు. ముందు చూపుగానీ, ఉపాయం గానీ లేకుండా చిక్కుల్లో పడ్డాడు దీర్ఘసూత్రుడు. కాబట్టి రాజు దీర్ఘ దర్శి మాదిరి దూరపు చూపుతో ఉండాలి." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! తన శత్రువుల చేతిలో చిక్కి బలము కోల్పోయిన రాజు తన కష్టముల నుండి ఎలా గట్టెక్కుతాడో వివరించండి." అని అడిగాడు.

" ధర్మరాజా! ఈ సందర్భంలో ఒక కథ చెబుతాను విను. ఒక అడవిలో ఒక పెద్ద మర్రి చెట్టు ఉంది. దాని మొదట్లో ఉన్న కలుగులో పలితుడు అనే ఒక ఎలుక నివాసం చేస్తూ ఉంది. అదే చెట్టు మీద రోజశుడు అనే పిల్లి కూడా కాపురం ఉంటూ ఉంది. ఒక బోయవాడు ప్రతి రోజూ రాత్రి ఆ చెట్టు దగ్గరలో ఒక వల పెట్టే వాడు. మరునాడు వచ్చి ఆ వలలోపడ్డ పక్షులను తీసుకొని వెళ్లేవాడు.

ఒక రోజు చెట్టు పైనున్న పిల్లి ఆ వలలో పడింది. పిల్లి వలలో పడటంతో ఎలుక నిర్భయంగా బయటకు వచ్చింది. ఆహారం కోసం వెతుకుతూ ఉంది. ఇంతలో దానికి ఒక గుడ్లగూబ, ఒక ముంగిస కనిపించాయి. ఎలుక పైప్రాణాలు పైనే పోయాయి. పరుగెత్తుకుంటూ కలుగు దగ్గరకు వచ్చింది. ఒక ఉపాయం ఆలోచించింది. నెమ్మదిగా వలలో ఉన్న పిల్లి దగ్గరకు వచ్చింది.

"ఓ మార్జాలమా! నేను నీ వల తాళ్లను కొరికి నిన్ను విడిపిస్తాను. నువ్వు నన్ను గుడ్లగూబ ముంగిస బారి నుండి రక్షించు." అని అడిగింది.

"ఓ మూషికమా! నీకు పరులకు ఉపకారం చేసే గుణం ఉండటం నాకు ఆనందం కలిగించింది. నిన్ను నేను తప్పకుండా రక్షిస్తాను. నన్ను చూస్తే ముంగిస,గుడ్లగూబ భయపడతాయి. కాబట్టి నన్ను విడిపించు." అని చెప్పింది. "తప్పకుండా విడిపిస్తాను" అని ఆ ఎలుక పిల్లి పక్కలో చేరింది. పిల్లి ఎలుక పక్క పక్కనే ఉండటం చూచి ముంగిస, గుడ్లగూబ పారిపోయాయి. "ఇంక తాళ్లు కొరికి నన్ను విడిపించు." అంది పిల్లి. "ఉండు కొరుకుతాను. తొందర పడతావేం." అంటూ దూరంగా వెళ్లి కూర్చుంది పిల్లి. "అబ్బా మూషికమా నేను నీ ప్రాణాలు కాపాడాను. నన్ను కూడా కాపాడు. తొందరగా తాళ్లు కొరుకు." అంది పిల్లి.

"అదికాదు మార్జాలమా! రేపు ఉదయం బోయవాడు వస్తాడు. వాడిని అల్లంత దూరంలో చూచి నేను నీ వల తాళ్ల గబా గబా కొరికేస్తాను. నీవు భయంతో చెట్టు ఎక్కుతావు. నేను కలుగులోని దూరిపోతాను. ఇప్పుడే కొరికాను అనుకో నువ్వు నన్ను తినేస్తావు కదా. నీవు నాకన్నా బలవంతుడివి. బలవంతుడితో స్నేహం చేసినా, అతనిని ఎక్కువగా నమ్మకూడదు. కొంచెం జాగ్రత్తగా ఉండటం మంచిది కదా!" అంది ఎలుక.

"అదేంటి ఎలుకా అలా అంటావు. నేను నీ ప్రాణాలు కాపాడాను కదా! నువ్వు కూడా నన్ను ఆపదల నుండి కాపాడు." అంది పిల్లి.

" నువ్వు నన్ను నమ్ము పిల్లీ నేను నిన్ను కాపాడుతాను. ఏ సమయంలో ఏ పని చెయ్యాలో నాకు బాగా తెలుసు కదా!" అంది ఎలుక.

ఇంతలో తెల్లవారింది. బోయవాడు పెద్ద కత్తి తీసుకొని వచ్చాడు. వాడి వెంట వేట కుక్కలు కూడా వచ్చాయి. వాళ్లను చూచిన పిల్లి "అమ్మో బోయవాడు కుక్కలతో సహా వస్తున్నాడు. ఇంక నేనేం చేసేది." అని వాపోయింది.

“భయపడకు పిల్లీ నేను ఉన్నాగా” అంటూ కరా కరా ఆ తాళ్లను కొరికేసింది. పిల్లి పారిపోయి చెట్టెక్కింది. ఎలుక తన కలుగులో దూరింది. కిచ కిచ మంటూ చూస్తూ ఉంది. ఇంతలో బోయవాడు అక్కడకు వచ్చాడు. వల తునా తునకలుగా కొరక బడి ఉంది. వలలో పక్షులు లేవు. ఉసూరుమంటూ వెళ్లిపోయాడు.

అప్పుడు పిల్లి చెట్టు దిగి కిందికి వచ్చి “మిత్రమా నీ వంటి మిత్రుడు దొరకడం నా అదృష్టం. మనం స్నేహంగా ఉందాము. ముందుగా నేను నిన్ను కాపాడాను. కాని నువ్వు నన్ను నమ్మలేదు. ఇది ధర్మమా! నాతో కలిసి మెలిసి ఉండు. మనం చక్కగా బతుకుదాము.” అని చెప్పింది పిల్లి. అప్పుడు ఎలుక ఇలా అంది.

“మార్జాలమా! నీవు చెప్పింది నిజమే. వీడు మిత్రుడు, వీడు శత్రువుఅని తెలుసుకోడం చాలా కష్టం. ఆ నేర్పు అందరికీ ఉండదు. మిత్రులు అని అనుకున్నవారు శత్రువులుగా మారుతున్నారు శత్రువులు అనుకున్నవారు మిత్రులు గా మారుతున్నారు బలవంతుడితో అవసరం కొద్దీ స్నేహం చేసినా, అవసరం తీరగానే ఆ స్నేహం వదిలెయ్యాలి. లేకపోతే ఆపదలలో చిక్కుకుంటాడు. నువ్వు నాకు సాయం చేసావు. నేను కూడా నీకు సాయం చేసాను. తీరి పోయింది. ఎప్పటిలాగే ఎవళ్లకు వాళ్లం బతుకుదాము. అవసరం వచ్చినప్పుడు ఒకరికి ఒకరం సాయం చేసుకుందాము.

నీకూ నాకూ జన్మ వైరం ఉంది. భగవంతుడు నన్ను నీకు ఆహారంగా సమకూర్చాడు. నిన్ను నమ్మి నేను నీతో స్నేహం చేస్తే నీ మనసు మారి ఎప్పుడో ఒకప్పుడు నన్ను నువ్వు తింటావు. ఆ బుద్ధి నీకు పుట్టకపోయినా నీ సంతానం, బంధువులు నీకు కలిగిస్తారు. పైగా రాత్రంతా ఆహారం లేక నువ్వు బాగా ఆకలిగా ఉన్నావు. అందుకని నన్ను పిలుస్తున్నావు. నేను నీ దగ్గరకు రాగానే నన్ను తినేస్తావు. ఇది నీకు ధర్మమా! నీమాటలు నమ్మి నీ దగ్గరకు వస్తానని ఎలా అనుకున్నావు.”

అని పలికింది ఎలుక.

అప్పుడు పిల్లి ఎలుకతో ఇలా అంది. "అయ్యో అదేంటి! అలాగంటావు. నేను నువ్వు చేసిన మేలు ఎలా మరిచిపోతాను. నీ వల్లనే కదా నా ప్రాణాలు దక్కాయి. నా ప్రాణాలు కాపాడిన నిన్ను నేను తింటానా!" అంది పిల్లి.

"నేనూ అదే అంటున్నాను. నా ప్రాణాలు నువ్వుకాపాడావు. నీ ప్రాణాలునేను కాపాడాను. ఇది చాలు. నేను నీ దగ్గరకు రావడం తగదు. ఎందుకంటే శుక్రనీతి ఈ విధంగా చెబుతోంది. బలవంతుడైన శత్రువుతో అవసరం కొద్దీ స్నేహం చేసినా, అవసరం తీరగానే అతనిని వదిలెయ్యాలి. సాయం చేసాడు గదా అని శత్రువును నమ్మితే కీడు తప్పదు. నమ్మకూడని వారిని నమ్మకూడదు. నమ్మతగిన వారిని కూడా మితంగానే నమ్మాలి. గుడ్డిగా నమ్మడం అసలు పనికిరాదు. ఎంతటి మిత్రులనైనా నమ్మినట్టుగా నటిస్తూనే, నమ్మక పోవడమే రాజనీతి. కాబట్టి నీ వంటి జన్మశత్రువును నమ్మకుండా నేను బతుకుతాను. నీకు శత్రువైన బోయవాడి కంటపడకుండా నువ్వు బతుకు. ఇంక వెళ్లు." అని పలికింది ఎలుక. పిల్లి ఎలుక ఎవరి దారిన అవి వెళ్లిపోయాయి.

కాబట్టి ధర్మనందనా! తన శత్రువు బలవంతుడైతే మరొక బలహీనుడైన శత్రువు సాయం తీసుకొని తన శత్రువును ఓడించాలి. అవసరం కొద్దీ శత్రువుతో స్నేహం చేయాలి. ఇది రాజనీతి." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! ఎవరిని నమ్మితే మనసుకు శాంతి కలుగుతుంది. ఎవరిని నమ్మితే కష్టాలలో చిక్కుకుంటాము. అసలు అందరినీ నమ్మాలా! లేక ఎవరినీ నమ్మకూడదా! వివరించండి" అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మనందనా! పూర్వము బ్రహ్మదత్తుడు అనే రాజు ఒక చిలుకను పెంచుతున్నాడు. ఆచిలుకతో స్నేహంగా ఉండేవాడు. ఆ చిలుక ఒక పిల్లను పెట్టింది. చిలుక పిల్ల తో ఆ రాజు యొక్క కుమారుడు రోజూ ఆడుకుంటు ఉండే వాడు. తల్లి చిలుక తాను తెచ్చిన పండ్లను తన బిడ్డకు, రాజకుమారుడికి సమానంగా పంచి పెట్టేది. ఒకరోజు తల్లి చిలుక లేని సమయంలో రాజకుమారుడు చిన్న చిలుకను చంపేసాడు. సాయంత్రం గూటికి వచ్చిన చిలుక, చచ్చి పడి ఉన్న తన బిడ్డను చూచింది. ఏడిచింది. “ప్రతి రోజూ పండ్లు ఫలాలు తెచ్చి తన బిడ్డతో సమానంగా చూచిన రాజ కుమారుడు తన బిడ్డను నిర్దాక్షిణ్యంగా చంపేసాడు. రాచ బిడ్డలకు దయ జాలి ఉండవేమో. వాళ్లకు లేని దయా జాలీ నాకెందుకు ఉండాలి.” అని పెద్ద చిలుక రాజకుమారుడి కళ్లను తన వాడి గోళ్లతో పొడిచింది. రాజ కుమారుడు గుడ్డివాడయ్యాడు.

తరువాత పెద్ద చిలుక రాజు ముందు వాలింది. “రాజా! నీ కొడుకు నా బిడ్డను చంపాడు. పాపం చేసాడు. తాను చేసిన పాపానికి ఫలితం అనుభవించాడు. ఇందులో నేనుచేసిన పాపం ఏమీ లేదు. ఇంక నేను ఇక్కడ ఉండటం నీతో స్నేహం చెయ్యడం తగదు. నేను వెళ్లి పోతున్నాను.” అని పలికింది.

అప్పుడు రాజు చిలుకతో ఇలా అన్నాడు. “చిలుకా! నీవు చెప్పినది నిజమే. నీకు ఏ పాపమూ అంటదు. కానీ నీవు వెళ్లి పోవడం ఏమీ బాగాలేదు. మనం యధాప్రకారం స్నేహంగా ఉందాము.” అన్నాడు రాజు.

“ మహారాజా! నేను నీ కుమారుడి కళ్లు పొడిచాను. నీకు నా మీద కోపం పగ ఉన్నాయి. అవి ఎక్కడకూ పోవు. మనం కలిసి ఉండటం అసంభవం.” అనిపలికింది చిలుక.

“చిలకా! అలా అనకు. నా కొడుకు నీ పిల్లను చంపాడు. నువ్వు నా కొడుకు కళ్లు పొడిచావు. ఆ విషయం అంతటితో తీరిపోయింది. అంత మాత్రం చేత నీ లాంటి మంచి వాడి స్నేహం వదులుకునే బుద్ధిహీనుడిని కాను నేను. ”అని అన్నాడు మహారాజు.

“రాజా! ఒకసారి మన స్నేహం చెడిపోయిన తరువాత తియ్యటి మాటలతో ఆ పగ మరిచిపోయినా చివరకు కీడు తప్పదు. అంతేగానీ మేలు జరగదు. పగ ఐదు రకాలుగా కలుగుతుంది. పరుల భూములను ఆక్రమించుకోడం ద్వారా గానీ, దాయాదుల మధ్య ఆస్తి తగాదాల వల్లగానీ, ఆడవాళ్లు మాటా మాటా అనుకోడం వల్లగానీ, మరొకరికి తీవ్రమైన అపకారం చెయ్యడం వల్ల గానీ, పగ మొదలవుతుంది. ఒక సారి పుట్టిన పగ ఏ నాటికీ చల్లారదు. నివురు గప్పిన నిప్పులాగా లోలోపల రగులుతుంటుంది. పగ పైకి కనపడటం లేదని పగవాడిని నమ్మితే చెడిపోతాడు. ఒకసారి పగ పుడితే తల్లి తండ్రులను, అన్న తమ్ములను, కడుపున పుట్టిన సంతానాన్ని ప్రాణస్నేహితులను ఎవరినీ నమ్మకూడదు. కాబట్టి నీ తియ్యటి మాటలను నమ్మి నేను నీతో స్నేహం కొనసాగించను.” అని పలికింది చిలుక.

“అదేంటి చిలుకా! అలా అంటావు. కాల వశం వల్ల మంచి చెడూ జరుగు తుంటాయి. వాటిని నియంత్రించడం మన తరమా! నీ లాంటి స్నేహితుడిని నేను ఎలా వదులుకుంటాను.” అన్నాడు రాజు.

“రాజా! నువ్వు నాతో ఎంతో సౌమ్యంగా మాట్లాడుతున్నా, ఆ మాటల వెనక ఉన్న పగ ద్వేషం స్పష్టంగా కనపడుతున్నాయి. కాబట్టి నేను నీ దగ్గర ఉండలేను.” అని ఎగిరిపోయింది.

కాబట్టి, రాజు తన వారిని గానీ, ప్రజలను గానీ గుడ్డిగా నమ్మరాదు. ఈ

సందర్భంలో కణికుడు శత్రుంజయుడు అనే రాజుకు ఉపదేశించిన హితవచనములు చెబుతాను విను. రాజు బయటకు తియ్యగా మాట్లాడుతూ మనసులో కరుగ్గా ఉండాలి. అందర్నీ నమ్మినట్టే ఉండాలి గానీ ఎవరినీ నమ్మకూడదు. దాయాదుల సాయంతో శత్రురాజులను జయించాలి. తరువాత వారికి పారితోషికాలు ఇవ్వాలి. కాని వారిని దూరంగా ఉంచాలి కానీ నమ్మరాదు. అవసరం వచ్చినప్పుడు శత్రువును బుజాల మీద ఎక్కించుకోవాలి. అవసరం తీర గానే కుండను నేలకేసి కొట్టినట్టు విసిరెయ్యాలి.

మద్యపానము, జూదము, వేట, స్త్రీలోలత్వము, రాజులకు వినోద సాధనములు. కాని వీటి విషయంలో మితిమీరకుండా అప్రమత్తంగా ఉండాలి. రాజు ఒక పని తల పెడితే అది పూర్తి అయ్యేదాకా ఎవ్వరికీ తెలియనివ్వకూడదు. తెలిసినా తెలియనట్టు, చూచీనా చూడనట్టు, వినినా విననట్టు ఉండాలి. రాజు తనకు ఇష్టం లేని పనిని -- అదుగో చేస్తాను ... ఇదిగో చేస్తాను.... అని కాలయాపన చెయ్యాలి. ప్రజలను మభ్య పెట్టాలి. తరువాత ఏదో ఒక నెపంతో దానిని ఎగ గొట్టాలి. అత్యంత గర్వంతో కార్యాకార్య విచక్షణ లేని వాడిని, మంచి చెడు తెలియని వాడినీ, చెడు మార్గంలో నడిచేవాడిని, గురువైనా సరే దండించాలి.

సొంతంగా తీర్చని అప్పు, పూర్తిగా ఆరని నిప్పు, పూర్తిగా తీరని పగ, ఎప్పటికయినా కీడు చేస్తాయి. మృదుత్వంతో దేనినైనా సాధించవచ్చు. సామరస్యంతో శత్రువునైనా నాశనం చెయ్యవచ్చు. కాబట్టి మృదుస్వభావము గుణములలో కల్లా ఉత్తమగుణము.” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! ధర్మ భ్రష్టత్వం కలిగినప్పుడు కరువుకాటకాలు సంభవిస్తాయి. అప్పుడు ద్విజులయిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు ఎలా బతకాలి చెప్పండి.”

అని అడిగాడు ధర్మరాజు. భీష్ముడు ఇలా చెప్పసాగాడు.

(ద్విజులు అంటే కేవలం బ్రాహ్మణులు అనే కాదు. ద్విజులు అంటే రెండుసార్లు పుట్టినవారు. వీరికి ఉపనయనం రెండో జన్మతో సమానం. బ్రహ్మ, వైశ్య, క్షత్రియులకు ఉపనయనం చేస్తారు. అందుకని వారిని ద్విజులు అన్నారు.).

ఈ సందర్భంలో భీష్ముడు విశ్వామిత్రునకు ఒక ఛండాలుడికీ జరిగిన సంవాదన వినిపించాడు.

ధర్మనందనా! త్రేతాయుగము ద్వాపర యుగ సంధిలో 12 ఏళ్లపాటు తీవ్రమైన కరువు సంభవించింది. నదులు, చెరువులు ఎండిపోయాయి. చెట్లు పచ్చిక బయళ్లు ఎండిపోయాయి. పశువులు చచ్చిపోతున్నాయి. రాజులు ప్రజల వద్ద ఉన్న ధాన్యమును పన్నుల రూపంలో లాగేసుకున్నారు. బలవంతులు బలహీనులను దోచుకుంటున్నారు. బ్రాహ్మణుల తమ తమ ధర్మములను తప్పి ప్రవర్తిస్తున్నారు. యజ్ఞయాగాదులు చెయ్యడం మానేసారు. ఆకలికి తట్టుకోలేక జనం చచ్చిపోతున్నారు.

ఆ సమయంలో విశ్వామిత్రుడు అనే మహర్షి ఆకలికి తట్టుకోలేక ఆహారం కోసం వెదుకుతున్నాడు. సాయంత్రానికి అతను ఒక పల్లెకు చేరుకున్నాడు. అది ఒక మాల పల్లె. సొమ్మసిల్లి ఒక గుడిసె ముందు పడిపోయాడు. అతని పక్కనే ఒక కుక్క శరీరం పడి ఉంది. దాని చర్మం ఒలిచి మిగిలిన శరీరం అక్కడ ఎండ పెట్టారు. ప్రాణం పోయే సమయంలో కుక్క మాంసం తిన్నా పాపం లేదని, విశ్వామిత్రుడు మెల్లగా ఆ కుక్క మాంసం దొంగిలించబోయాడు. దానిని అక్కడే ఉన్న ఒక ఛండాలుడు చూచాడు.

"ఎవరునువ్వు? ఎందుకు కుక్క మాంసం దొంగిలిస్తున్నావు?" అని అడిగాడు.

"అయ్యా! నా పేరు విశ్వా మిత్రుడు. ఆకలితో ఉన్నాను. చాలా రోజుల నుండి ఆహార పానీయములు లేవు ఆకలితో దహించుకు పోతున్నాను. ప్రాణాలు నిలుపు కోడానికి కుక్క మాంసం తిన్నా తప్పులేదు అని అనుకున్నాను.అందుకని ఈ కుక్క మాంసం తీసుకుంటున్నాను. అగ్ని పవిత్రుడు ఐనా సర్వభక్షకుడు కదా. అలాగే నేనూ" అని చెప్పాడు విశ్వామిత్రుడు.

"మహాత్మా! కుక్క మాంసం అన్ని మాంసములలోకీ నీచమైనది కదా. మరొక జంతువు మాంసం కోసం వెతుక్కోండి." అని అన్నాడు.

"బ్రహ్మ నాకు అండగా ఉన్నాడు. నాకు ఏ పాపమూ అంటదు. ముందు ప్రాణం నిలుపుకోడం ముఖ్యం. బ్రతికి ఉన్నట్టయితే తపస్సు చేసో యజ్ఞ యాగములు చేసో ఈ పాపం పరిహారం చేసుకుంటాను. నాకు జీవనాధారమైన ఈ కుక్క మాంసం వదిలిపెట్టను." అని అన్నాడు.

"మహాత్మా! మీలాంటి తాపసులు ఇలాంటి పని చెయ్యవచ్చునా! కుక్క మాంసం తినడం అపవిత్రము అధమం కాదా!" అని అన్నాడు ఆ ఛండాలుడు.

"అయ్యా! అగస్త్య మహా ముని రాక్షసుని మాంసం తిన్నాడు కదా! అతని పేరు ప్రతిష్టలు నశించలేదు కదా. నేనూ అంతే" అని అన్నాడు విశ్వామిత్రుడు.

" ఓ మహర్షీ! అగస్త్య మహాముని రాక్షసుల బారి నుండి లోకాలను రక్షించడానికి రాక్షసుల మాంసం తిన్నాడు. మరి మీరు మీ ఆకలి తీర్చుకోడానికి

కుక్క మాంసం తింటున్నారు. మీరూ అగస్త్యుడు ఒకటి ఎలా అవుతారు." అని అన్నాడు ఆ ఛండాలుడు.

"ఓయీ! ఈ దేహం బ్రహ్మ జ్ఞానానికి ఆలవాలమయింది. నేను ఏం చేసినా తప్పులేదు. అడ్డులే." అని అన్నాడు విశ్వామిత్రుడు.

"అది కాదయ్యా! దొరికిన ఆహారం వదులుకోడం ఇష్టం లేక అలా అంటు న్నావు కానీ దీని వలన నీ తేజస్సుకు హాని కలుగుతుంది కదా!" అని అన్నాడు ఆ ఛండాలుడు.

"అయ్యా! నేను బతకాలనుకుంటున్నాను. నాకు ఈ మాంసం ఇవ్వు. నేను నిన్ను అడిగి తీసుకుంటున్నాను కాబట్టి నాకు దొంగతనం వలన వచ్చే దోషం రాదు." అని అన్నాడు విశ్వా మిత్రుడు.

"మహానుభావా! మీరు ఎంతో పుణ్యాత్ములు. అటువంటి మీరు అధముడనైన నా దగ్గర నుండి దానం పుచ్చుకోవచ్చునా! ఇంతకన్నా కఠినంగా మాట్లాడటం నాకు చేతకాదు. ఇదుగో కుక్క మాంసం నీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి." అని అన్నాడు ఆ ఛండాలుడు.

విశ్వామిత్రుడు ఆ కుక్క మాంసం తిని తన ప్రాణాలు నిలబెట్టుకున్నాడు. తరువాత వానలుకురిసాయి. చెట్లు చిగురించాయి. పంటలుపండాయి. కరువుపోయింది. విశ్వామిత్రుడు తపస్సు చేసి కుక్క మాంసం తిన్న పాపం పరిహారం చేసుకున్నాడు.

కాబట్టి ధర్మనందనా! ఆపత్కాలంతో ఏ తప్పుచేసినా దోషం లేదు." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! శరణు చొచ్చిన వారికీ, ఆపదలలో ఆదుకున్న వారికీ ఎలాంటి ఫలం దక్కుతుంది." అని అడిగాడు.

"ధర్మనందనా! ఒక బోయవాడు అడవిలోకి వేటకు వెళ్లాడు. కొన్ని పక్షులను పట్టుకున్నాడు. ఇంతలో భయంకరమైన గాలి వాన వచ్చింది. చీకటి పడింది. అడివంతా జలమయం అయింది. ఆ బోయ వాడు ఒక మర్రి చెట్టు కింద తలదాచు కున్నాడు. చలికి గజగజ వణుకుతున్నాడు. ఈ ఆపద నుండి గట్టెంకించమని ఇంక మీదట వేటాడనని, జీవహింస చెయ్యననీ ఆ చెట్టును వేడుకున్నాడు.

ఆ చెట్టు మీద ఒక పావురం గూడు కట్టుకొని నివసిస్తూ ఉంది. దాని భార్య ఆహారం కోసం బయటకు వెళ్లింది. ఇంకా రాలేదు. మగ పావురము ఆడ పావురము కోసం ఎదురు చూస్తూ పరితపిస్తూ ఉంది. "అయ్యో! ఇంత రాత్రి అయింది. చీకటి పడింది. ఆహారం కోసం వెళ్లిన పావురం ఇంకా గూడు చేరుకోలేదు. ఈ వానలో ఎక్కడ అవస్థలు పడుతూ ఉందో ఏమో. నా భార్యలేని నా బతుకు ఎందుకు. నా భార్యలేని ఈ గూడు పాడుపడినట్టుంది." అని ఏడుస్తూ ఉంది.

కాని ఆ ఆడ పావురము ఆ చెట్టు కింద తలదాచుకుంటున్న బోయవాడి వలలో ఉంది. అది తన భర్త మాటలు విన్నది. "ఆహా! నా జన్మ సార్థకమయింది. నేను ఎంతో పుణ్యాత్మురాలను. నా భర్త మాటలు చెవులారా విన్నాను." అని మురిసి పోయింది. నేను ఇక్కడ ఉన్నాను అని కిచా కిచా అరిచింది. ఆ అరుపులు మగ పావురం వింది. అప్పుడు ఆడ పావురము మగ పావురముతో ఇలా అంది.

"అయ్యా! ఈ బోయవాడు ఈ చెట్టు శరణు జొచ్చాడు. ఇతడు మనకు అతిధి. కాబట్టి ఇతనికి అతిధి సత్కారాలుచెయ్యి ."అని చెప్పింది.

వెంటనే మగ పావురము ఆ బోయవాడి ముందు వాలింది. "అయ్యా! మీరు మాకు అతిథులు. మీకు ఏ విధంగా అతిధి సత్కారములు చెయ్యగలను." అని అడిగింది.

"ప్రస్తుతము నాకు బాగా చలిగా ఉంది" అని అన్నాడు ఆ బోయవాడు. వెంటనే ఆ పావురము అక్కడక్కడ ఉన్న ఎండు చితుకులు ఏరి కొని వచ్చి మంట చేసింది. ఆ మంటలో బోయవాడు చలి కాచుకున్నాడు. తనకు ఆకలిగా ఉంది అని అడిగాడు ఆ బోయవాడు.

"అయ్యా! మేము ఎప్పుడు ఆకలి అయితే అప్పుడు ఆహారము తెచ్చుకొని తింటాము. మీ మానవుల మాదిరి దాచుకొనము. మీరు మా పావురములను ఆహారంగా తింటారు కదా. నన్ను తినండి." అని ఆ నిప్పులో దూకి మంటలలో కాలిపోయింది. ఇది చూచిన బోయవాడికి జ్ఞానోదయం అయింది. "ఛీ...నాదీ ఒక బతుకేనా... ఈ పావురమునకు ఉన్న జ్ఞానం కూడా నాకు లేదు." అని తన వలలో ఉన్న పక్షులను అన్నింటినీ విడిచి పెట్టాడు.

బోయవాని చెరలో నుండి విముక్తి పొందిన ఆడ పావురము తన భర్త మరణానికి విలపించింది. తన భర్తలేని బతుకు తనకు ఎందుకు అని ఆ మంటలలో తాను కూడా దూకి కాలిపోయింది. అప్పటికే దేవలోకము చేరుకున్న మగ పావురము ఒక దివ్యమైన విమానంలో తన ఆడపావురము కొరకు ఎదురు చూస్తూ ఉంది. ఇదంతా కళ్లారా చూచిన బోయవాడు తన వద్ద ఉన్న వలను మిగిలిన వేట సామగ్రిని అక్కడే వదిలేసి విరాగిగా వెళ్లిపోయాడు.

ధర్మ నందనా! తమ శరణు జొచ్చిన ఆ బోయవానికి అతిధి సత్కారములు చేసి ఆ పావురములు దివ్యత్వమును పొందాయి." అని చెప్పాడు.

"పితామహా! తాను బుద్ధిపూర్వకంగా చెయ్యని పాపము ఎలా పరిహారం చేసుకోవాలో తెలపండి అని అడిగాడు.

" ధర్మ నందనా! పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు. జనమేజయునకు పూర్వజన్మలలో అతనికి తెలియకుండానే బ్రహ్మ హత్యాపాతకము చుట్టుకుంది. చేసిన పాపమునకు పశ్చాత్తాపము చెందినా, పరితపించినా ఆ పాపము పోతుంది అని చెప్పాడు మహా ముని శౌనకుడు. ఆయన మాట ప్రకారము జనమేజయుడు తీర్ధయాత్రలు చేసాడు. అశ్వమేధ యాగముచేసాడు. తనపాపాలన్నీ పోగొట్టుకొని చక్కగా రాజ్యపాలన చేసాడు.

దర్మరాజా! ఈసందర్భంలో నీకు ఒక కథ చెబుతాను.శ్రద్ధగా విను. విదిశా పట్టణంలో ఒక బ్రాహ్మణుని ఇంట్లో ఒక బాలుడు చనిపోయాడు. ఆ బాలుని శవాన్ని అతని తండ్రి బంధుమిత్రులతో సహా శ్మశానానికి తీసుకొని వచ్చారు. దహనం చేసేముందు ఆబాలుని శవం ముందు కూర్చుని తనివిదీరా ఏడుస్తున్నారు. ఇంతలో ఒక గ్రద్ద అక్కడకు వచ్చింది. వారిని చూచి "అయ్యలారా! ఎంతసేపు ఏడిస్తే మాత్రం పోయిన వాడు తిరిగి వస్తాడా! చీకలి పడబోతోంది. చీకటి పడితే భూత ప్రేత పిశాచాలు ఈ రుద్రభూమికి వస్తాయి. అవి మీ అందరినీ పీక్కుని తింటాయి. కాబట్టి తొందరగా వెళ్లిపొండి." అని తొందరపెట్టింది.

ఇదంతా నక్క చూచింది. చీకటి పడితే గ్రద్దకు కళ్లు కనిపించవు. అందుకని వాళ్లను తొందరగా సాగనంపాలని, తరువాత ఆ పీనుగను తిందామని చూస్తూ

ఉంది అని అర్థం అయింది నక్కకు. తను గనక వీళ్లను చీకటి పడేదాకా ఆపగలిగితే గ్రద్ద వెళ్లిపోతుంది. తరువాత తను ఒక్కతే ఈ శవాన్ని తినెయ్యవచ్చు అని అనుకుంది. వెంటనే వారి దగ్గరకు వెళ్లింది.

"అయ్యాలారా! ఆ గ్రద్ద మాటలకు భయపడకండి. తనివిదీరా ఏడవండి. అయినా అంత అందమైన బాలుని శవాన్ని వదిలి వెళ్లడానికి మీకు మనసు ఎలా ఒప్పుతుంది. మీ ఏడుపులు ఆలకించి ఏ దేవుడైనా మీ పిల్లవాడికి ప్రాణదానం చెయ్యవచ్చునేమో! అయినా ఇంకా సూర్యాస్తమయం కాలేదు కదా! భయం ఎందుకు."అని చెప్పింది. వారు మరలా శవం దగ్గరకు వచ్చి చుట్టు కూర్చుని ఏడుస్తున్నారు.

"అయ్యో! ఏమిటీ వెర్రి! ఈ బుద్ధిలేని నక్కమాటలు వింటున్నారు. చూడండి. పీనుగ వికృతంగా మారిపోయింది. ఇంకా ఏం బతుకుతుంది. ఆ కర్కశ హృదయుడైన యముడు మీ కుమారుని ప్రాణములను ఎప్పుడో తీసుకొని పోయాడు. మీరు ఎంత ఏడ్చినా ప్రయోజనము లేదు. తొందరగా పోయి ఈ బాలునికి ఉత్తర కర్మలు చేసి దానధర్మములు చెయ్యండి. ఉత్తమగతులు కలిగించండి" అని తొందరపెట్టింది గ్రద్ధ.

గ్రద్ధ మాటలు విని వారు మరలా వెళ్ల బోతుంటా నక్క ఆపింది. "ఆ గ్రద్ద హృదయం క్రూరమయినది. ఈ బిడ్డను చూస్తుంటే నాకే గుండెలు తరుక్కు పోతున్నాయి. మీరు ఎలా విడిచి ఎలా వెళ్ల గలుగుతున్నారు. అయ్యా మీరు గట్టిగా ఏడవండి. ఏ దైవమైనా కరుణించి మీ పిల్లవాడికి ప్రాణ దానం చెయ్యక పోడు." అని వారికి అడ్డుపడింది నక్క.

"ఏవండోయ్! నేను పుట్టి 1500 సంవత్సరాలు అయింది. ఇప్పటిదాకా

చచ్చినవాడు బతికిరావడం నేను చూడలేదు వినలేదు. అయినా చచ్చిన వాళ్లు మరోజన్మ ఎత్తుతారు గానీ మరలా బతకడం ఏమిటి చాదస్తం కాకపోతేనూ" అని దీర్ఘం తీసింది గ్రద్ద.

గ్రద్ద మాటలు విని వారు వెనక్కు మళ్లారు. మరలా నక్క వారికి అడ్డుపడింది. "ఒక్క మాట వినండి. పూర్వము శ్రీరామ చంద్రుడు చనిపోయిన బ్రాహ్మణ కుమారుని బ్రతికించి ఇవ్వ లేదా! అలాగే నారదుడు చనిపోయిన సృంజయుని కుమారుని బ్రతికించలేదా! అలాగే ఏ సిద్ధుడో రాక్షసుడో దయ తలచి మీ బిడ్డను బ్రతికించడా! ఆలోచించండి." అని చెప్పింది గ్రద్ద.

ఇంతలోసూర్యాస్తమయం అయింది.చీకటిపడింది. మహా శివుడు శ్మశానంలో విహరించడానికి వచ్చాడు. వారిని చూచాడు. "మీకేం కావాలి?" అని అడిగాడు. మహా శివుని చూచి వారందరూ ఆయన ముందు సాష్టాంగ పడ్డారు. చనిపోయిన బాలుని బ్రతికించమని వేడుకున్నారు. వారి ప్రార్థనల నాలకించిన శివుడు ఆ బాలుడిని బ్రతికించాడు. శతాయువుగా దీవించాడు. ఆకలితో ఉన్న గ్రద్దను, నక్కను ఆకలి లేకుండా దీవించాడు.

కాబట్టి ధర్మనందనా! ఆర్తుల కన్నీళ్లు తుడవడం రాజు బాధ్యత. తమ పనులు చక్కబెట్టుకోడానికి కపటంగా మాట్లాడుతున్న వారి మాటల నేర్పు గ్రహించి ప్రవర్తించాలి.

ధర్మనందనా! నీకు మరియొక కథను వివరిస్తాను. సావధాన చిత్తుడవై విను. హిమాలయ పర్వత ప్రాంతములలో ఒకపెద్ద బూరుగు చెట్టు ఉండేది. చాలా కాలం గా ఉడటం వలన అది బాగా ముదిరి పోయింది. దాని కాండం చాలా పెద్దది గా పెరిగిపోయింది. ఆ చెట్టు శాఖోపశాఖలుగా మైళ్లకొద్దీ విస్తరించింది.

ఒకరోజు నారదుడు అటుగా వెళుతూ ఠీవిగా నిలబడ్డ ఆ చెట్టునుచూచాడు.

"ఓ వృక్షరాజమా! నువ్వు ఇంత వెడల్పు విస్తరించి ఉన్నావు. ఎన్నోపక్షులకు ఆశ్రయం ఇస్తున్నావు. మరి ఇన్ని గాలి వానలు వచ్చినా, ప్రచండంగా గాలులు వీచినా నీవు చలించకుండా ఎలా ఉండగలుగుతున్నావు. అవి నిన్ను ఏమీ చెయ్యలేదా! నిన్ను కూల్చలేదా! దీనికి కారణ మేమి?" అని అడిగాడు. ఆ మాటలకు బూరుగు చెట్టు గర్వంతోపొంగిపోయింది.

" మునీంద్రా! నా బలం ముందు వాయుదేవుడు ఎంత? నాకున్న బలంలో వాయుదేవుడికి 18 వ వంతు కూడా లేదు. అలాంటి నన్ను వాయుదేవుడు ఏమి చేయగలడు." అని అన్నాడు.

"అదేంటి వృక్ష రాజమా! వాయుదేవుని ధాటికి కొండలే కొట్టుకుపోతాయి. నువ్వెంత! ఈ లోకంలో జీవులు అన్ని వాయువు దేవుని మీద ఆధారపడి జీవి స్తున్నాయి కదా!" అని అన్నాడు నారదుడు.

"అదేంకాదు మహర్షి! ఇంత పెద్ద పెద్ద కొమ్మలు, కాండము ఉన్న నన్ను ఎదుర్కోడం వాయుదేవునికి సాధ్యం కాదు లే!" అని అన్నది ఆ బూరుగు చెట్టు.

నారదుడు అక్కడి నుండి వాయుదేవుని వద్దకుపోయి తమ ఇద్దరికీ జరిగిన సంభాషణ గురించి చెప్పాడు. వెంటనే వాయుదేవుడు ఆ బూరుగుచెట్టు వద్దకు వచ్చాడు. "ఏంటీ! నా కన్నా నువ్వు బలవంతుడివి అన్నావట. నిజమేనా!" అని అడిగాడు. "అవును అన్నాను. నీ కన్నా నేను బలవంతుడిని." అని అంది బూరుగు చెట్టు. ఆ మాటలకు వాయు దేవుడు నవ్వి "ఒకరోజు బ్రహ్మ దేవుడు నీ నీడన కాసేపు విశ్రాంతి తీసుకున్నాడని నీకు కృతజ్ఞతలు చెప్పాడనీ గర్వంతో

విర్రవీగుతున్నావు. నీ బలం ఏపాటిదో రేపు చూపించు." అని వెళ్లిపోయాడు.

బూరుగు చెట్టు తనలో తాను తర్కించుకుంది. "అనవసరంగా నారదుడితో వివాదం పెట్టుకున్నాను. అయినా వాయుదేవుని బలం ముందు నేను ఏ పాటి." అని అనుకున్నాడు. వెంటనే రాత్రికి రాత్రి తన కొమ్మలు తాను విరగ్గొట్టుకొని మోడుగా మారిపోయాడు. మరునాడు వాయుదేవుడు అక్కడకు వచ్చాడు. మోడుగా మారిన చెట్టును చూచాడు. "నేను చెయ్యవలసిన పని నీకుగా నువ్వే చేసుకున్నావు." అని వెళ్లిపోయాడు.

కాబట్టి ధర్మనందనా! తన కంటే బలవంతునితో బలహీనుడు పంతాలకు పోరాదు. పోతే చెడతాడు." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! పాపమునకు మూలం ఏది! పాపం అనేది ఎక్కడ ఉంటుంది. ఎలా ఉంటుంది?" అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మరాజా! అన్ని పాపములకు మూలము లోభము. ఆ లోభానికి మూలము తీరని కోరికలు, కామ వాంఛలు, కోపము, ఇతరుల మీద అసూయ, ఇతరులకు ద్రోహం తలపెట్టడం, ఇతరుల భార్యలను కామించడం, సిగ్గు... ఓర్పు లేకపోవడం, ప్రతి వస్తువు తనకే కావాలి అని ఆశ పడ డం, ఇవన్నీ లోభం కలుగ చేస్తాయి. ఎలాంటి వారినయినా ఈ లోభం ముంచుతుంది. కాబట్టి లోభత్వానికి దూరంగా ఉండు." అని పలికాడు భీష్ముడు.

" మహాత్మా! అన్ని ఆపదలకు దుర్గతులకు మూలం అజ్ఞానం అని విన్నాను. ఆ అజ్ఞానం ఎలా ఉంటుంది." అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మరాజా! లోభం వలన అజ్ఞానం పుడుతుంది. అజ్ఞానం అన్ని ఆపదలకు మూలం. కాబట్టి లోభం వదిలితే అజ్ఞానం దానంతట అదే పోతుంది. ”అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! ధర్మములన్నింటిలోకీ ఉత్తమ ధర్మమేది?” అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మనందనా! ధర్మములన్నింటిలోకీ ఇంద్రియ నిగ్రహం ఉత్తమ ధర్మము అని పెద్దలు చెబుతారు. ఇంద్రియ నిగ్రహానికి జ్ఞానం తోడయితే ఉత్తమ గతులు లభిస్తాయి. ఇంద్రియ నిగ్రహం కలవాడు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను జయిస్తాడు. ఇంద్రియ నిగ్రహం కలవాడికి బ్రహ్మ పదము సంప్రాప్తమవుతుంది.

సర్వ ధర్మములలోకి తపస్సు ముఖ్యమైనది. తపస్సంటే ఆహార విహారములను నియమబద్ధంగా పాటించడం. తపస్సు వలన అన్ని పాపాలుపోతాయి. సత్యము శుచిత్వము పెంపొందుతాయి. సకల కార్యములు సిద్ధిస్తాయి.” అని అన్నాడు భీష్ముడు.

“పితామహా! దేవగణములు, పితృగణములు,బ్రాహ్మణులు, సత్యవ్రతమును ప్రశంసిస్తుంటారు కదా! ఆ సత్యవ్రత స్వరూపమును నాకు తెలపండి.” అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మనందనా! అన్ని ప్రాణుల యందు సమానత్వము కలిగి ఉండటం ఇంద్రియ నిగ్రహం, ఓర్పు, ధైర్యము, నిజాయితి కలిగి ఉండటం, యజ్ఞ యాగములు, దానధర్మములు చెయ్యడం, పరోపకారము చెయ్యడం, ఈర్ష్య,

ద్వేషము లేకపోవడం, ఎవరినీ హింసించకపోవడం ఇవన్నీ సత్త్వ స్వరూపాలు. ఈ సత్యవ్రతము అన్ని ధర్మములకు మూలము. సత్యవ్రతాచరణము వలననే యోగము, మోక్షము లభిస్తాయి. సత్యవ్రతానికి వెయ్యి అశ్వమేధ యాగాలు కూడా సాటిరావు" అని చెప్పాడుభీష్ముడు.

" పితామహా! కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య ములు అరి షడ్వర్గములు అంటారు కదా! అవివేటినుండి పుడతాయి. వాటిని ఎలా నాశనం చెయ్యవచ్చునో తెలపండి." అని అడిగాడు ధర్మజుడు.

"ధర్మ నందనా! మన మనస్సులో మెదిలే భావాల లో నుండి కామం పుడుతుంది. ఆ కామం ఇలా ఉంటుంది అని తెలిస్తే ఆ కామం నశిస్తుంది. ఇతరులు చేసిన పనులు మనకు ఇష్టం లేక పోతే, మనలో కోపం పుడుతుంది. కొంచెం ఓర్పు వహిస్తే ఆ కోపం పోతుంది. మనకు ఉండేది అంతా శాశ్వతం. అంతా నాకే కావాలి అనే భావన లో నుండి లోభంపుడుతుంది. ఇదంతా అశాశ్వతం--- ఏదీ నాది కాదు--- అనే జ్ఞానంతో లోభం పోతుంది. వివేకము లోపించడం వల్ల మోహం కలుగుతుంది. ధర్మ ప్రవర్తన వల్ల మోహం నశిస్తుంది. ఉన్నతమైన కులంలో పుట్టడం, ఎక్కువ ధనం, ఎక్కువ చదువు కలిగి ఉండటం వలన మదము ఎక్కుతుంది. అందరూ సమానమే అని అనుకుంటే అ మదం అణగారి పోతుంది సత్త్వగుణము తక్కువ అయి రజో గుణము, తమో గుణము ఎక్కువ అవడం వల్ల మాత్సర్యం ఏర్పడుతుంది. సత్త్వగుణము పెంపొందించుకొనడం వల్ల సాధు జన సేవలో మాత్సర్యం పోతుంది. ఈ ఆరింటి వల్ల మనుష్యులకు ఎన్నో అపాయములు కలుగుతాయి. వీటి జోలికి పోని బుద్ధిమంతునికి అన్నీ శుభాలు కలుగుతాయి. మనుష్యులలో మనోధైర్యం లోపించినపుడు ఈ ఆరు తోడేళ్ల మాదిరి మీద పడి పీక్కు తింటాయి. ధైర్యంగా ఎదిరిస్తే పారిపోతాయి.

ధర్మనందనా! ధృతరాష్ట్రుని కుమారులకు పై ఆరు గుణాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే సర్వనాశనము అయ్యారు. నీలో పైన చెప్పిన ఆరు గుణములు లేకపోవడం వల్ల నీకు విజయం సిద్ధించింది. నిరంతరం పరులను హింసించేవాడు ఈ ఆరు గుణములు కల వారి కన్నా అధముడు. అందరి ఆస్తి తనే లాక్కొని అనుభవిస్తుంటాడు.

తనకు ఉన్నది నలుగురికీ పెట్టి తను తినేవాడు ఈ లోకంలోనూ, పైలోకంలోనూ పూజింప బడతాడు. తనకు తన కుటుంబ జీవనం కోసం మూడేళ్లకు సరిపడా ధనం అట్టి పెట్టుకొనే వాడు యజ్ఞములు చేసిన ఫలితం పొందుతాడు. ధన ధాన్యములు, సిరిసంపదలు, కలిగి ఉండి కూడా వైశ్యులు యజ్ఞయాగములు చెయ్యకపోతే రాజు ఆ ధనమును గ్రహించి బ్రాహ్మణుల చేత యాగములు చేయించాలి. తను తినకుండా వేరొకరికి పెట్టకుండా సంపద కూడ పెట్టిన శూద్రుని వద్ద నుండి రాజు ఆసంపదలో నుండి సగపాలు గ్రహించి పుణ్యకార్యములకు వినియోగించవలెను. ఏ రాజ్యములోనైనా బ్రాహ్మణులు పేదవారుగా ఉన్నారంటే, అది ఆ రాజు తెలివితక్కువ తనము. రాజు బ్రాహ్మణులను కంటికి రెప్పలా చూచుకోవాలి.

ఒక మంచి మనిషి చెడ్డ వాడితో కొంతదూరం ప్రయాణం చేసినా కలిసి ఒక చోట కూర్చున్నా, భోజనం చేసినా, పానీయం సేవించినా, మంచివాడుకూడా పతితుడవుతాడు. అబద్ధం చెప్పడం మహా పాపము కాని ఆడువారి విషయంలో, వివాహ విషయాలలో, పరిహాసంగానూ, చావు గురించి తెలపడంలోనూ, ధన, మాన, ప్రాణములు ఆపదలో ఉన్నప్పుడు గానీ అబద్ధం చెప్పడం తప్పుకాదు. ఒక అమాయకుడిమీద అకారణంగా అపనింద వేస్తే అదేనింద కు వచ్చే పాపం నింద వేసిన వాడు అనుభవిస్తాడు. అకారణంగా తల్లి తండ్రులను వెళ్ల గొట్టే వాడు పాపాత్ముడు అవుతాడు.” అని పలికాడు భీష్ముడు.

అప్పటి దాకా అన్ని విషయాలను శ్రద్ధగా వింటున్న ఖడ్గ విద్యా విశారదుడైన నకులుడు భీష్ముని కొన్ని ప్రశ్నలు అడిగాడు. "పితా మహా! అయుధములలో కెల్లా ధనుస్సు ఉత్తమమైనది. కాని యుద్ధములో ఆ ధనుస్సు విరిగిపోయినప్పుడు, ఆత్మ రక్షణకు శత్రువులతో పోరుటకు ఖడ్గము ప్రశస్తము అంటారు. ఆ ఖడ్గ విద్య యొక్క పుట్టు క ను గురించి వివరించండి" అని అడిగాడు.

"నకులా! బ్రహ్మ దేవుడు ఈ జగములలో ప్రాణులను సృష్టించాడు. ఈ ప్రాణులు బ్రహ్మ దేవుడు నిర్దేశించిన మార్గములో జీవిస్తున్నారు. ఆ సమయములో దైత్యులు అన్యాయంగా దేవతలను, మునులను బాధించసాగారు. అపుడు బ్రహ్మ హిమాలయ పర్వతములలో వెయ్యి ఏళ్ల తపస్సుచేసాడు. తరువాత ఒక యాగం చేసాడు. ఆ యాగాగ్ని లో నుండి ఒక భయంకరమైన భూతము ఉద్భవించింది. దేవతలు, మునులు ఆ భూతాన్ని చూచి భయంతో వణికిపోయారు. ఇంతలో ఆ భూతం ఒక భయంకర ఖడ్గంగా మారి పోయింది.

బ్రహ్మదేవుడు భక్తితో ఈ శ్వరుడిని మనసులో ధ్యానించాడు. ఈశ్వరుడు ప్రత్యక్షం అయ్యాడు. బ్రహ్మదేవుడు ఆ ఖడ్గమును శివునికి ఇచ్చాడు. ఆ ఖడ్గంతో పరమ శివుడు దైత్యులను సంహరించాడు. తరువాత పరమ శివుడు ఆ ఖడ్గమును, ఖడ్గ విద్యను విష్ణువుకు ఇచ్చాడు. ఆ ఖడ్గ విద్య విష్ణువు నుండి మరీచికి, మరీచి నుండి పరశురామునికి, పరశు రాముని నుండి మునులకు, మునుల నుండి ఇంద్రునకు, ఇంద్రుని నుండి దిక్పాలకులకు సంక్రమించింది. దిక్పాలకులు ఆ ఖడ్గ విద్యను మనువుకు ఉపదేశించారు. మనువు నుండి ఖడ్గ విద్య వంశ పారంపర్యంగా దుష్యంతునకు సంక్రమించింది. దుష్యంతుడు ఖడ్గ విద్యను తన కుమారుడు భరతునికి ఉపదేశించాడు. భరతుని నుండి వంశ పారంపర్యంగా వస్తూ ఆ ఖడ్గ విద్య ద్రోణునికి సంక్రమించింది. ద్రోణుడు మీ ఐదుగురు పాండవులకు ఖడ్గ విద్యను నేర్పాడు. కాని నువ్వు ఒక్కడివే ఖడ్గ విద్యలో ప్రావీణ్యం

సాధించావు." అని చెప్పాడు భీష్ముడు.

ఇంతలో సూర్యుడు అస్తమించాడు. శ్రీ కృష్ణుడు, ధర్మరాజు మిగిలిన వారందరూ భీష్ముని వద్ద సెలవు తీసుకొని తమ తమ నివాలసములకు వెళ్లిపోయారు రాజప్రాసాదము చేరిన తరువాత విశ్రాంతి సమయములో ధర్మరాజు విదురుని చూచి తనకు ధర్మ, అర్ధ, కామ, మోక్షములలో ఉత్తమము, మధ్యమము, అధమము లు ఏవి వివరించండి అని అడిగాడు. విదురుడు ఇలా చెప్పసాగాడు.

" ధర్మ నందనా! ధర్మంగా ధనం సంపాదించాలి. ధనంతో కోర్కెలు తీర్చు కోవాలి. కాబట్టి ఉత్తమమైనది ధర్మము. మధ్యమము అర్ధము. అధమము కామము." అని చెప్పాడు. అప్పుడు అర్జునుడు ఇలా అన్నాడు.

"విదురా! ధర్మ, కామములకు ధనము అవసరం అని చెప్పారు కదా! సన్యాసులకు కూడా తమ దైనందిన కార్యక్రమములకు ధనం అవసరం కదా! కాబట్టి ధనం ఉత్తమం కదా!" అని అడిగాడు.

ఆ మాటలకు నకుల సహదేవులు ఇలా అన్నారు. " ధర్మము, ధనము, ఒక దాని మీద ఒకటి ఆధారపడి ఉన్నాయి. కాబట్టి ఏదో ఒకటి ఉన్నా లాభం లేదు. పైగా ధనం లేని వాడికి కామం ఎలా తీరుతుంది." అని అడిగారు. విదురుడు ఇలా చెప్పసాగాడు.

"ధర్మము, అర్ధము వాటికవేసాటి. ఒకటి మరొక దాని మీద ఆధారపడి ఉంటుంది. ధనం ధర్మంగా సంపాదించాలి కాబట్టి ధర్మమే ఉత్తమము. పెరుగులో దాగి ఉన్న వెన్న మాదిరి, కామము ధర్మ, అర్ధములలో దాగి ఉంటుంది. సుఖజీవనానికి కామము హేతువు. తుమ్మెద పూవులలో ని తేనె తాగినట్టు

మనుష్యుడు కామం వలన సుఖాలు పొందుతాడు . కాబట్టి మనిషి జీవితంలో మూడూ ముఖ్యమైనవే. కేవలం కామ వాంఛలతో జీవించేవాడు అధముడు. అర్థకామములతో జీవించేవాడు మధ్యముడు. ధర్మంగా ధనం సంపాదించి తద్వారా సుఖాలు పొందేవాడు ఉత్తముడు. " అని చెప్పాడు విదురుడు.

అప్పుడు ధర్మరాజు విదురుని తన తమ్ములను చూచి ఇలా అన్నాడు. "పుట్టిన ప్రతివాడికీ వార్థక్యమూ చావు తప్పదు. ఈ ధర్మార్థకామములు మొదట సుఖ సంతోషాలు కలిగించినా ఆఖరుకు దుఃఖాన్ని కలిగిస్తాయి. కాబట్టి ప్రతి మనిషి నాల్గవదైన మోక్షమార్గాన్ని అవలంబించడం మంచిది. కాని మోక్షం అంత సులభంగా దొరకదు కదా! అందుకని ధర్మార్థకామములను మనస్సులో శాశ్వతంగా ఉంచుకోకూడదు. అంటీ ముట్టనట్టు ఉండాలి మోక్షం కోసం ప్రయత్నించాలి. సుఖ సంతోషాలతో మదము, దుఃఖముతో దీనత్వము వస్తుంది. మానవుడు వీటికి లోబడ కూడదు. అపుడే మోక్షము సిద్ధిస్తుంది." అని చెప్పాడు ధర్మరాజు.

ఆ గోష్టి అంతటితో చాలించారు. మర్నాడు మర్నాడు యథావిధిగా అందరూ భీష్ముని వద్దకు వెళ్లారు.

"పితామహా! రాజులకు కావలసినవారు, అక్కరలేనివారు ఎలా ఉంటారు. వివరించండి."అని అడిగాడు ధర్మరాజు. భీష్ముడు ఇలా చెప్పసాగాడు.

"ధర్మనందనా! ఓర్పుగలవారు, ధర్మపరులు, సత్యం పలికేవారు, చంచల బుద్ధిలేనివారు, మదము, లోభము, కోపము లేని వారు, చతురతగా మాట్లాడి కార్యము నెరవేర్చేవారు, తమ రాజునకు సకల సంపదలు చేకూరుస్తారు. వీళ్లే రాజునకు కావలసినవారు. క్రూరుడు, లోభి, ఆశపోతు, చాడీలు చెప్పే గుణం కలవారు, మందబుద్ధి, చేసినమేలు మరిచేవారు, అబద్ధాలు చెప్పేవారు, ఒకరితో

నిందింపబడేవారు, పిరికివారు, ధైర్యములేని వారు, అవినీతిపరులు, దురలవాట్లకు బానిస అయిన వారు, రాజు పక్కన చేరితే రాజుకు నష్టం వాటిల్లు తుంది.

వీరందరిలోకల్లా చేసిన మేలు మరిచిపోయేవాడు అత్యంత నీచుడు. ఈ సందర్భంలో నీకు ఒక కథ చెబుతాను విను. ఒక బ్రాహ్మణుడు తన కుల ధర్మమును వదిలిపెట్టి ఒక బోయ వనితను వివాహం చేసుకున్నాడు. బోయవాళ్ల తో కూడి వేటకు పోవడం, మాంసం తినడం, భోగాలు అనుభవించడం చేస్తున్నాడు. ఇంకా బాగా డబ్బు సంపాదించాలని ఆశతో ఒక వర్తకుల గుంపులో చేరి వారితో ప్రయాణం చేస్తున్నాడు. ఇంతలో ఒక ఏనుగు వారిని తరిమింది. వర్తకులందరూ పారిపోయారు. ఈ బ్రాహ్మణుడు కూడా పరుగెత్తి ఒక మర్రిచెట్టు కిందికి చేరుకున్నాడు. ఆ చెట్టు కింద నాడీ జంఘుడు అనే ఒక కొంగ నివసిస్తూ ఉంది.

ఆ కొంగ బ్రాహ్మణుని చూచి "భూసురోత్తమా! ఎక్కడి నుండి వస్తున్నారు. ఏ పని మీద పోతున్నారు." అని అడిగాడు. "నేను గౌతముని కుమారుడను నేను బ్రాహ్మణులకు ఉచితమైన వేదాధ్యయనము చెయ్యకుండా కామ కోర్కెలతో బోయ స్త్రీని వివాహ మాడి బోయలలో కలిసి బతుకుతున్నాను. డబ్బు సంపాదనకు ఒక వర్తకుల గుంపు లో కలిసాను. ఏనుగులు తరిమితే ఇలా పారిపోయి వచ్చాను." అని చెప్పాడు. " ఓ బ్రాహ్మణోత్తమా! బాధ పడకు. నేను నీ దారిద్ర్యాన్ని పోగొడతాను. ముందు నా ఆతిధ్యాన్ని స్వీకరించు." అని పక్కనే ఉన్న నదిలోనుండి చేపలుపట్టుకొని వచ్చి కాల్చి పెట్టింది. వాటికి అలవాటు పడ్డ ఆ బ్రాహ్మణుడు ఆ చేపలను తిని ఆకలి తీర్చుకున్నాడు.

అప్పుడు నాడీజంఘుడు ఈ విధంగా అన్నాడు." మంచి స్నేహితుడు, వెండి, బంగారము, మంచి బుద్ధి ఈ నాలుగూ దారిద్ర్యమును పోగొడతాయి. ఈ నాలుగింటిలో మంచి మిత్రుడు గొప్పవాడు. నేను కశ్యపుని కుమారుడను.

నాతో మైత్రిగావించు. నీకు సంపదలు కలుగుతాయి. ఇక్కడకు మూడు యోజనముల దూరములో మధుధ్వజ పురము ఉంది. అక్కడ విరూపాక్షుడు అనే నా మిత్రుడు ఉన్నాడు. అతను రాక్షసరాజు. అతని వద్దకు పోయి నేను పంపానని చెప్పు. అతడు నీకు కావలసిన బంగారము, రత్నములు ఇస్తాడు" అని చెప్పింది.

ఆ బ్రాహ్మణుడు విరూపాక్షుని వద్దకు వెళ్లాడు. తాను నాడీజంఘుని మిత్రుడను అని చెప్పుకున్నాడు. నాకు ధనం కావాలి అని అడిగాడు. అతనిని చూడగానే అతను నీచుడు అని గ్రహించాడు విరూపాక్షుడు. "మిత్రమా! నీవు ఎవరు. నీ కులము ఏమిటి.... వివరంగా చెప్పు" అని అడిగాడు. ఆ బ్రాహ్మణుడు తన గురించి సవిస్తరంగా చెప్పాడు. "ఇతడు ఎవరైతే నేమి! నా మిత్రుడు నాడీజంఘునికి మిత్రుడు. అదే ఇతని అర్హత. ఇతనికి కావలసిన ధనం ఇస్తాను." అని అనుకున్నాడు.

ఆ మరునాడు కార్తీక పౌర్ణమి. వేలకొద్ది బ్రాహ్మణులు విరూపాక్షుని వద్దకు వచ్చారు. విరూపాక్షుడు వారికి భోజనము పెట్టి బంగారము, వెండి కానుకలు ఇచ్చి పంపాడు. వారితో పాటు ఈ బ్రాహ్మణునికి కూడా కడుపునిండా భోజనము పెట్టి ఎన్నో కానుకలు ఇచ్చాడు. విరూపాక్షుడు. ఆ కానుకలను మోయలేక మోసుకుంటూ నాడీజంఘుని వద్దకు వచ్చాడు బ్రాహ్మణుడు. తన మాట మన్నించి అతని దారిద్రము పోగొట్టినందుకు నాడీ జంఘుడు ఎంతో సంతోషించాడు. ఆ రాత్రికి ఆ బ్రాహ్మణుడు అక్కడే నిద్రపోయాడు. ఒక రాత్రప్పుడు మేలుకొని ఆలోచించాడు. తన వద్ద బంగారము వెండి ధనము ఉన్నాయి కానీ రేపటికి ఆహారము లేదు. అందుకని ఒ క కర్ర తీసుకొని నాడీ జంఘుని తలమీద కొట్టి చంపాడు. అతనిని ముక్కముక్కలుగా నరికి ఒక మూటగా కట్టాడు.

ఇంతలో తెల్లవారింది. విరూపాక్షునికి మనసు కలతగా ఉంది. ప్రతిరోజూ తనను చూడడానికి వచ్చే నాడీ జంఘుడు రాలేదు. ఆ బ్రాహ్మణుడు నీచుడు. నాడీజంఘునికి ఏమైనా అపకారము తలపెట్టాడా అని ఆలోచించాడు. వెంటనే నాడీజంఘుని వద్దకు తన భటులను పంపాడు. ఆ భటులు పోయి అడవిలో ప్రయాణం చేస్తున్న బ్రాహ్మణుని, అతని వద్ద ఉన్న మాంసము మూట చూచారు. అతనిని పట్టుకొని తెచ్చి విరూపాక్షుని ముందు నిలబెట్టారు . ఆ మూటలో ఉన్న మాంసము ముక్కలు నాడీ జంఘునివి అని నిర్ధారించుకున్నాడు విరూపాక్షుడు.

"వీడు చేసిన మేలు మరిచిపోయేవాడు. వీడిని చంపి తినండి." అని తన భటులకు ఆజ్ఞాపించాడు.

"అయ్యా! ఈ దుర్మార్గుడిని చంపి తింటే మాకు పాపం చుట్టుకుంటుంది. మేము తినము." అని అన్నారు.

"తింటే తినండా లేకపోతే లేదు. వీడిని చంపి అవతల పారెయ్యండి." అని ఆజ్ఞాపించాడు విరూపాక్షుడు.

భటులు ఆ బ్రాహ్మణుని రక్తం వచ్చేట్టు కొట్టి అతని శరీరాన్ని బయట పారేసారు. అతనిని ముట్టడానికి కుక్కలు కూడా రాలేదు. చేసిన మేలు మరిచిపోయేవాడి మాంసం కూడా ముట్టడానికి కుక్కలు కూడా ముందుకు రావు. తరువాత విరూపాక్షుడు తన మిత్రుడు నాడీజంఘుని మాంస ఖండములను ఒకటిగా చేర్చి అంత్యక్రియలు నిర్వర్తించాడు. ఇంతలో దేవేంద్రుడు అక్కడకు వచ్చాడు.

" దేవేంద్రా! నా మిత్రుడు నాడీజంఘుడు అకాల మరణం చెందాడు.

అతనిని బతికించు అని కోరాడు.

"విరూపాక్షా! నాడీజంఘుడు నీకే కాదు. బ్రహ్మకు కూడా స్నేహితుడే. అతడు మరణించినందుకు నీవే కాదు బ్రహ్మకూడా విచారిస్తున్నాడు. అటు చూడు. నీవు నాడీజంఘుని దహనం చేసిన చోట ఒక ఆవు తన దూడకు పాలు ఇస్తూ ఉంది. ఆ పాల తుంపరలు ఆ బూడిద మీద పడుతున్నాయి. ఆ అమృత ధారలతో నాడీజంఘుడు బతికాడు. ఇదంతా ఆ బ్రహ్మ దేవుని మహిమ." అని అన్నాడు దేవేంద్రుడు.

అంతలో నాడీజంఘుడు అక్కడకువచ్చాడు. చావు బతుకుల్లో ఉన్న ఆ బ్రాహ్మణుని దురవస్థ చూచాడు. అతనిని విడిపించమని విరూపాక్షుని ప్రార్థించాడు. విరూపాక్షుని అనుచరులు అతనిని విడిచిపెట్టారు. అతని బంగారము, ధనము అతనికి ఇచ్చారు. ఆ ధనము మోసుకుంటూ ఆ బ్రాహ్మణుడు వెళ్లిపోయాడు. కాబట్టి ధర్మనందనా! బ్రహ్మ హత్య చేసిన వాడి కైనా నిష్కృతి ఉంటుందేమోగాని మిత్ర ద్రోహికి, చేసిన మేలు మరిచే వాడికి నిష్కృతి లేదు. మంచి స్నేహితుడు ఈ లోకంలోనే కాదు పరలోకంలో కూడా సుఖాన్ని ఇస్తాడు. మిత్రుడు, ధనము ఆ రెండింటిలో మిత్రుడే గొప్పవాడు. కాబట్టి ఉత్తమ కులజుడు, గుణ సంపన్నుడు అయిన వ్యక్తితో మిత్రత్వము అన్ని విధాలా శ్రేయోదాయకము." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు. "పితా మహా! మరి ఈ విషయములు అన్ని నేడు లోకంలో పాటిస్తున్నారా! ఎలా పాటిస్తున్నారు? వివరించండి." అని అడిగాడు. భీష్ముడు ఇలా చెప్పసాగాడు." అని వైశంపాయనుడు జనమేజయునితో మహా భారత కథను చెప్పాడు.

మహాభారతము శాంతి పర్వము తృతీయాశ్వాసము సమాప్తము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహా భారతము

## శాంతి పర్వము

### చతుర్థాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునికి మహా భారత కథను ఈ విధంగా చెప్పసాగాడు.

౯ధర్మరాజా! నాకు తెలిసినంత వరకూ నీకు అన్ని విషయములను చెప్పాను. ఇంకా నీకు ఏమన్నా కావాలంటే అడుగు. నాకు తెలిసినంత వరకూ చెబుతాను.౯ అని అన్నాడు భీష్ముడు.

౯పితామహా! తమరు ఇప్పటి వరకూ రాజులకు ఉచితమైన ధర్మమును నాకు తెలియ చెప్పారు. ఇంక ప్రజల గురించి వారి మంచి చెడ్డల గురించి, వారికి పరమహితమైన ధర్మము గురించి తెలుసుకొన కోరుతున్నాను. అసలు ధర్మములలో ఉత్తమమైన ధర్మము ఏది?౯ అని అడిగాడు ధర్మరాజు.

౯ధర్మనందనా! లోకంలో ధర్మము అనేక విధములుగా విస్తరించి ఉన్నది. అన్ని ధర్మములు అనుసరింప తగ్గవే. కాని తత్త్వము తెలిసినవారు మాత్రము మోక్షమే ఉత్తమ ధర్మము అని అంటారు. ద్వంద్వములకు అతీతంగా, ఇష్టమును, అయిష్టమును సమానంగా అనుభవించడమే మోక్షమార్గము. అలా ఎలా జీవించాలో నీకు ఒక కథా రూపంలో వివరిస్తాను. పూర్వము సేనజితుడు అనే మహా రాజు ఉండేవాడు. అతనికి పుత్రవియోగము కలిగింది. అప్పుడు అతని వద్దకు అతనికి ఆప్తుడైన ఒక బ్రాహ్మణుడు వచ్చాడు.

౯మహారాజా! ఎందుకు చింతిస్తున్నావు. పుట్టిన వారు అందరూ

చనిపోవడంలోకధర్మం కదా! ఈ చావు నీ కుమారునికి మాత్రమే సంప్రాప్తించలేదు కదా! మూఢుని మాదిరి చింతిస్తావు ఎందుకు?౯ అని పలికాడు.

౯మరి ఈ దుఃఖము పోవాలంటే ఏమి చెయ్యాలో చెప్పండి.౯ అని అడిగాడు ఆ మహారాజు.

౯మహారాజా! నదీ ప్రవాహంలో ఎన్నో కలప దుంగలు కొట్టుకుపోతుంటాయి. అందులో కొన్ని దగ్గరగా చేరతాయి. అంతలోనే దూరంగా వెళుతుంటాయి. ఆ దుంగలు ఎంత సహజంగా కలుస్తాయో అంతే సహజంగా విడిపోతాయి. భార్య పుత్రులు బంధువులు కూడా అంతే. మన జీవితంలోకి వస్తుంటారు. పోతుంటారు. వారికోసం చింతిచడం మూర్ఖత్వమే అవుతుంది. ఎందుకంటే నీ శరీరమే నీకు శాశ్వతము కాదు. ఈ శరీరాన్ని ఎప్పుడో ఒకప్పుడు వదలాలి కదా. అలాంటిది నీ భార్య పుత్రులు శాశ్వతం అని ఎలా అనుకుంటావు. కాబట్టి భార్యా పుత్రుల మీద మోహం పెంచుకోడం మంచిదికాదు. మోహమే లేనపుడు వియోగము సంభవించి నపుడు దుఃఖము కలుగదు. కాబట్టి చింతించ పనిలేదు.

మానవునికి సుఖము, దాని వెంట దుఃఖము వెంట వెంటనే వస్తుంటాయి, పోతుంటాయి. సుఖము ఒక్కటే కలగదు. అలాగే దుఃఖము ఒక్కటే కలగదు. సుఖము వచ్చినపుడు పొంగి పోవడం, దుఃఖము వచ్చినపుడు కుంగిపోవడం వివేకుల లక్షణము కాదు. మానవుడు చరాచర వస్తువులను ఇది నాది అని అనుకుంటాడు. ఆ వస్తువులు అతని నుండి దూరమైనపుడు దుఃఖిస్తాడు. ఇది నాది అనే భావనే లేకపోతే దుఃఖము కలగడానికి ఆస్కారమే లేదు కదా! మానవుడికి అతని పూర్వ జన్మలో చేసిన కర్మఫలము ద్వారా ఈ జన్మలో చరాచర వస్తువులతో సంయోగ వియోగములు సంభవిస్తాయి. అతనుపండితుడైనా పామరుడైనా కర్మఫలములు సమానమైన ప్రభావాన్ని చూపుతాయి. దానికి మందు--- ధైర్యంగా వాటిని

ఎదుర్కోవడమే. సుఖదుఃఖములనుసమానంగా చూడటమే. మనం కోరికలను వదిలిపెడితే దుఃఖము మన చెంతకు రాదు. అంతా సుఖమే. ఈ విషయం పింగళ అనే వేశ్య చెప్పిన మాటలలో అర్థం అవుతుంది.

పూర్వముపింగళ అనే వేశ్య ఉండేది. ఆమె తన ప్రియుని కొరకు ఎంతోకాలం ఎదురు చూచింది. కాని అతనురాలేదు. అప్పుడు తనలో తాను ఇలా అనుకుంది. ౯నేను నా ప్రియుని కోసం ఎదురు చూచి చూచి పిచ్చిదాన్ని అయ్యాను. కాని నా ప్రియుడు కూడా నా మాదిరే పిచ్చి వాడు కాలేదుకదా! మరి వాడికోసం నేను ఎందుకు బాధ పడటం. అందుకని నా శరీరంలో ఉన్న అన్ని ద్వారములను మూసుకొని నిద్రపోతాను. రాని వాడి కోసం బాధపడటం కంటే నా దగ్గరకు వచ్చినవాడే నా ప్రియుడు అనుకుని తృప్తి పడితే సుఖంగా ఉంటుంది కదా. రాని వాడి కోసం ఆశపడటం మంచిది కాదు. ఈ ఆశ మనిషిని కుంగదీస్తుంది. పిచ్చివాడిని చేస్తుంది. సర్వనాశనం చేస్తుంది. కాబట్టి నేను ఈ రోజునుండి వాడి మీద ఆశ వదులుకుంటాను. ఉన్నదానితో తృప్తిగా జీవిస్తాను. నా నాశనాన్ని కొని తెచ్చుకోను.౯ అని తనలో తాను తృప్తి పడింది ఆ వేశ్య.

కాబట్టి మహారాజా! పోయిన దాని కోసం, చనిపోయిన వారి కోసం చింతించడం ఆపి ఉన్న దానితో, ఉన్నవారితో తృప్తిగా జీవించు.౯ అని పలికాడు ఆ విప్రుడు.

ధర్మనందనా! ఈ కథలోని అంతరార్థం గ్రహించి ఉన్నదానితో తృప్తిగా జీవించు. తృప్తిని మించిన సుఖము, సంపదా ఆ లోకంటో మరొకటి లేదు.౯ అని చెప్పాడు భీష్ముడు.

౯పితామహా! ఈ లోకంలో ఉన్న జీవజాలమంతా నశించే కాలం సమీపిస్తూ ఉందని నాకు తోస్తూ ఉంది. అలాంటిసమయంలో జనులు ఏమి చెయ్యాలి

వివరించండి.౯ అని అడిగాడు.

౯ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు ఒక కథ చెపుతాను. విను. ఒక గ్రామంలో ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. అతనికి మేధావి అనే కుమారుడు ఉన్నాడు. అతను వేద వేదాంగములు అభ్యసించాడు. ఒకరోజు ఆ బ్రాహ్మణుడు తండ్రిని ఇలా అడిగాడు.

౯తండ్రీ! రోజులు గడిచేకొద్దీ, జనులకు ఆయుష్షు తగ్గి పోతూ ఉంటుంది కదా! ఈ విషయం అందరికీ తెలుసు. మరి ఈ విషయంలో జనులు ఎలా ప్రవర్తిస్తే వారికి మేలు కలుగుతుంది.౯ అని అడిగాడు.

౯కుమారా! దానికి ఒకటేమార్గం. తగిన సమయంలో వివాహం చేసుకొని, సంతానం కలిగిన తరువాత, యజ్ఞ యాగములు చేసి, వానప్రస్థము స్వీకరించి తుదకు మోక్షము పొందడం. ఈ పద్ధతిలో మృత్యువును జయింపవచ్చును.౯ అని అన్నాడు.

౯తండ్రీ! నీవు మృత్యువు నీ అధీనంలో ఉన్నట్టు మాట్లాడుతున్నావు. మానవుడు తల్లి గర్భంలోనుండి పుట్టిన మరుక్షణం నుండి మృత్యువు వాడిని తీసుకు పోవడానికి ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటుంది. మానవ జీవితం కూడా, ఎండకు మడుగులో నీరు ఆవిరి అయినట్టు, క్షణం క్షణం తరిగిపోతూ ఉంటుంది. ఇంక భార్య బిడ్డల మోహంలో పడి కొట్టుకుంటున్నవాడిని మృత్యువు ఎప్పుడో ఒకప్పుడు మింగేస్తుంది. జరిగింది తల్చుకుంటూ, జరగబోయేదానికి ప్రణాళికలు వేస్తూ, దైనందిన జీవితం గడిపే వాడిని మృత్యువు ఎప్పుడు కబళిస్తుందో తెలియదు. కాబట్టి మనిషికాలం అధీనంలో ఉన్నాడు. కానీ కాలం మనిషిఅధీనంలో లేదు అన్నది స్పష్టం. మృత్యువుకు స్వపరబేధం లేదు. భీరుడు అని కానీ, శూరుడు అని కానీ, మూర్ఖుడు అని కానీ,

సకల విద్యావిశారదుడు అని కానీ, దుర్బలుడు అని కానీ, సబలుడు అని కానీ బేధం లేదు. అందరినీ సమానంగా కాలం తీరగానే కబళిస్తుంది. ఈ సంసారం లో కొట్టుమిట్టాడుతున్న వాడిని కబళించడానికి మృత్యువు పొంచి ఉంటుంది. కోరికలను వదిలిపెట్టి జీవించడంలోనే సుఖం ఉంది. కాబట్టి సంసార బంధనాలు తెంచుకోడమే ఉత్తమం. కోరికల మోహంలో పడటమే మృత్యువు. ఇది ఏదీ నాది కాదు అన్న సత్యమే అమృతము. ఈ ప్రపంచం అంతా అనిత్యము అన్న సత్యమే మృత్యువునుండి రక్షిస్తుంది. అప్పుడు నాకుసుఖం కలిగినా దుఃఖము కలిగినా నాకు సమానమే. ఎల్లప్పుడూ శాంతితో జీవిస్తాను. అంతే కాని, పెళ్లి చేసుకోడం, పిల్లలను కనడం, యాగాలు చెయ్యడం, వానప్రస్థానికి వెళ్లడం మోక్షానికి మార్గాలు కావు.

యజ్ఞములలో యాగములలో జీవహింస తప్పకుండా జరుగుతుంది. దానివలన మోక్షం ఎలా వస్తుంది. పైగా నేను యజ్ఞము చేస్తున్నాను అన్న అహంకారం మనిషిని ఆవహిస్తుంది. కాబట్టి యజ్ఞ యాగములు చెయ్యడం మోక్ష మార్గములు కావు. మనస్సును, వాక్కును, శరీరాన్ని నియమబద్ధంగా నిగ్రహించడం ద్వారా మోక్షం సాధించ వచ్చు. అవ్యయమైన ఆనందాన్ని పొందవచ్చు. నీవు ఆ అమృత తుల్యమైన ఆనందాన్ని పొందాలంటే అరిషడ్వర్గములను వదిలిపెట్టు. ఏకాంత ప్రదేశములో కూర్చుని ప్రాపంచిక వ్యవహారములను వదిలిపెట్టి, నిర్మల మనస్సుతో ధ్యానములో నిమగ్నుడవై, నిన్ను గురించి నువ్వు తెలుసుకో.FF అని ఆ బ్రాహ్మణ కుమారుడు తన తండ్రికి బోధించాడు.

కాబట్టి ధర్మనందనా! ఈ తండ్రికుమారుల సంవాదములోని అంతరార్ధ మును గ్రహించి, సత్యము, ధర్మమును గురించి తెలుసుకో!FF అని అన్నాడు భీష్ముడు.

FFపితామహా! ఈ లోకంలో ధనవంతులు, పేదవారు ఉన్నారు. అందులో ఎవరు

సుఖపడు తున్నారు. ఎవరు దుఃఖపడుతున్నారు. వివరించండి.ఽ అని అడిగాడు.

ఽధర్మనందనా! సంపదను, పేదరికాన్ని త్రాసులో పెట్టి తుల తూస్తే త్రాసు ముల్లు పేదరికం వైపుకే ఒరుగుతుంది. సంపదకు, పేదరికానికి ఉన్న గుణదోషముల గురించి చెబుతాను విను. ధనము, సంపద, ఆస్తి కలవాడు ఎప్పుడూ భయ పడుతూ ఉంటాడు. తన సంపదను దొంగలుదోచుకుంటారని, అగ్నికి ఆహుతి అవుతుందని, నిరంతరం భయంతో తల్లడిల్లిపోతుంటాడు. వాడు ఎల్లప్పుడూ మృత్యుముఖంలో ఉన్నట్టు ఉంటాడు. కాబట్టి ధనవంతునికి సుఖశాంతులు కరువవుతాయి. ధనం కారణంగా మనిషి అకారణం కోపం తెచ్చుకుంటాడు. ఉన్న ధనము చాలదని ఇంకా ధనం కావాలని అత్యాశకు పోతాడు. మనసు వికలం చేసుకుంటాడు. ఉన్నధనాన్ని కాపాడుకోడం కోసం నిత్యం విచారంతో ఉంటాడు కాబట్టి ధనవంతునికి సుఖం దొరకదు. కాని ధనల లేని వాడు ఎక్కడ ఉన్నా హాయిగా విచ్చలవిడిగా తన ఇష్టంవచ్చినట్టు సంచరించగలడు. వాడికి భయం అనేది ఉండదు. ఎవరి మీదా కోపం తెచ్చుకోడు. ఎవరినీ మోసంచెయ్యడు. ప్రశాంత చిత్తంతో ఉంటాడు. కాబట్టి ధనములేని వాడే గొప్పవాడు. ధనం ఉన్న వాడికి ఆ ధనం శాశ్వతంగా ఉండదు. కాలక్రమేణా నశిస్తుంది. ఉన్న డబ్బు ఎప్పుడైనా పోతుంది అనే జ్ఞానం ఉంటే డ బ్బునుండి విముక్తి పొంది శాంతంగా ఉంటాడు. ధనం ఎప్పటికీ దుఃఖ హేతువు అని తెలుసుకొని ఆ ధనాన్ని విడిచి పెట్టి తన గురించి తను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే సుఖ శాంతులు పొందుతాడు.ఽ అని చెప్పాడు భీష్ముడు.

ఽపితామహా! ధన తృష్ణతో కొట్టుకులాడే జీవి ఎప్పుడు సుఖాన్ని పొందు తాడు.ఽ అని అడిగాడు.

ఽధర్మజా! ధనము సంపాదించి సంపాదించి విసుగు పుట్టి, ధనం

సంపాదించడం మానుకున్నప్పుడే వాడికి సుఖం కలుగుతుంది. ఈ సందర్భంలో నీకు ఒక కథవినిపిస్తాను. ఒక ఊరిలో మంకి అనే పేరుగల ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. వాడికి ధనం మీద ఆశ జాస్తి. అందుకని వాడు రెండు కోడె దూడలను కొన్నాడు. వాటిని తాడుతో కట్టివేసాడు. ఒకరోజు అవి మెడకు కట్టిన తాళ్లతోనే పరుగెత్తాయి. ఒక ఒంటెపడుకొని ఉంటే దానిని దాటబోయాయి. అవి ఒంటె మీదికి రాగానే ఒంటే పైకి లేచింది. ఈ రెండు కోడె దూడలు ఒంటె రెండు పక్కలా వేలాడుతున్నాయి. వాటి మెడలకు కట్టిన తాళ్లు ఉరి తాళ్ల మాదిరి బిగుసుకు పోవడంతో అవి చనిపోయాయి. అది చూచి అ బ్రాహ్మణుడు హడలి పోయాడు. తాను ఎంతో ప్రేమగా పెంచుకున్న కోడెదూడలు క్షణాలలో శవాలుగా మారి పోయాయి. అక్కడే ఉన్న జనులనుచూచి ఇలా అన్నాడు

"అయ్యలారా! నేనేదో నా ప్రతిభతో డబ్బు సంపాదిద్దాము అనుకున్నాను.కాని దైవ కృపలేనిదే ధనము సంపాదించడం సాధ్యం కాదని తేలిపోయింది. మనస్సుకు సుఖం కావాలంటే దానికి కూడా దైవానుగ్రహము ఉండాలి. మనము ఎన్ని ప్రయత్నాలు చేసినా వ్యర్థమే కదా! కాబట్టి దైవం మీద భారం వేసి మన ప్రయత్నాలు మనం చెయ్యాలి. కోర్కెలు వదలక పోతే మనస్సుకు శాంతిసుఖము లేదు. కాని కోర్కెను మనసులోనుండి తీసివెయ్యాలంటే ఏమి చెయ్యాలి?

కోరికలకూ మూలం మనసులో సంకల్పం. కాబట్టి సంకల్పంలేకుండా మనసు ఉండాలంటే ఇంద్రియ ములను కట్టడి చెయ్యాలి. మౌనంగా ఉండాలి. మౌనంగా ఉన్నంత మాత్రాన కోరికలు కలగవా? అసలు కోరికలే లేకపోతే ఎలా ఉంటుంది. కోరికలు తీరడానికి ధనం కావాలి. ధనం ఉన్నంత మాత్రాన సుఖం కలుగదు. ఆ ధనం కూడా మనం కోరినంత మాత్రాన మనకు లభించదు. ధనం కోసం ప్రయత్నించాలి. ప్రయత్నించి నంత మాత్రాన ధనం లభించవచ్చు. లభించక పోవచ్చు. ఒక వేళ ధనము లభిస్తే ఏం చెయ్యాలి? దానిని దాయడానికి ఎన్నో పాట్లు

పడాలి. ధనం తో పాటు ఎన్నో కష్టాలు వెన్నంటి వస్తాయి. ఒక వేళ ధనం లభించక పోతే చచ్చినంత పని అవుతుంది. కాబట్టి ధనం లభించినా, ధనం లభించకపోయినా దుఃఖము తప్పడం లేదు. కాబట్టి ఆ ధనార్జనకు మూలమైన కోర్కెలను విడిచిపెట్టడంలోనే నిజమైనా సుఖము ఆనందము ఉంది.

పోనీ కొంత ధనం సంపాదించాము. కాని అంతటితో తృప్తి కలగడం లేదు. ఇంకా ఇంకా కావాలని ఆశ పుడుతుంది. కాబట్టి ధనం సంపాదించడానికి శ్రమ పడాలి. దానిని దాయడానికి శ్రమ పడాలి. అంతటి తో తృప్తి చెందకా ఇంకా ఇంకా కావాలని ఆరాటపడాలి. ఇన్ని ఆరాటాలకు కోరికలే మూల కారణం కాబట్టి కోరికలను వదిలిపెట్టాలి. ఎందు కంటే ఈ కామానికి కోరికలకు అంతు లేదు. కనపడినదల్లా కావాలని అంటుంది. అది సులభమా, దుర్లభమా అని చూడదు. మంకు పట్టు పడుతుంది. మనిషిని కష్టాలపాలు చేస్తుంది. ఒకకోరిక తీరితే మరొక కోరిక. అలా అంతం లేకుండా ఒకటివెంట ఒకటి పుడుతూనే ఉంటాయి కోరికలు. కాబట్టి అసలుకోరికలు పుట్టకుండా చెయ్యడమే ఉత్తమం.

నేను ధనము సంపాదన కోసం తెచ్చిన కోడెదూడలు అర్థాంతరంగా చని పోయాయి. ఇంక నాలో ధనము సంపాదించాలనే కోరిక చచ్చిపోయింది. కోపం అసలు లేదు. నా ఇంద్రియాలు నా మాట వింటున్నాయి నాలో సహనం నెలకొని ఉంది. ఇంక మీదట నన్ను లోభము ఆవరించదు." అని తనలో తాను సమాధాన పడ్డాడు. తనలో ఉన్న కామాన్ని కోరికలను విడిచిపెట్టాడు. శేష జీవితం సుఖంగా జీవించాడు." అని భీష్ముడు చెప్పాడు.

"పితామహా! మానవుడు దేనిని ఆచరిస్తే సమస్త దుఃఖముల నుండి విముక్తి పొందుతాడు." అని అడిగాడు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నేనునీకు అజగర చరిత్ర చెబుతాను.

సావధానంగా విను. పూర్వము ప్రహ్లాదుడు ఒక బ్రాహ్మణుని పిలిచి తనకు శమము(శాంతి) గురించి వివరించండి అని అడిగాడు. దానికి ఆ బ్రాహ్మణుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"మహారాజా! ఈ చరాచర జగత్తులో అనుదినమూ ఏ నిమిత్తము లేకుండానే ఎన్నో ప్రాణులుపుడుతున్నాయి. చస్తున్నాయి. అందులో నరులు కూడా ఉన్నారు. కాబట్టి ప్రాణులు అన్ని శాశ్వతములు కావు. ప్రాణులు శాశ్వతములు కావు అని తెలిసి కూడా వాటికోసం నరులు వ్యథ చెందుతున్నారు. నదులకు వరదలు వచ్చినప్పుడు, ఆ ప్రవాహములో ఎన్నో కలపదుంగలు కొట్టుకొని వస్తుంటాయి. అవి ఒక్కో సమయంలో దగ్గరగా వస్తాయి. వెంటనే దూరంగా కొట్టుకు పోతుం టాయి. ఈ సృష్టిలో కూడా భార్య, బిడ్డలు, బంధువులు అలా దగ్గరగా వస్తుంటారు. దూరంగా కొట్టుకొనిపోతుంటారు. వరదలు వచ్చినప్పుడు కట్టెలు ఏ ప్రకారంగా వాటి ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా దగ్గరగా వస్తూ మరలా దూరంగా కొట్టుకొని పోతుంటాయో, భార్యాబిడ్డలు, బంధువులు కూడా అంతే. ఈ బంధుత్వాలకు మన ప్రమేయం ఏమీ ఉండదు. కాబట్టి ఈ సత్యమును గ్రహించిన వాడు సుఖదుఃఖములకు అతీతుడుగా ఉంటూ శాశ్వతానందము పొందుతాడు.

నేను సుఖదుఃఖాలకు అతీతుడను కాబట్టి నన్ను పిలిచి నీ సందేహములను నివృత్తిచేసుకుంటున్నావు. నాకు మేలు జరగాలని నేను ఎప్పుడూ కోరుకోను. దుఃఖము వస్తే బాధ పడను. కాని దానిని పోగొట్టుకోడానికి ప్రయత్నం చేస్తాను. నేను ఆహారములో రుచికి ప్రాధాన్యము ఇవ్వను. ఏది దొరికితే అది తింటాను. మృదువైన శయ్య దొరికితే అక్కడ పడుకుంటాను. లేకపోతే కటిక నేలమీద పడుకుంటాను. రెండూ నాకు సమానమే. చీనాంబరము కానీ నార చీర కానీ ధరిస్తాను. ఏది దొరికితే అది. ఇది కావాలని కోరను.కాబట్టి సుఖదుఃములను, కలిమి లేములను పట్టించుకోకుండా అజగరము(కొండ చిలువ) మాదిరి చలనం లేకుండా

ఉండటమే అజగర వ్రతము.

నాకు ఇది కావాలి అది కావాలి అనే నియమం లేకుండా ఆహార విహార శయనాదులలో దేవుడిచ్చిన దాన్ని అనుభవిస్తూ, ఏ భారము లేకుండా జీవించడమే అజగరవ్రతము. ఉన్నదానితో తృప్తి చెందటం, శుభ్రత పాటించడం, ఓర్పుతో ఉండటం, అందరి పట్ల సమభావంతో ఉండటం, తనలో తాను రమిస్తూ ఉండటం దీనినే అజగరవ్రతము అంటారు. ఈ వ్రతము ఏ యజ్ఞ యాగముల వల్ల లభించదు. కేవలం జ్ఞానము వల్లనే కలుగుతుంది. ఈ అజగర వ్రతము ఆచరించే వాడికి ఏ పాపమూఅంటదు. ఏ భయమూ ఉండదు. శోకము అతని దగ్గరకే రాదు. మోక్షము అతని చెంతనే ఉంటుంది.౯ అని ఆ విప్రుడు ప్రహ్లాదునికి చెప్పాడు అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

౯ పితామహా! బంధువుల సిరిసంపదలు, తాను చేసే కర్మఫలము,తనకున్న సిరి సంపదలు, తనకు ఉన్న బుద్ధిబలము ఈ నాలుగింటిలో దేని వలన నరునికి కీర్తిప్రతిష్టలు కలుగుతాయి.౯ అని ధర్మరాజు అడిగాడు.

౯ఓ ధర్మనందనా! నరునికి తనకు ఉన్న ప్రజ్ఞ వలననే కీర్తి ప్రతిష్టలు కలుగుతాయి. ప్రజ్ఞ వలననే లాభము కలుగుతుంది. తుదకు స్వర్గ లోక ప్రాప్తి కూడా ప్రజ్ఞ వలననే కలుగుతుంది. కాబట్టి ప్రజ్ఞ నరునికి అత్యంత ఆవశ్యకము. దానివలన కాని పనులు లేవు. బలి, ప్రహ్లాదుడు, మంకి అనే బ్రాహ్మణుడు మొదలగు వారు తమకు ఉన్న ప్రజ్ఞ వలననే తమ తమ సమస్యలకు పరిష్కారం పొందారు.

కాశ్యపుడు అనే పేరుగల ఒక బ్రాహ్మణుడు ఒకసారి ఒక గర్వాంధుడు తోలే రథం తగిలి కింద పడిపోయాడు. అవమాన భారంతో కుమిలిపోయాడు. ప్రాణత్యాగానికి సిద్ధ పడ్డాడు. ఆ సమయంలో ఇంద్రుడు ఒక నక్క రూపంలో వచ్చి అతనికి ప్రజ్ఞ కలిగించి అతని ఆత్మహత్యా ప్రయత్నమును మాన్పించాడు.

కాబట్టి ప్రజ్ఞ అన్నింటికన్నా శ్రేష్టమయినది." అని చెప్పాడు భీష్ముడు.

" గంగా తనయా! మానవుడు తన దైనందిన జీవితంలో దానాలు, ధర్మాలు, తపస్సు, తలితండ్రులకు, పెద్దలకు సేవ, అత్యంత నిష్టతో ఒక యజ్ఞం చేసినట్టు చేస్తుంటాడు. అవి అన్ని ఆ మానవునకు ఏ రూపంలో ఫలితములను ఇస్తాయి. వివరంగాచెప్పండి." అని అడిగాడు.

"ధర్మరాజా! మేలు మీద మేలు, కీడు వెంటనే కీడు, ఒకదాని వెంట ఒకటి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఒక మనిషి పాపం చేసినట్టయితే, ఒక కష్టం వెంట మరొక కష్టం వస్తూనే ఉంటుంది. మనిషిని దారుణం గా దెబ్బ తీస్తుంది. అదే మనిషి పుణ్యాత్ముడైతే అతనికి సుఖం వెంట సుఖం వస్తూ ఉంటుంది. నిరంతరం సుఖ సంతోషాలలో మునిగి తేలుతుంటాడు. ధాన్యంలో తాలు గింజలు ఉన్నట్టు మనుషులలో పాపాత్ములు ఉంటారు. వారు సమాజానికి పనికిరాక పోగా హాని కలిగిస్తుంటారు.

మనిషి కి తాను చేసిన పాపపుణ్యాలు నీడ వలె అతని వెంటనే ఉంటాయి. ఈ లోకంలో ఉన్నప్పుడు అతను చేసిన పాపపుణ్యముల ఫలితం అనుక్షణం అతని జీవితం మీద తమ ప్రభావం చూపుతూ ఉంటుంది. అతను చనిపోయిన తరువాత ఆ పాపపుణ్యాల వాసనలు అతని వెంటే పరలోకాలకు వెళతాయి. కాబట్టి మానవుడు బతికి ఉన్నా చచ్చినా పాప పుణ్యాల ప్రభావాన్నించి తప్పించుకోలేడు.

తగిన ఋతువులలో చెట్లు చిగిర్చిపూలు పూసి కాయలు కాసి పండు పండినట్టు మానవునికి కూడా తన పుణ్యాలు, పాపాలు, పండి పక్వానికి వచ్చినప్పుడు తగిన ఫలితాలను ఇస్తాయి. సుఖ దుఃఖాలను కలిగిస్తాయి. సాధారణంగా మానవులు మంచి ప్రవర్తన కలిగి ఉంటారు. ధాన్యంలో తాలు మాదిరి అక్కడక్కడా

దుర్మార్గులు ఉంటుంటారు. మంచి ప్రవర్తన కలిగినవారిని, ఓర్పుతో ఉండేవారిని చేతగానివారిలా పరిణిస్తుంటారు. కాని మంచి వారు అలాంటి వారి మాటలు పట్టించుకోకుండా సన్మార్గంలో చరిస్తుంటారు. దాని ఫలితాన్ని సుఖాల రూపంలో పొందుతుంటారు. కాబట్టి ధర్మంగా, న్యాయంగా, మంచి ప్రవర్తతనలో ఉన్నవారికి తగిన ప్రతిఫలం తప్పకుండా లభిస్తుంది.” అని అన్నాడు భీష్ముడు.

“పితామహా! అసలు ఈ భూతసృష్టి ఎలా జరిగింది. ఎవరి వలన జరిగింది. తెలపండి.” అని అడిగాడు.

(భూతములు అంటే మనం, మన పిల్లలు దయ్యాలు భూతాలు అనుకుం టాము. భూతములు అంటే ఇప్పటి కే ఉన్నవి. అని అర్ధము. కాబట్టి ఈ చరాచర జగత్తులో ఉన్న ప్రాణులు జీవరాసులు అన్ని మన ముందు ఉన్నాయి కాబట్టి అవి అన్ని భూతములే.)

“ధర్మనందనా! ఈ విషయం ఇంతకు ముందు భృగు మహర్షి భరద్వాజునికి వివరించాడు. ఈ విషయాలు నేను నీకుచెబుతాను. విష్ణువు సర్వ వ్యాపి. ఆది అంతము లేని వాడు. విష్ణువు సృష్టి చేయ సంకల్పించి తనలో వెయ్యో వంతుతో అవ్యక్తుము అనే పదార్ధాన్ని సృష్టించాడు. అవ్యక్తము నుండి మహత్తత్త్వము అనగా ప్రకృతి తత్త్వము పుట్టింది. ఆ ప్రకృతి లోనుండి ఒక పద్మము పుట్టింది. ఆ పద్మము లో నుండి బ్రహ్మ ఉద్భవించాడు. ఆ బ్రహ్మదేవుని సంకల్పంచేత ఈ ఆకాశము (శూన్యము) ఉద్భవించింది. తరువాత ఆకాశము నుండి జలము పుట్టింది. ఆ జలము నుండి అగ్ని ఉద్భవించింది. అగ్ని నుండి వాయువు, అగ్ని వాయువుల సమ్మేళనంతో ఈ పృధివి (భూమి) పుట్టాయి. ఈ పంచ భూతములు బ్రహ్మలో ఉన్నాయి. ఈ ప్రకృతి అంతా బ్రహ్మమే. భూమి మీద ఉన్న కొండలు పర్వతములు బ్రహ్మకు ఎముకలు. ఈ భూమి అతని శరీరంలో మాంసము. సముద్రాలు, మహా

సముద్రాలు బ్రహ్మదేవుని రక్తము. ఆకాశం అతని ఉదరము (పొట్ట). వాయువు అతని ఉఛ్వాసనిశ్వాసములు, అగ్ని అతని లో ఉన్న తేజస్సు. సరిత్తులు బ్రహ్మదేవుని శరీరంలోన్న సిరలు. సూర్య చంద్రులు బ్రహ్మదేవుని రెండు కళ్లు. ఊర్ధ్వలోకము బ్రహ్మదేవుని శిరస్సు (తల), పాతాళము బ్రహ్మదేవుని పాదములు, నాలుగు దిక్కులు బ్రహ్మదేవుని నాలుగు చేతులు. ఈ ప్రకారంగా అనంతుడైన విష్ణువునుండి ఈ ప్రకృతి ఉద్భవించింది.

అప్పుడు భరద్వాజుడు పంచభూతములు ఎలా ఉంటాయి? వాటి కొలతలు ఎంత? అని అడిగాడు. అప్పుడు భృగు ఇలా చెప్పాడు.

పంచభూతములు అనంతములు. వాటికి హద్దులులేవు. గాలి నీరు నిప్పు నేల ఇక్కడా ఉన్నాయి అక్కడ లేవు అని అనలేము. విష్ణువు మాదిరి అవి కూడా సర్వవ్యాపకములు. ఇంక ఆకాశము అనంతము. హద్దులు లేనిది.

(నేటి సైన్సు ప్రకారము, భూమి లాంటి గ్రహాలు 9 సూర్యుని చుట్టు పరిభ్రమిస్తున్నాయి. సూర్యుడి లాంటి నక్షత్రాలు పాలపుంతలో లెక్కలేనన్ని ఉన్నాయి. అలాంటి పాలపుంతలు (గెలాక్సీలు) ఈ అనంత విశ్వంలోకి ఎన్నో కాంతి సంవత్సరాల వేగంతో దూసుకుపోతున్నాయి. అలా కొన్ని కోట్ల సంవత్సరాల నుండి జరుగుతూ ఉంది. అందుకే ఆకాశము అనంతము. ఈ అనంతాకాశంలో మనం నివసిస్తున్న భూమి ఎంత? అందులో మన దేశం ఎంత? అందులో మన ఊరు, మన ఇల్లు ఎంత? మన బతుకెంత? మనం అహంకారం ఎంత? ప్రతివాడూ ఆలోచించు కోవాలి. అందుకే అహంకారము పనికిరాదు.)

ఒకపదార్థము నుండి పుట్టినమరొక పదార్థము దాని పోలికలతోనే ఉంటుంది. అలాగే అనంతుడు, సర్వవ్యాపి, అయిన విష్ణువునుండి పుట్టిన ప్రకృతి, పంచ

భూతములు కూడా  విష్ణువు మాదిరి సర్వవ్యాపకములే. చెట్టునుండి చెట్టు, పక్షినుండి పక్షి, మనిషినుండి మనిషి, జంతువునుండి జంతువు పుడతాయి. అలా పుట్టినవి కూడా  తాము వేటి నుండి పుట్టాయో, వాటి లక్షణాలు కలిగి ఉంటాయి. అది ప్రకృతి సహజము. అనంతుడైన విష్ణువు నుండి పుట్టిన పంచభూతములు కూడా అనంతత్వాన్ని సంతరించుకున్నాయి.” అని అన్నాడు భృగు.

ఇప్పుడు భరద్వాజునికి ఒక సందేహం కలిగింది. “మహర్షీ! బ్రహ్మ పద్మములోనుండి పుట్టాడు అన్నారు కదా. అంటే బ్రహ్మ పుట్టక ముందే పద్మము పుట్టిందా? పుడితే ఎలా పుట్టింది? ఎవరు పుట్టించారు?” అని అడిగాడు భరద్వాజుడు.

“భరద్వాజా! విష్ణువు సర్వవ్యాపి అనుకున్నాము కదా. విష్ణువు మానస పుత్రుడు బ్రహ్మ. కాబట్టి బ్రహ్మ ఆద్యుడు (మొదటివాడు). బ్రహ్మకు ఆసనంగా పద్మము ఉద్భవించింది. కాని ఈ సృష్టిక్రమంలో ముందు వెనుకలు లేవు. అందుకని బ్రహ్మ పద్మములోనుండి పుట్టిన వాడు అని అన్నారు. పద్మము అంటే మనం అనుకునే పుష్పము కాదు. పద్మము అంటే భూమి. భూమి పైన ఎత్తైన మేరు పర్వతముపుట్టింది. అంటే మేరువు భూమి అనే పుష్పంలో మధ్య ఉన్న కర్ణిక. (కర్ణిక అంటే పుష్పము మధ్య ఉండే భాగము). అందుండి సమస్త చరాచర జగత్తు ఉద్భవించింది.” అని చెప్పాడు భృగువు.

“మహర్షీ! పంచభూతాలు దేని నుండి ఉద్భవించాయి? అవి ఐదుగా ఎలా రూపు దాల్చాయి.” అని అడిగాడు భరద్వాజుడు.

“భరద్వాజా! వాయువు నిరంతరము కదిలేది. చైతన్య స్వరూపము. ఆకాశము

శబ్దస్వరూపము. నీరు ద్రవ స్వరూపము. అగ్ని --వేడికి వెలుతురుకు ప్రతీక. ఇంక ఘన స్వరూపానికి ప్రతీక భూమి. వీటి ఐదింటి వలన సృష్టి ఏర్పడింది. ఈ సృష్టి లో రెండే జాతులు. స్థావరములు (కదలనివి)జంగమములు (కదిలేవి).౯ అని చెప్పాడు భృగువు.

౯మహర్షి! మరి కదలని వాటిలో ఈ పంచభూతములు ఎలా ప్రవర్తిస్తాయి.౯ అని అడిగాడు.

౯భరద్వాజా! కదలని వాటిలో వృక్షమును తీసుకో. పిడుగు పడినప్పుడు వృక్షము అల్లల్లాడుతుంది. అంటే ధ్వనికి అది స్పందిస్తూ ఉంది. అంటే వృక్షమునకు వినికిడి శక్తి ఉంది కదా. అలాగే గట్టిగా గాలి వీచినప్పుడు ఏ వైపునకుగాలి కొడితే వృక్షము ఆ వైపుకు ఒంగుతుంది. వెలుతురు ఏ వైపు ఉంటే ఆ వైపుకు పెరుగుతుంది. అంటే వృక్షమునకు గాలి వెలుతురు గ్రహించే శక్తి ఉన్నట్టే కదా. అలాగే వృక్షము తన వేళ్లతో నీటిని గ్రహించి చిట్ట చివర ఉన్న రెమ్మకూ కూడా అందిస్తుంది. అంటే వృక్షమునకు నీటిని పానం చేసే శక్తి అంటే జలశక్తి ఉన్నట్టే కదా ! చెట్టు సుగంధ భరితమైన పూలు పూచి కాయలు కాస్తుంది. అంటే ఘ్రాణ శక్తి కూడా ఉన్నట్టే కదా. ఘ్రాణ శక్తి భూమి శక్తి. కాబట్టి పంచభూతముల లక్షణాలు ఉండబట్టి వృక్షము పంచ భూతాత్మ కము అయినది. అదేమాదిరి కొండలు, రాళ్లలో కూడా పంచభూతముల లక్షణములు మనకు కనపడుతుంటాయి. కాబట్టి ఈ సృష్టిలో అన్ని పంచభూతాత్మకములే.౯ అని భృగువు భరద్వాజునికి చెప్పాడు.

౯ఓ భృగు మహర్షి! భూమి మొదలైన పంచభూతములకు రసము, గంధము, తేజస్సు మొదలగునవి సహజ గుణములు. ఆ గుణములు వేటిలో ఉంటాయి. వాటిని ఎవరు ఏ విధంగా అనుభవిస్తారు తెలియచెయ్యండి.౯ అని అడిగాడు భరద్వాజుడు.

ఓ భరద్వాజా! విషయములు, ఇంద్రియములు, మనసు. మనలో ఉన్న అంతరాత్మ విషయవాంఛలను, మనసు ద్వారా సంకల్పించి, ఇంద్రియముల ద్వారా అనుభవించి, వాటి వలన కలిగే సుఖమును దుఃఖమును పొందుతూ ఉంటుంది. జీవుడు క్షేత్రజ్ఞుడు అనే పేరుతో మన శరీరం మొత్తం వ్యాపించి ఉంటాడు. ఈ క్షేత్రజ్ఞుడు, మానవ సహజమైన సత్త్వరజస్తమో గుణములకు అతీతంగా, సాక్షీభూతంగా ఉంటాడు. ఈ జీవుడు తన పూర్వస్థానమైన కైవల్యము వంక చూస్తూ ఉంటాడు. విజ్ఞులైన వారు, తమ సూక్ష్మమైన విమల బుద్ధితో ఆ క్షేత్రజ్ఞుని గురించి తెలుసు కుంటారు. అతని యందే మనసు నిలుపుతారు. భౌతిక మైన సుఖదుఃఖ ము లకు అతీతంగా అత్యంత శాంతి మతులై ఉంటారు. తుదకు పరమ సుఖాన్నిపొందుతారు.

తొలుత బ్రహ్మదేవుడు సత్యము, ధర్మము, సదాచారము, తపస్సు మొదలగు వాటికి ఉనికి పట్టుగా బ్రాహ్మణులను సృష్టించాడు. తరువాత క్షత్రియులు, వైశ్యులు, శూద్రులను సృష్టించాడు. వారికి తగిన వర్ణములు(రంగులు) కల్పించాడు. బ్రాహ్మణులు తెల్లగానూ, క్షత్రియులు ఎరుపు రంగులోనూ, వైశ్యులు పసుపురంగు లోనూ, శూద్రులు నలుపు రంగులోనూ కల్పించాడు. ఆ ప్రకారంగా నాలుగు వర్ణముల వారు ఏర్పడ్డారు. ఈ నాలుగు వర్ణముల వారు తమ కు ఏర్పరచిన వృత్తులను వదిలి ఇతరుల వృత్తులను చేపట్టిన, వారు అదే వృత్తి చెయ్యాల్సి ఉంటుంది. కాని ఒక వర్ణము వాడు అనేక వృత్తులను చేసిన అతనికి వ్యభిచార వృత్తి వస్తుంది. కాని ఈ వర్ణములు అనగా తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు లేక నీలము వర్ణముల వారు, వారు చేసే పనులను బట్టి, ఒకరి కన్నా మరొకరు తక్కువగా పరిగణించ బడతారు. ఇవి వృత్తిధర్మములు.

అన్ని ధర్మములలోకల్లా సత్యము ఉత్కృష్టమైనది. సత్యమే బ్రహ్మము, సత్యమే

తపము, సత్యం ప్రజలను సృష్టిస్తుంది. సత్యం వలననే ఈ సృష్టి నిలిచి ఉంది. కాని ఈ సత్యము అసత్యము చేత మరుగున పడిపోతుంది. ఈ సత్యము, అసత్యము లకు అర్ధము లుగా ధర్మము-- అధర్మము, చీకటి-- ప్రకాశము, జ్ఞానము-- అజ్ఞానము, స్వర్గము-- నరకము, సుఖము-- దుఃఖములు అని ఈ లోకంలో పెద్దల చేత చెప్పబడతాయి. కాబట్టి అసత్యము దుఃఖ స్వరూపము. దానిని నిర్మూలించడానికి పెద్దలు ఎల్లప్పుడూ నియమ నిష్టలతో జీవితం గడుపు తుంటారు.

బాధలు రెండు విధములు. వ్యాధి, ముసలి తనము-- ఇవి శరీరానికి వచ్చే బాధలు. రెండరకం బాధ -- దగ్గర బంధువుల మరణం వలన కలిగేవి మానసికమైన బాధలు. ఈ రెండు రకముల బాధలను మానవుడు నియమ నిష్టలతో అధిగమించి సుఖపడవచ్చును. పైన చెప్పిన శారీరక, మానసిక బాధల వలన కలిగే సుఖదుఃఖములకు లోను కాకుండా స్థిర చిత్తుడైన మానవుడు వైరాగ్యంతో పరమపదమును పొందుతాడు.౯ అని భృగువు భరద్వాజునకు వివరించాడు.

తరువాత భరద్వాజుడు భృగు మహర్షిని ఆశ్రమ ధర్మములు గురించి వివరించమని అడిగాడు. భృగువు ఈ విధంగా చెప్పసాగాడు.

౯ఓ భరద్వాజా! బ్రహ్మచారి లక్షణములు వివరిస్తాను. బ్రహ్మచారి ఐన వాడు గురువు నందు భక్తి కలిగి,పరమ ఆదరముతో వేదాధ్యయనము చేస్తూ, శుచిత్వంతో, వినయంతో, మూడు వేళలలో హోమములు చేస్తూ, బ్రహ్మచర్యము పాటించాలి. ఇంక గృహస్థు, ధనమును ధాన్యమును ధర్మబద్ధంగా సంపాదించాలి. అతిధి సత్కారములు చెయ్యాలి. అన్నపానములు మొదలగు భోగములు పరిమితంగా అనుభవించాలి. అది గృహస్థాశ్రమ ధర్మము. ఇంక వానప్రస్థములో కంద మూలములు, ఆకులు, ఫలములు భుజించాలి. నేలమీద పడుకోవాలి. ఇంక ఆఖరుది సన్యాసము. భిక్షాటన చేసి, దొరికిన దానిని తింటూ ప్రశాంతంగా

జీవించడమే సన్యాసము.  ఈ నాలుగు ఆశ్రమ ధర్మములను ఫలాపేక్ష లేకుండా నిర్వర్తిస్తే మోక్షపదము తప్పకుండాలభిస్తుంది.” అని చెప్పాడు భృగువు.

“ఓ మహర్షి! పరలోకము అని ఒకటి ఉంది అంటారు కదా! ఇహ లోకమునకు పరలోకమునకు భేదం ఎట్టిది వివరించండి” అని అడిగాడు భరద్వాజుడు. భృగువు ఇలా చెప్పసాగాడు.

“ఇహ లోక సుఖములకు పరలోకసుఖములకు ఏనుగుకు, దోమకు ఉన్న భేదము ఉంది.  ఈ లోకంలో మనిషి సుఖములకు ఆలవాలమైనవి...  ఇళ్లు, మంచములు, పడకలు, సింహాసనములు, మంచి మంచి దుస్తులు, సుగంధ ద్రవ్యములు, పూలు, సంగీతము, నాట్యము, మొదలగు వినోదములు, ఆరామములు, స్త్రీజనములు వీటిలో ఒకదానికి ఒకటి తర తమ బేధములు కనిపిస్తాయి. కాని పరలోకసుఖముల్లో ఇలాంటి తారతమ్యములు లేవు.

కాని పాప చింతన కలవారు అధోలోకములకు(నరకానికి) పోతారు. అక్కడ నిరంతర దుఃఖమే గాని సుఖము ఉండదు. విషయ వాంఛల మీద మమకారము లేని వారికి పుణ్యమైనా పాపమైనా వారిని అంటదు. వారు శాశ్వతానందమును పొందుతారు.” అని భృగువు భరద్వాజునకు చెప్పాడు. ఆ సమాధానములతో సంతృప్తి నొంది భరద్వాజుడు వెళ్లిపోయాడు” అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

అప్పుడు ధర్మరాజు “పితామహా! ఆచారవిధులను గురించి తెలుసుకొన వలెనని ఉన్నది అని అడిగాడు.

“ధర్మనందనా! చెడు ప్రవర్తనా మంచి వాళ్లను, చెడ్డ వాళ్లను బాధ పెడుతుంది. కాబట్టి మంచి ప్రవర్తన కలిగిండటం శ్రేయోదాయకము. రాజ మార్గములోనూ,

రచ్చ బండదగ్గర, పశువులు ఉన్న చోట మలమూత్ర విసర్జన చేయడం పనికిరాదు. ఇవి చెడ్డ పనులు. ఉదయం సాయంత్రం నదిలో స్నానం చేసి సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడం, అసుర సంధ్య వేళలలో నిద్రపోకపోవడం, స్నానము, సంధ్యా వందనము చేసిన తరువాత భోజనము చేయడం, తినే అన్నమును నిందించ కుండా పూజించడం, తడి కాళ్లతో నిద్రపోకపోవడం ఇవి మంచి ఆచారములు.

ఉదయించే సూర్యుడిని చూడరాదు. ఇతర స్త్రీలను వివస్త్రలుగా చూడరాదు. తన మలమును తాను చూడకూడదు. చేసిన పాపం చెబితే పోతుంది. అందుకని చేసిన పాపం దాచి పెట్టకూడదు. స్త్రీతో సంభోగించడం చాలా గుప్తంగా చెయ్యాలి. గురువులకు శుశ్రూషచెయ్యడం, బ్రాహ్మణులను పూజించడం మనిషిఆయువును వృద్ధి చేస్తుంది. లక్ష్మీ కటాక్షము కలిగిస్తుంది. ఊర్ధ్వ లోక ప్రాప్తి కలిగిస్తుంది.ౘ అని చెప్పాడు భీష్ముడు.

ౘపితామహా! ఆధ్యాత్మ విద్య గురించి వినవలెనని కుతూహలముగా ఉన్నది. చెప్పండి.ౘఅని అడిగాడు.

ౘకుమారా! మానవునిలో భూమి, నీరు, ఆకాశము, వెలుగు, గాలి అను పంచభూతములు వాటి గుణములైన శబ్దము, రసము, గంధము, చలనము, తేజస్సు, సముద్రములలో కెరటముల వలె పుడుతూ ఉంటాయి, అంతమవుతూ ఉంటాయి. ఇంద్రియములు పంచభూతములకు సాధనములుగా ఉపయోగ పడతాయి. మనస్సు అనేది ఇంద్రియములకు ఆధారంగా ఉంటుంది. బుద్ధి అనేది మనసు ఒక నిర్ణయానికి రావడానికి తోడ్పడుతుంది. ఈ విధంగా పురుషుడు విషయములను గ్రహిస్తూ ఉంటాడు.

అలా కాకుండా, పురుషుడు ఇంద్రియములను బాహ్యవిషయ ములలో

కాకుండా అంతర్ముఖంగా చేసి, మనసును కట్టడిచేసి, బుద్ధితో విషయ వాంఛలను దూరం చెయ్యవచ్చు. ఈ ఆత్మ, క్షేత్రజ్ఞుడు అనీ, భూతాత్ముడనీ, పురుషుడు అనీ, పరమేశ్వరుడు అనీ, బుద్ధిసాక్షి అనీ, జనన రహితుడు అనీ పిలువబడు తుంటాడు. పురుషుడు తనయందు తోచు విషయములను అనుభవంతో తెలుసుకుంటాడు. కాని అవి అన్ని మాయ అనీ, స్వప్నములో మాదిరి కనపడి మాయమవుతుంటాయని, అంతా మిధ్య అని, ఈ మాయ కారణం గానే ఆత్మను తెలుసుకోలేక పోతున్నాడని, తెలియక మోసపోతుంటాడు. మాయ అంటే, తెలియక పోవడం. ఈ సత్త్వ రజస్తమోగుణములు ఆ మాయకు శరీరం వంటివి. కాబట్టి రజస్తమోగుణములను విడిచి పెట్టి సత్త్వగుణమును పెంపొందించు కుంటూ జ్ఞానవంతుడై మెలగాలి. తుదకు ఆ సత్త్వగుణమును కూడా వదిలి పెట్టి ఆత్మను పరమాత్మలో ఐక్యం చెయ్యాలి.

సత్త్వగుణము ఎల్లప్పుడూ సుఖదాయకము. రజోగుణము దుఃఖ మయము. తమోగుణము బుద్ధిమాంద్యము కలిగిస్తుంది. ఈ మూడు గుణములలో లీనం కాకుండా ఉండటమే మాయను పారద్రోలడం.

ధర్మజా! ఇంక యోగము గురించి చెబుతాను విను. ఎల్లప్పుడూ మనస్సును నిశ్చలంగా ఏకాగ్రతతో ఉంచుకోవాలి. మేఘములలో మెరుపు తీగవలె, తామరాకు మీద నీటిబొట్టు వలె మనస్సు ఎల్లప్పుడూ చలిస్తూ ఉంటుంది. మనస్సుకు ఉచ్ఛ్వాస నిశ్వాసములు గతి. కాబట్టి వాటిని ఒక క్రమ పద్ధతిలో నిరోధించాలి. వాటిని నిరోధించడం కష్టమే. కాని ఆయాసపడకుండా, కష్టపడకుండా సాధనతో నిరోధించాలి. యమ, నియమాదులను అభ్యసించాలి. ఆప్రకారంగా వాయు నిరోధం చేసే ప్రక్రియలో ముందు మనలోని ఆలోచనలు క్రమ క్రమేణా సన్నగిల్లి, ఆగిపోతాయి. శ్వాస క్రమబద్ధంగా ఉంటుంది. మన శ్వాస శరీరములోని అంతర్నాడి లోనుండి ప్రయాణం చేసి బ్రహ్మపదము చేరుతుంది. మనస్సు ప్రశాంతంగా

ఉంటుంది. తరువాత నిశ్చలమైన ఆనందం కలుగుతుంది.” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! నాకు జపము ఏ విధంగా చెయ్యాలి. జపము చేసినవారికి కలుగు ఉత్తమ గతులేవి తెలుపండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! ఈ విషయం గురించి పూర్వము యమునికి, మృత్యు దేవతకు, కాలమునకు, ఒక బ్రాహ్మణుడికి, ఇక్ష్వాకులకు జరిగిన సంవాదము గురించి చెప్పెదను, శ్రద్ధగా విను. వేదవిదులైన వారు ఆమోదించినది ఈ జప కర్మ. ఈ జపము చేయు వారు అత్యంత శుచిగా, ఒక సమతల ప్రదేశములో ఒక దర్భాసనము మీద కూర్చోవాలి. ధర్భలు చేతిలో పట్టుకోవాలి. మనస్సు ను నిగ్రహించాలి. ఇంద్రియములు విషయాసక్తములు కాకుండా నిరోధించాలి. మనసు లోనుంచి మత్సరము, అహంకారము, దంభము, మానము మొదలగునవి తొలగించాలి. బ్రహ్మ చర్యమును పాటించాలి. ఈ విధంగా జప కర్మను చేయు పురుషుడు సర్వలోకములలో విజయము సాధిస్తాడు. తుదకు మోక్షమును పొందుతాడు. అలా కాకుండా జప కర్మను శుచిగా కాకుండా, దుర్గుణములతో, నీచమైన ఆలోచనలతో, మనస్సు నిశ్చలంగా లేకుండా ఆచరిస్తే ముక్తి రాదు సరిగదా వాడు నరకానికి పోతాడు.

పూర్వము వేద వేదాంగ పారంగతుడైన కౌశికుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు అత్యంత నిష్టతో సావిత్రీ దేవిని గూర్చి జపం చేసాడు. అతని నిష్టపూర్వక జపమునకు మెచ్చి అతనికి సావిత్రీ దేవి ప్రత్యక్షం అయింది. ఏమి కావాలో కోరుకోమని అడిగింది. దానికి కౌశికుడు తనకు తాను చేసే జపంలో నిష్ట కావాలని కోరాడు. సావిత్రీదేవి అతని కి కోరిన వరం ఇచ్చింది.

“ ఓ కౌశికా! నీకు ఉత్తమ గతులు కలుగుతాయి. యముడు, కాలము, మృ

త్యువు నీ వద్దకు వచ్చి నీతో మాట్లాడుతారు.” అని చెప్పివెళ్లిపోయింది.

ఆ కౌశికుడు జప తత్పరుడై నూరు సంవత్సరములు గడిపాడు. అతని జపమునకు తృప్తి చెంది ధర్మదేవత అతని ముందు సాక్షాత్కరించింది.

“కౌశికా ! నీ జపము సిద్ధించినది. నీవు సిద్ధి పొందావు. నీవు ఈ శరీరమును విడిచిపెట్టి పుణ్యాలోకములకు వెళ్లు.” అని పలికింది. దానికి కౌశికుడు ఇలా అన్నాడు. “ధర్మదేవతా! నేను చేసే తపస్సుకు నాకు ఈ దేహము అవసరము. కాబట్టి దుఃఖమునకు ఐనా ఓర్చుకుంటాను కానీ పుణ్యాలోకముల కొరకు ఈ దేహమును విడిచి పెట్టను.” అని అన్నాడు.

“అదేమిటి కౌశికా! ఎప్పటికన్నా ఈ దేహము వదలవలసిందే కదా! పుణ్యా లోకములు వదిలిపెట్టి ఈ దేహమును ఎందుకుకోరుకుంటున్నావు” అని అడిగింది ధర్మదేవత.

“ ఏది ఏమైనా కానీ నా తపస్సుకు ఆలంబనం గా ఉన్న ఈ దేహమును నేను విడిచిపెట్టను” అని అన్నాడుకౌశికుడు .

“నిన్ను పుణ్యాలోకములకు తీసుకుపోవడానికి మృత్యువు, యముడు, కాలము వచ్చి ఉన్నారు చూడు.” అని పలికింది ధర్మదేవత.

అప్పుడు మృత్యువు, యముడు, కాల పురుషుడు వచ్చి తమను తాము పరిచయం చేసుకున్నారు. “నువ్వు చేసిన జపము ఫలించింది.” అని యముడు అన్నాడు. “నీకు పుణ్యాలోకములకు పోవు కాలము సమీపించినది” అని కాలపురుషుడు అన్నాడు. “కాలపురుషుని ఆదేశము మేరకు నిన్ను తీసుకొని

పోవడానికి నేను వచ్చాను" అని అన్నాడు మృత్యువు.

వారి మాటలు పెడ చెవిని పెట్టిన కౌశికుడు "మీరు అడిగినది తప్ప మీకు ఏమి పని చేయగలను." అని అడిగాడు.

ఆ సమయంలో అక్కడకు తీర్థయాత్రలు చేస్తూ ఇక్ష్వాకుడు అక్కడకు వచ్చాడు. వారందరకూ ప్రణామాలు చేసాడు. తన ఆశ్రమమునకు వచ్చిన ఇక్ష్వాకుని కౌశికుడు అతిధి గా గౌరవించాడు.

"మహారాజా! నాకు ఉన్న దాంట్లో నీకు ఏవిధంగా అతిధి సత్కారములు చేయగలను." అని అడిగాడు. "మహాత్మా! మేము క్షత్రియులము. దానాలు చేస్తాము కాని తీసుకోము. నీకు ఏమి కావాలో అడుగు" అని అన్నాడు ఇక్ష్వాకుడు.

"ఈ లోకంలో ప్రవర్తించేవాళ్లకు దానాలు కావాలి గాని ఈ లోకం తో పనిలేని నాకు, ఏ కోరికలు లేని నాకు, నీ దానములు ఎందుకు. నీవు నా అతిధివి. నీవే అడుగు నీకేం కావాలో నేను ఇస్తాను. అయినా నీవు నా అతిధివి. నేను నీకు అతిధి సత్కార రూపంలో ఇస్తున్నాను. దానంగా కాదు." అని అన్నాడు కౌశికుడు.

"అయితే నీకు అంతగా ఇవ్వాలని కోరికగా ఉంటే. నీవు చేసిన జపముతో కలిగిన ఫలమును నాకు ఇమ్ము." అని అడిగాడు ఇక్ష్వాకుడు. "అలాగే. నీకు నేను చేసిన జపఫలములో సగం కావాలన్నా ఇస్తాను. పూర్తి గా కావాలన్న ఇస్తాను. నీకు ఎంత కావాలి?" అనిఅడిగాడు కౌశికుడు.

"ఇంతకూ నీ జపము యొక్క ఫలము ఏమిటి?" అని అడిగాడు ఇక్ష్వాకుడు. కౌశికుడు నవ్వి "నేను ఈ జపమును ఏ ఫలితమును ఆశించి చెయ్యలేదు. కాబట్టి

దాని ఫలము ఏమిటో నాకు తెలియదు.ఽ అని అన్నాడు. ఽముందు నీవునా జప ఫలమును స్వీకరించి తర్వాత దాని ఫలితము ఏమిటో ధర్మవిదులను అడిగి తెలుసుకోఽ అని అన్నాడు కౌశికుడు.

ఽఅదేమిటి కౌశికా! ఫలము ఏమిటో తెలియకుండా నేను దానం ఎలా తీసు కుంటాను. నాకు వద్దుఽ అని అన్నాడు ఇక్ష్వాకుడు. ఽఓ భూ వల్లభా! నీవు అడిగావు. నేను ఇచ్చాను. ఇప్పుడు నువ్వు వద్దు అనడం నీకూ నాకూ సత్య వ్రతమునకు భంగం కాదా!ఽ అని అన్నాడు కౌశికుడు.

దానికి ఇక్ష్వాకుడు నవ్వి ఽ మేము క్షత్రియులము. మాకు యుద్ధము చేయడం క్షత్రియ ధర్మము. నీతో వాక్ రూపంలో యుద్ధం చేసాను.ఽ అని అన్నాడు ఽమహారాజా! నీవు ఏమి చేసావో, ఏమి చెయ్యలేదో, అది అలా ఉండనీ. నేను నా జపమును నీకు ఇస్తాను అన్నాను. నీవు తీసుకుంటాను అని అన్నావు. ఇప్పుడు వద్దు అంటున్నావు. దీని వలన క్షత్రియుడ వైన నీకు, బ్రాహ్మణుడ నైన నాకూ సత్యవ్రతమునకు భంగం వాటిల్లుతుంది కదా! ఇది ధర్మమా! రాజా! సత్యవ్రతమే తపస్సు. సత్యమే యజ్ఞము. సత్యమే వేదము, శాంతి, ఇంద్రియ నిగ్రహము. ఆ సత్యవ్రతమునకు భంగం వాటిల్లితే నేను నిర్మల చిత్తంతో చేసిన నిత్య అను ష్ఠానములు ఫలితం లేకుండా పోతాయి కదా!ఽ అని అన్నాడు.

వీరి వాదనను ఆసక్తితో వింటున్న ధర్మదేవత వారిని ఇద్దరినీ చూచి ఇలా అంది. ఽమీలో మీకు వివాదం ఎందుకు. కౌశికుడు దానము ఇచ్చిన ఫలమును, ఇక్ష్వాకుడు సత్యవ్రతమును పాటించిన ఫలమును పొందుతారు.ఽ అని అన్నాడు.

అప్పుడు పుణ్యలోకము మానవాకృతి దాల్చి వచ్చింది. తనను తాను తెలుపుకొని ఽఅయ్యా మీరు ఇద్దరూ వాదులాడు కోవడం ఎందుకు? మీ ఇద్ద రూ సమాన మైన ఫలితమును పొందుతారు. ఈ ప్రకారం చెయ్యండి.ఽ అని అన్నాడు.

“అయితే ఈ బ్రాహ్మణుడు కూడా నేను ఇచ్చేది స్వీకరించాలి.” అని పట్టు బట్టాడు ఇక్ష్వాకుడు.

“అయ్యా! నేను తపస్సు, స్వాధ్యాయము వీటిలో నిమగ్నమై ఉన్నాను. నాకు ఏదీ అక్కరలేదు. నేను ఏదీ స్వీకరించను” అని అన్నాడు.

“విప్రోత్తమా! నీకు సరిపోయేది నేను ఇస్తాను. నేను చేసిన సుకృతముల యొక్క ఫలమును ఇస్తున్నాను. తీసుకో” అని అన్నాడు ఇక్ష్వాకుడు.

ఇంతలో వికృత మైన వేషములతో ఉన్న ఇద్దరు తమలో తాము తగవులాడు కుంటూ అక్కడకు వచ్చారు.

“ ఈయనే మన మహారాజు” అని ఆయన ముందు నిలబడ్డారు.

రాజు వారితో “ఇంతకూ మీ వాదులాట ఏమిటి?” అని అడిగాడు.

అందులో మొదటి వాడు “అయ్యా! నేను గోదానం చేసాను. ఇతడు ఆ గోదానఫలమును తనకు ఇమ్మని అడిగాడు. నేను చేసిన గోదాన ఫలమును ఇతనికి ఇచ్చాను. ఇతడు నాకు ఇది చాలదు అని అన్నాడు. మంచి జాతి ఆవులను రెండింటిని కొన్నాడు. ఆ ఆవులను అర్హుడైన వానికి దానంగా ఇచ్చాడు. ఆ గోదాన ఫలమును నాకు దానంగా ఇస్తాను అన్నాడు. మొదట్లో తీసుకుంటాను అని అన్నాను. కానీ నాకు ఇష్టంలేదు. అందువల్ల ఆ దానము నేను తీసుకోలేదు. మా ఇద్దరికీ ఆ మూలంగా వాదులాట జరిగింది. మీరే చెప్పండి. నాకు ఇష్టం లేని దానాన్ని తీసుకొమ్మని నన్ను బలవంతం చేస్తున్నాడు. ఇది ధర్మమా! మీరే తీర్పు

చెప్పండి.” అని అడిగాడు.

“దానికి రెండవ వాడు అయ్యా! ఇతను ఇచ్చిన దానము నేను స్వీకరించాను. కాని నేను ఇస్తానన్న దానమును ముందు స్వీకరిస్తాను అని తరువాత ఇతను స్వీకరించడం లేదు. ఇది పాపం కాదా! మాట తప్పడం కాదా! మీరే చెప్పండి!” అని అన్నాడు.

వారి వాదములు విన్న కౌశికుడు ఇక్ష్వాకుని చూచి “విన్నారా మహారాజా! వీరి వాదనలు. వీరి తగవు కూడా మనలాంటిదే. నీవు దానం అడిగావు. నేను ఇస్తాను అన్నాను కాని నేను ఇస్తానన్న దానము స్వీకరించ డానికి విముఖత చూపుతున్నావు. నీవు నా జపము ఫలమును స్వీకరించక పోతే నేను శపిస్తాను.” అన్నాడు కౌశికుడు.

“ఇదెక్కడి ఖర్మ. ఎన్నడూ ఎవరి ముందు చెయ్యి చాచి ఎరగను. ఇతని వద్ద నుండి దానం తీసుకొనవలసి వచ్చింది.” అని అనుకుంటూ దానం గ్రహించడానికి చెయ్యి చాచాడు.

అప్పుడు కౌశికుడు “నేను అనేక సంవత్సరములనుండి చేసిన జపము వలన లభించిన ఫలము నంతయు నీకు ధారపోస్తున్నాను.” అని ఇక్ష్వాకుని చేతిలో నీళ్లువదిలాడు.

అప్పుడు ఇక్ష్వాకుడు కౌశికుని చూచి “బ్రాహ్మణోత్తమా! నీవు ఇచ్చిన దానమును నేను తీసుకున్నాను. నేను ఆర్జించిన యాగ ఫలము నీకు ధారపోస్తాను. స్వీకరించు. అప్పుడు మనకు సమానంగా పుణ్య ఫలం దక్కుతుంది.” అని అన్నాడు.

అప్పుడు అక్కడ ఉన్న ఇద్దరు మనుషులు వారిని చూచి “అయ్యా మేము కామము, క్రోధము. మానుష రూపములలో వచ్చాము, ధర్మదేవత చేతను, యముని చేతను, మా చేతను మీరు పరీక్షింపబడ్డారు. ఇంక ఇవ్వడం తీసుకోడం దైవనిర్ణయాలు. మీ చేతిలో లేవు” అని పలికారు.

అప్పుడు కౌశికుడు ఇక్ష్వాకును చూచి “మహారాజా! నేను చేయు జపమునకు అధిష్ఠాన దేవత సావిత్రీదేవి. ఆమెనుండి నేను శ్రద్ధను, బలమును పొందాను. ఇంక నేను వేరు జపతపములు చేయ పనిలేదు. నీవు అందరి ఎదుట నేను ఇచ్చిన దానమును స్వీకరించావు. నాకు అవసరం ఉన్నా లేకపోయిన నేను నీ నుండి నీ పుణ్యఫలమును స్వీకరించాను. ఇంక నీ దారిన నీవు వెళ్లు.” అని అన్నాడు.

కౌశికుని, ఇక్ష్వాకుని ధర్మనిష్టకు సంతోషించి దేవతలు వారి మీద పుష్పవృష్టి కురిపించారు. దేవ దుందుభులు మ్రోగుచుండగా దేవతలు అక్కడికి వచ్చి వారిరువురినీ అభినందించారు. అప్పుడు ఆకాశ వాణి ఇలా పలికింది. “అనఘులారా! మీరిద్దరూ సిద్ధి పొందారు. మీకు ఉత్తమ గతులు కలుగుతాయి.” అని పలికింది.

అప్పుడు కౌశికుడు భవబంధాలు తెంచుకున్నాడు. తనవద్దకు వచ్చిన ధర్మదేవత, యముడు, మృత్యుదేవత, కాలపురుషునికి వీడ్కోలు పలికాడు. మనస్సును నియంత్రించాడు. తన శరీరములోని ప్రాణ వాయువులను కనుబొమల మధ్య నిలిపాడు. తరువాత ఆ వాయువులను తల పైభాగమున ఉన్న బ్రహ్మ రంధ్రము వద్దకు చేర్చాడు. నిశ్చలంగా కూర్చున్నాడు. ఈ శరీరాన్ని విడిచి పెట్టాడు. అతని ప్రాణ వాయువులు బ్రహ్మ రంధ్రమును ఛేదించుకొని అనంత వాయువుల్లో కలిసిపోయాయి. అతని లోనుండి ఒక ఉజ్వలమైన కాంతి వెలువడింది. ఆ కాంతికి బ్రహ్మదేవుడు ఎదురు వచ్చి స్వాగతం పలికాడు.

అపుడు బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు. ౯ నిష్టతో జపం చేసేవారికి, యోగులకు, వారి వారి పుణ్యవిశేషమున ఉత్తమగతులు కలుగుతాయి. అందులో నిష్టతో జపం చేసేవారు తమకు గా తాము ఈ శరీరం నుండి వెలువడి ఉత్తమ లోకములకు వెళతారు. కౌశికా! రా౯ అని పిలిచాడు.

తన శరీరములోని బ్రహ్మ రంధ్రమునుండి బయటకు వచ్చిన కౌశికుని ఆత్మ, ముందు బ్రహ్మ దేవుని ముఖంలోకి ప్రవేశించింది. బ్రహ్మలో ఐక్యమయింది.. తరువాత ఇక్ష్వాకు మహా రాజుకూడా తనకు తానుగా తన శరీరమును విడిచి బ్రహ్మదేవునిలో ఐక్యమయ్యాడు. ఇది అంతా చూచి దేవతలు ఆశ్చర్యపోయారు. కౌశికుని, ఇక్ష్వాకు మహారాజును పొగిడారు.

౯ కాబట్టి ధర్మనందనా! నిష్టతో జపం చేసేవారికి కౌశికుని మాదిరి బ్రహ్మ ఐక్యము కలుగుతుంది.౯ అని చెప్పాడు.

౯పితా మహా! నాకు అన్ని యోగములలోకి మిన్న అయిన జ్ఞానయోగమును గురించి వినవలెనని కుతూహలముగా ఉన్నది.౯ అని అడిగాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజుడు మనువు, బృహస్పతి సంవాదము వినిపించాడు.

౯ధర్మ నందనా! మనువు, దేవ గురువు అయిన బృహస్పతికి నమస్కరించి తనకు జ్ఞాన యోగము గురించి వివరించమని అడిగాడు. అప్పుడు బృహస్పతి మనువుకు జ్ఞాన యోగము గురించి ఇలా ఉపదేశించాడు.

౯అనఘా! జ్ఞాన యోగమునకు మూలము సత్కర్మలను శ్రద్ధతో ఆచరించ డమే. తనకు ఇష్టమయినది పొందుటకు ఇష్టములేనిది విడిచి పెట్టుటకు మానవుడు

కర్మలను ఆచరిస్తూ ఉంటాడు. ఆ కర్మాచరణములో మొదట సుఖం కలుగుతుంది. తరువాత అది దుఃఖంగా పరిణమిస్తుంది. కాని తాను చేసిన కర్మలకు ఫలాన్ని ఆశించకుండా ఎవరు కర్మలను చేస్తాడో అతనికి సుఖదుఃఖములు కలుగవు. కామక్రోధములు మొదలగు అరిషడ్వర్గములకు అతీతంగా ఉంటాడు. అప్పుడు అతనికి జ్ఞాన యోగం సిద్ధిస్తుంది. చివరకు మోక్షం పొందుతాడు.

పరతత్వము ఆధారము లేనిది. శబ్దరహితమైనది. రస, గంధ, స్పర్శ, రూపములు లేనిది. అందుకని అది ఇంద్రియ గోచరము కాదు. ఆ పరతత్త్వము నకు స్త్రీ పురుష నపుంసకత్వ బేధములేదు. అది జ్ఞానస్వరూపంగా వెలుగుతూ ఉంటుంది. దేదీప్యమానంగా వెలుగుతున్న దీపము తన చుట్టు ఉన్న వస్తువులను ప్రకాశింప చేయు నట్టు, ఈ జ్ఞానస్వరూపము మానవుని ఇంద్రియములను, మనస్సును ప్రకాశింపచేస్తుంది. ఇంద్రియములకు, మనసుకు పట్టిన జాడ్యములను వదిలిస్తుంది. రాజుకు మంత్రులు ఎలా కార్యనిర్వహణలో సాయ పడతారో, అలాగే ఈ జ్ఞానము ఇంద్రియములకు, మనస్సుకు అనుదినము చేయు పనులలో సాయపడుతుంది. చెట్టును మనము గొడ్డలితో నరికినా కూడా అందులో అగ్ని కనిపించదు. కాని ఆ చెట్టు కొమ్మలు ఒకదానితో ఒకటి రాసు కొన్నప్పుడు ఆ రాపిడికి అగ్నిపుడుతుంది. అలాగే మన శరీరంలో నిండి ఉన్న పరతత్త్వమును మరొక తత్త్వము సాయంతో గ్రహించాలి గాని ఈ శరీరాన్ని హింసించిగానీ, బాధపెట్టిగానీ కనుగొనలేము. మనము ఈ పరతత్త్వమును బాహ్య ఇంద్రియములతో గానీ, మనసుతో గానీ చూడలేము. అలాగని పర తత్త్వము లేదని చెప్పలేము గదా! ఎందుకంటే మన చూపు, వినికిడి శక్తి పరిమితములు. ఒక వస్తువును ముందుభాగం మాత్రం మనము చూడగలము. వెనుక భాగం చూడలేము. అంతమాత్రాన వెనుక భాగం లేకుండా పోతుందా!

మానవుడు మృగములను పట్టుకొనాలంటే వలను, చేపలను పట్టాలంటే

గాలమును, ఏనుగులను పట్టు కొనాలంటే పైన గడ్డిపరిచిన కందకమును ఉపయోగిస్తాడు. అలాగే ఈ పరతత్త్వమును పట్టుకొనాలంటే జ్ఞానమును ఉపయోగించాలి. పాము కాళ్లు మనకు కనిపించవు. కాని మరొక పాము ఆ విషయం గ్రహిస్తుంది. అలాగే జ్ఞాని మాత్రమే జ్ఞానస్వరూపమైన పరమ తత్త్వమును గ్రహించగలడు.

అమావాస్యనాడు మనకు చంద్రోదయము కాదు. అంత మాత్రాన చంద్రుడు లేడు, నాశనము అయ్యాడు అని అనగలమా! ఆ మాదిరి మనకు కనపడనంత మాత్రాన పరతత్త్వము లేదు అని అనగలమా! రాహువు మింగినపుడు మనకు సూర్యుడు కనిపించడు. రాహువు తొలగి పోగానే సూర్యుడు మనకు కనిపిస్తాడు. అలాగే మనలో ఉన్న పరతత్త్వమును అజ్ఞానము ఆవహించినపుడు అది మనకు కనిపించదు. ఆ అజ్ఞానము తొలగి పోగానే పరతత్త్వము మనకు కనిపిస్తుంది. కలుషితమైన నీటిలో మన ప్రతిబింబము కనిపించదు. అదే నిర్మలమైన నీటిలో మన ప్రతి బింబము స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే మలినమైన మనస్సుకు పరతత్త్వము గోచరము కాదు. మనసు ప్రసన్నంగా ఉంటేనే పరతత్త్వము కనిపిస్తుంది.

ఇంద్రియ ములు తమ ఇష్టం వచ్చినట్టు బయట ప్రపంచంలో తిరుగు తుంటాయి. దాని వలన దుఃఖము కలుగుతుంది. ఇంద్రియములను నిగ్రహించి నట్టయితే, నిరంతర సుఖముకలుగుతుంది. కాబట్టి మనము ఆత్మను ఈ అరిషడ్వర్గముల బారి నుండి రక్షించుకొనాలి. మనలో ఉన్న పాపములు నశించి నట్టయితే, మనకు జ్ఞానం కలుగుతుంది. మన మనస్సు మలినము లేని అద్దము వలె ప్రకాశిస్తుంటుంది. మనము ధ్యాన యోగము చేత మనస్సును మన వశంలో ఉంచుకొనాలి. దానిని విషయ వాంఛలకు లోను కాకుండా కట్టడిచేయాలి. సత్త్వ, రజస్, తమోగుణాలకు అతీతంగా ఉండి ఆత్మను పరమాత్మలో లీనం చెయ్యాలి.

అదే పరమ పదము. దానికి మించినది లేదు.

కాని జ్ఞానమును మాయ కప్పి ఉంచుతుంది. కాబట్టి ముందు మనము ఆ మాయను గురించి తెలుసుకొనాలి. మాయ ఇలా ఉంటుంది ఇలా ప్రవర్తిస్తుంది అని చెప్పలేము. పక్షులు ఎలా పోతాయో ఏ దిక్కుకు పోతాయో ఎలా చెప్పగలము. అలాగే మాయ గురించి కూడా చెప్పలేము. మాయకు పేరు ఆకారం లేదు. సత్త్వరజస్తమోగుణములే దాని ఆకారము. అది ఇలా ఉంటుంది అని తెలుసు కోబోతే అది కనపడదు. మాయ మనకు కనపడదు. ఇతరులకూ కనపడదు. మనము సత్త్వరజస్తమోగుణములను దూరంగా పెట్ట గలిగితే మాయ దానంతట అదే తొలగిపోతుంది.

ఈ సత్త్వరజస్తమో గుణములు మన ఆత్మను నిరంతరమూ ఆవరించి ఉంటాయి. ఆత్మను వాటి నుండి వేరు చెయ్యాలంటే వైరాగ్యము అనే కొడవలితో వాటిని పూర్తిగా కోసేయాలి. మణులు, మాణిక్యములు, బంగారు పూసలు, వెండి పూసలు, మట్టి పూసలు వీటిని అన్నింటిని ఒక తాడు హారము రూపంలో బంధించి ఉంచుతుంది. అలాగే ఈ ప్రాణకోటి అన్నింటి లోనూ ఆత్మ అంతర్లీనంగా ఉంటుంది. ఒకసారవంతమైన క్షేత్రములో అనేకానేకములైన ఓషధీ మొక్కలున్నట్టు ప్రాణులలో ఉన్న బుద్ధి అనేక కర్మలకు ఆధార మవుతుంది.

భూమి కంటే జలము, జలము కంటే తేజస్సు, తేజస్సు కంటే వాయువు, వాయువు కంటే ఆకాశము పెద్దది. కాని వీటన్నిటికంటే మనసు పెద్దది. మనస్సు కంటే బుద్ధి పెద్దది. పై చెప్పినవి అన్ని కాలమునకు లోబడి ఉంటాయి. ఆ కాలాన్ని శాసించే వాడు ఈ మూడు లోకములకు అధిపతి అయిన పరమాత్మ. ఆ పరమాత్మకు ఆది, మధ్య, అంతము లేవు. అతడు అవ్యయుడు. వేదములకు అధిపతి. భవబంధముల నుండి మనలను విముక్తి చేసేవాడు. ఆ పరమాత్మ

తలపునకు, పలుకునకు అందడు. మనం చేసే కర్మలకు గోచరం కాడు. ఎవరైతే ముందు మనస్సును, తరువాత బుద్ధిని తరువాత జ్ఞానమును క్రమ క్రమంగా అంతరింప చేసిన, అక్షరుడైన జ్ఞాన మయుడైన విష్ణువు లో సాయుజ్యము పొందు తాడు. ఈ పరతత్త్వము అమృతము (చావు లేనిది), అచ్యుతము ( క్షీణత లేనిది), అమలము ( ఎలాంటి మలినము అంటనిది), అమేయము (ఇంత అని చెప్ప వీలులేనిది), అవ్యయము (వ్యయము లేనిది అంటే నాశము లేనిది)., అనంతము (మొదలు చివర అంటూ లేనిది). ఆ పరతత్త్వమును యమ,నియమాదులతో మనస్సును నియంత్రించి, ప్రశాంత చిత్తముతోనే కనుగొనగలము.్ అని బృహస్పతి మనువుకు పరమాత్మ తత్త్వమును ఉపదేశించాడు.్ అని భీష్ముడు ధర్మరాజుకుచెప్పాడు.

్పితామహా! నాకు పరమాత్మస్వరూపుడైన శ్రీ కృష్ణుని తత్త్వమును గురించి తెలుసుకొనవలెనని ఉన్నది.్ అని అడిగాడు.

్ధర్మనందనా! నేను నారదుడు మొదలగు మహాఋషుల వలన వినిన విషయములు నీకు చెబుతాను. శ్రద్ధగా విను.

శ్రీ కృష్ణుడు ప్రభావంతుడైన విష్ణు స్వరూపము. తన వినోదము కొరకు భూమి, ఆకాశము, తేజస్సు, నీరు, వాయువు అను పంచభూతములను కల్పించాడు. ఆ ప్రకారము కల్పించిన జలములో ఒక భవ్యమైన తల్పము మీద పడుకున్నాడు. అతని నాభినుండి ఒక పద్మము ఆవిర్భవించింది. ఆ పద్మము లో నుండి బ్రహ్మ దేవుడు ఆవిర్భవించాడు. ఆ బ్రహ్మ సంకల్ప మాత్రం చేత ఏడుగురు మానస పుత్రులను సృష్టించాడు. వారు మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు. వారిలో మరీచికి కశ్యప ప్రజాపతి జన్మించాడు. కశ్యపుని వలన దేవతలు, రాక్షసులు, గరుడులు, నాగులు, మొదలగు జాతుల

వారు జన్మించారు. ఆ కశ్యప ప్రజాపతి కుమారుడు సూర్యుడు. అత్రి మహా మునికి చంద్రుడు పుట్టాడు. ఈ సూర్య చంద్రులు రాజవంశములకు మూలపురుషులయ్యారు. (శ్రీరాముడు మొదలగువారు సూర్యవంశపు రాజులు, పాండవులు,కౌరవులు చంద్రవంశపురాజులు). సూర్య వంశము, చంద్ర వంశపు రాజులు అనేకమంది ఈ దేశమును ఏలారు. దేశ కాల పరిస్థితులను బట్టి రాచ వంశములు అనేకములైన శాఖోపశాఖలుగా వర్ధిల్లాయి. ఆ రాజ వంశములు తమలో తమకు ఉన్న విబేధముల వలన యుద్ధములు చేసుకున్నారు. ఆ యుద్ధముల కారణంగా విష్ణువు జనక్షయము చేస్తూ భూభారము తగ్గిస్తూ ఉన్నాడు.

ఆ దేవదేవుడు వాసుదేవ, సంకర్షణ,ప్రద్యుమ్న, అనిరుద్ధుడు అనే నాలుగు దివ్య రూపములతో దివ్య నామములతో వినోదించాడు.ౣ అని చెప్పి భీష్ముడు పక్కనే నిలబడి ఉన్న శ్రీ కృష్ణుని చూపించి ౣధర్మనందనా! ఈ దివ్య పురుషుని ఒక సామాన్య మానవునిగా చూడటం మన అజ్ఞానం. ఈ శ్రీ కృష్ణుడు భక్త పరాధీనుడు. తన కరుణా కటాక్ష వీక్షణముల ద్వారా తన భక్తు ల కోర్కెలు తీరుస్తూ ఉంటాడు.ౣ అని చెప్పాడు.

అప్పుడు ధర్మనందనుడు శ్రీ కృష్ణునికి భక్తితో నమస్కరించాడు.

ౣఓ పితామహా! ఎవ్వని తలుచుకుంటే మానవుడు పరమాత్మ సిద్ధి పొందు తాడు. ఏ ఉపాయంతో ఆ పరమాత్మ చింతన మానవునికి అలవడుతుంది. దయ చేసి చెప్పండి.ౣ అని ప్రార్థించాడు.

ౣధర్మనందనా! ఈ విషయం గురించి నేను పూర్వము నారదుని వలన వినిన తత్త్వమును నీకు ఉపదేశిస్తాను.ౣ అని భీష్ముడు మనసులో నారద మునీంద్రుని, అక్షరుడైన మహా విష్ణువును స్మరించుకొని ఇలా చెప్పసాగాడు.

ౣఒక సారి నారదుడు విష్ణుదేవుని స్మరించి ఇలా అడిగాడు. దేవదేవా!

మోక్షమును పొందగోరు జనాలు నిన్ను ఏ విధంగా తలుస్తారు. ఏ జపం చేస్తారు. నాకు తెలపండి అని అడిగాడు.  అప్పుడు విష్ణుదేవుడు నారదునితో ఇలా అన్నాడు.

“నారదా! నన్ను ధ్యానించ డానికి మూడు లక్షణాలు కలిగి ఉండాలి.మొదటిది పరమ భక్తి, రెండవది నిర్మలమైన శ్రద్ధ, మూడవది ఇంద్రియ నిగ్రహము. ఆ మూడు లక్షణములు విష్ణువును ధ్యానించడానికి ముఖ్యంగా ఉండాలి. కల్మషహృదయం లేని వాడికి పై మూడు లక్షణములు సులభంగా అలవడుతాయి. మనసులో ఉన్న కల్మషం పోవడానికి అనుక్షణం నన్ను స్మరించడం ఉత్తమమైన మార్గం.

ముందు ఓంకారంతో మొదలైన “నమః” అనే పదము దగ్గర, ఆరు గుణములతో కూడిన ఐశ్వర్య వాచకము, ఈశ్వర స్వభావాలను గూర్చి చెప్పే శబ్దములు ఒక క్రమంలో కూరిస్తే అది మంత్రం అవుతుంది. ఈ మంత్రమును మానవులు నిశ్చలమైన మనస్సుతో శ్రద్ధతో జపించాలి.తరువాత “అనుస్మృతి”ని పఠించాలి. దాని వలన మానవులకు ధర్మార్థ కామ మోక్షములు సిద్ధిస్తాయి.

తరువాత విష్ణువు నారదునికి అనుస్మృతి గురించి ఇలా చెప్పాడు.

అవ్యక్తుని, శాశ్వతుని, అఖిలప్రభవభూమిని, భక్తి వత్సలుడిని, విష్ణువును, పరమపురుషుని, అక్షయుని చేతులుజోడించి ఆశ్రయించెదను. పుండరీకాక్షుని, భువనసాక్షిని, నిత్యుని, పురాణ పురుషుని ప్రార్థిస్తాను. పరుని, సహస్రాక్షుని, అక్షరుని,లోకైకనాధుని, భవ్యుని కొలిచెదను.

భూతభవ్యభవత్ప్రభుని, సర్వతో ముఖుని, భూత సంప్రవర్తిని, అమృతుని, అచ్యుతుని, అనంతుని,హృషీకేశుని, రవిసహస్రనిభుని, హిరణ్యగర్భుని, అబ్జనాభుని, సత్యుని, ఆద్యంత రహితుని, భూగర్భుని, ప్రభువుని, భక్తిగమ్యుని, ధ్యానిస్తాను.

అచలుని, సూక్ష్ముని, వరేణ్యుని, సహస్రశీర్షుని, అభయకారుని, అశీర్షుని, నారాయణుని, సనాతనుని, యోగమూర్తిని, లోకాతిరిక్తుని, ధ్రువుని, ఈశ్వరుని, హరిని, భక్తితో కొలుస్తాను. ఈ చరాచర జగత్తుకు ఎవడు అధిపతో, ఎవని నాభినుండి పుట్టిన పద్మములో నుండి బ్రహ్మ ఉద్భవించాడో, ఈ జగములన్నియు ఎవ్వని వలన సృష్టింపబడ్డాయో, ఆ ముకుందుని నేను ఎల్లప్పుడూ కొలుస్తాను.

స్థావరములు (చలించనివి), జంగమములు (చలించేవి) బ్రహ్మ దేవుడు, మహా ప్రళయములో లయమైపోగా, ఎవ్వడు శాశ్వతంగా నిలిచి ఉంటాడో ఆ నిత్యసత్యస్వరూపుడు అయిన విష్ణువును నియమంతో కొలుస్తాను. కాల పురుషుడు, పర్జన్యుడు (మేఘములు), భూమి, పంటలు, మనం పనిచెయ్యడం, ఏపనీ చెయ్యకపోవడం, అన్నీ తానే అయి లీలలు చేసే ఆ వసుదేవ సుతుని నేను కీర్తిస్తాను.

ఎవ్వని వలన అగ్నికి, సూర్యునికి, చంద్రునికి, గ్రహములకు, నక్షత్రములకు, తేజస్సు కలుగుతుందో, ఆ స్వయం ప్రకాశకుని నేను కొలుస్తాను.

(ఇక్కడ ఒక పద్యం ఉంది.

నాలుగింటను వెండియు నాలుగింట, రెంట, ఐదింట మఱియును రెంట
వేల్చి యజ్ఞశీలు రారాధించునట్టి విష్ణు డిష్టదాయి ప్రసన్ను డయ్యెడునునాకు.
ఇదీ పద్యం. దీనికి మామూలు అర్థం చెప్పాలంటే నాలుగు అక్షరములతో, తరువాత రెండు అక్షరములతో, తరువాత ఐదు అక్షరములతో మరియు రెండు అక్షరములతో కూడిన మంత్రములతో యజ్ఞము చేసే యజ్ఞశీలురు ఆరాధించునట్టి విష్ణుమూర్తి, కోరినకోర్కెలు తీర్చేవాడు నాకు ప్రసన్నుడగుగాక అని అర్థం. కాని ఆ అక్షరాలు ఏమిటో తిక్కనగారు చెప్పలేదు. ఈ సందర్భంలో నేను మా గురువుగారిని సంప్రదించాను. వారి సాయంతో ఈ వివరణ ఇస్తున్నాను. వారికి నా కృతజ్ఞతలు.

ఈ పద్యమునకుమూలము కృష్ణయజుర్వేదము (తైత్తిరీయ సంహిత) ప్రథమ కాండ--షష్ఠప్రశ్న లో 11వ అనువాకము. ఈ మంత్రము ఇలా ఉంది.

“ఆశ్రావయేతి చతురక్షరమస్తు శ్రౌషడితి చతురక్షరం యజేతి ద్వ్యక్షరం యేయజామహ ఇతి పఞ్చాక్షరం ద్వ్యక్షరో వషట్కార ఏషవైసప్త దశః ప్రజాపతి.

పై మంత్రమునకు అర్థం.

ఆశ్రావయ ఇతి చతురక్షరం= యజ్ఞమునకు ఆధ్వర్యము వహించే అధ్వర్యువు ఆగ్నీధ్రుడికి “ఆశ్రావయ” (నాలుగు అక్షరములు)(యజ్ఞ కార్యమును “వినిపించు”) అని అన్నప్పుడు

అస్తు శ్రౌషట్ ఇతి చతురక్షరం= ఆగ్నీధ్రుడు “అస్తు శ్రౌషట్” (నాలుగు అక్షరములు) (“సరే వినండి”) అని అంటాడు.

యజ ఇతి ద్వ్యక్షరం= అప్పుడు అధ్యర్యుడు హోతలతో “యజ” (రెండు అక్షరములు) (యజ్ఞం చెయ్యండి) అని అంటాడు.

యేయజామహ ఇతి పఞ్చాక్షరం= “యే యజా మహే” (ఐదు అక్షరములు)అప్పుడు హోతలు యాజ్యలను చదువుతూ యజ్ఞాన్ని చేస్తారు.

ద్వ్యక్షరో వషట్కార= “వషట్” అని (రెండు అక్షరములు)

ఉచ్చరిస్తూ హవిస్సులను అగ్నిలో

అర్పిస్తారు.

ఏపఢ్ద్వై సప్త దశః ప్రజాపతిః=    ఈ 17 అక్షరములు ప్రజాపతి అంటారు.

యజ్ఞములలో పైన చెప్పిన కర్మకాండను జరిపి మంత్రములతో దేవతలను తృప్తిపరుస్తారు. విష్ణుదేవునికి ప్రియమైన మంత్రములను ఉచ్చరిస్తూ యజ్ఞములను చేస్తే వారు కోరినకోరికలు నెరవేరుతాయి. ఆ మంత్రములకు నిర్ణీతమైన సంఖ్యలో అక్షరములను నిర్దేశించారు. అవే ఈపద్యంలో చెప్పబడ్డాయి.

నాలుగింటను అంటే నాలుగు అక్షరములు కలిగిన మంత్రము. ఆశ్రావయ. మరలా నాలుగింట. అంటే మరలా నాలుగు అక్షరములు కలిగిన మంత్రము. అస్తుశ్రౌషట్. తరువాత రెండు అక్షరములు కలిగిన మంత్రము యజ. తరువాత మంత్రము ఐదు అక్షరములు కలవి. యే యజా మహే. మఱియు రెంట అంటే రెండక్షరముల మంత్రము వషట్. పై మంత్రములు విష్ణువుకు ప్రీతి అయిన మంత్రములు.)

ఇంకా విష్ణుమూర్తి యజ్ఞధరుడు. పంచయజ్ఞుడు అనగా పంచ యజ్ఞ స్వరూపుడు. (పంచ యజ్ఞములు..వేదపఠనము,వైశ్వదేవము,అతిథిపూజ, పితృ తర్పణము,భూతబలి). లక్ష్మీదేవికి నిలయమైన వాడు, యోగమునకు ఆధారమైనవాడు, వేయేల, ఈ జగత్తు సర్వమునకు ఇష్టమైన వాడు అయిన విష్ణుదేవుని నేను ఆశ్రయించెదను. అగముని అనగా నిశ్చలమైన వాడిని, పాంథుని అనగా ఎప్పుడూ నడుస్తూ ఉండేవాడిని, అఖిల జగద్ధరణ పరుని అనగా సకల లోకములను ధరించిన వానిని, నిరాకారుని, సాగరమంత పరిజ్ఞానము కలవానిని, ఐదు కాలముల గురించి ఎరిగిన వాడిని, అన్ని గుణములు తన యందే

కలవాడిని, ఏ గుణమూ లేని వాడిని, నేను భక్తితో కొలుస్తాను.

కంటికి కనిపించే వాటికి కారణమైన వాడిని, కంటికి కనిపించని వాటికి ఆవల ఉండే వాడిని, అత్యంత వాక్చాతుర్యము కల వానిని, భక్త పరాధీనుని, అన్ని శుభములు కలిగించేవాడిని నేను స్తుతి చేస్తాను. జ్ఞాన యోగములో, ధ్యానయోగములో నిమగ్నమైన వారు, జితేంద్రియులైన వారు ఎవనిని పొందితే మరలా పునర్జన్మ పొందరో అతని శరణు జొచ్చి నేను బతుకుతాను.

ఎవ్వడైతే ఈ సమస్త లోకములను తన అంశతో నిర్వహిస్తున్నాడో, ఆ దయాకరుని, ఆపద్మనాభుని నేను స్తుతిస్తాను. అయిదు రకములైన ఈ ప్రకృతిని తన ఐదుముఖములతో అనుభవించు క్షేత్రజ్ఞుని, సత్త్వ, రజస్తమోగుణములను లీలగా అనుభవించు మహానుభావుని, ఆత్మాను సంధానము చేసుకుంటాను. జ్ఞానులైన సాంఖ్యులు, యోగ పురుషులు ఎవ్వని సాక్షాత్కారం పొంది తిరిగి రాని లోకములు పొందుతారో, ఆ పరమాత్మను నేను తలుస్తాను. సూర్యుని లో లీనమై వెలుగుతూ, చంద్రుని లో ఉండికూడా ఆ చల్లదనానికి లోనుగాకుండా ప్రకాశించే ఆ అంతరాత్ముని నేను భజిస్తాను. సూర్యునితో, చంద్రునిలో, తారలలో నిత్యము సుస్థిరముగా నిలిచి ఉండే తేజోమయ తత్త్వమును నేను దర్శిస్తాను.

గుణములకు ఆది యైన వాడు, నిర్గుణములకు కూడా ఆదియైన వాడు, అసలు రూపమే లేని వాడు, లక్ష్మీమనోవల్లభుడు, అజుడు(పుట్టని వాడు), సూక్ష్ముడు(అత్యంత సూక్ష్మమైనవాడు), అంతటా నిండి ఉన్న వాడిని, నాకు ప్రసన్నుడయ్యేటట్టు ప్రణుతిస్తాను. ఎక్కడ చూచినా నీ తలలు, నీ కళ్లు, నీ ముఖములు కనపడే నిన్ను, నిర్మలుడివి, నిర్వికారుడివి, సర్వ సాక్షివి అయిన గోవిందుని నేను కొలుస్తాను.

ఓ నారాయణుడా! నిన్ను తెలుసుకుంటే గానీ ఈ సంసారమునుండి విముక్తి కలగదు. నీవేమో మా మనస్సుకు, ఇంద్రియములకు కనపడవు. ఇంక నేను ఏమనుకోవాలి.నాకు ఏది దిక్కు? సిద్ధులు, రోషము, కామము, రాగద్వేషములు వదిలి పెట్టి అత్యంత భక్తితో ఏకాగ్రచిత్తంతో తమ తమ మనస్సులలో నిన్ను నిలుపుకొని సేవిస్తారు. ఎవరైతే ఫలాపేక్ష లేకుండా కర్మలు చేస్తారో, ఆ కర్మఫలములను తమ జ్ఞానాగ్నిలో దగ్ధం చేస్తారో, ద్వంద్వములకు అతీతంగా జీవితం గడుపుతారో వారే నిన్ను కనుగొంటారు.

అన్ని దేహములలో నీవే ఉంటావు. కానీ నీకు ఒక దేహము అంటూ లేదు. అఖిల దేహములు నీవే. ద్వందాతీతులయిన యోగులను సదారక్షిస్తూ ఉంటావు. ఈ ప్రకృతి, బుద్ధి, అహంకారము, సమస్తభూతములు, ఇంద్రియములు అన్ని నీ వలననే ప్రకాశిస్తున్నాయి. నీ వలననే నడుస్తున్నాయి. పైన చెప్పిన వాటి అన్నింటిలో నీవు నిండి ఉన్నావు. ఈ సృష్టి సమస్తంలో నీవు ఉన్నావు. నీలోనే ఈ సమస్త సృష్టి ఒదిగి ఉన్నది. నీ మహిమ వలననే ఏకత్వములో భిన్నత్వము, అందులోనే అనేకత్వము ప్రకాశిస్తున్నాయి.

ఒకే దండలో అనేక మణులు దారముతో బంధింపబడి ఉన్నట్టు ఈ చరాచర జగత్తులో ఉన్న అన్ని భూతములలో నీవు ఉన్నావు. నీకు కారణము అంటూ లేదు. అంటే నీ పుట్టుకకు కారణము లేదు. అసలు పుట్టుకే లేదు. కాని అన్నింటికి కర్తవు, ఈ భూతకోటిని సృష్టించే వాడవు, అన్నిటిని భుజించే వాడివి నీవే. తత్త్వము, అతత్త్వము నీవే. ఈ చరాచర జగత్తులో ఉన్న అఖండ చైతన్యము నీవే. అందరిలో ఉన్న కూటస్థ చైతన్యము నీవే.

ఓ ముకుందా! నాకు ఒకరంటే ప్రియము, మరొకరంటే ద్వేషము లేదు. ఈ భూమిమీద ఉన్న అందరూ నాకు సమానమే. నాకు బుద్ధి, అహంకారము,

యుక్తి, సత్త్వ,రజస్తమోగుణములు లేవు. ఏ పనీ చెయ్యాలని లేదు. ధర్మాధర్మములు, ఇంద్రియ లోలత్వము, విషయ వాంఛలు లేవు. నాకు ఈ బాధ నుండి, మరణమునుండి మోక్షము ప్రసాదించు దేవా. నిన్నే శరణు వేడుతున్నాను. నా మీద కరుణ చూపించు. నా యొక్క జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను పంచభూతములలో కలిపి నన్ను కటాక్షించు.

గోవిందా! ఈ పంచభూతాత్మకమైన శరీరంలో ఉన్న జలము, జలము లోనూ, అగ్ని అగ్నిలోనూ, వాయువు వాయువులోనూ, ఆకాశతత్త్వము ఆకాశము లోనూ, చిత్తము చిత్తములోనూ, అహంకారము అహంకారములోనూ, కలిపి, ఈ వ్యక్తమయిన శరీరమును అవ్యక్తములోనికి చేర్చి, నాలో ఉన్న సత్త్వ, రజస్తమో గుణములను, అందుకు కారణభూతమైన తన్మాత్రలను నశింపచేసి, నాకు పరమ పదమును ప్రసాదించు దేవా. నన్ను నీలో ఐక్యము చేసుకో! ఈ లోకములోనికి రావడం పోవడం అనే రాకపోకల నుండి (జనన మరణ మనే చక్రము నుండి) నన్ను విముక్తుడిని చెయ్యి దేవా!

నేను హరి యందు, నా యందు హరి ఒకరిలో ఒకరం లీనమై ఉన్నాము. ఆ హరి మహిమ చేత మా ఇరువురికి నాశము లేదు. నాకు సతతమూ నిన్నుకొలిచే భక్తి భావము కలిగించు దేవా! నేను పూర్వ జన్మలలో చేసిన పుణ్యఫలములు నాకు చేరేట్టు చూడు. నేను వాటిని అనుభవించి ఋణవిముక్తుడనయ్యేదను. ఓ వాసుదేవా! నిను నేను ఎల్లప్పుడూ మనసులో తలుస్తాను. నీవుకూడా నన్ను నీ వాడుగా వాత్సల్యంతో కాపాడాలి.

వాసుదేవా! నన్ను మరిచిపోవద్దు సుమా! నిన్ను సదా నా యందే నిలుపుకుంటాను. అవ్యయుడవు, సనాతనుడవు, అగ్రాహ్యుడవు, చిన్మయుడవు అయిన నిన్ను పునరావృత్తిలేకుండా ఉండటానికి అనుదినమూ స్మరిస్తాను.

పరమాత్ముని, నారాయణుని, ఆది అంతము లేని వాడిని, భక్తసులభుడిని, షడ్గైశ్వైర్యములు కలవానిని, ఎల్లప్పుడూ నమస్క రిస్తాను. సర్వకాల సర్వావస్థల యందును నిన్ను విశిష్ట భక్తితో జపించిన వాడు సకలపాపములనుండి శాంతి పొందుతాడు. అవ్యయానంద పదవి పొందుతాడు.

అన్ని కల్మషములను ధ్వంసము చేసే ఈ విష్ణు అనుస్మృతిని, యజ్ఞము చేసేటప్పుడు,దానము చేసేటప్పుడు ఎవ్వడు పఠిస్తాడో వాడు ప్రాజ్ఞుడైనను, అజ్ఞానియైనను, తగిన ఫలమును శతాధికంగా(నూరింతలు) పొందుతాడు. ఈ అనుస్మృతిని దేవతా పూజలలోనూ, పితృకార్యములలోనూ, పరమ నిష్టతో చదువు తారో, అతనికి పుణ్యలోకములు కలుగుతాయి. అదే కాకుండా, ఈ అనుస్మృతిని అమావాస్య, పౌర్ణమి రోజులలో ఇతరులకు చదివి వినిపించిన, అతడికి సర్వ సంపదలు కలుగుతాయి. ఈ అనుస్మృతిని ఎవరన్నా చదువుతుంటే విని, భగవంతునికి నమస్కరిస్తే, అతడు అంటరాని వాడైనా, హీనకులజుడైనా, అతనికి ఉత్తమగతులు కలుగుతాయి. ఇంక ఉన్నత జాతుల గురించి చెప్పేది ఏముంది?౬ అని విష్ణు మూర్తి నారదునికి చెప్పాడు.

ఇంకా విష్ణుమూర్తి నారదునితో ఇలా అన్నాడు. ౬ఓ మునీంద్రా! మానవునికి కర్మఫలములన్ని అంతమయ్యేవే! తుదకు ముక్తి పొందుతాడు. అన్ని దానములకంటే జ్ఞాన దానము గొప్పది. ఒక జ్ఞాని మరొక అజ్ఞానికి జ్ఞానబోధ చేస్తే అది భూదానము కన్నా గొప్పది. కాబట్టి నారదా! నేను నీకు చెప్పిన ఈ జ్ఞానమును నీవు పరిశుద్ధ హృదయులకు అందరికీ బోధించు. పుణ్యాత్ము లందరికీ జ్ఞానమును ప్రసాదించు. ఓ నారదా! వేయి అశ్వమేధయాగములు చేసినా పొందలేని పరమ పదమును, నా యందు నిర్మలమైన భక్తితో మానవులు పొందగలరు.

౬ధర్మ నందనా! నారదునికి విష్ణువుస్వయంగా చెప్పిన విషయములన్ని నేను

నీకు చెప్పాను. నీవు కూడా నారదుని వలెనే ఆ పరమాత్ముని ఏకాగ్రచిత్తుడవై భక్తితో, శ్రద్ధతో భజించి కృతార్థుడవు కమ్ము. కోరిన వరములు ప్రసాదించే ఈ ౯అనుస్మృతి౯ ని జపించి నందువల్ల, పఠించి నందువల్ల, బుద్ధి పెరుగుతుంది. దుఃఖములు నశిస్తాయి. బంధములన్ని తొలగిపోతాయి. నిత్యము శుభం కలుగుతుంది.౯ అని చెప్పాడుభీష్ముడు.

అది శ్రద్ధతో విన్న ధర్మరాజు భీష్మునికి భక్తితో నమస్కరించాడు.

౯ పితామహా! నాకు మోక్ష మార్గమును ఉపదేశించు౯ అని కోరాడు.

౯ధర్మనందనా! వార్ష్ణేయ అధ్యాత్మము అను కథ ఒకటి ఉన్నది. అందులో నీకు తగిన సమాధానం దొరుకుతుంది. పూర్వము వార్ష్ణేయుడు అనే పేరుగల ఒక మాన్యుడైన మునీశ్వరుడు ఉండేవాడు. ఒక రోజు ఆ ముని సుఖాసీనుడై ఉండగా అతని శిష్యుడు గురువు గారి పాదములకు నమస్కరించి ౯గురువుగారూ! మీరునాకు మోక్షమార్గమును ఉపదేశించండి౯ అని అడిగాడు.

౯కుమారా! నీకు భక్తి, జ్ఞానముసమృద్ధిగా ఉన్నాయి. నీవు మోక్ష మార్గము ఉపదేశముపొందుటకు యోగ్యుడవు. కాబట్టి సావధానంగా విను. ఈ కాల చక్రము నిరంతరమూ తిరుగుతూ ఉంటుంది. ఇది ఎప్పుడు తిరగడం మొదలెట్టిందో తెలియదు. ఎప్పుడు ఆగి పోతుందో తెలియదు. ఈ కాలక్రమములోనే సృష్టి లయము నిరంతరమూ జరుగుతూ ఉంటాయి. ప్రళయ కాలంలో ఈ సృష్టిమొత్తం నాశనమవుతుంది. పరమాత్మ మాత్రం మిగిలి ఉంటాడు. తిరిగి సృష్టి ప్రారంభం అవుతుంది. అప్పుడు సమస్త భూతజాలము ఆవిర్భవిస్తుంది.

మునిపుంగవులు పరమాత్మ నుండి సర్వ వేదములు, సకల శాస్త్రములు

పొందుతారు. ఆ ప్రకారంగా వేదశాస్త్రములను పరమాత్మనుండి పొందిన తరువాత జ్ఞానులు లోకములోని జనులు ఆచరించుటకు న్యాయశాస్త్రము మొదలగు శాస్త్రములను, అనుష్ఠించ వలసిన ఆచారములను, వ్యవహారములను విశధీకరిస్తారు. ఈ శాస్త్ర పరిజ్ఞానము దేవతలకు, మునులకు దుర్లభము. ఆ పరమాత్మకు మాత్రమే ఈ పరిజ్ఞానము ఉంది. సకల దుఃఖములకు పరమ ఔషధమైన ఈ శాస్త్రపరి జ్ఞానము పరమాత్మ కరుణ వలన పొందారు. క్రమ క్రమంగా గురు శిష్య పరంపరగా ఆ శాస్త్ర పరిజ్ఞానము లోకములో విస్తరించింది. ప్రకృతి పురుషుల సమ్మేళనంతో చైతన్యం ఉద్భవించింది. ఆ చైతన్యం నుండి బుద్ధి ఉద్భవించింది. ఆ బుద్ధి నుండి అహంకారం పుట్టింది. ఆ అహంకారము చిత్తమును ఆశ్రయించి ఉంటుంది. ఈ అహంకారము నుండి ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి తేజస్సు, తేజస్సు నుండి జలము, జలము నుండి భూమి ఆవిర్భవించాయి.

పైన చెప్పిన బుద్ధి అనే దానిని మహతత్త్వము అని కూడా అంటారు. ఆ మహ తత్త్వము నుండి జ్ఞానేంద్రియములు ఐదు, కర్మేంద్రియములు ఐదు, వీటితో అనుభవించే శబ్ద,స్పర్శ, రూప,రస,గంధములు ఐదు, మనస్సు ఒకటి, మొత్తము పదహారు వికృతులు ఏర్పడ్డాయి. ఈ పదహారు వికృతులు పరమాత్మకు శరీరంగా భాసిల్లుతాయి. పరమాత్మ ఉనికికి సాధనములుగా ఉపకరిస్తాయి.

కుమారా! ఈ మానవ శరీరము తొమ్మిది ద్వారములతో నిర్మింప బడిన ఒక పుణ్యమైన నగరము. ఈ నగరంలో పరమాత్మ మనకు ఊహకందని రీతిలో వ్యాపించి ఉంటాడు. మన శరీరంలో ఉన్న ఆ పరమాత్మను పురుషుడు అంటారు. ( ఇది పురుషుడు, స్త్రీ అనే అర్థంలో కాదు. అన్ని జీవరాసులలో ఉండే పరమాత్మను పురుషుడు అంటారు). ఆ పురుషుడు అమరుడు (చావు లేని వాడు), అవ్యయుడు (నశించని వాడు),అజరుండు (జర అంటే ముసలితనము లేని వాడు), అమేయుడు (మొదలు తుది లేని వాడు, అమలస్వభావుడు (నిర్మలమైన

స్వభావము కలిగినవాడు). చెట్టు నందు అగ్ని దాగి ఉన్నట్టు, ఈ పురుషుడు మన శరీరంలో నిండి ఉంటాడు. ఎలాగైతే చెట్టు కొమ్మలు ఒకదానికి ఒకటి రాజుకుంటే నిప్పుపుట్టినట్టు, మానవుడు తననుతాను మధించుకుంటేనే గాని ఆ పురుషుడు కనిపించడు. ఆ పురుషతేజము యోగమధనంతో కనిపిస్తుంది. ఆ పురుషతేజము వలననే మనము వింటున్నాము, చూస్తున్నాము మొదలగుపనులు చేస్తున్నాము.

కుమారా! ఈ భూతకోటి అవ్యక్తము నుండి వ్యక్తమవుతున్నాయి ( పుడుతున్నాయి). పెరుగుతున్నాయి. నశిస్తున్నాయి. పుట్టడం,పెరగడం, నశించడం... వీటికి పురుషుడు సాక్షీభూతుడుగా ఉంటున్నాడు. (పురుషుడు పుట్టడు, పెరగడు, నశించడు. అవి అన్ని ఈ దేహానికే. ఆత్మకు కాదు అని భావము) కాలము ఒక చక్రము లాగా తిరుగుతూ ఉంటుంది. దానికి ఏడు అంచులు ఉన్నాయి. అవ్యక్తము దానికి కేంద్రము. 16 వికారములు దాని చుట్టు ఉన్న వలయములు. దాని మీద శాశ్వతమైన ఆత్మ అధిష్టించి ఉంటుంది. తత్త్వ దృష్టితో చేచినట్టయితే ఈ చరాచర జగత్తు ఈ కాలచక్రమునకు లోబడి ఉంటుంది. మానవుడు తన దైనందిన కార్యక్రములు నిర్వర్తించునపుడు సత్త్వ, రజస్తమో గుణములు ఆత్మను ఆవరిస్తూ ఉంటాయి. కాని విజ్ఞుడైన వాడు వాటికి లోబడక వివేకంతో సంచరిస్తాడు.

ఈ లోకంలో వేదాంత విదులు అరుదుగా ఉంటారు. వారు ప్రవృత్తి లక్షణములతో ధర్మాచరణము చేస్తుంటారు. మామూలు మానవులు నివృత్తి (ప్రాపంచిక) సుఖములలో మునిగి తేలుతుంటారు. అందువలన వారు పుణ్యాత్ములు కాలేరు. ఆర్యులైన వారు ప్రవృత్తి లక్షణములతో ఉన్న కార్యములను చేస్తూ కూడా, కామము, క్రోధము,భయము మొదలగు నివృత్తి లక్షణములను విడువలేరు. ఎంతటి శాంతమూర్తికైనా దేహాభిమానము విడువక పోతే కామ, క్రోధ, లోభములను విడవడం కష్టం. కాబట్టి వేదాంత విదులకు ముందు

దేహాభిమానము పోవాలి.

ఈ సంసారము ఒక అరణ్యము వంటిది. మానవుడు అత్యంత కుతూహలంతో ఆ అరణ్యములోనే తిరుగుతుంటాడు. ఎంత దూరము ప్రయాణము చేసినా ఆవల వైపుకు చేరుకోలేడు. మనకు జబ్బు చేస్తే ఎలా గైతే ఔషధము వేసుకుంటామో అలాగే ఈ దేహాభి మానము, మోహము పోవడానికి సత్యము, శౌచము(పరిశుభ్రత), శమము (శాంతి), దమము ( ఇంద్రియములను అదుపులో ఉంచుకోవడం) పాటించాలి.

భూమి, ఆకాశము, నీరు, తేజస్సు, వాయువు అను పంచ భూతములకు, జ్ఞానేంద్రియములకు, కర్మేంద్రియ ములకు, సత్త్వరజస్తమోగుణములకు, ఈ జగముల నేలే అధిపతులకు అందరికీ అహంకారము నివాస స్థానము. స్మృతి, సంప్రీతి, ప్రసన్నత మొదలగునవి సత్త్వగుణము వల్లకలుగుతాయి. రాగ ద్వేషములు, లోభము, రోషము మొదలగు నవి రజోగుణము వలన కలుగుతాయి. దర్పము, శోకము మొదలగునవి తామస గుణములు. జ్ఞాన సముపార్జనకు ఈ మూడు గుణములు అవరోధములు. కాని ముందుగా రజస్తమోగుణములు విడిచి పెట్టి మనసును సత్త్వగుణ ప్రధానముగా చెయ్యాలి. ఎందుకంటే మనస్సు సత్త్వగుణ ప్రధానమైతే రజస్తమోగుణములు నశించిపోతాయి. సత్త్వగుణము జ్ఞాన సముపార్జనకు దోహదం చేస్తుంది.

మనం చేసే పనులన్నీ మనలో ఉన్న అహం కారము తో చేస్తాము. మనం చేసే పనుల వలన దేహానికి బయట ప్రపంచంతో సంబంధం కలుగుతుంది. ఈ సంబంధమే తిరిగి జన్మ ఎత్తడానికి కారణమవుతుంది. జన్మ అంటే పురుషుడి శుక్లము, స్త్రీ శోణితము తో కలిసి పిండముగా రూపుదిద్దుకోవడమే. తల్లి గర్భ వాసంలో, మూత్రపురీషములలో పొర్లుతూ, నవమాసములు పెరిగి, తరువాత బయటకు

వచ్చి ఈ సంసార బంధములో చిక్కుకొని దుఃఖములో మునిగి పోతున్నాడు మానవుడు.

అసలు ఈ సంసార బంధమునకు మూలము ఆశ అనే తీగ. ఆ తీగ స్త్రీ అనే కొయ్యను పట్టుకొని పాకుతూ ఉంటుంది. ఈ సత్యం గ్రహించి, ఆశ అనే తీగను మొదట్లోనే త్రుంచి, మోక్ష మార్గంలో పయనించాలి. మనలో ఉన్న జ్ఞానమునకు అజ్ఞానమునకు మూలము మన బుద్ధి. మనలో ఉన్న నేను, నాది, నేను చేస్తున్నాను అనే అహంకారమును శ్రుతులు «జీవుడు» అని వ్యవహ రిస్తుంటాయి. ఆ జీవుడు కాలమునకు లోబడి ఇంద్రియములతో కర్మలు చేస్తుంటాడు. ఈ ఇంద్రియములు రాగముతో కూడిన మనస్సుతో కలిసి భోగములు అనుభవిస్తుంటాయి. ఈ రాగద్వేషములు విడిచి పెడితే గాని సంసారము నుండి విముక్తి కలగదు.

ఈ చరాచర జగత్తులో మానవ జన్మ ఉత్తమమైనది. మానవులలో బ్రాహ్మణులు ఉత్తములు. ఆబ్రాహ్మణులలో వేదమంత్రములు అధ్యయనము చేసినవారు శ్రేష్టులు. వారిలో కూడా జ్ఞాన సముపార్జన చేసిన వారు ఉత్తమోత్తములు. నరునకు జ్ఞానము కన్ను వంటిది. జ్ఞాన హీనుడు గుడ్డివాడితో సమానము. మానవుడు ఆచరించు ధర్మములలో క్షమ, సత్యము, శౌచము మంచి ధర్మములు. బ్రహ్మ చర్యము అత్యుత్తమ ధర్మము. మానవుడు పై చెప్పిన ధర్మములను ధైర్యంతో చిత్తశుద్ధితో అలవరచుకోవాలి.

అందమైన యువకులు యువతులతో పరిహాసంగా సంభాషించడమూ, వారి కోసం నిరీక్షించడమూ, మొదలగు పనులు చెయ్యకూడదు. అలా చేసినట్టయితే, అందమైన యువతులు అలాంటి యువకుల మనస్సులలో తిష్ట వేస్తారు. భోగములకు నిలయమైన స్త్రీ శరీరము మాంసము, ఎముకల మయమని గ్రహించి వివేకంతో ప్రవర్తిస్తే మనస్సు వారి పట్ల ఆకర్షింప బడదు. ఇంద్రియ నిగ్రహమునకు

నాడీ శుద్ధి ముఖ్యము. మన శరీరంలో కర్మలు చెయ్యడానికి పది నాడులు పనిచేస్తుంటాయి. దానికి తోడు జ్ఞానేంద్రియములు ఐదు. మొత్తము పదిహేను నాడులు మన దైనందిన కార్యక్రమములు నిర్వర్తిస్తుంటాయి. మన శరీరములో కళ్లకు కనిపించే నాడులు పది ఉన్నాయి. సూక్ష్మంగా ఉన్న నాడులు ఐదు. వీటన్నిటికంటే అత్యంత సూక్ష్మంగా ఒకనాడి హృదయం నడుమ విరాజిల్లుతూ ఉంది. కాని అది శరీరం అంతటా వ్యాపించి ఉంటుంది. మానవుడు తన దృష్టిని అంతర్ముఖం చేసి ఆ హృదయ నాడి మీద నిలిపిన, మనసు విషయ సుఖముల వంక మళ్లదు. కేవలం పరబ్రహ్మనే చూస్తుంది.

ఇంక ఇంద్రియ సుఖములు సంకల్ప జనితములు. శుక్లమునకు శరీరములోని అన్ని ఇంద్రియములు ఆవాసములు. కేవలం శారీరక స్పర్శ వలన నే శుక్లము స్ఖలనము అవుతుందనడం పొరపాటు! సంకల్ప రతిలో కూడా స్ఖలనం అవుతుంది కదా! కాబట్టి మానవుడు శారీరకంగానే కాదు, మానసికంగా కూడా ఇంద్రియ లోలత్వమునకు లోనుకాకూడదు.

శుక్లమునకు ఇంద్రియములని పేరు. ~~ఈ~~విషయం అత్రి మహా ముని ఇదివరకు జనులకు ~~ఈ~~విధంగా తెలిపాడు. మానవునిలో ఉన్న శుక్లము శరీరములో ఉన్న అన్ని ధాతువులకు మూలము. అది పూర్వము ఇంద్రుడి కి చెందినది. అందుకే దానికి ఇంద్రియము అనే పేరు వచ్చింది. ~~ఈ~~ ఇంద్రియ మునకు(శుక్లమునకు) మనస్సు సూక్ష్మరూపము. బుద్ధి మంతులైన వారు మాత్రమే మనస్సును అదుపులో పెట్టుకోగలరు. యువకులు, వృద్ధులు అజ్ఞానముచేత, దౌర్బల్యముచేత, మూఢత్వము చేత, మానసిక వికారములకు లోనవుతారు. కాబట్టి మానవుడు విషయ వాంఛలకు దూరంగా ఉంటూ, ఇంద్రియ నిగ్రహమునకు ఏర్పరిచిన యమ, నియమాదులను నిష్ఠతో ఆచరించాలి.

విషయ వాంఛలు చాలాచెడ్డవి. ఒకసారి వాటికి లోబడితే చేటుకలుగుతుంది. విషయ వాంఛలకు దూరంగా ఉంటే పరమపదము లభిస్తుంది. పుట్టుక, చావు,మధ్యలో రోగములు ఈ లోకంలో దుఃఖ కారణములు. వివేక వంతుడు పవిత్రుడై మోక్షము కొరకు ప్రయత్నిస్తాడు కాని ఈ జననమరణ చక్రములో ఇరుక్కుపోడు. వివేక వంతుడు వాక్కు, మనస్సు, శరీరము ఈ మూడింటినీ పరిశుభ్రంగా ఉంచుకొని, అహంకారము వదిలి పెట్టి, శాంత బుద్ధితో మెలగుతూ, రాగద్వేషములను వదిలి పెట్టి, సాటి జీవుల మీద దయ చూపిస్తూ మెలగుతాడు. కాని కొంత మంది కపట సన్యాసులు, పైకి ఇంద్రియ నిగ్రహము, త్రికరణ శుద్ధి కలిగినట్టు నటిస్తూ ధనము సంపాదించడానికి నానా పాట్లు పడుతుంటారు. మోక్ష సాధకులు వీరి విషయంలో జాగ్రత్త వహించాలి.

మంచి బుద్ధి కలిగి, మనస్సును నిగ్రహించి, ఇంద్రియ నిగ్రహముపాటిస్తూ, విషయముల జోలికి పోకుండా ఉండే వారికి దేవతలు ప్రసన్నులవుతారు. దేవతల అనుగ్రహము వలన మానవునకు నిర్మలమైన యోగ తంత్రములు అలవడుతాయి. అలా అలవడిననాడు, మనిషి అన్నపానముల మీద, శారీరక సుఖముల మీద ఆశ వదిలి నిశ్చల మైన మనస్సుతో చరించాలి. ఆకు కూరలు, కాయ కూరలు, కంద మూలములు, భిక్షాటనతో తెచ్చుకున్న ఆహారము, వీటితో ఏ మాత్రం దుఃఖ పడకుండా, ఆకలి తీర్చుకొనుచూ, ఈ లోకంలో తిరుగుతూ, మనస్సు చలించ కుండా మెలగాలి. సాధకుడు తన కున్న జ్ఞానం అనే అగ్ని తో విజ్ఞానమును ప్రజ్వరిల్లచేసి, జరా మరణములు నానావిధ దుఃఖములు లేని అమృతము, అక్షరము అయిన పరబ్రహ్మతత్త్వమును పొందుతాడు.

కాని నిద్రావస్థలో ఉన్నప్పుడు రజస్తమోగుణముల వికారములతో కూడిన స్వప్నములు కని, అప్పటి వరకూ తాను విన్నవి, చేసినవి మరచిపోయే ప్రమాదము ఉంది. యోగి అయిన వాడికి అది మంచిది కాదు. కాబట్టి యోగి ఎల్లప్పుడూ

మెలకువతో జాగరూకుడై ఉండాలి. మనిషి నిద్రావస్థలో ఉన్నప్పుడు కర్మేంద్రియములు అన్ని విశ్రాంతి తీసుకుంటూ ఉంటాయి. కేవలం మనసు మాత్రం పనిచేస్తుంది. స్వప్నావస్థలో ఉంటుంది. మనిషి, తాను నిజజీవితంలో ఎలాంటి విషయానుభవములను పొందుతూ ఉంటాడో అలాంటి అనుభవములనే స్వప్నములో కూడా అనుభవిస్తాడు.

ఇలా ఎందుకు జరుగుతుంది అనే సందేహమునకు పూర్వము ఋషులు ఈ విధంగా సమాధానము చెప్పారు. నిద్ర అనగా పగలంతా పని చేసి అలసిపోయిన ఇంద్రియములు విశ్రాంతి తీసుకోవడం. కల అంటే ఆ ఇంద్రియాలు ఇదివరకు అనుభవించిన విషయములను మిధ్యారూపంలో తిరిగి అనుభవి స్తున్నట్టు అనుకోవడం. స్వాప్నికావస్థలో ఆత్మ సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది. సత్త్వ రజస్తమోగుణముల వికారముల వలన గాలి తో కూడిన దోషముల వలన, మానవుడు నిజజీవితంలో అనుభవించినవి మిధ్యారూపంలో స్వప్నములో గోచరిస్తాయి. అవి శుభా శుభములను తెలుపుతాయి అని నమ్మకం.

మనిషి స్వప్నావస్థలో ఉన్నప్పుడు బయట ప్రకృతి ప్రకాశించదు. కాని దేహము లోపల ఉన్న ఆత్మ ఎల్లప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటుంది. కాబట్టి స్వప్నావస్థలో మానవుడు అత్యంత తెలివిగా ప్రవర్తిస్తూ ఉంటాడు. మనిషికి మేల్కొని ఉండటం (జాగ్రదావస్థ), కలలు కనడం (స్వప్నావస్థ) గాఢంగా నిద్రపోవడం (సుషుప్తావస్థ) అనే మూడు అవస్థలు ఉన్నాయి. సాధకుడు తన జ్ఞానం చేత ఈమూడు అవస్థలకు అతీతుడుగా ఉండి, నిర్భరానంద స్వరూపుడుగా ఉంటాడు.

వ్యక్తము -- మన కళ్లకు కనపడేది. అవ్యక్తము--మన కంటికి కనపడనిది. వ్యక్తము అంటే మృత్యువు. అవ్యక్తము అంటే అమృతము--అమరత్వము (చావు లేనిది). ఈ రెండింటి గురించి తెలుసుకోకుండా సాధకుడు మోక్షమును పొంద లేడు.

ఈ అవ్యక్తము అనునది మూడులోకములకు ఆధారమని, దానినే నివృత్తి లక్షణమని శాస్త్రప్రమాణము.. ఈ ప్రకృతి ధర్మము-- భూత,భవిష్యత్, వర్తమానములు, బ్రహ్మ చేత సృష్టింపబడినవి అనీ, నివృత్తిధర్మము-- మోక్ష మార్గమనీ ఆగమ శాస్త్రములు చెబుతున్నాయి.

ఈ దేహంలో ఉండే వాడు దేహి. అంటే ఆత్మ. సత్త్వరజస్తమోగుణములు, ఆ దేహి కట్టుకున్న చీర, పైనవేసుకున్న వల్లెవాటు, తల చుట్టుకున్న తలపాగా మాదిరి ఎల్లప్పుడూ కప్పి ఉంటాయి. ఆత్మయొక్క అసలు స్వరూపమును కనపడనీయవు. సత్త్వ,రజస్తమోగుణములకు అవతల ప్రకాశించే నాలుగవ తత్త్వమే పరబ్రహ్మము అని వేదాలు ఘోషిస్తున్నాయి. వాక్కు, మనసు, శరీరములతో ఏకత్వము సాధిస్తూ అత్యంత శౌచముతోనిష్ఠతో తపస్సు చేసిన సాధకునకు జ్ఞాన ము కలుగుతుంది.

అన్ని తపస్సులలోకి ఉత్తమమైన తపస్సు బ్రహ్మచర్యము, అహింసా వ్రతము. ఈ రెండు పరమ ధర్మములు. ఈ రెండింటినీ ఆచరించిన సాధకుడు నిర్మల జ్ఞానము తో వెలుగొందుతాడు. ఈ సంసారము ఆశా పాశములతో ధృఢంగా బంధింప బడి ఉన్నది. ఈ బంధనముల నుండి విముక్తి పొందుటకు తపస్సు ఒకటే మార్గము. ఆశ అనే బాగా వికసించిన తీగను నిర్మలమైన తపస్సు అనే కత్తితో నరకాలి. అప్పుడు జ్ఞానదృష్టి అలవడుతుంది.౯ ఈ ప్రకారంగా ఆ ముని తన శిష్యునికి జ్ఞానబోధ చేసాడు. ఓ ధర్మరాజా! నీవు కూడా ఆ బోధనలు వింటివి కదా. ఆ బోధనల అర్థము గ్రహించి నీవు కూడా కృతార్థుడివి కమ్ము.౯ అని పలికాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు భీష్ముని తో ఇలా అన్నాడు. ౯పితామహా! మిధిలానగరాధి పతి జనక మహారాజు ఏ ప్రకారంగా మోక్షమును పొందాడు.౯ అని అడిగాడు. దానికి భీష్ముడు ఈ విధంగా చెప్పసాగాడు.

“ జనక మహారాజు వద్ద నూరు మంది ఆచార్యులు ఉన్నారు. వారు సతతము ఆ మహారాజుకు తత్త్వ శాస్త్రము గురించి ఉపదేశము చేస్తూ ఉంటారు. ఆ జనక మహారాజు ఎవరు ఏమి చెప్పినా దానిని శ్రద్ధతో వినేవాడు. ఆ సమయంలో పంచ శిఖుడు అనే ముని భూలోక సంచారము చేస్తూ మిథిలానగరమునకు వచ్చాడు. అతని తల్లి కపిల. ఆ పంచ శిఖుడు తన ప్రతిభావిశేషములతో జనక మహారాజు కొలువులో ఉన్న నూరు మంది పండితులను తత్త్వ శాస్త్ర చర్చలలో ఓడించాడు. పంచశిఖుని విజ్ఞానమునకు ఆశ్చర్యపోయాడు జనకుడు. తనకు మోక్షమార్గమునకు తగిన బోధ చెయ్యమని అడిగాడు. పంచశిఖుడు ఇలా చెప్పసాగాడు.

“జనక మహారాజా! కోరికలకు మూలము అజ్ఞానము. మనం చేసే కర్మలకు కోరికలు మూలము. వీటన్నిటి కారణంగా మనిషికి పునర్జన్మ కలుగుతుంది. అని తత్త్వవేదులైన మునులు చెబుతారు. మనలో కలిగే లోభ, మోహములు ఒకదానితో ఒకటి పెనవేసుకొని, అవిద్య అనే భూమిలో నానా రకము లైన కర్మబీజములు అంకురించుటకు తోడ్పడతాయి. ఇది నాకు ఇష్టము, ఇది నాకు అయిష్టము అనే భావనలు హృదయములో ఒక దానితో ఒకటి చిక్కుపడగా, మానవుడు వాటికి అనుగుణంగా కర్మలు చెయ్యడం మొదలుపెడతాడు. ఆ కర్మ బంధనము లలో మునిగిపోయి, తనను ముసలి తనమూ, మృత్యువు కబళిస్తున్నాయి అన్న విషయం మరిచిపోతాడు. మానవుడు తన దైనందిన జీవితంలో ధనము, బంధువులు, భోగములు మొదలగునవి అస్థిరములు అని తెలుసుకొని, వీటికి దూరంగా ఉంటే, మనసుకు శాంతి చేకూరుతుంది. తుదకు మోక్షము కలుగుతుంది.” అని చెప్పాడు పంచ శిఖుడు.

“మహానుభావా! కేవలము వైరాగ్యము వలననే మోక్షప్రాప్తి కలుగుతుంది అని అనుకొందాము. అటులైన నరుడు విషయ వాంఛల మీద విరక్తిభావంతో

ఉంటే వాడికి మోక్షము లభిస్తుందా!" అని అడిగాడు జనకుడు. దానికి ఆ ముని ఇలా సమాధానం ఇచ్చాడు.

"జనకమహారాజా! సంతోషము, ఇష్టము, సుఖము, ఆనందము, శాంతి ఇవన్నీ సాత్వికానందములు. సత్త్వగుణము అలవరచుకొన్నందు వలన కలుగు తాయి.

ఎప్పుడూ దుఃఖంతో అలమటించడం, మనసుకు సంతోషం లేకపోవడం, ఎప్పుడూ దేనికో ఒక దానికి ఏడుస్తూ ఉండటం, ఉన్నదానితో తృప్తిపడకపోవడం, అది కావాలి ఇది కావాలి అని వెంపర్లాడటం, ఓర్పు లేకపోవడం, ఇవన్నీ రాజస భావాలు. రజోగుణము అలవరచుకొన్నందువలన కలుగుతాయి.

విపరీతమైన ఉద్రేకపూరితమైన ఆలోచనలు, కలలలో విహరించడం, ఎప్పుడూ ఏమరి పాటుగా ఉండటం, భ్రమలలో మునిగి తేలడం, ప్రతి దానికీ విజృంభించడం, ఊగిపోవడం, అలసత్వమూ, ఆలస్యము, సోమరితనమూ ఇవన్నీ తామస లక్షణములు, తామస ప్రవృత్తిని అలవరచుకుంటే కలుగుతాయి.

సత్త్వ, రజస్తమోగుణములు ఒక్కోసారి ఏదో కారణంగా కలుగుతాయి. ఒక్కోసారి అసలు ఏ కారణం లేకుండా కలుగుతాయి. ఒక్కోసారి మనమీదనే తిరగబడతాయి.

(చిన్న చిన్న కారణాలకూ, అసలు ఏ కారణం లేకుండానూ, నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యలు చేసుకోవడం ఇలాంటిదే).

మన మనసు సుఖ సంతోషాలతో ప్రశాంతంగా ఉన్నప్పుడు అది సాత్త్వికభావమనీ, మన మనసుకు ఎనలేని దుఃఖము కలిగినపుడు, అశాంతి కలిగినపుడు అది రాజస భావ మనీ, ఏమీ చెయ్యడానికి తోచకుండా స్థబ్ధతగా ఉండటం, తామస

భావమనీ ఎతెలుసుకొని, ఆ భావాలకు దూరంగా ఉంటూ, మనసును నిర్మలంగా ఉంచు కోగలిగిన వాడికి ఈ సంసార బంధనముల నుండి మోక్షము కలుగుతుంది. మన మనస్సును ఆ స్థితిలో ఉంచుకొనడానికి వైరాగ్యమే మూలము. ఈ సత్త్వ, రజస్తమోగుణములను ఆత్మతత్త్వములో లీనం చేస్తే, మనసు తన్మయత్వము పొందు తుంది. అప్పుడు ఆ మూడు గుణములు సముద్రములో కలిసిన మూడునదుల లాగా రూపం లేకుండా పోతాయి. కాబట్టి నరుడు సుఖము, దుఃఖముల వెంట పోక, మనస్సును అంతర్ముఖం చేసి, ఆత్మతో అనుసంధానము చేస్తే, మనస్సు ఆత్మలో లీనమై పోతుంది. ఈ కర్మబంధనముల నుండి విడివడిన ఆత్మ, కుబుసం విడిచిన పాము వలె ప్రకాశిస్తుంది.౯ అని చెప్పాడు పంచశిఖుడు.

ఆప్రకారంగా పంచ శిఖుని వలన బోధింప బడిన జనకమహారాజు, ఒక సారి మిధిలా నగరము తగలబడి పోతున్నా, ఏమీ దుఃఖ పడకుండా వైరాగ్యంతో నిశ్చలంగా ఉన్నాడు.౯ అని భీష్ముడు ధర్మరాజునకు చెప్పాడు.

౯పితామహా! ఎట్టివాడు సుఖంగా, మంగళకరంగా, భయంలేకుండా నిర్భ యంగా ఉంటాడు వివరించండి.౯ అని అడిగాడు. దానికి భీష్ముడు ఈ విధంగా చెప్పసాగాడు.

౯ఓ ధర్మనందనా! నాలుగు వర్ణముల వారికి శాంతి, ఇంద్రియ నిగ్రహము కలిగి ఉండటం ఆవశ్యకము. అందులోనూ బ్రాహ్మణునకు ఇంద్రియనిగ్రహము అత్యంతావశ్యకము. శుచిత్వము (శుభ్రత), కోపం లేకుండా ఉండటం, సంతోషము, మంచి నడవడి కలిగి ఉండటం, పరుల యెడ అసూయ లేకుండా ఉండటం, దుఃఖము, దైన్యము లేకుండా ఉండటం, ప్రమాదము లేకుండా ఉండటం, దురభిమానమును విడిపెట్టడం, అతివాదమును విడిచిపెట్టడం, లోకములోని సకల

జీవరాసుల యందు దయ కలిగి ఉండటం, గురువులను పూజించడం, తనను తాను పొగుడుకోకపోవడం, పరులను నిందించకుండా ఉండడం, ఇతరుల మీద నిందలు వేయకుండా ఉండటం, సత్సంగము, ఎల్లప్పుడు నిజమే చెప్పడం, అబద్ధములు ఆడకుండా ఉండటం, నిరాశా, నిస్పృహలకు లోనుకాకుండా ఉండటం, అహింస ను పాటించడం, మంచి భావనలతో మెలగటం, ఇంద్రియ నిగ్రమం కలిగి ఉండటంచ వీటిని దమములు అని అంటారు. పై గుణములు కలిగిన పుణ్య మూర్తికి, ఇహ లోకములోనూ పర లోకములోనూ శాంతి సౌఖ్యములు లభిస్తాయి.ౖ అని చెప్పాడు భీష్ముడు.

ౖపితామహా! కొంత మంది వ్రతములు చేస్తూ ఉంటారు. కాని మధ్యలో భోజనము చేస్తారు. మరి వారికి వ్రత భంగము కలగుతుంది కదా! అని అడిగాడు ధర్మరాజు.

ౖకుమారా! బ్రాహ్మణుని కోరిక మేరకు చేయు భోజనము, వేదోక్తప్రకారము చేయు భోజనము వలన వ్రత భంగముకలుగదు. కాని ఎల్లప్పుడూ ఉపవశించడం, సదా బ్రహ్మచర్యము పాటించడం, మాంసభక్షణ చేయకపోవడం, దేవతలను, అతిధులను తృప్తిపరచిన తరువాత భుజించడం, అమృతము వంటి ఆహారం భుజించడం, కలత నిద్ర లేకుండా ఉండటం మంచి లక్షణములు. వాటి స్వరూపము వివరించెదను.

రోజుకు రెండుసార్లు మాత్రమే భుజిస్తూ, మధ్య మధ్యలో ఏమీ తినకుండా ఉండేవాడు సదా ఉపవాసి; కేవలం సంతానార్ధియై, ఋతు కాలములో మాత్రము తన భార్యతో సంభోగం జరిపేవాడు సదా బ్రహ్మచారి; అది మాంసాహారమైనా సరే ముందు దేవతలకు, పితరులకు తరువాత అతిధులకుపెట్టి తరువాత తాను భుజించే వాడు, మాంసాహారి కాదు; అందరితో కూడి సహపంక్తి భోజనం చేసే

వాడు అతిధులకు, దేవతలను తృప్తిపరచి తరువాత భుజించే వానితో సమానము; ముందు తన కింద పని చేసే వారికి పెట్టి తరువాత తాను భుజించేవాడు తినే ఆహారము అమృతము తో సమానము; పగలు నిద్రపోని వాడు కలత నిద్రపోని వాడితో సమానము.” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! నరుడు చేసే కర్మలకు, అతని పూర్వజన్మ సంస్కారమును బట్టి శుభాశుభములను,సుఖదుఃఖములను కలుగు తుంటాయి. కాని ఆ పనులకు కర్త ఆ పని చేసే నరుడా! కాదా! అన్నది సందేహము. దీని గురించి తెలపండి.” అని అడిగాడుధర్మరాజు.

ధర్మనందనా! నీకు ఇంద్రుడు, ప్రహ్లాదుని మధ్య జరిగిన సంవాదము గూర్చి చెబుతాను. దానితో నీ సందేహములు తీరిపోతాయి.

సత్త్వగుణ సంపన్నుడు, ఎల్లప్పుడూ సంయమనము పాటించేవాడు, అహం కారము లేనివాడు, కోపమంటే ఎరుగని వాడు, నిందను, స్తుతులను సమానంగా పరిగణించేవాడు, మట్టిని, బంగార మును ఒకే విధంగా విలువ కట్టేవాడు, ఎల్లప్పుడు నారాయణ ధ్యానము లో నిమగ్నుడై ఉండేవాడు,అగు ప్రహ్లాదుడు ఒకరోజు తన మందిరము లో కూర్చుని ఉండగా ఇంద్రుడు అతని అంతరంగము తెలుసు కొనడానికి అక్కడి వచ్చాడు.

“ప్రహ్లాదా! నీవు సంపదలు లేకున్నా దుఃఖమును చెందవు. శత్రువుల చేతికి చిక్కుతాను అని కూడా తలంపవు. అసలు ఏ పనీ చెయ్యవు. మరీ ఇంతటి బేలగా ఉంటే ఎలాగ?” అని అడిగాడు ఇంద్రుడు.

“ఓ ఇంద్రా! కలిమి, లేమి అనేవి రెండూ పక్క పక్కనే ఉంటాయి. ప్రయత్నం

తో సంపదలు వస్తాయి. లేకపోతే రావు అనడం నీ బేల తనము సుమా! సంపదలు ఒకరు సంపాదించనవసరం లేదు. విధి అనుకూలిస్తే వాటంతట అవే వచ్చి పడతాయి. విధి ప్రతి కూలిస్తే ఉన్న సంపదలు హారతి కర్పూరంలా హరించుకొని పోతాయి. దీనికి మానవ యత్నంతో సంబంధం లేదు. మనలను శత్రువులు ఓడించడం, మనలను మిత్రులు కాపాడటం, మనకు సంపదలు కలగడం, ఉన్న సంపదలు పోవడం అన్నీ ఆ విధాత సృష్టించినవే కాని వేరు కావు. మానవుడి మనసు లో భావాలు అతని స్వభావానికి అనుగుణంగా పుడతాయి, పోతాయి. మనసు చంచల మైనది. భావాలు కూడా చంచలంగానే ఉంటాయి. దీనిని తెలుసు కుంటే మనసును నిగ్రహించుకోవచ్చు.

తాను చేసే ప్రతి పనికీ తానే కర్తను అనుకోవడం అజ్ఞానము. అన్ని పనులకు తానే కర్త అయితే, అన్ని పనులకు సమానమైన ఫలితాలు రావాలి కదా!కాని రావడం లేదు. అందుకనే, అఖిల కర్మలకు కర్త ఆ పరమాత్మ. మానవుడు కాదు. అంతా నేను చేస్తున్నాను అనే అహంకారంతో కర్మలను చేసే వాడికి ఆ కర్మఫలము కూడా తగులుకుంటుంది. అంతా భగవంతుడు చేస్తున్నాడు నేను నిమిత్త మాత్రుడను అని అనుకుంటూ కర్మ చేసేవాడికి ఆ కర్మల పాపపుణ్యములు అంటుకొనవు.

మనం చేసే కర్మలను ఫలాపేక్ష లేకుండా చేస్తూ, అవి నెరవేరాయా లేదా అని ఆలోచించకుండా, వాటి వలన కలిగే సుఖ దుఃఖాలకు లోను కాకుండా మనస్సును నిలకడగా ఉంచు కొనే వాడు మహనీయుడు. కాబట్టి, ఓ దేవేంద్రా! నేను, ఈ లోకములో ఉన్న సర్వ జీవజాతులూ అనిత్యములు, అశాశ్వతములు అన్న సత్యమును తెలుసు కొని, ఈ సంసార బంధనములలో చిక్కుకొనక, అన్ని సమయములలో కూడా సంతోషంగా ఉంటున్నాను. శాంతి తోనూ, ఇంద్రియ నిగ్రహముతోనూ ఉన్న వాడి మనస్సు ఎల్లప్పుడూ చింతలకు లోను కాదు. నేను కూడా శాంతి తోనూ, దాంతి తోనూ నిశ్చింతగా జీవిస్తున్నాను.“ అని అన్నాడు

ప్రహ్లాదుడు.

అప్పుడు ఇంద్రుడు ప్రహ్లాదునితో ౯ఓ దానవేంద్రా! నీకు ఇంతటి ప్రశాంత చిత్తము ఏ విధంగా అలవడింది. చెప్పవా?౯ అని అడిగాడు.

౯మంచి ప్రవర్తన, ఎల్లప్పుడూ మనసును ప్రసన్నంగా ఉంచుకోవడం, ఆత్మావలోకనం చేసుకోవడం, ఎల్ల ప్పుడూ అప్రమత్తంగా జాగ్రత్తగా ఉండటం, వృద్ధులను పెద్దలను సేవించ డం, ఈ లక్షణాలు మానవునికి మేలుచేస్తాయి. పై లక్షణములు కలిగిన వాడికి కాలక్రమేణా ప్రజ్ఞ, శాంతి కలుగుతాయి. ౯ అని చెప్పాడు ప్రహ్లాదుడు. ఈ విషయములు విన్న మహేంద్రుడు ఆశ్చర్యంతో ప్రహ్లాదుని వద్ద సెలవు తీసుకొని స్వర్గమునకు వెళ్లాడు.౯ అని చెప్పాడు భీష్ముడు.

౯పితామహా! రాజు తన కున్న సిరిసంపదలు ఏ కారణంగా పోగొట్టు కుంటాడు వివరించండి.౯ అని అడిగాడు.

౯ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు దేవేంద్రుడికీ బలి చక్రవర్తికీ జరిగిన సంవాదమును వినిపించెదను. ఒక సారి ఇంద్రుడు బ్రహ్మ దేవుని వద్దకుపోయి ౯బ్రహ్మ దేవా! ఒకప్పుడు బలి చక్రవర్తి మహా సంపదలతో వెలుగొందాడు కదా! ఆ బలి చక్రవర్తి ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు? ఏమి చేస్తున్నాడు?౯ అని అడిగాడు.

౯మహేంద్రా! నీ దుష్ట తలంపును గ్రహించాను. కాని అడిగావు కాబట్టి చెపుతున్నాను. ఒంటే, గాడిద, ఆవు, గుర్రము వీటిలో దేనిలోనో ఒకటి గా ఉంటున్నాడు. అతనిని చంపడం ఉచితము కాదు. అతనిని చంపనని నాకు మాట ఇవ్వు. అసత్యదోషమునకు పాల్పడవద్దు.౯ అని అన్నాడు బ్రహ్మదేవుడు.

"అలాగే మాట ఇస్తాను. అతనిని చంపనుకాని అతనితో మాట్లాడతాను" అని పలికి ఇంద్రుడు స్వర్గమునకు వెళ్లిపోయాడు. తరువాత ఇంద్రుడు బలి చక్రవర్తి కోసం గాలించాడు. బలిచక్రవర్తి ఒక గాడిద రూపంలో కనిపించాడు.

" ఓహో బలి చక్రవర్తీ! ఆనాడు లెక్కలేనన్ని ఏనుగులు నీ వెంట రాగా భద్ర గజము మీద ఎక్కి ఊరేగిన నీవు మా దేవతలను లెక్క సేయలేదు. కానీ ఈనాడు ఈ గాడిదవైనావు ఎందుకో!" అని అవహేళన చేసాడు.

"ఓ బలీ! నాడు నీవు చేసిన యజ్ఞములలో బంగారు ఊపస్థంభమును నిర్మించి యజ్ఞములు చేసావు కదా. మరి ఈ నాడు నీ దుస్థితి చూచి జాలిగా ఉందయ్యా! అది సరే! ఇప్పుడు నువ్వు గడ్డి, పొట్టు తింటున్నావు కదా! మరి నీ పూర్వపు వైభవము నేటి దుస్థితి తల్చుకొని ఎప్పుడూ దుఃఖించలేదా! ఉన్న మాట చెప్పవయ్యా!" అని అడిగాడు దేవేంద్రుడు హేళనగా. దానికి బలి ఇలా అన్నాడు.

"ఓ మహేంద్రా! నీకు నా వైభవము కనిపించదులే. నా సిరి సంపదలు, వైభవము ఒక కొండగుహలో దాచి పెట్టాను. అవసరం వచ్చినప్పుడు పోయి చూచి అనుభవించి వస్తుంటాను. అయినా ఇప్పుడు నువ్వు పెద్దవాడవు. మా లాంటి చిన్న వాళ్ల ముందర అసందర్భ ప్రేలాపనలు ఎందుకుచెప్పు. నీదారిన నీవు వెళ్లు" అని అన్నాడు బలి.

ఆ మాటలకు మహేంద్రుడు నవ్వుతూ "అది కాదు బలి చక్రవర్తీ! ఈ అఖిల భూత కోటి అంతా మంచు మాదిరి కనపడుతుంది. సూర్యరశ్మి రాగానే కరిగి పోతుంది. చావు పుట్టుకలు అంతేకదా! నీ లాంటి బుద్ధిమంతులు ఈ జననమరణ చక్రమునకు అతీతులు కదా!" అని అన్నాడు.

"ఓ మహేంద్రా! ఈ లోకంలో లాభ నష్టాలు, జనన మరణాలు, సుఖ దుఃఖాలు,

వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. నేను మాత్రం వీటన్నిటికీ అతీతంగా ఉంటాను. ఓ దేవేంద్రా! వీడు బుద్ధి మంతుడు, వీడు బుద్ధిహీనుడు, వీడు బల వంతుడు, వీడు బలహీనుడు, వీడు ధన వంతుడు, వీడు పేదవాడు అనే తారతమ్యం లేకుండా యమధర్మరాజు కాలము తీరగానే జీవుల నందరినీ సంహరిస్తూ ఉంటాడు గదా! ఈ విషయం తెలిసిన వాడిని కాబట్టి నా మనసులో సుఖదుఃఖములకు తావు లేకుండా, వాటికి అతీతంగాజీవిస్తున్నాను. ఓ దేవేంద్రా! ఈ నాడు నేను ఈ గాడిద రూపంలో ఉండి గడ్డి, ఎముకలు తింటున్నాను అని నన్ను హేళన చేస్తున్నావు. ప్రస్తుతము నేను ప్రశాంత చిత్తముతో ఉన్నాను. నీవు ఎంత హేళన చేసినా నాకు కోపము రాదు. నేను చక్రవర్తిగా ఉన్నప్పుడు ఎప్పుడన్నా నాతో ఇలా మాట్లాడావా! అసలునా ముందునిలబడడానికే భయపడేవాడివి. నాసంగతి నీకు తెలుసు. నీ సంగతి నాకు తెలుసు. నేను ఎవరో తెలుసుకొని మాట్లాడటం మంచిది. ఓ మహేంద్రా! వికసించడం, వాడిపోవడం విధి కోరిన ప్రకారము జరుగుతాయనీ, విధి బలీయమనీ ఎరుగవా! నీలాంటి పెద్ద వారికి ఇంత మాత్రం వివేకం కూడా లేదా! ఓ దేవేంద్రా! నీవు ఈ ప్రకారం గర్వంతో మాట్లాడటం ఎంతో నీచంగా ఉంది. ఎటుపోతావో పో! ఈ ప్రకారంగా గర్వంతో త్రుళ్లిపడటం మానుకో! నాకు కోపం వస్తే నువ్వు, నీ వజ్రాయుధము, నా పిడికిటి పోటుతో నేలకూలుతారు. జాగ్రత్త!” అని కోపంతో పలికి అంతలో తమాయించుకొని “దేవేంద్రా! కేవలం పరిహాసంగా అన్నాను. నా మనసులో పొగరు, అహంకారము లేవు. ఆశ్చర్యకరములైన విధాత చేతలకు నువ్వు నేను అతీతులు కారు. కాబట్టి ఈ త్రుళ్లుబాటు మాను! శాంతంగా జీవించు.” అని అన్నాడు బలి.

ఈ సమయంలో బలి శరీరంనుండి ఒక అందమైన వనిత బయటకు వెళ్లిపోతూ ఉంది. “బలీ! ఈమె ఎవరు?” అని అడిగాడు మహేంద్రుడు. “నాకేం తెలుసు. ఆమెనే అడిగితెలుసుకో!” అన్నాడు బలి

మహేంద్రుడు ఆమె ను నిలువరించి “నీవు ఎవరు?” అని అడిగాడు. దానికి ఆ వనిత “ఇంద్రా! నా పేరు లక్ష్మి. శ్రీ అని కూడా అంటారు. మీ ఇరువురికీ నేను ఎవరో తెలియక పోవడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ముల్లోకము లలో అన్ని యుగములలో ఇప్పటిదాకా నా గురించి ఎవరూ సంపూర్ణంగా తెలుసుకొన లేదు.” అని అన్నది లక్ష్మి.

“అది సరే! మరి నీవు ఆ రాక్షస చక్రవర్తి నుండి ఎందుకు తొలగి పోతున్నావు. కారణ మేమి!” అని అడిగాడు ఇంద్రుడు.
సత్యము, ధర్మము, ఇంద్రియ నిగ్రహము, దానగుణము నా నివాస స్థానములు. పైలక్షణములు ఉన్న పరాక్రమ వంతుడైన పురుషుని వద్ద నేను ఉంటాను. ఇంతకుముందు ఈ బలిచక్రవర్తికి పైన చెప్పిన గుణములు అన్నీ ఉన్నాయి. అందుకని నేను అతని వద్దనే ఉన్నాను. కాలక్రమేణా ఇతనిలో అవినీతి, బ్రాహ్మణుల పట్ల అసూయ ప్రవేశించాయి. అంతకు ముందు తనలో ఉన్న మంచి గుణములు అన్ని ఈ బలి చక్రవర్తి వదిలేసాడు. ఇంక ఇతని వద్ద నేను ఉండలేను. నీ దగ్గర ఉండటానికి వస్తున్నాను. ఎందుకంటే నీ దగ్గర నేను పైన చెప్పిన గుణములు, ఇంకా వేదములు, శాస్త్రములు చెప్పిన ఆచారములు, నీ వద్ద పుష్కలంగా ఉన్నాయి. అందుకని నీ వద్ద ఉండటానికి నిశ్చయించు కున్నాను. కాని నువ్వు బలి మాదిరి కాకుండా ఏమరు పాటు లేకుండా సచ్చరిత్రుడవై ఉండాలి.” అని పలికింది లక్ష్మి.

తనను లక్ష్మి వదిలి పోయిన తరువాత, బలి మహేంద్రుని చూచి ఇలా అన్నాడు.

“ఓ మహేంద్రా! సూర్యుడు పశ్చిమ దిక్కున అస్తమించినంత మాత్రాన తన తేజస్సు కోల్పోడు కదా. మరునాడు మరలా తూర్పుదిక్కున ఉదయిస్తాడు. అలాగే ప్రస్తుతము నేను ఈ గాడిద శరీరంలో ఉన్నంత మాత్రాన నా పరాక్రమము కోల్పోలేదు. మరలా వస్తాను. దేవాసురయుద్ధంలో నిన్ను గెలుస్తాను.” అన్నాడు

బలి.

‌అప్పటి సంగతి చూద్దాము కానీ ప్రస్తుతము నీతో వ్యర్ధ ప్రసంగము చేయు సమయములేదు. బ్రహ్మదేవునికి ఇచ్చిన మాటప్రకారము నిన్ను చంపకుండా వదిలిపెడుతున్నాను.‌ అని వెళ్లిపోయాడు ఇంద్రుడు. బలి కూడా అక్కడినుండి దక్షిణదిక్కుగా వెళ్లిపోయాడు.

ధర్మరాజా! ఇంద్రుడు బలి సంవాదము వింటివి కదా! ఇప్పుడు ఇంద్రుడు నముచి సంవాదము వినిపిస్తాను విను.

పూర్వం నముచి అనే రాక్షసుడు ఉండేవాడు. అతనికి ఉన్న సంపద అంతా పోయింది. అయినా అతను చింత పడలేదు. ఏకాంతస్థలంలో సంతోషంగా ఉన్నాడు. అతని వద్దకు ఇంద్రుడు వచ్చాడు. ‌అయ్యో దానవ రాజా! ఉన్న సంపదలు అన్నీ పోగొట్టుకున్నావు. పేదవాడిగా మిగిలిపోయావు. నిన్ను ఆదరించేవాళ్లు కూడా లేదు. నీకు దాపురించిన ఈ దుస్థితికి ఎంత చింతిస్తున్నావో కదా! అని అన్నాడు.

అప్పుడు నముచి ‌దేవేంద్రా! చింత ఎందుకు. పోయిన దాని కోసం విచారించడం నిరర్ధకము. అయినా కోరుకున్న వస్తువు చింత పడితేవస్తుందా! అలా చింతించడం వల్ల కోరుకున్న వస్తువు రాకపోగా, చింత, దుఃఖము మాత్రం మిగులుతుంది. ఇదంతా తెలుసు కాబట్టే నేను పోయిన దాని గురించి చింతపడటం లేదు. దేవేంద్రా! ముల్లోకములలో ఉన్న అందరినీ శాసించే వాడు ఒకడున్నాడు. నీరు పల్లమునకు పారినట్లు, మనకు ప్రాప్తమున్న వి మనం కోర కుండానే మన వద్దకు వస్తాయి. అయినా ఇది నాకు జరగాల్సి ఉంది కాబట్టే జరిగింది, అని అనుకుంటే సంతోషము, ఆనందము, చింత, దుఃఖము ఎందుకు కలుగుతాయి.

మనకు ప్రాప్తము లేని వస్తువు మనము ధైర్యముతో, వీరత్వముతో, శౌర్యముతో, ప్రజ్ఞతో కూడా సాధించలేము. బుద్ధిమంతుడు ఈ విషయం తెలుసు కుంటాడు కాబట్టి లేని దాని గురించి చింతించడు. దేవేంద్రా! మేలు, కీడు అనేవి కాల వశమున మనకు కలుగుతూ ఉంటాయి. అంతే గాని మనము రమ్మంటే రావు. పొమ్మంటే పోవు. కాబట్టి వాటి కోసం ఆరాటపడటం తగదు.' అని పలికాడు నముచి. ఆతని మాటలకు సంతోషించి దేవేంద్రుడు స్వర్గలోకమునకు వెళ్లిపోయాడు.' అని భీష్ముడు ధర్మరాజుడు వివరించాడు.

'పితామహా! మానవునికి ఏదైనా దుర్దశ కలిగినపుడు అతను ఎలా ఉంటాడు. దానిని ఎలా ఎదుర్కొంటాడు. వివరించండి.' అని అడిగాడు.

'ధర్మరాజా! అన్ని రకముల దుఃఖములకు, దుర్దశలకు ధైర్యమే మందు. ధైర్యంతో మనసు గట్టి పడుతుంది. మానవుడు ధృఢనిశ్చయంతో ఆ దుర్దశను ఎదుర్కొంటాడు. ఈ సందర్భంలో నీకు ఇంద్రుడు, బలిచక్రవర్తి సంవాదము వినిపించెదను.

దేవాసుర యుద్ధము ముగిసింది. మహా విష్ణువు అండతో దేవతలకు విజయం సిద్ధించింది. అప్పుడు దేవేంద్రుడు రుద్రులు, ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, గంధర్వులు,సిద్ధులు మొదలగు వారి పరివేష్ఠింపగా, ఐరావతము నెక్కి మూడులోకములలో సంచరిస్తున్నాడు. అలా విహరిస్తూ సముద్రము దగ్గర ఒక కొండ గుహలో ఉన్న బలిచక్రవర్తిని చూచాడు. అంత వైభవముతో ఉన్న దేవేంద్రుని చూచి బలి చక్రవర్తి ఏ మాత్రం చలించలేదు. నిబ్బరంగా, ధైర్యంగా ఉన్నాడు. అతనిని చూచి దేవేంద్రుడు బలితో ఇలా అన్నాడు.

'బలీ! నీకు ఉన్న వైభవమంతా నశించింది. చాలా హీనస్థానములో ఉన్నావు.

నేను నీకు శత్రువును. శత్రువు వైభవమును చూచి కూడా నీవు మనస్సులో దుఃఖ పడటం లేదు. నీకు ఈ నిర్వికారము ఎలా కలిగింది? నీ శౌర్యము వలనా! నీవు పెద్దలకు వృద్ధులకు చేసిన సేవల ఫలితమా! నీవు చేసిన తపస్సు వలనా! లేకపోతే దేవేంద్రుడనైన నన్నుకూడా లక్ష్యపెట్టకుండా ఉన్నావు. దీనికి కారణ మేమి!‌“ అని అడిగాడు. అప్పుడు బలి చక్రవర్తి దేవేంద్రునితో ఇలా అన్నాడు.

“దేవేంద్రా! నేనేదో నిన్ను లక్ష్య పెట్టలేదు అంటున్నావు. దాని వలన ప్రయోజన మేమి. ఇప్పుడు నీవు అనుభవించుచున్న వైభవము ఒక వైభవమా! దైవ వశము చేత ఎలాంటి వారికైనా నా లాంటి దీనస్థితితప్పదు. దేవేంద్రా! అప్పుడే మరిచిపోయావా! ఇదివరకు నేను నీ మీదికి దండెత్తి వచ్చి నిన్ను ఓడించి నిన్ను హీనుడిని చేసాను. అది నేను చేసినది కాదు. విధి విలాసము. అలాగే ఇప్పుడు నా హీనస్థితి కూడా నీ వల్ల జరగలేదు. ఇది కూడా విధి కృతము. ఇలాంటి వాటిని తట్టుకోడానికి ధైర్యం కావాలి. ఒక సారి సుఖము, ఒక సారి దుఃఖము కలుగు తుంటాయి. సుఖము కలిగినప్పుడు అంతా నా వలననే అని గర్వించడం, దుఃఖము కలిగినపుడు బాధపడడం మంచిది కాదు అని విజ్ఞులు చెప్పడం వినలేదా!

స్నేహితులు, బంధువులు, ఐశ్వర్యము, కీర్తి ప్రతిష్టలు, ఎన్ని ఉన్నా కాల వశమున మనకు కలిగేదుర్దశను తప్పించలేరు. ఈ విషయం తెలిస్తే, మనకు కలిగే ఐశ్యర్యములు, దారిద్ర్యము కాల వశమున వస్తూ పోతూ ఉంటాయి అని అర్థం అవుతుంది. అప్పుడు కాలం కలిసి వచ్చి నేను నిన్ను ఓడించాను. ఇప్పుడు కూడా నీ కాలం బాగుంది కాబట్టి నన్ను ఓడించావు. కాబట్టి మనకు కలిగే శుభాశుభములకు కాలమే కర్త అని తెలియదా దేవేంద్రా! అయినా నీకూ నాకూ శత్రుత్వం ఏముంది దేవేంద్రా! అంతా కాలవశమున కలిగిందే తప్ప. కాబట్టి అనవసరమైన మాటలు మాను. అయినా ప్రస్తుతం నా కాలం బాగాలేదు. నువ్వు ఎన్ని అన్నా నిన్ను ఎదిరించలేను. నీ మీద నాకు కోపం లేదు. అయినా నాకు లీలామాత్రంగా కోపం

వచ్చినా చాలు నిన్ను, నీ స్వర్గమును ఎడమ చేతితో కూల్చివేస్తాను. నీకు విజయ గర్వం తలకెక్కింది. అందు వల్ల కిందూ మీదూ కాన కుండా మాట్లాడుతున్నావు. కాని నీవుకూడా పరాభవము చెందు కాలము అతి త్వరలో సమీపిస్తూ ఉంది. నీవు ప్రస్తుతము ఇంద్రుడివి. నీకు ముందు ఎందరో ఇంద్రులు వచ్చారు. పోయారు.. ఒక్క ఇంద్రులేమి? బ్రహ్మలు కూడా శాశ్వతంగా ఉంటారా! కాలం గడిచేకొద్దీ ఇంద్రులు, బ్రహ్మలు మారుతుంటారు. అలాంటప్పుడు కాలవశాన ఒక దానవుడు ఓటమి చెందినంత మాత్రాన, నీవు నిందించడం బాగాలేదు. యజ్ఞములు యాగములుచెయ్యడం, వ్రతములు, పూజలు చెయ్యడం, మంచి నడవడి కలిగి ఉండటం లేక ఊహించలేని పతనం చెందడం కాల మహిమ చేతనే కదా!ఽ అని పలికాడు బలి.

ఆ మాటలువిన్న దేవేంద్రుడు కొంచెం మనసులో తొట్రుపాటు చెందాడు. అది అణచుకొని బలితో ఇలా అన్నాడు. ఽఓ బలీ! నీవు ఇంత హీన స్థితిలో ఉండి కూడా నీ మనస్సు నిర్వికారంగా ఉంది. నీలో ఉన్న ధైర్యము, వివేకము, వినయము, శాంతి ఏమాత్రం తగ్గలేదు. దీనికి కారణమైన నిష్ఠ ఏమిటో ఎరింగింపవా?ఽ అని అడిగాడు. దానికి బలి ఇలా బదులు చెప్పాడు.

ఽఓ దేవేంద్రా! ఎంత వెర్రివాడవయ్యా? నాలో ఉన్న ధైర్యము, వివేకము, వినయము శాంతి నేను ఎక్కడనుండి తీసుకొని రాలేదు. అవి నాలో స్వతస్సిద్ధముగా ఏర్పడ్డాయి. మరలా చెప్పుచున్నాను. విను. మానవులకు కలిగే అన్ని మహా దశలు, దుర్దశలు అన్ని కాల వశమున కలిగినట్టివే. ఈ కాలం ఒక నది వంటిది. నది కొంచెం కొంచెంగా కొండను కూడా కోసి వేస్తూ తుదకు ఎలా నామరూపాలు లేకుండా చేస్తుందో, అలాగే కాలం కూడా మానవుని లోభ, క్రోధ, మోహము, కామములలో పడవేసి క్రమ క్రమంగా నాశనం చేస్తుంది. మూఢ చిత్తుడైన మానవుడు దీనిని తెలుసుకోలేడు. ఈవిషయం గ్రహించలేని మానవుడు ఇతరులను చూచి

౯ అరే! ఇప్పటి దాకా బాగా ఉన్నాడే. ఇంతలో ఇంతటి దుర్దశ ఎలా దాపురించింది౯ అని ఆశ్చర్యపోతాడు. కాని అంతటి దుర్దశ తనకూ పడుతుందని తలంపడు.

దేవేంద్రా! భావము ( ఉండటం) అభావము (లేకపోవడం) అనే వాటికి లోను గాక, అత్యుత్తమ తపస్సు చేసేవాడికి కాల గతిలో జరిగే విచిత్రము లన్ని కరతలామలకములుగా శోభిస్తాయి. (చేతిలో ఉన్న ఉసిరిక కాయ మాదిరి కనపడతాయి). కాలగతిని చూడటం ద్వారా, మనసుకు శాంతి లభిస్తుంది. తాను ఆత్మగాని ఈ శరీరం కాదు; కాలగతిని కలిగే భావ, అభావాలు ఈ శరీరానికే గాని ఆత్మకు కాదు అనే విజ్ఞానం పొందు తాడు.౯ అని పలికాడు బలి. బలి కి కలిగిన మానసిక పరిపక్వతకు ఆశ్చర్యపోయాడు దేవేంద్రుడు.

౯ఓ రాక్షస రాజా! ఈ ప్రకారంగా కాలగతిని తెలుసుకొని పవిత్రమైన శీలంతో వెలుగొందుతున్నావు. నీ శీలము ఈ లోకములో ఎందరికో ఆదర్శము. ఈ లోక మంతా నీ అరిచేతిలో ఉన్నట్టు చూస్తూ సత్త్వరజస్తమో గుణములకు లోనుగాక, నిర్గుణత్వంతో వెలుగొందుతూ, ఆత్మావలోకనం చేస్తున్నావు. నీకు నువ్వే సాటి. నీకు కలిగిన ఈ దుర్దశ ఎంతో కాలం ఉండదు. నీకుమేలు కలుగుతుంది. నీకు పరమసుఖము కలుగుతుంది.౯ అని పలికి దేవేంద్రుడు అక్కడినుండి వెళ్లిపోయాడు. అమృతోపమాన మయిన బలి మధురమైన మాటలు, దేవేంద్రునకు అమృతం సేవించిన దానికంటే ఎక్కువ ఆనందం కలిగించాయి.౯ అని ధర్మరాజుకు భీష్ముడు కాల మహిమను గురించి వివరించాడు.౯ అని వైశంపాయనుడు జనమేజయునికి మహాభారత కధను చెప్పసాగాడు.

మహాభారతము

శాంతిపర్వము చతుర్థాశ్వాసము

సమాప్తము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహాభారతము

# శాంతి పర్వము

## పంచమాశ్వాసము(ప్రథమ భాగము)

వైశంపాయనుడు జనమేజయునకు మహా భారత కథను ఈ క్రింది విధంగా వినిపించసాగాడు.

భీష్ముడు ధర్మరాజు అడుగుతున్న ధర్మసందేహాలకు ఓపికగా సమాధానాలు చెబుతున్నాడు.  ఆ క్రమంలో ధర్మరాజు భీష్ముని ఈ విధంగా ప్రశ్నించాడు.

"పితామహా! ఈ దేహములో ఉన్న పురుషుడు ఏ కారణంగా శ్రీమంతుడవుతాడు. ఏ కారణంగా నశించి పోతాడు. వివరించండి." అని అడిగాడు.

" ధర్మ నందనా! ఈ సందర్భంలో నీకు శ్రీ(లక్ష్మీదేవి), చక్ర (ఇంద్రుడు)మధ్య జరిగిన సంవాదము అనే ఇతిహాసమును వినిపిం చెదను. నారదుడు లోక సంచారము చేయుచూ ఒకరోజు మందాకినీ నదిలో స్నానం చేసాడు. అప్పటికే ఇంద్రుడు ఆ నదిలో స్నానం చేసి అనుష్ఠానం తీర్చుకుం టున్నాడు. నారదుడు ఇంద్రుడు మాట్లాడుకుంటూ ఉంటే అక్కడకు ఒక స్త్రీ వచ్చింది. ఇంద్రుడికి నమస్కరించింది.

" నీవు ఎవరు? ఎక్కడకు పోతున్నావు?" అని అడిగాడు ఇంద్రుడు.

“ఓ ఇంద్రా! నేను తామర పూవునుండి పుట్టాను నా పేరు లక్ష్మి, శ్రీ, అంటారు.  నేను ఇప్పటిదాకా రాక్షసుల వద్ద ఉన్నాను. వారి ప్రస్తుత ప్రవర్తన నాకు నచ్చలేదు. అందుకని వారిని వదిలిపెట్టి  నీ వద్దకు వచ్చాను.”  అని చెప్పింది.

“అదిసరే! ఇప్పటి దాకా రాక్షసుల వద్ద ఉన్నావు కదా! వారిలో ఏ గుణములు నచ్చి ఇప్పటి దాకా వారి వద్ద ఉన్నావు?  ఇప్పుడు వారు ఎందుకు నీకు నచ్చలేదు. నిన్ను మెప్పించాలంటే నేను ఏమి చెయ్యాలి.” అని అడిగాడు.

“ఇంద్రా! ఇప్పటి వరకు అసురులు, దానములు, వేదాధ్యయనము, అతిధులను సన్మానించడం మొదలగు మంచి పనులు చేసారు. ఇప్పుడు వారికి గర్వం ఎక్కువ అయింది. ఆ మంచి గుణములు మాని వేసారు. అందుకని వారిని విడిచిపెట్టాను. నీవు సత్యధర్మపరుడవు అని తెలిసి నీ వద్దకు వచ్చాను.

గురువు ఎడల భక్తి కలవారు, దేవతలను, పితరులను పూజించేవారు, ఎల్లప్పుడూ సత్యమునే పలికేవారు, దానశీలురు,  ఇతరుల ధనమునకు కానీ, ఇతరుల భార్యలను కానీ  ఆశించని వారు, బ్రాహ్మణులను పూజించేవారు, పగలు నిద్రపోనివారు,  వృద్ధుల పట్ల, దీనుల పట్ల,  స్త్రీ ల పట్ల దయగల వారు, నిత్యము శుచి శుభ్రత కలిగినవారు, అతిధులకు భోజనము పెట్టిన తరువాతనే తాము భుజించేవారు, నాకు అత్యంత ప్రీతి పాత్రులు. నేను వారి వద్ద ఉండటానికి ఇష్టపడతాను.  అలా కాకుండా ధర్మమును వదిలి, కామము, క్రోధము మొదలగు వాటికి లోనైనవారు, గర్విష్టులు, అతిధి సత్కారములు చేయని వారు, పరులకు దానం చెయ్యని వారు, పరుషంగా మాట్లాడేవారు, క్రూరపు పనులుచేసేవారు, నాకు మెచ్చని వారు. వారి వద్ద  ఉండుటకు నేను

ఇష్టపడను.

వేదాలలో చెప్పబడినట్టు, బుద్ధి, ధృతి, నీతి, శ్రద్ధ, సన్నుతి, క్షమ, శాంతి, ఈ ఏడు మంది దేవతలు నాకు ప్రియులు. వారిలో నేను అష్టమ దేవతను. రాక్షసుల క్రూరస్వభావము చూచి వారిని వదిలిపెట్టాను. దేవతలు నాకు సంతోషం కలిగించే ప్రవర్తన కలవారని తెలిసి వారి వద్దకు వచ్చాను." అని చెప్పింది లక్ష్మీదేవి.

ఆ మాటలకు దేవేంద్రుడు, నారదుడు ఎంతో సంతోషించారు. లక్ష్మితో సహా ఇంద్రుడు స్వర్గపురికి వెళ్లాడు. కాబట్టి ధర్మరాజా! లక్ష్మీదేవి నివాస స్థానములు తెలుసుకొంటివి కదా. దానిని బట్టి నడుచుకో!" అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! జనులు దేనిని ఆచరిస్తే, ఏ ప్రకారంగా ప్రవర్తిస్తే, ఏ విద్య నేర్చుకుంటే, ముక్తిపొందుతారు." అని అడిగాడు ధర్మరాజు..

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు ఒక ఇతిహాసము చెపుతాను విను. పూర్వము జైగిషవ్యుడు అనే మహా ముని దేవలుడు అనే వానికి ఈ విధంగా చెప్పాడు. శాంతి మతులకు, సౌమ్యులకు ఏ ధర్మం వర్తిస్తుందో అదే నాకు ఇష్టము. ఆ ధర్మమును నీకు వివరిస్తాను. తనను పొగిడినా, తిట్టినా, తనకు ప్రియము చేసినా, అప్రియము చేసినా, తనను ఎవరైనా కొట్టినా లేక పూజించినా, అలాంటి వారి ఎడల సమభావంతో ఉండటం జ్ఞానుల లక్షణము. మనము కోరుకున్న వస్తువు ఏ కారణం చేతనైనా మనకు లభించక పోతే దానికి విచారించకూడదు. ఉన్నదానితో తృప్తి చెందాలి. తాను అనుకున్న పని జరగ లేదని చింతించకూడదు.

హర్షము, అభిమానము, అసూయ, మదము, తప్పుచెయ్యడం, మొదలగునవి చెడ్డ గుణములు. ఇంద్రియ నిగ్రహము కలవాడు తనకు అవమానం జరిగినా సన్మానం జరిగినట్టే భావిస్తాడు. తనకు సన్మానము జరిగినా దానికి ఎక్కువగా ఆనందించడు. సమత్వభావము కలిగి ఉంటాడు. ఇంద్రియ ములను అదుపులో పెట్టుకున్నవాడు మనశ్శాంతితో జీవిస్తాడు. దేవతలు కూడా అతనితో స్నేహం చెయ్యాలని కోరుకుంటారు." అని జైగీషవ్యుడు దేవలుడి తో చెప్పాడు అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

" ఓ పితామహా! అఖిల జనములకు ప్రియమైన వాడు ఎవరు?" అని అడిగాడు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు శ్రీకృష్ణునికి ఉగ్రసేనునికి జరిగిన సంవాదము వినిపించెదను. ఒక సారి ఉగ్రసేనుడు శ్రీకృష్ణుని ఇలా అడిగాడు.

"కృష్ణా! లోకంలో జనం అంతా నారదుని ఎంతో భక్తి ప్రమత్తులతో పూజిస్తారు కదా! అతను అంతటి వాడా. ఇంతకూ నారదుని లో ఉన్న గొప్పతనము ఏమిటి?" అని అడిగాడు.

శ్రీ కృష్ణుడు ఇలా చెప్పాడు. " నారదునిలో వేద విద్య, ఆచారము సమృద్ధిగా ఉన్నాయి కాని అహంకారము కొంచెంకూడా లేదు. శీలము ఎక్కువగా ఉంది కాని వేష భాషలలో నిరాడంబరంగా ఉంటాడు. ఇంకా నారదునిలో మత్సరము, గర్వము, మదము, మచ్చుకైనా లేవు. నారదుడు తన పుట్టుక చేత, చేసిన తపస్సుచేత, అతని తేజము చేత, బుద్ధి చేత, వినయము చేత, నీతి చేత ప్రసిద్ధి పొందాడు. నారదుడు ధీరుడు. మృదుమధురంగా

మాట్లాడతాడు. కాని అతనిలో కాఠిన్యము, దైన్యము, క్రోధము, లోభము, నిరాసక్తత చూద్దామన్నా లేవు. అసలు నారదుడికి ఈర్ష్య, అసూయ అనేవి ఎలా ఉంటాయో తెలియవు. కాబట్టి నారదుని లోకంలో ఉన్న జనులు అందరూ కీర్తిస్తారు." అని చెప్పాడు కృష్ణుడు. ధర్మజా! నీవు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇదే!" అని అన్నాడు భీష్ముడు.

" పితామహా! నాకు కాల విభజన గురించి, యుగప్రమాణముల గురించి, భూతములు ఎన్నిరకాలు? వాటి గురించి వివరించండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఈ విషయములను పూర్వము వేదవ్యాసుడు శుకుడికి చెప్పాడు. అవే విషయములను నీకు వివరిస్తాను.

కుమారా! ఈ కాలమునకు, పంచ భూతములకు ఆధారభూతంగా వెలిగే తేజోరూపము ఒకటి ఉంది. ఆ తేజస్సు ఎల్లప్పుడూ చైతన్యం వంతంగా ఉన్నట్టు కనిపిస్తుంది కానీ ఏ పనీ చెయ్యదు. కేవలం సాక్షీభూతంగా ఉంటుంది. ఆ తేజస్సు కేవలము భావన లోనే గోచరిస్తుంది.

ఇంక కాలప్రమాణముల గురించి చెబుతాను. 18 నిమిషాలు కలిస్తే ఒక కాష్ట అవుతుంది. 30 కాష్టలు ఒక కళ అవుతుంది. అటువంటి 360 కళలను ఒక ముహూర్తము అంటారు. అటువంటి 30 ముహూర్తములు ఒక అహో రాత్రము( ఒక రోజు) అవుతుంది. అలాంటివి 30 కలిస్తే ఒక మాసము అవుతుంది. అటువంటి రెండు మాసములు కలిసి ఒక ఋతువు అవుతుంది. అలాంటి ఋతువులు 6 అయితే ఒక సంవత్సరం అవుతుంది. అందులో

మూడు ఋతువులు కలిసి ఒక అయనము అంటారు. అవే ఉత్తరాయనము, దక్షిణాయనము.

యోగులు ఉత్తరాయనమును అగ్ని అనీ, దక్షిణాయనమును ధూమము అని అంటారు. మొదటిది మంచి చేస్తుంది. రెండవది చెడ్డ చేస్తుంది. ఈ భూమి మీద నివశించే మానవులకు ఒక నెల కాలము, చనిపోయిన పితరులకు ఒక దినము కింద సమానము. మానవులకు ఒక సంవత్సరము దేవతలకు ఒక రోజు కింద సమానము.

ఇంక యుగముల గురించి తెలియ చేస్తాను. దేవతలకు 12,000 సంవత్సరములు పూర్తి అయితే నాలుగు యుగములు గడిచినట్టు అవుతుంది.

అందులో మొదటిది కృతయుగము. దీని నిడివి 12,000 సంవత్సర ములలో పదింట నాలుగు భాగములు అనగా 4,800 సంవత్సరములు.

తరువాతది త్రేతాయుగము. 12,000 సంవత్సరములలో పదింట మూడు పాళ్లు. అనగా 3,600 సంవత్సరములు.

తరువాతది ద్వాపర యుగము. 12,000 సంవత్సరములలో పదింట రెండు పాళ్లు అనగా 2,400 సంవత్సరములు.

తరువాతది కలియుగము. అది 12,000 సంవత్సరములలో పదింట ఒక్కపాలు అనగా 1200 సంవత్సరములు.
(4800+ 3600+ 2400+1200=12,000).

పైచెప్పిన సంవత్సరములను 360 తో గుణిస్తే మానవ సంవత్సరములు

వస్తాయి.

(ఎందుకంటే మనకు 360 రోజులు అనగా ఒక సంవత్సరము, కాని ఆ కాల పరిమాణము  దేవతలకు ఒక రోజు అని పైన చెప్పుకున్నాముకదా. అందుకని దేవతా సంవత్సరములను 360 తో గుణిస్తే మానవ సంవత్స రములు వస్తాయి.)

ఆ ప్రకారంగా కృతయుగమునకు 17,28,000 సంవత్సరములు (4800**X**360=17,28,000); త్రేతాయుగమునకు 12,96,000 (3600**X**360=12,96,000); ద్వాపరయుగమునకు  8,64,000 సంవత్సరములు (2400**X**360=8,64,000); కలియుగమునకు 4,32,000 (1200**X**360=4,32,000). ఇవన్నీ మానుష సంవత్సరములు.

ఈ యుగముల మధ్య సంధి కాలమును సంధ్యలు, సంధ్యాంశములు అని అంటారు.  ఈ సంధి కాలములు దేవతల కాలమాన ప్రకారము  కృత యుగమునకు 400 సంవత్సరములు, త్రేతాయుగమునకు 300 సంవత్సరములు, ద్వాపర యుగమునకు 200 సంవత్సరములు కలియుగమునకు 100 సంవత్సరములు ఉంటాయి.  వీటిని మానుష సంవత్సరములలో గుణిస్తే కృత, త్రేత, ద్వాపర, కలియుగములకు వరుసగా 1,44,000 సంవత్సరములు, 1,08,000 సంవత్సరములు,  72,000 సంవత్సరములు, 36,000 సంవత్సరములు సంధ్యాకాలంగా పరిగణిస్తారు.

త్రేతాయుగము నుండి,  మానవులలో ధర్మము, న్యాయము,  ఆయువు, శరీర బలము, ధారుఢ్యము  యుగ యుగానికి, అంత కంతకూ సన్నగిల్లు తుంటాయి.

పైన చెప్పిన నాలుగు యుగాలు కలిసి ఒక మహా యుగము అవుతాయి. అటువంటి మహా యుగములు వెయ్యి అయితే బ్రహ్మకు ఒక పగలు అవుతుంది. అలాంటి వెయ్యి మహా యుగములు బ్రహ్మకు ఒక రాత్రి అవుతుంది. బ్రహ్మ నిద్రించే సమయంలో ఈ జగత్తుకు ప్రళయం సంభవిస్తుంది. నిద్ర లేవగానే బ్రహ్మ మరలా సృష్టికి పూనుకుంటాడు. ఇలా సృష్టి క్రమం సాగి పోతూ ఉంటుంది.

( ఇక్కడ మనం అందరం ఒక విషయం గమనించాలి. ప్రతి రోజూ మనం అందరం రాత్రి పూట కళ్లు మూసుకొని నిద్రపోతాము. అప్పుడు మన జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు పని చెయ్యవు. కళ్లు మూసు కుంటాము కాబట్టి ఈ ప్రపంచం మనకు కనపడదు. అంతా అంధకారము. అదే ప్రళయము. ప్రొద్దున కళ్లు తెరవగానే ప్రపంచం మొత్తం మనముందు సాక్షాత్కారం అవుతుంది. అంటే మన ప్రపంచాన్ని మనం సృష్టించు కున్నాము అన్న మాట. ఎవరికి వారే బ్రహ్మ. అహం బ్రహ్మోస్మి. నేనే బ్రహ్మను. ఈ ప్రకారంగా ప్రతిరోజూ మన జీవితంలో కూడా ప్రళయం సంభవిస్తూ ఉంటుంది. విధి వశాత్తు రాత్రి పడుకొని పొద్దున లేవకపోతే అదే మృత్యువు. శాశ్వత నిద్ర.)

ఈ బ్రహ్మ తత్త్వమునుండి ముందు మహత్తత్వము పుట్టింది. మహత్తత్వము నుండి క్రమంగా మనస్సు, గగనము, పవనము, అగ్ని, నీరు, భూమి ఒకదాని నుండి ఒకటి ఉద్భవించాయి. ఈ పంచ భూతములకు శబ్ద, స్పర్శ, రస, రూప, గంధములు గుణములుగా భాసిల్లుతున్నాయి. ఈ సప్త స్వరూపములను పురుషులు అంటారు. వారందరూ సమిష్టిగా సృష్టికార్యమును నిర్వర్తిస్తారు.

మనలో ఉన్న పురుషుడు అనే తేజోరూపమును బ్రహ్మము అనీ, ప్రాజాపత్యము అనీ అంటారు. ఆ పురుషుడు సత్యమై, నిత్యమై ప్రకాశిస్తూ ఉంటాడు. ఆ పురుషుడే సర్వవ్యాపకుడు, స్రష్ట, బ్రహ్మ, ప్రజాపతి అనే పేర్లతో పిలువ బడతాడు.

ఆ పురుషుడు నిత్య సత్యము అయిన ఆత్మ స్వరూపుడు. పురుషునికి ఏది అంటదు. ఆ పురుషుడు దేవతలలో, మునీంద్రులలో, గరుడ (పక్షులు), ఉరగ (పాములు), నర(మనుష్యులు), కిన్నర, గిరి(పర్వతములు), సరిత్ (నదులు), వన(అడవులు), పయోధులలో (సముద్రములలో) నిండి ఆయా కార్యములు నిర్వర్తిస్తూ ఉంటాడు. (అంటే సర్వ వ్యాపి అని అర్థం.)

ఇంక మనుష్యుల స్వభావాలు విచిత్రంగా ఉంటాయి. కొంతమంది తాము చేసిన ప్రయత్నముల వలననే తమకు ఫలితము లభిస్తుంది అను కొంటారు. మరి కొందరు తమకు దేవుడే అన్ని ఫలితములు ఇస్తాడు అని అనుకొంటారు. మరి కొందరు ఈ పంచభూతముల వలననే మన కార్యములు నెరవేరుతున్నాయి అని అనుకొంటారు. ఇంక సాత్త్వికమైన కర్మలు చేసేవాళ్లు అన్నింటినీ సమానం గా చూస్తారు. సుఖ దుఃఖములకు లోను గారు.

అన్నిటి కన్నా తపస్సు మేలైనది. ఈ తపస్సుకు ఇంద్రియ నిగ్రహము, మానసిక శాంతి ముఖ్యమైనవి. ఇంకా స్వాధ్యాయము అనగా వేదాధ్యయనము ఈ తపమునకు బలము చేకూరుస్తుంది. మంచి ఫలితాలను ఇస్తుంది.

ఈ బ్రహ్మములు రెండు రకాలు. శబ్దబ్రహ్మము, పర బ్రహ్మము. సాధకుడు ముందు శబ్ద బ్రహ్మమును సేవించి తరువాత పరబ్రహ్మ పదమును

పొందుతాడు. ఈ పరబ్రహ్మమే జగత్తును సృష్టిస్తుంది. లయం చేస్తుంది. కాని తాను మాత్రం ఏ క్రియలో పాల్గొనదు.

కుమారా! ఇప్పటి దాకా సృష్టి గురించి చెప్పాను. ఇంక లయం గురించి చెబుతాను. ప్రళయ కాలంలో, ఈ భూమి మీద ఉండే చరా చర జీవ రాసులు ఈ భూమిలో కలిసి పోతాయి. అంటే మట్టితో తయారైన ఈ శరీరాలు మరలా మట్టిలోనే కలిసిపోతాయి. తరువాత ఈ భూమి మొత్తం జలమయం అవుతుంది. ఆ జలం అగ్నిలో కలిసిపోతుంది. అగ్ని వాయు రూపం దాలుస్తుంది. ఆ వాయువు ఆకాశంలో కలిసిపోతుంది. ఆ ఆకాశాన్ని మనస్సు లాగేసుకుంటుంది. ఆ మనస్సు చంద్రుడిలో లీనమై పోతుంది. మనస్సులో పుట్టిన సంకల్పాలు ఆ చంద్రుడిని తమలో లీనం చేసుకుంటాయి. ఆ సంకల్పాలను జ్ఞానం తనలో ఇముడ్చుకుంటుంది. ఆ జ్ఞానం కాలంలో కలిసిపోతుంది. తరువాత ఆ కాలం కూడా నశిస్తుంది. ఆఖరున శుద్ధసత్త్వ స్వరూపమైన అఖండ జ్ఞానము వెలుగుతూ ఉంటుంది. దానినే బ్రహ్మము అంటారు. ఈ సంహరణ కార్యక్రమము అంతా బ్రహ్మ వలన జరుగుతుంది." అని చెప్పాడు వ్యాసుడు.

ఇంకా శుకునితో వ్యాసుడు ఇలా అన్నాడు. "కుమారా! బ్రాహ్మణుడు పుట్టగానే జాతక కర్మ (నామకరణం) చేస్తారు. తరువాత ఉపనయనం చేస్తారు తరువాత అతడు గురువు వద్దకు వెళ్లి వేదములు, శాస్త్రములు నేర్చుకుంటాడు. ఆ ప్రకారంగా గురువు ఋణం తీర్చుకుంటాడు. తరువాత, గురువుగారి అనుజ్ఞతో వివాహము చేసుకొని గృహస్థాశ్రమము స్వీకరిస్తాడు. గృహస్థాశ్రమం లో దేవఋణము, పితృఋణము తీర్చుకుంటాడు.

బ్రాహ్మణులకు యజ్ఞములు చేయడం, చేయించడం, వేదములు

అధ్యయనం చెయ్యడం, వేదములు ఇతరులకు బోధించడం, దానములు చెయ్యడం, దానము స్వీకరించడం,  ఈ ఆరు కర్మలు బ్రాహ్మణులు చేయదగినవి.

దానం చెయ్యడం అన్ని జాతులవారుచెయ్యదగిన పని. దానమునకు అర్హము కాని వస్తువు లేదు. కాశ్యుడు అనే రాజు తన ప్రాణములను దానంగా ఇచ్చి ఒక బ్రాహ్మణుని ప్రాణాలు కాపాడాడు. శిబి చక్రవర్తి తన శరీర అవయవములను, తన కుమారుని బ్రాహ్మణులకోసం అర్పించాడు. కాశీరాజు ప్రత్యర్థనుడు  ఒక బ్రాహ్మణుని కొరకు తన కళ్లు దానం చేసాడు.

(శరీర అవయవములను, కళ్లను,  దానం చెయ్యడంమనకు అనాదిగా వస్తున్న  ఆచారం, సంప్రదాయం).

జనక మహారాజు, పరశు రాముడు, గయుడు తమ తమ రాజ్యములను బ్రాహ్మణులకు దానంగా ఇచ్చారు. పాంచాల రాజు బ్రహ్మదత్తుడు  శంఖనిధిని బ్రాహ్మణులకు దానం చేసాడు  ఇంకా బ్రాహ్మణుల కొరకు తమ తమ ప్రాణములను, శరీరములను, మణులను, బంగారమును, కన్యలను, ఆవులను మొదలగు ప్రశస్త మైన వస్తువులను అనేకులు దానంగా ఇచ్చారు. వారి కందరికీ  ఉత్తమ గతులు కలిగాయి.

దానం చెయ్యడం వలన, వేదములు అధ్యయనము చెయ్యడం వలన, యజ్ఞములు చెయ్యడం వలన నానావిధములైన పాపములు వినాశమవుతాయి. కాబట్టి దానగుణమును ఆచరించడం ఉత్తమము.

ఆ ప్రకారంగా పాపములను పోగొట్టుకొన్న పవిత్రమైన మానవుడు

మితంగా భోజనం చేస్తూ, ఇంద్రియములను నిగ్రహించి, తన మనస్సులోకి కామమును క్రోధమును రానీయకుండా బ్రహ్మపదము కొరకు ప్రయత్నించాలి. ఇలాంటి వాడు ఇంద్రియాలకు లోబడకుండా, లోభమునకు, కోపమునకు లోను కాకుండా, ఈ భయంకరమైన సంసార మనే నదిని ఈది అవతల ఒడ్డుకు చేరతాడు. బుద్ధిమంతుడు ఈ సంసారమనే నదిని దాటడానికి ప్రజ్ఞ అనే నావను ఉపయోగిస్తాడు. ఎవరికైతే సంతోషము, కోపము, భయము లేవో, ఎవరికైతే ధైర్యము, అప్రమత్తత, బుద్ధి అపరిమితంగా ఉంటుందో, ఎవడైతే ధర్మము తప్పడో, ఎవడైతే ఇంద్రియము లను నిగ్రహిస్తాడో అట్టి వాడికి నాశనము అంటూ లేదు.

ఒక్కొక్కసారి మనం చేసే ధర్మపరమైన పనులు అధర్మంగా తోస్తాయి. అలాగే అధర్మమైన పనులు ధర్మంగా తోస్తాయి. ఈ సందర్భంలో శాస్త్రములను పరిశీలించి ధర్మనిర్ణయం చెయ్యాలి. బుద్ధిమంతులు జ్ఞానము సముపార్జిం చుటకు తమ వాక్కును, మనస్సును నియంత్రించుకుంటారు. వాడు వేదవిదుడైనా సరే, వేదములు చదవక పోయినా సరే, ధర్మాత్ముడైనా సరే పాపాత్ముడైనా సరే, పైన చెప్పిన పద్ధతులు పాటిస్తే, అతడు జర, మరణములతో కూడిన ఈ సంసార సాగరాన్ని అవలీలగా దాటుతాడు.

యోగము అనే రథమునకు సదాచారము అనేది చక్రము. ప్రాణము అనేది కాడి కొయ్య. అపానము అక్షము (చక్రములకు ఇరుసు). ఉపాయము, అపాయము అనేవి నొగలు. జ్ఞానేంద్రియాలు హయములు. సర్వ తంత్రము అనేది అశ్వములను తోలు చర్నాకోలు. త్యాగము అనేది పగ్గములు. సాధకుడు ఈ యోగరథమును ఎక్కి మోక్ష మార్గమున పయనిస్తాడు. క్రమ క్రమంగా పంచభూతములను గెలుస్తాడు. తనలో ఉన్న అహంకారాన్ని పక్కకు తోస్తాడు. బుద్ధిని పెంపొందించుకుంటాడు. ప్రకృతి సిద్ధములైన వికారములను

పోగొట్టుకుంటాడు. ఈ పురుషుడు భూమిని జయిస్తాడు అంతకంతకూ వృద్ధి చెందుతాడు. చివరకు యోగసిద్ధిని పొంది ప్రకాశిస్తాడు. మానవుడు తనలో ఉన్న అహంకారమును జయిస్తే అది పంచభూతములను, మనస్సును, బుద్ధినీ జయించే సంస్కారమును ప్రసాదిస్తుంది . ఇది యోగ పద్ధతి.

ఇంద్రియములను ప్రపంచములోని విషయముల మీదికి పోనీయ కుండా, మనస్సును అంతర్ముఖం చేసి ఆత్మతో అనుసంధానం చెయ్యడమే సాంఖ్యము అంటారు. సాంఖ్యము, యోగము రెండూ ఒకటే. వేరు కావు. సారం లేని ఈ సంసారానికి కారణం మమతలు, మమకారాలు. సాంఖ్యులకు, యోగులకు మమతలు, మమకారాలు వదలడం ముఖ్యం.

ఇంక ఈ భూతములలో (జీవులలో) తారతమ్యములు చెప్పెదను విను. జీవులు రెండు రకములు. కదలనివి, కదిలేవి (స్థావరములు, జంగమ ములు). వీటిలో కదిలేవి శ్రేష్టమైనవి. ఈ జీవులు వీర్యము, అండము, బీజము, చెమట మొదలగు వాటినుండి పుడతాయి. వీటిలో కొన్ని రెండు కాళ్లతోనూ మరి కొన్ని నాలుగు కాళ్ల తోనూ ఇంకా మరి కొన్ని చాలా కాళ్లతోనూ పుడతాయి.

ఈ జీవులలో రెండు పాదములతో ఉన్న మానవులు మేలు. ఈ మనుష్యులలో జాతి, ధర్మమును అనుసరించే వారు ఎక్కువ. వారిలో బ్రాహ్మణులు ఉత్తములు. ఆ బ్రాహ్మణులలో వేదాధ్యయనము చేసిన వారు గొప్పవారు. వేదాధ్యయనము చేసిన బ్రాహ్మణులలో వేదమును ఇతరులకు ప్రవచనము చేయు వారు ఇంకా గొప్పవారు. ఆ ప్రకారంగా ప్రవచనము చేసే వారిలో ఆత్మజ్ఞానము కలిగిన వారు శ్రేష్ఠులు. అటువంటి వారు స్వధర్మమును పాటించేవారు, మంచి సంకల్పము కలిగినవారు, దైవారాధకులు అయి

ఉంటారు. అటువంటి వారినే బ్రాహ్మణులు అని అంటారు.

అలాంటి వారు అందరి చేత నమస్కారములు, ఆదరము పొందుతారు. అటువంటి వారితో సమానమైన వారు భూమి మీద ఎవరూ ఉండరు. అటువంటి బ్రాహ్మణులను ఆధారం చేసుకునే ఈ జగము ధర్మమార్గంలో నడుస్తూ ఉంది. అటువంటి బ్రాహ్మణుడు ఎలా ప్రవర్తిస్తాడో చెబుతాను విను.

అతడు నిర్మలమైన జ్ఞానమును కలిగి ఉండాలి. నిష్కాగరిష్ఠుడై ఉండాలి. తనకు వేదము విధించిన కర్మలను నిష్ఠతో నెరవేర్చాలి. అలాంటి వాడికి ఎలాంటి సందేహములు ఉండవు. నిర్మలమైన మనస్సుతో జీవిస్తాడు. ఈ చరాచర జగత్తును ఎవరు సృష్టించారో ఆ మహా తత్త్వాన్ని చేరుకోడానికి తపస్సును మించిన సాధనము లేదు. బ్రాహ్మణులకు మైత్రి వంటి ధర్మము మరొకటి లేదు. మైత్రి అనే ధర్మమును సక్రమంగా పాటిస్తే ఇంక ఏ కర్మలను చేయనవసరం లేదు. మైత్రీ ధర్మము వివేకమును ఇస్తుంది." అని వ్యాసుడు శుకునితో చెప్పాడు.

అప్పుడు శుకుడు వ్యాసునితో ఇలా అన్నాడు. "ఓ మునీంద్రా! పరమ బ్రహ్మ పదమును పొందుటకు సాధనము ఏది? యజ్ఞములా! జ్ఞానమా! యోగాభ్యాసమా! సాంఖ్యమా! వీటిలో ఏది ముఖ్యమో తెలపండి." అని అడిగాడు. వ్యాసుడు ఇలా చెప్పసాగాడు.

" నీవు చెప్పినవి అన్నిమేలే. తపస్సు, ఇంద్రియ నిగ్రహము, రాగ ద్వేషములను, లోభములను పక్కకు నెట్టే నేర్పు, ధృఢమైన విద్య, వీటి వలన కూడా పురుషుడు బ్రహ్మపదమునుపొందగలడు. ప్రయత్నిస్తే మనస్సును నిగ్రహించవచ్చును. మనస్సు నిలకడగా ఉంటే ఇంద్రియములు పనిచెయ్యడం మాని వేస్తాయి. అప్పుడు బ్రహ్మ ప్రాప్తి పొందడం సాధ్యమవుతుంది.

బుద్ధి మనకు కనపడదు. వినపడదు. కాని బుద్ధి వలన మనము పరమాత్మను చూడగలము, తెలుసుకోగలము. వినయము, విద్య కల బ్రాహ్మణుడి యందును, ఆవులయందును, ఏనుగు నందును, వీధి కుక్క యందును, ఆ కుక్కను చంపి తినే వాళ్ల యందును, సమ దర్శనము కలవారు పరబ్రహ్మ ప్రాప్తికి అర్హులు. ఈ చరాచర జగత్తులో ఉన్న అన్ని జీవరాసులలో భగవంతుడు ఆత్మస్వరూపుడై వెలుగుతూ ఉంటాడు. కాని ఆ పరమాత్మలోనే అన్ని జీవ రాసులు నిండి ఉన్నాయి. ఈ సత్యము తెలుసుకున్నవాడు పరబ్రహ్మపదమును పొందుతాడు.

ఈ ఆత్మ క్షరమ్మైనది-- అక్షరమ్మైనది. క్షరము అంటే ప్రతి జీవిలో మృత్యువు పొంచి ఉంటుంది అందుకే అది క్షరమ్మైంది. అక్షరమనగా స్వర్గలోక ప్రాప్తి. అమృతము. పండితుడ్డైన వాడు ఈ రెంటినీ సమంగా చూస్తాడు. ఈ లోకముల నన్నింటినీ కాలము శాసిస్తుంటుంది. కాని ఎవడ్డైతే ఈ కాలాన్ని జయిస్తాడో, వాడు పరబ్రహ్మ పదమును పొందుతాడు.

ఈ శరీరము తొమ్మిది ద్వారములు కల ఒక పురము. అందులో ఆత్మ వెలుగుతూ ఉంటుంది. యోగులు ఆ ఆత్మను అక్షరము, అమృతము అంటారు. ఆ ఆత్మ తత్త్వమును, సత్కర్మలు చేస్తూ, వైరాగ్యంతో జీవించే యోగి మాత్రమే తెలుసుకొనగలడు. అటువంటి యోగులకు కామము, క్రోధము, భయము, నిద్ర, లోభము నిందితములు(అనుసరించకూడనివి). యోగులు వాటిని వెంటనే వదిలివేయవలెను.

పండితుడ్డైన వాడు, కామ సంబంధమ్మైన సంకల్పములను, కోరికలను వదిలిపెట్టి కామమును జయిస్తాడు. సత్త్వగుణ సంపదతో నిద్రను మోహము

ను జయిస్తాడు. గురువులను, పెద్దలను, పండితులను సేవించడం వల్ల లోభము వదిలేస్తాడు. ఇంద్రియములను నిగ్రహించి కోపమును జయిస్తాడు ధృడమైన మనస్సుతో భయాన్ని జయిస్తాడు. ఏ ఒక్క ఇంద్రియము అదుపు తప్పినా, యోగి సంపాదించిన ప్రజ్ఞ మొత్తం నాశనం అవుతుంది. కాబట్టి ముందు మనస్సును అదుపులోపెట్టుకోవాలి. తరువాత ఇంద్రియములను నిగ్రహించాలి. ప్రజలు తన్ను సన్మానించినా, తనను ద్వేషించినా పట్టించుకోకుండా సమబుద్ధి కలిగి ఉండాలి. జనావాసములలో ఉంటే ఇలాంటి వాటికి అవకాశం ఉంటుంది కాబట్టి యోగి జనావాసములు వదిలి అరణ్యములకు పోయి, అక్కడు కొండ గుహలలో నివసిస్తూ సాధన చేయాలి. ఇంకా యోగి అయిన వాడు విలువైన బంగార మును విలువ లేని మట్టి బెడ్డను సమంగా చూడాలి.

కర్మమార్గమును ప్రవృత్తి మార్గమనీ, నిష్కర్మ మార్గమును నివృత్తి మార్గమనీ అంటారు. ప్రవృత్తి మార్గము ఇహలోక బంధములను కలిగిస్తుంది. నివృత్తి మార్గము ఆ బంధముల నుండి మనసును విడుదలచేస్తుంది. కాబట్టి జ్ఞానులు కర్మమార్గమును విడిచిపెట్టి జ్ఞాన మార్గమును అనుసరిస్తారు. కాని కొందరు కర్మ మార్గమేమంచిది అంటారు.అందుకే, వారు జనన మరణముల బారి నుండి తప్పించుకోలేరు. కర్మయోగము వలన చిత్త శుద్ధి కలుగుతుంది. కాని అది అవిద్య, మాయకు లోబడి ఉంటుంది. కాబట్టి కర్మలను త్యాగము చెయ్యడమే మోక్షమునకు మార్గము." అని చెప్పాడు వేదవ్యాసుడు.

శుకుడు తండ్రిని చూచి "తండ్రీ!విద్య ఎట్టివారికి అలవడుతుంది చెప్పండి." అని అడిగాడు. దానికి వ్యాసుడు ఇలా చెప్పసాగాడు.

"అరణ్యములలో వానప్రస్థులు జీవిస్తారు. అలాంటి వారు బిక్షాటనతో

జీవించాలి. ప్రజల మధ్య తిరగడం మానెయ్యాలి. మానము, అవమానము సమంగా భరించాలి. అప్పుడు అధ్యాత్మ విద్య  అలవడుతుంది." అని చెప్పాడు వ్యాసుడు.

"తండ్రీ!  ఎలాంటి వాడి కైనా అన్ని కర్మలను విడవడం సాధ్యం కాదు అని అంటారు కదా! మరి అలాంటి వారి సంగతి ఏమిటి?" అని అడిగాడు శుకుడు.

"కుమారా! బ్రహ్మ చారులు, గృహస్థులు, వానప్రస్థాశ్రమములో ఉన్న వారు, యతులు, వారి వారికి విధించిన కర్మలను నిర్వర్తించాలి. మోక్ష మార్గము నకు ఈ నాలుగు ఆశ్రమములు నాలుగు మెట్ల వంటివి.  మనిషి శతాయువు అనుకుంటే అందులో నాల్గవ వంతు అనగా మొదటి 25సంవత్సరములు బ్రహ్మచర్య ఆశ్రమములో గడప వలెను. గురువుగారికి సేవలు చేస్తూ  వేద విద్య నభ్యసించవలెను. బ్రహ్మచర్యము పాటించునపుడు విషయ వాంఛలకు దూరంగా ఉండాలి.

విద్యాభ్యాసము పూర్తి అయిన తరువాత గురువుగారికి వినయంగా గురుదక్షిణ సమర్పించుకొని, గురువు గారి అనుమతి పొంది, వివాహం చేసుకోవాలి.  యజ్ఞయాగములు చెయ్యాలి.  అతిథులకు సత్కారములు చెయ్యాలి. బంధువులను ఆదరించాలి.  ఎల్లప్పుడూ సత్యమునే పలకాలి. భార్యను పుత్రులను ఆదరించాలి. పుత్రుని విద్యావంతుని చెయ్యాలి. ఇలా మరొక 25 ఏళ్లు గడపాలి.

తరువాత వానప్రస్థమునకు వెళ్లాలి. అంటే అరణ్యములకు వెళ్లాలి. అడవులలో కందమూలములు తింటూ, అక్కడ ఉన్న తాపసులను సేవిస్తూ,

వారికి పెట్టి మిగిలిన ఆహారమును తింటూ, తపస్సుచేసుకుంటూ 25 ఏళ్లు గడపాలి.

తరువాత, ఆఖరు 25 ఏళ్లు సన్యాసాశ్రమములో గడపాలి. సన్యాస ఆశ్రమమును స్వీకరించిన తరువాత కర్మలు విడిచి పెట్టాలి. ఎవరితోనూ పోట్లాటపెట్టుకోకూడదు. ఎవరి వద్దనుండి ఏమీ స్వీకరించకూడదు. తలను నున్నగా గొరిగించుకోవాలి. చెట్టు కింద నివసించాలి. జనావాసములలోకి వెళ్లరాదు. ఒంటరిగా జీవించాలి. కామానికి క్రోధానికి లోబడకూడదు. తనను ఎవరైనా స్తుతించినా, నిందించినా దానిని సమంగా స్వీకరించాలి. ఏది దొరికితే అది తిని ఎక్కడ బడితే అక్కడ నిద్రపోవాలి. సకల ప్రాణుల ఎడల భూత దయ కలిగి ఉండాలి. అలాంటి వాడు యతి అని పిలువ బడతాడు." అని చెప్పాడు వ్యాసుడు.

తరువాత వ్యాసుడు అంతర్యాగము గురించి వివరించాడు.

"కుమారా! అంతర్యాగము చేసే యోగి తన ప్రాణములను తన అంతరాత్మలో హోమం చేస్తాడు. అప్పుడు అతనికి పాపములన్నీ తొలగి పోతాయి. ఆత్మ అనేది ఒక పక్షి వంటిది. అది భూమి మీద వాలదు. ఆకాశంలో ఎవరికీ కనపడకుండా ఎగురుతుంటుంది. అది గుడ్డులోనుండి పుడుతుంది. కేవలం యోగులు మాత్రమే దానిని చూడగలరు.

ఈ కాలము ఒక చక్రం లాంటిది. దానికి 6 ఋతువులు అంచులుగా ఉంటాయి. 12 మాసములు పదునైన పళ్లు గా ఉంటాయి. ఆ కాల చక్రము విశ్వమంతా వ్యాపించి గిర గిరా తిరుగుతూ ఉంటుంది. మన శరీరములో ఉండే జీవుడు ఒక రథము. దానికి గుర్రములు ఇంద్రియములు. మనస్సు దానిని

నడిపేవాడు. ఇంద్రియములు అనే గుర్రములు అదుపు తప్పితే రధము దారి తప్పుతుంది. అందుకని ఇంద్రియములను అదుపులో ఉంచుకోవాలి.

మోక్షమును కోరు యోగి సర్వ సంకల్పములను విడిచిపెట్టాలి చిత్తమును సత్త్వగుణములో నిలపాలి. మితంగా ఆహారము తీసుకోవాలి. అప్పుడు గాలి లేని చోట పెట్టిన దీపము మాదిరి చిత్తము చాంచల్యము లేకుండా ప్రకాశిస్తుంది. కుమారా! శుక మునీంద్రా! వేదాంత సారమును మధించి ఆ వెన్నను నీకు ఇచ్చాను. నీవు దానిని యోగ్యులకు ఇవ్వు. ఎందుకంటే అన్ని దానములలో కి విద్యాదానము శ్రేష్టమైనది. నేను నీకు చెప్పిన వేదాంత విద్యాసారాన్ని నీవు యోగ్యులకు పంచిపెట్టు. నీకు ఇంకా ఏమన్నా సందేహ ములు ఉంటే అడుగు." అని అన్నాడు వ్యాసుడు.

"తండ్రీ! ఇప్పటిదాకా విన్నదే నాకు సరిగా అర్థము కాలేదు. ఇంకా వివరంగా చెప్పండి." అని అడిగాడు శుకుడు. వ్యాసుడు ఇలా చెప్పసాగాడు.

"ఈ సృష్టి కర్త పంచ భూతములలో అంతటా తానే నిండి ఉండి వాటిని ఆ లోకములో ప్రసరింప చేస్తాడు. మరలా ఆ పంచ భూతములను తనలో లీనం చేసుకుంటాడు. ఈ కార్యము నిరంతమూ సాగుతూనే ఉంటుంది. తాబేలు తన అవయవములను ఎలా తనలో ఇముడ్చు కుంటుందో అలాగే సృ ష్టి కర్త ఆ సృష్టిని తనలో లయం చేసు కుంటాడు. పరమాత్మను మాయ ఆవరించినపుడు ఈ సృష్టి జరుగుతుంది. ఆ మాయ వదిలి పోగానే సృష్టి అంతా పరమాత్మలో లయం అవుతుంది.

పంచ భూతములు వాటి గుణములు, ఇంద్రియములు, విషయములు సృష్టింపబడతాయి. మనకు జ్ఞానేంద్రియములు ఐదు, మనస్సు ఆరవది,

బుద్ధి ఏడవది. ఇంక  ఎనిమిదవ వాడుగా జీవుడు (క్షేత్రజ్ఞుడు) ప్రకాశిస్తుంటాడు.  ఈ మనస్సు లో తలంపులు కలుగుతాయి. ఆ తలంపుల మంచి చెడ్డలను బుద్ధి నిర్ణయిస్తుంది. ఆ తలంపులను ఇంద్రియములు ఆచరిస్తాయి. ఈ ప్రక్రియ నంతా క్షేత్రజ్ఞుడు అనే అంతరాత్మ సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది.

స్వస్థతతో ఉండటం సత్త్వగుణ లక్షణము.  ఎల్లప్పుడూ దుఃఖంతో ఉండటం రజోగుణ లక్షణము.   ఏ పనీ చేయకుండా సోమరిపోతుగా ఉండటం తమోగుణ లక్షణము.  ఈ గుణాల ఆధారంగానే ఇంద్రియములు పనిచేస్తూ ఉంటాయి.  ఇంద్రియములు, విషయములు, మనసు, బుద్ధి, ఆత్మ క్రమంగా ఒకదాని కంటే ఒకటి ఎక్కువ. బుద్ధి అన్నింటిలోనూ విస్తరించి ఉంటుంది. కళ్లతో చూచినా, చెవితో విన్నా, నాలుకతో రుచి చూచినా, ముక్కుతో వాసన చూచినా, చర్మంతో స్పర్శించినా, ఈ పనులన్నీ ఆయా ఇంద్రియముల ద్వారా బుద్ధి నిర్వర్తిస్తుంది.  ఈ బుద్ధి ఒక సారి సంతోషంతో పొంగి పోతుంది.మరొక సారి దుఃఖంతో కుంగి పోతుంది. మరొకసారి సుఖదుఃఖములు లేకుండా నిశ్చలంగా ఉంటుంది.  ఈ బుద్ధి స్వభావము ఎరిగిన సాధకుడు, ఇంద్రియముల మీద ఆసక్తి వదిలి,  ఆత్మ దర్శనము చేసుకుంటే అతనికి సుఖము, దుఃఖము కలుగవు.

అత్తి పండులో ఎన్ని పురుగులు ఉన్నా ఆ పండుకు ఏ హానీ కలగ నట్టు, ఆత్మలో ఎన్ని విషయవాంఛలున్నా, అవి ఆత్మకు అంటవు. సాలెపురుగు తనలో నుండి దారమును సృష్టించి నట్టు, సత్త్వ,రజస్తమోగుణములు సుఖదుఃఖము లను కలిగిస్తుంటాయి. కాని  ఆత్మ వాటిని సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది. ఆత్మ నాశనము లేనిది కాబట్టి పురుషుడు సత్త్వరజస్తమోగుణములను వదిలి ఆత్మానుసంధానము చేసుకుంటే మోక్షమును పొందుతాడు.

బ్రాహ్మణునికి ఇంద్రియ నిగ్రహము ఒకసంపద లాంటిది. ఇంద్రియ నిగ్రహము కల బ్రాహ్మణునికి భయము, శోకము, గర్వము, సంతోషము కలుగవు. మనస్సును నిగ్రహించడం, ఆత్మ గురించి తెలుసుకోడం ఈ రెండు వివేక వంతుల లక్షణములు. ఈ రెండు లక్షణములతో మోక్షసాధన చెయ్యవచ్చు." అని చెప్పాడు వ్యాసుడు.

అప్పుడు శుకుడు తండ్రితో "ధర్మముల కెల్ల పరమము అయిన ధర్మము ఏది?" అని అడిగాడు. దానికి వ్యాసుడు ఇలా చెప్పసాగాడు.

"ఇంద్రియ నిగ్రహము, ఏకాగ్రత అన్నింటి లోకి ఉత్తమ మైన ధర్మము. మనసుతో ఇంద్రియములను నిగ్రహించి తరువాత బుద్ధిని దానికి అనుసంధానము చెయ్యాలి. అప్పుడు పరతత్త్వమును దర్శిస్తావు. మొక్కలు తమ కు పూచిన పూలను తాము వాసన చూడలేవు. వృక్షములు తమకు కాచిన ఫలములను తాము ఆస్వాదించలేవు. అలాగే, మనలో ఉన్న అంతరాత్మ తన నిజ స్వరూపమును చూడలేదు. పైన చెప్పినట్టు ఇంద్రియనిగ్రహంతో మనస్సును బుద్ధితో అనుసంధానం చేసి పరతత్త్వమును దర్శించాలి. శాంతిని పొందాలి.

మనిషి పతనానికి మూలం లోభం. అది ఎప్పుడు ఎలా పుట్టిందో తెలియదు. లోభము అనే మడుగుకు సంకల్పము అనేది గట్టు. క్రోధము దానిలో ఉండే బురద. కోరికలు ఆ మడుగులో సంచరించే పాములు. ఆ మడుగు మోహము అనే గడ్డి, మొక్కలు, నాచు తో కప్పబడి ఉంటుంది. దానిని మామూలు అజ్ఞానులు కనుగొనలేరు. సత్యము అనే సాధనంతోనే ఆ మడుగు నిజస్వరూపమును కనుగొనగలరు. కాబట్టి నీవుకూడా ఆ లోభమునకు లోను

గాక ప్రసన్నతా త్ముడవై కొండ మీద ఉన్నవాడుకింద ఉన్న అందరినీ ఎలా చూడగలడో నీవు కూడా అలాగే ఈ లోకమును దర్శించుము. కాబట్టి అన్ని ధర్మములలోకి ఇంద్రియ నిగ్రహము ఉత్తమమైన ధర్మము.

కుమారా! బ్రాహ్మణత్వము వేదవేదాంగములు చదివినా, యజ్ఞయాగ ములు చేసినా సిద్ధించదు. కేవలం ప్రశాంతితోనే బ్రాహ్మణత్వముసిద్ధిస్తుంది. పరులకు భయపడకుండా, తనను చూచి పరులు భయపడకుండా, సమదృ ష్టితో జీవించే వాడే బ్రాహ్మణుడు. బంధములలో కెల్లా పెద్ద బంధము కామము. కామాన్ని వదిలిపెడితే మబ్బువీడిన చంద్రుడి మాదిరి ఆత్మ ప్రకాశిస్తుంది. కామాన్ని జయించి పరతత్త్వోపాసనా తత్పరుడైన పురుషుడు సుఖము, వృద్ధి పొందుతాడు.

ఇది నాది అనుకోకుండానే ఏది మనకు ప్రియముకలిగిస్తుందో, దేనిని తినకుండానే మనకు తృప్తి కలుగుతుందో, దేని పొందు లేకుండా మనకు బలం కలుగుతుందో, అటువంటి దానిని(పరమాత్మను) వేదాలసహాయంతో దర్శించాలి. విషయ వాంఛలూ, కర్మ బంధనములూ, సత్త్వరజస్తమోగుణములు వదిలిన బ్రాహ్మణునికి ముసలి తనము లేదు. మృత్యువు అతని దరి చేరదు. ఈ దేహము వేరు. ఇందులో ఉండే దేహి ( సూక్ష్మరూపంలో ఉండే ఆత్మ) వేరు. ఈ సత్యమును వేదాధ్యయనము చేసిన ప్రశాంత చిత్తులు మాత్రమే గ్రహించగలరు.

సూర్యుడు నీటి లో ప్రతి బింబ రూపంలో కనపడుతూ ఉంటాడు. అలాగే ఆత్మకూడా బుద్ధిలో ప్రతి బింబ రూపంలో కనపడుతూ ఉంటుంది. సత్త్వగుణ ప్రధానులైన సాత్త్వికులకు ఇది గోచరమవుతుంది. సూర్యుడికి రాత్రి పగలు అనేవి లేవు. నిరంతరమూ ప్రకాశిస్తూ ఉంటాడు. అలాగే పరమ

యోగికి వివేకము, అవివేకము అనేవి లేవు. నిరతమూ జ్ఞానంతో ప్రకాశిస్తూ ఉంటాడు. అలాంటి యోగికి ఇంద్రియములు ఉన్నా లేనట్టే. అతడు బయట ప్రపంచంలో తిరుగుతున్నా సమాధి స్థితిలోనే ఉంటాడు.

మోహము అనే బీజము నుండి కామము అనే చెట్టు మొలకెత్తుతుంది. దీనివి ఏమరుపాటు అనేనీరు పోసి పెంచుతాము. ఆ చెట్టుకు అసూయ అనే ఆకులు ఉంటాయి. అభి మానము అనే కాండముతో ఆ వృక్షము పెరుగుతుంది. శోకములు అనేవి ఆ చెట్టుకు పెద్ద పెద్ద కొమ్మలు. అనేక రకములైన చింతలు చిన్న చిన్నకొమ్మలు. ఆ చెట్టు పూర్వ జన్మలో చేసిన కర్మల ఫలితంగా పెరుగుతుంది. ఆ చెట్టుకు ఆశలు అనే తీగలు చుట్టుకొని ఉంటాయి. ఇటువంటి చెట్టుకు కాసిన పండ్లకోసం ఎవడైనా ఆ చెట్టు ఎక్కితే వాడి నాశనం తథ్యం. అలా కాకుండా త్యజించడం అనే కత్తితో ఆ చెట్టును సమూలంగా నరికితే, అన్ని రకములైన దుఃఖముల నుండి విముక్తి పొందుతాడు.

కుమారా! ఈ శరీరమే ఒక నగరము. ఈ నగరానికి ప్రభువు బుద్ధి. లోకంలో ఉన్న విషయములను గురించి ఆలోచించే మనస్సు ఆ నగరానికి మంత్రి. ఇంద్రియాలు అక్కడ పురజనులు. శబ్ద,స్పర్శ, రూప,రస,గంధాదులు అక్కడ పురోహితులు. ఈ రాజ్యాన్ని రజోగుణము, తమోగుణము అనే దొరలు పాలిస్తూ అనుభవిస్తూ ఉంటారు. అసలు రాజైన బుద్ధి, వివేకం లేకుండా రజస్తమోగుణములకు బానిసైతే, నశించి పోతుంది. అలా కాకుండా రజస్తమోగుణములను ఎదిరించి మనస్సుతో ఏకమై, వివేకంతో ప్రవర్తిస్తే, దుష్టులైన రజస్తమోగుణములను జయించి, శాశ్వతానందాన్ని అనుభవిస్తాడు" అని భీష్ముడు వ్యాసునికి శుకునికి జరిగిన సంవాదమును ధర్మరాజుకు చెప్పాడు.

అప్పుడు ధర్మరాజు భీష్మపితామహునితో "పితామహా! కార్యబలమూ, వీర్య బలమూ, మనోబలమూ ఉన్న అనేక మంది రాజులు ఈ యుద్ధములో చనిపోయారు. వీరికి ఎంత బలమున్నా మృత్యువును జయించలేకపోయారు. ఎందువలన? అసలు మృత్యువం టే ఏమిటి. అది ఏ ప్రకారము జీవరాసులను చంపుతుంది. తెలపండి." అని అడిగాడు.

"ధర్మనందనా! పూర్వము అకంపనుడు అనే రాజు ఉండేవాడు. అతని కుమారుడు యుద్ధంలో చనిపోయాడు. కుమారుని కోసం అకంపనుడు దుఃఖిస్తున్నాడు. అంతలో నారదుడు అకంపనుడి వద్దకు వచ్చాడు. అకంపనుడు తనకు కలిగిన దుఃఖమును నారదుడికి చెప్పాడు నారదుడు అతని దుఃఖమును పోగొట్టే ఒక కథను వినిపించాడు. ఆ కథ నువ్వు వింటే నీ సందేహములు అన్నితీరిపోతాయి.

సృష్టి ఆరంభంలో, బ్రహ్మదేవుడు ఈ జగములను సృష్టించాడు. సమస్త జీవరాసులను సృష్టించాడు. అవి దిన దినాభి వృద్ధి చెందుతున్నాయి. భూమి అంతా జీవరాసులతో నిండిపోయింది. అప్పుడు బ్రహ్మ ఈ జీవ రాసులను ఎలా సంహరించాలా అని ఆలోచించాడు. ఆ ఆలోచనల వేడికి అతని శరీరం దహించుకుపోసాగింది. బ్రహ్మ దేవుని శరీరమునుండి పుట్టిన అగ్ని మూడు లోకములను కాల్చివేయడానికి సమాయత్తమయింది.

ఇది చూచి శివుడు బ్రహ్మదేవుని వద్దకు వచ్చాడు. బ్రహ్మదేవుని శివుడు శాంతించ మని అర్థించాడు బ్రహ్మ శాంతించాడు. ప్రాణులను చంపే పద్ధతి ఇది కాదు అని చెప్పి ఆ మంటలను ఆర్పాడు. బ్రహ్మదేవుని దేహమునుండి ఒక రక్తవర్ణము కలిగిన కన్నులతో ఉన్న స్త్రీ ఉద్భవించింది. ఆమె పుట్టగానే

దక్షిణ దిశగా పోతూ ఉంది. బ్రహ్మదేవుడు ఆమెను తన దగ్గరగా పిలిచాడు.
" ఓ మృత్యుదేవతా! నీవు ఈ ప్రజలను బలవంతుడు బలహీనుడు అనే భేధం లేకుండా అందరినీ సంహరించు." అని ఆజ్ఞాపించాడు.

అప్పుడు మృత్యుదేవత కన్నులనుండి నీళ్ళు కారుతుండగా ఇలా అంది: "ఓ బ్రహ్మ దేవా! నేను నీ నుండి పుట్టాను. ఇంతటి క్రూరమైన పని ఎలా చేస్తాను? ఏదైనా ధర్మకార్యమునకు నన్ను నియోగించు." అని పలికింది.

అప్పుడు మృత్యుదేవత కన్నుల నుండి జలజలా కారుతున్న కన్నీళ్లను తన దోసిటితో పట్టాడు బ్రహ్మదేవుడు.

" ఓ మృత్యు దేవతా! నేను నిన్ను ఈ పనికోసమే పుట్టించాను. నీవు మారు మాటాడకుంటా ప్రజలను సంహ రించాలి. తప్పదు." అని అన్నాడు. ఆమాటలకు మృత్యుదేవత కంపించి పోయింది.

" ఓ బ్రహ్మదేవా! నేను మనుష్యులను చంపి వారి పుత్రులు బంధువుల యొక్క శోకము దుఃఖము నేను చూడలేను. ఈ పని నా వల్ల కాదు నేను తపస్సు చేసుకోడానికి వెళతాను. నాకు అనుజ్ఞ ఇవ్వండి." అని అడిగింది.

అప్పుడు బ్రహ్మ "అది ఎలా కుదురుతుంది. మానవ సంహారము నీకు అవశ్య కర్తవ్యము. నీకు అప్పగించిన పని నీవు చేయకపోతే అది అధర్మము అవుతుంది. కాబట్టి నీవు ఈ పని చేయక తప్పదు." అని ఖచ్చితంగా చెప్పాడు బ్రహ్మ.

మృత్యు దేవత మారు మాట్లాడకుండా అక్కడి నుండి ధేనుకాశ్రమ

మునకు పోయింది. అక్కడ ఎన్నో సంవత్సరములు తపస్సు చేసింది. తరువాత హిమాలయ పర్వతముల మీద బ్రహ్మ దేవుని గూర్చి తపస్సు చేసింది. బ్రహ్మ ఆమె వద్దకు వెళ్లాడు.

"ఓ మృత్యు దేవతా! నీవు ఈ ప్రకారంగా తపస్సు చేసినందువల్ల ప్రయోజనము ఏముంది. కాబట్టి ఈ తపస్సు మాని నీ కర్తవ్యమును నిర్వర్తించు" అని అన్నాడు.

"మహాత్మా! ఆ పని మాత్రం నా వల్ల కాదు. నన్ను క్షమించు." అని చెప్పింది మృత్యుదేవత.

" మృత్యుదేవతా! నేను నీకు అబద్ధం చెప్పడం లేదు. ఈ మానవ సంహారము నీకు పరమ ధర్మము. దీని వల్ల నీకు ఏ పాపమూ అంటదు. నా మాటను కాదనకు. మరొక్క మాట. నీవు ఏడ్చినపుడు నేను నీ కన్నీళ్లను నా దోసిటితో పట్టాను గుర్తుందా. వాటిని ఈ లోకములో ఉన్న ప్రజల మీద చల్లుతాను. అవి నానా రకములైన రోగములుగా మారి ప్రజలను బాధిస్తాయి. వాటికి తోడుగా కామము క్రోధము ఉంటాయి. ఈ ప్రజలంతా ఆ రోగముల తోనే చస్తారు. వారు చనిపోయిన తరువాత కేవలం వారి ప్రాణములను నీవు తీస్తావు. అంతే. నీవు నిమిత్త మాత్రమే. నీవు పురుషులను చంపే సమయంలో పురుషుడు గానూ, స్త్రీలను చంపే సమయంలో స్త్రీగానూ, నపుంసకుని చంపే సమయంలో నపుంసకుని గానూ మారే వరం ప్రసాదిస్తున్నాను. కాబట్టి నీకు ఏ పాపమూఅంటదు. పైగా ఈ సంహారము ధర్మకార్యంగా మారుతుంది." అని అన్నాడు బ్రహ్మ.

ఆ మాటలకు శాంతించింది మృత్యు దేవత. పైగా అంతగా చెబుతున్న

బ్రహ్మ దేవుని మాట వినక పోతే శపిస్తాడేమో అని కూడా భయపడింది. అందువల్ల మానవ సంహారమునకు ఒప్పుకుంది. ఆ ప్రకారంగా మరణ సమయంలో ప్రాణులు ఈ దేహాలను వదిలి పెట్టి తమ తమ పురాకృత కర్మ ఫలములను బట్టి తదుపరి జన్మలు ఎత్తుతుంటారు."అని చెప్పాడభీష్ముడు.

" పితామహా! ఈ విషయం ఇదివరకే నేను విని ఉన్నాను. కాని ఆ సమయంలో ఎక్కువ దుఃఖంలో ఉండటం వల్ల దానిని సరిగా అర్ధం చేసు కోలేదు. ఇప్పుడు బాగా అర్ధం అయింది. కాని పితామహా! మంచివారు ఎల్లప్పుడూ ధర్మానికి భయపడుతుంటారు. ఈ ధర్మము అంత గొప్పదా! వివరించండి." అని అడిగాడు.

ధర్మనందనా! వేదముల మీద భక్తి, ధృఢమైన స్మృతి, మంచి ఆచారము, అందమైన శరీరము, ఇవే ధర్మములని కొందరు పెద్దలు చెబుతారు. కాని కొంత మంది కేవలం ధనార్జనే ధర్మము అని చెబుతారు. కాని అన్యాయంగా అధర్మంగా, అబద్ధాలు చెప్పి ధనం సంపాదించడం మహా పాపము. పరుల సొమ్ముకు ఆశ పడకుండా, అబద్ధాలు చెప్పకుండా, అక్రమాలు చెయ్యకుండా ధనం సంపాదించడమే పరమ ధర్మము.

ధర్మాలు చాలా రకాలు. ధర్మము ఇలా ఉంటుంది అని తెలుసుకోవడం చాలా కష్టం. ధర్మం గురించి నాకు తెలిసింది చెబుతాను విను. ఇతరులు ఏ యే పనులు చేస్తే మన మనస్సుకు, శరీరానికీ కష్టం, నష్టం కలుగుతుందో, ఆయా పనులు మనము ఇతరుల పట్ల చేయకపోవడమే పరమ ధర్మము. ఇదే ధర్మ సూక్ష్మము." అని అన్నాడు భీష్ముడు.

ఆ మాటలకు చాలా సంతోషించాడు ధర్మరాజు. "తాత గారూ! నేను

అజ్ఞానంతో ఏమేమో అడుగుతున్నాను. అడిగినవే మరలా మరలా అడుగుతున్నాను. దయచేసి కోప పడవలదు.  మీరు ధర్మము ఇలా ఉంటుంది అని చెప్పారు. కాని ఉత్తమమైన ఆచారము గురించి వివరించండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా!  వేదములలో వివిధము లై న ఆచారముల గూర్చి వివరంగా చెప్పారు. మారు మాటాడకుండా వాటిని ఆచరించడమే మన కర్తవ్యము. పెద్దవాళ్లు దేనిని ఆచరిస్తే మనముకూడా దానినే ఆచరించాలి.  అదే ఉత్తమమైన ఆచారము.  ఈ సందర్భంలో నీకు జాబాలికి, తులాధరుడు అనే వ్యాపారికి జరిగిన సంవాదమును వినిపించెదను.

పూర్వము జాబాలి అనే మహా ముని తపస్సు చేసుకుంటున్నాడు. అతని తలమీద ఒకపిచ్చుక గూడుకట్టింది. గుడ్లు పెట్టింది. ఆ గుడ్లు పొదిగింది. అవి పిల్లలు అయ్యాయి.  పెద్ద పిచ్చుక, పిల్ల పిచ్చుకలు ఆ గూటిలో నివసిస్తున్నాయి. జాబాలి మునికి  ఈ విషయం తెలిసినా వాటిని తరిమివేయకుండా భరిస్తున్నాడు.  తనలో తనే "ఆహా! నా వంటి ధర్మనిష్టా పరుడు ఎక్కడైనా ఉంటాడా!" అని తనను తానే మెచ్చుకున్నాడు.

అప్పుడు ఆకాశవాణి "మహాత్మా! తనను తాను మెచ్చుకొనే ధర్మనిష్ఠ ఎక్కడైనా ఉందా. నీ కంటే ధర్మనిష్టాపరుడైన తులాధరుడు కూడా ఇలా ఎప్పుడూ మాట్లాడలేదు. ఇంక నీవెంత."  అని ఎగతాళి చేసింది.

ఆ మాటలకు ఆశ్చర్యపోయాడు జాబాలి. "ఆ తులాధరుడు ఎక్కడ ఉన్నాడు నేను అతనిని కలవాలి." అన్నాడు.

"అతడు వారణాసి పురంలో నివసిస్తున్నాడు." అని పలికింది ఆకాశవాణి.

జాబాలికి తులాధరుని మీద మాత్సర్యము కలిగింది. అతనిని చూడాలని వారణాసికి వెళ్లాడు. అక్కడ వ్యాపారం చేస్తున్న తులాధరుని చూచాడు. జనమంతా అతనిని ధర్మాత్ముడు అని పొగుడుతున్నారు. జాబాలి మునిని చూచి తులాధరుడు జాబాలికి అతిధి సత్కారములు చేసాడు.

" మహాను భావా! మీ తల మీద పిచుకలు గూళ్లు పెట్టినా కూడా చలించ కుండా హాయిగా తిరుగుతున్న మీరు జితేంద్రియులు. చాలా గౌరవింప తగ్గవారు." అని అన్నాడు. అతనిని చూచి జాబాలి ఇలా అన్నాడు.

"నా సంగతి సరే. నీవు వ్యాపారము చేస్తున్నావు కదా! ధర్మం తప్పకుండా వ్యాపారము ఎలా చెయ్యగలుగుతున్నావు?" అని అడిగాడు.

"అయ్యా! నేను వస్తువులు కొనడం లోనూ అమ్మడం లోనూ ఎలాంటి మోసములకుపాల్పడను. కొద్ది లాభంతో నే తృప్తి పడతాను. నాకు లాభం వచ్చినా నష్టం వచ్చినా సంతోషించను, బాధ పడను. నా మనసు ఎల్లప్పుడు మట్టిబెడ్డనూ బంగారము ముద్దనూ సమాన దృష్టితో చూస్తుంది. నేను ఎవరినీ పొగడను తిట్టను. నన్ను నేను పొగుడుకోను. ఇతరులను హింసించను. సాటి జీవుల యందు దయగలిగి ఉంటాను. ఎల్లప్పుడూ సత్యమునే మాట్లాడతాను.

నాకేదో కీర్తి ప్రతిష్టలు రావాలనీ, భోగభోగ్యములు కలగాలనీ కోరుకోను. నేను పరులకు ఉపకారము చేసినపుడు, ఇంత చేసాను అంత చేసాను అని

అందరికీ చెప్పుకోను. నాకు దేని మీదా మమకారము ద్వేషమూ లేవు. ఈలోకమును నేను ఒక ఆట వస్తువులాగా చూస్తాను. బయట ప్రపంచంలో తిరిగేటప్పుడు తామరాకు మీది నీటిబొట్టు మాదిరి సంచరిస్తుంటాను." అని పలికాడు.

"తులాధరా! నీవు నీ మాటలలో యజ్ఞములు, యాగములు, తపస్సు మొదలగు ధర్మముల గురించి మాట్లాడలేదు. వేదవిదులు అంతా వీటిని సత్కర్మలు అంటారు కదా! మరి నీ దృష్టిలో ఇవి అన్ని ఆచరించదగ్గ కర్మలు కావా!" అని అడిగాడు

"మహానుభావా! ఈ యజ్ఞములు, యాగములు, తపస్సులు ఏవేవో కోరికలు తీరడం కోసరం, అహంకారంతో, కోరికలతో చేస్తారు. అందుకని వాటి వల్ల ప్రయోజనం లేదు అని నా నమ్మకం. కాబట్టి దేవతలు వాటిని మెచ్చరు అని నా భావన. ఈ యజ్ఞ యాగముల వల్ల మరలా పుట్టడం మరలా చావడం తప్ప వేరు ప్రయోజనము ఏమీ లేదు కదా! ఎవరైతే సత్యమునే ఒక యజ్ఞముగా పాటిస్తూ నిత్యతృప్తుడు అయి ఉంటాడో అతనికి శాశ్వతానందము కలుగుతుంది. అని నా నమ్మకం." అని అన్నాడు తులాధరుడు.

"తులాధరా! నీవు కర్మలు వదలకుండా చేస్తున్నావు కదా. దానికి కారణ మేమి?" అని అడిగాడు. దానికి తులాధరుడు ఇలా బదులుచెప్పాడు.

"ఎవరు సతతము ధర్మమునే ఆచరిస్తుంటాడో, ఎవరు ధర్మముతో చెలిమి చేస్తాడో, ఎవడు నిష్కల్మష హృదయంతో కర్మలు చేస్తుం టాడో, అతనికి కర్మలు ఆచరించక పోతే ఎలాంటి ఆనందం కలుగు తుందో అలాంటి ఆనందం కలుగుతుంది. అన్ని నగరాలూ పుణ్య క్షేత్రాలే. అన్నినదులూ పుణ్య

నదులే. నిష్కల్మష హృదయంతో ఉన్న వాడికి అన్ని పవిత్రమైనవే. ఈ పని నేను చెయ్యాలి కాబట్టి నేను చేస్తున్నాను. ఫలితం భగవంతుడి కి అర్పిస్తున్నాను అని కర్మలు చేసేవాడికి ఏ దోషమూ అంటదు. కాని ఫలితం ఆసించి చేసే కర్మలకు దోషం అంటకుండా ఎలా ఉంటుంది. ఇదీ నాకు తెలిసిన ధర్మము. ఇది సరియైన ధర్మమో కాదో మనము సజ్జనులను అడిగి తెలుసుకుందాము. కాని నీవు ఇన్నాళ్లు తండ్రివలెపెంచి పోషిస్తున్న ఆ పిచికలు హాయిగా ఎగురు తున్నాయి. వాటిని పిలిచి లాలించండి." అని అన్నాడు.

అప్పుడు జాబాలి ఆ పిచుకలను తన దగ్గరకు రమ్మని పిలిచాడు. అవి అతని దగ్గరకు రాలేదు ఆకాశంలో ఎగురుతూ ఇలా అన్నాయి.

"ఓ మునీంద్రా! మేము ధర్మదేవత దూతలము. ధర్మదేవత పంపగా నిన్ను పరీక్షించడానికి వచ్చాము. మీకు కలిగిన సందేహమును మేము తీరుస్తాము. ఎవడి మనసులో ఇతరుల యెడ ద్వేషము, మాత్సర్యము ఉంటుందో అతనికి ఇతరులతో తగవులాడాలని కోరిక ఉంటుంది. దాని వలన హింస ఏర్పడు తుంది. కాబట్టి మునీశ్వరులు తమ తమ మనసులో నుండి ద్వేషము, మాత్సర్యము తీసివెయ్యాలి. స్పర్ధ ధర్మాన్ని నాశనం చేస్తుంది. ధర్మం నశిస్తే మనిషి నాశనం అవుతాడు. కాబట్టి మానవుడు స్పర్ధను వదిలిపెట్టాలి.

సత్త్వగుణమువలన శ్రద్ధ పుడుతుంది. శ్రద్ధ ఉన్నవాడు తాను తెలుసు కోదగిన దానిని తెలుసుకుంటాడు. కాబట్టి ప్రతి మనిషికీ శ్రద్ధ ముఖ్యము. శ్రద్ధ లేని తపస్సు, శ్రద్ధ లేని యజ్ఞయాగము నిష్ఫలములు. కాబట్టి శ్రద్ధ అన్నిటి కన్నా ముఖ్యము. శ్రద్ధ ధనము వంటిది. మన మనస్సును చెడు దారిలో పోకుండా కాపాడుతుంది. శ్రద్ధ అనేది జీవాత్మ యొక్క ప్రసన్నత్వము. యాగము చేయుటకు శ్రద్ధ, శుచిత్వము ముఖ్యము. శ్రద్ధలేని శుచిత్వము,

శుచిత్వము లేని శ్రద్ధ రెండూ సమానమే.

ఇదే విషయాన్ని బ్రహ్మ దేవుడు దేవతలతో ఇలా చెప్పాడు. శ్రద్ధ గలవాడు ఉత్తముడు. అతని చేతి భోజనము అత్యంత శ్రేష్టమైనది. వడ్డీకి ధనం అప్పుగా ఇచ్చి ఆ వడ్డీతో జీవిస్తూ దాన ధర్మములు చేసేవాడూ, వేదవేదాంగములు అభ్యసించినా లోభి అయిన వాడూ ఇద్దరూ సమానమే. అందులో యాగ సమయములో దాన ధర్మములు చేసేవాడు అధికుడు. శ్రద్ధ లేని వాడికి దానం చెయ్యాలనే బుద్ధి పుట్టదు. శ్రద్ధగలవాడి మనసులో మత్సరము మొదలగు దుర్గుణములు ఉండవు. అందుకని శ్రద్ధ గలవాడే శ్రేష్టుడు అని బ్రహ్మదేవుడు చెప్పాడు." అని ఆ పిచ్చుకలు జాబాలితో చెప్పాయి.

ఆ మాటలు విన్న జాబాలి తులాధరుని చూచి "మహాత్మా! నాకు అన్ని తెలుసు అని నేను అనుకున్నాను.నాకు ఏమీ తెలియదు అని ఇప్పుడే తెలిసింది. నేను ఇతర మునుల మాటలను వినలేదు. అందుకని నన్ను నేను పొగుడు కోవడం అనే దోషము నాకు పట్టుకుంది. నీ మాటలతో ఆ దోషము పోయింది. ఇంక నేను ప్రశాంత చిత్తముతో జీవిస్తాను." అని పలికాడు జాబాలి.

" ఓ మహాత్మా! ఎవరికైనా స్వధర్మమును ఆచరించడం కన్నా పరమ ధర్మము వేరొకటి లేదు." అని చెప్పాడు తులాధరుడు. తరువాత జాబాలి అతని వద్ద నుండి సెలవు తీసుకొని వెళ్లిపోయాడు.

ధర్మనందనా! వింటివి కదా తులాధరుని మాటలు. వాటిలోని ధర్మసూక్ష్మమును గ్రహించి ఆచరించు." అని పలికాడు భీష్ముడు.

" పితామహా! ఒక కార్యమును నెరవేర్చుటకు ఎక్కువ సమయం

తీసుకుంటే మంచిదా. తక్కువ సమయం తీసుకుంటే మంచిదా వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఏకార్యమైననూ తొందర పడకుండా చక్కగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకొని తరువాత చేయడం మంచిది. అలా చేసిన కార్యములకు మంచి ఫలితములు వస్తాయి. కాని కొంత మందికి ఓర్పు సహనము ఉండదు. ఏదో చేసెయ్యాలని తహ తహ. అలాంటి వారు, ఆలోచించి పని చేసేవారిని వీడికి చురుకు దనం లేదు. అన్ని ఆలస్యం చేస్తుంటాడు అని నిందిస్తుంటారు. అది మంచి పద్ధతి కాదు. ఈ సందర్భంలో నీకు మేధాతిధి అనే ముని కుమారుడు చిరకారి అనే వాని కథ చెబుతాను. సావధానంగా విను. అతడు ప్రతి పని కూడా చక్కగా విచారించి చేస్తాడు. అందుకని అతనిని చిరకారి అని పిలుస్తారు.

ఒకసందర్భంలో మేధాతిధి తన భార్యమీద కోపించాడు. ఆ కోపం తట్టుకోలేక తన కుమారుడు చిరకారిని పిలిచి తల్లిని చంపమని ఆదేశించాడు. తరువాత బయటకు వెళ్లిపోయాడు. ఏ పని కూడా చక్కగా ఆలోచించి చేసే చిరకారి ఆలోచించడం మొదలెట్టాడు.

తండ్రి ఆజ్ఞను మీర డానికి వీలులేదు కాబట్టి తల్లిని చంపాలి. కాని తల్లిన చంపడం కంటే మహా పాపం వేరొకటి లేదు. పోనీ తండ్రికి నచ్చచెబుదాము అనుకుంటే తండ్రి ఆజ్ఞను ధిక్కరంచడం పాపముఅనిపెద్దలు చెబుతారు. కాని తల్లిని రక్షించుకోవడం ప్రతి కుమారుని ధర్మము. ఎటు చూచినా పుత్రుడికి స్వతంత్రంగా వ్యవహరించే వీలు లేదు. కాబట్టి దీనికి ఒక ఉపాయం ఆలోచించాలి అని అనుకున్నాడు చిరకారి.

తండ్రి ఆజ్ఞ ప్రకారము తల్లిని చంపితే నరక ప్రాప్తి తథ్యము. అలా అని చెప్పి తండ్రి ఆజ్ఞను ధిక్కరిస్తే కూడా నరక ప్రాప్తి తథ్యము. తల్లి భూమి. తండ్రి బీజము. తల్లి తండ్రి వలననే వంశము నిలుస్తుంది. కాబట్టి తల్లి తండ్రి వీరిద్దరిలో ఎవరిని వదిలిపెట్టాలి అనేది సమస్య. తండ్రికి ప్రతి రూపమే కుమారుడు. కాబట్టి తండ్రి ఆజ్ఞ పరిపాలిస్తేనే ఆ కుమారుడికి ఉత్తమ గతులు లభిస్తాయి. తపము, ధర్మము,విద్య ఇవి అన్నీ తండ్రికి ప్రతి రూపాలు. కాబట్టి తండ్రికి ప్రీతి కలిగే పని చేస్తే దేవతలు కూడా సంతోషిస్తారు.

ఇంక తల్లివైపు నుంచి చూస్తే, కొయ్య నుండి అగ్ని పుట్టినట్టు, తల్లి గర్భము లో నుండి కాళ్లు చేతులు తల ముక్కు చెవులు మొదలైన అంగములతో పుడతాడు కుమారుడు. కుమారుని వలన తల్లి ఎంతో గర్భ క్లేశము అనుభవిస్తుంది. తల్లి తన బాగోగుల కన్నా కుమారుని బాగోగులకే ఎక్కువ ప్రాధాన్యము ఇస్తుంది. అందుకే తల్లిని మించిన దైవము లేదు. తండ్రి బిడ్డను పైపైన చూస్తాడు. కానీ తల్లి బిడ్డల గురించి ఎక్కువగా ఆలోచిస్తుంది. బాధ పడుతుంది. కాబట్టి ధర్మశాస్త్రాలు అన్ని తండ్రి కంటే తల్లికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. కొడుకు బాలుడైనా, ప్రౌఢ వయస్సులో ఉన్నా వృద్ధుడైనా, తల్లికి కొడుకు మీద ప్రేమ తగ్గదు. కాబట్టి తల్లి ఈ జగము కంతటికీ మూలాధారము.

క్షుద్ర జంతువుల కైనా ఉన్నత వంశస్థులకైనా తల్లి ఒకే విధంగా ఉంటుంది. తల్లి ఒడిలో ఉన్న సుఖం మనిషికి ఇంక ఎచ్చటా దొరకదు. ఎవరికైనా మాతృవియోగం కలిగి నప్పుడు అతడు సర్వమూ కోల్పోయినట్టు దుఃఖపడతాడు. అతనికి ప్రపంచమంతా శూన్యంగా ఉంటుంది. మనసంతా

చలించి పోతుంది. ఉన్నవాడైనా లేని వాడైనా, బలవంతుడైనా, బలహీనుడైనా, బుద్ధి ఉన్న వాడైన, బుద్ధి లేని వాడైనా, వీరందరికీ తల్లి సంపదతో సమానము. తల్లి జీవించి ఉంటే వారికి సకల సంపదలూ, సర్వ సుఖములు ఉన్నట్టే. అటువంటి తల్లిని చంపడం ఏ ప్రకారం చూచినా మహా పాపము. ఈ విషయం తెలుసుకోడానికి పెద్ద చదువులు చదవక్కరలేదు. పశువుల కాపరికి కూడా తెలుస్తుంది. తల్లిని చంపడానికి చేతులెలా వస్తాయి. మనసెలా ఒప్పుకుంటుంది.

ఈ ప్రకారంగా పరి పరి విధాలుగా ఆలోచిస్తూ ఉన్నాడు చిరకారి. ఇంతలో బయటకు పోయిన మేధాతిథి కూడా ఆలోచించాడు. "అయ్యో! ఏదో చిన్న తప్పుకు భార్యను చంపమని కుమారునికి చెప్పివచ్చాను. నా కుమారుడు తన తల్లిని చంపాడేమో. ఎంత తొందర పడ్డాను. అయినా నా కుమారుడు తొందరపడి ఏపనీ చెయ్యడు. ఆలోచించి చేస్తాడు. తల్లిని చంపడు." అని అనుకొని వడి వడి గా ఇంటికి వస్తున్నాడు.

అలా నడుస్తూనే "కుమారా! నీ తల్లి నిన్ను నవమాసాలు కని పెంచింది. నేను తొందరపడి ఆమెను చంపమని నిన్ను ఆజ్ఞాపించాను. కాని నువ్వు తొందర పడవని ఏపని అయినా ఆలోచించి చేస్తావని నాకు తెలుసు." అని అనుకుంటూ ఇల్లు చేరాడు.

తండ్రిని చూచి చిరకారి తల్లిని చంపడానికి చేత ధరించిన కత్తిని కింద పెట్టాడు. తండ్రికి నమస్కరించాడు. అతని తల్లి కూడా భర్తకు నమస్కరించింది. వారిరువురిని చూచి మేధా తిథి ఎంతో ఆనందించాడు. అప్పటిదాకా శోకముతో కారుతున్న కన్నీళ్లు ఆనందభాష్పములుగా మారాయి. ఇద్దరినీ దీవించాడు.

అప్పుడు మేధాతిధి కుమారుని తో ఇలా అన్నాడు. "ఒక కార్యము చెయ్యవలసి వచ్చినప్పుడు ఆలోచించి ధైర్యంగా చెయ్యాలి. అలాంటి వాడిని ఆర్యుడనీ, తొందర పడి పనులు చేసేవాడిని అనార్యుడనీ పెద్దలు అంటారు. ఒక పని చేసేముందు ఇతను మనకు మిత్రుడా, శత్రువా, ఇతడు యోగ్యుడా ఇతడు అయోగ్యుడా అని ఆలోచించి నిర్ణయం తీసుకొనే వాడు బుద్ధిమంతుడు. అలాంటి వాడికి సకల శుభములు కలుగుతాయి." అని అన్నాడు మేధాతిధి. కాబట్టి ధర్మనందనా! ఏపని అయినా ఆలోచించి చేస్తేనే సత్ఫలితాలు ఇస్తుంది." అని అన్నాడు భీష్ముడు.

" పితామహా! నాకు ప్రజలను శిక్షించు విధానము గురించి తెలపండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మరాజా! పూర్వము ద్యుమత్సేనుడు అతని కుమారుడు సత్యవంతుడు వారి మధ్య జరిగిన సంవాదమును వినిపించెదను. వారిద్దరూ ప్రజలకు వేయు శిక్షల గురించి విపులంగా చర్చించుకున్నారు.

ద్యుమ: నేరము చేసిన వారిని వధించడము ధర్మము అని పెద్దలు చెబుతారు.

సత్య: అదేమిటి. హింస చేయదగిన కర్మ అయితే ఇంక చేయకూడని కర్మ అంటూ ఏమి ఉంటుంది.

ద్యుమ: అవును. దొంగలు, దుర్మార్గులు చావ వలసిందే. లేకపోతే వారి వలన లోకమంతా బాధ పడుతుంది.

సత్య: దానికి మరణ దండనే మార్గమా: వేరే మార్గములు లేవా!

ద్యుమ: ఎందుకు లేవు. నేరమునకు తగిన శిక్షలు ఉంటాయి. నేరముచేసిన వాడిని వాడి చూపులతో చూడటం, పరుషమైన మాటలతో బాధించడం, మందలించడం, ధనరూపంలో శిక్షలు విధించడం ,శరీరంలోని అవయవములను తొలగించడం మొదలగునవి ఉన్నాయి. కాని నేరస్థుడు చంపదగిన నేరము చేస్తే వాడిని చంపడం తప్ప వేరేమార్గము లేదు. నేరస్థుని ఎడల వీడు నాకు స్నేహితుడు, బంధువు అని పక్షపాతం చూపడం కూడా నేరము అవుతుంది.

( ఇప్పుడు కూడా మర్డర్ నేరానికి ఉరిశిక్ష గానీ, యావజ్జీవశిక్ష గాని, వేస్తారు. ఉరి శిక్ష ఎందుకు వెయ్యకూడదో కారణాలు వివరించాలి. అదీ నేటి శిక్షాస్మృతి. కాని విజయవాడలో క్లాస్ రూములో అందరి పిల్లల ఎదుట పరీక్ష రాస్తున్న ఒక విద్యార్థిని మేదర కత్తితో నరికి చంపిన నేరానికి ఉరి శిక్ష వెయ్యాల్సింది పోయి, అదేం పెద్ద నేరం కాదులే అని యావజ్జీవశిక్షతో సరి పెట్టారు. అలాంటి మెతక తనం పనికిరాదు అని మహాభారతం మనకు చెబుతూ ఉంది.)

శిక్షలు విధించే రాజు ముందు తాను నీతి మంతుడిగా ఉండాలి. తన మంత్రులను, పుత్రులను, ఉద్యోగులను నీతి మంతులుగా తీర్చిదిద్దాలి. అప్పుడే అతను ప్రజాపాలనకు అర్హుడవుతాడు. తన దగ్గరకు వచ్చిన అభియోగమును చక్కగా పరిశీలించాలి. నేరస్థుని పట్ల, బాధితుని పట్ల ఎలాంటి కామము క్రోధము లేకుండా ధర్మప్రకారము తీర్పు చెప్పాలి.అప్పుడు

మరణ దండనకు అర్హ మైన నేరములలో నిందితుని వధించాలి. అప్పుడు ఆ రాజుకు ఏ పాపమూ అంటదు. మనం రోజూ హత్యలు చేయడం చూస్తూ నే ఉన్నాము. లోభం చేతగానీ, క్రోధం చేత గానీ, కామం చేత గానీ, మనస్సులో ఏ మాత్రం శంక లేకుండా దుర్మార్గులు హత్యలు చేస్తున్నారు. అలాంటి వారిని శిక్షించకుండా అహింసావ్రతము పూని వదిలేస్తే, హింస పెచ్చురిల్లుతుంది. అరాచకం ప్రబలుతుంది.

(డబ్బు కోసం, అక్రమ సంబంధాల కోసం, కోపాన్ని తట్టుకోలేక, ఎన్నో హత్యలు జరుగుతున్నాయి. హత్యలు చేసిన వారు హాయిగ బయట తిరుగు తున్నారు. ఒక వేళ న్యాయస్థానాలు ఉరి శిక్షలు వేసినా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు అలసత్వం చూపుతున్నాయి . న్యాయ స్థానాలు కఠిన శిక్షలు విధించినా, పండగలకో పబ్బాలకో వారిని వదిలేస్తున్నారు. నేరం చేస్తే కఠినం గా శిక్షింపబడతాము అనే భయం ప్రజలలో లేదు. ఏదోవిధంగా తప్పించుకోవచ్చు అనే భావన ప్రబలిపోయింది. అదీ నేటి లోక ధర్మము. వీరంతా మహా భారతములో ఈ ఘట్టము చదువుకోవాలి.)

అహింస అనేది క్షత్రియులకు, రాజులకు కాదు. బ్రాహ్మణుడు మాత్రమే అహింసను పాటించాలి. రాజైన వాడు ప్రజల పట్ల దయగలిగి ఉండాలి. వారిని కన్న బిడ్డల వలె పాలించాలి. దుష్టులను కఠినంగా శిక్షించాలి. అప్పుడే ప్రజలు సుఖశాంతులతో జీవించగలుగుతారు. ఈ ప్రకారము ప్రజలను పాలించడమే క్షత్రియుడైన రాజునకు అహింసా వ్రతము వంటిది." అని ద్యుమత్సేనుడు తన కుమారుడుసత్యవంతునికి బోధించాడు. అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

" పితామహా! గృహస్థ ధర్మము లేక సన్యాసమ. ఈ రెండింటిలో

ఆచరించ దగిన ధర్మము ఏది? వివరించండి.” అని అడిగాడు.

“ ధర్మనందనా! రెండునూ ఆచరణ యోగ్యములే. ఈ సందర్భంలో నీకు కపిల మహర్షికి ఒక గోవునకు జరిగిన సంవాదమును వినిపించెదను. పూర్వ కాలంలో కపిలుడు అనే మహా ముని ఉన్నాడు. అతడు ఒక ధేనువును చూచి “నీవు వేద స్వరూపమవు కదా!” అని అన్నాడు. అక్కడే అదృ శ్యరూపంలో ఉన్న స్యూమరశ్మి అనే ముని ఆ మాటలు విన్నాడు. ఆ మాటలతో కపిలునికి వేదముల మీద గౌరవము లేదు అని తెలుసుకున్నాడు. సూక్ష్మరూపంలో ఆ ఆవులో ప్రవేశించాడు. గోరూపంలో ఉన్న స్యూమరశ్మి కపిలునితో ఇలా అన్నాడు.

“మహర్షీ! యతులు వేదములను డాంబికత్వమునకు ప్రతీకగా పిలుస్తారు. కాని వేదములు అందరూ ఆదరించతగ్గవి. గౌరవించదగ్గవి. నీ సంగతి చెప్పు. నీకు వేదములు ఆదరించతగ్గవి కావా!”అని అడిగాడు. కపిలుడు ఇలా అన్నాడు

“ ఓ ధేనువా! నాకు వేదములు అనిన ఆదరము కానీ, నిరాదరముకానీ లేవు. అసలు నువ్వు నన్ను ఇలా ఎందుకు అడిగావో తెలియదు. నీ మనసు నాకు అవగతము కాలేదు. అయినను నాకు తెలిసినంతవరకూ చెప్పెదను వినుము. బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థము, సన్యాసము అను నాలుగు ఆశ్రమ ధర్మములు కలవు. అవి దేవతా మార్గములు. ఆ మార్గములలో నడచుట సంసారులకు కర్తవ్యము. వేదం లో విధించిన ఆచార వ్యవహారముల ప్రకారము నడుచుకోవడం మానవుల ధర్మము. కాని యజ్ఞములలో హింస చేయడం మంచిదో కాదో నువ్వే చెప్పాలి.” అని పలికాడు కపిలుడు.

“బ్రహ్మ దేవుడు యజ్ఞముకోసరమే ధాన్యమును, పశువులను సృష్టించాడు. అదీ కాకుండా స్వయంగా తానే యజ్ఞాలు చేసాడు. ప్రాజ్ఞుడు, అజ్ఞుడు ఇద్దరూ  స్వర్గ సుఖాలు కోరుకుంటారు. కాని యజ్ఞం చేస్తే తప్ప స్వర్గ లోక ప్రాప్తి కలగదు. అమలిన మైన గృహస్థ ధర్మము లోనే యజ్ఞములు చేయడానికి వీలుపడుతుంది. అప్పుడు యజ్ఞములు చేయడం హింస అనుకుంటే ఎలాగ?” అని ఆ ధేనువులో ఉన్న ముని పలికాడు. అప్పుడు కపిలుడు ఇలా అన్నాడు.

“ కేవలం ఆత్మ సుఖాన్ని కోరుకునేవాడు ఇతరములైన సుఖములకు ఆశ పడడు. అతనికి శోకము, కామము, విషయ వాంఛ, ఉండవు. అటువంటి వాడికి స్వర్గ సుఖములు ఎందుకు? కాబట్టి శాశ్వతమైన మోక్షము కోసం గృహస్థాశ్రమమును వదిలిపెడతాడు.” అని పలికాడు కపిలుడు.

“ మహర్షి! మిగిలిన ఆశ్రమము లన్నీ గృహస్థాశ్రమమును అనుసరించి వర్ధిల్లుతున్నాయి. గృహస్థాశ్రమంలో ఉన్న వాడు మోక్షమునకు అర్హుడు కాడు అని ఎక్కడన్నా చెప్పబడిందా! సమస్త ధర్మములకు, సమస్త కార్యములకు గృహస్థ ధర్మము మూలము కదా! దరిద్రులు సోమరి పోతులు చెయ్యాల్సిన కర్మలు చెయ్యరు. విడిచిపెడతారు. దాని వలన సద్గతి కలుగుతుందా? వేదాధ్యయనము విడిచి పెడితే పాపము చుట్టుకోదా! వేదాలను అంగీకరించక పోవడం  ఉచితమా!” అని ధేనువులో ఉన్న స్యూమరశ్మి పలికాడు. దానికి కపిలుడు ఇలా అన్నాడు.

“అయ్యా! బ్రాహ్మణులు తమ ఆచార వ్యవహారములను పాటించి దేవతలను తృప్తి పరుస్తారు. బ్రాహ్మణుడు పాటించే ఆచారాలు ఈ విధంగా ఉన్నాయి. చెయ్యి, యోని, పొట్ట,నోరు ఈ నాలుగూ తెరిచిన వాకిళ్లు.

సాధకుడు మోక్షప్రాప్తికై ఈ నాలుగు వాకిళ్లను గట్టిగా మూసి వేస్తాడు. తన ముందు బంగారము గుట్టగా పడి ఉన్నా చేతితో ముట్టుకోడు. కోపం వచ్చినా ఎవరినీ చేతితో కొట్టడు. హింసించడు. ఆ ప్రకారంగా చేయి అనే వాకిలి మూసి వేస్తాడు. ప్రాజ్ఞుడైన వాడు తన భార్యతో తప్ప పరస్త్రీలతో సంభాషించడు. పరస్త్రీలను కోరడు. అనుభవించడు. ఏక పత్నీ వ్రతంతో ఉపస్థ అనే వాకిలిని మూసి వేస్తాడు. కేవలము శరీరంలో ప్రాణములు నిలుపుకోడానికే ఆహారము దీసుకొంటాడు. అంతేగాని రుచి కోసమో, పొట్ట నింపుకోడానికో ఆహారము తీసుకోడు. తనకు లేని దాని కోసం తాపత్రయ పడడు. ఆ ప్రకారంగా ఉదరము అనే వాకిలి బంధిస్తాడు. ఎప్పుడూ అసత్యము పలుకడు ఒకరిని నిందించడు. పరుషంగా మాట్లాడడు. అనవసరమైన వాదనలకు దిగడు. కాబట్టి తెలివి గలవాడు నోరు అనే ద్వారమును బంధించి నట్టేగదా! పైవిధంగా నాలుగుద్వారములను నేర్పుతో మూయగలిగిన వాడే బ్రాహ్మణుడు. అటువంటి వానికి తపస్సు, యజ్ఞములు, యాగములు, దానములు, వ్రతములు ఎందుకు? అలాంటి వాడు వేదములకు ఎందుకు దాస్యం చేయాలి. ద్వంద్వములకు అతీతుడైన వాడు పేరు ప్రతిష్ఠల కొరకు పాకులాడడు. కళ్లకు కనపడే ప్రకృతినీ, కళ్లకు కనపడని పరబ్రహ్మమును సాక్షీభూతంగా చూస్తూ ఉంటాడు. అటువంటి వాడే నిజమైన బ్రాహ్మణుడు. అలా కాని వాడు ఫలాపేక్షతో కర్మలు చేస్తూ కర్మలలో మునిగి తేలుతుంటాడు.” అని కపిలుడు పలికాడు.

అప్పుడు స్యూమరశ్మి తన ఉనికిని తెలిపి “కపిల మహర్షీ! నా పేరు స్యూమరశ్మి. ధర్మ సూక్ష్మములను గ్రహించుట కొరకు ఈ ఆవులో చేరి ఇప్పటి వరకూ మాట్లాడాను. అంతే గాని వేరు గాదు. నేను నిన్ను ఆశ్రయించాను. వేదములు ప్రమాణములుగా గ్రహించిన తరువాత, వర్ణాశ్రమ ధర్మములను ఆచరించడమో పరిత్యజించ డమో చెయ్యాలి గదా! వర్ణాశ్రమ ధర్మములను

ఆచరించాలా! వద్దా వివరంగా తెలుపమని ప్రార్ధిస్తున్నాను." అని అడిగాడు అప్పుడు కపిలుడు ఇలా చెప్ప సాగాడు.

"జ్ఞాని అయిన వాడు ఏ పని చేసినా వాడికి కీడు వాటిల్లదు. జ్ఞాని కాని వాడు కామానికి కోరికలకు లొంగిపోతాడు. ఆ కర్మ బంధంలో చిక్కుకుంటాడు అహంకారము లేని వాడు, కోపము లేని వాడు, కోరికలు లేని వాడు, శుభము జరిగినా అశుభము జరిగినా బాధ పడడు. త్యాగ గుణంతో ఎల్లప్పుడూ సుఖ శాంతులతో జీవిస్తాడు. మీ మహా ఋషులందరూ జ్ఞానము కలవారే. కాని మీలో ఎవరో ఒకరికే ఏకాత్మనా భావన కలుగుతుంది. అలాంటి వాడికి ఎలాంటి సందేహాలు ఉండవు. కర్మ బంధనాలు ఉండవు." అని పలికాడు కపిలుడు. ఆ మాటలు విన్న స్యూమరశ్మి ఇలా అన్నాడు.

" మహాత్మా! వేదములు శాస్త్రములు చూపిన దోవను వదిలిపెట్టడం వలన మోక్షం రాదు. వేదములు నమ్మకపోవడం వల్ల కీడుకలుగుతుంది అని తెలుసుకున్నాను. కాబట్టి నా మనసులో ఉండే సందేహములను తొలగించండి." అని అడిగాడు అప్పుడు కపిలుడు అతనితో ఇలా చెప్పాడు.

"శబ్దబ్రహ్మము, పరబ్రహ్మము అని రెండు ఉన్నాయి. శబ్ద బ్రహ్మమును సేవించిన వాడు పరబ్రహ్మమును పొందుతాడు. మనసులో ఎలాంటి కోరికలు లేని వాడు, అసూయ లేని వాడు, శమము, దమము, ఆత్మ జ్ఞానము కలవాడు, వేదములో చెప్పబడిన ఆచార వ్యవహారములను శ్రద్ధతో ఆచరిస్తాడు. అటువంటి గృహస్థు సాటి జీవుల యడల దయ గలిగి ఉంటాడు. అతనికి అహంకారము, స్వాతిశయము మచ్చుకైనా ఉండవు. శాంత స్వరూపులైన బ్రాహ్మణులు, క్షత్రియులు గృహస్థాశ్రమములో ఉండికూడా మోక్షమును పొందుతారు.

ధర్మమునకు, బ్రహ్మ చర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థము, సన్యాసము అనే నాలుగు ఆశ్రమములునాలుగుపాదములుగా ఉన్నాయి. ఆ పాదముల మీద ధర్మము స్థిరంగా నిలిచి ఉంటుంది. పురుషుడు ఏ ఆశ్రమమును స్వీకరించినా అతను అనుసరించే ధర్మము ఒక్కటే. ఎవడైతే విషయవాంఛలను విడిచి పెట్టి, కోరికలు లేకుండా ప్రశాంత చిత్తంతో ఉంటాడో అతను ఏ ఆశ్రమములో ఉన్నా ఒకటే. దేనికీ క్షోభ చెందడు. మహాత్ములు ఆశాపాశములను తెంచుకొని సన్యాసాశ్రమము స్వీకరిస్తారు. దానిని మనము తప్పు పట్టలేము కదా!

జ్ఞానము ధర్మమునకు అదిష్ఠానము. పరమ సంతోషము ధర్మమునకు మూలము. త్యాగము దాని రూపము. అందుకని నాలుగు ఆశ్రమములు కూడా ఆచరణయోగ్యములే. ప్రశాంతమైన మనస్సు కలవాడికి నిరంతర సుఖసంతోషాలు లభిస్తాయి. వేదము చదవడం వలన ప్రయోజనము లేదు. వేదము లో ఉన్న భావమును కూడా గ్రహించగలగాలి. వేద తత్త్వము తెలియని వారు వేద పాఠకులు మాత్రమే అవుతారు. వేదము చదువుతుంటే అంతా తెలిసినట్టు అనిపిస్తుంది. కానీ ఏమీ తెలియదు.మోక్షమునకు మూడు మార్గములు. మొదటిది త్యాగము. అనగా కర్మ ఫల త్యాగము. రెండవది ఇంద్రియ నిగ్రహము. మూడవది శాశ్వతా నందము. ఇవి ఒకదాని కంటే ఒకటి గొప్పవి." అని చెప్పాడు కపిలుడు. కపిలుని ఎంతో ప్రశంసించాడు స్యూమరశ్మి. ధర్మనందనా! ఈ సంవాదములోని ధర్మసూక్ష్మములను గ్రహించి దాని వలన లబ్ధి పొందు." అన్నాడు భీష్ముడు.

మహా భారతము శాంతి పర్వము

పంచమాశ్వాసము మొదటి భాగము సమాప్తము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్

# మహాభారతము

## శాంతి పర్వము

## ఐదవ అధ్యాయము (రెండవ భాగము)

"పితామహా! వేదములలో ధర్మము, అర్థము, కామము అనేవి చెప్పబడ్డాయి కదా. ఈ మూడింటిలో దేనిని అనుసరించడం మంచిది." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు కుండధారుడు అనే వాని చరిత్ర చెబుతాను సావధానంగా విను. ఒక బ్రాహ్మణుడు యజ్ఞం చేయ తలపెట్టాడు. అతని వద్ద ధనము లేదు. ధనముకొరకు అతడు తపస్సు చేసాడు. అప్పుడు కుండధారుడు అనే దేవతల అనుచరుడు అతని వద్దకు వచ్చాడు. "విప్రుడా! నీ కోరిక ఏమిటి?" అని అడిగాడు. "నాకు ధనము కావాలి." అని అడిగాడు విప్రుడు.

అప్పుడు ఆ దేవతల అనుచరుడు మణిభద్రుడు అనే కుబేరుని అనుచరుని తలచుకొన్నాడు. మణిభద్రుడు ప్రత్యక్షం అయ్యాడు. "ఓ మణి భద్రా! ఇతనికి కావలసిన ధనము ఇమ్ము!" అని పలికాడు. "ఇతనికి ఎంత ధనం కావాలన్నా ఇస్తాను." అని అన్నాడు మణిభద్రుడు.

ఇంతలో కుండధారునికి ఒక ఆలోచన వచ్చింది. "ఈ విప్రుడు మానవుడు. ఎప్పుడో ఒకప్పుడు చనిపోతాడు. కాబట్టి ఇతనికి ధనము అనవసరము. ఇతని బుద్ధి ధర్మమార్గంలో నడిచేట్టు చేస్తే ఇతనికి సకల సంపదలు చేకూరుతాయి." అని అనుకున్నాడు. తన మనసులో అనుకున్న

విషయాన్ని మణిభద్రునికి చెప్పాడు కుండధారుడు.

ఆ ఆలోచనకు మణిభద్రుడు సంతోషించాడు. అప్పుడు కుండధారుడు విప్రుని బుద్ధి ధర్మమార్గములో చరించేట్టు అనుగ్రహించమని దేవతలను ప్రార్థించాడు. ఆ ప్రకారమే ఆ విప్రునికి తపస్సు చేయవలెనని తలంపు పుట్టింది.

అప్పుడు ఆ విప్రుడు కుండధారునితో ఇలా అన్నాడు. “ఓ మహాత్మా! ఇప్పటి వరకూ నా మనస్సు ధనము కావాలనే కోరుతూ ఉంది. నీ దయ వలన నా మనస్సు తపస్సు నందు లగ్నమయింది. ఇప్పుడు నాకు ధనము అక్కర లేదు. నాకు తపస్సుచేసుకోడానికి అనుమతి ఇవ్వు” అని ప్రార్థించాడు. కుండధారుడు ఆ బ్రాహ్మణునికి తపస్సుచేసుకోడానికి అనుమతి ఇచ్చి వెళ్లిపోయాడు.

ఆ బ్రాహ్మణుడు ఘోరమైన తపస్సు చేసాడు. అతని శరీరము మనస్సు మానవత్వాన్ని వదిలి దివ్యత్వాన్ని పొందాయి. ఇప్పుడు అతనికి దివ్య శక్తులు లభించాయి. “ఇప్పుడు నేను నన్ను ఆశ్రయించిన వారికి ధనము, రాజ్యము ఇవ్వగలను” అని మనసులో అనుకొన్నాడు.

ఆ సమయంలో విప్రుడు, కుండ ధారుని తన మనసులో తలచుకున్నాడు. కుండధారుడు ఆ విప్రుని వద్దకు వచ్చాడు. ఆ విప్రుడు తన తపో మహిమతో గంధము, పూలు సృష్టించి కుండధారుని పూజించాడు. “విప్రోత్తమా! నీవు నిరంతరమూ ధర్మాన్ని ఆశ్రయించు. యోగాభ్యాసము చెయ్యి. నీ మనస్సును ఆత్మానుసంధానము గావించు.” అని పలికి కుండధారుడు వెళ్లిపోయాడు.

ధర్మరాజా ఆ బ్రాహ్మణుని కథ వింటివి కదా. నీకు ఇంకొక ధర్మ సూక్ష్మమును చెబుతాను విను.

ఒక బ్రాహ్మణుడు తన భార్యతో అరణ్యంలో ఆశ్రమము కట్టుకుని నివసిస్తున్నాడు. అతడు పొలములో రాలిన గింజలను ఏరుకొని జీవి స్తున్నాడు. అతడు అహింసను ఒక వ్రతంగా పాటిస్తున్నాడు. యజ్ఞములలో హింస మంచిది కాదని ఫలములతో హవిస్సును అర్పిస్తున్నాడు. అది వేదవిహిత పద్ధతి కాదని తెలిసికూడా శాపం పెడతాడు అనే భయంతో అతని భార్య తన భర్తకు ఎదురు చెప్పలేకపోయింది.

కాని, ఇంద్రుడు మొదలగు దేవతలు హవిస్సులు స్వీకరించడానికి రాలేదు. అగ్ని తన శక్తిని కోల్పోయాడు. అప్పుడు అక్కడకు ఒక జింక వచ్చింది. తెలిసిన విషయం చెప్పనందుకు ముని పత్నిని దూషించింది. తనను చంపి ఆ మాంసముతో హవిస్సులు ఇవ్వమని కోరింది. దానికి ఆ బ్రాహ్మణుడు సమ్మతించలేదు. ఆ జింక కొంత దూరం పోయింది. మరలా వెనుకకు వచ్చి ॥ఓ విప్రోత్తమా! నీకు దివ్యదృష్టిని ఇచ్చాను. చూడు. నేను చెప్పినట్లు చేస్తే, నిన్ను అభినందించడానికి అప్సరసలు, గంధర్వులు విమానములలో వచ్చి ఎదురు చూస్తున్నారు. అని పలికింది.

ఆ ప్రకారంగా ఆ విప్రుడు దివ్యదృష్టితో చూచాడు. జింక చెప్పినట్టు అక్కడ అప్సరసలు, గంధర్వులు ఉండటం చూచాడు. ఆ జింక చెప్పినట్టు దానిని హింసించడానికి పూనుకొన్నాడు. దానితో అతని తపస్సు విఘ్నము యింది. ఆ జింక ధర్మదేవత రూపం దాల్చింది. ॥ఓ విప్రోత్తమా! నేను ధర్మ దేవతను. నిన్ను

పరీక్షించుటకు నేనే జింక రూపంలో వచ్చాను. నీకు ఒక ధర్మసూక్ష్మమును చెబుతాను విను. అనవసరంగా జీవహింస చెయ్యడం పాపము. కానీ అవసరమైన చోట జీవహింస చెయ్యడం పాపం కాదు. నీ అహింసా వ్రతమునకు హాని కలగదు. కాని, యజ్ఞం చేస్తున్నాము కదా అని అనవసరంగా జీవహింస చెయ్యడం మంచిది కాదు.” అని పలికింది ధర్మదేవత. అతని యాగము నిర్విఘ్నంగా నెరవేరేట్టు అనుగ్రహించింది.” అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

“పితామహా! పురుషుడు ఏ కారణంతో పాపాలు చెయ్యడం మొదలెడ తాడు. ఏ కారణంతో ధర్మ పరమైన కార్యములకు పూనుకొంటాడు. ఈ ధర్మ కార్యములు, పాప కార్యముల నుండి ఎలా విముక్తి పొందుతాడు. వివరించండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! మానవుడు ఇంద్రియములతో గంధము, రసము మొదలగు వాటిని ఆస్వాదిస్తాడు. ఆ క్రమంలో లోభము, మోహమునకు లోనవుతాడు. లోభము మోహము ఎప్పుడు మనసులోకి ప్రవేశించాయో అప్పుడు అధర్మమునకు పాల్పడతాడు. దాని వలన పాపకార్యములు చేస్తాడు. దాని వలన పాపం చుట్టుకుంటుంది. ఈ విషయం ముందే తెలుసుకుంటే, మనసును విషయముల మీదికి పోనీయక, సజ్జన సాంగత్యముతో గడిపితే, ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది. పాపపు ఆలోచనలు మనసులోనికి రావు. ధర్మమైన బుద్ధి కలుగుతుంది. ధర్మాచరణములో ఆసక్తి కలిగి ఉంటాడు. ఆ పైన ముక్తి పొందుతాడు.” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! మీరు మూడు ముక్కలలో విషయం తేల్చేసారు. కాస్త వివరంగా చెప్పండి.” అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మనందనా! కుమ్మరి కుండను చేయాలంటే మెత్తటి మట్టి, కుమ్మరి సారె, కుండలు చేసే నేర్పు ఉండాలి. అందువలన ఏ పనికైనా ఉపాయము, నేర్పు అవసరము.

మనలో ఉన్న కోపమును క్షమా గుణంతోనూ, కామాన్ని కామ కోరికలు సంకల్పించక పోవడం వల్లనూ, సత్త్వ గుణాన్ని పెంపొందించడం వల్ల అధిక నిద్రను, నిండైన ధైర్యముతో రాగ ద్వేషములను, ఎల్లప్పుడు జాగరూకతతో ఉండడంతో భయాన్ని, నిరంతర అభ్యాసము చేత వస్తువుల మీద వ్యామోహామును, భ్రాంతినీ, మితమైన ఆహారము తీసుకొనడం వల్ల రోగములను, ఈ శబ్ద,రస,రూప,గంధాదులు అన్ని సారము లేనివి అని గ్రహించడం వల్ల విషయ వాంఛలను, ఎల్లప్పుడూ తృప్తిగా జీవించడం వల్ల లోభత్వమును, ఇతరుల పట్ల దయగా ఉండటం వల్ల అధర్మాన్ని, విచక్షణా జ్ఞానంతో కర్మలనూ, అరికట్టవచ్చును.

పైన చెప్పిన ఉపాయములతో కామ క్రోధములను అరికట్టవచ్చును గానీ, ముక్తిని సాధించలేము. కాని పై చెప్పిన ఉపాయములు ఆచరిస్తూ నేర్పుతో ముక్తిని సాధించాలి.” అని పలికాడు భీష్ముడు.

“పితామహా! ఈ మహా భారత యుద్ధంలో అన్నలను తమ్ములను, తాతలను తండ్రులను బంధువులను, స్నేహితులను చంపుకోవడం కేవలం ఆశ వలననే కదా. మరి ఈ ఆశ ఎలా తొలగిపోతుంది? వివరించండి.”అని అడిగాడు.

“ధర్మరాజా! ఈ సందర్భంలో మాండవ్యుడు జనకునికి చెప్పిన మాటలు నీకు చెబుతాను. నీ ప్రశ్నకుసమాధానం లభిస్తుంది. ఒకసారి మాండవ్యుడు అనే ముని జనక మహారాజు వద్దకు వచ్చి తనలో ఉన్న ఆశ చావడానికి తగిన శిక్ష విధించమని అడిగాడు. అప్పుడు జనక మహారాజు మాండవ్యునితో ఇలా అన్నాడు.

“మునీంద్రా! మనకు ఉన్న సంపదలు దుఃఖమును, దోషములను తెచ్చి పెడతాయి. మనకు దేని మీదా ఆశ లేకపోతే మనకు దుఃఖములు దోషములు అంటవు. అందుకే మిథిలా నగరము తగల బడుతున్నా నాకు ఏమీ జరగనట్టే ఉంటుంది. ఏ కామసుఖమైనా, ఆశను, తృష్ణను విడిచి పెడితే వచ్చేసుఖంతో సమానమవుతుందా! ఆవుకు కొమ్ములు పెరిగినట్టు మనలో ఆశకూడా దిన దినమూ పెరుగుతూ ఉంటుంది. ఆ ఆశామోహము వలన కలిగే “ఇది నాది, వీళ్లు నా వాళ్లు, ఇది నా ధనము, వీళ్లు నా బంధువులు, ఇది నా ఇల్లు,” అనే భావనలు మన మనసులోకి రానీయక పోతే, మనలో ఉన్న ఆశ ఇంకి ఆవిరై పోతుంది.

ఓ మునీంద్రా! దొరికిన దానిని అనుభవించుచూ, దొరకని దానికి చింతపడకుండా, ప్రశాంత చిత్తంతో ఉంటే, అతని మనసులోకి ఆశ ప్రవేశించదు. ఈ ఆశను దుర్మార్గులు విడువ లేరు. ఈ ఆశకు ముసలి తనము, రోగము, చావు లేదు. కాని అది మన ప్రాణం మాత్రం తీస్తుంది. ఎవడైతే ఆశను జయిస్తాడో అతను ఆనందం పొందు తాడు. కాబట్టి మునీంద్రా! నీవు సుఖములు, దుఃఖములు అనే ద్వంద్వ ములకు లోను కావద్దు. అంతఃకరణలో శాంతినిపొందు. అదే నీకు అఖండ సౌఖ్యాన్నిస్తుంది.” అని చెప్పాడు జనకుడు.

కాబట్టి ధర్మనందనా! జనకుని మాటలే నీ ప్రశ్నకు సమాధానము అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! మానవునికి అవసాన కాలము ముంచుకొస్తున్నప్పుడు అతడు దేనిని ఆచరించాలి. ఇదే విషయం ఇది వరకు మీరు చెప్పినట్టు గుర్తు. కాని విపులంగా వినవలెనని కోరికగా ఉన్నది." అని అడిగాడు.

"ధర్మనందనా! ఒక బ్రాహ్మణునికి మేధావి అనే కుమారుడు ఉండేవాడు. అతను అపరిమితమైన మేధాసంపత్తి కలవాడు. ఆ కుమారుడు ఒకరోజు తండ్రి ఎదుట నిలిచి ఇలా పలికాడు.

"తండ్రీ! మానవునికి దినదినమూ ఆయువు తరిగిపోతూ ఉంటే అతడు ఏమి చెయ్యాలి?" అని అడిగాడు

" కుమారా! ప్రతి పురుషుడు తన జీవితములో బ్రహ్మ చర్యము, వేదా భ్యాసము, వివాహము, సంతానము, ధనము సంపాదించడం, యజ్ఞ యాగ ములు చెయ్యడం, తరువాత వానప్రస్థమునకుపోయి తుదకు సన్యాసము స్వీక రించడం. ఇంతకన్నా ఏమి చేస్తాడు." అని చెప్పాడు తండ్రి.

"తండ్రీ! మానవుడు పుట్టినది మొదలూ ముసలి తనము, మరణము అనుక్షణమూ వెంటాడుతూ నే ఉంటాయి కదా! మరి ఆ దిగులు లేకుండా మన ఇష్టం వచ్చినట్టు వర్ణాశ్రమ ధర్మములు తీరిగ్గా పాటించడం ధర్మమా! ఈ జన్మలో చేయదగ్గ పనులన్నీ వెంట వెంటనేచెయ్యడం మంచిది కాదా! మనం తీరికగా ఒకటి వెంట ఒకటి ధర్మాచరణ చేస్తూ ఉంటే, మరణం మనకోసం ఆగుతుందా! ఇది చెయ్యదగిన పనీ, ఇది చెయ్యకూడని పనీ, ఇది చెయ్యాలా,

చెయ్యకుండా ఉండాలా అని తర్కించుకుంటూ ఉంటే యముడు ఎప్పుడో ఒకప్పుడు అతనిని తన దగ్గరకు లాక్కుంటాడు.

తండ్రీ! మృత్యువు, అమృతమూ రెండూ మనలోనే ఉన్నాయి. మనలో ఉన్న మోహమే మనకు మృత్యువు. మనలో ఉన్న తత్త్వ విచారమే మనకు అమృతాన్ని ప్రసాదిస్తుంది. తండ్రీ! జీవ హింస చేస్తూ చేసే యజ్ఞ యాగముల కన్నా, జ్ఞాన యజ్ఞములు మేలు కదా! కాబట్టి నేను అహింసాయుతమైన బ్రహ్మ యజ్ఞము చేస్తాను. యోగ మార్గము అవలంబించడం, తపస్సు చేయడం, కర్మఫలములను త్యజించడం ఇవి కాక వేరే కర్మలు మనకు హితము చేకూరుస్తాయా. అలాగే అన్నీ నాకే కావాలనే కోరికలు దుఃఖాన్ని తెచ్చిపెడ తాయి కదా! విషయ సుఖములను త్యాగము చెయ్యడంతో పోలిన సుఖం వేరే ఉందా! ఈ లోకం శాశ్వతము కాదు అని నాకు తెలుసు. నీవు కూడా విషయ వాంఛలు శాశ్వతములు కావు అని తెలుసుకో! నీ మనసును శాంతంగా ఉంచుకో. ఆత్మ పరిశీలన చేసుకో.” అని చెప్పాడు ఆ కుమారుడు.

కుమారుని మాటలకు సంతోషించిన తండ్రి ఆ ప్రకారము ఆచరించి ముక్తిని పొందాడు. కాబట్టి ధర్మనందనా! ఇప్పుడే నేను చెప్పిన బ్రాహ్మణ కుమారుని మాటలలో అంతరార్థం గ్రహించు. నీ ప్రశ్నకు సమాధానం దొరుకుతుంది” అని అన్నాడు భీష్ముడు.

“పితామహా! ఎటువంటిశీలము కలవాడు బ్రహ్మపదము పొందుతాడు. వివరించండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! మితంగా ఆహారం తీసుకుంటూ, ఇంద్రియ సుఖములను త్యజించి, మోక్షము కొరకు ప్రయత్నించాలి. ఈ సందర్భంలో నీకు హారిత

గీత వినిపిస్తాను. సావధానంగా విను.

పూర్వము హారితుడు అనే ముని కొంత మంది పండితులకు ఈ విధంగా బోధించాడు. సాధకుడైన వాడు నిష్ఠతో ఇల్లు వదిలిపెట్టాలి. కోర్కెల పట్ల విముఖంగా ఉండాలి. తన మాటలతో గానీ, చేతలతో గానీ, సంకల్పంతో గానీ ఇతరులకు కీడు తలపెట్టకూడదు. అందరితోనూ మైత్రి కలిగి ఉండాలి. అందరినీ సమానంగా చూడాలి. పొగిడితే పొంగిపోవడం, తిడితే కుంగి పోవడం చెయ్యకూడదు. నివాస గృహములలో నివసించరాదు. దేవాలయములలో నిద్రించాలి. అడవులలో ఉన్నప్పుడు కొండగుహలలో తలదాచుకోవాలి. సరిగా భోజన సమయానికి మాత్రమే భిక్షాటనకు వెళ్లాలి. తనకు కావాల్సిన దానికంటే ఎక్కువ స్వీకరించరాదు. సన్మానితంగాతిరస్కరించాలి. ఎల్లప్పుడూ ఆత్మానురక్తుడై ఉండాలి. వింటివి కదా ధర్మనందనా! ఇలాంటి లక్షణములు కలవాడికి మోక్షము కరతలామలకము.” అని చెప్పాడు.

“పితామహా! నేను క్షత్రియుడిని కదా పైగా చక్రవర్తిని. ఈ రాజసము వదిలి పెట్టి, ఇంద్రియములను జయించి, సత్త్వ,రజస్తమోగుణములను పూర్తిగా విడిచిపెట్టి, శాంతి సుఖమును ఎప్పుడు పొందుతానో కదా!” అని ఆవేదన చెందాడు ధర్మరాజు.

“ధర్మనందనా! అప్పుడే అంత తొందర దేనికయ్యా! అన్ని కాలమే నిర్ణయిస్తుంది. కాల నిర్ణయము బట్టి మనము నడుచుకోవాలి. నీ లో కూడా క్రమ క్రమంగా కాలానుగుణంగా ఈ వర్ణ ధర్మముల మీద ఆసక్తి నశిస్తుంది. అప్పుడు కర్మలను త్యజిస్తావు. అప్పుడు సన్యాసమునకు అర్హుడివి అవుతావు. ఇవన్నీ కాలక్రమేనా జరగాలి కానీ నీకు కోరుకుంటే జరగవుకదా!

దీని కి సంబంధించి నీకు వృత్ర గీత అనే ఇతిహాసమును చెబుతాను.

విను.  దేవాసుర యుద్ధంలో వృత్రాసురుడు అనే రాక్షస రాజు పడిపోయాడు. అప్పుడు రాక్షసులు అతనినిసురక్షిత స్థావరానికి తీసుకొని వెళ్లారు. కానీ వృత్రాసురుని మొహంలో విషాదచ్ఛాయలు కనిపించలేదు నిర్మలంగా ఉన్నాడు. అప్పుడు రాక్షసుల గురువు శుక్రుడు అతనితో ఇలా అన్నాడు. "వృత్రా! శత్రువులు నీ రాజ్యమును సంపదలను హరించారు కదా! మరి నీకు ఏ మాత్రం దుఃఖము కలగలేదా! కారణమేమి?" అని అడిగాడు.

అప్పుడు వృత్రాసురుడు శుక్రునితో ఇలా చెప్పాడు. "గురుదేవా! కలిమి లేములు  కాల వశాత్తు వస్తుంటాయి, పోతుంటాయి. అజ్ఞానులే కలిమి ఉన్నప్పుడు దర్పము, కలిమి పోయినప్పుడు దైన్యము పొందుతారు. ఈ సంపదలన్నీ అశాశ్వతములు అని తెలిసిన వాడు సంపదలు ఉన్నా  లేక పోయినా బాధ పడడు. నిర్మలమైన మనస్సుతో ఉంటాడు.  ఈ ప్రాణులన్నీ కర్మ వశాత్తు దేవతలు గానూ, మనుష్యులు గానూ,  జంతువులు గానూ జన్మలు ఎత్తుతుంటాయి. చస్తూ ఉంటాయి. మరలా జన్మలు ఎత్తుతుంటాయి. ఈ విషయం నాకు తెలుసు కాబట్టే నేను దేనికీ బాధపడను." అని అన్నాడు వృత్రుడు.

శుక్రాచార్యుడు వృత్రుని మనశ్శుద్ధి ఎలాంటి దో తెలుసు కోవాలను కున్నాడు .  "ఓ వృత్రాసురా! నీవు రాక్షస రాజువు. నీకు ఇలాంటి అభిమానం లేని  మాటలు  పలకడం ఉచితమా!"  అని అతనిలో  ఈర్ష్య ద్వేషము రెచ్చగొట్టే మాటలు మాట్లాడాడు.  కాని వృత్రుడు చలించలేదు.

"గురుదేవా!  పూర్వము నేను దేవతల మీద విజయం సాధించాలని ఘోర తపస్సు చేసాను. విజయం సాధించాను. అప్పుడు ముల్లోకాలు పాలించాను. సమస్త ఐశ్వర్యములు అనుభవించాను. ఇప్పుడు అవన్నీ పోయాయి.  ఏదో

పాపం చేసి ఉంటాను. అందుకనే ఇలా అయింది. అవనీయండి. దీనికి విచారించడం ఎందుకు అయి తే ఒక మాట! ఇంక మీదట నేను సుకృతముల జోలికీ, దుష్కృతముల జోలికి పోను. తటస్థంగా ఉంటాను. నిర్మల చిత్తుడనై విష్ణువును ఆశ్రయిస్తాను. ఎందుకంటే నేను ఇంద్రుడి తో యుద్ధం చేసేటప్పుడు అతని పక్కన ఉన్న విష్ణువును చూచాను. అతని ప్రజ్ఞకు ఆశ్చర్యపోయాను. గురువరా! నాకు విష్ణు మహిమను గూర్చి వివరించండి." అని అడిగాడు వృత్రుడు. అలాగు చెబుతాను అన్నాడు శుక్రుడు.

ఇంతలో బ్రహ్మ మానస పుత్రుడైన సనత్కుమారుడు అక్కడకు వచ్చాడు. శుక్రుడు, వృత్రుడు అతనికి అతిథి సత్కారములు చేసారు. "మహాఋషీ! ఈ దానవేంద్రునకు విష్ణు మహిమను గురించి చెప్పండి!" అని అడిగాడు శుక్రుడు.

"విష్ణువు సర్వవ్యాపి. విష్ణువుకు భూమి పాదాలు. ఆకాశమే తల. భుజాలు దిక్కులు. ఆప్రకారంగా విష్ణువు సర్వదేవమయుడు అయి ఉన్నాడు ఈ చరాచర జీవరాసులను పుట్టించడం, పోషించడం, చంపడం ఆయన లీలా మాత్రం గా చేస్తుంటాడు. మానవుని జీవితంలో అవస్థలు రంగులు రంగులు గా భాసిల్లుతాయి. న ల్ల రంగు, బూడిద రంగు, ఆకుపచ్చ రంగు, పసుపు రంగు, ఎరుపు రంగు తెల్ల రంగు. జీవుడు తాను చేసిన పూర్వ కర్మ విశేషముల వలన మరుజన్మలో పైన చెప్పిన వర్ణముల రూపంలో అనుభవిస్తుంటాడు. పుట్టడం చావడం-- మరలా పుట్టడం-- ఈ చక్రభ్రమణంలో జీవుడు కొట్టుమిట్టాడుతుంటాడు.

జీవుడు మరు జన్మలో ఉత్తముడు, మధ్యముడు, అధముడు అనే మూడు రకాలుగా జన్మ ఎత్తుతుంటాడు. అనగా దేవతా జన్మ ఉత్తమ జన్మ, మానుష

జన్మ మధ్యమ జన్మ, పశుపక్ష్యాదులుగా పుట్టడం అధమమైన జన్మ. ఈ జన్మలో ఒకరికి ఉపకారం చేసే వాడికి మరు జన్మలో ఉత్తమమైన జన్మ లభిస్తుంది. ఈ జన్మలో పరులకు అపకారం చేసేవాడికి మరుజన్మలో అధో జన్మ లభిస్తుంది.
పుణ్య కార్యాలు చేస్తే జీవుడు మాలిన్యం వీడి పవిత్రుడౌతాడు. జీవుడు ఎంత ఎక్కువగా పుణ్య కార్యాలు చేస్తాడో అంత మంచి జన్మ లభిస్తుంది. దాని వలన అతడికి దుఃఖం తొలగిపోతుంది. నిర్మలానందాన్ని పొందుతాడు.
జీవుడు ఎల్లప్పుడూ తెల్ల రంగును తన మనసులో భావిస్తుంటాడో ఆ జీవునికి నిరంతర విష్ణు భావన కలుగుతుంది." అని సనత్కుమారుడు వృత్రుడికి విష్ణు మహాత్మ్యము వివరించాడు.

అమృతంతో సమానమైన ఆ మాటలు వినిన వృత్రుడు విశుద్ధుడై విష్ణు సాయుజ్యము పొందాడు" అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! వృత్రుడు ఇంతటి విజ్ఞాన వంతుడు, విష్ణు భక్తుడు కదా. మరి అతనికి దేవేంద్రునితో యుద్ధము ఎందుకు సంభవించింది" అని అడిగాడు. భీష్ముడు ఇలా చెప్ప సాగాడు.

"ఇంద్రుడు అపారమైన దేవసేనతో రాక్షస రాజైన వృత్రాసురుని మీదికి యుద్ధానికి వెళ్ళాడు. రాక్షస సైన్యాలు చూచి దేవేంద్రుడు భయపడ్డాడు. వృత్రాసురుడు పర్వతాకారంతో దేవేంద్రునితో యుద్ధ చేసాడు. ఇంద్రునికి వణుకు పుట్టింది. వృత్రాసురుడు తన మాయాశక్తితో ఇంద్రుని మూర్ఛ పోగొట్టాడు. అప్పుడు వశిష్ఠుడు ఇంద్రుని తన తపోమహిమతో మూర్ఛ నుండి తేరుకొనేట్టు చేసాడు. వశిష్ఠుడు మరలా ఇంద్రుని వృత్రుని మీదికి యుద్ధం చేయడానికి పురికొల్పాడు.

దేవ గురువు బృహస్పతి ఇంద్రునికి విజయం చేకూర్చమని మహాశివుని ప్రార్థించాడు.  వెంటనే మహాశివుని తేజస్సు దేవేంద్రునిలో ప్రవేశించింది. వృత్రుని చంపడానికి దేవేంద్రుడు తన వజ్రాయుధము పైకి ఎత్తాడు. ఆ వజ్రాయుధము లోనికి విష్ణువు ప్రవేశించాడు.

అప్పుడు రుద్రుడు  ఇంద్రుడితో ఇలా అన్నాడు. “దేవేంద్రా! ఈ వృత్రుడు 60,000 దివ్యసంవత్సరములు బ్రహ్మ గురించి తపస్సు చేసాడు. ఆ తపస్సుకు మెచ్చి బ్రహ్మ వృత్రునికి అధికము, మహోగ్రము అయిన బలాన్ని ప్రసాదించాడు.  ఆ బలాన్ని నేను నా తేజముతో నాశనం చేస్తాను.” అని అన్నాడు.  ఇదే సమయము అని ఇంద్రుడు వృత్రుని తన వజ్రాయుధము తో కొట్టాడు. ఆ దెబ్బకు వృత్రుడు నేల మీద పడిపోయాడు. దేవతలు దుందుభులు తూర్యనాదములు విజయ ఘోషలు చేసారు.  దేవేంద్రుని పొగిడారు.

అప్పుడు ఒక విచిత్రం జరిగింది. వజ్రాయుధములో విష్ణువు ప్రవేశిం చాడు అని చెప్పుకున్నాముకదా. విష్ణు స్పర్శ తగలగానే వృత్రుని లోని మాలిన్యము తొలగిపోయింది. అతడు పునీతుడయ్యాడు.  ఇంతలో విజయోత్సాహంతో ఇంద్రుడు శివునికి ప్రణామం చేసాడు.  “మహా శివా! మీ కరుణతోనే కదా నేను ఇంతటి విజయాన్ని సాధించగలిగాను.” అని అన్నాడు. ఇంద్రుడు స్వర్గమునకు వెళ్లాడు.

ఇంద్రుడు స్వర్గ లోకానికి వెళ్లాడే కాని అతనికి శాంతి లేదు. బ్రహ్మహత్యా పాతకం అతనిని చుట్టుకొని పీడిస్తూ ఉంది.

(వృత్రుడు బ్రాహ్మణుడు అని ఇదివరకు మనం తెలుసుకొని ఉన్నాము.

బ్రాహ్మణుని చంపితే బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంటుంది అని లోకవిదితమే).

ఇంద్రుడు బ్రహ్మ దగ్గరకు వెళ్లాడు. తరుణోపాయం చెప్పమని అడిగాడు. బ్రహ్మ ఇంద్రునితో నీ పాపం అందరికీ పంచిపెట్టు అని చెప్పాడు.

అప్పుడు ఇంద్రుడు తన బ్రహ్మ హత్యా పాతకము వలన సంక్రమించిన పాపమును పంచి పెట్టడానికి అగ్నిని, ఓషధులను, చెట్లను, గడ్డిని, స్త్రీలను, జలమును పిలిచాడు బ్రహ్మ. "నేను ఇంద్రుని బ్రహ్మ హత్యా పాతకాన్ని నాలుగా భాగాలు చేసాను. దానిని మీరందరూ స్వీకరించాలి." అని ఆజ్ఞాపించాడు.

"బ్రహ్మదేవా! మేము నువ్వు చెప్పినట్టే చేస్తాము. కాని ఈ పాపము నుండి మాకు నిష్కృతి లేదా!" అని అడిగారు. అప్పుడు బ్రహ్మదేవుడు ఇలా అన్నాడు.

"ఓ అగ్నీ! నీవు సరిగా మండకుండా ఉన్నప్పుడు ఆ యాగము చేసేవాడు నీలో హవిస్సులను వ్రేలిస్తే, నీ పాపం వాడికి సంక్రమిస్తుంది. (ముందు అగ్నిని ప్రజ్వరిల్లచేసి తరువాత హవిస్సులు అగ్నిలో వ్రేల్చాలి.)

పండగలకు పబ్బాలకు ఈ మానవులు మీ యొక్క ఆకులను, కొమ్మలను విరిచి పాడు చేస్తారు. అప్పుడు వారిలో కి మీ పాపం ప్రవేశిస్తుంది అని ఓషధులకు, గడ్డికి, చెట్లకు వరం ఇచ్చాడు.

(అన్ని పండగలకు మనం మామిడి ఆకులను విరిచి తోరణాలు కడతాము. వినాయక చవితికి అన్నిరకాల పత్రిని కోసుకొని వచ్చి పూజ చేస్తాము).

ఇంక స్త్రీలనుచూచి మీరు రజస్వలగా ఉండగా మీతో రతి సలిపే వాడిలో ఈ మహా పాతకము ప్రవేశిస్తుంది. మీర పాపరహితులు అవుతారు. అని వరం ఇచ్చాడు బ్రహ్మ.

జలమును చూచి, మీలో మలమూత్రములు విసర్జించడం, ఉమ్మడం చేసేవాడిలో మీకు సంక్రమించిన బ్రహ్మ హత్యాపాతకము చేరుతుంది.ౖ అని అన్నాడు బ్రహ్మ.

బ్రహ్మ మాటలకు వారు అంగీకరించారు. అగ్ని, ఓషధులు గడ్డి చెట్లు, స్త్రీలు, జలమూ ఇంద్రునికి సంక్రమించిన బ్రహ్మ హత్యా పాతకము స్వీకరించారు. ఇంద్రుడు తాను పాపము నుండి విముక్తుడయ్యాడు.

తరువాత ఇంద్రుడు బ్రహ్మ అనుమతితో అశ్వమేధ యాగము చేసాడు. స్వర్గాన్ని పరిపాలిస్తున్నాడు. ఇంద్రుడు వృత్రుని చంపినపుడు వృత్రుని శరీరం నుండి రక్తం కారింది. అవి కాలక్రమేణా పుట్టగొడుగులు గా రూపొందాయి. మనిషికి ఆహారంగా మారాయి. బ్రాహ్మణులు వాటిని మాంసాహారంగానే పరిగణించి పుట్టగొడుగులను ఆహారంగా స్వీకరించరు.

ఓధర్మనందనా! నీవు కూడా ఇంద్రుని వలెనే శత్రువులను జయించి కీర్తి పొందు.ౖ అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

ధర్మరాజుకు మరొక సందేహము కలిగింది ౖపితామహా! వృత్రునికి జ్వరం వచ్చింది (తాపం కలిగింది) అని విన్నాను. ఆ జ్వరము (తాపము) వృత్రునికి ఎలా వచ్చింది. వివరంగా తెలపండి.ౖఅని అడిగాడు.

" ధర్మరాజా! వెండి కొండమీద, పార్వతీ సమేతంగా పరమశివుడు, దేవతలు, మునులు, యక్షులు మొదలగు వారు తనను సేవిస్తూ ఉండగా కొలువుదీరి ఉన్నాడు. అప్పుడు కొంతమంది దేవతలు గుంపులు గుంపులుగా పోతున్నారు.

అప్పుడు సతీ దేవి భర్తను చూచి "నాధా! వీరంతా ఎక్కడికి పోతున్నారు?" అని అడిగింది.

"దేవీ! దక్షుడు చేయు యాగములో తమ తమ హవిర్భాగములను తీసుకొనుటకు వెళుతున్నారు!" అని చెప్పాడు శివుడు.

"నాధా! మరి మీరు ఎందుకు పోవడం లేదు. మీ హవిర్భాగము మీరూ స్వీకరించాలి కదా!" అని అడిగింది సతీ దేవి.

"దక్షుడు నన్ను ఈ యాగమునకు పిలవ లేదు. నాకుగా హవిర్భాగమును ఏర్పాటు చేయలేదు. అందుకని నేను వెళ్లడం లేదు" అని బదులు చెప్పాడు శివుడు.

సతీ దేవికి మహా కోపం వచ్చింది. దక్షుడు తన భర్తకు హవిర్భాగము ఎందుకు కల్పించ లేదు అని కోపంతో ఊగిపోయింది. కాని మౌనంగా ఉండి పోయింది.

భార్య ఆంతర్యం గ్రహించాడు శివుడు. తన ప్రమధ గణాలతో పోయి దక్షుని యజ్ఞము నాశనం చేసాడు. యజ్ఞమునకు వచ్చిన దేవతలు, మునులు యక్షులు అందరూ తలొకదిక్కుగా పారిపోయారు.

ఇంతలో బ్రహ్మదేవుడు శివుని వద్దకు వచ్చి “పరమశివా! నీకు ఈ యాగములో హవిర్భాగము కల్పిస్తాము. శాంతించు!” అని వేడుకున్నాడు. ఆ మాటలతో శివుడు శాంతించాడు. అప్పుడు బ్రహ్మదేవుడు శివునితో ఇలా అన్నాడు.

“పరమశివా! నీ నుదుటి నుండి పుట్టిన చెమట నుండి ఒక పురుషుడు ఉద్భవించాడు. అతడు జ్వరం అనే పేరుతో ప్రసిద్ధి పొందుతాడు. జీవులందరినీ ఆవహిస్తాడు. కాని జ్వరము ఏక రూపంలో ఉంటే ఆ జ్వర తీవ్రతకు ప్రజలు తట్టుకోలేరు కాబట్టి ఆ జ్వరమును వివిధ రూపములతో ఉండేట్టు వరం ప్రసాదించు.” అని అన్నాడు బ్రహ్మ.

అప్పుడు శివుడు ఆ జ్వరాన్ని ఇలా విభజించాడు. “ఏనుగుకు తలనొప్పిగా, పాముకు కుబుసంగా, గోవులకు పాదాల నొప్పిగా, లేళ్లకు తమ రూపము తాము చూచుకోడానికి నిరోధంగా, గుఱ్ఱములకు పార్శ్వపు నొప్పిగా, నెమళ్లకు ఈకలు ఊడిపోవడం ద్వారా, కోకిలకు కళ్ల వ్యాధిగానూ, చిలుకలకు ఎక్కిళ్లుగానూ, మేకలకు కంగారుతనంగా, పులులకు అలసటగా, మనుష్యులకు చావు పుట్టుకలప్పుడు వచ్చే దుఃఖంగా విభజిస్తున్నాను.” అని అన్నాడు శివుడు.” అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

“పితామహా! శాస్త్ర తత్త్వము తెలియని వాడికి అన్ని అనుమానాలే వస్తాయి. పరమార్ధము ఇలా ఉంటుంది అని వాడికి తెలియదు. మరి అలాంటి వాడు ఎలాంటి కర్మలను ఆచరిస్తాడు.” అని అడిగాడు.

“ధర్మరాజా! అలాంటి వాడికి గురుపూజ, వృద్ధులకు సేవచెయ్యడం,

వేదములను, శాస్త్రములను వినడం, అవశ్యము చేయవలసిన పనులు. ఈ విషయాన్నే పూర్వము నారదుడు గాలవుడికి వివరించాడు.

ఒకసారి గాలవుడు నారదముని దగ్గరక పోయి "మునీంద్రా! నేను చాలా శాస్త్రములు చదివాను. ఎన్నోవిషయములు చర్చించాను.కాని నా మనసులో ఏదో కొరత గా ఉంది. నాకు సంపూర్ణమైన జ్ఞానమును ప్రసాదించండి." అని అడిగాడు.

నారదుడు ఇలా చెప్పాడు. "ముందు మానవుడు బ్రహ్మచర్య,గృహస్థ, వానప్రస్థ,సన్యాసాశ్రముల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి. తరువాత పాపము చేయడానికి ఆస్కారమున్న అన్ని కర్మలను విడిచిపెట్టాలి. ఎల్లప్పుడూ పుణ్యకర్మాచరణం చెయ్యాలి. పరిశుద్ధ మనస్సుతో ఉండాలి. ఎప్పుడూ సజ్జన సాంగత్యంలో గడపాలి. సమస్త జీవులను దయతో చూడాలి. ఎల్లప్పుడూ మధురంగా సౌమ్యంగా మాట్లాడాలి. దేవతలను, పితృదేవతలను యధా విధిగా పూజించాలి. అహంకారము వదిలిపెట్టాలి. ఎవరినీ ఏ వస్తువు కొరకూ యాచించకూడదు. విషయ వాంఛలకు దూరంగా ఉండాలి. ఇంద్రియ నిగ్రహం పాటించాలి.

ఇతరులను నిందించడం, తనను తాను పొగుడుకోడం మానాలి. సోమరిపోతుగానూ, గర్విష్టిగానూ, అధిక ప్రసంగం చేసేవాడుగానూ, ఇతరుల పట్ల మాత్సర్యంతో మెలగేవాడుగానూ, ఎప్పుడూ కోపంగా ఉండేవాడు గానూ, ఉండకూడదు. ఎల్లప్పుడూ అతిధులను సత్కరిస్తూ ఉండాలి. ఎక్కడైతే వేదాధ్యయనము, వేదాంగముల చర్చలు, యజ్ఞయాగములు, బ్రాహ్మణ సన్మానము జరుగుతూ ఉంటుందో అటువంటి ప్రదేశములోనే నివసించాలి. మనుజుడు ఈ ప్రకారంగా ఋజువర్తనుడైతే అతనిలో ఉన్న అన్ని దోషములు

నివారింపబడతాయి. అతనికి జ్ఞానోదయమవుతుంది.” అని నారదుడు గాలవుడికి చెప్పాడు అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

“పితామహా! కాలము అవిచ్ఛిన్నము కదా. నా బోటి వాడు ఈ కాలపాశమును ఎలా ఛేధించగలడు.” అని అడిగాడు.

“ధర్మ నందనా! ఇదే విషయమును పూర్వము సగరుడు అనే మహారాజు అరిష్టనేమి అనే మునిని అడిగాడు. ఆముని చెప్పిన మాటలను నేను నీకు చెబుతాను. మానవుడు ఎల్లప్పుడూ భార్యా బిడ్డలూ, ధనము, ధాన్యము, పశువులు, వీటి వ్యామోహంలో పడి అతని మనస్సు ఎల్లప్పుడూ వ్యాకులమై ఉంటుంది. అటువంటి వాడికి మోక్ష మార్గము దుర్లభము. వయసులో ఉన్నప్పుడు అనుభవించినా, కనీసం వృద్ధులైన తరువాత, వృద్ధురాలైన భార్యను వదిలిపెట్టి ఏకాంత ప్రదేశమునకు పోవాలి. అటువంటి వాడికి కొడుకులు ఉన్నారా లేరా అన్నది ముఖ్యం కాదు. ఒకవేళ కొడుకులు ఉన్నా వాళ్లను విడిచి పెట్టి వెళ్లాలి. అప్పుడే అతనికి శాంతి వైరాగ్యము కలుగుతాయి.

కాని ఈ సంసార లంపటంలో మునిగిన వాడు “అయ్యో నేను లేకపోతే వీళ్లు ఏమయి పోతారు? ఎలా బతుకుతారు?” అని వాళ్లకు సేవలు చేస్తూ చస్తాడు. అప్పుడు ఆ బంధువులు, పుత్రులు ఇతనిని ఆదు కొనరు. ఈ విషయాన్ని గ్రహించి ముందే వైరాగ్యము అలవర్చుకోవాలి. పోనీ బంధువులకు, పుత్రులకు జీవితాంతం సేవచేసినా, కడకు వాళ్లు ఇతనికి ముక్తిని ప్రసాదిస్తారా అంటే అదీ లేదు. కాబట్టి ఈ సంసారము నుండి తొందరగా బయటపడటం ఉత్తమం.

ప్రతిరోజూ మన కళ్లముందే ఎంతో మంది పుడుతున్నారు. చస్తున్నారు.

పుట్టేవాడు ఏదీ తీసుకురావడం లేదు. చచ్చేవాడు ఏదీ పట్టుకుపోవడం లేదు. దీనిని జాగ్రత్తగా గమనిస్తే ఏదీ శాశ్వతం కాదని అనుభవంలోకి వస్తుంది. అప్పుడు అతడు ముక్తిమార్గంలో పయనిస్తాడు. అలాకాక ఈ సంసార లంపటంలో కొట్టుమిట్టాడేవాడు ఎన్నటికీ ముక్తిమార్గం చేరుకోలేడు. మనుష్యుడు ముందు ఈ ద్వంద్వముల నుండి బయటపడాలి. మృష్టాన్నమును-- పచ్చడి మెతుకులను, కటిక నేలను-- మృదువైన పట్టు పరుపులను, జింక చర్మమును-- చీని చీనాంబరములను, సమదృష్టితో చూడాలి. అటువంటివాడికి ముక్తి సునాయాసంగా లభిస్తుంది.

ఎంతోమంది చక్రవర్తులు ఈ భూమండలమును పరిపాలించారు. కాని వారందరూ కాలగర్భంలో కలిసిపోయారు. తమలో పూచిక పుల్లకూడా తీసుకొని పోలేదు. ఈ విషయమును గ్రహించిన సాధకుడు మోక్షమును పొందగలడు. ఈ ప్రపంచంలో ధనము సంపాదించడం చాలా కష్టము. కాని దుఃఖములు మాత్రం అవలీలగా మానవుని చుట్టుకుంటాయి. ఈ విషయం తెలిసిన వాడు మరలా ఈ జనన మరణ ఉచ్చులో పడక మోక్షము కోసం ప్రయత్నిస్తాడు.

కాబట్టి మహారాజా! నీవు గృహస్థాశ్రమములో ఉన్నా అంటీ ముట్టనట్టు గా ఉండు. ఎక్కువగా మమతలకు మమకారాలకు లోను కాకు. నీవు మహారాజువు అని అహంకరించకు. ప్రజాపాలన నీ ధర్మం అని పాలించు. అప్పుడు నీకు మోక్షము సిద్ధిస్తుంది.॥ అని అరిష్టనేమి సగరునికి మోక్షమార్గమును బోధించాడు.

॥ధర్మజా! నీ ప్రశ్నకుసమాధానం లభించింది కదా!॥ అన్నాడు భీష్ముడు.

॥పితామహా! దానవులు ధర్మ ద్వేషులు కదా. మరి వారికి శుక్రాచార్యుడు

మంత్రిగా ఎలా ఉన్నాడు. మరి ఆ శుక్రునకు “శుక్రుడు” అనే పేరు ఎలా వచ్చింది?” అని అడిగాడు.

“ధర్మ నందనా! శుక్రుని అసలు పేరు భార్గవుడు. భార్గవునికి యోగ బలము ఎక్కువ. భార్గవుడు ధనమునకు అధిపతి అయిన కుబేరుని మోసం చేసి అతని సంపదలను అన్నీ అపహరించాడు. కుబేరుడు ఈ విషయమును ఈశ్వరుడితో మొరబెట్టు కున్నాడు. ఈ విషయం వినగానే ఈశ్వరుడికి కోపం మిన్ను ముట్టింది. అతని కళ్లలోనుండి అగ్ని కణాలు రాలాయి. తన త్రిశూ లమును పైకెత్తి “ఎక్కడా! ఎక్కడ ఆ భార్గవుడు?” అని హుంకరించాడు.

ఇది తెలిసిన భార్గవుడు పరుగెత్తిపోయి ఒక పొదలో దాక్కున్నాడు. కాని శివుడు అతడిని పట్టుకున్నాడు. ఒక్క ఉదుటున భార్గవుని మింగేసాడు. శివుడు తాను మింగిన భార్గవుడు బయటకు పోకుండా తన శరీర ద్వారములు అన్నీ మూసేసాడు. కాని తన పురుషాంగ ద్వారము మాత్రం తెరిచి ఉంచాడు. ఈ మార్గంలో బయటకు రమ్మని భార్గవునికి సూచన ఇచ్చినట్టయింది. భార్గవుడు శివుని పురుషాంగ ద్వారా బయటకు వచ్చాడు.

ఇంకా శివుని కోపం చల్లారలేదు. అప్పుడు పార్వతి శివునితో ఇలా అంది. “పరమ శివా! ఈ భార్గవుడు నీ కడుపునుండి బయటకు వచ్చాడు. అందుకని మనకు పుత్రుని తో సమానము. పుత్రుని మీద కాఠిన్యము తగునా! కాబట్టి అతని మీద దయచూపండి.” అని చెప్పింది పార్వతి. శివుడు శాంతించాడు. శివుని పురుషాంగము ద్వారా శుక్రము వలె బయటకు రావడం వల్ల భార్గవునకు శుక్రుడు అనే పేరు సార్ధకమయింది.” అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

“పితామహా! మీరు ఎన్ని విషయములు చెప్పినా నాకు ఇంకా ఇంకా వినవలెనని కుతూహలముగా ఉన్నది. కాని అడగడానికి సందేహములు లేవు. మీరే నాకు మంచి మంచి ధర్మములు ఉపదేశించండి.” అని అడిగాడు.

అప్పుడు భీష్ముడు ధర్మరాజుకు పరాశర గీతను చెప్పాడు. “ధర్మ నందనా! పూర్వము జనకమహారాజు కోరిక మేరకు పరాశర ముని ,ఈ ప్రకారంగా ధర్మబోధ చేసాడు.

మానవుడు ఇహలోక సౌఖ్యములు, పరలోక సౌఖ్యములు, ధర్మకార్యములే అని తలంచి, చిన్న విత్తనము ద్వారా ఫలమును పొందినట్లు, ధర్మాచరణము వలన సుఖములు పొందవలెను. మంచి పనులుచేస్తే సుఖం కలుగుతుంది. చెడ్డ పనులు చేస్తే దుఃఖం కలుగుతుంది. సుఖదుఃఖములు మానవుని వదలవు. వస్తూ పోతూ ఉంటాయి. మానవుడు తన వాక్కుతో గానీ, మనస్సుతో గానీ, దృష్టితో గానీ,శరీరావయవములతో గానీ, అన్యాయము అధర్మము చేయం కుండా ఉంటే, వాడికి సత్పథ నిరతి కలుగుతుంది.

సత్పథమనగా సత్యము, మనో నిగ్రహము, ఇంద్రియనిగ్రహము, అహింస. వీటిని మంచి మార్గములు అంటారు. కోరికలు రథం లాంటికి. ఇంద్రియాలు ఆ రథానికి కట్టిన గుర్రాల వంటివి. అటూ ఇటూ పరుగెడుతూ ఉంటాయి. తెలివి అనే పగ్గాలతో ఆ గుర్రాలను అదుపుచెయ్యాలి. అప్పుడు కోరికల రథం సన్మార్గంలో నడుస్తుంది. మానవునికి భగవంతుడు పూర్ణాయుష్షు నిచ్చాడు.

( ఎలాంటి చెడు అలవాట్లు లేకుండా, చీటికీ మాటికీ మందులు వాడ కుండా , ప్రశాంత జీవితం గడుపుతూ ఉంటే మానవుడు దాదాపు 90 ఏళ్లు జీవించే అవకాశం ఎంతో ఉంది).

కాని మానవుడు ఆ జీవితాన్ని అనేక రకములైన అకృత్యాలు చేసి, మట్టి పాలు చేసుకుంటున్నాడు. అకాల మరణం పొందుతున్నాడు. అలా కాకుండా జీవితాంతం మంచి పనులు చేస్తూ సుఖమయం చేసుకోవచ్చు కదా! అక్రమాలు, అధర్మాలు, అవినీతి, ఆచరించినందువలన తత్కాలికంగా సుఖము, లాభము కలుగుతాయి. కాని ఆ సుఖములు అశాశ్వతములు. ఆ సుఖముల వెంట దుఃఖములు పొంచి ఉంటాయి. కాటేస్తాయి. కాబట్టి ధర్మకార్యాచరణ ఉత్తమమైనది.

విష్ణువును స్తుతించడం, తపస్సు చేయడం, ధర్మము ప్రకారం నడుచు కోవడం ఇవి మనస్సుకు జ్ఞానాన్ని శాంతిని కలుగ చేస్తాయి. ఎలాంటి దుర్మార్గుడైనా పైన చెప్పిన వాటిని చేస్తే అతను సన్మార్గుడ వుతాడు.

ఇంటిలో అగ్నిహోత్రము ఉంచుకున్న వాడిని పుణ్య పురుషుడు అంటుంది వేదము. ఎందుకంటే, తల్లి, తండ్రి, గురువు, మంచి మార్గము, బలము, బుద్ధి ఇవన్నీ అగ్ని స్వరూపాలే. సాధుజనుల సాంగత్యంతో ఎలాంటి దుర్మార్గుడైన సన్మార్గుడుగా మారతాడు. శూద్రులు కూడా బ్రాహ్మణుల సేవజేసి ఇహలోక సుఖములు, పరలోక సుఖములు పొందుతున్నారు కదా!

ఈ మానవ జీవితము అనిత్యము. శాశ్వతము కాదు. ఈ సత్యమును మానవులందరూ తెలుసుకొని సుఖములు సంభవించినప్పుడు కానీ, దుఃఖములు సంభవించి నప్పుడు కానీ, ధర్మము తప్పకుండా ప్రవర్తించాలి. ఇది ఏ జాతి వారికైనా అనుసరణీయము. ఎక్కువ ఫలము వస్తుందని తక్కువ పాపకార్యము కూడా చెయ్యవద్దు. తక్కువ ఫలం వస్తుందని ఎక్కువ పుణ్య కార్యమును మానవద్దు. దానివలన ఇహ పర సుఖములు కలుగుతాయి.

ప్రతి వాడూ స్వధర్మమును పాటించాలి. స్వధర్మము పాటించకుండా, ఇతరత్రా ఎన్ని ధర్మకార్యములు చేసినా, అతడు అధర్మపరుడే. యజ్ఞములు చెయ్యని విప్రుడు, ప్రజలను రక్షించని క్షత్రియుడు, ధర్మమార్గంలో ధనము ఆర్జించని వైశ్యుడు, విప్రుల సేవచేయని శూద్రుడు, ఎన్ని ధర్మ కార్యములు చేసినా, వారు  అధర్మపరులే. ధర్మంగా సంపాదించిన ధనము నాలుగవ వంతైనా అది ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది. అన్యాయార్జితమైన ఆస్తి, ధనము కోటి రెట్లు ఉన్నా  అది నిష్ఫలమే అని పెద్దలు చెబుతారు.

బ్రాహ్మణుడు పేదరికము చేత తన వృత్తిధర్మములు చేయలేక పోతే, అతను క్షత్రియ ధర్మము, వైశ్య ధర్మమును ఆచరించవచ్చును. కాని సేవకా వృత్తి అయిన శూద్రధర్మమును  ఆచరిస్తే నరకానికి పోతాడు.  ఇంక వైశ్యుడు ఎంతటి  కష్టములలో నైన మద్యము, మాంసము సేవిస్తే నరకానికి పోతాడు. శూద్రునకు తన జీవనాధారము నశించిపోయినపుడు, వైశ్యధర్మములైన, పశుపోషణ, వ్యవసాయము చేసి జీవించవచ్చును.

ఓ జనక మహారాజా! పూర్వము రాక్షసులు మానవులు చేయుచున్న ధర్మకార్యములు సహించలేక, రాక్షసులు మానవులను ఆవహించారు. దానితో మానవులు అధర్మ వర్తనులైనారు. మానవులలో గర్వము, రోషము ప్రవేశించింది. వేదాధ్యయనము, యజ్ఞ యాగములు చేయడం మానివేసారు. అది చూచి దేవతలు చింతించారు. శివుని వద్దకు పోయి మొరపెట్టుకున్నారు. శివుడు దేవతల మొరను ఆలకించి తన త్రిశూలమును పంపాడు. ఆ త్రిశూలము మానవులలోని  రాక్షసత్వమును అణచి వేసింది. ఆ ప్రకారంగా శివుడు ప్రజారక్షణ చేసాడు. అప్పటి నుండి వేదాధ్యయనము, యజ్ఞ యాగములు యధావిధిగా కొనసాగాయి.  కాబట్టి జనకమహారాజా! నీవు కూడా

ప్రజలలో ఉన్న రాక్షసత్వమును అణచివేసి వారిలో ధర్మనిరతిని పెంపొందించు.

ఇంక తపస్సు దాని మహిమను గురించి చెబుతాను విను. పూర్వము విద్యాధరులు, ముని పుంగవులు, దేవతా గణములు తపస్సు చేయడం వలననే ఎక్కువ విభవమును పొందారు. బ్రహ్మదేవుడు కూడా తపస్సు చేతనే సమస్త లోకములను సృష్టించాడు. పూర్వ కాలంలో రాజులుకూడా తపస్సు చేయడం వలననే కీర్తి గడించారు. మనకు సుఖాన్ని కలిగించే గంధము, సుగంధ లేపనములు, పట్టుపరుపులు, తపస్సు వలననే మనకు సమకూరాయి.

మానవుడు సంసారజీవితంలో పడిపోయి భార్యా, బిడ్డలు, డబ్బు, ఆస్తి, భోగములు వీటితో విసిగి పోయినపుడు, అతనికి నిర్మలమైన మనస్సుతో చేసే తపస్సు ఉపశాంతి కలిగిస్తుంది. మనిషికి లోభము దుఃఖమును, సంతోషము సుఖాన్ని కలిగిస్తాయి. కాని ఈ సుఖ దుఃఖాలు కూడా తపస్సు చెయ్యక పోవడం వల్లనే సంభవిస్తాయి. అలాగే సుఖము కలిగినప్పుడు మదించడం, దుఃఖము కలిగినప్పుడు విషాదంతో కుంగిపోవడం సాధారణంగా మానవులకు కలిగే లక్షణం. తపస్సు చేసిన వాడు సుఖదుఃఖములను సమానంగా అనుభవిస్తాడు. మానవుడు తపస్సు చేసి సిద్ధి పొందితే పురుషార్థములు అయిన ధర్మార్థకామమోక్షములు లభిస్తాయి.” అని పరాశరుడు జనకునికి బోధించాడు.

అప్పుడు జనకుడు పరాశరునితో ఇలా అన్నాడు. “ఓ మహర్షి! బ్రాహ్మణ, క్షత్రియ,వైశ్య,శూద్రులు అని మానవులను వారి వారి గుణ కర్మలను బట్టి నాలుగు వర్ణములుగా విభజించారు కదా. మరి వారిలో వారికి హెచ్చు తగ్గులు కల్పించడం ఎందుకు? తరువాత, తండ్రి తానే పుత్రుడుగా జన్మిస్తాడు అని అంటారు కదా! అది ఎలాగ! వివరించండి.” అని అడిగాడు. ఈ ప్రశ్నలకు

పరాశరుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

“జనక మహారాజా! నాలుగు వర్ణముల వారు బ్రహ్మ యొక్క ముఖము, బాహువులు, తొడలు పాదముల నుండి పుట్టారు. అందుకని వారుపుట్టిన ప్రదేశమును బట్టి వారిలో తర తమ బేధములు ఏర్పడ్డాయి. తండ్రి ఏ భావంతో తన వీర్యమును భార్యలో నిక్షిప్తం చేస్తాడో, అలాంటి భావాలు, లక్షణముల తోనే కుమారుడు జన్మిస్తాడు. ఋష్యశ్రుంగుడు మొదలగు వారు అలా జన్మించిన వారే కదా!

( ఇక్కడ మనం ఋష్యశ్రుంగుని జననం గురించి క్లుప్తంగా తెలుసుకుందాము. విభాండకుడు అనే ముని ఒక రోజు నదిలో స్నానం చేస్తున్నాడు. అప్పుడు అదే నదిలో స్నానం చేస్తున్న దేవకన్య ఊర్వశిని చూచాడు. అతనికి వీర్యస్ఖలనం అయింది. అతని వీర్యం ఆ నదీజలాలలో కలిసిపోయింది. ఈ నీటిని ఒక లేడి తాగింది. నీటితో కూడా విభాండకుని వీర్యము ఆలేడి గర్భంలో ప్రవేశించింది. ఆ లేడి గర్భవతి అయింది. ఒక కుమారుని ప్రసవించింది. అతడే ఋష్యశ్రుంగుడు. ఒక మహాఋషి వీర్యము కాబట్టి అతనికి ఋషిలక్షణాలు వచ్చాయి. తల్లి ఒక జింక కాబట్టి జింక లక్షణమైన కొమ్ము మాత్రం మొలిచింది. అందుకే అతనిని ఋష్య+శృంగుడు అని అన్నారు. కాబట్టి తండ్రే పుత్రుడై జన్మిస్తాడు అని తెలుసుకోవాలి. )

అప్పుడు జనకుడు పరాశరుని ఇలా అడిగాడు. “ఓమహర్షీ! మీరు నాలుగు వర్ణములలో, వారు పుట్టిన ప్రదేశమును బట్టి, తర తమ బేధములు ఏర్పడ్డాయి అని అన్నారు. కాని వారి ధర్మాలు, గుణాలు గురించి వివరించండి.” అని అడిగాడు జనకుడు. పరాశరుడు ఇలా చెప్పసాగాడు.

‌దానం పుచ్చుకోవడం, యజ్ఞములుచెయ్యడం, ఇతరులకు వేద విద్య బోధించడం, బ్రాహ్మణులకు విధింప బడ్డ విశేష ధర్మములు. ప్రజారక్షణ క్షత్రియునికి విధించబడ్డ విశేష ధర్మము. పశు పోషణ, వ్యవసాయము, వ్యాపారము, ధనార్జన, వైశ్యునికి విధించబడ్డ విశేష ధర్మము. శూద్రులకు సేవా వృత్తి వారికి విధించబడ్డ విశేష ధర్మము.

కాని అన్ని వర్ణముల వారికి కొన్ని సాధారణ ధర్మాలు ఉన్నాయి. అవి--సత్యమునే పలకడం, శుచిగా ఉండటం, అహింసా మార్గంలో నడవడం, ఇతరుల పట్ల అసూయ ద్వేషములు లేకుండా ఉండటం, పితరులకు శ్రాద్ధ కర్మలు, అతిధులకు సత్కారములు చెయ్యడం. తాను వివాహం చేసుకున్న భార్యతోనే సంపర్కం చెయ్యడం-- ఇవీ సాధారణ ధర్మములు. వారి వారికి విధించిన విశేష ధర్మములను నిర్వర్తిస్తూ, సాధారణ ధర్మములను పాటిస్తూ జీవనం గడిపే వారికి ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖం లభిస్తుంది. తన విశేష ధర్మమును విడిచి అన్యధర్మమును చేపట్టిన వాడికి పాపం వస్తుంది.

ఇంక హింస, అహింస,అహింసాకరమైన పనులు గురించి వివరిస్తాను. మానవునికి శమము, దమము ముఖ్యము. అవి లేని వారికి హింస కలుగుతుంది. అహింసతో మానవునికి శమము(మనో నిగ్రహము), దమము( ఇంద్రియ నిగ్రహము) సంప్రాప్తిస్తాయి. కాని క్షత్రియులు యుద్ధములో జయం పొందాలంటే హింస చెయ్యడం తప్పనిసరి. కాబట్టి అందుకు పరిహరణ స్థానములు కూడా చెప్తాను విను. యుద్ధ రంగములో శత్రువు కిందపడిపోయినా, పారిపోతున్నా, శత్రువు చేతిలో కత్తి కిందపడినా, రధమునుండి కానీ, గుర్రము పైనుండి కానీ కిందపడిపోయినప్పుడు, అతనిని చంపకూడదు.

కాని మానవుడు ఎన్నిపుణ్య కార్యములు చేసినా అవి అహింసతో సాటి రావు. న్యాయ మార్గంలో, అహింసాయుతంగా చేయబడే యుద్ధంలో చనిపోయిన వానికి మోక్షము లభిస్తుంది. యుద్ధములో వీరుడు తనతో సమానమైన బలము, ఆయుధములు కల వీరుని కానీ, తన కన్నా బలవంతు డైన వీరుని కానీ చంపినప్పుడు అతను పుణ్యలోకములకు పోతాడు. తన శరీరము పంచభూతములు, పంచేంద్రియములు, సత్త్వ, రజస్తమో గుణములతో తయారైంది అని తెలిస్తే ఎవరైనా అధర్మ కార్యములు చెయ్య గలడా!

పుట్టినవాడు చావక తప్పదు. జీవిత కాలములో మానవుడు అనుభవించే సుఖములు కూడా అనిత్యములు. అనిత్యమైన ~~ఈ~~ శరీరం కోసం మానవుడు అధర్మానికి ఒడిగడతాడా!

సజ్జనుడు ధర్మాత్ముడు ఐన వాడు ఉత్తరాయణంలో యుద్ధము మొదలైన పుణ్యకార్యమువలన మరణం పొందుతాడు. దుర్జనుడు దక్షిణాయనములో ఆత్మహత్య, విషప్రయోగము, ఉరివేసుకోవడం, నీళ్లలో దూకడం మొదలగు కారణాల వల్ల చస్తాడు. మానవులకు తన అజ్ఞానమే తనకు బద్ధవిరోధి. మానవుడు తన అజ్ఞానము వల్లనే అకృత్యాలకు, అధర్మాలకు పాల్పడి నశించిపోతాడు.

ఏ కులంలో జన్మించినా, అన్ని జన్మలకంటే మానవజన్మ ఉత్తమమైనది. ఎందుకంటే మానవజన్మలోనే సుగతి పొందడానికి అవకాశం ఉంది. మానవుడు దానధర్మాలు చేసినా, పుణ్యతీర్థములలో స్నానమాచరించినా, అతిధి పూజలు చేసినా, అవి అన్నీ ఫలాపేక్ష లేకుండా చెయ్యాలి. అప్పుడే అతడు శాశ్వత సౌఖ్యము పొందుతాడు.ः అని పలికాడు పరాశరుడు. అప్పుడు జనకుడు ఇలా

అడిగాడు.

“ఓ మహాత్మా! ఏ పని చేస్తే మేలు కలుగుతుంది? పరమ గతి అంటే ఏమిటి? ఏ పని చేస్తే అది నాశనం లేకుండా ఉంటుంది?” అని అడిగాడు. పరాశరుడు ఇలా చెప్పాడు.

“జనక మహారాజా! విషయ వాంఛలకు లోను కాకుండా ఉండటం అన్నింటి కంటే మేలైనది. మంచి జ్ఞానమును సంపాదించడమే పరమ గతి. అన్ని కర్మలలోకి తపస్సు నాశనము లేనిది. తెలివి కలవాడు ప్రాపంచిక విషయములను పట్టించుకోడు. తటస్థంగా ఉంటాడు. ప్రతిరోజూ ఈ ప్రాపంచిక విషయములలో మునిగి తేలుతున్నా, తామరాకు మీది నీటిబొట్టు లాగా అసంగంగా ఉంటాడు. విజ్ఞానము కలిగినందుకు అదే ఫలితము. కాని మూఢుల చిత్తములందు ఈ విషయముల మీద ఆసక్తి అత్యంత గాఢంగా ఉంటుంది. ఎలాగంటే లక్క ఎలాగైతే కర్ర మొదలగు వాటికి ఎలా గాఢంగా అతుక్కుపోతుందో అలా మూఢుడు విషయవాంఛలకు గాఢంగా అతుక్కుపోయి, వాటిలోనే మునిగి తేలుతుంటాడు.

సూర్య కిరణాలు పడగానే సూర్యకాంత శిల ఆ కిరణాలను ప్రతిఫలిస్తుంది. అలాగే లోకంలోజరిగే మంచి విషయాలకు మంచి మనసు స్పందిస్తుంది. మనస్సులో సదా పరమాత్మను ధ్యానిస్తే, అదే భావన మనస్సులో నిరంతరం ఉండిపోతుంది. అరటి చెట్టు బెరడు ఎలా నిస్సారంగా ఉంటుందో అలాగే ఈ సంసారం కూడా సారము లేనిది. అది గ్రహించిన జ్ఞాని జనన మరణములనుండి విముక్తిని పొందుతాడు. మానవుడు పుట్టినది మొదలు చచ్చేదాకా ఈ ప్రాపంచిక విషయములలో పడి కొట్టుమిట్టాడుతూ తన ఆత్మ సముద్ధరణను మరచిపోతాడు.

(ఆత్మ సముద్ధరణ అంటే తనను తాను ఉద్ధరించుకోడం)

గుడ్డివాడు అలవాటు ప్రకారము తన ఇంట్లో తాను అనాయాసంగా తిరుగుతూ ఉంటాడు. అలాగే మూఢుడైన వాడు ఈ సంసారంలో అటూ ఇటూ అంధుని వలే తిరుగుతూనే ఉంటాడు కానీ బయట పడడానికి ప్రయత్నించడు. తామర తూడును బయటకు తీసి దానిని మంచి నీటితో కడిగితే దానిని అంటుకున్న బురద వదిలిపోతుంది. అలాగే నిర్మల జ్ఞానంతో కడిగితే, సంసారము అనే బురద వదిలిపోతుంది.

మానవుడు తన జీవి తాంతం కడుపు నింపుకోడానికి, కామవాంఛలు తీర్చుకోడానికే తన జీవితాన్ని వృధా చేసుకుంటాడు కానీ ఎలుకను పట్టి తినడానికి పిల్లి పొంచి ఉన్నట్టు, తన ప్రాణములను హరించడానికి మృత్యువు పొంచి ఉంది అనే విషయం పట్టించుకోడు. బరువు ఎక్కువైతే పడవ సముద్రం దాటలేదు. అలాగే కామవాంఛలు ఎక్కువైతే, బతుకు పడవ బరువెక్కి, సంసార సాగరం దాటలేదు.

ధన వాంఛల వల్లా, కామవాంఛల వల్లా వచ్చే దుఃఖాలు, కష్టాలు ఎక్కువ, సుఖాలు చాలా తక్కువ.

(దానికి సరియైన ఉదాహరణ: పారిశ్రామిక వేత్త సత్యం రామలింగరాజు (ధనాశ), నిత్యానంద స్వామి(కామ వాంఛ)).

కాబట్టి ధనము మీద ఆశ, కామ వాంఛలు తీర్చుకోవాలనే కోరికలు తగ్గించుకుంటే చాలా మంచిది. మానవుడు ఎంత సేపూ తన భార్య, తన

అన్నదమ్ములు, తన కుమారులు వాళ్ల కోసమే శ్రమపడుతూ ఉంటాడు. కాని వారు మాత్రం తమ తమ పనులలో మునిగిపోయి వార్ధక్యంలో ఇతనిని గురించి పట్టించుకోరు. ఆ సమయంలో తనను తాను రక్షించుకోడానికి ఉపకరించేది తాను సముపార్జించిన జ్ఞానము ఒక్కటే అని ప్రతి మానవుడూ తెలుసుకోవాలి.

మబ్బులు పట్టినప్పుడు సూర్యకాంతి కనపడదు కానీ, సూర్యకాంతి సూర్యుని వదిలిపెట్టదు. అలాగే అందరినీ సమానంగా చూడాలి అనే బేధ భావం లేని మనుజునకు తాను సంపాదించుకున్న జ్ఞానము అతనిని ఎప్పుడూ వదిలిపెట్టదు." ఈ ప్రకారంగా అనేకవిధములుగా పరాశరుడు జనకునకు జ్ఞానబోధ చేసాడు. ఆ బోధనలు విని జనకుడు ఎంతో సంతోషించాడు." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

కాని ధర్మరాజుకు ఇంకా సందేహములు తీరలేదు. "పితామహా! మీరు దమము, సత్యము, క్షమ గొప్ప గుణములు అని కీర్తిస్తుంటారు కదా! అవి అంత గొప్పవా!" అని సందేహము వెలిబుచ్చాడు ధర్మరాజు.

"ధర్మనందనా! నీకు హంస గీతను చెబుతాను. అదే నీ సందేహము తీరుస్తుంది." అని హంసగీతను చెప్పసాగాడు భీష్ముడు.

"ధర్మరాజా! ఒక సారి బ్రహ్మ దేవుడు హంస రూపంతో ఒక కొలనులో క్రీడిస్తున్నాడు. అప్పుడు కొంతమంది సాధ్యులు ఆ హంసను చూచారు. హంస రాజమా! మేమే సాధ్యులు అనే దేవతలము. నీకు అన్ని విద్యలు తెలుసు అని అనుకుంటున్నాము. మాకు కొన్ని సందేహాలు ఉన్నాయి. వాటికి సమాధానాలు తెలపండి.

అన్నింటి లోకి ఉత్తమమైనది ఏది? చిత్తము ఎల్లప్పుడూ దేనిలో లీనమై

ఉంటుంది? పురుషుడు దేని వలన ఈ కర్మ బంధములనుండి మోక్షము పొందుతాడు?" అని అడిగారు.

అప్పుడు హంస రూపములో ఉన్న బ్రహ్మ ఇలా చెప్పసాగాడు.

"క్షమ, ఇంద్రియ నిగ్రహము, సత్యము పలకడం, అత్యంత మహిమ కలవి అని చెబుతారు. సమస్త ధర్మములలో కల్లా అవి కీర్తింపదగినవి. ఇతరులను బాధ పెట్టేవి, అవినీతి కరమైనవి, ధర్మకార్యములకు పనికిరానివి, ఇతరులకు నిష్ఠురంగా ఉండేవి అగు మాటలు సత్యములు అనిపించుకోవు. సజ్జనుడు అలాంటి మాటలు చెప్పడు. ఇతరులు తనను అవమానించినను, నిందించినను, మారు పలక కుండా ఓర్పుతో శాంతంతో ఉండే మానవుడు, ఎదుటి వారు ముందు చేసిన పుణ్యకార్యములు తాను పొందుతాడు.

నాకు ఎవరు కీడు చేసినా నేను మరలా వారికి కీడు చెయ్యను. వారికి మంచి చేస్తాను. నన్ను ఎవరైనా కొట్టినా నేను చిరునవ్వుతో వెనకడుగు వేస్తాను కాని వారిని తిప్పి కొట్టను. నా మనసులో ఎప్పుడూ కోపమునకు చోటు ఇవ్వను.

వేదముల సారము సత్యము. సత్యము యొక్క సారము ఇంద్రియ నిగ్రహము. ఇంద్రియ నిగ్రహ యొక్కసారము మోక్షము. కాబట్టి సత్యము పలికేవారికి మోక్ష ప్రాప్తికలుగుతుంది. ఇంద్రియ నిగ్రహంతో ఐదు జ్ఞానేంద్రి యములను, ఐదు కర్మేంద్రియములను అదుపులో పెట్టుకుంటాడో, అతడు సర్వధర్మములను పాటించి నట్టే. ఈ మాదిరి ఇంద్రియ నిగ్రహము పాటిస్తే చేసిన పాపాలు అన్నీ నశిస్తాయి. పాపాలు నశిస్తే ఆత్మ నిర్మలమవు తుంది. అదే మోక్ష ప్రాప్తి.

ఎవడైతే తన మనస్సునూ, మాటనూ అదుపులో పెట్టుకుంటాడో, అతనికి వేదములు, తపస్సు, త్యాగములు కరతలామలకములు(చేతిలో ఉసిరిక కాయ లాంటివి) అని పెద్దలు చెబుతారు. పరులను నిందిస్తే, ఎవరినైతే నిందించాడో అతని పాపములు తనకు చుట్టుకుంటాయి. కాబట్టి ఒకరిని నిందించడం ఎందుకు. వాడి పాపములు మొయ్యడం ఎందుకు. కాబట్టి ఇతరులను నిందించడం తగదు.

కోపము అన్ని విధాలా అనర్థము. కోపిష్టివాడు చేసిన వ్రతములు, జపము, దేవతల అర్చన, శ్రాద్ధక్రియలు, తపస్సు, దానము, యజ్ఞములు, మొదలగు పుణ్యకార్యములు నిష్ఫలములైపోతాయి. మాట్లాడ కుండా మౌనంగా ఉండటం కన్నా, మంచి మాటలు మాట్లాడటం మేలు. అనగా సత్యమునే పలకడం, అందరికీ ప్రీతి కలిగేట్టు మాట్లాడటం మంచిది. వీరిని దేవతలు కూడా మెచ్చుకుంటారు." అని హంస రూపంలో ఉన్న బ్రహ్మ సాధ్యులకు వివరించాడు.

అప్పుడు సాధ్యులు బ్రహ్మను ఇలా అడిగారు. "ఓ హంస రాజమా! దేని వలన ఈ లోకము కప్పబడి ఉన్నది? దేని వలన దేహములో ఉన్న జీవుడు ప్రకాశించకుండా ఉన్నాడు? ఏ కారణం చేత మిత్రులు విడిచి పోతారు. దేనివలన మోక్షం సిద్ధిస్తుంది?." అని అడిగారు. హంస రూపంలో ఉన్న బ్రహ్మ ఈ విధంగా చెప్పసాగాడు.

"ఈ లోకమంతా అజ్ఞానము చేత కప్పబడి ఉన్నది. మాత్సర్యమునకు లోనైన జీవుడు ప్రకాశించడు. లోభిని అతని మిత్రులు వదిలి వెళ్లిపోతారు. ఎల్లప్పుడూ విషయ వాంఛలలో మునిగి తేలేవాడికి మోక్షం లభించదు." అని పలికింది హంస.

అప్పుడు సాధ్యులు హంసతో ఇలా అన్నారు. “ఓ హంసరాజమా! తనలో తాను రమించే వాడు ఎవరు? అందరికీ ప్రీతి కలిగించే వాడు ఎవరు? ఎవడు బలవంతుడు? కలహపు మార్గమునుండి ఎవడు దూరంగా తొలగి పోతాడు?” అని అడిగారు. హంస రూపంలో ఉన్న బ్రహ్మ ఈ విధంగా సమాధానం చెప్పాడు.

“ప్రాజ్ఞుడు తనలో తాను రమిస్తుంటాడు. అటువంటి పాజ్ఞుడు అందరికీ ప్రీతి కలిగిస్తాడు. ప్రాజ్ఞుడే అందరి కంటే బలవంతుడు. ప్రాజ్ఞుడే ఎవరితోనూ కలహించడు.” అని చెప్పాడు బ్రహ్మ.

“ఓ హంసరాజమా! విప్రుడైన వాడు దేని వలన దేవత్వము పొందు తాడు? దేని వలన సాధుత్వము పొందుతాడు? దేని వలన అతను దుర్జను డవుతాడు? దేని వలన మనిషిగా చరిస్తాడు?” వివరించు అని అడిగారు. దానికి హంస రూపంలో ఉన్న బ్రహ్మ ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

“ వేదాధ్యయనంతో విప్రుడు దేవసమానుడౌతాడు. తాను చేసే పుణ్య కార్యముల వలన అతను సాధువుగా మారతాడు. అతను చేసే దుర్మార్గపు పనుల వలన దుర్మార్గుడవుతాడు. శుచి శుభ్రత పాటించకుండా కేవలం విషయ వాంఛలకు లోనవుతూ, మరణానికి భయపడే విప్రుడు మానవునికిగా జీవిస్తాడు.” అని చెప్పింది హంస.

అలా చెప్పిన బ్రహ్మ తన నిజస్వరూపముతో సాధ్యులముందు ప్రత్యక్షం అయ్యాడు. వారిని దీవించి బ్రహ్మ లోకమునకు వెళ్లిపోయాడు.

ధర్మనందనా! ఈ హంస గీతి వల్ల నీ సందేహము తీరినదా!" అని అడిగాడు.

" పితామహా! విన్నకొద్దీ నాకు సందేహాలు వస్తున్నాయి. నాకు సాంఖ్య యోగము, యోగశాస్త్రము వీటి స్వరూపము, బేధము తెలపండి." అని అడిగాడు.

"ధర్మనందనా! సాంఖ్యులు, యోగులు తమ తమ మార్గములు మేలైనవి అని చెబుతారు. కానీ నాకు మాత్రం రెండూ ఒకటే అనిపిస్తున్నాయి. యోగులు ప్రత్యక్ష ప్రమాణాన్ని నిజము అని నమ్ముతారు. సాంఖ్యులు వేదములు, శాస్త్రములు మొదలగు వాటిలో చెప్పినవి ప్రమాణములు అని నమ్ముతారు. కాని ఇద్దరి లక్ష్యము ఒక్కటే. కేవలము శాస్త్రములలోనే వీటి రెండింటికీ బేధములు కనిపిస్తాయి. కాని ఆచరణలో రెండూ ఒకటే. సర్వభూతముల యందు ప్రేమగా ఉండటం, మంచి నియమాలను పాటించడం, శుచిగా ఉండటం రెండు మార్గములలో ఉన్నాయి కదా!" అని అన్నాడు భీష్ముడు.

" పితామహా! మీరు చెప్పిన ప్రకారము సాంఖ్యులకు, యోగులకు, భూతదయ, నియమ పాలన, శౌచము ఒకటే అయినప్పుడు శాస్త్రములు మాత్రము ఎందుకు వేరుగా ఉన్నాయి. వివరించండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! యోగులు తమ యోగ బలంతో రాగము, మోహము, కాంక్ష, కోపము మొదలగు అవగుణములను తొలగించు కుని ఉన్నతస్థితి పొందుతారు. కాని యోగబలము లేని వారు ఈ రాగద్వేషములు, కామము, మోహము మొదలగు పాశములను ఛేదించలేక సంసార కూపంలోనే

కొట్టుకుం టుంటారు. కాబట్టి యోగికి యోగబలము ముఖ్యము. బలహీనమైన వాడు ప్రవాహంలో పడితే ఆ ప్రవాహ వేగానికి కొట్టుకుపోతాడు. అలాగే యోగ బలము లేని యోగి విషయవాంఛలనే ప్రవాహంలో పడి కొట్టుకుపోతాడు. అలాగే మదించిన ఏనుగు అడ్డంగా పడుకంటే ప్రవాహ వేగం తగ్గిపోతుంది. అలాగే యోగబలము ఉన్న యోగి ఈ విషయ వాంఛలు అనే ప్రవాహ వేగమును త గ్గించి చిత్తమును ముక్తి మార్గము వంక మళ్లించగలడు. అటువంటి యోగి దగ్గరకు మృత్యువు కూడా రావడానికి భయపడుతుంది.

యోగి ఈ ప్రపంచంలో తన ఇష్టం వచ్చినట్టు సంచరిస్తాడు. కాని ఈ సంసారమనే వలలో చిక్కుకోడు. యోగి యోగములో నైపుణ్యం సాధించాలి. అప్పుడు అతడు మోక్షము అనే లక్ష్యాన్ని ఛేదించగలడు. తన ఆత్మను మోక్షమనే సౌధం పైన నిలుపగలడు. రధికునకు సారధి వ లె, యోగధారణలో నిశ్చలుడైన యోగి ఆత్మను సరి అయిన మార్గములో నడిపించగలడు. మనిషి, తన శిరస్సు, నాభి,హృదయము, పొట్ట,చెవులు, పక్కలు--వీటి ద్వారా తన ఆత్మను సందర్శించవచ్చును.ॽ అని పలికాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు ॽపితామహా! యోగి ఎటువంటి ఆహారమును తిన కూడదు? ఎటువంటి ఆహారమును భుజించాలి?ॽ తెలపండి. అని అడిగాడు.

ॽధర్మనందనా! యోగి నూనెతో చేసిన పదార్థములు తినరాదు. ఆకలి తీరేట్టు, మితంగా ఆహారము, జలము తీసుకోవాలి. అంతేకానీ రుచికరమైన పదార్ధములు పొట్టనిండుగా తినకూడదు. ఇంకా కామమును, క్రోధమును, నిద్రను, ఆశను, భయమును, వదిలిపెట్టాలి. నిర్జన ప్రదేశములో కూర్చొని, శ్వాస నిశ్వాసలను అదుపులో పెట్టుకొని తనలో తాను రమిస్తూ, ముక్తిని పొందాలి.

ఇది అంత సులభం కాదు. అసిధారా వ్రతము. అనగా పదునైన కత్తి మీద నడవడం వంటిది. కాని ఎవరైతే ఈ యోగధారణా నియమమును చిత్తశుద్ధితో ఆచరిస్తాడో, అటువంటి యోగికి ఈ లోకంలో అసాధ్యమైనది లేదు. యోగసిద్ధి పొందిన యోగి దేనిమీదా ఆసక్తి చూపడు. అనాసక్తంగా ఉంటాడు. కాబట్టి అతడికి పుట్టగానే ఈ ప్రపంచంతో సంయోగమూ, చావుతో ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టి పోతున్నానే అనే దీనత్వము ఉండవు. భోగాల వలన సుఖాలు, భోగం లేక పోవడం వలన దుఃఖము ఉండవు. నిశ్చలంగా ఉంటాడు.

ధర్మనందనా! నేను నీకు యోగసిద్ధాంతం గురించి వివరించాను.ε అని చెప్పాడు భీష్ముడు.

ε ఓ పితామహా! నీ దయ వలన యోగ శాస్త్రము గురించి విపులంగా తెలుసుకున్నాను. ఇంక నాకు సాంఖ్య శాస్త్రము గురించి చెప్పవలసింది.ε అని అడిగాడు.

εధర్మరాజా! పూర్వము కపిలుడు చెప్పిన సాంఖ్య శాస్త్రము గురించి నీకు వివరిస్తాను. మానవుడు ముందు జ్ఞానమును పెంపొందించు కోవాలి. తరువాత జాగ్రత్తగా ప్రపంచములోని విషయములను గ్రహించాలి. ఈ విషయములు ఒక్కొక్కరికీ ఒక్కోవిధంగా ఉంటాయి. పశువులు, పక్షులు, మానవులు, దేవతలు, గంధర్వులు, పితరులు, సిద్ధులు, గరుడులు, కిన్నరులు-- వీరందరూ భిన్నభిన్నంగా ప్రవర్తిస్తారు. వీరి గురించి తెలుసుకోవడం అవసరమా అని నీవు అనుకోవచ్చు. నీకు అన్నివిషయములు తెలిసి ఉంటే వాటి నుండి బయట పడటం తేలిక.

ధర్మనందనా! చెవికి శబ్దమూ, చర్మానికి స్పర్శ, కళ్లకు రూపము, నాలుకకు

రుచి, ముక్కుకు వాసన, కడుపులో అగ్ని (జఠరాగ్ని), ఆకాశంలో వాయువు, అగ్నిలో జలము, జలములో భూమి, ఇంద్రుడులో చేతులు, వామనుడి యందు కాళ్లు, ధనంలో లోభము, తమోగుణంలో బుద్ధి, రజోగుణంలో తమోగుణము, సత్త్వగుణంలో తమోగుణము ఇమిడి ఉన్నాయి. ఆ సత్త్వగుణము ఆత్మతో అనుసంధానమై ఉన్నది. ఆత్మ నారాయణుడు మహేశ్వరుడు అనే పరమాత్మలో లీనమై ఉన్నది. ఆ పరమాత్మ మోక్షాసక్తుడై ఉన్నాడు. ఆ మోక్షము మాత్రము దేనితోనూ సంబంధం లేకుండా ఉంది.

సత్త్వ రజస్తమోగుణములకు ఆలవాలమైన ఈ ప్రకృతిలో 16 వికారములు ఉన్నాయి. (పంచభూతములు-5, 10 ఇంద్రియములు, మనస్సు-1, మొత్తం 16). మనలో ఉన్న ఆత్మకు ఆశ్రయము ఈ ప్రకృతి. ఆత్మ ఒక ప్రకాశ వంతమైన తేజోరూపము. ఆత్మ స్వయంగా ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ ఆత్మకు రెండు రూపములు ఉన్నాయి. ఒకటి ఇంద్రియముల ద్వారా ప్రపంచములోని విషయములను అనుభవిస్తూ ఉంటుంది. రెండవది తటస్థంగా ఉంటూ అన్నీ సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది.

మనలో ఉన్న వాయువు ఒక్కటే కాని అది ఐదు రూపాలలో పనిచేస్తూ ఉంటుంది. అవే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులు. మానవుడు ఈ వాయువులను జాగ్రత్తగా పరిశీలించి వాటిని నియంత్రించ గలిగితే అతనికి అంతరాత్మ దర్శనం కలుగుతుంది. అటువంటి మానవుడు తాను మాతృగర్భంలో ఉన్నప్పుడూ, జనన కాలంలోనూ పడే వ్యధ, బాల్యంలో ఉండే మూర్ఖత్వమూ, యౌవనము లోని రాగద్వేషములు, విషయాసక్తి వార్ధ క్యములోని దీనావస్థ....ఇవన్నీ తెలుసుకొని, వాటి నుండి విముక్తి పొందడానికి ప్రయత్నిస్తాడు.

ఈ మానవుడు పుణ్య కార్యములు చేసి స్వర్గ సుఖములుపొందుతాడు. అటు పుణ్యము కానీ ఇటా పాపం కానీ చెయ్యకుండా మధ్యరకం జీవితం గడిపి మానవుడిగా జన్మించి ప్రాపంచిక విషయములలో చిక్కుకుంటాడు. అలా కాకుండా జీవితమంతా పాపపు పనులుచేసి పశు పక్ష్యాదుల జన్మ పొందు తాడు. ఈ పాపపుణ్యములు, జన్మలలో బేధములు తెలిసిన జ్ఞాని వీటిలో లీనం కాకుండా మోక్షం కోసం ప్రయత్నిస్తాడు.

వివేకం లేని వాడు, అజ్ఞాని తనకు కాలక్రమేణా వచ్చే వృద్ధాప్యమును గురించి గుర్తించడు. తన బంధువులకు వచ్చిన వృద్ధాప్యము గురించో వారి చావు గురించో బాధపడుతుంటాడు. వేయి మందిలో ఒకడు మాత్రం శరీరంలో సహజంగా వచ్చే వృద్ధాప్యమూ, చావు అనే మార్పులను గ్రహించి, మోక్షం కోసం ప్రయత్నం చేస్తాడు. మిగిలిన వారు మాత్రం అహంకారంతో తాము చిరకాలం ఉంటామని విర్రవీగుతుంటారు.

ధర్మనందనా! ఈ దేహంలో కామము, క్రోధము, భయము, నిద్ర, నిట్టూర్పు, అనే ఐదు దోషములు ఉన్నాయి. క్షమ వలన కోపము, సంకల్పించక పోవడం వలన కామము, ప్రమాదము లేకుండా ఉండటం వలన భయము, సజ్జనసాంగత్యంతో నిద్ర, మితంగా భోజనం చెయ్యడం వలన నిట్టూర్పులు, నివారించ వచ్చును. ధర్మనందనా! ఇవీ సాంఖ్యయోగులు ఆచరించే విధానము.

సాంఖ్య యోగి, ప్రాపంచిక విషయములను పక్కకు నెట్టి వేసి, సాంఖ్యము అనే ఓడను ఎక్కి, జ్ఞానము అనే చుక్కానితో సంసార సముద్రమును అవలీలగా దాటగలడు. ఈ సంసారము అనే సముద్రంలో దుఃఖము అనే నీరు ఉంటుంది. అందులో వ్యాధులు, మరణము అనే మొసళ్లు, భయాలు అనే

పాములు సంచరిస్తూ ఉంటాయి. అందులో ప్రవాహమే హింస. విషయముల మీద ఆసక్తి బురద. ఆశలు సుడిగుండాలు. ఆ సముద్రంలో అట్టడుగున సుఖసంతోషాలు అనే రత్నాలు ఉన్నాయి. ఆ సముద్రమునకు గట్టు సత్యము. ఈ సంసార సాగరమును దాటిన వాడిని సూర్యుడు తన లోకానికి తీసుకొని పోతాడు. తరువాత ఆ జీవుడు సూక్ష్మదేహంతో తామర తూడులో ఉన్న సన్నని ద్వారం గుండా ప్రయాణిస్తాడు. ఆ జీవుని ప్రవహుడు అనే వాయువు ఆకాశం లోకి చేరుస్తాడు. తరువాత అతడు పరమాత్మలో ఐక్యమైపోతాడు.॥ అని చెప్పాడు భీష్ముడు.

॥పితామహా! చిన్న సందేహము. ఈ ప్రకారంగా పరమాత్మలో లీనమైన జీవుడు తన పూర్వ వృత్తాంతము గురించి తలంచుకుంటాడా లేక మరిచి పోతాడా. ఈ విషయం అర్ధం కావడం లేదు. మోక్షప్రాప్తి పొందిన తరువాత జీవుడి స్థితి ఎలా ఉంటుంది. ఈ ప్రాపంచిక స్థితి కన్నా భిన్నంగా ఉంటుందా! మోక్షం పొందిన తరువాత జీవుడు తన పూర్వవృత్తాంతము గురించి తలచుకుంటాడా లేక తలంచుకోడా! వివరించండి.॥ అని అడిగాడు ధర్మరాజు.

॥ధర్మ నందనా! కపిల మహర్షి ఈ విషయం గురించి కూడా విపులంగా చెప్పాడు. అదే నీకు చెబుతాను. విను. మానవుడు వినడం చేత గానీ, తాకడం చేత గానీ ఆత్మను తెలుసుకోలేడు. మానవుడు తన లోని మనసు ద్వారానే ఇంద్రియములను తెలుసుకుంటాడు. విజ్ఞానస్వరూపు డైన మానవుడు తన మనసు ద్వారా ఇంద్రియములను తెలుసుకొన్నా తెలుసుకోక పోయినా అతనికి ఒరిగేదేమీ లేదు.

ముక్తి పొందిన మానవుడి కి ఈ ఇంద్రియములు జడ పదార్ధములతో సమానము. వాటిపని అవి చేసుకొని పోతుంటాయి కానీ మనసుతో సంబంధం

ఉండవు. సాధకుడు ఈ శరీరము లో ఉండి మోక్షమును సాధిస్తే, అతడు ఇంద్రియములను అవి చేసే పనులను నిర్వికారంగా చూస్తూ ఉంటాడు. సాధకుడు తనలోని పంచభూతములను, బుద్ధిని, మనసును అణిచి పెట్టి, పరమాత్మను చేరుకుంటాడు. అట్టి పరమాత్మను చేరుకున్న వాడికి మరలా జన్మ లేదు. జన్మరాహిత్యం పొందుతాడు. ఇదే మోక్షము. దీని కన్నా అధికమైన దశ వేరే లేదు. ఇదంతా మానవుడు గురువు దగ్గర ఉపదేశం పొంది నియమంగా చేయాలి.

ధర్మరాజా! దీనినే సాంఖ్య పద్ధతి అంటారు. ఈ పద్ధతిని బ్రహ్మ దేవుడు కూడా గౌరవిస్తాడు. పరమ పదము పొందడానికి దీనిని మించిన మార్గము మరొకటి లేదు . నీవు కూడా నిర్మలమైన మనస్సుతో ఈ సాంఖ్య పద్ధతిని పాటించి మోక్షమును పొందు.

ధర్మనందనా! నీకు యోగులు, సాంఖ్యులు గురించి చెప్పానుకదా. వారి మధ్య తేడా చాలాస్వల్పము. వారి దృష్టిలో కూడా మార్పు లేదు. యోగి చూచే మాదిరే సాంఖ్యుడు చూస్తాడు. సాంఖ్యుడు చూచే మాదిరే యోగి చూస్తాడు. కాబట్టి మహా మునులు-- యోగులు, సాంఖ్యులు ఒకే మార్గములో పయనిస్తారు-- అని అంటారు. యోగము, సాంఖ్యము అని పేర్లలో బేధము కానీ, దాంట్లో ఇది, దీంట్లో అది గోచరిస్తూ ఉంటుంది. తత్త్వవేత్తలు కూడా వీటి రెండింటి మధ్య అభేదమునే చూస్తారు.

మానవుడు యోగ మార్గమున కానీ, సాంఖ్య మార్గమున కానీ సంచరిస్తూ ఉంటాడు. మోక్షం కోసం ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఒక వేళ దారి తప్పి మోక్షమునకు వెళ్ల లేకపోతే, కనీసం స్వర్గానికి వెళతాడు. అక్కడ స్వర్గ సుఖాలు అనుభవించి మరలా మానవునిగా ఉత్తమమైన జ్ఞానుల ఇంటిలో జన్మించి, తన సాధన కొనసాగిస్తాడు. తుదకు మోక్షమును పొందుతాడు. కాబట్టి నీవు కూడా

ఈ మార్గమే అవలంబించు." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు. అని వైశంపాయన మహర్షి జనమేజయునకు మహా భారత కధను వినిపించాడు.

మహా భారతము,

శాంతి పర్వము, పంచమాశ్వాసాము సమాప్తము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహా భారతము

## శాంతి పర్వము

### షష్టాశ్వాసము(ప్రధమ భాగము)

వైశంపాయనుడు జనమేజయునితో మహా భారత కధను ఈ విధంగా చెప్పసాగాడు.

యోగ, సాంఖ్య యోగులు అక్షరమైన పరబ్రహ్మమును పొందారు అని భీష్ముడు చెప్పగా  వినిన ధర్మరాజు ఇలా అన్నాడు.

“తాతగారూ! ఇంక  ఉత్తరాయనము ప్రవేశించుటకు కొద్దిరోజులే వ్యవధి ఉన్నది. కాని నేను  మీనుండి తెలుసుకోవలసిన విషయములు అనంతములు. దయచేసి మాకు అన్ని విషయములు వివరించండి. మీరు చెప్పిన అక్షరము అనగా నేమి? క్షర మనగా నేమి? వివరించండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు వసిష్టుడు జనకుడు మధ్య జరిగిన సంవాదము గురించి చెబుతాను. సావధానంగా విను.  ఒక సారి వసిష్టుడు జనక మహారాజు ఆస్థానమునకు వచ్చాడు. జనక మహారాజు వసిష్టుని పాదములకు నమస్కరించి అతిధి సత్కారములు గావించి ఈ ప్రకారంగా అడిగాడు.

“ఓ మునివరా! దేనికైతే నాశనము లేదో, దేనికైతే  మొదలు లేదో,

దేనికైతే పునరావృత్తి లేదో, ఏదైతే అత్యంత శుభప్రదమో, దాని గురించి వివరించండి.ౕ అని అడిగాడు.

అప్పుడు వసిష్ఠుడు ఈ విధంగా చెప్పసాగాడు.ౕ నేత్రములు, ముఖము, చేతులు, కాళ్లు ఉండి కూడా ఆది, అంతము, వృద్ధి, క్షయము లేకుండా ఉన్న దానిని అక్షరము అంటారు. ఆ అక్షర తత్త్వములోనుండి ఇరువది నాలుగు క్షర తత్త్వములు ఉద్భవించాయి. అక్షర తత్త్వము విక్రియ గా వైరుధ్యము పొందు తుంది. దానినే ప్రకృతి అంటారు. అవ్యక్తము అని కూడా అంటారు. దాని నుండి మహతత్త్వము పుట్టింది. ఆ మహతత్త్వము నుండి అహంకారము ఉద్భవిం చింది. ఆ అహంకారమునుండి పంచభూతములు ఐదు, వాటి గుణములైన శబ్ద,స్పర్శ,రూప,రస, గంధాదులు ఐదు, ఇంద్రియములు పది, మనస్సు పుట్టాయి. ఇవి 24 క్షర తత్త్వాలు. ఈ ఇరవైనాలుగు తత్త్వములు విజ్ఞాన గోచరములు.

కాని 25 తత్త్వమైన పరమ తత్త్వము అక్షరము. ఈ పరమ తత్త్వము విజ్ఞానమునకు కూడా గోచరము కాదు. అది అవ్యయము, అకళంకము, అనామయము, నాశములేనినది, అమృతము. ఈ అక్షర తత్త్వము తనకు తానుగా చరించలేదు. కాని సత్త్వరజస్తమోగుణాల ద్వారా సంచరిస్తూ జీవుల జనన మరణములకు కారణమవుతూ ఉంటుంది. ఈ అక్షర తత్త్వము సత్త్వరజస్తమోగుణములతో కలిసి జనన మరణ చక్రములో భ్రమిస్తూ, తనను తాను మరిచిపోయి తానే దేహము అనే భ్రమలో ఉంటుంది.

ఈ అక్షర తత్త్వము సత్త్వ గుణముతో చేరి తనకు అర్హమైన ధర్మములను ఆచరించి దివ్యత్వము పొంది స్వర్గ సుఖాలను అనుభవిస్తుంది. రజోగుణముతో కలిసి పుణ్య కార్యములను పాప కార్యములను ఆచరిస్తూ వాటికి తగిన

ఫలములను అనుభవిస్తూ ఉంటుంది. తమోగుణముతో కలిసి కేవలం పాపములను చేస్తూ పాప కార్యములను ఆచరిస్తూ పశువులు, పక్షులు మొదలగు జన్మలెత్తి దుఃఖమును, నరకమును అనుభవిస్తూ ఉంటుంది.

ఈ అక్షరమునకు అసలు ఏ రంగూ లేదు. కాని సత్త్వగుణములో కలిసి తెలుపు రంగూ, రజోగుణముతో కలిసి ఎరుపు రంగూ, తమోగుణముతో కలిసి నలుపు రంగుల పట్ల ఆకర్షితమవుతుంది. అదే మాదిరి ఈ అక్షరమునకు ఏ రకమైన గుణము లేదు కాని అహంకార లక్షణము ఆపాదించుకొనడం వలన అనేక రకములైన వికారములను పొందుతూ ఉంటుంది. కాబట్టి అహం కార ము లేకపోతే ఆత్మ నిర్వికారంగా, నిర్మలంగా ఉంటుంది.

ఈ అక్షర పరబ్రహ్మము అన్నిటికన్నా మొదటిది. ఏ రకమైన మలినము అంటనిది. కాని తన తత్త్వమును తాను తెలుసుకొన లేక, త్రిగుణాత్మకమై, యజ్ఞములు, యాగములు, ఒంటి పూట భోజనాలు, నేలమీద పడుకోవడాలు, నిష్ఠతో వ్రతాలు చెయ్యడాలు, సన్యాస ఆశ్రమము స్వీకరించి జడలు కట్టుకొని, నారచీరలు ధరించి, సన్యాసమునకు ఉచితమైన దండధారణ గావించి, ( ఏక దండి, ద్విదండి, త్రిదండి), మొదలగు వాటితో ఈ శరీరమును బాధ పెడుతూ ఉంటుంది.

నిజానికి ఈ అక్షర తత్త్వమునకు పుట్టుక జావు లేవు, అది మలినము లేనిది. అది అమృతత్త్వము. కాని తనను తాను మరచిపోయి ఈ అవలక్షణము లన్నీ తనకు కలవు అనే భ్రమలో ఉంటుంది. ఈ అక్షర తత్త్వము తనను తాను తెలుసుకొనిన నాడు, మబ్బు విడిచిన చంద్రుడి మాదిరి ప్రకాశిస్తుంది.ఃఅని చెప్పాడు వశిష్టుడు.

అది విన్న జనకుడు వశిష్టునితో ఇలా అన్నాడు. “ఓ మహాత్మా! పురుషుడు, స్త్రీ కలుసుకుంటేనే సృష్టి జరుగుతుంది. కాని కేవలం పురుషుడికి గానీ  స్త్రీకి గానీ సృష్టి చేసే శక్తి, నేర్పు లేవు  అని వేదం చెపుతుంది.  స్త్రీ పురుషులు కలుసుకొన్నప్పుడు, మరొక జీవి పుడుతుంది. ఆ జీవికి స్త్రీ నుండి చర్మము, మాంసము, రక్తము లభిస్తాయి. పురుషుడి నుండి మజ్జ, ఎముకలు, నరాలు మొదలగునవి లభిస్తాయి.

ఈ పద్ధతి ఒక్క మనుషులకే కాదు, రెండు కాళ్లు, నాలుగు కాళ్ల జంతువులు, పక్షులలో కూడా ఈ మాదిరే జరుగు తుంది. ప్రకృతీ పురుషుడు ఒకరిని ఒకరు ఆకర్షించుకొనడం  నరునికి స్త్రీకి ఉండే సంబంధం వలననే కదా!  నరునికి స్త్రీకి ఉండే సంబంధం వలననే సమస్త సృష్టి జరుగుతూ ఉంది అని వేదాలు చెబుతున్నాయి. ప్రకృతి గురించి పురుషుని గురించి  వారి వారి ప్రవర్తనల గురించి నిరూపించ వచ్చును, కాని మోక్షమార్గము ఎలా ఉంటుందో తెలియడంలేదు.  అవ్యక్తమూ, అనుప మానమూ అతీంద్రియము, అనామయము,  అనంతము, అమలము అయిన  దివ్యమైన తేజస్సు ఒకటి ప్రకాశిస్తూ ఉందని వేదాలు చెబుతున్నాయి కదా! ఆ తత్త్వాన్ని గురించి వివరించండి.”  అని అడిగాడు జనకుడు. వశిష్టుడు ఇలా చెప్పసాగాడు.

“మహారాజా! నీవు అన్ని ధర్మశాస్త్రములు అధ్యయనం చేసావు.కానీ వాటి అర్థము,  అంతరార్థము తెలుసుకొనడానికి ప్రయత్నించలేదు. అర్థము తెలియని చదువు వ్యర్థము  అని నేను నిశ్చయంగా చెప్పగలను.  కాబట్టి నేను చెప్పేది శ్రద్ధగా విను.

సాంఖ్యము, యోగము ఒకదానిని ఒకటి అనుసరించి ఉంటాయి. రెండూ ఒకటే. సాంఖ్యమునకు యోగమునకు మూలము వేదము. ఈ చరాచర ప్రకృతిలో ఉన్న మనుషులకు మూడు లింగములు అంటే పుంలింగము, స్త్రీ లింగము, నపుంసక లింగము అని ఉన్నాయి కదా. కాని మనిషిలో ఉన్న ఆత్మకు ఈ లింగబేధము లేదు. ఈ విషయము శ్రుతులు ఘోషిస్తున్నాయి.

విత్తనము నుండి మరొక విత్తనము పుడుతుంది. ఒక మనిషి నుండి మరొక మనిషి పుడతాడు, ఇంద్రియముల నుండి ఇంద్రియములు, మనసునుండి మనసు పుడతాయి. కాని ఆత్మ, బీజము నుండి కానీ,మనిషి నుండి కానీ, ఇంద్రియముల వలన కానీ, మనసు వలన కానీ, జన్మించదు. ఆత్మ నిర్గుణము, నిరాకారము, నిర్వికల్పము. అందువలన ఆత్మకు సుఖదుఃఖములు, ఈ బంధాలు ఏవీ లేవు.

ఈ ప్రకృతికి లింగబేధములేదు. కానీ ఈ ప్రకృతిలో పుట్టిన వాటికి మాత్రం లింగబేధము పాటిస్తున్నారు. ఈ ప్రకృతిలో పుట్టిన వాటికి వాటి వాటి గుణములను బట్టి, ఆకారాలను బట్టి, స్వభావాన్ని బట్టి లింగబేధము నిర్ణయిస్తారు. ఈ ప్రకృతిలో పుట్టిన వాటి సాంగత్యము వలన ఈ ప్రకృతికి కూడా లింగ బేధము ఉందని చెబుతారు. కాని ప్రకృతి సలింగము కాదు. అలింగము.

మనకు ఆరు ఋతువులు ఉన్నాయి. నిజానికి వాటికి రూపము లేదు. కాని వాటివాటి స్వభావాలను బట్టి, ఆయా ఋతువులలో జరిగే పనులను బట్టి ఆయా ఋతువుల పేర్లు నిర్ణయిస్తాము. కాబట్టి ఈ గుణములు అన్ని ప్రకృతిలోనే ఉన్నాయి. అవి మనిషిలో ఉన్న ఆత్మకు అంటవు. ఇది

అక్షరమునకు, క్షరమునకు కల బేధము. ఈ అక్షరము, క్షరమూ అనేవాటిని, ఏకము–అనేకము, దర్శనము–అదర్శనము, తత్త్వము–నిస్తత్త్వము అని కూడా పిలుస్తారు.

ఈ అక్షర పరబ్రహ్మము అవివేకులకు, మూఢులకు కనపడదు. వివేకము కలిగిన సాంఖ్యులు, యోగులు, తమ తమ బుద్ధితో, వివేచనతో, ఈ 25వ అక్షర తత్త్వమును తెలుసుకోగలుగుతారు.ఽ అని వసిష్ఠుడు జనకునితో చెప్పాడు. అప్పుడు జనకుడు ఇలా అడిగాడు.

ఽఓ మహర్షి! ఆత్మకు ఏకత్వము, అనేకత్వము ఉందని అంటుంటారు కదా! అలాగే ఆత్మకు విద్య, అవిద్య కూడా ఉంటాయి కదా! మీరు నాకు అక్షరము, క్షరమునకు కల బేధము వివరించారు. కాని నాకు ఉన్న బుద్ధి మాంద్యము వలన ఏమీ అర్థం కాలేదు. కాబట్టి నాకు మరలా క్షరము, అక్షరము, సాంఖ్యము, యోగము వీటి గురించి వివరించండి.ఽ అని అడిగాడు జనకుడు. వసిష్టుడు ఇలా చెప్పసాగాడు.

ఽ ఓజనకమహారాజా! యోగమనగా ధ్యానము. అది రెండువిధములు. మొదటిది ప్రాణాయామము. రెండవది మానసిక ఏకాగ్రత. మొదటిది సగుణోపాసన. రెండవది నిర్గుణోపాసన. పైన చెప్పిన ప్రాణాయామమును మల మూత్రములు విసర్జించేటప్పుడూ, భోజనము చేసిన తరువాత చెయ్యకూడదు.

యోగి లక్షణాలు చెబుతాను విను. మితంగా భుజించాలి. కోరికలను వదిలిపెట్టాలి. ఇంద్రియములను నిగ్రహించాలి. శబ్ద,రస,రూప,గంధాదుల వంక మనసును మరల్చకూడదు. బుద్ధిని మనసులో నిలుపుకొనాలి. మనసును ఆత్మవంక మళ్లించాలి. మనసులో ఎలాంటి కోరికలు పెట్టుకో

కూడదు. రాయి మాదిరి ఉండాలి. అలాంటి యోగి పగలు రాత్రి అని లేకుండా నిరంతర ధ్యానంలో ఉంటాడు. గాలిలేని చోట నిశ్చలంగా వెలిగే దీపం లాగా వెలుగుతూ ఉంటాడు పరమానందాన్ని పొందుతాడు. దీనినే యోగము అంటారు.

ఇంక సాంఖ్యము గురించి చెబుతాను విను. ప్రకృతి వాదులు అయిన సాంఖ్యులు ఈ ప్రకృతిని అవ్యక్తము అంటారు. ఈ ప్రకృతికి పుట్టించే ధర్మం ఉంది. కాబట్టి తనకు తానుగా బుద్ధి, అహంకారము, పంచభూతములు, విషయ వాంఛలు, ఇంద్రియములుగా ఈ లోకమంతా విస్తరించి ఉంటుంది. దీని కంతా పురుషుడు అధిష్టాత. ఇంక ఈ సృష్టి అనులోమ క్రమంలో అనగా పైనుండి కిందికి జరుగుతుంది. (అనగా తల్లి గర్భంలో నుండి శిశువు తలకిందులుగా కిందికి జారుతుంది.) ఇంక సంహారము కిందినుండి పైకి జరుగుతుంది. (చనిపోయేటప్పుడు ఎగశ్వాస వస్తుంది. శ్వాస పైకి ఎగతంతుంది). ఈ జనన మరణ సమయములలో ప్రకృతి ప్రకోపిస్తుంది.

ప్రధానంగా ప్రకృతి అనీ, ఇంకా క్షేత్రమనీ, అవ్యక్తమనీ అనబడే తత్త్వము ఒకటే. దానిని సత్త్వము అని అంటారు. జీవునికి పై చెప్పబడిన క్షేత్రము గురించి తెలుసు. కావుననే జీవుని క్షేత్రజ్ఞుడు అని కూడా అంటారు. జీవుడు ఈ అవ్యక్తపురములో ఉండటం వలన పురుషుడు అని కూడా అంటారు.

క్షేత్రము, క్షేత్రజ్ఞుడు వేరు అనడం స్పష్టం. అవ్యక్తమే జ్ఞానము. పురుషుడు ఆ జ్ఞానమును తెలుసుకొనే వాడు. ఈ ప్రకృతి సగుణాత్మకము. పురుషుడు నిర్గుణుడు. ఇది సాంఖ్య పద్ధతి. 24 వికారములను ఏర్పరచిన పురుషుడు తనను తాను చూచుకొనుచూ కైవల్యం పొందుతాడు. ఆ కైవల్యమే పునరావృత్తి మార్గము అంటే మరలా తిరిగిరాని మార్గము. (అంటే జననమరణములు లేని

స్థితి). ఈ సత్యమును తెలిసినవారికి చావు అంటే భయము ఉండదు.

ఓ జనక మహారాజా! నీకు సాంఖ్యమును, యోగమును, అక్షరమును గురించి వివరించాను. ఇంక విద్య, అవిద్య గురించి చెబుతాను విను. విద్య అనగా 25వ తత్త్వమైన అక్షర తత్త్వము. అవ్యక్తమైన ప్రకృతే అవిద్య. కర్మేంద్రియములకు జ్ఞానేంద్రియ ములు, జ్ఞానేంద్రియములకు మనసు, మనస్సునకు పంచభూతములు, పంచభూతములకు అహంకారము, అహంకారమునకు బుద్ధి, బుద్ధికి అవ్యక్తము, అవ్యక్తమునకు 25వ తత్త్వమైన అక్షర తత్త్వము, వరుసగా, విద్యగా పరిగణింపబడతాయి.

జనక మహారాజా! నీకు క్షరము, అక్షరము గురించి ఇంతకు ముందే వివరించాను. కొంత మంది జీవుడిని అక్షరమనీ, ప్రకృతిని క్షరమనీ చెబుతారు. ఇంకొంతమంది జీవుడు, ప్రకృతి కూడా క్షరములు అని అంటారు. మరి కొంతమంది, జీవుడు, ప్రకృతి కూడా అక్షరములే అని అంటారు. ఈ రెండింటికీ ఆది, అంతము లేకపోవడం, రెండింటికీ ఈశ్వరతత్త్వము కలిగి ఉండటం వలన రెండింటికీ సారూప్యం ఉంది. జీవుడు, ప్రకృతి సహజములైన మహత్తు, అహంకారములతో చేరి, ప్రకృతే తానుగా తలపోస్తాడు. అప్పుడు జీవుడు క్షరమవుతాడు. అదేజీవుడు ప్రకృతి వికారములకు లోబడకుండా స్వతంత్రంగా ఉంటే అక్షరమని పిలువబడతాడు.

జీవుడికి జ్ఞాన ప్రకాశము కలిగినపుడు ఈ విధంగా తలపోస్తాడు.

౬ ఇంత కాలము నేను అజ్ఞానము లో ఉండి ప్రకృతియే నేను అని అనుకుంటున్నాను. నీరు వేరు, నీటిలో ఉన్న చేప వేరు. అదే మాదిరి నేను వేరు.

ఈ ప్రకృతి వేరు. కాని నాలో ఉన్న అహంకారము చేత నేను ప్రకృతి అని భ్రమలో ఉన్నాను. ఈ ప్రకృతి తన వికృతులతో నన్ను వెర్రివాడిని చేసింది. నిజానికి నేను వేరు. ఈ ప్రకృతి వేరు. నేను నిష్కళంకుడను. నాకు రూపము లేదు. నాకూ ఈ ప్రకృతికి ఏలాటి సంబంధము లేదు. నేను ఈ ప్రకృతికి దూరంగా ఉంటాను. కాని ఈ తప్పంతా ప్రకృతిదా! కాదు కాదు. నాదే. అసలు ఏలాటి సంగమము లేని వాడిని, నేను ఈ ప్రకృతితో ఎందుకు కలిసాను? నాకు ఇన్ని రూపములు ఈ ప్రకృతి వల్ల కదా సంప్రాప్తించినవి! ఈ ప్రకృతి తో కలవడంవల్ల నాలో మమతా మమకారాలు చెలరేగాయి. దానితో జన్మవెంట జన్మ వస్తున్నాయి.

ఇప్పుడునేను ఈ ప్రకృతిని వదిలించుకున్నాను. ఇప్పుడు నేను నిర్మలంగా ఉన్నాను. నాకు ఈ ప్రకృతిని ఆశ్రయించవలసిన అవసరం ఏముంది? ఈ ప్రకృతి ఎన్ని రూపాలు ధరించినా వీటికి మూలం మమత, అహంకారము. నేను ఈ రెండింటినీ దగ్గరకు చేరనివ్వక పోతే ఈ ప్రకృతి నన్ను ఏమీ చెయ్యలేదు. ఏమీ చెయ్యలేక పోవడం, చెడ్డగుణముల ఎడల ఆసక్తి ఈ ప్రకృతి లక్షణములు. అందుకే ఈ ప్రకృతిని వదిలి వెయ్యాలి. నిశ్చలానందాన్ని పొందాలి. పరమ పదాన్ని పొందాలి.్

ఈ ప్రకారంగా ఆలోచించిన పురుషుడు (జీవుడు) ప్రకృతిని వదిలిపెట్టి అక్షరతత్త్వమును పొందుతాడు.

జనక మహారాజా!నీకు ఇంతకు ముందే చెప్పాను. ప్రకృతి వికారములు 24. దాని తర్వాత 25వ తత్త్వమే అక్షర తత్త్వము. దానికన్నా శ్రేష్టమైనది 26వ తత్త్వము. అదే పరమ తత్త్వము. ఈ తత్త్వము శాశ్వతమైనది. ఇది తన కింద ఉన్న 25 తత్త్వములను చూస్తూ ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ

తత్త్వమును సాంఖ్యులు తప్ప వేరెవరూ తెలుసు కోలేరు. ఈ జీవతత్త్వము, పరతత్త్వము నకు బ్రహ్మము అని కూడా పేరు.

ఇందాక చెప్పినట్టు జీవుడు జ్ఞానము పొంది, ఈ ప్రకృతిని విడిచిపెట్టి, పరతత్త్వాన్ని చూచినప్పుడు,ప్రకృతి తన సగుణత్త్వాన్ని విడిచిపెడుతుంది. అప్పుడు జీవుడు కైవల్యస్థితిని పొందుతాడు. ఆ ప్రకారంగా కైవల్యస్థితిని పొందిన జీవుడు పరతత్త్వములో కలిసిపోతాడు. ఆ స్థితి నిరామయము, అనంతము.

జీవునికి గల ఏకత్వము, అనేకత్వమును మనకు శాస్త్ర విజ్ఞానము ద్వారా తెలుసుకొనవచ్చును. శ్రద్ధ ఉన్న వాడు మాత్రమే ఇది తెలుసుకొనగలడు. ఈ జీవుడు తనను ప్రకృతిగా భావించుకొని ప్రకృతి గుణములను తనలో ఆపాదించుకొని జీవిస్తున్నాడు. కాబట్టి జీవునికి ప్రకృతి నుండి మోక్షం సిద్ధించాలి. అదే జరిగి, జీవుడు ప్రకృతి నుండి విడివడితే, 26వ తత్త్వమైన పరతత్త్వముతో కలిసిపోతాడు. ఆ పరతత్త్వమే శివమూ, పరమ బ్రహ్మమూ, సనాతనము అయిన బ్రహ్మపదము.

దానిని గురించి నీకు వివరంగా తెలియచేసాను. నీవు దీనిని భక్తి, శమము, ఇంద్రియ నిగ్రహము, వేదతత్పరత కలవారికి మాత్రమే ఉపదేశించు. పై అర్హతలు లేని వానికి ఈ విద్యను చెప్పవద్దు. అపాత్రదానం చెయ్యవద్దు. నీకు ఇష్టం అయితే ఈ భూమండలం అంతా దానం చెయ్యిగాని, ఈ విద్య మాత్రం అనర్హునికి చెప్పవద్దు.౯ అని వసిష్ఠుడు జనక మహారాజుకు చెప్పిన విషయములను భీష్ముడు ధర్మరాజుకు తెలిపాడు.

౯ఓ ధర్మనందనా! పూర్వము ఈ విద్యను బ్రహ్మ వసిష్ఠునకు, వసిష్ఠుడు

నారదునకు చెప్పారు. నారదుడు నాకు చెప్పాడు. ఇప్పుడు నేను నీకు ఉపదేశించాను. దీని వలన నీకు శాశ్వతానందము కలుగుతుంది.

ఈ సందర్భంలో నీకు మరొక వృత్తాంతము కూడా చెబుతాను. పూర్వము వసుమంతుడు అను వాడు వేట కోసం అడవికి వెళ్లాడు. అక్కడభృగు వంశ సంజాతుడైన ఒక మునిని చూచాడు.

“ఓ ముని పుంగవా ఈ లోకము లో గానీ, పరలోకములో గానీ ఆచరించ దగ్గ ధర్మము ఏది చెప్పండి!” అని అడిగాడు.

“ఓ మహారాజా! మనం ప్రతి రోజూ చేసే మంచి పనులు చెడ్డ పనుల వల్ల మనకు సుఖము దుఃఖము కలుగుతున్నాయి. అత్యాశతో అన్నీ పనులు చేయాలి అనుకోడం తప్పు. తియ్యటి తేనె కోసం కొండ మీదికి ఎగబాకు తున్నాము అని అనుకుంటారు గానీ, అక్కడినుండి జారి విరగ బడతాము అని తెలుసుకోరు. ధర్మాన్ని, జ్ఞానాన్ని నిర్మలమైన మనస్సుతో అభ్యసించాలి. ఎల్లప్పుడూ సత్సంగములలో కాలం గడపాలి. అప్పుడు అతనికి ఈ లోకములో పరలోకములో సుఖము లభిస్తుంది.

ఇంకా బ్రాహ్మణులకు హితమైన పనులుచేయాలి. అర్హులకు దానములు చెయ్యాలి. ఒక సారి దానం చేసిన తరువాత అయ్యో ఇంత ధనం దానం చేసానే అని బాధ పడకూడదు. క్రోధమును కామమును వదిలిపెట్టాలి. మనసు దృఢంగా ఉంచుకోవాలి. మనో ధైర్యము లేకపోవడంవల్లనే పూర్వము మహాభిషుడు స్వర్గమునుండి బహిష్కరింపబడ్డాడు. యయాతి మహారాజు మనోధైర్యము ఉండటం చేత ఆపదలనుండి అవలీలగా బయట పడ్డాడు.” అని చెప్పిన ఆ ముని మాటలు విన్న వసుమంతుడు కామ క్రోధములను

వదిలిపెట్టి మనోధైర్యమును పొందాడు” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! దేని కైతే ధర్మము అధర్మము లేవో, ఏదైతే అన్ని సందేహముల నుండి విముక్తి పొందిందో, దేని కైతే పుట్టుక, చావు లేవో, ఏదైతే నిత్యమై, శుచియై, ఆనందమయమై, అవ్యయమై, పరతత్త్వమై, దుఃఖ రహితమై ఉంటుందో అటువంటి దాని గురించి వివరించండి” అని అడిగాడు. దానికి భీష్ముడు ఇలా చెప్ప సాగాడు.

“ధర్మ నందనా! ఈ సందర్భంలో నీకు జనకుడు, యాజ్ఞవల్క్యుడు మధ్య జరిగిన సంవాదమును వినిపించెదను. యాజ్ఞవల్క్యుడు సకల లోకములలో కెల్లా విజ్ఞానఘనుడు. ఒక రోజు మిథిలా నగర రాజైన జనకుడు యాజ్ఞవల్క్యుని చూచి ఇలాఅడిగాడు.

“ఓ మునీంద్రా! ఇంద్రియములు, అవ్యక్తము అయిన ప్రకృతి, బ్రహ్మము, పరతత్త్వము, పంచభూతములు, అవి ఎలా పుట్టాయి, ఎలా లయమవుతాయి, వాటికి చెందిన కాలమును వివరించండి.” అని అడిగాడు. దానికి యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పాడు.

“ ఓ మహారాజా! సృష్టిని, లయమును ప్రకృతి కల్పిస్తుంది. ఒకరోజులో పగటిపూట పది కల్పములు, రాత్రి పది కల్పములు ఉంటాయి. పగలు సృష్టి జరుగుతుంది. రాత్రిపూట లయం జరుగుతుంది.

ఈ లోకంలో ఉన్న అన్ని జీవరాసులకు జీవనా ధారముగా ఓషధులు సృష్టింపబడ్డాయి. దాని కోసం బ్రహ్మ సృష్టింప బడ్డాడు.ఆ బ్రహ్మ పంచ భూతములను సృష్టించాడు. వాటి గుణములైన శబ్ద, స్పర్శ, రస, రూప,

గంధాదులను సృష్టించాడు. వీటిని గ్రహించడానికి 5 జ్ఞానేంద్రియములను, 5 కర్మేంద్రియములను సృష్టించాడు. ఈ ఇంద్రియములకు మనస్సు అధినేత. అది ఎలాగంటే, మనము వినడానికీ, చూడడానికీ సాధనాలైన చెవి, కన్ను కూడా తమంత తాము వినలేవు, చూడలేవు. మనస్సు ప్రభావంతోనే అవి వినగలవు, చూడగలవు. మిగిలిన ఇంద్రియములు కూడా అలాగే మనస్సు ప్రభావంచేత తమ తమ పనులను నిర్వర్తిస్తున్నాయి. ఈ విషయం గ్రహించడానికి పెద్దగా జ్ఞానం అవసరం లేదు. అజ్ఞానులు కూడా గ్రహించగలరు.

ఇంద్రియములు మనస్సు చెప్పినట్టు చేస్తాయి అని చెప్పాను గదా! మనస్సు ఇంద్రియములలో చరించక పోయిన, ఇంద్రియములు ఏమీ చేయకుండా ఊరుకుంటాయి. కాని మనసు మాత్రం ప్రాపంచిక విషయములలో సంచరి స్తూనే ఉంటుంది. కాబట్టి ముందు మన ఇంద్రియములు ప్రాపంచిక విషయ ములలో తగుల్కొనకుండా చూడాలి. తరువాత మనస్సును నిగ్రహించాలి. ఇది అభ్యాసముతోనే సాధ్యమవుతుంది.

ఇంక ప్రళయమును గూర్చి చెబుతాను విను. రాత్రికాగానే, అవ్యక్తమైన ప్రకృతి అహంకారపూరితుడైన పురుషుని ప్రబోధిస్తుంది. ఆ పురుషుడు 12 రూపములతో సర్వభూతములను నాశనం చేస్తాడు. ఈ పృథివి అంతా జల మయము అవుతుంది. ఆ జలములను కాలాగ్ని నశింప చేస్తుంది. ఆ కాలా గ్నిని వాయువు అంతమొందిస్తుంది. ఆ వాయువును ఆకాశం మింగుతుంది. ఆ ఆకాశ తత్త్వాన్ని మనస్సు తనలో లయం చేసుకుంటుంది. ఆ మనసును అహంకార పూరితుడైన పురుషుడు కబళిస్తాడు. ఆ అహంకారము అవ్యక్తమైన ప్రకృతిలో లీనమైపోతుంది. ఇదంతా రాత్రి జరుగుతుంది. రాత్రి గడిచిపోగానే మరలా సృష్టి ప్రారంభం అవుతుంది.

ఇప్పుడు నీకు అధ్యాత్మము, అధిభూతము, అధి దైవతము వీటిగురించి చెబుతాను.

మనశరీరములోని పాదము, అపానము, జననేంద్రియము, చేతులు, నాలుక ఇవి అధ్యాత్మములు. అవి చేయు పనులు అనగా, నడవడం, విసర్జన, సృష్టికార్యము(మైధునము), పనులు చెయ్యడం, మాట్లాడటం అవి అధి భూతములు. వీటికి వరుసగా విష్ణువు, సూర్యుడు, ప్రజాపతి, ఇంద్రుడు, అగ్ని అధిదేవతలు.

అలాగే, కళ్లు, నాలుక, ముక్కు, చర్మము, చెవి అధ్యాత్మములు. వాటి గుణములైన రూపమును చూడటం, రసాస్వాదన చెయ్యడం,వాసన చూడటం, స్పర్శ, శబ్దములు వినడం అధిభూతములు. వాటికి వరుసగా సూర్యుడు, నీరు, భూమి, వాయువు, ఆకాశము అధిదైవతములు.

అలాగే మన మనస్సు అధ్యాత్మము. మనసుకు గుణమైన తెలుసు కోవడం, స్పందించడం అనేవి అధిభూతములు. ఆమనస్సుకు చంద్రుడు అధిదైవతము. ఇది వేదప్రమాణము.

అలాగే బుద్ధి అధ్యాత్మము. దాని గుణమైన విషయ పరిజ్ఞానము, శాస్త్ర పరిజ్ఞానము దానికి అధిభూతములు. బుద్ధికి క్షేత్రజ్ఞుడు అధిదైవతము.

అలాగే అహంకారము అధ్యాత్మము. దాని గుణమైన అభిమానము, స్వాతిశయము అధిభూతము. రుద్రుడు అహంకారమునకు అధిదైవము. అలాగే మన చిత్తము అధ్యాత్మము. దానిగుణమైన చేతనత్వము అధిభూతము. దానికి అధిదేవత బ్రహ్మము.

ఇంక ప్రకృతి, పురుషుడు, వారి ప్రకారముల గురించి చెబుతాను విను. ప్రకృతి తన ఇష్టం వచ్చినట్టు, సత్త్వ రజస్తమోగుణముల ఆధారంగా అనేక రకములైన వికృతులను, ఒక ఆటగా, పెంపొందిస్తూ ఉంటుంది. ఒక దీపము నుండి అనేక దీపములు వెలుగుతున్నట్టు, ఈ ప్రకృతి తనలో నుండి అనేక రకము లైన రూపములను ఆవిష్కరిస్తుంది.

సంతోషము, ఆనందము, ఆరోగ్యము, కోపం లేకుండా ఉండటం, చక్కని ప్రవర్తన, పరిశుభ్రంగా ఉండటం, ప్రకాశ వంతంగా ఉండటం,మనస్సు స్థిరంగా ఉండటం, అహింస, నిర్మలత్వము, శ్రద్ధ, నీతిగా ఉండటం, కొంచెం సిగ్గు కలబోయడం, ఎల్లప్పుడూ సత్యమునే పలకడం, శుచిగా ఉండటం, ఆచార వంతులుగా ఉండటం, లోభము లేకుండా ఉండటం, అందరి పట్లా కరుణతో ఉండటం, కామవాంఛలు లేకపోవడం, ఎవరి మీదా చాడీలు చెప్పకుండా ఉండటం ఇవన్నీ సత్త్వగుణ లక్షణములు.

ఇంక రజోగుణ లక్షణములు ఏవంటే--- అందరితో తగువు పెట్టుకోడం, అహంకారము, గర్వము, కామ వాంఛలు అతిగా కలిగి ఉండటం, కోపము, మాత్సర్యము, నిర్దయగా ఉండటం, ఎల్లప్పుడూ భోగములు అనుభ వించాలనే కోరిక,అహంకారము, దుఃఖము ఇవి రజోగుణ లక్షణములు.

ఇంక తమోగుణ క్షణములు ఏవంటే--- ఎల్లప్పుడూ ఏడుపు మొహంతో ఉండటం, అధికమైన మోహము, ఎప్పుడూ తింటూ ఉండటం, అనవసరంగా ఎదుటి వారితో అడ్డంగా వాదించడం, మూర్ఖత్వము, ఒకరి మీద ఒకరికి విరోధము కల్పించి ఆనందించడం (శాడిజం), ఇవి అన్నీ తమోగుణ లక్షణములు.

మనలో ఉన్న జీవాత్మకు ఎలాంటి కళంకము ఉండదు. కాని జీవుడు అనేక రూపములతో ఉన్న ప్రకృతితో చేరి కళంకితుడు అవుతున్నాడు. జీవుడు చైతన్యమూర్తి, కాని ప్రకృతి చైతన్య రహితమైనది. జీవుని ప్రకాశంతోనే ప్రకృతి వెలుగుతూ ఉంటుంది. కాని జీవుని ప్రకృతి ఎల్లప్పుడూ తన వశంలో ఉంచు కుంటుంది.

మరొక విశేషం ఏమిటంటే, మనలో ఉన్న జీవాత్మ తన నిజస్థితిని తాను తెలుసుకొనలేదు. జీవాత్మ ప్రకృతి తో చేరి సత్త్వ, రజస్తమోగుణములకు లోనయి కర్మలను ఆచరిస్తూ ఉంటుంది. సత్త్వ గుణ ప్రధానములైన కర్మము లను ఆచరించి స్వర్గలోక ప్రాప్తి పొందుతుంది. రజోగుణ ప్రధానములైన కర్మము లను ఆచరించి తిరిగి మనిషి జన్మను పొందుతూ ఉంటుంది. తమోగుణ ప్రధానము లైన పాప కర్మములను ఆచరించి రౌరవాది నరకములను పొందు తుంది.

ఎప్పుడైతే ఈ శరీరములో ఉన్న జీవుడు తనను తాను తెలుసుకుంటాడో, అప్పుడు జీవుడు ఈ ప్రకృతి వికారములలో చిక్కుకొనడు. అంతర్ముఖుడై అక్షర పదమైన బ్రహ్మ పదమును పొందుతాడు.“ అని యాజ్ఞవల్క్యుడు జనకునితో చెప్పాడు.

అప్పుడు జనకుడు యాజ్ఞవల్క్యుని ఇలా అడిగాడు. “ఋషి పుంగవా! తమరు పురుషుడు చేతనత్వము కలవాడనీ, ప్రకృతి చేతనా రహితమైనది, జడమనీ చెప్పారు కదా! అలా ఎందుకు జరిగింది. దానికి కారణమేమి?“ అడిలడిగాడు. దానికి యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పసాగాడు.

ஜனక మహారాజా! సగుణము అగుణము కాదు. అగుణము సగుణము కాదు. సత్త్వ,రజస్తమోగుణములు కలిగిన అవ్యక్తమైన ఈ ప్రకృతి, జీవునికి సహజమైన చేతనత్వమును, ఎలా పొందు తుంది. మనలో ఉన్న జీవుని యొక్క సహజ రూపమును తెలుసు కొనే జ్ఞానము ప్రకృతికి లేదు. కాని ప్రకృ తి గురించి, దాని యొక్క స్వభావమును గురించి తెలుసుకొనే జ్ఞానము పురుషునికి ఉన్నది.

కాబట్టి ఓ జనక మహారాజా! ప్రకృతి అచేతనము, పురుషుడు చేతనత్వము కలవాడు. ఈ జీవుడు ఎల్లప్పుడూ ప్రకృతిలో విహరిస్తుంటాడు. కాని దాని వికారములు పురుషునికి అంటవు. ఇదీ ప్రకృతి పురుషుల సంబంధము. తామర పువ్వు ఎల్లప్పుడూ నీటిలో ఉంటుంది. కాని తామర పువ్వు రేకులకు నీరు చుక్కకూడా అంటదు. అలాగే ఎల్లప్పుడూ ప్రకృతిలో లీనమై ఉన్నప్పటికీ, పురుషునికి ప్రకృతికి సహజమైన వికారములు అంటవు.

జనక మహారాజా! ఇంతవరకూ నీకు సాంఖ్యయోగము గురించి చెప్పాను. ఇంక యోగము గురించి చెబుతాను. సాంఖ్యముతో వచ్చు జ్ఞానముగానీ, యోగముతో వచ్చు బలము గానీ, ఈ ప్రపంచములో ఇంకెక్కడా కానరావు. కాని కొంతమంది అవివేకులు సాంఖ్యము, యోగము వేరు వేరు అంటూ ఉంటారు. కాని నేను మాత్రము సాంఖ్య, యోగములను ఒకటిగానే భావిస్తాను.

మనోధారణ, ప్రాణాయామము అనేవి రెండు ప్రధాన యోగములు. అందులో మొదటికి నిర్గుణము. రెండవది సగుణము. మనోధారణ అనగా మనసును ఏకాగ్రతతో ఉంచడం. ప్రాణాయామము అనగా శ్వాసను ఒక క్రమ పద్ధతిలో పీల్చి వదలడం. అదీకూడా మనకు ఏ మాత్రం అసౌకర్యము కలగని విధంగా. క్రమం తప్పకుండా ప్రాణాయామం చేస్తూ, ఇంద్రియములను

అదుపులో ఉంచు కున్నవాడు యోగసిద్ధి పొందుతాడు.

ఈ ప్రాణాయామము చేసే సాధకుడు చాలా నియమ నిష్ఠలతో ఉండాలి. రోజూ కొంచెం సేపు ప్రాణాయామము చెయ్యడం అభ్యసించాలి. శరీరమునకు ఏ మాత్రం అసౌకర్యము కలగని రీతిలో ప్రాణాయామమును అభ్యసించాలి. ఆ ప్రకారంగా పగలు రాత్రి ప్రాణాయామము అభ్యసించాలి. దానివలన లోపలా బయటా శరీరం శుద్ధి అవుతుంది.యోగ సిద్ధికి ప్రాణాయామము, దాని వలన లభించే అంతర్ బాహ్యశుద్ధి, మూలము.

ప్రాణాయామము సగుణ తంత్రము. ఇంక నిర్గుణ తంత్రము గురించి వివరిస్తాను. ఇంద్రియాలను మనసులో లీనం చెయ్యాలి. మనసును అహంకార ములో లీనం చెయ్యాలి. అహంకారాన్ని బుద్ధిలో కలపాలి. బుద్ధిని ప్రకృతిలో లీనం చెయ్యాలి. దానినే ధ్యానము అంటారు. నిరంతరమూ ధ్యానములో నిమగ్నమైన వాడికి ముసలితనము లేదు. నిరంతరానందము పొందుతాడు. అతనికి ఏ మలినములు అంటవు. అట్టివాడు పరమాత్మను దర్శించ గలుగు తాడు. అటువంటి యోగి గాలిలేని చోట పెట్టిన దీపము వలె నిశ్చలంగా ఉంటాడు. నిర్మలమైన ఆకాశము వలె ఉంటాడు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా చలించని సముద్రము వలె ఉంటాడు. అతని చుట్టు ఎన్ని భయంకర శబ్దములు వినిపిస్తున్నా, వాటినిపట్టించుకోడు. తన ధ్యానమునకు భంగం కలుగనివ్వడు. దీనినే యోగ మార్గము అంటారు.

కాని ఈ మార్గంలో నడవడానికి ఏ మాత్రం అలసత్వము పనికిరాదు. ఎల్లప్పుడూ జాకరూకుడై ఉండాలి. ఎవరికీ అందని మోక్షపదము ఈ యోగికి లభిస్తుంది. మరణ సమయంలో ఇటువంటి యోగికి ప్రాణం పాదముల నుండి పోతే అతనికి విష్ణు పదం లభిస్తుంది. పిక్కలనుండి పోతే వసువులు ఉండే

లోకం లభిస్తుంది. జానువులు అంటే మోకాళ్ల నుండి పోతే సాధ్యులు ఉంటే లోకం లభిస్తుంది. విసర్జకావయవము నుండి పోతే సూర్యలోకము లభిస్తుంది. జననేంద్రియము నుండి పోతే భూలోకం లభిస్తుంది. తొడల నుండి పోతే ప్రజాపతి లోకము లభిస్తుంది. పార్శ్వముల నుండి పోతే మరుత్తులు అనే దేవతలు ఉండే లోకము లభిస్తుంది. బొడ్డులోనుండి ప్రాణం పోతే చంద్ర లోకము లభిస్తుంది. చేతుల నుండి ప్రాణం పోతే స్వర్గలోకము లభిస్తుంది. వక్షస్థలమునుండి పోతే కైలాస ప్రాప్తి కలుగుతుంది. గొంతులో నుండి పోతే నరుడు అనే మహాముని ఉండే లోకము లభిస్తుంది. ముఖంలో నుండి పోతే విశ్వేదేవతలు ఉండే లోకము లభిస్తుంది. చెవులనుండి ప్రాణం పోతే దిక్పాలకులు ఉండే లోకము లభిస్తుంది. ముక్కునుండి పోతే వాయుదేవుని లోకము లభిస్తుంది. కన్నుల నుండి ప్రాణం పోతే అగ్నిదేవుడు ఉండే లోకం లభిస్తుంది. కనుబొమల నుండి పోతే అశ్వినీ దేవతలు ఉండే లోకం లభిస్తుంది. నుదురు భాగం నుండి పోతే పితృదేవతలు ఉండే లోకం లభిస్తుంది. తల పైభాగం నుండి (బ్రహ్మ రంధ్రం నుండి) ప్రాణము పోతే శాశ్వతానంద దాయిని అయిన మోక్షము లభిస్తుంది.

ఇంకా మరణ సమయంలో కనపడే సూచనల గురించి చెబుతాను విను. ఆకాశంలో అరుంధతీ నక్షత్రం కనపడకపోయినా, తన ముక్కు చెక్కినట్టు కనపడినా, పున్నమి చంద్రుడు మలినంగా కనపడినా, అతని ఆయుష్షు సంవత్సరము మాత్రమే ఉందని తెలుసుకోవాలి. ఎవరి ముఖము ఎక్కువ కాంతితో గానీ, తక్కువ కాంతితో గానీ కనపడినా, తెలివితేటలు అపరిమితంగా పెరిగినా, తరిగినా, అతడి ఆయువు ఆరునెలలు మాత్రమే అని తెలుసుకోవాలి. పూర్ణ చంద్రుడిలోనూ, సూర్యుడి లోనూ మధ్యలో వెలితిగా కనిపిస్తే అతని ఆయువు ఏడుదినములలోపే అని తెలుసుకోవాలి. దేవాలయమునకు పోయినప్పుడు దేవునికి అర్పించిన పుష్పములు, సుగంధ ద్రవ్యములు

దుర్గంధము వెదజల్లితే అతని మరణము ఆరునెలలలోపు సంభవిస్తుంది అని తెలుసుకొనాలి. చెవులు ముక్కు వాలిపోయినా, దంతాలు రంగుమారిపోయినా, కళ్లలో కాంతి సన్నగిల్లినా, శరీరం నల్లబడ్డా, అతనికి తక్షణమే మృత్యువు ఆసన్నమయినది అని అర్థం.

మానవుడు తన చివరి దశలో ఉన్నప్పుడు ఏ కారణం లేకుండానే అతని ఎడమ కన్నులో నుండి నీరు కారుతూ ఉంటుంది. తల మీదినుండి సెగలు పొగలు వస్తుంటాయి. అదే అతని చివరి దశ అని తెలుసుకొనాలి. యోగి అయిన వాడు ఈ సూచనలు గమనించి నిరంతరము ధ్యాన సమాధిలో ఉండి, జీవుడిని పరమాత్మలో లీనం చెయ్యడానికి ప్రయత్నించాలి. అటువంటి యోగి, ప్రాణములు విడువగానే పరమాత్మలో లీనమై శాశ్వతానందాన్ని పొందుతాడు.

ఓ జనక మహారాజా! ఇంక పరతత్త్వాన్ని గురించిఅడిగావు. ఈ ప్రశ్న చాలా సూక్ష్మమైనది. వివరంగా చెబుతాను. సావధానంగా విను. నేను సూర్యుడిని గూర్చి తపస్సు చేసాను. సూర్యుడు నాకు ప్రత్యక్షం అయ్యాడు. ఒక వరం కోరుకోమన్నాడు. నాకు యజుర్వేదమును అధ్యయనము చేసే శక్తిని ప్రసాదించమని కోరాను. సూర్యదేవుడు నాకు యజుర్వేద ప్రాప్తిని అనుగ్రహించాడు. నా నోరు తెరవమన్నాడు. నేను నా నోరు తెరిచాను. అప్పుడు వాగ్దేవి అయిన సరస్వతి నానోట్లోకి ప్రవేశించింది. నా శరీరం తాపంతో దహించుకుపోసాగింది. సూర్యుడు నన్ను చూచి "కొంచెంసేపు ఓర్చుకో మంటలు చల్లబడతాయి" అని అన్నాడు. అప్పుడు సూర్యుని ముఖంలోనుండి నీకు కొన్ని మాటలు వీనుల విందుగావినిపించాయి. అప్పుడు సూర్యుడు నాతో ఇలా అన్నాడు. "ఓ విప్రుడా! నీకు వేదవిద్య లభిస్తుంది. నీకు సాంఖ్యము, యోగము నీకు లభిస్తాయి. నీ మనస్సు ఉల్లాసంగా ఉంటుంది." అని పలికాడు.

తరువాత సూర్యుడు వెళ్లిపోయాడు. నేను కూడా నా స్వగృహమునకు పోయి సరస్వతీదేవిని ఉపాశించాను. నాకు సరస్వతీదేవి ప్రత్యక్షం అయింది. సరస్వతీదేవిని చూడగానే నాకు యజుర్వేదము అంతానా మనసులో స్ఫురించింది. నేను యజుర్వేదమును అధ్యయనం చేసాను. నా శిష్యులకు నేర్పాను. అలా కొంత కాలం గడిచింది.

ఇంతలో ఒక రోజు విశ్వావసుడు అను గంధర్వరాజు నా వద్దకు వచ్చాడు. నేను అతనికి అతిథి సత్కారములు చేసాను. ఆయన నన్ను కొన్ని ప్రశ్నలు అడిగాడు. "విశ్వము అనగా నేమి? అవిశ్వము అనగా నేమి? మిత్రావరుణులు ఎవరు? జ్ఞానము జ్ఞేయము అనగా నేమి? తపస్సు అనగా నేమి? తపస్సు కానిది ఏది? సూర్యుడు, అతి సూర్యుడు అనగా నెవరు? విద్య అనగా నేమి అవిద్య అనగా నేమి? తెలుసుకొన దగినదీ, తెలుసుకొన దగనిదీ ఏమి? కదిలేవీ కదలనివీ ఏవి? వేదములు ఆమోదించినవి ఏవి? వీటి గురించి నాకు తెలుపండి." అని అడిగాడు. నేను ఆ గంధర్వునికి ఈ విధంగా చెప్పాను.

"భూత, భవిష్యత్ వర్తమాన కాలములతో కూడిన అవ్యక్తమైన ఈ ప్రకృతియే విశ్వము అని అంటారు. గుణరహితుడైన పురుషుడే అవిశ్వము. మిత్రావరుణులే పురుషుడు, ప్రకృతి; జ్ఞానము జ్ఞేయము, తపస్సు, తపస్సు కానిదీ, సూర్యుడు, అతి సూర్యుడు, ఇవన్నీ ప్రకృతిపురుషులు. విద్య, అవిద్య, తెలుసుకొన దగినదీ, తెలుసుకొన దగనిదీ, కదిలేదీ, కదలనిదీ, వరుసగా పురుషుని గురించీ ప్రకృతి గురించీ తెలియజేస్తాయి. అజములు, అవ్రణములు, అక్షయములు, అతీంద్రియములు-- వీటిని ప్రకృతి పురుషులు అంటారు. ఈ రెండు తత్త్వములు కలిస్తే ప్రకృతి కూడా పురుషుని వలె గోచరిస్తుంది.

వేదార్థమును తెలుసుకోలేని వాడు వేదము చదివినా ప్రయోజనము లేదు. కేవలం కంఠశోష మిగులుతుంది. వేదములలోని అర్థమును, సారమును గ్రహించిన పండితుడు, క్షరమును అక్షరమును గురించి తెలుసుకొనగలడు. అప్పుడు అతడు క్షరమును వదిలిపెట్టి అక్షర యోగము కొరకు ప్రయత్నిస్తాడు. 25వది అయిన అక్షర తత్త్వము గురించి తెలుసుకుంటే పరతత్త్వము బోధ పడుతుంది. పురుషుని ప్రకృతిని వేరు వేరుగా చూడటంకూడా సమం జసమే. కాని 25వ తత్త్వమైన అక్షర తత్త్వము, 26వది అయిన పర బ్రహ్మము ఒకటే --వాటికి బేధము లేదు. 26వ తత్త్వమునకు పరమేశ్వరుడు అనీ, పురుషోత్త ముడు అనీ కూడా పేర్లు కలవు. ఆ 26వ తత్త్వము నిష్కల్మషము, నిరం జనము, నిత్యము, జ్ఞానము, ఆనంద స్వరూపము." అని పలికాడు యాజ్ఞవల్క్యుడు.

అప్పుడు విశ్వావసుడు ఇలా అన్నాడు. "నేను ఈ 25వ తత్త్వము గురించీ దానికన్నా భిన్న అయిన పరతత్త్వము గురించీ, నారద, జైగీష, దేవల, కపిల, శుక, సుమంత,పైల మొదలగు మహా మునుల గోష్ఠులలో విని ఉన్నాను. కాని నాకు వాటి గురించి సరిగా అర్థం కాలేదు. అందుకని తమరిని ఆశ్రయించాను. దయచేసి నాసందేహములను తీర్చండి," అని అడిగాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పాడు.

" విశ్వావసా! నీకు అర్థం కాకపోవడానికి ఆ గోష్ఠిలో పాల్గొన్న మునులదా తప్పు! నీ మనసులో మలినము ప్రవేశించి నీకు సందేహములు కలిగేట్టు చేసింది. కాబట్టి ముందు నీ మనస్సులో ఉన్న సందేహములను పక్కన బెట్టి నేను చెప్పునది సావధానంగా విను. అవ్యక్తమైన ప్రకృతివేరు పురుషుడు వేరు అని తెలుసు కదా! పురుషుడు ఈ ప్రకృతితో చేరి అనేక రూపములను పొందుతుంటాడు. పురుషుడు జనన మరణ చక్రములో ఇరుక్కుపోతాడు.

అప్పుడు పురుషుని పురుషోత్తముడు అని అనరు. జీవుడు అని అంటారు. ప్రకృతి పురుషుని చూడలేదు. కాని పురుషుడు ప్రకృతిని చూస్తూ ఉంటాడు. పురుషుడు ప్రకృతిని చూస్తూ అందులో లీనమైపోయి పరమాత్మ వంక చూడలేడు. కాని పరమాత్మ మాత్రం ఈ పురుషుని (జీవుని) ప్రకృతిని సాక్షీభూతంగా చూస్తూ ఉంటాడు. ఇప్పుడు పురుషుడు పరమాత్మను దర్శించే ఉపాయం చెబుతాను విను.

ఈ పురుషుడు ప్రకృతితో స్నేహము, సహవాసమూ చేస్తాడు. ఈ ప్రకృతే తాను అనుకుంటాడు. కాలం గడిచేకొద్దీ ప్రకృతిలో లీనం అయిపోతాడు. దానితో అహంకారము పెరుగుతుంది. ప్రకృతిలోని వస్తువుల మీద మమ కారము, వాటిని పొందాలనే కోరికా పెరుగుతుంది. పురుషుడు ప్రకృతి వంక చూస్తున్నంత కాలము, పైనున్న పరమాత్మను దర్శించలేడు. జీవాత్మగానే ఉండిపోతాడు.

ఎప్పుడైతే పురుషుడు తానే ప్రకృతి, ప్రకృతే నేను అనే భావన విడిచి పెట్టి, చేప ఎప్పుడూ నీళ్లలో ఉన్నా, తాను వేరు, నీళ్లు వేరు అని ఎలా అనుకుంటుందో అలాగే ఎల్లప్పుడూ ప్రకృతిలో విహరిస్తున్నా, తాను వేరు ప్రకృతి వేరు అని అనుకుంటాడో, అప్పుడే పరమాత్మ భావనను పొందుతాడు. ఎప్పుడైతే ఈ పురుషుడు ప్రకృతి భావనను విడిచిపెడతాడో, అప్పుడే పరమాత్మను సందర్శిస్తాడు.

పురుషునికి జననము, వృద్ధాప్యము, మృత్యువు అనేవి తప్పవు. వీటి భయంతో యోగి సాంఖ్యమును, యోగమును ఆశ్రయిస్తాడు. మమకారమును వదిలిపెడతాడు. తిరిగి పునర్జన్మ లేని పరతత్త్వాన్ని పొందుతాడు. అసలు ఇదంతా, పురుషుడు తాను వేరు, ప్రకృతి వేరు అని అనుకోకపోవడమే. అలా

అనుకుంటే, తనకూ ప్రకృతికీ ఉన్న భేదం తెలుస్తుంది. పురుషోత్తముడు పురుషుడు వేరు వేరు అనుకోవడం మనకు తెలిసిందే. కాని ఈ ఇద్దరూ ఒకరే అనే భావన విజ్ఞులకు కలుగుతుంది. పురుషుడు పురుషోత్తముడు ఒకరే అనే భావన విద్య అభ్యసించడం వలన కలుగుతుంది. కాని అవిద్యలో కొట్టు మిట్టాడే వారికి పురుషుడు వేరు పురుషోత్తముడు వేరు అనే భావనలో ఉంటారు. వారు మమకార మును, అవిద్యను పోగొట్టుకున్నప్పుడు మాత్రమే పురుషోత్తముని గురించి తెలుసుకొనగలరు.‌ అని యాజ్ఞవల్క్యుడు విశ్వావసునికి పరమాత్మతత్త్వమును బోధించాడు.

ఆ బోధనలకు సంతృప్తిచెందిన విశ్వావసుడు యాజ్ఞవల్క్యునికి నమస్కరించి వెళ్లిపోయాడు. అని చెప్పిన యాజ్ఞవల్క్యుడు జనకునితో ఇంకా ఇలా చెప్పసాగాడు. ‌ఓ జనకమహారాజా! నేను పైన చెప్పినది దేవతలకు, మానవులకు సమ్మతమైన మతము. కేవలం దీని వలననే పురుషోత్తముని చేరుకోగలరు. అసలు, జననము, మరణము-- వీటిని జయించడమే ముక్తి అంటారు. జనన మరణములను జయించడం అనేది జ్ఞానసముపార్జన వలననే లభిస్తుంది. కాబట్టి జ్ఞాన సముపార్జన ముఖ్యము. జ్ఞానము గురుముఖతా లభ్యవమతుంది. గురువు ఏ కులము వాడు అనేది ముఖ్యము కాదు. జ్ఞానమును ఉపదేశించిన వాడే గురువు. శిష్యుడు గురువు దగ్గర అత్యంత శ్రద్ధాభక్తులతో విద్య నేర్చుకోవాలి. లేని యడల శిష్యునికి ఉన్న అజ్ఞానము నశించి జ్ఞానోదయము కలుగదు. కేవలము అజ్ఞానము వలననే పురుషుడు జీవునిగా మారి కర్మబంధనములలో చిక్కుకుంటాడు. జనన మరణ చక్రములో ఇరుక్కుపోతాడు. అతని మోక్షము లభించదు. కాబట్టి మోక్షము పొందాలంటే జ్ఞానము ముఖ్యము. ఓ జనక మహారాజా! ఇప్పటిదాకా నీవు అడిగిన విషయ ములు అన్నీ వివరంగా చెప్పాను. వీటిని శ్రద్ధగా ఆచరించు.‌ అని పలికాడు యాజ్ఞవల్క్యుడు. యాజ్ఞవల్క్యుని బోధనలకు అమందానందం పొందాడు

జనకమహారాజు.

ఓ ధర్మనందనా! వింటివి కదా. యాజ్ఞవల్క్యుని జనకునికి మధ్య జరిగిన సంవాదము. నీవు కూడా దీనిని ఆచరించి ముక్తిని పొందు,౯  అని పలికాడు భీష్ముడు.

౯ ఓ పితామహా! గృహస్థధర్మము వదిలిపెట్టకుండా మోక్షము పొందడం సాధ్యమంటారా. ఈ విషయంలో నాకు సందేహం కలుగుతూ ఉంది.౯  అని అడిగాడు ధర్మరాజుడు.

దర్మనందనా! జనక మహారాజుకు సులభకు మధ్య జరిగిన సంవాద మును వినిపిస్తాను. దానితో నీ సందేహము తీరుతుందనుకుంటాను. విను. పూర్వము జనక మహారాజు పరిపాలిస్తున్న  రోజుల్లో  ఆయన రాజ్యంలో  సులభ అనే స్త్రీ ఉండేది.  జనక మహారాజు యోగధర్మ లంపటంలో చిక్కుకుపోయాడు. సులభ జనక మహారాజుకు ఉన్న జ్ఞానము ఎంతో పరీక్షించాలని అనుకుంది.

ఒకరోజు సులభ  ఒక అందమైన బిక్షుకి వేషంలో జనకమహారాజు దగ్గరకు వెళ్లింది. జనకుడు ఆమెను  ఆహ్వానించి ఆమెకు కడుపునిండా భోజనం పెట్టించాడు.  సులభ జనకుని ఇంద్రియ నిగ్రహమును పరీక్షించే నిమిత్తం ఆయనను తన అందచందాలతో ఆకర్షించే  ప్రయత్నం  చేసింది. సులభ చేస్తున్న కామవికారములను  చూచి జనకుడు నవ్వుకున్నాడు.

౯అమ్మా! నీవు ఎవరవు! ఎక్కడినుండి వచ్చావు? ఎక్కడకు వెళుతున్నావు? నీ భర్త ఎవరు?  నీవు ఏమి చేస్తుంటావు?౯  అని అడిగాడు. సులభ మౌనంగా ఉంది.

‌సరే అది అటుల ఉండనీ. నేను చెప్పేది విను. నేను పంచశిఖుడు అనే మునీశ్వరుని శిష్యుడను. ఆయన ద్వారా సాంఖ్యము, యోగము, రాజ్యపాలన అనే మూడు విద్యలు అభ్యసించాను. పైచెప్పిన మూడూ మోక్ష మార్గములు. కావున పరతత్త్వము పొందడానికి ప్రయత్నం చేస్తున్నాను. మోక్షమునకు వైరాగ్యము మూలము. వైరాగ్యము ధృఢమైన జ్ఞానముతో లభిస్తుంది. నేను జ్ఞానమును, అందువలన వైరాగ్యము పొందాను. రాజ్య పాలన చేస్తూ, రాజ్యసుఖముల మధ్య ఉండి కూడా, వాటితో ఎలాంటి సంగమము లేకుండా నిస్సంగుడనై తిరుగుతున్నాను. ఎవరైనా నా కుడి భుజానికి చందనము పులుముతూ నా ఎడమ భుజమును నరికినా నేను కోపించను. నాకు మట్టి బంగారము రెండూ సమానమే.

జ్ఞానము, కర్మ -- ఈ రెండింటి నీ అత్యంత నిష్ట గా మోక్షము గురించి తెలిసినవారు చెబుతూ ఉంటారు. నాకు మాత్రం మా గురువుగారి శాసనమే అత్యంత నిష్ట. అదే నాకు మూడో నిష్ట. కొంత మంది గృహస్థాశ్రమంలో ఉంటే ఏదో కీడు జరుగుతుందని సన్యాసాశ్రమము స్వీకరిస్తారు. కాని మనసులో మాత్రం గృహస్థాశ్రమము గురించే ఆలోచిస్తూ ఉంటారు. మనసులో కోరికలు పెట్టుకొని సన్యాసము స్వీకరించి నంత మాత్రాన ఫలితము లేదు. కేవలము దండము , కమండలము ధరించి తల గొరిగించుకొని, కాషాయము కట్టినంత మాత్రాన మోక్షము వస్తుందా! రాదు. కేవలము వేషము మార్చినంత మాత్రాన మోక్షము రాదు. అత్మ జ్ఞానము పొందాలి. గృహస్థాశ్రమము లో ఉండి కూడా ఆత్మజ్ఞానము పొందవచ్చును. అలాంటి వారికి తుదకు మోక్షప్రాప్తి కలుగు తుంది.

సన్యాసము స్వీకరిస్తే గృహస్థాశ్రమములో ఉన్న దుఃఖములు తొలగి

పోతాయని చాలామంది సన్యాసము స్వీకరిస్తారు. కాషాయం కడతారు. రాజుగా నాకు పట్టే ఛత్రము ఎలాంటిదో వీళ్ల కాషాయము కూడా అలాంటిదే. అది సుఖాన్నిచ్చినా దుఃఖాన్నిచ్చినా నాకు రాజలాంఛన మైన గొడుగు తప్పదు కదా. సన్యాసులకు కాషాయము మోక్షాన్నిస్తే, నాకూ నా ఛత్రము మోక్షాన్నివ్వాలి కదా! కాబట్టి ఓ లలనా! జ్ఞానము వలననే మోక్ష ప్రాప్తి సాధ్యం కాని కేవలం కాషాయం కట్టి కమండలం ధరించి సన్యాసము పుచ్చుకొనిన రాదు. నేను రాజుగా ఉన్నా, ఈ ప్రాపంచిక సుఖములను త్యజించాను. మోక్షమార్గాన్ని అవలంబించాను. కాబట్టి నాకీ రాజలాంఛనములు అడ్డురావు. కాని నువ్వు నా నిగ్రహాన్ని పరీక్షించడానికి వచ్చావు. దాని వలన నీకేమీ ప్రయోజనము లేదు.

ఓ మగువా! నీవు బ్రాహ్మణ స్త్రీవి. యోగినివి. పరుల భార్యవు. ప్రస్తుతము నీ భర్త నీ దగ్గర లేకుండా దూరప్రాంతములలో ఉన్నట్టు ఉన్నాడు. కాని నేను క్షత్రియుడను. రాజును. గృహస్థాశ్రమంలో ఉన్నాను. ఆచార వ్యవహారములను నిష్ఠతో పాటిస్తాను. అలాంటి నీవు నా మీద మరులు కొనడం, నా పొందు కోరడం నీకు అపకీర్తి కదా! నీవు చేసిన ఈ అవినీతి పనికి ఫలితం నీదే సుమా!

ఇంకా చెబుతాను విను. నీవు నా మీద కోరికతోనే ఇంతటి అందగత్తె రూపంలో వచ్చావని నాకు తెలుసు. ఈ రూపం నీ యోగశక్తి వల్ల సాధ్యం అయింది. నీ బుద్ధి మలినము అయినందున నీ స్వరూపమును దాచి ఒక అందమైన స్త్రీ రూపంలో నా దగ్గరకు వచ్చావు. ఇది యోగినులు అవలంబించే పద్ధతేనా! ఇప్పటికైనా నీ కుటిల ప్రయత్నములు మాను! ఓ వనితా! నీ శరీరం చూడబోతే చాలా అందంగా ఉంది. మంచి యౌవనంలో ఉన్నావు. ఇంతటి చిన్న వయసులో నీకు ఇంతటి యోగ మహిమ ఎలా అబ్బింది? నాకు చెప్పవా! అని అడిగాడు జనక మహారాజు.

ఆ మాటలకు సులభ ఇలా బదులు చెప్పింది. ‌జనక మహారాజా! చెప్పే వాడికీ వినే వాడికీ ఇంపుగా ఉండే మాటలే మంచి మాటలు అనిపించు కుంటాయి. మిగిలినవి మూర్ఖపు మాటలు అని పించుకుంటాయి. ఈ ప్రకృతి పంచభూతాత్మకము. ఈ పంచభూతములు ఒకదానితో ఒకటి కలిసిపోయినట్టు కనబడతాయి గానీ ఏవీ ఒక దాని మీద ఒకటి ఆధారపడవు. వేటికవే స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటాయి.

ఒక శరీరంలో పంచ భూతములు, పది ఇంద్రియములు, మనస్సు, బుద్ధి ప్రధానమైనవి. ఇవి అన్నీ కలిసి ఉన్నట్టు ఉంటాయి కాని వేటి కవే ప్రత్యేకంగా ఉంటాయి. కాబట్టి మనుషులందరూ పైన చెప్పిన 17 ప్రధాన అంగములతో తయారు కాబడ్డా, ఎవరికి వారు ప్రత్యేకంగా ఉంటారు. ఈ చైతన్యము జవనాశ్వము వలే సకలలోకములలోనూ పరుగులు తీస్తూ ఉంటుంది. కాబట్టి ఎవ్వరు ఎక్కడ ఉంటారో, ఎవ్వరు ఎక్కడనుండి వచ్చారో ఎవరికి తెలుస్తుంది.

ఓ రాజా! నిన్ను నువ్వు ఎలా దర్శించుకుంటావో, ఈ లోకంలో ఉన్న అందరినీ అలాగే చూడాలి కదా! నువ్వు ఒకటీ నేను ఒకటీ కాదు కదా! అటువంటప్పుడు నువ్వు ఎవరు? ఎక్కడినుండి వచ్చావు? అని నన్ను అడగడం ధర్మమా! ఓ రాజా! నీవు క్షత్రియుడవు. నీ పాలనలో ఉన్న వారిని మంచి వారు, మధ్యస్థులు, చెడ్డవారు అని విభజించి పాలిస్తూ ఉంటావు. సామ, దాన, బేధ, దండోపాయములతో శత్రువులను జయిస్తూ ఉంటావు. మరి నీవు ముక్తికోసం పాటుపడే యోగివి ఎలా అవుతావు? ఇదేనా ముక్తి మార్గము? కాబట్టి ఓరాజా! నీవు ఈ విషయ వాంఛలతో జయాభిలాషతో ఉన్నావు కాబట్టి ముక్తి మార్గములో లేవు.

నిన్ను నీవు జ్ఞానిగా అనుకుంటున్నావు. ఇది ఒక మానసిక రుగ్మత. లేకపోతే నాకు ఇన్ని నీతులు చెబుతావా! ఎందుకైనా మంచిది నీ బంధువులకు చెప్పి వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకో. ఈ మానసిక రుగ్మత నుండి బాగుపడతావు. నేను చెప్పినది అంతా విని కూడా నువ్వు "నేను ఎందులకు ముక్తుడను కాను" అని నన్ను అడిగితే దానికి సమాధానం చెబుతాను విను.

నీవు మహారాజువు. ధర్మము, అర్ధము కామము అనే మూడు పురుషార్ధ ములలోనూ, రాజ్య తంత్రములలోనూ, ఎల్లప్పుడూ నిమగ్నమై ఉంటావు. నీవు మేలుకోమని (మేలుకొలుపులు), స్నానం చెయ్యమని, భోజనము చెయ్యమని నీ సేవకులు చెబితే గాని చెయ్యవు. ఇంక నీ చుట్టూ సుందరీ మణులు ఉంటారు. మంత్రులు సేనాపతులు ఉంటారు. వారందరూ నీ పనులు నిన్ను చేసుకో నివ్వరు. అన్నీ వారే చేస్తామంటారు. నీమెప్పుకోసం పాకులాడుతుంటారు. నీకు ఏపని చెయ్యడానికీ స్వతంత్రత ఉండదు. నీ భోజనము కూడా వారే కొసరి కొసరి తినిపిస్తూ ఉంటారు. నీ ఇష్టం వచ్చిన భోజనం చెయ్యనివ్వరు.

ఇంక నీవు అర్హులెవరో అనర్హులెవరో తెలుసుకొని దానధర్మాలు చెయ్యాలి. ఇంకా ధనం ఎలా కూడబెట్టాలి అనే ఆలోచన. ఇంక నీ పక్కనే ఉంటూ నీ కింద గోతులు తవ్వే విరోధులను ఒక కంట కనిపెట్టి ఉండాలి. కాబట్టి ఓ రాజా! రాజులకు దుఃఖాలు ఎక్కువ, సుఖాలు తక్కువ. మరి అలాంటి రాజులు ముక్తిమార్గంలో ఎలా పయనిస్తారు. విశేషించి నువ్వు ముక్తి మార్గంలో ప్రయాణం చేస్తున్నాను అంటున్నావు. ఎలాగ! కాబట్టి రాజులు ముక్తిమార్గంలో పయనించడం అబద్ధం.

ఓ రాజా! ఇంక అసలు విషయానికి వస్తాను. నీకు పంచశిఖ మహాముని మోక్షమార్గమును ఉపదేశిం చాడు అన్నావు. కానీ నేను నీ దగ్గరకు రాగానే అసహ్యించుకున్నావు. ద్వంద్వములకు అతీతులైన ముక్తులు అనుసరించే మార్గమా ఇది! మోక్షాసక్తుడు ద్వంద్వములను వదిలి పెట్టాలి. దేని మీదా అపేక్ష ఉండకూడదు. నిర్వికారంగా ప్రశాంతంగా ఉండాలి. ఏ పరిస్థితులలో కూడా నీ మనస్సు చలించకూడదు.

ఇంకా చెబుతాను విను. యతులు జనావాసములను వదిలిపెట్టి అరణ్యములలో నివసించాలి. నీవు ముక్తుడవు. నీ మనస్సు ఎలాంటి వికారములు లేకుండా శూన్యంగా ఉంటుంది అని నీ మనసులోకి ప్రవేశించాను. కాని నీవు ముక్తుడవు కావు. అదే నా తప్పు. అదీ కాకుండా నేను నిన్ను కాలితోగానీ, చేతితో గానీ తాకను కూడా తాక లేదు. మరి నన్ను చూచి నువ్వు ఎందుకు భయపడ్డావు. నన్ను అనవసరంగా ఎందుకు దూషించావు." అని పలికి ఆ సులభ పక్కనే ఉన్న అమాత్యులను చూచి

"ఓ రాజా! వీరంతా పెద్దవారు. వీరంతా వింటూ ఉండగా మీరు ఇలాంటి తులువ మాటలు మాట్లాడటం మీకు ధర్మమా! ఎదుటి వారిని కించపర్చడం మంచి పద్ధతేనా! దీని వలన మీకు మీ గొప్పతనానికి హాని కలగదా! అత్యంత గోప్యమయిన స్త్రీపురుష సంబంధమును గురించి బహిరంగంగా మాట్లాడటం దుష్టుల లక్షణము కాదా! ఎటువంటి నికృష్టుడు కూడా ఇలాంటి పనికి పాల్పడడు. మహారాజులైన మీకు ఈ విధంగా మాట్లాడటం ధర్మమా! నేను ఒక యోగినిని. తామరాకు మీది నీటి బొట్టు వలే నీ జీవితం గడుపుతున్నాను. నా గురించి నీవు తెలుసు కోలేక పోయావు. అసలు నీకు పంచశిఖ మునీశ్వరుడు ముక్తి మార్గం బోధించడం అంతా అబద్ధం అని నాకు తోస్తూ ఉంది.

రాజా! ఇన్ని మాటలు ఎందుకు కానీ--నీవు అటు గృహస్థ ఆశ్రమ ధర్మమును విడిచిపెట్టావు. ఇటు మోక్ష మార్గమునకు దూరం అయ్యావు. రెంటికి చెడ్డ రేవడవు అయ్యావు. నీకు అన్నీ తెలుసు అనే భ్రమలో బతుకుతున్నావు. ముక్తులు ముక్తులు కలవడం సాధారణం. ఆకాశము శూన్యము. ఆకాశమూ ఆకాశమూ కలిస్తే, శూన్యము శూన్యంలో కలిసినట్టే. మిగిలేది శూన్యమే. కాని నీ ముక్తి మార్గము శుద్ధ అబద్ధము. అందుకనే నేను నీ వద్దకు వచ్చినప్పుడు నీ మనసు చలించింది. నీ ముక్తి మార్గము అబద్ధం అని చెప్పడానికి ఇది చాలదా!

పోనీ మనము ముక్తులము కాదు అని అనుకుందాము. ఆ పరిస్థితులతో కూడా మన కలయిక నిందించదగినది కాదు. ఎలాగంటే నా గురించి చెబుతాను విను. నేను ప్రశస్తమైన చరిత్ర గల ప్రధన మహా రాజు వంశములో జన్మించాను. కాబట్టి నేను క్షత్రియ కాంతను. నా పేరు సులభ. మా పూర్వీకులు శతశృంగ పర్వతము మీద ఎన్నో యజ్ఞములు యాగములు చేసారు. సాక్షాత్తూ దేవేంద్రుడు వారి వద్దకు వచ్చి వారితో పరమార్ధము గురించి సద్గోష్టి చేస్తూ ఉండేవాడు. నాకు వివాహం చేసుకోడానికి తగిన పురుషుడు దొరకలేదు. అందుకని మోక్ష మార్గంలో వెళుతున్నాను. కాబట్టి నీవు అనుకున్నట్టు మనం కలిస్తే వర్ణ సంకరం కాదు. ఎందుకంటే నేను బ్రాహ్మణ స్త్రీని కాను క్షత్రియ కాంతను.

ఇంత వరకు వచ్చిన తరువాత ఇంక దాపరికం ఏముంది. జనక మహారాజు పంచశిఖ మహర్షి దగ్గర ముక్తిమార్గము ఉపదేశం పొందాడు కదా! నిజంగా జనకుడు ముక్తి మార్గంలో పయనిస్తున్నాడో లేదో అని పరీక్షించడానికి నేను నీ దగ్గరకు వచ్చాను. నీ మాటల వల్ల నీవు ముక్తి మార్గంలో

పయనించడం లేదనీ నీ మాటలన్నీ అబద్ధాలు అనీ తేలిపోయాయి.” అని అనర్గళంగా మాట్లాడిన మాటలు విని జనకుడు మారు మాటాడ లేదు. జనకుడి మొహం చూచి నవ్వుతూ సులభ ఇలా అన్నది.

“ ఓ జనక మహారాజా! నీవు ముక్తుడవో కావో అని పరీక్షించడం, అగ్ని వేడిగా ఉంటుందా చల్లగా ఉంటుందా అని పరీక్షించడం లాంటిది అన్నమాట. నేను చేసినది కేవలం నా అజ్ఞానము అని తలంచు. ఓ జనక మహారాజా! నీవు నాతో మాట్లాడిన మాటలో ఇసుమంత కూడా అసత్యము, దోషము లేదు. నీవు మునులచే కీర్తింప బడ తగినవాడవు. నీకు మోక్షము కరతలామలకము (అరచేతిలో ఉసిరికకాయ). ఈ విషయం నాకు బాగా తెలుసు.

నేను రాగానే మీరు నన్ను ఎంతో గౌరవించారు. అందుకని, మీతో అలా మాట్లాడితే ఎలా ఉంటుందో చూద్దామని, ఏదో హాస్యమునకు అలా మాట్లాడాను. ఎందుకంటే నేను చెప్పినవి అన్నీ అబద్ధములు. నేను నిన్ను పరీక్షించడానికి వచ్చాను అన్న మాట మాత్రం సత్యము. నేను చేసిన అపరాధమును సౌజన్యమూర్తులైన మీరు మన్నిస్తారని ఆశిస్తున్నాను.” అని అన్నది సులభ.

ఆ మాటలను జనకుడు, అతని మంత్రులు కూడా చాలా తేలిగ్గా తీసుకున్నారు. ఆమె వాక్చాతుర్యానికి సులభను అభినందించారు. ఆరోజుకు సులభ అక్కడే ఉండి జనకమహారాజు ఆతిధ్యము స్వీకరించి మరునాడు తన దోవన తాను పోయింది.

ధర్మనందనా! ఈ సులభ, జనకుని సంవాదముతో నీ సందేహములు తీరినవి కదా!” అని అన్నాడు భీష్ముడు.

ఇంతలో ధర్మరాజు మరొక సందేహం లేవదీసాడు. “పితామహా! వ్యాసుని కుమారుడు శుకునకు వైరాగ్యము ఎలా కలిగింది.” అని అడిగాడు. భీష్ముడు ఈ విధంగా చెప్పాడు.

“ ధర్మనందనా! వేదవ్యాసుని కుమారుడు శుకుడు. మొదట్లో శుకుడు మామూలు వ్యక్తి గా ఉండేవాడు. అందరితో కలిసి తిరుగుతూ,తనకు వ్యాధులు,మరణము ఉన్నాయి అన్న విషయం మరిచిపోయి, ఈ శరీరం శాశ్వతము అనుకుంటూ, ప్రాపంచిక విషయములలో మునిగి తేలుతుండే వాడు.

అది చూచి ఒకనాడు వేదవ్యాసుడు తన కుమారుడు శుకునకు ఈ ప్రకారంగా వైరాగ్యము ఉపదేశించాడు. “నాయనా శుకా! నీవు నీ మనసును, ఇంద్రియములను అదుపులో పెట్టుకో. వాటిని తప్పు మార్గంలోకి పోనీయకుము. కోపం లేకపోవడం, సత్యం పలకడం, ఇంద్రియములను అదుపులో పెట్టుకోవడం, మంచి మార్గంలో నడవడం, సత్ప్రవర్తన కలిగి ఉండటం, తపస్సు చేయడం, అహింసా మార్గము అవలంబించడం, ఇవన్నీ ధర్మము యొక్క ప్రతి రూపములు. వీటిని అవలంబిస్తూ, ఆకలి దప్పికలను అదుపులో పెట్టుకో.

నీవు సంపాదించిన బిక్ష ముందు దేవతలకు అర్పించి, తరువాత అతిధులకు అర్పించి మిగిలించి నీవు భుజించు. పంజరంలో పిట్ట మాదిరి ఈ శరీరంలో జీవుడు ఉన్నాడు. ఆ విషయం తెలుసుకోకుండా నీ ఇష్టం వచ్చినట్టు తిరగడం ధర్మమా! రోజులు గడిచే కొద్దీ నీ ఆయుష్షు తరిగి పోతూ ఉంటుంది. ఆఖరుకు మృత్యువు నిన్ను కబళిస్తుంది. ఈ విషయం

తెలిసికూడా నీ లాంటి వాడు నిద్రావస్థలో ఉండటం సమంజసమా!

ఈ శరీరం మాంసము, రక్తము తో వృద్ధిచెందినది. ఈ ప్రపంచం అంతా ఇంతే. మాంస,రక్త మయము. ఈ శారీరక సుఖములకు అలవాటు పడ్డవాడు పరలోకము గురించి ఆలోచించడు. వీళ్లు పెద్దలు చెప్పినది వినరు. వాళ్లకు ఎంత తెలిస్తే అదే నిజం అనుకుంటారు. ఈ శారీరక సుఖాలే ప్రధానం అని చెప్పే వాళ్ల బాటలో నడవడం మొదట్లో సుఖంగానే ఉంటుంది. కానీ, తరువాత ఆపదలను కలిగిస్తుంది.

కాబట్టి కుమారా! బుద్ధి మంతులు నడిచే త్రోవను వదిలిపెట్టి దుర్మార్గుల త్రోవలో నడవడం ధర్మమా! కాబట్టి నీ త్రోవ మార్చుకో. ధర్మ మార్గంలో నడుస్తూ, ప్రశాంత జీవనం గడిపే వారిని ఆశ్రయించు. వారి ఉపదేశాలు విను. మంచి మార్గంలో నడువు. సాలె పురుగు వలే నీ చుట్టు నువ్వు బంధనాలు కల్పించుకోవద్దు. అది అజ్ఞానుల లక్షణము. ఈ సంసార సాగరము లో ఇంద్రియములే జలం. కామ, క్రోధ,లోభములు మొసళ్లు. ఈ సాగరం దాటడానికి మనోధైర్యము తక్క మరో మార్గము లేదు. మనుష్యుడు ఈ కామ కోరికలతో తృప్తి పొందుతూ ఉన్నప్పుడు, మృత్యువు అతనిని హటాత్తుగా కబళిస్తుంది. అప్పుడు అతడు ఏమీ చెయ్యలేడు. నీవు మాత్రం అటువంటి మూఢునిగా ప్రవర్తించకు.

బ్రాహ్మణత్వము పొందడం చాలా కష్టం. నీ పూర్వజన్మ సుకృతము వలన ఆ బ్రాహ్మణత్వము పొందావు. కాని నీవు దానిని వృధా చేస్తున్నావు. కాబట్టి, దుష్టుల సాంగత్యము వదిలిపెట్టి, నీవు తపస్సు, ఇంద్రియ నిగ్రహాము, నిశ్చలత్వము, వివేకము మొదలగు మంచి గుణములు అలవర్చుకోవాలి

కదా! కుమారా! నీవు బ్రాహ్మణ జన్మ ఎత్తినది కేవలం శారీరక సుఖాలు అనుభవించ డానికా! కాదే! ఈ లోకంలో నియమ నిష్టలతో జీవితం గడిపి పరలోక సుఖాలు అనుభవించడానికి కదా!

ఈ లోకంలో కామసుఖములు అనుభవించడం తన మెడకు తానే ఉరి తాడు బిగించుకోడం లాంటిది. వివేక వంతులు ఆ పని ఎన్నటికీ చెయ్యరు. ఒకవేళ చేసినా ఆ ఉరితాడు తెంచుకొని బయట పడతారు. మూర్ఖులు మాత్రం ఈ విషయం తెలుసుకోలేక ఆ ఉరితాడుకు వేలాడుతూ ఉంటారు.

కుమారా! ఈ భార్య, పుత్రులు, బంధువులు, మిత్రులు అందరూ నీ శరీరంలో ప్రాణం ఉన్నంతవరకే నీ చుట్టూ ఉంటారు. తరువాత, నీ గురించి మరిచిపోతారు. కాబట్టి వారి గురించి తలంపక, విరాగివై ఆత్మ సాక్షాత్కారం చేసుకో. నీ గురించి నువ్వు తెలుసుకో! ముసలి తనము, మరణము, మనిషి పుట్టి నప్పటినుండి అతని వెంటే ఉంటాయి. కాబట్టి మంచి పనులు చెయ్యడానికి ముహూర్తము గురించి ఆలోచించక వెంటనే చేసెయ్యి. ఎందుకంటే మృత్యువు నిన్ను ఎప్పుడు కబళిస్తుందో నీకే తెలియదు కాబట్టి. నువ్వు మంచి పనులు చేసే దాకా మృత్యువు వేచి ఉండదు కాబట్టి.

కుమారా! ఈ భార్యా, బిడ్డలు, బంధువులు, స్నేహితులు నువ్వు చనిపోతే నీతో పాటు రారు. నీ శరీరాన్ని శ్మశానం దాకా మోసుకొని వస్తారు. అక్కడ తగలబెట్టి, తరువాత ఎవరి పనుల మీద వారు వెళ్లిపోతారు. అంతేగాని ఇన్నాళ్లు నువ్వు వారి వెంట ఉన్నావని నీతో రారు కదా! వీళ్ల కోసం నీవు తాపత్రయ పడటం వాళ్ల మీద వల్లమాలిన మమకారం పెంచుకోడం దేనికి? కాలం ఈ లోకాన్ని అతలా కుతలం చేస్తూ ఉంది. కాబట్టి ధైర్యంతో, ఈ ప్రాపంచిక విషయాలను వదిలిపెట్టి అంతర్ముఖుడివి కా!

ఈ మానవ జన్మ అత్యంత దుర్లభమైనది. నీకు లభించింది. ఈ మానవ జన్మను మెట్టుగా చేసుకొని మోక్షము పొందడానికి ప్రయత్నించు. అంతేగాని ప్రాపంచిక సుఖముల కొరకు పాకులాడకు. మనుష్యుడు తపో వనములకు వెళ్లినా అక్కడే మరణించినా, మనస్సు మాత్రం ప్రాపంచిక విషయములలో మునిగి తేలుతుంటే, అడవులకు పోయినా ప్రయోజనం లేదు. అడవులలో మరణించినా అంతకంటే ప్రయోజనం లేదు. వాడికి ముక్తి రాదు. సమస్త భోగాలను విడిచి పెట్టి, నిర్మలమైన మనస్సుతో ఇంట్లోనే ఉండితపస్సు చేసుకొనే వాడు ఈ సంసార సాగరాన్ని అవలీలగా ఈదగలడు.

ఓ కుమారా! నీవు ఈ జన్మకు ముందు ఎన్నో జన్మలు ఎత్తావు. ఆ జన్మలలో నీకు భార్యా పుత్రులు ఉన్నారు. స్నేహితులు ఉన్నారు. వారంతా చనిపోయారు. అలాగే ఈ జన్మలో ఉన్న భార్యా బిడ్డలు కూడా పోయేవారే. కాబట్టి నీవు కానీ, నీ భార్యా పుత్రులు కానీ, బంధువులు గానీ, స్నేహితులు గానీ నిరంతరం పుడుతూ చస్తూ ఉన్నారు. ఈ సత్యం తెలుసుకో! వివేక వంతుడు అయిన వాడు ఈ విధంగా భావిస్తాడు.

“నేను ఉన్నాను. నేను ఎవ్వరి వాడను? నావంటి వాడు వేరే ఎవరూ లేరు! కాబట్టి నేను ఎవ్వరి వాడనూ కాను.”

ఈ విధంగా తలచు కుంటే ఏ బంధనాలూ ఉండవు. భార్య మీద ప్రేమతోనే ఈ జన్మలో అన్ని కష్టాలు మొదలవుతాయి. ఈ లోకంలో పర లోకంలో కూడా ఎన్నో బాధలు కలుగుతాయి. కాబట్టి తెలివి గలవారు ఎవరూ ఈ భార్యామోహంలో పడరు.

అనుభవించకుండా, దానం చెయ్యకుండా దాచుకున్న ధనం ఎందుకు? దండగ. అలాగే, శత్రువును జయించలేని బలము, దర్పము ఎందుకూ పనికిరావు. ధర్మ ప్రవర్తనలేని వేదాధ్యయనము, శాస్త్రపరిజ్ఞానము ఎందుకు? ఇంద్రియములు జయించకుండా ఆత్మ తత్త్వమును తెలుసుకొని మాత్రం ఏమి లాభము? కాబట్టి కుమారా! ఈ సంసారము త్యజించుము. ఇంద్రియ నిగ్రహము పాటించు. జితేంద్రియుడవు కమ్ము.ౖ అని ఉపదేశించాడు వ్యాసుడు.

ధర్మరాజా! ఆ ప్రకారంగా తండ్రి వలన బోధింపబడిన వాడై శుకుడు, వైరాగ్యమును పొందాడు.ౖ అని చెప్పాడు భీష్ముడు.

ౖపితామహా! శుకుడు వ్యాసుని కుమారుడు అని చెప్పారు కదా! శుకుని జన్మ వృత్తాంతము ఏమి? అతని తల్లి ఎవరు? వివరంగా తెలపండి.ౖ అని అడిగాడు. అప్పుడు భీష్ముడు ఈ విధంగా చెప్పసాగాడు.

ౖధర్మనందనా! మేరు పర్వత ప్రాంతంలో కర్ణికార వనము అని ఒక వనము కలదు. ఆ ప్రాంతంలో వ్యాసుడు పుత్రుని కోసరం శివుని గూర్చి తపస్సు చేస్తున్నాడు. శివుడు ప్రత్యక్షం అయ్యాడు. ఏమి వరం కావాలి అని అడిగాడు. అప్పుడు వ్యాసుడు జలము, వాయువు, ఆకాశము, భూమి, అగ్ని (పంచభూతములతో) సమానమైన శక్తిగల పుత్రుని ప్రసాదించమని అడిగాడు. అలాగే అని శివుడు అంతర్ధానమయ్యాడు.

ఆ ప్రకారంగా వరమును పొందిన వాడై వ్యాసుడు హోమము చెయ్యడానికి అరణిని తీసుకొని మధిస్తున్నాడు. అప్పుడు ఘృతాచి అనే అప్సరస అక్కడకు వచ్చింది. ఆమెను చూచిన వ్యాసుడికి కామ ప్రకోపము కలిగింది. వ్యాసుని మనసులో ఉన్న కోరిక తెలిసిన ఘృతాచి చిలుక రూపం

ధరించింది. వ్యాసుడు మరలా అరణితో అగ్నికోసం మథించసాగాడు. కాని వ్యాసుని మనసులో ఘృతాచి రూపం నిలిచిపోయింది. అప్పుడు వ్యాసునికి వీర్యస్ఖలనము అయింది. వ్యాసుని వీర్యము అరణిలో పడింది. ఇది తెలియని వ్యాసుడు యథాప్రకారము అరణితో మథించసాగాడు. వ్యాసుడి శుక్లము యొక్క సంయోగంతో అరణిలో నుండి ఒక బాలుడు జన్మించాడు. అతనే శుకుడు. ఆ శుకుడు అగ్నివలె వెలిగిపోతున్నాడు.

అప్పుడు మందాకినీ నది (గంగానదిని దేవలోకంలో మందాకినీ అంటారు) మానవ రూపం ధరించి వచ్చి శుకునికి పురిటి స్నానం చేయించింది. ఆకాశము నుండి జింక చర్మము, కమండలము శుకుని ముందు పడ్డాయి. దేవ దుందుభులు మోగాయి. దేవతలు పూల వర్షము కురిపించారు. ఇంద్రుడు మొదలగు దేవతలు, పార్వతీ సమేతంగా శివుడు అక్కడకు వచ్చారు. అందరూ కలిసి శుకునికి ఉపనయనము చేయించారు.

దేవేంద్రుడు దివ్య కమండలము ఇచ్చాడు. దేవతలు ఎప్పటికీ మాసిపోని బట్టలు ఇచ్చారు. శుకుడుపుట్టగానే వేదములు అన్ని అతనిని వచ్చిచేరాయి. శుకుడు దేవ గురువు బృహస్పతిని తన గురువుగా ఎంచుకున్నాడు. బృహస్పతి వద్ద శుకుడు వేదములు, శాస్త్రములు చదివాడు. కాని ఆశ్రమములో ఉన్న ముని బాలకులతోటి ఆట పాటలతో శుకుడు చదువు మీద శ్రద్ధ చూపలేకపోయాడు. వ్యాసుడు కుమారునికి సాంఖ్యమును యోగమును బోధించాడు. దేహములో ఉండే అహంకారము గురించి, బంధు మిత్రుల మీది ప్రేమల గురించి, వాటిని పోగొట్టుకొనే ఉపాయాల గురించి బోధించాడు. ఆ బోధనలతో శుకుడు వైరాగ్యము పొందాడు.

శుకుడు బ్రహ్మ చర్యము, గృహస్థ, వానప్రస్థ, ఆశ్రమములలో శ్రద్ధ

చూపలేదు.  శుకుడు తన తండ్రిని చూచి తనకు మోక్ష మార్గము ఉపదేశించమని అడిగాడు. దానికి వ్యాసుడు “కుమారా! విదేహ రాజైన జనకుని వద్దకు పొమ్ము. అతడునీకు మోక్ష మార్గము ఉపదేశించగలడు. నీవు సర్వశక్తి సమన్వితుడవు. కాని అతని వద్దకు పాదచారిగా పొమ్ము. అతని ముందు నీ అహంకారము ప్రదర్శించ వద్దు. చాలా వినయంగా ఉండు.” అని చెప్పాడు వ్యాసుడు.

తండ్రి మాట ప్రకారము శుకుడు కాలి నడకన ప్రయాణము చేసి మిథిలా నగరము చేరుకున్నాడు.  శుకుడు రాజభవనము లోనికి పోతుంటే భటులు అడ్డగించారు. కాని శుకుడు కోపించలేదు. శాంతంగా అక్కడే నిలబడ్డాడు.  శుకుని ప్రశాంతతను చూచి కావలి వారు కంగారు పడ్డారు. లోపలకు వార్త పంపారు. అతనిని సగౌరవంగా లోపలకు తీసుకొని వెళ్లారు.

శుకుని రాక గురించి తెలిసిన జనకుడు తనపురోహితుని పంపించాడు. ఆ పురోహితుడు వెళ్లి శుకుని సాదరంగా ఆహ్వానించి లోపలకు తీసుకొని వచ్చాడు. జనక మహారాజు శుకునికి ఎదురు వచ్చి అతని కాళ్లు కడిగి,  తన సింహాసనము మీద కూర్చోపెట్టాడు.  ఇదంతా చూచి మంత్రులు సేనాపతులు సభాసదులు ఆశ్చర్యపోయారు. అత్యంత సౌందర్యవతులైన నాట్యకత్తెలు వచ్చి నాట్యం చేసారు. వాళ్లను ఎలాంటి వికారం లేకుండా నిశ్చల మనస్సుతో  అలా చూస్తున్నాడు శుకుడు. శుకునికి అన్న పానీయములు సమకూర్చమని తన పురోహితుని నియమించాడు జనకుడు. అతని వెంటే ఉండి అతనికి అన్ని సౌకర్యములు కలగ చేసాడు జనకుడు. శుకునితో ఎన్నో మాటలు మాట్లాడాడు. ఆరోజు గడిచి పోయింది.

మరునాడు జనకుడు శుకుని వద్దకు పోయి “మీరు ఇక్కడకు వచ్చిన కారణమేమి?” అని అడిగాడు.

“నేను మా తండ్రిగారు వ్యాసుడు పంపగా మోక్ష మార్గము గురించి తెలుసుకోడానికి వచ్చాను. విప్రుని కర్తవ్యము ఏమి? మోక్షము ఏ విధంగా పొందవచ్చును? నాకు తెలియజేయండి.” అని అడిగాడు శుకుడు.

“ ఓ లోకపూజ్యమైన చరిత్ర కలవాడా! వినుము. బ్రాహ్మణు డైన వాడు, ఉపనయనము చేసుకొని, యజ్ఞోపవీతము ధరించి, బ్రహ్మ చర్యము పాటిస్తూ, వేదాధ్యయనము చేయవలయును. తరువాత వివాహము చేసుకొని, నిజ భార్య ద్వారా సంతానమును పొందవలెను. యజ్ఞ యాగములు చేయవలెను. దేవతలను, పితరులను తృప్తి పరచవలెను. అతిధి సత్కారములు చేయవలెను. తరువా వానప్రస్థ ఆశ్రమము స్వీకరించి అడవులకు వెళ్లవలెను. అక్కడ ఉన్న మునులను, అతిథులను సత్కరించవలెను. తరువాత కాషాయములు ధరించి వైరాగ్యమును పొందవలెను. తన ఆత్మ యందే అగ్నిని వేల్చవలెను. కోరికలను వదిలిపెట్టవలెను. తుదకు పరమ శాంతి పదమైన బ్రహ్మ పదమును పొందవలెను.” అని పలికాడు జనకుడు.

అప్పుడు శుకుడు జనకుని చూచి ఇలా అన్నాడు. “మహాత్మా! మీరు చెప్పినది ఒక సాధారణ విప్రునకు వర్తిస్తుంది. కాని అసాధారణ ప్రజ్ఞాశాలియై, జ్ఞానోదయమైన వానికి ఈ మూడు ఆశ్రమములు అవసరమంటారా? జ్ఞాన విజ్ఞాన దృష్టి తో శాశ్వత మైన బ్రహ్మ పదము గురించి తెలుసుకొన్న వాడు కూడా ఈ నాలుగు ఆశ్రమములు ఆచరించాలా! వేదములు ఈ విషయం గురించి ఏమి చెబుతున్నాయి. నాకు వివరించండి.” అని అడిగాడు. దానికి జనకుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

“నీవు చెప్పినట్టు జ్ఞానము, విజ్ఞానము మోక్ష సాధనములు. వాటిని గురుముఖతా అభ్యసించాలి. వాటి వలన ముక్తి పొందవచ్చును. బుద్ధి మంతుడు కడకు ఆ జ్ఞాన విజ్ఞానములు కూడా వదిలివేస్తాడు. పూర్వము ఋషులు, మనుజులు ధర్మ భ్రష్టులు, కర్మభ్రష్టులు కాకుండా సన్మార్గంలో నడవడానికే ఈ నాలుగు ఆశ్ర ధర్మాలు ఏర్పరచారు. ఈ నాలుగు ఆశ్రమ ధర్మములు సక్రమంగా పాటించిన వాడు ముక్తి పొందడం తథ్యము.

అలా కాకుండా అతని పూర్వజన్మలో చేసుకున్న పుణ్యఫలం చేత అతనికి జ్ఞాన విజ్ఞానములు కలిగితే, అతడు మిగిలిన ఆశ్రధర్మములు పూర్తిచేయ కుండానే బ్రహ్మచర్యాశ్రమములోనే ముక్తిని పొందవచ్చు. కాకపోతే అతడు రజస్తమోగుణములకు లొంగకుండా ఉండాలి. సత్త్వగుణనిష్ఠ కలిగి ఉండాలి. అటువంటి వ్యక్తికి బ్రహ్మచర్యా శ్రమములోనే ముక్తి లభిస్తే, అతడు మిగిలిన మూడు ఆశ్రమములు పూర్తిచేసినా ఒకటే. చెయ్యకపోయినా ఒకటే. దానివలన ఒరిగేదేమీ లేదు.

మానవుడు కేవలం సత్త్వ మార్గము వలననే ఆత్మ తత్త్వ దర్శనము పొందగలడు. ఈ విశ్వంలో తాను ఉన్నట్టు, తనయందే ఈ విశ్వం ఉన్నట్టు భావించి ముక్తిని పొందుతాడు. ఈ సందర్భములో యయాతి మహారాజు చెప్పిన వాక్యములు స్మరింపదగినవి. జ్యోతిస్వరూపుడైన పరమాత్మ మన ఆత్మలోనే ఉన్నాడు. ఇది తెలుసుకున్న ముని, తన వలన పరులకు, పరుల వలన తనకు భయం లేకుండా బతకగలడు. అప్పుడే అతను ముక్తిని పొందుతాడు. నాకు ఇది కావాలి, అది వద్దు, అనే భావన లేకుండా, అన్ని భూతములను సమానంగా చూస్తూ, తన వలన పరులకు అపకారం కలుగ కుండా ప్రవర్తిస్తూ, కోరికలను వదిలిపెట్టి, తపోవృత్తిని అవలంబించిన వాడు ముక్తి పొందగలడు.

మనకు వినబడే వాటియందు, కనబడే వాటి యందు, సమదృష్టి కలిగి ఉండి, ప్రాపంచిక విషయములలో లీనం కాకుండా, రాగ ద్వేషములు, సుఖ దుఃఖములు మొదలగు ద్వంద్వముల వలన ప్రభావితం కాకుండా, జీవించ గలిగిన మానవుడు ముక్తిని పొందుతాడు. ఇనుమును, బంగారమును, నిందను, స్తుతిని, సమంగా భావించేవాడికి, తాబేలు ఎలాగయితే తన అంగములను తన డిప్పలోకి ముడుచుకుంటుందో ఆ ప్రకారంగా ప్రాపంచిక విషయముల నుండి తన ఇంద్రియములను తనలోకి ఇముడ్చుకునే వాడికి, ముక్తి అనాయాసంగా లభిస్తుంది.

నేను పైన చెప్పిన విషయములన్నీ నీ తండ్రిగారి దయవలన నీ తండ్రిగారి బోధనల వలన, నీకు సిద్ధించాయి. నేను చెప్పిన దానికంటే నీకు తెలిసినది అధికము. నీ బాల్య చాపల్యము వలనా, నీ భావనలో సందేహములు, భయములు ఉండటం వలనా, నీవు సర్వజ్ఞుడవు అని నీవు ఎరుగవు. జ్ఞానము, విజ్ఞానము నీకు ఉన్న గొప్ప గుణాలు. కాని అవి సమగ్ర రూపం దాల్చకపోతే నీకు మోక్షం సిద్ధించదు. కాబట్టి ధృఢనిశ్చయముతో పరిపూర్ణత సాధించు. నీకు ఏ కొరతా లేదు. నీకు మోక్షము సంప్రాప్తిస్తుంది. ముందు నీలో ఉన్న సంశయములు అన్ని విడిచిపెట్టు. నీవు ఎక్కడి నుంచి వచ్చావో అదే నీ శాశ్వతనివాసము అని తెలుసుకో.౯ అని జనకుడు శుకునికి జ్ఞాన బోధ చేసాడు.

జనకుని జ్ఞానబోధతో శుకుని సంశయములు అన్నీ తీరిపోయాయి. అతని మనస్సు శాంతి పొందింది. తానెవరో తాను తెలుసుకున్నాడు. తండ్రి వద్దకు తిరుగు ప్రయాణము అయ్యాడు.

మహా భారతము

శాంతి పర్వము

# మహాభారతము

## శాంతి పర్వము

### షష్ఠాశ్వాసము రెండవ భాగము

తనకు ఉన్న అన్ని సంశయములు తీరిన వాడై శుకుడు జనక మహారాజు వద్దనుండి సెలవు తీసుకొని తన తండ్రి వ్యాసుని వద్దకు బయలు దేరాడు. వాయు వేగంతో హిమవత్పర్వతము నకు వెళ్లాడు.

ఆ సమయంలో వ్యాసుడు తన శిష్యులైన సుమంతుడు, వైశంపాయనుడు, జైమిని, పైలుడు అనే వారలతో వేదాధ్యయనము చేయిస్తున్నాడు. శుకుడు వ్యాసాశ్రమమునకు వెళ్లాడు. జనకుని వద్దనుండి తిరిగి వచ్చిన పుత్రుని చూచి వ్యాసుడు సంతోషించాడు. శుకుడు తండ్రి పాదములకు నమస్కరించి కూర్చున్నాడు. తనకు జనకునికి జరిగిన సంభాషణా సారమును వివరించాడు. తరువాత వ్యాసుడు శుకుని కూడా తన శిష్యునిగా చేర్చుకొని మొత్తం ఐదు మందికి వేదము నేర్పుతున్నాడు. ఇలా కాలం గడుస్తూ ఉంది.

ఒకరోజు వ్యాసుని శిష్యులు గురువుగారిని ఇలా కోరారు. "గురువర్యా! వేదాధ్యయనంలో మేము ఐదుగురమే ఈ లోకంలో అందరి కన్నా మిన్నగా ముందుండాలి. మమ్మల్ని మించి మీరు ఇంకెవరికీ వేదము నేర్పకూడదు. అలా అని మాకు వరం ప్రసాదించండి." అని అడిగారు. పక్షపాతము అంటే ఎరుగని వ్యాసుడు ఇలా అన్నాడు.

"ఆసక్తి కల బ్రాహ్మణునకు వేదవిద్య నేర్పిన వారికి బ్రహ్మపదము

అరిచేతిలో ఉసిరికకాయ లాంటిది. ఈ విషయం మీరు వినలేదా! ప్రతివాడూ కష్టములను అనుభవించిన తరువాత సుఖములు పొందుతాడు. కాని స్వార్ధపరుడు కాకూడదు. ఇలాంటి స్వార్ధపూరిత కోరిక కోరడం మీకు ధర్మమా!" అని అన్నాడు వ్యాసుడు.

ఆ మాటలు విన్న వ్యాసశిష్యులు ఒకరి మొహాలు ఒకరు చూచుకొని వ్యాసునితో ఇలా అన్నారు. "అయితే మీరు మమ్ములను ఇక్కడే ఉంచితే ఎలాగ. మేము ఈ పర్వతశిఖరం దిగి, కిందికి వెళ్లి, వేదాధ్యయనము నందు ఆసక్తి కలవారిని వెతికి పట్టుకొని వారికి విద్య నేర్పమంటారా! వారితో యజ్ఞములు యాగములు చేయించమంటారా!" అని అన్నారు. ఆ మాటలకు వ్యాసుడు ఇలా అన్నాడు.

"శిష్యులారా! ఈ విషయం మీరు ముందే చెప్పవచ్చుకదా! ఇంత డొంక తిరుగుడు ఎందుకు? మీరు ఈ పర్వతము కిందికి వెళ్లి జనపదములలో తిరుగుతాను. అందరికీ విద్యాదానము చేస్తాము అంటే నేను అడ్డుపెట్టానా!" అని వాత్సల్యంతో కోపపడుతున్న గురువు గారిని చూచి ఆయన కాళ్ల మీద సాష్టాంగ పడ్డారు. వ్యాసుడు తన శిష్యులను లేవనెత్తి ఆశీర్వదించాడు.

"మీరు మూడులోకములలో మీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్లండి. కాని చాలా జాగ్రత్తగా ఉండండి. వేదములను మూడు లోకములలో ప్రచారం చెయ్యండి." అని పలికాడు. వ్యాసుని నలుగురు శిష్యులు నలుగురూ వెళ్లిపోయారు. వ్యాసుడు, అతని కుమారుడు శుకుడు మాత్రమే ఆశ్రమంలో ఉన్నారు.

ఒకరోజు నారదుడు వ్యాసాశ్రమమునకు వచ్చాడు. ఆశ్రమములో వేదఘోష వినిపించడం లేదు. ఆశ్చర్యపోయాడు నారదుడు.

“మునీంద్రా! మీ ఆశ్రమములో వేదాధ్యయనము వినిపించకపోవడానికి కారణం ఏమిటి?” అని అడిగాడు.

“నారదా! నా శిష్యులందరూ నన్ను విడిచి వెళ్లిపోయారు.” అని బదులు చెప్పాడు.

“అయితే ఏమి! నీవు నీ కుమారుడు శుకుడు ఉన్నారు కదా! మీరిద్దరూ వేదపఠనముచేయవచ్చు కదా!” అని అన్నాడు నారదుడు. అప్పటికి తాను చేసిన పొరపాటు తెలిసింది వ్యాసునికి. వెంటనే తాను తన కుమారుడు శుకుడు కలిసి వేదాధ్యయనము చేయడం ప్రారంభించారు.

ఒకరోజు పెనుగాలి వీచింది. వెంటనే వ్యాసుడు వేదాధ్యయనము ఆపి వేసాడు. “ఈ గాలి ఎక్కడ నుండి వచ్చుచున్నది.”అని అడిగాడు వ్యాసుని కుమారుడు శుకుడు.

“కుమారా! దేవ మార్గములో విష్ణువు, పితృమార్గములో సూర్యుడు పైకి కిందికి ప్రయాణించడం వల్ల ఈ ఝంఝామారుతము వీచుచున్నది. కుమారా! నీకు వాయువుల గురించి చెబుతాను విను.సమాన వాయువు దేవతల జాతిలో జన్మించాడు. సమానుడికి ఉదాన వాయువు జన్మించాడు. ఉదానుడికి వ్యానము అనే వాయువు జన్మించాడు. వ్యానుడికి అపానుడు, అపానునికి ప్రాణుడు జన్మించారు. ఈ ప్రపంచమంతా ఈ ఐదు వాయువులతో నిండి ఉంది.

ప్రవహుడు, ఆవహుడు, ఉద్వహుడు, సంవహుడు, వివహుడు, పవహుడు, పరావహుడు వీరు ఏడుగురు వాయుదేవతలు. వీరంతా అదితి పుత్రులు. అన్ని లోకములలో వ్యాపించి ఉంటారు. ఈ ఏడుగురు వాయు

దేవతలు పైన చెప్పిన సమానము మొదలగు పంచ వాయువులతో కలిసి ఉంటారు. వీరి వలననే వర్షములు రావడం, రాకపోవడం జరుగుతూ ఉంటుంది. వివిధ దేవతలు విమానములలో తిరుగుతూ ఉంటారు. పైగా విష్ణుమూర్తి నిట్టూర్పువేగము అపరిమితము. వీటి వల్ల ముల్లోకములలో ఝంఝా మారుతము వీస్తూ ఉంటుంది. ఇలాంటి సమయములలో వేదాధ్యయనము చేయరాదు. కీడు కలుగుతుంది. అందుకని వేదాధ్యయనము ఆపి వేసాను." అని చెప్పాడు వ్యాసుడు. తరువాత స్నానం చెయ్యడానికి వ్యాసుడు ఆకాశ గంగ వద్దకు వెళ్లాడు.

శుకుడు నారదుడు వింటూ ఉండగా వేదపఠనము చేసాడు. దానికి మెచ్చి నీకేమి వరం కావాలో కోరుకో అని అడిగాడు నారదుడు. "నారదమహర్షి! ఈ లోకంలో పుట్టిన వారికి హితమగునది ఏది తెలియచెయ్యండి." అని అడిగాడు.

"కుమారా! పూర్వము సనత్కుమారుడు మునీశ్వరులకు చెప్పిన మాటలే నేను నీకు చెబుతాను. సత్యవాక్పరిపాలనయే తపస్సు. మనం నేర్చుకున్న విద్య మన కన్ను వంటిది. త్యాగమే సుఖదాయకము. కోరికలే దుఃఖ హేతువులు. మానవుడు ఇహలోక బంధములలో చిక్కుకుంటే, ఈ జన్మలో కాదుకదా పైజన్మలో కూడా అతనికి ముక్తి లభించదు. తరచి చూడగా కామము, క్రోధము ముక్తిమార్గమునకు శత్రువులు. ఈ రెండింటినీ విడిచిపెడితే, సంసారము అనునది రూపం లేకుండా పోతుంది. ముక్తి సాధించడానికి మరో మార్గం ఎందుకు?

ఇతరుల నుండి ఏమీ స్వీకరించకపోవడమూ, సమస్త మైన కర్మములను త్యాగం చెయ్యడం అనేవి ఆచరిస్తే పండితునకు ఎలాంటి దుఃఖము కలుగదు. మోక్షం సిద్ధిస్తుంది. అసలు ఇతరులతో మాట్లాడకపోవడం, చూడకపోవడం,

తాకకపోవడం వారికి దూరంగా ఉండటం ముక్తికి మార్గములు. అహింసా వ్రతము పాటిస్తూ, ఇంద్రియములను నిగ్రహించుకొని, నిరాశకూ, చపలత్వము నకూ లోను కాకుండా ఉన్నవానికి ముక్తి అరిచేతిలో ఉసిరిక కాయలాంటిది. ఇవి సనత్కుమారుడు మునులకు చెప్పిన మాటల సారాంశము.

అదియును కాక, మానవుడు భార్యాబిడ్డలు, బంధుమిత్రులు వీరి మోజులో పడితే, ఊబిలో పడ్డ ఏనుగుమాదిరి కొట్టుకుంటూ ఉంటాడు కానీ వెలుపలికి రాలేడు. నిరంతర భోగములలో మునిగి తేలేవాడు, వలలో చిక్కుకున్న జింకవలె గిలా గిలా కొట్టుకుంటూ ఉంటాడు. ధర్మము అధర్మము, సత్యము, అసత్యము వీటి రెంటినీ విడిచిపెట్టాలి. అది ఎలా సాధ్యపడుతుంది అంటే.. అహింసను పాటిస్తే అధర్మం విడిచి పెట్ట వచ్చు. అలాగే, మనము ఏ పనీ సంకల్పించకుండా ఉంటే ధర్మాన్ని కూడా విడిచిపెట్ట వచ్చు. బుద్ధిని ఉపయో గించి సత్యమును, అసత్యమును రెండింటినీ వదిలిపెట్టవచ్చు. ఆత్మ సాక్షాత్కారం పొందితే బుద్ధితో పని ఉండదు. మన దైనందిన కార్యములలో శోకము, భయము కలుగుతూ ఉంటాయి. పండితుడైన వాడు వాటిని పట్టించు కొనడు. ఎందుకంటే అవి వస్తూ పోతూ ఉంటాయి కాబట్టి.

కుమారా! ఈ పంచభూతములు, దశ ఇంద్రియములు, మనసు, బుద్ధి వీటినన్నింటినీ మూటగట్టినట్టు ఉన్న ఈ శరీరం కోసరం తాపత్రయం ఎందుకు. భార్యాబిడ్డలకు, బంధు మిత్రులకు, ఊరిలో జనానికి కలిగిన బాధలకు మనం చింతించడం ఎందుకు." అని పలికాడు నారదుడు.

ఆ మాటలతో శుకునికి పూర్తి వైరాగ్యం కలిగింది. నారదుని చూచి "ఓ మహర్షి! నీ వాక్కులతో నాకు జ్ఞానోదయం అయింది. నా మనస్సు లో ఉన్న సందేహములు అన్నీ తొలగి పోయాయి. ఆ సూర్యభగవానుని దయవలన

యోగసిద్ధి పొందుతాను. సమస్తము త్యజిస్తాను.” అని పలికాడు.

వెంటనే నారదమహాముని ఆజ్ఞ తీసుకొని తండ్రి దగ్గరకు వెళ్లాడు. తండ్రికి తన నిశ్చయము తెలియజేసాడు. కుమారుని జ్ఞాన సంపదకు వ్యాసుడు సంతోషించాడు. తండ్రికి ప్రదక్షిణము చేసి శుకుడు బయలు దేరాడు. కాని వ్యాసునికి పుత్రప్రేమ ఇంకా చావలేదు.

“నాయనా శుకా! నిన్ను కనులారా చూచుకుంటాను. కాసేపు నా ఎదుట ఉండరాదా!” అని అడిగాడు. ఇప్పుడు శుకునిలో ఏ మమకారమూ లేదు. నిర్వికారంగా అలా వెళ్లిపోయాడు.

కైలాస శిఖరము చేరుకున్నాడు. ఒక సమతల ప్రదేశములో తూర్పు ముఖంగా కూర్చున్నాడు. ఆత్మావలోకనం చేసుకున్నాడు. అప్పుడు సూర్యుడు అతని ముందు ప్రత్యక్షం అయ్యాడు. శుకుడు సూర్యునికి సాష్టాంగ ప్రమాణం ఆచరించాడు. సూర్యుని వలన సర్వ ఆత్మ తత్త్వాన్ని తెలుసుకున్నాడు.

అదే సమయంలో నారదుడుకూడా అక్కడికి వచ్చాడు. శుకుడు నారదుని చూచి “నారదమహర్షి! మీ దయ వలన నాకు వైరాగ్యం కలిగింది. నాకు సరి అయిన మార్గం దొరికింది.” అని పలికి, సత్త్వ, రజస్ తమోగుణములను వదిలిపెట్టి, తన యోగ శక్తితో ఆకాశ మార్గాన వెళ్లిపోయాడు. పోతూ పోతూ దారిలో ఉన్న చెట్లను, పర్వతములను చూచి “నా తండ్రి వ్యాసుడు నా వెంట వస్తున్నాడు. ఆయన నన్ను పిలిస్తే మీరంతా ఓయ్ అని బదులుపలకండి.” అని ప్రార్థించాడు. వారంతా అలాగే అన్నారు.

తరువాత శుకుడు ఉత్తరదిక్కుగా ప్రయాణం సాగించాడు. గంగానదీ

తీరాన్ని సమీపించాడు. చాలా తక్కువ ఎత్తులో ఆకాశంలో పోతున్నాడు. ఆ సమయంలో గంగానదిలో అప్సరసలు బట్టలన్నీ విప్పి గట్టుమీద పెట్టి, దిగంబరంగా స్నానం చేస్తున్నారు. వారంతా యవ్వనంలో ఉన్న శుకుడిని చూచారు. కాని వారికి ఏలాంటి వికారము కలగలేదు. మామూలుగా స్నానం చేస్తున్నారు.

ఆసమయంలో వ్యాసుడు కూడా తనయోగశక్తితో ఆకాశ మార్గాన కొడుకును వెతుక్కుంటూ వస్తున్నాడు. గొంతు ఎత్తి నాయనా శుకా శుకా అంటూ అరుస్తూ వెళుతున్నాడు. కాని అప్పటికే శుకుడు సర్వభూతాత్మకుడయ్యాడు. అందుకే శుకుడు వ్యాసునికి కనిపించడం లేదు. వ్యాసుడు పిలిచే పిలుపులకు ప్రకృతి అంతా "ఓయ్..... ఓయ్" అంటూ ప్రతిధ్వనిస్తూ ఉంది.

వ్యాసుడు గంగానదీ తీరం సమీపించాడు. అప్పటిదాకా దిగంబరంగా జలకాలాడుతున్న అప్సరసలు పరపురుషుడైన వ్యాసుని చూచి సిగ్గుపడి హడావిడిగా బట్టలు కట్టుకున్నారు. వ్యాసుడు తన దివ్యజ్ఞానంతో జరిగింది తెలుసుకున్నాడు. తన కుమారుని అసక్తత (విషయముల మీద విముఖత), తనయొక్క సక్తత (విషయముల మీద ఆసక్తి) నిరూపింపబడింది అని అనుకున్నాడు. ఒక పక్క సంతోషిస్తూనే మరొక పక్క సిగ్గు పడ్డాడు.

ఆసమయంలో మహాశివుడు వ్యాసుని వద్దకు వచ్చాడు. "వ్యాస మునీంద్రా! నాడు నిన్ను వరం కోరుకోమన్నప్పుడు పంచభూతములకు అతీతుడైన కుమారుడు కావాలి అని అడిగావు. నేను నీకు అలాంటి కొడుకునే ప్రసాదించాను. నా ప్రభావమువలన, నీయొక్క తపోవిశేషము వలన, నీ కుమారునికి దేవతలకు కూడా దుర్లభమైన పరమగతి లభించింది. దీనికి నీవు సంతోషించాలి గాని విచారిస్తావెందుకు. ఓ వ్యాసమహర్షి! నీ కుమారుని కీర్తి

ఆచంద్రార్కము వర్ధిల్లుతుంది.” అని మహాశివుడు అంతర్ధానము అయ్యాడు.

ఓ ధర్మరాజా! ఈ శుక చరిత్ర చదివిన వారికీ, విన్నవారికీ, ఆయురారోగ్యై శ్వర్యములు లభిస్తాయి. తుదకు మోక్షం లభిస్తుంది.” అని భీష్ముడు ధర్మరాజుతో శుకుని వృత్తాంతము వివరంగా చెప్పాడు.

“పితామహా! తమరు నాకు బ్రహ్మ చర్యము మొదలగు నాలుగు ఆశ్రమముల గురించి చెప్పారు కదా. ఆ నాలుగు ఆశ్రమములలో ఉన్న వారు తమకు ఉత్తమ పదము లభించుట కొరకు ఆరాధించు దైవము ఎవరు తెలియ చెయ్యండి.” అని ధర్మరాజు భీష్ముని అడిగాడు అని వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు చెప్పాడు.

వైశంపాయనుడు జనమేజయునితో ఇంకా ఇలా చెప్పసాగాడు. “ఓ జనమేజయ మహారాజా! నేను నీకు నారాయణ కథను చెబుతాను సావధానంగా విను. ధర్మరాజు అడిగిన ప్రశ్నకు భీష్ముడు ఇలా సమాధానం చెప్పాడు.

“ఓ ధర్మనందనా! ఒకా నొకప్పుడు నా తండ్రి శంతనుడు నాకు నారాయణ నారద సంవాదాన్ని గురించి చెప్పాడు. నేను దానిని నీకు చెబుతాను. అది నీ సందేహమును తీర్చగలదు. అవ్యయుడు, సనాతనుడు, విశ్వాత్ముడు అయిన నారాయణుడు అనే మహాముని బదరికా వనములో తపస్సు చేసుకుంటున్నాడు. నారదుడు ఆయనను భక్తితో కొలిచి ఆయనను “ఓ మహర్షీ! మోక్ష సిద్ధికి ఆరాధించవలసినది ఏది?” అని అడిగాడు. నారాయణుడు ఇలా చెప్పాడు.

“ నారదా! ధ్రువము, అచలము, ఇంద్రియ ములకు గోచరము కానిదీ, సూక్ష్మమైనది, దేనికీ సాటిలేనిదీ, మన అందరిలో అంతరాత్మగా వెలుగొందేదీ అయిన పరతత్త్వము తక్క వేరు దైవము లేదు.” అని అన్నాడు. అప్పుడు నారదుడు నారాయణునితో ఇలా అన్నాడు.

“ ఓ మహర్షీ! నీవు ఈ లోకములను రక్షించుటకు ఈ అవతారము ఎత్తావని విద్వాంసులు అంటూ ఉంటారు. కానీ నీ మూల ఆకృతి ఎలా ఉంటుంది. నాకు తెలుపుము.  ఓ మహర్షీ! నాకు గురుభక్తి, వేదములయందు ఆసక్తి ఉన్నది. నాకు నీ మూల స్వరూపము చూడటానికి అర్హత ఉన్నది అని నీవు అనుకున్నట్టయితే నాకు దాని గురించి నీకు తెలుపుము.” అని ప్రార్థించాడు. అప్పుడు నారాయణుడు నారదునితో ఇలా అన్నాడు.

“ నారదా! ముందు నీవు  ఏకాగ్రతను సాధించు. అప్పుడు నీకు పరమాత్మను దర్శించు శక్తిని ప్రసాదిస్తాను.” అని అన్నాడు. ఆ మాటలకు తృప్తి చెంది నారదుడు వెళ్లిపోయాడు. నారదుడు ఆకాశ మార్గాన  మేరు పర్వత ప్రాంతమునకు వెళ్లాడు.  అక్కడ క్షీరసాగరమునకు ఉత్తర దిక్కున ఉన్న శ్వేత ద్వీపములో ఆహారము తీసుకోకుండా, ఇంద్రియ నిగ్రహము కలిగి, చెమట పట్టకుండా, తమ తమ శరీరములనుండి సుగంధములను వెదజల్లు తున్న మునీశ్వరులను చూచాడు”.అని భీష్ముడు చెప్పగా ధర్మరాజు అడ్డు తగిలి “పితామహా!  ఆ మహానుభావులు ఎవరు? వారి గురించి వివరించండి.” అని అడిగాడు. భీష్ముడు వారి గురించి చెప్పసాగాడు.

“ధర్మనందనా! ఆ మహాపురుషుల గురించి పూర్వము కొంత మంది మహా మునులు మా తండ్రిగారికి చెప్పగా నేను విన్నాను. ఆ విశేషములు నీకు చెబుతాను. విను.

పూర్వము ఉపరిచర వసువు అనే రాజు ఉండేవాడు. ఆ రాజు చాలా విశిష్టమైన ఆచారములు కలవాడు. అతడు సత్యము, ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము, విష్ణుభక్తి, నైతిక బలము కలవాడు. ఆ ఉపరిచర వసువు ఈ భూమి నంతయునూ పరిపాలించేవాడు. ఆ రాజుకు యజ్ఞయాగములు చెయ్యాలంటే మహా ప్రీతి. బ్రాహ్మణులంటే భక్తి.

అటువంటి రాజు, రాజ్యమును వదిలి పెట్టి అడవులకు పోయి తపస్సు చేసుకుంటున్నాడు. అప్పుడు దేవేంద్రుడు అతని దగ్గరకు వచ్చాడు. "ఓ మహారాజా! నీతో నేను స్నేహము చేయదలచుకున్నాను. నీకు తపస్సు ఎందుకు. నీవు వెళ్లి రాజ్యపాలన చేసుకో. నా నగరమునకు (అమరావతికి) వస్తూ పోతూ ఉండు. నీకు దివ్యత్వాన్ని ప్రసాదిస్తున్నాను. అమరావతికి రావడానికి నీకు ఒక విమానాన్ని ఇస్తున్నాను. నీవు దీనిని ఎక్కి నీ ఇష్టం వచ్చిన చోటికి రావచ్చు ... పోవచ్చు." అని అన్నాడు. ఇంద్రుని మాట కాదనలేక ఉపరిచరవసువు ఆ విమానాన్ని స్వీకరించాడు. అప్పటి దాకా వసువు అనే పేరుగల ఆ రాజు విమానాన్ని ఎక్కి తిరగడం చేత ఉపరిచర వసువు అని సార్ధక నామధేయు డయ్యాడు.

అది అటుండగా. కల్పమునకు ఆదిలో మరీచి, అంగిరసుడు, అత్రి, పులహుడు, పులస్త్యుడు, క్రతువు, వసిష్ఠుడు అనే మహామునులు, చిత్రుడు, శిఖండి అనే పేరుగలవారు, స్వాయంభువుడు అనే మనువు.... వీరందరూ కలిసి విష్ణువును గూర్చి అనేక సంవత్సరాలు తపస్సు చేసారు. అప్పుడు విష్ణువు అదృశ్యరూపంలో వారికి గోచరమయ్యాడు. వారితో ఇలా అన్నాడు.

"మీరందరూ ధర్మ శాస్త్రములను రచించే నైపుణ్యం కోసం నా గురించి తపస్సు చేసారు. అందుకని, సరస్వతీ దేవిని మీలో నియోగించాను. మీరు రచించే ధర్మశాస్త్రములు సకల జగములకు హితమును, గౌరవమును

కలిగిస్తాయి. అంగిరసుడు అనే అతనికి బృహస్పతి అనే మహాత్ముడు జన్మిస్తాడు. మీరు రాసిన ధర్మశాస్త్రములు అతనికి బోధించండి. భవిష్యత్తులో ఉపరిచర వసువు అనే మహారాజు జన్మిస్తాడు. అతడు మీరు రాయబోయే ధర్మశాస్త్రములను అధ్యయనము చేయడానికి అర్హుడు. బృహస్పతి వలన ఉపరిచర వసువు ధర్మశాస్త్రములను నేర్చుకుంటాడు. అతడు ధర్మశాస్త్రములను అన్నిలోకాలకు అందిస్తాడు. యజ్ఞయాగములను నిర్వర్తిస్తాడు. ఆ ఉపరిచర వసువు నాకు అత్యంత భక్తుడు. అతని వలననే ధర్మశాస్త్రములు లోకంలో ప్రచారమవుతాయి." అని పలికి విష్ణుమూర్తి అంతర్హితు డయ్యాడు.

తరువాత, ఆ వసువు అనే మహారాజు అశ్వమేధ యాగము చేసాడు. ఆ యాగమునకు మరీచి, మొదలగు సప్తఋషులు ఆధ్వర్యము వహించారు. సప్తఋషులతో సమానమైన మహానుభావులు ఋత్త్విక్కులు చేసేపనులు నిర్వర్తించారు. ఆయాగమునకు బృహస్పతి ప్రధాన ఋత్విక్కుగా వ్యవహ రించాడు. ప్రజాపతి పుత్రులైన ఏకతుడు, ద్వితుడు,త్రితుడు అను మునులు సదస్యులుగా వ్యవహరించారు.

ఆ ప్రకారంగా ఆ అశ్వమేధయాగము జరుగు తున్న సమయంలో వసు మహా రాజు అహింసా వ్రతుడవడం వల్ల జీవ హింసకు అనుమతించలేదు. జీవహింసకు బదులుగా ఆరణ్యకములలో చెప్పబడిన కొన్ని మంత్రములను విష్ణుమూర్తిని గురించి పఠింప చేసాడు. అతని నిష్టకు మెచ్చి విష్ణుమూర్తి అదృ శ్యరూపంలో వచ్చి తన హవిర్భాగమును స్వీకరించాడు. అది చూచి ప్రధాన ఋత్విక్కు అయిన బృహస్పతికి కోపము, దుఃఖము రెండూ వచ్చాయి.

వసురాజును చూచి బృహస్పతి ఇలా అన్నాడు. "ఓ వసుమహారాజా! యజ్ఞములో పురోడాశము సమర్పించునపుడు దేవతలు స్వయంగా వచ్చి

మనకు ప్రత్యక్షమయి స్వీకరించాలి. కాని విష్ణువు అదృశ్యరూపంలో వచ్చి స్వీకరించాడు. అదే నాకు బాధగా ఉంది.” అని అన్నాడు. వసుమహారాజు బృహస్పతిని అనునయించాడు. అక్కడ ఉన్న సదస్యులు బృహస్పతితో ఇలా అన్నారు.

“ఓ దేవ గురూ! మీరు అలుక మానండి. ఆ హవిర్భాగము హరికి చెందినది. హరి వచ్చి స్వీకరించాడు. దానికి మీరు బాధపడటం ఎందుకు? అసలు మహావిష్ణువును దర్శించడం మీకూ మాకూ సాధ్యమయ్యే పనేనా! బ్రహ్మ మానస పుత్రుల మైన మేమే మహావిష్ణువును దర్శించుటకు ఎన్నో ఏళ్లు తపస్సు చేసాము. అప్పుడు మాకు అశరీరవాణి ఇలా చెప్పింది.

“పాల సముద్రములో ఒక దీవి ఉన్నది. అందులో తెల్లటి వారు, ఇంద్రియ నిగ్రహము కలవారు, దివ్యమైన దేహము కలవారు, ఆకలి అంటే తెలియనివారు అయిన విష్ణుభక్తులు ఉన్నారు. వారలకు మాత్రము విష్ణువు తన నిజ రూపమును దర్శింపచేస్తూ ఉంటాడు. ఆ సమయంలో మీరు చూడగలిగితే వెళ్లి చూడండి.” అని అశరీరవాణి పలికింది.

ఆ మాటలు విన్న మేము వెంటనే అక్కడకు బయలుదేరాము. శ్వేతద్వీపమునకు వెళ్లాము. అశరీర వాణి చెప్పినట్టు మాకు ప్రకాశవంతమైన వారు కనిపించారు. ముల్లోకములలో అటువంటి వారిని మేము ఇంతవరకూ చూడలేదు. అలాంటి వారి ముందు సహస్ర భానులతో సమానమైన ఒక దివ్యతేజోరూపము ప్రత్యక్షం అయింది. అప్పుడు వారు అత్యంత భక్తితో “జయ పుండరీకాక్ష! జయ హృషీకేశ! జయ విశ్వభావన! నమస్తే నమస్తే” అంటూ పెద్దగా జయజయధ్వానాలు చేస్తున్నారు. ఎంత ప్రయత్నించిననూ మా కన్నులతో ఆ తోజోరూపమును చూడలేక పోయాము. అప్పుడు

ఆకాశమునుండి ఇలా వినిపించింది.

"ఓ బ్రహ్మమానస పుత్రులారా! మీరు విష్ణుమూర్తిని చూడలేదని దిగులుపడకండి. ఆ విష్ణుభక్తులను చూస్తే విష్ణువును దర్శించి నట్టే. అయినా మీరు చేసిన తపస్సు, నియమ నిష్ఠలు మీకు విష్ణుమూర్తిని దర్శింప చేస్తాయని మాట ఇచ్చాయా. కాబట్టి ఖేదపడకండి. అయినా మీరు చేసిన తపస్సు విష్ణుమూర్తి దర్శనమునకు చాలదు. అత్యంత భక్తితో, అనేక సంవత్సరములు విష్ణుమూర్తిని గురించి తపస్సు చేస్తే గాని విష్ణు దర్శనం దొరకడం దుర్లభం." అని వినిపించింది.

ఆ మాటలు విని మేము మరలా తిరిగి వచ్చాము. కాబట్టి ఓ బృహస్పతీ! నీవు విష్ణుదర్శనము గురించి ఆలోచించకుండా మిగిలిన యజ్ఞ కార్యక్రమము లను పూర్తి చెయ్యి" అని చెప్పారు.

ఆ మాటలు విన్న బృహస్పతి మిగిలిన యాగమును శ్రద్ధగా నడిపించాడు. తరువాత ఉపరిచర వసువు జనరంజకంగా ముల్లోకములను పరిపాలించాడు.

ఒక సారి స్వర్గలోకంలో దేవతలు, మునులు యజ్ఞయాగముల గురించి చర్చలు చేస్తున్నారు. దేవతలు అందరూ యజ్ఞయాగములలో అజములను (మేకలను) బలి ఇవ్వాలి అని తీర్మానించారు. కాని మునులు దానికి వ్యతిరేకించారు. అజములు అంటే యుగయుగములకు అర్ధములు మారుతాయని అన్నారు. కృతయుగములో అజము అనగా ఓషధులు అని అన్నారు. కాబట్టి అజములు అంటే ఓషధులు అని కూడా అర్థము తీసుకొన వచ్చును అని అన్నారు.

ఇంతలో ఉపరిచర వసువు అక్కడకు వచ్చాడు. దేవతలు మునులు ఆ

వివాదమును పరిష్కరించమని ఉపరిచర వసువును కోరారు. ఉపరిచర వసువు దేవతల పక్షం వహించాడు. యజ్ఞములలో మేకలను మాత్రమే బలి ఇవ్వాలని తీర్పు చెప్పాడు. వేదార్థమును వక్రీకరించినందుకు మునులు కోపించారు. ఉపరిచర వసువును శపించారు. ఆ శాప ప్రభావమున వసువు భూమి మీద ఉన్న ఒక లోయలో పడిపోయాడు. దేవతలు అతని వద్దకు వచ్చి అతనికి ఆకలి దప్పులు, శారీరక బాధ లేకుండా చేసారు. మహావిష్ణువు అనుగ్రహంతో మరలా తన పూర్వ స్థితిని పొందుతావు అని ఊరడించి వెళ్లారు. వసురాజు విష్ణువును గూర్చి ధ్యానం చెయ్యడం మొదలెట్టాడు. వసురాజు భక్తికి మెచ్చి విష్ణువు గరుత్మంతుని పంపి వసురాజును బ్రహ్మలోకమునకు పంపించాడు. విష్ణుమూర్తి మహిమకు, కరుణకు వసురాజు ఎంతో సంతోషించాడు.

ఓ ధర్మరాజా! నేను నీకు శ్వేతద్వీపంలో ఉండే మహాపురుషుల గురించి చెబుతుండగా ప్రసంగ వశాత్తు ఉపరిచర వసువు గురించి చెప్పాను. ఇంక శ్వేతద్వీపంలో ఉండే మహాపురుషుల గురించి చెబుతాను విను.

నారదుడి శ్వేతద్వీపమునకు వెళ్లాడు. ఆ ద్వీపములో అద్భుత శరీరాలతో ఉన్న మానవులను చూచి నమస్కరించాడు నారదుడు. వారు కూడా నారదుని ఆదరించారు. అప్పుడు నారదుడు విష్ణువును గూర్చి స్తోత్రం చెయ్యడం మొదలెట్టాడు. అప్పుడు విష్ణుమూర్తి నారదుడి ముందు ప్రత్యక్షం అయ్యాడు. లెక్కలేనన్ని శిరస్సులు, బాహువులు,పాదములతో, అనేక రంగులతో, కమండలములతో, ఓంకారాన్ని, గాయత్రినీ జపిస్తూ చతుర్వేదములను పారాయణం చేస్తూ విష్ణుమూర్తి నారదుడి ముందు సాక్షాత్కరించాడు. నారదుడు వినయంతో విష్ణుమూర్తికి నమస్కరించాడు. అప్పుడు విష్ణుమూర్తి నారదునికి ఇలా ఉపదేశించాడు.

"అనఘా! నన్ను ఎవ్వరూ చూడలేరు. నీ అనన్య భక్తి తత్పరత వలన, నీకు అహంకారము లేశ మాత్రమైనను లేని కారణమున, నన్ను చూడగలిగావు.నీకు కావలసిన వరము కోరుకో!" అని అడిగాడు.

నారదుడు విష్ణుమూర్తితో "ఓ మహానుభావా! నీ దివ్యసందర్శన భాగ్యము కంటే నాకు వేరు వరం ఏమున్నది? నీ దర్శన భాగ్యం నాకు చాలు." అని అన్నాడు. అప్పుడు విష్ణువు నారదునితో ఇలా అన్నాడు:

"నారదా! ఎవడైతే ఇంద్రియ ములకు లోబడకుండా ఉంటాడో, ప్రళయకాలంలో కూడా ఎవడు నిశ్చలంగా వెలుగుతూ ఉంటాడో, ఎవడైతే త్రిగుణములకు (సత్త్వ, రజస్, తమో గుణము లకు) అతీతంగా ఉంటాడో, ఆత్మ, సర్వసాక్షి, అజుడు, నిష్కళంకుడుగా వెలుగుతుంటాడో, అతడే క్షేత్రజ్ఞుడు, జీవుడు అనబడే వాసుదేవుడు, సంకర్షణుడు. మనస్సు, అహంకారము వరుసగా ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అని చెప్పబడు తుంటారు.

ఇదంతా నా మాయ. నేను 24 తత్త్వములకు అధినాధుడనైన 25వ తత్త్వమును. పరమపురుషుడను. నాకన్నా పరము వేరొకటి లేదు. మహామును లందరూ ఎవరి గురించి తపస్సు చేస్తుంటారు ఆ వాసుదేవుడను నేనే. ఈ చరాచర జగత్తులో ఉన్న సకల భూతములలో ఉన్న ధాతుశక్తివేరుగా లేదు. ఆ శక్తి నేను. ఆ జీవశక్తి సర్వవ్యాప్తంగా సకల లోకములలో విస్తరించి ఉంది. లేకపోయినట్టయితే ఈ లోకములన్నీ చైతన్యవంతము ఎలా అవుతాయి! జీవుడు, శరీరము వేరు. ఒకటి కావు. జీవుడిని తెలుసుకొన్నాను అని చెప్పడం నా మాయా విలాసమే. ఆ మాయ నేను కల్పించినదే. జీవుడు కూడా నాతో సమానమే. నా కన్నా వేరు కాదని తెలుసుకో. ఎవరైతే అచంచల మైన భక్తితో నా

ఆశ్రయం కోరతారో, వారికి నేను ముక్తి ప్రసాదిస్తాను.

ఆదిత్యులు, మరుత్తులు, వసువులు, రుద్రులు మొదలగు దేవతా గణములు, బ్రహ్మదేవుడు, చతుర్వేదములు, అందరూ నా స్వరూపాలే. అందువలననే వారికి విశేష గౌరవం లభించింది. నేను బ్రహ్మదేవుని సృష్టించాను. ఈ సకల జగత్తుల భారమును అతనికి అప్పగించాను. నేను మాత్రం ఏమీ పట్టించు కోకుండా, ఏకాకినై, నిమిత్తమాత్రంగా, కోరినసాయం చేస్తుంటాను. ఒక్కో కాలంలో ఈ లోకాలకు మేలు చెయ్యడానికి జన్మలు ఎత్తుతుంటాను. కర్మలు చేస్తుంటాను. వరాహ రూపంలో హిరణ్యాక్షుని, నరసింహరూపంలో హిరణ్యకశిపుని, పరశురామునిగా సకలక్షత్రియ కులమునూ, దశరథునికి పుత్రుడుగా, రాముడిగా జన్మించి రావణాసురుని సంహరించాను. యాదవకులములో పుట్టి, ఇంద్రుని కుమారుడైన నరుని సహాయంతో భూబారాన్ని తగ్గించాను.

పూర్వము నేను, నరుడు, నారాయణుడు అనే రెండు రూపములతో, ఋషులుగా వెలసి, లోకరక్షణ చేసాను. తరువాతి కాలంలో మానవ రూపములలో అవతరించి, కంసుని, కాలయవనుని, మురాసురుని, నరకాసురుని, బాణాసురుని మొదలగు లోక కంటకులను సంహరించాను. అదే సమయంలో బాణాసురుని రక్షించాడానికి మహా శివుడు, మహాసేనాని అయిన కుమారస్వామితో కలిసి అడ్డుపడగా, నేను మహాశివుని జయించి, బాణాసురుని పరాభవించాను. అంతకు ముందు మత్స్యత్వము, కూర్మత్వము పొంది దేవతలను, వేదములను రక్షించాను. ఆ చరిత్రలు నీవు వినే ఉంటావు. ధర్మరక్షణ కోసరం ఏమేమి చెయ్యవలెనో అవన్నీచేసాను. నేను చెయ్యవలసిన కార్యములు సంపూర్ణం కాగానే నా మూలప్రకృతిని పొందుతాను.

ఓ నారదా! నీవు ఏకాగ్రచిత్తుడవయి నన్ను ధ్యానించితివి కావున నీకు ఇవన్నీ చెప్పాను." అని బోధించాడు విష్ణువు.

తరువాత నారదునికి ఆ శ్వేతద్వీపంలో ఉన్న నిరాహారులు, ఇంద్రియము లను నిగ్రహించిన వారు, చెమట పట్టని వారు, సుగంధము వెదజల్లు తెల్లని దేహము కలవారు అయిన మహా పురుషులను చూపి "నారదా వీరు కాంతి దేహము కలవారు. వీరు నిరంతరమూ నన్నే ధ్యానిస్తూ ఉంటారు. నీవు ఇక్కడ ఉంటే వీరి ఏకాంతానికి భంగం కలిగిస్తుంది. ఇంక నీవు ఇక్కడి నుండి వెళ్లిపొమ్ము" అని పలికాడు.

నారదుడు విష్ణుమూర్తికి నమస్కరించి బదరికా వనమునకు వెళ్లాడు. అక్కడ నరనారాయణులను దర్శించుకున్నాడు. తరువాత తాను సాక్షాత్తు విష్ణుమూర్తి ముఖతా పొందిన వేదార్ధసారము, యోగము, సాంఖ్యముల సారము అయిన ఉపదేశమును మునులందరికీ ఉపదేశించాడు. అక్కడి నుండి నారదుడు బ్రహ్మ సభకు వెళ్లాడు. అక్కడ కూడా విష్ణుమూర్తిచేసిన ఉపదేశ మును అందరికీ చెప్పాడు. ఆ ఉపదేశము క్రమక్రమంగా ముల్లోకములలో వ్యాపించింది. దానిని నాకు మా తండ్రి శంతనుడు ఉపదేశించాడు. దానిని నేను నీకు చెప్పాను. ఈ ఉపదేశమును మునులు, దేవతలు, ఎంతగానో కొనియాడుతారు. విష్ణువును పూజిస్తారు. భక్తితో జపిస్తారు. మనస్సులో ధ్యానిస్తారు.

ధర్మనందనా! నీవు కూడా విష్ణు మహిమను అదే ప్రకారము జపించు. ధ్యానించు. నీవు ఎవరి కన్నా చెప్పదలచుకుంటే నీతి పరులకు, విష్ణుభక్తులకు, ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము కలవారికి మాత్రమే ఉపదేశించు. నీవు ఇప్పటి దాకా విన్న కథలు ఏవీ ఈ ఉపదేశమునకు సాటిరావు. దీనిని చదివిన

వారికి ఆయురారోగ్యైశ్వర్యములు కలుగుతాయి.” అని భీష్ముడు ధర్మరాజుకు విష్ణువు నారదునికి ఉపదేశించిన తత్త్వమును ఉపదేశించాడు. ఈ పరమ పవిత్రమైన ఉపాఖ్యానమును పఠించుచూ పాండవులు విష్ణుమూర్తిని భజిస్తూ కాలం గడిపారు.” అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడు.

( ఇక్కడి నుండి వైశంపాయనుడు జనమేజయునకు చెప్పినట్టు కథ నడుస్తుంది).

“ ఓ జనమేజయ మహారాజా! వ్యాసుడు కూడా విష్ణుమూర్తిని తల్చుకుంటూ ఆకాశ మార్గాన క్షీరసాగరం వైపుకు ప్రయాణం చేస్తున్నాడు.” అని వైశంపాయనుడు చెప్పగా జనమేజయుడు వైశంపాయనునితో ఇలా అన్నాడు.

“ ఓ మహర్షి! నీవు మోక్షము అత్యంత సుఖప్రదము అని చెప్పావు. కాని ఆ లోకములలో జనాలు ఎల్లప్పుడూ ఈ ప్రాపంచిక విషయములలో, సంసార కర్మబంధనములలో చిక్కుకొని ఉంటారు కదా! మానవుల సంగతి ఎందుకు. దేవతలు కూడా మోక్ష మార్గంలో పయనించకుండా ఎల్లప్పుడూ యజ్ఞ యాగములలో అర్పించు హవిస్సులకోసం పాకులాడుతూ ఉంటారు కదా. ఇది ఇలా ఎందుకు జరుగుతూ ఉంటుంది అని ఆలోచిస్తూ ఉంటాను. మానవులు, దేవతలు ఇలా మోక్షమార్గమును విడిచిపెట్టి కర్మబంధనములలో చిక్కువడి ఉండుటకు కారణమేమిటో చెప్పగలరా!” అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

“ జనమేజయ మహారాజా! వ్యాసభగవానుడు తన శిష్యులకు నాలుగు వేదములను, భారతమును బోధించాడు. ఆ సమయంలో నేను, సుమంతుడు,

పైలుడు, జైమిని కలిసి, నీవు నన్ను అడిగిన మాదిరే, మా గురువుగారు వ్యాసుని అడిగాము. మామీద దయతో వ్యాసుడు మాతో ఈ విధంగా చెప్పాడు.

"నేను భూత, భవిష్యత్ వర్తమానములను తెలుసుకొనే దివ్యజ్ఞానము సంపాదించడానికి క్షీరసాగర తీరంలో తపస్సుచేసాను. ఆ నారాయణుని అనుగ్రహం చేత నాకు భూత భవిష్యత్ వర్తమానములను తెలుసుకొనే దివ్య దృష్టి లభించింది. దాని ప్రభావంతో నేను ఈ కల్పము ప్రారంభంలో బ్రహ్మ దేవుడు, మిగిలిన వారు చేసిన పనులు చూడగలిగాను. వాటిని మీకు చెబుతాను ఆలకించండి.

ఆదిత్యులు, మరుత్తులు, వసువులూ,రుద్రులు, మొదలగు దేవతాగణములు, మునులు, బ్రహ్మదేవుని చూచి "మా కర్తవ్యము ఏమిటి దయతో చెప్పండి?" అని అడిగారు. "మీ కర్తవ్యము ఏమిటి అన్న ఆలోచన నా మనస్సులో మెదులుతూ ఉంది. మీరు కూడా అదే మాట అడిగి నాకు మేలు చేసారు. దీని గురించి మనము అందరమూ ఆ విష్ణు దేవుని అడుగుదాము రండి." అని బ్రహ్మదేవుడి వారితో అన్నాడు. తరువాత అందరూ విష్ణుదేవుని దగ్గరకు వెళ్లారు. విష్ణుదేవుని గురించి తపస్సు చేసారు. అప్పుడు వారికి ఒక దివ్యమైన వాక్కు వినవచ్చింది.

"ఓ దేవతలారా! మహా మునులారా! మీరు వచ్చిన పని నాకు తెలుసును. ఈ బ్రహ్మ దేవుడు లోకములన్నిటికీ గురువు. ఆయన ఏది చెప్పినా అది వేదవాక్కు. నాకు కూడా బ్రహ్మదేవుని మాటే వేదవాక్కు. మీరందరూ కలిసి వేదోక్తంగా ఒక యజ్ఞము చెయ్యండి. అందులో నాకు హవిర్భాగము కల్పించండి." అని ఆకాశ వాణి పలికింది.

ఆ మాటలకు సంతోషించిన బ్రహ్మదేవుడు ఒక యాగం చెయ్యమని మిగిలిన దేవతలను ఆదేశించాడు. దేవతలందరూ వేదోక్తంగా యాగం చెయ్యడానికి సంకల్పించారు. అందులో విష్ణుమూర్తికి భాగం కల్పించారు. విష్ణుమూర్తి అదృశ్యరూపంలో వచ్చి ఆకాశంలో నిలిచి వారితో ఇలా అన్నాడు.

“దేవతలారా! మునులారా! నేను చెప్పిన ప్రకారము మీరు యజ్ఞము చేసారు. మీరు చేసిన పుణ్యమునకు ఫలాన్ని ప్రసాదిస్తాను. మరీచి, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు, అను వారు బ్రహ్మమానస పుత్రులు. వారు వేదములకు ఆచార్యులు. యజ్ఞములను నిర్వహింపడానికి అర్హులు. వీరు ఏర్పరచిన నియమములు, ఆచారములు, పద్ధతుల ప్రకారము మానవులు యజ్ఞయాగములు చేస్తారు. అందులో మీకందరకూ హవిర్భాగములు ఇస్తారు. వాటితో మీరందరూ తృప్తిపొందుతారు.

సన, సనక, సనందన, కపిల, సనత్కుమారులు బ్రహ్మ మానస పుత్రులు. వీరు సహజ జ్ఞాన సంపన్నులు. విజ్ఞాన వంతులు, ఎల్లప్పుడూ ముక్తి గురించి ఆలోచిస్తుంటారు. వీరు మోక్షధర్మములను లోకమునకు విశదీకరిస్తారు. మీ అందరకూ తల్లి, తండ్రి, గురుడు ఈ బ్రహ్మదేవుడు మాత్రమే. నా అభీష్టము ప్రకారము ఇతడు ఈ లోకాలన్నింటినీ శాసిస్తాడు. నా నుదుటినుండి పుట్టిన రుద్రుడు సర్వలోకములకు ఆరాధనీయుడు, పూజ్యుడు. సకల వరములను ప్రసాదించేవాడు. ఇంక మీరు వెళ్లవచ్చు. వేదోక్త కర్మలన్నింటినీ ఈ బ్రహ్మ దేవుడు, మరీచి మొదలగు ప్రజాపతులు చెప్పినట్టు చేయండి. ఇది కృత యుగము అనే పేరుతో ఉత్తమమైన కాలంగా వర్ధిల్లుతుంది. యజ్ఞయాగము లలో పశువులను వధించరాదు. ఇందులో ఏ మాత్రం సందేహము లేదు.” అని ఆదేశించాడు.

విష్ణుమూర్తి కి నమస్కరించి మునులు, దేవతలు వెళ్లిపోయారు. కాని బ్రహ్మదేవుడు అక్కడే నిలబడి ఉన్నాడు. అప్పుడు విష్ణువు గుర్రపు తలతో (హయగ్రీవుడు), దండకమండలములతో వేదాధ్యయనము చేయు మొహముతో, బ్రహ్మదేవుని ఎదుటికి వచ్చి నిలబడ్డాడు. విష్ణువు బ్రహ్మదేవుని కౌగలించుకొని "ఓ బ్రహ్మదేవా! నీవు సర్వలోకములకు విధాతవు. అందరికి గురుడవు. అధిపతివి. అందుకే నీ యందు సర్వలోకములభారమును ఉంచి నేను సుఖంగా ఉన్నాను. ఈ లోకములను సక్రమంగా నడపడం నీ బాధ్యత. ఈ లోకములను నడపడంలో నీకు ఏమైనా కష్టమని తోస్తే అప్పుడు నేను కల్పించుకుంటాను. ఆ పరిస్థితులను చక్కదిద్దుతాను." ఈ మాటలు చెప్పి విష్ణుమూర్తి అంతర్హితుడయ్యాడు. ఈప్రకారం యజ్ఞయాగములలో అగ్రభాగమునకు అర్హుడు, యజ్ఞధారి అయిన మహా విష్ణువు ప్రవృత్తి ధర్మము నిర్వహించడానికి బ్రహ్మదేవుని, దేవతలను నియమించి, తాను మాత్రం నివృత్తి ధర్మమును నిర్వర్తిస్తూ జ్ఞాన మూర్తియై సర్వేసర్వత్రా సంచరిస్తున్నాడు." అని వ్యాసుడు వైశంపాయనుడికి చెప్పాడు.

వ్యాసుడు ఇంకా ఇలా అన్నాడు. "వైశంపాయనా! ఈ సమస్త లోకములను సృష్టించి వాటిని పదిలముగా రక్షిస్తూ తుదకు తనలోనే లీనం చేసుకొనే ఆ మహావిష్ణువును నేను కొలుస్తాను. అజుని (అంటే పుట్టుక లేని వానిని) విశ్వమే తన రూపముగా కలవానిని, మృత్యువు లేని వాడిని, దేవతలందరికీ అధినాధుని, మొట్టమొదటి వాడినీ, నాలుగు వేదములు అధ్యయనం చేసిన వాడిని, ఆత్మతో మాత్రమే తెలిసుకో తగిన వాడినీ, ఈశానుని, నాశనము లేని వాడిని, అన్ని తపములకు,కర్మలకు ఫలప్రదాతను నేను ఆశ్రయిస్తాను." ఈ ప్రకారంగా వ్యాసుడు నారాయణుని స్తుతించాడు. మమ్ములనందరినీ చూచి "నా పూర్వవృత్తాంతమును మీ అందరకూ చెప్పాను. మీరు కూడా నాకు విష్ణుమూర్తి చేసిన ఉపదేశములను ఆచరింపుడు. ఆ

పరమేశ్వరుని కొలవండి. వేదములలో చెప్పిన ప్రకారం నడుచుకోండి." అని చెప్పాడు. మేమందరమూ వ్యాసుడు చెప్పినట్టే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదముల ప్రకారము ఈ త్రిలోకాధిపతిని స్తుతించాము. మనస్సులలో ఆరాధించాము." అని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పాడు.

"జనమేజయ మహారాజా! వ్యాసుడు మాకు బోధించిన పుణ్యప్రదమైన విష్ణుతత్త్వమును చదివినను, విన్నను విప్రుడు వేదవేదాంగములు చదివిన ఫలమును పొందుతాడు. క్షత్రియుడు సర్వత్రావిజయము పొందుతాడు. వైశ్యుడు ధనలాభమును పొందుతాడు. శూద్రుడు అత్యంతసుఖమును పొందుతాడు. పెళ్లికాని కన్యలకు త్వరగా వివాహం అవుతుంది. గర్భిణీ స్త్రీలకు సుఖప్రసవము అవుతుంది. మంచి గుణములు కలిగిన పుత్రుడు కలుగుతాడు. పిల్లలు లేని స్త్రీ సంతానవతి అవుతుంది." అని వైశంపాయనుడు ఫలశృతి చెప్పాడు.

ఆ మాటలు విన్న జనమేజయుడు వైశంపాయనునితో ఇలా అన్నాడు. "మునివరా! గూఢములైన విష్ణునామములు నిర్వచించడానికి వీలులేనివి. నాకు వాటి గురించి వివరించండి." అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా చెప్పాడు.

"ఓ జనమేజయ మహారాజా! పూర్వము అర్జునుడు శ్రీకృష్ణుని ఇదే విషయం అడిగాడు. దానికి కృష్ణుడు అర్జునునకు వివరించిన విష్ణు నామముల ప్రాశస్త్యము గురించి నీకు చెబుతాను.

"అర్జునా! నీవు,నేను, నరనారాయణులు అనే సనాతనులము. ఈ ప్రపంచాన్ని ఉద్ధరించడానికి ఈ భూమి మీద అవతరించాము. గూఢములు

అయిన నా నామముల గురించి వాటి అర్ధముల గురించి వివరిస్తాను. విను.

అర్జునా! నారములు అనగా జలములకు పేరు. అయనము అనగా ఉండు స్థలము. నేను సదా జలములలో ఉంటాను కాబట్టి నాకు నారాయణుడు అనే పేరు సార్ధకమయినది.

నేను ఈ జగములలో నివసిస్తాను. కాని ఈ జగములన్నీ నాలో ఉన్నాయి. అందుకని నన్ను వాసుదేవుడు అని అంటారు.

నేను ఈ జగములన్నిటిలోనూ రోదసికుహరములోనూ పూర్ణంగా వ్యాపించి ఉన్నాను. కాబట్టి నన్ను విష్ణువు అని అంటారు. (విష్ణు అంటే అంతటా వ్యాపించినది అని అర్ధం).

ఇంద్రియములను నిగ్రహించుటకంటే ఉత్తమమైన ధర్మము లేదు. అట్టి జనులు నన్ను సదా కొలుస్తూ ఉంటారు. ఈ లోకములన్నీ నా ఉదరము (పొట్ట) లోనే ఉన్నాయి. అందుకని నన్ను దామోదరుడు అని అంటారు.

అన్నము ( ఆహారము), జలము, అమృతము, వేదములు, పృశ్ని అనే పేరులో పిలువబడుతూ ఉంటాయి. అవి అన్ని నా గర్భంలో ఉన్నాయి కాబట్టి నన్ను పృశ్నిగర్భుడు అని అంటారు.

సూర్య కాంతీ, చంద్రకాంతీ, అగ్ని శిఖలు (జ్వాలలు) నాకు తల వెంట్రుకలు(కేశముల) వంటివి. అందుకని నన్ను కేశవ అని అంటారు.

నేను లోక సంరక్షణార్ధము ఇటు బ్రాహ్మణత్వమూ (సత్త్వగుణమూ)

అటు క్షాత్రము (రజోగుణము) అవలంబిస్తుంటాను. బ్రాహ్మము విప్రులకు, క్షాత్రము క్షత్రియులకు పరమధర్మములు. కాబట్టి బ్రాహ్మణుడు, క్షత్రియులు తమ తమ ధర్మములు క్రమం తప్పకుండా నెరవేరుస్తూ ముల్లోకములలో విరాజిల్లు తున్నారు. బోధించడం, స్థాపించడం అనగా వృద్ధిపొందించడం అనేవి అగ్నికి (సూర్యునికి) చంద్రునికీ కర్తవ్యములు. సూర్యుడు, చంద్రుడు తమ తమ కర్తవ్యములు నిర్వర్తించి అఖిలలోకములకు సంతోషమును కలిగిస్తారు. సూర్యుడు చంద్రుడు నేనే. సూర్య చంద్రుల రూపములలో నేను అఖిల జగములకు మేలు చేకూరుస్తుంటాను. దాని వలన నాకు కొని పేర్లు ఏర్పడ్డాయి వాటి గురించి చెబుతాను విను.

వరదుడు, లోకభావనుడు, ఈశ్వరుడు, హృషీకేశుడు, మొదలగు నామములు నాకు వచ్చాయి.

యజ్ఞములలో యాగములలో హవిర్భాగములను హరిస్తాను కాబట్టి నన్ను హరి అని కూడా అంటారు.

గోవు ( ఆవు) అంటే భూమి అని అర్ధము. దానిని గుహలో పడకుండా ఎత్తిపట్టుకున్నందుకు నన్ను గోవిందుడు అని అంటారు.

నేను రోమములు లేకుండా అందంగా ఉంటాను కాబట్టి నన్ను శిపివిష్టుడు అని అంటారు.

నేను ఈ భూమిని దున్నుతాను. నా వర్ణం కూడా నలుపు. ఈ రెండు కారణములచేత నన్ను కృష్ణుడు అని అంటారు.

నేను సత్త్వగుణ ప్రధానుడను. అందుకని నేను సత్త్వగుణము నానుండి తొలగిపోదు. నేను ఎప్పుడూ సత్త్వగుణమునే ఆచరిస్తాను. అసలు నా జన్మ సత్త్వగుణ ప్రధానము అందువలన నను సాత్త్వతుడు అని అంటారు.

నాకు చ్యుతి అనగా నాశనము లేదు కాబట్టి నన్ను అచ్యుతుడు అని అంటారు.

మానవ శరీరంలో మూడు ప్రధాన ధాతువులరూపంలో నేను ఉంటాను కాబట్టి నన్ను త్రిధాతువు అని కూడా అంటారు.

నా తేజస్సు వలన నేయి ఏర్పడింది కాబట్టి నా పేరు ఘృతార్చి అని అంటారు.

ధర్మములలో వృషము అత్యుత్తమ ధర్మము. నేనే ఆ ధర్మమును. కాబట్టి నన్ను వృషుడు అని కూడా పిలుస్తారు.

నాకు ఆది, మధ్యము, అంతము లేవు. అందుకని నన్ను అనాది, అమధ్యుడు, అనంతుడు అని కూడా పిలుస్తారు.

ఎల్లప్పుడూ మంచి మాటలు శుచి అయిన మాటలు వినడానికి నేను ఎల్లప్పుడూ ఇష్టపడతాను. అందుకని నాకు శుచిశ్రవుడు అని పేరు.

వరాహావ తార సమయమున నేను ఒకే కొమ్ముతో భూమిని పైకి ఎత్తి పట్టు కున్నాను. అందుకని నాకు ఏకశృంగుడు అని పేరు.

నేను ఎల్లప్పుడూ ఈ లోకమును రేచనము అనగా చైతన్యవంతము చేస్తాను. అందుకని నన్ను విరించి అని అంటారు.

నేను విద్య రూపంలో అశరీరంగా సూర్యునిలో లీనమై ఉంటాను. అందుకని నన్ను కపిలుడు అని అంటారు.

యోగమును హిరణ్యము అని కూడా అంటారు. యోగమును నా కుక్షిలో దాచుకున్నాను కాబట్టి నన్ను హిరణ్య గర్భుడు అని అంటారు.

నేను నరుడిగా, నారాయణుడిగా ధర్మరక్షణార్ధము ఈ లోకంలో ఉద్భవించాను కాబట్టి నన్ను ధర్మజుడు అని కూడా అంటారు.

ఆ ప్రకారంగా నర నారాయణ రూపములలో నేను గంధమాధన పర్వతము మీద తపస్సుచేసుకొను చుండగా, కాలాంతకుడైన మహాశివుడు దక్షుని చేయు యజ్ఞమును ధ్వంసము చేయబోగా, ఆ యజ్ఞము పారిపోయి వచ్చి నా వక్షస్థలములో దాగుకొన్నది. అప్పుడు నా వక్షస్థలము మీద ఉన్న కేశములు ముంజముల వలె (గడ్డిపోచల వలె)మారిపోయినవి. అందుకని నాకు ముంజకేశుడు అనే పేరు సార్ధకమైనది.

అప్పుడు యజ్ఞమును తరుముకుంటూ వచ్చిన మహాశివుడు నాతో కలియబడ్డాడు. అప్పుడు నేను ఒక బాణమును అభిమంత్రించి పరశు రూపములో (గండ్రగొడ్డలి రూపములో) మహాశివుని మీదికి విసిరాను. అప్పుడు మహాశివుడు ఆ పరశువును ఖండించాడు. అందుకని నాకు ఖండపరశువు అనే నామము సార్ధకమైనది.” అని చెప్పిన కృష్ణుని చూచి అర్జునుడు “కృష్ణా! నీవు, మహాశివుడు యుద్ధం చేసారు అన్నారు కదా. మరి

ఆ యుద్ధములో నీవు గెలిచావా! మహాశివుడు గెలిచాడా. ఆ వృత్తాంతము నాకు చెప్పవా!" అని అడిగాడు. దానికి కృష్ణుడు ఇలా చెప్పాడు.

"ఓ అర్జునా! ఆ సమయంలో రుద్రుడు, నారాయణుడు యుద్ధంచెయ్యడానికి సంకల్పించారు. రుద్రుడు తన త్రిశూలంతో నారాయణుడి వక్షస్థలమును తాకాడు. నారాయణుడు తన చేత్తో రుద్రుని మెడ పట్టుకున్నాడు. ఇది తెలిసి బ్రహ్మదేవుడు అక్కడకు వచ్చాడు. ఇద్దరినీ సమాధాన పరిచాడు.

"మహాశివా! నీవు ఈ జగములకంతకూ శివుడవు.(శివం అంటే శుభకరము) మరి నీవు అందరికీ శుభములు చేకూర్చాలి కదా! కాబట్టి నీ కోపమును ఉపశమింప జెయ్యి. విష్ణువు శివుడు ఒకటే అని దివ్యజ్ఞానము కలవారందరికీ తెలియును కదా! వేదములతో తెలుసుకొనదగినదీ, నిర్గుణమయినదీ, ద్వందములకు అతీతమైనది, అరూపమైనదీ, అయిన ఒకే మూల తత్త్వము రెండు రూపములుగా విరాజిల్లుతున్నది. అవే శివ కేశవ తత్త్వములు. నిజానికి శివకేశవులకు బేధములేదు. నరనారాయణులు అనగా ఈ జగమునకు ఆది పురుషులు. నీ దివ్య బుద్ధితో చూస్తే మనమందరమూ వారి నుండి ఉద్భవించిన వారమే అని అవగతమవుతుంది. కాబట్టి మహాశివా! ముందు నీవు నారాయణుని ప్రసన్నం చేసుకో!" అని శివుని ప్రార్థించాడు.

అప్పుడు శివుడు ప్రసన్నుడయ్యాడు. తన కోపాన్ని విడిచిపెట్టాడు. నారాయణుడికి నమస్కరించాడు. అప్పుడు నారాయణుడు ఇలా అన్నాడు. "మహాశివా! ఎవడైతే నిన్ను తెలుసుకుంటాడో వాడు నన్ను తెలుసుకున్నట్టే! నిన్ను సేవిస్తే నన్ను సేవించినట్టే! శివకేశవులకు బేధము అనేది లేదు. మహాశివా! ఈ రోజునుండి నా గుండెలపై ఉన్న శ్రీవత్సము నీ త్రిశూలము

గుర్తుగా ఉంటుంది. నీ కంఠంమీద ఉన్న నలుపు ఈ రోజునుండి నా చేతి ముద్రతో శ్రీకంఠముగా పిలువబడుతుంది." అని అన్నాడు విష్ణువు.

అర్జునా! ఆ ప్రకారంగా నాకూ మహాశివునికీ సఖ్యత కుదిరింది. ఇది చూచి బ్రహ్మ మొదలగు దేవతా సమూహములు ఎంతో సంతోషించారు. కాబట్టి అర్జునా! నేను వివిధ రూపములతో ఈ లోకములలో ప్రవర్తిస్తూ ఉంటాను. నీవు కూడా అభవుడు, అమృతుడు, అయిన మహాశివుని పూజించి తరించు. నేను పక్కన ఉండి నిన్ను అనుక్షణమూ రక్షించాను కాబట్టి నీకు మహాభారత సంగ్రామంలో విజయం లభించింది. నీవు యుద్ధం చేసేటప్పుడు నీ రథం ముందు మహాశివుడు రుద్రరూపంలో త్రిశూలధారియై పరుగెడుతూ శత్రుసంహారం చేసాడు. ఆ కారణం చేత కూడా నీవు విజయుడివి అయ్యావు. ఈ విషయం నీవు తెలుసుకోడం మంచిది." అని శ్రీకృష్ణుడు అర్జునునితో చెప్పాడు అని వైశంపాయనుడు జనమేజయునితో చెప్పగా జనమేజయుడు ఇలా అన్నాడు.

"మునీంద్రా! ఇటు కృష్ణుడు, అటు మహాశివుడు తోడుగా ఉంటే సంగ్రామంలో అర్జునునికి విజయం లభించడంలో ఆశ్చర్యం ఏముంది? ఓ వైశంపాయన మహర్షీ! నారదుడు మహావిష్ణు దర్శనం చేసుకొని తిరిగి నరనారాయణుల వద్దకు వచ్చాడు మీరు అని చెప్పారు. ఆసమయంలో నరనారాయణులకు, నారదునికి జరిగిన సంభాషణా వివరములు వినవలెనని కోరికగా ఉన్నది వివరించండి." అని అడిగాడు. వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

" ఆ ప్రకారంగా నారదుడు నరనారాయణుల వద్దకు తిరిగి వచ్చాడు. నరనారాయణులు నారదునికి అతిథి సత్కారములు చేసారు. శ్వేతద్వీప విశేషములు ఏమి అని అడిగారు. వారితో నారదుడు ఇలా చెప్పాడు.

“ మీ కృపాకటాక్షములతో నేను శ్వేతద్వీపమునకు పోయి అచ్చట శ్రీ మహావిష్ణువును దర్శించుకున్నాను. ఆయన రూపము, ఇక్కడ మీరూపములు ఉన్నట్టే ఉన్నది. ఏమీ బేధము లేదు. అక్కడ తెల్లగా ఉన్న వారు, ఇంద్రియ నిగ్రహము కలవారూ, మౌనంగా ఉన్నవారూ అయిన నరులను దర్శించాను. వారందరూ విష్ణుదేవుని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు. విష్ణుమూర్తి కూడా వారితో విహరిస్తున్నాడు. నన్ను చూచి నా మీద కృపతో నాకు క్షేత్రజ్ఞుని గురించి, తన రాబోయే జన్మలగురించి, అవతారములగురించి తెలియజేసాడు. ఆ శ్వేతద్వీపము చాలా ప్రశాంతంగా ఉంది. అక్కడు, సూర్యుడు, చంద్రుడు లేరు. గాలి లేదు. మహావిష్ణువుకు ఏకాగ్రమైన మనస్సుతో ధ్యానం చేసేవారు చాలా ఇష్టులని తెలిసి నేను కూడా ఆ ప్రకారమే ఏకాగ్రచిత్తంతో ధ్యానం చేసాను. తరువాత విష్ణువు వద్ద వీడ్కోలు తీసుకొని మీ వద్దకు వచ్చాను. నేను కూడా ఇచ్చటనే ఉండి మీ దయకు పాత్రుడనయ్యేదను.” అని అన్నాడు. దానికి నరనారాయణులు సమ్మతించారు. తరువాత నారదుడు ఆ బదరికా వనంలో వేయి దివ్యసంవత్సరములు తపస్సు చేసాడు. తరువాత నరనారాయణుల దగ్గర వీడ్కోలు తీసుకొని హిమాలయ పర్వతములకు వెళ్లాడు. అక్కడ తన ఆశ్రమంలో శిష్యబృందంతో పూజలందుకుంటూ ఉన్నాడు.

జనమేజయ మహారాజా! తమస్త పాపహరమయిన హరి కథను నీవు భక్తిశ్రద్ధలతో విన్నావు. నీవు ఎల్లప్పుడూ విష్ణువును అధిక భక్తితో కొలువుము. నీకు మహోన్నతి కలుగుతుంది. హరిని ద్వేషించేవారికి ఈ లోకములో నేకాదు పరలోకములో కూడా సుఖం కలుగదు.వారికే కాదు వారి పితరులకు కూడా నరకప్రాప్తి కలుగుతుంది అని వేదాలు చెబుతున్నాయి. ముల్లోకములలో ఉన్న అందరికీ హరియే అంతరాత్మ. హరిని ద్వేషించడం అంటే తనను తాను ద్వేషించుకోవడమే కదా! మరి అలాంటి వారికి ఆపదలు వస్తాయి కదా! అంతేకాదు మా గురువుగారు వ్యాసులవారు సాక్షాత్తు శ్రీమన్నారాయణమూర్తి

అవతారము. ఆయన చేత విరచిత మైన భారతము అందరికీ పూజనీయము. అటువంటి భారతమును అధ్యయనము చేయడానికి సాక్షాత్తు ఆ ధర్మ స్వరూపు డైన మహావిష్ణువుకు తప్ప వేరొకరికి సాధ్యం కాదు. భారత కథలోని ధర్మములు చెప్పడం మా గురువుగారు వ్యాసునికే సాధ్యం అయింది." అనిపలికిన వైశంపాయనుని చూచి జనమేజయుడు "మహాత్మా! మహావిష్ణువు గుర్రపు తలతో కూడిన శరీరముతో (హయగ్రీవ రూపముతో) బ్రహ్మదేవుని వద్దకు వెళ్లాడు అని అన్నారు కదా. ఆ పురుషోత్తముడు అప్పుడు అలా ఎందుకు హయగ్రీవ అవతారము దాల్చవలసి వచ్చింది. వివరించండి." అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

" ప్రళయ కాలంలో జల ప్రళయంలో శ్రీ మహా విష్ణుడు యోగనిద్రలో ఉన్నాడు. ప్రళయము అంతరించిన తరువాత మేలుకొన్నాడు. మరలా ఈ విశ్వాన్ని సృష్టించడానికి సంకల్పించాడు. వెంటనే అహంకారము ఆవిర్భ వించింది. ఆ అహంకారమునకు బ్రహ్మ అని పేరు. విష్ణువు నాభి కమలంలో నుండి బ్రహ్మ ఉద్భవించాడు.

బ్రహ్మ ముందు వేదములను సృష్టించాడు. ప్రళయ కాలంలో లయమైనట్టి సత్త్వ, రజస్తమోగుణములలో మొట్ట మొదటిది అయిన సత్త్వగుణము మొదటగా పుట్టింది. బ్రహ్మ సత్త్వగుణ సంపన్నుడయ్యాడు. రజోగుణము, తమోగుణము రాక్షస గుణములు అయ్యాయి. ఆ రాక్షసులలో మధువు, కైటభుడు అనే ఇద్దరు రాక్షసులు ముఖ్యులు. వారు తొలుత ఆవిర్భవించిన వేదములనుతీసుకొని పోయి పాతాళంలో కట్టిపడేసారు.

సృష్టికి మూలం వేదములు. "నాకు బలము, దృష్టి, మార్గదర్శకములు వేదములే. అవి లేకపోతే నేను సృష్టి ఎలా చేస్తాను. ఈ ఆపద నుండి నన్ను

ఎవరు రక్షిస్తారు.” అని అనుకున్నాడు బ్రహ్మ. విష్ణుదేవుని ఎన్నో విధాలుగా స్తుతించాడు. జలములలో శయనించి ఉన్న మహా విష్ణువు గుర్రపు తలతో కూడిన పరమ అద్భుతమైన రూపంతో(హయగ్రీవుడుగా) వేదాలను వెదుకుతూ బయలుదేరాడు. ముందు పాతాళమునకు వెళ్లాడు. అక్కడ భయంకరంగా ప్రణవ నాదం చేసాడు. ఆ నాదం విన్న మధు కైటభులు ఆ ప్రణవ ధ్వని వచ్చిన వైపుకు పరుగు తీసారు. ఇంతలో హయగ్రీవ రూపంలో ఉన్న విష్ణువు వేదములకు కట్టిన బంధనములు ఊడదీసి వాటిని తీసుకొని వచ్చి బ్రహ్మదేవునికి ఇచ్చాడు. మరలా తన స్వస్వరూపంతో జలములలో శయనించాడు.

ప్రణవ ధ్వని వచ్చిన వైపుకు పరుగెత్తిన మధు కైటభులకు అక్కడ ఎవరూ కనపడలేదు. మరలా తాము వేదములను దాచిపెట్టిన చోటికి వచ్చారు. అక్కడ వేదములు కనపడలేదు. వారికి కోపం వచ్చింది. నానా రభస చేస్తూ అటూ ఇటూ తిరిగారు. వేదముల కోసం వెతికారు. వారికి విష్ణుమూర్తి కనపడ్డాడు. మధుకైటభులు విష్ణుమూర్తిని యుద్ధమునకు ఆహ్వానించారు. మహా విష్ణువు యుద్ధోన్మాదులైన మధు కైటభులను సంహరించాడు. ఆ ప్రకారంగా సృ ష్టికార్యము నిర్విఘ్నంగా జరిగేట్టు చూచాడు. బ్రహ్మ యధావిధిగా సృష్టిచెయ్యడం ప్రారంభించాడు. అప్పటి నుండి హయగ్రీవుడైన విష్ణువు అన్ని రూపములకంటే గొప్పవాడయ్యాడు. హయగ్రీవ రూపంలో వేదములను రక్షించాడు కాబట్టి వేదములు ఎల్లప్పుడు హయగ్రీవ రూపంలో ఉన్న మహావిష్ణువును ఆశ్రయించి ఉన్నాయి.

ఓ జనమేజయ మహారాజా! హరి, సత్త్వ,రజస్తమోగుణములలో హెచ్చు తగ్గులు కలిగిస్తూ ఉంటాడు. అందువలననే మానవులలో కూడా ఈ హెచ్చు తగ్గులు కనిపిస్తూ ఉంటాయి. ఒకడు గుణవంతు డైతే మరొకడు

గుణహీనుడు అవుతాడు. ఎందు కంటే మనలో గుణములను కల్పించేదీ, గుణములను నాశనం చేసేది ఆ శ్రీహరే. వేదములు, యజ్ఞములు, ఇతర పుణ్యకార్యములు, పంచభూతములు అన్నీ శ్రీమన్నారాయణుని స్వరూపాలే." అని చెప్పాడు వైశంపాయనుడు.

అప్పుడు జనమేజయుడు ఇలా అన్నాడు. "ఓ మహాత్మా! ఏకాగ్రచిత్తము కలవారు చాలా గొప్పవారు అని చెప్పారు కదా. అసలు ఏకాగ్రత అంటే ఏమిటి?" అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా చెప్పాడు.

"జనమేజయా! పూర్వము శ్రీ కృష్ణుడు మీ తాతగారు అర్జునునకు, మహాభారతయుద్ధ ప్రారంభంలో సాంఖ్యము, యోగము, వీటి సారమును గురించి బోధించారు. దానినే భగవద్గీత అంటారు. అది నేను ఎప్పుడో విన్నాను. దానిని నీకు ఇప్పుడు చెబుతున్నాను. శ్రద్ధగా విను.

ఈ ఏకాంతిక ధర్మమును పూర్వము నారాయణుడు బ్రహ్మకు ఉపదేశించాడు. బ్రహ్మదేవుడు దక్షప్రజాపతికి ఉపదేశించాడు. దక్షప్రజాపతి దానిని తన మనుమడైన సూర్యునికి ఉపదేశించాడు. దానిని సూర్యుడు మనువుకు చెప్పాడు. మనువు ఇక్ష్వాకునకు ఇచ్చాడు. ఇక్ష్వాకునుండి ఆ ఏకాంతిక ధర్మము యోగ్యులైన వారికి పరంపరగా అందజేయబడింది. ఈ ఏకాంతిక ధర్మాన్ని మహావిష్ణువునుండి గ్రహించిన నారదుడు దానిని తన శిష్యులకు ఉపదేశించాడు. వారి నుండి వారి శిష్యులకు అలా పరంపరగా సకల జనులకు చేరింది. ఈ ఏకాంతిక ధర్మము దుర్మార్గులకు మాత్రము గ్రహించడానికి వీలుపడలేదు.

ఈ ఏకాంతిక ధర్మమునకు అహింస మూలము. అహింసావ్రతముతో

శ్రీహరి ప్రీతి చెందుతాడు. హరి అన్నా క్షేత్రజ్ఞుడు అన్నా ఒకటే. కాని శ్రీ హరి తన భక్తులకు ఒకటి, రెండు, మూడు నాలుగు రూపములలో అనగా వాసు దేవుడు మొదలగు రూపములలో దర్శనం ఇస్తుంటాడు. ఈ నాలుగు రూపము లలో వాసుదేవుడు ప్రథముడు. రెండవ రూపము సంకర్షణుడు, మూడవ రూపము ప్రద్యుమ్నుడు, నాల్గవ రూపము అనిరుద్ధుడు. శ్రీ హరి ఇన్ని రూపములలో దర్శనం ఇచ్చినప్పటికినీ అదృశ్యరూపమైన దైవస్వరూపము ఒకటే. ఆ దైవస్వరూపము మన ఇంద్రియము లకు గోచరము కాదు. అనన్య భక్తి, తపస్సు, మనో నిగ్రహము, ఇంద్రియ నిగ్రహము కలవారికి మాత్రమే ఆ దైవస్వరూపము గోచరమవుతుంది. ఎల్లప్పుడూ శాంతి కోరుకొనే వాడికి ఈ ఏకాంతిక ధర్మము అరిచేతిలో ఉశిరిక కాయ వంటిది. మనలోని అన్ని రకములైన చింతలను తుంచి వేయడానికి ఈ ఏకాంతిక ధర్మమే ఆయుధము." అని చెప్పాడు వైశంపాయనుడు.

"ఓమహర్షీ! ఈ ఏకాంతిక ధర్మమును ఆచరించకుండా మానవులు ఏవేవో నోములు, వ్రతాలు ఆచరిసుంటారు. వాటి వలన ప్రయోజనం ఏముంటుంది. అసలు మానవులు ఇలా ఎందుకు చేస్తుంటారు? వివరించండి." అని అడిగాడు జనమేజయుడు.

"మహారాజా! ఇదివరకే చెప్పాను గదా. మన మనసు సత్త్వ, రజస్తమో గుణములతో ప్రభావితమౌతుంది. అందులో సాత్త్వికం ఉత్తమం. సాత్త్విక భావాలు కల వారి యోగక్షేమములు మహావిష్ణువే చూచుకుంటాడు. వారే ఏకాంతికులు. ఏకాగ్రచిత్తం కలవారు. వారికి దైవ చింతన తప్ప వేరే వ్యాపకం ఉండదు. ఇంక రాజసము, తామసము అవలంబించిన వారికి ఏకాంతికత, ఏకాగ్రత ఎలా అలవడుతుంది? రజస్తమోగుణములను ఆశ్రయించిన వారు ప్రాపంచిక విషయములలో, భోగలాలసతో నిమగ్నమై ఉంటారు. అలాంటి వారు

శ్రీహరి కృపకు పాత్రులు కారు. కాలేరు. ఏకాంతికులు, దైవమును ఏకాగ్ర చిత్తంతో సేవించేవారు, ఎల్లప్పుడు శ్రీహరి మనస్సులోనే ఉంటారు. వారికీ శ్రీహరికీ బేధమే లేదు. ఇదే విషయాన్ని వేదాలు కూడా చెబుతున్నాయి. మా గురువుగారు వ్యాసులవారు నాకు దయతో ఈ మార్గాన్ని ఉపదేశించారు. ఇది విని నేను పవిత్రుడ నయ్యాను. ఓ జనమేజయా! నీవు ఆచరించగలను అనుకుంటే, నీవు కూడా ఏకాంతికుడవై, ఏకాగ్రచిత్తంలో శ్రీ హరిని ధ్యానించు. శాశ్వతానందాన్ని పొందుతావు." అని అన్నాడు వైశంపాయనుడు.

" ఓ మహర్షీ! ఈ లోకంలో వేదములు, సాంఖ్యము, యోగము, పాశుపతము, పాంచరాత్రము, ఇంకా ఎన్నో ఎన్నెన్నో బోధన సాధనాలు (బోధించే మార్గాలు) ఉన్నాయి కదా! వీటిని అన్నిటినీ అభ్యసించడానికి నిష్ఠ ఒకటేనా లేక వేరు వేరు నిష్ఠలు ఉన్నాయా! అసలు వీటిని ఉపదేశించినది ఎవరు?" అని అడిగాడు జనమేజయుడు. వైశంపాయనుడు ఈ ప్రకారంగా చెప్పసాగాడు.

" ఓ జనమేజయ మహారాజా! వేదములకు, సాంఖ్యమునకు, యోగమునకు, ఇతర శాస్త్రములకు మూల కర్త ఆ శ్రీమన్నారాయణుడే. ఆ శ్రీమన్నారాయణుని చేరుకోడానికి ఇవన్నీ మార్గాలు. ఇంక వేదములను ఉపదేశించిన వాడు, ఆ శ్రీమన్నారాయణుని పుత్రుడైన వ్యాసుడు. సాంఖ్యమును ఉపదేశించిన వాడు కపిలుడు. యోగమును ఉపదేశించిన వాడు హిరణ్యగర్భుడు. పాశుపతము ఉపదేశించిన వాడు శివుడు. పాంచరాత్రము ఉపదేశించిన వాడు విష్ణువు. పాంచరాత్రమును వైష్ణవము అని కూడా అంటారు." అని చెప్పాడు వైశంపాయనుడు.

ఇప్పుడు జనమేజయునికి ఒక సందేహము కలిగింది.

“మహర్షీ! తమరు వ్యాసుడు పరాశరుని పుత్రుడు అన్నారు కదా. మరి మహావిష్ణువుకు కుమారుడు ఎలా అయ్యాడు?” అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

“మహాభారత రచన చేసి అలసి పోయిన వ్యాసుడు హిమాలయ పర్వత ప్రాంతములలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. వ్యాసుని శిష్యులు అందరూ వ్యాసునికి పరిచర్యలు చేస్తున్నారు. వ్యాసుడు తన శిష్యులకు వేదములను వాటి అర్థములను, భారతమును దాని అర్థములను వివరిస్తున్నాడు.

ఆ సమయంలో నేను మరి కొందరూ వ్యాసునికి పాదాభి వందనము చేసి “గురువు గారూ! తమరిని నారాయణుని నుండి పుట్టినవాడు అని అంటారు కదా. అది ఎలా సంభవించింది?” అని అడిగాము. అప్పుడు వ్యాసుడు మామీద కరుణతో మాతో ఇలా అన్నాడు.

“ఆది కాలములో ప్రజలను సృష్టిచేయ సంకల్పించిన నారాయణుడు మొదట తననాభి కమలములోనుండి బ్రహ్మను సృష్టించాడు. ఆ బ్రహ్మ సకల భూతకోటిని సృష్టించాడు. బ్రహ్మ ముఖము నుండి వేదములు పుట్టాయి. ఆ వేదములను అధ్యయనం చేయడం కోసరం శ్రీ మహావిష్ణువు అపాంతరతముడు అనే వాడిని తన మనసులో సంకల్పించి సృష్టించాడు. విష్ణు మానస పుత్రుడైన అపాంతరతముడు విష్ణుదేవుని పక్కన నిలబడి నా కర్తవ్యమేమి అని అడిగాడు. నీవు వేదములను ఏ కాగ్ర చిత్తంతో అధ్యయనము చెయ్యి. ఆ వేదములను వ్యాసము చెయ్యి (అనగా విభజించు)అని అన్నాడు విష్ణువు. అలాగే అన్నాడు అపాంతరతముడు.

అప్పటికి కలాగా పులగంగా ఉన్న వేదములను అపాంతరతముడు

సాకల్యంగా అధ్యయనము చేసి, వాటిని నాలుగు వేదములుగా విభజించాడు. దానికి ఆ విభుడు అనగా నారాయణుడు ప్రీతిచెంది అపాంతరతముడి మీద వాత్సల్యంతో "వేదవ్యాసుడా! (వేదములను వ్యాసము చేసిన వాడా) ఇలారా! నీవు నా కుమారుడవు. నీవు అన్ని మన్వంతరములలో కూడా ఉంటావు. నీవు వేదవ్యాసునిగా అనేక జన్మలు ఎత్తుతావు. నీకు త్రికాలజ్ఞత్వము(జరిగినది, జరుగుతున్నది, జరగబోవునది తెలుసుకొనే శక్తి) ప్రసాదిస్తున్నాను. నీకు నా కథలూ, అన్నిధర్మములు, ఈ లోకములో చేయవలసిన పనులు అన్నీ గోచరిస్తాయి. నీవు రాబోవు కాలములో పరాశర మహాముని కుమారునిగా జన్మిస్తావు. నీకు పుట్టిన కుమారులే(ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు) కురు సామ్రాజ్యాన్ని పరిపాలిస్తారు. వారు, వారి కుమారులు రాజ్య కాంక్షతో ఒకరితో ఒకరు కలహించుకొని యుద్ధములు చేసుకొని సర్వనాశనం అవుతారు.

ఓ అపాంతరతమా! కాలక్రమేణా మరలా వేదములు అన్నీ ఒకదానితో ఒకటి కలిసిపోతాయి. వాటిని మరలా నీవే విభజించాలి. ఈ లోకములో కలిగే అన్ని ధర్మసందేహములను నీవే తీర్చాలి. నీవు సాంఖ్యమును యోగమును అభ్యసిస్తావు. నీవు అందరి చేతా పూజింపబడతావు. ఇన్ని చేసినా కుమారా! నీకు వైరాగ్యము సిద్ధించదు. నీవు విరాగివి కాలేవు కాని నీకు విరాగి అయిన కుమారుడు కలుగుతాడు. అతనికి వైరాగ్యము సిద్ధిస్తుంది. ఇంక నీ ఇష్టం వచ్చినట్టు వెళ్లు." అని పలికి విష్ణుమూర్తి అంతర్ధానము అయ్యాడు. నాకు త్రికాలజ్ఞత్వము సిద్ధించినది కనుక నాకు అన్ని జన్మలలో జరిగిన విషయములు అన్నీ తెలుసు. ఆ ప్రకారంగా నేను నారాయణుని మానసపుత్రుడను. నేను ప్రతి జన్మలో అత్యంత నిష్ఠతో నారాయణుని గూర్చి తపస్సుచేసి ఆయన కరుణకు దయకు పాత్రుడనయ్యాను." అని నా గురువు వ్యాసుడు తన పూర్వజన్మ వృత్తాంతమును నాకు వివరించాడు అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడు.

వైశంపాయనుడు జనమేజయునితో ఇంకా చెబుతూ "జనమేజయా! ఈ ప్రకారంగా నారాయణ నారద సంవాద కథను నారదుడు బదరికాశ్రమమునకు వచ్చి, నరనారాయణులను కలుసుకోవడం శ్వేతద్వీపవిశేషములను వివరించడం, నారదుడు నరనారాయణుల అనుమతితో బదరికావనములో ఉండటం, తపస్సు చేయడం, మరలా హిమవత్పర్వత మునకు పోయి అక్కడ తపస్సు చేసుకోవడం, హయగ్రీవుని వృత్తాంతమూ, అన్నీ నాకు మా గురువుగారు చెబుతూ ఉండగా శ్రీకృష్ణుడు, ధర్మరాజాదులు కూడా విన్నారు. తన నామముల గురించి అర్జునుడు అడుగగా, శ్రీకృష్ణుడు అర్జునునికి వివరించాడు. వేదములు, సాంఖ్యము, యోగము, పాశుపతము, పాంచరాత్రము, ఏకాంతిక ధర్మము వాటి గురించి మా గురువుగారు వివరించారు. వాటిని ధర్మరాజాదులు విన్నారు. ఇప్పుడు నీవు అడిగావు కాబట్టి నేను ఆ విషయములన్నీ నీకు చెప్పాను. ఈ లోకంలో ఏకాంతిక ధర్మమును మించిన ధర్మము మరొకటి లేదు." అని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పాడు అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

"పితామహా! నీవు అన్ని ధర్మములు నాకు వివరించావు. కాని ఈ ధర్మములు అన్నింటిలోనూ ఉత్కృష్టోత్తమమైన ధర్మము ఏది నాకు తెలియ చెయ్యండి." అని అడిగాడు.

" ఓ ధర్మనందనా! అన్ని ధర్మములు మంచివే. అందులో పనికి రానిది అంటూ ఏదీ లేదు. ఎవరికి ఏది నచ్చితే దానిని వారు ఆచరిస్తారు. ఆ ధర్మము వారికి తగిన ఫలితాన్ని ఇస్తుంది. ఈలోకంలో తమకు నచ్చిన ధర్మములను ఆచరించే వారిని మనము ఎంత మందిని చూడటం లేదు.

అది అటుండగా, ఒకసారి నారదుడు లోక సంచారం చేస్తూ దేవేంద్రుని దగ్గరకు వెళ్లాడు. దేవేంద్రుడు నారదమునిని ఆహ్వానించి తగురీతిని సత్కరించి ఉచితాసనము మీద ఆసీనుడిని చేసాడు. "ఓ నారద మునీంద్రా! నీవు అన్ని లోకములూ సంచరిస్తుంటావు కదా! నీకు ఏదైనా అత్యంత ఆశ్చర్యకరమైన విషయము కనపడినదా?" అని అడిగాడు దేవేంద్రుడు. అప్పుడు నారదుడు దేవేంద్రునికి ఒక కథ చెప్పాడు. ఆ కథే నీ ప్రశ్నకు సమాధానము.

" గంగానదికి దక్షిణ తీరంలో మహాపద్మము అనే నగరము కలదు. ఆ నగరంలో భృగుడు అనే బ్రాహ్మణోత్తముడు నివసిస్తున్నాడు. ఆ బ్రాహ్మణుడు ధర్మపరుడు. నిత్యసత్యవ్రతుడు. అహింసా వాది. ఇంద్రియ నిగ్రహము కలవాడు. తనకు ఉన్నదాని తో తృప్తి చెందేవాడు. కోపం అసలే ఎరుగని వాడు. తాను న్యాయంగా సంపాదించిన ధనముతో దేవ కార్యములు, పితృకార్యములు, అతిధి సత్కారములు చేసేవాడు. అతనికి తగ్గట్టు అతనికి వినయ సంపన్నులు అయిన కుమారులు కలిగారు. కాని అతని మనస్సులో ఒక విషయం ఎప్పుడూ మెదులుతూ ఉండేది. "ఏ యే పనులు చేస్తే మేలు కలుగుతుంది. ఏవి ధర్మ కార్యములు." వీటి గురించి ఎప్పుడూ చింతిస్తూ ఉండేవాడు.

అలా ఉండగా ఒక రోజు ఆ బ్రాహ్మణుని ఇంటికి మరొక బ్రాహ్మణుడు అతిధిగా వచ్చాడు. భృగుడు ఆ బ్రాహ్మణునికి అతిధి సత్కార ములు చేసాడు. అతనితో ఇలా అన్నాడు. "అనఘా! నేను తమరి వద్దనుండి ఉపదేశమును కోరుతున్నాను. నేను ప్రతిరోజూ ఆత్మ దర్శనం చెయ్యడానికి అత్యంత నిష్ఠతో ప్రయత్నం చేస్తాను. కాని నేను ఈ ప్రాపంచిక విషయములలో నిమగ్నుడను కావడం వల్ల నాకు ఆత్మ దర్శనం సాధ్యం కావడం లేదు. నేను ఆత్మ దర్శనం ఎలా పొందాలో ఉపాయం చెప్పండి." అని అడిగాడు.

దానికి  ఆ బ్రాహ్మణుడు ఇలా బదులు చెప్పాడు.

"ఓ భృగూ! నేను కూడా నీ మాదిరే ఆత్మదర్శనం పొందడానికి ప్రయత్నం చేసి, ప్రాపంచిక విషయముల మోహంలో చిక్కుకొనడం వల్ల, పొందలేక పోయాను. నాకూ సరి అయిన దారి దొరకడం లేదు. కొంత మంది బ్రహ్మ చర్యము అవలంబించడం వల్ల, కొందరు గృహస్థాశ్రమంలో ఉండి కూడా, మరి కొందరు తపస్సు చేసి, మరి కొందరు యజ్ఞ యాగములు చేసి, ఇంకా కొందరు నిష్కామ కర్మలు చేసి ఆత్మదర్శనము పొందెదరని విన్నాను.  ఇంకా కొంతమంది తల్లితండ్రులను భక్తితో సేవించి, మరి కొందరు భగవంతుని మీద అత్యంత భక్తితోనూ, మరి కొందరు మంచి నడవడితోనూ, మంచి ప్రవర్తనతోనూ, ఇంకా కొందరు ఇంద్రియములను నిగ్రహించి శాంతి యుతంగా జీవనం గడపుతూ, మరి కొందరు సత్యమును అహింసను పాటించి, ఆత్మ సందర్శనము పొందుతారు. కాబట్టి ఆత్మదర్శనమునకు అనేక ధర్మ మార్గములు కలవు. కాని అది అంతసులభం కాదు.

నైమిశారణ్యంలో గోమతి అనే నది ప్రవహిస్తూ ఉంది. అక్కడనే మహాపద్మమనే ఒక మడుగు కూడా ఉంది. ఆ తటాకం ఒడ్డున ఒక సర్పము నివసిస్తూ ఉంది. ఆ మహాపద్మ తటాకము తీరంలోనే పూర్వము మాంధాత తపస్సు, యజ్ఞములు చేసాడని అంటారు. ఆ నాగ రాజు(సర్పము) పేరు పద్మడు. అతడు గొప్ప ధర్మాత్ముడు. ఎంతో దయగలవాడు. అతనికి అతిధులంటే ఎంతో ప్రేమ. నీవు వెళ్లి ఆ నాగరాజును దర్శించు. నీ సందేహము అతను తీరుస్తాడు." అని చెప్పాడు ఆ బ్రాహ్మణుడు.  ఆ మాటలకు భృగుడు సంతోషించాడు. బంధుమిత్రుల అనుమతి తీసుకొని భృగుడు నైమిశా రణ్యమునకు వెళ్లాడు. నాగేంద్రుడు ఉన్న చోటికి వెళ్లాడు.

నాగేంద్రుడి భార్య భృగువును భక్తితో పూజించింది. అతిథి సత్కారములు చేసింది. "మహానుభావా! తమరు ఇక్కడకు వచ్చిన పని ఏమిటో" అని అడిగింది.

"అమ్మా నేను నీ భర్తను కలుసుకోవాలని వచ్చాను. నీ భర్త ఎక్కడ ఉన్నాడు? " అని అడిగాడు భృగు.

"నా భర్త నెలకు ఒక సారి సూర్యుని రథమునకు పగ్గముగా ఉంటాడు. ఈ నెల నా భర్త వంతు. అందుకని సూర్యుని వద్దకు వెళ్లాడు. ఇంకొక ఎనిమిది దినముల తరువాత వస్తాడు. మీరు వచ్చిన పని తెలిపితే నేను ఆ పని చేస్తాను." అని చెప్పింది నాగరాజు భార్య.

"అమ్మా! నాకు వేరు పని ఏమీ లేదు. నీ భర్తను కలిసిపోదామని వచ్చాను. నీ భర్త వచ్చువరకూ ఆ వనములో ఉంటాను. నీ భర్త రాగానే నేను వచ్చానని చెప్పండి." అని అన్నాడు భృగు.

అలా ఆరు రోజులు గడిచాయి. ఆ ఆరురోజులు భృగు ఎటువంటి ఆహారమూ తీసుకొనలేదు. నాగరాజు భార్య, పిల్లలు, బంధువులు వచ్చి "అయ్యా మీరు ఆరు రోజులనుండి ఎలాంటి ఆహారము తీసుకొనలేదు. మాకు అన్నిటి కన్నా అతిథి పూజ ముఖ్యము. తమరు అన్యథా భావింపక మా ఆతిథ్యము స్వీకరించండి. మేము అన్నము, ఫలములు, కందమూలములు తీసుకొని వచ్చాము. వీటిలో వేటినైనా తమరు స్వీకరించండి." అని ప్రార్థించారు.

"అయ్యో! మీరు ఇంతగా చెప్పవలెనా! నేను నాగరాజు దర్శనము కోసరం వచ్చాను. ఆయనను కలిసే వరకూ నేను ఎటువంటి ఆహారము తీసుకోను.

నీళ్లు తాగను. నాకు ఆకలి, దాహము తీర్చుకోవాలనే కోరికా లేదు. దయచేసి నా నియమాన్ని మన్నించండి. నాకు అతిధి సత్కారములు చేయలేదని మీకు ఎటువంటి మాట రానివ్వను. నాగరాజు ఎనిమిది రోజులలో వస్తాడని చెప్పారు. ఇప్పటికి ఆరు రోజులు అయింది. నాగరాజు రావడానికి ఇంకా రెండురోజులు ఉంది. ఈ రెండు రోజులు నేను ఎలాంటి ఆహారం తీసుకోను. ఎనిమిదవ రోజున నాగ రాజు రావాలి. ఆయన రాకపోతే నేను మీరు ఇచ్చిన ఆతిథ్యం స్వీకరిస్తాను." అని అన్నాడు భృగుడు.

వారందరూ దానికి సమ్మతించి ఎవరి గృహములకు వారు వెళ్లారు. సరిగా ఎనిమదవ రోజున నాగరాజు సూర్యుని వద్ద అనుమతి పొంది తన గృహమునకు వచ్చాడు. నాగరాజు భార్య భర్తకు ఎదురేగి ఆయనను ఆదరంతో లోపలకు తీసుకొని వచ్చింది.

నాగరాజు భార్యతో ఇలా అన్నాడు. "అతివా! అందరూ క్షేమంగా ఉన్నారు కదా! దేవతా పూజలు, అతిధి మర్యాదలు చక్కగా సాగుతున్నాయి కదా! ఇంట్లో నేను లేనందువల్ల ఏమయినా ఎవరికన్నా పొరపాట్లు జరిగాయా?" అని అడిగాడు.

దానికి ఆయన భార్య ఇలా బదులు చెప్పింది. " నాధా! నాకు ఆ మాత్రం తెలియదా. మీరు నాకు ఇచ్చిన శిక్షణ తో అన్ని సక్రమంగా నెరవేరుస్తున్నాను. నాకు తోచినట్టు సమస్త దేవతారాధనలు, అతిధి పూజలు సక్రమంగా నెరవేరుస్తున్నాను. నాధా! శిష్యులకు గురువు ఎడల భక్తి; బ్రాహ్మణులకు వేదముల ఎడల భక్తి; క్షత్రియులకు జనులను రక్షించడంలో ఉన్న భక్తి; వైశ్యులకు న్యాయంగా ధనం సంపాదించడం లో ఉన్న భక్తి; శూద్రులకు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను సేవించడంలో ఉన్న భక్తి; యజమాని ఎడల

సేవకులకు భక్తి; సర్వులకు ఉపకారం  చేసే గృహస్థాశ్రమము మీద అందరికీ ఉన్న భక్తి;  ఏకాంతంలో కూర్చుని తపస్సుచేసుకోడంలో యోగులకు ఉన్న భక్తి, పతి ఎడల భార్యకు ఉన్న భక్తి-- ఇవన్నీ ప్రతి వారూ ఆచరించ తగ్గ సువ్రతములు అనగా మంచి వ్రతములు. ఎన్నో ధర్మ సూక్ష్మములు తెలిసిన వారైన మీకు భార్యగా ఉండి మీ మనసుకు ఇష్టలేని పని చేస్తానా!

అయినను నాది ఒక మనవి. పరమ పావనుడైన ఒక బ్రాహ్మణుడు మన ఇంటికి వచ్చాడు. తమరి దర్శనం కావాలి అని అడిగాడు. ఏమి పని మీద వచ్చారు అని నేను అడిగాను. నాకు ఏమీ చెప్పలేదు. మీరు సూర్యలోకమునకు వెళ్లిన సంగతి చెప్పాను. మీరు వచ్చువరకు పక్కనే ఉన్న వనంలో  వేచి ఉంటాను అని అన్నాడు. ఈ ఎనిమిది రోజులు ఆ విప్రుడు జపం చేసుకుంటూ నిరాహారంగా ఉన్నాడు. అన్న పానీయములు ముట్టలేదు. మీరు వెంటనే ఆయన దగ్గరకు పోయి ఆయనను పరామర్శించండి.” అని చెప్పింది భార్య.

“ ఓ లలనా! నేనేమిటి  ఇంకొకరి దగ్గరకు వెళ్లి పరామర్శించడం ఏమిటి! దేవతలు, అసురులు, మొదలగు వారు నన్ను ఏ విధంగా గౌరవిస్తారో నీకు తెలియదా! అలాంటి నన్ను ఒక సామాన్య బ్రాహ్మణుని దర్శనానికి వెళ్ల మంటావా!” అని అన్నాడు నాగరాజు.

“ నాథా! అలాకాదు. ఆ బ్రాహ్మణుడు మీకోసం వచ్చాడు. మీ రాక కోసం ఎనిమిది నాళ్లనుండి ఎదురుచూస్తున్నాడు. అతని కోరిక తీర్చకపోవడం  నీ వంటి ధర్మవేత్తకు ధర్మమా! ఆ బ్రాహ్మణుని ఆశ నిరాశపరచినందు వల్ల కలిగే పాపంలో,    నీవు ఇప్పటిదాకా సంపాదించిన పుణ్యము,  ఉచితానుచిత జ్ఞానము, కృపాగుణము, ధర్మశాస్త్రములలో పాండిత్యము, దగ్ధం చేస్తావా! ఇదేనా నీ ధర్మనిరతి!  నాథా! ఒక బ్రాహ్మణుని ఆశ నిరాశ పరచినందువల్ల బ్రహ్మ

హత్యా పాతకము చుట్టుకుంటుంది. ధర్మనిరతుడైన నీవంటి పురుషునకు ఒక బ్రాహ్మణుని కోరిక తీర్చడం ధర్మం కాదా! నాథా! మౌనవ్రతంతో ధృఢమైన జ్ఞానము, దానం చేసినందువలన అభ్యుదయము, ఎదుటి వారి ఆశలు సఫలం చేసినందువలన నరక బాధలు తొలగిపోయి, స్వర్గ సుఖాలు కలుగుతాయి అని పెద్దలు చెబుతారు కదా! వర్షం కోసం ఎదురు చూచే చాతక పక్షిలాగా ఆ బ్రాహ్మణుడు ఆ వనంలో నీ రాక కోసం ఎదురుచూస్తున్నాడు. నీలో ఉన్న రోషమును తగ్గించుకొని, ఆ బ్రాహ్మణుని పరామర్శించు." అని నాగరాజు భార్య అతనికి హితబోధ చేసింది.

అప్పుడు ఆ నాగరాజు భార్య మొహం చూచి ఇలా అన్నాడు. "ఓ తరుణీ! ఎవరో పరాయి వాడిని చూచి రమ్మని చెప్పడంతో నాకు కొంచెం రోషం వచ్చినమాట నిజమే! నాలో పుట్టిన గర్వమును, కోపమును అణిచే ధర్మములు నాకు బోధించావు. నేను అధర్మవర్తనుడు కాకుండా కాపాడావు. పూర్వము ~~ఈ~~ గర్వము, కోపము, చేతనే కదా కార్తవీర్యార్జునుడు, రావణాసురుడు, వరుసగా పరశు రాముని చేతిలో, రఘురాముని చేతిలో మరణించారు. కాబట్టి కోపమును వదిలిపెట్టడం ఎంతో మేలు కదా! నీ వంటి భార్య ఉండ వలన కదా నాకు ఇంతటి అపాయము తప్పినది. లేని ఎడల నేను పాపకూపములో పడిపోయి నాశనం అయి ఉండేవాడిని కదా! ఇదుగో ఇప్పుడే ఆ బ్రాహ్మణుని చూడడానికి వెళుతున్నాను." అని చెప్పి నాగరాజు వడి వడిగా భృగు వద్దకు వెళ్లాడు.

నాగరాజును చూచిన భృగువు సంభ్రమంతో అతనికి ఎదురు వెళ్లాడు. ఇద్దరూ ఒకరి క్షేమములు ఒకరు తెలుసుకున్న తరువాత ఒక చెట్టు కింద కూర్చున్నారు. అప్పుడు నాగరాజు భృగు తో ఇలా అన్నాడు.

"మహాత్మా! తమరు నా కోసరము ఎనిమిది దినముల నుండి నిరాహార

దీక్షతో వేచి ఉన్నారట. కారణమేమి? మీ కోరిక ఏదైనా సరే తక్షణం తీరుస్తాను." అని అన్నాడు.

" ఓ నాగరాజా! నా స్వజనుల వలన నీ గురించి విన్నాను. నిన్ను చూడ టానికి వచ్చాను. నీవు సూర్యలోకమునకు సూర్యభగవానుని సేవించుటకు వెళ్లావని నీ భార్యవలన విన్నాను. అందుకని నీ కోసము ఎదురు చూస్తు న్నాను. నా మనసులో ఉన్న సందేహములను మీరు తీర్చాలి!" అని అన్నాడు.

"మీ వంటి వారి సందేహము తీర్చడం కన్నా నాకు కావలసినది ఏమున్నది. మీ వంటి వారి సందేహము తీర్చినప్పుడే కదా నా జన్మకు ధన్యత చేకూరుతుంది." అని అన్నాడు నాగరాజు.

"ఓ నాగరాజా! నా సందేహముల సంగతి అటుంచండి. అవి తర్వాత తీర్చుదురు. మీరు సూర్యరథము వెంట పోవునపుడు జరిగిన అద్భుతముల గురించి తెలియచేయండి." అని అడిగాడు. దానికి ఆ సర్పరాజు ఇలా చెప్పాడు.

"ఓ బ్రాహ్మణోత్తమా! ఆశ్చర్యములలో కెల్లా ఆశ్చర్యము ఆదిత్యుడు. అతని వలననే కదా ఈ సృష్టిలోని జీవజాలము అంతా చైతన్యంతో జీవిస్తున్నది. సూర్యకిరణముల ప్రభావము చేతనే కదా దేవతలు, వాలఖిల్యుడు మొదలగు మహామునులు, సిద్ధులు, అనేకానేక పక్షిజాతులు, హాయిగా నివసిస్తున్నాయి. ఆ సూర్యుని లోనుండి వచ్చు వాయువుల వలననే కదా నీరు వేడెక్కి మేఘములుగా రూపొంది వర్షములు కురియుచున్నవి. ఇంతకన్నా అద్భుతములు కలవా! ఓ బ్రాహ్మణోత్తమా! సూర్యుడు వర్షములు కురిపిస్తాడు. మరలా తనకిరణముల వేడిచేత ఆ వర్షపు నీటినంతా ఆవిరిగా మార్చి తన వైపు లాక్కుంటాడు.

ఇంతకన్నా ఆశ్చర్యం వేరొకటి ఉన్నదా! ఆ సూర్యుని వలననే కదా బీజములు మొలకెత్తి, మహా వృక్షములుగా పెరుగుతున్నవి. ఇది అద్భుతము కాదా! ఇంత ఎందుకు! ఆ పరమాత్ముడు, నిరంజనుడు, అక్షరుడు, అజరుడు, అద్వయుడు,శాశ్వతుడు అగు పురుషోత్తముడు సూర్యునిలో ద్వారా కదా వెలుగుతున్నాడు. ఇంతకన్నా అరుదైన అద్భుతము వేరు ఉన్నదా!

ఒకరోజు మధ్యాహ్నం సమయంలో ఆకాశంలో ఒకడు ఎదురయ్యాడు. అతడు సూర్యుని తో సమానంగా వెలుగుతున్నాడు. అతనిని చూచి సూర్యుడు తన చేతిని అందించాడు. అతడు సూర్యుని చేతిని పట్టుకున్నాడు. క్రమ క్రమంగా అతడు సూర్యబింబములోనికి చొచ్చుకొని పోయాడు. ఇద్దరూ ఒకటయ్యారు. ఇప్పటి దాకా రథము మీద ఉన్న వాడు సూర్యుడా లేక బయటనుండి వచ్చిన వాడు సూర్యుడా అనే సందేహము రధము లాగుతున్న సర్పరాజులందరికి కలిగింది. నేను ధైర్యము చేసి ఇతను ఎవ్వరు అని మా ప్రభువు సూర్యభగవానుని అడిగాను. దానికి సూర్యుడు నా వంక ప్రేమగా చూచి ఇలా అన్నాడు.

“ ఈ వచ్చిన వాడు దేవతలు, యక్షుడు, గంధర్వుడు,నాగజాతి వాడు, ఎవరూ కాడు. ఇతడు ఒక పేద బ్రాహ్మణుడు. ఉంఛ వృత్తితో జీవిస్తుంటాడు. నియమ నిష్ఠలతో జీవితం గడుపుతున్నాడు. ఫలములు, కందమూలములు, నీరు మాత్రమే తాగి జీవిస్తుంటాడు. ఎలాంటి కోరికలు లేని వాడు. తనకు ప్రాప్తము లేని దానికి అర్రులు చాచేవాడు కాడు. సర్వభూతముల హితము కోరేవాడు. అందుకే అతడు సిద్ధిపొందాడు. సూర్యలోకము ప్రవేశించాడు.” అని చెప్పాడు సూర్యుడు. ఓ బ్రాహ్మణోత్తమా! ఇలాంటి అద్భుతాలు నేను ఎన్నో చూచాను.” అని చెప్పాడు నాగరాజు.

ఆ మాటలు విన్న భృగు నాగరాజుతో ఇలా అన్నాడు. "ఓ మహాత్మా! నీ మాటలతో నా సందేహములు అన్నీ తీరిపోయాయి. ఇంక నేను వెళ్లి వస్తాను." అని అన్నాడు.

"అదేమిటి బ్రాహ్మణోత్తమా! ఎంతో కష్టపడి ఇంతదూరం వచ్చావు. నీవు వచ్చిన పని చెప్పనేలేదు. నీ కోరిక ఏమిటి అడుగు. నేను తీరుస్తాను. ఎందుకంటే నాయందు నీవు, నీయందు నేను ఉన్నాము. మన ఇద్దరిలోనే ఈ ప్రపంచమంతా ఉంది. నిశ్చింతగా ఉండండి." అని అన్నాడు నాగరాజు.

"ఓ నాగరాజా! నీవు చెప్పినది నిజమే! నీవు, నేను, ఈ సమస్త జీవరాసులూ అంతా ఒకటే.  ఎలాంటి బేధము లేదు. నేను ఏమి తెలుసు కొనడానికి  వచ్చానో అది నాకు అవగతమయింది. నాకు ఆత్మ దర్శనము అయింది.  అందరినీ సమదృష్టితో చూడటం ఒక వ్రతంగా పెట్టుకుంటాను. ఇంక నాకు సెలవు ఇప్పించండి." అని పలికాడు భృగు. తరువాత భృగు అక్కడి నుండి చ్యవన మహర్షి దగ్గరకు వెళ్లాడు.

ఈ కథను పూర్వము భార్గవుడు నారదుడికి చెప్పాడు. నారదుడు ఇంద్రుడికి చెప్పాడు. ఇంద్రుడు వసువులకు చెప్పాడు. వసువులు నాకు చెప్పారు. నేను నీకు చెప్పాను." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు. అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడు.

మహాభారతము

శాంతి పర్వము షష్ఠాశ్వాసము సంపూర్ణం.

శాంతి పర్వము సర్వము సంపూర్ణం.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓంతత్సత్.

# మహాభారతము

## ఆనుశాసనిక పర్వము

### ప్రధమాశ్వాసము.

ధర్మరాజు భీష్మునితో ఇలా అన్నాడు. పితామహా!మీరు నాకు ఎన్నో ధర్మములు ఉపదేశించారు.కాని నా మనస్సుకు కొంచెంకూడా శాంతి కలగలేదు. పట్టుబట్టి ఎంతోమంది బంధువులను యుద్ధంలో చంపాను. నిన్ను అతి దారుణంగా శరతల్పగతుని చేయించాను. ఇంతచేసిన నాకు మనశ్శాంతి ఎలా కలుగుతుంది. పితామహా! నేను సుయోధనుని ఎన్నోవిధాలుగా బతిమాలాను. ఉన్న రాజ్యము చెరి సగం పంచుకొని పాలించుకుందాము అని. కాని సుయోధనుడు ససేమిరా వినలేదు. నేను మాత్రం ఏం చేసాను. పోనీలే చిన్నవాడు, అతనినే రాజ్యం అనుభవించనిద్దాం, అని అనుకున్నానా! లేదు. కోపంతో రగిలిపోయాను. పట్టుదలకు పోయి యుద్ధం చేసాను. ఫలితం-- సర్వనాశనం అయింది. ఈ నాడు పశ్చాత్తాప పడి ఏం ప్రయోజనం. ఏడవడం తప్ప. ఇంత చేసిన నాకు మనశ్శాంతి ఎలా కలుగుతుంది పితామహా!" అని బాధపడ్డాడు ధర్మనందనుడు.

"నాయనా ధర్మరాజా! చింతించకుము. అంతా విధిలిఖితము. దానిని ఎవరూ తప్పించలేరు. మనం మానవులము. దేనికీ కర్తలం కాము. మన చేతిలో ఏమీ లేదు. దీనికి ఒక కథ చెబుతాను విను.

ఒక ఊరిలో గౌతమి అనే బ్రాహ్మణ వనిత ఉండేది. అమెకు ఒక కొడుకు ఉన్నాడు. ఒకరోజు ఆ కుర్రవాడిని ఒక పాము కరిచింది. అతడు చనిపోయాడు. చనిపోయిన కొడుకు కోసం ఆమె దుఃఖిస్తూ ఉంది. ఇంతలో ఒక బోయవాడు

ఆ కుర్రవాడిని కరిచిన పామును పట్టి తెచ్చాడు.

“అమ్మా ఇదిగో! నీ కొడుకును కరిచిన పాము. ఇది విషప్పురుగు. దీనిని ఏం చెయ్యమంటావో చెప్పు. తల పగులగొట్టి చంపమంటావా! లేక రెండుగా చీల్చి చంపమంటావా. నీవు ఎలా చెబితే అలా చంపుతాను!” అని కోపంతో అన్నాడు.

“అన్నా! ఈ పామును విడిచి పెట్టు.” అని ఆ బ్రాహ్మణ వనిత చెప్పింది.

“అది కాదమ్మా! ఇది నీ కొడుకు ప్రాణాలు తీసిందమ్మా!” అన్నాడు ఆ బోయవాడు.

“అన్నా! విధివశాత్తు నాకు ఈ ఆపద వచ్చింది. నా కొడుకు చనిపోయాడు. దానికి ఏడవడం, దానికి కారకులైన వారిని చంపడం అధములు చేసే పని. ధర్మపరులు, ఉత్తములు అలాంటి పని చెయ్యరు. జరిగిన ఆపదను వెంటనే మరిచిపోతారు. అన్నా! నీవు ఆ పామును చంపితే నా కొడుకు బతుకుతాడా! కాబట్టి ఈ పామును విడిచిపెట్టు.” అని చెప్పింది.

“అమ్మా! నీ మాటలు నా లాంటి వాడికి అర్థం కావు. చంపిన వాడిని చంపడమే నాకు తెలిసిన ధర్మం. కాబట్టి నేను ఈ పామును చంపుతాను.” అని అన్నాడు.

“అన్నా నీ పేరు అర్జునకుడు. అంటే తెల్లని వాడివి. స్వచ్ఛమైన వాడివి. అమాయకుడివి. నీ వంటివాడు ఇలా క్రూరంగా ప్రవర్తించవచ్చునా! అయినా నేను హింసకు ఎలా అంగీకరిస్తాను.” అని అన్నది.

“అమ్మా! నా మాటవిను. జనులను బాధించే జంతువులను చంపడం మానవధర్మము. దాని వలన పాపం రాదు.” అని అన్నాడు ఆ బోయవాడు.

“తాను బంధించిన వాడు తనకు శత్రువైనా, వాడిని చంపడం ధర్మవిరద్ధం కదా!” అన్నది ఆమె.

“అమ్మా! ఈ పామును చంపి ఈ పాము మిగిలిన జనములను కరిచి చంపకుండా చెయ్యడం ధర్మం కాదా!  అమ్మా! వృత్రాసురుని దేవేంద్రుడు చంపలేదా! మహా శివుడు దక్షయజ్ఞం ధ్వంసం చెయ్యలేదా! అవన్నీ ధర్మములు అయినప్పుడు ఇది మాత్రం ఎందుకు ధర్మం కాదు? కాబట్టి ఈ పామును చంపడానికి అంగీకరించు.” అని పలికాడు ఆ బోయవాడు.

వీళ్ల సంభాషణ అంతా మౌనంగా వింటున్న ఆ పాము ఆ బోయవానితో ఇలా అన్నది.

“అన్నా! ఇందులో నా తప్పు ఏమీ లేదు. మృత్యుదేవత నన్ను ఆదేశించింది. నేను ఆ బాలుని కరిచాను. అతను చనిపోయాడు. నాకు ఆ కుర్రవాడి మీద కోపం కానీ ద్వేషం కానీ లేదు.” అని పలికింది ఆ పాము.

“ మరీ మంచిది. నీవు మృత్యుదేవత చేతిలో సాధనముగా ఉన్నావు. కాబట్టి నిన్ను చంపక తప్పదు.” అని అన్నాడు బోయవాడు.

“అయ్యా! కుమ్మరివాడు కుండ చెయ్యడానికి సారె (కుండలు చెయ్యడానికి ఉపయోగించే చక్రం) తిప్పుతాడు.  విధి వశాత్తు కుండ పగిలితే, సారె తిప్పిన కుమ్మరిదా తప్పు. తిరిగిన సారెదా తప్పు.  అయినా నాకు ఇతరులను చంపే

శక్తి ఎక్కడిది. నేను నరుల కంట పడితే నన్నే చంపేస్తారు కదా” అన్నది పాము.

“బాగా చెప్పావు సర్పమా! ఎవడైనా  మరొకడి మీద బాణం వేస్తే, ఎదుటి వాడు,  వేసిన వాడిది తప్పా, బాణం తప్పా అని ఆలోచిస్తూ  ఊరుకుంటాడా! వేగంగా వస్తున్న  ఆ బాణాన్ని మధ్యలోనే మరొక బాణంతో విరగ్గొడతాడు కదా!  అది పాపం కాదు కదా!  అయినా ఎవరో పంపించారని వచ్చి ఈ బాలుని కరిచి చంపుతావా! నిన్ను నరికినా పాపం లేదు. నిన్నే కాదు. మృత్యుదేవత చేతిలో సాధనాలైన మీ పాముల నన్నింటినీ చంపాలి.” అని  అన్నాడు బోయవాడు.

ఆ మాటలకు పాము నవ్వి ఇలా అంది. “అన్నా! యజ్ఞములు యాగములు, యజమాని ఆజ్ఞ మేరకు పురోహితులు చేయిస్తారు. కాని యజ్ఞఫలితం యజమానికి చెందుతుంది. కాబట్టి ఈ బాలుని చంపిన పాపం మృత్యుదేవతది కానీ నాది కాదు.” అని అన్నది.

ఇంతలో మృత్యుదేవత అక్కడికి వచ్చింది.   ఆ పామును చూచి “ఓ సర్పరాజమా! నీవు ఏ పాపమూ చెయ్యలేదు. నేను నీ కు చెప్పినట్టే యముడు నాకు చెప్పాడు. యముని ఆజ్ఞ నేను పాటించాను. నా ఆజ్ఞ నువ్వు పాటించావు.  ఇందులో నీ తప్పు,  నా తప్పు ఏముంది. మనం ఇద్దరం  ఈ బాలుని చావుకు కారణం కాదు. పైగా  సూర్యుడు, చంద్రుడు, అగ్ని, ఆకాశము, జలము, గాలి ఈ ప్రకృతి అన్నీ ఆ యముని చేతిలో ఉన్నాయి. ఆయనే ఇవన్నీ చేస్తున్నాడు.  కాబట్టి ఇందులో నీ తప్పు ఏమీ లేదు. అలాగే యముడు చెప్పినట్టు చేసాను కాబట్టి ఇందులో నా తప్పూ లేదు.” అని పలికింది మృత్యుదేవత.

“అదికాదు. నువ్వు చెప్పినట్టు నేను చేస్తే అదేదో నా తప్పు అన్నట్టు నన్ను

చంపుతాను అంటున్నారు. అందుకే నీవు పంపావని చెప్పాను. అంతే. అయినా ఇది  యముని తప్పా లేక నీ తప్పా అని చెప్పడానికి నేను ఎవరిని. నాకు అంత శక్తి ఎక్కడిది.” అని పలికింది పాము.

తరువాత బోయవాడిని చూచి “అన్నా! మృత్యుదేవత మాటలు విన్నావు కదా! కాని నువ్వు నాదే తప్పు అంటున్నావు. ఈ తప్పు నాకు అంటగట్టడం ధర్మమా! నన్ను విడిచి పెట్టు.” అంది దీనంగా పాము.

దానికి బోయవాడు నవ్వాడు.  “నీవూ ఆ మృత్యువూ ఇద్దరూ పాపాత్ములు. మనుషుల ప్రాణాలు  తీసేవాళ్లు. మీరు ఏం చెప్పినా నా మనసు మారదు. అలా అని నేను మీకు భయపడను.” అని అన్నాడు ఆ బోయవాడు.

ఇంతలో యమధర్మరాజు అక్కడకు వచ్చాడు. “మీకు కలిగిన ధర్మసందేహమును పోగొట్టడానికి వచ్చాను. అసలు విషయం ఏమిటంటే ఈ కుర్రాడి చావుకు నేను గానీ, ఈ మృత్యు దేవత గానీ, పాము గానీ కారణం కాదు. ఇతడు చేసుకున్న కర్మల ఫలితమే ఇతని మృత్యువుకు కారణము. ఎందుకంటే, ఒక మనిషికి వాడు చేసుకున్న కర్మల ఫలితంగానే పుట్టుక, చావు, సుఖము, దుఃఖము కలుగుతూ ఉంటాయి. వాటిని ఎవరూ తప్పించలేరు. కర్మఫలం అనుభవించకుండా తప్పించుకోడం ఆ పరమశివునికైనా సాధ్యంకాదు. ఇంక ఈ కుర్రవాడెంత. కాబట్టి  ఈ బాలుని మరణం గురించి ఎవరి మీదా నిందలు వెయ్యకండి.” అని అన్నాడు యమధర్మరాజు.

తాను చెప్పిన మాటలే యమధర్మరాజు చెప్పడం విని ఆ బ్రాహ్మణ వనిత ఇలా అంది. “అన్నా! ఇది నా కర్మఫలం. నాకు పుత్రశోకం కలిగే రాత ఉంది. అందుకే అనుభవిస్తున్నాను. దీనికి ఎవరినీ నిందించి ప్రయోజనం లేదు. కాబట్టి

ఆ పామును వదిలిపెట్టు” అంది.

ఇందరి మాటలు విన్న కిరాతుడికి జ్ఞానోదయం అయింది. వాడు పామును విడిచిపెట్టాడు. కాబట్టి ధర్మనందనా! యుద్ధంలో నీ బంధువులు చనిపోవడానికి నీవు కారణం కాదు. వారి వారి కర్మఫలాలను బట్టి వారు మరణించారు. దానికి నీవు దుఃఖించడం వృధా!” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! మానవుడు ఈ సంసార బంధాలలో ఉండి కూడా మృత్యుభయమును పోగొట్టు కోగలడా! తెలియ చెయ్యండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! ధర్మం తప్పని వాడికి, ధర్మం పట్ల స్థిరమైన బుద్ధి కలవాడికి ఏదీ అసాధ్యం కాదు. ఈ సందర్భంలో నీకు ఒక కథ చెబుతాను విను.

పూర్వము మనువంశంలో దుర్యోధనుడు అనే రాజు ఉండేవాడు. అతనిని చూ చి నర్మదా నది మోహించింది. నర్మదా నది మానవ రూపం ధరించి అతనిని పెళ్లిచేసుకుంది. వారికి ఒక కుమార్తె కలిగింది. ఆమె చాలా అందంగా ఉంటుంది. తల్లిదండ్రులు ఆమెకు సుదర్శన అనే పేరుపెట్టి అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. ఆమె తండ్రి నిత్యాగ్నిహోత్రుడు. అందుకని తనకు అగ్ని గృ హంలో అగ్నిహోత్రము ఏర్పాట్లు కూతురిని చూడమన్నాడు. ఆమె కూడా అగ్ని కార్యములో తండ్రి సాయం చేస్తూ ఉంది.

ప్రతిరోజూ తన దగ్గరే తిరుగుతున్న ఆమెను, ఆమె అందాన్ని చూచి అగ్నిదేవుడు ఆమె ప్రేమలో పడ్డాడు. ఒకరోజుఅగ్ని దేవుడు ఆమెతో ఇలా అన్నాడు. “ఓ లలనా! నిన్నూ, నీ అందాన్నీ చూచి నేను నీ మోహంలో పడ్డాను. నేను నిన్ను పెండ్లి చేసుకుంటాను.” అని అన్నాడు.

దానికి ఆమె “దేవా! నేను కన్యను. అస్వంత్రను. నా వివాహ విషయం నా తల్లితండ్రులను అడగండి.” అని చెప్పింది.

సరే అన్నాడు అగ్నిదేవుడు.

ఇంతలో దుర్యోధనుడు ఒక యాగం చేయ తలపెట్టాడు. ఆ యాగంలో బ్రాహ్మణులకు దానాలు ఇస్తున్నాడు. అప్పుడు అగ్నిదేవుడు కూడా బ్రాహ్మణ వేషంలో వచ్చి కూర్చున్నాడు. దుర్యోధనుడు దానం ఇవ్వబోగా “నాకు నీ కుమార్తెను దానంగా ఇవ్వు.”అని అడిగాడు అగ్నిదేవుడు. దుర్యోధనుడు ఇలా అనుకున్నాడు. “అయ్యో! ఇదేమిటి. ఇతడు బ్రాహ్మణుడు. పైగా నిరుపేద. ఇతనికి నా కూతురిని ఎలా ఇవ్వను.” అని చింతించాడు. “బ్రాహ్మణోత్తమా! నీకు నా కుమార్తెను దానంగా ఇవ్వలేను.” అని చెప్పాడు.

అగ్నిదేవునికి కోపం వచ్చింది. యాగ సమయంలో తాను నిస్తేజు డయ్యాడు. (అంటే యాగ కుండంలోఅగ్ని వెలగలేదు. ఆరిపోయింది.) యాజ్ఞీకులు పురోహితులు ఎన్ని మంత్రాలు చదివినా అగ్నిని ఆవాహన చేసినా అగ్ని వెలగలేదు. ఇంతలో అగ్నిదేవుడు వచ్చి ఋత్విక్కులకు తన మనసులో కోరిక తెలియచేసాడు. వారు పోయి ఆ విషయం రాజుకు చెప్పారు.

“అయ్యో! అగ్ని దేవుడు ఈవిషయం నాతోనే చెప్పవచ్చుకదా!” అని అనుకున్నాడు. తన కుమార్తెను అగ్ని దేవునికి ఇచ్చి వైభవంగా పెళ్లిచేసాడు. తరువాత దుర్యోధనుడు యజ్ఞం పూర్తిచేసాడు.

అగ్నిదేవునికి, సుదర్శనకు ఒక కుమారుడు కలిగాడు. వాడి పేరు సుదర్శనుడు. అతడు కూడా సుగుణ సంపన్నుడు. ధర్మపరుడు.

సుదర్శనుడు పెద్దవాడై తాతగారి రాజ్యమునకు రాజై రాజ్యభారం వహించాడు. ధర్మంగా రాజ్యపాలన చేస్తున్నాడు. సుదర్శనునకు వివాహం అయింది. అతనికి ఒక కుమారుడు కలిగాడు. వాడి పేరు ఓఘవంతుడు. అతడికి ఓఘరథుడు అనే కొడుకు, ఓఘవతి అనే కుమార్తె జన్మించారు.

ఓఘవతి పెళ్లీడు కొచ్చింది. ఆమెకు తగిన వరుడి కోసం వెదుకు తున్నారు. కాని ఆమెను తాతగారైన సుదర్శనునకు ఇచ్చి పెళ్లి చేసారు. (ఈరోజుల్లో కూడా తాతా మనవరాళ్ల పెళ్లిళ్లు అక్కడక్కడా కొన్ని తెగలలో చూస్తుంటాము. ఆ రోజుల్లో ఆ ఆచారం ఉండి ఉంటుంది.)

సుదర్శనుడు ఓఘవతిని వివాహం చేసుకున్న తరువాత "నేను గృహస్థ ధర్మమును పాటిస్తూ మృత్యువును జయిస్తాను." అని ప్రతిజ్ఞ చేసాడు. తరువాత అతడు కురుక్షేత్రమునకు పోయి అక్కడ ఒక పర్ణశాలలో భార్య ఓఘవతితో సహా గృహస్థాశ్రమము గడుపుతున్నాడు.

ఒకరోజు సుదర్శనుడు భార్య ఓఘవతితో ఇలా అన్నాడు. "భార్యామణీ! నాకు అతిధి పూజలు అంటే ఎంతో ఇష్టం. అందువలన నేను ఇంట్లో ఉన్నా లేకపోయిన నీవు మాత్రం మన ఇంటికి వచ్చిన అతిథులను తగురీతిగా సత్కరించాలి. ఎందుకంటే అతిథులు ఎవరి ఇంట్లో అయితే తమ కోర్కెలు తీర్చుకుంటారో, ఆ గృహస్థులు కృతార్థులవుతారు. మన ఇంటికి వచ్చిన అతిథి ఏ కోరిక కోరినా అతని కోరిక నీవు సంకోచించకుండా తీర్చాలి. పతి చెప్పిన మాటలు ఆచరించడం పతివ్రతల ధర్మం కదా!" అని అన్నాడు సుదర్శనుడు.

భర్త మాటలను అతని భార్య ఓఘవతి అంగీకరించింది. సుదర్శనుడు సమిధల కోసం అడవిలోకి వెళ్లాడు. ఇంతలో ఒక అతిథి పర్ణశాలకు వచ్చాడు.

ఓఘవతి అతనికి అతిధి స త్కారాలు చేసింది. కాని ఆ అతిథి ఆమెను కామ వాంఛతో చూచాడు.

“ ఓ లలనామణీ! నా మనసు నీ మీద మరులుగొని ఉన్నది. నా కామ వాంఛలు తీర్చవా! అయినా అతిథి కోర్కెలు తీర్చడం గృహస్థుల ధర్మం కదా. నీకు తెలియనిది ఏమున్నది. అయినా నీ భర్త నీకు చెప్పలేదా!” అని అన్నాడు.

“మహానుభావా! తమరు వేరే కోరిక ఏదైనా కోరండి. నేను తీరుస్తాను.” అని వినయంగా చెప్పింది.

“ఓ లతాంగీ! నాకు నీ పొందు తప్ప వేరే ఏమీ అక్కరలేదు.” అని అన్నాడు.

ఓఘవతికి తన భర్త మాటలు గుర్తుకు వచ్చాయి. భర్త మాట ప్రకారం అతని కామ కోరికలు తీరిస్తే తన శీలం పోతుంది. తీర్చక పోతే భర్త మాటను ఎదిరించినట్టవుతుంది. కొంచెం సేపు ఆలోచించి తుదకు భర్త మాట ప్రకారం అతిథి కోర్కె తీర్చాలని అనుకుంది. సిగ్గుపడుతూ తన అంగీకారం తెలిపింది.

ఆ బ్రాహ్మణ అతిథి ఓఘవతిని లోపలకు తీసుకు వెళ్లే సమయంలో ఆమె భర్త సుదర్శనుడు అక్కడకు వచ్చాడు. బయట నిలబడి తన భార్య ఓఘవతిని పిలిచాడు. ఆ సమయంలో అతిథి ఆమెను మాట్లాడవద్దని కట్టడి చేసాడు. ఆ బ్రాహ్మణ అతిథి శాపం పెడతాడన్న భయంతో ఓఘవతి భర్త పిలుస్తున్నా మాట్లాడలేదు. ఎంత పిలిచినా తన భార్య పలకనందుకు సుదర్శనుడు పర్ణశాల లోపలకు తొంగి చూచాడు. లోపల భార్య కనపడలేదు. భార్యను ప్రేమతో పిలిచాడు.

ఇంతలో ఆ వచ్చిన బ్రాహ్మణ అతిథి “ఓ యజమానీ! నీ భార్య నాకు ఆతిథ్యము ఇచ్చుచున్నది. నీకు గృహధర్మములు అతిథి సత్కారముల గురించి తెలియును కదా! కోపించకుము.” అని లోపల నుండి పలికాడు.

అప్పుడు సుదర్శనుడు లోపల నున్న అతిథితో “మహాభాగా! నీకు ఆతిథ్యము ఇచ్చుచున్నందు వలన నా జన్మ చరితార్థమైనది. ఏ ఇంట్లో అతిథి పూజ సక్రమంగా జరుగుతుందో ఆ ఇల్లు పవిత్రము అవుతుందని పెద్దలు అంటారు కదా. కాబట్టి అతిథి పూజ అయేంత వరకు నేను బయటనే ఉంటాను.” అని అన్నాడు సుదర్శనుడు. ఇంకా ఇలా అన్నాడు. “ఓ అతిథీ! నా మనస్సు, నా వాక్కు ఒకటే. దీనికి సాక్షులుగా ఈ భూమీ, అగ్ని, జలము, ఆకాశము, వాయువు, సూర్యుడు, చంద్రుడు ఉన్నారు.” అని అన్నాడు.

అప్పుడు ఆకాశవాణి “ఇతడు ధన్యుడు. ఎల్లరూ సంభావించ తగినవాడు.” అని పలికింది.

అప్పుడు లోపల ఉన్న అతిథి అద్భుతమైన తేజంతో సాక్షాత్కరించాడు. “సుదర్శనా! నేను ధర్మదేవతను. నీ చిత్తము ఎలాంటిదో తెలుసుకోడానికి వచ్చాను. అనఘా! నీవు నిశ్చలమైన వ్రతము కలవాడవు. నీవు ఎప్పుడు ధర్మం తప్పుతావో అప్పుడు నిన్ను చంపాలని మృత్యువు నీ వెంటనే పొంచి ఉంది. కాని నువ్వే మృత్యువును జయించావు. అంతకు ముందే నువ్వు నీలో ఉన్న కామ, క్రోధ, లోభ, మోహ,మద, మాత్సర్యములను, అహంకారమును జయించావు. నీ భార్యకూడా మహా పతివ్రత. నీవు ఈ శరీరంతోనే ఊర్ధ్వలోకములకు వెళ్లగలిగే అర్హత సంపాదించుకున్నావు. నీకు ఎప్పుడు ఈ శరీరంతో సహా ఊర్ధ్వలోకములకు వెళ్లవలెనని తలంపు పుడుతుందో అప్పుడు నీవు నీ భార్యసమేతంగా రావచ్చు.

నీవు చేసిన తపస్సులో సగ భాగం  తపః ఫలము చేత నీ భార్య ఓఘవతి పుణ్యనదియై ఈ భూలోకంలో ప్రవహిస్తూ ఈ జనులను పావనం చేస్తుంది. మిగిలిన సగభాగం తపః ఫలంతో నీ సేవ చేసుకుంటూ ఉంటుంది. నేను అతిథిగా రావడం, నీ భార్యను కోరడం అన్నీ నీ కీర్తి అందరికీ తెలియ చెయ్యడానికి నేను కల్పించాను. అంతేగాని నీ భార్య శీలమునకు ఎలాంటి హానీ జరగలేదు. ఇది యదార్ధము.ε    అని ధర్మదేవత పలికి అంతర్ధానం అయింది.

ఓ ధర్మనందనా! ఇదీ ఓఘవతీ నది కథ. ఈ కథా సారాంశం  ఏమిటంటే గృహస్థునకు అతిధి పూజ కన్నా పరమ ధర్మము వేరొకటి లేదు.ε అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

εపితామహా! నాదొక సందేహం. బ్రాహ్మణులు కాక ఇతర జాతుల వారికి, వారు చేసే గుణ కర్మల వలన బ్రాహ్మణత్వము సిద్ధిస్తుందా!ε అని అడిగాడు.

εధర్మనందనా! బ్రాహ్మణత్వము పొందడం చాలా దుర్లభము. ఎన్నో జన్మలు ఎత్తితే గానీ ఉన్నతమైన బ్రాహ్మణత్వము సిద్ధించదు.  ఈ విషయం గురించి నీకు ఒక ఇతిహాసము (జరిగిన కథ)చెబుతాను విను.

పూర్వము మతంగుడు అనే విప్రకుమారుడు ఉండేవాడు.  తండ్రి అతనిని ఒక యజ్ఞానికి వెళ్లమన్నాడు. మతంగుడు ఆ యజ్ఞానికి వెళ్తున్నాడు. దారిలో ఆ విప్రకుమారుడు ఒక గాడిద పిల్లను కర్రతో గట్టిగా కొట్టాడు. ఆ గాడిద పిల్ల ఏడుస్తూ తన తల్లి దగ్గరకు పోయి జరిగిన సంగతి చెప్పింది. అప్పుడు ఆ గాడిద εఅమ్మా! వీడు ఛండాలుడు, క్రూరుడు. అందుకనే అలా నిన్ను కొట్టాడు.ε అని పలికింది.

గాడిద భాష తెలిసిన ఆ విప్రకుమారుడు గాడిద మాటలు విన్నాడు.. “గాడిద మామూలుగా తిట్టలేదు. ఇందులో ఏదో అంతరార్థము ఉంది. లేకపోతే నన్ను ఛండాలుడు అని ఎందుకంటుంది!” అని అనుకున్నాడు.

వెంటనే ఆ విప్రకుమారుడు ఆ గాడిద దగ్గరకు పోయి తన జన్మ రహస్యము చెప్పమని అడిగాడు. “విప్రకుమారా! నీ తల్లి కామముతో ఒక క్షురకునితో సంగమించి నీకు జన్మనిచ్చింది. కనుక నీవు బ్రాహ్మణుడివి కావు.” అని చెప్పింది. అతడికి యజ్ఞమునకు పోవుటకు మనస్కరించలేదు. వెనక్కు తిరిగి ఇంటికి వెళ్లాడు. జరిగిన విషయం తన తండ్రికి చెప్పాడు.

“తండ్రీ! నేను శూద్రునకు, బ్రాహ్మణ స్త్రీకి పుట్టాను. కాబట్టి నేను బ్రాహ్మణుడను కాను. ఆ గార్ధభము ఏదో శాపంతో అలా పుట్టి ఉంటుంది. లేకపోతే నా జన్మవృత్తాంతము దానికి ఎలా తెలుస్తుంది. తండ్రీ! నేను తపస్సు చేసి బ్రాహ్మణత్వము సంపాదిస్తాను.” అని చెప్పి మతంగుడు తపస్సు చెయ్యడానికి అడవులకు వెళ్లిపోయాడు.

కొన్ని సంవత్సరములు ఘోర తపస్సు చేసాడు. ఇంద్రుడు ప్రత్యక్షం అయ్యాడు. “కుమారా! నీవు ఎందుకు తపస్సు చేస్తున్నావు. నీ కోరిక ఏమిటి!” అని అడిగాడు.

“మహేంద్రా! నాకు బ్రాహ్మణత్వము ప్రసాదించండి.” అని అడిగాడు.

“కుమారా! బ్రాహ్మణత్వము మహత్తరమైనది. ఇతర జాతులవారికి అది సంక్రమించదు. కాబట్టి వేరే ఏదైనా వరం కోరుకో!” అని అన్నాడు.

“అయ్యా! నా కోరిక తీర్చడం మీ వల్ల కాదు కానీ, నేను నా తపస్సు కొనసాగిస్తాను. మీరు వెళ్లండి.” అని అన్నాడు. ఇంద్రుడు వెళ్లిపోయాడు. మతంగుడు తన తపస్సు కొనసాగించాడు. ఒంటికాలి మీద నూరేళ్లు తపస్సు చేసాడు. మరలా ఇంద్రుడు ప్రత్యక్షం అయ్యాడు.

“కుమారా! నీ పట్టు విడవకున్నావు కదా! శూద్రుడు తపస్సు చేస్తే చస్తాడు. జాగ్రత్త! నీకు ఈ తపస్సు తగదు.” అని బెదిరించాడు. ఇంకా ఇంద్రుడు ఇలా అన్నాడు. “అసలు బ్రాహ్మణత్వము ఎలా సిద్ధిస్తుందో తెలుసా నీకు! ఇప్పుడు నువ్వు చేసిన తపస్సు కన్నా పది రెట్లు తపస్సు చేస్తేగానీ ఒక ఛండాలుడు శూద్రుడు కాడు. దానికన్నా నూరురెట్లు తపస్సు చేస్తే గానీ ఒక శూద్రుడు వైశ్యుడు కాలేడు. దాని కన్నా వెయ్యి రెట్లు తపస్సు చేస్తే గానీ ఒక వైశ్యుడు క్షత్రియుడు కాలేడు. దాని కన్నా పదివేల రెట్లు తపస్సు చేస్తే గానీ ఒక క్షత్రియుడు దుర్మార్గుడైన బ్రాహ్మణుడు కాలేడు(అంటే కనీసం బ్రాహ్మణ జన్మ ఎత్తలేడుఅని భావన). దాని కన్నా లక్షరెట్లు తపస్సు చేస్తేగానీ ఒక దుర్మార్గు డైన బ్రాహ్మణుడు, ఇంద్రియములను, మనస్సును జయించి, సత్యము అహింసలను పాటించి, మాత్సర్యము విడిచిపెట్టి, ఒక సద్బ్రాహ్మణుడు అవుతాడు. అలాంటి సద్బ్రాహ్మణత్వమును ఊరికే నూరు సంవత్సరాలు తపస్సు చేస్తేనే వస్తుందా చెప్పు!

ఒక వేళ బ్రాహ్మణ జన్మ వచ్చినా దానిని నిలబెట్టుకోవడం కష్టం కదా! ఒక్కొక్క జీవుడు అనేక జన్మముల తరువాత బ్రాహ్మణుడిగా జన్మ ఎత్తుతాడు. కానీ, అతడు, దానిని నిలబెట్టుకోలేడు. ధన వాంఛ తోనూ, కామ వాంఛల తోనూ, విషయముల మీద ఆసక్తితోనూ, సదాచారములను వదిలిపెట్టి, చెడ్డవారై పోతారు. మరలా బ్రాహ్మణజన్మ రావడానికి ఎన్నో వేల ఏండ్లు పడుతుంది. అటువంటి మహత్తరమైన బ్రాహ్మణత్వమునకు నీవు ఎందుకు ఆశపడతావు. నీ

వినాశము కొని తెచ్చుకుంటావు. కాబట్టి ఈ తపస్సు చాలించి నీ కిష్టం వచ్చిన వరం కోరుకో ఇస్తాను.॥ అని అన్నాడు ఇంద్రుడు.

మాతంగుడు ఏమీ మాట్లాడలేదు. ఈ మొండి వాడితో ఎందుకని ఇంద్రుడు వెళ్లిపోయాడు. మాతంగుడు మరలా తపస్సు చెయ్యడం ప్రారంభించాడు. కాలి బొటన వేలి మీద నిలబడి శరీరం అస్థిపంజరం అయేంతవరకూ తపస్సు చేసాడు.  అతని శరీరం అంతా శిధిలమయి పోగా అతను నేల మీద పడిపోబోతుండగా మరలా ఇంద్రుడు వచ్చి పట్టుకున్నాడు.

॥ఏమిటయ్యా ఇది! నీకు ఇదివరకే చెప్పాను కదా!  ఈ బ్రాహ్మణత్వము అనగా ఒక పెద్దపులి లాంటిది. నిన్నే మింగుతుంది. దానితో నీకు ఎందుకు చెప్పు! చక్కగా ఏవైనా వరాలు కోరుకో ఇస్తాను.॥ అని అన్నాడు.

మాతంగుడు సరే అన్నాడు. ఇంద్రుడు సంతోషించాడు.  ॥నీవు చంద్ర దేవుడు అనే పేరుతో అందమైన స్త్రీల పూజలు అందుకుంటావు. నీ కామ పరమైన కోర్కెలు తీర్చుకుంటావు.  నీకు ఇష్టం వచ్చిన రూపంలో  ఆకాశంలో ఎగిరే పక్షి మాదిరి నీ ఇష్టం వచ్చినట్టు విచ్చలవిడిగా నీ కోరికలు తీర్చుకుంటావు.॥  అని వరాలు ప్రసాదించాడు ఇంద్రుడు.

ఆసమయంలో ధర్మరాజు కు ఒక సందేహం కలిగింది. ॥పితామ హా! ఇంద్రుడు చెప్పినట్టు బ్రాహ్మణత్వము పొందడం అంత దుర్లభము అయితే మరి క్షత్రియుడైన విశ్వామిత్రుడు బ్రాహ్మణుడు ఎలా అయ్యాడు. వివరించండి.॥ అని అడిగాడు.

“ధర్మనందనా! జాహ్నవీ దేవి (గంగా దేవి) కి తండ్రి అయిన జహ్నుడు అనేవాని వంశంలో గాధి అనే క్షత్రియుడు జన్మించాడు . ఆ గాధి కూతురు సత్యవతి. భృగు వంశంలో జన్మించిన ఋచీకుడు అనే ముని సత్యవతిని తనకు ఇచ్చి వివాహము చెయ్యమని గాధిని అడిగాడు. గాధి అందుకు ఇష్టపడలేదు. తన కూతురికి కట్నం కింద ఒక చెవి తెల్లగా ఉన్న వేయి గుర్రములను ఇస్తే తన కూతురు సత్యవతిని ఇస్తానని మెలిక పెట్టాడు. ఎలాగైనా అటువంటి గుర్రములను తెచ్చి ఇచ్చి సత్యవతిని వివాహం చేసుకుంటాను అని చెప్పి రోషంతో ఋచీకుడు వెళ్లాడు.

ఋచీకుడు వరుణుడి దగ్గరకు వెళ్లాడు. తనకు వేయి ఒక చెవి తెల్లగా ఉన్న గుర్రములను ఇమ్మని అడిగాడు. వరుణుడు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. “ఈ మాత్రందానికి నాదాకా రావాలా! నీవు కోరుకుంటే అలాంటి గుర్రాలు నీ ఎదుట నిలబడతాయి.” అని అన్నాడు వరుణుడు.

వెంటనే ఋచీకుడు గంగానది ఒడ్డుకు పోయి పద్మాసనం వేసుకొని కూర్చుని కళ్లు మూసుకొని తనకు వేయి ఒక చెవి తెల్లగా ఉన్న గుర్రములు కావాలి అని గాఢంగా కోరుకున్నాడు. ఆశ్చర్యంగా అప్పటికప్పుడు అలాంటి వేయి గుర్రాలు అతని కళ్లముందు నిలబడ్డాయి. అప్పటి నుండి ఆ ప్రదేశము అశ్వతీర్థము అని ప్రసిద్ధికెక్కింది. ఋచీకుడు ఆ గుర్రాలను తెచ్చి గాధికి ఇచ్చాడు. చేసేది లేక గాధి తన కూతురు సత్యవతిని ఋచీకునకు ఇచ్చి పెళ్లిచేసాడు.

ఋచీకుడు సత్యవతి గృహస్థాశ్రమం స్వీకరించారు. కాపురం చేస్తున్నారు. వారికి సంతానం కావాలని కోరిక కలిగింది. “సత్యవతీ! మనకు సంతానం కలగడానికి యజ్ఞములో ఇచ్చే చరువు (హవిస్సు) సంపాదిస్తాను.” అని

అన్నాడు ఋచీకుడు. ఇంతలో సత్యవతి తల్లి కూడా తనకూ సంతానం కావాలని, తనకూ ఒక చరువు కావాలని అల్లుడిని కోరింది. అదే ప్రకారము ఋచీకుడు రెండు చరువులు సంపాదించాడు. వాటిలో తన తపశ్శక్తిని నింపాడు. ఒక చరువులో ఉన్న యజ్ఞశేషము తింటే ఉజ్వలంగా ప్రకాశించే బ్రాహ్మణుడు పుడతాడు అనీ, మరొక చరువులో ఉన్న యజ్ఞశేషము భుజిస్తే రాజస భావము అధికంగా కల వాడు పుడతాడనీ చెప్పాడు.

రెండు చరువులను భార్యకు ఇచ్చి, వాటి ప్రభావముల గురించి చెప్పి, ఇలా అన్నాడు. "సత్యవతీ! ఇందులో రాజస ప్రధానము క్షాత్రప్రధానము అయిన చరువును నీ తల్లికి ఇవ్వు. సాత్త్విక ప్రధానము బ్రాహ్మణత్వము అధికంగా కలిగిన చరువు నీవు తీసుకో. తరువాత ఋతు కాలంలో నీవు మేడి చెట్టును, నీ తల్లి రావి చెట్టును కౌగలించుకోండి. మీకుసంతాన ప్రాప్తి కలుగుతుంది." అని చెప్పాడు.

కాని విధి విధానము వేరుగా ఉంది. తల్లి కూతుళ్లు ఆ చరువులలోని యజ్ఞశేషము భుజించే వేళలో విధివశాత్తు ఆ చరువులు తారుమారయ్యాయి. అదే విధంగావారు కౌగలించుకున్న చెట్లు కూడా తారుమారు అయ్యాయి. తత్ఫలితంగా వారు ధరించిన గర్భాలు కూడా తారుమారయ్యాయి. ఇది తన దివ్యదృష్టి తో గ్రహించాడు ఋచీకుడు. తన భార్య సత్యవతితో ఇలా అన్నాడు.

"సత్యవతీ! మీ చరువులు, చెట్లు తారుమారయ్యాయి. తత్ఫలితంగా నీ గర్భంలో సద్బ్రాహ్మణుడి బదులు దుర్మార్గుడైన క్షత్రియుడు పెరుగుతున్నాడు." అని చెప్పాడు. ఆ మాటలు విని సత్యవతి తల్లడిలిపోయింది. "నాథా! నీవు సద్బ్రాహ్మణుడవు. తపస్సంపన్నుడవు. నీకు పుట్టే కుమారుడు తన బ్రాహ్మణత్వము కోల్పోతే ఆ అపకీర్తి నీకు కాదా. కాబట్టి

నీ మహిమ చేత ఈ అవాంతరము నివారించు." అని వేడుకొంది. దానికి ఋచీకుడు సమ్మతించాడు. "ఈ ప్రభావము ఒక జన్మకాలము పొడిగిస్తాను. ఇప్పుడు నీకు ఒక సద్బ్రాహ్మణుడు పుడతాడు. అతని కుమారుడు మాత్రం క్షత్రియాంశతో జన్మిస్తాడు." అని వరం ఇచ్చాడు.

ఆ వరం మేరకు సత్యవతికి జమదగ్ని మహర్షి కుమారుడుగా జన్మించాడు. కాని అతని కుమారుడు పరశురాముడు క్షాత్ర ధర్మంతో జన్మించాడు. క్షత్రియవంశాన్ని నిర్మూలించాడు. సత్యవతి తల్లి అనగా గాధి భార్యకు విశ్వామిత్రుడు కుమారుడుగా జన్మించాడు. విశ్వామిత్రుడు రాజైకూడా అతనిలో బ్రాహ్మణత్వము స్ఫురించింది. అతడు తపస్సు చేసాడు. కాని పరశురాముడు బ్రాహ్మణుడిగా జన్మించినా క్షత్రియత్వము అతనిలో గాఢంగా నాటుకుంది." అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

"పితామహా! ఈ సందర్భంగా నాకు మరొక కథ స్ఫురణకు వచ్చింది. పూర్వము వీతహవ్సుడు అనే క్షత్రియుడు బ్రాహ్మణత్వము పొందాడు అని విన్నాను. ఆ వివరము తెలియచెయ్యండి." అని అడిగాడు.

"ధర్మనందనా! మనువు పరంపరలో శర్యాతి వంశం ఒకటి. ఆ వంశంలో హైహయుడు అనే క్షత్రియుడు జన్మించాడు.అతడు వత్స దేశమునకు రాజు. హైహయునకు వీతహవ్యుడు అనే పేరుకూడా ఉంది. ఆ రాజుకు పది మంది భార్యలు. వారి ద్వారా ఆ రాజుకు నూరుమంది వీరులు, బలాఢ్యులు అయిన పుత్రులు కలిగారు. ఆ హైహయుని కుమారులు కాశీ రాజైన హర్యశ్వుని మీదికి యుద్దానికి పోయి అతనిని ఓడించారు. అతని తరువాత అతని కుమారుడు సుదేవుడు రాజయ్యాడు. హైహయుని కుమారులు మరలా సుదేవుని మీదికి దండెత్తి అతనిని కూడా చంపారు. ఆ తరువాత సుదేవుని కుమారుడు

దివోదాసు రాజయ్యాడు.  హైహయకుమారుడు మరలా దివోదాసును యుద్ధానికి పిలిచి అతనిని  ఓడించారు. అయితే అతడు భయంతో పారిపోయి భరద్వాజమహర్షి ని  శరణుజొచ్చాడు. తన తాత గారిని తన తండ్రిని హైహయులు చంపిన విషయము భరద్వాజునికి చెప్పాడు.

“భయపడకుము. నీకు ఒక పుత్రుని ప్రసాదిస్తాను. అతడు నీ శత్రువులను చంపుతాడు.” అని అన్నాడు భరద్వాజుడు.  భరద్వాజుడు దివోదాసు చేత పుత్రకామేష్ఠి యాగం చేయించాడు.  ఆ యాగ ఫలంగా అతనికి ఒక పుత్రుడు కలిగాడు. అతడు 13 ఏళ్ల వయసు వాడయ్యాడు. వాడి పేరు ప్రత్యర్ధనుడు. భరద్వాజ మహర్షి అనుగ్రహంతో ప్రత్యర్ధనుడు వేదములు,  ధనుర్వేదము అభ్యసించాడు.  దివోదాసు అతనిని యువరాజుగా అభిషేకించాడు.

వెంటనే ప్రత్యర్ధనుడు, తండ్రి అనుమతి తీసుకొని,  హైహయుని కుమారుల మీదికి దండెత్తి,  వారి నందరినీ అవలీలగా  హతమార్చాడు. తరువాత ప్రత్యర్ధనుడు హైహయుని మీదికి దూకాడు. హైహయుడు పారిపోయి భృగుమహర్షి శరణుజొచ్చాడు. భృగు మహర్షి హైహయుని ఆశ్రమం లోపల దాచి పెట్టాడు. అతనిని తరుముకుంటూ ప్రత్యర్ధనుడు కూడా భృగుమహర్షి ఆశ్రమానికి వచ్చాడు.  భృగుమహర్షికి నమస్కరించాడు.

“నీవు ఇక్కడకు వచ్చిన పని ఏమి?” అని అడిగాడు  భృగుమహర్షి. ప్రత్యర్ధనుడు భృగు మహర్షికి జరిగినది అంతా అనగా హైహయుని కుమారులు తన వంశం వారిని చంపడం గురించి  చెప్పాడు. తాను ఇప్పుడు హైహయుని చంపడానికి వచ్చాను అని చెప్పాడు.

“ప్రత్యర్ధనా! ఇక్కడా రాజవంశము వారు ఎవరూ లేరు.  ఇక్కడ ఉన్న

వారంతా  బ్రాహ్మణులైన నా శిష్యులే.” అని అన్నాడు భృగువు.

ఆ మాటలు విని ప్రత్యర్ధనుడు నవ్వాడు. “మహర్షీ! నేను వచ్చిన పని నెరవేరినది. నేను కృతార్ధుడను అయ్యాను. హైహయుని క్షత్రియుడు కాదు అన్నారు. అతనిని క్షత్రియ  కులం నుండి వెలి వేసారు. అదేనాకు కావలసినది. అయినా నీ పలుకులలో అసత్యం ఉండదు కదా. నా మీద కూడా కరుణ చూపండి.” అని భృగుమహర్షికి నమస్కరించి వెళ్లిపోయాడు ప్రత్యర్ధనుడు.

అప్పటి నుండి హైహయుడు బ్రాహ్మణత్వము స్వీకరించాడు. గొప్ప తపస్సు చేసాడు. కృత్సమదుడు అనే కుమారుని కన్నాడు.  అతని వంశంలో సుతేజసుడు, వర్చసుడు, విహవ్యుడు, సత్యుడు,సంతుడు, శ్రవసుడు, దమసుడు,  ప్రకాశుడు,వాగీంద్రుడు,ప్రమతి,రురుడు,సముదుడు, శునకుడు,శౌనకుడు అనే బ్రాహ్మణులు జన్మించారు.  ఈ ప్రకారం హైహయుడు అనే వీతహవ్యుడు ఒక బ్రాహ్మణ వంశమునకు కర్త అయ్యాడు.” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా!  దైవము, పురుష ప్రయత్నము ఈ రెంటిలో ఏది గొప్పది. వివరించండి.” అని అడిగాడు.

“ ధర్మనందనా! పూర్వము ఇదే ప్రశ్నను వశిష్ఠుడు బ్రహ్మను అడిగాడు. అప్పుడు బ్రహ్మదేవుడు చెప్పిన విషయములు నీకు చెబుతాను విను.

క్షేత్రము, మానవ ప్రయత్నము, విత్తనము. వేరు వేరుగా ఉన్నాయి. ఇవి మూడు కలిస్తే గానీ ఒక మొక్క మొలకెత్తదు.

క్షేత్రములో అనగా భూమిలో విత్తనములు వేస్తే మొలకలు వస్తాయి. ఆ

విత్తనములు భూమిలో  వెయ్యడానికి పురుష ప్రయత్నము కావాలి. కేవలము భూమి, విత్తనములు ఉన్నంత మాత్రాన మొలకలు రావు కదా. కాబట్టి పురుష ప్రయత్నము అవసరము. అన్నీ దైవమే చేస్తాడు అని ఊరికే కూర్చుంటే ఫలితం లేదు. కాబట్టి పురుష ప్రయత్నం అవసరం. పురుష ప్రయత్నం ఉంటేనే దైవ బలం కూడా తోడుగా ఉంటుంది.

ఇందులో  ఇంకొక విషయం కూడా ఉంది. కేవలం పురుష ప్రయత్నం వల్ల ఫలితం దక్కదు. దానికి దైవ సహాయం కూడా తోడవ్వాలి.  విత్తనం వెయ్యకుండా మొక్క రాదు కదా!  మనం మేలు చేస్తే మనకు మేలు కలుగుతుంది. మనం కీడు చేస్తే మనకూ కీడు కలుగుతుంది.  కాబట్టి మనం చేసే పనులు ఒకరికి మేలు చేసేవి గా ఉండాలి. అప్పుడు ఆ పనులకు దైవ బలం కూడా తోడవుతుంది.

ఉదాహరణకు నిప్పు రవ్వ చిన్నది అయినా బాగా గాలి వీస్తే అది పెద్దది అయి మంటగా మారుతుంది. అలాగే మనం చేసే మంచి పని చిన్నది అయినా దానికి ఎక్కువగా దైవబలం తోడవుతుంది.  మనం నేతితో దీపం పెడతాము. కాని దీపంలో నెయ్యి తగ్గిపోతే దీపం కొడి గట్టి ఆరిపోతుంది. అలాగే మనం చేసే పనులలో పవిత్రత లోపిస్తే ఆ  పనులకు దైవబలం తోడుగా ఉండదు. అవి సఫలం కావు.  పరశురాముడు, భృగువు, బలిచక్రవర్తి గొప్పవాళ్లే. కానీ, వారు చేసే పనులలో పవిత్రత లోపించింది. అందుకే వారికి దైవము సానుకూలంగా లేదు.  కాబట్టి మనం చేసే కర్మలకు దైవానుకూలము ముఖ్యము.

ఏ పని చేయడాని కైనా పురుష ప్రయత్నము, దైవ బలము ముఖ్యము. రెండూ సమానమే. ఎక్కువ తక్కువలు లేవు.\" అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

“పితామహా! మంచి పనులు చెయ్యాలి అన్నారు కదా. మరి ఆ మంచి పనులకు ఎలాంటి ఫలితం కలుగుతుంది.” అని అడిగాడు.

“ ధర్మనందనా! ఒక్కొక్క పనికి ప్రత్యేకమైన ఫలితాలు కలుగుతాయి. ఆకలితో ఉన్న బాటసారికి అన్నం పెడితే వచ్చే ఫలం అంతా ఇంతా అని చెప్పనలవి కాదు. అలాగే రోజూ అగ్నిని ఉపాసించి నందువలన మనం చేసే పనులన్నీ చక్కని ఫలితాలను ఇస్తాయి. మనం మంచి వస్తువులు ఇతరులకు దానంగా ఇస్తే, మనకు అవసరమయినప్పుడు ఆ వస్తువులు అయాచితంగా మనకు లభిస్తాయి. మనం మౌనం పాటిస్తే మన జ్ఞానము వృద్ధి చెందుతుంది. తపస్సుకు అధిక భోగములు చేకూరుతాయి. అహింసా వ్రతము ఆచరిస్తే రూపము, బలము, ఐశ్వర్యము చేకూరుతాయి. ఉపవాసం చేస్తే మనస్సు నిర్మలంగా ఉంటుంది. కేవలం ఫలములు, నీరూ త్రాగి జీవిస్తే అతనికి రాజ్యప్రాప్తి కలుగుతుంది. వేదము చదివితే సుఖాలు కలుగుతాయి. వేదార్థమును గ్రహిస్తే పరలోకంలో సుఖం అనుభవించవచ్చు. ఇంక సత్యవ్రతము పాటిస్తే మోక్షప్రాప్తి కలుగుతుంది.

ధర్మ నందనా! మంచి పనులు చేస్తే మంచి ఫలితములు, చెడు పనులు చేస్తే చెడ్డ ఫలితములు ఇస్తాయి. ఏ విత్తనం వేస్తే అదే చెట్టు మొలుస్తుంది కదా! మానవుడికి ముసలి తనం వచ్చి వెంట్రుకలు ఊడినా, పళ్లు ఊడిపోయినా, చెవులు వినపడకున్నా, కళ్లు కనపడకున్నా, అతని మనసులోని కోరికలు మాత్రం చావవు. ప్రాణాలు పోయినా కోరికలు మాత్రం మనిషిని విడిచిపెట్టవు. ఇది మామూలు మనుష్యులకే కాదు, బాగా చదువుకున్న పండితులు కూడా ఈ కోరికలకు బానిసలే. ఈ కోరికలు విడిచి పెడదామన్న ఆలోచన కూడా మనసులోకి ప్రవేశించనివ్వరు. బయట ప్రపంచంలో విహరించే వాళ్లకు పుణ్య

కర్మలు సుఖాన్ని, పాప కర్మలు దుఃఖాన్ని కలుగ జేస్తాయి. కాని బయట ప్రపంచం మీద ఆసక్తి లేని వారికి వారు చేసే పనులు ఏ ఫలితాలను ఇవ్వవు.” అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

“పితామహా! నాకు ఒక చిన్న సందేహము. తమ తమ యజమానుల ఎడల, అతని దయాదాక్షిణ్యముల మీద బతికే సేవకుడు, ఎలా నడుచుకోవాలి తెలియచెయ్యండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! కాశీ పట్టణంలో ఒక వేటగా డు ఉన్నాడు. వాడు ఒకరోజు అడవిలోకి వేటకు వెళ్లాడు. వాడు ఒక లేడిని చూచాడు. తన వద్దనున్న విషము పూసిన బాణమును ఆ లేడి మీద వేసాడు. కాని ఆ బాణము గురి తప్పి ఒక చెట్టును తాకింది. ఆ చెట్లు నిండి పూలు పండ్లు విరగ కాసి ఉన్నాయి. ఆ బాణము విషపూరితమైనందున, ఆ చెట్టు నిలువునా మాడిపోయింది. ఆ చెట్టు మీద ఒక చిలుక నివసిస్తూ ఉంది. ఆ చెట్టు మాడి పోయినా, ఇన్నాళ్లూ ఆ చెట్టు తనకు నివాసం ఇచ్చింది కాబట్టి ఆ చిలుక ఆ మాడిపోయిన చెట్టును విడిచి పెట్టకుండా ఆ చెట్టు మీదనే నివాసం ఉంటూ ఉంది. ఎండ వచ్చినా, గాలి వచ్చినా, వర్షం వచ్చినా, ఆ చెట్టును మాత్రం వదిలిపెట్టలేదు.

ఆ చిలుక గురించి ఇంద్రుడికి తెలిసింది. ఇంద్రుడు మామూలు మనిషి రూపంలో ఆ చిలుక దగ్గరకు వచ్చాడు. “ఓ చిలుకా! ఈ చెట్టు మాడిపోయింది కదా. అదీ కాకుండా ఈ అడవిలో ఫలములు పుష్పములతో కూడిన చెట్లు ఎన్నో ఉండగా, ఈ ఎండి మాడిపోయిన చెట్టును పట్టుకొని ఎందుకు వేలాడుతున్నావు.” అని అడిగాడు.

“అదేమిటి మహేంద్రా! చెట్టు ఫలపుష్పములతో నిండుగా ఉన్నప్పుడు ఆ

చెట్టును అంటిపెట్టుకొని ఉండటం, ఆ చెట్టు ఎండి పోగానే దానిని విడిచి పెట్టడం కృతఘ్నత అనిపించుకుంటుంది కదా!” అని అన్నది ఆ చిలుక.

మహేంద్రుడు కంగు తిన్నాడు. తాను మారు వేషంలో వస్తే ఈ చిలుక నన్ను ఇంద్రా! అంటుందేమిటి అని అనుకున్నాడు. ఓహో ఈ చిలుక ఇది వరకు తాను చేసిన పుణ్యము వలన నన్ను గుర్తు పట్టగలిగినది అని సమాధాన పడ్డాడు. “సరేలే గానీ నేను వచ్చాను కదా! ఏదైనా వరము కోరుకో ఇస్తాను.” అని అన్నాడు మహేంద్రుడు.

“ఈ చెట్టు ఫలపుష్పములతో తన పూర్వ వైభవముతో అలరారేట్టు చెయ్యి.” అని కోరింది ఆ చిలుక.

వెంటనే ఇంద్రుడు ఆ చెట్టు మీద అమృతము చల్లాడు. ఆ ఎండిపోయిన చెట్టు ఇదివరకటి కంటే ఫలపుష్పములతో ఎక్కువగా శోభిల్లింది. కాబట్టి ఓ ధర్మనందనా! ఆ చిలుక చూడు. తనకోసం ఏ వరం కోరుకోకుండా ఇన్నాళ్ల తనకు ఆశ్రయం ఇచ్చిన చెట్టు శ్రేయస్సు కోరింది. అలాగే భృత్యులు ఎల్లప్పుడూ తన యజమాని మేలు కోరుతుంటారు.” అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! అది సరే! మరి యజమానులు కూడా తన భృత్యులను సముచితంగా ఆదరించాలి కదా! అది ఎలాగా!” అని అడిగాడు.

“ ధర్మనందనా! వేదములు చదువుతూ, తపస్సు చేస్తూ, అందరికీ ధర్మములను బోధిస్తూ ఇహపరలోకములలో నూ మానవులకు సుఖమును కలుగ చేయు బ్రాహ్మణుడు సర్వత్రా పూజ్యులు. భార్యకు భర్త ఎలా పూజనీయుడో అలాగే రాజునకు బ్రాహ్మణుడు పూజనీయుడు. బ్రాహ్మణుడు

చెప్పు ప్రతి మాటా పవిత్రమైనది. సద్బ్రాహ్మణులు సాక్షాత్తూ ఇంద్రుని కైనా తమను సంతోష పెడితే సుఖమును, తమకు కష్టం కలిగిస్తే దుఃఖమును కలిగించ సమర్థులు. రాజైనవాడు విప్రుని తన కుమారుని వలె ఆదరించాలి. గురువు వలె గౌరవించాలి. అగ్ని దేవుని మాదిరి పూజించాలి. దీనికి సంబంధించిన వేద వాక్కులను చెపుతాను శ్రద్ధగా విను.

ఎవరైనా బ్రాహ్మణ జాతిని పరాభవిస్తే, వాడు చేసిన పుణ్యములు అన్నీ నశిస్తాయి అని ఋగ్వేదము చెబుతూ ఉంది. జపము, హోమములు, మొదలగునవి బ్రాహ్మణుల ఆధ్వర్యములోనే చేయాలని యజుర్వేదము చెబుతూ ఉంది. ఒకనెల పాటు బ్రాహ్మణులను అర్చించిన సకల పాపములు నమసి పోతాయని సామవేదము చెబుతూ ఉంది. బ్రాహ్మణులను ఆదరించక పోవడం కన్నా వేరే కీడు ప్రపంచంలో లేదు అని అధర్వణ వేదము చెబుతూ ఉంది.

పూర్వము మద్రదేశాధి పతి శల్యుడు కూడా వ్యాసుని ‘పరమ శ్రేష్టమైన ధర్మము ఏది? దేనిని తెలుసుకుంటే అది అన్ని జ్ఞానముల కంటే ఎక్కువ?’ అని అడిగాడు.

యజ్ఞమూర్తి (అన్ని యజ్ఞములు తానే అయిన వాడు), యజ్ఞకర్తృమూర్తి (అన్ని యజ్ఞములకు కర్త), యజ్ఞకలన మూర్తి (అన్ని యజ్ఞములలోనూ తానే ఉండేవాడు), యజ్ఞఫల మూర్తి (అన్ని యజ్ఞములకు ఫలములను ప్రసాదించే వాడు) అయిన విష్ణు మూర్తిని తెలుసుకోడమే జ్ఞానముల కంటే ఉత్తమమైన జ్ఞానము. ఆ విష్ణు మూర్తే ఈ శ్రీకృష్ణుడు. ఓ శల్య మహారాజా! ఒకప్పుడు కొంత మంది బ్రాహ్మణులు శ్రీ కృష్ణుని చూచి కృష్ణుడు వింటూ ఉండగా ఇలా అన్నారు. ‘ఈ బాలుడు యాదవుడైన వసుదేవునకు, కంసుడి చెల్లెలు అయిన

దేవకీదేవికి కలిగిన కుమారుడు. ఇతనిని యజ్ఞపురుషుడు అని పూజించడానికి కారణమేమి?" అని నన్ను అడిగారు. ఆ మాటలు విన్న కృష్ణుడు నన్ను చూచి దీనికి నీవు తగిన సమాధానము ఇమ్ము అని అన్నాడు. నేను కృష్ణునకు నమస్కరించి ఇలా అన్నాను.

" శ్రీ కృష్ణుడే వేదమయుడు, వేదములకు అర్థము, వేదములు తెలిసిన వాడికి ఇష్టుడు, శ్రీ కృష్ణుడే సాక్షాత్తు విష్ణువు అని తెలుసుకోవడమే ఉత్తమ బ్రాహ్మణత్వమునకు ఫలము." అని చెప్పాను.

నా మాటలు విన్న ఆ బ్రాహ్మణులే శ్రీకృష్ణతత్త్వము పూర్తి గా తెలుసు కున్నారు. అని చెప్పి వ్యాసుడు మద్రరాజు మనసులో ఉన్న సందేహ మును పోగొట్టాడు.

ధర్మనందనా! నీకు కృష్ణతత్త్వము గురించి తెలుసు అని నాకు తెలుసు. అయినా నీ యొక్క ప్రజ్ఞను ఒక సారి జ్ఞాపకం చేద్దామని చెప్పాను." అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! గరుత్మంతుడు మహానుభావుడు అని వింటూ ఉంటాను. ఆ గరుత్మంతుని గురించి వినవలెనని ఉన్నది.చెప్పండి." అని అడిగాడు.

"ధర్మనందనా! కశ్యపునకు ఇద్దరు భార్యలు. వారి పేర్లు వినత. కద్రువ. కశ్యపుడు తన భార్యలను చూచి వారికి ఎటువంటి సంతానము కావాలి అని అడిగాడు. కద్రువ తనకు వేయిమంది పుత్రులు కావాలని అడిగింది. వినత మాత్రం తనకు ఇద్దరు పుత్రులు కావాలని అడిగింది. కశ్యపుడు అలాగే అని వారు కోరినట్లు వరం ప్రసాదించాడు.

కాల క్రమేణా కద్రువకు వేయి అండములు (గుడ్లు), కద్రువకు రెండు అండములు జన్మించాయి. కద్రువ, వినత ఆ అండములను చల్లటి కుండలలో పెట్టి కాపాడుతున్నారు. అలా 1500 ఏండ్లు గడిచిపోయాయి. ముందుగా కద్రువ కు పుట్టిన అండములు పగిలాయి. వాటిలోనుండి అధిక బలము, తేజస్సు కలిగిన సర్పరాజులు పుట్టారు.

కాని వినత కు కలిగిన గుడ్లు పగల లేదు. తనకు కలిగిన సంతానమును చూచి సంతోషిస్తున్న కద్రువను చూచి వినతకు అసూయ కలిగింది. ఆ మత్సరము తట్టుకోలేక తొందర పాటుతో, తనకు కలిగిన అండములలో ఒకదానిని బలవంతంగా పగులగొట్టింది. అందులో నుండి ఒక పక్షి ఆకారము పుట్టింది. అతని పేరు అరుణుడు. కాని ఆ పక్షి శరీరంలో పైభాగము మాత్రమే తయారయింది. సగం శరీరంతో పుట్టిన కుమారుని చూచి వినత ఏడ్చింది.

అప్పుడు ఆ సగం పక్షి ఇలా అన్నది. "అమ్మా! నీవు తొందరపడి గుడ్డు పగుల గొట్టకుండా ఉంటే అత్యధిక బల సంపన్నులమైన ఇద్దరము నీకు కుమారులుగా పుట్టి ఉండేవాళ్లము. కాని నాకు ఆభాగ్యం లేకుండా చేసావు. నీ సవతి మత్సరమునకు, చాపల్యమునకు తగిన ఫలం అనుభవించు. నీవు నీ సవతి అయిన కద్రువకు దాసివై." ఉండు అని శాపం పెట్టాడు.

అసలే సగం శరీరంతో పుట్టిన కొడుకు, పైగా సవతికి దాస్యం చెయ్యమని శాపము. వినత తల్లడిల్లిపోయింది. వలా వలా ఏడ్చింది. వినతకు పుట్టిన కొడుకు జాలి పడ్డాడు. "అమ్మా! ఏడవకు. ఇది విధి కృతము. నీవు ఏమి చేయలేవు. అనుభవించాలి. అమ్మా! దయచేసి ఆ రెండో గుడ్డును మాత్రం తొందరపడి పగుల గొట్టకు. ఇంకా అయిదు వందల ఏండ్ల తరువాత నాకు ఒక తమ్ముడు జన్మిస్తాడు. అతడు మహా బలవంతుడు, పరాక్రమ వంతుడు.

అతడే నీ దాస్యమును పోగొడతాడు.‌" అని పలికాడు.

తన పెద్ద కుమారుడు వికలాంగుడు అయినందుకు, చేసిన తొందరపాటు పనికి శాపగ్రస్తురాలయి నందుకు చింతిస్తూ, అయిదు వందల సంవత్సరాలు రెండవ అండమును జాగ్రత్తగా కాపాడింది వినత. ఐదు వందల సంవత్సరాలు పూర్తి కాగానే ఆ గుడ్డు తనంతట తానే పగిలింది. అందులో నుంచి పెద్ద మెడతో, ధృఢమైన శరీరంతో, ప్రకాశవంతమైన ముఖంతో, ఎర్రటి కళ్లతో, పెద్దతలతో, అందమైన శక్తి వంతమైన రెక్కలతో, అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడి మాదిరి సుపర్ణుడు(గరుత్మంతుడు) పుట్టాడు.

సుపర్ణుడు పుట్టిన తరువాత, వినత పెద్ద కుమారుడు అరుణుడు చాలా సంతోషించాడు. "అమ్మా ఇంక నాకు సెలవు ఇప్పించు" అని తల్లి దగ్గర సెలవు తీసుకొని సూర్యభగవానుని సేవించడానికి ఆకాశ మార్గాన ఎగిరి పోయాడు. (అతడే సూర్యుని రథ సారథి అరుణుడు. అనూరుడు అని కూడా అంటారు. అనూరుడు అంటే తొడలు లేని వాడు అని అర్థం. మనం సూర్యోదయాన్ని అరుణోదయం అంటాము. ఎందుకంటే సూర్యుని రథం వచ్చేటప్పుడు మనకు ముందుగా కనపడేవాడు రథమును తోలే సారథి. అనగా అరుణుడు. అందుకని అరుణోదయం అని అంటారేమో! ).

గరుత్మంతుడు ఒక క్షణం ఇంట్లో ఉండేవాడు కాదు. ఆహారం వెదుక్కుంటూ అంతటా తిరుగుతూ ఉండేవాడు. అతనిని చూసి సిద్ధులు, సాధ్యులు, మొదలగు దేవతా గణములు, గరుడుని తాతగారు బ్రహ్మ అతనిని ముద్దు చేస్తూ ఉండేవాళ్లు.

రెండవ అండము పగిలి గరుత్మంతుడు బయటకు రాక ముందు ఒక

సంఘటన జరిగింది. అప్పటికి వినత తన పెద్ద కుమారుడు ఇచ్చిన శాపము మరిచిపోయింది.

వసంత ఋతువు కాలం వచ్చింది. లోకమంతా ఆహ్లాద కర వాతావరణం వెల్లివిరిసింది. వినత, కద్రువ ఇద్దరూ విహారానికి సముద్ర తీరానికి వచ్చారు. ఆ ఇద్దరికీ దూరంగా ఒక పాల నురగ లాగా మెరిసి పోతున్న తెల్లని గుర్రం ఒకటి కనపడింది. అది ఇంద్రుడి గుర్రము. పేరు ఉచ్చైశ్రవము.

( ఈ ఉచ్చైశ్రవము పాలసముద్రాన్ని దేవతలు రాక్షసులు అమృతం కోసరం మంధర పర్వతంతో చిలుకుతుంటే పుట్టింది. అందుకే అంత తెల్లగా ఉంది.).

ఆ గుర్రమును చూచి వినత “ఆహా! కద్రువా! ఆ గుర్రము ఎంత తెల్లగా అందముగా ఉంది.” అని అంది.

తన సవతి మాటను తిప్పి కొట్టాలనే నెపంతో కద్రువ “వినతా! ఆ గుర్రము తెల్లగా లేదు. దాని తోక మాత్రము నల్లగా ఉంది.” అని అంది.

వినత వింతగా కద్రువ వంక చూసింది. “అదేమిటి కద్రువా! నువ్వు పరిహాసానికి అంటున్నావా! తెల్లగా ఉన్న గుర్రము తోక నల్లగా ఉంది అంటున్నావేమిటి?” అంది వినత.

కద్రువకు పట్టుదల పెరిగింది. “అవును ఆ గుర్రము తోక నల్లగానే ఉంది?” అంది కద్రువ.

వినతకు కూడా పట్టుదల పెరిగింది. "కాదు ఆ గుర్రము తెల్లగా ఉంది." అని అన్నది.

"ఏమిటి పందెం?" అని అన్నది కద్రువ.

" నీ ఇష్టం. నేను ఏ పందెమునకైనా సిద్ధమే?" అన్నది వినత.

అప్పుడు కద్రువ ఇలా అంది. "ఈ పందెంలో నేను గెలిస్తే అంటే ఆ గుర్రము తోక నల్లగా ఉంది అని ఋజువు అయితే, నువ్వు నాకు దాస్యము చెయ్యాలి. ఆ గుర్రము తోక తెల్లగా ఉండి నువ్వు గెలిస్తే, నేను నీకు దాస్యము చేస్తాను." అంది కద్రువ.

వినతకు కుమారుడు అరుణుడు ఇచ్చిన శాపం పనిచెయ్యసాగింది. వివేకం నశించింది. కద్రువ వేసిన పందానికి ఒప్పుకుంది.

" ఇప్పుడు పొద్దు పోయింది. మన భర్తకు సాయంకాల సంధ్యకు వేళ అయినది. మనము ఇప్పుడు ఇంటికిపోయి రేపు పగలు వచ్చి ఆ గుర్రము తోక తెల్లగా ఉన్నదీ నల్లగా ఉన్నదీ తేల్చుకుందాము" అని అన్నది కద్రువ.

వినత, కద్రువ ఇద్దరూ తమ తమ గృహములకు వెళ్లారు. నిజానికి ఆ గుర్రపు తోక తెల్లగానే ఉందని కద్రువకు తెలుసు. ఏదో ఒక కుతంత్రము పన్ని పందెము గెలవాలని నిశ్చయించుకుంది. ఆ రాత్రి తన కుమారులనందరినీ పిలిచింది. "కుమారులారా! ఈ రోజు నేను, వినత ఒక పందెము వేసుకున్నాము. ఉచ్చైశ్రవము తోక తెల్లగా ఉంది అని వినతా, నల్లగా ఉంది అని నేను పందెము వేసుకున్నాము. ఓడి పోయిన వారు గెలిచిన వారికి దాస్యము చెయ్యాలని పందెము. నిజానికి ఆ గుర్రము తోక తెల్లగా ఉంది. మీరు ఎలాగైనా

ఆ గుర్రము తోక నల్లగా ఉంది అని భ్రమించజేయాలి." అని అన్నది.

వాసుకి మొదలగు వారు "అమ్మా అది అధర్మము. ఆ పని మేము చెయ్యలేము. అదీ కాకుండా మాకు నీవు ఎంతో వినత కూడా అంతే. ఆమె కూడా మాకు మాతృసమానురాలు. తల్లికి ద్రోహం చేస్తే పాపం వస్తుంది. మమ్మల్ని ఈ పాపం చెయ్యమనడం నీకు ధర్మమా!" అని అన్నారు.

కద్రువ తన పట్టుదల వదల లేదు. "ఎలాగైనా మీరు ఆ గుర్రము తోక నల్లగా చెయ్యాలి." అని చెప్పింది.

" మేము ఈ దేశము విడిచి పోతాము గాని ఆ పని మాత్రము చెయ్యము. మమ్ములను బలవంత పెట్టకు." అని అన్నారు వాసుకి మొదలగు వారు.

కద్రువ కోపంతో ఊగి పోయింది. "అయితే వినండి. అర్జునుడి మనుమడు జనమేజయుడు తన తండ్రిని చంపాడనే కోపంతో తక్షకుడిని అంతమొందించాలని సర్పయాగం చేస్తాడు. ఆ యాగాగ్నిలో పడి మీరంతా భస్మము అవుతారు. ఇదే నా శాపము." అని పలికింది కద్రువ.

తల్లి ఇచ్చిన శాపానికి వాసుకి మున్నగు వారు గడా గడా వణకి పోయారు. అందులో కొంతమంది పాములు "అమ్మా అమ్మా మేమున్నామమ్మా ...ఆ గుర్రము తోక నల్లగా చేస్తామమ్మా" అన్నారు. వెంటనే వారంతా పోయి ఆ గుర్రము తోకకు వెంట్రుకల మాదిరి చుట్టుకున్నారు. (కొన్ని పాములు నల్లగా ఉంటాయి కదా. అవి చుట్టుకోగానే గుర్రము తోక నల్లగా కనపడింది).

మరునాడు పందెం ప్రకారము వినత, కద్రువ సముద్ర తీరానికి వెళ్లారు.

దూరం నుంచి చూచారు. గుర్రము తోక నల్లగాకనపడింది.  కద్రువ మోసం గ్రహించ లేని వినత మొహం పాలిపోయింది. కద్రువకు పట్టరాని ఆనందం కలిగింది. పందెం ప్రకారము వినత కద్రువకు దాస్యం చెయ్యడం ప్రారంభించింది.  కద్రువకు వినత మీద కక్ష పెరిగింది. దాసిగా ఆమెకు చెప్పరాని పనులుచెప్పి బాధిస్తూ ఉంది.

అనుకున్న మాట ప్రకారం వినత కద్రువకు దాస్యం చేస్తూ ఉంది. అప్పుడు వినతకు తన పెద్దకొడుకు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. తనకు రెండవ కొడుకు ఎప్పుడు పుడతాడా ఎప్పుడు తనను దాస్య విముక్తను చేస్తాడా అని ఎదురు చూస్తూ ఉంది.

ఇంతలో  రెండవ అండము పగిలి మహా బలవంతుడైన గరుత్మంతుడు జన్మించాడు. కశ్యపుడు బ్రహ్మ మానస పుత్రుడు. కశ్యపుని కుమారుడు గరుత్మంతుడు. అందుకని బ్రహ్మగారు గరుడునికి తాతగారు. యవ్వనం లో ఉన్న గరుడుడు ఆకాశమంతా విహరిస్తుంటే తాతగారు వాడిని ముద్దు చేస్తున్నాడు.

ఒక రోజు నారదుడు గరుడుని దగ్గరకు వచ్చాడు. గరుడుడు నారదునికి నమస్కరించాడు.

"గరుత్మంతా!  ఏంటయ్యా ఇది! అక్కడ నీ తల్లి తన సవతికి దాస్యం చేస్తుంటే నువ్వు ఇక్కడ ఆనందంగా విహరిస్తున్నావా! నీకు ఇంత బలమూ, శౌర్యమూ ఉండి ఏం ప్రయోజనము. తల్లి దాస్యము తీర్చలేని నీ శౌర్యము బలము ఎందుకూ పనికి రాదు కదా!" అని అన్నాడు.

గరుడుడు ఆశ్చర్యపోయాడు. “మహర్షీ! నా తల్లికి దాస్యమా? ఎలా జరిగింది. నా తల్లి  ఎందుకు దాస్యం చేస్తూ ఉంది.” అని అడిగాడు. నారదుడు జరిగినది అంతా వివరంగా చెప్పాడు. గరుడుడు కోపంతో ఊగిపోయాడు. తన తల్లి మోసపోయింది అని గ్రహించాడు.  “ఆహా బాగుంది. అక్కగారు దాస్యం చెయ్యమని పందెం వెయ్యడం. చెల్లెలుగారు దాస్యం చెయ్యడం. నా తల్లి దాసిగా బతుకుతూ ఉంది.” అని అనుకున్నాడు.

మారు మాటాడకుండా ఇంటికిపోయి తల్లికి నమస్కరించాడు.  వెంటనే కద్రువ దగ్గరకుపోయాడు. “అమ్మా! నీ చెల్లెలు దాసిగాబతుకుతుంటే నీకు అది గొప్పగా ఉందా! నీ చెల్లిని దాస్యవిముక్తను చెయ్యి. నీ గౌరవం నిలబెట్టుకో! అమ్మా! నీకు వేయి మంది పుత్రులు ఉన్నారు. నేను కూడా నీకు పుత్రసమానుడనే కదా! అమ్మా నా మొహం చూచి అయిన దయతో నా తల్లిని వదిలి పెట్టు. జరిగింది ధర్మమో అధర్మమో ఇప్పుడు చర్చ అనవసరం. నా తల్లి కి ఈ దాస్యం పురాకృత కర్మ ఫలమని అనుకుంటాను. ఇప్పుడు నా తల్లిని విడిచిపెడితే నేను సంతోషిస్తాను.” అని అన్నాడు గరుత్మంతుడు.

ఆ మాటలకు కద్రువ ఇలా బదులు చెప్పింది. “నాయనా! నీవు చాలా బలవంతుడవు. నేర్పరివి. కాబట్టి నీవు వృధా మాటలు ఎందుకు మాట్లాడుతావు. చేతనయితే నీ శక్తి చేతల్లో చూపించు. నీవు నీ తల్లి మంచి కోరెదవేని, నీ తల్లికి దాస్యవిముక్తి నీకు ఇష్టం అయితే వెంటనే నీవు పోయి స్వర్గంలో ఉన్న అమృతభాండమును తెచ్చి నాకు ఇవ్వు. వెంటనే నేను నీ తల్లిని దాస్యము నుండి విముక్తురాలిని చేస్తాను. నీకు సంతోషం కలిగిస్తాను.”  అని చెప్పింది కద్రువ.

ఆ మాటలకు గరుడుడు “అమ్మా! ఇప్పుడే పోతున్నాను. అమృత భాండం

తీసుకొని వస్తాను." అని వెంటనే తండ్రి కశ్యపుని  దగ్గరకు వెళ్లాడు. తనకూ కద్రువకూ జరిగిన సంభాషణ అంతా వివరించాడు. అమృత భాండము తేవడానికి తండ్రి ఆశీర్వాదము కోరాడు. కశ్యపుడు సంతోషించాడు. కొడుకును దీవించాడు.

"నాయనా గరుడా! నీ ఆశయం మంచిదే. కాని ఇంద్రుడు అమృత భాండమును చాలా గుప్తంగా ఉంచాడు. అది ఎక్కడ ఉందో దేవతలకే తెలియదు. నీవు ఎలా తెలుసుకోగలవు. పైగా ఆ అమృత భాండము జలముల మధ్యలో, అగ్ని కీలల మధ్య, సాయుధులు, బలవంతులు, మహా కోపం కలవారు, పెద్ద పెద్ద శరీరములు కలవారు అయిన రాక్షసుల కాపలా లో  ఒక ఇనప వలలో నిక్షిప్తము అయి ఉందని విన్నాను." అని అన్నాడు కశ్యపుడు.

దానికి గరుడుడు నవ్వాడు. "తండ్రీ! పుత్రవాత్సల్యముతో నీవు అలా అనడం లో తప్పులేదు. కాని అసాధారణ బలవంతుడను. ఎన్నో ఉపాయము లను తెలిసిన వాడను. నాకు అసాధ్యం అనేది లేదు. నీకు అనుమానం ఎందుకు. నేను అమృత భాండము తీసుకొని వస్తాను." అని అన్నాడు గరుడుడు.

కుమారుని మాటలకు కశ్యపుడు పొంగిపోయాడు. కుమారుని కౌగలించుకొని "పుత్రా! నీ నిశ్చయం అదే అయితే మంచిదే.  దారిలో ఒక ఏనుగు, తాబేలు ఉన్నాయి. ఆ రెండు జంతువులను నీకు ఆహారంగా సమకూర్చాను.  నీవు వాటిని భక్షించి బాగా బలం పెంచుకో. నీ కార్యము నిర్విఘ్నం గా నెరవేరుతుంది." అని దీవించాడు కశ్యపుడు.

"తండ్రీ!  ఆ ఏనుగు, తాబేలు ఎక్కడ ఉన్నాయి? ఎలా ఉంటాయి? వాటి

గురించి వివరించండి." అని అడిగాడు.

కశ్యపుడు ఆ ఏనుగు తాబేలు కథను ఇలా చెప్పాడు. "కుమారా! తూర్పు సముద్రం దగ్గర ఒక ఎత్తైన పర్వతము ఉంది. పర్వతము పేరు ఉరగము. ఆ పర్వతము దగ్గర ఒక పెద్ద మంచినీటి సరస్సు ఉంది. ఆ సమీపంలో ఒక ఏనుగు నివసిస్తూ ఉంది. ఆ సరస్సులో నీరు తాగడానికి ఏనుగు ప్రతిరోజూ ఆ సరస్సు దగ్గరకు వెళుతూ ఉంటుంది.

ఆ సరస్సులో ఒక తాబేలు కూడా నివాసము ఏర్పరచుకుంది. ఆ సరస్సు తనదిగా భావిస్తూ ఉంటుంది. ఏనుగు నీళ్లు తాగడానికి వచ్చినప్పుడు తాబేలు ఆ ఏనుగుతో తగవులాడుతూ ఉంటుంది. ఏనుగు కూడా తాబేలు మీద పగ పెంచుకుంది. ఆ ఏనుగు, తాబేలు పూర్వ జన్మలో మధు, కైటభులు అనే రాక్షసులు. కాల వశమున ఏనుగు తాబేలుగా పుట్టారు. తమ పూర్వ జన్మల గురించి తెలియదు కాబట్టి అవి పోట్లాడుకుంటున్నాయి.

"వత్సా! ఇంకొక విషయము. ఏనుగు భూమి మీద ఉంటుంది. నీ తాబేలు నీటిలో ఉంటుంది. నీవు రెండింటినీ ఒకేసారి పట్టుకోవాలి. లేకపోతే అవి నీకు చిక్కవు." అని అన్నాడు కశ్యపుడు.

"అదెలా సాధ్యం?" అన్నాడు గరుడుడు.

కశ్యపుడు నవ్వి "దానికీ ఒక ఉపాయం ఉంది. ఏనుగు నీరు తాగడానికి వచ్చినప్పుడు తాబేలు దానితో పోట్లాడుతుంది. ఆ ఉద్రేకంలో అది నీరు వదిలి బయటకు వస్తుంది. ఆ సమయంలో పొంచి ఉండి రెండింటినీ ఒకేసారి పట్టుకో. నీవు ఆ రెండింటినీ ఆరగిస్తే నీకు స్వర్గంలో ఉన్న అమృతం తెచ్చే శక్తి లభిస్తుంది." అని అన్నాడు కశ్యపుడు.

తండ్రికి నమస్కరించి గరుడుడు ఆ గజ కచ్ఛపములు ఉన్న కొలను దగ్గరకు బయలుదేరాడు. గరుడుడు తన శరీరము చిన్నదిగా చేసుకొని చిన్న పక్షిగా మారిపోయాడు. ఆ కొలను దగ్గర పొంచి ఉండి సమయం కోసం ఎదురుచూస్తున్నాడు.

ఇంతలో ఏనుగు నీరు తాగడానికి ఆ కొలను దగ్గరకు వచ్చింది. అది పసికట్టిన తాబేలు ఆ కొలనుకు అడ్డంగా నిలబడి "ఈ కొలనులో నీరు తాగడానికి వీలు లేదు." అని అరిచింది. ఏనుగు తన ముందుకాళ్లతో ఆ తాబేలును నేలకేసి అదిమింది. తాబేలు తన సగం శరీరాన్ని నీటిలోకి జార్చింది. తన వాడి గోళ్లతో ఏనుగు కాళ్లను పట్టి పీకింది. ఏనుగు కూడా తక్కువ తినలేదు. తన తొండంతో తాబేలును బాదింది. ఏనుగుకూ తాబేలుకూ ఇలా యుద్ధం సాగుతూ ఉంది.

తాబేలుకు కోపం ఎక్కువ అయింది. దీని పని ఇట్టా కాదని తాబేలు నీటినుండి వెలుపలికి వచ్చింది. తటాలున ఏనుగు రెండు కాళ్లను పట్టుకుంది. ఇదే అదను అని గరుడుడు తన శరీరం పెంచి ఒక కాలితో ఏనుగును, మరొక కాలితో తాబేలును పట్టుకొని ఆకాశంలోకి ఎగిరాడు. అనుకోని ఈ సంఘటనకు ఏనుగు తాబేలు స్పృహ తప్పాయి.

గరుడుడు వాటిని సునాయాసంగా మోసుకుంటూ ఎగురుతూ దారిలో ఒక పెద్ద వృక్షమును చూచాడు. ఆ చెట్టు కొమ్మ ఐదు యోజనముల దూరము విస్తరించి ఉంది. ఆ చెట్టుకొమ్మ మీద కూర్చుని వాటి రెండింటినీ తీరిగ్గా తిందామని అనుకున్నాడు. ఆ చెటు కొమ్మ మీద వాలాడు. గరుడుని బరువు, ఏనుగు బరువు, తాబేలు బరువు -- ఈ మూటి బరువు తట్టుకోలేక 5

యోజనములు విస్తరించి ఉన్న అంత పెద్ద చెట్టుకొమ్మ కూడా పెళా పెళా మంటూ విరిగి పోయింది. ఆ చెట్టు కొమ్మకు వేలాడుతూ వాలఖిల్యులు అనే మహా మునులు తపస్సు చేసుకుంటున్నారు. వారిని చూచాడు గరుడుడు. అంతే. విరిగి పోతున్న ఆ చెట్టు కొమ్మను కింద పడకుండా తన ముక్కుతో పట్టుకున్నాడు. మరలా పైకి ఎగిరాడు. ఆ చెట్టు కొమ్మను, ఏనుగును, తాబేలునూ మోసుకుంటూ ఎగురుతున్నాడు.

ఇది చూచి ఆ చెట్టు కొమ్మకు వేలాడుతున్న మునులు ఆశ్చర్యపోయారు. అతనిని కశ్యప పుత్రుడు గరుడునిగా భావించారు. లేకపోతే ఇతరులకు ఇంతటి బలము సాహసము ఎక్కడి నుండి వస్తాయి అని అనుకున్నారు. గరుడుడు మెల్లగా కిందిగా ఎగురుతున్నాడు. నేల బారుగా ఎగురుతుంటే ఆ మునులు క్షేమంగా కిందికి దిగారు. గరుడుని ఆశీర్వ దించి తమ దారిన వెళ్లిపోయారు.

ఇప్పుడు గరుడునికి ఆ కొమ్మను ఎక్కడ వదలాలా అని ఒక సమస్య అయింది. ఎక్కడో ఒక చోట వదిలితే అది జనపదాల మీద పడి జనం చచ్చిపోతారు. ఎలా అని ఆలోచిస్తున్న సమయంలో ఆకాశం నుండి ఒక వాక్కు వినిపించింది.

"గరుడా! నీవు ఆ కొమ్మను అనునిత్యము దురాచారాలతో కలుషితమైన కుళింద దేశములో ఆ కొమ్మను వదులు." అని వినపడింది.

వెంటనే గరుడుడు కుళింద దేశమునకు ఎగిరిపోయాడు. అక్కడ ఆ కొమ్మను విడిచిపెట్టాడు. ఆ కొమ్మ తాకిడికి ఆ దేశంలో ఉన్న పాపాత్ములైన జనం మరణించారు. లోక కల్యాణము జరిగింది.

తరువాత గరుడుడు గజ కచ్ఛపములతో ఒక పర్వత శిఖరము మీద చదునైన ప్రదేశముమీద ఆగాడు. ఆ గజ కచ్ఛపములను తనివితీరా ఆరగించాడు. తండ్రి వశిష్టుడు చెప్పినట్టు గరుడినికి కొండంత బలం వచ్చింది. వేగంగా అమృతం కొరకు అమరావతి వైపు సాగిపోయాడు. అమృతం ఉన్న చోటుకు చేరుకున్నాడు. అమృత భాండము చుట్టు అగ్ని కీలలు ఆకాశానికి ఎగుస్తున్నాయి. ఆ మంటలలోకి దూకితే తన రెక్కలు కాలిపోతాయి అని అనుకున్నాడు గరుడుడు.

వెంటనే తాతగారైన బ్రహ్మదేవుని వద్దకు పోయాడు. "తాతగారూ! మా అమ్మ, ఆమె అక్క వేసుకున్న పందెం వలన అకారణంగా మా అమ్మకు దాస్యము చేసే దుస్థితి కలిగింది. మా తల్లి దాస్యవిముక్తికి నాకు అమృత భాండం కావాలి. దాని కోసం వచ్చాను. అమృత భాండం చుట్టు అగ్నికీలలు ఎగిసిపడుతున్నాయి. నాకు తగిన దారి చూపండి." అని అడిగాడు గరుడుడు.

"నాయనా గరుడా! అగ్ని ఆరిపోయే ఉపాయం చెబుతాను. నీవు వెన్నను సేకరించి తీసుకొని వచ్చి అగ్ని లో వేసిన, అగ్ని కీలలు మందగిస్తాయి. అప్పుడు నీవు అమృత భాండం తీసుకొన వచ్చును అని చెప్పాడు. వెంటనే గరుడుడు ఆవులు ఉన్న ప్రదేశములకు పోయి కొండంత వెన్న సేకరించి తెచ్చి అగ్నిలో పడవేసాడు. అగ్ని ఆరిపోయింది. అప్పుడు చుట్టు ఉన్న రాక్షసులను చంపాడు. నీటిని బయటకు తోడేసాడు. అమృత భాండము వద్దకు చేరుకున్నాడు. అమృత భాండమును తీసుకొని ఆకాశ మార్గాన ఎగిరిపోతున్నాడు.

చావగా మిగిలిన రాక్షసులు పోయి ఈ విషయం దేవేంద్రునికి మనవి

చేసారు. వెంటనే దేవేంద్రుడు తన దేవసేనలతో వచ్చి గరుడునితో యుద్ధం చేసాడు.  గరుత్మంతుడు దేవసేనలను తన కాలి గోళ్లతో, ముక్కుతో, రెక్కలతో చెల్లాచెదరు చేసాడు. అప్పుడు ఇంద్రుడు తన వజ్రాయుధమును గరుడుని మీద ప్రయోగించాడు. ఆ వజ్రాయుధము గరుడుని మీదికి దూసుకొని వస్తూ ఉంది.  గరుడుని పరాక్రమమును  చూచి ఆ వజ్రాయుధము వెనక్కు తిరిగి దేవేంద్రుని వద్దకు చేరుకుంది.  దేవేంద్రుడు  ఓటమిని అంగీకరించి అమరావతికి తిరిగి  వెళ్లాడు.

గరుడుడు అమృత భాండంతో కద్రువ దగ్గరకు వచ్చాడు. “అమ్మా! నేను అమృత భాండం తెచ్చాను. నా తల్లిని దాస్యం నుంచి  విడిపించు.” అని అడిగాడు.

అమృత భాండము తెచ్చాడు అన్న ఆనందంలో కద్రువ “అలాగే నీ తల్లి దాస్య విముక్త అయినది.” అని అందరిముందరా  ప్రకటించింది.   వినత  తన కుమారుడు గరుడుని వద్దకు వచ్చింది. తల్లిని తీసుకొని గరుడుడు వెళ్లాపోబోయాడు.

“ నాయనా గరుడా! మరి అమృత భాండము నాకు ఇవ్వు.” అని అడిగింది కద్రువ. “అమ్మా! నీవు ఏమి చెప్పావు. అమృత భాండము తెస్తే మా అమ్మను దాస్య విముక్తను చేస్తాను అన్నావు. నేను అమృత భాండము తెచ్చాను. నీవు నా తల్లిని అందరి ముందు దాస్యవిముక్తను చేసావు. అయి పోయింది.  నేను నీకు అమృత భాండము ఇస్తాను అని చెప్పలేదుగా!” అన్నాడు మోసానికి మోసం చెల్లు అన్నట్టు.

వెంటనే తల్లిని, అమృత భాండమును తీసుకొని ముందు తన ఇంటికి

వెళ్లాడు. తల్లిని ఇంటికి చేర్చి గరుడుడు అమరావతికి వెళ్లాడు. దేవ లోకములో అందరి ముందు అమృత భాండమును దేవేంద్రునకు సమర్పించాడు. అక్కడ సమావేశమైన దిక్పాలకులు, దేవతలు, మునుల సమక్షంలో ఇలా అన్నాడు.

"మహానుభావులారా! నా తల్లిని కద్రువ మోసపూరితంగా తన దాసిని చేసుకొన్నది. నా తల్లిని దాస్యవిముక్తను చేయుటకు నేను మీ వద్దనుండి అమృత భాండము అపహరించాను. నా తల్లిని దాస్య విముక్తను చేసాను. మరలా మీ అమృత భాండము మీకు అప్పగిస్తున్నాను. నన్ను మన్నించి నన్ను మీ మిత్రునిగా ఆదరించండి." అని వేడుకొన్నాడు. వారు అందరూ గరుడిని మన్నించారు. గరుడుని కోపం పెల్లుబికింది. "దేవేంద్రా! దేవతలారా! మునులారా! నా తల్లి దాస్యమునకు కారకులైన సర్పములు ఈ రోజు నుండి నాకు ఆహారము అవుతాయి. అనుదినమూ నే వాటిని నేను నా కాలి గోళ్లతోనూ, ముక్కుతోనూ చించి చెండాడుతాను. దీనికి మీరందరూ సాక్షులు." అని ప్రతిజ్ఞ చేసాడు.

గరుడుడు చేసిన ప్రతిజ్ఞకు దేవతలందరూ అతనిని అభినందించారు. దేవతలు, మునులు కలిసి గరుడునికి ఏదైనా వరం ప్రసాదించవలసినదిగా దేవేంద్రుని వేడుకున్నారు. "దేవతలారా! మహర్షులారా! గరుడునికి నేను వరములు ఇచ్చేంత వాడినా! ఇతడు సాక్షాత్తు విష్ణ్వంశ సంభూతుడు. రాబోవు కాలములో లోక కల్యాణార్ధము యాదవ వంశములో శ్రీ కృష్ణునిగా అవతరించి, దుష్ట శిక్షణ, శిష్ఠ రక్షణ చేస్తాడు." అని అన్నాడు దేవేంద్రుడు.

ధర్మనందనా! నీ పక్కన నిలబడి ఉన్న శ్రీకృష్ణుడు సాక్షాత్తు గరుత్మంతుని అవతారము." అని భీష్ముడు గరుత్మంతుని కథ వినిపించాడు.

( ఈ సందర్భంలో మీకు ఒక విషయం మనవి చేస్తాను. ఇదివరలో మహాభారత కథలో సౌపర్ణోపాఖ్యానము మనము చదువుకున్నాము. మరలా దానిని ఇక్క డ చెప్పనవసరం లేదు. పైగా గోరఖ్ పూర్ వారు ప్రచురించిన వ్యాస మహా భారతము (సంస్కృత ప్రతిలో) అనుశాసనిక పర్వంలో సౌపర్ణోపాఖ్యానము రాయబడలేదు. కాని తిక్కన భారతం తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన ప్రతిలో ఉంది. తిక్కన గారు సంస్కృత మూలంలోని కొన్నిటిని వదిలివేసారేమో గానీ లేని విషయములు చేర్చలేదు. ఇక్కడ ఈ సౌపర్ణో పాఖ్యానము చేర్చినట్టు కనపడుతూ ఉంది. పైగా ఇందులో గరుత్మంతుడే కృష్ణుని అవతారము అని రాయబడి ఉంది. ఇది సాంప్రదాయ విరుద్ధము. మనకు శ్రీమహావిష్ణువే కృష్ణునిగాఅవతరించాడని నమ్మకము. కాబట్టి ఈ సౌపర్ణోపాఖ్యానము తెలుగు మహాభారతము అనుశాసనిక పర్వములో తదుపరి చేర్చబడినది అంటే ప్రక్షిప్తము అని అనుకొనవలసి ఉంటుంది. నిర్ణయం విజ్ఞులకే వదిలివేస్తున్నాను.).

“ పితామహా! నా మదిలో ఇంకొక సందేహము మెదులుచున్నది. ఎవరైనా బ్రాహ్మణులకు ఏదైనా ఇస్తానని చెప్పి, ఇవ్వకుండా ఎగవేసిన, వాని గతి ఏమి వివరించండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! నీకు ఒక కథ చెబుతాను. ఆ కథ నీవు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తుంది. ఒక అడవిలో ఒక నక్క, కోతి స్నేహంగా ఉన్నాయి. ఒక రోజు కోతి నక్కతో ఇలా అంది. “మిత్రమా! నీవు పూర్వ జన్మలో ఏమి పాపం చేసావో గానీ, ఈ జన్మలో నీకు చచ్చిన పోయిన శవాలు ఆహారంగా ఏర్పడ్డాయి.” అని అన్నది.

అప్పుడు ఆ నక్కకు పూర్వ జన్మ స్మృతి కలిగింది. “ఓ మిత్రమా! నేను గతజన్మలో ఒక బ్రాహ్మణునికి కొంత ధనము ఇస్తాను అని చెప్పి ఇవ్వకుండా

ఎగవేసాను. అందుకని నాకు ఈ జన్మలో ఈ విధంగా చచ్చిపోయిన కళేబరములు ఆహారంగా నిర్దేశించబడ్డాయి.” అని అన్నాడు.

కాబట్టి ధర్మనందనా! బ్రాహ్మణునికి ఏదైనా ఇస్తాను అని చెప్పి ఇవ్వకుండా ఎగవేసిన వాడికి అటువంటి జన్మ లభిస్తుంది.” అని అన్నాడు.

“పితామహా! తక్కువ కులము లో పుట్టినా కూడా గొప్ప గుణములు, మంచి ప్రవర్తన ఉన్న వానికి మంత్ర విద్య తంత్ర విద్య బోధించడం ధర్మవిరుద్ధమా!” అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు ఒక కథ చెబుతాను. అదే నీ ప్రశ్నకు సమాధానం అవుతుంది. పూర్వము హిమాచలము మీద అనేక మంది బ్రాహ్మణులు తపస్సు చేసుకుంటున్నారు. వారి వద్దకు ఒక ధర్మ నిష్ఠా గరిష్టుడు, మంచి గుణగణములు, గొప్ప ప్రవర్తన కల వాడు అయిన శూద్రుడు వచ్చి “అయ్యా! మీరందరూ తపస్సు చేస్తున్నారు కదా. నాకు కూడా తపస్సు ఎలా చెయ్యాలో ఉపదేశించండి.” అని అడిగాడు. దానికి ఆ బ్రాహ్మణులు “ఓ ధర్మాత్మా! నీవు శూద్రుడవు. నీకు వైదిక విద్య ఉపదేశించడం తగదు. నీవు మాకు శుశ్రూషలు చేయుటకు తగినవాడవు.” అని అన్నారు.

ఆ శూద్రుడు కూడా అలాగే అని అక్కడే ఒక చిన్న పర్ణశాల వేసుకొని ఆ విప్రులకు సేవ చేస్తున్నాడు. కాని ఆ విప్రులు చేస్తున్న కార్యములు చూస్తూ తాను కూడా అతిథి పూజలు, దేవ,పితృపూజలు తనకు తోచిన రీతిలో చేస్తున్నాడు. ఒక రోజు అక్కడ తపస్సు చేసుకుంటున్న విప్రులకు గురువుగారు అతని ఆశ్రమమునకు వెళ్లాడు. అతడు చేస్తున్న అతిథి పూజలు, దేవ పితృ కార్యములు చూచి సంతోషించాడు. అతడు చేస్తున్న పూజలలో లోపముల

గురించి  చెప్పి పుణ్య కార్యములు ఇలా చెయ్యాలి అని ఉపదేశించాడు.  ఆ శూద్రుడు కూడా గురువు గారికి నమస్కరించి ఆయన చెప్పినట్టు దేవ పితృ కార్యములు ఆచరించాడు.

కాల క్రమమున ఆ శూద్రుడు, గురువుగారూ మరణించారు. మరు జన్మలో  శూద్రుడు ఒక ఉత్తమ రాజవంశములో  ఒక రాజకుమారుడి గానూ, ఆ గురువుగారు సకల మైన వేద శాస్త్రములకు నిలయమైన బ్రాహ్మణుని ఇంట్లో జన్మించాడు. అతడు పెరిగి పెద్ద వాడై గుణ సంపన్నుడయ్యాడు. కాలక్రమమున  ఆ రాజకుమారుడు ఆ బ్రాహ్మణ కుమారుని తన వద్ద పురోహితునిగా చేసుకున్నాడు. అతనికి సకల సంపదలు సమకూర్చాడు. కాని ఆ రాజకుమారుడు ఈ బ్రాహ్మణ కుమారుని చూచి ఓరగా నవ్వుతూ ఉండేవాడు. ఈ బ్రాహ్మణ కుమారునికి మాత్రము రాజకుమారుడు ఎందుకు నవ్వుతున్నాడో అర్థం కాలేదు. ఒకరోజు అడిగాడు.

౯రాజకుమారా! మీరు నన్ను చూచినప్పుల్లా సన్నగా నవ్వుకుంటున్నారు. నా వలన ఏమైనా అపరాధము జరిగినదా! దయచేసి తెలియచెయ్యండి.౯ అని అడిగాడు.

౯విప్రోత్తమా! నాకు పూర్వజన్మ జ్ఞానము కలదు. కిందటి జన్మలో నేను శూద్రుడను. మీరు గురువుగారు.  మీరు నాకు వైదిక విద్యలో ని మెళుకువలు, తపస్సు ఎలా చెయ్యాలో, దేవ, పితృకార్యములు ఎలా చెయ్యాలో  బోధించారు. తత్ఫలితంగా ఈ జన్మలో  మీరు ఒక రాజ పురోహితుడుగా క్షత్రియునకు సేవ చేస్తూ  ఉన్నారు. అది గుర్తుకు వచ్చి నవ్వుకుంటున్నాను. అంతేకానీ నీ వలన ఏమీ లోపము లేదు. నీవు ధర్మపరుడవు. నీలో లోపం ఎందుకు ఉంటుంది.౯ అని అన్నాడు రాజకుమారుడు.

కాబట్టి ధర్మ నందనా! వైదిక విద్యను, మంత్ర తంత్రములను, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకూ, అదీ ఆ విద్యలు నేర్చుకొనుటకు అర్హత కలిగిన వారికి మాత్రమే ఉపదేశించాలి." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

" పితామహా! ఈ లోకంలో ఎంతో మంది జనులు ఉన్నారు కదా! లక్ష్మీదేవి వారిలో ఎవరి దగ్గర నివసిస్తుంది." అని అడిగాడు.

" ధర్మనందనా! ఒక సారి రుక్మిణీదేవి లక్ష్మీదేవిని ఇలాంటి ప్రశ్న వేసింది. అప్పుడు లక్ష్మీదేవి రుక్మిణికి చెప్పిన సమాధానమే నేను నీకు చెబుతాను. నిత్యము సత్యము పలికేవారు, శుచిగా శుభ్రంగా ఉండేవారు, గురువుల ఎడల భక్తి శ్రద్ధలు కలవారు, ఎల్లప్పుడూ అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండేవారు, ప్రతి కార్యమును దక్షతతో దీక్షతో చేసేవారు, మనసులో ఎలాంటి మలినము లేని వారు, ఎల్లప్పుడూ మంచి పనులు చేసేవారు, విజ్ఞాన వంతులు, తపస్సు చేసుకొనేవాళ్లు, తనకు ఉన్నంతలో ఇతరులకు దానం చేసేవాళ్లు, బ్రహ్మచర్యము పాటించేవాళ్లు (అంటే పెళ్లి చేసుకోకూడదని కాదు. వివాహము చేసుకున్న భార్యను తప్ప పరస్త్రీలను కన్నెత్తి చూడని వారు బ్రహ్మచారులు), ఇంద్రియములను నిగ్రహించినవారు, వీరంతా నాకు ప్రేమపాత్రులు. నేను ఎల్లప్పుడూ వారి దగ్గరే ఉంటాను.

ఇంక, క్రూరాత్ములు, నాస్తికులు, చేసిన మేలు మరచిపోయే కృతఘ్నులు, చెడ్డబుద్ధి కలవారు, వీరి దగ్గర అసలు ఉండను.

ఇంక స్త్రీల విషయానికి వస్తే, ఎవరి ఎంగిలి తినని వారు, ఇల్లు వాకిలి శుభ్రంగా ఉంచుకొనే వారు, ఇంటిలో పాత్రలను శుభ్రంగా ఉంచుకొనే వారు, వీరి యందు నేను నివసిస్తాను.

ఇంక ఎల్లప్పుడూ భర్తకు ఎదురు చెప్పేవారు, ఎల్లప్పుడూ ఒకరిని నిందించేవారు, భర్త కు తెలియకుండా పరపురుషుల ఇళ్లకు వెళ్లేవారు, ఎప్పుడూ నిద్రపోయేవాళ్లు, ఇలాంటి స్త్రీల వద్ద నిలువను.

ఇంకా నేను తామర పుష్పముల యందు, పూల తోటలలోనూ, ఫలవృ క్షముల యందు నివసిస్తాను. అని లక్ష్మీదేవి రుక్మిణికి చెప్పింది.” అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

“ పితామహా! ఒక ఇబ్బంది కరమైన ప్రశ్న అడుగుతాను. పురుషులు స్త్రీలతో సంగమించేటప్పుడు, రతిలో సుఖము ఎవరికి ఎక్కువగా ఉంటుంది. పురుషులకా లేక స్త్రీలకా....”అని అడిగాడు.

(నిజంగా ఈ ప్రశ్న అసంబద్ధము. ఎందుకంటే భీష్ముడు బ్రహ్మచారి. స్త్రీ సంగమము ఎరుగడు. అతడు ఈ ప్రశ్నకు ఎలా సమాధానము చెప్పగలడు. దానికి కూడా భీష్ముడు ఒక కథ చెప్పి తప్పించుకున్నాడు.)

“ ధర్మనందనా! పూర్వము భంగాస్వనుడు అనే రాజు కు పిల్లలు లేరు. మామూలుగా యజ్ఞం చెయ్యాలంటే ఇంద్రుడి అనుమతి ఉండాలి. ఈ రాజు ఇంద్రుడి అనుమతి లేకుండా యజ్ఞం చేసాడు. తత్ఫలితంగా అతనికి నూర్గురు కుమారులు కలిగారు. మహా సంతోషంతో ఉన్నాడు ఆ రాజు. కాని, తన అనుమతి లేకుండా యజ్ఞము చేసినందుకు ఇంద్రుడు అతని మీద కక్ష కట్టాడు.

ఒకరోజు భంగాస్వనుడు వేటకు పోయాడు. ఇదే సమయమని

ఇంద్రుడు అతనికి దారి తప్పేట్టు చేసాడు. రాజు ఎక్కిన గుర్రము అతనిని ఎటో లాక్కుని పోయింది. ఇంతలో అతనికి దాహం వేసింది. దగ్గరలో ఒక మంచినీటి కొలను కనిపించింది. రాజు గుర్రం దిగి ఆ కొలనులో నీరు తాగాడు. అంతే.... స్త్రీగా మారిపోయాడు. రాజు ఆశ్చర్యపోయాడు. అయాచితంగా లభించిన స్త్రీత్వానికి చింతించాడు.

“ఈ వేషంతో గుర్రం ఎక్కి ఎలా రాజధానికి పోగలను. పురజనులు నన్ను చూచి ఏమనుకుంటారు? నా భార్యలు, కుమారులు, ఏమనుకుంటారు. అని చెప్పి ఈ అడవిలోనే ఉండలేను కదా! మరి రాజభవనానికి వెళ్లక తప్పదు కదా!” అని చింతించి ఎలాగో ఒకలాగ రాజధానికి వెళ్లాడు. మంత్రులను పిలిచి జరిగిన విషయం చెప్పాడు. పెద్దకొడుకును రాజ్యాభిషిక్తుని చేసాడు. తపస్సు చేసుకోడానికి అడవులకు వెళ్లాడు.

అక్కడ ఉన్న మునులతో నివసిస్తున్నాడు. వారిలో ఉన్న ఒక ముని ఆడవేషంలో ఉన్న రాజును చూచి మోహించాడు. పెళ్లి చేసుకున్నాడు. ఆ మునికి, ఆడవేషంలో ఉన్న రాజుకు అత్యంత బలసంపన్నులైన నూర్గురు కుమారులు కలిగారు. ఆడ వేషంలో ఉన్న రాజు తన కు ముని వలన పుట్టిన నూర్గురు పుత్రులను తీసుకొని, తన అసలు కుమారుల వద్దకు వెళ్ళాడు. తాను తపస్సుకు పోవడం అక్కడ ఒక ముని తనను పెళ్లాడటం తనకు నూర్గురు బలాఢ్యులైనకుమారులు కలగటం అన్ని వారికి చెప్పాడు.

“పుత్రులారా! నేను మగవాడిగా ఉన్నప్పుడు మీరు నాకు జన్మించారు. నేను స్త్రీగా ఉన్నప్పుడు వీరు నాకు కుమారులుగా జన్మించారు. కాబట్టి మీరు అందరూ అన్నదమ్ములు. మీరందరూ ఈ రాజ్యాన్ని పంచుకొని పరిపాలించండి.” అని అన్నాడు. దానికి వారు సమ్మతించారు. రెండు వందల

మంది రాజకుమారులు రాజ్యమును పంచుకొని సుఖంగా రాజ్యపాలన చేయసాగారు. రాజ్యాన్ని విస్తరింపచేసారు.

ఇదంతా చూచి దేవేంద్రునికి కోపం వచ్చింది. నేను ఈ రాజుకు కీడు చేద్దామని సంకల్పిస్తే వీడికి అంతా మేలేజరుగుతోంది. అని చింతించాడు. వీళ్ళ మధ్య ఎలా గైనా తగవులు పెట్టాలి అనుకొని ఒక బ్రాహ్మణ రూపంలో రాజుకు మగవాడిగా ఉన్నప్పుడు పుట్టిన పుత్రుల వద్దకు వచ్చాడు. "రాజకుమారులారా! ఏంటయ్యా మీ వెర్రి! ఎవరినో తీసుకువచ్చి మీ తమ్ముళ్లు అని చెప్పగానే మీరు నమ్మడమేనా! అసలు వాళ్ల తండ్రి ఎవరో మీకు తెలుసా? ఎవడికో పుట్టిన వాళ్లు మీకు తమ్ముళ్లు ఏమిటి చోద్యం కాకపోతేనూ." అని వాళ్ల మధ్య కలతలు రేపాడు.

అదే ప్రకారము రాజు స్త్రీగా ఉన్నప్పుడు పుట్టిన పిల్లలకు కూడా లేని పోని మాటలు చెప్పి ద్వేషము రగిల్చాడు. అన్నదమ్ములు బద్ధశత్రువులు అయ్యారు. ఒకరితో ఒకరు యుద్ధం చేసుకున్నారు. అందరూ చచ్చారు. చని పోయిన తన కుమారులను చూచి స్త్రీ రూపంలో ఉన్న రాజు గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నాడు.

ఇదంతా చాటునుండి చూస్తున్న ఇంద్రుడు అక్కడకు వచ్చాడు. "ఏంటమ్మా! నువ్వు ఎవరు నీవు? ఏంజరిగింది? ఎందుకు ఏడుస్తున్నావు?" అని ఏమీ ఎరగ నట్టు జాలిగా అడిగాడు. ఆ స్త్రీ కూడా తానుయజ్ఞం చెయ్యడం, పిల్లలు పుట్టడం, వేటకు పోవడం, స్త్రీగామారిపోవడం, పెళ్లిచేసుకొని పిల్లలు కనడం, ఇప్పుడు ఇద్దరూ కొట్టుకొని చావడం అంతా పూసగుచ్చినట్టు చెప్పింది.

ఇదంతా విన్న ఇంద్రుడు తన నిజరూపంతో సాక్షాత్కరించాడు. "రాజా!

నేను ఇంద్రుడను. నువ్వు పుత్రుల కోసం యజ్ఞం చేసేటప్పుడు నా కు ఇష్టం లేకుండా చేసావు. అందుకని నీకు ఇన్ని కష్టాలు  కల్పించాను అని అన్నాడు.

" ఓ ఇంద్రా! ఏదో పొరపాటున తెలియక అలా చేసాను. అయినా  నీవు దేవతలకు అధిపతివే. పగ తీర్చుకోడానికి నీకు నేను తగిన వాడినా! కాబట్టి నన్ను దయతో రక్షించు." అని వేడుకున్నాడు.

" ఓ రాజా! నీవు పోగొట్టు కున్న కుమారులలో కొంతమందిని మాత్రం బతికిస్తాను. నీకు రాజుగా ఉన్నప్పుడు పుట్టిన పుత్రులు కావాలా!  లేక నీవు స్త్రీగా మారిన తరువాత   పుట్టిన పుత్రులుకావాలా?" అని అడిగాడు.

రాజు సిగ్గు పడుతూ "నాకు స్త్రీగా ఉన్నప్పుడు పుట్టిన పుత్రులనే బతికించు." అని అడిగింది.

"అదేమిటి. వారు కూడా నీ పుత్రులు కదా!" అని అన్నాడు.

"వారు కూడా నా పుత్రులే! కాని వారికి నేను తండ్రిని. వీరికి నేను తల్లిని. తల్లి ప్రేమ గొప్పది కదా!" అన్నాడు.

"రాజా! నీ  సత్యనిష్టకు సంతోషించాను. నీ కుమారులు అందరినీ బతికించాను." అని అన్నాడు  దేవేంద్రుడు.

"రాజా! నీకు  ఇంకొక వరకు కూడా ఇస్తాను. నీవుపోగొట్టు కున్న పురుషత్వమును మరలా నీకు వచ్చేట్టు చేస్తాను." అని అన్నాడు దేవేంద్రుడు.

"మహేంద్రా! వద్దు. నీవు నా కుమారుల నందరినీ బతికించావు అదే చాలు.

నేను స్త్రీగానే ఉండదలిచాను.” అని అన్నాడు.

“అదేమిటి మహారాజా! నీవు పురుషుడవు కదా! స్త్రీగానే ఉంటాను అనడానికి కారణమేమి?” అని అడిగాడు.

దానికి స్త్రీగా ఉన్న రాజు సిగ్గు పడుతూ ఇలా అన్నాడు. “మహేంద్రా! నీవు పురుషుడవు, నీకు తెలియదు. రతిక్రీడలలో పురుషునికన్నా ఎక్కువగా స్త్రీ యే ఆనందం, సుఖం పొందుతుంది. నేను ఆ ఆనందం వదులుకోదల్చుకోలేదు. అందుకని నేను స్త్రీగానే ఉంటాను.” అని అన్నాడు.

దేవేంద్రుడు నవ్వి అట్లే అగు గాక అని వరం ఇచ్చాడు. కాబట్టి ధర్మనందనా! నీవు అడిగిన ప్రశ్నకు సమాధానము లభించినది కదా!” అని అన్నాడు.

“పితామహా! తమరు అంపశయ్య మీద ఉండి కూడా నేను అడిగే ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పారు. నేను ఎన్నో ధర్మసూక్ష్మములు తమ ముఖతా విన్నాను. కాని అవి ఏవీ జననము, మరణము వీని వలన వచ్చే దుఃఖములను తొలగిస్తాయా! ఎన్నో జన్మలలో ఎంతోమంది తల్లి తండ్రులకు పుడుతూ, మరలా చస్తూ ఈ సంసార చక్రంలో ఇంక తిరగలేను. పితామహా! గర్భ వాసమునకు, నరకమునకు బేధము ఉందా చెప్పండి. ఈ చరాచర జగత్తు అస్థిరము. అందుకనే నేను ఈ జగత్తును విషము మాదిరి చూస్తాను. నాకు ఈ రాజ్యము వద్దు, ఈ సంసారమూ వద్దు. మోక్ష కారకమైన వైష్ణవ ధర్మమును ఉపదేశించండి. ఎందుకంటే వైష్ణవ ధర్మము ఈ యుగంలో కనిపించడం లేదు అని వ్యాసభగవానుడు చెప్పాడు. అందుకని నిన్ను అడుగుతున్నాను. నాకు వైష్ణవ ధర్మము గురించి తెలియజేయండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! ఏమిటీ వెర్రి! 18 రోజులుయుద్ధము చేసి, శత్రువుల నందరినీ చంపి, రాజ్యము కైవసము చేసుకొని, రాజ్యసుఖములు అనుభవించ వలసినదిపోయి, ఈ మాదిరి విరాగిగా మాట్లాడటం నీకే చెల్లింది. లేని యెడల యౌవనంలో ఉన్న క్షత్రియులకు ఈ మాదిరి మాట్లాడటం చెల్లుతుందా! నీవు మిథిలా నగరాధి పతి అయిన జనకుని మాదిరి మాట్లాడుచున్నావు.

నిర్వాణము (మోక్షము) అనునది శాశ్వతసుఖాన్ని ఇస్తుంది. దానిని ఇలా ఉంటుంది అని చెప్పడానికి వీలు లేదు. జీవునికి అతీతంగా ఉంటుంది. ప్రకృ తులు ఎన్నో ఉన్నాయి కాని అకృతి ఒకటే. అదే అన్నిటికి మొదలు. ఆ అకృతి ఎన్నో జీవాత్మలుగా రూపాంతరం చెందినా, ఎటువంటి వికారముపొందదు. తన స్వస్వరూపమును మరిచిపోదు. సంసారము అనే మార్గము చాలా సుగమంగా ఉన్నట్టు అనిపిస్తుంది. మోక్ష మార్గము కామ కోరికలతో కప్పబడి ఉంటుంది. కాబట్టి కామమును క్రోధమును విడిచి పెట్టి సత్త్వగుణ ప్రధానంగా జీవనం గడపాలి. దానినే వైష్ణవ ధర్మము అంటారు. నీవు ఈ ధర్మాన్ని పాటించు. సంసార భయమును విడిచిపెట్టు. మోక్ష మార్గం వైపు పయనించు.” అని అన్నాడు భీష్ముడు.

“పితామహా! తత్త్వములు, అధ్యాత్మములు, అధిభూతములు,అధి దైవములు, అను వాటికి కర్త, భర్త, హర్త అవుతూ, సకల భూతములకు ఆధారభూత మైన ఆ పరమాత్మను గురించి తెలుపండి.” అని అడిగాడు.

“ ఓ ధర్మనందనా! సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు, ఈ నలుగురూ బ్రహ్మ మానస పుత్రులు. వీరుగాక వశిష్టుడు, శంకరుడు కూడా బ్రహ్మ మానస పుత్రులు. వీరు కాకుండా బ్రహ్మకు

మరీచి, భృగుడు, అంగిరసుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనే ఆర్గురు కుమారులు ఉన్నారు. అందులో సనత్సుజాతుడు బొటన వేలి ప్రమాణంలో ఉంటాడు. అగ్ని మాదిరి మండుతుంటాడు. ఒకచోట ఉండడు. ఎల్లప్పుడూ లోకాలన్నింటిలోనూ తిరుగుతూ ఉంటాడు.

ఒక రోజు సనత్సుజాతునకు నారదుడు మేరు పర్వతము మీద కన్పించాడు. ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. ఆమాటల్లో నీవు అడిగినట్టు నారదుడు సనత్సుజాతుడిని అడిగాడు. ఆయన చెప్పిన సమాధానము నేను నీకు చెబుతాను.

విష్ణు మూర్తికి పదివేల యుగములు రాత్రి, పదివేల యుగములు పగలు. మొత్తం 20 వేల యుగములు ఒక రోజు. విష్ణువు తన స్వస్వరూపంలో ఉండటాన్ని అవ్యక్తము అని అంటారు. (అంటే విష్ణువు సర్వాంతర్యామి. అవ్యక్తుడు. అతనికి రూపము లేదు). ఆ విష్ణువు రాత్రి నిద్రపోతాడు. పొద్దుటే లేచి సృష్టి మొదలు పెడతాడు. ఎలాగంటే తాను జలములలో ఉంటాడు కాబట్టి తన వీర్యాన్ని జలములో విడిచి పెడతాడు. అది ఒక పెద్ద అండముగా ఉంటుంది.

తరువాత విష్ణువు బ్రహ్మను సృష్టించాడు. తదుపరి సృష్టికి ఆయనను కర్తగా నియమించాడు. బ్రహ్మను అహంకారము(నేను నాది అనే తత్త్వము) ఆవహించింది. తరువాత మనసు, ఇంద్రియములు, బుద్ధి, పంచభూతములు ఆవిర్భవించాయి. ఆ పంచభూతములైన ఆకాశము, గాలి, అగ్ని, జలము, భూమి ఐదింటికి గుణములుగా వరుసగా, శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము ఆవిర్భవించాయి. తరువాత దేవతలు, మునులు, రాక్షసులు, గంధర్వులు, కిన్నరులు, నరులు, జంతువులు, మొదలగు

జీవజాతులు ఆవిర్భవించాయి. వీటన్నింటినీ  అహంకారము ఆవహించింది. ఇవి అన్నీ అవ్యక్తమయిన సంసారసాగరంలో పుడుతూ చస్తూ మరలా పుడుతూ జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటాయి.

ఈ సృష్టి స్థితి లయములకు కారకుడైన విష్ణువు జీవరాసులకు శుభములు అశుభములు కల్పిస్తూ ఉంటాడు.  ఈ సంసార చక్రాన్ని తిప్పుతూ వినోదిస్తూ ఉంటాడు. పైన చెప్పిన పంచ భూతములు ఐదు, వాటిగుణములు ఐదు, పది ఇంద్రియములు, మహత్తత్త్వము,  అహంకారము, మనస్సు, బుద్ధి, ఇవి 24 తత్త్వములు.

ఇంక అధ్యాత్మము మొదలగు వాటి గురించి వివరిస్తాను.

చెవి అధ్యాత్మము అయితే  శబ్దము అధిభూతము. దిక్కులు  అధిదైవములు. చర్మము అధ్మాత్మము అయితే సంస్పర్శ అధిభూతము, గాలి దానికి అధిదైవతము.
కళ్లు అధ్యాత్మము అయితే రూపము అధిభూతము, సూర్యుడు అధిదైవతము.  నాలుక అధ్యాత్మము అయితే రసముఅధిభూతము, నీరు అధిదైవతము.
ముక్కు అధ్యాత్మము అయితే వాసన అధిభూతము, భూమి అధిదైవతము. దీనినంతా బుద్ధి ఇంద్రియ ప్రపంచముఅంటారు.

పాదములు, విసర్జకావయవము, జననేంద్రియము, చేతులు, నోరు, కర్మేంద్రియములు అనునవి అధ్యాత్మకములు.   పైనచెప్పిన  వాటికి వరుసగా నడక, విసర్జనము, ఆనందము, పని, మాట, అధిభూతములు.   వాటికి వరుసగా విష్ణువు, సూర్యుడు, బ్రహ్మ,  ఇంద్రుడు, అగ్ని,  అధిదైవతములు..

అహంకారము, మనసు, బుద్ధి అధ్యాత్మకములు. వీటికి అభిమానము, సంకల్పము, నిశ్చయము అధిదైవములు. వాటికి మేధస్సు, చంద్రుడు,బ్రహ్మ అధిదైవములు. ఇది వేదప్రమాణము. ఇవన్నీ కూడా విష్ణువు నుండి పుట్టి, లయం అవుతుంటాయి.

ఇంక అవ్యక్తము అంటే మూల ప్రకృతి. అందులో పురుష చైతన్యము చేరితే ఆ ప్రకృతి చేతనమవుతుంది. అప్పుడు ఈ ప్రపంచం అంతా వైభవంతో నడుస్తుంది. ఈ సృష్టి కంతా విష్ణుడు ఆధారము. పరమ శివుని అనుమతితో బ్రహ్మ జనన మరణములు నిర్వహిస్తూ ఉంటాడు.॥ అని సనత్సుజాతుడు నారదుడికి చెప్పాడు అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

ధర్మరాజుతో భీష్ముడు ఇంకా ఇలా అన్నాడు. ॥ధర్మజా! ఈ సృష్టికంతకూ మూలము 25వ తత్త్వము అయిన పరమాత్మ. వేద వేదాంత పురాణ వేద్యుడైన ఆ పురుషుడు ఎల్లప్పుడూ వెలుగుతూ ఉంటాడు. అతడే కాలాంతకుడైన అచ్యుతుడు, అనంతుడు, యోగి జనముల హృదయములలో నివసించేవాడు, విష్ణువు, అద్వయుడు, అసంగుడు. అతడే పరమాత్మ.॥ అని పలికాడు భీష్ముడు.

ఆ మాటలు విన్న ధర్మజుడు ఇలా అన్నాడు. ॥పితామహా! మహాను భావులు అగ్నులను తమయందు సమాహితం చేసుకుంటారు కదా! అటువంటి వారు ఆ పరమాత్మను ఎట్టివానిగా భావిస్తారు. నాకు తెలియ చేయండి.॥ అని అడిగాడు.

॥ధర్మనందనా! క్షీర సాగర మథన సమయంలో అమృతం పుట్టింది. దాని

కోసరం దేవతలు దానవులు యుద్ధం చేసుకున్నారు. అందులో దేవతలకు ఓటమి కలిగింది. వారు బ్రహ్మదేవుని ఆశ్రయించారు. అప్పుడు ఆకాశంలో నుండి “నేను మిమ్మల్ని గెలిపించడానికి వస్తున్నాను.” అనే మాటలు వినిపించాయి. ఇంతలో విష్ణుమూర్తి గరుత్మంతుని ఎక్కి, చక్రము, గద ధరించి, అసురుల మీదికి యుద్ధానికి వెడలాడు. అసురులను యుద్ధంలో ఓడించాడు. వెంటనే విష్ణువు అంతర్ధానము అయ్యాడు.

ఇదంతా చూచిన దేవతలు ఆశ్చర్యంలో మునిగిపోయారు. “ఈ మహాత్ముడెవరు?” అని బ్రహ్మ దేవుని అడిగారు. అప్పుడు బ్రహ్మదేవుడు దేవతలతో ఇలా అన్నాడు.

“ఆయన విష్ణుమూర్తి. వైకుంఠములో ఉంటాడు. ఆ విష్ణువు ఇలా ఉంటాడు అని నాకు కూడా తెలియదు. మీకు తెలుపడానికి నాకు శక్తి లేదు. కాని విష్ణువు ఇలా ఉంటాడు అని చెప్పడానికి ఒక కథ చెబుతాను వినండి.” అని బ్రహ్మ దేవతలకు ఒక కథ చెప్పాడు. ఆ కథను భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

“హిమాలయ పర్వతముల మీద మునులు, సిద్ధులు, కూర్చుని మాట్లాడుకుంటున్నారు. అప్పుడు గరుడుడు అక్కడకు వచ్చాడు. ఆ మునులకు, సిద్ధులకు నమస్కరించాడు. వారు అతనిని సుఖాసీనుని చేసారు.

“గరుడా! నిన్ను ఒక విషయం అడగాలని ఉంది.” అని అన్నారు.

“ధన్యుడను. అలాగే అడగండి. నాకు తెలిసినంతవరకూ చెబుతాను.” అని అన్నాడు గరుడుడు.

"గరుడా! నీవు విష్ణువుకు ప్రియభక్తుడవు. విష్ణుదేవుడు కూడా భక్తులకు ప్రియుడు. నీవు ఎల్లప్పుడు విష్ణువు దగ్గరే ఉంటావు కదా! దయచేసి మాకు విష్ణు తత్త్వమును ఎరింగింపవా!" అని అడిగారు.

"మహానుభావులారా! ఈ మూడు లోకములను విష్ణు మూర్తి రక్షిస్తున్నాడు అని మాత్రం నాకు తెలుసు. అంత మాత్రాన అన్ని నాకు తెలుసు అని చెప్పడం కష్టం కదా! మీకూ నాకే కాదు, విష్ణు తత్త్వము గురించి ఎవ్వరికీ తెలియదు. ఆయన కథలు మాత్రం వింటూ ఉంటాను. ఆ కథలను కావాలంటే చెప్పగలను.

నేను దేవేంద్రుని జయించి అమృత భాండమును తీసుకొని పోతుంటే "గరుడా! నీ పరాక్రమానికి మెచ్చాను. ఏదన్నా వరం కోరుకో!" అనే మాటలు ఆకాశం నుండి వినిపించాయి.

"అయ్యా! మీరు ఎవరో తెలియదు. వరాలు ఇస్తానంటున్నారు. దయచేసి మీరు ఎవ్వరో తెలిపి వరాలు ప్రసాదించండి." అని అన్నాను. నా మాటలకు బదులుగా ఒక నవ్వు వినిపించింది. తరువాత ఈ మాటలు వినపడ్డాయి.

"కాలక్రమేణా నేను ఎవరో నీకే తెలుస్తుంది. నీవు నాకు వాహనముగా ఉండు. నీకు వ్యాధులు, మరణము లేవు. నీవు అసురులను జయిస్తావు." అని ఒక కాంతి మూర్తి నా ఎదుట నిలిచి చెప్పాడు.

నేను ఆ కాంతి స్వరూపునికి చేతులెత్తి నమస్కరించాను. "మహాత్మా! నేనునీకు వాహనమవుతాను. నీవు ఎక్కిన రథమునకు ధ్వజముగా ఉండవలెనని నా కోరిక. నాకు ఆ వరము ప్రసాదించండి." అని అడిగాను.

“అట్లే అగుగాక అని ఆ కాంతి స్వరూపుడు చెప్పి తిరోహితు డయ్యాడు. (అదే గరుడ ధ్వజము. గరుత్మంతుడు ఉన్న జండా).

ఆ మాటలకు నాకు సంతోషము ఆశ్చర్యము ఒకేసారి కలిగాయి. నేను వెంటనే పోయి నా తండ్రి కశ్యపునికి ఈ విషయం తెలిపాను. “కుమారా! ఆ మహాత్ముడు ఎవరో కాదు. నారాయణుడు. నీ మీద ఉన్న దయతో నీతో మాట్లాడాడు. నేను నారాయణుని చూడడానికి ఎంతో తపస్సు చేసాను. యోగ సమాధిలో ఉన్నాను. నారాయణుని తెలుసుకోడానికి ఆయనను ఆరాధించాను. కాని నాకు అనేక శరీరములతో ఉన్న తన విశ్వరూపమును చూపించాడు. “కశ్యపా! నీలో ఇంకా కోరికలు చావలేదు. మనసులో కోరికలు పెట్టుకొని నన్ను చూడ్డం నీకు తరమా! నిస్సంగుడవై నప్పుడు(అంటే కోరికలను విడిచి పెట్టి నపుడు, మనసులో ఎటువంటి కోరికలు లేకుండా నిర్మలంగా ఉన్నపుడు) నీవు నన్ను దర్శించెదవు.” అని నాతో అన్నాడు. అటువంటి విశ్వరూపునికి సేవలు చేసే భాగ్యం నీకు కలిగింది. నీవు అదృష్టవంతుడవు. నీ జన్మ ధన్యమయినది. నీవు వెంటనే బదరికాశ్రమమునకు పోయి అక్కడ లోకమంతా పూజించే ఆ దివ్యమూర్తిని సేవింపుము.” అని అన్నాడు.

నేను వెంటనే బదరికాశ్రమమునకు వెళ్లాను. అక్కడ నారాయణుడు, అచ్యుతుడు, పుండరీకాక్షుడు, గోవిందుడు, లోకజనకుడు అనిపిలువబడే ఒక దివ్యమూర్తి కనబడ్డాడు. అతనికి భక్తితో మొక్కాను. ఆ పీతాంబర ధారి అష్టభుజములతో, శంఖ,చక్ర,గదా,శార్ఙ్గములు ధరించి ఉన్నాడు. ఆ నారాయణుడు నన్నుచూచి “వచ్చావా. మంచి పని చేసావు. నా వెంటరా!” అంటూ ఉత్తర దిక్కుగా వెళ్లాడు. నేను కూడా ఆయనను అనుసరించాను. ఎన్నోయోజనములు అలా ప్రయాణం చేసాము.

అక్కడ ఏ విధమైన ఇంధనము లేకుండా మండుతున్న అగ్నిని చూచాను. నా కన్నా ముందుపోతున్న నారాయణుడు ఆ అగ్నిలో ప్రవేశించాడు. నేనూ ఆయనను అనుసరించాను. అక్కడ పార్వతీ సమేతంగా మహాశివుడు తపస్సు చేస్తున్నాడు. నారాయణుడు ఇంకా ముందుకుపోతున్నాడు. నేను ఆయనను అనుసరించాను. ఆక్కడ అంధకారం అలుముకుంది. ఏమీ కనిపించడం లేదు. “ఈ దిక్కుకు రా!” అని శబ్దం వినిపించింది.

నేను దిక్కుతోచక ఆ దిక్కుకు వెళ్లాను. అక్కడ వెలుగు కనిపించింది. క్రమక్రమంగా చీకట్లు అంతరించాయి. ప్రకాశ వంతమైన వెలుగు కనిపించింది. అక్కడ సూర్యుడు పట్టపగలు మాదిరి ప్రకాశ వంతంగా వెలుగుతున్నాడు. కమ్మని సంగీతం వినిపిస్తూ ఉంది. తామర కొలనులు ఉన్నాయి. అందమైన మగవారినీ, ఆడవారినీ చూచాను. వారంతా ఆ నారాయణ మూర్తిని పూజిస్తూ ఉండగా ఆయన అలా వెళుతూ ఉన్నాడు. నేను కూడా ఆయనను అనుసరించాను. కాని ఆ తీక్షణమైన వెలుగును తట్టుకోలేక పోయాను. “స్వామీ!” అని అరిచాను. ఆ స్వామి నా వంక వాత్సల్యంతో చూచి “వినతా కుమారా! నిన్ను నేను మరిచిపోతానా! భయం లేదు. నా వెంటరా!” అన్నాడు. “నీవు నన్ను చూడలేదని బాధ పడకు. కేవలం మమతలు, అహంకారము, మనసులోకి రానీయకుండా, ఏకాగ్రత, నిశ్చల మైన మనస్సుతో ఉన్న వాళ్లు మాత్రమే నన్ను చూడగలరు. నీకు నా మీద ఉన్న భక్తి, నిష్ఠ వలన, కేవలం నా స్థూల రూపం మాత్రమే చూడగలుగుతున్నావు.” అని స్వామి అన్నాడు.

అప్పటికి అక్కడ ఉన్న అమిత మైన వేడి, తేజస్సు చల్లారింది. తరువాత నేను స్వామిని కొంతదూరం అనుసరించాను. తరువాత నారాయణుడు ఆకాశానికి ఎగిరాడు. నేనూ ఆయన వెంట ఆకాశంలోకి ఎగిరాను. కాని అక్కడ

స్వామి కనపడలేదు. అంతర్ధానం అయ్యాడు. కాని “ఇటురా!” అని ఒక మాట వినిపించింది. నేను అటుగా వెళ్లాను. అక్కడ ఒక తామరపూల కొలను ఉంది. అందులో తెల్లటి హంసలు విహరిస్తున్నాయి. అక్కడ నారాయణుడు స్నానం చేస్తున్నాడు. నేను స్వామీ అంటూ ఆయన దగ్గరకు పోబోయాను. కాని స్వామి కనపడలేదు. కాని అక్కడ కొన్ని వందల అగ్నులు వెలుగుతున్నాయి. వేదఘోషలు వినిపిస్తున్నాయి. ఆ సమయంలో కొన్ని వందల గరుడ పక్షులు నా మీదికి ఎగురుకుంటూ వచ్చాయి. నేను భయభ్రాంతుడ నయ్యాను. అచ్యుతా! శివా!సమస్రాక్ష! వేదమయా! అనాది నిధనా! త్రిభువనైక నాధా! త్రినయనా! గోవిందా! పద్మనాభా! హరా! కృపావిధేయా!” అని పెద్దగా ఆ స్వామిని స్తోత్రం చేసాను.

అప్పుడు ఆ స్వామి నా ఎదుట ప్రత్యక్షం అయ్యాడు. “వినతా పుత్రా! భయపడకుము.” అని బుజం తట్టాడు. నాకు భయం కొద్దిగా తగ్గింది. నేను కొద్ది కొద్దిగా కళ్లుతెరిచాను. ఆశ్చర్యపోయాను. నేను బదరికాశ్రమంలో ఉన్నాను. అంటే ఇదంతా విష్ణుమాయ అన్న మాట. నా శరీరం పులకించి పోయింది. నా ఎదుట నారాయణుడు ఎనిమిది భుజములతో సాక్షాత్కరించాడు. నేను ఆ స్వామి ముందు మోకరిల్లి “మహానుభావా! నేను తమరి పాద సేవకుడను అయితే, నీ దయకు పాత్రుడ నయితే, నేను వినడానికి అర్హుడను అయితే, నీ మహిమ నాకు తెలిసేటట్టు చెప్పు.” అని అడిగాను.

“వినతా సుతా! దేవతలు గానీ, గంధర్వులుగానీ, దనుజులుగానీ, ఇప్పటి వరకు నా నిజస్వరూపమును ఎరుగరు. అఖిల భూతములు నా యందు పుడతాయి. పెరుగుతాయి. నశించిపోతాయి. అఖిల భూతములు నాలో ఉంటాయి. అలాగే నేనూ వాటి లో ఉంటాను. నన్ను తెలుసుకొనడానికి జీవాత్మను పరమాత్మ వంక మళ్లించాలి. కామములను, అహంకారమును,

జడత్వమును, కోపమును వదిలిపెట్టాలి. అపరిగ్రహము పాటించాలి(ఒకరి దగ్గర నుండి తీసుకొనడం మానాలి). అహింసను అవలంబించాలి. మనస్సు నిర్మలంగా ఉంచుకోవాలి. నిత్యతృప్తుడుగా ఉండాలి. (దొరికినదానితో తృప్తి పడాలి). శాంత చిత్తుడై ఉండాలి. అలాంటి వారికి నేను దర్శనం ఇస్తాను. సాంఖ్యయోగము అభ్యసించినప్పటికినీ, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచుకోలేని వారికి, నిశ్చయాత్మకబుద్ధి లేని వారికి నేను కనిపించను. అధిక మోహములో పడి కొట్టుకుంటూ, పూజలు, వ్రతములు, ఉపవాసములు ఆడంబరంగా చేసేవారికి నేను కనిపించను. ఏకాంతిక ధ్యానపరులకు నన్ను ఎరుగుట సాధ్యము. రజస్సు తమోగుణములకు లోను కాకుండా, కేవలం సత్వగుణ సంపన్నులకు నేను దర్శనం ఇస్తాను.

నేను వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అనే పేర్లతో నాలుగు విధములుగా విభజింప బడి ప్రాణుల యందు ఆత్మ, బుద్ధి, అహంకారము, మనస్సు అనే నాలుగు విధములుగా ప్రవర్తిస్తూ ఉంటాను. ఇదే నా స్థూల రూపము. నీవు కూడా నా మనసు తెలుసు కొని, నాయందు భక్తితో, నన్నే ఎల్లప్పుడూ ధ్యానిస్తూ నా స్వస్వరూపమును తెలుసుకో." అని నారాయణుడు తెలియ చేసాడు.

నాకు నారాయణుడు తెలియజేసిన విషయములు మీకు చెప్పాను." అని అన్నాడు సుపర్ణుడు (గరుత్మంతుడు). ఆ మాటలు విన్న సిద్ధులు ఆనందతో పరవశులయ్యారు. "మహానుభావా! నీవలన విష్ణు తత్త్వము గురించి విన్నాము. మా జన్మ ధన్యమయింది. ఈ కథ అత్యంత పుణ్యదాయకము. ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదిస్తుంది. దీనిని భక్తితో వింటే బ్రాహ్మణునకు వేద విద్య అలవడుతుంది. క్షత్రియులకు సర్వత్రా విజయం లభిస్తుంది. వైశ్యులకు ధనలాభం కలుగుతుంది. శూద్రులకు అన్ని

రకములైనసుఖములు కలుగుతాయి. సర్వజనులకు ఇహ, పర లోకములు సిద్ధిస్తాయి.౯ అనిపొగిడారు. ,

దర్మనందనా! ఈ వృత్తాంతము పూర్వము బ్రహ్మదేవుడు వసువులకు చెప్పాడు. వసువులు మా అమ్మ గంగాదేవికి చెబుతుంటే నేను విన్నాను. నీకు చెప్పాను.

(భీష్ముని పుట్టుక సందర్భంగా మనము అష్టవసువుల గురించి చదువుకున్నాము. అందులో ఏడుగురు వసువులను గంగాదేవి పుట్టగానే గంగకు అర్పించింది. ఎనిమిదవ వాడు శాపవశాత్తు చాలాకాలం ఈ భూమి మీద ఉన్నాడు. భీష్ముడిగా ప్రసిద్ధికెక్కాడు. చివరకు స్వచ్ఛంద మరణం పొందాడు.)

ధర్మ నందనా! మనస్సుతో చేసే వివిధములైన సంకల్పములను వదిలిపెట్టి, ఆత్మలో అగ్నిని ప్రతిష్టించుకొని, బాహ్య ప్రపంచముతో సంబంధములను తెంచుకొని అంతర్ముఖుడై విష్ణువును ధ్యానించు వారికి మోక్షము అనాయాసంగా లభిస్తుంది.౯

అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పినట్టు వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు వివరించాడు.

మహాభారతము

అనుశాసనిక పర్వము

ప్రథమాధ్యాయము సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

మహాభారతం పాఠకులకు ఒక మనవి.

ఇప్పటి దాకా నేను ~~ఈ~~ కింది ఇ.మైల్  ఐ.డి.తో నా మైల్సు పంపుతున్నాను. బయట వారి నుండి అందుకుంటున్నాను.

subrahmanyam_mv1947@yahoo.com

ఇటీవల నా ఇ మైల్ ఐ.డి. ఎవరో హాక్ చేసారు. ఆ విషయం నాకు శ్రీ కె.వి.రావుగారు తెలియజేసారు. ఇప్పుడు నా ఐ.డి. ఓపన్ కావడం లేదు.  అందుకని నేను కొత్త ఐడి క్రియేట్ చేసుకున్నాను. దానిని కింద ఇస్తున్నాను.

modalivenkatasubrahmanyam@gmail.com

దయచేసి నాకు పంపే మైల్సు అన్నీ పై  ఐ.డి.కి పంపండి. ఇప్పటికే నాకు మైల్సు పంపిన వారు దయ చేసి వాటిని తిరిగి పై ఐ.డి.కి ఫర్వార్డు చెయ్యమని మనవి. అప్పుడే నేను వాటికి జవాబు ఇవ్వడానికి వీలు  అవుతుంది.

భవదీయుడు...యం.వి.సుబ్రహ్మణ్యం.

# మహా భారతము

# అనుశాసనిక పర్వము

## ద్వితీయాశ్వాసము.

వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన మహా భారత కథను నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో సూతుడు శౌనకాది మహామునులకు ఇలా చెప్పసాగాడు.

భీష్ముడు చెప్పిన విష్ణుతత్త్వమును విని తరించిన ధర్మరాజు పితామహు నితో ఇలా అన్నాడు.

“పితామహా! వివాహ సమయంలో కన్యాదానం చెయ్యడానికి ఎలాంటి వరుడు కావాలి.” వివరించండి అని అడిగాడు.

“ధర్మనందనా! ~~ఈ~~ సందర్భంలో ఒక  ఇతిహాసము చెపుతాను. ఆలకించు. అష్టావక్రుడు అనే ముని కుమారుడు ఉండేవాడు. అతడు వదాన్యుని కుమార్తె సుప్రభ అను కన్యను వివాహ మాడాలని అనుకున్నాడు. తన కోరికను వదాన్యునికి తెలిపాడు. వదాన్యుడు దానికి అంగికరించాడు, కానీ ఉత్తర దిక్కుగా వెళ్లమన్నాడు. ఎందుకు అని అడిగాడు అష్టావక్రుడు.

“కుమారా!  ఉత్తర దిక్కున, కుబేరుని నగరం దాటిన తరువాత,

హిమాలయ పర్వతములు ఉన్నవి. అక్కడ శివుని గూర్చి పార్వతి తపస్సు చేసిన ప్రదేశము చాలా పవిత్రమైనది. అక్కడ పార్వతీ పరమేశ్వరులు విహరిస్తుం టారు. ఆ ప్రదేశము దాటి పోతే ఒక నీప వనము కనిపిస్తుంది. అక్కడ ప్రౌఢ వయసులో ఉన్న పవిత్రురాలైన ఒక స్త్రీ ఉంది. నీవు ఆ వనితను కలిసి రా. అప్పుడు నీకు నా కూతురుని ఇచ్చి పెళ్లి చేస్తాను." అని అన్నాడు వదాన్యుడు.

.అలాగే అని అష్టావక్రుడు ఉత్తరదిశగా ప్రయాణం అయ్యాడు. ముందు కుబేరుని నగరం చేరుకున్నాడు. అక్కడు కుబేరుని ఆతిథ్యం స్వీకరించాడు. కుబేరుడు ఏర్పాటు చేసిన అందమైన స్త్రీల నృత్య విన్యాసాలు అతనిని ఆకర్షించ లేదు. తరువాత హిమాలయ పర్వతముల వద్దకు వెళ్లాడు. శివుడు విహరించిన స్థలమును దర్శించాడు.

తరువాత వదాన్యుడు చెప్పిన కడిమి వనమునకు వెళ్లాడు. అక్కడ ఎన్నో బంగారు మేడలను చూచాడు. తాను వచ్చినట్టు లోపలకు వర్తమానం పంపించాడు. ఇంతలో అందమైన కన్యలు అతనికి ఎదురుగా వచ్చారు. అష్టావక్రునికి స్వాగతం పలికారు. లోపలకు తీసుకొని వెళ్లారు. అక్కడ అష్టా వక్రుడు ఒక ప్రౌఢను చూచాడు. ఆమె ఇతనిని తీసుకొని వెళ్లి తన పక్కన కూర్చోపెట్టుకుంది. అతనికి ఎన్నో సత్కారాలు చేసింది.

ఇంతలో రాత్రి అయింది. చలిగా ఉండటం వలన ఆమె కూడా అతని పక్కనే పడుకుంది. రాత్రి వేళ ఆ ప్రౌఢ అతనిని కౌగలించుకోడానికి ప్రయత్నించింది. కాని అతని శరీరం కట్టెలాగా తగిలింది. అతనిలో ఏ విధమైన స్పందన లేదు. అప్పుడు అతనితో ఇలా అంది.

"ఆర్యా! మీరు పురుషులు. పురుషులు భోగముల యందు ఆసక్తి

కలవారు కదా. మరి ఇలా ఉన్నారేమిటి? నాకు ఉన్న సంపదలు అన్నీ మీకు ఇస్తాను. నన్ను భార్యగా స్వీకరించండి. నేను మీ సేవ చేసుకుంటాను." అని పలికింది.

ఆ మాటలకు అష్టావక్రుడు ఇలా అన్నాడు. "అమ్మా! ఇతరుల భార్యలతో సంగమము దూషింపతగినది. బ్రాహ్మణుడు శూద్రస్త్రీతో సంగమించడం అధిక మైన దోషము. బ్రాహ్మణ స్త్రీ అయినచో మహా పాతకము. అదియును కాక నాకు ఇంకా వివాహము కాలేదు. నేను ఒక కన్యను వివాహమాడగోరుచున్నాను." అని అన్నాడు.

"ఆర్యా! నేను నీ అందానికి వశురాలను అయ్యాను. నిన్ను కామించాను. కామానురక్తులు వావి వరసలు, వంశహాని జరిగినా లెక్కచెయ్యరు. కాబట్టి నన్ను వివాహమాడు." అని బలవంతం చేసింది.

"అమ్మా! ఏమిటి నువ్వు ఇలా మాట్లాడుతున్నావు. అసలు ఇలాంటి మాటలు కూడా ఉంటాయా! నీ కామ వాంఛలు మానుకో. నేను వెళ్లాలి." అని పలికాడు.

అప్పుడు ఆ ప్రౌఢస్త్రీ చిరునవ్వు నవ్వింది. "పోదువుకానిలే ఉండు" అని అతనిని ఆపింది.

"నువ్వు నన్ను తాకకుండా ఉంటే ఉంటాను." అని అన్నాడు అష్టావక్రుడు.

తనలో ఇలా అనుకున్నాడు. "ఈమె ఎవరో శాపగ్రస్తురాలు. ఇలా ప్రవర్తిస్తూ ఉంది. అందుకనే ఈమె విషయం నాకు అర్థం కావడం లేదు." అని

మనసులో అనుకున్నాడు.

ఇంతలో తెల్లవారింది. కాలకృత్యములు తీర్చుకున్నాడు. ఆమె అతనికి స్నానమునకు ఏర్పాట్లు చేసింది. స్నానం చేయించింది. అతనికి మృష్టాన్నములు ఆరగింప చేసింది. "ఆర్యా! కాసేపు విశ్రమించండి." అన్ని శయ్యను ఏర్పాటు చేసింది. కాని అష్టావక్రుడు ఒప్పుకోలేదు.

"మహాభాగా! నేనూ కన్యనే. తగిన వరుడు దొరకక ఇంత వయసు వచ్చినా కన్యగానే మిగిలిపోయాను. నా అదృష్టం కొద్దీ మీరు కనిపించారు. నన్ను వివాహమాడండి." అని కోరింది.

దానికి అష్టావక్రుడు ఇలా అన్నాడు. "అమ్మా! బాల్యములో తండ్రి, వివాహము అయిన తరువాత భర్త, వార్ధక్యములో కొడుకు స్త్రీకి సంరక్షకులు. కాబట్టి స్త్రీ స్వతంత్ర కాదు. కాబట్టి నీవు స్వతంత్రించి వివాహము చేసుకొన డానికి వీలు లేదు. ఒక వేళ నీవు నన్ను కోరినా నేను అంగీకరించను. అది సరే ఇంతకూ నీవు ఎవరు! నన్ను ఇలా ఎందుకు పరీక్షిస్తున్నావు. నన్ను తొందరగా పంపించు. నేను వెళ్లాలి." అని అన్నాడు అష్టావక్రుడు.

అప్పుడు ఆమె నవ్వుతూ ఇలా అంది. "మహాభాగా! నిన్ను పరీక్షించమని వదాన్యుడు నాకు చెప్పి నిన్ను ఇక్కడికి పంపాడు. నేను నీ నిష్ఠకు మెచ్చు కున్నాను. కాబట్టి వదాన్యుడు కూడా నిన్ను అంగీకరిస్తాడు. నీకు తన కుమార్తె సుప్రభను ఇచ్చి వివాహం చేస్తాడు." అని పలికింది.

అష్టావక్రుడు ఆమెకు నమస్కరించి తిరిగి తన గ్రామానికి వెళ్లాడు. వదాన్యుడు తన కుమార్తె సుప్రభను అష్టావక్రునికి ఇచ్చి వివాహం చేసాడు.

ధర్మనందనా! కాబట్టి వరుని గుణగణములను విచారించి మరీ వివాహం చెయ్యాలి.” అని పలికాడు భీష్ముడు.

ఇంతలో ధర్మరాజుకు మరొక సందేహము కలిగింది.

“పితామహా! బ్రాహ్మణుడైన మునీశ్వరునికి శూద్రస్త్రీవలన సంతానం కలిగితే, అతడు బ్రహ్మర్షి ఎలా అవుతాడు.” వివరించండి అని అడిగాడు.

ధర్మనందనా! నీకు వివాహ విధిని గురించి చెబుతాను.

బ్రాహ్మణుడు తన కులములో కన్యను, తక్కిన మూడు కులములలో కన్యలను వివాహం చేసుకొన వచ్చును.

క్షత్రియుడు తన కులములో కన్యను, తక్కిన రెండు కులములలో (వైశ్య, శూద్ర)కన్యలను వివాహం చేసుకొనవచ్చును.

వైశ్యుడు తన కులములో కన్యను, శూద్ర కన్యను మాత్రం వివాహము చేసుకొన వచ్చును.

శూద్రుడు తన కులములో కన్యను మాత్రమే వివాహము చేసుకొనుటకు అర్హుడు.

ఇది వివాహ పద్ధతి. అంతేగాని ఎవరైనా తన కులము కన్నా పైకులములో కన్యలను వివాహమాడిన, వర్ణ సంకరం కలుగుతుంది. తల్లి ఏ కులమునకు చెందినది అయినా, సంతానమునకు తండ్రి కులమే వర్తిస్తుంది. ఇది సకల

జనులకు ఆమోదయోగ్యమైన పద్ధతి. విశేషంగా చెప్పాలంటే తపోనిష్టాగరిష్టులైన మునులకు తక్కువ కులము స్త్రీలతో సంతానం కలిగినా, వారు బ్రాహ్మణులే అవుతారు. అలాగే క్షత్రియులకు కూడా వైశ్య శూద్రుల స్త్రీల వలన కలిగిన సంతానము క్షత్రియులే అవుతారు.

అంతదాకా ఎందుకు పశువులకు, పక్షులకు కూడా బ్రాహ్మణుల వలన పుట్టిన వారు బ్రాహ్మణులే అవుతారు కదా! నీవు వినలేదా! కాబట్టి బ్రాహ్మణులకు, క్షత్రియులకు క్షేత్రము కంటే బీజమే ప్రధానము. వశిష్టుడు, ఋష్యశృంగుడు, అగస్త్యుడు,వ్యాసుడు, మందపాలుని కుమారులు, ద్రోణుడు, కృపాచార్యుడు, పుట్టిన విధము నీకు తెలుసు కదా! మరి వారందరికీ తండ్రి కులమే సంక్రమించింది కదా!

ఈ విషయంలో మనువు చెప్పిన వాక్యములు చెబుతాను. విను. నదుల యొక్క, సిద్ధుల యొక్క, మునుల యొక్క పుట్టుకల గురించి చర్చించడం మంచిది కాదు. ఎందుకంటే మహాత్ములు వారి జన్మలతో గాక వారి గుణగుణములతో ప్రశిద్ధి పొందుతారు." అని పలికాడు భీష్ముడు.

" పితామహా! విప్రుడు దానము పుచ్చుకొనుటకు అర్హుడు కావడం అతడు చేయు వృత్తి వలన నిర్ణయింపబడుతుందా! లేక అతను సన్యాసి అవడం వలన నిర్ణయింప బడుతుందా? తెలుపండి." అని అడిగాడు ధర్మజుడు.

ధర్మజా! మంచి బ్రాహ్మణుడు అతను ఆచరించు మంచి పనుల వలన దానమునకు అర్హుడుగా నిర్ణయింపబడుతాడు. అతడు సన్యాసియా, సంసారియా అనునది ముఖ్యము కాదు." అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! పుర జనులు బ్రాహ్మణుల కు శ్రద్ధతో ఇచ్చు అన్ని దానములు పాపము కలిగించవు అని అనుకుంటాను. నిజమేనా!" అని అడిగాడు ధర్మరాజు.

" ధర్మనందనా! శ్రద్ధతో ఇచ్చు దానములు పాపమును పోగొడతాయి గాని పాపమును కలిగించవు. కాని ఎవరైతే పైకి ధర్మములు పలుకుతూ లోలోపల అధర్మవర్తనుడవుతాడో, వాడు దానము పుచ్చుకొనుటకు పనికిరాడు. ఈ విషయంలో ఒక సారి భూదేవికి, కశ్యపునకు, అగ్నికి, మార్కండేయునకు ఒక చర్చ జరిగింది. దాని గురించి చెబుతాను విను.

ఎంత ఉన్నత కులములో జన్మించినా, వేదములు, శాస్త్రములు, పురాణములు చదివినా, శీలము, సత్ప్రవర్తన లేకపోతే అతనికి ఉత్తమ గతులు లభించవు. ఎంతో విద్య నేర్చుకొని, అనేక సన్మానములు పొందిన వాడు, ఎదుటి వారి విద్యను చులకన చేసి మాట్లాడితే అతనికి బ్రహ్మ హత్యాపాతకము చుట్టుకుంటుంది. వేయి యజ్ఞములు చేసిన ఫలము, సత్యవాక్పరిపాలన వలన కలుగు ఫలము త్రాసులో పెట్టి తూచిన, వేయి యజ్ఞముల ఫలము, సత్యవాక్పరిపాలన ఫలములో సగం కూడా తూగదు. .

దర్మనందనా! ఇంకా చెబుతాను విను. మద్యము తాగడం. మాంసము తినడం మాని వేస్తే, అది జీవితాంతము బ్రహ్మచర్యము పాటించడం కన్నా గొప్పది. అలాగే, ఈ లోకంలో సంచరిస్తూ ఇంద్రియములను నిగ్రహించుకొని శాంతంగా బతకడాన్నే శౌచము అని అంటారు." అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! ధర్మము, అర్థము, కామము, మోక్షము పురుషార్థములు అంటారు కదా! మరి వాటిని ఎప్పుడు ఆచరించాలి? తెలపండి." అని

అడిగాడు.

"ధర్మనందనా! మనిషికి అర్థము(ధనము) మీద, కామముమీద కోరిక ఉండటం మంచిది కాదు. ఎల్లప్పుడూ ధర్మము ఆచరించడం మీదనే ధ్యాస ఉండవలెను. లేదా అర్థము (డబ్బు సంపాదించడం) కామము (స్త్రీసంబంధ మైన కోర్కెలు తీర్చుకోవడం) ధర్మబద్ధంగా చెయ్యాలి. (అంటే న్యాయంగా, ధర్మంగా డబ్బు సంపాదించాలి. వివాహము చేసుకున్న భార్యతోనే కామ కోరికలు తీర్చుకోవాలి అని చెప్పుకోవచ్చు).

అయినా అడిగావు కాబట్టి చెబుతాను. ధర్మము పగటిపూట, కామము రాత్రిపూట, అర్థము తెల్లవారు జామున, ఆచరించాలి.

(దీనిని మన నిత్య వ్యవహారములలో అన్వయించుకోవాలంటే ధర్మము పగటి పూట ఆచరించాలి---- అంటే పగలంతా మనము మన పనులలో, వ్యాపారాలలో, ఉద్యోగాలలో నిమగ్నమై ఉంటాము--- కాబట్టి, ఎల్లప్పుడూ ధర్మంగానే ప్రవర్తించాలి. లంచాలు తీసుకోకూడదు. మనకు అప్పచెప్పిన పని సక్రమంగా చెయ్యాలి. వ్యాపారాలలో మోసం చెయ్యకుండా ధర్మంగా. నీతిగా వ్యాపారం చెయ్యాలి. ఇంక కామకలాపాలన్నీ రాత్రివేళలలో చెయ్యాలి. దీనికి వివరణ అనవసరం. అందరికీ తెలుసు. ఇంక ధన సంబంధమైన వ్యవహా రములు తెల్లవారుజామున చెయ్యాలి. ఎందుకంటే అప్పుడు మనసు ప్రశాంతంగా ఉంటుంది. లెక్కలలో తప్పులు రావు. పైగా వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది కాబట్టి మంచి నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది. తప్పుడు నిర్ణయాలకు ఆస్కారం ఉండదు. ఇలా అన్వయించుకుంటే 5000 వేల ఏళ్ల కిందట చెప్పిన మాటలు నేటికీ ఆచరణ యోగ్యాలు అవుతాయి).

ధర్మనందనా! గురువులను, బ్రాహ్మణులను పూజించడం వలన పుణ్యం వస్తుంది. బ్రాహ్మణులను నిందించడం, వేదాధ్యయనము విడిచిపెట్టడం, అగ్నిని విడిచిపెట్టడం మహా పాపము." అని అన్నాడు భీష్ముడు.

" పితామహా! ఇందాక మీరు చెప్పినది అర్థం కాలేదు. ఇంతకూ దానమునకు అర్హులెవరో వివరంగా తెలపండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ధర్మపరులు, కోపం లేనివారు, ఎల్లప్పుడూ సత్యము పలికేవారు, ధీరులు, తన పని తాను సక్రమంగా చేసేవారు, ఇంద్రియములను జయించినవారు, సర్వభూతములయందు దయగలవారు, లోభత్వము లేని వారు, శుచిగా ఉన్న వారు, దానము చెయ్యడానికి అర్హులు. వేదాధ్యయనము చేసినవారు, తత్త్వవిదులు అయిన బ్రాహ్మణులు దానము తీసుకొనుటకు తగినవారు. అర్హులు కాని వారికి దానం చెయ్యకూడదు. తాను చేసిన దానము వలన ఒక యోగ్యుడైన బ్రాహ్మణుడు తృప్తి చెందితే, సర్వదేవతలు, మునులు, పితరులు తృప్తి చెందుతారు. కాబట్టి యోగ్యుడైన బ్రాహ్మణునికి దానం ఇవ్వడం మంచిది.

ఇంకా ధర్మనందనా! ఉదయం పూట దేవతలను, దేవుళ్లను, మధ్యాహ్నం అతిధులను అంటే మానవులను, సాయంకాలము పితృదేవతలను ఆరాధించాలి. ధర్మనందనా! చాలాకాలము కిందట తయారు చేసిన ఆహారమును, (అంటే చద్ది అన్నము, పదార్థములు), శుభ్రంగా లేని ఆహార పదార్థములు, ఒకరు తిని విడిచిన పదార్థములు (అంటే ఇతరుల ఎంగిలి పదార్థములు), మంత్రపూతంగా దేవునికి నివేదన చెయ్యని పదార్థములు, పురుగులు, వెంట్రుకలు పడిన పదార్థములు, తినడానికి పనికిరావు.

దేవ కార్యములకు పితృ కార్యములకు ఆర్జించిన ధనమును చోరులు అపహరించకుండా జాగ్రత్తపెట్టుకోవాలి. మదించిన వాడిని, తెలివిలేని వాడిని, పిచ్చివాడిని, పాపములు చేసేవాడిని, నపుంసకుని, కుష్టురోగులను, పాపాత్ముడైన పురోహితుని, వైద్యము రాని వైద్యుడిని, నియమములు వదిలినవాడిని, అపస్మారకుడిని, రోగగ్రస్థుడిని, క్షయరోగిని, మద్యము విక్రయించువానిని, వేదవిద్యను విక్రయించువానిని, తక్షణం వదిలి పెట్టాలి. ధనము వడ్డీకి ఇచ్చి ఆ వడ్డీతో జీవించేవారు, అగ్నిహోత్రము చేయని వారు, మనుషులను విక్రయించి జీవించే వారు, దేవ కార్యములకు పితృకార్యములకు తగిన వారు కారు." అని చెప్పాడు భీష్ముడు.

" ఓ పితామహా! దేవ కార్యములు, పితృకార్యములు నిర్వహించునపుడు దానములు పుచ్చుకొనుటకు ఎవరు అర్హులు. తెలుపండి." అని అడిగాడు ధర్మరాజు.

"అతిథులకు భోజనము పెట్టి తృప్తిపరచడానికి డబ్బు కావలసిన వారు, దొంగల వలన సర్వము కోల్పోయిన వారు, వ్రతములు చేయుటకు యాచించే వారు, గురువులను, తల్లి తండ్రులను, భార్యాబిడ్డలను పోషించుకోడానికి ధనములేక ఇబ్బంది పడేవారు, తనకు వచ్చిన వ్యాధిని నయం చేసుకోడానికి డబ్బులేక బాధపడేవారు, దేవ పితృకార్యములలో దానము స్వీకరించుటకు అర్హులు.

సత్రములను, మంటపములను, నీడకోసరము వేసిన పందిరులను, నలుగురు కూర్చునే రచ్చబండను కూల్చి ధ్వంసము చేసేవారు; గురువులను నిందించేవారు; వేదములను నిందించేవారు; వేదవిద్యను అమ్ముకొనే వారు; ఇతరులమీద చాడీలు చెప్పేవారు; అనుకున్న ఒప్పందములను

ఉల్లంఘించేవారు, (బ్రీచ్ ఆఫ్ కాంట్రాక్ట్); ఇతరుల మీద పడి వారి సంపాదన తినేవారు; చేసిన మేలు మరిచేవారు; ఇతరుల భార్యల పొందు కోరువారు; మంత్రశాస్త్రములను నాశనం చేసేవారు; మదంతో విర్రవీగేవారు; అనాథలను, బాలలను, వృద్ధులను, సన్యాసులను మోసం చేసేవారు; అతిథులకు, భార్యాబిడ్డలకు, తన కింద పనిచేసేవారికి పెట్టకుండా తినేవారు; వీరు నరకానికి పోతారు.

మారణాయుధాలను, తల వెంట్రుకలను విక్రయించడం, కన్నె పిల్లలను, బ్రాహ్మణులను, గోవులను కత్తులతో నరికి చంపడం, విద్య చెప్పిన గురువును, తనను నమ్మకంగా సేవించే సేవకుడిని విడిచిపెట్టడం, పది మంది నడిచే దారిలో ముళ్లకంపలు వేసి, అడ్డంకులు కల్పించి, ఆదారిని ప్రజలకు ఉప యోగం లేకుండా చెయ్యడం (అంటే నేటి రాస్తారోకోలు ఇలాంటివే), ఇవన్నీ నరకమునకు ద్వారముల వంటివి.

ఇంకా, ఏమీ నేరం చెయ్యకుండానే, చెయ్యని నేరం మోపి శిక్షించే రాజు (నేడు పోలీసులు పెట్టే తప్పుడు కేసులు లాంటివి), ప్రజా రక్షణే కర్తవ్యంగా గల రాజు --ప్రజా రక్షణ మరచి ప్రవర్తించడం (నేటి ప్రజా ప్రతినిధులు అలాంటి వారే. ఐదేండ్ల పాటు చక్కని పరిపాలన అందిస్తామని చెప్పి ప్రజలను మోసగించి, ఆ మాట మరచి తమ స్వార్థం కోసం పాటుపడేవారు), ఏదైనా వస్తు వు తన వద్ద దాచి పెట్టినపుడు, మరలా అడిగినప్పుడు ఆ వస్తువు తనకు ఇవ్వలేదని బుకాయించే వారు, (చీటింగ్, క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్), గోవులను ముక్కుకుట్టి హింసించే వారు, వీరంతా అధోగతి పాలవుతారు. (రాజ్యాంతే నరకం ధృవం అని అంటారు కదా!).

పది మందికి ఉపయోగించే సత్రములు కట్టించడం, తోటలు

వేయించడం, మంచినీటి బావులు తవ్వించడం, భయంతోనో, బాధలతోనూ ఉన్న వారిని కాపాడటం, కన్యాదానము, గోదానము, భూదానము, వాహన దానము (కాళ్లు లేని వారికి నడవడానికి వాహనములు సమకూర్చడం), పనివారిని దానంగా ఇవ్వడం, ఎవరైనా తనకు కీడు చేస్తే వారిని క్షమించడం, భార్యాబిడ్డలను, చుట్టములను ఆదరించడం, దానధర్మములకు డబ్బు ఖర్చు చేసినా, దానిని ప్రచారం చెయ్యక పోవడం (పది రూపాయలు దానం చేసి పది పత్రికలలో, పది ఛానళ్లలో ప్రచారం చేసుకుంటున్నారు ఈ రోజుల్లో), దుర్మార్గులకు దూరంగా ఉండటం స్వర్గ ద్వారములు. పైనియమాలు పాటిస్తే ఎటువంటి వాడికైనా స్వర్గప్రాప్తి కలుగుతుంది." అని భీష్ముడు చెప్పాడు.

" పితామహా! కొన్ని పనులను బ్రహ్మహత్యాపాతకములు అని అంటారు కదా. మరి హింస లేకుండా అవి హత్యలు ఎలా అవుతాయి. వివరించండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఇదే ప్రశ్నను ఒక నాడు నేను వ్యాసుని అడిగాను. ఆయన నాకు చెప్పిన విషయములు నీకు చెబుతున్నాను. బ్రాహ్మ ణులను, పేదవారిని భోజనమునకు పిలిచి వారికి భోజనం పెట్టక పోవడం, మంచి కులములో పుట్టి వేద విద్యను నేర్చిన బ్రాహ్మణునికి, అతడిని తన వృత్తి చెయ్యకుండా అడ్డగించ డం, నీళ్లు తాగడానికి ఆవులు వస్తే వాటిని నీరు తాగ కుండా నిరోధించడం, గుడ్డివారు, చెవిటివారు, కుంటివారికి ఇచ్చిన ధనములను అపహరించడం, (ఫిజికల్లీ హాండీకాప్డ్ వారికి వచ్చిన నిధులను అపహరించడం, అందులో కూడా కమీషన్లు తీసుకోడం), వేదములను, శాస్త్రములను నిందిం చడం, ఇవన్నీ బ్రహ్మ హత్యతో సమానములు.

కోపంతో ఊళ్లకు ఊళ్లు తగల బెట్టడం, పండ్లతోటలు నాశనం చెయ్యడం,

అబద్ధపు సాక్ష్యాలు చెప్పి, బ్రాహ్మణు లకు ఇతరులకు శోకము కలిగించడం, ఇవి కూడా బ్రహ్మహత్యతో సమాన ములు.

రూపము, గుణము, శీలము ఉన్న వరునికి ఇచ్చి వివాహం చెయ్య కుండా, తన ఇష్టం వచ్చినట్టు ఆ కన్యకు సరితూగని వాడికి ఇచ్చి వివాహం చెయ్యడం, బ్రహ్మహత్యాసమానము." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! నాకు పుణ్య తీర్థ విశేషములను తెలియజేయండి."అని అడిగాడు.

" ధర్మనందనా! పూర్వము గౌతముడికి అంగిరసుడు వివరించిన విశేషములను నేను నీకు వివరిస్తాను. చంద్రభాగ, వితస్త నదీతీరాలలో ఏడు దినములు ఉపవాసము చెయ్యాలి. వాడు మునిసమానుడు అవుతాడు. కాశ్మీరదేశంలో పారే నదులలో నీరు తాగితే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. అలాగే పుష్కర తీర్థము, ప్రభాస తీర్థము, నైమిశారణ్యము, ఇంద్రమార్గము, దేవిక, స్వర్గబిందువు వీటిలో స్నానం చేస్తే అప్సరసలతో కూడి విమాన యోగం కలుగుతుంది. అలాగే గంధమాధన పర్వతము మీదినుండి ప్రవహించే ఇంద్రతోయ, కరతోయ అనే నదుల తీరాన మూడు రోజులు ఉపవాసము చేసి, ఆ నదులలో స్నానం చేస్తే వారికి అశ్వమేధ యాగము చేసిన ఫలము కలుగు తుంది. కనఖలములోనూ, గంగాద్వారములోనూ, కుశావర్తము లోనూ, బిల్వకము లోనూ, స్నానము చేస్తే పాతకములు తొలగిపోతాయి. కైలాస శిఖరము వద్ద ప్రవహించే గంగానదిలో స్నానం చేస్తే దేవతా దర్శనము కలుగుతుంది. ఒక నెల పాటు ఏమీ ఆహారము తీసుకోకుండా, నిత్యము అగ్నిహోత్రము చేస్తే, అతనికి సకల సిద్ధులు సంప్రాప్తిస్తాయి.

భృగుతుంగము అనే సరస్సులో మూడు రోజులు ఉపవాసం ఉండి స్నానం చేస్తే బ్రహ్మ హత్యాపాతకము తొలగిపోతుంది.సుందరికా సరస్సులో స్నానం చేస్తే మరుజన్మలో అత్యంత సుందరాకారుడుగా పుడతాడు.వైమానికము అనే తీర్థంలో స్నానం చేస్తే స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. కృత్తిక, అంగారకుల సేవ చేస్తే, పాపములునశించి స్వర్గలోక ప్రప్తి కలుగుతుంది. విపాశా నదిలో మూడు రోజులు స్నానం చేస్తే ఇంక జన్మ ఉండదు. కృత్తికా ఆశ్రమములో స్నానము పితృతర్పణము చేస్తే, వానికి శివసాన్నిధ్యం లభిస్తుంది అని పెద్దలు చెబుతారు.

ద్రోణ శర్మ అనే తీర్థమును, శరస్తంబము, దేవదారు వనము సేవించిన వారికి అప్సరసల వంటి భార్యలు దొరుకుతారు. చిత్రకూటము, జనస్థానము సేవించిన రాజ్యసంపదలు కలుగుతాయి. శ్యామాశ్రమములో ఒక నెలపాటు నిరాహారంగా ఉంటే అతనికి అంతర్ధ్యాన ఫలము కలుగుతుంది. కౌశిక వాలము లో మౌనంగా, నిరాహారంగా, 21 దినములు గడిపితే, అతడు ముక్తిని పొందు తాడు. మతంగ వాపిలో ఒక రాత్రి గడిపితే సిద్ధుడు అవుతాడు. నైమిశారణ్య ములో ఒక మాసము నివసించిన పురుషమేధము చేసిన ఫలము పొందుతాడు. అదేమాదిరి ఉత్పలావనములో చేస్తే అశ్వమేధయాగ ఫలము సగభాగము పొందుతాడు. గంగాయమునా సంగమములో ఉన్న కాలాంజనము అనే పర్వతము మీద స్నానం చేస్తే విముక్తి మార్గ ము పొందుతాడు. వైవస్వత తీర్థంలో స్నానం చేస్తే అనేక సంపదలు పొందుతాడు.

ప్రయాగ క్షేత్రములో మూడుకోట్ల పదివేల పుణ్యతీర్థములు వచ్చి కలుస్తాయి. ఆ ప్రయాగలో మాసము రోజులు గడిపిన అతనికి ముక్తి లభిస్తుంది. గంగా నదిలోనూబ్రహ్మ కపాలములోనూ ఒక మాసము రోజులు ఉపవాసము ఉంటే చంద్రలోక ప్రాప్తి కలుగుతుంది. అష్టా వక్రము,

కలవింకము, దేవహ్రదుము--వీటిలో స్నానం చేసిన నరునికి బ్రహ్మ లోక ప్రాప్తి కలుగుతుంది. రామ హ్రదములో 12 రోజులు నియమంగా ఉపవాసం ఉంటే అతడికి సకల కల్మషములు హరిస్తాయి. మహా హ్రదంలో నెలనాళ్లు ఉపవాసం ఉంటే జమదగ్ని పొందిన పుణ్యలోకములు పొందుతాడు. వింధ్యపర్వతము మీద నెల రోజులు తపస్సు చేస్తే అతడికి సకల ధర్మములు అలవడుతాయి. నర్మదానదిలో స్నానం చేస్తే రాకుమారుడిగా పుడతాడు.

జంబూ ద్వీపంలో మూడు మాసములా ఒక్కరోజు నివశిస్తే, అతడికి సర్వసిద్ధులు లభిస్తాయి. గోకాముఖములో స్నానము చేసి, తండులికాశ్రమ మునకు పోయి, నారచీరలు ధరించి, శాకాహారము తింటూ శాంతిగా జీవిస్తే, అతడు పదిమంది కన్యలకు భర్తయై ఏ రోగములు, అకాలమరణము లేకుండా సుఖంగా జీవిస్తాడు. కుల్యతీర్థములో మూడు రాత్రులు నిరాహారంగా, శుచిగా అఘమర్షణ జపం చేస్తే, అతనికి అశ్వమేధయాగము చేసిన ఫలము దక్కు తుంది. ఆర్షిసేనాశ్రమములో ఉన్న ఉజ్జానకము అనే తీర్థములో స్నానం చేసిన నరుడికి అన్ని పాపములుపోతాయి. పిండారకములో ఒక రాత్రి గడిపిన అతడికి అగ్నిష్టోమ ఫలము దక్కుతుంది. ధర్మారణ్యములో బ్రహ్మసరస్సులో స్నానం చేస్తే అతడికి పుండరీక యాగము చేసిన ఫలము లభిస్తుంది. హిమాలయ పర్వత ములలో మునులను సేవిస్తూ తపస్సు చేస్తే అతడికి సిద్ధులు కలుగు తాయి. బ్రహ్మ లోక ప్రాప్తి కలుగుతుంది. .

దర్మనందనా! పుణ్య తీర్థములను సేవించేటప్పుడు కామము, క్రోధము, మదము, లోభము లేకుండా ప్రశాంత మనస్సుతో ఉండాలి. అలా ఉంటేనే తీర్థములు సేవించిన ఫలితము దక్కుతుంది. ధర్మజా! నిజానికి అన్ని తీర్థములు మనలోనే ఉన్నాయి. ఇంద్రియములను నిగ్రహించడం, తపస్సు చేయడం, మనస్సును అదుపులో పెట్టుకోవడం, ఇవన్నీ కూడా తీర్థసేవనముతో

సమానమే. వీటిని ఆచరించకుండా కేవలం వట్టి నీళ్లలో స్నానాలే చేస్తే శరీరం శుభ్రపడుతుంది కానీ మనసులోని కల్మషములు పోతాయా!

ధర్మజా! దొరకని వాటిగురించి తాపత్రయ పడకుండా, దొరికిన వాటి మీద ఎక్కువ మమకారం పెంచుకొనకుండా, ఉన్న వాటితో తృప్తిపడుతూ, కోరికలను జయించిన వాడికి ఏ తీర్థ సేవనమూ అవసరం లేదు. అలాంటి వాళ్లు ఎల్లప్పుడూ పవిత్రంగా ఉంటారు.

ధర్మజా! మనుజుడు ఎంతో శ్రమకోర్చి దుర్గమమైన ప్రదేశములలో ఉన్న అన్ని తీర్థములను సేవించనవసరం లేదు. ఆ తీర్థములను మనసులో సేవిస్తే చాలు. అన్ని పాపాలు నశిస్తాయి. ధర్మనందనా! తీర్థ సేవనము గురించి నాకు తెలిసిన విషయములు తెలియజేసాను." అని చెప్పాడు భీష్ముడు.

ఇంతలో శరతల్పగతుడైన భీష్ముని చూడటానికి అత్రి, వసిష్ఠుడు, భృగువు, పులహుడు, పులస్త్యుడు, క్రతువు, అంగిరసుడు, అగస్త్యుడు, కణ్వుడు, గౌతముడు, విశ్వామిత్రుడు, జమదగ్ని, మొదలగు మహామునులు తమ తమ శిష్యులతో సహా అక్కడకు వచ్చారు. వారిని అందరినీ అక్కడ చూచి పాండవులు ఎంతో ఆశ్చర్యపోయారు. పాండవులు వారికి నమస్కరించారు. ఆ మహామునులందరూ భీష్ముని చూచిన తరువాత అంతర్ధానం అయ్యారు. మరలా ధర్మరాజు తన ప్రశ్నలు మొదలెట్టాడు.

"తాతగారూ! ఏయే జనపదములు, ఏయేపర్వతములు, ఏయే నదులు పవిత్రమైనవి. మహత్తు కలవి. తెలియజేయండి." అని అడిగాడు.

ధర్మనందనా! ఈ విషయం గురించి నీకు నేను ఒక ఇతిహాసము

చెబుతాను. ఆలకించు. ఉంఛవృత్తి (బిక్షాటనము, పొలములలో ధాన్యము ఏరుకొని రావడం) తో జీవించే ఒక బ్రాహ్మణుని ఇంటికి ఒక సిద్ధుడు అతిధిగా వచ్చాడు. ఆ బ్రాహ్మణుడు ఆ సిద్ధునికి అతిధి మర్యాదలు చేసాడు. ఆ బ్రాహ్మణుడు కూడా నువ్వు అడిగిన ప్రశ్న ఆ సిద్ధుని అడిగాడు. ఆ సిద్ధుడు ఆ బ్రాహ్మణునికి గంగానదీ మహాత్మ్యము వివరించాడు.

"ఏ యే ప్రాంతములలో గంగానది ప్రవహిస్తుందో, ఆయా ప్రదేశములు పవిత్రములు అవుతాయి. గంగానదిలో భక్తితో స్నానం చేసి పూజిస్తే వారికి యజ్ఞములు, బ్రహ్మచర్యము, తపస్సు, దానములు, ఇవి చేసిన ఫలము చేకూరు తుంది. ఇంతెందుకు గంగాజలము శరీరానికి సోకితే అతడి సకల పాపములు నశిస్తాయి. ఎన్ని పాపములు చేసిన వాడైనా ఒక్కసారి గంగానదిలో స్నానం చేస్తే, అతడి పాపములు నశించి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. మనుష్యుని అస్థికలు ( ఎముకలు) గంగానదిలో నానుతుంటాయో, అన్ని సంవత్సరములు అతడు స్వర్గలోకంటో ఉంటాడు.

(అందుకే తల్లితండ్రుల అస్థికలు గంగలో కలుపుతారు.).

గంగానది లేని దేశము, సోమము లేని యజ్ఞము, చంద్రుడులేని రాత్రి, సూర్యుడు లేని పగలు, ఆత్మధర్మలులేని ఆశ్రమము, పూలులేని చెట్టు మాదిరి శోభించలేవు. చాంద్రాయణ వ్రతములు నూరు చేసినా గంగాజలము సేవించిన దానితో సమానం కావు. అగ్నిలో పడిన దూది దగ్ధం అయినట్టు, గంగానదిలో స్నానం చేస్తే పాపములు అన్ని నశించిపోతాయి. దేవతలకు అమృతము ఎలాగో మానవులకు గంగాజలము అలాగా. దిక్కులేని వారికి గంగానది పరమ దిక్కు అని మునులు చెబుతారు. గంగానదిలోని ఇసుక తలమీద పెట్టుకొని, గంగానదిలోని మట్టి నుదుట ధరించిన, పాపములు తొలగిపోతాయి.

గంగానదిమీదినుండి వచ్చే గాలి తగిలినా చాలు పాపాలునశిస్తాయి. గంగా స్నానం చేస్తే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు పితృదేవతలుతరిస్తారు.

అంతెందుకు గంగలో మునుగుతున్నట్టు మనసులో తలంచుకుంటూ ఎక్కడ స్నానం చేసినా, గంగాస్నాన ఫలము కలుగుతుంది. గంగను చూచిన వాడు మనుషుడు. గంగను చూడని వాడు పశువుతో సమానము. గుడ్డివాడి తో సమానము. దేవతలు, ఇంద్రుడు ఎల్లప్పుడూ గంగను కోరుకుంటుంటే ఇంక మనుషుల గురించి చెప్పవలెనా! మరణ సమయంలో గంగానదిని స్మరించిన అతడికి ముక్తికలుగుతుంది. గంగా స్నానము చేసిన వానికి రాజభయము, చోరభయము, పాపభయము, భూతభయము ఉండవు.

గంగానది దివినుండి భువికి తరలి వస్తే సాక్షాత్తూ పరమశివుడు తన తలమీద ధరించాడు. ఇంక మానవులు ఎంత? మానవులకు ఇంద్రుడు, గ్రహములకు సూర్యుడు, నక్షత్రములకు చంద్రుడు, ఎలాగో మానవులకు గంగానదీ అలాగ! సగరుని కుమారులు ముని శాపంతో భస్మమైపోగా, వారి భస్మరాసుల మైన గంగానది ప్రవహించి వారిని పునీతులను చేసింది. ఈ గంగానదిని భగీరథుడు సగర పుత్రుల భస్మరాసుల మీద ప్రవహించేట్టుగా భూమి మీదికి తీసుకొని వచ్చాడు. ఈ గంగానది ఆకాశము నుండి చంద్రుని మీదికి, అక్కడి నుండి సూర్యలోకము మీదుగా విష్ణువు వద్దకు, అక్కడినుండి శివుని శిరస్సుమీదకు దిగి అక్కడ నుండి హిమాలయ పర్వతముల మీదుగా భూమి మీదికి ప్రవహించింది. అచంచల మైన భక్తితో ఎవడైతే గంగను పూజిస్తారో, ఆశ్రయిస్తారో వారికి గంగ సకల సంపదలు, ముక్తి ప్రసాదిస్తుంది. గంగా నది గురించి నాకు తెలిసినంతవరకూ చెప్పాను." అని ఆసిద్ధుడు బ్రాహ్మణునికి వివరించాడు. తరువాత ఆ సిద్ధుడు వెళ్లిపోయాడు" అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

"పితామహా! గంగా మహాత్మ్యము గురించి చెప్పావు. సర్వజనములతోనూ పూజింపబడే వారు ఎవరు? వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఒకసారి నారదుడు శ్రీ కృష్ణుని వద్దకు వచ్చాడు. శ్రీ కృష్ణుడు నారదునికి అతిథి సత్కారములు చేసి ఇలా అడిగాడు.

"నారదా! నీవు అత్యంత భక్తితో ఎవరికి మొక్కుతావు?" అని అడిగాడు.

"కృష్ణా! వరుణునికి, వాయుదేవునికి, భూమికి, ఆకాశమునకు, అగ్నికి (అంటే పంచభూతములకు), ~~ఈ~~శానుడికి, షణ్ముఖునికి, మహాలక్ష్మికి, విష్ణువుకు, బ్రహ్మదేవునికి, బృహస్పతికి, చంద్రునకు, నీటికి, భూమికి, ఏ జనులు భక్తితో పూజలు చేస్తారో, వారందరికీ నేను భక్తితో మొక్కుతాను.

ఇంకా నాకు, వేదాధ్యయనము చేసేవారు, తపోధనులు, దేవతలను పూజించేవారు, భూమిని, ధనమును, ధాన్యమును, గోవులను దానము చేసేవారు, అతిథిపూజ చేసేవారు, పితృ తర్పణములు చేసేవారు, భిక్షను స్వీకరించి, శాంత చిత్తముతో జీవనము గడిపేవారు, ఎల్లప్పుడూ సత్యమునే పలికేవారు, వీరందరికీ నేను భక్తితో నమస్కరిస్తాను. ధర్మము,అర్థము, కామము, సమానంగా అనుభవించేవారు, అహంకారము, అధిక మమకారము లేనివారు, మంచి నడవడి కలవారు, లోలత్వము (అన్నీ నాకు కావాలి అనే ఆసక్తి) లేని వారు, వీరందరికీ నేను నమస్కరిస్తాను. కృష్ణా! నీవు కూడా నాలాగే వీరందరినీ పూజించు. నీకు శుభం కలుగుతుంది." అని నారదుడు చెప్పాడు.

కాబట్టి ధర్మనందనా! నీవు కూడా నారదుడు చెప్పినట్టు ఆచరించు. నీకు

కూడా శుభములు కలుగుతాయి." అని చెప్పాడు పితామహుడైన భీష్ముడు.

"పితామహా! రాజ్యము చేసే రాజులకు కర్తవ్యములు అనేకం ఉంటాయి కదా! వాటి అన్నింటి లోనూ ప్రధానమైన కర్తవ్యము ఏది? వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఒక సామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుడైన రాజుకు, బ్రాహ్మణ పూజ అన్నిటి కన్నా అధిక మైన ప్రథమ కర్తవ్యము. ఏ రాజ్యంలో బ్రాహ్మణులు సుఖ శాంతలతో జీవిస్తారో, ఆక్కడ అన్ని శుభాలు కలుగుతాయి. బ్రాహ్మణులను అవమానించిన రాజ్యములో అనేక కష్టములు కలుగుతాయి. విప్రులు ఘటనాఘటన సమర్ధులు. విప్రులకు అనుకూలంగా ఉన్నవారు రాజ్యాధిపతులు కాగలరు. బ్రాహ్మణుడు కోపిస్తే, ఆ కోపమునకు దేవేంద్రుడు కూడా తట్టుకోలేడు. వారు శాపానుగ్రహ సమర్ధులు.

పూర్వము ద్రవిడ దేశాధిపతులు బ్రాహ్మణులను అవమానించి శూద్రు లైనారు. కాబట్టి ధర్మనందనా! నీవు కూడా ఎల్లప్పుడు బ్రాహ్మణులను పూజింపుము. ఎవరైనా సరే, సదాచారము కల బ్రాహ్మణునకు భోజనము పెట్టిన, అతని పితృదేవతలు తరిస్తారు.

బ్రాహ్మణుల విషయమై విష్ణుమూర్తికి, భూదేవికి ఒక సంవాదము జరిగింది. ఒక సారి విష్ణువు భూదేవిని చూచి "నీవు లోక మాతవుకదా! నిన్ను ఒక విషయం అడుగుతాను. ఏ పనులు చేస్తే చేసిన పాపములు పోతాయి." అని అడిగాడు. దానికి భూదేవి ఇలా సమాధానము చెప్పింది.

" నాధా! బ్రాహ్మణులను సేవించినా, పూజించినా, విప్రులకు హితము

చేసినా, చేసిన పాపములు నశిస్తాయి. అహల్యను కామించి నందుకు దేవేంద్రుని ఒంటి నిండా కన్నులు కలవానిగా శపించినది బ్రాహ్మణుడైన గౌతముడే కదా!" అనిజవాబు చెప్పింది భూదేవి.

కాబట్టి ధర్మనందనా! నీవు కూడా ఏమరక బ్రాహ్మణ పూజ చెయ్యి. ఎందుకుంటే పుట్టుకతోనే బ్రాహ్మణులు పూజనీయులు. మొదట బ్రహ్మ బ్రాహ్మణులను సృష్టించి వారితో ఇలా అన్నాడు.

"మీకు ధర్మనిరతి తప్ప వేరే పని లేదు. మీరు ధర్మమును సదా రక్షిస్తూ ఉండాలి. అదే మీ కర్తవ్యము. మీకు సకల శుభములు కలుగుతాయి. బ్రాహ్మణుడు మిగిలిన వర్ణముల వారికి మార్గదర్శకు డుగా ఉండాలి. నిత్యము వేదాధ్యయనము, అగ్నిహోత్రము ఆచరించాలి. క్షత్రియులు మీ మాట ప్రకారము నడుచుకుంటారు. ఎవరైనా అగ్నిని తాకవచ్చును. హిమాలయ పర్వతములను కదిలించవచ్చును. గంగానదిని మూటగా కట్టవచ్చును. కాని విప్రులను మాత్రము అవమానించరాదు. విప్రులను కొలవడం కల్పవృక్షమును కొలవడం లాంటిది." అని చెప్పాడు బ్రహ్మ.

ధర్మనందనా! ఈ విషయంలో ఇంద్రునికి, శంబరుడు అనే రాక్షసునికి జరిగిన సంవాదమును చెబుతాను విను. శంబరుడు జటాసురునికొడుకు. చాలా ఉన్నత మైన స్థానంలో ఉన్నాడు. ఇంద్రుడు జటాసురుని వద్దకు పోయి "నీకు ఈ ఉన్నత స్థితి ఎలా వచ్చింది?" అని అడిగాడు.

దానికి జటాసురుడు ఇలా బదులు చెప్పాడు. "నాకు బ్రాహ్మణుల మీద కోపము, అసూయ లేవు. నేను ఎల్లప్పుడూ బ్రాహ్మణులను రక్షిస్తాను. వారిని ఆరాధిస్తాను. అందుకే నాకు ఆ విభవము కలిగినది. దేవాసుర యుద్ధంలో

బ్రాహ్మణుల అనుగ్రహము వలననే కదా దేవతలు గెలుపొందారు.

అది చూచి నా జనకుడు చంద్రునితో "ఆహా! విప్రులు మహానుభావులు కదా! అందుకే దేవతలు గెలిచారు." అని చెప్పాడు.

అప్పుడు చంద్రుడు నా జనకునితో ఇలా అన్నాడు. "బ్రాహ్మణులు, తపస్సు, వేదాధ్యయనము ఎల్లప్పుడు ఆచరిస్తూ ఉంటారు. ఆ విషయం గురించి చెబుతాను విను. బ్రాహ్మణుడైన వాడు, ఎంత దూరమైనా సరే వెళ్లి గురువులకు శుశ్రూషచేసి విద్యాభ్యాసము చేస్తాడు. తరువాత తపస్సు చేస్తాడు. అది బ్రాహ్మణునికి విధించిన కర్మ. కాబట్టి బ్రాహ్మణుడు అందరిలోకీ అధికుడు. అటువంటి బ్రాహ్మణులను ఆదరించిన శుభములు, అవమానించిన అశుభ ములు కలుగుతాయి అనడంలో సందేహము లేదు" అని చంద్రుడు నా తండ్రికి చెప్పగా నేను విన్నాను. చంద్రుని మాటలు పాటించి నా జనకుడు బ్రాహ్మణులను పూజించాడు. మంచి తేజస్సుతో వెలుగొందాడు. ఆయన మాదిరే నేనూ బ్రాహ్మణులను పూజించి ఇంతటి ఉన్నత స్థితికి చేరుకున్నాను." అని శంబరుడు ఇంద్రునికి చెప్పాడు.

కాబట్టి ధర్మనందనా! నీవు కూడా ఎల్లప్పుడూ బ్రాహ్మణులను పూజించి ఆదరింపుము. నీకు సకల శుభములు చేకూరుతాయి." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

"పితామహా! ఎల్లప్పుడూ తన దగ్గరే ఉండేవారు, దూరంనుండి వచ్చిన వారూ--వీరిలో ఉత్తములు ఎవరు. ఎవరిని ఆదరించాలి చెప్పండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఎవరిలో క్రోధము, ఈర్ష్య మొదలగునవి లేవో, అట్టి వారు, స్నేహితులు, బంధువులు, సంబంధులు, ఋత్విజులు,పురోహితులు, వీరందరూ ఆదరింపతగిన వారే! ఇంక దూరంనుండి వచ్చినవారూ, ఇది వరకు తెలియని వారూ అయితే, వారు ఆచారవంతులు, విద్యావంతులు, గౌరవ నీయులు అయితే వారు పూజింప తగిన వారే!" అని చెప్పాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజు ఇలా అడిగాడు. "పితామహా! లోకంలో ఉన్న పాపాలన్నిటికీ స్త్రీలు మూలకారణము అంటారు కదా! అలా ఎందుకు అంటారో తెలపండి." అని అడిగాడు.

"ధర్మనందనా! స్త్రీలు నీవు చెప్పినటు వంటి వారే. ఈ సందర్భంలో నీకు నారదునికి పంచచూడ అనే అప్సరసకు, స్త్రీ స్వభావము గురించి జరిగిన సంవాదమును తెలిపెదను. వినుము.

ఒకసారి, నారదుడు లోక సంచారము చేస్తూ ఒకచోట పంచచూడ అనే అప్సరసను చూచాడు.

" ఓ లలనా! నిన్ను ఒక విషయం అడుగుతాను. చెప్పు." అని అడిగాడు.

"మహాత్మా! అడగండి నాకు తెలిసినంతవరకు చెబుతాను." అని బదులుచెప్పింది పంచచూడ.

"వనితల స్వభావము ఎలా ఉంటుంది. నాకు తెలిసేట్లు చెప్పు." అని అడిగాడు.

"అదేమిటి మహా మునీ! నేను వనితను. వనితలు మరొక వనితల చెడ్డ పనుల గురించి ఎలా చెబుతారు అనుకున్నావు." అని బదులు చెప్పింది.

"అదేంకాదు. నీవు నిజం చెప్పావు అనుకో. దాని వలన నీకు దోషం రాదు. చెప్పు." అని అడిగాడు నారదుడు.

"మహాత్మా! స్త్రీ స్వభావములు మీరు ఎరుగనివా. అయినా అడిగారు కనుక చెబుతాను వినండి. మంచి కులంలో పుట్టి కూడా, మంచి గౌరవ మర్యాదలు కలిగి ఉండి కూడా, ఒకనికి భార్య అయి ఉండి కూడా, స్త్రీ పరాయి పురుషులతో తిరుగుతుంది. దీనికి ఏమనాలి చెప్పండి. ఇదే స్త్రీ స్వభావము. ఇది ఎవరికీ అర్థం కాదు. అయినా స్త్రీలు సర్వ దోషములకు మూలము. ఇంక చెప్పేదేముంది. మగవారి మంచితనమును మగువలు గ్రహించలేరు. పరాయి మగాళ్లను గురించి పొగుడుతూ ఉంటారు. రాజ దండన ఉంటుంది అనే భయం లేకపోతే వనితలను అదుపులో పెట్టడం ఎవరికీ సాధ్యం కాదు. ఎన్ని కట్టెలు వేసినా అగ్నికి తృప్తి లేదు. ఎన్ని నదులు తనలో కలిసినా సముద్రునికి తృప్తిలేదు. ఎంతమంది ప్రాణాలు హరించిన మృత్యుదేవతకు తృప్తి లేదు. అలాగే స్త్రీ కూడా వివాహం చేసుకున్న పురుషునితో తృప్తిపడదు. పరాయి మగాళ్ల కోసం వెంపర్లాడుతుంటుంది." అని చెప్పిన పంచచూడ మాటలు విని నారదుడు తృప్తి చెందాడు. ఇదే నీ ప్రశ్నకు సమాధానము." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

" పితామహా! మరి అలాంటి స్త్రీలను ఎలా కాపాడుకోవాలి తెలపండి." అని అడిగాడు.

"ధర్మనందనా! స్త్రీలు అసుర మాయల కంటే మించిన మాయలు కలవారు.

ఈ సందర్భంలో ఒక కథ చెబుతాను విను.

మొట్ట మొదట స్త్రీలందరూ ఎలాంటి దోషము లేకుండా, మాయ మర్మములు లేకుండా, మంచి మనస్సుతో సాధువులుగా ఉండేవాళ్లు. అందుకే వారికి దైవత్వము లభించింది. ఇది చూచి దేవతలు అసూయ పడ్డారు. వారందరూ బ్రహ్మ దేవుని దగ్గరకు పోయి ఈ సంగతి చెప్పారు. అప్పుడు బ్రహ్మ స్త్రీలకు మాయ, మర్మములు వారి జాతి లక్షణములుగా కల్పించాడు. పైగా స్త్రీలకు కామము పాళ్లు ఎక్కువగా ఉండేట్టు చేసాడు. దాని ఫలితంగా పురుషులు వారి మాయలలో, చిక్కుకొని వారి కామమునకు బలి అవుతూ ఉండే వాళ్లు. స్త్రీల కోసరం రోషము, కోపము మొదలగు దుర్గుణములకు లోనవుతున్నారు. అందువలన పురుషులలో దైవత్వము నశించింది. ఇది చూచి దేవతలు తృప్తి చెందారు. కాబట్టి స్త్రీలు సహజంగా మాయామర్మములు కలిగిన వారు కావడం వలన, వారి మనసు తెలుసుకోవడం మగవారికి చాలా కష్టం.

దీని గురించి నీకు ఒక కథ వివరిస్తాను.పూర్వము దేవశర్మ అనే ముని ఉండేవాడు. అతని భార్మ అత్యంత సౌందర్యవతి. దేవశర్మకు ఒక యజ్ఞమునకు పోవలసి వచ్చింది. అతడు తన శిష్యుడు విపులుడిని పిలిచి ఇలా అన్నాడు. "విపులా! నా భార్య అతిలోకసుందరి. ఆమె కోసరం దేవేంద్రుడు పొంచి ఉన్నాడు. నేను ఇంద్రుని ఉపాయములను తిప్పికొడుతూ నా భార్యను రక్షించుకుంటున్నాను. కాని నేను ఇప్పుడు యాగము చేయించడానికి వెళ్లాలి. దేవేంద్రునికి ఇతరుల భార్యలను అనుభవించడం అలవాటు. కాబట్టి నేను ఇంట్లో లేని సమయంలో నీవు నా భార్యకు రక్షణగా ఉండాలి."అని చెప్పాడు.

దానికి విపులుడు ఇలా అన్నాడు. "గురువుగారూ! మీరుచెప్పినట్టే చేస్తాను. కాని ఇంద్రుడు మాయావి కదా. ఏరూపంలో వస్తాడో. ఏంచేస్తాడో

తెలుసుకోడం ఎలాగ?" అని అడిగాడు.

"విపులా! నీవు చెప్పినది నిజమే. దేవేంద్రుడు మాయావి. పక్షుల రూపంలో జంతువుల రూపంలో కూడా రాగలడు కాబట్టి జాగ్రత్తగా ఉండు. దేవేంద్రుడు నా భార్య మీద కన్ను వేసాడు. ఆమె చుట్టు తిరుగుతున్నాడు. అందులో సందేహము లేదు. నేను ఆశ్రమములో లేనని తెలిసి ఇంద్రుడు తప్పకుండా నా భార్య కోసరం వస్తాడు. కాబట్టి నీవు అత్యంత జాగరూకతతో కనిపెట్టి ఉండాలి." అని చెప్పాడు.

"అలాగే గురుదేవా! మీరు చెప్పినట్టే చేస్తాను." అని అభయం ఇచ్చాడు విపులుడు. దేవశర్మ నిశ్చింతగా యాగము చేయించడానికి వెళ్లాడు. విపులుడు జాగ్రత్తగా గురు పత్నిని కాపలా కాస్తున్నాడు. ఇంతలో శిష్యునికి ఒక ఉపాయం తట్టింది. "గురు పత్నిని నేను నా యోగ శక్తితో ఆవహించి ఉంటాను. అప్పుడు దేవేంద్రుడు గురుపత్నిని ఏమీ చెయ్యలేడు. నేను యోగశక్తితో ఆవహించిన సంగతి గురువుగారికి తెలిసే అవకాశం లేదు కదా!" అని మనసులో అనుకున్నాడు.

ఆకాశంలో గాలి తిరిగినట్టు, ఆమెకు తెలియకుండా శిష్యుని ఆత్మ ఆమెలో ఆవహించింది. శిష్యుని ఆత్మ ఆమెలో ప్రవేశించడం వల్ల ఆమె చైతన్యం జడత్వం పొందింది. ఇంతలో దేవేంద్రుడు అత్యంత సుందరంగా అలంకరించు కొని ఆమె వద్దకు వచ్చాడు. శిష్యుడు నిద్రపోతున్నాడు అనుకున్నాడు. మదనావేశం ఆవేశించి నందువల్ల ఆతని వివేకము నశించింది. పక్కన పడుకొని ఉన్న ముని భార్యను సమీపించాడు ఆమెను నిద్ర లేపాడు.

"లలనా! నీ గురించి నేను ఎంత విరహ బాధను అనుభవిస్తున్నానో నీకు

తెలుసుకదా! నేను వచ్చినా పలకవేమి?" అని ఆమెను లేపాడు. కాని ఆమె చైతన్యం కోల్పోయినందున కదలలేదు. పలకలేదు. ఇంద్రునికి సహనం నశించింది.

" ఓ లలనామణీ! నేను దేవేంద్రుడను. మదనుడు నా మనస్సును కామంతో దహించి వేస్తున్నాడు. ఇంకా ఆలస్యం ఎందుకు? ఇంకా ఎందుకు సిగ్గు పడతావు. నన్ను నీ దగ్గరకు చేర్చుకో!" అని అన్నాడు.

అప్పుడు ఆమె శరీరంలో ఉన్న విపులుడు ఇంద్రుని చూచి, తన యోగమాయతో ఇలా అన్నాడు. "నీవు ఇక్కడకు వచ్చుటకు పని ఏమున్నది?" అని పలికి ఆమెను స్పృహ తప్పేట్టుగా చేసాడు. అది చూచి ఇంద్రుడు భయపడ్డాడు. అప్పుడు విపులుడు ఆమె శరీరమును విడిచి బయటకు వచ్చి తన శరీరంలో ప్రవేశించాడు. అప్పుడు ఇంద్రునితో ఇలా అన్నాడు.

" దేవేంద్రా! ఒక సారి గౌతముని శాపంతో ఒళ్లంతా కళ్లు చేసుకొని ఉన్నావు. మరలా ఇదేమి పని? గౌతముని శాపంతో అయినా నీకు బుద్ధి రాలేదా? దేవేంద్రుడివి అయి ఉండి కూడా ఇంద్రియములను అదుపులో ఉంచుకోలేవా! నీ బుద్ధి కుత్సితమైనది. నీచుడా! ఇలాంటిపాపము ఎందుకు చేస్తున్నావు. ఈ విషయం తెలిస్తే మా గురువుగారి కోపాగ్నికి భస్మం అయి పోతావు జాగ్రత్త!" అని అన్నాడు.

దేవేంద్రుడు తన యోగ బలంతో విపులుడి శక్తిని గ్రహించాడు. గడగడా వణికిపోయాడు. అది చూచి విపులుడు ఇలా అన్నాడు. "అసలు నేనే నిన్ను భస్మం చేసి ఉండేవాడిని, కాని మనసు ఒప్పడం లేదు. అందుకని బతికిపోయావు వెళ్లు." అన్నాడు.

బతుకుజీవుడా అంటూ  ఇంద్రుడు పారిపోయాడు. తరువాత విపులుడు గురుపత్నిని నిద్రలేపాడు. గురువుగారు వచ్చిన తరువాత  గురువు గారు ఒంటరిగా ఉన్నప్పుడు గురువుగారితో ఇలా అన్నాడు. "గురువుగారూ! మీరు లేనపుడు దేవేంద్రుడు ఇక్కడికి వచ్చాడు. కాని నా యోగబలానికి భయపడ్డాడు. సిగ్గుతో వెళ్లిపోయాడు." అని చెప్పాడు. కాని తాను రుచి శరీరంలో ప్రవేశించడం మాత్రం చెప్పలేదు.   ఆ మాటలకు సంతోషించాడు దేవశర్మ.

తరువాత ఒకనాడు దేవశర్మ ఆశ్రమం మీదుగా ఆకాశ మార్గంలో ఒక దేవ కాంత పోతూ ఉంటే ఆమె చేతిలోని పూలదండ జారి దేవశర్మ తలమీద పడింది. ఆ పూల దండను దేవశర్మ భార్య తీసుకుంది.  ఆసమయంలో వంగదేశాధీశుడు అయిన చిత్రరథుడు అక్కడకు వచ్చాడు. చిత్రరథుడు భార్య, దేవశర్మ భార్య అక్క చెల్లెలు అవుతారు. అందుకని, తన ఇంట్లో జరిగే ఉత్సవమునకు రమ్మని దేవశర్మను, అతని భార్యను పిలిచాడు చిత్రరథుడు.

ఆ ఆహ్వానము మేరకు దేవశర్మ, అతని భార్య రుచి వెళ్లారు. వెళ్లేటప్పుడు రుచి  ఆకాశం నుండి పడిన దివ్యమైన పూల దండను అలంకరించుకొని వెళ్లింది. దాని పరిమళమునకు, దివ్యత్వమునకు  రుచి సోదరి ఆశ్చర్యపోయింది. "సోదరీ ఇటువంటి  పూలమాలనూ, ఇటువంటి సౌరభమునూ ఇప్పటి వరకూ నాకు తెలియదు. ఈ పుష్పములు ఎక్కడివి." అని అడిగింది.  దానికి రుచి "ఈ పుష్పములు మా ఆశ్రమంలో ఉన్నాయి." అని చెప్పింది. వెంటనే భర్త దగ్గరకు పోయి "నాథా!  ఈ పుష్పములు అంటే నా సోదరి సంతోషపడింది. మరి నాకు ఇటువంటి పుష్పములు తెప్పించి పెట్టరా!" అని అడిగింది.

అప్పుడు దేవశర్మ విపులుని పిలిచి  "ఆ మాదిరి పుష్పములు కావాలి

తీసుకురా!" అని చెప్పాడు. అప్పుడు విపులుడు ఆ పూవులు ఎక్కడ నుంచి వచ్చాయో రుచి నుండి తెలుసుకున్నాడు. తన యోగ మాయతో ఆ పూలు వెతుక్కుంటూ వెళ్లాడు.

దైవ వశాత్తు, ఆపూలు దొరికాయి. అవి తీసుకొని వస్తూ ఉండగా ఇద్దరు స్త్రీ పురుషులు వాదులాడుకుంటున్నారు. అప్పుడు స్త్రీ అన్నది. "నాది తప్పయితే పరలోకంలో విపులునికి పట్టిన గతి నాకు పడుతుంది." అని పలికింది. ఇది విన్న విపులుడు ముందుకు సాగిపోయాడు. మరొక చోట ఆరుగురుజూదరులు తగవులాడుకుంటున్నారు. అందులో ఒకడు మిగిలిన వారిని చూచి "నాది తప్పయితే పరలోకంలో విపులుడికి పట్టిన గతి నాకూ పడుతుంది." అని అన్నాడు.

ఈ మాటలు విన్న విపులుడు ఆలోచించాడు. "తాను చేసిన తప్పేమిటి?" అని తర్కించుకున్నాడు. "ఒక వేళ గురువు గారు ఇంట్లో లేనపుడు తాను గురుపత్ని రుచి శరీరంలో ప్రవేశించడం గురువుగారికి చెప్పనందుకు పాపం వచ్చిందా!" అని అనుకున్నాడు. వెంటనే వెళ్లి తాను తెచ్చిన దివ్యమైన పూల దండను రుచికి ఇచ్చాడు. ఆమె తన సోదరికి ఇచ్చింది. గురువుగారు సంతోషించారు.

తరువాత గురువుగారు విపులుడు ఒంటరిగా ఉండగా అతనితో ఇలా అన్నాడు. "విపులా! నీవు వచ్చు మార్గంలో ఇద్దరు స్త్రీ పురుషులు, ఆరుగురు జూదరుడు కనిపించారు కదా! వీరు నిన్ను నిందించారు కదా! వారు ఎవరో తెలుసుకున్నావా!" అని అడిగాడు. లేదు అని అన్నాడు విపులుడు.

"నీవు నా భార్య ను రక్షించునపుడు నా భార్య శరీరంలో ప్రవేవించావు. అది

పాపమని తలచి వారు అలా అన్నారు. నిజంగా అది పాపమే అయి ఉంటే నేనే నీకు శాపం ఇచ్చి ఉండేవాడిని కదా! అది పాపం కాకపోబట్టే నేను నీకు వరాలు ఇచ్చాను. ఇంతకూ ఆ స్త్రీ పురుషులు పగలు, రాత్రి, ఆ ఆరుగురు జూదరులు ఆరు ఋతువులు." అని అన్నాడు.

గురువుగారి ఔదార్యానికి ఆశ్చర్యపోయాడు విపులుడు. ఇంకా గురువు గారు ఇలా అన్నారు. "రాత్రి, పగలు, ఆరు ఋతువులు, మనుష్యులు చేసే మంచి పనులు, చెడ్డ పనులూ గమనిస్తుంటాయి. ఎవరికీ తెలియకుండా మనం తప్పు చేస్తున్నాము అని అనుకోడం మన అజ్ఞానం. ఒక స్త్రీని రక్షించడం చాలా కష్టం. నీవు విజ్ఞతతో నా భార్యను రక్షించి నా గౌరవాన్ని కాపాడావు. అది మంచి పనే కాని చెడ్డ పని కాదు. ఆ విషయం నాకు చెప్పకపోవడం పాపం అసలే కాదు." అని అన్నాడు.

"ధర్మనందనా! స్త్రీల గురించి పూర్తిగా చెప్పాను కదా. ధర్మనందనా! స్త్రీలలో చాలా రకాల స్త్రీలు ఉంటారు. అందులో మంచివారు, కులస్త్రీలు చాలామంది ఉంటారు. వారి వలననే కదా ఈ భూమి క్రమం తప్పకుండా పరిభ్రమిస్తూ ఉంది. పాతివ్రత్యము పాటించే స్త్రీ దైవముతో సమానము. మానవునికి ధర్మము, సుఖము, పేరు ప్రతిష్ఠలు, మంచి భార్య వలననే కలుగుతాయి అనడంలో సందేహం లేదు." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! కన్యావరణము( వరుడు మంచి కన్యకోసం వెదకుట) ఎలా చెయ్యాలి గురించి చెప్పండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! వధువు తండ్రి మంచి కులము, శీలము, విద్య కల వానిని బిలిచి వానికి తన కన్యను నీటితో సహా ఇవ్వాలి. (అంటే కన్యాదానం

చెయ్యాలి). ఇది బ్రాహ్మణ వివాహము.     ఇంక క్షాత్ర వివాహములో, కన్య పురుషుణ్ణి వరిస్తుంది(దానినే స్వయంవరముఅంటారు).పురుషుడు కూడా ఆ కన్య మీద  ఆశలు పెంచుకుంటాడు. వారిరువురి మధ ప్రేమ అంకురిస్తుంది. దానిని క్షాత్రము అంటారు. కన్య తన చూపులతో, మనస్సుతో తృప్తి పడి, ఆ కన్నె ఎవరిని కోరుకుంటుందో అతనికి ఇచ్చి వివాహం చెయ్యడం గాంధర్వం.  ఆ వివాహములో ధనము తీసుకుంటే అది ఆసుర వివాహము అవుతుంది. ఇంక, ఎవరైనా ఒక కన్నె మీద కోరికతో, ఆ కన్నె కు సంబంధించిన వారిని చంపి, ఆ అమ్మాయి దుఃఖిస్తుంటే,  ఆమెను  క్రూరంగా, బలవంతంగా ఎత్తుకొని వచ్చి వివాహం చేసుకోవడం  రాక్షసము అంటారు.

ఈ  మాదిరి వివాహములు ఐదు రకములు. అందులో మూడురకములు ధర్మసమ్మతములు. అసురము, రాక్షసము ధర్మసమ్మతములు కావు. పైగా దూషింపతగినవి. ఎవరైనా కన్యకు తల్లి, తండ్రి, అన్నదమ్ములు లేని పక్షంలో,  ఆ కన్నె వివాహమునకు పనికిరాదు.  బ్రాహ్మణుడు  బ్రాహ్మణ,క్షత్రియ,వైశ్య కన్యలను వివాహం చేసుకొన వచ్చును. శూద్రకన్యను వివాహమాడరాదు. ఆమె వలన సంతానం కలగడం నిషేధము. అలాగే క్షత్రియుడు, ముందు  క్షత్రియ కన్యను వివాహం చేసుకొని తరువాత , వైశ్య కన్యను వివాహమాడ వచ్చును. వైశ్యులు, శూద్రులు తమ తమ కులము వారినే వివాహం చేసుకోవాలి. ఇతర కులముల కన్యలను వివాహమాడరాదు. కాని కొన్ని సందర్భములలో క్షత్రియులు, వైశ్యులు శూద్రకన్యలను వివాహమాడవచ్చును." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! మీరు చెప్పడంలో బ్రాహ్మణుడు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యకన్యలను మాత్రమే వివాహమాడాలని అన్నారు. కాని బ్రాహ్మణుడు శూద్రకన్యలను కూడా వివాహం చేసుకున్నట్టు విన్నాము. అది ఎలా

సంభవించింది." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఏదైనా విషమ పరిస్థితులు సంభవించినప్పుడు కానీ, ప్రేమించి కానీ, ఆ శూద్రకన్యకు ఉన్న ధనము మీద లోభము చేత కానీ, బ్రాహ్మణుడు శూద్రకన్యను వివాహమాడిన సందర్భములు ఉండి ఉండ వచ్చును. కానీ బ్రాహ్మణునికి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కన్యల వలన కలిగిన సంతానమును బ్రాహ్మణులుగానే పిలువబడతారు. కానీ శూద్రస్త్రీ యందు కలిగిన సంతానమును బ్రాహ్మణునిగా పరిగణించరు." అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! కాని, వారికి ఆస్తిలో హక్కు ఉంటుంది కదా! బ్రాహ్మణుడు నాలుగు వర్ణములలో స్త్రీలను వివాహం చేసుకుంటే వారి వలన కలిగిన సంతానమునకు ఆస్తి పంపకములు ఎలా జరగాలి వివరించండి" అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ముందు ఆ బ్రాహ్మణుని ఆస్తిని పదిభాగములు చేస్తారు. అందులో నాలుగు పాళ్లు బ్రాహ్మణ స్త్రీ వలనపుట్టిన కుమారులకు, మూడు భాగములు క్షత్రియ కాంత వలన పుట్టిన కుమారులకు, రెండు పాళ్లు వైశ్య వనిత వలన పుట్టిన కొడుకులకు, మిగిలిన ఒక భాగము శూద్రస్త్రీవలన పుట్టిన సంతానమునకు పంచవలెను. శూద్రస్త్రీవలన పుట్టిన కుమారుడు, తన మీద ప్రేమతో భాగం ఇస్తే తీసుకోవాలి గానీ, ఆస్తిలో వాటా కోసం తండ్రితో, బ్రాహ్మణ, క్షత్రియ,వైశ్య వనితల వలన కలిగిన పుత్రులతో తగవులాడకూడదు. అదే ప్రకారంగా, బ్రాహ్మణుడైన తండ్రికి, క్షత్రియ, వైశ్య వనితల కు పుట్టిన కుమారులు కూడా శూద్రస్త్రీ వలన పుట్టిన సంతానమునకు ధర్మంగా రావలసిన పదవ భాగము ఇయ్యకుండా ఎగగొట్టడం తగదు." అని చెప్పాడు భీష్ముడు.

“ పితామహా! తమరు బ్రాహ్మణుని ఆస్తి పంపకాల గురించి చెప్పారు. మిగిలిన కులాల వారి ఆస్తి పంపకాల గురించి కూడా వివరించండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! క్షత్రియుని ఆస్తిని ఎనిమిదిభాగములుచెయ్యాలి. అందుతో క్షత్రియ కన్యకు పుట్టిన కుమారునికి నాలుగు భాగములు, వైశ్యకన్యకు పుట్టిన సంతానమునకు మూడు భాగములు, శూద్ర వనితకు పుట్టిన సంతానమునకు ఒక్క పాలు ఇవ్వవలెను.

ఇంక వైశ్యుని ఆస్తిని ఐదు భాగములు చేసి అందు వైశ్యస్త్రీ ద్వారా పుట్టిన కుమారునికి నాలుగు భాగములు, శూద్రస్త్రీ వలన పుట్టిన కుమారునికి ఒక భాగము ఇవ్వవలెను. ఇక్కడ కూడా శూద్ర వనితకు పుట్టిన కుమారుడు తన భాగము కొరకు తగవులాడకూడదు. ప్రేమగా ఇస్తే తీసుకొనాలి. అలాగే మిగిలిన సంతానము కూడా శూద్రస్త్రీకి పుట్టిన కుమారునికి న్యాయం గా రావలసిన ఒకభాగము అతనికి ఇవ్వాలి. ఎగగొట్టకూడదు. ఇది సాధారణ ధర్మము.

ఇంక శూద్రుడు తన జాతివారినే వివాహం చేసుకొనాలి. అతని ఆస్తి అతని కుమారులు సమానంగా పంచుకొనాలి.

ఇంక వైదిక కర్మలు కానీ, స్నానము, భోజనములు కానీ, దానికి సంబంధించిన కార్యములు అన్నీ బ్రాహ్మణ వనిత చెయ్యాలి. ఇతర కులము నుండి వివాహమాడిన భార్యలకు ఆ అధికారము లేదు.” అని చెప్పాడు భీష్ముడు.

“ పితామహా! కుమారులు బహువిధములుగా ఉంటారని విన్నాను. వారందరూ ఏ యే విధములుగా ఉంటారో వినాలని కుతూహలంగా ఉంది.” అని అడిగాడు.

“ధర్మనందనా!  ఎవరికైనా గానీ, తన కులములో వివాహమాడిన కన్యకు ధర్మబద్ధంగా  పుట్టిన సంతానమును  ఔరసుడు అని అంటారు.  ఇతడే  పెద్ద కొడుకు. మిగిలిన అందరి కంటే ఉత్తముడు.

ఎవరికైనా కుమారులు లేక పోతే, అతడు తన కుమార్తె కుమారుని అనగా దౌహిత్రుని. తన అల్లుడు, కూతురి సమ్మతితో  దత్తత తీసుకొన వచ్చును. అప్పుడు  ఆ దౌహిత్రుడు పుత్ర సమానుడు అవుతాడు.

ఎవరి కైనా సంతానము లేకపోతే, భర్త అనుమతితో భార్య మరొక అర్హుడితో సంగమించి సంతానం కంటే. ఆ సంతానము కూడా భర్తకు పుట్టిన సంతానమే అవుతంది.  (పాండవులు ఈ విధంగా పుట్టిన వారే!).

ఎవరైనా తల్లి తండ్రులు ధారా పూర్వకంగా (చేతిలో నీళ్లను వదిలిపెట్టడం ద్వారా) తన కుమారుని మరొకరికి దత్తం చేస్తే, అతని పేరు దత్రిముడు అంటారు. (దత్తకుడు, దత్తుకొడుకు అని కూడా అనవచ్చును).

తల్లి తండ్రి లేని అనాధలను దగ్గరకు చేర్చి, ఆత్మసాక్షిగా కుమారునిగా చేసుకొని  పెంచుకుంటే, వాడిని కృత్రిముడు అని అంటారు.

ఎవరైనా మగాడు పరుని భార్యతో సంగమించి, ఆమె ద్వారా  సంతాన మును కంటే, ఆ సంతానము, ఆ భార్య నిజభర్త కు కలిగిన సంతానము మాదిరి

పరిగణింపబడుతుంది. వాడిని గూఢజుడు అంటారు. (తండ్రి ఎవరో తెలియని వాడు).

ఎవరైనా తల్లి తండ్రులు తమ సంతానమును పెంచలేక గానీ వేరు కారణముల వలన గానీ వదిలి వేస్తే, ఆ సంతానమును వేరు వాళ్లు పెంచుకుంటే వాడిని అపవిద్ధుడు అంటారు. ( నేడు అనాధ శరణాలయములలో బాలలు అలాంటివారే.)

పెండ్లి కాక ముందు కన్య గర్భము దాల్చి బిడ్డను కంటే, ఆ సంతాన మును కానీనుడు అంటారు. ఆ కన్యకు వివాహము అయిన తరువాత, వివాహమునకు ముందు ఆమెకు పుట్టిన బిడ్డ, ఆమె భర్తకు కూడా కొడుకు అవుతాడు.

ఎవరైనా స్త్రీ పెళ్లి నాటికి గర్భం ధరించి ఉంటే, ఆ సంగతి తెలిసిగానీ, తెలియక గానీ, వివాహం చేసుకుంటే. తరువాత పుట్టిన బిడ్డ ఆ వివాహం చేసుకున్న వాడికి కుమారుడు అవుతాడు. అతనిని సహోఢుడు అని అంటారు.

భర్తను వదిలిన భార్య, భర్త వదిలిపెట్టిన భార్య, భర్త చనిపోయిన భార్య, గర్భం ధరించి బిడ్డను కంటే ఆ కుమారుడు, ఆమెకు ఎవరైతే గర్భధారణ చేసాడో వాడి కొడుకు అవుతాడు. వాడిని పౌనర్భవుడు అని అంటారు.

ఎవరికైనా తల్లి తండ్రులు లేకపోయినా, లేక వాడిని తల్లి తండ్రులు వదిలివేసినా, అలాంటి వాడు తనను తాను వేరు ఎవరి కైనా కుమారుడిగా దత్తత ఇచ్చుకుంటే అతనిని స్వయందత్తుడు అని అంటారు.

ఎవరైనా తల్లి తండ్రులు బిడ్డలను అమ్ముకుంటుంటే, అలాంటి బిడ్డలను వేరు ఎవరైనా కొనుక్కుంటే ఆ సంతానమును క్రీతుడు అని అంటారు. ,

ధర్మరాజా! ఈ పన్నెండు విధములైన కుమారులు తగిన వారే. కానీ ఔరసుడే తల్లి తండ్రులకు ఉత్తర క్రియలు నిర్వర్తించడానికి అర్హుడు. అని చెప్పాడు భీష్ముడు.

( ఈ విషయములు 5000 ఏండ్ల కిందట రాసినవి. నేడు అక్షరాలా అమలు జరుగుతున్నవి. ఆనాటి వారి ఊహా శక్తి మేధో సంపత్తి అమోఘము. ధర్మ బద్ధంగా గానీ, అధర్మబద్ధంగా గానీ సంతానం కన్నా, ఆ సంతానానికి చట్ట బద్దత కల్పించారు నాటి ధర్మవేత్తలు. నేడు కూడా ఇల్లెజిటిమేట్ సన్సుకు కూడా (అంటే అక్రమ సంతానానికి కూడా) ఆస్తి హక్కు కల్పించారు. తల్లి తండ్రి అక్రమంగా సంతానం కంటే అది వారి తప్పుగానీ, పుట్టిన సంతానానిదికాదు. ఈ ధర్మసూక్ష్మమును నాడు అమలు చేసారు... నేడు అమలు చేస్తున్నారు).

"పితామహా! ఒకరిని ఒకరు చూచుకోవడం ద్వారాగానీ, ఒకరితో ఒకరు కలిసి జీవించడం ద్వారాగానీ పుట్టే స్నేహాలు ఎలా ఉంటాయి. వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు చ్యవన నహుష సంవాదము వినిపిస్తాను. శ్రద్ధగా విను.భృగు వంశంలో జన్మించిన వాడు చ్యవనుడు. గొప్ప తపోధనుడు. అతడు గంగాయమునా సంగమ స్థానంలో నీటిలో మునిగి సమాధి స్థితి లో ఉన్నాడు. అప్పుడు ఆ నదులలో ఈదు తున్న చేపలు అతనిని తాకుతూ అతని చుట్టు తిరుగు తున్నాయి. ఆ చేపల స్పర్శకు అతను ఆనందిస్తున్నాడు. ఆ ప్రకారం అతను 12 ఏళ్లు సమాధిస్థితిలో ఉన్నాడు.

ఒకరోజు చేపలు పట్టే జాలరులు అక్కడకు వచ్చారు. వలలు లేసి చేపలు పడుతున్నారు. వారు వేసిన వలలో చేపలతో బాటు చ్యవనుడు కూడా చిక్కుకున్నాడు. అతనిని జాలరులు బయటకు లాగారు. అతడిని చూచి భయపడ్డారు.

"మునీంద్రా! మా తప్పు కాయండి. మీరు నీటిలో మునిగి ఉన్నది మాకు తెలియదు. అందువలన ఈ తప్పు జరిగినది. మమ్ములను క్షమించండి." అని ఆ జాలరుడు వేడుకున్నారు.

" ఇందులో మీ తప్పు ఏమీ లేదు. నేను నీటి అడుగున ఉన్నాను. ఈ చేపలతో సహజీవనం చేస్తున్నాను. వీటితోకూడా చావడానికి కూడాసిద్ధంగా ఉన్నాను. కాబట్టి నేను చెప్పిన పని చేయండి. ఈ చేపలతో పాటు నన్ను కూడా మీరు తీసుకొని పోయి తగిన వెలకు అమ్ముకోండి." అని అన్నాడు.

ఆ మాటలు విన్న ఆ జాలరులు ఇంకా భయపడ్డారు. వెంటనే ఆ దేశమును ఏలే రాజు నహుషుని వద్దకు పోయి జరిగినది అంతా వివరంగా చెప్పారు. అప్పుడు ఆ రాజు నహుషుడు మంత్రులు పురోహితులను వెంటబెట్టుకొని చ్యవనుని వద్దకు వచ్చాడు. చ్యవనునికి సాష్టాంగ దండ ప్రమాణము చేసాడు.

"మహానుభావా! ఈ జాలరులు తప్పు చేసారు. తమరు ఆ తప్పుకు ప్రాయశ్చిత్తము తెలపండి." అని ప్రార్థించాడు.

"మహారాజా! జాలరులకు చేపలు పట్టడం వారి ధర్మం. వారి ధర్మము వారు నెరవేర్చారు. ఇందులో వారి తప్పేముంది. అదియునుకాక, వీరు చాలా కష్టపడి

ఈ చేపలను నన్ను వలవేసి పట్టుకున్నారు. వీరికి తగిన వెల ఇచ్చి పంపండి." అని చెప్పాడు చ్యవనుడు.

"అమ్మయ్య! మునీంద్రుడు కోపం చెందలేదు." అని అనుకున్నాడు నహుషుడు. వెంటనే తన మంత్రులను పిలిచి ఆ జాలరులకు వేయి మాడలు ఇచ్చి పంపమని ఆజ్ఞాపించాడు.

ఆ మాటలు విన్న చ్యవనుడు "నా ఖరీదు వేయి మాడలా మహారాజా! తగిన వెల ఇమ్ము." అని అన్నాడు. "సరే ఒక లక్ష మాడలు ఇవ్వండి." అని అన్నాడు.

"అదేమిటి మహారాజా! నా విలువ లక్ష మాడలా!" అని అన్నాడు. దానికి నహుషుడు "కోటి మాడలు ఇవ్వండి." అని అన్నాడు. "మహారాజా! కాస్త ఆలోచించి వారికి తగిన వెల ఇవ్వవయ్యా." అన్నాడు చ్యవనుడు. నహుషుడు కూడా పంతానికి పోయాడు. "నా రాజ్యంలో సగభాగం ఈ జాలరులకు ఇవ్వండి." అని ఆజ్ఞాపించాడు. "అలా కాదులే మహారాజా! మరొక మాట చెప్పు" అని అన్నాడు చ్యవనుడు. "అలాగయితే నా పూర్తి రాజ్యము ఇస్తాను." అన్నాడు నహుషుడు.

" మహారాజా! అయితే ఒక పనిచెయ్యి. నీవు నీ మంత్రులతో ఆలోచించి తగిన వెల నిర్ణయించు." అని అన్నాడు. నహుషుడు మంత్రులతో "ఉన్నరాజ్యం మొత్తం ఇచ్చాను. ఇంక ఏమి ఉంది నా దగ్గర ఇవ్వడానికి." అని దుఃఖించాడు.

ఆ సమయంలో అక్కడు అవిజాతుడు అనే ముని వచ్చాడు. అక్కడ జరుగుతున్న విషయం పూర్తిగా తెలుసుకున్నాడు. "మహారాజా! మీరు చింత

పడకండి. ఇప్పుడే ఈ మునికి తగిన వెల నేను నిర్ణయిస్తాను.” అని అన్నాడు. “మునీంద్రా! అదేదో చెప్పి పుణ్యం కట్టుకోండి. మమ్ములను ఈ ఆపద నుండి గట్టెక్కించండి.” అని ప్రార్థించారు మహారాజు, మంత్రులు.

“ మహారాజా! గోవు, బ్రాహ్మణుడు ఒకే కులానికి చెందిన వారు. కాక పోతే బ్రహ్మదేవుడు వారిని రెండు కులాలుగా సృష్టించాడు. గోవు క్షీరములను, తద్వారా యాగమునకు కావలసిన పాలు,పెరుగు నెయ్యి సమకూరుతుంది. ఇంక యాగము చెయ్యడానికి కావలసిన వాడు పురోహితుడు.... బ్రాహ్మణుడు. కాబట్టి ఇరువురు ఒకే కులమునకు చెందినవారు. ఇంక బ్రాహ్మణుడు వేదవేదాంగవిదుడు. అతనికి వెల నిర్ణయించడానికి ఆ ఈశ్వరునికి కూడా తరం కాదు. గోవుకూడా బ్రాహ్మణునికి సమానం కనుక ఈ చ్యవనునికి ప్రత్యామ్నాయంగా గోవును ఇవ్వం సముచితము.” అని అన్నాడు.

ఆ మాటలతో మహదానందం పొందాడు నహుషుడు. చ్యవనునికి నమస్కరించి “మహానుభావా! నన్ను కరుణించు. నీ వంటి మునిపుంగవుని శరీరమునకు వెల నిర్ణయించే శక్తి ఎవరికైనా ఉందా! కాబట్టి తమరికి వెలగా గోవును ఇస్తాను.” అని అన్నాడు.

చ్యవనుడు నవ్వి “నీ నిర్ణయానికి సంతోషించాను. నహుష మహారాజా! గోవు అంటే ఎవరనుకున్నావు? గోవు అంటే అగ్ని; గోవు అంటే అమృతము; యజ్ఞములో గోవు అత్యంత పవిత్రమైన స్థానాన్ని అలంకరిస్తుంది. స్వర్గలోక ప్రాప్తికి నిచ్చెన వంటిది. దేవతలకు కూడా పూజనీయమైనది. కాబట్టి నాకు బదులుగా వారికి గోవును ఇమ్ము.” అని పలికాడు చ్యవనుడు. వెంటనే నహుషుడు ఒక గోవును తెప్పించి ఆ జాలరులకు ఇచ్చాడు. ఆజాలరులు ఆ గోవును చ్యవనునికి సమర్పించుకున్నారు.

" ఓ జాలరులారా! మీకూ, ఈ చేపలకు స్వర్గప్రాప్తి కలిగిస్తున్నాను." అని వరం ప్రసాదించాడు చ్యవనుడు.

తరువాత చ్యవనుడు, గవిజాతుడు ఇద్దరూ నహుషునికి చెరి ఒక వరం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. నహుషునికి సతతము ధర్మపరత్వము, ఇంద్రునికి దీటైన ఐశ్వర్యము ప్రసాదించారు. నహుషుడు తన రాజధానికి వెళ్లాడు." అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

" పితామహా! ఉత్తమమైన బ్రాహ్మణ వంశంలో క్షత్రియలక్షణములుగల పరశురాముడు జన్మించడం, క్షత్రియ వంశంలో కుశిక వంశంలో, పరమ బ్రాహ్మణుడు జన్మించడం చిత్రవిచిత్రంగా ఉంది. దీని గురించి నీ వలనకొంత విన్నాను. పూర్తి గా వినాలని ఉంది.నాకు తెలియజేయండి." అని అడిగాడు.

"ధర్మనందనా! చ్యవనుడు, కుశికుడు వీరిసంవాదము అనే ఇతిహాసము ఉన్నది. దానితో నీ సంశయము తీరగలదు. చ్యవనుడు ఒక బ్రాహ్మణుడు. కుశిక కులము కారణముగా తన వంశమునకు ఆపద వస్తుందని తెలుసు కున్నాడు చ్యవనుడు. ఆ కుశిక కులమునకు నాశనమును కలిగించాలి అని అనుకున్నాడు. వెంటనే కుశిక మహారాజు వద్దకు వెళ్లాడు. కుశిక మహారాజు ఆ మునికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి సత్కరించాడు. ఆ ముని రాజుతో ఇలా అన్నాడు.

"మహారాజా! నేను ఒక వ్రతము వ్రతము చేయ సంకల్పించాను. నీవు నీ భార్య నాకు సేవ చెయ్యాలని నా కోరిక." అని అన్నాడు. దానికి ఆ మహారాజు సంతోషంగా ఒప్పుకున్నాడు. ఆ రాజు చ్యవనునికి ఒక నివాసము ఏర్పాటు చేసాడు. స్నానమునకు భోజనమునకు అన్ని ఏర్పాట్లు చేసాడు.

"మునీంద్రా! మీరు ఇక్కడ ఉండండి. మీకు సకల సౌకర్యములు ఉంటాయి. మేము మీకు ఏమి సేవలు చెయ్యాలో చెప్పండి." అని వినయంగా అడిగాడు.

"మహారాజా! నేను భోజనం చేసి నిద్రపోతాను. నీవు, నీ భార్య నా కాళ్ళ పడుతూ ఉండండి. అదే చాలు. కాని నేను లేచేంతవరకూ నన్ను నిద్ర లేపవద్దు అని అన్నాడు. అలాగే అన్నారు ఆ రాజదంపతులు. ముని నిద్రకు ఉపక్ర మించాడు. ఆ మునిలో కదలిక లేదు. అలా నిద్రపోతూనే ఉన్నాడు. రాజు, రాణి నిద్రాహారాలు మాని అతని పాదసేవ చేస్తున్నారు.

21 రోజులు గడిచిపోయాయి. 22 వ రోజు ఆ ముని మేల్కొన్నాడు. ఎవరికీ చెప్పకుండా వెంటనే ఆ స్థలము విడిచి వెళ్లిపోయాడు. రాజు, రాణీ ఆయన వెంట వెళ్లారు. ఆయన నగరం దాటిపోయి అంతర్ధానం అయ్యాడు. అది చూచి రాజు రాణీ మూర్ఛపోయారు. కొంత సేపటికి వారు మూర్ఛనుంచి తేరుకున్నారు. అయ్యో ముని ఏమీ చెప్పకుండా వెళ్లిపోయాడే అని విచారిస్తూ మరలా రాజభవనమునకు వచ్చారు. అంతకు ముందు ముని పడుకున్న కుటీరమునకు వెళ్లారు. వారి ఆశ్చర్యానికి అంతు లేదు. పడక మీద ముని యధాప్రకారము పడుకొని ఉన్నాడు. మరలా ఆ రాజు రాణి ఆయనకు పాదములు ఒత్తుతూ పరిచర్యలు చేస్తున్నారు.

మరలా 21 రోజుడు గడిచాయి. 22వ రోజున ఆ ముని నిద్రలేచాడు. "రాజా నాకు అభ్యంగన స్నానము చేయవలెనని ఉన్నది." అని అన్నాడు. వెంటనే రాజు ఆ ఏర్పాట్లు చేసాడు. మునిని కూర్చోపెట్టి మంచి సువాసనలు గుబాళించే నూనెతో తల అంటారు. మరలా ఏమయిదో ఏమో ఆ ముని ఆ రాజును రాణిని తిట్టి వెళ్లిపోయాడు. రాజు రాణి అలానే నిలబడిపోయారు. కొంచెం సేపటికి ఆ

ముని వచ్చాడు. రాజు రాణి మొహంలో కోపం కనిపించలేదు. తరువాత తలంటి పోయించుకున్నాడు. రాజు అన్ని రకాల పదార్ధాలతో భోజన ఏర్పాట్లు చేసాడు. ఆ పదార్ధములు అన్ని చూచి మరలా ఆ ముని ఎటో వెళ్లిపోయాడు. "అయ్యో ముని భోజనం చెయ్యకుండా వెళ్లిపోయాడే!" అని బాధపడ్డారు ఆ దంపతులు.

మరునాడు పొద్దుటే ఆ ముని కనిపించాడు. "రాజా! వెంటనే నీ రథము సిద్ధం చెయ్యి. నీవు నీ భార్య ఆ రథమునకు గుర్రాల మాదిరి లాగండి. నేను రథములో కూర్చుని, బంగారము, రత్నములు, గోవులు, గుర్రములు, యాచకులకు దానం ఇస్తూ ఉంటాను." అని అన్నాడు.

రాజు మారు మాటాడక అంగీకరించాడు. రథమును తెప్పించి తాను తన భార్య అటు ఇటు గుర్రాల మీదిరి లాగుతున్నారు. ముని కోరిన బంగారము, రత్నములు, గోవులు మొదలగునవి తెప్పించాడు. ఆ ముని ఆ రథములో కూర్చున్నాడు. చర్నాకోల తీసుకొని రాజును రాణిని గుర్రాలను బాదినట్టు బాదుతున్నాడు. యాచకులకు బంగారము రత్నములు, గోవులు దానం ఇస్తున్నాడు. ఆ ప్రకారంగా రాజు,రాణి నిద్రాహారాలు మాని ముని చేతిలో చర్నాకోల దెబ్బలు తింటూ దేహమంతా రక్తం కారుతుంటే ఎన్నోదినాలు రథం లాగుతున్నారు.

అది చూచిన ప్రజలు ఇది కూడా ఒక తపోమహిమేనా! ఈయన కూడా ఒక తాపసియా. ఇది అన్యాయము. ఈ రాజ దంపతులు ఈ హింసను ఎలా సహిస్తున్నారో అని అనుకుంటూ రథం వెంట వెళుతున్నారు. చ్యవనుడు కూడా ఆ రాజదంపతుల ముఖములలో విసుగు కానీ వికారము కాని చూడలేదు. వారి ధైర్యానికి స్థైర్యానికి ఆశ్చర్యపోయాడు. అలా నగరం దాటారు.

వెంటనే చ్యవనుడు రథం దిగాడు. రాజ దంపతులకు కట్టిన పగ్గాలు విప్పాడు. వారి శరీరములను నిమిరాడు. వారి శరీరముల మీద కలిగిన గాయములు మటుమాయం అయ్యాయి. ఆ రాజు మొహం చూచి "రాజా! మీరు అలసి పోయారు కదూ. నేను మీకు వరాలు ఇస్తాను. మీరు వెంటనే రాచనగరుకు వెళ్లండి. నేను గంగాతీరమునకు పోయి వ్రతమును పూర్తిచేస్తాను. మీరు రేపు నా వద్దకు రండి." అని అన్నాడు.

"అయ్యో అదేమిటి స్వామీ. మాకు అలుపు ఆయాసము అసలే లేవు. మీరు మా శరీరం నిమరగానే మా శరీరం మీద ఉన్న దెబ్బలు అన్ని మాయం అయ్యాయి. మాకు ఏ అలసటా లేదు. నూతన యవ్వనంతో ఉన్నాము. ఇదంతా మీ మహిమ మహాత్మా!" అని అన్నారు రాజ దంపతులు. తరువాత ఆ రాజ దంపతులు మునికి నమస్కరించి రాచ నగరుకు వెళ్లిపోయారు.

మరునాడు సూర్యోదయం అయింది. ముని చెప్పిన ప్రకారము ఆ రాజదంపతులు గంగా తీరానికి వెళ్లారు. అక్కడ వారికి ఒక దేవేంద్రభవనం లాంటి భవనం కనపడింది. ఆ రాజదంపతులు ఆశ్చర్యపోయారు. ఆ భవనంలోకి అడుగుపెట్టారు. ఒక పక్క వేదాధ్యయనము, మరొక పక్క సంగీత, నృత్య వినోదములు, మరొక కోకిలలు మొదలగు పక్షులకు ఆలవాలమైన తోటలు, హంసలు మొదలగు పక్షులు విహరించే పద్మములు ఉన్న మడుగులు, క్రీడించడానికి వీలుగా ఉన్న చిన్న చిన్న కొండలు, అంతా కనుల పండువగా ఉంది. అక్కడ దేవతలు, గంధర్వులు, అప్సరసలు మొదలగు దేవతామూర్తులు అటు ఇటు తిరుగుతున్నారు. ఆ రాజదంపతులకు ఇది కలా నిజమా అని భ్రమ కలిగింది. ఇలాంటి అనుభవము ఎప్పుడూ పొందలేదు. అసలు ఇది భూలోకమా లేక స్వర్గలోకమా అనే భ్రాంతిలో ఉన్నాము అని అనుకున్నారు.

అక్కడ ఒక చోట చ్యవనుడు ఒక శయ్యమీద పడుకొని ఉన్నాడు. ఆ రాజదంపతులు అక్కడకు పోగానే ఆ ముని అదృశ్యం అయ్యాడు. వెంటనే అప్పటికా కనపడ్డ ఆ భవనము అప్సరసలు అందరూ అదృశ్యం అయ్యారు. మామూలుగా గంగాతీరము, అడవి ఉన్నాయి. అడవిలో కొంత దూరం పోగా అక్కడ చ్యవనుడు ఒక చోట కూర్చుని జపం చేసుకుంటున్నాడు. అది చూచి రాజు రాణితో ఇలా అన్నాడు.

"చూచావా దేవీ! యోగ బలం అంటే ఇదే! మానవులకు రాజ్యం సంపాదించడం సులభము. కాని బ్రాహ్మణత్వము, తపస్సు చాలా కష్టము. ~~ఈ~~ మహాముని చూడు తన తపోశక్తి వలన ఎన్ని సృష్టిస్తున్నాడో!" అని అన్నాడు. ఇంతలో ఆ ముని కళ్లు తెరిచి వారిని తన దగ్గరకు పిలిచాడు. ఆ రాజ దంపతులు రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ ఆ ముని దగ్గరకు వెళ్లారు. ఆ మునికి సాష్టాంగ పడ్డారు. ఆ ముని వారిని దీవించాడు. ఆ రాజ దంపతులతో ఇలా అన్నాడు.

"ఓ రాజా! నీకు నీ భార్యకు ఇంద్రియములు ఇంత వశంలో ఉన్నాయి. నేను నీకు ఇన్ని కష్టాలు కల్పించినా, నీలో నాకు ఏ లోపమూ కన్పించలేదు. నాకు చాలా సంతోషంగా ఉంది. నీకు కావలసిన వరం కోరుకో ఇస్తాను." అని అన్నాడు.

"మహానుభావా! నిన్నుసేవించుకోడం కన్నా నాకు వేరు కోరిక ఏముంటుంది. కాని ఒక్క విషయం చెప్పండి. మీరు మా ఇంటికి వచ్చి 21 రోజులు ఉన్నారు. అప్పటినుండి చాలా అద్భుతాలు జరిగాయి. ఇలా జరగడానికి కారణం నాకు తెలియడం లేదు. దయచేసి చెప్పండి." అని అడిగాడు.

"రాజా! ఒక సారి బ్రహ్మదేవుడు దేవతలు, మునులు ఉన్న సభలో ఇలా అన్నాడు. "భృగు వంశము, కుశిక వంశము, వాటి లక్షణములైన బ్రాహ్మము, క్షాత్రము మారి పోయి, వర్ణ సంకరము కలుగుతుంది." ఆ మాటలు నేను విన్నాను. భృగు వంశమునకు వర్ణ సంకరం కలగటం సహించలేకపోయాను. మీ కుశిక వంశమును నాశనం చేద్దామని వ్రతము నెపంతో నీ వద్దకు వచ్చాను. ఇన్ని కష్టాలు కల్పించాను. నా కష్టాలకు తట్టుకోలేక మీరిద్దరూ నన్ను తిడతారని అనుకున్నాను. అప్పుడు మీ ఇద్దరినీ మీ వంశమును శపిద్దామని తలంచాను. కానీ, నేను ఎన్ని కష్టములు కల్పించినా మీ ఇద్దరిలో ధైర్యము కొంచెం కూడా సడలలేదు. కోపం అసలే రాలేదు. కాస్తకూడా మీరు బాధ పడలేదు. మీ ధైర్యానికి మెచ్చుకున్నాను. నేను వరాలు ఇస్తామన్నా మీరు వద్దన్నారు. అందుకే మీరు ఇరువురకూ ఈ శరీరాలతోనే ఈ గంగా తీరంలో స్వర్గలోకం చూపించాను. రాజా! నీకు క్షాత్రము కంటే బ్రాహ్మణత్వము మీద మక్కువ ఎక్కువ అని గ్రహించాను. నీకు మూడవ తరంలో ఒక బ్రహ్మతేజోదీప్తుడు జన్మిస్తాడు. ఇప్పుడు నీకు ఏ వరం కావాలో కోరుకో!" అన్నాడు చ్యవనుడు.

"మునీంద్రా! దీనికంటే నాకు వేరువరం ఏం కావాలి. నా సంతానము నకు బ్రాహ్మణత్వము, ధర్మతత్పరత చేకూరేట్టు." అనుగ్రహించు అని వేడు కున్నాడు.

"రాజా! నీకు కోరినట్టే జరుగుతుంది. నీ మనుమడు మూడు లోకములలో పూజింప బడతాడు." అని అన్నాడు.

అప్పుడు రాజుకు ఒక సందేహము కలిగింది. "మునీంద్రా! నా మనుమడు ఏ ప్రకారంగా బ్రాహ్మణత్వము పొందుతాడు తెలియజేయండి." అని అడిగాడు. దానికి చ్యవనుడు ఇలా అన్నాడు.

"రాజా! నా వంశంలో రుచీకుడు అనే వాడు జన్మిస్తాడు. అతడు నీ కుమారుడు అయిన గాధి అనే వాని కూతురును పెళ్లి చేసుకుంటాడు. ఆ రుచీకునికి జమదగ్ని అనే కుమారుడు జన్మిస్తాడు. ఆ జమదగ్ని ధనుర్వేదమును కూలంకషంగా అభ్యసిస్తాడు. జమదగ్ని తన కుమారుడైన రామునితో ధనుర్వేదమును అభ్యాసం చేయిస్తాడు. ఆ ధనుర్విద్య సకల రాజలోకమును నాశనం చేస్తుంది. ఇదంతా విధివిలాసము. ఆ విధి విలాసము వలననే రుచీకుడు, గాధి, వారి వారి భార్యలు అనాలోచితంగా చేసిన పనుల వలన సద్బాహ్మణ వంశంలో జన్మించిన రుచీకునకు మనుమడుగా క్షాత్రధర్మాన్ని అవలంబించిన పరశురాముడు, క్షత్రియుడైన గాధికి బ్రాహ్మణత్వము అవలంబించిన విశ్వామిత్రుడు, కుమారులుగా జన్మిస్తారు. బ్రహ్మదేవుని వాక్కు ఈ ప్రకారంగాఫలిస్తుంది. ఈ ప్రకారంగా జరిగిన వర్ణసంకరము భవిష్యత్తులో జనులతో శ్లాఘించబడుతూ, కీర్తిదాయకమవుతుంది. నేను తీర్థయాత్రలకు వెళతాను. మీరుసుఖంగా ఉండండి." అని పలికి చ్యవనుడు వెళ్లిపోయాడు.

ధర్మనందనా! ఇదీ విశ్వామిత్ర, పరశురామ జన్మవృత్తాంతము." అనిభీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

" పితామహా! నాకు దానము దాని విశేషములను వినవలెనని ఉన్నది. వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! మంచి పాలిచ్చే పాడి ఆవును ఒక సద్బ్రాహ్మణునికి దానంగా ఇస్తే, ఆ ఆవుకు ఎన్ని రోమాలు ఉంటాయో అని సంవత్సరములు స్వర్గలోకంలో సుఖాలు అనుభవిస్తారు. అతనికి అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలవారు సద్గతులు పొందుతారు. గోదానమే కాక, ఇంకా ఇతరములు కూడా దానము చెయ్యవచ్చును. కన్య, భూమి, గృహము, బంగారము,

అన్నము, జలము, వస్త్రములు, మంచములు, కూర్చునుటకు పీటలు, వాహనములు, మొదలగునవి సద్బ్రాహ్మణులకు దానంగా ఇస్తే ఇహలోకము లోనూ పరలోకములోనూ సుఖములు పొందుతాడు. కాని ధర్మనందనా! ఎవడైతే దానము కొరకు తన వద్దకు వస్తాడో, అతని మనోరథమును తెలుసుకొని అతనికి ఏం కావాలో దానిని ప్రేమతో దానంగా ఇస్తే, ఆ దానమును మించిన దానము మరొకటి లేదు. అసలు ఈ దానములలో కల్లా భయంతో ఉన్నవారికి అభయం ఇవ్వడం అన్నిటి కన్నా శ్రేష్టమైనది. వీటన్నిటి కన్నా యుద్ధంలో మరణించడం... అంటే యుద్ధములో ప్రాణములు దానంగా ఇవ్వడం .....అన్నిటి కన్నా చాలా చాలా గొప్పది.

ధర్మనందనా! తన శత్రువు ఎలాంటి వాడైనా శరణు కోరితే ప్రసన్నమైన మనసుతో అతని కోరిక తీర్చిన వాడిని పురుషోత్తముడు అని అంటారు. కట్టుకున్న భార్యను కన్న కొడుకులను కూడా పోషించలేక అత్యంత పేదరికంతో బాధ పడే వాడికి సాయం చెయ్యడం, అతని దుఃఖాన్ని పోగొట్టడం చాలా గొప్ప గుణము. తన భార్యను తప్ప అన్య కాంతలవంక కన్నెత్తికూడా చూడని వారు, యజ్ఞయాగములు చెయ్యడం లో ఆసక్తి కలవారూ, కామమును, కోపమును మనసులోకి రానీయని వారు, అటువంటి సద్బ్రాహ్మణులను వెతికి వారికి దానం చెయ్యడం మూడులోకములలో పూజనీయము." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! దానము కోసం తన వద్దకు వచ్చిన వానికి దానం చెయ్యడం మంచిదా. లేక తనను దానము కోరకపోయినా అతని మనసు తెలుసుకొని దానం చెయ్యడం మంచిదా తెలియచెయ్యండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! అడిగితే దానం చెయ్యడం అందరూ చేసేదే. కాని అడగకుండా, ఎదుటి వాని మనసుతెలుసుకొని దానం చెయ్యడం ఎక్కువ

ఫలాన్ని ఇస్తుంది. అసలు దానం అడిగడం సత్పురుషునికి చావు వంటిది. ఇంక దానం కావాలా అని అడగబడటం అంతకన్నా పెద్ద చావు. కాబట్టి అడగని వాని మనసు తెలుసుకొని దానం చెయ్యడం వలన తనను తాను రక్షించుకుంటూ దానం పుచ్చుకున్నవాడిని కూడా రక్షిస్తాడు." అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! దానము యజ్ఞము వంటిది. దానం చెయ్యడం లో అనేక ధర్మ విధులు ఉన్నాయి. కాని ఆ దానములలో అధిక ఫలము ఇచ్చే దానము ఏదియో తెలపండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ధనము, ధాన్యము, గోవులు, మణులు, భూమి, జలము, అన్నము మొదలగునవి వినయపూర్వకంగా సద్బ్రాహ్మణులకు దానంగా ఇస్తే మంచి యజ్ఞములు చేసిన ఫలము దక్కుతంది. కాబట్టి ధర్మనందనా! నీవు కూడా ఎల్లప్పుడూ దానధర్మములు చేస్తూ ఉండు.

దానములలోకెల్లా ఉత్తమమైన దానము భూదానము. ఎందుకంటే మనకు అవసరమైన వస్త్రములు, ధాన్యము, రత్నములు మనకు భూమి నుంచే లభిస్తున్నాయి. మనకు బంగారము, వెండి, వస్త్రములు, ధాన్యము, వివిధము లైన రత్నములు ఇస్తున్న ఆ భూమిని దానం చేస్తే, దానం ఇచ్చిన వాడు ఉత్తమ ఫలములను పొందుతాడు. భూదానము చేసిన వాడు, భూమి ఉన్నంత కాలము స్వర్గంలో సుఖంగా ఉంటాడు. కొంచెంగా భూమి దానం చేసినా, అతడు మరుజన్మలో రాజ్యములు పాలిస్తాడు. క్షత్రియులు యుద్ధములో వీరమరణం పొందితే, అతనికి భూదాన ఫలితము దక్కుతుంది. భూదానం చేస్తే బ్రహ్మ హత్య మొదలగు పాపములు నశిస్తాయి. భూమిని ఎంతటి పాపాత్ముడు దానం చేసినా, ఆ పాపం భూమికి అంటదు. భూదానము అశ్వమేధ యాగము చేసిన దానితో సమానము. దారిద్ర్యంతో బాధపడుతూ ఎవరినీ యాచించకుండా

జీవించే బ్రాహ్మణునకు భూమిని దానం చేస్తే, ఆ దానము వలన వచ్చే ఫలము అంతా ఇంతా కాదు. యాగం చేసినపుడు శాంతచిత్తులైన బ్రాహ్మణులకు భూదానం చెయ్యడం అత్యతంత ముఖ్యము. అర్హుడైన బ్రాహ్మణునకు గోవు చర్మము మేర భూమిని దానంగా ఇచ్చినా, అది దానం ఇచ్చిన వాని పాపములను అన్ని పోగొడుతుంది. యుద్ధములో మరణించి వీరస్వర్గము పొందినవారు, సతతమూ గురువు లను పూజించేవారు, అనేక పుణ్యకార్యములను చేసిన వారు, వీరు ఎవరూ భూదానము చేసిన వారితో సరితూగరు. భూదేవి జనహితము కోరి భూగీతను ప్రజకు అందించింది. ఆ గీతను అనుసరించి పరశురాముడు భూదానం చేసాడు. భూదేవి చెప్పిన భూగీతను నేను నీకు వినిపిస్తాను.

భూదేవి ఇలా అంది. మీకు ఈ లోకములోనూ పర లోకములోనూ సుఖాలు కావాలంటే నన్ను (భూమిని) దానం చేయండి. భూదానమునకు సరి అయిన ధర్మము వేరొకటి లేదు. సంతోషంగా నన్ను దానం చేస్తే నాకు సంతోషం కలుగుతుంది. అలా కాకుండా ఆ దానమునకు దుష్ట చింతనతోఅడ్డు తగిలితే నాకు బాధ కలుగుతుంది. వాడు ఎటువంటి దుర్మార్గుడైనా గానీ, భూదానం చేస్తే అతడికి నేను ఇహపరములలో మేలు చేస్తాను. అని భూదేవి పలికింది.

ధర్మనందనా! ఈ విషయంలో బృహస్పతి ఇంద్రునికి చెప్పిన మాటలు కూడా చెబుతాను విను. దేవేంద్రా! భూమిని రత్నగర్భ అంటారు. కాబట్టి భూదానము చేసిన వాడికి హయములు, ఏనుగులు,రత్నములు, కన్యలను దానం చేసిన ఫలితం దక్కుతంది. ఇంకా భూమినుండి బంగారము వస్తుంది. ఆ భూమిని దానం చేసిన వాడిని చూచి మిగిలిన భూతములు (పంచ భూతములలో భూమి ఒకటి) తృప్తి చెందుతాయి.

రాజులు తమ పరి పాలనలో విధి నిర్వహణలో తెలిసో తెలియకో ఎన్నోపాపాలు చేస్తుంటారు. ఆ పాపాలు పరిహారం కావడానికి భూదానమే ఉత్తమమైన మార్గము. ఎవరైతే తాను ఇదివరకు దానంగా ఇచ్చిన భూమిని తిరిగి తీసుకుంటాడో వాడు నరకానికి పోతాడు. భూమిని దానం చేస్తానని వాగ్దానం చేసి ఇవ్వక పోతే మహా పాపము వస్తుంది. అలాగే అడగకుండా భూమిని దానం చేస్తే, మహా పుణ్యము వస్తుంది." అని బృహస్పతి దేవేంద్రునితో చెప్పినట్టు భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

" పితామహా! మంచి దానపరుడైన మానవునికి దానంగా ఇవ్వదగిన వస్తువులు ఏవి తెలియచెయ్యండి." అని అడిగాడు.

" ధర్మనందనా! అన్నము, బంగారము, జలము, ప్రముఖంగా దానము చెయ్యడానికి అనేకూలమైనవి. అందులో ప్రముఖము అన్నదానము. దాని గురించి చెబుతాను విను. మునులు, దేవతలు అన్నమును గురించి వినుతి చేస్తుంటారు. ఎందుకంటే యజ్ఞయాగములలో క్రతువులలో అన్నము విశిష్టస్థానము ఆక్రమిస్తుంది. కాబట్టి అన్నదానమును మించిన దానము వేరొకటి లేదు. కాబట్టి అన్ని పుణ్యకార్యములలో అన్నదానము తప్పకుండా చెయ్యాలి.

అన్నము మన ప్రాణములకు ఆధారము. కాబట్టి మనకు, మనవాళ్లకు లేకపోయినా సరే, అతిధికి భక్తితో అన్నం పెట్టడం అధికమైన పుణ్యాన్ని ఇస్తుంది. బాగా అలసిపోయిన వాడు, వృద్ధుడు, తపస్వి, బాలుడు, వికలాంగుడు, స్త్రీ --వీరు ఆకలితో అన్నం పెట్టమని అడిగితే, గృహస్థు కోపగించుకోకూడదు. వారికి అన్నం పెట్టాలి. ఇంతెందుకు ఆకలితో ఉన్న కుక్కకు, కడజాతి వానికి కూడా అన్నదానం చెయ్యడం ఎంతోపుణ్యాన్ని ఇస్తుంది.

మునులకు, పితరులకు, దేవతలకు అన్నదాన విధులు నిర్వర్తిస్తే, అది అన్ని కర్మలలోకి శ్రేష్టమైనది. అన్నదానం చెయ్యడానికి కులము, విద్య, వృత్తి ఏవీ అడ్డురాకూడదు. అడగంగానే బ్రాహ్మణునకు అన్నం పెట్టాలి. ధర్మనందనా! ఒక్క బ్రాహ్మణులకే కాదు, అన్ని జాతులవారికీ, కులముల వారికీ అన్నదానం చెయ్యి. అది నీకు అన్ని శుభాలను చేకూరుస్తుంది." అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! నాకు నక్షత్ర విషయములైన దానముల గురించి తెలపండి." అని అడిగాడు.

" ధర్మనందనా! ఇదే విషయాన్ని ఒక సారి దేవకీదేవి నారదుడిని అడిగింది. ఆమెకు నారదుడు చెప్పిన విషయములు నీకు చెబుతాను.

కృత్తికా నక్షత్రంలో పాయసము. బ్రహ్మదేవుని నక్షత్రంలో మినుములు, చంద్రుని నక్షత్రంలో అన్నము, ఆరుద్ర నక్షత్రంలో గోవు, అదితి నక్షత్రంలో తీపి పులగము (పెసలపప్పు,బియ్యము, చక్కెర, నెయ్యి, కలిపి వండిన అన్నము. ), బృహస్పతి నక్షత్రంలో బంగారము, ఆశ్లేషా నక్షత్రంలో ధనము, మఖానక్షత్రంలో ఉప్పు,నువ్వులు, భగుడు అధిదేవత గా ఉన్న తారకు చెరకురసము, ఉత్తర ఫల్గునీ నక్షత్రంలో పాలతో వండిన పౌష్టికాన్నము (పరమాన్నము), సూర్యతారలో ఏనుగులు,రథములు, చిత్తానక్షత్రంలో శ్రీగంధపు చెక్క, స్వాతీ నక్షత్రంలో తనకు ఏది ప్రియమైతే అది దానము చేయవలెను.

విశాఖ నక్షత్రంలో ఎద్దు, అనూరాధ లో పైపంచలు, జేష్టనక్షత్రములో ముల్లంగి, కరివేపాకు, మూల నక్షత్రములో మంచి ఫలములు, పూర్వాషాఢ లో పెరుగు, ఉత్తరాషాఢలో తేనెతో వండిన అన్నము, విష్ణువు, వసువులు, నీరు

అధిష్టాన దేవతలుగా కలిగిన నక్షత్రములలో దుప్పట్లు, వాహనము, యవలు దానముగా ఇవ్వవలెను. పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర  మాంసము, రేవతీ నక్షత్రంలో కంచు పాత్రతో సహా గోవు, అశ్విని నక్షత్రంలో గుర్రపుబండి, భరణీ నక్షత్రము నందు  నువ్వులు, ఆవులు దానం చేయడం మంచింది. ఈ ప్రకారంగా దానం చేయడం వలన ఊర్ధ్వ లోకములు పొందుతారు.

ఇన్ని దానముల కన్నా సువర్ణదానము అన్నిటికి  బదులు అంటే ప్రత్యామ్నాయంగా  చేయవచ్చును.  ఏదైనా మంచి వ్రతము చేసిన సమయంలో బంగారం దానం చేస్తే అయుష్షు  పెరుగుతుంది, మనిషి పునీతుడవుతాడు, భావశుద్ధి కలుగుతుంది అని పూర్వము హరిశ్చంద్రుడు చెప్పాడు.

అన్నిటి కన్నా దాహంగా ఉన్నవాడికి మంచినీరు దానం చెయ్యడం చాలా గొప్పది అని మనువు చెప్పాడు.

( వేసవి కాలంలో చలివేంద్రలు పెట్టి  దాహార్తులకు నీరు ఇవ్వడం. కాని ఈ రోజుల్లో నీళ్ల అమ్ముకుంటున్నారు.).

నీరు దానం చెయ్యడం అంటే మరో అర్థం కూడా ఉంది. చెరువులు, బావులు, కొలనులు తవ్వించడం. అందులోని నీరు తాగడానికి ఉపయోగించడం.

(నేడు ఆ చెరువులు, కొలనులు  అన్ని ఆక్రమించి ప్లాట్లు చేసుకొని అమ్ముకుంటున్నారు. అందుకే చెరువుల్లో ఉండాల్సిన నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి.).

చెరువులు, కొలకులు, బావులు, నూతులు తవ్వించడం వలన, వారు పుణ్యలోకములు పొందుతారు. ఎవడు తవ్వించిన చెరువులో, కొలనులో గోవులు నీళ్లు తాగుతాయో వాడి కులము మొత్తం సద్గతిపొందుతుంది. ఎవడు తవ్వించిన బావులలో, చెరువులలోని నీరు మండు వేసవిలో దాహార్తులు తాగి దాహం తీర్చుకుంటారో, వాడికి ఎలాంటి పాపము అంటదు.

దానములలో తరువాతి స్థానము ఘృతము అంటే నెయ్యి. నెయ్యి యాగములు మొదలగు పుణ్యకార్యములకు ఉపయోగిస్తారు కనుక అది చాలా పవిత్రమైనది. అలాంటి నెయ్యి దానం చెయ్యడం వలన అగ్ని దేవుడు, యజ్ఞపురుషుడు ప్రీతి చెందుతారు.

కుండలు బ్రాహ్మణులకు దానం చేస్తే, వారు చేసే పుణ్యములో ఆరవ వంతు దానం చేసిన వాడికి దక్కుతుంది. అలాగే యజ్ఞమునకు సమిధలు దానం చేస్తే, అతడు ధనవంతుడవుతాడు. గొడుగులు దానం చేస్తే పుత్రులను పొందుతాడు. వాహనములు దానం చేస్తే సకల కోరికలు సిద్ధిస్తాయి. చెప్పులు దానం చేస్తే, శత్రునాశనం జరుగుతుంది.

నువ్వులు పితృదేవతలకు ఆహారంగా సృష్టించాడు బ్రహ్మ. అటువంటి నువ్వులు దానం చేస్తే, చేసిన వాడిపాపములు అన్ని నశిస్తాయి. తిల దానం శ్రేష్టమైనది. వీటిని మునులు స్వీకరిస్తారు. అర్హులైన వారికి తిలలు దానం చేస్తే మునుల కంటే గొప్పవారు అవుతారు.

ఇంక దానం ఎక్కడ ఎప్పుడు చెయ్యాలి అంటే పుణ్య కార్యములలో, యజ్ఞయాగాదులలు దానాలు చెయ్యవచ్చును. దానాలు ఎక్కడైనా చెయ్యవచ్చును.

ధర్మనందనా! ఇంక గోదాన మహిమను వివరిస్తాను. గోవులు తపోధనుల కంటే గొప్పవి. గోవులు హోమములకు కావలసిన పాలు, పెరుగు, నెయ్యి ఇస్తాయి. గోవు శరీరంలో పనికిరానిది అంటే ఏదీ లేదు. దాని చర్మము, దాని మూత్రము, దాని పేడ, అన్నీ పవిత్రములే. పైగా గోవులు మనకు అన్ని పనులు చేసి పెడతాయి. గోవు, బ్రాహ్మణుడు ఒకటే అని వేదములు చెబుతున్నాయి. కాబట్టి గోదానము చేసిన వాడికి ముక్తి లభిస్తుంది. గోవులను బ్రాహ్మణులకు దానం చేస్తే, వారి పాపములు అన్ని నశిస్తాయి. పుణ్యలోకప్రాప్తి కలుగుతుంది. ఆవుపాలు అమృతముతో సమానము అని దేవేంద్రుడే స్వయంగా చెప్పాడు. కాబట్టి గోదానం చేస్తే అమృతమును దానం చేసిన ఫలితం కలుగు తుంది. గోవులు మనకు ప్రాణములతో సమానం. కాబట్టి గోదానం చేస్తే మన ప్రాణాలు దానం చేసినట్టే కదా!

కాని ఈ గోదానములు అర్హులకే చెయ్యాలి. క్రూరులకు, నాస్తికులకు, దుర్మార్గులకు, దానం చేస్తే చేసినవాడు పరమ దుఃఖమును పొందుతాడు. కాబట్టి గోవును దానం చేసేటప్పుడు బాగా పరీక్షించి వాడు తగిన వాడు అంటేనే గోదానం చెయ్యాలి. కాని ధర్మనందనా! దానం చేసే గోవు ఆరోగ్యంగా ఉండాలి కానీ, రోగం వచ్చినదీ, బక్కచిక్కినదీ, ఇంక చూలు రాని దానినీ దానం చెయ్యకూడదు. అంటే పనికిరాని గోవును దానం ఇవ్వకూడదు. మోక్ష ప్రాప్తికి గోదానమును మించిన దానము మరొకటి లేదు. ఎన్ని ఎక్కువ గోవులు దానం ఇస్తే అంత ఫలం దక్కుతుంది.

ధర్మనందనా! దానములలో తరువాతి స్థానము అన్న పానీయములది. ఇంతకు ముందు జలము దానం చెయ్యడం దానముల కెల్ల గొప్ప దానము అని చెప్పాను కదా! అందులో అన్నదానము చాలా గొప్పది. అన్నమును దేవ

లోకములో  అమృతమనీ, నాగ కులములో సుధ అనీ, పితృలోకంలో స్వధా అని పిలుస్తారు.  మహాత్ములు అన్నమును ప్రాణము అని కూడా అంటారు. కాబట్టి అన్నదానము ప్రాణదానముతో సమానము.

అన్నము కంటే జలము గొప్పది. ఎందుకంటే అన్నము పాకం చెయ్యడానికి  జలము ఆశ్రయము.  చంద్రుడు జలం నుండి పుట్టాడు కదా! ఓషధులన్నిటినీ చంద్రుడు కాపాడుతుంటాడు. కాబట్టి అన్నము కంటే జలము ఉత్తమము.  మానవుడు తనవద్ద ఉన్న అన్నమునే దేవతలకు నివేదించాలి, పితరులకు తర్పణము చెయ్యాలి, అతిధులను సత్కరించాలి.

ధర్మనందనా! అన్నిటి కంటే తిలదానము కూడా గొప్పది. దాని గురించి నీకు ఒక ఇతిహాసము చెప్పెదను వినుము.  పూర్వము మధ్యదేశములో పర్ణశాల అనే గ్రామము కలదు. ఆ ఊరిలో శర్మ అనే బ్రాహ్మణుడు నివసిస్తున్నాడు.  ఆ శర్మను యముడు పిలిచాడు. అతనికి ~~ఈ~~ ప్రకారము ఉపదేశించాడు. "దానముల కెల్ల నువ్వుల దానము గొప్పది. నువ్వులను పితరులు ఇష్టంగా ఆరగిస్తారు.  నువ్వులు ఆహారంగా స్వీకరిస్తే పాపములు పోతాయి. బుద్ధి ఎల్లప్పుడూ పుణ్యకార్యముల వంక మరలుతుంది. కాబట్టి నీవు ఎల్లప్పుడూ నువ్వులను బ్రాహ్మణులకు దానంగా ఇవ్వు. దాని తోపాటు వస్త్రదానం చేస్తే దేవతలు, దీపములు దానం చేస్తే పితరులు సంతోషిస్తారు." అని యముడు ఆ బ్రాహ్మణునికి ఉపదేశించాడు.  కాబట్టి ధర్మనందనా తిలదానం అంత  గొప్పది.

ఇంక సంగ్రహంగా చెప్పాలంటే దానము చేయదగ్గవి మూడు. భూదానము. విద్యాదానము. గోదానము. దానము చెయ్యడానికి ఇంతకు మించి దాతవ్యములు(దానము ఇవ్వతగినవి)  లేవు.   గురువు తన శిష్యునకు విద్యాదానం చేస్తే భూదానం చేసినంత ఫలితం వస్తుంది. గోదానం కూడా

భూదానం తో సమానమే.  గోమయంతో ( ఆవు పేడతో) దేవతా గృహములు, పితృకార్యములు నిర్వహించే గృహములు అలికి శుద్ధిచేయవలెను. దాని వలన పవిత్రత చేకూరుతుంది. తాను బతికి ఉన్నంత కాలము, తాను భోజనము చేసే ముందు  ఆవుకు  ఎవడైతే పిడికెడు గడ్డి పెడతాడో, వాడికి బ్రాహ్మణుల కోరికలు తీర్చిన ఫలము దక్కుతుంది.

కాని ఇందులో ఒక ధర్మ సూక్ష్మము ఉన్నది. ఎవడైతే గోదానము మంచి బుద్ధితో చేస్తాడో వాడికి మంచి ఫలితము దక్కుతుంది. ఎవడైతే గోదానము చెడుబుద్ధితో చేస్తాడు వాడికి కీడు కలుగుతుంది.  ఈ సందర్భంగా నీకు ఒక కథచెబుతాను విను. ద్వారవతి(ద్వారక) అనే పట్టణంలో ఒక బావి ఉంది. అందులో పెద్దశరీరం గల తొండ ఒకటి నివసిస్తూ ఉంది. ఒక నాడు అది మనుషుల కంట పడింది. దీనిని బావిలో ఉండనిస్తే నీరు పాడవుతుందని ఆ ఊరి జనులు దానిని తాళ్ల సాయంతో బయటకు తీయబోయారు. కాని అది ఇసుమంత కూడా కదలలేదు. వారందరూ శ్రీ కృష్ణుని వద్దకు పోయి ఈసంగతి చెప్పారు. అప్పుడు శ్రీకృష్ణుడు అక్కడకు వచ్చాడు. ఆ తొండను  బయటకు తీసాడు. అప్పుడు ఆ తొండ కృష్ణుని చూచి నేను నృగు మహారాజును అని తనను తాను తెలియపరచుకుంది. కృష్ణుడు అతనిని గుర్తు పట్టాడు.

“అయ్యో ఇదేమిటి నీవు మహారాజువు. పైగా  వేలకొద్దీ ఆవులు దానం చేసావు కదా. నీకు  ఈ దుర్జన్మ ఎలా వచ్చింది?” అని అడిగాడు.

“ఏమని చెప్పుదును కృష్ణా! నేను ఒక నాడు ఒక బ్రాహ్మణునికి ఒక గోవు దానంగా ఇచ్చాను. ఆ గోవును ఆయన తన వెంట తీసుకొని వెళ్లాడు. మరునాడు ఆ బ్రాహ్మణుడు నేను దానంగా ఇచ్చిన ఆవును మేతకోసం బయటకు తోలాడు.   మా గోవులు కూడా మేత మేస్తున్నాయి. అలవాటు

ప్రకారం  నేను దానంగా ఇచ్చిన గోవు మా ఆవుల మందలో చేరిపోయింది. ఇది గోపాలకులు గమనించలేదు.  మందతో కూడా ఆ గోవు మా ఇంటికి వచ్చింది. మరునాడు నేను గోదానము కొరకు ఆవులను తీసుకొని రమ్మన్నాను. గోపాలకులు మిగిలిన గోవులతో పాటు నేను ముందురోజు దానంగా ఇచ్చిన గోవును కూడా తీసుకొని వచ్చారు.  ఆ విషయం తెలియక నేను మిగిలిన గోవులతో పాటు ఆ గోవును కూడా దానం చేసాను. ఆ గోవును దానంగా తీసుకున్న బ్రాహ్మణుడు  గోవులను తీసుకొని పోతూ ఉండగా అంతకు ముందు నా వద్ద దానం పుచ్చుకున్న బ్రాహ్మణుడు తన గోవు కోసం వెతుకుతూ ఈ గోవును చూచాడు.

" ఈ గోవును  నాకు రాజుగారు దానం ఇచ్చారు." అని అన్నాడు. ఈ బ్రాహ్మణుడు కూడా "ఇది నాకు రాజుగారు దానంగా ఇచ్చారు." అని అన్నాడు. ఇద్దరూ ఆ గోవుతో సహా నా వద్దకు వచ్చారు. నేను జరిగింది విచారించి  నిజం తెలుసుకున్నాను.  ఒకసారి దానంగా ఇచ్చిన గోవును మరలా దానం చెయ్యడం మహా పాపం అని తెలుసు. కాని పొరపాటున జరిగింది కాబట్టి  నేను మొదట దానం తీసుకొన్న బ్రాహ్మణునికి ఆ గోవు బదులు లక్ష గోవులు దానంగా ఇస్తాను అన్నాను.   "నాకు వద్దు, ఆ గోవు మహాలక్ష్మి లాంటిది. నా కుమారునికి ఎప్పుడు కావాలంటే అప్పుడు పాలు ఇచ్చేది. నాకు అదే  ఆవు కావాలి." అని అన్నాడు.

నేను రెండవ బ్రాహ్మణునితో "నీకు  మణులు, రత్నములు బంగారము ఇస్తాను. ఆగోవును ఇవ్వండి."  అని అడిగాను. "నాకు నీ రాజ్యం మొత్తం ఇచ్చినా వద్దు. నాకు నాకు దానంగా ఇచ్చిన  ఆవు కావాలి." అని అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

తరువాత నాకు మృత్యువు సంభవించి నేను యమధర్మరాజు వద్దకు

వెళ్లాను. అతడు ప్రేమతో "రాజా! నీవు ఎన్నో దాన ధర్మాలు చేసావు. నీకు పుణ్యం వచ్చింది. కాని ఒకరికి దానంగా ఇచ్చిన ఆవును తిరిగి తీసుకొని మరలా మరొకరికి దానంగా ఇచ్చావు. అది తెలియక చేసినా అది పాపమే కదా. అందువల్ల నీకు దుర్గతి కూడా సంభవించింది. కనుక ముందు నీవు సద్గతి అనుభవిస్తావో దుర్గతి అనుభవిస్తావో తేల్చుకో!" అని అన్నాడు. నేను ముందు దుర్గతిని అనుభవించడానికి సుముఖత చూపాను. వెంటనే నేను తలకిందులుగా భూలోకంలో పడ్డాను. అలా పడటం ఒక ముని చూచాడు. నామీద జాలి పడ్డాడు. "నీవు తొండ జన్మ ఎత్తుతావు. కొంత కాలం తరువాత శ్రీకృష్ణుడు నిన్ను బావిలోనుండి బయటకు తీస్తాడు." అని చెప్పాడు. ఇంతకాలానికి నువ్వు వచ్చావు. నన్ను బయటకు లాగావు. నీ స్పర్శ వలన నా దుర్గతి అనుభవం పూర్తి అయింది. ఇంక సద్గతికి పోతాను." అని అన్నాడు నృగుడు.

"రాజులకు విప్రుల సొమ్ము అపహరించడం మహా పాపము. తెలియకుండా నృగుడు విప్రుని సొమ్ము అపహరించి ఇలాంటి దుర్గతి పొందాడు." అని శ్రీకృష్ణుడు నృగునితోనూ, అక్కడ చేరిన జనులతోనూ చెప్పినట్టు భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

"పితామహా! నాకు గోదానములు చేసి నందువలన కలిగే ఫలములు చెప్పండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు ఒక ఇతిహాసము చెప్పెదను. ఆకర్ణింపుము. ఔద్దాలకుడు అనే ముని ఉండేవాడు. అతని కుమారుడు నచికేతుడు. ఒకరోజు ఔద్దాలకుడు తన కుమారుడు నచికేతుని పిలిచి "కుమారా! నేను ఏటి దగ్గర సమిధలు, కలశము, పువ్వులు మరచి వచ్చాను.

నీవు పోయి తీసుకొని రా!" అని అన్నాడు. నచికేతుడు ఉత్సాహంతో తండ్రి చెప్పిన వస్తువులు తీసుకురావడానికి వెళ్లాడు. ఇంతలో ఆ ఏరు పొంగింది. ఆ వస్తువులు ఏటిలో కొట్టుకొని పోయాయి. అందువల్ల నచికేతునికి ఆ వస్తువులు కనపడలేదు. వెంటనే తిరిగి వచ్చి "ఆ వస్తువులు అక్కడ లేవు కనపడలేదు." అని చెప్పాడు. అప్పటికే ఔద్దాలకుడు ఆకలితో ఉన్నాడు. కోపం తట్టుకోలేక "లేకపోతే ఇక్కడకు ఎందుకు వచ్చావు. యముడి దగ్గరకు పో!" అని కోపంగా అన్నాడు. తండ్రి కోపముతో అన్న మాటలకు నచికేతుడు గడగడ వణికిపోయాడు. తండ్రి కాళ్ల మీద పడ్డాడు. కాని అప్పటికే అతను యముడి దగ్గరకు చేరు కున్నాడు. అది చూచి ఔద్దాలకుడు తల్లడిల్లి పోయాడు. చేజేతులా కొడుకును చంపుకున్నానని ఏడుస్తున్నాడు.

ఇంతలో రాత్రి గడచి సూర్యోదయము అయింది. ఆ సమయంలో నచికేతుడు కళ్లు తెరిచాడు. ఔద్దాలకుడు ఎంతో సంతోషించాడు. "నాయనా! పుణ్యలోకములకు పోయి మరలా నా కోసం తిరిగివచ్చావా!" అని ఆప్యాయంగా హత్తుకున్నాడు. "తండ్రీ! నీవు నన్ను యముని దగ్గరకు వెళ్ల మన్నావు కదా. అదే ప్రకారము నేను యమ లోకము పోయి యముని కొలువుకూటము ప్రవేశించాను. యముడు నన్ను దగ్గరగా పిలిచి ఉచితాసనము ఇచ్చి గౌరవించాడు. నాకు అర్ఘ్యము పాద్యము ఇచ్చాడు. నేను యముని చూచి "నేను ఇప్పుడు ఏలోకములో ఉన్నాను?" అనిఅడిగాను.

"కుమారా! నిన్ను నీ తండ్రి నన్ను చూడమని పంపాడు. అంతేగాని నీవు చావలేదు.నీకు ఆయుర్దాయము తీరలేదు. నీ కోసం మీ తండ్రి దుఃఖి స్తున్నాడు. నీవు వెంటనే వెళ్లి నీ తండ్రికి కనపడు." అని అన్నాడు యముడు. "అలాగే వెళతాను కానీ ఇక్కడ పుణ్యలోకాలు ఉంటాయట కదా! నాకు చూపించరా" అని యముడిని అడిగాను.

వెంటనే యముడు నా కోసం ఒక రథం తెప్పించాడు. నన్ను తనతో పాటు రథం ఎక్కించుకున్నాడు. నాకు అన్ని పుణ్యలోకములు తిప్పి చూపించాడు. నేను నయనానందకరంగా అన్ని పుణ్యలోకములు దర్శించాను.

అక్కడ దివ్యాభరణములు ధరించి భోగలాలసులుగా తిరుగుతున్న వారిని చూచి "మహాత్మా! వీరు ఎవరు? ఏమిపుణ్యం చేసుకుంటే ఇతంటి భోగములు అనుభవిస్తున్నారు" అని అడిగాను.

"కుమారా! వీరందరూ గోదాన ఫలమును అనుభవిస్తున్నారు." అని చెప్పాడు యముడు.

తరువాత నేను యమునికి నమస్కరించి అక్కడి నుండి వచ్చేసాను" అని అన్నాడు నచికేతుడు." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! గోదానము చేసినవారు ఏలోకంలో నివసిస్తారు! ఆ లోకం ఎక్కడుంది?" అని అడిగాడు.

"ధర్మనందనా! గోదానము చేసిన వారు పొందే లోకంలో కాలము ఉండదు. దినములు, వారములు, నెలలు, ఋతువులు ఉండవు. అలసట,రోగములు, ముసలి తనము, దాహము, ఆకలి ఏమీ ఉండవు. అక్కడ ఉన్నవారు ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటారు. ఆ లోకంలో గోదానము చేసిన వారి తో పాటు గురువులను భక్తితో సేవించినవారూ, ఎల్లప్పుడు సత్యము పలికినవారు, మనస్సును, ఇంద్రియములను నిగ్రహించినవారు, నిర్మలమైన ఆత్మగలవారూ, కూడా అక్కడ ఉంటారు. దానినే గోలోకము అంటారు. గోలోకమును మించిన పుణ్యలోకము వేరొకటి లేదు. గోదానము కంటే మించిన

దానము మరొకటి లేదు.

కాని గోదానము చేయుటకు కావలసిన ధనమును న్యాయమార్గంలో సంపాదించినది అయి ఉండాలి. అంతేగానీ, ఇతరుల సొమ్ముతో దానం చెయ్యకూడదు. కాబట్టి ధర్మనందనా! నీవు కూడా గోవులను అర్హులైన వారికి దానము చేసి పుణ్యలోకముల ప్రాప్తినొందుము." అని భీష్ముడు ధర్మరాజుడు గోదాన మహిమను వర్ణించి నట్టు, వైశంపాయనుడు జనమేజయునికి మహాభారత కథను వినిపించాడు.

మహాభారతము

అనుశాసనిక పర్వము,

ద్వితీయాశ్వాసము సంపూర్ణము.

ఓంతత్సత్ ఓంతత్సత్ ఓంతత్సత్

# మహా భారతము

## అనుశాసనిక పర్వము

### తృతీయాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన మహా భారత కథను నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో సూతి శౌన కాది మహామునులకు వివరిస్తున్నాడు.

ధర్మరాజు అంపశయ్య మీద ఉన్న భీష్ముని ఈ విధంగా ప్రశ్నించాడు.

“ పితామహా! రోజూ మనము ఎన్నో పనులను చేస్తూ ఉంటాము. అందులో శ్రద్ధాభక్తులతో చేయతగ్గ పనులేవి, వివరించండి.” అని అడిగాడు.

“ ధర్మనందనా! నియమ నిష్ఠలను శ్రద్ధతో పాటించాలి. ఇంకా వేదాధ్యయనము, వేదములను అర్థం చేసుకోవడం,

తాను అర్థం చేసుకున్న దానిని ఇతరులకు అర్థం అయేట్లు చెప్పడం, మనస్సును తన అధీనంలో ఉంచుకోవడం, ఇతరుల నుండి ఏ వస్తువూ తీసుకొనకపోవడం, తానే చేసే పనులు అన్ని శ్రద్ధాభక్తులతో చెయ్యడం, ఇంద్రియములను స్వాధీనంలో ఉంచుకోవడం, ఎల్లప్పుడూ సత్యమునే పలకడం, ఎల్లప్పుడూ చదువుకొనడంలోనూ, తనకున్నది పరులకు ఇవ్వడంలోనూ ఆసక్తి కలిగి ఉండటం, బ్రహ్మచర్యము అవలంబించడం, తల్లి తండ్రులకు సేవచెయ్యడం, గురువులకు సేవచెయ్యడం, ఇతరుల మీద దయ కలిగి ఉండటం, గోవులను సంరక్షించడం......పైన చెప్పి పనులన్నీ అత్యంత శ్రద్ధతో ఆచరించ తగినవి." అని చెప్పాడు భీష్ముడు.

" పితామహా! నీవు గోదానము గురించి చెప్పావు కదా? గోవులను ఏ విధంగా దానం ఇవ్వాలి వివరించండి." అని అడిగాడు.

" ధర్మనందనా! ఈ గోదాన విధి గురించి పూర్వము బృహస్పతి మాంధాతకు వివరించాడు. ఒక పుణ్య దినము నందు బ్రాహ్మణుల అనుమతి తీసుకొని, ఆ రోజంతా ఉపవాసము చేసి, గోవులు ఉన్న మంద వద్దకు పోయి, ఒక రోజు ఆ

గోశాలలో ఉండి, మరునాడు సూర్యోదయ సమయమున తాను దానము ఇవ్వదలచిన గోవును పేరుపెట్టి పిలిచి,

( ఆ రోజుల్లో గోవులకు కూడా పేర్లు పెట్టేవారు. అదే సంప్రదాయం ప్రకారం ఈ రోజుల్లో జూలలో జంతువులను కూడా పేర్లు పెట్టి పిలుస్తున్నారు.)

బ్రహ్మ దేవుడు చెప్పినట్టి మంత్రము ఈ విధంగా పఠించుచూ, "ఈ గోవు నా తల్లి, ఈ ఎద్దు నా తండ్రి, ఈ గోవు గర్భము స్వర్గము, ఈ గోవు నిలిచిన ప్రదేశము పుణ్యభూమి" అని పలికి మంచి సారము, సాధు శీలత గల గోవులను, తాను దానము ఇవ్వదలచిన వ్యక్తి చేతిలో నీటి ధారను వదులుతూ దానము ఇవ్వవలెను. అట్టి దానము ఇచ్చిన వానికి శాశ్వత సుఖసంతోషాలు లభిస్తాయి.

ఇంక దానము పుచ్చుకునేవాడు విద్యాభ్యాసము చేసే విద్యార్థి కానీ, వ్రతములు చెయ్యడంలో ఆసక్తి కలిగి ఉన్నవాడు కానీ, ఎలాంటి పాపములు చెయ్యని వాడు కానీ, శాంతచిత్తుడు కానీ, ఇంద్రియ నిగ్రహము కలవాడు కానీ, కోపము లేని వాడు కానీ, అయి ఉండవలెను."

ఇంకా బృహస్పతి మాంధాతతో ఇలా అన్నాడు. " ఓ రాజా! ఇంకా మానవుడు, ఆశ్వయుజ మాసంలో కృష్ణ పక్షంలో, అష్టమి నుంచి మూడు రోజులు గోశాలలో దీక్షలో ఉండి, గోమూత్రము, గోమయము పుచ్చుకుంటే అతనికి కోరిన కోరికలు సిద్ధిస్తాయి." అని బృహస్పతి మాంధాతకు చెప్పాడు.

కాబట్టి ధర్మనందనా! నీవు కూడా పైనియమములు ఆచరించి గోదానములుచెయ్యి. పొద్దునే లేచి కాలకృత్యములు తీర్చుకొని, ఏ ఆహారము తీసుకొన కుండా గోదానము చేస్తే ఎంతో పుణ్యం వస్తుంది. ఇంక నీవు దానము చేసే ఆవులలో కపిల వర్ణము గల ఆవులు దానం చెయ్యడం ఎంతో మంచిది. దాంతో నీ పాపాలన్నీ నశిస్తాయి." అని చెప్పాడు భీష్ముడు.

"ఓ పితామహా! కపిల వర్ణము గల ఆవులకు గల విశిష్ఠత ఏమి తెలుపండి." అని అడిగాడు.

"ధర్మనందనా! పూర్వము దేవతలకు ఆకలి వేసింది. వారందరూ బ్రహ్మదేవుని వద్దకు వెళ్లారు. బ్రహ్మ దేవుడు వారికి అమృతము ఇచ్చాడు. దేవతలు అమృతము సేవించారు. ఆ

అమృతము నుండి వెలువడిన సువాసనల నుండి కామధేనువు పుట్టింది. . కామధేనువుకు మరి కొన్ని ఆవులు జన్మించాయి. ఆ ఆవులన్నీ హిమాలయ పర్వతముల మీద విహరిస్తున్నాయి. ఆ సమయంలో ఒక లేగ దూడ, తల్లి ఆవు దగ్గర పాలు తాగుతూ ఉంది. ఆ పాల నురగ గాలికి ఎగిరి అక్కడే తపస్సు చేసుకుంటున్న శివుని తల మీద పడింది. శివునికి కోపం వచ్చింది. శివుడు మూడో కన్ను తెరిచాడు. ఆ మూడో కన్ను వేడికి ఆ గోవులన్నీ ఎర్రగా అయిపోయాయి. ఆవులన్నీ బెదిరి పోయి తలొక దిక్కుకు పారిపోయాయి.

ఈ సంగతి తెలుసుకొని బ్రహ్మదేవుడు శివుని వద్దకు వచ్చాడు. శివుని పాదాలకు నమస్కారము చేసాడు. "ఓ మహా శివా! నీ తలమీద చంద్రుడు ఉన్నాడు కదా. అతడు నిత్యమూ అమృతము కురిపిస్తుంటాడు కదా. ఇదీ అంతే. లేగ దూడల నోటి నుండి వచ్చిన పాల నురగ అమృతముతో సమానము కదా! ఇది ఎంగిలి ఎలా అవుతుంది. పైగా గోవులు ఇచ్చే పాలు అమృతముతో సమానము. ఆవుపాల మీద నురగ కూడా అమృతమే కదా! దీనికి కోపిస్తే ఎలా! వాటిని కరుణించు!" అని వేడుకున్నాడు.

ఒక మంచి ఎద్దును మహాశివునికి కానుకగా ఇచ్చాడు. శివుడు శాంతించాడు. ఆ ఎద్దును తన వాహనంగా చేసు కున్నాడు. ఆవులను ఆ ప్రాంతంలో తిరగడానికి అనుమతి ఇచ్చాడు. వెంటనే బెదిరిపోయిన ఆవులు అన్ని ఆక్కడకు వచ్చాయి. " ఓ బ్రహ్మదేవా! ఈ గోవులన్నీ నా మూడవ కంటి చూపుతో ఎర్రగా మారి పోయాయి. ఇప్పటినుండి ఎర్రని ఆవులు అతి శ్రేష్టమైనవిగా పరిగణింప బడతాయి" అని వరం ఇచ్చాడు మహాశివుడు. అప్పటి నుండి ఎర్రటి ఆవులు దానంగా ఇవ్వడం ఆనవాయితీగా మారింది." అని అన్నాడు భీష్ముడు.

ఇంకా భీష్ముడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. " ఓ ధర్మ నందనా! ఇక్ష్వాకు కులంలో సౌదాసుడు అనేవాడు జన్మిం చాడు. ఆయన పురోహితుడు వశిష్టుడు. ఒకరోజు సౌదాసుడు వశిష్ఠుని చూచి "మహాత్మా! ఈ లోకంలో పవిత్రమైనదేది?" అని అడిగాడు.

" సౌదాసా! ఈ లోకంలో ఆవు పవిత్రమైనది. ఆవు హవిస్సులకు పుట్టినిల్లు. అన్ని జీవులకూ గోవు ఆధా రము. గోవులు ఉన్నచోట లక్ష్మి నివసిస్తుంది. గోవు ఈ సంసార సాగరమును దాటడానికి పనికివచ్చే పడవ. స్వర్గలోకము

చేరడానికి నిచ్చెన వంటిది. మానవులు తనకున్న గో సంపదలో పదింటిలో ఒక దానిని గోదానంగా ఇవ్వాలి. గోవును పొద్దుటే స్మరించి నమస్కరించడం అధికమైన పుణ్యమును ప్రసాది స్తుంది. ఆవు పేడ, ఆవు పంచితము పవిత్రమైనవి. కాని ఆవు మాంసము తినడం మహాపాపము. మానవులకు చెడ్డ కలలు వచ్చినప్పుడు గోవును స్మరించుకుంటే ఆ పీడ కలల వలన వచ్చే చెడు నివారింపబడుతుంది. ఆవు పేడతో ఇల్లు శుభ్రం చెయ్య డం, ఆవు పంచితమును ఔషధంగా తీసుకోడం మంచిది. బ్రాహ్మణులు గోసంపదను కాపాడుకుంటూ ఉంటారు. గోదానము వలన అనంతమైన సుఖాలు కలుగుతాయి." అని వశిష్టుడు సౌదాసునకు గోవుల గురించి చెప్పాడు.

" ధర్మనందనా! ఒకసారి వ్యాసుని కుమారుడు శుకుడు తండ్రికి మొక్కి ఇలా అడిగాడు. " తండ్రీ! అన్ని వస్తువుల కంటే గొప్పది,యజ్ఞములకు మూలము అయినది ఏది?" అని అడిగాడు.

దానికి వ్యాసుడు ఈ విధంగా చెప్పాడు. " కుమారా! ఏ కాలంలో కూడా గోవుకు సమానమైనది ఈ లోకంలో ఏదీ లేదు. యాగములకు మూలకారణము గోవు. మొదట్లో ఆవులకు

కొమ్ములు లేవు. బ్రహ్మదేవుడు గోవులకు కొమ్ములు సృష్టించాడు. బ్రహ్మదేవుడు మునులతో ఇలా అన్నాడు.

" గోవులు పరమపవిత్రములు. యజ్ఞములకు గోవులు ఎంతో అవసరము. గోవులను చూచినంత మాత్రముననే అన్ని దురితములు తొలగిపోతాయి. ఎవరైతే గోవులను పూజిస్తారో వారు స్వర్గసౌఖ్యములు పొందుతారు.

కుమారా! ఆవు ఓషధులకు నిలయము. గోవు పంచితమును (మూత్రము), ఆవు పాలు, ఆవు నేయి, ఆవు పేడతో కలిపి మూడు దినములు సేవించిన అన్ని రోగములు నశిస్తాయి. తరువాత మూడు దినములు ఉపవాసము చేసి ఆవు గిట్టలతో తొక్కించిన యవలు కాచిన గంజి సేవించాలి. అలా చేస్తే తేజోవంతులవుతారు. దేవతలు ఈ విధంగా సేవించి రాక్షసులను గెలిచారు. ఆవునెయ్యిని సేవించడం వల్ల ఉదాత్తుడవుతాడు. ఆవు నెయ్యిని దానం చెయ్యడం వల్ల ఎంతో పుణ్యం వస్తుంది. ప్రతిరోజూ ఆచమనం చేసి గోవుల మధ్యన గోమతి మంత్రము జపిస్తే అతనికి అంతః శుద్ధి బాహ్యశుద్ధి కలుగుతుంది. పైన చెప్పిన గోమతి మంత్రము అగ్ని కార్యము లోనూ, గోవుల సమక్షములోనూ, బ్రాహ్మణుల ఎదుటా చదివిన

కోరిన కోరికలు సిద్ధిస్తాయి. అందువలన గోవును మించిన వస్తు ఈ మూడులోకములలో లేదు."  అని వ్యాసుడు తన కుమారుడు శుకునికి గోవు మహాత్మ్యము చెప్పాడు. ధర్మనందనా! వింటివి కదా గోమహాత్మ్యము అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

" పితామహా!  మూడులోకములకు బ్రహ్మదేవుడు అధిపతి. బ్రహ్మలోకమును గోలోకము అని అంటారట. ఎందువలన?"  అని అడిగాడు ధర్మరాజు.

" ధర్మనందనా!   పూర్వము విశ్వకర్మ గొప్ప తపస్సు చేసాడు.  అమృత మూర్తి కామరూపిణి అయిన సురభి అనే కన్యను తన మానసపుత్రికగా సృష్టించాడు.  ఆమెతోపాటు మహాతేజోవంతుడయిన ఒక పురుషుని కూడా సృష్టించాడు. ఆ పురుషుడు ఆ కన్యను చూచి మోహించాడు. ఆమె గురించి పరితపిస్తున్నాడు.   అది చూచిన బ్రహ్మ "మార్తోభవ!"  (నీ పరితాపము ఉపశమించును గాక) అని దీవించాడు.  అతనికి మార్తాండుడు అని పేరుపెట్టాడు. అతనికి సురభిని ఇచ్చి వివాహం జరిపించాడు. వారిని చూచి ఇలా అన్నాడు.

“ మీ ఇరువురకూ పుట్టిన సంతానము యాగములకు కావలసిన పాలు,పెరుగు నెయ్యి సమకూరుస్తాయి.” అని అన్నాడు. వారిరువురికీ గోవులు సంతానంగా జన్మించాయి. కాబట్టి ఆ ప్రకారంగా బ్రహ్మదేవుని ఆశీస్సులతో ప్రభవించిన గో సంతతి సమస్త జనులచే పూజింపబడు తున్నాయి. ఆ గోవులు కూడా మానవులకు, దేవతలకు, కోరినవి ఇస్తూ వారిచేత పూజలందుకుంటున్నాయి.” అని చెప్పాడు భీష్ముడు.

“ పితామహా! తమరు మార్తాండుడు, సురభిని వివాహం చేసుకున్నాడని చెప్పారు కదా! మరి వారికి కలిగిన సంతానము గురించి చెప్పండి. మొట్టమొదట వారికి ఎవరు పుట్టారు?” అని అడిగాడు.

“ ధర్మనందనా! మార్తాండునికి సురభికి మొట్టమొదట పదకొండు మంది ఉద్భవించారు. వారే బ్రాహ్మణులకు మూలపురుషులు. వారే ఏకాదశ రుద్రులు. వారి పేర్లు అజపాదుడు, అహిర్బుధ్న్యుడు, త్ర్యంబకుడు, వృషాకపి, శంభుడు, కపాలి, రైవతుడు, హరుడు,బహురూపుడు, ఉగ్రుడు, విశ్వరూపుడు. ఈ ఏకాదశ రుద్రులను లోకమంతా

పూజించారు.

ఏకాదశ రుద్రుల తరువాత గోసమూహము పుట్టింది. ఆ ఆవుల ముఖంలో, నాలుకలో, కొమ్ములలో ఇంద్రుడు; ఆవుల మూత్రద్వారములో, మలద్వారములో వాయుదేవుడు, మూపురంలో శివుడు, పాదాలలో దేవతలు, కడుపులో అగ్నిదేవుడు, ఆవు పాలపొదుగులో సరస్వతీ, ఆవు పేడలో లక్ష్మీదేవి, ఆవుపంచితంలో (మూత్రంలో) కీర్తి, రక్తంలో చంద్రుడు కొలువై ఉన్నారు. గోవు హృదయంలో భగుడు అనే దేవత, పాలలో బ్రహ్మదేవుడు, వెంట్రుకల లో అనుష్ఠానములు, తోకలో యమధర్మరాజు, ఆవు కన్నులలో సూర్యుడు, చర్మములో తపస్సు, తేజమూ అధిష్టాన దేవతలుగా ఉన్నాయి. ఆవు కాళ్లలో ఉన్న కీళ్లలో సిద్ధులు కొలువై ఉన్నారు.

సమస్తదేవతలకు ఆలవాలమైన గోవు మహాత్మ్యము ఏమని వర్ణింపగలము. ఈ సందర్భంలో నీకు ఒక ఇతిహాసము చెపుతాను. విను. త్రిశిఖరము అనే ఒక కొండ ఉండేది. ఆ కొండ ప్రాంతంలో భృగువంశము లో పుట్టిన కొంత మంది మునులు ఆశ్రమములు నిర్మించుకొని తపస్సు చేసుకుంటున్నారు. వారిలో సుమిత్రుడు ఒకడు. ఒక రోజు అంగిరసుడు

అనే బ్రాహ్మణోత్తముడు గోశర్కర అనే తీగను సుమిత్రునికి ఇచ్చాడు. సుమిత్రుడు దానిని తన గోవులకు ఆహారంగా ఇచ్చాడు. ఆ ఓషధిని తిన్న ఆవులు బాగా ఆరోగ్యంగా పెరిగాయి. ఆగోవులకు సంతానము తామర తంపరగా వర్ధిల్లింది. అలా అలా ఆగోసంతతి పెరిగిపోయింది. పెద్ద ఆవుల మంద గా అయింది. సుమిత్రుడు ఆ ఆవుల మందను చూచికొని మురిసిపోయేవాడు. ఆ ఆవు దూడలు తల్లుల పాలు తాగుతుంటే వాటి నుంచి వచ్చే నురగను తాను సేవించేవాడు. కాబట్టి అతనికి ఫేనుడు అనే పేరు వచ్చింది.

ఆ ఆవులకు కామరూప విద్యకూడా ఉంది. ఒక రోజు కొన్ని ఆవులు చక్కటి స్త్రీల రూపము ధరించి సమీప కొలనులో జలకాలాడుతున్నాయి. వాటిని చూచి అక్కడే స్నానం చేస్తున్న కొన్ని గోవులు " మీరు ఎవరు? మీకు ఈ మనుషుల రూపములు ఎలా వచ్చాయి?" అని అడిగాయి. అప్పుడు స్త్రీల రూపములో ఉన్న ఆవులు ఇలా చెప్పాయి. "మేము బ్రాహ్మణులకు సేవ చేస్తాము. యజ్ఞములకు, పితృ కార్యములకు, అతిధిసత్కారములకు, బ్రాహ్మణులకు ఆహారముగా ఉపయోగపడే పాలు ఇస్తాము. బ్రాహ్మణుల పొలములలో పనిచేయుటకు మా పిల్లలను పంపుతాము.

మేము చేసే మంచి పనుల వలన మాకు ఈ కామరూప విద్య సిద్ధించింది. మాకు గోలోక ప్రాప్తికూడా కలుగుతుంది. కాని, మీరు మంచి పనులు చేసే వారిని చూచి అసూయ చెందుతారు. కాబట్టి మీకు మీ దూడలకు దుర్గతి ప్రాప్తిస్తుంది." అని పలికాయి.

మిగిలిన గోవులకు తమ తప్పు తెలిసి వచ్చింది. తమకు తరుణోపాయం చూపమని ఆ కాంతల రూపంలో ఉన్న గోవులను అడిగాయి. దానికి ఆ గోవులు ఇలా అన్నాయి. "రంతిదేవుడు ఒక యజ్ఞం చేస్తున్నాడు. మీరు అక్కడకు వెళ్లండి. ఆయన మిమ్మల్ని ఆ యజ్ఞంలో బలి ఇస్తాడు. మీకు గోలోక ప్రాప్తి కలుగుతుంది." అని పలికాయి. వెంటనే ఆ ఆవులు అన్ని కలిసి రంతిదేవుడి దగ్గరకు పోవడానికి సిద్ధం అయ్యాయి. కాని అందులో ఒక గోవు ఒక సందేహాము వెలిబుచ్చింది. " మనము మన యజమాని సుమిత్రుని అడిగి కదా వెళ్లాలి అని అంది. కొన్ని ఆవులు ఇలా అన్నాయి. సుమిత్రుడు మనము వెళ్లడానికి అనుజ్ఞ ఇవ్వడు. కాబట్టి మనము అతనిని చంపుదాము. అతనుకూడా గోలోకమునకు వస్తాడు." అని అన్నాయి.

కాని కొన్ని ఆవులు సుమిత్రుని చంపలేకపోయాయి. కొన్ని ఎర్రని ఆవులు మాత్రం " సుమిత్రుని మేము చంపుతాము. కాని దానివలన మీరు మాకు ఏమి చేస్తారు." అని అడిగాయి. మిగిలిన ఆవులు ఆ ఎర్రని ఆవులకు ఒక వరం ఇచ్చాయి. " ఈ రోజునుండి అన్ని రంగుల ఆవులలోకి ఎర్ర ఆవులు శ్రేష్టమైనవి గా పరిగణింపబడతాయి." అని వరం ఇచ్చాయి. వెంటనే ఆ ఆవులు మారు రూపములలో తమ యజమాని సుమిత్రుని వద్దకు వెళ్లాయి. " అయ్యా! మీరు ఇప్పటి దాకా గోపూజ చేసారు. మేము ఎంతో సంతోషించాము. మీకు ఏం వరం కావాలో కోరుకోండి." అనిఅడిగాయి. దానికి సుమిత్రుడు "నాకు ఇప్పటి వలెనే ఎప్పటికి కూడా ఆవుల యందు భక్తి, గౌరవము, శ్రద్ధ ఉండేట్టు వరం ఇవ్వండి." అని అడిగాడు. అలాగే అని వరం ఇచ్చాయి ఆ గోవులు. ఇంకా ఇలా అన్నాయి. " ఇంకా మీరు ఈ లోకంలో ఎందుకు. మాతో పాటు గోలోకం రండి." అని అన్నాయి. " నేను నా గోవులను విడిచి పెట్టి ఎక్కడికీ రాను." అని అన్నాడు సుమిత్రుడు.

మారు వేషములలో ఉన్న ఆ ఆవులు అతని శరీరమును తమ కొమ్ములతో పైకి ఎత్తి కిందపడవేసాయి. సుమిత్రుని ప్రాణాలు పోయాయి. అతని శరీరం మాత్రం కిందపడింది.

అతని ఆత్మ గోలోకమునకు వెళ్లింది. అక్కడ ఉన్న గోమాతలు అంగిరసుని ఆదరంగా ఆహ్వానించారు. మర్యాదలు చేసారు. తరువాత జరిగినది అంతా చెప్పారు. ఇది నీకు మేలే చేసింది అని అన్నారు. కాని సుమిత్రుని దారుణంగా చంపిన ఎఱ్ఱ ఆవులకు ముఖం అంతా నల్లగా అవుతుందని శాపం పెట్టాయి.

ఇది ఇలా ఉండగా. భూలోకంలో ఆవులన్నీ రంతి దేవుని వద్దకు వెళ్ళాయి. “ అయ్యా! మమ్ములను ఈ యజ్ఞములో బలి ఇచ్చి మాకు గోలోక వాస ప్రాప్తి కలుగచేయండి.” అని ప్రాధేయపడ్డాయి. “ అది ఎలాగ! ఆవులను చంపి నేను పాపం ఎలా కట్టుకుంటాను. నాకు ఉత్తమ గతులు ఎలా లభిస్తాయి?” అని అన్నాడు. “ అయ్యా! ఇది మా నిర్ణయం కాదు. దేవతల నిర్ణయం. తమరు ఆచరించాలి.” అని అన్నారు. “ అయితే నాది ఒక నిబంధన. మీలో ఎవరో ఒక్క ఆవైనా మోహ వశంతో బలికి ఒప్పుకోకపోతే దానితో నేను యజ్ఞం ఆపేస్తాను.” అని అన్నాడు. గోవులన్నీ సరే అన్నాయి.

రంతిదేవుడు ఆ గోవులను వరసగా బలి ఇచ్చి యజ్ఞంలో హోమం చేసాడు. ఒక ఆవు వంతు వచ్చింది. ఆ ఆవు తన దూడతో ఇలా అంది. “ అయ్యో క్రూరాత్ములు నన్ను చంపడానికి

వస్తున్నారు. నేను చచ్చిపోతే నీ గతి ఏమిటి?" అని ఏడ్చింది. ఆ మాటలు రంతిదేవుడు విన్నాడు. వెంటనే యాగం ఆపు చేసాడు. ఆ ఆవుతో సహా మిగిలిన ఆవులు బతికిపోయాయి. అప్పటిదాకా బలి ఇవ్వబడిన ఆవులు గోలోకమునకు వెళ్లాయి. రంతి దేవుడు స్వర్గమునకు వెళ్లాడు. ఇది గోవుల మహిమ.

ఇంకా నీకు గోవుల గురించి వ్యాసుడు తన కుమారుడు శుకుడికి గో మహిమ గురించి చెప్పిన మాటలు కూడా చెబుతాను విను. "కుమారా! గోవులను బ్రహ్మ మొదటగా సృష్టించాడు. ఈ చరాచరజగత్తుకు మూలాధారము గోవు. దేవతలకు, సిద్ధులకు, సాధ్యులకు గోవు తల్లి వంటిది. బ్రహ్మ పదమును కోరు వాడు ఆవును మనస్సుతో గానీ, వాక్కుతో గానీ, కర్మలతోనూ బాధించకూడదు. ఇది బ్రహ్మవాక్కు. వేదము కూడా గోవుకు పవిత్రతను ఆపాదించింది. ఏ గోవును పూజించి, సేవించి దేవతలు మానవుల కంటే గొప్పవాళ్లయ్యారో ఆ గోవుకంటే పవిత్రమైనది లోకంలో ఏముంటుంది.

యజ్ఞ యాగములలో ఆవు పాలకు ఉన్న విశిష్టత నీకు తెలిసిందే కదా! ఉపనిషత్తులు అన్నీ గోస్వరూపాలే అనే బ్రహ్మదేవుడు చెప్పాడు. గోపూజ పవిత్రమైన యజ్ఞం లాంటిది.

మానవులు ఎక్కువగా కపిల వర్ణం ( ఎరుపురంగు) ఆవులను పూజిస్తారు. దానంగా ఇస్తారు. దానితో వారి పాపాలు అన్నీ తొలగిపోతాయి." అని అన్నాడు వ్యాసుడు.

అప్పుడు శుకుడు తండ్రితో " తండ్రిగారూ! కపిల వర్ణం గోవులకు అంత మహాత్మ్యము ఎలా వచ్చింది?" అని అడిదగాడు. ఒకానొకప్పుడు దేవతల సంఘానికి కనపడకుండా తనను దాచమని అగ్నిదేవుడు గోవులను వేడుకున్నాడు. అలాగే అని గోవులు అగ్ని దేవుని దాచిపెట్టాయి. దేవతలు అగ్ని దేవుని వెదుకుతున్నారు. తుదకు అగ్ని దేవుడు గోవుల వద్ద ఉన్నాడని తెలుసుకున్నారు. " గోవులారా! అగ్ని దేవుని దాచడం లోకములకు మంచిది కాదు. కాబట్టి అగ్నిదేవుడు ఎక్కడ ఉన్నాడో చెప్పండి." అని అడిగారు. గోవులు వారి మాటను మన్నించి అగ్ని దేవుడు దాగి ఉన్న చోటు తెలిపాయి.

అప్పుడు దేవతలు అగ్ని దేవుని చూచి " గోవులకు ఏదైనా వరం ప్రసాదిం చమని అడిగారు. దానికి అగ్ని దేవుడు తాను గోవుల యందు దాగియున్న కారణమున వాటికి ఎర్రటి రంగు వస్తుంది అని వరం ఇచ్చాడు. పైగా ఆవులలో కెల్లా ఎర్రటి ఆవులు శ్రేష్టమైన వనీ, వాటిని పూజించిన ఉత్తమలోకములు

ప్రాప్తిస్తాయని వరం ఇచ్చాడు. ఇంకా కపిల గోవును దానం ఇచ్చిన వాడు, దానం పుచ్చుకున్నవాడు ఇరువురు కూడా పుణ్యలోకములు పొందుతారు. అని వరం ఇచ్చాడు.

అప్పుడు శుకుడు కపిల గోవు లక్షణములను వివరించమని తండ్రిని అడిగాడు. అప్పుడు వ్యాసుడు శుకునితో ఇలా అన్నాడు. " కుమారా! సాధారణంగా కపిల గోవుకు చెవులు, కొమ్ములు, కళ్లు, ముక్కు, కపిల వర్ణములో ఉంటాయి అది చాలు ఆ ఆవు కపిల గోవు అని చెప్పడానికి. అలా కాకుండా పైచెప్పిన స్థానములలో ఏ ఒక్కచోటన్నా ఎర్రగా ఉంటే అదికూడా చాలు ఆ ఆవు కపిలగోవు అనడానికి. అలా కాకుండా శరీరం అంతా కపిల వర్ణంలో ఉంటే ఇంక చెప్ప పనిలేదు. దాని మహిమ చెప్పనలవి కాదు.

కపిల గోవు మీద మీద బరువు వెయ్యరాదు. దానిని హింసించరాదు. దానిని బలికి ఉపయోగించరాదు. కపిల గోవును కాలితే గానీ, చేతితో గానీ, కర్రతో గానీ, కొట్టిన వాడు నరకానికి పోతాడు. కపిల గోవుకు వేళకు మేత, నీరు పెట్టిన వాడు సద్గతి పొందుతాడు. గోవులతో పాటు బ్రాహ్మణులు, గాయత్రీమాత, వసంతకాలము, సత్యము, బంగారము

పుట్టాయని పెద్దలు చెబుతారు. దానము ఇవ్వతగిన వస్తువులలో ఆవులు, బంగారము, భూమి శ్రేష్టమైనవి." అని వ్యాసుడు తన కుమారుడు శుకునికి గోమహిమ గురించి వివరించాడు." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

" పితామహా! గోమయములో ( ఆవు పేడ)లో లక్ష్మీదేవి ఉంటుందంటారు. నిజమేనా!" అని అడిగాడు. దానికి భీష్ముడు ఇలా అన్నాడు.

" ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు గోవులకు లక్ష్మీదేవికి జరిగినసంవాదము గురించి చెబుతాను విను. ఒకసారి లక్ష్మీదేవి ఆవుల మందలోకి వెళ్లింది. ఆవులన్నీ లక్ష్మీ దేవిని చూచి " నీవు ఎవరు? మాలోకి ఎందుకు వచ్చావు?" అని అడిగాయి. "నేను లక్ష్మీదేవిని. మీలో కలిసి ఉందామని వచ్చాను." అని చెప్పింది లక్ష్మీదేవి. " ఓ లక్ష్మీదేవీ! నీవు చాలా చంచలమైన దానికి. మాలో ఉండదగవు!" అని అన్నాయి గోవులు.

ఆ మాటలకు అక్ష్మీదేవి దుఃఖించింది. " ఓ గోవులారా! నేను ఇది వరకు రాక్షసులవద్ద ఉన్నాను. వారి దుష్ప్రవర్తనకు కోపించి వారిని వదిలి దేవతల వద్దకు వెళ్లాను. రాక్షసులు

చెడిపోయారు.  దేవతలు బాగు పడ్డారు. నేను తమ వద్దకు రావాలని మానవులు ఎల్లప్పుడూ నాకు పూజలు చేస్తుంటారు. మీరేమో నేను మీ వద్దకు వస్తానన్నా వద్దంటున్నారు." అని పలికింది లక్ష్మీదేవి.   " నీవు ఎన్ని చెప్పినా  నిలకడ లేని నిన్ను మేము మాలో చేర్చుకొనము. నీ ఇష్టం వచ్చినచోటికి వెళ్లు" అని అన్నాయి.  "  గోవులారా! మీరే నన్ను ఇలా అవమానిస్తే నేను ఎక్కడికి పోను. నన్ను ఎవరు రానిస్తారు. అందుకని నేను మీ వద్దనే ఉంటాను."  అని పలికింది లక్ష్మి.  ఆమాటలకు గోవులు ఇలా అన్నాయి.   " ఓ లక్ష్మీదేవీ! మా మూత్రము, గోమయమూ ( ఆవు పంచితమూ, ఆవు పేడ) పవిత్రములు అని వేదములు చెబుతున్నాయి. నీవు వాటిలో నివసించు." అని అన్నాయి. అలాగే అన్నది లక్ష్మి దేవి.   అప్పటి నుండి  ఆవు పంచితము, ఆవు పేడా లక్ష్మీదేవికి నివాసస్థానాలు అయ్యాయి.

ఒకసారి కామధేనువు తపస్సుచేయగా బ్రహ్మ ప్రత్యక్ష మయ్యాడు. నీకు ఏం వరం కావాలి కోరుకో అని అడిగాడు. " ఓ బ్రహ్మదేవా! నేను కోరిన వెంటనే నా వద్దకు వచ్చారు. అంతకన్నా నాకు కావలసినది ఏమున్నది."  అన్నది కామధేనువు.  ఆ మాటలకు బ్రహ్మదేవుడు సంతోషించాడు. " నీ లోకమయిన గోలోకము అన్ని లోకముల కంటే పైగా ఉండేట్లు వరం

ఇస్తున్నాను. గోలోకము సత్యలోకము కంటే పైన ఉంటుంది." అని పలికాడు. ఓ ధర్మనందనా! గోవుల మహిమ అటువంటిది అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! గోవుల మహాత్మ్యము గురించి తమరు చెప్పారు. కాని సర్వయజ్ఞములలో దానము ఇవ్వదగినది సువర్ణము అని విన్నాను. వేదములలో కూడా సువర్ణ దక్షిణేతిపై అని చెప్పారు కదా. దానము ఇవ్వదగిన వాటిలో భూమి, సువర్ణము, గోవులు శ్రేష్ఠములు అని తమరు కూడా చెప్పారు కదా! మరి సువర్ణము (బంగారము) యొక్క విశేషములు వివరించండి." అని అడిగాడు.

" ధర్మనందనా! మా తండ్రి చని పోయిన తరువాత నేను ఆయనకు శ్రాద్ధవిధులను చేయుటకు గంగా ద్వారమునకు వెళ్లాను. నేను నా తల్లి గంగాదేవి సహాయముతో శ్రాద్ధవిధులను యధావిధిగా నిర్వర్తించాను. పిండ ప్రదాన సమయము వచ్చింది. పిండములు పెట్టుటకు నేల మీద దర్భలు పరిచాను. వాటి మీద నేను పిండము ఉంచు సమయమున ఉంగరములు, కంకణములు కల ఒక చేయి ఆ పిండము కొరకు చేయి చాచింది. ఆ చేతిని నేను నా తండ్రి శంతనునిది గా

గుర్తించాను.

ఆహా! సాక్షాత్తు నా తండ్రి నేను ప్రదానము చేయు పిండము కొరకు తన చేతిని చాచాడు. ఏమి నా అదృష్టము అని మురిసిపోయాను. కాని నా తండ్రి చేతిలో పిండము పెడితే శాస్త్రము ఒప్పుకోదు.  ఎందుకంటే పిండము దర్భల మీద పెట్టవలెనే గానీ నేరుగా చేతిలో పెట్టకూడదు. అది శాస్త్రవిరుద్ధము. అందుకని నేను పిండమును నా తండ్రి చేతిలో పెట్టకుండా నేలమీద పరిచిన దర్భల మీద పెట్టాను.

అంతలో నా తండ్రి చెయ్యి అదృశ్యం అయింది. అక్కడ నా పితృ,పితామహ,ప్రపితామహులందరూ సాక్షాత్కరించారు. “ఓ రాజా! ఏదో నీ తండ్రి చేయి చాచాడు గదా అని పిండము నేరుగా చేతిలో పెట్టకుండా ధర్మము ప్రకారము దర్భల మీదపెట్టావు. ధర్మాన్ని నిలబెట్టావు. మాకు చాలా సంతోషము అయింది. నీ పిండప్రదానముతో మేము తృప్తి చెందాము. అదీ కాకుండా నీవు భూమికి బదులుగా, గోవులకు బదులుగా సువర్ణము దానం గా ఇవ్వడం మాకు ఎంతో హితము చేకూర్చింది.  ఎందుకంటే సువర్ణము పావనమైనది. సువర్ణము ఇచ్చిన వాడిని పుచ్చుకున్నవాడిని పవిత్రులను చేస్తుంది. కాబట్టి

ఇకమీదటనుండి నీవు యజ్ఞ యాగములలో భూదానము, గోదానము బదులు సువర్ణదానముచెయ్యి." అని పలికారు. తరువాత నా పితరులు అంతర్ధానమయ్యారు.

ఓ ధర్మనందనా! ఇది నేను స్వయంగా చూచిన విషయము. నీకు చెప్పాను. అదీ కాకుండా, పరశురాముడు క్షత్రియజాతిని ఇరవై ఒక్కమారులు వెతికి వెతికి చంపాడు. తరువాత ప్రాయశ్చిత్తంగా వాజపేయము అనే యజ్ఞం చేసాడు. కానీ, పరశురామునికి తనివి తీరలేదు. వసిష్టుడు మొదలగు ఋషుల వద్దకు పోయి తాను చేసిన పాపములు పోవడానికి తగిన మార్గము చూపమని అడిగాడు. దానికి వసిష్టుడు ఇలా అన్నాడు. "రామా! సువర్ణము అగ్నితో సమానము. దేవతలు కూడా అగ్నిస్వరూపులు. కాబట్టి సువర్ణము దానం చేస్తే దేవతలను దానం చేసిన ఫలం వస్తుంది అని వేదములు చెబుతున్నాయి. కాబట్తి నీవు కూడా సువర్ణదానము చేసి నీ పాపములు పటాపంచలు చేసుకో.

ఇంకా సువర్ణము గురించి బ్రహ్మదేవుడు పలికిన పలుకులు గురించి చెబుతాను విను. పార్వతీ పరమేశ్వరులు ఒకరి గురించి ఒకరు తపస్సుచేసి తుదకు వివాహం చేసుకున్నారు. వారి

దాంపత్యఫలితంగా మహాశివుని రేతస్సు అగ్ని రూపంలో నిక్షిప్తమయింది. ఆసమయములో తారకాసురుడు అనే రాక్షసుడు దేవతలను మునులను బాధిస్తున్నాడు. దేవతలు మునులు బ్రహ్మదేవుని వద్దకు పోయి తారకాసురుని వలన తాము పడే బాధలు మొరపెట్టుకున్నారు. అప్పుడు బ్రహ్మ వారితో ఇలా అన్నాడు. " దీనికి నేను తగిన ఏర్పాటు చేసాను. మీరు వెళ్లి అగ్నిదేవుని వేడుకోండి." అని అన్నాడు.

దేవతలు మునులు అగ్నిదేవుని వద్దకు పోయారు. వాని అగ్నిదేవుడు వారికి కనపడలేదు. ఒక కప్ప వారితో అగ్నిదేవుడు పాతాళములో ఉన్నాడు అని చెప్పింది. తన ఉనికిని చెప్పిన కప్పకు అగ్నిదేవుడు " ఇప్పటినుండి కప్పల నాలుకకు రుచి తెలియకుండుగాక" అని శాపం పెట్టాడు. కాని దేవతలు, మునులు కప్పలకు ఒక వరం ఇచ్చారు. " ఎండా కాలములో నీరు దొరకక కప్పలు అన్ని చనిపోయినను, వానా కాలములో వర్షము కురవగానే మరలా జీవం పోసుకొని బెక బెక మంటూ అరుస్తాయి." అని వరం ఇచ్చారు.

ఇంతలో అగ్నిదేవుడు దేవతలకు దొరకకుండా పారిపోయాడు. మరలా దేవతలు, మునులు అగ్నిదేవుని

వెదుకుతున్నారు. ఇంతలో ఒక ఏనుగు తన తొండంతో ఒక రావి చెట్టు వంక కన్ను గీటి, అగ్నిదేవుడు అక్కడ ఉన్నాడు అని చూపించింది. దేవతలు మునులు అక్కడకు వెళ్లారు. వెంటనే అగ్నిదేవుడు ఏనుగులకు ఇప్పటి నుండి నాలుక తిరగ బడిపోతుంది అని శాపం పెట్టాడు. తరువాత దేవతలకు కనపడకుండా ఒక జమ్మి చెట్టులో ప్రవేశించాడు. వెంటనే దేవతలు మునులు ఏనుగులను చూచి మీ నాలుకలు తిరగబడ్డా మీరు అన్నిరుచులను చక్కగా గ్రహిస్తారు అని వరం ప్రసాదించారు.

ఇంతలో ఒక చిలుక అగ్నిదేవుడు జమ్మిచెట్టులోపల ఉన్నాడని పలికింది. దేవతలు మునులు అంతా ఒక్కుమ్మడిగా ఆ జమ్మిచెట్టును చుట్టముట్టారు. తన గురించి చెప్పినందుకు చిలకలకు కూడా నాలుక తిరగబడుతుంది అని అగ్నిదేవుడు శాపం పెట్టాడు. వెంటనే దేవతలు, మునులు చిలుకలకు ఒక వరం ఇచ్చారు. చిలుకలకు చక్కటి పలుకులు అలవడతాయి అని వరం ఇచ్చారు.

ఇంక తప్పించుకు పోలేక అగ్ని దేవుడు, దేవతలను మునులను చూచి మీరు వచ్చిన పని ఏమి అని అడిగాడు.

వారందరూ తారకాసురుడు తమను పెట్టు బాధలు తెలిపారు. బ్రహ్మదేవుడు చెప్పిన మాటలను చెప్పారు. తారకాసురుడు చనిపోయే ఉపాయం చెప్పమని అడిగారు. “ ఓ అగ్నిదేవా! నీవు మా క్షేమం కోరితే మేము నీ మహిమను లోకం అంతా తెలిసేట్టు ప్రచారం చేస్తాము. ఆ మాటలకు అగ్నిదేవుడు సరే అన్నాడు. వెంటనే తనలో దేదీప్యమానంగా వెలుగుతున్న మహాశివుని రేతస్సును గంగానదిలో వదిలాడు.

అప్పుడు గంగాదేవి గర్భం దాల్చింది. గంగాదేవి ఆ గర్భాన్ని మోయలేక తన ఒడ్డున ఉన్న రెల్లు పొదలో ఆ గర్భాన్ని నిక్షిప్తం చేసింది. అప్పుడు ఆ రెల్లు పొదలో ఒక బాలుడు పుట్టాడు. ఆరుగురు కృత్తికలు ఆ బిడ్డను పెంచారు. ఈ బిడ్డ నాది అంటే నాది అని అందరూ ఎత్తుకోసాగారు. అప్పుడు ఆ బిడ్డ షణ్ముఖుడై ఆ ఆరుగుగు కృత్తికల స్తన్యముల నుండి పాలు తాగాడు. ఆ ప్రకారంగా ఆ బాలుడు అగ్ని పుత్రుడు, గంగాపుత్రుడు,కార్తికేయుడు అనే పేర్లతో విరాజిల్లాడు. తరువాత ఆ బాలుడు దేవసేనకు అధిపతి అయ్యాడు. శక్తి అనే ఆయుధంతో తారకాసురుని సంహరించాడు. దేవతలకు మునులకు ఆనందం కలిగించాడు.

మహాశివుడు హిరణ్మయుడు. హిరణ్మయుడైన మహాశివుని రేతస్సును ధరించిన అగ్నిదేవుడు కూడా సువర్ణకాంతులతో ప్రకాశించాడు. బంగారము ఆ విధంగా ఏర్పడింది. అందుకే బంగారమునకు జాతరూపము అని పేరు వచ్చింది. బంగారము అంతటి మహిమగలది. సువర్ణదానము అందుకే ప్రశస్తమైనది." అని వసిష్టుడు పరశురామునికి చెప్పాడు. ఆ మాటలు విన్న పరశురాముడు ఎన్నో సువర్ణదానాలు చేసాడు.

కాబట్టి ధర్మనందనా! నీవు కూడా మిక్కుటముగా సువర్ణదానములు చేసి కీర్తిపొందు." అని భీష్ముడు ధర్మరాజుడు సువర్ణదానము మహిమ వివరించాడు.

" పితామహా! నాకు పితృయజ్ఞము గురించి వివరించండి." అని అడిగాడు.

" ధర్మనందనా! దేవతారాధన కంటే పితృదేవతలను ఆరాధించటం ఎంతో గొప్పది. మనుష్యులకు తమ తమ పితృ దేవతలను ఆరాధించడం సర్వశుభములు చేకూరుస్తుంది. ప్రతి అమావాస్యనాడు పితృయజ్ఞము, పిండప్రదానము, భక్తిశ్రద్ధలతో చేసేవాడు, నిత్యము పితృ దేవతలను ఆరాధించిన ఫలితము

పొందుతాడు.

ఇంక పితృయజ్ఞము ఏ తిధియందు చెయ్యాలో వివరిస్తాను. పాడ్యమినాడు పితృదేవతలను పూజిస్తే అతనికి అందమైన భార్యకు భర్త అవుతాడు. విదియనాడు పితృకార్యము చేస్తే అతనికి అందమైన కుమార్తెలు జన్మిస్తారు. తదియ, చవితి తిధులయందు పితృశ్రాద్ధము పెడితే అతను ధనికుడవుతాడు. పంచమి నాడు పితృదేవతలను పూజిస్తే అతను పుత్రవంతు డవుతాడు. షష్టినాడు చేస్తే మంచి విద్యాబుద్ధులు అబ్బుతాయి. సప్తమినాడు చేస్తే వ్యవసాయభూములకు అదిపతి అవుతాడు. అష్టమినాడు చేస్తే వ్యాపారవేత్త అవుతాడు. నవమి, దశమి, ఏకాదశి, ద్వాదశి,త్రయోదశియందు పితృకార్యములు నిర్వహిస్తే వాడికి వరుసగా ఆవుల మందలు, లోహ సంపదలు, మంచి కుమారులు, ధనధాన్యములు లభిస్తాయి. చతుర్దశి నాడు పితృ కార్యము చేస్తే అతనికి వీరస్వర్గము లభిస్తుంది. ఇంక పౌర్ణమి, అమావాస్యరోజులలో శ్రాద్ధకర్మలు నిర్వర్తిస్తే అతనికి కోరిన కోరికలన్నీ నెరవేరుతాయి.

ధర్మజా! శ్రాద్ధ కర్మ చేయుటకు కృష్ణపక్ష తిధులు, అపరాహ్ణము మంచివి. కాని పాడ్యమి, దశమి, చతుర్ధశి పితృ కార్యములకు మంచివికావు. ఇంక పితృకార్యములో తిలలు

(నువ్వులు), పాయసము, నెయ్యి, ఉత్తమము.  ఆవుల నుండి లభించు పాలు, పెరుగు, వెన్న, నెయ్యి అన్నీ శ్రేష్ఠమైనవి. మత్స్యములు, మాంసము తగు విధంగా ఉపయోగిస్తే మంచి ఫలితములను ఇస్తాయి. పితృదేవతల అర్చనలో గొర్రె మాంసము, ఖడ్గమృగము మాంసము, గండమృగము మాంసము, మేక మాంసము ఒకదాని కంటే మరొకటి మేలు అని పెద్దలు చెబుతారు.

పితృకర్మను కృత్తికా నక్షత్రములో చేస్తే అతనికి శతృభయం ఉండదు. రోహిణీ నక్షత్రంలో చేస్తే పుత్రులు కలుగుతారు. మృగశిరా నక్షత్రం లో చేస్తే  ఓజస్సు ప్రాప్తిస్తుంది. ఆరుద్ర నక్షత్రం లో చేస్తే క్రూరుడవుతాడు. పునర్వసు నక్షత్రం లో చేస్తే తాను చేసిన కృషి ఫలిస్తుంది. దేవ గురువు బృహస్పతి(పుష్యమి) నక్షత్రంలో చేస్తే  మంచి పుష్టిగా ఉంటారు.  ఆశ్లేషా నక్షత్రంలో చేస్తే వీరులైన కొడుకులు పుడతారు. మఖా నక్షత్రంలో చేస్తే తన కులము వర్ధిల్లుతుంది. పుబ్బ నక్షత్రంలో చేస్తే సౌభాగ్య వంతులవుతారు.  ఉత్తరా నక్షత్రంలో చేస్తే సంతాన వంతులవుతారు. హస్త నక్షత్రంలో చేస్తే చేసిన పనులు సఫలమవుతాయి.  చిత్రా నక్షత్రంలో చేస్తే అందమైన సంతానం కలుగుతుంది. స్వాతీ నక్షత్రంలో చేస్తే వర్తకవాణిజ్యములు వృద్ధిచెందు

తాయి. విశాఖలో పితృకార్యములు నిర్వర్తిస్తే సత్సంతాన ప్రాప్తి కలుగుతుంది. అనూరాధా నక్షత్రంలో చేస్తే రాజ్యాధికారం దక్కుతుంది. జేష్టానక్షత్రములో చేసే రాజపూజ్యులవుతారు. మూలా నక్షత్రంలో చేస్తే ఆరోగ్య వంతులవుతారు. పూర్వాషాఢా నక్షత్రంలో చేస్తే ఆరోగ్యవంతులవుతారు. ఉత్తరాషాఢా నక్షత్రంలో చేస్తే ఎలాంటి శోకం కూడా తొలగిపోతుంది. శ్రవణానక్షత్రంలో చేస్తే ఉత్తమగతులు సిద్ధిస్తాయి. ధనిష్టలో చేస్తే రాజ్యాధికారము, శతభిషా, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర నక్షత్రములలో చేస్తే కార్యసాఫల్యము, గోసంపద వృద్ధికావడం జరుగుతుంది. రేవతి, అశ్విని,భరణి నక్షత్రములలో చేస్తే లోహములలో అభివృద్ధి, అశ్వ సంపద, ఆయుః ప్రమాణము పెరగడం జరుగుతుంది." అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

" పితామహా! పితృకార్యములలో పూజించుటకు ఎటువంటి యోగ్యతలు కలవారు ఉండవలెను." అని అడిగాడు.

" ధర్మనందనా! దేవతా సంబంధమైన కార్యములకు మంచి బ్రాహ్మణులు దొరికితే చాలు. మరీ పరీక్షగా చూడనవసరం

లేదు. కాని శ్రాద్ధ కర్మలకు మాత్రము యోగ్యులైన బ్రాహ్మణులనే నియమించాలి. శ్రాద్ధకర్మలకు నియోగింపబడే బ్రాహ్మణులు ఎలాంటి దుర్గుణములు లేని వారై ఉండవలెను. అన్ని విద్యలు తెలిసిన వాడై ఉండవలెను. పదిమంది సరసన కూర్చుని భోజనము చేయగల యోగ్యులై ఉండవలెను.

జూదరులు, ఎదుటి వారికి విషప్రాయంగా ఉన్నవాడు, వేదాధ్యయనము చేయనివాడు, ధనము వడ్డీకి ఇచ్చువాడు, పాటలు పాడి జీవించేవాడు, గ్రామాధికారిగా పనిచేస్తూ జీవించేవాడు, ఇళ్లు తగలపెట్టేవాడు, కుష్టురోగి, వ్యాపారి, మద్యము విక్రయించేవాడు, ఖండాంతర ములలో వ్యాపారము చేసేవాడు, రాజుగారి దగ్గర పనిచేసే వాడు, భార్యతో తెగతెంపులు చేసుకొని సంతానమును పంచుకొన్నవాడు, పశువుల కాపరి, శిల్పకారుడు, దొంగతనం చేసేవాడు వీరందరూ పదిమంది సరసనకూర్చుని భోజనము చెయ్యడానికి అనర్హులు. వీరు పితృకార్యములో భోక్తలుగా పనికిరారు.

ఇంక భోజనము చేయునప్పుడు తలపాగా చుట్టుకొని చెప్పులు వేసుకొని భోజనము చేయరాదు. పితృకర్మలకు తయారు చేసిన వంటకములమీద నువ్వులు నీళ్లు చల్లి

శుద్ధిచేయాలి. ఎలాంటి దోషం ఉన్నా పోతుంది.

ఇంక పది మందితో భోజనం చేయతగినవారు..... శాంత చిత్తులు, మంచి గుణము శీలము కలవారు, ఇంద్రియ నిగ్రహము కలవారు, అధ్యాపకుడు, దయగలవాడు, జ్ఞాని అయినవాడు, వ్యాకరణ శాస్త్రములో, ధర్మశాస్త్రములో, పురాణములలో, బ్రహ్మజ్ఞానములో ప్రవీణులు...వీరందరూ పంక్తిభోజనమునకు అర్హులు.

శ్రాద్ధకర్మకు బ్రాహ్మణుని నియోగించక ముందే అతని గుణగణములు పరీక్షించాలి. ఒక సారి నియమించిన తరువాత అతడు అయోగ్యుడు అని తేలితే యజమాని పడేబాధ అంతా ఇంతాకాదు. పైపద్ధతులన్నీ పక్రమంగా పాటిస్తూ శ్రాద్ధకర్మ నిర్వర్తించేవాడికి ఉత్తమగతులు కలుగుతాయి.

ఈ సందర్భంగా నీకు మరొక కథ చెబుతాను. అత్రి మహాముని బ్రహ్మమానస పుత్రుడు. అతని కుమారుడు దత్తాత్రేయుడు. దత్తాత్రేయుని కుమారుడు నిమి. నిమి కుమారుడు శ్రీమంతుడు. శ్రీమంతుడు చనిపోయాడు. నిమి తన కుమారునకు శ్రాద్ధకర్మ నిర్వరిస్తున్నాడు. తన తాత గారైన అత్రి మహామునిని మనసులో తలచుకున్నాడు. అప్పుడు అత్రి

మహా ముని అక్కడకు వచ్చి శ్రాద్ధ కర్మను పర్యవేక్షించాడు. అప్పుడు శ్రాద్ధ కర్మను గురించి అత్రి మహాముని తన మనుమడు నిమికి ఈ విధంగా వివరించాడు.

శ్రాద్ధములో బ్రాహ్మణులుగా కూర్చొనువారు, పంక్తి భోజనమునకు అర్హులై ఉండాలి. బ్రాహ్మణులకు వేసిన దర్భ ఆసనములు కుడివైపుకు తిరిగి ఉండాలి. శ్రాద్ధకర్మలో తిలలు (నువ్వులు) సమృద్ధిగా వాడబడాలి. మంచి దర్భలు సేకరించాలి. దర్భలు పెట్టేటప్పుడు వాటి కొసలు దక్షిణము వైపుగా ఉండాలి. శ్రాద్ధమునకు చేయు వంటకములలో మునగ ఆకు, ఉల్లిపాయ, చెడిపోయిన మాంసము, మలినమైన ఉప్పు అంటే శుభ్రము చేయని ఉప్పు, నల్ల జీలకర్ర, కరివేపాకు, ఇంగువ, వాడరాదు. పూరి పంట ధాన్యము, నేరేడు పండు కూడా శ్రాద్ధమునకు పనికిరావు.

శ్రాద్ధము చేసే ప్రదేశములో కుక్కలు, రజస్వల అయిన స్త్రీలు, వ్యభిచారము చేయువారు, కడజాతి వారు తిరగ కుండా చూడాలి. శ్రాద్ధము జరిగేటప్పుడు తుమ్మడం, ఏడవడం జరగ కూడదు. అంతా ప్రశాంతంగా ఉండాలి. శ్రాద్ధకర్మలలో పైనియమములు విధిగా పాటించాలి.

ఇంకా అత్రి మహాముని నిమితో  పితృదేవతలు గురించి తెలియజేసాడు. బ్రహ్మదేవుడు శ్రాద్ధ కర్మలో అర్యముడికి (సూర్యుడికి), సోముడికి (చంద్రుడికి), అగ్నికి భాగములు ఏర్పరిచాడు. శ్రాద్ధకాలములో పితృదేవతలతో పాటు విశ్వేదేవత లను కూడా అర్చించాలి. వారికి భాగం ఇవ్వాలి.
(  ఈరోజుల్లో కూడా శ్రాద్ధ కర్మలలో విశ్వేదేవతలకు రెండు భాగములు, పితరులైన పితర, పితామహ, ప్రపితామహులకు మూడు భాగములు ఇవ్వడం పరిపాటి.)

ఇంకా దేవతలలో ఊష్మపులైన వారికి కూడా(వారు మొత్తం 60 మంది) పితృదేవతలతో సమానముగా  భాగములు ఏర్పరి చారు.   కొండలలో, అడవులలో ప్రయాణములు చేసేటప్పుడు, నదులు దాటేటప్పుడు శ్రాద్ధం పెట్టవలసి వస్తే,  ఈ అరవై మంది దేవతలను తల్చుకుంటే వారికి శుభం చేకూరుతుంది.

కుమారా! ఒకసారి  కొంతమంది మునులు శ్రాద్ధ కర్మ నిర్వర్తిసున్నారు.  అందరూ ఒకేసారి శ్రాద్ధ కర్మ నిర్వర్తించడం వలన,   ఆ పదార్థములన్నీ పితృదేవతలు   ఒకేసారి మిక్కుటంగా తినడం వలన అజీర్తి చేసింది.  వారు చంద్రుడి దగ్గరకు వెళ్లారు. తమకు అజీర్తి చేసిందని చెప్పారు.   చంద్రుడు వారిని

అగ్ని దేవుని వద్దకు వెళ్ల మన్నాడు. పితృదేవతలందరూ బ్రహ్మ వద్దకు పోయి తమ అజీర్ణ బాధ గురించి చెప్పారు. బ్రహ్మ పక్కనే ఉన్న అగ్నిని చూపించి మీకు వచ్చిన అజీర్ణమును అగ్ని అపహరిస్తాడు అని అన్నాడు. అగ్నిదేవుడు పితృదేవతలను చూచి "ఇప్పటి నుండి మీరు మీ ఆహారములను తీసుకొనే టప్పుడు నా ద్వారా తీసుకొనండి. అప్పుడు మీరు తీసుకొన్న ఆహార పదార్ధములు బాగా జీర్ణమవుతాయి." అని అన్నాడు. అప్పటి నుండి పితృదేవతలు తమ పితృభాగములను అగ్ని ముఖంగా ఆరగించడం ప్రారంభించారు.
(ఇప్పుడు కూడా శ్రాద్ధ కర్మలలో పిండ ప్రదానము అయిన తరువాత ఆ పిండములను అగ్నిలో వేయడం సాంప్రదాయం. కొందరు ఆవులకు పెడతారు. మరి కొందరు బావులలో కానీ చెరువులలో గానీ కలుపుతారు. ఎక్కువమంది అగ్నిలో వేస్తారు.)

కాబట్టి శ్రాద్ధకాలంలో అగ్నిని అర్చించాలి. దాని వలన పితృ దేవతలు కూడా తృప్తి చెందుతారు. అగ్నిదేవుని భయానికి అసురగణము ఆ ఛాయలకు కూడా రారు. (అందుకనే శ్రాద్ధకర్మలలో ముందు విచ్చిన్న ఔపోసనా కార్యక్రమము నిర్వహించడం నేటికీ ఆనవాయితీగా వస్తూ ఉంది.). పితృ, పితామహ, ప్రపితామహులను శిష్టమైన ఆచారముతో, భక్తితో,

శ్రద్ధతో అర్చించాలి. ఆసమయంలో యజ్ఞోపవీతమును అపసవ్యంగా మార్చుకోవాలి (అంటే కుడి బుజం మీద నుండి వేసుకోవాలి.)

చనిపోయిన పితరులకు, పిండ ప్రదానముతో వారి ప్రేత భావన నశిస్తుంది. వారికి మంచి గతులు కలుగుతాయి. చని పోయిన వారికి, వారి కొడుకులలో ఒకడైనా గయలో పిండ ప్రదానము చేస్తాడని ఆశతోనే ఎక్కువమంది పుత్రసంతానము కావాలని కోరుకుంటారు. పితరులకు, కన్యాదానము, నల్లటి ఆంబోతును వదలడం ఎక్కువ ప్రీతి పాత్రములు." అని అత్రిమహాముని నిమికి చెప్పినట్టు శ్రాద్ధ విధిని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

"పితామహా! ఉపవాస వ్రతమును తపస్సు అని అంటారు కదా! దానిగురించి నాకు వివరించండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఆహారం తీసుకోకుండా ఉపవాసం ఉండటం తపస్సు అని పించుకోదు. అలా ఆహారం తీసుకో కుండా ఉండటం ఆత్మను హింసించుకోవడమే అవుతుంది.

అసలు తపస్సు అంటే నిష్ఠతో ఆచరించేది. అవి ఏవంటే సత్యము పలకడం, బ్రహ్మచర్యము, నిత్యము శుచిగా ఉండటం, మౌనంగా ఉండటం (అంటే అనవసరంగా మాట్లాడకపోవడం), నియమ బద్ధంగా జీవితం గడపడం, ఇతరుల మీద దయగలిగి ఉండటం, ఎదుటి వారి మనస్సునుగానీ, శరీరం గాని నొప్పించక పోవడం, తనకు ఉన్నదానిలో దానం చెయ్యడం, వీటిని తపస్సు అంటారు." అని పలికాడు భీష్ముడు.

"పితామహా! ఉన్నదాంట్లో ఇతరులకు దానం చేసేవాడు, ఎవరి వద్దా ఉచితంగా ఏమీ తీసుకొనని వాడు వీరి యొక్క గుణగణములు ఎలాంటివి?" అని అడిగాడు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు సప్తఋషులకు, వృషాదర్భి అనే వానికి జరిగిన సంవాదమును వివరించెదను. వినుము. కశ్యపుడు, అత్రి, విశ్వామిత్రుడు, గౌతముడు, భరద్వాజుడు, జమదగ్ని, వశిష్టుడు వీరు సప్తఋషులు. వశిష్టుడి భార్య అరుంధతి. ఎప్పుడూ భర్త వెంటనే ఉంటుంది. వారందరికీ గండ అనే వనిత పరిచర్యలు చేస్తూ ఉంటుంది. ఆమె భర్త పేరు పశుసఖుడు. అతడు కూడా వారికి పరిచర్యలు చేసేవాడు. ఆ పదిమంది తపస్సు చేయడం లో ఎంతో ఆసక్తిగా

ఉండేవారు.

అలా ఉండగా ఒక సారి భయంకరమైన అనావృష్టి ఏర్పడింది. తినడానికి తిండి కూడా దొరకని పరిస్తితి ఏర్పడింది. జనములకు ప్రాణాల రక్షించుకోవడమే దుర్లభంగా అయింది. ఆ సమయంలో కశ్యపుడు మొదలగు ఋషులు ఆహారం కోసం వెదుకుతున్నారు. శిబిచక్రవర్తి కొడుకు యాజ్యుడు. అతడు తన కొడుకు నీలుడు అనే వాడిని యజ్ఞదక్షిణగా ఋత్విక్కులకు ఇచ్చాడు. ఆ నీలుడు కాలంతీరి చనిపోయాడు. ఆ నీలుని శవమును కాల్చడానికి శ్మశానానికి తీసుకొని వచ్చారు. కట్టెలమీద పెట్టారు.

ఇంతలో ఆకలి మంటతో నక నక లాడు తున్న సప్త ఋషులు, అరుంధతి, వారి పరిచారకులు మొత్తం పది మంది ఆ శవాన్ని చూచారు. ఆకలి తీర్చుకోడానికి ఆ శవాన్ని తిందామని ఆ శవం చుట్టు మూగాచు. ఆ సమయంలో వృషాదర్భి అనే మహారాజు వేటకు పోయి తిరిగి వస్తున్నాడు. ఆ రాజు దాన ధర్మాలు విరివిగా చేసేవాడు. శవాన్ని తినడానికి సన్నద్ధమవు తున్న ఆ మునులను చూచి ఆగాడు. వారితో ఇలా అన్నాడు. “”
“అయ్యో! మీరందరూ ఆకలితో ఉన్నట్టున్నారు. అందుకే శవాన్ని తినడానికి సిద్ధపడ్డారు. నా వెంట రండి మీకు కావలసిన

ఆహారమును సమకూర్చెదను. అంతేకాదు. మీకు ధనము, ధాన్యము భక్తితో ఇస్తాను. గోవులు, బండ్లు, గ్రామములు బహుమతి గా ఇస్తాను." అని అన్నాడు వృషాదర్భుడు. ఆ మాటలు విన్న సప్తఋషులు ఇలా అన్నారు. "ఓ మహారాజా! మేము ఎవరి వద్దా ఏదీ పుచ్చుకొనము. రాజుల వద్ద చేయి జాచి తీసుకుంటే అది మాకు విషము అవుతుంది. నీకు మా గురించి తెలియదు కాబట్టి అలా అంటున్నావు. కానీ మేము ఏమీ తీసుకొనము." అని అన్నారు.

రాజు మనసుకు ఎంతో బాధ కలిగింది. అక్కడి నుండి తన రాజధానికి వెళ్లాడు. కొన్ని కృత్రిమమైన ఫలములను తయారు చేసి వాటిలో బంగారము పెట్టి, వాటిని తీసుకొని పోయి మునులకు ఇవ్వమని తన మంత్రులను పంపాడు. ఆ ప్రకారమే మంత్రులు ఆ ఫలములను తీసుకొని పోయి సప్తఋషులకు ఇచ్చారు. వారు వాటిని ముట్టుకొని అవి బరువుగా ఉండడం గమనించారు. వాటిలో బంగారం ఉందని గ్రహించారు. వాటిని సున్నితంగా తిరస్కరించారు.

ఆ మంత్రులు తిరిగిపోయి రాజుతో ఈ విషయం చెప్పారు. వృషాదర్భునికి కోపం వచ్చింది. వెంటనే ఒక హోమం

చేయించాడు. ఆ హోమం నుండి కృత్తి అనే రాక్షసిని ఆవాహన చేసాడు. హోమం లోనుండి కృత్తి అనే రాక్షసి పుట్టి అతని ఎదురుగా నిలబడింది. “రాజా! నాతో పనియేమి?” అని అడిగింది. “”నీవు వెళ్లి కశ్యపుడు మొదలగు ఋషులను ముక్కలు ముక్కలు గా నరుకు.” అని ఆజ్ఞాపించాడు. ఆ రాక్షసి వెంటనే సప్తఋషులవద్దకు వెళ్లింది.

ఆ సమయంలో సప్తఋషులు అడవులలో కాయలకోసం పండ్లకోసం వెదుకుతున్నారు. ఆ సమయంలో శునస్సఖుడు అనే సన్యాసి వారి వద్దకు వచ్చి వారికి నమస్కరించాడు. అతడు కూడా వారితో కలిసి ఆహారం కోసం తిరుగుతున్నాడు. వారికి ఏమీ దొరక లేదు. కనీసం తామరతూండ్లు అయిన నమలుదామని ఒక కొలను వద్దకు వెళ్లారు.

ఆ సమయంలో కృత్తి అక్కడకు వచ్చింది. వారికి అడ్డంగా నిలబడింది. “నీవు ఎవరు? నీకు ఇక్కడ ఏమి పని? అడ్డు తొలగు.” అని వారు కొలనులోనికి దిగబోయారు. “నేనెవరైన నేమి? నేను ఈ కొలనుకు కావలి ఉన్నాను. మీరు ఈ కొలనులో దిగడానికి వీలు లేదు.” అని పలికింది. “మాకంతా ఆకలిగా ఉంది. తినడానికి ఏమీ దొరక లేదు. ఇదిగో ఈ

కొలను లో ఉన్న తామర తూండ్లను తిని ఆకలి తీర్చుకుం దామని పోతున్నాము."  అని అన్నారు. "అలా అయితే మీరు మీ పేర్లు చెప్పి ఈ తామరకొలనులో ప్రవేశించండి."  అని చెప్పింది.

సప్తఋషులకు విషయం అర్థం అయింది. అది ఒక రాక్షసి అనీ, తమను సంహరించడానికి వచ్చినది అని గ్రహించారు. అడిగింది కాబట్టి తమ తమ పేర్లను వాటి నిర్వచనంతో సహా,  ఎవరికీ అర్థం కాకుండా చెప్పారు. వారు చెప్పిన పేర్లు ఏమీ అర్థం కాకపోవడంతో ఆ కృత్తి దిక్కులు చూస్తూ ఉంది.

ఇంతలో శునస్సఖుడు తన పేరు చక్కగా అర్థం అయేట్టు చెప్పాడు. అది కూడా కృత్తికి అర్థం కాలేదు. "ఏమిటి నీ పేరు కూడా అర్థం లేకుండా చెప్పావు. సరిగా చెప్పు"  అని గద్దించింది. "నా పేరు సరిగా చెప్పినా అర్థం కాలేదని అంటావు ఇది తప్పు కదా! నీకు ఎలా చెప్పినా అర్థం కాదు. ఇదిగో ఈ మంత్రదండం నీకు తగిన బుద్ధిచెబుతుంది."  అని తన దండముతో కృత్తి తల మీద కొట్టాడు. ఆ దెబ్బకు కృత్తి నేలమీద పడి భస్మం అయింది.

తరువాత అందరూ తామర కొలను లో దిగి తామర తూండ్లను తెంపుకొని వచ్చి వాటిని శుభ్రం చేసారు. కొలను పక్కనపెట్టారు. సంధ్యావందనాది కార్యక్రములు పూర్తిచేసుకొన డానికి కొలనులోనికి దిగారు. వారు కొలను బయటకు వచ్చి చూచునప్పటికి ఆ తామర తూండ్లు లేవు. చుట్టు పక్కల చూచారు. ఎక్కడా కనపడలేదు. వారిలో వారికి అనుమానం కలిగింది. శునస్సఖుని మధ్యవర్తిగా పెట్టుకొని ఈ కింది విధంగాశపథం చేయసాగారు.

ముందు అత్రి ఇలా అన్నాడు. "నేను కనక తామర తూండ్లు దొంగిలించి ఉంటే ఆవును తన్నడం వలన, సూర్యుని ఎదురుగా మలమూత్రములు విసర్జించినందు వలన, వేదములు చదవకూడని రోజున వేదాధ్యయనం చెయ్యడం వలన కలిగా పాపములు నాకు కలుగాగాక! అని శపథం చేసాడు.

తరువాత వశిష్టుడు లేచి "ఈ తామర తూండ్లు దొంగిలించినవాడు వేదాధ్యయనము మానిన పాపము, సన్యాసిగా ఉండి కామకలాపములు చేసిన పాపము, కుక్కను

వెంటపెట్టుకొని తిరిగిన పాపము, ఈ పాపముల పోతాడు." అని పలికాడు. " కన్నకూతురిని అమ్ముకొన్న పాపము, శరణు అని వచ్చినానిని రక్షించని పాపము, ఎదుటి వాడిదగ్గర ఏమీ లేదని తెలిసికూడా వాడిని దానం అడగడం మొదలగు పాపములు తామరతూడులు అపహరించిన వాడికి చుట్టుకుంటాయి." అని పలికాడు వశిష్టుడు.

కశ్యపుడు లేచి ఇలా అన్నాడు. "అవసరం లేకున్నా మాంసము తినడం, న్యాయసభలలో ఒకరి పక్షం వహించడం, దుష్టులకు దానం చెయ్యడం, కట్టుకున్న భార్యతో పట్టపగలు రతిచేయడం, విద్యావంతులైన బ్రాహ్మణులను లోభబుద్ధితో ఏడిపించడం, సరకు నంతా ఒకే సారి కొని, తరువాత లాభములకు అమ్ముకోవడం... ఈ తామర తూడులు దొంగిలించిన వాడికి పైన చెప్పిన పాపములు చుట్టుకుంటాయి." అని పలికాడు కశ్యప మహాముని.

తరువాత భరద్వాజుడు లేచి "ఈ తామర తూడులు అపహరించడం ఎటువంటిదంటే జ్ఞాతుల(దాయాదులు) పట్ల గోవుల పట్ల, స్త్రీల పట్ల, ధర్మము విడిచి అతి క్రూరంగా ప్రవర్తించడం లాంటిది. ఇంకా యజ్ఞకుండంలో వేయాల్సిన

హవిస్సును, కంపలలో మండుచున్న అగ్నిలో వెయ్యడం, గురువును కించపరుస్తూ విద్య నేర్వడం లాంటిది కూడా." అని అన్నాడు భరద్వాజుడు.

తరువాత జమదగ్ని లేచి ఇలా అన్నాడు. "ఈ తామర తూండ్ల దొంగతనము ఎలాంటిదంటే.... రజస్వల అయిన భార్యతో సంభోగించడం, తాగే నీటిలో మల మూత్రములు విడవడం, ఎప్పుడూ పగ ప్రతీకారాలతో రగిలిపోతూ ఉండటం, భార్య సంపాదన మీద జీవించడం, ఈ తామర తూండ్లు దొంగిలించడం తో సమానము. ఇతరులను అతిథులుగా ఆదరించడం బదులు, తమలోనే ఒకరి నొకరు అతిథులుగా ఆదరించుకోవడం, అనవసరంగా పగను పెంచుకోవడం, పాడి ఆవును కొట్టడం--వీటికి ఏ పాపం వస్తుందో ఈ తామర తూండ్లు దొంగిలించిన వాడికి అటువంటి పాపము సంక్రమిస్తుంది." అని అన్నాడు.

తరువాత గౌతముడు లేచి "వేదము చదువుకొని కూడా వేదాధ్యయనం చెయ్యకపోవడం, రోజూ అగ్నిహోత్రం చెయ్యడం మానడం, మద్యం విక్రయించడం, వర్ణసంకరం చేసి శూద్రస్త్రీని పెళ్లిచేసుకోవడం, మొదలగు పాపములు ఈ తామర తూండ్ల

దొంగకు సంక్రమిస్తాయి." అని అన్నాడు గౌతముడు.

తరువాత విశ్వామిత్రుడు ఇలా అన్నాడు. "పనికి వచ్చేవారిని వదిలిపెట్టి, పనికిరాని వారిని పనిలో పెట్టుకోవడం, (ప్రతిభాపాటవాలు గాలికొదిలేసి, రిజర్వేషన్ల పేరిట సున్నా మార్కులు వచ్చినా ఇంజనీరింగు మెడికల్ సీట్లు కేటాయించడం, అనర్హులకు ఉద్యోగాలు ప్రమోషన్లు ఇవ్వడం ఇలాంటిదే!), అలా చేసిన అధర్మ వర్తనుడు, కపటుడు అయిన రాజును సేవించడం వంటి పాపములు, ఈ తామర తూండ్ల దొంగతనమునకు సాటి అవుతాయి." అని అన్నాడు.

ఇదంతా విని అరుంధతి నవ్వి ఇలా అంది. "ఎప్పుడూ అత్తగారిని ఆక్షేపించడం, తిట్టడం, భర్త పట్ల అనుచితంగా ప్రవర్తించడం, వండుకున్నది ఎవరికీ పెట్టకుండా తానే తినడం.... ఈ పాపములు అన్నీ ఈ తామర తూండ్లు దొంగిలించిన వాడికి తగులుతాయి." అంది అరుంధతి.

ఇంతలో సేవకురాలు గండ ఇలా అంది. "వంట వండిన తరువాత తానే ముందు తినడం, పని చెయ్యడంలో సోమారిగా, కుటిలంగా ఉండటం, అబద్ధాలు చెప్పడం, కన్నకూతురిని డబ్బుకు అమ్ముకోవడం, మంచి వారికి కీడు చెయ్యడం

మొదలగు పాపములు ఈ తామరతూండ్లు దొంగిలించిన వాడికి తగులుతాయి. అదీ కాకుండా ఈ తామర తూండ్లు దొంగిలించినవాడు వాడి జీవితం అంతా ఒకరికి దాస్యం చేస్తుంటాడు." అని పలికింది గండ.

ఆమె భర్త పశుసఖుడు ఇలా అన్నాడు. "ఈ తామర తూండ్లు దొంగిలించిన వాడికి సంతానం కలగదు. గర్భ దరిద్రుడు అవుతాడు." అని అన్నాడు.

ఇదంతా విన్న శునస్సఖుడు ఇలా అన్నాడు. "ఈ తామరతూడులు ఆ దొంగకు ఇవ్వడం వేదవేదాంగములు చదివిన బ్రాహ్మణోత్తమునికి తన పుత్రికను కన్యాదానం చెయ్యడం లాంటిది." అని అన్నాడు.

ఆ మాటలకు అందరూ ఆశ్చర్యపోయారు. "అదేమిటి నువ్వు ధర్మవచనాలు పలుకుతున్నావు. అంటే ఈ తామర తూడులు నువ్వే దొంగిలించావన్న మాట. ఆకలితో అల్లాడి పోతున్నాము. దయచేసి ఆ తామర తూండ్లు మాకు ఇవ్వు." అని అడిగారు.

అప్పుడు శునస్సఖుడు ఇలా అన్నాడు. "అయ్యా! నిజం చెబుతున్నాను. ఈ తామర తూండ్లు కనపడకపోతే మీరందరూ ఏమనుకుంటారో అని తెలుసుకొనడానికై ఈ తామర తూండ్లను దాచి పెట్టాను. ఇవిగో తీసుకోండి. మీ ఆకలి తీర్చుకోండి." అని దాచి పెట్టిన తామరతూండ్లను తెచ్చి ఇచ్చాడు.

ఇంకా ఇలా అన్నాడు. "మహానుభావులారా! మీమీద కోపించి మిమ్ములను చంపడానికి హోమ గుండం నుండి కృత్తి అనే రాక్షసిని సృష్టించి మీమీదికి పంపాడు వృషాదర్భి మహారాజు. అది తెలిసి నేను ఆ రాక్షసిని చంపాను. ఇంక దాపరికం ఎందుకు. నేను దేవేంద్రుడను. మీరంతా లోభత్వము వదలడం వలన మీకు పుణ్యలోకాలు సిద్ధించాయి. రండి. పుణ్యలోకములకు వెళదాము." అని అన్నాడు దేవేంద్రుడు. సప్తఋషులు, అరుంధతి పుణ్యలోకాలకు వెళ్లారు.

ధర్మనందనా! ఇదంతా వారు ఇతరులు ఇచ్చినది పుచ్చు కొనక పోవడం, లోభం విడిచి పెట్టడం అన్న సద్గుణముల వలన జరిగింది. నీవు కూడా లోభమును విడిచి పెట్టు. ఒకరి సొత్తుకు ఆశపడకు." అని పలికాడు భీష్ముడు.

(ఈకథలో మనకు అనేక రకములైన పాపముల గురించి వివరించారు. కేవలం తామర తూండ్లు దొంగిలించిన దానికి వచ్చే పాపములు గురించి వివరించారు. పైన చెప్పిన వాటిలో చాలా వరకు మనం రోజూ చేస్తూ ఉంటాము. కాని అవి పాపములు అని మనకు తెలియవు. అవి చెయ్యకూడదు అని చెప్పడమే ఈ కథలోని ఆంతర్యము అని నా భావన.).

"పితామహా! పితృకార్యములలో గొడుగులు చెప్పులు దానంగా ఇస్తారు కదా! అలా ఎందుకు ఇస్తారు? వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు సూర్యుడికి జమదగ్నికి జరిగిన సంవాదమును వినిపించెదను. ఒకసారి జమదగ్ని ఆయన భార్య రేణుకాదేవితో కలిసి వినోదంగా తమ ఆశ్రమము వదిలి పెట్టి దూరంగా వెళ్లారు. అప్పుడు జమదగ్ని విల్లు పట్టుకొని ఉన్నాడు. అమ్ముల పొది రేణుక పట్టుకొని ఉంది. ఆరుబయలు ప్రదేశములో జమదగ్ని విల్లుతో బాణాలు వదులుతుంటే రేణుక ఆ బాణములను తీసుకొని విచ్చి ఇస్తూ ఉంది. మధ్యాహ్నం అయింది. సూర్యుడు నడినెత్తి మీదికి వచ్చాడు.

ఒకసారి రేణుక బాణములు తేవడం ఆలస్యం అయింది. జమదగ్ని ఆమెను చూచి "ఇంత ఆలస్యం చేసావేమి?" అని అడిగాడు. "నాథా! ఎండవేడిమి ఎక్కువగా ఉంది. అందుకని కాసేపు ఆ చెట్టునీడననిలబడ్డాను.అందుకని ఆలస్యం అయింది." అని బదులు చెప్పింది రేణుక.

జమదగ్ని కి కోపం వచ్చింది. "ఏమీ ఆ సూర్యుడు తన వేడితో నీకు తాపం కలిగించాడు. ఉండు. సూర్యునికి తగు విధంగా బుద్ధి చెబుతాను. నా బాణములతో సూర్యమండలం కప్పివేస్తాను." అని అన్నాడు.

ఆ మాటలు విన్నాడు సూర్యుడు. బ్రాహ్మణవేషంలో జమదగ్ని వద్దకు వచ్చాడు. "అయ్యా! సూర్యుని మీద కోపం మానండి." అని వేడుకొన్నాడు. "మాట్లాడకు. పక్కకు పో. ఆ సూర్యుని నేలకూలుస్తాను." అని అన్నాడు జమదగ్ని.
" అదేమిటి మునీంద్రా! తాపసులు మీరు కూడా అలా కోపగించు కుంటే ఎలాగ! సూర్యుని తాపం చేత కదా సముద్రములలో జలాలు వేడెక్కి మేఘాలుగా మారి మనకు వర్షరూపంలో మంచి నీరు ఇచ్చేది. దానివలన మనకు ఓషధులు, పంటలుపండుతాయి కదా. మరి సూర్యుడు తాపం

చెందక పోతే ఎలాగా!" అని అన్నాడు.

కాని జమదగ్ని శాంతించలేదు. అప్పుడు సూర్యుడు తన నిజస్వరూపం ధరించాడు.""మునీంద్రా! నేను సూర్యుడను. నా వల్ల ఏమైనా అపరాధం జరిగి ఉంటే మన్నించు." అని వేడుకున్నాడు.

ఆమాటలకు జమదగ్ని ప్రసన్నుడయ్యాడు. వెంటనే సూర్యుడు "గొడుకు చెప్పులు" సృష్టించి అక్కడ పెట్టాడు. "ఓ మహర్షి! ఈ సాధనములు ఇంతకు ముందు లేవు. ఈ గొడుగు వేసుకుంటే సూర్యతాపము సోకదు. ఆ చెప్పులు వేసుకుంటే సూర్యుని వేడికి కాళ్లు కాలవు. ఈ గొడుగులను, చెప్పులను బ్రాహ్మణులకు దానం చేస్తే పుణ్యం వస్తుంది." అని అన్నాడు సూర్యుడు. ఆ వస్తువులను స్వీకరించి జమదగ్ని చాలా సంతోషించాడు.

"ధర్మరాజా! గొడుగు, చెప్పులు సూర్యుని చేత సృష్టించబడ్డాయి. వాటిని దానంగా ఇస్తే పుణ్యలోకాలు లభిస్తాయి." అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! శూద్రుడు ఏ ప్రకారం ప్రవర్తిస్తే ఈ లోకంలో కానీ పరలోకంలో గానీ సుఖాలు పొందుతాడు వివరించండి."

అని అడిగాడు.

"ధర్మనందనా! పూర్వము పరాశరుడు తన శిష్యులకు కొన్ని ధర్మసూక్ష్మములు తెలియ చేసాడు. ఆ వాక్యములు చెబుతాను విను. శూద్రుడైనవాడు ఇంద్రియములను జయించి,అంతః శత్రువులైన కామ, క్రోధ,లోభ,మోహ,మద,మాత్సర్యములను జయించి, గర్వ మును వదిలిపెట్టి, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులముల వారికి భక్తితో శశ్రూషలు చేసినట్లయితే ఈలోకం లోనూ పరలోకం లోనూ సుఖాలు పొందుతాడు.. అలా కాకుండా శూద్రుడు స్వధర్మాన్ని వదిలి వేదాధ్యయనము,తపస్సు చేస్తే, ఈ లోకంలోనే కాదు పరలోకంలో కూడా హీనుడవు తాడు.

బ్రాహ్మణునికి వేదాధ్యయనము, క్ష త్రియునికి బల పరాక్రమములు, వైశ్యునికి వాణిజ్యము, శూద్రునికి సేవకావృత్తి అధికమైన ధనములతో సమానము. ఇవి వేదములు, శాస్త్రములు చూపిన మార్గములు. ఈ మార్గములలో నడిస్తే అందరూ ఉత్తమ గతులు పొందుతారు.అలా కాకుండా స్వధర్మము మాని పరధర్మమును ఆచరిస్తే, అతడికి ఈ లోకంలోనే కాదు పరలోకంలోనూ కూడా దుష్టగతులు కలుగుతాయి.

"ధర్మనందనా! ఇప్పుడు నీకు శౌచము గురించి పరాశరుడు తన శిష్యులకు చెప్పిన విషయములు చెబుతాను.

మానవుని మలమూత్ర విసర్జనకు పగలు ఉత్తర దిక్కు, రాత్రి  దక్షిణ దిక్కు మంచివి. ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలములలో మల మూత్రములు ఉత్తర దిక్కుగా తిరిగి చేయవలెను. మల మూత్రములు విసర్జించిన తరువాత విసర్జకావయవములను బాగా శుభ్రం చేసుకోవాలి. మలద్వారము చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి దానిని సున్నితంగా శుభ్రం చెయ్యాలి. అలా కాకుండా గట్టిగా మంట పుట్టేట్టు తోమితే రోగాలు వస్తాయి.  విసర్జకావయవము లను ఎడమ చేతితో శుభ్రం చేసిన తరువాత, ఎడమ చేతిని కుడి చేతితో శుభ్రంగా కడుక్కోవాలి. చేతులకు మట్టి పూసుకొని రుద్ది రుద్ది శుభ్రంగా కడగాలి. తరువాత పాదము లను శుభ్రంగా కడుక్కోవాలి.

మరొక మాట. మల మూత్రము లను బహిరంగ ప్రదేశము లలో వదలరాదు. దూరంగా చాటుగా వదలాలి. మలమూత్ర విసర్జన తరువాత ఆచమనం చెయ్యాలి. అంటే నురగ లేని శుద్ధమైన నీటిని మూడు మార్లు తీసుకోవాలి. తరువాత నోటిని

తుడుచుకొనాలి. తల మీద నీళ్లు చల్లుకోవాలి. శుభ్రమైన నీటితో కళ్లు, ముక్కు, చెవులు భుజములు, గుండెలు,బొడ్డు తుడుచు కోవాలి. తలమీద నీళ్లతో తుడుచుకోవాలి. ఈ ఆచమనం చేసే టప్పుడు తూర్పుగా కానీ, ఉత్తరముగా కానీ కూర్చుని చెయ్యాలి.

పైన చెప్పిన ప్రకారము మూడు మార్లు నీళ్లు తీసుకోడం వలన ఋగ్యజుస్సామవేదములు సంతోషిస్తాయి. నీటితో నోటిని శుభ్రపరచుకుంటే అధర్వణ వేదం సంతసిస్తుంది.  ఆ విధంగా ధర్మశాస్త్రములు, ఇతిహాసములు,పురాణములు సంతోషిస్తాయి. కాళ్లు కడుగుకొనడం వల్ల పుండరీకాక్షుడు సంతోషిస్తాడు. నీటితో కళ్లు తుడుచుకుంటే సూర్యుడు సంతోషిస్తాడు. ఇది ఆచమన విధి.  ఈ ఆచమనమును ప్రతి ఒక్కరూ వస్త్రములు మార్చుకొనునప్పుడు, జంధ్యములు మార్చుకొనునప్పుడు, అన్నపానముల వేళలో ఆచరించాలి. ఆహారము తిన్న తరువాత, ఆహారపు ముక్కలు పళ్ల మధ్య ఇరుక్కొని నప్పుడు బాగా పుక్కిలించి ఉమ్మివేసి తరువాత  ఆచమనము చేయవలెను. ఈ ఆచమనము అన్ని వర్ణముల వారు చేయతగ్గది.

ధర్మనందనా! ఇంక వర్ణాశ్రమ ధర్మాలు పరాశరుడు ఇలా వివరించాడు. బ్రాహ్మణుడు జపం చెయ్యడం ద్వారా యజ్ఞం

చేస్తాడు. వేదాలను అధ్యయనం చేస్తాడు. అదే అతనికి బతుకుతెరువు. బ్రాహ్మణునికి తపస్సు శోభను చేకూరుస్తుంది. ఇంక క్షత్రియునకు రాజ్యపాలన శోభను చేకూరుస్తుంది. క్షత్రియుడు యజ్ఞయాగములను ప్రారంభిస్తాడు. దండనీతిని అవలంబించడమే అతని జీవనాధారము.  ఇంక వైశ్యుడు నిర్దుష్టమైన హవ్యములను(యజ్ఞమునకు కావలసిన సామగ్రిని) యజ్ఞయాగములకు సమకూరు స్తాడు.  అతనికి వర్తకము, వాణిజ్యము బతుకుతెరువు. వైశ్యుడు అతిధులను సత్కరిస్తాడు. ఇంక శూద్రుడు పరిచర్యలు చెయ్యడమే యజ్ఞంగా భావిస్తాడు. మిగిలిన మూడు వర్ణముల వారికి సేవలు చెయ్యడమే అతని బతుకుతెరువు. అతను తన పనిలో ఎక్కువసామర్థ్యం చూపించి మెప్పు పొందుతాడు.పైచెప్పిన ధర్మములు ఆచరించదగినవి.

యతులు అన్ని వర్ణముల వారికి పూజనీయులు. ప్రియమైన మాటలు పలకడం, శాంతంగా ఉండటం, ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండటం, అలసత్వము లేకుండా ఉండటం, మంచి ప్రవర్తన, నడవడి కలిగి ఉండటం, ఈ సంసారాన్ని దాటడానికి శాయశక్తులా ప్రయత్నించడం, దేనికీ ఆశపడక పోవడం, సన్యాసులకు సేవచేయడం, తనకు కావలసిన వస్తువు లను ధర్మమార్గంలో సంపాదించడం, ఆ ప్రకారంగా జీవితం

గడపడం, అందరికీ పరిచర్యలు చేయడం..... వీటి వలన శూద్రుడు ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖాన్ని పొందుతాడు. శూద్రునకు దానధర్మములు చేయవలసిన అవసరం లేదు. కాని యతుల పట్ల ఆదరము, భక్తి కలిగి ఉండటం వలన వారికి దానధర్మముల ఫలం కలుగుతుంది. దారి తప్పిన బాటసారులను, యతులను కనిపెట్టి వారికి దాహం ఇచ్చి, సేవచెయ్యడం శూద్రుని విధి. యతులకు వ్యాధి వస్తే వైద్యం చేయించడం, వారికి అన్న పానీయములను సమకూర్చి, సేవచెయ్యడం వలన శూద్రునికి పుణ్యలోకములు ప్రాప్తిస్తాయి.

తరువాత పరాశరుడు అన్ని వర్ణముల వారికి వర్తించే ధర్మములు ఈ విధంగా చెప్పాడు. పరుల ధనమునకు ఆశపడకుండా, అందనీ తన వలెనే ఆదరించడం, ఆ లోకంలో ఉన్న అన్ని వస్తువులను నీటిలో పుట్టే తరంగముల మాదిరి చూస్తూ వేటి మీద ఆసక్తి లేకుండా ఉండటం, సాటి ప్రాణుల మీద దయ కలిగి ఉండటం, సాటి వారికి మేలు చేయడం, తాను చేసిన పుణ్యం తనతో వస్తుంది అని నమ్మడం, అందరూ ఆచరించవలసిన ధర్మములు. పొరపాటున తెలియక చెడ్డ పని చేస్తే వెంటనే దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. జీవహింస చేసినప్పుడు దానికి తగిన ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. సాటి మనిషిని

చంపితే వచ్చే పాపం  అనేక సంవత్సరములు భిక్షాటన చేస్తే కానీ తొలగిపోదు.  ఇంక మద్యపానము, గురువుగారి భార్యను కామించడం ఘోరమైన పాపములు. తన ప్రాణములు బలి ఇచ్చినా ఆ పాపములు పోవు. పైవిషయములను తెలుసుకొని పరలోక భీతితో పాప భీతితో దైవ చింతనతో కాలం గడపాలి.  శూద్రునికి కఠినమైన నియమ నిష్ఠలు లేవుకాబట్టి అతడు పైధర్మసూక్ష్మములను గ్రహించి ఉత్తమ లోకములు పొంద వచ్చును.

ఇంకా పరాశరుడు జరుగబోయే కీడు గురించి ముందుగా ఎలా తెలుసుకోవడం గురించి  ఇలా చెప్పసాగాడు. ఎవరైనా ఉత్తర దిక్కున  బంగారు వర్ణంలో ఉన్న మనిషి  దక్షిణ ముఖంగా ఉండటం చూస్తాడో అతనికి మూడు సంవత్సరము లలో మరణం సంభవిస్తుంది అని తెలుసుకోవాలి.  అలాగే సూర్య బింబము తేజో విహీనంగా కనపడితే అతనికి రెండు సంవత్సరములలో మరణం సంభవిస్తుంది అని తెలుసుకోవాలి. ఎవరైనా వెన్నెలలో కనపడ్డ తన నీడలో రంధ్రములు పడటం చూస్తే అతనికి  ఒక సంవత్సరంలో మరణం సంభవిస్తుంది అని తెలుసుకోవాలి. తన నీడ తల లేకుండా కనపడితే ఆరునెలలలో మరణం సంభవిస్తుంది అని తెలుసుకోవాలి. చెవులను చేతు

లతో మూసినప్పుడు ఏ శబ్దమూ వినపడకుంటే అతనికి నెల రోజులలో మరణం సంభవిస్తుంది అని తెలుసుకోవాలి. చెవులు ముక్కు పనిచేయకుండా కళ్లలో జీవం పోయి, వికారంగా కనిపిస్తే అతనికి ఆరోజే మరణం సంభవిస్తుంది అని తెలుసుకోవాలి.

పైన చెప్పిన అరిష్టములు సంభవించినపుడు మనుష్యుడు ధైర్యము కోల్పోరాదు. ముందు జీవితం మీద ఆశను కోరికలను వదిలిపెట్టాలి. మనస్సు నిలకడగా ఉంచుకోవాలి. నిర్మలమైన మనస్సుతో ఏకాగ్రతతో ధ్యానం చెయ్యాలి.  అప్పుడు పరమాత్మ అనుగ్రహం అతనికి లభిస్తుంది.  అటువంటి వాడు మరణించిన తరువాత  మరుజన్మలో  అతని కర్మ ఫలమును బట్టి విప్ర, వైశ్య,క్షత్రియ కులములలో  సంపన్న కుటుంబాలలో జన్మిస్తాడు. మరుజన్మలో కూడా సుఖములు అనుభవించి పరలోకములో కూడా సుఖములు అనుభవిస్తాడు.

ఆ జన్మ ఎత్తినపుడు అతనికి జ్ఞానోదయం కలుగుతుంది. ఈ ప్రపంచంలో ఉన్నవన్నీ అశాశ్వతములు. ఏదీ మనతో రాదు. అన్నిటికి పుట్టుక, నాశము తప్పవు. అలాంటి వాటికి వెంపర్లాడటం ఎందుకు. ఈ సంసారమే దుఃఖమయము. అనంత

దుఃఖము తరువాత కొద్దిపాటి సుఖం కలుగుతుంది. దానికే మనం ఆనందపడి పోతాము. వెంటనే దుఃఖము ముంచు కొస్తుందని తెలుసు కోము. కాబట్టి ఈ సుఖముల మీద మమకారము పెంచు కోవడం వృధా. అని ఆలోచిస్తాడు. ధర్మపరుడై జీవిస్తాడు.

చేసిన పనికి ఫలితం తప్పకుండా వస్తుంది. చెయ్యని పనికి ఫలితం ఉండదు. కర్మఫలము తప్పించుకోడం ఎవరికీ సాధ్యం కాదు  అనే సత్యాన్ని గ్రహిస్తాడు. మంచి కార్యములు చేసినందు వలన కలిగిన పుణ్యమును స్వర్గంలో అనుభవిస్తాడు.  ఆ పుణ్యము క్షీణించిన తరువాత  మంచి జ్ఞానులు ఉన్న కుటుంబంలో పుట్టి  దేవతలను, పితరులను, అతిధులను పూజిస్తాడు. గృహస్థాశ్రమము స్వీకరించి భార్యాపుత్రులతో ఆనందం అనుభవిస్తాడు.

తరువాత వారినందరిని వదిలిపెట్టి అరణ్యములకు పోయి గురువులను సేవిస్తూ సాంఖ్యయోగ రహస్యములను అభ్యసి స్తాడు. తరువాత సన్యాసాశ్రమము స్వీకరిస్తాడు. దేవాలయ ములలో, కొండగుహలలో నివసిస్తాడు. భిక్షాటనతో జీవిస్తాడు. రాగద్వేషములను వదిలిపెడతాడు. సుఖదుఃఖములకు

అతీతుడుగా ఉంటాడు. అహంకారము వదిలిపెట్టి నిత్యము తృప్తిగా జీవిస్తాడు.  ఎవరి అధీనంలోనూ ఉండక, ఉన్నచోట నిలవక, తిరుగుతూ ఉంటాడు.  ఆఖరున అక్షర తత్త్వాన్ని తెలుసుకొని  పరమాత్మలో ఐక్యమైపోతాడు. అలాంటివారు తామే కాదు తమ వెంట ఉన్నవారిని కూడా ఈ సంసార సాగరమును దాటించి మోక్షమార్గం వంక పయనింపజేస్తారు.

అటువంటి సన్యాసులను సేవిస్తే శూద్రులు కూడా తమ పాపములను పటా పంచలు చేసుకొని పరమాత్మలో ఐక్యం అవుతారు. ఇతర వర్ణముల వారికి ఈ సౌలభ్యము లేదు. శూద్రులకు సేవకా వృత్తి ప్రధానము కాబట్టి, వారు పవిత్రులైన సన్యాసులకు సేవచేసి అనాయాసంగా ముక్తిని పొందగలరు. జనులందరికీ మోక్షము పొందాలనే ఆశ ఉంటుంది. కానీ సన్యాసులను సేవించి నందువలన శూద్రులకు సులభంగా మోక్షప్రాప్తి కలుగుతుంది. కాని బ్రాహ్మణ, క్షత్రియ,వైశ్యులు కూడా తమ తమ ఇంద్రియములను నిగ్రహించి నందువలన మోక్షమును పొందగలరు.  ఇంద్రియములను నిగ్రహించి, సన్యాసులను సేవించి పతితులు, పాపులు, వ్యభిచారిణులు కూడా సద్గతి పొందారు.

కాని అన్నిటికీ ముందు తమ తమ పాపపు వర్తన విడిచిపెట్టాలి. సన్మార్గంలో నడవాలి. పాపపు చింతన ఉన్న వాడికి జ్ఞానమార్గము కనపడదు. తరువాత మంచి గురువును ఆశ్రయించాలి. గురువు బోధనలను ఆచరణలో పెట్టాలి. మంచి గురువు దొరికాడు నాకు జ్ఞానోదయం అయింది  కదా అని గర్వించకూడదు. అ లా గర్విస్తే మరలా పాపకూపంలో పడి పోతాడు. అసలు జ్ఞానం కలిగింది అన్న దానికి నిదర్శనం గర్వం లేకుండా ఉండటం. మనిషికి జ్ఞానం పెరిగే కొద్దీ శాంతగుణం అలవడాలి. గర్వం నశించాలి. అప్పుడు గురువులకు సేవ చేస్తూ ముక్తిని పొందగలడు.

మానవుడు తన మనస్సును, పొట్టను, జననాంగమును, కాళ్లను చేతులను, కళ్లను, చెవులను  అదుపులో పెట్టుకోవాలి. (అతిగా ఆలోచిం చడం, అతిగా తినడం,అతిగా సంభోగ క్రియలో పాల్గొనడం మంచిదికాదు. చూడదగనివి చూడటం, వినకూడ నివి వినడం, పోకూడని ప్రదేశములకపోవడం అదుపులో పెట్టుకోవాలి).  పైచెప్పినవి పాటించి యుక్తుడైన వాడికి  పరమాత్మ సాక్షాత్కారం లభిస్తుంది. యుక్తుడు కాని వాడికి పరమాత్మ సాక్షాత్కారం లభించదు. దీనినే సాంఖ్యము అంటారు. ఈ సాంఖ్య మార్గమును మనసులో నిలుపుకొని,

గర్వము, అహంకారము లేకుండా, గురువులను సేవించే వారికి ముక్తి లభిస్తుంది.

సన్యాసాశ్రమము బ్రాహ్మణ, క్షత్రియ, శూద్రులకే పరిమిత మైనది. కాని శూద్రులకు మాత్రము సన్యాసాశ్రమము స్వీకరించిన వారికి సేవచేయడం వలననే మోక్షం లభిస్తుంది. ఏలనంటే, బంగారు కొండ పక్కన ఉంటే కాకి కూడా బంగారు రంగుతో మిలా మిలా మెరుస్తుంది. అలాగే పవిత్రుడైన సన్యాసికి సేవచేస్తే శూద్రునికి కూడా ఆ పవిత్రత సిద్ధిస్తుంది. శూద్రుడు సన్యాసాశ్రమము స్వీక రించి, తపస్సుచేసి పుణ్యము ఆర్జించ వలసిన పనిలేదు." అని పరాశరుడు తన శిష్యులకు గురుసేవ మహాత్మ్యమును గురించి వివరించాడు అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

"పితామహా! మానవులలో కూడా దేవతలు సైతం మొక్క దగిన వారు ఉంటారని విన్నాను. అలాంటి వారు ఎలా ఉంటారు తెలియచెయ్యండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఇదే ప్రశ్న ఒక సారి దేవేంద్రుని రథసారధి అయిన మాతలి దేవేంద్రుని అడిగాడు. దానికి దేవేంద్రుడు

ఇచ్చిన సమాధానము నీకు చెబుతాను విను.

కామము, అర్థము (ధనము) ధర్మమార్గముననే పొందు వారు. స్త్రీలచే కోరదగిన అందమూ, రూపమూ ఉండి కూడా, స్త్రీల పట్ల ఎలాంటి కామ వాంఛలూ,  కోరికలు లేని వారూ, అధిక మైన విద్య, ధనము, ఐశ్వర్యము కలిగి ఉండి కూడా గర్వము లేని వారూ, ఇంద్రియములను జయించిన వారూ, తను వివాహమాడిన భార్యతో తృప్తి పొందెడి వారూ, తపస్సు అనే ధనము మీద ఎక్కువ మమకారము కలిగిన వారూ, ఎల్లప్పుడూ సత్యమునే పలికెడి వారూ, పరమ శౌచులు (ఎక్కువగా పరిశుభ్రంగా ఉండేవారూ), అనవసరమైన పనులు నెత్తిన వేసుకొని సతమతమవని వారూ, సన్యాసము స్వీకరించిన వారూ, వీరందరూ మానవులైనా  దేవతలకు కూడా పూజ నీయులు." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! చెరువులు తవ్వించడంలో గల ధర్మ విశేషము లు తెలపండి అని అడిగాడు. "ధర్మనందనా! తటాకములు (చెరువులు) దేవతలకు, జంతువులకు, ఆశ్రయములు. చెరువులలో ఆవులు నీరు తాగుతాయి. అందువలన ఆ చెరువు తవ్వించిన వాడు పుణ్యలోకములు పొందుతాడు. అదీ కాకుండా చెరువులు తవ్వించిన వాడు ఈ లోకములో కూడా ఐశ్వర్యము

లను కీర్తిని  పొందుతాడు. ఆ చెరువులు నీటితో నిండుగా ఉన్నంత కాలమూ ఆ చెరువు తవ్వించిన వాడికి యజ్ఞములు చేసిన ఫలితం దక్కుతుంది.

అదే చెరువుకు గట్టు మీద చెట్లు నాటితే ఆ చెట్లు పక్షులకు స్థావరంగా ఉంటూ దారిన పోయే వారికి నీడ నిస్తూ ఆ చెట్లు నాటిన వారికి సకల సుఖములు కలుగచేస్తాయి. చెరువులు తవ్వించిన వారి  పితరులు పుణ్య లోకములు పొందుతారు. చెరువులు తవ్వించడం, చెట్టు నాటించడం దేవతలకు, మానవులకు ఎంతో మేలు చేస్తుంది."  అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! గృహస్థ ధర్మాన్ని గురించి వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా!  ఈ విషయంలో భూదేవికి విష్ణుమూర్తికి జరిగిన సంవాదము గురించి చెబుతాను విను.  నీవు నన్ను అడిగిన ప్రశ్న ఒక సారి విష్ణువు భూదేవిని అడిగితే భూదేవి కింది విధంగా జవాబు చెప్పింది. గృహస్థు ప్రతి రోజూ అగ్ని కార్యము చేయాలి. అత్యంత భక్తితో భూత బలి ఇవ్వాలి. (అంటే పశువులకు పక్షులకు ఆహారం పెట్టాలి.). దీని వలన దేవతలు

సంతోషిస్తారు. గృహస్థు ప్రతి దినము తన పితరులకు అన్నము, పాలు, పండ్లు, నీరు నివేదించాలి. వైశ్వదేవము(విశ్వేదేవులకు నివేదించడం) అనే క్రియను తప్పకుండా చెయ్యాలి. తరువాత తన శక్తిమేరకు పేదలకు దానము చెయ్యాలి. పేదబ్రాహ్మణులను వెదికి వారికి బిక్ష వెయ్యాలి. ప్రతిరోజూ అతిధులను సత్కరించాలి. ఏ కారణం చేతనైనా అతిధి దొరక్క పోతే అన్నము తినక ముందు మొదటి ముద్దను అగ్నిహోత్రంలో వెయ్యాలి. తరువాత బంధువులతోనూ మిత్రులతోనూ కలిసి భోజనం చెయ్యాలి.

తరువాత బలి కార్యము నిర్వర్తించాలి. బలి రెండు విధాలుగా చెయ్యాలి. మొదటిది శ్రౌతబలి. ఇది వేదములో చెప్పబడినది. ఈ బలి, ధర్మమునకు, ఓషధులకు, వనములకు, రాక్షసులకు సంబంధించినది. రెండవది స్మార్తబలి. ఇది పశువులకు, పక్షులకు, మొదలగు వాటికి సంబంధించిన బలి. గృహస్థు ఈ రెండు బలులు విధిగా చెయ్యాలి. (క్లుప్తంగా చెప్పాలంటే చెట్టు నాటడం, వాటికి నీరు పొయ్యడం మొదటిది. రెండవది పశుపక్ష్యాదులకు గడ్డి, గింజలు, పండ్లు ఆహారంగా పెట్టడం.) ఇది గృహస్థ ధర్మం. బ్రాహ్మణులు ఈ విధులు నిర్వర్తించి తరువాత భోజనం చెయ్యాలి." అని భూదేవి విష్ణువుతో చెప్పింది." అని భీష్ముడు గృహస్థ ధర్మము గురించి

ధర్మరాజుకు తెలియ చెప్పాడు.”  అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పినట్టు సూతుడు శౌనకాది మహామును లకు మహాభారత కథను వివరించాడు.

మహాభారతము,

అనుశాసనిక పర్వము,

తృతీయాధ్యాయము సంపూర్ణము.

ఓంతత్సత్  ఓంతత్సత్ ఓంతత్సత్

# మహాభారతము

# ఆనుశాసనిక పర్వము

## చతుర్ధాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు చెప్పిన మహాభారత కధను, నైమిశారణ్యంలో సూతి అను పౌరాణికుడు, శౌనకాది మహామునులకు ఈ ప్రకారంగా చెప్పాడు.

అంపశయ్య మీద ఉన్న భీష్ముని ధర్మరాజు ఎన్నో ప్రశ్నలడిగి తన సందేహ ములన్నీ తీర్చుకుంటున్నాడు. ఆ పరంపరలో ఇలా అడిగాడు.

“పితామహా! మానవులు దేవతలను ధూప, దీప, నైవేద్యములతో పూజిస్తారు, ఆరాధిస్తారు కదా! ఆ విశేషముల గురించి వివరించండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! ఇప్పుడు నీవు నన్ను అడిగిన విషయములు, పూర్వము శుక్రుడు రాక్షస రాజైన బలి చక్రవర్తికి, బలి చక్రవర్తి మనువునకు, మనువు సువర్ణుడు అను మహామునికి, ఆ సువర్ణుడు నారదునకు, ఆ నారదుడు నాకు చెప్పారు. ఇప్పుడు నేను నీకు ఆ విశేషములను తెలిపెదను. వినుము.

ఈ భూమి మీద ఓషధులు అత్యుత్తమమైనవి. ఆ ఓషధీ వృక్షములలో పూలు పూసే చెట్లు ఇంకా ఉత్తమమైనవి. ఆ పుష్పములతో దేవతలను పూజిస్తే మానవులకు మంచి మనసు వర్ధిల్లుతుంది. అందుకనే పూలకు సుమనస్సులు అనే పేరు వచ్చింది. పూలతో పూజిస్తే దేవతలు మానవుల కోర్కెలు తీరుస్తారు. కాబట్టి దేవతలకు సుమనస్కులు అని పిలువబడతారు. మంచి సువాసన, మంచి రూపము, తెలుపు వర్ణము కలిగి ముళ్లులేని చెట్లకు పూచిన పూలు దేవతారాధనమునకు మేలైనవి. అటువంటి పూలను దేవతలు ఎంతో ప్రీతితో స్వీకరిస్తారు.

తామరపూలు, జాజిపూలు,తులసీ దళాలు, దేవతలకు ఎక్కువ ఆనం దాన్ని ఇస్తాయి. యక్షులకు నీటిలో పుట్టిన పూలు మహాదానందాన్ని కలుగ జేస్తాయి. ఇంక ముళ్ల చెట్లకు పూసినవి, ఎర్రనివి, ఘాటైన వాసన కల పూలు శత్రువులను చంపడానికి, అధర్వణములో చెప్పబడిన మంత్ర, తాంత్రిక పూజలలో, ప్రయోగములలో వినియోగిస్తారు. ఎక్కువ ఘాటైన వాసన గల పూలు భూత,రాక్షస గణములకు ఎక్కువ ప్రీతిని కలిగిస్తాయి. నలుపు, తెలుపు రంగు కలిగి మంచి పరిమళములను వెదజల్లు పూలను మానవులు ఇష్టపడ తారు.

ఇంక దేవాలయములలోనూ, పితృవనములు అంటే శ్మశానములలోనూ పూసిన పూలను శుభకార్యములకు, స్త్రీలు అలంకారము కొరకు వాడరాదు. పూల వాసనలతో దేవతలు, పూలను చూచినంత మాత్రముననే యక్షులు, పూల వాసనను ఆస్వాదిస్తూ సర్పములు ఆనందం పొందుతాయి. దేవతలను మంచి పూలతో పూజిస్తే వారు సంతోషించి, తృప్తిచెంది, మానవులు కోరిన కోరికలను నెరవేరుస్తారు.

ఇంక ధూపముగురించి చెబుతాను. సల్లకీ అనే చెట్టునుండి తీసిన పొడి తో వచ్చే ధూపము దేవతలకు ప్రీతికరమైనది. ఇంక అగరు, గంధర్వులకు, యక్షులకు, నాగజాతికి ప్రీతికరమైనది. అసలు ఈ ధూపములలో కెల్లా కర్పూరం తో వేసే ధూపము శ్రేష్టమైనది. తియ్యని వాసన వచ్చే ధూపము దేవతలకు, ఘాటైన వాసన వచ్చే ధూపము రాక్షసులకు, కారంగా ఉన్నట్టు అనిపించే అంటే కళ్లు మండే లక్షణముగల ధూపము యక్షులకు ప్రీతికర మైనది. కాబట్టి దేవతలకు ప్రీతికరమైన ధూపములు వేసిన మానవులు పరమపుష్టిని, ఆయుస్సును పొందుతారు. అలాగే యక్షులు, రాక్షసులు, నాగులు మానవులు వేసిన ధూపములతో తృప్తి చెంది, వారు కోరినకోరికలు నెరవేరుస్తారు. మంచి గంధము, అగరు మొదలగు వాటితో వేసిన ధూపములు మానవుల మనసులకు ఆహ్లాదము కలుగజేస్తాయి.

ఇంక దీపారాధన గురించి చెబుతాను. దేవతలను పూజించేటప్పుడు దీపారాధన చెయ్యాలి. దాని వలన అక్కడ ఉన్న భూతములు, రాక్షసులు మొదలగు కుత్సిత జాతులు పారిపోతాయి. దీపారాధన చెయ్యడం అంటే మనసులోని చీకటులు తొలగించడం అన్నమాట. దేవుని గదిలో ముందు దీపం వెలిగిస్తే చీకట్లు తొలగిపోతాయి. అలాగే మన మనసులో ఉన్న చీకట్లు తొలగి ఆ స్థానంలో జ్ఞానం వచ్చి చేరుతుంది. ధర్మచింతన వంక మనసు మరలుతుంది.

ఇంక దీపం వెలిగించడంలో చెయ్యకూడని పనులు చెబుతాను. ప్రమిదలో నెయ్యి తక్కువగా ఉండకూడదు. వత్తి సన్నదిగా ఉండకూడదు. సగం సగం వెలిగించకూడదు. దీపారాధన చేస్తే వెలుగా బాగా రావాలి. చీకట్లు పూర్తిగా తొలగిపోవాలి. ఎవడైనా దేవుని దగ్గరి దీపం దొంగిలిస్తే వాడికి కళ్లు పోతాయి. గుడ్డివాడవుతాడు. ఎవరైనా నలుగురు కూర్చునే చావడిలోనూ, గుడిలోనూ, కొండపైన దీపం బెడితే వాడు ఐశ్వర్యవంతుడవుతాడు.

ఇంక దీపము పెట్టడానికి ఆవునెయ్యి శ్రేష్టమయినది. ఆవు నెయ్యి దొరకక పోతే, బర్రెలు, మేకలు వాటి పాల నుండి వచ్చిన నెయ్యితో దీపం పెట్టవచ్చును. జంతువుల కొవ్వుతోనూ, ఎముకల రసముతోనూ, మాంస రసముతోనూ దీపములు వెలిగించడం మహాపాపము. దీపములను దానం చేసిన వాడికి ఉత్తమ లోకాలు సంప్రాప్తిస్తాయి.

ఇంక నైవేద్యము గురించి చెబుతాను. తయారు చేసిన పదార్థములను ముందు దేవతలకు నివేదించి తరువాత భుజించాలి. దేవతలకు నివేదన చెయ్యకుండా తిన్న తిండి రాక్షస తిండి అవుతుంది. (దేవతలు మనకు అన్నం ఇచ్చారు. ఆ అన్నం వారికి నివేదించకుండా తినడం దొంగతనంతో సమానం అని గీతలో చెప్పబడింది.). అందుకనే ప్రతి మానవుడూ తన ఇంటిలో తినడానికి తయారుచేసుకున్న పదార్థములను ముందు దేవుడికి నివేదించి తరువాత భుజించాలి.

ఈ నివేదనలో నువ్వుల పిండి, పెరుగు, పాలు, మరియు సువాసనగల ద్రవ్యములు, కమ్మటి వాసనవేయు పదార్థములు, దేవతలకు ప్రియాన్ని చేకూరుస్తాయి. ప్రతిరోజూ దేవతలకు నివేదన చేయు వ్యక్తికి అన్నిరకములైన శుభములు కలుగుతాయి. ఇంక ఉరగములకు (నాగులకు), యక్షులకు, అసురులకు, మొదలగు భూతములకు రక్తము, మాంసము కలిసిన పిండములు, మద్యము అమితమైన ప్రీతిని కలిగిస్తాయి. సాత్వికులు సాత్వికాహారమును(సౌమ్య బలి), తామసులు తామస సంబంధమైన ఆహార పదార్థములను(అసౌమ్య బలిని ) వారి వారి ఇష్టదేవతలకు బలి ఇచ్చి వారి వారి కోరికలను విన్నవించుకుంటూ ఉంటారు. ఎవరికి తగ్గ ఫలితములను వారి వారికి ఆ యా దేవతలు ఇస్తూ ఉంటారు."అని పలికాడు భీష్ముడు.

“ పితామహా! పూలు, ధూపము, దీపము, బలి ప్రదానము...వీటిని దేవతలకు అర్పించడం వలన కలిగే ఫలవిశేషములను  గురించి వివరించండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! పూర్వము నహుషమహారాజు ఈ భూమిని పరిపాలి స్తున్నాడు. ఆయనకు తాను రాజును అనే గర్వము లేదు. సత్త్వనిష్ఠతో, దేవతలను, పుష్పములతోనూ, ధూప,దీప,నివేదనలతోనూ అర్చిస్తూ ఉండే వాడు. అలాగే పితృదేవతలను కూడా తగు విధంగా తర్పణాది కార్యములతో అర్చించేవాడు. అలాగే రాక్షసులను, యక్షులను, భూతములను, భుజంగము లను, పూలతోనూ వివిధములైన పూజాద్రవ్యములతోనూ అర్చించేవాడు.  ఈ పూజల ఫలితంగా నహుషుడు దేవేంద్రపదవిని కూడా పొందగలిగాడు. తుదకు నహుషుడు సప్తఋషులు మోసే పల్లకిలో  ఊరేగే అదృష్టమును కూడా పొందాడు.  అయినప్పటికీ అతను తన నిత్యపూజావిధానమును మానలేదు. నహుషుడు బ్రహ్మ సభకు కూడా వెళ్లగలిగేవాడు. ఇదంతా అతని నిత్యపూజా విధానము వలననే కదా!

కాని నహుషుడు చేసిన చిన్న తప్పు వలన (తాను ఇంద్రుడిని అనే గర్వంతో ఇంద్రపత్నిఅయిన శచీదేవిని కామించడం) నహుషుడు ముని శాపానికి గురి అయి భూపతనం చెందాడు. కానీ తన పూజాఫల విశేషము చేతనే  నీ వలన శాప విముక్తి పొందాడు. ఆ విషయం నీకు గుర్తు ఉంది కదా! ధర్మనందనా!  దీప ఆరాధన అత్యంత శ్రేష్టమైనది. దైవ సన్నిధిలో  ఎంత సేపు దీపము వెలుగుతూ ఉంటుందో, అన్ని దేవతా సంవత్సరములు మానవులు సుఖసంతోషాలతో జీవిస్తాడు. స్వర్గలోక ప్రాప్తికూడా పొందుతాడు.” అని పలికాడు భీష్ముడు.

"పితామహా! నాదొక చిన్న సందేహము. బ్రాహ్మణుని ధనమును హరించిన వాడు ఏ గతి పొందుతాడు." వివరించండి అని అడిగాడు.

"ధర్మనందనా! మానవులు ఈ లోకంలో చేసే పాపాలన్నిటిలోనూ బ్రాహ్మణుని ధనము దొంగిలించడం మహా చెడ్డది. బ్రాహ్మణుని ధనమును హరించిన వాడి కులము సర్వనాశనము అవడం తథ్యము. వాడు మరుజన్మలో నీచకులంలో జన్మిస్తాడు. పూర్వము క్షత్రబంధు అనే రాజు ఉండేవాడు. అతడు ఒకరోజు రాజ్యపర్యటన చేస్తున్నాడు. ఒక ఊరి బయట ఒక కడజాతి వాడు వెళుతున్నాడు. పక్కనే ఉన్న ఒక బ్రాహ్మణుని పొలములో నుండి ధాన్యపు గింజలు గాలికి ఎగురుతూ ఉన్నాయి. ఆ కడజాతి వాడు నేర్పుగా ఆ ధాన్యపు గింజలు తన మీద పడకుండా వెళుతున్నాడు.

రాజు అది చూచాడు. అతనిని పిలిచి ఇలా అడిగాడు. "నీవు ఎందుకు ఆ ధాన్యపు గింజలు నీ మీద పడకుండా తప్పుకుంటూ వెళుతున్నావు." అని అడిగాడు. "అయ్యా! పూర్వజన్మలో నేను ఒక బ్రాహ్మణ కుమారుడిని. బ్రహ్మచర్య వ్రతమును నిష్ఠతో ఆచరిస్తూ ఉన్నాను. ఒక రోజు భిక్షాటన చేసి భిక్ష తెచ్చు కున్నాను. ఒక నది ఒడ్డున ఆ భిక్షను తినడానికి కూర్చున్నాను. ఆ పక్కనే ఒక బ్రాహ్మణుని పొలము ఉంది. గాలి బలంగా వీచడం వలన ఆ బ్రాహ్మణుని పొలంలో ఉన్న ధూళి వచ్చి నేను తినబోయే అన్నమీద దట్టంగా పడింది. ఆవిషయం తెలియని నేను ఆ ధూళితో కూడిన అన్నము తిన్నాను. ఆ ప్రకారంగా బ్రాహ్మణుని చెందిన పొలంలో ఉన్నధూళిని నేను తిన్న కారణంగా ఈ జన్మలో కడజాతి వాడిగా పుట్టాను. నేను పూర్వజన్మలో చేసుకున్న పుణ్యం కారణంగా నాకు పూర్వజన్మస్మృతి ఉన్నది.

నిన్న రాత్రి నాకు ఒక కల వచ్చింది. ఆకలలో నాకు ఒక బ్రాహ్మణుడు

కనిపించి "నీకు కలిగిన ఈ కష్టము రేపు క్షత్రబంధు అనే రాజుతో చేయబోయే సంవాదంతో తొలగిపోతుంది." అని చెప్పాడు. ఆ స్వప్నఫలితంగానే మీరు కనిపించారు." అని చెప్పాడు. తరువాత ఆ కడజాతి వాడు మరణించి ఉత్తమ గతులు పొందాడు." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

( ఈ కథ మనకు కొంచెం అతిశయోక్తిగా కనిపించినా, అంతరార్థం మాత్రం స్పష్టంగా ఉంది. ఒక్క బ్రాహ్మణుల ధనము, ఆస్తి అనే కాదు ఎవరి ధనమైనా దొంగిలించడం, అన్యాయంగా అపహరించడం పాపహేతువు అని తెలుసుకోవాలి. వెంటనే కాకపోయినా కాలక్రమేణా ఆ పాపము మనకు కట్టికుడుపుతుంది. మనకు వచ్చిన కష్టములు మనకు ఎందుకు వచ్చాయో మనకు తెలియదు. ఎందుకంటే మనకు పూర్వజన్మ స్మృతి లేదు. కాని మనకు దైనందిన జీవితంలో కలిగే కష్టాలు, దుఃఖాలు, అకాల మరణాలూ, ప్రమాదాలూ, నయంకాని జబ్బులూ, అమృతాంజనం పూసుకుంటే పోయే తలనొప్పికి, డాక్టర్లు బ్రైన్ స్కాన్ చేసి వేలు లక్షలు ఖర్చుచేయించి తుదకు ఏమీ లేదు అని చెప్పడం, మనం రోడ్డుపక్కగా పేవ్ మెంటు మీదపోతున్నా, రోడ్డు మీద పోయే వాహనం దూసుకువచ్చి, మనకు గుద్ది కాలు విరగడం, లక్షలు కర్చుకావడం అంతా పూర్వజన్మ లోనూ, ఈ జన్మలోనూ మనం చేసిన పాపాల ఫలితమే. మనం పక్కవాడి దగ్గర నుండి పదిరూపాయలు అపహరిస్తే మనకు పదివేలు ఖర్చు అవుతుంది. కాని ఆవిషయం మనకు తెలియదు. మనకు పూర్వజన్మ స్పృహ లేదు కాబట్టి మనం నమ్మం. అలా నమ్మగలిగితే ఒకరి సొత్తు అపహరించ కుండా, పరులకు అపకారము చెయ్యకుండా మనమూ ప్రశాంతంగా జీవిస్తాము. అదే ఈ కథ అంతరార్థం అని నా భావన.)

" పితామహా! స్వర్గలోకము అని అంటారు కదా! అక్కడ సుఖ సంతోషాలు ఒకే విధంగా ఉంటాయా లేక వివిధ రకాలైన సుఖసంతోషాలు ఉంటాయా

వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా!పుణ్యకర్మలు అనేక విధములుగా ఉంటాయి కదా! అలాగే ఒక్కొక్కరకమైన పుణ్య కర్మకు ఒక్కొక్క రకమైన స్వర్గ సుఖము దొరుకుతుంది. ఒక మాటలో చెప్పాలంటే స్వర్గంలో సుఖమే కాని దుఃఖము మచ్చుకైనా కనపడదు. ఈ విషయంలో నీకు గౌతమునికి దేవేంద్రునికి మధ్య జరిగిన సంవాదమును వినిపిస్తాను విను.

గౌతముడు అనే బ్రాహ్మణుడు ఒక వనములో తపస్సు చేసుకుంటు న్నాడు. ఒకరోజు అతనికి తల్లిలేని ఏనుగు పిల్ల కనపడింది. గౌతముడు ఆ ఏనుగు పిల్లను తెచ్చుకొని తానే దానికి తల్లి తండ్రి అయి పెంచాడు. కాల క్రమేణా ఆ ఏనుగు పిల్ల పెద్ద ఏనుగు అయింది. ఒకనాడు దేవేంద్రుడు ఆ రాజ్యమును ఏలుతున్న రాజు వేషంలో గౌతముని వద్దకు వచ్చాడు. ఆ ఏనుగును తనకు ఇమ్మని అడిగాడు. "రాజా! నేను దీనిని నా కన్నకొడుకు వలె పెంచుకున్నాను. ఇది రోజూ నాకు సేవ చేస్తుంది. నాకు సమిధలు తెచ్చి ఇస్తుంది. నేను లేనిసమయంలో పర్ణశాలను కాపాడుతూ ఉంటుంది. కాబట్టి ఈ ఏనుగును నేను నీకు ఈయలేను." అని చెప్పాడు.

దేవేంద్రుడికి కోపం వచ్చింది. "గౌతమా! నీవు తపస్సు చేసుకొనే వాడివి. నీకు ఏనుగులు ఎందుకు? నీకు ఆవులుకావాలి. అవి నేను నీకు లెక్కకు మించి ఇస్తాను. అదీ కాకుండా నీకు కావలసినంత బంగారము కూడా ఇస్తాను. నాకు ఈ ఏనుగును ఇవ్వు." అని అడిగాడు. గౌతముడు ఒప్పుకోలేదు. "అయ్యా! ఈ ఏనుగు తల్లిలేని పిల్లగా నా వద్దకు వచ్చింది. నేను దీనికి తల్లిని అయి పెంచాను. దీని మీద నాకు ఉన్న ప్రేమకు వెల కట్టలేను కదా! కాబట్టి నీవు నాకు పదివేల గోవులు ఇచ్చినా, కోటి బంగారు నాణములు ఇచ్చినా ఈ ఏనుగును

నీకు ఇవ్వను" అని ఖచ్చితంగా చెప్పాడు గౌతముడు.

"గౌతమా! ఏనుగులు రాజులకు వాహనములు. ఇది నాకు వాహనంగా కావాలి. దీనిని బలవంతంగా తీసుకు వెళ్లడం నాకు అంత కష్టమైన పనేమీ కాదు. కాబట్టి నీవు ఇష్టపూర్వకంగానే నాకు ఈ ఏనుగును ఇవ్వు."అని అన్నాడు. దానికి గౌతముడు ఇలా బదులుచెప్పాడు.

"రాజా! పుణ్యకార్యములు చేసిన వారికి సుఖములు, పాప కార్యములు చేసిన వారికి శోకము కలుగు చోటు ఒకటి ఉంది. అదే యమసభ. అక్కడికి వస్తే నేను నీకు ఈ ఏనుగును ఇస్తాను." అని అన్నాడు. ఆ మాటలకు రాజు వేషంలో ఉన్న దేవేంద్రుడు నవ్వాడు. "గౌతమా! యమలోకము పాపములు చేసిన వారు, నాస్తికులు, పోయే చోటు. అక్కడకు నేను ఎలా వస్తాను." అని అన్నాడు.

"అదేమిటి రాజా! యముడు పుణ్యాత్ముడు కదా! అక్కడకు రానంటా వేమిటి? మర్యాదగా ఉంటుందా!" అని అన్నాడు. "అదికాదయ్యా! యముడు తన తల్లి తండ్రులను, అక్కను భక్తితో పూజిస్తాడు. అందుకని పుణ్యాత్మ డయ్యాడు. అక్కడకు నేను రాను." అని అన్నాడు.

" సరేలే పోనీ. గంగా నది ఒడ్డుకు రా అక్కడ నేను నీకు ఈ ఏనుగును ఇస్తాను." అని అన్నాడు గౌతముడు. "గౌతమా! గంగానదీ తీరాన అతిథులను సత్కరించిన తరువాత భోజనము చేసేవారూ, పరుల వద్దనుండి ఏమీ పుచ్చు కొనని వారూ ఉంటారు. నేను అక్కడకు ఎలా వస్తాను." అని అన్నాడు.

"పోనీ, మేరు పర్వతము వద్ద ఉన్న వనమునకు రా! అక్కడ ఏనుగును ఇస్తాను." అని అన్నాడు. "అదేమిటయ్యా! అక్కడ మృదువుగా మాట్లాడేవాళ్లు,

ఎల్లప్పుడూ సత్యం చెప్పేవాళ్లు, అందరి మీద దయతో ఉండే వాళ్లు, సర్వభూతముల యందు ప్రేమగలవారూ ఉంటారు. అక్కడు నేను ఎలా వస్తాను? ఇదంతా కాదు కానీ ఒక మంచి చోటు చెప్పు అక్కడకు వస్తాను." అని అన్నాడు రాజు వేషంలో ఉన్న దేవేంద్రుడు.

"అయితే నారదుడు విహరించే వనము ఒకటి ఉండి అక్కడకు వస్తే నీకు ఏనుగును ఇస్తాను." అని అన్నాడు. "బాగుంది. అక్కడ సంగీత నృత్య కళా కోవిదులు ఉంటారు. నారదుడు వారితో వినోదిస్తూ ఉంటాడు. అక్కడకు నేను రాను." అని అన్నాడు.

"పోనీ ఉత్తరకురుభూముల వద్దకురా! అక్కడ దేవతలు విహరిస్తూ ఉంటారు. దేవేంద్రుడు అక్కడకు వచ్చి దేవతల కోరికలు తీరుస్తూ ఉంటాడు. అక్కడ నీకు ఏనుగును ఇస్తాను." అని అన్నాడు గౌతముడు. "అది కూడా కుదరదయ్యా! ఎందుకంటే అక్కడకు కామము, హింస విడిచిపెట్టినవారు వస్తారు. ఆ చోటికి రావడం నా తరం కాదు." అని అన్నాడు రాజు.

" ఇదంతా కాదు గానీ చంద్రుడి ఇంటికా రా అక్కడ ఇస్తాను." అని అన్నాడు గౌతముడు. "అదీ కుదరదు లే. ఎందుకంటే అక్కడికి ఎప్పుడూ దానం చేసేవారు, మరొకరి వద్దనుండి దానం పుచ్చుకొననివారూ, అక్కడకు వస్తుంటారు. దానం తీసుకోడానికి అక్కడకు ఎలా వస్తాను." అని అన్నాడు రాజు.

"పోనీ సూర్యలోకమునకు వస్తావా!" అని అడిగాడు గౌతముడు.

" మంచి తపస్సు, స్వాధ్యాయము చేసేవారు వచ్చేచోటు అది. అక్కడకు

నేను రాను." అని అన్నాడు రాజు.

"పోనీ వరుణలోకానికి రా అక్కడ ఇస్తాను." అని అన్నాడు గౌతముడు. "అక్కడకు యజ్ఞములు, యాగములు, నిత్యాగ్నిహోత్రము చేసే వారు వస్తారు. నేను రాను." అని అన్నాడు.

"పోనీ ఇంద్రుడి దగ్గరకా రా అక్కడ ఇస్తాను." అని అన్నాడు గౌతముడు. "అమ్మో అక్కడకు యుద్ధములో చనిపోయిన వీరులు, యజ్ఞములు చేసిన సోమ యాజులు, నూరేండ్లు జీవించిన మానవులు, అక్కడకు పోతారు. అక్కడకు నేను రాను." అని అన్నాడు రాజు.

" పోనీ ప్రజాపతి లోకానికి రా అక్కడ ఇస్తాను." అని అన్నాడు గౌతముడు. "అక్కడకు అశ్వమేధ యాగము చేసిన వాళ్లు వస్తుంటారు. నేనురాను." అని అన్నాడు రాజు.

"పోనీ గోలోకమునకు రా అక్కడ మోహము, శోకము మచ్చుకైనా ఉండవు. అక్కడ ఇస్తాను." అని అన్నాడు గౌతముడు. "అక్కడకు గోదానము చేసిన వారూ, తీర్థయాత్రలు సేవించినవారూ, నిరంతరము బ్రహ్మచర్యము అవలంబించేవారూ, అచ్చటికి వస్తారు. నేను ఎలా రాను." అని అన్నాడు.

" రాజా! శీతోష్ణములు,సుఖదుఃఖములు, మిత్రులు శత్రులు, లేని ద్వంద్వములకు అతీతమైన బ్రహ్మలోకమునకు రా! అక్కడ ఏనుగును ఇస్తాను." అని అన్నాడు. "అదీ కుదరదులే! ఎందుకంటే అక్కడకు సంగత్వము వదిలిన వారూ, ఆత్మజ్ఞానము పొందినవారూ, ఎల్లప్పుడు వ్రతములు చేయడంలో ఆసక్తికలవారూ, అధ్యాత్మవిద్యయందు నిష్టకలవారూ, అక్కడకు వస్తుంటారు.

నేను ఎలారాను." అని అన్నాడు రాజు.

" మహాత్మా! మీరు సామాన్యులు గారు. సాక్షాత్తూ దేవేంద్రులు. లేని యడల సకల లోకముల గురించి తెలియడం పరులకు సాధ్యమా! దేవేంద్రా! నీవు అన్ని లోకములు తిరుగుతుంటావు కదా. నీకు వెళ్లకూడని ప్రదేశము ఏది ఉంది?" అని అన్నాడు గౌతముడు.

ఆ మాటలకు సంతోషించిన దేవేంద్రుడు "మహాత్మా! నీకు ఏంకావాలో కోరుకో!" అని అన్నాడు. "దేవేంద్రా! నేను ఈ ఏనుగును నా బిడ్డ మాదిరి పెంచుకున్నాను. దీనిని నా వద్దనే ఉండనీ." అని వేడుకున్నాడు. "గౌతమా! ఆమాత్రం నాకు తెలియదా! ఆ ఏనుగు చూడు ప్రేమతో తన తొండంతో నీ తలమీద తడుముతూ వాసన చూస్తూ ఉంది. నిన్ను నీ బిడ్డను నేను ఎలా వేరు చేస్తాను చెప్పు. పైగా మారువేషంలో ఉన్న నన్ను దేవతలు కూడా గుర్తుపట్టలేరు. కానీ నీపూర్వపుణ్యవశమున నన్ను గుర్తుపట్టగలిగావు. నీకూ నీ ఏనుగుకూ స్వర్గలోక ప్రాప్తి కలిగిస్తున్నాను. మీరిరువురూ శాశ్వతంగా స్వర్గలోకంలో ఉండండి." అని స్వర్గలోకానికి ఆహ్వానించాడు. ఆ ఆహ్వానాన్ని మన్నించాడు గౌతముడు. గౌతముడు తన ఏనుగుతోస్వర్గలోకానికి వెళ్లాడు. ధర్మనందనా! ఇదీ స్వర్గలోకసుఖము గురించిన కథ." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

"పితామహా! మీరు తపోధర్మము గురించి చెప్పారు కదా! తపోధర్మము కన్నా మించిన ధర్మము మరొకటి లేదా!" అని అడిగాడు.

"ధర్మనందనా! ధర్మము లన్నీ మంచివే. అందులో తపోధర్మము మిక్కిలి శ్రేష్టమైనది. తపస్సు అనగా ముఖ్యంగా మితంగా భుజించడం. ఒకసారి భగీరథుడు బ్రహ్మసభకు వెళ్లాడు. భగీరథుని చూచి బ్రహ్మ ఇలా అన్నాడు.

“ఇక్కడకు రావడానికి నిర్మలమైన తపస్సు చేస్తేగానీ సాధ్యం కాదు. ఎలాంటి తపస్సు చెయ్యకుండా నీవు ఎలా వచ్చావు?” అని అడిగాడు. దానికి భగీరథులు ఇలా అన్నాడు. “బ్రహ్మదేవా! నేను గోదానములు, భూదానములు, కన్యా దానములు, తీర్థయాత్రలు, రాజసూయ యాగములు, అశ్వమేధయాగములు, ఎన్నో చేసాను. కానీ నేను అవి చేసినందువలన ఇక్కడకు రాలేదు. ఒక సారి బ్రాహ్మణులంతా ఒక చోట చేరి యజ్ఞం చేస్తున్నారు. అప్పుడు వారి యజ్ఞానికి ఎన్నోఅవరోధాలు కలిగాయి. నేను ఆ అవరోధాలు తొలగించి వారి యజ్ఞం సక్రమంగా జరిగేట్టు చూచాను. అందుకు వారు నాకు “బ్రహ్మలోక ప్రాప్తిరస్తు” అని ఆశీర్వదించారు. అందుకని నేను బ్రహ్మలోకానికి వచ్చాను. నేను ఆకలి దప్పికలు మాని బ్రాహ్మణులకు సేవచేసాను. దానిని మించిన తపస్సు వేరే ఉన్నదా!” అని అన్నాడు భగీరథుడు.

ఆ మాటలు విన్న బ్రహ్మదేవుడు భగీరథుని ఎంతో ఆదరించాడు. కాబట్టి ధర్మనందనా! నీవు కూడా బ్రాహ్మణులను భక్తితో సేవింపుము.” అని అన్నాడు భీష్ముడు.

“ పితామహా! శతాయుష్మాన్‌భవ అనేది వేద వాక్కు కదా. మరి చాలామంది చాలా చిన్న వయసులోనే చనిపోతున్నారు. దీనికి కారణమేమి? దేని వలన ఆయుష్షు వృద్ధి పొందుతుంది. దేని వలన ఆయువు క్షీణము అవుతుంది. తెలపండి.” అని అడిగాడు.

“ధర్మనందనా! సదాచారము నియమబద్ధజీవనము ఆయువును పెంచుతుంది. అలాంటి వాడికి ధనము, కీర్తి కూడా లభిస్తాయి. దురాచారము లతో, నియమము లేని జీవనముతో ఆయువు తరిగిపోతుంది. సృష్టిలో ఉన్న అన్నిభూతములు వాడిని తిరస్కరిస్తాయి. కాబట్టి సదాచారము, నియమబద్ధ

జీవనము ముఖ్యమైనవి. ఉత్తములు నడిచిన మార్గములోనే మనమూ నడవాలి. వర్ణాశ్రమ ధర్మములు పాటించాలి. అప్పుడు నియమబద్ధజీవితము అలవడు తుంది.

గురువుగారి మాటను ధిక్కరించడం, పిట్టలను చంపడం, పనీ పాటా లేకుండా గోళ్లు కొరకడం, పుల్లలను తుంపడం, ఉదయం పూటా సాయంత్రం పూటా సూర్యుని వంక తేరిపారచూడటం, ఆయుక్షీణము కలిగిస్తాయి. మనసులో కోపము లేకుండా ప్రశాంతంగా ఉండటం, జీవహింస మానడం, సత్యమునే పలకడం, ఉదయము సంధ్యావందనము చెయ్యడం, ప్రతిరోజూ దేవాతారా ధనము చెయ్యడం, ఆయువును వృద్ధిపరుస్తాయి.

ఇతరుల భార్యలను కోరడం ఆయుక్షీణతకు దారితీస్తుంది. అది మహా పాపము. అందులోనూ మిత్రుని భార్య, గురువుగారి భార్య, తనకన్నా వయసులోపెద్దవారి భార్యలు, రాజుల భార్యలు, తనకన్నా చిన్నవారిభార్యలు, బంధువుల భార్యలు, బ్రాహ్మణుల భార్యలు, వైద్యుల భార్యలు, సేవకుల భార్యలు, పనివారి భార్యలు, పండితుల భార్యలు, వీరిని కామించడం మహా పాపము. అధికంగా ఆయుక్షీణతను కలుగచేస్తాయి.తను ఆచరించదగని వ్రతాన్ని అయినా ఆచరిస్తే, అది ఆయువు వృద్ధి చేస్తుంది.

ఇంకా దేవాలయముల దగ్గర, వీధిలోనూ, గోశాలల దగ్గరా రచ్చబండ దగ్గరా, పంటపొలములలోనూ మూత్రవిసర్జన చేయరాదు. అలాగే నిలబడి మూత్రము పోయరాదు. భోజనమునకు ముందు కాళ్లు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. నిలబడి భోజనము చేయరాదు. ఎంగిలి చేత్తో అగ్నిని, ఆవును, బ్రాహ్మణుని తాకరాదు. పెద్దవాళ్లు కనపడి నప్పుడు చిన్నవాళ్లు లేచి నమస్క రించాలి. వేదాధ్యయనము చేసేటప్పుడు తలమీద చేతులు పెట్టుకోకూడదు.

నిద్ర పోయేముందు స్నానం చేసి పరిశుభ్రంగా ఉండాలి. రెండు చేతులతో తలను గోకరాదు. తలకు పూసిన నూనెను ఒంటికి పూసుకోరాదు. గురువుల ఎడల శత్రుత్వము పనికిరాదు. గురువుగారు కోపించినా సర్దుకుపోవాలి కాని గురువును తిట్టకూడదు. గురువుల విషయంలో అబద్ధాలు ఆడకూడదు. ఇవన్నీ ఆయుక్షీణతను కలగచేస్తాయి.

బ్రాహ్మణులు, గోవులు, క్షత్రియులు, వృద్ధులు, దుర్బలులు, బరువు మోసేవారు, గర్భిణీస్త్రీలు, ఎదురుగా వస్తున్నపుడు తప్పుకొని దారి ఇవ్వాలి. బ్రాహ్మణులు, మంగళకరమైన వస్తువులు, చెట్టు కనపడినప్పుడు వాడికి ప్రదక్షిన నమస్కారము చెయ్యాలి. పౌర్ణమి, అమావాస్య, చతుర్ధశి,అష్టమి, ద్వాదశి తిధులలోనూ, జన్మతిధులలోనూ భార్యతో సంగమించరాదు. అది ఆయు క్షీణతకు దారితీస్తుంది.  ఇతరుల మీద చాడీలుచెప్పరాదు. వారితో తగవులాడ రాదు. కాళ్లు కడుగుకొనేటప్పుడు ఒకకాలును మరొక కాలుతో తోమరాదు. ఇవన్నీ అవలక్షణములు. ఆయుక్షీణతను కలుగచేస్తాయి.

వికలాంగులతోనూ, దరిద్రుని తోనూ, విద్యలేని వాడితోనూ, అంద వికారునితోనూ, అపహాస్యము చేయుట, వారిని తిట్టడం మహాపాపము. వారిని నిందించడం దేవతలను నిందించడమే అవుతుంది.  ధనము తీసుకొని జోస్యము చెప్పడం మహాపాపము. దంతధావనము అనగా పళ్లుతోము కొనేటప్పుడూ, మలమూత్రవిసర్జనము చేసేటప్పుడు మాట్లాడకూడదు. మౌనంగా ఉండాలి. సూర్యోదయకాలము, సూర్యాస్తమయ కాలములలో నిద్రపోకూడదు.

ప్రతిరోజూ తండ్రికి నమస్కరించి తరువాత గురువులకు, బ్రాహ్మణులకు నమస్కరించాలి. ఉదయము దేవతార్చనకు ముందు ఎవరివద్దకూ పోరాదు.

గర్భిణీ స్త్రీలతో సంగమించరాదు. పెళ్లికాని కన్యలతో సంభోగించడం మహాపాపము. పెళ్లికి ముందు స్త్రీ సంభోగము మహాపాపము. అది పెళ్లిఅయిన తరువాత చెయ్యవలసిన కార్యము. దీనిని అవకీర్ణము అని అంటారు. పడుకొనేటప్పుడు ఉత్తరము వైపు, పడమటి వైపు తలపెట్టి పడుకోరాదు. స్నానం చెయ్యకుండా పైపూతలు పూయరాదు. ఒకళ్లు కట్టిన వస్త్రమును కట్టరాదు. ఒకరు తిన్న పదార్ధములు తినరాదు. భోజనం చేసేటప్పుడు ప్రశాంతంగా ఉండాలి. మనస్సు ఎక్కడో పెట్టుకొని బలవంతంగా భోజనము చేయరాదు. మౌనంగా భోజనం చేయాలి. ఉద్రేకంగా మాట్లాడుకుంటూ భోజనము చేయరాదు.

ఒకరి చేతిలో నుండి ఉప్పును తీసుకోరాదు. రాత్రిపూట పెరుగు, తేనె తినరాదు. ఎదుటి వారు చూస్తూ ఉండగా తాను ఒక్కడే తినడం పాపము. వారికి పెట్టి తాను తినాలి. అలాగే పక్క పక్కనే కూర్చుని భోజనం చేస్తూ తాను మంచి పదార్థాలు తింటూ పక్కవాడికి నాసిరకం పదార్థాలు వడ్డించడం పాపము.

(నా చిన్న తనంలో మా తండ్రిగారు ఒక జోక్ చెప్పేవారు. ఇద్దరు బ్రాహ్మణులు కూర్చొని భోజనం చేస్తున్నారట. అందులో ఒకాయన భార్యనుపిలిచి ఏమేవ్! ఈ గొడ్డుకారం వారికి వడ్డించి, ఆ కందిపచ్చడి ఇలాతగలెయ్యి అన్నాడట. వినడానికి జోక్ గా ఉన్నా, ఇలా చెయ్యకూడదు అని అర్థం. పంక్తిభోజనం చేసేటప్పుడు అందరికీ సమానంగా వడ్డించాలి. అదే పైన చెప్పిన దానికి అంతరార్థం).

నెయ్యి, తేనె, పాయసము, నీరు.... వీటిని తను తినగా మిగిలినది (అనగా తన ఎంగిలి పదార్థములు) మరొకరికి ఇవ్వరాదు. అది ఆయుక్షీణత

కలగచేస్తుంది. పితరులకు తర్పణములు విడిచేముందు ముందు విధిగా ఆచమనము చెయ్యాలి.. పగటి పూట భార్యతోనైనా సంభోగించరాదు. పెళ్లికాని కన్యలతోను, వేశ్యలతోనూ సంభోగించరాదు. స్త్రీలను బట్టలు లేకుండా నగ్నంగా చూడటం తప్పు. అక్కచెల్లెళ్లు, గురువు, మిత్రులు, పండితులు, దాయాదులు-- వీరు పేదవారుగా ఉండి దిక్కులేని వారైతే, వారిని దగ్గరకు తీసి పోషించడం, తగిన విధంగా సాయం చెయ్యడం ఆయువును వృద్ధిచేస్తుంది.

పావురాళ్లు, చిలుకలు,శారికములు, పుష్పలతలు,బంగారము తో చేసిన వస్తువులు ఇంటిలో ఉండవలసిన మంగళ వస్తువులు. గ్రద్ద,దీపము పురుగులు, గుడ్లగూబలు ఇంట్లో ప్రవేశించరాదు. అలా జరిగితే శాంతి చేయించాలి. సాయం సంధ్యాసమయంలో చదవడం, తినడం పనికిరాదు. రాత్రిపూట శ్రాద్ధములు పెట్టరాదు. క్షురకర్మ, అభ్యంగనస్నానము, ఆమోదయోగ్యమైన తిధులలోనే చెయ్యాలి. ఉత్తర ముఖము,తూర్పుముఖంగా కూర్చుని చెయ్యాలి.

మనిషి చనిపోయిన తరువాత 11,12 రోజులలో సపిండీకరణము, ఏకోద్దిష్టము అనే కర్మలు చేస్తారు. ఆరోజులలో రాత్రిళ్లు భోజనము చేయరాదు. పిలువకుండా ఎవరి ఇంటికీ భోజనమునకు పోరాదు. ఏదైనా ఒక కార్యమును సాధించే విషయములో తల్లితండ్రులకు, కుమారులకు హితబోధ చెయ్య వచ్చును.

క్షత్రియుడు ఈ క్రింది విద్యలు విధిగా నేర్వాలి. గుర్రపు స్వారీ, ఏనుగును ఎక్కడం, రథము తోలడం, నానావిధములైన ఆయుధములను ప్రయోగించే నేర్పు, యుద్ధతంత్రముల గురించి తెలుసుకోవడం,దండనీతిని అభ్యసించడం, అర్ధశాస్త్రము, కామశాస్త్రము,సంగీతము, సర్వశాస్త్రములు, వేదములు, ప్రజాపరిపాలన, యజ్ఞములు చెయ్యడం. క్షత్రియుడు పైన చెప్పినవి విధిగా

నేర్చుకోవాలి.

రజస్వల అయిన స్త్రీని ముట్టుకోకూడదు. రజస్వల అయిన తరువాత నాలుగవ దినము స్నానం చేసిన తరువాత, భార్యతో కలియవచ్చును. కాని ఐదవ రోజు భార్యతో సంగమిస్తే ఆడపిల్ల పుడుతుంది. ఆరవ రోజు సంగమిస్తే మొగశిశువు జన్మిస్తాడు. ఇంకా చెప్పాలంటే రజస్వల అయిన రోజునుండి సరిరోజులలో సంగమిస్తే మగశిశువు, బేసి రోజులలో సంగమిస్తే ఆడశిశువు జన్మించే అవకాశం ఉంది. అదీ కాకపోతే ఋతుస్నానం నుండి పదహారు రోజులపాటు ప్రతిరోజూ సంగమిస్తే, సంతానప్రాప్తి కలుగుతుంది.

అన్ని ఆచారములలోకీ ఇతరుల పట్ల దయకలిగి ఉండటం సదాచారము. సదాచారముతో జీవిస్తే ఆయుష్షుపెరుగుతుంది." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

"పితామహా! ఈ లోకంలో అన్నదమ్ములు ఏ విధంగా ఉండాలి తెలియజేయండి." అని అడిగాడు.

"ధర్మనందనా! చిన్నవాళ్లయిన తమ్ములు తన కన్నా పెద్దవారైన అన్నల యెడ భక్తిశ్రద్ధలతో మెలగాలి. అలాగే అన్నయ్యలు కూడా తన తమ్ముల ఎడ వాత్సల్యముతో ప్రేమతో మెలగాలి. అన్నదమ్ములలో ఒక తమ్ముడు బుద్ధిలేక ప్రవర్తించినా ఇబ్బంది లేదు కానీ అన్న అవివేకంగా ప్రవర్తిస్తే ఆ కుటుంబం నాశనం అవుతుంది. అన్నదమ్ములు తమలో తాము కొట్లాడుకోకుండా పెద్దలు ఇచ్చిన ఆస్తిని సమానంగా అనుభవించాలి. అప్పుడు లోకమంతా వారిని గౌరవిస్తుంది. అలాకాకుండా అందు లో ఒకడు స్వార్థబుద్ధితో అంతా నాదే అని అంటే ఆ కుటుంబం ఛిన్నాభిన్నముఅవుతుంది. అపకీర్తిపాలవుతుంది.

తండ్రి తరువాత తండ్రి వంటి వాడు అన్నయ్య. ఆయన భార్య అంటే వదిన మిగిలిన వారికి తల్లి వంటిది. అనగా తల్లి తండ్రులు చనిపోయిన తరువాత అన్నగారిని తండ్రిగా, వదినను తల్లిగా భావించాలి. అన్నగానీ తమ్ముడు గానీ మిగిలిన అన్నదమ్ములకు ద్రోహం చేస్తే అతడు శిక్షార్హుడవుతాడు. తల్లి తరువాత అక్క తల్లివంటిది. చిన్న తనంలో తనకు పాలు ఇచ్చి పెంచిన ఆయాలు, దాదులు కూడా తల్లితో సమానులే.

తండ్రి తొలి గురువు. తండ్రి గురువుకంటే పదిరెట్లు ఎక్కువ. కాని తండ్రి కంటే తల్లి పదిరెట్లు ఎక్కువ. తల్లితండ్రులు ఈ దేహమునకు జన్మనిస్తే, గురువు విద్యాబుద్ధులు చెప్పి మరోజన్మనిస్తాడు. గురువు ఇచ్చిన జన్మ అజరామరము (చావు లేనిది. అంటే నేర్చుకున్న విద్యకు నాశనము లేదు.) కాబట్టి గురువు అధికంగా గౌరవింపదగినవాడు." అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

( ఇది వరకు ఇంట్లో పెద్దవాళ్లు, చెయ్య వలసిన పనులు, చెయ్యకూడని పనులు చెప్పేవారు. ఈ రోజుల్లో గ్లోబలైజేషన్ పుణ్యమా అని ప్రపంచం మనిషి గుప్పెట్లో ఇమిడిపోయింది. పెద్దవాళ్లు వృద్ధాశ్రమాలలో పరితపిస్తుంటే యువతీయువకులు నేను, నా భార్య, నా బిడ్డ అంటూ తమ చుట్టు గిరిగీసుకొని బతికేస్తున్నారు. మంచి చెప్పేవాడు కరువయ్యారు. వినేవాళ్లు అసలేలేరు. అన్నీ నాకు తెలుసు అనే భ్రమలో కొట్టుకుంటున్నారు. ఈ నాటి పరిణామాల్ని ఊహించి వ్యాసుడు మనకు ఏవి చెయ్యాలో ఏవి చెయ్యకూడదో వివరించి చెప్పాడు. వీటిలో కొన్ని అయినా పాటిస్తే, పుణ్యం మాట దేవుడెరుగు, సుఖంగా జీవించగలరు అని నా భావన.)

"పితామహా! ఉపవాస వ్రతము బ్రాహ్మణులకు, క్షత్రియులకు మాత్రమే నిర్దేశింపబడినది. మిగిలిన వర్ణములకు కాదు అని అంటారు కదా! పైగా, ఎక్కువగా ఉపవాసములు చెయ్యడం దోషము అని కూడా అంటారు కదా! అసలు ఉపవాసము అంటే ఏమిటి? దానికి ఉండవలసిన యోగ్యతలు ఏమిటి? ఉపవాసము చేసినందువలన కలుగు ఫలము ఏమిటి? వివరంగా చెప్పండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఇప్పుడు నువ్వు నన్ను అడిగినట్టుగానే పూర్వము నేను అంగిరసుడు అనే మునీశ్వరుడిని అడిగాను. ఆయన నాతో అన్న మాటలు నీకు చెబుతాను. శ్రద్ధగా విను. బ్రాహ్మణుడు, క్షత్రియుడు మూడు రాత్రులు ఉపవాసము చేయుటకు అర్హులు. శరీరము సహకరిస్తే, అనారోగ్యము పాలు కాకుండా ఉంటే, ఇంకొన్ని రోజులు కూడా చెయ్యవచ్చును. వైశ్యులు, శూద్రులు మాత్రము నాలుగు పూటలు మాత్రము ఉపవాసము చేయుటకు అర్హులు. అంతకు మించి వారు ఉపవాసము చేయరాదు.

ఇంక ఉపవాసము చేయతగ్గ దినములు ఏవంటే-- పౌర్ణమి, శుక్లపక్ష అష్టమి, చతుర్ధశి, శుక్ల పక్ష పంచమి, షష్ఠి, అలాగే బహుళ పక్ష పంచమి, షష్టి ఉపవాసము చేయుటకు పర్వదినములు. రోజుకు ఒక పూట మాత్రమే తిని, రాత్రి ఉపవాసము ఉండు బ్రాహ్మణునకు మంచి అందమైన భార్య, చక్కని సంతానము కలుగుతారు, అతను ఐశ్వర్యవంతుడవుతాడు. ఆ మాదిరి ఒక్క సంవత్సరము ఉపవాసము ఉంటే అతనికి ఈలోకములో ఉండే అన్ని సౌఖ్యములు అతనికి కలుగుతాయి. ఎన్ని రోజులు ఉపవాసము ఉంటే అన్ని శుభములు కలుగుతాయి.

ఒక సంవత్సరములో 15రోజులు ఉపవాస వ్రతముచేసిన అతనికి పుణ్యలోకములు ప్రాప్తిస్తాయి. అలాగే ఒక మాసము ఉపవాస వ్రతముచేసిన వానికి బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది. కాని ఎవరూ సంవత్సరంలో నెలరోజులకు మించి ఉపవాసములు ఉండరాదు. యుగ యుగానికి మనుషుల ఉపవాస సామర్ధ్యము మారుతూ ఉంటుంది. వారి కాల ప్రమాణాన్ని బట్టి ఉపవాస దినముల సంఖ్యకూడా మారుతూ ఉంటుంది.

తల్లిని మించిన గురువు, వేదమునకు మించిన శాస్త్రము, ధర్మమునకు మించిన లాభము లేవు. అలాగే ఉపవాసమును మించిన తపస్సు లేదు. పవిత్రములైన వాటిలో కెల్లా బ్రాహ్మణుడు పవిత్రుడు. కాబట్టి బ్రాహ్మణుని భక్తితో పూజించాలి. పూర్వకాలంలో దేవతలు, మునులు, ఉపవాస వ్రతము చేతనే గొప్పవాళ్లయ్యారు. విశ్వామిత్రుడు, తన జీవితమంతా ఏక భుక్తము చేసి బ్రాహ్మణత్వము పొందాడు. కాబట్టి ఉపవాసవ్రతమునకు మించిన ఫలము లేదు. ఉపవాస వ్రతము ఆచరించడం వలన శరీరానికి మనస్సు పవిత్రమవు తుంది.

పైన చెప్పబడిన ఉపవాస వ్రతమును మానవ లోకమునకు అందచేసిన వాడు అంగిరసుడు అనే మహా ముని. ఆ అంగిరసుడు చెప్పిన ప్రకారము ఈ వ్రతమును ఆచరిస్తే మానవునికి ఏ పాపములు అంటవు." అని భీష్ముడు ధర్మరాజుకు ఉపవాసవ్రతమును గురించి వివరించాడు.

"పితామహా! యజ్ఞములు చేయవలెనని మీరు చాలా సార్లు చెప్పారు. కానీ యజ్ఞములు చెయ్యాలంటే ఎంతో ధనము కావాలి. మరి అందరికీ యజ్ఞము చెయ్యడం సాధ్యం కాదు కదా! మరి యజ్ఞములు చేయలేని వారి సంగతి ఏమిటి? వారు ఎలాంటి పుణ్యకర్మలు ఆచరించాలి." అని అడిగాడు.

“ధ ర్మనందనా! అందరికీ యజ్ఞములు యాగములు చేయడం సాధ్యం కాదనే అంగిరసుడు ఈ ఉపవాస వ్రతమును ఉపదేశించాడు. ఉపవాసం చెయ్యడం కష్టమని కదా యజ్ఞములు గురించి అడిగావు. ఉపవాసము చెయ్యడంలో తేలిక విధానము చెబుతాను విను. రోజుకు రెండు సార్లు, అనగా పగటి పూట ఒకసారి, రాత్రిపూట ఒకసారీ, భోజనం చేస్తూ, భోజనం చేసేటప్పుడు మాత్రమే నీరు తాగుతూ, మధ్యలో ఏమీ తినకుండా, తాగకుండా, ప్రతిరోజూ అగ్నిహోత్రం చేసేవారు ఉపవాసవ్రతము చేసినట్టే అని పెద్దలు చెబుతారు. (మితంగా, వేళ ప్రకారము భుజించడం ఆరోగ్యకరమనీ నేడు వైద్యులు కూడా చెబుతారు కదా!) ఇది కూడా ఆచరించడం కష్టం అనుకుంటే అంగిరసుడుచెప్పిన మిగిలిన ఉపవాస వ్రతములు ఆచరించవచ్చును.” అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

అప్పుడు ధర్మరాజు “పితామహా! జ్ఞానానికి ప్రతీక శ్రీకృష్ణుడు అంటారు కదా. ఆయన బోధనలు నాకు వినవలెనని ఉన్నది. కాబట్టి ఆ మహాత్ముని తత్త్వజ్ఞాన వాక్యములను వినవలెనని ఉన్నది.” అని అడిగాడు.

“ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు హర, సనత్కుమార సంవాదాన్ని వివరిస్తాను. పూర్వము పరమశివుడు ఒక కోరికతో సనత్కుమారుని వద్దకు వెళ్లాడు. సనత్కుమారుడు పరమశివునికి అతిధి మర్యాదలు చేసి సత్కరించాడు. పరమశివుడు తనకు సనత్కుమారునితో కొన్ని సందేహములను తీర్చుకొనవలెనని కోరిక వెలిబుచ్చాడు. పరమశివుని సందేహములు తీర్చడం మహాభాగ్యం అని అన్నాడు సనత్కుమారుడు. “మహాత్మా! ధ్యానముతో దర్శింపతగ్గ వస్తువేది? తత్త్వములు ఎన్ని? సాంఖ్యము, యోగము --వాటితత్త్వములు ఏవి? ఇంకను అధ్యాత్మ విషయముల గురించి వివరించు.”అని అడిగాడు.

సనత్కుమారుడు ఇలాచెప్పసాగాడు. "మహాశివా! తత్త్వములు 24 అని కొంతమంది, 23 అని మరి కొంతమంది, 25 అని ఇంకా కొంతమంది అంటారు. ప్రాకృతులు 23 అని అంటారు. వారు మనస్సు, బుద్ధి ఒకటే అని నమ్ముతారు. అది సరి అయిన దారి కాదు. ఇంక తత్త్వములు 24 అనే వారు పరిశుద్ధమైన మనస్సే బుద్ధి అని అంటారు.

ఇంక నేను మాత్రము 25వ తత్త్వము ఉందని నమ్ముతాను. అదే అధిష్ఠానము. మిగిలిన 24 తత్త్వములను వికసింపచేస్తుంది. 24 తత్త్వములు ఆ 25వ తత్త్వములో లీనమైనట్లు ఉంటాయి. కాబట్టి ఆ 24 తత్త్వములు ఉన్నాయి అనడం, లేవు అనడం, రెండూ సంభవమే. నీకు ఆ 24 తత్త్వములు వివరిస్తాను.

ఈ విశ్వంలో పంచభూతములు ఐదు. వాటి గుణములు ఐదు. ఇంద్రియములు పది. ఇవికాక మనస్సు,బుద్ధి,అహంకారము,ప్రకృతి. మొత్తం 24. ఈ 24 తత్త్వములను అధిష్ఠించి ఉండునది మహాతత్త్వము. అది 25వ తత్త్వము. బాగా తెలిసిన వాడు ఈ 24 తత్త్వములో కూడినదే దేహము అని భావిస్తాడు. 25వ తత్త్వమైన పరమాత్మ కట్టెలో నిప్పుదాగి ఉన్నట్టు దేహం అంతటా నిండి ఉంటాడు. కాని మానవునితో ఉన్న సహజమైన ఈర్ష్య, దురభిమానము, ఈ జ్ఞానమును నిలువనీయదు. నేను, నాది అంటూ ఈ దేహమే నిత్యము అంటూ సంసారంలో కొట్టుమిట్టాడుతుంటాడు.

వేదము పరమాత్మ తత్త్వమును, బ్రహ్మమును గురించి తెలియజేస్తుంది. దానినే అమృతార్థతత్త్వము అని అంటారు. అన్నితత్త్వముల కంటే ఈ అమృ తార్థ తత్త్వము మేలైనది. ఈ అమృతార్థతత్త్వము తెలుసుకుంటే మృత్యువును జయింపవచ్చును. అది తత్త్వముల కన్నింటికీ ఈశ్వరుడు. దీనికంటే మించిన

ఈశ్వరుడు లేడు. అ తత్త్వమే సత్యము, రహస్యము.

పరమశివా! ఈ తత్త్వము లన్ని వరుసగా పైనుండి కిందికి వస్తే సృష్టి జరుగుతుంది. అదే విధంగా కిందినుండి పైకి వెళితే లయం జరుగుతుంది. వీటన్నిటినీ దాటి బ్రహ్మను చేరుకోవడమే ఏకత్వము అంటారు. ఈ జ్ఞానము, శ్రద్ధ లేనివాడికీ, మనస్సు ఏకాగ్రత పొందని వాడికీ, ఇంద్రియములను జయింపని వాడికీ, వేదాధ్యయనము చేయని వాడికీ, లభ్యముకాదు."

తరువాత సనత్కుమారుడు అధ్యాత్మమము, అధిభూతము, అదిదైవము ల గురించి ఈశ్వరునికి వివరించాడు.

"ఈశ్వరా! సకల జీవరాసులలోనూ ఈ అధ్యాత్మము నిండి సమానంగా ఉంటుంది అని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానము. కాని ఈ జ్ఞానమును మున్ను దేవతలు కానీ, రాక్షసులు గానీ, గంధర్వులు గానీ, మానవులు గానీ తెలుసుకొనలేక అజ్ఞానంలో పడిపోయారు. అసలు బ్రహ్మము గురించి ఇంతవరకూ ఎవరూ తెలుసుకొనలేదు. ఆ బ్రహ్మతత్త్వమే ఓంకారము. ఆ బ్రహ్మతత్త్వము, అహంకారము పూర్తిగా నశించిన మీదట కానీ గోచరము కాదు. ఈ బ్రహ్మము నిష్కళంకము, సుఖప్రదము, అఖిలము, ద్వందాతీతము, జ్ఞానదాహార్తిని తీర్చేది. ఇంకా ఈ బ్రహ్మము అప్రమేయము, అవిజ్ఞేయము, అచలము, ఆది అంతము లేనిది, విమలము, అవ్యయము, ఇంద్రియగోచరము కానిది, అచ్యుతము, సత్, అసత్ కలిసి భాసించేది.

ఈ బ్రహ్మతత్త్వము మొదట నారాయణుడికి తెలుసు. నారాయణుని వలన దేవతలు, మునులు, సిద్ధులు, సాధ్యులు, గంధర్వులు తెలుసుకున్నారు. తరువాత మానవులలో అర్హులకు బోధింపబడినది. ఎందుకంటే ఈ

బ్రహ్మతత్త్వము అందరికీ గోచరము కాదు.  ఈ భవబంధముల నుండి విముక్తి పొందినవాడే ఆ బ్రహ్మతత్త్వమును చూడగలడు.  ముందు జీవుడు అహంకారాన్ని వదిలిపెట్టాలి. జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములతోనూ మనస్సుతోనూ చేసే పనులను, ఆలోచనలను వదిలిపెట్టాలి. అప్పుడు అతని మనస్సు, బుద్ధి ఈ పరతత్త్వములో లీనమవుతాయి.  పరమశివా! ఈ విధంగా 23 తత్త్వములు పరతత్త్వములో లీనమైనపుడు ఇంక ఆ పరతత్త్వమును చూచేదేముంది? అదే అద్వైతస్థితి.

పరమశివా! మానవుని దేహములో ఉండే దేవతాస్వరూపములను వివరిస్తాను. నాలుకమీద చంద్రుడు, తలలో సరస్వతి, ప్రాణములో వాయువు, ఉదానములో మెరుపులు, వ్యానములో పర్జన్యుడు, స్తనములలో ఆకాశము, బలములో కౌశికుడు, అపానములో ఈశానుడు, సమానములో మిత్రుడు, అప్సరసలు, కన్నులందు సూర్యుడు, దేహంలో భూమి, పాదాలలో విష్ణువు, చెవిలో దిక్కులు, జననాంగములో ప్రజాపతి, బుద్ధిలో బ్రహ్మ, అధివసించి ఉన్నారు.  ఇవి అన్నీ ఆత్మతో తెలియబడుతుంటాయి.

ఈ ఆత్మ రెండు రకాలు. ప్రబుద్ధుడు, అబుద్ధుడు.  యోగి అయిన వాడు ఈ దేవతలనందరినీ సమంగా ఆదరిస్తూ తన ప్రాణములను ఊర్ధ్వ ముఖంగా ప్రయాణింపజేసి, శిరస్సులో నిలుపుతాడు.  ఆ సమయంలో యోగి వ్యక్తమైన బ్రహ్మను దర్శిస్తాడు. అదే అవ్యక్తస్థితి. అబుద్ధుడు వ్యక్తరూపం తెలుసు కుంటాడు. ప్రబుద్ధుడు అవ్యక్తరూపమును తెలుసు కుంటాడు. నిజానికి అబుద్ధుడు, ప్రబుద్ధుడు ఆత్మయొక్క రెండుదశలు మాత్రమే. ఆత్మ ఒకటే. అవ్యక్తమును దర్శించిన యోగికి ఈ లోకంలో ఎవరూ సాటిరారు. ఒక్క యోగులకు తక్క మరొకరికి ఆ స్థితి దుర్లభము.

ఆత్మ క్షరము, అక్షరము, పరము అనే మూడు స్థితులలో వ్యక్తమవుతుంది. 25వ తత్త్వమే ప్రబుద్ధము అంటారు. ఈ 25వ తత్త్వము ప్రకృతితో కలిస్తే అబుద్ధుడు అంటారు. ఈ అబుద్ధుడిని 26వ తత్త్వంగా పిలుస్తారు. ఈ అబుద్ధుడు మాటకూ, మనసుకూ అందడు. ఈ అబుద్ధుడు తనను తానుగా తెలుసుకుంటూ ప్రబుద్ధుడు అవుతాడు. లేక తనను తాను ప్రకృతిగా తలిస్తే అజ్ఞానంలో పడిపోతాడు. ఆ అజ్ఞానం తొలగిపోతే ప్రబుద్ధుడు అవుతాడు.

పరమశివా! నీకు పరమాత్మతత్త్వములో ఉంటే మూడు దశలను వివరించాను. ఇంక మునిజనులు చేసే పనుల గురించి వివరిస్తాను. ముని వృత్తి స్వీకరించినవాడు, అడవులలోనూ, కొండగుహలలోనూ నివసించాలి. ఇంద్రియ నిగ్రహము పాటించాలి. విషయ వాంఛలను విడిచిపెట్టాలి. అప్పుడు అతడు యోగి అవుతాడు. గురువు గారి బోధనలను పాటిస్తాడు. ఆహారాన్ని తగ్గిస్తాడు. తదనుగుణంగా మలమూత్రవిసర్జనము కూడా తగ్గిపోతుంది. క్రమ క్రమంగా ఆహారం తీసుకోవడం మానేస్తాడు. మనస్సు నిశ్చలంగా ఉంటుంది. అప్పుడు పరమాత్మ సాక్షాత్కారం అవుతుంది. దానికి నిర్జనము, ఎలాంటి శబ్దములు లేకుండా ఉండే ప్రశాంత ప్రదేశము కావాలి. అప్పుడే యోగి తమము, అస్తమము, జ్ఞానము, అజ్ఞానము, ఈ ద్వంద్వములు లేని స్థితిని పొందుతాడు. అదే అద్వైత స్థితి. యోగులు ఈ అద్వైతస్థితిని పొంది, తమ తమ దుఃఖముల నుండి విముక్తి పొందుతారు. జరామరణములు లేని స్థితిని పొందుతారు. వారికి అణిమాది అష్టసిద్ధులు సిద్ధిస్తాయి. అటువంటి యోగులు యక్షులు, గంధర్వులు,సిద్ధులు, సాధ్యులు మొదలగు భూతకోటిని మించిపోతారు. స్వేచ్ఛాజీవులుగా ఉంటారు.

ఈశ్వరా! భవ్యయోగ తత్పరులమైన నేను మా సహజన్ములయిన సనక,

సనంద,సనత్సుజాతులు కూడా ప్రస్తుతము అదే స్థితిలో ఉన్నాము. కాబట్టి యోగధర్మము కంటే ఉత్తమమైన ధర్మము వేరొకటి లేదు. మోక్షాన్ని పొందడానికి యోగధర్మము నిచ్చెనలాంటిది.

పరమశివా! నీకు యోగము గురించి చెప్పాను. ఇప్పుడు సాంఖ్యము గురించి చెబుతాను విను. సాంఖ్యయోగులు యోగము, సాంఖ్యము ఒకటే అను భావనతో ఈ భవ సాగరమును తరిస్తారు. ఇంద్రియముల కంటే మనస్సు, మనస్సు కంటే అహంకారము, అహంకారము కంటే బుద్ధి, బుద్ధికంటే ప్రకృతి ఎక్కువయినవి. వీటన్నిటికంటే అధికుడు పురుషుడు.

పరమశివా! పంచభూతములు ఐదు. వాటి గుణములైన శబ్దము మొదలగునవి ఐదు. ఇంద్రియములు పది. మనస్సు, బుద్ధి, అహంకారము, ప్రకృతి నాలుగు. మొత్తము 24 తత్త్వములు. చేతనుడు అగు పురుషుని ఆశ్రయించుకొని అచేతనమైన ప్రకృతి కూడా చైతన్యవంతమవుతుంది. మొదటి 23 తత్త్వములు, 24వ తత్త్వమగు ప్రకృతి అనే మహాసముద్రంలో అలలమాదిరి తేలియాడుతుంటాయి. పురుషునికి ఏ గుణములూ లేవు. కాని ప్రకృతితో చేరిన కారణంగా పురుషుడు కూడా గుణములు కలవాడు అవుతున్నాడు. అందువలన మిగిలిన 23 తత్త్వములు కూడా పురుషునికి వాటి వాటి గుణములు ఆపాదిస్తాయి. తాను వేరు, ప్రకృతి వేరు, ఈ 23 తత్త్వములు వేరు అని తెలుసుకున్న పురుషుడు ఈ ప్రకృతిని ఉపేక్ష చేసి, పొగలేని నిప్పువలె ప్రకాశిస్తాడు.

అలా కాకుండా ఈ ప్రకృతే తానని అహంకరించి, తానే ఈ సృష్టికి, లయానికి కర్త అని భావిస్తాడో, అప్పుడు పురుషుడు వికారములను పొందుతాడు. ధైర్యంతో ఈ ప్రకృతిని ఎదిరించలేని పురుషుడు, ప్రకృతికి

వశుడైపోతాడు. తమోగుణ కల్పితములైన ఈ ప్రాపంచిక సుఖములలో మునిగిపోతాడు. 25వ తత్త్వము అయిన పురుషుడు ప్రకృతిని పట్టించుకోకుండా ఉపేక్షిస్తే, 26వ తత్త్వమైన పరమపదమును పొందుతాడు. కాబట్టి పురుషుడు సత్త్వగుణమును ఆశ్రయించి, తత్త్వజ్ఞానము అలవరచుకుంటే, ప్రకృతిలో లీనం కాకుండా చిదానంద స్వరూపుడవుతాడు. ఈ 26వ తత్త్వమే విద్య. కాని దానికి విద్య, అవిద్య అనే గుణములు లేవు. దానికి ఆది అంతములేదు. మార్పులేదు. అజరామరుడు. అచ్యుతుడు. అనంతుడు. ఆత్మస్వరూపంగా ప్రకాశిస్తుంటాడు.

ఓ మహాదేవా! ఈ సాంఖ్యయోగమును అభ్యసించినవారు చక్కని జ్ఞానసంపదతో ప్రకాశిస్తారు. రాబోయే అరిష్టములను ముందే కనిపెట్టగల ప్రజ్ఞాపాటవములను కలిగి ఉంటారు. ఎందుకంటే ముందే రాబోయే అరిష్టములను తెలుసుకుంటే వాటిని ముందే నివారించగలుగుతారు. యోగాభ్యాసకులైన మునులు తమకు రాబోయే అరిష్టములను ముందే తెలుసుకొని సర్వాంగధారణ తో అన్నితత్త్వములను ఏకం చేసి మృత్యువును జయిస్తారు. నీటిలో చేప, మేడిపండులో పురుగులు ఎలా ఉంటాయో అలాగే తానుకూడా ఈ ప్రకృతిలో ఉన్నాను అని తెలుసుకున్న సాధకుడు ఈ ప్రకృతి నుండి విడివడి అవ్యయత్వమును పొందుతాడు. తామరాకు మీద నీటి బొట్టు మాదిరి పురుషుడు ప్రకృతిలో సంచరిస్తూ కూడా, తత్సంబంధమైన వికృతులకు లోను కాకుండా నిర్లిప్తంగా, నిశ్చలంగా, అజరామరంగా వెలుగొందుతాడు. ఈ ప్రకారంగా ప్రకృతిని వదిలిపెట్టిన 25వ తత్త్వమైన పురుషుడు, 26వ తత్త్వమును పొంది విమల, శివ, నిరంజన స్వరూపుడై వెలుగొందుతాడు. దానినే ముక్తి అంటారు.

ఓ పరమశివా! ఈ జ్ఞానాన్ని పూర్వము నాకు గురువైన కపిలమహర్షి

లోకానికి అనుగ్రహించాడు. ఆయన కింద శిక్షణ పొందిన అనేక మంది శిష్యులు ఆయన బోధనలతో విజ్ఞానవంతులయ్యారు. నేను కూడా అనేక మంది శిష్యులకు ఈ జ్ఞానాన్ని బోధించాను. ఎందరో దివ్యమునులు దీనిని శ్లాఘించారు. గార్గ్యుడు, గౌతముడు, కాత్యాయనుడు మొదలగు మహా మునులు ఈ బోధనలతో తమ తమ మనస్సులలోని శంకలను నివృత్తి చేసుకున్నారు. ఈ ప్రకృతి సంపర్కము వదిలి శాశ్వతానందమును పొందారు.

పరమశివా! పురుషుడు ప్రకృతితో కలియడమే బంధము. అలా కలియకుండా ఉండటమే మోక్షము.¬" అని చెప్పి సనత్కుమారుడు ఆకాశమార్గమున వెళ్లిపోయాడు. శివుడు కూడా తనయొక్క దివ్యమైన మనోపథంలో విహరిస్తున్నాడు." అని భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

"పితామహా! ఎన్నోతీర్థాలు ఉన్నాయి కదా! అందులో పరమ పవిత్రమైన తీర్థము ఏది వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! తీర్థములు అన్నీ మేలైనవే. అందులో పవిత్రము అపవిత్రమూ అంటూ లేవు. అన్ని తీర్థములలో మానస తీర్థము పరమ పవిత్రమైనది. దాని పేరు సత్యము. దానికి స్థానము ధృతి అనే సరోవరము. ఎవరైతే రజస్సు తమోగుణములను పక్కకు నెట్టి సత్యాన్ని చేత ధరించి ఆ సరోవరములో స్నానం చేస్తాడో అతడు పరిశుద్ధుడవుతాడు. రాగద్వేషములను వదిలి, ఇంద్రియ నిగ్రహము పాటించు మహాత్ములందరూ పవిత్రమైన తీర్థముతో సమానులే. వారిని సేవించడం ద్వారా మానవునికి పుణ్యతీర్థసేవన ఫలం దక్కుతుంది. తపస్సుచేయడం, ఇంద్రియ నిగ్రహము కలిగి ఉండటం, అహింసను పాటించడం, మనస్సును నిగ్రహించడం, శుభ్రత కలిగి ఉండటం ఇవన్నీ పుణ్యతీర్థసేవనముతో సమానములే.

పైగుణములు లేకుండా కేవలము నదీజలములలో మునిగి నంత మాత్రాన పుణ్యతీర్థ సేవనము దక్కదు. కేవలం శరీరం శుభ్రపడుతుంది కానీ మనస్సు శుభ్రపడదు కదా! దొరకని వాటి కోసం ఆశపడకపోవడం, దొరికిన వాటితో తృప్తిచెందడం, ఎల్లప్పుడూ తృప్తితో సంతుష్టితో ఉండటం, ఆశా పాశములను విడచిపెట్టడం మొదలగు గుణములను పాటించే నరులకు వేరే తీర్థములు సేవించడం ఎందుకూ!" అని పలికాడు భీష్ముడు.

"తాతగారూ! మానవుడు ఏ విధంగా ప్రవర్తిస్తే ఉత్తమ పదము చేరుకుంటాడు. మానవుడు చనిపోయిన తరువాత ఈ దేహము విడిచి పెట్టి దేనిని సాయంగా తీసుకొని వెళతాడు. వివరించండి." అని అడిగాడు ధర్మ రాజు.

"ధర్మనందనా! నీవు అడిగిన విషయములు పరమ నిగూఢమైనవి. వాటిని చెప్పుటకు ఒక్క బృహస్పతి తగినవాడు. ఆయన ఇక్కడకు వస్తున్నాడు. నీ సందేహములను ఆయనను అడిగి తీర్చుకో" అని అన్నాడు భీష్ముడు.

భీష్ముడు ఆ మాటలు అంటూ ఉండగానే దేవగురువు బృహస్పతి అక్కడకు వచ్చాడు. ధర్మరాజు తన తమ్ములతో సహా ఎదురేగి బృహస్పతికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి ఉచితాసనము మీద ఆసీనుడిని చేసాడు. తరువాత తాను అంతకు ముందు భీష్ముని అడిగినట్లు అడుగగా, బృహస్పతి ఈ విధంగా చెప్పాడు..

"ధర్మనందనా! పుట్టినప్పుడు, చచ్చినప్పుడు, పుణ్యలోకములలోనూ, నరకంలోనూ జీవుడు ఉంటాడు. ఈలోకంలో తల్లి, తండ్రి, భార్య, కుమారులు, కుమార్తెలు, బంధువులు స్నేహితులు శ్మశానం దాకా వెళ్లి తిరిగి వస్తారు. నరుడు

చనిపోయిన తరువాత అతని ధర్మమే అతనికి తోడుగా వస్తుంది. కాబట్టి బతికి ఉన్నప్పుడే మానవుడు ధర్మకార్యములు చేయాలి. అలా ధర్మకార్యములు చేయనివాడు, ధర్మము తప్పి నడుచుకునేవాడు, నరకానికి పోతాడు." అని పలికాడు బృహస్పతి.

అప్పుడు ధర్మరాజు ఇలా అన్నాడు. "మహాత్మా! ~~ఈ~~ శరీరాన్ని వదిలిపెట్టి వెళ్లే జీవుడిని ధర్మము ఎలా అనుసరిస్తుంది. వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! పంచభూతములు, వాటి గుణములు అయిన శబ్ద,స్పర్శ, రూప,రస,గంధాదులు బుద్ధి, ధర్మము జీవుడిని అనుసరించి వెళతాయి." అని పలికాడు.

"మహాత్మా! రేతస్సు ఏప్రకారంగా ఏర్పడుతుంది." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! మానవుని శరీరము పంచభూతాత్మకము. మనస్సు దేహంలో ఉంటుంది. అన్నం దేహాన్ని పోషిస్తుంది. మానవునిలో కలిగిన కామ ప్రకోపనంతో రేతస్సు ఏర్పడుతుంది. స్త్రీ పురుషుని కలిసినప్పుడు అది స్త్రీ గర్భాశయంలో ప్రవేశించి, స్త్రీ గర్భం ధరిస్తుంది. అలా పుట్టిన మానవుడు తాను పుణ్యం చేసుకుంటే సుఖాలు అనుభవిస్తాడు. పాపాలు చేసి ఉంటే దుఃఖాలు అనుభవిస్తాడు. పూర్వజన్మలో అతను చేసిన ధర్మకార్యములే అతనికి సుఖ సంతోషాలు కలుగచేస్తాయి. కాబట్టి ఎల్లప్పుడు ధర్మకార్యాలు చేయాలి. పాపకార్యాలకు దూరంగా ఉండాలి. పూర్వజన్మలో అధర్మము, పాపకార్యములు చేసిన వారు, మానవ జన్మకు బదులు పశుపక్ష్యాదులుగానూ, క్రిమికీటకాదులు గానూ జన్మిస్తారు. అదే నరకము. నరకము అంటూ వేరు లేదు.

ఇంక నీకు కర్మ, దాని విశేషములను వివరిస్తాను. విను. జననీ జనకులకు, గురువులకు మేలు చేస్తే సుఖము, వారికి కీడు చేస్తే దుఃఖము కలుగుతాయి. వీరు గాక తక్కినవారి విషయములలో పాపం చేస్తే ప్రాయశ్చిత్తము ఉంది గానీ, తల్లి,తండ్రి,గురువుల ఎడ అపచారము చేస్తే ఆ పాపమునకు ప్రాయశ్చిత్తము లేదు.

ఆహారధాన్యములను అపహరించిన వాడు, మరుజన్మలో ఎలుకగానూ పందిగానూ కుక్కగానూ పుడతాడు. అలాగే, ఇతరుల భార్యలతో సంగమించే వాడు తోడేలుగానూ, రాబందుగానూ గ్రద్దగానూ, కోతిగానూ పుడతాడు. ఆఖరుకు పురుగు జన్మకూడా ఎత్తుతాడు. అప్పటికి గానీ ఆ పాపము పోదు. ఎవరైతే తన కూతురును ఒకరికి ఇచ్చి పెళ్లి చేసి, మరలా మనసు మార్చుకొని ఆమెను వేరొకరికి అర్పిస్తాడో అతడు పురుగు జన్మ ఎత్తుతాడు. దేవ కార్యము చేసి తరువాత పితరులకు నివేదన చేయకుండా భోజనము చేసేవాడు కాకి జన్మ ఎత్తుతాడు. అన్నగారిని తిట్టిన వాడు పక్షి జన్మ ఎత్తుతాడు.

శూద్రుడు బ్రాహ్మణస్త్రీతో సంగమిస్తే అతను పురుగుగా పుడతాడు. చేసిన మేలు మరిచేవాడు నరకబాధలు అనుభవిస్తాడు. ధనము మీద వాంఛతో నిరాయుధుని చంపినవాడికి గాడిద జన్మ, పక్షిజన్మ వస్తుంది. ఆ జన్మలలో చావు దెబ్బలు తింటూ మారణాయుధాలతో మరణిస్తాడు. స్త్రీని చంపిన వాడు మరుజన్మలో అనేక రకములైన నరకబాధలు అనుభవిస్తాడు. అన్నము, పాలు పెరుగు దొంగతనము చేసినవాడు వాటిలోని పురుగుగా పుడతాడు.

ఎవడైతే పండ్లను, ఇనుమును, వెండిని, బంగారమును దొంగిలిస్తాడో అతడు వరుసగా కోతి, కాకి, పక్షి, క్రిమి మొదలగు పుట్టుకలుపుట్టి బాధలు అనుభవిస్తాడు. ఇతరుల బట్టలు దొంగిలిస్తే కుందేలుగా పుడతాడు. ఇతరులు

తన వద్ద దాచిన ధనమును అపహరించి నమ్మకద్రోహము చేస్తే అతడు చేప మొదలగు నీచ జన్మలు ఎత్తుతాడు.

పైన చెప్పిన పాపాలు స్త్రీలు చేస్తే, పురుషులు ఎత్తిన నీచజన్మలలో వారికి భార్యలై పుట్టి, పురుషులతో పాటు వారూ ఆ నరకబాధలు అనుభవిస్తారు." అని అన్నాడు బృహస్పతి.

"మహాత్మా! మరి ఈ పాపములనో పోగొట్టుకునే మార్గము లేదా!" అని అడిగాడు.

"ధర్మనందనా! చేసిన పాపములు దానధర్మములలో నశిస్తాయి. అన్ని దానములలోకీ అన్నదానము ఉత్తమమైనది. న్యాయంగా సంపాదించిన ధనంతో అన్నదానం చేస్తే అది అన్నిపాపములను నశింపజేస్తుంది. కడకు, తాను బిక్షమెత్తి అయినా సరే అన్నము తీసుకొని వచ్చి ఆకలితో ఉన్న పేద బ్రాహ్మణు లకు అన్నదానం చేస్తే, అతనికి పుణ్యలోకములు కలుగుతాయి.

బ్రాహ్మణుడు వేదాధ్యయనము చేయడం వలనా, తాను నేర్చుకొనినది పదిమందికి బోధించడం వలనా; క్షత్రియుడైన వాడు అటువంటి బ్రాహ్మణులను పోషించడం వలనా, ఉత్తమ లోకములను పొందుతారు. వైశ్యుడు ధర్మంగా వ్యాపారము చేసి ఆర్జించిన ధనములోఅన్నదానము చేసి ఉత్తమ లోకములు పొందుతాడు. ఇంక శూద్రుడు కూడా కష్టపడి పనిచేసి తనకు ఉన్నదానితో అన్నదానము చేసి పుణ్యలోకములు పొందుతాడు. అతడు ఏ కులము వాడైనా సరే తాను తినబోయే ముందు ఇతరులకు పెట్టి తింటే అతడికి సద్గతి కలుగుతుంది.

కాబట్టి ధర్మనందనా! అన్ని దానములలోకీ అన్నదానము గొప్పది. దాని వలన అన్ని పాపములు నశిస్తాయి." అని అన్నాడు బృహస్పతి.

ఆ మాటలు విన్న ధర్మరాజు బృహస్పతితో ఇలా అన్నాడు. "మహాత్మా! ధ్యానము, ఇంద్రియ నిగ్రహము, గురువులను భక్తితో సేవించడం, అహింసను పాటించడం,నిత్యము దేవుని పూజించడం,తపస్సు వీటిలో మిక్కిలిగా సేవింపదగినది ఏది? తెలపండి." అని అడిగాడు.

అప్పుడు బృహస్పతి ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధర్మనందనా! నీవు చెప్పిన ఆరు మంచి మార్గములే. కాని వీటి అన్నింటిలో అహింస పరమ పవిత్రమైనది. అహింస అన్ని వ్రతములను ప్రకాశింపచేస్తుంది." అని చెప్పి బృహస్పతి స్వర్గలోకమునకు వెళ్లిపోయాడు.

తరువాత ధర్మరాజు భీష్ముని ఈ విధంగా అడిగాడు. "పితామహా! సర్వదేవతలు, బ్రాహ్మణులు,మునులు అందరూ అహింస పరమ ధర్మము అని చెబుతారు కదా. ఆ అహింస గురించి వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఒక్కమాటలో చెప్పాలంటే ఈ అహింస అనే ధర్మంలో సకల ధర్మాలు ఇమిడి ఉన్నాయి. ఈ అహింస నాలుగు పాదములతో నడుస్తుంది. ఆ పాదములలో ఏ ఒక్కటి కుంటు పడినా ధర్మము దారి తప్పుతుంది. మనసు చేత గానీ, వాక్కు చేత గానీ శరీరం చేత గానీ పరులను హింసించడం, మాంసము తినడం ఇవి హింసా మార్గాలు. మాంసం తినడం కూడా హింస కింద లెక్కే. కాబట్టి ఈ నాలుగు మార్గాలలో హింస చెయ్యడం మానాలి. మాంసము తినడం మీద మక్కువ మానుకుంటే అది కూడా అహింస కిందకు వస్తుంది." అని భీష్ముడు చెప్పాడు.

ఇంతలో ధర్మరాజు "పితామహా! పితృకార్యములలో మాంసము ప్రధానంగా వాడుతారు కదా! మరి మృగములను చంపక పోతే మాంసము ఎలా వస్తుంది." అని ఎదురు ప్రశ్న వేసాడు. దానికి భీష్ముడు ఇలా సమాధానం చెప్పాడు.

"ధర్మనందనా! మాంసము తినడం మానడం అశ్వమేధయాగము చేయడంతో సమానము. మాంసము తినడం కోసం జంతువులను చంపడం, చంపించడం మహాపాపము. కాని శ్రాద్ధాలలో, యాగాలలో వేద విధి ప్రకారం మాంస భక్షణ జరుగుతుంది. దాని వలన దోషము లేదు. కానీ రుచి కోసం, కడుపు నింపుకోడం కోసం మాంసం తినడం, జంతువులను చంపడం మహాపాపము. మాంసము తినడం ఆపితే అదే ఒక తపస్సు అని శాస్త్రాలు చెబుతున్నాయి. మాంసము రుచి అన్ని రుచులకన్నా ఎక్కువ. కాబట్టి మాంసము తినడం మానితే అతడు దేవతలతో సమానుడవుతాడు. సాటి ప్రాణులను చంపితే గానీ మాంసము రాదు. అంతేగానీ, చెట్ల నుండి, రాళ్లనుండి మాంసము రాదు కదా! మాంసము కోసం ప్రాణులను వేటాడే టప్పుడు, చంపేటప్పుడు ఆ చంపేవాడికి చిన్న దెబ్బతగిలితే విలవిలలాడిపోతాడు కదా. మరి అదే నొప్పి ఆ చంపబడే ప్రాణులకు కూడా ఉంటుంది కదా! ఆ మాత్రం గ్రహించకుండా మాంసంకోసం ప్రాణులను చంపడం ఏం న్యాయం? కాబట్టి మాంసం తినడం కోసం జీవహింస చెయ్యడం మానుకుంటే అతడు ఉత్తముడౌతాడు.

మానవులు మాంసం తినడం మానేస్తే జంతువులు భయం లేకుండా బతుకుతాయి. స్వాయంభువ మనువు కూడా ఇదే మాట చెప్పాడు. మార్కండేయ మహర్షి కూడా మాంసం తినడం మానేస్తే ఆయుష్షు పెరుగుతుంది అని అన్నాడు. అసలు మాంసం తినే వాడు రాక్షసునితో

సమానము. మాంసం తినడం మానిన తరువాతనే దేవతలకు దేవత్వం కలిగింది. మాంసభోజనం మానడం, నూరేండ్లు తపస్సుచెయ్యడంతో సమానము. తపస్సు చేసినా, దానధర్మములు చేసినా బ్రహ్మలోక నివాసము లభిస్తుందో లేదో చెప్పలేము కానీ, మాంసము తినడం మానేస్తే మాత్రం బ్రహ్మలోక ప్రాప్తి లభిస్తుంది.

ఆషాఢము,శ్రావణము,భాద్రపదము, ఆశ్వయుజము (అనగా వర్షాకాలములో) మాంసం తినడం మానేస్తే వారికి రోగాలు రావు. ఆయుష్షు వృద్ధి అవుతుంది. బలవంతుడవుతాడు. సగరుడు, దిలీపుడు,నలుడు, నృగుడు, భగీరథుడు మొదలగు చక్రవర్తులు వర్షాకాలము నాలుగు నెలలు మాంసాహారము మాని వేసి కీర్తి వంతులయ్యారు." అని అన్నాడు భీష్ముడు.

అప్పుడు ధర్మరాజుకు ఒక సందేహం కలిగింది. "పితామహా! మాంసభక్షణము ఇంత పాపం అని తెలిసి కూడా మానవులు కాయగూరలు, పండ్లు, భక్ష్యములు ఎందుకు తినరు. మాంసాహారము మీద ఎందుకు మక్కువ చూపిస్తారు." అని అడిగాడు.

ఆమాటలకు భీష్ముడు నవ్వి " ధ ర్మనందనా! ఒకసారి మాంసము రుచి మరిగిన వాడికి దానిని తినడం మానడం చాలా కష్టం. ఎందుకుంటే మాంసం తినడం వలన రతి కార్యము మీద ఎక్కువ ప్రీతి కలుగుతుంది. రతి కార్యము చేయడానికి తగిన బలాన్ని ఇస్తుంది. ఇంకా మాంసము పనిచేసి అలసిపోయిన వాడికి తక్షణ శక్తిని ఇస్తుంది. గాయ పడిన వాడికి ఆ గాయాలు తొందరగా మానుతాయి. భక్ష్యములలో, ఫలములలో ఈ గుణములు లేవు కదా! పైగా మాంసం తినడం వలన కలిగిన దోషము దానధర్మాలతో తొలగి పోతుంది. యజ్ఞయాగములలో, శ్రాద్ధ కర్మలలో మాంసము తినడం పాపము

కాదు. ఇంకా మాంసము తినడం కొన్ని సందర్భములలో తప్పుకాదు అని శాస్త్రాలు చెబుతున్నాయి.

ఈ సందర్భంలో అగస్త్యుడు ఈ విధంగా చెప్పాడు. వేటాడటం రాజులకు పరమ ధర్మము. అందులో మృగములను పక్షులను చంపడం ధర్మము. ఆ మాంసంతో దేవ కార్యములను, పితృకార్యములను నిర్వర్తించడం కూడా ధర్మమే. కాని కేవలం రుచిగా తినడం కోసం, దేహాన్ని పెంచుకోడం కోసం మాంసం తినడం, జీవహింస చెయ్యడం, మహాపాపము. ఇతర జంతువుల, పక్షుల మాంసంతో తన దేహాన్ని పోషించుకోవడం మహాపాపము. మాంసం తినడం వల్ల వచ్చే పాపం దానధర్మాలతో పోతుంది నిజమే. కానీ ఆ తరువాత మాంసం తినకుండా ఉండాలి. అప్పుడే ఆ పాపం పోతుంది. అందువలన అహింసకు సాటి ధర్మము వేరొకటి లేదు.

దయ గల వాడు సాటి ప్రాణులలో ఉన్న ప్రాణభయాన్ని చూడగలడు. అందుకే అతడు మాంసము తినడు. అలాంటి వానికి బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది. మానవుడు ప్రాణుల ఎడల దయ కలిగి ఉంటే ఆ ప్రాణులు కూడా మానవుల ఎడల దయ కలిగి ఉంటాయి. మానవుడు సాటి ప్రాణుల ఎడల క్రూరంగా ఉంటే అవి కూడా మన ఎడల క్రూరత్వాన్ని కలిగి ఉంటాయి. కాబట్టి సాటి ప్రాణుల ఎడల దయ కలిగి ఉండటం, వాటిని హింసించకుండా, చంపకుండా ఉండటం, పరమ ధర్మము." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

"పితామహా! మేము చేసిన యుద్ధములో ఎంతో మంది మరణించారు కదా! వారికి ఏ లోకములు ప్రాప్తిస్తాయి తెలపండి. ఎందుకంటే మానవులు అందరూ బతకడం సుఖాలు అనుభవించడానికి అనీ, చావడం దుఃఖ హేతువు అని విశ్వసిస్తారు కదా! కాబట్టి తమ తమ ప్రాణములను సులభంగా

వదులుకోరు. అందుకని అడిగాను." అని అన్నాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు వేదవ్యాసునికి ఒక కీటకమునకూ జరిగిన సంవాదము గురించి చెబుతాను, విను. ఒక సారి వేదవ్యాసుడు బండ్లు పోయే దారిలో వేగంగా పరుగెడుతున్న పురుగును చూచాడు. " ఓపురుగా! ఎందుకు అలా భయంతో వేగంగా పరుగెడుతున్నావు. కారణమేమి?" అని అడిగాడు. "ఓ మహాత్మా! చూచారా! అతి వేగంగా ఈ దారిలో బండ్లు వస్తున్నాయి. ఆ బండ్లచప్పుడు, ఎద్దుల రంకెలు మనుష్యుల అరుపులు నాకు బెదురు పుట్టిస్తున్నాయి. బ్రతకడం సుఖం, చావడం దుఃఖం కదా! అందుకని ఆ బండ్ల కింద పడి చావకుండా, ఇంకా కొంతకాలం బతుకుదామని వేగంగా పరుగెడుతున్నాను. ఎందుకంటే ప్రాణులకు ప్రాణభీతి ఎక్కువ కదా!"

అప్పుడు వ్యాసుడు ఇలా అన్నాడు. "నీవు చిన్న పురుగువు. నీవు ఇంద్రియ సుఖములు అనుభవించలేవు. పైగా ఈ దేహము దుఃఖ మయమైనది. అటువంటప్పుడు నీకు ప్రాణ భయం ఎందుకు? నీకు చావే సుఖము కదా! అప్పుడు ఈ భయాలు ఉండవు." అని అన్నాడు వ్యాసుడు.

ఆ మాటలకు ఆ కీటకము నవ్వి "మహాత్మా! పురుగులకు కీటకములకు ఇంద్రియ సుఖములు లేవని మీరు ఎలా చెప్పగలరు. మా పద్ధతిలో, మా దారిలో మేము కూడా మానవులలాగే ఇంద్రియ సుఖములు అనుభవిస్తాము. అందుకనే మాకు కూడా బతకాలనే కోరిక, మరణభయము ఉన్నాయి. అయినా మునీంద్రా! నా మనసు తెలుసుకోడానికి అడుగుతున్నావు కానీ ఆ మాత్రం నీకు తెలియదా చెప్పు. అది అటుండనీ, నేను పోయిన జన్మలో శూద్రుడను. చాలా ధనవంతుడను. ఆ జన్మలో నేను చాలా క్రూరుడను. అనాచారుడను.అతి లోభిని. దయ, జాలి లేని వాడిని. దురుసుగా ఉండేవాడిని. అన్ని దుర్గుణ

ములు కలిగిన వాడిని. కాని నా తల్లిన నేను శ్రద్ధతో సేవించాను. ఒకసారి మా ఇంటికి ఒక బ్రాహ్మణుడు అతిధిగా వచ్చాడు. అతనిని నేను భక్తితో పూజించాను. అందువలన నాకు పూర్వజన్మ స్మరణ కలిగింది. అప్పటి నుండి నాకు మంచి పనులుచేస్తే సుఖాన్ని ఇస్తాయి అనే స్ఫురణ కలిగింది. కాబట్టి మునీంద్రా! ఈ విషయముల గురించి నాకు సవిస్తరంగా చెప్పండి." అని అడిగింది ఆ పురుగు.

" ఓ కీటకమా! నిన్ను చూడగానే నీ పూర్వజన్మ వృత్తాంతము నాకు తెలిసింది. నీవు గత జన్మలో పాపములు చేసినందువలన నీకు ఈ  పురుగు జన్మ వచ్చిందని నాకు తెలుసు. ఆ ప్రకారంగానే నీవు కొన్ని పుణ్యకార్యములు చేసావు. అందువలననే నేను నీతో మాట్లాడుతున్నాను. నా తపోబలము చేత నీకు ఈ పురుగు జన్మను పోగొడతాను. నీకు మనుష్య జన్మ ఎత్తి ఎన్నో పుణ్య కార్యములు చేయవలెనని కోరిక కలగడం కూడా నీవు చేసిన పుణ్యకార్యముల ఫలమే! మానవులు తాము చేసిన పుణ్య కార్యముల వలన దేవతలవుతారు. తాము చేసిన పాప కార్యముల వలన ఇలా కీటకముల జన్మ ఎత్తుతారు. నీవు పోయిన జన్మలో చేసిన పుణ్య కార్యముల వలన నీకు పూర్వ జన్మ స్మృతి కలిగింది. నా సందర్శన భాగ్యం కూడా కలిగింది. నీకు నేను ఉత్తమ గతులు ప్రసాదిస్తాను.  ఇంక నుండి నీవు జంతువులుగానూ, మానవులలో వరుసగా శూద్ర,వైశ్య,క్షత్రియ జన్మలెత్తి తుదకు బ్రాహ్మణ జన్మ ఎత్తుతావు. నీకు అన్ని జన్మలలో పూర్వజన్మ స్మృతి ఉంటుంది." అని ఆ పురుగుకు వరం ఇచ్చాడు. ఆ పురుగు కూడా  వ్యాసుడి పాదాలను తాకి ప్రాణాలను వదిలింది. తరువాత వ్యాసుడు వెళ్లిపోయాడు.

కాలక్రమేణా ఆ పురుగు వరుసగా అన్ని జన్మలు ఎత్తుతూ క్షత్రియ జన్మలో ఒక పెద్ద రాజ్యానికి రాజు అయ్యాడు. రాజ్యసుఖాలు అనుభవిస్తున్నాడు.

ఒకరోజు ఆ రాజు వ్యాసుని ఆశ్రమానికి వెళ్లాడు. ఆయన పాదాలు అంటి నమస్కరించాడు. వ్యాసుడు ఆ రాజుకు అన్ని మర్యాదలు చేసాడు. ఆ రాజుతో ఇలా అన్నాడు. "ఓ రాజా! ఈ జన్మలో నీవు తపస్సుచెయ్యి. ఆవుల కోసము, బ్రాహ్మణుల కోసమూ యుద్ధములో ప్రాణాలు వదులు. నీకు బ్రాహ్మణ జన్మ వస్తుంది." అని అన్నాడు వ్యాసుడు. ఆరాజు కూడా వ్యాసుడు చెప్పినట్టు తపస్సు చేసి యుద్ధములో ప్రాణాలు వదిలి మరుజన్మలో బ్రాహ్మణునిగా పుట్టాడు. ఆ బ్రాహ్మణ జన్మలో ఎన్నో యజ్ఞయాగములు చేసాడు. పుణ్యక్షేత్రాలు సందర్శించాడు. దానధర్మాలు చేసాడు.

తరువాత ఒక సారి వేదవ్యాసుని దర్శించుకున్నాడు. అతనిని చూచి వ్యాసుడు ఎంతో సంతోషించాడు. అతనిని కీర్తిప్రతిష్ఠలతో అలరారమని దీవించాడు. కాబట్టి ఓ ధర్మనందనా! యుద్ధములో మరణించిన వారికి ఉత్తమ గతులు కలగడంలో అనుమానం ఏమీ లేదు." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

ఆ మాటలకు ఆనందించిన ధర్మరాజు భీష్మునితో ఇలా అన్నాడు. "పితామహా! విద్య, తపస్సు, దానము వీటిలో ఏది మంచిది. వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు వ్యాసుడు మైత్రేయుడు మధ్య జరిగిన సంవాదము వినిపిస్తాను. ఒకసారి వ్యాసమహాముని కాశీనగరానికి వెళ్లాడు. కాశీలో ఉన్న మైత్రేయ మహాముని వద్దకు వెళ్లాడు. మైత్రేయుడు వ్యాసుని కి తగు మర్యాదలు చేసాడు. తృప్తిగా భోజనం పెట్టాడు. వ్యాసుడు ఆ మర్యాదలకు తృప్తిచెందాడు. "ఓ మైత్రేయా! దానములలో కెల్లా అన్నదానము గొప్పది. నువ్వు నాకు అన్నదానము చేసావు. నాకు చాలాసంతోషము అయినది.

మైత్రేయా! దానము ఇవ్వదగిన వస్తువులలో అన్నము చాలా శ్రేష్టమైనది. ఈ దేహము, అందులో ఉన్న ప్రాణములు, దేహమునకు ఉన్న బలము అన్నీ అన్నము వలన కలిగేవే కదా! మైత్రేయా! తపస్సు చేస్తే మనసులో ఉన్న కల్మషములు తొలగిపోతాయి. ఆ తపస్వి అంతకు ముందు చేసిన దానముల వలన అతనికి విద్య నేర్చుకొనడం సులభం అవుతుంది. అతడు నేర్చుకున్న విద్య అతడి తపస్సును వృద్ధిచేస్తుంది. కాబట్టి తపస్సు, విద్య, దానము వలననే పెంపొందుతాయి. దానములలో కెల్లా అన్నదానము గొప్పది. ఎంతటి దుష్టుడైనా అతడు చేసిన దానముల చేత పరమ పవిత్రుడవుతాడు." అని వ్యాసుడు మైత్రేయునకు చెప్పాడు. కాబట్టి ధర్మనందనా! అన్ని ధర్మములలో కెల్లా దానము గొప్పది. దానములలో కెల్లా అన్నదానము గొప్పది." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! తమరు నాకు అన్ని విషయములు చెప్పారు. కానీ స్త్రీల గురించి ఏమీ చెప్పలేదు. స్త్రీల గురించి వినవలెనని కోరికగా ఉన్నది." అని అడిగాడు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు కైకేయీ శాండిలీ సంవాదమును వినిపించెదను. దానితో నీ సందేహములు తీరగలవు. కేకయ రాజకుమారి సుమన (కైకేయి) దేవలోకములో ఉన్న శాండిలిని చూచి "ఓ కాంతామణీ! నీకు దేవలోకములో నివాసం ఎలా కలిగింది?" అని అడిగింది. దానికి శాండిలి ఇలా బదులు చెప్పింది.

"ఓ కైకేయీ! నేను అత్తగారికీ మామ గారికీ ఎదురు చెప్పకుండా వారిని సేవించాను. దేవతారధనలు, పితృ శ్రాద్ధములు, అతిథిపూజలు చెయ్యడంలో అలసత్వము చూపించలేదు. అన్నీ శ్రద్ధతో చేసాను. నేను ఎప్పుడూ వీధి వాకిట్లో నిల్చోలేదు. నేను ఎప్పుడూ వీధి మొహం చూడలేదు. అందరి ముందరా

బిగ్గరగా నవ్వలేదు. విద్యార్ధులకు, విద్యావంతులకు భిక్ష పెట్టడంలో ఏ మాత్రం అశ్రద్ధ చూపలేదు. భర్త ఇంటికి రాగానే ఆయనకు అన్ని సపర్యలు చేసాను. నా పిల్లలను మంచి వారుగా పెంచాను.

నా భర్తకు ఏది ఇష్టమో నాకు అదే ఇష్టం. అంతేగానీ నాకు గా వేరు ఇష్టా ఇష్టాలు లేవు. నాకు అపకారం చేసినా నేను వారిని దూషించను. నా భర్త బయటకు వెళితే ఆయన తిరిగి ఇంటికి వచ్చేదాకా తలలో పూలు పెట్టుకోను. మంచి బట్టలు, ఆభరణములు ధరించను. రుచి గల పదార్ధములు చేసికొని భుజించను. నేను ధాన్యమును, అన్నమును వృధా చెయ్యను. పొదుపుగా ఉంటాను. మా బంధువుల నందరినీ సమంగా ఆదరిస్తాను. మా ఇంటిలో ఉన్న ఆవుల ను స్వయంగా పోషిస్తాను. ఇంటి వ్యవహారాలలో నా భర్తకు ఎదురు చెప్పను. మా ఇంటిలో ఉన్న నిత్యాగ్నిహోత్రమును జాగ్రత్తగా కాపాడుతాను. మా ఇంటి రహస్యములను రచ్చకీడ్చను. నేను గర్భం ధరించినప్పుడు, రుచిగల భోజనము మాని, గర్భిణీ స్త్రీలకు ఏది అవసరమో అదే భుజిస్తాను. కాబట్టే నాకు దేవలోక ప్రాప్తి లభించినది." అని కైకేయికి శాండిలి బదులు చెప్పింది. దీనితో నీ సందేహము తీరిందనుకుంటాను అని అన్నాడు భీష్ముడు.

"పితామహా! సర్వశాస్త్రములలో చెప్పబడినదీ, శ్రేష్టమైనదీ అయిన కార్యము ఏది" చెప్పండి అని అడిగాడు.

" ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు నారదుడు, పుండరీకుడు వీరి మధ్య జరిగిన సంవాదమును వినిపించెదను. శ్రద్ధగా విను. ఒకసారి పుండరీకుడు నారదుని నీవు అడిగిన ప్రశ్న అడిగాడు. దానికి నారదుడు ఈ విధంగా బదులుచెప్పాడు.

పంచభూతములు(5), వాటిగుణములు(5), జ్ఞానేంద్రియములు(5), కర్మేంద్రియములు(5), మనస్సు,బుద్ధి,అహంకారము, ఇవి 23. 24వ తత్త్వము ప్రకృతి. 25వ తత్త్వము పురుషుడు. అతడు సర్వభూతాత్మకుడు. అతనిని నరుడు అని కూడా అంటారు. ఆ నరుని వలన కలిగినట్టి తత్త్వములను నారములు అంటారు. ఆ నారములకు అధిపతి నారాయణుడు. ఆ నారాయణుడు ఈ అనంత విశ్వమును తనయందు ఆవిర్భవించి, లయం చేస్తూ ఉంటాడు. విభుడుగా విరాజిల్లుతుంటాడు. ఈ నారాయణుడినే పరబ్రహ్మము, పరతత్త్వము, పరమపదము, ఈశ్వరుడు, విష్ణువు, అని పిలుస్తారు. ఆ నారాయణుడే జగత్తు అంతా నిండి ప్రకాశిస్తూ ఉంటాడు. ఇంకా ఆ నారాయణుడు, వాసుదేవుడు, ఆత్మ, అనే వేదాంత వాక్యములలో సంబోధింపబడుతూ ఉంటాడు. నరునికి కూడా అవే పేర్లు ఉంటాయి. నరనారాయణులకు బేధము లేదు. సర్వశాస్త్రములను పరిశీలించిన పిమ్మట, ధృడమైన విచారము చేసిన పిమ్మట, నారాయణుని స్మరించవలెనని చెప్పబడింది. కాబట్టి నారాయణుడే అనుష్టించ తగినవాడు.

మానవులు కొంచెంసేపు అయినా నారాయణుని తలచుకుంటే అతనికి ఉత్తమ గతులు కలుగుతాయి. ఇంక ఎల్లప్పుడూ మనసులో నారాయణ స్మరణ చేసేవాడి సంగతి చెప్ప పనిలేదు కదా! కనీసం మరణ సమయములో నైనా నాలుకతో "ఓం నమో నారాయణాయ" అని స్మరిస్తే చాలు అతనికి ఉత్తమ పదము లభిస్తుంది. నారాయణ శబ్దమే బ్రహ్మము. కాబట్టి నిరంతర నారాయణ నామ స్మరణ మానవులకు హితం చేస్తుంది. నిరంతర నారాయణ నామ స్మరణ చేసే వాడు తన పాతకములను పోగొట్టుకొనడమే కాకుండా, తనను ఆశ్రయించిన వారి పాతకములను కూడా పోగొట్టగల శక్తిమంతుడౌతాడు. ఇది బ్రహ్మ వాక్కు. మానవుడు ఏ ఆశ్రమములో (అనగా బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థము, సన్యాసము) ఉన్నప్పటికినీ నారాయణ నామ

స్మరణ ఏమరక చేయడం అతని విధి. లేనియడల అతనికి ఉత్తమ గతులు కలుగవు.

ఈ విష్ణువు భక్తితో తప్ప వేరేవిధంగా గోచరము కాడు. అందుకే విష్ణువుకు భక్తవత్సలుడు అనే నామము సార్ధకమైనది." అని నారదుడు పుండరీకునకు విష్ణుమహిమను వివరించాడు. అంతట ఆ పుండరీకుడు విష్ణువును భక్తితో అర్చించాడు. అప్పుడు పుండరీకునికి కలలో శంఖు చక్రములు, గద, శార్ఙము నాలుగు చేతులతో ధరించినవాడు, తామర రేకుల వంటి కన్నులు కలవాడు, కిరీటము, కుండలములు ధరించినవాడు, శ్రీ వత్స మను పుట్టు మచ్చ తన వక్షస్థలమున కలవాడు, కౌస్తుభమును ధరించి ప్రకాశించువాడు, అయిన శ్రీమన్నారాయణుడు కనిపించాడు. ఆ రూపం పుండరీకుని మనసులో శాశ్వతంగా నిలిచిపోయింది.

ధర్మనందనా! నీవుకూడా ఆ విష్ణుస్వరూపమును నిరంతరమూ మనసులో నిలుపుకొని ధ్యానించు. నీకు సకల శుభములు కలుగుతాయి." అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

"పితామహా! సాధారణంగా మానవులు దానధర్మములు చేస్తుంటారు. ఇతరులతో ప్రియంగా మాట్లాడుతుంటారు. ఈ రెండింటిలో గొప్పది ఏది? తెలియచెయ్యండి." అని అడిగాడు.

"ధర్మనందనా! రెండూ మంచివే. ఈ రెండూ ఎదుటి వాడి మనసును బట్టి చెయ్యాలి. దానం గురించి చెప్పపనిలేదు. దానగుణము ఎల్లప్పుడూ శ్లాఘనీయమే. ఇంక ప్రీతికరంగా మాట్లాడటం గురించి నీకు ఒక కథ చెబుతాను విను. ఒక బ్రాహ్మణుడు పని మీద అడవిలో వెళుతున్నాడు. అక్కడ

జనసంచారము లేదు. అప్పుడు ఒక రాక్షసుడు అతనిని చంపి అతని మాంసం తినవలెనని తలంపుతో ఆ బ్రాహ్మణుని పట్టుకున్నాడు. ఆ బ్రాహ్మణుడు రాక్షసునికి భయపడలేదు. నిర్మలంగా నిశ్చలంగా ఉన్నాడు.

ఆ రాక్షసుడు అతని ధైర్యమునకు ఆశ్చర్యపోయాడు. ఆ బ్రాహ్మణునితో ఇలా అన్నాడు. "ఓ బ్రాహ్మణోత్తమా! నీవు నా ప్రశ్నలకు జవాబు చెబితే నిన్ను విడిచి పెడతాను. లేకపోతే చంపి తింటాను." అని అన్నాడు. బ్రాహ్మణుడు సరే అన్నాడు.

"నా శరీరం డస్సిపోయింది. పాలిపోయింది. దానికి కారణమేమి?" అని అడిగాడు రాక్షసుడు.

" ఓ మహాత్మా! నీవంటి దయామయుడు అడిగితే చెప్పకుండా ఉంటానా! నీ ప్రశ్నకు బదులుచెబుతాను విను. నీవు చెడ్డవాడివి అని తెలిసి నీ బంధువులు అందరూ నిన్ను విడిచి పెట్టి వెళ్ళిపోయారు. అందుకని నీవు బాధపడుతున్నావు. నీవు దరిద్రంతో బాధ పడుతూ నీకు లభించని ధనము గురించి చింతి స్తున్నావు. మొహమాటానికి పోయి నీవు ఇతరుల చేతిలో ఓడిపోతే, వారు అదంతా తమ ప్రతాపమని పొంగిపోవడం. అది చూచి నీవు ఓర్వలేకున్నావు. దుర్మార్గులు నీ చుట్టు చేరి నిన్ను పొగుడుతూ ఉంటే, పండితులు నిన్ను పొగడటం లేదని మనసు బాధపెట్టుకుంటున్నావు. ఈ బాధల వలన నీవు కృ శించి పోతున్నావు.

ఇంకా కొన్ని కారణాలు ఉన్నాయి. నీవు చెప్పిన మాటలను సభ ఆమోదించకపోవడం. నీవు చేసిన పాడు పనులకు నీ భార్య బాధ పడుతూ ఉంటే ఆమెను అనునయించలేని దుస్థితిలో ఉన్నావు. నీ సొత్తును ఇతరులు

దోచుకు పోవాలని చూస్తున్నారని తెలిసి, నీ సొమ్మును రక్షించుకోలేక బాధపడుతున్నావు. చాటు మాటుగా నీ గురించి చెప్పే మాటలను నీ బంధువులు నిజమని నమ్మడం. నీవు నిజంగా ఇతరులకు మంచి చెయ్యడానికి ప్రయత్నిస్తుంటే, నీ స్నేహితులే నిన్ను నమ్మకపోవడం, దాని వలన కలిగే దుఃఖాన్ని నీవు లోపల అణుచుకోలేక బయటకు కక్కలేక కుమిలి పోవడం, ఇవన్నీ నీ క్షీణతకు కారణాలు.

ఇంకా నీ భార్యా,బిడ్డలు, అల్లుడు వారి వారి దుష్ప్రవర్తనతో నిన్ను ఇబ్బందిపెట్టడం, నీ తల్లి తండ్రులు, సోదరులు రోగములతో బాధపడటం, నీ పూర్వజన్మలో నువ్వు ఒక బ్రాహ్మణుని కి చెందిన ఆవును చంపడం, దుష్టబుద్ధితో బ్రాహ్మణుల సొత్తును, దేవుడి సొమ్మును అపహరించడం, నీధనమును నీవు పోగొట్టుకొని దానికోసం పరితపించడం, ఇంతలో నీ బంధువులు చనిపోవడం, దాని వలన కలిగే బాధలు, దుర్మార్గుడిని పనిలో పెట్టుకొని వాడు చేసే చెడ్డ పనులకు నువ్వు బాధ్యత వహించి బాధపడటం, చాలా కాలం పాటు ఎంతో ప్రయత్నించి సాధించిన కార్యమును ఒక దుర్మార్గుడు పాడు చెయ్యడం, దాని వలన కలిగే దుఃఖము, వీటి వలన కూడా మానవుడు కృంగి కృశించిపోతాడు." అని బ్రాహ్మణుడు ఆ రాక్షసునికి వివరించాడు. అని భీష్ముడు ధర్మరాజుడు వివరించాడు.

(పైన వివరించిన కష్టాలన్నీ మాననవులకు దైనందిన జీవితంలో కలిగేవే. వాటికి కృంగి పోవడం, కృశించి పోవడం మానవ సహజం. కాని వాటిని ధైర్యంగా ఎదుర్కోడంలోనే మానవుని బుద్ధికుశలత, మనోబలము బయటపడుతుంది. కాబట్టి ప్రతి మానవుడు తనకు వచ్చిన కష్టాలను ధైర్యంతో ఎదుర్కొని దానికి పరిష్కారమార్గాలు కనిపెట్టాలే గాని కృంగి పోకూడదు. ఆత్మహత్యలకు పాల్పడకూడదు. ఈ రోజుల్లో ప్రతి చిన్న విషయానికి కూడా కృంగి పోయి

ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అది ఆచరణీయము కాదు. అన్ని రకముల కష్టాలను ధైర్యంతో ఎదుర్కోవాలి. ఇదే ఈ సంవాదంలో ముఖ్యోద్దేశము.)

ధర్మరాజుకు ఇంక అడగడానికి సందేహాలు ఏవీ లేనట్టు ఉన్నాయి. అందుకని అందరూ వినేటట్టు ఒక ప్రాచీన పురాణ గాధను చెప్పమని భీష్ముని అడిగాడు. దానికి భీష్ముడు ఇలా చెప్పసాగాడు.

"ధర్మనందనా! నీకు ఉమామహేశ్వర సంవాదమును వినిపిస్తాను. ఈ సంవాదము శ్రీ కృష్ణుని సన్నిధానంలో వినిపించడం నా పూర్వపుణ్యవిశేషంగా భావిస్తున్నాను. శ్రీ కృష్ణా! నీ అనుమతితో ఈ కథ ధర్మరాజుకు వినిపిస్తున్నాను.

పుత్ర సంతానము కోరి శ్రీ కృష్ణుడు, రుక్మిణీదేవితో సహా హిమాలయ పర్వతములకు వెళ్లాడు. అక్కడ 12 సంవత్సరముల అత్యంత దీక్షతో వ్రతం చేసాడు. బాగా నలిగిపోయాడు. ఆ సమయంలో శ్రీ కృష్ణుని చూడడానికి నారదుడు, వ్యాసుడు, వాల్మీకి, దేవలుడు, కశ్యపుడు, మొదలగు వారు తమ తమ శిష్యబృందములతో అక్కడకు వచ్చారు. వారికి శ్రీ కృష్ణుడు అర్ఘ్యము పాద్యము ఆసనము ఇచ్చి సత్కరించాడు. వారలతో పుణ్యగోష్టి (మంచి మాటలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం) నడుపుతున్నాడు. అప్పుడు శ్రీ కృష్ణుని ముఖం నుండి ఒక మహా అగ్ని వెలువడింది. ఆ అగ్ని అక్కడ ఉన్న అడవులను కాల్చివేయసాగింది. ఆ అడవులలో ఉన్న మృగములు, పక్షులు, తపస్సు చేసుకుంటున్న సిద్ధులు,సాధ్యులు,మునులు ఆందోళన చెందుతున్నారు. అది గమనించిన శ్రీ కృష్ణుడు తన శుభప్రదమైన చూపులతో ఆ మంటలను ఆర్పివేసాడు. అడవులు మరలా యధాస్థితికి వచ్చాయి.

ఈ సంఘటన చూచి ఆ మునులందరూ ఆశ్చర్యపోయారు. వారిని చూచి

శ్రీ కృష్ణుడు ఇలా అన్నాడు. “మీరు ఈ అగ్నిని ఏ విధంగా అర్థం చేసుకున్నారు. ఉన్నది ఉన్నట్టుగా చెప్పండి.” అని అడిగాడు. ఆ మునులందరూ ముక్త కంఠంతో ఇలా అన్నారు. “దేవా! ఈ సమస్త జగత్తు నీ చే సృష్టించబడి, నీలోనే లయం అవుతూ ఉంది. సకల చరాచర జీవజాలము నీ అధీనంలో ఉన్నాయి కదా! అంతా నీ సంకల్పం వల్లనే ఇదంతా జరిగింది. కాని ఇది ఎలా జరిగిందో నీవు చెబితే గాని మాకు తెలియదు. అందుకే ఇదంతా చూచి ఆశ్చర్య పోయాము.” అని అన్నారు.

అప్పుడు శ్రీకృష్ణుడు వారితో ఇలా అన్నాడు. “మహా మునులారా! మీరు ప్రసన్నంగా ఉండటమే ఈ సృష్టికి ఆధారము. కాబట్టి మీకు ఆ అగ్ని గురించి చెబుతాను. వినండి. ఆ రోజుల్లో ఒక రాక్షసుడు ఉండేవాడు. వాడు అస్త్రవిద్యాప్రవీణుడు. అస్త్ర విద్య నా వద్దనే నేర్చుకున్నాడు. అందువలన నేను వాడిని చంపడానికి ఇష్టపడలేదు. ఈ సంగతి తెలిసి వాడు గర్వించి మూడు లోకములలో ఉన్న వారిని బాధపెట్టడం సాగించాడు. నాకు విసుగు పుట్టింది. వాడిని చంపడానికి నాకు కొడుకు పుట్టాలి. అందుకని ఇక్కడకు వచ్చి ఘోరమైన తపస్సు చేసాను. ఆ తపస్సు వల్ల పుట్టిన అగ్ని నా ముఖం నుండి బయటకు వచ్చింది. అది బ్రహ్మలోకానికి వెళ్లింది. అప్పుడు బ్రహ్మగారు మన్మథుడిని నాకు కొడుకుగా ప్రసాదించాడు. నా ముఖం నుండి పుట్టిన అగ్ని పోతూ పోతూ ఈ అడవిని కాల్చివేసింది. నేను నా చల్లని చూపులతో ఆ అడవిని మరలా పునరుజ్జీవింపచేసాను. అదీ మీరు చూసింది.” అని అన్నాడు కృష్ణుడు.

ఇంకా వారిని చూచి ఇలా అన్నాడు. “మునిసత్తములారా! మీ సందర్శన భాగ్యం కలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మీరుకూడా ఒక పుణ్య కథ నాకు వినిపించండి.” అని అడిగాడు కృష్ణుడు.

దానికి ఆ మునులు ఇలా అన్నారు. "మహాత్మా! మీరు ముల్లోకాలకు పెద్దలు. మీకు తెలియనిది ఏమున్నది. నీకు తెలియని కథ ఈ మూడు యుగములలో ఏమి ఉన్నది." అని అన్నారు.

దానికి కృష్ణుడు నవ్వి "ఓ మహామునులారా! ప్రస్తుతము నేను మానవ గర్భ సంజాతుడను. కేవలం మానవ మాత్రుడను. నా బుద్ధి కూడా అదే స్థితి లో ఉన్నది. మీరు ఆ విషయం మర్చిపోకూడదు. ఈ పరిస్తితులలో మీరు నాకు చెప్పే కథ నాకు తెలియనిదే అవుతుంది కానీ తెలిసినది కాదు కదా!" అని అన్నాడు.

" శ్రీ కృష్ణా! నీకు ఏదైనా చెప్పడానికి నారదుడే సమర్ధుడు. కాబట్టి నారదుడే ఒక కథ చెబుతాడు." అని వారు నారదుని చూచి "నారదమునీంద్రా! నీవు ఇంతకు ముందు చూచినది విన్నది అయిన వృత్తాంతమును శ్రీ కృష్ణునికి చెప్పుము." అని కోరారు.

నారదుడు కూడా పర మసంతోషంతో శ్రీకృష్ణునికి, తక్కిన మునులకూ భక్తితో నమస్కరించి, వారికి ఉమామహేశ్వర సంవాదమును వివరించాడు.

"నేను ఒక సారి తీర్థసేవనము చేస్తున్నాను. అలా తిరుగుతూ తిరుగుతూ హిమవత్ప ర్వతమునకు వచ్చాను. అక్కడ ఒక అందమైన ఉద్యానవనమును చూచాను. ఆ ఉద్యానవనములో పరమేశ్వరుడు ప్రమథగణములు, దేవతలు, సిద్దులు,సాధ్యులు, విద్యాధరులు, మునులు,భూతగణములు మొదలగువారితో కొలువుదీరి ఉన్నాడు. నేను కూడా అక్కడికి పోయి పరమేశ్వరుడికి నమస్కరించి వారితో పాటు అక్కడ కూర్చున్నాను.

ఆ సమయంలో పార్వతీదేవి అక్కడకు వచ్చింది. వెనుక నుండి పరిహాసంగా పరమశివుని కనులను తన చేతులతో మూసింది. ఆ హటాత్పరిణామానికి జగమంతా చీకటి అయిపోయింది. సూర్యుడు, చంద్రుడు కళ తప్పారు. లోకములన్నీ గాడాంధకారంలో మునిగిపోయాయి. ప్రాణకోటి అంతా సంక్షోభం చెందింది. ఆ సమయంలో పరమేశ్వరుడు తన మూడవ కంటిని తెరిచాడు. పరమేశ్వరుని మూడవ కంటినుండి అగ్నిజ్వాలలు చెలరేగి హిమవత్పర్వతమును దహించసాగాయి.

హిమవంతుడు పార్వతీ దేవి తండ్రి. అందుకని తండ్రికి కలిగిన ప్రమాదానికి పార్వతి తల్లడిల్లిపోయింది. వెంటనే పరమశివుని పాదాలమీద పడి నమస్కరించింది. శివుడు ప్రసన్నుడయ్యాడు. మూడవ కన్ను మూసాడు. హిమవత్పర్వతము మీద చెలరేగిన మంటలు చల్లారాయి. అప్పుడు పార్వతి శివునితో ఇలా అంది.

"పరమేశ్వరా! ఈ సమయంలో నీవు నీ నొసటి కన్ను తెరవడానికి కారణమేమి? ఇది రహస్యం కాకపోతే నాకు చెప్పండి." అని అడిగింది. అప్పుడు పరమేశ్వరుడు ఇలా అన్నాడు.

"పార్వతీ! నీకు చెప్పకూడని రహస్యములు ఏముంటాయి? నేను లోకపాలకుడను. నాకు ఏది జరిగితే లోకములకంతకూ అదే జరుగుతుంది. నీవు నా కళ్లు మూసి నప్పుడు నాకు ఏమీ కనపడలేదు. చీకటిగా ఉండింది. అందుకే లోకములు అన్నింటిలో గాడాంధకారము అలముకుంది. దానితో భూతకోటి అంత భయభ్రాంతమయింది. నీ చేతులు తియ్యకుండా ఈ చీకట్లు పారదోలడానికి నేను నా మూడవ కన్ను తెరవవలసి వచ్చింది." అని అన్నాడు పరమశివుడు.

వెంటనే పార్వతి ఇదే అదను అని "ఓ పరమేశ్వరా! నీకు నాలుగు ముఖాలు ఎందుకు ఉన్నాయి.చెప్పండి." అని అడిగింది.

"పార్వతీ! సుందోపసుందులు అని ఇద్దరు రాక్షసులు ఉన్నారు. వారు అపార భుజబలశౌర్య సంపద కలవారు. వారు ఏ అస్త్రముతో గానీ, శస్త్రముతోగానీ చావకుండా వరము పొందారు. ఆ రాక్షసులను చంపడానికి మయుడు లోకములో ఉన్న అంద చందములను, లావణ్యమును, పోగు చేసి ఒక అందాల రాసి తిలోత్తమ అనుదానిని సృష్టించాడు. ఆమెను నా వద్దకు తీసుకొని వచ్చాడు. తితోత్తమ రాగానే ఆమె నా చుట్టు తిరిగి ప్రదక్షిణ చేసింది. దేవకార్య నిమిత్తము సృష్టింప బడిన ఆమెను నా చుట్టు తిరుగు తున్నపుడు నాలుగు వైపుల నుండి చూచాను. అందుకని నాకు నాలుగు ముఖములు ఏర్పడ్డాయి." అని అన్నాడు.

వెంటనే పార్వతి "పరమేశ్వరా! నీకు కంఠంలో నలుపు ఎలా కలిగింది?" అని మరో ప్రశ్న అడిగింది.

పరమ శివుడు పార్వతితో ఇలా అన్నాడు. "పార్వతీ! పూర్వము దేవతలు రాక్షసులు అమృతం కోసం పాలసముద్రాన్ని మధించారు. అందులో నుండి మొదట హాలాహలము పుట్టింది. దానిని నేను తీసుకొని నా కంఠంలో నిలుపుకున్నాను. అందుకని నా కంఠం నల్లగా ఉంది." అని చెప్పాడు.

పార్వతి అంతటితో ఊరుకోలేదు. "మహాదేవా! నీకు అన్ని ఆయుధములలో కెల్లా పినాకము అంటే ఇష్టం కదా. ఎందువలన?" అని అడిగింది.

"పార్వతీ! కృతయుగంలో కణ్వుడు అనే ముని తపస్సు చేస్తున్నాడు. అతని మీద పుట్టలు పెరిగాయి. ఆ పుట్టమీద ఒక వెదురు గడ పెరిగింది. ఆ వెదురు గడ లోకంలో లేని విధంగా అధికమైన పొడవు గా లావుగా పెరిగింది. ఆ సమయంలో బ్రహ్మ దేవుడు ప్రత్యక్షమై కణ్వునికి వరాలు ప్రసాదించాడు. అతని మీద పెరిగిన వెదురుతో బ్రహ్మ విష్ణువుకు శార్ఙ్గమును, నాకు పినాకమును తయారు చేసాడు. మిగిలిన ముక్కతో గాండీవమును తయారుచేసాడు. పినాకము నాకూ, శారఙ్గము విష్ణువుకు ఇచ్చి గాండీవము తాను తీసుకొని వెళ్లాడు. బ్రహ్మదేవుడు ప్రసాదించినది కావున నాకు పినాకము అంటే ఎంతో ఇష్టం." అని అన్నాడు.

వెంటనే పార్వతి "మహేశ్వరా! ఎన్నో జంతువులు ఉండగా నీవు ఎద్దునే ఎందుకు వాహనముగా ఎన్నుకొన్నారు?" అని అడిగింది.

"పార్వతీ! పూర్వము నేను హిమాలయముల మీద తపస్సు చేసుకొను చుండగా, నా చుట్టు ఆవులు మేస్తూ నాకు తపోభంగము కలిగించాయి. అప్పుడు నేను వాటి వంక కోపంగా చూచాను. అవి బాధ పడ్డాయి. బ్రహ్మదేవుడు వచ్చి సర్దిచెప్పాడు. నాకు ఒక ఎద్దును కానుకగా ఇచ్చాడు. అప్పటి నుండి నాకు ఎద్దు వాహనము అయింది." అని అన్నాడు పరమేశ్వరుడు.

పార్వతికి ఇంకా సందేహాలు తీరలేదు. "నాథా! మీకు ఎన్నో భవనములు, నివాస స్థలములు ఉండగా ఏ మాత్రం శుభ్రత లేకుండా, వెంట్రుకలు, ఎముకలు, కపాలములతో నిండి, ఎల్లప్పుడూ దుర్గంధమును వెద జల్లుతూ ఉండే శ్మశానంలో నివాసము ఎందుకు ఏర్పరచుకున్నారు. తెలియచెయ్యండి." అని అడిగింది.

"పార్వతీ! క్రూరమైన భూతములు జనాన్ని నాశనం చేస్తున్నాయి. ఆ భూతముల ధాటికి ప్రాణి కోటి అంతా నాశనమయింది. ఈ విషయం తెలుసుకొన్న బ్రహ్మ నా వద్దకు వచ్చాడు. దీనికి ఏదైనా ప్రతీకారము చేయమని నన్ను వేడాడు. నేను కూడా ఆ భూతముల నుండి లోకములను కాపాడవలెనని నిశ్చయించుకున్నాను. ఆ భూతములు ఉన్నచోటనే ఉండి వాటిని నాశనం చెయ్యాలని అనుకున్నాను. పైగా మోక్షము కొరకు ప్రయత్నము చేయు రుషులు శ్మశానము అంటే ఇష్టపడతారు. అందుకని లోక రక్షణార్థము నేను శ్మశానమును నా నివాసస్థలముగా చేసుకున్నాను." అని చెప్పాడు పరమేశ్వరుడు.

"అది సరే శ్మశానంలో ఉన్నారు బాగుంది. కాని ఒంటి నిండా బూడిద పూసుకోవడం, త్రిశూలం ధరించడం, ఎముకలను, పాములను ఆభరణాలుగా ధరించడం, భయంకర రూపంతో ఉండటం ఇవన్నీ ఎందుకు?" అని అడిగింది పార్వతి.

" ఓ పార్వతీ! ఈ లోక స్వరూపము రెండు విధములుగా ఉంటుంది కదా! శీతలము, ఉష్ణము. ఈ రెండింటిలోనే సకలము ఇమిడి ఉంది. ఈ జగత్తు అంతా సౌమ్యము, ఆగ్నేయము(ఉగ్రము) అనే రెండు యోగముల సమ్మేళనము. అందులో సౌమ్యతను విష్ణువు భరించాడు. ఉగ్రతను నేను భరించాను. ఈ విశ్వమంతా ఈ రెండు గుణముల కలయికే కదా! అందుకనే నేను ఎల్లప్పుడూ ఉగ్రస్వరూపంతోనే భయంకరంగా ఉంటాను. ఇంకా ఏమన్నా సందేహాలు ఉన్నాయా?" అని అడిగాడు శివుడు.

పార్వతికి ఇంక అడగడానికి ఏమీ లేవు. అందుకని " నాథా! వర్ణాశ్రమధర్మముల గురించి వివరించండి. నాతోపాటు మానవులందరూ విని తరిస్తారు." అని అడిగింది పార్వతి. అని నారదుడు శ్రీ కృష్ణునికి పార్వతీ

పరమశివుల సంవాదమును వివరించాడు అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు. (పైన చెప్పిన విషయములు అన్నీ మనకు ఇదివరకు వచ్చినవే. కాని వాటిని అందరూ చదివారో లేదో అని మనకు మారుగా పార్వతీదేవి రూపంలో ప్రశ్నలు అడిగించి సమాధానరూపంలో మనకు అన్ని విషయములను క్లుప్తంగా చెప్పాడు తిక్కనగారు.)

మహాభారతము

ఆనుశాసనిక పర్వము

చతుర్థాశ్వాసము సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

:

# మహా భారతము

## ఆనుశాసనిక పర్వము

### పంచమాశ్వాసము

సర్పయాగ సందర్భంలో వైశంపాయనుడు జనమేజయునకు వినిపించిన మహా భారత కధను సూతుడు శౌనకాది మహామునులకు నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో వినిపించాడు.

పార్వతీ దేవి మహాశివుని వర్ణాశ్రమ ధర్మముల గురించి తెలుపమని అడుగగా మహాశివుడు పార్వతీ దేవితో ఇలా చెప్పసాగాడు.

"ఓ పార్వతీ! పూర్వము బ్రహ్మదేవుడు లోక హితము కొరకు నాలుగు వర్ణములను సృష్టించాడు అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు. బ్రహ్మ ముఖము నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు జన్మించారు. అందుకని ఆ జాతులలో తర తమ బేధాలు కలిగాయి. వారు చేసే పనులలో కూడా తారతమ్యాలు ఏర్పడ్డాయి.

విప్రులు లోకమునకు ఆధారము. వారిని పరాభవిస్తే చేటుకలుగుతుంది. వారిని సన్మానించి వారికి దానధర్మములు చేస్తే మేలు కలుగుతుంది. బ్రాహ్మణుడు పేదవాడైనా, ధనవంతుడైనా, విద్యావంతుడైనా, విద్యలేని వాడైనా,

అతనిని నిందించరాదు. బాధించరాదు. అలా చేస్తే వారికి ఈ లోకంలోనే కాదే పరలోకంలో కూడా సుఖసంతోషాలు కలుగవు. బ్రాహ్మణుని దూషించడం దైవదూషణతో సమానము. బ్రాహ్మణుని సొమ్ము అన్యాయం దోచుకోవడం దేవుడి సొత్తును దోచుకున్న దానితో సమానము.

ఇంక విప్రుల ధర్మములు ఏవంటే--వేదాధ్యయనము, యజ్ఞములు చేయడం, ఇతరులతో యజ్ఞములు చేయించడం, దానములు చెయ్యడం, తాను నేర్చిన విద్యలు ఇతరులకు బోధించడం, ఇతరుల నుండి దానములు స్వీకరించడం, మనసులో కానీ వాక్కులో కానీ కోపము లేకుండా ప్రశాంతంగా ఉండటం, తపస్సుచేయడం, ఎల్లప్పుడూ సత్యమునే పలకడం, శుచిగా ఉండటం. అవి విప్రుని ధర్మములు.

ఇంకా ఆపద సమయములలో తప్ప విప్రుడు వర్తక వాణిజ్యములు చేపట్టరాదు. బ్రాహ్మణుడు ప్రతిరోజూ అగ్ని కార్యము చెయ్యాలి. శూద్రులు ఇచ్చిన ఆహార పదార్థములు తీసుకోకూడదు. పరకాంతల వంక చూడకూడదు. తన నిజభార్యతోనే తృప్తిపడాలి. రోజుకు రెండుపూటలు మాత్రమే భోజనము చెయ్యాలి. హింసా ప్రవృతి పనికిరాదు. ఇంటిని పరిసరములను శుభ్రంగా ఉంచుకోవాలి. అతిథులకు అన్నంపెట్టాలి. తపస్సుచేసుకోవాలి. ఇలాంటి ధర్మకార్యముల కొరకు, ధర్మమును పరిరక్షించుటకొరకు మాత్రమే బ్రహ్మ బ్రాహ్మణులను సృష్టిచేసాడు.

ఇంక క్షత్రియులకు బ్రాహ్మణులను రక్షించడం పరమ ధర్మము. వారితో పాటు భూమి మీద ఉన్న ప్రాణులను అన్ని రక్షించాలి. క్షత్రియుల వల్లనే ఈ భూమి వృద్ధిచెందుతుంది. క్షత్రియుల పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారు.

ఇంకా క్షత్రియులు వేదాధ్యయనము చెయ్యాలి. యజ్ఞములు చెయ్యాలి. దానధర్మములు చెయ్యాలి. సాధువులను పోషించాలి, రక్షించాలి. దుష్టులను శిక్షించాలి. ఎల్లప్పుడూ ఉత్సాహంగా ధైర్యంగా ఉండాలి. ఇంకా క్షత్రియులు అస్త్ర శస్త్ర విద్యలలో నిపుణత్వం సాధించాలి. ప్రజలకు వచ్చిన ఆదాయంలో ప్రజా పాలన నిమిత్తం, ఆరవ వంతు మాత్రమే పన్నుగా స్వీకరించాలి. తన వద్ద పనిచేసే వారిని దయతో చూడాలి. ప్రజల తగవులు తీర్చేటప్పుడు నిష్పక్ష పాతంగా ఉండాలి. ఇవీ రాజులకు విధించబడిన ధర్మములు.

ఇంక వైశ్యులకు విధించబడిన ధర్మములు వివరిస్తాను. వైశ్యులు ఎల్లప్పుడూ లోకానికి మేలుచెయ్యాలి. అందరికీ ఉపకారము చెయ్యాలి. ఎక్కువ శ్రమ చెయ్యాలి. వ్యాపారము, పశుపోషణము చెయ్యాలి. వైశ్యులకు కూడా వేదాధ్యయనము, యజ్ఞములు చెయ్యడం, దానములు చెయ్యడం అర్హమైన పనులు. వైశ్యులు కూడా ఉపనయన సంస్కారము వలన ద్విజులు అవుతారు. కాబట్టి వారికి కూడా అతిధులను ఆదరించడం విద్యుక్తధర్మము. కాని వైశ్యులు నువ్వులు,గంధము,రసములతో కూడిన పదార్థములతో వ్యాపారము చెయ్యకూడదు.

ఇంక శూద్రులకు పైమూడు జాతులకు విధేయులై ఉండి వారికి సేవ చెయ్యడం, వారి వారి పనులలో సాయం చెయ్యడం, సౌమ్యంగా, విధేయులుగా ఉండటం వారికి విధించబడిన ధర్మము.

ఓ పార్వతీ! ఇంక ఆశ్రమ ధర్మముల గురించి చెబుతాను విను. మొదటి , ఆశ్రమము బ్రహ్మచర్యము. ఈ ఆ శ్రమములో పరమ నిష్టతో ఉండాలి. గురువును ఆశ్రయించి విద్యనేర్చుకోవాలి. వేదాధ్యయనము చెయ్యాలి. ప్రతి రోజూ అగ్నికార్యము చెయ్యాలి. గురువు గారి కోసరం, తన కోసరం బిక్ష

తీసుకురావాలి.

తరువాత అనుసరించవలసినది గృహస్థాశ్రమధర్మము. ఇది మిగిలిన ఆశ్రమ ధర్మములకు పునాది. గృహస్థాశ్రమములో శుచి,శుభ్రత, నిజభార్యను సంతోషపెట్టడం, పంచయజ్ఞములు అనగా దేవయజ్ఞము, పితృయజ్ఞము, భూతయజ్ఞము, బ్రహ్మయజ్ఞము, మనుష్యయజ్ఞము నిష్ఠతో చెయ్యడం, వేదాధ్యయనములో ఆసక్తి కలిగి ఉండటం, ఇంకా దాన,ధర్మాలు చెయ్యడం, హోమాలు చెయ్యడం, గృహస్థుకు విధించబడిన ధర్మములు.

దీని తరువాతది వనవాసము (వానప్రస్థము). ఈ ఆశ్రమములో బ్రహ్మచర్యము పాటించడం, శాకాహార భోజనము, నారచీరలు ధరించడం, కోరికలు లేకుండా ఉండటం ఈ ఆశ్రమమునకు విధించబడిన ధర్మములు.

తరువాతది ఆఖరుది సన్యాసము. సన్యాసి అయిన వాడికి కోపం పనికి రాదు. ఇంద్రియములను అదుపులో పెట్టుకోవాలి. తనకంటూ తాను ఏమీ ఉంచుకోకూడదు. ఓర్పుతో ఉండాలి. అడవులలో ఉన్న మునులతో కూడి సత్సంగములలో పాల్గొనాలి. మనసును ఎల్లప్పుడూ ప్రశాంతంగా ఉంచుకోవాలి. మంచి ప్రవర్తన కలిగి ఉండాలి. ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలి. సత్యవ్రతము, అహింసా వ్రతము ఆచరించాలి. భిక్షాటనతోనే భోజనము చెయ్యాలి. నేలమీద పడుకోవాలి. సాటి మానవుల ఎడల, ప్రాణుల ఎడల కరుణ,దయతో మెలగాలి. ఎల్లప్పుడు ఆత్మవిచారము, తత్త్వ చింతనచెయ్యాలి. ఇవీ సన్యాసి అనుసరించవలసిన ధర్మములు.” అని పరమశివుడు పార్వతికి వర్ణాశ్రమధర్మముల గురించి వివరించాడు.

“ ఓ పరమశివా! మునులు ఋషులు తపస్సు చేస్తారు కదా! దాని

గురించి చెప్పండి.” అని అడిగింది పార్వతి.

“ ఓపార్వతీ! చాలా మంది ఏవేవో కోరికలు తీరాలని తపస్సు చేస్తూ ఉంటారు. కాని తపస్సు అంటే వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు చేసే ఒక ధర్మము. తపస్సు చేసే ముందు ఇంద్రియ నిగ్రహము పాటించాలి. ఉదయము సాయంత్రము యోగాభ్యాసం చెయ్యాలి. అలా కాకుండా ఏవేవో కోరికలతో తపస్సు చేస్తే మరణానంతరము స్వర్గలోక సుఖములు అనుభవిస్తారు. ఆ తపఃఫలము పూర్తి కాగానే మరలా మానవులుగా పుడతారు. కాని తిరిగి రాని లోకాలకు వెళ్లలేరు. ఇంకా కొంతమంది ఆహారం తీసుకోకుండా, కఠోరమైన నియమ నిష్టలతో, పంచాగ్నుల మధ్య నిలబడి, ఘోరంగా తపస్సు చేస్తారు. అలాంటి వారు కూడా కేవలం అప్సరకాంతలతో సంభోగము మొదలగు వాటితో తృప్తిపడతారు. వారు కూడా ఆ తపోఫలము నశించగానే తిరిగి భూలోకములో పుడతారు.

అలాకాకుండా ఎలాంటి కోరికలు లేకుండా తపస్సు చేసేవారు, ముందు అహింసా వ్రతమును ఆచరిస్తారు. మనసా వాచా కర్మణా ఎవరికీ అపకారము హానీ చెయ్యరు. సాటి ప్రాణుల ఎడల దయ, కరుణ కలిగి ఉంటారు. అందరి జీవులలో ఉండే ఆత్మ ఒకటే అని భావిస్తారు. అలాంటి వారు కూడా మరణానం తరము భార్యాబిడ్డలతో స్వర్గ సుఖములు అనుభవిస్తారు. ఆ పుణ్యఫలము తీరిపోగానే మరలా భూలోకములో జన్మిస్తారు. ~~ఈ~~ రీతిగా తపస్సు చేసేవారు అందరూ స్వర్గలోకంతోనే తృప్తిపడుతుంటారు.” అని పరమశివుడు పార్వతీ దేవికి వివరించాడు.

“నాథా! వనవాస విశేషములు దాని ఫలితములు వివరించండి.” అని అడిగింది.

"పార్వతీ! ఉపవాస వ్రతము అనగా, ఆహారము తీసుకొనకుండా ఉండటం, నేలమీద పడుకోవడం, మౌనంగా ఉండటం, యోగాసనములు వేయడం, నియమిత వేళలలోనే ఆహారం స్వీకరించడం, అనే నియమాలు పాటించాలి. అలా చేస్తే వారు చంద్రలోకము, వాయు లోకము, యక్షలోకము, గంధర్వలోకము,నాగలోకము మొదలగు లోకములకు వెళతారు. అక్కడ కొంతకాలము నివసిస్తారు. ఈ వ్రతాలన్నీ వానప్రస్థములో చేస్తే పుణ్య లోకములు ప్రాప్తిస్తాయి." అని చెప్పాడు శివుడు.

"నాథా! విరాగులు ఇల్లిల్లు తిరిగి బిక్షను స్వీకరించి ఉదరపోషణము చేసుకుంటూ ఉంటారు కదా! వారి గురించి తెలపండి." అని అడిగిందిపార్వతి.

" ఓ పార్వతీ! అలాంటి వారు ఎక్కువగా ఉపవాసములు చేస్తారు. ఉన్నచోట ఉండరు. ఊరూరూ తిరుగుతూ ఉంటారు. పుణ్య తీర్థములు సేవిస్తూ ఉంటారు. పుణ్యనదులలో స్నానములు చేస్తూ ఉంటారు. తలంతా జడలు కట్టి ఉంటాయి. భిక్షాటనతో జీవిస్తారు. వారి శరీరం కృశించి పోతూ ఉంటుంది. నెలలో ఎక్కువ రోజులు ఉపవాసంతో గడుపుతారు. తృణ ధాన్యములను వండుకొని తింటారు. మరణించిన తరువాత వారు కూడా దేవతలతో సమానమైనసుఖాలు అనుభవిస్తారు." అని పరమేశ్వరుడు పార్వతికి చెప్పాడు.

"నాథా! వైఖానసుల గురించి వివరించండి." అని అడిగింది.

"ఓ పార్వతీ! వైఖానసులు కఠోర నియమ నిష్టలు కలవారు. వారు తృణ ధాన్యములు సేకరించి వాటిని దంచి తింటారు. పండ్లు కొరికి తింటారు. మరి కొందరు పక్షుల మాదిరి, దొరికిన గింజలు దొరికినట్టు కొరికి కొరికి తింటారు.

కొందరు ఆకులు తింటారు. కొందరు నీటిని మాత్రము తాగి బతుకుతారు. మరికొందరు కొందరు గాలిని మాత్రం పీల్చి బతుకుతారు. మరి కొందరు సుష్టుగా భోజనం చేస్తారు. వీరందరూ ఇంద్రునికి ఇష్టమైన వారు. వారు స్వర్గలోక సుఖములు చాలా కాలం అనుభవిస్తారు.  ఇవన్నీ వానప్రస్థములో చేయదగిన కార్యములు. ఇవన్నీ తపస్సు కిందికే వస్తాయి.

వీళ్లు గాక, అంగుష్ట ప్రమాణంలో దేహం కలవారు ఉన్నారు. వారి పేరు వాలఖిల్యులు. వారు సూర్యకిరణములను ఆహారంగా స్వీకరించి జీవిస్తారు. వారి వలననే ఈ లోకములు నిల్చి ఉన్నాయి.  ఇతరత్రా సాధించలేని కార్యములు తపస్సుతో సాధింపబడతాయి. తపస్సు అంత గొప్పది.

(దీని అర్థం. ముక్కుమూసుకొని కూర్చుంటే అన్ని కార్యములు సాధించగలము అని కాదు. ఏ కార్యమైనా దీక్షతో, క్రమశిక్షణతో, ధర్మబద్ధంగా, న్యాయబద్ధంగా, ఏకాగ్రతతో చేస్తే సాధించవచ్చును అని అర్థం. అదే తపస్సు)..

ఓ పార్వతీ! నీకు ధర్మముల గురించి వివరిస్తాను. ధర్మములలో కెల్లా గృహస్థ ధర్మము గొప్పది.  అది అందరికీ యోగ్యమైనది. కాని మిక్కిలి సూక్ష్మమైనది. గృహస్థ ధర్మంలో అతి పనికి రాదు. ఏదైనా సమతుల్యంగా ఉండాలి. ఏ కాలంలో చేయతగిన పనులు ఆయా కాలాలలో చెయ్యాలి. మనసును నిశ్చలంగా ఉంచుకోవాలి. ధర్మ బద్ధంగానే ధనము సంపాదించాలి. ధర్మబద్ధంగానే కామభోగాలు అనుభవించాలి. అదే గృహస్థ ధర్మము.

ఇంక నివృత్తి ధర్మము గురించి చెబుతాను విను. నివృత్తిధర్మము మోక్షమునకు మార్గము.  ఇంద్రియ నిగ్రహము, భూత దయ, సత్యమునే పలకడం, కోరికలను విడిచిపెట్టడం, మనస్సును నిలకడగా ఉంచుకోడం ఇవీ

నివృత్తి ధర్మమార్గములు. ఇంకా ఆకలి దప్పులతో వచ్చిన అతిధికి అతనికి దాహమునకు నీళ్ల ఇచ్చి ఆకలి తీరేట్టు భోజనం పెట్టడం ధర్మములలో కెల్లా ఉత్తమోత్తమైన ధర్మము. ఈ అతిధి సత్కారము ఒక్క గృహస్థాశ్రమములోనే వీలు కలుగుతుంది. మిగిలిన ఆశ్రమములలో అతిధిసత్కారములకు వీలు లేదు. అందుకని అన్ని ధర్మములలో కెల్లా గృహస్థ ధర్మము గొప్పది." అని అన్నాడు మహేశ్వరుడు.

"నాధా! గృహస్థు చేయవలసిన ముఖ్యమైన పనులేవి?" అని అడిగిందిపార్వతి.

"దేవీ! గృహస్థాశ్రమములో సతికి పతి సేవ ముఖ్యమైనది. పతిభక్తి ముఖ్యధర్మము." అని అన్నాడు మహేశ్వరుడు.

"నాధా! మానవునికి తల్లి తండ్రులు చనిపోతే, లేక భార్యకు భర్త చనిపోతే, వారు చేయవలసిన పనులేవి." అని అడిగింది పార్వతి.

"ఓ పార్వతీ! తల్లి తండ్రులు చనిపోయిన గృహస్థు ఏమరకుండా అతిధి సత్కారములు, పితృతర్పణములు, దేవతారాధన చెయ్యాలి. భర్తను కోల్పోయిన భార్యలు బ్రహ్మచర్యమును ఆచరించాలి. ఇంక గృహస్థు తన భార్యతో అష్టమి, చతుర్ధశి, పున్నమి, అమావాస్య రోజులలో సంగమించరాదు. తన ఇంటిలోని ధాన్యమును పక్షులు, ఎలుకలు తినివేస్తే, వాటిని హింసించకుండా, వాటికీ ఆకలి తీరి పోయింది అని అనుకోవాలి. ఇంక యతీశ్వరులు ఎక్కడ ఉన్నా, ఏమి చేస్తున్నా, చేసే పనులలో మాట్లాడే మాటల్లో ఆసక్తి లేకుండా నిస్సంగంగా ఉన్నవాడు ముక్తి పొందుతాడు." అని పలికాడు పరమేశ్వరుడు.

“ ఓ మహేశ్వరా! రాజులకు కూడా సామాన్యమానవుల వలె శరీరము, వాటి అవసరాలు, ఆకలి దప్పులు, స్నానము భోజనము మొదలగు పనులు జరుగుతాయి కదా! కాని రాజు ఎందులో అధికుడు. అందరూ అతనికి ఎందుకు నమస్కారాలు పెట్టాలి. రాజు యొక్క ఆగ్రహానికి అనుగ్రహానికి లోబడి ఎందుకు ఉండాలి? రాజులు సర్వాధికారులుగా ఎందుకు శోభిల్లు తున్నారు. దానికి కారణమేమి?” అని అడిగింది.

“ ఓ పార్వతీ! రాచరికము అనేది పూర్వజన్మలో చేసిన అధికమైన తపస్సు ఫలితంగా లభిస్తుంది. ఆ కారణం చేత రాజు అందరి చేత గౌరవాభి మానములు పొందుతాడు. అతడు తప్పుచేసిన వారిని శిక్షించడానికీ, మంచివారిని రక్షించడానికి అధికారము కలిగి ఉంటాడు. కాని రాజు నీతి మంతుడయి ఉండాలి. అతని నీతి అతనిని కాపాడుతూ ఉంటుంది. రాజు నీతి మంతుడయితే ప్రజలు కూడా నీతిగా ఉంటారు. రాజు ఇంద్రియములను జయించాలి. అప్పుడే తన శత్రువులను కూడా జయించగలడు.

రాజు యోగ్యులైన వారిని నీతి మంతులను తన వద్ద మంత్రులుగా నియమించు కోవాలి. తన వద్ద పనిచేసే సైని కుల పట్ల దయ కలిగి ఉండాలి అప్పుడే సైన్యము కూడా అతనికి విధేయులుగా ఉంటుంది. రాజు ఎల్లప్పుడూ తనకు మేలు చేసే వారినే మిత్రులుగా దగ్గర చేర్చుకోవాలి. రాజు అనుసరించే నీతి, నిజాయితీ అతనికి ధనమును సంపాదించి పెడుతుంది. అతని కోటను రక్షిస్తుంది. అతని ప్రజలను రక్షిస్తుంది.

ఇంకా రాజు అయిన వాడు అనవసర ఖర్చులుపెట్టకూడదు. అవసరమైన ఖర్చులు పెట్టడానికి వెనుకాడకూడదు. రాజు తన స్వీయ రక్షణలో ఏమరుపాటు ఉండరాదు. రాజు ఎప్పుడూ పుణ్య కార్యములు చెయ్యాలి. పాప కార్యముల

జోలికి పోరాదు. న్యాయ విచారణ చేసి శిక్షలు విధించేటప్పుడు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఒకరి మీద ప్రేమ, మరొకరి మీద కోపంగా ప్రవర్తించరాదు.తన గురించి తన పాలన గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో వేగుల వారి ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తదనుగుణంగారాజ్యపాలన సాగించాలి. రాజు ఎల్లప్పుడూ సత్యమునే పలకాలి. రాజైన వాడు ప్రియంగా మాట్లాడాలి. పరుషంగా మాట్లాడకూడదు. విద్యాధికుడు అయి ఉండాలి. మిత్రుల ఎడల శత్రువుల ఎడల ఉపాయంగా వ్యవహరించాలి. దీనుల పట్ల, పేదవారి పట్ల దయతో వ్యవహరించాలి. సేవకులతో ఉపాయంగా పనులు చేయించుకోవాలి. ఇవీ రాజు ఆచరించవలసిన ధర్మములు.

రాజు ఎవరితోనూ అనవసరంగా కయ్యము పెట్టుకొనకూడదు. కాని అవసరం వచ్చినప్పుడు మాత్రం తన శూరత్వము ప్రదర్శించాలి. రాజు యజ్ఞములు యాగములు చేసి దానధర్మములు చెయ్యాలి. ఇంకా రాజు అన్యాయం చేస్తే నరకానికి పోతాడు. రాజు చేసిన పాపములు అతనిని ఎప్పటికీ వదలవు. జన్మజన్మలకూ వెన్నాడుతూనే ఉంటాయి. ఏ రాజైతే పైన చెప్పిన రాజధర్మములు అనుసరిస్తూ రాజ్యపాలన చేస్తాడో అతడు పుణ్యలోకములకు వెళతాడు." అని పరమేశ్వరుడు పార్వతికి రాజధర్మముల గురించి వివరించాడు.

పార్వతి మరలా ఇలా అడిగింది. "నాథా! ధర్మములలో కెల్లా పరమమైన ధర్మము ఏది?" అని అడిగింది.

"అహింస అన్ని ధర్మములలో కెల్లా ఉత్తమమైన ధర్మము." అని అన్నాడు మహేశ్వరుడు.

"నాథా! హింస చెయ్యకుండా జీవించడం మానవులకు సాధ్యం కాదు

కదా? మరి అహింసను ఎలా అనుసరిస్తాడు. వివరించండి.”  అని అడిగింది.

“పార్వతీ! నీవు అన్నది నిజమే. నేల మీద పాకే చీమలు, కంటికి కనిపించని సూక్ష్మజీవులు, దోమలు, నల్లులు, క్రిమి కీటకములను చంపకుండా మనిషి బతకలేడు. కాని ఆహారము కొరకు జీవహింస చెయ్యడం పాపము. ఫలములు, కాయలు, ఆకులు తిని బతక వచ్చును కదా!పాలు తాగ వచ్చును కదా! ఇంద్రియ నిగ్రహంతో జీవించిన వారు మహాత్ములు అవుతారు. కాబట్టి అహింసను పాటించడం కష్టం కాదు.

కాని అహింస అనేది వేరు విధంగా కూడా చెప్పవచ్చును. చావు పుట్టుకలు ప్రాణుల ధర్మము. దానిని ఎవరూ తప్పించలేరు.  ఒకడు దీపం పెడతాడు. ఆ దీపం చుట్టు పురుగులు చేరి చనిపోతాయి. ఆ పాపము దీపం పెట్టినవాడికి అంటదు.    రైతు నాగలితో పొలం దున్నుతుంటే ఆ నాగలి చాలులో పడి ఎన్నో జీవాలు చచ్చిపోతుంటాయి. ఆ పాపము పొలం దున్నేవాడికి అంటదు కదా! మానవులు తమ తమ దైనందిన పనులు చేసుకుంటూ  ఉంటే,  ఆయువు తీరిన ప్రాణులు చచ్చిపోతుంటాయి. ఆ పాపములు ఆయా మానవులకు అంటవు. కాని ఆ ప్రాణులను తామే చంపామని బాధపడటం మూర్ఖత్వమే అవుతుంది.

పుణ్యకార్యములకు కానీ, పాప కార్యములకు కానీ బుద్ధి ముఖ్యము. ఏ పని అయినా బుద్ధిపూర్వకంగా చేస్తేనే ఆ ఫలము ఆ పని చేసిన వాడికి సంక్రమి స్తుంది.  ఈ సందర్భంలో నీకు ఒక విషయం చెబుతాను. తమకు చావు మూడిన గోవులు, తమకు తాముగా వెళ్లి రంతి దేవుడు చేసే యజ్ఞములో ఆహుతి అయ్యాయి. ఆ గోవులను చంపినపుడు కారిన రక్తం చర్మణ్వతి అనే నదిగా పారుతూ ఉంది. ఆ నదిలో స్నానం చేస్తే పాపములు నశించి పుణ్యాత్ములు

అవుతారు. ఆ యజ్ఞములో చనిపోయిన గోవులు అన్నీ ఉత్తమలోకములకు వెళ్లాయి. కాబట్టి యజ్ఞములో గోవులను చంపిన పాపము రంతిదేవునికి అంటలేదు.

ఇరుపక్షములకు యుద్ధము జరిగినప్పుడు, ఒకరిని ఒకరు నరుక్కుంటారు. కాని యుద్ధములో చచ్చిన వాళ్లు స్వర్గానికి పోతారు. కాబట్టి వీటిని హింస అని చెప్పడానికి వీలు లేదు. రాజులు వేటకు పోవడం, జంతువులను వేటాడటం రాజధర్మము. క్రూరమృగములు పంటపొలములను నాశనం చేస్తాయి. మానవులను చంపి వారికి హాని చేస్తాయి. రాజు వేటలో ఆ క్రూర మృగములను చంపుతాడు. దాని వలన రాజులకు పాపము అంటదు. రాజు చేతిలో చచ్చిన ఆ మృగములకు పుణ్యలోకములు ప్రాప్తిస్తాయి.

మరొక మాట. రాజైన వాడు దండించతగిన వారిని దండించకుండా విడిచిపెట్టినా, దండించ తగని వారిని దండించినా, తప్పుచేయని వాడికి శిక్ష విధించినా, బ్రాహ్మణులను హింసించినా, రాజు హింస చేసినట్టే. నహుషుడు బ్రాహ్మణులను హింసించి శాపోపహతుడయినాడు. అలాగే దేవేంద్రుడు గౌతమునికి అపకారము చేసి శాపం పొందాడు. కాబట్టి రాజైన వాడు బ్రాహ్మణులకు అపకారం చెయ్యకుండా రాజ్యపాలన చెయ్యాలి. అప్పుడే అతనికి అన్నిశుభములు కలుగుతాయి.

పార్వతీ! యజ్ఞములలో, యాగములలో జంతువులు ఊపస్థంభమునకు కడతారు. వాటిని శాస్త్ర సమ్మతంగా వధిస్తారు. అలా వధింపబడిన మృగములకు పుణ్యలోకములు ప్రాప్తిస్తాయి. యజ్ఞము చేసిన వాడికి పుణ్యం వస్తుంది. కాబట్టి యజ్ఞ యాగములలో జంతువులను చంపడం హింసకాదు." అని అన్నాడు శంకరుడు.

నాథా! లోకములలో జనుల జీవన విధానముల గురించి తెలపండి." అని పార్వతి అడిగింది.

"పార్వతీ! ఈ మానవ లోకము కర్మభూమి. స్వర్గము సుఖములకు ఆలవాలము. భూమి మీద జంతువులుగా పుట్టడం దుఃఖములకు మూలము. మానవులకు జీవనం గడపడానికి ధనము కావాలి. ధర్మంగా జీవించాలన్నా, కోరికలు తీర్చుకోవాలన్నా ధనము కావాలి కదా! విద్య, వర్తకము, సేవావృత్తి, కర్షక వృత్తి ధన సంపాదనకు మూలములు. విద్య కలవాడు నింద పడకుండా బతకాలి. కర్షకుడు నేల యొక్క తత్త్వమును తెలుసుకొని సేద్యం చెయ్యాలి. వర్తకుడు వస్తువుల యొక్క ధరల హెచ్చుతగ్గులు తెలుసుకొని వ్యాపారం చెయ్యాలి. వచ్చిన లాభంలో కొంచెం మాత్రం వ్యయం చేసి మిగిలినది పెట్టుబడికి చేర్చి వ్యాపారము చెయ్యాలి. అప్పుడే లాభాలు వస్తాయి. పశువులను కాచే వాడు, ఆ పశువుల యొక్క పోకడలు తెలుసుకొని ప్రవర్తించాలి. ఆ ప్రకారంగా నేర్పుతో పశువులను కాచే సేవకుడు పేరు, ధనము సంపాదిస్తాడు. యజమానిని మోసం చెయ్యకుండా తనకు అప్పగించిన పనిని సక్రమంగా నిర్వర్తించే సేవకుడు ధనము, కీర్తి పొందుతాడు. పరుల ధనమునూ, పరుల భార్యలనూ కోరకుండా ఉండటం, దైవమును పూజించడం, పితృదేవతలను ఆరాధించడం, ఇతరుల పట్ల కరుణ కలిగి ఉండటం, అతిధులను ఆదరించడం, ప్రతి మానవుడూ ఆచరించవలసిన ధర్మములు." అని చెప్పాడు మహేశ్వరుడు.

పార్వతి మరలా ఇలా అడిగింది. "నాథా! మానవులు నాలుగు వర్ణములుగా విభజింపబడ్డారు కదా. వారికి కర్మలు విధించారు కదా! ఆ కర్మలు ఎలా పరిపక్వమవుతాయి. వివరించండి." అని అడిగింది.

“ఓ పార్వతీ! మానవులను వర్ణములుగా విభజించారు. వారి వారి కి తగిన కర్మలు కూడా విధింప బడ్డాయి. ఆ కర్మలను శ్రద్ధతో చేయువారికి స్వర్గ సుఖములు కలుగుతాయి. ఆ పుణ్యము కరిగిపోగానే మరలా అదే కులములో పుట్టి సుఖాలు అనుభవిస్తారు. అలా కాకుండా తమ తమ వృత్తి ధర్మములను వదిలిపెట్టి ఇతరుల వృత్తులను ఆచరిస్తే, వారు మరలా ఆయా కులములలో జన్మిస్తారు. మానవులు ఎంత పుణ్యం చేస్తే వారు  అంతకంటే ఉత్తమ కులంలో జన్మిస్తారు. ఎక్కువ పుణ్యం చేసుకుంటే బ్రాహ్మణ కులంలో జన్మిస్తారు. తరువాత తిరిగిరాని ఉత్తమలోకములు పొందుతారు.

ఇంకా దేవతల అంశలో జన్మించిన వారు ఆపదలు వచ్చినప్పుడు కుంగిపోరు. సిరి సంపదలు వచ్చినపుడు పొంగిపోరు. గర్వంతో  మదించరు. తన శౌర్యముతో పాపులను గెలుస్తారు. తమ బంధువులతోనూ, మిత్రులతోనూ సఖ్యంగా మెలుగుతారు. దీనులను కరుణతో చూస్తారు. వారిని రక్షిస్తారు. దైవాంశలో పుట్టిన వారికి    కోపం రాదు. సౌమ్యంగా ఉంటారు.”  అని చెప్పాడు మహేశ్వరుడు.

“నాధా! మానవ లోకంలో కొంతమంది సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో తులతూగుతుంటారు. సుఖాలు అనుభవిస్తుంటారు. కాని కొంతమంది దరిద్రంతో బాధపడుతుంటారు. దీనికి కారణమేమి?”  అని అడిగింది పార్వతి.

“గత జన్మలో కాకులకు కూడా మెతుకులు పెట్టకుండా, పిడికెడు బిక్షము కూడా వెయ్యకుండా పిసినారిగా గడిపిన వాడికి ఈ జన్మలో దరిద్రం చుట్టుకుంటుంది. తినడానికి తిండి, కట్టడానికి బట్ట లేకుండా బాధపడతాడు. అలా కాకుండా పేదవారికి అన్న పానములు ఇచ్చిన వాడికి, తన బంధువులను,

స్నేహితులను కష్టకాలములో ఆదుకున్న వాడికి, మరుజన్మలో సిరి సంపదలు కలుగుతాయి. సుఖంగా జీవిస్తారు. కాబట్టి సుఖదుఃఖములు వారి వారి పూర్వజన్మ కర్మపరిపాకము వలన కలుగుతాయి. అంతేకానీ బ్రహ్మదేవునికి ఒకరి మీద కోపము, మరొకరి మీద ప్రేమా లేవు. దేవుడు ఎవరినీ పేదవారిగా పుట్టించడు. ఒకడు ఈ జన్మలో పేదవాడుగా కష్టములు అనుభవిస్తున్నాడు అంటే అది అతనిపూర్వజన్మలో చేసినపాపముల ఫలము. అని తెలుసుకోవాలి.

పార్వతీ! కొంత మందికి సిరి సంపదలు ఉంటాయి కాని వారు కడుపునిండా తినరు. అనుభవించరు. అలా దరిద్రం అనుభవిస్తుంటారు. ఎందుకో తెలుసా! వీరు పూర్వజన్మలో ఎవరికీ పిడికెడు అన్నం పెట్టి ఉండరు. బంధువులు, మిత్రులు పోరగా పోరగా వారి బలవంతం మీద పరులకు ఉపకారం చేసి ఉంటారు. అలాంటి వారు మరు జన్మలో పై చెప్పిన విధంగా సిరి సంపదలు ఉన్నా అనుభవించలేరు.

ఇంకా కొంత మంది తమకు ఏమీ లేక పోయినా బంధు మిత్రుల సహకారంతో తిండికి గుడ్డకు లోటు లేకుండా సుఖంగా జీవిస్తుంటారు. అలాంటి వారు పూర్వ జన్మలో తమకు దాన ధర్మములు చేసే శక్తి లేకపోయినా, ఇతరులకు దాన ధర్మములు చేయవలెనని మనసులో గాఢంగా కాంక్షిస్తూ ఉంటారు. అందువలన మరుజన్మలో తిండి గుడ్డకూ లోటు లేకుండా జీవిస్తారు. ఈ జన్మలో కొంత మందికి అయాచితంగా ధనం లభిస్తూ ఉంటుంది. అలాంటి వారు పూర్వ జన్మలో పేదలకు వారు అడక్కుండానే ధనము, అన్నదానము వస్త్రదానము చేసి ఉంటారు. ఈ జన్మలో శ్రమ చేసి ధనము సంపాదించేవారు, పూర్వ జన్మలో ఎవరినీ తిప్పించుకోకుండా, పేదవారు అడగగానే దాన , దర్మములు చేసిన వారు.

ఇంకా కొంత మందికి ఎంత శ్రమ పడ్డా ధనము చేకూరదు. అలాంటి వారు పూర్వ జన్మలో లోభులై, తమను యాచించిన వారిని రేపురా మాపురా అని తిప్పించుకొని చివరకు మొండి చెయ్యి చూపిన వారు. కొంత మందికి ముసలి వయస్సులో ధనలాభం కలుగుతుంది. అలాంటి వారు తమ పూర్వ జన్మలో యవ్వనంలో ఉన్నప్పుడు దానధర్మములు చెయ్యకుండా ముసలి తనములో దానధర్మములు చేసిన వారు. ఇంకా కొంతమంది తమకు మిక్కుటముగా ధనము కలిగి నప్పటికినీ వారికి ఉన్న రోగములచేత తిండి కూడా తినలేని దుస్థితి లో ఉంటారు. అలాంటివారు తమ పూర్వ జన్మలో దానధర్మములు చేయకుండా, చివకరకు తాము వ్యాధిగ్రస్తులైనపుడు మాత్రమే దానధర్మములు చేసిన వారు.

ఈ జన్మలో అందంగా ఉన్నవారు పూర్వ జన్మలో శాకాహారము తిన్నవారు. అలా కాకుండా ఈ జన్మలో కురూపులుగా పుట్టినవారు క్రితం జన్మలో అందగాళ్లై ఉండి అందవిహీనులను పరిహసించిన వారు. ఎవరైతే పూర్వజన్మలో ఏకపత్నీవ్రతుడుగా ఉంటాడో, మరుజన్మలో వాడికి సౌందర్యవతి, సౌశీల్యవతి, గుణవతి అయిన భార్య లభిస్తుంది. అలా కాకుండా పూర్వజన్మలో భార్యను సుఖపెట్టకుండా కష్టపెట్టినవాడికి, మరుజన్మలో భార్యాసుఖం దూరమవుతుంది. ఈ జన్మలో విద్య, జ్ఞానము, విజ్ఞానము కలిగి ఉండి కూడా పేదరికముతో బాధపడేవాడు క్రితం జన్మలో దానధర్మములు చేయాలి అని తెలిసికూడా దానధర్మములు చేయనివాడే.

ఈ జన్మలో విద్య తెలివి తేటలు లేకపోయినా అధికంగా ధనము కలవాడు, కిందటి జన్మలో తెలివి తక్కువ వాడుగా ఉన్నా, పేదసాదలను ఆదుకొని దానధర్మములు చేసినవాడు. ఈ జన్మలో విద్యావంతుడు మేధావిగా ఉన్న వాడు కిందటి జన్మలో గురువులను శ్రద్ధతో సేవించి విద్యలను

నేర్చుకున్నవాడు మరియు తాను నేర్చుకున్న విద్యలను అందరికీ చెప్పేవాడు. కొంత మందికి ఈ జన్మలో విద్య నేర్చుకుందామన్నా విద్యరాదు. అలాంటి వారు కిందటి జన్మలో విద్యాధికులై ఉండి, గర్వించి, సాటి విద్యావంతులను అవమానించినవారు. ఈ జన్మలో ఏ రకమైన బాధలు లేకుండా, రోగాలు లేకుండా, భార్యా బిడ్డలతో సుఖంగా ఉన్నవారు, కిందటి జన్మలో సత్యము పలుకుచూ, ఇతురుల మీద దయచూపుతూ, దానధర్మములు చేసిన వారు.

ఈ జన్మలో మాటవినని భార్య, మూర్ఖులైన కుమారులు, ఒంటి నిండా రోగాలతో బాధపడే వారు, కిందటి జన్మలో కోపంతోనూ, దురాశతోనూ, నాస్తికత్వంతోనూ విర్రవీగినవారే! ఈ జన్మలో పుట్టు గుడ్డివాడు, లేక మధ్యలో చూపుపోయిన వాడు, పోయిన జన్మలో అందగాడై ఉండి ఇతరుల భార్యల వంక చెడు భావనతో చూచిన వాడు. ఈ జన్మలో చెవిపోటుతో బాధ పడేవాడు పోయిన జన్మలో మంచి వారిని తన పరుషమైన మాటలతో నొప్పించిన వాడు. ఉదరవ్యాధులతో బాధపడుతున్నవాడు పోయినజన్మలో ఇతరులకు విషం పెట్టినవాడు.

మూత్రకోశ వ్యాధులతో బాధపడుతున్న వాడు, క్రి తం జన్మలో పెళ్లికాని కన్యలను, పెళ్లి అయిన పరకాంతలను శీలము చెరిచినవాడు. ఈ జన్మలో క్షయరోగంతో బాధపడుతున్న వాడు, పోయిన జన్మలో పరుల ఆహారమును అపహరించిన వాడు. ఈ జన్మలో కుష్ఠురోగిగా ఉన్న వాడు పోయిన జన్మలో పరులను దారుణంగా హింసించిన వాడు. ఈ జన్మలో కుంటి వాడుగా ఉన్న వాడు పోయిన జన్మలో పరుల కాళ్లు చేతులు విరిచినవాడు. ఈ జన్మలో చర్మరోగములతో ఇతర రోగములతో బాధపడేవారు పోయిన జన్మలో మంచివారిని హింసించిన వారే! ఈ జన్మములో పాదములకు వచ్చిన రోగములతో బాధపడుతున్నవారు పోయినజన్మలో పాదములు కడుక్కోకుండా

దేవుని వద్దకు వెళ్లినవారు. ఇంకా పేదవారిని, అమాయకులను నిష్కారణంగా పాదములతో తన్నినవారే! ఈ జన్మలో జ్వరముతోనూ, కడుపులో రోగముల తోనూ, శరీరం అంతా రోగాలతోనూ బాధపడేవారు పోయిన జన్మలో జంతువులను చంపినవారు, గురువుగారిని బాధపెట్టినవారు. ఈ జన్మలో గూని వాడు, మరగుజ్జువాడు పోయిన జన్మలో ధాన్యంలో తాలు గింజలు కలిపి అమ్మినవాడు, తప్పుడు కొలతలతో జనులను మోసం చేసి లాభం పొందిన వాడు. ఈ జన్మలో పిచ్చివాళ్లు, వెర్రివాళ్లు పోయిన జన్మలో అమాయకులను మోసం చేసి ధనం సంపాదించిన వారు.

ఈ జన్మలో సంతానము లేని వారు పోయిన జన్మలో తల్లితండ్రులకు శ్రాద్ధం పెట్టనివారు, పసిపిల్లలను చంపినవారు. ఈ జన్మలో నపుంసకులుగా ఉన్నవారు పోయిన జన్మలో ఎద్దులకు వృషణాలు కొట్టి దానికి రతిసౌఖ్యము లేకుండా చేసినవారు. ఈ జన్మలో వైధవ్యము పొందిన యువతి పూర్వ జన్మలో భర్తను మోసం చేసి ధనము సంపాదించినది, తన భర్తను వదిలి మరియొకరి భర్తను కోరినది. ఈ జన్మలో గొప్ప వంశంలో పుట్టి కూడా చేయకూడని పనులు, అందరూ ఏవగించుకొనే పనులు చేసేవారు పూర్వజన్మలో అహంకారంతో, మదంతో, గర్వంతో ఇతరులను అవమానించిన వారు.

ఈ జన్మలో సేవకులుగా సేవకావృత్తి చేస్తూ, యజమానులు పెట్టే బాధలు భరిస్తూ బాధ పడుతున్నవారు, పోయిన జన్మలో అమాయకులనూ నిరపరాధులను కొడుతూ తిడుతూ హింసపెట్టినవారే! ఈ జన్మలో చెయ్యని నేరానికి శిక్షింప బడినవాడు, క్రితం జన్మలో నిరపరాధిని శిక్షించినవాడే. ఈ జన్మలో బంధు వులు మిత్రులు ఒకేసారి మరణిస్తే దుఃఖిస్తున్నవాడు పోయిన జన్మలో ఎంతో మందిని నిర్దాక్షిణ్యంగా చంపినవాడు.

ఈ జన్మలో తనకు ఉన్న ధనమును పోగొట్టుకొని అల్లాడుతున్న వాడు, పోయిన జన్మలో ఇతరుల ధనము తన దగ్గర పెట్టినపుడు, వారిని మోసం చేసి ఆ ధనమును అపహరించిన వాడే. ఓ పార్వతీ! పైన నేను చెప్పిన పాపములుచేసిన వారందరూ ముందు నరకమును అనుభవించి తరువాత మానవులుగా పుట్టి ఆ కర్మఫలితమును అనుభవిస్తున్న వారే! క్రి తంజన్మలో తక్కువ పాపాలు చేసిన వానికి మనిషి జన్మ వస్తుంది. ఏ జన్మలో చేసిన పాపం ఆ జన్మలో అనుభవానికి రాదు." అని ఈశ్వరుడు పార్వతికి చెప్పాడు.

" నాధా! మనుషులు తాము చేసిన పాపకర్మలకు ఫలితము మరుజన్మలో అనుభవిస్తారు అని చెప్పారు కదా! కాని మానవులు వారు చేసిన పాప కర్మలకు రాజుల చేతిలో న్యాయాధికారుల చేతిలో శిక్షలు విధింపబడి అనుభవిస్తున్నారు కదా! అటువంటప్పుడు మానవులు తాము చేసిన పాప కర్మలకు ఫలితము ఆ జన్మలోనే అనుభవించినట్టు అవుతుంది కదా! ఇది తమరు చెప్పిన దానికి విరుద్ధము కదా!" అని అడిగింది.

" ఓ పార్వతీ! రాజులు న్యాయాధికారులు తప్పుచేసిన వారికి నిష్పక్ష పాతంగా శిక్షలు విధిస్తారు. ఎందుకంటే ఆ శిక్షలు చూచి ఇతరులు అటువంటి నేరములు చెయ్యకుండా ఉంటారని ఉద్దేశ్యము. అలాంటి శిక్షలు విధింప బడటం అనేది వారు క్రితం జన్మలో చేసుకున్న పాపఫలమే కాని ఈ జన్మలో చేసిన పాప కర్మలకు కాదు. ఈ జన్మలో చేసిన పాపకర్మలకు ఫలము మరు జన్మలో అనుభవించక తప్పదు." అని అన్నాడు.

" ఓ దేవదేవా! రాజ దండన పొందిన తరువాత వాడు చేసిన కర్మల వలన కలిగిన పాపము తొలగి పోతుందా! తొలగి పోదా!" అని అడిగింది. అడిగింది.

“ ఓ పార్వతీ! రాజ దండనమునకు గురి అయినవాడు యమ దండన మాత్రము తప్పించుకోగలడు. కాని అపరాధిని విడిచిపెట్టినా, నిరపరాధిని దండించినా, ఆ రాజుకు, అధికారికి యమదండన తప్పదు. (రాజ్యాంతే నరకం ధృవం). కాబట్టి ఎటువంటి వాడికైనా తాను చేసిన కర్మలకు ఫలము అనుభ వించక తప్పదు.” అని అన్నాడు మహేశ్వరుడు.

“నాధా! మీరేమో కర్మఫలములు అనుభవించక తప్పదు అంటున్నారు. కాని వేదములలో ప్రాయశ్చిత్తముల వలన చేసిన పాపాలు పోతాయి. అంటున్నారు. అదీ కాకుండా అశ్వమేధ యాగము చేస్తే అన్ని పాపాలు నశించి పోతాయి అంటున్నారు. ఇందులో ఏది నిజము?” అని అడిగింది.

“ఓ పార్వతీ! రెండూ నిజమే. మానవుడు తాను కావాలని చేసిన కర్మఫలములను అనుభవించక తప్పదు. కాని తన సంకల్పము, ప్రమేయము లేకుండా, తెలిసీ తెలియకుండా కొన్ని పనులు జరిగిపోతూ ఉంటాయి. వాటికి ప్రాయశ్చిత్తముతో పరిహారము చేసుకొన వచ్చును. మానవుడు తాను చేసిన పుణ్యకార్యముల ఫలితంగా స్వర్గమునకు వెళతాడు. అక్కడ స్వర్గ సుఖములు అనుభవిస్తాడు. తాను చేసిన పుణ్యఫలము కొద్దిగానే ఉంటే, తిరిగి మానవ లోకంలో జన్మిస్తాడు.మానవ లోకంలో కూడా భోగములు అనుభవిస్తాడు.” అని పలికాడు ఈశ్వరుడు.

“నాధా! మానవుడు చేసే కర్మలు తానే కావాలని చేస్తాడా లేక గ్రహబలం అనుకూలత వలన, ప్రతికూలత వలన చేస్తాడా! వివరించండి.” అని అడిగింది.

“ ఓ పార్వతీ! మానవుడు గ్రహ సంచారము కారణంగా శుభములు అశుభములు అయిన కర్మలు చేస్తూ ఉంటాడు. కాని ఆ కర్మల కన్నిటికీ అతనే

అధికారి. ఎందుకంటే గ్రహాలు అతని తో  ఆ పనులు చేయించడం లేదు కదా! అందుకని తాను చేసిన కర్మలకు తానే కర్త. గ్రహములు కాదు. ఆ కర్మఫలములు తానే అనుభవించక తప్పదు." అని అన్నాడు పరమేశ్వరుడు.

"నాథా! చావు అనునది ఏమి. దాని స్వరూపము ఎలా ఉంటుంది." అని అడిగింది పార్వతి.

"దేవీ! ఆత్మ నిత్యము. శాశ్వతము. దేహము అశాశ్వతము. దేహము ముసలి తనము చేత, రోగముల చేత కృశించి పోతుంది. దేహము ఇంక వాసయోగ్యము కానప్పుడు జీవాత్మ ఆ దేహమును వదిలిపోతుంది. అదే చావు. మరణము.  జీవాత్మ ముసలి తనముతోనూ రోగములతోనూ కృశించిపోయిన శరీరమును విడిచిపెట్టి మరొక కొత్త శరీరమును ధరించడమే జననము లేక పుట్టుక. కాబట్టి మానవులు ఈ జనన మరణ చక్రములో తిరుగుతూ ఉంటారు."  అని అన్నాడు పరమేశ్వరుడు.

"నాథా! మరి బాలురు చిన్న తనంలోనే చనిపోతూ ఉంటే, వృద్ధులు చాలా కాలం బతుకుతూ ఉంటారు. దీనికి కారణమేమి!" అని అడిగిందిపార్వతి.

"దేవీ! కాలము శరీరమును కృశింప జేస్తుంది కాని చంపదు. మానవులు తాను పూర్వజన్మలోనూ ఈ జన్మలోనూ చేసిన కర్మల వలన అతని జీవితం పొడిగింపబడడం లేక తగ్గింపబడడం జరుగుతూ ఉంటుంది. పొడిగిస్తే చాలా కాలం బతుకుతాడు. తగ్గిస్తే మరణం సంభవిస్తుంది." అని చెప్పాడు ఈశ్వరుడు.

"నాథా! మనిషికి ఆయుష్షు దేని వలన పెరుగుతుంది. దేని వలన

తగ్గిపోతుంది. తెలపండి.”  అని అడిగింది పార్వతి.

“ఓ పార్వతీ! మానవుడు ప్రశాంతంగా బతికితే ఆయువు పెరుగుతుంది. అశాంతిగా ఉంటే ఆయువు క్షీణిస్తుంది.   ఇంకా మానవుడు క్షమాగుణము అలవర్చుకోవాలి. సత్యమునే పలకాలి. శుచిగా ఉండాలి. అందరి మీదా దయకలిగి ఉండాలి. గురువు ఎడల భక్తి కలిగి ఉండాలి. వీటన్నిటి వలన మానవుడి ఆయుష్షు వృద్ధిపొందుతుంది. అధిక మైన కోపము, అబద్ధాలు ఆడటం, ఇతరుల ఎడల క్రూరంగా ప్రవర్తించడం, అపరిశుభ్రంగా ఉండటం, గురువులను ద్వేషించడం, వీటి వలన  మానవుని ఆయువు క్షీణిస్తుంది.

ఓ పార్వతీ! తపస్సు చేతనూ, బ్రహ్మచర్యము అవలంబించడం చేతనూ, మితంగా ఆహారం తినడం చేతనూ, రోగము వచ్చినప్పుడు తగిన  ఔషధములు సేవించడం వల్లనూ, ఆయుర్దాయం పెరుగుతుంది.  పైన చెప్పిన పనులు చెయ్యడం కూడా అతని పూర్వ జన్మలో చేసుకున్న కర్మల ఫలమే. (లేకపోతే వాడు ఇష్టం వచ్చినట్టు తింటాడు తాగుతాడు. రోగం వస్తే మందు వేసుకోడు. ఇష్టం వచ్చినట్టు తిరుగుతాడు. ఆయుక్షీణం అవుతుంది).

ముందు జన్మలో పుణ్యం చేసుకున్న వాళ్లు స్వర్గానికి వెళతారు. అక్కడ స్వర్గ సుఖములు అనుభవించి మరలామానవులుగా పుడతారు. వారికి ఆయుష్షు ఎక్కువగా ఉంటుంది. అకాల మరణం చెందరు. ముందు జన్మలో పాపం చేసిన వాళ్లు నరకానికి వెళతారు. అక్కడ నరకయాతనలు అనుభవించి, తిరిగి మానవ లోకంలో పుడతారు. వారికి చాలా తక్కువ ఆయుష్షు ఉంటుంది. అకాల మరణం చెందుతారు.”  అని చెప్పాడు మహా శివుడు.

“ నాథా! మానవులలో స్త్రీలు పురుషులు అని రెండు రకాలు ఉంటారు

కదా! స్త్రీ పురుషులలో జీవాత్మ ఎలా ఉంటుంది తెలియచెయ్యండి.”  అని అడిగింది పార్వతి.

“పార్వతీ! పుట్టడం -- స్త్రీగానూ పురుషుడుగానూ పుట్టినా, వారిలో ఉండే జీవాత్మ  ఒక్కటే. దానికి స్త్రీ పురుష లింగబేధము లేదు. మనస్సు బుద్ధి అహంకారము అందరికీ ఒకటే. అందరిలోనూ పంచభూతములు వాటి తన్మాత్రలు ఉంటాయి. మానవుడు చేసే కర్మలకు జీవాత్మ బాధ్యుడు కాడు. మానవులలో ఉన్న సత్త్వ, రజస్, తమోగుణముల ప్రకోపము వలన మానవుడు కర్మలు చేస్తుంటాడు. జీవాత్మ ఆ కర్మలను సాక్షీభూతంగా చూస్తూ ఉంటుంది.

సత్యము పలకడం, ఇతరుల పట్ల దయగా ఉండటం, శుభ్రంగా ఉండటం సత్త్వగుణములు. లోభి తనము, అన్ని నా వల్లనే జరుగుతున్నాయి అన్నీ నేను అనే స్వార్ధగుణము ఇవన్నీ రజోగుణములు. ఇంకా అబద్ధాలు చెప్పడం, ఇతరులను హింసించడం, ప్రతిదానికీ భయపడటం, ఏ పనీ చెయ్యకుండా సోమరిగా ఉండటం, ఎల్లప్పుడూ అధైర్యంగా ఉండటం, ఎప్పుడూ(మద్యం) మత్తులో జోగుతూ ఉండటం లేక నిద్రపోవడం ఇవన్నీ తామస గుణములు.

సత్త్వగుణము ప్రదానము గా కలవానికి పుణ్యలోకములు ప్రాప్తిస్తాయి. రజోగుణములు ప్రధానంగా కలవానికి మనుష్యలోకము ప్రాప్తిస్తుంది. తమోగుణము ప్రధానంగా కలవాడు పశుపక్ష్యాదులుగా పుడతాడు. ~~ఈ~~ మూడు గుణములు అధిగమించిన వాడికి ముక్తి లభిస్తుంది. ~~ఈ~~ సత్త్వ, రజస్, తమోగుణముల ప్రభావంతో  కర్మలు చేసే నరులకు, వాటికి అనుగుణంగా శుభములు, అశుభములు కలుగుతాయి. ఒక్కోసారి దీనికి భిన్నంగా కూడా జరుగుతూ ఉంటుంది.

అధికారులు సేవకులను బెదిరించి తిట్టి పనిచేయించుకుంటాడు. అది పాపము కాదు. వైద్యుడు రోగులకు కష్టంగా ఉండే మందులు ఇచ్చి, శస్త్రచికిత్సలు చేసి రోగిని కాపాడుతాడు. అవి పాపములు కావు. అలాగే గురువు గారు విద్యార్థులను దండించి విద్యబోధిస్తాడు. ఇది కూడా పాపం కాదు. అవి అన్నీ సుకృతములే. వారికి సుకృతములు చేస్తే కలిగే ఫలము కలుగుతుంది.

జీవులు గర్భము నుండి, గుడ్డునుండి, చెమట నుండి జన్మిస్తుంటాయి. వీటికి అన్ని ఇంద్రియములు ఉంటాయి. కాని విత్తనముల నుండి పుట్టిన చెట్లకు స్పర్శ జ్ఞానము మాత్రము ఉంటుంది. గర్భము నుండి పుట్టిన జీవులలో మానవుడు గొప్పవాడు. అతనికి ధర్మాధర్మ విచక్షణ, మంచి చెడుల విచక్షణా జ్ఞానము ఉంటుంది. ఆ జ్ఞానము లేకపోతే అతడు పశువులతో సమానము అవుతాడు.

చీకటి రెండు విధములు. మొదటిది రాత్రికాగానే అలుముకుంటుంది. రెండవది అజ్ఞానం వలన మనిషిలో అలుముకుంటుంది. మొదటి చీకటి వెలుగు రాగానే అంతరిస్తుంది. మనిషిలో అలుముకున్న చీకటి విద్య వలన, శాస్త్ర విజ్ఞానము వలన నశిస్తుంది. మానవులలో పుట్టిన చీకటిని పోగొట్టడానికే బ్రహ్మ వేదములు, శాస్త్రములు సృష్టించాడు. వేదములు, శాస్త్రములు అధ్యయనం చెయ్యడం వలన ఏది చెయ్యాలో ఏది చెయ్యకూడదో తెలుస్తుంది. దాని వలన అజ్ఞానం చీకట్లు తొలగిపోతాయి.

కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము మొదలగు గుణములు శాస్త్రములు, వేదములు చదివినందువలన నశిస్తాయి. విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. అలాంటి వాడు కొంచెం పుణ్యం చేసినా ఎక్కువ ఫలాన్ని పొందుతాడు. శాస్త్రజ్ఞానము లేకుండా అజ్ఞానాంధకారంలో మునిగిన

వాడు ఎన్ని పుణ్య కార్యములు చేసినా వాడికి చెందేవి కొద్దిఫలమే."  అని అన్నాడు పరమేశ్వరుడు.

ఇంకా పరమేశ్వరుడు పార్వతితో ఇలా అన్నాడు. "ఓ పార్వతీ! నరుడు మరణించగానే మరలా జన్మ ఎత్తితే అతనికి పూర్వజన్మ స్మృతి ఉంటుంది. వాడిని జాతి స్మరుడు అని అంటారు. కాని వయసు వచ్చే కొద్దీ ఆ పూర్వజన్మ స్మృతులను మరిచిపోతాడు. మామూలు మనిషిగా ఉంటాడు. ఇలా కొంతమందికి మాత్రమే జరుగుతుంటుంది. ఇలా పూర్వజన్మ స్మృతి కలగటం వలన పూర్వ జన్మ ఒకటి ఉన్నది అని మానవులకు రూఢిఅవుతుంది.

ఒక్కొక్క సమయంలో మరణించిన వాడు మరలా బతకడం కూడా జరుగుతుంటుంది. ఒక్కోసారి యమభటులు పొరపాటున ఒకరికి బదులు మరొకరిని తీసుకు వెళుతుంటారు. యముడు ఆ పొరపాటును సరిదిద్ది ఆ ప్రాణిని మరలా భూలోకమునకు పంపించి వేస్తాడు. ఇలాంటివి అక్కడక్కడా జరుగుతుంటాయి." అని చెప్పాడు మహాదేవుడు.

" మహాదేవా! స్వప్నము (కల) అంటే ఏమిటి?" అని అడిగింది.

"పార్వతీ! నరుడు నిద్రపోయేటప్పుడు ఇంద్రియములు (కన్ను, ముక్కు, చేతులు కాళ్లు మొదలగునవి) పనిచెయ్యవు. కేవలం మనస్సు మాత్రమే పనిచేస్తుంది. ఆ మనస్సు దర్శించేదే స్వప్నము లేక కల అని అంటారు. ఒక్కోసారి ఈ స్వప్నములలో జరగబోయే విషయములు కూడా కనిపిస్తాయి." అని అన్నాడు మహేశ్వరుడు.

"నాథా! మానవులు కర్మలు చేస్తుంటారు కదా. అవి దేవుడు

చేయిస్తున్నాడా. లేక వారంతట వారు ఉత్సాహంగా చేస్తున్నారా!" అని అడిగింది.

"పార్వతీ! దైవము ఏ పనీ చెయ్యడు. కాని దైవము మానవుడు చేసే పనులకు తన సహాయాన్ని అందిస్తాడు. ఆ పనులకు తగిన ఫలమును అందిస్తాడు. చెయ్యడం మాత్రం మానవుడిదే. ఏ పనిచెయ్యాలో నిర్ణయించేదీ మానవుడే. దైవానికి ఎలాంటి ప్రమేయమూ లేదు. పూర్వజన్మకర్మలను బట్టి మానవుడు ఏ పనిచెయ్యాలో ఏ పని చెయ్యకూడదో నిర్ణయించుకుంటాడు. మానవులు పూర్వజన్మలో చేసిన కర్మలు దైవములు అయితే, ఈ జన్మలో అతడు చేసే పనులు పౌరుషములు అనగా పురుష ప్రయత్నములు.

ఒక పని చెయ్యడానికి మనిషి చేసే ప్రయత్నము వ్యవసాయము వంటిది. దానికి దైవము చేయు సహాయం మొక్కకు నీరు , గాలి వంటిది. నేలను తవ్వితేనే భూగర్భంలో నుండి నీరు పైకి వస్తుంది. అలాగే అరణితో మదిస్తే అగ్ని పుడుతుంది. అలాగే ఏ పనికైనా పురుష ప్రయత్నం ఉంటేనే దైవం కూడా తోడయి చక్కటి ఫలితాలను ఇస్తుంది. పురుష ప్రయత్నం లేకుండా కేవలం దైవం మీద ఆధారపడితే, దైవం కూడా ఎందుకు సాయం చేస్తాడు? కాబట్టి ఓ పార్వతీ! ఏ ప్రకారం చూచినా ఏ పని చెయ్యడాని కైనా ముందు పురుష ప్రయత్నం కావాలి. అప్పుడు దైవం కూడా సాయం చేస్తాడు. ( ఈ విషయం విద్యార్థులు గమనించాలి. పుస్తకాలు, పెన్నులు, పాడ్లు దేవుడి దగ్గర పెట్టి దణ్ణం పెట్టుకోడం, దేవుడా దేవుడా నాకు వచ్చిన ప్రశ్నలే పరీక్షలో రావాలి అని మొక్కుకోడం అంత మంచి పద్ధతి కాదు. మీ ప్రయత్నం మీరు చెయ్యాలి. ఏ రోజు పాఠాలు ఆరోజు చదవాలి. మననం చేసుకోవాలి. పరీక్షల ముందు బాగా చదవాలి. చదివింది జ్ఞాపకం పెట్టుకోవాలి. జ్ఞాపకం లేకపోతే ఒకటికి పది సార్లు చదవాలి. అప్పుడు దైవం కూడా మీకు సాయం చేస్తాడు. పరీక్షలలో మీరు చదివినవి గుర్తుకు వచ్చేట్టు చేస్తాడు.మంచి మార్కులు వచ్చేట్టు చేస్తాడు.

అంతేగానీ, సంవత్సరం అంతా బలాదూరు తిరిగి, బందులు, హర్తాళ్లు, ప్రేమలు అని తిరిగి, పరీక్షల ముందు పుస్తకాలు ముందేసుకొని దేవుడా సాయం చెయ్యి అంటే ఏ దేవుడూ సాయం చెయ్యడు. ఈ విషయం సాక్షాత్తూ పరమేశ్వరుడే జగన్మాత పార్వతికి చెప్పాడు. నేను మీకు చెప్పాను .).

" నాథా! మరణానంతరము, జీవుడు మరొక దేహములో ప్రవేశిస్తాడు అని అన్నారు కదా! జీవుడు మరొక గర్భంలో ఎలా ప్రవేశిస్తాడు. తెలియ చెయ్యండి." అని అడిగింది.

"పార్వతీ! పురుషు స్త్రీని కలిసి నప్పుడు, పురుషుని లో నుండి వీర్యము స్త్రీ లోని శోణితముతో కలిసి గర్భంలో ప్రవేశిస్తుంది. పిండంగా మారుతుంది. దీనికి పురుషుని ప్రయత్నమూ, దైవసాయమూ రెండూ కావాలి. (కొంత మందికి భార్యాభర్తల్లో ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నా సంతానము కలగరు. దానికి దైవ యత్నం తోడు కాకపోవడమే. అది వారి వారి పూర్వజన్మ కర్మఫలం ప్రకారం జరుగుతుంది.).

పార్వతీ! ఈ సందర్భంలో నీకు ఒక దేవరహస్యమును చెబుతాను విను. పూర్వము మానవులందరికీ పూర్వజన్మ స్మృతి ఉండేది. అందువలన మానవులు ఎప్పటికప్పుడు తమను తాము సంస్కరించు కుంటూ పుణ్య కార్యములు చేసి స్వర్గలోక సుఖములు పొందుతూ ఉండేవారు. అందరూ స్వర్గానికి పోవడం వలన స్వర్గంలో విపరీతమైన తొక్కిసలాట జరిగింది. వీరికి స్వర్గ సుఖములు కల్పించడం దేవతలకు కష్టంగా తోచింది. దేవతలందరూ బ్రహ్మదేవుని వద్దకు వెళ్లి ఈ సంగతి చెప్పారు. అప్పుడు బ్రహ్మదేవుడు ఆలోచించి మానవులకు ఉన్న పూర్వజన్మస్మృతిని తీసేసాడు. దాని స్థానంలో మనిషికి కోరికలు, కామము, కోపము, మదము, లోభము మొదలగు

దుర్గుణములు కల్పించాడు.  దాని ఫలితంగా మానవులకు కోరికలు ఎక్కువ అయ్యాయి. ఆ కోరికలు తీరడాని చెడ్డపనులు చెయ్యడం మొదలెట్టారు. ఆ కోరికలు తీరక పోతే కోపం వచ్చేది. ఆ కోపంలో  పాపాలు చేసేవాళ్లు. ఆ కారణంగా మానవులు స్వర్గానికి రావడం తగ్గిపోయింది. కాని నరకానికి పాపుల తాకిడి ఎక్కువ అయింది.  దానికీ బ్రహ్మదేవుడు మరొక ఉపాయం ఆలోచించాడు.  స్వర్గానికి నరకానికి జీవులు సమంగా వెళ్లే ఏర్పాటు చేసాడు. మానవులకు స్వర్గము, నరకము వాటి స్థితి గతులు కేవలం శాస్త్ర పరిజ్ఞానము ద్వారానే తెలిసేటట్టు చేసాడు. కాబట్టి స్వర్గ నరకముల గురించి మానవులు ఎవడికి వాడు  మనసుతో తెలుసుకొనే శక్తిని కోల్పోయారు."   అని చెప్పాడు పరమేశ్వరుడు.

"నాథా! భూలోకంలో పునర్జన్మ ఉందని కొందరూ, లేదని కొందరూ వాదులాడుకుంటూ ఉంటారు కదా!  ఈ సందేహము మానవులకు ఎంతకూ తీరడం లేదు. దాని గురించి చెప్పండి."  అని అడిగింది పార్వతి.

దానికి ఈశ్వరుడు నవ్వి "ఈ సందేహము మానవులకే కాదు దేవతలకు కూడా ఉంది.  ఈ విషయంలో ఎవరికీ నిశ్చితమైన అభిప్రాయము లేదు. పునర్జన్మ అనేది ఉన్నది. కాని ఈ విషయం వేద పరిజ్ఞానము కలవారికే బోధపడుతుంది."  అని అన్నాడు ఈశ్వరుడు.

"ఓ నాథా!  మానవులు చనిపోగానే వారికి ఉన్న ఆకారము పోతుంది. అంటే ఈ స్థూల శరీరము పోతుంది.  శరీరమే లేనపుడు,  యమ భటులు ఈ మానవుని ఎలా యమలోకానికి తీసుకు పోతారు?"  అని అడిగింది పార్వతి.

" ఓ పార్వతీ! మానవునికి  ఆయువు తీరి పోగానే ఈ శరీరాన్ని విడిచి

పెడతాడు. అప్పుడు యమభటులు ఆ ప్రాణాన్ని ఒక సూక్ష్మ శరీరంలో ప్రవేశ పెడతారు. తరువాత, వారు మంచి వారు, ధర్మాత్ములు, పుణ్య కార్యములు చేసిన వారు అయితే, వారిని చక్కటి రాజమార్గములో తీసుకొని పోయి యమ , దర్మరాజు ముందు ప్రవేశ పెడతారు. అప్పుడు యముడు వారు చేసిన పుణ్య కార్యములను విచారించి ఎక్కువ పుణ్యము చేసిన వారిని పుణ్యలోకములకు పంపుతాడు. కొంచెం తక్కువగా పుణ్యం చేసిన వారిని మరలా మానవలోకంలో పుట్టమని పంపుతాడు. పాపం చేసిన వారిని నరకానికి పంపుతాడు." అని పలికాడు ఈశ్వరుడు.

"నాథా! నరకమనగా నేమి అది ఎలా ఉంటుంది" అని అడిగింది పార్వతి.

"దేవీ! ఈ భూమికి కిందుగా రౌరవము, హారౌరవము, కంటకావనము, అగ్ని కుండము, తరువాత పంచకష్టము అనే ఐదు రకాల నరకాలు ఉన్నాయి. మానవులు చేసిన పాపములను బట్టి ఈ నరకములలో శిక్షలు అనుభవిస్తారు. అక్కడ కాల్చడం, నరకడం, కట్టడం, కొట్టడం, కుక్కలచేత కరిపించడం, క్రిములచేత కుట్టించడం, గ్రద్దల చేత పొడిపించడం మొదలగు నరక బాధలు పెడతారు. ఆ ప్రకారంగా పాపము చేసిన వారు నరక బాధలు అనుభవించి పునీతులు అవుతారు. తరువాత మరలా భూలోకంలో ముందు పురుగులుగా తరువాత పక్షులుగా, తరువాత జంతువులుగా తరువాత మానవులుగా జన్మలు ఎత్తుతారు." అని పలికాడు ఈశ్వరుడు.

"నాథా! మీరు పాపములు పాపములు అని అన్నారు కదా! పాపములు అంటే ఏమిటి? ఇవి ఎలా ఉంటాయి తెలియజేయండి." అని అడిగిందిపార్వతి.

"ఓ పార్వతీ! మనిషిమూడు విధములుగా పాపాలు చేస్తాడు. అవి

మనస్సుతోనూ, వాక్కుతోనూ, శరీరంతోనూ చేస్తాడు. ఇతరులకు ధనం ఉందే అని ఏడుస్తూ వాటిని అపహరించవలెనని అనుకోవడం, తన ఎదుటగా చెడ్డ పనులు, చెయ్యకూడని పనులు జరుగుతుంటే చూచి ఆనందించడం, అడ్డు చెప్పకపోవడం, ఎవరైనా ధర్మ కార్యములు దైవ కార్యములు చేస్తుంటే వాటికి అడ్డు తగలడం, చెయ్యనీయకుండా ఆపడం. ఇవన్నీ మనస్సుతో చేసే పాపాలు. అబద్ధాలు చెప్పడం, ఇతరులను తిట్టడం, కఠోరంగా మాట్లాడటం, ఇవన్నీ వాక్కుతో చేసే పాపాలు. ఇంక ఇతరులను కొట్టడం, చంపడం, అక్రమంగా బంధించడం, అడ్డమైన తిండ్లూ తినడం, మద్యం తాగడం, పరాయి స్త్రీలను చెరచడం, అనుభవించడం, ఇవన్నీ శరీర సంబంధమైన పాపాలు. ఈ పాపాలన్నింటిలోకీ మద్యపానము మహాపాపము. దీనివలన ఎన్నో అనర్థాలు కలుగుతాయి. మానవులు పాపకూపంలో పడిపోతారు." అని అన్నాడు పరమేశ్వరుడు.

"నాథా! పాపముల గురించి చెప్పారు.మరి పుణ్యకార్యములు అంటే ఏమిటి అవి ఎలా ఉంటాయి." అని అడిగింది.

"పార్వతీ! పుణ్యములు కూడా మూడు రకములు. అవి ఔపరమికము, నిరుపకరణము, సోపకరణము అని మూడు విధములు. ఔపరమికము అనగా పాపాలు చెయ్యకుండా ఉండటం. పాప కార్యాలను విడిచిపెట్టడం. వాటి జోలికి పోకుండా ఉండటం. ఈ పని చెయ్యడానికి ధనం అవసరం లేదు. మనసులో అనుకుంటే చాలు. అన్ని సుఖాలే కలుగుతాయి. చెడ్డ పనులు చెయ్యకుండా ఉండటం మనచేతిలో పని. అదీ కూడా చెయ్యలేక పోతే నరకానికి పోవడం తప్పదు. చెడ్డ పనులు చెయ్యడం మాని వేసిన తరువాత, వేదములు, శాస్త్రములు, పురాణములు చదివి అర్థం చేసుకోవాలి. ఆచరించాలి. ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవాలి. దీనివలన ఈ లోకంలో సుఖాలు

అనుభవించవచ్చు పరలోకంలో కూడా స్వర్గసుఖాలు అనుభవించవచ్చు.

ఇంక నిరుపకరణము అనగా శౌచము అంటే  శుభ్రంగా ఉండటం. అంటే కేవలం శరీరం శుభ్రంగా ఉంటే చాలదు. మనసును కూడా నిర్మలంగా ఉంచుకోవాలి. అబద్ధాలు చెప్పకూడదు.  శాంతంగా ఉండాలి. ఇంద్రియములను అదుపులో ఉంచు కోవాలి.మనసును అదపులో ఉంచుకోవాలి. మంచి ప్రవర్తనలో మెలగాలి. శక్తిమేరకు ఉపవాసములు చెయ్యాలి. వ్రతములు శక్తి కొద్దీ ఆచరించాలి. బ్రహ్మ చర్యము పాటించాలి. దీనిని నిరుపకరణము అని అంటారు.

మొదట చెప్పిన శౌచము బాహ్యము, అభ్యంతరము అని రెండు రకాలు. బాహ్యశుచి  అంటే శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. తినే ఆహారం పరిశుభ్రంగా ఉండాలి.  కంటితో చూసింది, చెవులతో విన్నది బయటకు చెప్పాలి. చెప్పింది చెయ్యాలి.  అంటే ఎల్లప్పుడూ నిజమే చెప్పాలి. ఇంక అభ్యంతర శుచి అంటే మనసును నిర్మలంగా ఉంచుకోవాలి. ఎలాంటి వికారములకు లోను కానివ్వకూడదు.

దేవీ!  పుణ్యనదులలో స్నానం చెయ్యడంతో దేహము పవిత్రమవుతుంది. సముద్రములలో కలిసే నదులను తీర్థములు అంటారు. వాటిలో స్నానం చేస్తే పుణ్యం వస్తుంది. ఈ నదులలో కూడా మునీశ్వరులు తమ తమ పాదములు మోపిన ప్రదేశములు పునీతమ్మైనవి. అలాగే నదులు సముద్రములో కలిసే చోట్లు, రెండు కలిసే చోట్లు పరమ పవిత్రమ్మైనవి. ఈ పుణ్య తీర్థములలో స్నానం చేసే ముందు కాలకృత్యములు తీర్చుకొనాలి. శుభ్రంగా స్నానం చెయ్యాలి. అప్పుడు పుణ్యనదులలో స్నానం చెయ్యాలి. ఎల్లప్పుడూ దూరంగా ఉండి, శ్రమతో కూడిన తీర్థ యాత్ర మంచిది. దగ్గరలో ఉన్న తీర్థములలో స్నానం

ఫలితమును ఇవ్వదు.

ఓ పార్వతీ! పుణ్యములలో మూడవది సోపకరణము. ధనము ధాన్యములుసమృద్ధిగా ఉండి, దాన ధర్మములు, పితృకార్యములు, దేవ కార్యములు చేయు గృహస్థులు చేయు పుణ్య కార్యములను సోపకరణము అంటారు. గృహస్థులు తాము న్యాయంగా సంపాదించిన ధనమును, ధాన్యమును వేదములు, శాస్త్రములు చదువుకొన్న బ్రాహ్మణులకు పుణ్యతీర్థములందు దానము చేయడం వలన పుణ్యం వస్తుంది.

ఈ దానములు కూడా మూడు రకములు. తన శక్తికి మించి దానధర్మములు చెయ్యడం ఉత్తమము. తన శక్తికి తగినట్టు దాన ధర్మములు చెయ్యడం మధ్యమము. తనకు శక్తి ఉండి కూడా, దానికి తగినట్టు దాన ధర్మములు చేయకపోవడం అధమము. దానములు దేవ కార్యములలో, పితృ కార్యములలో చేయదగినవి. తనకు ఇష్టమైన వస్తువును బ్రాహ్మణులకు దానంగా ఇవ్వడం వలన పుణ్యం వస్తుంది. కొంత మంది దానం చేసిన తరువాత అయ్యో ఇంత దానం చేసానే ఎలాగా అని చింతించే వాళ్లు ఉంటారు. అలాగే, దానం చేసిన తరువాత తాను చేసిన దానముల గురించి పొగుడుకొనే వాళ్లు, పొగిడించుకొనే వాళ్లు, ప్రచారం చేసుకొనే వాళ్లు ఉంటారు. వారికి ఆ దానము చేసిన ఫలము దక్కదు. గుప్తదానము శ్రేష్ఠమైనది." అని పరమశివుడు పార్వతితో చెప్పాడు.

"నాధా! దానము ఇయ్యతగిన వస్తువుల గురించి తెలపండి." అని పార్వతి అడుగగా, పరమశివుడు ఈ విధంగా చెప్పాడు.

"పార్వతీ! అన్నము, నీరు అన్ని ప్రాణులకు మూలాధారము. కాబట్టి

దానము చేయతగిన వస్తువులలో కల్లా అన్నము నీరు ముఖ్యమైనవి. అతిథులకు అన్నము, నీరు ఇచ్చి తృప్తిపరిస్తే, వారికి స్వర్గలోక సుఖములు ప్రాప్తిస్తాయి. తరువాత బంగారము అగ్నితో సమానము. కాబట్టి బంగారము దానం చెయ్యడం అగ్నిని దానం చెయ్యడంతో సమానము. తరువాతది గోదానము. బ్రాహ్మణులకు గోవులను దానం చేస్తే ఆ గోవు మీద ఎన్ని రోమములు ఉన్నాయో అని సంవత్సరములు స్వర్గలోకంలో సుఖాలు అనుభవిస్తారు. గోవులలో కపిల గోవు దానం ఇవ్వడం ప్రశస్తమైనది. కపిలగోవును దానం చేస్తే 21 తరాల పితరులు స్వర్గానికి వెళతారు.

తరువాతది భూదానము. భూదానం చేసిన వారు ఆ భూమి ఉన్నంతకాలము స్వర్గసుఖములు అనుభవిస్తారు. ఇంకా భూమిలో సకల సంపదలు ఉంటాయి కాబట్టి భూమిని దానం చేస్తే సకల సంపదలను దానం చేసినట్టే. తరువాతది కన్యాదానము. కన్యాదానం చేస్తే యమధర్మరాజు సంతోషిస్తాడు. దేవతలు ప్రీతి చెందుతారు. కన్యాదానము చేసిన వానికి తేజస్సు, యశస్సు కలుగుతాయి. తరువాతది విద్యాదానము. ఈ విద్యాదానము అర్హులైన వారికే దానం చెయ్యాలి. అపాత్రదానము పనికిరాదు. విద్యాదానం చేసిన వానికి శాశ్వతంగా స్వర్గలోక సుఖం ప్రాప్తిస్తుంది. కొంతమందికి విద్య రాదు. అందుకని వారు విద్యాదానం చెయ్యలేరు అటువంటి వారు, బాగా విద్య వచ్చిన గురువులకు దక్షిణ ఇచ్చి వారి చేత ఇతరులకు విద్య చెప్పించిన ఎడల, వారే స్వయంగా విద్య చెప్పిన ఫలితం దక్కుతుంది.

(పాఠశాలలు కట్టించడం, వాటిని నిర్వహించడం, టీచర్లకు జీత భత్యములు ఇచ్చి చదువులు చెప్పించడం ఈ కోవకు చెందుతాయి. కాని పాఠశాలల మీద పేర్లు చెక్కించుకొని పబ్లిసిటీ కోసం చేస్తే విద్యాదాన ఫలం దక్కదు).

పార్వతీ! నువ్వులు దానంగా ఇస్తే అగ్నిష్టోమ ఫలము; వస్త్రములను దానంగా ఇస్తే దీర్ఘాయుష్షు; గొడుగులు దానం చేస్తే అన్ని పీడల నుండి విముక్తి; దానదాసీజనములను దానంగా ఇస్తే కర్మవిమోచనము; దీపములను దానం చేస్తే ఆత్మ సంతృప్తి; నదులను, జల ప్రవాహములను దాటిస్తే దుఃఖములన్నీ తొలగిపోతాయి; రహదారులు బాగు చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుంది; ఔషధములు దానం చేస్తే దానం చేసిన వాడికి రోగములు తొలగిపోతాయి; ప్రయాణము చేయు బాటసారులకు రహదారుల పక్కన సత్రములు కట్టి ఆశ్రయము కల్పిస్తే అతనికి సకల శుభములు కలుగుతాయి. ఇవీ దానమునకు కలుగు ఫలములు." అని మహేశ్వరుడు పార్వతికి చెప్పాడు.

"నాథా! యజ్ఞములు, వాటి విశేషముల గురించి తెలపండి." అని అడిగాడు.

"పార్వతీ! యజ్ఞములు రెండు విధములు. ఒకటి వైదిక యజ్ఞము. రెండవది లౌకిక యజ్ఞము. వైదిక యజ్ఞము అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు,న్యాయంగా ధనమును సంపాదించి ఆ ధనముతో దేవతలను తృప్తి పరచడానికి ఋత్విక్కులతో చేయించే యజ్ఞములు వైదిక యజ్ఞములు అని అంటారు. ఇంక దేవతలకు చేసే ఉత్సవములు, బ్రహ్మోత్సవములు, గీత, వాద్య, నృత్య ప్రదర్శనలు, ధూప,దీప,నైవేద్యములు, ఊరేగింపులు, రథోత్సవములు, మొదలగునవి లౌకిక యజ్ఞములు. ఈ రెండునూ దేవతలకు ప్రీతిపాత్రములే. దాన ధర్మాలు చెయ్యడం, మంచి వ్రతాలు ఆచరించడం, ఇవన్నీ కూడా యజ్ఞములకు సాటిరావు. యజ్ఞము చేసిన వాడు లోకోత్తరుడు. అతనికి ఇవ్వడం, అతని నుంచి తీసుకోవడం అధికమైన పుణ్యమును కలుగజేస్తుంది.

కాని ఈ వైదిక యజ్ఞములు, లౌకిక యజ్ఞములు శ్రద్ధాభక్తులతో చెయ్యాలి. కాని మనసు ఎక్కడో పెట్టుకొని చెయ్యరాదు. పైగా చెయ్యాల్సి వచ్చిందే అని కూడా చెయ్యకూడదు. అలా చేస్తే ఆ యజ్ఞములకు రావలసిన ఫలితము దక్కదు." అని చెప్పాడు మహేశ్వరుడు.

"నాథా! మీరునాకు దేవ యజ్ఞముల గురించి తెలిపారు. పితృయజ్ఞముల గురించి కూడా తెలపండి." అని అడిగింది.

"ఓ పార్వతీ! గయ, కురుక్షేత్రము, గంగ మొదలగు పుణ్యక్షేత్రములు అధికంగా ఫలితాన్ని ఇస్తాయి. మాఘమాసము, భాద్రపదమాస బహుళ పక్షము, అమావాస్య, ద్వాదశి, నవమి తిథులు, ఆ తిథులలో అపరాహ్ణ సమయము (దీనినే మనము మహాలయ పక్షము అని పిలుస్తాము) పితృ కార్యములకు శ్రేష్టము. అపరాహ్ణ కాలము, దౌహిత్రుడు, నువ్వులు పితృ కార్యములకు ముఖ్యమైనవి. పితృకార్యములయందు కోపము పనికిరాదు. అతిశుభ్రంగా ఉండాలి. మనసు నిర్మలంగా ఉండాలి. పితృకార్యములలో నెయ్యి, పెసలు, పెసలపప్పు తో కూడిన పాయసము, పిండి వంటలు ప్రధానమైన వంటకములు. పితృకార్యములకు శుక్లపక్షము, అనగా అమావాస్య తరువాత వచ్చు పాడ్యమినుండి పౌర్ణమి వరకు ఉండే తిథులు, ఉదయం పూట, మధ్యాహ్నానికి ముందు, సరి తిథులు (విదియ, చవితి మొదలగునవి)పుట్టిన రోజులు పితృకర్మలకు పనికిరావు.

ఇంక పితృకర్మలకు పిలువ బడేవారు వేదము చదువుకొన్న వారు అయి ఉండాలి. రోగిష్టి వాడు, వికలాంగుడు, పనికిరారు. సరి గోత్రము వాడు, భార్య చనిపోయిన వాడు, ఇతర కులముల వారు పనికిరారు. పితృకార్యములలో నియమించిన వారిని గంధము, పుష్పములు, ధూపము, దీపములతో

అర్చించాలి. వస్త్రములు ఇవ్వాలి. భోజనము పెట్టాలి. తరువాత పిండప్రదానము చెయ్యాలి.” అని చెప్పాడు పరమశివుడు.

తరువాత పార్వతి ఇలా అంది. “నాథా! మానవులు చనిపోగానే మరలా వెంటనే ఏదో ఒక జన్మ ఎత్తుతారు కదా! మరి ఎవరి కోసం ఈ పితృకార్యములు, పిండప్రదానములు చెయ్యాలి. వివరంగా తెలపండి.”

ఆ ప్రశ్న పార్వతి అడగగానే అక్కడ ఉన్న వారందరూ ఆశ్చర్యపోయారు. పరమశివుడు ఏమి సమాధానము ఇస్తాడో అని ఆతురతగా ఎదురు చూచారు.

( ఈ సందేహము ఈ రోజుల్లో చాలా మందికి వస్తూ ఉంది. మన అందరి బదులు పార్వతీ ఈ ప్రశ్న శివుడిని అడిగి సమాధానం రాబట్టింది).

“పార్వతీ! నువ్వు అడిగిన ప్రశ్న చాలా సందేహములతో కూడుకొన్నది. పరమ రహస్యము కూడాను. పితరులుకూడా దేవతల వంటివారే. దేవతలు ఉత్తరదిక్కున ఉంటారు. పితరులు దక్షిణ దిశలో ఉంటారు. దేవతా పూజలకు హవ్యము అనీ, పితరుల పూజలకు కవ్యమనీ పేర్లు. పితృకార్యములు చేస్తే దేవతలు సంతోషించి ఆ కర్తకు ఆయుష్షు, ధనము, కీర్తి ప్రసాదిస్తారు. పితృ గణములు దేవతలకు, అసురులకు, గరుడులకు, యక్షులకు మొదలగు వారికి పూజనీయులు.

(పరమశివుడు కూడా ఈ ప్రశ్నకు సరి అయిన సమాధానం ఇవ్వకుండా ఏదో ఒకటి చెప్పి దాటవేసాడు. కాని నాకు తెలిసినంతవరకూ పితృకార్యములు చెయ్యడం, తద్దినములు, శ్రాద్ధములు పెట్టడం, చని పోయిన వారి పట్ల మనకు ఉన్న భక్తి,శ్రద్ధ,ప్రేమ,అభిమానము ప్రకటించుకోవడం తప్ప వేరుకాదు.

పెద్దవాళ్లు చనిపోయిన రోజున ఇద్దరు బ్రాహ్మణులకు భోజనం పెట్టి, పిండముల రూపంలో పక్షులకు ఆహారం పెడితే, మనకు జన్మ ఇచ్చినందుకు, తోడపుట్టినందుకు, కట్టుకున్నందుకు వారి ఋణం తీర్చుకున్నట్టు అవుతుంది. అంతేకానీ, వాళ్లు మరలా పుట్టారా, లేదా, ఒక వేళ పుట్టి ఉంటే బతికి ఉన్న వారికి తద్దినాలు పెట్టినట్టు అవుతుంది కదా! అనే కుశంకలు లేవదియ్య కూడదు. ఇవన్నీ చచ్చిన వాళ్ళు ఎటూ చచ్చారు ఈ ఖర్చుకూడా ఎందుకు దండగ అని తద్దినాలు పెట్టకుండా ఎగ్గొట్టడానికి వేసే ఎత్తులు తప్ప వేరు కావు. ఇష్టం లేని వారు మానుకోవాలి గాని ఇలాంటి వితండ వాదాలు చెయ్యరాదు.).

ఓ పార్వతీ శ్రద్ధగా విను. కుంచెడు దాన్యము రాబడి కలవాడు, ఆ కుంచెడు ధాన్యము దానంగా ఇచ్చినా, కోటి రూపాయల రాబడి కలవాడు, ఆ కోటి రూపాయలు దానంగా ఇచ్చినా, రెండూ సమానమే. కాబట్టి దానములు తనకు శక్తికి తగినట్టు చెయ్యాలి. అప్పుడే తగిన ఫలితాన్ని ఇస్తాయి. ఏ దానం చేసినా మనసులో తిట్టు కోకుండా, ప్రేమతో మనసారా ఇస్తే ఆ దానము సత్ఫలితాలను ఇస్తుంది.

ఓ పార్వతీ! ఇంకా నీకు కొన్ని ధర్మముల గురించి చెబుతాను విను.వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులిచ్చి ఆదుకోవడం, కష్టాలలో ఉన్న వారికి సాయం చెయ్యడం, యాత్రికులకు అన్న పానాదులు ఇచ్చి వారి ఆకలి దప్పులు తీర్చడం, దిక్కులేని అనాధ శవాలకు అంతిమ సంస్కారములు చెయ్యడం, దుఃఖంతో బాధపడుతున్న వారిని ఓదార్చడం, ఓర్పు కలిగి ఉండటం మానవుని ముఖ్యధర్మములు." అని చెప్పాడు ఈశ్వరుడు.

"నాధా! ధర్మము నానావిధములుగా ఉంటుంది అంటారు కదా. ఆ ధర్మముల యొక్క విశేషముల గురించి తెలియచెయ్యండి." అని

అడిగిందిపార్వతి.

" పార్వతీ! శ్రుతులలో స్మృతులలో చెప్పబడిన ధర్మవిశేషములను వివరిస్తాను. ధర్మములలో జాతి ధర్మములనీ, కుల ధర్మములనీ, గణ ధర్మములనీ, శరీరములను బట్టీ కాలముల బట్టి మారే ఆపద్ధర్మమూ, అని ధర్మములు ఐదు విధములు." అని చెప్పాడు పరమశివుడు.

" నాధా!పుణ్యలోకములలో భోగములు ఎలా ఉంటాయి వివరించండి." అని అడిగింది.

" పార్వతీ! ఆ లోకములలో పుష్పములు ఆయాఋతువులను బట్టి పూస్తూ ఉంటాయి. కల్పతరువుల నుండి శరీరానికి పూసుకొనే లేపనము సువాసనలు వెదజల్లుతూ ఉంటుంది. అక్కడ అమృతమే ఆహారము. అక్కడ దుస్తులు మలినము లేనివి. ఆభరణములు నిరుపమానంగా మెరుస్తూ ఉంటాయి. అక్కడ అందరూ పరస్పరమూ స్నేహభావంతో మెలగుతూ ఉంటారు. అక్కడ ఉన్నవారి మనసుల్లో మార్దవము, సుగుణములు విరాజిల్లుతుంటాయి. అక్కడ సుఖం తప్ప దుఃఖం లేదు. అక్కడ కోపము మొదలగు దుర్గుణములకు తావు లేదు. అక్కడ ఉన్న వారు రోగములు, ముసలి తనము అనేది తెలియకుండా నిరంతరమూ ఆనందంలో తేలియాడుతుంటారు." అని చెప్పాడు మహేశ్వరుడు.

" ఓ నాధా! చని పోయిన తరువాత వీరు సుగతికి (స్వర్గానికి) పోవాలి వీరు (దుర్గతికి) నరకానికి పోవాలి అని ఎవరు ఎలా నిర్ణయిస్తారు." అని అడిగింది పార్వతి.

"ఓ పార్వతీ! తన తోటి వారికి కీడు తలపెట్టని వారు, ఎల్లప్పుడూ ధర్మంగా బతికేవారూ, సజ్జనులను, గురువులను పూజించేవారూ, ఎల్లప్పుడూ సత్యమునే మాట్లాడేవారూ, దీనులను ఆదరించేవారూ, అతిథులను పూజించేవారూ, ఇతరుల పట్ల దయ, జాలి కలవారు, వీరందరూ స్వర్గమునకు పోవుటకు అర్హులు అని తెలుసుకొనవలెను.

పరుషంగా మాట్లాడేవారూ, అబద్ధాలు చెప్పేవారూ, ఇతరుల ధనమును కోరుకొనే వారూ, ఇతరుల భార్యలను కోరుకొనే వారు, బంధువులను, సజ్జనులను ద్వేషించేవారూ, దుర్మార్గులతో స్నేహం చేసేవారూ, ధర్మంగా జీవించే వారి పట్ల ద్వేషం పెంచుకొనే వారూ, వీరందరూ ఘోర నరకానికి పోయేవారు అని తెలుసుకోవాలి. " అని చెప్పాడు పరమేశ్వరుడు.

"స్వామీ! ధర్మాలు ఎన్నో ఉన్నాయి కదా! అందులో ఉత్తమమైన ధర్మము ఏది?" అని అడిగింది పార్వతి.

" ఓ పర్వతరాజపుత్రీ! పురుషార్థములు నాలుగు. ధర్మము, అర్థము, కామము, మోక్షము. అందులో మొదటి మూడు అయిన ధర్మ,అర్థ,కామముల వలన కలిగే సుఖములు అశాశ్వతములు. ఎన్నటికైనా నశిస్తాయి. కాని ఆఖరిది అయిన మోక్షము శాశ్వతమైనది. సుఖప్రదమైనది. అది ఎన్నటికీ నశించదు. కాబట్టి మొదటి మూడు పురుషార్థములలోకి మోక్షము అత్యుత్తమమైనది.

మోక్షము ఎలా పొందాలో నీకు చెబుతాను విను. మానవుడు గృహస్థాశ్రమము స్వీకరించి న తరువాత ఋణములు అన్నీ తీర్చుకుంటాడు. అంటే దేవఋణము, పితృఋణము,ఋషిఋణము, మనుష్యఋణము తీర్చుకుంటాడు. తరువాత వానప్రస్థమునకు వెళతాడు. అక్కడ అడవులలో

నివసిస్తాడు. ప్రశాంత వాతావరణములో, నిర్మలమైన మనస్సుతో మునుల వద్దనుండి సాంఖ్యమును అభ్యసిస్తాడు. సాంఖ్యము నగా 25 తత్త్వముల జ్ఞానమును తెలుసుకోవడమే.తరువాత యోగాభ్యాసము చేస్తాడు. సాంఖ్యమూ యోగమూ రెండూ ఒకటే. తరువాత సుఖదుఃఖములు, రాగద్వేషములు మొదలగు ద్వంద్వములను జయిస్తాడు. తరువాత శౌచము, బ్రహ్మచర్యము, శాంత జీవనము, మితాహారము తీసుకోవడం పాటిస్తాడు. మనస్సును అంతర్ముఖం చేస్తాడు. మధ్య మధ్య వచ్చే అవాంతరములను తొలగించుకుంటూ మోక్ష మార్గాన పయనిస్తాడు. ఇదీ మోక్ష ధర్మము. ఇది నిరంతర అభ్యాసము వలన మాత్రమే కలుగుతుంది. ఈ మోక్ష మార్గము మానవుని జనన మరణ చక్రము నుండి విముక్తుడిని చేస్తుంది. మానవుడు సంసారము నందు విముఖత చెందనంతవరకూ మోక్ష మార్గములో పయనించలేడు. ఈ ప్రాపంచిక విషయముల మీద మనసు విరక్తి కలిగినపుడే మానవుడు మోక్ష మార్గము పొందగలడు.

" ఓ పార్వతీ! మనసులో ఉన్న చింతలన్నీ వదిలిపెడితేగానీ, అందరి యందు సమత్వము, సమభావన కలిగితే గానీ, తృష్ణ, ఆశ, లోభత్వము విడిచిపెడితే గానీ పైన చెప్పిన విరక్తి కలగదు. వాటి స్వభావమును వివరిస్తాను విను. ఉన్న ధనము పోయినా, దగ్గర బంధువులు చనిపోయినా, దాని గురించి విచారించడం మానుకోవాలి. పోయిన ధనం గురించి, చనిపోయిన బంధువుల గురించి దుఃఖించడం వలన, దుఃఖము పెరుగుతుందే గానీ తరగదు. కాబట్టి దుఃఖించడం అనవసరము. ఎందుకంటే సుఖము, దుఃఖము ఒకదాని వెంట వస్తూ పోతూ ఉంటాయి. స్వర్గలోకాధి పతి దేవేంద్రునికి కూడా సుఖము, దుఃఖము మరలా సుఖము ఒకటి వెంట ఒకటి వచ్చాయి.

(మీకు గుర్తు ఉండే ఉంటుంది. దేవేంద్రుడు వృత్రాసురుని చంపాడు. అందువల్ల బ్రహ్మ హత్యాపాతకము చుట్టుకుంది. దానితో దేవేంద్ర పదవిపోయింది. బ్రహ్మహత్యాపాతకమునకు భయపడి, భార్యను కూడా వదిలి పారిపోయి తామరతూడు నాళములో దాక్కున్నాడు. తరువాత నహుషుడు దేవేంద్రపదవిని అధిష్టించాడు. గర్వం తలకెక్కింది. దేవేంద్రుని భార్యను కామించాడు. సప్తఋషుల చేత తన పల్లకీ మోయించాడు. శాపగ్రస్తు డయ్యాడు. ఉన్న పదవి ఊడింది. భూలోకంలో వచ్చి పడ్డాడు. దేవేంద్రుడు అశ్వమేధయాగము చేసి, బ్రహ్మ హత్యాపాతకమునుండి విముక్తి పొంది మరలా దేవేంద్ర పదవిని చేపట్టాడు. కాబట్టి దేవేంద్ర పదవిలో ఉన్న వాడికైనా సుఖము, దుఃఖము, మరలా సుఖము ఒకదాని వెంట ఒకటి వస్తూ ఉంటాయి అని అర్థం.)

ఈ ప్రపంచంలో మన కంటికి కనిపించే ప్రతి ప్రాణీ, ప్రతి వస్తువు పరిణామం చెందడం కానీ, నాశనం అవడం కానీ తథ్యము. ఈ సత్యము తెలిస్తే దుఃఖము కలగదు. కాబట్టి నాశనం అయ్యేవాటి గురించి చింతించడం అవివేకము. ఇతరుల నుండి ధనమును వస్తువులను స్వీకరించడం, ఆశపడటం అవివేకము. కాని ఎప్పుడూ ఎదుటి వారి వద్దనుండి ధనమును, వస్తువులను స్వీకరించేవాడు, పట్టు పురుగు తన దారాలతో తనను ఎలా బంధించు కుంటుందో అలా తనను తాను బంధించుకుంటాడు.

పార్వతీ! మానవునకు ధనం సంపాదించడం, సంపాదించిన ధనం కాపాడటం, ఆ ధనమును ఖర్చు చెయ్యడం, ఆ ధనము పోతే దాని కొరకు దుఃఖించడం ప్రధాన వ్యాపకాలు. కాబట్టి అన్ని దుఃఖములకు మూలము ధనము. ఆ ధనమే లేకపోతే దుఃఖమే లేదు. ధనము తరువాత ఆశ మానవుని నాశనం చేస్తుంది. ఆశను మించిన దుఃఖము మరొకటి లేదు. ఆశను వదిలి

పెడితే కలిగే సుఖము దేనికీ సమానము కాదు.

ఆశ అనేది మనిషి తో పాటు పుడుతుంది. మనిషి చచ్చిన దాకా అతనిలోని ఆశ చావదు. కాబట్టి ఆశ అనేది మనిషి ప్రాణాలు తీయగల ప్రాణాంతక వ్యాధి. కోరికలు అనేవి ఒకటి వెంట ఒకటి పుడుతూ ఉంటాయి. కోరికలు అనుభవిస్తే తీరేవి కావు. అగ్నిలో నెయ్యి పోస్తే అగ్ని ఆరిపోతుందా! అలాగే అనుభవించే కొద్దీ కొత్త కొత్త కోరికలు పుట్టుకొస్తూ ఉంటాయి. కోరికలను ఆశను అదుపులో పెట్టుకుంటే అంతులేని సుఖం కలుగుతుంది. మానవుడు ఇంద్రియములను నిగ్రహించుకోవాలి. ఇంద్రియములను వాటి ఇష్టం వచ్చినట్టు పోనిస్తే అవి చేయకూడని పనులు చేసి దుఃఖమును కలిగిస్తాయి. అలా కాకుండా ఇంద్రియములను నిరోధిస్తే మానవునికి సుఖం కలుగుతుంది. మరణం తరువాత సద్గతులు కలుగుతాయి.

ఎప్పుడూ ధనము సంపాదించడంలోనూ, ఇంద్రియసుఖములు అనుభవించడంలోనూ మునిగి తేలేవాడిని మృత్యువు ఒక్కసారిగా మీద పడి, అడవిలో పెద్దపులి మేక మీద పడి కబళించినట్టు కబళిస్తుంది. మానవుడు సంపాదించిన ధనము, వాడు చేసిన దాన ధర్మములు, యజ్ఞములు, యాగములు, అతనిని మృత్యువు నుండి కాపాడలేవు. పుట్టినవాడు చావక తప్పదు. కేవలం మోక్ష సాధనతోనే ఈ జనన మరణ చక్రము నుండి విముక్తి పొందగలడు. మానవుని జీవితంలో ఒక్కొక్క రోజు, ఒక్కొక్క నెల, ఒక్కొక్క సంవత్సరము గడిచేకొద్దీ అతని ఆయువు క్షీణిస్తూ ఉంటుంది. అతడు మృత్యువుకు దగ్గర అవుతుంటాడు. కాబట్టి రేపటి పని ఈరోజు, తరువాత చెయ్యాల్సిన పని ఇప్పుడే చేయాలి. కాలయాపన, అలసత్వము సోమరితనము పనికిరాదు. కాలమునకు వశుడైన మానవునకు ఏమరిపాటు సహజము. కాలం గడిచేకొద్దీ ఆయుష్షు తరిగిపోతూ ఉందని గ్రహించిన నాడు ఈ సంసారము

మీద విరక్తి కలుగుతుంది.  ఆ విరక్తియే  ముక్తి మార్గమునకు సోపానము వంటిది.

ఓ పార్వతీ! ఈ ప్రాపంచిక సుఖముల మీద కోరిక, ఆశ లేకపోతే, అతడు మనస్సును జయించగలడు. దాని వలన ముక్తి లభిస్తుంది. జరామరణ చక్రము నుండి విముక్తి కలుగుతుంది.

ఓ పార్వతీ! ఇప్పుడు నీకు సాంఖ్యమును గురించి చెబుతాను విను. ఈ సాంఖ్యయోగము సంసారము అనే జబ్బుకు మంచి మందు. సాంఖ్య యోగులు జ్ఞాన సముపార్జనతో ముక్తి పొందుతారు. కాని ఈ శరీరంతో తపస్సుచేయడం, శరీరాన్ని శుష్కింపచేయడం వృథా ప్రయాస. కేవలం జ్ఞానము వలననే మోక్షము పొందగలము. ఈ ప్రకృతికి అవ్యక్తము అనే పేరు కూడా ఉంది.  ఈ ప్రకృతి లోనుండి మహతత్త్వము, అహంకారము,మనస్సు, ఇంద్రియములు(10), పంచభూతములు(5), వాటి గుణములు(5) ఆవిర్భవించాయి.  ఇవి అన్నీ కలిపి 24. 25వ తత్త్వము ఆత్మ.  ఈ ఆత్మ సత్వ, రజస్ తమో గుణములతో ప్రభావితమవుతుంది. వీటి  ఆధారంతో ప్రకృతిలో సృష్టి జరుగుతుంది. అవ్యక్తమైన ప్రకృతి అణువు ఏకము. అనగా అణువు ఒక్కటే. అవిచ్ఛిన్నము. కంటికి కనపడదు. ఇదే సృష్టికి ప్రధానము.

సౌఖ్యము, తృప్తి, ప్రకాశము సత్వగుణ లక్షణములు. సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, మొదలగు ద్వంద్వములు రజోగుణ లక్షణములు.  అజ్ఞానము, భయము, తనకు అంతా తెలుసు అని భ్రమపడటం, విపరీత జ్ఞానము కలిగి ఉండటం, ఏపనీ  చెయ్యకపోవడం, అలసత్వము ఇవి తమోగుణలక్షణములు. సత్త్వగుణము ప్రధానముగా కలవానికి ధైర్యము, విజ్ఞానము, శ్రద్ధ, దేని మీదా మోహము లేకపోవడం,ఇతరుల పట్ల దయ, ఎప్పుడూ సంతోషంగా ఉండటం,

అనేవి ప్రధాన గుణములు. ఈ గుణములు లేకపోతే సత్త్వగుణము కూడా నశించి పోతుంది. కోపము, లోభము, కామము, ద్రోహ చింతన, దుఃఖము, ఇవి రజోగుణ ప్రధానములు. ఈ గుణములు విడిచిపెడితే రజోగుణము నశించి పోతుంది. ఎల్లప్పుడు ప్రతిదీనికి సంశయించడం, విషాదము, జడత్వము ( ఏ పనీ చెయ్యకుండా సోమరిగా పడి ఉండటం, ఎల్లప్పుడూ నిద్రపోవడం), ఇవీ తమోగుణ ప్రధానములు. ఈ గుణములు తగ్గించుకుంటే తమోగుణము నశించి పోతుంది. ఈ మూడు గుణములూ ప్రతి మనిషిలోనూ హెచ్చుతగ్గులుగా ఉంటూ ఉంటాయి. ఒకటి ఎక్కువయితే మిగిలిన రెండూ తగ్గుముఖం పడతాయి. రెండు ఎక్కువగా ఉంటే మిగిలింది తక్కువగా ఉంటుంది.

సత్వగుణము ఎక్కువగా ఉన్నప్పుడు మనిషి తేజస్సుతో ప్రకాశిస్తూ ఉంటాడు. ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటాడు. రజోగుణము ఎక్కువగా ఉన్నప్పుడు ఎప్పుడూ కోపంగా ఉంటాడు. దుఃఖిస్తూ ఉంటాడు. తమోగుణము ఎక్కువగా ఉంటే కామ కోరికలు, అన్ని తనకు కావాలనుకోవడం, అవి దక్కక పోతే దుఃఖపడుతూ ఉంటాడు. మానవుడు ఈ గుణముల ప్రభావానికి లోను కాకుండా ఉంటే జితేంద్రియుడు అవుతాడు. ఈ గుణముల ప్రభావంతో చేసే పనుల వలననే మానవునికి దేవలోక ప్రాప్తి, మనుష్యలోకములో పుట్టడం లేక జంతువులలో, పశుపక్ష్యాదులలో పుట్టడం జరుగుతూ ఉంటుంది.

మహతత్త్వమునే బుద్ధి అని కూడా అంటాము. ఈ బుద్ధి వివేకమునకు, జ్ఞానమునకు గుర్తు. అహంకారము సృష్టికి మూలము. అహంకారము వదిలితే ముక్తి దానంతట అదే వస్తుంది. ఇంక మనస్సు. ఇది ఇంద్రియముల ద్వారా ప్రకృతిలో సంచరిస్తూ ఉంటుంది. ఇంద్రియలోలత్వమునకు, ఇంద్రియ

నిగ్రహమునకు ఈ మనస్సే కారణము.

ఇంక ఈ శరీరము పంచభూతము లతో నిర్మింపబడినది. పంచభూతముల గుణములైన శబ్ద,స్పర్శ, రస,గంధ, రూపములు ఈ శరీరము ద్వారా ప్రకటింపబడుతూ ఉంటాయి. ఈ దేహము ఆత్మ కాదు. ఆత్మకంటే వేరైనది. జీవాత్మ ఈ దేహములో అవ్యక్తంగా ప్రకాశిస్తూ ఉన్నాడు. కాని మానవులు తానే దేహము అనే అజ్ఞానములో ఉంటారు. అన్నీ తామే చేస్తున్నాము, తమ వల్లనే జరుగుతున్నాయి అనుకుంటారు. కాని తాను వేరు, ఈ దేహము వేరు అనుకొని మనస్సును ప్రకృతి వైపు నుండి పరమాత్మ వంకకు మళ్లించిన వాడు. ముక్తిపొందుతాడు. దేహాభి మానము పూర్తిగా నశిస్తేనేగాని ఇది సాధ్యంకాదు. ఈ తత్త్వమే 25వ తత్త్వము. ప్రకృతిని వదిలిపెట్టి ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ విజ్ఞానము పరమ శాంతి ప్రదము.

ఇంక అన్నిటికీ అధిష్ఠానము అయిన పరమాత్మతత్త్వము 26వ తత్త్వము. దానికి ఈ శబ్ద,స్పర్శ,రూప,రస,గంధాలు అంటవు. ఇది నిత్యము. శాశ్వతము, అవ్యయము. అన్నిటి లోనూ ఉంటుంది. సర్వేసర్వత్రా వ్యాపించి ఉంటుంది. అతి సూక్ష్మమైనది. అత్యంత విశాలమైనది. ఇంద్రియములకు గోచరము కానిది. ఇదే 26వ తత్త్వము. ఆ తత్త్వమునే పరమాత్మ అని పిలుస్తారు. ఇదే మోక్ష పదము. సమదృష్టి కలవారు ఈ మోక్ష పదమునకు అర్హులు.

ఓ పార్వతీ! నీకు ఇప్పుడు చెప్పిన సాంఖ్యము కపిల మహర్షి సేవించిన ధర్మము. ఇంక యోగమార్గము గురించి చెబుతాను విను. ఈ దేహము, ఇంద్రియములు, మనసు, బుద్ధి, ఆత్మ ఇవన్నీ ఒకటే-- వేరు కావు అని అనుకోవడమే యోగము. ప్రతిరోజూ అగ్నిహోత్రము చెయ్యడం, అధికంగా మాట్లాడకుండా ఉండటం, సత్త్వగుణము కలిగి ఉంటడం, అర్హులైన వారికి

దానములుచెయ్యడం, వేదాభ్యాసము, ఎల్లప్పుడూ శుచిగా ఉండటం, సత్యము పలకడం, వీటిని అనుసరించడం వలన మానవునిలోని పాపాలు నశించి పోతాయి. అతడు యోగమార్గము అవలంబించడానికి అర్హుడవుతాడు.

యోగాభ్యాసమునకు ముందు మనస్సును నిగ్రహించాలి. మనస్సును ఇష్టం వచ్చినట్టు పోనీయరాదు. శుచిగా శుభ్రంగా ఉండాలి. ఏకాంత ప్రదేశములో మెత్తని ఆసనము మీద కూర్చోవాలి. నడుము దగ్గర నుండి తల దాకా నిటారుగా ఉండేటట్టు కూర్చోవాలి. ఇంద్రియములను మనస్సును ఏకం చెయ్యాలి. మనస్సును ఆత్మలో లీనం చెయ్యాలి. ప్రాణ అపాన వాయువులను క్రమబద్ధంగా ఉంచాలి. ( ఉచ్ఛ్వాస నిశ్వాసములను క్రమబద్ధంగా లోపలకు పీలుస్తూ బయటకు వదులుతూ ఉండాలి.) మానవుడు ఈ దశలో ఉన్నప్పుడు ప్రాణవాయువు అపానముతో కూడి ఊర్ధ్వ ముఖంగా (అంటే పైకి) పయనించి శిరస్సు దగ్గరకు చేరుతుంది. అప్పుడు జీవాత్మ పరమాత్మ గా వెలుగుతాడు. .

యోగమును అనుష్టానము చెయ్యడానికి సోమరి తనము, పరధ్యానము, అత్యాశ, ఇతరుల పట్ల ఆదరం లేకపోవడం, రోగములు, స్వప్నములు (కలలు) లోభత్వము, భయము, కామము, క్రోధము, సుఖములు అనుభవించాలనే కోరిక, చంచలత్వము, మొదలగు దుష్టస్వభావములు అత్యంత విరోధులు. పైన చెప్పిన లక్షణములు ఉన్నవారు యోగాభ్యాసమునకు పనికిరారు. ఈ యోగా భ్యాసము నిష్టతో చేస్తే అతనికి అష్టసిద్ధులు లభిస్తాయి. అలాంటి యోగి స్వేచ్ఛగా ఎక్కడంటే అక్కడ తిరగ గలడు.

యోగి ఎక్కువగా నిద్రపోకూడదు. అలా అని అసలు నిద్రలేకుండా ఉండకూడదు. ఎక్కువగా తినకూడదు. అలా అని అసలు తినకుండా ఉండకూడదు. ఏదైనా మితంగా ఉండాలి. అటువంటి యోగికి యోగం

సిద్ధిస్తుంది. ఇదే యోగధర్మము." అని చెప్పాడు మహేశ్వరుడు.

" ఓ నాథా! మీ దయ వలన సాంఖ్యము, యోగము గురించి తెలుసు కున్నాను. భక్తులు పరమాత్మలో లీనం కావడానికి ఎటువంటి పరిచర్యలు చెయ్యాలి." అని అడిగింది పార్వతి.

" ఓ పార్వతీ! దేవతలకు కానీ మానవులకు కానీ పరమాత్మను గురించి తెలుసుకోవడం అసాధ్యం. ఎందుకుంటే సాంఖ్యము, యోగము ఈ రెండూ పరమాత్మస్వరూపాలే. ఆ పరమాత్మను నేను. నేను సనాతనుడను. అవ్యయుడను. సత్యమే నాస్వరూపము. నా దయలేనిది నన్ను ఎవరూ దర్శించలేరు. నన్ను చేరుకోడానికి మంత్రము, జపము, నిరంతర పరమాత్మ చింతన, స్తోత్రములు, నమస్కారములు ఇవన్నీ నిష్టతో చేస్తే పరమాత్మను చేరుకోవచ్చు.

పూర్వము నేను నాలుగు ఆశ్రమముల గురించి, పాశుపతమహావ్రతము గురించి నలుగురు విప్రులకు బోధించాను. వారు దానిని తమ శిష్యులకు బోదించారు. ఆ ప్రకారంగా లోకమంతా విస్తరించింది. సకల శుభములు కలుగుటకు, శుచిగా ఉండటానికి, నా స్వరూపమైన లింగార్చనకు నేను విభూతిని రూపొందించాను. యోగులు ఆ విభూతిని శరీరం అంతా అలుముకొని, కపాలము చేత బూని, తల గొరిగించుకొని, బిక్షాటన చేయుచూ, మనో నిగ్రహంతో మెలగుతూ, నా మీదనే మనసు నిలిపి, ఇతరకోరికల మీదకు మనసు పోనియక, పరమానందైక అనుభూతిని అనుభవిస్తారు. కేవలం ఈ ప్రకారము సంగమును విడిచిన యోగులు నా సాయుజ్యమును పొందగలరు. నిరాకారంగా నిస్సంగంగా నన్ను పూజించుట కొరకు నేను మూడు లోకములలో ఏ ఆకారమూ లేని శివలింగములను

స్థాపించాను. ఆ లింగములను నా స్వరూపములు గా పూజిస్తే నేను వారికి ప్రసన్నుడనవుతాను. ఆ లింగములకు ఎవరికి తోచినట్టు, ఎవరి శక్తికి తగినట్టు వారు పాలతో గానీ, నెయ్యితోగానీ, లేక నీరుతో గానీ ఆ లింగములను అభిషేకించవచ్చును. నాకు మారుగా ఆ లింగములకు గంధము, పుష్పములు, ధూపము, దీపము, నైవేద్యములు సమర్పించ వచ్చును. ఆ లింగములను పూజిస్తే పరమేశ్వరడునైన నన్ను పూజించి నట్టే.

ఓ పార్వతీ! నా గురించి నేను చెప్పాను కదా. మరి స్త్రీ ధర్మము గురించి నీ నుంచి తెలుసుకోవాలని ఉంది. చెప్పవా." అని అడిగాడు పరమేశ్వరుడు.

ఆ మాటకు పార్వతీ దేవి సిగ్గు పడి "అయ్యో! నేను మీకు చెప్పగలదాననా! అయినా మీరు సర్వజ్ఞులు. మీకు తెలియనిది ఏదీ లేదు. కాని నన్ను అడిగారు. నేను చెప్పకుండా ఉండటం భావ్యం కాదు. అందుకని నా తెలిసి నంతవరకూ స్త్రీ ధర్మము గురించి చెబుతాను. కాని నేను, ముందు నన్ను ఎప్పుడ విడువకుండా సేవించే నదులతో సంప్రదించి తరువాత మనవి చేస్తాను." అని చెప్పి గంగా, యమునా, గోదావరి, కౌశికి, కావేరి, కృష్ణవేణి, పెన్న, నర్మద, బాహుద, రేవ, తమస మొదలగు నదులను మనసులో తలచుకొంది. వారు స్త్రీ రూపములతో పార్వతి ముందు నిలిచారు. వారికి పరమేశ్వరుడు తనను స్త్రీధర్మము గురించి అడగడం, తనకు ఎలా చెప్పాలో తెలియక వారిని తలచుకొన్నాను అని చెప్పింది పార్వతీ.

" ఓ పార్వతీ! నీ కంటే మాకు ఎక్కువ ఏమి తెలుసు. నీకు తెలిసినంత వరకూ స్త్రీధర్మమును నీ భర్తకు చెప్పి ఆయనకు సంతోషము కలిగించు. మేము కూడా నీ నోటి నుండి వచ్చు అమృతవాక్కులను వినడానికి కుతూహలంగా ఉన్నాము." అని అన్నారు.

అప్పుడు పార్వతీ మహేశ్వరుని మీద చూపు నిలిపి ఇలా చెప్పింది. "ఓ దేవా! నీ అనుగ్రహంతో నాకు అబ్బిన తెలివితో మీ అందరికీ స్త్రీధర్మము గురించి చెబుతున్నాను. స్త్రీ రజస్వల కాక ముందు కన్య అని పిలువబడుతుంది. తల్లి తండ్రులు కానీ, పిన తండ్రి కానీ, మేనమామలు కానీ, అన్నదమ్ములు కానీ, వీరిలో ఎవరైనా కన్యను తగిన వరుడితో వివాహం జరిపించడానికి అర్హులు.

స్త్రీకి వివాహము తర్వాత భర్త కు ఆమె మీద సర్వహక్కులు సంక్రమిస్తాయి. భర్తయే భార్యకు ప్రభువు, దైవము. భర్తతో కూడి భార్య, ఆయన అనుమతితో దేవతా పూజలు, పితృతర్పణములు, అతిధి పూజలు, ఆచరించాలి. ఎల్లప్పుడూ భర్త హితము కోరుతూ ఉండాలి. ఇటువంటి పతివ్రత ఈ లోకములోనే కాదు పరలోకములో కూడా సుఖములు అనుభవిస్తుంది.

ఈ సందర్భంలో మీకు ఒక విషయం చెబుతాను వినండి. ఒక బ్రాహ్మణునికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య ఎల్లప్పుడూ భర్త క్షేమం కోరుతూ ఆయన చెప్పినా చెప్పకపోయినా దేవతా పూజలు, పితృతర్పణములు, అతిధి పూజలు చేస్తూ ఉండేది. రెండవ భార్య భర్తను అనుసరిస్తూ ప్రతి పనీ భర్త అనుమతితో చేసేది. ఆ భర్త, ఇద్దరు భార్యలు ఒకేసారి మరణించారు. భర్త, రెండవ భార్య స్వర్గానికి పోయారు. మొదటి భార్య అంటే భర్త అనుమతి లేకుండా దేవతా కార్యములు చేసిన భార్యను యముడు స్వర్గమునకు అనుమతించలేదు. నీవు భర్త అనుమతి లేకుండా పుణ్యకార్యములు చేసావు కాబట్టి స్వర్గప్రవేశమునకు అర్హతలేదు అని అన్నాడు.తిరిగి ఆమెను తిరిగి నీ శరీరంలో ప్రవేశించమని శాసించాడు. అందుకు ఆమె విలపించింది. తనను కాపాడమని యమధర్మరాజును వేడుకొంది. ఆమె మాటలకు కరిగిపోయాడు యమధర్మరాజు. ఓ వనితా! భర్త అనుమతి లేకుండా పుణ్యకార్యములు చేయడం భార్యకు తగదు. మరుజన్మలోనైనా నీవు నీ భర్త అనుమతితో పుణ్యకార్యములు

చెయ్యి అని అన్నాడు యమధర్మరాజు. కాబట్టి చేసేవి పుణ్యకార్యములు అయినా భర్త అనుమతి లేకుండా చేస్తే అవి ఫలించవు.

భర్త కు ఇష్టము అయిన వంటకములను భార్య అతనికి చేసి పెట్టాలి. ఆయన కోరినపుడు ఆయనకు సుఖాన్ని అందించాలి. భార్య భర్త మాటకు ఎదురు చెప్పకూడదు. అతని ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించకూడదు. పొరపాటున భర్త తాను చెయ్యవలసిన కార్యములను మరిచిపోతే, ఆయనకు గుర్తు చెయ్యాలి. తనకు మరియొక సవతి ఉంటే ఆమెతో తగవులాడకుండా సఖ్యతతో మెలగాలి. భర్త తన వద్ద ఏదైనా వస్తువును దాచిన, దానిని భద్రంగా అట్టిపెట్టి భర్త అడిగినప్పుడు అందచేయాలి. భర్త తనకు ఏది ఇచ్చినా దానిని సంతోషంగా స్వీకరించాలి. భర్త ధనవంతుడైనా దరిద్రుడైనా, అందగాడైనా కురూపి అయినా, తెలివి కలవాడైనా, తెలివి తక్కువ వాడైనా, ఆరోగ్యవంతు డైనా, అనారోగ్యంతో బాధపడుతున్నా, భర్తను భార్య గౌరవించాలి. ప్రేమతో ఆదరించాలి. వయసు వచ్చిన కుమారునితో నైనా స్త్రీ ఒంటరిగా ఉన్నపుడు ఒకే శయ్యమీద కూర్చొనకూడదు. పశుపక్ష్యాదులకు ఆహారంపెట్టడం, యాచకులకు అన్న దానం చెయ్యడం, దేవతలను పత్రుదేవతలకు పూజ చెయ్యడం, ఆ పనులన్నీ భర్త క్షేమం కోరి చెయ్యడం భార్య కర్తవ్యము.

పరమేశ్వరా! స్త్రీలందరూ ధర్మపరులు కారు కదా. అధర్మపరులు అయిన స్త్రీలను రాక్షసి అని పిలుస్తారు. ఇటువంటి స్త్రీలు పరపురుషులను కోరుకుంటూ ఉంటారు. అటువంటి స్త్రీలు అసుర అంశలో జన్మించిన వాళ్లు. అటువంటి స్త్రీల కు మనసు నిలకడ ఉండదు. ఎప్పుడూ సుఖవాంఛల మీద కోరిక కలిగి ఉంటారు. క్రూరమైన పనులు చెయ్యడంలో ఆసక్తి కలిగి ఉంటారు. అటువంటి స్త్రీ ధనమును సంపదలను విచ్చలవిడిగా వాడుతుంది. ఆమెకు కోపం ఎక్కువ. భర్త యందు, పిల్లలయందు ప్రేమ ఉండదు. ఇంటి పనులు చెయ్యదు.

నిర్లక్ష్యం ఎక్కువ. ఎప్పుడూ అబద్ధాలు చాడీలు చెబుతూ ఉంటుంది. ఎల్లప్పుడూ నిద్రపోవడానికి అలవాటు పడుతుంది. వీరి వలన భర్త వంశం మొత్తం నరకానికి పోతారు.  అటువంటి స్త్రీలు కూడా, తమ తప్పు తెలుసుకొని భర్తకు అను కూలంగా ప్రవర్తిస్తే వారు కూడా భర్తతో స్వర్గానికి పోతారు. అలా కాకుండా జీవితమంతా భర్తను నానా బాధలు పెట్టినా, భర్త చనిపోయిన తరువాత, ఆయనతో సహగమనం చేసిన భార్య, భర్తతో పుణ్యలోకాలకు వెళుతుంది.

కాని ఇందులో ఒక ధర్మసూక్ష్మము ఉంది. స్త్రీలు సంతాన వతులయి నప్పుడు, భర్త చనిపోతే, పిల్లలను వదిలి భర్తతో సహగమనం చేయరాదు. అది అధర్మము."  అని పార్వతీ దేవి పరమేశ్వరునకు స్త్రీధర్మముల గురించి వివరించింది.  అని నారదుడు  శ్రీ కృష్ణునికి చెప్పాడు."  అని భీష్ముడు ధర్మరాజుకు పార్వతీ పరమేశ్వర సంవాదమును వివరించాడు.

పితామహా! మీరు చెప్పిన శివపార్వతీ సంవాదమును శ్రద్ధతో విన్నాను. నా జన్మ ధన్యమయింది. పితామహా! మరొక సందేహము. పరమ పదము అని అంటూ ఉంటారు. అది ఎలా సిద్ధిస్తుంది. తెలుపండి."  అని అడిగాడు.

"ధర్మనందనా!  నిరంతర నారాయణ ధ్యానము, నిరంతరము నారాయణ పూజచేసి స్తుతించడం, నారాయణుని కథలు వినడం, మానవులకు మేలు చేస్తాయి.  విద్వజ్జనులను సేవించడం వలన పరమపదము పొందడానికి అర్హత లభిస్తుంది.

ఈ సందర్భంలో నీకు ఒక కథ చెబుతాను. పూర్వము ఒక విద్వాంసుని రాజభటులు దొంగతనం చేసాడని దారుణంగా శిక్షిస్తున్నారు.  అది  ఒక వేశ్య చూచింది.  "రాజభటులారా! ఈయన మావాడు. మాకు తెలిసిన వాడు.

ఈయనను ఎందుకు దండిస్తున్నారు." అని ఆ విద్వాంసునిని వారి బారినుండి విడిపించింది. మరుజన్మలో ఆ వేశ్య బ్రాహ్మణ వనితగా జన్మించింది. కాబట్టి విద్వాంసులను గౌరవించడం వలన మనకు ఉత్తమ జన్మ లభిస్తుంది." అని చెప్పాడు భీష్ముడు.

"పితామహా! మానవులు దరిద్రము,వ్యాధులు,దుఃఖము వీటితో బాధ పడుతుంటారు కదా. ఆయా సమయాలలో వారికి శాంతి చేకూర్చే మార్గము ఏది?" అని అడిగాడు.

" ధర్మనందనా! నీవు చెప్పిన దుఃఖములతో బాధలు పడుతున్నవారు భక్తితో, శ్రద్ధతో, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను, వినాయకుడిని, కుమార స్వామిని, అగ్నిదేవుని, వాయుదేవుని, సూర్యచంద్రులను, దేవేంద్రుని, వరుణదేవుని, యమధర్మరాజును, కుబేరుని, కామధేనువును, సప్తసముద్ర ములను, గంగ,యమున మొదలగు మహానదులను, మరుత్తులను, అశ్వినీ దేవతలను, వసువులను, రుద్రులను, దేవతలను, పితృదేవతలను, వాలఖిల్యాది సిద్ధులను, వేదవ్యాస, వాల్మీకి, నారద, అగస్త్య, గౌతమ, కశ్యప, అత్రి, కణ్వ, మొదలగు మహామునులను, రంభ, ఊర్వశి మొదలగు అప్సరసలను, ధర్మము, తపస్సు, సత్యము మొదలగు వానిని, రాత్రింపగళ్లను, నక్షత్రములను, గ్రహములను, అశ్విని మొదలగు నక్షత్రసముదాయములను, మాసములు, ఋతువులు, సంవత్సరములను, వైనతేయులను, సర్పరాజములను, కాశీ గయ ప్రయాగ మొదలగు పుణ్యక్షేత్రములను, నైమిశారణ్య, దండకారణ్య మొదలగు అరణ్యములను, మేరు పర్వతము, హిమవత్పర్వతము, కైలాస పర్వతము మొదలగు పర్వతములను, నాలుగు దిక్కులను ఉండే భూములను, ఆకాశమును, రావి,మర్రి మొదలగు వృక్షరాజములను, బ్రాహ్మణులను, చక్రవర్తులను, తమను పరిపాలించే రాజులను మనసారా ధ్యానించాలి.

నమస్కరించాలి. మీరందరూ నన్ను రక్షించండి. నాకు ఆయురారోగ్య ఐశ్వర్యములు, అభివృద్ధిని, పరమానందమును ప్రసాదించండి అని మనసారా కోరుకోవాలి.

( ఒక్కసారి గమనించండి. దేవతలు, ప్రకృతి, పురుషులు, అనంత విశ్వము ఎలా ఆరాధ్యులో ఈ వివరణ వలన తెలుస్తుంది. అనంత విశ్వాన్ని అవలీలగా వర్ణించా చెప్పగలిగిన మహాభారత కర్తకు ప్రణామాలు చెయ్యడం తప్ప మనం ఏమీ చెయ్యలేము కదా! )

తరువాత నారాయణ మహా మంత్రమును భక్తిశ్రద్ధలతో పఠించాలి. ఓం నమోభగవతే వాసుదేవాయ, నమః పురుషోత్తమాయ, నమః సర్వలోక గురవే, నమః సర్వ లోక పిత్రే, నమః సర్వలోక పితాయ, నమః సర్వలోక పితామహాయ, నమః సర్వలోక ప్రధానాయ, నమః సర్వలోకేశ్వరాయ, నమః సర్వలోక విశిష్టాయ, నమః సర్వలోక సుఖప్రదాయ, నమః సర్వలోక కర్త్రే, నమః సర్వలోక భర్త్రే, నమః సర్వలోక హర్త్రే, నమః సర్వలోక నిధయే, నమః సర్వలోక నిధానాయ, నమః సర్వలోకోద్భవకరాయ, నమో విష్ణవే, ప్రభవిష్ణవే అని పఠించాలి. ఇది నారాయణ మహా జపము. ఈ మహా మంత్రము పఠించిన వారికి సమస్త భయాలు, సమస్త పాపాలు, కష్టాలుతొలగిపోతాయి. శుభం కలుగుతుంది. అని భీష్ముడు ధర్మరాజుకు మహా విష్ణు మహా మంత్రమును ఉపదేశించాడు.

(పాఠకులకు ఒక మనవి. ఇది చదవడానికి ఐదు నిమిషాలకంటే ఎక్కువ పట్టదు. ఫలితం వస్తుందో రాదో అనే అనుమానాలు పెట్టుకోకుండా అందరూ ఈ మహా మంత్రమును రాసుకొని పఠిస్తారని నా మనవి. ఫలితం వస్తే మంచిదే. రాకపోయినా పర్వాలేదు. ఒక మంచి పని చేసామనే ఆత్మ సంతృప్తి కలుగుతుంది

కదా!).

తరువాత ధర్మరాజు ఇలా అన్నాడు. "పితామహా! ఈ సమస్తలోకములలో మహనీయమైన దైవము ఎవరు? ఏదేవుని నామమును మానవులు పారాయణము చెయ్యాలి. ఏ దైవమును స్తుతిస్తే మానవునికి సకల శుభములు కలుగుతాయి. జపములలో కెల్లా ఉత్తమమైన జపము ఏది? ఏ దైవమును గురించి జపం చేస్తే మానవులకు ఈ జనన మరణ చక్రము నుండి విముక్తి కలుగుతుంది. దయతో వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! అఖిల జగములకు ప్రభువు అయిన దేవదేవుడు అనంతుడు. అతనిని పురుషోత్తముడు అని కూడా అంటారు. ఆ పురుషోత్తముని మానవులు వేయి నామములతో స్తుతిస్తారు. ఎవరైతే ఆ పురుషోత్తముని వేయినామములను భక్తితో జపిస్తారో, ధృఢ మైన ధ్యానంతో నిరంతరము నమస్కరిస్తూ స్తుతిస్తారో, ఆ దేవ దేవుడు, ఆది అంతము లేని వాడు, ఎల్లలోకములకుపూజనీయుడు, మూడు లోకములలో కీర్తి వర్ధిల్లినవాడు, సర్వధర్మస్వరూపుడు, కోరిన వరములు ప్రసాదించేవాడు, ఈ లోకములకెల్లా నాధుడు, ముల్లోకములలో ఉన్న సమస్త జీవులను సృష్టించేవాడు, అయిన ఆ పురుషోత్తముని భక్తితో కొలిస్తే సమస్త పాపములు తొలగిపోతాయి. ఆ పుండరీకాక్షుని పరమభక్తితో అర్చించడం నాకు ఎంతో ఇష్టం. సర్వధర్మములలో కెల్లా అధిక మైన ధర్మము ఆ పురుషోత్తముని అర్చించుటయే.

ఆ మహావిష్ణువు పరమ తేజస్వరూపుడు. అతడే పరమ పదము. పరబ్రహ్మము. మానవులకు మేలు చేసేవాడు. పవిత్రుడు. మంగళములలో కెల్లా మంగళ కరుడు. సకల దేవతలకు పరమ దైవము. ఈ సమస్త భూత

కోటికి మూల పురుషుడు. యుగాంతంలో ఈ సమస్త చరాచరములు అతనిలో లీనవవుతాయి. యుగారంభంలో మరలా అతనినుండి ఆవిర్భవిస్తాయి. ఆయనే విష్ణువు. ఆ విష్ణువు యొక్క వేయినామములు జపిస్తే సమస్త పాపములు, భయములు తొలగిపోతాయి." అని చెప్పాడు భీష్ముడు.

విశ్వం,విష్ణువు,వషట్కారుడు,భూతభవ్యభవత్ప్రభువు అను వాటితో మొదలుపెట్టి రథాంగ పాణి యక్షోభ్యుడు, సర్వప్రహరణాయుధుడు అనే నామముల దాకా ఉన్న విష్ణ సహస్రనామములు అన్నీ ధర్మరాజుకు ఉపదేశించాడు భీష్ముడు.

"ధర్మనందనా! కీర్తిమంతుడైన వాసుదేవుని సహస్రనామములు ఇవే. నీ హితము కోరి ఈ నామములు నీకు ఉపదేశించాను. ఈ విష్ణ సహస్ర నామములు శ్రద్ధతో ప్రతి దినమూ పఠించిన వారికి ఈ లోకంలో కానీ పరలోకంలో కానీ అశుభములు దరి చేరవు. అత్యంత శుభములను అనుభవిస్తారు. ఈ సహస్రనామములను పారాయణము చేస్తే విప్రుడు వేదాంత విద్యను తెలుసుకుంటాడు. క్షత్రియుడు సమస్త విజయములను పొందుతాడు. వైశ్యుడు అంతులేని ధనమును సంపాదిస్తాడు. శూద్రుడు అంతులేని సుఖములు అనుభవిస్తాడు.

ధర్మము, అర్థము, కామము, మోక్షము ఈ పురుషార్థములలో ఎవరు దేనిని కోరుకుంటే అది వారికి లభిస్తుంది. ప్రతి దినము ఏకాంతములో కూర్చుని శుచిగా భక్తితో విష్ణుసహస్రనామములు పఠిస్తే వారికి కీర్తి, అంతులేకి ఐశ్వర్యము, వంశాభివృద్ధి, పెంపు, సొంపు కలిగి వర్ధిల్లుతారు. పురుషోత్తముని వేయి నామములు కీర్తించు వారికి భయము అనేది ఉండదు. అమితమైన వీరత్వము, తేజస్సు, కాంతి, బలము, రూపము, గుణము పెంపొందుతాయి.

ఈ విష్ణు సహస్రనామములు కేవలం పఠించినంత మాత్రముననే రోగములతో బాధపడేవారికి ఆ రోగములన్నీ తగ్గి ఆరోగ్యవంతులవుతారు. అతని పాపములన్నీ తొలగిపోతాయి. జనన మరణములు, రోగము ముసలి తనము లేని పరబ్రహ్మ పదమును పొందుతాడు.

ప్రతి దినము విష్ణుసహస్రనామములు పఠించే విష్ణు భక్తులకు దుర్మార్గము, కోపము,లుబ్ధత్వము(పిసినారితనము), మత్సరము మొదలగు దుర్గుణములు దగ్గరకు కూడా రావు. సూర్యుడు, చంద్రుడు సంచరించే ఆకాశము, సకల చరాచరములు సంచరించే ఈ భూమి, సమస్త సముద్రములు, నదీనదములు, దేవ, దానవ, గంధర్వ, గరుడ, యక్ష, పన్నగములు, ఇవి అన్నీ విష్ణువు ఆజ్ఞననుసరించి వర్తిస్తూ ఉంటాయి. మానవునిలోని బుద్ధి, ఇంద్రియములు, మనస్సు, బలము, తేజము, ధృతి, ప్రకృతి, అందులోని పదార్థములు అన్నీ వాసుదేవుని మయము. వేదములు, శాస్త్రములలో చెప్పబడిన ధర్మములన్నిటికీ విష్ణువే ప్రభువు. సాంఖ్యము, యోగము, తంత్రము, శిల్పము,వేదశాస్త్రములు, కర్మలు, అన్ని కూడా వాసుదేవుని వలన ఉద్భవించబడ్డాయి. ఈ భూతముల కెల్లా మహా భూతము విష్ణువు. ఈ మూడులోకములలో ఉన్న భూతములకు ఆత్మ విష్ణువు. విష్ణువు సర్వవ్యాపి. మానవులందరూ సమస్త శుభములు పొందుటకొరకు వ్యాసప్రోక్తమైన ఈ విష్ణుసహస్రనామస్తోత్రమును నిత్యమూ భక్తితో పఠించాలి. వారికి సకల శుభములు కలుగుతాయి. కాబట్టి ఓ ధర్మనందనా! నీవు కూడా విష్ణు సహస్రనామములను భక్తితో పఠించు. నీకు ఆయురారోగ్య ఐశ్వర్యములు కలుగుతాయి." అని భీష్ముడు ధర్మరాజుకు చెప్పాడు.

భీష్ముడు బోధించిన విష్ణుసహస్రనామ స్తోత్రము దాని మాహాత్మ్యమును వినిన ధర్మరాజు పరమానందము పొందాడు. కాని ఇంకా సందేహములు

తీరలేదు. "ఓ పితామహా! పూజించుటకు నమస్కరించుటకు ఎవరు అర్హులు? ఎవరికి హాని కలిగిస్తే మనకు హాని కలుగుతుంది. ఎవరు సంతోషిస్తే మనకు సమస్త శుభములు కలుగుతాయి. వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! పూజించుటకు, నమస్కరించుటకు తగినవారు బ్రాహ్మణులు. బ్రాహ్మణులకు కీడు చేస్తే సాక్షాత్తు దేవేంద్రుడు కూడా దుఃఖముల పాలవుతాడు. బ్రాహ్మణులు సంతోషిస్తే అందరికీ సకల శుభములు కలుగుతాయి. ఈ లోకములకు ఆధారము, ధర్మమునకు వారధిలాంటి వారు, అఖిలశాస్త్రములను ప్రవచించుటకు అర్హులు బ్రాహ్మణులు మాత్రమే. విప్రులకు వారి తపస్సు, వారి సత్యవాక్కు ధనముతో సమానము. బ్రాహ్మణులకు ఒక్కపూట భోజనము పెట్టిన వారికి వారి సమస్త పాపములు పటా పంచలు అవుతాయి. మానవులు మంచి మార్గములో నడచుటకు దారి చూపేవారు బ్రాహ్మణులే. దేవతలకే దేవతలలాంటి వారు బ్రాహ్మణులు. బ్రాహ్మణుడు బాలుడైనాపూజనీయుడే. ఇంక వృద్ధబ్రాహ్మణుల గురించి చెప్పతరమా!" అని చెప్పాడు భీష్ముడు.

" ఓ పితామహా! నీవు బ్రాహ్మణులను ఇంతగా పొగుడుతున్నావు కదా! బ్రాహ్మణులను పూజించుట వలన ఎలాంటి శుభములు కలుగుతాయి. వారిని ఇంతగా పూజించుటకు బ్రాహ్మణులలో కల విశిష్టమైన గుణములేమి?" అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! ఈ సందర్భంలో నీకు పవన అర్జున సంవాదమును వినిపిస్తాను. ఆ సంవాదము నీ ప్రశ్నకు సరిఅయిన సమాధానము. పూర్వము కార్తవీర్యార్జునుడు అనే మహారాజు ఏడు ద్వీపములను పరిపాలించేవాడు. అతనికి వేయి చేతులు ఉండేవి. అతనికి అద్భుతమైన బలపరాక్రమములు

ఉండేవి. ఒకరోజు ఆ కార్తవీర్యార్జునుడు పెద్దగా "ముల్లోకములలో నాకు సాటిఅయిన వాడు లేడు." అని గర్వంతో అన్నాడు..

అది విన్న ఒక భూతము ఆకాశము నుండి ఇలా పలికింది. "ఓ మహారాజా! నీకు తెలియకుండా మాట్లాడుతున్నావు. నీకన్నా భూసురులు అధికులు కదా! నీవు ఎలా అధికుడవు అవుతావు." అని ఆక్షేపించింది.

దానికి కార్తవీర్యార్జునుడు ఇలా బదులు పలికాడు. "ఆ భూసురులకు రాజులు ఆధారము కదా. ఎందుకంటే భూసురులు రాజులను ఆశ్రయించుకొని జీవిస్తారు కదా! మరి భూసురులు రాజుల కన్నా ఎక్కువ ఎలా అవుతారు? అదీ కాకుండా నాకు అనుగ్రహంవస్తే అందరినీ రక్షిస్తాను. నాకు కోపం వస్తే అందరినీ సర్వనాశనం చేస్తాను." అని అన్నాడు. ఇంక ఏమీ మాట్లాడలేక ఆ భూతము వెళ్లిపోయింది.

ఆ సమయంలో వాయు దేవుడు తనను తాను ఎరిగించుకొని ఇలా అన్నాడు. "ఓ రాజా! నేను వాయు దేవుడను. నీ వాదనకు ప్రతివాదనను వినిపిస్తున్నాను. నీవు ఏదో బ్రాహ్మణులను రక్షిస్తున్నావు అని అన్నావు. కానీ ఆ బ్రాహ్మణుల అనుగ్రహం చేతనే నీవు ప్రజలను రక్షిస్తున్నావు అని తెలుసుకో! కాబట్టి బ్రాహ్మణుల కన్నా అధికులు ముల్లోకములలో లేరు. అహల్యను కోరిన ఇంద్రుడు బ్రాహ్మణుడైన గౌతముని శాపమునకు గురి కాలేదా! బ్రాహ్మణుడైన అగస్త్యుడు సముద్రములను ఆపోసన పట్టలేదా! బ్రాహ్మణుడైన భృగు మహర్షి అగ్నిదేవుని శపించలేదా!" అని అన్నాడు వాయుదేవుడు. ఆ మాటలకు కార్తవీర్యార్జునుడు మారు పలకలేదు. మౌనంగా ఉన్నాడు. మరలా వాయు దేవుడు ఇలా అన్నాడు.

ఓ మహారాజా! నీకు ఒక విషయం చెబుతాను విను. పూర్వము అంగిరస వంశంలో జన్మించిన ఉచథ్యుడు చంద్రుని కుమార్తెను కోరగా, చంద్రుడు తన కూతురిని ఇచ్చి ఉచథ్యునికి ఇచ్చి వివాహము చేసాడు. ఆ దంపతులు అరణ్యములలో హాయిగా నివసిస్తున్నారు. కాని వరుణుడు ఉచథ్యుని భార్యమీద కోరిక పెంచుకున్నాడు. ఒకరోజు ఉచథ్యుడు స్నానానికి నదికి వెళ్లాడు. ఆ సమయంలో వరుణుడు వచ్చి ఉచథ్యుని భార్యను అపహరించుకొని పోయి తన అంతఃపురంలో ఉంచాడు.

ఈ విషయం తెలిసిన నారదుడు వెంటనే పోయి ఉచథ్యునికి ఈ విషయం చెప్పాడు. అప్పుడు ఉచథ్యుడు నారదునితో ఇలా అన్నాడు. "నారదా! వరుణుడు దిక్కులకు అధిపతి. అతనికి పరుల భార్యను తీసుకొని పోవడం తగునా! నీవు పోయి నేను ఇలా అన్నానని వరుణునితో చెప్పు." అని అన్నాడు. నారదుడు సరే అని పోయి ఇదే విషయం వరుణునితో చెప్పాడు. కాని వరుణుడు కామంతో కళ్లు మూసుకొని పోయి ఉన్నాడు. "నారదుడు చెప్పినా సరే ఉచథ్యుని భార్యను విడువను." అని అన్నాడు. నారదుడు అక్కడి నుండి ఉచథ్యుని వద్దకు పోయి ఇలా అన్నాడు. "ఉచథ్యా! నీ మాట ప్రకారము నేను వరుణుని దగ్గరకు పోయి నీవుచెప్పినట్టు చెప్పాను. కనీసం నా మాటకు కూడా గౌరవం ఇవ్వలేదు. నీ భార్యను విడువను అని చెప్పాడు. అంతటితో ఊరుకోలేదు. నన్ను బయటకు నెట్టించాడు." అని అన్నాడు. ఉచథ్యుడికి పట్టరాని కోపం వచ్చింది. సముద్ర జలములన్నిటినీ ఒక్క గుక్కలో పీల్చివేసాడు. భూమి అంతా ఎడారి అయింది. వరుణుడు గడా గడా వణకిపోయాడు. ఉచథ్యుని భార్యను తీసుకొని వచ్చి సవినయంగా ఉచథ్యునికి సమర్పించు కున్నాడు. తను చేసిన తప్పును క్షమించమని వేడుకున్నాడు. దయామయుడైన ఆ బ్రాహ్మణుడు వరుణుని క్షమించాడు. కాబట్టి కార్తవీర్యార్జునా! రాజుల కంటే బ్రాహ్మణులే ఎక్కువ." అని అన్నాడు వాయుదేవుడు. కార్తవీర్యార్జునుడు మారు

మాటాడలేదు. మౌనంగా ఉన్నాడు.

వాయుదేవుడు ఇంకా ఇలా అన్నాడు. "ఓ మహారాజా! పూర్వము దేవతలు రాక్షసుల చేతిలో ఓడిపోయి అగస్త్యుని శరణు జొచ్చారు. అప్పుడు అగస్త్యుడు దేవతలకు విజయాన్ని చేకూర్చి పెట్టాడు. మరొక సారి దేవతలను రాక్షసులు బాధిస్తూ ఉండేవాళ్లు. రాక్షసుల బాధలకు తట్టుకోలేక దేవతలు వసిష్టుని వద్దకు వెళ్లారు. తమ గోడు చెప్పుకున్నారు. దేవతలకు అపకారం చేస్తున్న రాక్షసుల మీద వసిష్టునికి కోపం వచ్చింది. వసిష్టుని కోపజ్వాలలో రాక్షసులు భస్మం అయిపోయారు. కాబట్టి రాజా! అగస్త్యుడు, వసిష్టుడు దేవతలకన్నా గొప్ప వాళ్లు కారా!" అని అన్నాడు. కార్తవీర్యార్జునుడు బదులుచెప్పలేదు.

ఇంకా వాయుదేవుడు ఇలా అన్నాడు. "ఓ మహారాజా! ఒక సారి దేవతలకు రాక్షసులకు భయంకరంగా యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో రాహువు ప్రయోగించిన అస్త్రములతో సూర్యుడు చంద్రుడు మూర్ఛపోయారు. సూర్యచంద్రులు మూర్ఛపోగానే లోకమంతా చీకట్లు కమ్ముకున్నాయి. అప్పుడు రాక్షసులు దేవతల వెంటపడ్డారు. వారిని చితకబాదారు. అప్పుడు దేవత లందరూ అత్రిమహాముని దగ్గరకు వెళ్లారు. "ఓ దయామయా! రాక్షసుల బారినుండి మమ్ములను రక్షించు" అని శరణువేడారు. వెంటనే అత్రి మహా ముని సూర్యుని చంద్రుని మూర్ఛనుండి విముక్తి కలిగించాడు. వారి గాయాలు మాన్పాడు. తన తపోశక్తితో రాక్షసులను నాశనం చేసాడు. మరి ఆ బ్రాహ్మణుడు దేవతలందరి కన్నా గొప్పవాడు కదా!

ఓ మహారాజా! ఇంకా చెబుతాను విను. ఒకసారి దేవేంద్రుడు అశ్వినీ దేవతలు సోమపానమునకు అర్హులు కారు అని ఆజ్ఞాపించాడు. అప్పుడు

అశ్వినీ దేవతలు భార్గవ వంశము వాడైన చ్యవనుని ఆశ్రయించారు. అశ్వినీ దేవతలకు మేలు చేయడం కోసరం చ్యవనుడు దేవతలతో దేవేంద్రునితో విరోధం కొని తెచ్చుకున్నాడు. ఎలాగైనా చ్యవనుని చంపాలని అనుకున్నాడు దేవేంద్రుడు. తన వజ్రాయుధాన్ని, ఒక కొండను చ్యవనుని మీదికి విసిరాడు. చ్యవనుడు తన తపోశక్తితో ఆ వజ్రాయుధాన్ని, కొండను నుగ్గు నుగ్గు చేసాడు. ఇంద్రుడిని మూర్ఛపోయేట్టు చేసాడు. ఇంద్రుడు కొంచెంసేపటికి మూర్ఛ నుండి తేరుకున్నాడు. ఈ లోపల చ్యవనుడు మదుడు అనే రాక్షసుని సృష్టించి ఇంద్రుని మీదికి ప్రయోగించాడు. ఆ మదుడు దేవతలను, దేవేంద్రుడిని మింగేసాడు. వారు చ్యవనుని కి ప్రణామం చేసి తప్పు ఒప్పుకున్నారు. అశ్వినీ దేవతలకు సోమపానార్హత కల్పించారు. ఓ మహారాజా! ఆ చ్యవనుడు బ్రాహ్మణుడు కాదా! చ్యవనుడు దేవేంద్రుని కన్నా గొప్పవాడు కాదా!" అని అన్నాడు వాయుదేవుడు.

ఇంత చెప్పినా కార్తవీర్యార్జునుడు బ్రాహ్మణుల గొప్పదనాన్ని అంగీకరించ లేదు. మౌనంగా ఉన్నాడు. వాయుదేవుడు మరలా మొదలెట్టాడు. " ఓ మహారాజా! అంతెందుకు. నీ సంగతే తీసుకో. నీ గురువుగారు దత్తాత్రేయుడు. ఆయన బ్రాహ్మణుడు. ఆయన దయ తోనే కదా నీవు ఇంతటి బలపరాక్రమము లను పొందావు. రాజులలో కెల్లా మహారాజుగా వెలుగుతున్నావు. నీవే కాదు. దేవతల దగ్గనుండి మానవుల దాకా సమస్తజీవులందరూ బ్రాహ్మణుల అనుగ్రహము వలననే మనుగడ సాగిస్తున్నారు. కాబట్టి నువ్వు కూడా బ్రాహ్మ ణుల కులము దైవస్వరూపమని నీ మనస్సులో నిలుపుకొని బ్రాహ్మణులను భక్తితో పూజించు. నీకు మేలు కలుగుతుంది." అని అన్నాడు వాయుదేవుడు.

అప్పటికి కార్తవీర్యార్జునుని గర్వము అణగిపోయింది. వివేకవంతు డయ్యాడు. లోకంలో బ్రాహ్మణులు గొప్పవారు అని ఒప్పుకున్నాడు. కాబట్టి

ధర్మనందనా! బ్రాహ్మణులు సర్వత్రా పూజనీయులు," అని భీష్ముడు ధర్మరాజుతో చెప్పాడు.

" ఓ పితామహా! నాకు ఎంత విన్ననూ బ్రాహ్మణుల యొక్క ప్రభావము ఇంకనూ వినవలెనని ఉన్నది. నాకు చెప్పండి." అని అడిగాడు.

"ధర్మనందనా! నాకు ఇంద్రియములు, వాక్కు, మనస్సు అన్ని దుర్బలము లయినాయి. నేను అలసిపోయాను. అదీకాకుండా దక్షిణాయనము అయి పోవస్తూ ఉంది. ఉత్తరాయనము రాగానే నేను ఈ దేహమును విడిచి పెట్టవలసిన సమయము ఆసన్నమయినది. నా మరణమునకు ఇంక ఎన్నోరోజులు లేదు. కాబట్టి శ్రీ కృష్ణుడు నీకు బ్రాహ్మణుల యొక్క ప్రభావమును సవివరంగా చెబుతాడు.

ధర్మ నందనా! నాకు కృష్ణతత్త్వము బాగా తెలియును. ఈ భూమి నంతయూ వరాహరూపంలో అవలీలగా తన మూతి మీద ధరించాడు. ఇది ఒకటే కాదు. కృష్ణుడు ఇటువంటి లీలలలు ఎన్నో చేసాడు. ఈ భూమి మీద భూతకోటి ఆవిర్భావము అంతా ఆ కృష్ణలీల కాక మరేమున్నది. తన నాభి కమలం లో నుండి బ్రహ్మను సృష్టించి ఆయన చేత ఈ చరాచర జగత్తును సృష్టింప చేసాడు. దానిని బ్రహ్మసృష్టి అన్నారే కాని నిజానికి ఇదంతా ఆ శ్రీమన్నారాయణుని సృష్టి. కాబట్టి కృష్ణలీలలు తెలుసుకోవడం ఎవరి తరము?

ఏ సమయంలో అయితే ధర్మమునకు దనుజుల చేతిలో హాని కలుగుతుందో, ఆ సమయంలో తాను పుట్టి ఆ దురాత్ములను నాశనం చేసి ధర్మాన్ని రక్షిస్తాడు. ధర్మాత్ములను కాపాడుతాడు. కాబట్టి ధర్మనందనా! పరమేశ్వరుడు, దిక్పాలకులు, విశ్వపతి, అన్నీ ఈ శ్రీకృష్ణుడే . కాలము,

దిక్కులు, జగత్తు అన్నీ తానే అయి ఉన్నాడు. కృష్ణుడు యజ్ఞ స్వరూపుడు. ఈ కృష్ణుని, యజ్ఞయాగములలో ఋత్విక్కులు వేదమంత్రములతో స్తుతిస్తారు. ఋగ్వేదములో శ్రీ కృష్ణస్తుతి వింతకాదు. ఎందుకంటే అఖిల వేదములు ఈ శ్రీ కృష్ణుని లీలల నుండి పుట్టినవే కదా! వేదములలో నిరూపితమైనవాడు శ్రీ కృష్ణుడు. యాగాగ్ని, యాగము చేసే యజమాని, యజ్ఞములో అర్పించే ఆహుతులు, ఆ యాగము చేసే ఫలము అన్నీ ఆ శ్రీకృష్ణస్వరూపాలే. సూర్యచంద్రులకు, నక్షత్రములకు వెలుగు నిచ్చేది కూడా ఆ శ్రీకృష్ణుడే కదా! పరంజ్యోతిస్వరూపుడు, అజరామరమైన పరమపదము,సత్యము, అమృతము, ఇవి అన్నీ శ్రీకృష్ణ స్వరూపాలే!" అని ఉపదేశించాడు భీష్ముడు.

( ఇక్కడ చిన్న వివరణ. శ్రీ కృష్ణుడు అన్న చోట భగవంతుడు, పరమాత్మ, విష్ణువు, శివుడు అనే పదాలను వాడుకుంటే మనకు అంతర్గత భావము అవగతమవుతుంది. అంతేకానీ, ద్వాపర యుగంలో ఉన్న కృష్ణుడు వేదములలో ఎలా ఉన్నాడు అనే కుశంకలకు తావివ్వకూడదని నా మనవి. శ్రీకృష్ణుడు సాక్షాత్తు విష్ణ్వంశ సంభూతుడు కదా!).

అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుని ముందు ప్రణామం చేసి "దేవాది దేవా! శ్రీ కృష్ణా! నాకు బ్రాహ్మణ మహాత్మ్యం ఇంకా ఇంకా వినవలెనని ఉన్నది. దయచేసి చెప్పండి." అని వేడుకున్నాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు ఇలా అన్నాడు.

"ధర్మనందనా! ఇదివరకు నేను ప్రద్యుమ్నునికి చెప్పిన విషయములు ఈ సందర్భంగా నేను నీకు చెబుతాను. సావధానంగా విను. నాలుగు పురుషార్థములు అయిన ధర్మ, అర్థ,కామ,మోక్షములను సంపాదించుటకు, దేవతారాధన, పితృదేవతారాధనలు ఆచరించుటకు, ఇహలోకములో లభించే సుఖములు పొందుటకు, బ్రాహ్మణులే మానవులకు ఆధారము. దేవతలకు

కూడా ఆయుస్సు, కీర్తి, సందలు కలగడానికి బ్రాహ్మణులే కారణము. బ్రాహ్మణులకు కోపంవస్తే ఎంతటి వారి నైనా భస్మము చెయ్యగలరు. బ్రాహ్మణులు అనుగ్రహిస్తే వారు సిరిసంపదలతో తులతూగుతారు. బ్రాహ్మణులకు శక్తి కొద్దీ దానములు చేసిన వారు ఇహలోకములోనూ, పరలోకములోనూ సుఖములు పొందుతారు.

ఈ సందర్భంలో నీకు ఒక ఆశ్చర్యకరమైన కథ ఒకటి చెబుతాను. విను. దుర్వాసుడు అనే మహా ముని ఒకడు ఉన్నాడు. ఆయన ఒక సారి మా ఇంటికి వచ్చాడు.

ఆయన వింతమనస్తత్వము కలవాడు. ఒకసారి ప్రసన్నంగా ఉంటాడు. నవ్వుతుంటాడు.మరుక్షణమే కోపం ప్రదర్శిస్తాడు. వెంటనే సుముఖుడవుతాడు. మరుక్షణం విముఖత్వము ప్రదర్శిస్తాడు. ఆహారము తీసుకోమంంటే తీసుకోడు. వెంటనే ఆహారం కావాలంటాడు. ఎంతోమందికి చేసిన ఆహార పదార్థాలు తానొక్కడే తింటాడు. ఒకసారి పక్కమీద పడు కుంటాడు. మరుక్షణం నేలమీద పడుకుంటాడు. చెప్పకుండా వెళ్లిపోతాడు. మరలా తనంతట తానే తిరిగి వస్తాడు. ఇలా తిక్క తిక్కగా ప్రవర్తిస్తుంటాడు.

అలాంటి దూర్వాసుడు ఒకరోజు తనకు పాయసం కావాలి అని అడిగాడు. నేను వెంటనే పాయసం తయారుచేయించాను. ఆ పాయసాన్ని కొంచెం తిన్నాడు. కొంత పాయసం తన ఒంటికి రుద్దమన్నాడు. సరే అని నేను ఆ పాయసాన్ని ఆయన ఒంటికి రుద్దాను. అపుడు నా పక్కనే రుక్మిణి నిలబడి ఉంది. దుర్వాసుడు కొంచెం పాయసం తీసుకొని తానే స్వయంగా ఆమె ఒంటికి పూసాడు. ఆమెను ఒక రథానికి గుర్రము మాదిరి కట్టాడు. తాను ఆ రథము ఎక్కాడు. రుక్మిణి రథం లాగుతుంటే తాను వీధిలోకి రథం

తోలుకుంటూ వెళ్లాడు. రుక్మిణిని గుర్రాన్ని పొడిచినట్టు కర్రతో పొడుస్తున్నాడు. రథం నడుపుతున్నాడు. దానిని చూచి నాకు కోపం కానీ ఈర్ష్యకానీ పుట్టలేదు. నేను కూడా ఆ రథం వెంట నడిచాను. కాని ఇది చూచిన యాదవులు కోపం పట్టలేకపోయారు. తమలో తాము ఆయనను తిట్టుకుంటూ ఏమీ చెయ్యలేక నా వెంట నడిచారు. రుక్మిణి కొంచెం దూరం రథం లాగి, ఇంక లాగలేక కూలబడి పోయింది. వెంటనే దుర్వాసుడు రథం దిగాడు. రుక్మిణి మీద మట్టిచల్లి దక్షిణ దిక్కుగా పరుగెత్తాడు.

నేను కూడా ఆయన వెంట పరుగెత్తాను. ఆయనను అడ్డగించాను. ఆయన కాళ్లు పట్టుకొని తిరిగి రమ్మని వేడుకున్నాను. ఆయన ప్రసన్ను డయ్యాడు. "అయ్యో మిమ్ములను బాధ పెట్టాను కదా! అయినా కృష్ణా! నువ్వు కోపాన్ని జయించావు. నీకు ఒక వరం ఇస్తాను. ఈలోకంలో ఉన్న సమస్తజనులు తమను తాము ఎంతగా ప్రేమిస్తారో అంత కంటే ఎక్కువగా నిన్ను ప్రేమిస్తారు. నీవు అందరిచేతా పూజలందుకుంటావు. సాటిలేని మహిమలతో విరాజిల్లుతావు. కృష్ణా! నేను పాయసం పూయమన్నప్పుడు నా ఒంటినిండా పూసావు కానీ కాలి మీద పూయడం మరిచిపోయావు. అందుకే నీకు కాలికి హాని కలుగుతుంది. కాని నీ పాదములకు కలిగిన హాని మరలా నిన్ను వైకుంఠమునకు తీసుకొని వెళుతుంది. దానిని నీవు ఆపదగా భావించరాదు. కృష్ణా! నీవు నా పట్ల నే కాకుండా బ్రాహ్మణుల అందరి పట్లా భయభక్తులతో ఉండు." అని వరం ఇచ్చాడు. వెంటనే కింద పడిపోయిన రుక్మిణి వద్దకు వెళ్లాడు. "అమ్మా! రుక్మిణీ! నీవు సౌందర్య, సౌభాగ్యములలో అప్రతిమానంగా విరాజిల్లుతావు. శ్రీకృష్ణుని పదహారువేల భార్యలలో అగ్రగణ్యవై, కీర్తి సౌభాగ్యాలతో ప్రకాశిస్తావు." అని వరం ఇచ్చి వెళ్లిపోయాడు.

అప్పటినుండి మా శరీరాలు వింత కాంతులతో విరాజిల్లాయి. మా ఇల్లు

కూడా సమస్త సంపదలతో విరాజిల్లింది. అప్పటి నుండి నేను బ్రాహ్మణులను పూజిస్తున్నాను. కాబట్టి ధర్మనందనా! నీవు కూడా నిరంతరమూ బ్రాహ్మణులను పూజించు." అని అన్నాడు శ్రీ కృష్ణుడు.

వెంటనే ధర్మరాజు ఇలా అన్నాడు. "శ్రీ కృష్ణా! దుర్వాసుడు ఈశ్వరుని అంశలో జన్మించాడు అని అన్నారు కదా! దాని గురించి వివరించండి." అని అడిగాడు.

"ధర్మనందనా! ఏ మానవుడైతే పరమశివుని మనసులో నిలుపుకొని శతరుద్రాలను పఠిస్తాడో, అతనికి ఈ లోకంలోనూ పరలోకంలోనూ సుఖాలు లభిస్తాయి. శివునికి మహాదేవుడు అనే పేరు కూడా ఉంది. శివునికి మించిన దైవము లేదు. ఆ శివుడు మూడో కన్ను తెరిస్తే వేదవిరుద్ధమైన భావనలు కలవారు నాశనమైపోతారు. ఎందుకంటే ఈశ్వరుని పిలవకుండా అతనికి హవిస్సులు ఇవ్వకుండా చేసిన దక్షయజ్ఞము ఎలా ధ్వంసం అయిందో నీకు తెలుసు కదా! అప్పుడే కదా సూర్యునికి కళ్లు పోయింది. తిరిగి ఆ మహాదేవుని అనుగ్రహంతోనే కదా ఆయనకు తిరిగి కళ్లు వచ్చింది.

అంతే కాదు. మిక్కిలి బలవంతులైన త్రిపురాసురులు లోకకంటకులై మూడులోకములను బాధిస్తుంటే, దేవతలు ఆ ముక్కంటి శరణు వేడారు. అప్పుడు ఆ దేవదేవుడు త్రిపురాసురులను సంహరించి ఆ మూడు పురములను ఒకే ఒక్క అస్త్రంతో ధ్వంసం చేసాడు. తరువాత ఆ అస్త్రమును తన తొడమీద పెట్టుకున్నాడు. ఆ అస్త్రము ఒక బ్రాహ్మణ మానవాకారము దాల్చింది. దేవతలు ఆశ్చర్యంతో ఇతడు ఎవరు అని అడిగారు. అప్పుడు పరమేశ్వరుడు అతనికి దుర్వాసుడు అని పేరు పెట్టాడు. అతడే మా ఇంటికి వచ్చిన దుర్వాసుడు." అని చెప్పాడు కృష్ణుడు.

"ఓ శ్రీకృష్ణా! శివుని ముఖ్యమైన నామములను జపిస్తే సమస్త సంపదలు మోక్షము కలుగుతుందంటారు. ఆ నామములు వాటి అర్థములు వివరించండి." అడి అడిగాడు.

" ఓ ధర్మనందనా! నిజానికి పరమశివుని భక్తి శ్రద్ధలతో పరిపూర్ణంగా పూజించడం, ఆయన పేర్ల అర్థములను తెలుసుకోవడం నాకే కాదు ఆ బ్రహ్మదేవునికి కూడా సాధ్యము కాదు. అయినా నీవు అడిగావు కాబట్టి నాకు తెలిసినంతవరకూ ఆ పరమేశ్వర నామములు వాటి అర్థములు వివరిస్తాను.

అగ్ని, వాయువు,దేవేంద్రుడు, సూర్యుడు, వసువులు, మరుత్తులు, మొదలగు దేవతలందరూ శివస్వరూపాలే. అటువంటి శివుని మహిమల గురించి ప్రీతితో చెప్పడం, దానిని శ్రద్ధతో వినడం, సర్వార్థసాధకము. ~~ఈశ్వర~~ తత్త్వము మహాత త్త్వము. అఖిలము లైన మునులు, ఋషులు ఆ మహాదేవుని మహేశ్వరుడు అని స్తుతిస్తారు. ఆయన హరుడు అనే నామంతో కూడా ప్రకాశిస్తుంటాడు. ఉగ్రత్వము, అఖండమైన ప్రతాపము కలిగిన వాడు కాబట్టి రుద్రుడు అంటారు. దేవతల కందరికీ దేవుడు కాబట్టి మహాదేవుడు అనే పేరుతో పిలువబడతాడు.

అఖిలములైన సత్కర్మలకు శుభద్రములైన ఫలితములను ప్రసాదిస్తాడు కాబట్టి శివుడు అని పిలుస్తారు. సుస్థిరమైన తేజంతో ప్రకాశిస్తాడు కాబట్టి స్థాణువు అని పిలుస్తారు. ~~ఈ~~ చరాచర జీవ రాసులన్నింటిలో తానే అయి ప్రకాశిస్తున్నాడు కాబట్టి ఆయన బహురూపుడు అని పిలువబడుతుంటాడు. ఆయన జటాజూటములు ధూమ్రవర్ణంతో ప్రకాశిస్తుంటాయి కాబట్టి ధూర్జటి అనే పేరుతో పిలుస్తారు. విశ్వేదేవతలందరూ ఆయన నుండి ఉద్భవించారు కాబట్టి ఆయనను విశ్వరూపుడు అని పిలుస్తారు. అనేకమైన కన్నులతో

ప్రకాశిస్తుంటాడు కాబట్టి ఆయనను సర్వతశ్చక్షువు అని ప్రసిద్ధికెక్కాడు. ఈ జీవులు అన్నీ పశువులు. ఆయన ఈ జీవులకు పతి. అందువలన ఆయన పశుపతి అనే నామంతో పిలువబడుతున్నాడు. శివుడు ఎప్పుడూ వృషభమును ఎక్కి తిరుగుతాడు కాబట్టి ఆయనను వృషభవాహనుడు అని కూడా అంటారు.

మహాశివుడు జీవులను రక్షిస్తాడు. వారి ప్రాణములను లయం చేస్తాడు. శివునికి వేదములలో ఎన్నో పేర్లు ఉన్నాయి. పరమేశ్వరుడిని అన్ని నామములతో స్తుతిస్తే వారికి ఇహలోక, పరలోక సుఖములు కలుగుతాయి. ఈ సందర్భంలో వ్యాసుడు శివుని గూర్చి ఒక స్తోత్రం రచించాడు. శివుడు సర్వజగములకు నిత్య సాక్షి, లోకైక శుభావహ మూర్తి, నిరామయుడు, పంచభూతముల కంటే ముందున్న వాడు. శివుని ముఖంలో నుండి అగ్ని పుట్టింది. శివుని భక్తితో ఆరాధిస్తే, శివుడు అతనికి మోక్షమును ప్రసాదిస్తాడు. ఈ శివస్తోత్రమును ప్రతిరోజూ పఠిస్తే అతనికి సకల శుభములు కలుగుతాయి." అని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు మహాశివుని నామముల మహాత్మ్యమును వివరించాడు.

తరువాత ధర్మరాజు భీష్ముని ఇలా అడిగాడు. "పితామహా! ధర్మములు పలువిధములు కదా! అందులో ముఖ్యంగా అనుష్ఠింపతగిన ధర్మము ఏది?" అని అడిగాడు.

"ధర్మనందనా! ధర్మము ఇలా ఉంటుంది అని ధర్మవేత్తలే తెలుపగలరు. కాని కాలానుగుణంగా ధర్మం కూడా మారుతూ ఉంటుంది. ఒక్కోసారి ధర్మము తన స్వరూప స్వభావాలను కోల్పోతుంది. ఒక్కో సారి అధర్మం కూడా ధర్మం లాగానే గోచరిస్తుంది. ధర్మసూక్ష్మములు తెలియని వారు అధర్మమును ధర్మంగా ప్రచారం చేస్తారు. దానివలన సాధారణ మానవులు దుఃఖముల పాలవుతారు. కాబట్టి ధర్మసూక్ష్మములు తెలిసిన పెద్దలు చెప్పిన మాటల వలన, వేద,శాస్త్రముల

అధ్యయనము వలన ధర్మము ఇలా ఉంటుంది అని తెలుసుకోగలము. అంతే గాని లోభము, మోహము, మదము, వీటితో కప్పబడిన బుద్ధి ఉన్నవారి వలన ధర్మము గురించి తెలుసుకోకూడదు. అలా తెలుసుకుంటే అధర్మమును ధర్మముగా పొరబడి కష్టాలపాలవుతారు.  ఎల్లప్పుడూ వేదా ధ్యయనమూ, యజ్ఞయాగములు చేయుటయందు ఆసక్తి, ఆచారవ్యవహారములలో శ్రద్ధ కలవారి వలననే ధర్మసూక్ష్మములు తెలుసుకొనవలెను.

ధర్మనందనా! ధర్మసూక్ష్మములను నిర్ధారించుటకు మూడు మార్గములు కలవు. వీటినే పూర్వము మునులు అనుసరించారు. నీవు అనవసరంగా సందేహాలు పెట్టుకోకుండా నా మాటవిను. అహింస, దానగుణము, సత్యము పల్కడం, కోపం లేకుండా ఉండటం ఇవి ఉత్తమ ధర్మములు. కాబట్టి ఈ గుణములు అనుసరించు.  ఎల్లప్పుడూ బ్రాహ్మణులను ఆరాధించు. ఇతర విచారములు మనసులోనుండి తొలగించు. ఎల్లప్పుడూ నిర్మల చిత్తంతో ఉండు. అదే ఉత్తమ ధర్మము." అని చెప్పాడు భీష్ముడు.

" పితామహా! సాధారణంగా ఎవరు ధర్మమును పాటిస్తారు. ఎవరు ధర్మమును ద్వేషిస్తారు వివరించండి." అని అడిగాడు ధర్మరాజు.

"ధర్మనందనా! రజోగుణము, తమోగుణము అధికంగా కలిగిన మానవులు ధర్మమును ద్వేషిస్తారు. అటువంటి వారు నరకానికి పోతారు. ఎల్లప్పుడూ సత్యము పలికేవారు ధర్మాన్ని ఉపాసిస్తారు. అటువంటివారు ఊర్ధ్వలోకములకు అర్హులు. తొలుత బ్రహ్మ నుండి ధర్మముపుట్టింది. సత్త్వగుణ ప్రధానులు మంచి బుద్ధికలవారు ఆ ధర్మమును ఆచరిస్తారు." అని చెప్పాడు భీష్ముడు.

“పితామహా! సాధువులు అనగా ఎవరు! సాధువులు కాని వారు ఎవరు? వివరించండి.” అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మనందనా! సాధువులు కాని వారు ధర్మము అంటే ఏమిటో తమంతట తాము తెలుసుకోలేరు. కనీసం తెలుసుకోడానికి ప్రయత్నం కూడా చెయ్యరు. ఇతరులు ధర్మం గురించి చెప్పినా, బోధించినా వినరు. వారంతట వారు వేదములు శాస్త్రములు చదవరు. వీరిని అసాధులు అంటారు. సాధు జనులు ధర్మమును తమంతట తామే తెలుసుకోడానికి ప్రయత్నం చేస్తారు. వేదములు శాస్త్రములు పురాణములు చదివి తెలుసుకుంటారు. మునుల వలన విని తెలుసుకుంటారు. తెలిసిన వారి బోధనలు విని కూడా తెలుసుకుంటారు. వీరిని సాధులు అంటారు.

సాధుజనులు ఎలా ప్రవర్తిస్తారో చెబుతాను విను. సాధుజనులు అతిధులకు పెట్టిగానీ తాము తినరు. పెద్దలకు ప్రదక్షిణ నమస్కారాలు చేస్తారు. ఎల్లప్పుడూ సత్యమునే పలుకుతారు. కపటము వారిలో కానరాదు. ఎవరన్నా తమ శరణు కోరితే వారిని రక్షిస్తారు. తమ భార్యలతోనే తృప్తి చెందుతారు. పరస్త్రీల వంక కన్నెత్తి కూడా చూడరు. గురువుల ఎడల భక్తి శ్రద్ధలతో ఉంటారు. వారి హృదయం ఎల్లప్పుడూ నిర్మలంగా ఉంటుంది. అలాంటిసాధులు ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటారు. దుఃఖము అంటే ఏమిటో వారికి తెలియదు.

సాధులు ఇంద్రియములను అదుపులో ఉంచుకుంటారు. తెలియకుండా ఏమైనా పాపం చేస్తే వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకుంటారు. దానధర్మాలు చేసేటప్పుడు తనకు తప్ప ఇతరులకు తెలియనీయరు. గుప్తంగా చేస్తారు. వారికి భూతదయ అపారంగా ఉంటుంది. సాటి వారిని కానీ, జంతువులను, కానీ, పక్షులను కానీ హింసించరు. ఇవీ సాధుల లక్షణములు.” అని భీష్ముడు

ధర్మరాజుకు వివరించాడు.

“ పితామహా! ఈ లోకంలో సాధారణంగా కొంతమందికి, ఏ ప్రయత్నమూ లేకుండానే ధనము వచ్చి పడుతూ ఉంటుంది. కొంతమంది ధర్మాత్ములకు, నీతి మంతులకు, ఎన్ని ప్రయత్నములు చేసినా, ఎన్ని ఉపాయములు అనుసరించినా ధనము సమకూరదు. కొంత మందికి ధనము సమకూరినప్పటికినీ ఆ ధనము సుఖాలు అనుభవించడానికి ఉపయోగ పడదు. కొంత మందికి గురువుల వద్ద విద్యనేర్చుకోకపోయినా, అన్ని విద్యలు అబ్బుతాయి. మరి కొంత మందికి ఎంత మంది గురువుల వద్ద విద్య నేర్చుకున్నా, పిసరంత కూడా విద్య అబ్బదు. కొంత మందికి ఎన్ని రోగాలు వచ్చినా, ఎన్ని దెబ్బలు, కత్తిపోట్లు తిన్నా చావరు. కాని కొంత మంది బలవంతులు కూడా చిన్న పుల్ల తగిలినా, చిన్న దెబ్బ తగిలినా చచ్చిపోతారు. ఇటువంటి విపరీతములు జరుగుటకు కారణమేమి? వివరించండి.” అని అడిగాడు ధర్మరాజు.

“ధర్మనందనా! వీటికన్నింటికీ ఒకటే సమాధానము. పూర్వజన్మకృతము. మనము విత్తనం నాటకుండా మొలకలు మొలవవు కదా. అలాగే పూర్వజన్మలో చేసిన పుణ్య,పాపములు ఈ జన్మలో శుభాశుభములను, సత్ఫలితాలను, దుష్ఫలితాలను ఇస్తాయి. క్రితం జన్మలో చేసిన దానధర్మముల వలన మరుజన్మలో ఎలాంటి ప్రయత్నం లేకుండానే ధనం సమకూరుతుంది. ముందటి జన్మలో తపస్సు చేసినట్టయితే మరుజన్మలో అతనికి అపారమైన సుఖములు కలుగుతాయి. క్రితం జన్మలో మనం గురువులకు, పెద్దలకు చేసిన సేవల ఫలితంగానే ఈ జన్మలో చదవకపోయినా విద్య అబ్బుతుంది. క్రిందటి జన్మలో అహింసను పాటిస్తే ఈ జన్మలో దీర్ఘకాలం బతుకుతాడు.

కాబట్టి సాధు జనులు అహింస, దానములు, ధర్మములు, తపస్సు, పెద్దలను సేవించడం, అతిధులను సత్కరించడం మొదలగు మంచి గుణములు అలవరుచుకోవాలి. అప్పుడే మరుజన్మలో కూడా సుఖ సంతోషాలు అనుభవిస్తారు. ఎల్లప్పుడూ ధర్మాన్ని ఆచరిస్తూ, దానధర్మాలు చేస్తూ, తనకు తెలిసిన ధర్మములను ఇతరులకు బోధిస్తూ, వేళకు స్నానము, సంధ్య, జపము, మితాహారము మొదలగు నియమాలు పాటిస్తూ, మనస్సునే నిర్మలంగా ఉంచుకుంటే, అటువంటి వారు ముక్తిని పొందుతారు.

ధర్మనందనా! నీ కంటి వెలుగు వ్యాసుడు. నీకు కృష్ణుని ఆశ్రయము ఉంది. వీటి అండతో  నీవు ప్రజలను పాలించు. నీకు విజయం లభిస్తుంది." అని చెప్పాడు భీష్ముడు. ఆ మాటలతో ధర్మరాజు సంతృప్తి చెందాడు.

అక్కడే ఉన్న వ్యాసుడు భీష్ముని చూచి "శాంతనవా! నీ ఉపదేశములతో ధర్మతనయుడు విజ్ఞానవంతుడయ్యాడు. ధర్మజుడే కాదు, అతని తమ్ములు, ధృతరాష్ట్రుడు,  కృష్ణుడు, ఇక్కడ ఉన్న సమస్త రాజన్యులు నీ ఉపదేశములను విని ధన్యులయ్యారు.  ఇంక ధర్మరాజుకు  హస్తినాపురమునకు పోవుటకు అనుజ్ఞ ఇమ్ము.  తగిన సమయములో మరలా నీ దగ్గరకు వస్తాడు."  అని అన్నాడు వ్యాసుడు.

అప్పుడు భీష్ముడు ధర్మరాజును తన గ్గరకు పలిచి "ధర్మనందనా! వింటివి కదా వ్యాసుని మాటలు. ఆయన మాటల ప్రకారము నీవు, నీసోదరులు నీ పరివారముతో కూడా హస్తినాపురమునకు పోయి జనరంజకంగా రాజ్యపాలన చెయ్యి. నీ బుద్ధి ఎల్లప్పుడూ ధర్మము నందే  నిలిచి ఉంటుంది. నీ పూర్వీకుడు యయాతి మహారాజు మాదిరి యజ్ఞములు యాగములు చెయ్యి. రాజధర్మము తప్పకుండా ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించు. నీ బంధువులను

స్నేహితులను ఆదరించు. ప్రస్తుతానికి హస్తినాపురమునకు వెళ్లు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించిన తరువాత నా దగ్గరకు రా! నీతల్లి, నీ తమ్ముళ్లు,నీ పెదతండ్రి ధృతరాష్ట్రుడు, విదురుడు వీరితో సుఖంగా రాజ్యపాలన చెయ్యి." అని ఆశీర్వదించాడు భీష్ముడు.

" పితామహా! తమరు చెప్పినట్లే చేసెదను." అని భీష్మునికి నమస్కరించాడు ధర్మరాజు. అక్కడ ఉన్న మునుల ఆశీర్వాదము తీసుకున్నాడు. శ్రీకృష్ణుడు, తన తమ్ములు వెంటరాగా హస్తినాపురమునకు వెళ్లాడు. మంగళవాద్యములు మోగుతూ ఉండగా పుణ్యాంగనలు అక్షతలు పూలు చల్లుతూ ఉండగా హస్తినాపుర నగర ప్రవేశము చేసాడు. ముందు పెద తల్లి గాంధారీదేవిని సందర్శించుకొని ఆమె ఆశీర్వాదము తీసుకున్నాడు.తరువాత తన పెదతండ్రి ధృతరాష్ట్రుని సందర్శించుకున్నాడు. ఆయనను ప్రణామం చేసాడు. తరువాత తన కన్న తల్లి కుంతీదేవికి నమస్కరించి ఆమె ఆశీర్వాదము తీసుకున్నాడు. భార్య ద్రౌపదీదేవిని కలుసుకున్నాడు. యోగక్షేమాలు విచారించాడు.

నగర వాసులతో గోష్టి జరిపి వారి కష్టసుఖములు తెలుసుకున్నాడు. బ్రాహ్మణులకు దానధర్మములు చేసాడు. యుద్ధములో భర్తలను, కుమారులను పోగొట్టుకొని నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పించాడు. వారిని ధనముతో సంతోషపెట్టాడు. తరువాత కురుసామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుడై రాజ్యాధి కారము చేపట్టాడు. తన తమ్ములకు వారి వారికి తగిన పనులు అప్పగించాడు. తాను విశ్రాంతి మందిరము చేరుకున్నాడు.

యాభయి దినములు గడిచాయి. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించాడు. ఉత్తరాయనము మొదలయింది. వెంటనే ధర్మరాజు తన తమ్ములను,

శ్రీ కృష్ణుని, ధృతరాష్ట్రుని, గాంధారిని, కుంతీ దేవిని, విదురుని, యుయుత్సుని, సంజయుని, కృపాచార్యుని, ధౌమ్యుని మొదలగు పెద్దలను తన వెంట తీసుకొని, నూతన వస్త్రములను, చందనము, అగరు మొదలగు సుగంధ ద్రవ్యములను తీసుకొని భీష్ముడు అంపశయ్య మీద ఉన్న చోటికి వెళ్లాడు. కొంచెం దూరం లోనే రథం దిగాడు. పాదచారియై భీష్ముని వద్దకు వెళ్లాడు. కృష్ణుడు మొదలగు వారు కూడా వారి వారి రథములుదిగి పాదచారులై భీష్ముని వద్దకు వెళ్లారు.

అప్పటికే అక్కడికి వ్యాసుడు, నారదుడు,దేవలుడు మొదలగు మహామునులు వచ్చి ఉన్నారు. ధర్మరాజు మొదలగు వారు వారందరికీ నమస్కరించారు.

ధర్మరాజు భీష్ముని చూచి ఇలా అన్నాడు. "పితామహా! నేను ధర్మతనయుడను వచ్చాను. నీకు నమస్కరిస్తున్నాను. నా మాటలు వినండి. ఉత్తరాయనం వచ్చింది. అందుకని అగ్ని మొదలగు వస్తువులు తీసుకొని వచ్చాను. శ్రీ కృష్ణుడు, నా తమ్ములు, ధృతరాష్ట్రుడు మొదలగు వారు వచ్చారు. కళ్లు తెరిచి చూడండి." అని ప్రార్థించాడు.

భీష్ముడు నెమ్మదిగా కళ్లు తెరిచాడు. అందరినీ చూచాడు. ధర్మరాజు చేతిని తన చేతిలోనికి తీసుకున్నాడు. ఆప్యాయంగా నిమురుతూ " కుమారా! వచ్చావా. ఇప్పుడు మాఘమాసము శుక్లపక్షము నా మనస్సుకు ఎంతో ఆహ్లాదము కలిగించింది." అని అన్నాడు.

పిదప ధృతరాష్ట్రుని చూచి "కుమారా! నీకు అన్ని ధర్మాలు తెలుసు. నీవు జరిగిన వాటి గురించి జరగనున్న వాటిని గురించి భయపడనవసరం లేదు.

నీవు సద్భావంతో చూస్తే ఈ పాండు నందనులు కూడా నీ కన్న కుమారుల వంటి వారు కారా! కాబట్టి దయతో పాండవులను పాలించు. వీరి శుశ్రూషలు అందుకొనుము. ధర్మరాజు మీద కరుణ చూపుము. అతనికి కర్తవ్య బోధ చేయుము. రాచకార్యములలో తోడుగా ఉండు.

ధృతరాష్ట్ర మహారాజా! నాకు బాగా తెలుసు. ఈ ధర్మతనయుడు నీ పట్ల ప్రేమ భక్తి కలిగి ఉన్నాడు. ఇతనికి క్రూరత్వము తెలియదు. కాబట్టి వాత్సల్యంతో ధర్మనందనుని చూచుకొనుము. నేను చెప్పేది విను. నీ కుమారులు దుర్యోధనాదులు అవినీతి పరులు, అధర్మపరులు, క్రోధబుద్ధి కలవారు, అతిగా లోభత్వము కలవారు. వారి కోసం నీవు బాధపడవద్దు." అని అన్నాడు.

తరువాత శ్రీకృష్ణుని చూచి "కృష్ణా! వాసుదేవా! సమస్త జీవులలో సంచరించేవాడా! దేవతలచేత పూజింపబడేవాడా! శంఖ,చక్ర,గదా,పద్మములు నాలుగు చేతులలో కలిగిన వాడా! త్రివిక్రమా! వరదా! పరమపురుషా! నీకు నమస్కారం చేస్తున్నాను. నా వంక దయతో చూడుము. నేను నీ భక్తుడను. నీవే నాకు బలము. ఆలు,బిడ్డలు లేని వాడిని. కాబట్టి అధిక మైన కరుణతో నన్ను రక్షించు. నాకు అనుజ్ఞ ఇమ్ము. ఓ మాధవా! ఈ పాండవులకు మార్గదర్శకుడివి నీవే! వారిని కరుణతో రక్షించు. నేను కూడా దుర్బుద్ధియైన సుయోధనునితో చాలా సార్లు అన్నాను.... కృష్ణుడు ఎక్కడ ఉంటాడో అక్కడ విజయం ఉంటుంది అని. నేను ఆ మాదిరి చెప్పినా సుయోధనుడు నా మాటలు వినలేదు. తనవారి నందరినీ చంపి తానూ చచ్చాడు.

కృష్ణా! నేను నిన్ను తెలుసుకున్నాను. పూర్వము ఈ జగత్తును రక్షించుటకు నరుడు, నారాయణుడు అనే మునులు జన్మించారు అని, వారు లీలామానుషవిగ్రహాలుగా భూలోకంలో సంచరిస్తున్నారు అనీ, వారు కృ

ష్ఠారునులు అనీ  నారదుడు, వ్యాసుడు నాకు చెప్పగా విన్నాను." అని అన్నాడు.

ఆ మాటలు విన్న శ్రీకృష్ణుడు "దేవవ్రతా! ఇందులో నీవు చేసిన తప్పు ఏమీ లేదు. నీవు పుణ్యాత్ముడవు. నీ తండ్రి శంతనుని పట్ల భక్తి శ్రద్ధ కలవాడవు. ఆ కారణం చేతనే కదా మృత్యువు నీ దగ్గర సేవకుని మాదిరి నీ ఆజ్ఞకొరకు వేచి ఉన్నది. నేను నీకు అనుజ్ఞ ఇస్తున్నాను. నీవు ఈ దేహమును విడిచి వసువులలో చేరుము." అని అన్నాడు శ్రీ కృష్ణుడు.

ఆ మాటలు విని పరమానందభరితుడయ్యాడు భీష్ముడు. పాండవులను, ధృతరాష్ట్రుని మిగిలిన వారిని ఆదరంతో చూచాడు. "మీ అందరి దగ్గర అనుజ్ఞ తీసుకుంటున్నాను." అని అన్నాడు. అందరినీ కౌగలించుకున్నాడు. "మీరందరూ క్రూరత్వమును వదిలిపెట్టి, సత్యమునే నిత్యమూ పలకండి." అని బోధించాడు. తాను ఇంతకు ముందు రాజులనుండి గెలుచుకున్న ధనమును బ్రాహ్మణులకు దానంగా ఇచ్చాడు. "ధర్మనందనా! బ్రాహ్మణు లందరూ పూజింప తగినవారు. అందులోనూ ఋత్విక్కులు, ఆచార్యులు, వృద్ధులు విశేషించి పూజింప తగినవారు." అని పలికాడు.

తరువాత మౌనం వహించాడు. యోగధారణతో జీవాత్మను పరమాత్మతో అనుసంధానం చేసాడు. అన్ని వాయువులను ఏ అడ్డు లేకుండా ఊర్ధ్వముఖంగా ప్రయాణింపచేసాడు. ఒక్కొక్క అవయవము నుండి ప్రాణములను వెనక్కు లాగుకుంటున్నాడు. అక్కడ ఎముకలు మాయమవుతున్నాయి. అది చూచి కృష్ణుడు మొదలగువారు, అక్కడ చేరిన అఖిల జనులు ఆశ్చర్యపోతున్నారు. భీష్ముని గట్టిగా కీర్తిస్తున్నారు.

ఆ సమయంలో భీష్ముని జీవాత్మ మూర్ధమును చీల్చుకొని ఒక మహా ఉల్క

మాదిరి ఆకాశంలోకి ఎగిరిపోయింది. కొంచెందూరం పోయి అదృశ్యం అయింది. దేవతలు పూలవాన కురిపించారు.దేవ దుందుభులు మోగాయి. దేవతలు, సిద్ధులు, సాధ్యులు ఆనందంతో భీష్ముని పొగిడారు. ఈ ప్రకారంగా దేవవ్రతుడు (భీష్ముడు) స్వర్గలోకం చేరుకున్నాడు.

తరువాత ధర్మరాజాదులు, విదురుడు, యుయుత్సుడు మొదలగు వారు భీష్ముని శరీరానికి దహన సంస్కారానికి ఏర్పాట్లు చేసారు. చందనము, అగరు, మొదలగు కట్టెలతో చితి పేర్చారు. అందరూ గంగాస్నానం చేసారు. వేదములు పఠిస్తుంటే హోమాగ్ని వెలిగించారు. భీష్ముని పార్థివ శరీరాన్ని తల పక్క నకుల సహదేవులు, కాళ్ల పక్క ధృతరాష్ట్రుడు, ధర్మరాజు పట్టుకున్నారు, భీష్ముని శరీరాన్ని బాగుగా అలంకరించిన వాహనము మీద ఉంచారు. నకుల సహదేవులు, ధృతరాష్ట్రుడు, ధర్మరాజు మోస్తూ ఉండగా, భీమార్జునులు చామరములు వీస్తున్నారు. యుయుత్సుడు ఛత్రము పట్టుకున్నాడు. వృద్ధ కౌరవ స్త్రీలు వింజామరలు వీస్తున్నారు. ధౌమ్యుడు పౌరోహిత్యము వహించాడు.

అందరూ భీష్ముని శరీరమును చితిమీద ఉంచారు. నేతిని ఆ చితిమీద పోసారు. చితికి నిప్పంటించారు. ఆ ప్రకారంగా భీష్ముని అంతిమ సంస్కారములు వైభవంగా నిర్వహించారు. తరువాత అందరూ గంగానదిలో స్నానాలు చేసారు. అందరూ భీష్మునికి నువ్వులు నీళ్లు వదిలారు.

ఆ సమయంలో భీష్ముని తల్లి అయిన గంగాదేవి దుఃఖిస్తూ గంగాజలములలో నుండి బయటకు వచ్చింది. కుమారుని మరణానికి ఏడుస్తూ ఉంది. "అయ్యో! దేవవ్రతా! ముల్లోకాలలో నీ కంటే పరాక్రమ వంతుడు లేడనుపించుకున్నావు కదా! మీకు తెలుసు కదా! నా కుమారుడు ధృ ఢవ్రతశీలుడు. బుద్ధిమంతుడు. క్షత్రియ ధర్మము బాగా తెలిసినవాడు.

అందరి యందు కృపకలిగిన వాడు. మంచి కార్యపరుడు. పితృభక్తిలో తనకు తానే సాటి అనిపించుకున్నాడు. అన్ని విద్యలలో ఆరితేరినవాడు. పెద్దలయందు గౌరవం కలవాడు. తన తమ్ముల కొరకు సకల రాజులను జయించి కాశీరాజ పుత్రికలను తీసుకొని వచ్చిన వీరుడు. తన గురువు పరశురామునే ఎదుర్కొన్నాడు. అలాంటి వాడు ఒక్క శిఖండి చేతిలో ఓడింపబడ్డాడు. శరతల్పగతుడయ్యాడు. ఆఖరుకు ఈ లోకమునే వదిలివెళ్లిపోయాడు. ఇది చూచి కూడా నా గుండెలు బ్రద్దలు కాలేదంటే నా హృదయం వజ్రసమానమై ఉంటుంది కదా!" అని రోదిస్తూ ఉంది గంగాదేవి.

అప్పుడు వ్యాసుడు గంగా దేవి దగ్గరకు వచ్చి "అమ్మా! భాగీరధీ! నీ శోకాన్ని విడిచి పెట్టు. నీ కుమారుడు పరమగతి పొందాడు. నీ కుమారుడు వసువు. శాపవశాత్తు మానవుడిగా అవతరించాడు. నీ కుమారుడు అత్యంత ప్రతిభాశాలి. అతడిని గూర్చి శోకించవద్దు. శిఖండి వల్ల నీ కుమారుడు పడిపోలేదు. ఒక్క శిఖండియే కాదు సాక్షాత్తు ఆ దేవేంద్రుడు కూడా నీ కుమారుని జయించలేడు. భీష్ముడు తన ఇష్ట ప్రకారమే అన్ని బాణములను తన శరీరంలో నాటించుకొని శరతల్పగతుడయ్యాడు. అంతేగానీ ఎవరూ అతనిని జయించలేదు. ఇంతకాలమూ మృత్యువును దూరంగా ఉంచాడు. ఉత్తరాయన పుణ్యకాలము రాగానే తనంత తానుగా ఈ శరీరమును వదిలిపెట్టాడు. అటువంటి పుత్రుని కొరకు చింతించ తగదు." అని ఎన్నోవిధాలుగా గంగాదేవిని ఊరడించాడు వ్యాసుడు. తరువాత శ్రీకృష్ణుడు, పాండవులు, ధృతరాష్ట్రుడు మొదలగు వారు గంగాదేవి అనుమతి తీసుకొని అక్కడి నుండి వెళ్లిపోయారు. గంగాదేవి కూడా గంగానదీ జలాలలో కలిసిపోయింది.

మహా భారతము ఆనుశాసనిక పర్వము పంచమాధ్యాయము సమాప్తము.

ఆనుశాసనిక పర్వము సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓంతత్సత్.

# మహా భారతము

## అశ్వమేధ పర్వము

### ప్రధమాశ్వాసము.

సర్ప యాగము ముగిసిన సందర్భంగా వైశంపాయనుడు జనమే జయునకు చెప్పిన మహా భారత కధను, నైమిశారణ్యంలో జరుగుతున్న సత్రయాగ సందర్భంలో సూతుడు శౌనకాది మహా మునులకు సవిస్తరంగా వినిపించాడు.

భీష్ముడు పరమపదించాడు. చిన్నప్పటి నుండి పెంచి పెద్ద చేసి విద్యా బుద్ధులు చెప్పించి, మంచీ చెడూ చెప్పి, తాను, తన మరణానికి కారకు డయినా, ఇసుమంత కూడా కోపగించక, తాను అడిగిన ధర్మ సందేహము లన్నిటికీ ఓపికగా సమాధానాలు చెప్పి, ఉత్తరాయణ పుణ్యకాలము రాగానే తనువు చాలించిన భీష్ముని మరణాన్ని తట్టుకోలేకపోయాడు ధర్మరాజు. చింతాక్రాంతు డయ్యాడు. తూలు తున్నాడు. కింద పడిపోతున్నాడు.

భీముడు ధర్మరాజును పట్టుకున్నాడు. మెల్లిగా పక్కన కూర్చోపెట్టాడు. ఇదంతా విన్న ధృతరాష్ట్రుడు ధర్మరాజు దగ్గరకు వచ్చాడు.

"ధర్మనందనా! నీవెందుకయ్యా చింతిస్తావు. నీవు క్షాత్రధర్మమును నెరవేర్చావు. ఇది శోకించడానికి సమయం కాదు. నీవు నీ తమ్ములు

రాజ్యాధికారము చేపట్టండి. నా కుమారుడు కానీ, నేను కానీ, విదురుని హితోక్తులు వినలేదు. నా కుమారుడు సుయోధనుడు తన తమ్ముళ్లతో సహా యుద్ధంలో మరణించాడు. నేను కూడా విదురుని మాటలు వినకపోవడం వల్ల ఈ యుద్ధం సంభవించింది. అపార జననష్టం వాటిల్లింది. నేనూ, గాంధారీ పుత్రశోకంతో కుమిలిపోతున్నాము. ఇందులో నీ తప్పు ఇసుమంత కూడా లేదు. నాయనా ధర్మనందనా! నేను గాంధారీ ఒంటరి వాళ్లము. దిక్కులేని వాళ్లము అయ్యాము. మా ఇద్దరినీ నీవే జాగ్రత్తగా చూచుకోవాలి. నీవే మాకు దిక్కు." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

ఆ మాటలు విని ఏమాట్లాడలేదు ధర్మరాజు. అప్పుడు కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"ధర్మనందనా! నీవు ఇప్పుడు శోకించి నంత మాత్రాన పోయిన వారు తిరిగి వస్తారా! పైగా నువ్వు వారి కోసం బాధ పడుతుంటే వారి ఆత్మలకు ఎలా శాంతి కలుగుతుంది. పైగా సుయోధనాదులు వీరోచితంగా పోరాడి వీర స్వర్గము అలంకరించారు. వారి కోసం బాధ పడటం ధర్మమా!

అయినా కూడా నువ్వు భీష్ముని వలన వినవలసిన ధర్మసూక్ష్మములు అన్నీ విన్నావు కదా! అవన్నీ విని కూడా ఏమీ తెలియని వాడి వలే శోకించడం భావ్యమా! ఒక్క భీష్ముడే కాదు. వ్యాసుడు, నారదుడు మొదలగు వారు నీకు ఎన్నో నీతి వాక్యములు చెప్పారు కదా. అవన్నీ ఒక సారి గుర్తుకు తెచ్చుకో. వెంటనే ఒక మహా యాగమునకు కర్తవు కా! దేవతలకు, నీ పితరులకు ప్రీతితో, భక్తితో పూజలు, తర్పణములు కావించు. రాజ్యాధికారము చేపట్టి ప్రజలను జనరంజకంగా పాలించు. అతిధులను అభ్యాగతులను సత్కరించు. నీ బంధువులను, మిత్రులను ఆదరించు." అని అన్నాడు శ్రీ కృష్ణుడు.

అప్పుడు ధర్మరాజు అక్కడే ఉన్న వ్యాసుని మొహం వంక చూచి "దేవా! నీయొక్క ప్రేమ,దయ నా మీద ఎప్పుడూ గాఢంగా ఉంటాయి కదా! మీరు నన్ను ఎన్నోసార్లు ధర్మసంకటముల నుండి రక్షించారు. కాబట్టి నా మీద దయయుంచి నాకు వనవాసమునకు అనుజ్ఞ ఇవ్వండి. వనములకు వెళ్లక పోతే తాతగారిని, నా అన్న కర్ణుని చంపిన నా వంటి క్రూరాత్మునకు శాంతి ఎట్లు కలుగుతుంది. నేను చేసిన మహాపాపములు ఎలా పోతాయి? కాబట్టి నాకు వనవాసమునకు అనుజ్ఞ ఇవ్వండి." అని ప్రాధేయపడ్డాడు ధర్మరాజు.

వ్యాసునికి కోపం వచ్చింది. "ధర్మనందనా! ఇప్పటి దాకా నేను, భీష్ముడు నీకు చేసిన ధర్మోపదేశములు అన్నీ వరదలో కొట్టుకొని పోయాయా! లేక గంగలో కలిసిపోయాయా! మరలా మొదటికి వచ్చావు. నీ బుద్ధి ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా జరిగిన దానికి నీవు కర్తవు కాదు. ఈశ్వరుడే మానవాళికి మేలు, కీడు కలిగిస్తుంటాడు. కాబట్టి ఇందులో నీ తప్పు ఏమాత్రమూ లేదు. ఒక వేళ నీకు పాపము చేసాను అనే సందేహము ఉంటే దానిని దాన ధర్మములు చేసి యజ్ఞయాగములు చేసి తొలగించుకో. అంతేగానీ వనవాసము పోతాను అనడం వెర్రిమాట.

ఇప్పుడు చెబుతున్నాను విను. నువ్వు అశ్వమేధ యాగము చెయ్యి. ఆ యాగములో బ్రాహ్మణులకు అధికంగా దక్షిణలు ఇచ్చి తృప్తి పరుచు. దానితో నీ మనసులో కలిగిన దుఃఖము పూర్తిగా తొలగిపోతుంది." అని అన్నాడు వ్యాసుడు.

ఆ మాటలతో మనసు మార్చుకున్నాడు ధర్మరాజు. "మహాత్మా! తమరు చెప్పినట్టే అశ్వమేధ యాగము చేస్తాను. కాని నాది ఒక విన్నపము. అశ్వమేధ యాగమునకు దక్షిణలు ఎక్కువగా ఇవ్వాలని, ధనము ఎక్కువగా వ్యయము

అవుతుంది అని తమరు చెప్పారు.  ప్రస్తుతము నా వద్ద అంత ధనము లేదు. జరిగిన యుద్ధము వలన సైనికులు అంతా మరణించారు. వారి భార్యాబిడ్డలు మాత్రం మిగిలారు. ఈ సమయంలో వారి మీద అధిక పన్నులు వేసి బాధ పెట్టలేను. మామీద ఉన్న అసూయతో సుయోధనుడు దుర్మార్గులయిన రాజులందరినీ చేరదీసి ధనము అంతా దుర్వినియోగము చేసాడు. భూములను, ధనాగారమును పాడు చేసాడు.  దాని కారణంగా ధనాగారములో ధనము లేదు. ధనము సంపాదించడానికి నాకు ఏ మార్గమూ కనపడటం లేదు. ఈ సందర్భంలో మీరే మాకు ఒక దారి చూపి ఈ  అశ్వమేధ యాగము జరిపించాలి." అని అన్నాడు ధర్మరాజు.

వ్యాసుడు ధర్మరాజు వంక ఆదరంతో చూచాడు. "ధర్మనందనా! పూర్వము మరుత్తు అనే మహారాజు యజ్ఞము చేసి మహా ధనరాసులను బ్రాహ్మణులకు దానంగా ఇచ్చాడు. అప్పుడు బ్రాహ్మణుల వద్ద ఎక్కువగా ధనం సమకూరింది. వారికి ఎక్కువ అయింది. అప్పుడు ఆ బ్రాహ్మణులు తమ పోషణకు కావలసిన ధనము మాత్రము ఉంచుకొని మిగిలిన ధనమును ఒక నిధిగా చేసి దాచి పెట్టారు. "ఈ ధనము ఎవరు కనుగొంటారో వారికే ఈ ధనము చెందుతుంది."  అని  ఆ బ్రాహ్మణులు  ఒకే ఒక వాక్యంతో  ఆ నిధికి వారసులను నియమించారు. ధర్మనందనా! ఆ ధనము ఇంకా ఎవరూ తీసుకొన లేదు.  అలాగే ఉన్నది. నీవు ఆ ధనమును తీసుకొని అశ్వమేధయాగమును నిర్విఘ్నంగా నిర్వహించు." అని అన్నాడు వ్యాసుడు.

"ఓ మహాత్మా! మరి ఆ మరుత్తు ఆ ధనమును, బంగారమును ఎలా సంపాదించాడు.  అది సక్రమ సంపాదనా లేక అక్రమ సంపాదనా!" అని సందేహము వెలిబుచ్చాడు ధర్మరాజు.

( ఏ ధర్మకార్యమైనా న్యాయంగా ఆర్జించిన ధనముతోనే చెయ్యాలని ఆనాటి ధర్మము. ప్రజలను, ప్రభుత్వ ఆస్తులను, దేవాలయాల ఆస్తులను అక్రమంగా, అడ్డంగా దోచుకుంటూ, ఆ డబ్బులో కొంత డబ్బు హుండీలో వేసి చేతులు దులుపుకోడం, లేకపోతే కొంత డబ్బు ఖర్చుపెట్టి, ధర్మకార్యాలు చేసి చేసి, పాపాలు కడిగేసుకోవడం నేటి ధర్మము.)

ధర్మనందనా! నీకు మరుత్తు యొక్క కథను చెబుతాను విను. నీ సందేహములు తొలగిపోతాయి. కృతయుగములో మనువునకు ప్రజాని అనే కుమారుడు ఉండేవాడు. అతని కుమారుడు క్షుతుడు. క్షుతుని కుమారుడు ఇక్ష్వాకువు. ఆ ఇక్ష్వాకునకు నూరుగురు కుమారులు. అందులో పెద్దవాడు వింశుడు. వింశుని కుమారుడు వివింశుడు. వివింశునకు 15 మంది కుమారులు.

వారిలో పెద్దవాడు ఖనీనేత్రుడు. అతడు అధిక మైన బలము, శౌర్యము కలవాడు. పరమ దుర్మార్గుడు. అతడు తన 14 మంది తమ్ములను చంపి రాజ్యాధికారము చేజిక్కించుకున్నాడు. ఖనీనేత్రుడు ఎవరినీ నమ్మేవాడు కాదు. మంత్రులను ద్వేషించేవాడు.ప్రజలను పీడించేవాడు. అతని ఆగడములను తట్టుకోలేక మంత్రులు ఖనీనేత్రుని రాజ పదవి నుండి దించారు. అతని కుమారునికి పట్టం కట్టారు.

ఖనీ నేత్రుని కుమారుడు దయామయుడు. మంత్రులను ఆదరించాడు. ప్రజలను దయతో చూచేవాడు. సత్యము పలికేవాడు. ధర్మము పాటించేవాడు. ఎప్పుడూ దానధర్మములు చేసేవాడు. తనకు ఉన్నదంతా దానధర్మములకు వినియోగించాడు చివరకు దరిద్రుడయ్యాడు. కోశాగారంలో ధనము లేదు. సైన్యములకు వేతనములు లేవు. సైన్యం క్షీణించింది. శత్రురాజులు తమ తమ

సైన్యాలతో వచ్చి రాజ్యమును ఆక్రమించుకున్నారు. ఆ రాజు తన వారితో అడవుల పాలయ్యాడు.

కాని ఆ రాజు ఏ మాత్రం చింతించలేదు. నియమ నిష్టలతో అడవిలో తపస్సు చేసాడు. అప్పుడు ఒక అద్భుతము జరిగింది. అతని తపోబలానికి అక్కడి కక్కడ అపారమైన సైన్యము ఉద్భవించింది. ఆ రాజు ఆ సైన్యములతో వెళ్లి శత్రురాజులను జయించి తన రాజ్యమును తిరిగి సంపాదించుకున్నాడు. ఆ రాజు ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము కలిగి, సత్యవాక్పరిపాలన చేయుచూ ధర్మం గా రాజ్యం పరిపాలించాడు. ఆ రాజు అంగిరసుని ఉపద్రష్టగా పెట్టుకొని ఎన్నో అశ్వమేధయాగములు చేసాడు. ఆ రాజు పేరు కరంధముడు. ఆ కరంధముని మనుమడే మరుత్తు.

ఆ మరుత్తు మహా బలవంతుడు. కీర్తిమంతుడు. విష్ణువుతో సమానమైన వాడు. ధర్మతత్పరుడు. వేదములు బాగా అధ్యయనము చేసినవాడు. అధిక మైన తేజస్సు కలవాడు. ఆ మరుత్తు మహారాజు అశ్వమేధ యాగము చేస్తున్నాడు. ఆ అశ్వమేధ యాగమునకు కావలసిన ముఖ్యమైన వస్తువులు దాచి పెట్టుటకు పెద్ద పెద్ద బంగారు కుండలను తయారుచేయించాడు. ఆ యజ్ఞములో బ్రాహ్మణులకు మిక్కుటముగా దానములు చేసి వారిని తృప్తి పరిచాడు. కాని మరుత్తు తృప్తి పడలేదు. బ్రాహ్మణులకు వారి దైనందిన జీవనము కావలసిన చెంబులు బిందెలు పాత్రలు కూడా బంగారంతో చేయించి ఇచ్చాడు.

ఇంతకూ ఆ మరుత్తుకు ఆ ధనము ఎక్కడి నుండి వచ్చినదో నీకు తెలుపుతాను. మరుత్తు తాతగారు కరంధముడు అని చెప్పాను కదా. ఆ కరంధముడు అంగిరసుని ఉపద్రష్టగా చేసుకొని అనేక అశ్వమేధ యాగములు

చేసాడు. ఆ కారణంగా ఈ శరీరంతోనే స్వర్గానికి వెళ్లాడు. కరంధముని కుమారుడు అవిక్షిత్తు. అతడు కూడా తండ్రి మాదిరి ప్రజలను కన్న బిడ్డలవలె పాలించాడు.

ఆ అవిక్షిత్తు కుమారుడే మరుత్తు. ఆ మరుత్తు మహా బలవంతుడు ధర్మాత్ముడు అని చెప్పాను కదా. అతడు ఇంద్రుని కూడా లెక్కచెయ్యలేదు. అందుకని ఇంద్రునికి మరుత్తు మీద అసూయ ద్వేషము కలిగాయి. వెంటనే ఇంద్రుడు తన గురువు గారైన బృహస్పతి దగ్గరకు వెళ్లాడు.

"గురువరా! మరుత్తు గురించి మీరు విన్నారు కదా! ఆయన అశ్వమేధ యాగములు ఎన్నో చేసాడు. ఆ మరుత్తు మిమ్ములను తను చేయబోయే యాగమునకు ఉపద్రష్టగా ఉండమని అర్థించబోతున్నాడు. మరి మీరు దేవ గురువుకదా. ఒక మానవుని యజ్ఞమునకు ఉపద్రష్టగా ఉంటే అది మీ గౌరవమునకు భంగము కదా! మీరు అతని యాగమునకు ఆధ్వర్యము వహిస్తాను అంటే నన్ను మరిచిపొండి. లేకపోతే నా దగ్గరే ఉండండి. అతని యాగమునకు రాను అని చెప్పండి. తరువాత మీ ఇష్టం." అని అన్నాడు ఇంద్రుడు.

ఆ మాటలకు బృహస్పతి ఇలా అన్నాడు. "అదేమిటి దేవేంద్రా! నా సంగతి నీకు తెలియదా! నేను నిన్ను కాదని మరొకరి యాగమునకు ఆధ్వర్యము ఎలా వహిస్తాను! దాని గురించి నీవు నాకు ఇంతగా చెప్పాలా! నువ్వు తప్ప నాకు ఇంకెవరూ అక్కరలేదు." అని అన్నాడు బృహస్పతి. ఆ మాటలకు తృప్తిపడిన దేవేంద్రుడు తన నివాసమునకు వెళ్లిపోయాడు.

తరువాత మరుత్తు బృహస్పతి దగ్గరకు వెళ్లాడు. "మహాత్మా! నేను

అశ్వమేధ యాగము చెయ్యబోతున్నాను. తమరు దానికి ఉపద్రష్టగా వ్యవహరించ వలెను. తమరు అంగీకరిస్తారని నేను అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను." అని అన్నాడు.

" ఓ మరుత్తు! నేను రాలేను. ఎందుకంటే అదే సమయానికి ఇంద్రుడు కూడా ఒక యాగము తలపెట్టాడు. నేను దానికి ఉపద్రష్టగా వ్యవహరించవలెను కదా!" అని అన్నాడు.

"అదేమిటి మహాత్మా! తమరి తండ్రిగారైన అంగిరసుడు మా తాతగారు కరంధముడికి ఉపద్రష్టగా ఉండి ఎన్నో అశ్వమేధ యాగములు నిర్వహించారు కదా. అలాగే తమరు కూడా నాకు ఉపద్రష్టగా ఉండి నేను తలపెట్టిన అశ్వమేధ యాగమును సఫలం చేయండి." అని అర్ధించాడు.

"ఓ మరుత్తు మహారాజా! నేను దేవతలు చేయు యజ్ఞములకు ఉపద్రష్టగా వ్యవహరిస్తాను. కానీ, నీవు మానవుడివి. నీవు చేయు యాగములకు ఉపద్రష్టగా ఎలా వ్యవహరించగలను. కాబట్టి నీవు వేరే ఉపద్రష్టను చూచుకో." అని అన్నాడు బృహస్పతి.

మరుత్తు ఇంక ఏమీ మాట్లాడలేకపోయాడు. అవమాన భారంతో వెనుదిరిగిపోతున్నాడు. దారిలో మరుత్తుకు నారదుడు కనిపించాడు.

"ఓ మరుత్తు మహారాజా! ఎక్కడి నుండి వస్తున్నావు. ఏ పని మీద వెళుతున్నావు" అని అడిగాడు.

" ఓ నారద మహర్షి! నేను బృహస్పతిని వద్దకు పోయి, నేను చేయబోవు

అశ్వమేధ యాగమునకు ఉపద్రష్టగా ఉండమని అడగడానికి వెళ్లాను. దానికి బృహస్పతి తాను కేవలం దేవతలు చేసే యాగములకు మాత్రము ఉపద్రష్టగా ఉంటానని, మానవులు చేయు యాగములకు ఉపద్రష్టగా ఉండనని అవమానించి పంపాడు. ఇంతటి అవమానము పొలయి కూడా నేను ఇంకా ఎందుకు బతకాలి." అని అన్నాడు మరుత్తు దీనంగా.

"అదేమిటి మరుత్తు మహారాజా! బృహస్పతి కాక పోతే మరొకడు. యాగం ఆగిపోతుందా. అంగిరసుని చిన్న కొడుకు, బృహస్పతి తమ్ముడు సంవర్తనుడు అను వాడు ఉన్నాడు. అతడిని బృహస్పతి అవమానించి ఇంటి నుండి వెళ్లగొట్టాడు. ఆ అవమానము తట్టుకోలేక సర్వము వదిలిపెట్టి సంవర్తనుడు అడవులకు వెళ్లిపోయాడు. ప్రస్తుతము వైరాగ్యంతో దిగంబరంగా తిరుగు తున్నాడు. నీవు అతనిని కలుసుకో. ఆతడు నీ యాగమునకు ఉపద్రష్టగా వ్యవహరిస్తాడు." అని చెప్పాడు నారదుడు.

" నారదా! నాకు మంచి మార్గము చూపారు. ఆ సంవర్తనుడు ఎక్కడ ఉంటాడో! అతనితో ఎలా మాట్లాడాలో! అతడు నా మాటను ఎలా మన్నిస్తాడో! వివరంగా చెప్పండి." అని అడిగాడు మరుత్తు.

"ఓ మరుత్తు మహారాజా! సంవర్తనుడు కాశీనగరంలో ఉంటాడు. పిచ్చివాడి మాదిరిగా తిరుగుతుంటాడు. అతనిని పట్టుకోవాలంటే ఒక ఉపాయము చెబుతాను విను. నీవు కాశీనగరమునకు పోయి నగర ముఖద్వారము వద్ద ఒక శవమును పెట్టుకొని నిలబడు. ఎవరైనా నీ దగ్గరకు వచ్చి ఆ శవమును చూచి పారిపోతే అతడే సంవర్తనుడు అని తెలుసుకో. అతని వెంట వెళ్లు. ఏకాంత ప్రదేశంలో అతనిని కలుసుకో. భక్తితో అతనిని ప్రార్థించు. "నా గురించి నీకు ఎవరు చెప్పారు?" అని అడుగుతాడు. నన్ను నారదుడు

పంపాడు అని చెప్పు. ఇప్పుడు నారదుడు ఎక్కడ ఉన్నాడు అని అడుగుతాడు. నారదుడు నాకు నీ గురించి చెప్పి అగ్నిప్రవేశము చేసాడు అని చెప్పు." అని అన్నాడు నారదుడు.

మరుత్తు వెంటనే నారదుడి మాట మేరకు కాశీనగరమునకు వెళ్లాడు. ఒక శవాన్ని ఎదురుగా పెట్టుకొని కాశీనగర ద్వారం దగ్గర నిలబడ్డాడు. అక్కడికి ఒక వెర్రివాడు వచ్చాడు. ఆ శవం వంక చూచాడు. వెంటనే దెబ్బతిన్న పశువు మాదిరి అక్కడి నుండి పారిపోయాడు. అతడే సంవర్తనుడిగా తెలుసుకున్న మరుత్తు ఆ వెర్రివానిని వెంబడించాడు. కొంత దూరము పోయి అతని ఎదురుగా నిలబడ్డాడు. ఆ వెర్రివాడు మరుత్తు మీద దుమ్ము ఎత్తి పోసాడు. మొహాన ఉమ్మివేసాడు. పిచ్చివాడి మాదిరి ప్రవర్తించాడు. మరుత్తు కోపం తెచ్చుకోకుండా చేతులు జోడించి అతని వెంటనే వెళ్లాడు.

ఒక నిర్జన ప్రదేశానికి వెళ్లాడు ఆ పిచ్చివాడు. ఒక వటవృక్షము కింద కూర్చున్నాడు. వెంటనే మరుత్తు సంవర్తనుడికి సాష్టాంగ ప్రణామము చేసాడు. తరువాత లేచి వినయంగా నిలబడ్డాడు.

"ఓయీ! నిన్ను ఎవరు పంపారు. నువ్వు చెప్పింది నిజమైతే నీ కోరిక నెరవేరుతుంది. నువ్వు చెప్పింది అబద్ధం అయితే నీ తల వెయ్యి ముక్కలు అవుతుంది." అని అన్నాడు సంవర్తనుడు.

"అయ్యా! మీగురించి నాకు నారదుడుచెప్పాడు." అని అన్నాడు మరుత్తు.

" ఇప్పుడు నారదుడు ఎక్కడ ఉన్నాడు." అని అడిగాడు సంవర్తనుడు.

"మహాత్మా! మీ గురించి అంతా చెప్పి, నన్ను ఇక్కడికి పంపించి, నారదుడు అగ్నిప్రవేశము చేసాడు." అని అన్నాడు మరుత్తు.

అప్పుడు సంవర్తనుడు మరుత్తు మొహంలోకి చూచి "నన్నుచూడడానికి నీవు వచ్చి పని ఏమి?" అని అడిగాడు.

" మహాత్మా! నేను చేయబోయే యజ్ఞమునకు మీరు ఉపద్రష్టగా వ్యవహరించాలి." అని ప్రార్థించాడు మరుత్తు.

ఇంకా ఇలా అన్నాడు.

"మహాత్మా! నా పేరు మరుత్తు. నేను కరంధముని మనుమడిని. మీ తండ్రిగారు మా తాతగారికి ఉపద్రష్టగా ఉండి ఎన్నో యజ్ఞములు చేయించాడు." అని అన్నాడు మరుత్తు. అప్పుడు సంవర్తనుడు మరుత్తు మొహంలోకి ప్రీతితో చూచాడు.

"ఓ మరుత్తు మహారాజా! నీవు చెప్పవలసినది చెప్పావు. ఇంక నేను చెప్పేది విను. మా అన్న బృహస్పతి నన్ను అవమానించాడు. అందుకని నేను నా గృ హమును, ధనములు ఆయనకు వదిలి ఈ ప్రకారము విరాగిగా తిరుగు తున్నాను. నా బోటి పేదవాడు నీ యాగమునకు ఉపద్రష్టగా ఉంటే నీకు ఏం గౌరవంగా ఉంటుంది. కాబట్టి నీవు బృహస్పతినే నీ ఉపద్రష్టగా ఎంచుకో. అలా కాకుండా నేను నీకు ఉపద్రష్టగా ఉండాలంటే నాకు మా అన్న బృహస్పతి అనుమతి కావాలి. ఎందుకంటే నాకు మా అన్నగారంటే ఎంతో గౌరవం. మా అన్న అనుమతిస్తేనేను నీ యాగమునకు ఉపద్రష్టగా వ్యవహరిస్తాను. కాబట్టి ముందు మా అన్న బృహస్పతి అనుమతి తీసుకో." అని అన్నాడు సంవర్తనుడు.

"మహాత్మా! నీ దగ్గరకు రాక ముందు నేను బృహస్పతి వద్దకు వెళ్లాను. ఆయన నా మాట మన్నించలేదు. దేవతలకు యజ్ఞములు చేయించు నేను ఒక మానవుడు చేయు యజ్ఞమునకు ఆధ్వర్యము ఎలా వహించగలను అని అవమానించి పంపాడు.  ఇంద్రుడు నా మీద అసూయతో బృహస్పతితో ఇలా మాట్లాడించాడు. ఇప్పుడు నేను మరలా బృహస్పతి వద్దకు ఎలా పోను." అని అన్నాడు మరుత్తు.

" సరే నేను నీకు ఉపద్రష్టగా ఉండి నీ చేత అశ్వమేధ యాగము చేయిస్తాను. కానీ నీవు ఎప్పుడు దీక్షను భగ్నం చేస్తావో అప్పుడు నేను నీకు శాపం ఇస్తాను. నీకు కీడు మూడుతుంది. కాబట్టి ఇది మనసులో పెట్టుకొని యజ్ఞము నిర్వహించు. నేను నీ యజ్ఞమునకు ఉపద్రష్టత్వము వహిస్తున్నాను అనే ద్వేషంతో నా అన్న బృహస్పతి  నీ మీద కోపిస్తాడు. నీవు ఆ కోపానికి భయపడి యజ్ఞదీక్ష భగ్నం చేస్తే నేను శపిస్తాను. నీకు కీడు మూడుతుంది. కాబట్టి నీవు స్థిరమైన నిశ్చయంతో ఉండాలి." అని అన్నాడు సంవర్తనుడు.

" మహాత్మా! నాకు నీ కృప లభించింది. నాకు ఇంక ఏ విచారమూ లేదు. ఆ ఇంద్రుడు, బృహస్పతి యే కాదు.  సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే కోపించినా నేను చలించను.  నేను నా ప్రతిజ్ఞకు తప్పితే నాకు సూర్యచంద్రులు ఉన్నంత కాలము పుణ్యలోకములు లేకుండు గాక!" అని శపథం చేసాడు మరుత్తు.

ఆ మాటలకు సంతోషించాడు సంవర్తనుడు. "ఓ మరుత్తు మహారాజా! నేను నిన్ను ఆ మహేంద్రుని కంటే ఎక్కువ ధనవంతుని చేసి నీ చేత యజ్ఞం చేయిస్తాను." అని అన్నాడు సంవర్తనుడు.

సంవర్తనుడు ఇంకా ఇలా అన్నాడు. "నేను నిన్ను దేవేంద్రుని కంటే ఎలా

ధనవంతుని చేస్తాను అని సందేహము కలుగుతుంది కదూ. నేను చెప్పేది విను. హిమవత్పర్వతమున ఉత్తర భాగమున, ముంజవంతము అనే పర్వతము ఉంది. అక్కడ శివుడు, పార్వతి, దేవతలు,సిద్ధులు,గరుడులు,గంధర్వులు మొదలగు వారితో కూడి విహరిస్తూ ఉంటాడు. ఆ పర్వతము మీద రోగములు కానీ మృత్యువు కానీ లేవు. అక్కడ పళ్లు పూలు సమృద్ధిగా ఉంటాయి.

ఆ పర్వతము మీద బంగారు రాళ్లు, బంగారు ఇసుక సమృద్ధిగా లభిస్తుంది. మనము ఆ పర్వతము వద్దకు వెళతాము. ఆ పరమేశ్వరుని భక్తితో ప్రార్థిస్తాము. ఆయన కరుణతో మనము అక్కడ ఉన్న బంగారు రాళ్లు ఇసుక మోసుకొని వస్తాము. వాటిని మొయ్యడానికిసేవకులను సిద్ధం చేసుకో. ఎంతమందిని తీసుకుపోతే అంత బంగారము తీసుకు రావచ్చును." అని అన్నాడు సంవర్తనుడు.

సంవర్తనుని మాట ప్రకారము మరుత్తు సంవర్తనుని తో కలిసి ఆ పర్వతము వద్దకు వెళ్లారు. పరమేశ్వరుని ప్రార్థించారు. ఆయన కరుణతో అంతులేని బంగారమును మోసుకొని వచ్చారు. నగరం చేరుకున్నారు. ఆ ప్రకారంగా మరుత్తు మహా ధనవంతుడయినాడు. మరుత్తు అంతా బంగారు మయం చేసాడు. యజ్ఞవాటిక మొదలుకొని అన్ని యజ్ఞ పాత్రలు బంగారుతో తయారు చేయించాడు. మహా విభవంతో యజ్ఞము ప్రారంభించాడు.

ఇదంతా తెలిసిన బృహస్పతి తనలో తాను కృంగి కృశించి పోతున్నాడు. ఇదంతా గమనించిన దేవేంద్రుడు బృహస్పతితో ఇలా అన్నాడు. "మీరు దేవతలకు గురువు అయి ఉండి కూడా ఈ మాదిరి ఎందుకు శోకిస్తున్నాను, కృంగి పోతున్నారు కారణం ఏమిటి? దీనికి కారణం ఎవరో చెప్పండి. వారిని కఠినంగా శిక్షిస్తాను." అని అన్నాడు దేవేంద్రుడు.

" ఏమీ లేదు దేవేంద్రా! మరుత్తు ఒక మహా యజ్ఞమును చేయ సంకల్పించాడు. ఆ మరుత్తుకు నా విరోధి అయిన నా తమ్ముడు సంవర్తనుడు యాజకుడుగా ఉన్నాడు. నా విషాదమునకు అదే కారణము. మరుత్తు ఆ యజ్ఞం చేయకూడదు. నా విరోధి ఆ యజ్ఞమునకు ఉపద్రష్టత్వము వహించకూడదు. దేవేంద్రా! నీవు ఎలాగైనా ఆ మరుత్తును ఒప్పించి అతనికి సంవర్తనుని ఉపద్రష్టగా ఉండటం మాన్పించాలి." అని అన్నాడు బృహస్పతి.

వెంటనే దేవేంద్రుడు అగ్నిదేవుని పిలిచాడు. "మరుత్తు మహారాజు ఒక మహా యజ్ఞము చేస్తున్నాడు. నీవు వెంటనే మరుత్తు వద్దకు పోయి ఆ యజ్ఞమును దేవ గురువు బృహస్పతి నిర్వహిస్తాడు అని నా మాటగా చెప్పు. నువ్వు ఏంచేస్తావో ఏమో. దీనికి మరుత్తు అంగీకరిచేట్టు చెయ్యి." అని అగ్ని దేవుని మరుత్తు వద్దకు పంపాడు.

అలాగే చేస్తాను అని చెప్పి అగ్నిదేవుడు మరుత్తు వద్దకు వెళ్లాడు. మరుత్తు ముందు అగ్నితన నిజస్వరూపంతో ప్రజ్వరిల్లాడు. మరుత్తు అగ్నికి నమస్కారం చేసాడు. మరుత్తు సంవర్తుని పిలిచాడు. అగ్నికి అర్ఘ్యము పాద్యము ఆసనము ఇచ్చి సత్కరించాడు. అప్పుడు అగ్నిదేవుడు మరుత్తుతో ఇలా అన్నాడు.

" ఓ మరుత్తు మహారాజా! నన్ను అగ్నిదేవుడు నీ దగ్గరకు దూతగా పంపించాడు. అసలు విషయం ఏమిటంటే నీవే చేయబోయే యాగానికి దేవ గురువు బృహస్పతి యాజకుడుగా ఉండటానికి అంగీకరించాడు. దీనితో నీవు మానుష్యత్వమును వీడి దైవత్వమును పొందుతావు. కాబట్టి నీవు వెంటనే బృహస్పతి యాజకత్వమును అంగీకరించు. ఇది దేవేంద్రుడు నీకు తన మాటగా చెప్పమన్నాడు." అని అన్నాడు అగ్నిదేవుడు.

"ఓ అగ్నిదేవా! దేవగురువు బృహస్పతికి శతకోటి నమస్కారాలు. నేను పోయి ఆయనను నేను చేయబోయే యాగమునకు యాజకుడిగా ఉండమన్నప్పుడు ఆయన నన్ను పరిహాసించి పంపాడు. తరువాత ఆయన తమ్ముడయిన సంవర్తనుని అతి కష్టం మీద ఒప్పించి తీసుకొని వచ్చాను. ఆయన నేను చేయబోయే యజ్ఞమునకు యాజవత్వము వహిస్తున్నాడు. ఆయనే దీనికి సమర్ధుడు అని నమ్ముతున్నాను." అని అన్నాడు మరుత్తు.

"అదికాదు మరుత్తు మహారాజా! నీకు దేవగురువు ఉపద్రష్టగా ఉంటే ఆ దేవేంద్రుడు నీకు అపారమైన పుణ్యలోక ప్రాప్తి కలిగిస్తాడు. ఇది నీకు మేలే కదా!" అని అన్నాడు అగ్ని.

ఈ మాటలన్నీ అప్పటి వరకూ సావధానంగా విన్నాడు సంవర్తనుడు. ఆయనకు విపరీతమైన కోపం వచ్చింది.

"ఓ అగ్నిదేవా! నీవు ఇంకా ఇలాగే మాట్లాడుతూ ఉంటే నిన్ను నా కంటి చూపుతో కాల్చేస్తాను. వెంటనే వెళ్లిపో." అని అన్నాడు.

(అగ్ని అన్నిటినీ కాల్చేవాడు. మరి ఆ అగ్నిని కాల్చే అగ్ని ఏది అని మనకు అనుమానం రావచ్చు. అగ్ని బాహ్యప్రపంచంలో ఉన్న వస్తువులను కాలుస్తాడు. కాని తపో అగ్ని ఆ అగ్నినే కాల్చే శక్తివంతమైనది. అది మానవుడుచేసిన పాపములను అగ్నిలాగా కాలుస్తుంది అని అర్థం చేసుకుంటే సరిపోతుంది.).

ఆ మాటలకు అగ్ని దేవుడు భయపడ్డాడు. ఈయనతో మనకెందుకని వెనక్కుతిరిగి దేవేంద్రుని వద్దకు పోయాడు. "దేవేంద్రా! నీవు చెప్పినట్టు మరుత్తుతో చెప్పాను. కాని మరుత్తు సమ్మతించలేదు. దేవగురువు బృహస్పతి

తమ్ముడు సంవర్తనుని ప్రార్థించి యాజకత్వమునకు  అంగీకరింపచేసాడట. అందుకని బృహస్పతి యాజకత్వమునకు అంగీకరించలేదు. నేను ఇంకా మాట్లాడబోతే సంవర్తనుడు నన్ను భస్మం చేస్తాను అన్నాడు. భయపడి పరుగెత్తుకుంటూ నీ దగ్గరకు వచ్చాను.” అని అన్నాడు అగ్ని.

“ఓ అగ్నిదేవా! మరలా మరొక సారి వెళ్లు. నయానా భయానా దేవగురువు బృహస్పతి యాజకత్వానికి మరుత్తును ఒప్పించు. ఒప్పుకోకపోతే నా వజ్రాయుధాన్ని ప్రయోగించి మరుత్తును యమసదనానికి పంపుతానని హెచ్చరించు. ఇది నా ఆజ్ఞ అని చెప్పు.” అని అన్నాడు దేవేంద్రుడు.

“ దేవేంద్రా! నాకు భయంగా ఉంది. ఈసారి వస్తే నన్ను భస్మం చేస్తాను అన్నాడు సంవర్తనుడు. అందుకని నేను పోను. నా బదులు ఇంకెవరినన్నా పంపు” అని అన్నాడు అగ్ని.

“అదేమిటయ్యా! నువ్వే అందరినీ భస్మం చేస్తావు. నిన్ను భస్మం చేస్తాను అనడం ఏమిటి?” అని అన్నాడు దేవేంద్రుడు.

“అదేమిటి దేవేంద్రా అలా అంటావు. నీకు యోగ శక్తి గురించి తెలియదా! నిన్ను వృత్రాసురుడు ఎలా ఓడించి నీ సింహాసనాన్ని ఎలా ఆక్రమించాడో మరిచిపోయావా!  ఇంకా చెప్పనా! నీవు అశ్వినీ దేవతలకు సోమపానము తాగడానికి వీలు లేదు అంటే బ్రాహ్మణుడైన చ్యవనుడు నిన్ను పెట్టిన బాధలు మరిచిపోయావా! నీవు నీ వజ్రాయుధాన్ని చ్యవనుని మీద ప్రయోగిస్తే చ్యవనుడు దానిని తిప్పికొట్టలేదా! విధి లేక నువ్వు అశ్వినీదేవతలకు సోమరసమును పంచి ఇచ్చావు కదా. కాబట్టి బ్రహ్మ బలము గొప్పది కదా! కాబట్టి నేను మరలా మరుత్తు దగ్గరకు వెళ్లను.” అని అన్నాడు అగ్ని.

చేసేది లేక ఇంద్రుడు ధృతరాష్ట్రుడు అనే గంధర్వరాజును పిలిచాడు. మరుత్తు వద్దకు పోయి తన సందేశమును వినిపించమని పంపాడు. పైగా తన సందేశమును సంవర్తనుడు ఎదురుగా ఉండగా వినిపించు అని మరీ మరీ చెప్పాడు. అంతకు ముందు జరిగిన విషయములు తెలియని గంధర్వుడు మరుత్తు వద్దకు వెళ్లాడు. దేవేంద్రుని సందేశమును, హెచ్చరికను వినిపించాడు.

"ఓ రాజా! నీవు నీ యాగమునకు దేవగురువు బృహస్పతిని యాజకునిగా నియమించు. ఇది దేవేంద్రుని ఆజ్ఞ. ఇలా చేస్తే ఇంద్రుడు సంతోషిస్తాడు. లేకపోతే నీ మీద తన వజ్రాయుధమును ప్రయోగిస్తాడు. తరువాత నీ ఇష్టం." అని అన్నాడు గంధర్వుడు.

దానికి మరుత్తు ఇలా అన్నాడు. "ఓ గంధర్వరాజా! మొదట బృహస్పతి నా యాగమునకు యాజకత్వము వహించుటకు ఇష్టపడలేదు. అందుకని ఆయన తమ్ముడు సంవర్తనుని యాజకత్వమునకు ఒప్పించాను. మరలా నేను బృహస్పతిని ఎలా యాజకుడిగా పెట్టుకోను. అది మిత్రద్రోహము కాదా! ఈ సంగతి దేవేంద్రునికి తెలుసు. నీకు తెలుసు. సిద్ధులు,సాధ్యులు,మొదలగు దేవతలు అందరకూ తెలుసు." అని అంటూ ఉండగానే వజ్రాయుధం అటుగా వస్తూ ఉంది.

"ఓ రాజా! అటు చూడు. ఆ శబ్దం విను. వజ్రాయుధము నీ వైపే వస్తూ ఉంది. ఆ వజ్రాయుధాన్ని నీవు ఎలా అడ్డుకుంటావో నీ ఇష్టం." అని అన్నాడు గంధర్వుడు.

తన వైపు వస్తున్న వజ్రాయుధాన్ని చూచి మరుత్తు భయపడిపోయాడు. వెంటనే సంవర్తనుని చూచి "ఓ మహాత్మా! చూచారు కదా! వజ్రాయుధం నా

మీదికి వస్తూ ఉంది. మీరే కాపాడాలి." అని అన్నాడు మరుత్తు.

సంవర్తనుడు ఒక చిరునవ్వు నవ్వాడు. "ఓ రాజా భయపడకు. నా సంగతి ఇంద్రునికి తెలుసు. సంస్తంభన విద్యతో ఆ వజ్రాయుధాన్ని తిప్పి పంపుతాను. ఒక్క ఇంద్రుడే కాదు. ఏ దేవతల ఆయుధాలైనా నా సంస్తంభన విద్య ముందు పనిచేయవు." అని అన్నాడు.

ఇంతలో వజ్రాయుధము మరుత్తు దగ్గరగా వచ్చింది. "మహాత్మా! అదుగో వజ్రాయుధము నా మీది మీదికి వస్తూ ఉంది. నన్ను రక్షించండి." అన్నాడు మరుత్తు.

" ఓ రాజా! నువ్వు వజ్రాయుధం గురించి మరిచిపో. నీ కేం వరం కావాలో కోరుకో ఇస్తాను." అని అన్నాడు సంవర్తనుడు.

"మహాత్మా! మీరు ఉండగా నాకు ఇంద్రుని వలన భయం లేదు. మీ తపోశక్తితో ఇంద్రునికి నా మీద ఉన్న ద్వేషమును పోగొట్టి, నా యాగమునకు వచ్చి హవ్యభాగమును స్వీకరించేట్టు చెయ్యండి. ఒక్క దేవేంద్రుడే కాదు ఇతర దిక్పాలకులు కూడా నా యాగమునకు వచ్చి హవిర్భాగములను స్వీకరించేట్టు చెయ్యండి. నాకు శాశ్వత కీర్తిని కలుగచేయండి. ఇదే నాకు మీరు ఇచ్చే వరము." అని ప్రార్థించాడు మరుత్తు.

ఆ మాటలకు సంవర్తనుడు ఇలా అన్నాడు. "ఓ రాజా! నా ఆహ్వానం మేరకు ఇంద్రుడు సోమరసాన్ని తాగడానికి వస్తాడు. అతనితోపాటు ఇతర దేవతలు కూడా వస్తారు. ఇంక నీ యజ్ఞము మొదలు పెట్టు." అని అన్నాడు.

ఇంతలో ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధము వచ్చి అల్లంత దూరంలో ఆగింది. సంవర్తనుడు దానిని ఆపి దానిని మరలా ఇంద్రుని వద్ద పోయేట్టు చేసాడు. రాయబారిగా వచ్చిన గంధర్వుని సగౌరవంగా పంపివేసాడు.

తరువాత సంవర్తనుడు దేవేంద్రుని, దేవతలను ఆవాహన చేసాడు. సంవర్తనుని మంత్రశక్తి ప్రభావం చేత దేవేంద్రుడు, దేవతలను అక్కడికి వచ్చారు. సంవర్తనుని ఆజ్ఞ మేరకు మరుత్తు వారికి ఎదురు పోయి వారిని సగౌరవంగా ఆహ్వానించాడు. వారికి అర్ఘ్య పాద్యాదులు ఆసనములు అర్పించాడు.

మరుత్తు దేవేంద్రునికి ప్రణామాలు చేసి "ఓ దేవేంద్రా! నీవు నా గృహమునకు విజయము చేసి నా జన్మ సఫలం చేసావు. నేను కృతార్థుడనయ్యాను. కృపాధామా! నా మీద కోపము మాను. నన్ను కరుణించు. నన్ను చల్లగా చూడు." అని వేడుకున్నాడు.

తరువాత సంవర్తనుని చూపి "మహాత్మా! ~~ఈ~~ తపస్వి దేవగురువు బృహస్పతి కి స్వయానా తమ్ముడు. నేను చేయబోవు యజ్ఞమునకు యాజకునికి వ్యవహరించమని అర్ధించాను. నా ప్రార్ధనను మన్నించి నా యాగమునకు యాజకత్వము వహిస్తున్నాడు." అని చెప్పాడు.

" ఓ మరుత్తు మహారాజా! నీ వలన నేను ప్రీతి పొందాను. ~~ఈ~~ మహానుభావుడు బృహస్పతి తమ్ముడు కావున అంతటి ప్రతిభావంతుడు అనుటలో సందేహము లేదు కదా!" అని పలికాడు దేవేంద్రుడు. అప్పుడు సంవర్తనుడు దేవేంద్రునితో ఇలా అన్నాడు.

“ ఓ దేవేంద్రా! నేను పిలవగానే  నీవు ఈ యజ్ఞమునకు రావడం నేను చేసిన తపస్సు ఫలము కాక మరేమున్నది.  నీ రాక వలన ఈ మరుత్తు చేయు క్రతువు పుణ్యరాసి అయింది. ఓ మహేంద్రా! నీవు సర్వము తెలిసిన వాడవు. నీ చల్లని చూపులు మామీద ప్రసరించు. నేను ఈ క్రతువును మంత్రలోపం క్రియా లోపం లేకుండా నిర్వర్తిస్తాను. నీవు దయతో వీక్షించు. నీ రాకతో మరుత్తు పుణ్యలోకములకు అర్హుడయ్యాడు”  అని ప్రేమపూర్వకంగా అన్నాడు సంవర్తనుడు.

సంవర్తనుడి ప్రశంసలకు దేవేంద్రుడు అమందానంద హృదయు డయ్యాడు. వెంటనే దేవతలనందరినీ పిలిచాడు. “ఓ దేవతలారా!  ఈ యజ్ఞవాటికను ఉదాత్తంగా తీర్చిదిద్దండి. అప్సరస్త్రీలను, గంధర్వులను రావించండి. నృత్య గీత వినోదములను ఏర్పాటుచెయ్యండి.  ఈ యజ్ఞము నిర్విఘ్నముగా నెరవేర్చుటకు సాయం చెయ్యండి.” అని ఆదేశాలు ఇచ్చాడు.

తరువాత సంవర్త మహాముని ఆధ్వర్యంలో యాగము నిర్విఘ్నంగా నడిచింది. సంవర్తముని దేవేంద్రుని దేవతలను పేరుపేరునా పిలిచి వారికి సోమరసమును అందించాడు. దేవేంద్రుడు దేవతలు అందరూ సోమరస పానము చేసి సంతుష్టులయ్యారు.  మరుత్తు దగ్గర వీడ్కోలు తీసుకొని దేవేంద్రుడు, దేవతలు స్వర్గలోకమునకు వెళ్లిపోయారు.

దేవతలు వెళ్లిన తరువాత కూడా యాగము కొనసాగింది. యాగము పూర్తి అయిన తరువాత మరుత్తు యాగమునకు వచ్చిన బ్రాహ్మణులకు, ఆహూతులను  అపారంగా బంగారము దానం చేసాడు. అంతే కాదు, ఆ యజ్ఞవాటికలో వాడిన బంగారు కలశములు పాత్రలు అన్నీ కూడా దానంగా ఇచ్చాడు.  తరువాత సంవర్తనుని అనుజ్ఞ మేరకు ప్రజలను జనరంజకంగా

పరిపాలించాడు. కాని బ్రాహ్మణులకు ఒక చిక్కు వచ్చి పడింది. మరుత్తు ఇచ్చిన బంగారమును వాళ్లు మోసుకొని పోలేకపోయారు. అందుకని వారి జీవనమునకు సరిపడా బంగారమును తీసుకొని మిగిలిన బంగారమును బంగారు కలశములలో భద్రపరిచి భూమిలోపల పూడ్చిపెట్టారు. "రాబోవు కాలములో ఈ నిధిని ఎవరు కనుక్కుంటారో వారికి ఈ బంగారు నిధి చెందుతుంది" అని శాసనము రాసి పెట్టారు.

కాబట్టి ఓ ధర్మనందనా! నీవు వెళ్లి ఆ బంగారు నిధిని తీసుకొని వచ్చి యధావిధిగా అశ్వమేధ యాగమును నిర్వర్తింపుము." అని చెప్పాడు వ్యాసుడు.

దనము వచ్చే ఉపాయము చెప్పినా ధర్మరాజు తన శోకము వీడలేదు. అప్పుడు కృష్ణుడు ధర్మజుని చూచి ఇలా అన్నాడు.

"ఓ ధర్మనందనా! ఇంకనైనా నీ వంకర ఆలోచనలు కట్టిపెట్టి వ్యాసుడు చెప్పినట్టు అశ్వమేధ యాగము చెయ్యి. అనవసర ఆలోచనలు కట్టిపెట్టు. ధర్మరాజా! నీవు ఏ పని కూడా నిర్మలంగా, సక్రమంగా చెయ్యవు కదా! మాటి మాటికీ దుఃఖిస్తుంటావు.ఇప్పటి దాకా సంపాదించిన జ్ఞానము అంతా ఏమయింది? నీవు నీ శోకమును నిర్మూలించలేక పోతున్నావు అంటే నీలో ఇంకా కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము లు ఇంకా నశించి పోలేదన్నమాట.

ఈ సందర్భంగా నీకు ఒక కథ చెబుతాను విను. ఒక సారి వృత్రాసురుడు భూలోకమును దేవలోకమును జయించాడు. భూమికి సహజ గుణమైన వాసనను లాగివేసాడు. అప్పుడు ఇంద్రుడు వృత్రాసురుని మీద వజ్రాయుధము ప్రయోగించాడు. అప్పుడు వృత్రుడు భూమి తప్ప మిగిలిన నాలుగు

భూతములలో అనగా  నీరు, తేజస్సు,వాయువు, ఆకాశము లలో ప్రవేశించాడు.  నీటి నుండి  రసమును, తేజస్సు నుండి రూపమును, వాయువు నుండి స్పర్శను, ఆకాశము నుండి శబ్దమును లాగి వేసాడు. ఇప్పుడు పంచభూతముల నుండి వాటి తన్మాత్రలు వృత్రుడి అధీనమయ్యాయి. అప్పుడు వృత్రుడు ప్రచండ విక్రమంతో ప్రకాశించాడు.

ఇది చూచి దేవేంద్రుడు మరలా తన వజ్రాయుధమును ప్రయోగించాడు. ఇది చూచి వృత్రుడు పంచభూతము లను వదిలి ఇంద్రునిలో ప్రవేశించాడు. ఆ దెబ్బకు ఇంద్రుడు మూర్ఛ పోయాడు.  అప్పుడు వసిష్ఠుడు తన మంత్రశక్తి చేత ఇంద్రుని మూర్ఛ పోగొట్టాడు.  మూర్ఛ నుండి తేరుకున్న ఇంద్రుడు తన వజ్రాయుధమును తనలో దాగి ఉన్న వృత్రుని మీద ప్రయోగించాడు. వెంటనే వృత్రుడు మరణించాడు.  ఇది అంతా రహస్యంగా జరిగింది. ఈ రహస్యమును దేవేంద్రుడు మునులకు చెప్పాడు. ఆ మునులు నాకు చెప్పారు.

కాబట్టి ధర్మనందనా!  అంతశ్శత్రువులను ఆ విధంగా సంహరించాలి. ఇంకా చెబుతాను విను.

వ్యాధులురెండు రకాలు. ఒకటి శారీరకము. రెండు మానసికము. శరీరములో వాతము, పిత్తము, శ్లేష్మము  సమానంగా వాటి వాటి పాళ్లలో ఉంటే మానవుడు ఆరోగ్యంగా ఉంటాడు. ఆ మూడింటిలో ఏ ఒక్కటి దారి తప్పినా శరీరం వ్యాధిగ్రస్తమవుతుంది. అలాగే సత్త్వము, రజస్సు, తమస్సు   అదుపులో ఉంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అవి అస్తవ్యస్తమయితే అదే మనో వ్యాధి అవుతుంది.  శరీర వ్యాధి మనోవ్యాధి ఏవీ ఒంటరిగా రావు. రెండూ ఒకదానికి ఒకటి అనుబంధంగా ఉంటాయి.  శరీర వ్యాధీ మనోవ్యాధి కలిస్తే ఇంక

చెప్పేదేముంది. వాడికి గడ్డు కాలమే.

దీనినే కర్మానుష్ఠానము అంటారు. దీనిని నీవు ఎప్పుడూ అభ్యాసము చెయ్యలేదు. కాబట్టి ఇది నీకు తెలియదు. కాబట్టి నువ్వు ఏపనీ కూడా సక్రమంగా చెయ్యలేకపోతున్నావు. ప్రస్తుతము నీలో శారీరకంగా వాత, పిత్త, శ్లేష్మములు, మానసికంగా సత్త్వ, రజస్, తమో గుణములు గాడి తప్పాయి. హెచ్చుతగ్గులలో ఉన్నాయి. దాని వలననే నీవు ఏపనీ సక్రమంగా చెయ్యలేక పోతున్నావు అన్న జ్ఞానము నీకు కలిగిననాడు, వాటిలో సమత్వము ఎలా సాధించాలి అన్న విషయం నీకు తెలుస్తుంది. అలా కాకుండా ఒక పక్క వాత, పిత్త, శ్లేష్మములు మరొక పక్క సత్త్వ,రజస్తమోగుణములు చెరి ఒక పక్క లాగుతుంటే నీవు ఏమి చెయ్యగలవు. ఎందుకంటే అలా జరగడం వలన బాధ పడటం నీకు స్వభావము అయిపోయింది. ఏంచేస్తాం.

ఈ సందర్భంలో నీకు ఒక విషయం చెబుతాను విను. నీవు ద్రౌపదిని ఏకవస్త్రను చేసి సభలోకి ఈడ్చుకొని వచ్చి, వలువలు ఊడదీసి అవమానపర్చారు అన్న విషయం మర్చిపో. పన్నెండేళ్లు అడవులలో అష్టకష్టాలు పడ్డాము అన్న విషయం మనసులో నుంచి తుడిచెయ్యి. జటాసురుడు సైంధవుడు మిమ్మల్ను పెట్టిన బాధలు గుర్తుచేసుకోకు. విరాట రాజు కొలువులో మీరు పడ్డ బాధలు అవమానాలు అన్ని మరిచిపో. భీష్మ, ద్రోణ, కర్ణాదులతో యుద్ధముచెయ్యలేదు అనుకో. వారి మరణములకు నీకు కారకుడవు కాదు అనుకో. అసలు యుద్ధమే జరగలేదు అనుకో. కాబట్టి యుద్ధము వలన జరిగిన మేలు, కీడు నీ మనసులో ఉండవు.

అసలు అది యుద్ధము కాదు, మిధ్య అని ఎందుకంటున్నాను అంటే, నిజమైన యుద్ధము గురించి చెబుతాను విను.

కౌరవులు నీకు నిజంగా శత్రువులు కాదు. నీ నిజమైన శత్రువు నీ మనస్సు. ఎందుకంటే నీవు నీ మనస్సులో కౌరవులు నా శత్రువులు అనుకుంటున్నావు. అందుకని వారు నీకు శత్రువులు అయ్యారు. అందుకే వారితో యుద్ధం చేసావు. కాని నీ నిజమైన స్నేహితుడు నీ ఆత్మ.

ఈ మిత్రుత్వానికి శత్రుత్వానికి మనస్సే కారణము. నీ మనస్సు శాంతి చెందితే అంతా శాంతంగా కనపడుతుంది. కాబట్టి శాంతంగా ఉండటం నేర్చుకో. ముందు నీ మనస్సులో ఉన్న శత్రువులను జయించు. ఆ శత్రువులను గెలవ లేక ఊరికే ఏడుస్తూ కూర్చోవడం వలన ఏమి లాభము. కాబట్టి నీ బుద్ధిని ఉపయోగించి సన్మార్గమున పయనించు. ఇంతకన్నా నేను ఏమీ చెప్పలేను.

ధర్మనందనా! మృత్యు (చావు) అనేది కేవలం రెండుఅక్షరములు. బ్రహ్మము అనేవి మూడక్షరములు. అలాగే మమ అంటే నేను. న మమ అంటే నేను కాదు. ఈ రెంటి మధ్య నిత్యము పోరాటము జరుగుతూ ఉంటుంది. మృత్యువు అంటే చావు. బ్రహ్మము అంటే పుట్టుక. ఈ రెంటి మధ్య కనపడని యుద్ధం జరుగుతూ ఉంటుంది. పుట్టిన వాడిని ఎలా చంపాలా అని మృత్యువు ఎదురు చూస్తూ ఉంటే, చచ్చిన వాడు మరలా ఎలా పుట్టించాలా అని బ్రహ్మ ఆరాటపడుతూ ఉంటాడు.

ఈ రెంటికీ అతీతమైనది ఆత్మ. దానికి నాశనము లేదు. ఆత్మకు శరీరమునకు సంబంధము లేదు. శరీరమునకు ఉండే నాశనత్వము, పరిమితత్వము ఆత్మకు లేవు. ఆత్మ అఖండము. ఈ భూమిని మొత్తం పరిపాలిస్తూ ఉన్న మహా రాజులు ఆ భూమి మీద, ఆ రాజ్యము మీద మమకారము, ఇంకా పరిపాలించవలెనని కోరిక లేకపోతే, అతనికి ఏ పాపములు అంటవు.

అలాగే అడవులకు పోయి, సన్యాసము స్వీకరించి, కందమూలములు భుజిస్తూ జీవితము గడుపుతున్న సన్యాసికి ప్రాపంచిక భోగముల మీద, సుఖముల మీద కోరికలు చావక పోతే, అతడు అడవిలో ఉండీ ప్రయోజనము లేదు. అలాంటి వాడు అనుక్షణం మృత్యువుకు చేరువలో ఉన్నాడు అని అర్థం చేసుకోవాలి.

ఓ ధర్మనందనా! నీవు యుద్ధములో నీ శత్రువులను గెలిచానని అనుకుంటున్నావు. అదీ ఒక గెలుపేనా! బయట ఉన్న శత్రువులను గెలవడం ఒక గెలుపు కాదు. అంతఃశత్రువులను గెలిచినపుడే అని నిజమైన గెలుపు అవుతంది.

ఓ ధర్మరాజా! నీ అంతఃశ్శత్రువులలో ప్రధముడు, ముఖ్యుడు, కాముడు (కోరికలను రేకెత్తించేవాడు). కోరిక లేని పని ఈ ప్రపంచంలో ఏమీ లేదు. వేదాలు చదివినా, శాస్త్రాలు వల్లెవేసినా, దానాలు ధర్మాలు చేసినా ఏదో ఒక కోరిక మనసులో పెట్టుకొని చేస్తారు కానీ నిష్కామంగా ఎవ్వరూ చెయ్యరు. ఆ కాముడు ఒక సారి ఇలా అన్నాడు.

" నాకు దగ్గరగా ఉన్నవాడు నా ప్రభావం ఉన్నవాడు నన్ను ఎన్నటికీ ఓడించలేడు. వేదముల చేతనే నన్ను తెలుసుకొన గలరు. కాబట్టి ఈ వేదజ్ఞానము లేకుండా నన్ను ఓడించడం ఎవరి తరమూ కాదు. నన్ను హతమార్చాలని కోరికతో ఎల్లప్పుడూ నన్ను ఎవడైతే తలచుకుంటూ ఉంటాడో నేను వాడి వెంటనే ఉంటాను. నేను వాడి వెంట ఉన్నానని వాడికి తెలియదు. కాబట్టి నన్ను అతడు జయించలేడు.

( ఇది ఎలాగంటే ఈ నాడు మనకు కనపడే స్వామీజీలు నాకు కోరికలు

లేవు నేను సన్యాసిని అంటూ ధర్మ శాస్త్రాలు వల్లిస్తుంటారు. నిజానికి మనకన్నా వారికే కోరికలు ఎక్కువ. ఆవిషయం వారికి తెలియదు. నేను కోరికలను జయించాను అని చెప్పుకుంటారే కానీ వారు కోరికలను ఎన్నటికీ జయించలేరు. పేర్లు చెప్పక్కర్లేదు కానీ ఈ రోజుల్లో స్వామీజీల మీద వస్తున్న ఆరోపణలు అభియోగములు ఈ విషయాన్ని ఋజువుచేస్తున్నాయి కదా! ఇదే విషయం "నేను స్వార్ధమా నీ మరణమెప్పుడు" అనే నాటికలో ఒక డైలాగు రాసాను.

"స్వార్ధం అనేది మనిషి పుట్టక ముందే పుడుతుంది. మనిషిని చంపి కాని అది చావదు."

అలాగే కోరిక మనిషి పుట్టక ముందే పుడుతుంది. మనిషిని చంపిగానీ అది చావదు. కోరికలను జయించాము అని అనుకోవడం కేవలం మన భ్రమ).

కోరికలను జయించడానికి ఒకడు తపస్సు చేస్తాడు. కోరికలను జయించాలని అనుకోవడం అనేదే ఒక కోరిక. అదే నేను. ఇంక నన్ను జయించేదెవడు? ఒకడు మోక్షం కోరి తపస్సు చేస్తాడు. ఆ మోక్షము కావాలి అనే కోరికే నేను. కాబట్టి వాడు నన్నేమీ చెయ్యలేడు. కాబట్టి నేను శాశ్వతుడను. నాకు చావు లేదు." అని ఈ విధంగా కాముడు (కోరిక) తన గురించి చెప్పాడు.

కాబట్టి ధర్మనందనా! నా మాటవిను. ఏ పనినీ "ఈ పని నేను చెయ్యాలి. దీని వలన నాకు లాభం కలగాలి" అనే కోరికతో చెయ్యకపోవడం; చేసే పని మీద అపారమైన శ్రద్ధ పెట్టడం; అడవులకు పోయి తపస్సు చేస్తున్నప్పుడు ఏ కోరికా లేకుండా తపస్సు చెయ్యడం; చివరకు నాకు మోక్షం కావాలి అనే కోరిక కూడా లేకుండా ఉండటం; ఈ లక్షణముల వలన కోరికలను జయించవచ్చును.

కాని పైన చెప్పిన విధంగా కార్యములు చెయ్యడం మానవునికి అసాధ్యం. అందుకనే కాముడు (కోరికలు) "నన్ను ఎవ్వడూ గెలవలేడు. నేను అజేయుడను" అని ప్రకటించుకున్నాడు.

ఓ ధర్మనందనా! ఇన్ని మాటలెందుకు కానీ, నీ మనసులో ఎలాంటి కోరికలు కోరవద్దు. ఆ కాముడిని నీలో చంపెయ్యి. ఏ కోరికా మనస్సులో లేకుండా నిర్వికారంగా అశ్వమేధ యాగము చెయ్యి. అప్పుడు నీకు పుణ్యం వస్తుంది. నీవు పుణ్యాత్ముడికి అవుతావు. అప్పుడు ఆ కాముడే నీ యజ్ఞానికి సాక్షిగా ఉంటాడు.

అయినా ధర్మనందనా! యుద్ధంలో చచ్చిన బంధువులు తిరిగి వస్తారా! కాబట్టి వారి కోసం ఈ ఏడుపు మాను! వారిని గూర్చి కలలో కూడా తల్చుకోవద్దు. యజ్ఞములు యాగములు విరివిగా చెయ్యి. నిన్ను ఈ ప్రపంచం మెచ్చుకుంటుంది. నీకు పుణ్యలోకాలు సిద్ధిస్తాయి." అని చెప్పాడు కృష్ణుడు.

తరువాత వ్యాసుడు, దేవస్థానుడు, నారదుడు, తమకు తోచిన హితవచనములు ధర్మరాజుకు చెప్పారు. అంతటితో ఊరుకోకుండా భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు, ద్రౌపది కూడా ధర్మరాజుకు నీతి బోధ చేసారు.

అప్పటికి ధర్మరాజుకు తల తిరిగింది. రాజ్యపాలనకు, అశ్వమేధ యాగము చెయ్యడానికి ఒప్పుకున్నాడు. యుద్ధములో శత్రువులను చంపిన పాపమునకు ప్రాయశ్చిత్తముగా గంగానదీ తీరమున కొన్ని దినములు ఉండాలని అనుకున్నాడు. అక్కడ ఉన్న మునులకు నమస్కారము చేసి వాని అనుమతి తీసుకున్నాడు. వారందరికీ వీడ్కోలు పలికాడు.

ధర్మరాజు వ్యాస మహా మునిని చూచి "మహానుభావా! మీ దయ వలన అపార మైన నిధి రహస్యం తెలిసింది. తమరిని తోడు తీసుకొని వెళ్లి ఆ నిధిని సేకరిస్తాను. అశ్వమేధ యాగము నిర్విఘ్నముగా పరిసమాప్తి చేస్తాను." అని పలికాడు.

తరువాత వ్యాసుని అనుమతితో ధర్మరాజు, ధృతరాష్ట్రుడు కలిసి భీష్మునికి అంత్య క్రియలు యధావిధిగా నిర్వర్తించారు. అనేక దాన ధర్మాలు చేసారు. కొన్ని రోజులు అక్కడే వుండి, ధర్మరాజు, తన తమ్ములు, ధృతరాష్ట్రుడు, కృష్ణుడు మొదలగువారితో సహా హస్తినా పురము చేరుకున్నాడు. మనసులో ఉన్న కల్మషాన్ని వదిలిపెట్టి, ప్రజా పరిపాలనలో నిమగ్నమయ్యాడు.

ఈ కధ వింటున్న జనమేజయ మహారాజుకు మహాభారత కధ అయిపోయినట్టు అనిపించింది. అప్పుడు వైశంపాయనుని ఒక ప్రశ్న అడిగాడు.

" ఓ వైశంపాయన మహర్షి! ధర్మరాజు రాజ్యపాలన చేస్తుంటే శ్రీ కృష్ణుడు, అర్జునుడు ఏంచేస్తున్నారు. ఆ విశేషములను వివరించండి." అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు మహాభారత కధను కొనసాగించాడు.

" ఓ జనమేజయ మహారాజా! ఆ ప్రకారంగా ధర్మరాజు ప్రజలను కన్నబిడ్డల వలె పాలిస్తుంటే, శ్రీ కృష్ణుడు అర్జునుడు విలాసంగా కాలం గడుపుతున్నారు. విహార యాత్రలు చేస్తున్నారు. అప్పుడప్పుడు అర్జునునికి అభిమన్యుని గుర్తుకు వచ్చి చింతాక్రాంతుడవుతున్నాడు. దుఃఖంతో క్రుంగి పోతున్నాడు. అప్పుడు శ్రీ కృష్ణుడు అర్జునుని ఓదారుస్తున్నాడు.

మయసభా నిర్మాణం కాగానే జూదం జరిగింది. తరువాత అడవులకు

వెళ్లారు. మరలా ఇప్పుడు రాజ్యాధికారం పొందారు. కాబట్టి శ్రీకృష్ణుడు అర్జునుడు మహసభను తనివితీరా చూడనేలేదు. అందుకని కృష్ణార్జునులు మహసభను చూడటానికి వెళ్లారు. మయసభ అంతా కలయ తిరిగారు. అణువు అణువు సందర్శించారు. చాలా సంతోషించారు.

ఒకరోజు కృష్ణుడు అర్జునుడితో ఇలా అన్నాడు. "అర్జునా! భీముని బల పరాక్రమములతో, నకుల సహదేవుల విలువిద్యానైణ్యంతో, ఇంక నీ గాండీవ కౌశలంతో ధర్మరాజు తన రాజ్యమును తిరిగి పొంది జనరంజకంగా రాజ్యపాలన చేస్తున్నాడు. మీ లాంటి తమ్ములు కలిగిన ధర్మరాజు ఎంత ధన్యుడో కదా!

అర్జునా! నేను వచ్చి చాలా రోజులు అయింది. ద్వారకలో మా అమ్మ దేవకీదేవి, తండ్రి వసుదేవుడు నా అన్న బలరాముడు నా కోసం ఎదురు చూస్తూ ఉంటారు. నాకు కూడా వారందరినీ చూడాలని కోరికగా ఉంది. ఇంక నేను ద్వారకకు వెళతాను. ,ఈ విషయం నీవు ధర్మరాజుకు తగిన సమయంలో చెప్పు. ఎందుకంటే ఆయన అనుమతి లేనిదే నేను హస్తినాపురం విడిచి వెళ్లలేను. ఆయన చెప్పినట్టు చెయ్యడం నా వ్రతము. అందుకని మనము హస్తినాపురమునకు పోవుదము. తగిన సమయం చూచి ఆయనతో నా ప్రయాణం విషయం చెప్పి తరువాత ద్వారకకు వెళతాను." అని అన్నాడు కృ ష్ణుడు.

" సరే బావా అలాగే చేద్దాము. కానీ ఒక మాట అడగనా! అని అన్నాడు అర్జునుడు.

"అడుగు అర్జునా. సందేహ మెందుకు?" అని అన్నాడు కృష్ణుడు.

"కృష్ణా! యుద్ధ ప్రారంభమునకు ముందు నేను యుద్ధము చేయనని విషాదంతో కుంగి పోతే నీవు నాకు కొన్ని విషయములను బోధించావు. ఈ యుద్ధము వలన అవన్నీ మరిచిపోయాను. నా మీద దయ ఉంచి మరలా వాటిని చెప్పవా" అని అడిగాడు అర్జునుడు.

ఆ మాటలు విన్న కృష్ణుడు పకా పకా నవ్వాడు. అర్జునుని వాటేసుకున్నాడు.

"ఓ అర్జునా! నీకు బుద్ధితత్త్వము  బొత్తిగా లేదు. శ్రద్ధ అసలే లేదు. నీవు ఎట్టా బతుకుతావయ్యా! ఏ పని చేస్తున్నా బుద్ధి దాని మీద లగ్నం కావాలి. చేసే పని మీద శ్రద్ధ ఉండాలి. అప్పుడు వినినది జ్ఞాపకం ఉంటుంది. చేసే పని సఫలం అవుతుంది." అని సున్నితంగా మందలించాడు కృష్ణుడు.

"అయినా అర్జునా! ఆ రోజు నేను నీకు చెప్పినవి బ్రహ్మ పదమును సాధించుటకు సాధనములు. కాని నీవు వాటిని బుద్ధిలో నిలుపుకోలేదు. మరలా అవన్నీ నీకు చెప్పడం సాధ్యమా!  కాని దాని గురించి నీకు ఒక కథ చెబుతాను. శ్రద్ధగా విను.

ఒకసారి నా వద్దకు  ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. నేను అయనను తత్త్వ జ్ఞానమును ఉపదేశించమని అడిగాను.  అప్పుడు ఆ బ్రాహ్మణుడు నాతో ఇలా అన్నాడు.

"ఓ కృష్ణా! నేను ఒక సారి కాశ్యపుడు అనే సిద్ధుని చూచాను.  ఆ సిద్ధుడు ఇంద్రియములను జయించిన వాడు. జ్ఞానవిజ్ఞాన శాలి. ఈ సంసార బంధములను విడిచిన వాడు.  ఎంతో మంది మహాత్ములచే సేవింపబడ్డవాడు.

నేను ఆయనకు శిష్యరికం చేసాను. ఆయన నాకు చేసిన బోధనలను నీకు చెబుతాను విను." అని చెప్పి ఆ బ్రాహ్మణుడు నాకు ఆ సిద్ధుని బోధనలను వినిపించాడు. వాటినే నేను నీకు చెబుతాను. విను. ఆ సిద్ధుడు బ్రాహ్మణునికి ఈ ప్రకారం ఉపదేశించాడట.

" ఓ బ్రాహ్మణోత్తమా! నేను ఎల్లప్పుడూ పుణ్య కార్యములే చేసాను. అందుకని ఈ లోకంలో పరలోకంలో సుఖాలు అనుభవించాను. కాని కేవలం ఒకే ఒక తప్పుతో స్వర్గం చేజారి పోయింది. స్వర్గభ్రష్టుడనయ్యాను. మరలా మానవలోకంలో పుట్టాను. కామ,క్రోధ,మోహములకు లోనయ్యాను. మరలా మరలా జన్మలు ఎత్తుతూనే ఉన్నాను. ఈ జన్మలలో నాకు ఎంతో మంది తల్లులు, తండ్రులు, సహోదరులు, భార్యలు, పుత్రులు, బంధువులు కలిసారు. విడిపోయారు. ఎన్ని జాతులలో పుట్టానో లెక్కలేదు. ఎన్నో కష్టములను సుఖములను అనుభవించాను. ఎంతో శ్రమ పడ్డాను. బాధలు పడ్డాను. నరక యాతలను అనుభవించాను. ఎంతో మంది చేత చంప బడ్డాను. ఎంతో మంది చేత బంధింపబడ్డాను. ఎంతో మంది చేత మర్దనము(తన్నడం, కొట్టడం) చేయబడ్డాను. ఈ జనన మరణములతో విసిగిపోయాను.

నాకు జ్ఞానోదయము అయింది. ఇప్పుడు ఆత్మజ్ఞానము కలిగి సిద్ధి పొందాను. ఇప్పుడు నాకు ఈ మనుషులతో సంబంధం లేదు. ఈ లోకాన్ని ఒక సాక్షిగా చూస్తున్నాను కానీ ఈ బంధములలో తగుల్కొనను. ఇప్పుడు నాకు సుఖ దుఃఖములు లేవు. బ్రహ్మానంద స్థితిని పొందుతాను. అంటే శాశ్వత బ్రహ్మ పదమును పొందుతాను. మరలా ఈ జనన మరణ చక్రములో ఇరుక్కోను.

ఓ బ్రాహ్మణోత్తమా! నీ భక్తికి, శ్రద్ధకు సంతోషించాను. నిన్ను నా శిష్యునిగా స్వీకరించాను. నీవు నా దగ్గర నుండి ఏమేమి నేర్చుకోదల్చుకున్నావో

అవి నేను నీకు నేర్పుతాను." అని అన్నాడు ఆ సిద్ధుడు.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు సిద్ధునితో ఇలా అన్నాడు. "ఓ మహాత్మా! నాకు పరతత్త్వమును బోధించి నన్ను తరింపజేయండి." అని అడిగాడు. అప్పుడు ఆ సిద్ధుడు పరతత్త్వమును గురించి ఇలా చెప్పాడట.

ధర్మసాధనకు ఈ శరీరము సాధనము. కాబట్టి మానవుడు ఈ శరీరమును జాగ్రత్తగా చూసుకోవాలి. దేహమునకు ఏ రోగము రాకుండా జాగ్రత్త పడాలి. ఆరోగ్యవంతుడయి ఉండాలి. తన శరీరమునకు తగిన ఆహారమును తగిన వేళలలో క్రమం తప్పకుండా తీసుకోవాలి. కాని కొంత మంది మానవులు వేళా పాళా లేకుండా, కంటికి కనపడ్డ పదార్థాన్ని, ఇష్టం వచ్చినట్టు తింటూ ఉంటారు. ఇంకా కొంతమంది ఏదో ఒక సాకుతో పుణ్యం వస్తుందని కఠోరమైన ఉపవాసములు చేసి శరీరాన్ని శుష్కింపచేస్తుంటారు. ఇవి రెండూ శరీర పోషణకు మంచివి కావు.

ఇంకా కొంతమంది సమయం లేదని, ఉడికీ ఉడకని పదార్థములు, కుళ్లి పోయినవి, పుచ్చిపోయినవి చూచుకో కుండానూ, తిన కూడనివీ, తాగ కూడనివీ, దేహానికి చెరుపు చేస్తాయని తెలిసి కూడా తింటూ ఉంటారు. ఇంకా కొంత మంది ఒక సారి భోజనం చేసిన వెంటనే మొహమాటానికి పోయి, వెంట వెంటనే, మరలా మరలా, తింటూ ఉంటారు; తాగుతూ ఉంటారు. కొంత మంది తిన్న వెంటనే నిద్ర పోతారు. ఇంకా కొంతమంది తిన్న వెంటనే మైథున కార్యక్రమంలో పాల్గొంటూ ఉంటారు. ఇలాంటి పనులు చేస్తే మనిషిలో ఉన్న వాత, పిత్త, శ్లేష్మములు హెచ్చు తగ్గు లయి, నియమం తప్పి తీవ్రమైన రోగములు కలుగచేస్తాయి.

ఇంకా కొంత మంది తమ స్వభావానికి విరుద్ధమైన పనులు చేస్తూ ఉంటారు. చీటికీ మాటికీ ఉద్రేకపడుతుంటారు. దాని వలన దేహము రోగగ్రస్తమవుతుంది. ఇంకా కొంత మందికి కోరికలు ఎక్కువ. అవి తీరకపోతే కోపం వస్తుంది. దాని వలన శరీరం ఎన్నో వ్యాధులకు గురి అవుతుంది. ఆహారము తీసుకోడంలోనూ, ఇతరులతో ప్రవర్తించడంలోనూ నియమం తప్పి నడిస్తే, ప్రాణాంతకము లైన రోగములు వస్తాయి. అవి మరణానికి కూడా దారి తీస్తాయి.

నీకు ఇప్పుడు శ్లేష్మము గురించి చెబుతాను విను. శ్లేష్మము ఎక్కువ అవడం దోషము. అది ఏ అవయవము మీద తన ప్రభావాన్ని చూపిస్తుందో అ అవయవము రోగ గ్రస్తమవుతుంది. ఈ శ్లేష్మమునకు అన్ని అవయవములకు వ్యాపించి వాటిని రోగ గ్రస్తము చేసే గుణము ఉంది. ఈ శ్లేష్మము గొంతుకు అడ్డ పడుతుంది. ఊపిరి ఆడనివ్వదు. ఎగశ్వాస వస్తుంది. ఆ పరిస్థితుల్లో జీవుడు ఇంక ఆ శరీరంలో ఉండలేక బయటకు వెళ్లి పోతాడు.

(శ్లేష్మము అంటే గళ్ల. దగ్గితే వచ్చేదే గళ్ల. అది క్షయ, ఉబ్బసము, ఆయాసము మొదలగు రోగములకు మూలము. క్షయరోగ నిర్ధారణకు ముందు గళ్లను పరీక్ష చెయ్యడం మనకు తెలిసిందే కదా! )

మానవునికి జ్ఞానేంద్రియములు కర్మేంద్రియములు మొత్తం పది ఉన్నాయి. వీటిని మనస్సు నియంత్రిస్తూ ఉంటుంది. వీటికి మంచి చెడ్డా గురించె చెప్పేదే బుద్ధి. వీటి నియంత్రణకు లోబడి ఇంద్రియములు తమకు కావలసిన సుఖములు అనుభవిస్తూ ఉంటాయి. ఎప్పుడైతే శ్లేష్మము ఈ ఇంద్రియములకు అడ్డుపడి వాటిని పనిచెయ్యనివ్వదో అదే వ్యాధికి మూలము. అప్పుడు అన్ని అవయవముల పనులు ఆగిపోతాయి.

తరువాతది వాతము, వాయువు అంటారు. వాత దోషము అన్ని అంగములలోనూ ప్రసరిస్తూ ఉంటుంది. వాతము మానవుని ఆహార, వ్యవహారముల అలవాట్ల వలన దోషపూరితమైతే, ఆ దోషము అన్ని అంగములకూ వ్యాపించి వ్యాధులు కలుగచేస్తుంది. అది క్రమ క్రమంగా శరీరం అంతా వ్యాపిస్తుంది.

(వాత దోషం వలన వచ్చేది పక్షవాతము, కీళ్ళ వాతము, కీళ్ళ నొప్పులు. ఇది శరీరానికి కానీ, మెదడుకు కానీ రావచ్చు. ఇది శరీరాన్ని పనిచెయ్య నివ్వకుండా స్తంభింప చేస్తుంది. )

నాలుకను ఆడించడం, చేతులు కాళ్లు కదిలించడం, చేతులు కాళ్లు ముడవడం జాపడం, మొదలైన పనులను దేహంలో ఉన్న వాతము నియంత్రిస్తూ ఉంటుంది. ఈ వాతము శరీరంలో ఎక్కువ తక్కువ అయితే ఈ పనులు చేయడం కష్టం అవుతుంది. ఈ దోషములు ఒక్కొక్కటిగా అయితే ఆయా అవయవములు పనిచేయడం మానివేస్తాయి. కాని ఈ దోషములు రెండు మూడు కానీ ఒకేసారి సంభవిస్తే సన్నిపాతము అంటారు. దీని వలన మరణం సంభవిస్తుంది. వాత, పిత్త, శ్లేష్మములు అస్తవ్యస్తము అయి నందు వలన రోగములు సంభవించి ఈ శరీరము ఉండడానికి యోగ్యంగా లేకపోతే జీవుడు ఈ దేహము వదిలి వెళ్లిపోతాడు.

( ఇల్లంతా పెచ్చులు ఊడి, రంధ్రాలు పడి వర్షం నీళ్లు లోపలకు వస్తుంటే, కారుతుంటే మనం ఇళ్లు రిపేరు చేయించుకుంటాము (శరీరానికైతే వైద్యం చేయిస్తాము) రిపేరు చేయించినా పరిస్థితి చక్కబడకుంటే ఇల్లు ఖాళీ చేస్తాము. అలాగే జీవుడు కూడా ఈ శరీరాన్ని ఖాళీచేసి వెళ్లి పోతాడు. కాబట్టి ఈ వాత పిత్త శ్లేష్మములు అదుపులో ఉంచుకోడం మన బాధ్యత.).

ఈ విధంగా శరీరాన్ని వదిలిన జీవుడు తాను ఆ శరీరంలో చేసిన కర్మల ఫలితంగా వచ్చే సుఖాలను, దుఃఖాలను అనుభవించడానికి తగిన జన్మను పొందుతాడు. ఆ జన్మలో తాను క్రితం జన్మలో చేసిన పాప పుణ్యముల ఫలితములను అనుభవిస్తాడు. పాపాలు చేస్తే నరక బాధలు, పుణ్యాలు చేస్తే స్వర్గ సుఖాలు అనుభవిస్తారు. ఏ బంధనములూ లేని వారు మోక్ష పదవిని పొందుతారు.

పుణ్యకార్యములు చేసిన వారు పోవు ఊర్ధ్వ లోకముల గురించి చెబుతాను విను. ధర్మకార్యములు పుణ్య కార్యములు చేసిన మానవులు సూర్య మండలము, చంద్రమండలము నక్షత్ర మండలముల కు వెళతారు. అక్కడ కూడా వారి వారి పుణ్యములకు తగ్గట్టు సుఖములు అనుభవించి, ఆ పుణ్యము అయిపోగానే మరలా భూలోకములో పుడుతూ ఉంటారు. ఒక్క మోక్షము పొందితేనే మరలా జన్మ ఉండదు.

తరువాత మానవుడు ఎలా పుడతాడో చెబుతాను విను. మానవుడు పోయిన జన్మలో చేసిన శుభములు, అశుభములు అతని తరువాతి జన్మకు కారణం అవుతాయి. దానిని తప్పించుకోడం ఎవరి తరమూ కాదు. పురుషుడు స్త్రీ కలిసి నపుడు పురుషుని లోని శుక్లము, స్త్రీలోని శోణితముతో కలుస్తుంది. అవి స్త్రీ గర్భంలో చేరి పిండంగా ఏర్పడుతుంది. ఆ పిండము చైతన్యవంత మవుతుంది. క్రమక్రమంగా తల, చేతులు, కాళ్లు, పొట్ట, మొదలగు అవయవములు ఏర్పడతాయి. ( ఐదు నెలలకు బిడ్డకు శరీరం ఏర్పడుతుందని డాక్టర్లుచెబుతారు.) తొమ్మిది నెలలు రాగానే జీవుడు మాతృగర్భంనుండి బయటకు వస్తాడు. తరువాత, తన పూర్వజన్మకర్మల ఫలాలను బట్టి ప్రవర్తిస్తాడు. ( ఒకే తల్లి కడుపున పుట్టిన పిల్లలు వివిధ ప్రవృత్తులతో ప్రవర్తించడం మనం చూస్తూనే ఉన్నాము.).

మానవుడు ఎంత కాలమైతే జన్మ రాహిత్యం పొందడో, అప్పటి వరకూ పుట్టడం, చావడం, మరలా పుట్టడం, సుఖ దుఃఖాలు అనుభవిస్తూ ఉంటాడు. మానవుడు ఎంత కాలం మోక్షం పొందకుండా ఉంటాడో అంతకాలం ఈ జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటాడు.

ఇంతకూ మోక్షము, ముక్తి అంటే ఏమిటి? అది ఎలా వస్తుంది? అనే విషయం చెబుతాను విను.

దానాలు చెయ్యడం, శమము, దమము, బ్రహ్మ చర్యము పాటించడం, ఇతరుల పట్ల దయకలిగి ఉండటం, పరుల ధనమును పరుల భార్యలను కోరకుండా ఉండటం, నియమంగా జీవితం గడపడం, ఇంద్రియములను నిగ్రహించడం, తల్లి తండ్రులను, గురువులను పూజించడం, దేవతలను, పితరులను, అతిధులను పూజించడం, అర్చించడం, సత్యము పలకడం, శుభ్రంగా ఉండటం, ఎల్లప్పుడూ శుభ కార్యాలు చెయ్యడం, ధైర్యంగా ఉండటం, క్రూరత్వాన్ని వదిలిపెట్టడం, మొదలగు పుణ్య కార్యములు చేయాలి. ఆ పుణ్యకార్యములను ఆసరాగా చేసుకొని మానవుడు మోక్ష సాధనకు ప్రయత్నిస్తాడు.

పైన చెప్పినవే కాదు. ధర్మాచరణ కూడా అత్యంత ముఖ్యమైనది. ధర్మాచరణ అనేది గురువుల దగ్గర పెద్దల దగ్గర అభ్యసించ వలసిన విద్య. గురువులను, పెద్దలను అనుసరించాలి. వారి ధర్మప్రవర్తనను అనుకరించాలి. వారు చెప్పే శాంతమైన, ఉదారమైన వచనములను శ్రద్ధగా వినాలి. అప్పుడే ధర్మా చరణ సాధ్యపడుతుంది. దానిని ఒక వ్రతము మాదిరి ఆచరించాలి. ఇంద్రియములను జయించాలి. శాంతిమయ జీవితమును గడపాలి. ఆ పరబ్రహ్మను అనునిత్యమూ భజిస్తూ ఉండాలి.

అటువంటి మానవునికి బ్రహ్మయే అగ్ని, యాగము, సమిధలు, జలము, మంత్రము, ఋత్విక్కు. అటువంటి మానవుడు అనునిత్యమూ బ్రహ్మలో చరిస్తూ ఉంటాడు. అతనికి దుఃఖము, మోహము ఎటువంటి హానీ కలిగించవు. కాలక్రమంలో అతనికి సంసారమంటే విరక్తి కలుగుతుంది.

బ్రహ్మదేవుడు సృష్టి చేయడానికి సంకల్పించినపుడు, ప్రధానంగా క్షరమును సృష్టించాడు. దానికి అతీతంగా అక్షర తత్త్వమును సృష్టించాడు. అక్షరము అంటే అమృతము అని కూడా అంటారు. ~~ఈ~~ క్షరము అక్షరము లనే జంట వలన ~~ఈ~~ సృష్టి యావత్తు ఆవిర్భవించింది. ఆ సృష్టికి జననము, మరణము నిర్దేశించాడు బ్రహ్మ. జీవుడు ~~ఈ~~ జనన మరణ చక్రంలో తిరుగుతూ ఉంటాడు.

ఆ ప్రకారంగా జనన మరణ చక్రంలో నిరంతరమూ తిరుగుతున్న జీవుడు తాను చేసిన పుణ్యకార్యముల ఫలితంగా వివేక వంతుడవుతాడు. సుఖదుఃఖములు, సిరిసంపదలు, దేహము అశాశ్వతమని తెలుసుకుంటాడు. నిరంతరమూ కర్మలు చేయడం ఒక వ్యాధిగా భావిస్తాడు. కోరికలను, మోహమును వదిలిపెడతాడు. మోక్షం పొందాలన్న కోరికతో అటుగా పయనిస్తాడు. తనకున్న పాపములను ముందు ప్రక్షాళన గావించుకుంటాడు. మరలా సంసారంలో పడకుండా జాగ్రత్త పడతాడు. పుట్టడం, రోగములు, ముసలితనము, చావు జీవుని పరిణామాలని తెలుసుకుంటాడు. వాటికి బాధపడటం అవివేకమని భావిస్తాడు. మోక్షము కోసం ప్రయత్నం చేస్తాడు.

ఆ పరిస్థితిలో ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుంటాడు. హృదయము లో ఉన్న చింతలన్నీ వదిలిపెడతాడు. మనసులోకి కొత్త కొత్త ఆలోచనలను రానీయడు. ఎవరి మీదా ఆధార పడకుండా ఒంటరిగా ఉంటాడు.

ఇంద్రియములను జయిస్తాడు. భయాన్ని వదిలిపెడతాడు. కోరికలను, కోపమును జయిస్తాడు. మనసును అదుపులో పెట్టుకుంటాడు. మానము, అవమానము మొదలగు ద్వంద్వములను వదిలిపెడతాడు. సర్వభూతములలో పరమేశ్వరుని దర్శిస్తాడు. ఆత్మజ్ఞానాన్ని పొందుతాడు. లాభములు, నష్టములు, ప్రేమలు, ద్వేషములు, సుఖములు, దుఃఖములు, వీటిని ఎవడు సమానంగా చూస్తాడో; ఆశలు, నిరాశలు, ధర్మము, అధర్మము మొదలగు ద్వంద్వములను ఎవడు వదిలిపెడతాడో; ధర్మ, అర్థ, కామములను వదిలి ఎవడు మోక్షము కోసం తాపత్రయ పడతాడో, ఎవడైతే దేనికీ తాను కర్తను కాననే వైరాగ్యంతో ఉంటాడో అతడు మోక్షమును చేరుకోడానికి అర్హుడు.

ఆ మోక్ష స్థానము ఏ ఆధారము లేకుండా ఉంటుంది. అది పంచభూతాత్మకము కాదు. పంచభూతముల గుణములతో ప్రభావితము కాదు. అది నిర్గుణము. ఆ మోక్ష పదమును నిరంతర అభ్యాసము చేతనే పొందగలడు. ఆ మోక్ష పదమును పొందడానికి సర్వ సంకల్పములను వదిలిపెట్టాలి. మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలి. నిరంతర సాధన చెయ్యాలి. అప్పుడే మోక్షమును పొందగలడు.

ఓ బ్రాహ్మణోత్తమా! యోగిజనులకు అనుభవ మైన స్థానము గురించి చెబుతాను. విను. ఆత్మ అతి సూక్ష్మమైనది. దానిని కంటితో చూడటం సాధ్యం కాదు. జ్ఞాన నేత్రంతో మాత్రమే చూడగలము. అది యోగులకు మాత్రమే సాధ్యము. ముందుగా యోగి తన శరీరం నుండి జీవాత్మను వేరు చేయడం నేర్చుకుంటాడు. జీవాత్మను దర్శిస్తాడు. తరువాత పరమాత్మను కూడా దర్శించడం అభ్యాసం చేస్తాడు. పరమాత్మను దర్శించిన తరువాత ఈ జనన మరణ చక్రం నుండి విముక్తి పొందుతాడు. ఆ విధంగా ముక్తుడైన యోగి రోగములు, ముసలి తనము మొదలగువాటి చేత బాధింప బడడు. అతనికి

సంతోషము కానీ దుఃఖము కానీ కలగవు. అప్పుడు ఆ యోగి తనను తానే కాదు ఇతరులను కూడా మోక్ష మార్గములో పయనింప జేయగలడు.

యోగి ఎప్పుడూ ఈ శరీరము అశాశ్వతము అని గుర్తిస్తాడు. అందుకని ఈ శరీరపోషణకు ప్రాధాన్యము ఇవ్వడు. ఎల్లప్పుడూ ఆత్మ దర్శనము చేయడానికి ఆరాటపడుతుంటాడు. దాని కోసం యోగ సాధన చేస్తాడు. అప్పుడు ఆ యోగికి భయం అనేది ఉండదు. రాగద్వేషముల వలన సంతోషము, దుఃఖము పొందడు. అటువంటియోగి ఏ వికారములకు లోను కాడు. ఇంద్ర పదవి ఇచ్చినా నిరాకరిస్తాడు. ఎప్పుడూ తనలో తాను అంతర్ముఖుడై ఉంటాడు. మనసును ఎల్లప్పుడూ ఆత్మయందే లగ్నం చేస్తాడు. మనస్సును చలించనీయడు.

యోగి అయిన వాడు తన మనసును ఆత్మయందు లగ్నంచేసి దానిని అక్కడినుండి కదలకుండా ఉండేట్టు చూసుకంటాడు. అప్పుడు అతడు శాశ్వతమైన బ్రహ్మపదమును పొందగలడు. ఈ బ్రహ్మ పదమును మామూలు కళ్లతో చూడలేము. చెవులతో వినలేము. ఒక్క ప్రశాంత మైన మనస్సుతోనే ఆ బ్రహ్మ పదమును దర్శింపగలము.

ఆ పరబ్రహ్మ తత్వ్యము అన్ని పక్కలా తలలు, చేతులు, కాళ్లు కలిగి ఈ జగత్తు అంతా వ్యాపించి ఉంటుంది. సూర్యుని మాదిరి వెలిగిపోతూ ఉంటుంది. దానిని యోగులు మాత్రమే దర్శింపగలరు. శరీరము నుండి జీవాత్మను వేరు చేసి పరమాత్మ వైపుకు అనుసంధానము చేసినపుడే ఆ పరమ తత్త్వ దర్శనం కలుగుతుంది. బ్రహ్మ విద్యారహస్యము సర్వమూ నీకు చెప్పాను. నీవు ఇంక సుఖంగా పొమ్మ" అని సిద్ధుడు బ్రాహ్మణునికి పరతత్త్వమును ఉపదేశించాడు.

తన సంశయములన్నీ తొలగిన వాడై శిష్యుడు వెళ్లిపోయాడు. సిద్ధుడు కూడా వెళ్లిపోయాడు.

ఓ  అర్జునా! విన్నావు కదా! ఆనాడు యుద్ధభూమిలో నీకు చెప్పిన విషయములు సిద్ధుడు బ్రాహ్మణుని సంవాద రూపంలో  ఇప్పుడు నీకు సంక్షిప్తంగా వివరించాను.        ఈ బ్రహ్మ విద్యను నీవు శ్రద్ధలేని వారికి బోధించరాదు. ఈ విద్యను పూర్వము నేను దేవతలకు బోధించాను. మానవులలో నీకు బోధించాను.  శ్రద్ధ గలవారు ఏ జాతి వారైనా, ఏ వర్ణము వారైనా స్త్రీలైనా పురుషులైనా  ఈ బ్రహ్మ విద్యను అభ్యసించుటకు అర్హులు. ఎందుకంటే ఈ  పరబ్రహ్మ తత్త్వము మానవులందరికీ అవశ్యము ఆచరించదగినది. ప్రతివ్యక్తీ  ముక్తి పొందుటకు అర్హుడే కదా!  ఎవడైతే శ్రద్ధతో, ప్రాపంచిక సుఖములు వదిలిపెట్టి, ఈ బ్రహ్మ పదమును గూర్చి తెలుసు కుంటాడో వాడికి మోక్షము కలుగుతుంది అనడంలో సందేహము లేదు.

అర్జునా! నేను చెప్పదగినది అంతా చెప్పాను. ఇంతకన్నా నీకు ఎవరూ చెప్పలేరు." అని శ్రీ కృష్ణుడు అర్జునునికి బ్రహ్మవిద్యను బోధించాడు.

మహాభారతము

అశ్వమేధ పర్వము

ప్రధమాశ్వాసము సంపూర్ణము.

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహా భారతము

## అశ్వమేధ పర్వము

### ద్వితీయాశ్వాసము

సర్పయాగ సందర్భంగా వైశంపాయన మహర్షి జనమేజయునకు వినిపించిన మహాభారత కథను నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో సూతుడు శౌనకాది మహా మునులకు వినిపించసాగాడు.

ఆ ప్రకారంగా శ్రీ కృష్ణుడు అర్జునునకు గీతా సారాన్ని బోధించే క్రమంలో ఇంకా ఇలా అన్నాడు.

"ఓ అర్జునా! అభయ అనే పేరుతో ప్రసిద్ధమైన ఒక భార్య ఒక భర్త మధ్యజరిగిన సంవాదమును నీకు వినిపిస్తాను శ్రద్ధగా విను.

పూర్వ కాలంలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. ఒక రోజు ఆయన వద్దకు ఆయన భార్య వచ్చి తనకు అధ్యాత్మ బోధ చెయ్యమని అడిగింది. ఆయన కూడా తనకు తెలిసిన వరకు చెబుతానని ఇలా చెప్పసాగాడు.

"ఓభార్యామణీ! విన డానికి, చూడడానికి, చెయ్యడానికి వీలైన పనులను కర్మలు అంటారు. అజ్ఞానము అనే చీకట్లో కొట్టుకుంటున్న వారు తాము చేసే కర్మలు అన్ని సిద్ధిస్తాయని అనుకొంటూ ఉంటారు. ప్రపంచంలో కర్మ చేయకుండా ఉండటం అనేది లేదు. అందరూ ఏదో ఒక కర్మ చేస్తూ నే ఉంటారు. అది సహజము. ఎవడైనా ఏ పనీ చెయ్యక పోతే వాడిని మూర్ఖుడు

అంటారు జనులు. కానీ కర్మలన్నీ విడిచి పెట్టడమే బ్రహ్మ పదము. నా మటుకు నేను ఎల్లప్పుడు నా ఆత్మ యందు బ్రహ్మను నిలుపుకొని ఉపాసిస్తాను. దానిని నిష్కర్మ అంటారు. బాహ్మ ప్రపంచంలో చేసే ప్రతి పనీ కర్మయే. కర్మచెయ్యకుండా ఉండటం అసాధ్యము.

అగ్ని సోముడు కలిసి ఈ సృష్టిని చేస్తుంటారు. బ్రహ్మ అక్షర తత్త్వమును ఉపాసిస్తూ ఉంటాడు. అక్షర తత్త్వము గురించి వివరిస్తాను. ఆ అక్షర పర బ్రహ్మ తత్త్వము పంచభూతాత్మకము కాదు. వాటి తన్మాత్రల మయం కాదు. అందువలన ఈ అక్షర పర బ్రహ్మమును ఇంద్రియములతో దర్శించలేము. కేవలము బుద్ధి, జ్ఞానముతో మాత్రమే బ్రహ్మను దర్శించగలము.

మనలో ఉండే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అను పంచ వాయువులు కూడా ఈ బ్రహ్మనుండి ఉద్భవించాయి. మరలా ఆ బ్రహ్మలోనే లీనం అవుతాయి. ప్రాణమునకు, అపానమునకు మధ్య ఉదాన వాయువు తిరుగుతూ ఉంటుంది. మానవుడు ప్రాణ, అపాన వాయువుల మధ్య నిద్రపోతున్నప్పుడు వ్యాన,సమాన వాయువులు వాటితో కలిసిపోతాయి. కాని మానవుడు ఉదాన వాయువు లో నిద్రించునపుడు ప్రాణ అపానములు అతనిని వదిలిపెట్టవు.

పైన చెప్పిన పంచ వాయువులు, మనస్సు, బుద్ధి కలిస్తే ఇవి వైశ్వానరునికి అంటే అగ్ని దేవునికి నాలుకల వంటివి. అందుకే అగ్ని దేవుని సప్తజిహ్వుడు అని పిలుస్తారు. కాబట్టి మానవుల దేహములలో అగ్ని దేవుడు ఆత్మ రూపంలో వెలుగుతున్నాడు. వాసన చూడటం, తినడం, దృశ్యములను చూడటం, వస్తువులను స్పృశించడం, వినడం, ఆలోచించడం, ఇతరుల నుండి తెలుసుకొనడం, ఈ ఏడు మనలో వెలిగే అగ్నికి సమిధలు(కట్టెలు లేక

ఇంధనములు). మనలో ఉన్న వాసన చూచేవాడు, తినే వాడు, కంటితో చూచేవాడు, స్ప ృశించేవాడు, వినేవాడు, ఆలోచించేవాడు, తెలుసుకొనే వాడు..హోమం చేసే ఋత్విక్కులు. అంటే పైన చెప్పబడిన సమిధలను, మనలో ఉన్న ఋత్తిక్కులు ఆత్మ అనే అగ్నిలో వేసి హోమం చేస్తారు. అంటే మనలో నిత్యం హోమ కార్యం జరుగుతూ ఉంటుంది అన్నమాట. దీనినే సప్తహోతృ విధానము అంటారు.

వైశ్వానరునికి పది ముఖములు. అవి దిక్కులు, వాయువు, సూర్యుడు, చంద్రుడు, భూమి,అగ్ని, ఇంద్రుడు, విష్ణువు,బ్రహ్మ, మిత్రా వరుణులు. ఇవి వైశ్వానరుడి ముఖాలు. శబ్దము, రూపము, స్పర్శ, రసము, గంధము, వక్తవ్యము(మాట్లాడటం), కర్తవ్యము (పనిచెయ్యడం), గంతవ్యము (రాకపోకలు), విసర్జనము (విడిచిపెట్టడం), ఆనందము ఈ పదీ ఆ పది ముఖములకు హోమద్రవ్యాలు. ఇంక పైన చెప్పిన హోమ ద్రవ్యములను వైశ్వానరాగ్నిలో హోమం చేసే హోతలు.....కళ్లు, ముక్కు, చెవులు,చర్మము, నాలుక, చెవులు, పాదములు, చేతులు, గుదము, జననేంద్రియము. దీనినే దశహోత్రవిధి అంటారు.

ఈ రెండు విధులను తెలుసుకొన్న యోగి తనలో ఉన్న జీవాత్మను ఉపద్రష్టగా చేసుకొని(ఋత్తిక్కుగా చేసుకొని) తనలోనే నిత్యమూ యాగం చేస్తూ ఉంటాడు. తుదకు ఈ జనన మరణ చక్రము నుండి విముక్తి పొందుతాడు. ఇది తెలియని వారు పుడుతూ చస్తూ ఈ జనన మరణ చక్రంలో గిరా గిరా తిరుగుతూ ఉంటారు.

ఓంకారము నుండి వాక్కు పుట్టింది.

( ఆ ఈ ఊ ఓ కలిసి ఓం అవుతుంది. ఇవి అచ్చులు అంటాము. భాషకు అచ్చులు మూలము. ఏదో ఒక రూపంలో ఈ అచ్చులు అన్నిభాషలలో ఉన్నాయి.)

ఆ ఓంకారము అనుసరించి మన మనసు నాలుగు పురుషార్థముల సాధనకు ప్రయత్నం చేస్తుంది. (అంటే భాష నేర్చుకొని, వేదములు శాస్త్రములు చదువుకొని, ధర్మము అనుసరిస్తాడు)." అని అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

అప్పుడు ఆయన భార్య ఇలా అంది. "నాథా! మనస్సు లో సంకల్పిస్తేనే కదా నోటినుండి వాక్కు వచ్చేది. మరి అటువంటప్పుడు వాక్కును అనుసరించి మనసు ఎలా ప్రవర్తిస్తుంది." అని అడిగింది.

"నీవు అన్నది నిజమే. అందరూ అలాగే అనుకుంటారు. కాని వాక్కు మనసు ఒకటికి ఒకటి అనుసంధానము అయి ఉంటాయి. మనసులో ఒకటి అనుకొని మరొకటి పలకలేడు.

(కాని నేటి ధర్మం ఏమిటంటే మనసులో అనుకున్నది నోటితో చెప్పరు. నోటితో చెప్పింది చేత్తో చెయ్యరు. దేని కదే. ఇదీ నేటి లోక ధర్మము.)

ఒకసారి మనసు, వాక్కు కలిసి బ్రహ్మదగ్గరకు పోయి మాలో ఎవరు గొప్ప అని అడిగాయట. మనస్సే గొప్పది అని బ్రహ్మ ఠక్కున సమాధానం చెప్పాడట. పక్కనే ఉన్న సరస్వతి బ్రహ్మతో ఇలా అంది.

"నాథా! నేను వాక్కుకు దేవతను. అలాంటి నేను మీ పక్కనే ఉండగా మనస్సు గొప్పది అని ఎలా చెప్పారు." అని నిలదీసింది.

"ఓ దేవీ! మనస్సు రెండు రకాలు. స్థిరమైన మనస్సు. చంచలమైన మనస్సు. స్థిరమైన మనస్సు నా వద్దా, చంచలమైన మనస్సు నీ వద్ద ఉన్నవి. నీ అనుగ్రహం వలన పుట్టిన అన్ని రకాల వర్ణములు, అక్షరములు, విద్యలు, మంత్రములు, మొదలగునవి చంచల మనస్సు అని అంటారు కదా. కాని వాటి కన్నా స్థిర చిత్తము గొప్పది. అదే నేను". అని వివరించాడు.

ఆ మాటలకు సరస్వతి ఏమీ మాట్లాడలేకపోయింది." అని చెప్పాడు ఆ బ్రాహ్మణుడు.

అప్పుడు ఆ బ్రాహ్మణుని భార్య ఇలా అంది.

"నాథా! బ్రహ్మ దేవుని మాటలకు చింతించిన సరస్వతి ఏ ప్రకారము తేరుకుంది." అని అడిగింది.

"తరుణీ! వాక్కు అనునది ప్రాణము అపానముల( ఉచ్ఛ్వాస నిశ్వాసముల) వల్ల కలుగుతుంది. అందు ప్రాణ వాయువే బ్రహ్మము. తనలో సగమైన సరస్వతి చింతను బ్రహ్మదేవుడు పోగొట్టగలిగాడు. కాబట్టి వాక్కు, మనస్సు యొక్క ధర్మములను తెలుసుకొన్న వాడు మోక్షమునకు అర్హుడు.

ఇంకా, వాక్కు మనస్సు, వీటి యొక్క ధర్మములను గురించి చెబుతాను విను. ప్రాణము అపానములో కలుస్తుంది. అప్పుడు వాక్కు తన సహజమైన శబ్దమును వదిలి పెట్టి పంచ భూతములలో కలిసి వ్యానుడి ప్రేరణతో శరీరం అంతా వ్యాపిస్తుంది. అప్పుడు మనస్సు ప్రశాంతత పొందు తుంది. ఆ ప్రకరంగా మనస్సు ప్రశాంతత పొందడమే ముక్తికి మార్గము.

వాక్కు అనేది బయటకు ఉచ్ఛరించేది(ఘోషిణి), బయటకు ఉచ్ఛరించనిది (అఘోషిణి) అంటే మనసులోనే అనుకొనేది అని రెండు విధములు. ఇందులో అఘోషిణి అనునది ఉత్తమమైనది. ఆ వాక్కు అవ్యయము. శబ్ద రూపము లేనిది. కాని ఉజ్వలంగా ప్రకాశిస్తుంది. అదే బ్రహ్మతత్త్వము.

జ్ఞానేంద్రియాలు ఐదు, మనస్సు, బుద్ధి ఈ ఏడూ జీవాత్మను ఆశ్రయించుకొని ఉంటాయి. దేని పని అదే చేసుకుంటూ ఉంటుంది. ఒకదాని పని ఒకటి చెయ్యవు. వాసన చూడడం అనేది ముక్కు మాత్రమే చేస్తుంది. మిగిలిన వాటికి చేతకాదు. అలాగే నాలుక రుచి చూస్తుంది. మిగిలిన ఇంద్రియములు ఆ పని చేయలేవు. రూపాన్ని కళ్లు మాత్రమే చూడగలవు మిగిలినవి చూడలేవు కదా. స్పర్శను చర్మము మాత్రమే గ్రహిస్తుంది. శబ్దమును చెవులు మాత్రమే వినగలవు. ఏదైనా విషయం తెలుసుకోవడం, అనుమానించడం, అనేవి మనసు ధర్మములు. మిగిలిన ఏ ఇంద్రియములు ఈ పని చేయలేవు. అలాగే మంచి చెడు గురించి తెలుసుకోవడం మనసును జాగృతం చెయ్యడం బుద్ధి పని. ఆ పనికి మిగిలిన ఇంద్రియములు పనికిరావు.

ఒకప్పుడు మనస్సుకు, ఇంద్రియములకు, వాగ్వివాదము జరిగింది. మనస్సుతో ఇంద్రియాలు అన్నాయి. "ఓ మనసా! నువ్వు మేము ఒకటే కదా! మరి నీ గొప్ప ఏమిటి?" అని అడిగాయి. అప్పుడు మనస్సు ఇంద్రియములతో ఇలా అంది.

" ఓ ఇంద్రియములారా! నేను అంటే మనస్సు, మీ మీ ఇంద్రియముల ద్వారా పనిచెయ్యకపోతే మీరు పని చెయ్యలేరు. అంటే నేను లేనిదే ముక్కు వాసన చూడలేదు. నాలుక రుచి చూడలేదు. కన్ను దేనినీ చూడలేదు. అలాగే

చెవులు ఏమీ వినలేవు.  నేను కనక లేకపోతే మీ ఇంద్రియములు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే. కాబట్టి మీ అందరి కంటే నేను గొప్ప." అని అన్నది మనస్సు.

అప్పుడు ఇంద్రియములు మనస్సుతో ఇలా అన్నాయి. "ఓ మనసా! అంత మాత్రం చేతనే నీవు గొప్ప దానివి అయిపోయావా! మేము లేకుండా నువ్వు దేనినీ అనుభవించ లేవు కదా. ముక్కు లేకుండా నువ్వు వాసన చూడగలవా. నాలుక లేకుండా రుచి చూడగలవా.  మా లో ఏ ఒక్కటి లేకపోయినా నువ్వు ఏమీ చెయ్యలేవు. పోనీ ఒకదానితో మరొక పని చేయించ గలవా అంటే అదీ చేయించలేవు. ముక్కుతో కన్ను పని చేయించలేవు కదా. కనుక మేము అందరం ఉంటేనే నువ్వ అన్నీ అనుభవించగలవు. ఇందులో నీ గొప్పదనం ఏముంది.

అదీ కాకుండా ముందు మేము అనుభవించిన తరువాతనే నువ్వు అనుభవిస్తావు. అంటే మా ఎంగిలి నువ్వు అనుభవిస్తున్నావు అన్నమాట.   అంతే కాదు. ఒక వేళ నీవు  ఏ కారణం చేతనైనా పనిచేయలేకపోతే, మాలోని ప్రాణ శక్తి చేతనే నువ్వు మరలా పని చేయగలవు.  మేమంటూ ఉంటేనే నువ్వు మా ద్వారా విషయములను గ్రహించి అనుభవించగలుగుతున్నావు. మేమే లేక పోతే నీవు విషయములను అనుభవించలేవు కదా! కాబట్టి నీకు స్వతస్సిద్ధంగా అనుభవం లేదు. మామీద ఆధార పడవలసినదే కదా!  కాబట్టి ఓ మనసా! నువ్వు, మేము కలిస్తేనే ఈ శరీరము విషయ సుఖములను అనుభవించగలుగుతుంది. అది తెలుసుకో. ఇందులో ఎవరి గొప్పతనమూమీ లేదు."  అని అన్నాయి ఇంద్రియములు. ఆ వాదనకు బదులు చెప్పలేక పోయింది మనస్సు." అని చెప్పాడు ఆ బ్రాహ్మణుడు తన భార్యతో.

ఆ బ్రాహ్మణుడు ఇంకా ఇలా అన్నాడు. "ఓ భార్యామణీ! నీకు మరొక విషయం కూడా చెబుతాను విను. ఒక సారి, మానవుని శరీరములో పని చేయుచున్న ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులు అన్నీ బ్రహ్మ దేవుని వద్దకు పోయి మాలో ఎవరు గొప్ప అని అడిగాయి. దానికి బ్రహ్మదేవుడు నవ్వి "మీలో ఎవ్వరు ఉంటే మిగిలిన వాయువులు అన్ని పని చేస్తాయో, మీలో ఎవరు లేకపోతే ఏ వాయువూ పని చేయదో వారే గొప్ప. ఇంక పోయి మీ మీ పనులు చేసుకోండి." అని అన్నాడు.

కాని ఆ వాయువులు అక్కడ నుండి కదల లేదు. "ఏం ఇంకా ఇక్కడే ఉన్నారు!" అని అడిగాడు బ్రహ్మ. అప్పుడు ప్రతి వాయువూ తానే గొప్ప అనీ తాను లేకపోతే ఏ వాయువూ పని చేయలేదనీ వాదించాయి.

బ్రహ్మదేవుడు నవ్వి "ఆ విషయం నాకు తెలియదా! మీలో ప్రతి ఒక్కరూ విశేషవృత్తి కలవారే. మీలో ఎవరు లేకపోయినా మిగిలిన వారు పని చేయలేరు. అది ఎలాగో చెబుతాను వినండి. మీరు అందరూ ఒకే సారి పని చెయ్యరు. ఒక్కొక్కరూ ఒక్కోసారి, ఒక్కొక్క పని చేస్తూ ఉంటారు. ఎప్పుడు ఏ వాయువు పనిచేస్తుందో అప్పుడు ఆ వాయువు గొప్పది అవుతుంది. కాబట్టి మీరందరూ ఒకరితో ఒకరు స్నేహ భావంతో కలిసి పని చేసి నప్పుడు మీరందరూ గొప్పవారే. ఈప్రకారంగా మీరు నడచుకోండి." అని అన్నాడు బ్రహ్మదేవుడు. ఆ మాటలకు మారాడక వెళ్లిపోయాయి వాయువులు.

ఇదే సందర్భంలో నీకు నారదుడికి దేవమతుడికి జరిగిన సంవాదము వినిపిస్తాను విను.

"ఒకసారి దేవ మతుడు అనే బ్రాహ్మణుడు నారద మహర్షిని చూచి ఇలా

అడిగాడు.

"ఓ మహర్షి! మానవులలో ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులు ఉంటాయి కదా. తల్లి గర్భంలో ఉన్నప్పుడు శిశువులో మొదటగా ఏ వాయువు పని చెయ్యడం మొదలె పెడుతుంది. తెలియచెయ్యండి." అని అడిగాడు.

అప్పుడు నారదుడు ఇలా అన్నాడు. " పిండము ఏర్పడడానికి ముందు స్త్రీ పురుషులు కలియాలి కదా. పురుషునిలోని సమాన వాయువు పురుషునిలో వీర్యాన్ని, వ్యానము అనే వాయువు స్త్రీలో శోణితమును పుట్టిస్తాయి. పురుషుడు స్త్రీతో కలిసి సంభోగించినపుడు పురుషునిలోని శుక్లము స్త్రీలోని శోణితముతో కలిసి పిండము గా ఏర్పడుతుంది. ఆ పిండము లోనికి ప్రాణ వాయువు, అపాన వాయువు ప్రవేశిస్తుంది. అప్పుడు శ్వాస తీసుకోడం, విడవడం జరుగుతుంది. ప్రాణవాయువు కిందికి, అపాన వాయువు పైకి ప్రసరిస్తూ ఉంటుంది. ఈ రెండు వాయువులలో అగ్ని తో కూడిన వ్యాన, ఉదాన,సమాన వాయువులు ప్రవేశిస్తాయి. అప్పుడు ఈ ఐదు వాయువులు శిశువు శరీరం అంతా ప్రసరిస్తాయి. కాబట్టి ఈ వాయువులు అన్నింటిలో నూ అగ్ని అంతర్లీనంగా ఉంటుంది. (అదే శరీర ఉష్ణోగ్రత 98.4). ఈ అగ్నినే ఉదానము అని కూడా అంటారు.

నేను ప్రాణ, అపాన వాయువులు అని చెప్పాను కదా! వాటినే రాత్రి పగలు, శుభము అశుభము, సత్యము అసత్యము, ఉంది లేదు, మొదలగు ద్వంద్వములు అని కూడా అంటారు. వీటన్నిటి మధ్య ఉదాన వాయువు అనే అగ్ని తత్త్వము ప్రవహిస్తూ ఉంటుంది. మనలో ఉన్న అగ్ని తత్త్వము, వాయు తత్త్వము ను శరీర శాస్త్రము తెలిసిన నిపుణులు(డాక్టర్లు) మాత్రమే

గ్రహించగలరు." అని నారద మహర్షి ఆ బ్రాహ్మణునికి చెప్పాడు.

" ఓ భార్యామణీ! నీకు మరొక రహస్యము కూడా చెబుతాను విను. ఈ ప్రపంచం అంతా మూడింటి మీద ఆధార పడి ఉంది. అవి... చేసేవాడు(కర్త), చేసే పని(కర్మ), ఆ పని చెయ్యడానికి ఉపయోగ పడే సాధనము(కరణము). ముక్కు మొదలగు జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి ఇవి అన్నీ సాధనములు(కరణములు). వాసన చూడటం, వినడం, రుచి చూడటం, చూడ డం, తాకడం, ఆలోచించడం, నిర్ణయాలు తీసుకోడం మొదలగు పనులు (కర్మలు) జీవుడు(కర్త) చేస్తాడు. వీటితో జీవుడు విషయ సుఖములు అనుభవిస్తాడు.

జీవుడు, వాటిని వదిలి పెట్టి, మోక్ష మార్గమున కూడా పయనించగలడు. ఎలాగ అంటే కరణము, కర్మ ... వీటిని అనుభవించేవాడు(భోక్త) జీవుడు. కాని ఆ జీవుడు వీటితో కలియ కుండా, ప్రాపంచిక విషయములను సమిధల మాదిరి ఆత్మ అనే అగ్నిలో పడేసి కాలిస్తే, అవి కాలిపోతాయి. అప్పుడు అతనిలో ఉన్న అవిద్య నశిస్తుంది. జీవుడు, అవిద్య అనే పొగ లేకుండా వెలుగుతాడు. అదే మోక్ష మార్గము. దానినే యోగయజ్ఞము అంటారు. ఆ యజ్ఞమునకు దక్షిణ (సంభావన) కోరికలను వదిలిపెట్టడమే. అప్పుడు సర్వవ్యాపి అయిన భగవంతుడు సంతోషించి, మోక్షమును ప్రసాదిస్తాడు. అలా కాకుండా జీవుడు (భోక్త) ప్రాపంచిక విషమయులలో ఆసక్తి కలిగి ప్రవర్తిస్తే ఆ బంధనములలో ఇరుక్కుంటాడు. పతనమై పోతాడు.

ఓ భార్యామణీ! ఈ ప్రపంచమునకు శాసించే వాడు ఒక్కడే. అతని శాసనమును నేను పాటిస్తాను. ఆ లోకములో గురువు ఒక్కడే. అతని బోధనలు నేను శిరసావహిస్తాను. శ్రోత కూడా ఒక్కడే. అదే నేను. నాకు శత్రువు వలన

ఆపద వస్తే అప్పుడు ఆ శత్రువుకు తల వంచుతాను. ఆ సంసారమును దాటే మార్గము పెద్దల వలన తెలుసుకుంటాను.

ఒక సారి దేవతలు మునులు బ్రహ్మదేవుని వద్దకుపోయి మాకందరకూ హితము ఏదో తెలపండి అని అడిగారు. అప్పుడు బ్రహ్మదేవుడు "అక్షరోపాసనే మీకు హితమైన మార్గము." అని అన్నాడు. నేను కూడా అదే మార్గమును అవలంబిస్తున్నాను.

కాబట్టి ఓ భార్యామణీ! నేను ఈ సంసారమనే అరణ్యమును దాటే ప్రయత్నం చేస్తున్నాను. కోపము అనే చీకటిని, లోభము అనే పామును, కామము అను కోటను, దాటాను. ప్రస్తుతము ఒక అడవిలో ఉన్నాను." అని అన్నాడు.

"నాధా! అది ఎటువంటిఅడవి ఎలా ఉంటుంది?" అని అడిగింది.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు తన భార్యతో ఇలా అన్నాడు. " ఓ భార్యామణీ! అక్కడ చిన్నా పెద్దా తారతమ్యము లేదు. సుఖదుఃఖాలు అసలే లేవు. చింతా లేదు భయమూ లేదు. అడవిలో ఉన్న చెట్లకు పంచరంగుల ఫలాలు ఉన్నాయి. అవి చాలా తియ్యగా ఉంటాయి. ఈ ఫలాలు ఆ అడవిలోకి వచ్చిన అతిధులను తృప్తి పరుస్తూ ఉంటాయి. ఆ అడవిలోకి వచ్చే వారు సామాన్యులు కారు... మహా ఋషులు. ఆ ప్రశాంత వనంలో తపస్సు చేసుకుంటూ ఉంటారు. ఆ అడవికి యజమాని సూర్యుడు. ఆ అడవిలో ఉన్న నదులలో బ్రహ్మసంభవమైన నీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఆ అడవిలో ఉన్న కొండల మీద ఋషులు తపస్సు చేసి ముక్తి పొందుతూ ఉంటారు. ఆ అడవిలో ఉండే మహా ఋషులు చాలా ప్రభావం కలిగిన వారు. వారు శాంతి, దాంతి కలిగినవారు. ఎల్లప్పుడూ

వైరాగ్యభావనతో బ్రహ్మానందం పొందుతూ ఉంటారు. నేను కూడా ఆ అడవిలో ఉన్న మునుల వలె నిస్సంగత్వంతో ఉంటాను.

నేను ఏపని చేసినా దాని ఫలితమును ఆశించి ఆపని చెయ్యను. అందు వలన నాకు ఎటువంటి కర్మ బంధములు లేవు. నా ఆలోచన ఎలా ఉంటుంది అంటే జరగనున్నది మనం ఎన్ని ప్రయత్నములు చేసినా జరగక మానదు. రాబోయే ఆపదలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న కలగక మానవు. కాబట్టి వాటి గురించి చింతించడం వృధా. ఇవన్నీ తెలుసుకొని నేను తామరాకు మీది నీటి బొట్టు మాదిరి ఈ ప్రపంచంలో తిరుగుతూ ఉంటాను.

ఓ భార్యామణీ! ఈ సందర్భంలో నీకు ఒక అధ్వర్యునికి (అనగా యజ్ఞములు చేయించే యాజకుడు(పురోహితుడు) మరొక యతికి జరిగినసంవాదమును వినిపిస్తాను విను.

ఒకచోట యజ్ఞం జరుగుతూ ఉంది. ఆ యజ్ఞములో బలి ఇవ్వడానికి ఒక మేకను సిద్ధం చేస్తున్నారు. ఆ మేక మీద నీళ్ల చల్లి శుద్ధి చేసి బలి ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు ఆ యాజకుడు. యాజకుని చూచి ఒక యతి ఇలా అన్నాడు.

"అయ్యా పవిత్రమైన యజ్ఞ చేస్తూ జీవ హింస చేయడం తప్పుకాదా!" అని అన్నాడు.

ఆ మాటలకు యాజకుడు ఇలా అన్నాడు. "అయ్యా! మీరు వేదములు చదివినట్టు లేదు. ఇది వేదములలో చెప్పిన విధి. ఈ మేక చనిపోయిన తరువాత స్వర్గసుఖాలు అనుభవిస్తుంది." అని అన్నాడు.

అప్పుడు ఆ యతి ఇలా అన్నాడు. "అయ్యా! మీరు చెప్పినట్టు ఈ మేక స్వర్గలోకమునకు పోతుంది అనుకుందాము. కాని ఈ మేకను ఈ యజ్ఞములో బలి ఇచ్చినందువలన మీకు కలిగే లాభము ఏమిటి?" అని అడిగాడు.

"అదేమిటి అలా అంటారు. యజ్ఞములలో మేకలను బలి ఇవ్వమని వేదములు ఘోషిస్తున్నాయి. దానివలన యజ్ఞములు చేసిన వారు, చేయించిన మేమూ స్వర్గసుఖములు అనుభవిస్తాము. ఇది తప్పా?" అని అన్నాడు.

"మీరు చెప్పునది సరి కాదు. వేదములలో జీవహింస మహా పాపము అని పదే పదే చెప్పారు. నాకు తెలుసు." అని అన్నాడు ఆ యతి.

"ఓహో! తమరు అలా అంటున్నారా. మరి తమరు చేసే పని ఏమిటి. తమరు సమాధిలో ఉన్నప్పుడు ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములను బంధించి యోగాభ్యాసము చెయ్యడం లేదా. మరి మీరు కూడా మీ శరీరమును హింస పెట్టడం లేదా!" అని అన్నాడు యాజకుడు.

దానికి ఆ యతీశ్వరుడు ఇలా బదులుచెప్పాడు. "నేను చేసేది తపస్సు. అందులో గాఢమైన పరిపక్వతను పొందాను. జ్ఞాన స్వరూప మైన అక్షర తత్త్వాన్ని తెలుసుకున్నాను. క్షర తత్త్వమును నా జ్ఞానంతో వివేకంతో నశింప చేసాను. ఐహిక సుఖములను విడిచి పెట్టాను. మోక్ష ప్రాప్తి కోసం నేను చేసే యోగము హింస అనడం నీ మూర్ఖత్వము కాక మరేమవుతుంది." అని అన్నాడు ఆ యతి.

అప్పుడు ఆ యాజకుడు ఇలా అన్నాడు. "ఓ యతీంద్రా! నాకు అవన్నీ తెలియవు. నేను యజ్ఞము చేస్తున్నాను. యజ్ఞములలో మేకలను బలి ఇవ్వమని

వేదములు చెబుతున్నాయి. నేను వేద విధిని నిర్వర్తిస్తున్నాను. ఈ హింస చేసిన పాపము నాకు అంటదు. నాకు తెలిసింది యజ్ఞము చేసి ఉత్తమ గతులు పొందడమే." అని అన్నాడు.

అప్పుడు ఆ యతి ఇలా అన్నాడు. "ఓ యాజకుడా! నీవు చేసే జీవ హింస తో కూడిన యజ్ఞము కన్నా నేను చేసే తపో యజ్ఞము గొప్పది అని అన్నాను. అంతే కాని వేరు కాదు." అని అన్నాడు ఆ యతి. ఆ మాటలను ఒప్పుకున్నాడు ఆ యాజకుడు.

ఓ భార్యామణీ! ఈ విషయమును వివరించే కథ ఇంకొకటి ఉన్నది.చెబుతాను విను.

పూర్వము కార్తవీర్యార్జునుడు అనే రాజు పరశురాముడు అనే బ్రాహ్మణునికి తీరని అపకారము చేసాడు. దానికి ప్రతీకారంగా పరశురాముడు ఆ కార్తవీర్యార్జునుని చేతులు ఖండించాడు. అతనిని దారుణంగా చంపాడు. ఆ పగను మనసులో పెట్టుకొని అతని కుమారులు పరశురాముడు ఇంట్లో లేని సమయంలో పరశురాముని తండ్రి అయిన జమదగ్నిని చంపారు. దానితో ఆగ్రహోదగ్రుడైన పరశురాముడు ఆ కార్తవీర్యార్జునుని కుమారులందరినీ తన గండ్రగొడ్డలితో చంపాడు. వారినే కాదు క్షత్రియ జాతి నంతా 21 మారులు దండెత్తి సమూలంగా నాశనం చేసాడు. అప్పటికి కానీ అతని పగ చల్లారలేదు.

అప్పుడు అతని పితృదేవతలు ప్రత్యక్షం అయ్యారు. పరశురామునితో ఇలా అన్నారు.

"పరశురామా! నీవు బ్రాహ్మణుడివి కదా. ఈ హింసను ఎందుకు

చేసావు. ఇది తప్పుకదా" అని అన్నారు.

అప్పుడు పరశురాముడు వారితో ఇలా అన్నాడు. "పితృదేవతలారా! నేనుచేసేది మహా యజ్ఞము. ఆ యజ్ఞములో ఈ క్షత్రియులు అందరూ బలిపశువులు. యజ్ఞంలో బలి ఇవ్వడం వేద ధర్మము. నేను వేద ధర్మాన్ని పాటిస్తున్నాను.మీరు నాకు అడ్డురాకండి." అన్నాడు పరశురాముడు.

కాని పితృదేవతలు మరలా పరశురామునితో ఇలా అన్నారు.

"ఓ పరశురామా! యజ్ఞములలో కల్లా తపో యజ్ఞమే శ్రేష్ఠమైనది. నీవు కూడా ఆ తపోయజ్ఞము చెయ్యి. శాంతం వహించు. భగవంతుడు నిన్ను కరుణిస్తాడు. అసలు మనము జయించ వలసినది బాహ్య శత్రువులను కాదు. అంతఃశత్రువులను. అవి ఆయుధములతో వధింప బడవు. కేవలం తపస్సు చేతనే వాటిని జయింపగలము. కాబట్టి నువ్వు కూడా తపస్సు చేసి అంతఃశత్రువులను జయించి ఆత్మ సుఖం అనుభవించు." అని అన్నారు. పితృ దేవతలు చెప్పిన ప్రకారము పరశురాముడు హింస వదిలి తపో మార్గము అవలంబించాడు.

ఓ వనితా! మానవునికి తొమ్మిది గుణాలు ఉంటాయి. వాటిలో స్తంభము, అభిమానము, హర్షము అవి సత్త్వ గుణ ప్రధానములు. క్రోధము, సంరంభము, శోకము రజోగుణ ప్రధానములు. మోహము, నిద్ర, స్వప్నము ఇవి తమోగుణ ప్రధానములు. వీటిని జయించ డానికి తగు అస్త్రములు మనమే ప్రయోగించాలి. దానికన్నా ముందు ఇంద్రియములను జయించాలి. తరువాత మోక్షమార్గములో పయనించాలి.

మోక్ష మార్గములో వచ్చే ముఖ్యమైన శత్రువు గురించి తెలుసుకోడానికి నీకు అంబరీష గీత చెబుతాను విను.

పూర్వము అంబరీషుడు అనే రాజు ఉండేవాడు. అతను రాజ నీతిలో చాలా గొప్పవాడు. శత్రువుల నందరినీ జయించాడు. ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలిస్తున్నాడు. ఒకరోజు తన ఆస్థానములో ఉన్న పండితులను చూచి ఇలా అన్నాడు.

"ఓ పండితులారా! నేను శత్రువులను అందరినీ జయించాను. కాని అది కూడా ఒక జయము అని నాకు అనిపించడం లేదు. ఎందుకంటే నన్ను ఇంకా అరిషడ్వర్గములు, రోగములు, మృత్యువు మొదలగు అంతః శత్రువులు బాధిస్తున్నాయి. వాటిని గెలవ కుండా నాకు సంపూర్ణ విజయం ఎలా దక్కుతుంది." అని అన్నాడు. అప్పటి నుండి ఆ మహారాజు అరిషడ్వర్గములను జయించి శాంతితో రాజ్యపాలన సాగించాడు.

ఓ తరుణీ! కాబట్టి అంతఃశత్రువులను జయించడం ముఖ్యం. ~~ఈ~~ సందర్భంలో నీకు జనక మహారాజుకు ఒక బ్రాహ్మణునకు జరిగిన సంవాదమును వినిపిస్తాను.

ఒక సారి ఒక బ్రాహ్మణుడు జనక మహారాజు రాజ్యములో ఒక అనుచితమైన పని చేసాడు. దాని ఫలితంగా ఆ రాజు ఆ బ్రాహ్మణుని రాజ్యము నుండి వెడలగొట్టాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు జనకమహారాజుతో ఇలా అన్నాడు.

"రాజా నన్ను నీ రాజ్యము నుండి వెళ్లి పొమ్మన్నావు. కాని నీ రాజ్యము

ఎంతవరకు విస్తరించి ఉందో చెప్పు. నేను దాని అవతలకు వెళతాను." అని అన్నాడు.

ఆ ప్రశ్నకు సమాధానము చెప్పలేక పోయాడు జనకుడు. మౌనంగా ఉన్నాడు. తరువాత ఆ బ్రాహ్మణునితో ఇలా అన్నాడు.

"అయ్యా! ఈ రాజ్యము నాది కాదు. మా తాత ముత్తాతల నుండి నాకు సంక్రమించింది. ఈ రాజ్యము నాది అని నేను ఎలా చెప్పగలను. ఏదో ఆవేశంలో నా రాజ్యమునుండి వెళ్లిపొమ్మన్నాను. కాని నా రాజ్యమేదో నాకు తెలియనపుడు నేను నిన్ను ఎలా వెళ్లమని చెప్పను." అని అన్నాడు జనకుడు.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు జనకునితో ఇలా అన్నాడు. "అదేమిటి మహారాజా! ఇది నీ రాజ్యము. ఈ నగరము నీది. నువ్వు ఆ రాజ్యమునకు మహారాజువు. కాని నీవు, ఏదీ నాది కాదు, అనుకుంటూ ఎలారాజ్యము చెయగలుగుతున్నావు. ఆ రహస్యం నాకు తెలియ చెయ్యండి." అని అడిగాడు.

అప్పుడు జనక మహారాజు ఇలా అన్నాడు. "ఓ విప్రోత్తమా! ఈ రాజ్యము, రాజ్యాధికారము, నేను పుట్టక ముందు నుండి ఉన్నాయి.నేను పోయిన తరువాత కూడా ఉంటాయి. కాబట్టి వీటిని నావి అని ఎలా చెప్పుకోను. కాబట్టి నేను కేవలం ఈ రాజ్యాన్ని అనుభవిస్తున్నాను. ఇవి నావి కావు అనే భావన తోనే నేను రాజ్యపాలన చేస్తున్నాను." అని అన్నాడు జనకమహారాజు.

ఆప్పుడు బ్రాహ్మణుడు నవ్వుతూ ఇలా అన్నాడు. "ఓ జనకమహారాజా! నేను యమ ధర్మరాజును. నిన్ను పరీక్షించడానికి అలా ప్రవర్తించాను. నీవు జ్ఞానివి. నిష్కామ కర్మయోగివి. నీ మనస్సు ఎల్లప్పుడూ శాంతితో వర్ధిల్లుగాక అని

ఆశీర్వదించి వెళ్లిపోయాడు యమ ధర్మరాజు." అని ఆ బ్రాహ్మణుడు తన భార్యతో  ఇంకా ఇలా అన్నాడు.

" ఓ లలనామణీ! నేను సంసార బంధనములను విడిచి వైరాగ్యముతో ఇల్లు విడిచి ఏకాంత స్థలమునకు వెళ్లవలెనని సంకల్పించగా నువ్వు నా మనసు తెలుసుకొని నన్ను వైరాగ్య మార్గము నుండి మార్చవలెనని  నా వద్దకు వచ్చి అధ్యాత్మబోధ చెయ్యమని అడిగావు. నాకు నీ  మనసు తెలిసి కూడా ఏమీ తెలియని వాని వలె నీకు అధ్యాత్మ బోధ చేసాను. నేను ఇంక  ఎంతమాత్రం ఈ సంసారం లో ఉండలేను. నేను ఇప్పుడు నిజమైన బ్రాహ్మణుడను. బ్రహ్మ చర్యము అవలంబిస్తాను.  నేను జీవన్ముక్తుడ నయ్యాను.

కాని నువ్వు మాత్రము నన్ను  ఒక సామాన్యమానవుడిగా చూస్తున్నావు. నేను ఎంతో సాధన చేసాను. యోగి గా మారాను. నేను ఈ ఇంటికి పరిమితం కాలేను.  ఈ ప్రపంచమే నాది. నేను అంతటా నిండి ఉన్నాను. నాకు స్వర్గాధిపత్యము ఇచ్చినా అక్కరలేదు. నాకు ఇలాంటి తలపు బుద్ధి కలగడమే నాకు అన్ని సంపదలతో సమానము. అన్ని కొయ్యలలోనూ అగ్ని ఉన్నట్టు ఈ చరాచర జగత్తులో భగవంతుడు నిండి ఉన్నాడు. నదులన్నీ సముద్రంలో కలిసినట్టు అందరూ తుదకు ఆ భగవంతుని చేరుకుంటారు. కానీ ఈ శరీరంతో ఆ భగవంతుని చేరుకోలేము.

ఈ శరీరం తో చేసే కర్మలకు మొదలు, ఆఖరు ఉంటాయి. ఆ కర్మలే ఈ శరీరాన్ని బంధిస్తాయి. నేను ఈ కర్మ బంధనములను తెంచుకున్నాను. ఇప్పుడు నాకు మృత్యు భయం లేదు. నన్ను అడ్డుపెట్టే ఆలోచన మాని నువ్వు కూడా నా మార్గంలో ప్రయాణం చేసి మోక్షము పొందు." అని అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

ఆ మాటలు విన్న ఆ బ్రాహ్మణుని భార్య ఇలా అంది. "నాధా! నీవు చెప్పిన మాటలు సామాన్యులకు అర్థం కావు. ఒకవేళ అర్థం అయినా కలకాలం గుర్తు ఉండవు. అటువంటి జ్ఞానమును మీరు నాకు ఉపదేశించారు. నేను కృతార్ధురాలనయ్యాను." అని అంది ఆ ఇల్లాలు.

" ఓ భార్యామణీ! నువ్వు అన్నది నిజమే. బ్రాహ్మణుడు అరణి అయితే గురువు ఉత్తర అరణి.

(అరణి, ఉత్తర అరణి రెండూ కొయ్యలే. ఒకదానితో ఒకటి రాపాడిస్తే అగ్ని పుడుతుంది. దానితో హోమం వెలిగిస్తారు. అది పవిత్రమైన అగ్ని).

రెండూ కలిస్తేనే జ్ఞానాగ్ని పుడుతుంది." అని అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

"నాధా! అటువంటి బ్రాహ్మణుని ఎలా తెలుసుకోవడం." అని అడిగింది ఆ బ్రాహ్మణ వనిత.

" ఓ భార్యామణీ! అటువంటి బ్రాహ్మణోత్తముని తెలుసుకోడానికి ఎటువంటి సాధనము లేదు. అతడి లక్షణములు ఇంద్రియములకు గోచరించవు. అతడు గుణములకు అతీతుడు. అతనికి అహంకారము అంటే ఏమిటో తెలియదు. అతడు శుద్ధసత్త్వగుణ స్వభావుడు." అని చెప్పాడు ఆ బ్రాహ్మణుడు.

భర్తవలన బోధనలు పొందిన ఆ భార్య తాను కూడా భర్త అడుగు జాడలలో నడిచి ముక్తి పొందింది." అని శ్రీ కృష్ణుడు అర్జునుని తో చెప్పాడు.

"ఓ శ్రీ కృష్ణా! ఆ భార్యాభర్తలు అయిన బ్రాహ్మణులు అంత గొప్పవారా. వారి గురించి ఇంకను వినవలెనని ఉన్నది. వివరించండి." అని అడిగాడు అర్జునుడు.

అప్పుడు శ్రీకృష్ణుడు నవ్వి ఈ విధంగా చెప్పసాగాడు.

"ఓ అర్జునా! నా మనసే ఆ బ్రాహ్మణుడు. నా బుద్ధి ఆ బ్రాహ్మణుని భార్య. ఇంద్రియములకు అతీత మైన ఆ పరమాత్మను నేను." అని చెప్పాడు శ్రీ కృష్ణుడు.

అది విన్న అర్జునుడు శ్రీ కృష్ణునితో ఇలా అన్నాడు. "ఓ కృష్ణా! నీ అనుగ్రహము చేత నా మనస్సు చాలా వివేకవంతము, సూక్ష్మగ్రాహి అయింది. కాబట్టి నాకు బ్రహ్మము గురించి తెలియచెయ్యండి." అని అడిగాడు.

" ఓ అర్జునా! నీ ప్రశ్నకు సమాధానము గా నీకు ఒక గురు శిష్యసంవాదమును వినిపించెదను. నీవు అడిగిన ప్రశ్నను యథాతథంగా ఒకశిష్యుడు తన గురువుగారిని అడిగాడు. అప్పుడు ఆ గురువుగారు బృహస్పతి, భరద్వాజుడు, భార్గవుడు, గౌతముడు, కశ్యపుడు, వసిష్ఠుడు, అత్రి, విశ్వామిత్రుడు, మొదలగు మహా మునులను తోడు తీసుకొని బ్రహ్మ దేవుని వద్దకు వెళ్లాడు. ఆయనకు నమస్కరించి ఇలా అడిగాడు.

" ఓ దేవా! హితము అనగా నేమి? ఆ హితము పొందుటకు సులభ మైన మార్గము ఏది?" అని అడిగాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు వారిందరికీ ఈ విధంగా బోధించాడు.

ఈ చరాచర జగత్తు సత్త్వగుణములోనే జన్మిస్తాయి. (పుట్టగానే ప్రతివాడూ సాత్వికుడే, మంచివాడే.). కొంత కాలము ఆ సత్త్వగుణముతోనే సంచరిస్తాడు. తరువాత ఒకటి వెంబడి ఒకటి రజస్తమోగుణములు జీవుడిని ఆశ్రయిస్తాయి.

ముందు సత్త్వగుణము దాని విశిష్టత గురించి చెబుతాను. వేదములు, తపస్సు, ప్రజాపతి ఇవి సత్త్వగుణమునకు పేర్లు. సత్త్వగుణము అత్యంత మహిమ గల తత్త్వము. కాబట్టి యోగులు అందరూ కామము, క్రోధమును పూర్తిగా విడిచి పెట్టి సత్త్వగుణమును ఆశ్రయిస్తారు.

ఆ సత్త్వగుణమును అనుసరించుటకు తగిన మార్గము చెబుతాను వినండి. ధర్మమునకు నాలుగు ఆశ్రమములు(అనగా బ్రహ్మచర్య,గృహస్థ, వానప్రస్థ,సన్యాస ఆశ్రమములు) నాలుగు కాళ్లు. ఈ ధర్మము అన్ని వర్ణముల వారిచేత అనుష్ఠింప బడుతుంది. ఇదియే ఉత్తమ ధర్మము. ఈ ధర్మమును అనుసరించడం ద్వారా మోక్షమును పొందవచ్చును.

పైన చెప్పిన నాలుగు ఆశ్రమములలో కూడా ఆత్మ సాక్షాత్కారము పొందని వారు మోక్షపదమును పొందలేరు. ఇది అన్నివర్ణముల వారికి సమానము. మరుత్తులు, ఆదిత్యులు, దేవతలు ఎవరికైనా సరే మోక్షమునకు ఆధ్యాత్మ దర్శనమే సులభమైనమార్గము. అధ్యాత్మ దర్శనము అంటే 24 తత్త్వముల గురించి తెలుసుకోవడమే. వాటి గురించి వివరిస్తాను.

భూమి మొదలగు పంచభూతములు 5. వాటి తన్మాత్రలు అనగా గంధము, రసము మొదలగునవి 5. ఇంద్రియములు 10. మనస్సు, బుద్ధి, అహంకారము 3. ప్రకృతి-1. ఇవన్నీ 24 తత్త్వములు. ఎప్పుడైతే మానవుడు

జనన మరణాల రహస్యమును తెలుసుకొని, అజ్ఞానమును వదిలి పెట్టి, ఈ 24 తత్త్వముల నిజస్వరూపమును తెలుసుకుంటాడో, అతనికి ఈ సంసార బంధములు విడిపోతాయి. మోక్షమార్గము వైపు పయనిస్తాడు.

మానవ దేహమునకు తొమ్మిది రంధ్రాలు ఉన్నాయి. మనస్సు ఈ తొమ్మిది రంధ్రాల గుండా, సత్త్వ,రజస్తమోగుణాల ప్రభావంతో, బాహ్య ప్రపంచంతో సంబంధాలు పెట్టుకుంటుంది. అందుకే ఈ దేహము వ్యక్తము. కాని అందులో అంతర్లీనంగా ఉండే పరమాత్మ అవ్యక్తము. కాబట్టి వ్యక్తమైన దేహము మీది భ్రాంతి వదిలిపెట్టి అవ్యక్తమైన పరమాత్మను దర్శించడానికి ప్రయత్నించాలి.కాని అది చాలా కష్టము. అసాధ్యము. ఇంద్రియములను, మనస్సును, సత్త్వరజస్తమోగుణములను జయించిన వాడే మోక్ష మార్గము వంక పయనించగలడు.

పైన చెప్పిన సత్త్వరజస్తమోగుణములు, ఒకదానితో ఒకటి కలిసి పనిచేస్తాయి. ఒకదానికి మరొకటి ఆసరాగా ఉంటుంది. ఒకదాని వెంట మరొకటి వస్తుంది. ఒకదానితో మరొకటి సహకరించుకుంటుంది. కాబట్టి ఈ సత్త్వ,రజస్తమోగుణములను గుర్తించడం, వాటిని నివారించడం అసాధ్యము. ఒకదానిని నిరోధిస్తే మరొకటి విజృంభిస్తుంది. తమోగుణమును అణిచి వేస్తే రజోగుణము వృద్ధిచెందుతుంది. సత్త్వగుణమును ఆశ్రయిస్తే తమోగుణము వృద్ధి చెందుతుంది.

లోభము, శోకము, భ్రాంతి, నిద్ర, భయము, వికారము, దురభిమానము, మంకుతనము, పాపకార్యములయందు ఆసక్తి, అధిక కోపము, ఇతరులను మోసం చెయ్యడం, ఇతరుల పట్ల అసూయ, ద్వేషము ఇవన్నీ తమోగుణ లక్షణములు. ఈ జన్మలో పాములుగా, తేళ్లుగా, పశువులుగా,

పందులుగా, కుక్కలుగా, చేపలుగా, కోళ్లుగా, చీమలుగా, కాకులుగా, క్రిములుగా, జింకలుగా,నక్కలుగా, గుంటనక్కలుగా, దోమలుగా, చెట్లుగా జీవనం గడుపుతున్నవారు క్రిందటి జన్మలో తమోగుణమును ఆశ్రయించిన వారే! ఈ విషయాన్ని ఎవరు గుర్తిస్తారో వారు ఈ తమోగుణము నుండి దూరంగా ఉంటారు. తామస వికారాలతో అధోగతి పాలు గాకుండా బయటపడతారు.

ఇంక రజోగుణము గురించి చెబుతాను విను. బలము, శౌర్యము, మదము, ప్రాభవము, సుఖము, దుఃఖము, స్నేహం చేయడం, మిక్కుటమైన కోరికలు, కాంక్షలు, ఏదీ నచ్చకపోవడం, ప్రతాపము, ఇతరులతో పోట్లాడటం, ఈర్ష్య, పరుషంగా మాట్లాడటం, తిట్టడం, స్త్రీల ఎడల కామప్రవృత్తి, దాని గురించి అబద్ధాలు ఆడటం, తన గురించి తాను గొప్పలు చెప్పుకోవడం, పొగడ్తలు అంటే ఇష్టపడటం, ఇవన్నీ రజోగుణములు. ఇది వరకు జన్మలో రజోగుణము ప్రధానముగా కలిగినవారు ఈ జన్మలో నీతి అవినీతి వీటి మధ్య తేడా గ్రహించి, ధన సంపదలు కలిగి, వాటితో తమ కోరికలు తీర్చుకుంటూ, సుఖజీవనము చేస్తుంటారు. కేవలం ప్రాపంచిక సుఖములయందు ఆసక్తి కలిగి ఉంటారు. ఇవి రజోగుణము వలన వచ్చినవి అనే వివేకము కలిగిన వారు, ఈ రజోగుణముల నుండి బయటపడి, సత్త్వగుణము వంక పయనిస్తారు.

ఇంక సత్త్వగుణము గురించి చెబుతాను విను. సంతోషము, ప్రకాశము, ప్రియంగా ఉండటం, ఆనందము, కరుణ, క్షమాగుణము, సత్యము, శౌచము, ధైర్యము, లోభత్వము(అంటే అంతా నాకే కావాలి అనే గుణం, పరులకు పిసరంత కూడా పెట్టకపోవడం) లేకుండా ఉండటం, ఓర్పుతో ఉండటం, అహింస, మంచి ప్రవర్తన, ఇతరుల ఎడల అసూయ లేకుండా ఉండటం, ఇతరుల పట్ల కోపంతో ప్రవర్తించకుండా ఉండటం, ప్రతి

దానికీ హడావిడి చెయ్యకపోవడం, అందరి ఎడల సమభావం కలిగి ఉండటం, ఇతరుల ఎడల దయాదాక్షిణ్యాలు కలిగి ఉండటం, ప్రతి పనీ శ్రద్ధతో చెయ్యడం, క్రూరభావనలు వదిలిపెట్టడం, ఇతరులను గౌరవించడం. ఇవి అన్నీ సత్త్వగుణములు. పూర్వజన్మలో సత్త్వగుణమును ప్రధానముగా కలిగినవారు ఈ జన్మలో అహంకారము, అధికమైన మమకారము, ధనము మీద అధికమైన ఆశలేకుండా, కామార్తులు కాకుండా, ఎల్లప్పుడూ భగవత్ చింతనలో ఉంటారు.

ఈ గుణముల గురించి బాగా తెలుసుకున్న వాడు ఆయాగుణముల బంధములలో చిక్కుకొనడు. ఈ గుణములు మూడు వేరు వేరుగా ఉండవు. ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. ఈ మూడు గుణములు కలిసి ఈ సంసారమును నడిపిస్తున్నాయి. ఈ మూడు గుణములలో ఒకటి ఎక్కువగా ఉంటే మరొకటి దాని వెంట ఉంటుంది. మూడవది లోపిస్తుంది. తమస్సు అధోముఖంగా ప్రవహిస్తుంది. రజస్సు మధ్యస్తంగా ఉంటుంది. సత్త్వగుణము ఊర్ధ్వముఖంగా ప్రవహిస్తుంది.

ఈమూడుగుణముల ప్రభావంనుండి బయట పడటం అసాధ్యము. మోక్షము పొందాలంటే ఈ మూడు గుణములను విడిచిపెట్టాలి. వీటి ప్రభావము నుండి బయట పడాలి. వీటి ప్రభావము నుండి బయట పడాలంటే ముందు మనకు దురాశ పోవాలి. అలా కాకుండా ఈ మూడు గుణముల ప్రభావములకు లోనై ఉంటే సాత్త్వికులు స్వర్గలోకము పొందుతారు. రజోగుణ ప్రధానులు భూలోకములో పుడతారు. తమోగుణ ప్రధానులు జంతువులుగా, జన్మిస్తారు. నరకబాధలు అనుభవిస్తారు.

(చిన్న ఉదాహరణ. పల్లెటూళ్లలో ఉన్నవారికి తెలుస్తుంది. బండి మీద విపరీతమైన బరువులువేస్తారు. ఆ బండికి రెండు ఎద్దులు కడతారు. వాటి

మెడమీద కాడి పెడతారు. ఆ ఎద్దులు  ఆ బరువు లాగలేకపోతే హంటర్‌తో కొడతాడు. అప్పుడు ఆ ఎద్దులు కన్నీరు కారుస్తుంటాయి.  అంబా అని అరుస్తుంటాయి. కాని ఆ బండివాడుపట్టించుకోడు. అలా కొడుతూనే ఉంటాడు. దీని కన్నా నరకం వేరు ఉంటుందా! అలాగే పులి పొరపాటున జనారణ్యంలోకి వస్తుంది. అందరూ దానిని తరుముతారు. అది ప్రాణ భయంతో పరుగెత్తుతుంది. దానిని తుపాకీతో చంపుతారు. అలాగే పాములను వెదికి వెదికి చంపుతారు. దాని చర్మం బతికి ఉండగానే  వలుస్తారు. ఇవి నరకబాధలు కావా! ఆలోచించండి. కాబట్టి మానవులు  ఈ జన్మలో నన్నా తమోగుణము వదిలిపెడితే, తమోగుణ ప్రభావమునకు లోనుకాకుండా ఉంటే, మరుజన్మలో  ఇలాంటి పశు జన్మరాకుండా, నరకబాధలు అనుభవించ కుండా, జాగ్రత్త పడవచ్చు.).

మానవులు తమ దైనందిన జీవితంలో ధర్మము, అర్థము, కామము తో కూడిన కర్మలను చేస్తూ ఉంటారు. ఈ కర్మలు సత్త్వ, రజస్తమోగుణములతో ప్రభావితమౌతుంటాయి. కాబట్టిమానవులు ఏ గుణములతోనూ ప్రభావితం కారాదు. నిర్గుణులుగా ఉండాలి.

మన శరీరంలో ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన వాయువులు ఉన్నాయి. వాటిలో ప్రాణము సత్త్వగుణము. అపానము రజోగుణము. ఉదానము తమోగుణము. ఈ మూడు గుణములలో సాత్వికము ఉత్తమమైన గుణము.  కానీ ఈ మూడు గుణములు ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా సమానంగా ఉంటే, అదే అవ్యక్తము. మహతత్త్వము. అదే శాశ్వతమైన బ్రహ్మపదము. ఈ అవ్యక్తము సత్తు, అసత్తులకు అతీతమైనది. ఈ అవ్యక్తమును గురించి తెలుసుకొన్నవాడు విజ్ఞానవంతుడవుతాడు. అతడే మోక్షమును పొందగలుగుతాడు."  అని బ్రహ్మదేవుడు ఆ ఋషులతో

చెప్పాడు.

వారితో బ్రహ్మదేవుడు ఇంకా ఇలాఅన్నాడు. " ఓ మహాఋషులారా! అవ్యక్తము నుండి మహతత్త్వము పుడుతుంది. ఆ మహతత్త్వమునే బుద్ధి, ధృతి అని కూడా అంటారు. ఈ బుద్ధి తోనే బయట ప్రపంచంలో జరిగే వాటిని మానవుడు చూస్తాడు, వింటాడు, గ్రహిస్తాడు. కాబట్టి బుద్ధికి ఈ సృష్టిలో ఉన్నత స్థానము ఉంది. ఆ బుద్ధి నుండి అహంకారము పుడుతుంది.

(నాకు అంతా తెలుసు. అంతా నేనే. నన్ను మించిన వాడు ఎవరూ లేరు! అనే బుద్ధిని అహంకారము అంటారు.)

ఈ లోకంలో ఇన్ని పనులు జరగడానికి కారణం ఈ అహంకారమే. మొదటిమూడు వర్ణముల వారు అనగా బ్రాహ్మణ, క్షత్రియ,వైశ్యులు వేదాధ్యయనము, వ్రతములు, తపస్సులు, యజ్ఞములు చేయడం అన్నీ ఈ అహంకార తత్త్వము వలననే జరుగుతున్నాయి. ఈ అహంకారము యొక్క మహిమ వలననే లోకంలో అన్ని పనులు జరుగుతున్నాయి.

ఈ అహంకార తత్త్వము నుండి పంచభూతములు అనగా భూమి, అగ్ని, ఆకాశము, వాయువు,నీరు ఉద్భవించాయి. వాటికి వాసన, రూపము, రుచి, స్పర్శ,శబ్దము మొదలగు తన్మాత్రలు ఆవిర్భవించాయి. ఈ తన్మాత్రలను పొందడానికి మానవులు విషయ సుఖములలో తేలియాడుతుంటారు. విషయ సుఖముల మోహములో మునిగి తేలుతుంటారు. సకల జీవరాసులు అన్నీ ఆ మోహాంధకారంలో మునిగిపోతాయి. ఎప్పటికీ బయటకు రాలేవు. కాని జ్ఞానులు మాత్రం నిష్కామ కర్మలు ఆచరిస్తూ, విషయసుఖముల మోహములో పడకుండా బయట పడతారు.

ఈ ప్రాపంచిక సుఖములు అశాశ్వతములు. నిలిచేవి కావు. సుఖం వెంట దుఃఖము, దుఃఖము వెంట సుఖమూ వస్తూ పోతూ ఉంటాయి. ఈ విషయ సుఖములే అన్ని వికారములకు కారణములు. విషయ సుఖముల మీది మోహము లోభాన్ని కలగచేస్తుంది. ఆ లోభానికి ప్రభావితుడైన మనిషి బుద్ధిని కోల్పోతాడు. దురాలోచనలు చేసి పాపాలు చేస్తాడు.

మానవ శరీరములు మాంసము, రక్తము, ఎముకలతో చేయబడినవి. కాలము తీరగానే ఈ శరీరము నశించి పోతుంది. కాని మానవులు ఈ శరీరము శాశ్వతమని నమ్మి అనేక పాపాలు చేస్తుంటారు. తుదకు నశిస్తారు.

మానవులలో ఉండే పంచప్రాణములు, వాక్కు, మనస్సు, బుద్ధి వీటిని అంతరాత్మ అంటారు. ఈ ఎనిమిది తత్త్వములు లోకములో ఉపాదాన కారణములు. లోకములో జరిగే అన్ని పనులకు ఈ ఎనిమిదీ కారణములు. కుండ చెయ్యడానికి మట్టి ఎలా అవసరమో, ఈ ప్రపంచంలో అన్ని పనులు చెయ్యడానికి ఈ ఎనిమిది కారణము.

ఈ విషయములను తెలుసుకోడానికి పెద్దలు చేసే జ్ఞానబోధ అవసరము. అహంకారము నుండి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, కలిసి పదకొండు ఏర్పడతాయి. వీటి వలన ప్రభావితం కాకుండా బుద్ధి స్వతంత్రంగా ప్రవర్తిస్తూ ఉంటుంది. ఆ బుద్ధిని సక్రమం వాడుకోగలిగితే వాడు ఆత్మజ్ఞానమును పొందగలడు.

ఓ ఋషులారా! ఇప్పటి దాకా ప్రాణుల గురించి చెప్పాను. ఇప్పుడు అధ్యాత్మ తత్త్వము గురించి చెబుతాను.

పంచభూతములు ఐదు. అవి భూమి, నీరు, వాయువు, అగ్ని, ఆకాశము.

ఈ ప్రకృతిలో మూడు తత్త్వములు ఉన్నాయి. అవి అధ్యాత్మము, అధిభూతము, అధిదైవతము.

చెవి అధ్యాత్మము అయితే శబ్ధము అధిభూతము, ఆ శబ్దము వచ్చు దిక్కు అధిదైవతము.

చర్మము అధ్యాత్మము అయితే, స్పర్శ అధిభూతము, ఆ స్పర్శలో నుండి పుట్టే విద్యుత్తు అధిదైవతము;

కన్ను అధ్యాత్మము అయితే రూపము అధిభూతము, సూర్యుడు అధిదైవతము.

నాలుక అధ్యాత్మము అయితే రుచి అధిభూతము, చంద్రుడు అధిదైవతము;

ముక్కు అధ్యాత్మము అయితే వాసన అధిభూతము, వాయువు అధిదైవతము.

ఇది జ్ఞానేంద్రియములకు సంబంధించిన జ్ఞానము. ఇంక కర్మేంద్రియ జ్ఞానము గురించి చెబుతాను వినండి.

వాక్కు అధ్యాత్మము అయితే మాట్లాడటం అధిభూతము, అగ్ని అధిదైవతము.

చేతులు అధ్యాత్మము అయితే పనిచేయడం అదిభూతము, వానికి దేవేంద్రుడు అధిదైవతము.

పాదములు అధ్యాత్మము అయితే నడవడం అధిభూతము, బభ్రువు అధిదైవతము.

విసర్జకావయవము అధ్యాత్మము అయితే విసర్జించడం అధిభూతము, మిత్రుడు అధిదైవతము.

జననేంద్రియము అధ్యాత్మము అయితే శుక్రము అధిభూతము, ప్రజాపతి  అధిదైవతము.

మనస్సు అధ్యాత్మము అయితే ఆలోచించడం అధిభూతము, దానికి చంద్రుడు అధిదైవతము.

బుద్ధి అధ్యాత్మము అయితే విషయ పరిజ్ఞానము అధిభూతము, దానికి బ్రహ్మ అధి దైవతము.

ఈ విషయ పరిజ్ఞానము కలిగితే మానవుడు వీటి మోహములో పడకుండా, మోక్షప్రాప్తి పొందుతాడు.

ఓ ఋషులారా! మీకు ఇప్పుడు నివృత్తి మార్గమును బోధిస్తాను శ్రద్ధగా వినండి.

తాబేలు తన అంగములను డిప్పలోనికి ఎలా ముడుచుకుంటుందో, అలాగా విద్వాంసుడు  బయట ప్రపంచములో ఉన్న కోరికల నుండి తన అంగములను మనస్సును లోపలకు లాక్కుని, మనస్సును ఆత్మ వంక మరలిస్తాడు.  అడ్డు ఆపూ లేకుండా విజృంభించే కోరికలను ఎవడు అదుపుచేయగలడో అతడే ధీరుడు.  అతడు సత్వ,రజస్తమోగుణములను విడనాడి మోక్షమార్గములో పయనిస్తాడు.

ఇంద్రియ నిగ్రహము చాలా కష్టమైన పని. ఈ ఇంద్రియాలకు అతీతంగా ఆత్మ వెలుగుతూ ఉంటుంది. ఆ ఆత్మను దర్శించ గలిగిన వాడే మోక్షమునకు అర్హుడు.

ఈ శరీరం పంచభూతములతో నిర్మించబడింది. ఈ శరీరంతో సంసార సాగరాన్ని దాటడం చాలా కష్టం. ఎందుకంటే ఈ సంసారంలో రోగాలు, దుఃఖాలు, ఇంద్రియ సుఖాలు, నిరంతరం వస్తూ పోతూ ఉంటాయి. ఈ సంసారమునకు  కామము, క్రోధము అధిపతులు.

(ముందు కోరిక కలుగుతుంది. ఆ కోరిక తీర్చుకోడానికి నానాపాట్లు పడతాడు. ఆ కోరిక తీరక పోతే కోపం వస్తుంది.).

కాబట్టి ముందు మానవుడు కోరికలను, కోపమును జయించాలి. అప్పుడే ఈ సంసారము అనే సముద్రాన్ని దాటగలడు. ఒక దీపము ఉండి అనేక దీపములు వెలిగినట్టు, ఒకే పరమాత్మ అనేక ఆత్మలుడా వెలుగుతున్నాడు.

విజ్ఞులు ఈ విషయాన్ని తెలుసుకొని అన్నిభూతములలో పరమాత్మను దర్శిస్తారు. పామరులు మాత్రము మనుషుల మధ్య బేధాలు కల్పించుకొని నానా కష్టాలు పడుతుంటారు.

ఈ పరమాత్మను వరుణుడు, అనిలుడు, అగ్ని,సోముడు, విష్ణువు, అజుడు, శివుడు అనేపేర్లు ఉన్నాయి." అని చెప్పి బ్రహ్మదేవుడు ఆ ఋషులతో ఇంకా ఇలా అన్నాడు.

"ధర్మము లక్షణము అహింసా వ్రతము. అధర్మ లక్షణము హింస. దేవతల లక్షణము ప్రకాశము. మనుష్యుల లక్షణము కర్మలు చేయడం. ఆకాశం లక్షణం శబ్దం చేయడం. ( ఉరుములు, పిడుగులు) వాయువు లక్షణం అందరినీ స్ప ృశించడం. జ్యోతి లక్షణం ఒక రూపంతో వెలగడం. నీటి యొక్క లక్షణం రుచి. భూమిలక్షణం వాసన. ( ఎండవేడిమికి వేడెక్కిన భూమి మీద వానపడితే మనకు ఒక విధమైన కమ్మని వాసన వస్తుంది. గమనించండి). చదువుకున్నదానికి లక్షణం సత్యము పలకడం, మనస్సు యొక్క లక్షణం ఏదో ఒకటి ఆలోచించడం, చింతించడం, బుద్ధి యొక్క లక్షణం మంచి పనులు చేయడం, మహత్తు యొక్క లక్షణం ధ్యానం చెయ్యడం, అవ్యక్తము యొక్క లక్షణం సాధువుగా ఉండటం, యోగము యొక్క లక్షణం ప్రవృత్తి, జ్ఞాని యొక్క లక్షణం కర్మబంధములు వదిలిపెట్టడం.

జ్ఞానంతో కూడిన సన్యాసము మోక్షమును కలిగిస్తుంది. ద్వంద్వములకు అతీతుడైన యోగిని రోగములు, మృత్యువు ఏమీ చేయలేవు. ఈ ప్రకృతి అవ్యక్తము. దీనినే క్షేత్రము అని కూడా అంటారు. ఈ ప్రకృతి సత్త్వరజస్తమో గుణములలో నుండి పుట్టింది. మనలో ఉన్న పురుషుడు అంతరాత్మ. ఆయనకు అన్నీ తెలుసు. కాని ఆయన ఈ గుణములకు అతీతుడు. స్థిరంగా ఉంటాడు.

దేనికీ ప్రభావితం కాడు. జీవాత్మ ప్రకృతి నుండి విడివడి పరమాత్మ వంక పయనించిన నాడు ముక్తి పొందుతాడు.

జ్యోతిస్సులలో సూర్యుడు, పంచభూతములలో అగ్ని, విద్యలలో సావిత్రీ దేవి, దేవతలలో ప్రజాపతి, వేదములలో ఓంకారము, పంచ వాయువు లలో ప్రాణము, ఛందస్సులలో గాయత్రీ ఛందస్సు, పశువులలో మేక, నాలుగుకాళ్ల జంతువులలో వృషభము ( ఎద్దు), మానవులలో బ్రాహ్మణుడు, పక్షులలో డేగ, యజ్ఞవిధానములలో హవిస్సు, నాలుగు యుగములలో కృతయుగము, ధాతువులలో బంగారము ప్రశిద్ధములైనవి.

ఇంకా ఓషధులలో యవలు, భక్ష్యములు భోజ్యములలో (పిండి వంటలు, తినదగినవి వీటిలో) అన్నము, తాగే వాటిలో నీరు, పర్వతములలో మేరు పర్వతము, చెట్లలో ప్లక్షము (జువ్విచెట్టు), దిక్కులలో ఊర్ధ్వము (అనగా పై దిక్కు, అనగా ఆకాశము), నదులలో గంగానది, సరస్సులలో (అనగా నీరు ఉండే ప్రదేశములలో) సముద్రము, నాలుగు ఆశ్రమములలో గృహస్థా శ్రమము, ప్రజాపతులందరిలో నేను, తత్త్వములలో కెల్లా విష్ణు తత్త్వము, దేవతలలో కెల్లా ఈశ్వరుడు, శ్రేష్టమైనవి.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు అనీ వేరు వేరు గా పిలిచినా, ముగ్గురిలో ఉన్న పరమాత్మ తత్త్వము ఒక్కటే. వేరు వేరుకాదు. ఈ ఏకత్వాన్ని గుర్తించడమే బ్రహ్మజ్ఞానము. రోజులో రాత్రి, పగలు సహజంగా ఎలా వస్తూ పోతూ ఉంటాయో అలాగే సుఖ దుఃఖాలు కూడా వస్తూ పోతూ ఉంటాయి. కాబట్టి సుఖాలు కలిగినప్పుడు పొంగిపోవడం, దుఃఖములు వచ్చినప్పుడు కుంగి పోవడం తగదు. ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి పదార్ధము పెరుగుతుంది, తరుగుతుంది. అది పుట్టిన ప్రతి వస్తువుకు సహజ లక్షణం. పుట్టిన ప్రతి

వస్తువు నశించడం సహజం. వచ్చిన ప్రతి సుఖము దుఃఖించడానికే. ఈ సత్యమును తెలుసుకొన్న విజ్ఞులు రెండింటినీ సమంగా చూస్తారు.

ఓ ఋషులారా! ఇప్పుడు మీకు నేను ఆశ్రమముల గురించి వివరిస్తాను. బ్రహ్మచర్యము మొదటిది. బ్రహ్మచర్య ఆశ్రమములో, బ్రహ్మ చారి ఈ క్రింది విధంగా ఉండాలి. గురువుగారిని భక్తితో సేవిస్తూ వేదాధ్యయనముచెయ్యాలి. ప్రతిరోజూ బిక్షాటన చేసి ఆహారము సేకరించాలి. బిల్వ వృక్షము నుండి సేకరించిన కొయ్యను ఒక దానిని దండముగా ధరించాలి. ఎప్పుడూ శుచిగా శుభ్రంగా ఉండాలి. బ్రహ్మచర్యమును పాటించాలి. ఇంద్రియములను అదుపులో ఉంచుకోవాలి. ఎల్లప్పుడూ యజ్ఞోపవీతమును ధరించాలి. మితంగా మాట్లాడాలి. ఎప్పుడూ మొలనూలు ధరించాలి. కూర్చునేటప్పుడు, పడుకునే టప్పుడు నియమం ప్రకారం ఒద్దికగా ఉండాలి. ఎప్పుడు సత్యమునే పలకాలి. మనస్సు శాంతంగా ఉంచుకోవాలి. ఉదయం సాయంత్రం అగ్ని కార్యము నిర్వర్తించాలి. పాప కార్యములజోలికి పోకుండా ఉండాలి. ఈ విధులను బ్రహ్మచర్య ఆశ్రమములో విధిగా పాటించాలి.

ఇంక గృహస్థాశ్రమ ధర్మముల గురించి చెబుతాను వినండి. గృహస్థు బయట ప్రపంచంలో తిరిగేటప్పుడు ధర్మము, న్యాయము పాటించాలి. ఆ ప్రకారమే నడుచుకోవాలి. స్వంత భార్యను తప్ప పరాయి స్త్రీల వంక కన్నెత్తి చూడకూడదు. నిర్మలమైన జీవితం గడపాలి. పంచ యజ్ఞములు పాటించాలి. అతిధులను ఆదరించాలి. అతిధులకుపెట్టి తాను తినాలి. సాధ్యమైనంత వరకూ తెల్లని బట్టలు ధరించాలి. తన శక్తి కొద్దీ దానధర్మాలు చెయ్యాలి. ఇంద్రియ నిగ్రహముపాటించాలి. ఎల్లప్పుడూ శుచిగా ఉండాలి. ఇతరులతో స్నేహంగా ఉండాలి. వేదాధ్యయనము, యజ్ఞయాగములు చెయ్యాలి. ఎల్లప్పుడు క్షమా గుణం కలిగి ఉండాలి. సత్పురుషులు ఇచ్చే దాన ధర్మములు స్వీకరించాలి.

ఇతరుల ఎడల నిష్పక్షపాతంగావ్యవహరించాలి. పాపకార్యములకు దూరంగా ఉండాలి. ఇవీ గృహస్థాశ్రమములో ఆచరించవలసిన ధర్మములు.

దాని తరువాతది వానప్రస్థాశ్రమము. వానప్రస్థాశ్రమములో ఈ క్రింది ధర్మములు పాటించాలి. జనపదములను విడిచి పెట్టాలి. అరణ్యములలో కుటీరములు నిర్మించుకోవాలి. అందులో నివసించాలి. రెండు పూటలా స్నానము, సంధ్య నిర్వర్తించాలి. బ్రహ్మచర్య వ్రతమును పాటించాలి. అరణ్యములో పండే ధాన్యములు, కాయలు, పండ్లు, ఆకులు, దుంపలు ఆహారంగా స్వీకరించాలి. నారచీరలు, చర్మములు వస్త్రములుగా ధరించాలి. ఎల్లప్పుడూ నేలమీదనే పడుకోవాలి. అతిధులను సత్కరించాలి. వేదాధ్యయనము అగ్ని హోత్రము ప్రతి దినమూచెయ్యాలి. ఇంద్రియములను అదుపులో పెట్టుకోవాలి. ఇవీ వానప్రస్థములో ఆచరించవలసిన విధులు.

పైన చెప్పిన మూడు ఆశ్రమము లలో ఉన్న వారు ముక్తి మార్గం వైపు ప్రయాణం చెయ్యదలచుకుంటే. వారు సూటిగా సన్యాసాశ్రమము స్వీకరించ వచ్చును. ( అనగా, మామూలుగా జీవితంలో మొదట బ్రహ్మ చర్యము, తరువాత గృహస్థాశ్రమము, తరువాత వానప్రస్థము, ఆఖరున సన్యాసము స్వీకరించాలి. కాని మోక్షమును కోరుకొనే వాడు బ్రహ్మచర్యములోనుండి సూటిగా సన్యాసము స్వీకరించవచ్చును. అలాగే గృహస్థ, వానప్రస్థములలో ఉన్న వారుకూడా సన్యాసముస్వీకరించ వచ్చును.).

ఇంక సన్యాసాశ్రమములో ఆచరించవలసిన ధర్మములను గురించి వివరిస్తాను. సన్యాసి అయిన వాడు సాటి ప్రాణుల ఎడల దయ కలిగి ఉండాలి. దేనినీ హింసించకూడదు. జరిగిన దానిని గురించి బాధపడకూడదు. జరగ బోయే వాటి గురించి ఆసక్తికనబరచ కూడదు. జరుగుతున్న దాని గురించే

ఆలోచించాలి. అంటే ఏరోజు కారోజు గడపాలి. తాబేలు తన అంగములను డిప్పలోనికి ఎలా లాక్కుంటుందో ఆ మాదిరి సన్యాసి తన ఇంద్రియములను బయట ప్రపంచములో జరిగే విషయములలో ఆసక్తి కనపరచకుండా తనలోకి లాక్కోవాలి. నిరాసక్తతగా ఉండాలి. కేవలం భిక్షాటన మీదనే జీవించాలి. తన కోసరం రేపటి కోసరం ఏమీ దాచుకోకూడదు. కూడబెట్టుకోకూడదు. రోజుకు ఒక్కసారి మాత్రమే భుజించాలి. ఇతరుల నుండి అన్నము వస్త్రము తప్ప వేరే ఏమీ తీసుకోకూడదు. స్నేహములు కానీ, కోపతాపములు కానీ ప్రశంసలకు కానీ లొంగకూడదు. అసూయ, కోపము ఉండకూడదు. ఇంద్రియములను మనస్సును నిగ్రహించుకోకూడదు. బ్రహ్మచర్యమును పాటించాలి. ఎల్లప్పుడూ సక్రమమైన జీవితం గడపాలి. సత్యము, అహింస పాటించాలి. ఇవీ సన్యాసి ఆచరించవలసిన ధర్మములు.

ఇంక సన్యాసి ఉండవలసిన స్థలములు గురించి చెబుతాను. చెట్ల కింద, నదీతీరములలో, జనము లేని చోట, అడవులలో, కొండగుహలలో, దేవాలయములలో నివసించాలి. కుటిలత్వముతో ఏమీ సంపాదించకూడదు. తన గొప్ప దనము గురించి ప్రచారము చేసుకోకూడదు. తన వద్దకు వచ్చే ప్రజలతో అంటీముట్టనట్టు ఉండాలి. ఇవీ సన్యాసి లక్షణములు.

అసలు సన్యాసము అంటేనే తపస్సు చేసుకోవడం.తపస్సు చేయడం వలన కలిగిన జ్ఞానం తోనే సన్యాసులు పరమాత్మను దర్శిస్తారు. తపస్సు వలననే రజస్సు తమస్సు వదిలి సత్త్వగుణ ప్రధానులుగా ఉంటారు సన్యాసులు. మోక్షమార్గమునకు అది మొదటి మెట్టు. సన్యాసి ద్వంద్వములను వదిలి పెట్టి మోక్షము కోసం ప్రయత్నించాలి.

(మనం రోజూ చూస్తున్న స్వామీజీలలో, పీఠాధిపతులలో, సన్యాసులలో ఎంతమందికి పైన చెప్పి సన్యాసలక్షణములు ఉన్నాయో గమనించండి.)

ఓ ఋషులారా! ఈ సంసారము మహావృక్షము. ఈ వృక్షమునకు అవ్యక్తము(ప్రకృతి) అనేది విత్తనము. బుద్ధి అనేది కాండము. అహంకారమే దీని కొమ్మలు. పంచభూతములు దీని ఆకులు, రెమ్మలు. ఇంద్రియములు ఈ చెట్టుకు ఉండే తొర్రలు. ఈ సంసార వృక్షములకు మంచీ, చెడూ అనే పండ్లు కాస్తుంటాయి. ఆశలు అనే చిగుళ్లు ఎప్పుడూ చిగురిస్తూనే ఉంటాయి.

ఈచెట్టును నరకడానికి జ్ఞానము అనే కత్తి అవసరము. జ్ఞానముతో ఈ సంసార వృక్షమును నరికిన వాడి బ్రహ్మ పదమును పొందగలడు. దానికి యోగసాధన అవసరము. ఆ యోగ సాధనలో ముందు మనలోని జీవాత్మను దర్శించాలి. అది క్షణమైనా అమితానంద దాయకంగా ఉంటుంది. తరువాత ఈ విషయ వాంఛలను వదిలి ముక్తిని పొందుతాడు.

ఓ మహాఋషులారా! మీకు తెలియనిది ఏమున్నది. మీరు వేదములు చదివిన వారు. తత్త్వవేత్తలు. ఆత్మ సాక్షాత్కారము పొందడానికి సత్త్వ మార్గమును మించి మరొకటి లేదు అన్నది సత్యము. అలాగే ఆ పరమాత్మను చేరుకోడానికి కూడా సత్త్వ నిష్ట తప్ప మరొక మార్గము లేదు.

సత్యము, ఆనందము, అహింస, క్షమా గుణము, మంచి ప్రవర్తన, సన్యాసము, ఒకరికి ఇచ్చే గుణము, విజ్ఞానము, ఇవన్నీ సాత్విక గుణములు. ఈ సాత్విక గుణములో పరమాత్మను చేరుకోడానికి సోపానాలు." అని అన్నాడు బ్రహ్మ.

అప్పుడు  ఋషులు బ్రహ్మ దేవుని ఇలా అడిగారు. "ఓ బ్రహ్మదేవా! ధర్మములు అనేక విధములు కదా! ఈ ధర్మములలో దేనిని అనుసరించితే మేలు జరుగుతుంది. మేము అందరమూ  అన్ని ధర్మములను అనుసరిస్తూ  అందులో ఏది  మంచిది అనే నిర్ణయానికి రాలేకపోతున్నాము. కాబట్టి నిశ్చయమైన ధర్మమేదో మాకు బోధించండి. ఇంకా సత్త్వగుణమునకు  పురుషునకు కల సంబంధమును వివరించండి." అని అడిగారు. దానికి బ్రహ్మ వారితో ఇలా అన్నాడు.

" ఓఋషులారా! సకల ధర్మములలో కల్లా అహింస పరమ మైన ధర్మము. (అహింసా పరమోధర్మః). అహింసను అవలంబించే వాడికి ఉత్తమమైన జ్ఞానము కలుగుతుంది. అదే మోక్షమునకు దారి. నిరంతరం కోరికలతో సతమతమయ్యేవాడు ప్రాపంచిక సుఖములు అనే బంధనములలో చిక్కుకుంటాడు. దాని వలన జనన మరణముల చక్రము లో తిరుగుతూ ఉంటాడు.

కోరికలు సహజమే. ఆ కోరికలను తీర్చుకోడానికి కర్మలు చెయ్యడం సహజమే. కాని ఆ కర్మలవల్ల వచ్చే ఫలితములను ఆశించకుండా కర్మలు చెయ్యగలిగితే ఆ కర్మబంధనములు కర్మచేసిన వానికి అంటవు. ఫలాపేక్ష లేకుండా చేసే కర్మల వలన కర్మ బంధములలో చిక్కుకోడు. అదే మోక్షమునకు దారి. కాబట్టి బయట ప్రపంచములో విహరించేటప్పుడు మానవుడు తామరాకు మీద నీటి బొట్టు మాదిరి వ్యవహరించాలి. దేని మీద ఆసక్తి చూపకూడదు. అప్పుడు అతనికి ఏ బంధనములు అంటవు. పరతత్త్వమును దర్శించడానికి సత్త్వము అనేది దివిటీ వంటిది. కాబట్టి పరతత్త్వ సాధనలో సత్త్వము ఒక సాధనము వంటిది. సత్త్వగుణ సాయంతో యోగులు పరతత్త్వమును సాధించి ముక్తిని పొందుతారు.  కాబట్టి సత్త్వము, ముక్తి పొందడానికి ఒక  మంచి

ఉపాయము.

ఎవరైనా ఉపాయం లేకుండా ఏ పనీ సాధించలేడు కదా! ఏదో ఒక సాధనము లేనిది ఏ పనీ సాధించలేడు. కాబట్టి సత్త్వము ముక్తికి తరుణోపాయము. సాధకుడు సత్త్వగుణంతో తనను తాను శుభ్రపరచు కోవాలి. తాను తలపెట్టిన కార్యము సిద్ధిస్తుందా లేదా అనే సందేహము వదిలిపెట్టాలి. తాను శక్తి మంతుడిని అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.(దీనినే ఈ రోజుల్లో పాజిటివ్ తింకింగ్ అంటుంటారు) నిరంతరము సాధన చెయ్యాలి. ఆత్మజ్ఞానము కలిగేంతవరకూ సాధకుడు సత్త్వగుణమును అవలంబించాలి. ఒక సారి ఆత్మసాక్షాత్కారము కలిగిన తరువాత ఆ సత్త్వగుణమును కూడా వదిలి, నిర్గుణుడై ముక్తి కోసం సాధనచెయ్యాలి.

ఓ ఋషులారా! మరలా చెప్పుచున్నాను. అవ్యక్తం నుండి మహతత్త్వము, మహతత్త్వము నుండి అహంకారము, అహంకారము నుండి పంచభూతాలు, వాటి నుండి శబ్ద,రస,రూప,స్పర్శ,గంధములు ఏర్పడాయి. వీటి వలననే విషయములు ఏర్పడతాయి. ఈ విషయవాంఛలలోనే మానవుడు మునిగి తేలు తుంటాడు. ఎవరైతే వీటిని గురించి తెలుసుకుంటాడో వాడు ఈ విషయము లను తేలికగా అధిగమించగలడు.

విషయముల గురించి తెలుసుకొనే ముందు పంచభూతముల గురించి తెలుసుకొనాలి. పంచభూతముల గురించి తెలుసుకున్న సాధకుడు, ఈ శరీరము పంచభూతాత్మకము అని గుర్తించి దేహాభి మానము వదిలి ముక్తిమార్గంలో పయనిస్తాడు. రథసారధి రథమునకు కట్టిన గుర్రములను నియంత్రించినట్టు, మనస్సు ఇంద్రియములను అదుపులో ఉంచుతుంది. దానికి బుద్ధి తోడ్పడుతుంది. అందుకనే ఈ శరీరము అనే రథములో అధిష్టించి

ఉన్న  అంతరాత్మ స్వేచ్ఛగా విహరిస్తూ ఉంటుంది. ఈ రహస్యమును తెలుసు కొన్న సాధకుడు, నిర్గుణుడై ముక్తిపథంలో పయనిస్తాడు.

సముద్రంలో అలలు ఎలా పైకి లేస్తూ కిందపడుతూ ఉంటాయో అలాగే ఈ చరాచర జీవరాసులు అవ్యక్తమైన ప్రకృతిలో  పుడుతూ పెరుగుతూ వస్తూ ఉంటారు.  ఈ అవ్యక్తమైన ప్రకృతి  అవ్యయుడైన పరమాత్మ నుండి ఆవిర్భ వించింది. కాబట్టి ఈ ప్రకృతి శాశ్వతము కాదు. ఈ సత్యము గ్రహించిన నాడు మానవులు మోహ బంధములో చిక్కుకొనరు.

( ఈ ఇల్లు నాది, ఈ స్థలం నాది, ఈ భూమి నాది.  ఈ పొలాలు నావి. నేనే వీటి కంతా అధిపతిని. అనడమే మోహము.  ఎందుకంటే వాడు పుట్టక ముందునుంచి ఈ భూమి, ఇళ్లు, పొలాలు ఉన్నాయి. వాడు చచ్చిన తరువాతా ఉంటాయి. వీడు మధ్యలో వచ్చి మధ్యలో పోతాడు. కాని నేను శాశ్వతము. నాకు ఉన్న భూములు, ఇళ్లు పొలాలు శాశ్వతము అనుకుంటాడు. అదే మోహము. మాయ. కాని ఈ విషయాలను ప్రతిరోజూ తమ ఉపన్యాసాలలో బోధించే స్వామీజీలు కూడా తమ తమ ఆశ్రమములను, వాటిస్థలాలను, భూములను, ఆస్తులను కాపాడుకోడానికి తాపత్రయ పడడం, అనవసరంగా రాజకీయాలలో తలదూర్చడం, అరెస్టులు కావడం,  అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం  మన చూస్తూ నే ఉన్నాము. ఇది మహామాయ. కాదంటారా!)

పరమాత్మను దర్శించడానికి తపస్సే ముఖ్యసాధనము. కాబట్టి సాధకుడు తపోధనాన్ని సంపాదించాలి. ఎందుకంటే పూర్వము ప్రజాపతులందరూ తపస్సు తోనే ఈ సృష్టిని నిర్వహించారు. మహామునులు అరణ్యములలో ఆకులు అలములు తిని తపస్సు చేసి త్రికాల జ్ఞానమును పొందగలిగారు. (అంటే జరిగినది, జరుగుచున్నది, జరగబోవునది తెలుసుకోగలిగే దివ్యదృష్టి).

తపస్సు వలన తను నేర్చుకున్న విద్యలో నైపుణ్యం సిద్ధిస్తుంది. ఏ ఇతర మార్గములలోనూ పొందలేనివి తపోమార్గములో పొందవచ్చును. బ్రాహ్మణులను హింసించడం, మద్యపానము మొదలగు దుర్గుణములను తపస్సు దూరం చేస్తుంది. తపస్సు వలన సమస్తభూతకోటి తృప్తి చెందుతుంది. ఈ తపోదీక్షలో సాధకులు, యోగులు, మమతలు, అహంకారము వదిలిపెట్టి బ్రహ్మపదమును పొందుతారు.

ఈ బ్రహ్మ పదమును పొందడానికి ముందు రజోగుణము, తమోగుణము వదిలిపెట్టి సత్త్వగుణమును ఆశ్రయించాలి. క్రమేణా ఆ సత్త్వగుణమును కూడి వదిలి నిర్గుణత్వము పొంది పరమాత్మలో ఐక్యము అవుతాడు.

వేదముల అంతమున ఉన్న ఉపనిషత్తుల సారమే ముఖ్యమైనది. ఈ ఉపనిషత్తులు అధ్యయనం చెయ్యడం ద్వారా జ్ఞానము సిద్ధిస్తుంది. ఉపనిషత్తులను అధ్యయనం చెయ్యడం ద్వారా ఆత్మజ్ఞానమును కలుగుతుంది. మనలో ఉన్న ఆత్మయే క్షేత్రజ్ఞుడు అని అంటారు.

మానవుడు కర్మజీవి. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉంటాడు. ఆ పనిలో లీనమవుతూ ఉంటాడు. ఆ పనులను మనసు పెట్టి చేస్తూ ఉంటాడు. కానీ ఆత్మ మాత్రం ఏ పనిలో లీనం కాకుండా సాక్షీభూతంగా అన్నీ చూస్తూ ఉంటుంది. ఇది యే యోగ సాధన.

ఈ ప్రకృతి అవ్యక్తము. మానవుడు ప్రకృతిలో సంచరిస్తూ ఉంటాడు. కాని తనలో ఉన్న అవిద్య కారణంగా తాను చేసే ప్రతి పనితోనూ మమతాను బంధాలు పెంచుకుంటూ ఉంటాడు. బంధనాలకు లోనవుతూ ఉంటాడు.

తుదకు దుఃఖములపాలవుతూ ఉంటాడు. తాను చేసే పనిని మమతాను రాగాలు లేకుండా, నిర్మలంగా, మమకారం లేకుండా చేస్తే ఆ బంధనాలు అంటవు. దాని వలన వచ్చే దుఃఖము కూడా అంటదు.

యోగులు రెండు రకాలు. జ్ఞాన యోగులు. కర్మయోగులు. జ్ఞాన యోగులు జ్ఞానమే మేలంటారు. కర్మ యోగులు కర్మచెయ్యడమే మేలంటారు. కాని వేదము చెప్పేది ఏమిటంటే. ప్రథమంలో కర్మలు చెయ్యాలి. పదహారు వికారములతో పరమాత్మను సేవించాలి. క్రమేణా కర్మలను వదిలి జ్ఞానయోగము అవలంబించాలి. ఎందుకంటే జ్ఞానమే పురుషుని యొక్క స్వభావము. ఈ జ్ఞానముకలిగిన నాడు సాధకుడు కర్మలను వదిలి జ్ఞానయోగ మవలంబించి తుదకు ముక్తిని పొందుతాడు. కాబట్టి నిత్యము కర్మలు చేస్తున్నా వాటిలో లీనం కాకుండా, కోరికలను విడిచిపెట్టి, మనస్సును స్థిరంగా నిలిపి, అన్నింటి ఎడలా సమభావం కలవారు ముక్తిని పొందుతారు.

ఓ ఋషులారా! బ్రాహ్మణులారా! మీకు అన్ని విషయములు వివరంగా చెప్పాను. ఈ ప్రకారంగా మీరు మీ మీ పనులను నిర్వర్తించండి. మీకు పరమపద సిద్ధి కలుగుతుంది." అని బ్రహ్మదేవుడు మునులకు జ్ఞానోపదేశము చేసాడు. అని గురువు తన శిష్యునికి వివరించాడు.

(అర్జునుడు అడిగిన ప్రశ్నకు, శ్రీ కృష్ణుడు గురు శిష్య సంవాదమును అర్జునునికి చెప్పాడు.) పైవిధంగా శ్రీ కృష్ణుడు అర్జునునికి జ్ఞానబోధ చేసాడు. అప్పుడు అర్జునునికి ఒక సందేహము కలిగింది. "శ్రీ కృష్ణా! ఇంతకూ ఆ గురువు ఎవరు? ఆ శిష్యుడు ఎవరు?" అని అడిగాడు.

దానికి కృష్ణుడు నవ్వి "అర్జునా! ఇంకా అర్థం కాలేదా! ఆ గురువును నేను. నా మనసే ఆ శిష్యుడు. నీ పై ప్రీతితో నీకు ఈ జ్ఞానబోధ చేసాను. నీవు నిర్మలము, చంచలము కాని నీ మనస్సును నా పై నిలిపి అధ్యాత్మమును అనుసరించు. నీలో ఉన్న చింతలు అన్నీ సమసిపోతాయి.

ఇప్పుడు నేను చెప్పిన విషయములు అన్నీ నీకు నేను యుద్ధము ప్రారంభం కాక ముందు చెప్పాను. మరలా ఇప్పుడు చెప్పాను. నీ మనస్సును, ఇంద్రియములను నిగ్రహించుకొని, అచంచల మైన మనస్సుతో ఈ ఆత్మజ్ఞానములో రమించు." అని శ్రీ కృష్ణుడు అర్జునునికి అధ్యాత్మబోధ చేసాడు.

అని వైశంపాయన మహర్షి జనమేజయునకు మహాభారత కథను వినిపించినట్టు, నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో సూతుడు శౌనకాది మహామునులకు మహాభారత కథను వినిపించాడు.

మహాభారతము,
అశ్వమేధ పర్వము
ద్వితీయాశ్వాసము సంపూర్ణము.
ఓంతత్సత్ ఓం తత్సత్ ఓంతత్సత్

.

# మహా భారతము

## అశ్వమేధ పర్వము

### తృతీయోధ్యాయము

సర్పయాగ సందర్భంలో జనమేజయునకు వైశంపాయనమహర్షి చెప్పిన మహా భారత కథను, నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో సూతుడు అనే పౌరాణికుడు శౌనకాది మహామునులకు వినిపించాడు.

ఆ ప్రకారంగా శ్రీ కృష్ణుడు అర్జునునికి ఆత్మ విద్య బోధించిన తరువాత ఇలా అన్నాడు.

“ఓ అర్జునా! నా చిత్తము నా తండ్రి-వసుదేవుని చూడ వలెనని ఆరాటపడుతున్నది. నేను త్వరగా ద్వారకకు వెళ్లవలెను. మీ అనుమతి కోసం ఎదురు చూచుచున్నాను.” అని అన్నాడు.

“కృష్ణా! అయితే మనము వెంటనే హస్తినకు వెళుదాము. నేను, నీ ద్వారక ప్రయాణము గురించి ధర్మజునకు చెప్పి ఒప్పిస్తాను. ఆయన కూడా నిన్ను సంతోషంగా ద్వారకకు పంపుతాడు.” అని అన్నాడు అర్జునుడు.

తరువాత కృష్ణార్జునులు ద్వారకకు ప్రయాణమయ్యారు. రథము ఎక్కిన తరువాత అర్జునుడు శ్రీ కృష్ణునితో ఇలా అన్నాడు.

“ఓ కృష్ణా! నీ దయ వలన కౌరవ సైన్యము అనే సాగరమును దాట

గలిగాము. యుద్ధములో శత్రువులను జయించాము. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు మొదలగు మహా వీరులను జయించాము. ఈ విజయము నీది. నీవు ముందుగా మా శత్రువులను చంపిన తరువాత, మేము ఈ కీర్తిని ప్రతిష్ఠలను పొందాము. ధర్మరాజు చక్రవర్తిగా పట్టాభిషిక్తుడయ్యాడు. సర్వాంతర్యామివి. నీ మహిమ గురించి పొగడటం నా తరమా! దామోదరా! నీవు ఈ విశ్వ సంవిధాతవు. నీ తేజస్సే అగ్నిష్టోమము (అన్ని అగ్నుల స్వరూపము). నీవే కాలస్వరూపుడవు. నీ ఉచ్ఛ్వాస నిశ్వాసములే వాయువు (పంచ భూతము లలో ఒకటి). నీ కోపమే మృత్యువు. నీ అనుగ్రహమే లక్ష్మీ కటాక్షము. నీ మూలము గానే మానవులకు సుఖదుఃఖములు, జననమరణములు సంభవిస్తున్నాయి. ఈ చరాచర జగత్తులు నీ వలననే ఉద్భవించి నీ లోనే లయమవుతున్నాయి. నీవు భావమునకు అతీతుడవు. ఈ సర్వజగత్తుకు నీవే పతివి.

ఓ కృష్ణా! నారదుడు, దేవలుడు, కౌశికుడు, పారాశర్యుడు మొదలగు మహామునులు, భీష్ముడు, చెప్పిన మంచి మాటలు విని నీవు సకల ధర్మ స్వరూపుడవు అని తెలుసుకున్నాను. అంతే కాకుండా నీవు నా మీద ఉన్న కరుణా కటాక్ష ముల వలన నాకు మరలా అధ్యాత్మ విద్యను బోధించావు. నేను బ్రహ్మానందాన్ని పొందాను." అంటూ అర్జునుడు శ్రీ కృష్ణుని భక్తితో ప్రార్థించాడు.

ఆ మాటలు విన్న వాసుదేవుడు చిరునవ్వుతో అర్జునునితో ఆదరించాడు. అభినందించాడు. కృష్ణార్జునులు ఇద్దరూ హస్తినాపురముచేరుకున్నారు. ముందుగా ధృతరాష్ట్రుని వద్దకు పోయి ఆయన ఆశీర్వాదము, గాంధారి ఆశీర్వాదము తీసుకున్నారు. తరువాత కుంతీదేవి ఆశీర్వాదము తీసుకున్నారు. తరువాత విదురుడు, ధౌమ్యుడు, యుయుత్సుడు, సంజయుడు మొదలగు

వారిని దర్శించుకున్నారు. తరువాత ధర్మరాజు వద్దకు వెళ్లారు. ధర్మరాజు శ్రీ కృష్ణుని ఆలింగనము చేసుకున్నాడు. అర్జునుడు అన్నగారికి భక్తిపూర్వకంగా నమస్కరించాడు.

మరునాడు కృష్ణార్జునులు కలిసి ఆస్థాన మండపములో ఉన్న ధర్మరాజు వద్దకు వెళ్లారు. అప్పుడు అర్జునుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"అన్నయ్యా! మన బావ, శ్రీ కృష్ణుడు, హస్తినకు వచ్చి చాలా రోజులు అయింది. ద్వారకలో శ్రీ కృష్ణుని తండ్రి వసుదేవుడు, శ్రీ కృష్ణుని సోదరులు ఆయన కోసరము ఎదురు చూస్తుంటారు కదా! వారిని చూడడం కోసరం శ్రీ కృష్ణుడు కూడా ఆతురతగా ఉన్నాడు. అందువలన తమరు అనుమతి ఇస్తే శ్రీ కృష్ణుడు ద్వారకకు బయలు దేరుతాడు. అక్కడ తండ్రి వసుదేవుని, తల్లి దేవకీదేవిని, అన్న బలరాముని సంతోషంతో దర్శిస్తాడు. కొంతకాలము వారితో గడిపి మరలా హస్తినాపురమునకు వస్తాడు. కాబట్టి తాము ఆలోచించి ఒక నిర్ణయము తీసుకోండి." అని అన్నాడు అర్జునుడు.

ఆ మాటలు విన్న ధర్మరాజు చాలా సంతోషించాడు. "తమ్ముడూ అర్జునా! అలాగే చేద్దాము. కృష్ణా! తమరు ద్వారకు పోయి మా బదులుగా తమరి తండ్రి వసుదేవునికి, తల్లి దేవకీదేవికి మా నమస్కారములు తెలియచేయండి. బలరామునికి మా నమస్కారములు తెలియజేయండి. తక్కిన బంధువులను మిత్రుల యోగక్షేమములు పేరుపేరునా అడిగినట్టు చెప్పండి. కొన్నిరోజులు వారితో గడిపి, తమరు బంధు మిత్ర సపరి వార సమేతంగా నేను చేయబోవు అశ్వమేధ యాగమునకు రండి." అని సాదరంగా ఆహ్వానించాడు.

తరువాత శ్రీ కృష్ణుడు కుంతీ దేవిని కలిసి ఆమె అనుమతి

తీసుకున్నాడు. ద్రౌపదిని, సుభద్రను కలిసాడు. వారి అనుమతి తీసుకున్నాడు. సుభద్రను తనతో తీసుకొని పోవుటకు కుంతీదేవి, అర్జునుడు అనుమతి తీసుకున్నాడు. వారు సంతోషంతో అంగీకరించారు.

తరువాత శ్రీకృష్ణుడు ద్వారకకు ప్రయాణము అయ్యాడు. ద్వారకకు పోతున్నాడే కాని కృష్ణుడి మనసు మాత్రము అర్జునుని వెంటనే ఉంది. రథము ముందుకు పోతుంటే కృష్ణుడు, అర్జునుని వెనక్కు తిరిగి మాటి మాటికీ చూస్తున్నాడు. అర్జునుడు కనుమరుగు అయ్యేంత వరకూ కృష్ణుని అలా చూస్తూనే ఉన్నాడు. శ్రీకృష్ణుడు, సాత్యకి ఒక రథం మీద వెళుతుంటే వెనక సుభద్ర వేరొక రథం మీద వెళుతూ ఉంది.

అలా ద్వారకకు పోతున్న శ్రీ కృష్ణుడు దారిలో ఉదంకుని ఆశ్రమమును చూచాడు. ఉదంకుడు శ్రీ కృష్ణునికి అతిథి మర్యాదలు చేసాడు. ఉదంకుడు శ్రీ కృష్ణునితో ఇలా అన్నాడు.

" కృష్ణా! హస్తినాపురంలో పాండవులు కౌరవులు క్షేమంగా ఉన్నారా. అన్నదమ్ములు అందరూ సయోధ్యతగా ఉన్నారా. నీవు వారి మధ్య సంధి కుదిర్చావా! కౌరవ పాండవులు ఎవరి రాజ్యములు వారు చేసుకుంటూ సుఖంగా ఉన్నారా! అని ఏమీ తెలియనట్టు అడిగాడు.

(ఉదంకుడు తెలిసీ తెలియనట్టు అడిగాడు అని మూలంలో ఉంది. కాని ఆ రోజుల్లో రవాణా సౌకర్యాలు కానీ,సమాచారము చేరవేసే సౌకర్యముగానీ లేవు. మనిషి వచ్చి చెబితేగానీ తెలియదు. కాబట్టి ఉదంకుడికి శ్రీకృష్ణుడు రాయబారమునకు వెళ్లాడని మాత్రము తెలుసు. ఎలాగంటే ఉదంకుని ఆశ్రమము హస్తినాపురము-- ద్వారక మధ్యలో ఉంది. బహుశా శ్రీకృష్ణుడు

హస్తినాపురము పోతూ పోతూ అక్కడ దిగి ఉదంకునికి తాను రాయబారమునకు పోతున్నట్టు చెప్పి ఉండవచ్చు. కాని తరువాత జరిగిన రాయబార వైఫల్యము, మహాభారత యుద్ధము, కౌరవుల నాశము, ధర్మరాజు పట్టాభిషేకము గురించి ఉదంకునికి తెలిసే అవకాశము లేదు అని అనుకోవాలి.)

శ్రీకృష్ణుడు కూడా తనకు ఏమీ తెలియనట్టు ఉదంకుడి మొహం చూచి ఇలా అన్నాడు. "ఓ మహర్షీ! నేను కురుపాండవులకు సంధి చెయ్యడానికి వెళ్లి ఉచితమైన మంచి మాటలు చెప్పాను. కొంచెం గట్టిగా గద్దించాను కూడా. నాకు తోచిన విధంగా నయానా భయానా సంధి చెయ్యడానికి ప్రయత్నం చేసాను. కానీ నామాటలు సుయోధనుడు, అతని తమ్ములు వినలేదు. నాకు తోడుగా భీష్ముడు ద్రోణుడు కూడా సంధిచేసుకొనడం మంచిది అని చెప్పారు. అక్కడ ఉన్న మునులు కూడా అదే విషయం చెప్పారు. కాని అతిలోభి అయిన సుయోధనుడు మా అందరి మాటలు పెడచెవిని పెట్టాడు. సంధికి ఒప్పుకోలేదు. కురు పాండవుల మధ్య యుద్ధము జరిగింది. ఆ యుద్ధములో కౌరవులు సమూలంగా నాశనము అయ్యారు. పాండవులు ఐదుగురు తప్ప ఎవరూ మిగలలేదు. కాలనిర్ణయమును ఎవరు తప్పింప గలరు?" అని అన్నాడు కృష్ణుడు.

ఆ మాటలు విన్న ఉదంకుడు కోపంతో ఊగిపోయాడు. "కృష్ణా! దీని కంతకూ నీవే కారణము. నీ మోసంతో కౌరవ కులమును నాశనము చేసావు. కౌరవ పాండవులకు సంధి చేసే శక్తి నీకు ఉండి కూడా నీవు ప్రయత్నించలేదు. నీ వలననే ఇంతఘోరం జరిగింది. కాబట్టి నీకు శాపం ఇస్తున్నాను." అని కోపంతో పలికాడు.

ఆమాటలు విన్న కృష్ణుడు ఉదంకునితో ఇలా అన్నాడు.

"మహర్షీ! నేను చెప్పబోవు మాటలుకూడా విని తరువాత తమరు ఇష్టం వచ్చినట్టు చేయండి. ఓ మహర్షి! నీ కోపం మాను. మునులకు కోపించడం తగదు. ప్రశాంత చిత్తంతో నేను చెప్పేది వినండి. అనవసరంగా నాకు శాపం ఇచ్చి తమరి అమూల్యమైన తపోబలమును వృధాచేసుకోకండి." అని అన్నాడు.

అప్పుడు ఉదంకుడు శాంతించాడు. "సరే. నీవు చెప్పుకోదగ్గది ఏదో చెప్పు. నేను శాంతంగా వింటాను." అని అన్నాడు.

అప్పుడు శ్రీ కృష్ణుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు. "ఉదంకా! నేనెవరో నీకు తెలియ జెపుతాను.

సత్త్వ, రజస్ తమోగుణములు నా యందే ఉన్నాయి. నా ఆజ్ఞానుసారం ప్రవర్తిస్తాయి. మరుత్తులు, వసువులు, మొదలగు దేవతాగణము నా యందే ఉద్భవించాయి. ఈ విశ్వమంతా నేను వ్యాపించి ఉన్నాను. ఈసృష్టి అంతా నా యందే నిండి ఉన్నది. పర, అపర తత్త్వములు నేనే. ఓం కారము, మూడు వేదములు,నాలుగు వర్ణములు,నాలుగు విధములైన ఆశ్రమములు, వాటికి సంబంధించిన సమస్త కర్మలు, స్వర్గము, మోక్షము, అన్నీ నేనే. నారూపాలే. యజ్ఞ యాగములలో నన్ను స్తుతించి యజ్ఞఫలమును పొందుతూ ఉంటారు. పాపములు చేసిన వారు కూడా, నన్ను భజించి, వారి పాపములకు ప్రాయశ్చిత్తము చేసుకుంటూ ఉంటారు.

ఈ లోకములో అధర్మము పెచ్చు పెరిగినపుడు నేను అవతరించి అధర్మమును రూపు మాపి, ధర్మరక్షణ చేస్తూ ఉంటాను. నేను బ్రహ్మాగా,

విష్ణువుగా, మహేశ్వరుడుగా ఆయావిధులను నిర్వర్తిస్తూ ఉంటాను. అంటే సృష్టి స్థితి లయములను మూడు రూపములలో నిర్వర్తిస్తూ ఉంటాను. ఎప్పుడైతే ధర్మమునకు హాని కలుగుతుందో, నేను అధర్మ వర్తనులను నశింప జేసి, ధార్మికులను రక్షిస్తూ ఉంటాను. లోకోపకారం చేస్తూ ఉంటాను.

ఓ ఉదంకా! నేను సర్వ సమర్ధుడిని అయి ఉండి కూడా, అధర్మ వర్తనులైన కౌరవులతో ధర్మ వర్తనులైన పాండవులను కలపడానికి ఎంతో ప్రయత్నించాను. నేను చేసిన ప్రయత్నములను వ్యాసుడు, మొదలగు మహా మునులు కూడా ప్రశంసించారు. కాని దుర్మదులైన కౌరవులకు నా మాటలు రుచించలేదు. అందువలన యుద్ధమే శరణ్యమైనది. అధర్మ వర్తనులైన కౌరవులు సమూలంగా నాశనమైనారు. ఇదీ జరిగింది. ఇప్పుడు నువ్వు అనదలచుకొన్నది అను. చెయ్యదలచుకొన్నది చెయ్యి." అని పలికాడు శ్రీ కృష్ణుడు.

"శ్రీ కృష్ణా! నీవు ఎవరో నీ మహిమలు ఏమిటో నాకు ముందే తెలుసు. కాని నేను తాత్కాలికమైన కోపానికి గురి అయ్యాను. నిన్ను నిందించాను. నీ అమృతతుల్యమైన వాక్కులతో నా మనసులోని మాలిన్యాన్ని కడిగివేసావు. కాని నాకు ఒక కోరిక ఉంది. మహోన్నతమైన నీ విశ్వరూపమును చూడవలెనని కోరికగా ఉన్నది. నేను దానికి అర్హుడను అని నీవు అనుకుంటే నాకు నీ విశ్వరూపమును చూపించు." అని ప్రార్థించాడు ఉదంకుడు.

ఉదంకుని మాటలు మన్నించాడు శ్రీ కృష్ణుడు. నాడు యుద్ధ భూమిలో అర్జునునికి చూపించిన విశ్వరూపమును ఉదంకునిచేత దర్శింపజేసాడు. అద్భుతము, అనిర్వచనీయము అయిన విశ్వరూపమును చూచి ఉదంకుడు భయము, ఆనందము, ఆశ్చర్యములకు ఒకేసారి లోనయ్యాడు. చేతులు జోడించి ఇలా ప్రార్థించాడు.

" ఓ పుండరీకాక్షా! ఈ భూమి అంతా నీయొక్క పాదపద్మములతో నిండి పోయింది. ఆకాశమంతా నీ శిరస్సులతో నిండిపోయింది. నీ యొక్క నడుము అంతరిక్షము అంతా నిండిపోయింది. నీ భుజములు, చేతులు అన్ని దిక్కులను ఆక్రమించాయి. లెక్కలేనన్ని శిరస్సులతో, చేతులతో, కాళ్లతో ఈ విశ్వమంతా నీవే నిండి ఉన్నావు. మహాత్మా! నీ విశ్వరూపమును కళ్లారా చూచాను. ధన్యుడను అయ్యాను. నా మనసు తృప్తి చెందింది. లోకోత్తరమైన ఈ విశ్వ రూపమును ఉపసంహరించి, నీ జగన్మోహనాకారముతో నాకు దర్శనము ఇవ్వమని ప్రార్థిస్తున్నాను కృష్ణా!" అని ప్రార్థించాడు ఉదంకుడు.

శ్రీ కృష్ణుడు తన విశ్వరూపమును ఉపసంహరించాడు. "ఉదంకా! ఏదైనా వరము కోరుకో ప్రసాదిస్తాను." అని అన్నాడు.

"ఓ మహాత్మా! సామాన్యులకు దుర్లభమైన నీ విశ్వరూపమును కనులారా చూచాను. ఇంతకన్నా నాకు వేరే వరం ఏం కావాలి. ఈ భాగ్యం చాలు నాకు." అని అన్నాడు ఉదంకుడు.

"ఉదంకా! నా విశ్వ రూపమును దర్శించడం నీకు శుభములు కలిగిస్తుంది. కాని నీకు ఒక వరము ఇవ్వవలెనని కోరికగా ఉన్నది." అడుగు అని అన్నాడు శ్రీకృష్ణుడు.

" ఓ కృష్ణా ఈ ప్రాంతం అంతా కరవు ప్రాంతము. వర్షపు జలము కానీ భూగర్భజలము కానీ దొరకవు. కాబట్టి నాకు ఎప్పుడు కావాలంటే అప్పుడు నీరు లభించేటట్టు వరం ప్రసాదించు." అని ప్రార్థించాడు.

"దానిదేముంది. నీకు నీరు కావాల్సి వచ్చినప్పుడు నన్ను స్మరించు. నీకు

నీళ్లు లభిస్తాయి." అని వరం ఇచ్చాడు శ్రీ కృష్ణుడు.

తరువాత శ్రీ కృష్ణుడు ద్వారకకు వెళ్లి పోయాడు. తరువాత ఒకరోజు ఉదంకునికి దాహం వేసింది. ఎక్కడూ చుక్క నీరు దొరక లేదు. అప్పుడు ఉదంకునికి ఒక కడజాతి వాడు కనిపించాడు. అతని ఒంటి మీద బట్టలు లేవు. అతని చుట్టు కుక్కలు తిరుగుతున్నాయి. చాలా మురికిగా ఉన్నాడు. కాని అతని శరీరం నుండి నిర్మలమైన జలం కారుతూ ఉంది.

అతడు ఉదంకుని పిలిచి "ఉదంకా! నీకు దాహంగా ఉంది కదా. నా శరీరం నుండి కారుతున్న నిర్మలమైన జలం తాగు." అని అన్నాడు. కాని ఉదంకుడు సందేహించాడు. "ఉదంకా! నీకు దాహంగా ఉందని తెలిసి వచ్చాను. నీకు నీరు అవసరము. అందుకని నా దేహము నుండి కారే నీరు తాగు." అని అన్నాడు.

ఉదంకుడికి కోపం వచ్చి అతనిని వెళ్లి పొమ్మని అరిచాడు. అప్పుడు ఆ కడజాతి వాడు, అతని కుక్కలు మాయం అయ్యాయి. ఇంతలో కృష్ణుడు అక్కడకు వచ్చాడు. ఉదంకుడు కృష్ణుని చూచి ఇలా అన్నాడు.

"మహానుభావా! నిన్ను తలచుకుంటే జలం లభిస్తుంది అని అన్నావు కదా. కాని నీవు నన్ను ఈ కడజాతి వాని శరీరం నుండి కారే జలాన్ని తాగమంటు న్నావా. ఇదేనా నీవు నాకు ఇచ్చిన వరం." అని అన్నాడు.

"”ఉదంకా! నీవు మంచి అవకాశాన్ని జారవిడుచుకున్నావు. నేను నీకు అమృతం ప్రసాదించమని దేవేంద్రుని కోరాను. మానవులు అమృతము తాగడానికి అర్హులుకారు అని దేవేంద్రుడు అన్నాడు. కాని నా మాట కాదన లేక

ఇంద్రుడు నీ కొరకు అమృతాన్ని పంపుతాను కాని ఒక నిబంధన. నేను ఛండాలుని రూపంలో ఉదంకుని వద్దకు వెళతాను. కాని అతడు నేను ఇచ్చే అమృతాన్ని ఇష్టపడక పోతే నేనేమీ చేయలేను. అని అన్నాడు. తరువాత ఇంద్రుడు చండాలుని రూపంలో నీ వద్దకు వచ్చాడు. అమృతాన్ని నీకు అందించాడు. కానీ నీవు తిరస్కరించావు. దానికి నేనేం చేయను. కాని నీకు ఇంకొక వరం ప్రసాదిస్తాను. నీకు సంవత్సరం పొడుగునా నీరు దొరికేట్టు చేస్తాను. నీవు నీరు కావాలి అని అనుకుంటే వెను వెంటనే మేఘాలు నీ దగ్గర వర్షం కురిపిస్తాయి. అలా అకాలంలో వర్షం కురిపించే మేఘాలు ఉదంక మేఘములు అని పేరుతో ప్రసిద్ధి చెందుతాయి. కాబట్టి నీ కోరిక తీరినట్టే కదా." అని అన్నాడు కృష్ణుడు. తరువాత శ్రీకృష్ణుడు వెళ్లిపోయాడు. అప్పటి నుండి ఉదంక మేఘాలు ఆ ప్రదేశంలో క్రమం తప్పకుండా వర్షం కురిపిస్తున్నాయి." అని వైశంపాయనుడు జనమేజయునికి ఉదంకోపాఖ్యానము చెప్పాడు.

అప్పుడు జనమేజయుడు వైశంపాయనుని ఇలా అడిగాడు.

"ఓ మునీంద్రా! ఈ ఉదంకుడు ఎవరు. అతడికి శ్రీ కృష్ణుని కూడా శపించ గలిగే శక్తి ఎలా వచ్చింది." వివరించండి అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు జనమేజయునకు ఉదంకుని వృత్తాంతము ఈ విధంగా చెప్పసాగాడు. ( ఈ ఉదంకుని కథ మీకు ఆదిపర్వములో వచ్చింది. మరలాచిన్న చిన్న మార్పులతో ఇక్కడకూడా చెప్పారు).

"ఓ జనమేజయ మహారాజా! ఉదంకునికి కల గురు భక్తి వలన, గురువునకు అతడు చేసిన సేవల వలన అతనికి అంతటి శక్తి వచ్చింది. ఉదంకుడు గౌతమునికి శిష్యుడు. విద్యాభ్యాసము పూర్తి అయిన తరువాత మిగిలిన శిష్యులందరికీ గౌతముడు ఎవరికి తగ్గట్టు వారికి తగిన వరాలు ఇచ్చి

పంపి వేసాడు. కాని ఉదంకునికి ఎటువంటి వరము ఇవ్వలేదు. అతనిని బయటకు పంపలేదు. కాని ఉదంకుడు గురువుగారైన గౌతముని భక్తితో సేవిస్తున్నాడు.

ఒక రోజు ఉదంకుడు మిక్కి లి బరువైన కట్టెల మోపును తెచ్చి ఆశ్రమం దగ్గర పడేసాడు. ఆ పడేయడంలో అతని జడ ఒకటి అందులో చిక్కుకున్నది. బలవంతంగా లాగడంతో ఆ జడతెగిపోయింది. ఆ జడలోని వెంట్రుకలు తెల్లగా మెరుస్తూ ఉన్నాయి. అంటే ఉదంకునికి ముసలి తనం వచ్చింది అని అర్థం అయింది. అది చూచి ఉదంకుడు బాధ పడుతున్నాడు. ఏడుస్తున్నాడు.

అది చూచాడు గౌతముడు. అతని కన్నీళ్లు భూమి మీద పడకుండా పట్టుకోమని తన కుమార్తెను పంపాడు. గౌతముని కుమార్తె తండ్రి ఆజ్ఞ ప్రకారము పోయి ఉదంకుని కళ్ల నుండి కారే నీళ్లను పట్టడానికి ప్రయత్నించింది. కాని ఆ కన్నీళ్లు సలా సలా కాగుతున్నాయి. చేతులు కాలడంతో వదిలేసింది. అప్పుడు గౌతముడు తన శిష్యుడు ఉదంకుని చూచి ఇలా అన్నాడు.

"ఉదంకా! ఎందుకు దుఃఖిస్తున్నావు. కారణము ఏమి?" అని అడిగాడు.

"గురువు గారూ! తమరు మిగిలిన శిష్యుల మీద చూపిన దయ నామీద చూపలేదు. వారు వెళ్లిపోయి హాయిగా గృహస్థు లయ్యారు. నాకు వయసు మీరిపోయింది. ముసలి వాడినయ్యాను. ఈ వయసులో నాకు వివాహం కాదు. అందుకే ఈ ఏడుపు." అని అన్నాడు.

గౌతముడు నవ్వి "ఉదంకా! దిగులుపడకు. నీకు మరలా యౌవనం

ప్రసాదిస్తున్నాను. అంతేకాదు. నా కూతురును ఇచ్చి వివాహం కూడా చేస్తాను. హాయిగా గృహస్థాశ్రమము స్వీకరించు." అని అన్నాడు.

అప్పటికే వయసు మీరి పోయిన గౌతముని కుమార్తెకు కూడా యౌవనాన్ని అందాన్ని ప్రసాదించాడు గౌతముడు. ఇద్దరికీ పెళ్లి చేసాడు. అప్పుడు ఉదంకుడు "గురువర్యా! తమరు నాకు యౌవనాన్ని, యౌవ్వనవతి అయిన భార్యను ప్రసాదించారు. తమరి ఋణం ఎలా తీర్చుకోను. ఏదో ఒక పని చెప్పండి. అది సక్రమంగా నెరవేర్చి ఆ రూపేణా గురుదక్షిణ ఇచ్చుకుంటాను." అని అన్నాడు.

"అదేమిటి ఉదంకా! నీవు నాకు వేరు గురుదక్షిణ ఇవ్వాలా! నీ గురుభక్తి, మంచి నడవడి ఇవే నాకు గురుదక్షిణ." అని చెప్పి బయటకు వెళ్లాడు. అప్పుడు ఉదంకుడు గురు పత్ని అహల్య వద్దకు వెళ్లాడు. ఆమెను చూచి "అమ్మా! తమరైనా చెప్పండి. నేను ఏమి చెయ్యాలో." అని అడిగాడు.

"అదేమిటి నాయనా! నీ గురువు గారి మాటలు నావికావా. అయినా నువ్వు అడుగుతున్నావు కాబట్టి చెబుతున్నాను. నీవు మిత్రసఖుడు అను వాని వద్దకు పోయి ఆయన భార్య వద్ద ఉన్న కుండలములు తెచ్చి నాకు ఇవ్వు. నేను సంతోషిస్తాను." అని చెప్పింది గురుపత్ని.

ఉదంకుడు ఆ పని మీద వెళ్లాడు. కొంత సేపటికి గౌతముడు ఆశ్రమానికి తిరిగివచ్చాడు. ఉదంకుడు కనిపించలేదు. భార్యను పిలిచి ఉదంకుడు ఎక్కడకు వెళ్లాడు అని అడిగాడు. ఆమె తాను ఉదంకుని మిత్రసఖుని వద్దకు పంపాను అని చెప్పింది. "అయ్యో! ఆ సౌదాసుడు రాక్షసుడు. వాడు శాప వశాత్తు మనుష్య మాంసము తింటాడు. ఈ విషయం

ఉదంకునికి తెలియదు. ఏమవుతుందో ఏమో!" అని కంగారుపడ్డాడు గౌతముడు.

ఆ మాటలకు గౌతముని భార్య కూడా భయపడింది. "నాథా! నేను పొరపాటు చేసాను. ఉదంకునికి ఏ అపాయమూ కలగ కుండా చూడండి." అని ప్రార్థించింది. గౌతముడు నవ్వి భయపడవలసిన పనిలేదు. నేను ఉదంకునికి ఎలాంటి ఆపదా రానివ్వను. నిశ్చింతగా ఉండు." అని భార్యను ఊరడించాడు.

అక్కడ ఉదంకుడు మిత్రసఖుని వద్దకు వెళ్లాడు. అతనిని సౌదాసుడుఅని కూడా అంటారు. సౌదాసుని ఒక నిర్జనమైన అడవిలో చూచాడు. ఆ సమయంలో సౌదాసుని శరీరం అంతా రక్తం తో తడిసి ఉంది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. భయంకరంగా ఉన్నాడు. కాని ఉదంకుడు సౌదాసుని చూచి భయపడలేదు. ధైర్యంగా అతని ముందు నిలబడి ఉన్నాడు.

సౌదాసుడు ఉదంకుని చూచి ఇలా అన్నాడు. "ఎవరునువ్వు! ఎక్కడికి పోతున్నావు. ఈ రోజు ఆహారం ఎలాగా అని చూస్తున్నాను. నువ్వు దొరికావు. నిన్ను విడిచిపెట్టను. నిన్ను చంపి తింటాను." అని అన్నాడు సౌదాసుడు.

"ఓ రాజా! నా పేరు ఉదంకుడు. నేను గురువుగారి పని మీద వెళుతున్నాను. గురుకార్యం మీద వెళ్లే వాడిని చంపడం మహా పాపము. నీవు ఈ అధర్మానికి ఒడిగట్టుతావా!" అని అన్నాడు ఉదంకుడు.

"ఓ బ్రాహ్మణా! నాకు దినములో మూడవ జాములో మనుష్య మాంసము ఆహారంగా తినమని నన్ను దేవతలు ఆదేశించారు. కాబట్టి ఈ మూడవ జాములో నాకు ఆకలిగా ఉంది. నిన్ను తిని నా ఆకలి తీర్చుకుంటాను." అని

అన్నాడు సౌదాసుడు.

"అలాగా అయితే మంచిదే. ముందు నేను గురువు గారి పని ముగించుకొని వస్తాను. అప్పుడు నీవు నన్ను తిని నీ ఆకలి తీర్చుకో. నేను అబద్ధం ఆడను. నా మాట నమ్ము. అయినా నీవు కూడా నిన్ను యాచించే వారి కోరికలు తీరుస్తావు కదా! నేను ఈ కోరికను నా స్వార్ధం కోసం కోరడం లేదు. గురువు గారి కొరకు కోరుకుంటున్నాను. కాబట్టి నా కోరిక తీరుస్తావని నమ్ముతున్నాను." అని అన్నాడు ఉదంకుడు.

ఆ మాటలకు సౌదాసుడు "సరే. అయితే నీ కోరిక ఏమిటి?" అని అడిగాడు.

"మహాత్మా! మా గురు పత్ని తమరి భార్య వద్దనున్న కుండలములు తీసుకొని రమ్మని నన్ను పంపింది. అవి ఇస్తే నేను వెళ్లి పోతాను. అవి నా గురువు గారి భార్యకు వచ్చి నీ దగ్గరకు వచ్చినీకు ఆహారం అవుతాను." అని అన్నాడు ఉదంకుడు.

దానికి సౌదాసుడు "ఆ కుండలములు నావి కావు కదా! ఇతరుల సొమ్ము నేను ఎలా ఇవ్వగలను. అవి తప్ప ఇంకేమన్నా అడుగు ఇస్తాను." అని అన్నాడు.

" నాకు ఇతరుల సొమ్ము అక్కర లేదు. నాకు కుండలములే కావాలి." అని అన్నాడు ఉదంకుడు.

"అయితే నీవు నా భార్య వద్దకుపోయి నేను పంపానని చెప్పి నీకు

కావాల్సిన కుండలములు ఆమెను అడిగి తీసుకో!" అని అన్నాడు.

"అయితే మీ ధర్మపత్ని ఎక్కడ ఉందో చెప్పండి. ఆమెనే అడిగి తీసుకుంటాను." అని అన్నాడు ఉదంకుడు.

"అదుగో ఆ కనపడేదే ఆమె నివాసము." అని చూపించాడు సౌదాసుడు.

ఉదంకుడు సౌదాసుని భార్య ఉండే మందిరమునకు వెళ్లాడు. "తల్లీ నమస్కారము. మా గురుపత్ని, అహల్య, తమరి వద్ద ఉన్న కుండలములు తీసుకు రమ్మని నన్నుపంపింది. తమరు కుండలములు ఇస్తే నేను తీసుకొని వెళతాను." అని అన్నాడు ఉదంకుడు.

"కుమారా! నీవు ఉదంకుడు అని, నాభర్త నిన్ను పంపాడు అని నాకు గుర్తు ఏమిటి. నీ దగ్గర గుర్తు ఏమన్నా ఉంటే చూపించు." అని అడిగింది సౌదాసుని భార్య.

ఉదంకుడు మరలా సౌదాసుని వద్దకు వచ్చాడు. "రాజా! నీ భార్య నన్ను గుర్తు తెమ్మని చెప్పింది. ఏదైనా గుర్తు ఇప్పించండి." అని అడిగాడు ఉదంకుడు.

"ఉదంకా! నేను నీకు కొన్ని మాటలు చెబుతాను. అవి యధాతథంగా చెప్పు. అవే నా గుర్తు అని ఈ విధంగా అన్నాడు.

"ఈ విధంగా క్షేమం అవుతుంది అని చెప్పలేము. కాని ఇది తప్ప వేరు

మార్గము లేదు." ఈ మాటలు చెప్పు చాలు." అని అన్నాడు.

ఉదంకుడు సౌదాసుని భార్య మదయంతి వద్దకు వెళ్లి అవే మాటలు చెప్పాడు. మదయంతి ఆ మాటలకు సంతోషించి "కుమారా! నీకు నేను కుండలములు ఇస్తాను.కాని ఒక్కమాట. ఈ కుండలముల కోసం దేవతలు, గంధర్వులు, నాగులు పొంచి ఉన్నారు. ఎన్నో ఉపాయములను పన్నుతున్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండు. ఈ కుండలములకు ఎంగిలి సోకినా, ఏమరుపాటున నీవు నిద్రించినా, నేల మీద పెట్టినా, దీనిని అపహరించే ప్రమాదము ఉంది. నీవు ఈ కుండలములను భక్తితో సేవిస్తే, పూజిస్తే నీకు ఆకలి, దప్పికలు ఉండవు. నీకు అగ్ని వలన, విషము వలన, భూత, భేతాళ, పిశాచముల వలన భయము కలగదు. ఈ కుండలములకు మరొక ప్రత్యేకత కలదు. ఈ కుండలములు పిల్లలు పెట్టుకున్నా, పెద్దవారు ధరించినా వారికి అతికినట్టు సరిపోతాయి. పైగా ఈ కుండలములు బంగారమును కురిపిస్తుంది. అందువల్ల అత్యంత అప్రమత్తతతో వీటిని జాగ్రత్తగా తీసుకొని పోయి నీ గురుపత్నికి ఇమ్ము." అని తగు జాగ్రత్తలు చెప్పి కుండలములు ఉదంకునికి ఇచ్చింది మదయంతి. ఉదంకుని ఆశీర్వదించింది.

ఉదంకుడు కూడా ఆ కుండలములు జాగ్రత్తగా భక్తితో తీసుకున్నాడు. తిరిగి సౌదాసుని వద్దకు వచ్చాడు. "దేవా! నీ వలన కృతార్ధుడనయ్యాను. కాని నాకు ఒకటి అర్థం కాలేదు. నీవు నీ గుర్తుగా చెప్పిన మాటలు నాకు అర్థం కాలేదు. నీకు అభ్యంతరములేకపోతే వాటి అర్ధము నాకు వివరించండి." అని అడిగాడు.

"ఓ బ్రాహ్మణ కుమారా! లోకంలో క్షత్రియులు బ్రాహ్మణులను పూజిస్తారు. నేను కూడా బ్రాహ్మణులను పూజిస్తాను. కాని ఒక బ్రాహ్మణుని పట్ల

నేను చేసిన చిన్న తప్పుకు ఇలా మానవ మాంస భక్షణ చేస్తున్నాను. నేను చేసిన పాపమునకు బ్రాహ్మణ పూజ ఒక్కటే మార్గము. కాని బ్రాహ్మణులను పూజించుట చాలా కష్టము. దీని వలన మేలు జరుగుతుంది అని చెప్పలేము. కాని ఇది తప్ప వేరు మార్గము లేదు. ఇదే నేను చెప్పిన మాటలకు అర్థము.

నీవు బ్రాహ్మణుడవు. నీకు కుండలములు ఇచ్చి నా పాపం తొలగించుకొన వచ్చును అని భావించాను." అని అన్నాడు సౌదాసుడు.

ఉదంకుడి దర్శనము వలన రాక్షస ప్రవృత్తి కలిగిన సౌదాసునికి పూర్వజన్మ జ్ఞానము, వినయమూ, బ్రాహ్మణులకు దానం చెయ్యాలనే బుద్ధి ప్రాప్తించాయి. ఉదంకుడు సౌదాసుని చూచి ఇలా అన్నాడు.

"మహానుభావా! నీ దయ వలన నాకు కుండలములు లభించాయి. నేను వెళ్లి వీటిని నా గురుపత్నికి ఇచ్చి నీకు ఇచ్చిన మాట ప్రకారము తిరిగి నీ వద్దకు తిరిగి వస్తాను. అప్పుడు నీవు నన్ను భక్షించి నీ ఆకలి తీర్చుకో." అని అన్నాడు.

అప్పుడు సౌదాసుడు ఉదంకుని చూచి ఇలా అన్నాడు. "నేను చంపుతాను అని తెలిసీ నా వద్దకు తిరిగి వస్తాను అన్నావు. నీ సత్య నిష్టకు నేను ప్రీతి చెందాను. నీవు చేసిన తపస్సుతో నా దుఃఖమును తొలగించు." అని ప్రార్థించాడు.

" ఓ రాజా! మంచి మనసు కలవారికి, పొరపాటున ఆపదలు కలిగినే వెంటనే తొలగిపోతాయి. నీ సుగుణములే నీపాపమును పోగొడతాయి. నా గురువు గౌతముని కరుణ నీమీద ప్రసరించింది. నీవు కృతార్థుడివి అయ్యావు. నీకు శుభం జరుగుతుంది." అని అన్నాడు ఉదంకుడు.

సౌదాసుని వద్ద సెలవు తీసుకొని ఉదంకుడు జింక చర్మముతో చేసిన సంచిలో పెట్టిన కుండలములతో సహా గురు పత్నివద్దకు ప్రయాణం అయ్యాడు. దారిలో ఉదంకునికి ఆకలి వేసింది. ఒక పళ్ల చెట్టును చూచాడు. కుండలములు ఉన్న సంచిని ఆ చెట్టు కొమ్మకు తగిలించాడు. ఆ చెట్టు ఎక్కి పండ్లను కోసి తింటున్నాడు.

ఇంతలో గట్టిగా గాలి వీచింది. ఆ గాలి తాకిడికి ఆ కుండలములు ఉన్న సంచి కింద పడింది. అక్కడే పొంచి ఉన్న ఒక నాగు పాము ఆ సంచిని నోట కరచుకొని వేగంగా పారిపోయింది. ఇది చూచాడు ఉదంకుడు. గబగబా చెట్టు దిగాడు. ఆ పామును వెంబడించాడు. ఆ పాము ఒక పుట్టలో కి దూరింది. ఉదంకుడు ఒక కర్ర తీసుకొని ఆ పుట్టను తవ్వసాగాడు. ఆ త్రవ్వకానికి భూమి కంపించింది.

ఇంతలో దేవేంద్రుడు ఒక బ్రాహ్మణ వేషంలో అక్కడకు వచ్చాడు. "విప్రోత్తమా! అంత చిన్న కర్రతో తవ్వి పాతాళమునకు మార్గముచెయ్యడం సాధ్యమా? ఎందు కంటే ఇక్కడి నుండి పాతాళము వెయ్యి యోజనముల దూరంలో ఉంది. నీ కుండలములు దొంగిలించిన నాగు పాము ఎవరో తెలుసా! అతడు నాగరాజు ఐరావతుని కుమారుడు." అని అన్నాడు బ్రాహ్మణుని వేషంలో ఉన్న దేవేంద్రుడు.

"విప్రోత్తమా! కుండలములు పాతాళంలో ఉన్నా సరే నేను వెళ్లి తీసుకొని వస్తాను." అని పలికాడు ఉదంకుడు.

దేవేంద్రునికి ఉదంకుని ధృఢమైన సంకల్పము నచ్చింది. అందుకని ఉదంకుడు చేతిలో ఉన్న కర్రముక్కకు వజ్రాయుధమునకు ఉన్న వాడి వేడి శక్తి

ప్రసాదించాడు. ఉదంకుడు ఆ కర్రతో భూమిలో ఒక్క పోటు పొడవగానే భూదేవి కూడా వజ్రాయుధమునకు భయపడి దారి ఇచ్చింది. ఆ దారి గుండా ఉదంకుడు పాతాళంలో ఉన్న నాగలోకమునకు వెళ్లాడు.

పటిష్ఠమైన కోట గోడలు ద్వారములు, అగడ్తలు కల ఆ నాగలోకము చూడగానే ఉదంకుడికి తాను తిరిగి కుండలములు పొందడం అంత సులభం కాదు అనిపించింది. ఇంతలో దారిలో అతనికి ఒక గుర్రం కనిపించింది. ఆ గుర్రము మొహం అరుణ వర్ణము ( ఎరుపు రంగు) లోనూ, శరీరం నలుపు రంగులోనూ, తోక శ్వేత వర్ణములోనూ ప్రకాశిస్తున్నాయి. ఆ గుర్రము ఉదంకుని ఇలా అంది.

"ఓ ఉదంకా! నీవు నాకు తెలుసు. నేను నీవు నీ ఆశ్రమములో రోజూ పూజించే అగ్నిహోత్రుడను. నేను నీకు కుండలములు ఎక్కడ ఉన్నాయో చెబుతాను. నీవు ఏమీ అనుకోకుండా నా వెనక భాగంలో నీ ఊపిరి ఊదు." అని అన్నాడు.

ఉదంకుడు ఆ గుర్రము వెనక భాగంలో ఊదాడు. అప్పుడు ఆ గుర్రము శరీరం నుండి సెగలు పొగలు వచ్చాయి. ఆ పొగ నాగ లోకం అంతా అలము కొంది. వాయు భక్షణతో జీవించే నాగులకు ఊపిరి ఆడలేదు. విల విల లాడుతున్నారు. కుండలములు దొంగిలించిన ఐరావతుని కుమారునికి కూడా ఊపిరి ఆడక గిలా గిలా కొట్టుకుంటున్నాడు. వేరు దారి లేక నాగ రాజులు అందరూ కలిసి ఆ కుండలములను తెచ్చి ఉదంకునికి ఇచ్చి అతని శరణు వేడారు. ఉదంకుడు వారిని క్షమించి, వెంటనే తన ఆశ్రమమునకు పోయి గురుపత్నికి కుండలములు అందచేసాడు.

గౌతముడు ఉదంకుని చూచి ఇలా అన్నాడు. "ఉదంకా! రాక్షస ప్రవృత్తి కలిగిన సౌదాసుని ప్రసన్నం చేసుకొని కుండలములు సంపాదించడం, అగ్ని దేవుని ప్రసన్నం చేసుకొని నాగ రాజు దగ్గర నుండి కుండలములు సంపాదించడం నీవే చేయగలవు. ఇది మరొకరికి సాధ్యమయ్యేపని కాదు." అని అన్నాడు గౌతముడు.

ఇదీ ఉదంకోపాఖ్యానము అని వైశంపాయనుడు జనమేజయునికి ఉదంకుని చరిత్ర వివరించాడు. తరువాత కథ ఇలా చెప్పసాగాడు.

"జనమేజయ మహారాజా! ఉదంకుని వద్ద నుండి బయలు దేరిన శ్రీ కృష్ణుడు ద్వారకాపురి చేరుకున్నాడు. ఆ సమయంలో రైవతక పర్వతము నకు ఉత్సవములు జరుగుతున్నాయి. ద్వారకాపురి వాసులందరూ ఆ ఉత్సవము నకు పోవడానికి సమాయత్తమవుతున్నారు. శ్రీకృష్ణుని ద్వారకాపురి ప్రవేశంతో వారు ఆగిపోయారు. శ్రీ కృష్ణునికి స్వాగతం పలికారు. శ్రీ కృష్ణుడు ముందు తల్లి తండ్రులు దేవకీ వసుదేవులను, అన్న బలరాముని కలిసి వారికి ప్రణామాలు చేసాడు. వారికి ధర్మనందనుడు చెప్పిన ప్రణామాలు అర్పించాడు. తరువాత, తన తమ్ముళ్లను, కుమారులను భార్యలను కలిసి వారికి ఆనందం కలుగచేసాడు.

తరువాత ఒకనాడు వసుదేవుడు తన కుమారుడు శ్రీ కృష్ణుని దగ్గర కూర్చోపెట్టుకొని "నాయనా కృష్ణా! మహా భారత యుద్ధము జరిగిందని వాళ్ల వాళ్ల చెప్పుకుంటుంటే విన్నాను. కాని పూర్తి వివరములు తెలియలేదు. నీవు ఆ యుద్ధ విశేషములు నాకు చెప్పవా!" అని అడిగాడు.

"తండ్రీ! మహాభారత యుద్ధము 18 రోజులు జరిగింది. ఆ యుద్ధ

విశేషములు చెప్పడానికి చాలా రోజులు పడుతుంది. కాని ప్రముఖులు చేసిన యుద్ధవిశేషాలు క్లుప్తంగా వివరిస్తాను.

తండ్రీ! ఇరు వైపున మోహరించిన సైన్యము 18అక్షౌహిణులు. అందులో కౌరవ సైన్యం 11 అక్షౌహిణులు. పాండవ సైన్యము 7అక్షౌహిణులు. కౌరవ సైన్యాధ్యక్షుడు భీష్ముడు. భారత యుద్ధం 18 రోజులు హోరాహోరీగా జరిగింది. భీష్ముని చంపడానికి పాండవులు శిఖండిని ఉపయోగించారు.  శిఖండిని ముందు నిలబెట్టుకొని అర్జునుడు భీష్ముని పడగొట్టాడు. కాని భీష్ముడు ఉత్తరాయనపుణ్యకాలము వచ్చే దాకా ఆగి తరువాత ఈ శరీరం వదిలిపెట్టాడు. అప్పటిదాకా అంపశయ్య మీద కాలం గడిపాడు. భీష్ముడు పడిపోయిన తరువాత ద్రోణుడు సర్వసైన్యాధ్యక్షుడు అయ్యాడు. ఆయన 5 రోజులు యుద్ధం చేసాడు. ద్రుపద కుమారుడు ధృష్టద్యుమ్నుడు, ధర్మరాజు సాయంతో ద్రోణుని చంపాడు. తరువాత అంగదేశాధీశుడు కర్ణుడు సర్వసైన్యాధ్యక్షుడు అయ్యాడు. కర్ణుడు రెండురోజులు యుద్ధం చేసాడు. తుదకు అర్జునుని చేతిలో పరమపదించాడు. మరునాడు శల్యుని సారధ్యంలో కౌరవ సేన యుద్ధమునకు సమాయత్త మయింది. కాని సగం దినం లోనే అతను ధర్మరాజు చేతిలో మరణించాడు. తరువాత వచ్చిన శకుని, వచ్చీ రాగానే సహదేవుని చేతిలో చంపబడ్డాడు. అప్పటికే సుయోధనుని తమ్ముళ్లు, బంధువులు, స్నేహితులు అందరూ యుద్ధంలో మరణించారు. సుయోధనుడు ఒంటరిగా మిగిలాడు.  ఆ అవమానం తట్టుకోలేక సుయోధనుడు ఒక మడుగులో దాక్కున్నాడు. అతని జాడ తెలుసుకున్న పాండవులు ఆ మడుగు దగ్గరకు వెళ్లారు. సుయోధనుని సూటిపోటీ మాటలతో రెచ్చగొట్టారు. మడుగులోనుండి బయటకు వచ్చేట్టు చేసారు. తరువాత భీమసుయోధనులు గదాయుద్ధం చేసారు. భీముడు సుయోధనుని తొడలు విరుగ గొట్టి చంపాడు. సుయోధనుని మరణంతో పాండవులకు  సంపూర్ణ విజయం లభించింది.

కాని అంతలోనే  ఒక అపశృతి దొర్లింది. ఆ రోజు రాత్రి గురు పుత్రుడు అశ్వత్థామ, పాండవ శిబిరములలో ప్రవేశించి ఉపపాండవులతో సహా, పాండవ సేనలను మట్టుపెట్టాడు. సర్వనాశనం చేసాడు.  ఆరోజు నేను పాండవులు ఆ శిబిరములలో లేము. అందు వలన నేను,పాండవులు బతికి బయటపడ్డాము. ఆ ప్రకారంగా 18 దినములు జరిగిన మహాభారతయుద్ధములో, పాండవుల వంక నేను, పాండవులు, సాత్యకి తక్క మిగిలిన వారు అందరూ మరణించారు. కౌరవుల వంక అశ్వత్థామ, కృపాచార్యుడు, కృత వర్మ తక్క మిగిలిన వారందరూ మరణించారు. యుయుత్సుడు పాండవుల వంక వచ్చాడు కాబట్టి అతడూ బతికిపోయాడు.  ఇదీ భారత యుద్ధ కథ.”  అని చెప్పాడు కృష్ణుడు.

ఇది విని వసుదేవుడు చింతాక్రాంతుడయ్యాడు.   వసుదేవుడు ఇంకా బాధపడతాడు అని అభిమన్యుని చావు గురించి వారికి చెప్పడం ఇష్టం లేక చెప్పలేదు. కాని పక్కనే ఉన్న సుభద్ర దుఖం ఆపుకోలేక పోయింది.

“అన్నా! మీ తండ్రి వసుదేవుడు చెవులారా వినేటట్టు నా కుమారుడు అభిమన్యుడు మరణించిన తీరు కూడా చెప్పు అన్నా!”  అని వసుదేవుడు వినేటట్టు ఏడ్చింది. దుఃఖము ఆపుకోలేక భూమి మీద పడిపోయింది సుభద్ర. వసుదేవుడు అక్కడ ఉన్న యాదవులు ఆ మాటలు విని మరింత దుఃఖించారు. వారి నందరినీ ఓదార్చడం శ్రీ కృష్ణుని వంతు అయింది. తరువాత మెల్ల మెల్లగా అన్ని వివరాలు చెప్పాడు. అభిమన్యుడు మరణించడం, కుంతీదేవి అభిమన్యుని భార్య ఉత్తరను, అభిమన్యుని తల్లి సుభద్రను ఓదార్చడం, తరువాత ధర్మరాజు, ధృతరాష్ట్రుడు కౌరవులకందరికీ తర్పణములు వదలడం, బ్రాహ్మణులకు దానములు ఇవ్వడం, వారి పేరుమీద అనేక ధర్మకార్యములు చెయ్యడం సవిస్తరంగా వివరించాడు కృష్ణుడు.  అందరూ మెల్ల మెల్లగా ఆ దుఃఖము నుండి బయట పడ్డారు.” అని  వైశంపాయనుడు జనమేజయునకు

వివరించాడు.

“ఓ వైశంపాయన మహర్షీ! వ్యాసుడు ధర్మరాజును అశ్వమేధ యాగము చేయమని ఆదేశించాడు కదా. ధర్మరాజు ఆ యాగమును ఎలా నిర్వహించాడు. తెలియజేయండి.” అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

“ఓ జనమేజయ మహారాజా! తన మీద వాత్సల్యంతో అశ్వమేధ యాగము చెయ్యమని ఆదేశించిన తరువాత, ధర్మరాజు తన తమ్ములను చూచి ఇలా అన్నాడు. “భీమార్జుననకుల సహదేవులారా! వింటిరి కదా వ్యాసమహర్షి ఆదేశము. ఆ యాగము చేయుటకు మన వద్ద ధనము లేదు. వ్యాసుల వారు చెప్పినట్టు బ్రాహ్మణులు దాచిన ధనమును తీసుకురావలసిన ఆవశ్యకత ఉన్నది. మరి ఆ నిధిని హిమాలయ ప్రాంతముల నుండి ఎలా తీసుకురావాలి. దానికి ఏమేమి ఏర్పాట్లు చెయ్యాలి. ఈ విషయంలో మీ మీ అభిప్రాయములను తెలపండి.” అని అడిగాడు.

అప్పుడు భీముడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. “అన్నయ్యా ధర్మనందనా! మనము ఆ పరమేశ్వరుని నియమ నిష్ఠలతో పూజించి, ఆయన కరుణను పొంది, ప్రమధగణములను పూజించి, ఆ స్థలములో భూత బలులు ఇచ్చి, ఆ నిధిని తీసుకొని వస్తాము. కాబట్టి మన వద్ద ధనము లేదు అన్నచింత మనకు అక్కరలేదు. ఆపనికి తమరు సముచిత సైన్యముతో బయలు దేరాలి.” అని అన్నాడు భీముడు.

భీముని మాటలకు అర్జునుడు, నకుల సహదేవులు తమ అంగీకారమును తెలిపారు. తమ్ముల మాటలకు ధర్మరాజు ఎంతో సంతోషించాడు.

హిమాచలమునకు పోవుటకు నిశ్చయించుకున్నాడు.

పెదనాన్న గారు అయిన ధృతరాష్ట్రుని అనుమతి తీసుకొనటకు ఆయన వద్దకు వెళ్లాడు. తాను అశ్వమేధ యాగము చేయవలెనని సంకల్పించినట్టు ధృ తరాష్ట్రునితో చెప్పాడు. ఆయన ఆ మాటలు విని తన కుమారులు లేనందుకు ఎంతో విలపించాడు. ధర్మరాజు ధృతరాష్ట్రుని పాదములు పట్టుకొని, గాంధారి వింటూ ఉండగా వ్యాస మహర్షికి తనకు జరిగిన సంభాషణ, వ్యాసమహర్షి తనను ఆశ్వమేధ యాగము చేయమని ఆదేశించడం మొదలగు విషయములు అన్ని సవిస్తరంగా చెప్పాడు. యాగం చేయడానికి ధృతరాష్ట్రుని అనుమతి పొందాడు.

తరువాత తన తల్లి అయిన కుంతీ దేవి వద్దకు పోయి అశ్వమేధయాగము గురించి ఆమెకు కూడా చెప్పాడు. ఆ మాటలు విని కుంతీదేవి చాలా సంతోషించింది. కుంతీ దేవి అనుజ్ఞ కూడా తీసుకొని ధర్మరాజు ఆ స్థాన మండపమునకు వచ్చాడు. యుయుత్సునికి హస్తినాపుర సంరక్షణ బాధ్యత అప్పగించాడు. అతనికి తోడుగా విదురుని నియమించాడు. సైన్యాధిపతులకు ప్రయాణ సన్నాహములు చేయమని ఆదేశించాడు. తరువాత సమస్త దేవతలను, పితరులను పూజించాడు. దాన ధర్మములు చేసాడు. అగ్ని కార్యము నిర్వర్తించాడు. తన పురోహితుడు ధౌమ్యునికి నమస్కరించాడు. తరువాత తనరథము మీద కూర్చున్నాడు. దారిలో బ్రాహ్మణుల యొక్క పుణ్యస్త్రీల యొక్క ఆశీర్వాదములు స్వీకరిస్తూ తన పురోహితుడు ముందు నడువగా హిమాచలమునకు పయనమయ్యాడు. ధర్మజుని వెంట భీమార్జున నకుల సహదేవులుకూడా తమ తమ రథముల మీద ప్రయాణమయ్యారు.

దారిలో వారి సామంత రాజులు కూడా వచ్చి వారిని కలిసారు. కొన్ని

రోజులు ప్రయాణము చేసి ధర్మరాజాదులు హిమవత్పర్వతము చేరుకున్నారు. ఒక సమతల ప్రదేశములో విడిది చేసారు.

ఆ సమయంలో వ్యాసుడు వారి వద్దకు వచ్చాడు. ధర్మరాజు తన తమ్ములతో వ్యాసునికి ఎదురు వెళ్లి ఆయనకు స్వాగత సత్కారములు చేసాడు. వ్యాసునికి అర్ఘ్యము పాద్యము సమర్పించి ఉచితాసనము మీద కూర్చోపెట్టాడు. తరువాత చేయవలసిన పనుల గురించి వ్యాసుని అడిగాడు.

"ధర్మనందనా! ఈ రోజు రాత్రికి మీరందరూ నిష్ఠగా ధర్భ చాపలమీద పడుకోండి. రేపు ఉదయమే లేచి శివుని అర్చించండి." అని చెప్పాడు వ్యాసుడు.

మరునాడు ఉదయము పాండవులందరూ వేకువ జామునే మేలుకొన్నారు. స్నానాదికములు ఆచరించి దర్భల మీద మహాశివుని ప్రతిష్ఠించారు. ధూప,దీప,నైవేద్యములతో పూజించారు. పాయసమును సమర్పించారు. తరువాత ప్రమథ గణములను ఆవాహన చేసి పూజించారు. కుబేరుడు,మణిభద్రుడు మొదలగు యక్షులను భక్తితో ఆవాహన చేసి పూజించారు. తరువాత పురోహితుడు ధౌమ్యుడు ముందు నడువగా ధర్మరాజు తన తమ్ములు వెంటరాగా, ఆ నిధి ఉన్న చోటికి వెళ్లాడు. ఆ నిధిని ఆవహించి ఉన్న భూతములను ఎర్రని పూలతోనూ, మాంసముతో చేసిన పదార్థముల తోనూ, పేలాలతోనూ అర్చించారు.

భూత తృప్తి చేసిన తరువాత ఆ ప్రదేశములో త్రవ్వమని తన సేవకులను ఆజ్ఞాపించాడు ధర్మరాజు. కొంత లోతు తవ్వగానే ఆ నిధి బయట పడింది. అప్పుడు ధర్మరాజు వ్యాసుని పాదములకు సాష్టాంగ నమస్కారము చేసాడు.

వ్యాసుడు ధర్మజుని ఆశీర్వదించాడు. తరువాత ధర్మరాజు ఆ నిధికి బలులు సమర్పించాడు. పూజలు చేసాడు. తరువాత ఆ నిధిని అనేక వేల బండ్ల మీదికి ఎక్కించాడు. ఆ నిధిలో బంగారం తో చేసిన బిందెలు, చెంబులు, గృహోప కరణములు, రోళ్లు రోకళ్లు ఉన్నాయి. ఇంకా బంగారు దిమ్మలు, కణికలు ఉన్నాయి. ధర్మరాజు వాటిని మూటలు కట్టించి, సంచులలో ఎత్తించి బండ్ల మీదికి ఎత్తించాడు. వేల కొద్ది బండ్లు హస్తినకు సాగిపోయాయి. బరువు ఎక్కువ కాబట్టి అక్కడక్కడా మజిలీలు చేస్తూ ప్రయాణం సాగించారు.

ఇది ఇలా  ఉండగా, అక్కడ ద్వారకలో శ్రీ కృష్ణుడు ధర్మరాజు చేయబోయే అశ్వమేధ యాగము గురించీ, ధర్మరాజు తమకు పంపిన ఆహ్వానము గురించి తెలియజేసాడు. తరువాత శ్రీ కృష్ణుడు ధర్మరాజు హిమాచలమునకు పోవుటయు, నిధిని సంపాదించుటయు ఆ నిధిని హస్తినకు తరలించుటయు విని మిక్కిలి సంతోషించాడు. శ్రీకృష్ణుడు తన అన్నగారు అయిన  బలరాముడు, సాత్యకి, కృతవర్మ, ప్రద్యుమ్నుడు, సాంబుడు మొదలగు యాదవ ప్రముఖులతో కలిసి హస్తినాపురమునకు వచ్చాడు. వారి రాక విని ధృతరాష్ట్రుడు, గాంధారి సంతోషించారు. యుయుత్సుని, విదురుని  వారిని తీసుకొని వచ్చుటకు పంపారు. విదురుడు, యుయుత్సుడు వెళ్లి శ్రీకృష్ణుని బలరాముని యాదవ ప్రముఖులకు  స్వాగతం పలికి అంతః పురానికి తీసుకొని వచ్చారు.

శ్రీకృష్ణుడు, బలరాముడు, యాదవ ప్రముఖులు ముందు ధృతరాష్ట్రుని, గాంధారిని దర్శించుకొని వారికి ప్రణామాలు అర్పించారు. తరువాత కుంతీదేవిని కలుసుకున్నారు. సుభద్ర తన అత్తగారైన కుంతీ దేవి వద్దకు పోయి ఆమె ఆశీర్వాదము తీసుకొంది. విదురుడు, యుయుత్సుడు, శ్రీ కృష్ణునికి, బలరామునకు, యాదవులకు తగిన విడిది ఏర్పాట్లు చేసారు.

ఆ సమయంలో గర్భిణితో ఉన్న అభిమన్యుని ధర్మపత్ని ఉత్తర గర్భ వాసాన తమరి జనకుడు పరీక్షిత్తు జన్మించాడు. దాసీలు ఉత్తర కు పుత్రుడు జన్మించాడు అని ప్రసూతి గృహము నుండి బయటకు వచ్చి చెప్పారు. అందరూ ఆనందోత్సాహాలలో ఓలలాడారు. కాని ఇంతలో మరొక దుర్వార్త. గర్భంలోనే చనిపోయిన బిడ్డ పుట్టాడు అని వెలువరించారు. అందరూ దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

ఈ విషయం శ్రీ కృష్ణునికి తెలిసింది. వెంటనే శ్రీ కృష్ణుడు, సాత్యకిని వెంటబెట్టుకొని కుంతీదేవి దగ్గరకు వెళ్లాడు. ఆ సమయంలో కుంతీదేవి, ద్రౌపది, సుభద్ర పెద్దపెట్టున ఏడుస్తున్నారు. శ్రీ కృష్ణుని చూచి ఇంకా బిగ్గరగా ఏడవసాగారు. అప్పుడు కుంతి కృష్ణునితో ఇలా అంది.

"కృష్ణా! నాకు నీవే గతి. వేరెవ్వరూ లేరు. నీ మేనల్లుడు అభిమన్యునికి కుమారుడు కలిగాడు. కాని చచ్చిపోయి పుట్టాడు. ఈ క్రూరాత్ముడు అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రము వలన గర్భములోనే చనిపోయినాడు. బ్రహ్మాస్త్రము మహిమ వలన మాడి మసిఅయిపోయాడు. కృష్ణా! ఈ బాలుని నీవే బతికించాలి. ఆనాడు నీవు చెప్పిన మాట, చేసిన ప్రతిజ్ఞ గుర్తుకు తెచ్చుకో. "ఉత్తర రాకుమారి గర్భమును నేను రక్షిస్తాను." అని అన్నావు. "ఉత్తర కడుపులో ఉన్న బిడ్డను కాపాడుతాను" అని ప్రతిజ్ఞ చేసావు.

కృష్ణా! నాప్రాణాలు, ద్రౌపది, సుభద్రల ప్రాణాలు నీచేతిలో ఉన్నాయి. బిడ్డ బతికితే మేము బతుకుతాము. లేకపోతే మేమందరమూ చస్తాము. ఈ బిడ్డ చనిపోతే పాండవ వంశంలో పితరులకు పిండప్రదానము చేయుటకు తిలోదకములు వదలుటకు ఎవ్వరూ మిగలరు. కాబట్టి ఈ బిడ్డను బతికించు. మత్స్యరాకుమారి ఉత్తర శోకమును పోగొట్టు.

ఓ దేవా! కృష్ణా! నీవు పాండవ వంశమును నిలిపిన వాడవు. ఈ పాండవ వంశాంకురమును బతికించు." అని ప్రార్థించింది కుంతి. శోకము తట్టుకోలేక నేలవాలిపోయింది.

అక్కడే ఉన్నసుభద్ర శ్రీకృష్ణుని చూచి ఇలా మొరపెట్టుకుంది. "అన్నయ్యా! ఆ అశ్వత్థామ భీముని చంపడానికి బ్రహ్మశిరోనామకాస్త్రమును ప్రయోగించాడు. కాని ఆ అస్త్రమునకు నేనూ, నా భర్త అర్జునుడు ఫలితమును అనుభవిస్తు న్నాము. వంశాంకురమును పోగొట్టుకున్నాము. నీ మరిది అర్జునుడు ఇప్పటికీ తన కుమారుడు అభిమన్యుని తల్చుకుంటూ కుమిలిపోతున్నాడు. అప్పుడు మనుమడు కూడా చనిపోయినాడని తెలిస్తే ఆయన పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేము. ఇంక ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులు ఈ దుఃఖాన్ని ఎలా తట్టుకుంటారు.

అన్నయ్యా మరిచిపోయావా! అశ్వత్థామ బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించినపుడు దానిని నిర్వీర్యం చేస్తానని పలికావు. నీ మాటలతో మేము ఊరట చెందాము. కానీ నీ మాటలు ఫలించినట్టు కనపడలేదు. కాబట్టి మా యందు దయయుంచి పాండవ కులమును కాపాడు. పాండవ వంశ ఉద్ధారకుడిని కాపాడు.

అన్నయ్యా! నీవు ఉండగా పాండవులకు భంగపాటు కలగదు. కానీ ఇప్పుడు నీ ఎదురుగానే ఆ అశ్వత్థామ పాండవుల వంశాంకురాన్ని నాశనం చేసాడు. ఓ భక్తవత్సలా! ఈ చరాచర జగత్తులో మరణించిన వారిని బతికించడం నీ ఒక్కడికే సాధ్యపడుతుంది అని నాకు తెలుసు. అలాంటిది నీ మేనత్త కొడుకు నీకు ఆప్తుడు, నీ సఖుడు అయిన అర్జునుని మనుమడు అకాల మరణం చెందితే ఊరుకుంటావా!

అన్నయ్యా! ఈ దుఃఖ భారంతో మేము ఏమేమో మాట్లాడాము. నీ శక్తి తెలియకుండా ప్రవర్తించాము. మమ్ములను క్షమించు. ఈ బిడ్డను బతికించు." అని దీనంగా వేడుకుంది సుభద్ర.

కుంతీ సుభద్రల మాటలకు కృష్ణుని హృదయం ద్రవించింది. అందరూ వింటూ ఉండగా కృష్ణుడు ఇలా అన్నాడు.

" ఎవరూ విచారించకండి. ఈ బిడ్డను నేను బతికిస్తాను." అని పెద్దగా అన్నాడు కృష్ణుడు.

ఆమాటలకు అందరూ సంతోషించారు. తన వెంట కుంతీదేవి, ద్రౌపది, సుభద్ర వెంటరాగా కృష్ణుడు ప్రసూతి గృహానికి వెళ్లాడు. వెంటనే తెల్లటి పూలు, ఆవాలు, లాజలు, పూర్ణ కుభంతో పుణ్యజలాలు, తెప్పించాడు. అగ్ని హోత్రం జ్వలింపజేసాడు. అక్కడ పదునైన ఆయుధములను, లేచిగుళ్లను పేర్చారు.

అందరి కంటే ముందు ద్రౌపది వెళ్లి "అమ్మా ఉత్తరా! లేచి చూడమ్మా! శ్రీ కృష్ణుడు వచ్చాడు. నిన్ను చూడ్డానికి వచ్చాడు." అని చెప్పింది.

ఉత్తర కళ్లు తెరిచింది. భారంగా లేచి కూర్చుంది. కృష్ణునికి నమస్కారం చేసింది. "దేవాది దేవా! నీవు భక్తుల ఆర్తిని బాపుతావని ప్రతీతి. నీదయ మామీద చూపించు. ఈ మృతశిశువును పునర్జీవితుడిని చెయ్యి. నేను భర్తను పోగొట్టుకున్నాను. తుదకు బిడ్డను కూడా పోగొట్టుకొని ఎలా బతుక గలను. అయినా నీ మేనల్లుని కుమారుడిని చంపే సామర్ధ్యము ఆ అశ్వత్థామకు ఉందా! కృష్ణా! నా భర్త అభిమన్యుడు చనిపోయినప్పుడే నేను సహగమనం చెయ్యాల్సి ఉంది. కానీ ఈ బిడ్డ కోసం బతికాను. ఇప్పుడు నేను చనిపోయి స్వర్గమునకు

పోతే నా భర్త అభిమన్యుడు తన కుమారుని గురించి అడిగితే ఏమని సమాధానము చెప్పను.

అయినా పరంధామా! ఈ విధంగా నా కుమారుడు చనిపోతాడని ఆనాడే తెలిస్తే, నేను నా భర్తతో సహగమనము చేసేదాన్ని కదా! నాకు కొడుకు పుట్టగానే, ఆ కొడుకును ఎత్తుకొని శ్రీ కృష్ణుల వారి దగ్గరకు పోయి మురిపెంతో నా కుమారుని చూపాలని అనుకున్నాను. కానీ ఆ క్రూరాత్ముడు అశ్వత్థామ నా ఆశలన్నీ వమ్ముచేసాడు." అంటూ బిడ్డ శవాన్ని ఒడిలోపెట్టుకొని ఏడుస్తూ ఉంది ఉత్తర.

ఆ మృత శిశువును చూచి ఉత్తర "ఒరేయ్ కన్నా! లేవరా! మీ తాతగారు, శ్రీ కృష్ణుల వారు వచ్చారు. లేచి నమస్కారం చెయ్యి నాయనా! పెద్దలు వచ్చినపుడు అలా పడుకొని ఉండటం తగునా!" అని కొడుకును నిద్రలేపినట్టు లేపింది. అంతలో కొడుకు మరణాన్ని తలుచుకొని తలుచుకొని ఏడుస్తూ సొమ్మసిలి పడిపోయింది ఉత్తర. ఆమె శోకము చూచి అక్కడ ఉన్న వారంతా కన్నీరుమున్నీరు అయ్యారు.

అప్పుడు శ్రీ కృష్ణుడు "అమ్మా ఉత్తరా! భయపడకు. నీ కుమారుని నేను బతికిస్తాను." అని అన్నాడు.

వెంటనే పాదప్రక్షాళనము చేసాడు. ఆచమనము చేసాడు. శుచి అయ్యాడు. అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రమును నిర్వీర్యము చేసాడు. మృతశిశువును శయ్య మీద ఉంచమని అన్నాడు. కృష్ణుని ఆ బాలుని చూచి "ఈ బాలుని నేను బతికిస్తాను. ఉత్తరకు, సుభద్రకు, పాండవులకు మనస్సులకు ఆనందం చేకూరుస్తాను." అని పలికాడు.

తరువాత ఈ విధంగా పలికాడు.....

నేను శత్రువుల తో సైతమూ ఎన్నడూ అసత్యము పలుకని వాడినయితే, యుద్ధభూమిలో ఎన్నడూ వెనుకంట వేయని వాడనైతే, ఈ శిశువు వెంటనే పునరుజ్జీవితుడు అగుగాక!

నేను బ్రాహ్మణుల ఎడల అచంచల మైన భక్తి విశ్వాసములు కలవాడనైతే, ఎల్లప్పుడూ ధర్మము తప్పని వాడనైతే, ఈ ఉత్తర కుమారుడు పునరుజ్జీవితుడు అగు గాక!

అర్జునుని ఎడల నా మనస్సులో ఏనాడూ విరోధ భావము లేని వాడనైతే, ఈ బాలుడు బతుకు గాక!

ధర్మ సంస్థాపనార్థము నేను కంసాదులను వధించడం నిక్కువమైతే, నేను చేసిన ఈ ధర్మ సంస్థాపన ఆర్యజనులకు ఆయోద యోగ్యమైతే, ఈ శిశువు బతుకుగాక!

నేను ఎల్లప్పుడూ సత్యమును, ధర్మమును, బ్రహ్మచర్యమును పాంటిచే వాడినైతే ఈ బాలుడు బతుకు గాక!

అని శ్రీ కృష్ణుడు గాఢంగా పలికాడు.

ఆ మాటలకు బాలునిలో చలనం కలిగింది. మెల్లిగా కాళ్లు చేతులు కదిలాయి. నెమ్మదిగా కళ్లు తెరిచాడు.

అది చూచి కుంతీదేవి, ద్రౌపది, సుభద్ర మొదలగువారు అమితానందాన్ని పొందారు. వారి కళ్లలో ఆనందాశ్రువులు నిండాయి. వారి దేహములు పులకించాయి. రోమములు నిక్కపొడుచుకున్నాయి. అక్కడ ఉన్న జనులందరూ ఆనందోత్సాహములతో కేరింతలు కొట్టారు. ఆకాశంనుండి దివ్యవాణి శ్రీ కృష్ణుని స్తుతించింది.

ఓ జనమేజయ మహారాజా! అప్పుడు మీ తండ్రి గారు ఉన్న ఆ పురుటి ఇల్లు మీ తండ్రిగారి తేజస్సుతో ప్రకాశించింది.”  అని జనమేజయుడు వైశంపాయనునికి చెప్పాడు.

అప్పటి దాకా కదలిక లేకుండా ఉన్న బిడ్డ ఒక్కసారి కాళ్ళ చేతులు ఆడిస్తూ కళ్లు తెరిచి కేరింతలు కొడుతుంటే ఉత్తర ఆ ఆనందం తట్టుకోలేక పోయింది. బిడ్డను పొదివి పట్టుకొని శయ్య దిగి పరుగు పరుగున వచ్చి శ్రీ కృష్ణుని పాదాల మీద పడిపోయింది. శ్రీ కృష్ణుడు  ఆమెను ఆదరంతో లేవనెత్తాడు.

అంతలోనే యాదవులందరూ ఆ పసిబిడ్డకు ఎన్నో అలంకారాలు బహుమతులు సమర్పించారు.  అప్పుడు కృష్ణుడు అందరూ వింటూ ఉండగా ఇలా  ప్రకటించాడు.

“ పాండవ వంశము అంతా నశించి పోయింది అనుకుంటున్న తరుణంలో జన్మించిన వాడు కావున ఇతనికి పరీక్షిత్తు అనే పేరుపెడుతున్నాను.”  అని బహిరంగంగా ప్రకటించాడు. అప్పటినుండి నీ తండ్రికి పరీక్షిత్తు అనే పేరు సార్థకమయింది. ఓ జనమేజయ మహారాజా! ఆ ప్రకారంగా శ్రీ కృష్ణుడు పాండవ సంతతిని నిలిపాడు.

ఒక మాసము గడిచింది.  నీ తండ్రి నెల వయసు బిడ్డ అయ్యాడు. అప్పటికి ధర్మరాజు, భీమార్జున నకుల సహదేవులు బంగారు రాసులు ఎత్తించుకొని వేలాది బండ్లతో హస్తినాపురము చేరుకున్నారు.  వారికి స్వాగత సన్నాహాలు చేయమని కృష్ణుడు విదురుని, యుయుత్సుని నియోగించాడు. హస్తినాపుర వీధులను శోభాయమానంగా అలంకరించారు. తోరణాలు కట్టారు. అరటి స్తంభాలు పాతారు. కస్తూరితో కళాపు చల్లారు.  ముత్యాల ముగ్గులు

పెట్టారు.  పూర్ణ కుంభములతో పాండవులకు స్వాగతము పలికారు.

శ్రీ కృష్ణుడు, బలరాముడు, విదురుడు, యుయుత్సుడు యాదవులు పాండవులకు ఎదురు వెళ్లి వారికి స్వాగతం పలికారు. సువర్ణ రాసులతో సహా పాండవులు హస్తినాపుర నగర ప్రవేశం చేసారు. ధర్మరాజు, తన తమ్ములతో ముందు ధృతరాష్ట్రుడు, గాంధారిని దర్శించుకున్నారు. తరువాత తమ తల్లి కుంతీ దేవిని దర్శించుకున్నారు. తరువాత ఒక  మండపములో కొలువుతీరారు.

ఆ సమయంలో ఉత్తర మృత శిశువును ప్రసవించడం,  శ్రీకృష్ణుడు ఆ మృతశిశువును పునరుజ్జీవింపచేయడం,  ఆ శిశువునకు పరీక్షిత్తు అని నామకరణం చేయడం అన్నీ విపులంగా చెప్పారు. ధర్మరాజాదులు ఇది అంతా విని ఆశ్చర్యపోయారు. పాండవులు శ్రీ కృష్ణుని అనేక విధముల స్తుతించారు.

తరువాత కొన్ని దినములకు వ్యాసుడు వారి వద్దకు వచ్చాడు. ధర్మరాజాదులు వ్యాసునికి అర్ఘ్య పాద్యాదులు ఇచ్చి సత్కరించారు. ధర్మరాజు వ్యాసుని చూచి ఇలా అన్నాడు.

“ఓ మునీంద్రా! తమరి దయ వలన అశ్వమేధ యాగమునకు కావలసిన ధనము సమకూరినది. తమరి అనుమతి అయితే అశ్వమేధ యాగమును ప్రారంభిస్తాను.” అని అన్నాడు.

“ ధర్మనందనా! నీకు శుభములు కలుగు గాక! అశ్వమేధ యాగము నిర్విఘ్నముగా నెరవేరుగాక!”  అని దీవించాడు.

అప్పుడు ధర్మరాజు శ్రీ కృష్ణుని చూచి “కృష్ణా!  ఆపద్బాంధవా! నీ కరుణా

కటాక్ష వీక్షణములతో భారత యుద్ధములో విజయము సాధించాము. ఈ అశ్వమేధ యాగము కూడా నీ చేతుల మీదుగా జరిపించి మమ్ములను కృతార్థులను చెయ్యి. మాకు తల్లి తండ్రి గురువు దైవమూ అన్నీ నీవే. నీవు ఆజ్ఞాపించు. నా ఆజ్ఞానువర్తులమై మేము అశ్వమేధ యాగమును నెరవేరుస్తాము." అని వినయంగా ప్రార్థించాడు ధర్మరాజు.

"ధర్మనందనా! వ్యాసులవారు ఆజ్ఞాపించారు.మనందరం ఈ యాగమును చేద్దాము. ఈ యాగంతో నీ మనసులోని పరితాపమంతా పటాపంచలవుతుంది. అసలు అశ్వమేధ యాగము చేయడం వలన కలిగే ఫలము అన్ని ఫలముల కన్నా మేలైనది అని నీకు ముందే చెప్పాను కదా! నేనే నిన్ను అశ్వమేధ యాగము చెయ్యమని చెప్పినపుడు మరలా నా అనుమతి దేనికి. నీవే ఈయాగమునకు కర్తవు. నీవు మమ్ములను ఆజ్ఞాపించు. నీ ఆజ్ఞానువర్తులమై మేము యాగనిర్వహణ చేస్తాము." అని అన్నాడు కృష్ణుడు.

ఆ మాటలకు ఎంతో సంతోషించాడు ధర్మరాజు. వ్యాసుని చూచి "మహానుభావా! యాగ దీక్షకు సుముహూర్తము తమరు నిర్ణయించండి. తగిన సంస్కారములను ఆచరించండి." అని ప్రార్థించాడు.

"ధర్మనందనా! ఈ యాగమును నేనూ, యాజ్ఞవల్క్యుడు పైలుడు ముగ్గురము కలిసి నిర్వహిస్తాము. రాబోవు చైత్రమాసములో పౌర్ణమాస్య నాడు దివ్యమైన ముహూర్తము. యజ్ఞాశ్వము కొరకు అశ్వనిపుణులను పంపించు. యాగములో వేదోక్తముగా విడువ బడిన ఆ ఉత్తమాశ్వము ఈ భూమండలం అంతా కలయ తిరుగుతుంది. నీ యశస్సును భూమండలం అంతా వ్యాపింపజేస్తుంది. యాగమునకు కావలసిన సంభారములు సిద్ధం చేయించు. పనిముట్లను తయారు చేయించు." అని ఆదేశించాడు వ్యాసుడు.

అప్పుడు ధర్మరాజు అశ్వశాస్త్రము తెలిసిన వారిని పిలిపించి సకల శుభ లక్షణములు కలిగిన ఉత్తమాశ్వమును ఎంపిక చేసి తీసుకురావలసినది అని ఆజ్ఞాపించాడు. యజ్ఞమునకు కావలసిన పనిముట్లను అన్నీ బంగారం తో తయారు చేయించమని ఆజ్ఞలు ఇచ్చాడు.

కాలక్రమేణా ఉత్తమాశ్వము, బంగారముతో చేయబడిన పనిముట్లు, సకల సంభారాలు సమకూరాయి. ధర్మరాజు వ్యాసుని వద్దకు పోయి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి అని మనవి చేసాడు. వ్యాసుడు ఆ హయమును చూచి సంతృప్తి చెందాడు. ,

అప్పుడు ధర్మరాజు వ్యాసునితో ఇలా అన్నాడు. "మహర్షి! ఈ అశ్వమును వేదోక్తముగా అర్చించి వదులుతాము. కాని దీనిని అనుసరించి రక్షించు వీరుడెవరో తమరే నిర్ణయించండి." అని అన్నాడు.

"ధర్మనందనా! ఇంకెవరున్నారు. దివ్యాస్త్ర కోవిదుడు, బుద్ధిమంతుడు, శౌర్యము, పరాక్రమము కలవాడు అయిన అర్జునుడే దీనికి సమర్ధుడు. నీవు యాగ దీక్షలో ఉంటావు. భీముడు, నకులుడు రాజ్యాన్ని రక్షిస్తూ ఉంటారు. సహదేవుడు అంతఃపుర రక్షణ చూస్తూ ఉంటాడు." అని అన్నాడు వ్యాసుడు.

అప్పుడు ధర్మరాజు అర్జునుని పిలిచి "అర్జునా! భగవాన్ వ్యాసమహర్షి చెప్పిన మాటలు విన్నావు కదా! ఈ అశ్వము యాగాశ్వము. దీనిని నీవు సంరంక్షించవలెను. నీకు తక్క ఈ పని వేరే వారికి శక్యము కాదు. కాబట్టి, ఈ పనిమీద నీవు వెళ్లవలసి ఉంటుంది. ఈ యాగాశ్వము ఎక్కడెక్కడ తిరుగుతుందో అక్కడక్కడ ఉన్న రాజులకు ఇది యాగాశ్వము. యాగ దీక్షలో ఉన్నది అని చెప్పు. ఏ ఆటంకమూ లేకుండా ఈ యాగాశ్వము అన్ని

ప్రాంతములలో తిరిగేటట్టు చూడు. ఆ యాగాశ్వమును పట్టుకున్న రాజులతో యుద్ధము చెయ్యకు. ఎవరినీ చంపకు. ఆ రాజులందరికీ అశ్వమేధయాగమునకు నా ఆహ్వానమును అందించు. అని అన్నాడు ధర్మరాజు.

వ్యాసుడు ఆదేశించినట్టు భీముని, నకులుని రాజ్య పరిరక్షణకు నియోగించాడు. సహదేవుని అంతఃపుర రక్షణకు నియోగించాడు. మిగిలిన పనులకు ఆయారంగములలో నిష్ణాతులను నియోగించాడు. గాంధారీ, ధృతరాష్ట్రుల అనుమతి తీసుకున్నాడు. తల్లి కుంతీదేవి అనుమతి తీసుకున్నాడు. ద్రౌపదితో సహా అశ్వమేధ యాగము చెయ్యడానికి ఉద్యుక్తుడయ్యాడు ధర్మరాజు." అని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పినట్టు సూతుడు శౌనకాది మహామునులకు మహాభారత కథను చెప్పాడు.

మహాభారతము,

అశ్వమేధ పర్వము,

తృతీయాశ్వాసము సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహాభారతము

## అశ్వమేధపర్వము

### చతుర్ధాశ్వాసము

వైశంపాయన మహర్షి జనమేజయునకు సర్పయాగ సందర్భంగా వినిపించిన మహాభారత కథను నైమిశారణ్యంలో, సత్రయాగ సందర్భంలో సూతుడు శౌనకాది మహామునులకు వినిపించసాగాడు.

అశ్వమేధ యాగమునకు పెట్టిన ముహూర్తము సమీపించినది. ఆ శుభ ముహూర్తమున వ్యాసుడు మొదలగు ఋత్విజులు వేద విహిత మైన విధానము ప్రకారము ధర్మరాజు చేత యాగ దీక్ష పట్టించారు. ధర్మరాజు చేత దండమును ధరించి, కృష్ణాజినము మీద కూర్చున్నాడు. తరువాత యాగాశ్వమును పూజించి శాస్త్రోక్తంగా వదిలిపెట్టాడు.

ఆ యాగాశ్వము బయలు దేరింది. అర్జునుడు గాండీవము చేత బూని తన సైన్యముతో యాగాశ్వమునకు రక్షణగా వెంబడించాడు. హస్తినాపుర ప్రజలందరూ పురవీధులలో అటు ఇటునిలబడి అర్జునుని ఆశీర్వదించారు. వారి ఆశీర్వాదములు వినయంగా అందుకుంటూ అర్జునుడు యాగాశ్వరక్షణకు బయలుదేరాడు. అర్జునుని వెంట యాజ్ఞవల్క్య శిష్యుడు మరి కొంత మంది బ్రాహ్మణులతో బయలుదేరాడు.

ఆ యజ్ఞాశ్వము ఉత్తరదిక్కుగా వెళుతూ ఉంది. త్రిగర్తదేశంలో ప్రవేశించింది. త్రిగర్త దేశాధీశుని కుమారులు, మనుమలు, రెట్టించిన

ఉత్సాహంతో ఆ హయమును బంధించడానికి వచ్చారు.

అర్జునుడు వారితో ఇలా అన్నాడు. "రాకుమారులారా! ఇది ధర్మరాజుచే వదిలి పెట్టబడిన యాగాశ్వము. ఈ అశ్వమునకు కీడు తలపెడితే ధర్మరాజుకు కీడుచేసినట్టే. మనలో మనకు వైరం దేనికి. మాతో మిత్రులుగా ఉండండి. అదియును కాక మా అన్న ధర్మజుడు నాతో ఇలా అన్నాడు. "మహాభారత యుద్ధంలో రాజులందరూ మరణించారు. ప్రస్తుతం వారి కుమారులు ఉన్నారు. వారిని చంపవద్దు. దయతో వారితో స్నేహం చెయ్యి. ఒక వేళ వారు ఉద్రేకంతో హయమునకు అడ్డుపడినా మన చుట్టరికములను కలిపి వారిని వారించు." అని అన్నాడు. కాబట్టి నేను మీతో పోరాడను. మీరు కూడా ధర్మరాజుతో వినయంగా ఉండటం మంచిది. ఎందుకంటే మీకు కూడా ప్రాణములు అంటే తీపి కదా!" అని వినయంగా చెప్పాడు అర్జునుడు.

కాని అర్జునుని మాటలు వారు పెడచెవిని పెట్టారు. త్రిగర్తాధీశుడు సూర్యవర్మ అర్జునుని మీద బాణ వర్షం కురిపించాడు. అర్జునుడికి ఇంక వారితో యుద్ధము చెయ్యక తప్పలేదు. సూర్యవర్మ ప్రయోగించిన బాణములనన్నిటినీ మధ్యలోనే ముక్కలు చేసాడు. ఇంతలో సూర్యవర్మ తమ్ముడు కేతు వర్మ వచ్చాడు అతను కూడా అర్జునుని మీద శరవర్షము కురిపించాడు. అర్జునుడు తన బాణ పరంపరతో కేతు వర్మను రణరంగము నుండి తరిమివేసాడు.

ఇంతలో కేతు వర్మ తమ్ముడు ధృతవర్మ వచ్చాడు. అతడు కూడా అర్జునుని మీద బాణ ప్రయోగం చేసాడు. అర్జునుడు ధృతవర్మ యొక్క యుద్ధకౌశలాన్ని మెచ్చుకున్నాడు. అందుకని అతనిని తన బాణములతో బాధించలేదు. కేవలము ధృతవర్మ వేస్తున్న బాణములను మాత్రం మధ్యలోనే ఖండిస్తున్నాడు. కాని ధృతవర్మ అర్జునుని శరీరంలో బాణములను నాటాడు.

అర్జునునికి కోపం వచ్చింది. గత్యంతరం లేక ధృతవర్మ గుండెలకు గురి చూచి బాణములతో కొట్టాడు. ధృతవర్మ కూడా అర్జునుని చేతి మీద కొట్టాడు. అంతలో చేతి పట్టు తప్పి అర్జునుని చేతిలోని గాండీవము  కిందపడింది.

ఇది చూచి త్రిగర్త సైన్యము హర్షధ్వానాలు చేసారు. కాని సైన్యాధిపతులు మాత్రం ఇలా అన్నారు. "ఆగండి. అర్జునుడు ధర్మరాజు మాట ప్రకారం గాండీవం కిందపడినా ఊరుకున్నాడు. అర్జునుడు మూడో కన్ను తెరిస్తే మనం భస్మం కావడం తప్పదు" . అని ధృతవర్మను పక్కకు లాగారు. తామందరూ అర్జునుని ఎదురుగా నిలబడ్డారు.

ఇంతలో అర్జునుడు కింద పడ్డ గాండీవమును చేతిలోకి తీసుకున్నాడు. పిడుగులు పడుతున్నట్టు వాడియైన బాణములను ప్రయోగించాడు. త్రిగర్త సైన్యమును నాశనం చేసాడు. పీనుగు పెంటలు చేసాడు. మిగిలిన త్రిగర్త సైన్యము చెల్లాచెదరు అయింది. కాని మిగిలిన కొంత మంది మాత్రము అర్జునుని శరణు వేడారు. అర్జునుడు వారి మాటను మన్నించాడు. త్రిగర్త సైన్యములను వెంటబడి చంపలేదు. వారిని పోనిచ్చాడు.  ఆ ప్రకారంగా అర్జునుడు త్రిగర్త సైన్యమును జయించాడు.

తరువాత అశ్వము ప్రాగ్జ్యోతిష పురములోకి ప్రవేసించింది. భగదత్తుడి కుమారుడు వజ్రదత్తుడు ప్రాగ్జ్యోతిషపురమును పరిపాలిస్తున్నాడు. అతను కూడా హయమును బంధించాడు. అర్జునునితో యుద్ధమునకు సిద్ధం అయ్యాడు. అర్జునుడు వజ్రదత్తుని మీద వాడియైన బాణములను ప్రయోగించాడు. ఆ బాణముల ధాటికి తట్టుకోలేక వజ్రదత్తుడు హయమును వదిలి పారిపోయాడు.  కొంచెం సేపటికి ఏనుగును ఎక్కి రణభూమికి వచ్చాడు. అర్జునుని ఎదుర్కొన్నాడు.

వజ్రదత్తుడు వేసిన బాణములను అర్జునుడు మధ్యలోనే విరిచాడు. కాని అతని మీద శరప్రయోగము చెయ్యలేదు. వజ్రదత్తుడు మాత్రము అర్జునుని మీద వాడియైన బాణములను ప్రయోగించాడు. ఇంక ఊరుకుంటే ప్రయోజనము లేదని అర్జునుడు వజ్రదత్తుని నేల మీద పడేట్టు కొట్టాడు. నేల మీద పడ్డ వజ్రదత్తుడు ఒక్క ఉదుటున లేచి మరలా ఏనుగు ఎక్కాడు. అర్జునుని తన బాణ పరంపరతో కప్పివేసాడు.

వారి మధ్య మూడు రోజులు హోరాహోరి యుద్ధము జరిగింది. నాలుగవ రోజున వజ్రదత్తుడు విజృంభించాడు "అర్జునా! నా తండ్రి వృద్ధుడు కాబట్టి అతనిని చంపారు. కాని నేను యువకుడను. నా చేతిలో నీ చావు తప్పదు." అంటూ తన కొండవంటి ఏనుగును అర్జునుని మీదికి తోలాడు. ఏనుగు మీద ఉన్న వజ్రదత్తుడు అర్జునుని తన బాణములతో ముంచెత్తాడు.

అర్జునుడు ఒకే ఒక బాణంతో ఆ ఏనుగును నేలకూల్చాడు. ఏనుగుతో పాటు వజ్రదత్తుడు కూడా కిందపడ్డాడు. కింద పడ్డ వజ్రదత్తుని చూచి అర్జునుడు ఇలా అన్నాడు. "ఓ వజ్రదత్తా! ఇది యాగాశ్వము. ఈ అశ్వమునకు నేను రక్షకుడను. ఈ యాగాశ్వమును వదలుటకు ముందు ధర్మరాజు నాతో ఇలా అన్నాడు. "ఈ అశ్వమును అడ్డగించిన వారిని చంప వద్దు. వారిని దయతో చూడు." అని అన్నాడు. అందుకే నేను నిన్ను ఏమీ చేయను. నాకు నీ మీద ఎలాంటి కోపమూ లేదు. ధర్మరాజు చేయుచున్న అశ్వమేధ యాగమునకు రమ్మని నిన్ను బంధుమిత్రసపరివార సమేతంగా ఆహ్వానిస్తున్నాను. రాబోవు చైత్రశుద్ధ పౌర్ణమి నాటికి హస్తినకు వచ్చి యాగము జయప్రదం చెయ్యి ." అని అన్నాడు అర్జునుడు. ఆ మాటలకు వజ్రదత్తుడు సమ్మతించాడు. యాగాశ్వమును వదిలిపెట్టాడు. అర్జునునితో సంధి చేసుకున్నాడు.

తరువాత అశ్వము సింధు దేశము వైపు నడిచింది. సింధు దేశంలో ప్రవేశించింది. మహాభారత యుద్ధంలో సింధు దేశపు రాజులు (సైంధవుడు మున్నగువారు) మరణించారు. ఇప్పుడు వారి కుమారులు, మనుమలు రాజ్యం చేస్తున్నారు. అర్జునుడు వస్తున్నాడు అని తెలిసి వారందరూ ఒక్కుమ్మడిగా అర్జునునితో యుద్ధమునకు తలపడ్డారు. ముందు యాగాశ్వాన్ని పట్టుకున్నారు. తరువాత అర్జునుని చుట్టుముట్టారు. అర్జునుని మీద అస్త్రములు శస్త్రములు వర్షంలాగా కురిపించారు.

వారి ధాటికి అర్జునుడు తట్టుకోలేకపోయాడు. అర్జునుని చేతిలో ఉన్న గాండీవము కిందపడింది. అర్జునుడు తన లోని శక్తిని కూడదీసుకున్నాడు. గాండీవమును చేతిలోకి తీసుకున్నాడు. సింధు రాజుల మీదికి, వారి సైన్యము మీదా విరుచుకు పడ్డాడు. రణభూమి అంతా శవాలతో నిండిపోయింది. చావగా మిగిలిన సింధు దేశ సైనికులు చెల్లాచెదరుగా పారిపోయారు. కాని సింధు వీరులు మరలా సేనలను కూడగట్టుకొని యుద్ధానికి తలపడ్డారు. అప్పుడు అర్జునుడు వారితో ధర్మరాజు పలికిన శాంతి వచనములు వినిపించాడు. కాని వారు పెడచెవినిపెట్టారు. గత్యంతరం లేక అర్జునుడు సింధు దేశపు వీరులందరినీ సంహరించాడు.

అప్పుడు దుస్సల (సైంధవుని భార్య, దుర్యోధనుని చెల్లెలు, ధృతరాష్ట్రుని కుమార్తె) దుఃఖిస్తూ అర్జునుని వద్దకు వచ్చింది. చెల్లెలు దుస్సలను చూచి అర్జునుడు రథం దిగి ఆమె వద్దకు వచ్చాడు. అర్జునుని చూచి దుస్సల ఇలా అంది. "అన్నయ్యా! వీడు నా మనుమడు. నీ మేనల్లుని కుమారుడు. (మేనల్లుడు అనగా సైంధవుని కుమారుడు). వీడిని కాపాడు." అని ప్రార్థించింది.

" దుస్సలా! నా మేనల్లుడు ఎక్కడ?" అని అడిగాడు ర్జునుడు.

" అన్నయ్యా! తన తండ్రి సైంధవుడు నీ చేతిలో మరణించాడు అని తెలిసి చాలా దుఃఖించాడు. ఇప్పుడు నువ్వు వచ్చావని తెలిసి గుండె ఆగి మరణించాడు. వీడొక్కడే వంశాంకురం మిగిలాడు." అని చెప్పింది దుస్సల.

ఆ మాటలు విని అర్జునుడు ఎంతగానో దుఃఖించాడు. ఇంకా దుస్సల ఇలా అంది. "అన్నయ్యా! అర్జునా! ధార్తరాష్ట్రులు మీకు చేసిన అపకారములు, నా భర్త సైంధవుని అనుచిత ప్రవర్తన మనసులో పెట్టుకోకు. నా మనుమడు తండ్రిలేని వాడయ్యాడు. వీడిని దయతో రక్షించు." అని మనుమనితో అర్జునునికి పాదాభివందనం చేయించింది.

"అమ్మా! నీ అన్న సుయోధనుడు దుర్మార్గుడే. కాని మేము మాత్రం తక్కువా చెప్పు. మా వలననే కదా ఇంతటి ఘోర వినాశనం సంభవించింది. ~~ఈ~~ రాచకులములో పుట్టడమే మహా పాపం కదా! అమ్మా! నీవేమీ భయపడకు. నీ మనుమనికి ఏమీ అపకారము చెయ్యను." అని చెల్లిని ఓదార్చాడు. ఆ మాటలకు సంతోషించి దుస్సల మనుమనితో సహా వెళ్లిపోయింది. అర్జునుడు యాగాశ్వమును విడిపించుకొని దానిని అనుసరించాడు.

తరువాత ఆ యాగాశ్వమునకు ఎక్కడా అవరోధము వాటిల్లలేదు. అన్ని దేశములు తిరుగుతూ ఉంది. ఆ క్రమంలో మణిపూరము అనే పట్టణము చేరుకుంది. ఆ నగరమునకు అధిపతి బభ్రువాహనుడు. అర్జునునికి చిత్రాంగదకు కలిగిన కుమారుడు. తండ్రి వచ్చాడని తెలిసి బభ్రువాహనుడు సైన్య సమేతంగా ఎదురేగి తండ్రికి స్వాగతం పలికాడు. కాని కుమారుని స్వాగత సత్కారములను అర్జునుడు తిరస్కరించాడు. బభ్రువాహనునితో ఇలా అన్నాడు.

"కుమారా! ఇది యాగాశ్వము. యాగాశ్వమును పట్టుకోడం క్షత్రియ ధర్మం. ఈ విధంగా చేతగాని వాని వలె స్వాగత సత్కారాలు చెయ్యడం పిరికి వాని లక్షణం. క్షత్రియ లక్షణము మరిచిపోయి భయంతో వణికి పోయేవాడు రాజు కాజాలడు. కాబట్టి ఇక్కడినుండి వెళ్లు! చేతనయితే యాగాశ్వమును పట్టుకో!" అని కుమారునిలోని పౌరుషాన్ని రెచ్చగొట్టాడు.

ఆ మాటలు విన్న బభ్రువాహనుడు వెను తిరిగి రాచమార్గములో పోతున్నాడు. ఆ సమయంలో అర్జునుని మరొక భార్య అయిన నాగ కన్య ఉలూపి ఈ విషయం తెలుసుకొంది. వెంటనే నాగ లోకం నుండి బభ్రువాహనుని వద్దకు వచ్చింది.

( ఈ చిత్రాంగద ఉలూపి గురించిన కథ మనకు ఆది పర్వము అష్టమాశ్వాసంలో కనపడుతుంది. మర్చిపోయి ఉంటారు కాబట్టి క్లుప్తంగా గుర్తుచేస్తాను.

ద్రౌపదితో వివాహా నంతరము,వ్యాసుడు, నారదుని ఆదేశం ప్రకారము సంవత్సరానికి ఒక్కరు వంతున ద్రౌపదితో కాపురం చేస్తున్నారు. ఆ సమయం లో మిగిలిన వారు, వారు ఉన్న మందిరము దరిదాపులకు కూడా వెళ్ల కూడదు. పొరపాటున వెళితే వారు 12 నెలలు తీర్థయాత్రలు చెయ్యాలి. ఇదీ నియమం. ఒకనాడు ఒక బ్రాహ్మణుడి ఆవును దొంగలు ఎత్తుకుపోయారు. ఆ బ్రాహ్మ ణుడు అర్జునుని వద్దకు వచ్చి తన ఆవును తెచ్చి ఇమ్మన్నాడు. అర్జునుడు ఆయుధముల కొరకు ఆయుధాగారమునకు వెళ్లాడు. ఆ సమయంలో ధర్మరాజు, ద్రౌపది అక్కడ ఉన్నారు. అర్జునుడు తన ఆయుధములు తీసుకొని వెళ్లి, దొంగల వద్దనుండి గోవును రక్షించి ఆ బ్రాహ్మణుడికి అప్పగించాడు. నియమ భంగం జరిగినందున తీర్థ యాత్రలకు వెళ్లాడు. ఆ తీర్థ యాత్రలు

చేస్తూ ఉన్న అర్జునుని నాగ కన్య ఉలూపి చూచి ప్రేమించింది. అతనిని నాగలోకం తీసుకొని వెళ్లింది. అక్కడు అర్జునుడు ఆమెను వివాహ మాడాడు. తరువాత అర్జునుడు మణిపూరము అనే నగరానికి వెళ్లాడు. మణిపూరమునకు రాజైన చిత్రవాహనుని కూతురు చిత్రాంగద అనే రాకుమారిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ చిత్రాంగద కుమారుడే బభ్రువాహనుడు.).

అప్పుడు ఉలూపి బభ్రువాహనుని చూచి ఇలా అంది. "కుమారా! నేను కూడా నీ తల్లినే. నా పేరు ఉలూపి. నేను నాగ కన్యను. నీ తండ్రి అర్జునుడు మహా వీరుడు. ఆయనకు తన కుమారుడు పిరికివాని వలె ఉండటం నచ్చదు. అందుకని యాగాశ్వమును పట్టు. నీ తండ్రితో యుద్ధం చెయ్యి. ఆయన మీద గెలుపు సాధించు. ఎవరు గెలిచినా నేను, నీ తండ్రి ఆనందిస్తాము." అని పలికింది. ఆ మాటలకు ఆనందించాడు బభ్రువాహనుడు.

"అమ్మా! తండ్రితో యుద్ధం చేయడం సమంజసం కాదని ఊరుకున్నాను కానీ చేత కాక కాదు, చేవలేక కాదు. నా తండ్రి తనతో యుద్ధం చెయ్య మన్నాడు. నువ్వు కూడా తండ్రితో యుద్ధం చెయ్యమన్నావు. ఇంక నాకేం కావాలి. అర్జునునితో యుద్ధం చేసి నా తల్లితండ్రులకు ప్రియం చేకూరుస్తాను." అని పలికాడు.

బభ్రువాహనుడు తల్లికి నమస్కారము చేసి తండ్రిఅర్జునునితో యుద్ధమునకు సన్నద్ధం అయ్యాడు. బభ్రువాహనుడు ముందు యాగాశ్వమును బంధించాడు. అప్పుడు అర్జునుడు బభ్రువాహనునితో యుద్ధానికి దిగాడు. తండ్రి కొడుకులకు సమరం సంప్రాప్తించింది. ముందు బభ్రువాహనుడు అర్జునుని మీద బాణ వర్షం కురిపించాడు. కుమారుడు వేసిన బాణములను అన్నీ మధ్యలోనే ఖండించాడు అర్జునుడు. బభ్రువాహనుని

శరీరంలో నాటేటట్టు పదునారు శరములు ప్రయోగించాడు. బభ్రువాహనుడు అర్జునుని శరీరంలో నాటేట్టు 20 వాడి బాణములు ప్రయోగించాడు.

కుమారుని రణ కౌశలానికి మురిసిపోయాడు అర్జునుడు. ముందు బభ్రువాహనుని ధ్వజమును ఖండించాడు. బభ్రువాహనుని శరీరం నిండా బాణములు కొట్టాడు అర్జునుడు. కాని బభ్రువాహనుడు బెదరక ఒక బాణంతో అర్జునుని భుజం మీద కొట్టాడు. ఆ దెబ్బకు అర్జునునికి దిమ్మ తిరిగింది. కాని అంతలోనే తేరుకున్నాడు. కుమారుని విలువిద్యాకౌశలాన్ని మెచ్చుకున్నాడు. మరలా బభ్రువాహనుని మీద శరప్రయోగం చేసాడు. కాని అర్జునుడు ప్రయోగించిన బాణముల నన్నిటినీ మధ్యలోనే ముక్కలు చేసాడు బభ్రువాహనుడు.

కుమారుని అస్త్రవిద్యా కౌశలము చూచి అర్జునునిలో ఒకింత అసూయ జనించింది. కోపంతో బభ్రువాహనుని ఒంటి నిండా బాణములు గుచ్చాడు. బభ్రువాహనుడు కూడా పట్టరాని కోపంతో ఒకే ఒక్క బాణాన్ని అర్జునుని గుండెల్లో సూటిగా దిగేట్టు కొట్టాడు. ఆ బాణము అర్జునుని గుండెలను చీల్చి వెనక నుండి దూసుకొని పోయింది. అర్జునుడు భూమి మీద పడ్డాడు. పడుతూ పడుతూ బభ్రువాహనుని మీద బాణములు సంధించాడు. ఆ బాణముల ధాటికి బభ్రువాహనుడు కూడా నేలకూలాడు.

తన భర్త కుమారుడు యుద్ధంలో నేలకూలారు అన్న విషయం తెలిసి ఉలూపి గబా గబా యుద్ధభూమికి వచ్చింది. ఇంతలో బభ్రువాహనుని తల్లి చిత్రాంగద కూడా యుద్ధభూమికి వచ్చింది. ఉలూపిని చూచి ఇలా అంది.

"ఉలూపీ! చూచావా. నీ వలన ఎంత ఘోరంజరిగిందో. నీవే కదా

కుమారుని తండ్రి మీదికి యుద్ధానికి ఉసిగొల్పావు. దాని ఫలితంగా తండ్రికొడుకులు యుద్ధభూమిలో అచేతనం గా పడిపోయారు. నీవు పతివ్రతవు కావా! నీకు ధర్మం తెలియదా! ఏ కారణం చేత నీవు ఈ పసివాడిని తండ్రితోయుద్ధానికి పురిగొల్పావు. మహా వీరుడు అర్జునునితో ఈ పసివాడు యుద్ధం చెయ్యగలడా! కాబట్టి నీవే మన భర్తను పునరుజ్జీవితుడిని చెయ్యాలి. నీ వలననే ఇదంతా జరిగింది కాబట్టి మన భర్తను బతికించే బాధ్యత నీదే." అని నిక్కచ్చిగా చెప్పింది చిత్రాంగద.

తరువాత అర్జునుని చూచి ఇలా విలపించింది. "ఓ మహావీరా! నీవు ఎంతో మంది ప్రాణాలు కాపాడావు. కానీ నీ ప్రాణాలు నీవు కాపాడుకోలేకపోయావు కదా! నాధా! ఎన్నాళ్లయింది నిన్ను చూచి. నేను చిత్రాంగదను వచ్చాను. కళ్లు తెరిచి చూడండి. మీరు మీ అన్నగారి యాగాశ్వమును కాపాడాలికదా! లేవండి. యాగాశ్వము వెంట వెళ్లండి." అని శోకించింది చిత్రాంగద.

మరలా ఉలూపి వంక చూచి "ఈయన మన ఇద్దరికీ భర్త. నా కొడుకు చేతిలో నా భర్త మరణించేట్టు చేసావు. ముందు నా భర్తను బతికించు. లేకపోతే నేను ఇప్పుడే ఇక్కడే ప్రాయోపవేశం చేసి మరణిస్తాను." అని ధృఢంగా చెప్పింది చిత్రాంగద.

ఇంతలో బభ్రువాహనుడు మూర్ఛనుండి లేచాడు. ఏడుస్తున్న అమ్మ చిత్రాంగదను చూచాడు. "అమ్మా! నీవు శోకించడం నేను ఎన్నడూచూడలేదు. ఇది కూడదు, తగదు అని కూడా చూడకుండా నా తండ్రిని యుద్ధంలో చంపిన పాపాత్ముడను. నా పాపానికి నిష్కృతి లేదు." అని అమ్మ పక్కనే కూర్చుని విలపిస్తున్నాడు.

ఇంతలో యాగాశ్వము వెంట వచ్చిన యాజ్ఞవల్క్యుని శిష్యులు, తక్కిన బ్రాహ్మణులు అక్కడకు వచ్చారు. "అయ్యో! ఈ బ్రాహ్మణులు అర్జునుని అనుసరించి వచ్చినట్టున్నారు. వీరు ఏ పని మీద వచ్చారో కదా! కాని అర్జునుడు ఇలా విగతజీవుడై పడి ఉన్నాడు." అని శోకిస్తున్నాడు బభ్రువాహనుడు.

ఉలూపిని చూచి "అమ్మా! నీ మాట మీదనే కదా నిన్ను సంతోషపరచ డానికే కదా అమ్మా నేను నా తండ్రిగారితో యుద్ధం చేసాను. కాని నా తండ్రిగారు యుద్ధంలో మరణించారు. ఇప్పుడు నీకు సంతోషంగా ఉందా అమ్మా. కాని నేను నా తండ్రిని చంపానమ్మా. నా పాపానికి నిష్కృతి లేదు. జీవితాంతం నాకు మనశ్శాంతి లేదు. చచ్చిన తరువాత కూడా నాకు ఉత్తమ లోకాలు ఉండవు." అని విలపిస్తున్నాడు.

తరువాత బభ్రువాహనుడు పైకి లేచాడు. తన తల్లి చిత్రాంగద. ఉలూపి, అక్కడ చేరిన జనులు వింటూ ఉండగా ఇలా అన్నాడు. "నా తండ్రిలేని లోకంలో నేను బదుకలేను నా తండ్రితో పాటు నేను కూడా ప్రాయోపవేశము చేస్తాను. ఎందుకంటే నేను వీరుడు, రాజు, ధార్మికుడూ, మీదు మిక్కిలి నా తండ్రి అయిన అర్జునుని చంపాను. నా పాపానికి విముక్తి కలగాలంటే నాకు ప్రాయోపవేశమే శరణ్యము." అని నేల మీద మౌనంగా కూర్చున్నాడు.

అప్పటి దాకా ఒక్క మాట కూడా మాట్లాడకుండా నిల్చుని ఉన్న ఉలూపి కళ్లు మూసుకుంది. తన మనస్సులో నాగ జాతికి ప్రియమైన సంజీవనీ మణిని స్మరించింది. వెంటనే సంజీవనీ మణి ఆమె చేతిలో ప్రత్యక్షం అయింది.

"కుమారా! బభ్రువాహనా! ఏమిటయ్యా ఈ వెర్రి. మీ అందరికీ పిచ్చి పట్టిందా. లేకపోతే అర్జునుడు ఏమిటి! చావడం ఏమిటి! ఆయన ఎవరు.

సాక్షాత్తు దేవేంద్రుని కుమారుడు. మహావీరుడు. నీ శక్తిని పరీక్షించడానికి అర్జునునితో యుద్ధం చేయమన్నాను. నీతో యుద్ధం చేయాలి అన్న నీ తండ్రి అర్జునుని అభిమతమూ నెరవేర్చాను. మీ ఇద్దరూ మూర్ఛపోయేట్టు చేసాను. ఇదంతా మీ భ్రమ. మీలో ఎవరూ చావలేదు. చూడు. ఇప్పుడు నీ తండ్రి అర్జునుడు లేచి కూర్చుంటాడు." అని పలికింది ఉలూపి.

ఆ మాటలకు అందరూ ఆశ్చర్యపోయారు. ఆనందించారు. ఉలూపి ఆ మణిని బభ్రువాహనుని చేతి లో పెట్టి "కుమారా ఈ మణిని అర్జునుని హృదయం మీద పెట్టు." అని చెప్పింది. ఆ ప్రకారమే బభ్రువాహనుడు ఆ మణిని అర్జునుని గుండెల మీద పెట్టాడు.

అప్పుడే నిద్ర నుండి లేచినట్టు అర్జునుడు లేచి కూర్చున్నాడు. చుట్టు చూచాడు. తన కుమారుడు బభ్రువాహనుని చూచి "కుమారా! నీకు సేమమే కదా!" అని కుశల ప్రశ్నలు వేసాడు. అప్పుడు బభ్రువాహనుడు తండ్రి కాళ్లకు మొక్కాడు. "తండ్రిగారూ! తమరి దయవలన అందరూ క్షేమమే" అన్నాడు. అర్జునుడు చుట్టు చూచాడు. తన భార్యలు చిత్రాంగద, ఉలూపి, తన తో వచ్చిన బ్రాహ్మణులు అక్కడ నిలబడి ఉన్నారు. వారందరినీ కలయ చూచాడు.

"కుమారా! వీరందరి ముఖాలలో ఆశ్చర్యము, సంతోషము, దాని వెనక విషాదమూ కనిపిస్తున్నాయి. పైగా, నేను నీతో యుద్ధము చేస్తున్నాను. ఇక్కడకు చిత్రాంగద, ఉలూపి ఎందుకు వచ్చారు. ఏం జరిగింది." అని అడిగాడు అర్జునుడు.

అప్పుడు బభ్రువాహనుడు ఉలూపిని చూపి "తండ్రీ! అంతా ఈమెను అడగండి. ఈ మహానుభావురాలు మీకు జరిగిన విషయం సవిస్తరంగా

తెలియజేస్తుంది." అని అన్నాడు.

అప్పుడు అర్జునుడు ఉలూపి వంక చూచి "ఉలూపీ! ఏం జరిగింది. కుమారుడు బభ్రువాహనుడు గానీ, అతని తల్లి చిత్రాంగద కానీ ఏమైనా నీ పట్ల అనుచితంగా ప్రవర్తించారా! నీరాకకు కారణమేమి?" అని అడిగాడు.

అప్పుడు ఉలూపి చిరునవ్వు నవ్వి "నాథా! ఇందులో ఎవరి తప్పూ లేదు. ఎవరూ ఏమీ చేయలేదు. అయినా నీవు, కుమారుడు బభ్రువాహనుడు, సోదరి చిత్రాంగద తప్పుచేయగలరా! కలలోమాట. తమరు నా పట్ల కోపగించకుండా సావధాన చిత్తులై నేను చెప్పునది వినండి. తమరూ కుమారుడు యుద్ధం చేస్తుంటే కుమారుడి వల్ల తమరికి అశుభం జరిగింది.

దీనికీ ఒక కారణం ఉంది. అది ఏమంటే, తమరు యుద్ధంలో శిఖండిని ముందు పెట్టుకొని తాతగారు, గంగాపుత్రుడు అయిన భీష్ముని పడగొట్టారు. దాని వలన మీకు పాపము సంక్రమించింది. తమరు ఆ పాపమునకు ప్రాయశ్చిత్తము చేసుకోకుండా మరణిస్తే తమరికి నరక ప్రాప్తి కలుగుతుంది. అందుకని నేను పాతాళ లోకము నుండి వచ్చి తమరి పాపమును నివృత్తి చేసాను. అది ఎలాగంటే.....

నేను ఒక రోజు గంగానదిలో స్నానం చేస్తున్నాను. అప్పుడు వసువులు కూడా వచ్చి ఆ నదిలో స్నానం చేస్తున్నారు. అప్పుడు గంగాదేవి తన స్వస్వరూపంతో వారితో మాట్లాడుతూ ఉంది. అప్పుడు వసువులు గంగాదేవితో ఇలా అన్నారు. "మాతా! భీష్ముడు నీ కుమారుడు. మాలో ఒకడు. ఆయనను అర్జునుడు శిఖండిని అడ్డుపెట్టుకొని పడగొట్టాడు. కాని భీష్ముడు తన నియమం ప్రకారం శరసంధానం చెయ్యలేదు. అందుకని భీష్ముడు అంపశయ్య

మీద పడిపోయాడు. తరువాత పరమపదించాడు. నిరాయుధుడైన భీష్ముని పడగొట్టి అర్జునుడు కుత్సితమైన, నీచమైన  విజయం సాధించాడు. అతనికి మేము శాపం ఇవ్వదలిచాము."   అని అన్నారు. వసువుల మాటలకు గంగాదేవి తన ఆమోదము తెలిపింది.

ఇదంతా విన్న నేను వెంటనే నా తండ్రి నాగరాజు వద్దకు పోయి జరిగింది అంతా చెప్పాను. నా తండ్రి వెంటనే వసువుల దగ్గరకు పోయి వారిని అనేక విధాల అర్జునుని కాపాడమని ప్రాధేయపడ్డాడు.  కొంత సేపటికి వారు కరుణించారు. కాని ఒక నియమం పెట్టారు.  అర్జునుడు తన కుమారుడైన బభ్రువాహనుని తో యుద్ధం చేసి అతని చేతిలో ఓడిపోయి నేలకొరిగితే అప్పుడు అర్జునుని పాపము తొలగిపోతంది.  అని అన్నారు. మా నాన్నగారు ఆ విషయం నాకు చెప్పారు.

నేను సమయం కొరకు వేచి ఉన్నాను.  ఇంతలో తమరు ఇక్కడకు వచ్చారు. బభ్రువాహనుని యుద్ధం చేయమని అడిగారు.  ఆ సమయంలో కుమారుడు బభ్రువాహనుడు తమతో యుద్ధం చేయడానికి మనసురాక నగరానికి వెళుతున్నాడు. ఇదంతా నేను దివ్య దృష్టితో గ్రహించాను. వసువులు చెప్పిన పని చేయడానికి ఇదే సమయమని తలచి  వెంటనే ఇక్కడకు వచ్చాను. నేను  కుమారుడు బభ్రువాహనుని తమతో యుద్ధము చేయుటకు పురికొల్పాను. ఈ రణము నీకు ధర్మము. నీకు ప్రియము అని బభ్రువాహనుని రెచ్చగొట్టాను. తరువాత కథ మీకు తెలిసిందే. కుమారుని చేతిలో మీరు ఓడిపోయి పడిపోయారు. దానితో మీ పాపం నశించిపోయింది.  ఇదీ జరిగింది." అని వివరించింది ఉలూపి.

ఆ మాటలు విన్న అర్జునుడు ఎంతో  ఆనందం పొందాడు.  అర్జునుడు

అందరినీ చూచి ఇలా అన్నాడు. "రాబోవు చైత్రశుద్ధపౌర్ణమినాడు హస్తినాపురములో అశ్వమేధ యాగము జరుగుతుంది. తాము అందరూ బంధు మిత్ర సపరివార సమేతంగా రావాలని ధర్మజుల వారి ఆహ్వానము మీకు అందిస్తున్నాను." అని అందరినీ సాదరంగా యాగమునకు ఆహ్వానించాడు.

"తండ్రిగారూ! తమరు చెప్పినట్టే చేస్తాము. కానీ మీరు మా నగరమునకు వచ్చి మా ఆతిధ్యము స్వీకరించ వలెనని ప్రార్ధన." అని ప్రార్ధించాడు బభ్రువాహనుడు.

" కుమారా! నేను యాగ దీక్షలో ఉన్నాను. నగర ప్రవేశము చెయ్యను. అని అన్నాడు అర్జునుడు. తరువాత అర్జునుడు తన భార్యలు చిత్రాంగద, ఉలూపి వద్ద సెలవు తీసుకొని మరలా యాగాశ్వమును అనుసరిస్తూ వెళ్లాడు.

ఆ యాగాశ్వము అలా తిరుగుతూ తిరుగుతూ రాజగృహం అనే నగరానికి చేరింది. రాజగృహాన్ని జరాసంధుని మనుమడు మేఘసంధి అనే వాడు పరిపాలిస్తున్నాడు. మేఘసంధి హయమును పట్టుకున్నాడు. అర్జునునితో యుద్ధానికి సన్నద్ధం అయ్యాడు. "ఇదేమన్నా విరాట రాజు అంతః పురము అనుకున్నావా ఆడవాళ్ల మధ్య తిరిగినట్టు తిరగడానికి. నేను హయమును పట్టుకున్నాను. నాతో యుద్ధం చెయ్యి" అని అర్జునుని కవ్వించాడు.

అప్పుడు అర్జునుడు నవ్వి ఇలా అన్నాడు. "రాజా! నాకు నీ మీద ఎలాంటి కోపమూ లేదు. ఇది యాగాశ్వము. దీనిని పట్టుకొన్న వారిని చంపవద్దని మా అన్నగారి ఆజ్ఞ. ఆ విషయం నీకు చెప్పాను. తరువాత నీ ఇష్టం." అని అన్నాడు అర్జునుడు.

ఆ మాటలను అర్జునుని బలహీనతగా తీసుకున్నాడు మేఘసంధి. అర్జునుని మీద అస్త్ర వర్షము కురిపించాడు. అర్జునుడు తనను తాను రక్షించు కుంటూ మేఘ సంధి వేస్తున్న బాణములను ముక్కలు చేస్తున్నాడే తప్ప మేఘ సంధిని గానీ అతని సారధిని గానీ  గాయపరిచే ప్రయత్నం చెయ్యడం లేదు. మేఘ సంధి రథమును కప్పేట్టు బాణములు సంధించాడు అర్జునుడు. కాని మేఘ సంధి ఇది అలుసుగా తీసుకొని అర్జునుని శరీరం అంతాబాణములతో కొట్టాడు.

అర్జునునికి కోపం వచ్చింది.  ఇంక లాభం లేదనుకున్నాడు. అన్నగారి మాట పక్కన పెట్టాడు. మేఘసంధి రథమునకు కట్టిన గుర్రములను చంపాడు. సారధిని చంపాడు. అతని పతాకమును కూల్చాడు.  రథమును కూలగొట్టాడు. మేఘసంధి రథము నుండి కిందికి దూకాడు. గదను చేతిలోకి తీసుకున్నాడు. గదను  తిప్పుతూ అర్జునుని మీదికి దూకాడు.  అప్పుడు కూడా మేఘ సంధిని అర్జునుడు కొట్టలేదు. కేవలం అతని గదను మాత్రం విరగ్గొట్టాడు. నిరాయుధుడుగా నిలబడి ఉన్న మేఘ సంధిని చూచి అర్జునుడు ఇలా అన్నాడు.

"ఓ రాజా! మా అన్న మాట  ప్రకారము నేను నిన్ను చంపలేదు. అందుకనే ఇప్పటిదాకా బతికి ఉన్నావు. ఏదో క్షత్రియ ధర్మమును పాటించి అశ్వమును పట్టుకున్నావు. నాతో యుద్ధం చేసావు. ఇంక చాలు. శాంతి వహించు." అనిఅన్నాడు అర్జునుడు.

మేఘ సంధి కూడా ఆలోచించాడు. అదే మేలనుకున్నాడు. అర్జునునికి ప్రణామం చేసాడు. అర్జునుడు మేఘ సంధిని కౌగలించుకున్నాడు.  అశ్వమేధ యాగమునకు అన్నగారు ధర్మజుని ఆహ్వానమును మేఘ సంధికి అందచేసాడు. బంధుమిత్రసపరివార సమేతంగా రాబోవు చైత్రశుద్ధపౌర్ణమి నాడు జరగబోయే

అశ్వమేధయాగమునకు రమ్మని ఆహ్వానించాడు. ఆ ఆహ్వానమును మన్నించాడు మేఘసంధి. తరువాత అర్జునుడు యాగాశ్వమును అనుసరిస్తూ వెళ్లాడు.

ఆ అశ్వరాజము వంగ దేశము, పౌండ్రదేశము, మ్లేచ్ఛదేశము, మొదలగు దేశములలో సంచరించింది. అర్జునుడు ఆయాదేశ రాజులను జయించాడు. ధర్మజుని ఆహ్వానమును వారికి అందజేసాడు. తరువాత ఆ హయము ఛేది దేశములో ప్రవేశించింది. ఛేది దేశము రాజు శరభుడు. శరభుడు శిశుపాలుని కుమారుడు. మొదట శరభుడు యాగాశ్వమును బంధించినా, అంతలో తెలివితెచ్చుకొని దానిని విడిచిపెట్టి అర్జునుని ఆదరించాడు. అర్జునుడు అతనికి కూడా ధర్మజుని యాగ ఆహ్వానమును అందించాడు.

తరువాత అర్జునుడు టెంకణ దేశపు రాజు అయిన కిరాత రాజును జయించాడు. తరువాత కోసల, కాశీ రాజులను జయించాడు. తరువాత దశార్ణ దేశాధీశుడు చిత్రాంగదుడు కూడా మొదట అర్జునుని ఎదిరించినా తరువాత లొంగిపోయాడు. తరువాత హయము నిషాద దేశము చేరింది.

ఆ దేశమును ఏకలవ్యుని కుమారుడు పరిపాలిస్తున్నాడు. అతడు అర్జునుని మీదికి ససైన్యంగా యుద్ధానికి వచ్చాడు. కాని ఎంతో కాలం అర్జునుని ముందు నిలువలేకపోయాడు. తుదకు అర్జునునికి లొంగిపోయాడు.

తరువాత ఆ హయము దక్షిణంగా ప్రయాణం చేసింది. పౌండ్రదేశము, ఆంధ్రదేశము, ద్రవిడ దేశము, కేరళ దేళము, కర్ణాటక దేశములలో సంచరించింది. అర్జునుడు ఆయాదేశాధీశులను యుద్ధం చేసి ఓడించాడు. తరువాత ఆ హయము సౌరాష్ట్ర దేశములో ప్రవేశించింది. గోకర్ణం చేరింది. తరువాత ద్వారక ప్రవేశించింది.

అర్జునుని రాక విన్న యాదవులు ఆయనకు ఎదురు వెళ్లి ఆయనను స్వాగత సత్కారములు చేసారు. తరువాత ఆ హయము పశ్చిమ సముద్ర తీరము గుండా పాంచాల దేశమును చేరింది. తరువాత గాంధార దేశములో ప్రవేశించింది.

గాంధార దేశమును శకుని కుమారుడు పరిపాలిస్తున్నాడు. అతడు కూడా బాల్య చాపల్యం చేత అర్జునుని  ఎదుర్కొన్నాడు. అర్జునుడు తన అన్నగారి ఆజ్ఞను తెలియ చేసాడు. కాని శకుని కుమారుడు వినలేదు. మొండిగా యుద్ధం చేసాడు. గాంధార సేన అంతా అర్జునుని చేతిలో నాశనమయింది. కాని శకుని కొడుకు పట్టు విడువ లేదు. ఒంటరిగానే అర్జునుని ఎదుర్కొన్నాడు.  అతని బలపరాక్రమములకు అర్జునుడు ముచ్చట పడ్డాడు. అతనితో ఇలా అన్నాడు.

"కుమారా! మా అన్న ధర్మరాజు నన్ను ఎవరినీ చంప వద్దని, అశ్వమేధ యాగమునకు ఆహ్వానమును అందజేయమని నన్ను పంపాడు.  కాబట్టి నా మాట విను.  ఈ అనవసర యుద్ధము మాను." అని అనునయించాడు. కానీ ఆ శకుని కొడుకు అర్జునుని మాటలు వినలేదు.  పదునైన బాణములను అర్జునుని మీద ప్రయోగించాడు. విధి లేక అర్జునుడు శకుని కుమారుని కిరీటము నేల పడేట్టు కొట్టాడు.

అది చూచిన అందరూ కావాలంటే ఆ బాణంతో శకుని కుమారుని తల ఎగుర గొట్టి ఉండేవాడు. ఆహా అర్జునుడు ఎంత దయగలవాడు అని అనుకున్నారు. కాని శకుని కుమారునికి బుద్ధి రాలేదు. మరలా అర్జునుని మీద బాణములు ప్రయోగించాడు. అర్జునుడు కేవలం అతను వేసిన అస్త్రములను శస్త్రములను తిప్పి కొట్టాడు.  ఇది చూచిన గాంధార సేనలు పారిపోయాయి.

శకుని కుమారుడు అర్జునునితో యుద్ధం చేస్తున్నాడు అని తెలిసి అతని తల్లి, మంత్రులు యుద్ధ భూమికి వచ్చారు. శకుని కుమారుని విడిచిపెట్టమని అర్జునుని వేడుకున్నారు. అర్జునుడు వెంటనే యుద్ధం ఆపాడు. శకుని భార్యకు నమస్కారం చేసాడు. శకుని కుమారునితో ఇలా అన్నాడు.

"కుమారా! నీవు నాతో యుద్ధం చేయడం నాకు బాధ కలిగించింది. ధర్మరాజు ఎవరినీ చంపవద్దు అని ఆజ్ఞాపించాడు. ఆ విషయం నేను నీకు చెప్పాను. కానీ నీవు వినలేదు. అయినా నేను నిన్ను చంపలేదు. పైగా నీవు మా పెదనాన్న గారు ధృతరాష్ట్రునికి, పెదతల్లి గాంధారికి దగ్గర బంధువు. అందుకని నిన్ను చంపలేదు. ఇంక నైనా శాంతి వహించు. అయినా నాతో యుద్ధం నీకు ఎందుకయ్యా. మనం ఏమన్నా శత్రువులమా చెప్పు." అని అన్నాడు.

ఆ మాటలకు శకుని కుమారుడు శాంతించాడు. తరువాత అర్జునుడు ధర్మరాజు ఆహ్వానమును అందచేసాడు. "రాబోవు చైత్రశుద్ధపౌర్ణమి నాడు జరుగబోవు అశ్వమేధ యాగమునకు తామందరూ తరలి రావాలి." అని ఆహ్వానించాడు. తరువాత అర్జునుడు యాగాశ్వమును వెంబడించాడు. ఆ అశ్వము హస్తినాపురమునకు తిరుగు ప్రయాణమయింది.

అర్జునుడు యాగాశ్వాన్ని వెంబడిస్తూ ఆయాదేశాల రాజులను జయిస్తూ దిగ్విజయం గా పర్యటిస్తున్న విషయములను ఎప్పటికప్పుడు చారుల వలన తెలుసుకుంటూ ధర్మరాజు పరమానంద భరితుడవుతున్నాడు. ఇంతలో మాఘ శుద్ధ పూర్ణిమ రానే వచ్చింది. ఆ రోజు ధర్మరాజు నిండుకొలువులో ఆశీనుడై ఉన్నాడు. తన తమ్ములను కొలువు కూటమునకు రావించాడు. భీముని చూచి ధర్మరాజు ఇలాఅన్నాడు.

" భీమసేనా! నీ తమ్ముడు అర్జునుడు అశ్వమేధ యాగాశ్వము వెంట జైత్రయాత్ర ముగించుకొని తిరిగి వస్తున్నాడని వర్తమానం వచ్చింది. నీకు తెలియదా! చైత్ర మాసం రావడానికి ఎంతో సమయం లేదు. మహామునులను, రాజులను ఆహ్వానించాలి. తగిన వార్తాహరులను సిద్ధం చెయ్యి. అలాగే యాగ నిర్వహణకు ఒక యజ్ఞశాలను నిర్మించ డానికి సన్నాహాలు చెయ్యి. యాగమునకు వచ్చు రాజులకు, మునులకు, ప్రముఖులకు తగు విడిది ఏర్పాట్లు చెయ్యండి. తగిన అతిథి గృహములను నిర్మించండి." అని ఆదేశించాడు.

భీముడు వెంటనే వాస్తు శిల్పులను పిలిపించి, యాగశాలను, విడిది గృహములను వెను వెంటనే నిర్మింపజేసాడు. భూమండలం అంతా తిరిగి రాజులను, మునులను ఆహ్వానించడానికి బ్రాహ్మణులను పంపించాడు. ధర్మరాజు ఆహ్వానమును బ్రాహ్మణుల ద్వారా అందుకున్న రాజులు తమ తమ సైన్యములతోనూ, మునులు తమ తమ శిష్యబృందములతోనూ హస్తినాపురము చేరుకున్నారు. వారందరినీ చూచి ధర్మరాజు మహదానందభరితుడయ్యాడు. వారి వారి అంతస్తులను బట్టి వారికి అతిథి మర్యాదలు, భోజన సదుపాయాలు, విడుదులు ఏర్పాటు చేయించాడు. ఈ ఏర్పాట్లన్నీ సేవకులకు అప్పగించకుండా, ధర్మరాజు తానేస్వయంగా పర్యవేక్షించసాగాడు.

భీముని ఆధ్వర్యంలో నిర్మింపబడిన యాగశాలను, అతిథి గృహములను చూచి శ్రీ కృష్ణుడు, వచ్చిన అతిథులు, ఎంతో సంతోషించారు. అతిథి సత్కారాలు ఎలా ఉన్నాయంటే, జనమేజయ మహారాజా! లక్షమంది ఒక సారి భోజనం చేస్తే, ఒక నగారా మోగుతుంది. ఆ నగారా ఎడతెరిపి లేకుండా మోగుతూనే ఉంది. అంటే అనుక్షణం లక్షమంది భోజనంచేయడం పూర్తిచేస్తున్నారన్న మాట! అని జనమేజయుని వైశంపాయనుడు చెప్పాడు. ఇంకా ఇలా చెప్పసాగాడు.

ధర్మరాజు, భీమసేనుడి సాయంతో, వచ్చిన ఆహూతులను పూజించాడు. ఆ పూజలందుకున్న శ్రీ కృష్ణుడు, బలరాముడు, సాత్యకి, యాదవ ప్రముఖులు మొదలగువారు ఎంతో సంతోషించారు. ఇంతలో అర్జునుని దగ్గర నుండి వర్తమానము వచ్చిందని శ్రీ కృష్ణుడు ధర్మరాజుతో చెప్పాడు.

" ధర్మనందనా! అర్జునుడు తాను కలిసిన రాజులందరినీ అశ్వమేధ యాగమునకు ఆహ్వానించాడట. వారందరూ యాగమునకు వస్తున్నారట. వారు ఇదివరకు మనకు విరోధులైనా, ప్రస్తుతం మన ఆహ్వానము మేరకు వస్తున్నారు కాబట్టి వారిని పూజించడం ఆదరించడం మన విధి. అదీ కాకుండా మణీపురాధీశుడు, నా (అర్జునుని) కుమారుడు అయిన బభ్రువాహనుడు యాగమునకు వస్తున్నాడు. అతనికి తగు మర్యాదలు చెయ్యండి. అని అర్జునుడు తమరికి తెలియజేయమన్నాడు." అని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పాడు.

ఆ మాటలు విన్న ధర్మరాజు ఎంతో సంతోషించాడు. శ్రీకృష్ణుని తో ఇలా అన్నాడు. "శ్రీ కృష్ణా! నేనూ విన్నాను. అర్జునుడు ఎంతో మందితో యుద్ధం చేసి వారిని ఓడించి వారికి ఆహ్వానమును అందజేసాడు అని. కృష్ణా! అర్జునుడు మొన్న జరిగిన యుద్ధంలో భీష్మ,ద్రోణ,కర్ణులు మొదలగు మహాయోధులతో యుద్ధం చేసి ఎంతో శ్రమ పడ్డాడు. మరలా ఇంతలోనే ఈ అశ్వమేధ యాగము కొరకు మరలా యుద్ధములలో పాల్గొన్నాడు. అకటా! నావలన అర్జునునికి ఎన్ని కష్టములు కలుగుతున్నాయి. కృష్ణా! నిన్ను ఒక మాట అడుగుతాను. అర్జునుని దేహము అనేకమైన మంచి లక్షణములతో కూడినది కదా! మరి ఈ యుద్ధములు ఒకటి వెంట ఒకటి అతనికి వెంట వెంటనే ఎందుకు సంప్రాప్తిస్తున్నాయి. అతనికి ఏ అంగములో ఏదైనా దోషము ఉందా! నీకేమైనా తెలుసా!" అని అడిగాడు ధర్మరాజు.

ఆ మాటలకు శ్రీ కృష్ణుడు ఇలా అన్నాడు. "ధర్మనందనా! నీవు చెప్పినది నిజమే. అర్జునుడు సకల సులక్షణ సమన్వితుడు. కాని ఒకటే లోపము. అతని చిరుతొడలు (పిక్కలు) మాత్రము అతని శరీరానికి తగినట్టు కాకుండా కొంచెం ఎక్కువగా ఉన్నాయి. అదే అతని శరీరంలో లోపం. దాని వలననే అతనికి ఈ కష్టాలు కలుగుతున్నాయేమో అని అనుమానంగా ఉంది. కానీ అర్జునుని కష్టాలు అన్నీ తొలగిపోయాయి. ఇంక అతనిని ఏ కష్టమూ వరించదు." అని అన్నాడు కృష్ణుడు.

ఇంతలో అర్జునుని వద్దనుండి ఒక దూత అక్కడకు వచ్చాడు. ఆ దూత ధర్మరాజుకు నమస్కరించి "మహారాజా! అర్జునులవారు హస్తినాపుర సమీపానికి విచ్చేసారు. రేపు తమ దర్శనం చేసుకుంటారు అని తమరికి మనవి చేయమన్నారు." అని చెప్పాడు.

ఆ మాటలు విని ధర్మరాజు, భీమ, నకుల సహదేవులు, శ్రీ కృష్ణుడు పరమానందభరితులయ్యారు. అర్జునుని రాక కోసం ఎదురు చూస్తున్నారు. మరునాడు అర్జునుడు యజ్ఞాశ్వము ముందు నడువగా హస్తినాపుర ప్రవేశము చేసాడు. వందిమాగధులు, హస్తినాపుర ప్రజలు అర్జునుని విజయ యాత్రా విశేషములను వేనోళ్ల పొగుడుతున్నారు. అర్జునుడు యాగశాలనుసమీపించాడు. ధర్మరాజు, భీముడు,నకుల సహదేవులు, శ్రీకృష్ణుడు, బలరాముడు, యాదవులు అర్జునునికి ఎదురు వెళ్లి స్వాగతం పలికారు. అర్జునుని సాదరంగా యాగశాలము తీసుకొని వచ్చారు.

అర్జునుడు ధృతరాష్ట్రుడు, గాంధారిని దర్శించి నమస్కరించాడు. తరువాత తన తల్లి కుంతీ దేవిని కలిసి ఆమె ఆశీర్వాదాలు తీసుకున్నాడు. ఇంతలో అర్జునుని కుమారుడు బభ్రువాహనుడు, అర్జునుని భార్యలు

చిత్రాంగద, ఉలూపి హస్తినకు చేరుకున్నారు. వారందరిని తీసుకొని అర్జునుడు ధర్మరాజు వద్దకు వెళ్లాడు. తన భార్యలను, కుమారుడిని ధర్మరాజుకు పరిచయం చేసాడు. తరువాత ధృతరాష్ట్రుడు గాంధారిలను కలిసి వారి ఆశీర్వాదములు అందుకున్నాడు. తల్లి కుంతీదేవికి కోడళ్లను, మనుమడిని చూపించాడు. కుంతీదేవి వారిని ఆదరంతో ఆశీర్వదించింది.

తరువాత చిత్రాంగద, ఉలూపి తమ అక్కగారలైన ద్రౌపది,సుభద్రలను కలుసుకొన్నారు. అందరూ అరమరికలు లేకుండా హాయిగా మాట్లాడుకున్నారు. ఆ ప్రకారంగా అశ్వమేధయాగమునకు సర్వసన్నాహాలు పూర్తి అయ్యాయి. ఇంతలో యాగము మొదలు పెట్టవలసిన రోజు వచ్చింది.

వ్యాసుడు ధర్మరాజును చూచి ఇలా అన్నాడు. "ధర్మనందనా! ఈ యజ్ఞము చాలా గొప్పది. ఈ యాగమునకు కావలసిన ధనము నీవు సంపాదించావు. కాబట్టి యాగమును నిర్విఘ్నంగా నెరవేర్చు. అశ్వమేధ యాగము సమాప్తము అయ్యేరోజున చేసే స్నానము అతి పవిత్రమైనది. ఆ స్నానముతో నీ సమస్తపాపములు తొలగిపోతాయి. నీవు భారతయుద్ధములో అన్నదమ్ములను, గురువులను, పితరులను,పితామహులను, బంధువులను సంహరించిన పాపములన్నీ ఆ స్నానంతో తొలగిపోతాయి. నీకు శుభం కలుగుతుంది." అని చెప్పాడు వ్యాసుడు.

వ్యాసుని ఆదేశం ప్రకారం ధర్మరాజు యజ్ఞదీక్ష పూనాడు. ఋత్విక్కులు యజ్ఞకాండ నిర్వర్తిస్తున్నారు. మంత్రాలు పఠిస్తూ అగ్నిలో హోమద్రవ్యాలు వేలుస్తున్నారు. వేద మంత్రములను ఉచ్ఛరిస్తూ సోమ లతల నుండి సోమరసాన్ని పిండుతున్నారు. యజ్ఞమునకు వచ్చిన వారందరికీ భోజన సదుపాయములు సమకూర్చడం భీముడు పర్యవేక్షిస్తున్నాడు. అందరి చేతా

కొసరి కొసరి తినిపిస్తున్నాడు. లేదు అన కుండా సంతర్పణలు చేస్తున్నాడు. యజ్ఞమునకు వచ్చిన వారు ఎవరూ ఒట్టి చేతులతో వెళ్లడం లేదు. ఆ యజ్ఞవాటిక దేవయజ్ఞమును తలపిస్తూ ఉంది. భూలోకంలో ఈ విధంగా అశ్వమేధయాగము జరుగుతుంటే దేవతలుకూడా ఆకాశము నుండి చూస్తున్నారు.

ప్రధాన యజ్ఞ వాటికను బంగారు ఇటుకలతో చతుర ప్రాకారంలో నిర్మించారు. ఎటు చూచినా 18 మూరలు ఉండేట్టు నిర్మించారు. యజ్ఞవాటిక గరుడుని ఆకారంతో నిర్మితమయింది. ఋత్విక్కులు ఊపస్తంభములు పాతారు. దానికీ ఒకసంఖ్య ఉంది. మొత్తం 21 ఊపస్తంభములు నిర్మించారు. ఖాదిరములతో చేసిన స్తంభములు 6, బిల్వ కర్రలతో చేసినవి 6, మోదుగ కర్రతో చేసినవి 6, దేవదారు కర్రలతో చేసినవి 2, శ్లేషాతక చెట్టు కొయ్యతో చేసినవి 1, మొత్తం 21 ఊపస్తంభములు పాతారు. ఇవి కాకుండా ఇంకా బంగారం తో చేసిన స్తంభములు అనేకములు అలంకరణార్థము పాతారు. ఆ ఊపస్తంభములకు నాలుగు కాళ్ల జంతువులను, వివిధ పక్షులను, జలచరములను కట్టారు. ఆ ప్రాణులు మొత్తం 300. అందులో ప్రధాన ఊప స్తంభమునకు యజ్ఞాశ్వమును కట్టారు.

ఆ యజ్ఞమునకు వేదవ్యాసుని శిష్యబృందము వచ్చింది. అందరిలో వారు ప్రధానంగా ప్రకాశిస్తున్నారు. తరువాత ఊప స్తంభములకు కట్టిన 300 జంతువులను, పక్షులను, జలచరములను చంపారు. తరువాత యజ్ఞాశ్వమును చంపే సమయం వచ్చింది. అప్పుడు ద్రౌపదిని యజ్ఞాశ్వము దగ్గరగా ఉండమన్నారు. దేశమంతా తిరిగి వచ్చిన ఆ యజ్ఞాశ్వమును చంపారు. ఆ అశ్వము యొక్క వివిధ అవయవములు అన్ని ద్రౌపది తన స్వహస్తములతో అగ్నిలో వేసి దేవతలకు హవిస్సుల రూపంలో అందజేసింది. యజ్ఞాశ్వము

యొక్క మాంసము హోమగుండములో కాలుతుంటే, అందులో నుండి వచ్చే పొగను, వాసనను పీల్చి, పాండవులు, ద్రౌపది ఎంతో ఆనందించారు. తరువాత యజ్ఞాశ్వము యొక్క మిగిలిన మాంసమును ఋత్విక్కులు శాస్త్ర విధిగా హోమగుండములో వేసారు. దానితో అశ్వమేధ యాగము పూర్తి అయింది.

ధర్మరాజు సదస్యులకు కోటి వేల నిష్కములు దక్షిణగా ఇచ్చాడు. భూదానం కింద ధర్మరాజు తన రాజ్యమును వ్యాసునికి దానంగా ఇచ్చాడు. అప్పుడు వ్యాసుడు ఇలా అన్నాడు.

"ధర్మనందనా! నీవునాకు భూమిని దానంగా ఇచ్చావు. మేము నీవు ఇచ్చిన భూమి ఏం చేసుకుంటాము. దానికి సమానమైన బంగారమును దానంగా ఇవ్వు." అని అన్నాడు వ్యాసుడు.

" వ్యాసమునీంద్రా! అశ్వమేధయాగము పరిసమాప్తి సమయములో భూదానం చెయ్యాలని ఆర్యులు అంటారు. అందుకని అర్జునుని చేత జయింప బడిన భూమి అంతా మీకు దానంగా ఇచ్చాను. నాకు ఇంక రాజ్యము లేదు. కాబట్టి వనవాసమునకు వెళతాను. అంతే కానీ ఇచ్చిన రాజ్యమును తిరిగి తీసుకోను." అని అన్నాడు ధర్మరాజు.

ఆ మాటలకు వ్యాసుడు ఇలా బదులు చెప్పాడు. "ధర్మనందనా! నీవు మాకు భూమిని దానంగా ఇచ్చావు. కాబట్టి ఈ భూమి అంతా మాదే. అందుకు సందేహం లేదు. కానీ మాకు ఈ భూమి అవసరం లేదు. అందుకని మేము ఆ భూమిని నీకు తిరిగి అమ్ముతున్నాము. తగిన వెల ఇచ్చి తీసుకో. దీనికి అభ్యంతరం ఏముంది. పైగా ఈ భూమిని మేము అమ్ముతాము అని అంటున్నాము కాబట్టి తగిన వెల ఇచ్చి తీసుకొనడం రాజధర్మం. ఇందులో

తప్పులేదు." అని అన్నాడు వ్యాసుడు.

ఆ మాటలు విన్న శ్రీకృష్ణుడు కూడా వ్యాసుడు చెప్పిన ప్రకారం చెయ్యమన్నాడు. అప్పుడు ధర్మరాజు కోటికోట్ల మాడలు కుప్పగా పోసి నేను దానంగా ఇచ్చిన భూమి వెల ఇంత అని అన్నాడు. ఆ బంగారమును తీసుకొని వ్యాసుడు భూమిని తిరిగి ధర్మరాజుకు అప్పగించాడు. ఆ బంగారమును వ్యాసుడు ఆ యాగమునకు వచ్చిన బ్రాహ్మణులకు అందరికీ పంచిపెట్టాడు.

అంతేకాకుండా ధర్మరాజు, ఆ యాగము కోసరం తయారు చేయించిన బంగారు పళ్లెములు, బిందెలు, ఇతర వస్తువులు బ్రాహ్మణులకు పంచి పెట్టాడు.

బ్రాహ్మణ దానములు అయిన తరువాత క్షత్రియులకు, వైశ్యులకు, శూద్రులకు, ఇంకా తక్కువ జాతి వారందరికీ అపారంగా ధనమును పంచి పెట్టాడు ధర్మరాజు. యజ్ఞమునకు వచ్చిన వారంతా అత్యంత సంతుష్టులై వారి వారి ఇండ్లకు తిరిగి వెళ్లారు.

వేద వ్యాసుడు తన భాగమునకు వచ్చిన ధనమును కుంతీదేవికి ఇచ్చాడు. కుంతీ దేవి ఆ ధనమును పేదలకు పంచి పెట్టింది.

ఓ జనమేజయ మహారాజా! ధర్మరాజు దాన ధర్మములలో రెండవ మరుత్తు అని అనిపించుకున్నాడు. యజ్ఞము పరిసమాప్తి అయిన తరువాత ధర్మరాజు, తమ్ములతో, భార్యలతో యజ్ఞస్నానముచేసాడు. తన దేహమును మనస్సును పవిత్రం చేసుకున్నాడు. ఆ యజ్ఞమును దగ్గర ఉండి నిర్విఘ్నముగా జరిపించిన వ్యాసునికి సాష్టాంగ ప్రమాణం చేసాడు ధర్మరాజు. ధర్మరాజును దీవించి వ్యాసుడు తన శిష్యులతో పాటు వెళ్లిపోయాడు.

(ఈ సందర్భంలో ఒక విషయం మనవి చేస్తాను. వ్యాసుడు ఒక ధర్మసూక్ష్మం చెప్పాడు. ధర్మరాజు వ్యాసునికి, బ్రాహ్మణులకు భూమిని దానంగా ఇచ్చాడు. అందు వలన ఆ భూమి వ్యాసుడు, బ్రాహ్మణుల స్వంతం అయింది. ఆభూమి వ్యాసునికి బ్రాహ్మణులకు అవసరం లేదు. అందుకని వారు ఆ భూమిని తిరిగి ధర్మరాజుకు అమ్మారు. దానికి తగిన వెల చెల్లించాడు ధర్మరాజు. తిరిగి భూమిని స్వంతం చేసుకున్నాడు. దీని వలన మనకు తెలిసింది ఏమిటంటే ప్రభుత్వము ప్రజల నుండి భూమిని తీసుకోవాలి అని అనుకొన్నప్పుడు, ప్రభుత్వం ప్రజలకు తగిన వెల చెల్లించి మాత్రమే తీసుకోవాలి కానీ తనకు అధికారం ఉంది కదా అని ప్రజల భూమిని లాక్కోకూడదు. ఇది ఆనాటి ధర్మము. అదే నేడు భూసేకరణ చట్టము (లాండ్ అక్విజిషన్ యాక్టు) గా అమలులో ఉంది. ఇందిరా గాంధీగారు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఆనాడు ఉన్న సంస్థానము లను రద్దుచేసింది. కాని ఆ సంస్థానాధీశులకు తగిన పరిహారము చెల్లించలేదు. వారు సుప్రీంకోర్టుకు వెళ్లారు. అప్పుడు సుప్రీం కోర్టుకూడా ఇదే చెప్పింది. ప్రభుత్వము ఏదైనా ఆస్తిని స్వాధీనం చేసుకునేటప్పుడు తగిన మూల్యము (మార్కెట్ రేట్) చెల్లించాలి అని. అదే ప్రీవిపర్స్ కేసుగా ప్రసిద్ధి చెందింది. ఇది ప్రభుత్వానికే కాదు మనకూ వర్తిస్తుంది. తేరగా వచ్చింది కదా అని పక్కవాడి స్థలం కలిపేసుకోకూడదు. హద్దులు చెరిపెయ్యకూడదు. ధనబలం అంగబలం ఉంది కదా అని లాగేసుకోకూడదు. అంతేకాదు కనీసం ఏ చిన్న వస్తువును కూడా ఊరికే తీసుకొనకూడదు. తగిన మూల్యం చెల్లించి తీసుకోవాలి. అదే నాడు నేడు ఆచరించవలసిన ధర్మం.)

వ్యాసుల వారు తమ శిష్యులతో సహా వెళ్లిపోయిన తరువాత ధర్మరాజు యాగమునకు వచ్చిన రాజులను అందరినీ సముచితంగా సత్కరించాడు.

బంగారమును మణులను, మాణిక్యాలను, నగలను, ఏనుగులను, హయములను, వేశ్యలను కానుకలుగా ఇచ్చాడు.

ఎంతో దూరమునుండి వచ్చిన బభ్రువాహనుని సముచితంగా సత్కరించాడు. తన దేశమునకు వెళ్లడానికి అనుమతించాడు. ఎన్నాళ్లుగానో భర్తనుండి విడిగా ఉన్న ఉలూపీ, చిత్రాంగదలు ఇప్పుడు తమ భర్త అర్జునుని వద్దనే ఉండిపోయారు. బభ్రువాహనుడు మాత్రము తన దేశమునకు వెళ్లాడు.

సింధు దేశము నుండి శిశుపాలుని భార్య అందరి కంటే ముందుగా యాగము చూడటానికి వచ్చింది. ధర్మరాజు అమెను సముచితంగా ఆదరించాడు. ఆమె మనుమడిని సింధు దేశమునకు పట్టాభిషిక్తుడిని చేసాడు. తరువాత భారత యుద్ధములో ఓడిపోయి చని పోయిన రాజుల రాజ్యములను వారి వారి వారసులకు ఇచ్చివేసాడు ధర్మరాజు.

అందరూవెళ్లి పోయిన తరువాత శ్రీ కృష్ణుడు బలరాముడు యాదవ ప్రముఖులు మిగిలారు. శ్రీ కృష్ణునికి, బలరామునికి, సాత్యకికి ఇతర యాదవ ప్రముఖులకు అనేక రత్నాభరణములు, విలువైన కానుకలు ఇచ్చిసత్కరించాడు. ధర్మరాజు ఇచ్చిన కానుకలతో వారు సంతృప్తి చెందారు. తరువాత శ్రీకృష్ణుడు, బలరాముడు, సాత్యకి మిగిలిన వారు ద్వారకకు వెళ్ళారు." అని వైశంపాయనుడు జనమేజయునతో అశ్వమేధయాగ విశేషములను సవిస్తరముగా వివరించాడు.

అప్పుడు జనమేజయుడు ఈ విధంగా అడిగాడు. "ఓ వైశంపాయన మహర్షి! అత్యంత వైభవోపేతంగా జరిగిన అశ్వమేధ యాగ సందర్భంలో ఏదైనా అందరికి విస్మయము కలిగించే సంఘటన జరిగిందా. అలా జరిగి ఉంటే

దాని గురించి వివరించండి.” అని అడిగాడు. వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

“ మీ తాతగారు అశ్వమేధ యాగము చేయుచున్న సమయంలో ఒక ముంగిస యాగ శాలకు వచ్చింది. అక్కడ ఉన్న ఋత్విక్కులను సదస్యులను బ్రాహ్మణులను చూచి “ఈ అశ్వమేధ యాగము సక్తుప్రస్థుని ధర్మమును కొంచెం కూడా పోలదు.” అని ప్రకటించింది. ఆ మాటలు విని అక్కడ ఉన్న బ్రాహ్మణులు ఆశ్చర్యపోయారు. అప్పుడు ఋత్విక్కులు ఆ ముంగిసతో ఇలా అన్నారు.

“ఈ యాగములో మంత్రపఠనము, కర్మకాండ, వివిధములైన దాన ధర్మములు, అన్నియు అందరి చేత ప్రశంసలు పొందాయి. ధర్మరాజు ఈ యాగమును నిర్వహించిన తీరు, శ్రద్ధ, భక్తి అందరికి ఆమోద యోగ్యము అయ్యాయి. ఇందులో జరిగిన ధర్మవిరుద్ధకార్యము ఏమి?” అని అడిగారు.

ఆ మాటలకు ఆ ముంగిస ఇలా బదులుచెప్పింది. “అయ్యా! ధర్మక్షేత్రము అని పిలువబడుతున్న కురుక్షేత్రములో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు పొలములో రాలి పడిన ధాన్యమును ఏరుకొని దానిని ఆహారంగా తింటూ జీవించేవాడు. అతనికి రోషము, కామము లేవు. అత్యంత సౌమ్యుడు. అతనికి భార్య, కుమారుడు, కోడలు ఉన్నారు. వారు కూడా ఆ బ్రాహ్మణుని అనుసరించి దొరికిన దానితో తృప్తిగా జీవిస్తున్నారు.

ఒకసారి తీవ్రమైన అనావృష్టి (కరువు) వచ్చింది. వర్షములు కురవ లేదు. తిండి దొరకడమే కష్టం అయింది. ఒక రోజు వారు నలుగురూ పొలములకు వెళ్లి గింజలు ఏరుకొని వచ్చారు. వాటితో పేలపిండి తయారుచేసుకున్నారు.

దేవతారాధన, సంధ్యావందనము మొదలగు కార్యక్రములు ముగించుకొని ఆ పేలపిండిని నలుగురూ సమంగా పంచుకున్నారు. ఆ పేలపిండిని తినడానికి సిద్ధం అవుతున్న తరుణంలో వారి వద్దకు ఒక బాటసారి అతిధిగా వచ్చాడు. వారు నలుగురూ ఆయనకు ఎదురు వెళ్లి సాదరంగా తీసుకొని వచ్చారు. తమ కుటీరములోకి తీసుకొని వెళ్లి అతనికి అతిధి మర్యాదలు చేసారు.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు తన వంతుకు వచ్చిన పేలపిండిని ఆ అతిధికి ఇచ్చి "మహానుభావా! ఈ పేలపిండి అన్యాయముగా సంపాదించినది కాదు. ధర్మంగా సంపాదించాము. కాబట్టి ఈ పేలపిండిని తమరు సేవించండి." అని అన్నాడు. సరే అని ఆ పేలపిండిని ఆ అతిధి తిన్నాడు. కాని అతని ఆకలి తీరలేదు.

అప్పుడు ఆ బ్రాహ్మణుని భార్య ఇలా అన్నది. "నాధా! నా వంతు వచ్చిన పేలపిండిని మీరు ఆయనకు ఇచ్చి తృప్తి పరచండి. ఆయన ఆకలి తీర్చండి." అని చెప్పింది.

అప్పుడు ఆ బ్రాహ్మణుడు ఇలా అన్నాడు. "నోరు లేని పక్షులుకూడా తమ తమ భార్యలకు ఆహారము తెచ్చి పెట్టి ఆకలి తీరుస్తాయి కదా. అటవంటప్పుడు నేను నీవు తినబోవు ఆహారమును ఎలాతీసుకొన గలను." అని అన్నాడు.

ఆ మాటలకు అతని భార్య ఇలా అంది. "నాధా! భార్యకు తన భర్తయే చుట్టము, స్నేహితుడు, భర్త, తల్లి, తండ్రి, గురువు, దైవము. కావున భర్త చెయ్యలేని పని భార్య చెయ్యడం ధర్మం కదా! మీ తరువాత నేను. మీరు ముందు మీ వంతుకు వచ్చిన పేలపిండి ఇచ్చారు. తరువాత నేను కదా ఇవ్వాలి. అదీ కాకుండా మీరు తినకుండా పస్తు ఉంటే నేను మాత్రం ఎలా తినగలను. కాబట్టి

సంకోచించక ఈ పేలపిండిని అతిధికి ఇచ్చి సంతోష పెట్టండి." అని చెప్పింది ఆయన భార్య. చేసేది లేక ఆ బ్రాహ్మణుడు తన భార్య వంతుకు వచ్చిన పేలపిండిని ఆ అతిధికి సమర్పించాడు. ఆ పేలపిండి తిన్నాకూడా ఆ అతిధి ఆకలి తీరలేదు. ఇంకా విచారంగానే ఉన్నాడు. అయ్యో అతిధిని సంతోష పెట్టలేకపోయానే అని ఆ బ్రాహ్మణుడు బాధపడుతున్నాడు.

తండ్రి బాధను చూచి కుమారుడు ఇలా అన్నాడు. "తండ్రీ! దీనికి ఇంత బాధ పడతారెందుకు. నా వంతుకు వచ్చిన పేలపిండిని అతిధికి ఇచ్చి ఆయనను తృప్తి పరచండి." అన్నాడు.

"నాయనా కుమారా! పిల్లలు ఎంత పెద్ద వాళ్లయినా తల్లి తండ్రులకు వాళ్లు చిన్న వాళ్లే. చిన్న వాళ్లకు ఆకలి ఎక్కువ. అందుకని నీ నోటి దగ్గర ఆహారము నేను ఎలా తీసుకొనగలను." అని అన్నాడు.

ఆ మాటలకు కుమారుడు ఇలా అన్నాడు. "తండ్రిగారూ! తండ్రియే కొడుకు రూపంలో పుడతాడు అని శాస్త్రములు చెబుతున్నాయి కదా. మీ బాధ నాది కాదా. మీ దుఃఖము తీర్చడం కొడుకుగా నా కర్తవ్యము కాదా! కాబట్టి సంకోచించక ఈ పేలపిండిని అతిధికి ఇవ్వండి అని అన్నాడు. కుమారుని మాటలకు తృప్తి పడి ఆ బ్రాహ్మణుడు తన కుమారుని వంతుకు వచ్చిన పేలపిండిని ఆ అతిదికి ఇచ్చాడు. ఆ అతిధి ఆ పేలపిండిని ఆరగించాడు కానీ అతని ఆకలి తీరలేదు. అతిధి తృప్తి చెందలేదు అని తెలుసుకున్నాడు ఆ బ్రాహ్మణుడు. దుఃఖంతో బాధపడుతున్నాడు.

ఇది చూచింది ఆయన కోడలు. వెంటనే తన వంతుకు వచ్చిన పేలపిండిని మామగారి ముందు పెట్టింది. "మామగారూ! దీనిని కూడా అతిధి కి సమర్పించి

ఆయనను తృప్తిపరచండి." అని పలికింది. అది చూచి ఆ బ్రాహ్మణుడు ఇలా అన్నాడు.

"అమ్మా! నీవు మా ఇంటికి కోడలిగా వచ్చావు. మా దరిద్రంలో భాగం పంచుకున్నావు. సరి అయిన ఆహారము లేక సుకుమారమైన నీ శరీరము శుష్కించి పోయింది. దొరక్క దొరక్క ఇవ్వాళ ఈ పేలపిండి దొరింది. ఇది కూడా ఇచ్చి నీవు ఆకలితో ఎలా ఉండగలవు. నీవు ఆకలితో అలమటిస్తుంటే నేను ఎలా చూడగలను." అని బాధపడ్డాడు ఆ బ్రాహ్మణుడు.

"మామగారూ!మీరు నాకు గురువులు. ఈ దేహములో ప్రాణములు కలిగిన దానికి గురువులకు శుశ్రూష చెయ్యడం శిష్యుల విధి. కాబట్టి నాకు మీకు శుశ్రూష చేసుకొనే భాగ్యం కలుగచేయండి. ఈ పేలపిండిని తీసుకొని అతిధికి సమర్పించండి." అని వినయంగా చెప్పింది కోడలు. ఆమాటలకు సంతోషించి ఆ బ్రాహ్మణుడు తన కోడలి వంతు వచ్చిన పేలపిండిని కూడా ఆ అతిధికి సమర్పించాడు. ఆ అతిధి సంతోషంగా ఆ పేలపిండిని తిన్నాడు. అమ్మయ్య ఆకలి తీరింది అన్నాడు. ఆ మాటలకు వారునలుగురూసంతోషించారు.

అప్పుడు ఆ అతిధి వారితో ఇలా అన్నాడు. "ఓ బ్రాహ్మణోత్తమా! నేను మీ ఇంటికి అతిధిగా వచ్చిన యమధర్మరాజును. నీ యొక్క, నీ కుటుంబ సభ్యుల యొక్క ధర్మనిరతి, సద్గుణ సంపత్తిని చూచి ఎంతో సంతోషించాను. నీ యందు పెద్దల ఎడల భక్తి, అతిధుల పట్ల వినయమూ, చేసే పని మీద శ్రద్ధ, కష్టకాలములో ఓర్పు మిక్కుటముగా ఉన్నాయి. నీవు చేసిన దానమును ప్రశంసిస్తూ దేవతలు పైనుండి చూస్తున్నారు చూడు." అని అన్నాడు. అప్పుడు దేవేంద్రుడు వారి మీద పూలవాన కురిపించాడు.

యముడు వారితో ఇంకా ఇలా అన్నాడు. "ఓ బ్రాహ్మణోత్తమా! దేవలోకంలో సప్తఋషులు మీ అందరి రాక కోసం ఎదురు చూస్తున్నారు. నీవు, నీ భార్య, కొడుకు కోడలితో స్వర్గానికి రా!" అని ఆహ్వానించాడు.

అంతలో మరలా ఇలా అన్నాడు. "ఓ మహాభాగా! ఆకలి అన్నింటి కన్నా చెడ్డది. ఆకలి బుద్ధిని, వివేకమును మట్టుబెడుతుంది. ఆశ దయాగుణమును నాశనం చేస్తుంది. నీవు, నీ భార్య, కుమారుడు,కోడలు ఆకలిని, ఆశను జయించారు. అతిధి పూజచేసి దివ్యత్వమును పొందారు. నీ దానగుణమునకు మెచ్చి బ్రహ్మగారు తన లోకమునకు రమ్మని ఆహ్వానించారు. బ్రహ్మలోకము నుండి త్వరలో విమానం వస్తుంది. అంతేకాదు.

ఓ బ్రాహ్మణోత్తమా! తనకు ఉన్న సంపదలో దానములు ధర్మములు చెయ్యడం, యజ్ఞాలు, యాగాలు చెయ్యడం గొప్ప విషయం కాదు. ధర్మంగా సంపాదించింది కొంచెమైనా దానిని తనకంటూ ఏమీ మిగుల్చుకోకుండా యోగ్యుడైన వాడికి దానం చెయ్యడం ఉత్తమోత్తమం." అని పలికి యమధర్మరాజు తన దివ్యమైన రూపమును వారికి చూపించాడు.

ఇంతలో ఆకాశంలో ఒక దివ్యమైన విమానం కనపడింది. దేవతలు మునులు ఆశ్చర్యపోయారు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు, ఆయన భార్య, కుమారుడు, కోడలు యమునికి సాష్టాంగ ప్రమాణం చేసి నిలబడ్డారు.

"ఓ బ్రాహ్మణోత్తమా! అదుగో బ్రహ్మదేవుడు పంపిన దివ్య విమానము. మీరందరూ ఆ దివ్యమైన విమానము ఎక్కి బ్రహ్మలోకము వెళ్లండి." అని అన్నాడు యమధర్మరాజు. తరువాత ఆ బ్రాహ్మణుడు, తన భార్య, కుమారుడు,కోడలితో సహా ఆ దివ్యమైన విమానము ఎక్కి బ్రహ్మలోకము

వెళ్లిపోయాడు.

ఇదంతా నేను పక్కనే ఉన్న కలుగులో ఉండి చూచాను. నేను వెంటనే సక్తుప్రస్థుడు యమధర్మరాజు కాళ్లు కడిగిన నీటిలో అటు ఇటు పొర్లాను. కాని నా ఒంటికి ఒక పక్కమాత్రమే ఆ నీరు అంటుకుంది. ఆనీటి ప్రభావంతో నా శరీరం ఒక పక్క అంతా సువర్ణమయం అయింది. ఆ రోజు నుండి నేను ఎక్కడ యజ్ఞములు, యాగములు, దానములు, ధర్మములు జరుగుతుంటాయో అక్కడకు వెళుతుంటాను. ఎందుకంటే నా శరీరం రెండో వైపు కూడా ఎక్కడన్నా బంగారం మయం అవుతుందేమో అని ఆశ. కాని ఎక్కడా కాలేదు. ఇక్కడ ధర్మరాజు లోకోత్తరమైన అశ్వమేధ యాగము చేయుచున్నాడు అని తెలిసి ఇక్కడకు వచ్చాను. ఇక్క ఉన్న నీటిలో పొర్లి నా మిగిలిన శరీరం బంగారం చేసుకోవాలనుకున్నాను. కానీ అలా జరగలేదు. ఎందుకంటే కేవలం పొలాలలో రాలిన గింజలు ఏరుకొని జీవించే ఆ బ్రాహ్మణుడు చేసిన అతిథి పూజ కన్నా ధర్మరాజు చేసే అశ్వమేధ యాగము సాటి రాదు అన్న విషయం అర్థం అయింది." అని పలికింది ఆ ముంగిస. వెంటనే ఆ ముంగిస అక్కడి నుండి ఎటో వెళ్లి పోయింది. ఇదీ ఆ యజ్ఞంలో జరిగిన ఒక అద్భుత విషయం." అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడు.

అప్పుడు జనమేజయుడు వైశంపాయనునితో ఇలా అన్నాడు. "ఓ వైశంపాయన మహర్షీ! రాజులు యజ్ఞముల యందును, మునులు తపస్సు చేయడం లోనూ, బ్రాహ్మణులు మనస్సును, ఇంద్రియములను నిగ్రహించడం లోనూ ఆసక్తి చూపుతారు అని విన్నాము కదా! అందుకే కదా పూర్వము రాజులు, చక్రవర్తులు ఎన్నో యజ్ఞములు యాగములు చేసి కీర్తి గడించారు. పుణ్యలోకములు పొందారు. అదే ప్రకారము ధర్మరాజు కూడా అశ్వమేధ యాగమును అత్యంత ఉదాత్త రీతిలో నిర్వహించాడు కదా! ఇదివరకటి రాజుల

కంటే సత్యము, శౌచము, భక్తి, శ్రద్ధలతో నిర్వహించాడు కదా. ఆయన నేసిన యాగమును వ్యాసుడు మొదలగు మహామునులు కూడా మెచ్చుకున్నారు కదా! ధర్మరాజు దేవేంద్రుడు చేసినట్టు అశ్వమేధ యాగము చేసాడు కదా! అటువంటి యాగమును ఆ ముంగిస ఎందుకు గర్హించింది. అవహేళన చేసింది. దానికి కారణము ఏమి?" అని అడిగాడు జనమేజయుడు. వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

"జనమేజయా! ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగము నువ్వు చెప్పిన ఉత్తమ లక్షణములు అన్ని కలిగి ఉంది. కాని ఒక్క విషయం. ఆ యాగములో ఎంతో జీవ హింస జరిగింది. 300 మృగజీవులను చంపారు. దేశ మంతా తిరిగి వచ్చిన ఆ యాగాశ్వమును కూడా చంపారు. ఆ ముంగిస దృష్టిలో ఇంతటి జీవహింసతో నిర్వహించే అశ్వమేధ యాగము కన్నా అ బ్రాహ్మణుడు చేసిన తపోయజ్ఞము ఎంతో మేలైనది. ఆ విషయమే ఆ ముంగిస బహిరంగంగా చెప్పింది. ఆ బ్రాహ్మణుడు చేసిన సాత్విక, తపో యజ్ఞము వలననే తన సగం శరీరం సువర్ణ మయం అయింది అని కూడా చెప్పింది కదా. అది అబద్ధం కాదు కదా! కాబట్టి ఆ ముంగిస మాటలు మనం తోసి పుచ్చలేము.

ఈ విషయంలో నీకు ఒక ఇతిహాసము చెబుతాను విను. పూర్వము దేవేంద్రుడు ఒక యాగమే చేయ తలపెట్టాడు. ఆ యాగమునకు అనేక మంది ఋత్విక్కులు, మహామునులు, దేవతలు, వచ్చారు. యజ్ఞవేదిక తయారు చేసారు. అగ్ని వేల్చారు. ఆ యజ్ఞములో బలి ఇవ్వడానికి ఎన్నో జంతువులను సమకూర్చారు. అది చూచిన మునులు దేవేంద్రుడిని చూచి ఇలా అన్నారు.

"దేవేంద్రా! నీవు చేసే యజ్ఞములో ఇన్ని జంతువులు చావవలెనా! ఇంత జీవ హింస జరగాలా! ఇది ధర్మం కాదు. జీవ హింసకు ప్రత్యామ్నాయంగా

(బదులుగా) మూడేళ్లపాటు నిలువ వుంచిన విత్తనములను యజ్ఞద్రవ్యము లుగా వాడవచ్చును గదా. ఇది కృతయుగధర్మము. ఇది వేదములలో కూడా చెప్పబడింది. కాబట్టి వేదోక్తంగా యజ్ఞం చెయ్యి. జీవహింస మాను. కన్నీరు కారుస్తూ ఉన్న ఆ జంతువులను చూడు. కనికరంతో వాటిని వదిలిపెట్టు." అని అన్నారు.

కాని దేవేంద్రుడు వారి మాటలు వినలేదు. మునులు కూడా గట్టిగా ఇంద్రుని జీవహింస మానమని ప్రతిఘటించారు. దేవతలు ఇంద్రుడి పక్షం వహించారు. దేవలోకం రెండుగా చీలిపోయింది.

ఆరోజుల్లో దేవేంద్రుడికి ఒక స్నేహితుడు ఉపరిచర వసువు అనే రాజు ఉన్నాడు.

(మహాభారతం మొదట్లో ~~ఈ~~యన ప్రస్తావన వస్తుంది. ~~ఈ~~యన వీర్యం వలననే సత్యవతి జన్మించింది. ~~ఈ~~ యాగం ప్రస్తావన మహాభారతంలో శాంతిపర్వంలో కూడా వచ్చింది. )

ఆ ఉపరిచర వసువు దేవేంద్రుడు చేస్తున్న యాగం చూడ్డానికి అక్కడకు వచ్చాడు. దేవతలు, మునులు ఆయనను మధ్యవర్తిగా పెట్టుకొన్నారు. తమ వివాదమును ఆయనకు విన్నవించారు. యజ్ఞములలో జీవహింస చేయాలా వద్దా అని అడిగారు. ఆయన దేవేంద్రుడికి మిత్రుడు కాబట్టి యజ్ఞ యాగములలో జీవహింస సరి అయినదే అని తీర్పు చెప్పాడు. ఆ తీర్పు ఫలితంగా ఆ ఉపరిచర వసువు నరకానికి పోయాడు.

కాబట్టి జనమేజయ మహారాజా! జీవహింస లేని యాగము

ఉత్తమమైనది. ఇందులో సంశయింప వలసినది ఏమీ లేదు. అదీకాకుండా, కేవలం పొలాలలో ఏరుకున్న గింజలతో పేలపిండి చేసుకొని పొట్ట నింపుకుంటున్న ఆ పేదబ్రాహ్మణుడు తనకు ఉన్నదంతా అతిధికి పెట్టాడు. మరి అది పొగడతగినదే కదా!" అని అన్నాడు వైశంపాయనుడు.

ఆ మాటలు విన్న జనమేజయుడు ఇలా అన్నాడు. "మీరు చెప్పినది నిజమే మునీంద్రా! ఆ బ్రాహ్మణుని త్యాగం కొనియాడతగినదే! దానం చెయ్యడానికి ధర్మమార్గంలో సంపాదించిన ధనం మాత్రమే యోగ్యమైనది అన్న విషయాన్ని ఇంకా విపులంగా వివరించండి." అని అడిగాడు. దానికి వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

"జనమేజయ మహారాజా! ఈ సందర్భంలో నీకు ఒక కథ చెబుతాను. సావధానంగా విను. పూర్వము అగస్త్యుడు 12 సంవత్సరములు నిరాఘాటంగా సాగే ఒక యాగము చెయ్యడానికి పూనుకున్నాడు. ఆ యాగమునకు అనువజ్ఞులు అయిన మునులు, ఋత్విజులు వచ్చారు. యజ్ఞమునకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాని ఇంద్రుడు వర్షము కురిపించలేదు. ఫలితంగా ఓషధులు లభించలేదు. పంటలు పండలేదు. అందుకని దానములు ధర్మములు చేయుటకు, యజ్ఞమునకు వచ్చిన వారికి భోజనము పెట్టుటకు ధాన్యము లేదు. ఈ యాగము అగస్త్యుడు ఎలానిర్వహిస్తాడో అని అందరూ ఆతురతతో ఉన్నారు.

ఎందుకంటే అగస్త్యుడు పన్నెండేళ్ల దీక్ష వహించాడు. ధర్మమార్గంతో సంపాదించినది తప్ప మరొక వస్తువు ముట్టుకోడు. ధర్మమార్గంలో ధాన్యం సమకూరాలంటే వానలు పడాలి. పంటలుపండాలి. ఏంజరుగుతుందో ఏమో అని అందరూ విచారంగా ఉన్నారు.

ఆమాటలను విన్నాడు అగస్త్యుడు. "ఓ మహామునులారా, ఋత్విక్కులారా! నేను చేయబోవు ధర్మయజ్ఞమునకు దేవేంద్రుడు సహకరించి సమృద్ధిగా  వర్షములు కురిపిస్తే సరే సరి. లేక పోతే నేను ఇంద్రపదవిని అధిష్టించి, లోకములను పాలిస్తాను. మీరునిశ్చింతగా ఉండండి.  అదీ కాకపోతే ఈ మూడు లోకములలో యజ్ఞద్రవ్యములు సమృద్ధిగా ఉన్నాయి కదా. అవన్నీ తీసుకొచ్చి యజ్ఞము చేయిస్తాను.  ఈ సంవత్సరము ఉత్తర కురుభూములలో పంటలు బాగా పండాయి. ధాన్యము సమృద్ధిగా ఉంది. యాగసమయంలో అన్నదానం చెయ్యడానికి అక్కడి నుండి ధాన్యం తెప్పిస్తాను. అయినా నేను విత్తనములను అగ్నిలో వేల్చి యజ్ఞం చేస్తే లోకానికేమన్నా చెడు జరుగుతుందా! విత్తనములతో యజ్ఞం చేస్తే యజ్ఞమునకు ఆటంకం కలుగుతుందా! కాబట్టి ఈ విషయంలో మీరు చింతించవలసిన పనిలేదు."  అని అన్నాడు అగస్త్యుడు.

ఆ మాటలకు అక్కడ చేరినమునులు ఇలా అన్నారు. " ఓ అగస్త్య మహర్షీ! ఇంత చిన్న దానికి తమరు తమ తపోశక్తిని ఎందుకు వృధా చేసుకుంటారు.  ఇతరుల వద్దనుండి ధనం తీసుకొనడం ఎందుకు. ఉత్తర కురుభూముల నుండి ధాన్యం తెప్పించడం ఎందుకు. పంటలు పండడానికి ఉపయోగించే విత్తనములతో యజ్ఞం చేయడం ఎందుకు. మాకు కావలసిన వస్తువులు, యజ్ఞమునకు కావలసిన వస్తువులు మేము మా ఆశ్రమముల నుండి తీసుకొని వస్తాము. యజ్ఞము నిర్విఘ్నంగా నెరవేరుస్తాము."  అని అన్నారు.

ఈ విషయం అంతా తెలిసి దేవేంద్రుడు తన పదవి ఎక్కడ ఊడుతుందో అని భయపడ్డాడు.  వెంటనే వర్షములు కురిపించాడు. బృహస్పతిని తోడు తీసుకొని భయపడుతూ భక్తితో  అగస్త్యుని వద్దకు వచ్చాడు.  ఇంద్రుని సాదరంగా ఆహ్వానించాడు అగస్త్యుడు. యజ్ఞము

నిర్విఘ్నముగా నెరవేర్చాడు. ఇంద్రుని, బృహస్పతిని సాదరంగా స్వర్గలోకమునకు పంపాడు. అంతేకాదు యజ్ఞమునకు వచ్చిన మునులను, ఋత్విక్కులను అగస్త్యుడు భక్తితో పూజించి వారికి తగు సత్కారములు చేసి పంపాడు. ఆ విధంగా హింసకు తావు లేకుండా యజ్ఞమును చేసి కీర్తి పొందాడు అగస్త్యుడు.

కాబట్టి ఓ జనమేజయ మహారాజా!ధర్మమార్గంతో సంపాదించిన ధనంతో చేసే యజ్ఞము, హింసకు తావు లేకుండా చేసే యజ్ఞము మనోజ్ఞమై వెలుగుతుంది." అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పాడు.

అప్పుడు జనమేజయుడు వైశంపాయనుని ఇలా అడిగాడు. "ఓ మహర్షీ! ఇది వరకు మీరు ఒక ముంగిస మానుష భాషలో మాట్లాడింది అని చెప్పారు. ఆ ముంగిస ఎవరో మహానుభావుడు అయి ఉండవచ్చును. కాబట్టి ఆ ముంగిస గురించి వివరించండి." అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

" ఓ జనమేజయ మహారాజా! జమదగ్ని పితృకార్యము చేయ సంకల్పించాడు. ఒక కొత్త కుండలో తమ ఇంటిలో ఉన్న హోమ ధేనువు (పాడి ఆవు) పాలు పితికి పదిలంగా ఒక చోట పెట్టాడు. అతనిలో ఉన్న క్రోధమునకు అధి దేవత ఆకారము ధరించి వచ్చింది. పొరపాటున జరిగింది అనుకునేటట్టు ఆ కుండను పడదోసింది. పాలు అన్నీ నేలపాలు అయ్యాయి. జమదగ్ని అది చూచాడు. పాలు నేలపాలు అయ్యాయి అని తెలిసి కూడా ఏమీ కోపం తెచ్చుకోలేదు. అప్పుడు కోపమునకు అధి దేవత ఆయనను చూచి ఇలా అంది.

"ఓ జమదగ్నీ! సాధారణంగా భృగు సంతతి వారు మహా కోపిష్టులు అని

అందరూ అంటారు కదా!  ఇది నిజము కాదని నీవు నిరూపించావు. నీముందు నేను ఓడిపోయాను. నేను నీ పట్ల తప్పు చేసాను. నన్ను క్షమించు." అంది క్రోధము.

"అదేమిటి! నీవేమి తప్పు చేసావు.  ఒకవేళ నీకు తప్పుచేసాను అనే ఆలోచన ఉంటే దానిని నీ మనసులో నుండి తీసివెయ్యి. కాని నీవు శ్రాద్ధ సంకల్పమునకు భగ్నము కలిగించావు. పితృదేవతలు నీ మీద కోపింప గలరు. వెంటనే ఇక్కడి నుండి వెళ్లిపో." అని అన్నాడు జమదగ్ని.  ఆ మాటలు విని కోపము అంతర్ధానము అయింది.

తరువాత జమదగ్ని పితృదేవతలను ఆహ్వానించాడు. వారు వచ్చారు. విషయం తెలుసుకొన్నారు. నీవు తల పెట్టిన శ్రాద్ధ కర్మకు కోపాధిదేవత విఘ్నం కలిగించింది అని తెలిసికూడా నీవు  ఊరుకున్నావు. నా శాంతము క్షమించరానిది.  కాబట్టి నీవు ముంగిసలై పుట్టు." అని శపించారు.

అప్పుడు జమదగ్ని వారికి నమస్కరించి "పితృదేవతలారా! బ్రాహ్మణులకు కోపము తగదు అంటారు కదా. అందుకని నేను క్రోధము చేసిన పనికి కోపించ లేదు. నా తప్పు క్షమించండి. నాకు ఈ శాపము నుండి విముక్తి కలిగించండి." అని ప్రార్థించాడు జమదగ్ని.  వారు శాంతించారు.

"కుమారా!  మహా పండితులు ఉన్న సభలో ఒక మహాధర్మమును తప్పు అని చెప్పి నిరూపించా వనుకో, అప్పుడే నీకు శాపమునుండి మోక్షము కలుగుతుంది." అని పలికారు.

జనమేజయ మహారాజా! ఆ ముంగిస గతజన్మలో జమదగ్ని. మరు

జన్మలో ముంగిసగా జన్మించి, ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగమును అధర్మము అని నిరూపించి, శాపవిముక్తిని పొందింది." అని చెప్పాడు వైశంపాయనుడు.

మహాభారతము

అశ్వమేధ పర్వము

చతుర్థాశ్వాసము సంపూర్ణము.

అశ్వమేధ పర్వము సర్వం సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహా భారతము

## ఆశ్రమ వాస పర్వము

### ప్రథమాశ్వాసము.

సర్పయాగ సందర్భంగా జనమేజయ మహారాజునకు వైశంపాయన మహర్షి చెప్పిన మహాభారత కథను, నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంగా సూతి అను పౌరాణికుడు శౌనకుడు మొదలగు మహామునులకు వినిపించ సాగాడు.

ధర్మరాజు చేసిన అశ్వమేధయాగము గురించి విన్న జనమేజయ మహారాజు వైశంపాయన మహర్షిని ఇలా అడిగాడు. "ఓ మహర్షి! ఆ ప్రకారంగా పితృపితామహుల నుండి సంక్రమించిన రాజ్య సంపదను స్వీకరించిన పాండవులు ధృతరాష్ట్రుని పట్ల ఏవిధంగా ప్రవర్తించారు. కుమారులు, మిత్రులను, అమాత్యులను యుద్ధంలో పోగొట్టుకున్న ధృతరాష్ట్రుడు, అష్ట ఐశ్వర్యములను పోగొట్టుకున్న ధృతరాష్ట్రుడు, ఆయన భార్య గాంధారి ఏ ప్రకారము ప్రవర్తించారు. వివరించండి." అని అడిగాడు. దానికి సమాధానంగా వైశంపాయనుడు జనమేజయ మహారాజునకు ఇలా వివరించాడు.

" ఓ జనమేజయ మహారాజా! ధర్మరాజు, అతని తమ్ములు పెదనాన్న ధృతరాష్ట్రునికి, గాంధారికి ఏ విధంగానూ తక్కువ చేయలేదు. వారిని అత్యంత గౌరవ ప్రదంగా చూసుకుంటున్నారు. ప్రతిరోజూ ధృతరాష్ట్రుని కలుసుకుంటూ ఆయన నుండి ఆదేశాలను స్వీకరిస్తున్నారు. విదురుడూ, యుయుత్సుడూ ప్రతిరోజూ ఆయనను ఏమరక సేవిస్తున్నారు. వారికి ఏమి కావాలో అడిగి

తెలుసుకొని వాటిని వెంటనే అమరుస్తున్నారు. ధృతరాష్ట్రుడు గాంధారి కూడా పాండవుల పట్ల ప్రేమాభిమానాలతో వ్యవహరిస్తున్నారు.

కుంతీ దేవి కూడా తన అక్కగారైన గాంధారిని ప్రతి రోజూ వచ్చి పలకరిస్తూ ఉండేది. ద్రౌపది, సుభద్ర తమ అత్తగారైన గాంధారిని ఏమరక సేవిస్తూ ఉన్నారు. ఆమెకు విలువైన వస్తువులు కానుకలుగా ఇస్తున్నారు. వారే కాకుండా అర్జునుని భార్యలైన చిత్రాంగద, ఉలూపి కూడా గాంధారిని ఆదరించేవారు.

ఇంక ధర్మరాజు ప్రత్యేకంగా పెదనాన్న గారికావలసిన భోజన సదుపాయములు, దైనందిన అవసరములు అన్నీ ప్రత్యేంగా అమరుతున్నాయో లేదో అని స్వయంగా పరిశీలించేవాడు. ప్రతిరోజూ వారికి ఏ లోటూ రాకుండా చూసుకొనే వాడు. ఇంక ధర్మరాజు అనుమతితో ధృతరాష్ట్రుడు ఎన్నో ధర్మకార్యాలు చేసాడు. దేవాలయములు కట్టించాడు. సత్రములు నిర్మించాడు. చెరువులు త్రవ్వించాడు. బ్రాహ్మణులకు అగ్రహారాలు, మిగిలిన జాతుల వారికి గ్రామములు నిర్మించాడు.

ధర్మరాజ చక్రవర్తిని చూడటానికి వచ్చే సామంత రాజులు ముందు ధృ తరాష్ట్రుని దర్శించుకొని తరువాత ధర్మరాజును దర్శించుకొనే వాళ్లు. దానికి ధర్మరాజు ఎంతో సంతోషించేవాడు. తన కుమారులు లేరు అన్న వ్యధను మనసులోనికి రానీయకుండా ధృతరాష్ట్రునకు ధర్మరాజు అన్ని సౌకర్యాలు సమకూర్చాడు. అదే కాకుండా ధర్మరాజు తన తమ్ములకు, అమాత్యులకు, సైన్యాధిపతులకు ఇలా ఆదేశాలు ఇచ్చాడు. "నాపెదనాన్న, పెదతల్లిగారు పుత్రులను పౌత్రులను పోగొట్టుకొని దుఃఖంతో ఉన్నారు. వారికి ఏలోటూ రానీయకుండా చూడండి. నాకు ఏ విధమైన గౌరవ మర్యాదలు ఇస్తారో అవే

గౌరవ మర్యాదలు వారికీ ఇవ్వండి." అని ఆదేశించాడు. ధర్మరాజు మాటలను అమాత్యులు, తమ్ములు, సేవకులు పాటించేవారు.

కాని భీముడికి మాత్రం మనసులో ఏమాత్రం ఇష్టం లేదు. కాని అన్న మాట కాదనలేక పైకి మాత్రం వారి పైన గౌరవాభిమానములు ఉన్నట్టు నటిస్తుండేవాడు. ధృతరాష్ట్రుని చూడగానే భీమునకు తాము మాయా ద్యూతము వలన పడిన బాధలు, అరణ్య అజ్ఞాత వాస క్లేశమును గుర్తుకు వచ్చి మనసు మండిపోయేది. ఎంత అణచుకున్నా ఆవేశం పొంగి ధృతరాష్ట్రుని చూడగానే మండిపడేవాడు భీముడు.

కాని ధర్మరాజు మాత్రము దానికి భిన్నంగా ఉండేవాడు.సుయోధనునకు, అతని తమ్ములకు శ్రాద్ధకర్మలు నిర్వర్తించునపుడు ధృత రాష్ట్రుని చేత ఎన్నో దాన ధర్మములు చేయించేవాడు. ఆ మాటకు వస్తే ధృతరాష్ట్రునకు తన కొడుకులు ఉన్నప్పటి కన్నా ఇప్పుడు రాచమర్యాదలు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతే కాదు ధర్మరాజు ధృతరాష్ట్రుని వలన, అతని కొడుకుల వలన తనకు జరిగిన అపకారములను మనసులోకి రానిచ్చేవాడు కాదు. ధర్మరాజు తత్వము తెలిసి ఎవరు కూడా ఆయన ముందు ధృతరాష్ట్రుని గురించి, ఆయన కుమారుల గురించి, వారి పూర్వ ప్రవర్తన గురించి, చెడ్డగా మాట్లాడేవాళ్లు కాదు.

ప్రజలలో కూడా ధృతరాష్ట్రునకు ధర్మరాజుకు బేధం ఉండేది కాదు. ఇరువురినీ సమానంగా గౌరవించేవారు. ధృతరాష్ట్రుడు కూడా క్రమ క్రమంగా తన కుమారులను మరిచిపోయి ధర్మరాజు మీదనే ఎక్కువ ప్రేమానురాగాలు చూపించేవాడు. కాని భీముని చూచినప్పుడు మాత్రం ధృతరాష్ట్రుని గుండె రగిలిపోయేది. ఎందుకంటే భీముడే తన పెద్దకుమారులు ఇద్దరినీ నిర్దాక్షిణ్యంగా సంహరించాడు. భీముడు కూడా తమ సకల కష్టములకు కారణమైన ధృ

తరాష్ట్రుని చూచి మనసులో కోపంతో రగిలిపోయేవాడు. ఆ ప్రకారంగా ధృతరాష్ట్రుడు, భీముడు ఒకరి మీద కోపంతో మరొకరు రగిలిపోతున్నా, పైకిమాత్రం ఎంతో నమ్రతగా మర్యాదగా మాట్లాడు కొనేవాళ్లు.

కాని భీముడు మాత్రం ఒక్కోసారి బయటపడేవాడు. ధృతరాష్ట్రుడు ఒంటరిగా ఉన్నప్పుడు గాంధారి వింటూ ఉండగా ఈ విధంగా అనేవాడు. "ఈ గుడ్డి వాడి కొడుకులందరినీ చంపేశాను. అయినా నా పాల బడ్డ ఎవడైనా చావకుండా బయటపడ్డాడా! ఆ కౌరవులకు బుద్ధిలేక మాతో యుద్ధానికి వచ్చారు కానీ, నా సంగతి తెలిసిన వాడెవడైనా మాతో పెట్టుకుంటాడా! ఈ భుజాలతోనే నేను సుయోధన,దుశ్శాసనులను మట్టుబెట్టాను. ఇంతటి మహత్కార్యమును నిర్వర్తించిన నా బాహువులకు పూజ చేస్తాను. కౌరవులను సమూలంగా నాశనం చేసేట్టు చేసిన ఆ దైవానికి నా శతకోటి వందనాలు." అని అంటూ ఉండేవాడు.

కాని భీముడు ఇలా అంటూ ఉండేవాడని ధర్మరాజుకు, అర్జునునికి, కుంతికి, ద్రౌపదికి తెలియదు. నకుల సహదేవులు మాత్రము భీముని మాటలు విని సంతోషించారు. కానీ ధర్మరాజుకు భయపడి బదులు చెప్పరు. ధృతరాష్ట్రుడు, గాంధారీ భీముని మాటలు విని, ఏమీ చెయ్యలేక మనసులోనే బాధపడుతుంటారు.

ఆ ప్రకారంగా 15 ఏళ్లు గడిచాయి. ఒకరోజు ధృతరాష్ట్రుడు తన బంధువులను, మిత్రులను, ధర్మరాజును సమావేశ పరిచి వారితో ఇలా అన్నాడు. "ఆర్యులారా! నా వలననే నా కుమారులు నాశనం అయ్యారు అని మీకు బాగా తెలుసు. నా కొడుకు అతి క్రూరుడు, లోభి, దాయాదులకు ద్రోహం చేసేవాడు. అయినా వాడిని ఈ కురుసామ్రాజ్యానికి చక్రవర్తిని చేసాను. రాయబార

సమయంలో కృష్ణుడు చెప్పిన మాటలు వినలేదు. నాకు నా కుమారుల పట్ల ఉన్న వ్యామోహము వలన వారికి మంచి చెడూ గట్టిగా చెప్పలేకపోయాను. ఒక్క కృష్ణుడే కాదు, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, సంజయుడు నాకు ఎన్నోవిధాలుగా చెప్పారు. చివరకు నా భార్య గాంధారి కూడా నన్ను తిట్టింది. అయినా నేను వారి మాటలు పెడచెవిని పెట్టాను. ఇదంతా తల్చుకుంటూ ఉంటే మనసుకు బాధ కలుగుతూ ఉంది. తుదకు నా కొడుకులు యుద్ధమును కోరుకున్నారు. యుద్ధంలో ఓడిపోయి తిరిగి రాకుండా అందరూ యుద్ధభూమి లో మరణించారు. యుద్ధంలో మరణించి వీరస్వర్గం పొందడం క్షత్రియుల లక్షణం కాబట్టి నేను వారి మరణానికి చింతించడం లేదు." అని అన్నాడు ధృ తరాష్ట్రుడు.

ధర్మరాజును దగ్గరగా పిలిచాడు. "ధర్మనందనా! నీ దయ వలన నేను సుఖంగా జీవితం గడుపుతున్నాను. రాచమర్యాదలు అనుభవిస్తున్నాను. నా కుమారుల శ్రాద్ధకర్మలయందు విశేషంగా దానధర్మాలు చేసి వారికి పుణ్యలోకాలు కలుగునట్లు చేసావు. నావలన నువ్వు నీ తమ్ములు ఎన్నో కష్టాలు అనుభవించారు. నీ భార్య ద్రౌపది పట్టరాని పరాభవాన్ని చవిచూచింది. నిన్ను నీ భార్యను ఇన్ని కష్టముల పాలు చేసిన నాకుమారులను నువ్వు నీ తమ్ములు చంపడం సమంజసమే. దానికి మిమ్ములను తప్పుపట్టను. అవన్నీ మరిచిపోయి నీవు నాపట్ల ఎంతో గౌరవము అభిమానము చూపిస్తున్నావు.

ఈ సందర్భంలో నేను నీకు ఒక విషయాన్ని చెప్పుకుంటాను. ఎందు కంటే నీవు ఈ రాజ్యమునకు రాజువు. ఈ రాజ్యంలో ఉండే ఎవరూ రాజుకు చెప్పకుండా ఏ పనీ చెయ్యకూడదు. అందుకని నీతో చెప్పుకుంటున్నాను. మాకు ముసలితనము వచ్చేసింది. ఎంతోకాలము బతకము. క్షత్రియుడైన వాడు యుద్ధంలో మరణించి వీరస్వర్గము పొందాలి. లేకపోతే తపస్సు చేసి ఆ

తపోఅగ్నిలో దగ్ధం అవ్వాలి. నాకు రెండో మార్గమే శరణ్యము. మా పూర్వీకులు ఎంతో మంది వార్ధక్యములో తపస్సు చేసి ముక్తి పొందారు. కాబట్టి నేను గాంధారి అడవులకు పోయి తపస్సు చేసుకోడానికి అనుమతి ఇవ్వు. నేనూ గాంధారీ అడవులకు పోయి అక్కడ నారచీరలు ధరించి కందమూలములు తింటూ తపస్సు చేసుకుంటూ నిన్ను దీవిస్తూ ఉంటాము." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

ఆ మాటలు విన్న ధర్మరాజు పెదతండ్రితో ఇలా అన్నాడు. "పెదనాన్న గారూ! మీరూ పెదతల్లిగారూ అడవులకు పోయి అక్కడ కందమూలములు తింటూ అరణ్యవాసము చేస్తుంటే నేను ఇక్కడ రాజ్యసుఖములు అనుభవించ గలనా! ఈ రాజ్యపాలన నాకుసుఖాన్నిస్తుందా! పెదనాన్నగారూ! నాకు తెలుసు మీరు ఇన్నాళ్లూ సుఖంగా ఉన్నట్టు పైకి కనపడుతున్నారు కానీ మీరు సుఖంగా లేరు. మీరు మనసులో మాత్రం దుఃఖంతో పరితపిస్తున్నారు. మీ మాటలు విని నాకు చాలా బాధగా ఉంది. మీరు లేని రాజ్యము నాకు అవసరము లేదు.

పెదనాన్నగారూ! నాకు తల్లి, తండ్రి, గురువు, దైవమూ అన్నీ మీరే అనుకున్నాను. అటువంటి మీరు అడవులకు పోతే నేను హస్తినాపురములో ఎలా ఉండగలను. ఒక పని చేద్దాము. తమరి కుమారుడు యుయుత్సునికి రాజ్య పట్టాభిషేకము చెయ్యండి. నేను కూడా మీతోపాటు అడవులకు వస్తాను. అందరం అక్కడే ఉందాము. యుయుత్సుడు పరాయి వాడు కాదు. సాక్షాత్తు తమరి వలన పెద తల్లి గాంధారికి జన్మించిన వాడు. తమరి కుమారుడు. తమరికి వారసుడు ఈ రాజ్యానికి వారసుడు అతడే.

పెదనాన్నగారూ! నేను ఇప్పటికే బంధువులను మిత్రులను యుద్ధములో కోల్పోయి, ఆ దుఃఖమును తట్టుకోలేకుండా ఉన్నాను. ఇప్పుడు మీరుకూడా నన్ను విడిచి వెళ్లిపోతే నేను ఏం కావాలి! నా దుఃఖాన్ని ఎవరు తీరుస్తారు. అయినా

పెదనాన్నగారూ! ఈ రాజ్యం మీది. ఈ కౌరవ సామ్రాజ్యానికి మీరే రాజు. మీకు అనుజ్ఞ ఇవ్వడానికి నేను ఎవరిని. మీరు ఇంకా మీ కుమారులు చేసిన దురాగతములు గుర్తుపెట్టుకున్నారు కానీ నేను ఎప్పుడో మరిచిపోయాను. అయినా అవన్నీ కర్మవశాత్తు జరిగినవే కానీ, ఎవరూ చేసినవి కావు కదా!

నాకు మా అమ్మ కుంతీ దేవి, పెద తల్లి గాంధారీ ఒకటే కదా! ఇద్దరినీ సమానంగా పూజిస్తాను. గౌరవిస్తాను. అటువంటిది మీరు లేకపోతే నేను హస్తినలో ఎలా ఉండగలను. నేను ఇన్నిచెప్పినా మీరు అరణ్యములకు పోదలచుకుంటే నేను కూడా మీ వెంట వస్తాను. కాదనకండి. పెదనాన్నగారూ! అమ్మా గాంధారీ మాతా! నిజం చెబుతున్నాను. మీరు ఈ ప్రకారంగా మనసు కష్టపెట్టుకొని అరణ్యములకు పోతే నేను ఈ రాజ్యసుఖములు అనుభవించలేను. మాకు మీకు కలిగిన నష్టములు, పుత్రశోకములు అన్నీ విధివశాత్తు కలిగినవే. కాబట్టి వాటిని మరిచిపోయి మీరు సుఖంగా ఉండంది. ఈ అరణ్యవాస ఆలోచన మానుకోండి. బంధుమిత్రులను అందరినీ యుద్ధములో పోగొట్టు కొన్న నేను మీ ఇద్దరికీ సేవచేసుకుంటూ ఈ దుఃఖమును మరిచి పోదామని అనుకుంటూ ఉంటే మీరు ఈ ప్రకారము మమ్ములని విడిచి పెట్టి అరణ్యములకు పోతాము అనడం న్యాయమా! కాబట్టి నా ప్రార్థనలు మన్నించి ఈ అరణ్యవాస ఆలోచన మానండి. మీ మనసులో ఉన్న దుఃఖాన్ని దూరం చేయండి." అని ధృతరాష్ట్రుడు, గాంధారి కాళ్లమీద పడి ప్రాధేయపడ్డాడు ధర్మరాజు.

ధృతరాష్ట్రుడు ధర్మరాజు పట్టుకొని పైకి ఎత్తి కౌగలించుకున్నాడు. "నాయనా ధర్మనందనా! నీవు నాకు ఎంతో భక్తితో సేవలు చేస్తున్నావు. నేను కాదనలేదు. కానీ నాకు వయసు వచ్చింది. పెద్దవాడినయ్యాను కదా! ఈ వయసులోనైనా నేను తపస్సు చేసుకోవద్దా! ఇన్నాళ్లు రాజ్యపాలన చేసాను.

ప్రజలు చేసిన పాపాలలో నాకూ పాలు ఉంటుంది కదా! మరి నేను తపస్సు చేసి ఆ పాపాలు పోగొట్టుకోవాలి కదా!” అని పలికి ధృతరాష్ట్రుడు సంజయుని, విదురుని, కృపాచార్యుని చూచి “అయ్యా! మీరు దయచేసి ధర్మరాజుకు నచ్చచెప్పండి. నాకు ఇంక మాట్లాడే శక్తిలేదు.” అంటూ శోష వచ్చి పక్కనే ఉన్న గాంధారి మీద పడిపోయాడు. అది చూచి ధర్మరాజు దుఃఖించాడు.

“అయ్యో! వెయ్యి ఏనుగుల బలంకల ధృతరాష్ట్రుడు కూడా పక్కనే ఉన్న ఒక అబల(గాంధారి)ను ఆసరాగా చేసుకొని పడిపోయాడు కదా! ఎంతటి వారికైనా ఇటువంటి దుర్దశ తప్పదు కదా!” అని దుఃఖించాడు. అప్పుడు గాంధారి ధర్మరాజుతో ఇలా అంది. “ధర్మనందనా! నాయనా! మీ పెద తండ్రి గారికి వయసు అయిపోయింది. ఆయన వానప్రస్థమునకు పోవాలని అనుకుం టున్నారు. ప్రతిరోజూ నిద్రాహారాలు మాని ఇదే ఆలోచిస్తున్నారు. అందుకని ఆయనను అరణ్యములకు పోవడానికి అనుమతి ఇవ్వు.” అని పలికింది.

ఆంతరూ కలిసి చల్లని నీరు మొహం మీద చిలకరించి ధృతరాష్ట్రుని సేదతీర్చారు. మరలా ధృతరాఘ్రుడు ధర్మరాజుతో నేను ఎలాగైనా తపస్సు చేసుకోడానికి అడవులకు వెళ్లాల్సిందే. తప్పదు. ~~ఈ~~విషయం తేలేంతవరకూ నేను అన్నపానాదులు ముట్టను. అని అన్నాడు. ఇంతలో వ్యాసమహర్షి అక్కడకు వచ్చాడు. అందరూ ఆ మహానుభావునికి నమస్కరించారు. వ్యాసుడు ధర్మరాజును చూచి ఇలా అన్నాడు.

“ధర్మనందనా! నీ పెదనాన్నగారి మాటను మన్నించు. ఆయనను తపస్సుచేసుకోడానికి అరణ్యములకు వెళ్లనివ్వు. ఎందుకంటే నీ పెదనాన్న వృద్ధుడు. కొడుకులను, బంధువులను పోగొట్టుకున్నాడు. అటువంటి వాడు తపస్సుచేసుకోడానికి అరణ్యాలకు పోవాలి అని కోరకుండా ఉంటాడా! గాంధారి

కూడా పుత్రశోకమును ఇన్నాళ్లు మనసులోనే అణచుకొన్నది. ఆమెకు కూడా ప్రశాంతత కావాలి. ఆమెకు కూడా తన భర్త తపస్సుచేసుకోవాలనే కోరిక ఉంటుంది కదా! అందుకే ఇప్పుడు నీవద్దకు వచ్చాను. వీళ్లను అడవులకు పోనివ్వు. వీరు అక్కడ ఉత్తమ గతులు పొందుతారు. అదే శ్రేయస్కరము.

"ధర్మనందనా! ఇన్నాళ్లు నీవు ఎంతో శ్రద్ధాభక్తులతో వీరికి సేవచేసావు. కాదనను. ఇంకనైనా వారిని వారి ఇష్టవచ్చినట్టు చెయ్యనీ! ఎందుకంటే ధర్మనందనా! క్షత్రియులకు యుద్ధభూమిలో మరణించి వీరమరణం పొందడమో లేక తపస్సు చేసుకుంటూ ఆ ధ్యానంలో మరణించడమో ఉత్తమము. అంతేకానీ ఈ సంసార సాగరంలో పడి వ్యాధులతో బాధలతో తీసుకుంటూ మరణించడం భావ్యమా!" అని అన్నాడు వ్యాసుడు.

ధర్మరాజు మారు మాటాడలేకపోయాడు. " మహానుభావా! నీ మాట మాకు శిరోధార్యము. నీ ఆజ్ఞప్రకారమే చేస్తాను. అయినా తమరి అనుమతి లభించిన తరువాత నా అనుజ్ఞ ఏపాటిది. అయినా లాంఛనంగా పెదనాన్న గారి అరణ్యవాసమునకు అంగీకరిస్తున్నాను." అని అన్నాడు ధర్మరాజు.

ఆ మాటలకు వ్యాసుడు ఎంతో సంతోషించాడు. "కుమారా! ధర్మనందనా! నీ తండ్రి పాండురాజు, తన అన్నగారైన ఈ ధృతరాష్ట్రుని సింహాసనము మీద కూర్చోపెట్టి ఆయనతో ఎన్నో యజ్ఞములు యాగములు, పుణ్యకార్యములు చేయించాడు. తాను రాజ్యభారము వహించి, అన్నగారి చేత రాచరికపు భోగములను అనుభవింపచేసాడు. తన అన్న గారిని భక్తితో సేవించాడు. నీవు కూడా నీ తండ్రి అడుగుజాడలలో నడిచావు. ఈ కురు సామ్రాజ్యమును విస్తరింపచేసావు. ఆయన, ఆయన కుమారులు నీకు నీ తమ్ములకు చేసిన దుర్మార్గములు అన్నీ మరిచిపోయి, నీ పెదనాన్న గారిని ఇన్నాళ్లు సేవించావు.

ఇన్నాళ్లు రాజభోగములు అనుభవించాడు. ఇప్పుడు తపస్సుచేసుకొనవలెనని కోరిక కలిగింది. కాబట్టి ఆయనను అడవులకు పోనివ్వడం నీ ధర్మం." అని అన్నాడు.

ఆ మాటలు చెప్పి మరలా వ్యాసుడు తనదారిన తాను వెళ్లిపోయాడు. అప్పుడు ధర్మరాజు ధృతరాష్ట్రుని చూచి "పెదతండ్రిగారూ! మీరు ఏంచేయాలను కున్నారో, విదురుడు, సంజయుడు, యుయుత్సుడు, కృపాచార్యుడు ఏమి చెయ్యాలనుకున్నారో అదే చెయ్యండి. నా అభ్యంతరం ఏమీ లేదు. కానీ తమరు అలసిపోయి ఉన్నారు. ముందు మీరు భోజనం చెయ్యండి." అని ప్రాధేయపడ్డాడు.

ధర్మరాజు మాట మన్నించి ధృతరాష్ట్రుడు గాంధారితో సహా లోపలకు వెళ్లాడు. ఆయన వెంట విదురుడూ, సంజయుడు, యుయుత్సుడు,కృ పాచార్యుడు కూడా వెళ్లారు. ధృతరాష్ట్రుని వానప్రస్థమునకు తగిన ఏర్పాట్లు అన్నీ చేస్తున్నారు. మరునాడు ధృతరాష్ట్రుడు ధర్మరాజును ఏకాంత మందిరంలోకి తీసుకొని వెళ్లాడు. . ఆయనతో ఇలా అన్నాడు.

"ధర్మనందనా! ఈ రాజ్యము ఏడు అంగములతో కూడి ఉంది. రాజ్యపాలన ధర్మబద్ధంగా చెయ్యాలి. కాని అది చాలా కష్టము. నాకు తెలిసినంత వరకూ నీకు రాజనీతి గురించి చెబుతాను విను.

(నాడు ధృతరాష్ట్రుడు చెప్పిన మాటలు నేటి ప్రభుత్వపాలనకు ఎలా అన్వయింపబడతాయో చూడండి.)

నీవు ఎల్లప్పుడూ విద్యావంతులను, వృద్ధులను భక్తితో సేవించు. వారికి

తగు ధనసహాయము చేసి వారిని ప్రీతులను చెయ్యి.

(వృధ్యాప్య పెన్షన్లు, పండితులకు, కళాకారులకు ఉపకారవేతనాలు, ప్రోత్సహకాలు ఇవ్వడం).

పెద్దవాళ్లు చెప్పిన నీతులు విని ఆ ప్రకారం ఆచరించడం. (అనుభవజ్ఞులను సలహాదారులుగా నియమించుకోడం).

రాజ్యం ఎంత జాగ్రత్తగా చేస్తావో నీ ఇంద్రియాలను కూడా అంతే జాగ్రత్తగా అదుపులో ఉంచుకోవాలి. ( ఎలాంటి సెక్సుస్కాండల్సులో ఇరుక్కోకుండా ఉండటం, అవినీతి ఆరోపణలలో కూరుకుపోకుండా ఉండటం).

నీ ఇంద్రియాలను నీవు అదుపులో పెట్టుకుంటే అవి నిన్ను కాపాడుతాయి. (నిజాయితీ కలిగినపాలన అందించాడు అన్న కీర్తి దక్కుతుంది).

ఇంక మంత్రులను ఎలా నియమించాలంటే... వారి వారి పూర్వ చరిత్రలను, నిజాయితీని, పరిగణనలోకి తీసుకొనాలి. ఇంద్రియ నిగ్రహము కలిగిన వారినే మంత్రులుగా నియమించాలి.
(నేడు అక్రమార్జన కోటాను కోట్లు ఆస్తులు కలిగి ఉన్న వారు, పూటకో మాట, రోజుకో పార్టీ మార్చేవారు, రౌడీలు, గూండాల అండదండలు ఉన్నవారు, మంత్రిపదవులకు అర్హులు. నేడు ఎంతో మంది కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రులు సెక్సు స్కాండల్సు లోనూ, అవినీతి ఆరోపణలలోనూ ఇరుక్కుని జైలుపాలయ్యారు కదా. )

ఇంక రాజ్యపాలనలో ఎంతో మంది శత్రువులు ఉంటారు. వారి యొక్క కదలికలు,నడవడికలు, వారియొక్క ఆప్తులు, బంధుమిత్రులు వారి కదలికలు అనుక్షణం చారుల వలన గమనిస్తూ ఉండాలి.

(అదే నేటి ఇంటలిజెన్సు వ్యవస్థ, ఫోన్ టాపింగ్, బంధుమిత్రులమీద నిఘా. బినామీ ఆస్తుల గురించి ఆరా.)

ధర్మనందనా! ఇంక శాంతిభద్రతలు,పుర రక్షణ వ్యవస్థలను పటిష్టం చెయ్యాలి. నీకు నమ్మకమైన వారినే నీకు భోజన సమయంలో, నిద్రించే సమయంలో నీకు సహాయకులుగా నియమించుకోవాలి. రాజ్యంలో ఆడవాళ్ల రక్షణ ఎంతో ముఖ్యమైనది. వారి రక్షణకు తగిన ఏర్పాట్లు చెయ్యాలి.

(నేడు జరుగుతున్న గృహహింస, అమ్మాయిల మీద ఆసిడ్ దాడులు, కిడ్నాపులు, వేధింపులు, మానభంగాలు, భ్రూణహత్యలు  ఈ కోవలోకి వస్తాయి. వాటిని అదుపులో పెట్టడానికి నిర్మూలించడానికి తగిన పటిష్టమైన రక్షణ వ్యవస్థను రూపొందించాలి.)

ధర్మనందనా! నీవు  ఏ పని చేయాలనుకున్నా మంత్రులందరితోనూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

( ఈరోజుల్లో మంత్రులకు వారి వారి శాఖల్లో జరుగుతున్న విషయాలు గురించి అస్సలు  తెలియడం లేదు. ఎవరికి వారే స్వతంత్రనిర్ణయాలు తీసుకుం టున్నారు. మంత్రులు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రధాన మంత్రికి, ముఖ్యమంత్రికి కూడా తెలియడం లేదు. ఉదాహరణ 2జిస్కామ్.

సమిష్టినిర్ణయాలు తీసుకున్నప్పుడు పాలనలో పారదర్శకత ఉంటుంది. స్కాములకు, అవినీతికీ తావుండదు.).

నీవు నీ మంత్రులతో కలిసి రహస్య ప్రదేశాలలోనే సమావేశం అయి తగు నిర్ణయాలు తీసుకోవాలి. ఏ నిర్ణయం తీసుకున్నా అది రహస్యంగా ఉండాలి. (కాబినెట్ నిర్ణయాలు అధికారికంగా ప్రకటించకముంటే ఛానల్సులో ప్రసారం అవుతున్నాయి. అంతకన్నా ముందే కావలిసిన వారికి చేరుతుంటాయి. లీకు వీరుల మహత్యం).

ఓధర్మనందనా! నీవు మంత్రులతోనూ, చారులతోనూ, రహస్య మంతనాలు జరిపేటప్పుడు మూగవాడైనా, చెవిటి వాడైనా, గుడ్డివాడైనా సరే, దగ్గరగా ఉండనివ్వకూడదు. (నేటి బగ్గింగులు, రహస్యకెమెరాలు, ఫోన్ టాపింగులు, స్టింగు ఆపరేషన్లు ఇదే కోవకు వస్తాయి.)

ఓ ధర్మనందనా! రాజుగా నీవు తీసుకున్న నిర్ణయాలు బయటకుపొక్కితే జరిగేనష్టం నివారించడం చాలా కష్టం. కాబట్టి మంత్రివర్గ నిర్ణయాలు గోప్యంగా ఉంచాలని నీ మంత్రులకు నొక్కి చెప్పాలి. (అదే నేడు మంత్రులతో చేయించే ఓత్ ఆఫ్ సీక్రెసీ).

ఇంక న్యాయనిర్ణయం. న్యాయనిర్ణేతలుగా బాగా చదువుకున్నవారినీ, నిజాయితీ కలవారినీ నియమించాలి. ( ఒక సందర్భంలో ఒక సుప్రీం కోర్టు న్యాయవాది ఆంధ్రప్రదేశ్ లో వాదిస్తున్నప్పుడు అన్న మాట: (A JUDGE MAY BE A PERSON WHO KNOWS LAW OR LAW MINISTER.)

అపరాధులను దండించేటప్పుడు వారు చేసిన నేరము, ఏపరిస్థితుల్లో ఆ

నేరంచేసారో, ఆ నేరం ఎంతతీవ్రమైనదో గుర్తించి, దానికి తగుమాత్రంగానే శిక్ష విధించాలి.

( ఈ సూత్రం నేడు కూడా అమలులో ఉంది. ఉదాహరణకు దొంగతనం నేరం.... దానికి మూడేళ్ళ శిక్ష అనుకుందాము. ఆకలివేసి రొట్టెముక్క దొంగిలించినా అది దొంగతనమే. బయట పెట్టిన వస్తువులు దొంగిలించినా దొంగతనమే. దారిన పోతున్న స్త్రీ మెడలో గొలుసు లాక్కుని వెళ్లినా దొంగతనమే, దౌర్జన్యంగా ఇంట్లోప్రవేశించి ఇంట్లో ఉన్న వారిని కట్టేసి దోచుకుపోయినా దొంగతనమే. కాబట్టి నేరతీవ్రతను బట్టి శిక్ష విధించాలి కాని పిడుక్కు బియ్యానికి ఒకే మంత్రం అన్నట్టు దొంగతనం అనగానే మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించకూడదు. అది నాడు నేడు ఉన్న ధర్మం.).

రాజైనవాడు పొద్దుటే లేచి దేవతార్చన చెయ్యాలి. తరువాత కిందటిరోజు ఆదాయవ్యయాలు చూచుకోవాలి. తరువాత భోజనం చెయ్యాలి. సాయంత్రము వేళలో ప్రజలకు దర్శనం ఇవ్వాలి. వారి బాధలు వినాలి. రాత్రివేళలలో, గూఢచారులను, దూతలను కలిసి మంతనాలు సాగించాలి. బాగా పొద్దుపోయిన తరువాత మాత్రమే స్త్రీసుఖం అనుభవించాలి.

ఏదైనా కొత్త సంగతి, అత్యవసరమైన పరిస్థితి ఏర్పడితే, ఆలస్యం చేయకుండా బద్ధకించకుండా దానిని వెంటనే పరిష్కరించాలి. అంతేగానీ ఆలస్యం చేయకూడదు. (ప్రతి పనినీ సమస్యనూ నానబెట్టడం, అది తీవ్రతమము అయ్యేవరకూ వేచి ఉండటం దాని వలన లబ్ధి పొందటం నేటి రాజకీయము.).

ధర్మనందనా! ఈ ప్రకారంగా పరిపాలనసాగించు. ఇంక సంపాదన. నీవు న్యాయంగా, ధర్మంగానే సంపాదించాలి.

(పదవిలోకి రాకముందు పది ఎకరాలు ఉన్నవాడు, పదవిలోకి వచ్చి పదినెలలు తిరక్కుండానే కోటాను కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నాడు. అదీ నేటి రాజకీయం.)

ప్రజలకు, ప్రభుత్వానికీ విఘాతము కలిగించేవారిని కనిపెట్టి వారిని కఠినంగా శిక్షించాలి. వారి ప్రయత్నములను వమ్ముచేయాలి. ధర్మనందనా! ప్రభుత్వకార్యములలో నేర్పు ప్రదర్శించిన వారికి ఏ లోటూ రాకుండా చూడు. వారి జీవితాలు సక్రమంగా గడిచేట్టు వారికి జీవనోపాధి ఏర్పాటుచెయ్యి. వారు చేసిన మంచి పనులకు ప్రోత్సహకాలు బహిరంగంగా ప్రకటించు. పదిమందిలో వారిని గౌరవించు.

నీమీద భక్తి, స్నేహము, ప్రేమ ఉండి శూరత్వము కలిగిన వాడిని సేనాపతిగా నియమించు. ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా నిలబడగలిగే ఉన్నత వంశంలో పుట్టిన వారిని సేనాపతిగా నియమించు. ఇంకొక్క విషయం. ప్రతివాడిలో తప్పులు ఉంటాయి. నీ తప్పులు ఇతరులకు, నీ కింద పనిచేసే వారికి చెప్పకు. నీ కింద పనిచేసేవారి తప్పులను ఎప్పటికప్పుడు కనిపెట్టి వారిని సక్రమమార్గంలో పెట్టు.

నీ శత్రువుల వద్ద బుద్ధిమంతుడు, నిజాయితీ పరుడు, పరాక్రమ వంతుడు, శ్రమకోర్చి పనిచేసేవాడు ఉన్నట్టయితే వారిని నానా రకములైన బహుమతులు ఇచ్చి, నీకు అనుకూలంగా పనిచేసేట్టు చేసుకో. సాధారణంగా పొరుగు రాజులతో వైరం కలుగుతుంది. అటువంటి వారి పట్ల చాలా జాగ్రత్తగా ఉండు. నీవు ఏమరిపాటుగా ఉన్నప్పుడు నీ మీద దాడిచేసే అవకాశం ఉంటుంది. నీ శత్రువులు నీతో సమానమైన కానీ నీ కన్నా అధికంగా కానీ బలవంతులైతే వారితో సంధిచేసుకొని మిత్రులను చేసుకో. నీ కన్నా తక్కువ

బలము ఉన్న వాడితో శత్రుత్వము వహించి వాడిని ఓడించు. లేకపోతే నీ సామంతరాజును చేసుకో.

యుద్ధము రెండువిధాలు. ఒకటి... కోటను ముట్టడించి కోటలో వారికి బైటనుండిసహాయము అందకుండా చేసి ఓడించడం. రెండవది ముఖాముఖి యుద్ధం చేసి ఓడించడం. మొదటి దానిలో సైన్య నష్టం తక్కువగా ఉంటుంది. సమయానుకూలంగా ఏ పద్ధతి అనుసరించాలో నీవే నిర్ణయించుకోవాలి. ~~ఈ~~ రెండింటికీ ముఖ్యమైన సైన్యమును పటిష్ఠంగా ఉంచుకోవాలి. నీ శత్రురాజ్యంలో ఉన్న మంత్రులు రాజునకు ఎదురు తిరిగినట్టు తెలిస్తే, అదే అదనుగా భావించి, వారిలో వారికి విబేధాలు కల్పించి, దండెత్తి వారిని సులభంగా జయించాలి. ఎంత ప్రయత్నించినా తన రహస్యాలు, తనరాజ్యములోని రహస్యాలు బయటకు పొక్కనీకుండా జాగ్రత్తపడుతూ, రాజ్యపాలన చేసే రాజుతో యుద్ధం కన్నా సంధి ఉత్తమం.

ఇంక శత్రు రాజులను అనువైన సమయం చూచి జయించి వశపరచుకోవాలి. అంతదనుక అతనిని స్వేచ్ఛగా ఉండనివ్వాలి. ఆదమరిచి ఉన్నప్పుడు మీద పడి లోబరచుకోవాలి. నీవు నీ పొరుగు రాజు మీదికి దండెత్తాలి అనుకున్నప్పుడు ముందు అతని బలము, అతని సైన్యము, అతని శక్తియుక్తులు, అతనికి మిత్రులు ఎవరు, శత్రువులు ఎవరు, అతనికి నమ్మిన వారు ఎవరు ఇవన్నీ తెలుసుకొని తరువాత అతనిని జయించడానికి తగు వ్యూహాన్ని ఏర్పాటుచేసుకోవాలి.

రాజుకు రెండు రకాల బలాలు ఉంటాయి. ఒకటి నీ స్వంతబలము. అంటే నీ స్వంత సైన్యము. రెండవది. నీ మిత్రుల బలము. నీ కష్టసుఖములలో నీకు అండగా ఉండే బలము ఏదో గ్రహించి దానిని నమ్ముకోవాలి. దానికి

ఎక్కువ ప్రాధాన్యము ఇవ్వాలి. నీవు నీ శత్రు రాజ్యమును జయించి నప్పుడు ఆ రాజ్య ప్రజలకు నీ మీద అభిమానం కలిగేట్టు చూసుకోవాలి. వారిని అన్ని విధాలా ఆదుకోవాలి. అప్పుడు నీ కీర్తి శత్రు రాజ్యంలో కూడా పెరుగుతుంది. కాబట్టి, నీ రాజ్యములోని ప్రజలను కానీ, శత్రురాజ్యములోని ప్రజలను కానీ దయతో చూడాలి.

ధర్మనందనా! రాజైనవాడు వివిధశాస్త్రములు చదివి అందులో నిష్ణాతుడై, ప్రజలను వారి  ఆస్తులను జాగ్రత్తగా కాపాడుతూ, అందరి ఎడలా దయతో ఉంటూ, ప్రజలకు ఇబ్బంది కలగని విధంగా పన్నులు వసూలు చేస్తూ, ధర్మబద్ధంగా రాజ్యపాలన చేసే రాజుకు ఆ రాజ్యము కామధేనువే అవుతుంది. ధ ర్మమార్గంలో రాజ్యపాలన చేసిన రాజుకు ఈ లోకంలోనే కాదు పరలోకంలో కూడా సుఖాలు లభిస్తాయి. ప్రజలను దయతో, ప్రేమతో, పక్షపాతం లేకుడా, కన్నబిడ్డలవలె కాపాడే రాజుకు అశ్వమేధ యాగములు చేసిన ఫలితం కన్నా ఎక్కువ ఫలితం కలుగుతుంది.

నాయనా ధర్మనందనా! నీకు ఇదివరకే తాత భీష్ములవారు, వ్యాసుడు, కృ ష్ణుడు ఎన్నో నీతి వాక్యములు చెప్పారు. నీవు విన్నావు. అయినా నీ మీద ఉన్న వాత్సల్యము కొద్దీ నాకు తెలిసిన రాజనీతి సూత్రాలు చెప్పాను. అయినా నీకు తెలియని రాజనీతి ఏముంది. కానీ నిరంతరమూ పెద్దలను సేవిస్తూ ఉండు. నీకు సకల శుభములు కలుగుతాయి."  అని ధృతరాష్ట్రుడు ధర్మరాజుకు రాజనీతిశాస్త్రము వినిపించాడు.

" పెదనాన్న గారూ! ఇప్పుడు తాత భీష్ముల వారు లేరు. కృష్ణుడు ద్వారకకు వెళ్లాడు. ప్రస్తుతము తమరు తప్ప నాకు పెద్ద దిక్కు ఎవరూ లేరు కదా! తమరు ఉపదేశించిన రాజనీతి సూత్రములు అక్షరాలా పాటిస్తాను." అని అన్నాడు.

ధర్మనందనా! ఇంక నీవు విశ్రాంతి తీసుకో. నేనూ కొంచెంసేపు విశ్రమిస్తాను." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

తరువాత ధృతరాష్ట్రుడు అంతః పురానికి వెళ్లాడు. అక్కడ గాంధారి "మనము అరణ్యములకు ఎప్పుడు వెళ్లుతాము." అని అడిగింది.

" గాంధారీ! మన అరణ్యవాసమునకు వ్యాసమహర్షి అనుమతి, ధర్మరాజు అనుమతి లభించాయి. ఇంకా ఆలస్యం చెయ్యడం దేనికి. మనము వెంటనే అరణ్యములకు బయలుదేరుదాము. ఎన్నోపాపాలు చేసిన నీ కుమారులకు నేను తపస్సు చేసి ఉత్తమగతులు కలిగిస్తాను. మనము అడవులకు పోయే ముందు నీ కుమారులకు ఊర్ధ్వలోక ప్రాప్తి కలిగేటట్టు కొన్ని పుణ్యకార్యములు దాన ధర్మములు చేసి వెళుదాము." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

వెళ్లే ముందు ఇంతకాలము తనతో మమేకమై ఉన్న పురప్రముఖుల అనుమతి తీసుకోవాలి అని అనుకున్నాడు ధృతరాష్ట్రుడు. ధర్మరాజు దానికి తగిన ఏర్పాట్లు చేసాడు. హస్తినాపురములో ఉన్న ప్రముఖులను రావించాడు. గాంధారితో సహా ధృతరాష్ట్రుడు వారి దగ్గరకు వచ్చి వారితో ఇలా అన్నాడు.

"హస్తినాపుర పౌరులారా! ఇన్ని రోజులూ మీరూ కౌరవులు కలిసి మెలిసి ఉన్నారు. వయసు పైబడిన వారు వానప్రస్థము నకు వెళ్లడం లోక ధర్మము. అందుకనీ నేను కూడా వానప్రస్థమునకు వెళ్లడానికి నిర్ణయించుకున్నాను. మీరందరూ మంచి మనసుతో నన్ను దీవించి పంపండి." అని వేడుకున్నాడు ధృతరాష్ట్రుడు. ఆ మాటలు విని అక్కడ ఉన్న కళ్లనీళ్ల పర్యంతము అయ్యారు. వారిని చూచి ధృతరాష్ట్రుడు ఇంకా ఇలా అన్నాడు. "ఈ హస్తినాపురమును మనకు తెలిసీ శంతన మహారాజు పరిపాలించాడు. తరువాత ఈ రాజ్యమును

భీష్ముడు కాపాడాడు. విచిత్రవీర్యుని రాజుగా చేసాడు. ఆయన కుమారుడ నైన నేను పుట్టు గుడ్డిని కావడం వల్ల నా సోదరుడు పాండురాజు ఈ రాజ్యమును కాపాడాడు. తరువాత దుర్మార్గులు, దుష్టులు అయిన నా కుమారులు పాండవులతో యుద్ధము ఓడిపోయారు. వీరస్వర్గము అలంకరించారు. నిజానికి ఈ దుస్థితికి కారణం నేనే. నన్ను క్షమించండి. నాకు అరణ్యావాసమునకు అనుమతి ఇవ్వండి.

నా భార్య గాంధారి వృద్ధురాలు. ఈ వయసులో కొడుకులనందరినీ పోగొట్టుకొంది. వృద్ధులైన మమ్ములను చూచి అయినా మాకు అరణ్య వాసమునకు అనుమతి ఇవ్వండి. ఇప్పుడు మీకు ధర్మరాజు ఈ హస్తినాపురము నకు రాజు. కురు సామ్రాజ్యమునకు చక్రవర్తి. నాలుగు దిక్కుల వంటి తన తమ్ముల మధ్య దేవేంద్రుని వలె వెలిగిపోతున్నాడు. ఇంక మీరందరూ ధర్మరాజుకు అనుగుణంగా ఆయన ఇష్టప్రకారము నడుచుకోండి. ధర్మరాజు పాలనలో మీరంతా సుఖసంతోషాలతో ఉంటారని ఆశిస్తున్నాను. నా వలన నా వాళ్ళకు కష్టం కలిగిందేమోకానీ మీకు మాత్రం నేను కష్టం కలిగించలేదు. అందుకే ధర్మపరుడైన ధర్మరాజును సింహాసనము మీద ఉంచి వెళుతున్నాను.

ఓ హస్తినాపుర పౌరులారా! మీరందరూ ఇప్పటి దాకా నాకు ఎలాంటి కష్టమూ కలిగించలేదు. ఇప్పుడు కూడా నన్ను సాదరంగా అడవులకు సాగనంపండి. ఆమాటలు వింటున్న పురప్రముఖులు తమ తమ దుఃఖాన్ని ఆపుకోలేక పోతున్నారు. ధృతరాష్ట్రుడు వారిని చూచి ఇంకా ఇలా అన్నాడు.

"అయ్యలారా! ఈమె నా భార్య గాంధారి. సద్వర్తనురాలు. ఇంతకాలం నన్ను అనుసరించి ఉన్నది. ఈమెతో సహా నన్ను అరణ్యావాసమునకు అనుమతి ఇవ్వండి. ధర్మరాజు, వ్యాసుడు కూడా మా అరణ్యావాసమునకు అనుమతి

ఇచ్చారు. ఇంక మీ అనుమతి తో నేను సంతోషంగా అరణ్యవాసమునకు వెళతాను." అని అన్నాడు.

ఆ మాటలకు పౌరప్రముఖులంతా భోరున ఏడ్చారు. తరువాత పురప్రముఖులందరి పక్షాన ఒకడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు.

"ఓ భరతకులభూషణా! ధృతరాష్ట్రమహారాజా!పౌరులందరూ తమందరికి మారుగా నన్ను తమతో మాట్లాడమన్నారు. నా మాటలు సావధానముగా అవధరించండి. కురువంశపు మహారాజులలో తగని పనులు చేసిన వారు ఎవరూ లేరు. అందరూ సకల సద్గుణ సంపన్నులే. అందరూ తమ ప్రజలను కన్నబిడ్డలవలె పాలించారు. ఆ మాటకొస్తే దుర్యోధనుడు చేసిన అనర్థమైన పని ఏమీ లేదు. దానికి మీరు చింతించవలసిన పనిలేదు. తమరికి వ్యాసభగవానుడు ఏమి ఆనతిచ్చాడో దానిని మీరు నెరవేర్చండి. కాని మీరు అడవులకు వెళ్లడం మేమందరమూ తట్టుకోలేకపోతున్నాము. తమరిని తమరి గుణగణములను త ల్చుకుంటూ తమరి మామధ్య ఉన్నట్టే భావించుకుంటాము. మీ తాతగారు శంతనమహారాజూ, మీ నాన్న గారు విచిత్రవీర్యుడు, తమరూ, తమరి కుమారుడు సుయోధన సార్వభౌములూ అందరూ ప్రజారంజకంగానే పాలించారు. ఇందులో తమరిని కానీ, తమరి కుమారుడు సుయోధనుని గానీ తప్పుపట్టవలసిన పనిలేదు. ఇంక యుద్ధము అంటారా. అంతా విధిని అనుసరించి జరిగింది. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు,కృపాచార్యులు, అశ్వత్థామ,శల్యుడు, సుయోధనుడు,భీమార్జుననకులసహదేవులూ, ద్రుపదుడు, విరాటుడు, ధర్మరాజు అందరూ విధిప్రేరణతో ఒకరితో ఒకరు యుద్ధం చేసారు. అందులో కొందరు వీరస్వర్గమలంకరించారు. క్షత్రియ కులమంతా సర్వ నాశనం అయింది. దీనికి ఎవరూ కర్తలు కారు కదా!

ఇంక తమరు ఎప్పుడూ ధర్మాన్ని అవలంబించారు. అందుకే తమరికి పుణ్యలోకములు ప్రాప్తిస్తాయి. ఇందుకు సందేహము లేదు. ప్రస్తుతము మేము మా అదృష్టము కొద్దీ పాండవుల పాలనలో ఉన్నాము. మూడులోకములను కూడా అవలీలగా పాలించగల సమర్ధులైన పాండవులకు ఈ పరిపాలనా బాధ్యతలను అప్పగించావు. చాలా సంతోషము. ధర్మరాజు చాలా ముందుచూపు కలవాడు. అతని మంత్రులు కూడా సమర్ధులు. ధర్మరాజు తన శత్రువుకు కూడా అపకారం చెయ్యడానికి సంకోచిస్తాడు. ఇంక మాకు అపకారం చేస్తాడు అనేది కలలోని మాట. ధర్మరాజు తమ్ములు కూడా అన్న ఆజ్ఞాపాటిస్తూ ధర్మం తప్పని వారే కదా!

ఇప్పటికే ధర్మరాజు దేవతలకు ధూపదీపనైవేద్యములకు గాను అగ్రహారములను, బ్రాహ్మణులకు మాన్యములను బహూకరించాడు. పాండవులందరూ మంచి వారికి ప్రాణం ఇస్తారు. శత్రువులను కఠినంగా శిక్షిస్తారు. వారికి అహంకారము, మదము, లోభము, మాత్సర్యము మచ్చుకైనా లేవు. ఇంక పాండవుల మాతృమూర్తి కుంతీదేవి, పాండవుల ధర్మపత్ని ద్రౌపది కి మామీద ఎనలేని ప్రేమ అభిమానము ఉన్నాయి. వారు తర తమ బేధము లేకుండా అందరినీ ఆదరంతో పలకరిస్తారు. మాట్లాడతారు. కాబట్టి మేమందరమూ పాండవుల చేతిలో, వారి ధర్మపత్ని చేతిలో సుఖసంతోషాలతో జీవిస్తాము. మీరు మా గురించి చింతవీడండి. మీకు తోచిన విధంగా అరణ్యములకు వెళ్లండి." అని ఆ పౌరప్రతినిధి సభాముఖంగా ధృతరాష్ట్రునితో విన్నవించాడు.

ఆ మాటలకు ధృతరాష్ట్రుడు ఎంతోసంతోషించాడు. ఆ ప్రకారంగా ధృతరాష్ట్రుడు పురజనులకు వీడ్కోలు పలికాడు. మరునాడు విదురుని పిలిపించాడు ధృతరాష్ట్రుడు. యుద్ధంలో మరణించిన బంధువులందరికీ

శ్రాద్ధకర్మలు, దానధర్మములు చేయవలెనని చెప్పాడు. అప్పటిదాకా అరణ్యవాసమునకు వెళ్లను అని పలికాడు. విదురుడు ఇదే విషయాన్ని ధర్మరాజుకు చెప్పాడు. ఆ మాటలకు భీముడు కోపోద్రిక్తుడు అయ్యాడు. ఏదో అనబోయాడు. కానీ అర్జునుడు అతనిని వారించాడు.

"భీమసేనా! శాంతించు. ధృతరాష్ట్రుడు మనకు రాజు. వయోవృద్ధుడు. యుద్ధములో భీష్ముడు, ద్రోణుడు మొదలగు వారు ఎంతో మంది బంధువులు చనిపోయారు. వారికి శ్రాద్ధకర్మలు చెయ్యాలని అనుకుంటున్నాడు. దాని కోసం మనలను అర్థిస్తున్నాడు. మనము ఇప్పుడు దానికి ఒప్పుకొనకపోతే మనకు, మన వంశమునకు చెడ్డపేరు రాదా! ఇది ధర్మవిరుద్ధము కాదా! అన్నగారు దీనికి సమ్మతించారు. అన్నగారు చెప్పిన మాటను వనము వ్యతిరేకించవచ్చునా! మరిచిపోయావా! ఇంతకు ముందు మనము అర్ధరాజ్యము కోసరం ధృతరాష్ట్రుని అర్ధించాము. ఇప్పుడు ధృతరాష్ట్రుడు మనలను కేవలం శ్రాద్ధకర్మలు చెయ్యడానికి అర్థిస్తున్నాడు. ఈ మాత్రం మనం చెయ్యలేమా. కాబట్టి ఇప్పుడు ధృతరాష్ట్రుడు చేయ తలపెట్టిన ఈ శ్రాద్ధకర్మలను అతని చేత చేయించడం మనధర్మం. నీవు మారు మాటాడవలదు." అని అన్నాడు అర్జునుడు. అర్జునుని మాటలు విన్న ధర్మరాజు అతని ధర్మనిరతికి ప్రశంసించాడు. కాని భీమసేనుడు మాత్రం అర్జునుడి మాటలు లక్ష్యపెట్టలేదు.

"అర్జునా! ఇంతకు ముందు చేసిన శ్రాద్ధకర్మలు, దానధర్మములు చాలలేదా! భీష్ముడు మొదలగు బంధువులకు శ్రాద్ధ కర్మలు చెయ్యడానికి మనం లేమా. ఆయనే చెయ్యాలా! ధృతరాష్ట్రుడు లాంటి దుర్మార్గుడు చేసే శ్రాద్ధ కర్మలను పితరులు అంగీకరిస్తారా! అన్నయ్యా! ఈ ధృతరాష్ట్రుడి మూలంగా మనం పడిన బాధలు అప్పుడే మరిచిపోయారా! మనం బాధలు పడుతుంటే ఈ భీష్ముడు, బాహ్లీకుడూ మొదలగు పెద్దలు ఏంచేస్తున్నారు. ఒక్కరైనా ఇది

తప్పులని ఈ ధృతరాష్ట్రుని నివారించారా! అటువంటి బంధువులు అసలు బంధువులే కాదు. వారికి శ్రాద్ధక్రియలు చేయనవసరం లేదు. వారికి ఊర్ధ్వలోకాలు కలగక పోతే వచ్చే నష్టం ఏమీ లేదు. అంతగా చెయ్యదలచుకుంటే తన కుమారుడైన కర్ణునికి కుంతీ దేవి శ్రాద్ధక్రియలు చెయ్యవచ్చు. అందులో దోషం లేదు. అయినా అన్నయ్యా! నాడు నిండుసభలో మన ధర్మపత్ని ద్రౌపదిని అవమానించిన విషయమూ, అన్న ధర్మనందనునితో సహా మనం అందరం అడవులలో మృగాలమాదిరి బతికిన విషయం అప్పుడే మరిచిపోయారా! ఇప్పుడు ధృతరాష్ట్రుడుని తండ్రి అంటున్నావు కదా! మరి ఈ తండ్రి ఆ రోజు ఎక్కడకు పోయాడు. సభలో కూర్చుని ఉన్నాడు కదా! అలాంటి వాడూ ఒక తండ్రేనా! అప్పుడు ఈ భీష్ముడు మొదలగు పెద్దలు, బంధువులు సభలో కూర్చుని ఉన్నారు కదా. వారేం చేస్తున్నారు. అప్పుడు వారికి మనతో బంధుత్వము గుర్తుకు రాలేదా! ఈ సంగతులు అన్నీ విదురునికి తెలియవా! ఈనాడు ధృతరాష్ట్రుని మాటలను మనకు చెప్పడానికి ఎలా వచ్చాడు.......” అని ఇంకా భీముని వాక్ప్రవాహము అలా సాగుతుంటే ధర్మరాజు వారించాడు. అర్జునుడు భీమసేనునితో ఇలా అన్నాడు.

“అన్నయ్యా భీమసేనా! ధృతరాష్ట్రుడు మనచేత గౌరవింపతగినవాడు. ఇంక ఒక్క మాట కూడా మాట్లాడవద్దు. పెదనాన్నగారి సంకల్పం నెరవేర్చడం అన్నగారి అభిమతము, ఆదేశము. దానిని మనం ఆచరించాలి. అది మన కర్తవ్యము.” అని భీముని వారించాడు. విదురుని వంక చూచి “పెదనాన్న ధృతరాష్ట్రులవారు శ్రాద్ధకర్మలు ఏ ప్రకారము నిర్వర్తింపదలచు కున్నారో అదే ప్రకారం ఆచరించవచ్చును. ఈ విషయాన్ని ధృతరాష్ట్రులవారికి తెలియ చేయండి.” అని అన్నాడు.

అర్జునుడు పలికిన పలుకులకు ధర్మరాజు ఎంతో సంతోషించాడు.

ధర్మరాజు విదురుని చూచి "విదురా! మా పెదనాన్న ధృతరాష్ట్రుడు ఎంత ధనమునైనా వెచ్చించి శ్రాద్ధకర్మలను నెరవేర్చవచ్చును. అలా చేయడం మా అందరికీ ఇష్టం అని మా పెదనాన్న ధృతరాష్ట్రులవారికి మనవి చేయండి. విదురా! అరణ్యవాసములో పడ్డ బాధలు తలచుకొని భీమసేనుడు ఏదో అన్నాడు. ఆ మాటలు మనసులో పెట్టుకోవద్దు అని ధృతరాష్ట్రుల వారికి మనవి చెయ్యి. అయినా విదురా! భీమసేనుడు ఏమి అన్నా అంటే మాత్రం ఏమవుతుంది. ధృతరాష్ట్రుడు మాకుపరమదేవత. ఆయనే నన్ను ఈ కురుసామ్రాజ్యానికి చక్రవర్తిగా అభిషేకించాడు. కాబట్టి మా తండ్రిగారు తన ఇష్టం వచ్చినట్టు పితృకర్మలు ఆచరించమనండి. దానికి తగిన ఏర్పాట్లు అర్జునుడు చేస్తాడు. బ్రాహ్మణులకు అగ్రహారములు, ధనము, ధాన్యము, విరివిగా దానం చెయ్యమని చెప్పండి." అని అన్నాడు ధర్మరాజు.

వెంటనే విదురుడు ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లాడు. ధర్మరాజు చెప్పిన మాటలు యధాతథంగా చెప్పాడు. "ఓ ధృతరాష్ట్రమహారాజా! నీకు నచ్చిన విధంగా భీష్మాదులకు శ్రాద్ధకర్మలు, దానధర్మాలు చెయ్యమని చెప్పాడు. నీ కుమారులు పుణ్యలోకములు పొందేవిధంగా బ్రాహ్మణులకు బంగారము, రత్నములు, గ్రామములు, హయములు, గోవులు, మిక్కుటంగా దానం చెయ్యమని చెప్పాడు." అని అన్నాడు విదురుడు. భీముడు అన్నమాటలు కూడా చూచాయగా తెలియ జేసాడు. "ధృతరాష్ట్ర మహారాజా! నీవు భీముడు అన్న మాటలు లక్ష్యపెట్ట వద్దు. ఎందుకంటే భీముడు దుర్మదుడు. అతని మాటలు పట్టించుకోనవసరం లేదు." అని అన్నాడు.

ఆ మాటలకు ధృతరాష్ట్రుడు సంతోషించాడు. కార్తీక మాసంలో పౌర్ణమి తిథియందు ధృతరాష్ట్రుడు పెద్దలకు శ్రాద్ధకర్మలు నిర్వర్తించాడు. ధర్మరాజు బంగారముతో చేసిన వస్తువులను విరివిగా పంపించాడు. ధృతరాష్ట్రుడు

ముందు బాహ్లికునకు, భీష్మునకు, సోమదత్తునకు, ఆయన పుత్రులకు శ్రాద్ధ కర్మ ఆచరించాడు. తరువాత సుయోధనుడు మొదలగు నూర్గురు కుమారులకు శ్రాద్ధకర్మలు నిర్వర్తించాడు. తరువాత సింధురాజు సైంధవునకు అతని బంధువులకు, మిగిలిన రాజులకు, ద్రోణునకు తనకు తోచిన విధంగా శ్రాద్ధకర్మలు చేసాడు. తరువాత తనకు గుర్తుకు వచ్చిన బంధువులకు అందరికీ శ్రాద్ధకర్మలు నిర్వర్తించాడు. తరువాత 15రోజుల పాటు నిర్విరామంగా దానధర్మములు చేసాడు. దానికి తగిన నిధులు, సంభారాలు, బంగారము, రత్నములు, గోవులు, హయములు, వస్త్రములు, స్త్రీలు, గ్రామములు సమకూర్చాడు ధర్మరాజు. ధృతరాష్ట్రుడు చేసినవి కాకుండా ధర్మరాజు ఎన్నో గ్రామములు బ్రాహ్మణులకు దానంగా ఇప్పించాడు.

తరువాత అరణ్యములకు పోవడానికి తగిన సన్నాహములుచేసుకున్నాడు. మరునాడు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు ఉదవసీయం అనే యజ్ఞమును చేసాడు. పాండవులకు మిగిలిన వారికి తాను అడవులకు పోతున్నట్లు తెలియ చేసాడు. పట్టు వస్త్రములు విడిచి తాను, గాంధారి నారచీరలు ధరించారు. ఆభరణములు, ఆడంబరాలు విడిచిపెట్టాడు. పురోహితులు అగ్నిహోత్రము తో సహా వెంట నడువగా గాంధారీ సహితంగా ధృతరాష్ట్రుడు అడవులకు బయలుదేరాడు. ఆసమయంలో కుంతీదేవి అక్కడకు వచ్చింది. దుఃఖము ముంచుకొస్తూ ఉండగా కుంతీ దేవి గాంధారీ వెంట నడిచింది. ,

ధృతరాష్ట్రుడు వెళుతున్న వంక చూస్తూ ధర్మరాజు దుఃఖాన్ని తట్టుకోలేక కిందపడిపోయాడు. పక్కనే ఉన్న అర్జునుడు ధర్మరాజును ఓదార్చాడు. భీముడు, నకులుడు, సహదేవుడు, యుయుత్సుడు, సంజయుడు ధౌమ్యుడు మొదలగు వారు కూడా దుఃఖంతో కుమిలిపోయారు. కుంతీ దేవి గాంధారీ బుజం మీద చెయ్యి వేసి నడుస్తూ ఉంది. ద్రౌపదీ,సుభద్రా,చిత్రాంగద, ఉలూపీ, ఉత్తర,

ఇంకా అంతఃపుర జనాలు శోకిస్తూ నడుస్తున్నారు. కొంతమంది పెద్దగా ఏడుస్తున్నారు. జూదం ఆడిన తరువాత పాండవులు అడవులకు వెళ్లేటప్పుడు ఏ ప్రకారం పౌరులు దుఃఖించారో ఆ మాదిరి దుఃఖిస్తున్నారు. పౌరులందరూ వీధులకు అటు ఇటు నిలబడి చూస్తున్నారు. చిన్న పెద్దా ఆడా మగా తేడా లేకుండా పౌరులందరూ దుఃఖిస్తున్నారు.

ధృతరాష్ట్రుడు పురద్వారము సమీపించాడు. తనతో వచ్చు వారందరినీ ఇంక నిలువమని ప్రార్థించాడు. విదురుడు కూడా ధృతరాష్ట్రుని తో కూడా వనములకు వెళ్లడానికి నిశ్చయించు కున్నాడు. విదురునితోపాటు సంజయుడు కూడా అడవులకు అనుసరించాడు. కృపాచార్యుడు, యుయుత్సుడు కూడా వెంట వస్తానంటే ధృతరాష్ట్రుడు వారించాడు. ధర్మరాజుకు వారిని అప్పగించాడు. తన కోడళ్లను సముచిత మైన మాటలతో అనునయించాడు. వారలందరూ ధృతరాష్ట్రునకు గాంధారికి నమస్కరించి వారి వద్ద సెలవు తీసుకున్నారు. ఆ సమయంలో ధర్మరాజు కుంతీదేవిని చూచి ఇలా అన్నాడు.

“అమ్మా! ధృతరాష్ట్రుడు నాకు పితృసమానుడు. ఆయన అడవులకు వెళుతున్నాడు. నేను కూడా ఆయన వెంట వెళతాను. ఆయనకు శుశ్రూషలు చేస్తాను. నీవు ఈ అంతఃపుర జనమును తీసుకొని తిరిగి వెళ్లు.” అని పలికాడు. ఆమాటలకు కుంతీదేవి ఇలా అన్నది.

“కుమారా! రాజ్యము చెయ్యవలసిన వాడవు తనతో రావడానికి నీ పెదతండ్రి అంగీకరిస్తాడా! కాబట్టి నీవు అంతఃపురజనములో తిరిగి వెళ్లు. అక్కగారికి సేవచేయడానికి నేను వారితోపాటు అడవులకు వెళతాను. ఎందుకంటే వారికి సేవలు చెయ్యడం మీ వల్ల అవుతుందా చెప్పు. నేను స్త్రీని. పైగా సమర్ధురాలిని. కాబట్టి నేను వారితో పాటు అడవులకు వెళతాను. అయినా

ఇంతకాలం కలిసి ఉన్నాము ఇప్పుడు వారు అడవులకు పోతే నేను రాజభవనములలో ఉండటానికి నా మనసు ఎలా ఒప్పుతుంది." అని అన్నది కుంతి. ఆ మాటలు విన్న పాండవులు ఐదుగురూ కుంతినీ ఆపడానికి ఎంతో ప్రయత్నం చేసారు. కాని కుంతి వినలేదు. ధర్మరాజుతో ఇలా అంది.

" కుమారా! నేను వీరితో అడవులకు వెళ్లడానికి నిశ్చయించుకున్నాను. ఇంక నీవేమీ మాటాడకు. ఎవరు చెప్పినా నేను వినను. నకుల సహదేవులను జాగ్రత్తగా చూచుకో. నా పెద్దకుమారుడు కర్ణుని మరువకు. ఎందుకంటే, కపట బుద్ధితో నా కుమారుని జనన రహస్యం మీకు చెప్పకుండా దాచాను. మహా పాపం చేసాను. దానిని తలచుకుంటూ నేను బాధపడని రోజులేదు. నేను చేసిన పాపము తొలగిపోయేట్టు కర్ణుని పేరుమీద విరివిగా దానధర్మములు చెయ్యి. నా పెద్దకుమారుడు కర్ణుడు, చిన్న కుమారుడు అర్జునుని చేతిలో దారుణం చంపబడ్డాడు అని తెలిసికూడా నా గుండెలు బద్దలవలేదు. ఎందుకంటే నాది గుండె కాదు. బండరాయి. నేను ఎంత కఠినాత్మురాలినో కదా! కాబట్టి నీవు నీ తమ్ములు కర్ణుని సదా స్మరించండి.

ధర్మనందనా! మీ భార్య ద్రౌపదిని అనురాగంతో చూడండి. నీ తమ్ములు భీమార్జున నకులసహదేవులు మనసు తెలుసుకొని ప్రవర్తించు. వారికి కావలసినవి వారు అడగకుండానే సమకూర్చు. ఇంటి విషయములలో పడి రాజ్యపాలన, ధర్మపరిరక్షణ ఉపేక్ష చేయకు. నా నిర్ణయము మారదు. ఇంక మీరు తిరిగి వెళ్లండి." అని పలికింది కుంతి. చేసేది లేక ధర్మరాజు దుఃఖిస్తూ నిలబడ్డాడు. భీమార్జుననకులసహదేవులు కూడా కళ్లలో నీళ్లు కారుతుండగా తలలు వంచుకొని నిలబడ్డారు.

అప్పుడు ధర్మరాజు తల్లితో ఇలా అన్నాడు. "అమ్మా! ఏంటమ్మా ఇది!

ఇంత హటాత్తుగా ఇలాంటి నిర్ణయం తీసుకున్నావు. నిన్ను నేను అడవులకు ఎలా పంపగలను అని ఎలా అనుకున్నావు. అమ్మా! నీవు మా చిన్నప్పటి నుండి మాకు మార్గనిర్దేశం చేస్తున్నావు. ఇప్పుడు కూడా అదే ప్రకారము మా చేత రాజ్యపాలన చేయించు. అంతేగానీ అడవులకు పోతాను అంటే ఎలాగా! నీవు కృష్ణుడూ మమ్ములను అనుక్షణం కనిపెట్టి ఉండక పోతే మేము ఇంతవారము అయ్యేవారమా! అమ్మా! మమ్ములను కోడళ్లను, మనుమళ్లను విడిచి నీవు అడవులలో ఎలా ఉండగలవమ్మా! చెప్పు." అని అన్నాడు.

కానీ కుంతీ దేవి ఏ సమాధానమూ చెప్పకుండా గాంధారి వెంట సాగిపోతూనే ఉంది. ఇలా కాదని భీముడు కుంతీదేవికి అడ్డం పడ్డాడు.

"అమ్మా! అమ్మా! ఏంటమ్మా ఇది. అసలు నీవు మా అందరినీ విడిచి పెట్టి వెళ్లడానికి కారణం ఏమన్నా ఉందా!నీ ఆదేశం ప్రకారమే కదా మేమందరమూ యుద్ధము చేసి శత్రువులను సంహరించి రాజ్యలక్ష్మిని చేపట్టాము. సుఖించ వలసిన తరుణంలో నీవు ఇలా అడవులకు పోవడం భావ్యమా చెప్పు. అమ్మా! నీవు అరణ్యములలో ఏంచేస్తావో అదే ఇక్కడా చెయ్యి. నీ ఇష్టం వచ్చినట్టు దానధర్మాలు చెయ్యి. అమ్మా ఒక్కసారి గుర్తుకు తెచ్చుకో. నకుల సహదేవులు చిన్నవాళ్లు అడవులలో ఎన్ని అవస్థలు పడుతున్నారో అని నీవు కుమిలిపోయావు కదా! రాజ్యం మరలా సంపాదించడానికి మమ్ములను యుద్ధం చెయ్యమని పురికొల్పావు కదా! మేము యుద్ధం చేసి రాజ్యము సంపాదించిన తరువాత మమ్ములను వదిలి నీవు అడవులకు పోవడం తగునా!" అని కుంతిని ఆపడానికి ప్రయత్నించాడు భీముడు. భీముని మాటలు విని ద్రౌపది,సుభద్ర ఎంతో దుఃఖించారు.వీరి పరిస్థితి ఇలా ఉంటే కుంతీదేవి పరిచారికల దుఃఖానికి అంతులేదు.

వీరందరినీ చూచి కుంతి ఇలా అనుకుంది. ఇంక కొంచెం కఠినంగా మాట్లాడితేగాని వీరు ఇక్కడినుండి వెనుకకు మరలరు అని మనసులో అనుకొని వారు వింటూ ఉండగా పక్కనే ఉన్న పరిచారికలతో ఇలా అంది.

“నిజమేనమ్మా! నా కుమారులు నా కోడలు నిండుకొలువులో పడ్డ అవమానాలను, వారు అరణ్యములలో పడ్డ కష్టములను చూచి సహించలేక కృష్ణునితో ఆ మాటలు అన్నమాట నిజమే. వీళ్లను యుద్ధమునకు పురికొల్పిన మాట కూడా నిజమే! అయినా లోకోత్తర పరాక్రమ వంతులైన కుమారులు ఆ ప్రకారం కష్టములు పడటం ఏతల్లి అయినా ఓర్చుకుంటుందా! చెప్పండి.” అని పలికి పక్కనే ఉన్న ద్రౌపదిని ముందుకు తోసి ధర్మరాజుతో ఇలా అంది. “చూడు! ఈమె కుసుమకోమలి. ఈమెను తల్లిలా పూజించవలసిన ఈమె మరిది ఈమె కొప్పుపట్టుకొని నిండు సభకు ఈడ్చుకు వచ్చాడు. దానిని మీరు సహించారు. కాని నేను సహించలేకపోయాను. కురువంశ ప్రతిష్ఠ సర్వనాశనం అవుతుంటే సహించలేకపోయాను. అందుకని మిమ్ములను యుద్ధమునకు పురికొల్పాను. కృష్ణునితో అలా మాట్లాడాను. అంత మాత్రం చేత భీమసేనుడు ఈరోజు నన్ను ఇలా మాట్లాడుతున్నాడు. నన్ను ఎత్తిపొడుస్తున్నాడు. నేను ఏమనగలను చెప్పు.” అని పలికింది కుంతి.

ఆ మాటలకు భీముడు సిగ్గు పడ్డాడు. బాధతో కుమిలిపోతున్నాడు. అంతలోనే తన కుమారుడు బాధ పడటం చూచి కుంతి సహించలేకపోయింది. భీముని చూపించి ధర్మరాజుతో ఇలా అంది. “అది కాదు ధర్మనందనా! నేను ఊరికే నవ్వులాటకు అన్నాను. అంతే కానీ భీముని కించపరచాలని కాదు. అయినా మీరు నాకేం తక్కువ చేసారు. నేను కోరినట్టు దాన ధర్మాలు చెయ్యనిచ్చారు. నేను కూడా మీరు అశ్వమేధ యాగము చెయ్యడం కళ్లారా చూచాను. ధన్యురాలినయ్యాను. ఈ జన్మకు నాకు ఇంక కావాలిసింది ఏముంది.

ఇంక అనుభవించాల్సింది ఏమీ లేదు. ఈ రాజ్యసుఖాలు అనుభవించి నాకు విసుగు పుట్టింది. కాబట్టి ఇంక నేను అడవులకు పోవడం మంచిది. ఈ జీవిత చరమాంకంలో హాయిగా ప్రశాంతంగా తపస్సు చేసుకుంటూ పుణ్యలోకాలు పొందుతాను. ఆ పని నేను ఒంటరిగా చెయ్యలేను కదా. ఇప్పుడు ధృతరాష్ట్రుడు గాంధారి తోడు దొరికారు. ఇంతకన్నా నాకు కావాల్సింది ఏముంది. అందుకని నన్ను వారితో అడవులకు వెళ్లనివ్వు. నేను గాంధారీ ధృతరాష్ట్రులకు సేవచేసు కుంటూ తపస్సు చేసుకుంటూ శేషజీవితాన్ని ఆనందంగా ప్రశాంతంగా గడుపుతాను. మీరు ఇంక వెనుకకు మరలండి." అని చెప్పింది కుంతీదేవి.

ఇదంతా దూరం నుండి చూస్తున్న విదురుడు జరిగిన విషయములు అన్నీ ధృతరాష్ట్రునకు వివరించాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా అన్నాడు. "నీవు పోయి కుంతి తో ధర్మరాజు ఎలా చెబితే అలా చేయుము అని చెప్పు" అని అన్నాడు. విదురుడు సంజయుడు వచ్చి కుంతితో ఆ సంగతి చెప్పారు. కాని కుంతీ దేవి వారి మాటలు వినలేదు. తన పట్టుదల మానలేదు. ఒక్కసారి తన కొడుకులను కోడళ్లను చూచి "మీరు అందరూ ఎందుకు నా వెంట వస్తారు. నేను అడవులకు వెళుతున్నాను.మీరు మీ మీ రాజభవనములకు వెళ్లండి." అని చెప్పింది.

ఇంక కుంతీ తన నిర్ణయం మార్చుకోదని వారికి తెలిసిపోయింది. అందుకని వారందరూ ఆమెకు ప్రదక్షిణా నమస్కారములు చేసారు. అక్కడే దుఃఖిస్తూ నిలబడ్డారు. పాండవులు మాత్రం తల్లికి వీడ్కోలు చెప్పడానికి ఆమెతో కొంచెం ముందుకు నడిచారు. ఆమెను ధృతరాష్ట్రుని వద్దకు తీసుకొని వెళ్లారు. ధర్మరాజు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "మీరు అడవికి వెళుతున్నారు అని తెలిసి మా తల్లిగారు కుంతీదేవి కూడా మీతో వస్తానని పట్టుబట్టింది. మేము ఎంత చెప్పినా వినడం లేదు. ఇంక మా తల్లి బాధ్యత మీదే. ఆమెతో

మీరు సేవలు చేయించుకోండి." అని తమ తల్లి కుంతీదేవిని గాంధారీ ధృతరాష్ట్రులకు అప్పగించారు. తరువాత పాండవులు ధృతరాష్ట్రునకు, గాంధారికీ, కుంతీదేవికి చుట్టు తిరిగి నమస్కరించారు. వెను తిరిగి అంతఃపుర స్త్రీలు ఉన్నచోటికి వచ్చారు. అందరూ బరువెక్కిన హృదయాలతో హస్తినాపురమునకు తిరిగి వచ్చారు.

తరువాత ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతి, విదురుడు, సంజయుడు అందరూ గంగానదీతీరమునకు చేరుకున్నారు. అక్కడ విడిది చేసారు. గంగానది లో స్నానాదికములు ఆచరించి, సంధ్యావందనము మొదలగు నిత్యపూజలు చేసారు. అగ్నిహోత్రము వెలిగించారు. అగ్నిని పూజించారు. తరువాత అందరూ భోజనాది కార్యక్రమములు నిర్వర్తించారు. ధృతరాష్ట్రుడు దర్భలతో చేసిన శయ్య మీదకూర్చున్నాడు. అలాగే గాంధారీ, కుంతి, విదురుడు, సంజయుడు కూడా తమతో వచ్చిన ఋత్విక్కులతో విశ్రాంతి తీసుకుం టున్నారు.

మరునాడు సూర్యోదయము కాగానే ప్రాతఃకాల విధులు నిర్వర్తించారు. గంగానదిని దాటి కురుక్షేత్రంలో ప్రవేశించారు. అక్కడ ఉన్న శతయూపుడు అనే రాజర్షి ధృతరాష్ట్రుడు, గాంధారీ సమేతంగా అక్కడకు వచ్చాడని తెలిసి ఆయనను చూడటానికి వచ్చాడు. ధృతరాష్ట్రుని, గాంధారినీ, కుంతినీ, విదురుడు, సంజయుని, ఋత్విక్కులను తన ఆశ్రమమునకు తీసుకొని వెళ్లాడు. అక్కడ ఉన్న ప్రశాంతతను చూచి ధృతరాష్ట్రుడు అక్కడే ఉండాలని కోరుకున్నాడు. వెంటనే అక్కడ పర్ణశాలలు నిర్మించారు. అందరూ వనవాసము లో అనుసరించవలసిన పద్ధతులు అనుసరిస్తున్నారు. నారచీరలు ధరించారు. కందమూలములు మొదలగు శాకాహారములు తింటున్నారు. పర్ణశాలలతో ఉంటున్నారు. గాంధారీ, ధృతరాష్ట్రులు అత్యంత నిష్ఠతో తపస్సు చేస్తు న్నారు. కాలక్రమేణా ధృతరాష్ట్రుడు ఎముకల పోగుగా మిగిలిపోయాడు. అతని తపస్సు

రోజురోజుకూ తీవ్రరూపం దాల్చసాగింది.”  అని వైశంపాయనుడు జనమేజయునికి చెప్పిన మహాభారత కధను నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో సూతుడు శౌనకాది మహామునులకు వినిపించాడు.

మహా భారతము

ఆశ్రమ వాస పర్వము

ప్రధయోధ్యాయము సంపూర్ణము.

ఓం తత్సత్ ఓంతత్సత్ ఓంతత్సత్.

# మహా భారతము

## ఆశ్రమ వాస పర్వము

## ద్వితీయాశ్వాసము.

సర్పయాగ సందర్భంలో వైశంపాయనునకు జనమేజయుడు చెప్పిన మహాభారత కధను నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో సూతి అనే పౌరాణికుడు శౌనకుడు మొదలగు మహామునులకు వినిపించసాగాడు.

ఆ ప్రకారము ధృతరాష్ట్రుడు అడవిలో తపస్సు చేసుకుంటున్నాడు. అడవిలో ఉన్న ధృతరాష్ట్రుని చూడటానికి నారదుడు, పర్వతుడు, దేవలుడు, మౌంజాయనుడు అనే మహర్షులు వచ్చారు. శతయూపుడు కూడా ఆ సమయంలో అక్కడకు వచ్చాడు. కుంతీదేవి వారందరికీ అతిథి సత్కారాలు చేసింది. తరువాత అందరూ ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లారు. వారిని చూచి ధృతరాష్ట్రుడు సంభ్రమంతో లేచి అందరికీ నమస్కరించాడు. వారు ధృతరాష్ట్రుని ఆశీర్వదించారు. వారందరికీ ధృతరాష్ట్రుడు దర్భాసనములు ఇచ్చి కూర్చోమన్నాడు.

ఆ సమయంలో నారదుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "ధృతరాష్ట్ర మహారాజా! పూర్వము శతయూపుడు అనే మహారాజు ఉండేవాడు. ఆయన తాత గారు సహస్రచిత్యుడు. ఆ సహస్రచిత్యుడు తన పెద్దకుమారునికి రాజ్యము ఇచ్చి అడవులకు వచ్చి ఇదే ప్రదేశములో తపస్సుచేసాడు. ఇంద్రుడితో మిత్రత్వము పొందాడు.

ఆయనే కాకుండా పృషధ్రుడూ, శైలాలయుడూ, పురుకుత్సుడూ అనే రాజులు కూడా ఇక్కడే తపస్సు చేసి  స్వర్గలోకమును  పొందారు. నాకు వారందరూ తెలుసు. ఈ ఆశ్రమంలో తపస్సు చేయడం అందరికీ సాధ్యము కాదు. అలాంటిది వ్యాసుని దయవలన నీకు ఆ అదృష్టం కలిగింది.  ఇక్కడ తపస్సు చేయడం వలన నీవు కూడా ఆ రాజుల వలెనే  ఉత్తమ గతులు పొందుతావు. నీ భార్య గాంధారి కూడా నిన్ను అనుసరించి వస్తుంది.

మీకు సేవలు చేసినందుకు కుంతీదేవి కూడా ఉత్తమగతులు పొంది తన భర్త పాండురాజు ఉన్నచోటికి చేరుకుంటుంది. ఈ సమయంలో పాండు రాజు ఇంద్రుడి వద్ద ఉన్నాడు.  ఎల్లప్పుడూ నిన్నే తలుచుకుంటూ ఉన్నాడు.

యమధర్మరాజునే ఆత్మగా కల విదురుడు కూడా యమధర్మరాజును చేరుకుంటాడు. సంజయుడు మిమ్ములను అనుసరించి స్వర్గలోకము చేరుకుంటాడు."  అని అన్నాడు నారదుడు.

ఆమాటలు విన్న ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీ ఎంతో సంతోషించారు.  ఆ సమయంలో శతయూపుడు నారదునితో ఇలా అన్నాడు. "ఓ నారదమహర్షి! మీకు అన్ని తెలుసు కదా. నేను ఒకటి అడుగుతాను. నాకు సమాధానము చెప్పండి. తమరు ఈ కురుసార్వభౌమునికి ఉత్తమగతులు కలుగుతాయి అని అన్నారు కదా. దానిని గురించి వివరించండి." అని అడిగాడు.

నారదుడు ఇలా చెప్పసాగాడు.  "ఓ శతయూపా! నేను ఒకసారి

దేవేంద్రునితో అవీ ఇవీ మాట్లాడుతున్నాను. ఆ సమయంలో ధృతరాష్ట్రుని గురించి ప్రస్తావన వచ్చింది. ధృతరాష్ట్రుని తీవ్రమైన తపస్సు గురించి దేవలోకంలో అంతా ప్రశంసించారు. అప్పుడు దేవేంద్రుడు నాతో ఇలా అన్నాడు. “నారదా! ఇంతటి తీవ్రమైన తపస్సు చేస్తున్న ధృతరాష్ట్రుడు, తన భార్యగాంధారితో సహా దేవలోకము చేరుకుంటాడు. ఆ సమయంలో పాండురాజు అక్కడే ఉన్నాడు. ఆ మాటలు విని పాండురాజు ఎంతో సంతోషించాడు.” అని నారదుడు చెప్పాడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు మున్నగువారు ఎంతో సంతోషించారు. తరువాత నారదుడు మొదలగు మహామునులు అందరూ తమ తమ నివాసములకు వెళ్లిపోయారు.

ఇక్కడ ఇలా ఉండగా, హస్తినాపురంలో పాండవులు తమ తల్లి కుంతీదేవిని అనుక్షణం తలుచుకుంటూ ఉన్నారు. అడవులతో తమ పెదతండ్రి, పెదతల్లి ఎన్ని కష్టాలు పడుతున్నారో అని దు:ఖిస్తున్నారు. ముదుసలి ప్రాయంలో సుఖపడవలసిన తరుణంలో, అడవులలో కష్టములు పడుతున్నారు అని కుమిలిపోతున్నారు. హస్తినాపుర ప్రజలుకూడా ఎంతో దు:ఖిస్తున్నారు. అంతేకాదు పాండవులు విదురుని, సంజయుని కూడా అనుదినమూ తలచుకుంటూ విచారిస్తున్నారు. రాచభోగములు వదిలి అడవులలో ఆకులలములు తింటూ బతకవలసిన ఖర్మ ఏమిటని వాపోతున్నారు. వారిని చూచి ద్రౌపది సుభద్రకూడా ఎంతో బాధపడే వాళ్లు.

ఇంక ఉండబట్టలేక పాండవులు అందరూ ధృతరాష్ట్రుని తదితరులను చూడటానికి అరణ్యములకు వెళ్లడానికి

నిశ్చయించుకున్నారు.  ఆ సమయంలో సహదేవుడు అన్నలకు నమస్కరించి ఇలా అన్నాడు.

“తల్లి కుంతీ దేవిని చూడటానికి అడవులకు వెళ్లాలని నేను ముందే అనుకున్నాను కానీ మీరు ఏమంటారో అని బయటకు చెప్పలేదు. మన తల్లి కుంతీ దేవి తన అక్క, బావగార్లకు సేవ చెయ్యడానికి వారితో పాటు అడవులకు వెళ్లింది. అక్కడ నారచీరలు కట్టుకొని,   ఆకులు అలములు తింటూ ఎలా జీవితం గడుపుతూ ఉందో అని బెంగగా ఉంది అన్నయ్యా.  అందుకని ఇంకా  ఆలసస్యం చెయ్యకుండా మీరు అరణ్యములకు వెళ్లి వారిని చూచి రావడం మంచిది.” అని అన్నాడు.

ఆ మాటలకు విన్న ద్రౌపది కూడా ఇలా అంది. “సహదేవుడు చక్కగా చెప్పాడు. మీరు తక్షణం కుంతీదేవిని చూడటానికి అడవులకు వెళ్లడం సముచితం. కాని ఒక్క విషయం. మీరే కాదు మాకోడళ్లందరం అత్తగార్లను చూడవలెనని కోరికతో తహ తహ లాడుతున్నాము. మేమందరమూ ప్రయాణమునకు సిద్ధంగా ఉన్నాము.” అని చెప్పింది.

ధర్మరాజు అందుకు సమ్మతించాడు. ప్రయాణానికి తగు సన్నాహములు చెయ్యమని ఆదేశాలు ఇచ్చాడు. హస్తినాపుర ప్రజలు ఎవరైనా తమతో రావచ్చు అని అలా వచ్చిన  వారికి తగు ఏర్పాట్లు చేయించమని ఆదేశాలు ఇచ్చాడు. తాము లేని సమయంలో  నగర రక్షణకు యుయుత్సుని, కృపాచార్యుని, పురోహితుడు ధౌమ్యుని నియమించాడు. ఆ ప్రకారంగా అడవులకు పోవడానికి ప్రయాణ సన్నాహాలు చేస్తున్నారు.

భీముడు గజ బలంతో బయలుదేరాడు. అర్జునుడు రథసమూహంతో బయలుదేరాడు. నకులుడు తన అశ్వబలంతో బయలుదేరాడు. సహదేవుడు కాల్బలంతో బయలు దేరాడు. ద్రౌపది మొదలగు అంత:పుర కాంతలు పల్లకీలలో, బంగారు రథములలో బయలుదేరారు. ధర్మరాజు 16 హయములు కూర్చబడిన తన రథంలో బయలుదేరాడు. వారి వెంట రకరకాలైన వాహనములు ఎక్కి హస్తినాపుర ప్రజలు బయలుదేరారు.

ఆ ప్రకారంగా ధర్మరాజు గంగానదిని దాటి కురుక్షేత్రంమీదుగా వెళుతున్నాడు. అందరూ శతయూపుని ఆశ్రమమునకు దగ్గరలో ఉన్న ధృతరాష్ట్రుని ఆశ్రమమునకు చేరుకున్నారు. అందరూ తమ తమ వాహనములు దిగి కాలి నడకన ఆశ్రమము వద్దకు వచ్చారు. ధర్మరాజు అక్కడ ఉన్న వారిని చూచి "ధృతరాష్ట్రులవారు ఎక్కడ?" అని అడిగాడు. "యమునలోస్నానం చెయ్యడానికి వెళ్లారు." అని చెప్పారు. వెంటనే ధర్మరాజు మొదలగు వారు అందరూ యమునానదీ తీరానికి వెళ్లారు.

అప్పటికే యమునలో స్నానములు జపములు తపములు ముగించుకొని ధృతరాష్ట్రుడు మొదలగువారు వారికి ఎదురు వస్తున్నారు. కుంతీదేవి పాండవులను చూచింది. అందరినీ తనకౌగిట్లో పొదివి పట్టుకొని అందరినీ ఆశీర్వదించింది. సహదేవుడు కుంతీ దేవి కాళ్లమీద పడి ఏడిచాడు. కుంతీదేవి గాంధారికీ, ధృతరాష్ట్రునకు తనకుమారులు వచ్చారని చెప్పింది. పక్కనే ఉన్న సంజయుడు పాండవులను చూచి సంతోషంగా వారిని పలకరించాడు. ద్రౌపది మొదలగు అంత:పుర స్త్రీలు అందరూ వచ్చి గాంధారికీ, కుంతి కినమస్కరించారు. వారు అంత:పుర స్త్రీలను ప్రేమతో ఆదరించారు.

తనవారంతా తన చుట్టు ఉండటం వలన ఒక్కసారి ధృతరాష్ట్రుడు తాను హస్తినాపురంలో ఉన్నట్టు భావించాడు. అందరూ ఆశ్రమాలకు వెళ్లారు.

పాండవులు, ధర్మరాజు ఆశ్రమాలకు వచ్చారని తెలియగానే చుట్టు పక్కల ఉన్న ఆశ్రమములలో ఉన్న ఋషులు మునులు వారిని చూడటానికి అక్కడకు వచ్చారు. అక్కడకు వచ్చిన మునులకు పాండవులు అందరూ పాదాభివందనములు చేసారు. ఆ మునులు సంజయుని చూచి పాండవులను పరిచయం చెయ్యమని అడిగారు. అప్పుడు సంజయుడు ఈ విధంగా పరిచయం చేస్తున్నాడు.

" ఈయన ధర్మరాజు. భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు ఆయన తమ్ములు. ఈమె వారి భార్య ద్రౌపది. ఈమె శ్రీకృష్ణులవారి చెల్లెలు, అర్జునుడి భార్య అయిన సుభద్ర. ఉలూపి, చిత్రాంగదలు కూడా అర్జునుని భార్యలు. ఈమె ఉత్తర. యుద్ధములో వీరమరణము పొందిన అర్జున కుమారుడు అభిమన్యుని ధర్మపత్ని." తరువాత పాండవుల ఇతర భార్యలను కూడా వారికి పరిచయం చేసాడు సంజయుడు.

పరిచయాలు అయిన తరువాత ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధర్మనందనా! నీవు, నీ తమ్ములు,నీ మిత్రులు, బంధువులు అందరూ  కుశలమే కదా! పౌరులు,జానపదులు నీకు అనుకూలంగా ఉంటున్నారుకదా! నీ  ఆంతరంగిక పరిజనము సుఖంగాఉంటున్నారు కదా! నీవు నీ పూర్వీకులు నడిచిన ధర్మమార్గమునే నడుస్తున్నావు కదా! దేవాలయములను బ్రాహ్మణులకు ఇచ్చిన అగ్రహారములు మాన్యములు

అన్యాక్రాంతము కాకుండా జాగ్రత్తగా కాపాడబడుతున్నాయి కదా! ప్రజలను బాధపెట్టకుండా పన్నులను వసూలు చేస్తూ కోశాగారాన్ని నింపుతున్నావు కదా! నీవు మిత్రులైన రాజుల పట్ల స్నేహ భావంతోనూ, నీకు శత్రు రాజుల పట్ల కఠినంగానూ వ్యవహరిస్తున్నావు కదా! నీకు మిత్రులు, శత్రువులు కాకుండా తటస్థంగా ఉన్న రాజుల పట్ల అప్రమత్తంగా ఉంటున్నావు కదా! ఎందుకంటే వారు ఏ క్షణంలో ఎవరి వైపు ఉంటారో తెలియదు కదా! దేవతలకు, పితృదేవతలకు,అతిథులకు నైవేద్యములు, భోజనములు పెట్టి తృప్తి పరుస్తున్నావు కదా! నీ రాజ్యంలో నాలువు వర్ణముల వారూ తమకు విధించిన వృత్తులు క్రమం తప్పకుండా పాటిస్తున్నారు కదా! నీ రాజ్యంలో బాలలు, వృద్ధులు, స్త్రీలు, అందరూ భయంలేకుండా జీవిస్తున్నారుకదా! నీ ఆజ్ఞలను పురప్రజలు అందరూ ఖచ్చితంగా పాటిస్తున్నారు కదా!" అని గబా గబా ప్రశ్నించాడు ధృతరాష్ట్రుడు.

అప్పుడు ధర్మరాజు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "పెదనాన్న గారూ! మీరునాకు చేసిన రాజనీతి ఉపదేశం వలన రాజ్యపాలన అంతా సక్రమంగా జరుగుతూ ఉంది. కాని తమరి గురించే మా దిగులంతా. తమరికి అన్నీ సక్రమంగా జరుగుతున్నాయా. తమరి తపస్సు ఎలా సాగుతోంది. మా తల్లి కుంతీదేవి తమరికి సేవలు చేస్తూ ఉందా! మా పెదతల్లి గాంధారి తపస్సు కొనసాగుతూ ఉందా! విదురుల వారు ఇక్కడ లేరు.... ఎక్కడకు వెళ్లారు? నేను వెంటనే విదురుని చూడాలని అనుకుంటున్నాను." అని అన్నాడు ధర్మరాజు.

అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇలాఅన్నాడు. "కుమారా ధర్మరాజా! నేను బాగానే ఉన్నాను.నా తపస్సు నిర్విఘ్నంగా

కొనసాగుతూఉంది. కుంతీదేవి మాకు తగిన సపర్యలు చేస్తూ ఉంది. మీ పెదతల్లి గాంధారి కూడా తన తపస్సును అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తూ నే ఉంది. సంజయుడు కూడా తనకు తోచినరీతిలో తపస్సు చేసుకుంటున్నాడు.

కాని విదురుడు మాత్రం ఎక్కడు ఉంటాడో ఎక్కడ తిరుగుతాడో తెలియదు. సరిగా ఆహారం తీసుకోడు. ఒక్కోసారి గాలి, నీరు మాత్రమే ఆహారంగాతీసుకుంటూ ఉంటాడు. ఒక్కోసారి అది కూడా తీసుకోడు. చాలా విచిత్రంగా ప్రవర్తిస్తుంటాడు. మనుష్యులు కూడా తిరగడానికి భయపడే ఈ కారడవిలో ఒంటరిగా స్వేచ్ఛగా భయంలేకుండా తిరుగుతుంటాడు. ఈ క్షణంలో ఇక్కడ ఉంటాడు మరుక్షణంలో ఎక్కడో ఉంటాడు. ఇక్కడో ఎక్కడో తిరుగుతున్నాడు చూడు అంటూ దూరంగా పోతున్న విదురుని చూపించాడు ధృతరాష్ట్రుడు.

విదురుని చూచాడు ధర్మరాజు. విదురుడు ఒళ్లంతా మట్టికొట్టుకొనిపోయిఉన్నాడు, ఒంటిమీద బట్టలు లేవు. జుట్టంతా జడలుకట్టి ఉంది. ఆశ్రమం సమీపంలోకి వచ్చాడు .కానీ అక్కడ ఎక్కువ మంది జనం ఉండటం చూచి దూరంగాపోతున్నాడు. ఇది చూచిన ధర్మరాజు “విదురా! విదురా! ఆగు! నేను ధర్మనందనుడను. నిన్ను చూడటానికి వచ్చాను.” అని అరుస్తూ విదురుని వెంట పరుగెత్తాడు. విదురుడు వెనక్కు తిరిగి చూచాడు. ఒక చెట్టు కింద నిలబడ్డాడు. ధర్మరాజు పరుగెత్తుతూ విదురుని వద్దకువెళ్లాడు. విదురుని ఎదురుగా నిలబడ్డాడు. విదురుడు నిశ్చలంగా నిలబడిఉన్నాడు. ధర్మరాజు విదురునితో ఇలా అన్నాడు. “విదురా! నేను ధర్మనందనుడను. నన్ను చూడండి. కళ్లు తెరిచి చూడండి.”అని ప్రార్థించాడు.

విదురుడు ధర్మరాజు వంక కళ్లు తెరిచి చూచాడు. తదేకంగా చూచాడు. తన యోగబలంతో ఈ శరీరాన్ని విడిచి పెట్టాడు. విదురుని ఇంద్రియములు, విదురుని ప్రాణములు విదురుని శరీరాన్ని విడిచిపెట్టి తేజోరూపంలో ధర్మరాజు శరీరంలో ప్రవేశించాయి. విదురుని పాంచభౌతిక శరీరం కింతపడిపోయింది. అప్పుడు ధర్మరాజు ఇనుమడించిన కాంతితో ప్రకాశిస్తున్నాడు.

ఇదంతా చూచి ధర్మరాజు ఆశ్చర్యంలో మునిగిపోయాడు. అంతలో తేరుకొని విదురునికి అంత్యక్రియలు నిర్వర్తింపదలిచాడు. అప్పుడు ఆకాశంనుండి ఒక వాక్కు వినపడింది. "విదురుడు యతీశ్వరుడు. యతిధర్మమును స్వీకరించాడు. ఆయన శరీరానికి అగ్నిసంస్కారము చేయడం తగదు. నీవు ఆ విధంగా చేయవద్దు." అని వినిపించింది.

తరువాత ధర్మరాజు గబా గబా ధృతరాష్ట్రుని ఆశ్రమానికి వెళ్లాడు. జరిగినది అంతా అక్కడున్నవారికి వివరించాడు. అందరూ ఆశ్చర్యపోయారు. తరువాత ధర్మరాజును చూడటానికి వచ్చిన తాపసులు ధృతరాష్ట్రుని వద్ద సెలవు తీసుకొని వెళ్లిపోయారు. తరువాత ధృతరాష్ట్రుడు ధర్మరాజును చూచి ఇలాఅన్నాడు. "ధర్మనందనా! నీకు ఫలములు, దుంపలు ఇస్తాను ఆహారంగాస్వీకరించు." అన్నాడు. అలాగే అని ధర్మరాజు ధృతరాష్ట్రుని ఆతిథ్యమును సంతోషంగా స్వీకరించాడు. అందరికీ ఫలములు, కందమూలములూ భోజనంగా ఇచ్చారు. అందరూ వాటిని సంతోషంగా ఆరగించారు. ఆ రోజు రాత్రికి ఆశ్రమంలోనే పడుకున్నారు.

తెల్లవారి కాలకృత్యములు, సంధ్యావందనములు మొదలగు కార్యక్రమములు నిర్వర్తించారు. తరువాత ధర్మరాజు తన భార్యద్రౌపది, తమ్ములతో మిగిలిన పరివారముతోనూ ఆశ్రమము అంతా తిరిగి చూచాడు. తరువాత ధృతరాష్ట్రుని వద్దకు పోయి అతనికి నమస్కరించి అతని చెంత ఒక ఆసనము మీద కూర్చున్నాడు. అతనితో ఇష్టాగోష్టి సలిపాడు. ఆ ప్రకారంగా ధర్మరాజు తమ్ములతో పరివారముతో ఒక మాసము రోజులు అరణ్యములో గడిపాడు.

ఒకరోజు ధృతరాష్ట్రుడు, ధర్మరాజు, శతయూపుడు మొదలగు మహామునులతో కూర్చుని సంభాషిస్తున్నప్పుడు అక్కడకు వ్యాస మునీంద్రుడు వచ్చాడు. ధృతరాష్ట్రుడు, ధర్మరాజు  ఆయనకు అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి ఉచితాసనముమీద కూర్చోపెట్టారు. ధృతరాష్ట్రుని చూచి వ్యాసుడు ఇలా అన్నాడు. “ఓ ధృతరాష్ట్రమహారాజా! నీకు వనవాసము అలవాటు పడినదా! తపస్సు ఆచరిస్తున్నావా! తాపసులకు అనువైన పనులను  నియమం తప్పకుండా నిర్వర్తిస్తున్నావా! నీ పుత్రులు పోయిన శోకము నీ మనసు లోనుండి తొలగిపోయినదా! నీ భార్య గాంధారి తన దు:ఖమును విడిచి పెట్టినదా! నీకు నీ భార్యకు పరిపూర్ణమైన జ్ఞానము కలిగినదా!  కుంతీదేవి నీకు నీ భార్యకు పరిచర్యలు చేస్తూ ఉన్నదా! మీరంతా అరణ్యములలో ఉంటే తాను రాచనగరులో ఉండటం భావ్యం కాదని మీ తోపాటు అడవులకు వచ్చింది కుంతి. ఆమె త్యాగము వర్ణనాతీతము కదా! నీవు ధర్మరాజు పైనా, భీమార్జున,నకులసహదేవులమీద ప్రేమానురాగములు కలిగి ఉన్నావా! నీ మనసు నిర్మలత్వము పొందినదా!  ఎందుకంటే ధృతరాష్ట్రమహారాజా!  శత్రుత్వము కానీ, ఒకరికి అపకారము చెయ్యవలెననే గుణము కానీ  కలకాలము నిలుపుకోకూడదు.

మనసును  ఎల్లప్పుడూ నిర్మలంగా ఉంచుకోవాలి.  అప్పుడు సంపదలు కలుగుతాయి.

విదురుడు తన దేహమును విడిచి పెట్టాడని విన్నాను. విదురుడు ఎవరో కాదు. సాక్షాత్తు యమధర్మరాజు. మాండవ్యముని ఇచ్చిన శాపము మేరకు మానవ జన్మ ఎత్తాడు. బ్రహ్మదేవుని ఆదేశానుసారము, అంబిక యొక్క దాసికి పుత్రుడుగా శూద్రయోని యందు జన్మించాడు. అతనే కాదు. ఈ ధర్మరాజు కూడా యమధర్మరాజు ప్రతిరూపము. అందుకే విదురుడుయోగబలంతో తన అంశలను ధర్మరాజులో కలిపాడు.  అటువంటి ధర్మదేవతాస్వరూపుడైన ధర్మరాజు నీకు సేవలు చేస్తుంటే సంతోషిస్తున్నావా!" అని అన్నాడు వ్యాసుడు.

ఆ మాటలు విన్న ధృతరాష్ట్రుడు వినయంగా వ్యాసునితో ఇలా అన్నాడు. " ఓ వ్యాసమునీంద్రా! ఈ వనవాసము నాకు ఏమాత్రమూ దు:ఖము కలిగించడం లేదు. నా దేహము, చిత్తము తపస్సు చేయడంలో నిమగ్నమైఉన్నది. నేను కానీ, గాంధారి కానీ పుత్రశోకమును ఇసుమంత కూడా పొందడం లేదు. ఆ దు:ఖమును మరిచిపోయాము. నాకు ధర్మరాజుమీద, అతని తమ్ములమీదా అంతులేని అనురాగం ఉంది. ఈ ధర్మరాజు సాక్షాత్తు ధర్మదేవతా స్వరూపుడు అని నాకు తెలుసు. ఆ విషయాన్ని నేను నా మాటలతో చేతలతో ధర్మరాజుకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాను. ఇంక కుంతి హస్తినాపురంలో రాజభోగములు వదులుకొని మాకోసం మా వెంట అరణ్యములకు వచ్చి మాకు సేవలు చెయ్యడం మాకు ఎంతో ఆశ్చర్యమును కలిగిస్తూ ఉంది.  తమరి దయవలన నాకు  ఆధ్యాత్మ పరిజ్ఞానమును, మానసిక నిర్మలత్వమును కలిగాయి." అని

వినయంతో చెప్పాడు.

ఆ సమయంలో ద్రౌపది, సుభద్ర మొదలగు అంత:పుర కాంతలు వ్యాసుని దర్శనము కొరకు అక్కడకు వచ్చారు. ఆయనకు భక్తితో నమస్కారములు చేసారు. వారి నందరినీ ఆశీర్వదించాడు వ్యాసుడు. తరువాత ధృతరాష్ట్రుని చూచి వ్యాసుడు ఇలా అన్నాడు. "మీ అందరికీ మీ మీ మనసులలోని చింతలను తొలగించి మంచి బుద్ధికలుగచేసే తలంపుతో నేను ఇక్కడకు వచ్చాను.  మీకు ఇష్టము వచ్చినది అడగండి. మీకోరికలు తీరుస్తాను." అని అన్నాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు. "తమరు మా మీద దయతో మా వద్దకు రావడమే మాకు మహా భాగ్యము. ఇంతకన్నా మేము కోరేది ఏంముంటుంది. మీదయకు పాత్రులము అయ్యాము. మీ దయకంటే అధిక మైనది ఏముంటుంది. అది మాకు లభించింది. మీరు నావద్దకు వచ్చి నన్ను ఆదరించడంతో నా జన్మ ధన్యము అయింది. నాకు ఉత్తమ లోకములు కలుగతాయా లేదా అన్న భయం పోయింది. నేను ధన్యులలో ధన్యుడనయ్యాను. అయినా తమరు కోరుకోమన్నారు కాబట్టి నా మనసులో ఉన్న విషయం అడుగుతున్నాను.

నా కుమారుడు దుర్యోధనుడు దుష్టస్వభావము కలవాడు. పాండవులు పాపస్వభావము లేని వారు. పుణ్యాత్ములు. అటువంటి వారిని పరాభవించాడు నా కుమారుడు సుయోధనుడు. తన మిత్రరాజులందరినీ వారి వారి సైన్యములతో సహా యుద్ధభూమికి బలి ఇచ్చాడు.  భీష్మ,ద్రోణ,కర్ణ మొదలగు వీరులను పోగొట్టుకున్నాడు. తుదకు తానూ బలి అయ్యాడు.  అధముడైన సుయోధనుని కొరకు

భార్యబిడ్డలను రాజ్యములను వదులుకొని యుద్ధమునకు వచ్చి ప్రాణములను అర్పించిన నానాదేశాల రాజులకు ఎటువంటి సద్గతులు లభించాయి. మరణించిన తరువాత వారంతా ఏమయ్యారు. ఏ లోకాలకు వెళ్లారు. నాకు తెలియజేయండి." అని అడిగాడు.

తరువాత గాంధారి చేతులు జోడించి వ్యాసునికి నమస్కరించి ఇలా అన్నది. "ఓ వ్యాసమునీంద్రా! మహాభారత యుద్ధము జరిగి ఇప్పటికి 16 ఏళ్లు అయింది. ఈ 16 ఏళ్లు నా భర్త ధృతరాష్ట్రుడు కొడుకుల కోసం పరితపిస్తూ ఉన్నాడు. ఆయనే కాదు. నేను, ద్రౌపది,సుభద్ర,కుంతి, నా కోడళ్లు నూరుమంది, యుద్ధములో చనిపోయిన భూరిశ్రవసుడు, సోమదత్తుడు, బాహ్లికుని యొక్క భార్యలు, యుద్ధములో మరణించిన తమ తమ భర్తలు, పుత్రులు, సోదరులు ఎక్కడున్నారో చూడాలని ఆతురతగా ఉన్నారు. ఈ సృష్టిలో ఎన్ని లోకాలు ఉన్నాయో అన్నీ నీ యోగశక్తితో చూపగలసమర్థులు మీరు. మాకు ఈ మాత్రం చూపలేరా! కాబట్టి మాకు మా మా బంధువులు ఎక్కడ ఏ లోకాలలో ఉన్నారో చూపించండి. మా దు:ఖములు తొలగించండి. ఇదే మేమందరమూకోరుకొనే కోరిక." అని అందరి బదులు కోరింది గాంధారి.

ఆ సమయంలో కుంతీదేవికి తన కుమారుడు కర్ణుడు మనసులో మెదిలాడు.కుంతి మనసు బాధ పడింది. అది గ్రహించాడు వ్యాసుడు. "అమ్మా కుంతీదేవీ! గాంధారి తన కోరిక తెలియ చేసింది. నీ మనసులో కోరిక కూడా తెలియచెయ్యి. తీరుస్తాను." అని అన్నాడు వ్యాసుడు.

కుంతీ దేవి వ్యాసునికి నమస్కరించి వ్యాసునితో ఇలా అన్నది.
" ఓ వ్యాసమునీంద్రా! నీవు దేవతలకు దేవతవు. నీవు నా భర్తకు తండ్రివి. నిన్ను మా మామగారిగా పొందడం మా అదృష్టం. నా మీద దయయుంచి నా విన్నపము ఆలకించు. నేను కన్యగా ఉన్నప్పుడు దుర్వాసమహాముని మా తండ్రి గారి వద్దకు వచ్చాడు. ఆయనకు సేవలు చెయ్యడానికి నన్ను నియమించాడు నా తండ్రి. నా సేవలకు మెచ్చుకున్నాడు దుర్వాసుడు.

" నీకు ఒక వరం ఇస్తాను కోరుకో " అని అన్నాడు.

"మహానుభావా! మీ దయ నా మీద ఉన్నది నాకు అంతే చాలు. నాకు ఇంక ఏవరమూఅక్కర లేదు." అని అన్నాను

అప్పుడు దుర్వాసుడు "నేను వరం ఇస్తాను అన్నప్పుడు నువ్వు కాదు అని అనకూడదు. అడుగు" అని అన్నాడు.

నేను భయపడి నాకు పుత్రుడిని ప్రసాదించమని అడిగాను. అప్పుడు ఆ ముని నాకు ఒక మంత్రము ఉపదేశించాడు. " కల్యాణీ! ఈ మంత్రము మననము చేసి నీవు ఏ దేవతను తలిస్తే ఆ దేవత వచ్చి నీకు పుత్రుని ప్రసాదిస్తాడు. కుంతీ! నీకుసాక్షాత్తు యమధర్మరాజు కుమారుడి గా జన్మిస్తాడు." అని చెప్పాడు.

తరువాత దుర్వాసమహాముని వెళ్లిపోయాడు. నాకు బాల్యచాపల్యంచేత ఆ మంత్రమును పరీక్షించాలి అనిపించింది. ఏదేవతను పిలుద్దామా అని అనుకుంటూ ఉండగా ఆకాశంలో

సూర్యుడు కనిపించాడు. నేను మంత్రము మననం చేసి సూర్యదేవుని ప్రార్థించాను. ఇది కేవలం నేను వినోదం కోసం చేసాను. కాని సూర్యభగవానుడు నిజంగానే నా ముందు ప్రత్యక్షం అయ్యాడు.

"నీకు ఏం వరం కావాలో కోరుకో" అన్నాడు.

నాకు భయం వేసింది. చేతులు జోడించి "అయ్యా! మీరెందుకు వచ్చారు మీరు వెళ్ళిపోండి" అని ప్రార్థించాను.

"కన్యామణీ! వృధాగా ఎవరినీ ఆహ్వానించడం తప్పు. నీకు మంత్రము ఎవడు ఉపదేశించాడో వాడిని శపిస్తాను." అని కోపంతో అన్నాడు సూర్యభగవానుడు. నేను భయంతో వణికిపోయాను. నా బాల్య చాపల్యం వలన నిరపరాధి అయిన గురుదేవులు దుర్వాసుల వారిని శాపగ్రస్తులను చెయ్యడం ఇష్టంలేదు. అందుకని సూర్యుని చూచి "దేవా! తమరు నా మీద దయయుంచి, తమరితో సమానమైన తేజస్సు కలిగిన కుమారుని ప్రసాదించండి."అని అడిగాను.

అప్పుడు సూర్యభగవానుడు తన తేజస్సును నాలో ప్రవేశపెట్టాడు. " నీకు నా వంటి తేజస్వి అయిన కుమారుడు కలుగుతాడు. కాని నీవు కన్యవు. కాబట్టి నీ కన్యాత్వముచెడకుండా నీకు కుమారుడు కలుగుతాడు. ఆ ప్రకారంగా నీకు వరాన్ని ప్రసాదిస్తున్నాను." అని పలికాడు.

తరువాత సూర్యభగవానుడు వెళ్లిపోయాడు. తరువాత నేను గర్భవతినయ్యాను. నా తల్లి తండ్రులకు తెలియకుండా, నా

అంత:పురంలో రహస్యంగా కుమారుని ప్రసవించాను. కాని కన్యగా ఉండి కొడుకును పెంచలేక నదిలో వదిలిపెట్టాను. ఇదంతా నాకు ఒక కలగా జరిగిపోయింది. తమరు జ్ఞానులు కాబట్టి ఈ విషయం అంతా గ్రహించారు. కాని ఆ పుత్రుడు నాకు పుట్టిన విధానము, వాడిని నేనునదిలో వదిలిన విధానము ఇప్పటికీ నాకు బాధను కలిగిస్తూ ఉంది. నేను చేసింది పాపమో కాదో తెలియదు కానీ నేను నా కన్నకుమారుని నిర్దయగా నదిలో వదలడం తలుచుకొని నా హృదయం దహించుకుపోతూ ఉంది. ఆభయం ఇప్పటికీ నన్ను వెన్నాడుతూనే ఉంది. తమరు నా భయాన్ని పోగొట్టండి. తనకుమారులు మరణించిన తరువాత వారికి ఎటువంటి ఉత్తమ గతులు కలిగాయి అన్న ఈ ధృతరాష్ట్రుని కోరికను తీర్చండి. అదే మీరునాకు ఇచ్చే వరము." అని వేడుకొన్నది కుంతి.

అప్పుడు వ్యాస మహర్షి కుంతీ దేవితో ఇలా అన్నాడు. "నీవు చెప్పినది అంతా యదార్థము. ఇందులో నీ తప్పు ఏమీ లేదు. దేవతలు ఇటువంటి అద్భుతములు చేస్తూ ఉంటారు. కర్ణుడు ఆ ప్రకారము జీవించవలసి ఉన్నది కాబట్టి కర్ణుని నీవు నదిలో వదిలిపెట్టావు. కర్ణుడి పుట్టుకతో నీ కన్యాత్వము భంగము కాలేదు కాబట్టి నీవు స్త్రీలలో ఆగ్రగణ్యురాలవయ్యావు. నీవు నిష్కళంక చరిత్రవు అందులో ఏ మాత్రము సందేహము లేదు. గాంధారీ! నీవుకోరినట్టు నీ కుమారులను, సోదరులను, కుంతీ తన కుమారుడిని, మీ మీ బంధువులను చూస్తారు. ద్రౌపది, సుభద్ర, మిగిలిన స్త్రీలు వారి వారి సోదరులను, పుత్రులను, పౌత్రులను చూస్తారు. నేను ఈ పని చేయడానికే ఇప్పుడు ఇక్కడకు వచ్చాను. నీ యొక్క నీ భర్తయొక్క, ఈ కుంతి యొక్క చింతలుపోగొట్టడానికి మీరు కోరిన కోరికలు

నెరవేరుస్తాను. కానీ గాంధారీ! నీవు నీ కుమారుల గురించి, మనుమల గురించి  విచారించవద్దు. వారు యుద్ధము చేసి వీరమరణం పొందారు. ఈ మహాభారతయుద్ధము ఇలా జరగాలని ఎప్పుడో నిర్ణయింపబడింది. ఎందరో దేవతలు తమ తమ  అంశలతో ఈ భూమి మీద జన్మించారు.

నీ భర్త ధృతరాష్ట్రుడు పూర్వజన్మలో ధృతరాష్ట్రుడు అనే గంధర్వరాజు. ఈ జన్మలో అంధరాజుగా జన్మించాడు.

యమధర్మరాజు అంశతో పుట్టినవాడు ధర్మరాజు. వాయుదేవుని అంశతో భీముడు,  అశ్వినీ దేవతల అంశలతో నకులసహదేవులు జన్మించారు.

నరనారాయణులు అనే మునిపుంగవులు.... నరుడు అర్జునుడుగానూ,  నారాయణుడు  కృష్ణుడు గానూ జన్మించారు.

ద్వాపరుడు శకునిగా జన్మించాడు. కలి అంశతో సుయోధనుడు, రాక్షసాంశలతో దుశ్శాసనుడు మొదలగు నీ కుమారుడు జన్మించారు. కర్ణుడు సూర్యుని అంశతో, అభిమన్యుడు చంద్రుని అంశతో జన్మించారు.  అగ్నిలో  నుండి పుట్టిన ద్రౌపదికి అన్న ధృష్టద్యుమ్నుడిగా అగ్నిదేవుడే జన్మించాడు.  అతని తమ్ముడు శిఖండి వాయుదేవుని అంశ. కులగురువు ద్రోణుడు బృహస్పతి అంశగా తెలుసుకో.

అష్టవసువులలో  ఎనిమిదవ వసువు శాపగ్రస్తుడై  దేవవ్రతుడు (భీష్ముడు) గా జన్మించాడు.  అశ్వత్థామ రుద్రుని అంశతో జన్మించాడు.

మిగిలిన రాజులందరూ దేవతల అంశలతోనూ, రాక్షస అంశలతోనూ జననమొందారు.

కాబట్టి వీరందరూ కారణ జన్ములు. వారి వారి జన్మసాఫల్యము పొందగానే ఈ లోకాన్ని విడిచిపెట్టారు. అంతేగానీ ఎవరూ ఎవరినీ చంపలేదు. ఇంక మీరందరూ నాతో పాటు గంగానదీ తీరానికి రండి. అక్కడ మీ మనసుల్లో ఉన్న దు:ఖము పోయేట్టు మీ మీ పుత్రులను పౌత్రులను, సోదరులను బంధువులను చూపిస్తాను." అని వ్యాసుడు అందరినీ గంగానదీ తీరానికి తీసుకొని వెళ్లాడు. వారితో పాటు శతయూపుడు మొదలగు మునులు కూడా ఆ ఆశ్చర్యమును చూడటానికి గంగాతీరానికి వెళ్లారు.

ఇంతలో సాయంత్రం అయింది. బంధుదర్శనము రేపు చేద్దాము అన్నాడు వ్యాసుడు. కాని వారందరూ ఎప్పుడెప్పుడు తమ వారిని చూద్దామని ఉత్సుకతతో ఉన్నారు. అందుకని వారందరికీ ఆ రాత్రి నూరు సంవత్సరములు గడిచినట్టుగా ఉంది.

మరునాడు సూర్యోదయము అయింది. అందరూ ప్రాత:కాలము నిర్వర్తించవలసిన విధులు నిర్వర్తించారు. ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతి, పాండవులు మొదలగు వారు ఉత్సాహంగా వ్యాసుని వద్దకు పోయి ఆయన చుట్టుచేరారు. సకల జనసమూహము జరగబోవు అద్భుతము తిలకించడానికి ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

వ్యాసుడు గంగానదిలో దిగాడు. ఒక్క మునక వేసాడు. పైకి లేచాడు. చేతులుచాచాడు. అందరినీ పిలుస్తున్నట్టు " అందరూ రండి"

అని ప్రేమగా పిలిచాడు. ఇంతలో పెద్దగా చప్పుడు అయింది. బిల బిల మంటూ నీళ్లలో నుండి  యుద్ధములో చనిపోయిన దుర్యోధనుడు, అతని నూర్గురు తమ్ముళ్లు, అతని యావత్తు కుంటుంబసభ్యులు, అభిమన్యుడు,  అశ్వత్థామ చేతిలో హతమైన ఉపపాండవులు, మొదలగు పాండురాజు సంతతివారు, కర్ణుడు, బాహ్లికుడు, మొదలగు కురు ప్రముఖులు, ద్రుపదుడు అతని సంతతివారు, విరాటుడు అతని కుమారులు,  శకుని అతని అన్నదమ్ములు, కుమారులు, వీరందరి కన్నా ముందు భీష్ముడు, ద్రోణుడు నడువగా, గంగానదిలో నుండి వెలుపలికి వచ్చారు. వారి దేహములు అన్నీ దివ్యమైన కాంతితో ప్రకాశిస్తున్నాయి.

కాని ధృతరాష్ట్రుడు అంధుడు కాబట్టి వారిని  చూడలేడు. అందుకని వ్యాసుడు అతనికి దివ్యదృష్టి ప్రసాదించాడు.  గాంధారి కూడా తన కళ్లకు కట్టుకున్న బట్టను తొలగించింది. అందరూ తమ తమ పుత్రపౌత్రసమేతంగా బంధుగణమును చూచారు.  వారందరూ నవ్వుతూ తుళ్లుతూ హాయిగా ప్రేమగా ఒకరితో ఒకరు మాట్లాడు కుంటున్నారు. వీరేనా యుద్ధంలో ఒకరి మీద ఒకరు కత్తులు దూసుకొన్నది అని అందరూ ఆశ్చర్యపోయారు. సుయోధనాదులలో పూర్వము ఉన్న అభిమానము క్రౌర్యము మచ్చుకైనా లేవు. అంతా ప్రేమమయంగా ఉన్నారు.

అందరూ ధృతరాష్ట్రుని వద్దకు వచ్చారు.  వారి రాక అక్కడ ఉన్న వారందరికీ  ఆనందం కలిగించింది. అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు. చిన్నవారందరూ వారి కన్నా పెద్దవారికి నమస్కారాలు చేసారు. పెద్దవాళ్లు చిన్న వాళ్లను ఆశీర్వదించారు. అంతా ఆనందంగా ఉన్నారు. అక్కడ రెండు విధాల వారు ఉన్నారు. దివ్య శరీరులు మానవశరీరంతో

ఉన్నవారు. భీష్ముడు మొదలగు పెద్దలు తమ కన్నా చిన్న వారినీ, ద్రోణుడు తన శిష్యులను, తమ తమ తండ్రులను, తల్లులను, కొడుకులను, కూతుళ్లను, తాతలను, మనుమళ్లను, మనుమరాళ్లను, బావలను, బావమరుదులను, అన్నలను, తమ్ముళ్లను, అక్కలను, చెల్లెళ్లను, అత్తగార్లను, మామగార్లరు, కూతుళ్లను, అల్లుళ్లను, తదితర బంధువులను కలుసుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆ రోజంతా అందరూ పూర్వ వైరములను మరిచి హాయిగా గంగాతీరంలో గడిపారు.

మరునాడు ఉదయం దివ్యశరీరులు మానవ శరీరుల వద్ద వీడ్కోలు తీసుకున్నారు. తిరిగు ప్రయాణమునకు సిద్ధం అయ్యారు. దివ్యదేహులు తిరిగి తమ తమ లోకములకు వెళ్లుటకు గంగానదీలోకి దిగారు. వారికి వీడ్కోలు పలకడానికి వ్యాసుడు గంగానదీజలాలో దిగి ఉన్నాడు. గంగ ఒడ్డున ఉన్న వారిని చూచి ఇలా అన్నాడు. “మీరంతా చనిపోయిన మీ మీ భర్తలను కలుసుకున్నారు. మీలో ఎవరైనా మీ మీ భర్తలను అనుసరించి వారితో పాటు దివ్యలోకములకు వెళ్ల దలచు కుంటే వెళ్లవచ్చును. అలాంటి వారు ఈ గంగలో మునుగుటకు రండి.” అని అన్నాడు వ్యాసుడు.

వెంటనే యుద్ధములో చనిపోయిన వీరుల భార్యలందరూ ధృతరాష్ట్రుడు, గాంధారీల అనుజ్ఞ తీసుకొని తమ తమ భర్తలను అనుసరించడానికి గంగానదిలో మునిగారు. వెంటనే వారందరూ తమ తమ మానవ శరీరములను వదిలి దివ్యదేహములతో తమ తమ భర్తలను అనుసరించారు. ఆ దృశ్యమును చూచి అందరూ ఆశ్చర్యచకితు లయ్యారు.

ఆ విధంగా అక్కడి వారికి వ్యాసుని దయ వలన వారి వారి బంధువులతో సమాగమము జరిగింది. ధృతరాష్ట్రునకు మరలా అంధత్వము ప్రాప్తించింది. తరువాత శతయూపుడు మొదలగు మహామునులు ధృతరాష్ట్రుని వద్ద సెలవు తీసుకొని వారి వారి ఆశ్రమములకు వెళ్లారు.

వ్యాసుడు ధృతరాష్ట్రుని చూచి  ఇలాఅన్నాడు.  “కుమారా! చూచావుగా నీ కొడుకులను, నీ బంధువులను. వారు ఇక్కడికంటే పరలోకములో  ఎక్కువ సౌఖ్యములు అనుభవిస్తున్నారు. కాబట్టి ఇకనైనా వారి మరణము గురించి చింతించకు.  ధర్మరాజు ఇక్కడకు వచ్చి మాసము రోజులు దాటింది. నీవు వెళ్లమనే దాకా వెళ్లడు. అక్కడ రాజ్యపాలన కుంటువడుతుంది. ఇంకనైనా వెళ్లమని చెప్పు.” అని అన్నాడు వ్యాసుడు.  “మునీంద్రా అలాగే చేస్తాను. తమ దయవలన నా కుమారులను, బంధువులను చూచాను. కృతార్ధుడను అయ్యాను.” అని నమస్కారము చేసాడు ధృతరాష్ట్రుడు..

తరువాత వ్యాసుడు వెళ్లిపోయాడు. తరువాత ధృతరాష్ట్రుడు ధర్మరాజును పిలిచి “నాయనా ధర్మనందనా! నీవు ఇక్కడకు వచ్చి చాలారోజులు అయింది. అక్కడ రాజ్యపాలన కూడా చెయ్యాలి కదా! నీవు అక్కడ ఉంటేనే కదా అనుదినము రాచకార్యములు సక్రమంగా నడిచేది. నీవు రాజనీతి గురించి భీష్మాదుల వలన తెలుసుకున్నావు. నేను ప్రత్యేకంగా చెప్పవలసినది ఏమీ లేదు. నీవు రాజధానిలో లేని సమయం చూచి నీ శత్రువులు విజృంభించే ప్రమాదము ఉంది. కాబట్టి వెంటనే నీవు నీ తమ్ములతో హస్తినాపురము వెళ్లు. నీ రాక వలన నా మనసులో ఉన్న బాధ అంతా మాయమయింది. ఇప్పుడు నా

మనస్సు ప్రాపంచిక విషయముల మీద లేదు. తపస్సు మీదనే ఉంది. మీరంతా ఇక్కడ ఉంటే నా తపస్సుకు భంగం కలుగుతుంది. కాబట్టి నీవు నీ అన్నదమ్ములు, అంత:పుర స్త్రీలు, పరివారముతో సహా సత్వరమే రాజధానికి తిరిగి వెళ్లండి." అని అన్నాడు.

ఆమాటలకు ధర్మరాజు చేతులు జోడించి ఇలా అన్నాడు. "పెదనాన్న గారూ! అలాగు చేస్తాను. రాజ్యభారము వహించడానికి భీముడు, అర్జునుడు. నకుల సహదేవులను పంపుతాను. నేను ఇక్కడేఉండి తమరి పాద సేవ చేసుకుంటూ శేషజీవితమును గడుపుతాను. నాకు అనుమతి ఇవ్వండి." అని అన్నాడు.

ఆ మాటలకు గాంధారిఇలా అంది. "కుమారా ధర్మనందనా! నీవు ఈ ప్రకారము మాట్లాడటం తగునా! నీవు ఇక్కడ ఉండి సన్యాసదీక్ష స్వీకరిస్తే అక్కడ రాజ్యపాలన ఎవరు చేస్తారు. నీయొక్క మాయొక్క పితరులకు శ్రాద్ధ కర్మలను ఎవరు నిర్వర్తిస్తారు. కాబట్టి నీవు రాజధానికి వెళ్లడమే ఉత్తమము." అని పలికింది గాంధారి.

" అమ్మా! మీరు ఎన్ని చెప్పినా ఇంత ప్రశాంతంగా ఉన్న ఈ అరణ్యమును విడిచి వెళ్లడానికి నా మనసు ఒప్పడం లేదు. నా మనసులో ఇదివరకు మాదిరి రాజ్యకాంక్ష లేదు. అమ్మా అటు పాంచాల వంశంలో నూ ఇటు మాత్స్య వంశంలోనూ పురుషులందరూ యుద్ధంలో మరణించారు. కేవలం స్త్రీలు మాత్రమే మిగిలారు. ఇదంతా నావలననే జరిగింది. ఆ వంశములలో కేవలము ఒక్క పురుషుడు కూడా లేని రాజ్యము నాకు అక్కరలేదు. భారత యుద్ధము అయినప్పటినుండీ నా మనసు రాజ్యపాలన మీద లేదు. తపస్సు మీదనే

నిలిచి ఉంది. అమ్మా! నేనుమీకు  ఎలాంటి ఇబ్బంది కలిగించను. నా పాటికి నేను తపస్సు చేసుకుంటాను. నన్ను ఇక్కడే ఉండటానికి అనుమతించండి.  ఇంక ఏమీ మాట్లాడకండి.” అని అన్నాడు.

వెంటనే పక్కనే ఉన్న సహదేవుడు ఇలా అన్నాడు. “అన్నయ్యా! నేను ఇక్కడే ఉండి తపస్సుచేసుకుంటాను. నా తల్లి కుంతికి, పెదనాన్న గారికి సేవలు చేస్తాను. తమరు  అంత:పుర కాంతలందరనూ  తీసుకొని హస్తినాపురమునకు  వెళ్లండి.” అని అన్నాడు.

తన చిన్న కుమారుడు సహదేవుడు ఆ మాటలు అనడం చూచి కుంతీదేవి సహదేవుని తన గుండెలకు హత్తుకుంది. “నాయనా సహదేవా!  మీరందరూ రాజధర్మంలో సమర్థులు. మీరు రాజ్యపాలన చెయ్యాలి గానీ మాకు సేవచెయ్యడం కోసరం అరణ్యములలో ఉండటం తగదు.  ఇంకో మాట. మీరు ఇక్కడే ఉంటే మాకు తపోభంగం అవుతుంది. మేము ఏకాగ్రతతో తపస్సు చేసుకొనలేము.  మీరు ఇక్కడ ఉండటం మాకు కీడు చేసినట్టే అవుతుంది కాని వేరు కాదు. కాబట్టి మీరందరూ హస్తినకు వెళ్లండి.  ఇది నా మాట కాదు. బావగారు ధృతరాష్ట్రులు, అక్క గాంధారి మాట కూడా. మీకు అంతా శుభమే జరుగుతుంది. ఇంక పోయి రండు.” అని పలికింది కుంతీదేవి.

ఇంక చేసేది లేక ధర్మరాజు పెదతండ్రి గారి వద్ద సెలవు తీసుకున్నాడు.  ధృతరాష్ట్రుడు భీమార్జున నకుల సహదేవులను ఆలింగనము చేసుకొని ఆశీర్వదించాడు. పాండవులందరూ ధృతరాష్ట్రుని పాదములకు నమస్కారము చేసి ఆయన ఆశీర్వాదములు తీసుకున్నారు.  తరువాత పాండవులు గాంధారికి తల్లి కుంతీదేవికి

నమస్కరించి వారి దీవెలను పొందారు. తరువాత ద్రౌపది, సుభద్ర మొదలగు అంత:పుర కాంతలందరూ అందరి దగ్గరా సెలవు తీసుకున్నారు. అందరూ తిరిగి హస్తినాపురమునకు వెళ్లిపోయారు.

తరువాత కొన్ని దినములు జరిగాయి. ఒకరోజు ధర్మరాజు తన తమ్ముళ్లతో సహా ఇష్టాగోష్టిలో ఉండగా అక్కడకు నారదుడు వచ్చాడు. పాండవులు నారదునికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి సత్కరించారు. ఉచితాసనము మీద కూర్చోబెట్టారు.

"మహానుభావా! తమరు ఎక్కడి నుండి వస్తున్నారు. తమరి రాకకు కారణమేమి?" అని అడిగాడు ధర్మరాజు. దానికి నారదుడు ఇలా అన్నాడు.

" ధర్మనందనా! నేను లోక సంచారము చేస్తూ ఎన్నో దేశాలు తిరిగాను. నిన్ను చూచి చాలాకాలము అయింది. అందుకని మీ అందరినీ చూచిపోదామని వచ్చాను. గంగానదీ తీరమున ఉన్న మునుల వలన మీ పెదతండ్రి గారి తపస్సు గురించి కూడా విన్నాను." అని అన్నాడు.

అప్పుడు ధర్మరాజు నారదునితో ఇలా అన్నాడు. "మహామునీ! మా పెదతండ్రిగారు, మా పెదతల్లిగారు, మా తల్లి కుంతీదేవి క్షేమంగా ఉన్నారా! వారికి ఏ ఇబ్బంది కలగడం లేదు కదా!" అని అడిగాడు ధర్మరాజు.

దానికి నారదుడు ఇలా అన్నాడు. "ధర్మనందనా! నీకు అన్ని

విషయములు సవిస్తరముగా చెబుతాను సావధాన చిత్తుడవై విను. మీరందరూ ధృతరాష్ట్రుని ఆశ్రమమునుండి వచ్చిన తరువాత కొంత కాలము బాగానే జరిగింది. ఒకరోజు మీ పెదతండ్రి ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతీదేవి, సంజయుడు అగ్నిహోత్రముతో సహా తపస్సు చేసుకొనడానికి  ఆశ్రమమునకు దూరంగా గంగానదీ తీరంలో ఉన్న అరణ్యములలోకి వెళ్లారు.

అక్కడ ధృతరాష్ట్రుడు కేవలం గాలి ఆహారంగా తీసుకుంటూ ఘోరమైన తపస్సు చేయడం మొదలెట్టాడు. గాంధారీ కూడా కేవలం నీరు ఆహారంగా తీసుకుంటూ తపస్సు చేయడం మొదలెట్టింది. మీ తల్లి కుంతీ దేవి నెలకు ఒకసారి ఆహారం తీసుకుంటూ తపస్సు చేసింది. సంజయుడు వారానికి ఒకసారి ఆహారం తీసుకుంటూ తపస్సు చేసాడు. యాజకులు నిత్యమూ అగ్నిహోత్రమును చేస్తూ ఉండేవారు.

ఒక్కొక్కసారి ధృతరాష్ట్రుడు ఆ నిర్జనారణ్యములో ఒంటరిగా తిరుగుతూ ఉండేవాడు.  ఒకరోజు వారందరూ గంగానదిలో స్నానం చేసి వస్తున్నారు. ఇంతలో అడవికి నిప్పంటుకుంది. దావానలము తీవ్రంగా వ్యాపించింది.  అడవినంతా చుట్టుముట్టింది.  పక్షులు జంతువులు కకావికలై పరుగెత్తాయి.  గాంధారీ, ధృతరాష్ట్రులు నిరాహారంగా ఉండటంవలన అక్కడినుండి వేగంగా పరుగెత్తి ఆ మంటల బారి నుండి తప్పించుకొని పారిపోలేకపోయారు. ఎక్కడివారు అక్కడే నిలబడ్డారు.

ధృతరాష్ట్రుడు సంజయుని చూచి "సంజయా! నీవు పారిపో.  అగ్ని జ్వాలలు లేని చోటికి పారిపో. పారిపోడానికి మాకు శక్తిలేదు. మేము

రాలేము. నీవు పారిపోయి నీ ప్రాణాలు దక్కించుకో." అని అన్నాడు.

అప్పుడు సంజయుడు "మహారాజా! జీవితమంతా కలిసి ఉన్నాము. ఇంక మీదట కూడా కలిసి ఉంటాము. నా ప్రాణాలు కాపాడుకోడానికి మిమ్మల్ని ఒంటరిగా వదిలి వెళ్లలేను." అని అన్నాడు.

"అది కాదు సంజయా! మేము తప్పించుకొనే పరిస్థితిలో లేము. కాని నీవు తప్పించుకు పోగలవు. ఇది పాపం కాదు. వెంటనే వెళ్లిపో." అని అన్నాడు ధృతరాష్ట్రుడు.

ఎట్టకేలకు సంజయుని అక్కడినుండి పారిపోవడానికి ఒప్పించాడు ధృతర్వాష్టుడు. తరువాత ధృతరాష్ట్రుడు యోగ నిష్ఠలో కూర్చున్నాడు. గాంధారీ కుంతీ ఆయన పక్కనే కూర్చున్నారు. సంజయుడు ఆ మంటలలో నుండి నేర్పుగ తప్పించుకొని హిమా లయాలలోకి పారిపోయాడు.

గాంధారీ, ధృతరాష్ట్రుడు, కుంతీదేవిని ఆ మంటలు చుట్టు ముట్టాయి. వారు ముగ్గురూ ఆ మంటలకు ఆహుతి అయ్యారు. ఇదంతా నాకు గంగాతీరంలో ఉండే మునులు చెప్పారు. ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీదేవి అడవులకు రావడం, మీరు వారిని చూడటానికి రావడం, తరువాత మీరు హస్తినకు తిరిగి వెళ్లడం కూడా నేను  ఆ మునుల వలన విన్నాను. తరువాత నేను పోయి ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీదేవి మృతదేహములను కూడాచూచాను.

ఈవిషయం నీకు చెప్పిపోదామని వచ్చాను.   వారంతా ఉ

త్తమలోకాలకు వెళ్లిపోయారు. నీవేమీ బాధపడకు." అని అన్నాడు నారదుడు.

ఈవిషయం వింటూ ఉండగానే ధర్మరాజు, భీమార్జున నకులసహదేవులు దు:ఖంతో రోదిస్తున్నారు. ఈ విషయం అంత:పుర కాంతలకు తెలిసింది. అంతా శోకసముద్రంలో మునిగిపోయారు. ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీదేవి దావానలములలో ఆహుతి అయ్యారు అన్నవార్త హస్తినాపురం అంతా వ్యాపించింది. జనులు తండోపతండాలుగా రాజప్రాసాదానికి రాసాగారు.  అంతా తమ మహారాజు మరణానికి దు:ఖిస్తున్నారు.

తన ఏడుపును దిగమింగుకొని ధర్మరాజు నారదునితో ఇలా అన్నాడు. "మునీంద్రా! ఎవరి చావు ఎప్పుడు ఎక్కడ రాసి పెట్టి ఉందో ఎవరికి తెలుసు. మేమంతా ఉండగా మా పెదనాన్న కురువృద్ధుడు దిక్కులేని చావు చచ్చాడు. నూరుగురు కుమారులు ఉండి కూడా, వేయిఏనుగుల బలం ఉండికూడా, ఆ ధృతరాష్ట్రుడు కేవలం అగ్నికి ఆహుతి అయ్యాడు. ఏమంటాము? పట్టుపానుపుల మీద, హాయిగా నిద్రిస్తూ, వందిమాగధుల కైవారాలతో నిద్రలేవవలసిన ధృతరాష్ట్రుడు, ఇప్పుడు కటిక నేలమీద పడి ఉండి, నక్కలు తోడేళ్ల ఊళలు వింటూ దిక్కులేకుండా చచ్చి  పడి ఉన్నాడు కదా!

నారదా! గాంధారి తన భర్తతో కూడా వెళ్లి పోయింది. పుణ్యాత్మురాలు. ఆమె గురించి చింతింప పనిలేదు.  కానీ మా తల్లి కుంతీదేవి. మేమందరమూ రాజభోగములు అనుభవిస్తూ ఉంటే, అడవులకు పోయి, అక్కడ అగ్నికి ఆహుతి అయింది. అమె గురించే నా

దు:ఖమంతా! ఆమె కడుపున బుట్టిన నేను, భీమసేనుడు, అర్జునుడు, మాద్రీసుతులు, నకుల సహదేవులు ఇంతమంది కుమారులను పెట్టుకొని మా తల్లి  అనాధగా దిక్కులేని చావు చచ్చింది.  ఆమెకోసం దు:ఖించకుండా ఎలా ఉండగలను చెప్పు.

నారదా! తమరికి తెలుసుకదా! ఖాండవ దహన సమయంలో అర్జునుడు అగ్నిదేవునికి ఎంతో సాయం చేసాడు. కాని అగ్ని దేవుడు ఆ సాయం కూడా గుర్తుపెట్టుకోకుండా మా తల్లిని దగ్ధంచేసాడు.  ఆ అగ్నిదేవునికి కనీసం కృతజ్ఞత అన్నా ఉందా. అతడు ఎంత కృతఘ్నుడు. మునీంద్రా! ఇప్పుడు ఎంత వగచి మాత్రం ఏమి లాభము. మా పెదనాన్న, పెదతల్లి, మా తల్లి అగ్నిలో ఆహుతి అయ్యారు కదా. వారికి మేము ఏమి చెయ్యాలి. వివరంగా చెప్పండి.” అని అడిగాడు.

అప్పుడు నారదుడు ఇలా అన్నాడు. “నీకు  ఇంకో విషయం కూడా చెప్పాలి.  ఇది జరగిన ముందు రోజు ధృతరాష్ట్రునకు విరక్తి అధికమై అగ్నికి ప్రత్యేకమైన పూజలు చేసి అగ్ని దేవుని వద్దనుండి సెలవు తీసుకున్నాడు. ఆ అగ్నిని వేల్చిన ఋత్విక్కులు ఆ అగ్నిని అక్కడే ఉద్వాసన చేసి వెళ్లిపోయారు. ఆ అగ్ని రగిలి రగిలి కార్చిచ్చుగా మారి ఆ అడవిని దహించి వేసింది. ఆ అగ్నిలోనే వారంతా దహనం అయ్యారు.  మీ పెదనాన్న తాను వేల్చిన అగ్నిలోనే తాను దగ్ధం అయ్యాడు. కాబట్టి నీవు, నీ తమ్ములు, ద్రౌపది మొదలగు అంత:పుర కాంతలు అందరూ  గంగా నదికి వెళ్లి స్నానం చేసి మీ పెదనాన్న ధృతరాష్ట్రునకు, గాంధారికి కుంతీదేవికి  తిలోదకాలు ఇవ్వండి.”  అని అన్నాడు.

వెంటనే పాండవులు, అంత:పురకాంతలు, పురజనులు అందరూ

గంగానదీతీరమునకు వెళ్లారు. గంగా స్నానం చేసారు. తిలోదకాలు ఇచ్చారు.

పదిరాత్రులు అశౌచము(మయల) కాబట్టి  గంగానదీతీరముననే కుటీరములు నిర్మించుకొని అక్కడే ఉన్నారు.  సమర్ధులైన వారిని పిలిచి ధృతరాష్ట్రుడు, గాంధారీ, కుంతీదేవిల అస్థికలు సేకరించి వాటిని గంగానదిలో నిమజ్జనం చేసారు. శ్రాద్ధకర్మలు శ్రద్ధతో నిర్వర్తించారు. దానధర్మాలు విరివిగా చేసారు. వారికి ఉత్తమలోకములు కలగడానికి ఏం చెయ్యాలో అన్నీ సక్రమంగా శ్రద్ధతో చేసారు. శ్రాద్ధకర్మలు జరిగిన పన్నెండు రోజులు నారదుడు అక్కడే ఉండి అన్ని కార్యములు యధావిధిగా నిర్వర్తింప చేసాడు. ధర్మరాజును అతని తమ్ములను అందరూ ఆశీర్వదించారు.

తరువాత ధర్మరాజు తన తమ్ములతో అంత:పుర కాంతలతో హస్తినాపుర ప్రవేశము చేసాడు.  ఈ విధంగా ధృతరాష్ట్రుడు మహాభారత యుద్ధము జరిగిన తరువాత 15 ఏళ్లు హస్తినాపురము లోనూ, తరువాత 3 ఏళ్లు అరణ్యములలోనూ గడిపి పరలోకము చేరుకున్నాడు.” అని వైశంపాయనుడు జనమేజయునకు మహాభారతకధను వినిపించాడు.

మహాభారతము  ఆశ్రమ వాస పర్వము
ద్వితీయోధ్యాయము సంపూర్ణము.
ఆశ్రమవాస పర్వము సర్వం సంపూర్ణము.
ఓంతత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్.

# మహా భారతము

# మౌసల పర్వము

## ఏకాశ్వాసము.

వైశంపాయన మహర్షి జనమేజయ మహారాజుకు మహాభారత కథను ఈ విధంగా చెప్పసాగాడు.

“అప్పటికి ధర్మరాజుకు కురు సామ్రాజ్య పట్టాభిషేకము జరిగి 35 సంవత్సరములు అయింది. 36వ సంవత్సరంలో కొన్ని ఉత్పాతాలు సంభవించాయి. ఉదయం పూట తీవ్రమైన గాలులు వీచాయి. ఇసుక తుఫానులు వచ్చాయి. ఆకాశం నుండి ఉల్కలు రాలాయి. మేఘాలు లేకుండానే పిడుగులు పడ్డాయి. సూర్యుడికి చంద్రుడికి చుట్టూ ఎర్రటి కాంతులతో వలయాలు ఏర్పడ్డాయి. వేసవి కాలంలో కూడా చలిగాలులు వీచాయి. మంచు కురిసింది. ఈ ప్రకారంగా ప్రతి రోజూ ఏదో ఒక ఉత్పాతము కనపడుతూ నే ఉంది.

ధర్మరాజు దీనికి కారణం తెలియక కలవరపడుతున్నాడు. కొంతకాలానికి ఒక దుర్వార్త తెలిసింది. అదేమిటంటే శ్రీకృష్ణుడు, బలరాముడు తప్ప మిగిలిన యాదవులందరూ ఒకరితో ఒకరు పోట్లాడుకొని కొట్టుకొని చనిపోయారని తెలిసింది. ఈ దుర్వార్త విని ధర్మరాజు వెంటనే ఈ వార్తను తన తమ్ములకు మిగిలిన వారికీ తెలియ జేసాడు. అందరూ ఈ దుర్వార్త విని శోక సముద్రంలో మునిగిపోయారు.” అని చెప్పిన వైశంపాయనుని చూచి జనమేజయుడు “”

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

“మునీంద్రా! హటాత్తుగా యాదవులందరూ ఒకరితో ఒకరు కలహించుకొని మరణించడం ఏమిటి. అసలు ఏమి జరిగింది?” అని అడిగాడు. అప్పుడు వైశంపాయనుడు ఈ విధంగా చెప్పసాగాడు.

“జనమేజయ మహారాజా! ఈ విషయం ఇప్పటిది కాదు. చాలా కాలం కిందట జరిగిన దానికి ఫలితం ఇది. చాలా కాలం కిందట ఒక రోజు కణ్వుడు, నారదుడు, విశ్వామిత్రుడు మొదలగు మహాఋషులు తమ తమ శిష్యులతో శ్రీ కృష్ణుని చూడటానికి ద్వారకకు వచ్చారు. ఈ మునులను చూచిన యాదవ యువకులకు వారిని ఆటపట్టించాలనే దుర్బుద్ధిపుట్టింది. వెంటనే వారిలో చిన్నవాడైన సాంబుడికి ఆడవేషం వేసారు. సాంబుడిని తీసుకొని యాదవులందరూ ఆ మునుల దగ్గరకు వెళ్లారు.

“మహామునులారా! ఈమె మా స్నేహితుడు బభ్రుడి భార్య. వీరికి చాలారోజులుగా సంతానము లేదు. అసలు ఈమెకు సంతానము కలుగుతుందా లేదా?” అని అడిగారు.

వారి మొహాలు చూడగానే ఆ ఋషులకు వీరు తమను హేళన చేయుటకు నాటకం ఆడుతున్నారు అని తెలుసుకున్నారు. “వీడు శ్రీ కృష్ణుని కుమారుడు సాంబుడు. వీడు మగవాడు. వీడు ఒక ముసలము (రోకలి)ని కంటాడు. ఆ ముసలము, శ్రీకృష్ణబలరాములను తప్ప, తక్కిన యాదవ కులమును సర్వనాశనం చేస్తుంది. బలరాముడు మాత్రము యోగనిష్టతో ఈ శరీరం వదిలి సముద్రంలో ప్రవేశిస్తాడు. శ్రీకృష్ణుడు నేలమీద పడుకొని ఉండగా, జర అను రాక్షసి శ్రీకృష్ణుని చంపుతుంది. మీ కపటనాటకమునకు ఇదే శిక్ష” అని ఆ ఋషులు శ్రీకృష్ణుని చూడకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఈ వార్త శ్రీ కృష్ణునికి తెలిసింది. జరగనున్నది జరగక మానదు అని ఆయన మిన్నకున్నాడు. మరుసటి రోజే ఋషుల శాపం ఫలించింది. సాంబుడి కడుపులో నుండి ఒక ముసలము పుట్టింది. యాదవులు ఆశ్చర్యపోయారు. సాంబుని, ముసలమును తీసుకొని వసుదేవుని వద్దకు వెళ్లారు. ఇదంతా విన్న వసుదేవుడు భయభ్రాంతు డయ్యాడు. వెంటనే ఆ రోకలిని చూర్ణంగా చేసి ఆ పొడిని సముద్రంలో కలపమని చెప్పాడు. ఇంక ఆ ముసలము వలన బాధ ఉండదు అని అనుకున్నాడు వసుదేవుడు. యాదవ కుమారులు వసుదేవుడు చెప్పినట్టు ఆ ముసలమును బాగా పొడి పొడిగా చేసి ఆ పొడిని సముద్ర జలాలలో కలిపారు. అంతటితో ఆ విషయం మరిచిపోయారు.

కాలం గడిచింది. మహాభారత యుద్ధం జరిగింది. తన కుమారుల మరణానికి కారణం శ్రీ కృష్ణుడు అని తెలుసుకున్న గాంధారి యాదవులందరు కూడా తన కుమారుల వలెనే దుర్మరణం పొందుతారు అని శపించింది. తరువాత కొంతకాలానికి ద్వారకానగరంలో అనేక ఉపద్రవాలు సంభవించాయి. దీనికి తోడు యమధర్మరాజు తన చేత యమదండము ధరించి దున్నపోతునెక్కి ద్వారకానగరంలో సంచరిస్తున్నాడు అనే వార్త పాక్కింది. యాదవులందరూ భయభ్రాంతులయ్యారు.

రాత్రులు చిలకలు, గుడ్లగూబల మాదిరి, వికృతంగా అరుస్తున్నాయి. పగలు మేకలు, నక్కలవలె, అరుస్తున్నాయి. యాదవులందరూ దుర్వ్యసనములలో మునిగితేలుతున్నారు. మునులను బ్రాహ్మణులను అవమానిస్తున్నారు. తాగుడు జూదం మొదలగు వ్యసనములకు బానిసలు అయ్యారు. యాదవస్త్రీలు కూడా మొగుళ్లను లెక్కచెయ్యడం లేదు. తమ ఇష్టం చ్చినట్టు తిరుగుతున్నారు. తినే ఆహారంలో పురుగులు అప్పటికప్పుడు పుడుతున్నాయి.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఈ అశుభములను చూచి శ్రీ కృష్ణుడు ఆలోచనలో పడ్డాడు. నాడు గాంధారి ఇచ్చిన శాపము 35 ఏళ్ల తరువాత పనిచెయ్యడం మొదలుపెట్టింది. యాదవులకు సర్వనాశనము త ప్పదు. వీరందరూ ఒకరితో ఒకరు కొట్టుకొని చస్తారు. అదేదో ఒక పుణ్యభూమిలో కొట్టుకుంటే పుణ్యం వస్తుంది అని అనుకున్నాడు కృష్ణుడు. అందుకని యాదవులతో ఒక సభచేసాడు ఆ సభలో ఇలా ప్రకటించాడు.

"యాదవులారా! మనమందరమూ కలిసి సముద్రునకు ఒక జాతర చేయాలి. ఈ విషయం అందరికీ తెలిసే విధంగా చాటింపు వేయించండి." అని ఆదేశించాడు. ఆ ప్రకారంగా సముద్రునికి జాతర చేసే విషయం ద్వారకా నగరం అంతటా తెలిసిపోయింది. అదే రోజు రాత్రి యాదవులందరికీ వింత వింత స్వప్నములు వచ్చాయి. నల్లగా భయంకరంగా ఉన్న స్త్రీలు యాదవుల ఇళ్లలో చొరబడి వారి స్త్రీలను బలవంతంగా ఈడ్చుకొని పోయారు. యాదవుల ఆయుధములను నాశనం చేసారు. వారి వారి ఆభరణములను దొంగలు అపహరించుకొని పోయారు. మరునాడు శ్రీ కృష్ణుని చక్రాయుధము, గరుడ ధ్వజము, శ్రీకృష్ణుని రథమునకు కట్టే సుగ్రీవము,శైబ్యము,వలాహకము, మేఘపుష్పము అనే నాలుగు అశ్వములు, ఆయన రథము అన్ని ఆకాశంలోకి ఎగిరిపోయాయి. ఇంతలో ఆకాశంనుండి పదండి పదండి యాదవులందరూ సముద్రతీరానికి పదండి అని బిగ్గరగా వినిపించింది.

ఇన్ని ఉత్పాతాలు జరుగుతున్నా, శ్రీకృష్ణుని ఆయుధములు, హయములు, రథములు ఆకాశంలోకి ఎగిరిపోతున్నా, వారి వారి ఆభరణములు దొంగిలింపబడ్డా, యాదవులకు ఇసుమంత కూడా బాధ కలగలేదు. వారంతా మద్యమాంసములు సేవించడంలో మునిగిపోయారు. యాదువులందరూ రకారకాల భక్ష్యములు భోజ్యములు మద్యములు తయారు చేసుకున్నారు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వాటిని బండ్లలోకి ఎత్తించుకొని అందరూ సముద్రతీరానికి బయలుదేరారు. శ్రీకృష్ణుడు కూడా వారి వెంట సముద్రతీరానికి బయలుదేరాడు. అన్ని తెలిసికూడా కృష్ణుడు ఏమీ తెలియనట్టు నిర్వికారంగా ఉన్నాడు. బలరాముడు కూడా తన అలంకారములు అన్నీ తీసివేసి నిరాడంబరంగా కాలి నడకన సముద్రతీరానికి బయలుదేరాడు. యాదవ స్త్రీలందరూ చక్కగా అలంకారములు చేసుకొని పల్లకీలలో బయలుదేరారు.

అందరూ సముద్ర తీరం చేరుకున్నారు. అంతకు ముందే అక్కడ లెక్కలేనన్ని పందిళ్లు వేసారు. అందరూ ఆ పందిళ్లలో కూర్చున్నారు. అంతకు ముందే ఉద్ధవుడు తాను తపస్సుచేసుకోడానికి వెళతానని కృష్ణుడికి చెప్పి వెళ్లిపోయాడు. బలరాముడు ఒంటరిగా ఒక చెట్టు కింద కూర్చున్నాడు. యోగసమాధిలోకి వెళ్లిపోయాడు. యాదవులు ఇవేమి పట్టించుకోలేదు . మద్యము సేవించి విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. బ్రాహ్మణ సంతర్పణకు గాను తయారు చేసిన పదార్థములు అన్నింటినీ కోతులకు పంచిపెట్టారు. అవి తింటుంటే కేరింతలు కొడుతున్నారు. మద్య మాంసములను సేవిస్తూ కేరింతలు కొడుతూ ఆడుతున్నారు. పాడుతున్నారు. వారి వారి శరీరాలు వారి స్వాధీనంలో లేవు.

యాదవ ప్రముఖులైన సాత్యకి,కృతవర్మ, చారుధేష్ణుడు, గదుడు, ప్రద్యుమ్నుడు, మొదలైన యాదవ ప్రముఖులు కూడా మద్యము సేవించారు. ఒకరితో ఒకరు పరిహాసాలు ఆడుకుంటున్నారు. ఆ సందర్భంలో సాత్యకి కృతవర్మను చూచి రోషంగా ఇలా అన్నాడు.

"ఒరేయ్ కృతవర్మా! శత్రువులైనా నిద్రలో ఉంటే వారు చచ్చినట్టేరా. అలాంటి వారిని చంపడానికి ఏ నీచుడూ ప్రయత్నించడురా! అలాంటప్పుడు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఈ కృతవర్మ అంత నీచకార్యమునకు ఎలా ఒడిగట్టాడురా! ఏరా ప్రద్యుమ్నా! నిజమేనా! ఒరేయ్ అదీ ఒక వీరత్వమా! అదీ ఒక శత్రు సంహారమా! అలా చంపడం పాపం అని కూడా తెలియదట్రానీకు!" అని హేళనగా అన్నాడు సాత్యకి.

దానికి ప్రద్యుమ్నుడు ఇలా అన్నాడు. "అబ్బా! ఎప్పుడో జరిగిందానికి ఇప్పుడు ఎందుకు వాదన పోనివ్వు. ఈ కృతవర్మ చేసిన పనికి ప్రజలందరూ వీడిని నానా తిట్లు తిడుతున్నారు కదా! ఇంకా మీరు కూడా తిట్టడం ఎందుకు." అని సముదాయించాడు ప్రద్యుమ్నుడు.

సాత్యకి అన్న మాటలకు కృతవర్మ కోపం నసాళానికి అంటింది. "ఒరేయ్ సాత్యకీ! నీకు సిగ్గులేదురా! నా సంగతి, నేను చేసిన యుద్ధం సంగతి నీకెందుకురా! నీ సంగతి నువ్వు చూసుకోరా! అర్జునుడు చెయ్యి నరికితే పాపం ఆ భూరిశ్రవసుడు ఆయుధములు విడిచి రథం మీద యోగసమాధిలో కూర్చున్నాడు. అప్పుడు నువ్వు ఆయన తల నరకలేదా! ఈ సంగతి అప్పుడే మరిచిపోయావా! నువ్వు చేసింది కూడా ఒక యుద్ధమేనా! పైగా ఈ కృష్ణుడు కూడా అక్కడే ఉన్నాడు కదా!" అని ఎత్తిపొడిచాడు కృతవర్మ.

ఆ మాటలకు కృష్ణుడికి కోపం వచ్చింది. కృతవర్మ వంక కోపంగా చూచాడు. అప్పుడు సాత్యకి కృష్ణుడితో ఇలా అన్నాడు. "అన్నయ్యా! వీడి సంగతి ఎవడికి తెలీదు! నాడు సత్రాజిత్తు దగ్గర ఉన్న శమంతకమణిని అపహరించ డానికి వీడి తమ్ముడు శతధన్వుడు సత్రాజిత్తును చంపలేదా!" అని అన్నాడు. ఈ మాటలు విన్న సత్యభామకు తండ్రి అకాల మరణం గుర్తుకు వచ్చింది. ఆమె ఏడుస్తూ కృష్ణుడి వద్దకు వచ్చింది. ఏడుస్తున్న తన ముద్దులభార్య సత్యభామను చూచి కృష్ణుడు కోపంతో ఊగిపోయాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఇది చూచాడు సాత్యకి. అన్నకు వదినకు సంతోషం కలిగించడానికి ఒక్క ఉదుటున కృతవర్మ మీదికి దూకాడు. "అందరూ వినండి. ఈ దుర్మార్గుడు కృతవర్మ, అశ్వత్థామ కలిసి రాత్రిపూట నిద్రిస్తున్న ఉపపాండవులను నిర్దాక్షిణ్యంగా చంపారు. వీడు బతకకూడదు. వీడు కూడా ఆ ప్రకారమే చావాలి." అని అరిచాడు. వెంటనే తన ఒరలోనుండి కత్తిని బయటకు లాగాడు. కృతవర్మ తల పట్టుకొని ఒక్క వేటుతో కృతవర్మ తల నరికాడు.

సాత్యకి అంతటితో ఆగలేదు. కృతవర్మకు చెందిన భోజకులము వారందరి మీదా పడ్డాడు. ఇది చూచిన భోజకులు, అంధకులు విజృంభించారు. ఒక్క ఉదుటున సాత్యకిని చుట్టుముట్టారు. ఇంత జరుగుతున్నా కృష్ణుడు తన తమ్ముడు సాత్యకిని వారించడానికి కానీ, రక్షించడానికి కానీ ప్రయత్నం చెయ్యలేదు. మౌనంగా చూస్తున్నాడు. కాని ప్రద్యుమ్నుడు సాత్యకికి అండగా నిలబడ్డాడు. ప్రద్యుమ్నుని అండచూచుకొని సాత్యకి రెచ్చిపోయాడు. తనవాళ్లతో కలిసి భోజాంధక కులములవారితో యుద్ధానికి దిగాడు.

ఇరువర్గముల వారికీ యుద్ధం జరిగింది. కాని అక్కడ ఏ ఆయుధములు లేవు. అందుకని సముద్రం ఒడ్డున పెరిగిన తుంగ మొక్కలను పీకి ఒకరితో ఒకరు కొట్టుకున్నారు. ఈ తుంగ మొక్కలు సముద్రం పొడుగునా పెరిగి ఉన్నాయి.

చాలా కాలం కిందట, యాదవులు చిన్నతనంలో చేసిన చిలిపి పనికి మునులు ఇచ్చిన శాపం కారణంగా పుట్టిన ముసలాన్ని యాదవకుమారులు చూర్ణం చేసి సముద్రంలో కలిపారు కదా. ఆ చూర్ణం సముద్రం నీళ్లలో కలిసిపోయి, ఒడ్డుకు వచ్చి తుంగ చెట్ల రూపంలో పెరిగింది. ప్రతి తుంగ మొక్కలో ఆ ముసలం శక్తి నిక్షిప్తం అయింది. ఇప్పుడు ఇన్నేళ్ల తరువాత ఆ

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ముని శాపం ఫలించింది. ఆ తుంగ మొక్కలతోనే యాదవులు కొట్టుకుంటున్నారు.

ఆ సమయంలో యాదవులు అందరూ మద్యం సేవించి మత్తులో ఉన్నారు. ఆ తుంగ మొక్కలతో కొడుతుంటే ఒక్కొక్క దెబ్బకు ఒక్కొక్క యాదవుడు చస్తున్నాడు. ఆ మత్తులో వారికి ఈ విషయం తెలియలేదు. తండ్రి, కొడుకు, అన్న, తమ్ముడు, బావ మరిది అనే విచక్షణ లేకుండా కొట్టుకున్నారు. అంతా కిందపడిపోయారు. కింద పడ్డవారు మరలా లేచి కొట్టుకుంటున్నారు. చచ్చేదాకా కొట్టుకుంటున్నారు. కాని కృతవర్మకు చెందిన భోజులు, అంధక వంశస్తులు ఎక్కువగా ఉండటంతో, సాత్యకి వంశస్తులు అయిన వృష్ణి వంశము అంతా నశించి పోయింది.  అనిరుద్ధుడు, ప్రద్యుమ్నుడు, సాంబుడు,సాత్యకి,గదుడు చచ్చి పడి ఉన్నారు. ఇదంతా చూచిన కృష్ణుడికి మునుల శాప ప్రభావం వలన వల్లమాలిన  కోపం ముంచుకొచ్చింది. మిగిలిన తుంగ కర్రలను తీసుకొని చావగా మిగిలిన భోజ అంధక వంశస్తులను అందరినీ సమూలంగా నాశనం చేసాడు. యాదవ వంశము పూర్తిగా నాశనం అయింది.

ఆ రణభూమిలో కృష్ణుడు ఒంటరిగా నిలబడి ఉన్నాడు. చావగా మిగిలిన వారిలో కృష్ణుని రథ సారధి దారుకుడు,బభ్రుడు ఉన్నారు. వారు భయం భయం గా కృష్ణుని వద్దకు వచ్చారు. వారు కృష్ణుని చూచి  ఇలా అన్నారు.

“ కృష్ణా! యాదవులందరూ చనిపోయారు. బలరాముడు ఎక్కడ ఉన్నాడో తెలియ లేదు. అతనిని వెదకడం మంచిది.” అని అన్నారు.

సరే అన్నాడు కృష్ణుడు. అందరూ బలరాముని వెతుక్కుంటూ

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

బయలుదేరారు. ఆ సమయంలో బలరాముడు ఒక చెట్టు కింది యోగ సమాధిలో కూర్చుని ఉన్నాడు.

కృష్ణుడు దారుకుని చూచి ఇలా అన్నాడు. “దారుకా! నీవు వెంటనే హస్తినకు వెళ్లు. ఇక్కడ యాదవ కులం అంతా సర్వనాశనం అయిందని చెప్పి అర్జునుని తీసుకొని రా!” అని అన్నాడు. వెంటనే దారుకుడు రథం మీద హస్తినకు వెళ్ళాడు. కృష్ణుడు బభ్రుని చూచి “నీవు వెళ్లి సముద్రం ఒడ్డున ఉన్న స్త్రీలను, అంతః పురజనములను ద్వారకకు చేర్చు.” అని అన్నాడు. సరే అని బభ్రుడు వెళ్లబోయాడు. అంతలో ఒక బోయవాడు అటుగా వెళుతున్నాడు. అతని చేతిలోని తుంగ పరక ఎగిరి వచ్చి బభ్రునికి తగిలింది. అదిరి పడ్డాడు బభ్రుడు. నేల మీద పడి మరణించాడు. అమ్మో ఋషుల శాపం ఇంత శక్తి వంతమైనదా అని కృష్ణుడు కూడా ఆశ్చర్యపోయాడు.

తరువాత కృష్ణుడు బలరాముని వద్దకు పోయి “ అన్నయ్యా నువ్వు నేను తప్ప అందరూ మరణించారు. నేను వెళ్లి అంతఃపుర స్త్రీలను ద్వారకకు చేర్చి వస్తాను. అప్పటి దాకా నీవు ఇక్కడే ఉండు.” అని అన్నాడు కృష్ణుడు.తరువాత కృష్ణుడు సముద్ర తీరానికి పోయి అక్కడ ఉన్న స్త్రీలనందరినీ తీసుకొని ద్వారకకు వెళ్లాడు.

తరువాత తండ్రి వసుదేవుని వద్దకు పోయి ఇలా అన్నాడు. “తండ్రీ! నేను భారత యుద్ధం చూచాను. అక్కడ కురుపాండవులు నాశనం కావడం చూచాను. ఈరోజు యాదవులందరూ తమలో తాము కొట్టుకొని చావడం చూచాను. మీరు నేను బలరాముడు తప్ప వేరు ఎవరూ లేరు. బంధువులు మిత్రులు లేని చోట నేను ఉండలేను. నాకన్నా ముందు బలరాముడు యోగసమాధిలోకి వెళ్లాడు. నేను కూడా వెళ్లి అతనితోపాటు తపస్సు చేస్తాను. ఇక్కడ విషయాలు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అన్ని మీరు చూచుకోండి. నేడో రేపో అర్జునుడు ఇక్కడకు వస్తాడు. అతడు మీకు తోడుగా ఉంటాడు." అని అన్నాడు కృష్ణుడు. తరువాత తండ్రి పాదములు తాకి నమస్కరించాడు. కాని అప్పటికే వసుదేవుడు యాదవుల మరణ వార్త విని ఉన్నాడు. ఇప్పుడు కృష్ణుని వీడ్కోలు వాక్యాలు విన్నాడు. దుఃఖంతో వసుదేవుడు చైతన్యం కోల్పోయాడు. నిశ్చేష్టుడయ్యాడు. స్పృహ తప్పిపోయాడు.

వసుదేవుని పరిస్థితి చూచి అంతఃపుర స్త్రీలు హాహాకారాలు చేసారు. కృష్ణుడు వారిని ఓదార్చాడు. "ఏడవకండి. అర్జునుడు ఇక్కడకు వస్తున్నాడు. ఇక్కడ చేయవలసిన పనులు అతను నిర్వర్తిస్తాడు. నేను అన్నగారి దగ్గరకు వెళతాను." అని కృష్ణుడు బలరాముని వద్దకు వెళ్లాడు. "అన్నయ్యా! అంతఃపుర స్త్రీలను ద్వారకకు చేర్చాను. తండ్రిగారి అనుమతి తీసుకొని ఇక్కడకు వచ్చాను." అని అన్నాడు.

బలరామునిలో చలనం లేదు. అంతలో బలరాముని ముఖంలో నుండి ఒక పెద్ద సర్పము బయటకు వచ్చింది. బలరాముడు తన యోగశక్తితో ఈ శరీరం వదిలిపెట్టాడు. అతని ప్రాణాలు సముద్రం మీదుగా ఆకాశంలోకి వెళ్లిపోయాయి. ఆదిశేషుని అవతారమైన బలరామునికి నాగ జాతి స్వాగతం పలికింది. నాగ ప్రముఖులు వచ్చి బలరాముని ఆత్మకు స్వాగతం పలికారు. ఆ ప్రకారంగా బలరాముడు విష్ణులోకం ప్రవేశించి విష్ణువులో ఐక్యం అయ్యాడు.

ఆ ప్రకారంగా బలరాముడు తన అవతారమును చాలించడం కళ్లారా చూచాడు కృష్ణుడు. తాను కూడా అవతారం చాలించవలసిన సమయం వచ్చిందని అనుకున్నాడు. తాను భూలోకంలో ఏ కార్యనిర్వహణకు అవతరించాడో ఆ కార్యములు ఎలా నెరవేరాయో తల్చుకుంటూ దిక్కూ తెన్నూ లేకుండా తిరుగుతున్నాడు. ఇప్పుడు తాను ఏ విధంగా ఈ శరీరం వదిలిపెట్టాలి

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అని ఆలోచించాడు.

శ్రీ కృష్ణునికి ఒక్కసారి గతం గుర్తుకు వచ్చింది. ఒకసారి దుర్వాసుని కోరిక మేరకు అతని ఒంటి నిండా పాయసం పూసాడు. కాని అరికాలికి మాత్రం పూయలేదు. దాని ఫలితంగా దుర్వాసుడు కృష్ణా! నీ మరణం నీ అరికాలిలో ఉంది అని అన్నాడు. ఆ ఋషి వాక్కు గుర్తుకువచ్చింది. తాను ఎలా ప్రాణాలు వదిలి పెట్టాలో అర్థం అయింది.

కృష్ణుడు నేల మీద పడుకున్నాడు. ఇంద్రియములను నిగ్రహించాడు. యోగసమాధిలోకి వెళ్లాడు. ఆ సమయంలో జర ఆ అడవిలోకి ప్రవేశించింది. (జర అంటే ముసలి తనము అని అర్థము). ఆ సమయంలో ఒక వేటకాడు అక్కడ జంతువుల కోసం తిరుగుతున్నాడు. జర ఆ వేటగాడిని ఆవహించింది. అతడి కళ్లకు పడుకున్న కృష్ణుని కాలు ఒక లేడి అనే భ్రాంతిని కలుగ చేసింది. వెంటనే ఆ వేటగాడు తన విల్లును సంధించి బాణాన్ని ఎక్కుపెట్టాడు. పడుకున్న కృష్ణుని పాదమునకు గురి పెట్టి వదిలాడు. ఆ బాణము తీవ్రమైన వేగంతో పోయి కృష్ణుని అరికాలిలో దిగబడింది. అవతల వైపుకు పొడుచుకొని వచ్చింది.

ఆహా జింక చచ్చింది అని ఆ జింకను తీసుకొని పోవడానికి ఆ వేటగాడు కృష్ణుని వద్దకు వచ్చాడు. అక్కడ జింక లేదు. కృష్ణుడు ఉన్నాడు. అతని మాయ తొలగిపోయింది. భయంతో వణికిపోయాడు. కృష్ణుని పాదాల మీద పడ్డాడు. భోరున ఏడుస్తున్నాడు. కృష్ణుడు ఆ వేటగాడిని ఓదార్చాడు. వెంటనే శ్రీ కృష్ణుడు ఈ మానవ శరీరమును వదిలి వైకుంఠపదము చేరుకున్నాడు.

వైకుంఠలోకంలో ఉన్న మునులు, సిద్ధులు, సాధ్యులు,రుద్రులు, వసువులు, మరుత్తులు, విశ్వేదేవతలు, స్వర్గాధిపతి దేవేంద్రుడు, కృష్ణునికి ఘనస్వాగతం పలికారు. తిరిగి వైకుంఠము చేరిన శ్రీకృష్ణుని చూచి దేవేంద్రుడు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఇలా అన్నాడు.

" ఓ మహాత్మా! ధర్మరక్షణ కొరకు నీవు ఆడే జగన్నాటకంలో ఒక పాత్రగా భూమి మీద అవతరించావు. కంసుడు నరకుడు మొదలగు లోక కంటకులను నాశనం చేసావు. భ్రష్టు పట్టిన భరత కులమును పరిశుభ్రం చేసావు. తిరిగి వైకుంఠధామము చేరుకున్నావు. నీవు అజరామరుడవు. ఆదిపురుషుడవు. ఆది అంతము లేనివాడవు. నీకు చావు ఎక్కడిది. కృష్ణుడిగా జన్మించడం, మరణించడం, అంతా నీ లీల. ఓ మహాత్మా! మానవుల కష్టములు ఈ యుగంతో తీరేవి కావు. కాబట్టి నిన్ను నమ్ముకున్న నీ భక్తులను కాపాడటానికి నీవు ప్రతి యుగంలో కూడా అవతరించాలి. అదే నీ భక్తుల కోరిక." అని అన్నాడు దేవేంద్రుడు.

ఆ మాటలన్నీ చిరునవ్వుతో విన్నాడు కృష్ణావతారం చాలించిన శ్రీమహావిష్ణువు. ఇంతలో బ్రహ్మదేవుడు వచ్చి భక్తితో చేతులు జోడించి పక్కన నిలబడ్డాడు. వేద మంత్రములతో శ్రీమహావిష్ణువును స్తుతించాడు.

అప్పుడు శ్రీ మహావిష్ణువు ఇలా సమాధానం చెప్పాడు. (శ్రీ మహా విష్ణువు ఇచ్చిన సమాధానం అత్యుత్తమమైనది. అందుకని తిక్కన గారి పద్యం యధాతథంగా అందిస్తున్నాను. అంతే కాకుండా ఆ పద్యానికి అర్థము, విశేషార్థము కూడా వివరిస్తున్నాను. వీటిని తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రచురించిన మహాభారత సంపుటములలో నుండి సేకరించాను. ఈ వివరణ రాసిన డా.హెచ్. ఎస్.బ్రహ్మానంద గారికి, ప్రచురించిన తి.తి.దేవస్థానముల వారికి మనః పూర్వకమైన కృతజ్ఞతలు తెలియ పరచుకుంటున్నాను.)

సీ. అప్పరమేశ్వరుం డయ్యందఱను జూచి। యనిరుద్ధనామకంబైన యదియు
  బ్రద్యుమ్నతాప్రతిభాసమానమును సం।కర్షణభావ వికాసితంబు
  వాసుదేవాత్మక వరరూపమున నేక।తా విభవత్సమాధానసిద్ధి

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

నొందించుకొంటి నానందబోధ నిరం జనామేయ మత్పదప్రాప్తి పరమ

ఆ: మంగళానుభూతి నంగీకరించెద । సుఖుల రగుడు మీరు సుకృతులార!
యనిన వచనసమితి యతిమృదుమధురత।నింపు నొసగ నలరి రెల్లవారు.

ఆ పరమేశ్వరుడు అయిన నారాయణుడు వారందరినీ చూచి ఇలా అన్నాడు. అనిరుద్ధమనే పేరు కలిగినదీ, ప్రద్యుమ్నత్వమనే కాంతి కలిగినదీ, సంకర్షణ అనే భావంతో ప్రకాశించేదీ, వాసుదేవుడు అనే పేరుతో పిలువబడేదీ అనన్యమైనదీ, అద్వితీయమైనది, జ్ఞానముతో కూడినదీ, ఏ దోషమూ లేనిదీ అయిన విష్ణుపదమును నాకు నేనుగా సిద్ధించుకున్నాను. పరమ మంగళకరమైన ఈ విష్ణుపదమును నేను స్వీకరిస్తున్నాను. ఓ సుకృతులారా! మీరందరూ మీ మీ నెలవులకు మరలండి. అని ఆదేశించాడు శ్రీ మహావిష్ణువు.

(ఈ పద్యంలో శ్రీ కృష్ణుడు శ్రీమన్నారాయణత్వ సిద్ధి పొందాడు అని వివరింపబడింది. నిర్వికారమైన పరబ్రహ్మ తత్త్వము నుండి సాకారమైన ఈ సృష్టి నాలుగు అంచెలుగా ఏర్పడింది. దీనినే నారాయణ తత్వము అంటారు. సృష్టిలోని ఈ నాలుగు దశలు:

1.సనాతన వాసుదేవ తత్త్వము. నిష్క్రియ, నిర్గుణ, నిష్కళంక, నిర్ద్వంద్వమైన పురుష తత్త్వము. దీనినే పరతత్త్వము అని కూడా అంటారు. ఈ పరతత్త్వమే పంచభూతాత్మకమైన ఈ శరీరంలో జీవుడుగా ఉంటున్నాడు. జీవుడు లేకుండా పరతత్త్వానికి కదలిక ఉండదు. అందుకే వసుదేవ కుమారుడు వాసుదేవుడు అని శ్రీకృష్ణుడు పిలువ బడ్డాడు.

2. సంకర్షణ తత్త్వము: ఇది జీవ తత్త్వము. ఆదిశేషువు. సంకర్షణుడు. ఈ

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

పాంచభౌతిక శరీరాన్ని వాసుదేవ తత్త్వము వైపు ఆకర్షించేవాడు అని అర్థం. కర్షతీతి అంటే ఆకర్షించునది. కృష్ణ అంటే కూడా ఆకర్షించేవాడు అని అర్థం. భారతంలో అన్ని పాత్రలూ శ్రీ కృష్ణుడి చేత ఆకర్షింప బడ్డాయి ప్రభావితం కాబడ్డాయి.

3.ప్రద్యుమ్న తత్త్వము. సంకర్షణ తత్త్వము నుండి పుట్టినది ప్రద్యుమ్న తత్త్వము. దీనినే సనత్కుమార తత్త్వము అని కూడా అంటారు. దీనినే మనస్సు అని కూడా అంటారు. శరీరంతో నిమిత్తం లేకుండా మనస్సుతో మనము విశ్వ విహారం చెయ్యవచ్చు. ప్రళయకాలంలో పంచభూతాలు ఈ మనస్సులో లీనం అవుతాయి. (మనిషి చనిపోయేటప్పుడు పంచ భూతాత్మకమైన ఈ శరీరం ఇక్కడే ఉంటుంది. ఈ జీవితంలోని అనుభూతులను తీసుకొని మనస్సు వెళ్లిపోతుంది.) శ్రీ కృష్ణుడి కుమారుడు ప్రద్యుమ్నుడు. శ్రీ కృష్ణుడు పురుషుడు అయితే ఆయన నుండి పుట్టినది మనస్సు.

4. అనిరుద్ధ తత్త్వము: పైన చెప్పబడిన ప్రద్యుమ్న తత్త్వము నుండి అనిరుద్ధ తత్త్వము పుట్టింది. అందుకే ప్రద్యుమ్నుని కుమారుడు అనిరుద్ధుడు అని చెప్పబడింది. దీనినే అహంకార తత్త్వము అని అంటారు. మనస్సునుండి అహంకారము పుట్టింది. అహంకార స్వరూపుడు అనిరుద్ధుడు. పరమేశ్వరుడైన నారాయణుడిలో ఈ నాలుగు తత్త్వములు ఉన్నాయి అని పైపద్యంలో వివరించబడింది.

సులభంగా చెప్పుకోవాలంటే వసుదేవుని కుమారుడు వాసుదేవుడు. అతడు వ్రేపల్లెలో గోపికలను మొదలుకొని, పాండవులు, కౌరవులు తదితరులను ఆకర్షించాడు. అందుకే కృష్ణుడు అయ్యాడు. ఆయన మనస్సే

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఆయన కుమారుడి రూపంలో ఉద్భవించింది. అతడే ప్రద్యుమ్నుడు. మన్మధుడే ప్రద్యుమ్నుడుగా పుట్టాడు అంటారు. మన్మధుడు అంటే మన మనస్సే కదా. అక్కడే కదా మన్మధ వికారాలు పుట్టేది. ఆ మనస్సులో నుండే అహంకారము పుట్టింది. (మనస్సు ఒక కోరిక కోరుకుంటుంది. అది తీరకపోతే అహంకరిస్తుంది. నా వంటి వాడు కోరితే ఆ కోరిక తీరదా. ఏది ఏమైనా సరే నా కోరిక తీరాలి అని సంకల్పిస్తాడు. అదే అహంకారము) మనస్సు స్వరూపమైన ప్రద్యుమ్నుని కుమారుడే అహంకారానికి ప్రతిరూపమైన అనిరుద్ధుడు. ఈ నాలుగు తత్త్వములు విష్ణువులో ఉన్నాయి. శ్రీ కృష్ణుడు తన అవతారమును చాలించి, ఈ నాలుగు తత్త్వములను తనలో కలుపుకొని తన మూలస్థానమైన వైకుంఠపదమును చేరుకున్నాడు. అని ఈ పద్యము భావము. భారతమునకు తలమానికమైన పద్యము ఇది. అందుకే వివరంగా చెప్పాను.)

ఆ ప్రకారంగా దేవతలను, మునులను పంపివేసిన తరువాత నారాయణుడు ఆది అంతము లేని తన మూలస్థానమును చేరుకున్నాడు.

శ్రీ కృష్ణుని చేత హస్తినాపురమునకు పంపబడ్డ దారుకుడు హస్తినకు పోయి పాండవులను కలుసుకున్నాడు. యాదవులకు వారి చిన్న తనంలో మునులు ఇచ్చిన శాపము, ఆ శాప ఫలితంగా యాదవులందరూ అదికంగా మద్యం సేవించి, ఆ మత్తులో ఒకరితో ఒకరు కొట్టుకొని మరణించడం గురించి వివరంగా చెప్పాడు. బలరామ కృష్ణులు అడవిలో ఉన్నారని చెప్పాడు. అర్జునుని తీసుకురమ్మని కృష్ణుడు పంపినట్టు చెప్పాడు. యాదవుల దుర్మరణం గురించి విని పాండవులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ వార్త అంతఃపురానికి పాకిపోయింది. సుభద్ర, ద్రౌపది మొదలగు వారు పెద్దపెట్టున ఏడ్వడం మొదలెట్టారు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అంతా సద్దుమణిగాక దారుకుడు అర్జునుని తో ఇలా అన్నాడు. "అర్జునా! శ్రీ కృష్ణులవారు తమరిని వెనువెంటనే ద్వారకకు తీసుకురమ్మని ఆదేశించారు." అని అన్నాడు. అర్జునుడు ధర్మరాజు అనుమతి తీసుకొని వెంటనే ద్వారకకు బయలు దేరాడు. వేగంగా ద్వారకకు చేరుకున్నాడు.

ద్వారకా నగరమంతా నిర్మానుష్యంగా ఉంది. జన సంచారం లేదు. శ్రీకృష్ణుడు బలరాముడు ఎక్కడా కనిపించలేదు. అర్జునుని మనస్సు కీడు శంకించింది. ఏదో విపరీతం జరిగి ఉంటుంది అని అనుకున్నాడు. అర్జునుడు దారుకుడు వెంటరాగా రాజసౌధానికి వెళ్లాడు. అర్జునుని చూడగానే శ్రీకృష్ణుని భార్యలందరూ భోరు మని ఏడిచారు. అర్జునుడు కూడా వారి బాధను చూచి తట్టుకోలేక పోయాడు. కిందపడిపోయాడు. రుక్మిణీ సత్యభామలు ఏడుస్తూ అర్జునుని వద్దకు వచ్చారు. దుఃఖము ఎక్కువయి నేల మీద పడి ఏడుస్తున్నారు. వారి నందరినీ ఓదార్చడం శ్రీకృష్ణుని వంతు అయింది.

తరువాత దారుకుడు అర్జునుని వసుదేవుని వద్దకు తీసుకొని వెళ్లాడు. అర్జునునికి ఒక సందేహం పట్టుకుంది. మామూలుగా యాదవులు చనిపోతే ఏడవడం వేరు. ఇప్పుడు వీరు ఏడవడం వేరుగా ఉంది. ఇంతకూ శ్రీ కృష్ణుడు ఎక్కడ ఉన్నాడు. అతనికి ఏమయింది. శ్రీకృష్ణుని గురించి ఎవరు చెబుతారు అని దిక్కులు చూస్తున్నాడు. దారుకుడికి కూడా ఏమీ తెలియదు. అతడు కూడా బిక్కమొహం వేసుకొని చూస్తున్నాడు.

వసుదేవుడు కూడా శయ్య మీద పడి భోరు భోరున ఏడుస్తున్నాడు. అర్జునుని చూచి వసుదేవుడు పైకి లేచాడు. అర్జునుని పట్టుకొని విలపించాడు. చనిపోయిన యాదవులనందరినీ పేరు పేరు నా తలచుకుంటూ ఏడుస్తున్నాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కాసేపటికి వసుదేవుని దుఃఖము ఉపశమించింది. తరువాత అర్జునునితో వసుదేవుడు ఇలా అన్నాడు.

"అర్జునా! ఎంతో పరాక్రమ వంతులు, దేవతలచేత కూడా పొగడబడిన యాదవ వీరులు అందరూ ఒకరితో ఒకరు కలహించుకొని కొట్టుకొని మరణించారు. ఈ ఘోరం ఎక్కడయినా ఉన్నదా! నీ కోవిషయం తెలుసా. నీ శిష్యులు సాత్యకీ, ప్రద్యుమ్నుడు మొదటగా చచ్చారు. అసలు ఇంత ఘోరం జరిగిన తరువాత కూడా నేను ఇంకా బతికి ఉన్నాను. నాదీ ఒక బతుకేనా చెప్పు. అయినా వీళ్ల కేం పుట్టింది. సాత్యకి కృతవర్మలు ఒకరిని ఒకరు రెచ్చగొట్టు కున్నారట. దానితో కొట్టుకోడం మొదలయింది. ఇదంతా ముందే నిర్ణయింప బడింది. వీళ్ల చిన్నతనంలో చేసిన పాపము, ముని శాపము ఇలా పరిణ మించింది. యాదవ కులం నాశనమయింది. ఒకరిని అని ఏమి లాభము.

నీ కోవిషయం తెలుసా అర్జునా! ఇదంతా కృష్ణుని సమక్షంలో జరిగింది. కావాలంటే కృష్ణుడు ఈ కొట్లాట ఆపలేడా! కాని ఆపలేదు. విధి లిఖితం అలా ఉంది. యాదవ నాశనము కావాలని కృష్ణునికి తెలుసు. అందుకే ఆపలేదు. లేకపోతే ఉత్తర గర్భంలో ఉన్న పరీక్షిత్తును కాపాడిన వాడికి ఇదొక పెద్ద విషయమా చెప్పు. విధి నిర్ణయం అని సరిపెట్టుకోడం తప్ప మనం చేయ గలిగింది ఏముంది." అని అన్నాడు వసుదేవుడు.

అర్జునుడు ఆలోచించాడు. వసుదేవుడు కేవలం కృష్ణుడు ఆ కొట్లాట ఆపలేదని మాత్రమే చెబుతున్నాడు. కాని కృష్ణుడికి ఏమయింది. ఎక్కడ ఉన్నాడు అని అస్సలు ఆలోచించడం లేదు. కాబట్టి కృష్ణుడికి ఏమీ కాలేదు. అమ్మయ్య కృష్ణుడు క్షేమంగానే ఉన్నాడు అని తన మనసును సమాధాన పరచుకున్నాడు అర్జునుడు. అర్జునుడు ఇలా ఆలోచిస్తుంటే వసుదేవుడు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

మరలా అర్జునునితో ఇలా అన్నాడు.

"ఏం చెప్పను అర్జునా! ఆ ప్రకారంగా ముని శాపం మూలంగా యాదవులందరూ తుంగ కర్రలతో కొట్టుకొని చచ్చిపోతే, అక్కడ ఉన్న అంతఃపుర కాంతలను, యాదవ స్త్రీలను అందరినీ కృష్ణుడు అంతఃపురానికి చేర్చాడు." అని అన్నాడు.

అర్జునుడు ఇంక ఉండబట్టలేక "అది సరే! ప్రస్తుతము కృష్ణుడు ఎక్కడ ఉన్నాడు. ఏం చేస్తున్నాడు. నేను కృష్ణుని చూడాలి." అని అన్నాడు.

"ఇక్కడే ఉన్నాడు. అంతః పుర కాంతలను తీసుకొని వచ్చిన తరువాత నన్ను కలిసాడు. నన్ను ఈ ప్రకారంగా ఓదార్చాడు.

"నరనాధా! విధి వశాత్తు భోజ, అంధక కులముల యాదవులు, వృష్ణి వంశము వారూ ఒకరితో ఒకరు కొట్టుకొని మరణించారు. నేను అర్జునుని కొరకు దారుకుని పంపాను. అర్జునుడు ఈ పాటికి వస్తూ ఉంటాడు. అర్జునుడు నీకు భక్తుడు. నీ ఆజ్ఞలు పాటిస్తాడు. అన్ని పనులు చేయడానికి అర్జునుడు సమర్ధుడు. అత్యంత పరాక్రమ వంతుడు. కార్యదక్షుడు. నాకూ అర్జునునికి ఏ మాత్రం తేడా లేదు. నేను అతడు. అతడే నేను. అర్జునుని సాయంతో నువ్వు మిగిలిన వారిని రక్షించు. అర్జునుడు అంతఃపుర కాంతలను, బాలురను, వృద్ధులను కాపాడతాడు. ఇంకొన్ని రోజులలో సముద్రం పొంగి ద్వారకా నగరము సముద్రగర్భంలో కలిసిపోతుంది. యాదవులు ఈ ప్రకారం ఒకరితో ఒకరు కొట్టుకుంటుంటే బలరాముడు ఒంటరిగా ఒక చెట్టు కింద కూర్చుని యోగసమాధిలో ఉన్నాడు. నాకు కూ ఆ మార్గమే ఉత్తమమైనది అని తోస్తూ ఉంది. కాబట్టి తమరు నాకు అనుజ్ఞ ఇవ్వండి. నేను తపస్సు చేసుకోడానికి వెళుతున్నాను. నీవు మాత్రం అర్జునుడు చెప్పినట్లు చేయుము. చనిపోయిన

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

యాదవులందరికీ అర్జునుడు అగ్ని సంస్కారములు చేస్తాడు. అంతే కాదు కాలక్రమంలో ఆ అర్జునుడే మీ అందరికీ అంత్యక్రియలు నిర్వహిస్తాడు." అని శ్రీ కృష్ణుడు నాతో చెప్పాడు.

తరువాత శ్రీ కృష్ణుడు వెళ్లిపోయాడు. ఇప్పుడు నీవు వచ్చావు. ఇంతకు మించి నాకు ఏమీ తెలియదు. కాని అర్జునా! ఏ కారణం లేకుండా హటాత్తుగా కొడుకులు, మనుమళ్లు, బంధువులు పీనుగులుగా మారిపోతే ఆ బాధ తట్టుకోవడం నా వల్ల అవుతుందా చెప్పు. ఆహారము, నీరు సహించడం లేదు. నా ప్రాణం మాత్రం ఈ దేహమును విడిచి పోవడం లేదు. ఏం చెయ్యను. నా వల్ల ఏమీ కాదు. ఈ యాదవ స్త్రీలను, బాలురను, వృద్ధులను, అశ్వ సంపదను, గజ సంపదను, నీవే జాగ్రత్తగా కాపాడాలి. ఈ బాధ్యతను కృష్ణుడు నీ భుజముల మీద పెట్టాడు గదా!" అని అన్నాడు వసుదేవుడు.

ఆ మాటలు విన్న అర్జునుడు ఈ విధంగా మనసులో అనుకున్నాడు. శ్రీ కృష్ణుడు లేని ఈ ద్వారకలో నేను మాత్రం ఎలా ఉండగలను. వెంటనే హస్తినకు పోతాను అని అనుకున్నాడు. తరువాత వసుదేవునితో ఇలా అన్నాడు.

"ఓ అనఘా! ఈ విషయంలో ధర్మరాజు ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఆ నిర్ణయం ప్రకారము నేను అంతఃపుర కాంతలను, యాదవ స్త్రీలను, బాలురను, వృద్ధులను అందరినీ హస్తినాపురమునకు చేరుస్తాను. అక్కడ వారు సుఖంగా ఉంటారు. తమరు కూడా దయచేసి మాతో హస్తినాపురమునకు రండి. అంతా దైవనిర్ణయం, విధిలిఖితము అనుకొని మీ దుఃఖమును మానండి." అని అన్నాడు అర్జునుడు.

తరువాత అర్జునుడు దారుకుని చూచి "దారుకా! మనము ఇద్దరం శ్రీ కృ

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ష్ణుడు వెళ్లిన దారిన వెళ్లి ఆయనకోసం వెదుకుదాము. ఇక్కడ చేయాల్సిన పనులు అన్నీ అందరికీ ఆదేశాలు ఇద్దాము. అందుకని ఇక్కడ ఉన్న వారందరినీ ఒక చోటికి రమ్మను." అని అన్నాడు.

దారుకుడు ద్వారకలో ఉన్న మంత్రులను, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్గాలవారిని, పురప్రముఖులను, అందరినీ సుధర్మ అనే రాజసభా భవనంలో సమావేశ పరిచాడు. అర్జునుడు వారినందరినీ ఉద్దేశించి ఇలా అన్నాడు. "ఈ రోజుమొదలు ఏడవ రోజున సముద్రము పొంగి ద్వారకా నగరము సముద్రములో మునిగి పోతుంది అని ఆకాశవాణి చెప్పగా అందరూ విన్నారు. కాబట్టి మనం అందరం ఈ నగరం విడిచి పెట్టి పోవాలి. అందుకని మనం అందరం ఇంద్రప్రస్థ నగరానికి పోదాము. మీరందరూ అక్కడ సుఖంగా ఉండవచ్చును. మీకు అవసరమైన వస్తుసామగ్రిని మూటలు గా కట్టండి. స్త్రీలకు, బాలురకు, వృద్ధులకు బండ్లు ఏర్పాటు చేయండి. అన్నీ సిద్ధంగా ఉంచుకోండి. ఎప్పుడు అవసరమైతే అప్పుడు ద్వారకానగరాన్ని విడిచి పోవడానికి సిద్ధంగా ఉండండి. మీరందరూ ధర్మరాజు పాలనలో ద్వారకా నగరంలో ఉన్నట్టే ఉంటారు. అటువంటి జీవితాన్నే గడుపుతారు." అని అందరికీ ఆదేశాలు ఇచ్చాడు.

వారందరూ వెళ్లిపోయారు. తరువాత మంత్రులతో సమాలోచన చేసాడు. వారికి ఈ విధంగా ఆదేశాలు ఇచ్చాడు. "ఏనుగులతోనూ గుర్రాలతోనూ లాగబడే బండ్లను, రథములను సిద్ధం చేయించండి. వేటి వేటి మీద ఏయే వస్తువులు వేయాలో, ఎలా ఇంద్రప్రస్థము చేరాలో ఒక ప్రణాళిక ప్రకారము చేయండి.. స్త్రీలకు, బాలబాలికలకు పల్లకీలను, బండ్లను సిద్ధం చేయించండి. అంతా ఓపికగా చేయండి. మీలో ఓర్పు నశింపచేయకండి. చనిపోయిన మీ యాదవులు మరలా తిరిగి రారు. కాని ధర్మరాజు మీ అందరికీ వారిని మరిపింప

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

చేసే  పాలన అందిస్తాడు. వసుదేవుని మనుమడైన వజ్రదేవుడిని ఇంద్రప్రస్థానికి రాజుగా ధర్మరాజు నియమించవచ్చు. కాబట్టి ఈ విషయం లో మీరు దిగులు చెందవలసిన అవసరం లేదు.”  అని పలికాడు. మంత్రులందరికీ ఆదేశాలు ఇచ్చి పంపించి వేసాడు అర్జునుడు.

అప్పటికి రాత్రి అయింది. ఆ రాత్రికి కృష్ణుడు ఉన్న మందిరంలోనే పూజలు భజనలతో కాలం గడిపాడు. మరునాడు సూర్యోదయం కాగానే కాలకృత్యములు సంధ్యావందనాది కార్యక్రమములు పూర్తి చేసుకొని బయటకు రాగానే వసుదేవుడు తన పాంచభౌతిక శరీరమును వదిలి పెట్టాడని విషయం తెలిసింది. అప్పటికే అంతఃపురములో స్త్రీలందరూ వసుదేవుని మరణానికి పెద్దపెట్టున శోకిస్తున్నారు. వసుదేవుని భార్యలందరూ వసుదేవునితో సహగమనానికి  సిద్ధపడ్డారు.

అర్జునుడు భారమైన హృదయంతో వసుదేవుని మందిరానికి వచ్చాడు. వసుదేవుని శరీరానికి పన్నీటితో స్నానం చేయించాడు. ఆయన శరీరాన్ని పూలమాలలతో అలంకరింపచేసాడు ఆయనకు పట్టు వస్త్రములను, ఆభరణములను ధరింపచేసాడు. వసుదేవుని శరీరమును పూలమాలలతో అలంకరింపబడిన రథము మీద ఉంచారు. ముందు వేద పండితులు వేద మంత్రములు పఠిస్తూ ముందు నడువగా, వసుదేవుని శవయాత్ర సాగిపోయింది. అర్జునుడు పాదచారియై రథం వెంట నడిచాడు. వసుదేవుని భార్యలైన దేవకీదేవి, రోహిణి,భద్ర,మదిర చక్కగా అలంకరించుకొని పల్లకీలలో కూర్చున్నారు. ఆ పల్లకీలు కూడా శవయాత్ర వెంట సాగిపోయాయి. ద్వారకా నగర వాసులందరు ఆ శవయాత్రలో కన్నీరు మున్నీరుగా విలపిస్తూ రథం వెంట నడిచారు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వసుదేవుని ఉద్యాన వనంలో మంచి గంధపు చెక్కలతో చితి పేర్చారు. వసుదేవుని శరీరమును చితి మీద ఉంచారు. అర్జునుడు శాస్త్రోక్తంగా శవదహన క్రియను జరిపించాడు. వసుదేవుని భార్యలు నలుగురూ వసుదేవుని వెంట ఆ చితిలో ప్రవేశించారు . ఆ దృశ్యం చూచి కంటతడిపెట్టని వారు లేరు. కొందరు చితిలో నేయి పోసి మంటలను ప్రజ్వలింపచేస్తున్నారు. జనాలు హాహాకారాలు చేస్తున్నారు. ఆ ప్రకారంగా వసుదేవుని అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. తరువాత వజ్రుడు మొదలగు వారు, ఆడవారు వసుదేవునికి తర్పణములు వదిలారు. అందరూ ద్వారకకు తిరిగి వెళ్లారు.

తరువాత అర్జునుడు వృష్ణి,భోజక,అంధక వర్గములవారు కొట్టుకున్న చోటికి వేద పండితులు, బ్రాహ్మణులను తీసుకొని వెళ్లాడు. ఆయనతో పాటు ఆ కొట్లాటలో చనిపోయిన వారి బంధువులు కూడా వచ్చారు. ఒక్కొక్కరు తమ తమ బంధువులను గుర్తుపట్టి ఏడుస్తున్నారు. కొంతమంది మూర్ఛవచ్చి పడిపోయారు. ఇదంతా చూచి అర్జునుడు చింతాక్రాంతుడయ్యాడు. అక్కడ శోకిస్తున్న వారిని ఓదారుస్తున్నాడు. తరువాత అక్కడ చనిపోయిన వారందరికీ యధోచితంగా వేదోక్తంగా అగ్ని సంస్కారములు చేయించాడు. చనిపోయిన వారి బంధువులచేత వారి అందరికీ తర్పణములు విడిపించాడు. సామూహికంగా దశదినకర్మలు చేయించాడు. ఆ ప్రకారంగా ఆ యాదవులకు ఉత్తమలోకాలు కలిగేట్టు చేసాడు అర్జునుడు.

అర్జునుని మనస్సులో ఎప్పుడెప్పుడు కృష్ణుని చూద్దామా అని ఆతురతగా ఉంది. అంతఃపుర స్త్రీలను, బాలురను, వృద్ధులను, సమస్త ద్వారకావాసులను ఇంద్రప్రస్థమునకు చేర్చమని దారుకునికి చెప్పాడు. అందుకు తగిన ఏర్పాట్లు చేసాడు. తరువాత అర్జునుడు కృష్ణుని వెతుక్కుంటూ అడవిలోకి వెళ్లాడు. అర్జునుడు తన మనసులో ఇలా అనుకున్నాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

"అయ్యో కృష్ణా! నువ్వేమో నీ తండ్రిని సంరక్షించడానికి నన్ను ద్వారక నుండి పిలిపించావు. ఇప్పుడు నేను నీ తండ్రి మరణ వార్త నీకు చెప్పడానికి వస్తున్నాను. ఎవరికైనా ఇంతటి దౌర్భాగ్యము కలుగుతుందా! అయినా ఇప్పుడు నేను వసుదేవుని మరణ వార్త బలరామ కృష్ణులకు చెప్పడం ఎందుకు. మీరు చెప్పిన పనిని సక్రమంగా పూర్తి చేసాను అని చెబితే సరి పోతుంది కదా!" అని తన మనసుకు సర్దిచెప్పుకున్నాడు.

ఇంతలో అర్జునునికి గాంధారి శాపం మనసులో మెదిలింది. గాంధారి కృష్ణునికి శాపం ఇచ్చేటప్పుడు అర్జునుడు పక్కనే ఉన్నాడు. "ఎవ్వరూ నీ పక్కన లేనప్పుడు, నువ్వు దిక్కు లేకుండా, చస్తావు." అని కృష్ణుని శపించింది గాంధారి. అయినా శ్రీకృష్ణుడు మహానుభావుడు. ఆయన మీద ఇలాంటి శాపాలు పని చేస్తాయా! ఇలా పరి పరి విధములుగా ఆలోచిస్తూ శ్రీ కృష్ణుని కోసం పిచ్చివాడిలా వెదుకుతున్నాడు అర్జునుడు.

అర్జునుడి వెంట వస్తున్న వాళ్లు ఆయనకు ఇటు కాదు అటు అని కూడా చెప్పడానికి సాహసించలేకపోతున్నారు. కొన్ని రోజులు అలా తిరుగగా తిరుగగా, ఒక రోజు ఒక బోయవాడు వారిని చూచి మీరు దేని గురించి వెతుకుతున్నారు అని అడిగాడు. ఇక్కడ ఎక్కడో శ్రీ కృష్ణుడు తపస్సు చేసుకుంటున్నాడట. ఆయన గురించి వెదుకుతున్నాము అని అన్నాడు అర్జునుడు. దానికి ఆ బోయవాడు ఇలా అన్నాడు. "నేను శ్రీ కృష్ణుని చాలా రోజుల కిందట చూచాను. తరువాత చూడలేదు. రండి నేను కూడా మీ వెంట వస్తాను. వెదుకుదాము." అని అన్నాడు.

ఆ బోయవానితో కలిసి అర్జునుడు శ్రీ కృష్ణుని వెతుకుతున్నాడు. ఆ బోయ వాడు చెప్పిన ఆనవాళ్ల ను బట్టి వారందరూ శ్రీ కృష్ణుడు పడి ఉన్న

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

చోటికి చేరుకున్నారు. దిక్కు లేకుండా నేల మీద పడి దివ్యమైన కాంతులు వెదజల్లుతున్న శ్రీ కృష్ణుని శరీరాన్ని చూచారు. ఆ దృశ్యం చూచి అర్జునుడు నిలువునా కూలి పోయాడు. మూర్ఛపోయాడు. పక్కన ఉన్నవారు నీళ్లు తెచ్చి అర్జునుని మొహం మీద చల్లి సేదదీర్చారు.

అర్జునుడు శ్రీ కృష్ణుని శరీరాన్ని గట్టి కౌగలించుకొని భోరున ఏడ్చాడు. అప్పటి దాకా ఉన్న ధైర్యము, నిగ్రహము అతనిలో సడలిపోయాయి. కళ్లనుండి నీరు ధారాపాతంగా కారిపోతోంది. నోట మాట రావడం లేదు. అతడిని ఓదార్చడానికి కూడా అక్కడ ఉన్న వారికి ధైర్యము చాలడం లేదు. కొంచెం సేపటికి అర్జునుడు తెప్పరిల్లాడు.

"అయ్యో! కృష్ణా! నీకా ఈ దురవస్థ. నీ వంటి మహాత్ముడు ఇలా దిక్కులేకుండా కటిక నేల మీద పడి ఉండటమా!" అంటూ కృష్ణుని పాదాల వంక చూచాడు. అరి కాలులో దిగబడ్డ బాణం కనపడింది. ఒక్కసారిగా దుర్వాసుని మాటలు గుర్తుకు వచ్చాయి. ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు అర్జునుడు. కృష్ణుని దేహం అంతా పరికించి చూచాడు. ఒక్క అరికాలు మాత్రం నల్లగా కమిలినట్టు ఉంది. మిగిలిన శరీరం అంతా ఏ మార్పూ లేకుండా ఉంది. కేవలం నిదుర పోతున్నట్టు ఉన్నాడు కృష్ణుడు. శ్రీకృష్ణుని వంక కన్నార్పకుండా చూస్తున్నాడు అర్జునుడు.

అర్జునుని తోపాటు వచ్చిన వాళ్లు అర్జునుని ఓదారుస్తున్నారు. "అయ్యా! తరువాతి కార్యక్రమాలు చూడండి. మనము పోయి ద్వారకలో ఉన్నవారిని తీసుకొని వస్తాము. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేద్దాము. లేకపోతే మనము శ్రీకృష్ణుని శరీరమును ద్వారకకు తీసుకొని పోదాము. మీరు ఎలా చెబితే అలా చేద్దాము." అని అన్నారు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అర్జునుడు ఆలోచించాడు. ద్వారక సముద్రంలో మునిగి పోయే రోజు ఇంకా ఎన్నిరోజులు ఉందో! ఈ అడవిలో కృష్ణుని వెతుకుతూ ఎన్నిరోజు గడిచిపోయాయో! లెక్క కట్టాడు. చివరకు, మరునాడు ఉదయమే ద్వారక సముద్రంలో మునిగి పోతుంది అని తెలుసుకున్నాడు. అప్పటికి సూర్యాస్తమయము అయింది. అర్జునుడు తన వెంట వచ్చిన వారితో ఇలా అన్నాడు.

"రేపు ఉదయం ద్వారక సముద్రంలో మునిగి పోతుంది. కాబట్టి మనం ఈ రాత్రికి ద్వారకు వెళ్ళాలి. శ్రీకృష్ణుని నిర్యాణము గురించి ఎవరికీ చెప్పవద్దు. అందరినీ ప్రయాణమునకు సమాయత్తము చెయ్యాలి. రేపు ఉదయం కల్లా అందరూ ద్వారకను విడిచి పెట్టాలి. లేకపోతే అంతులేని ప్రాణనష్టం సంభవిస్తుంది. ప్రస్తుతం మనము శ్రీ కృష్ణుని అంత్యక్రియలు ఇక్కడే నిర్వహిస్తాము." అని అన్నాడు.

బరువెక్కిన హృదయంతో అర్జునుడు శ్రీ కృష్ణునికి అంతిమ సంస్కారములు చేసాడు. శ్రీ కృష్ణుని పార్ధివశరీరాన్ని వేదోక్తంగా దహనం చేసాడు. బలరాముడు కూడా ఆ పరిసరములలో ఉంటాడని ఊహించి అందరూ కలిసి చుట్టు పక్కల వెదికారు. వారి శ్రమ ఫలించింది. యోగసమాధిలో తన ప్రాణములను వదిలిన బలరాముని శరీరం కనిపించింది. అర్జునుడికి ఏడవడానికి కూడా సమయం చిక్కలేదు. భక్తిశ్రద్ధలతో బలరాముని పార్ధివ శరీరానికి అగ్ని సంస్కారము చేసాడు. ఆ ప్రకారంగా అర్జునుడు శ్రీకృష్ణ బలరాములకు అగ్ని సంస్కారములు అంతులేని భక్తి శ్రద్ధలతో చేసాడు. తరువాత తన వెంట వచ్చిన వారందరినీ తీసుకొని ద్వారకకు వెళ్లాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

మార్గ మధ్యంలో దారుకుని చూచి అర్జునుడు ఇలా అన్నాడు. "దారుకా! మనం చేసిన పని సరిఅయినదని నమ్ముతున్నాను. లేకపోతే శ్రీకృష్ణుని మరణ వార్త విన్న రుక్మిణి,సత్యభామ మొదలగు అష్టభార్యల దుఃఖమును ఆపడం మన తరమా చెప్పు. వారందరూ శ్రీకృష్ణునితో పాటు సహగమనం చేస్తామంటే మనం ఆపగలమా! రాత్రంతా వారిని ఓదారుస్తూ ఉంటే ఇంతలో సముద్రం పొంగి ద్వారకను ముంచి వేస్తే, ద్వారకావాసులను కాపాడలేదని, ఈ లోకం మొత్తం నన్ను తిట్టిపోస్తుంది. పైగా శ్రీ కృష్ణుని మాటను తప్పిన వాడను అవుతాను. కాబట్టి ముందు మనం అందరం వడి వడిగా ద్వారకు పోదాము." అని అర్జునుడు వేగంగా ద్వారకను చేరుకున్నాడు.

అప్పటికి ద్వారకలో ప్రయాణాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. రుక్మిణీ మొదలగు అష్ట భార్యలు, పదహారు వేల మంది భార్యలు, అంతఃపుర స్త్రీలు, ద్వారకా వాసులు, అందరూ పల్లకీలలోనూ, రథములలో, బండ్లలోనూ, ఏనుగులు, హయములు మొదలగు వాహనముల మీద ద్వారకను వదిలి పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. అర్జునుడు దారుకుడు రాగానే అందరూ కదిలారు. అర్జునుని నేతృత్వంలో దారుకుడు అందరినీ ద్వారకనుండి ప్రయాణం చేయించాడు.

శ్రీకృష్ణుడి అంతః పుర స్త్రీలు 16,000 మంది, ఎనిమిది మంది భార్యలు, బలరాముని నలుగురు భార్యలు పల్లకీలలో కూర్చున్నారు. వారి వెంట సేవకులు నడుస్తున్నారు. వారి వెనుక బండ్లలో వారికి సంబంధించిన సామగ్రిఅంతా తీసుకొని వస్తున్నారు. వారి వెనక ద్వారకాపురములో ఉన్న యాదవులు అందరూ తమ తమ వాహనములు ఎక్కి వస్తున్నారు. వారందరి వెనుకగా అర్జునుడు తన రథము మీద బయలుదేరాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వారందరూ ద్వారకనే దాటగానే సూర్యోదయం అయింది. సూర్యుని రాకతో సముద్రం ఒక్కసారిగా పొంగింది. సముద్రపు అలలు ద్వారకా నగరాన్ని ముంచెత్తాయి. ద్వారకా నగరం సముద్రగర్భంలో మునిగిపోయింది. అర్జునుడు, యాదవులు అందరూ ఒక్కసారి వెనక్కు తిరిగి చూచారు. సముద్రం ఒక్కసారిగా పొంగి ద్వారకను ముంచెత్తడం కళ్లారా చూచి గగ్గోలు పెట్టారు.

అర్జునుని నేతృత్వంలో వారందరూ ఇంద్రప్రస్థము వైపు ప్రయాణం చేస్తున్నారు. దారిలో ఒక చోట విడిది చేసారు. ఆ రాత్రి ఒక దొంగల దండు వారి మీద దాడి చేసింది. కేవలం యాదవులు, స్త్రీలు మాత్రమే ఉన్నారు. ఒక్క వీరుడు (అర్జునుడు) మాత్రమే ఉన్నాడు. అతనిని కట్టడి చేస్తే అపార ధన సంపద దోచుకోవచ్చు అని అనుకున్నారు ఆ దొంగలు. అంతే ఒక్కసారిగా నిద్రపోతున్న స్త్రీల మీద, యాదవుల మీద పడ్డారు. వారి వద్దనుండి నగలు, ధనము అపహరించడం మొదలెట్టారు.

ఇంతలో అర్జునుడు అక్కడకు వచ్చాడు. వారందరికీ మర్యాదగా వెళ్లి పొమ్మని చెప్పాడు. ఆ దొంగలు వినలేదు. స్త్రీల నుండి నగలు అపహరించడం మొదలెట్టారు. అర్జునుడికి కోపం వచ్చింది. వారి మీద బాణములను ప్రయోగించాడు. ఆ దొంగలు మొరటు తనంతో రాటు తేలి ఉన్నందు వల్ల ఆ బాణములు వారిని ఏ మాత్రం గాయపరచలేకపోయాయి. అర్జునుడు తమ మీద బాణములు వెయ్యడం చూచి ఆ దొంగలు కూడా అర్జునుని మీద దాడి చేసారు. అర్జునుడు ఎదురు దాడికి దిగలేదు. అర్జునునికి ఏ అస్త్రము స్ఫురించలేదు. అందువల్ల మామూలు బాణాలు ప్రయోగించడం మొదలెట్టాడు. ఆయన తూణీరంలో బాణాలు అయిపోయాయి కానీ ఆ దొంగలు మాత్రం దోపిడీ చేస్తూనే ఉన్నారు. అర్జునుడికి ఇది అంతా దైవలీల అని అర్థం అయింది. ధనము, నగలు, వదిలి పెట్టి కేవలం రుక్మిణి మొదలగు స్త్రీలను

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

రక్షించాడు. దొంగలు దోచుకున్న ధనము నగలతో పారిపోయారు. రథాలు, గుర్రాలు, ఏనుగులు తీసుకొని పోవడానికి వీలుకాకపోవడంతో అక్కడే విడిచిపెట్టి వెళ్లిపోయారు.

ఆ ప్రకారంగా సర్వస్వాన్ని కోల్పోయి కట్టుబట్టలతో వారందరూ కురుక్షేత్రము చేరుకున్నారు.వారి రాక విని హస్తినాపుర వాసులు వారిని చూడడానికి అక్కడకువచ్చారు. జరిగిన విషయాలన్నీ అర్జునుడు వారికి వివరించాడు. అన్నగారి ఆజ్ఞప్రకారము అర్జునుడు యాదవ స్త్రీలకు బాలురకు వృద్ధులకు తగిన ఏర్పాట్లు చేసాడు.

కృతవర్మ కుమారుడిని అతని తల్లి, కుమారులతో మృత్తికావత పురంలో ఉండటానికి ఏర్పాటు చేసాడు. మృత్తికావత పురానికి కృతవర్మ కుమారుని రాజ్యాభిషిక్తుని చేసాడు. సాత్యకి కుమారుడిని సరస్వతీ నగరానికి అభిషిక్తుని చేసాడు. మిగిలిన వారిని ఇంద్రప్రస్థమునకు తీసుకొని వెళ్లాడు. శ్రీకృష్ణుని మనుమడు వజ్రుని ఇంద్రప్రస్థమునకు పట్టాభిషిక్తుని చేసాడు. అక్రూరుడి భార్యను, పిల్లలను వజ్రుని సంరక్షణలో ఉంచాడు. అందరినీ అన్ని చోట్ల సురక్షితంగా ఉంచాడు.

ఇంక శ్రీకృష్ణుని అష్ట భార్యలు, అంతః పుర కాంతలు బలరాముని భార్యలు, అర్జునునితో ఉన్నారు. వారందరికీ శ్రీ కృష్ణుని, బలరాముని నిర్యాణ వార్తను ఎలా చెప్పాలా అని ఆలోచించాడు అర్జునుడు. ఒకరోజుమనసు దిటవు చేసుకొని వారందరినీ ఒక చోట సమావేశ పరిచి, తాను, దారుకుడు పరివారముతో శ్రీకృష్ణుని, బలరాముని వెదుకుతూ వెళ్లడం, బోయవాడు కనపడటం, అందరూ శ్రీ కృష్ణుని కోసం వెదకడం వరకూ చెప్పి తరువాత ఏడుస్తూ ఉండిపోయాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వారందరికీ బలరామ కృష్ణులు పరమపదించారు అని అర్థం అయింది. అందరూ పెద్దపెట్టున రోదించడం మొదలెట్టారు. కొంత సేపు అయిన తరువాత వారందరూ మనసులు దిటవు చేసుకొని "నాయనా అర్జునా! అయినది ఏదో అయింది. తరువాత ఏం జరిగిందో వివరించు." అని అడిగారు.

అర్జునుడు ఇలా చెప్ప సాగాడు. "అప్పుడు మేము బలరామ కృష్ణులను వెదుకుతూ ద్వారకానగరం సంగతే మరిచిపోయాము. రోజులు లెక్కించి ఆ మరునాడే ద్వారకా నగరం మునిగి పోతుంది అని తెలుసుకున్నాము. ఈ విషయం మీకు చెబితే మీరు చేయవలసిన కార్యక్రమములలో మునిగి పోయి, ద్వారకా నగరంతో సహా మునిగి పోతారు అని మీకు ఈ సంగతులుచెప్పలేదు. మేమే బలరామ కృష్ణులకు అంత్య క్రియలు నిర్వర్తించాము. ఆ రాత్రికి రాత్రి మీ అందరినీ ప్రయాణం చేయించి ద్వారకా నగరం దాటించాము. కేవలం మీ అందరి ప్రాణాలు కాపాడటానికే ఇలా చేసాను. కానీ నా మనసులో మాత్రం ఏదో పెద్ద తప్పు చేస్తున్నట్టు, పాపం చేస్తున్నట్టు బాధగానే ఉంది. కాని ఏమీ చేయలేని పరిస్థితి. మీ రంతా బాగా ఆలోచించి, నన్ను మన్నించి నాకు ఏలాంటి పాపం అంటకుండా చూడండి." అని వారందరికీ ప్రణామం చేసాడు అర్జునుడు.

రుక్మిణి మొదలగు వారు అర్జునుడిని పట్టుకొని లేవనెత్తారు. "నాయనా అర్జునా! విధి విధానము అలా ఉంటే నీవు మాత్రం ఏమి చేయగలవు. మా ప్రాణాలు కాపాడటం కోసం అలా చేసావు కానీ, కావాలని చెయ్యలేదు కదా. ఇంక జరగాల్సిన కార్యక్రమాలు చూడు." అని అన్నారు.

శ్రీకృష్ణుని ఎనిమిది మంది భార్యలలో రుక్మిణి, జాంబవతి తదితరులు శ్రీకృష్ణునితోపాటు సహగమనం చేస్తామన్నారు. అది విని బంధువులంతా

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఏడిచారు. వారిని వారించడానికి ప్రయత్నించారు. కాని వారు వినలేదు. వారిని పల్లకీలలో ఊరేగించి, చితివద్దకు తీసుకొని వచ్చారు. మంచి గంధపు చెక్కలతో చితి పేర్పించారు. బ్రాహ్మణులు అగ్నికార్యము నిర్వహించారు. సహగమనం చేయదలచుకొన్న వారు చితిలో దూకారు. సత్యభామ మొదలగు వారు తపస్సు చేసుకోడానికి అడవులకు వెళ్లిపోయారు.

తరువాత అర్జునుడు వ్యాసుని వద్దకు వెళ్లాడు. మరుత్ నదీ ప్రాంతంలో తన కుటీరంలో ఉన్న వ్యాసుని దర్శించుకున్నాడు అర్జునుడు. వ్యాసునికి భక్తితో నమస్కరించాడు. "మహాత్మా! యాదవులందరూ తమలో తాము కొట్టుకొని మరణించారు. శ్రీకృష్ణుడు, బలరాముడు ఈ పాంచభౌతిక శరీరాలను వదిలిపెట్టి తమ తమ నెలవులకు వెళ్లిపోయారు. ద్వారకా నగరం సముద్రంలో మునిగిపోయింది. నేను అంతఃపుర స్త్రీలను, యాదవులను తీసుకొని వస్తుండగా దారి మధ్యలో దొంగలు మా సమస్తం దోచుకున్నారు. ఆ సమయంలో నాకు ఏ అస్త్రమూ దాని మంత్రమూ గుర్తు రాలేదు. గాండీవము దాని శక్తి చూపలేదు. కారణం తెలియలేదు. అమ్ములపొదిలో బాణములు అయిపోయాయి. కేవలం వారిని మాత్రం కాపాడగలిగాను. వారి వారిని తగు స్థానములలో నిలిపాను. కృతవర్మ, సాత్యకి సంతతిని రాజ్యాభిషిక్తులను చేసాను. తమ వద్దకు వచ్చాను. తదుపరి కార్యక్రమము సెలవియ్యండి." అని ప్రార్థించాడు అర్జునుడు.

వ్యాసుడు అర్జునునితో ఇలా అన్నాడు. "అర్జునా! దుర్వాసుని పలుకులు, యాదవులకు మునులు ఇచ్చిన శాపము, శ్రీకృష్ణునికి గాంధారి ఇచ్చిన శాపము వృథా పోదు కదా! అంతా విధివశాత్తు జరిగింది. ఎవరూ తప్పించలేరు. యాదవ నాశనం గురించి శ్రీకృష్ణుని కి ముందే తెలుసు. అందుకనే యాదవులు కొట్టుకుంటుంటే తటస్థంగా ఉన్నాడు కానీ వారించలేదు. శ్రీకృష్ణుడు తలచుకుంటే మునుల శాపము ఆపలేడా! అలా చెయ్యడం శ్రీకృష్ణునికి

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఇష్టంలేదు. యాదవ నాశనం జరగాలి. అందుకనే శ్రీకృష్ణుడు ఉపేక్ష వహించాడు.

నీవుయుద్ధం చేస్తున్నప్పుడు కూడా ముందు రథంలో శ్రీ కృష్ణుడు కూర్చుని రుద్రుని సాయంతో నీ శత్రువులను చంపాడు. నీవు నీ బాణాలతో నీ అస్త్రశస్త్రములతో శత్రువులు మరణించారు అని నీవు అనుకున్నావు. అటువంటి కృష్ణుడు కాలం అనుకూలించకపోవడం వలన దోపిడి దొంగల నుండి నిన్ను కాపాడలేదు. అలా జరగాలని ఉంది. జరిగింది. శ్రీకృష్ణుడు అవతార పురుషుడు. భూభారాన్ని తగ్గించడానికి మానవునికి అవతారం ఎత్తాడు. తాను అనుకున్న కార్యములను నిర్వర్తించి తన మూలస్థానము చేరుకున్నాడు. ఆ కృష్ణునిచేత గీతాబోధను విన్నవాడవు నీవు దీనికి దుఃఖపడవలసిన పనిలేదు. కేవలం శ్రీకృష్ణుని సాయంతో భూభారాన్ని తగ్గించడానికి నీ అస్త్రశస్త్రాలు, గాండీవము ఉపయోగ పడ్డాయి. ఆ పని పూర్తి కాగానే, అవి కూడా నిర్వీర్యము అయ్యాయి. అస్త్రములు కానీ శస్త్రములు కానీ పురుషప్రయత్నము కానీ, దైవానుగ్రహము ఉంటేనే రాణిస్తాయి ఫలిస్తాయి. నీవు జ్ఞానివి. నీవు దీని గురించి శోకించకూడదు. అంతా నా వలననే జరిగిందని గర్వించనూ కూడదు. మీ పాండవులకు కూడా ఈ శరీరములను వదిలిపెట్టవలసిన సమయం వచ్చింది. దానికి తగు ఏర్పాట్లు చేసుకోండి. ఉత్తమగతులు పొందండి." అనిపలికాడు వ్యాసుడు.

ఆ మాటలు విన్న అర్జునుని మనసులో నుండి శోకము, మోహము దూరం అయ్యాయి. అతని మనసు నిశ్చలానందంతో తొణికిసలాడింది. వెంటనే అర్జునుడు హస్తినాపురమునకు వచ్చాడు. ధర్మరాజుతో, తక్కిన వారితో అప్పటి వరకూ జరిగిన సంగతులు, బలరామకృష్ణుల నిర్యాణము, వ్యాసభగవానుని బోధ అంతా సవివరంగా చెప్పాడు." అని వైశంపాయనుడు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

జనమేజయునితో మహాభారత కధను వినిపించాడు.

మహాభారతము

మౌసల పర్వము ఏకాశ్వాసము సంపూర్ణము.

ఓంతత్సత్  ఓంతత్సత్ ఓంతత్సత్.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

# మహాభారతము

## మహాప్రస్థానిక పర్వము

### ప్రథమాశ్వాసము

వైశంపాయనుడు జనమేజయ మహారాజునకు మహాభారత కథను ఈ విధంగా చెప్పసాగాడు.

శ్రీకృష్ణుడు, బలరాముడు, యాదవులూ మరణించారు. అర్జునుడిని వ్యాసుడు మహాప్రస్థానానికి తయారుకమ్మన్నాడు. అదే విషయాన్ని అర్జునుడు హస్తినాపురమునకు వచ్చి ధర్మరాజుకు చెప్పాడు. ఆ మాటలు విన్న ధర్మరాజు అర్జునునితో ఇలా అన్నాడు.

“అర్జునా! కాలుడు అన్ని భూతములను కాల్చి పరిపక్వము చేస్తాడు. మనకు కూడా కాలము ఆసన్నమయింది. మనము కూడా అన్ని కర్మలను త్యజించవలసిన సమయం వచ్చింది. నీవు కూడా ఇదే అనుకుంటున్నావు కదా!” అని అన్నాడు ధర్మరాజు.

“అవును అన్నయ్యా! కాలానికి సాటి కాలము మాత్రమే. కాలానికి మరొకటి సాటిరాదు. కాబట్టి మనం కూడా కాలంతో పాటు ప్రయాణించాలి.” అని అన్నాడు అర్జునుడు.

వెంటనే ధర్మరాజు భీమ, నకులసహదేవులను పిలిపించాడు. వారికి

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కూడా అన్ని విషయములు చెప్పాడు. వారు కూడా ధర్మరాజు మాటలకు ఒప్పుకున్నారు. ధృతరాష్ట్రుని కుమారులలో యుయుత్సుడు ఒక్కడే మిగిలి ఉన్నాడు.

(యుయుత్సుడు ధృతరాష్ట్రునకు వైశ్యస్త్రీవలన పుట్టినకుమారుడు. మహాభారత యుద్ధం ప్రారంభంలో ఎవరైనా కౌరవుల పక్షమునుండి మా పక్షమునకు రావచ్చును అని ధర్మరాజు ప్రకటించగానే, నాకు సుయోధనుని కుయుక్తులు నచ్చవు. నేను వస్తాను అని కౌరవుల పక్షము నుండి వచ్చి పాండవుల పక్షము చేరాడు యుయుత్సుడు. అందుకని అతడు ఒక్కడే మిగిలాడు.)

యుయుత్సుని కౌరవ సామ్రాజ్యానికి పట్టాభిషిక్తుని చేసాడు ధర్మరాజు. ఉత్తర కుమారుడైన పరీక్షిత్తు ను యువరాజుగా అభిషేకించాడు. యుయుత్సునికి రాజ్యపాలన గురించి అన్ని విషయాలు వివరించాడు ధర్మరాజు. తరువాత సుభద్రను చూచి ఇలా అన్నాడు.

"అమ్మా సుభద్రా! ఈ భరత సామ్రాజ్యానికి నీ మనుమడు ఉత్తరాధికారి అయ్యాడు. శ్రీకృష్ణుని మనుమడు వజ్రుడు ఇంద్రప్రస్థానికి రాజు అయ్యాడు. ఈ ప్రకారంగా కురు వంశము, యాదవ వంశము వర్ధిల్లుతాయి. ఈ రెండు వంశములను నీవే రక్షించాలి." అని రెండు వంశములకు సంరక్షకురాలిగా సుభద్రను నియమించాడు.

తరువాత భారత యుద్ధములో మరణించిన వీరుల కుటుంబాలకు అగ్రహారములు, గ్రామములు, ధనము ఇచ్చి వారి పోషణకు తగు ఏర్పాట్లు చేసాడు. బ్రాహ్మణులకు గోదానములు, భూదానములు, సువర్ణదానములు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

విరివిగా చేసాడు. పరిక్షిత్తును కృపాచార్యుడికి శిష్యునిగాఅప్పగించాడు. తరువాత హస్తినాపుర ప్రజలను పిలిపించి ఒక సభ ఏర్పాటు చేసాడు.

"మా ఐదుగురికి మారుగా అభిమన్యుని కుమారుడు పరిక్షిత్తును మహారాజుగా నియమించాను. అతని మీద కూడా మీరు మీ ప్రేమ అభిమానము చూపించండి." అని హస్తినాపుర పౌరులకు చెప్పాడు.

హస్తినాపుర ప్రజలకు పాండవులు వెళ్లి పోతున్నారని అర్థం అయింది. "" "మహారాజా! ఏమిటిది! మమ్ములను ఈ ప్రకారంగా వదిలిపెట్టి పోవడం మీకు ధర్మమా! నీవు ప్రేమమూర్తివి, కారుణ్య మూర్తివి అంటారే. ఇదేనా నీ కరుణ. మేమందరమూ నిన్ను చూచుకొని బతుకుతున్నాము. మమ్ములను వదిలి వెళ్లడం న్యాయమా!" అని ప్రార్థించారు. వారిని అనునయించాడు ధర్మరాజు.

తరువాత పాండవులు ద్రౌపది తమ తమ పట్టు బట్టలను, నగలను తీసివేసారు. అందరూ నారచీరలు, నారబట్టలు, జింక చర్మములు ధరించారు. అగ్ని కార్యములను నెరవేర్చి అగ్నిని నీటిలో నిమజ్జనం చేసారు. అందరూ అంతఃపురము నుండి బయలు దేరారు. పంచపాండవులు ముందు నడువగా వెనకగా ద్రౌపది నడవసాగింది. వారి వెంట ఒక కుక్క కూడా నడవసాగింది. హస్తినాపుర వాసులు అందరూ వీధులకు అటు ఇటు నిలబడి కన్నీటితో వారికి వీడ్కోలు పలుకుతున్నారు. పాండవులు అలా వెళుతుంటే, జూదంలో రాజ్యము పోగొట్టుకొని అడవులకు వెళుతున్న పాండువులు గుర్తుకు వచ్చారు. వారి వెంట యుయుత్సుడు సైన్యంతో బయలు దేరాడు. వారి వెంట పరీక్షిత్తు కూడా నడుస్తున్నాడు. అందరూ హస్తినాపుర పొలిమేరలు వద్దకు వచ్చారు.

ధర్మరాజు వారందరినీ చూచి ఇంకమీరు ఆగండి అని ప్రార్థించాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అందరూ పాండవులకు ప్రదక్షిణ నమస్కారాలు చేసారు. పాండవులు, ద్రౌపది ముందుకు సాగిపోయారు. యుయుత్సుడు, పరీక్షిత్తు వెనకకు తిరిగి హస్తినాపురము చేరుకున్నారు. అర్జునుని భార్య ఉలూపి తన పుట్టిల్లు అయిన నాగలోకము వెళ్లిపోయింది. చిత్రాంగద తన కుమారుడు బభ్రువాహనుని వద్దకు చేరుకుంది. కృపాచార్యుడు, ధౌమ్యుడు, ధర్మరాజు ఆదేశాను సారము హస్తినా పుర రక్షణ బాధ్యతలు స్వీకరించారు.

పాండవులు, ద్రౌపది ముందుకు పోతున్నారు. వారి వెంట నడుస్తున్న కుక్క కూడా వారిని వదలకుండా నడుస్తూ ఉంది. ఆ ప్రకారంగా వారు చాలాదూరం ప్రయాణించారు. గంగా నదిని దాటారు. తూర్పువైపుగా ప్రయాణం చేసి తూర్పు సముద్రతీరానికి చేరుకున్నారు.

అప్పుడు అగ్నిదేవుడు వారి ముందు ప్రత్యక్షం అయ్యాడు. "అర్జునా! శ్రీకృష్ణుని సుదర్శన చక్రము ఎప్పుడో వైకుంఠము చేరింది. ఇంకా నీవు ఎందుకు ఈ గాండీవము వదలకున్నావు. నీవు దుష్ట సంహారము చెయ్యడానికి నేను ఈ గాండీవాన్ని వరుణుని వద్దనుండి తెచ్చి నీకు ఇచ్చాను. కాబట్టి నీవు దీనిని మరలా వరుణ దేవునికి అప్పగించు." అని అన్నాడు. అర్జునుడు అలాగే అని గాండీవమునకు నమస్కరించి దానిని సముద్రంలోని నీటిలో ఉంచాడు. గాండీవము వరుణుని చేరుకుంది. అగ్నిదేవుడు అదృశ్యం అయ్యాడు.

పాండవులు దక్షిణ దిక్కుగా ప్రయాణిస్తున్నారు. అక్కడి నుండి పడమర వైపుగా తిరిగి పశ్చిమ సముద్రతీరమును చేరుకున్నారు. నీటిలో మునిగిపోయిన ద్వారకా నగరము సమీపమునకు వచ్చారు. తరువాత వారందరూ ఉత్తర దిక్కుగా ప్రయాణించి హిమవత్పర్వత ప్రాంతమునకు చేరుకున్నారు. అక్కడ నుండి ప్రయాణించి మేరుపర్వత ప్రాంతము వద్దకు వచ్చారు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఇప్పుడు వారు యోగసమాధి స్థితిలో ఉన్నారు. వారికి నడక శ్రమ తెలియడం లేదు. కాని మేరు పర్వతము వద్దకు వచ్చునప్పటికి పాంచాల రాజపుత్రి ద్రౌపదికి యోగసాధన సడలిపోయింది. ఆమె ఇంక నడవలేకపోయింది. ఆమె నేలమీద పడిపోయింది. ఇది చూచాడు భీముడు. ద్రౌపది పడిపోయిన విషయం ధర్మరాజుకు చెప్పాడు. అప్పుడు ధర్మరాజు భీముని చూచి "భీమా! ఈమెను మత్స్య యంత్రము కొట్టి అర్జునుడు గెల్చుకున్నాడు. అందుకే ఈమెకు అర్జునుడు అంటే అధికమైన ప్రేమ, అనురాగము, పక్షపాతము. అందుకే ఆమె చేసిన పుణ్యములు ఫలించలేదు. పడిపోయింది." అని అన్నాడు ధర్మరాజు. భీముడు ద్రౌపది వంక చూచాడు. ఆమె చనిపోయింది. ధర్మరాజు నిర్వికారంగా ఆమె శవమును అక్కడే వదిలి ముందుకు నడిచాడు.

మిగిలిన నలుగురూ ధర్మరాజును అనుసరించారు. అలా కొంతదూరం వెళ్లారు. ఇంతలో సహదేవుడు నేలమీద పడిపోయాడు. సహదేవుడు పడిపోవడం, చనిపోవడం చూచి భీముడు ఇలా అన్నాడు.

"అన్నయ్యా! సహదేవుడు పడిపోయాడు. ఇతనికి అహంకారము అంటే ఏమిటో తెలియదు. నీకు ఎల్లప్పుడూ భక్తితో సేవలు చేస్తుంటాడు. మా అందరిలోకి సన్మార్గంతో చరించేవాడు. కాని ఇలా ఎందుకుపడిపోయాడు." అని అడిగాడు.

ఆ మాటలకు ధర్మరాజు ఇలా అన్నాడు. "ఇతనికి తన కంటే ప్రాజ్ఞుడు ఈ ప్రపంచంలో లేడు అని గర్వము. ఆ గర్వాతిశయముతో ఇలా పడిపోయాడు." అని అంటూ ముందుకుసాగాడు. తరువాత భీమార్జున,నకులులు ధర్మరాజును అనుసరించారు. కుక్క మాత్రం వారిని

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వదలకుండా వెంట వస్తూనే ఉంది.

కొంచెం దూరం పోయేసరికి నకులుడు కిందపడిపోయాడు. అది చూచి భీముడు తట్టుకోలేక పోయాడు. ధర్మరాజును చూచి "అన్నయ్యా! నకులుడు కూడా పడిపోయాడు. ఇతడు అతి సుందరుడు, మంచితనమునకు మారుపేరు. అత్యంత శౌర్యవంతుడు. ధైర్యశాలి. సుగుణాల ఖని. ఇటువంటి మంచిగుణములు అన్నీ ఒకే చోట కలవాడు నకులుడు ఒక్కడే. ఇతనిలో ఏ దుర్గుణము ఉందని ఇలాంటి దుర్గతి సంభవించింది." అని అడిగాడు. "భీమా! నిజమే. నువ్వు చెపినట్టు ఇతనికి లేని సుగుణములు లేవు. కానీ తాను ఈ లోకములోనే అత్యంత సౌందర్యవంతుడని గర్వము. అహంకారము. ఆ అహంకార ఫలితమే ఈ దురవస్థ." అని అన్నాడు ధర్మరాజు. తరువాత ధర్మరాజు, భీమార్జునులు కుక్కతో సహా ముందుకు సాగిపోయారు.

అప్పటిదాకా ఇదంతా మౌనంగా చూస్తున్న అర్జునుని మనస్సు బాధతో మునిగిపోయింది. తరువాత తన వంతు వస్తుందా అని అనుకున్నాడు. అలా అనుకుంటూ ఉండగానే అతని మృత్యువు రానే వచ్చింది. నేలమీద పడిపోయాడు. "అన్నయ్యా! అర్జునుడు కూడా పడిపోయాడు. ఎన్నడూ అర్జునుడు అబద్ధం ఆడి ఎరుగడు. అతనికున్న సుగుణములు, శౌర్యపరాక్రమ ములు ఎవరికీ లేవు. అర్జునుడు పడిపోవడానికి కారణం ఏమిటి?" అని అడిగాడు.

ధర్మరాజు కొంచెం సేపు ఆలోచించి "అవును ఇతడు అత్యుత్తమ ధనుర్ధారి. అదే ఇతని గర్వమునకు మూలము. తనకంటే ధనుర్ధారి లేడని గర్వము. పైగా ఇతడు కౌరవులందరినీ ఒకేరోజు యుద్ధంలో చంపుతానని ప్రతిజ్ఞచేసాడు. కాని అది నెరవేర్చుకోలేదు. అందువల్ల ఆడినమాట

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

తప్పినవాడయ్యాడు. అందుకే ఇతనికి ఈ దురవస్థ." అని ముందుకుసాగాడు ధర్మరాజు. భీముడు, కుక్క అతనిని అనుసరించారు.

ఇది చూచి భీమునికి కూడా భయం పట్టుకొంది. భయం భయంగా నడుస్తూ మధ్యలోనే కూలిపోయాడు. కాని పడిపోతూ ధర్మరాజుకు నమస్కరించి "ఓ ధర్మరాజా! నేనుకూడా పడిపోయాను. నాలో ఉన్న లోపం ఏమిటి? నాకు తెలియ చెప్పు." అని ప్రార్థించాడు. "భీమసేనా! నీవు అత్యుత్తమ గదాధారివి. పరాక్రమ వంతుడవు. కానీ తిండి పోతువు. అనవసరంగా మాట్లాడుతుంటావు. నీకు అనవసరమైన విషయాలన్నిటినీ మాట్లాడుతుంటావు. అందుకే నీకీ దురవస్థ." అని ముందుకుసగిపోయాడు. కుక్కకూడా అతనిని అనుసరించింది.

ఆసమయంలో ఇంద్రుడు తన రథం మీద వచ్చి ధర్మనందనుని ముందు నిలబడ్డాడు. ఇంద్రుని చూచి ధర్మనందనుడికి వినయంతో నమస్కరించాడు. ఇంద్రుడు ధర్మరాజును తన రథం ఎక్కమన్నాడు. అప్పుడు ధర్మరాజు బాధతో ఇలా అన్నాడు. " మహేంద్రా! మేము ఐదుగురము అన్నదమ్ములము, ద్రౌపది బయలుదేరాము. నా నలుగురు తమ్ములు, ద్రౌపది నేలకూలారు. వారు లేనిది నేను ఎక్కడికీ రాను. వారు కూడా నాతో వచ్చేట్టు చెయ్యి." అని అన్నాడు ధర్మరాజు.

అప్పుడు ఇంద్రుడు ఇలా అన్నాడు. "ఓ ధర్మనందనా! వారందరూ వారి వారి శరీరములను వదిలిపెట్టి స్వర్గలోకము చేరుకున్నారు. వారి నందరినీ నీవు స్వర్గములో చూస్తావు. వారు మానవ దేహములను వదిలిపెట్టారు. మరలా వారు ఆ దేహములలో ప్రవేశించడం అసాధ్యం. కాబట్టి మనం స్వర్గానికి పోదాం పద." అని అన్నాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అప్పుడు ధర్మరాజు ఇంద్రుని చూచి ఇలా అన్నాడు. "ఓ మహేంద్రా! మేమందరమూ హస్తినాపురమునుండి బయలుదేరినప్పటినుండి ఈ శునకము మా వెంట వస్తూ ఉంది. దీనిని వదిలిపెట్టి నేను ఎలా రాను. కాబట్టి ఈ శునకమును కూడా మనవెంట స్వర్గానికి తీసుకొని పోదాము." అని అన్నాడు ధర్మరాజు.

ఆ మాటలకు ఇంద్రుడు నవ్వాడు. "ఓ ధర్మనందనా! అది ఎలా సాధ్యమవుతుంది. శునకమునకు స్వర్గలోక ప్రాప్తి ఎలా కలుగుతుంది. నీ వెంట వచ్చింది కదా అని దీనిని స్వర్గానికి ఎలా తీసుకుపోతావు. కాబట్టి ముందు నీవు రథం ఎక్కు." అని అన్నాడు.

" మహేంద్రా! నీవు లోకపాలకుడవు. నీకు తెలియంది కాదు. ఈ శునకము అత్యంత భక్తిశ్రద్ధలతో నా వెంట వచ్చింది. ఇప్పటి దాకా నా వెన్నంటి ఉంది. నేను ఎంత కఠినుడిని అయితే మాత్రం భక్తితో నన్ను సేవించిన ఈ శునకమును వదిలి ఎలా ఒంటరిగా స్వర్గానికి రాను. నన్ను భక్తితో సేవించిన ఈ శునకమును వదిలి నేను స్వర్గ సుఖములు ఎలా అనుభవించగలను." అని అన్నాడు ధర్మరాజు.

"ఓ ధర్మనందనా! కుక్కలకు స్వర్గంలో స్థానం లేదు. ఈ కుక్కను ఇక్కడ వదిలినందువలన నీకు పాపం రాదు. నీకు శుభం కలుగుతున్నప్పుడు దీనిని వదిలిపెట్టడం న్యాయమే. ఇందులో తప్పులేదు." అని అన్నాడు ఇంద్రుడు.

"మహేంద్రా! భక్తితో సేవించిన వారిని వదిలిపెట్టడం బ్రహ్మహత్యతో సమానం అంటారు. నీవు అన్ని ధర్మములు తెలిసినవాడవు. నీకు చెప్పేదేముంది. కాబట్టి నేను ఈ కుక్కను వదిలి నీతో స్వర్గానికి రాను. కేవలం స్వర్గసుఖాలు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అనుభవించడానికి నన్ను భక్తితో సేవించిన ఈ కుక్కను వదిలిపెట్టలేను." అని అన్నాడు ధర్మరాజు.

ఓ ధర్మనందనా! ఏదైనా వ్రతం చేసేవాడు కుక్కను ముట్టుకుంటేను మహాపాపంగా భావిస్తాడు. వాడు చేసే వ్రతము సర్వనాశనము అయిందను కుంటాడు. అలాంటప్పుడు నీవు ఈ కుక్క గురించి ఎందుకు పట్టుబడు తున్నావు. కాబట్టి ఈ కుక్కను వదిలెయ్యి. దీనిని వదిలితేనే నీకు స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది. అయినా ధర్మనందనా! నీ భార్య ద్రౌపది, నీ తమ్ములు నలుగురూ నీ కళ్ల ఎదుటపడి పోయి చనిపోయినా చలించని వాడివి ఈ కుక్క కోసరం ఎందుకు ఇంత తాపత్రయ పడుతున్నావు." అని అడిగాడు ఇంద్రుడు.

అప్పుడు ధర్మరాజు ఇలా అన్నాడు. " ఓ దేవేంద్రా! నీవు అఖిల లోకములకు పాలకుడవు.ధర్మ దేవతవు. నీ కంటే నేను ఎక్కువగా ధర్మములు తెలిసిన వాడిని కాను. నీవంటి వారితో వాదించడానికి నేను అర్హుడిని కాను. కాని నాకు తోచిన ధర్మము చెప్పడం తప్పు కాదు కదా. ద్రౌపది,భీమార్జున నకుల సహదేవులు నా కళ్లెదుట చనిపోయారు. వారి కోసం ఎంత ఏడ్చినా వారు తిరిగి రారు. అది జగమెరిగిన సత్యము. లోక ధర్మము. కాని ఈ కుక్క మాత్రం నా వెంట వచ్చింది. వారి వలె ఇది మధ్యలో చనిపోలేదు. కాబట్టి దీనిని వదిలి పెట్టడం ధర్మమా చెప్పండి. నాకు తెలిసిన ధర్మము ప్రకారము శరణు కోరిన వాడిని వదిలిపెట్టడం, మంచి మిత్రునికి ద్రోహం చెయ్యడం, స్త్రీలను చంపడం, బ్రాహ్మణుల ధనమును అపహరించడం వల్ల ఏ పాపము వస్తుందో, నన్ను నమ్మి నా వెంట వచ్చిన ఈ కుక్కను వదిలిపెడితే అదే పాపము నాకు సంక్రమిస్తుంది. ఈ పరిస్థితులలో నేను ఈ పాపమును ఎలా మూటగట్టుకోను. నేను అనుభవించబోయే స్వర్గలోక సుఖములు అలా ఉంచండి. నీవు మాత్రం నా మీద దయ ఉంచు. నేను ఇప్పటి దాకా సంపాదించిన పుణ్యం అంతా ఇప్పుడు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

నేను ఈ కుక్కను ఆదరించడంతో కలిగిన పాపంతో సమానం అయితే కానిమ్ము. నాకు ఈ స్వర్గసుఖములు వద్దు. దయచేసి నన్ను వదిలిపెట్టండి. తపస్సు చేసుకుంటూ నేను ఈ అడవులలోనే ఉంటాను. నాకు ఇది చాలు. ఏ స్వర్గసుఖాలు అక్కరలేదు.” అని అన్నాడు ధర్మరాజు.

అప్పటి దాకా కుక్క రూపంలో ఉండి తన కుమారుడైన ధర్మరాజు చెప్పిన మాటలను విన్న యమధర్మరాజు తన నిజరూపం ధరించి అతని ఎదుట నిలబడ్డాడు. తన ఎదుట సాక్షాత్కరించిన యమధర్మరాజును చూచి సంభ్రమాశ్చర్యాలతో నమస్కరించాడు ధర్మరాజు.

“నాయనా ధర్మనందనా! నీ పుణ్య చరిత్ర, నీ ధర్మనిరతి, నిర్మలమైన బుద్ధి, నీయొక్క భూత దయ, ఇతర ప్రాణుల ఎడల నీ దయా గుణము నాకు ఎంతో సంతోషాన్ని కలిగించాయి. భూలోకంలో నీ వంటి వారు ఉంటారా అని నాకు సందేహము కలుగుతూ ఉంది. ఇంతకు ముందు మీరు ద్వైతవనములో ఉండగా నీ యొక్క ధర్మనిరతిని నేను పరీక్షించాను. నీకు గుర్తుందా. నీ తమ్ములు మంచి నీటి కోసం వచ్చి నా అధీనంలో ఉన్న సరస్సులో దిగడానికి ప్రయత్నించి నేను అడిగిన ప్రశ్నలకు సమాధానము చెప్పడానికి నిరాకరించి స్పృహ తప్పి పడిపోయారు. అప్పుడు నీవు వచ్చావు. అప్పుడు నేను వీరిలో ఒకరిని బతికిస్తాను. ఎవరు కావాలో కోరుకో అన్నాను. అప్పుడు నీవు చెప్పిన సమాధానము నాకు ఎంతో నచ్చింది. కుంతీ తనయులలో నీవు బతికి ఉన్నావు. మాద్రితనయులలో నకులుని బతికించిన చాలును అని అన్నావు. ఆ ప్రకారంగా ధర్మనిరతిని ప్రదర్శించడం లోకం లో ఎక్కడైనా ఉంటుందా! నీ వెంట విశ్వాసముతో వచ్చిన కుక్కకోసరం సాక్షాత్తు ఇంద్రుడు తెచ్చిన రథం ఎక్కకుండా నిరాకరించిన నీ ధర్మనిరతి ఎంతో కొనియాడదగినది. నీకు సాటి అయిన వారు స్వర్గలోకంలో కూడా లేరు. నీ ధర్మనిరతిని ఇంద్రుడు గమనిస్తూనే ఉన్నాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఇంక నీవు నిశ్చింతగా ఈ శరీరంతోనే సిద్ధ పథంలో పుణ్యలోకాలకు వెళ్లు. అక్కడ నీకు సకల సౌఖ్యాలు లభిస్తాయి." అని అన్నాడు యమధర్మరాజు.

ఆ సమయంలో అక్కడకు గంధర్వులు, దేవఋషులు, మరుత్తులు, అశ్వినులు, వసువులు, పరమానందంతో అక్కడకు వచ్చారు. అందరూ ధర్మరాజును ఇంద్రుడు తీసుకొని వచ్చిన దివ్య రథంలో కూర్చోపెట్టారు. రథం కదిలింది. వారందరూ వెంటరాగా ధర్మరాజు పుణ్యలోకాలకు వెళ్లాడు.

ఆ సమయంలో నారద మహర్షి ఇలా అన్నాడు. "దానాలతో ధర్మాలతో తపస్సులతో పుణ్యాన్ని ఆర్జించిన వారిని గురించి విన్నాను. కాని నేడు ధర్మరాజు కీర్తి కాంతుల ముందు వారి కీర్తి వెలవెలా పోతోంది. ఆ రాజులలో ఎవరు కూడా శరీరంతో స్వర్గానికి రాలేదు. ఆ గౌరవం ఈనాడు ఒక్క ధర్మరాజుకే దక్కింది." అని ధర్మరాజును ప్రశంసించాడు నారదుడు.

ధర్మరాజు నారదుని చూచి ఇలా అన్నాడు. "నారదమునీంద్రా! నేను నా తమ్ములను చూచేదాకా ఈ సుఖాలు అనుభవించ లేను. ఇంతకూ వారు ఎక్కడ ఉన్నారు. అది ఎంత దుర్గమమైనా నాకు చూపించండి. నన్ను అక్కడకు తీసుకొని వెళ్లండి. నాకు నా తమ్ములను, యుద్ధంలో నా పక్షాన నిలిచి పోరాడిన రాజులను చూడవలెనని కోరికగా ఉన్నది." అని అడిగాడు.

అప్పుడు ఇంద్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "నీవు చేసిన పుణ్యవిశేషముల వలన నీవు సశరీరంగా స్వర్గానికి రాగలిగావు. స్వర్గానికి వచ్చినా నీకు మానవ మాత్రులకు ఉండే స్నేహభావము వదిలిపెట్టలేదు. అదుగో అటు చూడు. దేవఋషులు, గంధర్వులు, దేవతలు ఎలా ఆనందంగా ఉన్నారో. వారిని చూచి అయినా సంతోషంగా ఉండు. నీ మనసులోని దుఃఖమును

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వదిలిపెట్టు. ఇంకొక విషయం. నీవు చేసుకొన్న పుణ్య విశేషము చేతనే కదా ఇతరులకు దుర్లభమైన ఈ పదవిని పొందగలిగావు. నీ తమ్ములు ఈ పదవిని పొందలేదు కదా! నీవు ఇప్పుడు మానవ లోకం విడిచి పెట్టి దేవలోకం ప్రవేశించావు. ఇంకా నీవు మానవ సంబంధాలకోసం వెంపర్లాడటం తగదు. నీవు ఇప్పుడు దివ్యరూపంలో ఉన్నావు అన్న విషయాన్ని మరిచిపోకు." అని అన్నాడు ఇంద్రుడు.

ఆ మాటలు ధర్మరాజును సమాధాన పరచలేకపోయాయి.

"ఓ మహేంద్రా! మీరు ఎన్ని అయినా చెప్పండి. నేను నా సోదరులను, ద్రౌపదిని, నా బంధుమిత్రులను చూడకుండా ఉండలేను. ఒక్కసారి వారి నందరినీ చూచిన తరువాత మీరు చెప్పినట్టు చేస్తాను. నాకు అదే ఆనందాన్ని కలుగచేస్తుంది." అని అన్నాడు ధర్మరాజు. అని వైశంపాయనుడు జనమే జయునకు మహాభారత కథలో మహాప్రస్థానిక పర్వమును వినిపించాడు.

మహాభారతము

మహాప్రస్థానిక పర్వము

ఏకాశ్వాసము సంపూర్ణము

ఓం తత్సత్ ఓంతత్సత్ ఓంతత్సత్.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

# మహాభారతము

## స్వర్గారోహణ పర్వము

### ఏకాశ్వాసము

మహాభారత కథను చెబుతున్న వైశంపాయనుని చూచి జనమేజయుడు ఇలా అడిగాడు. "మునివర్యా! మా తాతలయిన పాండవులు స్వర్గారోహణ చేసి ఏ యే లోకములకు వెళ్లారు ఎక్కడెక్కడ ఉన్నారు. తెలియజేయండి అని అడిగాడు. వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు.

తన బంధువులను చూడవలెనని గట్టిగా పట్టుబట్టిన ధర్మరాజు కోరికను ఇంద్రుడు మన్నించాడు. వెంటనే ఒక దూతను పిలిచాడు. "ఈయన ధర్మరాజు. ఈయనకు తన వారిని చూడవలెనని కోరికగా ఉన్నది. నీవు ఈయనను తీసుకొని పోయి ఆయన బంధువుల నందరినీ చూపించు." అని ఆజ్ఞాపించాడు.

అప్పుడు ఆ దేవ దూత ధర్మరాజును తన వెంట తీసుకొని వెళ్లాడు. ఆయన వెంట నారదుడు మరి కొందరు దేవఋషులు కూడా వెళ్లారు. మొట్ట మొదటగా వారికి సుయోధనుడు కనిపించాడు. స్వర్గంలో సుయోధనుడు పెద్ద సింహాసనము మీద కూర్చుని వున్నాడు. అయన చుట్టు దేవ కాంతలు సేవలు చేసున్నారు. అంతులేని సుఖాలు అనుభవిస్తున్నాడు సుయోధనుడు.

అది చూచి ఆశ్చర్యపోయాడు ధర్మరాజు. దేవమునులను చూచి ఇలా అన్నాడు. " ఓ దేవర్షులారా! ఈ సుయోధనుడు పరమలోభి. ఇతడికి ముందు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

చూపు లేదు. అనేక దేశములు ఏలే రాజులను యుద్ధమునకు పిలిపించి వారి వారి రథ,గజ,తురగ,కాల్బలములో సహా మరణించేట్టు చేసాడు. రాజసూయ యాగము చేసి పవిత్రురాలైన ద్రౌపదిని నిండుకొలువుకు ఈడ్చుకొని వచ్చి ఘోరంగా అవమానించాడు. అలాంటి వాడు స్వర్గ సుఖాలు అనుభవిస్తున్నాడు. వీడితో పాటు నేను కూడా స్వర్గ సుఖాలు అనుభవించాలా! వీలు లేదు. నన్ను నా తమ్ములు భీమార్జుననకులసహదేవులు, ద్రౌపది, ఉన్న చోటికి తీసుకొని వెళ్లండి." అని అంటూ వెనక్కు తిరిగాడు ధర్మరాజు.

అప్పుడు నారదుడు నవ్వి ఇలా అన్నాడు. "ఓ ధర్మనందనా! ఈ సుయోధనుడు తన లోపభూయిష్టమైన శరీరమును వదిలి పెట్టాడు. ఇప్పుడు దివ్యదేహంతో ప్రకాశిస్తున్నాడు. అందుకే దేవతలచేత గౌరవించబడుతున్నాడు. ఇతడు యుద్ధంలో మరణించాడు. యుద్ధంలో రాజులను చంపాడు. అది పాపము ఎలా అవుతుంది. ఇతడు భూలోకంలో చేసిన పాపములను ఇక్కడ తలుచుకొనడం దేనికి. ఇది పుణ్యలోకము. ఇక్కడ ఏ పాపము అంటదు.

ధర్మరాజా! నీవు స్వర్గమునకు వచ్చి కూడా నీ లో ఉన్న ఈర్ష్యా ద్వేషములను వదిలి పెట్టలేదు కదా! ఇక్కడ వాటికి తావు లేదు. కాబట్టి నీలోని కోపతాపములు, ఈర్ష్యాద్వేషములను వదిలి పెట్టి సమత్వమును పొందు. నీవు ఆడిన జూదము, దాని వలన కలిగిన దుఃఖములు అన్ని మరిచిపో.ప్రశాంతంగా ఉండు." అని అన్నాడు నారదుడు.

" ఓ దేవర్షీ! పుణ్యము చేసిన వారికి స్వర్గము. పాపులకు నరకము ప్రాప్తిస్తుంది అంటారు కదా. ఈ సుయోధనుడు పాపి. ఇతరులకు అపకారము తప్ప ఉపకారము ఎన్నడూ చేయలేదు. కురు వంశము నాశనము చేసినవాడు. రాజులలో కెల్లా అధముడు. ఇటువంటి వాడు దేవతలకు పూజనీయుడా. వీడు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కూడా స్వర్గంలో ఉండటమా! పోనీలే అది మీ స్వర్గవాసుల ఇష్టం. నాకెందుకు. అతడిని స్వర్గలోక సుఖములు అనుభవించనీ. నన్ను మాత్రము నా తమ్ములు, నా భార్య, నా కుమారుల వద్దకు తీసుకొని వెళ్లండి. నేను వారిని చూడాలి.

మహాఋషులారా! నేను తిలతర్పణములు ఇస్తున్న సమయంలో మా తల్లి కుంతీ దేవి నా వద్దకు వచ్చి కర్ణుడు తన కుమారుడు అని తెలిపింది. అతని జన్మరహస్యము కూడా చెప్పింది. అప్పటి నుండి నాకు కర్ణుని చూడవలెనని కుతూహలము గా ఉన్నది. ఆ పరాక్రమ వంతుడు మేము కలిస్తే ఆ ఇంద్రుడు కూడా మమ్ములను జయించలేడు కదా! కర్ణుడు మా అన్న అని తెలియక అతనిని చంపమని నేను అర్జునుని పంపాను. పాపం చేసాను. ఆ పాపము నన్ను నిరంతరమూ వేధిస్తూ ఉంది. కర్ణుని ఎప్పుడెప్పుడు చూద్దామా అని నా మనసు తహతహలాడుతూ ఉంది. దయచేసి నాకుమా అన్న కర్ణుని చూపండి.

అదీ కాకుండా ద్రుపదుడు,విరాటుడు,యుధామన్యుడు,శంఖుడు, మొదలగు వారు యుద్ధములో మరణించారు. వారిని కూడా చూడాలని ఉంది. నేను మొదటినుండి నా తమ్ములు భీమార్జుననకుల సహదేవులు, ద్రౌపదిని చూడాలని ఉందని కోరుతూనే ఉన్నాను. ఒక వేళ వారు స్వర్గంలో లేకుంటే వారు లేని స్వర్గంలో నేను కూడా ఉండను. వారికి లేని స్వర్గసుఖములు నాకూ అవసరము లేదు వారు ఎక్కడ ఉంటే అదే నాకు స్వర్గముతో సమానము. నన్ను తొందరగా వారి వద్దకు తీసుకొని వెళ్లండి." అని అడిగాడు ధర్మరాజు.

అప్పుడు ఆ దేవదూత ఇలా అన్నాడు. "ఓ మహాత్మా! నీ మనసులో ఏ కోరిక పుడుతుందో దానిని తీర్చమని ఇంద్రుడు నన్ను ఆదేశించాడు. నేను అలాగే చేస్తాను. తమరు ఇలా రండి." అని అన్నాడు. ధర్మరాజు ఆ దేవదూతను అనుసరించి వెళ్లాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఆదారి అంతా దుర్గంధభూయిష్టంగా ఉంది. దారిలో వెంట్రుకలు, ఎముకలు కుప్పలుగా ఉన్నాయి. దోమలు ఈగలు ముసురుతున్నాయి. శవాలు గుట్టలు గుట్టలు గా పడి ఉన్నాయి. ఆ శవాల కోసం కాకులు తిరుగుతున్నాయి. శవాల మీదినుండి దుర్గంధము ముక్కులను బద్దలు కొడుతోంది. దేవదూత ఆ మార్గంలో ధర్మరాజును తీసుకొని వెళుతున్నాడు. వారు వైతరిణీ నదిని సమీపించారు. ఆ నదిలో నీరు సలా సలా కాగుతూ తెర్లుతున్నాయి. దాని ఒడ్డున కత్తుల వలె సూదుల వలె ఉన్న ఆకులు కల మొక్కలు ఉన్నాయి.

అక్కడ నానా విధము లైన పాపములకు శిక్షలు అనుభవించే పాపులను చూచాడు ధర్మరాజు. "ఇంకా  ఎంత దూరము వెళ్లాలి." అని అడిగాడు.

"ఇదంతా దేవతల అధీనములో ఉన్నది. మనము రావలసిన ప్రదేశమునకు వచ్చాము." అని అన్నాడు దేవదూత. కాని ధర్మరాజుకు ఆ పాపుల అవస్థలు చూచి అక్కడ ఉండటానికి మనస్కరించలేదు. వెంటనే వెళ్లిపోదామని అనుకున్నాడు. అప్పుడు ధర్మరాజుకు కొన్ని గొంతులు వినిపించాయి.

"ఓ పుణ్యచరితా! నీ రాక వలన మా పాపములు పోయాయి. నీ శరీరం మీదినుండి వచ్చే పరిమళం వలన మా బాధలు ఉపశమించాయి. మాకు హాయిగా సుఖంగా  ఉంది. నిన్ను చూడటం వలన మా బాధలు దూరం అయ్యాయి. నీవు కాసేపు ఇక్కడే ఉండి మాకు సంతోషాన్ని కలిగించు." అని వినిపించింది.

ఆమాటలు విన్నాడు ధర్మరాజు. "ఆహా! వీరు అందరూ ఎన్ని బాధలు పడుతున్నారో కదా!" అని అనుకుంటూ అక్కడే నిలబడ్డాడు. మరలా మరలా

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అవే మాటలు వినబడుతున్నాయి.

అప్పుడు ధర్మరాజు పెద్ద గొంతుతో "మీరు ఎవరు. ఏం పాపాలు చేసారు." అని అడిగాడు.

" మేము ఎవరమో కాదు. నీ అన్నదమ్ములము. కర్ణుడు, భీముడు, అర్జునుడు, నకులుడు,సహదేవుడు అందరమూ ఇక్కడే నరకబాధలు అనుభవిస్తున్నాము." అని వినిపించింది. మరొక వంక నుండి "మహారాజా! నేను ద్రౌపదిని, నేను ధృష్టద్యుమ్నుడను. మేము ద్రౌపది కొడుకులము." అని వినిపించింది.

ధర్మరాజు ఒక్కసారి నిశ్చేష్టుడయ్యాడు. "అయ్యో దైవమా! ఇదేమిటి. నా తమ్ములకు, ద్రౌపదికి ఈ గతి పట్టడం ఏమిటి. వారు ఏం పాపం చేసారు ఇటువంటి నరకయాతలను అనుభవించడానికి. ఇంద్రుడు మొదలగు దేవతలు పరమ నీచులు. లేక పోతే నా తమ్ములకు నా భార్యకు ఇటువంటి నరక యాతలను కలుగచేస్తారా! ఇక్కడ ధర్మం లేదు. న్యాయం లేదు. లేక పోతే నా తమ్ములు, ద్రౌపది సామాన్యమైన వారా. పరమ నిష్టాగరిష్టులు. సత్యము, దయ గలవారు. దానశీలురు. యజ్ఞయాగములుచేసినవారు. అటువంటి వారికి ఇటువంటి దుర్గతి పట్టడం ఏమిటి. కనీసం జీవితంలో ఏ ఒక్కరి కూడా మేలు చేయని సుయోధనునికి స్వర్గ సుఖాలా? అతని చుట్టు అంత మంది దేవ కాంతలా! అంతులేని భోగాలా! కనీసం పీసమెత్తు కూడా పాపం చెయ్యని నా వారికి నరక బాధలా! దైవం న్యాయం ధర్మం మరిచినట్టుంది." అని చింతిస్తున్నాడు ధర్మరాజు.

ఇంతలో ఒక అనుమానం. "ఇదంతా నిజమా! లేక దేవతల మాయా!

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

లేక నేను కలకంటున్నానా! లేక ఇదంతా నా భ్రాంతియా!" అని పరి పరి విధముల చింతిస్తున్నాడు ధర్మరాజు.

ఇంద్రుని మీద అంతులేని కోపం వచ్చింది ధర్మరాజుకు. పక్కనే ఉన్న దేవ దూతను చూచి "ఓ దేవదూతా! ఇంక నాకు నీ సాయం అక్కరలేదు. నిన్ను ఎవరు పంపారో వారి దగ్గరకే వెళ్లు. నా తమ్ములు, నా భార్య నరక బాధలు అనుభవిస్తున్నారు. వారు ఎక్కడ ఉంటేనేనూ అక్కడే ఉంటాను. నా మాటలు యధాతథంగా ఇంద్రుని కి చెప్పు." అని అన్నాడు.

వెంటనే ఆ దేవదూత ఇంద్రుని వద్దకు పోయి జరిగింది అంతా వివరంగా చెప్పాడు. వెంటనే ఇంద్రుడు దిక్పాలకులను, దేవఋషులను వెంట బెట్టుకొని ధర్మరాజు వద్దకు వచ్చాడు. యమధర్మరాజు కూడా తన కుమారుని అనునయించ డానికి అక్కడకు వచ్చాడు. వారి రాకతో అక్కడ ఉన్న వాతావరణం అంతా మారిపోయింది. నరకయాతనలు నిలిచిపోయాయి. చెడు వాసనలేదు. శవాల గుట్టలు లేవు. ఎముకల పోగులు మాయమయ్యాయి. పాపుల ఆక్రందనలు ఆగిపోయాయి. పైన తిరుగుతున్న కాకులు గద్దలు మాయమయ్యాయి. వైతరణీ నది మచ్చుకైనా కనిపించడం లేదు. సుగంధబంధుర మైన పిల్ల తెమ్మెరలు వీస్తున్నాయి. వాతావరణం చల్లగా ఆహ్లాదకరంగా ఉంది. మనోహరమైన గాలులు అంతటా వీస్తున్నాయి.

ఆ సమయంతో ఇంద్రుడితో పాటు వచ్చిన వసువులు, రుద్రులు, ఆదిత్యులు, గంధర్వులు, నాగులు, సిద్ధులు ధర్మరాజు దగ్గరకు వచ్చారు. వారంతా సంతోషంగా ఉన్నారు. అప్పుడు ఇంద్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. "నీవు నరకంలో ఉండటం ఏమిటి. నిన్ను తీసుకొని పోవడానికే దేవతలందరూ ఇక్కడకు వచ్చారు. నీ కోపం వదిలిపెట్టు. నీకు శాశ్వతబ్రహ్మలోక ప్రాప్తి

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కలిగింది. నీలోని వికారములు అన్నీ నశించాయి. నీకు సద్బుద్ధి కలిగింది.

ధర్మనందనా! నీకు ఒక మాట చెబుతాను విను. రాజ్యాంతే నరకం ధ్రువం అని వేదోక్తి. రాజ్యము చేసిన వాడికి నరకం తప్పదు. అందుకే నీకు నరక ద్వార దర్శనం కలిగింది. ధర్మనందనా! పుణ్యము పాపమూ రెండూ ఒకదాని వెంట ఒకటి ఉంటాయి. పుణ్యం చేసుకుంటే స్వర్గలోకమూ, పాపం చేసుకుంటే నరకలోకమూ కలుగుతాయి. మానవులు తాము చేసుకున్నపుణ్యానికి స్వర్గలోక సుఖాలు అనుభవించి తరువాత నరకయాతనలు అనుభవిస్తారు. అలాగే తాము చేసిన పాపాలకు నరక యాతనలు అనుభవించిన తరువాత స్వర్గలోకసుఖములు అనుభవిస్తారు. కొద్ది పుణ్యం చేసుకున్నవాడు ముందు ఆ పుణ్యమునకు సరిపడా స్వర్గలోక సుఖములు అనుభవించి తరువాత తాను చేసిన పాపములకు దీర్ఘకాలము నరకలోకబాధలు అనుభవిస్తాడు. అధికంగా పుణ్యం చేసుకున్న వాడు, ముందు తాను చేసిన కొద్దిపాటి పాపములకు నరకయాతన ముందే అనుభవించి, తరువాత దీర్ఘకాలము స్వర్గలోక సుఖములు అనుభవిస్తాడు. ఇది ఇక్కడి నియమము.

నీవు చేసిన స్వల్ప పాపమునకు నరకద్వార దర్శనము చేయించాము. దీర్ఘకాలము నీవు స్వర్గసుఖములు అనుభవిస్తావు. నీవు మనస్తాపము చెందినందు వలన ఇదంతా చెప్పవలసివచ్చింది. నీ అనుజుడు కర్ణుడు ఉత్తమలోకాలు పొందాడు. నీ తమ్ములు భీమార్జున, నకులసహదేవులు కూడా ఉత్తమ లోకాలుపొందారు. వారందరూ తమ తమ ఉత్తమ స్థానాలలో ఉజ్వలంగా ప్రకాశిస్తున్నారు. వారినందరినీ చూచి సంతోషించు. నీలో ఉన్న స్వల్ప పాపమునకు నరకద్వారము చూచావు. ఇంక స్వర్గసుఖములు అనుభవించు. నీవు చేసిన రాజసూయములు, యజ్ఞములు, యాగములు, వ్రతములు, దానములు నీకు ఉత్తమ లోకాలు సిద్ధింపజేసాయి. నీ పూర్వీకులైన మాంధాత,

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

నలుడు, హరిశ్చంద్రుడు, దిలీపుడు, దుష్యంతుడు, భరతుడు ఎటువంటి ఉత్తమ లోకాలుపొందారు అటువంటి ఉత్తమ లోకాలు నీకూ లభించాయి. నిన్ను అభినందించడానికి గంధర్వులు, నాగులు, గరుడులు, సిద్ధులు, సాధ్యులు, అందరూ వచ్చారు." అని వారందరినీ చూపాడు ఇంద్రుడు.

ధర్మరాజు వారందరికీ వినయంతో నమస్కరించాడు. ఇంద్రుడు ఇంకా ఇలా అన్నాడు. "ఓ ధర్మరాజా! ఇదే ఆకాశ గంగ. పుణ్యమే ఈ ఆకృతి దాల్చింది. ఇందులో స్నానం చేసి దివ్య దేహంతో ప్రకాశించు." అని అన్నాడు.

తరువాత యమధర్మరాజు ధర్మరాజు వద్దకు వచ్చి ఇలా అన్నాడు. "కుమారా! నేను నిన్ను మొదటిసారి ద్వైతవనంలో, రెండోసారి మేరు పర్వతప్రాంతంలో కుక్కరూపంలో, మూడోసారి ఇక్కడా పరీక్షించాను. నీ మనసు చలించలేదు. నీకు శమము, దమము మొదలగు గుణములు పుష్కలంగా ఉన్నాయి. నీవు జితేంద్రియుడవు. నీకు పెట్టబడిన పరీక్షలు పూర్తి అయ్యాయి. నీవు గెలిచావు. ఇంక నీవు స్వర్గసుఖములు అనుభవించు. రాజులకు నరక ప్రాప్తి కలుగుతుంది. అందుకే నేను ఇంద్రుడు కలిసి నిన్ను నరకానికి పంపాము. నీవు విన్న కర్ణ, భీమార్జుననకులసహదేవుల, ద్రౌపదీ ఆక్రందనలు మేము కల్పించినవే. నీ తమ్ములు, ద్రౌపది,కర్ణుడు పుణ్య లోకములు చేరుకున్నారు. ఇంద్రుడు చెప్పినట్టు నీవు ఈ ఆకాశ గంగలో మునుగు. నీకు ఈ సంసార భావము, నేను నీవు అనే బేధభావము నశిస్తాయి. మానవ సహజమైన సుఖదుఃఖాలు, రాగద్వేషాలు నశిస్తాయి. దైవత్వము సిద్ధిస్తుంది. తరువాత స్వర్గసుఖములు అనుభవిస్తున్న నీ సోదరులను, భార్యను ఆనందంతో కనులారల చూడు. ఇంకా ఆలస్యం ఎందుకు. ఆకాశగంగలో స్నానమాచరించు." అని అన్నాడు యమధర్మరాజు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

తరువాత యమధర్మరాజు ధర్మరాజును తీసుకొని ఆకాశ గంగవద్దకు వెళ్లాడు. ధర్మరాజు ఆకాశ గంగలో పుణ్యస్నానం చేసాడు. వెంటనే ధర్మరాజు తన మానుష శరీరం వదిలి దివ్యశరీరం ధరించాడు. ఎప్పుడైతే ధర్మరాజు దివ్యకాంతితో కూడిన శరీరం ధరించాడో అతనిలోని వైరము, మాత్సర్యము, స్నేహము, చంచల స్వభావము, గర్వము, దుఃఖము అన్నీ సమసిపోయాయి. ధర్మరాజు సాక్షాత్తు అగ్ని వలె ప్రకాశిస్తున్నాడు. ఎదురుగా ఉన్న ఇంద్రుని, యమధర్మరాజును స్తుతించాడు. వారితో కలిసి ముందుకు సాగాడు.

అక్కడ నరుడైన అర్జునుడు చతుర్భుజములతోనూ, శంఖ, చక్ర, గదాయుధములతోనూ ప్రకాశిస్తున్న శ్రీమహావిష్ణువును సేవిస్తున్నాడు. ద్వాదశాదిత్యుల పక్కన పదమూడవ ఆదిత్యుడుగా ప్రకాశిస్తున్న కర్ణుని, మరుత్తులలో ఒకడిగా ప్రకాశిస్తున్న భీముని చూచాడు ధర్మరాజు. అశ్వినీ దేవతలతో సమానంగా వెలుగుతున్న నకులసహదేవులను కూడా చూచాడు ధర్మరాజు. కొంచెం దూరంలో మహారాణి మాదిరి దివ్యమైన కాంతితో వెలిగిపోతున్న ఒక స్త్రీమూర్తిని చూచాడు. ఇంద్రుని చూచి దేవా! ఈమె ఎవ్వరు? అని అడిగాడు.

" ధర్మనందనా! ఈమె శ్రీ మహాలక్ష్మి. ద్రౌపదిగా ద్రుపదునికి కుమార్తెగా అయోనిజగా జన్మించింది. మహేశ్వరుని ఆజ్ఞ ప్రకారము ఆ ప్రకారం మానవ రూపు దాల్చింది. ఆ పక్కన ఉన్న గంధర్వులు ఆమె కుమారులు ఉపపాండవులు. వారికి కొంచెం అవతల కనిపిస్తున్న వాడు ధృతరాష్ట్రుడు అనే పేరు గల గంధర్వరాజు. అతనే మీకు పెదనాన్నగా జన్మించాడు. తరువాత ఆయా అంశలతో యాదవ వీరులుగా పుట్టిన సాత్యకి, కృతవర్మ మొదలగువారు అక్కడ స్వర్గ సుఖములు అనుభవిస్తున్నారు చూడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ధర్మనందనా! చంద్రుడి అంశతో సుభద్ర గర్భవాసాన జన్మించిన అభిమన్యుడు..... రెండవ చంద్రుని వలె ప్రకాశిస్తున్నాడు." అని పలికాడు ఇంద్రుడు. ఇంతలో ఒక విమానం అటుగా వస్తూ ఉంది. "ధర్మనందనా! అడుగో మీ తండ్రి పాండురాజు తన భార్యలు కుంతీ, మాద్రిలతో దివ్య విమానంలో మన వైపు వస్తున్నాడు." అని చూపించాడు ఇంద్రుడు.

తరువాత అష్ట వసువులలో ఒకడుగా వెలుగొందుతున్న భీష్ముని, బృహస్పతి పక్కన కూర్చుని ఉన్న ద్రోణుని చూచాడు ధర్మరాజు. తరువాత గంధర్వ, యక్ష, గుహ్యక, గణములలో కలిసి ఉన్న ద్రుపదుని, విరాటుని, వారి అన్నదమ్ములను, కుమారులను, బంధువులను, కేకయ, పాండ్య రాజులను, నానా దేశముల నుండి వచ్చి మహాభారత యుద్ధములో ప్రాణములు విడిచిన రాజులను చూపించాడు ఇంద్రుడు. వీరందరూ ఉత్తమ లోకములు పొందారు అని వివరించాడు." అని చెప్పిన వైశంపాయనుని చూచి జనమేజయుడు ఇలా అన్నాడు.

"ఓ మునివర్యా! తమరు అందరి విషయములు చెప్పారు. వీరందరూ ఉత్తమలోకాలు పొందారు అని చెప్పారు. కాని ఒక సందేహము. వీరందరూ ఎంత కాలము స్వర్గ సుఖములు అనుభవిస్తారు. శాశ్వతంగా స్వర్గంలోనే ఉండిపోతారా! లేక కొంత కాలము మాత్రమే ఉండి తిరిగి మనుష్య జన్మ ఎత్తుతారా! ఈ విషయం వివరించండి." అని అడిగాడు.

దానికి వైశంపాయనుడు ఇలా చెప్పసాగాడు. " ఓ జనమేజయ మహారాజా! ఇది దేవ రహస్యం. ఈ విషయం వేదవ్యాస మహర్షి నా మీద కరుణతో నాకు చెప్పాడు. అది నీకు చెబుతాను విను.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ప్రద్యుమ్నుడు సనత్కుమారుడిలో కలిసాడు. ధృతరాష్ట్రుడు గాంధారీ కుబేరలోకంలో చేరారు. పాండురాజు తన భార్యలు కుంతీ, మాద్రిలతో స్వర్గంలోనే ఉన్నాడు. అభిమన్యుడు చంద్రునిలో కలిసిపోయాడు. ద్రోణాచార్యుడు బృహస్పతిలో, శకుని ద్వాపరుడిలో కలిసిపోయారు. సుయోధనుడు కొంతకాలము స్వర్గసుఖములు అనుభవించి తరువాత నరక లోకంలో తాను చేసిన పాపములకు శిక్షలు అనుభవించి, తుదకు కలిపురుషుడిలో ఐక్యమయ్యాడు. అదేవిధంగా మిగిలిన కౌరవులందరూ తాము చేసిన పుణ్య పాపములకు సరిపడా స్వర్గ సుఖములు, నరక బాధలు అనుభవించి తరువాత రాక్షస గణములలో ఐక్యమయ్యారు. కర్ణుడు తన తండ్రి అయిన సూర్యునిలో లీనమయ్యాడు. భీష్ముడు అష్టవసువులలో ఆఖరివాడిగా కలిసిపోయాడు. ద్రుపదుడు,విరాటుడు,ధృష్టకేతుడు, భూరిశ్రవుడు, శల్యుడు,శంఖుడు, ఉత్తరుడు, వీరందరూ విశ్వేదేవతలలో కలిసిపోయారు. ధృష్టద్యుమ్నుడు అగ్నిలో కలిసిపోయాడు. అప్పటికే ధర్మరాజు శరీరంలో కలిసిపోయిన విదురుడు, తన శరీరమును వదిలిపెట్టిన ధర్మరాజు, యమధర్మరాజులో లీనమయ్యారు. బ్రహ్మదేవుని ఆదేశము ననుసరించి బలరాముడు అనంతునిలో కలిసిపోయాడు. శ్రీకృష్ణునితో రాసలీలలు జరిపిన పదహారువేలమంది గోపికలు సరస్వతీ నదిలో మునిగి అప్సరసలుగా రూపొంది మహావిష్ణువును సేవిస్తున్నారు. శ్రీకృష్ణునితో పాటు సహగమనము చేసిన రుక్మిణి లక్షీదేవిలో కలిసిపోయింది. శ్రీకృష్ణుని తక్కిన ఏడుగురు భార్యలు కూడా లక్ష్మీదేవిలో కలిసిపోయారు.

ఓ జనమేజయ మహారాజా! మహాభారత యుద్ధములో చనిపోయిన వారు, ఇంతకు ముందు నేను చెప్పినవారు, చెప్పని వారు అందరూ వారి వారి అంశలైన దేవతా, రాక్షస,యక్ష,గుహ్యక,గంధర్వ బృందములలో కలిసిపోయారు. ఇదే నీవు అడిగిన ప్రశ్నకు సమాధానము.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఓ జనమేజయ మహారాజా! ఇంకా చెబుతాను విను. కురు పాండవుల విషయములతో కూడిన ఈ మహాభారత కథను అనేక ఉప కథలతో చేర్చి నీకు వివరంగా చెప్పాను. సర్పయాగ సందర్భంలో భగవాన్ వేదవ్యాసమహర్షి అనుమతితో నేను చెప్పిన మహాభారత కథను నీవు శ్రద్ధతో విన్నావు. జ్ఞానం సముపార్జించావు." అని అన్నాడు వైశంపాయనుడు.

ఈ మహాభారత కథలో విరాట పర్వము నుండి స్వర్గారోహణ పర్వము దాకా 15 పర్వములు తెనిగించిన తిక్కన సోమయాజి తన రచన గురించి హరిహర నాధునికి ఇలా వివరిస్తున్నాడు.

" ఓ హరిహరనాథా! సర్పయాగ సందర్భంగా భగవాన్ వేదవ్యాస మహర్షి శిష్యుడైన వైశంపాయనమహర్షి జనమేజయునికి శ్రీ మహాభారత కథను వినిపించాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న వ్యాసమహర్షి శిష్యుడు, ఉగ్రశ్రవసుడు వైశంపాయనుడు చెప్పిన మహాభారత కథను ఆమూలాగ్రంగా అత్యంత భక్తి శ్రద్ధలతో విన్నాడు. తరువాత నైమిశారణ్యంలో సత్రయాగ సందర్భంలో శౌనకుడు ఇంకా తదితర మహాఋషులు పుణ్యకథాశ్రవణం చెయ్యాలని కుతూహలంతో అక్కడే ఉన్న ఉగ్రశ్రవసుని భారత కథను చెప్పమని కోరారు. అప్పుడు ఉగ్రశ్రవసుడు మహాభారత కథను వారికి రసవత్తరంగా చెప్పాడు. మహాభారత కథనుచెప్పడం పూర్తి చేసిన తరువాత ఉగ్రశ్రవసుడు ఇలా అన్నాడు.

"ఓ మహాఋషులారా! నేను ఈ కథను జనమేజయుడు చేసిన సర్పయాగ సందర్భంలోవేదవ్యాసమహర్షి శిష్యుడైన వైశంపాయనుడు జనమేజయునకు చెప్పగా విన్నాను. తరువాత సర్పయాగం పూర్తి అయింది. సర్పయాగమును ఆపి సర్పముల బాధలను తీర్చిన ఆస్తీకుని జనమేజయుడు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

పూజించి సత్కరించాడు. ఋత్విక్కులకు కానుకలు దక్షిణలు ఇచ్చి సంతోష పరిచాడు. తరువాత వేదవ్యాసమహర్షిని, వైశంపాయన మహర్షిని దేవోపచారములతో పూజించాడు. తరువాత జనమేజయుడు హస్తినాపురము ప్రవేశించాడు.

ఓ మహాఋషులారా! ఈ భారత కధను రచించిన వేదవ్యాసమహర్షి ఋషులలో కెల్లా సత్యమును దర్శించిన వాడు. వేదములే రూపముగా ధరించిన వాడు. విజ్ఞాన ఖని. పుణ్యశాలి. బ్రహ్మజ్ఞాని. శౌచము, శాంతి, క్షమ, దాంతి, తపోనిష్ఠ కల వాడు. ధర్మములను ఉపదేశించడంలో దిట్ట.

పాండవుల కీర్తి ప్రతిష్టలను లోకానికి తెలపడానికి, అనేక మంది రాజుల కధలను సామాన్య జనానికి చెప్పడానికీ, దేవదేవుడగా వాసుదేవుని లీలా విశేషములను వివరించడానికి, సర్వదేవజాతులు ఎలా పుట్టారు, మరలా ఎలా లీనమయ్యారు అనే విషయాలు సామాన్యజనులకు తెలపడానికీ, సకల ధర్మములను లోకానికి తెలియజెయ్యడానికీ, పంచమ వేదము గా రూపొందిన ఈ మహాభారత కధను రచించాడు. వేదవ్యాసుడు ఈ ఇతిహాసమును మూడు సంవత్సరములలో పూర్తిచేసాడు. ధర్మము, అర్ధము, కామము, మోక్షము అనే పురుషార్ధములలో చెప్పబడిన ధర్మసూక్ష్మములు ఈ మహాభారతంలో చెప్పబడ్డాయి.

**ఈ మహాభారతంలో చెప్పబడిన ధర్మములు ప్రపంచంలో ఎక్కడైనా ఉండవచ్చు. కాని ఈ మహాభారతంలో చెప్పబడని ధర్మము ఈ ప్రపంచంలో ఇంకెక్కడా చెప్పబడలేదు.**

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఈ పుణ్యమైన ఇతిహాసమును జనమేజయుడు చేసిన సర్పయాగ సందర్భంలో వేదవ్యాసుని ఆజ్ఞమేరకు అతని శిష్యుడైన వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఆదరంతో చెప్పాడు. ఆ సమయంలో నా పూర్వపుణ్యవశాత్తు నేను అక్కడే ఉండి ఆ మహాభారత కథను ఆమూలాగ్రంగా విన్నాను. నా జన్మధన్యమయింది. ఆ వేదవ్యాసుని కరుణ వలన మీ అందరి ఆదరాభిమానములతో నేను మీకు వినిపించాను.

ఈ పుణ్య కథను మొదటి నుండి చివరి వరకూ పర్వదినములలో ఎవరు భక్తిశ్రద్ధలతో వింటారో, వారికి పాపములు అన్నీ నశించిపోతాయి. వారు స్వర్గలోక సుఖములు అనుభవిస్తారు. తుదకు మోక్షమును పొందుతారు. వారు చేసిన బ్రహ్మ హత్యాపాతకము మొదలగు ఘోరపాపములు నశిస్తాయి.

దైవ కార్యములు, పితృకార్యములు జరిపేటప్పుడు ఎవరైతే ఈ మహాభారత కథను బ్రాహ్మణులకు వినిపిస్తారో, వారికి ఆ యా పుణ్యకార్యముల ఫలితం దక్కుతుంది. ఈ మహాభారత కథను పూర్తిగా వినలేకపోయినా, ఏ కొంచెం అయినా చెవిలో సోకితే, వారికి కూడా సమస్త పాపములు తొలగిపోతాయి.

ఓ మునీంద్రులారా! మొదట ఈ ఇతిహాసము జయ అనే పేరుతో ప్రసిద్ధిచెందింది. అందుకని, క్షత్రియులు ఈ ఇతిహాసమును వింటే వారికి సదా జయం కలుగుతుంది. ఈ మహాభారత ఇతిహాసమును భక్తితో చదివినా, విన్నా, వారికి సకల సంపదలు, ఆయుష్షు,చదువు వృద్ధిచెందుతాయి. గర్భిణీ స్త్రీలు వింటే వారికి పుత్రసంతానము కలుగుతుంది. కన్యలు వింటే మంచి వరుడు దొరుకుతాడు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఓ మహామునులారా! ఈ మహాభారత ఇతిహాసములో అత్యంత ముఖ్యుడు శ్రీకృష్ణుడు. ఆ శ్రీ కృష్ణుని మీద అచంచల మైన భక్తి విశ్వాసములతో ఈ మహాభారత ఇతి హాసమును ఎవరు వింటారో, వారికి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి.

వ్యాసమహర్షి కరుణతో ఎవరికైతే మహాభారత ఇతిహాస అర్ధము స్ఫురిస్తుందో, అట్టి వానికి వేదములు, ఉపనిషత్తులు, పురాణములు, సకల శాస్త్రములు అవగతమవుతాయి. జనులు అతనిని కీర్తిస్తారు. అతనికి బ్రహ్మజ్ఞానము అలవడుతుంది." అని సూతుడు శౌనకాది మహామునులకు వారికి తృప్తి కలిగేటట్టు మహాభారత ఇతిహాసమును చెప్పగా, వారు ఎంతో సంతోషించారు. ఆ మహామునులందరూ ఉగ్రశ్రవసుడు అనే సూతిని ఘనంగా సత్కరించారు.

**మహాభారతము**

**స్వర్గారోహణ పర్వము**

**ఏకాశ్వాసము సంపూర్ణము.**

**శ్రీ మహాభారత ఇతిహాసములో 18 పర్వములు సర్వం సంపూర్ణము.**

**ఓం తత్సత్ ఓం తత్సత్ ఓంతత్సత్.**

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

# ఉప సంహారము

మహాభారత కధ పూర్తి అయింది. నా ఐదు సంవత్సరాల కృషి ఫలించింది.

ఐదు సంవత్సరాల కిందట శ్రీ తిరుమల వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు వెళ్లాను. స్వామి వారి దర్శనము తరువాత బయట కూర్చుని వున్నాను. అప్పుడు నాకు దైవికంగా ఒక ఆలోచన వచ్చింది. అదే... మహాభారత కధను తేట తెలుగులో రాస్తే ఎలా ఉంటుందా అని.... నేను హైదరాబాదు వచ్చినా నాకు అదే ఆలోచన. అప్పటికే నేను తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించిన  మహాభారతము పరిశోధిత గ్రంధము నాలుగు సంపుటములు కొని పెట్టుకున్నాను. అది చదవడం మొదలెట్టాను. మా గురువుగారు  శ్రీ యమ్.నరశింహారావుగారిని అడిగి సందేహాలు తీర్చుకున్నాను. ఆ ప్రకారంగా నా మహాభారత రచనకు అంకురార్పణ జరిగింది. ఇంక ఎలా రాయాలి అనేది ఒక సంశయం.

నేను 1999 లో హైకోర్టు సర్వీసు నుండి రిటయిర్ కాగానే ఒక కంప్యూటర్ కొనుక్కున్నాను. ఒక ఇన్సిట్యూట్ లో చేరి విండోస్, యం.యస్. ఆఫీస్, అడోబ్ పేజిమేకర్, శ్రీలిపి తెలుగు నేర్చుకున్నాను. మేము ప్రతి ఆదివారము సత్సంగము చేస్తాము. దానికి ఉపయోగపడే ఒక చిన్ని పుస్తకాన్ని మా గురువుగారి ప్రోద్బలంతో కంప్యూటర్‌లో రూపొందించాను. అది అందరి మన్ననలు పొందింది. ఆ అనుభవంతో మహాభారత కధను తేటతెలుగులో డిజిటల్‌లో రూపొందించడానికి పూనుకున్నాను.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

కొంతకాలానికి శ్రీయుతులు కె.వి.రావుగారు, విష్ణుప్రసాద్ గారు, కృష్ణార్జునులు మాదిరి నాకు పరిచయం అయ్యారు. నాకు భక్తిపేజీల గురించి తెలిసింది. అప్పటినుండి మహాభారతము ధారావాహికంగా తెలుగు భక్తి పేజీలు సంచికలో వస్తూ ఉంది. ఈ ఐదు సంవత్సరాలు నెలకు ఒక్క ఆశ్వాసము వంతున రాసి పంపాను. ఏ ఒక్క నెల కూడా తప్పలేదు. అది అంతా ఈ శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షము అని చెప్పాలి. ఈ నాటికి శ్రీ మహాభారతము ఏ ఒడిదుడుకులు లేకుండా పూర్తి అయింది.

ఇన్ని రోజులు నన్ను ఆదరించి ప్రోత్సహించిన శ్రీయుతులు కె.వి.రావుగారికి, విష్ణుప్రసాద్ గారికి, గోపీకృష్ణ గారికీ, మహాభారతమును చదివి నాకు తగు సలహాలనిస్తూ ప్రోత్సహించిన పాఠకులకు నా హృదయపూర్వక నమస్కారాలు తెలుపుకుంటున్నాను.

## మహాభారతము పుట్టుపూర్వోత్తరాలు.

మహాభారతము ఐదేండ్ల పాటు అధ్యయనం చేసిన తరువాత నాకు కొన్ని విషయాలు తెలిసాయి. అవి మీతో పంచుకోవాలి అనుకున్నాను. అందుకే ఈ శీర్షిక రాస్తున్నాను.

భారతదేశ చరిత్రను అనుసరించి క్రీస్తుపూర్వము ఐదువేల ఏండ్లకు పూర్వమే మన దేశంలో అక్కడక్కడా నదీతీరాల్లో మానవులు నివసిస్తూ ఉండేవారు. ఎక్కువగా సింధునదీ తీరప్రాంతాలలో, గంగా యమునా తీర ప్రాంతాలలో ఉండేవారు. అప్పుడు ఉత్తర దిశనుండి కొంత మంది సంచార జాతులు ( ఆర్యులు) మన దేశంలోకి వచ్చారు. వారు ఆజానుబాహులు. ప్రకృతి శక్తులను ఆరాధించేవారు. వారికి అప్పటికే స్థానికంగా ఉన్న జాతులకు పోరాటం

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

జరిగింది. కొంత మంది పారిపోయారు. మరి కొంత మంది వారిలో కలిసిపోయారు. ఇది ఏ  పది ఇరవై ఏండ్లలో జరిగింది కాదు. వందల సంవత్సరాలు జరిగింది. తరువాత ఆర్యులు స్థానికులతో కలిసి నదీతీరములలో స్థిరనివాసము ఏర్పరచుకున్నారు. గణములు ఏర్పడ్డాయి. జనపదాలు ఏర్పడ్డాయి. వారికి రాజులు ఏర్పడ్డారు. వర్ణవ్యవస్థ రూపుదిద్దుకుంది.

రాజులతో పాటు జ్ఞానులు, ఋషులు కూడా వృద్ధిచెందారు. వారు కూడా నదీ తీరాలలో ఆశ్రమాలు, గురుకులాలు ఏర్పరచుకున్నారు. వారి శిష్యులకు తాము చూచినవి (ద్రష్టలు), విన్నవి (శ్రుతులు) తాము జ్ఞాపకం ఉంచుకొన్నవి (స్మృతులు) శిష్యులకు చెప్పసాగారు. ఆ శిష్యులు కూడా తాము చూచినవి, విన్నవి, తెలుసుకొన్నవి, జ్ఞాపకం ఉంచుకున్నవి తమ తమ శిష్యులకు చెప్పసాగారు. అలా గురు శిష్య పరంపరగా తెలుసుకోదగ్గ విషయాలు, విజ్ఞానదాయకమైన విషయాలు ఒకరి నుంచి ఒకరికి మౌఖికంగా అందించబడ్డాయి. అవే వేదములు. (విద అనగా జ్ఞానము, తెలుసుకోదగ్గది అని అర్థం). ఆ ప్రకారంగా అపౌరుషేయములు అనగా ఏ ఒక్కరి చేతా చెప్పబడని, అందరి చేతా చెప్పబడిన వేదములు శతాబ్దాల పాటు  మౌఖికంగా గురుశిష్య పరంపరగావృద్ధిచెందాయి.

కలగా పులగంగా ఉన్న వేదములను ఒక క్రమ పద్ధతిలో పెట్టే బృహత్కార్యమును స్వీకరించాడు వ్యాసుడు.  దేవతలను స్తుతించే స్తుతులు, స్తోత్రాలు, రాజుల కథలు,  ఆ  నాటి ఆచార వ్యవహారాలు, అలవాట్లు, దురలవాట్లు, ఆర్థిక,సామాజిక పరిస్థితుల గురించి చెప్పబడిన శ్లోకములను (ఋక్కులను, మంత్రములను) ఒక చోట చేర్చి దానికి ఋగ్వేదము అని నామకరణం చేసారు. తరువాత, యజ్ఞములు, యాగములు, వ్రతములు, క్రతువులు, అవి చేసే విధానము, యజ్ఞము ఎలా చెయ్యాలి, ఏయే మంత్రాలు

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వల్లించాలి, యజ్ఞకుండము ఎలా నిర్మించాలి, వేటి వేటిని బలి ఇవ్వాలి. ఊపస్తంభములు ఎన్ని ఉండాలి ఇటువంటి వివరములతో కూడిన మంత్రములను అన్ని కూర్చి దానికి యజుర్వేదము అని పేరుపెట్టారు. కొంత మంది గాన ప్రియులు ఈ మంత్రములను సరళంగా, రాగయుక్తంగా చదవడం చేసేవారు. అలా రాగయుక్తంగా చదవడానికి అనుకూలంగా ఉండే మంత్రములను ఋగ్వేదమునుండి, యజుర్వేదమునుండి వేరు పరిచి వాటికి సామవేదము అని పేరు పెట్టారు. ఇలా మూడు వేదములు ఏర్పడ్డాయి.

నిజానికి వేదములు మూడు. అందుకే త్రయీ వేదములు త్రయీ విద్య అని అంటారు. కాని పైమూడు వేదముల పరిధిలోకి రాని అంశములు వాటికి సంబంధించిన శ్లోకములు అన్నిటినీ అధర్వణవేదములో చేర్చారు. అందులో మంత్ర తంత్రములు, యుద్ధ తంత్రములు, అస్త్రశస్త్రముల వివరములు ప్రయోగ ఉపసంహారములు, యుద్ధరీతులు, ఇలా అన్ని రకములైన శాస్త్రములు అధర్వణవేదములో చేర్చారు. కాబట్టి ఒక వేదములో ఉన్న మంత్రములు మరొక వేదములో కూడా కనపడుతాయి. ఆ ప్రకారంగా వేదవిభజన జరిగింది.

ఇక్కడే ఒక చిక్కు వచ్చి పడింది. ఈ వేదములు సామాన్య జనాలకు అర్ధంకావడం లేదు. బ్రాహ్మణుల చేతిలోనే ఉండేవి. కొందరు స్వార్ధబుద్ధితో వేదములు బ్రాహ్మణేతరులు, స్త్రీలు చదవరాదు అని నిషేధించారు. అప్పుడు వేదవిద్యను అందరికీ అందుబాటులోని తీసుకురావాలనే ఆకాంక్షతో వేదవ్యాసుడు ఒక ఇతిహాస రచనకు పూనుకున్నాడు. ఇతిహాసము అంటే ఇలా జరిగింది అని అర్థము. వేదకాలంలో జరిగిన సంఘటనలు, వేదములలో చెప్పబడిన రాజులు, పాత్రలు ఆధారంగా ఆ ఇతిహాసము వ్యాసుడు రచించాడు. దానికి జయ అనే పేరు పెట్టాడు. ఆ ఇతి హాసము రాయడానికి వ్యాసునికి మూడు సంవత్సరములు పట్టింది. జయ అనే ఇతిహాసము 24,000

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

శ్లోకములతో వ్యాసుని చేత రాయబడినది. దీనిని మూలభారతము అని అనవచ్చును.

తరువాత అర్జునుని మనుమడు పరీక్షిత్తు రాజ్యానికి వచ్చాడు. ఆయన కుమారుడు జనమేజయుడు. ఆయన సర్పయాగం చేసాడు. ఆ యాగమునకు వ్యాసుడు శిష్య సమేతంగా వచ్చాడు. ఆ యాగము ఆస్తీకుని చొరవ వలన అర్థంతరంగా ఆగిపోయింది. ఆ సమయంలో యాగమునకు వచ్చిన ఆహూతులు వ్యాసుని చూచి తమకు ఏదైనా పుణ్య కథ వినిపించమని కోరారు. అప్పుడు జయ ఇతిహాసమును వినిపించమని వ్యాసుడు వైశంపాయనుని ఆదేశించాడు. అప్పుడు జనమేజయుని ఉద్దేశించి వైశంపాయనుడు వ్యాసుని చేత రచింపబడిన జయ ఇతిహాసమును వినిపించాడు. ఆ చెప్పడంలో కొన్ని ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు చేర్చాడు. అప్పుడు అది భారంగా పరిణమించి భారతము అయింది.

వ్యాసుని చేత చెప్పబడిన ఆ భారతాన్ని ఉగ్రశ్రవసుడు అనే సూతి శ్రద్ధగా విన్నాడు. తరువాత కొంత కాలానికి ( ఎంత కాలమో తెలియదు. క్రీ.పూ.300 సంవత్సరములో అని విజ్ఞులు అంటారు) నైమిశారణ్యంలో శౌనకుడు ఇంకా ఇతర ఋషులు కలిసి సత్రయాగము నిర్వహించారు. అది పన్నెండేళ్ల పాటు సాగింది. పగలు యాగము. మరి సాయంత్రము హరికథాకాలక్షేపము, పురాణ కాలక్షేపము కావాలి కదా. దాని కోసరం ఎదురు చూస్తూ ఉంటే పైన చెప్పబడిన ఉగ్రశ్రవసుడు అక్కడకు వచ్చాడు. శౌనకుడు మొదలగు ఋషులు ఆయనను ధర్మశాస్త్రము,హరికథా భరితము అయిన కథను వినిపించమని కోరారు. అప్పుడు ఉగ్రశ్రవసుడు అనే సూతి, తాను వైశంపాయనుని ముఖతా విన్న భారతమును వారికి వినిపించాడు. ఆ వినిపించడంలో ఆయన ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడు. ఎన్నోవ్యాఖ్యానాలు వివరణలు ఇచ్చాడు. మరికొన్ని

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఉపాఖ్యానులు చేర్చాడు. దానితో గ్రంధ విస్తరణ జరిగింది. భారతము కాస్తా మహాభారతము అయింది. కాబట్టి నేడు మనకు అందుబాటులో ఉన్నది ఉగ్రశ్రవసుడు చే చెప్పబడిన మహాభారత ఇతిహాసము.

కాబట్టి మహాభారతము మూడు దశలలో విస్తరించింది అనేది నిర్వివాదాంశము. మొదట రాసినది జయ కావ్యము వ్యాసుడు కర్త. రెండవది వైశంపాయనుడి చే చెప్పబడిన భారతము. మూడవది సూతి చే చెప్పబడిన మహాభారతము. అసలు ఈ జయ కావ్యము వ్యాసుడు రాయడానికి ఆధారము ఏమిటి? ఈ కధ కల్పితమా లేక నిజంగా జరిగిందా! అనేవి జవాబు లేని ప్రశ్నలు. కాని కొన్ని ఆధారాలతో మనం కొంత ఊహించవచ్చును.

ఒకసారి మనము మహాభారత కధను మననం చేసుకుందాము. విచిత్రవీర్యునికి సంతానం లేదు. వ్యాసుని నియోగము వలన సంతానం కలిగింది. వారే ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు. పాండురాజుకు సంతానము లేదు. దేవతల నియోగము వలన అరణ్యములో ధర్మరాజు మొదలగు పంచపాండవులు పుట్టారు. హస్తినలో సుయోధనాదులు జన్మించారు. కుంతి పాండవులను తీసుకొని మునులతో హస్తినకు వెళ్లింది. భీష్మాదులు వారిని ఆదరించారు. రాకుమారులందరూ విద్యాభ్యాసము చేసారు. యువరాజు ఎవరు అన్న ప్రశ్న తలెత్తింది. అంతా ధర్మజుడు అన్నారు. సుయోధనునికి ఇది నచ్చలేదు. ఫలితంగా పాండవులను వారణావతమునకు పంపి వారిని హతమార్చబోయాడు. కాని విదురుని మంత్రాంగంతో పాండవులు బతికి బయటపడ్డారు. తరువాత ద్రౌపదితో వివాహము, హస్తిన ప్రవేశము జరిగాయి.

మరలా రాజ్యము గురించి చర్చ. ఈ సారి రాజ్యవిభజన జరిగింది.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఎందుకూ పనికిరాని ఖాండవ ప్రస్థమును పాండవులకు ఇచ్చి ఏలుకొమ్మన్నారు. పాండవులు దానిని కష్టపడి ఇంద్రప్రస్థంగా మార్చారు.

( ఉదాహరణకు..... 50 ఏళ్ల కిందట హైదరాబాదులో ఉన్న బంజారా హిల్సు, జూబిలీ హిల్సు అనే కొండలు,గుట్టలు ఉన్న ప్రదేశాలు ఖాండవ ప్రస్థము అయితే, నేడు అత్యంత సంపన్న కుటుంబాలు, కళ్లు చెదిరే భవనాలు, ఖరీదైన షాపింగ్ మాల్సు, సామాన్యులు కన్నెత్తి కూడా చూడలేని రెస్టారెంటులు ఉన్న బంజారా హిల్సు జూబిలీ హిల్సు ఇంద్రప్రస్థము అన్నమాట)

నాలుగు దిక్కులు జయించి రాజసూయ యాగము చేసారు. అంతా సుఖంగా ఉన్నారు. ఈ కథ ఆది పర్వము, సభాపర్వములో సగభాగం అయింది.

కథా పరంగా చూస్తే ఇంక చెప్పడానికీ వినడానికీ ఏమీ లేదు. ఎవరి రాజ్యం వారు చేసుకుంటూ సుఖంగా ఉన్నారు. కాని వ్యాసుడు ఊరుకోలేదు. ఏదో ఒక సంఘటన జరగాలి. దుర్ఘటన జరగాలి. అది ఏమిటి! మూల భారతానికి అంటే జయ కావ్యానికి అదే ఆయువు పట్టు కావాలి.

సాధారణంగా ఒక కథ రాయాలన్నా నవల రాయాలన్నా, సినిమా తీయాలన్నా ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఉంటుంది. ఆ సంఘటన చుట్టు పాత్రలు, కథ తిరుగుతుంది.

అలాగే జయ కావ్యంలో ఆ ఆయువు పట్టు ద్యూతము, ద్రౌపదీ వస్త్రాపహరణము. ఈ రెండు సంఘటనలు కథను ఒక మలుపు తిప్పాయి. మరి ఈ సంఘటనకు మూలం ఎక్కడ. అని విచారిస్తే ఋగ్వేదంలో దీనికి

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

మూలందొరుకుతుంది. అదే ద్యూతసూక్తం. ఋగ్వేదంలో ఆరవ సూక్తము.

మం॥ అన్యేజాయాం పరిమృశన్త్యస్య యస్యాగృధద్వేదనేవాజ్య ఉక్షః।
పితామాతా ఏన భ్రాతర ఏన మాహుః నజానీమో నయతాబద్ధమేతమ్॥

యస్య= ఏ జూదరికి
వేదనే= ధనమునందు
వాజీ= బలవంతమగు
అక్షః= పాచిక
అగృధత్= కోరికలను అంటే ఆశలను కలుగజేయుచున్నదో
తస్య అస్య= అటువంటి జూదరి యొక్క
జాయాం= భార్యను
అన్యే= ఇతరులు, తోటి జూదరులు,

**పరిమృశన్తి= వస్త్రములను, కేశములను లాగుచున్నారు.**

పితా మాతా= ఆ జూదరి తల్లి తండ్రులు
భ్రాతరః= సోదరులు
ఏనం= ఆ జూదరిని గూర్చి
ఆహుః= ఇట్లు చెప్పుచున్నారు
బద్ధమేతం= కట్టబడిన ఈ జూదరిని
నయత= మీ ఇష్టం వచ్చినట్టు చేయండి.

దీనిని బట్టి ఆ రోజుల్లో జూదంలో ఓడి పోయిన వాని భార్యను ఇతరులు జుట్టు పట్టిలాగి బట్టలు ఊడదీసి అవమానపరుస్తారు అని అర్థం అవుతూ ఉంది.
ఇది ద్యూతమునకు సూచన మాత్రమే.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఈ ద్యూతమునకు సూత్రధారి శకుని. వస్త్రాపహరణముచేసిన వాడు దుశ్శాసనుడు. మరి ఈ పాత్రల సృష్టి ఎలా జరిగింది అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఇవి కూడా మనకు ఋగ్వేదములో ఉన్నాయి అంటే అతిశయోక్తి కాదు.

ఈ ద్యూతము జరిగింది అని ఋగ్వేదము 10–43–5 సూక్తములో మనకు కనపడుతుంది. పాండవుల యొక్క రాజ్యసర్వస్వమును శత్రువుల పరం చేసిన ద్యూతము అని చెప్పబడింది. పాచికలు వేసిన వాడు శ్వఘ్నిఅని ఆ సూక్తంలో ఉంది. ఆ పేరు శకునిగా మారి పోయింది.

ఈ ద్యూతము గురించి మరొక చోట కూడా చెప్పబడింది. అది ఋగ్వేదము 10–34. ఈ సూక్తమునకు ఋషులు కవషుడు, ఐలూషుడు, మౌజవత అక్షుడు. ఈ మంత్రములో నేను జూదంలో నా భార్యను పణంగా పెట్టాను. నాకు కోపం కానీ, అసూయ గానీ, సిగ్గు కానీ లేదు. అని ఉంది. ఆ మౌజవత అక్షుడే యుధిష్ఠిరుడు అని చెప్తారు.

తరువాత భారతములో ఇంకొక విశేషము ఉంది. అదే ద్రౌపది ఐదుగురు భర్తలను వివాహ మాడటం. ఆ రోజుల్లో బహు భార్యాత్వము అమలులో ఉంది. ధృతరాష్ట్రునకు గాంధారి కాక మరో వందమంది భార్యలున్నారు. అలాగే పాండవులకు ద్రౌపది కాకుండా ఒక్కొక్కరికీ పది మంది భార్యలు ఉన్నారు. అర్జునుడు ఎక్కడకు పోతే అక్కడ ఒకరిని వివాహమాడుతూ ఉన్నాడు. శ్రీకృష్ణునికి ఎనిమిదిమంది భార్యలు. కాని ఎక్కడా ఒకే స్త్రీకి ఐదుగురు భర్తలు లేరు, ఒక్క ద్రౌపదికి తప్ప.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఈ ద్రౌపది ఎవరు? వేదములో ఈమె ప్రసక్తి ఉన్నదా అని విచారిస్తే ఉంది అని అంటారు పెద్దలు. ఋగ్వేదములో 1-167-లో 5, 6 మంత్రములు ఉన్నాయి. అందులో కక్షీవతునికి ఒక కుమార్తె ఉంది. ఆమె పేరు ఘోష. అనేక మంది మరుత్తులకు ఈమె భార్య అయింది.  అందుకే భారతంలో కూడా మరుత్తుల(దేవతల) అంశలతో జన్మించిన  పాండవులకు ద్రౌపది భార్య అయింది.  ఋగ్వేదము 1-122-5 మంత్రములో కక్షీవతుడు తన పుత్రిక ఘోషకు అర్జునుడు భర్త కావాలని ప్రార్థించినట్టు ఉంది. భారతంలో కూడా  తన కుమార్తె ద్రౌపదికి అర్జునుడు భర్త కావాలని మత్స్య యంత్రమును ఒక్క అర్జునుడే ఛేధించగలడని, ద్రౌపదీ స్వయంవరమునకు మత్స్యయంత్రమును రూపొందించాడు ద్రుపదుడు.

యోగపరంగా ఆలోచిస్తే కూడా..... భారతములో ద్రౌపది ద్రుపదుని కుమార్తె. ద్రుపద అనే శబ్దమునకు కణుపులు కల వెన్నెముక అని అర్థం కూడా ఉంది. ఆ వెన్నెముక లోనుండి పుట్టినది కుండలినీ శక్తి. ఆ  దివ్యశక్తి స్వరూపిణి యే ద్రౌపది.  అందుకే ఐదుగురు భర్తలున్న ఆమె మహా పతివ్రత అయింది. అందరికీ పూజనీయురాలు అయింది.

భారతంలో అత్యంత శక్తి వంతమైన పాత్ర అభిమన్యుడు. అభిమన్యుని గురించి 4-16-12 లో  ఉదహరింప బడింది. అతడు కుత్సుడు అనే వాని కుమారుడు. ఇంద్రుడు కుత్సుని రక్షించడానికి కుత్సుని కుమారుడైన ఉపమన్యుని రాక్షసుల మీదికి యుద్ధానికి పంపాడు.  మరొక మంత్రంలో (1-102-9)లో శత్రుసైన్యములోకి చొచ్చుకుపోతున్న తన కుమారుడు ఉపమన్యుని రక్షించి జయం కలిగించమని కుత్సుడు ఇంద్రుని ప్రార్థించినట్టు ఉంది. ఆ ఉపమన్యుడే భారతంలో అభిమన్యుడు, ఆ కుత్సుడే అర్జునుడు  అని చెప్పవచ్చును.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఇక్కడ మరొక విషయం మనం ప్రస్తావించుకోవాలి. కొంచెం విరుద్ధంగా తోచినా ఇది ఇలా చెప్పబడింది. శ్రీ కృష్ణుడు ఇంద్రుని అవతారము. మనకు ఇది కొత్తగా ఉంటుంది. ఇందాక కుత్సుని అర్జునునిగా అనుకున్నాము కదా. ఋగ్వేదంలో ఒక మంత్రం ఉంది. సంవరణుడు అనే మహర్షి కుత్సునకు సారథ్యపమొనర్చుటకు ఇంద్రుని ప్రార్థించే మంత్రము. (ఋ.5–33 లో 2,3 మంత్రములు). అందులో ఇలా ఉంది.

"ఓ ఇంద్రా! మన్త్రపూర్వకములైన మా స్తోత్రములచే నీవు మమ్ములను కాపాడుటకు అశ్వచోదకుడవు కమ్ము..........ఓ వజ్రహస్తా! ప్రసిద్ధమైన కుత్స రథమును అధిష్టించి నీవు సారధివగుచు అశ్వములను నడుపుము." అని ఉంది.

భారతములో చిన్న మార్పుతో అర్జునుడే కృష్ణుని తన రథము నడుపుము అని కోరినట్టు ఉంది. కాబట్టి ఈ విధంగా కృష్ణుడు అర్జునునికి సారధి అయ్యాడు అని ఋగ్వేదములో కూడా ఉంది అని అనడంలో సందేహంలేదు.

ఇదే మాదిరి మనకు భారతములో కనిపించే ధృతరాష్ట్రుడు, గాంధారి, సుయోధనుడు, మొదలగు పాత్రలన్నీ ఋగ్వేదములో ఉన్నాయి.

కావ్యకంఠ శ్రీ వాశిష్ఠ గణపతి ముని గారిచే సంస్కృతములో రచింపబడి శ్రీ గుంటూరు లక్ష్మీకాంతం గారిచే తెలుగులోకి అనువదింప బడిన అత్యద్భుత విమర్శ గ్రంథము భారత చరిత్ర పరీక్ష లో వివరింపబడ్డాయి. నేను పైన చెప్పిన ఋగ్వేద మంత్రములు అన్నీ ఆ గ్రంథములో నుండి గ్రహింపబడినవి. వారికి నా మనఃపూర్వక కృతజ్ఞతాభి వందనములు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

జయ కావ్యమును వ్యాసుడు రచించాడని, వైశంపాయనుడు దానిని విస్తృతపరచి భారత గ్రంధముగా జనమేజయునికి చెప్పాడని, మరలా దానికి ఆఖ్యానములు, ఉపాఖ్యానములు చేర్చి మహాభారత గ్రంధముగా సూతి అనే ఉగ్రశ్రవసుడు రచించాడని చెప్పుకున్నాము. కాబట్టి ప్రస్తుతము మనము చదువుతున్న సంస్కృత మహాభారతము ఉగ్రశ్రవసుడు రచించినది అని పండితుల అభిప్రాయము. ఈ భారత కథ యధాతథంగా కాకుండా వేరే రూపంలో వేరు వేరు పేర్లతో జరిగింది అనడంలో అతిశయోక్తి లేదు. కాని ఎప్పుడు జరిగింది అనేది ప్రశ్న.

ఋగ్వేదము దశమ మండలంలో వర్షకామ సూత్రము అని ఉంది. దాని ఋషి దేవాపి. ఈ దేవాపి సూక్తంలో శంతనుడు, దేవాపి, కురువంశమునకు చెందిన సోదరులు అని ఉంది. దేవాపి తపస్సుకు వెళితే శంతనుడు పట్టాభిషిక్తుడయ్యాడు. అప్పుడు ఘోరమ్మైన కరువు వచ్చింది. అప్పుడు దేవాపి శంతనునిచేత యజ్ఞము చేయించాడు. ఈ విషయములన్నీ ఆ సూక్తములో ఉన్నాయి. పైన చెప్పబడిన శంతనుడే కురుపితామహుడు దేవవ్రతునికి (భీష్మునికి) తండ్రి. ఆ సూక్తము దశమ మండలంలో ఉంది. దశమ మండలం ఋగ్వేద కాలము మధ్యలో జరిగింది. కాబట్టి భారత కథ కూడా ఋగ్వేద కాల మధ్యలో జరిగినది అని పండితుల అభిప్రాయము.

అదే కాకుండా అంగిరస ఘోరుడు అనే ఋషికి శ్రీకృష్ణుడు శిష్యుడు అని ఛాందోగ్యోపనిషత్తులో చెప్పబడింది. ఈ అంగిరస ఘోరుడు ఋగ్వేద కర్త. అంగిరస ఘోరునితో పాటు ఆయన కుమారుడు కణ్వుడు, మనుమలు ప్రస్కణ్వుడు, మేధాతిధి, పర్వతుడు, నారదుడు అందరూ ఋగ్వేద మంత్రములు రచించిన వారే. వారందరూ శ్రీ కృష్ణునికి సమకాలీనులు కానీ

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అంతకు ముందు కానీ ఉన్నట్టయితే పాండవులు కూడా అప్పటి వారే కదా. ఈ ప్రకారం కూడా భారత కథ ఋగ్వేదకాలం మధ్యకాలం లో జరిగింది అని చెప్పవచ్చును.

ఋగ్వేద కాలమును క్రీస్తు పూర్వము 4760 సంవత్సరములకు ముందు జరిగిందని నిరూపితమయింది. కాబట్టి దాదాపు క్రీ.పూ. 5000 సంవత్సరముల కిందట భారత కథ జరిగి ఉంటుందని, అంతకన్నా ముందు జరిగే అవకాశము లేదు అని పండితుల అభిప్రాయము.

మరి ఈ భారత కథ రాసినది వ్యాసుడు అని మనందరికీ తెలుసు. కాని ఈ వ్యాసుడు భారత కథలో ఉన్నాడు. అయన కూడా అక్కడక్కడ వస్తూ పోతూ ఉంటాడు. భారత కథలో పరాశరునికి కన్యగా ఉన్నప్పుడు సత్యవతికి పుట్టిన వ్యాసుడు, జయ కావ్యమును రచించిన వ్యాసుడు ఒకరేనా అని సందేహము. భాషను బట్టి మనము కొంత వరకు నిర్ధారింప వచ్చును.

ఋగ్వేదము మధ్యకాలము లో రచించిన ఋగ్వేదసూక్తముల ప్రకారము అప్పటి భాష చాలా కఠినము. మామూలు సంస్కృత పండితులకు కూడా అర్థం కాదు. కాని భారతములో వాడిన భాష మామూలు సంస్కృతము వచ్చిన వారికి కూడా అర్థం అవుతుంది. కాబట్టి భారత కర్త వ్యాసుడు, ఋగ్వేదము మధ్యకాలములో ఉన్న వ్యాసుడు ఒకటి కావడం అసంభవం అని పండితుల అభిప్రాయము. వ్యాసుని తండ్రి పరాశరుడు కూడా ఋగ్వేద మధ్య కాలము నాటి వాడే. ఎందుకంటే పరాశరుని కి చెందినవి ఋగ్వేదములో 9 సూక్తములు ఉన్నాయి.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఇంక జయ కావ్యమును వ్రాసిన వ్యాసుని గురించి చర్చిద్దాము. వ్యాసుడు రాసిన జయ కావ్యములో ఈ నాడు మనము చదువుకుంటున్న భగవద్గీత ఈ రూపంలో లేదు. క్లుప్తంగా ఉంది. ఎందుకంటే భగవద్గీత ముఖ్యంగా ఉపనిషత్తుల మీద ఆధార పడి రచించబడింది. అందువలన, జయ కావ్య కర్త వ్యాసుడు ఉపనిషత్తుల ముందు కాలము వాడని, వేదకాలము తరువాతి వాడని పండితుల అభిప్రాయము. దీనికి కారణం ఉంది. వేదాంగములలో జ్యోతిషము ఒక అంగము. అది క్రీ.పూ.1100 సంవత్సరములకు కొంచెము అధికము. అప్పటికే ఉపనిషత్తులు రచింపబడ్డాయి. అంతకు ముందే వ్యాసుడు జయ కావ్యమును రచించాడు. అనగా జయ కావ్యమును రచించిన వ్యాసుడు క్రీ.పూ.1500 కంటే తరువాతి వాడు కాడు అని చెప్పవచ్చును. కాబట్టి జయ కావ్యమునకు, క్రీ.పూ.300 సంవత్సరములో సూతి చే రచింపబడిన మహాభారతమునకు మధ్య దాదాపు 1200 సంవత్సరములు గడిచిపోయాయి అన్ని కావ్యకంఠ శ్రీ వాశిష్ఠముని గారి అభిప్రాయము.

జయ కావ్యమును భారతముగా తీర్చి దిద్దిన వాడు వైశంపాయనుడు. ఈ వైశంపాయనుడు ఎప్పటి వాడు? మనకు తెలిసి నంతవరకూ వైశంపాయనుడు వ్యాసుని శిష్యుడు. ఆ వైశంపాయనుడు జనమేజయుడు చేసిన సర్పయాగ సందర్భంలో వ్యాసుని ఆదేశం మేరకు భారత కథను జనమేజయునికి వినిపించాడు. కాని వేదముల ప్రకారము, చారిత్రక ఆధారముల ప్రకారం వాస్తవాలు వేరుగా ఉన్నాయని పండితుల అభిప్రాయము. వైశంపాయనుడు క్రీ.పూ.1000 సంవత్సరములకు అటు ఇటుగా ఉన్నాడు. అంటే పాణిని కంటే ముందు వాడు. వైశంపాయనుడు భారత కథను చెప్పగా విన్న జనమేజయుడు కూడా కురువంశమునకు చెందిన వాడే కానీ అర్జునుని ముని మనుమడు కాజాలడు. కేవలం ఆ సంతతికి చెందిన వాడు మాత్రమే. అదే ప్రకారంగా వైశంపాయనుడు కూడా వ్యాసుని పరంపరా శిష్యుడు కాని

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

వ్యాసుని శిష్యుని కాడు. ఈ నిర్ణయానికి రావడానికి కావ్యకంఠ శ్రీ వాశిష్టగణపతిముని శ్రేష్టులు తా ము రచించిన భారత చరిత్ర పరీక్షలో ఎన్నో కారణములు ఉదాహరణములు ఇచ్చారు.

ఇంక ప్రస్తుతము మనకు అందుబాటులో ఉన్న మహాభారత సంహిత ఉగ్రశ్రవసుడు అనే సూత పౌరాణికుడు రచించినది. ఈ మహాభారతము క్రీ.పూ. మూడవ శతాబ్దములో రచింప బడినది అని చెబుతారు. ఎందుకంటే మహాభారతములో కలికాలము గురించి చెప్పినపుడు బౌద్ధస్తూప నిర్మాణము గురించి ప్రస్తావించారు. బౌద్ధస్తూపములు అశోకుడు క్రీ.పూ.274 తరువాత నిర్మించారని చారిత్రక ఆధారాలు. కాబట్టి మహాభారత రచన దాని తరువాత జరిగి ఉండాలి. ఇంకొక ఆధారము ఏమిటంటే మహాభారత రచనలో రాసుల గురించి ప్రస్తావన లేదు. మన దేశానికి రాసుల గురించిన జ్ఞానము యవనుల రాక తరువాతనే కలిగింది. యవనులు మన దేశానికి క్రీ.పూ.150 లో వచ్చినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కాబట్టి మహాభారత రచన అంతకు ముందే జరిగి ఉండాలి. దీనిని బట్టి మహాభారతము సూతి చేత క్రీ.పూ.3 వ శతాబ్దములో రచించబడింది అని చెప్పవచ్చును . అప్పటికి బౌద్ధము మంచి ఉచ్ఛస్థితిలో ఉంది. సనాతన ధర్మము అడుగంటి పోయింది. వేదములు, ఉపనిషత్తులు సామాన్య జనులకు అందుబాటులో లేవు. ఎన్నో ఆంక్షలు. అందుకని, మరలా సనాతన ధర్మము పునరుద్ధరించుటకు, సామాన్య జనము చదువుకొనుటకు వీలుగా ఒక మహత్తర గ్రంధ రచన అవసరమైనది. అప్పటికే వ్యాసుని జయ కావ్యము, వైశంపాయనుని భారతము వ్యాప్తి లో ఉన్నందున, సూతి వాటిని విస్తృత పరిచి, అనేకానేక ఆఖ్యానములను, ఉపాఖ్యానములను, నీతి శాస్త్ర విషయములను చేర్చి మహాభారత కధ రచించాడు . అందుకే మహాభారతము ధర్మ జిజ్ఞాసువులకు ధర్మశాస్త్రముగానూ, రాజనీతి వేత్తలకు నీతి శాస్త్రముగానూ, బ్రహ్మ జిజ్ఞాసువులకు జ్ఞాన శాస్త్రముగానూ, యోగ పరంగా

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఆలోచించే వారికి యోగశాస్త్రముగానూ, భగవద్భక్తులకు భక్తిని బోధించే శాస్త్రము గానూ, కేవలం కధాశ్రవణంతో తృప్తి పడేవారికి అనేక చిత్ర విచిత్ర కధలతోనూ, మహాభారతము విరాజిల్లింది. అందరూ చదవడానికి, ఆమోదించడానికి ఆస్కారమయింది.

ఈ విషయములన్నీ నేను మహనీయులు కావ్యకంఠ శ్రీ వాశిష్ఠ గణపతి మునీంద్రుల వారు రచించిన భారత చరిత్ర పరీక్ష అను ఉద్గ్రంధము నుండి సేకరించి మీకు అందించాను. వారికి నా మనఃపూర్వక కృతజ్ఞతాభి వందనములు.

అంతే కాకుండా, తిరుమల తిరుపతి దేవస్థానము వారు మహాభారతమును 15 భాగములుగా, అనేక పీఠికలు, కధా సంగ్రహములు, ప్రతిపదార్ధము, తాత్పర్య, విశేషార్ధములతో సహా ప్రచురించారు. ఆదిపర్వము మొదటి భాగమునకు పూజ్యులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం గారు పీఠిక రాసారు. అందులో కొన్ని భాగములను మీ సౌకర్యార్థము ఇక్కడ పొందు పరుస్తాను.

"కురుక్షేత్రయుద్ధం 5000 సంవత్సరాల క్రితం జరిగిందని జనశ్రుతి ప్రసిద్ధంగా ఉన్నది. కాని చరిత్రకారులు చెప్పే కాల నిర్ణయాలు క్రీ.పూ.14 వ శతాబ్దంనుండి 32వ శతాబ్దం వరకూ వేలాడుతూ ఉన్నాయి. అయితే శ్రీవేదవ్యాస్ ఐ. ఏ.యస్ గారు చేసిన కాలనిర్ణయం ప్రకారం కురుక్షేత్ర యుద్ధం క్రీ.పూ.1328 సం॥లో జరిగింది. మహాభారతంలోని అంతర్గత సాక్ష్యాలతోనూ, యుధిష్ఠిర జనమేజయుల పేర్లతో కనపడుతున్న శాసనాధారాలతోనూ, మరికొన్ని చారిత్రక పరిస్థితులతోనూపరిశీలించిన తరువాత ఆ సంవత్సరంలో యుద్ధం జరిగి ఉంటుందని అనేకమంది ఇప్పుడు విశ్వసిస్తున్నారు. ఆ కాలాన్ని

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

బట్టి కురుక్షేత్రయుద్ధం జరిగి దాదాపు అయిదు వేల ఏండ్లు అయి ఉంటుంది అని అనటంలో కూడా కొంత సామంజస్యం కనపడుతున్నది.

కురుక్షేత్ర యుద్ధానికి ప్రత్యక్ష సాక్షి కృష్ణద్వైపాయనుడు. ఒక విధంగా ఆయన కురువంశాన్ని నిలిపినవాడు కూడా. ఆయనకు ఆ వంశచరిత్ర ఆమూలాగ్రంగా తెలుసు. అందుకే ఆయన ఆ ఇతిహాసాన్ని నిర్మించడానికి ఉత్తమ అధికారి. అంతకు మించి ఆయన మహర్షి, ద్రష్ట, స్రష్ట. అయితే ఆయన జయ కావ్యాన్ని ఎప్పుడు రచించి ఉండి ఉంటాడన్నది ఒక పెద్ద ప్రశ్న. జయాన్ని లోకంలో ప్రచారం చేయటానికి తన శిష్యులైన పైల, వైశంపాయన, సుమంత, జైమినులనే శిష్యులను నియోగించాడు. వారు దాన్ని భారతంగా పెంచారు. ఆ తరువాత సూతుడు (సౌతి) మహాభారతంగా విస్తృతపరిచాడు. వ్యాసుడు రచించిన జయ కావ్యాన్ని గురించి అర్జునునికి మూడవ తరంవాడైన జనమేజయుడి కాలంలో మొదట వినవస్తున్నది. వైశంపాయనుడు దానిని వినిపిస్తూ ఉపాఖ్యానాలతో పెంచాడు. అశ్వలాయన గృహ్యాసూత్రాలలో "భారత, మహాభారతాచార్యాః" అని వ్యాసశిష్యులైన పైల, వైశంపాయన సుమంతులను కీర్తించడం గమనిస్తే వారి కాలంలో జయకావ్యం, భారతంగా, మహాభారతంగా మారిన విషయం ధృవపడుతున్నది. ఆ తరువాత భారతాన్ని శౌనకాదులకు వినిపించిన సూతుడు వ్యాసశిష్యుడైన రోమహర్షణుని కుమారుడే. భారతం మహాభారతం కావటానికి మరొక తరం కాలం గడిచి ఉంటుంది. లేదా వైశంపాయనుని తరంలోనే భారతం మహాభారతం కాగా, దానిని సూతుడు మరీ పెంచి ఉంటాడు. ఈ విధంగా శ్రోతృజనాపేక్షలకు అనుగుణంగా పెరుగుతూ వచ్చిన సమగ్ర మహాభారత నిర్మాణం క్రీ.పూ.3 వ శతాబ్దం వరకూ సాగి ఉండవచ్చునని చరిత్రకారులు భావిస్తున్నారు.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

జయ కావ్యం మహాభారత రూపం తాల్చే నడిమి కాలంలో అందులో చేరిన అనేకాంశాలు ఆయాకాలాలలో తలయెత్తిన సామాజిక జీవన ధర్మాలను గురించిన మీమాంసలకు సమాధానాలై ఉంటాయి. క్రీ.పూ.3వ శతాబ్దానికి ముందే భారత దేశంలో ప్రవర్తిల్లి ఉన్న వేద సంస్కృతి మ్లేచ్ఛుల దండయాత్రలతో క్రొత్త సమస్యల నెదుర్కొన్నది. ప్రకృతి ఆరాధన, యజ్ఞయాగాది క్రతువులు క్రమంగా సన్నగిల్లటంతో వాటిని గురించిన అనేక ప్రశ్నలు ప్రజలలో రేకెత్తాయి. ఇంద్ర, వరుణాగ్ని సూర్యుల వంటి ప్రకృతి దేవతల స్థానంలో విష్ణు, రుద్ర, దేవీ మూర్తులు వెలసి వారి వారి శాఖలను విస్తరింప చేయటం మొదలు పెట్టాయి. ఆ తరువాత క్రమంగా జైన బౌద్ధ మతాలు దేశమంతా వ్యాపించాయి. మహారాజులు చక్రవర్తులు వైదిక ధర్మం వదిలి జైన బౌద్ధాలను స్వీకరించి వాటి ప్రచారానికి తోడ్పడ్డారు. దానితో వర్ణాశ్రమ ధర్మాలు, యజ్ఞయాగాది కర్మవిధానాలూ శిథిలమైపోసాగాయి. వేద ధర్మాన్ని ఆశ్రయించిన వ్యవస్థలు సడలిపోవటంతో బాగా దెబ్బతిన్నది గార్హస్థ్యాశ్రమ ధర్మం. జైన బౌద్ధాల వలన సమాజంలో సన్న్యాసులకు, సన్న్యాసినులకు గౌరవం పెరిగింది. అది ఆశ్రమ ధర్మంగా కాక మతధర్మంగా పరిణమించింది. పరిణత చిత్త సంస్కారం లేకుండా సన్న్యాసాన్ని స్వీకరించిన వారు దానికి న్యాయం చేయలేకపోగా, వ్యవస్థకు కీడు చేయవచ్చును. వేదధర్మంలో సమాజవ్యవస్థకు గార్హస్థ్య ధర్మమే పునాదిగా పేర్కొనటం ప్రసిద్ధం. జైన బౌద్ధాల ప్రాబల్యం వలన దెబ్బతిన్న కుటుంబ వ్యవస్థను, వేదధర్మాన్నీ పునరుద్ధరించుకోవలసిన అవసరం ఏర్పడింది. ఆ సామాజికమైన ధర్మపునరుద్ధరణ ఉద్యమంలో భాగంగా వేదవ్యాస మహర్షి రచించిన జయ కావ్యాన్ని ఆయన శిష్యులు బలమైన వాఙ్మయ సాధనంగా వాడుకొన్నారు. జయకావ్యానికి ముందున్న వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, పురాణాలు మొదలైన సాహిత్ శాఖలు వేద ధర్మాన్ని విపులంగా వివరించి ఉన్నాయి. ఆ తాత్పర్యాన్నంతా ఒక ఇతిహాసంలో ఇమిడ్చి మిత్రసమ్మితంగా చెప్పవలసిన అవసరమూ, కాలానుగుణమైన ధర్మ

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

సమన్వయాలు చేయవలసిన ఆగత్యమూ ఏర్పడింది. అందువలననే మహాభారతం పంచమ వేదంగా రూపొందింపబడింది.

శ్రుతులలో చెప్పబడిన తత్త్వాలకు ఆయా యుగాలకూ, కాలాలకూ అనుగుణంగా ఆచరణయోగ్యమైన ధర్మసూత్రాలను ప్రతిపాదించేవి స్మృతి గ్రంథాలు. వాటిల్లో మొదటిది మనుస్మృతి. ఆ తరువాత గౌతముడు, వసిష్టుడు, నారదుడు, ఆపస్తంభుడు మొదలైన వారు రచించిన ధర్మసూత్రాలు ప్రసిద్ధాలు. మనుస్మృతి కంటే ముందే పుట్టిన జయకావ్యంలో క్రమంగా ఆ యా స్మృతి గ్రంథాలలో అంశాలన్నీ చేరి దాన్ని భారతంగా, మహాభారతంగా మార్చి ఆయాకాలాల ప్రజలకు అనుగుణమైన ధార్మికజీవన సూత్రాలను అందిస్తూ వచ్చాయన్నమాట! స్మృతుల కంటే ముందు పుట్టి, స్మృతుల నన్నింటినీ తనలో యథావకాశంగా ఇముడ్చుకొని, విశ్వశ్రేయస్సు కోసం విశ్వరూపాన్ని తాల్చిన ఇతిహాసం మహాభారతం."
(పై విషయములు... తి.తి.దేవస్థానం వారు ప్రచురించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము ఆది పర్వము మొదటి భాగమునకు, బ్రహ్మశ్రీ జి.వి.సుబ్రహ్మణ్యం గారిచే రాయబడిన పీఠికలో నుండి సేకరింపబడినవి.)

చివరిగా ఒక్క మాట. మనము అందరమూ మహాభారతము చదువు కున్నాము కాబట్టి దాని పుట్టుపూర్వోత్తరముల గురించి తెలుసుకోవడం అవసరం కాబట్టి ఈ విషయములు అన్ని సేకరించి మీకు తెలియ పరిచాను. ఇప్పటి వరకూ మనము చదివిన మహాభారతములో ఎన్నో నీతికి సంబంధించిన విషయాలు ఉన్నాయి. నారదుడు ధర్మరాజుకు చెప్పినవి, విదుర నీతులు, యక్షప్రశ్నలు, భీష్ముడు ధర్మరాజుకు చెప్పిన నీతి కథలు, చివరగా ప్రపంచము మొత్తమూ ఆరాధించి శ్లాఘిస్తున్న శ్రీ కృష్ణార్జున సంవాదమైన భగవద్గీత..... ఇలాంటికి ఎన్నో ఉన్నాయి. ఇందులో ఉన్న ఏ ఒక్క విషయమైనా మనము

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

ఆచరించగలిగితే మన జీవితాలు ధన్యము అవుతాయి.

ఉదాహరణకు భగవద్గీతలో మొట్ట మొదటి శ్లోకము. అందులో మొట్ట మొదటి రెండు పదాలు. ధర్మక్షేత్రే కురుక్షేత్రే..... అనగా ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రమందు.... అని అర్థము. కురు క్షేత్రము అంటే కురుభూమి. అక్కడ ఎందరో మునులు ఆశ్రమాలు నిర్మించుకొని తపస్సు చేసుకుంటున్నారు. ఎందు కంటే బలరాముడు, సుయోధనుడు, భీముడు గదాయుద్ధము ఎక్కడ చేస్తున్నారు అని కనుక్కోడానికి కురుక్షేత్రంలో ఉన్న ముని వాటికలలో విచారించి తెలుసుకున్నాడు అని ఉంది. కాబట్టి మహాభారత యుద్ధము జరగక ముందు అది ధర్మక్షేత్రము. అన్నదమ్ములు కొట్టుకోడానికి ఆ ప్రదేశాన్ని ఎంచు కున్నారు. అప్పుడు అది యుద్ధ రంగమయింది.

ప్రతి మనిషీ పుట్టగానే అతని మనసు ధర్మక్షేత్రమే. ఏమీ తెలియవు. ఆ పసి మనసులో రాగద్వేషాలు, సుఖదుఃఖాలు ఉండవు. కాల క్రమేణా నేను... నువ్వు, ఇది నాది ...అది నీది, నాది నీకు ఇవ్వను, నీది నాక్కావాలి, ఇలాంటి రాగద్వేషాలు మనిషిలో ప్రబలుతాయి. తనకు ఏమీ తెలియక పోయినా అంతా తనకు తెలుసు అనుకుంటాడు. ధర్మక్షేత్రంగా ఉన్న మనసును మనిషి కావాలని తనకు తానుగా కురుక్షేత్రంగా మార్చుకుంటాడు.

పెద్దల మాట వినడం వల్ల, మహా భారతం లాంటి గ్రంథాలు చదవడం వల్ల, సత్సంగాల వల్ల, నిరంతర భగవధ్యానం వల్ల, అవినీతికి దూరంగా ఉండటం వల్ల, కొంత వరకైన మన మనస్సును ధర్మక్షేత్రంగా ఉంచుకోగల అవకాశము ఉంది.

ఆ ప్రక్రియలో భాగంగానే అందరూ చదవాలనీ, అందరికీ

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com

అందుబాటులో ఉండాలనీ, అందరికీ అర్థం కావాలనే తలంపుతో ఈ మహాభారత ఇతిహాసాన్ని సరళమైన తెలుగులో రాసాను. ఇది చదివి ఏ కొంతమందైనా తమ మనసులను ధర్మక్షేత్రాలుగా మార్చుకోగలిగితే నా కృషి సార్ధకమవుతుంది అని నా ఆకాంక్ష.

మీ అందరికీ ఆ భగవంతుడు ఆయురారోగ్యైశ్వర్యములను ప్రసాదించాలని మనసారా కోరుకుంటూ....

భవదీయుడు
యం.వి.సుబ్రహ్మణ్యం.

PDF created with pdfFactory Pro trial version www.pdffactory.com